శ్రీకృష్ణం వందే జగద్గురుం

# శ్రీ కృష్ణ చరిత్ర

(చరిత్ర,లీలలు)



రచన : వోరుగంటి రామకృష్ణ ప్రసాద్

శ్రీ కృష్ణం వందే జగద్గురుం

# శ్రీ కృష్ణ చరిత్ర

## ప్రథమ భాగం "భక్తికాండ"

## (చరిత్ర, లీలలు)




రచన : వొరుగంటి రామకృష్ణ ప్రసాద్



**నవరత్న బుక్ హౌస్**

28-22-20, రహిమాన్ వీధి, అరండల్‌పేట,

విజయవాడ - 520 002.

**శ్రీ కృష్ణ చరిత్ర**
**ప్రథమ భాగం "భక్తికాండ"**
**(చరిత్ర, లీలలు)**


రచన
**వొరుగంటి రామకృష్ణ ప్రసాద్**



ముఖచిత్రం
**పాణి,** చెన్నై.



**© నవరత్న బుక్ హౌస్**



డి.టి.పి.
**శ్రీ శ్రీనివాస గ్రాఫిక్స్**

RS.750/-

ముద్రణ
**శ్రీ చైతన్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్,**
విజయవాడ – 520 002.



వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనం
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుం

*

రుక్మిణీ కేళిసంయుక్తాం పీతాంబర సుశోభితం
ఆ వాప్త తులసీగంథం, కృష్ణం వందే జగద్గురుం

*

శ్రీవత్సాకం, మహోరస్కం వనమాలా విరాజితం
శంఖచక్రధరం దేవం, కృష్ణం వందే జగద్గురుం

*

గోపికానాం కుచద్వన్ద కుంకుమాంకిత వక్షసం
శ్రీ నికేతం మహేష్వాసం కృష్ణం వందే జగద్గురుం

* * *

## శ్రీ కృష్ణం వందే జగద్గురుం

ఈ దేశం చేసుకున్న పుణ్యం, ఈ దేశంలో పుట్టినవారి భాగ్యంగా, "శ్రీ కృష్ణ" నామం, అంతో ఇంతో చరిత్ర, ఎంతో కొంత భగవద్గీత (శ్లోకాలు) తెలియని వారుండరే వుండరన్నది అతిశయోక్తి కాదు. హాస్యాస్పదమసలే కాదు.

అంతటి ధన్యచరిత్రుల - ధర్మ, కర్మ భూమి - సనాతన సద్ధర్మ, స్వయంప్రకాశ, చారిత్రక, ఇతిహాసక పుణ్యభూమి ఇది. ఇక్కడి సంస్కృతీ సౌరభాలే ప్రపంచానికి అందాయి. గీత ప్రవచించబడింది. ప్రవర్తన నిర్దేశించబడింది. ధర్మార్థ కామ మోక్షాల - శిక్షణా, రహస్యం, ఆచరణ - ఆవశ్యకత ఈ దేశానికి ఉగ్గుపాలతో లభిస్తే, దాంతో ప్రపంచానికి "ప్రాణప్రతిష్ఠ" గావించబడింది. ధర్మం తెలిపింది.

అవగాహన పెంచింది. ఆలోచింపచేసింది. ఆరాధన నేర్పింది. సమత-మమత-మానవతల- "మహనీయ శక్తిని, త్రివేణీ సంగమంగా విశ్వవ్యాప్తం చేసింది. విశ్వంభర అయింది. అందుకే -

ఇది సనాతన భూమి. సద్ధర్మ భూమి. ప్రతి వ్యవస్థ - ఏ అవస్థ పడకుండా - సుప్రకాశము, స్వప్రకాశమై, అర్థించే వారికి ముందు భక్తి, ఆ తదుపరి జ్ఞానమిచ్చింది. అర్థ పురుషాల పరమ రహస్యాన్ని తత్వంగా తెలిపింది. తరించమని కోరింది. అందుకు, ఈ దేశంలో పుట్టిన రామకృష్ణుల రమ్య - ధర్మ - కర్మ - జీవనం, సదాచార సంపత్తి సనాతన ధర్మమయింది. సదా ప్రకాశిస్తుంది.

"రామ-కృష్ణ"లను "వర" ప్రసాదులుగా సనాతన సారథిని చేసింది. శాశ్వతత్వాన్ని చూపి, తెలిపింది.

శ్రీ"రామ" కథలో మానవతకు అంజలి ఘటించింది.

"శ్రీ కృష్ణ" చరిత్రలో - ప్రేమకు పట్టం గట్టింది.

అందుకే "రామకృష్ణులు" ఈ లోకానికి ఆరాధ్యనీయులు, ఆది దైవాలు" అయ్యారు. అందుకే "స్థాపకాయచ ధర్మస్య, సర్వధర్మ స్వరూపిణే అవతార వరిష్ఠాయ "రామ - కృష్ణాయతే నమః" అనేది.

ఎన్నో జన్మల "పుణ్య ఫలం" సుకృతంగా, శ్రీమతి సువర్చలాంబా, వేంకట సూర్యప్రసాదరావుల జేష్ఠ తనూజుడినై - "ఆ - "శ్రీ" పరాంబిక, దివ్యశక్తి బిడ్డడివై - "నారాయణీ" - నారాయణ" అనే ఆ శ్రీమన్నారాయణుని, దివ్య - పరిపూర్ణావతారమైన -

"శ్రీ కృష్ణ చరిత్ర"ను "కృష్ణం వన్దే జగద్గురుం - అంటూ - "శ్రీకృష్ణ" భాగవతంగా ఈ వొరుగంటి వంశీయుడు, తన శక్తి మేర, "శ్రీ రామకృష్ణ" వర "ప్రసాద"మై - అందిస్తున్నాడు. అందుకుని ఆనందించండి. పఠించి పరమానందం పొందండి.

శ్రీ సాయి సువర్చలా సదన్
రామలింగేశ్వర పేట,
కుడిచేతి 6వ లైను
విజయవాడ - 520 003.
ఫోన్ : **0866-2532139**
**9393007648.**

వీం
**వొరుగంటి రామకృష్ణప్రసాద్**
పారంపర్య పీఠాధ్యక్షులు,
విశ్వమానవతా గురుపీఠం

***web*** **: www. voruganti ramakrishnaprasad.com**

# ప్రకాశకుల మాట

ప్రియ పాఠకులారా, భక్త జనులారా!

అజరామర, అద్భుత సాహితీ "భక్తి" సంపదకు నిలయమైన ఈ భరతఖండ మదృష్టంగా, బోయడు - పరమదుర్మార్గునిగా ప్రసిద్ధి గాంచిన, వ్యక్తి "మరామరా" అనే నామంతో "రామ" మనిపించుకుని, వల్మీకం నుండి పుట్టి "మహర్షి" అనిపించుకున్నాడు "వాల్మీకి"గా విఖ్యాతుడై, బ్రహ్మగారి ఆదేశం, సరస్వతీ మాత కటాక్షంతో ఆదికావ్యంగా శతకోటి శ్లోకాలకు పైగా విస్తరించిన "రామాయణ"మనే "శ్రీ సీతా చరి"తాన్ని, గాయత్రీ మంత్రార్థ స్వరూపంగా ఇరవైనాల్గు వేల శ్లోకాలతో, లిఖించి, మనకందిం చాడు. ఇది త్రేతాయుగ సంఘటన.

ఇక - ద్వాపరానికి వస్తే "పరాశర - సత్యవతీ" సంగమ మహాశక్తిగా "కృష్ణ ద్వైపాయన" నామంతో ఆవిర్భవించిన వ్యక్తి వ్యాసుడై - ఈ లోకానికి వేద విభజనంతో పాటు, పద్దెనిమిది "పురాణ-ఉప పురాణాలను ప్రసాదించి, లోక ప్రసిద్ధుడైనాడు. వారి కలం నుండి వెలువడిన మహాకథనం "జయ" అను పేరుగల మహాభారతం. అటునుండి భక్తజన భాగవతత్త్వ దర్శకంగా "మహాభాగవతం " లభించాయి.

ఇందులో ఎందరో భగవద్భక్తుల కథలు పన్నెండు స్కంధాల భాగవతంలో భాగంగా, తొమ్మిది భాగాలలో పరతత్వం ప్రకాశిస్తే, దశమ "పూర్వ - ఉత్తర "స్కంధాలలో పరమాత్మ ప్రభవించి "కృష్ణం వందే జగద్గురు"మనిపించుకున్నాడు. తన చరిత్రను "శ్రీకృష్ణ చరిత్ర" చేసాడు. ఇదంతా శ్రీమద్భగావతంలోని అంతర్భాగం.

అయితే, శ్రీమద్భాగవతంలోని "శ్రీకృష్ణ చరిత్రను" వీలైనన్ని విశేషాలతో ఒక మహాగ్రంథంగా తీసుకురావాలనే ఆలోచన వచ్చింది. దాంతో మేము "శతాధిక గ్రంథ రచయిత, "శ్రీ" విద్యోపాసకుల పరంపరా ప్రాప్త శక్తిరూపులకు వారసుడు "శ్రీభువనేశ్వరీ, మణిద్వీప" యాగోత్సవాల నిర్వాహకులు. అంతకుమించి మా శ్రేయోభిలాషులైన గురుదేవులు శ్రీ వొరుగంటి రామకృష్ణ ప్రసాద్ గారి ముందు వుంచడం....

వారి మూడు గ్రంథాల శ్రీకృష్ణ చరిత్రను శ్రీకృష్ణ భగవతత్త్వాన్ని లీలా విశేషాల చరిత్రను, ధరిత్రి మెచ్చేలాగున అందించడం జరిగింది.

ఇందులో కొన్ని విశేషాలు, లీలలు దర్శనమిస్తాయి. అద్భుతానందాన్ని ప్రసాదిస్తాయి. ఇందులో కృష్ణుడు - అవతారపురుషుడు, లీలా వినోదుడు, సర్వశక్తి సంపన్నుడు, నిజమైన "శూర"వీరుడిగా, వాసుదేవుడై దర్శనమిస్తాడు. తన వాళ్ళనందర్నీ తరింప చేస్తాడు.

మూడు భాగాలను మొత్తం వర్ణించడం సాధ్యం కాదు కానీ, పఠించి, ఆనందం పొందడం మాత్రం సులభ సాధ్యము.

అందుకే "కృష్ణం వందే జగద్గురుం" అని కాబోయే జగదాచార్యునకు శిరసు వంచి నమస్కరిస్తూ - ఈ "శ్రీకృష్ణ చరిత్ర"ను అందిస్తున్నాం.

అందుకోండి. ఆనందించి, తరించండి.

**శుభం భూయాత్!**

**మీ**

**- ప్రచురణ కర్తలు.**

# ముందుమాట

"కృష్ణం వందే జగద్గురుం." అనగానే శ్రీ కృష్ణుడు ఆతని లీలా విలాసాల చరిత్ర గుర్తుకు వస్తుంది. ఈ దేశం చేసుకున్న అదృష్టంగా "రామ, కృష్ణులు ఈ మానవాళి నరనరాలలోని రక్త ప్రసరణలో కలిసిపోయారు.

రామునికి నిదర్శనం "హనుమంతుడు." అతని "యత్ర యత్ర రఘునాధ కీర్తనం" మనకు మచ్చుతునకలు, నిదర్శన - ఆదర్శాలు. అలాగే "కృష్ణా" అనగానే- కాలు నోట్లో పెట్టుకున్న "వటపత్ర" శాయిగా - కృష్ణ దర్శనం కల్గుతుంది. బ్రహ్మానంద ముదయింప చేస్తుంది. అది "శ్రీ కృష్ణ భాగవతం".

అందరు "ఎప్పుడో చెప్పిన భగవద్గీతను "కృష్ణా! అనగానే గుర్తు చేసుకుంటారు. యశోద కన్నులతో చూస్తే, అల్లరి-పిల్లల-చేష్టలతో, నవ్వుతూ అమ్మను కవ్వించి, నవ్వించే "యశోదా" "నంద" కుమారుడు, నవ్వుతూ పలుకరిస్తాడు. అమాయకంగా చూస్తూ, అందని హృదయానందాన్ని, అందుకోమని ప్రసాదిస్తాడు.

ఎంతసేపు నా పిల్లవాడేననుకున్న యశోదమ్మ "ఒడి" పిల్లవాడు, ఆ తల్లిని మురిపింపచేసిన ఆత్మానంద, దివ్యస్వరూపమే -"కృష్ణం వందే జగద్గురుం" గా తలిచే కృష్ణ చరిత్ర. ఎన్ని కష్టాలు - కన్నీళ్ళున్నా, అందరి కష్టాలు - కన్నీళ్ళు తుడిచి ఆనందవీధులలో విహరింపచేసే లీలామానుష విగ్రహుడు - ఈ కృష్ణుడు.

ఇతడు అందరికి సామాన్యుడైన యశోదా"నంద" కుమారుడు. కొందరికి మాత్రం "దేవుడు కాదు, "దేవదేవుడు" బ్రహ్మానందాన్ని ప్రదర్శించే ఆ పరబ్రహ్మ, బ్రహ్మగారి తండ్రి", ఈ వయస్సులో అందరు పిల్లలు అల్లరి చేస్తారు. కానీ అందరి ఇళ్ళల్లో చెయ్యరు. అందరి మనసులలో వుండరు. ఎందరి మనసులనో కొల్లగొట్టి, నోటిని, మనసులను తెరిపించాడు.

పాలు త్రాగే వయస్సులో "పూతన"ను చంపాడంటే, అమ్మో! అనుకున్నారు. ఆ తర్వాత కాళ్ళతో శకటాసురుడిని, ఎగిరి తృణావర్తుని, తిరిగి ధేనుకాసురుని... ఇలాగ ఎంతమందిని చంపాడో, ఎందరికి మోక్ష సామ్రాజ్యాన్ని ప్రసాదించాడో తలుచుకుంటే... అదే కృష్ణ భాగవతం. అదే "కృష్ణం వందే జగద్గురుం".

మన్ను తిని అమ్మకు, "మన్నేమిటి ? సకల భువనాలను చూపించాడంటే, అతడు నిజంగా బ్రహ్మాండ నాయకుడే! అందుకు నిదర్శనం - అక్రూరునికి యమునా జలాలలో అర్ఘ్యప్రదానమిస్తుంటే, అక్కడ దర్శనమిస్తాడు. కంస చాణూర మర్దనం, కువలయపీడనం, మహామహుల మదమణచడం...

ఇదంతా "భక్తి"కాండగా, భగవతత్వ పిపాసకులైన, తత్వ వేదులకు బ్రహ్మానంద దాయకంగా ఈ శ్రీకృష్ణ భాగతమున దర్శించవచ్చును. ఈ కృష్ణుడు యశోదా "నంద" నుడనుకుంటే, ఆశ్చర్యం. దేవకీసుతుడంటే, పరమ భాగవత, భక్తితత్వం. అందుకే అందరు ఆ చిన్నవాడిని "కృష్ణా! వాసుదేవా!" అనడం, ఆ పిలుపుకు ఆతడు పలకరించడం, మనం పులకరించడం!

ఇక - దేవకి అయితే - ఆ పిల్లడు ఆ పరబ్రహ్మమని, సాకారుని చూస్తూనే విగ్రహారాధనకు, తలుపులు తెరిచింది. ఎప్పడు "కృష్ణం వందే జగద్గురుం" అని భక్తి పారవశ్యంలో బ్రహ్మానందస్థితిని పొందుతుంది. ఇటు భక్తజన రక్షణ, అటు దుష్ట శిక్షణగా, జరాసంధుని, ఎందరో మూర్ఖులను, తనను శత్రువుగా తలంచినా, సంస్కరించే వారిని సంస్కరించాడు. శిక్షించేవారిని శిక్షించాడు.

అటువంటి దివ్యచరిత్ర - ఈ - శ్రీకృష్ణ చరిత్ర. ఇందులో బాలకృష్ణుడు, రాధా కృష్ణుడు, వీరకృష్ణుడు, కృష్ణుడు గూడా కనుపిస్తాడు. తన చిద్విలాసంతో సర్వులను సమ్మోహనపరుస్తాడు.

మధురలో చూసిన గోపబాలుని మదిలో సుప్రతిష్ట మొనర్చుకున్న విదర్భ రాజకుమారి గడుసుపిల్లగా, పరమానందంలో ముంచుతుంది. ప్రేమను పంచుతుంది. పరిణయం చేసుకుని పరమాత్మవని ప్రశంసిస్తుంది.

ఇవన్ని ఆనందాలే, "భక్తి" భావ మకరందాలే! అందుకునేవారు అదృష్టవంతులు.

''కృష్ణా'' అనగానే కష్టాలు తొలగుతాయనే ఎందరో భక్తులు, ప్రేమమూర్తులు, మరెందరో తత్వవేత్తలు, సర్వసమర్థకులు తలుస్తున్నారు.

వారందరి "దివ్యకథే" - ఈ - "శ్రీకృష్ణ చరిత్ర" అందించగల్గడం - నాకు దక్కిన భాగ్యం. అందుకో గల్గడం - మీకు లభించిన "ఆదృష్టం."

"కృష్ణా, ముకుందా, మురారీ" అని శరణాగతులుకండి. ఆ శ్రీవత్సాంకితుని దివ్య లీలా విలాసాల మధురిమలనాస్వాదించి ధన్యులు కండి.

- స్వస్తి -

మీ

**- వోరుగంటి రామకృష్ణ ప్రసాద్.**

పారంపర్య పీఠాధ్యక్షులు,
విశ్వమానవతా గురుపీఠం


శ్రీ సాయి సువర్చలా సదన్
రామలింగేశ్వర పేట,
కుడిచేతి 6వ లైను
విజయవాడ - 520 003.
ఫోన్ : **0866-2532139**
**9393007648.**

**web site : www. vorugantiramakrishnaprasad.com**
**e-mail : vorugantiramakrishnaprasad@gmail.com**

# విషయసూచిక

పేజి. నెం.

## ప్రథమోధ్యాయం


| | |
|---|---|
| ప్రార్థన | 11 |
| దేవకీ వసుదేవులు | 13 |
| అక్రూరుడు | 26 |
| మంత్రాంగం | 32 |
| వేదవ్యాసులు | 37 |
| హస్తిన | 41 |
| గోకులం | 47 |
| కరువు-కాటకం | 49 |
| బలరామ-కృష్ణులు | 54 |
| ‘‘గాలి’’దుమారం | 59 |
| నంద‘‘నంద’’నుడు | 71 |
| ‘‘పండుగ’’- సంబరం | 73 |
| కృష్ణలీలలు-‘‘పూతన’’ | 76 |
| తృణావర్తుడు | 87 |
| ఆనందమయుడు | 96 |
| మద్దివృక్షాలు | 106 |
| రాసలీలా తరంగిణి | 111 |
| పిచ్చిపని | 114 |
| ప్రమాదాలా! ప్రమోదాలా ? | 123 |
| గోవర్ధనగిరి | 130 |
| కంసుడు | 137 |
| ధనుర్యాగం | 153 |


## ద్వితీయోధ్యాయం


| | |
|---|---|
| ఆ‘‘నంద’’ప్రదాత, ఆ‘‘నంద’’నందనుడు | 163 |
| మధురానగరిలో | 173 |
| అంధకుడు | 185 |
| అష్టవంకరుల ‘‘వక్ర’ త్రివక్ర | 197 |
| కంసుడు - ధనస్సు | 205 |
| గజరాజు - కువలయము | 212 |
| కంసుని దుర్బుద్ధి | 221 |

చాణూర, ముష్టికులు ........................................................ 225
కంసవధ - కిరీట ధారణ ........................................................ 236
విద్యాభ్యాసం ........................................................ 243
కృష్ణార్జునులు ........................................................ 259
సాందీపులు-సంచార గురుకులం ........................................................ 262
గురుదక్షిణ ........................................................ 285
స్వయంవరం ........................................................ 295
జరాసంధుని ఆగ్రహం ........................................................ 299
పునరావాసం ........................................................ 304
మహేంద్రగిరి ........................................................ 310
గోమంతకం ........................................................ 325


## తృతీయోధ్యాయం


గెలవాలి, తప్పదు! ........................................................ 331
ఉద్ధవుడు ........................................................ 337
కరవీరపురం ........................................................ 352
రుక్మి ........................................................ 363
రేవతి ........................................................ 371
కుశస్థలి ........................................................ 383
పునరాగమనం ........................................................ 386
భవిష్యత్తు ........................................................ 390
ముందుచూపు ........................................................ 401
కోపం పోతే, అంతా శాంతమే ........................................................ 424
శైబ్య ........................................................ 430
సందిగ్ధత ........................................................ 433
స్త్రీబుద్ధి ........................................................ 438
ఆహ్వానం ........................................................ 443
కల్యాణ కాంతులు ........................................................ 448
సమాలోచనం..! ........................................................ 455
జయోస్తు...! ........................................................ 468
ప్రమాదం...! ........................................................ 470
సురక్షితం - మన జీవితం ........................................................ 479
కాలయవనుడు ........................................................ 483
ఆందోళన...! ........................................................ 492
కమనీయ కల్యాణపండుగ ........................................................ 498

# కృష్ణం వన్దే జగద్గురుం

## ప్రథమాధ్యాయము

*"వ్యాస" ప్రణీతమైన - ఈ దివ్య కథామృతానికి వందనం.*

*"వ్యాసో నారాయణో హరి" అన్న వ్యాసభగవానునికి మళ్ళీ వందనం.*

*"పొరుగంటి వంశంలో పుట్టి, వందనీయత నొంది", సువర్చలాంబా, వెంకట సూర్యప్రసాదరావుల - గర్భశుక్తిముక్తా ఫలమై భువి వెలయింపచేసిన - ఆ మాతా పితలకు శిరో వందనం.*

శ్లో॥ **చిన్తయామి హరిమేవ సంతతం, మన్దమన్ద హసితాననాంబుజం**
**నారదాదిముని బృందవందితం, పరమపురుషం శ్రీహరిం,**
**భక్తాసంరక్షణామూర్తినిం.**

### ప్రార్థన

**అ**ధర్మం పెరుగుతుంది. ధర్మం తరుగుతుంది. ధర్మహాని నేమాత్రం భరించలేని ధరణీమాత కన్నీరు మున్నీరయింది. తన గోడును, కాలాతీతుడు, కాలపురుషుడు, కాలకాలుడు, కాలాత్మకుడైన శ్రీమన్నారాయణునికి తెలుప నిశ్చయించుకుంది. బయలుదేరింది. అనంతునిపై అధివశించియున్న శ్రీపతి చేరి, ముకుళిత హస్తాలతో-

"ఓ శరణాగత రక్షకా! దీనబంధూ, దయాళూ శరణు, శరణు." అని శ్రీహరిని స్తుతిస్తూ ప్రార్థన మొదలుపెట్టింది.

"ఓ దయాసింధూ, శరణాగతవత్సలా! కరుణామయా, ఇక ఈ పాపభారము మోయలేను. కాలహరణము భరించలేను. పుణ్యామూర్తులు, ధర్మ నిరతులైన సత్సంతాన మందరికి ఆనందాయకమే. వారి వలన ఏ విధమైన బాధలుండవు. వారు, వారి భక్తితో, నీవు, నేను, అందరము ఆనందప్రదుల మౌతాము. ఇది ధర్మం. దీనిని భరించగల్గడం సహజం.

అయితే, వీరికి భిన్నంగా - అధర్మవర్తనులై జన్మించి, వారి ప్రవర్తనముతో లోకాలను గగ్గోలు పరిచి, ధర్మాత్ములకు, పుణ్యాత్ములకు అనునిత్యం కీడు సలిపే, పరమ దుర్మార్గ జాతి ఒకటి వారి చేష్టలతో, నాకు మనశ్శాంతి లేకుండా చేస్తుంది. ఆ పాపభారాన్ని భరించలేకపోతున్నాను. సర్వేశ్వరుడు, సనాతన, సద్ధర్మమూర్తివైన నీవు....

వెంటనే కల్గుచేసుకోవాలి. పాపభారమంతమొందించి, ధర్మసంరక్షణం గావించాలి. ఇదే నా ప్రార్థన. ఈ స్వార్థపరులైన మనుషులు, సంకుచిత భావాలతో, దుష్ట ప్రవర్తనతో, నీకు, నాకు, ఇలలో మనుగడ లేకుండా చేస్తున్నారు. అసూయా ద్వేషాలతో పెచ్చరిల్లుతూ "దేవుడంటే.... ఏడీ లేడనే - స్థితిని భగవద్భక్తులకు కల్గిస్తూ పరమ భాగవతోత్తములను, పాశవికంగా, దారుణ మారణకాండకు గురి చేస్తున్నారు.

స్త్రీలను చెరబడుతున్నారు. యజ్ఞయాగాలు ధ్వంసం చేస్తున్నారు. అన్యాయాన్ని న్యాయంగా, అధర్మాన్ని ధర్మంగా, తమను ఆరాధనీయులుగా తలపింప చేస్తున్నారు. శిశువుల ఉసురులు తీస్తూ - నీ ఉనికినే ప్రశ్నిస్తున్నారు. అధికారమదం, దుర్మార్గ బుద్ధులతో రెచ్చిపోతున్నారు.

భగవాన్! ఎన్ని రకాల విధ్వంసం చేయాలో, అన్ని రకాల దారుణాలకు, ఇక ఇంతకుమించి, అపకారం చెయ్యలేను, మొర్రో'' అన్న విధంగా స్త్రీ బాలవృద్ధులను, తాపసులను, ధర్మమూర్తులను, పుణ్యప్రియులను కూల్చి, కాల్చి వేస్తున్నారు. అన్ని రకాల హింసించి, ధర్మ ప్రగతిని, నిరతిని, దుర్భరం చేస్తున్నారు.

ఓ దేవదేవా.. కరుణించు. కదలిరా! ధర్మం నిలబెట్టు. ఓ సనాతన సారధీ, సద్ధర్మమూర్తీ, నన్ను ప్రశాంతంగా బ్రతుక నియ్యి. ఇప్పుడు నువ్వు చేసే ఏ నిర్లక్ష్యమైనా, అధర్మ పునాదులు పటిష్టమవడానికి మార్గమౌతుందే తప్ప, మానవాళి శాంతి మనుగడకు ఏ మాత్రం ఉపకారి కాజాలదు.'' తన ఆవేదనను ధరణీమాత వెళ్ళ బోసుకుంటుంది. అంతా వింటున్న శ్రీహరి, పెదవి విప్పి భూమాతను వూరడించ సిద్ధపడుతున్నాడు.

"ఓ భూదేవి, నీ ఆవేదన, అందులోని బాధ. ఏర్పడిన గడ్డు పరిస్థితులు, ఎదుర్కునే దుస్థితి సర్వం చూస్తున్నాను. నాకేమీ తెలియదనుకోకు. చెట్టునున్న పండైనా, చేసుకున్న పాపమైనా పండాలి. అప్పుడే పరిస్థితి చక్కబెట్ట గల్గుతాము. పిల్లలు తప్పులు చేస్తే, దండిస్తారే తప్ప ..... చంపరు.

అదే హద్దు దాటితే, అవసరమైతే, సమాజ శ్రేయస్సు, లోక క్షేమం కోసం, మమతాను బంధాల్ని ప్రక్కనబెట్టి, మరణదండన విధించడానికి కూడా ధర్మం వెనుకాడదు. అది శిక్షా శాస్త్రం. కనుక -

అధర్మం పెరిగి, ధర్మానికి హాని జరిగినప్పుడు తప్పక నేనవతరిస్తాను. నా ధర్మం నేను నిర్వర్తిస్తాను. కర్తవ్య నిర్వహణలో, మమతానురాగాలకు, వాని వరుసలకు, బాంధవ్యాలకు దారిలేదు. ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతాను. ఇది సత్యం. శాంతించు''మని, భూదేవిని వూరడించి శ్రీమన్నారాయణుడు పంపాడు.

# దేవకీ వసుదేవులు

త్రేతాయుగం ముగిసింది.

ద్వాపరం ప్రారంభమయింది. ధర్మంలో కొంత మార్పు వచ్చినా, అధర్మానికింకా చోటు దొరకడం లేదు. అయినా త్రేతాయుగ ధర్మాలు, ద్వాపరంలో కనుపించడం లేదు. కొంతలో కొంత... ఏదో తెలియని మార్పు... అది. కాల మహిమ.

ఆ ద్వాపర కాలంలో -

యాదవవంశం వృద్ధి చెందింది. యమునాతీర పరిసర సుక్షేత్ర ప్రాంతాల "వ్రజభూమి"లో, యాదవులు సుఖంగా వుంటున్నారు. విశాల మైదానం ప్రాంతంలో గుబురుచెట్ల సముదాయం, కనులు మిరుమిట్లు గొలిపి, పరవశింప చేసే ప్రకృతి అందాలు, పూలసుగంధాలు, కావలసినంత పచ్చిక బయళ్ళు, ఎక్కసంగా మొఖం మొత్తేటంత మెక్కగల గ్రాసం,... అది, తమ సంపదగా... అచ్చటి యాదవులు -

అపార గోగణంతో, గోవర్ధనగిరిని ప్రత్యక్షదైవంగా పూజిస్తూ, సుఖసంతోషాలతో, కాలం గడుపుతున్నారు. ప్రకృతి సహజ అందాలు, ఆనందం వారికి, పుట్టుకతో లభించిన సిరిసంపదలుగా, ఆనందమూర్తులై సుఖసంతోషాలతో కాలం గడుపుతున్నారు.

ఈ యాదవులలో కొందరు సంస్థానాధీశులు కూడా వున్నారు. కుక్కుర, అంధక, వృష్ణి, సత్వత్, భోజ, మరు, శూర వంశాల వారొక సమాఖ్యగా కలిసి

కట్టుగా నిలబడ్డారు. వీరినే వృష్ణి వంశీయులని గూడా అంటారు. వీరు స్వతంత్ర రాజులు. వీరిలో "అంధకులు" ప్రతాప, పరాక్రమవంతులు, చెప్పుకోదగ్గ ఘనులు. వీరినే "మహారాజా!" అని కూడా సంబోధింపచేసుకుంటూ తమ గుర్తింపును, నిలబెట్టుకుంటున్నారు.

ఈ యాదవులు మిగిలిన మానవజాతికన్నా మిన్నగా తమ తమ ప్రత్యేకతలను చాటుకుంటూ, మరొకప్రక్క నిలబెట్టుకుంటున్నారు. చతుర్ముఖ ప్రజాపతి వరాలు పొంది, దేశ ప్రసిద్ధులుగా, ప్రముఖులుగా చెలామణి అవుతున్నారు. మరొక రకంగా చెప్పాలంటే వీరు (యాదవులు) బ్రహ్మ వరప్రసాదులు.

చతుర్ముఖ ప్రజాపతికి ఇద్దరు పుత్రులు. వారు అత్రి, దక్షులు. దక్షుని కుమార్తె అదితి. ఆమెకు వైవస్వతుడు. ఇతనికి మనువు. మనువు కుమార్తె "ఇళ", ఈమె చంద్ర కుమారుడు బుధుని వివాహం చేసుకుని పురూరవునకు జన్మనిచ్చింది. అతడు కాలమహిమగా దేవవేశ్య ఊర్వశి ప్రేమలో పడ్డాడు.

ఈ పురూరవునికి ఇద్దరు పుత్రులు. జేష్టుడు ఆయువు. ఇతనికి అయిదుగురు కుమారులు. ఈతని కుమారుడే వీరాధివీరుడు, సద్ధర్ముడైన నహుషుడు. ఇతని కుమారుడు యయాతి. ఈ యయాతి దేవ, దానవులతో యుద్ధం చేసి, వారి దర్పమణచిన ప్రప్రథమ పౌరుషవంతుడు, వీరాధివీరుడు. ఇతని ప్రాభవం వల్లనే యదువంశానికి నూతనశకం ప్రారంభమైంది.

యయాతి ప్రథమ భార్య దేవయాని. ఈమె భృగువంశీయుడైన రాక్షస గురువు, శుక్రాచార్యులవారి ముద్దుబిడ్డ. ఈమెకు ఇద్దరు పుత్రులు. వీరు యదువు, తుర్యసుడు. ఈయన సంతానమే "యదువంశ" ప్రారంభ నూతన శకానికి నాంది అయింది. ఈ యదు కుమారుడు క్రోష్టువు. అతని కుమారుడు దేవమిధుషు. అతని కుమారుడు శూరుడు.

త్రేతాయుగంలో, ''మధువు'' అనే రాక్షసుడు, వ్రజభూమి అరణ్యప్రాంతాలలో వుండేవాడు. అతని పేరుతో అది మధువనమని ప్రఖ్యాతి చెందింది. ఈ మధువు అరణ్యాలను నరికి, సుందర ప్రాంతమైన మధురగా తీర్చిదిద్దాడు. ఈ మధు సంతతి వలన ఆ ప్రాంతీయులు అల్లల్లాడిపోయారు.

అప్పుడు శ్రీరాముని సోదరుడైన శత్రుఘ్నుడు మధుసంతతి నెదుర్కొని, ప్రజలకు భయభ్రాంతులు లేకుండా చేసాడు. మధుర సుఖశాంతులతో మనసాగింది. ఆ పరిసర ప్రాంతాలను కూడా సంరక్షించి, ఇక్ష్వాకు వంశ ప్రాభవానికి దారి చేసాడు. మధువన బాధితులకు దుష్టరాక్షస పీడ లేకుండా శత్రుఘ్నుడు శాంతిని ప్రసాదించాడు.

అప్పుడు శూరుడు అధికారమొందాడు. వానివలన శూర వంశం ప్రభావ మొందింది. యాదవులు మధురపై దండెత్తి శత్రుఘ్న వంశీయులను జయించి సామ్రాజ్యం చేజిక్కించుకున్నారు. వారు గోగణ, వెండి బంగారాది సిరులతో సుసంపన్నులయ్యారు. వారివలనే, ఈ ప్రాంతం శూరసేన దేశంగా విఖ్యాతి చెందింది.

ఈ శూరసేన వంశీయుడే వసుదేవుడు. నక్షత్రాలు శుభలగ్నంలో వుండగా, దేవదుందుభులు మ్రోగుతుంటే, శుభముహూర్తంలో శుభ లక్షణాలతో, శుభలగ్నం, యోగంలో వసుదేవుడు జన్మించాడు. దేవతులు పుష్పవృష్టి కురిపించారు. అప్సరసలు ఆనందంగా నాట్యమాడారు.

ఈ వసుదేవునికి అయిదుగురు సోదరీమణులు. వారిలో ఒకామె పృథ. ఈమెను కుంతీభోజుడు దత్తత తీసుకున్నాడు. ఆమెయే పాండురాజు జేష్ఠపత్ని. ఈమెకు ముగ్గురు వీరాధివీరులైన పుత్రులు వరప్రసాదంగా జన్మించారు. పంచపాండవులుగా విఖ్యాతులైన మొదటి ముగ్గురు ఈమె పుత్రులే. మరో సోదరి ఛేది దేశాధీశుని పరిణయమాడింది. ఆమె కుమారుడే శిశుపాలుడు. శూరవంశీయుల అధిపతి వసుదేవుడు. ఇతను అనంత పశుసంపదకు అధిపతి.

అయితే యదువంశీయులలో మరొకశాఖ క్రోష్టువు వంశీయుడైన అంధ కేయూదులు, తమ మహారాజుగా ఉగ్రసేనుని గుర్తించి ఆయన నాయకత్వంలో కాలం గడుపుతున్నారు. ఈ శూరసేనాధీశుడైన ఉగ్రసేనునికి అయిదుగురు పుత్రులు. తొమ్మిదిమంది కుమార్తెలు. వారిలో జేష్టుడు "కంసుడు".

ఉగ్రసేనుని సోదరుడు దేవకునకు నలుగురు పుత్రులు. ఏడుగురు కుమార్తెలు. వీరందరిలోకి "దేవకి" అంటే అతనికెంతో ఇష్టం. శూర అంధకేయుల మధ్య సఖ్యం కన్న వైర భావమే ఎక్కువ. దీనితో తరచు పోట్లాటలు జరుగు తుండేవి. దాంతో ఇరువర్గాల వారికొక ఆలోచన వచ్చింది. తమ వర్గం వాడైన

వసుదేవునికి అవతలి వర్గం వ్యక్తి దేవకితో వివాహం చేస్తే అనవసర పోట్లాటలు కుమ్ములాటలుండవని భావించారు. ఇరువర్గాలలో శాంతి నెలకొంటుందని కూడా తలంచారు. ఉభయుల ఆలోచన మెచ్చదగినదేనన్నట్లు భావించి ఆ వర్గ పెద్దలు ఉగ్రసేనుని రాజమహలులో వారికి, వివాహం చేసారు. అందరు ఎంతో.... ఎంతో... ఎంతగానో సంతోషించారు.

వివాహం జరిగింది. అగ్నికి నూతన దంపతులు ప్రదక్షిణం చేశారు. ఈ సంఘటనకు లోకాలు సంతోషించినట్లు పుష్పవర్షం కురిసింది. దేవ దుందుభులతో, పెండ్లి బాజాలు, తప్పెట్లు, తాళాలు, మంగళ తూర్య రవాలతో,... పృధివి పులకించినట్లు లోకానికో పండుగగా...

ఆ కార్యక్రమం యావత్తూ ఆనందమయంగా అంబరాన్నంటే సంబరాలతో సాగిపోయింది. అందరితోపాటు యాదవులలో కూడా సంతోషం వెల్లివిరిసింది. అయితే-

ఉగ్రసేనుని జేష్ఠపుత్రుడైన కంసుడు తన స్వార్థం కోసం ఏమైనా చెయ్యగల దుష్టబుద్ధి. దురాత్ముడు. ధైర్యవంతుడు, బలవంతుడు, శూరసేనీయులకు శూరుడే. రాజులకు వీరాధివీరులకు కంసుడు.... సింహస్వప్నం. తనకు తోచిందే తప్పు, ధర్మం - శాస్త్రము, నీతి - న్యాయం - అనే మాటలకు అర్థం తెలియదు. అటువంటి మాటలు వినబడవు.

తనను కాదంటే ఎంతటి ధర్మాత్ములు, భాగవతోత్తములైనా నిగ్రహిస్తాడు. ఇంకా ఎదురు తిరిగితే చంపడానికి కూడా వెనుకంజ వెయ్యని క్రూర మనస్తత్వం- కానీ దేవకి అంటే, కంసునికి ప్రేమ, అభిమానం. వారి ఆనందానికి తాను ఎంతగానో మురిసాడు. దేవకీ వసుదేవుల సంతోషమే తన సంతోషంగా భావిస్తున్నాడు.

ఇలావుండగా ఒకనాడు దేవఋషి నారదులవారు మధురకు వచ్చారు. కంసుని చూసారు. నారదుని సమయోచితంగా స్వాగతించి, జరుపవలసిన మర్యాదలనన్ని కంసుడు జరిపించాడు. నారదుని ఆశీస్సులనపేక్షించాడు. వచ్చిన మహర్షి వూరుకోకుండా "నా ఆశీస్సులెందుకయ్యా నీకు" అంటూ అతన్ని రెచ్చగొడుతున్నట్లు హెచ్చరించాడు. నారదుని మాటలకు వులిక్కిపడిన కంసుడు.

అదేవిటి మహర్షి, అలాగంటారు! మీ ఆశీస్సులు మాకు....! "ఎంతో వినయ విధేయతలను ప్రదర్శిస్తుంటే, తంపులమారిగా బిరుదాంకితుడైన నారదుడు "చూడు. కంసా! ధర్మం శాశ్వతం. అధర్మానికి ఎప్పటికైనా వినాశనం తప్పదు. అవునా ?"

"ఓస్. అంతేనా...!" అని అతి సామాన్యమైన విషయానికి తాను కంగారు పడినట్లు తలచాడు. సమయస్ఫూర్తి వంటి నారదుని హెచ్చరికకు పకపక నవ్వేశాడు. కంసుని బెదురుపాటును, ఆ వెంబడి ఆతని నిర్లక్ష్యాన్ని గ్రహించిన నారదుడు, తనకదే కావాలన్నట్లు తలవూపాడు. అప్పుడే -

"ఓ ఋషివర్యా! న్యాయము - ధర్మము - అన్యాయము - అధర్మము... వీటి విలువలు, నా మార్గానికి అడ్డు రావడం, ఎవరో వచ్చి ... అదే.. ఆ దేవుడు వచ్చి, నన్ను నాశనం చెయ్యడం, మళ్ళీ ఒకసారి పకపక నవ్వి... అదేదో.. హాస్యాస్పద హెచ్చరికన్నట్లు", మహర్షీ!ఇది సాధ్యమా ? అన్నవాడు" - ఆ వెంటనే -

"ఓ దేవఋషీ. ఇది చెప్పడానికే ఇంత దూరం వచ్చారా ? మీరు చెప్పే ఆ దేవుడికి నన్ను చంపడమే ఒక పనా ? నా దారి నాది, నా ధర్మం నాది. ఇందులో ఏ ఒక్కరికి భయపడవలసిన పని లేదు. ముఖ్యంగా, మీరు హెచ్చరించి చెప్పే మీ దేవునికి ?" ఎంతో వ్యంగ్యంగా వుందాతనిప్రసంగం.

"బలహీనులను భయపెట్టే మాయలమూర్తి మీరు దేవుడనే... అసలు సిసలైన ఆ పిరికిపంద. వీరులను, శూరులను ఆతడు నిర్బంధించలేడు సరికదా, ఆ దరిదాపులకు కూడా రాలేడు. నేను బల, పరాక్రమవంతుడను, దృఢచిత్తుడను. శాసనకర్తను, నా ఆజ్ఞే నా రాజ్యంలో శిరసావహించాల్సింది. నన్ను కాదన్నవారు మనలేరు, బ్రతికి బట్టకట్టలేరు." వళ్ళంతా పొగరును దట్టించుకున్నట్లు, నా రాజ్యం, నా శాసనం, నా ధర్మమన్నట్లు మాట్లాడుతున్నాడు.

నారదునికి కావల్సింది గూడా అదే. అంతా విన్న నారదుడు, చిన్నగా నవ్వుతూ...

"కంసా! ధర్మం. వాడిమొనకల్గిన కత్తికన్నా పదునైనది. శిక్షించు శక్తి కలది. ఎవరైనా, దేనినైనా సరే ధిక్కరించవచ్చును. వెక్కిరించవచ్చును కానీ, ధర్మాన్ని అతిక్రమించలేరు. ధర్మహాని జరిగి, పాపభారం పెరిగిపోతే, ఆ పరమాత్మ తప్పక అవతారమెత్తుతాడు. ధర్మ ప్రతిష్ఠాపనం గావిస్తాడు. సనాతన, సద్ధర్మ, భాగవతోత్తము లకు తప్పక బాసటగా నిలుస్తాడు. ఇది సత్యం తప్పదు" దీనిని హెచ్చరికగా కాక, ఒక చురకగా అంటిస్తాడు.

కంసుడు నారదుని అధిక్షేపిస్తున్నట్లు బిగ్గరగా నవ్వాడు. ఆ నవ్వులో నిర్లక్ష్యం, పరిహాసం, వ్యంగ్యం... ఎన్నో కలబోసుకుని, వెక్కిరింతకు అన్నగారివలె వుంది.

అప్పుడే "నారదా! ఈ మనుషులు కాని, దేవతలు కాని, నన్నెదిరించగలరా ? ధిక్కరించి బ్రతుకగలరా ? ఆ... ?" ప్రశ్నించాడు.

కంసుని మాటలు విన్న నారదుడు "నువ్వంత గొప్పవాడివా ?" అని అనబోయి, వూరడింపుగా, "నీ మీద నీకంత ధైర్యముంటే చాలా సంతోషం. కాకపోతే ఎందుకైనా మంచిది. మానవుల మాట దేవుడెరుగు. ఆ దేవతలపై మాత్రం ఒక కన్నువేసి ఎంతో జాగ్రత్తగా వుండు. నీకన్న మహామాయామయులైన దేవతలలో పగ పెరిగితే మాత్రం -

"కంసా, నీ పని హుళక్కి. అప్పుడెవరు రక్షించలేరు. కాబట్టి నీ జాగ్రత్తలో నీవుండడం చాలా మంచిది." ఈ మాటలతో కంసుని కళ్ళు ఎరుపెక్కాయి. చిత్రంగా త్రిప్పుతూ, మండు గోళాల వంటి ఆ కళ్ళను కదలిస్తూ -

"నారదా! నన్ను నిర్జించగలవారు, ఆ దేవతలలో ఎవరు వున్నారు ? ఎవరికంత ధైర్యం ?" అనవసరమైన పగతో రెచ్చిపోతున్నట్లు మాట్లాడుతున్నాడు. క్షణకాలం నారదుడు మౌనం వహించాడు. కంసుడు, నారదుని చూస్తూ, ఆలోచనలో పడ్డాడు. ఆ సమయంలో-

"కంస రాజేంద్రా! అహంకరించకు. హుంకరించకు - గర్వం పతన నాశనం. అహంకారం దానికి ఆయువుపట్టు. ఎవరు ? ఎవరో... నసే ఆలోచనలనవసరం. నీ వాళ్ళే నీకు నాశకులవుతారు. నీ ప్రియ సోదరి, దేవకి కడుపున బుట్టిన అష్టమ గర్భజుడు, నిన్ను సంహరిస్తాడు. అతడే నీకు మృత్యువు. సంహారకుడు. తెలిసిందా ?" దేవ రహస్యమంటూ అసలు విషయాన్ని బహిర్గతం చేసాడు. కంసునికి వెఱ్ఱెక్కించాడు.

నిజానికీ కంసుడు యువరాజు. ఆతని తండ్రి ఉగ్రసేనుడు మహారాజు. కాని మధురాధిపతిగా కంసుడే తండ్రిని ఉత్సవ విగ్రహం చేసి రాజ్యపాలన చేస్తున్నాడు. కంసుడంటే, పొరుగు రాజ్యాధిపతులకు, వారి ప్రతినిధులకు హడలు. కంసుని ఎదిరించడానికి లేదా నిరోధించి, నిర్జించే సాహసం ఏ ఒక్కరు చేపట్టలేక పోతున్నారు. వారిలో అంతటి భయాందోళనలను కంసుడు పెంచి పోషించాడు.

అటువంటి కంసునికి నారదుని మాటలు కోపం తెప్పించాయి. తోక తొక్కిన త్రాచు అయ్యాడు. ఒక్క ఉదుటున లేచాడు. వివాహమైంది. అగ్నిసాక్షిగా

దంపతులయ్యారు. వూరెరిగింపు (వూరేగింపు) కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నారు. సోదరి దేవకి, తన భర్త వసుదేవునితో, ఆనంద మహోత్సవంలో తేలియాడే సమయంలో వచ్చిన నారదుడు,.....

దూది కుప్పలపై నిప్పురవ్వ విదిలించినట్లు తన హెచ్చరికతో కంసుని భయభ్రాంతుడిని చేసాడు. అతనిలోని క్రూర దౌష్ట్యానికి ఆజ్యమయ్యాడు. అంతే చట్టున బయలుదేరాడు. కంసుని హడావుడిని చూసిన నారదుడు "కంసా, కంసా...!" అంటూనే వున్నాడు. అతను దెబ్బతిన్న బెబ్బులి అయ్యాడు.

తక్షణం "సోదరి" అని చూడకుండా, ఆ క్షణంలో దేవకిని సంహరించడమే మార్గంగా పెద్ద పెద్ద అంగలతో, వీరావేశంతో ముందుకు సాగుతున్నాడు. అరివీర భయంకరుడై, దుష్ట క్రూరబుద్ధితో కోటగుమ్మాలను దాటి, వూరేగింపు బయలుదేరే ప్రాంతానికి చేరుకున్నాడు.

అంతవరకు, ఎంతో అట్టహాసంతో, వివాహ జరిపించిన కంసుడు, కాలరుద్రుడై మండిపడుతూ వచ్చే ఆ నడక అందర్నీ భయభ్రాంతుల్ని చేసింది. అందరి ఆనందాన్ని, అట్టహాస సంరంభాన్ని చూసే కంసుని హృదయం, దేవకి అష్టమ గర్భం తనకు మృత్యువన్న నారద - సత్య స్వరంతో, విపరీత దారుణ, భయంకర క్రోధానికి, దేవకి నాశనానికి కార్చిచ్చు అయింది. మృత్యువాత బడనున్న దేవకిని గంభీరంగా చూసాడు.

అంతవరకు ఆనందంగా మ్రోగిన మేళతాళాలు ఆగిపోయాయి. కంసుని రూపం అందరిలో భయాన్ని రేపింది. ప్రాణాలుగ్గబెట్టుకుని విగ్రహాలవలె వుండి పోయారు. వున్నట్టుండి వచ్చిన ఉత్పాతమేమిటో తెలియక వణుకు, దడ పట్టుకుని, గిజగిజలాడి పోతున్నారు. కంసుడు దేవకీ వసుదేవుల, వూరేగింపు రధాన్ని చేరాడు.

తండ్రి అక్కడే వున్నాడు. ఆయన మహారాజని ఆయన సమక్షంలో ఆగడాలు చెయ్యకూడదని కూడా తలువకుండా, "దేవకీ!" ఒక్క ఉదుటున ఆమెను జుట్టు పట్టుకుని క్రిందకు లాగాడు. ఆ హఠాత్సంఘటనకు సర్వులు నివ్వెరపోయారు. క్షణం క్రితం -

చీని చీనాంబరాలతో, నగలతో, తమను తాము మరచి, పరవశించిన ఆ క్రొత్త దంపతులు, మరుక్షణం, ఈ రకమైన దౌర్జన్యానికి, కంసదుర్మార్గ నడతకు

గురవడం, ఒక ప్రక్క ఆశ్చర్యం, మరొక ప్రక్క భయం, అక్కడ గుమికూడిన బంధు మిత్రాది, పరిచారక, పరిజన, ప్రజలకేర్పడింది. దేవకి ఆ హఠాత్సంఘటనకు బెదిరి పోయింది. అప్రయత్నంగా "అన్నా!" అన్నమాట మాత్రం ఆమె పెదవుల నుండి బయటికి వచ్చింది.

కుమారుని క్రూరత్వం, ఆగడాలు తెలిసిన ఉగ్రసేనుడు, మహారాజయి వుండి కూడా, మామూలు పౌరుడయ్యాడు. బిక్కు బిక్కు మంటున్నాడు. యాదవ యువరాజైన వసుదేవుడు రథం నుండి దూకి కత్తిని ఎత్తి పట్టుకున్న కంసుని చెయ్యి పట్టుకుని -

"కంస రాజేంద్రా! భోజకులతిలకా, ఏమిటి నువ్వు చేస్తూన్న పని ? ఆడది, అందునా నీ చెల్లెలు. ఆమెపైకత్తి దూయడం, చంపబూనడం తగునా ? ఏవిటీ వింత ప్రవర్తనము ? నీ దూకుడు. నీ కోపానికి కారణం ? అర్థం కాని పరిస్థితి నర్థం చేసుకొన వీలుగా, వసుదేవుడు అడుగుతున్నాడు.

అతనికి సమాధానమివ్వదలచని కంసుడు. ప్రక్కకు తప్పుకో, "బిగ్గరగా అరుస్తూ, ఒక్క తోపు త్రోసాడు. కోపంతో కంసుని కళ్ళు ఎఱ్ఱగా జేవురించి వున్నాయి. అగ్నిగోళాల వంటి ఆ కళ్ళను చూస్తూ, కారణం తెలియని, ఉగ్రసేనుని సోదరుడైన దేవకుడు -

కంసుని చెయ్యి గట్టిగా పట్టుకుని "కుమారా, కంసా! ఆమెను విడిచిపెట్టు. భర్తతో అత్తింటికి వెళ్ళనివ్వు. ఆమె నీ ప్రియసోదరే. ఆమెను కరుణించు. ఆమె వల్ల నీకు ప్రమాదమేమి లేదు కదా, ఆమెను వెళ్ళనివ్వు" బ్రతిమాలుతున్నట్లు చెబుతున్నాడు.

"తప్పుకోండి. దేవకి బ్రతుకరాదు. ఆమెను నేను బ్రతుకనివ్వను. ఆమె చావాల్సిందే!" కఠిన పాషాణ హృదయునిగా తన నిర్ణయం చెబుతున్నాడు. వింటున్న వసుదేవుడు నిజానికి తెలివైనవాడు. కంసుని రాజ్యపాలనం, ఆతని క్రూరదుష్ట ప్రవత్తి, పూర్తిగా తెలిసినవాడు. కోపం వస్తే అతడు మనిషి కాడు. ఏం చేస్తాడో కంసునికే తెలియదు.

అసలెందుకతనికి కోపం వచ్చిందో. ఆ కారణం తెలిస్తే, సర్వం సుగమ మౌతుంది. ప్రమాదం తొలగిపోతుంది. అందుకు ఎంతో వినయవిధేయతను పుణికి పుచ్చుకుని, తెలివైన వసుదేవుడు "ఓ రాజా! నీ కోపానికి కారణం తెలుపు.మా తప్పుల్ని సరిదిద్దుకుంటాము. నీ అనుగ్రహానికి పాత్రులమౌతాము" అర్థిస్తున్నట్లు అడిగాడు.

అతని వినయవిధేయతలకు సంతోషించిన కంసుడు "వసుదేవా! తప్పిద మెవరిదన్న ప్రశ్నకాదు ఇక్కడ. దేవతల పరమ రహస్యమొకటి నాకు తెలిసింది. దేవకి అష్టమ గర్భపుత్రుడు నీకు కుమారుడు, నాకు "మారకు"డౌతాడట. పెచ్చు మీరిన ఆగ్రహంతో రెచ్చిపోయి మరీ చెబుతున్నాడు.

కనుక..అష్టమ గర్భం రాకుండా చెయ్యాలంటే అసలు గర్భమే కల్గనీయకుండా, దేవకిని చంపేస్తే నీకు కుమారుడు, నాకు "మారకు"డు వుండడు. అవునా ? అందుకే ఈ కోపం, ఆ విపరీత ప్రవర్తనం. విన్న వసుదేవుడు, అక్కడున్న మిగిలిన వారలు కూడా మిన్నకున్నారు. అతనిని సమాధానపరిచేవారు, సమాధాన మిచ్చేవారు అక్కడెవరు లేరు. అంతో ఇంతో ధైర్యంచేసి వసుదేవుడొక్కడే అడుగుతున్నాడు.

"ఓ ఘనకీర్తి! నా మాట విను. దేవతలు, ఈ అబల ద్వారా నీకు ప్రమాదమని సూచించలేదు. కనుక ఆమెను చంపవద్దు. ఆమె అష్టమగర్భం ద్వారా నీకు మరణమని సూచించారు. అవునా ? అదే నిజమైతే, నేను, నీ నిజమైన బంధువుగా, నీ స్నేహితునిగా నిన్ను రక్షించుకుంటాను. దేవకిని బ్రతుకునివ్వు. నీ ప్రాణస్నేహితునిగా, ఆమెకు పుట్టిన ప్రతిబిడ్డను పుట్టిన మరుక్షణం నీకర్పిస్తాను.

ఇది సత్యం. వారిని (ఆ పిల్లలను) ఏమైనా చేసుకో నేను కాని, నీ చెల్లెలు కాని ప్రశ్నించము. ఏం చేసావని అడగము. దాంతో నీకు ప్రమాదమైన ప్రాణగండం తప్పుతుంది. నీ చెల్లెలు (నా దేవకి) ప్రాణము నిలుస్తుంది. ఆ మాటలతో, తన తండ్రిని, ప్రాణాలుగ్గపెట్టుకున్న దేవకిని, 'సత్యము పునాది. ధర్మం దానికి ప్రాకారమనే వసుదేవుని మార్చి మార్చి చూసాడు.

అక్కడున్న యాదవ వీరులను, ఇతర బంధుపరిజనాన్ని కూడా చూసాడు. నమ్మదగిన వసుదేవుని మాటలకు తలవంచినట్లు, దేవకిని విడిచిపెట్టాడు. ఈమెను విడిచి పెట్టానని సంబరపడకండి. ఈమెను ప్రాణాలతో విడువడానికో షరతు. దానికి అంగీకారమైతే, ఈ దేవకి ప్రాణాలతో వుంటుంది. కాదంటే కత్తిని పైకెత్తాడు. చంపడానికి ఏమాత్రం వెనుకాడని శూరుడిలా వున్నాడు. ఆ శూరసేన దేశ, రాజాధిరాజైన యువరాజు కంసుడు.

★ ★ ★ ★

గజ రాజభవనంలో జరిగే సర్వము, తన చారుల ద్వారా కంసుడు తెలుసు కుంటున్నాడు. అక్కడ బలమైన బందోబస్తు వుంది. ఎటువంటి దారుణానికైనా తలపడగల పరమ క్రూరులు వీరిని కాపలా కాస్తున్నారు. ఆ తరుణంలోనే కంసుడు-

'వసుదేవా! నీ మాట నిలబెట్టుకో. పుట్టిన బిడ్డను పుట్టినట్లు నాకర్పించి, నీ సత్య పాలన శాశ్వత సత్యం చేసుకో. ఇందులో ఏ పొరపాటు జరిగినా, నువ్వు వుండవు.నీ దేవకీ వుండదు. అంతేగాదు - నీ యాదవ ప్రముఖులకు పుట్టగతులు కూడా వుండవు. తెలిసిందా ?'' అని హెచ్చరించాడు. అందుకు వసుదేవుడు తల వూపాడు. తన సత్యసంధతను నిరూపించుకుంటానన్నాడు.

ప్రస్తుతానికి గండం గడిచినందులకు అందరు సంతోషించారు. కాని కంసుని ప్రవర్తన అందర్ని కలచి వైచింది. నిరాశా నిస్పృహులను కూడా పెంచి పోషించింది. ఇలాగ రోజులు గడుస్తున్నాయి. కంసునిపై ప్రజలు, తన పరివారము, బంధుమిత్రుల నిరసన జ్వాలలను, అసంతృప్తిని చారుల ద్వారా గ్రహించాడు. ముఖ్యంగా యదువీరులందరిలో అసంతృప్తి బలపడసాగింది. కంసుని దుర్మార్గాలకు స్త్రీ బాల వృద్ధులు భయపడసాగారు. ఆ అసంతృప్తి తీరని క్రోధాగ్ని జ్వాలలకు దారి చేసింది. కాని అసహాయులైన వారు, తమలోని కోపాన్ని అణుచుకుంటున్నారే తప్ప, ఏ ఒక్కరు కంసుని ఎదిరించ సాహసించడం లేదు.

అందులో దేవకి దారుణ, దుర్భర పరిస్థితి ప్రతి ఒక్కరిని కలచి వైచింది. దీంట్లో పాలు పంచుకుంటే, కంసుని తీవ్ర క్రోధానికి గురవడమే కాకుండా, దేవకి పరిస్థితి మరింత దిగజారుతుంది. దారుణ పరిస్థితులకు గురికావాల్సి వస్తుందనే భయంతో ప్రతి ఒక్కరు తమ అసహాయతతో, మౌనముద్ర దాల్చారు.

అంతా విన్న కంసుడు హడిలిపోలేదు. వీరంతా పిచ్చుకలు. బురద పాములు. వీరి వలన తనకెప్పుడు, ఎన్నడు ప్రమాదం రాదని, వుండదని, కల్గదని, వూరుకున్నాడు. అయినా ఆ తలెత్తే బురదపాముల వంటివారి కోరలు పీకెయ్యమని, తన ముఖ్య అనుచరులకు సూచించాడు. అతని అనుచరులలో అన్ని శాఖలు, వర్గాలవారు వున్నారు.

వీరందరు పరమ క్రూరులు, దుర్మార్గులు. ఎదుటివారిని పీడించుకు తినడం వీరికి మహదానందం. వీరు కంస పరివారంగా, హింసాకాండలో

సిద్ధహస్తులై, కంస ఆజ్ఞకు బద్ధులై, రెచ్చిపోవడంలో దిట్టలుగా ప్రసిద్ధి పొందారు. వారు కంసుడు తిట్టమంటే, (తిట్టడమే కాదు), కొట్టి భయపెట్టగల, చెరసాల పాల్జేయగల క్రూర హింసామూర్తులు.

అయితే, యదువీరులకెంతవరకు, దేవకీ వసుదేవులపైనే అభిమానం, ప్రేమాదరణాలు, గౌరవం. దాంతో ఉగ్రసేన మహారాజును దర్శించారు. తమ గోడును వెళ్ళబోసుకున్నారు. కంసుని దుర్మార్గాన్ని వినడం తప్ప రాజుగా ఉగ్రసేనుడు నిస్సహాయుడు. సర్వాధికారియైన కంసుని కాదనలేడు. ఎదిరించి నిలువలేని బలహీనుడు.

అంతకుమించి కంసుని వద్ద వున్న వారందరు దుర్మార్గులు - రాక్షస ప్రవృత్తి గలవారు. ఎంతటి దారుణానికైనా సిద్ధపడగల పరమక్రూరులు. వారిలో కంసుని ముఖ్య సలహాదారులలో ఒకరి భార్య పూతన. ఆమె పని యాదవ స్త్రీలు, కంసుని గూర్చి అనుకునే మాటలను యధాతథం మూటగట్టడం. తనిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ అమాయకులనందరినీ భయభ్రాంతులను చేయడం ఆమె నైజమయింది.

ఇటువంటి వారంటేనే కంసునికి అమిత ఇష్టం. అందుకే కంసుడు పూతనను బాగా అభిమానించాడు. ఏ విధమైన భయం, నదురు బెదురు లేకుండా, నగ్నసత్యాలను బహిరంగపరచే పూతన కంసునికి వీరాభిమాని అయింది. యాదవ స్త్రీలకు మీరంటే అసహ్యం. మిమ్మల్ని ఎదుర్కొనమని వీరులవలె బ్రతుకమని, ఆ ఆడవాళ్ళు తిరుగుబాటు ధోరణిని ప్రదర్శించమని రెచ్చగొట్టి మరీ పురి కొల్పుతున్నారు.

వారందరికి వసుదేవుడు, దేవకి అంటే ఎంతో ప్రేమ. జాలి, దయ. వారినెంత హింసిస్తే అంత సానుభూతిని పొందుతున్నారు. భవిష్యత్తుపై అశావహంగా, ఆమె గర్భాన పుట్టబోయే అష్టమ బాలునికై ఎంతో ఉత్కంఠతో వారు ఎదురు చూస్తున్నారు. నీ వినాశనమే వారలకు కావలసింది. విన్నవి కన్నవి పూతన వివరించి చెబుతుంది. కంసుడు వింటున్నాడు.

వింటున్న మాటలతో కంసుడు పళ్ళు బిగపెట్టాడు. యాదవులకు వారి దురహంకారానికి తగుబుద్ధి చెప్పాలని తలంచాడు. ఇలాగ కాలం గడుస్తుంది. ఒకనాడు కంసుడు వేట నిమిత్తం అగ్రివాన్‌కు వెళ్ళాడు. ఆ సమయంలోనే

వ్రజభూమి సరిహద్దు ప్రాంతాన్ని పరిపాలించే, చిన్ననాటి తన బాల్యమిత్రుడు భీమను కలుసుకున్నాడు. తన చిన్ననాటి మిత్రత్వానికి గుర్తింపునిచ్చాడు. వీరిరువురు కలిసి మరో సమీప ప్రాంత రాజ్యాధికారి "బన"ను కలుసుకున్నారు. వీరందరు గాలవ ఋష్యాశ్రమంలో విద్యాభ్యాసం చేసారు.

చిన్ననాటి నుండి దుందుడుకు ప్రవర్తన, దుష్ట నడతకల కంసుని భయంకర అల్లరి చేష్టలను భరించలేక, మహారాజు ఉగ్రసేనుని ప్రార్థించి, తమ గురుకులం నుండి కంసుని పంపేసారు. అయినా వీరు ముగ్గురు వయసుతోపాటు పెరుగుతూ తమ చిన్ననాటి మిత్రత్వాన్ని మరువకుండా, మరింత మిత్రులయ్యారు. తమ మైత్రీ బంధం - బలమైనదని నిరూపించుకున్నారు.

కంసుని ప్రజ్ఞాపాటవాలనెరిగిన భీమ, బనాలు ఎప్పుడు ఎదురు తిరగలేదు. తమ సామ్రాజ్య విస్తరణకు ముందుకురకలేదు. వారేమిటో, తమ మిత్రుని శక్తేమిటో తెలిసినవారలు, తమ పరిధిలో, తమ జాగ్రత్తలో తామున్నారు.

చాలాకాలానికి కలుసుకున్నవారి, వారి ముచ్చట్లతో మధురానగరంలో జరిగే విప్లవధోరణి, ఎదురీతను చర్చించుకున్నారు. బుసకొట్టే త్రాచుపాములవలె కాక, బురద గొడ్లవలెనున్న పాముల కోరలను పెఱికి వెయ్యాలని, యాదవుల తలలను ఎత్తనివ్వరాదని తీర్మానించుకున్నారు. అలాగే ఉగ్రసేనుల వారి దాక్షిణ్యా గుణాలను కూడా కాదని, తండ్రిని తండ్రిగా తలచి, గౌరవించని కుమారుడిగా కంసుడు అవసరమైతే తండ్రినికూడా ఎదిరించ తలచాడు.

"ఆ ముసలి బుద్ధిలేని రాజుకు, నా కన్న ఆ యాదవులు, వారి పరిజనులపైనే ప్రేమ. నా యందు లేశమైనా అభిమానం చూపించడు. నన్ను సమర్థించడు. నేను, నా చేష్టలు, ఆ రాజుకు విషతుల్యాలు. ఇక నేను ఎవ్వరినీ ఉపేక్షించను. ఆ యాదవులను నా ఉక్కుపాదాల క్రింద అణగద్రొక్కుతాను. దీనికి యాదవులకు ఏ విధమైన సహాయమందని ప్రతికూల పరిస్థితులు కలిపిస్తే కాని సాధ్యం కాదు. కనుక ఆ దిశగా అడుగు ముందుకు వేసి, పొమ్మనకుండా పొగబెట్టి నిరోధించాలని తలిచాడు.

నిజానికి యాదవ ప్రముఖులు, వీరులు కుత్సితులుకారు. చెడ్డవారు అసలే కారు. కాకపోతే కంసుని నిరంకుశ ప్రవర్తన, ప్రభుత్వం - వారి స్వతంత్ర జీవితంలో జీవన పరిస్థితులలో, కొంత ఆలోచనను ప్రేరేపింపచేసింది. అది కంసునికి

దుర్మార్గంగా తోచింది. తమ నాయకుడిగా, తమ తోడ్పాటుతో రాజ్యాధికార మొంది "మహారాజు"గా పిలువబడే ఉగ్రసేనసుతుడు, రాజ్యాధికారాన్ని ఒక వారసత్వహక్కుగా తలంచాడే తప్ప-

ప్రజా జీవనంపై శ్రద్ధలేదు. రాజ్యం వీరభోజ్యమన్నమాట మరచి, తన స్వార్థం కోసం, ఇతరుల సుఖసంతోషాలను కూడా పణంగా పెట్టి, ఎదురొస్తే నిరోధించి, అడ్డమొస్తే అంతంచేసి, తన అభీష్టం ప్రకారం తాను కోరుకున్న మేరకూ రాజ్యం అనుభవించాలనే తపనే తప్ప - తప్పు చేస్తున్నాననే ఆలోచన కాని, ఇతరులకు, అదే ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందన్న భయంకాని ఏ కోశానా లేకుండా ప్రవర్తించడం ..... అది -

యాదవవీరులకు, ప్రముఖులకు మింగుడుపడక, తమ నిరసన జ్వాలలను ప్రకటించబోవడం, ఆ తలంపు కంసుని పాలిట అవిశ్వాస పూర్వక యమపాశ మయింది. ప్రజలది ధిక్కార ధోరణిగా తలిచాడే తప్ప, తన బలహీనతను సరిచేసుకోవాలనే బుద్ధి, ఆ స్వార్థపరునకు, క్రూర దుర్మార్గునకు తోచలేదు.

ఇప్పుడు నిరంకుశ, అనధికార సర్వాధికారి రేపు మహారాజయినా ఇదే బుద్ధి. ప్రజలకింతకన్న కీడే తప్ప మేలు జరగదన్నది ప్రజల, ప్రముఖుల విశ్వాసం. ఇప్పుడు ఇతనికి కావలసింది, ఇతనిని సమర్థించే పరమ దుష్ట క్రూర రాజులు, అటువంటి మిత్ర సహచరులు. ఎందరు మంచివాళ్ళున్నా - ఇటువంటివాళ్ళు నూటికి లేదా వేయికొక్కరుంటే చాలు. ఈ భూమి గుండె బ్రద్ధలయ్యేటట్లు రోదిస్తుంది.

ఈ దుర్మార్గ రాజుకు, అతని దృష్టి పథంలో మగధ దేశాధిపతి జరాసంధుడు కనబడ్డాడు. ఈతడు మహాసాహసి. తన అపారసేనా బలంతో ఇరుగు పొరుగు రాజులను జయించి, ఆ రాజ్యాలను తన రాజ్యంలో అంతర్లీనం చేసుకునే ఘనుడు. రాజ్యకాంక్ష, అలాగే వుంటుంది. ముందు, ముందు తన బలపరాక్రమాలతో, మహారాజు నుండి చక్రవర్తి కావాలనే ఆకాంక్ష జరాసంధునిలో బలీయంగా వుంది. అంతటి శక్తివంతుడు కూడా.

ఇటువంటి జరాసంధుడు, మన కంసునికి ఆరాధ్య నాయకుడు, అభిమాని అయ్యాడు. దీంతో జరాసంధునికి సమయం, సందర్భం దొరికింది. ముందు మధుర సామ్రాజ్యానికి సహాయకునిగా వుండి, ఆ తదుపరి మెల్ల మెల్లగా తన తెలివితేటలతో, సార్వభౌమాధికార కాంక్షను నెరవేర్చుకోవాలని తలిచాడు.

ఇదే అదనుగా కంసుడు, జరాసంధునితో వివాహ బంధమొనరించుకుంటే, యాదవుల పోరు తప్పుతుంది. తన అవసరాలు తీరి, మగధతో మైత్రి వలన, ఆ మహారాజు మరణిస్తే ఆ రాజ్యం కూడా తనకు వీరభోజ్యమౌతుందనుకున్నాడు. జరాసంధుని దూరపుబంధువు ద్వారా, మగధ దేశాధిపతిని చేరి, కంసునితో వరబంధం పొంది, మన పిల్లలనిచ్చి వివాహం చెయ్యమని సూచించాడు.

అందుకు జరాసంథుడు అంగీకరించాడు. తన ఇరువురు కుమార్తెలను కంసునికిచ్చి వివాహం చేసాడు. ఇప్పుడు మధురకు, మగధ అత్తవారిల్లయింది. వివాహబంధం, ఇతర రాజపాలనా బంధాలు బలపడ్డాయి. ఇప్పుడు కంసునితో "పోరు" అంటే, జరాసంధుడు జ్ఞప్తికి వస్తున్నాడు. జరాసంధుడు తన కుమార్తెలతో పాటు, అరణంగా, తనవద్దనున్న మహావీరులను, శక్తివంతులైన యోధులను కూడా కొందర్ని మధురకు పంపాడు.

# అక్రూరుడు

**రా**ను రాను కంసుడు బలపడుతున్నాడు. ఇక్కడ చెరసాలలో దేవకి వసుదేవులు దుర్భర చెఱసాల జీవితం గడుపుతున్నారు. ఈ నరక చెఱసాల బాధలెన్నాళ్ళో వారికి అర్థం కావడం లేదు. అసహాయులైన దేవకీ వసుదేవులు, తమ నిస్సహాయస్థితిని ఆ శ్రీహరికి విన్నవించుకుంటూ, తమనీ బందిఖాణా నుండి బయటపడ వెయ్యమని అనుక్షణం ప్రార్థించసాగారు.

దుర్భరమైన ఆ చెఱసాల జీవితంలో, అర్థరాత్రిళ్ళు ఉలిక్కిపడి లేచే ఆ దంపతులు, పరమ కరుణామూర్తి. కృపాసింధువైన ఆ పరంధాముని, త్వరగా తమను కరుణించమని, ఈ దారుణ బందిఖానా నుండి విడుదల చేయు మార్గాన్ని సూచించమని ప్రార్థించడం, అనకూడదు కానీ, ఒక దినచర్యగా మారిపోయింది.

దేవకి గర్భవతి అయింది. తమకు రక్షకుడైన శిశువును ప్రసాదించమని, ఆ శరణాగత రక్షకుని, ఆశ్రిత పారిజాతాన్ని, ఆ దంపతులు, తమ దయనీయ స్థితికి బాధపడుతూ, ప్రార్థిస్తున్నారు. కాలమహిమగా నెలలు నిండాయి. దేవకి ప్రసవించింది.

ఈ గడ్డు స్థితిలోనే....

సాధువు, ధర్మమూర్తి అయిన అక్రూరుని, కంసుని వద్దకు రాయబారం పంపాలని యాదవ ప్రముఖులు తలిచారు. అష్టమగర్భ శిశువు కదా కంసారి. ఇప్పుడు పుట్టినవాడు కేవలం ప్రథమ శిశువు. ఈ మొదటివాని వలన రాబోయే ప్రమాదంలేదు కాబట్టి, కంసుడు శిశుహంతకుడు కాకుండా నివారిద్దామని తలచిన యాదవులు అక్రూరుని పెద్దగా పెట్టుకుని, వసుదేవునితో కలిసి కంసుని చేరారు.

అదే సమయంలో తానన్నమాట ప్రకారం జన్మించిన ప్రథమ శిశువును తీసుకుని వసుదేవుడు కంసుని వద్దకు వచ్చాడు. అప్పుడు కంసుడు, తన నమ్మకమైన అనుచరులతో, మగధసేనా వీరులతో, తన సింహాసనంపై ఠీవిగా కూర్చున్నాడు. కనీసం వచ్చిన యాదవ ప్రముఖులకు కనీస మర్యాద కూడా సలుపలేదు. అయినా ధర్మాత్ముడైన అక్రూరుడు వినయ విధేయతలతో చేతులు జోడించి -

“రాజా! కరుణించి, ఇప్పుడు జన్మించిన బాలుడు, అర్భకుడు. ఇతడు నీకేమి అపకారం చెయ్యగల్గుతాడు ? ఆలోచించు. శిశుహత్యలు వలదు. శిశు హంతకునిగా పేరు పొందవద్దు. దానంత పాపం మరొకటి లేదు. ఇది ఆర్యులకు తగదు. ఇక నీకు ప్రమాదకారుడంటావా, అష్టమ గర్భశిశువు కాని ఈ ప్రథమ జన్మశిశువు కాదు.

అయినా నీవంటి వీరాధీవీరుని, ఈ బాలురు ఎదిరించ నిలువగలరా ? వీరినుండి వచ్చే ప్రమాదమెంత ? దీనిని నీవు అరికట్టలేవా ? ఇది నీకు అసాధ్యమా ? అనగా ‘‘సర్వము సాధ్యమే. అందుకే ప్రమాదాలను, ప్రమాదకారులను ఆదిలోనే త్రుంచి వేయడం, తెలివైనవారి పని. అదే నేను చేస్తున్నా’’నంటాడు కంసుడు. అందుకు వసుదేవుడు -

“రాజా! “నా విష్ణుః పృథ్వీ పతిః” అన్నారు. రాజంటే.... సాక్షాత్ ఆ శ్రీ మహావిష్ణువే. చతుర్భుజాలతో ధర్మసంరక్షుడివై, నీ ప్రజలను కన్నపిల్లలవలె పాలించి పోషించి, రక్షించాలి. ఇది శాస్త్ర ధర్మం. పిల్లవాడిని గుండెలకు హత్తుకుంటూ, ఇంకా కళ్ళే తెరవని పిల్లవాడిని తన చేతులలో పొదివి పట్టుకుని చెబుతున్నాడు.

వారి మాటల్ని లక్ష్యపెట్టక తిరస్కార భావంతో, వికటాట్టహాసం చేసాడు. ఆ వికృత నవ్వుతో ఉచ్ఛనీచాలు మరచినట్లు -

"ఆ... మీ దేవుడంత కరుణామయుడైతే, ఆతన్నే ఆశ్రయించకపోయారా? సహాయపడమని ఏడ్వకపోయారా ? దెప్పి పొడుస్తున్నట్లున్నాయా మాటలు. అతనే- "నేను దేవుడిని కాను. కంసుడను. ఉగ్రసేనుని కుమారుడను. ఆ దేవుడితో నన్ను పోల్చకండి. నాకు పాపభీతి, కరుణ, కొంచెమైనా లేదని తెలుసుకుంటే చాలా సంతోషిస్తాను!''

అయినా ధర్మాత్ముడు అక్రూరుడు, నిజమిత్రుడు వసుదేవుడు తమ భావాలను వెల్లడిస్తున్నారు. వేదనను వివరిస్తున్నారు. ఇది వాదన కాదు, మా వేదనని కూడా తెలిపారు. కంసుని ముందు వారి వాదన, వేదన, మొత్తం వృథా అయింది. కంసుడు తన సింహాసనం నుండి లేచాడు. తిరస్కారభావంతో వారిని చూస్తూ -

వసుదేవుని చేతులలో నుండి ఆ పురిటబిడ్డను గబుక్కున లాక్కున్నాడు. కాళ్ళు పట్టుకుని ఆ బిడ్డను నేలకేసి కొట్టాడు. అక్రూర, వసుదేవులు బిత్తరపోయారు. ఇతర యాదవ ప్రముఖులు భయకంపితులయ్యారు. కార్చిచ్చులా ఈ వార్త యాదవులందరికి తెలిసింది. ముక్కుపచ్చలారని వసుదేవుని బిడ్డను కంసుడు నేలకేసి బాదాడన్న బాధాకర విషయం విన్నవారందరు మహారాజు ఉగ్రసేనుని దర్శించి, తమ గోడును విన్నవించుకున్నారు.

ఇటువంటివి జరుగకుండా ప్రతిఘటించడమెలాగో తెలియక స్త్రీ, పురుషులు, గుండెలు బాదుకున్నారు. శోకసముద్రంలో మున్గిపోయారు. ఇది దారుణం అని వాపోయారు. ఉగ్రసేనుడు, పౌరుల.... ముఖ్యంగా యదువీరుల మాటలకు తల్లడిల్లి పోయాడు. కన్నుల వెంట జలజలనీరు కారుతూంటే, తానుకూడ ఆ విచారాన్ని ఆపుకోలేక బాధపడ్డాడు. తీవ్రవేదనతో, తడబడు అడుగులతో, కంసుని సరిదిద్దాలనీ, తన అభిప్రాయం తెలుపడానికి, కంస మందిరానికి బయలుదేరాడు.

అయితే ఆ తల్లిదండ్రుల మధ్య ఏం జరిగిందో, ఆ విధాతకు తప్ప మరెవ్వరికి తెలియదు. ఆ విధాత చెప్పడు. కానీ, కంస మందిరానికి వెళ్ళిన ఉగ్రసేనుడు తిరిగి రాలేదు. ఉగ్రసేనుని భార్యలకూ, వారి సేవకులు ముఖ్యమైన పరిచారకులకు కూడా ఉగ్రసేనుని విషయం తెలియదు. కంసమందిరం నుండి తిరిగి రావడం వారెవ్వరు చూడలేదు. ఉగ్రసేన మహారాజు బంధింపబడి వుండాలి.

యాదవులంతా ఎంతో బాధపడ్డారు. ఇటువంటి కొడుకు, పృథ్వీతలంలో మరెక్కడా వుండండని కుమిలిపోయారు.

ఆ మరునాడు కంసుని కిరాయి (పరాయి) సైనికులు మధురలో అల్లకల్లోలం సృష్టించారు. సాధుపురుషుడు అక్రూరుని, దేవకి-వసుదేవులున్న భవంతిలోనే గృహ నిర్బంధం గావించారు. అక్రూరుని అనుసరించిన యాదవ ప్రముఖుల, ముఖ్యుల, వీరుల గృహాలు తగులపెట్టారు. కనుపించినవారిని చంపుతున్నారు. ఆ నరమేధానికి భయపడిన కొందరు తలుపులు బిగించుకున్నారు.

ఒంటరిగ్గియై, ఏ ఆధారంలేనివారు "బ్రతుకు జీవుడా!" అంటూ, మధుర విడిచి రహస్యమార్గాన్న పారిపోయారు. కంసుడు తన రథంపై నగర సంచారం ప్రారంభించాడు. విదేశీ సైనికుల భయోత్పాతాలకు వెరచి, చిట్టెలుకల్లా, ఇళ్ళలో కిమ్మనకుండా వున్న యాదవుల దీనస్థితిని, తమ విజయంగా భావిస్తూ -

కంసుని విశ్వాస సేవకులు విజయోత్సహంతో సంబరంలా సాగుతున్నారు. తన సేవకుల విజయ వీరాలాపములతో సాగుతుంటే, బాధితుల ఆక్రందనలు గమనించిన కంసుడు, యాదవులు తమ విపరీతబుద్ధికి తగ్గ శిక్షను పొందారని మురిసిపోయాడు.

ఇక్కడ చెఱసాలలో దేవకీ వసుదేవులు, తమ దురదృష్టానికి, తమ కడుపున పుట్టిన ఆ పసిపిల్ల వాని దౌర్భాగ్యాన్ని చింతించడానికి కూడా కన్నీరు లేక పొడారిన కళ్ళతో, తడారిన గొంతుకతో అచేతనులయ్యారు. కాకపోతే, చిన్న మూలుగులా మూల్గి 'కరుణా జలధియైన, ఆ పరమాత్మ, ఈ దారుణాలను ఎలాగ భరించగల్గు తున్నాడని మాత్రం వాపోయారు.

అక్కడేవున్న అక్రూరుడు "చింతించకండి. మీరన్నట్లు పరమాత్మ కరుణా సింధువే. కృపామూర్తే. కాని, **కర్మలు మనవి. అనుభవించడం మన పని**" అని దేవకిని ఓదార్చి, వసుదేవునితో -

"మన సంరక్షకుడైన, ఆ పరమాత్మ తప్పక వస్తాడు. ఆయన లీలలు అనంతం. వర్ణనాతీతం. ఏదో శుభ వర్తమానం పొందుతామని నాల్గురోజులుగా నా మనస్సు సూచిస్తుంది. మరికొద్ది రోజులలో కృష్ణాదైపాయనులైన వ్యాసులవారు, ఇంద్రప్రస్థానికి వెడుతూ, ఇటు వస్తారని తెలిసింది. ఆ మహామేధావి ఆపదోద్ధారకుడు, మనకు తప్పక మార్గదర్శకులౌతారు.

అక్రూరుడు వయసుకు చిన్నవాడేకాని, అపార జ్ఞానఖని. భగవంతునిపై తరగని విశ్వాసము, అకుంఠిత దీక్షగల వ్యక్తి. అక్రూరుడంటే..... మధురవాసులందరికీ ప్రేమా, గౌరవం. అనాధులను, అసహాయులను బాధాతప్తులను ఓదార్చి, వూరడించడం, అక్రూరుల వారి లక్ష్యం. అటువంటి పుణ్యమూర్తి, భాగవతోత్తముడు బంధింపబడటం, విధివిలాసంగా, మధురపురవాసులు తలిచారు. ప్రస్తుతం -

పరిస్థితి చక్కబడుతుందని, విద్రోహులు సమసిపోయారని, కంసుని ఎదిరించి నిల్చే మగవాడే లేడనే వార్త కంసునికి అందింది. సంతోషంతో పకపక నవ్వాడు. పరిస్థితులకు తట్టుకోలేక, యాదవ ప్రముఖులలో చాలామంది తమ కుటుంబాలతో మధురను విడిచి, పొరుగు రాజ్యాలకు శరణార్థులుగా పారిపోయారు. మిగిలినవారు తలలు వంచుకుని కంసునికి శరణాగతులయ్యారు.

కాకపోతే, కంసుని విధేయులు కొందరు, ప్రజలతోపాటు, అక్రూరుని చెరబట్టడం మాత్రం భరించలేక పొయ్యారు.

కంసుడు పరిస్థితులు చక్కబడటం, తన ఆశలు నెరవేరడంతో, అందరి అభిప్రాయాన్ని తలదాల్చుతున్నట్లు, యదువీరుల వలన ఏ ప్రమాదము లేదని, రాదని తలచి, అక్రూరుని విడుదల చేసాడు. ఇది తనకు అనుకూలమవుతుందని, ప్రజలు తనను కీర్తిస్తారని కంసుడు తలచి, అక్రూరుని బంధవిముక్తిడిని చేసాడు.

ఈ సమయంలోనే మహాకురువీరుడైన భీష్ముల వారి నుండి వార్తాహరులు మధురకు వచ్చారు. వసుదేవుని తమతో ఇంద్రప్రస్థానికి పంపమని కోరారు. దీంతో కంసుడు అయోమయంలో పడ్డాడు. ఏం సమాధానం చెప్పాలో తోచడం లేదు. ఆ మహావీరునితో తలపడటం అసాధ్యం. దారి కనబడటం లేదు.

భీష్ముడు సామాన్యుడు కాడు. అరివీరభయంకరుడు, ఆర్తత్రాణ పరాయణుడు. ఇటు అభయహస్తం, అటు ఖడ్గనైపుణ్యం ప్రదర్శించగల మహామేటి. పైగా పరశురాముని ప్రియశిష్యుడు. హస్తినాపురాధిపతి, ఆయనతో తలపడటం తగని పని. కాకపోతే అక్రూరుడు, హస్తినాపురవాసులకు కూడా ప్రియుడే.

కనుక అక్రూరుని సంప్రదిస్తే, తగు రక్షణ సలహా లభిస్తుందని కంసుడు తలిచాడు. అక్రూరుని బంధవిముక్తిడిని చెయ్యడానికి భీష్ముల వర్తమానం కూడా

కొంత సుగమ మార్గమయింది. ఆ బ్రహ్మాస్త్రంతో, అక్రూరుడు, బంధవిముక్తు డయ్యాడు. ఇక భీష్ముల వారి కరుణను పొందాలి.

విడుదలైన అక్రూరుడిలో సంతోషం లేదు. అలజడి లేదు. మామూలుగానే ఇంటికి వెళ్ళాడు. కుటుంబాన్ని గోకులానికి పంపించి, తాను మాత్రం మధురలో, తన అనుయాయుల, అభిమానుల సహాయార్థం, ఒక వారథిగా సారధిగా అక్కడ వుండిపోయాడు.

మధురలోని ప్రతి ఇల్లు అక్రూరుల వారిదే. వారికి "చిరపరిచితమైనదే, ఒక్కొక్క ఇంటికే వెడుతున్నాడు. అందర్ని కలుసుకుంటున్నాడు. వారి బాధలు వింటున్నాడు. సాటి మానవునిగా వారిని ఓదారుస్తున్నాడు. కంసుని ప్రవర్తనకు బాధపడుతున్నాడు.

వారికి తను చేయగల్గిన సహాయమందిస్తూ ఆరాధ్యునిగా కాక, ఆదరణీ-యునిగా మెలగుతున్నాడు. భగవంతునిపై ప్రీతిని పెంచుకోమన్నాడు. శరణాగత రక్షకుడైన ఆ శ్రీహరి, తప్పక, సమయానుకూలంగా మనల్ని సంరక్షిస్తాడని ఎంతో విశ్వాసంతో ప్రకటిస్తున్నాడు.

ఈ బాధలు భగవంతుని సృష్టే. ఇందులోని సత్యాన్ని గ్రహిస్తే, రేపు లభించే సుఖము, నిజంగా సుఖదాయకమౌతుంది. దాని విలువ మనకర్థమౌతుంది. సుఖం లేకపోతే కష్టం, అది లేకపోతే సుఖం, సూర్యచంద్రులు - పగలు రాత్రుళ్ళవలె, కాలంతో సాగే కాలచక్ర భ్రమణమిది. దీనిని గూర్చి అనవసరంగా ఆలోచించడం, విపరీతంగా బాధపడటం తగదు. అందుకనే ఆ పరమాత్మ "నన్ను నమ్ముకున్న వారు నాశనమవరు'' అని అభయపూర్వకంగా తెలిపింది. శాసనం చేసింది.

అందుకే ముందు శోకాన్ని విడిచిపెట్టాలి. అందుకు ధైర్యం కావాలి. అది శాంతిని, ప్రశాంతిని ప్రసాదిస్తుంది. పరమాత్మ పథం వైపు, ఆ దివ్యాత్మ దర్శనం వైపు తీసుకువెడుతుంది. ధన్యులను చేస్తుందని, వారందర్ని ఎంతగానో ఓదార్చాడు.

అక్రూరుని సమయోచిత సలహాలకు, ఓదార్పుకు, సర్వులు సంతోషించారు.

# మంత్రాంగం

ఒకనాడు కంసుడు, "వృష్ణి" యాదవ ప్రముఖుడైన మహాభక్తుడు అక్రూరుని పిలిపించాడు. కంసుని పిలుపుకు అక్రూరుడు ఆశ్చర్యపోయాడు. ఆతని కృత్రిమ, కపట ప్రేమను గుర్తించిన ఆయనను చూస్తూంటే - కంసుడు,

"అక్రూర మహాశయా! కృష్ణద్వైపాయనులైన వేదవ్యాసులవారు, రేపు మన మధురకు వస్తున్నారట. ఈ సంగతి మీకు తెలిసే వుంటుంది. వారెందుకు వస్తున్నారో వివరిస్తే, మీ ముఖతః వినాలన్నది నా కోరిక" అంటాడు. అలాగే - దీనికి, భీష్ముల వారి వర్తమానానికి సంబంధముండి వుండాలి. ఆ రహస్యం మీకు తప్పక తెలిసి వుండాలి. వుంటుంది కూడా! అవునూ. భీష్ములవారు, వసుదేవుని రాకను కోరుతూ, వార్తాహరులను పంపారన్న సంగతి మీకు తెలుసా ?" అని కంసుడు అడుగుతాడు.

సమాధానంగా, అక్రూరుడు "వారు వస్తున్న సంగతి నాకు తెలుసంటాడు."

"ఎందుకు వస్తున్నారో తెలుసుకోవచ్చా ?" కంసుని అసహన ప్రశ్న.

"అది నాకేం తెలుసు ? మహాత్ముల రాకలను కనిపెట్టి చెప్పగల శక్తి మనకుందా ? ప్రశ్నకు..... ప్రశ్నలాంటి సమాధానం.

"మీకు తెలిసే వుంటుంది." అని క్షణమాగి, అది సరే అన్నవాడు" ఆయన నీకు తెలుసా ?" తనే అడుగుతాడు. కంసుడు భయానికి తగ్గట్టే.

"ఆ తెలుసు. వారిని చాలాసార్లు కలుసుకున్నాను. నేను."

"అలాగా! ఈ మునేనా ? ఆ చేపలదాని కొడుకు, కురువంశ యువరాజు తండ్రి ?" కపట క్రూరత్వాలు నిండిన కళ్ళతో, పరిహాస ప్రసంగంగా, వదలు తున్నాడు. అందుకు సమాధానంగా, అక్రూరుడు -

"సత్యం. ఆ మహాతల్లే సత్యవతి. వ్యాసుని మాత. కురువంశ యువరాజులకు పితామహి కూడా. ఆమె మత్స్యరాజు... అదే చేపలవాని కూతురే కావచ్చును. కాని ఆమె వ్యాసుని మాత. వ్యాసుని తండ్రి పరాశరులు. ఆ మహర్షి శక్తి కుమారుడు, వసిష్ఠుల వారి మనుమడు. ఆ పరాశరమహర్షి పుత్రుడే మనం

దర్శించబోయే మహనీయులు, కురువంశ యువరాజుల తండ్రియైన వ్యాసుల వారు. వీరినే వేదవ్యాసులని కూడా అంటారు. మహాత్ములే శిరసు వంచి నమస్కరించే మహనీయులు శ్రీ వేదవ్యాసుల వారు.

అసలు విషయాన్ని ప్రక్కనబెట్టి, "అవును. వయస్సులోనున్నప్పుడు సత్యవతి మహా అందగత్తెట కదా. మరిప్పుడెలాగ వుంటుందో ?'' మహాత్ముల, పుణ్యధర్మమూర్తుల మనసు చివుక్కుమనేటట్లు కంసుడు వ్యంగ్య ప్రసంగం, వ్యర్థ ప్రేలాపనలుగా చేస్తున్నాడు. ఆ ప్రశ్నకు క్షణకాలం అక్రూరుడు స్తబ్దుడయాడు.

మాట్లాడాలంటే అసహ్యమనిపించింది. వ్యర్థ ప్రసంగం విని, ఆపలేని అక్రూరుడు "రాజా! మీరు చెప్పినట్లు ఆమె అప్సరసలను తలదన్నిన అందగత్తె. ఆమె రాజమాత. కడు సంస్కారి'' అన్నాడు. అయినా కంసుని ప్రవర్తన అక్రూరునికి నచ్చడం లేదు. ఎంతసేపు తను అభిమానించే వారినందర్ని అవమానించి, తాను రెచ్చిపోతే, తన ద్వారా, తన పగ - ప్రతీకారాలు తీర్చుకోవాలనే బుద్ధితో కంసుడున్నట్లు, అక్రూరుడు గ్రహించాడు.

అందుకేనా, మహావీరుడు అరివీరభయంకరుడని చెప్పబడే, ఈ వింతమనిషి భీష్ముడు, మడిగట్టుకున్నట్లు, తన యవ్వనాన్ని చంపుకుని, ముసలి తండ్రికి ఆ అందాలరాశిని అర్పించింది. ఈ చేపలపిల్లతో, ఆ మహారాజుకు, మగవాడినని మరచి, స్వయంగా వివాహం చేసి, ఆ గంగాపుత్రుడు, "భీష్ముడై'' నేను ప్రతాపవంతుడినని విర్రవీగేది. "ఇది సబబా ?''

కంసుడు, అక్రూరుని సహనాన్ని పరీక్షిస్తున్నాడు. విషయం గ్రహించిన అక్రూరుడు, తనను నిబ్బరించుకుని "అదేకదా రాజా, భీష్ములవారి గొప్పతనం. ఆ మహనీయుని సామాన్యులు అర్థం చేసుకోలేరు. వారిదరిన నిలువలేరు. కారణం దేవుడైన శంతనుని కుమారుడు, పరమపవిత్ర గంగా పుత్రుడు భీష్ముడు. పితృఋణం తీర్చుకున్న పరమశ్రేష్టుడు, మహాపుణ్యుడు భీష్ముడు. వారినర్థం చేసుకోవడం.. సామాన్యులకు సాధ్యం కాదు.

ఆ మాటతో అవాక్కయ్యాడు, కంసుడు. అక్రూరుని మాటలలో ఏదో వ్యంగ్యం. తనపై పరిహాసం. అర్థం చేసుకుంటున్నాడు. "అవునవును గొప్పవాడే. అందుకే, శంతనుని ఇద్దరు పుత్రులు మరణిస్తే.... మళ్ళీ మాటల్లో శ్లేష ......

"తల్లిగా, ఆ చేపల సత్యవతి పిలుపు. ఈ వేదమూర్తి రాక. సంతానం లేని సవతి తమ్ముళ్ళ భార్యలనుద్ధరించి, ఆ చేపల, రాజమాత, సంస్కారరాణి అభ్యర్థన. తగుదునని ఈ పెద్దమనిషి సంభోగం. ఆ తదుపరి సంతానంగా ఆ విధవా తల్లులకు ధృతరాష్ట్ర, పాండురాజుల జననం. అంతా చిత్రం విచిత్రం. ఇది సంస్కారవంతుల సమ్మోహన చరిత్ర. అవునా ?'' అక్రూరుని, కంసుడు - వెక్కిరిస్తున్నట్లు నిలదీసాడు.

''అది సనాతన సాంప్రదాయం, సదాచారం. దానినే వ్యాసుడు అనుసరించాడు. వంశోద్ధారణం గావించాడు. ఇది శాస్త్ర, దేవ సమ్మతం. దీనిని అందరూ అర్థం చేసుకోలేరు.

ఆ మాటతో, మాటిమాటికి తనను కుసంస్కారిగా పరాభవిస్తున్నట్లు మాట్లాడే, అక్రూరుని ప్రవర్తనతో రెచ్చిపోయాడు. "ఆయ్!" అంటూ సింహాసనం దిగాడు. అంతలో సర్దుకుని 'అక్రూరా, నిజం చెప్పు. కొన్నాళ్ళక్రితం నువ్వు హస్తినాపురం వెళ్ళావు కదూ, అప్పుడు ?'' ఆ కురువంశ యువరాజులిద్దరు నిజానికి రాజ్యానర్హులు. ఒకడు గుడ్డివాడు. మరొకడు మందభాగ్యుడైన పాండురోగి. ఇద్దరకు పిల్లలు లేరు. వారు మరణిస్తే, కురువంశం, వారి రాజ్యం ఏమవుతుందో చెప్పు ?'' ప్రశ్నించాడు. అసలాప్రశ్న ఎందుకు అడుగుతున్నాడో, అక్రూరుడికి అర్థం కాలేదు. అయినా, ధైర్యంగా -

''భీష్ముల వంటి మహావీరుని సంరక్షణలో ఆ రాజ్యానికి వచ్చిన ప్రమాదమేమీ లేదు. సద్ధర్మమూర్తి, సదాచార సంపన్నుని నేతృత్వంలో ఆ రాజ్యం దినదినాభివృద్ధి చెందుతూ, నిక్షేపంగా వుంటుందన్నాడు.

అలాగా! అయితే వసుదేవుని వారెందుకు రమ్మని పిలుస్తున్నారో...! శ్లేషతో అడిగాడు. ఆ కంసుడే మరల "ఇందులో ఏదో కీలకం వుండి వుంటుందంటాడు.

"నాకు తెలిసి భీష్ములవారు నిష్కపటే తప్ప వారికి కీలకాలు, మాయా మంత్రాంగాలు తెలియవు.'' అది అక్రూరుని సమాధానం -

"ఏమయితే అయింది. నేను మాత్రం వసుదేవుని విడిచిపెట్టను. భీష్ముల వారి వద్దకు పంప'' నన్నాడు, మడతపేచీలు పెట్టడంలో సిద్ధహస్తుడు, క్రూరుడైన కంసుడు-

"ఆ సంగతి నాకే కాదు, మధురలోని అందరికి తెలుసు. ఎంతటి సుజ్ఞానో, అంతటి వీరాధివీరుడైన ఆ ధర్మాత్ముడు, పరశురాముని శిష్యుడు, కోపిస్తే పరిస్థితి

భయంకరంగా వుంటుంది. శాత్రవులు ప్రాణాలమీద ఆశ వీడి స్వర్గనరకాల వైపు పరుగెత్తిన సంఘటనలు చాలా వున్నాయి.

"అయినా ఆ విషయాలు మనకనవసరం. నీవు తెలివిగల రాజువైతే వసుదేవుని పంపుతావు. కాదంటే భీష్ముని క్రోధాగ్ని జ్వాలలకు గురి అవుతావు. ఆ పరమశివుడు కూడా, తన పాశుపతాస్త్రంతో, ధర్మమూర్తియైన, ఆ గంగాసుతుడు భీష్ముని ముందు దిగదుడుపే.

కనుక - అనవసర కయ్యానికి కాలు దువ్వకుండా, వసుదేవుని, ఆతనితో దేవకిని పంపి ప్రశాంతంగా వుండటం మంచిదని, పరిస్థితుల్ని గమనించే నాకు తోచిన సలహా. ఆ తర్వాత, యువరాజా! రాజుగా సర్వాధికారిగా నీ ఇష్టం" అన్నాడు.

అక్రూరుని సలహాను విన్న కంసుడు "అవునవును." అంటూ వికటంగా నవ్వుతూ "అక్రూరా, నీవు చాలా తెలివైనవాడివి. అందుకే నిన్ను పిలిపించాను. ఇప్పుడు ఆ గంగాసుతునకు ఏం వర్తమానం పంపమంటావో కాస్త చెప్పమన్నాడు. ఇందులో ఏ మాత్రం సందేహించనవరసం లేదు. నిర్మొహమాటంగా నీ ఆలోచన చెప్పు. పోనీ మా పినతండ్రి దేవకులవార్ని మా ప్రతినిధిగా పంపనా ? చెప్పు. రేపు ఆ మహర్షి వచ్చేసరికి ఏం చెప్పాలి ? ఎలాగ చెప్పాలి. అప్పుడు ఆలోచనలు చేయడం సబబు కాదు కదా!" అనగా -

"ఇందులో చెప్పేదేముంది. ఆ ముని ఏమడిగినా, నిజమే చెప్పండి ? పరిస్థితి నర్థం చేసుకుంటారు. పెద్దలవద్ద ఏదీ దాచనవసరం లేదు. మనం దాచినా దాగని పరమ రహస్యమది. నేను కొన్ని రాజకీయ కారణాల వలన వసుదేవుని, ఆతనితోపాటు దేవకిని పంపదలచుకోలేదు." అని నిరభ్యంతరంగా చెప్పండి. ఆ సత్యవాది మీ సమాధానానికి సంతోషించవచ్చును. లేదా తగిన సమాధానం, నీ సందేహం తీరునట్లివ్వవచ్చును.

అక్రూరుని సమాధానాలు ధర్మబద్ధమే అయినా, కంసుని రెచ్చగొడుతున్నాయి. అసహనంతో వూగిపోతున్నాడు. ఏవిటో మూర్ఖపు మాటలు ? తెలిసి తెలిసి కొరివితో తలగోక్కోవడమా ? ప్రమాదం కొనితెచ్చుకోవడమా ?"

"కంసరాజేంద్ర! ఈ సంగతి అందరికి తెలుసు. ఇప్పుడిక చేసేదేముంది ?

"అక్రూరా! నువ్వొక మేధావిలాగ నిన్ను నీవు ప్రకటించుకుంటున్నావు. వింటున్నాను కదా అని సుభాషితాలు చెబుతున్నావు ? ఇదంతా నీకు తెలియదా ? వసుదేవుడు, దేవకి లేకుండా ఒంటరిగా వెళ్ళాడు. కనుక నువ్వు భీష్మలవారి వద్దకు వెళ్లు. పరిస్థితిలు వివరించు. ఆ మహావీరుని శాంతపరచు. ఇది నా ఆలోచన. అందుకే నిన్ను పిలిపించానన్నాడు - కంసుడు!

అక్రూరుడు మనసు, నోరు, మూగబోయాయి. చివరకు తనను బలిపశువును చేసి, కంసుడు ప్రమాదం నుండి తప్పించుకోవాలని తలుస్తున్నట్లు గ్రహించిన అక్రూరుడు "రేపు వేదవ్యాసుల వారు వచ్చాక, పరిస్థితిని సమీక్షించి వారి ఆలోచనల మేరకు నడుచుకుంటాను. వారు మంచిదంటే, "హస్తిన"కు వెడతాను. కాదంటే మధురే నాకు గతి" అన్నాడు.

"ఆయన వద్దంటే ఏం చేస్తావు ?" అడిగాడు కంసుడు.

"చెప్పాను కదా, ఇక్కడే వుండిపోతానని" అక్రూరుని సమాధానం.

"అప్పుడేమవుతుందో తెలుసా ?" అప్పుడతని కళ్ళు అగ్నిగోళాల్లా వున్నాయి. "కంసు"డంటే మూర్తీభవించిన కోపంలా.... వున్నాడు.

"నా చావు బ్రతుకులు, రాజుగా, సర్వాధికారిగా నీ చేతుల్లో వున్నాయి. "దయ" ఎరుగని కంసుడు మహాకాలుడవుతాడు. అవునా ? అగ్నిపర్వతంలాగ, కోపమనే "లావా" కక్కుతున్న కంసుని మరింత రెచ్చగొడుతున్నట్లు, సత్యము సత్యంగా అక్రూరుడు చెప్పాడు. రెండు చేతులు జోడించి, నమస్కరించి, అక్కడనుండి కదిలాడు. గృహోన్ముఖుడయ్యాడు.

కంసుడు సింహాసనం దిగాడు. పరమ భయంకరంగా గర్జిస్తూ - "అక్రూరా! అధిక్షేపించకు. ఆపద కొని తెచ్చుకోకు. నేను నిన్ను విడువను. ఆ వచ్చే మహర్షితో నాకు పనిలేదు. నేను చెప్పింది చెయ్యడం నీ ధర్మం. కాదంటే నీ కర్మం. ఇక్కడ దయాదాక్షిణ్యాలకు తావులేదు. అందుకే దీన్ని రాచరికమంటారు. అర్థమవుతుందా ?

అక్రూరుడు అంత బిగ్గరగా, గర్జిస్తూ చెప్పే కంసుని వెనుదిరిగి చూసాడు. ఒక్క చిరునవ్వు నవ్వి ముందుకు సాగాడు. విధి విలాసమనంతం. అవశ్యం అనుభవమనీయమన్నది - ఆ చిరునవ్వు వెలిబుచ్చే మహార్థం, పరమార్థం లేదా- అనంత తత్వ ప్రకాశానికి, తొలి సోపానం.

# వేదవ్యాసులు

**వృ**ష్ణివీరులు, వచ్చే మూడు పడవలను ఆసక్తిగా చూస్తూ నిల్చున్నారు. అప్పటికే ఆ ప్రాంతమంతా కృష్ణ ద్వైపాయనులవారు వస్తున్నారని, వారికి తగు స్వాగత సత్కారాలు సలుప వీలుగా కొందరు, ఎందరో ఆ మహనీయుని దర్శనం కోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు. ఆ వచ్చే మహర్షి తమ మధురకు రావడం. మధురపురవాసుల అదృష్టంగా ప్రతి ఒక్కరు తలచి ఆనందిస్తున్నారు.

మూడు సం॥ల నాడు మహర్షి వేదవ్యాసులవారు మధురకు రావడం ఆనందదాయకం. ఆనాటి మహారాజు ఉగ్రసేనులవారు. స్వయంగా మహర్షిని స్వాగతించి నగరికి తెచ్చారు. ప్రతి ఒక్కరు పరవశించారు. ~~ఈ~~నాడు పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు మధుర, సర్వాధికారి "కంసుని" పాలనలో వుంది. పరిరక్షణలేని ప్రజలు తాము తమ ఇక్కట్లు చెప్పుకోలేని దుస్థితిలో వున్నారు.

పడవలు తీరం చేరుతున్నాయి. మొదటి పడవలోనే మహర్షిని, అక్రూరుడు గమనించాడు. ఎందరిలో వున్నా, అక్కడెందరున్నా, మహర్షిని గమనించడం చాలా తేలిక.

ఆ కృష్ణ వర్ణ శరీరం, తేజోమయనేత్రాలు, బ్రహ్మ వర్చస్సు వుట్టిపడే వదనం, జింకచర్మం, వారి చిన్ముద్రుల దివ్యరూపం, సర్వులను ఆకర్షించి, చూస్తుండగానే ప్రశాంతిని ప్రసాదించి, కదలకుండా కట్టిపడేస్తుంది. వారిని చూస్తూనే - అక్రూరుని మనసులో, వారి దివ్య లీలా విశేషాల చరిత్ర, ప్రముఖంగా చిత్రీకరణమైంది.

**"వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్ర మకల్మషం**

**పరాశరాత్మజం వందే శుక తాతం తపోనిధిం"**

అన్న భావం, తెలియకనే రెండు చేతులు కలిపి, నమస్కరించే సంస్కారం ఏర్పడుతుంది. అంతటి మహనీయులు, వేదవ్యాసులవారు. వసిష్ఠుల వారి ముని మనుమడు, శక్తి మనుమడు, పరాశరుని పుత్రుడు, వరపుత్రుడు, శుకునికి తండ్రి- ~~ఈ~~ - మహనీయు వేదవ్యాసులవారు. ఆ దివ్యరూప సందర్శన మదృష్టంగానే చెప్పాలి. అంతటి పుణ్యచరితులు వారు.

వేదవ్యాసులు, మహర్షి పరాశరుని పుత్రులు. వీరి తల్లి మత్స్యగంధి సత్యవతి. జన్మిస్తూనే విజ్ఞానమూర్తిగా, తల్లిని వూరడించి తపోమూర్తిగా

సాగిపోయారు. అవసరమైనప్పుడు స్మరించుకుంటే, తప్పక వచ్చి ఆమె మనోభీష్టం నెరవేరుస్తామన్నారు.

"వ్యాసో నారాయణో హరిః" అన్న మాట సత్యం. బ్రహ్మకే అర్థమవని వేదాలు విభజించడం మాటలా ? సాధారణులకు సాధ్యమా ? వాటిని, ఆ వేదశాఖలను తన శిష్యులకు అందించి, వారిచే అధ్యయనం చేయించడం సామాన్య విషయమా ? భూత భవిష్యత్తు, వర్తమానాలు తెలిసి, ఆ పరబ్రహ్మమే తానుగా నిలిచిన, ఆ బ్రహ్మమూర్తి దర్శనమే సర్వపాపహరం. సంభాషణం జన్మ నిష్కృతి. అదొక వరం.

ఇంకా చెప్పాలంటే, వేదవ్యాసులు. ధర్మప్రతిష్ఠాపనాచార్యులు. జితేంద్రియులైన ఆ మహనీయులీవిధంగా మధురకు వచ్చి, ఈ నగరవాసులకు తమ దర్శన మనుగ్రహించడం, సకల సంపత్కరం, శుభకరమని, ఆ మహర్షిని చూస్తూనే -

అక్రూరుడు అంజలి ఘటించాడు. సాష్టాంగ నమస్కారం చేసాడు. మహర్షి కరుణాపూరిత చూపులకు అక్రూరుడు పరవశించాడు. పరిశుద్ధుడనయ్యానని తలంచాడు. తల్లి వద్ద పసిబిడ్డలాగ అక్రూరుడు ఆనందమొందాడు. ఆ తదుపరి మిగిలిన వారినందర్ని అభినందించాడు. అందరిని స్వాగతించాడు.

'అక్రూరా! ఇతడు నా కుమారుడు విదురుడు నీకు తెలుసా ? అప్యాయంగా మహర్షి అడిగారు. వారిని చూస్తూనే అక్రూరుడు పాదాభివందనం చేసాడు. అంతకుమునుపే ఆయన గుణగణాలను, ధర్మనిరతిని విన్న అక్రూరుడు, విదుర దర్శనంతో మరింత మురిసాడు. గుండె నిండుగా రెండుచేతులు వుంచి శిరసువంచి, మరీ అక్రూరుడు నమస్కరించాడు.

కృష్ణద్వైపాయనులవారు, విదురాదులతో అక్రూరుని నివాసానికి వెళ్ళారు. తన భక్తితో, మహర్షికి అర్ఘ్యపాద్యాదుల పూజ సల్పి, విదురాదులకు వారితోపాటు, పూలు, పండ్లు సమర్పించాడు. ఆ తదుపరి మధుర పరిస్థితిని, దేవకీ వసుదేవుల పరిస్థితిని వివరంగా చెప్పాడు. వారున్న భవనానికి తీసుకువెళ్ళాడు కూడా!

వచ్చిన మహర్షిని చూసి, గుండె నిండుగా నమస్కరించి, వారి రాక తమకు సౌభాగ్యంగాను, అదృష్టంగాను తలచిన దేవకీ, వసుదేవులు, మహర్షి ఆశీస్సుల నభ్యర్థించారు. అర్ఘ్యపాద్యాదుల నొసగి, తమ శక్తి మేర భక్తితో పూజించారు. వారిరువురిని మహర్షి నుదుట ముద్దాడి ఆశీర్వదించారు.

అప్పుడు మనశ్శాంతి పొందిన దేవకీ వసుదేవులు తమ దీనావస్థను అన్ని తెలిసిన వ్యాసులవారికి తమవంతుగా వివరించి చెప్పారు. కళ్ళనీళ్ళ పర్యంత మయ్యారు. అంతా విన్న మహర్షి, అన్నీ తెలుసన్నట్లు మందహాసంతో వారిని ఓదారుస్తూ -

“దేవకీ, వసుదేవులారా! భయపడకండి. ధైర్యంగా వుండండి. కష్టాలెవరికీ కలకాలం వుండవు. వుండేది ‘‘కల’’ కాలమే. దురదృష్టం కొద్దీ కంసుడు దుష్టలక్షణాల అసురీ ప్రవృత్తితో జన్మించాడు. అందుకే ఈ బాధలు కష్టాలు. ఇవి తప్పవు. పురాకృత పాపం కొద్దీ వీటిని అనుభవించక తప్పదు. పాపం పండితేనే తప్ప, పుణ్యఫలం దక్కదు.

మీరిద్దరు నాతో వస్తే మంచిది. కానీ అలాగ జరగదు. అంతా కాలమహిమ, నువ్వు ఒంటరిగా వస్తే ఫలితముండదు. దేవకి ఒంటరిదవుతుంది. ఆమెకు ఇటువంటి కష్ట సమయంలోనే నీ అవసరం, అవసరం. నీకు ఆమె అనురాగం తప్పదు. అందుకే నీ బదులు, ఈ అక్రూరుడు నాతో వస్తున్నాడు. ఇదంతా నాకు తెలిసిన విషయమే.

మేము ఇంద్రప్రస్థానికి వెళ్ళాక, అక్కడ అక్రూరుడు తన మనస్సు విప్పి మహావీరుడు ధర్మాత్ముడైన భీష్మునికి తెలియబరుస్తాడు. తర్వాత ఏం జరుగుతుందని ఆలోచించకు. అంతా కాలమహిమ. విధి నిర్ణయం. దాని ప్రకారమే సర్వం సాగుతుంది.’’ అనగా -

“నిజం చెప్పారు. అక్రూరుడు ధర్మాత్ముడే కాదు, నాకు మిత్రుడు కూడా. నాకన్న నా పరిస్థితిని విశ్లేషించి వివరించి చెప్పగల సర్వసమర్థుడుగా నా సోదరుడు.” అనగా వసుదేవుడు, అంతవరకు నిబ్బరించుకున్న దేవకి -

“ముని శ్రేష్ఠా! మీరు సర్వసమర్థులు. శ్రీ సచ్చిదానందులు. సాక్షాత్తు ఆ నారాయణ స్వరూపం - మా అదృష్టంకొద్ది ఇక్కడకు వచ్చారు. మాకు మీ అపూర్వ దర్శనం, అద్భుతమైన ఆశీస్సులు లభించాయి. అవే వేనవేలు. మాకు తారక తరుణోపాయాలని’’ ఆనందించింది. తన అభిప్రాయాన్ని మహర్షికి అందించింది.

ఆమెకు సమాధానంగా మహర్షి “అమ్మా! భర్తను అనుసరించి చరించే స్త్రీ చాలా అదృష్టవంతురాలు. తాత్కాలికంగా బాధలనొందినా ఆమె దేవతా సమానురాలు. సర్వదేవతలు వారికి, ఆ దంపతులకు ఇష్టసిద్ధి కల్గిస్తారన్నారు. అలాగే ఓర్పు ప్రశంస నీయము. శ్రేష్ఠమైనది. దాని ఫలం వెంటనే లభించకపోయినా, ముందు ముందు దాని గొప్పతనం, అనుసరించే వారి కీర్తి ప్రతిష్ఠలు లోకవిదిత మవుతాయి.

“ఓ పుణ్యమూర్తి, మీ మాటలు నిజంగా మాకు ఓదార్పు. ఎంత ఓర్పు నిష్ఠలతో వున్నా సోదరుడు కంసుని ప్రవర్తనమే మమ్మల్ని భయపెడుతుంది. అతడు నా సంతానం మొత్తాన్ని సంహరిస్తాడు. సంతుని చూసుకునే భాగ్యం, మాతృమూర్తిననే భావం నశించిపోతుంది.” అశ్రు నయనాలతో, తన ఆవేదనను వెళ్ళబోసుకుంది. మహర్షి ఆమెను ఓదార్చాడు. వారి వూరటతో ఆమె కాస్త కోలుకుంది.

“దేవకితో, పిల్లా! భయం విడనాడు. కాలజ్ఞానం గురించి ఆలోచించకు. అదంతా నిజమే.

ఆ వెంటనే వసుదేవుడు ఇవి వదంతులా ? గాలి కబుర్లా ? లేక పీడకలా ? అన్న ఆలోచనలనవసరం. దేవఋషి నారదుడు అందర్ని కలువడు. అవసరాన్ని బట్టి, లోకక్షేమాన్ననుసరించి, విశ్వకల్యాణ కర్తయై, తాను తన కార్యాల్ని చక్కబెడతాడు. ఇది సత్యం. అందరు ఆయనను కలహభోజనుడంటారు కానీ అది తప్పు. కారణంలేని కార్యముండదు. కార్యంలేని కలహముండదు.” చెబుతున్నాడు.

“వసుదేవా, నువ్వు చెప్పిందంతా నిజమే. ఇది నాకు ఆనందదాయకం గూడా! పాపభారం పెరిగిపోతుంది. ధర్మరక్షకుని అవతారం ఆవశ్యకం. ఆ అవతరణమెంతో దూరంలో లేదు” అన్నారు మహర్షి.

“ఆ అదృష్టం నాకు లభిస్తుందా ? ఆ అవతార పురుషుడు నా కడుపున పుడతాడా ? ఆ పుణ్యపురుషుని అవతరణంతో నా సోదరుడు కంసుని ఆటలు కడ్తాయా ? నా పిల్లవాడిని బ్రతుకనిస్తాడా?” తన పరిస్థితికి బాధపడ్తూ జాలిగా దేవకి అడిగింది.

వ్యాసులవారు ఒక్కక్షణం మౌనం వహించి, కళ్ళు మూసుకున్నారు. భగవద్ధ్యానం చేసారు. ఆ తదుపరి కళ్ళు తెరచి, “పిల్లా! ఆందోళన చెందకు. నీ విశ్వాసమే నీకు భగవద్రక్ష. ఆ ధర్మరక్షకుడు నీ కడుపునే పుడతాడు. దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తాడు. ఆ జన్మించేది జగద్రక్షకుడే, నీవు చాలా అదృష్టవంతురాలివని” ధర్మం చెప్పి ధైర్యమొసగారు. అందుకామె ఎంతో సంతోషించింది.

# హస్తిన

పవిత్ర గంగాజలాల నుండి వెలువడే సూర్యరశ్మి కాంతులు హస్తినా పురంలోని ఆలయాలపైన, భవంతులపైన ప్రతిబింబిస్తూ, అందాల శోభలతో, కాంతులతో మిలమిల మెరుస్తున్నాయి.

గంగా తీరమందలి కురురాజభవనంలోని, తన ప్రార్థనా మందిరంలో, శంతనురాణి, రాజమాత సత్యవతీదేవి పూజ చేసుకుంటుంది. ముఖాన విభూతి దాల్చిన ఆ మత్స్యగంధికి అరవై సం॥లు దాటినా, పరాశరుని కరుణ వలన ఇంకా అందం, వయోబింకాలు సడలలేదు. ఆనాడు శంతనుని మత్తెక్కించిన ఆమె చందాలపోకడలు, తను కోరుకున్న పరాశర వరప్రభావాన, భర్త గతించినా, పూర్వపు శోభలతోనే వెలుగొందుతున్నది.

కాకపోతే, కట్టుకున్న భర్తా, పిల్లలు మరణించడంతో, విధివంచితురాలివలె విలపించసాగింది. ఇటువంటి సమయంలో రాజమాత సత్యవతికి, కుడి ప్రక్కన భీష్ముడు, ఆమెకెదురుగా, "కృష్ణ" ద్వైపాయన నామ లోకవిదిత వ్యాసుడు దర్భాసనంపై కూర్చున్నారు. ఆయన ప్రక్కన అక్రూర, విదురులున్నారు.

ప్రస్తుత పరిస్థితులలో ఆమెకు మనశ్శాంతిని కల్గించడానికి, సత్యవతి, కుమారుడు "కృష్ణ"ను (వ్యాసునికి రాజమాత సత్యవతి పెట్టుకున్న ముద్దుపేరు) తలచుకుని, తన వద్దకు రప్పించుకుంది. పుట్టడమైతే పుట్టాడు కాని, ఆతని ఆటపాటలు, ముద్దుముచ్చట్లు ఆ తల్లికి తెలియవు. పుడుతూనే మహాజ్ఞానిగా తల్లికి నమస్కరించి "అమ్మా!" నేను తపోభూములకు సాగుతున్నాను. నువ్వు తలచిన తక్షణం కోరుకున్న సమయంలో నిన్ను దర్శించుకోగలనని, తెలియబర్చి వెళ్ళిన పిల్లవాడిపై -

అనుక్షణ మమకారం, ఆలోచనలతో కాలం గడిపిన ఆ తల్లి, ప్రస్తుత గడ్డు పరిస్థితులనుండి తన ఆవేదన తొలగించి, మనశ్శాంతి ప్రసాదిస్తాడని కుమారుడు వ్యాసుని పిలిచింది.

ఏ తల్లి పిలుపుకోసం ఎదురుచూస్తున్నాడో వ్యాసుడు, ఆ తల్లి పిలుపుతో ఆనందమూర్తయ్యాడు ఆ తల్లిని చేరాడు. "అమ్మా! ఎందుకీవేదన. ఇదంతా కాలమహిమ. సహజం. వీటికి బాధపడటం తగదు - నీకేం కావాలో చెప్పు.

అవసరమైనప్పుడు పిలువగానే వచ్చి నీ సేవ చేసుకుంటానన్న నేను, తప్పక నా ధర్మం నిర్వర్తిస్తాను. ఇప్పుడేం చెయ్యమంటావు ?'' తల్లి కళ్ళ వెంట, ఆ నీటిని చూడలేని తనయుడిగా అడిగాడు.

ఎలాగ చూసిన గతమంతా బాధాకరమే. నేనేదో సుఖశాంతులతో వుంటానని, నా తండ్రి దాశరాజు, స్వార్థబుద్ధితో, ఈ గంగాపుత్రుని, మహాభీషణ ప్రతిజ్ఞతో భీష్ముని చేసాడు. వృద్ధిచెందవలసిన కురువంశం క్షీణదశలో సాగుతుంది.

నీ సోదరులు మరణించారు. వారి భార్యలు విధవలయ్యారు. ఈ గంగాపుత్రుడు వివాహం చేసుకోడు. సంతానం పొందడు. "అమ్మా!'' అంటాడు. గౌరవిస్తాడే తప్ప, ఈ గాంగేయుడు నా మాట వినడు. వంశం నిర్వంశమయ్యే స్థితి నా వల్లనే దాపురించింది. ఈ ఉపద్రవం నుండి బయటపడాలంటే, గాంగేయుడు సంసారి కావాలి.

ఒకటికి నాల్గుసార్లు ఆ మాటనేసరికి "అమ్మా! నా విషయం విడిచిపెట్టి, ఈ మహనీయుని ద్వారా కాగల కార్యం, మీ మనోభీష్టం తెలియబర్చండి. అన్నాడు భీష్ముడు -

"ఇదీ నాయనా! ఈ భీషణ ప్రతిజ్ఞని వరుస. అనగా, సత్యవతి - "అమ్మా! అసలు విషయం మీరు పిలిపించిన కారణమంటాడు వ్యాసుడు.

"ఏముంది నాయనా! అన్నీ తెలిసినవాడివి. ఈ కురువంశం సూర్య చంద్రాదులున్నంతవరకు నిలచి వుంటుందని తలంచాను. అది కల్లగా తోస్తుంది. ఎందుకంటావేమో, రెండేండ్ల క్రితం, ధృతరాష్ట్ర, పాండులకు వివాహం చేసాము. వారికి వివాహమయిందే తప్ప ఆ రాణులు, తల్లులయి, ఈ వంశాన్ని తామరతంపరగ పెంచే, పెరిగే మార్గం కలదన్నట్లు కనబడటం లేదు.

"అయితే, ఏమిటి ?'' వ్యాసుడు అడుగుతున్నాడు.

"కుమారా, కృష్ణా!'' అందే కాని, గొంతు వణుకుతుంది. మాట తడబడుతుంది. ఇంకే కావాలి. ధృతరాష్ట్రుడు అంధుడు. ఇది నీకు తెలిసిందే. అతని భార్య గాంధారి గర్భవతయింది. అదేం శాపమో, సం॥రం గడిచింది. అయినా సంతానం లేదు. దీనినేమనాలి ?'' తల్లి ప్రశ్నతో -

"నిజంగా దురదృష్టమంటాడు'' వ్యాసుడు. ఇక పాండు.. అంటూ ఆగిపోయింది.

నేలచూపులు చూస్తూ, కొద్ది కొద్దిగా తేరుకుటూ, ధైర్యం తెచ్చుకుని చిన్నగా చెబుతుంది. అతనికి సంతానం కలుగదు. అదో దురదృష్టకరం. అతనికి గల శాపం తలచుకుంటేనే... ఏమీ చెప్పలేక కళ్ళనీళ్ళ పర్యంతమయిందా తల్లి.

తల్లి కన్నులలోని, ఆ నీటిని చూస్తూ, అనకూడదు కానీ, అంతటి మహనీయుడు, వ్యాసుడు వ్యాకులత చెందాడు. "వూరుకో, అమ్మా!" వూరడించ సాగాడు. పెదవులు బిగపెట్టుకుని, తల్లిని ఓదారుస్తూంటే, అక్కడ - ఆ సమయంలో ఏర్పడిన నిశ్శబ్దాన్ని చేదిస్తూ భీష్ముడు -

"నా జీవితాన్ని ఈ కురువంశాభివృద్ధికి పణంగా పెట్టి నా శాయశక్తులా రక్షించుకున్నాను." ఇప్పుడు - ఈ నిస్సంతు జీవితాలతో, కురువంశ పితృ పితామహులు ఇన్ని తిలోదకాలకు నోచుకోని దుస్థితికి లోనవుతున్నారు. ఈ దురవస్థ నుండి బయటపడే మార్గం, కురువంశం నిర్వంశం కాకుండా, నా కళ్ళముందే, ఘోరాపరాధంగా కూలిపోకుండా వుండాలన్న మా ఆశయం, ఆలోచన" అన్నాడు.

ఈ దౌర్భాగ్యానికి మూలకారణాన్ని, రూపిణిని నేనని "సత్యవతి, కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ చెప్పింది. నా కారణాన్నే, ఈ గాంగేయుడు, భీష్ముడయ్యాడు." మళ్ళీ మొదలెట్టిందనుకున్నాడు భీష్ముడు. భరతవంశ ప్రాభవం వన్నె తగ్గేటట్లుంది. ఆ పరమేశ్వరుడు నన్ను క్షమించడు. ఈ వంశం విశ్వవిఖ్యాతం కావాలి. అందుకేం చెయ్యాలి ? ఇప్పటికి అసలు విషయానికి వచ్చింది, వ్యాసమాత సత్యవతి.

అప్పుడు భీష్ముడు. "వంశాభివృద్ధికన్న ప్రస్తుత పరిస్థితి మరింత భయంకరంగా తయారయిందనగానే ఏమిటి ?" అన్నారు వ్యాసులు.

కుంతి, నిస్సంతు జీవితం గడుపలేక ప్రాయోపవేశం చేస్తానని మొండికెత్తింది. ఇది చాలు భరతవంశ ఖ్యాతి దిగజారడానికి. మన ప్రాభవం తగ్గడానికి. అంతా గందరగోళంగా వుందీ తల్లి పరిస్థితి, దుస్థితి. వ్యాసుడు చూడలేకపోతున్నాడు. వెంటనే ఆమె "ఈ దారుణాలు చూడకుండా, అందరికంటే ముందు నేను పోతే బాగుంటుంది" అంది నిరుత్సాహంతో.

అది వ్యాసుని కలిచివేసింది. "అమ్మా! నేనుండగా నిరాశ ఏల ? సర్వం కాలాధీనమని తెలియదా ? బాధలు నీకొక్కతికేనా ? వూరడిల్లు. నీకు కొండంత అండ ఈ భీష్ముడు. ఈ ధర్మాత్ముడుండగా, ఆందోళనమనవసరం" అంటూంటే-

"కృష్ణా! నిజమే గాంగేయుడు నాకు కొండంత అండే. కాని ఆతడు కూడా, తన పూర్వీకుల సరసకు చేరితే, నేను...." కొంగుతో నోరు మూసుకుంది.

'అమ్మా! పరిస్థితులన్నీ నాకు తెలియనివి కావు. ఇవన్నీ చూసి నాకు బాధగానే వుంది. కానీ, ఈ కురువంశీయులు ధర్మసంరక్షకులు. కురువంశ నాశనమే జరిగితే, అది ధర్మ నాశనమౌతుంది. యుగసమాప్తికి దారి చేస్తుందన్నాడు. ఆ వెంటనే, భీష్ముడు-

"మహర్షి! ప్రస్తుతం ధర్మం మీ చేతుల్లో వుంది. దానిని రక్షించి, మాకు అందించండి. దాని రక్షణమెలాగ చేసుకోవాలో చూసుకుంటాము. దాని ద్వారా మమ్మ రక్షించుకొన ప్రయత్నిస్తా" మన్నాడు. సరయిన దారి చూపమని అర్థించాడు.

అప్పుడు - "ఇక్కడ కుంతి వుందా ?" వ్యాసులడిగారు. "వుంది! అన్న భీష్ముడు, ఇక్కడేం జరిగిదీ, హస్తినాపురానికి తెలియకూడదు. అదే నా ఆలోచన అన్నాడు. కుంతిని చూడమని - ముఖ్యులు బయలుదేరారు.

ప్రక్కనున్న భవనంలో కుంతి శోకమూర్తిగా కూర్చుంది. నిస్సంతు జీవితం, ఎంత వున్నా, ఎంత బాధాకరమో మాకు బాగా తెలుసు. ఒకప్పుడు ఛెంగు, ఛెంగున లేడి పిల్లలా ఎగురుతూ, తన అందచందాల హావభావాలతో, చూపుల తూపులు ప్రసరింపచేసే, వసుదేవుని చెల్లెలు కుంతి... కుంతిభోజుని దత్తపుత్రిక కుంతి... నేడు శోకమూర్తిలా దీనంగా, వ్యాకులత చెందిన మనస్సుతో వుంది.

అటువంటి సమయంలో ఆ దీనురాలినోదార్చడానికి వ్యాసులవారు రాగా, మహర్షిని చూస్తూనే లేచి నిల్చున్నామె, వారి పాదాలకు మ్రొక్కింది. కాని ఆహ్వానించడం మరచిపోయినట్లు, చేతులు కట్టుకుంది. ఆమెను లేవనెత్తిన మహర్షి-

ఆమె తలను, తన అభయహస్తంతో రుద్ది, అప్యాయగా ఆమెను చూస్తూ- ఆమెను కూర్చోపెట్టి, తాను తన దర్భాసనంపై కూర్చున్నాడు. ఆమె వద్దనున్న ముసలి పరిచారికకు తన ఆశీస్సులనొసగి, చెయ్యి వూపగా, నమస్కరించి, ఆ దాసి అక్కడనుండి కదిలింది. అప్పుడు కుంతిని అనునయిస్తూ -

"ఏమిటమ్మా, ఇది!" తల, భుజాలు తడుముతూంటే, తట్టుకోలేని ఆ పిల్ల, కుంతి... భోరున విలపిస్తూ... "నాకు చచ్చిపోవాలని వుంది. నేను బ్రతుకను. నేను చచ్చిపోతాను. చావే నా కిష్టం. నేను చచ్చిపోతాను!" వుద్రేకపడుతుంది. పిచ్చిదానిలాగ అరుస్తూంది, ఏడుస్తూంది. ఆమెను అనునయించ ప్రయత్నిస్తూ-

"పిల్లా! చచ్చి ఏం సాధిస్తావు ? పాండు శాపం నాకు తెలియదా ? నేను మిమ్ము నట్టేట్లో ముంచుతానా ? మీకు సుఖసంతోషాలు కల్గించడం నా బాధ్యత కాదా! నేనొకడిని వున్నానన్న సంగతి మరచినట్లు విడిచి, "చచ్చిపోతానంటే... అది జరిగే పనా ? నీ బేలత్వాన్ని విడిచిపెట్టు....!" మెల్లిగా, దృఢంగా చెబుతున్నారు.

అయినా, ఆవేశం - ఆవేదన కలబోసుకున్న కుంతి -

"ఇక నాకు సంతోషమేమిటి ? అదెలాగ లభిస్తుంది ? ఇక ఈ జీవితమింతే. దీన్ని గడుపలేను. అందుకే చచ్చిపోతాను." అలాగన్న కుంతి - మరుక్షణం వ్యాసునితో "నాకు పిల్లలంటే ఇష్టం. కానీ దురదృష్టం నన్ను వెంటాడినట్లు మూర్ఖించాను. కన్న సంతానాన్ని నేలపాలు చేసుకున్నాను. ఇది మీకు తెలియని సంగతి కాదు.

ఇప్పుడు... ఇప్పుడు... ఆ పాపం కట్టికుడిపినట్లు నిస్సంతును చేసింది. ఈ జీవితం, ఈ బాధ... భరించలేను, బ్రతుకలేను. అందుకే చస్తాననేది. ఓ మహాపురుషా! నన్ను దయచేసి విడిచిపెట్టండి. క్షమించండి. నాకు ఈ ఆలోచనలతో పిచ్చెక్కేటట్లుంది. మీతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నాను. నేనేం చేస్తున్నానో, ఏమవుతుందో, ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. "ఆమె ఆక్రోశం, బాధ.... సర్వం అర్థం చేసుకున్న వ్యాసులు, తన వరదహస్తాన్ని ఆమె శిరస్సుపై వుంచాడు.

ఆ హస్త స్పర్శ ప్రభావం, మహర్షి మందహాసం, కుంతిలోని ఆవేదన తొలగిస్తూ, మంత్రముగ్ధను చేసింది. మెల్లిమెల్లిగా తేరుకుంటూ ఆమె స్వస్థతకు రాసాగింది. అప్పుడు మహర్షి ఆమెను ప్రేమతో చూస్తూ" అమ్మాయీ! నీ మనసు నాకు తెలియదా ? పిల్లలపై ప్రేమ, ఈ ఆవేదన, పిల్లలకై పడే తల్లి తాపత్రయం, సర్వం నాకు బాగా తెలుసు.

కాకపోతే కొద్ది సమయం. కాలమహిమగా కొన్ని ఇబ్బందులు - పరిస్థితులు ఏర్పడతాయి. త్వరలో అన్నీ చక్కబడతాయి. పిల్లల అల్లరి ఆటపాటలు, అభివృద్ధి... ఒక్కటేమిటి వారి జీవితాలలోని కష్టసుఖాలు సర్వం నువ్వు చూస్తావు. కొద్దిగా ఓపిక పట్టు!" అనునయిస్తున్నారు.

ఆ క్షణం కుంతి పిల్లల ప్రపంచంలో తేలిపోయింది. మరుక్షణం సిగ్గుతో తలవంచుకుంది. అడగకూడదు కానీ, ఆ ప్రేమ అలాగ పలుకరిస్తుంది. నాకీ

అదృష్టం ఎప్పుడు సంభవిస్తుంది ? అంటే ఎంత తొందరలో సంతానం కల్గుతుంది.'' సిగ్గుపడుతూనే అడిగింది.

"కుంతీ! ఇందులో సిగ్గుపడాల్సింది, అడగకూడనిది ఏదీ లేదు. అంతా ప్రకృతి సహజం. మాతృత్వ అభిలాష, అంత గొప్పది. అది ధర్మం కూడా. నిస్సంతు జీవితం దుర్భరం. గొడ్రాలి బ్రతుకు ఆక్షేపణీయం. ఆ స్త్రీని చూడాలన్నా "ఆడది'' అని అనాలన్నా కూడా తగదు. గొడ్రాలి నీడ, నిజం చెప్పాలంటే ఒక పీడ. నిస్సంతులైనవారు సంతానవంతుల్ని, పిల్లల్ని చూసి మొదట్లో ఏడుస్తారు. తదుపరి అసూయాపాలవుతారు. ఆ తదుపరి, తమకు దొరకని అదృష్టం మరొకరికి దక్కకూడదని, అడ్డదారులలో నానా ఆగడాలు అపభ్రంశ పనులు చేస్తారు. వాళ్ళు వంశనాశకిలు, లోకకంటకులౌతారు.

కాలం కఠినమైనది. ధర్మం శస్త్రం వంటిది. ఈ ధర్మాన్ని "ధర్మం"గానే పాటించి, ఆచరించాలి. వంశోద్ధరణం గావించాలంటే, సాంప్రదాయ సనాతనాచారాన్ని పాటించాలి. తప్పదు. ప్రతీదీ అనుకూలం కాదు. కాని అనుకూలం చేసుకోవాలి. నేను చెప్పినట్లు ధర్మ పరిరక్షణకు సిద్ధపడితే, అనతికాలంలో నీవు సంతానవతి వవుతావు. పితృపితరులు, అటు ఇటు - ఉభయవంశాలవారు తరిస్తారు.

వ్యాసులవారి అభయం, ఆశ్వాసనంతో, వూరడిల్లిన కుంతి, ఆ మహర్షి ఆజ్ఞ అవశ్యం శిరసావహిస్తానంది. అయితే నా భర్తకు, కురువంశానికి హాని కలిగేటట్లు ప్రవర్తించనందామె.

"తల్లీ! నువ్వు సతివి. నీ సతీధర్మం పాటించు. నీ భర్త ఆజ్ఞానువర్తివై ప్రవర్తించు. సర్వం శుభమౌతుంది. గొడ్రాలి జీవితం సమసిపోతుంది. నా వాక్కు నిజం. ఇందులో అసత్యమిసుమంతయినా లేదు, వుండదని తెలిపారు.''

ఇంకో విషయం. పతి ఆజ్ఞను పాటించే పత్నిని "పతివ్రత'' అంటారు. నీ భర్త ఆదేశం ప్రకారం నడుచుకో. అప్పుడు నేను చెప్పవలసిన మంత్రాలు చెబుతాను. ఆ మంత్ర దేవతలపై నీ దృష్టిని వుంచు. వారు నిన్ను కరుణించి ఆశీర్వదిస్తారు. వారి ఆశీర్వచనాన్ని అందుకో. శరణాగతివికమ్ము. ఆ సర్వేశ్వరుడు తన అపార కృపను, కరుణామూర్తియై ప్రసరింప చేస్తాడు. నీ జన్మ ధన్యమౌతుంది. కురువంశ వృద్ధి జరుగుతుంది. మీ పితృ పితరులు ఉత్తమ శాశ్వతగతుల్ని పొందుతారు.

"అయితే, ఏం చెయ్యాలి ? ఎలాగ చెయ్యాలి ?" పిల్లలు అనేసరికి మాతృత్వం పెల్లుబుకుతుంది. బిడ్డను గుండెకు హత్తుకుని, ఆ మధురిమను శాశ్వతం చేసుకోవాలని కుంతి తపిస్తోంది.

పతియే ప్రత్యక్ష దైవమని భర్త సేవలో తరించే ఇల్లాలు జీవితం శ్లాఘనీయం. సర్వదా పూజనీయం. ధర్మం నిలబడుతుంది. వంశం వృద్ధి చెందుతుంది. ఒకరు గాదు, ఇద్దరు గాదు, అయిదురుగురు పిల్లల ప్రేమను పొందుతావు. చరిత్ర సృష్టించే తనయులతో చరితార్థు రాలవుతావు. ఇది, సత్యవతీ తనయుని వాక్కు. ఇది సత్యం - నీకు శుభ"మని ఆశీర్వదించారు. అంతవరకు భోరుమని విలపించిన కుంతి ఇప్పుడు పరమానంద భరితురాలయింది.

# గోకులం

వ్రజభూమి కరువు కాటకాల నిలయమైంది. పంటలు ఎండిపోయాయి. పశుగ్రాసం కరువయింది. అంతకుమించి యమునా నదే అడుగంటిపోయే దుర్భర స్థితికి వచ్చింది. ఇది దారుణం.

గోకులమంతా విచారగ్రస్త మయింది. పచ్చని పొలాలతో, ప్రకృతి అందాలతో పరవశింపచేసే గోకులం, మరుభూమిలాగ తయారవడం, అందర్ని ఆశ్చర్యవంతుల్ని గావించింది. మరొకప్రక్క భయాన్ని, ఆ భయంకర వాతావరణం కలుగ చేయసాగింది.

పశుగ్రాసం కొరత, బీడయిన పొలాలు, బక్కచిక్కిన గోగణాలు, నీటికొరత... అన్ని గోప, గోపికలలో, యాదవ ప్రముఖులలో కలకలం రేపసాగాయి. ఈ విపత్తును ఎలాగ ఎదుర్కోవాలి ?

యాదవులలోని శూరవంశ ప్రముఖుడైన నందుడు వర్షాభావ పరిస్థితులకు భయపడి, చినుకు కోసం, మోరలెత్తి పెట్టుకున్న పశువుల వలె, ఆశగా, ఆకాశాన్ని, తన పరివారంతో కలిసి పరికిస్తున్నాడు. ఆతని ఎదురు తెన్నులు, కేవలం చూపులే అయ్యాయి తప్ప, వర్షపు "చినుకు" జాడ కనబడటం లేదు.

నందుని, మూడువందల గోగణం, ఒకనాడు మహారాణి సోయగాలతో ప్రకాశించాయి. ఇప్పుడు బక్కచిక్కి కొన్ని బ్రతుకలేక, కొన్ని మోరలెత్తి ఆకాశాన్ని

చూస్తూ మరికొన్ని, కొనప్రాణాలతో ఇంకొన్ని.... దయనీయంగా కనబడుతున్నాయి. అయితే, నందుడు తన కోసం, తన పశుసంపద కోసం బాధపడటం లేదు. గోకులంలోని వారి బాధను, ఒక నాయకునిగా, పితృమూర్తిగా ఎలాగ తీర్చాలన్న బాధ, ఆలోచన, అనుక్షణం పెరిగి కృంగదీయసాగింది.

అతని భార్య, యశోద కూడా, తల్లివలె గ్రామస్థుల దయనీయ స్థితికి తల్లడిల్లుతుందే తప్ప, తను గురించి ఆమెకు, అణువంతయినా ఆలోచన లేదు. కాకపోతే యశోదమ్మ, "అమ్మ" వలె తవకున్న దానిలో, ఏ ఒక్కరు ఆకలితో అలమటించకూడదని తన వంతు ప్రయత్నం తాను చేస్తుంది. ఇంతకు మునుపెన్నడును, ఇటువంటి దారుణ కరువును వారెరుగరు. ప్రభువు దుర్మార్గుడైనా, పాలకులు ప్రజలను పీడించుకు తింటున్నా, నరమేధంతో, దుర్మార్గ ప్రవృత్తితో, స్త్రీ - బాల - వృద్ధులను - అమాయకులను - అనాథలను - హింసించినా, ఇటువంటి దారుణ కరువు సంభవిస్తుందని, పెద్దలు - శాస్త్రాలు చెబుతాయి.

మహాత్ముడైన మహారాజును చెరపట్టి, రాజ్యం చేజిక్కుంచుకుని, పాలనా పగ్గాలు హస్తగతం చేసుకున్న, దుర్మార్గ - సర్వాధికారి - దుష్ట ప్రవర్తన వల్లనే తమకీ అగచాట్లు, దారుణ కరువు కాటకాలు ఏర్పడ్డాయని ప్రజలు వాపోతున్నారు. కొందరైతే ఇంతకంటే ఆపద రాదని, తెగించి బయటకు అనేస్తున్నారు.

ఇదంతా కాలమహిమ. కాలచక్ర ప్రభావమనేకన్న కంస దౌష్ట్యానికి పరాకాష్ట. "మధుర "మధురే" ఈ పాపాత్ముల, దుష్కృత్యాలకు బలి అవుతుంది. దీనికి తగ్గట్లు కంసుడు శిశుహంతకుడయ్యాడు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఇప్పటికే దేవకీ సంతానమైన ఆరుగురు శిశువుల్ని హతమార్చి తన క్రౌర్యాన్ని చాటుకున్నాడు.

ఇప్పుడే ఆ రక్షకుడెవరో... ఆ ధర్మపరిరక్షకుడు... ఇదే సమయంగా, ఈ అధర్మమూర్తి నాశనానికి తరలి రావాలి. తమ పరిస్థితులు బాగుపడాలి. మధుర, పరిసర ప్రాంతాలు, ప్రజలు సుఖసంతోషాలతో వుండాలి. ఇది ప్రజల ధర్మ, పుణ్యమూర్తుల ఆకాంక్ష.

ఇటువటి తరుణంలో ఒకనాడు "శూర" యదు వంశీయుల కులగురువు "గర్గుల" వారు, నందునితో సంప్రదించడానికి, గోకులానికి బయలుదేరారు. ఆ కులగురువుల కళ్ళలో ఆందోళన, విచారం తొణికిసలాడుతున్నాయి. నందుని వదనంలో, ఆనంద దరహాసనం, ప్రశాంతత కొట్టవచ్చినట్లు కనబడుతుంది.

# కరువు - కాటకం

**కు**లగురువు "గర్గాచార్యులు" వచ్చిన మరునాడే, కంసదూతలు వూహించినట్లే గోకులానికి వచ్చారు. ఆ వచ్చినవారు నందుని కంసులవారు రమ్మని ఆదేశించినట్లు చెప్పారు. ఎలాగో తాను మధురకు వెడదామనుకుంటున్న నందుడు, "అలాగే, తప్పకుండా వస్తానని వారికి చెప్పాడు. ఆ వెంటనే ఎనిమిది బండ్లు సిద్ధమయ్యాయి. నందుడు మధురకు బయలుదేరాడు." అతనిని బలాఢ్యులైన "శూర" శౌర్యవంతులు, తమ తమ ఆయుధాలతో అనుసరించారు.

గత ఆరు సం॥గా, కంసునికి కంటిమీద కునుకు లేదు. ప్రాణభయం పట్టుకు పీకుతుంది. ఎవరిని నమ్మాలో, ఎవరిని కాదనాలో అర్థం కావడం లేదు. ఎవరు శత్రువులో, ఎవరు నిజమైన మిత్రులో వూహకందడం లేదు. అందులో ముఖ్యంగా తమ యాదవకుల ప్రముఖులు, వీరులంటే మరింత భయం పట్టుకుంది. ఇది అతని పరిస్థితి.

అటు యాదవులు, తన పీడను వదుల్చుకోవాలని తలుస్తున్నారు. అనుక్షణం వారు తమ రక్షకుని కోసం, ధర్మపరిరక్షకుని కోసం మూగ ప్రార్థనలు చేస్తున్నారు. నిజానికా ధర్మపరిరక్షకుడు జన్మించలేదు. కానీ కంసుడు మాత్రం అనుక్షణం ఆ అవతారపురుషుని చూస్తూనే వున్నాడు. అతన్ని చూసినప్పుడల్లా భయంతో కంపించి, ఉలికి, ఉలికి పడుతున్నాడు.

ప్రతిక్షణం ప్రాణసంకటంగా గడిపే కంసునికి ప్రశాంతి లేదు. మనశ్శాంతి ముందేలేదు. అందరు తన వినాశనం కోరేవారు. అదే భయంకర కలలుగా వస్తున్నాయి. భయంతో అవి అర్ధరాత్రిళ్ళు తట్టి లేపుతున్నాయి. ఈ వులికిపాటు జీవితంతో, రాత్రిళ్ళు నిద్ర లేక, కంటికి కునుకు రాక, ఆ పొందే భయంకర స్థితి, భయపడే దుస్థితి తలచుకుంటేనే గుండె దడదడలాడుతుంది. గుండె ఆగిపోతుందేమో నన్న భయం... అతన్ని పట్టి పీడిస్తుంది.

ఇటువంటి పరిస్థితులలో కరువు విలయతాండవం. రెండు కలిసి ప్రళయ తాండవంగా కంసుని భయపెడుతున్నాయి. దారుణ పరిస్థితులు. ప్రజల సహాయ నిరాకరణ, నిరాదరణ, ఒకవైపు - మరొకవైపు పుట్టబోయే అష్టమ సంతాన - వెఱపు. అవును. ఇప్పుడు పుట్టబోయే వాడు, ఏడా ? ఎనిమిదా ? ఇదొక శంక.

మొత్తానికి శూరసేన వంశీయులు, మెల్లిమెల్లిగా ధైర్యం పుంజుకుంటున్నారు. అశలు, ప్రాణాలు మొత్తం దేవకి మీదే. కంసునికీ ఆమె మీదే దృష్టి, ఇతర బాధాతప్తులకు దేవకి మీదే దృష్టి. అది -

ఆ "అవతార పురుషుని రాక. ధర్మపరిరక్షకుని అవతరణ" దీని కోసం నిరీక్షణ. అయితే నందుడు శూరసేనీయుల ప్రభువు. అందరు ధర్మపరిరక్షకుడైన దైవం కోసం ఎదురు చూస్తున్నా, నందుడు మాత్రం నాయకునిగా తన వుద్దేశం, పెదవి విప్పి బయట పెట్టలేదు. "జరిగేదంతా భగవదేచ్ఛ" అన్నది నంద సిద్ధాంతం. అంతుబట్టని ఆ సిద్ధాంతం, కంసునికి మరో అలజడి.

ఒక్క శూర వంశీయులే కాదు, యాదవ కుల వంశభాగీయులందరు కూడా, కంసుని క్రూర దుష్ట ప్రవృత్తిని గూర్చి తలచే వారందరు కూడా, అవతార పురుషుని ధర్మపరిరక్షకుని, ఆ విశ్వమూర్తి రాకకై ఎదురు చూస్తున్నారు. అందుకనే కంసుడు, నందుని నుండి అతని అభిప్రాయాన్ని రహస్యంగా తెలుసుకోవాలని, అతనికి కబురు పంపాడు.

తన బృందీయులతో మధురకు వచ్చిన నందుడు, రాజదర్శనం చేసాడు. తను తెచ్చిన బహుమతులనందించాడు. తన నమ్మినబంటులైన వీరులతో కలిసి వినయంగా నిలబడ్డాడు. అంతా ఓరకంట, ఓరగా చూస్తున్నాడు కంసుడు. పరిస్థితి నర్థం చేసుకుంటున్నాడు నందుడు.

నదురు బెదురు, ఏ విధమైన వికారాలు లేకుండా నమ్రతగా నిలబడిన నందుని చూసిన కంసుడు "నందా! ఎప్పుడూ నాకు నీ గురించే ఆలోచన. నువ్వు తెలివిగలవాడివని, బుద్ధిమంతుడవని. అవును క్రిందటి సం॥రం నువ్విక్కడకు రాలేదు కదూ. ఎందుకో, తెలుసుకోవచ్చునా ?" మామూలుగానే అడిగాడు. అందుకు సమాధానంగా, నందుడు -

"రాజా! రాకపోవడానికి ప్రత్యేక కారణం లేదు. కరువు కాటకాలతో పరిస్థితులు అస్తవ్యస్తంగా వున్నాయి. ప్రజలంతా అశాంతితో, చీకాకులతో బాధపడుతుంటే, వాళ్ళ క్షేమం చూడవలసి వచ్చింది. దాంతో ఇక్కడికి రాలేకపోయాను." వినయంగా పరిస్థితి వివరించి చెప్పాడు." మళ్ళీ నందుడు -

ఈ కరువు కాటకాలతో పంటలు పండక, గోగణాలకు గడ్డి దొరకక, ఏరులు ఎండిపోయి, ఎటు చూసినా దారుణ కాటకం వెక్కిరిస్తుంటే, ఏం చెయ్యాలో

పాలుపోని దుర్భర పరిస్థితులు. ఈ కరువు కాటకాల బారిపడి పశువులు, అనాధలైన మనుషులు కూడా మరణిస్తున్నారు. ఈ పరిస్థితిలో ఎలాగ ఇక్కడికి రాగలం ? బిక్కుబిక్కుమంటూ, మా దీన విచార వదనాలు మీకెలాగ చూపగలు ? శిస్తు కట్టగలం'' వేడుకుంటున్నట్లు, వినయమూర్తియై నందుడు, పరిస్థితిని వివరిస్తూంటే - కంసుడు -

"చూడండి. ఎక్కడ నుండి తేగలము ?'' అని అనకూడదు. అందరు ఇలాగ ఎగకొడితే, రాజ్యపోషణమెలాగ జరుగుతుంది ? కనుక, దారుణ పరిస్థితులు.. అంటూ చెప్పే కథలు కడుపులు నింపవు. రాజ్య సంరక్షణం గావించవు. కాబట్టి మీరు చెల్లించాల్సిన శిస్తు చెల్లించాల్సిందే'' చాలా కటువుగా, కరుకుగా చెప్పాడు.

"మరో విషయం. మీరు శిస్తు కట్టలేదనుకో. మీ పొలాలు, పశుసంపద, ఇళ్ళు వాకిళ్ళు. నేను లాక్కుంటాను. మిమ్మల్ని నిరాధారులను చేస్తాను. అటువంటి పరిస్థితి తెచ్చుకోకుండా, మా శిస్తు మాకు కట్టండి. లేదో మీ పొలాలు మావి. మా వాళ్ళు ఆ పొలాలు దున్ని పంటలు పండిస్తారు. నష్టపోయేది మీరే. త్రాగునీరు సాగునీరవుతుంది. మీరు గొంతు ఎండిపోయి, విలవిలలాడుతారు. వూపిరందక చస్తారు'' ఇంతటి పరమదుర్మార్గుడు "కంసుడు'' తప్ప మరొకరు లేరన్నట్లు మాట్లాడుతున్నాడు. తన కాఠిన్యాన్ని ప్రదర్శించుకుంటున్నాడు.

"ఓ! రాజా! నువ్వు ప్రభువులకే ప్రభువువు. నిన్ను కాదనగలమా ? నువ్వు సర్వసమర్థుడివి. ఆ సంగతి మాకు తెలియదా ?'' కోపమన్నదెరుగనట్లు మందహాస వదనంతో అన్నాడు. అయినా - మీరు తీసుకుంటానన్న పొలాలు, ఇళ్ళు, పశుసంపద మావి. కానీ మీరు ప్రభువులు కాబట్టి, మాపై అధికారిగా మీ అభిప్రాయాన్ని చెప్పారు.

"రైతే రాజు, ఈ సంగతి ప్రపంచానికి తెలుసు పండించేవాడు పడుకుంటే, పశువులు ఒట్టిపోతే, ప్రకృతి శపిస్తే... అందరూ ఆ బాధ అనుభవించాల్సిందే. ఆకలితో మలమలలాడుతూ, మీ బొక్కసం, ధాన్యాగారం నింపడానికి ఏ ఒక్కరు ముందుకు రారు. ముందా రైతు కడుపు మండకుండా వుంటే, వాడు అవతలివారి గురించి ఆలోచిస్తాడు. ఇది మీకు తెలియని విషయం కాదు.

గతంలో తామెట్లాగా వున్నా, ఈనాడు రాజుగా, ధర్మప్రభువుగా మా మేలు కోరేవారే తప్ప, అధర్మ ప్రవర్తనకు సాహసించరు. ఎందుకంటే అవి శాస్త్ర, ధర్మ విరుద్ధం కనుక. నేను మా పరిస్థితి వివరించి చెప్పాలనుకుంటున్నాను. ఇక్కడికి రావాలనుకుంటున్నాను. దేవుడు దయతలిచినట్లు ప్రభువుల నుండి పిలుపు వచ్చింది. మా బాధలు తొలగుతాయని తలచి, వెనువెంటనే బయలుదేరి వచ్చామన్నాడు.

కంసుడాతని మాటలు వినదలచుకోలేదు. "నందా! ఈ కబుర్లనవసరం. శిస్తు కట్టక తప్పదు. దానిని బలవంతంగానైనా వసూలు చెయ్యడం రాజధర్మం. ఇందులో ఏ అధర్మం లేదు. శిస్తు ఎప్పుడు కడతావో చెప్పు. కాదంటే, నా మొండితనం, అందులోని క్రూరత్వం అనుభవించాల్సి వస్తుంది. మరచిపోకు.

"రాజా! మేము పన్ను కట్టననటం లేదు. మాకు కొంత గడువివ్వండి. పరిస్థితులు సహకరించి, పంటలు పండించుకునే పరిస్థితి వచ్చిన తదుపరి, తప్పక మీకు చెల్లించాల్సిన శిస్తును చెల్లిస్తాం. అంతవరకు కరుణించి, మమ్మి ఆ పన్నుల బాధ నుండి తప్పించండి." ప్రార్థిస్తున్నట్లు అడుగుతున్నాడు.

"అలాగా, సరే వెళ్ళు. ఇపుడు నీకు ఉదారుడనై పన్ను మినహాయించి ఇస్తున్నాను. వెళ్ళు. నీ అనుయాయులతో వెళ్ళి, నీ ఆశ్రితులతో చెప్పు. ఈ కంసుని ఎదిరించినా, ఆజ్ఞను ధిక్కరించినా, ఎదిరించ తలబెట్టినా, నిన్నే కాదు నీ పరివారం మొత్తాన్ని, పరిచారకులు, బంధుమిత్ర సహితంగా వధిస్తాను. జాగ్రత్త!"

"అవును. మీ వాళ్ళందరిలాగ, నువ్వు నా చావును కోరుకుంటున్నావా ?" కంసుడు అడిగాడు. అందులో ఏదో భయం, ఆందోళనను గమనించిన నందుడు "రాజా! ఇపుడా రక్షకుని గూర్చి ఎవరాలోచిస్తున్నారు ? ఎవరాలోచిస్తారు ?

"ఇంకెవరు ? మీ శూరవంశీయులే ఆ ధర్మపరిరక్షకుడు రావాలని, నన్ను తుదముట్టించాలని తలుస్తున్నారు. వాళ్ళను జాగ్రత్తగా వుండమని, హెచ్చరించానని చెప్పు. కంసుని హెచ్చరికకు తలవూపిన నందుడు, తప్పకుండా! అని, నాదొక విన్నపం. ప్రభువులు మన్నిస్తే...!" మెల్లిగా అడిగాడు.

"శూరవంశీయులకు మీ హెచ్చరికను చెప్పమన్నారు కదా... ముందీ విషయంలో మా నాయకుడు వసుదేవుల వారిని కలుసుకోదలిచాను. అదీ మీరు అనుమతిస్తేనే...

"తప్పక కలుసుకోవచ్చు. కానీ, మీ సమావేశంలో ఏ మాత్రం భిన్న పోకడలు కనుపించినా, నన్ను అలక్ష్యం చేసినా, నీ పొలాలలోని ప్రతి అంగుళం నువ్వు

పోగొట్టుకోవల్సి వస్తుంది. జాగ్రత్త'' అన్న కంసుని హెచ్చరికతో తప్పక మీ ఆజ్ఞ శిరోధార్యమన్నాడు.

దాంతో నందుడు, ఆతనితోపాటు "వృష్ణి" వంశ ప్రముఖుడు అక్రూరుడు, శూరవంశీయుల కులగురువులు గర్గాచార్యులవారు, దేవకీ వసుదేవులను కలుసు కున్నారు. వసుదేవుని పెద్ద భార్య రోహిణి, అంతకు మునుపే మాతృత్వమొందిన తల్లి కూడా భర్తను కలుసుకుంది.

వారు వారి వారి బాధలను తలచుకుని బాధపడ్డారు. అందరిలోకి రోహిణి మాత్రం భగద్వాక్యమైన కాలజ్ఞానం నిజం కావాలని భగవంతుని ప్రార్థించింది. రోహిణి, భర్తను ఆ స్థితిలో చూడటంతో బావురుమంది. అనకూడదు కాని, దేవకిని వివాహం చేసుకున్న భాగ్యానికి, ఈ దౌర్భాగ్యం సంప్రాప్తించిందని మనసులో చాలా, బాధపడింది.

మరునాడు, నందునితో కలిసి రోహిణి, గోకులానికి వెళ్ళిపోయింది. మధురకు వచ్చిన నందబృందం అందరు గోకులానికి తిరిగి రాలేదు. ఒక్క నందుడు, రోహిణి తప్ప, మిగిలిన వారందరు, మధురలో వేరు వేరు ప్రదేశాలకు వెళ్ళిపొయ్యారు.

ఆ రోజు రాత్రి..... ఎంతో ధైర్యవంతునిగా ప్రవర్తించిన, కంసుని గుండె దడదడ లాడిస్తూ, వూపిరి ఆగిపోయేటట్లొక కల వచ్చింది. ఆ కలలో -

కంసుడు కత్తి చేతపట్టుకుని వులికిపడుతూ దేవకి ప్రసవించిన గదికి బయలు దేరాడు. అప్పటికే దేవకి ఇద్దరు పుత్రులను ప్రసవించింది. వారు ఎంతో ముద్దొస్తున్నారు. వారిలో ఎనిమిదవ వ్యక్తి, అప్పుడే విరిసిన నల్లకమలంలా నిగనిగ మెరుస్తున్నాడు. క్షణక్షణానికి ఎదుగుతున్నాడు. కంసుని కత్తిపట్టిన చెయ్యి వణుకుతుంది.

జరిగేది అర్థం చేసుకోలేకపోతున్నాడు. ఆ పిల్లవాడి ముఖం తళతళ కాదు కళకళ లాడుతుంది. నెత్తిమీద కిరీటము, చేతిలో చక్రం వున్నాయి. చూస్తుండగానే అచేతనుడైన కంసునిపై ఆ పిల్లవాడు చక్రం విసిరాడు. అది కంసుని తలను నరకడం, అది నేలపై పొర్లడం, కంసుడు, భయంగానే ఆ దృశ్యం దర్శించాడు. రక్తపు మడుగులో వుందా తల. అప్పుడా కుర్రవాడు, ఆనందంగా ఎగిరెగిరి పడుతున్నట్లు విజయోత్సాహంగా నవ్వుతున్నాడు. కల చెదిరింది. ఆ తదుపరి-

అప్పుడు కంసుడు, తన నమ్మినబంటు ముఖ్య అంగరక్షకుడైన ప్రద్యోతిని భార్య, తనకు సమాచార వాహినియైన పూతనను దేవకి సర్వకదలికలను గమనించి తనకు తెలియబర్చాలని వున్నదున్నట్లు చెప్పడంలో దిట్టయిన ఆమెను హెచ్చరించి మరీ నియోగించాడు. ఆమెకు తనకు వచ్చిన కలను కూడా చెప్పి జాగ్రత్త" అన్నాడు. అలాగే -

పూతనకు, దేవకి గర్భం ధరించిందో లేదో తెల్సుకోమని చెప్పాడు. ఆమె తగు విధంగా సమాచారం సేకరించింది. ఇంకో నెలరోజులు ఆగితే విషయం వెల్లడవుతుందని చెప్పింది.

# బలరామ - కృష్ణులు

**దే**వకి, వసుదేవులు పదిరోజులు దీక్షగా "భగవాన్! నీ మాట నిలబెట్టుకోమని ప్రార్థించారు. వ్యాసులవారి మాట పొల్లు పోదు కాబట్టి, మమ్మల్ని కరుణించి, శరణొసగగలదని దేవకి భావించింది.

భవన రక్షకులు, దేవకి, వసుదేవుల ప్రేమకు ఎంతో మురిసారు. వున్నది చెరసాలే అయినా, వారి అవ్యాజ ప్రేమ కాపలావారికి ఆనందమొసగింది. దేవకి, వసుదేవుల అనురాగం, కాపలాదారుల మనసుల్ని కరిగించింది. ఈ కాపలాదారులు, ఆ వచ్చే శూరవంశ యువరాజును చూడటానికి ఎంతో ఆసక్తిని కనబరిచారు.

వీళ్ళకు వ్యాసుని భవిష్యద్దర్శనం కూడా తెలిసి వుండటమొక కారణమైంది. అలాగే అక్రూరుని నిర్మలత్వము, అకుంఠిత విశ్వాసం, వారి విశ్వాసానికి మరింత బలాన్ని చేకూర్చింది. ఈ ఆలోచనలిలా సాగుతున్నాయి. నందుడు వెళ్ళిన పదవనాడు, అర్థరాత్రి సమయంలో, వసుదేవుడు, దేవకి వున్న మందిర భాగంలోని తీరానికి, ఒక పడవ వచ్చింది. అందులో ముగ్గురు వ్యక్తులున్నారు. వారిలో ఒకడు చేతిలో ఒక మూటతో దిగాడు.

వసుదేవునితో సదావుండే అక్రూరుడు, గర్గాచార్యులతో, కలిసి ఆ తీరగట్టు దిగాడు. ఆ వచ్చిన యువకుడు, నేను వృష్టి వంశాధిపతినని తెలిపాడు. "ఏవిటా మూటని ?" అక్రూరుడు అడిగాడు. అంతా మౌనంగా, సంజ్ఞలతో సాగుతుంది.

"ఇది ఇప్పుడే పుట్టిన బాలిక" అని ఆ మూట వివరం ఎంతో మెల్లిగా ప్రక్కవారికి కూడా వినబడని విధంగా చెప్పాడు.

అక్రూరుడు కళ్ళు మూసుకున్నాడు. మనసులోనే మూగగా ప్రార్థన చేశాడు. అక్కడ రక్షణకై వున్న ఇద్దరు కాపలాదారులు వారివద్దకు వచ్చారు. వాళ్ళతో అక్రూరుడు గర్గాచార్యులవారు, ఈ యువకుడిని, యువరాణి దేవకి శ్రేయస్సు నిమిత్తం పూజలు చెయ్యడానికి పిలిపించారుట. ఈ విషయాన్ని కంసులవారితో చెప్పండి. యువరాణి దేవకీదేవి, అతి త్వరలో ప్రసవం చేస్తుందట...!" అన్నాడు. ఈ మాటను విన్న కాపలాదారులు విషయం, కంసునికి విన్నవించడానికి పరుగు దీసారు.

గర్గాచార్యులవారు, ఇద్దరు వృద్ధ స్త్రీలతో, యువ బ్రాహ్మణమూర్తి రాకకోసం ఎదురు చూస్తున్నారు. కొద్ది నిముషాలు వారు గొణుక్కున్నట్లు మాట్లాడుకున్నారు. దేవకీ వసుదేవుల కోసం బయలుదేరారు. దేవకి కళ్ళు మూసుకుని పడుకుని వుంది. ఆమె చెంతన వసుదేవుడున్నాడు. అప్పుడు ఇద్దరు మంత్రసానులతో వచ్చిన గర్గుల వారు, దేవకిని అంతరగృహంలోకి వెళ్ళమన్నాడు.

దేవకి శిరస్సున అభయప్రదానంగా తన చేతిని వుంచి "బాలుడు పుడతాడు." అని గర్గులవారు చెప్పారు. భగవంతుడు నీకు మనో ధైర్యములను ప్రసాదించుగాక అని ఆశీర్వదించారు. అప్పుడు దేవకి -

"గురుదేవా, అనవసరంగా బాధపడకండి. నాకే భయం లేదు. అవసరమైతే నిప్పుల్లో దూకమన్నా దూకుతాను. నాకే ప్రమాదం లేదు, రాదు" ఆమె మాటలు, చిరునవ్వు గర్గులవారి నానందపరచింది. "అనంతుడైన ఆ ఆదిశేషుడు. ఇక్కడ వుండి తనను సంరక్షించాడనుకున్నారు. ఆమె గురుదేవులకు నమస్కరించింది. తన ప్రాణ సంరక్షకునిగా గురుదేవులను, భర్త వసుదేవుని తలిచింది. ఆ మంత్రసానులతో గురుదేవులు వెళ్ళిపోయారు.

ఆ వచ్చిన యువకుడు, తన చేతిలోని మూటను, ఆ వృద్ధ మంత్రసానులలో ఒకరికిచ్చాడు. కొద్దిసేపు ప్రశాంతత. మరుక్షణం ప్రసవ వేదన. ఆ బాధ క్షణక్షణానికి పెరుగుతూ చెవులకు చిల్లులు పొడుస్తున్నట్లుంది. మరి కొంతసేపటికి మళ్ళీ ప్రశాంతత. ఆ క్షణంలో గర్గులవారు, అక్రూరుడు, వసుదేవుడు, ఆ వచ్చిన యువకుడు వూపిరి బిగపెట్టుకున్నారు.

అప్పుడు - అప్పుడే పుట్టిన పిల్లవాని ఏడుపు గట్టిగా వినబడింది. వృద్ధ మంత్రసాని బయటికి వచ్చి, "పుట్టింది పిల్లవాడు, బాగా, బలంగా వున్నాడు. దృఢకాయుడని, బోసినోటితో నవ్వుతూ చెప్పింది. రండి. చూడండి.'' వాళ్ళందర్ని పిలిచింది. తలుపు తట్టి వాళ్ళు ఆ చీకటి గదిలో ప్రవేశించారు. దేవకి అలసిపోయి, నీరసంగా పడి వుంది. ఆమె ప్రక్కన పిల్లవాడు. తొందర తొందరగా, హడావుడిగా ఈ లోకానికి వచ్చినట్లున్నాడా జీవుడు.

కాలహరణం చెయ్యకండి. కాపలాదారులు కంసునికీ వర్తమానం తెలుపడానికి వెళ్ళారు. వారు వచ్చేలోగా "అక్రూరుడు'' అంటున్నాడు. ఆ మాటలు విన్న దేవకి నీరసంగానే "నిజం''. అంటూ ఒక్కసారి ఆ పిల్లవాడిని గుండెలకు హత్తుకుంది. మరుక్షణం ప్రక్కకు వత్తిగిల్లి "తీసుకువెళ్ళండి'' అని మంత్రసానికి చెప్పింది.

ఆ శిశువును మంత్రసాని ఎత్తుకోగానే, ఆ భవనం ప్రతిధ్వనించేటట్లరవ సాగాడు. అతనికి స్నానం చేయించి, క్రింద పడుకోబెట్టారు. గర్గులవారా పిల్లవాడిని తీసుకుని, మెడలో నల్లటి దారం కట్టారు. ఏం పేరు పెడదామని వసుదేవుని వైపు చూసారు. అతడు "దేవకీ ఏం పేరు పెడదామని ?'' అడిగాడు. ఆమె మనోభీష్టం ప్రకారం నడుచుకోవాలనే అభిప్రాయంతో, పేరు గూర్చి అడిగాడు.

అతడు మహా బలవంతునిగా వున్నాడు కాబట్టి ''బల'' అని పిలిస్తే బాగుంటుందంది. "మీ వుద్దేశ్యం'' వసుదేవుడు తమ కులగురువులనడిగాడు. ఆయన నన్నడిగితే సంకటస్థితిలో జన్మించాడు కాబట్టి "సంకర్షణుడు'' అని పిలిస్తే బాగుంటుందన్నారు. వెంటనే వసుదేవుడా శిశువును, గోకులం నుండి వచ్చిన వ్యక్తి కిచ్చాడు. అతడు అక్రూరునితో కలిసి అక్కడనుండి బిరబిర వెళ్ళిపోయాడు.

కంసునికీ విషయం తెలుపదలచి పరుగెత్తిన కాపలాదారులు, ఒకరినుండి మరొకరికి, దేవకి ప్రసవించబోతుందన్న విషయాన్ని అందించారు. అందరిలోకి ఈ విషయాన్ని విన్న కంసుని ముఖ్య అంగరక్షకుడు. పూతన భర్తయిన ప్రద్యోతుడు వులిక్కిపడినట్లు తన తల్పం నుండి దిగ్గున లేచాడు. పరుగు, పరుగున కంసుని చేరాడు. యువరాణి దేవకి ప్రసవించబోతుందని హడావుడిగానే తెలియబరిచాడు.

ఆ వార్తతో కంసుడు మేలుకొన్నాడు. దాన్నొక భయంకర కలగా తలిచాడు. కళ్ళు రుద్దుకుని, చెవులు రిక్కించి కత్తి ఝుళిపిస్తూ, రథాన్ని సిద్ధం చెయ్యమన్నాడు.

అలాగే, అంగరక్షకుల ముఖ్య సేనాని ప్రద్యోతుని, అతని భార్యను తీసుకుని రమ్మన్నాడు. అతనిలోని క్రౌర్యం నశించింది. భయం పట్టుకుంది. దేవకి ఇద్దరు పిల్లల్ని ప్రసవించి వుంటుందని, కల వమ్ముకాదని, పది రోజుల క్రిందట తనకు వచ్చిన కల నిజమేనన్నట్లు వణికిపోతున్నాడు. ఈలోగా రథచక్రాల ఘోష. ఆ ఉదయపు వేళ ప్రశాంతతను భగ్నపరుస్తూ, రోదన చేస్తున్నట్లు వినబడగా, కంసుడు, ప్రద్యోతుడు, పూతనలు, దేవకీ వసుదేవులను బంధించిన భవంతికి వెళ్ళారు.

అక్కడ గర్గాచార్యులవారు, వసుదేవుడు కనబడ్డారు. ఆ భవంతిలో అడుగు పెడుతూనే వీళ్ళను చూసిన కంసుడు "ఎక్కడ ? ఎక్కడా పిల్లలు ?" అరుస్తున్నాడు.

"పిల్లలా ? ఏం పిల్లలు ?" గర్గులవారు అడిగారు.

"దేవకికి పుట్టిన కవలలు ? ఎక్కడా బాలురు ? అసహనంగా, ఆ పిల్లలను చూడాలనే ఆసక్తి కన్న వారి నుండి తన ప్రాణ రక్షణం చేసుకోవాలన్న భయంతో అడుగుతున్నాడు. ఆతని పరిస్థితిని గమనించిన గర్గాచార్యులవారు -

"రాజా! కొద్దిగా ప్రశాంతంగా చెప్పండి. బాలుడెవరు ? దేవకి ప్రసవించింది బాలికను. బాలురను కాదు." వసుదేవుడు మెల్లిగా చెప్పాడు. దాంతో "అబద్ధం చెబుతున్నారు" కంసుడు అగ్గిగుగ్గిలమయ్యాడు. పూతనతో వెళ్ళు. వెళ్ళి నిజమో కాదో చూడు. ఆ పిల్లల్నిలాగ తీసుకురా ఆదేశించాడు. మళ్ళీ వసుదేవ, గర్గులను చూస్తూ "ఏది ? ఆ పిల్ల ?" అడిగాడు.

"ఇదిగో." అని వృద్ధ మంత్రసాని చేతిలో వున్న పిల్లను చూపింది. అది మృతశిశువు. కంసుడా పిల్లను చూసి "ఇది మృత శిశువు." దానిని కళ్ళు చిట్లించి సాలోచనంగా చూసిన కంసుడు, "ఎందుకైనా మంచిది. వీరి మాటలు విశ్వసనీయం కావు. ఈ గదుల ప్రతి అంగుళాన్ని నిశితంగా వెదకండి. అబద్ధమో, నిజమో తేలిపోతుంది. ఇటు పూతనను, ప్రద్యోతుడిని హెచ్చరించాడు.

కంసుని ఆజ్ఞతో మూలమూలలు వెదికారు. వారికేమీ కనబడలేదు. వారి ప్రయత్నం వ్యర్థమయిందిగా తలిచారు. నిరాశతో తన భవనానికి తిరిగి వచ్చిన కంసుడు ఆలోచనలో పడ్డాడు. ఇందులో ఏదో మాయా మర్మముందని తనపై కుట్ర జరుగుతుందని, వూహించని పరిణామాలతో ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. తన ప్రాణానికి ప్రమాదం తప్పదనే స్థితికి వచ్చేస్తున్నాడు. అయినా మొండి ధైర్యం.

కొద్దిసేపు అలాగ ఆలోచించి, ఆలోచించి, కంసుడు అశాంతతను పొందాడు. అయినా ఇది దేవకి సప్తమ గర్భమే కదా! అష్టమ గర్భం కాదు కదా!'' అని అప్పటికి తెప్పరిల్లి, తనను తాను సముదాయించుకున్నాడు. ఈ సప్తమ సంతానం నన్నేం చేస్తుందని తమాయించుకున్నాడు. అయినా సప్తమ సంతానం మృతశిశువవడం...... కంసుని ఆలోచింపచేసింది.

"అవును. నారదుడు, దేవకికి ఆడపిల్లలు పుడతారని ఎక్కడా, ఎప్పుడు సూచించలేదు. ఈ విచిత్రమేమిటి ? ఇందులో ఏదైనా మర్మముందా ? ఎందుకైనా మంచిది. నా జాగ్రత్తలో నేనుండాలనుకున్నాడు. పోనీ దేవకిని చంపేస్తే, తండ్రి, పినతండ్రి ప్రాణాలు విడుస్తారు. ఈ విషయం విన్న యాదవులు ఎదురు తిరుగుతారు. అప్పుడది విప్లవమౌతుంది. అందరు ఎదురు తిరిగితే, ఆ విప్లవాన్ని అణచడం చాలా కష్టం. ఆలోచనలు పరి పరి విధాల సాగుతున్నాయి.

ఇక్కడిలాగుంటే, పసిబిడ్డను తీసుకున్న బ్రాహ్మణ బ్రహ్మచారికి వైద్యం కూడా తెలియడంతో, గుక్కపెట్టి ఏడ్చే ఆ పిల్లవానికి తేనె నాకిస్తున్నాడు. తెల్లవారేలోగా గోకులాన్ని చేరి తన చేతిలోని శిశువును రోహిణికి అందించాడు. ఆ పిల్లవాడిని అందుకుని రోహిణి మురిసింది.

పిల్లవాడికి పాలుపట్టి ఊయలలో పడుక్కోబెట్టి కాస్సేపు మాగన్నుగా నిద్రపోయింది. ఉన్నట్టుండి వులిక్కిపడ్డట్లు కళ్ళు తెరచి చూసింది. ఇటు ఆశ్చర్యం, అటు భయంతో కలవరపడింది. ఉయ్యాలలో వున్న ఆ పిల్లవానికి ఒక పెద్ద పాము పడగ విప్పి గొడుగు పట్టింది. బిత్తరపోయి నోటమాటరాక చూస్తూ నిలబడిపోయింది. తేరుకున్నాక, అరిస్తే ఆ పాము పిల్లవానికి ఏమైనా ప్రమాదం కల్గిస్తుందేమోనని భయపడి లోలోపలే విచారించసాగింది.

కాస్సేపు అలాగ ఛత్రం పట్టిన ఆ పాము మెల్లగా, ఈ మనుషుల హడావుడికి జారుకుంది. అప్పుడు పరుగున పిల్లవాడిని చేరిన రోహిణికి తన పిల్లవాడు ఆదమరచి నిద్రపోవడం, పెదవుల తెలి నవ్వులు ఆమె ఆందోళనను హరించి వేసాయి.

# "గాలి" దుమారం

ఉన్నట్టుండి వ్రజభూమిలో పెనుగాలి వీచడం మొదలుపెట్టింది. ఏవిటీ అనుకోని గాలి దుమారమని ప్రతి ఒక్కరు తమలో తాము తర్కించుకుంటూ ఆందోళన పాలవుతున్నారు. ఇక్కడ వసుదేవుని భార్య దేవకి, అష్టమ గర్భశిశువును ప్రసవించడానికి తగిన రంగం సిద్ధమౌతుంది. అంతా హడావుడి. దానికి తగ్గట్లే వుంది వాతావరణం.

అదృష్టం కలిసి వస్తున్నట్లు, కాలం నడుస్తూంది. దేవకిలో తెలియని ఆనందం, శరీరంలో చిత్రమైన మార్పు. శరీరంలోని ప్రతిభాగం, అణువణువునా, తెలియని చెప్పలేని ఆనందంతో పరవశిస్తుంది. కళ్ళు ధ్యానస్థులౌతున్నాయి. నిద్రలో, మెలకువలో కూడా భగవత్స్వరూపమే ఆమె కన్నుల ముందు నడయాడుతుంది.

మరొక ప్రక్క, ఈ ఆనందంలోనే ఆందోళన. నిజంగా ఆ పరమాత్మ నా కడుపున పుడతాడా ? ఈ దురదృష్టవంతురాలికంత అదృష్టమా ? నిజంగా ఆ భగవంతుడు జన్మించి, నన్ను, ఈ యాదవులను కరుణిస్తాడా ? ఆ దుష్ట కంసుని కడతేరుస్తాడా ? లేక ఈ పిల్లవాడు కూడా కంసుని క్రూరత్వానికి బలి అవుతాడా? అపరిపక్వమానసస్థితిలో దేవకి ఆందోళనాపూరిత అయింది.

అయినా ధైర్యం సడలటం లేదు. నారదుని వాక్కు, వ్యాస మహర్షి కాలజ్ఞానం వట్టిపోదు. భగవంతుడు తప్పక అవతరిస్తాడు. మమ్మల్ని కరుణిస్తాడు. "అవును, కాదు"లు రెండు తానే అయింది. సంశయాలు - సందేహాలు సమాధానం కూడా తానే అయింది.

దేవకి ప్రసవించే సమయం దగ్గర పడుతున్న కొద్ది నిరంతరం భయపడే కంసుడు, తగు విధమైన జాగ్రత్తలు దృఢంగా చేపడుతున్నాడు. దేవకి వసుదేవుల నిర్బంధంలో వున్న పరిచారకులను, కావలివారలను తొలగించాడు. గతంలోవలె మంత్రసాని లేదు. పూతనను నియోగించాడు. తనకు అమిత నమ్మకమైన అంగరక్షకులను కాపలాదారులను చేసాడు.

"పూతన" ను చూడగానే, రోతగా దేవకి అసహ్యించుకునేది. ఆమెను తన దరిదాపులకు రాకుండా నిరోధించేది. వసుదేవుడు కూడా ఆమె ఒంటరిదన్న

భావాన్ని తొలగిస్తున్నాడు. తను స్వయంగా తన ముద్దుల భార్యకు కావలసిన విధంగా ప్రవర్తిస్తూ ఆమెకు ఆనందాన్ని కల్గిస్తున్నాడు. తన ప్రేమతో, ఆమె అనురాగాన్ని చూరగొంటున్నాడు. ఆమె ప్రార్థనలలో పాలుపంచుకుంటూ - ఆమెకు అసౌకర్యమన్న మాట కలుగనీయకుండా ప్రవర్తిస్తున్నాడు.

ఎల్లప్పుడు, ప్రతి సాయంసంధ్యవేళ దేవకి ప్రక్కనే వుంటూ, యమునా జలాలను వీక్షిస్తూ గత ప్రాచీన పురాణ పురుషులను తల్చుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. భగవంతుని కథలను, ఆయన లీలలు అనుక్షణం తలచుకుంటూ, ఆ భగవత్కరుణను పొందాలని తపిస్తున్నారు. పరమాత్మను తలచుకున్న క్షణంలో ఆ సర్వేశ్వరుడు తమ ముందు నిల్చుని తమను అనుగ్రహిస్తున్నట్లు తలంచేవారు.

ఆ దేవదేవుని అపార కరుణా దృష్టి తమ మీద ప్రసరిస్తున్నట్లు భావించేవారు. ఇంకా చెప్పాలంటే ఆ భావనలో లీనమై పరవశించేవారు. దేవకీ వసుదేవులే కాదు, మధురాపురవాసులు, పరిసర గ్రామ ప్రజలు, కంసుని దౌష్ట్యాల నుండి తమను రక్షించే పరమాత్మ అవతరణకోసం అనుక్షణం తపిస్తున్నారు. ఆ దివ్యసుమూహూర్తం కోసం, కళ్ళు కాయలు కాచేటట్లు ఎదురుతెన్నులు చూస్తున్నారు.

దేవకి గర్భ శిశువును కంసుడు చంపే ప్రతిక్షణం, కంస నాశనానికి, ధర్మ ప్రతిష్టాపనానికి, సాధు సత్పురుషులు పరమ భాగవతోత్తములు చేసే ప్రార్థనలంతా ఇంతా కావు. ఇప్పుడా కంసుడు తన క్రూరచేష్టలతో దుర్మార్గంగా ప్రవర్తిస్తే, తమ పిరికితనాన్ని విడనాడి కంసుని తుదముట్టించాలనే దృఢనిశ్చయానికి ప్రజలు, యాదవ ముఖ్యులు వచ్చేసారు.

యమునకు అటు ఇటు వున్న మహర్షి సంఘాలు పుణ్యామూర్తులు, తమ తపోశక్తిని, అర్ఘ్యాలను పరమాత్మకర్పించి, ఆయన అవతరణం కోసం, "కాయేన వాచా మనసైంద్రియేర్వా" అని శరణాగతులౌతున్నారు. బ్రాహ్మణులు, వేదమూర్తులు, ఆ వేదవేద్యుని అవతరణ కోసం అనుక్షణం శ్రవణ మననాల జపిస్తున్నారు. స్వస్తి వాచకాల శుభముహూర్తం కోసం ఉత్కంఠతో వూగిపోతున్నారు.

ఈమారు కంసునిలో కూడా ధైర్యం జావగారిపోయింది. ప్రతిక్షణం భయ కంపితుడౌతున్నాడు. అతని దుష్టచేష్టలు, క్రూర పన్నాగాలు ఏ ఒక్కరికి నచ్చడం

లేదు. శత్రువులను ఇబ్బడి ముబ్బడిగా తయారు చేస్తున్నాయి. రోజు గడుస్తున్నకొద్దీ విప్లవ వాక్యాలు, అపశకునాలు. ఏ క్షణంలో ఏం ప్రమాదం ముంచుకొస్తుందోననే భయం, దినదినగండం నూరేళ్ళు ఆయుష్షులా కంసుని పరిస్థితి తయారయింది.

చివరకు ప్రతి చిన్న విషయానికి ఆగ్రహమొందడం, మొదలుపెట్టాడు. నిద్ర రావడం లేదు. గుండె కొట్టుకుంటుందో లేదో తెలియడం లేదు. అసహనం, అశాంతి వెంటాడుతున్నాయి. అందరు విరోధులుగాను, హంతకులుగాను కనుపిస్తున్నారు. దేవకీ, వసుదేవులకు కాపలాగా వుండేవారిని ప్రతి నిత్యం మార్చేస్తున్నాడు. ఎవరినీ నమ్మలేక పోతున్నాడు. ఇంకా చెప్పాలంటే, కంసుని మీదే కంసునికి నమ్మకం పోయింది.

ఒక్క కులగురువులు గర్గాచార్యులవారు తప్ప మరెవ్వరు చూడడానికి వీలులేని ఆంక్షలు. అక్కడ అంతరంగిక దాసిగా వున్న పూతన దేవకి పరిస్థితిని, అనుక్షణం కంసునికి అందచేస్తుంది. అష్టమ గర్భ శిశువును అంతమొందిస్తే ఏర్పడే విపరీత పరిణామాలను ఎదుర్కోవడానికి, ఆ ఆందోళన అణచడానికి కీలక స్థానాల్లో మగధ వీరులను నియోగించాడు. నిర్దాక్షిణ్యంగ పరిస్థితిని ఎదుర్కోమని ఆదేశించాడు.

ఇంకా పరమాత్మ అవతరించలేదు. అవతరణకు ముందు అవతరించే ముందటి పరిస్థితిని కంసుడు ఎదుర్కొన సమీక్షిస్తున్నాడు.

అది శ్రావణమాసం. బహుళ అష్టమి. ఎనిమిదో తిథి, నక్షత్రం “రోహిణి”. ఆనాడు ఉరుములు, మెరుపులతో, చినుకులుగా వర్షం ప్రారంభమయింది. ఈదురు గాలులు వీస్తున్నాయి. పగటిపూట మధ్యాహ్న సమయం తుఫాను వాతావరణం నెలకొంది. యధాప్రకారం కులగురువు గర్గాచార్యులవారు, తమ నిత్యనైమిత్తిక కార్యక్రమాలు నిర్వహించడానికి వచ్చారు. వెడుతూ, వెడుతూ ఏదో చెప్పి వెళ్ళారు.

“వసుదేవా!” ఇది దేవ రహస్యం. జాగ్రత్తగా విను. ఆ పుట్టేది విశ్వాత్మకుడైన విష్ణువు. అతని లీలలు మహామహులకే అర్థం కావు. మనం సామాన్యులం. దుష్ట శిక్షణార్థం, ఆ పరంధాముడే భూమిపై అవతరిస్తున్నాడు. అతనికి సహాయంగా సర్వదేవతలు, సామాన్య యాదవులవలె జన్మిస్తున్నారు.

ఇదంతా దేవరహస్యం. భగవంతుడు అవతరించగానే, సమస్త లోకాలు, జీవులు సంతోషిస్తారు. అన్ని శుభ చిహ్నాలతో ప్రకాశిస్తాయి. అందరిలో తెలియని ఆనందం తొణికిసలాడుతుంది.

ఇక్కడ ఆ ప్రభువు సుఖంగా వుండలేడు. కాబట్టి, పుట్టగానే గోకులంలో, యశోద ప్రక్కలో ఈయనను వుంచి, అక్కడ పుట్టిన యోగమాయను ఇక్కడికి తీసుకురావాలి. ఇందుకు ఏ అవాంతరాలు కలుగవు. ఇబ్బందులు వుండవు.

ఇదంతా ఆ ప్రభువు ఆదేశం ప్రకారం నడిచే ఆట. ఈ మొత్తం పూర్తవగానే అష్టమ శిశు జననం లోకవిదితమౌతుంది. మీ పురాకృత పుణ్యంకొద్దీ ఆ దేవదేవునికి తల్లిదండ్రులౌతున్నారు. నందుని అదృష్టం కొద్దీ, ఆ పరమపురుషునికి నంద, యశోదలు పెంపుడు తల్లిదండ్రులౌతున్నారు.

కనుక ఈ పరమరహస్యాన్ని ప్రాణప్రదంగా చూసుకో. ఆ తర్వాత జరిగేది, భగవత్ చిద్విలాసం. చూడటమే మనపని. నడిపించడం ఆ దేవదేవుని పని. అందుకే, ఆ దేవదేవుడు, అదృష్టంకొద్దీ దేవకీ సుతుడౌతున్నది.

అంతే ఆ క్షణం నుండి వాతావరణం మారిపోయింది.

సన్నగా ప్రారంభమైన వర్షం క్రమంగా పెరుగుతూ, పెరుగుతూ, కుండ పోతగా కురుస్తుంది. సూర్యాస్తమయం కాలేదు కానీ చీకట్లు ముసురుకున్నట్లు, నగరం చీకట్లో చిక్కుకుంది. ప్రొద్దున్ననగా ఇంటికి వెళ్ళిన పూతన కుండపోత వర్షంతో దారులన్నీ జలమయమవడంతో, తన ధర్మ నిర్వహణకు రాలేదు. భవన రక్షకులు చలికి వణుకుతున్నారు. తలుపులు బిగించుకుని లోపల వుండిపోయారు. ప్రధాన ముఖ్య ద్వారాలన్ని ఏ విధమైన కాపలా లేక బోసిగా వున్నాయి.

రాజభవనంలోని భవనాలన్నీ నూనె దీపాలతో గుడ్డి వెలుగులో వున్నట్లున్నాయి. ఎక్కడ కళాకాంతులు కనబడటం లేదు. ఇటువంటి సమయంలో దేవకి వున్నట్టుండి లేచి కూర్చుంది. ఆమె భవనంలోని దీపాలు గాలికి వూగిసలాడు తున్నాయి. దేవకి భర్త వసుదేవుని చేతిని తన చేతిలోనికి తీసుకుంది. వచ్చే వచ్చే నొప్పులను తట్టుకుంటూ ఆనందబాష్పాలు రాల్చుతూ, భర్తను ఆరాధనా పూర్వకంగా చూసింది. తెలియని, చెప్పలేని, అవ్యక్తానందం.

భర్తను చూస్తూ "మహాత్మా! భగవంతుడవతరిస్తున్నాడు. ఉండుండి వచ్చే ప్రసవ నొప్పులను అణుచుకుంటూ ఆనందంగా దేవకి చెప్పింది. ఆమె మాటలకు అమితానందపడిన వసుదేవుడు, ఆమెను మెల్లిగా ప్రక్కగదిలోకి తీసుకువెళ్ళాడు. అప్పుడు అర్థరాత్రి. వర్షం కురుస్తూనే వుంది. మెరుపులు మెరుస్తూనే వున్నాయి.

అభిజిల్లగ్నం. ఏ విధమైన ప్రయాస లేకుండా దేవకి సుఖప్రసవం చేసుకుంది. బాలుడు పుట్టాడు. ఆ సమయంలో వసుదేవుడే మంత్రసాని అయ్యాడు. తమ ఆశల బాలుడు, వూపిరి పిల్లడు, రక్షకుడు, అవతార పురుషుడు, ఆ భగవంతునిపై ఎన్నో ఆశలు. సర్వ శుభలక్షణాలతో, నీలమేఘునిగా ఆ పిల్లవాడు జన్మించాడు. అందరి పిల్లలవలె, ఆ పిల్లవాడు పుట్టగానే ఏడ్వలేదు. ఏడిచే వార్ని ఓదార్చడానికి వచ్చినట్లు ఎంతో ప్రశాంతంగా వున్నాడా పిల్లవాడు.

ఆ పిల్లవాడిని చూసిన వసుదేవుడు అప్రతిభుడయ్యాడు. అక్కడ పిల్లవాడు కనబడటం లేదు. అతని స్థానంలో ఆ పరమాత్మ ఆ విశ్వాత్ముడు. ఆ శ్రీహరి, శ్రీమన్నారాయణుడు, చతుర్భుజుడై దర్శనమిస్తున్నాడు. వేదవ్యాసులవారు చెప్పిన భవిష్యద్వాణి నిజమైంది. ఆ పరమాత్మే అవతరించాడు.

వసుదేవుడు తనను తాను గిల్లుకున్నాడు. ఇది కలకాదు, నిజం. పిల్లవాడిని దేవకి ప్రక్కన పడుకోబెట్టి, అక్కడున్న నూనె దీపాలను తీసుకున్నాడు. వాటితో ఆ పరమేశ్వరునికి హారతిచ్చాడు. యమునా జలాల నుండి ఏదో దివ్యకాంతి ప్రసరిస్తున్నట్లు తలిచాడు. మళ్ళీ పిల్లవాడిని తీసుకున్నాడు. శుభ్రం చేశాడు.

ఆ పిల్లవాడిని వూలుగుడ్డలో చుట్టి తట్టలో పెట్టుకున్నాడు.

"దేవకీ!" నేను బయలుదేరుతున్నానన్నాడు. ఎలాగ వెడతారు అడిగిందామె. ఒక మూల వర్షం పడుతుంది. యమున పొంగి ప్రవహిస్తుంది." అంది అమాయికంగా.

"చూడు. అంతా ఆ భగవంతుని ఇష్టం. ఆయనాలోచన ప్రకారం సాగుతుంది. మనం నిమిత్తమాత్రులం. సాధారణ మానవులం" అని కాపలాదారులు ఎలాగున్నారో చూడాలనివెడితే, వాళ్ళందరు తమ తమ గదులలో సుఖనిద్రలో వున్నారు. పూతన ఇంకా రాలేదు. రాజభవన ప్రధాన ద్వారాలన్నీ తెరచే వున్నాయి.

వసుదేవుడు, పిల్లవానికి శాలువా కప్పాడు. తట్టలో పెట్టుకుని, మరోగుడ్డ కప్పాడు. ఆ తట్టను తలపై పెట్టుకుని అడుగులు వేస్తున్నాడు. రెండు ఫర్లాంగుల

దూరం గోకులానికి వెళ్ళడానికి వీలుగా, యమున రెండుపాయలుగా విడిపోయి దారినిచ్చింది. అప్పుడే పుట్టిన ఆ పిల్లవాడు ప్రశాంతంగా కాలిబొటనవ్రేలు నోట్లో పెట్టుకుని సుఖంగా నిద్రపోతున్నాడు.

యమున దాటాడు. అక్కడ గర్గులవారు, నందుడు ఎదురు చూస్తున్నారు. గర్గులు, వసుదేవుని చేతిలోని తట్టను తీసుకుని మరొకటి ఇచ్చాడు. "ఇదెవరి బిడ్డ ?" వసుదేవుడడిగాడు. ఇది యశోదకన్న ఆడపిల్ల ?" అన్నాడు నందుడు. అందుకు ప్రతిగా "నందా, నీ ఋణమెలా తీర్చుకోనన్నాడు. సమాధానంగా వసుదేవుని పాదాలకు నమస్కరించి, 'రాజా!' అది నా ధర్మమన్నాడు.

ఆ తట్టను గర్గుల వారినుండి అందుకున్న వసుదేవుడు అందులోని పిల్లను చూసాడు. ఆనందభరితుడయ్యాడు. అందమైన పిల్ల. చక్కని కళ్ళు. తెలియని మమత ఆమెపై కల్గింది. అక్కున చేర్చుకున్నాడు వసుదేవుడు.

అవతరణ జరిగింది. అవతారపురుషుడు జన్మించాడని పొంగిపోయాడు. పిల్లను తీసుకుని, ఇందులోని ఆ భగవతత్వమేమిటో, తెలుసుకోదలచి, ముందడుగు వేసాడు.

ఈ సమయంలో కంసుడు భయవిచారగ్రస్తుడయ్యాడు. సంవత్సరాల తరబడిన, అతన్ని కుదిపేసిన భయంకర కల రూపుదాల్చుకోబోతుంది. నారదుని మాటలు నిజమయి, అవతారపురుషుడు జన్మిస్తే, తన ప్రయత్నాలన్ని వమ్ముచేసి తనను చంపేస్తే - అనవసర భయాందోళనలతో అవిశ్రాంతుడయ్యాడు.

అయినా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కాలగమనాన్ని, కర్మ విధానాన్ని రూపుమాపడ మెవ్వరికీ సాధ్యం కాదు. నమ్మినబంట్లు, ప్రాణమిచ్చే పరిచారకులు, ప్రాణాలు లెక్కచెయ్యని వీరులు, చీమకూడా దూరలేని, దాటలేని పహారా....

అయినా.... ఆనాడు శ్రావణ బహుళ అష్టమి, అర్ధరాత్రి రోహిణీ నక్షత్ర ఘడియలలో.... కంసుని ప్రాణాలు ఆతనిలో లేనట్లు, వూపిరి ఆగిపోతున్నట్లు, వుండుండి భయపడుతున్నాడు. ప్రాణభయంతో ప్రతిక్షణం నరకమనుభవిస్తున్నాడు. ఉరుములు మెరుపులు, అదర గొడుతున్నట్లు వూదరగొడుతున్నాయి. ప్రతి మెరుపు కంసునికదొక ఉత్పాతంలా కనబడసాగింది.

గుండెలు చిక్కబెట్టుకున్నాడు. అయినా దడదడ. ఆగని దడ. వూరికే పిచ్చివాడిలా భవనంలోని తన గదిలో విశ్రాంతి తెలియనట్లు, కాలుకాలిన పిల్లి... అంటారే ఆ రకంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. దేవకి తన ప్రాణహరుడిని ప్రసవిస్తుంది. ఎన్నాళ్ళ నుండో ఎదురుచూస్తున్న - ఆ - డింభకుడు వూపిరి పోసుకుని ఈ నేలపై పడతాడు. అదే తన చావుకు ముహూర్తం. అతనిని నేలమీద పడకుండా చూడాలి. పొరపాటున పడ్డా వెంటనే అంతం చెయ్యాలి.

జోరీగల రొదలా ఆలోచనలు, వూపిరాడని విధంగా సాగుతున్నాయి. ఇప్పుడు కంసుని ఆపదనాపగలవారెవ్వరు లేరు. తన వాళ్ళనేభార్యలు కూడా భయభ్రాంతులౌతున్నారు. నమ్మినబంట్లు, విశ్వాసపాత్రులు కూడా కంసుని చూసి భయపడుతున్నారు. దాంతో అతనిపై అతనికి భయమేర్పడింది. అయినా మనసును చిక్కబెట్టుకుంటున్నాడు. తనకు తాను సర్దిచెప్పుకుంటున్నాడు.

దేవకి ఈ అష్టమగర్భం నశించిందో, ఇక నాకు ప్రమాదము, పీడ లేదన్న స్థితికి వచ్చాడు. కానీ, గండం గడవాలి కదా! ప్రశ్నా - సమాధానాలు, "అవును కాదు" లతో వుక్కిరి బిక్కిరి అవుతున్నాడు. అప్పుడు తన గదిలోకి కొద్దిగా వెలుగు రావడంతో అదొక శుభసూచకమనుకున్నాడు.

ఉదయాన్నుండి వాతావరణం మారిపోయింది. చినుకు, చినుకు.... గాలి, వానగా తయారయింది. ఆ వాతావరణంలో తలుపులు బంధించుకుని కూర్చోవడం తప్ప, బయటికి తలపెట్టి వాతావరణాన్ని గమనించే స్థితి కనబడటం లేదు. ఇప్పుడు "పూతన వచ్చి, దేవకి, బాలునికి జన్మనివ్వలేదంటే, ఇది మరీ విచారకరం. ప్రతిరాత్రి కాళరాత్రిగా ప్రాణం తీసుకోవడమౌతుంది. అనవసరాలోచనలతో వణికిపోతున్నాడు. సరిగ్గా అటువంటి సమయంలోనే పూతన వచ్చింది.

కంసునికి విజయం పల్కింది. "మహారాజా! యువరాణి దేవకీదేవికి ఆడపిల్ల పుట్టింది" అని మెల్లిగా చెప్పింది. ఆ మాట వినగానే "ఆడపిల్లా! నిజమా ? నువ్వు చూసావా ? నిర్ధారించుకున్నావా ? కంసుడు ప్రశ్నలు సంధించాడు. ఎప్పటి పరిస్థితిని అప్పుడు చాడీలు, కొండెములు కాక వున్నది వున్నట్లు చెప్పే పూతన, తనను సంబాళించుకుని -

"నిజం మహారాజా! అంతా నా సముఖంలోనే జరిగింది" అని అబద్ధం చెప్పింది.

అయినా కంసునికి నమ్మబుద్ధివేయడం లేదు. పుట్టాల్సింది పిల్లవాడు. పుట్టింది ఆడపిల్ల. ఏవిటీ చిత్రం ? ఇది దేవమాయా ? ఏమైనా సరే. పుట్టిందెవరైనా సరే. శతృశేషం లేకుండా అంతం చేయడం, తన విధిగా తలంచాడు. రథం సిద్ధం చేయమని అరిచాడు. ఆయుధం వంటి బెత్తమందుకున్నాడు. దేవకి వసుదేవులున్న భవంతిని చేరాడు.

పెద్దపెద్ద అంగల్తో దేవకిని బంధించిన ప్రదేశాన్ని చేరాడు. "ఎక్కడా పిల్లా, ఇలాగ తే!" రంకెలు వేస్తున్నట్లడిగాడు. అప్పుడు వసుదేవుడు "యువరాజా! పుట్టింది పిల్లవాడు కాదు. పిల్ల. అన్యాయంగా అమాయకురాలైన ఆడపిల్లను సంహరించడం తగదు. దయచేసి....!" ప్రార్థిస్తున్నాడు.

"ఎవరైతే నాకేమిటి ? ఇది దేవకి అష్టమగర్భం. నా ఆనవాయితిగా దీనిని అంతం చెయ్యాల్సిందే. పాపం-పుణ్యాలు మీనమేషాలు లెక్కించడం తగదు. ఇవ్వు!" గద్దించాడు. పిల్ల పడుకున్న ఉయ్యాల దగ్గరకు వెళ్ళి, ఆమెను చేతిలోకి తీసుకో బోతుంటే -

"అన్నా! తగదు. ఇది ఆడపిల్ల. మేనల్లుడు కాదు. మేనకోడలు. దయవుంచి, నాకు, కనీసం ఈ పిల్లను చూసుకుని బ్రతికే అదృష్టాన్ని ప్రసాదించు. ఇన్నాళ్ళు నీకు ఎదురాడలేదు. నిన్నడ్డగించలేదు" ప్రాధేయపడుతుంది.

"ఈ ఏడుపులు, పెడబొబ్బలు, ఈ కంసుని కరిగించవు. పరిస్థితిని ప్రశాంతత బరచవు" అంటూ, పిల్లను వూయల నుండి తీసి కాళ్ళు పట్టుకుని, తలక్రిందులుగా వ్రేలాడేటట్లు పట్టుకున్నాడు. పైకి విసిరి కత్తిమీద పడేటట్లు చెయ్యడమో లేక కఠినుడై బండమీద బాదడమో... చేద్దామనుకునే తరుణంలో, గుండెలో అలజడి. చేతులు వణకడంతో ఆశ్చర్యపోయాడు. అయినా తెగించి, ఆ పిల్లను నేలకేసి కొట్టాలనుకునే ఎడం చెయ్యి తిమ్మిరెక్కి, కదలనని మొరాయించినట్లయింది. అప్పుడు -

అప్పుడా బాలిక, ఆతని చేతుల నుండి జారి, కీచుమనే వింత అరుపుతో, మహాభయంకరంగా, వికటాట్టహాసం చేస్తూ, జారిన పిల్ల, అలాగే పైకి ఎగిరింది. కిటికీగుండా బయటకు వచ్చి, తల ఎత్తి చూసే విధంగా గాలిలో నిలబడింది.

అప్పుడా పిల్ల, ఒకరూపు దిద్దుకుని, మహాభయంకరంగా కనుపించింది.

"మూర్ఖుడా! నేను యోగమాయను. విశ్వవిజేతను. నన్ను నువ్వు చంపగలవా"? నీ తలదన్నేవాడు నాతోనే పుట్టాడు. మరొక చోట పెరుగుతున్నాడు. సమయం చూసుకుని నిన్ను చంపుతాడు!" ఆ హెచ్చరికతో, కంసునికి శాశ్వతంగా ఆ యోగమాయ నిద్రలేకుండా చేసింది. ఇక కంసునికి మిగిలింది, కలవరింతలు పలవరింత అలజడి, దడదడలే!

యోగమాయ హెచ్చరికతో కంసుని నరనరాలు చచ్చుపడ్డాయి. కదలలేక పోతున్నాడు. పూతన, ఆతన్ని పట్టుకుని, మంచినీళ్ళందించిది. ఆ ప్రక్కనే పూతన భర్త ప్రద్యోతుడు కూడా వున్నాడు. అతను బిక్క చచ్చిపోయాడు. అయినా తేరుకుని "ప్రభూ!" రాజభవనానికి వెడదామన్నాడు.

"వద్దు-నేనిక్కడే వుంటాను." అతని శరీరంలో ప్రతి అంగము తెలియని భయానికి గురయింది. నన్నిక్కడే వుండనివ్వండి. అదొక్కటే మాట" కంసుని నోటినుండి రాగల్గింది, వచ్చింది.

"ఇక ఇక్కడ వుండి ఈ యువరాజు, యువరాణిలతో నేను చేయగల్గిందే ముంది." నేను వెళ్ళిపోనా ? మెల్లిగా పూతన అడిగింది. ఆమె వైపు సుదీర్ఘంగా కంసుడు చూసాడు. పూతన ప్రశ్న కంసునికి అర్థం కాలేదనుకుంటాను. పిచ్చిగా చూస్తూ - నారదుని భవిష్యద్వాణి, నిజమో-అబద్ధమో-ఈ రకంగా రూపుదాల్చింది. దేవకీ, వసుదేవులకు - నాకు పీడగా పరిణమించింది.

ఎనిమిదిమంది జన్మించారు. నా భయాన్ని తీర్చారు. ఇక దేవకీ వసుదేవులు ఇక్కడ వుండటంలో అర్థం లేదు. వారెక్కడికైనా వెళ్ళవచ్చును. ఎక్కడైనా వుండవచ్చును. అది వారిష్టం, వారినెవరు నిరోధించకండి!" అని తన వారికందరికి తగు ఆజ్ఞలు జారి చేసాడు. తన భవంతికి వేడి నిట్టూర్పులతో, కాళ్ళీడ్చుకుంటూ బయలుదేరాడు. ఆ మర్నాడు-

కంసుడు - తన ఆశ్రితులను, నమ్మకస్తులను, విశ్వాసపాత్రులను పిలిపించాడు. సభ ఏర్పాటు చేసాడు. ముఖ్య సలహాదారుడు ప్రలంబుడు,

అంగరక్షకుడు, ప్రద్యోతుడు, ముఖ్య వార్తాహారిణి పూతనలు కూడా, సభలో వున్నారు. మగధ యుద్ధవీరుడు బాహుకుడు అక్కడ, అప్పుడు వున్నాడు.

వారికి కంసుడు జరిగిందంతా చెప్పాడు. యోగమాయ హెచ్చరికను కూడా చెప్పాడు. అప్పుడు ప్రలంబుడు, మీరు అనుమతిస్తే.... ననగా, చెప్పమన్నాడు కంసుడు. "రాజా! అది దేవతల హెచ్చరిక. నిన్ను చంపేవాడు నాతో పుట్టాడన్నది కేవలమొక హెచ్చరిక! ఇంకా వారి రక్షణకు ఆ అవతారపురుషుని రాకకు ఎదురు చూస్తున్నారన్నది సత్యమన్నాడు.

అప్పుడు - పూతన కల్పించుకుని "ప్రభూ! మీ మాటలు సత్యం. ఆ పిల్ల మీ చేతినుండి జారి, గాలిలోకి ఎగరడం, "నిన్ను సంహరించేవాడు, నాతో పుట్టి మరొకచోట పెరుగుతున్నాడన్నమాట నేనూ విన్నాను. నిజమంది.

క్షణమాగిన కంసుడు తల పంకించాడు. అందరిని ఒకసారి చూసాడు.

"ఇప్పుడు కావల్సింది జాగు కాదు, అప్రమత్తత. కనుక నిర్దాక్షిణ్యంగా నిన్నగాక మొన్నటి నుండి పుట్టిన ప్రతి పసిపిల్లవాడిని, పిల్లను చంపెయ్యండి. పాపభీతి వలదు. అది ప్రాణభీతి కల్పిస్తుంది." అంటూ మగధవీరుడు బాహుకుని చూసాడు. దానికతడు -

"రాజా! మనం పసిపిల్లల నెందరినైనా చంపగలము. అందులో సందేహము లేదు. కానీ, ఆ దైవరక్షకునికై ఎదురుచూసేవారిని చంపగలమా ? అది సాధ్యమా ?" ఆలోచించండి "మనం చేసే పనులవలన, అవతలివారిలో సహనం నశిస్తుంది. క్రోధం పెరుగుతుంది. విరోధాలు పెరుగుతాయి. ఆ విప్లవానికి, ప్రజాచైతన్యానికి మనం తట్టుకుని నిలబడలేము."

మరో విషయం. ప్రజల్ని గొఱ్ఱెలమంద అంటాము. కానీ, అది తప్పు. తలవంచుకుని వెళ్ళడమే అలవాటనుకుంటే మన విద్రోహ చర్యల వలన తలెత్తి కుమ్మే పౌరుషానికి ఆజ్యం పోస్తాయి. ఆలోచించండి." చెబుతున్నాడు. మధ్యలో కంసుడు అందుకుని - "మగధవీరా, ప్రస్తుత మన కర్తవ్యం ?" అడుగుతాడు.

అందుకు ఒక్క క్షణం ఆగిన మగధవీరుడు బాహుకుడు. "రాజా! ముందు శాంతించండి. ఆ తర్వాత ప్రశాంత మనసుతో కొద్దిగా ఆలోచన చెయ్యండి. ప్రస్తుత పరిస్థితి ఏ విధంగా చూసినా మనకనుకూలంగా లేదు. మనం

దుర్మార్గులమని, మనల్ని చంపించడానికి దేవుడు తప్పక అవతారమెత్తి మనల్ని శిక్షిస్తాడన్నది సామాన్య విషయం కాదు. చాలా తీవ్రమైన సమస్య.

దీనిని, పరమ భాగవతోత్తములు, ఋషులు, మునులు, ధర్మవేత్తలు, సాధుసత్పురుషులు, సర్వులు ఒక్కమాట మీద నిలిచినట్లు అవతారపురుషుని ఆగమనం గురించి ప్రముఖంగా చర్చిస్తున్నారు. ప్రజలకు నూరిపోస్తున్నారు. ఇటువంటి తరుణంలో మనం చేసే ఆలోచన, వేసే ప్రతి అడుగు గమనించ బడుతుంది. కనుక తొందరపాటు తగదు.

"నిజం. నువ్వు చెప్పిందంతా సత్యం" అంటూ కంసుడు - ఇప్పుడు మనమేమి చెయ్యాలి ? ఇదీ సమస్య!" ఆ సమస్యా పరిష్కారం నీనుండి మేము కోరుతున్నా మన్నాడు. అందుకు సమాధానంగా బాహుకుడు-

"ప్రభూ! ప్రజలకు కావాల్సింది మంచి పాలన, రక్షణ, ఈ రెండూ కొరవడితే వచ్చేది విప్లవం. కోరేది అవతారపురుష ఆగమనం. దీనిని ఉపశమింపచెయ్యాలి. సాధు సత్పురుషులు, సన్యాసుల ప్రభావంతో, ప్రస్తుతం, ప్రజలను మనవైపుకు మళ్ళించుకోవడం, కుదరదు.

"మరైతే ఎట్లాగ ?" కంసుని ప్రశ్న.

"ఉపేక్ష కాదు. అపేక్ష పెంచుకోవాలి. సాధు సన్యాసులు నిజంగా, రాగద్వేష, అసూయలు లేని సన్యాసులు. వారిని ప్రలోభపరుచలేము. ఎందుకంటే వారే తపోమూర్తులు సర్వశక్తిమంతులు కనుక. ఇక బ్రాహ్మణులు. వీరు వేదమూర్తులు. వేద ప్రసాదిత ధర్మమూర్తులు. వీరిని లొంగదీసుకోవడమసాధ్యం. ఎందుకంటే వారు ధర్మమనే ఫిరంగులను మన పైకి త్రిప్పి పేల్చడానికి సిద్ధంగా వున్నారు.

"అపార ధనరాశులను కానుకలుగా ఇస్తే.... ?"

"రాజా! ఋషిసత్తములు, మునులు సర్వ సమర్థులని ముందే చెప్పాను. బంగారాన్ని, మట్టిని సమానంగా చూసే ఆ మహాత్ములు, అనకూడదు కాని, మనకే కోరినన్ని ధనరాశులనివ్వగల శక్తివంతులు.

పోనీ బ్రాహ్మణులకగ్రహారాలు ఇద్దామా ? అంటే ఈ స్థితిలో ఒక్కరు తీసుకోరు. ఏ ఒక్కరు ప్రలోభానికి గురయి ముందుకు రారు. పొరపాటున

ఎవరైనా వచ్చినా ప్రజాబలం ముందు ఓడిపోవడమో, అవమానాల పాలవడమో, చావడమో జరుగుతుంది" బాహుకుడు చెబుతున్నాడు.

"అయితే చంపేద్దాము ?!" కంసుడు.

"ఎంతమందిని ? బాహుకుడు.

"ఎదిరించినవారినందరిని" కంసుడు -

"రాజా! ఇదే మానవాళి మనుగడను నాశనం చేసేది. రాజులను, రాక్షసులగాను, ప్రజల్ని పరమాత్ములను చేసేది. ఇప్పుడు మనం కర్తవ్యం....

ప్రజలలో నమ్మకం, మనపై విశ్వాసం పెంపొందింప చేసుకోవాలి. ఎలాగంటే వారి అభిప్రాయాలకు, అభిలాషలకు, ఆశలకు - ఆశయాలకు తగ్గట్లు మనల్ని మనం మార్పు చేసుకుని, ప్రజల్ని వూరడిస్తూ ఉద్ధరిస్తే, వారి అభిప్రాయాలను గౌరవిస్తే, నమ్మకం కుదిరినవారు -

మెల్లిమెల్లిగా, సమాజపరంగా మనకు చేయూతనిస్తారు. మనం చెప్పింది వింటారు. మనం చెయ్యమన్నది చేస్తారు. కనుక ముందు మనం, వారి మనసులను జయించాలి. ఇదొక్కటే ప్రస్తుత కర్తవ్యం. ఇంతకుమించి, నాకు తెలిసినంతలో మరో మార్గం లేదు" రాజును ఆశావహుని చేస్తూ బాహుకుడు ఆశావహంగా, తన అభిప్రాయాన్ని ముగించాడు.

అంతా విన్న కంసుడు - ప్రస్తుత పరిస్థితులలో ఇది ఇప్పుడిప్పుడే సాధ్యపడే విషయం కాదు. అప్పటి మీ అవతారపురుషుడు రానూ వస్తాడు. నా ప్రాణం తీయను తీస్తాడు. కనుక ముందు మనం, నిన్న - మొన్న పుట్టిన పిల్లలను చంపేస్తే, పూతనా..... నీ కుయ్యుక్తులతో, రాక్షసత్వంతో, పసిపిల్లలు - అని చూడకుండా విజృంభించమంటాడు - కంసుడు - ప్రస్తుతమదే తన కర్తవ్యంగా శాసిస్తూ సభ ముగిస్తాడు.

# నంద"నంద"నుడు

**యు**వరాణి దేవకి ఇప్పుడు స్వతంత్రురాలు. తన భవనంలో నీలమేఘ శ్యాముడైన పుత్రుని తలచుకుంటూ అనుక్షణం స్వప్నలోకంలో విహరిస్తూంది. తన పిల్లవాడు తనను చూస్తున్నట్లు, చనుపాలు త్రాగుతున్నట్లు, పట్టుకుంటే గుండెలపై తన్నుతున్నట్లు, కాళ్ళు చేతులు చిత్రంగా ఆడిస్తూ, బోసినవ్వులతో కవ్విస్తున్నట్లు కలలు గంటుంది. అందులో అపరిమితానందాన్ని పొందుతుంది.

ఆ తన్మయత్వంలో దేవకి, తనను తాను మరచిపోతుంది. వసుదేవుడు తనచెంత నుండగా ఎవరి మాటలు ఆమెకు వినబడవు. ఆమె ఎవరి మాటలు వినదు. తనే తన బిడ్డ గురించి, ఆతని ఆటపాటల్ని గూర్చి వూహించి, చెబుతుంది. వసుదేవుడు ఆ రాత్రి సంఘటనలను ఎంతో ఆనందంగా వివరించి చెప్పాలని తలిస్తే, అతన్ని నోరు మెదపనీయదు. ఆమె తన ఆనందాన్ని వ్యక్తబరుస్తుంది.

వసుదేవుని కళ్ళలో మాత్రం ఆనాటి సంఘటన ఎంతో ఆనందాన్ని కల్గించింది. అంతా చిత్రంగా, మాయగా వుంది. అది -

ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా ఆ దివ్యశిశువు జననం, ఆ పిల్లవాడు చతుర్భుజునిగా దరిశనమివ్వడం, గుండెలలో నుండి వచ్చిన ప్రార్థన, అప్రయత్నంగా తలుపులు తెరుచుకోవడం, కాపలాదారుల గాఢనిద్ర, వర్షమాగడం, యమున దారివ్వడం, ఆదిశేషుడు బాలునికి పడగవిప్పి ఛత్రమవడం, యశోద కన్న బాలికను తీసుకుని, ఎంతో చిత్రంగా వెళ్ళాడో, అంత చిత్రంగా తిరిగి రావడం....

ఆ పిల్ల జనన విషయం కంసునికందడం, ఆ పిల్లను చంపగా కంసుడు పరుగు పరుగున రావడం, ఆ పిల్ల కంసుని చేతినుండి జారి, మహామాయగా నింగికెగరడం "నిన్ను చంపకు నాతో పుట్టినవాడు, మరొకచోట పుట్టి పెరుగు తున్నాడని హెచ్చరించడం.... అది ఆ కంసుని మతిభ్రమింపచేయడం, అంతా వసుదేవునికి ఆనందంగాను, చిత్రంగాను వుంది.

ఈ విషయం ఆమెకు చెప్పాలంటే, దేవకి ఏ మాత్రం సావకాశమివ్వడం

లేదు. పైగా తను తప్ప ఇతరులు మాట్లాడటం ఆమె సహించడంలేదు. ఆమె ఏం మాట్లాడినా తన పిల్లవాడి గురించే.... తన వూహాలోకంలో తాను విహరిస్తు ఆ కలల లోకంలోని అచ్చట్లు, ముచ్చట్లు, భర్త వసుదేవునితో తానే చెబుతుంది తప్ప అతన్నేమాత్రం మాట్లాడనివ్వడంలేదు.

ఆ రోజు రాత్రి, దేవకి వసుదేవునిపై చెయ్యి వేసి పడుకుంది. అప్పుడామెకు వున్నట్టుండి గోకులానికి వెళ్ళి తన పిల్లవాడిని చూడాలనిపించింది. కానీ తమాయించుకుంది. ప్రతిదినము గర్గులవారు, తమ దినచర్యలో భాగంగా గోకులానికి వెళ్ళి విశ్వకల్యాణ మపేక్షిస్తూ నందుని ఇంట పూజలు చేసి వస్తున్నారు.

గర్గులవారు వచ్చేవరకు వూపిరి బిగపెట్టుకున్న దేవకి వారు రాగానే వివరాలు అడిగి తెలుసుకుని, ఆ కార్యక్రమంలో తాను భాగం పంచుకున్నట్లు, పిల్లవాని ముద్దు ముచ్చట్లలో మున్గిపోయినట్లు కలలుగంటుంది. ఈ విషయం బయటపడితే పిల్లవానికేం ప్రమాదమోనన్న వసుదేవుని బాధ. రానురాను దేవకి వుయ్యాలలో పిల్లవాడి నుంచి పాటలు పాడటం మొదలుపెట్టింది, అందరు పిల్లలు చనిపోయేసరికి, తమ యువరాణికి పిచ్చి పట్టిందనో, మతి భ్రమించిందనో పరిజనం భావించేవారు.

ఒకనాడు దేవకి మరీ పిచ్చిపట్టినట్లు మట్టితో అప్పుడే పుట్టినపిల్లవాని బొమ్మను తయారుచేసింది. దానికో చిన్న ఉయ్యాలను కూడా తయారుచేసింది. ఇక అక్కడనుండి ఆమె దినచర్య ప్రారంభమయ్యేది. ప్రొద్దున్నే పిల్లవాడిని ఉయ్యాల నుండి తీసుకోవడం, ఆ పిల్లవానికి, పువ్వులు, చందనం, కుంకుమ దిద్దడం, మళ్ళీ ఉయ్యాలలో పడుకోపెట్టడం, లాలిపాటలు, జోలపాటలు....

పాలు పట్టడం, ఆటపాటలతో ఆనందించడం, పడుక్కోబెట్టడం ఉదయం సుప్రభాత గీతాలు, రాత్రిళ్ళు జోలపాటలు, పాలు, పళ్ళు, తేనె ఇవ్వడం.... ఇదొక దినచర్యగా చేసుకుందామె.

వసుదేవుడు, గర్గులవారు ఇదంతా చూసారు. ఆ చిన్న పిల్లవాడి విగ్రహాన్ని దేవునిగా, తన ప్రాణప్రదంగా చూసుకుంటూ, ఆ బొమ్మతోనే, తన భాగ్యమని, జీవితమని పరవశిస్తుందా పిచ్చితల్లి. దాచుకోలేని ప్రేమను భక్తి భావంతో వ్యక్తపరుస్తూంటే, తన్మయత్వమొందేవారు కొందరైతే, మతి చెడిందని తలంచేవారు మరికొందరు. ఇది "మధుర"లోని దేవకి మధురగాథ. మరి అక్కడ-

# "పండుగ" - సంబరం

ఇక్కడ, గోకులంలో లేక లేక అపురూపంగా పిల్లవాణ్ణి కన్న యశోద, కళ్ళ నిండుగా, ఆ పిల్లవాడినే పెట్టుకుని మరో ప్రపంచం తెలియక ఆ పిల్లవాని బాల్య ప్రపంచం, తనకు బాలప్రపంచం చేసుకుని, అవ్యాజమైన ప్రేమలో మురిసి ముద్దవుతుంది. కారణం... ఆనాడు... అతి కష్టం మీద ప్రసవించిన ఆమె అలసి సొలసి సొమ్మసిల్లింది. ఆ సమయంలో అక్కడ వున్నది వసుదేవుని భార్య రోహిణి ఒక్కతే. యశోద తెల్లవారి తేరుకున్నాక, ఆమె అపురూప సంతానాన్ని చూసుకుంది. పిల్లలు కలుగరన్నట్లు, మోడువారిన జీవితమని చింతించిన భావనను, అసత్యంచేసి పుట్టినబిడ్డ ఆమెకు అపురూపం. అమితానందదాయకమయ్యాడు. రోహిణి చేతుల నుండి తన బిడ్డను తీసుకున్న యశోద ఆనందం-అవ్యక్తము, అపూర్వము.

"నా బాబే, నా బంగారే!" గుండెలకు నిండుగా హత్తుకుని పిల్లవాడిని యశోద ముద్దాడింది. బాలుడు కళ్ళు తెరిచాడు. ఆ కళ్ళలో ఏదో వెలుగు. ఆ వెలుగులో యశోద మురిసి ముద్దయింది. అంతే.... ఆ క్షణం నుండి యశోద పిల్లవాణ్ణి కంది. నందుడు, మన పెద్దనాన్న అయ్యాడు. మహదానందదాయకంగా, నోటినుండి చెవికి, అందుండి నోటి ద్వారా గోకులానికి పాకింది. గోకులమంతా నంద యశోదల అదృష్టానికి మురుస్తూ, ఈ అపురూప బాలుడిని చూడటానికి, పరుగులు దీసినట్లు ప్రతి ఒక్కరు వచ్చారు.

అది భగవంతుని కరుణ. తన ప్రేమను అందరికి పంచిపెట్టడానికి, ఆ చిన్న వయస్సులోనే అందర్ని, ఆకర్షించి తన వద్దకు రప్పించుకునే అద్భుత ఘటన, సంఘటన! నంద యశోదలకు - శిశు జననమవడం - గోకులానికే పండుగ. ప్రతి ఒక్కరు తమ ఇళ్ళను అలంకరించడమే కాదు, తాము, తమ పశుసంపదతో పాటు - పిల్లలు పెద్దలు అందరు పండుగ చేసుకుంటున్నారు. ప్రతి ఒక్కరికి అవతలివారు నిజమైన ఆప్త-ఆత్మబంధువులై పోయారు.

అంబరాన్నంటే సంబరాలతో నంద - యశోదలను, వారి బిడ్డను దర్శించ డానికి రకరకాల కానుకలతో రంగ రంగ వైభోగంగా వచ్చారు. అనకూడదు

కాని, గోకులంలో తిరునాళ్ళ జరుగుతుందేమోనన్న భావానికి ప్రతి ఒక్కరు వచ్చేసారు, విచ్చేసారు. అది తిరునాళ్ళే మరి. నందుల వారికి సంతానం కల్గడం నిజంగా పండుగే. ప్రతి ఒక్కరు తమను కన్నతల్లిదండ్రులవలె చూసే నంద-యశోదల - శిశువు - తమకు బాలునిగా, సోదరునిగా, ఆప్త-ఆత్మ బంధువుగా తలుస్తు మరీ మరీ మురిసిపోతున్నారు.

ఇది ఇక్కడ "గోకులం"లోని "బాల"కుల ముచ్చట్లు అక్కడ దేవకి ఆరాధన. ఇచ్చట యశోద ఆత్మార్పణం దర్శించేవారికి ఆనందం, ఆశ్చర్యం - పూర్వజన్మ పుణ్యం - సుకృతం.

★★★★

ఇటువంటి రోజులలో ఒకనాడు దేవకి, తన భవనంలోని, మేడమీద గది ముందరున్న విశాల ప్రదేశంలో నిల్చుంది యధాలాపంగా ప్రకృతిని పరవశించి చూసే ఆమె ఆకాశాన్ని చూసింది. నీలాకాశం, కదిలే మబ్బులపై కళ్ళు పడ్డాయి "ఇలాగే వుంటాడు నా పిల్లాడనుకుంది. అలాగ చూస్తు నిల్చుంది. వినీలాకాశంలో మబ్బులు చెల్లాచెదురయ్యే వరకు పిచ్చిదానిలా చూస్తూ నిలబడింది. ఆ మబ్బులు తమాషాగా ఓ పిల్లవాని ఆకారంగా కనబడటంతో మరింత ఆశ్చర్యపోయింది.

ఆ ఆకారంలో దేవకికి - కాళ్ళు, చేతులు మరచిపోలేని కళ్ళు, ముఖం, స్పష్టంగా చూసింది. ఆ మేఘశ్యాముని తలచుకుని మురిసి ముదమొందింది. ఆ సమయంలో గర్గాచార్యులవారు, వసుదేవుడు అక్కడికి వచ్చారు. ఆమె ఆనందంలో పాలు పంచుకున్నారు. కులగురువులు, దేవకి-యశోదల ప్రియ సంతాన జాతకాన్ని చూసారు.

మహర్షులు, పండితుల సూచన ప్రకారం - ఆ పిల్లవాని పేరు, "క", "చ", "ఘ"లతో ప్రారంభమవ్వాలి. తమాషాగా దేవకి వూహించుకున్న వూహల "ఘనశ్యాముడే" ఆ పిల్లవాడి పేరయింది. దేవకి ఆరాధనలోని ఆంతర్యాన్ని గ్రహించిన వసుదేవుడు, ఆ మర్నాడు, మేఘశ్యాముని ప్రతిరూపంగా ఓ నల్లపాలరాతి విగ్రహాన్ని తెచ్చి ఆమెకిచ్చాడు. అందుకెంతో సంతోషపడిన ఆమె, ఆమె ఆరాధనను, ఆ విగ్రహంతో ప్రారంభించింది. ప్రాణప్రదం చేసుకుంది.

దానికి ఘనశ్యాముడని పేరు పెట్టుకుని మురిసిపోసాగింది. ఈ బొమ్మ, అందులోని ఆమె ఆనందం, దేవకి వసుదేవులకు, గర్గులవారికి తప్ప మరెవ్వరికి తెలీదు.

అక్కడ గోకులంలో, తన పిల్లవానికి నామకరణ మహోత్సవం, నంద యశోదలు చేయదలిచారు. దానికి తగ్గట్లుగానే నందుని భవంతి, సభా ప్రాంగణం వగైరాలు అలంకరిస్తున్నారు. అద్భుత శోభలతో, మామిడి తోరణాలు, అరటి చెట్లతో అందరిని ఆహ్లాదపరుస్తుందా వాతావరణం, ఆ గృహశోభ.

కులగురువులు గర్గాచార్యులవారు, తమ పరివారంతో నందుని ఇంటికి వచ్చారు. "కుల గురువులను మేళతాళాలతో సాదరంగా ఆహ్వానించారు. నందుడు, కులగురువులను విలువైన బహుమతులతో గౌరవించాడు. యశోద తన ముద్దుల పిల్లవాడిని తెచ్చి కులగురువుల చేతిలో వుంచిది. గర్గులవారు తన అదృష్టంగా ఆ పిల్లవాడిని స్వీకరించి, తగు పూజలు సలిపారు. పాలు, తేనె నాకించారు. ఆచార వ్యవహారాల మధ్య ఆ బాలునకు "కృష్ణు"డని నామకరణం చేసారు.

నామకరణ కార్యక్రమం ముగిసాక, గోకులం మొత్తం అందరికి విందు భోజనాలు జరిపించారు. సర్వులు సంతోషచిత్తులయ్యారు. ఈ మహత్తర దృశ్యాన్ని చూడటానికి, విందు భోజనంలో పాల్గొనడానికి, పరిసర గ్రామాల నుండి ప్రజలు బండ్లు కట్టుకుని వచ్చారు. కార్యక్రమమెంతో ఆనందంగా జరిగింది. ఆనాటి సాయంత్రమే, గర్గులవారు, తమ పరిజనంతో మధురకు తిరిగి వచ్చారు. అక్కడ జరిగిందంతా గర్గులవారు, దేవకీ వసుదేవులకు తెలిపారు. వారెంతో ఆనందించారు. ఇక్కడ దేవకి, ఆ ఆనందాన్ని తన విగ్రహారాధనతో చేసుకుని, చూసుకుని మురిసి పోయింది.

ఈలోగా పన్నెండు నెలలు గడిచాయి. వ్రజగోకులవాసులు, కృష్ణుని మొదటి పుట్టినరోజు వేడుకలను, అదీ యమునానది ఒడ్డున వున్న మహదేవుని మందిరంలో, ఎంతో అట్టహాసంగా, ఘనంగా జరుపుకున్నారు. బ్రాహ్మణులకు, తమ ప్రాంత ప్రజలకు గూడా ప్రత్యేకంగా విందు భోజనాలు ఏర్పాటు చేసారు. యశోద చంకన పిల్లవాడిని పెట్టుకుని, మురుస్తూ - ప్రతి ఒక్కరిని ప్రేమతో, ప్రేమగా పలుకరించింది.

భోజనాలు ప్రారంభించేసరికి మధ్యాహ్నమైంది. పిల్లవాడు నిద్రపోతున్నాడు. యశోద వచ్చిన వారితో హడావుడిగా వుంది. ఎంతో కోలాహలంగా, ఆనందంగా

వుందా ప్రథమ జన్మదిన పండుగ వాతావరణం, వున్నట్టుండి ఆ సమయంలో ఏడుపు. ఏ బండిలో పిల్లవాడిని పడుక్కోపెట్టిందో, ఆ బండి తలక్రిందులైంది.

హడావుడిగా యశోద వెళ్ళి పిల్లవాడికోసం వెదికింది.పిల్లవాడు కాలిని గాలిలోకి తన్నుతున్నట్లు విసురుతున్నాడు. నందుడు కూడా పరుగెత్తుకు వచ్చాడు. పిల్లవాడు తన్నుతున్న సూచనలు, శకటం నేలపడి విరిగిన దృశ్యం. చూస్తుండగా రాక్షసుడిగా మారిపోవడం. వాడు కంసుడు పంపిన రాక్షసుడు శకటాసురుడు, ఆ విధంగా కృష్ణుని పాదాల రాపిడికి పవిత్రమయ్యాడు. ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అయినా అదృష్టవంతుడు.

ఈ విషయాన్ని గర్గులవారి ద్వారా విన్న దేవకి ఆశ్చర్యపోయింది. ఒళ్ళు గగుర్పొడిచింది. కళ్ళ వెంట బాష్పాలు రాలాయి. "నా బిడ్డా! ఓ నా దైవమా! ఓ నా భాగ్యమా!'' అంటూ ఒక్కక్షణం కళ్ళు మూసుకుంది. ఆ తదుపరి తెప్పరిల్లింది.

## కృష్ణలీలలు - "పూతన"

**మొ**ట్టమొదటి జన్మదినోత్సవం నాడు, సర్వదేవ, వేదవంద్యుడైన పరమాత్మ, సామాన్యునిగా పుట్టి, తన ఆటలతో నిజమైన పసిబాలునిగా, తల్లిదండ్రుల కానందం కల్గిస్తున్నాడు. ఆ ప్రథమ జన్మదినోత్సవం, తన అవతార లీలావిలాసాల ప్రకటనకూ, మొట్టమొదటి వేదిక, వేడుక అయింది.

కంసుడు, పుట్టిన తన శత్రువెవరో, ఎక్కడున్నాడో తెలుసుకోవడానికి తన నమ్మినబంట్లను, విశ్వాసపాత్రులను, తన రాజ్యంలోని ప్రతిపల్లెకు, వేయి కళ్ళతో గమనించమని పంపాడు. ఆ ప్రయత్నంలో వచ్చిన అసురుడు అదృశ్యరూపంలో, బాలకృష్ణుడు పడుక్కున్న బండిని ఆవహించగా, నిద్రపోతున్నట్లు నటించే, ఆ నటన సూత్రధారి నారాయణుడు, శ్రీకృష్ణుడై వాని వునికిని పసిగట్టి తన పాదాలతో తన్ని వాని పీచమణచి చంపాడు. అదే శకటాసుర వధ.

ఈ విషయం కంసునికందింది. ఒక్కసారి వులిక్కిపడ్డాడు. ఓ పిల్లవాడు.... ఈ ఘోరం సలిపాడనేసరికి, పూతనను పిలిచాడు. ఆమెపై మండిపడ్డాడు. చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేదు. గోకులంలో, నందయశోదల పిల్లవాడు,

మన శకటాసురుని చంపాడుట. నీకు తెలుసా ? నువ్వేం చేస్తున్నావు ? కసురు కున్నాడు, గద్దించాడు.

“ఇదేనా, నీ వాగ్దానం ? శ్రావణమాసంలో పుట్టిన పిల్లలనందరిని మట్టుపెడతానన్నావు ? నీ మాట నిలబెట్టుకున్నావా ? ఎందుకీ వ్యర్థ ప్రతిజ్ఞలు ? అప్పుడే రెండేళ్ళు గడిచిపోయాయి. అయినా నీ శపథం నెరవేరలేదు. నువ్వు ఈ మధురలో పుట్టింది - కేవలం తొమ్మిదిమందేనని, వారిని హతమార్చానని చెబుతున్నావు. ఇంత మన రాజ్యంలో శ్రావణమాస, కృష్ణపక్షంలో పుట్టింది కేవలం తొమ్మిదిమందేనా ? ఇదేనా నీ ప్రతాపం” కంసుడు గద్దిస్తున్నాడు.

పూతన భయంతో బిగుసుకుపోయింది. కంసుని భయమల్లా, తన నాశకుడు ఎక్కడో పుట్టి నిక్షేపంగా వున్నాడని, వున్నట్టుండి వూడిపడి తనను మట్టుపెడతాడని భయపడిపోతున్నాడు. కాపలాదారుల మాటలు, దేవకికి పుట్టినపిల్ల తన చేతినుండి జారిపోయి, గగనానికెగిసి, తనను హెచ్చరించడం భరించలేక పోతున్నాడు. కాపలదారుల మాటలు నమ్మలేకపోతున్నాడు. అది కంసుని స్థితి.

పూతన పరిస్థితి కంసునికంటే దారుణంగా వుంది. ఆమెను చూస్తేనే మధురపురవాసులు, తలుపులు మూసుకుంటున్నారు. తమ పిల్లల్ని భద్రంగా దాచుకుంటున్నారు. చాలామంది తమ తమ పసిపిల్లలతో మధురను విడిచి వెళ్ళిపోయారు కూడా! ఇటువంటి పరిస్థితులలో ఆమె మాత్రం ఏం చెయ్యగలద ? అదీ ఆమె దీన పరిస్థితి. అయినా గుండె నిబ్బరంగా వుంది. పరిస్థితిని సమీక్షించ డానికి, ఎదుర్కోవడానికి ఆయత్తమౌతుంది.

ఇది మధురలోని పరిస్థితి.

ఇటువంటి సమయంలోనే, కంసునికి, గోకులంలో దాని అధిపతి నందుని-భార్యకు దాదాపు రెండేండ్ల క్రితం ఒక పిల్లవాడు పుట్టాడని తెలిసింది. దాని వివరాలు సేకరించమంటున్న తరుణంలో, నందుడు శిస్తు కట్టడానికి తన అనుచరులతో మధురకు వచ్చాడు. కంసుని గూఢచారులు నందుని పుత్రజననం వివరాలు, నందుని అనుచరులు, అనుయాయుల నుండి సేకరిస్తున్నారు. నందుడు కూడా పుత్రోత్సాహంతో, తన పిల్లవాని ఆటలను, ముద్దుముచ్చట్లను అమాయికంగా వర్ణించి చెబుతున్నాడు.

ఈ విషయాలన్నీ విన్న కంసునిలో, ఈ పిల్లవాడు కాని తనను వధిస్తాడా ? అన్న అనుమాన పిశాచం, బయలుదేరింది. యధావిధి నందుడు వస్తున్నాడు. తాము చెల్లించవలసిన పన్నులను చెల్లిస్తున్నాడు. నందుడు అందరికి ఆనందుడు, ఆరాధ్యుడు. ఆతనిని వ్రేలు పెట్టి ఎవరు చూపరు. అంతటి సుగుణాత్ముడు, గోకులంలోని శూరవంశయాదవులు, పట్టుదల - పరాక్రమం గలవారు. సంపన్నులు, సాధువులు కూడా. ఎంతో ఘనచరిత్ర గలవారు. సద్గుణ సంపన్నులు.

హస్తినాపురానికి వీరికి ఎంతో సంబంధ బాంధవ్యాలున్నాయి. కురువంశ శ్రేష్టుడైన పాండురాజు, వీరి సోదరి కుంతిని వివాహం చేసుకోవడం వీరికి మరింత ఆదరణ హస్తినాపురంలో కల్గింది. ఇప్పుడు వీరితో ఏ విధమైన పగ ప్రతీకారాలు పెట్టుకుని, యుద్ధానికి సిద్ధబడ్డా, అది హస్తినాపురానికి అంది, మరింత ఇబ్బందుల్ని పొందాల్సి వుంటుంది. ఆ స్థితిలో కంసుడు సంకటమొందాడు. ఇప్పుడు పూతనలాంటి వారి సాయం కంసునికి అవసరం. అందుకే ఆమెకు కబురు పంపాడు. ఆమె ద్వారా చాకచక్యంగా తన పని నెరవేర్చుకోవాలని చూస్తున్నాడు.

వచ్చిన పూతనను చూసి "నీకు నందుని భార్య యశోద మగపిల్లవాడిని కన్న విషయం తెలుసా ?" అడిగాడు. పూతన తెలియదన్నట్లు అడ్డంగా తలవూపింది. దేవకి ఆడుబిడ్డను ప్రసవించిన సమయంలోనే, నందుని భార్య యశోద కూడా ప్రసవించిందట. అతడు అద్భుతశక్తి సంపన్నుడట. వరాల మూటట. అందరికి ప్రేమపాత్రుడట. వెళ్ళు. వెళ్ళి, వాణ్ణి ఒకసారి చూడు" ఆదేశించాడు.

"క్షమించు ప్రభూ! నేను వెళ్ళలేను. ప్రస్తుత నా పరిస్థితి దయనీయంగా వుంది. నా స్వంత అప్పచెల్లెళ్ళే నన్నుచూసి "వంశనాశని"నని తిట్టుకుంటున్నారు. అసహ్యించుకుంటున్నారు. బయటి వాళ్ళైతే సరేసరి. ఈ మధురానగరంలోనే నాకు పుట్టగతులు లేవు. నా చరిత్ర ఈ పరిసరాల ప్రాంతాలకు బాగా ప్రాకింది. ఈ తరుణంలో నేను గోకులానికి వెళ్ళడం, ఆ పిల్లవానిని చూడటం సాధ్యం కాదు.

కాకపోతే చావును ఖాయం చేసుకుని, అందరికి వీడ్కోలు చెప్పి మరీ గోకులానికి వెళ్ళాలి. తిరిగివస్తే అదృష్టవంతురాలిని. కాదంటే... కర్మభ్రష్టురాలి నవుతాను. ఆ మాటలతో కంసుడు విసుక్కున్నాడు. అప్పటి స్థితిని సమీక్షించి తన పరిస్థితి ఈ విధంగా తయారవుతుందని కంసుడు శంకించలేదు. కలలో గూడా తలంచలేదు.

"ప్రభూ! నా సేవలలో లోపం లేదు. ఎంతో విశ్వాసంతో సేవించాను. ఇప్పుడు.... ఇప్పుడు మాత్రం అశక్తురాలను. క్షమించండి - మరోమాట. ఎవరో ఎందుకు ? మీ వాళ్ళనే నా గురించి అడగండి. నా పేరు చెబితే వాళ్ళు వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకుంటారు. అంతటి పాపిష్టి జన్మమయింది. నా విశ్వాసం, ప్రభుసేవ, మన్నన లేకుండా పోయాయి. ఇంచుమించు ఏడుస్తున్నట్లు బాధపడుతూ చెప్పింది.

అంతా విన్న కంసుడు - "పూతనా! నీపై నమ్మకముంది. నీ విశ్వాసాన్ని నేను గుర్తించాను. ఇతరుల మాటెందుకు ? నువ్వు గోకులానికి వెళ్ళి, ఆ పిల్లవాడిని చూడు. తగు విధంగా స్పందించు. ఇది స్వామిగా నిన్ను కోరే అర్థింపు. ఈ కాస్త ఉపకారం చెయ్యి. ఇకపైన నిన్ను బాధించను. ఇబ్బందీ పెట్టనన్నాడు.

"బతికి వుంటే కదా ?" ననుకుంది పూతన. దయచేసి నన్ను విడిచి పెట్టండి." ఇంచుమించు రోదించింది. ఇప్పుడు నేను అశక్తురాలను. ఒక పిల్లవాణ్ణి పట్టుకునే ఓపికా, నాలో పోయింది. రెండునెలల క్రితం నా కడపటి శిశువు నా చేతుల్లోనే మరణించింది. నేనూ తల్లినే. అప్పుడు నాకు మాతృప్రేమ, అందులోని మమకారం అర్థమయ్యాయి.

నా ద్వారా నల్గురు పిల్లల చావుకేకల్ని విన్నాను. చలించలేదు నేను. నా పిల్లవాడు మరణించడంతో, నాలోని మమకారం, మాతృత్వం మేలుకొన్నాయి. గర్భశోకమంటే ఏమిటో తెలిసింది. ఇప్పుడు చంపమన్నా, చచ్చే పిల్లల్ని చూడటమన్నా నాకు భయంగా వుంది. కనుక నన్ను మన్నించండి. ఇక ఈ ఘోరం చెయ్యలేను." ఎంతో జాలిగానే చెప్పింది.

"ఏవిటా మూర్ఖత్వం ? నువ్వేనా మాట్లాడేది ? ఇక కబుర్లు కట్టిపెట్టి నేను చెప్పినట్లు చెయ్యి. తప్పదు" ఆజ్ఞాపిస్తున్నాడు. పూతన నేలచూపులు చూస్తుంది. అది ఆమె అసమ్మతి. ధిక్కారంగా తలచిన కంసుడు "నా మాట వినవా ?" ఖంగుమని గర్జించింది కంసుని కంఠస్వరం.

"క్షమించండి! అంతకు మించి పూతన దగ్గర మరోమాట లేదు. ఈ శిశు హత్యలు తప్ప మరేమైనా చెప్పండి. మీ ఆజ్ఞను శిరసావహిస్తాను. అమలు పరుస్తాను." ఎంతో దీనంగా, కన్నీటి బాష్పాలతో చెప్పింది. కంసుడు ఆ దృశ్యాన్ని చూసి అదిరి పోయాడు. "పూతనా....?" ఆమె దీన, జాలి పరిస్థితికి ఆశ్చర్య

పోయాడు. మరుక్షణం స్థిమితమొంది -

"పూతనా, నువ్వు, నీ భర్తా, బకాసురుడు వగైరా మీరందరూ నాకు కట్టుబానిసలు. ఆజ్ఞాబద్ధులని మరువరాదు. నన్ను కాదంటే మిమ్మల్నేమైనా చెయ్యగలను. అది తెలుసుకో. నేనిచ్చిన భోగభాగ్యాలను తలుచుకో. పొరపాటున నేను మరణిస్తే మీ పరిస్థితి ఎంతటి దుర్భరము, దారుణమౌతుందో తలచుకుని, మరీ మూర్ఛించు.''

అయినా పూతన తలవంచుకుంది. తన అయిష్టాన్ని నేలచూపులతో తెలిపింది. ఇంకా నా శక్తి నీకు అర్థం కావడం లేదు. నేను "వూ'' అంటే ఆ మగధవీరులు ఒంటిచేత్తో మీకు సమాధి కడతారు.'' అనగా - "తెలుసును. అయినా... నా అశక్తతను గూడా అర్థం చేసుకోమని ప్రార్థిస్తున్నానంది.''

"అయితే ? ఫో. గోకులానికి వెళ్ళి నేను చెప్పిన పని పూర్తిచేసుకురా. కాదని ఇక్కడెక్కడున్నా.....''హుంకరించాడు కంసుడు. "మీ ఆజ్ఞ'' అంది పూతన.

"నీకు పక్షం రోజులు గడువిస్తాను. ఈలోగా ఆ కార్యక్రమం పూర్తిచెయ్యాలి. తెలిసిందా ?'' అది కంసుని ఆజ్ఞ.

"చిత్తం! పూతన విధేయత తెలిపి, మరీ వెనుదిరిగింది. తిరిగి వెళ్ళడం గమనించి, స్త్రీలు పూతనను చూస్తునే ముఖం ముడుచుకోవడం, ఓ పిశాచిలా చూడటం గమనించింది. దఢాలున తలుపులు పెద్ద చప్పుడుతో, తమ రాజమందిర సేవకులే మూసుకున్నారు. అదీ గమనించింది. ఎంత చెప్పినా వినని రాజు, తనను చూస్తూనే అసహ్యించుకునే పరిచారికులు, ఇతర స్త్రీలు. ఇంతకన్న అవమానం మరొకటి వుండదు. చాలా బాధపడింది. ఇదంతా గత ప్రారబ్ద ఫలితమని నొచ్చుకుంది.

ఆనాడు ఆశ్వయుజ శుద్ధ పౌర్ణిమ. కృష్ణునికి రెండేండ్లు పూర్తయ్యాయి. గోకులమంతా ఎంతో సంతోషంగా వుంది. తమ కులదైవమైన గోపనాథ మహదేవ్ సంబరం చేయాలని సన్నాహాలు ప్రారంభించారు. ఇదొక సాంప్రదాయ జాతర. ఇందులో పాల్గొనడానికి, ఎక్కడెక్కడి శూరవంశీయులు బండ్లలో, రెండ్రోజులు కష్టపడి ప్రయాణంచేసి వస్తారు. ఆనాడు అందరు యమునానదిలో స్నానం చేస్తారు. మహాదేవును దర్శిస్తారు. బిల్వపత్రాలు సమర్పించి భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహిస్తారు.

ఆ పున్నమినాటి రాత్రి చంద్రుడు తమ అమృత కిరణాలతో అందరికి

ఆహ్లాదం కల్గిస్తుంటే, ఆ నిండు పండు వెన్నెలలో, యమునా సైకత తీరంలో పిల్లాపాపలతో కలిసి, కుండల నిండా అటుకులు కల్పిన పాలు తెస్తారు. ఆ పాల అటుకులు ఆయురారోగ్యములు, సిరిసంపదలు, సౌభాగ్యం ప్రసాదిస్తాయన్న నమ్మకంతో, వ్యయప్రయాసలకోర్చి మరీ తెస్తారు.

ఆ నిండుపున్నమి వెన్నెలలో, పాలఅటుకులు తిన్నాక పండుగ సంరంభం ప్రారంభమౌతుంది. గోపయువతులు ఆ సమయంలో సంతోషంగా, ఆడతారు, పాడతారు. గోపాలురు తమ సంతోషానికి చిహ్నంగా తమవంతు సహకారంగా మృదంగాది సాంప్రదాయ ప్రాచీన సంగీత వాయిద్యాలను వాయిస్తారు. పిల్లలు వారి వారి పద్ధతులలో, పెద్దలు తమదైన శైలిలో ఆటపాటలలో మున్గిపోతారు.

తెల్లవారేసరికి ఉత్సవం ముగుస్తుంది. ఇంటికి తిరుగు ప్రయాణం చేస్తారు. ఈ పండుగ సంరంభం ముగిసినా, కంసుని ఆజ్ఞను ధిక్కరించలేక, విధిలేక పూతన, గోకులానికి వచ్చింది. ఆ సమయంలో, గోకుల యాదవ నాయకుడైన నందుడు, తన ముఖ్య పరివారంతో మధుర వెళ్ళాడు. అది మంచి సమయంగా పూతన భావించింది. అర్ధరాత్రికి గాను నందుడు రాడు. కనుక, ఈలోగా తనపని చక్కబెట్టుకోవాలని తలచిందది.

ఆ రోజు సాయంకాలం.... ఎవరో బ్రహ్మమూర్తుల భార్య మహదేవునికి మ్రొక్కులు చెల్లించుకోవడానికి, మధుర నుంచి వచ్చిందన్న వర్తమానం, నందుని భార్య యశోదకు అందింది. ఆ వెంటనే గ్రామంలోకి ప్రాకింది. మృదు స్వభావులు, ధర్మాత్ములు, పుణ్యశీలురైన యాదవులు ఆ వచ్చిన మహాసతికి తగు గౌరవ సాంప్రదాయ మర్యాదలనర్పించారు. ఆ వచ్చిన వారు స్థితి - స్థాయి కాదు మనకు కావల్సింది.

ఎవరొచ్చినాసరే, మన కనీస ధర్మంగా, సాంప్రదాయబద్ధంగా అతిథి మర్యాదలు సలుపాలన్న నందుని ఆజ్ఞ. దానినే పాటిస్తున్నారు ఆ గ్రామీణులు. ఆమె రాకను విన్న యశోద, ఇద్దరు మనుషులను పొలిమేరలకు పంపి, ఆ వచ్చిన తల్లిని సకలమర్యాదలతో ఇంటికి తీసుకుని రమ్మంది. సైకత తీరంలో జరిపే ఆతిథ్యాన్ని స్వీకరించి, ఆనందంగా గడుపమని, ఆ తదుపరి ఆమె పవిత్ర స్నానం చేసి, తన మ్రొక్కులను తీర్చుకోమని యశోద కోరింది.

ఇదంతా పూతన పన్నాగం. ఈ తంతు ఆమెకే మాత్రం నచ్చలేదు. యశోద ప్రార్థనను విని, తన రథాన్ని త్రిప్పి పంపేసింది. నందుని ఎద్దుబండ్లలో ప్రయాణించడానికి, అర్థరాత్రి వెన్నెలవిందు భోజనంలో పాల్గొనడానికి రమ్మని తప్పనిసరిగా నందుని సేవకులతో, యశోదమ్మ స్వాగతంతో బయలుదేరింది.

అచ్చటి పరిస్థితి ఎంతో హుషారుగా, ఆనందంగా వుంది. కపటమెరుగని అమాయిక యాదవులు, వారి స్త్రీలు, తమ అధినేత్రి ఆదేశంతో, సలిపే ఆ పండుగ సంబరం, అతిథిగా బ్రాహ్మణ ముత్తయిదువుగా వచ్చిన పూతనకు ఒక ప్రక్క ఆనందం, మరొకప్రక్క ప్రాణాంతకంగా తయారయింది. తను వచ్చిన పని, ఈ పరిస్థితులలో ఎలాగ సానుకూలమవుతుందో అర్థం కావడంలేదు. అయినా పూతన -

యమునా జలాలలో పవిత్రస్నానానికి లేచింది. ముందు స్నానం చేసి, ఆ తదుపరి దేవుని దర్శించాలన్న ఆమె తలంపు, నిండు పండువెన్నెల కాంతి, ఆ ఆహ్లాద వాతావరణం, కమనీయ ప్రకృతి... పరవశింపచేస్తుంటే... హృదయాలు సంతోషతరంగాల తేలియాడుతున్నాయి. కుళ్ళు, కపటాలు, మాయ-మర్మాల కలీతంగా మనసులు పరవశిస్తున్నాయి.

స్నానం చేసింది. మహదేవుని మందిరానికి వెళ్ళింది. ఎక్కడా చూసినా త్రుళ్ళిపడే కేరింతలు, సంతోష సంబరాలు, ఆనంద కోలాహలం... మహదేవుని అర్చించడానికి తెచ్చిన బిల్వ పత్రాలను శివలింగంపై వుంచింది. కళ్ళు మూసుకుని నమస్కరిస్తూ "భగవాన్. అందరికి ఎంతో ఆనందాన్నిస్తున్న నీవు నాకెందుకు ఆనందమివ్వవు. ఏమిటీ దుర్భరస్థితి. దారుణమైన ఆజ్ఞ. పాటించవలసిన దురవస్థ" చాలా బాధపడింది.

మనసు నుండి గతంలోని కుళ్ళు, పాపజాలమంతా కరగిపోయేటట్లు మనసులోనే మూగగా విలపించింది. "ఇదే నా ఆఖరి మజిలి చెయ్యి. ఎట్టి పాపాలు చెయ్యని దివ్యస్థితిని ప్రసాదించు. బ్రతకాలనే కోర్కె లేదు. పదిమంది శాపనార్థాలతో బరువుగా ఈడ్చే బ్రతుకు కడతేర్చు!" మ్రొక్కుకుంది. పవిత్రజలం కళ్ళకద్దుకుంది. ఆమెను తీసుకువచ్చిన మార్గదర్శి, మాయదారి పూతనను, మంచి బ్రాహ్మణ ముత్తయిదువుగానే తలచి యశోద వద్దకు తీసుకు వెళ్ళాడు.

అతిథి రాకను ఆ ప్రత్యేక దూత తెలుపగానే అందరు మర్యాదపూర్వకంగా నిల్చుని స్వాగతాంజలిని సమర్పించారు. గోప యువతులు పూతనను ఆమె

వేషధారణను, నగలను అసూయగా చూసారు. ఇటువంటి సంపన్న రాజమందిర స్త్రీని వారెప్పుడు చూసి వుండలేదు.

యశోద ఇసుక తిన్నలపై కూర్చుంది. ఆమె ప్రక్కన రోహిణి కూడా వుంది. యశోద పాలను పిల్లలకిస్తుంది. పూతనను చూసి సాదరంగా నవ్వి "రామ్మా సోదరి, రా!" అని ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా పిలిచింది. కొద్దిగా జరిగి తన ప్రక్కన చోటును కూడా ఇచ్చింది.

ఆమె సాదర స్వాగతానికి పూతన, యశోదకు కృతజ్ఞతలు చెప్పింది. ఆమె మనసు మాత్రం దోష ప్రవృత్తితో ముడుచుకుపోతుంది. ఆ కుటుంబాన్ని నాశనం చెయ్యాలని తాను వస్తే, తన రాక వారికి బ్రహ్మానందంగా బ్రహ్మరథం పడుతున్నారు. వారి స్వాగత సత్కారాలకు యశోద మంచి మర్యాదలకు, నవ్వును కొని తెచ్చుకుని వారితో కలిసిపోయింది.

యశోద ప్రక్కనే, ఆమె చీరచెంగులో తన తలను దాచుకున్న, తను చంపాలని వచ్చిన పిల్లవాడిని చూసింది. నీలంగా ఆకాశరంగులో వున్నా అందంగా కనబడు తున్నాడు. ఆనందింప చెయ్యడం తన సొత్తుగా దరిశనమిచ్చాడు.

"చేత వెన్నముద్ద, చెంగల్వ పూదండ" అనే కృష్ణుడు - బంగారు మొలత్రాటితో, సిరిమువ్వ గజ్జలతో - చిన్ని కృష్ణా నిన్ను చేరి కొల్తు" అన్నట్లు కృష్ణుడు నిల్చున్నాడు. ఈతని ప్రక్కన మరో పిల్లవాడు వున్నాడు. ఇతనికి రెండేండ్లయితే, అతనికి మూడేండ్లు వుంటాయి. అతను రోహిణి జుట్టుతో ఆడుతున్నాడు.

అంతా చిత్రం. లోకాలనాడించే ఆ ప్రభువు, తన ఆదిశేషుని అన్నగార్ని చేసుకుని, అమ్మలముందు ఆడుతూ, అమాయకత్వాన్ని ప్రదర్శిస్తూ - తల్లిదండ్రుల గుండెల లోతులలోకి మమతానురాగాల ప్రేమను పంచి పెంపుచేస్తూ - యదుకుల మౌళి, గోకులవిహారి, నంద యశదా "ప్రియకేళి" - అయ్యాడు.

కృష్ణుడు తన భోజనం ముగించాడు. తల్లిచీర కొంగునుండి ఛెంగున బయట పడ్డాడు. చేతిలోని పాలుత్రాగిన దుత్తను నేలకేసి కొట్టాడు. అలవోకగా చూస్తాడు. పూతన కూడా కృష్ణుని చూసింది. కనబడని అందం తెలియని ఆనందం, ఆ పిల్లవానిలో తొణికిసలాడుతుంది. ముద్దులమూటలు కడుతున్నాడు. మోహన రూపధారిగా చిత్రంగా కనబడుతున్నాడు. ఎందరో పిల్లల్ని, ఆఖరికి

తన పిల్లల్ని చూసిన పూతన కళ్ళు - ఈ పిల్లవానిని చూస్తూ గుడ్లప్పగించింది.

ఆమె చూస్తుంది. మనసు - ఇతన్ని చంపడంమాట దేవుడెరుగు. ఈతని చేతిలో మరణించడమే మోక్షమన్న స్థితికి వచ్చేసింది. తను, తన భర్త, తన కుటుంబం కంసుని పాలబడి నాశనమైపోతుంది. దిక్కుమాలిన చావు చస్తాము. అంతకన్న ఈ బాలుని చంపే ప్రయత్నంలో తను చావడమే మంచిదని, అతన్నేదో విధంగా చంపి, తన బ్రతుకు పండించుకోవాలనుకుంటుంది.

పూతన పిల్లవాడిని చూసింది. "నా బంగారే..." అంటూ మెటికలు విరిచింది. దగ్గరకు రమ్మని పిలిచింది. దాని ప్రయత్నమంతా తెలిసిన ఆ చిన్నికృష్ణుడు, ఆమె పిలుపుకు స్పందిస్తున్నట్లు, మంత్రముగ్దను చేస్తూ, విలాసంగా చూస్తూ నవ్వాడు.

రమ్మని పూతన చేతులు చాచింది. కాదనలేని ఆ పరంధాముడు, బాలకృష్ణుడు, ముందుగా తల్లి వడిలోకెక్కి అక్కడ నుండి పూతన చేతుల్లోకి లాస్యంగా జరిగాడు. అందరు పకపక నవ్వారు. పూతన కూడా ఆ దృశ్యానికి పరవశించినట్లు నవ్వింది. అనుకోకుండా పూతన కృష్ణుని తన గుండెకు హత్తుకుంది. అతడు పరాయి పిల్లడు. తాను చంపబోయేవాడన్నమాట, ఆ క్షణంలో మాయమై, మాతృత్వం పెల్లుబికింది. తన పిల్లవాడినే గుండెకు హత్తుకున్నట్లు మురిసి, పరవశించింది.

అంతలో తన ధర్మం గుర్తొచ్చింది. తన భర్తా, ఎనిమిదిమంది పిల్లలు కళ్ళెదుట కదలాడారు. ఇతన్ని చంపకుంటే, తనతోపాటు వారంతా శవాలు. ఆ దృశ్యం కళ్ళలో కనబడుతుంటే, తన వేదన బయటపడనీయకుండా, పూతన తన ప్రేమనంతా కురిపిస్తూ, ముక్కుతో, ముక్కుతూ అతని మొహం, బుగ్గలు, పొట్ట రుద్దుతుంది. బాలకృష్ణుడు నవ్వుతున్నాడు.

పుడుతూనే పరమాత్మనన్న - ఆ పిల్లవాడు - చిన్నికృష్ణుడు, బాలకృష్ణుడు, అలాగ నవ్వుతూ, నవ్వుతూ, ఆమె తలలోని చంపక పుష్పాన్ని చూసాడు. దాన్ని లాక్కున్నాడు. "కృష్ణా!" తెలియకనే, లాలనగా పిలచింది. నవ్వుతూ, పువ్వును ఆమె ముఖంపైకి విసిరాడు. కొంటెచూపులు, కొంటె చేష్టల పసందును, పూతనకు, పిల్లవానిగా, ఆ జగత్ప్రభువు రుచి చూపించాడు.

"అమ్మా! అమ్మా! చూడు. ఈ అల్లరి కృష్ణుడు, నా తలలోని చంపక పుష్పాన్ని లాక్కుని, నా ముఖంకేసి కొట్టాడు. అంటూ కొండెము చెప్పింది. కృష్ణుని చూసి ముసిముసి నవ్వులు నవ్వుతూ, ఆ తల్లి - యశోద - "అన్నా!" అంటూ అతనికై లేవబోయింది.

"ఇదేమల్లారమ్మా!" అంటే, అయ్యో! మా కృష్ణుని కొంటెచేష్టలు, ఒక ప్రక్క నవ్వు, మరొక ప్రక్క కోపాన్ని తెప్పిస్తాయి." అదేమంటే...."పిల్లలు కదమ్మా! అల్లరి చేస్తారంటాడు" ఓ పెద్దమనిషిగా నవ్వేస్తు చెబుతుంది.

"ఇప్పుడు ఫర్వాలేదు. ఈ అల్లరిపిడుగు పెద్దవాడైతే పట్టడం కష్టమేనంటుంది." పిల్లవాని అనురాగం పూర్తిగా పొందాలనే బుద్ధితో - పూతన! అయినా ఆమె మనసు ప్రేమతో పొంగింది. అనురాగం వర్షించింది. ఆనందం కురిపించింది. చిన్నికృష్ణుని గుండెలకు హత్తుకోవాలనిపించింది. చిత్రంగా పాలుచేపి, కారుతున్నాయి. మనసా, వాచా, కర్మణా... ఇప్పుడు పూతన, చిన్నకృష్ణుని గుండెకు హత్తుకోవాలని కోరుకుంటుంది. ఆమెలోని క్రూరస్వభావం కరిగిపోయింది. దగ్గరకు తీసుకోవాలనే కోరిక పెరుగసాగింది. అయితే ఇక్కడొక పొరపాటు జరిగింది. ఆమె స్నానం చేసిన వెంటనే తన చనుమొనలకు ఒక విధమైన విషాన్ని రాసుకుంది. పాల నెపంతో ఆ విషంతో పిల్లవాడిని చంపాలన్నదామె వుద్దేశం. ఈ రకంగా పూతన ఎందరినో చంపింది. ఇలాగే కృష్ణుని కూడా చంపాలని ఆమె ఆ విషం రాసుకుంది - కానీ,

మాతృప్రేమ, మమకారం, మానవత్వం ఆమెలో పెల్లుబుకుతున్నాయి. ప్రాణం తీయడం మీదకన్నా, గుండెలకు హత్తుకోవాలనే కోర్కె బలీయ మవుతుంది. దగ్గరకు తీసుకుని పాలిస్తే, అందరిలాగే, ఈ కృష్ణుడు చచ్చిపోతాడు. నా ప్రేమ గెలుస్తుంది. కంసుని పంతం జయిస్తుంది. నా కుటుంబం మరణం నుండి బయట పడుతుంది.

పూతన మామూలు సమయాలలోను, గతంలోను, ఇటువంటి విషమ పరిస్థితులనెదుర్కొనలేదు. తన ప్రేమను పంచడానికి తనను చంపుకుంటూ, పిల్లవానిని దగ్గరకు తీసుకుంది. ఆమె మనస్సు, శరీరం తన స్వాధీనంలో లేవు. యాంత్రికంగా ప్రవర్తిస్తుంది. కృష్ణుని దగ్గరకు తీసుకుని తొడపై కూర్చోబెట్టుకుంది.

కృష్ణుడు అటు ఇటు కదులుతున్నాడు. నవ్వుతున్నాడు. పూతనను ఆటలాడిస్తు న్నాడు. స్వాధీనం తప్పిన మనస్సుతో, స్తనాలపై కొంగు తొలగించింది. పాలు

కారుతున్నాయి. చేపిన స్తనాలను తన పమిటకొంగుతో, మళ్ళీ మళ్ళీ తుడుచుకుంది. పిల్లవాడికి పాలివ్వాలని దగ్గరకు తీసుకుంది. అప్పుడామెను ఆశ్చర్యపరుస్తూ -

"విషం రాసుకున్నావు. కదూ!" ఆ మాటలకు వులిక్కిపడింది. ఎక్కడనుండి వచ్చాయి, ఎవరన్నారు ? పిల్లవాడిని చేసి చంపాలని వచ్చావు కదూ!" మరేమి వినదలచుకోలేదు. ఏమైతే అయిందని కృష్ణుడిని దగ్గరకు తీసుకుంది. చేపిన స్తనాల నుండి కారే పాలను బాలకృష్ణుని కిచ్చింది. చిన్నికృష్ణుడు త్రాగుతున్నాడు. ఆమె కోరిన విధంగా స్పందించిన బాలకృష్ణుడు, పాలు త్రాగుతుంటే, పూతన పరవశించింది. తెలియని మత్తు ఆవరించింది. మాతృత్వం పొంగిపులకరించింది.

పిల్లవాడు పాలు త్రాగుతున్నాడు. త్రాగు నాయనా, త్రాగు. నా అదృష్టం. నీ ఆనందం, పులకరించి చెబుతుంది. పరవశత్వం తప్ప ప్రపంచం తెలియడం లేదు. బుద్ధి పనిచెయ్యడం లేదు. తెలియని మమత, మమకారం, పరవశత్వం, ఏదో అవుతుంది చెప్పలేదు. ఆమె కోరికల్లా, ఈ కృష్ణుని యశోదా, "నందుడు", నందనందనుడు పాలైనా త్రాగి మరణించాలి. లేక నా ప్రాణమైనా తీసి నన్నుద్ధరించాలి. అదే తలంపు. అదే ఆనందం. ఆ పరవశత్వమే.... తనకు మతి లేకుండా చేసింది. తనను అర్పించుకుంటున్నట్లు.... పూతన కలవరింతలాగ పలవరించింది.

వున్నట్టుండి తలబ్రద్దలవుతున్నట్లుంది. ఏదో అవుతుంది. ఏమవుతుంది. నొప్పి, గుండెలు పిండేసే నొప్పి. సంతోషంతో పిల్లవాడు చనుపాలను త్రాగుతున్నట్లు వాటిని కొరుకుతున్నాడు. అదే సమయంలో.... అరుపులు, కేకలు, పరుగులు....... నందుడు వచ్చాడు. అతనివెంట పరిచారిక, మిత్రబృందం.

పూతన వచ్చిందంట. ఎక్కడ ? మీరు చూసారా ? నందుని ప్రశ్న. "పూతనా..." ఆ పేరు వింటూనే భయపడేవారు, ప్రక్కకు జరిగేవారు, పారిపోయారు. కొందరు కాదు. ఎందరో... ఎక్కడా ? ఎక్కడ ? మరికొన్ని గొంతుకులు.

ఇక్కడే వుంది. ఇక్కడికే వచ్చింది. కృష్ణా, కృష్ణా! కృష్ణుడెక్కడ ? పెదవి నుండి, మరో పెదవికి పూతన పేరు... పెను ఉత్పాతంలా సాగుతుంది. యశోద కూడా ఆ పేరు వింది. పూతనా.... పూతన, .... కృష్ణుడు... కృష్ణా, కృష్ణా... అమాయకంగా తను పిలుస్తున్నట్లు అరుస్తుంది.

తనవైపు పరుగులుతీస్తూ కృష్ణుని పిలుస్తూ, పూతన పేరెత్తుతూ, అటు

ఇటు హడావుడి పడుతున్నారు. వారిలో నందుడు వున్నాడు. యశోద ప్రక్కనున్న మనిషిని చూస్తూ, ఈమెవరు ?' అనే లోగా ఆమె "పూతన" అన్నారెవరో. అప్పటికే కృష్ణుడు ఆమె నవనాడుల్ని గుంజేసాడు. ప్రక్కకు తప్పుకున్నాడు. ఆమె అలాగే నేలమీదకు జారిపోయింది. చివరి చూపుగా, కృష్ణుని ప్రేమగా చూసింది. ఆ చూపులలో అమిమైన మాతృప్రేమ తొంగి చూసింది.

పూతన అలాగ నేలవ్రాలడం, కృష్ణుడు యశోద చాటుకు వెళ్ళడం ఒకేసారి జరిగింది. ఆమె కృష్ణుని పొదివిపట్టుకుని దగ్గరకు తీసుకుంది. గుండెలకు హత్తుకుంది. అప్పుడు అక్కడికి నందుడి కూడా వచ్చాడు. బోర్లా సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్లు నేలమీదపడివున్న ఆమెను చూసి, ఆమెను పూతనగా నిర్థారణ చేసుకున్నాడు.

"కృష్ణుడెక్కడ ?" తెలియని కంగారుతో, అంత హడావుడిగాను అడిగాడు. 'ఇడిగో' అంది యశోద. అప్పుడు నందుడు -

పూతన, మన గోకులానికి బయలుదేరినట్లు మధురలో నాకు తెలిసింది. వెంటనే బయలుదేరి వచ్చేసాను!" వూపిరాడనంత హడావుడిగా నందుడు యశోదతో చెప్పాడు.

దాంతో అక్కడ చేరిన వారందరు, చేతిలో వున్న వెదురుకర్రలతో, "చంపండి. చంపండి పూతనను. ఏదీ పూతన, చంపండి!" మహావీరుల్లా అరుస్తున్నారు.

"ఆమె చచ్చిపోయింది" చాలా మెల్లిగా, చల్లగా యశోద చెప్పింది. పూతన శవ శరీరం నుండి ప్రక్కకు తొలగుతూ చెప్పింది. ఈ కృష్ణుడే దానిని చంపేసాడు!" అది వీరత్వమైనా, ఇంకా మెల్లగా చెప్పింది. కృష్ణుడిని గట్టిగా కావులించుకున్న పుణ్యంతో, ఆమె, ఆమె జీవితం, శరీరం సర్వం ధన్యమయ్యాయంది.

# తృణావర్తుడు

**పూ**తన మరణవార్త కంసుని అగ్గిగుగ్గిలం చేసింది. తట్టుకోలేని ఆ వార్తతో, మహాకోపిష్టి - వుగ్రుడయ్యాడు. వెంటనే ప్రలంబుడిని రమ్మని ఆదేశించాడు. ఈ ప్రలంబుడు, కంసునికి - మంత్రి - తత్వవేత్త, సంరక్షకుడు లేదా మార్గదర్శి.

కంసుని పిలుపుతో వున్నవాడు వున్నట్లే వచ్చాడతడు. అతన్ని చూస్తూ -

"ప్రలంబా, విన్నావా ? పూతన మరణించింది. ఆ వార్త విని భరించ లేనట్లన్నాడు. పూతన వంటి విశ్వాసపాత్రురాలు, వినయమూర్తి దొరకదు. ఇప్పుడు గోకులం నుండి వచ్చే ప్రద్యోతునికి, ఈ అవాంతర మరణాన్ని, నాశనాన్ని ఎలా చెప్పాలి, దీనికెలాగ ప్రతీకారం తీసుకోవాలి ?" కంసుడు ఆవేశ పడుతున్నాడు. అడుగుతున్నాడు.

"రాజా! పగ-ద్వేషాలు, మన ప్రతాపాన్ని, పౌరుషాన్ని ప్రదర్శించవు. అనవసర సంఘర్షణలు, అల్లర్లు, ఆగడాలకు దారిచూపుతాయి. మీరు చెప్పమంటే నా మనస్సు విప్పి చెబుతాను.

"చెప్పు" సాలోచనగా కంసుడు చూసాడు.

"ప్రభూ! మధురాధిపతులైన మీరు, ఇప్పుడు పదిమందిలో పరిహాసపాత్రు లయ్యారు. అందుకు దేవకీ సంతాన సంహారకాండే మూలకారణమైంది. అయినా వాళ్ళు, ఇంకా చెప్పాలంటే, ఆశ్రితులు, బంధువర్గం, ఇతర ప్రజలు యదువీరులతో కలిసి మీ సార్వభౌమాధికారాన్ని ధిక్కరించే పరిస్థితిలో వున్నారు.

ఇప్పుడు, క్రొత్తగా గోకుల విషయం మీ చర్యగా లోక విదితమైతే, యదువంశీయులందరు ఒక్కుమ్మడిగా మిమ్ము ఢీ కొనవచ్చును. మనవాళ్ళలో చాలామంది పాంచాల రాజ్యానికి వెళ్ళిపోయారు. ద్రుపదుని ఆదరాభిమానాలను కూడా పొందారు. ఆ ద్రుపదుడు, ఆతనిని అభిమానించే యాదవులు కత్తి గడితే, ఎదుర్కొనడం చాలా కష్టం.

ఇది పిరికితనంతో చెప్పే మాటలు కావు. ప్రస్తుత పరిస్థితిని వివరిస్తున్నాను. ఈ సమయంలో మనం తీసుకొను ప్రతి తొందరపాటు చర్య, పూతనవలె మట్టి గరచుతుంది. మనల్ని హరించి వేస్తుంది. అంతా విన్న కంసుడు పరమ మూర్ఖుడయ్యాడు.

అయితే ద్రుపదుడు మనపై కత్తి కడతాడంటావు - కట్టనీ, మనమంతా యుద్ధానికి సిద్ధంగా వున్నాము. మన ప్రతాపాన్ని ప్రకటించి, పాంచాల దేశాన్ని పరాజయం పాలు చేద్దాము. తిరగబడినట్లుంది కంసుని వరుస. ముదిరే సంక్షోభం కన్నా, ఇప్పుడే ఎదుర్కోవడం చాలా మంచిదన్నాడు.

"నిజం, మహాప్రభూ! మీరు యుద్ధానికి సిద్ధంగా వున్నారని నాకూ తెలుసు. కాకపోతే, ఇప్పుడు మీరు గోకులంపై కత్తిగట్టి, దానిని మట్టిగరుప దలిస్తే, యదు శూర వంశీయులు వీరులై విజృంభిస్తారు. వృష్ణివంశీయులు సహాయపడతారు. వసుదేవుని బంధువైన కుంతిభోజుడు, పాంచాల ప్రభువుకు తప్పక సహకరిస్తాడు.

"వీరందరు పోరుకు సిద్ధపడితే, పాండురాజు పితామహుడు భీష్ముడు తన వీర విక్రమాన్ని ప్రదర్శిస్తాడు. ఇంత గొడవ జరిగితే మనము, వీరావేశం మనంగానే మిగులుతాము. చేతులెత్తేస్తాం. అప్పుడు చెప్పుకోవడానికి, ఈ వీర విక్రమ సాహసాలెందుకు పనికిరావు. ఒక్కక్షణం శాంతంగా ఆలోచించండి. పరిస్థితి మీకే అర్థమవుతుంది. అప్పుడేం చెయ్యాలో నిర్ణయించుకుందామన్నాడు.

క్షణకాలం మౌనంగా వున్న కంసుడు, "ఓ వృద్ధమంత్రీ! నీ సలహా సమంజసంగా వుంది. నీ తెలివితేటలు, సమయోచిత సలహాకు, ధన్యవాదములు. కాని కంసుడు వూరుకోడు. తనకక్ష తప్పక తీర్చుకుంటాడు" అవేశపడ్తూ చెప్పాడు. ఆతని అనుమతితో ప్రలంబుడు వెళ్ళిపోయాక, కంసుడు ఆలోచనలో పడ్డాడు.

"అంటే... నందుని కొడుకు సామాన్యుడు కాదు. మాయలమారి పూతన ప్రాణాలను హరించాడంటే, ఆతనిని గూర్చి తప్పక ఆలోచించాలి. అతన్నెలాగ వదిలించుకోవాలి. బలపరాక్రమాలు ప్రదర్శిస్తే, ఖచ్చితంగా ప్రలంబుడు చెప్పినట్లు జరుగుతుంది. బహిరంగంగా బలప్రదర్శన తగదు. మరి.... ?!

సింహాసనం దిగి లేచి నిల్చున్నవాడు, కిటికీ నుండి యమునను చూస్తున్నాడు. అప్పుడతని కళ్ళలో ఆ యమునానది ఒడ్డున పక్షులను పట్టే వేటగాడు కనబడ్డాడు. వీళ్ళు పిల్లలనెత్తుకుపోవడంలో దిట్టలు. ఇటువంటి వాళ్ళను వుసిగొల్పితే... ఆ ఆలోచన రావడమే తడవుగా. చప్పట్లు కొట్టాడు. ఒక నమ్మినబంటు రాగా, ఆతన్ని. ఆ పిట్టలు పట్టేవాడిని తీసుకురమ్మని పంపాడు. ఇది ఇక్కడి పరిస్థితి...

అక్కడ గోకులంలో -

పూతన రాకనుండి, ఆమె మరణం వరకు సర్వం తలచుకున్న యశోద "అమ్మో! నా బిడ్డకు ఎంత ప్రమాదం తప్పిందని క్షణం భయపడి, ఆ తదుపరి భగవంతుని కరుణకు కృతజ్ఞతలు చెప్పుకుంది. ఇక చాలా జాగ్రత్తగా వుండాలని

నిశ్చయించుకుంది. అసలా కథనం తలుచుకుంటేనే ఒక ప్రక్క ఆశ్చర్యం. మరొక ప్రక్క భయం. తెలియకుండానే పెదవులు "అమ్మో!" అనేస్తున్నాయి. ఒళ్ళు గగుర్పొడుస్తుంది కూడా!

ఆ జరిగింది యశోద రాత్రింబవళ్ళు మరచిపోలేకపోతుంది. అకస్మాత్తుగా, మనసు పిలిచినట్లు "కృష్ణా! కృష్ణా" అనేస్తుంది. అవును. ఇంతటి ప్రమాదం నుండి తప్పించుకున్నాడంటే, పాలివ్వ వచ్చిన పూతననే చంపాడంటే... ఈతడు... ఉహూ... సామాన్యుడు కాడు. పేరుకు రెండేండ్లవాడే కాని, అతడు చేసిన ఈ లీల అసాధారణము. అనన్య సామాన్యము. తనలో తనే తర్కించుకుంటుంది.

ఏమైనా సరే కృష్ణుని ఒంటరిగా విడువరాదు. ఇటువంటి ప్రమాదాలకు కారణం కారాదు. బలంగా తీర్మానించుకుంది. నందుడు, రోహిణితో, తన కుటుంబ సభ్యులందరికి ఆ విషయం చెప్పింది. "జాగ్రత్త"ని హెచ్చరించింది. కంటికి రెప్పలా ఆ పిల్లవాడిని కాపాడుకోవాలని కూడా చెప్పింది.

ఇవి ఆమె తల్లిగా యశోద చెప్పే మాటలు. కానీ కృష్ణుని.... అదే కొంటె కృష్ణుని, అల్లరి కృష్ణుని ఎవ్వరు ఆపలేరే ? ఆపడం కూడా అసహజం. అలాగ కళ్ళుగప్పి, ఆ చేసే అల్లరికి నవ్వుకునేవారు - ఉడుక్కునే వారు, ఉలికిపడేవారూ వున్నారు. అంతటి దుడుకు, దుందుడుకు - ఆ చిన్ని, రెండేళ్ళ బాల అల్లరి, తుంటరి, కొంటె కృష్ణుడు. ఈతనికి తోడు బలరాముడు.

పేరుకు అన్న అయినా, కృష్ణుని మాటకు, ఆ ముగ్ధమోహన రూపానికి కట్టుబడితాడు. ఒక్కొక్కసారి మిగిలిన పిల్లలతో కలిసి, తల్లి యశోదమ్మను బలరాముని వలె ఆటపట్టిస్తాడు. క్షణం కనబడకపోతే యశోద కొట్టుకుపోతుంది. చేసే పనిని ఆపేసి, కృష్ణుడిని వెదకడం ప్రారంభిస్తే - ఏదో ప్రమాదంలో చిక్కుకుని, ఆ ఉపద్రవం నుండి తేలికగా బయటపడి "అమ్మా!" ప్రమాదం తప్పిందని అమ్మచేత అనిపించి, ఆమె కౌగిలి చేరుతాడు. అమ్మ ప్రేమకు, అమ్మనే బందీ చేస్తాడు. ఆనందపరుస్తాడు.

"ఏమిటి కృష్ణా...!" అందో యశోద - "ఏం చేసానమ్మా ?! అంటాడు అమాయకంగా. కృష్ణుని ఏమీ అనలేని అశక్తతో, అతని అమాయకచూపులకు, ఆ తల్లిని బందీ చేస్తాడు. తన ప్రేమతో బంధిస్తాడు. నందుడుకైతే యశోదకన్నా ఎక్కువ భయం. మగవాడు, నాయకునిగా పైకి చెప్పుకోలేక తల్లడిల్లిపోతాడు.

జరిగిందానిని బట్టి చూస్తే కంసుడు, ఈ కృష్ణుని దేవకి అష్టమ గర్భ

శిశువుగా తలచి, సరాసరి ఎదుర్కోలేక, ఈ రకమైన దురాగతాలకు పాల్పడి ఉంటాడు. ఇక వీడు వూరుకోడు. తన దుర్మార్గాన్నేదో రకంగా ప్రకటించుకుంటూ తమకు పీడాకారమౌతాడని, తన నాయకత్వ బుద్ధితో, కంసుని నైజం తెలిసినట్లు వులిక్కిపడ్డాడు. తనను తాను జాగ్రత్తగా వుండమని, వుండాలని హెచ్చరించుకున్నాడు. కాబట్టి కృష్ణుని వేయి కళ్ళతో కాపలా కాచుకోవాలని, ఆ బాలుని రక్షించుకోవాలని తీర్మానించుకున్నాడు.

"కృష్ణుడు"..... అనగానే నందుడు కూడా, యశోద వలెనే జావగారి పోయాడు. ఆ చిన్నడి అల్లరిచేష్టలు ఆనందదాయకాలు. ఆతని ప్రతి అడుగు, కదలిక, పరమానందదాయకం. అది చూసి ఆనందించడమే తప్ప, కాదని అదిలించడం తనకే కాదు, గోకులంలో ఎవ్వరికి చాతకాదు. అందరికి సమ్మోహనమూర్తి. ఆనందుడు, ఆ"నంద"నందనుడు.

పిల్లల అల్లరి, ఆటలు ఎలాగ వుంటాయో తెలియని, ఇలాగే వుంటాయని చెప్పలేని, ఆ "నంద-యశోద"లు, ఆతని పరివారం ఆనందించడం తప్ప, తప్పు" అని అనలేరు. తప్పనిదని విడలేరు. వూహించలేని ఆ కొంటెచేష్టలకు ఆ క్షణంలో విన్నప్పుడు, కన్నప్పుడు కోపమొచ్చినా, కృష్ణుడు ఎదురుపడి, నవ్వుతూ, తన సమ్మోహన చూపులతో "నేను" అల్లరి చేసానా ? అంటే, "నువ్వు చెయ్యలేదు. ఈ కృష్ణుడు అల్లరివాడు కాడు. ఇవి బాల్యక్రీడలు. నీకే చెందిన "బాల" కృష్ణా... ఆటలు, మాకు ఆనందాలని మైమరచిపోతారు. అంతటి మాయా మోహన సమ్మోహనమూర్తి - నిజమైన ఇంద్రజాలికుడా కృష్ణుడు."

కృష్ణుడి అల్లరి విని, కోపించి, ఆతని కోసం వెదకులాట ప్రారంభిస్తే, ఆ మాయా మోహనుడు తన లీలతో "ఏవిటమ్మా వెతుకుతున్నావు, నన్నేనా.... ? ఇక్కడే వున్నాను, కదా!" అనే మాటకు లొంగిపోతారు. విని కరిగిపోతారు. కృష్ణునిపై చెప్పినవన్నీ కొండెములుగా కొట్టి పడేస్తారు. అంతటి ఆ "నందుడా", "నంద" కుమారుడు. "ఎక్కడరా నువ్వంటే, ఇక్కడేనమ్మా" అని ఆ పసిపిల్లవాడు తల్లి కొంగు పట్టుకుని మారాం చేస్తున్నట్లు నటిస్తాడు. "నా మతిమండ - నిన్నిక్కడే వుంచుకుని...!" యశోద బాధపడుతుంది.

నంద, యశోదలకు - శ్రీకృష్ణుని బాలచేష్టల నుండి బయటపడటం సాధ్యం కాదు. ఆ కృష్ణలీలలలో వారు బందీ అయ్యారు. పూర్తిగా బంధించబడ్డారు. అదొక అద్భుతం ఆనందం.

ఇలాగ రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు తన సమీప బంధువు ప్రసవవేదన పడుతుంటే ఆమెను చూడటానికి కృష్ణుని ఎత్తుకుని తీసుకు వెళ్ళింది. ఎడంవైపు ఎత్తుకుందేమో, కృష్ణుని మోకాళ్ళు ఆమె నడుముకు తగులుతున్నాయి. కొంటె కృష్ణునికేమనిపించిందో ఏమో, వున్నట్టుండి క్రిందకు జారి గబగబా పరుగెత్తాడు. ఆ గుజ్జం పరుగుకు, కృష్ణుని పట్టుకోవడం ఆమెకు కష్టమైంది.

కృష్ణా, కృష్ణా..... వట్టినే అరుస్తుంది. ఏం లేదమ్మా - ఎగురుతూనే సమాధానమిచ్చాడు. "వద్దురా...!" యశోద. "వుండమ్మా!" కృష్ణుడు... . అబ్బబ్బ. నేను పరుగెత్తలేనురా, నిన్ను పట్టుకోవడం నావల్లకాదు!" అలిసిపోయి చతికిల బడినట్లు నిలబడిపోయింది.

"నేను పరుగెడతాను. తప్పదన్నాడు.

"రా" అంటూ అతన్ని గట్టిగా పట్టుకుని ప్రక్కనున్న వరండాలో నిల్చుని వూపిరి పీల్చుకుంటుంది. అప్పుడు - సూర్యుడు మేఘాల చాటుకు వెళ్ళాడు. వాతావరణం చిత్రంగా మారిపోయింది. గాలి దుమారం లేచి, సుడులు తిరిగితే వచ్చిన ఆ సుడిగాలికెగిరిన దుమ్ము కళ్ళలో పడకుండా కళ్ళు మూసుకున్నా, యశోద కళ్ళలో పడనే పడింది. "కృష్ణా" అంటూ కళ్ళు మూసుకుంది.

"కృష్ణా..." అంటూ ఒక ప్రక్కగా అతన్ని వుంచి, అతని ప్రక్కనే కళ్ళు నులుముకుంటూ నిల్చుంది. కళ్ళు తెరవడం బలవంతంగా కృష్ణుని ఆపడం యశోదకు సాధ్యం కావడం లేదు. కొంతసేపటికి సుడిగాలి ఆగింది. యశోద మెల్లిగా కళ్ళు తెరిచి కృష్ణుని కోసం చూసింది. ప్రక్కన కన్నయ్య లేడు. కళ్ళు రుద్దుకుని, లోతుగా చుట్టుప్రక్కల చూసింది. కృష్ణుని జాడ లేదు. అంతే -

కృష్ణా... కృష్ణా... బిగ్గరగా అరవడం, ఆ వెంటనే ఏడవడం ప్రారంభించింది. అరుస్తూంది. అటు ఇటు పిచ్చిదానిలాగ తిరుగుతుంది. అటు ఇటు పరుగెడుతుంది. కృష్ణునికై అరుస్తుంది. అక్కడ కృష్ణుడు లేడు. అరుపులు కాస్తా, ఏడుపులు, "నా కృష్ణా.... కృష్ణా...!" అపుకోలేకపోతుంది. తన అరుపే తనకు వినబడుతుంది తప్ప, కృష్ణుని సమాధానం లేదు. కృష్ణా.... ఏడుస్తూ క్రిందకు జారగిలబడిపోయిందా తల్లి.

దారిన గోపికలు, యశోద ఏడుపును చూసి ఆగారు. వాళ్ళు కూడా చుట్టుప్రక్కల వెదకడం ప్రారంభించారు. ఇంకొందరీ వార్తను నందునకందించారు.

నందుడు హడావుడి పడ్తూ పరిజనులతో వచ్చాడు. అంతటా వెదకమని తన వాళ్ళను పంపి, ఏం జరిగిందో చెప్పమని యశోదను ఓదారుస్తూ అడిగాడు.

అలాగ వెదకగా, వెదకగా పొలిమేరల్లో ఎవరో పడుకున్నట్లు దూరం నుంచి చూసి, పరుగెత్తుకు వెళ్ళి, ఆ పడివుండేవాడెవరో గమనిస్తే,, అతదు పిట్టలపట్టేవాడు. అతని బుఱ్ఱ పగులగొట్టబడి వుంది. అతని పేరు తృణావర్తుడు. రెండురోజుల క్రితం మధుర నుండి, ఆ సంచార దేశద్రిమ్మరి ఇక్కడికి వచ్చాడు. ఇలాగ దారుణంగా పడి చచ్చాడు. ఇతన్నెవరు చంపారు ? ఇప్పుడిదో సమాధానం లేని శేష ప్రశ్న.

వాణ్ణి చూసిన నందుడు, అదుపు తప్పి గట్టిగా అరిచాడు. వీడు, వీడు నా పిల్లవాడిని మాయం చేసి వుంటాడు. అందుకే ఇక్కడికి వచ్చి వుంటాడు. మరి పిల్లవాడెక్కడ ? ఇతన్నెవరు చంపారు ? అనే ఆలోచనకు సమాధానం తెలియని వారు, నలుప్రక్కలకు పరుగులు తీసారు. కృష్ణా.... కృష్ణా.... అనే అరుపులు అక్కడ ప్రతిధ్వనిస్తున్నాయి.

కొంత తడవు జరిగాక, అప్పుడు... అప్పుడు... కృష్ణా.. కృష్ణా... అంటూంటే... ఇక్కడున్నాను నాన్నా... అన్నాడా బుడతడు. మరుక్షణం, గుబురు మామిడిచెట్టు నీడ నుండి పరుగెడుతూ, కృష్ణుడు తండ్రిని సమీపించాడు. నందుని చేతులలో ఇమిడిపోయాడు.

"ఏమయింది నాన్నా, ఎలాగొచ్చావు ఇక్కడికి ?" కృష్ణుని గట్టిగా కౌగలించుకుని, ముద్దులు పెడుతూ, గుండెకు హత్తుకుని గోముగా, కుమారుని, నందుడు అడుగుతున్నాడు. "నాన్నా!" కృష్ణుడు తండ్రిని రెండుచేతులతో మెడపట్టి కౌగలించుకుని "వీడు పరుగెత్తి నన్ను పట్టుకున్నాడు" తృణావర్తుని చూపుతూ, గోముగా అడిగిన తండ్రికి మారాం చేస్తున్నట్లు చెబుతున్నాడు.

వాడు నన్ను గట్టిగా పట్టుకున్నాడు. నేను వాడినలాగే పట్టుకున్నాను. వాడు పడిపోయాడు. నేను పరుగెత్తాను! అంటూ మిగిలిన విషయం చెప్పక, పకపక నవ్వాడు.

"పోనీలే, నాన్నా.... మా అదృష్టం బాగుంది." ఆ పిచ్చి తండ్రి బాలకృష్ణుని అక్కున చేర్చుకుని, ఇంటికివచ్చి, జాగ్రత్తంటూ యశోదకు ఇచ్చాడు.

ఇక్కడ జరిగింది యావత్తూ... పూతన రావడం, కృష్ణుడామెను చంపడం, తృణావర్తుని రాక, చిత్రంగా ఆతను చావడం... అన్నీ... అన్నీ... దేవకీ వసుదేవులకు తెలిసాయి. వారు తల్లడిల్లిపోయారు. తమ దౌర్భాగ్యానికి కుమిలిపోయారు. కంసుడికి

తమ శిశువు నందుని ఇంట, గోకులంలో వున్న సంగతి తెలిసిపోయిం దనుకుంటాను.

అందుకే పిశాచి పూతనను పంపాడు. అది చావడంతో, ఈ పిట్టలు పట్టే తృణావర్తుడు. ఇతడు చిత్రంగా చచ్చాడు. గర్గులవారి నుండి దేవకి, వసుదేవులు, పూతన కథనాన్ని విని ఆశ్చర్యపోయారు.

దాంతో దేవకికి, తన పుత్రుడనుకునే కృష్ణుడు, ఆ దేవదేవుడని, అందుకే అతడు పూతనను, తృణావర్తుని చిత్రంగా సంహరించాడని తలచుకుని మురిసింది. చేతులెత్తి తమకు సంతోషం కల్గించమని ప్రార్థించింది. తన ప్రార్థనా మందిరంలోకి వెళ్ళి "దేవదేవా! ఈ దేవకిని కరుణించి, ఆనందాన్ని ప్రసాదించు. ఆత్మానందం ప్రసాదించు!" గుండెనిండుగా ప్రార్థించింది.

అయితే వసుదేవుడు సామాన్య యాదవుడయ్యాడు. దేవకికి వున్నంత భక్తి, విశ్వాసాలు తమ పుత్రునిపై వసుదేవునికి లేవు. "కంసుడు"ఆ పేరు వింటేనే వసుదేవుడు భయపడిపోతున్నాడు. వాడు పరమక్రూరుడు. కృష్ణుడిని విడిచిపెట్టడు. ఆ భయము కలగడంతో, వసుదేవుడు, అక్రూరుల వారిని - కులగురువులు గర్గుల వారిని సంప్రదించి ఈ గండం నుండి బయటపడటానికి సలహానడిగాడు.

వసుదేవుని ఆందోళనను అర్థం చేసుకున్న అక్రూరుడు, అతన్ని ఆందోళన పడవద్దని ప్రశాంతంగా వుండమని కోరాడు. కంసుడు ప్రలంబుని సంప్రదించడం తనకు తెలిసిందని, తొందరపడి కంసుడు పరిస్థితులకు తెగించి ప్రాణం మీదకు తెచ్చుకోడని వూరడించాడు.

పైగా నీ భయం నిరాధారమనీ, శ్రీకృష్ణుడు ఆ సర్వేశ్వరుడని, అతనికి అపాయం కల్గించడానికెవరు సాహసించరని, ఈ విషయం తెల్సినవారు తెగించి, ప్రాణాలు తీసుకోరని, విచారించవలదని చెప్పాడు. అనవసర ఆందోళన, ఆదుర్దా వలన ఏమీ ప్రయోజనం లేదని, అంతా ఆ సర్వేశ్వరుడు తలచినట్లే జరుగు తుందని శాంతచిత్తుడిని చేసాడు.

మరోవిషయం. నేను పక్షానికోసారి గోకులానికి వెళ్ళి అక్కడ పరిస్థితులను చెబుతుంటాను. విని వూరుకో. అనవసర ఆందోళన పరిస్థితిని ఉద్రేకపరుస్తుంది.

చివరకు కంసుడు "ఆ నందబాలుడు, దేవకీ అష్టమగర్భ సంతానమని తెలుసుకున్నా ఆశ్చర్యపడనక్కర్లేదు. అంతటి క్రూరుడు వాడు. తన ప్రాణహరుని తెలుసుకోవడానికి, అతనిని తుదముట్టించడానికి, కంసుడు పడే తాపత్రయం అంతా, ఇంతా కాదు. ప్రాణభయం, ప్రాణంపై తీపి అలాగ వుంటుంది. కాబట్టి, అనవసరాలోచనలు చేసి, పరిస్థితినుద్రేకపరచి ప్రమాదస్థాయికి తీసుకురాకు." అంటూ మళ్ళీ గర్గులవారే వసుదేవుని చూస్తూ -

కాకపోతే ఒక పని చెయ్యి. ఈ ఉద్రేకాలు, ఆందోళనల నుండి బయట పడటానికి మీరివురు కొన్నాళ్ళు తీర్థయాత్రలు చెయ్యండి. మనో ప్రశాంతత కల్గుతుంది. దృఢవిశ్వాసం కల్గుతుంది. ఇంతకుమించి మరోమార్గం లేదు" అన్నారు.

"మేము లేని సమయంలో పిల్లవాడికేమైనా జరిగితే... వసుదేవుని భయం వింటూ....

"వుండి ఏం చేస్తావు ? గర్గులు అడిగారు కోపంగా. మళ్ళీ కాస్త తేరుకుని, "నేను మీకు (యాదవులకు) పురోహితుడిని. నా రాకపోకలకు ఆంక్షలు లేవు. గోకులానికి వెడుతూ, వస్తూ వుంటాను. అవసరమైతే కొన్నాళ్ళు అక్కడ వుంటాను. ఇంతకుమించి ఏం చెయ్యగలమో నువ్వే చెప్పు." అనగానే అక్రూరుడు కల్పించుకుని "వసుదేవా, గర్గులవారు చెప్పింది నిజం. వారి మాటల్ని గౌరవించి ఆ ప్రకారం మనం నడుచుకుంటే, కృష్ణునిపైబడ్డ నీలినీడలు తొలగిపోతాయి. మీ పిల్లవాడు కృష్ణుడనే భావన ఎవ్వరికి రాదన్నాడు.

"దేవకి ఒప్పుకుంటుందా ?" వసుదేవుడు అనుమానంగా అడిగాడు. అర్థమయ్యేటట్లు చెబితే, దేవకి తప్పక ఒప్పుకుంటుందన్నారు గర్గులవారు. వసుదేవునిలో భయ ఛాయలు తొలగడం లేదు. అప్పుడు - అక్రూరుడు స్థిర నిశ్చయంతో చెప్పాడు.

"వసుదేవా, ఒక్క విషయం తెలుసుకో. ఏ వృష్ణివీరుడు, కృష్ణునికి అపకారం జరిగితే వూరుకోడు. కృష్ణుని రక్షించుకోవడమే వృష్ణివీరుల లక్ష్యమని తెలుసుకుని ప్రశాంతంగా వుండు. అయినా, నీ పిచ్చిగాను, మాయ పూతనను, సుడిగాలిలాగ వచ్చిన తృణావర్తుని అవలీలగా చంపిన కృష్ణుడు అవతార పురుషుడు కాని సామాన్య మానవుడు కాదు. కనుక ఆందోళన, అనవసర భయాలనవసరమని సిద్ధాంతీ కరించినట్లు, స్పష్టంగా చెప్పాడు. దేవకికి, నిజం చెప్పి నేను ఒప్పిస్తానంటున్నాడు అక్రూరుడు. ఆ సమయంలో.. "ప్రభూ" అంటూ దేవకి

వచ్చింది. అంతా విన్నట్లామె, మన కులగురువులు గర్గులవారు చెప్పింది. నిజం, సత్యం. మనం మనకి ప్రశాంతికోసం, తీర్థయాత్రలకు వెడదాం. మనల్ని రక్షించడానికి పుట్టిన ఆ పరమాత్మ, తననే కాదు, ఈ లోకాన్ని రక్షించగల సర్వసమర్థుడు. ఆతని గూర్చి చింతన అనవసరమని ఎంతో విస్పష్టంగా, ఖండితంగా, దృఢనిశ్చయంతో చెప్పి, "వసుదేవుని వూరడించిందా తల్లి - దేవకి, శ్రీ కృష్ణమాత".

""""""

# ఆనందమయుడు

గోకులంలో తెల, తెలవారుతుంది. అరుణ సూర్యుడుదయిస్తున్నాడు. కృష్ణుడు అందరికి ఆశ్చర్యం కల్గిస్తున్నట్లు "నేను నిత్యానందుడను. అది ఆరేళ్ళైనా, అరవై ఏళ్ళయినా సరే......" అన్నట్లున్నాడు.

యశోద పాలు పితుకుతుంది. రంకెలువేసే ఈనిన ఆవులు, దూడలు, ఆ పిలుపుకు స్పందించే తల్లి ఆవులు... అవి వింటూ ఇంక లేవాలనుకున్నాడు కృష్ణుడు. బలరాముడో సోమరిపోతు. వాడొక పట్టున తొందరగా లేవడు. వాడిని ఆటపట్టించి, నిద్ర లేపాలి, వాడుమొండి, మొర్రటైనా, నేనేం చేసినా, వాడికి.... వాడికి నేనంటే ప్రేమే. తల్లి రోహిణితో మధుర వెళ్ళడానికన్న, ఇక్కడ నాతో గోకులంలో వుండటమే బలరామునికిష్టం.

మేము తొందరగా తయారయి, ఇతర గోపాలురకన్న ఆవులమందతో ముందు వుండాలి. అప్పుడే ఆ పిచ్చి, వెఱ్ఱి గోపాలురు సంతోషిస్తారు. లేదంటే "కృష్ణా, కృష్ణా" అంటూ బాధపడతారు. మాకోసం వెదుక్కుంటారు. నేను వాళ్ళకు నాయకుడిని కదా! నన్ను చూడక వాళ్ళుండలేరని కృష్ణుడు తలచాడు. ఇవి లీలలనేకన్న పరమానందుడనైన నా నిత్యానందానంద స్వరూపం.

కృష్ణుడిది ఆనందతత్వం. ఆయన పరమాత్మ. భక్తుల మనోదృష్టిని, బుద్ధిని బట్టి, తనను మలుచుకునే దివ్యాత్ముడు. తల్లిని ఆడించాడు. ఆనందింపచేసాడు. వూళ్ళోకివెళ్ళి అల్లరి చేసాడు. అందరింటి పాలు, పెరుగు, వెన్నలు తాను తిన్నాడు.

తనవారందరికి పంచాడు.

కుండలకొద్దీ ఇంట్లో వుంచుకునేకన్న కోరినవారికి ప్రేమతో వున్న సంపద పంచి పెట్టడంలోనే ఆనందముందన్న సత్యాన్ని, తన ప్రేమతో - వెన్న, పాలువలె చిలకరించి పంచిపెట్టాడు.

తాను తన తత్వం - తల్లికి అర్థమవడానికిగాను, తానెవరో తెలియ చేయాలని ఒకమూల ప్రయత్నిస్తూనే వున్నాడు. మరొకప్రక్క ఆమె మాతృప్రేమకు లొంగిపోయి, పరాకు, మాయలతో ఆమెను మామూలు తల్లిని చేసి ఆనందింప చేస్తున్నాడు.

పాలు, పెరుగులు, ముఖ్యంగా వెన్నంటే అమిత ఇష్టమైన ఈ కన్నయ్య, గోకులంలోని అన్ని ఇళ్ళు తనవేనన్నట్లు ఆ ఇళ్ళలోకి తనను అనుసరించి వచ్చే కొందరితో కొన్ని సమయాలు, అందరితో మరికొన్ని సమయాలతో - అన్న బలరామునితో కలిసి ఇంకొన్ని సమయాలలో, పాలు, వెన్నల వేటకు బయలు దేరేవాడు. ఆ చిన్నికృష్ణుడు తాను తిని, తనవారికి పంచిపెట్టడంలోనే అమితానందం పొందాడు. ఒకటి, రెండు దినాలైతే ఎవరైనా వూరుకుంటారు. నిరంతరాయంగా, నిరంతరం జరిగే ప్రక్రియను, ఎవరు మాత్రం, ఎన్నాళ్ళు భరిస్తారు.

దాంతో కొండెములు చెప్పడం, ఆగడాలు వర్ణించడం, అల్లర్లు సహించలే మనడం నిత్య తంతు అయింది. తల్లి దృష్టి నుండి తనను, కోపాన్ని తప్పించడానికి, తమాషాగా ఒక్కొక్కసారి మన్ను తిన్నట్లు నటించేవాడు. ఒకనాడు కావాలని బలరాముడు చూసేటట్లు మన్ను తింటాడు. వెళ్ళి అతడు యశోదకు చెబుతాడు.

గబగబ యశోద వచ్చి "ఇదేం బుద్ధిరా, మా పరువు తీస్తున్నావని చెవి మెలేస్తుంది. అందరు చూస్తుండగా మన్నుతిన్న ఈ కిట్టయ్య, వెంటనే మాట మార్చేస్తాడు. "ఏమిటి, నేను మన్ను తిన్నానా ?" అంటాడు. తినలేదూ. అమ్మా! అబద్ధం చెబుతున్నాడు, కృష్ణుడు తిన్నాడని బలరాముడు, అవునమ్మా, తిన్నాడని ఇతర గోపబాలకులు చెబుతూంటే -

ఆ చాడీలు భరించలేని యశోద "నువ్వు తినలేదూ. అయితే నోరు చూపమంది. "వద్దమ్మా! వద్దు. నువ్వు భయపడతావు. అదే.... భయపెడతావు ? మెల్లిగా అంటాడు. కాదు, కూడదనేసరికి, నవ్వుతూ, గోపకుల బాలుడు, తన నోటిని తెరుస్తాడు." అయితే, చూడమంటాడు. చూస్తుంది యశోద.

"కృష్ణా.... నువ్వేనా.... ఇది నిజమా ? కలకాదు కదా. నువ్వు.... ఇది మాయా...

నిజమా ? నువ్వు నువ్వేనా ? నా కృష్ణుడివేనా ? నేను యశోదనేనా ? ఇది గోకులమేనా.... ?'' అమాయక, ఆ పిచ్చి - వెఱ్ఱితల్లి సమస్త భువన భాండములు తనలో నింపుకుని -

అన్నీ తానై.... తనలో అన్ని వుండగా - చిన్నపిల్లడై "ఆకలి, అమ్మా!'' అంటూ అల్లరి చేస్తున్నట్లు, అందర్నీ ఆటపట్టిస్తున్నట్లు, ఆడించే సకల భువన సామ్రాట్ బ్రహ్మాండకర్త, వేదవేద్యుడు, వేదరూపుడు, ఆయాభక్తుల ప్రేమాభిమానములు, భక్తి ప్రేమలు, సేవల ఫలితంగా, సర్వశ్య శరణాగతికి చిహ్నంగా-

ఆ భక్తజనులకు తాను శరణాగతుడౌతూ, ఆ దేవదేవుడు భక్తజన బాంధవుడు ఆటల, అల్లరి పిల్లవాడు, అందర్నీ అనందముద్రల తేలియాడుస్తూ, నందనందనుడు ఆ "నంద'', యశో"దానందు''డై, ఆ తల్లికి, ఆమె అనురాగ వాత్సల్య భక్తికి పరవశించినట్లు కట్టుబడి, కరుణాంతరంగుడై తన నిత్య సత్య సాన్నిహిత్యాన్ని, సన్నిధిని, మాయని మమతను మాధవుడు, ప్రేమాస్పదుడై ప్రసాదించి, పరవశింప చేస్తున్నాడు.

అందుకే తనను, ఆ"నందు''నిగా, పరమానందునిగా, నందనందనునిగా, యశో"దానంద''మూర్తిగా చిత్రీకరించుకున్నాడు. ఆ ఆరేండ్ల వయస్సులోనే ఆ"నందు''డనన్నాడు. ఆ తన్మయానందాన్ని, అందరికి పంచి ఇచ్చిన ఆనంద ప్రదుడు, ఆనందుడు, ఆనందమయుడయ్యాడా బాల, చిన్ని, గొల్లపిల్లల, గోపాలకృష్ణుడు.

"ఇదే జీవితమంటే.... ఇక్కడే వున్నది - వున్న ఆనందమంతా.... ఇదే కృష్ణుని, ఆ బాల - బాల్య తత్వం. గోకులంలోని ఆబాలవృద్ధులకు కృష్ణుడంటే ప్రేమేకాదు, ప్రాణం. పెద్దవాళ్ళు ఆ కృష్ణుని చూపులకు, అల్లరికి, కొంటెతనానికి, పైకి చెప్పలేక మనసులలోనే మురిసిపోతూ "కొంటె కృష్ణయ్యా!'' అంటే ఇంకాస్త కొంటెగా అల్లరిచేస్తూ వారిని ఆటపట్టించేవాడు, ఆనందింపచేసేవాడు.

మా బంగారేనంటూ ముద్దుపెట్టుకుంటే బుగ్గలు కొరికేవాడు. కోరినన్ని ముద్దులు మూటగట్టినట్లు, ముద్దు ముద్దుగా ఇచ్చేవాడు. వాళ్ళ మనసులలోని భావాన్ని బట్టి పెదవులు కొరికితే "అల్లరి....!'' అనేవారు. తుంటరి పిడుగా'' అనేవారు. ఇంకొందరు.... ఏడేళ్ళే బ్రతికాం. అంటే.... అదే ఏ పదిహేడేళ్ళో... అయితే... తట్టుకునేవాళ్ళం కాదు. అందులో శ్లేష, ఆనందం, అనురాగం - ప్రేమ,

ఎన్నో మిళితమై వున్నాయి. సిగ్గు, కొందరికి బుగ్గలు ఎరుపెక్కడం గూడా వుంది. ఇది కొందరి పెద్దల, మధ్య వయస్కుల సంగతి.

మరి తన వయసువారో, అప్పుడే వయసులోకి అడుగుపెడుతున్నవారో... అయితే.... కృష్ణుని - ఆ చూడచక్కని రూపాన్ని, అనుక్షణం తలచుకుని మురిసిపోతూ, ముసిరే వయస్సు తెచ్చే ప్రేమాలోచనలతో, కృష్ణుడు కుదరదు కదా, కృష్ణుడు వంటి భర్త కావాలని కొందరనుకుంటే, కృష్ణుడే తమ భర్త కావాలని ఇంకొందరు...

కృష్ణుని ప్రేమసామ్రాజ్యాన్ని పొందాలని, అందులో తానే మహరాణిగా, సర్వాధికారిణియై, సంతోషచిత్తయై, ఆనందమూర్తియై, ఆ"నంద"నందనుని, ఆ"నంద" ప్రేమని, "ఆనందుని" లతలా పెనవేసుకుని, కృష్ణుని ప్రేమ సుధను పానంచేస్తూ. ఆ"కృష్ణనామ" సుధాసముద్రంలో కలిసిపోవాలని పొందే- ఆరాటం- అనంతం, అవ్యక్తం. అనిర్వచనీయం. అది కృష్ణప్రేమ. ఎందరినైనా సరే, అందరికి, తన ప్రేమను పంచి ఇవ్వగల పరమ పురుషుడు, ప్రేమమూర్తి - "గో"కుల, "గో"పాలకృష్ణయ్య గో, గోప, గోపికల - ప్రాణ, ప్రేమమూర్తి.

ఒకసారి గర్గులవారు కృష్ణుని చూస్తూ "నువ్వు సామాన్య బాలుడివి కాదు. క్షత్రియుడవు. సర్వజనరక్షణ నీ బాధ్యత. ఆపదలో నున్నవారిని ఆదుకోవడం, అనాధలను రక్షించడం, దీనుల, హీనుల, పాపుల, పతితుల సంరక్షించడం, కటాక్షించడం - నీ ధర్మమన్నారు.

"నిజం, అదే నా ధర్మమన్నాడు... విన్న ఆ లీలాకృష్ణుడు.

శ్రీకృష్ణలీలా విశేషాలపై, ఆశ-ఆసక్తి వున్నవాళ్ళు, గోపకులంలోని గోపికలలో "విశాఖ, లలిత" అనేవాళ్ళు. వీళ్ళు మగవాళ్ళతో సమానంగా పోటీ పడేవారు. పొరపాటున అపజయమొందే సమయంలో, ఉడుక్కుంటూ, వాళ్ళ అధికారము, ఆయుధమైన "స్త్రీ" రాగం, అదే ఏడుపు లంకించుకునేవారు. అప్పుడు కృష్ణుడు వాళ్ళను కాపాడి, అందమైన కథలు చెప్పి, తన మాటలతో వారిని వూరడించేవాడు.

బలరాముడిలో - బండ, మొరటుతనం తప్ప, కృష్ణునిలోని వాక్చాతుర్యం లేదు. ఆకర్షణశక్తి లేదు. గోప, గోపికలతో కృష్ణుని ఆటపాటలకు, అల్లరి పిల్లవాడనుకుంటూ తానొక పెద్ద ఆరిందలాగ, ఓ ప్రక్కగా నిల్చుని నవ్వుకునేవాడు ఇదంతా తమాషా అనీ, భవిష్యత్తులో వారు జీవితాలను కమనీయంగా తీర్చుదిద్దు

కోవడానికి, కృష్ణుడు వారికి బాల్యము నుండి నేర్పిన చికిత్స వంటి విచికిత్స ఆత్మస్థైర్యము, మనోధైర్యము.

కృష్ణుని ఆటలు, కొంటెచేష్టలు, తుంటరిపనులు - పాలు వెన్న దొగిలించడంతో సరిపెట్టలేదు. చీరలు దొంగిలించడం, కళ్ళుగప్పి - అత్తా కోడళ్ళకు, భార్యా భర్తలకు, గో-దూడలకు, .... "ఇది, అది" అని లేకుండా, వూహించని, చిత్ర విచిత్రమైన చేష్టలతో ఇబ్బంది పెట్టేవాడు. కొందరు నవ్వుకుంటే కొందరు కన్నెర్ర చేసేవారు. యువతీ యువకులు, ప్రౌఢ వృద్ధులు కూడా, ఈ కృష్ణుని లీలా విలాసాలకు అర్హులే. ఆనందప్రదుని ఆనందమొందదగినవారే.

ఈ సర్వలీలలలోని - ఆధ్యాత్మికతను - కృష్ణతత్వాన్ని కనుక సాలోచనగా ఆలోచించి తర్కించుకుంటే, శరణాగతి, దాసతత్వం, ప్రేమ, సన్నిధానం... ఇలాగ నవవిధ భక్తిలోని ప్రతిపాదిత, ప్రతిసూత్రము తెలుసుకోవచ్చును. మనల్ని మనం కృష్ణలీలావిలాసంతో సంస్కరించుకోవచ్చును.

ఒకనాడు - గోపస్త్రీలు, గోపికలు యమునలో స్నానం చేయడానికి, తమ బట్టలన్ని ఒక చెట్టువద్ద పడేసి, స్నానానికి దిగారు. వాళ్ళలో ఆధ్యాత్మికతత్వాన్ని అనుభవానందాన్ని సదా కల్గించాలని తలంచే కృష్ణుడు ఆ చీరలన్ని మూటగా చుట్టచుట్టాడు. మూటతో కదంబ వృక్షమెక్కి కూర్చున్నాడు.

ఆడుతు, పాడుతూ స్నానాలు చేసిన ఆడవాళ్ళు, అలసినట్లు "లేవండి" అని నదిలోంచి, ఒక్కొక్కరే బయటికి వచ్చారు. బట్టలు.... అని ఒకరు, బట్టలా... అని అందరు అరచి ఆశ్చర్యపోయారు. "ఏవి ?!" అని ఇంకొకరు, ఇక్కడే పెట్టామే" అని మరికొందరు, కనబడని వాటికై, వెదుక్కుంటు చెప్పుకుంటున్నారు. "ఏమయ్యాయి ?" అదొక ప్రశ్న.

"ఆ సమయంలో చెట్టుమీద నుండి వేణుగానం, కృష్ణుని దివ్య మంగళరూపం కనుపించాయి. ఆ.... అందరు ఒక్కసారే... నోళ్ళు తెరిచారు. అంతవరకు సిగ్గు తెలియనివారు, సిగ్గుపడిపోయారు, సిగ్గుకు లొంగిపోయి చేతులతో, తడిసిన జుత్తుతో, తమ మానాల్ని కప్పుకునే ప్రయత్నం చేస్తూ మెలికలు తిరుగుతున్నారు.

ఒక్కటైతే, మొండి-శిఖండి తెగించి చెట్టెక్కడం ప్రారంభించింది. పాపం. కృష్ణుని అనుజ్ఞలేదుగా, పాపం, జారిక్రిందపడి వళ్ళు విరగొట్టుకుంది. "కృష్ణా...." జాలిగా

చూస్తున్నారు. తన వేణుగానంతో, తాను మత్తిల్లకపోయినా, శ్రవణీయు లను తన్మయపరుస్తూ - ఆ పరవశత్వంలో వారు తమను తాము మరచేటట్లు చేసే, కృష్ణవేణుగానామృతానికి పరవశమౌతూనే, తమ వస్త్రాలకై జాలిగా చూస్తూ అర్థిస్తున్నారు.

వాళ్ళు జాలిముఖాలను చూసి జాలిపడినట్లు "ఏమిటి ?" అడిగాడు. మా వస్త్రాలు కృష్ణా అన్నారు. తీసుకోండి భామలు ?" అన్నాడు. అంతా వెటకారంగా వుంది. కృష్ణునికి సరదాగా లేకపోయినా, ఆ సత్య ప్రభువుకు, దేహాభిమానం వీడి శరణాగతులు పొందు, దివ్య బ్రహ్మానందాన్ని, ఆ వయస్సులోనే, వయస్సుతో నిమిత్తం లేకుండా, అందించదలచిన ఆ పరమాత్మ దాసోహమనడంలోని తాత్పర్యాన్ని, తన సహజ ధోరణిలో ప్రత్యక్షసాక్ష్యంగా అందించదలిచాడు. అందుకే ఈ ఆట -

"కృష్ణా, కృష్ణా..." అంగనలు బ్రతిమాలుతున్నారు.

"ఇవిగో. ఇవి మీవే, తీసుకోండి.." చెబుతున్నాడు.

"ఎలాగ ?" అడుగుతున్నారు.

ఇప్పుడెలాగ వచ్చారో, అలాగే వచ్చి తీసుకువెళ్ళండి.

"ఆడవాళ్ళం రాలేము."

"అలాగా, నేను పిల్లవాణ్ణి, దిగలేను"

"నీ అల్లరి...." ఒక్కత్తె అందుకుంది.

"నా దగ్గరకు వచ్చి ఆ మాట చెప్పు. అల్లరో, ఆగడమే, వేగుదువుకాని, విషయం తెలుసుకుందువుగాని."

"ఛీ.... ఫో...." సిగ్గు మొగ్గలైన ఆ గోపరమణి.

"ఏవిటీ నా దగ్గరే... చిన్నప్పటి నుంచి నిన్ను నేను చూస్తున్నాను. మీరు నన్ను చూస్తున్నారు. ఇంక సిగ్గుపడటానికేముంది ?"

"నీతో వేగలేము. మాట్లాడలేము." అన్నారెవరో.

"అదే కదా నేను కోరేది. మనసు నిండుగా మాట్లాడమంటున్నాను. మాయ లేకుండా మాట్లాడమంటున్నాను. మాయామర్మాలకతీతమైనదే, నేనూ నా తత్వ" మన్నాడు కృష్ణుడు.

"కృష్ణా...!"

"ఎందులకల్లా మాటిమాటికి, వూరికే "కృష్ణా" అంటున్నావు. చేతులెత్తి క్షమించమనండి. సిగ్గువిడిచి ముందుకు వచ్చి మీ బట్టలు తీసుకోండి. చెట్టుచాటున, ఆకుల చాటున ఎంతసేపు వుంటారు ? ఇంటికి వెడితే...

"ఇంటికి వెడితే... అనేసరికి, అందరు "అమ్మో!" అన్నారు.

"అయితే రండి.....!" పిలిచాడు.

"ఎలాగ కృష్ణా....!" వాళ్ళ అభ్యర్థన.

"ఎలాగ నదిలో దిగారు, ఎలాగ పైకి వచ్చారో... అలాగే.... ?" నన్నాడు.

విధిలేక అందరు చేతులు జోడించి, ఆ చేతులను పైకెత్తి, "కృష్ణా... మమ్మ క్షమించు. మా బట్టలను మాకిచ్చి కరుణించు. శరణాగతులమన్నారు.

సంతోషించానంటూ, ఆ బట్టల కుప్పను మూటలాగ క్రిందపడేసాడు. ఇప్పుడవి ఎవరెవరివో ఏరుకోవడం, కట్టుకోవడం ఒక పని.... ఆ తతంగంలోనే "భలేవాడు - ఈ కృష్ణుడు" ఎవరో అనేశారు.

ఆ వెంటనే మరొకరు ... ఏడేళ్ళ వాడే సరిపోయింది. అదే పదిహేడేళ్ళ వాడయితే...!" అప్పుడే చెట్టు దిగుతున్న కృష్ణుడు, ఆమెను వెనుక నుండి జుట్టుపట్టుకు లాగి, ఏం చేసేవాడినన్నాడు. ఆ జుత్తు పట్టుకుని లాగడంలో వెనక్కి కృష్ణుని మీద పడ్డ ఆ సుందరాంగి బుగ్గ కసుక్కున గిల్లినట్లు కొరికాడు కృష్ణుడు.

"ఆరిభడవా ?" అంది మరొక సుందరి.

"అందుకే చీరలివ్వక ఏడిపించి, క్షమాపణలు చెప్పించాను. అయినా...

ఆ మాటలతో, "విడు కృష్ణా! బుద్ధొచ్చింది" అందరిలో ఎక్కువమంది, తమ తప్పు ఒప్పుకున్నట్లు చెంపలు వేసుకుని శరణాగతులయ్యారు.

ఇటువంటి కృష్ణలీలలు, ఆ దేవదేవుని గోకుల ప్రస్థానంలో, ఎన్నో... ఎన్నెన్నో... అన్నీ ఆనందమయాలే. ఆశ్రిత వాత్సల్యపూరితాలే! కారణమాతడు ఆశ్రిత వత్సలుడు, ఆనందప్రదుడు, శరణాగత రక్షకుడు!

ఇంకా - ఈ కృష్ణుడెంతటి లీలామానుష విగ్రహుడంటే.... అమ్మకు కోపం వచ్చిందని తెలుసుకున్నాడో, పిల్లవాడై నేలమీద పడుకుని అరవడం, ఏడవడం... చెప్పలేని, వూహించలేని అల్లరిచేస్తూ కాళ్ళు చేతులు ఆడనివ్వడు.

అప్పుడు యశోదమ్మ చేస్తున్న పనిని విడిచిపెట్టి ఈ చంటిపిల్లవాడిని,

చిన్ని కృష్ణుని లాలించాలి. ఓదార్చాలి. ఇటువంటి ఎత్తులు, ఆ చిన్మయానందుడైన పరంధాముని దగ్గర చాలా వున్నాయి. ఎంతో కోపంతో వున్న యశోదమ్మ, ఈ ఆగడంతో, అన్నీ మరచిపోయి, కృష్ణుని ఓదార్చే కార్యక్రమానికి, శ్రీకారం చుడుతుంది. అంతటి మాయావినోదుడు, ఈ చిన్ని, బాలకృష్ణుడు.

అయినా తనను చూడగానే, ఆ తల్లి యశోద అన్నీ మరచి లాలనగా చేతులు చాపితే సరి. లేదంటే మరో బాలక్రీడ. వస్త్రాపహరణ కార్యక్రమం ముగించి, ఇంటికి వచ్చిన చిన్నికృష్ణుడు, బాలకృష్ణుడిగా కాక, మారిన వాతావరణాన్ని జాగ్రత్తగా గమనించాడు. ఇక తన లీలను, ఆ వాత్సల్యమూర్తయిన తల్లికి ముందు చూపాలి. ఆ తదుపరి అందించి ఆనందింపచెయ్యాలి. అప్పుడు-

తల్లి రాలేదు. తనను పిలువలేదు. ఏమీ ఎరగనట్లు చల్ల చిలుకుతుంది. అమ్మ, ఆ చల్ల చిలకడమాపి, తనను ఎత్తుకు, ముద్దాడుతుందనుకున్నాడు. అది బెడిసికొట్టింది. అంటే, ఈ ఆడంగులు, కొంటెకోణంగులై, తనపై కొండెములు చెప్పారన్నమాట. బాగుంది. తలవూపుకున్నాడు. ఇక తనకేదో అపకారం జరిగిపోయినట్లు వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించాడు. అయినా, యశోదమ్మ ఉలకలేదు, పలకలేదు. అదే వట్టిరోజుల్లో, అయితే, "అయ్యో" నాయనా, నా బంగారు" అని పరుగెత్తుకొచ్చే యశోదమ్మ బింకం గ్రహించిన కృష్ణుడికి కోపం వచ్చింది. పరిస్థితినెలాగ ధిక్కరించి తల్లిని వశం చేసుకోవాలన్న ఆలోచనకు కృష్ణుడు వచ్చాడు.

తన కోపాన్ని తల్లి తెలుసుకోవాలి. దగ్గరకు తీసుకుని లాలించాలి. ఇది కృష్ణుని ఆలోచన. వస్త్రాపహరణం సంగతి తెలిసి, తన తత్వమర్థం చేసుకోలేక, శరణాగత రక్షకుడైన తనను, కరుణావిహీనునిగా తలవడం, వాళ్ళ మూర్ఖత్వంగా, వారిని సరిచేయ ఆడిన నాటకం, మూర్ఖుల మనసును మార్చలేదు. కళ్ళను తెరిపించలేదు.

కనుక ఇప్పుడు తాను, ఈ మాయ ఏడుపును ఆపి, తల్లిని లొంగదీసు కోవాలి. తన లీలలతో ఆమెను అలరింప చెయ్యాలి. ఈ ఆలోచనతో కృష్ణుడు అడుగు ముందుకు వేసాడు. తల్లి కొంగు పట్టుకుని, ఏడుస్తూనే ఆమె కాళ్ళను చుట్టేసాడు.

ఇప్పుడు తప్పక అమ్మ వెనుదిరిగి చూస్తుంది. తన కంట నీరు చూసి

కరగిపోతుంది. తనను దగ్గరకు తీసుకుని ముద్దులతో ముంచెత్తి మురిపిస్తుంది. ఇది కృష్ణలీలా విలాసం. కృష్ణుని ఆలోచన ప్రకారం, అమ్మ వెనుదిరిగి చూసింది. అయితే అతన్ని యశోదమ్మ దగ్గరకు తీసుకోలేదు. వెళ్ళు'' అని ఒక్క తోపు తోసింది. దాంతో -

"అమ్మా!'' ఆ చంటి పిల్లవాడు, చంటి పిల్లాడిలాగే ఏడిచాడు. ఇప్పుడే... పాలు మరగి పొయ్యిలో పడుతున్న వాసన. దానిని గమనించిన యశోదమ్మ పాలను తియ్యడమో లేక పొయ్యి మంటనార్పడమో చెయ్యడానికి పరుగున ప్రక్క గదిలోకి వెళ్ళింది. అప్పుడు మళ్ళీ యశోదమ్మ తనను నిర్లక్ష్యం చేసినందులకు, కృష్ణునికి కోపం వచ్చింది. కానీ అది బలరాముడిలాగ కాదు. బలరాముడికి కనుక కోపమొస్తే

చిరచిరలాడుతాడు, మండిపడతాడు. ఉద్రేకపడుతూ నేలను కాళ్ళతో తంతూ, తెలియని, అర్థంకాని ఆగడాన్ని సృష్టిస్తాడు. అలాగ కాకుండా, అమ్మ కోపాన్ని పోగొట్టాలి. ఆమెను శాంతపరచాలి. అందుకు ఆలోచన ప్రారంభించాడు. "వూ'' అని ఆలోచించి, తలవూపి, ఓ బెడ్డముక్కను తీసుకున్నాడు. గురిచూసి కుండకేసి కొట్టాడు.

"ఫట్''మని కుండ పగిలింది. అందులోని వెన్నను తిన్నంత తిన్నాడు. కొంత ఇత్తడి పళ్ళెంలోకి ఎత్తాడు. వెనుక తలుపులు గుండా పెరట్లోకి, అక్కడ నుండి బయటికి వెళ్ళాడు. కొయ్యరోలుపై కూర్చుని "రండి. మీకోసమే తెచ్చాను ఈ వెన్న. తిందాం రండి'' అని పిలుస్తు, మనషులతో మాటాడుతున్నట్లు, అక్కడి కోతులను వెన్న తినడానికి రమ్మని పిలుస్తున్నాడు.

ఒకటి, రెండు, మూడు, నాలుగు.... అలాగ కృష్ణుడు పిలవడంతో కోతులు వస్తున్నాయి. అతని చేతినుండి వెన్న తీసుకుని తింటున్నాయి. కృష్ణుని కెదురుగా కూర్చున్న ఆ వానరాలు వెన్నతినడం తెలియకపోయినా, ఆ బాలకృష్ణుని పిలుపుతో దగ్గరకు వచ్చి ఎదురుగ్గా కూర్చుని ఎంత తిన్నాయో, అంతకు రెట్టింపు క్రిందే పడేసుకుని ఏరుకుని తింటున్నాయి. ఈ ఆటలో కృష్ణుని కోపం కొంత తగ్గింది.

యశోదమ్మ పాలను భద్రంచేసి, పాడి గదిలోకి వచ్చి, కుండ పగిలి, వెన్నంతా చెల్లాచెదరి వుండటం చూసింది. ఇది కృష్ణుని పనేనని గ్రహించిందామె,

ఇలాగే ఇతరుల ఇండ్లలోని వెన్న, చల్ల, పాలకుండలను, కృష్ణుడు పగులకొట్టి వుంటాడని నిర్ధారించుకుంది. ఆ వెంటనే యశోద పెరట్లోకి వచ్చింది. కృష్ణుని చూసింది. అతని ఆగడాన్ని, కోతులు వెన్న తినడాన్ని గమనించి - కృష్ణుని చెవి పట్టుకుని మెలి పెట్టింది. ఇంకెప్పుడు నీకు బుద్ధి వస్తుందని, ఒక్కటిచ్చింది. తల్లి ప్రవర్తనకు చాలా బాధపడ్డాడు. ఆమె లాలిస్తే, ఇతడు ప్రేమించేవాడు. కానీ యశోదమ్మ ఈనాడు కృష్ణునికా అవకాశమివ్వలేదు. పైగా యశోదమ్మ కోపం, కృష్ణునికి సరదాగా వుంటుంది. తమాషాగా నవ్వు తెప్పిస్తుంది. కళ్ళు తిప్పుతుంది. కనుబొమ్మలెగుర వేస్తుంది. ముఖం రకరకాలుగా మార్చేస్తుంది. దానిని చూసి నవ్వడం తప్ప, కృష్ణుడింకే చేస్తాడు ? అదే ఆ తల్లి కోపాన్ని, ప్రేమను సమానంగా ఆస్వాదించే కృష్ణుని తత్వం.

"లాభంలేదు. నీకు బుద్ధి చెప్పాలి. చెబుతాను. బాగా గుర్తుండేటట్లు చేస్తాను." ఆమె కోపం నుండి బయటపడలేనట్లు ప్రవర్తిస్తూంది. బలరాముడి వలె కోపంతో, అనవసరంగా తన శక్తిని పాడుచేసుకుంటుంది. "ఆగు'' అంటూ లోపలికి వెళ్ళింది. బెత్తం తెచ్చింది. దాంతో దెబ్బలు తప్పించుకుందుకు కృష్ణుడు పరుగెత్తాడు. పట్టుకుందుకు ఆమె పరుగెత్తింది.

ఆ పరుగెత్తడంలో, చిందర, వందరగా పడ్డ వెన్న మరకలను దాటలేక జారి క్రింద పడింది. "అబ్బా!'' నడుం పట్టుకుంది. లేచింది. గట్టిగా పట్టుకుంది. రోలుమీద కూర్చున్నాడు. కళ్ళు నులుముకుంటూ ఏడుపు లంకించుకున్నాడు. యశోదమ్మ పట్టించుకోకుండా కొట్టడానికి కర్ర ఎత్తింది. అప్పటికే ఏడుపు మొదలెట్టిన కృష్ణుని చూసి, ఆ తల్లి కరగిపోతుందన్నది కృష్ణుని ఆలోచన - కానీ,

యశోదమ్మ బెత్తం విసిరేసింది. తాడు తెచ్చి రోటికి కట్టాలనుకుంది. ఇవ్వాళ ఎందుకో యశోదమ్మలోని కోపం తగ్గటం లేదు. అంటే.... ఏ విధంగాను, కృష్ణమాయకు లొంగడం లేదు. రోటికి కట్టాలనుకున్నా తల్లి, ప్రయత్నాన్ని ఆ తర్వాత ఏడుస్తున్నట్లు నటిస్తూ గమనిస్తున్నాడు.

నానాతిప్పలు పడి, ఒకటి - రెండు మూడు ముళ్ళతో కృష్ణుని గట్టిగా

కట్టబోయింది. ఒకదానికొకటి, దానికి మరొకటి, దానికి ఇంకొకటి.... అమ్మో! ఆయాసంతో ప్రయాసపడుతుంది. యశోదమ్మ పరిస్థితి గమనించిన కృష్ణుడు ఆమెకు ఆనందం కల్గించ, తన లీలలకు స్వస్తి పలికాడు. అప్పుడు యశోదమ్మ అమాయకంగా అనుకుంది. "కృష్ణుడు కట్టుబడ్డాడు. లేకుంటే, ఆతను కాదనుకుంటే, ఈ గోకులంలోని త్రాళ్ళు చాలేవి కాదేమో, కొంటె కృష్ణయ్య" ఆనందం తొణికిసలాడిన ఆమె మనసు, మళ్ళీ కృష్ణుని అల్లరిని తలచుకుని అలిసిపోయింది. ఆలన, పాలన, లాలన.... అదే కృష్ణయ్య "ప్రేమ"తత్వం..

అప్పుడు - మళ్ళీ మామూలుగా యశోదమ్మ - ఇదే నీకు తగిన శాస్తి అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

# మద్ది వృక్షాలు

**అ**మ్మ కోపంగా వుంది. నాకు కోపంగా వుంది.

అమ్మ "యశోద"ను అంతసేపు కోపంతో వుంచడం, కృష్ణునికి ఇష్టం లేదు. అందుకే కోపం ప్రకటించాడు. కోపం నటిస్తున్నాడు. ఇప్పుడేం చెయ్యాలి ? ఏదో ఒకటి చెయ్యాలి ? అదే.... ఏమిటది, ఏం చెయ్యాలి ? ఏం చేద్దామన్న అమ్మ రోలుకు కట్టివేసిందే ? లేద్దామంటే రోలు కదులుతుంది. దాన్ని లేపడం, అమ్మ కొడుకుగా కష్టం. కాళ్ళు, చేతులు కదపాలన్నా, విదపాలన్నా కష్టం. ఏదో ఒకటి చెయ్యాలన్న తపన, కార్య సాఫల్యానికి దారి చూపింది.

కృష్ణుడు కదలడంలో రోలు అడ్డంగా పడింది. దాంతో ఈతను ప్రాకుతుంటే, రోలు కృష్ణునితో ప్రాకుతూ వస్తోంది. కృష్ణుడు ప్రాకుతున్నాడు. రోలు దొర్లుతూ కృష్ణునితో వస్తుంది. విచిత్రబంధం, విచిత్రదృశ్యం.... అలాగ, అలాగ రోలును దొర్లిస్తున్నాడు.

పాపం బాలకృష్ణునికి చెమట పట్టింది. పిల్లవాడు కదా, ఆశ్చర్యపడకండి. బలంగా, బరువుగా వుంది. ఇలాగ కొంతదూరం వెడతాడు ? ఎక్కడకని వెడతాడు" తల్లికోపం తగ్గి, ప్రేమ వుప్పొంగి, తనను చెంతకు తీసుకునే వరకు. ఈ ఆట చూసేవారికి ఆట, పెంకితనం, మొండితనం. కృష్ణునికో తల్లి ప్రేమను పొందడం. దానికా పరంధాముడు

పిల్లవాడై మాతృప్రేమకు ఎలాగ తపించి తల్లడిల్లుతున్నాడో....

**ఈ మానవులో... తమ నిజమైన కన్న తల్లిదండ్రులను అగచాట్లపాలు చేస్తున్నారు. అపహాస్యాలపాలు గావిస్తున్నారు. మాతృదేవోభవ; పితృదేవోభవ; ఆచార్య దేవోభవ" చెప్పుకుందికే తప్ప, చేతులెత్తి నమస్కరించడానికి, జన్మ ధన్యం చేసుకోవడానికి, పుట్టిన పుట్టుక చరితార్థం చేసుకోవడానికి ప్రయత్నించడం లేదు. ఈ కృష్ణుని తపన చూసైనా, ఈ దుష్టప్రవృత్తి కల, కంస - వారసులు మారితే, చరిత్ర - మనము ధన్యులమవుతాము...**

అలాగ, అలాగ - రోటిని గుమ్మం దాటించి, మంటపాన్ని దాటించి, ప్రహరీ దాటి, గుబురుగా వున్న చెట్ల దారిపట్టాడు. అక్కడ నుండి ముందుకు సాగితే, అడవి దారి దొరుకుతుంది. ఈ ప్రయత్నంలో తల్లి మనసు మారాలి. మారం చేసే తనకు ముద్దులు మూటలు కట్టి ఇవ్వాలి. లేకపోతే అనంతృప్తి... అమ్మ... అనిర్వచనీయమైన ఆనందానికి మారురూపుగా తలుస్తున్నాడు. నడుముకు కట్టిన త్రాటితో రోలును దొర్లిస్తు ముందుకు సాగుతున్నాడు. నాలుగంగలు పాకాక, కాస్త విశ్రాంతి తీసుకుని, మరల ప్రాకుతున్నాడు. అంచెలంచెలుగా ముందుకు సాగుతున్నాడు.

బారులు తీరిన పక్షులు, పిట్టల (అరుపులు) పాటలు, నెమలి నృత్యం, ఆహ్లాదకర వాతావరణం. అన్నీ కృష్ణునికిష్టమైనవే కాని, "అమ్మ" ప్రేమంత కాదు. ఇదంతా... ఈ పడే బాధంతా... అమ్మకోసం. ఆమె ప్రేమ కోసం. కృష్ణుడు వస్తుంటే, పక్షులు ఎగిరిపోతున్నాయి. జారిపడ్డ నెమలి ఈకలు తీసుకున్నాడు. ఆ నెమలి పింఛాలను తన తలపైన గల తలపాగాలో దోపుకున్నాడు.

మనిషి అందం, మాట అందం, చేసే పనులు అందం, అందరికీనా అంటే, కొందరికి, అందరికి గూడా! అటువంటి అందమైన కృష్ణుని నవ్వు మధురం, మాటలు మధురం, చేష్టలు మధురం, మధురానికే మధురం.... ఆ కృష్ణుడు వ్రజగోకుల, బాలుడు, నంద-యశోదల, ఆనందుడు - ఆ యశో"దానంద" "నందను"డు.

ఇప్పుడు ఈ ప్రయాణంలో కృష్ణునికి దాహం వేస్తుంది. నది వెంటనే వెడితే, అటు వెళ్ళేవారెవరైనా చూసి, కాస్త మంచినీళ్ళిస్తారనే ఆశతో, నదీ తీరం గుండా సాగుతున్నాడు. అలాగ సాగినవాడు, ఎవరో గోపస్త్రీ నది నుండి రావడం చూసి

రోటితో ఆగాడు. దాహంతో పాటు అలసట. కొంచెంసేపు ఆగాడు.

ఈ సమయంలో ఏ స్త్రీ ఇటువైపు రాదు. అందరు తమ తమ గృహకృత్యాలలో నిండిపోతారు. ఇంకెవరిటు వస్తారు. నన్ను చూస్తారు ? "ఏం చేస్తాను. ఇలాగే ఈసురోమంటు తిరిగి ఇంటికి వెళ్ళిపోదామనుకుంటున్నాడు. అదే సమయంలో, కృష్ణుని కళ్ళలో కవలల వంటి రెండు పెద్ద మద్దివృక్షాలు కళ్ళపడ్డాయి.

ఆ చెట్ల మధ్యనున్న అతి సన్నటి దారి గుండా వెళ్ళాలని తలిచాడు. అదొక కృష్ణలీల. పిల్లల ఆటలు అలాగే వుంటాయనడానికి కృష్ణుడే నిదర్శనం. ముందుకు వెడదామంటే రోలు ముందుకు కదలదు. ఆ రెండు చెట్ల మధ్య లాగుతున్నట్లు కృష్ణుడు. ముందురోలు, ఆ వెనుక కృష్ణుడు. చూసేవారికదొక పిచ్చి - వింతదృశ్యం.

ఎవరైనా చూస్తే "ఏవిటా ఆట ? చెట్లమధ్య నుండి రోలు వేడితే కదా నువ్వు కదిలేది. ఈ ప్రక్కనుండి వెళ్ళవచ్చును కదా. ఆ మాత్రం తెలివితేటలు లేవా ? అంటారు. వెనక్కి రమ్మంటే, ఆ చెట్ల మధ్య రోలు బిగుసుకుంది. కృష్ణుడు వెనుదిరగలేడు. దారి చేసుకుని రాలేడు. భలే దిగ్బంధం. ఆ స్థితిలో కృష్ణుడు - బలంగా, ఆ చెట్ల మధ్య నుండి బయటపడాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నాడు. అలాగ ముందుకు వెనక్కు వూగిన కృష్ణుడు. కాస్సేపు కదలకుండా వుండిపోయాడు. కొంత తడవు అలాగ వున్న కృష్ణుడు పళ్ళు బిగపెట్టాడు. బలం పుంజుకున్నాడు. వూపిరి బిగపెట్టాడు. అటు ఇటు వూగుతూ లాగుతున్నాడు. ఈ ప్రయత్నంలో రోలు కదలలేదు. కానీ -

చిత్రంగా - ఆ రెండు మద్దిచెట్లు, ఫెళ, ఫెళ శబ్దాలు చేస్తూ నేలకూలాయి. దాంతో, కృష్ణుడు - రోలు ఎటు కదలలేని విధంగా ఇరుక్కుపోయారు. ఎటు కదలలేని పరిస్థితికి కృష్ణుడు భయపడలేదు కానీ, చెమటలు పట్టి పాపం కృష్ణునికి నీరసం వచ్చింది.

కొంచెంసేపు ఆగితే తప్ప వూపిరి పీల్చుకోలేడు. బలం పుంజుకోలేడు. రక్షించమని కూడా అరువలేడు. పూతన, తృణావర్తులను చంపినవాడికీ చెట్లొక లెక్కా, కాదు. ఈ చెట్లు పడిన శబ్దానికి, అదిరిపడి చూద్దామని కొందరు స్త్రీలు వస్తున్నారు. "రానీయ్" అనుకున్నాడు తప్ప, భయమెరుగని కృష్ణుడు భయపడ

లేదు. జరిగిందానికి భయపడలేదు.

గోపస్త్రీలు తనవైపు రావడం చూసాడు. వారిలో ఒకామె ఆమె పేరు "రాధ", కృష్ణుని చూసి "ఎవరు నువ్వు" అంది. ఇక్కడిలాగ కూర్చున్నావేమని అడిగింది. ఆ ప్రక్కనే వున్న ఇంకో అమ్మాయి లలిత. "ఇతడు అల్లరి పిల్లవాడు. యశోదా దేవి కొడుకు" అనగానే "నందరాజు కుమారుడా ?" అంది. అదే తనకు తెలుసన్నట్లు

"కనబడటం లేదా ?" చెట్లు కూలుస్తున్నాను అన్నాడు. కాళ్ళు, చేతులు, రోటికి కట్టి వుంచారు. కదా! వాటిని ఎత్తి చూపుతూ ఆమె అడిగింది. అదే చిత్రం" ఈ కృష్ణుడు వింత వింత పనులు తప్ప సామాన్య ఆటలు ఆడడు కదా!" అనగానే "అవునవును" అంది ప్రక్కనున్న అమ్మాయి. కృష్ణుడు ఈ రాధను చూసాడు. ఈమె క్రొత్త అమ్మాయి. చాలా చక్కగా, అందంగా, చూడ ముచ్చటగా వుంది. చూస్తూ కూర్చోవాలనిపిస్తుంది" అనుకుని, నువ్వు చాలా బాగున్నావు పిల్లా" పెద్దవాడిలా అన్నాడు.

అప్పుడామె ఎవరు నిన్ను రోటిక్కట్టారని అడిగింది. మా అమ్మ యశోదమ్మ తప్ప నన్నెవరు కట్టలేరు, కొట్టలేరన్నాడు, కొంటెగానే ఆ కొంటె కృష్ణుడు, కట్లు విప్పుదాం పట్టవే" అంది. ఆ మరొక యువతి. "లలిత".

"వద్దు. అమ్మకు కోపం వస్తుంది. అమ్మ కట్టిన కట్లు అమ్మే విప్పాలి. అదే సిద్ధాంత"మంటాడు. ఆ కృష్ణుని మాటలకు, రాధ మురిసిపోతుంది. నవ్వుతుంది. "నీకన్నా, నీ నవ్వుకన్నానా ?" అందంగా వున్నానా ? అంటాడు కృష్ణుడు.

ఇటువంటి సమయంలో అటువైపు వచ్చిన గ్రామస్థునికి విషయాన్నంతా చెప్పి, దీనిని నందరాజుకు, యశోదాదేవికి చెప్పమంటారు. ఆ గ్రామస్థుడు పరుగు పెడతాడు.

ఇదే సమయంలో, అటువైపు వెళ్ళే గోపాలురు చాలామంది కృష్ణుని చుట్టుముట్టారు. అటు యశోద "కృష్ణా" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది. ఇటు తండ్రి నందుడు. "నాన్నా!" అంటూ పిల్లవాని కోసం పరుగెత్తుకుంటూ వచ్చాడు. పరుగెత్తుకుంటూ వచ్చిన యశోద "నా తండ్రీ! నిన్ను కష్టపెట్టానురా. ఎంత పెద్ద ప్రమాదం తప్పిం"దంటూ కట్లు విప్పింది.

కౌగలించుకుంది, ముద్దుపెట్టుకుంది. తను తప్పుచేసినట్లు బాధపడింది. కృష్ణుడు కూడా, తల్లిని చుట్టేసుకున్నాడు. పసి పిల్లవాడి వలె ఆమె పైకి, ఎప్పుడు చేయనట్లు (చిన్నప్పుడెప్పుడో చేసినట్లు) ఎగబ్రాకాడు. ఆ తల్లి పిల్లల ప్రేమ కళ్ళతో చూడవలసిందే తప్ప వర్ణించి చెప్పడం చాలా కష్టం. అంతటి మధురమైనది. అవ్యక్తము, అనిర్వచనీయమైనదా ప్రేమ.

తండ్రి అచ్చట పరిస్థితిని గమనించాడు. ఈ చిన్ని పిల్లవాడా, ఆ పెద్ద మద్దిచెట్లను కూల్చింది. ఆశ్చర్యపోతున్నాడు. పైకి క్రిందకు చూస్తున్నాడు. ఇతడు దేవుడేమో! అందుకనే ఇటువంటి అద్భుతాలు చేస్తున్నాడు. మనసులోనే, అనుకున్నాడు. అవునని సమాధానం చెప్పుకుంటున్నాడు. ఆ వూరికి క్రొత్తగా వచ్చిన పిల్ల రాధ, తనకేదో తెలిసినట్లు కృష్ణుని వీరత్వాన్ని పొగొడుతుంది. కృష్ణుని వీరత్వాన్ని లీలా విలాసాన్ని ఎవరిమట్టుకువారు తమకు తోచిన విధంగా పొగుడుతున్నారు. "సరి... సరి" అంటూ నంద యశోదలు కృష్ణుని ఇంటికి తీసుకువెళ్ళారు. తల్లిగా యశోద కృష్ణునికి దిష్టికూడా తీసింది.

ఆ రాత్రి కృష్ణునికి నిద్రపట్టలేదు. అలసిపోయినవాడు ఆదమరచి నిద్రపోతాడు. ఆలోచనలతో వున్నవాడు, నిద్ర విడిచి, మరచి, ఆ ఆలోచనలోనే సతమతమవుతాడు. అదే ప్రస్తుతం కృష్ణుని విషయంలో జరుగుతుంది. తన మనసు దోచిన క్రొత్త పిల్ల రాధ, తెల్లవారి వెళ్ళిపోతుంది. వెళ్ళిపోతుందన్నమాట కృష్ణునికి నిద్రపట్టనివ్వలేదు.

పెందలకడనే లేచాడు. అన్న బలరాముని లేపలేదు. అన్నీ చెప్పే అన్నకు ఆనాడు అతనికేమీ చెప్పలేదు. రాధ వున్న ఇంటికి బయలుదేరాడు. ఆ సమయంలో రాధ, ఆమె సోదరుడు ఎడ్లబండినెక్కడానికి బయటకు వస్తున్నారు. వస్తూనే ఆమె కృష్ణుని చూసింది. పరుగెత్తుకుంటు వచ్చి అతన్ని చేతుల్లోకి తీసుకుంది. అబలగా కనుపించే రాధ, సబలగా, కృష్ణుని అన్న వద్దకు తీసుకు వెళ్ళింది. కృష్ణుని చూపింది.

"అన్నా! ఇతడు నందరాజు కుమారుడు పేరు కృష్ణుడు. నిన్న ఇతన్నే రోటికి కడితే, లాగుకుంటూ వెళ్ళి, రెండు బలమైన వృక్షాలను నేలకూల్చిన ఘనుడు, వీరుడు. క్షణకాలం నవ్వుతూ జరిగిందంతా, తనకు తెలిసినట్లు, చూసినట్లు చెప్పింది. ఆమె నవ్వుకు కృష్ణుడు పరవశించాడు. దానికోసమే పరుగు

పరుగున ఇక్కడికి వచ్చాడు. తనకు కావలసిన, చూడాలనుకున్న నవ్వును చూసాడు. అందులోని ఆనందాన్ని పొందాడు.

చెల్లెలు చెప్పిన మాటలకు సంతోషించిన రాధ సోదరుడు కూడా సంతోషంగా కృష్ణుని ఎత్తుకున్నాడు. వెన్నుముద్దుగా తట్టాడు. కృష్ణునికిటువంటి పిల్లచేష్టలు నచ్చవు. రాధకోసం, ఆతడు రాధ సోదరుడైనందులకు, ఆ వెన్ను తట్టడాన్ని ఆ సమయానికి విధిలేక, విధిగా అనుభవించాడు. ఆనందం పొందినట్లు నటించాడు.

వాళ్ళు ఎడ్లబండి ఎక్కగానే, తాను బండెక్కాడు. పొలిమేరల వరకు వస్తానన్నాడు. బండెక్కిన కృష్ణుడు ఇప్పుడు నోరు తెరిచాడు "రాధ చాలా మంచిది." ఆమె ప్రక్కన కూర్చొని ఆమెను అభినందిస్తున్నట్లు చెప్పాడు.

బండి వేగంగా వెడుతుంది. దానివేగానికి కల్గిన కుదుపుకు కృష్ణుడు ఎగిరి ఆమె వళ్ళో పడ్డాడు. మరోక్షణంలో ఆమె కూడా అలాగే కృష్ణునిపై బడింది. అదొక తమాషా. ఇద్దరు నవ్వుకున్నారు. ఆ కుదుపులో, వారు - ఆ కుదుపులో పడిన తొట్రుపాటు ఇద్దరికీ, ముఖ్యంగా రాధకు కోపం కల్గించలేదు సరికదా అదొక మధురమైన ఘటనగా స్పందించి ఆమె ఆనందించింది.

బండి పొలిమేరలకు రాగానే, కృష్ణుడు బండి దిగాడు. రాధకు, ఆమె సోదరునికి వీడ్కోలు చెప్పాడు. రాధ.... ఎందుకో ఆ క్షణంలో అతన్ని విడువలేక పోయింది. ఆతని చెంత ఆమెలో కల్గిన స్పందన - తియ్యటి ప్రేమ - ఒక మధురిమ. అదేమిటో చెప్పలేని అశక్తత. అనుభవమే అందించగల అవ్యక్తమైన ఆనందం. ఆ తీపి మధురిమను ఆస్వాదిస్తూ -

"నీ వయస్సెంత ?" కృష్ణుని అడిగింది.

"ఏడేళ్ళే....! అన్నాడు. నా వయస్సు... పన్నెండు అంది రాధ. మళ్ళీ ఆమే- మా బృందావనానికి రా, బాగుంటుందది."

"తప్పకుండా వస్తాను. నిన్ను మరచిపోనులే" చెప్పాడు - ప్రేమామృతుడైన యశో"దానంద"నుడు.

బండి బయలుదేరింది. అది కనుచూపు మేర కనబడే వరకు నిలబడి... అంతటి మంచి స్నేహితురాలు దొరికినందులకు సంతోషిస్తు - ఇంటికి బయలుదేరాడు.

# రాసలీలా తరంగిణి

**బృ**ందావన తీరంలో, గోపగోపికలతో, వెన్నెలలో విహారం ప్రకృతికి పరవశం. ప్రేమజీవులకు ఆత్మానందదాయకం. ఆత్మోద్ధరణంగావింపచేసే, ఆ-"నంద నందనుడు, వెన్నెలలో పొగడచెట్ల పరిసరాలలో, యమునాతీరంలో పరవశించి చేసే ఆటపాటలకు, అదనంగా - మధురాకర్షణంగా వేణుగానం...

వర్ణనాతీతమైనదా దృశ్యం. అంతటి ఆనంద పారవశ్యాన్ని కల్గించే అదృష్టం. అనుభవానికే ఆనందం తప్ప వర్ణించడానికేమీ లేదు. జీవాత్మ పరమాత్మల సంగమంలో అమృతానందం - ఆ బృందావన రాసవిహారం. ఒక్కొక్క జీవుడిని లేదా తోటి జీవులలో కొందరు "కొందరంటే నాకు చచ్చేటంత ప్రాణమంటారు. అది శారీరకం కాదు, ఆంతరంగికం. ఆ ఆనందం అవ్యక్తం. ఆ పారవశ్యం వర్ణనాతీతం. ఇవి ఏవీ శారీరకం కాదు. ఆత్మానందదాయకం.

అందుకే - ఈ రాసలీలా కార్యక్రమంలో పెద్దా, చిన్నా లేకుండా, వయసుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరు పాల్గొంటారు. కృష్ణనామ - ప్రేమామృతంలో మున్గి పరవశిస్తారు. ఆ పారవశ్యం ప్రసాదించేది - ఆనందం. అది ఆనందకర ప్రేమ. నిష్కాములకు, పరమాత్మనే కోరే వారికి మాత్రమే లభించే దివ్యానంద ప్రేమ! ఇది గోపికల ఆనంద నాట్య దృశ్యం. దీనికి నాయిక రాధ కావచ్చును. లలిత కావచ్చును. మరొకరు కావచ్చును.

బాలురకు మాత్రం కృష్ణుడే కథానాయకుడు. బలరాముడు కేవలం పాత్రధారి. ఆ వెన్నెలలో, ఇసుకతిన్నెలలో, ప్రకృతీ పారవశ్యంలో, ప్రస్తుత జీవితంలో పెల్లుబికే ఆనందాన్ని, సర్వ సమస్యలు మరచి, విడిచి - సంతోషంగా జరుపుకునే సంబరాన్ని మొదట్లో గోపకులు, చూస్తారు. ఆ తర్వాత మెల్లిమెల్లిగా ఇందులో పాల్గొన ప్రయత్నిస్తారు. కృష్ణుడు తన వేణుగానాన్ని ఆలపిస్తుంటాడు.

ప్రతి ఒక్కరు ఆ గానపారవశ్యానికి కృష్ణుని చుట్టు మూగి అవ్యక్తమైన ఆనందంతో పరవశిస్తారు. అప్పుడు ఆడే ఆట, కృష్ణగానానికి అనుగుణంగా చేసే నర్తనం.... చూడాలి తప్ప చెప్పడం కుదరదు. అందుకే అందరు బొమ్మలవతారు. బొమ్మలు కూడా పసి పిల్లలైపోతారు.

ఈ ఆనంద దృశ్యం కాముకుల బుద్ధికందదు. ప్రకృతి సుందర దృశ్యాల రసాస్వాదనం చేసేవారికి అమితానందదాయకం. వెన్నెల రాత్రిళ్ళలో, ఈ రకంగా ఆడుకోవడం, ఆ రోజుల్లో అందరికి చాలా, చాలా... ఎంతో సరదా!

బలరామ, కృష్ణులు మానసికంగా ఒక్కరే కాని, శారీరకంగా ఇరువురు. కాని వారి ప్రవృత్తి ఒక్కటే, ఏ ఒక్కరు మరొకరిని విడిచి వుండలేరు. అంతటి గాఢ, ప్రేమానుబంధం వారిది. ఉదయాన్నే లేవడం, చక్కగా దుస్తులు ధరించడం, తోటి గోపబాలురతో కలిసి, వారి పెద్దల సారథ్యంలో ఆలమందలను పరిసరాలలోని పచ్చిక బీళ్ళకు తీసుకువెళ్ళడమొక దినచర్య.

ఆ సమయంలోనే తమ ఆలమందలకు కావలసిన సమృద్ధిగా ఆహారముండే పచ్చికబీళ్ళను గుర్తించడం కూడా, వారి పాలనలో భాగం. ఒక మూల చక్కని నీరు గడ్డిదొరికే ప్రదేశాలలో ఆవులను విడిచి, తాము రకరకాల వినోదాలతో, ఆటపాటల్లో మునిగి తేలేవారు. అందరికి కథానాయకుడైన కృష్ణుడు, అన్నిటా అగ్రగణ్యుడే. అందుకే అందరికి కృష్ణుడంటే అంత ప్రేమ, అభిమానం. ఎవరికి ఏ కష్టమొచ్చినా దానిని తొలగింపచేసి, ఆనందమొసగే కృష్ణుడు, ఆ - నంద-నందనుడే కాదు, ఆ "నందు"డు కూడా!

ఇదివరకటివలె ఇరుగు పొరుగు వారింట నుండి వెన్న దొంగిలించడం లేదు. పెద్దవాడయ్యాడు కదా. పొరపాటున కృష్ణుడే వాళ్ళ ఇళ్ళకు వెడితే, కృష్ణునికి వెన్నంటే ఇష్టమన్న సంగతి తెలిసిన గోపకుల కాంతలు వెన్నను స్వయంగా తెచ్చి ఇచ్చి గౌరవించేవారు. అప్పుడు తన సహచరులను పిలచి, తనకిచ్చిన వెన్నను వారికిచ్చి ఆరగింపచేసేవాడు. ఆనందింపచేసేవాడు. ప్రేమకు ప్రతిరూపం కృష్ణుడన్న మాట చిరస్థాయి చేసాడు.

అందుకేనేమో, దినదినానికి, యశోదమ్మకు కృష్ణునిపై గల ప్రేమ అధికమౌతుంది. హద్దులు కనబడటం లేదా ప్రేమకు. మనుషులకే కాదు, తన పశుసంపదకు కూడా కృష్ణుడంటే ప్రేమ. కృష్ణుని వేణుగానాన్ని మోరలెత్తి వింటాయి. అతని అడుగు చప్పుడుకు ప్రతిస్పందిస్తున్నట్లు అరుస్తాయి అంతటి ప్రేమలోలుడు. ప్రియుడు, కృష్ణుడు. ప్రతి ఆవుకు పేరుపెట్టి, దానినాపేరు పెట్టి పిలిస్తే, ఆ గోసంపద పొందే ఆనందం వాటికే తెలియాలి. అధినాయకుడు కృష్ణునికే తెలియాలి.

ఇటు ఆవులు, ఆటు నెమళ్ళు - కృష్ణునికి తమవలె రూపమున్నట్లు, అతన్ని చూసి పురివిప్పి ఆడేవి. అతని కోసం, స్వయంగా పింఛాలు విదిల్చేవి. అలంకరిచుకోమన్నట్లు ఆహ్వానించేవి. సకల జీవకోటి కృష్ణనామానికి ఆయన ప్రేమతత్వానికి పులకరించేదనడానికిదొక నిదర్శనం. ఇలావుండగా ఒకనాడు -

వారి మందలో పిశాచం పట్టినట్లు ఒక ఆవు పరుగెడుతూ పిచ్చిపట్టినట్లు రెచ్చిపోయి, తోటి ఆవులను, గోపబాలురను, కుమ్మడం ప్రాణభయం కల్గించడం చేయసాగింది. దానిని పొగరుబోతు ఎడ్లను బంధించగల వాళ్ళు సైతం బంధించ లేకపోయారు. ఇటువంటి తరుణంలో -

గోపకులు ఆడుకుంటున్నారు. ఆ పొగరుబోతు గిత్తకు, వెర్రెత్తినట్లు రెచ్చిపోయి, తోటి ఆవును చంపబోయింది. దాని పొగరుబోతుతనాన్ని గుర్తించిన కృష్ణుడు తోటి బాలురతో ఆడుతున్నవాడు లేచి  గిత్తకు ఎదురు నిల్చున్నాడు. కృష్ణుని కుమ్మడానికి ఆవేశంతో రంకెలేస్తూ పరుగెత్తుకొస్తుందది. ఒక్క ఎగురు ఎగిరి కృష్ణుడు తటాలున తప్పుకున్నాడు. ప్రమాదాన్ని గ్రహించిన గోపకులు "వద్దు, వద్దని" ప్రార్థిస్తున్నా వినకుండా దానిని, ఢీకొనదలిచాడు. కృష్ణుని నిగ్రహాన్ని కోపంతో రంకెలేస్తూ గమనించిన, ఆ పొగరుబోతు పోట్లగిత్త, తలను వంచి, పరుగెత్తుకు వచ్చి, కృష్ణుని కుమ్మడానికి సిద్ధమౌతుంది. అది పరుగెత్తుకు రావడం, కృష్ణుడు ప్రక్కకు తప్పుకోవడం, ఆ పోట్లగిత్తకు ఆవేశం రేకెత్తించసాగింది.

పరుగెత్తి అలిసిన ఆ గిత్తను కుదిపి పట్టుకున్నట్లు చిత్రంగా మెడకు వలలా త్రాటిని వేసి, ప్రక్కనున్న బలమైన చెట్టుకు కట్టాడు. ఆ ఎగరడంలో త్రాటిముడి బిగిసింది. గిత్త గిరగిర తిరుగుతూ బందీ అయిపోయింది. గోపమిత్రులు కాదంటున్నా, దాని పొగరు అణిచే వుద్దేశంతో కృష్ణుడు రెచ్చగొడుతున్నాడు. ఆ పిచ్చిది రెచ్చిపోతుంది. అది ఇక తప్పించుకోవడం, అందునా కృష్ణుని బంధనం నుండి దాని తరం కాదు.

ఈ రకంగా ఎన్ని ఆటలో.... లీలలో... ఇన్నిట కృష్ణుడేనాడు భయపడలేదు. తనకేదో అవుతుందని బెదరనులేదు. పరిస్థితులను చూసేవారు భయపడేవారు. వారిని చూసి కృష్ణుడు బాధపడేవాడు. తన ధర్మం తాను నిర్వర్తించాక, చిద్విలాసంతో సాగిపోయే కృష్ణుడు బృందావనాధీశుడు, వీరాధివీరుడు -

అందరికి ఆరాధ్యుడు.... అతడు కృష్ణుడు, కృష్ణుడే..!

# పిచ్చిపని

**కా**లం గడుస్తుంది. బలరామకృష్ణులకు వయసు వచ్చింది. వయసుకు తగ్గట్లు ఎదుగుతున్నారు. ఆ సమ్మోహనాకారాలను, మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే విధంగా ప్రకృతే పరవశించేటట్లున్నారు - ఆ అన్నదమ్ములు, బలరామకృష్ణులు.

బలరామకృష్ణుల పాద మహాత్మ్యం - వీరి చరణధూళినిగ్రోలి బృందావనం, అందాలసీమగానే కాదు, అందరికి విఖ్యాతమయింది. పశుసంపద పెరిగింది. ఋతు సంబంధం లేకుండా ప్రకృతి పులకరించేటట్లు భూదేవి పరవశించి, గో, గోపీ, గోపాలురకు, కావలసిన సర్వస్వం ప్రసాదిస్తుంది.

ఈ అన్నదమ్ములకు తోడు - శ్రీదామ, ఉద్ధవులు ఏకమయ్యారు. ఒకనాడు వీరు నల్గురు తమ ఆలమందను దాటి ముందుకొచ్చేసారు. ఎందుకొచ్చేసారో. ఆలోచించుకునేలోగా - బలరాముడు "గుర్తుందా, రేపే ఆఖరి దినము ?" అన్నాడు. ఆ... గుర్తుంది అన్నాడు కృష్ణుడు. తెల్లవారేసరికి హస్తిని లొంగ దీసుకోకుంటే నువ్వు పందెంలో ఓడిపోవాల్సి వస్తుంది. జాగ్రత్త"ని బలరాముడు హెచ్చరించాడు. "హస్తి"ని అన్నదొక బలిసిన ఎద్దు పేరు.

"నీకెందుకు వచ్చిందా అనుమానం. నేను హస్తిని లొంగదీసుకుంటాను. పోటీలో గెలుస్తాను. బహుమతిని కైవసం చేసుకుంటాను. గుర్తుంచుకో" అన్నాడు కృష్ణుడు.

"వద్దు కృష్ణా! అనవసర పందాలు వద్దు - ప్రమాదాలు కొనితెచ్చుకోకు. బలరామా! ఎందుకు కృష్ణుని రెచ్చగొడతావు. హస్తిని అసలే పొగరుబోతు ఎద్దు. దాంతో ఏ విధమైన పందాలు వద్దు" ఉద్ధవుడు కృష్ణుని బ్రతిమాలడం, బలరాముని హెచ్చరించడం, ఒకేసారి రెండు చేస్తున్నాడు.

"వద్దు, మనకిటువంటి పందాలు, పట్టింపులు వద్దు... అయినా మన తండ్రి నందరాజుకు కూడా ఇవన్నీ ఇష్టం లేదు. ఇటువంటి సాహసాలు చెయ్యవద్దని మనల్ని హెచ్చరించాడు" వద్దన్నది శ్రీదాముని ముక్తాయింపు.

"చూడండి. కృష్ణుడు పిరికివాడు కాదు. అనుకున్నపని జరగాల్సిందే, ఆ హర-బ్రహ్మలు వచ్చినా నా పట్టుదల మారదు. తెల్లవారేసరికి హస్తిన అనుకున్న ప్రకారం లొంగదీసుకుంటాను. పోటీలో విజయం నాదే. ఇది తథ్యం" శాసనంగానే చెప్పేసాడు.

"బలరామా, బలరామా, కృష్ణుని ఆపవా ?" ఉద్ధవుని బుజ్జగింపు, ప్రార్థన. ఆ హస్తితో పోటీ అనర్థదాయకం. నా మాట విను, కృష్ణుని..." బ్రతిమాలుతున్న ఉద్ధవుని మాట పూర్తి కాలేదు.

"నేను హస్తిని లొంగదీసుకోవడం పోటీలో గెలవడం తథ్యం." అనేసి ఇతర గోప, గోపికా బృందంతో ఆవులమందలో కలసిపోయాడు. ఇంటికి బయలు దేరారు.

"బలరామా; ఇప్పుడేం చెయ్యాలి ?" భయపడుతూ శ్రీదాముడు బలరాముని అడుగుతున్నాడు. భయపడకు. ఎవరు ఎదిరించలేని కృష్ణునకు, నేనొక గుణపాఠం చెబుతాను. దాంతో అనవసర ప్రతిజ్ఞలు, వాగ్దానాలు చెయ్యడన్నాడు.

"నువ్వు చెప్పినా వినకపోతే...!" ఉద్ధవుని అనుమానం.

ప్రారబ్ధం. ఏం చేస్తాం ? అది పొగరుబోతు ఎద్దు. బాగా మదించి వుంది. దానిని లొంగదీసుకోవడం ఆషామాషీ కాదు. కృష్ణుడు ఈ పందంలో ఓడిపోవడం, గుణపాఠం నేర్చుకోవడం జరుగుతుంది. ఎంతో ఆత్మవిశ్వాసంతో బలరాముడు చెబుతున్నాడు.

"పెద్దన్నా. కృష్ణుని సంగతి తెలిసుండి కూడా నువ్విలా మాట్లాడడం తగదు. అనుకున్నది సాధించనిదే కృష్ణుడు విడిచిపెట్టడు."

"అయితే అది కొమ్ములతో ఒక్క కుదుపు కుదిపి ఎత్తి పారవేస్తుంది. అప్పుడు... దెబ్బలు కృష్ణునికి తప్పవు. దాని విసురుకు దెబ్బలు తగిలి తప్పక బుద్ధి వస్తుంది." ఇది బలరాముని మాట.

ఈ మాటతో శ్రీదాముడు, ఉద్ధవుడు కలవరపడ్డారు. ఇప్పుడు దారేది ? బుజ్జులు పగులగొట్టుకుంటున్నారు. శ్రీదాముడు ఏం చేద్దామనగానే, ఉద్ధవుడు "ఉండు, రాధతో చెప్పి వస్తానంటాడు. భలే మంచి ఉపాయమనుకున్నారు.

నిజానికా మదించిన ఎద్దు బృందావనానికి మకుటంలేని మహారాజు వంటిది. పట్టపుటేనుగు వంటి ఆ ఎద్దు మంచి ప్రతాపవంతురాలు. మదించినా

పొగరుబోతును ఎవరు ఎదిరించరు. అసలే పొగరుబోతు మదించి వుంది. అనకూడదు కాని గొలుసులతో ఒక పెద్దవూడలు దిగిన బలమైన చెట్టుకు దానిని కట్టేసారు. దాని కంటికి ఆవు కనుపించిందో, అదేం పాపమో, గొలుసులు తెంచుకుని, ఆ చెట్టును కూలదీసి దానిమీద కురుకుతుంది. అటువంటి మదించిన మదపుటేనుగు వంటి ఎద్దు అదే ఆంబోతును ఒకసారి బలరాముడు చూసాడు. తోటి బాలురతో-

ఏదో ఒకనాడు అది నా పిడిగుద్దుకు చస్తుందన్నాడు. అప్పుడు పెంచుకున్న బలమేమిటో, నా శక్తేమిటో నిరూపిస్తానన్నాడు. దానికి కృష్ణుడు నవ్వుతూ, నువ్వు పిడిగుద్దుతో చంపుతావో లేదో నాకు తెలియదు కాని, దానిమీద సవారీ చెయ్యి. "చాలు" అంటాడు సమాధానంగా, బలరాముడు -

"నేనే కాదు, నువ్వు కూడా దానిమీద సవారీ చెయ్యలేవంటాడు."

"నేను సవారి చేస్తానంటాడు కృష్ణుడు. అన్న చెయ్యలేవని, తమ్ముడు సవారి చేస్తానని, ఆ పందెం ఇలాగ పరిణమించింది. చివరికావాదన పందాల వరకు వెళ్ళింది. అన్నదమ్ములు పందెమంటూ పందెమనుకున్నారు. ఈ నెల ఆగండి. పుచ్చపువ్వులాంటి పున్నమి వెన్నెలలో నా పందెం నెగ్గించుకుంటానన్నాడు. సరేనంటే, 'సరే' ననుకున్నారు అన్నదమ్ములు. ఇది అన్నదమ్ములకన్న ఆశ్రితులైన శ్రీదామ, ఉద్ధవులకు బాధాకరమైంది. వాళ్ళు బాగానే వున్నారు. వీళ్ళు తలలు పగులగొట్టుకుంటున్నారు. విపరీతంగా భయపడిపోతున్నారు. అది. "కృష్ణుడు" కాబట్టి. అదే మరొకరైతే, వాడి కర్మకు వాడిని విడిచిపెట్టేసేవారు.

అసలు భయమెందుకంటే. మొదటిది దానితో పోట్లాడి లొంగదీసుకుని సవారి చెయ్యడం. అలాగ కాకపోతే - అది - రెండవది. ఓడినవాళ్ళు, అవతలి వ్యక్తిని, పందానికి ప్రేరేపించిన వ్యక్తిని, పట్టపగలు భుజాలపై ఎక్కించుకుని గ్రామమంతా తిప్పాలి. ఇది పందెం. ఇది ఎంతవరకు వెడుతుందో తెలియక శ్రీదామ, ఉద్ధవులు భయపడి, రాధ నాశ్రయించారు. విషయం మొత్తం వివరించి ఆమెకు చెప్పారు.

★★★★

"రండి. వెడదాం. బలరాముడు, శ్రీదామ-ఉద్ధవులు ఇతర గోపాలురతో కలిసి, రండి. అన్నాడు. కృష్ణుడు రమ్మంటున్నాడు. వాళ్ళు భయపడుతూనే బయలు దేరారు." ఆ పొగరుబోతు ఆంబోతును చూస్తూనే వీళ్ళు హడిలిపోతూంటే దగ్గరకెవరు వెడతారు ? కృష్ణుడు నవ్వుతూ, ప్రమాదం లేదన్నట్లు చెబుతున్నాడు. రమ్మని పిలుస్తున్నాడు.

చివరకు ఒక బుట్టనిండా ప్రత్తివిత్తులు ఆంబోతునకు ఆహారంగా తీసుకుని ఆంబోతు దగ్గరకు బయలుదేరారు. వీళ్ళ రాకను గమనించిన ఆంబోతు గిరగిర తిరుగుతూ భయంకరంగా చూస్తుంది. కట్టుతాడు త్రెంచుకుని, వీరిని ఢీకొనాలని గుఱ్ఱుగా వుంది. ఎఱ్ఱటి కళ్ళతో, కాళ్ళు తాటిస్తూ తలవంచి కొమ్ములతో కుమ్మి పారవెయ్యాలన్నట్లుంది దాని స్థితి.

ఆ సమయంలో కృష్ణుడు వేణువు ఊదడం మొదలుపెట్టాడు. మొదట్లో వేణుగానం దానికి నచ్చనట్లు గిరగిర తిరుగుతుంది. కేవలం కొన్ని క్షణాలు గడిచాయి. ఆ వేణుగానానికి ఆకర్షితమైనట్లు ఆ ఆంబోతు నెమ్మదించింది. భయంకరచూపులు, కోపం స్థానంలో ప్రశాంతత నెలకొంది. దాని కాపలాదారుడు, మెల్లిగా వెళ్ళి ప్రత్తి విత్తులు బుట్ట దాని దగ్గర పెట్టాడు. అది గమనించలేదు. కృష్ణ వేణుగానంలో మున్గిపోయింది. సమయం చూసుకుని కృష్ణుడు అడుగు ముందుకు వేసాడు. పొగరుబోతుతనం పోయి ఎంతో సౌమ్యంగా తయారయిందది. కృష్ణుడు వేణువునూదడం ఆపి, ఆహార బుట్టను ముందుకు త్రోసాడు. అప్పటి నుండి కృష్ణుడు దాని దగ్గరకు రావడం, వేణుగానమందించడంతో, ఆ పొగరుబోతు ఆంబోతు కృష్ణునితో చెలిమికి తయారయింది. కృష్ణుని చూడగానే తల ఎత్తి వేణుగానం కోరుతున్నట్లు చూడటం ప్రారంభించింది.

వచ్చేటప్పుడు కృష్ణుడు దానికోసం, రకరకాల పదార్థాలు తెచ్చి ఇచ్చేవాడు. అతని కోసమే ఎదురుచూస్తూన్నట్లు వేణుగానం వింటూ, ఆ తెచ్చిన పదార్థాలు తినేది. కొద్దిరోజులు గడిచేసరికి ఆ హస్తి కృష్ణునికి బాగా మచ్చికయిపోయింది. దగ్గరకు వచ్చి నాలుకతో, ప్రేమగా కృష్ణుని నాకడానికి సిద్ధపడేది. అంత పొగరుబోతు ఇంత సౌమ్యమెలాగయిందాన్ని, గోపాలకులు ఆశ్చర్యపోతున్నారు.

పందెం కట్టిన రోజు రానే వచ్చింది. బలరామ, కృష్ణుడు ఆ ఎద్దుండే శాలకు వచ్చారు. క్రింద కూర్చున్నారు. ఆనాడెందుకో ప్రక్కన బలరాముడున్నాడని కాబోలు, గుఝ్ఝుగా, తన సహజస్థితిలో చూస్తుంది. ఆ పరిస్థితిని గమనించిన బలరాముడు తమ్ముని చూసి "ఏమిటి, నువ్వు నిజంగా దీనిపైన సవారీ చేస్తావా అని అడుగుతాడు."

"చేస్తాను. చెయ్యాలని వుంది!" ఎంతో తాపీగా సమాధానమిచ్చాడు.

"వెర్రివేషాలు వెయ్యక. నేనేదో తమాషాగా అంటే దానినే పట్టుకుని వ్రేలాడు తున్నావు ?" కోప్పడ్డాడు. అప్పుడే శ్రీదాముడు, ఉద్ధవుడు వచ్చారు. వాళ్ళతో వచ్చిన వ్యక్తిని చూసి బలరాముడు ఆశ్చర్యపోయాడు. "ఎవరు వాళ్ళు" అడిగాడు.

"ఆమె రాధ" అన్నాడు. ఈలోగా "ఇదేవిటి కృష్ణా, నువ్వు చేసే పనేమిటి ?" అది ప్రశ్న కాదు. ఆవేదనతో అడిగింది. ఆమే - ఇదేమైనా బాగుందా ? ఇటువంటి పందాలు కట్టవచ్చా. సరదాగా సవాలక్ష అంటాము. అవన్నీ సాధిస్తానని, పందాలు, పట్టుదలలు పట్టవచ్చునా ? పందెం కాసే ముందు కనీసం నాకు చెప్పావా" "చేతులు పట్టుకుని ముఖం చిట్లించి అడుగుతున్న రాధ వెంటనే బలరాముని చూసి -

"పెద్దన్నా! కృష్ణుడు నీకన్న చిన్నవాడుగా. వాడితో నువ్వు సరదాగా అని ఇటువంటి పందాలు కాయించవచ్చునా ? పెద్దవాడివే నీకన్న చిన్నవాళ్ళు అల్లరి చేయకుండా చూడటం పోయి ఇటువంటి పందాలకు దింపితే, ఎంత ప్రమాదమో ఆలోచించావూ ? కృష్ణుడు గొప్పవాడు కావచ్చు. పోరి - పోరి, కోరి-కోరి ఇటువంటి ఆగడాలకు దింపడం ఏం బాగుండలేదు" నిర్మొహమాటంగా అడిగేసింది.

"నేనేం వాడిని పురిగొల్పలా ? నేనే ఎప్పుడో ఒకప్పుడు ఒక్క గుద్దుతో దాని మదమణుస్తానంటే, నువ్వేం చెయ్యలేవు. పందెమంటే పందెమని, వాడే రెచ్చిపోయాడు. జరిగింది ఉడుక్కుంటున్నట్లు, ఒక చిన్న, ఆడపిల్ల తనను బెదిరించి నందులకు, ఉక్రోషంతో అన్నాడు.

"చాల్లే, రా పోదాం. ఇటువంటి పనులు నీకు వద్దు. ఇవేనా "ఆటలు"

కృష్ణుని చెయ్యి పట్టుకు లాగుతూ అంది రాధ. అసలు విషయాన్ని ప్రక్కనబెట్టి "రాధా! కోపంలో నువ్వెంత అందంగా వున్నావో తెలుసా ?" అందరి పెద్దవాళ్ళ వలెనే చతురితను ప్రకటిస్తున్నాడు.

"చాల్లే బడాయి, రా, పోదాం, ఈ "హస్తి" ఈ ఆంబోతును ఎక్కడంలేదు కాని, రా!" నిర్ణయం తీసేసుకున్నట్లు కృష్ణుని అదిలించినట్లు చెప్పేసింది.

"నవ్వుతూ, నేను దీనిపై సవారీ చెయ్యడంలేదని...!" నీతో చెవిలో చెప్పానా? రహస్యంగా చెప్పానా...... చిత్రమైన, ముగ్ధమోహన లాస్యం. ఇదే సమయంలో, వీరందరితో తన ప్రశాంతత భగ్నమైనట్లు, ఆ ఆంబోతు రెచ్చిపోతుంది.

"వద్దు, వద్దు, వద్ద"ని, రాధ, బలరాముడు, శ్రీదాముడు, ఉద్ధవుడు, ప్రతి ఒక్కరు బ్రతిమాలుతున్నారు. ప్రాణాలకు తెగించి, ప్రమాదం తెచ్చుకోవద్దని ప్రార్థిస్తున్నారు. వీళ్ళు ప్రార్థించే కొద్దీ, కృష్ణునిలో పంతం, పట్టుదల పెరుగుతున్నాయి. "నేను తప్పక సవారీ చేసి తీరుతాను, ఇందులో తిరుగులేదు" ఇది "జగ" మొండి, కృష్ణుని మొండి లేదా పెంకితనం.

"వద్దు. తమ్ముడు!" బలరాముడు, భుజం మీద ఎంతో ప్రేమగా చెయ్యివేసి, బ్రతిమాలుతున్న దీనస్వరం.

"అన్నా! తగదన్నా, తప్పదన్నా! అన్న మాట నిలబెట్టాలన్నా! పందెం పందెమే నన్నా, పట్టుదల, పట్టుదలేనన్నా తప్పదు. ఇక అనవసరంగా, నన్ను - దానిని రెచ్చగొట్టాక ఆ వెనక్కిపోయి, దాక్కుని, జరిగేది చూడండి అన్నా!" శాసించినట్లు తన పట్టు"దలను, గట్టిగా పట్టు పట్టినట్లు మరీ సరదా కలిపి చెప్పాడు.

"రాధా! అనవసరంగా గొడవ చెయ్యక, నువ్వు కూడా వెళ్ళు. జరిగేది చూడు...". రాధ కోపంగా చూసింది. కృష్ణుని మాట వినదల్చుకోలేదు. నువ్వు దానిపై సవారీ చేస్తాను అంటే, నేను, నీతో దానిపై సవారీ చేస్తాను. నువ్వు దాని చేతుల్లో చావాలనుకుంటే, నేను నీతో కలిసి చచ్చిపోతాను." గట్టిగా పాదాలతో భూమిని అదిమి పెట్టి మరీ ఎంతో బింకంగా చెప్పింది.

"అది అసాధ్యం, జరగని పని" అది కృష్ణుని సమాధానం.

"అయితే, నా చావుతోనే నీకు దానిపై ప్రయాణం సాధ్యం" ఆగిపోతాడేమో నని, రాధ అంత మొండికెత్తింది. ఆమె సాహసానికి ఆశ్చర్యపోయాడు. ప్రేమకు పరవశించాడు. తనకు పధ్నాలుగు. రాధకు పందొమ్మిదేళ్ళు. తనపై ఇంతటి ప్రేమ పెంచుకున్నందులకు, ఆ ప్రేమతో తనను శాసిస్తుందన్నందులకు, ఆ ప్రేమకు లోలోపల పొంగిపోతూ, లొంగిపోయిన కృష్ణుడు -

"సరే నాతో కలిసి సవారి చేద్దువుగాని, సరేనా ?" అని అన్న బలరాముని చూస్తూ, మీరంత వెళ్లి ఆ వెనుకగా నిల్చుని జరిగేది చూడండి" అని వాళ్ళను హెచ్చరించి "నువ్వు నోరుమూసుకుని, కాస్సేపు జరిగేది చూస్తూ నిల్చో. ఆ తర్వాత నాతో స్వారీ చేద్దువుగాని" అని రాధను వదిలి -

ఆంబోతుకు పెట్టవలసిన ప్రతివిత్తనాలు, తెలకపిండి, కొబ్బరి చెక్కలను తీసుకుని, ఆంబోతు దగ్గరకు బయలుదేరాడు. దాని ప్రశాంత వాతావరణం చెడిపోయి, గందరగోళం ఏర్పడటంతో, అది కోపంతో వూగిపోతుంది. అది రాధను కూడా గుఱ్ఱుగా చూస్తుంది. వీళ్ళందరు కలిసి తన ఏకాంతాన్ని భగ్నం చేసినట్లు భావించింది.

దానికి కొద్ది దూరంలో దాని ఆహారాన్నుంచి, కృష్ణుడు వేణువు వూదడం మొదలుపెట్టాడు. కొద్ది నిమిషాలయిందో లేదో, దాని కోపం తగ్గింది. అప్పుడు, కొబ్బరి, తెలకపిండి, ప్రత్తి విత్తనాలున్న బుట్టను దాని నోటి దగ్గర వుంచాడు. వేణువు మొదలుపెట్టాడు. వేణుగానానికి పరవశించే దాని వెన్ను నిమిరాడు. గంగడోలు తడిమాడు. దాన్ని ఆనుకుని గూడా నిల్చున్నాడు. అది హాయిగా దాని ఆహారం కొబ్బరి/తెలకపిండి తీసుకుంటుంది.

అది మంచినీళ్ళు త్రాగుతుంటే, కృష్ణుడు దానిమెడను రుద్దాడు. అలాగ రుద్దడంతో, రాధ దానిమీద దూకడానికి వీలుగా గోడనెక్కడం చూడలేదు కృష్ణుడు. దానితో మాటాడుతున్నాడు. అది కూడా పెద్దమనిషిలాగా, కృష్ణుని మాటలు వింటూ, ఎంతో బుద్ధిగా వుంది, కృష్ణుని మాటలు వింటుంది. నీళ్ళు త్రాగడం పూర్తయింది. ముక్కుత్రాడు పట్టుకుని దానిమీదకెగిరి కూర్చున్నాడు. రాధ దానిపై కూర్చోడానికి వీలుగా చేతినందించి, సహకరించాడు.

వెనక్కి తల ఎత్తి చూసింది. కూర్చున్నది కృష్ణుడని గ్రహించింది. దాని మెడలు, పై భాగం చేతితో రుద్దుతూ "ఏయ్, హస్తి, మనం పరుగెత్తుకుంటూ

అడవిలోకి వెడదాం" అన్నాడు. దానికి అర్థమయినట్లు తలవూపింది. తల ఆడించిన ఆ "హస్తి"ని అదే రంకెలు వేసే ఆంబోతు, మెల్లిగా పరుగు మొదలు పెట్టింది "పరుగెత్తాలి. అప్పుడే మన ప్రతాపం తెలుస్తుంది" వీపును రుద్దుతూ చెప్పాడు. కృష్ణుని మాటకు హస్తిన పరుగు మొదలుపెట్టింది. పక్షుల కిలకిలా రావాలు, సూర్యుని సంధ్యకాంతుల బంగారు పూతపోసిన రూపం, వాతావరణం, ఆ సమయంలో ఎంతో ఆహ్లాదకరంగా వుంది.

రంకెలువేస్తూ, కుమ్మ తలచే ఆంబోతు, సాధు గోవు అయింది. కృష్ణుని మాటలను గౌరవించి పరుగుపెడుతుంది. ఆ పరుగుకు భయపడిన రాధ, భయంతో గట్టిగా కృష్ణుని నడుం పట్టుకుంది. ఎందుకంటే "ఇప్పుడతడు. మగాడు. వీరుడు. సాహసాలా"నందు"డు.

ఈ దృశ్యాన్ని చూడడంతో, ఒక్క ఎగురు ఎగిరి క్రింద పడతాడనుకున్న బలరాముడు, ప్రాణాపాయం తెచ్చుకుంటాడేమోనని భయపడ్డ "శ్రీదామ-ఉద్ధవులు" ఇతర గోపాలకులు కళ్ళప్పగించి నోళ్ళు తెరచి వింతగా చూస్తున్నారు.

మనతో మాట్లాడుతున్నట్టే ఆ "హస్తిని" అన్న అంబోతుతోను కృష్ణుడు మాట్లాడు తున్నాడు. అది అర్థమైనట్లే ప్రవర్తిస్తుంది. అదే కృష్ణమాయ, కృష్ణప్రేమ. చూస్తూండగా ఆనందంతో వాళ్ళు ఆ హస్తినిపై వాలుగా వున్న కొండవైపు ప్రయాణం చేస్తున్నారు.

"వద్దు, వద్దు, కృష్ణా ప్రమాదమన్న రాధ, ఆ కృష్ణునితో కలిసి ఆనందంగా ఆ "నంద" నందనునితో విహరిస్తుంది. కొండవాలు ప్రయాణంలో కృష్ణుడు తన మోకాళ్ళతో ఎద్దును గట్టిగా పట్టుకున్నాడు. రాధ, కృష్ణుని వెనుకదాగి, అతన్ని గట్టిగా పట్టుకుంది.

కొంతదూరం ప్రయాణించి, ఆ ఎద్దు ఆగింది. ఇంతవరకు బాగానే వుంది ప్రయాణము. ఇకపైన... ఇది కృష్ణునిలో వచ్చిన ఆలోచన. రాధ నెమ్మదిగా క్రిందకు

దిగింది. కృష్ణుడు ఆమె ప్రక్కన నిల్చున్నాడు. "హస్తిని" అదే ఎద్దు గూడా, వీరి సహచర్యంతో అదో భాగ్యంగా ఆనందం పొందినట్లుంది. రాధ కూర్చుంటే, ఆమె ప్రక్కనే కూర్చుని నుదుటకు పట్టిన చెమట బిందువులను ప్రేమగా తుడిచాడు. వేణుగానం మొదలుపెట్టాడు.

సూర్యుడు తన ప్రభావం చూపిస్తున్నాడు. బలరామ, శ్రీదామ, ఉద్ధవులు, వారిని అనుసరించినట్లు గోపాలురతో కలసి వచ్చారు. రాధకృష్ణులు వారిని కలిసారు. రాధ, కృష్ణులు తమ మిత్ర ఆంబోతుతో కలిసి మంచిమిత్రులవలె సుహృద్భావ వాతావరణంలో ఉన్నారు.

ఈ మొత్తం చూసిన గోపబాలురు, పశుపక్ష్యాదులను సైతం, ప్రేమించి తన చెంతకు చేర్చుకోగల శ్రీకృష్ణప్రేమ తత్వానికి పరవశించి, పులకరిస్తున్నారు. అయితే ఈ పిచ్చిచేష్టను గూర్చి నందరాజుకు ఏ మాత్రం తెలిసినా వీరిని క్షమించడని మాత్రం భయపడి పోతున్నారు.

""""""""

# ప్రమాదాలా ? ప్రమోదాలా ?

క్రొత్తక్రొత్త పచ్చిక బయళ్ళ అన్వేషణలో, బలరామకృష్ణులు గోవర్ధనగిరి పరిసర ప్రాంతాల్ని చూసారు. అక్కడ పశువులకు పచ్చిమేత, పుష్కలంగా వుండటంతో, ఇక పశువులను ఆ ప్రాంతంలో మేపితే బాగుంటుందనుకున్నారు. దీంతో కృష్ణుడు  గొప్పతనం మరికొంత పెరిగింది.

అతన్ని ఆ ప్రాంతంలో వున్న తులసీవనం బాగా ఆకర్షించింది. తులసి ప్రియుడైన ఆ వనమాలి ఆనందానికి అంతు లేదు. దానివల్లనే ఆ ప్రాంతానికి బృందావనమని పేరు వచ్చింది. ఈ తులసి మొక్కల నుండి వచ్చే గాలి, కదంబవృక్షాల నీడ, వాటి పూవులు, వాటి మధుర పరిమళాలు, మొత్తానికి పారవశ్యాన్ని కలుగ చేస్తున్నాయి. చంపక, కేతకీ,  వంటి పుష్పాలు కూడా కృష్ణునికి ఆనందాన్ని కల్గిస్తున్నాయి. వాటిని పూలదండలుగా గ్రుచ్చి ధరించడం, ఆ పూవుల్ని

సిగలో తురుముకోవడం చేస్తూండేవాడు.

ప్రకృతి కృష్ణునికి ప్రాణం. ఆ సోయగాల్ని చూస్తూ, పరిసరాలను, తనను, ఇతర గోపమిత్రులను కూడా మరచిపోయేవాడు. ఇంకా తమాషా ఏమిటంటే, మనతో మాట్లాడుతున్నట్లు కృష్ణుడు వాటితో మాట్లాడేవాడు. ఇంకొన్ని సమయాలలో వేణువునూదుతూ ఆ రమణీయ ప్రాంతానికి రాగధూమం వేసేవాడు. ఆ చెట్లు కృష్ణుని వేణుగానికి తలలూగిస్తున్నట్లు వాటి చిటారు కొమ్మలు చిత్రంగా కదిలేవి.

ఇంకా... ఇంకా... చెప్పాలంటే, "గోవర్థనగిరి" కృష్ణునికి చాలా ఇష్టం. రకరకాల పూలమొక్కలతో, సుగంధవాసనలు ప్రకృతికి పంచిపెట్టే అందాలకోన, ఆ గోవర్థనగిరి కొండ. దాని వాతావరణం, పూవుల రమణీయకత, సుగంధ వాయువుల పరిమళం. ప్రకృతి ప్రియులకు, పరవశించేవారికి పరమానందం. ఇంకా చిన్న చిన్న జలపాతాలు, నెమళ్ళుల క్రీంకారాలు, నాట్యాలు, చిన్న వాగులు, వంకలలో హంసలు, అది దర్శించిన అనుభవంతో పారశ్యమొందవలసిన దృశ్యము, ఆనందమే తప్ప వర్ణించనలవి కానిదా ప్రాంతం, దృశ్యాలు.

వన్యమృగాలు, కుందేళ్ళు, వాటి ఆటలు, ప్రవర్తన, నర్తనం కృష్ణుని వేణుగానానికి శోభలిచ్చేటట్లు కనుపించేవి. ఎన్నోసార్లు తానుగా, తన మిత్రులతో, ఈ గోవర్థనగిరికి వచ్చాడు. ఒంటరిగా వచ్చినప్పుడు కొండశిఖరాగ్రం వరకు వెళ్ళి అక్కడనుండి క్రిందికి చూసి, దిగువ ప్రకృతి అందాలను, ఆనందంగా దర్శించేవాడు. "ప్రమాదం, జాగ్రత్త" అని కృష్ణుని హెచ్చరించవలసిన పనిలేదు. పుట్టింది ప్రమాదాలలో, పెరిగేది ప్రమాదాలతో! అందరికి ప్రసాదించే ఆనంద ప్రమోదాలతో!

ఒకసారి తామెప్పుడు చూడని ప్రదేశాన్ని చూడటం తటస్థించింది. అక్కడ పెద్ద కొంగ తన గుడ్లను కాపాడుకోవడం కూడా చూసారు. వీళ్ళను చూసిన ఆ కొంగ, తన గుడ్లను తీసుకుని పోతారనే భయంతో, శివమెత్తినట్లు, అరవడం ఎగరడం ప్రారంభించింది. దాని అరుపులు, చిందుళ్ళు, గోపబాలురకు, తమాషాగా, ఆనందంగా వుంది. దాంతో వీళ్ళు చప్పట్లు కొడుతూ ఎగురుతున్నారు.

దాంతో ఆ కొంగకు కోపం వచ్చి, సహనం కోల్పోయింది. ఈ ఎగిరే పిల్లల అల్లరికి, కథానాయకునివలె వున్న శ్రీదాముని భయంకరంగా ముక్కుతో పొడవసాగింది. ఇంతవరకు ఎగుళ్ళుతో కేరింతలు కొట్టిన మిగిలిన గోపబాలురు భయపడి పారిపోయారు. కృష్ణుడు మాత్రం కదలకుండా అక్కడే నిల్చున్నాడు. ఎంతో శాంతంగా ప్రశాంతంగా వున్న కృష్ణుడు, ఆ కొంగ వీర విక్రమాన్ని అణుస్తున్నట్లు, దానినోటివలెనున్న రెండు ముక్కులను గట్టిగా రెండుగా చీల్చేసాడు.

ఆ దెబ్బతో రక్తం కక్కుకుంటూనే, కృష్ణుని నుండి పారిపోవాలని తలచింది కాని, కొద్దిదూరం వెళ్ళేసరికి క్రిందపడి మరణించింది. ఇదొక సంఘటన.

మరో సందర్భంలో, ఒక పెద్ద కొండచిలువను ఎదుర్కోవలసి వచ్చింది. అది అప్పటికే ఒక ఆవును తింది. మరికొన్ని ప్రాణులకై ఎదురు చూస్తుంది. కృష్ణుడు దానిని చూసాడు. అప్పటికే కొన్ని ఆవులు, దూడలు కట్లు తెంచుకుని ప్రాణభయంతో పరుగెడుతున్నాయి. ధైర్యం సడలని కృష్ణుడు, తన మిత్రులు గోపబాలుర హెచ్చరికలను పట్టించుకోకుండా, ఆ కొండచిలువకు తగు గుణపాఠం నేర్పాలని నిర్ణయించుకున్నాడు.

దాని నోరు తెరచి, దాని జవాలు తొలగించాలని చేసే ప్రయత్నంలో, కొండచిలువ, తోకతో ఒక్కటేసింది. కాని కృష్ణుడు ఒడుపుగా తప్పించుకుని దాని నోటిని చీల్చి అందులోకి రాళ్ళు, కర్రలు, దుంగలు, ఒకదానివెంబడి మరొకటి త్రోసాడు. దాంతో దాని నోరు మూసుకుపోయింది. ప్రాణాంతకమై కూర్చుంది. మెల్లిగా తప్పించుకుందది. ఆ మరునాడు యధాప్రకారం, గోపాలకులు పశువులను మేపుడానికి వచ్చి, ఈ చచ్చిన భయంకరమైన కొండచిలువును చూసారు.

బలరాముడు చేసిన సాహసాలు తక్కువైనా, ఆతని ఆకారంలాగే, ఆ ఒక్కటి కూడా, అతని వీరత్వానికి సాహసమై కూర్చుంది.

బలరాముడు తొందరగా స్పందించడు. మెల్లిమెల్లగా రంగంలోకి దిగుతాడు. ఒక్కసారే కోపం తెచ్చుకుని రంగంలోకి దిగాడో, ఆ బలవంతుని దెబ్బకు ఒకేసారి "తా" అంటారు. అందుకే ఎక్కువ భాగం శాంతమూర్తిలాగ, ఇటువంటి వీరాలాపాలకు దూరంగా వుంటాడు.

ఒకసారి బలరాముడు తమ గోగణాన్ని తీసుకుని పచ్చికబయళ్ళకు వచ్చాడు.

అవి పచ్చిక మేస్తుంటే బలరాముడు ఒక చెట్టువద్ద కొద్దిసేపు నిలబడ్డాడు. ఆ సమయంలో గాడిదల దండు కనబడింది. ఆ దండులోని నాయక గాడిద ఒక మనిషిని పట్టి ఎగిరి తన్నడం చూసాడు. ఆ దృశ్యానికి ఆ క్షణంలో బలరాముడు వుగ్రుడయ్యాడు. అంతే పరుగెత్తి, దానిని మొహమ్మీద బలమైన గుద్దు గుద్దాడు. ఆ దెబ్బకు, ఆ గాడిద మొహం పచ్చడయి, రక్తం కక్కుకుని మరీ చచ్చింది.

బలరాముని ముష్టిఘాతం... అదే పిడికిలి దెబ్బ.. సామాన్యమైనది కాదు. అది దేనినైతే గుద్దిందో, దెబ్బకు "ఠా", అది దాని రూపంలో వుండకపోవచ్చును. జీవులైతే ప్రాణాలకు నీళ్ళొదులుకోవలసి వస్తుంది. అది.... ఆ పిడికిలి దెబ్బ. దాన్ని పెద్దవాళ్ళు "ముష్టిఘాత"మంటారు.

ఒకసారి బలరామ, కృష్ణులు ఆటలాడుకుంటున్నారు. బలరాముడొక బృందానికి, కృష్ణుడొక బృందానికి నాయకులు. ఆ ఆటలో బలరాముని బృందం గెలిచింది. ఆట నియమం ప్రకారం ఓడినవారు గెల్చినవారిని భుజం లేదా వీపుపై ఎక్కించుకుని ముందే నిర్ణయించుకున్న ప్రాంతానికి తీసుకువెళ్ళి దిగబెట్టాలి.

ఆ నియమం ప్రకారం, కృష్ణుడు తన మిత్రుడైన శ్రీదాముని వీపుమీద ఎక్కించుకున్నాడు. ప్రలంబుడనే నల్లటి, మూర్ఖ మొండివాడు, ఒక సమస్యా పరిష్కారం నిమిత్తం వారిని ఆనాడే కలిసాడు. బలరాముడు, వాడి వీపుపై బయలు దేరాడు. ఈ మూర్ఖుడు బలరాముని అనుకున్న ప్రదేశానికి కాకుండా, దారి తప్పించి అడవిలోకి తీసుకువెడుతున్నాడు. ఆ ప్రాంతం ప్రలంబునకు తప్ప మరొకరికి తెలియదు. అటువంటి ప్రదేశానికి బలరాముని తీసుకుపోతున్నాడు.

బలరాముడు పరిస్థితినర్థం చేసుకున్నాడు. ఈ ప్రలంబుని ఉడుముపట్టు నుండి బయటపడటం మామూలుగా సాధ్యం కాదనుకున్నాడు. దాంతో వీడిని మాయావిగా తలిచాడు. మోసం చేసి, పరిష్కారమంటూ వారిలో కలిసి, తమకు ఆపదకొని తేవాలన్న బుద్ధితో వచ్చాడనే విషయం తెలుసుకునేసరికి తమాయించుకోలేక, తీరని కోపంతో పిడికిలి బిగించి, నెత్తిమీద ఒక గుద్దు గుద్దాడు. ఆ దెబ్బకు వాడు క్రింద పట్టు విడిచి తల పగిలి క్రింద పడ్డాడు. బలరాముడు వాడి వుడుముపట్టు నుండి బయటపడ్డాడు.

ఇటువంటి సంఘటనలు బృందావనమంతా విస్తరించాయి. వీరికి ముందే అక్కడ వున్న గోపకుటుంబాలు, బలరామ, కృష్ణులు సామాన్య యాదవులు కారనీ, వారు తప్పక దైవాంశ సంభూతులు అయి వుంటారని అనుకోసాగారు. ఇంతవరకు బాగానే వుంది. పొరపాటున వీరే కనుక ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే మన పరిస్థితి....

అమ్మో! ప్రాణాంతకం ప్రమాదకరమని భయపడ్డారు.

అది నిజమన్నట్లు, ఆనాడు కృష్ణుడు మిత్రుడైన శ్రీదాముడు పరుగు, పరుగున వచ్చి, కృష్ణుడు కాళీయుని మడుగులో దూకాడని, అందులోని కాళీయుడనే విషసర్పధాటికి, కృష్ణుడేమౌతాడోనని, శ్రీదాముని నోట... విన్న...

కృష్ణుడు మడుగులో దూకాడన్న వార్తతో, అరుపులు, కేకలు, గగ్గోలు పెడుతూ కాళింది మడుగుకు అందరు వచ్చారు. ఈ కాళింది అడవిలో ఒక మూలగా వుంది. ఇక్కడ జనసంచారం తక్కువ - అనేకన్నా దాని సంగతి తెలిసిన వారెవరూ అటువైపు పోరు అన్నది సత్యం. అది వర్షాకాలంలో సమృద్ధియైన జలాలతో, పొంగిపొరలుతుంది. మిగిలిన రోజులలో సామాన్య తటాకమనాల్సిందే!

వట్టిరోజులలో ఆ నీళ్ళు అదొకరకమైన దుర్వాసనతో తెలిసినవాళ్ళు అటువైపు వెళ్ళాలంటేనే అసహ్యమనిపించేటట్లుంది. అందులో క్రూర, పెద్ద కాలసర్పం "కాళియు"డనేవాడు ఆక్రమించుకుని, విచ్చలవిడి విహారం చెయ్యడంతో దానికి "కాళింది" మడుగు, "కాళీయ" మడుగు - అని పేరు వచ్చింది. అటువైపు మానవులే కాదు, జంతువులు కూడా వెళ్ళవు.

ఆకుపచ్చ ఆ నిలువనీరు, కాళీయుని విషంతో మున్గిపోయింది. అందులోని నీళ్ళు పొరపాటున త్రాగినవారెవరైనా సరే, వారి వారి ఫలాల ప్రకారం స్వర్గ నరకాలలో దేనినో దానిని సత్వరం చేరాల్సి వస్తుంది.

ఒకసారి ఇందులోని నీటిని కొన్ని ఎడ్లు తాగి, అక్కడికక్కడే మరణించాయి. అవి చూచిన గోపాలురు, తక్షణ సహాయం కోసం పరుగులు తీసారు. జరిగింది చూసిన కృష్ణుడు, ఈ సంగతేదో చూడాలని నిర్ణయించుకున్నాడు. అంతే, కళ్ళు చిట్లించాడు. పామును చూసాడు. అది హాయిగా మడుగు మధ్యలో చుట్టలు చుట్టుకుని వుంది. ఇతరులు హడావుడిగా వచ్చి ఏమిటో తెలుసుకునేలోగా -

పంచ బిగించాడు. నడుంకొక త్రాడు కట్టుకున్నాడు. ఒకచెట్టు కొమ్మమీద కెక్కాడు. మడుగులోకి దూకాడు. అలాగ దూకడాన్ని చూసిన ప్రతి ఒక్కరు అదొక విషపూరిత మడుగు కాబట్టి, కృష్ణుడు ఆ జలంలో తన ప్రాణాలు వీడుతాడని భయపడిపోయారు. కొందరైతే స్పృహకూడా తప్పారు. కృష్ణునికి అనుంగు మిత్రులైన శ్రీదామ, ఉద్ధవులు, ఈ విషయాన్ని నందరాజుకు యశోద మాతకు చెప్పాలని పరుగులు తీసారు. ఆ పరుగు ఊహాతీతం, అంత వేగంగా గాలితో సమానంగా పరుగెత్తారు.

ఆ మడుగులోని నీళ్ళు పాచిపట్టి, నాచుతో నిండి వుండటంతో కృష్ణుడు ఈదడానికి, లోలోపలకు వెళ్ళడానికి అవరోధంగా తయారయింది. అట్టఅడుగున కాళీయుడు, ఆ నాచుమొక్కల మధ్యన విశ్రమిస్తున్నాడు. ఈ ప్రదేశాన్ని తన నివాసంగా చేసుకుని అక్కడ నివసిస్తున్నాడు. కృష్ణునిలో కోపతాపాలు లేవు. ఎప్పటిలాగ పరమ ప్రశాంతంగా వుండి, శత్రువుపై విజయం సాధించాలని, సాధు జనరక్షణానికి ఉద్యమించాలన్నది కృష్ణుని ఉద్దేశం.

పరమ ప్రశాంతంగా వుండే, కృష్ణుని రాకతో కల్గిన అలజడితో, తన ప్రశాంతతకు భగ్నం కల్గినట్లు తలలెత్తాడు. పడగలెత్తిన కాళీయుడు, కృష్ణుని చూసి, ఈతడు తన మడుగులో ప్రవేశించడమొక విచిత్రం. తన విషపు ధాటికి నిలబడి ఇంకా ప్రాణాలతో వుండటం మరొక విచిత్రం. కాళీయుడు ఆశ్చర్య పోతున్నాడు.

కాళీయుడు ఆశ్చర్యం నుండి తేరుకునేలోగా, నడుముకు గట్టిగా కట్టుకున్న త్రాడు ముడివేసాడు. దానిని ఉచ్చులాగ చేసి పాము మెడకు విసిరాడు. పడగల కాళీయుని కంఠానికి తాడు ఉచ్చు బిగుసుకుంది. త్రాడు తనకు మెడకు బిగవడం, అంత సాహసంగా పిల్లవాడు వేయడం అమితాశ్చర్యాన్ని కలుగచేసింది. జరిగింది వూహించుకుని తెలుసుకునేలోగా, కాళియుని కదలికలకు ఆ వుచ్చు బిగుసు కోవడం ప్రారంభించింది.

ఆ కదలడంలో, తోక కాళిందీ జలాలలో, కవ్వం పెట్టి త్రిప్పినట్లు అయి నురుగులు కక్కడం మొదలుపెట్టింది. బయటనుండి చూసేవారికి ఆ హడావుడి ఆదుర్దాకు కారణమైంది. ఏం జరిగిందో ఏమిటో తెలియక కంగారు, భయంతో, ఒడ్డున వున్నవారు గజగజ వణుకుతున్నారు. ఏ ఒక్కరికి వూపిరి ఆడుతున్నట్లు

లేదు. అలాగున్నారు, వారందరూ!

ఆ పెద్ద కాళీయుడు, ఆ వుచ్చు నుండి చేసే ప్రతి ప్రయత్నం ప్రాణాంతకమై, వుచ్చు బిగుసుకుపోతుంది. వూపిరాడక, ఆ నీళ్ళలో ఎగిరెగిరి పడుతుంది. దాని తోక, శరీర భాగాల కదలిక తనకు ఇబ్బంది కలుగకుండా, వుండవలసినంత దూరంలో వుండి దాని ప్రాణాలకు కాలాంతకుడయ్యాడు. దాని ప్రయత్నాలన్నీ వ్యర్థమై పోయాయి. కొన ప్రాణానికి వచ్చినట్లు గింగుర్లు తిరుగుతుంది.

అలాగ ఎంతసేపు పోరాడుతున్నాడో ఆ దేవునికే తెలియాలి. మడుగు వద్దనున్నవారు మాత్రం నరాలు తెగే ఉత్కంఠతో కృష్ణుడు సుఖంగా తిరిగి రావాలని, ఏ విషము కృష్ణునికి ప్రమాదము ఆపద కల్గించరాదని, ఆ భగవంతుని ప్రార్థిస్తూ - వూపిరి బిగపెట్టి మరీ ఎదురు చూస్తున్నారు.

కాళీయుడు బలహీనమైపోయినట్లు ఏ మాత్రం కదలిక లేకుండా నీరసపడి పోయాడు. అప్పుడు కృష్ణుడు కాళీయుని వెనక్కి వెళ్ళి, దాని తోక పట్టుకున్నాడు. ఆ పరిస్థితిని గమనించిన కాళీయుని భార్యలు ఎంతో వినయ విధేయతలతో అతన్ని అనుసరిస్తున్నారు. ఆశ్చర్యపోయాడు కృష్ణుడు.

కృష్ణుడు కాళింది మడుగులో దూకాడన్న విషయాన్ని అందరిలాగ విన్న రాధ పరుగు పరుగున కృష్ణుని చూడాలని, అవసరమైతే దండించాల్ని, ప్రాణాలుగ్గ పెట్టుకుని మరీ వచ్చింది. అప్పటికే కృష్ణుడు కాళీయుని మదమడచి, నీటిపైకి వచ్చేసాడు. ఇక కాళియుని వలన, ఆ మడుగు వలన ఎవరికీ, ఏ ప్రమాదము లేకుండా చేసాడు. ఇది కాళీయ మర్దనం.

ఇక రాధా కథనం.... దాని వివరాలు...!

ఇది ఉత్తరభారతానికి చెందిన కథా "కథ"నం. దక్షిణ భారతంలోని ప్రశస్త వ్యాసం (భాగవతంలో కాని) పరమార్థ సూచికయైన పోతన గారి భాగవతంలో కానీ -

ఈ అనంతాత్ముని ప్రేమ - విశ్వప్రేమా కథా విపంచి మనకు కనబడదు. వినబడదు.

కాకపోతే వ్యాస "దేవీ భాగవతం"లో, గోలోకమని ఒకటి వుంది. దానికి అధిపతి రాసరాణి రాధాదేవి. ఆమె ప్రియుడు కృష్ణుడు. వీరి నుండి అనంత సృష్టికి, ఆద్యము, ఆధారమై సృష్టి వికశిస్తుంది. ఈ మొత్తాన్ని ఈ గ్రంథ రచయిత విశ్వమానవతా గురుపీఠం, పారంపర్య పీఠాధ్యక్షులు, గురుదేవులు శ్రీశ్రీశ్రీ వేూరుగంటి రామకృష్ణ ప్రసాద్‌గారు వ్రాసిన, నవ "రాత్రి" దీక్షా నిత్య పారాయణ గ్రంథం "దేవీభాగవతం"లో విపులంగా చదువవచ్చును.

కనుక "రాధా-మాధవుల" ప్రేమ సిద్ధాంతం కేవలం ఒక్క ఉత్తరాదివారిలో కనుపిస్తుంది. ఈ విషయాన్ని భారతీయ విద్యాభవన్ కులపతి శ్రీ కె.యం. మున్షీగారు తెలియబరుస్తారు. ప్రచారం వేరు. ప్రాముఖ్యత వేరు. ప్రచారం జానపద మౌతుంది. ప్రాముఖ్యం శాస్త్ర పరమౌతుంది. ఇక్కడ శాస్త్ర, పురాణాదులలో దక్షిణాత్యులు రాధా - మాధవ ప్రేమామృతం గానం, కథనం - శాస్త్రబద్ధంగా స్వీకరించలేదు. విని ఆనందించడానికి తప్పు లేదు.

# గోవర్ధనగిరి

**బృ**ందావనంలో రెండు వర్గాలు తయారయ్యాయి. ఒక వర్గం గోవర్ధనగిరిని పూజించి, "గిరిపూజ - ఉత్సవం" చెయ్యాలని సంకల్పిస్తే, "అబ్బేబ్బే. గిరి పూజ కాదు మనం చెయ్యాల్సింది. యథాప్రకారం ఇంద్రాది ప్రకృతీ దేవతలకు పూజ చెయ్యాలనే వాదం రెండోవర్గం చేసింది. ఈ ప్రకారంగా, ఇప్పుడా చిన్న బృందావనములో రెండు వర్గాలు, రెండు రకాల వాదనలు మొదలయ్యాయి.

యాదవకుల గురువులు గర్గాచార్యులు, విద్యా గురువులు శ్రీ సాందీపుల వారు అసంఖ్యాక గోపకులు, కృష్ణుని సమర్థిస్తుంటే, అక్కడ పూర్వం నుండీ వున్న

అయ్యన్న తండ్రి స్తోకకృష్ణ వగైరా వారలు, ఆధిపత్యంలో చిన్నయినా, అహంకారంలో పెద్దగా, మధురనుండి ఉత్సవ నిర్వహణకు పురోహితుని తెచ్చి సంరంభం ప్రారంభించ తలిచారు. ఇటు, నందరాజు, ఆయన గోపబృంద కుటుంబాలు, రెండో వర్గం వారిని పట్టించుకోకుండా తమ కార్యక్రమాలు తాము మొదలుపెట్టారు.

ఆనాడే ఉత్సవ ప్రారంభం.

పెద్ద సంబరంగా జాతరవలే, చాలమంది గిరిపూజకు తరలి వచ్చారు. వారి పశుగణాన్ని శుభ్రంగా కడిగారు. పసుపు రాశారు. కుంకుమబొట్లు పెట్టి చక్కగా అలంకరించారు. ఆ పశుగణంలోని ప్రతిదానికి మెడకు గంటలు కట్టారు. కొందరు వాటికాళ్ళకు కూడా గజ్జలు కట్టారు. గోగణమంతటికి కూడా మెడలో గవ్వలు దండ వేసారు.

భయంకరమైన ఎద్దులకు కూడా గిట్టలు కొట్టి, వాటి కొమ్ములకు వెండి ఆకులను కట్టారు. వృద్దులు, పెద్దముత్తయిదువులు రకరకాల అందమైన రంగు రంగుల దుస్తులు ధరించి, అందంగా అలంకరించుని వారి సాంప్రదాయ గీతాలు పాడుకుంటూ బండ్లమీద వస్తున్నారు. ఆ బండ్లు లాగే ఎడ్లను రకరకాలుగా అలంకరించారు. తాము, తమ పశుసంపద, అంతా సాంప్రదాయ చిహ్నాలు, నగలు, అలంకారాలతో ఆనందమయంగా, కోలాహలంగా గిరిపూజకు బయలుదేరారు.

బలాఢ్యులు, సమర్థులు, కొందరు, ఆంబోతులపై అధిరోహించి వస్తున్నారు. అందరు అందమైన తలపాగాలు మెడలో కండువాలు ధరించి వున్నారు. యువతీ యువకులు, కాలినడకన ఆడుతూ, పాడుతూ బయలుదేరారు. వీరిలో అందంగా అలంకరించుకుని, తారామణిలాగ, యశోదామాత, వివాహ సంబంధ నిశ్చయ తాంబూల సమయంలో పెట్టిన అలంకరణలను ధరించి, వెలుగుతుంది.

బలరామ, కృష్ణులు ఈ అందమైన సంబరానికి, సారథ్యం వహిస్తూ ముందు నడుస్తున్నారు. బలరాముడు చూడటానికి అందరికన్న పొడుగు, అంతకుమించి భుజాలమీద హలాయుధం (నాగలిని) ధరించి సారథ్యం వహించే

నాయకునిలాగ దర్జాగా నడుస్తున్నాడు. కృష్ణుడు పీతాంబరం ధరించి తలపై నెమలి పింఛం, చేతులకు, పూలదండలతో, సర్వులను సమ్మోహనపరిచే వేణువుతో కృష్ణుడు ఎంతో అందంగా, అందరికి అధినాయకునిగా నడుస్తున్నాడు.

ఆడవాళ్ళను స్నేహితులను చూసి సరదాగా మాట్లాడుతూ, అలాగే పెద్దవారిని అభినందిస్తూ, గోగణాన్ని పలుకరిస్తూ, ఆ ఉత్సవానికి, ఉత్సవ రూపంగా, అందరికి వుత్తేజాన్ని కల్గిస్తూ కృష్ణుడు నడుస్తున్నాడు. కులగురువులు గర్గాచార్యులవారు, విద్యా గురువులు శ్రీ సాందీపులవారు, శ్రీ కృష్ణుని సాహసానికి జరుగబోయే అద్భుతాలను తలచుకుని, తాము ధన్యులమన్నట్లు తలుస్తున్నారు.

ఉత్సవంగా గోవర్థనగిరి వద్దకు అందరు కలిసి తరలి వచ్చేసరికి మధ్యాహ్నమైంది. అక్కడవున్న పెద్ద పెద్ద చెట్లు క్రింద తమ తమ కుటుంబాలతో వాళ్ళు విడిది చేసారు. తెచ్చుకున్న భోజనాలు మొదలుపెట్టారు. పిండివంటలు, చిత్రాన్నాల వంటి వాటిని ఒకరికొకరు పంచుకోవడం సనాతన సాంప్రదాయకంగా ఆ పల్లె ప్రజలు తమ తమ గృహస్థ సాంప్రదాయాలను పాటిస్తున్నారు.

సాయంత్రవేళ ఆటపాటలు ప్రారంభమయ్యాయి. కొంతమంది పులి, గుర్రాలు, ఎడ్లు, కుక్కల అరుపులను అనుకరించి చెబుతున్నారు. ఆ రోజుల్లా సరదాగా గడిపేసారు. తెల్లవారింది. ఆవులు, ఎడ్లను కడగడం, పాలు పితకడం, స్నానసంధ్యలు, అలంకారాలు... ఉదయపు కార్యక్రమాలన్నీ ఉత్సాహంగా సాగుతున్నాయి. ఒక్కొక్కరే అనకుండా అందరు కలిసి గోవర్థనగిరిని అధిరోహిస్తున్నారు

గర్గాచార్యులు, సాందీపుల వారి నేతృత్వంలో నందరాజ బృందాలు, కృష్ణుడు అధిపతిగా, బలరాముడు ఉపనాయకునిగా గోవర్థనగిరి నధిరోహిస్తున్నారు. గర్గ, సాందీపులు గిరిపూజ ప్రారంభించారు. ఈ క్షణం నుండి గోవర్థనగిరి జడ పదార్థమైన కొండ కాదు. ఈ "గిరి" దేవుడు - పూజ పూర్తయింది. ఆరతి ఇవ్వబోతున్నారు. ఆ సమయంలో అయ్యన అతని స్నేహితులతో కలిసి, కొండ వెనుక మార్గం నుండి కొండ ఎక్కుతున్నాడు. కృష్ణుడితోపాటు మిగిలిన వారందరు కూడా వారిని చూసారు "చూడు, అయ్యన్న తన స్నేహితులతో వస్తున్నాడు. సాదరంగా ఆహ్వానించాలి"!! అన్నాడు కాని, తానే నాయకుడు కాబట్టి" అయ్యన్నా

రండి. అందరం కలిసి గిరిపూజ చేసుకుందా''మని సాదరంగా ఆహ్వానించాడు. శ్రీదాముడు వారిని తీసుకురావడానికి ముందడుగు వేసాడు. ఈ దృశ్యాన్ని చూసి అయ్యన ఏమనుకున్నాడో, ఏమో... ఎంతో కష్టపడి ఎక్కినవాళ్ళు, అంత తొందరలో గబగబ కొండ దిగడం ప్రారంభించారు.

గర్గాచార్యులవారు, కేవలం గిరిపూజే కాకుండా, వృక్షపూజ, గోపూజ... ఇంకా చెప్పాలంటే, ప్రకృతి పూజను కూడా చేసారు. చివరకు కృష్ణునికి మంగళహారతిని ''జయ జయ గోకులబాలా!'' అని కొందరు, ''జయకృష్ణా యశోదానంద ''గోపాలా!'' అని మరికొందరు జయ జయ నినాదాలు చేస్తూ వచ్చారు. సాయంకాలం అందరు ఒకచోట చేరారు. విందు భోజనాలు చేసారు.

కొందరు ఆటలు, కొందరు పాటలు.... కొందరు... కృష్ణా లీలా విలాసాలు'' చెబుతూ, ఆ ఉత్సవానికి పరిపూర్ణ పండుగశోభను తెచ్చారు. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి.... అంటే చీకట్లు బాగా ముసురుకున్నాయి. ఎవరి బళ్ళ క్రిందవారు, భద్రంగా నిద్రిస్తున్నారు.

ఇంచుమించు అర్ధరాత్రి అయింది. దట్టంగా మేఘాలు క్రమ్ముకున్నాయి. చల్లగాలులు వీస్తున్నాయి. ఆ చలికి ముడుచుకుని పడుకున్నారు. అయినా చలి ఆగడం లేదు. ఉరుములు, మెరుపులతో గోపాలకులందరు లేపినట్లు లేచారు. ఆకాశం హడావుడి చేస్తుంది. చూడగా, చూడగా ఓ పెద్దవాన వచ్చేటట్లుంది.

ఇది ఇలాగ వుంటే.... కొందరిలో భయం పట్టుకుంది. ఇంద్రుడిని కాదని, ప్రకృతిపూజ, గిరిపూజ చేసాం. దానికి ఇంద్రుడు కోపించి, ఉరుములు- మెరుపులతో మనల్ని బెదరకొడుతున్నాడు. పెద్ద వర్షం వచ్చి, పిల్లాపాప, గొడ్డు- గోదా - నిలువనీడ లేకుండా ఇబ్బంది పడతామేమోనని మనసులో రణగొణధ్వని ఆలోచనల భయంతో బయటికి చెప్పలేక, చలికి వణుకుతున్నట్లు, గిజగిజ లాడిపోతున్నారు.

కుర్రవాడు కృష్ణుని సలహాను పాటించి, ప్రమాదం కొనితెచ్చుకున్నామోనని ఇంకొందరు, అసలు - దేవతలను కాదని, గిరిని దేవుడిని చేసి గౌరవించి, ప్రకృతీపూజ, గో-వృక్షపూజలు చెయ్యడంతో, వర్షాధిపతి కోపించి, తన ప్రతాపాన్ని చూపుతున్నాడనుకుంటాను. ఒకరు, ఇద్దరు కాదు అందరు అనుకుంటున్నారు,

భయపడుతున్నారు. తెల తెలవారుతుంది. సూర్యుడు వస్తున్నాడు. సూర్యుని వెల్గురేఖలు మేఘాల మధ్య - కప్పబడిపోయాయి.

ప్రతి గోపాలకుడు, బండ్లు కట్టుకుని, ఈ వర్షం ప్రారంభించి పెద్దది కాకుండా ఇంటికి తిరిగి వెళ్ళిపోవడం మంచిదిగా భావించారు. బండ్లు కడుతున్నారు. మెరుపులు మెరుస్తున్నాయి. వురుములు వురుముతున్నాయి. అంతటా అంధకారం. చూస్తుండగా జడివాన. అనుకుంటూండగానే పెద్దదయిందా వర్షం. ఆ కుండపోత వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లడం, నేలంతా మురికి, మురికి, బురదనీళ్ళతో క్షణమొక యుగమన్నట్లు తయారయింది. స్త్రీ, పురుషులందరు బండ్ల క్రిందకు ముక్కుతూ మూల్గుతూ చేరారు.

ఇంక అందరు తలొక విధంగా మాటాడసాగారు. ఏముంది, ఇంద్రుని పూజించకుండా, కొండలను, చెట్లను పూజించాముగా, అందుకే ఇంద్రునికి కోపం వచ్చిందని ఇలాగ ఇబ్బంది పాల్జేసాడు. ఏవిటో, అనవాయితీ, సాంప్రదాయాలను కాదంటే, ఇలాగే వుంటాయి. అందరు పెద్దలే. ఎవర్ని కాదంటాము ?

ఇలాగ - తలకొకరు, తలా ఒక మాట మొదలుపెట్టారు. ఇంక బృందా వనానికి వెళ్ళడం, అందులో ఈ అడవి దారికుండా ప్రమాదమని ఒకరంటే, ప్రమాదమని మెల్లిగా అంటావేమిటి! ప్రమాదమే. ఈ గండం గడిచి... ఈలోగా స్త్రీ, పురుషులందరూ -

ఒక్కుమ్మడిగా, 'ఇంద్రా! ఓ దేవతా సార్వభౌమా! మా తప్పులు మన్నించు. నీకు తప్పక ఇంద్రోత్సవం చేస్తాం. ఒట్టు అని, ఆ తుఫాను నుండి రక్షించు గలవానిగా ఇంద్రుని తలుస్తూ ప్రార్థనలు, మ్రొక్కులు... ఎవరిష్టం వారిదన్నట్లు, తమ తమ అంగళ్ళు తెరిచారు. పొంగళ్ళు.... అవి... ఇవి... అంటూ మ్రొక్కులు మ్రొక్కుతూ, వాగ్దానాలు చేస్తున్నారు.

మొట్టమొదటి మేఘాన్ని చూడగానే, కృష్ణుడు లేచి తన మిత్రులనందర్ని పిలిచాడు. మనం తప్పక ఇప్పుడు ఇంద్రునికి బుద్ధిచెప్పాలని చెప్పాడు. వెంటనే మిత్రులను గోవర్ధనగిరి గుహల దగ్గరకు తీసుకు వచ్చారు. ఇవన్నీ కృష్ణునికి తెలిసిన మార్గాలు, విషయాలే! ఆ గుహలు మనుషుల మాటలకు, గోగణ కాలి గిట్టల శబ్దాలకు ప్రతిస్పందిస్తాయి.

"అన్నా!" అని బలరాముడిని పిలిచి - "ఈ ఇంద్రుడు తన ఆధిక్యాన్ని ప్రదర్శించాలని చూస్తున్నాడు. అతనికి తగిన బుద్ధి, గుణపాఠం చెప్పాలి. అంటూ గుహలకడ్డంగా వున్న పెద్ద బండరాళ్ళు అడ్డంకులను, అన్న బలరాముడు మిగిలిన మిత్రులతో తొలగించాడు. ఎప్పుడైతే గుహలకడ్డం తొలగి దారి ఏర్పడిందో. అందరు చప్పట్లు కొడుతూ విజయోత్సాహంతో ఎగురసాగారు.

అక్కడ వుంటానికి అడ్డంగా వున్న రాళ్ళు, మట్టి బండలు క్షణాలలో తొలగించారు. పసిబిడ్డ బాలాది స్త్రీ బాలవృద్ధులను చకచక తీసుకురావడానికి, కృష్ణసేన బయలుదేరింది. జరిగే హడావుడి తెలుసుకుందామని నందరాజు వచ్చాడు. జరిగేదంతా చూసాడు. కృష్ణుని - ఆతని సేన ప్రజ్ఞాపాటవాలకు మురిసాడు.

ఇక్కడిలా రక్షణ కోసం భద్రతా చర్యలు తీసుకుంటుంటే, బయటి తుఫాను తీవ్రత పెరుగుతుంది. ఆ వురుముల శబ్దానికి కొండగుహ ప్రతిధ్వనిస్తుంది. ఆ ప్రతిధ్వనులతో చెవులు గింగురుమంటున్నాయి. ఎక్కడో వురుము పడింది. ఈ ఉరుముల మెరుపులు తుఫాను హడలగొడుతూంటే, పనిలో పని భూకంపం. ఆ భూకంపానికి, గోవర్ధనగిరి కూడా కదిలింది. అడ్డంగా వున్న ఒక పెద్ద బండరాయిని కృష్ణుడు తన దివ్యశక్తితో తొలగిస్తుంటే -

అది - ఈ భూకంపానికి అదిరి, కృష్ణుని మీద పడింది. ఆ పడేదాన్ని అక్కడున్న వారందరు కలిసి, సమయస్ఫూర్తితో పట్టుకున్నారు కాబట్టి సరిపోయింది. లేకపోతే అమ్మో! ఎంత ప్రమాదం జరిగిపోయేదో.... మళ్ళీ నెత్తిన ఓ పిడుగు పడ్డట్టయింది. ఈ మారు మరింత పెద్ద భూకంపం వచ్చింది. నిల్చున్న వాళ్ళు నిల్చున్నట్లే ఎవరో త్రోసినట్లు క్రిందపడి పోయారు.

అప్పుడే మరో అద్భుతం జరిగింది. గోవర్ధనగిరి, అచ్చటి పర్వతాలలో రాజు. కొన్ని అడుగుల ఎత్తు భూమి నుండి పైకి లేచింది. దానిమీదనుంచి రాళ్ళు క్రిందకు దొర్లాయి. కొండపైకి లేవడంతో, క్రింద అద్భుతమైన గుహ లభించినట్ల యింది. దీనిక్రింద ఎందరైనా హాయిగా నిల్చునే సావకాశం, ఏ విధమైన ఇబ్బంది లేకుండా, తమ పనులు తాము చక్కబెట్టుకునే సావకాశం లభించింది.

అద్భుతమైన ఈ దృశ్యానికి ఆబాలగోపాలం హర్షధ్వానాలు చేసారు. చప్పట్లు కేరింతలతో, ఏ ఒక్కరినీ పట్టలేకపోతున్నారు. గోపాలురు, గోపికలు, స్త్రీ

బాలవృద్ధులు, తమ పశుసంపదతో, ప్రస్తుత పరిస్థితికి గొడుగులా పైకి లేచిన పర్వత క్రింద భాగాన్ని చేరుకున్నారు. వున్నట్టుండి నోళ్ళప్పగించి చూస్తున్నారు. అది లేవలేదు. కృష్ణుడు లేపాడు. ఆ చిన్నకృష్ణుడు, ఈ పెద్ద పర్వతం.... ఒక్కొక్కరిలో........

చలనం ప్రారంభమైంది. ఆ అద్భుతాన్ని వర్ణించలేకపోతున్నారు. శ్రీకృష్ణ మాయకు పరవశించి, మైమరచిపోవడంతో ఆ దివ్యలీలా విలాసాన్ని, ఆ దైవ చేష్టను కేవలం కళ్ళప్పగించి విచిత్రంగా చూస్తున్నారు. ఉన్నట్టుండి మాయపొరలు తొలగినట్లు మళ్ళీ ఉత్సవకాండ ప్రారంభించారు. ఇప్పుడు వాళ్ళకు ఇంద్రుని గూర్చిన భయం పోయింది. ఇప్పుడు వాళ్ళకు కృష్ణుడే - ఇంద్రుడు, సర్వదేవతలు.

ఇప్పుడు మళ్ళీ ఓ తమాషా! ఆశ్చర్యము, అద్భుతము. ఒక్క ప్రక్కన గోవర్ధనగిరిని చిటికెనవ్రేలిపై గొడుగు చేసిన కృష్ణుడు, ఆ పర్వతాన్ని పట్టుకుని వున్నాడు. తమతో కలిసి కలివిడిగా తిరుగుతున్నాడు. అదే కృష్ణలీల. "కృష్ణం వన్దే జగద్గురుం" అనీ, సర్వ దేవతాస్వరూపమని, "అనంత" శక్తి సమన్వితుడనని తెలిపే మహత్తర, మహాద్భుత ఘటన, సంఘటన.

ఈ దివ్య సంఘటన, యదువీరులలో, బృందావనవాసులలో కృష్ణునిపై భక్తిశ్రద్ధలు, ప్రేమ గౌరవాలు. అంతకుమించి సర్వరక్షకుడనే భయభక్తులు.... అమితంగా, విశేషంగా పెరిగాయి. ఏదో చిన్న చిన్న సంఘటనలు కాదు. అచ్చటి పర్వతాలలో శ్రేష్ఠరాజమనే గోవర్ధనాన్ని ఎత్తడం, ఆలమందలతో సర్వులను సంరక్షించడం, వారి వారి పనులు వారికి విధానంగా జరుపబడటం -

అందరిలో ఆనందాన్ని శ్రీకృష్ణునిపై శ్రద్ధా-విశ్వాసాల భక్తిని పెంచింది. లేనివారికి భక్తి కల్గించింది. వున్న వారికి భక్తి ఇంకా, ఇంకా, పెంచింది. ఇప్పుడిక ఇంద్రుడంటే భయం వారికి పోయింది. కృష్ణుడున్నాడన్న ధైర్యం బాగా పెరిగింది.

మెల్లి మెల్లిగా వర్షం తగ్గడం ప్రారంభించింది. సూర్యుడు తనకాంతిరేఖలను

వెదజల్లుతున్నాడు. తన స్వప్రకాశాన్ని చూపుతున్నాడు.

గోపాలురు, తమ ప్రయత్నానికి, కృష్ణుని సకల "సర్వరక్షక" సహాయానికి పొంగిపోయారు అనడంకన్న, కించిత్తు గర్వమొందారు. తమశక్తికి తామే పొంగిపోయారు.

"ఈతడు" "గోవిందు"డని ఆనాటినుండి (గో, గోప, గోపికల సంరక్షకుడని) క్రొత్త పేరు ప్రసాదించారు. సకల జీవ - ప్రాణరక్షకుడు "గోవిందు" డని పరిపరి విధాల ప్రస్తుతించారు. ఇంక నీతో జాగ్రత్తగా వుండాలి. అల్లర్లు - ఆగడాలు - రాసలీలలు......

"అదేం... ?!" అన్నాడు కృష్ణుడు. తనే - "నేను మీ వాడిని కానా ? నాతో రాసక్రీడకు రా, రా ?!" రండి. మనమందరము కలిసే రేపు ఆశ్వయుజ పూర్ణిమకు హాయిగా పున్నమి రాత్రి ఆటాడుకుందాం. ఎవరికి దొరకని ఆనందాన్ని పంచుకుందాం." అన్నాడు.

అంతేకాదు - ఇక ఇంద్రాదుల గూర్చి ఆలోచించకండి. అయినా - ఇంద్రోత్సవంలో పాల్గొందాం. పెద్దలను గౌరవిద్దాం. సాంప్రదాయాన్ని పాటిద్దాం" అన్నాడు. అందరు కేరింతలు, హర్షధ్వానాలతో తమ ఆనందాన్ని పెద్ద పెట్టున ప్రదర్శించారు.

# కంసుడు

**మా**మగారు జరాసంధుడు సల్పిన "అశ్వ"మేధానికి ముఖ్యపాత్ర వహించిన మధురాధిపతి కంసుడు తన రాజ్యానికి తిరిగి వచ్చాడు. అశ్వమేధం దిగ్విజయంగా సాగింది. అల్లుని యాగాశ్వానికి రక్షణగా వుండి, కార్యక్రమ దిగ్విజయానికి సర్వవిధాల సహకరించమన్నాడు. మధురాధిపతి తన పాత్రను చక్కగా నిర్వర్తించి మామగారి కీర్తి ప్రతిష్ఠలనిడుమడింప చేసాడు.

దాదాపు పన్నెండు సం॥గా సంచారం సాగించిన, ఆ పవిత్ర యాగాశ్వం, మగధ రాజ్యానికి తిరిగి వచ్చింది. అశ్వమేథ యాగంలో, సామంత రాజులందరు పాల్గొన్నారు. తమ రాజభక్తిని చాటుకున్నారు. వేదవేత్తలైన బ్రాహ్మణోత్తములు, యాగాన్ని దిగ్విజయంగా నిర్వర్తించారు. వారందర్ని తగిన విధాన భూరిదక్షిణలతో సత్కరించిన జరాసంధుడు -

అల్లుని వీరవిక్రమాన్ని ప్రశంసిస్తూ, తాను జయించిన రాజ్యాలలో చాలా మట్టుకు మధురాధిపతికి కానుకగా సమర్పించి, ఆ రాజు ఏలుబడిలోకి వాటిని తెచ్చాడు. ఈ పన్నెండు సం॥ల యజ్ఞకాలంలో కంసుడు మధురను యధాలాపంగా దర్శించి, ఏలుబడినొకసారి చూసుకొనడం తప్ప, మొత్తం రాజ్య సంరక్షణా భారాన్ని తన విశ్వాసపాత్రులైన, ప్రధానమంత్రి ప్రలంబుడు, సర్వసైన్యాధ్యక్షుడు ప్రద్యోతుని భుజస్కంధాలపై నిలిపాడు.

అంతా బాగానే వుంది. ఎంతో సంతోషంగా రాజధానికి వచ్చిన కంసుడు ఆశంతా నీరుగారిపోయింది. అంతటి సంతోషం ఆవిరైపోయింది. తన సామ్రాజ్యాధీనంలో వున్న ముప్పై యొక్క యదువంశాల వీరులు (శూరులు, అంధకులు, వృష్ణి వంశీయులతోపాటు, తన స్వపక్షమైన భోజవంశీయులు కూడ) స్వతంత్రపాలకులైపోయారు. గతంలో యాదవ వంశాల కూటములను చీల్చి - వారలను దెబ్బతీయాలని పథకాలు పన్ని, అందరిని నిస్సహాయులు చేసి, తన దాసులుగా చేసుకున్న కంసుని పన్నాగాలు, ఛిన్నమై, ఆతడు, యజ్ఞాశ్వంతో విజయయాత్రలు చేస్తుంటే -

ఇక్కడ తన అధీనంలోని యదువంశీయులు, తలలెత్తి ఎవరి సామర్థ్యాన్ని వారు, తమ సార్వభౌమాధికారంగా సామంతుల నుండి ధీమంతులుగా, శ్రీమంతులుగా స్థిరపడ్డారు. దీంతో కంసుని రాక గాని, ఆతని ఏకచ్ఛత్రాధిపత్యం గాని యదువంశాల వారిని కదిలించలేదు. బెదరించలేదు.

దీంతో కొన్ని దినాలు కుమిలిపోయాడనేకన్న తీవ్ర ఆందోళనకు, కలవరానికి గురయ్యాడు. కంసుడు పొందిన స్వాగత సత్కారాలు నిరాశ కల్గించాయి. రాజభవనానికే పరిమితమైన తండ్రి, అసలు మహారాజు ఉగ్రసేనుడు, తన విజయాన్ని గాని, పాలనా విధానాన్ని గాని నిరాశాజనకంగానే చూసాడు తప్ప, ఏ విధమైన సంతృప్తి, ప్రోత్సాహము, అభినందనల నివ్వలేదు. ఇదో పెద్ద అశనిపాతము, ఓటమి తెలుపని పెద్ద అసమర్థతగా తలంచాడు.

అనుకూలించని ప్రస్తుత పరిస్థితులకు అసహనాన్ని జోడించి, ప్రమాదాన్ని కొని తెచ్చుకునే ఆలోచనలకు, తలవొగ్గ దలచలేదు. అంతకుమించి ప్రధానమంత్రి, ముఖ్య సలహాదారు అయిన ప్రలంబుడు పక్షవాతంతో, చావు బ్రతుకుల మధ్య వూగిసలాడుతున్నాడు. ఇక ఇప్పుడు దిక్కు, ఆధారము ప్రద్యోతుడు. ఆతని నుండి అన్ని విషయాలను సేకరించాడు. పరిస్థితినవగాహన చేసుకున్నాడు.

తను రాజ్యంలో లేకపోవడం, ప్రధానమంత్రి అసమర్థత, సమర్థ యంత్రాంగం-సేనలు తనతో వుండటం కొంత అరాచకానికి, యాదవులు బలపడి తమ స్వయం ప్రతిపత్తిని చాటుకోవడానికి సుగమ మార్గమయింది. మరొక కారణం, తండ్రిని నిరోధించి, చేసిన అనధికార సర్వాధికార ప్రయత్నం కూడా, యాదవులు బలపడటానికి, కంసునిపై ద్వేషాన్ని, అతన్ని నిగ్రహించాలనే ఆలోచనకు బలమైన ఊతమిచ్చి, యదుకులవంశీయులనందరిని సంఘటిత పరిచింది.

ప్రస్తుత పరిస్థితులన్నీ సమీక్షించి, ఎవరి ఎదుగుదలను చూసి, భరించలేని కంసుడు, తన కుట్ర కుతంత్రాల బుద్ధికి తప్పక పదును పెట్టాలనే ఆలోచన, ఎంత వద్దనుకుంటున్నా, అనుభవించిన అధికారమదమాతన్ని అధికారం వైపు నెట్టుకుపోతుంటే, వరద ప్రవాహానికి కొట్టుకుపోయే దుంగలాగ, తన స్వార్థకుట్ర కుతంత్రాల భీభత్స ప్రవాహంలో, తన బుద్ధి వరదల్లో, అధికారమదమనే దుంగతో, ఏటికెదురీదాలని తలుస్తున్నాడు.

అందుకు పర్యావసనంగా, తనకు నమ్మకస్తులు, విశ్వాసపాత్రులైన వీరాధివీరులను నగరిలోని ముఖ్య కూడళ్ళు, అత్యంత ప్రాముఖ్య ప్రాంతాలలో వుంచి, తన విజయ వీర విక్రమానికి చిహ్నంగా "ధనుర్యాగమనే" పేరుతో సంబరాలు జరుపాలని, ఆ వేడుకలలో అందరు పాల్గొనాలని, ప్రజలందరకు ఆనందమొసగే ఈ ఉత్సవాలలో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొని రాజు, రాజ్యంపై గల తమ భక్తి ప్రపత్తులను చాటుకోవాలని చాటింపు వేయించాడు.

ఇలా దండోరా వేయించి, "ధనుర్యాగం" పేరుతో, మళ్ళీ యదుకుల వంశీయుల నుండి, తన సామంతులుగా కప్పం వసూలుచేసి, తన భృత్యాను భృత్యులుగా చేసుకోవాలని, కంసుడు "ధనుర్యాగ" పన్నాగం పన్నాడు. ఇలాగుంటుండగా - ఒకనాటి రాత్రి ప్రద్యోతుడు కంసరాజును కలుసుకున్నాడు. పరమ రహస్యమంటూ అతను

చెప్పిన మాటలు కంసుని నరాలు చచ్చుబడినట్లు చేసాయి.

"నిజం" అన్నాడు, గుండెలు బాదుకుంటున్నట్లుగా. "అవును. మనతో యుద్ధములో పాల్గొనే ఆంతరంగికుడు అయ్యన్న - నాకీ విషయాన్ని చెప్పాడు. దాన్ని జీర్ణించుకోలేక, నాలో నేను మథనపడి, ఆపుకోలేక, హుటాహుటిన ఇక్కడికి వచ్చి, మీ చెవిన వేసాను" ప్రద్యోతుడు వివరంగా విన్నది, విన్నదివిన్నట్లు చెప్పాడు.

ఈ మొత్తం వినడంతో, కంసుని మొహం పాలిపోయింది. తన దుర్భేద్యమైన కోట కూలిపోతున్నట్లు తలంచాడు. చేతులు వణకడం, శారీరక పరిస్థితి దిగజారిపోతూండటంతో, ప్రద్యోతుని, అయ్యనను, వెళ్ళిపొమ్మని ఆదేశించాడు. తలుపులు బిగించుకున్నాడు.

అసహనంగా అటు ఇటు తిరిగి, కోట పైభాగమందలి ముందరి విశాల ప్రాంతానికి వచ్చి అటు ఇటు పచార్లు చెయ్యసాగాడు. పిడికిలి బిగుసుకుంది. కళ్ళు భయంతో పొంగి, బిక్కచచ్చినట్లుందప్పటి పరిస్థితి. అప్పటి స్థితి, కంసుని పరిస్థితి వర్ణించడం, వూహించుకోవడం తగని పనే. మామగారి అశ్వమేథయాగం, ఆ యాగాశ్వంతో జైత్రయాత్రలకు వెళ్ళడం, విజయయాత్రల వీరవిహారంతో...

నారదుడు, ఆతని భవిష్యద్వాణి పూర్తిగా మరుగునపడ్డట్లు కంసుడు మరచిపోయాడు. ఇప్పుడు... ఇప్పుడు... మళ్ళీ అప్పటి భయం, నారదుని వాణి ముచ్చెమటలు పోయిస్తున్నాయి. దేవకి అష్టమగర్భం ఆడపిల్లవడంతో, కొంతబెట్టు, ప్రాణభయం సడిలింది. కానీ, గోకులంలో, యాదవ ప్రముఖుడు నందరాజు కుమారుడు కావడం. వాడు పుట్టడం దేవకి అష్టమగర్భ వయస్సు, వూహల కందని విధంగా వయస్సు మాట మరచినట్లు ప్రవర్తించడం, పూతనాదులను సంహరించడం సామాన్య విషయమా ? ఈతడే ఆ జగద్రక్షకుడా ? దేవకి బదులు, నందరాజు కుమారునిగా జన్మించాడా ? ఇదంతా దేవతల పన్నాగమా ? లేక మాయా ??

సమాధానం దొరకడం లేదు. బుఱ్ఱ.... అస్సలు... పని చెయ్యడం లేదు. ఇప్పుడు కంసునికి యాభై సం॥లు వచ్చేసాయి. చావంటే... గతంలోని కన్నా, ఇప్పుడే విపరీతంగా భయపడిపోతున్నాడు. దేవకి అష్టమ గర్భశిశువు, ఈ రకంగా, నందబాలుడై, తనను ఘోరాతి ఘోరంగా చంపక, అనుక్షణం భయపెట్టి చంపడాన్ని కంసుడు భరించలేకపోతున్నాడు. అసలు ఈ కథకు, తన మరణ భయానికి

ఆద్యంతాలెక్కడో, కంసుడు అర్థం చేసుకోలేకపోతున్నాడు.

మహా, మహా యోధులతో కూడా జరిపిన యుద్ధాలలో యుద్ధమంటే భయపడని కంసుడు, ఈ బాలుడు, తమ వంశీకుడు రక్త సన్నిహితుని చేతిలో, దారుణంగా చంపబడతానని, చెప్పిన మాట, నరనరాల్లో భయాన్ని లేపి, మనసును కృంగదీస్తుంటే...

అదే... అది... భరించలేకపోతున్నాడు. తల్చుకుని సహించలేకపోతున్నాడు. అందుకే యాదవ ప్రముఖులనందర్నీ అణచి మట్టుపెడితే, తను క్రొత్తగా పొందిన రాజ్యాలతో కలిసి, తాను "చక్రవర్తి"గా పేరు పొందుతాడు. శౌర్య ప్రతాపాల ఘనకీర్తిని పొందుతాడు. కాబట్టి, ఇక ఉపేక్షించక, తగు చర్యలను తీసుకుని, నంద బాలుని, "దేవకీ" సంతానంగా తలచి, మట్టుపెట్టాలి. అప్పుడే మనస్సుకు శాంతి. తన మనుగడకు ప్రశాంతిగా, నిర్ణయం తీసుకున్నాడు.

రాత్రంతా, నిద్రలేమితో బాధపడ్డ కంసుడు, తెల్లవారుతూనే ప్రద్యోతను రమ్మని కబురు పంపించాడు. ఇరువురు కలిసి ప్రధానమంత్రి ప్రలంబుని ఇంటికి వెళ్ళారు. పక్షవాతమొచ్చి, సగం శరీరం చచ్చుబడి, నిర్జీవ శవంలాగ బ్రతుకుతున్న ప్రలంబుడు, మహారాజు రాకకు సంతోషించాడు. కాని ఎదురేగి స్వాగతమివ్వలేక పోయాడు. ప్రద్యోతుని గది ముంగిట కాపలాగా పెట్టి, తాను ప్రలంబునితో చర్చించ తలిచాడు.

చచ్చినట్లు పడుక్కున్న సగం చచ్చిన ఆ మనిషి ప్రలంబును, కంసరాజు కుదపడంతో, అతడు కళ్ళు తెరిచాడు. అలాగే చచ్చుపడ్డ ఆ చేతిని మరోచేత్తో మెల్లిగా పైకెత్తి, నమస్కరించినట్లు స్వాగతించాడు. "వూ" "వూ" అని తలూపిన కంసుడు -

"ప్రలంబా!" అని అతన్నోసారి ఆపాదమస్తకం చూసాడు.

"నా మాటలు వినబడుతున్నాయా ? అర్థమవుతున్నాయా ?" అడిగాడు కంసుడు. సమాధానంగా కళ్ళు కదుపుతూ, తల వూపాడు.

"బృందావనంలో ప్రస్తుతమున్న నందరాజు కుమారుడు కృష్ణుడు, రోహిణి కుమారుడు బలరాముని, పేర్లు విన్నావా ?

తెలుసన్నట్లు కళ్ళు కదుపుతూ తలవూపాడు.

"ఆ కృష్ణుడు మన పూతన, తృణావర్తులను చంపాడు. అదీ తెలుసా ?"

"తెలుసు"

"ఇప్పుడతడు పెద్దవాడు, బలాఢ్యుడైనాడన్న సంగతి విన్నావా, తెలుసా ?"

సమాధానంగా, మళ్ళీ తెలుసున్నట్లు ప్రలంబుడు తలవూపాడు.

"అతడు చిన్న పిల్లవాడిగా వున్నప్పుడే, ధేనుకాసుర, బకాసురులను చంపాడన్న విషయం తెలుసా ?" దానికీ తలవూపాడతడు.

బృందావనమందలి గోప, గోపికలందరు అతన్ని అమితంగా ప్రేమిస్తారుట ....?! తెలుసన్నట్లు తల త్రిప్పాడు. భయంకర విషసర్పం కాళియుని చంపి, ఆ మడుగును విష నాశనం చేసాడుట.... ?" పాపం, ప్రలంబుడు - తెలుసన్నట్లు దానికీ తలవూపాడు.

అంతే! దాంతో కోపోద్రిక్తుడయ్యాడు. ఓ మూర్ఖ ముదుసలీ, అన్నీ తెలిసి, వాడలా పెరిగిపోతుంటే చూస్తు వూరుకున్నావా ? ముందు... నిన్ను... ?" చంపాలన్నంత కోపం కంసునికి వచ్చేసింది. అసలే సగం చచ్చి ఎందుకు బ్రతుకు తున్నాడో అర్థంకాక, శవమై మంచానికతుక్కుని పోయిన ప్రలంబుని చూసి, కొద్దిగా తమాయించుకున్నాడు.

పరిస్థితిని అర్థం చేసుకున్న ప్రలంబుడు, తన అవిటి చేతిని అలాగే మరోచేత్తో పైకెత్తి, అసమర్థుడినన్నట్లు, ఎంతో దీనంగా కంసుని చూసాడు. రెండు చేతులు కల్పి క్షమించమందామనుకున్నాడు కాని, చేత కాలేదు, అతని దీన పరిస్థితికి కొంత సంబాళించుకున్న కంసుడు -

"నీ అనారోగ్య సమయంలో ఈ బాలుడు - కృష్ణుని గూర్చిన నివేదికలు నీకు వచ్చాయా ?" - వచ్చాయన్నట్లు చేతితో చెబుదామనుకున్నాడు ప్రలంబుడు కానీ, అవునన్నట్లు తలవూపి వూరుకున్నాడు. మళ్ళీ - కంసుడే -

"అవును. ఈ కుర్రవాడు బృందావనంలో ఇంద్ర పూజను వద్దని గిరిపూజ, ఆ గోపాల, యాదవుల చేత చేయించాడుట తెలుసునా ?" దీనికి మాత్రం తెలియదన్నట్లు తల అడ్డంగా తిప్పాడు.

పోనీ ఏదో రకంగా, గిరి, వృక్ష, గో, ప్రకృతీ పూజలను చేయించాడుట, తెలుసా ?

ఇందుకు తెలుసన్నట్లు తలవూపాడు.

''నీకు తెలిసినవన్నీ నాకెందుకు విన్నవించలేదు'' ఆగ్రహంతో వూగిపోయాడు. సమాధానంగా ప్రలంబుడు ప్రద్యోతుని చూపాడు. అతనికి తెలుసన్నట్లు వేలు చూపి, తల వూపాడు. అతనికి తెలుసా ? అదేనా నీ సమాధానం అడిగాడు కంసుడు. "అప్పుడు కృష్ణుడు గూడా ఆరాధించబడ్డాడుట. ఇదీ తెలుసా ?'' కంసుడడిగాడు. అందుకు సమాధానంగా - ప్రలంబుడు మౌనం వహించాడు.

"శ్రీకృష్ణుడు - పొగరుబోతు "అరిష్ట"ను, ఆ దెయ్యపు గుఱ్ఱం కేశినిని, చంపాడన్న విషయాలు కూడా.... ?? అదేవి తనకు తెలియదన్నట్లు చూసాడు.

"ప్రలంబా!" ఒక్కసారి గట్టిగా అరిచి, క్షణమాగి ప్రశాంతతను పొంది, "ప్రలంబా! నీవు చేసిన ఆ ముప్పై అయిదు సం॥ల నమ్మకమైన సేవ నిన్ను రక్షించింది. లేకపోతే నిన్నీపాటికి, ఆయుధమవసరం లేకుండా గొంతు పిసికి చంపేవాడిని. నా రాజ్యానికి, సర్వాధికారిగా నీపై ఎంతో నమ్మకంతో విడిచిపెడ్తే ఆ మొత్తం వమ్ముచేసి, రాజ్యాన్ని నన్ను సర్వనాశనం చేసావు. నేను తల ఎత్తకుండా చేసిన, నా వాళ్ళందరు తలఎత్తి నన్నుధిక్కరించేటట్లు చేసావు.

పేరుకు పిల్లవాడైనా, మనకు ఉత్పాతంగా ఉద్భవించిన ఆ కృష్ణుని వూపిరి ఆపుచేయకుండా, ఓ వీరాధివీరునిగా తయారుచేసావు. ఇప్పుడా కుర్రవాడు బృందావనానికి, కాదు, మన మధురలోని వారికి కూడా, "వీరుడు-ఆరాధ్యుడు'' అయ్యాడు.

వింటున్నా, చేతులెత్తి క్షమించమని కోరలేని అశక్తతో, కళ్ళవెంట కన్నీరు కారుస్తుంటే, "నువ్వే చేతులు జోడించి ప్రయోజనం లేదు. కాకపోతే... ఒక్కమాట నీకు తెలిస్తే నాకు చెప్పి పుణ్యం కట్టుకో. నీ తప్పులు సర్వం జరిగిన దాంతో సహా మరచిపోతాను. ఆ కృష్ణుడు దేవకీదేవి అష్టమ గర్భమేనా ? ఆ సంగతి చెప్పి పుణ్యం కట్టుకో, సత్యం కోసం అడుగుతున్నట్లుంది - కంసుని వదనం. నాకు తెలియదన్నట్లుంది ప్రలంబుని ముఖం.

"చెప్పు. ఇదైనా చెప్పిన నాకు మనశ్శాంతిని కల్గించు. లేదంటే బ్రాహ్మణుని చంపానన్న అపకీర్తిని మోయడానికైనా నేను సంసిద్ధుడనే. నన్ను, నా సహనాన్ని పరీక్షించిక నిజం చెప్పు. నీకు తెలుసా ? అతడు దేవకి అష్టమగర్భ సంతానమేనా?

ఆ ప్రలంబుడు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ వివరించలేక పోతున్నాడు. అతని అసమర్థతను కంసుడు క్షమించలేకపోతున్నాడు. కాలరుద్రుడౌతున్నాడు. అతని భుజంతట్టి వూపేస్తున్నాడు. ఆ కదలికలో కొంతచలనం. ప్రలంబుని ప్రయత్నం.

"చెప్పు. నువ్వు రాజద్రోహివి. ఇన్నాళ్ళు నీకు తెలిసిన రహస్యాన్ని దాచిపెట్టి ప్రభుద్రోహం చేసావు." కాలనాగులా కంసుడు బుసకొట్టాడు. అతన్ని పట్టుకుని అటు ఇటు వూపుతూ చంపినంత పనిచేసాడు.

"కృతఘ్నుడా" ఇన్నాళ్ళు నాకెందుకు చెప్పలేదు ? వాడు దేవకి సుతుడే కదా!" రెచ్చిపోతున్నాడు. అసహనంతో, అవతలి వ్యక్తి అశక్తతను గమనించి, తన ఆగ్రహాన్ని అదుపు చేసుకోలేకపోతున్నాడు.

ఆ హడావుడికి, అతనిలో మార్పు వచ్చింది. కళ్ళు విశాలమయ్యాయి. అతని శరీరంలోనె తెలియని శక్తి ప్రవేశించింది.

"చెప్పు." ఇన్నాళ్ళు ఎందుకు మోసం చేసావు ?" ఆపుకోలేకపోతున్నాడు. "కృష్ణ" అనేసరికి ఏం శక్తి ప్రవేశించిందో తెలియదు కాని -

పెదవులు కదలుతున్నాయ. చేతులు పైకి లేచాయి. శక్తి కూడగట్టుకున్నాడు. శరీరంలో వింత చలనం. వినూత్న శక్తి ప్రసరించనారంభించింది.

"వ్యాస భగవానుల ఆదేశం నన్ను కట్టి పడేసింది. అతడు భగవంతుడేనట. దైవశాసనం కాదనలేము. ధిక్కరించి ముందుకడుగు వెయ్యలేము."

చావు తెలివితేటలవలె వచ్చిన శక్తితో పై మాటను అన్నాక, అతను తల వెనక్కి వ్రేలాడేసాడు. అంతవరకు చచ్చినట్లున్న ప్రలంబుడు నిజంగా చచ్చిపోయాడు. ఆ దేవరహస్యం అటు ఇటు కాకుండా మధ్యలో ఆగిపోయింది. అతడు "దేవుడే" అన్నాడు కానీ, దేవకి సుతుడేనా ? అర్థం కాని సంశయం -

సందిగ్ధం - పరిస్థితి దిగజారేసరికి, కంసుడు అసహనంగా బయటపడ్డాడు.

తానేదో నిర్ణయం తీసుకున్నట్లు, కంసుడు, యాదవ వంశ ప్రముఖులందరికి, ప్రత్యేక సమావేశానికి రమ్మనమని కబుర్లు పంపాడు. కానీ తన మాటను గౌరవిస్తారా ? ఆదేశాన్ని అమలుపరుస్తారా ? ఇదొక ఆలోచన.

ఇదే సమయంలో, తన వృద్ధమంత్రి ప్రలంబుడు కాలం చేసాడు. ఇదో ఏకాకి దశ. దీంతో మూగిగా, చేయవలసిన కార్యక్రమం, తీసుకోవలసిన జాగ్రత్తలు, బాధ్యతలను గూర్చి తీవ్రంగా ఆలోచించసాగాడు. చేజారిన అధికారం చేజిక్కించుకోవాలి ? ఎలాగన్నది ప్రస్తుత మీమాంశ, ప్రశ్న. ఈ సమయంలోనే మరొక దురాలోచన, బుద్ధికి చెదపురుగై కూర్చుంది. దొలచడం ప్రారంభించింది.

ఇలాగ అనవసరంగా ఆలోచిస్తూ కూర్చునేకన్న, సమయ సందర్భాలను బట్టి, యదువంశ ప్రముఖులతో పాటు, ఆ"నంద" కుమారుని కూడా చంపేస్తే... అది సులువు, సాధ్యం కాకపోయినా, ఆలోచన మాత్రం అగ్నిపర్వతంలాగ, మనసును కుతకుత వుడికిస్తూ, ఆలోచింప చేస్తుంది.

ఇంకా కార్యక్రమాలు పక్షంరోజులు వుండగానే, నాలుగు దినాలు ముందుగా యాదవాధీశునిగా కంసుడు, "ధనుర్యాగ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వీరులందరు, ప్రాంతీయాధిపతులు, ఇతర ప్రముఖులు తప్పక ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని చాటింపులు, ప్రకటనలు వేయించారు. ఈ సాంస్కృతికోత్సవాలు వారంరోజులు జరుగుతాయని, ఇందులో మల్లయుద్ధాలు, యుద్ధ విన్యాసాలు, ఏనుగుల పోరాటాలు, విందులు - ఇతర వినోదాలు ఎన్నో వున్నాయని ప్రకటించారు.

జరిగేదంతా బాగుంది కానీ, కంసుని ముఖ్య నమ్మినబంటు, సర్వసైన్యాధ్యక్షుడు మాత్రం అంతరంగంలో విపరీతంగా మనస్తాపం చెందుతున్నాడు. మహారాజు ఆదేశాలను అమలుపరచడంలో, రాజు మనస్సు తెలుసుకుని ప్రవర్తించడంలో ఎంతో చురుకైన పాత్రను ఎన్నో సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించిన - ప్రద్యోతుడు తనను, తన మహారాజు అవమానపరచినట్లు తలుస్తున్నాడు.

అంతటి వీరవిక్రముని, ఆంతరంగికుని కేవలం ధనుర్యాగ కార్యక్రమాల పర్యవేక్షణకు ఉపయోగించుకుంటూ అతనిపైగల ఉదాసీనతను ఈ రకంగా

నిరాదరణగా ప్రదర్శించాడు. ఇంకా చెప్పాలంటే, నీతో నాకు పనిలేదని ఆ సర్వసైన్యాధ్యక్షుని త్రోసి రాజన్నట్లే. “వృత్రిఘ్న” అనే కంసుని ముద్దులరాణి, సోదరుని, మగధ రాజ్య యువరాణిని, రాజభవనం యొక్క సర్వ సంరక్షణాధికార బాధ్యతల నివ్వడమంటే... ప్రద్యోతుని పరువు గంగలో కలిసినట్లు. అతనొక కీలకవ్యక్తి శక్తి పదవినుండి కలుపుమొక్క స్థాయికి దింపి, ఏరి పారవేయడం అతనికెంతో తీరని తీవ్ర మనస్తాపాన్ని కలుగచేసింది.

ప్రద్యోతుడు తీవ్ర అసహనానికి మనస్తాపానికి గురయ్యాడు. కంసుని చెంత తన చరిత్ర ముగిసిపోయిందనుకున్నాడు. తన జీవితాన్ని, భార్యాపిల్లలతో సహా కంసునికి అంకితం చేసి, తన యజమాని కంసుని ఆజ్ఞలను ఏ విధమైన పాపభీతి లేకుండా అమలుపరచి, అత్యంత విశ్వాసపాత్రునిగా, నిజమైన సేవకునిగా నిలబడ్డ తననీనాడు ఒక గడ్డిపరకగా ప్రక్కనుంచడం..... అది గాక కూలిదాని ముందు త్రోసిరాజన్నట్లు దానిని నెత్తికెక్కించుకోవడం భరించలేకపోతున్నాడు.

ప్రలంబుడు మాటలనతడు అసలు పట్టించుకోలేదు. తన మహారాజు ఆజ్ఞ ప్రకారం, ప్రలంబుని గుమ్మం ముందు కావలివానిగ నిలబడ్డాడు. అయినా... కంసుడు, ప్రలంబుల మధ్య జరిగిన సంభాషణం యావత్తు తాను వినగలిగాడు. ప్రలంబుని చివరి మాటలు ప్రద్యోతుని తలపై పిడుగుపడ్డట్లయింది. ఇన్ని సం॥లలో ప్రధానమంత్రిగా, రాజ్యసంరక్షకునిగా ప్రలంబుడు, నందరాజు కుమారునిపై ఏ విధమైన చర్య తీసుకోలేదు సరికదా, తనకో అవకాశం కూడా ఇవ్వలేదు. తాను ముందుకురకలేదు. ఇది నిజంగా స్వామిద్రోహం.

ప్రలంబునికి, నందరాజు కుమారునిగా పెరుగుతున్న కంసుడు, దేవకీ వసుదేవుల కుమారుడని, ~~ఈ~~తడు అష్టమగర్భ పుత్రుడు, జగద్రక్షకుడని తెలిసి వుంటుంది. అందుకే అతను ఏ విధమైన చర్య తీసుకోలేదు. ఇప్పుడు అనవసరంగా, ఏ పాపమెరుగని నాకు, ఆ పాపం పాశంలా నా మెడకు చుట్టుకుంది. నన్ను ప్రభుద్రోహిని, అసమర్థుడిని చేసిందని లోలోపల మధనపడిపోతున్నాడు.

ఇప్పుడు మళ్ళీ ప్రద్యోతుని ఆలోచనలు, తన భార్య పూతన వైపు మళ్ళాయి. కృష్ణుడు నిజంగా వసుదేవుని కుమారుడైతే, మరి పూతన దేవకి ఆడపిల్లను కనడం నా కళ్ళారా చూసానందే! అప్పుడు ఇతడు నందుడు కొడుకే అయి వుండాలి తప్ప, వసుదేవుడు కొడుకు కాడు. మరి ప్రలంబుడు, వ్యాసులవారు జగద్రక్షకుడు

పుడతాడన్నారు - అంటే... అతడు నందుడు కొడుకా ? వసుదేవుడుకు, పుట్టిన వారందరు మరణిస్తే, ఈ కొడుకు ఎవరు ? ఎంత బుఱ్ఱ పగులగొట్టుకున్నా, ప్రద్యోతునికి బుఱ్ఱపని చేయడం లేదు. సమాధానం దొరకడం లేదు.

అవునూ... ? దేవకికి పుట్టిన ఆడపిల్ల మహారాజు చేతి నుండి, ఆకాశాని కెగిరి, నిన్ను చంపేవాడు మరొకచోట పుట్టి పెరుగుతున్నాడంది కాబట్టి, అతడు "నంద" కుమారుడేనా ?

అటువంటప్పుడు, దేవకి అష్టమ గర్భ శిశువు బాలుడు కాక ఆడపిల్లయి నప్పుడు, కంసరాజు పసిపిల్లలనందర్నీ చంపెయ్యమంటే... పూతన-నందకుమారుని చంపడానికి సిద్ధపడిందా ? నందకుమారునికి, దేవకీ నందనునికి సంబంధ మేమిటి ? కృష్ణుడు దేవుడనో, దైవాంశ సంభూతుడనో... పూతనకు తెలుసా ?

దేవుడైతే, కోరి, కోరి మృత్యువు కొని తెచ్చుకుంటుందా ? నా కోసం, పిల్లల కోసం, పూతన మృత్యువును నెత్తిన వేసుకుందా ? ఇదంతా మాయ, మహామాయగా వుంది. తల విదిలించి, "బాబోయ్" అనుకున్నాడు. ఈ అయోమయంలో, తానెవరో మరచే స్థితికి, ప్రద్యోతుడు వచ్చేసాడు, ఎంత కాదన్నా ఆలోచనలు ఆగడం లేదు. జోరిగల్లా ముసురుతున్నాయి. చెదపురుగుల్లా బుఱ్ఱను దొలిచేస్తున్నాయి.

ప్రలంబునికి "కృష్ణుడు" భగవంతుడనే విశ్వాసం సుస్థిరమైపోయి వుండాలి. పూతనకు గూడా పై విషయం అర్థమయి వుండాలి. ఇప్పుడు ప్రలంబుని చూపు తెలివితేటలతో కంసునికి గూడా అర్థమైపోయింది. ఇక - ఈ దుష్ట కంసుడు, పాపాలు చేయడమే ఒక పనిగా పెట్టుకున్న ఈ దురాత్ముడు తన ప్రాణం కోసం, కృష్ణుని.... అతన్ని కాదనే యదువీరులను తుదముట్టిస్తాడా ? ఇందులో నేను పాలుపంచుకోవాలా ?

తన స్వంత రక్త సంబంధీకులైన యదువంశాల వారిని కడతేరుస్తాడా ? దీనికి తనను పావుక్రింద వాడుకుంటాడా ? అసలీ యదువీరులను చంపితే అతనికొచ్చే లాభం ?

అతడు నిజానికి యాదవ ప్రభువు. ఏం చేసినా నేను, నా సేవలు కంసుని ముందు నిరర్థకం. మహారాజు యాదవ ప్రభువుగా తన వారందరి - గోత్రీకులు, జ్ఞాతుల - సహకారం తనకు వుందని విర్రవీగుతాడు. ఇలాగసాగే -

ఈ ఆలోచనలకు ముగింపుగా, మహారాజు రమ్మన్నారన్న వార్తతో, కొంత

అసహనానికి లోనయ్యాడు. ఆలోచనలనైతే బలవంతంగా ఆపుకున్నాడు. కానీ, మహారాజును చూడటానికి మాత్రం, మనస్పొప్పడం లేదు. అనవసర అణుకువ వినయ విధేయతలు, వుండి వుండి పిల్లి పంజా విసరినట్లుంటుంది. ప్రద్యోతుని మనసు స్వాధీనంలో లేదు. ఇన్నాళ్ళు అంటే... గత కొలది వారాలుగా ఛీకొట్టి, అవమానించిన ప్రభువులో సౌమ్యం, దయకల్గడం, తాను చేయబోయే దుష్ట-క్రూర, పాప, అవలక్షణాలకు వూతం కోరినట్లుంది.

ఆ వచ్చిన ప్రద్యోతునితో కంసుడు "మిత్రమా! ముందు నువ్వు అక్రూరుల వారిని దర్శించడానికి వెళ్ళు. అలాగే రేపటి సమావేశానికి యాదవ కుల ప్రముఖుల నందరిని రమ్మనమని ఆహ్వానించు.

"అందరినా... ?" ఆ వచ్చిన ప్రద్యోతుడడిగాడు.

"ఆ.... అందరినీ....! వారందరితో మాట్లాడి, ప్రశాంత వాతావరణ మేర్పడటానికి నా వంతు కృషి చేస్తాను. మరచిపోకు. అందరు వచ్చేటట్లు చూడాలి, ఇది నీ బాధ్యత. అందర్ని నువ్వు చూసుకో. అలాగే ఈ సమావేశానికి పరమపూజ్యులు మా నాన్నగారు కూడా వస్తారు.

ఆ మాటలు వినడంతో "తమ ఆజ్ఞ" అన్నాడు "నేను కూడానా... ? ఎందుకైనా మంచిదని, ప్రద్యోతుడడిగాడు.

"నువ్వు... ఆ... నువ్వు కూడా వుండాలి. నువ్వు లేకుండా ఎట్లాగ ?" - ఆ మాయమాటలు తేనెపూసిన కత్తి వంటి కంసుని మాటలకు, మనసులోనే అసహ్యించుకున్నాడు. తన భావాలు బయటపడకుండా... జాగ్రత్తపడ్డాడు.

"తమ ఆదేశం మహారాజా" అన్నాడు. అయినా, ఈ మధ్య కాల పరిస్థితులు ప్రద్యోతుని బాధిస్తుంటే..." అయితే ఈ సమయంలో రాజభవన సంరక్షణ బాధ్యతలను నేను చేపట్టాలి కదా ?" అన్నాడు.

"నీకెందుకా బాధ. యువరాజు వృత్రఘ్నుడు... ఆ పనులు చూసుకుంటాడు. నీకు..."

ఇక మహారాజు మాటలు వినడమిష్టంలేని ప్రద్యోతుడు "మీ చిత్తం మహారాజా!" అన్నాడు. ఆ తదుపరి కంసుడు వృష్ణి వంశీయుడైన అక్రూరుని మనోభావాలు, ఆయన సందేశము జాగ్రత్తగా తెలుసుకుని నాకు చెప్పాలి." అంటాడు. అసలీరాజు అంతుబట్టని అంతరంగం అర్థం చేసుకోవడం కష్టంగా

వుంది. అసలీయన వుద్దేశం. "యాదవ వంశస్థులందరు కంసుడంటేనే అసహ్యించుకుంటున్నారు." అనే కన్న, అనుక్షణం అసహ్యించుకునే కంసుడు, అనివార్య పరిస్థితులలో వారి నాహ్వానిస్తున్నాడనుకున్నాడు.

గూఢచారులనందరిని ఏకంచేసి, రాజభవన రహస్యాలన్నింటిని వీలయినంత సేకరించాడు. తన రాకను గూర్చి అక్రూరుల వారికి తెలియబర్చాడు. ప్రద్యోతుని రాక అక్రూరులవారి కాశ్చర్యాన్ని కల్గించింది. అయినా, తగు మర్యాదలతో స్వాగతించాడు. ఉభయకుశలోపరి తదుపరి, వచ్చిన విషయాన్ని సాదరంగా అడిగాడు. ఆ వచ్చిన సైన్యాధిపతి మహారాజు మనసువిప్పి చెప్పాడు. ప్రద్యోతుని మాటల్ని విన్న అక్రూరుడు "ఏవిటీ అకస్మాత్తు పిలుపు. ఇందులోని ఆంతర్యం" అక్రూరుడు అడుగుతున్నాడు.

"నాకూ ఇది ఆశ్చర్యంగానే వుంది. కొద్ది క్షణాల క్రితమే నాకు తెలిసింది. రాజధర్మం, ఒక బంటుగా నిర్వర్తిస్తున్నా" నన్నాడు.

"అవునూ! నిన్ను ధనుర్యాగ పరిరక్షకునిగాను, ఆ మగధీయుడు వృతఘ్నుని రాజభవన సంరక్షకునిగా నియమించారుట, నిజమేనా ?" అక్రూరుడడిగాడు. ప్రద్యోతుడు తలూపాడు. అప్పటి పరిస్థితి అది. ఇటువంటి సచ్చరిత్రుని, నేరస్థునిగా తలచి, ఈయనను మోసగించాలని మా ప్రభువు తలుస్తున్నాడు. ఔరా ? ఎంతటి విపరీతమనుకున్నాడు ప్రద్యోతుడు.

"మేమంటే .... అదే...... యదువంశ ప్రముఖులంటే, మీ మహారాజుకు తమ దిగ్విజయ యాత్ర నుండి వచ్చినప్పటి నుండి చాలా కోపంగా వుందిట. నిజమేనా ?" పెద్దాయన అక్రూరుడు - అడుగుతున్నాడు.

నిజానికి ఆయన కోపంగానే వున్నాడు. ఇవ్వాళ మాత్రం ఎంతో ప్రేమాదరాలతో మిమ్మల్ని దర్శించి, అందరిని రమ్మనమని, ఆహ్వానించమన్నారన్నాడు.

"ఎందుకు ?" తుఫాను ముందటి ప్రశాంతిని తలచుకుని అక్రూరుడడిగాడు.

"నాకేం తెలుస్తుందండి ? నాకేం తెలియదు!" ఆ మాటలోనే ఏదో తేడా వుంది. ఆ ధర్మాత్ముడు అక్రూరుడు నిజం గ్రహించడానికన్నట్లు ప్రద్యోతుని కళ్ళలోకి చూసాడు. అతన్ని దెబ్బతిన్న అభిమానధనునిగా తలిచాడు. క్షణమాగి మమ్మల్ని పిలిపించడంలోని ఆంతర్యం నీకు తెలుసుంటుంది ? నీవంటి

ఆంతరంగికుడు, ఆప్పుడు కంసునికి మరెవ్వరున్నారు ? - అన్న అక్రూరుడు -

"అవును, ప్రద్యోతా! నిజంగా మీ రాజు మాతో స్నేహాన్ని వాంఛిస్తున్నాడా ? లేక వంచన చేసి మమ్మల్ని దెబ్బతీయాలని ఎత్తులు వేస్తున్నాడా ? ఎందుకంటే మీ రాజు అంతటి విశ్వసనీయుడు, విమల పురుషుడు కాడు! అందుకని మా ఆలోచన!'' తన అనుమానాన్ని, తమ అనుమానంగా ఆ యదు "వృష్ణి'' ప్రముఖుడు అడిగాడు.

ఈ సాధుపురుషుని ప్రశ్నకు ప్రద్యోతుడు తడబడుతున్నాడు. ఎందరో మెచ్చి గౌరవించే అక్రూరుని, ప్రలంబుడు మాటల్తో పూజనీయుని ముఖంలోకి చూడాలన్నా, అబద్ధం చెప్పాలన్నా ప్రద్యోతునికి ఇబ్బందిగానే వుంది.

"నేనేం చెప్పగల్గుతాను. ఆయన రాజు.... మీ అందరు కలివిడిగా వుండాలని నన్ను పంపించింది. తీరా వచ్చాక ఏమన్నా మనసు మారితే... ఏమో! నేనేం చెప్పగలను ? నాకేం తెలుస్తుంది ?'' ఎంతో వినయంగా, తన అశక్తతను తెలియబరుస్తూ చెప్పాడు.

"అయితే, మాకేదైనా అపకారమో.... లేక దుర్బుద్ధితోనో పిలిపిస్తున్నారన్నది నీ అనుమానమా ?

ఎటు చెప్పలేని విధంగా తలూపాడు.

అదే క్షణంలో - మధురమైనది. అదొక రకంగా వున్న దివ్యస్వరం వినబడింది.. మీరు వస్తున్నారా ... గర్గాచార్య...!? అని ఆ ప్రశ్న ఆగిపోయింది. ప్రద్యోతుడు కళ్ళు మూసుకుని, ఆ సమయానికి తటస్థ విధానమవలంబిస్తున్నట్లు ప్రద్యోతుడు ఆ స్త్రీ మూర్తిని చూసాడు. మూప్పై సం॥లు దాటి వున్న ఆ ఇల్లాలు, మరెవ్వరో కాదు. దేవకీ యువరాణి వారు.

అతి చిన్నవయస్సులో తెల్లజుట్టుతో పెద్దావిడలాగ తయారయింది. కన్నీటి చారికలతో, విషాదమూర్తివలె కనుపించే ఆమె, ప్రద్యోతుని చూస్తూనే మాటల్ని మధ్యలో త్రుంచేసింది. భయపడినట్లయిపోయింది. ఆమెను చూస్తూ, అక్రూరులు-

"రా. తల్లి, ఇతడు ప్రద్యోతుడు. మన అంధకరాజు... కంసుని సేనాపతి'' అన్నారు. అక్రూరుని మాటలతో దేవకి ముందుకడుగు వేసిందే తప్ప, ఈతనిని చూసినట్లనిపించలేదు. పాలిపోయిన మొహం, అదిరే పెదవులతో, తల ఆడించి, చేతుల్ని తలపై వుంచి నిలబడింది. ఆ సమయంలో ఆమెను చూస్తే, ఏ క్షణంలోనైనా ఆమె

తూలి క్రింద పడిపోతుందేమోనన్న బలహీనంగా, నీరసంగా వుంది.

ప్రద్యోతునికి కూడా, దేవకి యువరాణి వార్ని చూడగానే ఒక్కసారి నీరసించి పోయాడు. అప్పుడు గతమంతా జ్ఞప్తికి వచ్చింది. "ఈమె యువరాణీ దేవకీదేవి. ఈమెను వూరేగింపుగా సాగే రథం నుండి, మీ మహారాజు జుట్టుపట్టిలాగి క్రింద పడేసాడు. ఇక ఆమె కన్న... ఆమె సంతానాన్ని, ఒకరి తర్వాత మరొకర్ని, పుట్టిన వారిని పుట్టినట్లు, ఆనాటి యువరాజు, నేటి సర్వాధికారి కంసుడు, కిరాతంగా చంపి శిశుహత్యా పాపం మూటగట్టుకున్నాడు.

ఇప్పుడింకా దేవకి సంతానమని... ఒక్కొక్క సంఘటనే జ్ఞప్తికి వస్తుంది. దేవకిదేవిని సరాసరి తలెత్తి చూడలేక నేలచూపులు చూస్తూ రెండు చేతులు జోడించి నమస్కరించాడు. పరిస్థితిని గమనిస్తున్న అక్రూరులువారు "అమ్మా! ఈ ప్రద్యోతునిని పంపి నేను వస్తాను." నువ్వెళ్ళమన్నట్లు తెలిపారు." అలాగే అని హీనస్వరంతో, కన్నీళ్ళు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళింది.

ప్రద్యోతుని పరిస్థితి చాలా దయనీయంగా తయారయింది. గతం నీడలా వెన్నంటుతూంటే, వర్తమానంతో కలువలేక గతాన్ని వీడలేక, అక్రూరులను చూడాలన్నా వారితో మాట్లాడాలన్నా అశక్తుడయ్యాడు. దీనికి తగ్గట్లు యువరాణి దేవకీదేవి వింత ప్రవర్తన బంగారు బొమ్మను పిల్లవానిగా తలంచి, రాత్రింబవళ్ళు తేడా లేకుండా ఆరాధించడం, ప్రేమగా ఆదరించడం, లాలించడం, పాలు పట్టడం, బట్టలు తొడగడం. లాలిపాటలు, జోలపాటలతో సముదాయించడం వింటున్నాడు.

అంతా చిత్రంగా వుంది. అంతకుమించి ఆమె పాడే పాటల్లో లాలనలో ఏదో ఒక వింత, గూడార్థం కనబడుతుంది. ఆమె పాటలు, లాలన... అన్నీ, పదహారు సం॥ల క్రిందట తాను పోగొట్టుకున్న, నందకుమారునిగా అదే సమయంలో జన్మించిన లీలామానుష విగ్రహుని గూర్చి పాడుతున్నట్లనిపిస్తుంది. ఈ ఆలోచన ప్రద్యోతుని హెచ్చరించింది.

"పరమ మూర్ఖుడా, క్రూరుడా!" నీ ఆలోచనలు, కంసరాజును పురిగొల్పి, అతి తొందరగా, దేవకీనందనునిగా తలచి, యశోదా-నంద, నందనునికి ప్రాణహాని తెచ్చేటట్లుంది. నీ ఆలోచన తప్పని, ఆతని మనస్సే, అతనిని - ప్రద్యోతుని హెచ్చరించింది. సత్పురుషుడు, ధర్మమూర్తియైన అక్రూరులవారు,

ప్రద్యోతుని మనస్సులో జరిగే సంఘర్షణను గుర్తించగలిగారు.

అతన్ని మామూలు స్థితికి తీసుకురావాలనే తలంపుతో, అక్రూరులవారు "ప్రద్యోతా! వసుదేవుడుని సందర్శించి, మీ రాజశాసనాన్ని, స్వయంగా వెల్లడిస్తావా ? నువ్వు ఆహ్వానిస్తేనే బాగుంటుంది" విషయాన్ని వివరించి చెప్పాడు.

"అమ్మో! నేను వారిని కలువలేను. కలిసి, ఈ విషయాన్ని చెప్పే ధైర్యము నాకు లేదు. దయచేసి నన్ను విడిచిపెట్టండి" ప్రద్యోతుడు, అక్రూరులవారిని ప్రార్థిస్తున్నాడు.

"నువ్వీ పేరుతో అక్కడికి వచ్చావనుకో. దేవకీదేవి పూజించే, ఆ దైవాన్ని కూడా దర్శించవచ్చును. అతన్ని ప్రశాంతపర్చాలని అక్రూరులవారు తలుస్తున్నారు.

"వద్దు. నేనా తల్లిని మళ్ళీ చూడలేను. నాకా ధైర్యం లేదు. దయచేసి నన్ను విడిచిపెట్టండి. రెండు చేతులు జోడించి, ఎంతో అమాయక, వినయ విధేయతలతో ప్రద్యోతుడు ప్రార్థిస్తున్నాడు. నేను పాపాత్ముడను. పాపాత్ములు, పుణ్యమూర్తుల దర్శనం చెయ్యలేరు. వారి కరుణా కటాక్షాలు పొందలేరు. తప్పు చేసానన్న భయం, వారిని సర్వదా పీడిస్తుంటే, వారా పుణ్యమూర్తులను దర్శించలేరు. దయనర్థించలేరు.

"పిచ్చివాడా! ఆమె అనురాగమయి, కరుణామూర్తి. నీ పశ్చాత్తాపమే నిన్ను పరిశుద్ధుడిని చేసింది. తప్పక యువరాణి దేవకీదేవి నిన్ను క్షమిస్తుంది. ఆందోళన పడకు. అతని వీపు తట్టుతూ, భయాన్ని పోగొడ్తున్నారు. అంటే - అభయాన్ని అక్రూరులవారు ప్రసాదిస్తున్నారు.

"మీరు మహానుభావులు. మిమ్ములను దర్శించగల్గడం నా అదృష్టం. దయచేసి నాకు అనుజ్ఞనివ్వండి."

"తప్పక వెడుదువుగాని. ముందు ఆందోళనను విడిచి కొద్దిసేపు ప్రశాంతత పొందు. ఆ తర్వాత నీ యిష్ట ప్రకారం చేద్దువుగాని" అక్రూరులు సూచించారు. వారే, మరో విషయం మంచికాని, చెడుకాని ప్రతివారికి ఒక సమయమొస్తుంది. అప్పుడు కాగల కార్యాలన్ని అనాయాసంగా, అప్రయత్నంగా జరిగిపోతాయి. అలాగే

భగవంతుని కరుణ కూడా, మనకు తెలియకుండానే మనమీద ప్రసరిస్తుంది. ప్రస్తుతం నీకదే కలిగింది. ధన్యుడవన్నారు.

ప్రద్యోతుడు లేచాడు. వంగి నమస్కరించాడు. ద్వారంపైపు అడుగు వేస్తున్నాడు. అక్రూరులవారు "ప్రద్యోతా! అదృష్టం వరించినప్పుడు, అందుకోవాలి తప్ప, దానిని త్రోసి రాజనడం తగదు. ఈ సత్యాన్ని మానవులు అర్థం చేసుకోలేరు.'' అంటూ ప్రద్యోతునితో కలిసి గుమ్మం వరకు అనుసరించాడు. అప్పుడు - తక్షణం వెనుదిరిగి -

"అక్రూరా! భగవంతుని కరుణ నన్ను చేరదు. కారణం నేను సంఘద్రోహిని, పాపాత్ముడిని.' అన్నవాడు అక్రూరుని అదొక రకంగా వింతగా చూసాడు. "వసుదేవుని అష్టమ సంతానం జీవించి వున్నాడు. బృందావనంలో హాయిగా విహరిస్తున్నాడు. అవునా ?'' అంతవరకు ఎంతో పెద్దమనిషిలా ప్రవర్తించిన ప్రద్యోతుడు వున్నట్టుండి, ఈ విధంగా మాట్లాడటం, ఒకవైపు భయాన్ని, మరొకవైపు ఆశ్చర్యాన్ని కల్గించింది.

''ఈ సంగతి నీకెలా తెలుసు ? నీకెవరు చెప్పారు'' రహస్యం బట్టబయలైనట్లు అక్రూరుడు తలంచాడు.

"ఇంకెవరు, ఆ ప్రలంబుడే. తన చివరి క్షణాల్లో కంసరాజుకు చెప్పాడు. "అలాగా...!" ఒక్కసారి గుండాగినట్లయింది. పరిస్థితిని గమనించాడు. ఏ ఒక్కరు తన మాట వినేటట్లు లేరు. భయపడకండి. అతన్నెవరు ఏమీ చెయ్యలేరు. అతడు అవతారపురుషుడు, జగద్రక్షకుడని ప్రలంబుడు చెప్పాడు. కనుక భయపడకండి. వూపిరి బిగపెట్టుకుని ప్రద్యోతుడు చెప్పవలసింది చెప్పి, అక్కడనుండి కదిలాడు.

# ధనుర్యాగం

ఇరవై అయిదు సం॥ల తన పరిపాలనా కాలంలో కంసుడు ఏనాడు, యదువంశ

ప్రముఖులను పిలిపించలేదు. వారితో ఏ విధమైన సంప్రదింపులు జరుపలేదు. ఉగ్రసేనులు వారు మాత్రం, తరచు వీరందర్ని రప్పించడం ఆ యదువంశాల ప్రముఖులతో, అధికార - అనధికార చర్యలు జరుపడం చేస్తూండేవారు.

ఈ అర్థాంతర పిలుపు, అందరిలో ఆందోళనతోపాటు, ప్రతి ఒక్కరిని ఆలోచింపచేసింది. అయినా తమ ఆలోచనలను ఓ ప్రక్కనపెట్టి యదువంశాలకు పెద్దలైన, అక్రూర - వసుదేవులతో చర్చించి, ఆ తదుపరి నిర్ణయాలు, పెద్దలభీష్టం మేరకు తీసుకోవాలనుకున్నారు. ఎందుకంటే కంసునిలో మంచి బుద్ధులకన్న, దుష్టబుద్ధి ఆలోచనలే ఎక్కువ. ఇంతకుమించి కంసరాజు, అశ్వమేధం - యాగాశ్వ రక్షణం పేరిట మధురలో లేకపోవడం, పాలనా పగ్గాలు చేపట్టిన, ప్రలంబ- ప్రద్యోతులు వంటివారు, ఉదాసీనత వహించడంతో, యదువంశవీరులు, నాయకులయ్యారు.

తమ ప్రాతినిధ్యాన్ని చాటుకుంటూ, స్వతంత్ర పాలకులుగా చెలామణి అవుతున్నారు. ఇది కంసునికి నచ్చని విషయం. అతని కోపానికి కారణం. తిరిగి వచ్చాక, మరికొన్ని రాజ్యాలను అరణంగా పొంది, తన సార్వభౌమాధికారత్వాన్ని నిలుపుకుంటూ, "చక్రవర్తి"గా చలామణీ కావాలన్న ఆలోచనతో వున్న కంసునికి, యదువంశ నాయకుల ధిక్కార ధోరణి.... అనే కన్న... స్వతంత్ర పాలనా వ్యవస్థ... అడ్డుకట్టవేసినట్లయింది.

అందుకే ఈ "ధనుర్యాగ" జైత్రయాత్రా కార్యక్రమం రూపొందించబడింది. ఇది సరదాగా సాగే కార్యక్రమం కాదు. రక్తాన్ని పారించే కార్యక్రమం. వీరులు, వీరమల్లులు, విజయం కోసం త్రాగడం, తినడం, తందనాలాడటం, చచ్చేటట్లు కొట్టుకోవడం... అరాచక పరిస్థితులేర్పడటం, ప్రభు సేవలకై, ఆయన సంతోషానికై పరితపించడం జరుగుతుందే తప్ప, అక్కడ నిజమైన క్రీడావినోదం, విజయం దొరకదు.

కంసుని ఆలోచనలు, మధురలోని పరిస్థితులు, అన్నీ అస్తవ్యస్తంగా వున్నాయి. సర్వ సైన్యాధ్యక్షుడు ప్రద్యోతుని కాదని, మగధ యువరాజు వృతిఘ్నుడు, రాజ్య సంరక్షణా బాధ్యతలను చేపట్టాడు. పగ్గాలు లేని ప్రద్యోతుడు వార్తాహరుడయ్యాడు. ఈ కంసరాజు ఏదో దుష్టపన్నాగంతోనే, ఈ పిలుపును మొదలుపెట్టాడు. కనుక సర్వదా, సర్వత్రా జాగ్రత్తగా వుండాలనుకుంటున్నారందరు.

మొత్తానికి పెద్దలందరు చర్చించుకుని, అవసరమైతే కంసుని ధిక్కరించ డానికి గూడా సిద్ధపడి మధురకు వెళ్ళాలని తలచారు. అనుకున్న ప్రకారం అందరు, తమ తమ అనుచరులతో, తగు భద్రతతో మధురకు వెళ్ళారు. అయితే ఆ కోట మగధ వీరులతో దుర్భేద్యంగా వుంది. దాంతో ఈ కోట దాటడం కష్టమన్నంత ఆలోచన వారిలో ప్రతి ఒక్కరిలో కల్గింది.

మహారాజు ఉగ్రసేనులవారు, ఈ సభా భవనానికి వస్తారో, లేదో తెలియదు. వారు సకల వసతులు కల, గృహ నిర్బంధంలో వున్నారు. ఏం కావాలసినా వారికక్కడ లభిస్తుంది కానీ, వారా భవంతిని దాటి బైటకు అడుగు మాత్రం పెట్టలేరు. ప్రపంచం, ప్రజల ముఖం తెలియదు. ఎంతసేపు అక్కడి పరిచారకులు, ఆ భవంతిలోని వస్తు సామాగ్రి మాత్రమే ఆయనను పలుకరించాలి. పరవశింప చెయ్యాలి.

అటువంటి మహారాజు కంసుని సింహాసనం ప్రక్కన కూర్చున్నారు. చూపులు నిశ్చలం. శరీరం కంపిస్తుంది కానీ, కదిలే బొమ్మలా కూర్చుండిపోయారు.

ఉగ్రసేనుల వారి ప్రక్కన, అంధక వంశీయుడైన బాహుకుల వారున్నారు. వారికి ప్రస్తుతం తొంభై సం॥ల వయస్సు. ఆయన ప్రద్యోతుని తండ్రి. ఉగ్రసేనుల వారి దాయాది. బాహుకుల వారి ప్రక్కన వసుదేవుడు, కంస యువరాజుకు మరొక ప్రక్కన ఉగ్రసేనుని సోదరుడు దేవకుడు. ఆ ప్రక్క మహాత్ముడు అక్రూరులవారు. యదువంశ ప్రముఖులకు ప్రస్తుతం అక్రూరులవారే దిక్కు. వారి తెలివితేటలే, ఈ యదు వంశ ప్రముఖులను సంరక్షించగలిగేది.

ప్రద్యోతుడు, అక్రూరుల వారికి ప్రక్కన మౌనంగా కూర్చున్నాడు. అందర్ని చూస్తున్నాడు. విధిలేక వచ్చిన వీరప్రముఖులు, యదువంశ ప్రముఖులని కూడా ప్రద్యోతుడు గుర్తించాడు. కంసుని ఇద్దరు సోదరులు ప్రక్కన నిల్చుంటే మరో ఇద్దరు కంసుని అంగరక్షకుల వలెనే వెనుక నిల్చున్నారు. కంసరాజును చూసుకోవడం వారికి ధర్మంగా ఆదేశించి, నిర్ధారించబడింది.

మిగిలినవారు యధాప్రకారం తమ ఆయుధసంపత్తితో సాయుధులై కాపలా కాస్తున్నారు. ఎటువంటి పరిణామాన్నైనా ఎదుర్కొనే స్థితిలో వారున్నారు. అయినా కంసుడు తన మనసును బయటపడనీయక, అందరినీ ఎంతో ప్రేమగా చూసాడు.

ఒక్కొక్కరినీ, మరింత ప్రేమతో వారి ఉభయకుశలోపరిలు కనుక్కుంటున్నాడు.

కంసుని ప్రవర్తనకు అందరూ ఆశ్చర్యపోతున్న తరుణంలో, అందర్నీ మరింత ఆశ్చర్యపరుస్తూ - రెండు చేతులు జోడించి, తండ్రి ఉగ్రసేనుల వార్నీ దర్శించి, "పూజ్యతండ్రీ!" "పరమపూజ్య" అంటూ కులపెద్ద బాహుకులవారిని అలాగే సోదరులారా! తన సోదరులనూ, పెద్దలను... అంటూ పేరు పేరున పిలిచి వందనాలర్పించాడు. ధనుర్యాగ కార్యక్రమంలో పాల్గొనమని మిమ్ములనందరిని ఆహ్వానిస్తున్నాను. ఇందులో పాల్గొనమని కోరుతున్నాను....!" అన్న కంసుడు -

"అందరికి తెలుసు. నేను, నా బలపరాక్రమాలతో యాదవ సంస్థానాలను ఏకత్రాటిని నిల్పి, యాదవ మహాసామ్రాజ్యాన్ని రూపొందించాను. దీనికి మధుర అధిపతి. మధురాధిపతులు చక్రవర్తులు. కాబట్టి మీరందరు ఈ ధనుర్యాగాన్ని విజయవంతమొనరించు విధంగా సహకరించమని కోరుతున్నాను" అన్నాడు.

అందరు విన్నారు. ఏ ఒక్కరు ఔననలేదు, కాదనలేదు. ఈ ప్రారంభంలో, కంసుని వినయ ప్రవర్తనలో ఏదో ఆంతర్యముండి వుంటుంది. తెలివిగా ఉచ్చులోకి దించుతున్నాడనుకుంటున్నారు.

"ఇంకా, ఈ మహాయాగ కార్యక్రమం ప్రారంభమవడానికి కేవలం వారం దినాలే సమయముంది." అందుకున్నాడు కంసుడు. మళ్ళీ తన విధానాన్ని - విధానంగా చెబుతున్నాడు. విధిలేక ఆహూతులైన ఆ వీరవర్యులు వింటున్నారు.

"తారాకాంతులతో, అప్సరసలను మించిన భామినుల సంగీత నృత్య వాయిద్యాలతో, విన్నవారు వెఱగు పడేటట్లు, కన్నవాళ్ళ కన్నులు మనసు దిగ్భ్రమ చెందేటట్లు నిర్వర్తించాలి. అంతేకాదు - అంతా క్రమశిక్షణతో, సైనిక విన్యాసాలు, మల్లుల వీరవిక్రమ ప్రజ్ఞాపాటవ ప్రదర్శనలతో" నభూతో నభవిష్యతి" అన్న విధంగా కార్యక్రమం తీర్చిదిద్దాలి. ఇతర రాష్ట్రాల నుండి కూడా వీరవర్యులు వస్తారు. ప్రదర్శన లిస్తారు. ఈ కంసుని కాదనేవారు లేరు -

మరొక్క విషయం. ధనుర్యాగం నిమిత్తం పవిత్ర ధనస్సును రూపొం దించాలి. దానిని ఎక్కుపెట్టి తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించే వీరవర్యుడు, శూరుడు మహావీరుడుగా కేవలం గుర్తించబడటం కాదు. సకల విధాలైన

మర్యాదలు, గౌరవాదులు అనాయాసంగా పొందుతాడు.

కంసుడు చెబుతున్నాడు. సభికులు వింటున్నారు. కంసుని పరిచారిక సేవాజనం, తలలూపుతూ, సర్వసమ్మతాదేశంగా, కంసాజ్ఞను గుర్తిస్తూ శిరసువంచి, వందనాలర్పిస్తున్నారు. కంసుని వాగ్ధాటి కొనసాగుతుంది.

ఆ ధనుర్యాగ ధనస్సు సామాన్యమైనది కాదు. అతి రథ, మహారథులే తేరిపార చూడరాని విధంగా శత్రుదుర్భేద్యంగా, వీరశుల్క స్వరూపంగా వుంటుంది. సామాన్య వీరులు దాని దరిదాపులకు చేరలేరు. ఉత్సవాల ప్రారంభసూచకంగా యాదవవీర యువకుల, వీరత్వాన్ని - వారి నైపుణ్యాన్ని, కనులారా చూడాలను కుంటున్నాను. వీరవర్యులకు మనకు కొదవలేదని సంతృప్తి పడదలిచాను.

మనవాళ్ళు తక్కువకారు. మనలో ఎందరో వీరులు, శూరులు, ప్రతిభావంతులు, మహామహులు వున్నారు. అది మనకు కేవలం గర్వకారణం కారాదు. అది సుస్థిరం, శాశ్వతం కావాలి. చాణూర ముష్టికులు చెప్పుకోదగ్గ ప్రతిభావంతులు, ఎన్నదగిన వారు. వారిని చూసి గర్వపడాలని కాదు నేను చెప్పేది మనం వారిని మించి ఎదగాలని అందుకు ప్రతి ఒక్క యదుకుల యువకుడు పరిశ్రమించాలి. తన ప్రతిభా పాటవాలకు మెరుగుపెట్టుకుని - జగజట్టిలైన మొనగాళ్ళు కావాలి. చెబుతున్న కంసుని ఆర్తిని ఆకాంక్షను ప్రస్తుతిస్తున్నట్లు, అక్రూరుడు -

"సత్యం మహారాజా! మీ నమ్మకం వమ్ముకాదు. మన యువకులు యదువీరుల శౌర్య పరాక్రమాలకు, ప్రజ్ఞాపాటవాలకు దీటుగా నిలచి ఎంతటి వారికైనా తగు సమాధానమిస్తారు. వారి ప్రజ్ఞ - వీర- శూర విన్యాసాలను చూసి, గుర్తించి, మీరే పొంగిపోతారు. ఇంతటి ఘనులున్నారా ? అని విస్తుకూడా పోతారన్నాడు. ఆ మాటలకు క్షణకాలం నిజంగానే, కంసుడు నివ్వెరపోయాడు. తక్షణం తేరుకుని, "అవునవును. వృష్ణివీరుల ప్రతాపం లోకవిదితం, పరమపూజ్యం. మనవాళ్ళు అంతటి ఘనులే." అన్న కంసునితో -

"మహాప్రభూ! వృష్ణివీరుల వీరత్వం జగమెరిగిన సత్యం. మన పూర్వీకులు, వారి శక్తి సామర్థ్యాలు, శతృభేదన వ్యూహం, సర్వం మీకు తెలియనిది కాదు. ఈ సమయంలో పెద్దలను, పూజ్యులను గౌరవించే వంశస్థులుగా మనం, మన మహారాజును, ఈ మహోత్సవాధ్యక్షునిగా నిలుపుకుని, వారి పర్యవేక్షణ శిక్షణలో, ఈ మహాయాగ కార్యక్రమ మహోత్సవాన్ని మహాసంరంభంగా పంబరంగా

చేసుకుందామన్నాడు - అక్రూరుడు.

"తప్పక మమ్మనుగ్రహిస్తారు కదా మహారాజా!" వేడికోలుగా అక్రూరుడు అడిగాడు. పేరుకు పెద్దగా సభకు కంసుని అనుమతితో అతిథిగా వచ్చిన ఉగ్రసేనుడు, నిస్సహాయంగా చూసాడు. "కంసాజ్ఞ" అన్నట్లు, కుమార యువరాజు" "రాజును" చూసాడు. అంతా గమనిస్తున్న కంసుడు.

ఇక అప్పటి పరిస్థితికి తలఒగ్గదలచినట్లు "నిజం, నిజం, అక్రూరా! నీ మాట నిజం. తప్పక మన మహారాజు, మా పితృదేవులు ఉగ్రసేనులవారు, తప్పక ఈ మహాయాగంలో పాల్గొంటారు. సజావుగా నిర్వహిస్తారు. వారి ఆశీస్సులు మనకు పుష్కలంగా వుంటాయి." చెప్పాడు. అయినా అంతా శ్లేష -వ్యంగ్యం. అంతటితో సభ పూర్తయిందనుకున్నాడు. కాని ఆ తదుపరి కార్యక్రమం ఎవ్వరికి తెలియదు. ఈ వ్యవహారం జరుగుతూనే వుంది. కంసునికి దూరంగా సాయుధుడై నిల్చిన మగధ యువరాజు అక్కడనుండి వెళ్ళిపోయాడు.

అక్రూరుడు మాత్రం కంసుని నైజాన్ని నమ్మలేక ఏ క్షణంలో ఏం పిడుగు పడుతుందో, ప్రళయం వస్తుందోనని, అంతరాంతరాళాలలో వులిక్కిపడుతున్నట్లు భయపడుతున్నాడు. వాళ్ళ మనసులలోని భావం బయటికి రాలేదు. ఆలోచన తెగలేదు. నలుమూలల ద్వారాల నుండి మగధవీరులు వచ్చారు. వీరిని నిర్భంధించినట్లు లేదా నిర్బంధం చేసినట్లు చుట్టుముట్టారు. అప్పుడు మగధ యువరాజు కూడా సాయుధుడై వచ్చి కంసునికి కవచమై వెనుక, ప్రద్యోతుని ఇరువురి - సోదరుల ప్రక్కన సాయుధపాణియై నిలబడ్డాడు.

ఆ హఠాత్సంఘటనకు, కంసుని దుష్టప్రవర్తనకు అసహ్యించినట్లు యాదవ ప్రముఖులు తలలు త్రిప్పుకున్నారు. తరగని కోపం ఆరని అగ్నిగుండంగా, యదువీర ప్రముఖులలో ప్రజ్వరిల్లి రగులసాగింది. ఆ క్షణంలో తనదైన పద్ధతిలో కంసుడు వికటాట్టహాసం చేస్తూ "యదువీరులారా! వీరందరు నాకు ఆత్మీయులు నాకు సహజ కవచధారులు. ఎన్నో రకాల నాకు విజయాలు, కీర్తి ప్రతిష్ఠలు కల్గించిన విశ్వాస వీరమూర్తులు. వీరంతా మన ధనుర్యాగ మహోత్సవంలో ముఖ్యపాత్ర వహిస్తారు. విజయలక్ష్మిని మనకు కైవసం చేస్తారు. ఇందులో ముఖ్యంగా వృతఘ్నుడు, మగధ యువరాజు నాకు మహాసేనాని. ఆంతరంగికుడు, ప్రాణప్రియుడు. పన్నెండు సం॥గా

నన్ను అభిమానిస్తూ నాకై పరిశ్రమించే ప్రముఖ విశ్వాసపాత్ర అంతరంగీకుడు.'' అని చెప్పి అందర్నీ తగు ఆసనాలలో కూర్చోమని కంసుడు కోరాడు.

అంతావిన్న అక్రూరుడు "చాలా సంతోషం రాజ, రాజా! ఇంకా మేము చెయ్యగల విషయం వివరించమని కోరాడు. సమాధానంగా రాజు కాని ఆ మహారాజు, రాజు "అక్రూరా! ప్రత్యేకంగా మనవాళ్ళ గురించి చెప్పవలసిన పని లేదు. విధి విధానాలు నిర్దేశించవలసిన అగత్యం లేదు. ఎటొచ్చి, నాకు "వసుదేవుడు'' అంటేనే కోపం ఆ నమ్మకద్రోహి - కృతఘ్నుని...తలచుకుంటేనే ఒళ్ళు కంపరమెక్కుతుంది. నరనరాల్లో తీరని కోపం, ఉడుకు నెత్తురుతో సమానంగా ప్రవహిస్తుంది.'' అన్నాడు. వెంటనే....

"నేనా....!'' అంతటి కృతఘ్నుత నేనేం చేసాను'' అందుకున్నాడు వసుదేవుడు.

"ఏం చేసావా ? విశ్వాస ఘాతకా ? పెద్ద సత్యవంతునిలా ప్రతిజ్ఞను చేసి, ఎనిమిదో గర్భ శిశువును చెరసాల దాటించి, ఆడపిల్లంటూ, ఎవరి పిల్లనో తెచ్చి, నన్ను మోసం చేసిన నిన్ను.... నిన్ను..... ఏమనాలి ?'' కోపంతో వూగిపోతూ గట్టిగా అరిచాడు. నిజమైన శూరవీరుడివి, సత్యసంధుడవని అనుకున్నానే కాని, ఈ రకంగా మోసగాళ్ళకు మోసగాడి వవుతావనుకోలేదు.''

"కంసా.... ఓ ప్రాణమిత్రమా!'' ఏదో చెప్పబోతున్నాడు వసుదేవుడు.

"ష్. అరవకు.'' కంసునిలో అసహనం. రాత్రికి రాత్రి, అష్టమ శిశువును యమునను దాటించి, వ్రేపల్లెలోని ఆ నందుని ఇంట వుంచి, అక్కడ వాళ్ళకు పుట్టిన యశోదా తనయను, నీ పిల్లగా భ్రమింపచేసావు. నన్ను మోసగించావు. మహా సత్య సంధుడవు. వీర క్షత్రియుడవు.'' కటువుగా, ఎంతో వ్యంగ్యంగా పెదవి విరిచి మరీ కంసుడు పలుకుతున్నాడు.

బిత్తరపోతున్న వసుదేవుని, హేళనగా చూస్తూ "నీ కుయ్యుక్తులు, నీచబుద్ధి నాకు తెలియదనుకున్నావు. ఈ కంసుడు అసామాన్యుడని, గత జన్మలో కాలనేమి అనే రాక్షసుడని, అతని శక్తియుక్తులను తెలుసుకోలేక, కోరి కోరి, కొరివితో తల గోక్కున్నావు. కంసుడు అధిక్షేపిస్తున్నాడు. మిగిలిన కంసరాజ వీరులు, ప్రముఖులు నివ్వెరపడి బొమ్మలైపోయారు.

దేవకి అష్టమగర్భం నశించలేదు. నారదుని వాక్కు నిజమయింది. వసుదేవుడు ద్రోహి అయ్యాడు. కంస ముఖ్య పరివార జనం. విచిత్రంగా చూస్తున్నారు. దాంతో వసుదేవుడు కోపాన్నాపుకోలేక, లేచి ఏదో చెప్పబోయాడు. అప్పుడాతని పరిస్థితిని గమనించిన అంథకుడు, చేత్తో అతన్ని వారించాడు. కంసుని చూస్తూ "కంసా, ఉగ్రసేన మహారాజు సుతా! ధన్యుడవు. నీవు నిజంగా వీరుడవు. శూరుడవు. మీరంతా క్షాత్ర ధర్మాన్ని గుర్తు చేసుకున్నారు. గుర్తించి మాకు గుర్తు చేసారు. చాలా సంతోషం."

ఆ మాటలకు కంసుడు ఆశ్చర్యపోయాడు. సభకు వచ్చిన ఆ ముసలి వగ్గు ఈ రకంగా మాట్లాడతాడని కానీ తనను అధిక్షేపిస్తాడని కానీ తలువని కంసుడు - అంథక రాజు బాహుకునికి అడ్డు పడలేకపోయాడు. అది సాంప్రదాయ విరుద్ధం. అయినా కంసుడు సాంప్రదాయబద్ధంగా ఆగలేకపోయాడు. "నేనన్న మాటలలో తప్పేముంది ?! అడిగేశాడు కంసుడు.

"తప్పేమిటి ?" అని అడగడం కాదు, ఉగ్రసేన సుతా! ముందు చెప్పేది విను. ఆ తర్వాత తప్పొప్పుల సమీక్ష. నీ చేతలు సాంప్రదాయబద్ధమైతే, "తండ్రి" అని చూడకుండా, ఒక మహారాజును యదుప్రముఖుడిని నిర్బంధించి, చట్టాన్ని చేతిలోకి తీసుకుని రాజ్యం చేయడం, క్షత్రియ ధర్మమా లేక రాక్షస ధర్మమా ? దీనినే సాంప్రదాయమంటారు ?

తోబుట్టువు దేవకిని పదిమందిలో జుట్టుపట్టుకుని ఈడవడం, ఆమెను బంధించడం, ఇదేం రాచమర్యాద ? బావగారని కూడా శూరసేన ప్రముఖుడైన, ఒక త్యాగమూర్తి, ధర్మమూర్తి వసుదేవుని కాళ్ళ పారాణి ఆరకుండా, పసుపు బట్టల వధూవరులను చెరపట్టడం క్షత్రియ ధర్మమా ? అదేం రాజ సాంప్ర దాయం? ఎప్పుడో, ఏదో జరుగుతుందని, పుట్టిన బొడ్డూడని ఆ పసికందులను పురిట్లోనే చంపడం రాచమర్యాదా ? అదేం ధర్మము ?

"కంసా! చెప్పిన మాటలు దెప్పి పొడుపులు, వెక్కిరింతలు కావు. సహజ నిజాలు, నీ శ్రేయోధర్మాలు. నిదానంగా ఒక్కసారి ఆలోచించు. సత్యం బోధపడుతుంది. ఇక నేనంటావా ? ముసలి, పరిచారకుడను, ఎన్నో ఏళ్ళు బ్రతుకను. ఎంతయినా కొంతకాలం. నాకు ప్రాణభయం లేదు. బ్రతుకుపై ఆశ అసలే లేదు. మరో విషయం. ఇప్పుడే కాదు. ఎప్పుడూ... నిండు వయస్సులో కూడా, మృత్యువుకు భయపడని వీరవర్యుడను. కనుక నేను చెప్పదలచుకున్నది, చెబుతాను. శ్రద్ధగా,

సావధానంగా విను. ఆ తర్వాత, నువ్వు విందామన్నా చెప్పేవాళ్ళు దొరకరు. సరే అసలు విషయానికొద్దాం. నీవు చేసిన క్రూర, ఘాతుక చర్యలు, ఈ యదువంశీయులలో ఏ ఒక్కరు గతంలో చెయ్యలేదు యదు వంశానికి మచ్చగా నిలువలేదు. యదుకులమౌళిగా వుండాల్సిన నీవు, యదుకుల ఘాతివి, ఘాతుడవయ్యావు. అంతా నిశ్శబ్దం. ఒక్కక్షణం వూపిరి పీల్చుకున్న బాహకులవారు, క్షణం తర్వాత -

"అసలు నీవు వసుదేవుని సంతానం గురించి, ఆలోచించడమనవసరం. అతడెక్కడుంటే నీకేం, ఏ చేస్తుంటే నీకేం ? నీవు మంచివాడవైతే నినెవ్వరు - ఎదిరించరు, ధిక్కరించరు, దండించ ముందుకు రారు. కాని నాడు, ఎవరో ఎందుకు ? విసిగిపోయిన ఈ నగర ప్రజలే నీకు తగు గుణపాఠమైన ప్రాణ దండన విధిస్తారు. ఈ కాస్త ఆలోచించే సంయమనం, సహనంలేని నీవు నిజంగా శిక్షార్హుడవు. దండనార్హుడవు.

ఎప్పుడో, ఏదో జరుగుతుందని, అమాయకులు ధర్మబద్ధులైన దేవకి వసుదేవులను నిర్ధాక్షిణ్యంగా బంధించి, నానా ఇబ్బందులకు గురి చేసావు. ఇంక ఈ - ఆగడాలు జరగడానికి వీల్లేదు. నేను నీ శ్రేయోభిలాషిగా, ఇక వీటిని కొనసాగనివ్వను. ఇక ఆ మాటలు.... ఒక్క అక్షరమైన వినదలచుకోలేని కంసుడు ఒక్క క్షణం వులిక్కిపడ్డాడు. మరుక్షణం స్థిరనిశ్చయుడయ్యాడు. చేతులు బిగుసుకున్నాయి. కరవాలాన్ని పట్టింది కుడిచెయ్యి. వెనుకనున్న ప్రద్యోత, వృతఘ్నులను ఓరగంట చూసాడు.

అక్రూరుడు అంతా గమనిస్తున్నాడు. ఆ విషమస్థితిలో, ప్రద్యోతుని చూపులతో చూపులు కల్పిన అక్రూరుడు "రాజనందనా! శాంతం వహించండి. మీరు పాలకులు. మేము పాలితులం. ఆగ్రహం వలదు. స్థిరచిత్తులు, శాంత స్వభావులు, మృదుభాషణులని మనకు పేరు. ఈ కోపం, వర్తమానాన్ని, గతాన్ని కూడా నాశనం చేస్తుంది. భవిష్యత్తుకు పీడాకరంగా తయారవుతుంది. కాస్తంత నా మాట వినండి. మీకు కావల్సింది - వసుదేవుని అష్టమ శిశువు వివరాలు. అవునా ?" అని అడగ్గా, "అవునంటాడు" కంసుడు.

దేవకి అష్టమ గర్భ సంతానం - బాలుడే. అతనెక్కడని అడుగుతావేమో! అతడు బృందావనంలో వున్నాడు. ఇందులో మోసం లేదు. నువ్వు మోసగించ

బడ్డావని తలిస్తే, అది నా వలనే. దైవనిర్ణయంగా భగవన్మాయగా, దేవకీ, యశోదలు చిత్రంగా తారుమారయ్యారు. ఆ సంగతి నాకు తెలుసు. అది నాకు చెప్పలేదే.... అంటే... అది దేవరహస్యం, దైవమాయ, దైవలీల.

ఇంతవరకు ఆత్మరహస్యమైన ఈ సత్యం ఈనాడు దైవలీలగా, సమయం వచ్చినట్లు బయటికి వచ్చింది - ఇది - ఇక - బహిరంగ రహస్యం. నువ్వు మంచివాడవై, దేవకి సంతానం గురించి ఆలోకించకుండా వుంటే ఈ ప్రమాదం లేదు, మాయ జరిగేది కాదు. కావాలని మృత్యువు నెత్తి నెక్కించుకున్నావు. కోరి కోరి మరణాన్ని ఆహ్వానించుకుంటున్నావు.

"అలాగా! నా చావును కోరి, ఆ పిల్లవాడిని సంరక్షించిన, జగద్రక్షకులా - మీరు ? అయితే నంద గోకులంలో పెరిగే ఆ నందకిశోరుడు, ఈ దేవకీ తనయుడన్నమాట. కంసుడు అడుగుతున్నాడు. అక్రూరుడు తలూపాడు. క్షణకాల మాగాడు. కంసుడు తన ముఖంలో చిరునవ్వు పులుముకున్నాడు. మెల్లిగా అక్రూరుని చేరాడు. క్షణంలో శాంతమూర్తిగా మారడం, పెద్ద ప్రళయానికి దారి తీస్తుంది అనుకుంటున్న అక్రూరునితో, కంసుడు -

"జరిగిందేదో జరిగిపోయింది. అన్నీ తెలిసి కొన్ని తప్పులు జరిగినా, అన్నింటిని మరిచాను. నవ్వు. మీరు.... మీరు.... యదువీర ప్రముఖులవైపు చూస్తూ "మరచిపోండి" కంసుడు చెప్పవలసింది, చెప్పినట్లు చెప్పాడు. ఆ వెంటనే "ఇప్పుడతనిని, ఇక్కడ చూడాలనుకుంటున్నాను'' ఉత్పాతంలాగే చెప్పాడు. "ఎందుకు ?'' అనాలోచితం కాకపోయినా, అప్రయత్నంగా, అక్రూరుడడిగేసాడు.

"ఎందుకేమిటి ? ఈ ధనుర్యాగం చూడటానికి వీలుంటే ఇందులో పాల్గొనడానికి. దేవతోత్తముడు, లీలామానుష విగ్రహుడు కదా! ఆతని శూర, వీర, ధైర్య, పరాక్రమ - ప్రజ్ఞాపాటవాలను గమనించడానికి! మరోమాట. అందరు చెప్పుకునేటట్లు, అతడు - దేవుడు, జగద్రక్షకుడు, అవతారపురుషుడైతే, ఆతడు తప్పక, ఈ ధనుర్యాగంలో పాల్గొంటాడు. దీనికి విజయం కల్గిస్తాడు. వీరాధివీరుడై విశ్వవిజేత, విఖ్యాతుడౌతాడు, అవునా ?! సందేహమా ?

కంసుని మాటలకు, అక్రూరుడు బిత్తరపోతాడు. తెలిసి పిలిపించుకుంటూ న్నాడా ? నిజంగా మృత్యువనే, కాలాగ్నిని మూటగట్టుకోబోతున్నాడా ? ఈ

ఆలోచనలు తెగేలోగా, బాహుకుడు "కంసా, తెలిసే మాట్లాడుతున్నావా ? ఎరిగి ఆహ్వానిస్తున్నావా ? ఆతడు బాలుడు.

"అయినా మహానుభావుడు. దేవదేవుడు. ఇందులో వింత, మాయా - మర్మం ఏ మాత్రం లేదు. ఆతని రాక, నీకు సంతోషమే కదా నాన్నా!" అంటూ ఈ - ప్రభువులను ప్రభువుగా కాక, తండ్రిగా సంబోధిస్తూ!" అడిగాడు.

కుమారుడు "నాకు సంతోషం. మీకు కాదా, నాన్నా ?" అన్న మాటలకు మహారాజు ఉగ్రసేనులవారు స్పందిస్తూ "అంతా శివానుగ్రహం. శివుడాజ్ఞ లేనిదే ఏదీ జరుగద"ని, తన భావాన్ని ప్రకటించారు.

ప్రముఖులందరు వింటున్నారు. వీరత్వం మరచి చెవులప్పగించి, అక్రూరుని, ఆక్షేపణీయం కాని పద్ధతిలోని ప్రసంగానికి, మనసులోనే అభినందనలు తెలుపుకుంటున్నారు.

ఆ వెంటనే కంసుడు "అక్రూరా! నువ్వు నాకొక వుపకారం చెయ్యాలి. వెళ్ళు. వెళ్ళి, ఆ దేవకి కుమారుడు కృష్ణుని, అతనికి తోకలా వుండే, ఆ రోహిణీ కొడుకు బలరాముని వెంటనే ఇక్కడకు తోడ్కొని, రా!

వాళ్ళను చూసి సంతోషిస్తాను. ఎదిగిన మేనళ్ళులను, ఆహ్వానించానని చెప్పు. ధనుర్యాగంలో, మల్లయుద్ధంలో, విలువిద్యలలో వారికిష్టమొచ్చిన విధాన పాల్గొనమను. విజేతలై, విశ్వకీర్తిని పొందమన్నానని చెప్పుము. అలాగే నందుని కూడా రమ్మను. వట్టి చేతులతో కాదు, కప్పం తీసుకుని మరీ రమ్మనమను. ఏమంటావు వసుదేవా ? నేను చెప్పే మాటలలో నిజముంది కదూ! కపటమెరుగని విధానం చెప్పే ఆ మాటకు అందరు తలవూపాల్సి వచ్చింది. వసుదేవుడు అదే చేసాడు.

అక్రూరుడు, "నేను బయలుదేరుతాను. బృందావనానికి వెడతాను. బలరామకృష్ణులను, నందుని సాదరంగా తీసుకువస్తానన్నాడు. తన తలంపు ఫలించినందులకు "శహభాష్" అన్నాడు కంసుడు.

## ద్వితీయోధ్యాయము

# ఆ "నంద" ప్రదాత, ఆ "నంద" నందనుడు!

**ఆ** చల్లని ప్రశాంత వాతావరణంలో ఎక్కువమంది తమ ఇళ్ళు అరుగుల మీద, కొందరు వరండాలలో పండువెన్నెల చల్లని కాంతులనాస్వాదిస్తూ ముచ్చట్లుగా ఒకే మాటను విడ్డూరంగాను, వింతగాను విశేష విషయంగాను చెప్పుకుంటున్నారు. అది - కంసుడు మన అక్రూరులవారిని పంపించాడు. అదేం విశేషమనకండి -

కంసుడు పంపించడం, అక్రూరులవారు రావడం ఆనవాయితీ అయినా గాని, ఇప్పుడు బలరామకృష్ణులను, కప్పం తీసుకుని నందుల వారిని తన ముఖ్య అనుచరులతోను, తీసుకు రమ్మని కబురు పంపించాడుట. ఇప్పుడు మనకు విశేషం, ఆలోచించదగ్గది. మన కృష్ణ - బలరాముల "మథురా"పురీ యాత్ర. కంసుడు ఎందుకు పిలిపిస్తున్నాడంటావు ? నిజంగా ధనుర్యాగ మిషా ? లేక కృష్ణుని చూడాలనే కోరికా ? లేక ఎందరో రాక్షసులను పంపి, కృష్ణుని ఏమీ చెయ్యలేక తన సన్నిధానంలో, తన బలగాలలోని దుష్టరాక్షసులను వుసికొల్పి - రామకృష్ణులకు ఏదైనా ప్రమాదం కల్గించడానికా ?

ఇదే - ఇప్పుడా బృందావనంలోని ప్రతి ఒక్కరి నోట నానుతున్న - విశేష ప్రశ్న. వింత భాష్యాలు. పల్లెటూళ్ళకు, పట్టణాలకు, నగరాలకు జనజీవితంలో ఎన్నో మార్పులు, విశేషాలు వుంటాయి. గ్రామస్థులు పట్టణ, నగర ప్రాంత విశేషాలకు ఆకర్షితులవడం విశేషమే. కాకపోతే - ఎప్పుడు లేనిది, ఆ దుష్ట కంసుని ఆహ్వానమే, ఆశ్చర్యకరం. ఆలోచించదగ్గ విషయం.

ఇందులో ఏదో విశేషంకన్న మర్మముంది. ఇది ఆ అమాయక బృందావన పల్లె ప్రజల భావన. అంతకుమించి, అక్రూరులవారు వస్తూనే పరమ రహస్యంగా నందునితో ముచ్చటించారుట. ఆ తదుపరే నందుని, రామ-కృష్ణులతో కలిసి తనతో రమ్మని చెప్పారుట. నందరాజుతో జరిపిన సమావేశం తదుపరి, మహా ధర్మమూర్తి అక్రూరుల వారి వదనంలో ఏదో అలజడి, ఆందోళన ఎంత గంభీరంగా వున్నా దాచినా దాగక కనిపిస్తున్నాయని, ఆలోచనాపరులు, ముందుచూపుగల మరికొంతమంది విజ్ఞానులైన పెద్దలు అంటారు.

అక్రూర సమావేశానంతరం, నందరాజు, గ్రామస్థులకు కంసరాజుకు చెల్లించవలసిన శిస్తు ధాన్యం, ధనం తగు పరివారంతో బండ్లు సిద్ధం చెయ్యమని ఆదేశించాడు. నందునిలో ఆ"నంద"ం తాండవిస్తూంది. యశోద, కృష్ణ

వియోగాన్ని - క్షణం కూడా భరించలేని తల్లిగా, అకులా వణికిపోతుంది.

అందరు నందరాజు ఆదేశాలు అందుకున్నారు. ఆయన ఆజ్ఞలను తలదాల్చారు. అన్నీ బాగానే వున్నాయి. కృష్ణ బలరాముల, మథురాపురి యాత్ర, వింతైన ధనుర్యాగం, అందులో మహా, మహా మల్లుల, భిల్లుల, వీరుల సరసన, ఈ కృష్ణ - బలరాములు అతిథులుగా వెళ్ళడం, అందులో పాల్గొనమని కంసుడు కోరడం, వీళ్ళు తలవూపి వెళ్ళబూనడం, ఇదే బృందావనంలోని, యశోదతో సహా ఏ ఒక్కరికి నచ్చని విషయం.

కృష్ణ వియోగం - అంత భయంకరంగా, మహావిషాదంగా, వారికి సంభవించిన మహా విలయంగా ప్రతి ఒక్కరు వూహించుకుని విలవిలలాడి పోతున్నారు. అర్థరాత్రి గడిచినా ఏ ఒక్కరు తమ కంటిపై కునుకును ఆహ్వానించ లేకపోతున్నారు. సరిగ్గా అటువంటి సమయంలో -

సకల జీవసమ్మోహనాస్త్రం - వేణునాదం, అందరికి వినబడింది. అందరిలో ఆనందం. ప్రతి ఒక్కరికి ప్రాణం లేచి వచ్చింది. అందరు ఆ స్వరనాదం వైపు పరుగు పెట్టారు. పెల్లుబుకిన ఉత్సాహం. కృష్ణయ్య ఆనంద ముఖ దర్శనం... అపురూప వేణుగానమృత రసాస్వాదనం..... వర్ణించి, వ్యక్తపరుపలేని మహదానందంతో, అ నాదానికై, ఆ నాదం వైపు, కృష్ణయ్య నామంతో నినదించారు. నిలువునా పొంగి పరుగులు దీసారు.

బాల, ప్రౌఢ, వృద్ధ - అన్న వ్యత్యాసం లేకుండా, ఆ "బాల" గోపాలం పరుగు దీసింది. చూస్తుండగా యమునా సైకత తీరం, వేణునాదం ప్రతిధ్వ నిస్తుంది. ప్రతి ఒకరిలో మహదానందం. అదిగో కృష్ణయ్య. ఆ నాదం అతనిదే. ప్రతి ఒక్కరికి, కృష్ణయ్య ఆతని వేణుగానం స్వంతమన్నట్లు ప్రతిస్పందిస్తున్నారు

ఈ హడావుడిలో ఎవరు ఎలాగున్నారో తెలియదు. చెదిరిన తిలకం, జారిన శిరోముడులు, చీరకొంగులు, దాని ముడులు, అస్తవ్యస్త ఆభరణాలు, వంటిమీద దుస్తులు వారు ఆ పరిస్థితిలో బయటికి రావచ్చో, కూడదో తెలియని విధంగా యమునాతీరానికి, కృష్ణ వేణునాద గాన స్వరానికి మత్తిల్లి, మైమరచి పరుగులు దీస్తున్నారు.

అందరిలోను, అధికంగా కృష్ణుడు ప్రేమించే రాధ, కృష్ణుడు - మధురకు

ప్రయాణమౌతున్నాడని తెలుసుకుంది. అలాగ తెలిసిన క్షణం నుండి చెప్పలేని ఆరాటం, తెలియని అలజడి. చెప్పలేని ఆందోళన. చెప్పుకునేవారు కనబడటం లేదు.

"చేత వెన్నముద్ద, చెంగల్వపూదండ" అనే కృష్ణుడు, చేతులెత్తి నమస్కరించే స్థితికి చేరువయ్యాడు. ఎంత ఎదిగినా, ఒదిగే మనస్తత్వంతో తన వారల నాదరించే కృష్ణ వియోగం, అమ్మో! తలుచుకుంటే మహా భయంకరం. భరించలేని విషాదమా వియోగం. ఆమె కూడా, కృష్ణుని వేణుగానం వింది. వివశయై, వున్న స్థితిని మరచి పరుగుదీసింది.

అందరిని ఆనందింపచేసే కృష్ణయ్య వేణుగానలోలుడై, తన సహజమైన పద్ధతిలో కాలు మీద కాలు వేసుకుని నిల్చున్న భంగిమలో, ప్రతి ఒక్కరికి కనువిందు చేసాడు. కృష్ణయ్య... కృష్ణయ్య... ప్రతి ఒక్కరిలోను కృష్ణ నామమే. ఆనంద స్వరూపమే. ఆనంద సముద్రమే!

మువ్వలు-గజ్జెలు, అందెల రవళులతో ఆనంద తాండవం, మహదానంద కరంగా ప్రారంభించారు. ఆ తనివి తీరని ఆనందం అందరికి స్వంతం. ఆ నాట్యం ఆనంద నిలయం. పరుగులతో వచ్చిన రాధ అందర్ని త్రోసుకుంటూ ముందుకు పోయి కృష్ణయ్య ప్రక్కన నిల్చుంది. వయోభారం తెలియని గోపకాంతలందరు, కృష్ణయ్య చుట్టు ఒక వలయంలా నిల్చున్నారు. ఆనంద పారవశ్యంతో తమను మరచి, కృష్ణయ్య నామంతో పరవశించి మురిసిపోతున్నారు.

అజరామరమైన ఆ ప్రేమ వర్ణించడమసాధ్యం. చిన్నపిల్లలవలె మత్తిల్లి, చేసే ఆ ఆనందతాండవం వూహాతీతం. ప్రముఖ నర్తకీమణులు సైతం నర్తించ గల్గడమసాధ్యం. వేణుగానమాపి కృష్ణుడు వారందరితో కలిసి తను నర్తించాడు. ఆడాడు. పాడాడు. ఆనందం ప్రసాదించాడు. అది పల్లెసీమలకే పరిమితమైన ఆనందతాండవం. గోపకులానికే చెందిన మధురానందం.

కోలాటాలు, ఆ భక్తి కీర్తనలు, ఆనంద నర్తనం. వారికే స్వంతమన్నట్లు ఆనందం ప్రదర్శిస్తున్నారు. అది కనులారా దర్శించవలసిన దృశ్యమే తప్ప వర్ణన మసాధ్యం. అంత బ్రహ్మానంద దాయకం. భూమ్యాకాశాలు ఏకమైనట్లు, చంద్రుడు సిగ్గుతో మబ్బులలో దాగి గోపికామణుల ఆనంద నృత్యానికి పరవశుడైనట్లు తానూ ఆటాడుతున్నట్లే దాగుడుమూత లాడుతున్నాడు. ఆ దోబూచులాటలో

యమున పుప్పొంగి పరవశిస్తున్నట్లు, యమున, యమునాతీరం, గోపికా బృందం, కృష్ణయ్య సన్నిధానం- నయనానందకరం - మహాద్భుతం.

అందరు అలసి సొలసి, మానసిక ఆ మహదానందమనుభవిస్తూ, ఎక్కడి వారక్కడ కూలబడిపోయారు. అలసట తీరి, కదిలేసరికి మళ్ళీ వేణుగానం. ఇప్పుడు తమ ప్రక్కనుండి వెలువడటం లేదు. దూరంగా, అడవి నుండి - అల్లంత దూరం నుండి. ఎంత అలిసినా కదలాలని లేదు. అడుగులు కదలడం లేదు. శరీరాలు ప్రపంచంతో మొరాయించినట్లు కృష్ణనామం, వేణుగానంతో పరవశించేటట్లు కట్టి పడేసాయి. ఆ కమనీయ స్థితిలో - దూరంగా రెండు ఆకారాలు. అవి ఎవరివో తెలుసుకునే ఓపిక లేదు. బొమ్మల్లా చూస్తున్నారు. ఆడనివ్వూపిరితో, రిక్కించిన కర్ణాలతో, చూడాలనే కళ్ళతో, కదలని కాళ్ళతో, ఇతర స్పర్శ తెలియని శరీరంతో, అ ప్రేమ జంటను తదేక ధ్యానంతో చూస్తున్నారు. మాటలు వింటున్నారు.

"రాధా! నువ్వు అలిసిపోయావు కదూ ?!" కృష్ణుని ఓదార్పు, కదలలేవు - మెదలలేవు. రా! నిన్ను నేను నా చేతులపై తీసుకువెడతాను." సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కాయి. మనసు మురిసింది.

"ఫర్వాలేదు. నేను నడవగలను. నడుస్తాను!"

"అబద్ధం. నువ్వు నడువలేవు. రా. చాలా దూరం వెళ్ళాలి." అంటూ చేతులపై ఎత్తుకున్నాడు. గోవర్ధనగిరిని చిటికిన వ్రేలిపై మోసిన గోవిందుడు, ఈ బృందావన "రాధ"ను అమాంతం ఎత్తుకున్నాడు. అతి సునాయాసంగా అడుగులు వేస్తున్నాడు.

కృష్ణయ్య హస్తస్పర్శతో వళ్ళంతా ఝల్లుమంది. జలదరించి, పులకించింది. తెలియని మత్తులో పరవశించింది. చేతులు ఆతని భుజాల చుట్టు లతలాగ చుట్టుకున్నాయి. ఆ అడవిదారిలో, అభిమానించే కృష్ణయ్య బాహువులలో బందీ అయి, తన ప్రేమను కృష్ణుని ప్రేమతో కలిపింది, ఆ ఆరాధనా "రాధ".

"రాధా ?" కృష్ణుని పిలుపు.

"కన్నయ్య" - ఆమె అరమోడ్పు కన్నుల పరవశత్వం.

"ఇవ్వాళ - ఈ రాత్రి - రాత్రులకే రాత్రి. శోభారాత్రి."

"అవును. అద్భుత....!" తమాయించుకోలేని తమకం. తెలియని ఆనందం,

చెప్పుకోలేని పారవశ్యం. "నువ్వు ఇవ్వాళెంత అందంగా, అద్భుతంగా వున్నావో తెలుసా ?' ఆమెను చుట్టుకున్నాడు. ఆమె పైకి వంగి ఆమె పెదవులను చుంబించాడు. ఆమె శరీరం స్పృశించాడు. ఆ భక్తి ప్రేమ పారవశ్యంలో - ఆ"రాధ"నామూర్తి అయింది ఆరాధనా"రాధ".

ప్రశాంత వాతావరణం. మబ్బుల్లోని చంద్రుడు చెట్ల గుబురుల నుండి వింత వింత కాంతుల్ని ప్రసరింప చేస్తున్నాడు. ఆ క్షణానికి మేల్కొనిన రాధ, "కృష్ణయ్యా! ఎప్పుడూ ఇలాగే నాతో వుంటావా ? మనమిలాగే వుంటామా ? అమాయకంగా అడిగింది.

"తప్పకుండా సూర్యచంద్రులున్నంత వరకు రాధాకృష్ణుల ప్రేమ అజరామరం." కృష్ణయ్య బదులిచ్చాడు.

"అయితే నువ్వు నన్ను మరచిపోవన్నమాట"

"అది అసాధ్యం. నువ్వు నా ఆరాధ్యదైవానివి. నా ఆనందమూర్తివి. ఆ"రాధ"నామూర్తివి. అలాగనుకుంటునే ఎంతో దూరం వచ్చేసారు. ఆమెను రావిచెట్టు మొదట్లో, చక్కని సున్నిత ప్రదేశంలో దించాడు. ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. రాధ ఇంకా కృష్ణుని గొంతుకను తీగలాగ చుట్టుకుని వుంది. అందులో ఆరాధన. అద్వితీయమైన ఆత్మానందం. తెలియని తన్మయత్వం. చెప్పలేని పారవశ్యం. అద్భుతమైన మానసికానందం.

బంధించిన కృష్ణయ్య మెడలను, తన చేతుల కౌగిలి నుండి విడిచిపెట్టింది. గాలికి అల్లల్లాడే ముంగురులను సర్దుకుంది. జుత్తు సరిచేసుకుంది. కృష్ణునికంటే దాదాపు అయిదేళ్ళ పెద్దదైన రాధ "కన్నయ్యా!" మనమెప్పుడు పెండ్లి చేసుకుందాం. ఈ వియోగం, నీ సన్నిధానం నుండి దూరమవడం నాకు సాధ్యం కాదు.

రాధ కళ్ళలోకి చూస్తూ కృష్ణయ్య చిరునవ్వులు చిందించాడు. రాధా! మనది అమరప్రేమ. దీనిశక్తి అనంతం. మానసికంగా మనమిరువురము పెనవేసుకున్నాం. ఈ క్షణంలో క్షత్రియోచిత గాంధర్వ విధిన మనకు వివాహమయిపోయింది కూడా. శారీరకంగా మనం దూరమైనట్లు తలంచుకున్నా, మన ఆత్మలు, అందలి తత్వం-ప్రేమ.... ఆ మనోభావనా ఒక్కటే, నరనరాలలోని మన అనన్య అమర ప్రేమను ఎవ్వరు కొల్లగొట్టలేరు. చెబుతున్న కృష్ణుని చేత్తో లాలనగా ఒక్కటేసి-

"ఈ కబుర్లకేం తక్కువలేదు. గాంధర్వ వివాహమట. ఎప్పుడయిందో.." అందులో ఎకసక్కెం వుంది. చిలిపితనంతో కూడిన అల్లరి పారవశ్యము కలిసి వుంది. సమాధానంగా కృష్ణయ్య - "నిన్ను నా చేతులతో, ఎత్తుకుని పొదివి పట్టుకున్నప్పుడే, గాంధర్వ విధిన మనం వివాహం జరిగిపోయింది. ఇంకేం వివాహం."

"నువ్వేం రాజువా, గాంధర్వ విధిన వివాహమాడడానికి ?" ఎదిరించినట్లు రాధ ప్రశ్నించింది.

"పిచ్చి రాధా! నేను రాజులకే రాజును. జగత్ప్రభువును." అని రాధ కళ్ళను, కృష్ణుడు చుంబించాడు. మళ్ళీ తనే - "ఇది నీకు తెలుసా ? నేను వీరశౌర్య పరాక్రమాల యదు సింహాన్ని. రాజును. ఇక్కడ ఈ నంద-బృందావన గోకులంలో తిరుగుతున్నాననే, అల్లరి కృష్ణుడను కాను. అందరిని అలరించి, ఆదరించి, ఆనందపరిచే అనాధనాథుడను. విశ్వే దేవతలు సదా కొలిచే అసలు సిసలైన రాజాధిరాజును.

"అవును. నిజమే. నువ్వు రాజువే. నా రాజువి. నా ఆరాధనా ప్రభుడవు." సిగ్గులు చిందిస్తూ, గోముగా సుతారంగా మీటుతూ పలికింది. "నిజం. నువ్వు నా ఆ "రాధ"నామూర్తివి. నిజానికి నేను గోపాలుడను కాను. గోవిందుడైన యదు సింహాన్ని, రాజును. నువ్వు నా రాణివి." అన్నాడు సత్యగంభీర స్వరంతో.

"నిజంగా!" అతన్ని పట్టి పట్టి రాధ చూడటం - ప్రారంభించింది. ఆమె ఆంతర్యాన్ని గ్రహించినట్లు "రాధా" రేపే నా మధురానగర ప్రయాణం. తిరిగి ఎప్పుడొస్తానో తెలియదు. కొన్ని రోజులు పట్టవచ్చును. లేదా కొన్ని సంవత్సరాలు కూడా పట్టవచ్చును. అంతా కాలం, దైవం మీద ఆధారపడి వుంది.

"లేదు, లేదు. నువ్వు తప్పక తిరిగి వస్తావు. ఎప్పుడో కాదు. ఇంకొద్ది రోజులలో. ఆమె మాటలకు చిరునవ్వులు చిందిస్తూ "రాధా! నీకో పరమ రహస్యం చెప్పాలని ఇక్కడకు తీసుకువచ్చాను. జాగ్రత్తగా విను. అది దేవరహస్యం. నీకు, నాకు తేడా లేదన్న సత్యంతో దానిని చెబుతున్నాను - అర్థం చేసుకో. ప్రస్తుతానికి దానిని గోప్యంగానే వుంచు.

కాలక్రమంలో ఆ దేవ రహస్యం లోకానికి బహిర్గతమౌతుంది. అంతవరకు ఇదిరహస్యమే. ప్రస్తుతం యదువంశం సంవత్సరాల బానిసత్వంలో మగ్గుతుంది.

దీనిని తుదముట్టించాలి. కాదు నిరోధించాలి. నారదుల వాక్యం, సత్యం కావాలి. తరతరాల బానిసత్వపు బ్రతుకులు అంతం కావాలి. స్వతంత్రయోధులు, రాజులై రాజాధిరాజులుగా బ్రతకాలి. పాలనా పగ్గాలు చేతబట్టి చరితార్థులు కావాలి.'' ఇదంతా నా వల్లనే జరుగుతుంది. అధర్మాన్ని కూలదోసి, ధర్మపరిరక్షణం చెయ్యాలి. అదే నా జన్మ, జన, జీవన రహస్యం. ఎంతో మెల్లిగా - స్థిర నిశ్చయంగా కృష్ణయ్య చెబుతున్నాడు.

కృష్ణుని మాటలకు బొమ్మలాగ చూస్తూ "కృష్ణయ్యా." నువ్వు దేవదేవుడవా? అవతార పురుషుడవా ? ధర్మ పరిరక్షకుడివా ?'' ఆశ్చర్యంతో, అమాయకంగా అడుగుతుందామె. అందుకు కృష్ణుడు "రాధా! నారదుడు దేవఋషి. త్రిలోక సంచారి. సర్వమెరిగిన సర్వసమర్థ శక్తిమంతుడు. ఇది నారదుని వాక్యమే కాదు, దేవ రహస్యం. దేవకి అష్టమగర్భ శిశువు, ఆదినాథుడు, జగన్నాథుడు. లోక రక్షకుడు.'' అని ఆకాశవాణి కూడా కంసుని హెచ్చరించింది.

ఆతడు దుష్ట శిక్షణం గావించి, సజ్జన సంరక్షణం చేస్తాడు. యదువంశ మౌళిగా, యదుకుల భూషణునిగా, విరాజిల్లుతాడు. వంశోద్ధారకుడౌతాడు. చెబుతున్నాడు కృష్ణుడు. అవును. నేనూ విన్నా ఈ విషయాన్ని. ఆతడెక్కడున్నాడో, ఎప్పుడొస్తాడో... ఎలాగ రక్షిస్తాడో.... ఇది మాత్రం దేవరహస్యంగానే వుంది. అసలు విషయమెవ్వరు చెప్పడం లేదు.

"అందుకే నా మధురానగరి ప్రయాణం. నేనే ఆ దేవకీ సుతుడిని. వసుదేవుని వరాల పుత్రుడిని'' శాంత గంభీరస్వరంతో చెప్పాడు.

"నిజం, కృష్ణా. నువ్వు, నువ్వు.... దేవకీ వసుదేవుల పుత్రుడివా ? యువరాజువా ?'' భయపడుతూ అడుగు వెనక్కి వేసింది. దడదడ గడగడ వణుకుతుంది. ఆమెను, రాధ భయాన్ని తీరుస్తూ -

"పిచ్చిదానా, భయపడకు. కంగారు పడకు. నేను చెప్పేదంతా నిజం. నేను దేవకి సుతుడను. కంసుని మేనల్లుడను. అందుకే నన్ను ఏదో విధంగా తుద ముట్టించాలని, కంసమామ, మహా ఆత్రంగా వున్నాడు. ధనుర్యాగం పేరిట మధురకు రప్పించి నన్ను మట్టుపెట్టాలన్నదాతని దురాలోచన. దానిని భగ్నం

చేసి, ధర్మరక్షణంగావించడానికి -

"యధాయధాహి ధర్మస్య...!" అని సజ్జన సంరక్షణకు, దుష్టశిక్షణకు మధురకు ప్రయాణమౌతున్నాను. మరో విషయం. బలరాముడు కూడా నా తల్లి దేవకి సంతానమే కానీ, నిజమైన రోహిణి సంతానం కాదు. రోహిణి నాకు పెదతల్లే. కానీ బలరాముడు, నా మాయా ప్రభావంతో, యోగమాయ శక్తితో, సంకర్షణుడై, రోహిణీ గర్భమొంది, నాకు సోదరుడయ్యాడు.

కంసుని దురాగతాల నుండి, కొంతకాలం తప్పించుకోవడానికి వీలుగా, గోకులంలో నంద యశోదల పుత్రునిగా నేను, రోహిణీ సుతునిగా బలరాముడు ఇక్కడ పెరుగుతున్నాం. ఇదీ నా లీలా విలాసమే. అవతారపురుషుడను, అధినాథుడనైనా ఆపదలు విడువవు. అనర్థాలు జరుగకుండా వుండవు. అందుకు అందరి వలెనే మాయోపాయలవసరం. తప్పదు.

కృష్ణుని ఒక్కొక్క మాటకు వులికులికి పడుతుంది. ఇదివరకటి కన్నయ్యగా దగ్గరకు చేరువవ్వాలో, వసుదేవ సుతునిగా, భయభక్తులతో దూరమవ్వాలో రాధ కర్థం కావడం లేదు. అయినా ధైర్యం తెచ్చుకుంది. "కృష్ణయ్యా!" నువ్వు చెప్పేదంతా నిజమే కదా ?" అంది. అవునన్నాడతడు. ఆపుకోలేక కంసుడు దుర్మార్గుడు కదా, అతన్ని నీవు నిరోధించి, వధించగలవా ?" అమాయకత్వం నరనరాల్లో జీర్ణించుకున్నట్లు అడిగింది రాధ. నువ్వు మధురకు వెళ్ళకు. నేను సహించలేను. ఏదైనా జరగకూడనిది జరిగితే...." తన చేత్తో ఆమె నోటిని మూసి...

"రాధా! బాధపడకు. నేను వెళ్ళక తప్పదు. నేను పుట్టిందే కంస సంహారానికి, ధర్మ పరిరక్షణకు." స్థిరనిశ్చయం. గంభీర వదనం గాంచి, కళ్ళనీళ్ళ పర్యంతమైన రాధ, వణికిపోతూ "మరి నేనూ ?" అంది. మళ్ళీ ఆమే, "నువ్వెళ్ళిపోతే, నా జీవితమో..." పెల్లుబుకిన.. ఇటు బాధ, అటు కన్నీళ్ళతో, అడుగుతుంది - రాధ.

"భయపడకు నేను నీ కున్నాను. ధర్మరక్షణం గావిస్తాను. నేనిటు రావడమో, నిన్నటు రప్పించుకోవడమో చేస్తాను. ధైర్యమొందు. వూరడిల్లు. మహాకాల కాలుడినైన నన్ను నిర్జించేవాడు, ఈ సృష్టిలో, అఖిల భువనాలలో నాకు నేనే తప్ప, మరొకరు లేరు. ఇది సత్యం." ఇక ఆమెను మామూలు స్థితికి తీసుకు రావాలని తలచిన, రాధను దగ్గరకు తీసుకున్నాడు. వూరడించాడు, ఓదార్చాడు. తన అమృత హస్తాలతో

చల్లని చిరునవ్వులతో సమ్మోహన పరిచాడు. స్వస్థత కూర్చాడు.

కృష్ణుని ఒడిలో ఒదిగిపోయిన రాధ "కృష్ణయ్యా" నన్ను మరువవు కదా!" అమాయకంగా అడిగింది. "నువ్వు నా రాధవు. ఆ "రాధ" నా మూర్తివి. అని లోకం ప్రశంసిస్తుంది.

"మరి నేను గోపకన్యను. నువ్వో రాచబిడ్డవు. మన సాంగత్యం...!"

"పిచ్చిదానా, ఇవన్నీ లోకమర్యాదలు. ప్రేమకు పేదరికం, పెద్దరికం లేదు. అయినా నీ భయమసంబద్ధం. నువ్వు నా ప్రేమ, హృదయరాణివి. ఇది నిజం. హృదయపూర్వకంగా కృష్ణుడు చెబుతున్నాడు. ఆతని మాటలు నిజమైన ప్రేమను, వేణుగానాన్ని తలపింప చేస్తున్నాయి. మురిసిపోతూనే రాధ -

"కృష్ణయ్యా! ఇది అసహజం. నింగికి నేలకు పొత్తు ఎలాగ కుదరదో, పాలకులకు పాలితులకు మధ్య అంతే వ్యత్యాసముంటుంది. ఇది ధర్మసూక్ష్మం. ఆచరించేవారే తప్ప దీనినెవరూ కాదనలేరు. కాదని ముందుకు సాగలేరు. నేనటు రాలేను. పొరపాటున వచ్చినా నిన్ను నా కృష్ణయ్యగా చూడలేను.

"రాచబిడ్డవు. రాజలక్షణాలు, అలంకారాలు, మణిమయ అంగభూషణాలు, రత్నఖచిత కిరీటాలతో, ఇక్కడ ఈ బృందావన సీమలలో గోపబాలునికి, ఈ అమాయక పల్లె ప్రజలతో తిరిగిన నీవు, ఎంత దగ్గరవుదామనుకున్నా, మేము - మా మనసులు నీకు దగ్గర కానివ్వవు. ప్రేమాభిమానాలకు బదులు, భయ భక్తి గౌరవాలు చోటు చేసుకుంటాయి. మమ్మ్మ కదలక కట్టి పడేస్తాయి. అందుకే....!" ఆశ-నిరాశల మధ్య వూగిసలాడుతున్నట్లు రాధ మాట్లాడుతుంది.

"అందుకే...!" అందుకున్నాడు - కృష్ణయ్య.

"నేనిక్కడే వుంటాను. నీకు నిజంగా నామీద ప్రేమవుంటే, నేను నీ దాననను కుంటే, మన ఆ"నందా"నికి చిహ్నంగా, ఓ ఆనంద కిశోరమా నీ వేణువును, నా కివ్వు. అందులోనే అనుక్షణం నిన్ను చూసుకుంటూ ఈ యమునాతీర సైకత ప్రాంతాలలో, నీవు నడయాడిన ప్రతి ప్రదేశంలో, నీ పాద ముద్రలను దర్శిస్తూ, నిన్ను తలుచుకుంటూ, నన్ను నేను మరచిపోతాను. ఈ నా వరం నాకివ్వవా ?

ఆనందమూర్తియైన ఆ"రాధ"నా మూర్తి, అంత ప్రేమగా ముద్దుగా,

అడగడంతో పరవశించిన కృష్ణయ్య "రాధా! నువ్వు - ఆ "రాధ"నవు కావు. నా - ఆ "రాధ"నా మూర్తివి. అనుక్షణం నీ కనుసన్నలలో నేనుంటాను. నీవు ఇక్కడ ఇప్పుడు చూసిన నీ కృష్ణుడు. సదా నీ కోసం, నీ పిలుపుకోసం, నీ ఆనందం కోసం, "ఆ"నందు"డు, ఆ"నంద"నందనుడౌతాడు. ఇది సత్యం. అభయ పూర్వకంగా చెబుతున్నాడు. అంతంత కళ్ళు చేసుకుని, కృష్ణప్రేమకు పూర్తిగా తిరిగి దాసురాలైన ఆ "రాధ'నా"రాధ" చూస్తుంది. ఆమెను ఆనందింప చెయ్యడమే తన ధ్యేయంగా తలిచే ఆ"నంద"నందనుడు, అమాంతం ఆమెను ఎత్తుకున్నాడు. గుండెలకు హత్తుకున్నాడు. విరిసిన పువ్వు తుమ్మెద మకరందమొంద వచ్చి సూర్యాస్తమయ సమయంలో ముడుచుకుపోతే, ఆ పువ్వులో వుండిపోయి, ఉక్కిరి బిక్కిరయి, ఆ మకరంద మధుపానం కోసం, మత్తిల్లి, తనను మరచిపోయి, తన మనుగడ గ్రహించనట్లు, రాధ ఆ"నంద"నందనుని చేతిలో ఒదిగిపోయింది. గువ్వ లాగ కువ కువలాడసాగింది.

"అయితే నీ వేణువునిస్తావా ?" మళ్ళీ అడిగిందా అమాయకురాలు రాధ."

"వేణువేమిటేమిటి, నన్నే నీకు అర్పించుకుంటే. రా.. ముందు మనం సాందీపుల వార్ని దర్శిద్దాము. వారి నేతృత్వంలో, పవిత్రాగ్నిసాక్షిగా మనమొకటవుదాం. అప్పుడు వేణువు, ఈ వేణుగోపాలుడు, దేవకీ - వసుదేవుల రాజపుత్రునిగా కాక, ఈ జనపదాలలో, మీతో కలిసి మెలిసి తిరిగిన ఆ"నంద"గోపాలునిగానే వుంటాడు. ఆ"నంద"బాలునిగానే అలరిస్తాడు. మీ ఆరాధనల నందుకుంటాడు. సరేనా... !"

ఆమె నోదార్చి - ఓ ప్రేమమూర్తిగా, ఆనంద సామ్రాజ్ఞిననునయించి, నిజంగా ఆ"రాధ"నామూర్తిగా, రాధతో ముందుకు, సాందీపాశ్రమానికి కృష్ణుడు బయలు దేరాడు.

# మధురానగరిలో...

**చీ**కట్లు తొలగుతున్నాయి. తొలి సంజవేళలో, నందరాజు, ఆదేశం ప్రకారం, ఆతని పరివారం, మధురానగర యాత్రకు కావలసిన తగు సరంజామాతో

ఆడంబరంగా, తమదైన సాంప్రదాయ పద్ధతిలో సంబరంగా బయలుదేరారు.

అక్రూరుడు పొలిమేరలలో తన కాలకృత్యాలు, నిత్య కృత్యాలు నెరవేర్చుకుని, నందాదుల రాకకై ఎదురు చూస్తూన్నాడు. బలరామకృష్ణులు... ఎంతో హడావుడిగా తమ వాళ్ళందరిని కలుసుకుని, వీడ్కోలు చెబుతున్నారు. వారి వదనాలలో ఎంతో సంతోషం. నగరికి వెడుతున్నారు. కానీ, కృష్ణ బలరాములను చూసినవారి వదనాలు మాత్రం చిన్నబోయాయి. ముఖ్యంగా కృష్ణుని వియోగాన్ని భరించలేని ఉద్వేగానికి గోపాలురు లోనయ్యారు.

రాజాజ్ఞతో నగరికి వెళ్ళే రామ-కృష్ణులను వారు నిరోధించలేక. పసిబిడ్డ బాలాది, స్త్రీ, వృద్ధులందరు, ఇంకా చెప్పాలంటే.... గోవత్సాలతో కలిసి అందరు మూగబోయారు. విషాదం కమ్ముకున్న ముఖాలతో వియోగం మూర్తీభవించిన ఆ బాలగోపాలం కృష్ణుని అనుసరించారు.

గ్రామ పొలిమేరలలో వున్న అక్రూరుడు, ఆ వచ్చే గోపజనాన్ని, నెమలి పింఛము దాల్చిన కృష్ణుని, ఆ ప్రక్కనే నడుస్తున్న గుర్తించగల శక్తివంతుడైన బలరాముని ఆనంద గోకుల, బృందావన గో, గోప, గోపికా జనంతో కృష్ణ - బలరాములు పెంపొందించుకున్న అనుబంధానికి, అనురాగ - ఆప్యాయతలకు మురిసి - చలించాడు.

గోపబాలురు అక్రూరునికి సాష్టాంగ వందనం చేసారు. ఒక పెద్దగా అక్రూరుడు వారందర్ని సుఖీభవ అంటూ ఆశీర్వదించారు. అదే సమయంలో కృష్ణుడు గోప-గోపికా సమూహమునకు ముందు నాయకురాలిగా నిల్చిన ఆ గ్రామపెద్ద మమతల మాతృమూర్తి యశోదమ్మకు సాష్టాంగ వందనం చేసాడు. ఆమె పాదాల క్రింద ధూళిని తన కళ్ళకు నుదుట వ్రాసుకున్నాడు. దాంతో చలించి, రోమాంచిత యైన యశోద "నా, కన్నా!" దగ్గరకు తీసుకుంది. నుదుట ముద్దుపెట్టి గట్టిగా కౌగలించుకుంది. ఆపలేని ఆమె అశ్రుధారలు కృష్ణుని భుజాలు, గుండెపై పడ్డాయి. ఆ తదుపరి బలరాముని కూడా ఆ తల్లి యశోద అలాగే కౌగలించుకుంది.

ఆ ప్రక్కనే వున్న రాధ పెండ్లి కూతురిలాగకాదు, పెండ్లిబట్టలలో వుంది.

చీర కొంగులో రాధ ముఖం దాచుకుంది. మబ్బులచాటు నుండి, సూర్య-చంద్రులు చూసే విధంగా, చురుకు - చల్లని చూపులతో, మబ్బుల నుండి తొంగి తొంగి చూస్తున్నట్లు, కప్పుకున్న చీర కొంగుచాటు నుండి నిశితంగా తన చూపులను, కృష్ణుని చూపులతో కలుపుతుంది. చల్లదనమను కమ్మని ప్రేమను ప్రసరించే, చురుకు చూపులతో కృష్ణయ్య గుండె లోతులకు - చూపుల గాలంతో, అనంత భక్తి ప్రేమ సామ్రాజ్య "రాధ" అనురాగరాణి, ఆరాధనాపూర్వకంగా చూస్తూంది.

అంతా గమనిస్తున్నాడు, కృష్ణుడు తన చల్లని చూపులతో చురుకు చూపుల చిన్నారి, తన ప్రేమ సామ్రాజ్యరాణి రాధను ఉలికిస్తున్నట్లు, ఉడికిస్తూన్నట్లు పలుకరిస్తున్నాడు. ఆ చూపుల భావం, అందులోని ఆనందం, రాధ - కృష్ణులు అనుభవిస్తున్నారు. అనుభవించి పరవశిస్తున్నారు.

ఆ వీడ్కోలుకు ముగింపుగా కృష్ణుడు చేతులెత్తి అందరికి నమస్కరించాడు. చిరునవ్వులతో పలుకరించవలసిన వారినందర్ని పలుకరించాడు. అందరి కళ్ళలోకి తొంగి చూడలేక, వారి మనసులలోకి తొంగి చూసిన "ఆ బాల" కృష్ణుడు, బలరాముని చెయ్యి పట్టుకుని లాగాడు. ఇరువురు రథమధిరోహించారు.

అక్రూరుడు గుఱ్ఱాలనదిలించాడు. అసహనంగా గుఱ్ఱాలు కదిలాయి. రామకృష్ణులు చేతులు వూపుతున్నారు. ఆ ఉద్విగ్న క్షణాల ఉద్విగ్నత వర్ణనా సాధ్యం కాదు. బరువెక్కిన హృదయాలతో, మరల్చుకోలేని చూపులతో, కదలలేని అనుబంధంతో, అడుగులు వెనక్కి పడని - ఆబాల"గోపాలం" కూలబడినట్లు అక్కడే వుండిపోయారు.

"రాధ" - అస్సలు చూపులు త్రిప్పుకోలేకపోయింది. ఇంతమందిని సమ్మోహింపచేసి, ఏడిపించిన ఆ కృష్ణుడు ఈ వియోగాన్నెలాగ భరిస్తాడు ? అంతకంతకు అనుభవిస్తాడు. శాపం కాని ఆ ప్రేమపాశం పలికిన పలుకులు - అమంగళాలు కావు. ఆనందతీరాలు. ద్వారాలు - దారులు. దయనీయ స్థితిలో దిక్కెరగని ఆబాల"గో"పాలం పొందిన అనుభవ "బాధ" పరాకాష్టకు చేరింది.

ఇదంతా గమనిస్తున్న అక్రూరుడు చలించిపోయాడు. ఇది కేవలం ఆ పరమాత్మకు తప్ప అన్యులకు, సామాన్యులకు సాధ్యం కాదు. స్థిర నిశ్చయాని

కొచ్చేశాడు. "నిజంగా. ఈతడు ఆ శ్రీమన్నారాయణుడే. దుష్టజన శిక్షకుడు, సజ్జన సంరక్షకుడే." తన అభిప్రాయాన్ని మరింత బలపరచుకుని, రామ-కృష్ణులతో కలిసి, రథాన్ని పరుగులు దీయిస్తున్నాడు.

గాలికి అల్లలాడుచు ఎగిరే నల్లని ముంగురులు శిరమున నెమలి పింఛము, ఆకర్షణీయ రూపము సమ్మోహన శక్తి, సార్వజనానీక ప్రేమ, ఆబాల-గోపాల, "గో" ప్రియుడైన, ఈతడు భక్తవరదుడు. భగవంతుడు. పరమ భాగవతోత్తముల పరంధాముడై తన "భాగ"వత తత్త్వంతో, "భాగ"వత కథామూర్తియైన, ఈ గోపాలకృష్ణుడు - "గోవిందుడు, గోకులోద్ధారుడు, ఆర్తజన బాంధవుడే! "మనసులో ఎన్నో మధురిమల ఆలోచనలు. ఆనంత "తత్వ" తాత్వికా స్ఫురణలు.

ఈతనికోసం, మధురానగరం - పదిహేడు సం॥లుగా నిరీక్షిస్తుంది. ఈతని పదధూళితో ఆ నగర భామిని పవిత్రమౌతుంది. పరవశించి అడుగులను గుండెలకు హత్తుకుని పులకరిస్తుంది. అయితే ఈ దుష్టజన సంహార క్రీడకు నాయకుడు కృష్ణుడా ? లేక ఆతని సోదరుడు బలాఢ్యుడు వయసును మించిన శరీరదారుఢ్య బలరాముడా ? లేక ఈ జరిగేదంతా జనపథ, జానపద ప్రచారహా ? నిజానికి కృష్ణునికి ప్రేమమూర్తిగా, ఒక సమ్మోహనాకారునిగా పేరు వుంది. ఆతని వేణుగానానికి అందరు పరవశించి, ఆ తన్మయత్వంలో ఆడిపాడుతారని, దానికి "రాసలీల" అని పేరు పెట్టబడింది. ఈ రస లీలా గుళికలు గ్రోలినవారికి అంతా... అదే "జగమంతా కృష్ణమయ"మై, సమస్త సృష్టిలో ఆ సమ్మోహనమూర్తినిగాంచి తరిస్తారనేది వదంతా లేక సత్య సమ్మతమా ? ఇది అక్రూరునిలోని ఆలోచనా జోరు. అనాలోచిత ఆలోచనలు కావుకదా!

అర్థరాత్రి ఎవ్వరికి చెప్పకుండా ఒక గొల్లభామను పెండ్లి చేసుకున్నాడంటే.... అది ప్రేమా ? లేక స్త్రీ లోలత్వము... బలహీనతా ? అనకూడదు కానీ, గర్గులవారు ఈతని గూర్చి ఎంతో పరవశిస్తూ ప్రశంసిస్తారు. కాని అదంతా నమ్మశక్యంగా లేదు. ఒకరిని గూర్చి అంచనావేసేటప్పుడు, ఆలోచించేటప్పుడు, చూసిందానికి బదులు ప్రత్యక్షంగా అవతలివారి శక్తిస్థోమతలను పరికించి, పరీక్షించి మరీ ప్రకటించాలి. అంతే కాని కృష్ణుడు "దేవుడు" అనగానే సరిపోదు. అంతటి మహానుభావుడైన గర్గులవారి ప్రవర్తన, వీళ్ళను ప్రశంసించే పద్ధతి, ఎందుకో

అక్రూరునికి నచ్చలేదు. సరికదా కృష్ణుని ఈ స్త్రీ లోలుడు వయస్సుకు మించిన ఆలోచనలు, చెప్పరాని అల్లరి చేసేవాడుట. ఇతడు ఆదిదేవుడౌతాడా ? గర్గుల వారు చాలా పొరపాటు చేసారు. వారి ఆలోచన తప్పు. అంతటితో విడువకుండా-

నారదుల వారి భవిష్యద్వాణి, వ్యాసులవారి దివ్యదృష్టి.... దృష్టి మందగించి నట్లు ప్రక్కదారి పట్టాయేమో...?! లేకపోతే దేవుడనేవాడు ఈ విధంగా కొంటె కోణంగిలా, కోతి కొమ్మచ్చులు, స్వైర విహారం, రాసలీలలా ?... ఆడదైతే చాలు, శ్రీకృష్ణుని సమ్మోహన రూపానికి, వేణుగానానికి వళ్ళు మరచి ప్రవర్తిస్తుందట. ఆడుతుందట. పాడుతుందట. ఇవేం చేష్టలో!

ధర్మాత్ముడు, మహితాత్మకుడనుకునే అక్రూరుని ఆలోచనలు పెడదారి పడుతున్నాయి. సృష్టికే మూలస్వరూపమైన కృష్ణుడు, పిల్లవాడిలాగే అక్రూరుల వారిని నవ్వుతూ చూసాడు. ఆ నవ్వులో అసంబద్ధత ఏవగింపు వెక్కిరింపు, వెకిలితనం, విర్రవీగుడు లేదు. ప్రేమ, అభిమానం, గౌరవం, దయ, హృదయాంత రాళలోకి సూటిగా చొచ్చుకుపోయే చూపులతో, అందరి హృదయాలను చక్కగా చదువగల్గిన, సునిశిత చూపుల ప్రజ్ఞావంతునిగా కనిపించాడు. అయినా అక్రూరుడు, కృష్ణుని మందహాసాన్ని స్వీకరించలేదు. ప్రతిగా తాను స్పందించ లేకపోయాడు. కారణం - తన మనసు సంకుచితమై, సర్వాత్మక దివ్యశక్తి స్వరూపుని శక్తిని, గుర్తించి గౌరవించలేకపోవడమే. ఆ బలహీనతే, అక్రూరుడు సిగ్గుపడేటట్లు చేసింది. అప్పుడు - అతన్ని సంస్కరించదల్చుకున్నట్లు, కృష్ణయ్య -

"ఓ పెద్దనాన్నా! నా తండ్రి నందుడు మనకంటే ముందుగా మధురకు వెడతాడా ? లేక మనమే ముందు వెడతామా ?" ఏ కల్మషంలేని ప్రశ్న అది. సమాధానంగా అక్రూరుడు. "వారు సాయంకాలానికి మధురకు వస్తారు. మనం ఓ ఎనిమిదిగంటల్లో అక్కడికి చేరుకుంటాము. మనవి మేలుజాతి అశ్వాలు, మహావేగంతో సాగగల్గేవి. కాబట్టి మనం ముందే అక్కడికి చేరుకుంటాము" అన్నట్లు చెప్పాడు. అప్పుడు బలరాముడు -

"నాకు "అశ్వధాటి" అంటే చాలా ఇష్టం" వాటి మహావేగం నాకు మరీ, మరీ ఇష్టం" అన్న - బలరాముడు. "అంతేకాదు ఓ పెద్దనాన్నా! మీరు కనుక

విసుక్కోకుండా, ఈ రథం పగ్గాలును నాకిస్తే - కేవలం నాలుగే - నాలుగు గంటల్లో మనం మధురకు వెళ్ళవచ్చును. ఇలాగైతే ఎనిమిది గంటలు కాదు, పన్నెండు గంటలైనా మనం వెళ్ళలేము. అన్యథా భావించక, ఆ పగ్గాలు నాకివ్వండి. ఈ అశ్వధాటి, నా ధాటిని కూడా చూద్దురుగాని'' ఆ రథంలో కాళ్ళు ముడుచుకుని కూర్చోలేని బలరాముడు, అక్రూరుని నిలదీసినట్లు అడిగేసాడు.

అన్నదమ్ముల మధ్య అంతరానికి తనలోనే నవ్వుకున్నాడు. ఒకడు వీర విక్రముడు, మరొకడు విలాసపురుషుడు. ఎంత చిత్రంగా వుంది ? పరిస్థితిని బేరిజు వేసుకుంటున్నట్లు తనలో తను తర్కించుకుంటున్నాడు. అక్రూరుని మనసును, బలరాముని తొందరపాటును గ్రహించిన కృష్ణుడు -

"పెద్దనాన్నగారూ! మనం తండ్రిగారు రాకుండా మధురకు ముందు వెళ్ళి ఏం చేస్తాం ? ఏం సాధిస్తాము ? అలాగ వెళ్ళడం తప్పు, తొందరపాటు కదూ! మరో విషయం. మీరు నన్ను మీతో రమ్మన్నారని, ఈ రథమధిరోహించానే తప్ప, లేకపోతే హాయిగా, అందరితోపాటు కలిసిమెలిసి ఆడుతూ పాడుతూ, ఆ ఎడ్లబండ్ల మీదే వచ్చేవాడిని. అందరితో కలిసి నడిచినా నాకానందమే! "ఏకత్వంలో భిన్నత్వంలా వుంది - కృష్ణుని సమాధానం. ఆతని ఆలోచనా సరళి.

నిజానికి అక్రూరుడు చెడ్డవాడు కాడు. ధర్మాత్ముడు, మహాత్ముడే. ఎందుకో.... కృష్ణ-బలరాముల విషయంలో కొంతలో కొంత భిన్నతత్వమూర్తి, భిన్న ఆలోచనామూర్తి అయ్యాడు. అయితే ఇప్పటి కృష్ణుని మాటలతో, కన్నయ్య.... సార్వజనీనక ప్రేమ, హృదయ విశాలం.... కదిలించింది. అతన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు.

"నీ మాట సత్యమే కావచ్చును, కృష్ణా! కానీ, నీ కోసం... మధురానగరి యావత్తూ - వెయ్యికళ్ళతో... కాదు, కాదు.... వళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు చూస్తుంది. అందుకే ఈ రథ ప్రయాణం. అలాగే దేవకీ వసుదేవులు కూడా నిన్ను చూడాలని ఆకాంక్షిస్తున్నారు'' అన్నాడు. సమాధానంగా -

పదహారు సం॥గా, తహతహలాడుతూ నిరీక్షించేవారు, మరికొన్ని గంటలు నిరీక్షిస్తే తప్పేముంది ? నిరీక్షణలోని ఆనంద, విరహంలోని సుఖం.... అనుభవజ్ఞులకే తెలుస్తుంది. అందరు ఆ సత్యాన్ని గుర్తించలేరు. గుర్తించి

కీర్తించలేరు. జరిగిందేదో జరిగింది. ఇక నేను ఈ రథమధిరోహించలేను. నా తండ్రి కాలినడకన మెల్లమెల్లగా నడిచి వస్తూంటే, సభ్యత-సంస్కారం, సాంప్రదాయం మరచినట్లు నేను రథారూఢుడనై రాజాలను ఖచ్చితంగా చెప్పాడు.

కృష్ణునిది వాచాలత్వంగా తలచి ఏ మాత్రం ఉపేక్షించదలచని అక్రూరుడు “కృష్ణా! బృందావన ఋణం తీరిపోయింది. ఇక నీవు దానిని మరచిపో. నువ్వు ఇప్పుడు బృందావన వాసివి గావు. మథురాపురవాసుడవు. నందకుమారుడవు కావు. వసుదేవుసుతుడవు. యువరాజునన్నది మరువక గుర్తు తెచ్చుకో! నువ్వొక యువరాజువన్న సంగతి కూడా గుర్తు చేసుకో!”

చిద్విలాసంగా కృష్ణుడు నవ్వాడు. “అక్రూర మహాశయా! నేను బృందావన గోపాలుడను. గోపకుమారుడను. ఎవరెన్ని చెప్పినా, ఇది మాత్రం సత్యం. దీనిని మరువడం అసాధ్యం.” ఆ మాటకు ఆలోచించే అక్రూరుడు, సాలోచనగా కృష్ణుని చూసాడు. “ఈతని వల్ల యదువంశోద్ధారణ, జరుగుతుందా ? ఏమో! అది “అత్యాశ కాదు గదా!” అదే సమయంలో కృష్ణుడు మనమిక్కడ ఆగిపోదాం. తండ్రి గారు వచ్చిన తదుపరి అందరం కలసి మథురకు ప్రయాణిద్దామన్నాడు!

దాంతో బలరామునికి చిర్రెత్తింది. “కృష్ణా! ఏమిటి ఆగం, ఆగడం. ఇకనైనా వీటిని మానవా ? ముందుగా మనం వెడితే నగరాన్ని చూడవచ్చు. ఆ నగర సందర్శనంలో దాని ఆనుపాన్లు తెలుసుకోవచ్చును.” తన వుద్దేశాన్ని త్వరగా వెడితే వచ్చే లాభాన్ని కృష్ణునికి తెల్పిన బలరాముడు, కృష్ణుని తత్వం, శక్తి సామర్థ్యాలను తెలిసినవాడిగా, వివేకవంతుడై విషయాన్ని కృష్ణుని ముందు వుంచి, అతనిష్టం ప్రకారం నడచుకోవడం, మొదటినుండి ఒళ్ళు తప్ప బుజ్జి లేని బలరామునికి అలవాటు. పేరుకు తమ్ముడైనా కృష్ణుని ఆదేశం, బలరామునికి శిరోధార్యం.

బలరామునికి వత్తాసు పలుకుతున్నట్లు అక్రూరుడు “నువ్వు చెప్పింది సమంజసంగా వుంది.” అంటూ కంసుని పన్నాగం యాదవులకు వివరించి చెప్పాను. వారిని మిమ్మల్ని అనుసరించి, వెనుకన రమ్మన్నాను. మిమ్మల్ని నేను, నాయకుడిగా ముందు నడిపిస్తున్నాను. కనుక...

"అదేమిటి అక్రూరా! తెలిసి, తెలిసి యాదవుల నీ కుట్రకు ఎందుకు బలి చేస్తున్నారు ? తప్పు కదూ! అమాయకులు, అన్నెం పున్నెం ఎరుగని - కుట్రలు, కల్మషాలెరుగని వారినీ విధంగా ఇరికించడం పాపం కదూ! బలరాముడు అక్రూరుని ఆలోచన క్షంతవ్యం కాదన్నట్లు నిరసించాడు.

"నిజమే బలరామా! నువ్వన్నది అక్షరాలా నిజం. మా అమాయికత్వాన్ని లోకువగా తీసుకుని కంసుడు సంవత్సరాలుగా, తన కుట్రలు - కుతంత్రాలతో బలి తీసుకుంటున్నాడు. అతని ఆటలు కట్టించాలంటే యదువీరులు సింహాలై గర్జించాలి. యువకిశోరాలు పరమ మహేశ్వరులు కావాలి. అప్పుడే కంసుడు నాశనమౌతాడు. యదువంశం బ్రతికి బట్టగడుతుంది. లేదా..... యదువంశ ప్రాభవం గత కాలకీర్తి ప్రతిష్ఠలు, మాతోనే ముగిసిపోతాయి. ఆ తదుపరి చెప్పుకుందికే పనికి వస్తాయి తప్ప, ప్రకటించడానికేముండదు ?

"కంసుడెంతటి ఘటికుడో, అతని మంత్రి ప్రలంబుడు ఇంకా దూరదృష్టి కలవాడు. ఆతని వలే, మాకు ముందుచూపు లేకపోయింది. దాంతో యదు శ్రేణులలోని అంధకులు కంసునికి బాసటగా నిలిచారు. వారిలోని మహా శక్తివంతుడైన ప్రద్యోతుడు కంసునికి ముఖ్య అనుచరుడు. అంతఃప్రాణం. ఇప్పుడిక మాకు గతి, పతి, దారి - తెన్ను కరువయ్యాయి. అక్రూరుడు బాధపడుతున్నాడు. ఇప్పుడేం చెయ్యగలం. తప్పు జరిగిపోయింది. శత్రువు విజృంభిస్తున్నాడు. ఈ క్షణంలో యాదవులు - వీరులు, శూరులుగా, సింహాలు - మదపుటేనుగులుగా మారడం సాధ్యమా ?" అడిగాడు కృష్ణుడు.

అందుకే ధనుర్యాగం మిషతో అందర్నీ రప్పించిన కంసుడు, తను ప్రత్యేకించి నిర్మింపచేసిన ధనువందుకుని అల్లెత్రాడు బిగించి, నారిసారిస్తే.... ఏముంది ? అంతా పరుగులాట, వెదకులాట. చతికిలబడుట. ఇంతకుమించి జరిగేది, చేసేది ఏమీ లేదు.

అక్రూరుని మాటలను అందుకున్న బలరాముడు "ఇందుకు మమ్మ ల్నెందుకు పిలవడం ? మమ్మల్ని చంపడానికా ?" సమాధానం చెప్పలేక క్షణకాల మాగిన అక్రూరుడు శ్వాస దీర్ఘంగా పీల్చుకుని, గుండెలు చిక్కబెట్టుకుని

''అందుకే'' మెల్లిగా అన్నాడు. ముందు కృష్ణుని, ఆ తదుపరి నిన్ను సంహరించాలన్నది కంసుని దుష్ట పన్నాగమన్నాడు బలరామునితో "ఆకాశవాణి, నారద వాక్యాలు, వ్యాసుని దీర్ఘదృష్టి - కృష్ణుడిక్కడ నుండి నందయశోదల మధ్యకు మార్చబడడం కంసుని ఏమార్చడం వగైరాదులు తలచుకుని, తలచుకుని ప్రాణభీతితో, కంటికి నిద్దుర లేకుండా చస్తున్నాడా కంసరాజు'' చెప్పాడు.

కృష్ణుని జన్మవృత్తాంతం తెలుసుకున్న కంసుడు ఏదో రకంగా కృష్ణుని, ఆతనితో నిన్ను ఇక్కడకు రప్పించి తుదముట్టించాలన్న కుట్రలో భాగమే - ఈ ధనుర్యాగం. అందుకు మీకు ఆహ్వానం. నన్నుపంపి నమ్మకంగా తీసుకు రమ్మనడం, సత్యం తెలుసుకోవడానికి నందుని "కప్పం'' పేరున ఇక్కడికి రప్పించడం. అక్రూరుని మాటలలోని సత్యాన్ని -

అంతావిన్న కృష్ణుడు ఫక్కున నవ్వాడు. "బుద్ధిః కర్మానుసారిణి. విధి వంచితులను, మృత్యు బిలమందుకునేవారిని, ఆ కాలుడు, మహాకాలుడు, కాలకాలుడే కాదు, ఏ మహాదేవుడు గూడా రక్షించలేడు. పోగాలము దాపురించిన వాడి పిదపబుద్ధులు వాడినే బలి తీసుకుంటాయన్న సత్యం మరిచాడా మూర్ఖుడు'' చాలా ప్రశాంతంగా అన్నాడు. ఆ మాటలతో అక్రూరుడు విస్తుపోయాడు. మరుక్షణం నివ్వెరపాటు నుండి బయటపడి ''దేవుడు! దేవుడే, మానవుడు "మానవుడే'' ననుకున్నాడు. తృప్తిగా నిట్టూర్చాడు.

అప్పుడే కృష్ణుడు దృఢ నిశ్చయంతో "కంసుడు నన్నేం చెయ్యలేడు. నన్నిక్కడకు పిలవడం ద్వారా త్వర త్వరగా తన అంతిమయాత్రకు సిద్ధమౌతున్నాడు. ఒక్క కంసుడే కాదు, అతనికి సహకరించిన ప్రతి దుష్ట రాక్షసుడు సంహరించబడతాడు. ఇది తథ్యం - సత్యం కూడా! "చిలిపి కృష్ణునిలోని ధీరత్వానికి అవాక్కయిన అక్రూరుడు, ఈ కృష్ణుడు "నిజంగా స్త్రీ లోలుడు, వ్యసనపరుడు కాడు. ఆ బాలగోపాలాన్ని లాలించి పాలించి, నడిపించే మానసచోరుడు, మార్గదర్శకుడు. అప్పుడు జ్ఞానోదయమైనట్లు "కృష్ణం వన్దే జగద్గురుం'' అనుకున్నాడు. ఇది కృష్ణ లీలావిలాస తరంగిణికి మధురాతి మధుర దృశ్య భావనమని నిర్మల చిత్తం, నిష్కల్మష హృదయంతో, మనసులోనే అంజలి ఘటించుకున్నాడు.

అయినా కృష్ణమాయకు లోనయినట్లు ప్రవర్తిస్తూంటే "ఇదంతా నాకెలాగ తెలిసిందనుకుంటున్నారా, అక్రూరా! కులగురువులు గర్గాచార్యులవారు, మహర్షి సాందీపుల ప్రస్తావనలో విన్న విషయం. భయపడకండి. మీ బ్రతుకులు బాధలు, యదువంశ చరిత్ర, ఆ వీరుల దీనాలాపాలు నాకు తెలుసు." అంటూంటే...

"లేదు కృష్ణా! మేము పడ్డపాట్లు ఆ పగవారికి కూడా వద్దు. ఎంతటి దుర్భర జీవితమనుభవించామో! పరమపుణ్య, ధర్మాత్ముడను మహారాజు ఆ దుష్ట కంస కుమార యువరాజు చేత బంధిపబడ్డాడు. మాట్లాడటానికి మరో మనిషి లేకుండా నరక యాతననుభవిస్తున్నాడు.

నీ తల్లిదండ్రులు - దేవకి వసుదేవులు, పుణ్యాత్ములు, ధర్మాత్ములైన సాధు సత్పురుషులు, మహర్షి బృందములు, ముని కూటములు కంసుని చేతిలో పొందిన చేదు అనుభవాలు వర్ణించ నలవి కాని, అనుభవమే - ఆ కపటి - కపట, దురాచారవర్తన నడకకు సాక్ష్యం. ఆ ధర్మ నాశకుని -

"అక్రూరా! అవశ్యం అనుభవోక్తం కృతం పాపం శుభాశుభ"మన్న సంగతి నీవెరుగనిది కాదు. చేసుకున్న పాపమైనా, చెట్టుకున్న పండయినా, పక్వానికి రాకపోతే ఫలితాలననుభవించలేరు. కనుక ఊరడిల్లు. కాలమే - ఆ కంస మామకు తగిన పరిష్కారం చేస్తుంది. సమాధానమిస్తుంది. ఇన్నాళ్ళు ఓపిక పట్టిన వారు, కేవలం కొన్ని నాళ్ళు గడుపలేరా ? చీకటి పోయాక వెలుతురు. ఇది సర్వ సహజం."

కృష్ణుని పరిపక్వ మానసానికి, తన అస్థిరచిత్తానికి అక్రూరుడు, ఒక మూల సిగ్గుపడుతూనే, మరొకప్రక్క అంజలి ఘటించాడు. కన్నయ్య సమర్థతకు కనుల ఆనందమొందాడు. ఇంత తత్వం....! ఆశ్చర్యపోతున్న అక్రూరుని చూస్తూ - ఎంతో అందంగా హాయిగా, స్థిర నిశ్చయంతో, కృష్ణుడు నవ్విన నవ్వుకు అక్రూరుడు ఆనందమొందాడు. అందుకే కృష్ణుడు అందరికి ఆనందబంధువనుకున్నాడు. అప్పుడు కృష్ణుడు - అక్రూరా! నువ్వు నవ్వనంటే, నీకో విషయం చెబుతానన్నాడు.

"చెప్పు కృష్ణా! ఈ మధురభాషణలకు, నీ మధుర భావనలకీ ఇన్నాళ్ళు వేచి వున్నానన్నాడు. ధర్మం నాశనమవదు. ధర్మాత్ములు ఈ ధరణీతలానికి ఆధారమూర్తులు, భూతులు, అధర్మం పాతాళానికి ధర్మం అమర లోకాలకు

సాగేటంత ఔన్నత్యమూర్తి. దీనికోసమే, ఈ మానవులు సదాచార సంపన్నులు, సాంప్రదాయమూర్తులై నడుస్తున్నారు. తాత్కాలిక భోగాలు, నిజంగా క్షణభంగురాలు.

శాశ్వతం సత్యం - ధర్మం. సనాతనుడైన ఆ ఈశ్వరుడు.... అవునా ? జ్ఞానులు చెప్పేదిదే కదు. దీనిని తెలుసుకోవడం కోసమే కదా, అఖండ తపస్సు సర్వసంగ పరిత్యాగం, అడవుల పాలవడం, కాదా ? నోరు వెళ్ళబెట్టాడు అక్రూరుడు. "కృష్ణా!" కళ్ళు తేలవేసినట్లు ఆశ్చర్యపడి చూస్తుంటే -

"అవునా, కాదా ? చెప్పు" అడిగాడు కృష్ణుడు.

"నిజం" నిజాన్ని ఒప్పేసుకుని, శరణాగతుడై పోయాడు - ఆ - అక్రూరుడు.

"అక్రూరా! నేను వసుదేవుని కుమారుడైన వాసుదేవుడను కాను. "మరి" ఆశ్చర్యపోతూ అడిగాడు, అక్రూరుడు. అవును. నేను ఈ సకల భువన భాండాల్ని శాసించగల, అందు వశించు, "వాసదేవు"డను" నేను. అర్థమైందా. మాట మాటకు ఆశ్చర్యపోతున్నాడు. ఈ "బాల", "అల్లరి" కృష్ణుడనుకున్న అక్రూరుడు "సర్వ ధర్మాన్ పరిత్యజ్య" అనే శరణాగతునికి ప్రభువని గ్రహించాడు. "ప్రభూ!" అని కాకుండా "ప్రభో!" అని ఎలుగెత్తి పిలవడానికి సంసిద్ధుడౌతున్నాడు.

"అక్రూరా! నేను సామాన్యుడను కాను. అలాగని మాన్యుడనను. అందరు నా వాళ్ళే. అందరు నాలో వున్నారు తప్ప నేనెవ్వరిలోను లేను. ఈ సకల జీవులు, సర్వసృష్టి నా ఇచ్ఛా స్వరూపం. ఈ మొత్తం నాలో వుంది. కానీ నేనీ సృష్టిలో లేను. "ఆశ్చర్యపోతూ వింటున్న అక్రూరుని అజ్ఞానం తొలగిస్తున్నట్లు -

"అక్రూరా! గర్గాచార్యులవారు, నేను సమర్థ యంత్రాంగం కల్గిన సర్వ సమర్థుడనంటే, నాకేమి మంత్రాంగం, యంత్రాంగం వుందనుకున్నాను. కాని కాలక్రమంలో అది నిజమనిపించింది. ఇంద్ర భయాన్నుండి గోపకులను రక్షించడం, ఒక కారణమై వుంటుందనుకున్నాను. అలాగే చిటెకినవ్రేలిపై గోవర్ధనగిరి నెత్తడం, మరో అద్భుత లీలా విలాసమని నన్ను ఘనంగా పొగిడి, ఆకాశానికెత్తేసారు నన్నొక దేవుడిని చేసారు.

ఆ చిన్నికృష్ణుడు చెప్పే మాటలు, అక్రూరుని దిగ్భ్రమ పరుస్తున్నాయి. ఈ బాల, గోపాలకృష్ణుడు ఇంతటి ఘనుడు, శక్తివంతుడా ? ఎంత అజ్ఞానంలో, చీకటిలో వున్నానోననుకుంటున్న సమయంలో -

ఈ సర్వ సమర్థ సమ్మోహనారూపుడైన కృష్ణుని చుట్టూ, సూర్య - చంద్రులు, నక్షత్రాలు ప్రదక్షిణ నమస్కారాలు చేస్తున్నట్లు పరిభ్రమిస్తున్నాయి. కృష్ణుని మాటలు, చేష్టలు అనిర్వచనీయమైన ఆనందాన్నిస్తూ - పరమ పురుషుని దివ్య వాక్కులను స్ఫురింప చేస్తున్నాయి. కృష్ణుడు నవనీతచోరుడు కాదు. “నవ” యువత, జన మానసచోరుడు, అందరి హృదయాలలో సుస్థిరుడైన మానస మోహనుడు. ఆత్మానంద ప్రసాదుడు. దేవాధిదేవునిగా, జగన్నాధునిగా అందరిలో వశించే “వాస” దేవునిగా తలపించి, తపింప చేస్తున్నాడు.

వేలమంది సూర్యుల తేజం, అంతే వేలమంది చంద్రుల కాంతితో ప్రకాశిస్తున్నాడు. ఆ అద్భుత దివ్యశక్తి తేజోకాంతిని దర్శించలేక, ఆతని కళ్ళు మిరుమిట్లు గొల్పుతున్నాయి. ఒకవైపు కళ్ళు చిట్లించుకోవడం, మరొకవైపు - ఆ కళ్ళు మూసుకుపోవడం జరుగుతుంది.

అంతే! ఆ దివ్యపురుషుని దివ్యశ్రీచరణాలకు శిరసువంచి నమస్కరించాడు. అజ్ఞానం తొలగి, ఆ పరంధాముని గుర్తించినందులకు మురిసి పోయాడు. కానీ కృష్ణుడు, పెద్దవాడు, పుణ్యశీలుడైన ఆతన్ని వారిస్తున్నట్లు చేతులతో ఆతనిని పట్టుకున్నాడు. ఆ దివ్యస్పర్శలో అక్రూరుడు తనను తాను మరచిపోయాడు. తాదాత్మ్యం చెందాడు. ఆ దివ్య సహజస్థితిని నిజంగా తాను అనుభవిస్తున్నాడా? లేక భ్రమిస్తున్నాడా ? మధ్యలో మళ్ళీ ఇదొక సందేహం. ఇది సర్వాంతర్యామి, సర్వవ్యాప్తుడు, సర్వహృదయ - జీవ - సృష్టి నివాసుడైన ఆ లీలామానుష విగ్రహుని లీలా విలాసం. ఇది గ్రహించాలంటే, ప్రతి వ్యక్తి మూలాధారం నుండి ప్రారంభించి, సహస్రారంలో కొలువైతే, అక్కడ నెలవున్న ఆ పరమాత్మ, వాసుదేవుడై పరవశింప చేస్తాడు. తన శాశ్వత సన్నిధానాన్ని అనాయాసంగా, ప్రసాదిస్తాడు. దివ్యాత్ములుగా మనల్ని ప్రకాశింప చేస్తాడు.

అదే దైవలీల, లేదా శ్రీ“కృష్ణ” మాయ.

ఆ సమయంలో పవిత్ర యమునాజలాల వద్దనున్న పరమ ప్రశాంత ప్రదేశంలో, హాయిగా నీడనిచ్చే చెట్ల మధ్యకు వచ్చారు. అప్పుడు కృష్ణుడు "పెదనాన్న గారు, రథం దిగి, ఆ పరమ పవిత్ర యమునా జలాలలో స్నానమాడి, భగవంతునికి అర్ఘ్యమొసగి మరీ ముందుకు సాగుదామన్నాడు.

అక్రూరుడు - శ్రీకృష్ణ వచనానికి తలవూపాడు. గుఱ్ఱాలనాపాడు. రథం దిగారు. అప్పుడు బలరాముడు నాకు కొద్దిగా బద్ధకంగా వుంది. మరి కొంత నిద్రా స్థితిలో వున్నాను. మీరిరువురు వెళ్ళి స్నానం చేసి రండి. ఈ కాస్త విశ్రాంతితో నా అలసట తీరుతుంది. అప్పుడు కంసమామను ఎదిరించడానికి, ఆతని పరిజనాన్ని ఎదుర్కోవడానికి తగ్గ ఓపిక, శక్తి వస్తుందన్నాడు.

"నిజం, సోదరా! నీకున్న శక్తి మొత్తం ద్విగుణీకృతం కావాలి. ఆ ఘోరపాపులను తప్పక తుదముట్టించాలి" ఒప్పుకున్నాడు కృష్ణుడు.

అక్రూరుడు యమునా జలాలలో దిగాడు. మునక వేసాడు. ఆ కొద్ది సమయంలో, సర్వవ్యాప్తుడు, సర్వ హృదయవాస దేవుడైన, శ్రీకృష్ణుని ఆ క్షణంలో అక్కడ, అత్యాశ్చర్యకరంగా దర్శించాడు. ఇటుచూస్తే ఒడ్డున వున్న కృష్ణయ్య అటు చూస్తే దేవతాదులు, ఆదిశేషుడు, బ్రహ్మాదులు, ఋషులు, మునులు అందరు స్తుతిస్తుంటే శేషశయ్యపై లక్ష్మి సమేతుడైన ఆ పరంధాముడు - ఆ వేదవేద్యుడు కోరకనే దరిశనమిచ్చాడు. అప్రతిభుని చేసాడు. యమునా జలాలలో నల్లనయ్య. వర్ణించలేని అద్భుత దివ్యశక్తి రూపంతో, దేవదేవునిగా కనుపించే ఆ సర్వవ్యాప శక్తిని, వాసుదేవ "వాస" తత్వాన్ని అక్రూరుడు అర్థం చేసుకోలేక పోతున్నాడు.

"కృష్ణం వన్దే జగద్గురుం" అని అక్రూరుడు అనకుండా వుండలేకపోయాడు.

- స్వస్తి -

# అంధకుడు

**రా**నురాను కంసునిలో - అహంకార, కండకావరాలు, కుట్ర - కుతంత్రాల మధ్యలో; తెలియని ప్రాణభయం ఆవరించింది. తానెంత నిగ్రహించుకున్నా, తన గతకాల పాప దుశ్చర్యలను, కరకు - కాఠిన్య - దుష్ట - దుర్మార్గ రాక్షస కృత్యాలను భరించలేని, ఎదురించలేని యదువంశాల వారి నుండి, ఏ క్షణంలో- ఏ విధంగా ప్రమాదం ముంచుకొస్తుందో అర్థంకాక భయపడిపోతున్నాడు.

చాపక్రింద నీరులాగ, తనను ప్రతిఘటించలేని వారందరు నేడు తలలెగుర వేయ సంసిద్ధులౌతున్నారు. ఈ ఆలోచనల భయం క్షణక్షణానికి కంసుని కృంగదీస్తుంది. ప్రాణం పోవడం సహజమే. ఆ ప్రాణం పోతుందేమోనని అనుక్షణం పడే ఆవేదన, ప్రతి క్షణం ప్రాణగండమనిపించే పరిస్థితులలో బిక్కుబిక్కు మనడం, ప్రాణసంకటంగా తయారయింది.

ఎదిరించలేని యదువీరులు బలపడతల్చుతున్నారు. చిన్న చిన్న ఇరుగు పొరుగు రాజ్యాలవారు కూడా ధైర్యం కూడగట్టుకుంటున్నారు. శౌర్యం పుంజు కుంటున్నారు. ఇప్పుడొక్క మగధ సామ్రాజ్యాధిపతి జరాసంధుడు తప్ప ప్రస్తుత పరిస్థితిలో కంసుని ఆదరించి, ఆదుకునేవారు లేరు. జరాసంధుడు కూడా, తన కుమార్తెల సౌభాగ్యం కోసం, తను మెచ్చని యదువంశవీరుడైన కంసుని కడదాక కాపాడ దలిచాడు.

అందుకే దాదాపు మూడు వేలమంది పైగా మగధసేనలు మధురలో విడిది చేసి, కంసరక్షణకు తమ ప్రాణాలొడ్డ సిద్ధంగా వుంచాడు. ఒకప్పటి "ఆంతరంగికు డైన ప్రద్యోతుడు తన దురదృష్టం కొద్దీ, కంసరాజు అభిమానాన్ని కోల్పోయినా, ప్రస్తుత మాతనికి విశ్వాసపాత్రునిగానే కనిపిస్తున్నాడు.

ఇటు యదువీరులు, అటు "పుర" క్షేమాన్ని కాంక్షించే, "పురోహిత" పురహిత బ్రాహ్మణవర్గం కూడా కంసునిపై ఉదాసీనత చూపడం, కాలానికి తలవంచినట్లు యాంత్రిక జీవనం గడపడం చూస్తుంటే, వారంతా నివురుగప్పిన నిప్పువలెనున్నారన్న సత్యమర్థమౌతుంది.

ఇంతకుమించి, తానెంత ప్రయత్నించినా చావని దేవకి అష్టమ గర్భశిశువు, కంసునికి "కొరకరాని కొయ్య" అయ్యాడు. మనశ్శాంతి - నిద్రాహారాలకు దూరం

చేసి క్షణం క్షణం బెదిరిస్తున్నట్లు, హెచ్చరిస్తున్నట్లు భయకంపితుని చేస్తున్నాడు. నారదుని భవిష్యద్వాణి, ఆకాశవాణి హెచ్చరిక, అంతకుమించి, వేదవ్యాసులవారి వేదవాక్కు, దివ్యదృష్టి కంసునికి కడవూపిరి అయింది.

కృష్ణుడు. నిజానికాతడు "గో"పాలకుడు, గోపాలుడు - అతను చేసే ప్రతిపని, ఆ పిచ్చి నంద గోకుల గోపాల జనానికి మహామహిమలు, దివ్యానుభూతులు. కానీ, కానీ... దేవకి వసుదేవులతోపాటు మరికొందరు యాదవ ప్రముఖులు, ధర్మ - మహాత్ములు - "అవతారపురుషుడు" జన్మిస్తాడని - ఆతడు తప్పక దేవకి సుతుడైన శ్రీ కృష్ణుడేనని పిచ్చి ధైర్యం, అంధవిశ్వాసం. దానిని వమ్ము చెయ్యాలి. అప్పుడే నా మనస్సుకు శాంతి. ఇది కంస ఆలోచన.

పైగా - గర్గాచార్యుల వంటి యాదవకుల గురువు కూడా ఇలాగే మాట్లాడుతూంటే, యాదవులలో ధైర్యం పుంజుకుని, సమయానుకూలంగా ఎదురు తిరగాలనే దృష్టికి ~~ఈ~~ - యాదవ ప్రముఖులు వచ్చేసారు. ఇప్పుడు వారిలో, తనపై గల భయంకన్న, రక్షకుడైన కృష్ణునిపై గల ధైర్యం మిక్కుటమవుతుంది.

అందరి ఆశలను అడియాసలను చేయాలని కంసుడెంతో ప్రయత్నించాడు. అయినా ఫలితం శూన్యం. క్రూరుడైన కంసుడు - క్రూరుడు, దుష్టుడే. దేవుడైన కృష్ణుడు ఎప్పుడు దేవాధి దేవుడే అయ్యాడు. ఇప్పుడు తన తొందరపాటువల్ల ''కృష్ణుడు-'' దేవకి వసుదేవుల అష్టమగర్భ శిశువు ''నందయశోద''ల ముద్దుబిడ్డడన్న సత్యం, ఆనందమయమైంది. అతి త్వరగా లోకానికి అందుతుంది.

ఇప్పుడు కృష్ణుని ఏమీ చెయ్యలేడు. అందుకే ధనుర్యాగం పేరిట రప్పిస్తున్నాడు. మహామహుడవు, సర్వశక్తిమంతుడవని, అందరిముందు ప్రశంసించి, ప్రస్తుతించి - తన దుష్టరాక్షస - పీడా పిశాచగణంతో, కృష్ణుని మట్టుపెట్టి, అతనికి పీడయిన తాను, ఆతని పీడనుండి బయటపడాలని ప్రశాంతంగా వుండాలని తలుస్తున్నాడు.

కంసునికి అశాంతి తప్ప, మనశ్శాంతి, విశ్రాంతి కనబడటం లేదు. అనుక్షణం కృష్ణుని గురించే ఆలోచన. ఇప్పుడు - అక్రూరుడు బృందావనానికి వెళ్ళి వుంటాడు. ఆ పిల్లలు మధురకు రావడానికి సంసిద్ధులౌతుంటారు. రేపు తప్పకుండా ఆ పిల్లలు - రామకృష్ణులు, మధురకు వస్తారు. కనుక వాళ్ళెలాగ

వుంటారు, వాళ్ళు ఆలోచనలేమిటి ? ఆకార విశేషాలు, ఆనుపాన్లు గూర్చి ఆలోచనలనవసరం. వాళ్ళు అర్భకులు. ఈ కంసుని ముందు గడ్డిపరకలు. వాళ్ళును తలచుకుని, వాళ్ళ వీర విక్రమాలను భూతద్దంలో చూస్తున్నట్లు తలచుకుని భయపడటమనవసరం. కుర్రకుంకలు. ఈ కంసుని ముందరా వారి కుప్పిగంతులు, కొంటె చేష్టలనుకుంటున్నాడు.

ఒక మూల మనసుకు సర్ది చెప్పుకుంటున్నాడే కాని మనసుకు నిజమైన ప్రశాంతత లేక ఒక చోట కదలక మెదలక కూర్చునే స్థిరత్వము, చేసే పనిపై దృష్టి... ఎక్కడ కనబడటం లేదు. అశాంతి, ఆందోళనలతో వెర్రెత్తిపోతున్నాడతడు. ఈ స్థితిలో కంసునికి "జ్ఞాపకానికి వచ్చింది" ఆమె. ఆమె అందమైన సుందరాంగి. మేథావి. అద్భుత వ్యక్తిత్వంతో ఎటువంటి సమస్యలనైనా ఇట్టే పరిష్కరించగల విజ్ఞాని, వివేకి, జ్ఞాని-శ్రేష్ఠురాలు.

అనుక్షణం ఆమె సన్నిధానాన్ని ఆకాంక్షించే కంసుడు, వీరవిక్రముడై వచ్చిన తదుపరి ఆమెనుపేక్షించాడు. ఇప్పుడు ఈ జటిల - భయానక సమయంలో ఆమె సహాయమే, కాదు, కాదు... తోడు-నీడ, అండదండలు తప్పక కావాలి. అ ఆలోచన స్ఫురించినందులకు సంబరపడుతూ, అదృష్టవంతులను ఏ దేవుడు ఎదిరించలేడు, నిరోధించలేడని విర్రవీగుతూ, ఆమెకై కబురు పంపాడు. ఇక, ఇది తనకు యోగకాలంగా తలచి భ్రమించాడు.

అయినా ఆతని మనస్సు ఆగక, వార్తాహరుని అనుసరించాడు. రాజభవనాల శ్రేణిలో కల ప్రత్యేక భవనంలో వున్న - అందగత్తె - సకల కళావిలసిత "వరద"ను ముందు వార్తాహరుడు కలిసి, రాజశాసనం తెలుపగా ఆనందిస్తున్నామె, వార్తాహరుని అనుసరించి వచ్చిన కంస రాజేంద్రుని చూసి మహదానంద పడింది. అనురాగంతో ఎదురొచ్చింది. ప్రేమానురాగాల భామ, తన సోయగాలతో వయోపొంకాల అందచందాలతో కంసుని చెంతచేరింది. ఆతనిని తన ప్రేమతో గుచ్చి కౌగలించుకుంది.

ఆ సంఘటన కంసునికి ఆనందం కల్గించింది. "వరద" ప్రేమకు, ఆత్మీయతకు అనురాగాహ్వానానికి, తన సమస్యలన్నీ మరచి ప్రశాంత

చిత్తుడయ్యాడు. ఇక్కడ ఆనందం తప్ప ఏ విధమైన భయాందోళనలు చుట్టు ముట్టవు. దగ్గరకు రావు. అందుకే కంసుడు ఆమె చెంత చేరాడు. వచ్చిన వానిని బాహువుల్లో బంధించింది. తన ప్రేమతో ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆ సంఘటనతో కంసరాజు తనను తాను మరచిపోయాడు.

"వరద" ఆడింది, పాడింది. సేద తీర్చింది. అతనిని సంతోషచిత్తుడను చేసింది. దాంతో "వరదా! నీవు అద్భుతశక్తి సంపన్నవు, సౌందర్యరాణివి. ఆనంద ప్రదాతవు." అనగా "మీరు కారా ?" గువ్వలాగ ఆతని ఒడిలో కువకువలాడుతూ అందామె.

"చిలిపి" అన్నాడు దగ్గరకు తీసుకున్నాడు. వచ్చిన అదృష్టాన్ని జార విడుచుకోలేని ఆమె "తమ సాంగత్య ఫలమే కదా!" అంటూ లతలా అల్లుకు పోయింది. తీగలాగ బంధించింది. కేవలం ఆమె వేశ్య కాదు. పేరుకే వేశ్యకాని, ఆమె నర్తకి, విదుషీమణి. అసలు సిసలైన కళారాణి. మేధావి కూడా! అందుకే రాజా "మీరు సంతోషంగా వున్నారా ?" గోముగా, ప్రేమగా అడిగింది.

"నీ సన్నిధానంలో నాకు లభించేదదే కదా! నీ కన్నుల ఆదరణా; పెదవుల మధురిమ, బాహువుల ప్రేమబంధం, మమ్మనుగ్రహించే విధానం. సర్వదా ప్రశంసనీయం. ఆరాటపోరాటాల నడుమ నలిగిపోయే ఈ మానసిక అశాంతి, నీ సన్నిధానంలో ప్రశాంతి పొందుతుందని, ఎంతో విశ్వాసంతో వచ్చాను. దానిని నువ్వు నిజం చేసావని దగ్గరకు తీసుకున్నాడు. ఆమెలో తాను, తనలో ఆమె ఒక్కటయిపోయారు. అటువంటి సమయంలో, రాజా! నాకొక సందేహం, సమాధానమిస్తారా ? అని అడిగింది.

"తప్పకుండా, ఒక్కటి కాదు, ఎన్నిటికైనా" అంటూంటే, అవసరం లేదు. ఒక్కమాట చెప్పండి, చాలు" అంది. "అడుగు" అన్నాడు కంసరాజు. క్షణమాగి-

"రేపు దేవకి అష్టమ పుత్రుడు కృష్ణుడు మన నగరానికి వస్తున్నాడట కదా! నిజమేనా ? అంది. దాంతో కంసుని శరీరం బిర్ర బిగుసుకుపోయింది. ఏ భయం, బాధ నుండి బయటపడదలచుకున్నాడో, అది...., ఆ భయం, బాధ ఇక్కడ.... బాకులా మనసుకు తగిలింది. తోక తొక్కిన త్రాచుపాము కాటులాగ వణికిపోయాడు.

"వరదా!" ఆ స్వరానికి, అందులోని కాఠిన్యానికి బెదరిన వరద, నిజంగా

"వరదై"ంది. ఎవరు చెప్పారు ? ఆ ప్రశ్నకు, తలవంచుకుని దిక్కులు చూస్తూ "అందరు అనుకుంటూంటే విన్నాను. అంతకుమించి నాకేమి తెలియదు" ఆకులా వణికిపోతూ చెప్పింది.

"నువ్వతన్ని చూడాలనుకుంటున్నావా ?" తను కూర్చున్న మంచం పైనుండి లేచాడు. మొహంలో రంగులు మారాయి. ఆ దేవకి అష్టమ సంతానాన్ని చూడాలనుకుంటున్నావా.... లం..... జా..... ?" పగ, కసి, ద్వేషం మానవత్వం మరచిన ఆ కసాయి, సభ్యతా సంస్కారాలు మరచి మరీ వదిరాడు. మళ్ళీ.... లం.... ఎక్కడికి పోతుంది - దాని బుద్ధి, లక్షణం ?" అనుకుంటూ తోక త్రొక్కిన త్రాచులా బుసకొడుతూ అక్కడనుండి కదిలాడు. భయంకర నేత్రాలు, రక్త స్వరూపాలై..... చూసేవారి గుండెలు మండిస్తున్నాయి. "పిండి" చేస్తున్నాయి.

"దేవకి.... అష్టమ గర్భ శిశువు..." హహ్హాహ!" అనుకున్న మరుక్షణం -"అవును. వస్తున్నాడు. అందరు అనుకున్నట్లే కంసుని, కంసరాజును, వేలాది ఘాతుకాలు చేసిన పరమ దుర్మార్గుని, చంపడానికి వస్తున్నాడు. చూద్దాం! ఏం జరుగుతుందో, ఆ కృష్ణుడెలాగ వుంటాడో, ఈ కంసుని స్థితి - గతేమిటో ?!"

ఇటువంటి అసహనస్థితిలో కంసుడు, సేనాధిపతి ప్రద్యోతునికి, మగధ యువరాజు వృత్రఘ్నునకు కబురు పంపాడు. వాళ్ళు వస్తూనే కంసరాజును చూసి కంగారు పడిపోయారు. వారిచూపులను ధిక్కరిస్తున్నట్లు కంసుడు -

ప్రద్యోతో, వృత్రఘ్నా! ఏం జరిగింది ? ఎలాగ జరిగింది ? కృష్ణుని.... దేవకి అష్టమ పుత్రుని రాక.... లోకానికి ఎలాగ వెల్లడైంది. ఎవరు చెప్పారు ? ప్రశ్నిస్తున్నాడు. బాధ్యులను చెప్పమని కోరుతున్నాడు ప్రద్యోతుడు -

"కంసరాజా! మీరు క్షమిస్తానంటే నేను సత్యం చెబుతాను!" ఎంతో మెల్లిగా, సన్నగా అన్నాడు.

"చెప్పు!" కంసుని ఆదేశం. ఆ ఆజ్ఞకు తలవంచుతూ ప్రద్యోతుడు-

"రాజా! క్షమించండి. ఆ రోజు నిండుసభలో ప్రముఖుల సమక్షంలో మీరే వెల్లడించారు. వసుదేవుని నిందించి, అక్రూరునితో - గతం క్షమిస్తున్నట్లు చెప్పి దేవకి - కృష్ణుని - ఆతని సోదరుడనబడు - తోక బలరాముని తోడ్కొని

రమ్మన్నారు. అది బహిరంగ రహస్యమయింది. మధురానగరి మూలమూలలకు రహస్యం - రహస్యంగానే వ్యాపించి, వ్యాప్తి చెందింది.

"సరి. సరి. నీకో హెచ్చరిక. అతి జాగ్రత్తగా, భద్రంగా దానిని నిర్వర్తించాలి. ఎటువంటి పరిస్థితులలో దేవకి అష్టమ సంతానం ఈ రాజభవనంలో అడుగు పెట్టరాదు. ధనుర్యాగ మహోత్సవం, ప్రారంభించడానికి ముందే ఆ కృష్ణుడు, ఈ యాగశాలలో అడుగు పెట్టకుండానే అంతమొందాలి. ఇందులో జరిగే అలక్ష్యం నీకు, నా ఆజ్ఞను ఖాతరు చెయ్యనివారికి ప్రాణ సంకటం! జాగ్రత్త!" ఆ హెచ్చరికను గట్టిగా హెచ్చరిస్తూ మరీ హెచ్చరించి చెప్పాడు.

"మీ ఆజ్ఞ!" అన్నాడు. అప్పుడు ఆ ప్రద్యోతుని చూస్తూ కంసుడు "ఏవిటి, నీవు గతంలో వలె కనబడటం లేదు. ఏమయింది ? ఏమొచ్చింది ?" అడిగాడు.

"అబ్బే. నేను గతంలో వలె బాగానే వున్నాను!" అన్నాడు. కాకపోతే వయసు పైబడుతుంది. ఓపిక తగ్గుతుంది. ఈ ఉత్సవ ఏర్పాట్లు వలన కొంత అలసట కల్గి, మీకు అలాగ కనిపించి వుంటాను!" తలదించుకునే పెదవులపై వెఱ్ఱినవ్వు చిలికించుకుని, మరీ విన్నవించాడు.

"జాగ్రత్త! ప్రతి ఒక్కరిపై నిఘా వుంచండి. సమర్థులైన వేగులను నియమించండి. ప్రద్యోతా! నీవాళ్ళు..... అదే నీ సోదరులు నాకు విధేయులే! అని వృత్రఘ్నుని వైపు తిరిగి 'నీ మనుషులను సమర్థవంతంగా, మన నాయక, ఉప, యువ నాయకులపై తమ దృష్టిని వుంచమను. ఎక్కడ ఏం తేడా వచ్చిన వారిని కాదు. వారి మృతకళేబరాలను నాకు చూపాలి. తన మన భేదం లేకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలి. ఇది కంసాజ్ఞ! ఏ మాత్రం తేడా వచ్చినా నా వాడి కరవాలానికి, తలలు, తాటిపండ్లువుతాయని మరచిపోకండి!" కటువుగానే కంసుడు హెచ్చరిస్తున్నాడు.

ఈ యాదవ నాయకులు, ఆ కృష్ణునితో కలిసి నన్ను తుద ముట్టించాలని చూస్తున్నారు. అది అసంభవం. వారి ఆశలు అడియాసలు చెయ్యాలి. మనమే ఒక అడుగు ముందుకువేసి వారి ఆలోచనల్ని భగ్నంచేసి - వారిని అంతం చెయ్యాలి. కంసరాజు పగ - శక్తి సామర్థ్యాలు ప్రతి ఒక్కరు అనుక్షణం

గుర్తుంచుకోవాలి. శాశ్వత జీవిత శిక్షను, మన శత్రువులు రుచి చూడాలి!''

ఇలాగ కంసుడు హెచ్చరిస్తున్న సమయంలో "జయం జయం కంసరాజా!'' అంటూ ఆంతరంగిక భటుడొకడు మందిరం ప్రవేశించి, వినయంగా నిల్చున్నాడు. ఏమిటన్నట్లు చూసిన కంసుని చూపులకు భటుడు, తలవంచుకుని, బాహుకుల వారు మీతో అత్యవసర సమావేశానికి వచ్చారని చెప్పాడు.

ఆ బాహుకుడు తొంభై ఏండ్ల వృద్ధుడు. యదువంశ - శాఖలోని - అంథక వంశీయుడు, ప్రద్యోతుని పిన తాతగారు. ఇప్పుడీయన ఎందుకు వచ్చాడు. ఈ ముసలినక్క, ఎంతటి వంశపెద్దయినా... కంసుడు ఆయనను చూడటం ఇష్టం లేనట్లున్నాడు - అప్పటికే బాహుకులవారు, కంసుని వద్దకు వచ్చేసారు.

ఈ సమయంలో ''తమరు'' పెద్దరికాన్ని గుర్తిస్తున్నట్లు కంసుడు, ఆశ్చర్యంగా అన్నాడు.

"అదిసరే. వీళ్ళెవరు ? ఈ సమయంలో వీళ్ళకిక్కడేం పని. వాళ్ళనోసారి చూసాడు. వాళ్ళు - ఒకడు ప్రద్యోతుడు. మరొకడు మగథ యువరాజు...... మీరా ? అనగానే ఆ పెద్దాయన, కంసుడు బాహుకుల వారిని కూర్చోమని అభ్యర్థించాడు.

"మీ ఆజ్ఞ తెలుసుకోవచ్చునా ? ఎంతో వినయంగా కంసుడు అడుగుతున్నాడు.

''ఆదేశాలు కావు. ఈ''దేశాన్ని'' రక్షించే నా ఆఖరి సలహా విను. అదివ్వడానికే వచ్చానన్నాడా పెద్దాయన - వృద్ధ - బాహుకుడు.

"చెప్పండి!'' అర్థిస్తున్నట్లే కంసుడడిగాడు.

"అక్రూరుడు, వసుదేవుని పిల్లలను తీసుకురావడానికి వెళ్ళాడు కదూ ? వాళ్ళు రేపు ఉదయానికి - ఈ నగరానికి వస్తారు. ఔనా ?'' బాహుకుని ప్రశ్నకు ఔనని కంసుడు సమాధానమిచ్చాడు.

"జన్మతః నీకున్న లక్షణం - చెప్పింది వినకపోవడం వద్దనది, చెయ్యడం! వాళ్ళ నుండి తప్పించుకోవాలని, అదే నీ నుండి శాశ్వతంగా దూరం చెయ్యాలన్నది కదా నీ వుద్దేశం ? అవునా ?''

"అబ్బే. అలాగెందుకు చేస్తాను. వాళ్ళను చంపితే నాకేమొస్తుంది ? బొడ్డూడని ఆ పిల్లలు నన్నేం చెయ్యగలరు ? తొట్రుపడుతూ చెప్పాడు.

"కంసా....... కాస్త కంగారుపడకు. నారదుని వాక్యం, ఆకాశవాణి హెచ్చరిక నిన్ననుక్షణం భయపెట్టడం లేదా ? అందుకే కదా - దేవకి వసుదేవులను చెరబట్టావు ? ఇంకా నన్ను మభ్యపెట్టకని'' - క్షణమాగిన ఆ పెద్దాయన "కంసా! నా మాట విను. మనం మంచివాళ్ళమైతే మనల్నెవరు, ఏమీ చెయ్యరు.

ఎవరో ఏదో అన్నారని, మన బ్రతుకు మనమే బండలు చేసుకోవడం తగదు. అలాగే నిన్ను నీవు మృత్యువుకు అప్పగించుకుని, మాకు తీరని బాధ, ఆరని అగ్ని కల్పించకు. మమ్మ ప్రశాంతంగా, మరణించనివ్వు... వేడుకొంటు న్నారు. అందులో ఇటు హెచ్చరిక, అటు అభ్యర్థన - రెండు కలిసి వున్నాయి.

"అందరు సత్యమనే దానిని, నేను అబద్ధం చెయ్యగలను, అది నాకు సాధ్యమే!'' తెగేసి పెంకిగా సమాధానమిస్తున్న కంసుడినోసారి చూసి -

"కంసా! పశ్చాత్తాపము "మరణము''. అదే పునర్జన్మ. పశ్చాత్తాపముతో సర్వపాపాలు ప్రక్షాళిత మౌతాయి. ఇంతవరకు నీవు చేసిన ఘాతుకాలకు కనుక నిజంగా పశ్చాత్తాపమొందినట్లయితే, నీవు - నీ జన్మ - ధన్యము. అదే పాప పరిహారము. మాకు కైవల్యదాయకం. నిజం'' వృద్ధ బాహుకుని మాటలకు అడ్డొస్తున్నట్లు - కంసుడు -

"అదెలాగ నమ్మడమంటాడు. అతనే మరల - "నేను ఎందరినో చూసాను. పశ్చాత్తాపమొందడం, ఆ తదుపరి... అటువంటి అభాగ్యులను, మాట తప్పిన దుర్మార్గులను ఎందరినో చూశాను!'' అన్నాడు.

"కంసా! మన పశ్చాత్తాపంలో కనుక నిజం లేక స్వార్థ - మోసపూరిత - కల్మష దాయకమైతే, ఫలితం నువ్వు చెప్పినట్లు - నిజంగా అలాగే వుంటుంది. ఇక్కడ మనం ఆలోచించాల్సింది - ప్రవేశపెట్టాల్సింది మన ధర్మం. అది మానవ లక్షణం. నిజానికి వసుదేవ సుతుడు దేవుడైనా, కాకపోయినా మనకే విధమైన భయం లేదు. అతనెవరో తెలుసుకోవలసిన అవసరం వుండదు. అప్పుడు మన మంచితనమే, మన ప్రజలకు విశ్వాసమై మనల్ని సదా కంటికి రెప్పలా కాపాడతారు. ఎటువంటి ఆపదల నుండైనా

బయట పడేస్తారు. మనమంచితనాన్ని అర్థం చేసుకున్న మన ప్రజలు మనకై పరితపిస్తారు. తపిస్తారు. అప్పుడు శత్రువు వాడెంతటి బలవంతుడైనా, మన నగర పొలిమేరలలో కూడా అడుగు పెట్టలేడు!'' అంటూంటే-

"నేను పశ్చాత్తాపమెలాగ ప్రకటించాలంటారు ?'' కంసుడడిగాడు.

"నువ్వు నోటితో అడుగుతున్నావే కాని - నొసటతో వెక్కిరిస్తున్నావు ? ఫర్వాలేదు - మీ వంశ పెద్దగా, నీ శ్రేయోభిలాషిగా సద్ధర్మ మార్గం చెబుతాను. దాని నాచరించు, తరించు'' మంటూ వృద్ధ బాహుకులు -

"కంసా! దేవకీ వసుదేవులను, ఇటు బాంధవ్యం, అటు మిత్రత్వం కూడా విడిచి, మరిచి - మరీ హింసించావు. యాదవులను బానిసలను చేసావు. మధురలోని పురోహిత వర్గాన్ని నిర్లక్ష్యం చేసావు. నిత్య కల్యాణ పచ్చతోరణాలతో, శోభాసుఖమూర్తియై ప్రకాశించవలసిన "మధురానగరిని'' స్వర్గం నుండి - నరక సామ్రాజ్యానికి రాజధానిని చేసావు.

ఎంతో బుద్ధిమంతుడిగా - ఇప్పటికైనా వింటాడని తలచిన - అంధక వంశ - వృద్ధ బాహుకులవారిని ఎత్తి పొడుస్తున్నట్లు... "అలాగా...!'' అని వ్యంగ్యంగా మాట్లాడాడు. దాంతో - ఆ పెద్దాయనలో కోపం చోటుచేసుకుంది.

కళ్ళు ఎర్రబడ్డాయి. అగ్నిగోళల్లా వారి కళ్ళు మెరుస్తున్నాయి. పట్టలేని కోపంతో గొంతు పెద్దదయింది. స్వరం కాఠిన్యమొందింది. ఇక చెప్పవలసినది నిర్మొహమాటంగా, నిష్కర్షగా చెప్పదల్చుకున్న ఆ వంశ పెద్ద -

"ఓ కంస యువరాజా!'' అంటూ మొదలుపెట్టాడు. "మా రాజ్యాలు, మా సీమలు, మా స్వతంత్రాధికారాలు మావి మాకిచ్చేయి. కొల్లగొట్టిన సంపదలు, స్వాతంత్ర్యము మాకు కట్టబెట్టు. దేవకీ వసుదేవులను, వారి సంతానాన్ని గుర్తించవలసిన పద్ధతిలో వారిని గౌరవించు. అనవసర శత్రుత్వం రగిలించి, ఆ రగిలించిన అగ్నిలో మిడతవు కాకు.

మధురను విడిచిన వార్ని తిరిగి రమ్మనమని ఆహ్వానించు. వారి సంపదలు వారినే అనుభవించమను. ధన - మాన - ప్రాణాలు పోగొట్టుకున్న కుటుంబాలవార్ని ప్రేమించి, లాలించు. జరిగిన తప్పిదానికి తగువిధంగా స్పందించి - రక్షణను

ప్రసాదించు. మహారాజు ఉగ్రసేనులవారిని, వారి రాజ్యము నిర్వహించుకోనివ్వు. యువరాజుగా - సకల ధర్మ - సద్ధర్మమూర్తివై వెలుగొందు.

విదేశీ సేనలను దూరం చెయ్యి. వారి భయం, పీడల నుండి ప్రజలను సుఖంగా బ్రతకనివ్వు. వూపిరి ప్రశాంతంగా పీల్చుకోనివ్వు. యజ్ఞయాగాదులు కొనసాగచెయ్యి. వేదమూర్తులను, పెద్దలను, ప్రముఖులను, ధర్మపుణ్యాత్ములను గౌరవించి, పూజించు. వారి సలహామేరకు, ఈ రాజ్యాన్ని స్వర్గధామం చేసి, సర్వులకు - ఆదర్శమూర్తివై "విరాజిల్లు!" చెబుతున్నాడు.

అంతా వింటున్న కంసుడు "అయితే నేను పశ్చాత్తాపంతో కరగి, నన్ను కడిగి, పరిశుద్ధుడనవ్వాలి. అంటే మీ వుద్దేశంలో నేను పాపాత్ముడను, పరమ దుర్మార్గుడను, ప్రజాద్రోహిని.... ఇప్పుడు నన్ను నేను సంస్కరించుకోవాలి. ఆహా... భలే భేషుగ్గా వుంది. మీ సలహా - సమాలోచనా బోధ... ?!"

"నిజం. నా మాట విను. మన పుణ్యాపాపాల ఫలితంగా లభించిన సంస్కార ఫలమే సజ్జన సాంగత్యం. సద్ధర్మ ప్రవేశం. ఇటువంటి రాజును - ఆ దేవతలు కూడా తేరిపార చూడలేరు. ప్రమాదాలు కల్పించరు. దీనివలన నీవు, మన యదువంశం, అందలి వీర - శూర - ప్రముఖులు రక్షించబడతారు..!" అంటూ-

అప్పుడు కృష్ణుడు నిజంగా దేవుడైతే తప్పక నిన్ను కరుణిస్తాడు - కాదంటే ఏమీ చెయ్యలేని అసహాయతతో తన దారిన తాను పోతాడు. నా మాట మన్నిస్తావా ? ఈ రాజ్యనాశనం, ప్రజా వినాశనం తప్పిస్తావా ? మా కళ్ళముందే మా ఆశలు పేకమేడలై కూలిపోకుండా సంరక్షిస్తావా ?, ఎంతో ఆశగా, ప్రార్థిస్తున్నట్లు, అంతటి వృద్ధ వీరుడు, కంసుని కరుణించి సంస్కరించుకోమని ఒక ప్రక్కన - మరొక ప్రక్క రాజ్య - ప్రజా వినాశనానికి తలపడవలదని అభ్యర్థిస్తున్నాడు.

అంతావిన్న కంసుడు ఆలోచనలో పడ్డట్లు సాలోచనగా - "ఓ దయామయా, నాకు కొంత సమయమిమ్ము! ఇప్పటికిప్పుడు నీకు నేనే విధమైన మాట ఇవ్వలేను. మీకు మాటివ్వాలన్నా, చెల్లించిన వాగ్దానము నిలుపుకోవాలన్నా, నాకు కొంత సమయం కావాలి. నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి!" ఆ మాటల తీరులో

ఏదో శ్లేష కలిగి వుంది. దానిని భరించలేకపోయిన - ఆ వృద్ధ పితామహుడు.

"కంసా! నువ్వు మాకు పిల్లవాడివి. అందుకే ఇంకా పిల్లవాడిగా, మమ్మొక వృద్ధ సిద్ధాంత మూర్ఖునిగాను తలుస్తున్నావు. ఇన్ని సం॥ల జీవితానుభవంలో, ఈ సత్యం తెలుసుకోలేని మూర్ఖుడను, అసమర్థుడను కాను. నేను అజ్ఞానిని కాను, అసలైన అజ్ఞానివి, మూర్ఖుడవు నీవే!

ఇప్పుడు - ఆ పెద్దాయన - పగిలే అగ్నిపర్వతమైపోయాడు. క్రోధమనే లావా ఎగిసి, ఎగిసి చిమ్ముపోతుంది. అది యదువంశ నాశకంగా తయారౌతుంది. తప్పదు. అదీ అప్పటి పరిస్థితి.

అయినా పెద్దాయన వూరుకోలేదు. చివరిగా "కంసా! నీకొక హెచ్చరిక. నీవు వద్దన్నా చెప్పక తప్పదు. ఇప్పుడు అందరిలో అగ్నిపర్వతం, అంతరాంతరాలలో కుతకుత వుడుకుతుంది. అది బ్రద్దలయి, అగ్నిశిఖల లావా చిమ్మితే, ఈ మధుర, మీ ఆగడాలు, అకృత్యాలతో ఎంతో చరిత్ర ప్రాభవం కల్గిన - ఈ రాజ్యం - సర్వనాశనమవక తప్పదు. ఆ ప్రళయం రానివ్వకు!

ఇక నా ఆఖరి మాటగా కళ్ళు తెరు...

"కృష్ణుడు సామాన్యుడు కాడు. జగద్రక్షకుడు. జగత్పిత. ఇంద్రుని నిరోధించడం, బ్రహ్మనెదిరించడం, చిటెకెన వ్రేలిపై గోవర్ధనగిరిని నిలపడం, మహా మహా.... నువ్వాశపెట్టుకున్న దుష్టదానవులను నశింప చెయ్యడంలో - పాలు త్రాగే వయసులో పూతన, శకటాసుర, తృణావర్తులను మట్టిగరపించడం, ఆ పరమాత్మకే సాధ్యమైన చేష్టలు - లీలలు. ఎందరి ప్రార్థనల ఫలితంగానో, ఎవ్వరు పొందలేని సన్నిధి, సాంగత్య - ప్రేమ - మమకారాల - అనుభూతులను, అటు నంద ప్రజలు, నందయశోదలు పొందారు. కాబట్టి....

కృష్ణుని సామాన్యునిగా తలవకు. ఆతడు ప్రాణ రక్షకుడు, శిక్షకుడు కూడా! ధర్మ సంస్థాపనార్థం వెలసిన దేవదేవుడు. "కృష్ణుడు మరణించడమంటే యదుకుల నాశనమే! ఆ విషయం మరచిపోకు.'' చెబుతున్న బాహుకునితో -

"పెద్దవాడిగా నీకు నమస్కారం. నా ఆలోచన నాది. మీరు చెప్పినవన్నీ విన్నాను. నా నిర్ణయం తీసుకుంటాను. అనవసరంగా నన్ను బెదరించి, భయపట్టాలని మాత్రం తలువకండి. నా మంచిని నన్నాలోచించుకోనివ్వండి.

"మంచిది. శంకరుని మూడోకన్ను నిన్ను దహించకుండా, నీ జాగ్రత్తలను నువ్వు తీసుకో. నీతోపాటు మమ్ము మలమలమాడిపోకుండా చూడు." ఇందులో బాహుకుల అభ్యర్థన వుంది. హెచ్చరిక వుంది. శంకరుని కోపం.... అనేసరికి .... కంసుడు రెచ్చిపోయాడు.

"చూడండి. ఈ దేవుళ్ళకు, దిక్కులేని వాళ్ళ కోపాలకు నేను భయపడను" అనగానే "నిజం. మూర్ఖుల మనసు రంజిపలేమన్నట్లు, అధర్మపరుడైన ప్రభువును తమ ప్రజలు రక్షించుకోలేరు. అతని దుర్మార్గాలకు దైవ కోపానికి అన్యాయంగా వీరు బలయిపోతారు.

బాహుకుని మాటలిక ఏ మాత్రం వినదలచుకోనట్లు కంసుడు నవ్వుతూ "ఒక్కక్షణం ఆగండి!" సర్వంసానుకూలమౌతుంది. ఆ వెంటనే వృత్రఘ్నుని పిలిచి ఏదో రహస్యంగా చెప్పాడు. అతను కదిలాడు. ఇప్పుడు ప్రద్యోతుని పిలిచాడు. అతని ఎదురుగా -

"మహావీరా! నా మాటనమ్ము. నా వలన కృష్ణునికి ఆపదరాదు. నేనేమీ చెయ్యను. ప్రద్యోతుడు ఆ జరిగేదంతా గమనిస్తుంటాడు. అనగానే చాలా సంతోషమని బాహుకుడు, మీ ఆజ్ఞని" ప్రద్యోతుడు చెబుతాడు. ఆ మరుక్షణం, ప్రద్యోతునితో - "ప్రద్యోతా! నా శాసనం గుర్తుంది కదా! ఆతడు, అదే.... ఆ గొల్లపిల్లడు నా ఎదుట పడరాదు, నా ఆజ్ఞ ధిక్కరించరాదు!" జాగ్రత్తగా, చూసుకో!" అంటాడు. "అల్లాగే ప్రభూ" అంటాడు ప్రద్యోతుడు. అతడు అడుగు కంసుని గదినుండి బయట పెట్టాడో.... లేదో.... కత్తుల రాపిడి, అవి క్రిందబడ్డ శబ్దం, ఎవరివో అడుగులు, ఎవరిదో మూగవేదన వంటి ఆక్రందన, బాధాకర అరుపు" విన్నాడు. వెనుదిరిగాడు. రక్తం కారుతుంది. ఎవరో ఇద్దర్ని చేతులపై మోసుకుపోతున్నారు. అంతే. ప్రద్యోతుడు కళ్ళు తిరిగి క్రిందపడ్డాడు. ధనేల్మని క్రిందపడ్డ కత్తి శబ్దం. ఆ దృశ్యం అతన్ని కృంగదీసింది. నీరు గారిపోయాడు.

# అష్టవంకరుల "వక్ర" త్రివక్ర

**కం**సుని కొలువు కూటంలోని సేవికులలో "త్రివక్ర" ఒకత్తె. కంసునికి కావలసిన పువ్వులు, పరిమళ సుగంధద్రవ్యాలు తెచ్చి కంసరాజుకివ్వడం, ఆమె ప్రధాన బాధ్యత. అంతకు మించి ఆమెకు మరోపనిలేదు. ఆమె తక్కువది కాదు. ఆమెకు ఎందరో సేవకులున్నారు. అందరు ఆమెకు - సుగంధ ద్రవ్యాల లేపనాల తయారీలో, కావలసిన వస్తు సేకరణలో తలమున్కలైన సిద్ధహస్తులు - పరిచారకులు. వంశపారంపర్యంగా వస్తున్న సాంప్రదాయాన్ని ఆచరిస్తూ రాజసేవలో తరిస్తున్నది - అష్టవంకరుల వక్ర - "త్రివక్ర".

మొదట్లో ఎంతో అందంగా వుండే ఆమె, పన్నెండవ సం॥లో వచ్చిన వ్యాధి వలన శరీర భాగాలు కృంగి, అందం పోయి, అనాకారిత్వం - అంగవైకల్యం కల్గించి ఆమెను "వక్ర-త్రివ"క్ర'ను చేసింది. ఆమె అనారోగ్యానికి ముందు కంసరాజు సభలోని అత్యున్నత పదవిలో వుండే మహారథుడు కుమారుడు అంగారకుని వివాహం చేసుకుంది. దురదృష్టం ఆమెను వెక్కిరిస్తూ ముందు అనారోగ్యం, ఆ తదుపరి అంగవైకల్యం రావడంతో, భర్త అంగారకుడు ఆమెను వదిలేసాడు. తనపై భగవంతుడు చూపిన చిన్న చూపుకు, కుమిలి, కుమిలి, కృంగి కృశించి కొన్నాళ్ళు ఏడిచింది.

చావడం చాతకాని త్రివక్ర, బ్రతకడం తప్పదని, అలాగే జీవితాన్ని ఆనందం కొనితెచ్చుకుని, తన ద్వారా కొందరికి ఆనందం, మరికొందరికి, సరదాల చప్పట్లు ముచ్చట్లు కల్గిస్తూ - అవతలి వెక్కిరింతల కేరింతకు వెఱువకుండా, వున్న బ్రతుకును, అంతం చేసుకోలేని అతి దీనాతిదీనావస్థలో, అందరికి ఉల్లాసం కల్గిస్తూ - ఉత్సాహం నింపుకుని మరీ బ్రతుకు నడుపుతూ, గడుపుతూ బ్రతుకుతుంది.

జన్మించినప్పుడామెపేరు మాలిని. కాలం ప్రసాదించిన గాయంతో ఆమె "తివక్ర" అయింది. అందంతోపాటు కంసరాజు కూడా ఆమెను చూసి చమత్కరించేవాడు. హాయిగా వ్యగ్యంగా నవ్వుతూ పలుకరించి, పరవశించేవాడు.

వారందరు గుండెనిండా నవ్వుకుంటూంటే తన జన్మ ధన్యమైందని తలచేదామె.

మెడవంకర్లు పోయినా, వదనం "అరవిందం" శరీరం వంకర్లు తిరిగినా సౌకుమార్యం, ఆమె స్వంతం. మోకాళ్ళు బిగిసుకుపోయినా, నడక అద్భుతంగా ఆనందదాయకంగా వుండేది. అందుకామె పరవశించి ఎవరికి లేని అవక్ర అందం, త్రివక్రయైన తనకు లభించినందులకు మురిసిపోయేది.

తన నమ్మకం తనది. తన ఆనందం తనది. తన విశ్వాసం తనది. అందుకనే ఎవర్ని లక్ష్యపెట్టేది కాదు. నిరాశా నిస్పృహలకు తగుల్కొనేదికాదు. అంతటి ఉత్తమురాలా పిల్ల, ఒకనాటి - అంగారకుని ఇల్లాలు. బాధపడాలని అద్దంలో చూసుకునేది కాదు. పరుండేటప్పుడు, పరవశించి, తన గత అందాన్ని తలచుకుని మురిసిపోయేది. అంతటి స్థిరచిత్త - ధీరవనితామె.

అయితే తన దురదృష్టాన్ని తలచుకుని అప్పుడప్పుడు బాధపడేది. ఇటువంటి దురదృష్టం మరెవ్వరికి రాకూడదని, ఆ భగవంతుని అనుక్షణం ప్రార్థించేది. ప్రశాంత జీవనం ప్రసాదించమని కోరుకునేది. ఇలాగ సం॥ల తరబడి తన బాధను మరచిపోతూ, లోక క్షేమం దృష్ట్యా జీవితం గడిపే తివక్ర, మూడురోజుల క్రితం, మహామహుడు దేవదేవుడైన దేవకి అష్టమ సంతానమైన కారణజన్ముడు కృష్ణుడు మధురానగరికి వస్తున్నాడని తెలిసి, సంరక్షకుడు, జగద్రక్షకుడు, తనను కరుణిస్తాడని తలచింది. కరుణించమని మనసులోనే ప్రార్థించుకుంది.

అప్పుడే తివక్ర "నంద కుమారుడు" బృందావనం నుండి వస్తున్నాడని వింది. అతనిని కంసరాజు కడతేర తలిచాడని తెలిసి భయపడింది. అయినా ఆ భగవంతుడు, ఈ అవతారపురుషుని ద్వారా ధర్మసంరక్షణం, తన లీలతో విశ్వకల్యాణం తప్పక చేస్తాడని నమ్మకమొందింది. ఆ భగవంతుని కరుణ తనపై కూడా ప్రసరించాలని, ఆ దేవదేవుని మరల, మరల ప్రార్థించడం మొదలుపెట్టింది.

కృష్ణుడు వస్తున్నాడన్న వార్త మధురలో మధురమైంది. వీనులవిందు చేసింది. ఎక్కడో కొంతమంది కంస పరిచారకులు, విశ్వాసపాత్రులు తప్ప, మిగిలిన మూడు వంతులకు పైగా నగరం మహదానందపడింది. తాము తరింపబడతామని ఉద్ధరించబడతామని, తలంచి ఆ అదృష్టానికి అర్రులు చాస్తూ ఎదురు చూస్తుంది.

ఎదురేగి స్వాగతించాలని మురిపిసోతుంది.

త్రివక్ర అయితే, నందబాలుడే, ఆ దేవకీ "నంద"నుడనీ, ఆతడు బాల్యంలోనే పూతన, తృణావర్తా, శకటాసురులను వధించాడని, చిటెకిన వ్రేలితో గోవర్ధనగిరి నెత్తాడని, అందరు.... కథలు... గాథలుగా చెప్పుకునే లీలా విశేషాలను, లీలలుగా, తన చెవుల కందించి మురిసి, తన్మయత్వ మొందసాగిందామె. అంతే కాదు. అతడు "కంసారి" అని కూడా తెలుసుకుంది. దుష్టశిక్షణ, శిష్టసంరక్షణ గావిస్తాడని విని ప్రజలు తమ బాధలు తీరిపోతున్నాయని పొంగిపోవడం కూడా గమనించింది.

కృష్ణుని రాకకు, ఇంకా మూడు దినాలే సమయముంది. త్రివక్ర కంటిమీద కునుకు లేదు. వళ్ళంతా కళ్ళయి, ఆ కళ్ళతో కృష్ణదర్శనం, చెవులతో కృష్ణ నామ గానం విని, ఆ తన్మయత్వంలో మైమరిచిపోవాలని తను తరింపబడాలని అనుక్షణం ప్రార్థనంలో మున్గిపోయింది.

కృష్ణుని చూడాలని, ఆతను కోరితే రకరకాల సుగంధ పరిమళ ద్రవ్యాలను, బట్టలను కూడా ఇవ్వాలని తలచింది. ఆ తర్వాత తన అదృష్టమనుకుంది. ~~ఈ~~ ఆలోచనలలో వుండగానే త్రివక్రకు నంద, వసుదేవ కుమారులు, నగరిలో అడుగుపెట్టారని తెలుసుకుని పొంగిపోయింది. వాళ్ళను చూడాలని తహతహ లాడసాగింది. ఆ పిల్లలు అక్రూరులవారితో వచ్చారని మధురలో వున్నారని కూడా తెలుసుకుంది. అయితే, చీకటిపడే సమయానికి అక్రూరుని రథం మధుర చేరింది. నందాదులు అప్పటికే మధుర గ్రామ సరిహద్దులలోని తోటలో దిగారు. తమను "రామకృష్ణులు" అక్కడే వుండనిమ్మన్నారు. అదికాదు కృష్ణా! ముందు నువ్వు నా ఇంటిని పావనం చెయ్యి. అప్పుడు అందుకు సమాధానంగా -

"అక్రూర మహాశయా! ముందు యాదవకుల సంరక్షణ. కంసవధ జరగాలి. ఆ తదుపరే మీ ఇంట నా ప్రవేశం. విందు విలాసాలు. ఇతర బాగోగులు. ఖచ్చితంగా చెప్పాడు. కృష్ణాదులు వచ్చిన....

ఆనాటి రాత్రి రాజమహలులో రహస్య సమావేశాలు, సమాలోచనలు జరిగాయి. కంసుని ముఖ్య అనుచరులు, సేనాని, ఇతర విశ్వాసపాత్ర వీరులు, గూఢచారులు, కంసుని కలుసుకున్నారు. సమాలోచనలు చేసారు. కంసరాజును

కలుసుకున్నవారిలో అక్రూరులు, ప్రద్యోత, వృత్రఘ్నులు, అఘా.... వగైరా అతి ముఖ్యులున్నారు. అంతకుమించి, రహస్యంగా - ఆవేశపరులైన అనుయాయులకు, విశ్వాసపాత్రులకు, రాజభటాది పరివారానికి ఆయుధాలు, ఉచితంగా పంచిపెట్ట బడ్డాయి. అవి - కంసుని కళ్ళబడకుండా -

కృష్ణుని ప్రతిఘటించడానికి, రెచ్చిపోయి ప్రాణం తియ్యడానికి, రాజప్రసాదం నుండి, సంహార "ప్రసాదం"గా ఇవ్వబడ్డాయి. అందరిలోను ఒక్కప్రక్క కృష్ణుని చూడాలనే ఆతృత, మరొకప్రక్క కంసుని నుండి ఎటువంటి ప్రమాదం రామకృష్ణులకు రాకూడదని వారు సురక్షితంగా వుండి, తమకు రక్షకులై ప్రకాశించాలన్న వారి ప్రార్థన ఆ - ఆందోళన ఆంతర్యం తాత్పర్యం.

అన్నీ వింటున్న త్రివక్రకు కృష్ణుని చూడాలనే కోరిక బలీయమైంది. ఆ రాత్రి కంటిమీద కునుకు పడితే ఒట్టు. అతి బలవంతంగా తెల్లారింది. అలవాటుగా రాజభవనంలో కంసునికి, రాణులకు, ఇతర ప్రముఖులకు సుగంధ ద్రవ్యాలను త్వరత్వరగా అందించిది. మిగిలిన పనులు తన పరివారానికి అప్పగించి, వెండి పెట్టెలో అపురూప అద్భుత, పరిమళ సుగంధ ద్రవ్యాలను పెట్టుకుని, రామకృష్ణులకు ఇవ్వాలని, అయిష్టమైనా, కృష్ణుని కోసం అక్రూరులవారి భవనానికి వడివడిగా, హడావుడిగా, బయలుదేరింది.

తన దారిలో, తనదైన శైలిలో జరిగేవేమి పట్టించుకోకుండా, కృష్ణ సందర్శనమనే తీవ్ర కాంక్షతో సాగే త్రివక్ర హడావుడికి, ఎప్పుడు వెళ్ళని అక్రూర భవన సందర్శనా కాంక్షకు, అందరు కాదు, ఎందరో విస్తుపోయారు. అదేమి గమనించకుండా త్రివక్ర ముందుకు సాగుతుంది.

ఆ ప్రయాణంలో ఆమె గుంపులు, గుంపులు సాగే కొందర్ని చూసింది. యాదవ యువకులు ఎందరో తమ తమ సాంప్రదాయ వస్త్రధారణలో దుకాణాలు చూస్తూ ముందుకు వెళ్ళడం చూసింది. ఈ హడావుడిలో తను పాలు పంచుకుంటున్నట్లు వడివడిగా నడిచే ఈ త్రివక్ర - కుబ్జను చూసి అక్కడున్న కొందరు "దీనికెందుకింత హడావుడి ?" అని అలవాటుగా వెక్కిరింతలు, ఎగతాళి చేస్తున్నారు. అక్కడ జరిగే దేమిటో చూడాలన్నదా కుబ్జ హడావుడిలోని ఆంతర్యం.

అప్పుడే ఆమె ఒక దుకాణం ముందు ఇద్దరు యువకులు నిల్చుని చేసే

హడావుడిని గమనించింది. అదేవిటో చూద్దామని అందర్ని త్రోసుకుంటూ ముందుకు వెళ్ళింది.

అది ఓ రజకుని దుకాణ గృహం. ఆతడు రాజసేవకుడు. కంసరాజుతో పాటు, రాజభవన ముఖ్య పరిచారికుల బట్టలన్ని ఈతడే వుతికి, చక్కగా మడతలు పెట్టి వారికందిస్తాడు. కోటలోని ప్రముఖులకు ఈతడు ఎంతో నమ్మకస్తుడు. ఆ దుకాణం ముందు ఇద్దరు యువకులు నిల్చుని ఏదో అంటున్నారు. ఆ రజకుడు విసుక్కుని కసురుతున్నాడు.

"చూడు, మేము రాజబంధువులము. ప్రత్యేకాహ్వానంమీద ధనుర్యాగం చూడాలని ఈ మధురకు వచ్చాం. మాకిందులో కొన్ని బట్టలు ఇవ్వాలి. రాజబంధువులను అవమానిస్తే జరిగేదేమిటో మీకు తెలుసా ? వారు ఒకరి తర్వాత ఒకరు మాట్లాడుతున్నారు. ఒకరు ఎఱ్ఱగా, బొద్దుగా, ఆకారంలో పెద్దగా వుంటే, మరొకడు నల్లగా ముద్దుగా, ఎంతటి వారినైనా ఇట్టే ఆకర్షించేటట్లు కనబడుతున్నాడు.

ఆ రజకుడు వీళ్ళను చూస్తూనే అసహ్యించుకుంటున్నాడు. "పల్లెటూరి బైతులు. చెట్లమీద కోతుల వలె వూరిమీద పడ్డారు. మంచి మర్యాద, సభ్యత సంస్కారమెరుగని మూర్ఖులు" నోటి కొచ్చినట్లు వదురుతున్నాడు. అంతేకాదు వాళ్ళను అదిలిస్తూ చెయ్యెత్తి కొట్టడానికి కూడా సిద్ధపడుతున్నాడు. అతని దుందుడుకుతనాన్ని ఆగ్రహించిన నీలమేఘశ్యాముడు ఒక్కటిచ్చాడు. ముందుకు త్రోసాడు. ఆ చిన్నవాని చిట్టి దెబ్బకు పల్టీలు కొడుతూ రజకుడు క్రిందపడ్డాడు. వున్నాడో, చచ్చాడో.... ఆ దేవుడికీ, ఈ కృష్ణునికే తెలియాలి.

కృష్ణ - బలరాములు, దుకాణంలో తమకు కావలసిన మంచి, మంచి దుస్తులను ఎన్నుకుని మరీ ధరించారు. ఈ సమయంలో కృష్ణునితో దెబ్బలు తిన్న రజకుని అందరు తలొకటి వేసారు. ఈ దెబ్బలకాతడు "హరీ" అని, ఆ హరిని చేరి వుంటాడేమో! అప్పుడే కుబ్జయైన త్రివక్ర - ఎవరీ పిల్లలని వివరణ కోసం అక్కడున్నవారిలో ఒకరిని అడిగింది. వీళ్ళు నీకు తెలియదు. నవ్వుతూ న్నారెవరో. "వీళ్ళు నందుని పిల్లలు" అన్నారింకొకరు. బృందావనం నుండి కంసరాజు పిలుపుతో ఇక్కడికి వచ్చారు. వింటూన్న త్రివక్ర హృదయం ఆనందంతో

నిండిపోయింది. తాను చూడాలనుకున్న వారిని చూసింది. "అవును ఆ రజకుడు... ఎందుకు కసురుకుని కొట్టబోయాడు అడిగింది. ఒళ్ళు పొగరెక్కి" ఎవరో అన్నారు.

వీళ్ళు అందమైన దుస్తుల్ని చూసి కావాలని అడిగారు. ఆ రజకుడు, రాజప్రాసాద సేవకుడు కదా! ఆ దర్పం ప్రకటిస్తూ రెచ్చిపోయి, చెయ్యెత్తాడు. ఆ ఎత్తిన చెయ్యి మరీ లేవకుండా కృష్ణుడొక్కటిచ్చాడు. అదిగో, క్రిందపడి బిగుసుకు పోయాడు. వున్నాడో... చచ్చాడో...!" ఆ మాటతో "అయ్యబాబోయ్!" అందామె. మహారాజుకు తెలిస్తే ప్రమాదమే....!" వణికిపోతుంది.

ఫర్వాలేదు. మా బలరామకృష్ణులనెవ్వరు "ఏమి చెయ్యలేరు. ఏదైనా చెయ్యాలనుకుంటే... చావు వారికి పరిష్కారము, పరమార్థమౌతుంది!" ఇవన్నీ విన్న త్రివక్ర - కుబ్జ - ఆ పిల్లలను, వారి శిక్షణా కార్యక్రమాన్ని చూసి ఆశ్చర్య పోయింది. అ రజకుడు... వాడెప్పుడు తాను కంసరాజుగా, ఆ భవంతి తనదిగా తలుస్తాడు. మా బాగా జరిగింది ? చెప్పుకోలేని చావు దెబ్బ!" ఒక్కొక్కరొక్కక్క విధంగా, ఆతనిపైగల తమ అక్కసును చెప్పుకుంటూ, కృష్ణుని ప్రతాపానికి నీరాజ నాలర్పిస్తున్నారు.

మంచి దుస్తులు ధరించి, హుందాగా దుకాణంలో నుండి వచ్చిన రామకృష్ణులను చూసి అక్కడున్న వారందరు వార్ని అభినందించారు. తమ సంతోషాన్ని ప్రకటించారు. "వాడి పొగరణిగింది" అది అక్కడ వినబడిన మాట. అక్కడేవున్న పువ్వుల దుకాణాదారుడు, ఈ బలరామకృష్ణులను చూసి గబగబా పరుగెత్తుకుని వచ్చాడు. తన దుకాణంలోకి ఆహ్వానించాడు. రకరకాల పూల దండలతోపాటు వారు కోరిన పుష్పాలను భక్తితో సమర్పించుకున్నాడు. అక్కడ జరిగింది చూసిన అతను తన భక్తి ప్రపత్తులను యధోచితంగా ప్రకటించు కున్నాడు.

ఇవన్నీ చూస్తున్న వంకరటింకర కుబ్జ "త్రివక్ర" ఇక ఆగలేక, అందర్ని త్రోసుకుంటూ ముందుకు వెళ్ళింది. రామ - కృష్ణుల ఎదుటపడింది. వారు ప్రసాదించిన దర్శనంలోని ఆనందాన్ని పొందసాగింది. అటువంటి తరుణంలో- ఈమెకు కూడా, ఈ రామకృష్ణులు కావాలా ? అనే గొణుగుడు. అదే సమయంలో బలరామకృష్ణులు కూడా ఆమెను చూసారు. ముఖ్యంగా కృష్ణుని చిరునవ్వుకు-

ఆతనిని చూస్తూ త్రివక్ర "నందకిశోరా, కృష్ణా! నీ రాక నాకు మంగళ దాయకం"

అంటుంది. కృష్ణుడు ఆమెను సమీపించాడు. మా గురించి ఎదురు చూస్తున్నావా, ఎందుకు ? నవ్వుతూ అడిగాడు. ఆ మందహాసానికి కుబ్జ లొంగిపోయింది. నీకోసం ఎదురుచూడని వారెవరు ? అప్రయత్నంగానే అనేసిందామె. "అలాగా ? అన్నాడు కృష్ణుడు. ఇంకా.... కృష్ణుని మాటలు పూర్తి కాలేదు.

"నువ్వు వస్తావని ఎప్పుడో నాకు తెలుసు. కాకపోతే ఇప్పుడొస్తావన్నదే నాకు తెలియదు." అంది.

"ఇంతకి నువ్వెవరు ?" అడిగాడు కృష్ణుడు. చెప్పిందామె. నా పేరు త్రివక్ర. ఒకప్పుడు అందగత్తెనే. ఇప్పుడిల్లాగ తయారయ్యాను. కంసరాజుకు పారంపర్యంగా సుగంధ ద్రవ్యాలనిచ్చే సంతతి మాది. అయితే నీవద్దనున్న ఆ సుగంధ పరిమళ ద్రవ్యాలు, సుగంధాదులను మాకిస్తావన్నమాట. "అవును" తలూపింది. ఆ వెంటనే తన వద్దనున్న అత్తరు, పరిమళగంధ, ఇతర సుగంధ ద్రవ్యాలను కృష్ణుని చేతులకు, నుదుటికి, శరీర మొత్తం వ్రాయగల్గినంత, ఆ విధంగా రాసింది. అలాగే బలరామునికి.

దాంతో కృష్ణుడామెను దగ్గరకు తీసుకున్నాడు. "ప్రభూ! నన్ను చూసి అందరు వెక్కిరించి, హేళన చేస్తుంటే, మీరేమిటలాగ నన్ను అభినందించి, ఆనందపరుస్తున్నారని అడుగుతుంది.

"చూడు త్రివక్రా! ఎవ్వరు ఏమనుకున్నా, నీవంటి అందగత్తె దేవలోకంలో గూడా లేదు. ఇది పరిహాసం కాదు. సత్యం" అంటూ ఆమె పాదాలను తన పాదాలతో పట్టి రబ్బరు బొమ్మను సాగదీసినట్లు కృష్ణుడు ఆమెను సరిచేసాడు. వంకర్లు పోయి ఎక్కడికక్కడ వంపుసొంపులతో తీర్చిదిద్దిన అందాలబొమ్మ అయిపోయింది.

అనకూడదు కాని, అంతవరకు అందరు వెక్కిరించి, గేలిచేసి, అల్లరిచేసే, ఆ కుబ్జ "త్రివక్ర" చూస్తుండగా సుందరాంగి అయిపోయింది. అక్కడున్న వారందరు, కళ్ళారా - కృష్ణుని గొప్పతనానికి ఒకనాటి సామాన్య అందగత్తె మాలిని.

ఈనాడు సుందరాతి సుందరాంగి అవడంతో ఆశ్చర్యపోయారు. అందగత్తెలకే అందగత్తెగా శ్రీకృష్ణుని వాక్యం ఫలించినట్లు ప్రతిబింబించిందామె.

ఇప్పుడు నీవు అందగత్తెవే తప్ప, కురూపివి కావు, నీలోని వికారాలన్నీ నిముషంలో తొలగించాను. ఎంతో ప్రేమ - అభిమానంతో ఆమె ఆరాధన ప్రార్థనకు తగ్గ ప్రతిఫలాన్ని పరమాత్మగానే కృష్ణుడు ప్రసాదించాడు. దానికి ఆశ్చర్యపోతూ, మురిసే మనసుతో -

"కృష్ణా! మురళి మోహనా, లోకపావనా!? అంటుంది. "కృష్ణ పాదాలను పట్టబోయింది. ఆమెనలాగే పట్టుకుని "నీవే వందనీయవు. నాకు వందనం చెయ్యరాదు!" అని ఎంతో ప్రేమతో - ఆమె భక్తికి పరవశించినట్లు కృష్ణుడామెను దగ్గరకు తీసుకున్నాడు. చూస్తుండగా మారిపోయిందామె. అంతే. "మీరు నా ఇంటికి రండి. నా ఆతిథ్యాన్ని తీసుకోండి" కోరికతో అభ్యర్థించిందామె.

కృష్ణుడు గొప్పవాడనుకుంది. కానీ, ఇలాగ. క్షణాలలో అవతలివారి లోపాలను ఎత్తి చూపకుండా, దెప్పిపొడవకుండా, సరిచేయగల సన్మార్గుడు, సుశీలుడు, మహాశక్తివంతుడు, పరమేశ్వరుడు, పరాత్పరుడు .... ఇప్పుడనుకుంటుంది. చివరకు-

గొప్పవాడనుకుంది. మాటలు రావడం లేదు. ఆ ప్రభువు చెప్పినట్లే అందగత్తెను చేసాడు. నడుస్తూంటే ఇదివరకటి వంకర - టింకర నడక రావడం లేదు. అడుగులు తడబడే హంసలనడక. రాయంచల నడకను ఆ ప్రభువు ప్రసాదించాడు. ఇన్నాళ్ళ నిరీక్షణకు - ప్రార్థనకు, ఇన్నాల్టికి... ఇవ్వాళ.... ఫలం.... ఫలితం రూపాన అడగకుండా లభించింది.

పిల్లవానిగా కళ్ళముందు చేసిన ఆ కృష్ణలీలలు వర్ణనాతీతమని మరొక్కసారి తనింటికి రమ్మని ప్రార్థించిందామె. తప్పక నా పని పూర్తయ్యాక నీ ఇంటికి వస్తానన్నాడు. వందన శతాలర్పించిందా అందాలరాశి ఒకనాటి కుబ్జ - అదే "త్రివక్ర" ఇప్పుడు కళ్ళతో ఆ ప్రభుని చూసి ఆతని రాకకు ఎదురుచూపులు మొదలుపెట్టింది.

"వస్తానన్న ఆ కృష్ణుని కోసం!" వంకరులు పోయిన తివక్ర వళ్ళంతా కళ్ళు చేసుకుంది. సౌందర్యాతిశయంతో పొంగిపోతూ.

# కంసుడు - ధనస్సు

రజకుని దుకాణం ముందు జరిగింది చూసి, మూడు వంకర్ల కుబ్జ సౌందర్య రసాస్వాదనం చేసిన ప్రతి ఒక్కరు బలరామ-కృష్ణులకు రెండు చేతులు జోడించి వందనాలర్పిస్తున్నారు. కొందరైతే - వారి పాదాలకు శరణొందారు. ఈ సమయంలో - వున్నట్టుండి -

గుఱ్ఱాల పదఘట్టనల చప్పుడు, కొరడా ఝుళిపింపులు, వారి దెబ్బలు తిన్నవారి అరుపులు - కేకలు, ఏడుపులు - వినిపించాయి. గుంపులు గుంపులుగా వున్న ప్రజలనందర్ని చిందరవందర చేస్తు కొరడా ఝుళిపిస్తూ - తన ప్రతాపాన్ని చూపుతున్నాడో పొరుబోతు రౌతు. ఆ ప్రక్కన మేలుజాతి ఎడ్లు పూన్చిన రథం. అందులో ఇద్దరు రాజవంశీకులు. వాళ్ళు చూడటానికి రాజవంశీయులుగా వున్నారు. అతనిలో అధికార మదం బాగా కనుపిస్తుంది. అందుకే ఈ ప్రతాపమని, అతని గర్వమణచాలని బలరాముడు తలచాడు.

మనిషిని మనిషిగా చూడని ఆ రౌతును చూస్తే రాజును చూడనక్కర్లేదు. యధారాజా తధాప్రజా! అన్న సూక్తి చక్కగా అమరుతుంది. రాజు అంతటి అధికార దుర్మదాంధుడు. పొగరుబోతు కాబట్టే, ఈ సైనికులు తమ పొగరునిలా చాటుకుంటున్నాడనుకున్నాడు. ఆ వెంటనే - గుఱ్ఱానికి అడ్డం పడ్డాడు. రౌతుకు ఎదురు నిల్చున్నాడు.

"ఏం బ్రతకాలని లేదా ?" కొరడా ఝుళిపిస్తు అడిగాడా అశ్వికుడు. "అనుకుంటా...!" ననగానే బలరాముడు, ఆతడు కొరడా ఎత్తాడు. అది బలరాముని సమీపిస్తుంది. దానిని అలాగే ఒడిసి పట్టుకుని బలంగా గుంజాడు. అలాగ గుంజడంలో రౌతు జారి క్రిందపడ్డాడు. అదుపు తప్పిన గుఱ్ఱం దానితోపాటు వెనుకనున్న ఎడ్ల రథం వెనక్కి వెడుతుంది. కాని దానిని అదుపు చెయ్యడం, దారిలో పెట్టడం సాధ్యం కావటం లేదు. ఆ రథం వెనుదిరగడంలోని ధాటికి, వెనుకనున్న ఎడ్లు బెదురుతున్నాయి. అందులోని రాజబంధువులు

వణికిపోతున్నారు. అయినా క్రిందబడినవాడు లేచి దుమ్ము దులుపుకున్నాడు. వీళ్ళను అనుసరించి వచ్చిన ఇద్దరు అశ్వికభటులు వెనక్కి తగ్గారు. అది మరొక కోప కారణమయింది. అప్పటికే బెదరిన గుర్రం, అదుపు తప్పిన ఎద్దులు, అటు ఇటు వూగిసలాడే రథం, అందులోని స్త్రీలు... అంతా పరిస్థితి గందరగోళంగాను, అందులోని మనుషులు ఆందోళన పాలవుతున్నారు. హడావుడిలో దారి దిగ్బంధ మయింది. అప్పుడు క్రిందబడిన ఓ రాజబంధువు లేచి.... బలరాముని ఢీకొనపోతే, కృష్ణుడాతని పీకను పట్టుకున్నాడు. ఈ హఠాత్సంఘటనకు, అక్కడ చూసే వారందరు -

చప్పట్లు - కేరింతలతో, అభినందించి - ఆనందించే ప్రజానీకం తమ సంతోషాన్నాపుకోలేక పోయింది. అప్రయత్నంగా కరతాళధ్వనులక్కడ మిన్నుముట్టాయి. ఇది ఒక రకంగా కంసునికి పరాభవం. ప్రజలకు అమోఘ విజయం. నిస్సహాయ స్థితికి అందరు నవ్వుకున్నారు. ఈ హఠాత్సంఘటనతో యువరాజు మండిపడుతూ "నేనెవరో తెలుసా ?" ఉక్రోషంగా - ఉరుకుతూ, రాజసముట్టిపడే స్వరంతో గిజగిజలాడుతున్నా - గట్టిగా, గంభీరంగానే అన్నాడు.

"ఎవరివో.... !" అమాయికంగా అడిగాడు - ఆతని పీక పట్టుకున్న కృష్ణుడు.

"మూర్ఖుడా, నేను రుక్మిని. విదర్భ యువరాజును. మీ మహారాజు కంసుని ఆహ్వానంపై వచ్చిన వాడను." అవమానం జరిగిపోయిందని బాధపడుతూ చెప్పాడు.

"అలాగా! అదే అనుకున్నాను, సరే. జరిగిందేదో జరిగింది కాని, పొరుగూరుకు వెళ్ళినప్పుడు పెద్దమనిషిలాగ ప్రవర్తిస్తూ పదుగురి అభిమానాన్ని పొందాలి తప్ప, నీ రాజ్యంలో నీ ఇష్టం వచ్చినట్లు చేసే వీరవిహారం చెయ్యడానికి కంస మహారాజువా ? చావ సిద్దపడిన దురదృష్టవంతుడివా ?" కృష్ణుని మాటలు, రుక్మిని కృంగదీసాయి. రథంలో వున్న రుక్మిణి, ఈ నల్లవాని తెగువకు ఆశ్చర్యపోతుంది.

ఈ మథురానగరిలో.... మమ్మల్ని నిరోధించి ఎదిరించే వాళ్ళున్నారా ? తెలియనట్లు తెల్లమొహం వేసిందామె. ఆ వెంటనే ఆడవాళ్ళ ముందు అవమాన, పరాభవాలకు చిక్కుకున్న రుక్మి, చివాలున కత్తి తీసాడు. ఆ ఎత్తిన చేతిని అతి నేర్పుగా కృష్ణుడు మెలిత్రిప్పాడు. కత్తి ఖణేల్‌మంటూ క్రిందపడింది. కృష్ణుడొక్క త్రోపు తోసాడు. ఆ యువరాజు నిరాయుధుడు, అసహాయుడయ్యాడు.

రథంలోని అందమైన రాజకుటుంబ స్త్రీలు "ఏయ్! ఏయ్! ఏం చేస్తున్నావు? ఏం చేస్తావు ?" అంటూ కుప్పకూలినట్లు తూలి రథంలో పడ్డ అతన్ని చూస్తూ అరిచారు. మమ్మల్ని వెళ్ళనివ్వు. మాకడ్డంలే. అతడు మా సోదరుడు.....!" అరుస్తున్నారు వాళ్ళు.

కృష్ణుడు నవ్వుతూ "ఓ అందాల సుందరీ! నువ్వు చూస్తే యువరాణి వలె వున్నావు ? ఈతడు నీ సోదరుడా ? యువరాణిగా కాస్త జ్ఞానముంటే అంతో ఇంతో బుద్ధి చెప్పి ప్రజలతో ఎలాగ బ్రతకాలో, ప్రపంచంలో ఎలాగ జీవించాలో తెలియబర్చు. తెలిసిందా ? అప్పుడే ఎత్తిన జన్మకు, మన రాజసానికి మనుగడ, విలువ ? తెలిసిందా ?

చిరునవ్వులు చిందిస్తూ కృష్ణుడు చెప్పాడు. కానీ, అవతల ఆ యువరాణి నుండి ఏ విధమైన ప్రతిస్పందన లేదు. నవ్వడానికి ఆమె పెదవులు వెలవెల పోయాయి. నీ సోదరుడు చావలేదు. తేరుకుంటాడు. తెలివొందుతాడు. ఇకపైన ఇట్లాగ ప్రవర్తించడన్నాడు. ఆ బెదిరే ఎడ్లను అదిలించలేదు. లాలనగా దువ్వాడు. ప్రేమగా చూసాడు. అవి తన ఆత్మబంధువును చూసినట్లు, మొరాయించడమాని మోర ఎత్తి చూసాయి. అప్పుడే మెల్లిగా రుక్మి స్వస్థతకు వచ్చాడు.

"యువరాజా! వెళ్ళు. మనిషి వలె ప్రవర్తించు"మని ఎడ్ల గంగిడోలు దువ్వాడు. మొహం, మెడలు, వీపు సున్నితంగా తట్టాడు. మానవులీ మహనీయుని చూసి ఎంత ఆనందపడ్డారో, అంతటి అనిర్వచనీయమైన ఆనందాన్ని "పశువులు' అనబడే ఆ పశువులు పొందాయి. పరమానందంతో పరవశించాయి.

అక్కడ మూగిన వారందరు కృష్ణ - బలరాముల నభినందించారు. కృతజ్ఞతగా వీరు చిరునవ్వులు ప్రసరించారు. ఆ నవ్వుకు అందరు సమ్మోహితు లయ్యారు. ఇక్కడ జరిగినదంతా క్షణాలలో గాలిలో వార్తలా ప్రద్యోతుని కందింది. పరుగు పరుగున ఈ కృష్ణ - బలరాములు సంచరిస్తున్న ప్రాంతానికి వచ్చాడు. వీళ్ళకు గౌరవసూచకంగా అన్నట్లు గుఱ్ఱం దిగాడు.

దగ్గరకు వచ్చి, వాళ్ళనే - మీరేనా నందకుమారులని అడిగాడు. అవునన్నారు రామ - కృష్ణులు. మిమ్మల్ని కంసరాజు ఆహ్వానించారని, ఉదయం నుండి మీ కోసం నేను ఎదురుచూస్తున్నాను. కానీ కలుసుకోలేకపోయాను. అతిథులుగా

మిమ్మల్ని గౌరవించలేకపోయాను. తప్పు చేసినట్లు ప్రద్యోతుడు మాట్లాడుతున్నాడు. వాళ్ళిద్దరి దగ్గరకు వచ్చిన ప్రద్యోతుడు కృష్ణుని చూసి వందన మొసగాడు.

అతనెవరో తెలియని బలరాముడు, ఈ కంస నగరంలో తమను గౌరవించే వారెవరనుకుంటూ "మీరెవరు ?" అడిగాడు బలరాముడు. సమాధానంగా అతడు "నా పేరు ప్రద్యోతుడు. అంథక వంశీయుడను. కంసరాజు ప్రధాన అనుచరుణ్ణి" చెప్పుకున్నాడు. వెంటనే భలే ప్రధానివి భలే రాజ్యం. నగరంలో అడుగుపెట్టామో, లేదో... ఒకరు కొట్టేవాడు, ఒకడు చంపేవాడు. భలే సంస్కారులు మీ ప్రజలు. మీ రాజు, రాజ్య సర్వస్వమిలాగే వుంటుందనుకుంటాను. కాకపోతే మీ అధికారుల కన్న మీ ప్రజలే కొంతలో కొంత కరుణామయులు. దయార్ద్ర హృదయులు అన్నాడు, బలరాముడు.

కృష్ణుడు యధావిధి చిరునవ్వులు చిందిస్తూ నిన్ను కలుసుకున్నందులకు మహదానందంగా వుంది. నువ్వొక మహావీరుడవని విన్నాను. వీరులను గౌరవించడం, వారి క్షేమాన్ని కాంక్షించడం నిజమైన యదువీరుల సాంప్రదాయం, వారి నిజమైన సంస్కారం.

"ప్రద్యోతా! క్షమించండి. ఈ రజకుడు గర్విష్టి - పొగరుబోతు. సాటి మనుషులను మనుష్యులుగా గుర్తించలేని మనస్తత్వం. అనవసరంగా చెయ్యెత్తాడు. చాపచుట్టులా కుప్పకూలాడు. ఎవరి కర్మకెవరు బాధ్యులు ? అలాగే రుక్మి - అతడు విదర్భ రాజకుమారుడుట. ఈ రాక్షస కంసుని ప్రాబల్యమొందాడంటే, అతడు కూడా దుష్టాత్ముడు, పరమమూర్ఖుడై వుండాలి. ఒక్క త్రోపుకు వాళ్ళ తాత ముత్తాతలనొకసారి పలుకరించి వచ్చాడు.

ఈ మాటలు వింటూ ప్రక్కనున్న సుందరాంగిని చూసిన ప్రద్యోతుడు "నీవు.... నీవు.. తన రాజ్యంలో ఆమెను చూడనట్లు నసుగుతూ అడుగుతున్నాడు. సమాధానంగా ఆమె "మామా! నన్నిప్పుడే మరచిపోయావా ? నవ్వుతూ అడిగింది. ఆ సుందరాంగి నిన్నటి త్రివిక్ర - ఒకనాటి మాలిని. మళ్ళీ ఈ ఉదయాన్నే చందన పరిమళ అత్తరు, సుగంధ ద్రవ్యాలనిచ్చిందతనికి.

అయితే.... నువ్వు.... ఆమెను త్రివక్రగా తలంచుకోలేక ఆశ్చర్యపోతూ,

తన అనుమాన నివృత్తి కోసం తనలో తను మాటలతో కలిసి తడబడుతున్నాడు. అవును. మామా! త్రివక్రనే. ఈ పరమపుణ్యుని దయవలన నేను అందగత్తె నయ్యాను. ప్రణామమర్పిస్తూ చెప్పింది. చిన్నప్పటి నుంచి చూసే ఆనాటి మాలిని, నిన్నటి త్రివక్ర - ఇప్పుడు అప్పటికి మించిన అపురూప సౌందర్యవతి. ఆమెను తెలిసిన పెద్దలు - నేను "మాలిని"ని అన్నా నమ్మరు. నమ్మలేరు. గతాన్ని మించిన అపురూప సౌందర్యవతిగా, మధురకే అలంకారమొనరించాడీ ప్రభువు.

ప్రద్యోతుడు కృష్ణుని ఆరాధనాభావంతో చూసాడు. దేవదేవుడే జన్మించాడు- జన్మిస్తాడన్న దేవకీ వసుదేవుల సత్యవాక్కులకు నిదర్శనమే, ఈ పిల్లవాడని, చేతులు అప్రయత్నంగానే ముకుళించాడు. అతను కృష్ణ నాశనా పీఠానికి సేనాధిపతి. మంత్రి వృత్రఘ్నుడు. అధిపతి కంసుడు.

"మీ కభ్యంతరం లేకపోతే, ఈ నగరం యావత్తు దర్శింప చేస్తాను!" వినయంగానే చెప్పాడు. "అలాగే చూద్దాం" అన్నాడు కృష్ణుడు. అప్పుడు బలరాముడు "ముందు - మా కంసమామ నిర్మింపచేసిన, ఆ మహాధనువును చూద్దామన్నాడు."

"అల్లాగే" అన్నాడు ప్రద్యోతుడు. ముగ్గురు బయలుదేరారు.

దారిలో ప్రద్యోతుడు "అయినా, మీరెప్పుడైనా పెద్ద పెద్ద ధనువులను చూసారా ?" ఆసక్తిగా అడిగాడు.

"మీరెవరిచేతో తయారుచేయించిన విల్లులను మేము చూడలేదు. మా అంతట మేము, అన్ని విధాలా పరీక్ష చేసిన వెదురుతో తయారుచేసుకున్న ప్రత్యేక ధనువులతో ఆటలాడుకున్నాం. "వేట"లాడుకున్నాం. అది మా ప్రత్యేకత. "ఎక్కడ లొంగనట్లు సమాధానమిచ్చారా సోదరులు - ఒకరి తర్వాత మరొకరు - చాలా సాదా సీదాగా!

ఆ మాటల్లోనే ధనుర్యాగ మంటపానికి విచ్చేసారు. మంటప మధ్యంలో ప్రత్యేకంగా నిర్మించబడిన "మహాధనువు" అంటూ - ఆ ధనువును వుంచారు. దాని చుట్టు పురోహితులు, వేదవేదాంగవేత్తలు మంత్రానుష్టానం చేస్తున్నారు.

ఎందరో అతిథులు, ముఖ్యులు, వీరాధివీరులు, పరాక్రమవంతులు -

ఒళ్ళు విరుచుకుంటూ, ఆ ధనువును చూసి మురిసిపోతూ, ఆ మహాధనువు ఎవరి చేతుల్లో పరమ పునీత మవుతుందోనని, తమలో తాము అనుకుంటున్నారు. ఎవరిమట్టుకు వారు ఆ వీరవర్యుడు తామేనని తమలో తాము ఉబ్బితబ్బిబ్బ వుతూంటే, ఇంకొందరు - ఎవరో ఆ మహావీరుడని, మరికొందరు - సామాన్యుల కసాధ్యమనీ, రకరకాల తమలో తాము పైకనలేక తర్కించుకుంటున్నారు. అసాధ్యమనుకునేవారు నమస్కరించి వెనుదిరుగుతున్నారు.

అందరు చూస్తున్నారు. త్రివక్ర, కృష్ణ, బలరాములతో వచ్చిన ప్రద్యోతుడు త్రివక్రకేదో చెప్పాడు. దాన్ని గమనించిన కృష్ణుడు "ఇది అసాధ్యము కాదని, తనకు సర్వము సాధ్యమేనన్న మాట చెప్ప"కుండా, శక్తితో చూపాలని, తానేమిటో- తామేమిటో.... ఈ లోకానికి తెలియబర్చాలని తలంచాడు.

కంసుడు అట్టహాసంగా కాక, సర్వానుభవశక్తి స్తోమతలతో మంత్ర పూతముగా నిర్మింపచేసిన ధనువును కృష్ణుడు చూస్తుంటే, ప్రభూ! మీరు దీనిని ఎక్కుపెట్టగలరా ? అమాయికంగా అడిగింది. ఆ ప్రశ్న ఎవరిదైనా - ఎవరినుండి వచ్చినా సమాధానము కృష్ణుని చిరునవ్వులో, ఆతని తేజోవంత నేత్రాలలో, భువన భాండాలను పిండి చేయగల భుజబలశక్తిలో కలిసి వుంది.

త్రివక్ర ప్రశ్న నుండి వచ్చిన భావాన్ని - ఆమె కళ్ళలోని వెల్గును గమనించిన కృష్ణుడు "మామా! ప్రద్యోతా! నేను విలుకాడినే కాని మీ దృష్టిపథానికి అందేవాడిని, అందగలవాడిని కాను. ఏదో అప్పుడప్పుడు వింటినారి సాధించేవాడిని. కాకపోతే దీనినెత్తాలనిపిస్తుంది. మీకభ్యంతరం లేకపోతే, రేపటి వరకు ఆగకుండా, ఇప్పుడే ఈ ధనువు యొక్క శక్తి సామర్థ్యాలు చూడదలిచాను. మీకు అంగీకారమా లేక అభ్యంతరమా ?

"లేదు. మీరు ప్రయత్నించవచ్చును" అన్నాడు ప్రద్యోతుడు. అతని మనసులో కృష్ణుడు గొప్పవాడు. శక్తివంతుడే కావచ్చును. అనాకారిని అందగత్తెను చెయ్యవచ్చును. కాని ఈ అద్భుత బల - శక్తి సంపన్నమైన ధనువును ఎత్తడం, నారి

కూర్చడమసాధ్యమన్న దృష్టిలోకి వెళ్ళిపోయాడు. అలాగే అతడు త్రివక్రను చూసాడు.

నిజంగా ~~ఈ~~తడు రక్షకుడు, అవతారపురుషుడైతే అందరు అదృష్ట వంతులమే, కాదంటేనే వచ్చేది చిక్కు. ప్రమాదం - యదుకుల నాశనం, శాశ్వత బానిసత్వం!

సుదీర్ఘంగా కృష్ణుడా ధనువును పలుకోణాల్లో చూసాడు. ఆతనితోపాటు, అటు - ఇటు - నలుదిక్కులా ఎందరో చూస్తున్నారు. అలా చూస్తున్న వారిని ఆశ్చర్యపరుస్తూ ఛటుక్కున విల్లందుకున్నాడు. నారి కూర్చాడు. "వద్దు.... వద్దు!... ప్రమాదమని హెచ్చరిద్దామనుకున్న వారందరు అవాక్కయ్యారు."

"ఇదా... రేపు... గొప్పగా చెప్పుకుని, వూరేగబోయే... వీరుల నూరించే ధనస్సు" తేలికగ్గా చూస్తు అన్నాడు.

"అవును." గుటకలు మ్రింగుతూ - నీళ్ళు నములుతున్నట్లు తడారిన గొంతు తడుపుకుంటూ, నుదుటపట్టిన చెమటలు తుడుచుకుంటూ ప్రద్యోతుడు చెప్పాడు.

"దీన్నెత్తడం, నారి కూర్చడం అసంభవమా ?" అమాయికంగా అడిగినట్లు అడిగాడా ధీరవర్యుడు. తనకు తెలియకుండగానే ప్రద్యోతుడు, తలూపాడు. కృష్ణుడు దానిని యధాస్థానంలో వుంచక కాలితో నొక్కిపట్టి నారి కూర్చి, ఒక్కసారి కంసమామ గుండెలు పగిలేటట్లు ధనుష్టంకారం చేసాడు. ఆ దెబ్బకు అది ముక్కలయింది, కానీ...

ఆ ధనుష్టంకారం.... అలాగ.. వాయు ప్రభావంతో ఎగిరి, ఎగిరి... ఎగిసి, ఎగిసి... చెవులు గింగురుమనేటట్లు, అమాయకుల గుండెలు పగిలేటట్లు కంస మామ ప్రాణాలు కూలిపోయినట్లు ఆకాశమే అదిరిపోయేటట్లు ప్రతిధ్వనించింది.

అక్కడున్న వారు సరేసరి. ఎక్కడివారక్కడ అచేతనులై కూలబడ్డారు.. ప్రద్యోతుడు పరిస్థితిని గమనించేవారు, ఆతనికై తపించేవారు ఎవ్వరు లేరు. ఉన్నవి హర్షధ్వానాలు. రామకృష్ణులకు జేజేలు. వర్ణించనలవికాని, సాహస ప్రశంసలు, పొగడ్తలు!! కేరింతలు, ఆశ్చర్యాలు!

ఆనందోద్రేకాలు! కరతాళ ధ్వనులు.

""""""

# గజరాజు - కువలయము

**కృ**ష్ణుని రాక, ఆయన లీలా విశేషాలు, తన ధర్మంగా యజమాని కంసునకు ప్రద్యోతుడు విన్నవించాడు. ఒకప్పుడు అతి ముఖ్య ఆంతరంగీకుడైన ప్రద్యోతుడు, ఇప్పుడు అవసర అనుచరుడయ్యాడు. ఆతని నుండి కృష్ణుని రాకతోపాటు నగరంలో జరిగిన విషయాలను విన్న మరుక్షణం శరీరం గడ్డకట్టినట్లయింది. నిజంగా ఆతడు దేవదేవుడా ? నా ప్రాణ భక్షకుడా ? ఇదొక భయం.

దీనికి తగ్గట్లు ఎందరో వేగులు కృష్ణునిపై ప్రజలకు గల ప్రజాస్పందన, అభిమానం, అతని చూడాలనే కాంక్ష - హారతులు అభినందనలు.... వరుసగా చెబుతున్నారు, తెలుస్తున్నాయి. జారిపోయే గుండె ఆగిపోకుండా, దానిని చిక్కపెట్టుకునే ప్రాణ సంకట ప్రయత్నానికి బుర్ర పని చేయించసాగాడు. అంతకుమించి, అపురూపంగా, అనన్య సామాన్యంగా, అభేద్యంగా చేయించిన ధనువును, ఆ కుర్రవాడు, గొల్లడు, వెట్టి యాదవుడు, గ్రామీణుడు, అతి సునాయాసంగా ఎత్తి, అల్లెత్రాటిని బిగిస్తూ దానిని ధ్వంసం చెయ్యడమా ? ఇక నేనూ అంతేనా... ?! నాకు చావు తప్పదా ? అంతా అయోమయం!

వణికిపోతున్నాడు. బుఱ్ఱపని చేయడం లేదు. ఆలోచనలు సాగటం లేదు. ఎవర్ని నమ్మలేడు. తన ప్రాణాలనెవరూ కాపాడలేరు. తనకు చావు తధ్యము, మరణము నిశ్చయమైనట్లు, ఆ క్రూరుడు, కపటి, రాక్షసాత్ముడు.... నిర్వీర్యమై పోతున్నాడు. నీరుగారి పోతున్నాడు.

ధనుర్భంగం... ఆ పిల్లవాడు చేతిలో అంతటి ధనువు, విచిత్రంగా ముక్కలు ముక్కలవడం, ఎన్నిసార్లు అడిగినా అందరిది ఒకటే మాట. "అదే మాకు అర్థం కావటం లేదు." సామాన్యులు కాదు, మేమే ఎత్తలేమనుకునే వింటిని ఎత్తడం కాదు, ఎక్కుపెట్టి ముక్కలు చెయ్యడం, తలచుకుంటే కృష్ణుడు....... ఆతని

శక్తేమిటో మాకు అర్థం కావటం లేదు. ఇంకా చెప్పాలంటే మాకు ప్రాణభయంగా వుంది. అంతటి ధైర్య- వీరశూరులు, పిరికితనం నరనరాల్లో జీర్ణించుకుపోయినట్లు పలుకు తున్నారు. అసలే భయపడి చస్తున్న కంసరాజుకు, వారి మాటలు మరింత భయాన్ని కల్గిస్తున్నాయి.

"ఛీ! పిరికిపందలు ?" అలవాటుగా అనేశాడే తప్ప అందులో తానూ వున్నాడన్న సంగతి ఆ క్షణంలో గుర్తుకు రాలేదు. గుర్తుకొచ్చిన మరుక్షణం, ఏం చెయ్యాలో అర్థంకాక వాళ్ళనే అడిగాడు "కిం కర్తవ్యమంటూ ఏం చేద్దామన్నాడు!"

"అదే మాకు తెలియటం లేదు. ధనువులేని ధనుర్యాగం సమంజసమా ?" అంటున్నారు. అదేం కుదరదు. మరొక ధనువు చేయించమన్నాడు. తొందరగా చేయించండి. పరువు నిలబెట్టుకోవాలన్నట్లు - ఆదేశమిచ్చాడు. అన్నీ అవే జరుగు తాయని, బయటికి భరోసా వెలిబుచ్చాడు.

"ఆ... రేపు కేవలం మల్లయుద్ధాలు జరుగుతాయి" అని ప్రద్యోతునితో - ఆ నంద కుమారులకేది ఇష్టమో, ఎందులో పాల్గొంటారో....!" సమాధానం కోసం కంసుడు క్షణమాగాడు.

"పెద్దవాడు బలాఢ్యుడు. చిన్నవాడు తెలివి గలవాడు. ఇద్దరు అసాధ్యులే. దేనికైన తలపడు సిద్ధహస్తులే. చూపులకు కనుపించని పరాక్రమవంతులని - తన కళ్ళతో చూసింది, చూసిన్నట్లు - అలాగే చెప్పాడు. రుక్మిని అడ్డుకున్నది - ఆతని గుఱ్ఱాన్ని కదలక నిలువరించిందా పెద్దవాడే" అనగా -

"అలాగ... అయితే వారెక్కడున్నారు ?" కంసుడడిగాడు. వారు నగర పొలిమేరలలో, నందరాజు, అతని పరివారంతో కలిసి వున్నారు. అంతా తిరకాసుగా వుంది. తన మనోభిప్రాయాలు అవతలివారికి తెలియకుండా ప్రక్కచూపుల నేలచూపులు చూస్తు "ప్రద్యోతా, నువ్వు నాకు నమ్మకస్తుడవు కదా, నీపై నాకు గల విశ్వాసము పెరుగుతుందా ? తరుగుతుందా ?

ఆ మాటకు ఖంగుతిన్న ప్రద్యోతుడు - కలత చెందాడు. "రాజా! ఇంతవరకు మీకు నేను విశ్వాసపాత్రునిగానే సేవించుకుంటున్నాను. మీకు నాపై గల నమ్మకం మాసిపోయినట్లయితే, తక్షణం నగర బహిష్కారం చెయ్యండి.

క్రమశిక్షణ గల - బుద్ధిమంతుడైన సైనికునిగా, సేవకునిగా - మారు మాట్లాడక మీ ఆజ్ఞను శిరమున దాలుస్తాను. అనుమానం లేకుండా అమలుపరుస్తాను. "చాలా ఖచ్చితంగా, ఖండితంగా చెప్పాడతడు. అప్పుడు "అదికాదు, ప్రద్యోతా! నీ మీద నాకు నమ్మకం సన్నగిల్లలేదు. కానీ పరిస్థితులు వంచిస్తున్నాయి. మనో భావాలను దెబ్బతీస్తున్నాయి. ఈ పరిస్థితిలో ఎవరైనా అలాగే ప్రయత్నిస్తారేమో నన్నది - నా భయం - నా బాధ", కంసరాజ మాటలు అర్థం కాని డొంక తిరుగుడిలాగ వున్నాయి -

కంసుడు క్షణకాలమాగాడు. అక్కడ నిశ్శబ్దం తాండవిస్తుంది. ప్రశాంతతత రాజ్యమేలుతుంది. "ఏది ఏమైనా ప్రద్యోతా! ఆతడు ఆ నంద... దేవకీ నందనుడు, నా కళ్ళ పడరాదు. ఈ రాజభవనాల అడుగు పెట్టరాదు. ఆలోచించుకో! ఆలోచించుకుని తగు విధంగా నా ఆజ్ఞను అమలు చెయ్యి!" నిరాశా నిస్పృహలు చోటు చేసుకున్నట్లుంది కంసరాజు మానసం, ఆతని మాటలు.

చిత్తమన్నవాడు. "రాజా! అందరితో నందుడు, ఆతని బృందం, ఈ పిల్లలు, సందడిగా చూడటానికి వస్తే రమ్మనమని ఆహ్వానం పంపించిన మనం "ప్రవేశం నిషిద్ధమంటే" పెద్ద గొడవే కాదు - పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రజావాణిని- ఎలాగ ఆపు చెయ్యాలన్నట్లు అయోమయంగా అడిగాడు.

"నిజం. నిజం. ముందు రేపు మల్లయుద్ధ పోటీలు" అని ప్రకటించు. ఆ మరునాడు ధనుర్యాగముంటుందని తెలియబర్చండి. ఆ తర్వాత - జరిగేవి, జరుగవలసిన వాటి విధి విధానాలను, నిర్ణయించుకుని, ఆ విధంగా అమలు పరుద్దాం!" అన, తలూపి, వందనం చేసి కంసరాజు ఆదేశం అమలు చెయ్య ప్రద్యోతుడు బయలుదేరాడు.

తదుపరి కొన్ని క్షణాలకు అతి ముఖ్య పరిచారకుని పిలిచిన కంసుడు త్రివక్ర వచ్చిందా ? అని అడిగాడు. వచ్చిందని బదులిచ్చాడు వాడు. ఆమె మగధ యువరాజు వృత్రఘ్నునితో వుందని కూడా చెప్పాడు. అయితే ముందా యువరాజును నేను అత్యవసరంగా రమ్మనమన్నానని చెప్పు.

నిజానికి, బయట సభా మందిరంలో, కంసుని చూడకోరి నిలచిన మగధ యువరాజు, కంసరాజు ఆదేశంతో ఆయన సముఖంలో నిలిచాడు. అతన్నోసారి చూసిన కంసుడు "ప్రద్యోతుడు నీతో ఏమైనా చెప్పాడా ? అలాగే ప్రజాస్పందన నీకు తెలిసిందా ?"

"ప్రభూ! అంతా విచిత్రం, విడ్డూరంగా వుంది. ప్రజలలో నందకుమారులను చూడాలని బయటకు అనుకుంటూ లోలోపల వీళ్ళు, ముఖ్యంగా ఆ చిన్నవాడు మన దేవకి అష్టమ సంతానమట. పెద్దవాడు, రోహిణి కుమారుడుట. మొత్తానికి వీళ్ళు నంద కుమారులు కారు. మన వసుదేవుల వారి పుత్రులని అనుకుంటు న్నారుట. వాళ్ళను విరగబడి చూడటానికిదొక ముఖ్య కారణం. ఆ తదుపరి వాళ్ళ అదే వారి "పిల్ల"చేష్టలు.

"ఇదే నాకు" తెలిసిందన్నాడు. వాళ్ళనుపేక్షించకు. అలాగ విడిచిపెడితే ప్రజా విప్లవానికి కారణభూతమౌతుంది. కనుక, నీ మనుషులను హెచ్చరించి, సర్వ విధాల పరిస్థితినెదుర్కొన వీలుగా సమాయత్తం చెయ్యి. ఇక్కడ ఉపేక్ష - అపేక్షలకు తావు లేదు. ఇప్పుడు జాలి తలచినా పరిస్థితిని చెయ్యి జార్చుకున్నా ఫలితం మనకు విరుద్ధంగానే వుంటుంది. కాబట్టి అన్నివిధాల సర్వసమర్థంగా సన్నద్ధంగా వుండండి. అది "కంసుని హెచ్చరిక". అలాగేనని మగధ యువరాజు, రాజు ఆదేశాలను పాటించ కదిలాడు.

ఇక్కడ - ఇలాగ వుంటే - అక్కడ,

అందరు వెక్కిరించి, అపహాస్యం చేసే త్రివక్ర - నవ మోహనాంగికి - ఆడవాళ్ళనే ఆశలలో ముంచుతూంటే ఆడుతుంది. పాడుతుంది. విరగబడి నవ్వుతుంది. తనను చూసి తానే పొంగిపోతుంది. ఇదంతా శ్రీకృష్ణుని కరుణ, దయగా ప్రస్తుతిస్తుంది. ఇది రాణీవాసానికి అందింది. కృష్ణుడు.... అనేసరికి వారందరు భయపడిపోతున్నారు. ఎందుకు భయమని - త్రివక్ర నిలదీస్తుంది.

కృష్ణుని ప్రతాపాన్ని, ఆతని అన్న బలపరాక్రమాల్ని కళ్ళారా చూసిన విదర్భ యువరాణి రుక్మిణి, వంకరల త్రివక్రను అపురూప సుందరాంగిగా చేసిన కృష్ణశక్తికి అబ్బురపడుతూనే, ఆతని - కృష్ణలీలా విశేషాలను తెలుసుకుని, తలచుకుని...

ఆలోచనలో పడింది. తెలియని మక్కువ లేదా ప్రేమ లేదా అభిమానం - ఇంకా చెప్పాలంటే ఏదో అనురాగం, తీపి మధురిమ ఆమె మనసులో చోటు చేసుకున్నాయి. "కృష్ణా" అంటే దగ్గరకు వచ్చినట్లు ఉలికిపడుతుందా... పిల్ల అదే విదర్భ యువరాణి, రుక్మి సోదరి రుక్మిణి.

వాళ్ళతో వచ్చిన రుక్మి భార్య మాత్రం - "కృష్ణ" అన్నపేరు వినగానే భయపడిపోతుంది. అట్టహాసంగా వచ్చిన వాళ్ళను, అంతమంది ప్రజల సమక్షంలో ఆపడమే కాకుండా, ప్రతిఘటించి, దెబ్బతీసి ప్రాణాలతో వదలిన, ఆ అన్నదమ్ములను తలచుకుని, జరిగిన పరాభవానికి కృంగిపోతూ గది బయటకు కాలు పెట్టలేక, లోలోపల కృంగిపోతూ గదిలోనే కూర్చుండిపోయింది.

ఇదే తమ రాజ్యంలో జరిగితే, ఆ గొల్లపిల్లల తల తెగి నేలరాలేది, లేదా - ఇతరులెవ్వరు ఆ విధమైన సాహసం చెయ్యకుండా వారి తలలు కోటగుమ్మానికి కట్టబడేవి. ఇక్కడ తీరని అవమానభారంతో ఆమె కృంగిపోతుంది. అన్యాయం జరిగినట్లు బాధపడుతుంది.

అంతఃపురంలో తన పనులు ముగించుకుని, ముచ్చట్లు తీర్చుకున్న త్రివక్ర తన మందిరానికి బయలుదేరుతుంటే, తనకోసం ఎవరో హడావుడిగా వస్తున్నట్లు గమనించి ఆగింది. నిజమే తనవైపెవరో వస్తున్నారు. ఎవరో అనుకునేసరికి, ఆ వచ్చేది విదర్భరాజ కుమారి రుక్మిణి. ఆమె వస్తూనే త్రివక్ర "వాళ్ళు ఆ నల్లనయ్యను చంపాలని చూస్తున్నారు. వెళ్ళి, ముందాతనిని రక్షించు" ప్రార్థించినట్లు కోరింది.

సమాధానంగా త్రివక్ర ఆమెను ఓదారుస్తూ "చూడమ్మా! ఆ నీలమేఘ శ్యాముని, ఎవ్వరు చంపలేరు. ఆ దృష్టితో అడుగు ముందుకు వేస్తే ఆ చచ్చేది వాళ్ళే కాబట్టి ఆయనకేమీ కాదు. ధైర్యంగా వుండు. ఆయన భగవంతుడమ్మా! నిప్పును ఒళ్ళో దాచుకుంటే కాలేది ఒడికాదమ్మా, ఒళ్ళు...... ఒళ్ళు..... అది నీవు బాగా గుర్తుంచుకుని ధైర్యంగా వుండు."

సమాధానంగా రుక్మిణి "ఇప్పుడు నీ ఓదార్పు మాటలు కావు కాదు నాక్కావల్సింది. నేను చెప్పేది జాగ్రత్తగా విను. కువలయముతో పీడిస్తారుట. దానిని వుసిగొల్పి ప్రాణాలు తియ్యాలని పథకం వేస్తున్నారు. ఆ విషయం చెప్పి పరుగెత్తిపోతూంటే "ఇంకా" అడిగింది త్రివక్ర. "చాల్లే! ఇక్కడ కూర్చుని తాపీగా

కబుర్లు చెబుతుంటే మా అన్నయ్య నన్ను చంపి పాతరేస్తాడు.'' ఆమె వెళ్ళిపోయింది. త్రివక్రలో ఆందోళన మొదలయింది.

"కువలయం'' ఆ పిచ్చిది "మనిషి'' అనుకుంటుంది. అది మత్తెక్కిన మదపుటేనుగు. దానిని విడిచిపెడ్తే అసుర సంహారాన్ని మించి అది రెచ్చిపోతుంది. దానిని నిరోధించడమెవరికి సాధ్యం కాదు. ఒకనాడు నన్ను కాదని త్రోసిపుచ్చిన నా భర్త అంగారకుడు, ఆ గజశాలకు అధిపతి. అతనికి అన్నీ తెలిసి వుంటాయి. ఈ ఆపద గడిచేదెట్లాగా. ఆ నీలమేఘశ్యాముడు రక్షించబడేదెట్లాగ ? ఇది ప్రస్తుతం తననొక మనిషిగా, అపురూప సుందరాంగిగా గుర్తింపు తెచ్చిన ఆ పరమపురుషుని రక్షించానికి పడే ఆవేదనలో ఒక భాగం. కానీ కాదని, విడిచి, పశువులాగ ప్రవర్తించిన ఆనాటి భర్తను చేరాలంటే ఆమెకు అసహ్యాం వేసింది. అయినా ఏదో చెయ్యాలి. తన ప్రాణ దేవుళ్ళను రక్షించుకోవాలి ? అదే ఆమె ముందున్న ప్రశ్న - సమస్య.

నిజానికి అంగారకుడు, గజసంరక్షకుడు, బాధ్యతాయుత వ్యక్తి. అంగారకుని కాదంటే గజశాల ఘోరం. గజసమూహాన్ని నిర్వహించడమసాధ్యం. అటువంటి గజశాలాధ్యక్షుడైన, యాభయ్యోపడిలో పడ్డ అంగారకుడు, తన ఇరువురు భార్యలు ఎకసక్కాలాడుతుంటే, అసహనంగా ఆనాటి రాత్రి నిద్రపోకుండా బాధపడు తున్నాడు. అతనికొచ్చిన ఆదేశం విన్న, ఆ అంగారకుడు, దానిని అమలుపరచడం లోనే కలవరపడుతున్నాడు. ఈ సమయంలో చీమ చిటుక్కుమన్నా అతడు వులికి, వులికి పడుతున్నాడు. వూపిరాడని స్థితిలో వున్నాడు.

అటువంటి సమయంలో, ఎవరో తలుపు తడుతున్నారు. ఆ చప్పుడు వింటూనే గుండెలవిసినట్లు గుటకలు మ్రింగుతున్నాడు. తలుపు తీసాడు. ఎదురుగ్గా ఎవరో సుందరాంగి. అంతటి అందగత్తె నాతడు, ఆ మధురానగరిలో చూడలేదు. పొరబడి ఆమె దెయ్యం కాదు కదా! అది తలచుకోగానే అంతటి వీరుని గుండెలవిసాయి. "ఎవరు ? ఎవరు నువ్వు'' కంగారు, కంగారుగా అడిగాడు.

"ఎవరా ?! కిలకిల నవ్విందామె. ఆమే మళ్ళీ - నన్ను గుర్తుపట్టలేదా ? ఆర్యపుత్రా!'' అది ఒక్క ప్రక్క సమ్మోహనంగాను, మరొకప్రక్క వ్యంగ్యంగాను వుంది.

అతను తలూపేలోగా, ఇప్పటి మొదటి భార్య "అక్కా! నువ్వు, నువ్వు.... ఎలాగ బాగుపడ్డావు ? ఒక ప్రక్క ఆశ్చర్యము, మరొక ప్రక్క అసూయ నిండిన కళ్ళతో అడిగింది. ఆ రోజుల్లో.... అసలే అందగత్తె. ఈనాడు పరమ పురుషుడైన శ్రీకృష్ణుని కరుణతో ఆ అందానికే అందాలు తెచ్చుకున్న అందగత్తయిందామె.

"ఇదా, ఇదంతా నా ప్రభువు చలవ" ఎంతో గొప్పగా చెప్పింది. ఎన్నో సం॥గా మనం మాట్లాడుకోపోయినా, ఈ ఆనందకర, అందమైన విషయం నీకు చెప్పాలని వచ్చాను. ఆమెను చూసి ఆశ్చర్యపోతూ, మానవ సహజ భావంతో గత ఇరవై సం॥గా ఏ విధమైన సంబంధ బాంధవ్యాలు లేకపోయినా అన్నీ మరచి ఆత్రుతనాపుకొన వీలుగా "కూర్చో మాలిని, ఏం జరిగింది ?" విషయం తెలుసుకోవాలనే వేగిరపాటుతో ఆహ్వానించి మరీ అడుగుతున్నాడు.

నవ్వుతూ "త్రివక్ర"గా పేరు మోసినామె కూర్చుంది. "ఇప్పుడు చెప్పు." ఎంతో ఆసక్తిగా అడిగాడు. జరిగిందంతా చెప్పింది. ఇదంతా నందకుమారుడనే, ఆ దేవకీ సుతుడు కృష్ణుని ప్రభావమని, ఆ మహనీయుని కరుణతో తాను తరించానని చెప్పుకుంది. ఈలోగా కాస్త మంచి నీళ్ళిమ్మంటే, అంగారకుని ఆఖరి భార్య తెచ్చిచ్చింది. ఆ నీళ్ళు త్రాగి మళ్ళీ జరిగిందంతా మొదట్నుంచి చెప్పింది. మరో రహస్యం.... మెల్లగా అంటూంటే, తన ఇద్దరు భార్యలను లోపలకి పొమ్మని అంగారకుడు కసురుకున్నాడు.

నమ్మలేని అందంతో వున్న త్రివక్ర అందచందాలను కళ్ళతో ఆస్వాదిస్తూ- కొద్దిగా దగ్గరకు ఆమె పైకి వంగి చెప్పమన్నాడు - ఆ దేవరహస్యాన్ని. తనకు కొంత తెలుసు. ఇతడు ప్రత్యక్షానుభవం పొందిన, తాను విడిచిపెట్టిన మొదటి భార్య నుండి సత్యం వినాలని, ఆ ప్రత్యక్ష కథనం తెలుసుకోవాలని తహతహలాడుతున్నాడు.

"ఆతడు నిజానికి నందగోపబాలుడు కాడు. నందుని ఇంట పెరిగిన దేవకీ సుతుడు. అలాగే బలరాముడు కూడా నందకుమారుడు కాదు. అతడు రోహిణి గర్భాన జన్మించిన వసుదేవ సుతుడు. ఇది దేవరహస్యం. నా అదృష్టమనంగా వారిని కలుసుకున్నాను. వారిచేత ఆశీర్వదించబడి, కరుణ, అనుగ్రహములు పొందాను!" పరమరహస్యాన్ని, విషయాన్ని, వివరంగా చెప్పింది. "జాగ్రత్త" అతనితో

విరోధము నీకే కాదు, మధురలో ఎవ్వరికి మంచిది కాదు'' హెచ్చరించింది.

ఆమె మాటలు వినడంతో "భగవాన్. ఏమిటి నీ లీల ?'' అంటూంటే, "చూడు. ఈ మధురాపురవాసులకు, ఇన్నాళ్ళుపడ్డ కష్టాలు తీరబోతున్నాయి. ఆ విషయాన్ని మనసులో నిలుపుకుని జాగ్రత్తగా వుండు. మన కంస మహారాజు, ఆయన యంత్రాంగం, మంత్రాంగం నీకు తెలియనిది కాదు. అశ్రద్ధ - అజాగరుకత వీడి సావధానుడవై, నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు!'' అనగానే-

"నేను నిజంగా దురదృష్టవంతుడను. నా ప్రాణాలిక నిలువవు. రేపటితో నా ఆయువు సరి. దేవకీ సుతుడైన ఆ కృష్ణుని రేపు నేను "కువలయ పీడ''తో అంతమొందించాలి. కాదంటే నాకు చావు తప్పదు. భయపడుతూ చెప్పాడు.

"భయపడకు. నీవు నిజంగా శరణాగతుడవైతే, తప్పక ఆ దేవకిసుతుడు, నిన్ను కటాక్షిస్తాడు. నా మాట నమ్ము. ఆతడు భక్తవత్సలుడు, భక్తపరాధీనుడు, అధర్మనాశక, శిష్టాచార ప్రకాశ - పరమాత్మ, అన్నీ మరచి, విడిచి, ఆయనను మనసులోనే శరణొందుము. నువ్వు రక్షింపబడతావు.'' ధైర్యమిచ్చిందామె.

ఇరవై అయిదు సం॥గా తాను నిర్లక్ష్యం చేసినా తన రక్షణకు వచ్చిన ఆమెకు కృతజ్ఞతలు చెప్పి దేవకీ సుతుడైన ఆ దేవదేవునికి శరణాగతుడయ్యాడు. భక్తజన సంరక్షకుడైన కృష్ణుని ప్రార్థనా శతాల ముంచెత్తాడు. అయితే -

గత రెండు రోజులుగా జరుగుతున్న సంఘటనలు యాదవ ప్రముఖులను, వీరులను కలవరపెడుతున్నాయి. బాహుకుల వారి అదృశ్యము, కృష్ణుని రాక... వస్తూనే ఆతను చేసిన పనులు, చూపిన లీలలు... ఒక ప్రక్క సంతోషము, మరొకప్రక్క ఆందోళన కల్గిస్తున్నాయి. ఏమవుతుందో ? కంసుని బుద్ధి ఎలాగ వుంటుందో ? కృష్ణుని... తలచుకుని ఆ పెద్దలు భయభ్రాంతులవుతున్నారు. ఇప్పుడా ప్రముఖులందరు వసుదేవుని భవనంలో కలుసుకున్నారు.

ఆ భవనంలో చర్చలు. తర్జన భర్జనలు. విషమ పరిస్థితి తలెత్తితే ఎదుర్కొనవలసిన విధానం, తమకే విధమైన అపకారం జరుగకుండా, ప్రస్తుతమున్న పరిస్థితిలోనైనా వుంటే బాగుంటుందని - చెప్పుకుందుకైనా యదు వంశీయులు, వారి శాఖలు నిలుస్తాయని కొందరు తలుస్తుంటే, భయపడుతూ పిరికివాళ్ళలా చచ్చే బదులు,

ఎదురు తిరిగి వీరోచిత మరణం పొందినా మంచిదేనని ఇంకొందరు -

ఇలాగ తలకొకరు తమ తమ ఆలోచనలు పరమ రహస్యంగా చెప్పుకుంటూంటే, విధేయత తప్ప మరో మాట, మార్గం, ఆలోచన లేని అక్రూరుడు అలాగే మౌనంగా మాట్లాడుకునేవి వింటున్నాడు. అక్కడ జరిగేది గుడ్లప్పగించి చూస్తున్నాడు.

అందరిలో నుండి ఓ యువకుడు "అయ్యా! మీరంతా పెద్దలు, అనుభవజ్ఞులు. మీకు ప్రత్యేకించి నేను చెప్పేది లేదు. నారదుని వాక్యము నిజమైంది. ఆకాశవాణి హెచ్చరిక నిరూపితమయింది. అందరికి ఆశలు, అత్యుత్సాహము కల్గిస్తూ - దేవకీసుతుడు జన్మించాడు. దైవలీలగా "నంద" గోకులంలో, యశోదానందనుడై పెరిగాడు. ఇప్పుడా రహస్యం బట్టబయలయింది. కారణమెవరన్నది ప్రశ్నకాదు. కార్యమవసరం.

ఆ దేవకీసుతుడు నందబాలునిగా, రోహిణీ సుతుడు బలరామునితో కలిసి ఇక్కడికి వచ్చాడు. ఎక్కడో ఏదో జరిగిందనే "ట" కబుర్లకు స్వస్తి పల్కి, ఇక్కడ తన శక్తి సామర్థ్యాలను బయలుపరచి, ధనుర్యాగ మిషతో వచ్చిన ఆ పరమాత్మ ధనువును ముక్కలు చేసాడు. అంటే మన మన బ్రతుకులు, పండినట్లే. మనకు మంచిరోజులు వచ్చినట్లే. కాబట్టి మనం, శక్తిమేరకు ఆ దేవదేవునికి సహాయం చెయ్యలేము కనుక బాసటగా నిలుద్దాం. ఆ ధర్మమూర్తికి మన ధర్మాన్ని మనం చేయూతగా అందిద్దాం." అనగా "నిజం... కృష్ణుడు, అవతార పురుషుడు, ధర్మావతారుడే!" అన్నారు, మిగిలినవారలు.

సరిగ్గా అదే సమయంలో రెండు నీడలు. ఆ ఆకారాలెవరో తెల్సుకునే సమయంలో కనుపించాయి. ఒకరు యాదవ కులగురువు గర్గులవారు.... రెండవ వ్యక్తి దేవకిగాను గుర్తించారు. అప్పుడు - దేవకి - ఏదో, చెప్పాలని వచ్చిందని గర్గులవారన్నారు. అందుకు దీటుగా ఆమె మెల్లిగా గొంతు సవరించుకుంది. కాని మాటపెగలటం లేదు. అయినా కొంతలో కొంతగా గొంతు సరిచేసుకుని "పెద్దలారా, నాదొక విన్నపము. సావధానంగా వింటారని తలుస్తాను" అంటూ దేవకి మొదలుపెట్టింది.

"చూడండి. ఇంతవరకు ఉపేక్షించాను. దైవానికి తలవంచాను. ఇప్పుడు నా పిల్లలకేవిధమైన ప్రమాదం సంభవించినా, అగ్ని ప్రవేశం చేస్తానే కాని, మౌనంగా వుండబోను. అది సత్య"మంది. చెప్పవలసిన మాట చెప్పి, ఆమె అక్కడనుండి వెళ్ళిపోయింది. ఆమె కఠోర నిశ్చయం అందరిని కలవరపరచింది. అందరిలో అలజడి మొదలైంది. ఇప్పుడు ప్రతి ఒక్కరు ఆలోచనలో పడ్డారు. సరియైన నిర్ణయం తీసుకుని, సమస్యను పరిష్కరించుకోవడమో లేక ఎదుర్కోవడమో.... దేనికైనా సిద్ధపడాలనే స్థిరనిశ్చయంలో వాళ్ళున్నారు. వాళ్ళు విన్న కథలు - గాథలు, ఇప్పుడు ప్రత్యక్షంగా నగరంలో జరిగిన విశేషాలు.... తలచుకుని...

ఈ సమయంలో అనవసర చర్చలు, తమవారిని గూర్చిన వెదకులాటలు, ప్రత్యేకాలోచనలు అనవసరమని, దేవ దేవుడైన ఆ పరంధాముడు - శ్రీమన్నారాయణుడు, యదుకులంలో శ్రీకృష్ణుడిగా జన్మించాడు కాబట్టి, ఆతని రక్షణ గురించిన ఆందోళన.... అనవసరం.

ఆ అవతార పురుషుడు ఇప్పుడు నగరానికి వచ్చాడు కాబట్టి మన బ్రతుకులు-వంశాభివృద్ధి శ్రేయస్సు గూర్చిన ఆందోళనలనవసరమనే సిద్ధాంతానికి, అందరు ఒక్కసారిగా కాకపోయినా, ఒక్కొక్కరిగా తీర్మానించుకుని, ప్రశాంత వదనం, మనస్సులతో జరిగేది యావత్తు గమనిస్తూండాలని, సమయానుకూలంగా స్పందించాలనే స్థితికి వచ్చేసారు.

# కంసుని దుర్బుద్ధి

"ఇక కృష్ణుని చావు ఖాయం." ఇది విధి నిర్ణయమని కంసాలోచన. అందుకు గల ప్రబల కారణం అంగారకుడు. అతడు స్వామి భక్తుడు. సంపూర్ణ విశ్వాస పాత్రుడు అతను రెచ్చగొట్టాడంటే కువలయపీడ రెచ్చిపోతుంది. కృష్ణునే కాదు. జగజెట్టివంటి, వాడి జేజమ్మను కూడా వదలకుండా చంపుతుంది.

ఇంకొన్ని గంటలలో సూర్యోదయమౌతుంది. ఎవరి మట్టుకు వారు ధనుర్యాగంలోని భాగమైన మల్లయుద్ధ దర్శనానికి బయలుదేరుతారు. నగర హద్దులలో విడిది చేసిన, ఆ పల్లెటూరి బైతులు, రామకృష్ణులు మహాకోలాహలంగా బయలుదేరుతారు. అంగారకుడు తన ప్రతిభను చాటుతూ కువలయపీడను

రెచ్చగొడతాడు. అతని ప్రభుభక్తి, మదించిన ఆ గజశక్తి క్షణాలలో రెచ్చిపోయి రామకృష్ణులను అతి రాక్షసంగా చంపుతుంది. ఇదొక కుట్ర.

అందరితో కలిసి నేను "అయ్యో!" అనవచ్చును. ఆ తదుపరి నా కెదురు లేదు. సర్వయాదవ శ్రేణులు, తమ రక్షకుడు, భక్షకుడైపోయినందుకు బాధపడ్తూ, నా కాళ్ళక్రింద నలిగి తల ఎత్తకుండా బ్రతుకుతారు. ఇది క్రూర కంసునిలో సాగుతున్న దుష్ట ఆలోచన. ఈ పరిస్థితిలో ఆనంద డోలికలలో తేలియాడాడు. ఆ రాత్రి చాలా దినాల తర్వాత చాలా ప్రశాంతంగా కంసుడు నిద్రపోయాడు. కృష్ణుడు, ఆ కువలయ పీడ పదఘట్టల క్రిందన నలిగి మరణించినట్లు కలగన్నాడు. కళ్ళు తెరిచాడు. భళ్ళున తెల్లవారింది. వందిమాగధుల స్తోత్రాలతో కళ్ళు తెరిచాడు, ఇది "కలా" అనుకున్నాడు.

నమ్మకమైన సేవకులతోపాటు ప్రతినిత్యం చందన - పరిమళ సుగంధ ద్రవ్యాలనిచ్చే త్రివక్ర కూడా కనుపించింది. "ఏమిటే సుందరాంగి ? నీ అందమే అంద"మని పరిహసించే కంసుడు నిజంగా దానిని చూసి మతిభ్రమించిన వాడయ్యాడు. ఇది.... ఆ కృష్ణుని పనా... ?! లేస్తూనే, కృష్ణశక్తికి ఆశ్చర్యం.... ఆతనిని నిలువరించలేననే భయం.... ఆశా నిరాశల వలె తొణికిసలాడుతున్నాయి.

"ఏవిటే ఇదంతా... ?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"మహాప్రభూ!" ఇదంతా మీ పుణ్యఫలం. మీరే కనుక ఆ నంద బాలుడిని ఆహ్వానించకపోతే, నాకీ అదృష్టం దక్కింది. ఇదంతా మాపై మీకు గల కరుణా ఫల ప్రసాదమని ఎంతో వినయంగా చెప్పింది. ఆమె మాటలు అందరు మంచివాళ్ళే.... నువ్వే చెడ్డవాడివన్నట్లున్నాయి.

మళ్ళీ అనుమానం. నారద, ఆకాశవాణి హెచ్చరికలు నిజమవుతాయనే భయం. కృష్ణ రాక, కంస నాశనం, యదు వంశ వర్ధనం.... మళ్ళీ మొదటికి వచ్చాడు. చక చక అలంకారం చేసుకున్నాడు. అందర్ని పొమ్మనమని భవంతి ప్రతిధ్వనించేటట్లు గట్టిగా అరిచాడు. కిరీటం ధరించాడు. రాజుగా చేసుకోవలసిన అలంకారాలు చేసుకున్నాడు. ఆ కువలయపీడ పదఘట్టనంతో కృష్ణ నిర్యాణం చూడాలని తలచుకుంటూ... తహతహలాడుతూ -

ఆ భవంతిలోని మహాగవాక్షం (పెద్దకిటికి) గుండా కువలయపీడ రాక,

అంగారకుని శుభవార్తకోసం ఎదురు చూస్తున్నాడు. ఇది ప్రారబ్ధమా ? చేతులారా చేసుకున్న పాపమా ? తెచ్చుకున్న ప్రాణభయమా ? ఎందుకీ ఆందోళన ? ఏమిటీ అసహనం" గంగ వెఱ్ఱిలెత్తునట్లు వూగిపోతూ, అటు ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. కళ్ళు మాత్రం మహాగవాక్షం గుండా రాజవీధిని చూస్తూన్నాయి.

★ ★ ★ ★

ఒక్కొక్కరు సభా భవనాన్ని చేరుతున్నారు.

యాదవ ప్రముఖులు గూడా వారి వారి స్థానాలనలంకరించారు.

మగధ యువరాజు వృత్రఘ్నుని నేత్రంలోని సైనికులు సర్వదా పరిస్థితిని, గమనిస్తూ, సమీక్షిస్తున్నారు. ఏ విధమైన ఇబ్బంది ఎవరికి కలగకూడదనే ఆలోచన ఒకవైపు, అచ్చటి కార్యకలాపాలను గమనించడం... మరో లక్ష్యంగా సైనిక సిబ్బందితో పహారా పటిష్టం చేసారు. డేగ కళ్ళతో ఎటువంటి అవాంతరాన్నైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా వున్నారు వాళ్ళు.

అప్పుడే మంగళవాయిద్యాలు మ్రోగాయి. అది శుభసూచకాహ్వానం. మల్ల యుద్ధ ప్రవీణులకు సాదర స్వాగతంగా ఆ మేళతాళాల మంగళ ధ్వనులు మ్రోగు తున్నాయి. వీరవర్యుల హృదయాలు ఆనంద డోలికలతో వెల్లివిరుస్తున్నాయి.

అతిరథ - మహారథులనబడు, తన శ్రేష్ట మల్ల యుద్ధవీరులను, ఎటువంటి వారినైనా మట్టిగరిపించగల వారి నాయకులు చాణూర, ముష్టికులను, చూసి కంసుడు గర్వంతో పొంగిపోతున్నాడు. ఆహ్వానం ఏకపక్షం. మల్లయుద్ధం మరో ఏకపక్షం. తన వీరుల విజయవికటాట్టహాసం, అతి ముఖ్యమన్నట్లు ఆ విజయం తమదైనట్లు లక్ష్యం మరచి, విడిచి కంస క్రీడాకారులు కంసుని వలెనే పొంగిపోతున్నారు.

ఆ సమయంలో అందరి దృష్టి నాకర్షించేటట్లు కంసుని మనసు ఆనంద డోలికలలో తేలియాడేటట్లు గజాధ్యక్షుడు అంగారకుడు తమ మత్త గజంతో, క్రీడారంగ ప్రవేశం చేస్తున్నాడు. కంసునిలో సంతోషంకన్న దుఃఖభయం కలుగ సాగాయి. కువలయ పీడమంటే, ఆ మత్తగజం పేరు వింటేనే ప్రజలు... దూరం, దూరంగా పరుగులు దీస్తారు. అటువంటి మత్త గజం, ఈనాడు, ఎంతో ప్రశాంతంగా, విలాసంగా వస్తుంది. ఇది నిజమా, నా భ్రమా ? ఇది కంసుని దృష్టి పథంలోని అంతర్మథన భావన.

ఇది అబద్ధం కాదు. నా దృష్టి చెదరలేదు. కువలయపీడ చాలా సౌమ్యంగా-ప్రశాంతంగా నడిచి వస్తూంది. దాని వీర విజృంభణం - ఆగడం తెలిసినవారు ఆశ్చర్యపోతూనే భయపడుతున్నారు. ఇది కువలయపీడమేనా ? ఏమో.... ప్రళయం ముందు ప్రశాంతిలాగ, మనం జాగ్రత్తగా వుండాలి. ఎవరి మట్టుకు వారు అప్రమత్తులౌతున్నారు.

కువలయపీడ ముఖద్వారం ముందు నిల్చుంది. నాట్యం చేసే స్థితిలో వుందది. ఆ సమయంలో మందలు మందలుగా, గోకుల బృందావన వాసులు, ఎంతో హడావుడిగా సభాస్థలి ప్రవేశిస్తున్నారు వారిలో ఇద్దరు యువకులు. అందరు వారినే చూస్తూ పాదాభివందనం, అభినందనలు, అభివందనం చెయ్యాలనే పద్ధతిలో కనబడుతున్నారు.

వాళ్ళు.... వాళ్ళు నిజంగా బలరామకృష్ణులే. తాను స్వయంగా చూడకపోయినా విన్న వర్ణనకు అనుకూలంగా వున్నారు. వాళ్ళు వస్తూనే కువలయ పీడను చూసారు. ఇదే సరైన సమయం. ఇప్పుడే అది స్పందించి, రెచ్చిపోవాలి. కంసునిలో త్వరత్వరగా దాని విజృంభణ కృష్ణ సంహార దృశ్యం చూడాలనే ఆతృత. అది తొండంతో రామకృష్ణులనెత్తి నేలకేసి కొట్టి ఎముకలు నుగ్గునుగ్గు చేసినట్లు వూహలు. ఆ భ్రమ - ఆ క్షణంలో అతనికి కల్గిందే తప్ప నిజానికి కువలయ పీడ రెచ్చిపోలేదు. రామకృష్ణులకు అక్కడ భీతావహ పరిస్థితి, భయోత్పాతం కల్గించలేదు.

వాళ్ళలో బలరాముడు ముందుకు వచ్చాడు. కువలయపీడ తొండం నిమిరాడు. అది అలవోకగా, ఆనందంగా తొండం పైకెత్తిందే తప్ప - అందులో విజృంభణ, కోపం కనబడటం లేదు. కృష్ణుడు ఎటు తిరిగితే అటు ఆనందంగా, అది తొండం త్రిప్పుతుంది. విలాసంగా ఆడుతుంది. అది అందరికి ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. ఆలోచింప చేస్తుంది.

అక్కడున్న వారిలో కొంత అలజడి, ఎందుకైనా మంచిది జాగ్రత్త, కృష్ణా.... అనే హెచ్చరింపులు. మరొకప్రక్క దానిని రెచ్చగొట్టే విధంగా - అరుపులు, కేకలు, రణగొణ ధ్వని. ఇంత జరుగుతున్నా, కువలయపీడ కృష్ణుని తన బాల్యమిత్రునిగా తలుస్తుంది. అదే కృష్ణునిలోని గొప్పతనం. ఆ బాల గోపాలాన్ని ఎలాగ ప్రేమించాలో, వశం చేసుకోవాలో, ఆతనికి తెలిసినట్లు, ఈ సృష్టిలో మరెవ్వరికి

తెలియదు. అతని చూస్తున్న -

కంసుడు వంటిపై జెర్రులు ప్రాకుతున్నాయి. ఏమీ అర్థం కాని అయోమయం. ఎవరెన్ని రకాల హెచ్చరించినా, తనదైన పద్ధతిలో కృష్ణుడు కువలయపీడను ఎంతో మాలిమి వున్నట్లు సుతారంగా త్రాకుతున్నాడు. ఆ పరమాత్మ చేతిస్పర్శకు, దేవుని చూసిన జీవుడు పరమానందభరితుడై బ్రహ్మానంద స్థితిననుభవిస్తున్నట్లుందా దృశ్యం.

ఇటువంటి సమయంలో ఆ మదగజం తొండంతో కృష్ణుని పైకెత్తింది. ఏదో ఘోరం జరుగబోతున్నట్లు దాని లక్షణం తెలిసిన ప్రతి ఒక్కరు భయపడు తున్నారు. కొందరైతే స్పృహ తప్పారు. కొందరు విలపిస్తున్నారు. భగవంతుడా, మా కృష్ణుని రక్షించుమని మరికొందరు అంజలి ఘటించి, ఆ భగవంతుని అర్థిస్తున్నారు.

అయితే అందరి ఆశలను తలక్రిందులు చేస్తు కువలయపీడ కృష్ణుని క్రిందకు దించింది. ఆనందంగా నర్తిస్తున్నట్లు అటు ఇటు కదిలింది. ఇదంతా చూస్తున్న కంసుని గుండెలు గుభేలుమన్నాయి.

ఏమిటిది ? కలా - భ్రమా... నిజమా... నిజంగా కృష్ణుడు దేవుడా ? అందుకే కువలయపీడ రెచ్చిపోలేకపోయింది. ఇక ఏ మాత్రం ఆలోచించలేక, గోడ పట్టుకుని అలాగే క్రిందకు జారి కూలిపోయాడు.

# చాణూర, ముష్టికులు

**అ**తి ప్రయాసమీద కంసుడు తేరుకున్నాడు. ఎంతో కష్టం మీద స్వస్థతకు వచ్చాడు. ఎక్కడ చూసిన, ఎటు తలత్రిప్పినా కంసునికి వినబడేవి “జయ జయ నందగోపాలా!” అనే జయజయ ధ్వనులు, కృష్ణనామం. అంతటా అలుముకుంది. అతని మనసుకు ప్రశాంత లేకుండా పోయింది.

ఆ పిల్లవాడు, నీలమేఘశ్యాముడు, దేవకి అష్టమ గర్భ సంజాతుడు, తన

మారకుడనీ; మహావీరుడు, రాజనీతి యంత్ర - మంత్రాంగసిద్ధుడని పేరు పొందిన కంసరాజు, ఈ పిల్లవానిచేత కూలిపోబోతున్నాడా ? అది తలచుకుంటేనే గుండె ఆగిపోయేటంత భయం కంసునిలో పట్టుకుంది.

అయినా కోపం, ఆవేశం ఆగటం లేదు. పళ్ళు పట పట కొరికాడు. తను చావకూడదు. ఆ పిల్లవాడినే చంపాలి. దేవుళ్ళ వాక్కు వమ్ము చెయ్యాలి. రక్షణ కోరే వారినందరిని దిక్కులేని వాళ్ళను చెయ్యాలి. అంతే చప్పట్లు చరిచాడు. పరిచారకుడు వచ్చాడు. ఆఘాను పిలు. వెంటనే రమ్మని చెప్పు.

"ఆఘా" అంటే... కంసుని ఆంతరంగిక, ఏకాంత రహస్యవేత్త. పరమ కుటిలుడు. దుర్మార్గ పన్నాగ శ్రేష్ఠుడు. కంసుని కోసం ఎంతటి ఘాతుకమైనా చేయ సంసిద్ధుడు - సంకల్పబలుడు. పరుగున వచ్చాడు.

"అఘా! నా కళ్ళ పడకూదనుకున్న - ఆ - నందకుమారుడు, నా కళ్ళ పడ్డాడు. సభాస్థలి కేతెంచాడు. కువలయపీడ ఆతనిని స్వాగతించింది. సమాధానంగా - ఆఘ - "రాజా! కొందరు కువలయపీడం చచ్చిందంటారు. ఇంకొందరు కృష్ణ హస్త స్పర్శతో - ఆ ఏనుగు, పీనుగై పోయిందంటారు. ఏది ఏమైనా అంగారకుని గూర్చి ఆరా తియ్యమని" మనుషులను పంపించానన్నాడు.

ఇప్పుడు కావల్సింది ఆరాలు, తీర్మానాలు కాదు. మరికొంతసేపట్లో మల్లులు సభా ప్రాంగణానికి వస్తారు. నేను నా అతిథులతో అక్కడికి వెళ్ళాలి. అప్పుడు జరిగే విన్యాసాలకు ముందే కృష్ణుని మట్టుపెట్టాలి, చాణూరునికి వర్తమానం పంపాలి. అలక్ష్యం ఆతని ప్రాణాలు తీస్తుందని, హెచ్చరించాలి. అంతా చకచక క్షణాలలో జరిగిపోవాలి. ఆ సభాస్థలిలో - నేను, ఆ నందకిశోరాలను, ముఖ్యంగా ఆ నల్లవాడిని చూడరాదు. ఆతడు సజీవంగా నా కళ్ళ పడరాదు. కంసుడు హెచ్చరించాడు. "మీ ఆజ్ఞ" అని ఆఘా బయలుదేరాడు.

సమస్త రాజలాంఛనాలతో తీసుకువెళ్ళడానికి అతిథులతోపాటు కలిసి సభాస్థలికి వెళ్ళే సమయం కావడంతో ఆఘా.... వెనకడుగు వేస్తున్నట్లు కనబడ్డాడు. దానిని తన అధికార ధిక్కారంగా తలచిన కంసుడు ఇతరాలోచనలు మాని, తక్షణం నా ఆజ్ఞను పాటించాలన్నాడు. అతిథులు కంసుని సమీపిస్తున్నారు. తీవ్ర స్వరాన్ని

మంద్రస్వరంగా మార్చుకుని, ఆఘాను వెళ్ళమని చేతితో సైగచేసాడు.

చతురస్ర కోణంగా ఏర్పాటు చేసిన ఆ సభాస్థలిలో ఒక్క ప్రక్క కంసరాజుకు, రాజప్రతినిధులు, అతిథులకు ప్రముఖులకు కేటాయించబడింది. వారి హోదాకు తగ్గట్లు ఆ సభామంటపం వలయాకారంగా తీర్చిదిద్దబడింది. మరొక ప్రక్క బ్రాహ్మణులకు, ఇంకో ప్రక్క యాదవ తెగలకు చివరిగా నగర సామాన్య ప్రజలకు కేటాయించబడింది. మధురలో మల్లుల కోసం యుద్ధ ప్రావీణ్యత ప్రకటించడానికి వీలుగా చూడ చక్కగా రూపొందించబడ్డది.

ఆపైన గల గవాక్షాల నుండి అంతఃపుర స్త్రీలు. వారికి దూరంగా ఇతరులు నలుప్రక్కల కూర్చుని చూడవీలుగా ఏర్పాట్లు చేసారు. నందాదులు, వారి పరిజనం, బలరామకృష్ణులు - తమ సాంప్రదాయ గ్రామీణ వేషధారణలో - అందరికి ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా బలరామకృష్ణుల మీద వివిధ వర్గాల సభికుల దృష్టి కేంద్రీకృతమయి వుంది.

సభా సమయం ప్రారంభమైనట్లు మంగళ తూర్యా రావాలు, వందిమాగధుల స్తోత్రాలు కంసరాజు, తన అతిథులు, సభా ప్రతినిధులు, అధికారులతో సమస్త రాజలాంఛనాలతో వస్తున్నాడు. అందర్ని కలయచూస్తూ తన సింహాసనంపై కంసుడు మందహాసం చిందిస్తూ మరీ కూర్చున్నాడు. ఆ తదుపరి వరుసగా - అతిథులు, రాజ ప్రతినిధులు వారి వారి ఆసనాలలో కూర్చున్నారు. యువరాజు వసుదేవుడు, యాదవ ప్రముఖుడు అక్రూరుడు, ఇతర యాదవ ప్రముఖులు ఎడం ప్రక్కన కూర్చున్నారు. కంసుని వెనుకవైపు ప్రద్యోతుడు, వసుదేవుని వెనుక భాగంలో వృత్రఘ్నుడు కూర్చున్నారు. ఆతని ప్రక్కన ఇతర సేనా విభాగాల వారు, నాయకులున్నారు.

"ఏదో కొద్దిమంది అతిథులు మినహా రాజపథ మంటపం భాగంలో ఎవరు లేరు. ఆ క్రీడా మంటపం మధ్యలో చాణూర, ముష్టికులు, లోపల మరో ముగ్గురు పిల్లవీరులు వున్నారు. వాళ్ళ ప్రక్కల దాదాపొక డజనుమంది శిక్షకులతోపాటు, విద్యార్థులు నిలబడి వున్నారు. వీళ్ళందరు వెనుక ప్రత్యేకంగా ఆహ్వానించబడిన ఎన్నిక చేసిన మల్లులు దాదాపు రెండు వందలమంది పైగా వున్నారు.

భేరీ మ్రోగడమే తరువాయి. గోదాలో దిగి ఆ మల్లులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తారు. విజేతలకు వీరోచిత సత్కారం. కంసరాజు స్వయంగా అందిస్తారు. ప్రత్యేకంగా అభినందిస్తారు.

బాహు యుద్ధంతోపాటు వారి వారి స్థాయి, ప్రావీణ్యతను బట్టి రకాల ఆయుధాలు గద, గండ్రగొడ్డలి, కత్తులు, కటార్లు... ఇలాగ ఎన్నో ఆయుధాలతో తమ వీర విక్రమం, శౌర్యప్రతాపాలను ప్రదర్శిస్తారు. విల్లంబులతో చేసే ధనుర్విద్య ప్రదర్శనం మరొక ప్రత్యేక ఆకర్షణ.

వాయిద్యాలు మ్రోగాయి. బాకాలు వూదారు. చాణూరుడు ప్రథమంగా తాను ధరించిన శాలువాలను తన పరిజనానికిచ్చి, ప్రప్రథమంగా రంగప్రవేశం చెయ్యడానికి సిద్ధపడుతున్నాడు. దాదాపొక వందమంది మల్లవిద్యార్థులను సిద్ధం చేసాడు. చాణూరుడు ఈల వెయ్యగానే, వాళ్ళు గోదాలో విక్రమించడానికి వీలుగా అందర్నీ సిద్ధంగా వుంచాడు.

చూస్తుండగా అక్కడ - ఉద్విగ్న వాతావరణ మేర్పడింది. వాళ్ళ వూపిరి వాళ్ళకే పాము బుసలాగ వినిపిస్తుంది. అంతటి నిశ్శబ్దం అక్కడ రాజ్యమేలసాగింది. అందరు గుడ్లప్పగించి, ప్రదర్శన చూడటానికి ఉత్సాహపడుతున్నారు. అందరిలోకి చాణూరుడు ఆకారంలో ప్రదర్శనా పాటవంలో మహావీరుడు, అతి భయంకరుడు కూడా. ఇంకా చెప్పాలంటే కరుడుగట్టిన మూర్ఖుడు, మొండివాడు. అతన్ని చూస్తూనే సామాన్యులు వణికిపోతారు. పిరికివాళ్ళు ప్రాణాలు వదులుతారు. ఒక మాదిరి వాళ్ళు కదలకుండా నిలబడి పోతారు. మేము కాస్త ఘనులమనుకునేవారు తలవంచుకుని ప్రక్కనుండి మెల్లిగా జారుకుంటారు. వీరులనే వాళ్ళు విర్రవీగరు కాని, మర్యాద సూచకంగా వందనం చేసి మరీ ముందుకు సాగుతారు. అంతటి గొప్పవాడు చాణూరకుడు.

అందర్ని పరికించి చూస్తూ, బృందావనవాసుల్లోని యాదవ గోపాలుర వద్దకు వచ్చి, అందులో ముఖ్యంగా కృష్ణ బలరాములను మైత్రీ పూర్వకంగా చూస్తే, కొందరు మందహాసం చేస్తే, మరికొందరు అలవాటుగా “వచ్చార”న్నట్లు, అదొక చిత్రంగా పగలబడి నవ్వుతారు. ప్రస్తుతమలాగే చేసాడు చాణూరకుడు.

"నందరాజా! వీళ్ళేనా నీ పిల్లలు ? రాజకుమారులవలె వేషాలు వేసుకున్నారే ? మరి ఆటలపోటీలలో పాల్గొనవచ్చు గదా ?!" అది తెలిసి చేసే కవ్వింపులా వుంది తప్ప సామాన్య పలకరింపు లాగలేదు.

అందుకు సమాధానంగా "నందరాజు" వారు మల్లులు కాదు, మీతో యుద్ధం చేసే ప్రావీణ్యమొందినవారు కూడా కారు. అయినా మేము చాలా సామాన్య గ్రామీణ యాదవులము. ఈ వాసనలు మాకు పడవు!" చాణూరకుని పలుకరింపుకు తగ్గ సమాన స్థాయిలో సమాధానమిచ్చాడు.

చాణూరకుడు కృష్ణ బలరాముల వద్ద నిలబడటం, నందరాజుతో మాట్లాడటం, ప్రతి ఒక్కరి మెడ నిక్కి నిక్కి చూడసాగింది.సామాన్యులు ఆ విర్రవీగే మల్లులకు బుద్ధి చెప్పాలని తలుస్తారు. ఎందుకంటే, వాళ్ళు కథలు కథలుగా విన్న కృష్ణలీలా కథల ప్రభావంతో, వారి మనస్సులు, ఈ సర్వసమర్థులు శక్తిమంతులు, చూడటానికి చిన్నవాళ్ళయినా, గోదాలోని మల్లుల గర్వమణచి, తగు విధంగా బుద్ధి చెప్పగలరని తలుస్తున్నారు.

యాదవ ప్రముఖులు మాత్రం - ఇదేదో వివాదానికో ప్రమాదానికో కారణభూతమౌతుందని భయపడుతున్నారు. ఆ వెనుక ఎత్తుగా, ఆ క్రీడా మంటపానికి పైన గల వరండామీద వున్న యదువీరుల భార్యలలో, ముఖ్యంగా యువరాణి దేవకి, చాణూరుడు తన పిల్లలతో మాట్లాడటం చూసింది. వీడేం ప్రమాదం కొనితెస్తాడోనని ఆమె మొహం వెలవెలపోసాగింది. వెనుక ప్రహరీగోడ కానుకుని క్షణ కాలం కళ్ళు మూసుకుని భగవంతుని ధ్యానించుకుంది. "భగవంతుడా!" అనుకుంది కాని. మనస్సుండబట్టలేక జరగబోయేది చూడాలని కళ్ళు తెరచి సూటిగా, ఓరగా చూడసాగింది.

"మీ ముసలి తండ్రితో పనేమిటి ? మీరు వీరులని, శూరులని విన్నాను. మీ ప్రతాపాలు వివరించి చెబుతుంటే ఆశ్చర్యపోయాను. అటువంటి మీరు ఇలాగ... కూర్చోవడం ఏమీ బాగోలేదు. రండి. మీ ప్రతాపం చూపండి. వీరులు దద్దమ్మల్లాగ కూర్చోరు. సవాలు చేస్తున్నట్లు చాణూరుడు తొడగొట్టాడు. ఆతనికి వత్తాసుగా వీర, వీరణాలు, కొమ్ముబూరాలు వూదబడ్డాయి.

ఆ హడావుడి యదువీరులలో దడ పుట్టించసాగింది. జరగబోయేది

వూహించగల కంసుడు పేలవంగ నవ్వాడు. చేత్తో విడిచి పెట్టుమన్నట్లు సైగ చేసాడు. ఇదంతా బలరామునికి అవమానంగా తోచింది. ఆగ్రహం కూడా తెప్పించింది. రెండోది క్రీడా చరిత్రలో - ప్రస్తుత పరిస్థితి సభా మర్యాద కూడా కాదు. నిజమైన వీరుడు, సిసలైన వీరుని ఆహ్వానం మన్నించాలి. కాదన్న వాడు క్రీడాకారుడు, వీరుడే కాదు.

మొలత్రాడు గట్టిన మగవాని స్థైర్యము, నైజము బలరాముని, చాణూరకుని ఆహ్వానం, పరిపరి విధాల, పిలుస్తుంది. కాని అతనికి సరైన సంకేతం రాలేదు. దానికోసమే ఎదురుచూస్తున్నాడు. ఆతని పరిస్థితిని గమనించిన చాణూరకుడు, ఏమిటీ మీ నాన్న అదే ఆ ముసిలాయన అంగీకారం కోసమా ? ఆయన కాదంటే అంతేనా ? భలే... ఏదో అనబోతున్నాడు.

చాణూరకుడు వాళ్ళను ఏదో విధంగా రెచ్చకొట్టి తన శిష్యులు లేదా తాను అప్పడంలాగ పిండిచెయ్యాలని తలుస్తున్నాడు. అందుకు అతడు కృష్ణుని చూస్తూ నువ్వు పెద్ద జగజట్టీవట కదా, నీ ప్రతాపం చూపుతావా ? వెక్కిరింపు, ఎగతాళి, పరిహాసం... అన్నీ మిళితం చేస్తూ అడిగాడు.

“ఏవిటి నీతోనా.... ? ఎవరైనా చూస్తే నవ్వుతారు.. ఏ మాత్రం జ్ఞానం లేకుండా ఎలాగ అడిగావు ?” చాణూరకుని స్వరం వలెనే కృష్ణుడు కూడా, వెటకారం, వెక్కిరింపు సమపాళ్ళతో కలిపిన స్వరంతో అడిగాడు. అయినా నీకు పెద్దా! చిన్నా తేడా కూడా తెలియటం లేదు. ఎవరితో ఎలాగ మాట్లాడాలన్న బుద్ధి, కనీసం మీ యజమాని కూడా నేర్పడా ? అహం దెబ్బతీసి కొట్టినట్లే మాట్లాడాడు.

ఆ మాటలకు క్షణకాలం అవాక్కయిన చాణూరుడు, బలరాముని చెయ్యి పట్టుకుని “రా! చెప్తాను. ఇదొక ఆట. మా పరిచయంలో నీకు కొన్ని పట్లు కూడా తెలుస్తాయి. వాటిని కూడా నేర్చుకోవచ్చును. ఇతరులకెవరికైనా చెప్పవచ్చును.” లాగుతూ అంటాడు. కృష్ణుడు తలూపాడు. ఇదేదో వాడి చావుకోసం తహతహ లాడుతున్న కథనమనుకున్నాడు.

ఇదంతా చూస్తున్న అక్రూరుడు విపరీతంగా భయపడి పోయాడు. “వద్దు, వద్దు” పిల్లలతో యుద్ధమేమిటి ? అంటూ అరవసాగాడు. మిగిలిన యదు

ప్రముఖులు మాట్లాడలేకపోయారు. కంసుణ్ణి, చాణూర - ముష్టికుల "ముష్టిఘాత" దెబ్బల శక్తిని తెలిసినవారు పరిపరి విధాల గందరగోళంలో పడిపోయారు. వసుదేవుడు ఎటూ చెప్పలేక పోతున్నాడు. తేల్చుకోలేక పోతున్నాడు.

రామ - కృష్ణుల లీలా విశేషాలు, అపూర్వ శక్తి సంపదలకన్నా, ఆ అవతార పురుషుని, ఈ సామాన్యులు.... ఏం చెయ్యగల్గుతారు ? ముక్కి, నీలిగి, పాదాల బడి ప్రాణాలు పోగొట్టుకుంటారన్నది కళ్ళారా, కృష్ణలీలలను గాంచిన వసుదేవుని వమ్ముపోని విశ్వాసం, నమ్మకం. ఇంతలో గుసగుసలు, గొణుగుళ్ళతో మారు మ్రోగుతుంది ఆ క్రీడా ప్రాంగణం. ఆ సమయంలో - తన కర్తవ్యం హెచ్చ-రిస్తున్నట్లు, కృష్ణుడు - "రా...! "రా.... !" అంటూ నవ్వుతూ - గోదాలో అడుగు పెట్టాడు. కృష్ణుని, చాణూరుడు అనుసరించాడు.

"భయపడ్డావా ?" చాణూరకుడు అడిగాడు.

"నువ్వా....!" కృష్ణుని ప్రతి సమాధానం.

అందరి భయాలకు, గొణుగుడు, గుసగుసలకు ముగింపుగా, ఏనుగు ముందు సింహంలా నడుస్తూంటే "నృత్యాలే కాదు, యుద్ధాలు కూడా చేస్తావా ? గొల్లభామలతో సయ్యాటలు, మల్లయుద్ధ ప్రవీణులతో బాహుపరాక్రమం ఒకటవుతుందా ? "రా! రా! ఎత్తి మూటను నేలకేసి కొట్టినట్లు నిన్ను బాదుతానన్నట్లు చాణూరకుడు వదరుతున్నాడు. నవ్వుతూ కృష్ణుడు వింటున్నాడు.

"ఇది రాసక్రీడా!" చాణూరుడు వెక్కిరింపు.

"చాణూరా! నాకు నాట్యం చెయ్యడం తెలుసు. నాట్యం చేయించడం తెలుసు. నటనలాడ నాట్యానికి సిద్ధంగా వుండమని" కృష్ణుడు హెచ్చరించి నందరాజును సమీపించి వందన చేసాడు.

"తండ్రీ! ధర్మోరక్షతి రక్షిత. సర్వం సుఖాంతమౌతుంది. విజయం తథ్యం. యదువంశం శోభిస్తుంది. తమ ఆజ్ఞ" కృష్ణతత్వం తెలిసిన నందుడు మందహాసం చేసాడు. కనులతో తన అంగీకారం తెలిపాడు.

ఆ మల్లయుద్ధ వాతావరణానికి అనుకూలంగా తన దుస్తులను మిత్రుడు ఉద్ధవునికి కృష్ణుడు అందించాడు. ఆ ప్రేమమూర్తి, ధర్మమూర్తి, విశ్వరక్షణామూర్తి,

విశ్వేశ్వరుడు, తరగని చెరగని, పెరిగే మందహాసంతో విలాసంగా, అవతలివారిని కవ్విస్తూన్నట్లు నిలుచున్నాడు.

“చాణూరా! సిద్ధమా.... ?!” ఇప్పుడు పరిస్థితి ఎదురుతిరిగినట్లు, కృష్ణుడాతని ఆహ్వానిస్తున్నాడు.

ఇదంతా చూసిన బలరాముడు రెచ్చిపోయాడు. వీరావేశంతో విజృంభించాడు. ఎప్పుడైతే కృష్ణుడు, చాణూరుని రెచ్చగొడుతున్నాడో, అప్పుడతను కూడా గోదాలో దిగే సమయ మొచ్చిందని తలిచాడు. “రండర్రా, రండి. మాతో ఎవరు కలబడతారో, కైవల్యమొందుతారో...” రండని, తొడగొట్టి సవాలు చేస్తూ, రెచ్చగొడుతున్నాడు. ఇంకా ఆవేశం ఆపుకోలేని బలరాముడు “మగవాళ్ళు ముందుకు రావచ్చు” నన్నాడు. అంతే ?

శ్రీకృష్ణుడు చాణూరకునితో బాహు యుద్ధానికి సిద్ధపడ్డ మరుక్షణం. ముష్టికుడు బలరామునితో కలియపడటానికి ముందుకురుకుతున్నాడు, వాతావరణం వేడెక్కడం ప్రారంభించింది. కంసునిలో అసహనం బాగా పెరిగి పోతోంది. తొందరగా ఇద్దరు చెరొక దెబ్బ వేసి పిట్టను నులిమి చంపినట్లు, కృష్ణ బలరాములను తొందరగా చంపక, ఎందుకు వుపేక్షిస్తున్నారో, కంసునికి అర్థం కావడం లేదు.

ముష్టికుడు, బలరాముని చూస్తూ “ఏవిటి, ఆడపిల్లలాగ ఓ మూల దాక్కుంటావా ? లేక మాగాడిలా ముందుకు వస్తావా ? ఆ ప్రత్యర్థి సవాలుతో, కోపం పట్టలేకపోయిన ఆ ఆదిశేషుడు, అమాంతం ఎగిరి వాడి పీక పట్టి నొక్కడం ఊపిరిబంధింప చెయ్యాలన్న స్థితికి వచ్చేశాడు. అంతే - బలరాముడు -

గోదాలో దిగాడు. ఎలాగ వున్నవాడు, అలాగే అతనిపై లఘించ సిద్ధపడ్డాడు. అదే కావాల్సింది - ఇటు ముష్టికునికి, అటు వారి అధినాయకుడైన కంసునికి. చూసేవాళ్ళలో కొందరికి సంతోషం, ఇంకొందరికి ఉత్కంఠ, మరికొందరికి నరాలు తెగిపోయే ఆందోళన.... ఇంకొందరికి.... అది అన్యాయమని , దీనికి ప్రతిఫలం తప్పక కంసుడు పొంది తీరుతాడని అంతరాంతరాళాలలో - అంతర్మథనం.

ఇటు బలరామ - ముష్టికులు, అటు కృష్ణ - చాణూరకులు. అదేదో చిత్రంగా వుంది. ఈ కథ ఎలాగ పరిణమిస్తుందో ఏ ఒక్కరికి అర్థం కావటం లేదు. కాకపోతే

కృష్ణచరిత్ర, ఆ విశ్వాత్మకుని, పరంజ్యోతి, సద్ధర్మశక్తి తెలిసినవాళ్ళు మాత్రం, అతి తొందరగా ఈ కథ ముగింపుపెట్టి, తమకు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే అదృష్టాన్ని ప్రసాదించమని, ఆ పరమాత్మనే అర్థిస్తున్నారు - ప్రార్థిస్తున్నారు.

బలరాముని ముష్టి ఘాతాలకు, ముష్టికుడు తట్టుకోలేక తడబడుతూంటే "జయహో విజయహో బలరామా!" అని బృందావన వాసులు ఆ క్రీడాప్రాంగణము దద్దరిల్లేటట్లు కేరింతలు కొడుతున్నారు. అదే సమయంలో కృష్ణుడు - చాణూర మర్దనం ప్రారంభించాడు. కృష్ణుడు గాలిలోకి ఎగిరెగిరి ఇచ్చే ప్రతి ఒక్క తాపు, తాడనం, ముష్టిఘాతం, అంతకుముందు నవ్వుతూ ఎద్దేవా చేసిన చాణూరకుని ముక్కుపుటాలు అదిరి, నెత్తురుకారే స్థితిలోకి తెచ్చాడు. ఆ దృశ్యం చూసి ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోతున్నారు.

కాని - దుర్మార్గ దుష్ట - క్రూర బుద్ధులులైన, కంసుని విశ్వాసపాత్రులతో పాటు, చాణూరుని మర్మస్థానాలను ఛేదించగల ముష్టిఘాత ప్రహారం, ఎంతటివానినైనా చిత్తుచేసి చంపగలవాడి ప్రతికారేచ్ఛ ఆ ప్రతిఘటన ఎలాగ వుంటాయో అర్థం కావడం లేదు.

మదమెక్కిన ఆంబోతు వంటి బలిష్ఠ శరీరం కల ఆ చాణూరకుని ప్రతి ముష్టి ఘాతాన్ని చిత్రంగా ఎగిరి తప్పించుకుంటూ కృష్ణుడు తన్నే తాపులు, పాదతాడనం, ముష్టిఘాతాలు చూడటానికి ఆటలాడుకునే చిన్నపిల్లవాడి బాలచేష్టలుగా కనబడుతున్నా, చాణూరుని కళ్ళు మాత్రం బైర్లు క్రమ్ముతున్నాయి.

ప్రతి ఒక్క పాదతాడనానికి, ఒక్కొక్క ప్రాణం ఒక్కసారి పైకి వెళ్ళిపోతుం దేమోనన్న అలసట, ఆయాసం, భయంతో ఖంగు తింటున్నాడు. దిమ్మెరపోతున్నాడు. తిరిగి తాను నేర్పుగా కృష్ణునెదుర్కొనడానికి తప్పక సమయం తీసుకుంటున్నాడు. ఇదే అందరికి నమ్మలేని విచిత్రంగా వుంది.

కంసునికైతే, ఆ దెబ్బలేవోతానే తింటున్నట్లు వళ్ళు పులిసిపోతుంది. వళ్ళంతా చెమటలు పట్టి గొంతు తడారిపోతూ, ప్రాణ సంకట స్థితిలో వూగిస లాడుతున్నాడు.

చిత్రాతిచిత్రమైన పిల్లవాడుగా కనుపించే కృష్ణుని మల్లయుద్ధ కళాకౌశ లానికి, ఆహుతులు, సభికులు, ముఖ్యులు, ఎందరో విస్తుపోతున్నారు. మల్లయుద్ధంలో అంతో ఇంతో ఆసక్తి, నేర్పు వున్న బలరాముడు, దుష్టుల

అంతమొందించడానికి జన్మించిన అవతారపురుషుడు కృష్ణుల... ఆ మల్లయుద్ధ విన్యాసం చూడవలసిందే తప్ప వర్ణించ శక్యం కాదు.

ఆ దృశ్యం - ఇటు ఉత్కంఠతోపాటు అటు ఆనందం కల్గించడం, బలరామకృష్ణులు తీసే ప్రతిఒక్క చావుదెబ్బకు, సభికుల నుండి వచ్చే విపరీత స్పందన - ఇటు చాణూర, ముష్టికులు, అటు కంసుడేకాదు, ఆతని ననుసరించి వున్న రాక్షసాధముల చావు తప్పదన్న స్థితికి ఆ పరిస్థితి ప్రజలందరిలో వచ్చేసింది.

అంతటి మహామల్లులు ఈ పిల్లకాకుల ముందు తలవంచడానికి సిగ్గుపడి పోతున్నారు. ఇంకా చెప్పాలంటే చచ్చిపోయినట్లు కృంగిపోతున్నారు. ఎలాగ ప్రతిఘటించినా; ఆ అన్నదమ్ముల శక్తియుక్తుల ముందు వీళ్ళ కుయుక్తులు ఫలించడం లేదు. రెండు బలిసిన ఆంబోతులు, పరుగులు తీసే దూడల అల్లరికి అలసిపోయినట్లు...... కాదు... అసువులు బాసేటట్లుంది.

తన ప్రాణాలు, శక్తిని పిడికిలలోకి తెచ్చి, ఒక్క చావుదెబ్బ తీసాడు చాణూరుడు. నిజానికా ముష్టిఘాతానికి, కృష్ణుడు కాక మరెవ్వరైనా సరే అంగసంధులు పగిలి రక్తం కక్కుకుని చావాల్సిందే. అటువంటిదా ముష్టిఘాతం. అయినా దేవదేవుడైన ఆ పరమాత్మ, తన అభయాన్ని నిలుపుకుంటూ, ఇచ్చిన వరప్రదానానికి దీటుగా, నేలమీద బోర్లాపడకుండా, తన దివ్యశక్తితో ఇచ్చిన ఆ పిడిదెబ్బకు...

చాణూరుని మతి చలించింది. భూమ్యాకాశాలు వున్నాయో, లేదో.. తానెవరో... నిజస్థితేమిటో.... ఊహు.... అసలు గుర్తు రాలేదు సరికదా, తక్షణం అలాగే కుప్పకూలిపోయాడు. ఇది చూడటంతో కంసుని పైప్రాణాలు పైకి ఎగిసాయి. "చూస్తారే!" అందరు కలిసి ఒక్కుమ్మడిగా వాళ్ళపైబడి హతమార్చ మన్నట్లు చెప్పాలని గొంతు సవరించుకుంటున్నాడు. కానీ...

గొంతుక పెగలడం లేదు. మాట బయటికి రావడం లేదు. చాణూరుని నవనాడులు బిగుసుకుపోయాయి. చైతన్యం చూడటానికి, చెప్పుకుందికి గూడా ఎక్కడ కనబడటంలేదు. పిట్టలా వుండే పిల్లవాడు కృష్ణుని పిడిగుద్దులు, చాణూరకుని మర్మస్థానాలను ఛేదించి, రక్తం కక్కిస్తున్నదంటే ప్రేక్షకులలో కొందరు హాహాకారాలు చేస్తుంటే, మరికొందరు చప్పట్ల అభినందనలతో తమ సంతోషం ప్రకటిస్తూ, బలరామ కృష్ణులకు హుషారు కల్గిస్తున్నారు. అత్యంతాసక్తి దాయకంగా వూహాతీత విజయపథంలో

సాగుతున్నట్లుందా మల్లయుద్ధ క్రీడో.... విలాస క్రీడగా!

ఇటువంటి స్థితిలో అందరి ఆశలను వమ్ముచేస్తూ - మగధ యువరాజు- వసుదేవుని గుండెలకు, తన కత్తిని గుచ్చుతున్నాడు. దానిని అక్రూరుడు ఎదిరించగా, ప్రద్యోతుడు మరొకప్రక్క నిరోధించ సిద్ధబడుతున్నాడు. అదొక కలకలం. కలవరం. కాకతాళీయం కాని - కంస వ్యూహం. కలహద్యూతం. ఈలోగా కంసుని ప్రతిఘటన.

ఆ దృశ్యం చూసిన కృష్ణుడు రివ్వున కంసునివైపు పరుగుతీశాడు. ఎందరో వ్యతిరిక్తత, కంసునికి నిరసన తెలుపుతున్న తరుణంలో - కృష్ణుడిక వుపేక్షించ దలచలేదు. కంసుని ప్రతిఘటనలో అక్రూరుడు క్రిందబడ్డాడు.

కృష్ణునిలో ఆగ్రహం కట్టలు త్రెంచుకుంది. ఎగిరి మామ రత్నఖచిత కిరీటం నేలపాల్జేశాడు. ఆ దెబ్బకు కంసుడు వెల్లకింతల పడ్డాడు. వూహించని ఆ ఆదమరపు చర్యకు విస్తుపోతూ లేచేలోగా కృష్ణుడు జుట్టుపట్టి పీకి, నేలపడేసి, పిడిగ్రుద్దులతో గుండెను బ్రద్దలు కొడుతున్నాడు.

కంసుని గుండెలపై కృష్ణుడు వేసే ప్రతి ఒక దెబ్బకు, లోపలి నరాలు నజ్జునజ్జవుతున్నట్లు వూహ కాదు నిజమయింది. బలరాముడు వృత్రఘ్నుని చావుదెబ్బ తీసాడు. యదు ప్రముఖులకు బాసటగా నిల్చి, తన ప్రతాపంతో అమోఘశక్తి యుక్తులతో, కంస మామ - దుష్టశక్తుల మదమణచుతున్నాడు.

అదే తరుణంలో - ఈ సంహార క్రీడకు ముగింపుగా కంసుని కత్తితోనే అతనిని కృష్ణుడు హతమార్చాడు.

కంసుని మరణం - దుష్ట దానవ బుద్ధులైన కంస మిత్ర బృందానికి, కొందరి విశ్వాసపాత్రులకు సంపూర్ణ మరణాన్ని ప్రసాదింప చేసింది.

చూస్తూండగా... క్షణాలలో కంసవధ చేసిన శ్రీకృష్ణుని - దుష్టబుద్ధుల పీచమణచిన బలరాముని అందరు శ్లాఘించారు. జయ జయ ధ్వానాలతో ముంచెత్తారు. యదు వంశానికి పట్టిన పీడ నశించింది. వారికి చక్కని అదృష్టం కల్గింది. ఇది అవతారపురుషుడు, లీలామానుష విగ్రహుడైన - కృష్ణుడు, ఆతని

సోదరునిగా వెలసిన - బలరామరూప, ఆదిశేషుని ప్రతిభాసంపత్తి, అక్కడ మార్రోమ్రోగి, భూమ్యాకాశాల ప్రతిధ్వనించింది.

"కృష్ణం వన్దే జగద్గురుం". ఇది యాదవుల భక్తి వందనం. లోకాల అమరానందం.

ఊపిరాడని ఉద్వేగం. ప్రకటించలేని ఆనందం. అవ్యక్త దివ్యానుభూతి, ఒడలెల్ల పుడమితో కలిసి పులకరించే - దివ్యానంద స్థితి!!!

# కంసవధ - కిరట ధారణ

**కృ**ష్ణుని - దుష్టశిక్షణావతారంలోని ప్రథమాంకం పూర్తయింది. ఇది నిజం చెప్పాలంటే మొదటి అడుగు, ముందడుగు. ఈ అవతార అవతరణంలో కృష్ణుడు భగవానునిగా చేయవలసిన అవతారలీలా విశేషాలెన్నో... ఎన్నెన్నో... వున్నాయి.

కంసుని మరణం అత్యాశ్చర్యకమైంది. ఎందర్నో దిగ్భ్రమపాలు చేసింది. "కృష్ణుడు"... ఆ మాట వింటూంటూనే దుర్మార్గుల గుండెలు పగిలేటట్లుంది కాని ఎక్కువమంది హర్షధ్వానాలతో పులకించారు. ఇక్కడ అందరికి ఆశ్చర్య మనిపించిన విషయం - ఎంతో నమ్మకస్తుడైన ప్రద్యోతుడు, ఈ ఆఖరి క్షణాలలో ఆవేశమొంది మగధ యువరాజు వృత్రఘ్నుని ఎదిరించి వధించిన సంఘటన మాత్రం, కంసవిధేయులకు, దుష్ట దుర్మార్గులకు అశనిపాతమయింది.

దాంతో బలరామ, కృష్ణులు.... యుద్ధ వాతావరణాన్ని విడిచి ప్రశాంతతను పొందమని, తమ పెద్దలను కోరారు. ఇరుపక్షాలమధ్యా నిలచిన బలరాముడు. ఇక ఆయుధాలకు స్వస్తి చెప్పండి. కాదంటే మా ప్రతాపాలను పరికించిన మీకు ఫలితం విపరీతంగా వుంటుంది. కొంత ప్రమాదకరంగాను వుండవచ్చున్నాడు.

అందరు తమ ఆయుధాలను విడిచి పుచ్చారు.

వసుదేవ, అక్రూర, ప్రద్యోతుల నేతృత్వంలో కొంత సలహా - సంప్రదింపులు జరిగాయి. వసుదేవుడు అందర్ని ఒకసారి కలయచూస్తూ అతిథులను గౌరవించే

సాంప్రదాయికులుగా, మీకు మా నుండి ఏ విధమైన ప్రమాదము లేదు, రాదు కూడా! మీ మీ భవంతులకు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి. మీకు తగు రక్షణ, యధావిధి జరుపవలసిన మర్యాదలు సాగుతాయి.

అక్రూరుడు, కంసుని శరీరాన్ని రాజ సభ మందిరానికి తీసుకువెళ్ళమని ఆదేశమిచ్చాడు. ప్రద్యోతుడు నగరంలో శాంతి భద్రతలను పూర్తిగా పర్యవేక్షించాలని ఏ విధమైన అభద్రతా వాతావరణానికి తావివ్వరాదని తన సేనలకు - సర్వాధికారిగా ఆదేశమిచ్చాడు. అందరు ప్రస్తుతిస్తూ - హర్షధ్వానాలు చేస్తూంటే, కంసుని చంపిన ఆ రక్తహస్తాన్ని కృష్ణుడు అందరికి చూపుతూ శాంతించమన్నాడు.

అతని దురదృష్టమేమైనా కంసరాజు మరణించిన సమయంలో, ఈ విధమైన ఉత్సవాలు, సంబరాలు కూడవని ఇళ్ళకు ప్రశాంతంగా వెళ్ళమని ఆదేశించాడు. చూస్తుండగా శాంతిసముద్రమై ప్రజలు మౌనంగా అక్కడనుండి కదిలారు.

అప్పుడు కృష్ణుడు నందరాజును సమీపించి "తండ్రీ!" తొందరపడ్డాను, క్షమించు. తప్పుచేస్తే దండించు. ఎంతో వినయంగా, ఆ పెంపుడు తండ్రి ముందర నిల్చున్నాడు. ఆ పిల్లవాడిని, ఆ వినయ విధేయతలకు చలించి, గద్గద స్వరంతో, ఆ తండ్రి కాని తండ్రి, పెంపుడు తండ్రి - తనకు లభించిన మహత్తర దృష్టానికి మురిసిపోతూ" -

"నా తండ్రీ కృష్ణా! నా జన్మ ధన్యమయ్యా" అంటూ - ఆబాల "బాల" కృష్ణుని అక్కున చేర్చుకున్నాడు. గుండెలకు గట్టిగా హత్తుకున్నాడు. ఆ గాఢాలింగనంలోని పారవశ్యం, తండ్రి - బిడ్డలుగా నందరాజుకు ఆ భగవంతుడు ప్రసాదించిన, ఆనందం అనిర్వచనీయం. నిజమైన జన్మ సాఫల్య అదృష్టం.

కృష్ణునికి తమ్ముడైన ఉద్ధవుడు కృష్ణునికి ధరించమని, ఆతని దుస్తుల నిచ్చాడు. పంచ తప్ప మరొక దుస్తులు ఏ విధమైన విలాసవంతంగాను ధరించలేదు. నందుని చూస్తూ "మీరు మన వసతికి వెళ్ళండి. ఈ మేనమామ సంస్కారాదులను జరిపించి నేను వస్తానన్నాడు. అప్పుడు...

అప్పుడు.... అన్నాళ్ళు.... పొత్తిళ్ళలో కనిన వెంటనే చూసుకుని, ముద్దాడి భర్త వసుదేవుని చేతిలో పురిట బిడ్డనుంచిన, తల్లి దేవకి కృష్ణుని చూస్తూ అలాగ నిలబడింది. అడుగు కూడా కదలని, కదుపలేని, ఆనందం - ఆ తల్లి నరనరాలలో

రక్తంవలె ప్రవహించి, వింతగా - చలన - చిత్రమైన నిశ్చలనం చేసింది. ఈ సుముహూర్తానికై ఎదురుచూస్తూ అలాగ నిలచి, ఎదురుచూస్తుంది. ఆమె “అమ్మ” అయినా పిలిచే పిలుపుతో, పులకరించ, అమ్మతనమొంద అలాగ బొమ్మయింది. అమ్మ గావాలని, అమ్మగా చూస్తుంది. అందరి అంతరాత్మలను చదివే హరి “హరియే” అంతరాత్మగా, అమ్మ మనసును చదివి, అమ్మను “అమ్మ” చేయ, ఆమె - ఆ అమ్మ విశ్వాసం - వమ్ముగాక - “అమ్మ”కై తానూ బయలుదేరాడు.

ఒక్కసారి - సప్తమ, అష్టమ గర్భ సంతానాలు - రెండు, ఎదిగి వచ్చి ఎదపై వ్రాలి ఆనందమొసగే ఆనంద క్షణాలకు, ఆ తల్లి ఒళ్ళు పులకరించింది. అన్నాళ్ళు కోల్పోయిన అదృష్టం, పుత్రగాత్రగాఢ పరిష్వంగనా సౌఖ్యం - ఈనాడు లభిస్తున్నందులకు ఎంతగానో.... మురిసిపోతుంది.

తెలియని ఆనందం. పరుగులు తీయాలనే పరవశత్వం. ఆమె కళ్ళలో అవ్యక్తమైన వెలుగు - ఆ వెలుగులోనే కృష్ణయ్య, ఆమెను చూస్తున్నాడు. చూపుల్లో చూపులు కలిపి, పరమానందమొసగుతు ఆమెవైపే అడుగు వేస్తున్నాడు. ఇంకో అడుగు.... మరో అడుగు... ఈ అడుగులో కృష్ణయ్య తన వడి చేరుతాడు. తానా పిల్లవాడిని గుండెకు హత్తుకుంటుంది. కళ్ళలో ఆనందం, ఆ వెంట అశ్రువులు.... ఎన్నాళ్ళ నిరీక్షణో.. ఈనాడు, ఈ క్షణంలో వూహాతీతంగా, అనూహ్యంగా లభిస్తున్న స్పందన.

కళ్ళు తుడుచుకుని, నీటిబిందువులతో కళ్ళు తన చూపులను క్రమ్మి కృష్ణయ్యను మసక, మసకగా చూపుతుంటే, ఒక ప్రక్క తుడుచుకుంటూ, కళ్ళు విదిలించుకుంటున్నట్లు, కన్నీళ్ళు తొలగించుకుని, విప్పారిన నేత్రాలతో, ఆ నీలమేఘ శ్యాముని బ్రహ్మాండమంత కళ్ళు చేసుకుని చూద్దామంటే, తీరా దగ్గరకు వచ్చేసరికి, అశ్రుబిందువులతో నేత్రాలతో, అది ఆనంద సాగరమైన “ఆ”“నంద” నందనునిగా వెలుగొందిన “ఆనంద నందనుని” చూడాలనుకుంటూంటే కన్నీటి తెరలు పొరలు అడ్డుపడుతున్న సమయంలో వున్న మాయగా, ఆ కృష్ణుడు “అమ్మా!” అని చేతులు సాచాడు. దగ్గరకు తీసుకుందే గాని మాట్లాడలేకపోయింది. అవ్యక్తమైన ఆ బ్రహ్మానంద స్థితిలో చేతన రహితమైన, తల్లిని - లోకాల్ని, లోకేశుల్ని పులకరింపచేసే - ఆ పరమాత్మ పలుకరించ - పలుకులు ప్రకటించలేని ఆ

తల్లిని "అమ్మా!" అంటూ తన చేతులలోకి తీసుకున్నాడు. ఇది -

ఇలాగ వుంటే - ఇప్పుడు యాదవ ప్రముఖులంతా వూపిరి పీల్చుకున్నారు. స్వతంత్ర వాయువులు వీస్తున్నాయి. అందరు కలిసి వసుదేవుని సభామంటపాన్ని చేరారు. వసుదేవుడు, యాదవుల పురోహితులు శ్రేయోభిలాషి గర్గులవారితో కలిసి తన వాళ్ళందర్ని కలుసుకున్నాడు.

వీళ్ళను శ్రీ సాందీపుల వారు కూడా కలిసారు. ప్రస్తుతం ఆచార్య సాందీపుల వారు, మగధ చక్రవర్తి జరాసంధుని మిత్రుడు, శైభ్య దేశాధిపతియైన సాల్వుని, కుమారులు అవంతీ యువరాజులు, "వింద - అనువిందులకు" ఆచార్యులు. బృందావనంలో వున్న సమయంలో సాందీపులవారు వేదవ్యాస మహర్షి ఆదేశంతో కృష్ణ బలరాములకు కొన్నాళ్ళు విద్యాభ్యాసం చేసారు. ఆ రకంగా రామకృష్ణులతో సాందీపులు అనుబంధమొందారు.

ఈ తరుణంలోనే ప్రద్యోతుడు కూడా, మరో ఇద్దరు యాదవ ప్రముఖులతో వసుదేవుని సందర్శించాడు. ఇక మనం తొందరపడకపోయినా, తగు జాగ్రత్తలు తీసుకోకపోయినా, పరిస్థితి విషమిస్తుందని ప్రద్యోతుడు, సర్వసేనాధిపతిగా వసుదేవునికి సూచించాడు. ఈ ధనుర్యాగ ఆహ్వానితులలో కంసునికి బాగా కావల్సినవారు, కంసుని అభిమానించే వారున్నారు.

అలాగే మగధ చక్రవర్తి జరాసంధుడు కూడ జరిగిన దానికి ప్రతీకారం తీర్చుకోవాలని తలుస్తుంటాడు. కనుక ఉత్తరాధికారిని నియమించుకుని రాజ్యరక్షణం చేసే సత్వర నిర్ణయంలో తాము వున్నట్లు వసుదేవుడు కూడా తెలియబరిచాడు.

మన మహారాజు ఉగ్రసేనుల వారు ఆరోగ్యం వయస్సు రీత్యా బలహీనంగా వున్నారు కాబట్టి, మరెవ్వరినైనా సమర్థుని ఉత్తరాధికారిగా నియమించుకుంటే బాగుంటుందన్న ప్రద్యోతుని సలహా, అతన్ని అందరు కోరగా, ఓరగా చూసి అనుమానించే స్థితి, ఆ క్షణంలో ఏర్పడింది.

ప్రద్యోతుని సలహాకు, వసుదేవుడు, గర్గాచార్యులు వత్తాసు పల్కడంతో, "అయితే, మీరే రాజ్యాధికారం చేపట్టండి" మిగిలిన యాదవ ప్రముఖులలో కొందరు, వసుదేవుని కోరారు. అందుకు పెదవి విరుస్తూ, వసుదేవుడు -

"నేను, నా శక్తి స్తోమతలు, పడ్డ బాధలు, అందరికి తెలుసు. సానుభూతి పవనాలలో బ్రతికిన వాడినే తప్ప - పరాక్రమించే శక్తి నాకు లేదు. కాబట్టి - "నేను ఇందుకు అసమర్థుడను నాకీ రాజ్యాధికారము అసలే వద్దు'' అన్నాడు. ఆ మాటలు వసుదేవుడంటూంటే, కొందరు ప్రముఖులు ప్రద్యోతుని గమనించ సాగారు. అతనికీ రాజ్యంపైన ఏమైనా ఆశ వుందా ? అన్న అనుమానం వారిలో తొంగి చూడసాగింది.

సరిగ్గా - ఇటువంటి సమయంలో, పిలిచినట్లు అక్కడికి కృష్ణుడు వచ్చాడు. అందరు ఇటు గౌరవం, అటు అభినందనలతో, తమ ప్రాణరక్షకునికి అంజలి ఘటించి, స్వాగతించారు. "ఇంతవరకు ఎక్కడికి వెళ్ళావయ్యా ?'' వసుదేవుడు, ఎంతో లోతుగా అడిగాడు.

అమ్మను, మందిరానికి చేర్చి, సేదతీర్చి కంస మామకు జరుపవలసిన ఉత్తరక్రియల విధి విధానమేర్పచి ఇదిగో.... ఇలాగ..... ఈ సమయానికి ఇక్కడికి వచ్చాను'' నిజంగా.... నువ్వు.... మాకు!'' అభినందనల పర్వం కొనసాగుతుంది.

"క్షమించండి. మీకందరికి ఆనందంగా వుందేమో కాని, నాకు మాత్రం ఎంతో బాధగా వుంది. రాకరాక వచ్చి పగబట్టినట్లు మేనమామను చంపడం ఒక బాధ అయితే, అదే అత్తలైన ఆ యువరాణుల ఆక్రందన నన్ను కలచి వైచింది. తెలిసి ఘోరం చేసానో, తెలియక తప్పులాంటి ఒప్పే చేసానో...... కాని... లోకానికి నేరస్థుడనయ్యాను.'' తన హృదయావేదనను ఒక మానవ మాత్రునిగా, మానవత్వ శక్తికి ప్రతిరూపంగా తెలియబరచి అందరికి ఆ ధర్మమూర్తి, ఆరాధ్యుడయ్యాడు. భగవానుడైన - ఆ ప్రేమమూర్తి - శ్రీకృష్ణుడు.

ప్రస్తుతమక్కడ నిశ్శబ్దం తాండవిస్తుంది. కొన్ని క్షణాలు గడిచాయి. అప్పటికే అక్కడికి అక్రూరుడు - మహారాజు ఉగ్రసేనుల వారిని, బలరాముడు వజ్ర అంథక - బాహుకుల వారిని సాదరంగా తోడ్కొని రాగా, మహారాజు ఉగ్రసేనుడు, వసుదేవుని ప్రక్కనే కూర్చున్నాడు.

ముందు ఎవరు మాట్లాడాలో.... అన్నది ఒక సందేహం, ఎలాగ ప్రారంభించాలన్నది, మరో సంశయం. ఇటువంటి తరుణంలో, ఆ నిశ్శబ్దాన్ని

చీలుస్తూ - మహారాజు ఉగ్రసేనులవారు, మెల్లిగా -

"ప్రద్యోతుని సలహా, నేను విన్నాను. అది సమయోచితమని నా వుద్దేశం. నాలో ఓపిక లేదు. ఇటు శారీరకంగా అటు మానసికంగా ఎంతో నష్టపోయాను అనేకన్న అలిసిపోయాను. ప్రస్తుత పరిస్థితులలోని ఆటుపాట్లు నేను ఎదుర్కోలేను. కనుక.....!" ఇంకా మహారాజుగా తన అభిప్రాయాన్ని, తన మనసును అందరి ముందు విప్పి చెప్పాడు, నా వుద్దేశాన్ని మన్నించేటట్లయితే చిన్నవాడైన, సర్వసమర్థుడైన కృష్ణుని నేను రాజ్యభారం వహించమని కోరుతున్నానన్నాడు. బాగు బాగు యని ఇందుకు ప్రతి ఒక్కరు స్పందించారు. జయజయ ధ్వానాలు చేసారు. పెద్దవాళ్ళకు పెద్దతనాన్ని అప్పగించి, చాలా సామాన్యునిలాగ, కృష్ణుడూ జరిగేదంతా ప్రశాంతంగా గమనిస్తున్నాడు. క్షణకాలం అందర్ని తన చిరునవ్వులతో గెల్చిన కృష్ణయ్య, మరొక్కసారి తన మందహాసంతో వాళ్ళనందర్ని చూస్తూ-

"పెద్దలకు, యాదవ ప్రముఖులకు, ముఖ్యంగా ఉగ్రసేన మహారాజుల వారికి, వసుదేవ సుతుడైన ఈ వాసుదేవుడనే, నంద-యశోదల ప్రియపుత్రుని వినయాంజలి. నేనేమిటో నాకు బాగా తెలుసు. ఒక గోపాలునిగా, మధురాధి పత్యము, ప్రముఖులు ధరించిన, రత్నఖచిత కిరీట ధారణం చెయ్యలేను. అది నాకు తగదు. కానీ మీరందరు చూపిన అభిమానమే కాదు, గౌరవ మర్యాదలతో ఇచ్చిన ఘనత, గణనీయమైన కీర్తి సర్వదా సంస్మరణీయము. అందుకు సదా కృతజ్ఞుడను." ఆ వాక్యం పూర్తి కాలేదు. అందరు కలిసికట్టుగా -

"కృష్ణా.... ధర్మరక్షకా, నిన్ను మించిన అర్హుడు ఈ పృథ్వీతలంలోనే లేడు. కాదనక, మా అభ్యర్థన మన్నించ కోర్తాము. ఇందుకు కృష్ణుడు -

క్షమించండి. ఆలకించండి. ఇది నా మనవి. ఉగ్రసేన మహారాజే మహారాజు. వారికి తోడుగా, మహనీయుడు, అక్రూరులవారు, మా జనకుడు వసుదేవులు, సర్వసైన్యాధ్యక్షులుగా ప్రద్యోతుడు, తమ తమ బాధ్యతలను, మంత్రాంగాలతో నిర్వర్తించ మీ పరిపాలన సర్వశ్రేష్ఠ - సురశ్రేష్ఠ - పూజనీయమవుతుంది.

"ఇంకా మేము, అంటే... మా అన్నదమ్ములం విద్యార్థి దశను దాటలేదు. శ్రీ గురువుల సారధ్యంలో క్షాత్రయోచిత విద్యలను, ధర్మార్థ కామమోక్షాలను సాధించుకొను. చతుర్విధ పురుషార్థాలను, వేద వేదాంగాలను - లోకరీతిన నేర్చుకోవాలి. ధర్మ బుద్ధిన నడుచుకుని ప్రకాశించాలి. అప్పుడే ఈ కృష్ణునికి మా అన్న బలరాముడు, సోదరుడు ఉద్ధవుడు ఇతరులు గుర్తించి, ప్రసాదించే గౌరవం.

శ్రీకృష్ణుని మాటలు సత్యం. ఆతని ధర్మనిరతికి అందరు శిరసు వంచారు. అంజలి ఘటించారు. తమ ఆమోదంతో హర్షధ్వానాలు చేసారు. మహారాజు ఉగ్రసేనుల వారిని జయజయ ధ్వానాలతో ప్రస్తుతించి తమ ఛత్రఛాయల్లో మధురాధిపత్యం, మధుర లోకారాధ్యం కావాలని, ఆకాంక్షించారు. ఆ రాత్రి -

బలరామకృష్ణులు, ఉద్ధవుడు, ప్రక్కప్రక్కనే పడుకున్నారు. రాత్రి భాగంలో బలరామునిలో తమాషాగా నవ్వు పుట్టింది. ఎంత చిత్రమనుకున్నాడు. మూడు రోజుల క్రితం గొల్లపిల్లలం. ఇప్పుడు యువరాజులం. భలే చిత్రంగా వుంది" అనుకున్నాడు. కానీ -

కృష్ణుని పద్ధతే అతనికి నచ్చలేదు. అదృష్టంగా లభించిన రాజ్యం వద్దన్నాడు. సామాన్యుని వలె బ్రతుకుతానన్నాడు. తెలివితేటలుంటే వుండవచ్చును కానీ సమయస్ఫూర్తి లేదు. పైగా వచ్చిన అదృష్టాన్ని కాలదనుకున్నాడు. నాకిచ్చినా బాగుండేది.

పైగా - అందరు కృష్ణుని దేవుడు అంటున్నారు. దేవుడట, దేవుడట. దైవాంశ వుండటం వేరు. దేవుడవడం వేరు. మీరు దేవుడంటే, దేవుడై పోతామా. అమాయకుడు, పిచ్చివాడు.... మా కృష్ణుడు. అందరి పొగడ్తలకు లొంగిపోతాడు. పొంగిపోతాడు. కనీసం.... పెద్దవాడినని నన్నేమీ అడగడు.

కృష్ణుడు అడగకుండా ఏమీ మాట్లాడటం నాకు చాతకాదు. ఎందుకో అడగని విషయాలలో అనవసర విషయాలలో తలదూర్చడం నాకు చాతకాదు. నాకు చాతయిందల్లా శరీర బల ప్రయోగమే తప్ప, బుద్ధి ప్రయోగం కాదు. అందుకే చిన్నవాడైనా కృష్ణుని కనుసైగల కోసం ఎదురు చూస్తుంటాను.

నిజానికి మా కన్నయ్య అద్భుత శక్తి సంపన్నుడు. మా బంగారు కన్న.... అని మొదట్లో మనసులో గొణుక్కున్న బలరాముడు.... శ్రీ కృష్ణుని దివ్యవదనార విందానికి, ఆ పెదవులపై సదా కనుపించే తరగని, చెరగని, చెదరని దరహాసానికి పొంగిపోతూ -

తన చేతిని తమ్ముడు కృష్ణుని భుజాల నుండి పొట్టపైకి వేసి, నిద్ర కుపక్రమించదలిచాడు.

"మా బంగారుకన్న....." అది శ్రీకృష్ణునిపై - అందరికంటే మిన్నగా - ప్రేమానందాల్ని ప్రసాదించే - బలరాముని - అద్వితీయ ప్రేమ, వాత్సల్యాలు.

# విద్యాభ్యాసం

**ఆ** భవంతిలోని, తమ గదిలో విదర్భ యువరాణి రుక్మిణి ఒక ప్రక్కగా కూర్చుంది. తన వదినగారు - అన్న రుక్మి భార్య సువ్రత ఆమెను కోపంగా చూస్తూ "తమరు నిన్నల్లా కనబడలేదు. నేనెంత భయపడ్డానో, ఆందోళన పాలయ్యానో తెలుసా ? తమరెక్కడికి వెళ్ళారు ?" రాజస - వ్యంగ్యాల మేళవింపు స్వరంతో, ఆ వదినగారు - అధికారయుతంగానే దబాయిస్తుంది.

సమాధానంగా రుక్మిణి ఎంతో మెల్లగా "త్రివక్రతో కలిసి - పరిస్థితులు గమనిస్తున్నాను" అంది. అక్కడనుండి - దేవకీదేవి భవనానికి, అటు నుండి ఏదో చెప్పబోతుంది.

"రుక్మిణీ, నీ ఆంతర్యం నాకు అర్థమయింది. మా అన్నగారు చూస్తే చాలా ప్రమాదం. అయినా నాకెందుకు ? నీ వ్యవహారం. ఆయనే చూసుకుంటారు. కానీ నీ పద్ధతి నాకేం నచ్చలేదు. ఒక దాసీ త్రివక్రతో షికార్లు కొట్టడం, దేవకి చుట్టు ప్రదక్షిణలు చెయ్యడం - ఎంత అవమానకరమో, మా అన్నగారికి ఎంతో బాధాకరమో... అర్థం చేసుకుంటే.... ఇలాగ ప్రవర్తించవు! "కూడని పనిచేసినట్లు కసురుకుంటే, రుక్మిణి కోపంతో మొహం ముడుచుకుని కూర్చుంది.

మొత్తానికి ఆ రాత్రి భాగం గడిచి తెల్లవారింది. కంసునికి జరుగవలసిన

పారలౌకిక క్రియలు పూర్తయ్యాయి. విదర్భ యువరాజు రుక్మి తన అతిథి గృహానికి వచ్చేసాడు. కంసుని అంతిమయాత్రలో మహారాజు ఉగ్రసేనుడు, యువరాజు వసుదేవుడు, ఇతర యాదవ ప్రముఖులలో ముఖ్యులైన బాహుకుడు, అక్రూరులతో పాటు బలరామకృష్ణులు, ఇతర ధనుర్యాగ అతిథులు.... ఇష్టం లేకపోయినా సాంప్రదాయబద్ధంగా, రాజవంశానికి కృతజ్ఞతగా - ప్రజలు పాల్గొన్నారు.

మధ్యాహ్నం దాటింది. ఎందరో సంతోషించారు. కాని విదర్భ యువరాజు రుక్మి వంటి, యువనేతలు, కంస "హింస" ప్రియులు, ఆ హఠాత్పరిణామాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. అటువంటి చిరాకు సమయంలో "రాజా!" మీ చెల్లెలి గారి ప్రవర్తనతో నాకు విసుగేస్తుంది. ఆమె రక్షణ ఇక మీదేనంది. ఆ వెంటనే రుక్మిణి "పొరపాటు చేసి అనవసరంగా మీతో వచ్చాను. నా ప్రాణాలు తోడేస్తున్నారు. చంపుకు తింటున్నారనేసింది.

"అసలేం జరిగింది" వస్తూనే అవమానం, ఆ తదుపరి కంస మరణంతో, తన ఆశలన్నీ అడియాసలైనట్లుగా తలచే రుక్మి - ఆగ్రహం పట్టలేక గట్టిగా అరిచాడు. రెండు కొప్పులు ఒక చోట ఇమడలేవన్న సత్యం సత్యపరిచారు. అయినా వదినా, మరదళ్లు - కలివిడిగా వుంటారని అనుకోవడం.... "నాదే ఒక పెద్ద పొరపాటు..." తప్పు చేసినట్లు తలబాదుకుంటున్నాడు "అసలేం జరిగింది, రుక్మిణీ ?" చెల్లెల్ని ముందుగా అడిగాడు.

"ఏం జరుగలేదు" అని, "ఆ కాబోయే మహారాణినే అడుగు" నేనంటే ఎంత అసహ్యమో ఆమే చెబుతుంది. అనవసరంగా వచ్చాన"న్నట్లు అటు.... నిష్ఠూరం, ఇటు వెటకారం కలిపి మరీ చెప్పింది.

"అదేం కాదు. నేనేం తప్పు చెయ్యలేదు. మనమంటే మీ చెల్లెలుకే చులకనగా వుంది.... నిన్నటికి నిన్న... బాహు యుద్ధం జరుగుతుందా ? అప్పుడామె ఎగురులు, చప్పట్లు అలగా జనంలాగ ఎగురుతూంటే, అదేమిటన్నా.... అంతే. ముంగిలాగ....! మోహం ముడుచుకుంది.

"ఏం ఎగరకూడదా ? చిన్న పిల్లను, నా సరదాతో నేను ఎగురుతే నీకేమిటి ?"

"అవునవును. నీ ఎగురుళ్ళు, ఆ నల్లటివాడిని ఇకిలిస్తూ చూడటం అన్నీ

నేను గమనిస్తున్నాను. చిన్నపిల్లట, చిన్నపిల్ల. నువ్వు చిన్నపిల్లవా ?'' చిన్నబుచ్చు తున్నట్లు మాట్లాడింది. ఒకరిమీద మరొకరు చాడీలతో, అదేదో రాజకుటుంబ వ్యవహారం లాగ కాక, వీధులలో గొడవలు పెట్టుకునే పూరిజనంలాగ - తనను విసిగించడంతో, ''నోరు ముయ్యండి'' అని కసురుకున్నాడు.

వదిన, మరదళ్లు వాగ్వివాదం తారాస్థాయికి చేరుకుంటుంది. పున్నట్టుండి మాయమయ్యావు, ఎక్కడికి వెళ్ళావు ? ఆ కంసారిని చూడటానికి, శత్రువులతో మిత్రత్వం చెయ్యడానికి సిగ్గుగా లేదా ? రుక్మి భార్య సువ్రత ఈసడింపుగా పలికింది.

''మీ ఇద్దరు నోర్మూసుకుంటారా ?'' కసురుకున్నాడు. ''రుక్మి...'' తప్పకుండా.... అనవసరంగా ముందు వదిన, తనను తాను, తానెక్కడ వున్నదో తెలుసుకుని మరీ మాట్లాడితే ఆమె గౌరవాన్ని నేను గుర్తిస్తాను. గౌరవిస్తాను.'' ధర్మబద్ధంగానే రుక్మిణి పలికింది.

''అనండి. అందరు నన్నే అనండి. అన్నా చెల్లెలు ఎప్పుడూ ఒక్కటే. ఎటొచ్చీ బయట దానిని నేనే కదా, అనండి!'' స్త్రీ సహజ బుద్ధిని కాబోయే మహారాణి సువ్రత ప్రదర్శించుకుంది.

''నిన్నూరు కోమన్నానా ?'' అని భార్యను గదిమి, చెల్లెలు వైపు తిరిగి, అసలు దేవకి భవనానికి ఎందుకు వెళ్ళావు ? అక్కడేం జరిగింది ? వివరంగా చెప్పు'' రుక్మి అడుగుతున్నాడు. సమాధానంగా రుక్మిణి.

''మీరంతా కంసరాజు శరీరాన్ని అనుసరించారు. నేను దేవకిని చూద్దామని త్రివక్రతో కలిసి వెళ్ళాను. అప్పుడామె ఎందుకో స్పృహ తప్పితే, ఆమెను, ఆ నీలపు కుర్రవాడు, పట్టుకుని ఆమె భవంతికి తీసుకువెడుతూంటే త్రివక్ర అనుసరించింది. ఆమెను నేననుసరించాను. దేవకీదేవికి స్పృహ వచ్చాక, అతనూ వెళ్ళిపోయాడు. కాస్సేపు నేనక్కడ కూర్చుని ఇలాగ వచ్చేశాను.

''ఇంతేనా.... ?''

''అక్కడ నుండి, అతను వాళ్ళ భవనం ముందున్న చెట్టు క్రింద సమావేశమైన వారి వద్దకు వెళ్ళాడు. అంతకుముందేం జరిగిందో నాకు తెలియదు కాని అప్పుడు ప్రస్తుత మహారాజు ఉగ్రసేనులవారు. అదే మన కంసరాజుగారి

తండ్రిని అందరు రాజ్యాధికారం చేపట్టమని కోరారు. అందరు "ఔనంటే, ఔనన్నారు." మరి ఆయనో, కాదని ఆ నల్లనయ్యను రాజ్యం ఏలమన్నారు. అందరు, అప్పుడు అతన్ని అదే ఆ నల్లవాడిని జయజయ ధ్వానాలతో స్తుతించారు.

"అయిపోయింది." ఏది జరగకూడదో, అది జరిగిపోయిందని, రుక్మి తల బాదుకున్నాడు.

"కంగారుపడకన్నయ్యా! అతను అందరి మాటను కాదన్నాడు. రాజ్యాధికారం వలదన్నాడు. గొల్లపిల్లలతో కలిసి, గోపాలుడిగా పెరిగిన నాకు, ఈ సింహాసనాధిపత్యం వద్దు. మీ అందరు ఇచ్చిన గౌరవానికి, చూపిన ప్రేమాభిమానాలకు చాలా సంతోషమని" లేచి, రెండు చేతులు జోడించి, మరీ వినయంగా, రాజ్యాధికారం వలదన్నాడు. "రుక్మిణి, ఆ విధంగా చెప్పగానే "నిజమా!" కృష్ణుడు రాజు కాకపోయినందులకు, రుక్మి సంబరపడుతూ అన్నాడు.

అర్థమయిందా ? ఆమె.... భీష్మకుని కూతురిగా యువరాణిగా, "ఆతను" అందే తప్ప, ఆ కృష్ణుని పేరు ఉచ్ఛరించలేదు. "తెలిసిందా ?" అన్నట్లు రుక్మి భార్యను హెచ్చరిస్తే - అందుకు సుద్రవత.

"ఎందుకు చెబుతుంది. పేరు ? అతనిపై మక్కువ కల్గి, మమకారం పెరిగి, అతనికి రాణీ కావాలని తలచేవాళ్ళు. పేర్లు చెబుతారా ? చెప్పరు. ఇది మన సాంప్రదాయ విరుద్ధం" అంది.

ఈ గొడవ తెగేటట్లు లేదనుకుంటున్న సమయంలో ద్వారపాలకుడు వచ్చాడు. జయము చెప్పాడు. "యువరాజుల దర్శనార్థం, గురుదేవులు సాందీపుల వారు, అవంతి ప్రభువులు జయసేనులవారి యువరాజులు, విందానువిందలు, వేచియున్నారని చెప్పాడు.

సుద్రవత, రుక్మిణిలు సర్దుకుని లేచేసరికి గురుదేవులు వచ్చారు. వారికి రాణీ - యువరాణులు పాదాభివందనం చేసారు. సాంప్రదాయానుసారం, తాను గురుదేవులకు వందనాలర్పించాడు. పరమపూజ్యులు, అస్త్రవేత్తలయిన శ్రీ సాందీపులవారు, దాదాపు ఇరవై అయిదు సం॥ల క్రింది శక్తి సమన్వితుడు, అవతార పురుషుడు, అస్త్రశస్త్రాస్త్ర కోవిదులు, "పరశు"రామునిగా విఖ్యాతుడైన

భార్గవరాముని ఆశ్రమాన్ని విడిచి...

సుదీర్ఘ ప్రయాణం చేసి, చేసి, చివరకు పదిహేను సం॥ల క్రిందట, అవంతీపురంలో తన ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్న శ్రీ సాందీపులవారు, తమ అస్త్రవిద్యా పాండిత్యాన్ని కోరిన సమర్థులందరికి ప్రదానం చేసారు. విదర్భరాజు కుమారుడైన, ఈ రుక్మి గూడా సాందీపుల వారివద్దే అస్త్రవిద్యను పొందాడు. ప్రస్తుతం - వింద, అనువిందలు మహర్షి శిష్యరికం చేస్తున్నారు.

మహర్షి తమ నలభైమంది శిష్యులతో సంచారం గావిస్తూ, ఆహ్వానించిన రాజ్యాధీశులను దర్శిస్తూ, ప్రస్తుతం మధురానగరానికి విచ్చేసారు. మళ్ళీ ఇక్కడ నుండి తమ ఆశ్రమానికి వారి ప్రయాణం. ఇది లోక విదితం. ప్రస్తుతం గురుదేవుల రాకకు కారణం తెలియని రుక్మి, తమ ఆదేశం సర్వదా శిరోధార్యమని ఆజ్ఞ కోసం ఎదురు చూస్తు నిల్చున్నాడు.

రుక్మి అభ్యర్థనముతో మహర్షి "రాజకుమారా! ప్రస్తుతం నేను మధురాధిపతి ఉగ్రసేనులవారి ఆజ్ఞానుసారమిటు వచ్చాను. తమనొక కనీసం పక్షం (పదిహేను) దినములు, తమ రాజ్యంలో, తమకు అతిథిగా వుండమన్నది ప్రభువుల కోరిక అన్నారు.

"పక్షం దినాలా ? ఇటువంటి సమయంలోనా ? నేనుండలేను ?"

"ఇటువంటి సమయంలోనే మహారాజుకు తమ తోడు అవసరం. ఏదీ అకారణం కాదు. అలాగని కారణం వెదకలేము. విధి బలీయం. కంసుడు మీ మిత్రుడు కాబట్టే. అవసర సమయంలో మహారాజుకు మీరు అండగా వుండి, ఓదార్చడం మీ విధి" అని నా భావన. ప్రభువుల వుద్దేశంకూడా అదే - అంటూంటే...

"కొన్నాళ్ళిక్కడే వుందాం, యువరాజా!" తన అభిప్రాయాన్ని కూడా అడగకుండానే విందుడు తెలిపాడు. ఆ తదుపరి మన గురువులతో నగరానికి తిరిగి వెడదామన్నాడు. అదేం కుదరదు. పదిహేను దినాలు కాళ్ళు చేతులుకట్టుకుని ఇక్కడ వుండలేను. వెళ్ళిపోవాలన్న భావాన్ని రుక్మి నిక్కచ్చిగా ప్రకటించాడు -

"నిజమే. ఇక్కడ మీకేమీ తోచదు. వెళ్ళి తీరాలి. తప్పదు. కానీ, మీ మిత్రుని శ్రాద్ధ దినాలు పూర్తిగాకుండా, అర్థాంతరంగా మహారాజును విడిచిపెట్టి,

మధ్యలో వెళ్ళిపోవడం సబబుగా వుంటుందా, నువ్వే ఆలోచించు, యువరాజా!''

“మరో విషయం. ఆ తర్వాత అయిదు దినాలకు బలరామ-కృష్ణులకు ఉపనయన సంస్కారం జరుగుతుంది. ఇవన్నీ సాటి రాజులుగా, మధురాధిపతిని మన్నిస్తూ - పాటించవలసిన కొన్ని సాంప్రదాయక, విధి విధానాలు.'' గురువుగా శ్రీ సాందీపులు విషయ వివరణ చేస్తున్నారు. బలరామకృష్ణులకు ఉపనయనం జరగలేదనేసరికి రుక్మి ఆశ్చర్యపోయాడు. అతని మనసును కనిపెట్టిన సాందీపులు-

“యువరాజా! వారు పెరిగిన వాతావరణం, ఆ ప్రదేశిక వ్యక్తులు, రాజులు కారు, రాజ ప్రతినిధులు మాత్రమే. “గురుదేవుల మాటలతో నిజమన్నట్లు తలూపిన రుక్మి'' అవును, గురుదేవా! ఆ కృష్ణుడు అంది వచ్చిన అవకాశమైన రాజ్యాధికారాన్ని కాదన్నాడట. నిజమేనా ?' అడిగాడు.

“నిజమే. ఆ “నిజం'' నాకు నిజంగానే తెలిసింది.'' అనగా గురుదేవా! “మరి - ఆ కృష్ణుడు మేనమామను ఎందుకు చంపినట్లు ?' అది అమాయకత్వమో, విషయం తెలుసుకోవాలన్న గడుసుతనమో కానీ, యువరాజు అడుగుతున్నాడు. తను చెప్పాలి.

“యువరాజా! కృష్ణుని గూర్చి ఇంకా ఈ లోకానికి సరిగ్గా తెలియదు. అతడు అధర్మ నాశకుడైన అవతార పురుషుడే తప్ప. ఈ లోక సహజ ధర్మాన్నను సరించి సాగే, సామాన్య రాజకుటుంబీకుడు కాదు, అతనికి రాజ్యకాంక్ష ఏ కోశానా లేదు.'' సత్యం విషయంగా గురుదేవులు సాందీపులవారు వివరించారు

“అలాగా'' అని తలూపిన రుక్మి అయితే, ఇప్పుడా కృష్ణుడేం చేస్తాడు ?'' ఆసక్తిగా అడుగుతాడు.

“అందరిలాగే చదువుకుంటాడు.'' గురుదేవులు అంటూంటే, అనువిందుడు, ఆ కృష్ణుడు తన అన్నతో కలిసి మన ఆశ్రమానికి వస్తున్నాడంటాడు.

“మన ఆశ్రమానికా ?'' రుక్మి ఆశ్చర్యపోతూంటే “వద్దా!'' అన్న సాందీపులు “చూడు. యువరాజా! నేను కొన్నాళ్ళు బృందావనంలో వుండటం తటస్థించింది. ఆ సమయంలో ఈ కృష్ణుని నేను చూసాను. అన్ని రకాల గమనించాను. అటువంటి అసాధ్యులను క్రమశిక్షణ - కట్టుబాట్లలో వుంచుకోవడం నాకు బాగా తెలుసం''టారు.

"అలాగా" అని, భార్యవైపు తిరిగి "సువ్రతా! నీ ఉద్దేశం" రుక్మి అడుగుతాడు. ఆమె సమాధానం చెప్పేలోగా రుక్మిణి "అన్నయా! మహారాజు అభీష్టాన్ని కాదనడం సబబు కాదు. వారి మాటను మనం గౌరవించాలి. కనుక, ప్రభువు కోరిక మేరకు కొన్నాళ్ళు ఇక్కడే వుందామంది... ఆ.... వెంటనే-

"అదేం కుదరదు. వెళ్ళిపోదామంది, సువ్రత. ఇరువురిని అటు ఇటు చూసిన సాందీపులవారు "యువరాజా! వీరిరువురి మనసులు కలువవు. ఇవి భిన్న ధృవాలు. కనుక, నువ్వే ఆలోచించుకుని, ఒక నిర్ణయానికి, రా! నా వుద్దేశమేమిటని, పొరపాటున నువ్వడిగితే, "వుండటం, మంచి"దంటాను. ఆ తర్వాత నీ ఇష్టం. కాదని వెళ్ళి, అనవసర వాదాలకు లేదా పట్టుదలలకు ఆజ్యం పోయకూడదు!" అనగానే రుక్మి, మెత్తబడతాడు.

★★★★

దురదృష్టవంతుడీ కంసుడు. ఇందర్ని కాదని, తన స్వబుద్ధి మేరకు, అనవసరంగా ప్రాణాలు తీసుకున్నాడు. చరిత్రపుటలలో లోకకంటకునిగా నిలచి పోయాడని, క్షణకాలం కృష్ణుడు బాధపడ్డాడు. అది ఆ ప్రేమమూర్తికి, మానవ సహజమైన ఆలోచన. కృష్ణుడు అలాగే చేసాడు. అలాగే ప్రవర్తించాడు.

తాతగారు ఉగ్రసేనుని చూస్తేనే కృష్ణునికి మనసు ద్రవించింది. ఎంతో బాధ కల్గింది, ఆయనకు అంతిమ సంస్కారం చెయ్యవలసిన కుమారునికి, ఆయన ప్రేతకర్మ చెయ్యరావడం నిజంగా బాధాకరం. దురదృష్టకరం. కంసమామ దహన కార్యక్రమానికి హాజరైన కృష్ణుడు - అన్న బలరాముడు, దాయాది తమ్ముడు ఉద్ధవునితో కలిసి పవిత్ర స్నానమొనరించి, నందాదులు విడిది చేసిన పొలిమేరలకు వెళ్ళాడు.

నందుడు - ఇప్పుడు ఆ "నందుడు" కాదు, మామూలు బృందావన గో-గోప - స్త్రీ పరిరక్షకుడు. ప్రజా ప్రతినిధి. ముగ్గురు తనకు సాష్టాంగ నమస్కారం చేస్తే అందర్ని దగ్గరకు తీసుకున్న నందుని కంఠం గద్గదమయింది. కళ్ళనీళ్ళు చిమ్మాయి. మాట పెగలడం లేదు. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. వచ్చే బాధను ఆపుకున్నాడు. గొంతు సవరించుకున్నాడు.

అయినా కృష్ణుని రూపం, నందుని కన్నీటి జారికల మధ్య అస్పష్టమయింది.

అయినా తనను తాను అన్నివిధాల తమాయించుకున్నాడు. గొంతు పెగల్చు కున్నాడు. కృష్ణుని అక్కున చేర్చుకుని, గాఢాలింగనంతో వదలలేడనుకున్న, అందరి ఆలోచనలను ఓ ప్రక్కన పెట్టాడు. మమతానుబంధాలకు ఇక, ఏ మాత్రం తగుల్కొని, భరించి బాధపడలేనట్లు మనసు రాతిని చేసుకున్నాడు. మెల్లిగా-

"కృష్ణా! రేపు ఉదయం మా ప్రయాణం" చెప్పుకోలేని, అశక్తత, ఆర్ద్రత, ఆ మాటల్లో ధ్వనించింది. బరువెక్కిన హృదయం - దాన్ననుసరించి మాట పెగలటం లేదు. "వూ" - "వూ" అన్నట్లు కృష్ణుడు తలవూపాడు. కన్నీటిని తుడుచుకున్నాడు.

"తెల్లవారే వెడుతున్నారా ?" బలరాముడడిగాడు. అతడే - మరో పదిహేను దినాలలో ఉపనయనం జరుగుతుంది కదా! అంతవరకు వుండి, ఆ పైన మెల్లిగా వెళ్ళవచ్చును. మాట్లాడవేం కృష్ణా... నాన్నగారు వెళ్ళిపోతానంటే....! ఉభయులు సమాధానం చెప్పుకోలేని తీరులో వున్నారు.

"లేదు బలరామా! బయలుదేరుతాము. అంతవరకు ఇక్కడ వుండలేము. అక్కడ, ఆ పిచ్చిది మన రాకకోసం ఎదురు చూస్తూ, అన్నపానాలు విడిచి వీధిలో కూర్చుంటుంది. ఆరుబయలు వరండాయే ఆమెకు అన్నీ....! చీమ చిటుక్కుమన్నా ఆకు కదిలినా, మనముగాను, మన రాకగాను తలచి, తలచి ఆ పిచ్చిది. మరీ వులికి పడుతుంది.

అయినా ఎలాగైనా మేము వెళ్ళవలసిన వాళ్ళం. మీరిక్కడ వుండవలసిన వాళ్ళు. ఈ ఎడబాటు మా దౌర్భాగ్యం. దురదృష్టవంతులమైన మా అదృష్టం కొద్దీ... ఇన్నాళ్ళు.... మీ ముద్దుముచ్చటలు చూసే మహద్భాగ్యం కలిగింది. ఇకపైన ఆ తీపి గుర్తులను తలచుకుంటూ, ప్రాణమున్నన్నాళ్ళు బ్రతుకమని ఆ భగవంతుడు నిర్ణయించాడు. ఆ సంతోషంలాగే ఈ బాధ భరిస్తాము. ఎటొచ్చీ ఆ పిచ్చిదే మీపై గల ప్రేమాభిమానాలతో ఏమయిపోతుందో! మా బ్రతుకు లెలాగ ముగుస్తాయో....!" నిరాశా నిస్పృహలు సంపూర్ణంగా అలుముకున్న నందుడు తీరని దుఃఖంతో, ఉద్వేగమాపుకొన ప్రయత్నిస్తున్నాడు. సర్వం తెలుసుకోగల కృష్ణునికి, తన జీవితాన్ని నందుడు, తెరచిన పుస్తకంగా చేసాడు.

"తండ్రీ! తొందరపడకండి. ఈ కృష్ణుడెక్కడున్న ఇతడు "యశోదా" నందుడు" - "నంద"నుడే. ఇది సత్యం. కొన్నాళ్ళు ఓపిక పట్టండి. వెన్నెల వెనుక చీకటి. ఆపై మరల వెన్నెల. ఇది ప్రకృతి సహజం. అలాగే మన జీవితాలు,

అందలి కష్టసుఖాలు - పండిపోయిన ముసలి జ్ఞానిలాగ చెబుతున్నాడు.

కృష్ణుడు చెప్పింది సత్యమే కావచ్చును. కానీ ప్రస్తుత పరిస్థితులలో బలరామునికి నచ్చలేదు. నందుని ఆవేదనను తీర్చలేడు. ఆ స్థితిలో కృష్ణుడే తండ్రి నందరాజుతో "తండ్రి! నేను మీకు దూరమయ్యానని, నా వియోగం భరించలేమని బాధపడకండి. ఈ కృష్ణుడు - ఎక్కడెలాగ వున్నా మీతో వున్న అనుభూతిని మీకు కల్గిస్తాడు. నా మాట నమ్మండి."

"మీతోపాటు, ఈ ఉద్ధవుడు వస్తాడు. నా మాటలను అందరికి చెపుతాడు. అమ్మను ఓదారుస్తాడు. ఈ కృష్ణుడు ఈ నంద యశోదలకు "నంద"నుడు. యశోదా "నంద"నందనుడు. ఇది నిజం. అందర్ని ఓదార్చాడు. కాలగతిని కాగల కార్యాన్ని తెలియబరిచాడు. పేరు పేరున స్నేహితులనందరిని వూరడించిన కృష్ణుడు - అక్కడ నుండి -

వసుదేవుని మందిరానికి వచ్చాడు. అక్కడ తల్లిని అన్నాళ్ళు గుండెలో ప్రేమను, పదిల పర్చుకుని, ఆరాధనతో గడిపిన, ఆనందవల్లి, దేవకిమాతను ప్రేమతో చూసాడు. ఆ ఆరాధనలోని ఆనందమహాత్మ్యం ఆ తల్లికి మాత్రమే తెలుసు. ఆ తదుపరి తండ్రి వసుదేవుని కలిసాడు.

అన్నీ తెలిసిన ఆ యదుకుల మౌళిని, గోపాలబాలునిగా ఆ క్షణంలో తలచిన వసుదేవుడు "కుమారా!" అంటూ క్షత్రియ ధర్మాలను, వారి లక్షణాలను, మహా ఋషులు, తాపసవేత్తల తత్వాలను, బ్రహ్మమూర్తుల "పరబ్రహ్మ" తత్వాన్ని మానవాళి కోసం వారు చేసే సాధనలు, బోధనలను వివరంగా చెప్పాడు.

ఆ సమయంలో అక్కడ బలరాముడు, ఉద్ధవుడు కూడా వుండి కృష్ణునితో కలిసి వసుదేవుని బోధనలను ఎంతో చక్కగా వింటున్నారు. ఆ క్షణంలో వసుదేవుడు తన సోదరి కుంతిని గూర్చిన వివరాలను కూడా చెప్పాడు. ఆమెను హస్తినాపుర "రాణి"గా కూడా విపులంగా చెప్పాడు.

కుంతీ కథనాన్ని, పాండురాజు - వారి పుత్రుల వివరాలతో కలిసి అంతా విన్నారు. నందరాజు, ఆతని పరివారాన్ని, రాచప్రతినిధులను, అతిథులను ఆహ్వానించినది కంస యువరాజైనా, మధురాధిపతి ఉగ్రసేనుల వారితోపాటు, వసుదేవుడు, అక్రూరుడు, యదుకుల గురువులు గర్గాచార్యులవారు, శిక్షా గురువు

శ్రీ సాందీపుల వారు కూడా సాదరంగా తమతో వుండమని కోరారు.

"కంసరాజు ఉత్తరక్రియలను దగ్గరుండి పూర్తిచేయమని కోరారు. ఆ తదుపరి బలరామ-కృష్ణుల ఉపనయన కార్యక్రమాన్ని కూడా పావనం చెయ్యమని ప్రార్థించారు. "ఈ మొత్తం విషయం కృష్ణునికి తెలిసింది. విదర్భ యువరాజు రుక్మి, ఆతని భార్య యువరాణి సువ్రత పెదవి విరుపులు, యువరాణి రుక్మిణి అంతరంగం.... సర్వం సాందీపుల మాటలలో గ్రహించిన కృష్ణుడు మందహాసం చేసాడు.

ఆ తర్వాత అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. అనుకున్న ప్రకారం - బలరామ, కృష్ణులు, ఉద్ధవుడు శ్రీ సాందీపుల వారి గురుకులానికి బయలుదేరారు. కృష్ణునికి సాందీపుల వారంటే ఎంతో మక్కువ, ప్రేమ, సమర్థులైన శిష్యులకు, శ్రీ గురువులు తమ సహజ ప్రేమానురాగాలతో, తమ వద్ద ఏమీ దాచుకోకుండా, సర్వ విద్యలు ప్రసాదించి, ఉన్నతుని - ఉత్తముని చేసార్తన్న సత్యాన్ని -

శ్రీ సాందీపులవారు బృందావనంలో వున్న ఆ కొద్ది సమయంలో కృష్ణుడు "సత్యం"గా తెలుసుకున్నాడు. తన శ్రద్ధా-భక్తులను వారియందు గల గౌరవాన్ని విస్పష్టంగా ప్రకటించుకున్నాడు.

"రాజ్యం వీరభోజ్య"మన్న క్షత్రియశాస్త్ర వాక్యమొక సిద్ధాంతంగా, యదు వంశీయులందరొక బృందంగా చేరి, ఆ సంఘానికి శూరసేనుని నాయకుని చేసే కార్యక్రమంలో, బలపడిన ఆ బృంద నాయకుల సంతానం ప్రభావం - శక్తియుక్తులతో ప్రతిభాపాటవానికి తలవొగ్గినట్లు, ఉగ్రసేనుడు రాజవడం, ఆయన బలహీనతలు, దయా ధర్మబుద్ధి నచ్చని ఒకనాటి "కాలనేమి" నేటి కంసుడు తనదైన పద్ధతిలో తన వంటి వారినందర్నీ ఒక కూటమిగా చేసి, బలహీనులను తన బలదర్పాలతో, అణిచివెయ్యడమో, బహిష్కరించడమో, బహిరంగవధో... జరిపి, తండ్రిని కూడ చెరబట్టి, ఏదో వకరకంగా తన ప్రాబల్యాన్ని చాటుకున్నాడు. తన రాక్షస కృత్యాలతో అందరిముందు కుల, వంశ ఘాతకుడు, శిక్షార్హుడయ్యాడు.

యదు మహారాజు పుణ్యంతో వెలసిన వంశం కాలక్రమంలో - కొన్ని శాఖలుగా విభజించబడి విస్తరిల్లింది. అందులోనివే - అంథక, వృష్ణి, శూర, భోజ వంశాలు. అవి కొన్ని దేశాల పాలనా పగ్గాలు స్వీకరించాయి. చరిత్రకు ఋజువైన,

బలమైన సాక్ష్యాధారాలుగా కేవలం నిలబడటం కాదు, సుస్థిర స్థానమొందాయి. సత్య-ధర్మ పరిరక్షణకు తగు విధంగా పాటుబడ్డాయి.

భోజుల వంశం "చేధి" దేశంలో స్థిరపడింది. ఆ దేశాధిపతియైన దమన ఘోషుడు వసుదేవుని మరో సోదరియైన "శృతశ్రవ"ను వివాహమాడాడు. వాళ్ళ కుమారుడే శిశుపాలుడు. బలరామ-కృష్ణుల "ఉపనయన" మహోత్సవానికి ఎందరెందరో బంధువులు, యాదవ ప్రముఖులు, దేశాధిపతులను ప్రత్యేకంగా ఆహ్వానించారు.

అయితే వైరానికి మూల స్వరూపమైన కంసుని మామగారు, తన కుమార్తెలు కంస రాణులైన "అస్తి - ప్రాప్తి"ల తండ్రి, చక్రవర్తి అయిన జరాసంధునితోనే ఈ వచ్చిన తంటాకు, కంసుని మరణం మరో కారణమై, వైరం పెరిగి పగ-ద్వేషాలు పెచ్చరిల్లడానికి, ప్రజ్వరిల్లడానికి - ఆజ్యధార అయింది. దీనికి మూలకారణం "కృష్ణుడు" అనేసరికి అల్లుని మరణాన్ని భరించలేని జరాసంధుడు, కృష్ణుని ఉనికిని గుర్తించి సహించలేకపోతున్నాడు.

ఆ గోపాలుడు, పశువుల కాపరి, వీరాధివీరుడైన నా అల్లుని చంపాడు... అన్నమాట కన్నా.... అందరు కలిసి కుట్రపన్ని తన అల్లుని చంపి, తన కుమార్తెలకు వైధవ్యం కల్గించారని, ఇది భరించలేని దుర్మార్గమనీ - దీనిని భరించి, సహించ రాదని, తగు శాస్తి చెయ్యాలనే ప్రతీకార జ్వాలలకు లోబడిపోయాడు.

ఎంత బంధువు, బావగారయినా, వసుదేవుని కుమారునిగా చెప్పబడే కృష్ణుడు చేసిన కంసవధ ఆతని మిత్రునిగా, వీరాభిమానిగా దమనఘోషునికి వ్యధ - బాధ. తండ్రికి తోడుగా, ఆతని కుమారుడు శిశుపాలునికి కూడా - "కంసు" డంటేనే ఇష్టం. కాబట్టి యాదవుడైనా, అయిన వాడయినా, కాని పనులు చేసే కంసమిత్ర బాంధవుడై, దమనఘోషుడు, తమకు వ్యతిరేకమౌతాడేమోనన్నది మధుర, పరిసర ప్రాంతాధీశులు, రాజప్రతినిధులైన యాదవుల భయం.

సరే. విదర్భరాజు భీష్మకుడు కూడా, కంసునికి ప్రియమైన మిత్ర బాంధవుడే యువరాజు రుక్మి సరేసరి. "కంస" అన్నపేరు వినగానే, ఆ "హింసా"వాది నామంతో పులకరిస్తాడు. అహింస మాట వినబడరాదని తనవారిని శాసిస్తాడు కూడా! అంతటి వీరాభిమానులు వారు.

ఇటువంటి స్థితిలో - ఏ ఒక్కరు వూహించినట్లుగా, ఏ ప్రతిఘటనను

అందుకోలేదు. అలాగే వస్త్రారనుకున్న వారందరు కూడా రాలేదు. ఛేది దేశాధిపతి దమనఘోషుడు వారి కుమారుడు యువరాజు శిశుపాలుడు కూడా రాలేదు. ఆ "గోపాల-పశువుల కాపరితో బంధుత్వమేమిటి ? వాళ్ళకు ఉపనయనం, మనం వెళ్ళడం... అనవసరమన్న సిద్ధాంతానికి వచ్చేసాడు.

ఊహాతీతంగా అతిధులు, బంధువులు, వారి స్పందనలు, మధురాధిపతికి, ఆ ప్రాంత యాదవ ప్రముఖులకు ఆశ్చర్యం కల్గించింది.

ఇలా వుంటుండగా అంటే - ఇంకో మూడు రోజులలో ఉపనయన మనగా- అందర్ని ఆశ్చర్యపరుస్తూ వసుదేవుని మరో సోదరి, పాండు పత్ని కుంతీ భోజుని దత్తపుత్రిక కుంతీదేవి, తన కుమారులతో బలరామ - కృష్ణుల ఉపనయన మహోత్సవానికి వస్తున్నట్లు వర్తమానమందింది.

ఈ విషయం, తన మేనత్త కుంతీదేవి తన బావలతో వస్తున్న విషయం, అన్నీ తెలిసిన కృష్ణునికి తెలిసింది. వీరితోపాటు ధర్మాత్ముడైన విదురుడు - ధృతరాష్ట్ర, పాండు రాజులకు సోదరుడు, హస్తినాపుర - కురురాజ్య మంత్రి సత్తముడు కూడా వస్తున్నట్లు కృష్ణుడు తెలుసుకున్నాడు.

తన మేనత్త సుతులు కౌంతేయులుగాను, పాండు పుత్రులు కాబట్టి పాండవులుగాను విఖ్యాతులైన తన బావలు ద్రోణాచార్యుల వారి శిష్యులు. ధనుర్విద్యా పారంగతులు. మేటి విలుకాడు, ధనుర్విద్యతోపాటు, శస్త్రాస్త్ర విద్యా కోవిదుడైన మేటి వీరుడు, అవతార పురుషుడు "పరశువు"ను ఆయుధంగా కల్గిన - పరశురాముల వారి ప్రియశిష్యులు - శ్రీ ద్రోణాచార్యులవారు. ఆ వీరవర్యుల శిష్యులు - తన బావలైన పాండవులు.

వస్తూనే కుంతీదేవి, అంతకుముందు చూడని కృష్ణుని, తనకు చిరపరిచితుని వలెనే ఆలింగనం చేసుకుని, దగ్గరకు తీసుకుంది. ముదమార ముద్దాడింది. నువ్వు అల్లరి పిల్లాడివిట, గడుగ్గాయివట. నీ గురించి విన్నానులే "కృష్ణుని గడ్డం పట్టుకుని ప్రియమార ముద్దులాడుతూ, పరవశించినట్లు మేనత్త కుంతి పులకరించి, పలికింది.

తదుపరి అన్నగార్కి పాద నమస్కారం చేసింది. ప్రేమతో చెల్లిని దగ్గరకు తీసుకున్నాడు. ఇద్దరి కళ్ళలో ఇటు ఆనందం, అటు విచారం కలగలిపినట్లు

ముంచుకొచ్చాయి. ఇద్దరు అటువంటి దురదృష్టానికి బలయిన విధివంచితులే. మహనీయుని తండ్రి ఒకరైతే, మహావీరుని పట్టమహిషి మరొకరు. ఎంతటి వారైనా కాలానికి తలవంచాలని, బలీయమైన విధి నిర్ణయానికి అనుగుణంగానే నడువ వలసి వస్తుందని, కృష్ణునితో కలిపి, అందరి చరిత్ర - కాలానికో చరిత్రగా అందించిందన్న సత్యం - లోకవిదితమైన బహిరంగ రహస్యమయింది.

ఆమె ప్రక్కనే కుంతీ సంతానం - అయిదుగురు అమోఘశక్తివంతులుగా నిలిచారు. నిజానికి కుంతికి వరప్రసాదంగా లభించిన సంతానం ముగ్గురైతే మాద్రి భర్తతో సహగమనం చెయ్యడంతో, తన సవతి మంత్ర వర సంతాన మిద్దరు కలిసి, పంచపాండవులకు కుంతి మాతృమూర్తయింది.

స్ఫురద్రూపులు, దృఢకాయులైన బావలను కృష్ణుడు పరిశీలనగా చూసాడు. మందహాసం చేసాడు. పెద్దవాడు యుధిష్ఠిరుడు. నిజంగా పెద్దవాడు, కృష్ణునికన్న మూడేళ్ళ పెద్దవాడు. రెండవ వాడు భీముడు. అన్న బలరాముని వలెనే బుర్ర లేని బుద్ధిమంతుడు. కండలు తిరిగిన బలశాలి. పైగా భీముడు పదివేల ఏనుగుల బల, శక్తివంతుడని, లోక ప్రఖ్యాతి. పెద్దవాళ్ళిద్దరికి కృష్ణుడు మర్యాదగా- సాంప్రదాయ పూర్వకంగా వందనమాచరించాడు.

యుధిష్ఠరుడు - ధర్మమూర్తి. పిల్లవాడిని పిల్లవానిగానే ప్రేమించి, దగ్గరకు తీసుకుంటే, ఈ భీముడు ఎంతో బాగా తెలుసున్నట్లు చనువుగా బావ వీపుమీద సుతారంగానే చరిచాడు. అనకూడదు కానీ.... ఆ దెబ్బకు.... కృష్ణుడు కాబట్టి కొద్దిగా వూగాడు. అదే ఉద్ధవుడో, మరొకడో అయితే, నిక్కి నీల్గి - బొక్కా బోర్లా పడేవాడు. ఇక - కుంతీ మూడో కొడుకు అర్జునుడు. తానొక పెద్దవిలుకాడినని చెప్పక చెప్పేటట్లు ధనుర్బాణములతోనే అక్కడికి వచ్చాడు. అతన్ని కృష్ణుడు చూసాడు.

కృష్ణార్జునులు - ఇంచుమించు ఒకే వయసు వారు. చూపులకు రంగుభేదం తప్ప - చూడటానికి - ఇరువురు సమాన వయస్కులు. లోక దృష్టిలో సమ ఉజ్జీలు. కాని అర్జునునికన్న కృష్ణుడే పెద్దవాడు. ఆ దృష్టితో బావ కృష్ణునికి, చిన్న బావ అర్జునుడు పాదవందనం చేస్తే - ఎంతో ప్రేమగా అందరు విస్తుపోయేటట్లు ఆలింగం చేసుకుని తన సుకుమార ప్రేమతత్వాన్ని చక్కగా ప్రదర్శించాడు.

ఇక చిన్నవాళ్ళు నకుల - సహదేవులు. ఆ చిన్నవాళ్ళు - కృష్ణుని శక్తి స్థోమతలు, ధర్మ - అవతారతత్వం విని వున్నట్లు - ఎంతో వినయ విధేయతలతో భక్తి పురస్కరంగా పాదాభివందనం చేసారు. ఆ చిన్నవాళ్ళను తనదైన చిరునవ్వుతో స్వాగతించి, దగ్గరకు తీసుకున్నాడు. తన ప్రేమామృత చూపులతో కరుణరసాన్ని కల్పి మరీ - వారిని ఆశీర్వదించాడు. అక్కున హత్తుకున్నాడు.

పాండవులను, బలరామకృష్ణులను విడిచి పెద్దవాళ్ళు వెళ్ళిపోయారు. పిల్లల పిల్లచేష్టలకు తాము అడ్డం కారాదన్న ఉద్దేశమో లేక - బాధల - కుశలప్రశ్నల- బాదరాబందికి నిజంగా బందీ - అయ్యో! మొత్తానికి పిల్లలందరు కలిసారు. ఆ పెద్దవాళ్ళు వెళ్ళగానే అందరిలోకి - ఆకారంలో - పెద్దగా కనుపించే భీముడు - ఎంతో సరదాగా నవ్వుతూ, కృష్ణుని చూస్తూ -

"నీ గురించి నేను విన్న కథలన్నీ నిజమేనా ? లేక కట్టుకథలా ? సహజంగా అడిగేసాడు. ఇదే మరొకరైతే; బలరాముడు తగు సమాధానమిచ్చేవాడు. అడిగింది మేనబావ. ప్రథమ పరిచయంలో తెలుసుకోవాలన్న కుతూహలం కొద్దీ, ఆ ప్రశ్న అడిగినట్లుందే తప్ప, అధిక్షేపించే విధంగా లేదు. దాంతో - అది నవ్వుల సందర్భంగానే మిగిలిపోయింది. అందుకు సమాధానంగా, కృష్ణుడు -

"బావా! నువ్వేం విన్నావో అవి కథలో, గాథలో నాకేం తెలుసు ? నేనేం సమాధానం చెప్పగల్గుతాను'' చమత్కారంగా అన్నాడు.

"భలే చమత్కారివి. నీ చిత్రాలు - లీలలు హస్తినాపురానికే కాదు, లోకంలో చాలామందికి తెలిసాయి. సరే నిజం చెప్పు. పిల్లవాడిగా వుండి పూతన, బకాసుర, తృణావర్త, శకటాసురుల నెందరినో చంపావుట. నిజమేనా ? మళ్ళీ భీముడే...

"అవును. కాళియునిపై నాట్యం చేసావుట. గోవర్ధనగిరిని చిటికెనవ్రేలుపై ఎత్తావుట. ఇవి, ఇవన్నీ.... నువ్వే చేసావా ?'' కృష్ణుని చూసి ఆశ్చర్యంగా అడుగు తున్నాడు. చూడటానికి వ్రేలెడంత లేవు. ఇవెలాగ చేసావు ? ఆ చూపులలోని అర్థం గ్రహిస్తుంటే "గోపాలుర ప్రేమపాత్రుడవు. గోకుల ప్రియుడివనే, భీముని నడుం చుట్టు చెయ్యివేసి, "బావా!'' ఇవన్నీ నేను చెయ్యకూడదా ? అంటే... బలరాముడు కల్పించుకుని "భీమా! మేము కంస - చాణూర - ముష్టికాదులను

చంపాము. ఇది కూడా కథలు - కల్పన లేనా ? సత్యం అందరు అభిమానిస్తారని చెప్పుకుంటారు. ఇదెలాగ సాధ్యం ?

వాళ్ళకు తనపై వున్న అభిమానానికి, తనను గూర్చి తెలుసుకోవాలన్న ఆసక్తికి సంబరపడుతూ, ఈ మధురాపుర ప్రజలు చెబుతారు. అవునో, కాదో... వెళ్ళి కనుక్కోరాదూ ? అనడంతో బలరామునిలోని అసహనాన్ని గమనించిన, యుధిష్ఠరుడు "బలరామా! శాంతించు. బుఱ్ఱ - బుద్ధి లేనివాడు, మా భీముడు కండలు తిరిగిన తన బలం చెయ్యలేని పని.... ఈ చిన్న చిన్ని కృష్ణుడు చెయ్యడమా? అనే ఆలోచనే తప్పు, శ్రీకృష్ణ - బలరాముల శక్తి అతనికి తెలియదు.

అంతెందుకు ? మమ్మల్ని దగ్గరుండి తీసుకు వచ్చిన "శంకు!, మీ గురించి ఎంతో గొప్పగా, ఎన్నో రకాలుగా చెబితే, అన్నీ ఆశ్చర్యంగా విన్న మాకు, నిన్ను తప్పక చూడాలనిపించి, ఇలాగ బయలుదేరి వచ్చాము. వయసుకు, నీవు సల్పిన అద్భుతాలకు పొంతన లేకపోయేసరికి, మా అమాయక భీముడు, ఆశ్చర్యంగా అడిగాడు. అంతే! వినయ విధేయతలు, పెద్దరికం.... తన సొత్తుగా చెప్పాడు.

అన్నగారి సర్దుబాటు ధోరణికి, తన సహజ స్వరంతో నవ్వుతూ "అన్నా! నువ్వే కాదు, ఈ బలరామ - కృష్ణులు కూడా నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేదు. బలరామకృష్ణుల ప్రతాప ప్రభావంతో పులకరించిన నాకు.... అనుక్షణం - అసూయా ద్వేషాలతో, మన వునికిని సహించలేని, మన దుష్ట దాయాదులు, దుర్యోధన - దుశ్శాసనులను, వాళ్ళ తోక - ఆ కర్ణుని అవలీలగా చంపగలనన్న ఆత్మ విశ్వాసం కల్గింది. అది ప్రకటించడానికే విషయం వివరం కోరాను. తప్పు....!" తన మనసును అందరికి, అప్పుడు విప్పి చెప్పేసి, సందేహ నివృత్తి చేశాడు.

"చాలు, వూరుకో!" ఇంటిగుట్టు రట్టు చేయకూడదన్నట్లు యుధిష్ఠరుడు చేతితో సైగ చేసి వారిస్తున్నాడు. పరిస్థితి నర్థం చేసుకున్న బలరాముడు అవసరమైతే మాకు కబురు పంపు. వారి పీచమణుస్తామన్నాడు. కృష్ణుడుకు మాత్రం ఈ అనవసర ప్రతాప ప్రదర్శన, వాదం నచ్చలేదు. సరే మీ విద్యాభ్యాసం వగైరా వివరాలు తెలుపమని, మాట మార్చేసాడు. ప్రస్తుతానికి వారికి మనశ్శాంతిని ప్రసాదించాడు. అందరిలో ఆనందం, మంద-మంద దరహాసం తొణికిసలాడింది.

"మా విద్యలకేం. నువ్వు, నీ విద్యలు మాకన్న అగ్రస్థానంలో వున్నాయి, కదా!" అర్జునుడు అందుకుంటే, "అవును, ధర్మరక్షణం కూడా మీ సోదరులు చేసారు ? ముక్తాయింపు ధర్మరాజు పలికాడు. "బలమైన శత్రువులను కూడా సంపాదించుకున్నాం....!? కృష్ణుడు తన తరగని దరహాసంతో నవ్వుతూ చెప్పాడు.

"భయం లేదు, మేమున్నామన్నా మన్నాడు.

"భయం వారికి కాదు. ఆ "భయం" మనకు. బలరామకృష్ణులే మనకు "ఆ"భయం" తీర్చే అభయమివాల్సి వుంటుందేమో! ఒక ప్రక్క నవ్వులు, మరొక చరిత్ర భవిష్యత్తు - చిత్రంగా ఆ పిల్లల చెబుతున్నట్లుంది. అంతా కృష్ణమాయ... ఏమో! అందుకే అన్నారు "కృష్ణం వన్దే జగద్గురుం" అని.

తలపంకించిన కృష్ణుడు - "భయపడకండి. కాలం చిత్రమైనది. విచిత్ర గతుల నడుపుతుంది. వివేకవంతులు...! అంటున్నాడు. అప్పుడు ఇలాగంటూనే అందరు మమ్ము అప్రయోజకులను చేసి ఆడిస్తున్నారు. బాధల బందీఖానాలో కట్టి పడేసారు" అర్జునుని వదనంలో కనబడని విచారం... మనసులో కనుపించని, చెప్పలేని ఆవేదన.

ఆ నిర్వేదం నుండి అందర్ని బయటపడెయ్యాలని బలరాముడు తలిచాడు. "భయపడకండి. ఈ బాధలు మానవులకు, అందరికి సర్వసహజం. ఈ సమయం అనుకోకుండా, ఒక మంచి కారణంతో కలుసుకున్నాం కాబట్టి. అందరం సంతోషంగా వుందాం. సమయ సందర్భాలని బట్టి కష్టసుఖాలలో మనమంతా ఒక్కటే అన్నట్లు కలిసి బ్రతుకుందాం. పరిస్థితుల నెదుర్కుందాం!" అని అభయప్రదానం చేసినట్లు అతనికి ధైర్యాన్నందించాడు. రండి. అందరం, సరదాగా యమునా నదిలో స్నానం చేద్దామంటే కృష్ణుడు "వద్దు. అమ్మ దగ్గరకు వెళ్ళాలి." అని ఒక్కొక్కరే ధర్మరాజును అనుసరించారు. అర్జునుడు తప్ప అందరు యుధిష్ఠరుని అనుసరించారు. ఇక మిగిలింది కృష్ణార్జునులు.

"ఇప్పుడు చెప్పు. నీవు మేటి విలుకాడివట. క్రొత్త విద్యలు.... అదే ధనుర్విద్యా మెలకువలు ఏం తెలుసుకున్నావని" అడిగాడు. సమాధానంగా - అర్జునుడు - "ప్రత్యేకంగా ఏమీ లేదు కాని, చీకట్లో శరసంధానం చెయ్యగల నేర్పును

సంపాదించుకున్నాను.'' అదే తన అస్త్రవిద్యా పాటవంలో, క్రొత్త విన్యాసమని తెలియబరుస్తూ! అన్నాడు.

"అలాగా! చాలా సంతోష''మన్న కృష్ణునితో కలిసి, అర్జునుడు యమునా జలాలలో ఆడుకుంటున్నట్లు స్నానం చేస్తున్నాడు. ఈ సమయంలోనే యుధిష్ఠరుడు, భీమ - నకుల - సహదేవులు యమునలో స్నానానికి వచ్చారు. భీముడికి నీటిలో బలహీనులతో ఆడుకోవడం, తన ప్రతాపాన్ని ప్రదర్శించడమొక అలవాటు. ఈ దుడుకుతనమే ధృతరాష్ట్రపుత్రులలో కలకలం లేపి, కలవరపెట్ట సాగింది.

ఇప్పుడు తన ప్రతాపంతో కృష్ణార్జునులను పట్టుకుని నీటిలో బంధించి వారితో ఆడుకోవాలని తలంచాడు. కృష్ణుని ముందు భీముని ఆటలు సాగలేదు. ఆతని పట్టును సడిలించి, కృష్ణార్జునులు ఒడ్డును చేరారు. క్షణకాలం కళ్ళు మూసుకున్న కృష్ణుడు కళ్ళు తెరచి, ప్రశాంతంగా అర్జునుని చూస్తూ -

"గతంలో నేను ఇంద్రునికి అభయమిచ్చిన ప్రకారం, ఇంద్ర వర ప్రసాదివైన నీకు తోడుగా వుంటాను. నిన్ను సదా సంరక్షించుకుంటాను. నన్ను నమ్ము. నా అభయం నీకెప్పుడు రక్షగా వుండి, సర్వకాల సర్వావస్థలలో సాయపడుతుంది. ఇంద్రుని కోర్కె మన్నించబడుతుంది.'' ఉన్నట్టుండి కృష్ణుడిచ్చిన అభయానికి, ఆతని వాగ్దానానికి అర్జునుడు ఆశ్చర్యపోయాడు.

# కృష్ణార్జునులు

**కృ**ష్ణార్జునులు, ఆ రాత్రంతా ఒకరి ప్రక్కనొకరు పడుకుని, ఎన్నాళ్ళ నుండో కలిసి వున్న ఆత్మీయతా, మిత్ర భావంతో మాట్లాడుకుంటున్నారు. అర్జునుడు ఆపుకోలేని దుఃఖంతో, మనసులోని "బాధ! ఆలోచనలను సవివరంగా కృష్ణునికి చెప్పేసాడు. కొంత బరువు దించుకున్నాడు, "కృష్ణా! ఇప్పుడు మా పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. దుర్యోధనుడు మమ్మల్ని కాదంటున్నాడు. అతను కాదంటే, అంగుళం భూమి కూడా ఇవ్వనంటుంటే, మా పరిస్థితి...!'' అయోమయంగా చూసాడు.

"అర్జునా! ఏమిటీ పిరికితనం ? అయిదుగురు సోదరులు. బలాఢ్యులు. మీదు మిక్కిలి ఈ కృష్ణునికి ప్రేమ పాత్రులు. మీరు మీ పిత్రార్జిత రాజ్యాన్ని వీరత్వంతో సంపాదించుకోలేరా ? ఎత్తి పొడిచినట్లు హెచ్చరించాడు. కర్తవ్యాన్ని గుర్తు చేసాడు. సత్యము, ధర్మము శాశ్వతాలు. వాటి పరిరక్షణ నా ధ్యేయం. నువ్వు దిగులు పడక. "జీవితాంతం ధర్మపరిరక్షణకై - ఈ కృష్ణుడు తోడునీడగా మీకు వుంటాడని" సంపూర్ణ అభయప్రదానం చేసాడు.

ఆ మర్నాడే - బలరామకృష్ణుల ఉపనయన మహోత్సవ సంరంభం. శాస్త్ర, సాంప్రదాయ విధి విధానంగా కార్యక్రమాలు జరుపుతున్నారు. ఉపనయన విధితో బలరామ - కృష్ణులు - ద్విజన్ములయ్యారు. జ్ఞానసముపార్జనకు, వేదవిద్యా శాస్త్ర పాండిత్య మొందుటకు అర్హులయ్యారు. ఇప్పుడు వారు సద్బ్రహ్మచారులై, గురుకుల వాసం చేస్తూ, మధుకర భిక్షతో - గురు శుశ్రూషతో నిత్య నైమిత్తికాలు చేసుకుంటూ మరీ గురువుల నుండి శ్రద్ధా - విశ్వాసాల భక్తితో విద్యల నొందాలి. అప్పుడే - వారి నడవడికల ననుసరించి, శ్రీ గురువులు తగు విద్యాబోధనలతో వారిని కరుణిస్తారు. ఇప్పుడు - సంపూర్ణ శిష్యమూర్తులై, గురుసేవలొనరించి ఆశ్రమమూర్తులయ్యారు. విద్యాబుద్ధులు పొంద, ఆ అల్లరి, చిల్లరి గొల్ల పిల్లలు, రాజకుమారులుగా విద్యలనొందు సాంప్రదాయపరులయ్యారు.

శ్రీ సాందీపులవారు, బలరామ-కృష్ణ -ఉద్ధవులకు ఆశ్రమవాసి, శిక్షామూర్తి అయిన శివకేతువుకు అప్పగిస్తూ "జాగ్రత్త". ఈ క్రొత్త విద్యార్థులకు వారి వారి అభిష్టానుసారం.... జాగ్రత్త. ఇక ఏమీ వివరించలేదు. కారణం శివకేతు ప్రథముడు. ఆశ్రమంలో, విద్యార్థులందరికన్న ఉపగురువు లాంటివాడు అని హెచ్చరించారు.

గురుకులంలో, గురువులకు అందరు సమానమే. యువరాజయినా, సామాన్య భిక్షుకుడైనా కూడా విద్యా దాన విషయంలో భిన్నత్వముండదు. ఎటొచ్చి వారి వివేక శ్రద్ధా - భక్తులే వారికి విద్యనొందడంలో ఔన్నత్యం కనుపింపచేస్తుంది. శ్రద్ధావాన్ లభతే జ్ఞానమని ఆ తర్వాత కాలంలో, ఈ కృష్ణుడే - పరమాత్మగా, జగదాచార్యునిగా చెప్పినమాట పునరుక్తి దోషం లేని సత్యం - శాశ్వతమై, విద్య "అర్థి"కి తగు విద్యను ప్రసాదింప చేస్తుంది. శ్రీ గురువుల సంపూర్ణ కరుణకు పాత్రుని చేస్తుంది.

శివకేతు బృందంలో వారు ఒక్కటైనప్పటికి కృష్ణుని అంతకుముందే

గురుకులంలో వుండి విద్యాభ్యాసం చేసే అవంతీ యువరాజులు మాత్రం - రాచరిక ఠీవిలో తమ దర్పాన్ని ప్రదర్శించుకుంటూ, కృష్ణాదులను గోపాలురగా, హీనకులస్థులుగా, తక్కువచేసి చూసేవారు.

నిజం చెప్పాలంటే - కృష్ణుని "గో, "గో"పాల తత్వం - ఆ - ప్రేమావతారుని, కరుణా, దయల శక్తి అదృష్టవంతులు మాత్రమే అందుకోగల్గుతారు. కురూపిగా అందరిచేత వెక్కిరించబడే తివక్రను అందాలరాశిని చేసిన ఘనుడు. ఆమె ఆతిథ్యాన్ని స్వీకరించిన ప్రేమాస్పదుడు. భక్తజన వల్లభుడు. "ఆనందప్రదాత...! ఆ గోప గోపీ జనప్రియ - ఆ "నంద" నందబాలుడు శ్రీకృష్ణుడు!

ఇంకో విషయం. కృష్ణుడు ఎక్కడికి వెళ్ళినా విదర్భ రాజకుమారి అక్కడ కనిపించేది. తన కన్నులనిండా, కృష్ణుని గాంచి మురిసేది. ఆమె రాజకుమారి కనుక తివక్ర ఆమెను అనుసరించేది. రుక్మిణి కోరే ఆనందానికి ఆలంబన అయింది.

కాని కృష్ణతత్వాన్ని అర్థం చేసుకోలేని ఆ నిర్భాగ్య అవంతీ రాజకుమారులను చూసి కృష్ణుడు లక్ష్యపెట్టక, జాలి పడేవాడు. వీరి బృందంలోని ఆఖరు వ్యక్తి. లేదా మరో ప్రముఖ శిష్య - విద్యార్థి - "సుదాముడు". ఇతన్నే "కుచేలుడు' అని తర్వాత.. తర్వాత.... కాలంచే పిలువబడ్డాడు. ఈ సుదాముడు సామవేది." ఈతనిని కృష్ణునికి సామవేదం తెలియబర్చమని, శ్రీ గురుమూర్తి ఆదేశించారు.

అయితే కృష్ణుడికి - కొద్దిగా భిన్నతత్వమైన బలరాముడు, కాళ్ళు చేతులు ముడుచుకుని, ఈ బట్టీపట్టే - మిధ్యావాద చదువులపై శ్రద్ధ చూపక ఈ ఆశ్రమంలో తనొక వ్యర్థ పదార్థమైనట్లు తలచేవాడు. అసలు ఆ వాతావరణం, కుదురుగా కూర్చునే పద్ధతి బలరామునికి, ఏ మాత్రం నచ్చలేదు.

బలరాముని బుద్ధి - తత్వమెరిగిన కృష్ణుడు ఇప్పటినుండే, తన జగద్గురు తత్వాన్ని ప్రదర్శిస్తూ అన్నగారిని, అయిష్టం నుండే ఇష్టం వైపుకు, గురుకుల పద్ధతులు, తాముండవలసిన విధి-విధానాలను మెల్లిగా చెబుతూ, దారిలో పెట్టసాగాడు. బలరామునిలోని సుగుణం - ఎవరిని కాదన్నా, ఎదిరించినా, తమ్ముడు కృష్ణుడంటే ప్రాణం. అతని మాట వేదవాక్కు, శిలాశాసనం. దానిని ధిక్కరించలేడు. తృణీకరించలేడు. అందుకే కృష్ణుడు, అన్నను అనునయించి,

తగు దారిలో పెట్టే కార్యక్రమానికి, ఎప్పుడూ - శ్రీకారం చుట్టేవాడు.

అన్నగా గౌరవిస్తూ, అతనిని సరియైన దారిలో పెట్టడానికి, తనకు జ్ఞాపకమున్నప్పటికి, విన్న విషయాలు, స్మరించే మంత్రాలు, ఇతర శ్లోకాలు అటు ఇటుగా చెబుతూ "ఇంతేనా ?" అని అన్నగారిని హెచ్చరిస్తూన్నట్లు, తన అన్న సరైన మార్గంలో శాస్త్ర, మంత్ర వేద జ్ఞానమొందడానికి మార్గోపదేశం, సందేహ స్వరూపంగా ఇచ్చి, అన్నను అనుసరిస్తున్నట్లు విద్యాభ్యాసంలో ఉత్తమ శిష్యుని చేసాడు.

కృష్ణుని తత్వం తెలిసిన బలరాముడు తన కోసం తమ్ముడు చేసే ప్రయత్నాలకు నవ్వుకుంటూ, అతని ఆనందానికి తానూ ఒక పావుగా సహకరించేవాడు. వారిరువురు నిజమైన ఉత్తమ విద్యార్థులుగా - గురుకులంలో మెలుగసాగారు.

ఈ తరుణంలో - బృందావనం వెళ్ళిన ఉద్ధవుడు తిరిగి వచ్చి, అక్కడి విషయాలన్ని విపులీకరించినట్లు వివరించాడు. అన్నీ తెలిసినా ఉద్ధవుని నోటితో వాటిని విన్న కృష్ణుడు - అమ్మ యశోద అవస్థను తలచుకుని, సామాన్య మానవునిగా, మాతృప్రేమను గుర్తించి, గౌరవించే పుత్రునిగా తల్లడిల్లిపోయాడు.

రాధ ప్రేమ, ఆమె మాటలు, అందులోని ఆవేదన, కృష్ణునికై ఆరాటం, అందులోని ప్రేమతత్వం.... ఒక్కొక్కటే, ఆమె మాటలలో, అదే భాషలో - భావంలో చెపుతూంటే, లోకంలోని ప్రేమ, మమత, మానవబంధాలు, అందులోని అనుబంధాలు, అనురాగాలు." అన్నీ దర్శిస్తూ ఆ ప్రేమమూర్తి కన్నయ్య - ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు.

మానవులు దాసోహమయ్యే తీరు, ఈ సంసారము, అందలి సుఖ దుఃఖాలు. అన్నీ తెలిసి, పూర్ణ మానవునిగా, ఉద్ధవుడు చెప్పే మాటలకు - స్పందిస్తున్నట్లు అందులో లీనమైపోయాడు.

మమతానుబంధాల మానవ సంబంధాలకు, మానవుడై - ఆ మాధవుడు క్షణకాలం - తనను, తత్వాన్ని మరచి, ఆ విశ్వాత్ముడు, ఈ లోకంలోకి వచ్చాడు. సాధారణ మానవుడై - సంకటస్థితిని - అందులోని దుఃఖాన్ని పొందాడు.

# సాందీపులు - సంచార గురుకులం

**"చ**తుష్షష్టి కళలు" అంటారు. ఆ కళామూర్తి "కృష్ణుడే". అన్నీ తెలిసిన వాడు, ఏమీ తెలియని అమాయకుడై, అరవై నాల్గు రోజులలో సాందీపుల వారి నుండి వివిధార్థ విద్యలనభ్యసించాడు. శ్రీ సాందీపుల వారి సంచార గురుకులంలో సుశిక్షితుడైన, శివకేతు సహచర్యంలో, ఆ బృంద - అంతే వాసిగా బలరామ - కృష్ణులు సంచార జీవనం సాగిస్తున్నారు. పగలు సంచారం రాత్రి ఆ ప్రక్కన - అప్పటి గమ్యంలోని గ్రామంలో విశ్రమించడం, నిత్య నైమిత్తికాలు నిర్వహించు కోవడం, వేదాభ్యాసాలతో తిరిగి, ఉదయ సంచారం సాగుతుండేది.

ఆ సంచారంలో భాగంగా, ఇప్పుడు శ్రీ సాందీపులవారు తమ శిష్య 'బృందం'తో భృగు తీర్థం నుండి ప్రభాస తీర్థానికి బయలుదేరారు. నిజానికి కృష్ణుడింత వరకు సముద్రాన్ని చూడలేదు. ఇప్పుడు సముద్రాన్ని చూసి, దాని ఉరుకుల పరుగులకు, పేరుకునే నురుగులకు, ఎగిసిపడే అలలకు చంటి పిల్లవాడయి పోయాడు. మానవావతార మెత్తిన ఆ పరమాత్మ పసిపిల్లవాడివలె కేరింతలు కొడుతూ పరమానంద ప్రదాతయైన తాను పరమానంద భరితుడయ్యాడు.

ఆ పడవ ప్రయాణం అతనికి మరింత హుషారు నిచ్చింది. ఒకటి కాదు, రెండు కాదు - ఆ సంచార గురకులవాసులు, ముఖ్యశిష్యుడు శివకేతువు అందరు కలిసి, ఆరు పడవలలో బయలుదేరారు. అది ఇంకా కృష్ణునికి ఆనంద దాయకమయింది. ఆ తీర ప్రయాణంలో గురుకులవాసులందర్నీ, ఆ పల్లెవాళ్ళు, ఇతరులు, శ్రీ గురువులతో కలిపి ఎంతో సాదరంగా ఆహ్వానించారు.

ప్రభాస తీర్థాన్ని చేరిన వీరికి, సౌరాష్ట్రాధిపతి ఘన స్వాగతమిచ్చాడు. అందర్నీ సాదరంగా ఆహ్వానించాడు. అక్కడ మళ్ళీ సంచార గురుకుల కార్యక్రమాలు యధావిధి ప్రారంభమయ్యాయి. సాందీపుల వారు ప్రతి సంవత్సరము వస్తున్నా, తిర్గి వెళ్ళిన గురుదేవులు మరల వచ్చే శుభదినానికై ఎదురు చూడటం, వారికి అలవాటు, ఆనవాయితీ అయిపోయి, మహారాజు వీరి రాకకై ఎదురు తెన్నులు చూస్తూ, తన విద్యుక్త ధర్మానుసారం శ్రీ గురుమూర్తిని, వారి గురుకుల శిష్యులను యధావిధి ఆహ్వానించి గౌరవించారు.

శ్రీ సాందీపులవారి సంచార గురుకులం సముద్ర ఒడ్డున (తీరాన) గల

సూర్యదేవాలయంలో ప్రారంభించారు. యధావిధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అలాగే స్థానికావసరాలు, ప్రజలను గమనించడం గూడా ఒక ఆశ్రమ బాధ్యతగానే శ్రీ సాందీపులు, ఎక్కడైనా సరే, స్వీకరిస్తుంటారు.

ఎందుకో ఈ ప్రభాస తీర్థానికి వచ్చినప్పటి నుండి శ్రీ సాందీపులవారు అన్యమనస్కంగా వుంటున్నారు. ఎవరు గమనించినా, గమనించకపోయినా, కృష్ణుడు దీనిని గమనించాడు. వారి ముఖతః విషయం తెలుసుకోవాలి. ఇది శిష్య ధర్మంలోని ప్రథమ లక్షణం. ఇది గమనించిన సాందీపులవారు, గత సం॥రం జరిగిన ఘోర, దాఋణ దృశ్యాన్ని తలచుకుని, "శ్రీ గురు"మూర్తిగా బయటికి చెప్పుకోలేక, అంతర్మధనంతో శోకమూర్తులయ్యారు.

క్రిందటేడాది కొంతమంది శిష్యబృందంతో కల్సి స్నానార్థం - ఈ ప్రభాస తీర్థానికి వచ్చిన శ్రీ సాందీపులవారి ఏకైక పుత్రుడు "పునర్థత్తుడు" నీటిలో మునిగిపోయాడు, నీటిలో మునిగినట్లే అదృశ్యమయ్యాడు. ఇది తరచు వ్యాపారార్థం ఈ ప్రాంతానికి వచ్చే సముద్ర రాక్షస బృందం ఎత్తుకుపోయిందని విన్న ఆచార్యుల వారు, తట్టుకోలేని ఆ అతి భయంకర దుర్వార్తకు తల్లడిల్లిపోయారు.

ఆ రాక్షసులను ప్రతిఘటించి పిల్లవాడి ప్రాణాలు తెచ్చుకోలేని ఆచార్యుల వారు అంతకంత క్షోభకు గురి అయ్యారే తప్ప, తమ తపోశక్తితో, వారిని నిలువరించి, తన పుత్రుని పొందలేకపోయారు. ఈ భయంకర దారుణ శోకం తాను, గర్భశోకంతో తనపత్ని - గుండెలు చిక్కపట్టుకుని లో- లోపల ఏడవడం తప్ప మరేమీ చెయ్యలేకపోయారు. ఇప్పుడీ రాత్రిపూట, ఈ సముద్రాన్ని చూస్తుంటే గతమంతా జ్ఞప్తికొచ్చి నిబ్బరించుకోలేకపోతున్నారు. అదిగో, సరిగ్గా అటువంటి సమయంలో - కృష్ణుడు -

ఆ నిండుపున్నమి వెన్నెలలో శ్రీ గురువులు ఒంటరిగా సముద్రపు ఒడ్డున తిరగడం గమనించాడు. అప్పుడే కృష్ణునికి జరిగిదంతా అర్థమయింది. గురువుగారి విచారాన్ని తొలగించడం శిష్యునిగా తన ధర్మమని తలచిన కృష్ణుడు, జింక చర్మంపై కూర్చున్నవాడు అలాగే లేచి, దానిని కప్పుకుని, శ్రీ గురువుల చెంతకు బయలుదేరాడు.

ఇసుక తిన్నెల చకచక నడిచి వస్తున్న కృష్ణుని చూసిన సాందీపుల వారు

అతనికి తెలియనట్లు కళ్ళు తుడచుకుని "ఏం కృష్ణా! ఈ సమయంలో ఇటు వస్తున్నావు. నా కోసమా లేక అలవాటయిన వెన్నెల విహారార్థమా ?" యుక్తిగా అడిగారు. అయినా అందులోని శ్లేషను, మనసులోని బాధను గమనించి కృష్ణుడు.

"గురుదేవా! నేనున్నాను. చింతించకండి. విషయం చెప్పండి. ఆజ్ఞాపించండి. అదేదైనా, ఎంతటి అసాధ్యమైనదైనా, సుసాధ్యం చేసి, మీకు గురుదక్షిణగా సమర్పించుకుంటాను. నన్ను నమ్మండి. విశ్వసించి మీ విషాద కారణాన్ని వివరంగా చెప్పండి. ఇందులో అభ్యర్థన, ఆదేశం, ఆవేశం, ప్రార్థన. ఎన్నో ఎన్నెన్నో అర్థికి కావలసినవన్ని వున్నాయి. ప్రభువే! ప్రసాదించగల అభయముద్ర వుంది.

"కృష్ణా! చాలా సంతోషంగా వుంది. నీ అమృతోపమానమైన మాటలతో నా మనసు చల్లబడింది. ప్రశాంత చిత్తుడనయ్యాను. మళ్ళీ మళ్ళీ సంతోషం. నీ గురుభక్తికి మహదానందం. కానీ....

"చెప్పండి. గురుదేవా! నా ధర్మం నేను నిర్వర్తిస్తాను."

"కృష్ణా! అసాధ్యము, అపరిష్కార కార్యక్రమానికి నిన్ను ప్రోత్సహించడం- గురువుగా నా ధర్మం కాదు. విద్య వినయాన్ని, వినయం - సౌశీల్యతను ప్రసాదిస్తుందన్న నీతివాక్యం నీ చెంత సత్యమయింది. అది మాకు చాలు. మా గురువులకు నువ్విచ్చే దక్షిణ-రక్షణ-అమోఘము, అనన్య సామాన్యము, అద్భుతమైనదని చెప్పడానికి.... ఇంతకంటే నిదర్శనం మరొకటి వుండదు. విషయం చెప్పకుండా శ్రీ సాందీపులవారు, అభినందించడం, ఈ అభయప్రదాత కృష్ణునకు కష్టమనిపించింది.

"కృష్ణా.... కాకపోతే" నంటూ సాందీపులవారు తన బాధను మొత్తం ఓ కథగా చెప్పి - "ఇప్పుడు చెప్పు కృష్ణా! ఇది సామాన్యులకు సాధ్యమా ?" అమాయకంగా శిష్యుని అడిగారు, లోకమహామాయాశక్తికి లొంగిన, ఆ శ్రీ గురుదేవులు.

"గురుదేవా!" లోకంలో ప్రతీదీ సాధ్యమా ? అనుకుంటే సాధ్యమే. కాదంటే అసాధ్యము. గతం మరచిపొండి. ఇప్పుడు నేను చెయ్యవలసింది కాదు, మీకు కావల్సింది చెప్పండి. శిష్యునిగా, ఇచ్చట పుత్ర స్వరూపిగా, మీ కోరిక నెరవేరుస్తాను. అది ఎంతటి అసాధ్యమైనదైనా సరే, మీకు మనఃప్రియం కల్గిస్తాను!" అభయ

ప్రదానం చేస్తున్నట్లు కృష్ణుడు అడిగాడు.

"ఆత్మావై పుత్రనామాసి" అంటారు. ఆ బిడ్డడు భౌతికంగా ఆత్మబంధువు. భౌతిక పతనానంతరం స్వర్గప్రాప్తికి మూలకారకుడు. "ఆ పుత్రస్య గతిర్నాస్తి" లేనివాళ్ళ బాధపడుతుంటే, వున్న ఒక్కడిని సముద్రునికి, అర్పించి, అనాధునిలాగ, జీవచ్ఛవంలాగ గడుపుతున్నాను. మీతో వున్నంతసేపు ఫర్వాలేదు. పగలు గడిచి రాత్రయితే, మా ఇరువురి బాధ ఆ పగవారికి కూడా వద్దు. అనంత శోక సముద్రా న్నీదడం మాకు సాధ్యం కావడం లేదు." బావురు మనకపోయినా చిన్న పిల్లవాడివలె ఆపుకోలేని ఆ రోదనను - బాధను ప్రకటించ, గ్రహించి, గమనించిన కృష్ణుడు-

"జరిగినదంతా, శ్వేతకేతులవారు తెలిపారు. దీనికి పరిష్కారం లేదా ? మీరు ప్రతిఘటించలేదా ?" అని అడుగుతాడు. అప్పుడు సాందీపులవారు - బొటనవ్రేలు పరిమాణంతో దూరంగా కనుపించే ఒక నల్లటి నీడవంటి ఆకారాన్ని చూపుతారు.

"అది పాంచజన్యుడు వచ్చే ఓడ. అతను మళ్ళీ వస్తున్నాడు. పుణ్యాజనులను తెగకు సంబంధించిన వాడతను. సం॥ల క్రిందట అతను కుశస్థలిని (ప్రస్తుత ద్వారకను) ఆక్రమించాడు.

ఇతడు సముద్ర వ్యాపారస్థుడు. సంవత్సరానికోసారి ఇక్కడికి వస్తాడు. సముద్రపు ఒడ్డున లంగరు వేసుకుని కొన్నాళ్ళిక్కడ వుండి, వ్యాపారం ముగించుకుని వెళ్ళిపోతాడు. క్రిందటి సం॥ ఇలాగే వచ్చాడు. ఇప్పుడు వస్తున్నాడు. ~~ఈ~~తని వునికి ఆ భగవంతునికే తెలియాలి. చెప్పుకోవడం మాత్రము "పాతాళ" వాసి అని.

క్రిందటి మాటు వీడు వ్యాపారం కోసం వచ్చిన చివరిరోజున, నా కుమారుడు సముద్ర స్నానానికి వెళ్ళడం, అతని దురదృష్టం. మా దౌర్భాగ్యం కొద్ది వాడిని ఆ రాక్షస తెగ ఎత్తుకుపోవడం, "వున్నాడో.... లేడో" అన్న సంశయంలో వుంచి, ఏమీ చెయ్యలేని సందిగ్ధంలో నుంచి ఇటు చావలేక - అటు బ్రతుకలేక, అయోమయ స్థితిలో, తలపుకు వచ్చినపుడల్లా ఏడుస్తూ ఇలాగ బ్రతుకుతున్నాం.... ఆపుకోలేక, తన బాధను యావత్తు పుత్రసమానుడైన శిష్యుడికి, ఆ దేవ దేవోత్తముడని, ఉత్తరకాలంలో లోకవిఖ్యాతుడౌ పరమపురుషునికి, పాఠంలా చెప్పుకున్నాడు.

అంతా విన్న కృష్ణుడు క్షణకాలమాగి, తల పంకించి, స్థిర నిశ్చయాని కొచ్చినట్లు "గురుదేవా! నా సోదరుడు పునర్దత్తును తీసుకురావడానికి మీకేమైనా

అభ్యంతరమా ?'' ఎంతో శాంతంగా అడుగుతాడు.

"అభ్యంతరం లేదు కానీ, అది సాధ్యమా ? ఈ పుణ్యాజన ఓడలు సప్త సముద్రాలను చుడతాయని విన్నాను. తెలియని ప్రాంతాలలో గుర్తుపట్టని విధంగా సంచరిస్తాయనీ విన్నాను. కొందరు పాతాళ లోకానికి వెడతారని, ఆ పాతాళంలో అతి ఘోర భయంకర దానవ శ్రేణులు వుంటారని విన్నాను. ఈ పునర్దత్తుని బానిసగా వారికి అమ్మడమో లేక భక్షించడమో చేసి వుంటారు. ఎప్పుడో సం॥ నాడు జరిగిన సంఘటనకు సమాధానం, సమాచారం ఇప్పుడు లభిస్తుందా ?'' వృథా ప్రయాస అన్నట్లు సాందీపులవారు మాట్లాడుతుంటే -

"భయపడకండి. కారణం తెలుసుకుంటాను. జరిగిందానికి ప్రతిఫలమను భవింప చేస్తాను. నా సోదరుడు పునర్దత్తుని తీసుకు వస్తానన్నాడు ఎంతో దృఢ సంకల్పంతో కృష్ణుడు -

"వద్దు కృష్ణా. వద్దు, అతి సాహసం వలదు. చూస్తూ, చూస్తూ... ఆ రాక్షసులకు నిన్నర్పించుకోలేను'' కృష్ణుని గట్టిగా కౌగలించుకుని, గురుదేవులు బావురుమన్నారు.

"గురుదేవా! ఒక్క క్షణం, శాంతి వహించండి. ముందు వాణ్ణిక్కడికి రానివ్వండి. జరిగేది చూడండి. మీ పుత్రుని ఆహ్వానించ సంసిద్ధులుగా వుండండి!'' అది - కృష్ణుని వూరడింపు. అయినా శ్రీ సాందీపులు మెత్తబడలేదు. అనవసరంగా ఈ పసిపిల్లవాడిని తన కోసం కోల్పోతానేమోనన్న భయంతో తన అభ్యంతరాలను ప్రకటిస్తూనే వున్నారు. చివరగా -

"కృష్ణా! ముందు నీ ఆలోచనను విరమించుకో. మా అదృష్టం బాగుండి నువ్వు విజయం సాధిస్తే సంతోషం. కాని పొరపాటున విధి వక్రిస్తే నీ తల్లిదండ్రులు "దేవకీ వసుదేవుల'' నెలాగ చూడగలను ? ఏమని చెప్పగలను ? ఆ మాత్రం వారించలేని మీరేం గురువులు ?'' అంటే...

"ధర్మావతారుడు - ధర్మప్రతిష్ఠాపనకై - దుష్టశిక్షణ గావింప తలచి బయలుదేరాడని, వారికి చెప్పండి. ఈ కృష్ణుడు విజయుడై, సోదర గురు పుత్రునితో కలసి వస్తాడు. నిజం. నా మాట నమ్మండి!''

శ్రీ సాందీపులు ఆపలేకపోయారు. కృష్ణుడు తన ప్రతిజ్ఞ ప్రకారం బయలు దేరాడు. కృష్ణతత్వం బాగా తెలిసిన ఉద్ధవుడు - కృష్ణుని కనుసన్నలలో మెలుగుతు పుణ్యాజనుని గూర్చి వివరాలు తెలుసుకుంటున్నాడు. శ్రీ గురువులతో ప్రతిజ్ఞ చేసిన నాల్గవనాడు, ప్రభాస తీర్థంలో తన వ్యాపారం ముగించుకుని, దూరంగా లంగరు వేసిన తన ఓడను చిన్నపడవలో దరిచేరబోతున్న పుణ్యాజనుని గమనించి ఉద్ధవ - కృష్ణులు, ఆ ఓడవైపు ఈదుకుంటూ వెళ్ళారు.

వీళ్ళు సునాయాసంగా ఓడను చేరారు. రాత్రివేళ, ఓడను కాపలా కాసే ఒక ముసలి సరంగు వీరిని గమనించి పట్టుకున్నాడు. ఎవర మీరు ? ఎందుకిలా వచ్చారని ప్రశ్నలు మొదలుపెట్టాడు. సమాధానంగా కృష్ణుడు, తన మందహాసంతో ఆతనిని సమ్మోహనపరుస్తూ -

"బాబాయ్! నీతో కలసి, సరదాగా సముద్ర ప్రయాణం చెయ్యాలని వచ్చాము. అనుభవజ్ఞుడివి, పెద్దవాడివి. నీ ప్రక్కన మేముంటే ఎంతో సంతోషంగా వుంటాము. అయినా నీకో విషయం చెప్పాలి. క్రిందటి సం॥రం ఇక్కడకు నీవే వచ్చావనుకుంటాను."

"వచ్చాను." అన్నాడు. ఆ వెంటనే కృష్ణుడు "అప్పుడు మీరు మా సోదరుడు గురుపుత్రుడు పునర్దత్తుని ఎత్తుకుపోయారు. అతడు లేకుండా మేముండలేము. అందుకే ఇన్నాళ్ళు మీకోసం ఎదురుచూసి, ఇప్పుడు మీరు రాగానే అనుసరించాము." "ఇక్కడనుండి మేము నిన్ను కదలనివ్వము. మాతో తీసుకువెళ్ళి...!"

పకపక నవ్వాడా ముసలి సరంగు. అంతలోనే ఆశ్చర్యపోయాడు కూడా! ఈ పుణ్యాజనుని గూర్చి తెలిసినవారెవరు, ప్రాణాలకు తెగించి, ఇలాగ బరితెగించినట్లు బయలుదేరరు. అసలింతవరకు అతనిని ఎదిరించి నిల్చినవారు కూడా లేరు. ఈ పిల్లకాకులు మనసులో అనుకుంటూనే అతడు -

"బ్రతకాలనే బయలుదేరారా ? ఈ సాహసమెంత ప్రమాదకరమైనదో వూహించుకునే ఈ పడవ ఎక్కారా ? అని హెచ్చరించిన ఆ ముసిలి, "అసలు వీళ్ళెవరు ?! అన్న ఆలోచనకు వచ్చేలోగా ఓడ బయలుదేరింది. ఇక దానిని ఆపడం తనకు సాధ్యం కాదనుకుని వీళ్ళను ఒడుపుగా త్రాళ్ళతో బంధించాడు - ఆ ఓడ

కదలికలో, దాని వేగంలో, నీటి ఉధృత వేగ జల శబ్దంతో, ఏ ఒక్కరు మాట్లాడలేక పోయారు. ఆ జలఘోష, ఓడ వేగం యొక్క శబ్దం - పెదవులను కదలనివ్వడం లేదు.

క్షణమాగి కృష్ణుడే "బాబాయ్! నీ ఓడ బ్రహ్మాండంగా వుంది. సరంగుగా నీ సారధ్యం భేషుగ్గా వుంది. అవును నీవు ఎన్ని సం॥ల నుండి దీన్ని నడుపుతున్నావని అడిగాడు. "నేనా... ? ఈ ఓడ నడపడమా ? విరగబడి నవ్వినాడతడు,క్షణమాగాడు. మరుక్షణం... "ఎందుకు ?" అని - తన ప్రతిభను తెలుపుతున్నట్లు, నీ కంటే చిన్న వయస్సులోనే - ఈ ఓడను నడపడం ప్రారంభించాను. ఈ సారధ్యం ఉగ్గుపాలతో పెట్టిన విద్యలా పలికాడు. అవును. నీవు చాలా బాగా ఓడను నడుపు తున్నావు. "నాకు గూడా నేర్పవా ?" బ్రతిమాలుతున్నట్లడిగాడు.

"నేర్పుతాను. నువ్వు నాతోనే నన్ను వదలక వుంటానంటే" అన్నాడు "అవును. ఇందాక నువ్వు నన్ను తీసుకుపోతానన్నావవు ?" అడిగాడా సరంగు.

"అదా ?" అని చిన్నగా నవ్వి "నువ్వెక్కడ ? నేనెక్కడ ? నీతో కలిసి ఈ ప్రయాణం చెయ్యాలంటే అలాగ చెప్పకపోతే, మమ్ము బంధించి, ఇలాగ తీసుకు వెళ్ళగల్గుతావా ? నీతో రావాలని అలాగ చెప్పాము." అన్నాడు, ఆ వెంటనే - "అది సరే. మీరెక్కడెక్కడికి వెడుతుంటారని" అడిగాడు.

"మేమా ? క్రిందటి నెలలో కుశస్థలిలో వున్నాం. అతని మాట పూర్తికాలేదు." అక్కడ రాక్షసులుంటారుట కాదా ? ఎటువంటి వారు ? ఒక ప్రక్క ఆసక్తి, మరొక ప్రక్క భయంకల్పి అడిగాడు.

"ఆ వుంటారు. వాళ్ళంతా, మా యజమాని కూటమికి చెందిన వారే ? అని వాళ్ళ గురించి చెప్పడం ఇష్టం లేనట్లు ఆ ముసలి సరంగు - సముద్రం గురించి, రకరకాల కథలు చెబుతున్నాడు. ఈ లోగా భళ్ళున తెల్లారింది. ఓడకు లంగరు వేసారు. అప్పుడు తన బాధ్యతగా, ఈ యువకులను, తన యజమాని పుణ్యాజనుని సమక్షానికి చేర్చాడు.

అతడు మహాభీకరంగా వున్నాడు. అతనికిరుప్రక్కల ఇద్దరు భీకరకాయులు కొరడాలతో సిద్ధంగా వున్నారు. వారు పుణ్యాజనుని అంగరక్షకులై వుండాలి. తమను చూపుతూ వాళ్ళు ఓడచేరిన విధానాన్ని సరంగు చెప్పాడు. అప్పుడు కృష్ణుడు

నవరస నటనా సూత్రధారుడు - పాత్రధారుడుగా, ఎంతో వినయంగా అతనికి నమస్కరించాడు.

"ఓ మహావీరా! మేము మా గురుపుత్రుడు పునర్దత్తుని కోసం వచ్చాము. ఇందులో అబద్ధం లేదు. అతనిని, విడిచి మేముండలేము. అతని కోసం మేమేదైనా చేస్తాము. నిజం." తన దృఢనిశ్చయాన్ని చెప్పాడు.

అతడు వెంటనే - వీళ్ళను ఆ పునర్ధత్తుని వద్దకు తీసుకువెళ్ళండి!" అన్నాడా వ్యాపారమూర్తి!

కార్యసాధకుడైన, కృష్ణుడు తన తరగని మందహాసంతో "మమ్మల్ని మా పునర్దత్తుని వద్దకు తీసుకువెళ్ళండి. అంతవరకు, మేమెవ్వరికి భారం కాకుండా, ఆ పెద్దాయన ముసలిరంగుకు తోచిన విధాన సహాయం చేస్తా"మన్నాడు. కృష్ణుని మాటలు వింటూ పాంచజన్యుడు పకపక నవ్వాడు.

"నువ్వు.... నువ్వు.... సాయం చేస్తావా ? ఏం సాయం చేస్తావు ? ఆ చేతులు చూస్తే నువ్వెంత సుకుమారుడివో అర్థమౌతుంది ?

"అలాగనకండి. మేము సుకుమారులమైనా మేము చేయదగ్గ సేవ చేస్తాము!" కృష్ణుడు, అన్నాడు. అప్పటి పరిస్థితులను గమనించిన పాంచజన్యుడు, ఆ ముసలి సరంగుతో "చూడు. వీళ్ళు పిల్లలు, సుకుమారులు. ఎండకన్నెరుగని వారు. వాళ్ళకేం కష్టం రానీయకుండా వారి సేవల్ని పొందు"మని హెచ్చరించినట్లు చెప్పాడు. ఉద్ధవ, కృష్ణులు తృప్తిగా నిట్టూర్చారు.

ఉద్ధవ - కృష్ణులంటే ఆ సరంగుకు ఇష్టం. దాంతో మనుమడు కుక్కురిని పిలిచి, వీరిని పరిచయం చేసాడు. తొలి చూపుల్లోనే వాళ్ళు ఒకరికొకరు ఆకర్షితు లయ్యారు. ఈ పరిచయ ప్రభావంతో దగ్గరైన ఆ సరంగు మనుమడు కుక్కురుడు కృష్ణ ప్రేమకు లోనయ్యాడు. అప్పుడు కృష్ణుడు పునర్దత్తుని విషయమడిగాడు. సమాధానంగా కుక్కురుడు - "మా ఏలిక అతడిని పాతాళానికి తీసుకువెళ్ళాడు అక్కడనుండి సూర్యుని రాజధాని వైవస్వతపురికి తీసుకువెళ్ళబడ్డాడు. దానిని "యమపురి" అనిగూడా పిలుస్తారు.

ప్రస్తుత మీ ఓడ అక్కడికే వెడుతుంది. అక్కడ వున్నది తల్లి రాణి. ఆమే

యోగమాయు. దాని అధిపతి మృత్యుదేవుడు. అంటే సూర్యపుత్రుడైన యమధర్మరాజు. అతను మీ పునర్దత్తుని పాంచజన్యుడు నుండి కొన్నాడు. ఇప్పుడు మనం అక్కడికే వెడుతున్నాం. "కుక్కురుడు చెప్పాడు. అంతా ఆశ్చర్యంగా వుంది. వింతకాని కృష్ణునికి, ఆతని చెంతనున్న ఉద్ధవునికి.

ఈ ప్రయాణంలో ఎన్నోసార్లు పాంచజన్యుడు కృష్ణుని సమ్మోహన రూపం చూడాలనే తలంపుతో పలుమార్లు పిలిపించుకున్నాడు. తప్పక మిమ్ము పునర్దత్తు వద్దకు చేరుస్తానన్నాడు. కృష్ణుడు సంతోషించాడు.

మధ్యాహ్న సమయంలో క్రమం తప్పక పాంచజన్యుడు, ఓడపై భాగానికి రావడం, అందర్ని రమ్మని పిలుస్తున్నట్లు, తన నడుముకు కట్టుకున్న, లేత, అతి తక్కువ పసుపురంగు - ఇంకా చెప్పాలంటే పన్నీటి రంగుతో వున్న శంఖాన్ని తీసి అట్టహాసంగా వూదడం, అనకూడదు కాని, కృష్ణుడుకి "ఎంతో ఆనందమనిపించింది. ఆ శంఖధ్వని వినబడటంతో, ఓడలో పనిచేసేవాళ్ళతోపాటు, ఈ పాంచజన్యునికి సంబంధించిన ఇతర పరివారము కూడా పరుగు పరుగున కదలి వస్తారు. అప్పుడు తనదైన పద్ధతిలో -

ఇరుప్రక్కల క్రూర చండశాసనుల వంటి దండధారులు కొరడాలతో సిద్ధంగా వుండగా తమ యజమాని ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా, ఆ పరివారం యావత్తు తమ తమ నిత్య కార్యక్రమాలలో మునిగిపోతారు.

తన అధికారాన్ని మన్నించేవారికి మెచ్చుకోలు, అలక్ష్యం చేసేవారికి తగు దండన లభిస్తుంది. అందుకు ప్రతి ఒక్కరు భయభక్తులతో, అత్యంత విధేయులై తమ తమ పనులు నిర్వర్తిస్తుంటారు. ఆ సమావేశానికి, అనుకోకుండా, కృష్ణుడీ దినం హాజరయ్యాడు. అప్పుడు, ఆ ఓడలో పనిచేసే వడ్రంగి కుర్రాడిని తీసుకువచ్చి, పాంచజన్యుని పాదాలపై బడేసారు. అతడు క్షమించమని, ఈ తప్పు కాయమని కోరాడు. అయినా పాంచజన్యుడు, తన అధికార ధిక్కారాన్ని సహించక బలంగా ఒక్కతాపు తన్నాడు.

తన ప్రక్కనున్న దండనాధునితో అతనిని ఆరు కొరడా దెబ్బలను కొట్టమన్నాడు. ఆ దెబ్బలకా యువకుడి పని చచ్చినట్లయింది. రక్తం కారే

గాయాలతో విలవిలలాడుతూ, బాధ భరించలేక గట్టిగా అరవలేక, బాధను తమాయించుకోలేక గిలగిలలాడిపోతున్నాడు.

ఆ రాత్రి పూట, కృష్ణుడు, ముసలి సరంగును చేరి ఆ వడ్రంగిని కొట్టడానికి కారణమడిగాడు. అతడు పాంచజన్యుని వసతి భాగాన్ని, సరిగ్గా మరమ్మత్తు చెయ్యలేదని, అతడు నిర్లక్ష్యం చేసాడని ఈ రకంగా చావబాదాడు. నిజానికతడు రెండ్రోజులుగా జ్వరంతో బాధపడుతూ సరిగ్గా పని చెయ్యలేకపోయాడు. ఆ విషయం మా ఏలిక ముందు చెప్పే ధైర్యం ఎవరికి లేదు. ఫలితంగా వాడు ప్రాణావ శిష్టుడయ్యాడు.'' చెప్పాడా ముసలి సరంగు.

"ఇప్పుడతడెక్కడన్నాడు. అతన్ని నేను చూడాలన్నాడు'' కృష్ణుడు.

"అమ్మో! పాంచజన్యునికి తెలిస్తే నీ ప్రాణాలు అనంత వాయువులలో కలిసి పోతాయి.'' ఆ పెద్దతను చెప్పాడు.

"ఫర్వాలేదు. నేను సామాన్యుడను కాను. నన్నెవరు ఏమీ చెయ్యలేదు.'' కృష్ణుడి హెచ్చరిక వంటి సమాధానం. మళ్ళీ కృష్ణుడే, నీ మనుమడు కుక్కురుని పంపు. మిగిలిన విషయాలు నేను చూసుకంటాను. భయపడకు. నాకేం కాదు, నీ మనుమనికి ఏం కాదు.''

కుక్కురుడు భయపడిపోతున్నాడు. అయినా కుక్కురుడు, ఉద్ధవ కృష్ణులకు, ఆ వడ్రంగి యువకుడు పడి వున్న ప్రదేశాన్ని చూపాడు. చకచక అతన్ని సమీపించిన కృష్ణుడు, దెబ్బతిన్న భాగాలను మృదువుగా తాకాడు. కృష్ణుని చెయ్యి పడగానే, ఆ కుర్రవాడు వణకసాగాడు.

ఎవరో నల్లగా వున్న రాక్షసులు తనను మళ్ళీ శిక్షించడానికి భయంతో వచ్చారని వణికిపోతున్నాడు. భయపడకు. నేను కృష్ణుడిని "సుతారంగా తాకాడు. దగ్గరకు తీసుకున్నాడు. ఆ స్పర్శ అతనిలోని భయం పోగొట్టింది. శక్తినిచ్చింది. బాధను తొలగించింది. ఇంత జరుగుతున్నా, కృష్ణుడు ఒక్కమాటయినా మాట్లాడలేదు.

అతనిలోని భయాన్ని పోగొట్టి ప్రశాంతంగా నిద్రించేవరకు కృష్ణుడతనిని పొదివి పట్టుకున్నాడు. అతను నిద్రించాక, వీళ్ళు తమకు కేటాయించిన స్థలానికి

వచ్చి, విశ్రమించసాగారు. అప్పుడు ఉద్ధవుడు -

"కృష్ణా! ఇప్పుడు మనం అపరాధులమని...! అంటున్నాడు. సమాధానంగా- కృష్ణుడు.

"చూడు సోదరా! మంచి కోసం, ధర్మ పరిక్షణ కోసం, మనమిటువంటి సాహసాలు చెయ్యాలి, తప్పదు.'' భయం విడనాడమన్నట్లు అభయమొసగాడు.''

తెల్లవారింది. అంత బాధను గుటుక్కున మ్రింగేసినట్లు, ఆ వడ్రంగి కుర్రవాడు, ఏమీ ఎరగనట్లు, జరగనట్లు, తన పనిలోకి దిగిపోయాడు. ఆ సరంగు పెద్ద, సాటి జీవిగా, అతని గాయాలకు, ఏదో లేపనం వ్రాసాడు. అయితే సూటిగా కాకపోయినా, కర్ణాకర్ణిగా, ఓడలోని పనివారందరికి, ఈ క్రొత్తగా వచ్చిన "ఉద్ధవ- కృష్ణులు'' వడ్రంగి కుర్రవాడి బాధలు మాయం చేసి, సేదతీర్చారని తెలిసి పోయింది.

అయితే - పాంచజన్యుడు, ఆతని ఇరువురు దండనాధులు మాత్రం, కృష్ణ - ఉద్ధవులను, యధావిధి, మామూలుగానే ఎంతో ప్రేమతో చూడసాగారు. అందరికి, అదొక విచిత్రం. ఓడ బయలుదేరిన మూడవనాడు, కుశస్థలిని చేరింది. మహారాజు కకుద్మని రాజ్యభ్రష్టుని చేసి, పుణ్యజన రాక్షస తెగ కుశస్థలిని ఆక్రమించుకుంది. ఇప్పుడు - అదొక రాక్షసరాజ్యం. పాంచజన్యుడు తన పరివారంతో నగరంలో ప్రవేశించాడు. తన వ్యాపార కలాపాలు పూర్తిచేసుకుని, తమకు కావలసిన మంచినీళ్ళు, ఇతర అవసర పదార్థాలతో తిరిగి వచ్చాడు.

ఓడ బయలుదేరింది. ఆ మర్నాడు మళ్ళీ దారుణం. ఓ పదిహేడేళ్ళ కుర్రాడిని తీసుకువచ్చారు. అతడు వడ్రంగి కుర్రవాడివలె పనిలో అలక్ష్యం చేసాడు. దానికి అతనిలాగే కొరడాదెబ్బలు. వళ్ళంతా చీరుకుని అతడు ప్రాణావశిష్టుడయ్యాడు. పాంచజన్యుడు అది తన ప్రతాపంగా తన పాశవిక ప్రవర్తనకు, తానే గర్వపడుతు మందహాసం చేసాడు.

ఆ రాత్రి అందరు విశ్రమించాక, మెల్లిగా ఉద్ధవ, కృష్ణులు అతన్ని చేరారు. దగ్గరకు తీసుకుని ఓదార్చారు. దయాదాక్షిణ్యాలు లేని పాంచజన్యుడు, ఆతని బృందం, ఇతరుల ప్రాణాలు తీస్తూ వాటితో ఆడుకోవడం తప్ప, మానవత్వం, దయా మమకారాలు ప్రకటించని కసాయి జాతికి చెందిన వారవడంతో, కొన్ని నెలల క్రిందట, అతన్ని ఎత్తుకొచ్చారు. తను బందీ అయినప్పటి నుండి, ఆ పిల్లవాడు అనురాగం,

ఆప్యాయతలకు దూరమయ్యాడు. ఇన్నాళ్ళకతడు, తాను కోల్పోయిన, ప్రేమామృతాన్ని కృష్ణుని నుండి, ఇప్పుడు ఆస్వాదించగలిగాడు.

ఆ పిల్లవాడు ప్రశాంతంగా నిద్రించే వరకు, ఆతనిని పొదివి పట్టుకున్న కృష్ణుడు, ఆతను నిద్రపోగానే తన ఒడిలోంచి, అతని తలను క్రింద పెట్టి వెనుదిరగ బోయాడు. వాళ్ళ వెనుక, అందర్ని హడలెత్తించి, కొరడా దెబ్బలతో చావగొట్టే దండధరుని వలె ఒకడు, చేతిలో కొరడాతో, కాలయమునిలాగ నిలబడ్డాడు. ఉద్ధవుడు కదలబోయాడు. అప్పుడు -

కృష్ణుడు - "ఉద్ధవా! కదలకు - ఆ కాలయముడు ఏం చేస్తాడో చూద్దాం!" ఆ మాటలు విన్న అతడు వీళ్ళను, క్రొత్తవారయిన, తన యజమాని అభిమానులుగా తలచి, రండి" అంటూ, ఓడ క్రింద భాగంలో గల అంతర్భాగానికి తీసుకువెళ్ళాడు. ఆ గదిలో బంధించి, వెళ్ళిపోయాడు.

ఉద్ధవ - కృష్ణుల - పరిస్థితి అక్కడ - ఆ గాలిలేని, దుర్వాసనతో, కూడిన గదిలో, ఇంచుమించు బంది అయిపోయినట్లుంది. క్షణం గూడా అక్కడ వుండలేని ఉద్ధవుడు కళ్ళు తిరిగి, నీరసించి, కృంగిపోతున్నాడు. నిదానంగా ఆ ప్రదేశానికి అలవాటు పడి నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో కృష్ణుడు ఉచ్ఛ్వాసా నిశ్వాసాల్ని విన్నాడు. దాంతో అది ఎవరిదో, తమతోపాటు వున్నారా ? లేక...!" క్షణాలలో అప్రమత్తుడయ్యాడు.

మెల్లిగా ముందుకడుగు వేసిన కృష్ణుడు దానిని పెద్ద సరంగు శ్వాసగా తలచి "బాబాయ్!" అన్నాడు. "ఆ...!" అతను జవాబు చెప్పాడు.

"నువ్వేమిటిలా ?" కృష్ణుడడిగాడు. తన యజమాని, ఆ నౌక దారి మార్చుమన్నట్లు చెప్పాడని అందుకు తానిక్కడకు వచ్చానన్నవాడు, మెల్లిగా "ఇప్పుడు వైవస్వతపురికి వెళ్ళడం లేదు. "అనగా" మరెక్కడికి వెడుతున్నా" మన్నాడు కృష్ణుడు.

"సుదూర ప్రాంతమైన శోణపురికి అన్నాడా మంచివాడు."

"కాదు - మనం వైవశ్వతపురికి వెళ్ళాలి. మా పునర్దత్తుని తీసుకురావాలి." ఇది కృష్ణుని మాట.

"అసాధ్యం. మా యజమాని ఒప్పుకోడు. మిమ్మల్ని కదలనివ్వడు. కాదని ప్రతిఘటిస్తే, మిమ్మల్ని చంపేస్తాడు కూడా! ఇటువంటివెన్నో గతంలో జరిగాయి. ఇకమీరు వైవస్వతపురి మాట మరచిపోవాలన్నాడా పెద్దాయన.

"అలాగా! అయితే ఇక్కడనుండి తప్పించుకోలేమా ?" అడిగాడు కృష్ణుడు.

"తాళాలు, ఆ కాలయముడి వద్ద వుంటే మనం తప్పించుకోవడం సాధ్యం కాదు."

"అలాగా!" అని ఆ చెక్కల బందీఖానా వంటి దానిని పరిశీలనగా చూసాడు. దానికున్న రెండు సన్నటి బద్దలు రెండు బలహీనంగా కనుపించాయి. దాంతో వాటిని విరిచి, బయటపడ్డాడు. వాళ్ళ తెగింపుకు ముసలాయన నోరు తెరిచాడు. ఆ తర్వాతేం జరుగుతుందో ? ఆ పెద్దాయనకు భయం, ఆందోళన!

ఇంతలో తెల్లవారింది. యథాప్రకారం సూర్యునికి ఉద్ధవ - కృష్ణులు అర్ఘ్య ప్రదానమిస్తున్నారు. ఆ దృశ్యాన్ని రాత్రి వీళ్ళను బంధించిన కాలయముడు చూసాడు. కళ్ళు నులుముకున్నాడు. నిజమా ? కలా ?! నిజమే, మరి వీరెలాగ వచ్చారు ? ఇది అతనిలో కల్గిన మరో సందేహం. నిజమే, వాళ్ళే" అనుకున్న అతను, తను వీళ్ళను బంధించిన ప్రదేశానికి వెళ్ళి చూసాడు. అక్కడ అంతా సవ్యంగా వుంది. మరి వీరెలాగు బయట పడ్డారు. అంతా చిత్రము, చోద్యమని పించింది వాడికి. కొందరు "అదృశ్య దృష్టశక్తులు" వుంటాయని, అవి ఎవరికి కనబడకుండా చిత్ర విచిత్రాలు చేస్తుంటాయని విన్నాడు. ఈ అదృశ్య శక్తులు, దుష్ట గ్రహాలకు, దేవతలకు గూడా వుంటాయని; దుష్టశక్తుల ప్రభావం తాత్కాలికమని, అదే దేవతా శక్తుల ప్రభావం శాశ్వతమని తను విని వున్నాడు.

ఇప్పుడీ నల్లనివాడు, పాంచజనుని అభిమాని, ఈ కృష్ణుడు, తను బంది చేస్తే, అందులో నుండి ఎవ్వరికీ ఏ అనుమానం కలుగకుండా, ఆ బోనులో నుండి దానిని పాడు చేయకుండా ఎలాగ బయటికి వచ్చాడు. ఇతడు, బాలుడైనా- కనుపించని దుష్టశక్తి కాదు. కనుపించే దైవశక్తి అయుండాలి. ఆ తలంపు రావడంతో, అతనిలో భయాందోళనలు చోటుచేసుకున్నాయి. అయినా -

ఆశ్చర్యపోతూనే వాళ్ళను చూస్తున్నాడు. అయినా ఏమీ అర్థం కావటం లేదు. మొత్తం ఈ వ్యవహారం పాంచజన్యునికి తెలిసింది. కృష్ణ - ఉద్ధవులు

అర్ఘ్యం ప్రదానం చేసి వెనుదిరిగేసరికి ఎప్పుడు తమతో ప్రేమతో మాట్లాడే పాంచజన్యుడు తన పరివారంతో కనబడ్డాడు. అతని కళ్ళలో ఇదివరకటి ప్రేమ లేదు. త్రాచుపాము పగ వంటి కోపంతో బుసలు కొడుతూ చూస్తున్న వాడిని, కృష్ణుడు చాలా సామాన్యంగా పలుకరించాడు.

దానికి సమాధానం చెప్పకుండా, వుగ్రుడౌతూ "రాత్రి మీరెక్కడున్నారు ? ఏం చేసారు ?" ఉరుములా ఉరిమాడు. సమాధానంగా కృష్ణుడు, "నిన్న నువ్వు ఓ పదిహేడేండ్ల కుర్రాడిని చావు దెబ్బలు కొట్టించావు చూడు, వాడి ప్రక్కన కూర్చుని ఓదార్చాం. బాధనుపశమింప చేసాం ?

"ఎంత ద్రోహం ?" ఎర్రగా మండే కళ్ళతో పాంచజన్యుడు అన్నాడు.

"అది ద్రోహం కాదు, మా ధర్మం. అనాధలను, ఆపదలో వున్నవారిని సంరక్షించడం మా కర్తవ్యం. నువ్వు రాక్షసంగా ప్రవర్తించి ఆతన్ని చావగొట్టించావు. మేము మానవత్వం మరువక ఆతనిని రక్షించాం ?" "ఏం తప్పా ?" అన్నట్లు కృష్ణుడు చూస్తుంటే - ఆ చూపులను తట్టుకోలేని పాంచజన్యుడు, "నేనడిగేది, అది కాదు. రాత్రి మిమ్మల్ని బంధిస్తే ఆ బోనులో నుండి ఎలాగ బయటికి వచ్చారు ? దీనికి సమాధానం... ?!"

"అది తెలుసుకోవలసిన బాధ్యత నీది, నీ వాళ్ళది ?" పెడసరంగా వుందా సమాధానం. మళ్ళీ తన దండధరుని పంపి, ఆ బోను పరిస్థితిని గమనించమన్నాడు.

అంతకుముందే యజమానికి భయపడి తన ధర్మము తాను నిర్వర్తించినా కాలయముడు, అన్నీ సవ్యంగా వున్నాయి ప్రభూ! అయినా వీరెలాగ బయటికి వచ్చారో అర్థం కావడం లేదు" నసుగుతూ నంగి నంగిగా చెప్పాడు.

"అర్థమౌతుంది. ఆ కొరడా ఝుళిపిస్తే సరి. కానీయ్!!" ఆదేశించాడు.

అప్పటికే కృష్ణుని చూసి వణుకుతున్న ఆ కాలయముడు, అటు ఇటు కదలలేకపోయేసరికి, అతని చేతిలోని కొరడాను తానందుకుఉన్నాడు. ఆ హడావుడికి ఆ ఓడలోని కళాసీలందరు పరుగుల మీద వచ్చినట్లు, అక్కడికి వచ్చి చేరారు. కర్కశ, మొండి, మొరటు ప్రభువు, ఆ సుకుమారులనేం చేస్తాడోనన్న

భయమొకవైపు, ఏం జరగబోతుందోనన్న ఉత్కంఠ మరో వైపు.... అందరు కళ్ళప్పగించి చూస్తున్నారు. ఆ సమయంలో...

పాంచజన్యుని ప్రయత్నాన్ని వమ్ము చేస్తూ కృష్ణుడు ఎగిరి ఆతని చేతిలోని కొరడానందుకున్నాడు. ఝుళిపించాడు. ఆ హఠాత్సంఘటనకు అక్కడున్న వారందరు నివ్వెరపోయారు. ఏం జరగబోతుందోనన్న భయం ప్రతి ఒక్కరిలో మొదలయింది.

నిజానికి పాంచజన్యునికి కొరడా ఝుళిపించడం రథం నడపడానికి తప్ప తన ప్రతాపాన్ని తెలియబరచే విధంగా ఝుళిపించడం చాత కాదు. అటువంటి దిప్పుడు, కోపం కొద్ది కృష్ణుని శిక్షంచడానికి చెయ్యెత్తగానే, ఒక ఒడుపుగా ఆతని చేతిని పట్టుకుని, ఆ కొరడా తాను లాక్కున్నాడు. ఆ వెంటనే దానిని ప్రయోగించాడు. "సర్"మంది నషాళానికికంటేటట్లు ఆ దెబ్బ. అంతే. "అబ్బా!" అంటూ మెలికలు తిరుగుతూ, పాంచజన్యుడు ఆ కొరడా పట్టాలని ప్రయత్నించాడు.

"అతని ప్రయత్నం ఫలించలేదు సరికదా, ఒకదాని తర్వాత మరొకటి పడే ఆ కొరడా దెబ్బలకు పాంచజన్యుడు, కండలూడిన, రక్తం కారే శరీరంతో ప్రాణావశిష్టుడయ్యాడు. ఇదివరకటి నీ పాలబడ్డవారు పడే బాధ ఎలాగుంటుందో అనుభవించు" అంటూ అతడు ఎటు కదలలేని విధంగా, కృష్ణుడు మార్చి మార్చి మరీ ఏమార్చి చావ గొడుతున్నాడు.

అతను స్పృహ తప్పి పడిపోగానే, మానవత్వం మరువని, మమతామూర్తి కృష్ణుడు ఉద్ధవునితో అతన్ని తీసుకురమ్మన్నాడు. గుర్తుండే ఆ గాయాలకు తగు విధంగా మందులు వ్రాయమన్నాడు. ఆ దెబ్బకు ఓడ అందులోని పరిజనం, పాంచజన్యుని పరివారం, అంగరక్షకులు ... ఒక్కరేమిటి... అందరు కృష్ణునికి శరణాగతులై, అతని కరుణనర్థిస్తూ నిలబడిపోయారు.

"వెళ్ళండి. వెళ్ళి, మీ మీ పనులు చేసుకోండి" అని ముసలి సరంగును చూస్తూ "పెద్దాయన మన ఓడను వైవస్వతపురివైపు మళ్ళించు" ఆదేశించాడు. చిన్నవాళ్ళయినా, ఇప్పుడతని ఆజ్ఞ అందరికి శిరోధార్యం.

అప్పుడు కృష్ణుడు - ఆనందంగా ఎప్పటినుంచో తనకున్న ఆశ, ఆశయంగా,

పాంచజనుని నడుం చుట్టు వున్న శంఖం తీసుకున్నాడు. ఇప్పటి నుంచి దీని పేరు - నన్నభిమానించి, ప్రేమించిన ఈ పాంచజనుని గుర్తుగా, పాంచజన్య'' మన్న పేరిట ప్రసిద్ధమౌతుందని చెప్పాడు. దానిని వూదాడు.

ఆ శంఖధ్వనికి అందరు అప్రమత్తులైనట్లు స్థిరంగా నిల్చారు. ఎవరి ధర్మం వాళ్ళు నిర్వర్తించండి... తప్పు చెయ్యనంతవరకు ఎవరు, ఎవరికి భయపడనవసరం లేదు. ధైర్యంగా వుండండి. "స్వతంత్రం దొరికింది కదా'' అని తోక ఝాడిస్తే అది - ఈ పాంచజన్యుని వలె అధోగతి పాలవుతుంది. చచ్చిన వాళ్ళ కర్మకు కర్త అవుతుందన్నాడు. అందరు తలలు వంచి, "తమ ఆజ్ఞ'' అన్నట్లు తలవంచి, వందనమొనరించి హుషారుగా తమ తమ పనులలో లీనమయ్యారు.

అందర్ని పంపి కృష్ణుడు, పాంచజనుని విభాగంలోకి వెళ్ళాడు. బాధను భరించలేని అతడు, కృష్ణుని చూస్తూనే బండబూతులు ప్రారంభించాడు. ఇప్పుడర్థమయిందా, నీ పాలబడ్డవారు కూడా, ఇలాగే బాధపడి ప్రవర్తించి వుంటారన్నాడు. ఒకసారి అతనిని పరామర్శించిన కృష్ణుడు, అప్పటితో కొంత తన ధర్మము పూర్తయిందని తలచాడు.

కాలచక్రం తిరుగుడుకు సమాధానంగా అందరు ప్రశాంతంగా ఆదమరచి నిద్రపోతున్నారు. కృష్ణ - ఉద్ధవులు కూడా అంతే! సర్వాంతర్యామియైన కృష్ణుడు, తన వదనంపై ఎవరిదో నీడ పడినట్లు తలచి కళ్ళు తెరిచాడు. చేతిలో కత్తితో, మనస్సంతా "పగ - కసి - ద్వేషం - క్రోధం - రగులుతున్న పాంచజనుడు పిడిబాకుతో కృష్ణుని చంప సిద్ధంగా వున్నవాడు -

కృష్ణుడు వులిక్కిపడినట్లు కళ్ళు తెరవడం, మెరుపులా, ఒడుపుగా తన చేతిని పట్టుకుని, కత్తిని క్రిందపడేయించడంతో పాంచజన్యుడు అసహాయుడు, కృద్ధుడయ్యాడు. అదే - అదనుగా - పాంచజనుని వెనుక మరో ఆకారం.... అంతా విచిత్రం. నిశీధికే విస్మయం. అసలే దెబ్బతిని, అసమర్థునిగా వున్న అతన్ని ఎవరో బలంగా ఎత్తి, సముద్రంలోకి బంతిలా విసిరాడు. నీళ్ళలో పడ్డ ఆతడు, ఈది, బయటికి వచ్చే స్థితిలోలేని దుస్థితిలో బుడుంగుమని మున్గిపోయాడు. ఓడ తన సహజ శబ్దంతో యధాప్రకారం జరిగే దానితో తనకేమీ సంబంధం

లేనట్లు ముందుకు సాగిపోతుంది.

అంతవరకు అతని పరివారంలో వుండి అవమానాలు, ఆందోళనలు, భయభ్రాంతులకు లోనైన వారిలోని ఒక దండధరుడు, కృష్ణుని దివ్యునిగా, దేవునిగా చూస్తూ - శరణాగత రక్షకుని కరుణ నపేక్షిస్తూ - తన ధర్మం నెరవేర్చాడు.

ఇప్పుడు - పుణ్యజన ఓడ అన్నివిధాలా క్రొత్తదనం సంతరించుకుంది. భయాందోళనల స్థానంలో, ఆనందానుభూతులు వెల్లివిరుస్తూ - ప్రతి ఒక్కరి నోట కృష్ణ నామం, కర్ణపేయం, శ్రవణ - స్మరణానందంగా వినిపిస్తుంది. కావలసినంత ఆహారం, సమృద్ధిగా లభిస్తుంది.

మంచి బట్టలు, మధురభక్ష్యాలు కృష్ణుడు ప్రసాదించాడు. ఆ ఓడ చుట్టు తిరిగి లోలోపల క్షుణ్ణంగా పరిశీలించిన కృష్ణుడు, అందులోని ఆయుధ సంపత్తిని చూసాడు. ఒక్కొక్క ఆయుధాన్ని ఒక్కొక్కరికి యిచ్చి, అందులో తగు శిక్షణ కూడా ఇస్తున్నాడు. ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ, దాంతోపాటు ప్రేమాభిమానాల సద్బుద్ధి, పరస్పర ప్రేమ, స్నేహభావాలను పెంపొందింప చేస్తున్నాడు. ఇప్పుడు కృష్ణుడందరికి - పిలిస్తే పలికే నడిచే ఆరాధ్య దైవం.

పాంచజన్యుని పరివారంలోని ఆతని బంధు గణానికి ఇప్పుడు కృష్ణునిపై భయభక్తులు పెరిగాయి. అంతటి తమ ఏలికనే, మరబొమ్మను చేసి ఆడించిన మహనీయ శక్తికి, మానవతామూర్తికి, ఆ దానవ శక్తి తలవంచింది. ఇప్పుడు - ఆ ముసలి పెద్దాయనే ఆ ఓడకు సర్వాధికారి. కృష్ణుడు ప్రభువు.

ఓడ క్రమక్రమంగా, వైవస్వతపురికి చేరువవుతుంది. ఆ సూర్యక్షేత్ర వివరాలను పెద్దాయన చెబుతున్నాడు. ~~ఈ~~ వైవస్వతపురి (సూర్యక్షేత్రం) పాతాళం లోని, నాగలోకానికి చేరువలో వుంది. నాగకన్యల క్షేత్రాధిపత్యములో పాలనం సాగుతుంది. ఆ దేశ రాణి ఆ లోకానికి దేవత - ఆమె కనుసన్నలలో వెలిగే-దీని కధిపతి యముడు - అధినాయకి దేవమాత. ఆ తల్లి కనుసన్నలలో సర్వకార్యాలు వైవస్వతపురి రక్షణ - శ్రేయస్సులు - పరిరక్షణాదులు జరుగు తున్నాయి.

ఆమెను లోకమాతగా, జగన్మాతగా ఆ లోకస్థులు సర్వులు ఆరాధిస్తారు. ఆమె ఆజ్ఞే వేదం. కాదంటే దాని అధిపతియైన యమధర్మరాజు (దానిని

సంయమనపురం, "యమపురి"గా కూడా పిలుస్తారు) క్రూర దండనలకు గురి కావల్సి వుంటుంది. కనుక అందరు ఆ తల్లికి ఆజ్ఞాబద్ధులే. ఆమెకు గల అద్భుత శక్తులే ఆమెకు, ఆ లోకానికి సహజ కవచంగా భాసిల్లుతున్నాయి. ఆమె భర్తే ఆమెకు ప్రథమ అధికార సేవకుడు.

అటువంటి ఆ తల్లి, తన యువరాణులకోసం ఆచార్యులు సాందీపుల వారి గురుపుత్రుని, అధిక వెల వెచ్చించి మరీ కొంది. ఈ కథంతా పెద్దతను ముందస్తు నివేదికగా అందించాడు. ఇదంతా పూర్తయిన కొన్ని దినాలకు వారు "వైవస్వతపురి"గా విఖ్యాతమొందిన సంయమనపురికి వచ్చారు. సూర్యుని లేలేత అరుణ కిరణాలు బంగారు వర్ణంతో ఆ ప్రాంతమంతా ప్రకాశిస్తూ ఎంతో ఆహ్లాదంగా వుంది. ఆ ఓడరేవులో ఎన్నో చిన్న చిన్న పడవలు బహుశః చేపల వేటకు - ఇతర అవసరాలకు వుపయోగించేటట్లు నిలచి వున్నాయి.

ఎదురుగా ఎత్తైన కోట. అధిరోహించడానికి మెట్లు. వాటిని సోపాన సముదాయమని కూడా మేథావులు పిలుస్తారు. వీరి ఓడ అక్కడికి చేరుకొనేలోగా అక్కడ కలకలం. వీరిని స్వాగతిస్తున్నట్లు, వీరి కోసమే ఎదురుచూస్తున్నట్లు, అక్కడున్నవారు కనుపిస్తున్నారనే భావన కల్గుతుంది. కృష్ణుడు, ఉద్ధవునితోపాటు, పుణ్యజన జాతికి చెందిన కొందర్ని వెళ్ళి పరిస్థితి తెలుసుకురమ్మని పంపించాడు.

వారంతా ఓ చిన్ని పడవలో ఒడ్డుకు బయలుదేరారు. కృష్ణుడు మిగిలిన వారితో ఓడకు లంగరు వేసి ఆ సముద్రంలోనే వుండిపోయాడు. ఆ మర్నాడు కోట ముందర కలకలం. ఎవరి కోసమో ఎదురు చూస్తున్న ఎదురుతెన్నులు. విషయం తెలుసుకున్న ఉద్ధవుడు కృష్ణుని సమీపించి, వారంతా నీ కోసం ఎదురు చూస్తున్నారు. స్వాగతించ వచ్చారని, తనకు తెలిసినదంతా వివరించి, వివరంగా చెప్పాడు. ఈ ఉద్ధవునితోపాటు మధ్య వయస్కురాలైన స్త్రీమూర్తి, వంటి మీద ఆభరణాలతోపాటు, నెత్తిన నాగాభరణం కూడా దాల్చి, కృష్ణుని స్వాగతించ వచ్చింది. ఆమెను చూస్తూనే ఆ ఓడ సరంగు, ఈమెను నాగలోక ముఖ్య అధికారిణిగా, కృష్ణునికి పరిచయం చేసాడు.

పెద్దాయన మాటలకు, ఆమె ఆధిపత్యానికి కృష్ణుడు ఆశ్చర్యపోలేదు సరికదా, చాలా సామాన్యంగా తలపంకించాడు. ఇదంతా స్త్రీ సామ్రాజ్యమని, పురుషులు భర్తలైనా, వారికి ప్రధమ అధికార సేవకులని, వీరిని కాదంటే, భర్తలైనా

పలు బాధలకు గురి కావల్సి వస్తుందని, ఆ పెద్దతను కృష్ణునికెంతో వివరంగా, ఎంతో వినయంగా చెప్పాడు. పైగా ఇది మాతృస్వామ్య వ్యవస్థయనీ, మన పితృసామ్య వ్యవస్థకు విరుద్ధమైన సర్వాధికారాలను సంక్రమింప చేసుకున్న ఓ "శక్తి" సంస్థయని మరీ వివరించి చెప్పాడు.

అప్పుడే ఉద్ధవుడు, ఈ ప్రాంతం చాలా ప్రమాదకరమైనదన్నాడు. సర్వ శక్తిపరురాలైన ఈ దేశమాత నీ రాకను తన దివ్యదృష్టితో ముందే గ్రహించిందంట. దీనికి తగ్గట్లు నిర్వాహ్వానించడానికి తగు పథకాలు గూడా రూపొందించుకుందంట. మెల్లిగా చెప్పాడు. అతనితో వచ్చిన అధికారిణి కృష్ణునికి వందనం చేసింది. తమ ప్రాంతానికి రమ్మని, వచ్చినందులకు సంతోషమని, స్వాగతం చెప్పింది.

దాంతో ఉద్ధవ, కృష్ణులు - రాజులు విహరించే రాయంచ వంటి సుందర పడవ నెక్కారు. వీరిని మరో రెండు పడవలు అనుసరిస్తున్నాయి. అందులో కృష్ణుడు ఆ రాజమాతకు ఇవ్వదలచుకున్న బహుమానాలు వగైరా వున్నాయి. కోట ముందర కృష్ణుని స్వాగతించడానికి ఇరువురు అందమైన యువతులు కన్నులవిందు చేస్తున్నారు. వారు యువరాణులని, వారిలో చిన్నదానికింకా వివాహం కాలేదని, ఆమెను కొందరు సఖీబృందం అనుసరించి యుండగా, ఆ చిన్నది, ఈ కృష్ణుని స్వాగతించింది.

వాళ్ళందరు ప్రభుత్వ - రాజోద్యోగులవలె దుస్తులు ధరించి వున్నారు. కాని వారి మధ్యలో తారల మధ్య రోహిణి వలె, ఈ రాచకన్య భిన్నాలంకారాలతో, కనువిందుగా కనపడుతుంది. ఆ యువరాణుల కిరుప్రక్కన బల్లెములు ధరించిన బలిష్ఠులైన, అందమైన స్త్రీలున్నారు. వారి వెనుక ఆ దేశ - దివ్యమాత, ఆమె ప్రక్కన ఆమె భర్త వున్నారు.

ఆ రాజమాత భర్త నిజానికి రాజు కాడు, చెప్పుకునే యువరాజు. ఆ దేవమాతకు ఆజ్ఞాబద్ధుడు. అనుక్షణం ఆమె కనుసన్నలలో, ఆమె ఆదేశాల నమలుపరిచేవాడే తప్ప, స్వతంత్రుడు కాదు. ముందే ఉద్ధవుడు చెప్పి వున్నందు వలన, కృష్ణుడు మన సామాన్య భాషలో, ఆ దివ్యమాతను గుర్తించాడు. సాంప్రదాయ బద్ధంగా వందనం చేసాడు. ఆమె ఆ వందనం స్వీకరించినట్లు, యువరాజువైపు చూసింది. తను ముందుకు వచ్చాడు. కృష్ణునికి దేవభాషయైన

సంస్కృతంలో స్వాగతం పలికాడు.

కృష్ణుడు కూడా తనదైన దేవభాష - సంస్కృతంలో "యువరాణీ! నా పేరు కృష్ణుడు. శూరవంశ శ్రేష్ఠుడైన వసుదేవుడు నా తండ్రి, నేను ఆచార్య సాందీపుల వారి ప్రియ శిష్యుడను. "అనగానే, యువరాజు ముఖం కళా విహీనమయింది. అప్పుడు కృష్ణుడు అతడే పునర్దత్తుడై వుంటాడని తలిచాడు. యువరాజు పరిచయంతో, దేవరాణి ముందుకు వచ్చింది.

"కృష్ణా! మా దేవ ప్రాంతానికి సాదర స్వాగతమని, తాను దివ్యమాత తరఫున స్వాగతమిస్తున్నానని యువరాణి ఆహ్వానించింది. వాళ్ళ ఆహ్వానంతో అక్కడున్న వారినందర్నీ, కృష్ణుడు పట్టిపట్టి పరిచయం చేసుకుంటున్నట్లు, పరికించి చూసాడు. దేవ యువరాణి, చిన్న రాజకుమారివైపు చూసింది. ఆమె సైగల ప్రకారం, ఆ పిల్ల కృష్ణునికి చేరువయింది. ఆ నగర శోభలు, దివ్యకాంతుల వైవస్వతపురి సందర్శనానికి దారితీసింది. కృష్ణునికి దారి చూపింది.

ఇరువురు పల్లకి నధిరోహించారు. కృష్ణునికి ఆ పాముపిల్ల (నాగకన్య) చూడముచ్చటగా వుంది. ఆమె కూడా ఎంతో చనువుగా కృష్ణునితో మసలుతుంది. కాకపోతే తానున్నది నాగలోకమన్న సంగతి తెలిసిన కృష్ణుడు తన జాగ్రత్తలో తానుండదలిచాడు. ఆ ప్రాంతం, విశేషాలు, అన్నీ గమనిస్తున్నాడు. ఈ సమయంలోనే కృష్ణుడు - దేవమాత అధికార భవనాన్ని సమీపించాడు.

పుణ్యజన ఓడనుండి వచ్చిన ఇద్దరు వ్యక్తులతో కలసి ఆ నాగలోకవాస అధికారులు, కృష్ణుని అనుసరించారు. యువరాజు పునర్దత్తుడు, అలాగే యువరాణి కూడా మళ్ళీ కలుస్తానని శెలవు తీసుకున్నారు. అందరు వెళ్ళిపోయాక కృష్ణుడు "ఉద్ధవా! మన గురుపుత్రుడిని చూడగలిగాం. కానీ, అతన్ని ఈ నాగకన్యల నుండి తీసుకువెళ్ళడం సామాన్య విషయం వలె కనుపించడం లేదు. అయినా తప్పదు!" దీర్ఘంగా నిట్టూర్చి, తన స్థిర అభిప్రాయాన్ని తెలిపాడు.

కొద్ది క్షణాలు గడిచాయి. తనను స్వాగతించిన యువరాజు అక్కడికి వచ్చాడు. అతన్ని చూస్తూనే కృష్ణుడు, పునర్దత్తా! ఇచ్చటి నుండి వెళ్ళిపోవడానికి

మార్గాలు... అర్థోక్తిలో అడిగాడు.

"నేను రాను. రాలేను. అయినా అక్కడికి వచ్చి మళ్ళీ ఆ ముష్టిసన్యాసి.... అదే ఆ సాధు నిరర్థక జీవితం గడపలేను. స్థిరంగా చెప్పాడు.

అదేవిటి పునర్దత్తా, అలాగంటావు ? జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ...!" అన్నాయి కదా మన శృతులు.

"కృష్ణా! ఈ కబుర్లు అక్కడుండే పనికిరాని వారికి తప్ప, ఇక్కడుండే మాలాంటివాళ్ళకు కాదు. ఇక ఈ మాటలు కట్టిపెట్టు. ఈ స్త్రీకి భాష రాకపోయినా, భావాలు చదువగల స్థిత ప్రజ్ఞురాలు. మన వాలకాన్ని పసిగడితే నాకన్న ముందు నీకు ప్రమాదం" అన్నాడు.

"చూడు పునర్దత్తా! ఇక్కడ నీకు రాజ్యం లేదు, అధికారం లేదు. వున్నది బానిసత్వం. ఇక్కడ సర్వాధికారినౌతానని చెప్పు. నీ వునికిని చెప్పి నీ తండ్రిని సంతోషపెడతాను. రాజయి తన సర్వాధికారాలతో మిమ్ము చూడవస్తాడని వూరడిస్తాను.

'ఆ అదృష్టం, ప్రస్తుతం, కలలో కూడా కనబడదు. దేవమాత, "ఆ జగజ్జనిలో చేరితే, ఆ అదృష్టం లభిస్తుందేమో, అప్పటికి నేను ప్రాణాలతో, ఏ విధమైన ప్రమాదాలకు లోనుగాకుండా వుండాలి. ఇది అసాధ్యం. అయినా ఇక్కడనుండి బయటపడాలనుకోవడం కూడా చాలా ప్రమాదం. మరోమాట - నేనేకాదు, నువ్వు కూడా ఇక్కడనుండి బయటపడలేవు. ఆ సంగతి తెలుసుకో!" భయపెట్టడం కాదు కానీ, అచ్చటి పరిస్థితిని వివరించి చెప్పాడు.

అంతా విన్న కృష్ణుడు "సోదరా! గురుదేవులు నీపై బెంగపెట్టుకుని కృంగి పోతున్నారు. మాతాజీ బాధ చెప్పనలవి కానిది కాదు. నువ్వు మాతో వస్తానంటే ఆలోచన వేరు. కాదంటే పరిస్థితి వేరు. ఆలోచించుకో!" వినయ, హెచ్చరికలు కల్గిన స్వరంతో చెప్పాడు.

"ఓ వాసుదేవా! ఇచ్చటి పరిస్థితులు నీకర్థం కావు. ఒక్కసారి ఈ లోకంలో అడుగుపెట్టినవాడు, అడుగు పెట్టడం వరకే తప్ప, వెనక్కి మరలలేడు. మొదట్లో నేను ఇక్కడ నుండి వెళ్ళిపోవాలనుకున్నాను. పూట గడిచేసరికి తెలుస్తుంది - మనము, మన పరిస్థితి. ఇప్పుడు - ఇక్కడి సుఖాలు, సంతోషాలు, దిగ్బంధనం

తెలిసినవారు, బంధమూర్తులైన ఆనందమూర్తులే తప్ప - విముక్తులు - "ముక్తు"లు కాలేరు. నువ్వు చెప్పే మోక్షానందము నొందలేరు. కనుక వెనుతిరిగే ప్రసక్తే వుండదు" అన్నాడు క్షణమాగాడు. అప్పుడు కృష్ణుడు -

"సోదరా! దేవతలు పంపినట్లు నీ అదృష్టం కొద్దీ నేనిక్కడకు వచ్చాను. కాని దురదృష్టమేమిమంటే, ఈ లోకంలో అడుగుపెట్టిన క్షణమే, నువ్వు నీ సర్వశక్తులు బందీ అయిపోయాయి. క్షణక్షణానికి వుచ్చు బిగుసుకుని, ఆ వలలో నుండి బయటపడలేని విధంగా ముళ్ళు పడుతున్నాయి.'' అని విపరీతంగా భయపడిపోతున్నావు.

"నిజం. కానీ, దేవమాత ఆజ్ఞను కాదని, నేనేకాదు ఏ ఒక్కరు, ఆఖరికి ఆ పితృమూర్తి యమధర్మరాజు కూడా ముందడుగు వెయ్యలేడు. ఇది సత్యం. ఇక ఇంతే ఈ జీవితం. అలవిమాలిన ఆశలు పెంచుకుని పొందే సుఖ జీవితాన్ని కాదనుకుని, ఎక్కడో - ఎప్పుడో ఏదో లభిస్తుందని - పారిపోయి, ప్రాణాల మీదకు తెచ్చుకునేకన్న - మన పెద్దలు చెప్పినట్లు'' పరుగెత్తి పాలు త్రాగేకన్న - నిలబడి నీళ్ళు త్రాగడం మంచిదన్నట్లు ఈ జీవితాన్నిలాగ ఆనందంగా, గడపడం శ్రేయస్కరం. నిజమైన బుద్ధివుంటే, ఆ బుద్ధిమంతుల లక్షణమన్నా గురుపుత్రుని మాటలకు విస్మయమొందుతూ-

"దీనినే బుద్ధిః కర్మానుసారిణి'' అనేది. అంది వచ్చిన అదృష్టాన్ని చేజార్చుకుని, దొరికిన పేలపిండిని నేలపాల్జేసుకుని, మధురాన్నం కోసం ఎదురు చూస్తున్నట్లుంది, నువ్వు - నీ జీవితమని'' కృష్ణుడు నిరసించాడు.

"చూడు కృష్ణా! నువ్వు గొప్పవాడివి కావచ్చును. శూర వంశీయుడవు, వీరుడవు కావచ్చును. కాని నన్నిక్కడకు తెచ్చిన ఆ పుణ్య జన రాక్షసులు ధనానికై నన్ను అమ్మేసారు. కొన్న దేవమాత సాదర స్వాగత మొసగింది. ఎంతో ప్రేమతో గౌరవించింది. ఆ తర్వాత వీర శుల్కం వంటి స్వయంవరం. అదొక చిత్రమైన ఆట.

అంతకుముందు - ఆ దేవ యువరాణికున్న భర్తతో నేను పోరాడాలి. అతన్ని చంపేస్తే, నాకు ఆ యువరాణికి మరల పెళ్ళి. ఇక్కడ వీరత్వం ప్రధానం తప్ప - భూలోకంలోని, వావివరుసలు మాన మర్యాదలు కావు. ఆ వీరవ"రణం"లో

నేను మరణిస్తే - సముద్రంలో తోసేస్తారు. అంతకుముందటి భర్త - యువరాజుగా చెలామణి అవుతూ వుంటాడు. ఆ యువరాణితో పొందవలసిన, పొందదగిన సర్వ భోగాలు ఆ నాగరాణి అందించినట్లు అందుకుని ఆనంద సుఖాల-సంతోషాన్ని అదృష్టమున్నన్నాళ్ళు పొందుతాడు. అలాగ పొందిన వీ "సుఖ-సంతోషాలు" వివరంగా చెప్పాడు.

"అయితే, ఈ తతంగమంతా నాకు సంప్రాప్తిస్తుందా ? వీరత్వాన్ని ప్రదర్శించాలా ?" అడిగాడు కృష్ణుడు.

నాకు తెలిసి తప్పదు. అందుకే ఆ దేవమాత నిన్నిక్కడికి ఎంతో ప్రేమగా స్వాగతింప చేసింది.

"కాదంటే....!" అర్థోక్తిలో ఆగాడు.

"ఏముంది ? ఆ మహారాజు నిన్ను సంహరిస్తాడు. నీ చరిత్ర ముగుస్తుంది. వున్న కథ యధాప్రకారం నడుస్తుంది. ఇదీ కథ" అంటాడు.

"పెళ్ళి చేసుకుంటే.....!" ఇదీ అర్థోక్తే!

"కథ సుఖాంతమౌతుంది. సుఖ సంతోషాలు పొందుతావు. నాగరాణికి భర్తగా - ఆమె కనుసన్నలలో ఆమె కోరిన ఆనందమిస్తూ - అమృతత్వ మొందక పోయినా, ఆనందమూర్తిగా, అదృష్టమున్నన్నాళ్ళు" బ్రతుకుతావు.

ఇంత ప్రమాదకరమైన జీవితాన్నెలాగ అనుభవిస్తున్నావు ? పోనీ, దారిచేసి చూసి నిన్ను తీసుకుపోతానంటే, నా వెంట వస్తావా ? అడిగిన కృష్ణునికి

"రాను" అంటూ మూర్ఖంగా పునర్దత్తుడు సమాధానమిచ్చాడు. మళ్ళీ అతనే "పరిస్థితులు నీకర్థం కావడం లేదు. ఆ దేవమాతను కాదనకున్నా, పితృ పతి యమధర్మరాజు, దయాదాక్షిణ్యాలు పొంది తిరిగి భూలోకానికి వెళ్ళడం, లేదా వెళ్ళగలగడం" అసాధ్యమని ఖరాఖండీగా పునర్దత్తుడు చెప్పేసాడు.

అటువంటి ఆలోచనలు విడిచిపెట్టమని బ్రతకడం నేర్చుకోమని, తనదైన సలహా నిచ్చాడు.

# గురుదక్షిణ

అది సాయంకాలం వేళ. ఉద్ధవ - కృష్ణులను దేవమాత సన్నిధికి తీసుకు వెళ్ళడానికి అధికారిణి వచ్చింది. ఆమెతో పుణ్యాజన ఓడలో కృష్ణుని అనుసరించి వున్న మనుషులు, తాము తెచ్చిన బహుమతులతో, కృష్ణ-ఉద్ధవులతో కలిసి, సాంప్రదాయబద్ధంగా నిలచిన ఆయుధపాణులైన, రక్షకశ్రేణి పర్యవేక్షణలో దేవమాత పవిత్రమందిరానికి బయలుదేరారు.

అక్కడ - ఆ సభా భవనంలో, గౌరవనీయులైన సభ్యులు, ఆయుధ పాణులైన రక్షకశ్రేణి, వీళ్ళందర్ని స్పష్టంగా చూడగల్గిన పవిత్రాగ్ని జ్వాలలతో, ఆ దేవమాత సభా భవనం పరమపవిత్రంగానే కనుపిస్తుంది. కృష్ణ ఉద్ధవులు ఎత్తుగా వున్న సభావేదికను చేరారు. అక్కడ దేవ యువరాణులు, వారి ప్రక్క యువరాజు ఉన్నారు. ఆ ప్రాంత దేవపిత - ఆయుధపాణియై, ప్రత్యేకంగా ఎత్తైన సభావేదిక మీద ఎంతో అందంగా, హుందాగా వున్నాడు. ఆయన అలంకారాన్ని బట్టి ఆయనను దేవపిత లేదా "పితృపిత"గా గ్రహించవచ్చును.

మంగళధ్వానాల నడుమ, పరమ ఉవ్వెత్తున లేచే పవిత్ర అగ్నిజ్వాలలు. దానివెనుక దేవమాత ప్రకటితమయింది. వాళ్ళు దేవతలు కాబట్టి ఎప్పుడు మధ్య వయస్కులు. అందానికి ప్రతిరూపులు. ముసలితనము, వ్యాధులు - బాధలకు దూరంగా వుంటారు. ఆ తల్లి దర్శనం కాగానే ప్రతి ఒక్కరు వందనాలర్పించారు. ఆ దేవమాత సైగలతో, రాజు దేవ పిత, యువరాజును హెచ్చరించాడు. అతడు కృష్ణుని చేరి, తన సందేశాన్ని వినిపించమని కోరాడు.

కృష్ణుడు - తన చెరగని దరహాసంతో -

"ఓ దేవమాతా! నా పేరు కృష్ణుడు. నేను శూరశ్రేష్టుడైన వసుదేవుని కుమారుడను. మా మహారాజు మధురాధిపతి ఉగ్రసేనుల వారి సందేశం వినిపిస్తున్నాను. వినండి. యదువీరుల తరఫున వారినుండి సేకరించిన ఉత్తమో-త్తమమైన బహుమతులివి. మా శక్తి కొలది తెచ్చినవి మీకర్పిస్తున్నాం. అందుకోండి. మా కోరికను మన్నించి, దేవమాత మా బహుమతులను స్వీకరిస్తుందని తలుస్తాను" అంటూనే కృష్ణుడు - మరల ఏదో చెప్పబోయాడు కానీ, దేవమాత

నుండి ఎటువంటి స్పందన లేకపోయేసరికి మిన్నకుండిపోయాడు.

కొద్దిక్షణాలు గడిచాయి. అప్పుడు దేవమాత -

"ఓ వసుదేవ కుమారా, వాసుదేవా! కృష్ణా! నీకు స్వాగతం, సుస్వాగతం. నువ్విక్కడకు వస్తున్నావని తెలిసింది. చాలా సంతోషం కల్గింది. ఆ జగన్మాత ఆదేశంతో నిన్ను స్వాగతించడానికి, ఆతిధ్యమొసగడానికి అప్పటినుండి సర్వ సన్నద్ధంగా వున్నాము. నీ నుండి బహుమతులను పొందగల్గడం, మా అదృష్టం. వాటిని మేము తప్పక స్వీకరిస్తా"మని చెప్పి - ఆగింది. ఆ విషయాన్ని, పునర్దత్తుడు విపులీకరించి చెప్పాడు. అతని మాటలు పూర్తయ్యాయి. దేవమాత తన చేతిని పైకెత్తి ఆగమన్నట్లు సూచించింది. తాను చెప్పడం ప్రారంభించింది.

"ఓ వసుదేవ సుతా! ప్రస్తుతం నీవు మాకు అతిథివే కాదు. ఆ జగన్మాత ఆదేశం ప్రకారం, నువ్విక్కడ - మాతో - శాశ్వతంగా వుండాలి. ఇది ఆ తల్లి ఆదేశం, మా అభిలాష. దీనినెవరు కాదనలేరు" అసలు విషయాన్ని స్పష్టపరిచింది. దానికి తన సమాధానమివ్వ తలచిన కృష్ణుని వారిస్తూ - దేవమాత "ఇప్పుడు నువ్వు మాలో ఒక్కడివి. ఇది జగన్మాత అభిలాష. ఆదేశం. దీనికి విరుద్ధంగా ఎవ్వరు ప్రవర్తించలేరు. దీనిని అందరు తలదాల్చవలసిందే!"

కృష్ణునిలోని అనంగీకారము, అసహనత గుర్తించిన వ్యక్తి పవిత్రాగ్నిలోని కొరకంచు తీసుకుని, ముందుకు, కృష్ణునివైపు దూకబోతూంటే, దేవమాత ఆపింది. అప్పుడు, రాజు ముందుకడుగువేసి, ప్రేమగా కృష్ణుని భుజం తట్టాడు. అతన్ని పవిత్రాగ్ని వుంచిన గది వెనుక గల ఏకాంత ప్రదేశానికి తీసుకువెళ్ళాడు.

అప్పటికే దేవమాత, జగన్మాత తనను ఆవహించినట్లు, ఆదేశాలు, సందేశాలనిచ్చింది. ఎన్నో వివరాల నడిగి తెలుసుకోవాలనుకున్న దేవభాష తెలిసిన పితృపతి యమధర్మరాజు. తాను తెలుసుకున్న విషయాలకు సంతోషించి, చివరగా కృష్ణుని - "పరశురాముల వారి గురించి" అడిగాడు. ఆశ్చర్యపోయాడు కృష్ణుడు.

మళ్ళీ మామూలుగా, యముని కుశలప్రశ్నలనంతరము, ఉద్ధవ - కృష్ణులను సంరక్షకి తీసుకు వెళ్ళింది. తమ ప్రాంతమంతా వివరంగా చూపించి, వారి విడిదికి తీసుకువచ్చింది. అక్కడనుండి కృష్ణుడు మరల తమ ఓడలోని పెద్దాయనకు

మరికొన్ని బహుమతులను పంపమని సందేశం పంపించాడు.

ఆ రాత్రి భాగంలో, ఎవరో తన వద్దకు వచ్చినట్లు కృష్ణుడు నీడను బట్టి గ్రహించాడు. ఆ వచ్చిందెవరో కాదు - గురు పుత్రుడైన పునర్దత్తుడు. "చిన్న యువరాణి నీ కోసం వచ్చింది" మెల్లిగా పునర్దత్తుడు అంటున్నాడు. అనురాగం ప్రేమలు అలాగ వుంటాయనుకుంటున్నాడు. ఏం చెప్పాలనో, లేక... ఏం చెయ్యాలన్నదో వాళ్ళ వుద్దేశం తెలిపేలోగా, ఇంకొకరెవరో వచ్చారు. యువరాణికేదో చెప్పారు. అంతే.... లేడివలె భయపడుతూ పారిపోయింది.

ఈ హడావుడికి ఉద్ధవుడు లేచి "ఏమయింది కృష్ణా" అడుగుతున్నాడు. సమాధానంగా "ఏముంది, ఇది నాగలోకం. పాములు చుట్టబెట్టుకోవడానికి ఆరాటపడుతుంటాయి." చాలా సహజంగా చెప్పాడు. అప్పుడే... ఎవరివో అడుగుల చప్పుడు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఆ మనిషి దగ్గరకొచ్చి యమ-ధర్మరాజు రమ్మంటున్నట్లు చెప్పాడు.

"నేనూ రానా ?" ఉద్ధవుడు అడిగాడు.

"వద్దు. ఆ పిలుపు నాకొక్కడికే!" అన్నాడు. ఆ వచ్చిన వ్యక్తిని అనుసరించాడు. దూరంగా నక్షత్రకాంతులు వెదజల్లే - సుదూర ప్రాంతంలోని భవంతి వద్దకు తీసుకువెళ్ళాడు. అక్కడ దేవపిత, కృష్ణుని కోసం ఎదురు చూస్తున్నట్లు నిల్చున్నాడు.

"రా, కృష్ణా! నా వలన నీకే విధమైన అపకారం జరగదు. ధైర్యంగా దగ్గరకు రావచ్చు" అన్నాడాయన.

"వందనం దేవ పితా, వందనం. నన్ను రప్పించిన కారణం ?! నిర్భయం తన సొత్తయినట్లు అతనికెదురుగా కూర్చుని కృష్ణుడడిగాడు.

"వాసుదేవా! నువ్వు దైవ సమానుడవని, అవతారపురుషుడవని, దేవమాతకు తెలుసు. ఇక్కడికి నీ రాక కూడా ఆమెకు తెలుసు. నీ దివ్యత్వానికి మురిసి నీ వివరాలన్ని నేను అడిగి తెలుసుకున్నాను. నువ్వు నీ ప్రవర్తన నాకెంతో ముచ్చటగా వుంది. నన్ను ముగ్ధుడిని చేసాయి. అవును... ఇప్పుడు నిన్నెందుకు పిలిపించానో తెలుసా ? ఎంతో రహస్యంగా మెల్లిగా అడుగుతున్నట్లు చెబుతున్నాడు.

"ఇక్కడ ఈ నాగలోకంలో వుండటం నీకు చాలా ప్రమాదకరం.

తెల్లవారేలోగా రాత్రికి రాత్రి వెళ్ళిపోండి. పొంచి వున్న ప్రమాదం నుండి బయట పడండి. కావాలంటే నేను మీకు సాయపడతాను.'' ప్రమాదం చెప్పకుండా పారిపోమని కోరుతున్న రాజుతో -

“నీ మాటలు జ్ఞానులు, బుద్ధిమంతుల తీరును తలపిస్తున్నాయి. మీరీ లోకానికి మహారాజు మీ రక్షణలో నేనున్నాను. అటువంటప్పుడు పిరికిపందలాగ, ఏదో ప్రమాదం ముంచుకొస్తుందని పారిపోవడం సబబా ? ఇది ఆర్యులు మెచ్చే పనా?! ఆలోచించండి!''

“కృష్ణా! నువ్వు నన్నర్థం చేసుకో. నువ్విక్కడ వున్నావంటే, ఇక్కడ శాశ్వత బందీవవుతావు. మా పుత్రికను వివాహం చేసుకోవాలి. ఇప్పుడు కాదంటే అప్పుడు అరంగుళం కూడా నువ్విక్కడ నుండి కదలలేవు. పొరపాటున ఎవరైనా ప్రతాప వంతులు వచ్చి, వాళ్ళు నీకన్న బలవంతులైతే, పొందిన భార్య, పదవి, ప్రాణాలు అన్నీ పోతాయి. అర్థం చేసుకో!

“మరి మీకెందుకీ ప్రమాదం రాలేదు ?'' ఇది కృష్ణుని అమాయిక ప్రశ్న వంటి సాలోచనాధోరణి.

“వాసుదేవా! నా మాటలు నిన్ను కొద్దిగా కూడా చలింపచెయ్యడం లేదు. వచ్చేది ప్రమాదమని చెప్పగల్గుతామే కాని, దాని ఆకార-వికారాలు, లక్షణాలు విడమరచి చెప్పడం కష్టం. సూక్ష్మగ్రాహకులైన బుద్ధిమంతులకు నా సూచన చాలు. ఆ తర్వాత ఏ మాత్రం సూచన లభించినా, పారిపోయేవాడినన్న బాధకు తావు లేకుండా విషయం విపులంగా వివరించలేక సూచనగా చెబుతున్నాను.

“అది....!'' కృష్ణుని అంతరంగ ఆంతర్య ప్రశ్న.

“సరే. విను. సం॥ల నాటి కథ. ఎన్ని సం॥లని అడగకు. ఆ సంగతి మరచిపోయి కొన్నేళ్ళయింది. నేను ప్రయాణించే పడవ ఇక్కడకు వచ్చేసరికి మునిగిపోయింది. నాకు, ఈమెకు ముందున్న దేవమాత సాదర స్వాగత మొసగింది. తెలియకుండానే ఇక్కడ జరిగే స్వయంవర కార్యక్రమంలో పాల్గొన్నాను. నేను మహాశక్తివంతుడు, యోధుడైన పరశురాముని శిష్యుడనవడంతో, ఎంతటివారినైనా, అవలీలగా ఎదుర్కొనగల శక్తి సామర్థ్యాలను పొందాను. ఆ

పెంపొందింప చేసుకున్న వీరత్వంతో, అప్పటి యువరాణి, ఇప్పటి దేవమాత, అప్పటి భర్తను ఢీకొన్నాను. అతన్ని చంపేసాను. "అంతే. ఆ వీరత్వానికి శుల్కంగా లభించిన, దేవ యువరాణికి వీర వరుడనయ్యాను. ఇక్కడ బందీనైపోయాను.

"పోనీ! మళ్ళీ వచ్చిన ఓడలో పారిపోబొయ్యారా ?" కృష్ణుడడిగాడు.

"వాసుదేవా! నువ్వు చూడ, చాలా అమాయకునిలా కనబడుతున్నావు. ఒక్కసారి నాగకన్య చెయ్యి పట్టుకుందో, ఆ పట్టుకు అవతలి వ్యక్తి బానిస. ఆమె మాత్రం తల్లికి వారసురాలు. ఇతడు ఆమె ప్రేమకే తప్ప - ఇతరత్రా ఏ అధికారాలు లేని ఆటబొమ్మ. అన్నీ వుంటాయి. అనుభవించడమే జీవిత పరమావధిగా బ్రతకాలి తప్ప - ఆశపేరాశలు, అధికారాల కోరిక చంపుకుని, తనను వరించిన కోమలికి ప్రియుడిగా, అధికార బానిసగా ఆమె కనుసన్నలలో మెలగాలి. ఎంతవారైనా కాంతా దాసులేనన్న సూక్తి వీరినుండే వచ్చినట్లుంది!" వేదాంతిలా చెప్పుకుపోతున్నాడు. ఆ యమపురి - "యమ" రాజు కాదనలేని సత్యాన్ని, అసత్యంగా కాక సత్యంగా చెబుతూ!!!

ఈ కథ ఇంతటితో ఆగిపోలేదు. ఇక్కడ రాజునే అయినా, స్వతంత్ర మెరుగని బానిసబ్రతుకు నాది. ఇన్ని సంగలలో, ఎన్ని అగచాట్లు పడ్డానో నీకు తెలియదు. ఒకటి కాదు, నాలుగుసార్లు... నలుగురు, వివిధ సమయాలలో ఇక్కడికి వచ్చారు. వారు రాగానే దేవమాత వీర స్వయంవరం ఏర్పాటు చేసేది. చెప్పాను కదా, నేను పరశురాములవారి శిష్యుడనైనందువల్న, వారివద్ద నేర్చుకున్న సకల విద్యాశక్తి నన్ను రక్షించి, నన్ను బ్రతికింప చేసింది.

"కాలక్రమంలో మా అత్తగారు, అదే... దేవమాత మరణించింది. దాంతో నా భార్య దేవమాత అయింది. నేను దేవపితనయ్యాను. ఇప్పుడు నేను మృత్యు దేవతను. దేవమాత అభీష్టానుసారం, జీవులను తుదముట్టించడం, ప్రస్తుత, విద్యుక్తధర్మం" అన్న యమరాజుతో, కృష్ణుడు -

"ఓ రాజా! ఏది, ఏమైనా ఇప్పుడు నీవు సర్వసమర్థుడవు. శక్తివంతుడవు. కాలం చెల్లిన నియమనిబంధనలను మార్చి క్రొత్త విధానాన్ని ప్రవేశపెట్టవచ్చును కదా! రాజులు మారినప్పుడు, ఆ రాజ్యాధినేతలు, తమ పాలనా పగ్గాల

కనుగుణంగా నిర్ణయాలు చెయ్యడం, పాతవాటిని మార్చడం సహజమే కదా! మరి అటువంటి సాంప్రదాయ మార్పు నువ్వెందుకు తీసుకురాలేదు ?!'' అది ప్రశ్నే అయినా విజ్ఞులు ఆలోచించాల్సిన విషయం.

ఒక్కసారి బిగ్గరగా నవ్వి "కృష్ణా! నేను అన్నిటికి అస్వతంత్రుడను. దేవమాత ఆజ్ఞ - నా జీవితము.నవ్వడానికి, నడవడానికి గూడా ఆమె అధికారమే ఆలంబనం. ఈ సత్యం మరిచి, నీ పద్ధతిలో నువ్వు మాట్లాడుతున్నావు ?'' సాధ్యం కాదన్నదొక సత్యంగా ఆ యమరాజు ప్రకటించాడు.

అంతా విన్న కృష్ణుడు "పునర్దత్తా. నీ సంగతి. రా, వెళ్ళిపోదాం!'' చాలా సహజంగా అడిగాడు. అంతా విని మళ్ళీ నన్ను రమ్మనడం - నీ అమాయికత్వమో లేక గడుసుతనమో నాకర్థం కావడం లేదు. మా యువరాజే అస్వతంత్రుడనంటే, మా పరిస్థితి ఇక వివరించి చెప్పవలసిన పనిలేదు. కాబట్టి సాహసాలు మాని, నీ దారి నువ్వు చూసుకోగల్గితే చాలామంచిది'' ఇది పునర్దత్తుని సమాధానం.

బుద్ధిమంతులైన మన పెద్దలు "దిగితే కాని లోతు తెలియదంటారు. అలాగే ఈ నాగకన్యల సంపర్కం పొందితేనే తప్ప ఇచ్చటి జీవితం, దానిపై మమకారం. అందులోని ఆనందం... ఇవన్నీ నీకర్థం కావు. వీటినెలా అందించాలో తెల్సిన ఆ నాగకన్యలు, వాటిని నీకందిస్తారు. నిన్ను తమ బందీని, తాముగా కాక, నీవుగా అయ్యేటట్లు తీర్చిదిద్దుతారు. అప్పుడవి కష్టాలు కావు. ఆనంద సుఖాలు. అవి ఎక్కడా దొరకవు. కాబట్టి వీటికి చిక్కి, వాటికి (ఆ నాగకన్యలకు) చుట్టుకుపోతావు.

"అంటే..... మన పూర్వీకులైన మహాఋషులు వశిష్ట అరుంధతులు, అగస్త్య లోపాముద్రలు - ఒకరికొకరు సుఖసంతోషాల నొసగుకుని, ఉన్నత - ఉత్తమ స్థితి నందుకోలేదా ? అవన్ని మరచి, ఈ నాగులు, ఈ లోకం - దీనినుండి రాలేననడం, ఇదే అద్భుతము, ఆనందము, స్వర్గమనుకోవడం నిజంగా వెఱ్ఱితనం....!''

"నువ్వేమైనా అను కృష్ణా....! నాగకన్యలు మనకు కావలసినదివ్వగలరు. వారికి కావల్సింది పొందగలరు. కనుక....!'' నేనే కాదు, ఈ లోకంలో అడుగుపెట్టి సుఖాలు పొందిన వారెవ్వరు, తిరిగి తమ తమ లోకాలకు, ప్రాంతాలకు వెళ్ళలే''రని

నిక్కచ్చిగా యమరాజు చెప్పేసాడు.

"అలాగా, అయితే.... నేను మా గురువుగార్కి ఈ పునర్దత్తుని తీసుకు వస్తానని మాట ఇచ్చానే, మరి ఆ వాగ్దానం నీటి మూట చెయ్యాలా ?"

"ఏం చేస్తాం ? అన్ని సమయాలలో మనమే గెలవాలంటే కుదరదు."

"చూడు పితా! ఇచ్చినమాట ఈ కృష్ణుడెప్పుడు నిలబెట్టుకుంటాడు. ఇతడు వసుదేవుని కుమారుడు, వాసుదేవుడు..."

"అసంభవం, నీవే ఇక్కడనుండి కదలలేవు. ఇక నీ మిత్రుడు, ఆ గురు పుత్రుడు, మా పునర్దత్తుడిని తీసుకువెళ్ళడం మరీ అసంభవం."

"పోతే, ఓ పని చెయ్యకూడదు. ఇక్కడ నీవు దేవపితవు. కాబట్టి నా ప్రయత్న విజయానికి, సహకరించి ధన్యుడవకూడదూ ?" కృష్ణుడడిగాడు.

"కృష్ణా! అది అసంభవం. నా మాటవిను."

"యమరాజా! ధర్మం శాశ్వతం. అశాశ్వతం ఈ జీవితం. కాలగర్భంలో, మహా ప్రళయంలో ఆ విరాట్పురుషుడు, తప్ప మిగిలినవారందరు నశించాల్సిందే.

"కాబట్టి. సత్య - ధర్మాల ప్రాతిపదికన సాగే నీవు తప్పక నాకు సాయపడతావు. పరశురామ శిష్యుడు పారమార్థి, పరోపకార బుద్ధి కలవాడవుతాడే తప్ప అప్రయోజకుడు, స్వార్థపరుడు కాడు. ఆ విషయం అతనికే కాదు, ఈ విశ్వానికే తెలుసు" అని కృష్ణుడు మెల్లిగా చెప్పి ముగించాడు.

ఆ మర్నాడు పగలల్లా ఉద్ధవ, కృష్ణులు "వైవస్వతపుర" నగర శోభలను తిలకిస్తూ గడిపారు. తమ ఓడలోనుండి తెప్పించిన బహుమతులను కృష్ణుడు "యమ"రాజుకు, భావి దేవ యువరాణికి, యువరాణికి ఇచ్చాడు చిన్న దేవ యువరాణి, అసిక ఆ బహుమతులకు, అందుకుని, తను అభిమానించే కృష్ణుని నుండి పొందినందులకు ఎంతో మురిసిపోయింది.

సాయంకాలం కృష్ణుడు, ఉద్ధవునితో తాము ఇక్కడినుండి పారిపోయే పథకరచన, సాలోచనగా ప్రారంభించాడు. అంతకుముందు తన సాంగత్యం

కోసం తపించిన అసిక వున్నట్టుండి స్వభావ సిద్ధంగా పగపట్టిన త్రాచు అయింది. బుసలు కొడుతూ, అరవసాగింది. ఆమె బాధ అర్థంకాని కృష్ణునికి, తమ ఓడలోని, ఈ నాగభాష తెల్సిన కళాసీ ఒకడు ఆమె భావాన్ని విపులీకరించాడు. ఆమె కోపానికి కారణం... ఆమె తల్లి, రాజ్యాధికారిణి, దేవమాత ప్రవర్తనమని చెప్పాడు.

ఇంతకుముందు వరకు, అసికకు మిమ్ము కట్టబెట్టాలని చూసారు. ప్రస్తుతం, నీ మనసు తెలుసుకున్నట్లు, ఆ దేవమాత తన మనసును మార్చుకుని, క్రొత్త ఆజ్ఞలను జారి చేసింది. దాని ప్రకారం నువ్వు ప్రస్తుత యువరాణి లారిక, భర్తతో నీవు వీర స్వయంవరంలో పాల్గొని, విజయమొందితే లారికకు భర్తవవుతావు. లేదో, యమరాజుకు శాశ్వత అతిథివవుతావు. ఇది తెల్సిన అసిక కోపంతో బుసలు కొడుతుంది.

వాళ్ళ చిత్రమైన ఆలోచనలకు, పరస్పర విరుద్ధ ప్రవర్తమునకు కృష్ణుడు ఆశ్చర్యపోతున్న సమయంలో దేవమాత నుండి పిలుపు, ప్రక్కనే వున్న యమరాజు బుసకొట్టి అలిసి, సొలిసిన దేవమాత ఆజ్ఞను పైన తాను విన్న ప్రకారం అందించాడు. ప్రస్తుతం వాళ్ళు క్రూర దుష్ట - సుఖబుద్ధికి నిదర్శనంగా తాను, పునర్ధత్తునితో చావడమో, ఆతనిని చంపడమో చెయ్యాలి. అంతా విన్న కృష్ణుడు క్షమించాలి. మీ ఆలోచనను నేను అమలు చెయ్యలేను. అది నా బుద్ధికి విరుద్ధమన్నాడు.

"తప్పదు. ఇది ఈ దేవమాత కాదు. ఆ జగన్మాత ఆజ్ఞ. దీనిని కాదని ధిక్కరించడమెవ్వరికి సాధ్యం కాదు" చెప్పాడు యముడు. నవ్వాడు కృష్ణుడు.

"నవ్వకు. నువ్వు వీరస్వయంవరాన్ని కాదని, ఆ జగన్మాత ఆజ్ఞను ధిక్కరిస్తే, నేను నిన్ను చంపాల్సి వుంటుంది. దయచేసి నా మాట విను. ఆ పరిస్థితినే మాత్రం ఆహ్వానించకు." బ్రతిమాలుతున్నట్లు చెప్పాడా దేవపిత, మళ్ళీ ఆయనే... "ఎల్లుండి, ఆ వీరస్వయంవర కార్యక్రమం సిద్ధంగా వుండు" చెప్పాడు.

"చూద్దాం!" మని వాళ్ళకు నమస్కారం చేసి కృష్ణుడు తన బసకు వచ్చాడు. అప్పటికి పునర్ధత్తుడు కూడ అక్కడికి వచ్చాడు. తన భయాన్ని, వచ్చిన ప్రమాదాన్ని మళ్ళీ వెళ్ళగ్రక్కి, "కృష్ణా! నీవు అసామాన్యుడవని, ఉద్ధవుడు చెప్పాడు. కాళీయ, చాణూర మర్దనం, కువలయపీడనం, కంసవధ.... ఒక్కటేమిటి... ఎన్నో చెప్పాడు అన్నీ విన్నాను. నీ ముందు నేను అల్పుడను. వాళ్ళకన్నా చాలా బలహీనుడను"

ప్రాణభీతితో వణుకుతున్నాడు. రక్షించ వేడుకుంటున్నాడు.

"ఈ పరిస్థితి గడవడమెలాగ ?" ఇది కృష్ణుని ఆలోచన, ఇటువంటి సమయంలో, యమరాజు నుండి మళ్ళీ పిలుపు వచ్చింది. ఆ ఆదేశాన్ని కృష్ణుడు పాటించాడు.

వచ్చిన వ్యక్తిని ప్రేమగా చూస్తూ "కృష్ణా! కష్టాల నుండి అధిగమించడం నీకు తెలుసోమో కాని, ఇక్కడ సాధ్యం కాదు. ఈ లోకం, ఇక్కడి ఆచార వ్యవహారాలు మీ లోకానికి భిన్నమైనవి. మాకు మాకే స్వంతమైనవి. అసలు విషయం నువ్వంటే అసికకు, మా చిన్న యువరాణికి ప్రాణం, ఎంతో ఇష్టం. ఇప్పుడా పరిస్థితి దుర్విధిగా మారిపోయింది. కనుక నా మాట విని.... బ్రతిమాలుతున్నాడు.

"కాదంటే.....!" ఇది కృష్ణుని ప్రశ్న.

"చెప్పానుగా ? నిన్ను, నిన్నెదుర్కొనని, ఆ యువరాజును చంపడం కాదనలేని, ధిక్కరించలేని నా బాధ్యత.

"అప్పుడు, నీ ఇద్దరి కూతుళ్ళు.... ఆ వచ్చే పిచ్చి భర్తల కోసం ఎదురు.... అలాగ, చూస్తూ... చూస్తూ... జీవితం గడపాలి కదా?!" కృష్ణుని ప్రశ్నకు, యువరాజు నుండి సమాధానం లేదు. అప్పుడు కృష్ణుడే -

"యువరాజా! నేను మృత్యుదేవత నంటావు. మృత్యువు అతన్ని సమీపించకపోతే, ఏ దేవతైనా వ్యర్థుడే కదా! సమయమొస్తేనే, నీ ప్రతాపం ప్రకటిత మౌతుంది. కాదంటే, అవతలివారి విజయానికి జోహార్లర్పించాల్సి వుంటుంది. అవునా, పరశురామ శిష్యా!" కొంటెతనం లేని, ఆలోచనను రేపే ప్రశ్నార్థ పూర్వక సమాధానమిచ్చి, ఆగాడు.

వెంటనే సమాధానమివ్వని యమరాజు, క్షణకాలమాగి, "కృష్ణా! నాదొక ప్రార్థన. ప్రస్తుతం ఆ పిచ్చిది నా చిన్నకూతురు, నిన్ను మరువలేక మరణానికి కూడా సిద్ధపడుతుంది. ముందు నువ్వామెను ఓదార్చు. అప్పుడు నీ ధర్మ రక్షణానికి, వీలయితే, నా చాతనైన విధంగా సాయపడ ప్రయత్నిస్తాను-" అన్నాడు, మళ్ళీ తనతో తానుగా "కృష్ణా.... ప్రాణహాని కన్న రక్షణం ముఖ్యము,

ఆపద్ధర్మమన్నది - మా గురుదేవుల ఉవాచ. ముందు నాకో వుపకారం చెయ్యి. ఆ తర్వాత నేను....." తలవంచుకుని అడుగుతున్నాడు.

తలూపిన కృష్ణుని, యమరాజు నమ్మకస్తుడైన అనుచరుడు, అసిక వద్దకు తీసుకువెళ్ళాడు. తెలియని అపరిచిత కృష్ణుని చూడగానే అనురాగం పెంచుకున్న ఆ అమాయకురాల్ని వూరడించడానికి శతవిధాలా ప్రయత్నించాడు. మరణ మొక్కటే శరణము కాదని, ఎవరో తెలియని వ్యక్తి, ఏదో పనిమీద మీ లోకానికి వస్తే అతనిపై మరులు కొనడం, పెళ్ళి చేసుకోమని నిరోధించడం తగదు.

"మరో విషయం. ఎల్లుండి నేను మీ ఆదేశాలను ధిక్కరిస్తున్నాను. అప్పుడు, నీ తల్లి ఆదేశమంటూ నీ తండ్రి నన్ను సంహరిస్తే -

"నేను చస్తాను. అనగా, నీతోడిదే నా జీవితమందామె."

"ఇదే మూర్ఖత్వం. మీ ఆచార విరుద్ధం. నీ తల్లి ఒప్పని, మీ లోకం హర్షించని విధి విధానం. నా మాటవిని, నీ మూర్ఖత్వం వీడు. కాదంటే నీ కర్మమనిబయలుదేరాడు.

అలా వెళ్తున్న వాడు, వెనుదిరిగి "అవును. నువ్వు నాతో వచ్చేస్తావా ?" చురుకుగా చూస్తూ కృష్ణుడడిగాడు. ఆ చిలిపి చూపులకు చిక్కుకున్నట్లు, బిక్కు బిక్కుమని చూసే అసిక "తప్పకుండా వస్తాను. ఈ లోకం, ఈ ఆచారాలు, సాంప్రదాయంతో విసిగిపోయాను. నువ్వెక్కడికి రమ్మంటే అక్కడికి, ఎక్కడికి తీసుకువెడితే అక్కడికి.... సంతోషంగా వస్తానని చెప్పిందామె. సరేనని" కృష్ణుడు బయలుదేరాడు.

# స్వయంవరం

**అ**నుకున్న ఎల్లుండి వచ్చేసింది. ఆనాడే వీరస్వయంవరం. ఊరంతా ఆ మహోత్సవాన్ని చూడటానికి, ఎంతో ఆసక్తితో, నదీ తీరంలోని మెట్లమీద కూర్చున్నారు. చుట్టూ ఆయుధపాణులైన అంగరక్షకులు, గోదాలో ఒక ప్రక్కగా కృష్ణుని ప్రస్తుత పరిజనం. పుణ్యాజన పరివారం. అంతా వీర స్వయంవరానికి సిద్ధంగా వున్న తరుణంలో దేవమాత, ఆమెతోపాటు రాజు వచ్చారు. అలాగే యువరాణులు. వారిని చూస్తూనే

గుమికూడిన జనం హర్షధ్వానాలతో స్వాగతం పలికారు.

కార్యక్రమం ప్రారంభ సూచకంగా వాయిద్యాల ఘోష మొదలైంది. అందరిలో ఉత్సాహం. విజేతను తమ యువరాజును చూడాలనే ఉత్కంఠ. బలి పశువుల్లాగ పునర్ధత్త, కృష్ణులు అక్కడికి వచ్చారు. ఒకరు తెలుసు. మరొకరు తెలియదు. అయినా వాళ్ళు అసక్తిగా చూస్తున్నారు.

ఇద్దరు గోదాలో అడుగుపెట్టారు. పునర్ధత్తుడు కృష్ణుని చూస్తూ "నా వల్ల ఏమైనా తప్పిదం జరిగితే నన్ను క్షమించు" అర్థించాడు.

"యువరాజా! నీ శక్తి మేర నువ్వు పోరు. నా యుక్తితో నన్ను నేను రక్షించుకుంటాను. అక్కడ నీకై ఎదురుచూసే నీ తండ్రికి, నిన్ను గురుదక్షిణగా సమర్పిస్తానన్న - నా మాటను నేను నిలబెట్టుకుంటాను. కనుక నీ శాయశక్తులా నువ్వు పోరి నిన్ను నీవు రక్షించుకో!"

"ప్రారంభించండి." అది దేవమాత ఆజ్ఞ. వాయిద్యాలు మ్రోగుతున్నాయి. కత్తులందుకున్నారు. అయినా పునర్ధత్తుడు కృష్ణుని పైకి కత్తి ఎత్తలేకపోతున్నాడు. పరిస్థితిని గమనించిన కృష్ణుడు "మూర్ఖంగా ప్రవర్తించకు. నిన్ను నువ్వు రక్షించుకో. నా సంగతి నేను చూసుకుంటాను" అని తానే కత్తి దూసాడు. అప్పుడు విధిలేక తానూ కత్తి దూసాడు. ఇక ఇప్పుడు ఆపద్ధర్మం. తనను తాను రక్షించుకోవాలి. వీరత్వం కన్నా ప్రాణరక్షణ ముఖ్యం. శూరుడు కాకపోయినా, శూర వంశీయునికి చిక్కకుండా వుండాలని నిశ్చయించుకున్నాడు. ప్రతిఘటిస్తున్నాడు.

నిజానికి కృష్ణునికి, పునర్ధత్తుడు ఒక చీమలాంటి వాడు. అయినా, అతనికి ప్రాముఖ్యతనిస్తూ, తాను తెలివిగా తప్పించుకుంటూ, ఈ శూరవంశీయుడు, ఆతనిని శూరుని చేసి కత్తి యుద్ధంలో నైపుణ్యాన్ని ప్రదర్శింప చేస్తున్నాడు. ఎంతో ఉత్సాహంగా ఎదుటివారి విజయాన్ని ప్రత్యర్థి రక్తాన్ని చూడగోరిన వైవస్వతపుర వాసులు ఓర్మి నశించి నిరాశలో కృంగిపోతున్నట్లు కనిపించారు.

అది యుద్ధంలా కాక ఆటలాగ వుంది. ఇలాగ ఎన్ని దినాలు గడిచినా విజేతను తేల్చడం కష్టం. ఆసక్తిగా చూసే దేవమాత, యువరాణులు లారిక - ఆసికలు - ఆశ్చర్యపోతున్నారు. వాళ్ళు ఆశ్చర్యం పెరుగుతున్నట్లు యువరాజు

కత్తి గాలిలో తేలింది. దానిని పట్టేటట్లు కృష్ణుని కత్తి గాలిలో కలిసింది. ఇక కత్తి యుద్ధంలో లాభం లేదనుకుంటున్న తరుణంలో -

తెలియకుండానే ఒకరికొకరు, ఇరువురు ఢీకొన్నారు. ఇప్పుడు బాహా బాహీ, బాహుయుద్ధం. ఇది ఇంకా రసవత్తరంగా తయారయింది. ఇద్దరు సమాన వయస్కులు. శరీరాలు. ఇంకేముంది ? ఎదుటివారికి ఆసక్తిని, ఆశ్చర్యాన్ని పెంచడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు, కంస, కాళియ మర్దనుడు - చూపరులకు ఆనందం కల్గిస్తున్నాడు. పునర్ధత్తుడి ఆశ్చర్యానికి అవధులు లేవు. దొరుకుతున్నట్లు దొరికి, చావు దెబ్బతీయకుండా తనకు లొంగకుండా, తాను బాధపడకుండా, తనను బాధ పెట్టకుండా సలిపే ఆ బాహా బాహీ యుద్ధానికి ఆశ్చర్యపోతూనే కృష్ణుని ఢీకొంటున్నాడు.

అంతా చూస్తున్న దేవమాత కన్న, యమరాజు వారి సిద్ధాంతానికి, ధర్మ నిరతికి జోహార్లర్పిస్తూ లేచాడు. ఇక సూర్యాస్తమయమయే సమయమైంది. కానీ ఫలితం తేలటం లేదు. దాంతో -

పరిస్థితినర్థం చేసుకున్న దేవమాత ఫలితం రాకపోయేసరికి "వూ" అంది. ఆమె ఆదేశాన్ని పాలించే దేవపిత, రాజుగా ముందడుగు వేసాడు. అతని చేతిలో కత్తి తళతళ మెరుస్తూ, రక్తం కోసం వెదుక్కుంటుంది. యమరాజు గోదాలోకి వెళ్ళాడు. అతని చేతిలోని తళతళలాడే కత్తి, గోదాలో ఒకరితో మరొకరు పోరుతున్న పునర్ధత్త, కృష్ణుల కుత్తుకల నుత్తరించ సిద్ధపడుతుంది.

అటువంటి సమయంలో నాగరాణి అసిక, కృష్ణ - పునర్ధత్తుల మధ్య తండ్రికి దూరంగా నిల్చుంది. అదెంతటి ఘోరఅపరాధమో అందరికి తెలుసు. అయినా ప్రాణాలకు తెగించి, అమాయకులనిద్దర్ని, వాళ్ళ క్రూర, పాశవిక, ఆటవిక ప్రయత్నం నుండి రక్షించడానికి సిద్ధపడింది. ఆ హఠాత్సంఘటనకు ప్రేక్షకులందరు ఆశ్చర్యపోయారు. రాజపరివారం హడిలిపోయింది.

ఇదే సమయంలో, పునర్ధత్తుని చేతిలోని కత్తి జారిపోయింది. అతన్ని బంధించమని కృష్ణుడు ఆదేశించాడు. నిరాయుధుడు, నిరాసక్తుడైన పునర్ధత్తుడు,

తలవంచుకుని నిల్చున్నాడు. ఇదే అదనుగా రాజును చేత చిక్కించుకున్నాడు. తీసుకువెళ్ళు, అది కృష్ణుని ఆదేశం. పునర్దత్త, యమరాజులు, చిన్న తొట్టె పడవలోకి ఎక్కించబడ్డారు. తొట్టె పడవలోనున్న పుణ్యాజన నౌకా సిబ్బంది వీరిని తమ అధీనంలోకి తీసుకున్నారు.

చిత్తరువుల వలె చూస్తున్న ప్రేక్షకులలో అలజడి. రాజును రక్షించుకోవాలనే తపనతో సిబ్బంది ఎదురు తిరుగుతూ, తమ అతిథి కృష్ణుని తుదముట్టించాలని విరుచుకుపడబోతే రాజు "అవసరం లేదు. నా సంగతి నేను చూసుకుంటాను." అన్నాడు. అయితే పునర్దత్త, అశికలు తొట్టె పడవ లోకి పరుగెత్తారు. రాజు ప్రతిఘటించడంతో కృష్ణుడు తన చేతిలోని కత్తిని విసిరేసాడు. యమధర్మరాజా! నీ ధర్మం నన్ను సంహరించడమే అయితే, ఓ భార్గవరామ శిష్యా, నేను సిద్ధంగా వున్నాను. నన్ను నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చును. కానీ ఒక విషయం. నీవు మృత్యుదేవతవు. అది మమ్ము, ఆయువు తీరకుండా అందుకోలేదు. ఎవ్వరినీ సంహరించలేదు. అది తెలుసుకుని మరీ నీ ప్రయత్నాన్ని విరమించు. ఇప్పటికైనా నీవు దీన్ని ధర్మరాజ్యంగా నడిపించు. పాశవిక, అటవిక ప్రవృత్తి నుండి లోకాన్ని రక్షించుకో."

కృష్ణుని ఈటెలవంటి హెచ్చరికల మాటలతో యమరాజు చేతిలోని కత్తి జారిపోయింది. స్థాణువయి పోయాడు. తను వచ్చిన పని పూర్తయినట్లు కృష్ణుడు తొట్టె పడవలోకి దుమికాడు. అది కదలుతుంది. ప్రజలు వుగ్రులై, జరిగిన పరిణామం దారుణంగా తలుస్తూ రెచ్చిపోతున్నారు. కదలలేని అశక్తతతో, కర్తవ్యం బోధించిన కృష్ణుని హెచ్చరికలతో, ఎటూ కదలలేనట్లు నీళ్ళలో నిలబడిపోయాడు.

తొట్టెపడవ, పుణ్యాజన నౌకా సిబ్బంది సంరక్షణలో ముందుకు సాగుతూంటే, కొందరు రాజభక్త రక్షణ సిబ్బంది నీళ్ళలో దూకి, ఆ తొట్టెపడవను అందలి వ్యక్తులను అదుపులోకి తీసుకుందామని ఆత్రంగా వెళ్ళి, అచేతనుడైన మృత్యుదేవత చేతికి చిక్కారు. ఈ హడావుడిలాగ వుంటే....

దేవమాతను, జగన్మాత ఆవహించడంతో, ఆమె రాజును చేరింది. ఆమె అడుగుల సవ్వడి కనుగుణంగా, వీరణాలు మొ॥గు వాయిద్యాలు ఘోష మిన్ను ముట్టుతున్నాయి. కృష్ణాదులు పుణ్యా, జన నౌకను చేరారు. వచ్చిన దేవమాతను అసిక చూస్తుంటే "అమ్మా! వచ్చేయ్. ఇది జగన్మాత ఆజ్ఞ. వచ్చేయ్!" ఆ మాటలకు

మంత్రముగ్ధయిన అసిక నీటిలోకి దూకింది. నాగస్వరం విన్న నాగిని వలె త్వరత్వరగా సముద్రమిాది, తల్లిని చేరింది. అది కలకాదు, కథకాదు. సహజమైన జాతి లక్షణం - ఆ జాతి జీవిత ధర్మంగా కృష్ణుడు తలిచాడు. పునర్ధత్తుడు ఇంకా భయం వీడక మౌనమూర్తిగానే వుండిపోయాడు.

# జరాసంధుని ఆగ్రహం

**జ**రిగింది తెలుసుకున్న జరాసంధుడు కోపంతో, మండిపోయాడు. తన వాళ్ళను, అల్లుడిని అంతదారుణంగా, అమానుషంగా - బంధుత్వాన్ని కూడా మరచి జరిపిన మారణకాండకు, యాదవుల తెగువుకు ఎద మండిపోతూంటే, ప్రతీకారానికై ఆతని మనసు పరుగులు దీయసాగింది.

"కంస వధ'' మగధ సామ్రాజ్యంపై దండయాత్రగా తలిచాడు. ఉగ్రసేనునికి తిరిగి పట్టాభిషేకం, బుడతడనుకునే కృష్ణుని వీర విజృంభణం, జరాసంధుని ఒక ప్రక్క కృంగదీస్తూనే, మరొక ప్రక్క రెచ్చగొట్టసాగింది. అల్లుని మరణం, కుమార్తెలకు కల్గిన వైధవ్యం అమిత శోకాన్ని కలుగచేసింది.

విదర్భరాజ కుమారుడైన రుక్మి స్వయంగా గిరివ్రజపురానికి వచ్చాడు. మధురలో జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు వివరించి చెప్పాడు. సంవత్సరీకాలు పూర్తయ్యాక, విధవలైన జరాసంధసుతలు, తండ్రిని చేరారు. తమ అక్కసుకొద్ది- "పనికిరాని ప్రతాపంతో ప్రతాపవంతునిగా విఱ్ఱవీగుతున్నావే తప్ప, నా భర్తను మధుర సామ్రాజ్యాధిపతిని సంరక్షించలేని, ఓ మగధ చక్రవర్తీ! ఎందుకు నీ పౌరుషం, ఏడ్వనా నీ ప్రతాప ?'' మంటే, కూతుళ్ళను ఓదార్చలేని ఆ తండ్రి, ఓడిపోయినట్లు తలదించుకున్నాడు.

కానీ భగభగ మండే మంటలతో, పౌరుషాగ్ని ప్రజ్వరిల్లుతుంటే, "నేను నమ్ముకున్న ధర్మం, దానికి ప్రతిరూపమైన ఆ దైవం సాక్షిగా చెబుతున్నాను ఆ కంసారిని తుదముట్టించే వరకు విశ్రమించను. పౌరుషాగ్నిని ఆర్పుకోనని'' ప్రతిజ్ఞ చేసాడు. తండ్రి చేసే ఆ కఠోర ప్రతిజ్ఞకై ఎదురుచూసే కంస సుతలు, "అస్తి, ప్రాప్తి''.

తాత్కాలికంగా ఆ క్షణానికి సంబరపడ్డారు. తండ్రి ఓదార్పుతో ఒకింత ఊపిరి పీల్చుకున్నారు. ఆశావహమైన భవిష్యత్తుకై ఆ కంస భార్యలు ఎదురుచూస్తున్నారు.

అంతే! పరాక్రమానికి మరోపేరుగా జరాసంధుడు - ఛేది దేశాధీశునకు, విదర్భ రాజకమారునకు, అవంతీ యువరాజులు "విందాను, విందులకు త్రిగర్తాధీశుడు, సాల్వునకు.... ఒక్కరేవిటి తన అభిమానులు, సహచరులకు, సామంతులకు సందేశాలు పంపించాడు. మధుర ముట్టడిలో వసుదేవుని కుమారుల వధకు సర్వవిధాల సహకరించమని కోరాడు.

సందేశాలందుకున్నవారు సన్నద్ధులయ్యారు. వర్షాకాలం ముగిసింది. పులకరించే ప్రకృతి, స్వాదుజలాలు, మధుర ఫలాలు, ఆహ్లాదకర అనువైన వాతావరణం, యుద్ధానికి వీలయిన సమయంగా భావించి, అందరు, మగధ చక్రవర్తికి "సై" దోడుగా, తోడుగా, తమ తమ సైన్యాలతో ముందడుగు వేసారు. కదం త్రొక్కుతూ కదిలారు.

జరాసంధుని కదలికలు యాదవ ప్రముఖుల కందాయి. బలరామకృష్ణుల శిరస్సులు కోరడానికి వస్తున్న అతని దుందుడుకుతనానికి, అంతకుమించిన వీరత్వానికి కూడా యాదవ ప్రముఖులు కళవళపడుతున్నారు. బలరాముడు గురుదేవుల ఆశ్రమం నుండి వచ్చేసాడు. ఆ తదుపరి గురుపుత్రుని విషయంలో తన ప్రతిజ్ఞ చెల్లించుకుని కృష్ణుడు మధురకు వచ్చాడు.

కృష్ణుని రాక, మధురానగరికి మహదానందదాయకమైంది. అసలే కృష్ణలీలల్ని కథలు -కథలుగా, గాథలుగా చెప్పుకునే నగర ప్రజలు, కష్ణుడు, ఆచార్య సాందీపులవారి పుత్రుని, తాను ప్రతిజ్ఞ చేసిన ప్రకారం యముని ధిక్కరించి, యమపురి నుండి తీసుకువచ్చి గురుదేవులకు "దక్షిణ"గా అంకిత మివ్వడం, మరో లీలా విశేషమైంది. యావత్ర్పజానీకం ప్రస్తుతమాలీలతో, గతాన్ని కూడా తల్చుకుంటూ, శ్రవణ-మననాల "సంస్మరణం" గావించుకుంటు మురిసిపోతుంది.

మధురాధిపతి ఉగ్రసేనుడు, ఇతర యాదవ ప్రముఖుల ఆనందానికి అంతు లేకుండా పోయింది. మధురాధిపతి స్వయంగా "చిన్నవాడైనా, చెప్పుకోదగ్గ ప్రజ్ఞావంతుడు. నిజమైన శూరుడైన, ఆ శూర వంశీయునికి" సాదర స్వాగత మొసగాడు.

ఇక - ఈ విషయాలన్నీ వింటున్న మగధవీరులకు ముఖ్యంగా, ఆ దేశాధిపతి జరాసంధునికి వూపిరాడటం లేదు. దిక్కు తోచడం లేదు. ఎవరిపైన పరాక్రమించాలి. ఉగ్రసేనుడు - ఆతడు తన అల్లుని తండ్రి, వియ్యంకుడు. ఆయన పైనా ? అక్రూరుడు.... అతడో సాధుమూర్తి. అతనిపై దురాక్రమణం - లోకం హర్షించదు. ముఖ్యంగా మధురవాసులు తప్పక ఎదురు తిరుగుతారు.

"వసుదేవుడు. అతడు సన్మార్గుడు. ప్రభువు కాని, అధికారం లేని, అందరికి యోగ్యమైన పెద్దమనిషి. ఎటొచ్చి, "బలరామకృష్ణుల" తండ్రిగా ఆతనిపై విజృంభించాలి. అందుకు, అసలే వీరులైన ఆ శూర వంశీయ శూరులు - బలరామ- కృష్ణులు వూరుకుంటారా ? అంధ వంశీయుడైన వృద్ధ బాహుకుడు మరణించాడు. అతని వంశీయుడైన ప్రద్యోతుడు. అతను జరిగిన అవమానాలకు సమాధానం చెప్పాలని తలంచే సాహసి.

ఇక యాదవ ప్రముఖులు. కంసుని దురాగతాలకు, ఆతని చేష్టలకు భయపడో, భంగపడో, నగరి వదిలి వెళ్ళినవారు, కృష్ణ అభయంతో సామ్రాజ్య మొందిన ఉగ్రసేన హితులుగా, సన్నిహితులుగా తిరిగి వచ్చారు. సమయమొస్తే తగు సమాధానమివ్వడానికి, సిద్ధంగా వున్నారు. అందరిలోకి సర్వసమర్థుడైన కృష్ణుడు పెద్దరికాన్ని, నాయకత్వాన్ని స్వీకరించకుండా, అన్నగారి అడుగు జాడలలో... అంటూ కృష్ణయ్య... వెనుకనుంటానంటూ ప్రక్కనున్నాడు.

అటువంటి సమయంలో మగధ చక్రవర్తి, దండయాత్రను వేగుల ద్వారా విన్న ఉగ్రసేనుడు, తన మంత్రి సామంతులతో, అందర్ని సమావేశపరిచాడు. విషయం వివరించి, వారి సలహా, సహాయ సహకారాల కోసం ఆగాడు. ఈ సమావేశంలో మహారాజు ఉగ్రసేనునికి ఒక ప్రక్కన కృష్ణుడు, మరొక ప్రక్క బలరామ - ఉద్ధవులు, కులగురువులు గర్గాచార్యులవారు కూర్చుని వున్నారు. జరాసంధుని ఎదిరించడం - అసాధ్యమన్న పద్ధతిలో కొందరి వాదన. అతి బలవంతుడైన మగధ చక్రవర్తి కవచంలాగ - మనకు - కంసరాజు సంరక్షణలో వుండటంతో, మన రాజ్య రక్షణ, కోసం బలగాలు.... ఇతర శ్రేణులపై అశ్రద్ధ చేయబడింది. ఇప్పుడు..." వికద్రుడు చెబుతున్నాడు.

ఉగ్రసేనుడు, పరిస్థితిని సమీక్షించాడు. అక్రూరుడు, తనకు తోచినది

చెప్పాడు. ఆయుధాలు పొందగల్గుతాము కానీ ఆయుధపాణులు దొరకరు! ఒకప్పుడు, కంసరాజుకు భయపడి, తలదించుకుని పరువు గాపాడుకున్న యాదవులలో కొందరు, కంస భయం తీరడంతో, బురదపాములు బుసకొడు తున్నట్లయింది. కాబట్టి వారి స్వతంత్రత, మనకు సహాయ నిరాకరణమౌతుంది. ఛేది, భోజకులు ఆయుధాలనిస్తారు. అదీ రహస్యంగా, భీష్మలు విషయం విన్నారు తప్ప, సహాయం ప్రకటించలేదు.

ధృతరాష్ట్రుడు, తానుగా ఏమి చెయ్యలేడు కాబట్టి అస్వతంత్రుని క్రింద లెక్క. దుర్యోధనుడు, తన దాయాది వర్గ శతృత్వంలో, మనకు సహాయమంటే మండిపడతాడు. ఆ దాయాదులు, పాండవులు, బలపడటం, ఆ దుర్యోధనునికి నచ్చదు.'' ఇవి అక్రూరుని మాటలు, ఇవి ఛేదిస్తూ -

ప్రస్తుతం మనకున్న ఆశ, ఆలంబనం "కృష్ణుడు'' అన్నాడు వసుదేవుడు. నిజమన్నాడు మహారాజు. అప్పుడు కృష్ణుడు - "మహారాజా! ఆశ, ఆశయం మంచిదే. కాని రాత్రికి రాత్రి ఏ మాయలు మంత్రాలు చెయ్యలేము. ఎవర్నీ ఏమార్చలేము. ప్రజాస్పందన తెలుసుకోగల్గుతాము. మనమే కావాలనే ఆత్మార్పణ పరులను దగ్గరకి తీసుకుని, ఆ ధైర్యంతో ముందుకు వెడతాము. కానీ...

"చెప్పు కృష్ణా!''. అవి ఎంతో సహజంగా వుండటంతో, ఎంతో ఆతురతతో ఇటు మహారాజు అటు తండ్రి వసుదేవుడు కూడా అతన్ని అడిగారు. సమాధానంగా మీరందరు "ఇప్పుడో విషయం తెలుసుకోవాలి. లేదా తేల్చుకోవాలి.

"ఏవిటది ?'' మళ్ళీ అందరిలో ఆతృత, ఆందోళన.

"ఏమీలేదు. ఇప్పుడున్న పరిస్థితులలో ఎవరు జరాసంధుని ఎదిరించలేరు. అది సత్యం. ఆ జరాసంధునికి కావల్సింది, మధుర సామ్రాజ్యం కాదు. బలరామ-కృష్ణుల తలలు. విషయం తెలిసిన మనం వివేకంగా ప్రవర్తిస్తే, ఈ ఉపద్రవం తప్పుతుంది. మేమిక్కడ వుంటే - ఈ మధురకు, అధిపతికి, ప్రజలకు ప్రమాదం. మేము తప్పుకుంటే మాగధుడు మాకోసం, మిమ్మల్ని విడిచిపెడతాడు. కాబట్టి.....

"కాబట్టి....!'' విషయమర్థమవక, అర్థోక్తిలో వసుదేవుడు ఆగిపోయాడు. అక్రూరుడు, అందుకుని "ఎక్కడికి వెడతారు ? సహ్యాద్రి వరకు విస్తరించిన

రాజ్యం, సామంతులు, ఇతర అభిమానులతో, ఎక్కడికి వెళ్ళినా, ఆ మగధ రాజ్యాధిపతి మిమ్మల్ని విడిచి పెడతాడా ?'' ప్రశ్నలో ప్రశ్న. ఆందోళనా సమస్య.

"కాలం, కర్మం... సహకరించకపోతే, ఎవరు ఎవర్ని ఏమీ చెయ్యలేరు. అనవసరంగా ఆందోళనపడకండి." అన్న కృష్ణుడు, వికద్రుని చూసి, "నీకు తెలిసి, మాకు సురక్షితంగా, మీకు అపకారం జరుగకుండా వుండే ప్రదేశముంటే తెలుపు!" అడిగాడు. క్షణమాలోచించిన అతను -

"నాకు తెలిసి'' కరవీరపురముంది. మన పూర్వీకులు మాధవుల వారికి, సవతి సోదరుడైన పద్మవర్మ దానిని కనుగొని, తమ రాజ్యపాలనం కొనసాగించారు. ఇప్పుడు శ్రీ గాలవ్యుడు దానికధిపతి. ఆతడు తప్పక మిమ్ము సాదరంగా ఆహ్వానిస్తాడు. ప్రస్తుతానికిదే మీకు, అదే మనకు... సురక్షితమైనది'' చెప్పాడు.

"అది సరే... ఆ శ్రీ గాలవ్యుడు మనకెలా బంధువు ?'' తనకు తెలియని ఆ బాంధవ్య వివరాలను ఆసక్తిగా అడిగాడు. ఆ వెంటనే వసుదేవుడు స్పందిస్తూ చెప్పు వికద్రా! మన యాదవ సామ్రాజ్యం విస్తరణ, యుద్ధవీరుల వీరపరాక్రమములు, వివరించి చెప్పడం మంచిదన్నాడు. వికద్రుడు అందుకున్నాడు. బలరామ కృష్ణులతోపాటు అక్కడున్నవారు కూడా, ఈ యాదవో పాఖ్యానాన్ని వింటున్నారు.

యదువంశ ప్రముఖుడైన యయాతి వంశీకుడైన హర్యశ్వుడు, "మధు"వన రాక్షసుని కుమార్తె మధుమతిని వివాహం చేసుకున్నాడు. అందుకు బహుమతిగా మామగారు "మధువు'' అల్లునికి "అనర్తా, సౌరాష్ట్ర'' దేశాలను బహుమతిగా ఇచ్చాడు. ఆ తర్వాత హర్యాశ్వుడు "గిరినగరా''న్ని ఏర్పాటు చేసుకున్నాడు.

నాగరాజు - ధూమ్రకర్ణుని అయిదుగురు యువరాణులను వివాహం చేసుకున్నాతనికి అయిదుగురు పిల్లలు కలిగారు.

వారు - ముచికుందుడు, పద్మవర్మ, సారస, హరిత, మాధవులు. ఈ మాధవుడే మీ పూర్వీకుడు. ఇతనికి సత్యవంతుడు, ఆతనికి భీముడు ఇలాగ ఆ వంశం వృద్ధి చెందింది.

ఆ తదుపరి మధువన ప్రాంతాన్ని శతృఘ్నుడు నాశనం చేసాడు. ఇతడు మానవజన్మ సాఫల్యతను లోకానికి విశదం చేసిన, సూర్యవంశీయుడు, వశిష్ఠ శిష్యుడైన శ్రీ దశరథ మహారాజుకు పుత్రకామేష్టిలో జన్మించిన - శ్రీరామచంద్రుని

సోదరుడు. ఆ తర్వాతి కాలంలో శతృఘ్నుడు ఈ మధురను పాలించగా, కాలక్రమేణా జరిగిన పరిణామంలో యాదవ ప్రముఖుడైన భీముడు శతృఘ్నుని వంశీయుల నుండి మధురను సంపాదించుకున్నాడు. అప్పటినుండి ఇది యాదవ సంస్థానమయిందని, వారి వంశ చరిత్రను సంక్షిప్తంగా చెప్పాడు.

అయితే, భీముడు, అంథకుడిని, అతను రేవతుడిని, సంతానంగా పొందారు. ఈ రేవతుని పేరున రైవతక మేర్పడింది. ఇతనికి రిక్షకుడు ఆతనికి విశ్వగర్భుడు, ఆ వరుసలో భభ్రుడు, వసుదేవ, అక్రూరులు జన్మించారు అంటూనే వికద్రుడు - వాసుదేవా, నీవు యదుప్రముఖుడివి. ఉన్నత వంశస్థుడవు, సౌరాష్ట్రలోని అనర్తులోని వింధ్య ప్రాంతం, సహ్యాద్రిలోను నీ వంశీయులున్నారు.

మరొక విషయం. నీ మేనత్త పృథ కుమారులు భరత వంశీయులు. మరో మేనత్త శృతశ్రవ ఛేది మహారాణి. విదర్భ రాజవంశీయులు భోజులు కూడా యదు ప్రముఖులే. వారందరి మధ్య దేదీప్యమానంగా వెలిగే పరమ పురుషుడివి నువ్వు. అంతా వింటున్న వసుదేవుడు - వున్నట్టుండి -

"అదికాదు, జరాసంధుడు వెంటాడి వేధించి, వధించినా, శ్రీగాలవ్యుడు కాదని విరోధించినా, ఏం జరుగుతుందో, అదెంత...!'' మాటలలోనే భయపడుతున్నాడు.

"తండ్రీ! నీ వూహ, "వూహే.'' మాకేమీ కాదు. ధర్మ సంరక్షకులం, ధర్మాత్ములం. ధర్మం తప్పక మమ్మల్ని రక్షిస్తుంది అన్నాడు. అప్పుడే గర్గాచార్యులవారు ? "అవును - వాసుదేవా! ప్రస్తుతం ఆ ధర్మం మహర్షి జమదగ్ని కుమారుడు భార్గవరాముని రూపంలో ప్రకాశిస్తుంది. వారిని నేను ప్రార్థిస్తాను. వారు తప్పక మన బలరామ - కృష్ణులను సంరక్షిస్తారన్నాడు. వెంటనే బలరాముడు అస్త్రసన్యాసం చేసి ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే ఆ భార్గవుడు, మా రక్షణమెలాగ చేస్తారు ? అనగా - గర్గులవారు.

"బలరామా! వారు తపస్సంపన్నులు. వారికి ఆయుధాలు నిమిత్తమాత్రాలు. సంకల్పబలంతో సర్వసంహారం చేయగల సమర్థ తపోమూర్తులు భార్గవులన్నాడు.

అంతా విన్న కృష్ణుడు, "ఇక పదిమాటలనవసరం. తెలతెలవారేలోగా, మనం

బయలుదేరాలి. తీర్మానం చేసినట్లు చెప్పాడు.

""""""

# పునరావాసం

**ఒ**క నిశ్చయానికి, నిర్ణయానికొచ్చిన కృష్ణుడు తల్లి దేవకిని సమీపించాడు. ఆమె శెలవు కోరి నిల్చోగా "కృష్ణా! నేను విన్నది నిజమా ? మళ్ళీ మాకు ఎడబాటా...?" గద్గద స్వరంతో అడిగింది తల్లి దేవకి.

"అమ్మా! అనవసర ఆందోళనపడకు. కార్యాకారణ స్వరూపుడైన ఆ కాలపురుషుని లీలలు అనూహ్యము. అగ్రాహ్యము. అనుల్లంఘనీయం కూడా. వాటినర్థం చేసుకన్నవారు విజ్ఞులు, విమల పురుషులు. అన్నీ తెలిసిన నీవు....!" తల్లిని ఓదార్చాడు. మరొక విషయం. జరాసంధునికి, నాకు వ్యక్తిగతంగా పగ - ప్రతీకారాలు లేవు. కాకపోతే ఆ మగధ చక్రవర్తి తన అల్లుడిని హతమార్చానని నా మీద ప్రతీకారం తీర్చుకోదలిచాడు. కాని అది అసంభవం. అతను నన్నేమి చెయ్యలేడు. నేను కూడా అతన్ని పరిమార్చాలనే ఆలోచనలో లేను.

కుమారుని మాటలు విన్న ఆ తల్లి దేవకి, ఎవరెవరు వెడుతున్నారని అడిగింది. ప్రస్తుతానికి "మేమిద్దరమే బయలుదేరుతున్నాం. ప్రమాదం కూడా మాకే కదా! కాకపోతే ఉద్ధవుడు మాతో కుండినపురం వరకు వస్తాడు. అక్కడనుండి మాకంటే ముందు బయలుదేరి కరవీరపురానికి వెళ్ళి మా రాకను తెలియ బరుస్తాడు. ఆ తర్వాత భగవంతుని దయ" అన్నాడు కృష్ణుడు.

"నాన్నా, వీలయినంత తొందరగా వచ్చేయండి, ఈ తల్లి మనసు తల్లడిల్లకుండా చూడండి!" అర్థించింది.

"అమ్మా! నిన్ను కష్టపెట్టడం మా లక్ష్యం కాదు. వీలయినంత తొందరలో నిన్ను మళ్ళీ కలుస్తాను. సరేనా ?" ఊరడించాడు.

ఆ సమయంలో, దేవకికి అనుంగు చెలికత్తెగా మారిన త్రివక్ర అక్కడే వుంది. శ్రీకృష్ణుని పాదాలపై పువ్వులు వుంచి, "దేవకీనందనా, వీలయినంత

తొందరలో మాకు నీ పునర్దర్శనాన్ని ప్రసాదించు. నన్ను మరువకు" అని ప్రార్థించింది. కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ పూల పరిమళం నా ముక్కుకు సోకినంత కాలం నిన్ను మరువడం కుదరదు." ఆమెను అలరిస్తున్నట్లు చెప్పాడు.

కృష్ణప్రేమకు కృతజ్ఞురాలినంది. తెల్లవారుతూనే బలరామ, కృష్ణ, ఉద్ధవులు తీవ్ర వేగంతో సాగే గుఱ్ఱాలపై మధుర వీడారు. తప్పదు - ప్రస్తుతం నగర రక్షణకు, ప్రజా సంరక్షణమునకు ఆ చర్య తప్పదు. అది ఎందరికో కష్టం కావచ్చును కానీ, ఇష్టం కొద్దీ మాత్రం బలరామ, కృష్ణ, ఉద్ధవులు మధురను వీడటం లేదు.

ఇక్కడ ఇలాగ వుంటే, అక్కడ విదర్భ దేశంలో మధురలో జరిగే ప్రతి విషయం, గోపాలుని లీలావిశేషాలకు మురిసిన రుక్మిణికి తెలుస్తుంది. ఆమె తెలియని, చెప్పలేని కృష్ణప్రేమకు లోనయింది. సరిగ్గా ఈ సమయంలో, మగధ చక్రవర్తి జరాసంధుడు, మధురపై దండెత్త దల్చుకున్న విషయాన్ని, అందుకు "సై" అనే తన అన్న విచిత్ర ప్రవృత్తిని తలచుకుని బాధపడింది.

అయినా తెగించి, తండ్రి సమక్షంలో అన్నగారితో "అన్నా! మగధ చక్రవర్తి మధురపై దండెత్తాడనుకో. అతనికి నువ్వు సాయం చెయ్యవలసిన పనేముంది ? పైగా అతను బలరామ, కృష్ణులను సంహరిస్తాడుట. ఇందులో మనకు గల ప్రమేయం లేదా సంబంధం ఏముంది ? కాస్త ఆలోచించు.

చెల్లి మాట వింటూనే రుక్మి కస్సుమన్నాడు. ఆడవాళ్ళు ఆడవాళ్ళలాగే వుండాలి. అంతఃపురంలో వుండేవాళ్ళు రాజుల ఆంతరంగిక విషయాలలో, సమస్యలలో తలదూర్చకూడదు. నీకేం తెలుసని ? అవును, కాదని ప్రతిఘటించడానికి....!"

అన్నమాటలకు ఉక్రోషం చెందిన రుక్మిణి "ఆడవాళ్ళు అంతఃపురానికే పరిమితమవ్వాలి. రాజరిక విషయాలలో తలదూర్చకూడదన్నది, పొరపాటు. నేను ఎవరి రాజకీయ విషయాలలోనో వేలు పెట్టలేదు. ఇది నా తండ్రి రాజ్యం. నీలాగే నేను యువరాణిని. కనుక...!"

"అహ.. వ్యవహారం అంత దూరం వచ్చిందా ?" అన్నాడో, లేదో...

"తండ్రీ! అన్నగారు యువరాజు కావచ్చును.నీకు రాజకీయ వారసుడు కావచ్చును. కాని అన్నగారి ప్రవర్తన వలన, నువ్వు, ప్రభువుగా కాక, ఒక సామంతుడిగా తయారు చేయబడుతున్నావు. స్వతంత్ర రాజ్యం, రాజు సర్వస్వతంత్రుడిగా ఉండక, మరొకరికి సామంతునిగా తయారవడం ఎంత తప్పో ఆలోచించండి. అది బానిస బ్రతుకవుతుంది. మనం స్వతంత్ర రాజులం తప్ప, సామంతులం కాదు, కారాదు. ఆలోచించండి.

చెల్లెలు రుక్మిణి మాటలతో అన్నగారు రుక్మి సహనం కోల్పోయాడు. "రుక్మిణీ...!" సింహం లాగ గర్జించబోయినవాడు, కాస్త తమాయించుకున్నాడు. "రుక్మిణీ.... నా మాట విను. రాబోయే కాలంలో కుండినపురం బలమైన రాజ్యంగా రూపొందుకుంటుంది. దీనికి మగధ చక్రవర్తితో గల మైత్రి మరింత వన్నె తెస్తుంది. దీంతో అచిరకాలంలో నువ్వొక మహారాణివి కావచ్చు. నా చెల్లెలు "మహారాణి" అంటే నాకెంత గర్వకారణమో ఆలోచించు.

"చూడు నా గురించి పగటి కలలు గనకు. నీ మూలాన నేను మహారాణీ నవడం నా కిష్టం లేదు. అయినా తాడిచెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డి కన్నట్లు, నీ మగధమైత్రి, కృష్ణ వధ కార్యక్రమం, నా మేలుకోసమనడం ఏమీ బాగోలేదు." రుక్మి మాటలను బలంగా ఖండిస్తూ మరీ చెప్పిందామె.

అన్నగారు రుక్మి విచిత్ర ప్రవర్తకు విసిగిపోయిన చెల్లెలు రుక్మిణి తాతగారు కైశికులవారిని చేరింది. ఆయన మొదట్నుంచి ఆధ్యాత్మికవేత్త. ప్రస్తుతం శాంతి ప్రియుడు. మనుమరాలి మనోదుఃఖానికి, మనుమని ప్రవర్తనకు దుఃఖితు డయ్యాడు. అయినా ఆ పిల్లను ఓదార్చే పెద్దగా "చూడమ్మా! ఇది మగవారి విషయం. మగువుల పాత్ర ఇందులో రవ్వంతయినా లేదు. కనుక, లోకరీతికి తగ్గట్లు నీకు రాబోయే వాడు, కాబోయే వాడు సత్శీలుడు, సద్గుణధాముడు, ధర్మపరుడు కావాలని మాత్రమే ఆ భగవంతుని ప్రార్థించు." అంతకుమించి తనకు తెలియదన్నట్లు అంతటితో, లౌక్యంగా, ఆ సందర్భాన్ని ముగించాడు.

"అందరి మగవారిలాగే మీరూ మాట్లాడారు. మా అన్న బుద్ధి మీకు పూర్తిగా తెలిసినట్లు లేదు. నన్ను నేను కోరుకున్న వానికి గాక, తనకు నచ్చినవాళ్ళకు అమ్మ గల స్థిరబుద్ధి, స్థితప్రజ్ఞుడు!" తన గోడు చెప్పేసింది.

"అవచ్చు. నీవు అందగత్తెవు. బుద్ధిమంతురాలివి. నీకు తప్పక స్వయంవరం జరుగుతుంది. అందులో, నువ్వు నచ్చినవారినే వివాహం చేసుకో. నీకు మంచివాడే దొరుకుతాడు. ఎందుకో.... నా మనసు నీకు మంచే జరుగుతుందని తెలుపు తుంది. ధైర్యంగా వుండు. మంచివారిని ఆ భగవంతుడు వంచన చేయడు. తప్పక మంచినే చేస్తాడు. ఆ తాత, ఈ మనుమరాలిని ఓదారుస్తున్నాడు.

ఇది ఆమె అరణ్యరోదన. తనకు వచ్చిన ఆహ్వానం మేరకు, రుక్మి తన సైన్యంతో మగధ చక్రవర్తికి బాసటగా నిలిచాడు. అన్న వెళ్ళడం, ఈ చెల్లెలికి మరింత దిగులును పెంచింది. పరమ మూర్ఖుడు, మొండి అయిన తన అన్న, వివేక, విచక్షణాలను మరచి "ఆ నల్లనివాడు, పద్మనయనంబులవాడు, ఆశ్రిత రక్షకుడు, ఆ - బాల - గో"పా"లుడు ఆ దేవకీసుతునికి అపకారం చెయ్యడు కదా! - లేక -

ఆ దేవకీ సుతుడు, దేవతల నుతులు, ప్రణతులనందుకొను, ఆ "నంద" నందనుడు, ఈ దుష్టవక్ర తుంటరి బుద్ధిని, మందలించి కాని వదలడు కదా! లేక - "వద్దు. కృష్ణా! నా తండ్రికి అమంగళం, అశాంతి కల్గించకు!" రక్త సంబంధ ప్రేమతో, రుక్మిణి దేవకి సుతుని, నా అన్నను కరుణించమని మనసులోనే ప్రార్థించి, ప్రణతులర్పించింది.

ఒకనాడు రాజకుమారిని పెంచిన దాది, కుల పురోహితుల నుండి, త్రివక్ర పంపిన సందేశాన్ని తీసుకు వచ్చింది. "త్రివక్ర" అనగానే రుక్మిణి మనసు పొంగి మురిసింది. అమె నుండి ఉద్ధవుడనే యువకుడు కృష్ణ బంధువు నీకు తెలుసునట. ఆతను తెచ్చాడీ సందేశమంది దాది. ఆయన నీతో మాట్లాడాలన్నాడు. గురుదేవులకేమీ చెప్పలేదు. "అలాగా!" అంది. కాని, కృష్ణ భక్తుడు, సన్నిహితుడు, ఉద్ధవుడు - తనతోనే చెప్పాలనుకున్న సందేశం వినాలని ఒక ప్రక్కన ఆతురత, మరొక ప్రక్క ఆందోళన, వూగిసలాడే మనస్సు. దాంతో ఆతన్ని తాతగారి దగ్గరకు గురువుగార్ని తీసుకురమ్మను. లేదా పంపమను. నేను అక్కడికి వస్తాను. అది భద్రగృహంగా తలచి రుక్మిణి చెప్పింది, ఆ మధ్యాహ్నం తాతగారు కైశికులవారి మందిరానికి ఆతడు వచ్చాడు. అక్కడ అతన్ని రుక్మిణి కలుసుకుంది. అక్కడి విషయాలన్నింటిని ఒక్కటొక్కటిగా చెబుతున్నాడు. జరాసంధుని దుందుడుకు తనం, తన అల్లుడు మంచివాడైనట్లు, కృష్ణుడాతనిని నిర్దాక్షిణ్యంగా వధించినట్లు

తలపోస్తూ, మధురపై దండయాత్ర కన్న - బలరామ, కృష్ణులను వధించాలనే తలంపుతో వున్నట్లు, అందుకు తగ్గ విధంగా సమాయత్తమౌతున్నట్లు, జరుగు తున్నది మొత్తం ఉద్ధవుడు తెలియబరచి -

అందుకుగాను కృష్ణుడు - అనవసర రక్తపాతం, ప్రజా నాశనం దర్శించలేనట్లు, సురక్షిత ప్రాంతానికి తరలిపోతున్నాడనీ, కాలవిలంబనతో, ప్రకృతి మార్పులవలె సర్వ సమస్యలు సమసిపోతాయన్నది కృష్ణుని ఉద్దేశమని అంతా పూస గ్రుచ్చినట్లు చెప్పాడు. అంతేగాకుండా, మహేంద్రగిరికి వెళ్ళి, అక్కడ భార్గవ రాముని చెంత కొన్నాళ్ళుండాలని తలపోస్తున్న విషయం కూడా చెప్పాడు.

ఇప్పుడు నేనిక్కడకు రావడానికి గల కారణం - బలరామకృష్ణులు విదర్భ మీదుగా వెళ్ళాలి కాబట్టి, జరాసంధ మిత్రులైన ఈ విదర్భ రాజ్యాధికారులు బలరామకృష్ణులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా చూడమనే విజ్ఞప్తితో, కృష్ణమాత దేవకిదేవి సందేశంతో తాను, ముందుగా వచ్చానని, తన రాకకు గల రాజకీయ కారణంలోని సందేశాన్ని వివరంగా వారికి అందించాడు.

ఆ సందేశాన్ని విన్న రుక్మిణి, పూర్తిగా తన పరిధిలో లేని ఆ విషయ పరిరక్షణకై తాతగార్ని చూసింది. తాను కొంత తెగింపు చేయగలదు, అది వ్యక్తిగతం. రాజకీయ కారణాలతో ముడివడి వున్న ఆ చిక్కు సమస్యను వంశ పెద్దగా తాతగారు మాత్రమే సరిదిద్దగలరన్న వూహతో, వారిని, రుక్మిణి చూసింది. ఆమె చూపులను గ్రహించిన ఆ పెద్దాయన “చూడమ్మా! నీ అన్నకు భయపడి మేమెవ్వరము నీకు సాయపడలేము. ఆ తర్వాత, తర్వాత నీ అన్న మూర్ఖత్వానికి నీ తండ్రితో కలిపి.... మేమందరం బలి కావల్సి వస్తుంది.” తన నిస్సహాయతను తెల్పితే ఆ అసహాయతను విన్న రుక్మిణి, రెండుచేతులలో ముఖం దాచుకుని భోరుమని విలపిస్తూ -

“నావంటి దురదృష్టవంతురాలు, ఈ ప్రపంచంలో మరొకరు వుండరు, తండ్రి ప్రేమ, అన్న అభిమానం, తాత అనునయం దొరకని నష్టజాతకిని. నా తల్లితో పాటు నేను మరణించి వుంటే, నాకీ ప్రేమ, దయా, జాలి, అభిమాన-అనురాగ బాధలుండేవి కావు, మనుమరాలి కన్నీటిని, వలవలలాడే, విల విల స్థితి గమనించిన తాతగారి గుండె కరిగింది.

ఆమెను, అనునయించి ఓదారుస్తూ "అమ్మా! విచారించకు. ఈ తాత పనికిరాని ప్రాణాల జీవితం కన్న నీ జీవితం, నీ ప్రేమ - నీ సుఖమే ఆ తాతకు ముఖ్యం. నువ్వు విరిసిన మొగ్గవు. నేను రాలేపండును. తప్పక నీ కోరిక నెరవేరుతుంది. నా శాయశక్తులా నీకు మనఃప్రియం కల్గిస్తానని అభయ మొసగాడు. ఆమె వూరడిల్లింది.

ఇది జరిగిన కొన్నాళ్ళకు ఇద్దరు బాల సన్యాసులతో, ఉద్ధవుడు విదర్భకు వచ్చాడు. వారిని చూస్తూనే పరిస్థితి అర్థమయింది. వృద్ధ పెద్ద కైశికుడు బలరామ కృష్ణులను, వారెవరో తెలియనట్లు నటిస్తూ వారు మథుర నుండి వచ్చారనగానే, అచ్చటి పరిస్థితులను, ఆ నగర విశేషాలను ముచ్చటించారు. ఈ విషయం వివరంగా గ్రహించాడా పెద్దాయన.

ఆ తర్వాత కృష్ణలీలల ముచ్చటలో భాగంగా ఆతని విద్యాభ్యాసం - వైవస్వత పురి ప్రవేశం, ఆ దేశ స్థితిగతులు, నాగలోకం, అచ్చటి నాగకన్యల జీవిత విశేషాలను అడిగి మరీ తెలుసుకున్నాడు. "నాగకన్యను వధించాల్సింది", కృష్ణ మనస్సు చదవాలని అడిగాడు. "తాతా! అది అసంభవం. ఆ స్త్రీ రాజ్యంలో, ఈ గోపాలుడు ఇమడలేడు. అందుకే రాజ్యాన్ని - రాజరిక వ్యవస్థకు సవరణలనందించి, సమూలంగా కాకపోయినా కొన్ని కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టించాను" అనగా-

"కృష్ణా! అద్భుతమైన సావకాశాన్ని జారవిడుచుకున్నావు" అన్నాడు కైశికుడు. "తాతా! ఎవరి అదృష్టమెలాగ వుంటుందో, ఎవరి చెయ్యి నేను పట్టాలో, ఆ పిల్లచేత పట్టించుకోవాలో - అంతా - విధి నిర్ణయం" అన్నాడు.

అప్పటికే కొందరు కుండినపుర యాత్రికులతో కలిసి సునాయాసంగా, కరవీరపుర రథ యాత్ర సందర్శనానికి వెళ్ళడానికి తగు ఏర్పాట్లు చేయబడ్డాయి. అందులో ఈ బాలయతులు కలిసిపోయారు.

# మహేంద్రగిరి

**స**హ్యాద్రిని గమనించిన బలరామ, కృష్ణులు రథ యాత్రీకుల నుండి విడిపోయారు. మహేంద్రగిరివైపు అడుగులు వేసారు. ప్రయాణమెంతో సుఖవంతంగా, ఆనందకరంగా సాగింది. ఎక్కడికక్కడ, ఈ అవతార పురుషులకు అడుగడుగునా అతిథి మర్యాదలు - ఎంతో గౌరవం లభించాయి. బలరాముడు ఆ పర్వత శ్రేణుల నుండి వచ్చే చల్లచల్లని గాలులకు, ఎత్తైన శిఖరాలతో, ఎంతో అందమైన చెట్లతో చూడముచ్చటగానున్న ఆ వాతావరణానికి మురిసిపోతూంటే కృష్ణునికి, బృందావనంలో తన సహచర గోపబాలురతో కలిసి, ఆడి-పాడిన దినాలు జ్ఞాపకాని కొచ్చాయి.

ఆ మధురస్మృతులలో మున్గి తేలుతున్న తరుణంలో, ప్రకృతి నుండి విడివడిన పరమాత్మవలె, బలరాముడు "కృష్ణా! నువ్వు చాలా తెలివిగలవాడివి. అందులో ఏ మాత్రం సందేహం లేదు. కాకపోతే నాకొక అనుమానం." అంటూనే "లోకంలో మనవంటి వాళ్ళెందరో వుంటారు. వారివ్వేరికి రాని ప్రమాదాలు, సంఘటనలు, సమస్యలు మనల్నే ఎందుకు పట్టుకుని పీడిస్తున్నాయి. అది నా ప్రశ్న ? అన్నాడు.

అందుకు సమాధానంగా కృష్ణుడు "అన్నా! ఎందుకు" అంటే... సమాధానం దొరకదు. ఎందుకంటే మనం జన్మించింది, సమస్యల సుడిగుండం నుండి జీవజాతిని సంరక్షించడానికి. అందరూ తమ గురించే ఆలోచించుకుంటారు తప్ప, లోకం గురించి, అందులోని జీవజాతి సుఖసంతోషాలను గురించి అందరు ఆలోచించరు. కాబట్టి, వారికి సమస్యలున్నా, మనకెదురైనటువంటిని, వారెరుగరు. పొరపాటున ఎవరికైనా ఎదురైనా, కర్మమనో, ధర్మమనో, మరో రకంగానో ఆలోచిస్తూ, కర్తవ్యతామూర్తులుగా కాక పారమార్థిక దృష్టితో బ్రతుకుతూ, "ఏతత్ఫలం శ్రీ పరమేశ్వరార్పణమస్తు" అంటూ, ఆ రక్షించే జగన్నాథునికై జనచైతన్య యాత్రలు, భజనలు చేస్తూ బ్రతుకుతారే తప్ప, తమ తమ ధర్మాలను గుర్తించరు. వివేకంతో ప్రవర్తించరు. కనుక అన్నా! అనవసరపుటాలోచనలనుమాని మనం, మన ధర్మాన్ని మనం నిర్వర్తిద్దాం. మానవాళికి ఆదర్శంగా నిలబడుదాం!" కర్తవ్యాన్ని, ధర్మంగా, సందేహానికి సమాధానంగా చెప్పాడు.

"కృష్ణా! నువ్వు - నీ తత్వం నాకు బొత్తిగా అర్థం కావటం లేదు. ప్రేమన్నావు. రాధను విడిచిపెట్టావు. ధర్మమంటున్నావు. వీరునిలాగ ఎదుర్కోవలసింది పోయి, పిరికివానిలాగ మథురను విడిచి, ఈ కొండలు, కోనలనాశ్రయింప చేసావు.

ఇదేం ధర్మమో.... నీ సిద్ధాంత సారం... ఊహు... ఆవగింజంతయినా అర్థం కావడం లేదు.'' ఇందులో నిష్ఠూరం లేదు కానీ, నిరాశ కొంత పాలుపంచుకుంది.

యథాప్రకారం చిరునవ్వులు చిందిస్తూ "అన్నా! అడుగు ముందుకు వేద్దాం. అదే అర్థమవుతుంది'' నడవమన్నాడు. ఆ కృష్ణుని, అన్నయినా, "విధి''గా అనుసరించాడా సోదరుడు. కొంతదూరం వెళ్ళేసరికి ఓ ఆశ్రమం! అది.... గొర్రెల కాపరిని అడిగాడు. వీళ్ళను చూస్తూనే భక్తి భావం కల్గిన ఆ గొర్రెల కాపరి "అయ్యా! పరశువు.... అదే గండ్రగొడ్డలి పట్టుకుంటాడే, ఓ పెద్దాయన... ముక్కోపి, శివపూజ కోసం వస్తాడు. అది ఆయన ఆశ్రమం...'' చెప్పాడతడు. ఈ సంగతి గర్గులవారు ముందే చెప్పారు. కనుక, కృష్ణుడు త్వర త్వరగా పరశురాములవార్ని కలవాలని ఉత్సాహ పడుతున్నాడు.

సద్ధర్మ స్థాపనకు అవతరించిన - ధర్మరూపుడు, వీరవర్యుడు, భార్గవ రాముడు. ఆ మహనీయుని దర్శించడం తన సుకృతమని, ఎందరో తాపసులు, మునిశ్రేష్ఠులు చెప్పి, ఈ వీరవర్యుని, ధర్మస్వరూపుని తప్పక దర్శించి, తన కర్తవ్య - కార్య నిర్వహణంలో తగు సమయోచిత ధర్మబోధనలను, సూచనలను పొందాలని, ఈ పరమపురుషుడు - కృష్ణుడు ఉవ్విళ్ళూరుతున్నాడు. పరశురాముని అవతార మహాత్మ్యం. వారి లీలావిశేషాలు, సద్ధర్మ సంస్థాపనంలో, క్షత్రియుల దౌష్ట్యాల నుండి మునిమూర్తులను, సాధుపురుషులను రక్షించి, ఆ ధర్మ నిరతిలో, తాను తన ధర్మాన్ని ప్రతిష్ఠించాడే తప్ప, పరాక్రమముంది కదాయని, పాలనా పగ్గాలు పట్టని, అధికార దాహం లేని, అత్యున్నత శక్తి - శీలసంపన్నుడా దివ్యుడు.

"పరశురాముడు....!'' అనేసరికి బీభత్స స్వరూపునిగానే తలంచారు తప్ప, వారి ధర్మనిరతిని, అవతార లక్ష్యాన్ని గ్రహించిన వారు చాలా అరుదు. తన బలిమితో సంపాదించిన, యావత్ భూమిని కాశ్యపులకు, దానమిచ్చిన ధర్మపరుడు. ఆర్యావర్తాన్ని కాశ్యపులకు దానమిచ్చి భార్గవ రాముడు దక్షిణ తీర ప్రాంతానికి రాగానే, సముద్రుని తనకు నివాస భూమిని చూపమని కోరాడు. అందుకు ఆ మహనీయుని శక్తి స్థోమతలు తెలిసిన సాగరుడు -

తన మధ్యనగల "శూర్పారక''మనే ద్వీపాన్ని చూపి, అక్కడ నివశించమని ప్రార్థించాడు. అదొక తీర ప్రాంతం. నౌకా రవాణా ప్రాంతం. అక్కడ చాలా

సామాన్యుని వలె నివశిస్తున్న భార్గవరాముని ఎందరెందరో వచ్చి దర్శించి, శరణాగతులయ్యేవారు. ఆయన నుండి ఎటువంటి ప్రమాదము రాకూడదన్నట్లు, పరశురాములకు శరణాగతులయ్యేవారు. ఆ విధంగా ఎందరో, ఆ మహనీయునికి, అవతార పురుషునికి, ఆశ్రితులు, అనుయాయులు, శిష్యులు కూడా లభించారు.

ఈ వీరవర్యుని విక్రమ - సాహస - విద్యాశక్తికి తలవంచి, శరణొంది, ఎందరో విద్యార్థులయ్యారు. వివేకంతో, అస్త్ర విద్యా పారంగతులయ్యారు. కనుక కృష్ణుడు - అన్న బలరామునితో ఆ మహనీయుని దర్శించ తలచి, మహావృక్షము క్రింద అగ్నికార్యం సల్పుతున్న, ఆ విప్రోత్తముని వినయంగా సాష్టాంగ వందన మాచరించి, నిలిచాడు.

ఆజానుబాహువు, కమలనేత్రుడు, తెల్లని జడలు కట్టిన శిరోజములు, తేజోవదనము, ముడతలు పడ్డ దృఢమైన శరీరం, వీరిముందు సూర్యుడే శిరసు వంచాలేమోనన్న దివ్యకాంతిసమ ప్రభావునికి బలరామకృష్ణులు శిరసు వంచారు.

భార్గవుల ఆశ్రమం, దాని పరిసరాలలో పూర్వ విద్యార్థుల గోసంరక్షణ కేంద్రం. దానికి కొద్ది దూరంలో మరికొన్ని కుటీరాలు, వాటి వద్ద కొందరు విద్యార్థుల వేద విద్యాభ్యాసం - ఇవన్నీ చూస్తూ పరశురాముల వారిని దర్శించిన బలరామ కృష్ణులు సాష్టాంగ దండ ప్రణామమాచరించిలాగ ప్రార్థించారు.

"ఓ పరమగురూ! పరశురామా! భార్గవాన్వయా, మా పేరు బలరామ, కృష్ణులు. మేము "శూరవంశీయుడైన వసుదేవుని సుతులం. ప్రస్తుత బృందావన వాసులైన నంద యశోదలకు ప్రియపుత్రులం. సర్వం తెలిసిన తమకు, మా వందన శతాలతో, మా గురించి విన్నవించుకుంటున్నామని, వినయమూర్తులుగా నిలిచారు.

వారిని చిరునవ్వులు చిందిస్తూ, సాదరంగా చూసిన భార్గవులు, "వసుదేవ సుతం దేవం, కంస చాణూర మర్దను"లన్న దేవకీ సుతులారా, మీ రాక మాకు తెలుసును. అందుకే ఇక్కడ మీ కోసం ఎదురు చూస్తున్నామని, ఎంతో సంతోషంగా తెలిపారు. ఆ వెంటనే భార్గవులు - "వెళ్ళండి స్నానసంధ్యాదికాలను

పూర్తి చేసుకోండి. ఆహారం తీసుకోండి. కాస్సేపు విశ్రాంతి తీసుకున్న తదుపరి మిగిలిన విషయాలనగానే, ఆ ప్రక్కనే వున్న ఆశ్రమ వాసియైన ఒక పెద్దాయన వీరిని తీసుకు వెళ్ళాడు.

తమ కాలకృత్యాలు, స్నానసంధ్యాదికాలు, ఆహార-విశ్రాంతుల తదుపరి, బలరామకృష్ణులు వినయ "విద్యార్థులు"గా - గురు - జ్ఞానశ్రేష్ఠుడైన పరశురాముని వీరునిగాకాక, విజ్ఞానమూర్తిగా దర్శించారు. తమ రాకలోని గాథను యావత్తు మహర్షి దృష్టికి తెచ్చారు.

మంచి పని చేసారు. మారణహోమాన్ని తప్పించారు. సాలోచనగా తెలిపారు. అప్పుడే కృష్ణుడు "మహాపురుషా, ప్రస్తుతం యాదవేంద్రుడైన కరవీరపురాధిపతి సన్నిధానంలో శరణార్థులుగా వుండాలన్నది మా ఆలోచన. సాటివాళ్ళకు తోడుగా నిలుస్తాడా ప్రభువని బయలుదేరాము" విషయం విన్నవించాడు.

విషయం విన్న మహర్షి "కృష్ణా! ఆ కరివీరపురాధిపతి సామాన్యంగా మీకు సాయపడడు. అతడు దుష్టుడు. మూర్ఖుడు - కపటి కూడా! అతనిలోని మరో దుర్గుణం దేవతలకే దేవుడననే - దుష్ట లక్షణం. దాంతో ఆ అజ్ఞాని సనాతన సాంప్రదాయవాదుల్ని, సదాచార సంపన్నులను - జ్ఞానులు, ఋషి - ముని శ్రేష్ఠులను సైతం ధిక్కరించి బంధించాడు. అటువంటివాడు శరణాగత రక్షకుడు కాడు. అతని ప్రాపును పొందాలన్నా ఆతని రాజ్యంలో కొన్నాళ్ళు స్థిరపడాలన్నా మీరు, ఆతడే దేవుడని, మిగిలిన దేవతలు ఒట్టి తోలుబొమ్మలు, దిష్టిబొమ్మలని చెప్పగలగాలి.

అంతేకాదు, అవసరమైతే మిమ్మల్ని ధనం కోసం జరాసంధునికి అమ్మేతాడన్నా ఆశ్చర్యపడకూడదు. అంతటి నీచుడు. ఇక వీరత్వానికొస్తే మేటి విలుకాడు. కనుక - ఎంతో జాగ్రత్తగా - సామరస్యంగా వ్యవహరించాలి. తనకు తెలిసిన విషయాలన్ని చెప్పి భార్గవులు హెచ్చరించడంతో -

"మరిప్పుడు... మాకు దారి...!" బలరాముడడిగాడు.

అదే ఆలోచిస్తున్నాం. మీరెక్కడికి వెళ్ళినా ప్రమాదం మీప్రక్కనే పొంచి వుంటుంది. జరాసంధుడు మధురను నాశనం చెయ్యకపోయినా, మధురలో మీకు ఇష్టులు, విశ్వాసపాత్రులను మీ గురించి తెలుపమని హింసించవచ్చును. మిమ్మ

వెంటాడవచ్చును. కాబట్టి ప్రస్తుతం మీరు ఏ రాజ్యానికి వెళ్ళినా మాగధుని ప్రాపుకోసం, రాజ్యవిహీనులైన మిమ్ము బంధించడానికి, జరాసంధుని దర్శించడానికి వెనుదీయరు. కనుక -

మీరు నా మాట విని గోమంతకానికి వెళ్ళండి. అటువంటి భద్రప్రదేశం ఈ భూలోకంలో మరెక్కడా దొరకదు. అది ఎంతో ప్రశాంతమైనది. అంతకుమించి సురక్షితమైనది లేదు. రథాశ్వాలు, ఏనుగులు వగైరా ఏమీ ఆ కొండను చేరలేవు. ప్రమాదమన్న విషయం గట్టిగా మరచిపోవచ్చును. అక్కడ వున్న గరుడులు, సాధు సత్పురుషులు, మిమ్ము కంటికి రెప్పలా చూసుకుంటారు. కొన్నాళ్ళు.... పరిస్థితులు చక్కపడేవరకు అక్కడ అజ్ఞాతవాసం చెయ్యండి. పైగా మీరు నా దగ్గర నుండి వచ్చారని, నేను పంపగానే అక్కడకు వచ్చారన్న విషయం ఆ గరుడులు తెలుసుకోగానే మీకు బ్రహ్మరథం పడతారని చెప్పారు.

సుందరము, సురక్షితమైన ఆ ప్రదేశానికి రేణుకా, ఆ జమదగ్ని సుతునితో కలిసి బలరామకృష్ణులు బయలుదేరారు. ఆ పర్వతాన్నధిరోహించడంలో అధిక శ్రమ వత్తిడి - ఇబ్బందుల నెదుర్కుంటున్న బలరాముడు "మహర్షీ! ఇంతటి సువిశాల ధరణితలాన్ని జయించి, కాశ్యపుల కొసగి, చివరకిలా కొండలు, గుట్టలు పట్టుకుని కాలక్షేపం చెయ్యడం వింతగా వుందని ఆశ్చర్యం, ఆసక్తి కలగలిపి మరీ అడుగుతాడు.

పరశురాములు నవ్వుతూ "బలరామా! నీ సందేహాలు చిత్రంగా వున్నాయి. సరే. అడిగావు కాబట్టి చెబుతాను. అందరు నాకు రాజ్యకాంక్ష వుందని, అందుకే అనవసరంగా క్షత్రియ ద్వేషం పెంచుకుని రాజన్నవాడు లేకుండా చేసానని అనుకుంటారు. నిజానికి నాకా బుద్ధి లేదని తెలియబర్చడానికే జయించిన ఈ భూమండలాన్ని కాశ్యపులకు ధారాదత్తం చేసాను. ఇక క్షత్రియ వధ... అంటావా... అనవసరంగా ఆ క్షత్రియాధముడు కార్తవీర్యార్జునుడు, అతని సుతులు కారణమేదైనా, నా తండ్రి ననవసరంగా వధించి, నా తల్లిచేత కంటనీరు పెట్టించారు.

ఆ తల్లి చేసిన ఆక్రందనలకు నిదర్శనంగా, ఇరవై ఏడుసార్లు ఈ భూమండలాన్ని చుట్టి, చుట్టి రాజన్న వాడిని లేకుండా చేసాను. క్షత్రియ నాశనం చేసి నా మాతృభక్తిని ప్రకటించుకున్నాను. అంతటితో పగ చల్లారిన నేను, మాతృదేవి ఆదేశంతో, శాంతుడను, స్వాంతుడనయ్యాను. దత్తాత్రేయ వరప్రసాదుడు,

భక్తుడైన ఆ కార్తవీర్యుడు గర్వాహంకారాలతో, లోకానికి తానే ప్రభువునన్నట్లు విర్రవీగుతూ, ధర్మభ్రష్టుడౌతున్న తరుణంలో, ధర్మరక్షణా కర్తవ్య బాధ్యతతో, ఆతన్ని అంతం చేయాల్సి వచ్చింది. దురంత నాశనం ధర్మ భ్రష్టం కాదు. అది ఆనాడు నడిపించవలసిన సద్ధర్మము. ధర్మము ఎప్పుడైనా సరే నిలబెట్టాలి. అది మన కర్తవ్యమనే పరశురాముల అడుగుజాడలలో ముందుకు అడుగు వేస్తున్నారు.

అప్పటికే పరశురాములవారి రాక ఆ కొండ ప్రాంతీయులకు తెలియడం, తగు సత్కారాలనొసగ సన్నద్ధమవడం మొదలైంది. ఇది ఇక్కడి స్థితి.

అయినా అక్కడ వారలను విడిచి, వారి ధర్మాన్ని మరొక్కసారి హెచ్చరించి, మహర్షిగా పరశురాములు, ఆ వీరవిక్రముడు వెనుదిరిగారు. ఇక్కడ ఇలాగ వుంటూండగా అక్కడ, మగధ సేనలు, తమ మిత్ర - సామంత పరివారంతో, యమునానది ఒడ్డున విడిది చేసాయి. అక్కడ గజ, అశ్వ, రథ, పదాతి దళాలున్నాయి. అవన్నీ జరాసంధునికి, ఆతనికి బాసటగా వచ్చిన ఇతర మిత్ర - సామంత రాజులవి. ఇకముందు జరగాల్సిన దానికి వారి వారి ఏర్పాట్లు వారు చేసుకుంటున్నారు.

పాంచాల రాజు ద్రుపదుడు. తమ దేశం గుండా జరాసంధ సేనలు నడవడానికి ఒప్పుకోలేదు. అది మగధ చక్రవర్తికి బాధాకరమనిపించింది. అదే ఇతర సమయమైతే జరాసంధుడు పాంచాలరాజును ఢీకొనేవాడు కాని, ప్రస్తుత పరిస్థితుల్లో జరాసంధునిది అతి సాహసమౌతుంది. ఇరుగు-పొరుగు రాజ్యాల వారితో కలహ కారణమవుతుందని వూరుకున్నాడు. కానీ, దీనికి తగిన మూల్యం ద్రుపదుడు ఆ తదుపరి తప్పక చెల్లించవలసి వస్తుందని మాత్రం గట్టిగా తలిచాడు. ప్రస్తుతం తనకు కావల్సింది ద్రుపదునితో కయ్యం కాదు, బలరామ-కృష్ణుల సంహారం. ఆ దిశలో తన ఆలోచనల్ని సాగిస్తున్న జరాసంధుడు అసహనాన్ని విడిచిపెట్టేసాడు.

అక్కడ భోజన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాని ఛేది దేశాధీశుడు కనబడలేదు. దాంతో సాల్వుడిని, దమఘోషుని గూర్చి అడిగాడు. కాస్త ఆలస్యంగా వస్తానని మహారాజు కబురు పంపినట్లు సాల్వుడు చెప్పాడు. సరిగ్గా ఇదే సమయంలో మథుర నుండి శాంతి సందేశం తీసుకుని, శాంతిదూతలు వచ్చారని మగధ సేనాని చేతులు కట్టుకుని వివరంగా చెప్పబోతున్నాడు. అందుకు విసుక్కుంటూ-

"ఈ కబుర్లు కాదు నాక్కావల్సింది. నాక్కావల్సింది నా అల్లుని చంపిన, ఆ వసుదేవ సుతుల తలలు. తొందరగా తేవాలి. కోపంతో వూగిపోతూ చెప్పాడు. చెప్పాల్సింది, తెచ్చామనే ఆ తలల మాట తెల్సిందా ? మళ్ళీ హెచ్చరిస్తున్నట్లు చెప్పాడు.

మగధ సేనాధిపతులు, మౌనంగా భోజనానికి విస్తళ్ళ ముందు కూర్చున్నారు. ఇప్పుడు మళ్ళీ ఛేది దేశాధిపతిపై, సమయానికి తన దగ్గర లేడన్న నిరసనను, జరాసంధుడు వ్యక్తం చేసాడు. దమనఘోషుని భార్య - వసుదేవుని సోదరి. ఆయన బాంధవ్యాన్ని ప్రక్కనపెట్టి, తన మాట మీద గౌరవంతో ఇక్కడకు వచ్చినా, ఆ ఛేదిరాజు ప్రవర్తనకు జరాసంధుడు ఆలోచనలో పడ్డాడు. మర్యాదకు వచ్చాడా ? లేక, మనసుపెట్టి వచ్చాడా ? ఏది ఏమైనా ఆ వచ్చిన వాడు ప్రక్కన వుండక, ఇలాగ... వేడెక్కించే ఆలోచనలను భరించలేకపోతున్నాడు.

సరిగ్గా... సరిగ్గా... ఆ సమయంలో ఛేదిరాజు దమఘోషుడు అక్కడికి వచ్చాడు. జరాసంధునికి వందనాలర్పించి, "ఆలస్యానికి క్షమించండి" అన్నాడు. మితభాషి, మృదుభాషి అయిన దమనుని చూస్తూ మథుర నుండి ఎవరైనా వచ్చారా ?" అర్థోక్తిలో ఆగాడు.

"వచ్చారు. నా కోసం కాదు, మీ కోస"మన్నాడు దమఘోషుడు.

"అలాగా! మరి, ఆ వచ్చినవాళ్ళు బలరామ, కృష్ణుల తలలు నరికి తెచ్చారా ? లేక...!" మనమే వెళ్ళాలా ? అందరు విని, స్పందించాలన్నట్లు గట్టిగా, అరచినట్లు పలికాడు.

"ప్రస్తుతం, మీకావసరం లేదు. వాళ్ళు మథురను విడిచి వెళ్ళారుట!"

"ఏమంటున్నావు ? బలరామ, కృష్ణులు మథురను విడిచిపెట్టారా ? నే వింటున్నది, నిజమే"నా ?"

పూర్తిగా. అక్రూరుడు, బృహద్బలుడు వెంటరాగా ఇక్కడికి వచ్చి, విషయం తెలిపాడు. ఎవరి మాటన్నా నమ్మకూడదేమో కానీ, అక్రూరుడు మహాత్ముడు, సహృదయుడు. కనుక అతడు సత్యమే చెబుతాడు. అన్న చేదిరాజు మాటలతో జరాసంధుడు ఏకీభవించలేక, మౌనంగా వుండిపోయాడు. ముందు భోజనాలు కానివ్వండి. ఆ తర్వాత, దీని మర్మం తెలుసుకుందా"మన్నాడు. జరాసంధుని

ఆ నిశ్శబ్దం అనకూడదు కానీ, ప్రతి ఒక్కరిని సంశయంలోకి త్రోసేసింది. ఇప్పుడందరిలో వున్నది ఒకేమాట, అది "కిం, కర్తవ్యం!" అన్నది.

ఒక మూల భోజనం జరుగుతుంది. పోనీ, మన వేగుల్ని సత్యం తెలుసు కోవడానికి అర్థరాత్రి పంపితే..... ఇది - జరాసంధుని తోక అయిన సాల్వుని సూచన. భోజనం పూర్తి చేసుకుని, మాట్లాడకుండా, తన గుడారానికి వచ్చిన జరాసంధుడు, దమనఘోష, సాల్వులను తన ప్రక్కన వుండమని చెప్పాడు. మథుర నుండి వచ్చిన శాంతిదూతలను తీసుకురమ్మని తన సేనాధిపతిని ఆదేశించాడు.

కంస మరణానికి తగు ప్రతీకారం తీసుకుంటానని ప్రతిజ్ఞ చేసిన మగధ చక్రవర్తి సంకటస్థితిలో పడిపోయాడు. ఆ బలరామ కృష్ణులు నిజంగా పారిపోతే, ఈ యుద్ధం ఎవరిపైన ? ఎందుకోసం ? వూపిరాడనివ్వని ఆలోచనలతో జరాసంధుడు ఉక్కిరి బిక్కిరవుతున్నాడు.

అక్రూరుడు, బృహద్బల, గదలు, మగధ చక్రవర్తికి నమస్కారం చేయడంతో, ఆలోచనల నుండి బయటపడ్డ అతడు, చివాలున లేచి, కోపం, అసహనం చోటుచేసుకుని, "ఏమిటి ? మీరు చెప్పేది నిజమేనా ? ఇది... ఏదో అనబోతున్నాడు.

"మగధ చక్రవర్తీ, ఇందులో మాయ లేదు, మర్మం లేదు. మేము చెప్పేది యదార్థం. బలరామ, కృష్ణులు మూడు దినాల క్రితమే నగరాన్ని విడిచి వెళ్ళిపోయారు."

"అబద్ధం. ఎక్కడో మీరే దాచిపెట్టి బొంకుతున్నారు. అసహనంగా జరాసంధుడరిచాడు.

"నిజం." ఎంతో వినయంగా అక్రూరుడు, జరాసంధుని కోపానికి భయపడుతూ బృహద్బలుడు, కదలలేని స్థితిలో బదులు చెప్పి నిల్చున్నారు. ఇదంతా గమనిస్తున్న మగధ చక్రవర్తి, సాల్వుడు, దమనఘోషుల వైపు చూసి "కాస్సేపు నన్ను ఒంటరిగా వుండనివ్వండి. వీళ్ళతో నేను మాట్లాడాలన్నాడు. వాళ్ళు తలలూపి లేచారు. అగమ్యగోచరమైన ఆ స్థితిలో కర్తవ్యానికై "జరాసంధ" మిత్ర- సామంతులు, తలమున్కలవుతున్నారు.

వాళ్ళు వెళ్ళిపోతూంటే "ఛేదిరాజా! ఈ పిరికి బృహద్బలుని మీతో తీసుకు వెళ్ళండి. ఇతన్ని చూస్తే, నా చూపుతో గుండె ఆగి చచ్చేటట్లున్నాడన్నాడు.

దమనఘోషుడు "అలాగే" అన్నాడు. వాళ్ళు కదిలాక -

అక్రూరుని చూస్తూ "వృష్ణివీరా! సాధుస్వరూపుడవని ప్రఖ్యాతి చెందినవాడవు నీవు. కనుక నిజం చెప్పు. లేకుంటే ఈ మధురనిలాగే భస్మీపటలం గావించి, నా కసి తీర్చుకుంటాను. పగ, ద్వేషం, కసి - పట్టుదల కలబోసినట్లు మధురాధిపతి మాట్లాడుతూంటే, "చక్రవర్తీ! నీ సర్వసమర్థత నాకు తెలుసు. అందుకే, మా మధురాపురాన్ని రక్షించుకునే వుద్దేశంతోనే సత్యం చెబుతున్నాను. నిజంగా బలరామ, కృష్ణులు పారిపోయారు.

"అలాగా! ఆ పశువుల కాపరులు, అలాగెందుకు పారిపోయారో," వ్యంగ్యం మిళితం చేస్తూ - పిరికి పందలన్నట్లు మాట్లాడుతూంటే -

"చక్రవర్తీ! వారు నిజంగా పిరికిపందలు, నీవన్నట్లు పశుల కాపరులైతే, నీ చేతులలోనే చచ్చేవారు. కానీ వారు వీరాధివీరులు. తమ మూలాన యదువంశ క్షోభ జరుగకూడదనే వుద్దేశాన్ని, అందరికి చెప్పి, ఈ నగరికి వీడ్కోలు పలికారు. నీకు అనవసర పగ, శ్రమ లేకుండా చేసారు.

"మరోమాట. యదుకులం మొత్తం ఆ వీరులకు బాసటగా నిల్చింది. అయినా అనవసర సంక్షోభం, పగ-ద్వేషాలు ప్రజ్వరిల్ల చెయ్యరాదని శాంతికాముకులై నగరాన్ని - నీ రాకకు - ఎంతో ముందుగానే, విడిచారు.

అక్రూరుని నిశితంగా చూస్తూ "నీ మాటలు నమ్మబుద్ధి కావడం లేదు. ఇందుకు మీరు తగిన శిక్షననుభవించాల్సి వస్తుంది." అనగానే - "ఈ విషయం మా చర్చకు వచ్చింది. అల్లుడిని పోగొట్టుకుని, విధవలైన కుమార్తెలను చూస్తూ "ఏ తండ్రీ ప్రశాంతంగా వుండలేడనీ అందులో చక్రవర్తి - సాహసియైన జరాసంధుడు అసలు మిన్నకుండలేడనే వాదం చెలరేగింది. అయినా సాహసంతో అనవసర వినాశానికి, క్షోభకు తావీయరాదని, ఆ వసుదేవ సుతులు, తమ నిర్ణయాన్ని అందరి ముందు ప్రకటించి మరీ, ఇక్కడ నుండి వెళ్ళిపోయారు." ఎంతో వినయంగా, శాంతంగా - అక్రూరుడు చెబుతున్నాడు.

మగధరాజు వింటున్నవాడు మరుక్షణం లేచి "అక్రూరా! జరిగింది దారుణం. దానినెవరు ఖండించలేదు. నాకు ప్రాణమిత్రుడు, నా అనుయాయి, నా అల్లుడిని

చంపినందులకు, కోపం, కాదు'', అదీ... ఆ వసుదేవసుతులను అంతమొందించాలన్నది నా పట్టుదల.'' అంటూంటే - అక్రూరుడు-

"నిజం, మనిషి ఎదురుగా వుంటే కోపం పెరుగుతుంది! అదే ప్రక్కకు తప్పుకుంటే శాంతం చోటుచేసుకుంది. ఇది ప్రకృతి ధర్మమంటూంటే-

"ఏమిటి మహర్షిలాగ మాట్లాడుతున్నావు ?'' కంసుడన్నాడు.

"క్షమించు చక్రవర్తి. విన్న ధర్మాన్ని వివరంగా చెబుతున్నానే తప్ప "నేను మహర్షిని కాను. నాకంతటి శక్తి కూడా లేదు.'' ఆ వినయం జరాసంధునికి నచ్చలేదు.

"చాలా తెలివిగా మాట్లాడుతున్నాననుకుంటున్నావేమో, జాగ్రత్త!! మగధ చక్రవర్తి హెచ్చరించాడు. అతనే మళ్ళీ అన్యాయం జరిగింది నాకు, న్యాయమంటూ నీతులు చెబుతున్నావు ?'' ఎర్రని జేవురించిన కళ్ళతో, కోపాన్ని తట్టుకోలేక అరచి, మరీ చెబుతున్నాడు.

"చక్రవర్తి! మీరనుమతిస్తే, నావో రెండుమాటలు'' అన్నాడు.

"చెప్పు.'' అనగా - మెల్లిగా "సాహసమనకండి. సామ్యవాద సందేహం. "అన్యాయం జరిగిందని మీరంటున్నారు. నిజమే, కాదనను. అది బాధాకరమైన విషయమే. కానీ, కంసరాజు, కేవలం యువరాజయి వుండి, తండ్రిని చెరపట్టి, యాదవ వీరులను తుదముట్టించి, సత్యధర్మాలు పలికిన వారిని, పలికేవార్ని ప్రాణాలు తీసి, ఏ వసుదేవసుతులీనాడు, తన మేనమామపై ధ్వజమెత్తి వధించారో.... ఆ వసుదేవ సుతులనెందరినో నిర్దాక్షిణ్యంగా వధిస్తే....., ఆనాడు వద్దని ఆపినవారు, కాదని చెప్పినవారు కానీ, వున్నారా ? అది న్యాయమైతే, ఇప్పుడు జరిగిందీ న్యాయమే. అది అన్యాయమైతే, ~~ఈ~~నాడు జరిగింది అన్యాయమే. ఇది ఒక్క అక్రూరుని మాట కాదు. క్షోభించిన యదువంశం మొత్తం బాధ. దీనినెవరు తీరుస్తారు ? ఎందరు యువతులు తమ ధన - మాన - ప్రాణాలను, భర్తలను పోగొట్టుకున్నారో.... దీనిని మా కంస యువరాజు, చక్రవర్తులైన మీ సముఖానికి తీసుకు రాలేదనుకుంటాను. నిజంగా మా యువరాజు తీసుకువస్తే, పరిస్థితి ఇలాగ వుండేది కాదనుకుంటాను.

గొంతుకలో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. జరాసంధుడు సమాధాన

మివ్వలేక క్షణకాలమాగాడు. ఒక్క దీర్ఘ నిట్టూర్పు విడిచాడు. ఇప్పుడు జరిగిన ఘోరానికి - పర్యవసానం - మధుర నాశనం. అగ్నిజ్వాలలలో అది ఆహుతి అవుతుంటే -

కావాలని రాజ్యాన్ని తన హస్తగతం చేసుకున్న "నీ అల్లుని గుండె భగ్గుమంటూంది." అన్న అక్రూరుడు, మెల్లిగా - "చక్రవర్తీ! ఇప్పటికే సగంమంది యాదవులు, మధురను విడిచారు. ఇక్కడి నుండి మేము సుఖంగా కనుక తిర్గి వెళ్ళకపోతే మిగిలిన వారు నగరాన్ని విడిచిపోతారు. అప్పుడు మిగిలేది, కోటబురుజు లతో నీ వాళ్ళనుకున్న కొందరు మాత్రమే. అప్పుడా శిథిలాలను, అధినాయకుని వారసులైన నీ కూతుళ్ళు... అవునా అన్నట్లు" అడుగుతున్నాడు.

మళ్ళీ అక్రూరుడే - "ఆలోచించండి. మీ పగ, ప్రతీకారాలకు కారణభూతులైన బలరామ, కృష్ణులు ఇక్కడలేరు. మధుర భస్మీపటలం చేస్తే - నీ ద్వేషం చల్లారదు. అటువంటప్పుడు అవనసవర అనర్థానికి కారకుడౌతానంటే నీ ఇష్టం. ఆ దగ్ధ నగరం, నీ దుగ్ధ తీరుస్తుందా ? తీర్చదు, సరికదా ప్రపంచానికి మగధ చక్రవర్తి ఒక మాయని మచ్చగా నిలిచిపోతాడు.

ఆ మాట వినడంతో జరాసంధుడు కస్సుమన్నాడు. "నువ్విలాగే మాట్లాడు తుంటే, నీ నాలుక చీరేస్తాను. నా సహనాన్ని అసమర్థతగా తలవకు. జాగ్రత్త."

"ప్రభూ! నువ్వు సర్వ సమర్థుడవని ముందే చెప్పాను. కాకపోతే, శాంతిదూతగా వచ్చినందులకు కొంత ధైర్యం చేసి విషయం వివరిస్తున్నాను. అంతే!" అనుక్షణం వినయాన్ని ప్రదర్శించే అక్రూరుని ఏం చెయ్యాలో అర్థం కాక సతమతమవుతున్నాడు.

దాంతో జరాసంధునికి తగ్గక తప్పలేదు. కోపాన్ని తమాయించుకుంటూ, "అందుకే మహర్షి వన్నాను. సరే. ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు. ఆ పిల్లలు ఎక్కడికి వెళ్ళారంటావు ?" మెల్లిగా అడుగుతున్నాడు.

"చక్రవర్తి! తెలిసిన విషయాన్ని ఎవరైనా చెప్పగలరు. తెలియని విషయాన్ని ఎవరు మాత్రమెలాగ చెప్పగల్గుతారు. ప్రమాద నివారణోద్దేశంతో మధురను విడిచి వెళ్ళినవారిమానసమెలాగ వుంటుందో వూహించడం కష్టం. కలహ నివారణం

కాబట్టి ఎక్కడో దాక్కుని, మీరు శాంతించిన తదుపరి వారు మళ్ళీ ఇక్కడకు రావచ్చునేమో!'' అనేసరికి -

"అక్రూరా! నేను కాదు నీవు నిజమైన శాంతి దూతవు. ముందు నీవు వెళ్ళు. మిగిలిన విషయాలు రేపు. నువ్వెళ్ళి ఆ బృహద్బలుని పంపు.'' సాలోచనగా జరాసంధుడు పలికాడు. అది రాజనీతిలో ఒక భాగమనుకున్నాడు అక్రూరుడు. అక్కడనుండి కదిలాడు.

జరాసంధునిలో కోపం స్థానంలో కొద్దిగా ఆలోచన - అందులో కొంత శాతం ''శాంతం' చోటు చేసుకుంటున్నాయి. అక్రూరుడు చెప్పిందంతా నిజమనుకున్నాడు. అందుకే తన సలహాదారుగా ఒకనాటి మధుర వాసిగా, తనకెంతో సమాచారమిస్తూ, తన కూతుళ్ళను సదా కంటికి రెప్పలాగ సంరక్షించిన, నమ్మకస్తుని పిలిపించమన్నాడు. వసుదేవుని సోదరుని కుమారుడైన దేవభాగుని రెండవ కుమారుడు బృహద్బలుడు. అతన్ని కనుక కదిపితే, భయంతో కొన్ని విషయాలను తప్పక తెలుసుకోవచ్చని అతనిని పిలిపించాడు - ఈ ఆలోచనలలో-

ఎదురుగ్గా బృహద్బలుడు, చక్రవర్తి ఆజ్ఞకోసం, ఎదురుచూస్తూ నిల్చున్నాడు.

బృహద్బలుడు ధైర్యవంతుడే కాని, చక్రవర్తి జరాసంధుని పేరు వింటే మాత్రం పిరికివాడిలా వణికిపోతాడు. విధిలేక అక్రూరునితో వచ్చాడు. ఇటువంటి పరిస్థితి నెదుర్కోవాలని తెలిస్తే, చక్రవర్తి ఎదుట పడకుండా, గాలితో సమానంగా పరుగెత్తుకు పారిపోయేవాడు. మృత్యుకోరలలోకి వెడుతున్నంతగా భయపడి పోయాడతడు. అతని భయాన్ని పసిగట్టిన జరాసంధుడు, చిరునవ్వులు కాకపోయినా, భయాన్ని పోగొట్టాలనే వుద్దేశంతో నవ్వుతూ పిలిచాడు. దాంతో అతనిలో భయం పోయి జరాసంధుని చెంతకు మెల్లిగా చేరాడు.

దీంతో అందరు చెప్పినట్లు నిజంగా మగధ చక్రవర్తి దుర్మార్గుడు కాడనుకున్నాడు. ''శుభమస్తు'' అని బృహద్బలుని ఆశీర్వదించిన చక్రవర్తి "తాతగారు బాగున్నారా నాయనా!'' అనడంతో మరింత దగ్గరయ్యాడతడు. మీ అమ్మ కులాసాగా వుందా ? నిజంగా బుద్ధిమంతురాలు. మీ తాతగార్కి సేవలు చేసి తరించిన ఉత్తమ ఇల్లాలని జరాసంధుడు ప్రస్తుతించాడు. ''రా, కూర్చో'' ఎంతో ప్రేమగా పిలిచాడు.

"అంతా బాగున్నారు. తాతగారంటే నాకు ప్రాణమని వినయంగా చెప్పాడతడు. ఒకసారి మా నగరానికి రా! ఈ రాకపోకలతో ఉభయ దేశాల మధ్యనున్న విద్వేషాలు చల్లారిపోతాయి. సంబంధ బాంధవ్యాలు పెరుగుతా యనడంతో, బృహద్బలుడు మరింత మురిసిపోయాడు. అక్కడ నుండి ఉగ్రసేనుల వారి పరిపాలన, వారసత్వ వివరం, అడగాలని కాకుండా, తెలుసు కోవాలనే కుతూహలాన్ని ప్రదర్శిస్తూ చక్రవర్తి అడుగుతుంటే, తనకు తెలిసినదంతా, ఆ కుర్రవాడు చెప్పేస్తున్నాడు. ఆసక్తిగా జరాసంధుడు వింటున్నాడు.

"చూడు బృహద్బలా! నువ్వు కనుక ఈ మధురకు యువరాజువైతే మధుర నాశనానికి నేను ఒడిగట్టను. నేను నిన్ను భావి మహారాజును చేస్తాను. నీకన్ని విధాలా తోడుగా వుంటాను. కాకపోతే.... మీరంతా ఆ కృష్ణుని మరచి, విడిచి పెడితే, నా సహకారం నీకు, మీ మధురానగరికి ఎల్లప్పుడు వుంటుంది. మరి ఆ కృష్ణుడు....!" చక్రవర్తి ఆగాడు.

సమాధానంగా బృహద్బలుడు కృష్ణుని వుద్దేశం మీకు మా పెదతండ్రి అక్రూరులవారు చెప్పి వుంటారు.

అయితే, కృష్ణుడు, ఈ రాజ్యానికి వారసుడు కాదా!

ఎన్నటికి..... కాదు! అతడు అనవసరపు సంక్షోభం సమసిపోయేటట్లు చూడాలనే ఇక్కడనుండి వెళ్ళిపోయాడు.

"ఎక్కడికి, హస్తినకా ?"

"కాదు. దక్షిణ దిశగా శాంతి కాముకుడై మరీ కృష్ణుడు వెళ్ళాడు." వివరంగా బృహద్బలుడు చెబుతూంటే, కనుగ్రుడ్లు చిత్రంగా త్రిప్పుతూ వింటున్నవాడు "వేణీ నదీ తీర ప్రాంత కరవీరపురానికి కృష్ణుడు వెళ్ళాడని తెలుసుకున్నాడు.

"సరే"నని తలూపిన చక్రవర్తి "నువ్వు యువరాజువైన క్షణంలో నా సంపూర్ణ సహకారం నీకు లభిస్తుంది." మళ్ళీ వాగ్దానం చేసాడు.

"జాగ్రత్త. రేపు నీకే విధమైన ఇబ్బంది లేదా కష్టమొచ్చినా నేనున్నానని మరచిపోకు"మని అభయమిచ్చి పంపిన చక్రవర్తి, ఆ మర్నాడు యధాప్రకారం - అక్రూర, బృహద్బల, గదాదులను రప్పించి, మళ్ళీ సమావేశమేర్పరిచాడు.అప్పుడు

చక్రవర్తి తనకు కావలసిన బలరామ-కృష్ణులు మథురలో లేని కారణాన, దానిపై దండెత్తి ప్రజానాశనం, అనవసర సంక్షోభం జరుపకూడదని నిశ్చయించుకున్నానని బాహాటంగా తెలిపాడు.

ఇది ఛేది దేశాధీశునకు సంతోషం కల్గించింది. మిగిలినవారు ఆశ్చర్య పోయారు. వాళ్ళందులో నుండి తేరుకునేలోగా జరాసంధుడు -

"అక్రూరా, బృహద్బలా! మీరు నాకు హితులు, సన్నిహితులు. బలరామ, కృష్ణుల కోసం యాదవులతో వైరం కొనసాగించలేను. మీరందరు ఇకపై నాకు మిత్రులు. ఇది సత్యం. ముందు ముందు, ఈ అక్రూరులు, ఆ బృహద్బలుడు కీర్తి గడిస్తారు. ఈ మథుర, మగధకు మంచి నమ్మకమైన నెచ్చెలి అవుతుంది. ఈ మాటలు ఎందుకో ఛేది దేశాధీశునిలో కొంత కలకలం సృష్టించసాగాయి.

ఇదేదో విపరీతానికి దారితీసేటట్లుందనుకున్నాడు. రాజనీతిలో శుక్రనీతి అందులో అవిభాజ్యాలోచనలకు, ఏకత్వంలో భిన్నత్వం. శుక్రనీతి వక్రనీతి అవుతుందని తలిచాడు. దమనఘోషుని ఆలోచనలను సమర్థిస్తున్నట్లు, మగధ చక్రవర్తి -

"కాబట్టి, మన బహుకాల, భవిష్యత్మైత్రీ చిహ్నంగా నాకు ఇరవై అయిదు ఏనుగులు, వంద రథాలు, ఇద్దరు బలిష్ఠుల బరువుకు తగ్గ బంగారం కానుకలుగా లేదా కప్పంగా సమర్పించుకోండి. సర్వం సమసిపోయి, సహృదయ వాతావరణానికి దారి చేస్తుందన్నాడు. ఈ మొత్తం నాకు రేపు రాబోయే పున్నమిలోగా సమర్పించుకోవాలి. పున్నమి పదిరోజులుంది. కాదంటే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుంది. నెయ్యమో, కయ్యమో తేల్చుకోండి! "హెచ్చరిస్తున్నట్లు చెప్పాడు. అలాగే మరోమాట... ఈ కప్పం చెల్లించామని విర్రవీగకండి. బలరామకృష్ణులు మధురలో అడుగుపెట్టిన మరుక్షణం వారిని నాకు అర్పించాలి. కాదంటే మారణహోమం. ఎదిరిస్తే మధురకే ముప్పు. గుర్తుంచుకోండి. చెప్పవలసింది గట్టిగా చెప్పాడా చక్రవర్తి. ఏమంటావు అక్రూరా ? "జరాసంధు"ని ప్రశ్న.

"కాదని ఏం చెయ్యగలం ?" కర్మమన్నట్లు చెప్పాడు అక్రూరుడు. "అది బుద్ధిమంతుల లక్షణం" తన రాజసాన్ని ప్రకటించుకుంటూ వికట్టాహాసం చేసాడు. "ఇక వెళ్ళండి మీరు" అని అక్రూరునితో చెప్పిన జరాసంధుడు "బృహద్బలా!

తాతగార్ని, మీ మాతృశ్రీని అడిగానని చెప్పు.'' అని సాల్వునివైపు తిరిగి -

"వెళ్ళు. వెళ్ళి మహారాజు మామాట మన్నిస్తాడో కాదని ధిక్కరిస్తాడో... తేల్చుకుని రా...!'' ఆజ్ఞాపించిన వాడు, దమనఘోషునివైపు తిరిగి -

"ఛేదిరాజా! ముందు మనం ఇదివరకటివలె మౌనం వహించకుండా, ఆ పిల్లకాయల ఆచూకీని తెలుసుకోవాలి. నా ప్రతిజ్ఞ నెరవేర్చుకోవాలి. ఇందుకు మనం సర్వసన్నద్ధం కావాలి.'' అంటూంటే -

"తప్పక కనుగొందాం.'' విదర్భ రాజకుమారుడు - రుక్మి వత్తాసు పలికాడు.

"ఇప్పుడు ఛేదిరాజు ఇరకాటంలో పడ్డాడు. అటు బంధుత్వం. ఇటు రాచరికం. ఏది కాదని కష్టాల్లో పడాలో తేల్చుకోలేకపోతున్నాడు. అప్పుడు "ఛేదిరాజా! ఆ పిల్లకాయలను కనుగొనడమేమంత కష్టం కాదు. ఇరవై రథాలు, యాభైమంది అశ్వికులు, ఈ కార్యక్రమాన్ని సునాయాసంగా నిర్వర్తించగలరు. మీకుకనుక వీలు కాకపోతే, మీ యువరాజు శిశుపాలుని, మీ బదులు పంపండి'' అన్నాడు.

అందుకు సమాధానంగా, పరిస్థితి తీవ్రతనర్థం చేసుకోగల దమనఘోషుడు "ఎందుకు ? ఆ కప్పం అందుకున్నాక మనమే బయలుదేరుదాం.'' తన అంగీకారాన్ని, రాచరికపుటెత్తులలో భాగంగా తెలిపాడు.

జరాసంధుని ఎత్తులు, శిశుపాలుని ధూర్తవర్తనం తెలిసిన దమనఘోషుడు, తెలివిగా తానే కృష్ణుని ప్రయాణ రహస్య ఛేదనంలో ఒక భాగమయ్యాడు. తానే చొరవ తీసుకుని ముందడుగు వేసాడు. ఇదంతా మూర్ఖుడు అజ్ఞానియైన, మేనల్లుడు బృహద్బలుని వలన ఏర్పడిన సంకటస్థితిగా తలచి, ఆ విషమ సమస్యను పరిష్కరించడానికి, జరాసంధుని కన్న ఘనుడు, బలుడైన కృష్ణుని ప్రాపు నొందడానికి వేసుకున్న పథకంతో తొలి అడుగు వేసాడు.

# గోమంతకం

**ఆ** గోమంతకంలో - గతంలో పరశురాముడు ఆరాధ్యుడు. ఇప్పుడు, కృష్ణుడు, ఇక్కడే అంతకుముందు పరిపూర్ణ వ్యక్తిత్వం సంతరించుకొని బలరాముడు కృష్ణునితో కలిసినా, వారు తమ తమ ప్రత్యేక వ్యక్తిత్వాలతో విరాజిల్లు

తున్నారు. ఆ గరుడ వంశీయులకు ఆరాధ్యులై ప్రకాశిస్తున్నారు. బలరాముడు, కృష్ణుడు చూడటానికే ఇద్దరు తప్ప - "పరమాత్మ - జీవాత్మలవలె" ఒక్కరే.

సాధారణ జీవితంలో బలరాముడు, కృష్ణుడని చెప్పుకుంటారు. కాని విజ్ఞులు వారిని బలరామ-కృష్ణులు గానే వ్యవహరిస్తారు. ఆత్మ-పరమాత్మ అభేద స్వరూపమన్న సంగతి తెలిసినవారు బలరామకృష్ణులను, విడివిడిగా చూడరు. మొదట్నుంచీ, తనకంటూ ప్రత్యేకతను ప్రకటించుకోని బలరాముడు - "కృష్ణ" భాగస్వామియై, కృష్ణాంతర్భాగమైనవాడు ఇప్పుడు లోకం దృష్టిలో - సూర్యుడు సూర్యకాంతివలె రెండుగా కనబడుతున్నారు.

గోమంతకం - బలరామునికెంతో నచ్చింది. ఇక్కడంతా ఆనందమూర్తులే తప్ప, భిన్న ప్రకృతుల వైరుధ్య స్వభావులు కారు. ప్రేమాభిమానములు, గౌరవ మర్యాదలు పుష్కలంగాకల పుణ్యమూర్తులు వారు. అందుకే పరశురాములవారు తమను బాహ్య ప్రపంచం నుండి అంతర్లోక దర్శనం చేయిస్తున్నట్లు ఇక్కడకు తీసుకువచ్చారని ఎంతో ఆనందపడ్డాడు.

దేవజాతికి చెందిన సుపర్ణుని వంశీయులైన ఈ గరుడులంటే బలరామునికి ప్రత్యేకాభిమానం ఏర్పడింది. దాంతో వారిలో ఒకడయిపోయాడు. ఆనందలోకాల విహరించే స్వతంత్రుడైపోయాడు. మధ్యాహ్నంవేళ విశ్రాంతి తీసుకుంటూ, గోమంతకం అనుపానులు తెలుసుకోవాలనుకున్న కృష్ణుని పరిహసిస్తూ "సుఖపడటం చాతకాని పెద్దన్న" అన్నట్లు నవ్వేవాడు.

"అన్నా! నువ్వు నవ్వుతున్నావు సంతోషమే కాని, ఒకనాడు మనం జరాసంధుని ఇక్కడనుండే ఎదుర్కోవలిసి వస్తుంది. కనుక - అనేసరికి - "కృష్ణా! ఇంకా చిన్నపిల్లవాడి లక్షణాలు పోలేదు. సుఖపడే వయస్సును శోకసంద్రం చేసుకుంటూ ఎప్పుడో, ఏదో జరుగుతుందని ఎందుకీ వేదన ?"

"నిజమే, అన్నా! ఎప్పుడో - ఏదో జరుగుతుందన్నావు. అది తప్పక నిజం. దాహానికి, ఇతర అవసరాలకు మంచినీరు కావాలి. దానికి తగు ఏర్పాట్లు ముందునుండే చేసుకుంటారా ? దాహం వేసినప్పుడు చూద్దామని, నీటికోసం అప్పుడు పరుగులు తీస్తావా ? వూ....!"

అయినా, "నీ ఇష్టం నీది" అనడంతో బలరాముడు; కృష్ణుడు అన్నగారి వుద్దేశాలను కాలానికి వదిలినట్లు వదిలి ముందుకు సాగితే, కృష్ణుని దయాపాత్రుడై,

సర్వ సమర్థ జీవితానికి మార్గమొందిన వైనతేయుడు కృష్ణుని నీడలా అనుసరిస్తున్నాడు. వినతాసుతుని నూతన జీవనంతో, ఆ గరుడసంతతి యావత్తు కృష్ణుని కదలికల కనుగుణంగా నడువసాగింది. దీంతో అన్నదమ్ములిరువురు వారి వారి, అభిప్రాయాలలో కృతకృత్యులయ్యారు.

గరుడుని సహచర్యంలో కృష్ణుడు గోమంతకాన్ని అణువణువునా పరికించాడు. దానికున్న రహస్య మార్గాలు రక్షణ సూచికలు సర్వం గ్రహిస్తున్నాడు. విశ్రాంతి సమయంలో మానవులు, వారి జీవిత ధర్మాలు, ఆశావాదం, అందలి సుఖ సంతోషాలు, ఈతిబాధలు సర్వం స్మరించుకుంటున్నాడు. ఇంకొన్ని సమయాలలో తనను పెంచి పెద్దచేసిన నంద యశోదలు, వారి వియోగ దుఃఖం తలచుకుని, తలచుకుని బాధపడుతున్నాడు. అప్పుడే మరువలేని రాధ కృష్ణుని మనస్సు నాక్రమించుకుంటుంది. కళ్ళల్లో నాట్యం చేస్తుంది.

ఈలోగా కనీ, పెంచలేక, ముద్దు ముచ్చట్లు చూడకపోయినా జననీ జనకులు దేవకి వసుదేవులు గుర్తుకు వస్తున్నారు. అప్పుడే మరణించిన తన సోదరులు, కంస దౌష్ట్యం, జరాసంధ ప్రతీకార వాంఛ, దుఃఖమెరుగని నంద నందునునికి, ఆ తల్లి బాధల చూపులు శరీరమెల్ల ఆవరించడంతో అందరివలే ఆశానిరాశలకు లోనయ్యాడు. మనిషిగా పుట్టినందులకు ఈ లోకంలోని సర్వ సుఖములు, దుఃఖములు వెంబడించినట్లు భక్తజన దాసానుదాసుడు. కర్మదాసుడై కాస్సేపు విచారగ్రస్తుడయ్యాడు.

అంతలో ఉద్ధవుడు, అతని సహచర్యం గుర్తుకొచ్చాయి. అయినా కృష్ణుడు గరుడజాతి వారితో తామరాకుపై నీటిబిందువయ్యాడు. కలిసి మెలిసి తిరుగుతున్నాడు. ఆటపాటల ఆనందిస్తున్నాడు. తన చెలిమితో అందర్నీ ఆనందపరుస్తున్నాడు.

అందరితో కలిసి ఆటపాటలే కాదు. వారి ఆయుధ సంపత్తిని గ్రహించాడు. అందలి మెళుకువులు పరిశీలించాడు. ప్రయోగ - ఉపసంహారాలలో సఫలీకృతుడయ్యాడు. ఇక గరుడుల నాయకుడు ఆర్తేయుడు. అగ్నికి భక్తుడు. భక్తిశ్రద్ధలతో ఆర్తేయుడు చేసే హోమాలకు అగ్నిభట్టారకుడు సంతోషించి, రాళ్ళను ఎట్టటి లోహంగా మార్చి కరుణించేవాడు. వాటిని బాణాలకు ములుకులుగా తాము ఉపయోగిస్తే, గరుడ వీరులు కఠినశిలలతో చేసిన ములుకులను వుపయోగించుకునేవారు.

నాగరిక ప్రపంచం నుండి వచ్చిన కృష్ణుడు, అధినాయకుని అనుమతితో,

కొన్ని కొన్ని ఆయుధాలను రూపొందింపచేసి, వాటి వుపయోగంలో శిక్షణనివ్వడం, ఆధునిక ప్రపంచానికి దగ్గర చేయడం చేస్తున్నాడు. అగ్నిమిత్రుడైన వాసుదేవుని సారథ్యంలో వైనతేయునికి తామ్ర (రాగి) లోహ వుపయోగంలో శిక్షణనిచ్చాడు.

కేవలం విల్లంబులే తెలిసిన వారికి, గరుడుని సహకారంతో కత్తులు, డాళ్ళు, బాణాలకు మొనదేలిన ఇనుప ములుకులు.... ఒక్కొక్కటే తయారుచెయ్యడం అందులో వారికి అవగాహన కల్పించి, తగు శిక్షణనివ్వడంతో, కృష్ణుని రాక వారికెంతో ఉపయుక్తము, ఆనందదాయకమైంది. కొండలపై లావా చిమ్మే అగ్ని శిలలను పనికిరాని వాటిగా తలచి విసిరేసే గరుడ నాయకుడికి వాటి ఉపయోగం తెలియబరిచాడు.

పవిత్రాగ్ని పుట్టించడం, దానిని మంత్రయుక్తంగా ఆజ్యధారలతో, ఆహుతలర్పించి, ఆరాధించడం వగైరా ఎన్నో పద్ధతులను కృష్ణుని నుండి వారు తెలుసుకున్నారు. ఒకనాటి రాత్రి అగ్ని ప్రజ్వరిల్లింది. ఈ మంటలను చూస్తూ ఆనందిస్తూన్న కృష్ణుడికి అగ్నిభట్టారకుడు సంతోషించి, రాళ్ళను, తామ్రలోహంగా మార్చడం, అది కరగి ప్రవహిస్తూంటే దానినొక సన్నని దారిలో పంపిస్తూంటే వినతాసుతుడు, దానిపై నీళ్ళు చల్లడం గమనించారు. ఇదంతా గమనించే కృష్ణుడు ఇతరత్రా సామాన్య ఆయుధాలకు కొన్ని రకాల సాంప్రదాయ పద్ధతులకు అలవాటు పడిన ఈ గరుడ జాతికి దైవశక్తికి మూల స్వరూపులైన దివ్యాస్త్ర సంపదను అర్జించి పెట్టాలని తలిచాడు.

అయితే ఆ మొత్తం కరగించడం అగ్నిదేవునికి కష్టతరమవడంతో, కొబ్బరినూనె, చందనం వగైరాదులను ఆజ్యంగా సమర్పించి, తన అపురూప కార్యక్రమానికి మార్గం సుగమం చేసాడు. ఇది కృష్ణుని కథ అయితే -

తనదైన పద్ధతిలో తాను స్వతంత్ర జీవనం గావిస్తున్న బలరాముడు మధ్యాహ్నం నిద్రపోతున్న తరుణంలో, వున్నట్టుండి ముక్కుపుటాలకు, చందన కొబ్బరినూనె, వగైరా సుగంధ వాసనలు సోకడంతో "ఎక్కడ నుండి వస్తుంది. ఈ వాసన''లని కళ్ళు తెరిచాడు. ఇన్నాళ్ళలో ఇటువంటి సుగంధ వాసనలు ఆస్వాదించని బలరామునిలో ఆశ్చర్యం - ఆసక్తి ఏర్పడ్డాయి. వివరం తెలుసుకోవాలని లేచి ముందడుగు వేసాడు.

అడుగులు వేస్తూ చెట్లు నుండి తెల్లటి పాలవంటి సుమధుర వాసనల ద్రవం కారడం గమనించి ఆశ్చర్యపోయాడు. దాంతో గబగబ ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి

దోసిలితో ఆ ద్రవాన్ని తీసుకుని త్రాగాడు. ఎంతో రుచిగా, మధురంగా వుంది. అటువంటి రుచిని గతంలో తానెప్పుడు చూడని బలరాముడు, మళ్ళీ మళ్ళీ ఆ పాలవంటి ద్రవాన్ని త్రాగాడు. ఎంతో ఆనందం కల్గింది. ఆకాశాన్ని చూసాడు. దివ్యకాంతులతో పులకరించి, పరవశింపచేసే ఆ మధుర ప్రకృతికి సహజంగా మురిసి, తెలియకుండా గాలిలోనే నాట్యం చెయ్యడం ప్రారంభించాడు.

ఆ ఆనందంలో తియ్యటి ఆ పాలవంటి మధుర ద్రవాన్నెంత త్రాగాడో తెలియదు. త్రాగుతున్నాడు, పరవశిస్తున్నాడు. పులకరించి గాలిలో తేలుతున్నట్లు మురిసి, ఆనందనాట్యంలో తేలియాడుతున్నాడు. ఆ తమకంలో అందర్ని ఆలింగనం చేసుకుంటున్నాడు. ఆనందం తాండవం చేస్తున్నాడు. అప్పుడు అప్పుడు... బలరామునికి, కృష్ణుడు జ్ఞాపకం వచ్చాడు. అతని కుటీరానికి వెళ్ళాడు.

అన్నగారిని చూసిన కృష్ణుడు "ఏమిటలాగ వున్నావు ?" అడిగాడు. "అదా! నేను అమృతం కనిపెట్టాను. ఆ అమృతానుభవంలో వుండిపోయాను" చెప్పాడు. ఇక్కడ చెట్లన్నీ చిత్రంగా అమృతాన్ని కురిపిస్తున్నాయి. రా! నువ్వు కూడా ఆ ఆనందాన్ని.. అదే అమృతానుభవాన్ని పొందుదువుగాని" ప్రేమగానే బలరాముడు పిలిచాడు.

"వద్దు. ప్రస్తుతం నేను ఆయుధ సేకరణ, నిర్మాణాలలో వున్నాను." కృష్ణుని సమాధానం.

"ఆయుధాలా ? అవెందుకు ?' అమాయికంగా బలరాముని ప్రశ్న.

"జరాసంధుని ఢీకొనాలి కదా!" అంటూ తన ప్రయత్నాలను చెప్పాడు.

"అలాగా!" నాకే ఆయుధమవసరం లేదు." అని అటు ఇటు చూసి, అక్కడ నాగలి దున్నుతున్న వారి వద్దకు వెళ్ళాడు. కాడికి కట్టిన ఎడ్లను విడిచి ఆ నాగలి భుజానకెత్తుకుని "ఇది చాలు నాకు. పగతురలను పరిమార్చడానికి!" అన్నాడు. ఆ హలాయుధము ఇటు సస్యరక్షణకు, అటు శాత్రవ శిక్షణకు గూడా పనికి వస్తుందన్న తన అభిప్రాయాన్ని ఆయుధం ద్వారా బలరాముడు సూచించాడు. కృష్ణుడు అన్నగారి బుద్ధి తత్పరతకు ఎంతో సంతోషించాడు.

ఒకనాడు కృష్ణుడు, గరుడునితో కలిసి, గోమంతకం క్రిందకు దిగాడు. ఆ పరిసరాలన్ని నిశితంగా పరిశీలించాడు. ఆ భాగమంతా సముద్ర కోతకు గురయిన ప్రదేశం. దీనిని కనుక జాగ్రత్తగా పరికించి, పరిరక్షిస్తే శత్రు దుర్భేధ్యమౌతుందని తలంచాడు. దీనికి మార్గం అన్వేషిస్తూ కొండపైకి వచ్చిన కృష్ణుడు అన్నగారు

అమృతానుభవంలో ముగ్గురు స్త్రీ సేవకులతో ఆనందా పారవశ్యులవడం చూసాడు.

బలరాముడు కూడా తమ్ముడిని, అధినాయకుని కుమారుని చూసాడు. "తమ్ముడూ! ఏమానందం! అప్సరసలు, అమృతం.... అంటూ పరవశిస్తూ వాళ్ళకు "వారుణి, కాంతి"శ్రీ" అని పేర్లు పెట్టానని, అబ్బ... ఈ జీవితం ఎంత గొప్పగా వుందో, భలే భలే ఇక్కడికి తెచ్చి నన్ను ధన్యుడిని చేసావు!" కృష్ణుని ప్రస్తుతిస్తున్నాడు.

"అవునవును నిన్ను తెచ్చి భలే ముప్పులో పడ్డాను, ఇప్పుడు జరాసంధుడు వస్తాడు. నా తప్పును సరిచేసినట్లు నిన్ను చావగొడితే, శరీరంలో ఏ భాగం నీ మాట వినదు. ఒక్క అమృతపానం మాత్రం నిన్ను మాయ చేస్తుంది. మనిషిని మందబుద్ధుని చేస్తుంది. జాగ్రత్త." నీ భవిష్యత్తు నీ చేతిలో వుందన్నట్లు కృష్ణుడు హెచ్చరిస్తాడు.

ఈ సమయంలో అలవాటుగా కరవీరపురం, ఇతర ప్రాంతాల వైపు సాగే గరుడుడు, హడావుడిగా కృష్ణుని సమీపించి "ప్రభూ!" అన్నాడు. తాను అనుకోకుండగా కరవీపురానికి వెళ్ళానని ఆ దేశరాజు, ఎవరో పెద్దరాజును ఆహ్వానించబోతున్నాడని తెలిసింది. అతను... పేరు గుర్తు రావడం లేదన్నాడు.

"జరాసంధుడు కాడు కదా!" కృష్ణుడు అనుమానంగా అడిగాడు.

"ఆ.... ఆ...! అవు"నన్నా గరుడుడే, ఆ జరాసంధుడు, కొందరు రాజులతో కలిసి వస్తున్నాడుట. కరవీరపురమంతా హడావుడిగా వుందన్నాడు. ఇది బలరాముడు విన్నాడు. అతని మత్తంతా దిగిపోయింది. తన చుట్టూ వున్న స్త్రీలను త్రోసేసి, "కృష్ణా! నువ్వు తయారుచేసిన ఆయుధాలేవి ?" యుద్ధానికి సన్నద్ధుడౌతూ అడిగాడు. అన్నగారి చెయ్యి పట్టుకుని "మరో కుటీరానికి తీసుకువెళ్ళాడు. అక్కడగల ఆయుధాలనన్నింటిని చూపాడు.

అన్నీ చూసిన బలరాముడు, ముందు వీటిని ఆరాధించి వీటికి మంత్రశక్తిగల పేర్లు పెట్టాలి" అన్నాడు. అలాగే కానీ, మరి నీ సంగతి.... కృష్ణుడడిగాడు. పూజా సమయానికి అన్నీ సిద్ధమవుతాయంటూ బయలుదేరిన బలరాముని, అలవాటుగా మధువునందించే సుందరాంగులు చుట్టుముట్టబోగా, వాళ్ళనొక్క త్రోపుత్రోసి, గొడ్డలి అందుకున్నాడు. ఒక పెద్ద చెట్టును నరక సిద్ధమవుతున్నాడు జరాసంధుడు. యుద్ధమన్న మాటలు విన్న బలరామునిలో తమపై ప్రతీకారం చెయ్యబోయే ప్రత్యర్థిని తుదముట్టించాలన్న ఆలోచన బలీయ మవసాగింది. ఆ వీరబలుడు తన ఆయుధ సంపత్తి సేకరణకు మొదలుపెట్టాడు.

ఆయుధాలు తయారయ్యాయి. వాటి ఆరాధన కార్యక్రమం ప్రారంభ మయింది. అక్కడున్న గరుడ వంశీయులనందర్ని ఆహ్వానించారు. ఆయుధపూజను మొదలుపెట్టారు. "కానీ కృష్ణా!" అన్నాడు బలరాముడు. "అలాగే.... నీ ఆయుధాలో.....!" కృష్ణుడడిగాడు. "పూజ ప్రారంభించు. అవే వస్తాయి!" బలరాముని సమాధానంతో కార్యక్రమం ప్రారంభమైంది.

ఆ సమయంలో ఇలాగ వెళ్ళి, అలాగ, ఒక పెద్ద నాగలి, అయిదు అడుగుల రోకలిబండతో బలరాముడు వచ్చాడు. "బాగుంది" అన్నాడు కృష్ణుడు. "ఇవే కాక మరొకటి" అంటూ కృష్ణుడు చక్రాయుధాన్ని చూపాడు. గరుడుడు తాను చేసిన కవచాలు, శిరస్త్రాణాలు వగైరాలు చూపించాడు. వాటి మధ్యలో మరో బంగారు కిరీటం. ఇది మీకోసం ప్రభూ!" కృష్ణుని చూస్తూ గరుడుడు అన్నాడు.

ఆ కిరీటాన్ని చూసి బలరాముడు ఆశ్చర్యపోయాడు. కళ్ళు విప్పారి చూసాడు. "నిజంగా బాగుంది" మెచ్చుకున్నాడు. బలరాముని హలాయుధానికి "సంవర్తక"మని, రోకలికి సౌనందమని, కృష్ణుని ధనస్సుకు శారంగమని, అలాగే... కౌమోదకం, సుదర్శనమని శంఖచక్రాలకు పేర్లు పెట్టబడ్డాయి. వాటిని దైవదత్తంగా భావించి పూజించారు.

"గరుడుడు - మా ఆయుధ సంపత్తికి అధిపతి. అతని పర్యవేక్షణ, రక్షణలో ఇవి వుంటాయి. ఇక జరాసంధుడే కాదు, ఎవరు వచ్చినా మా ముందు నిలువలేరు, గెలువలేరు" అంటూ కృష్ణుడు శంఖం పూరించినట్లు విజయాట్టహాసంతో చెప్పాడు. ఆ మాటలకు ఆ గ్రద్ధ జాతికి చెందిన సర్వశ్రేష్టులు సంతోషంతో అంబరాన్నంటే సంబరాలలో మున్గినట్లు ఎగిరి గంతులు వేసారు. బలరాముడు - తన హలాయుధ (నాగలి) ముసలాయుధా (రోకలి)లు ఎంతటి వారినైనా ఇట్లే చిత్తు చెయ్యగలవని ప్రకటించాడు.

"""""""""

## తృతీయోధ్యాయం

# గెలవాలి, తప్పదు!

**అ**నుకున్న సమయం రానే వచ్చినట్లుగా -

జరాసంధుడు - తన మిత్ర - సామంత - పరివారంతో కరవీరపురానికి వచ్చాడు. ఆ దేశాధిపతి శ్రీ గాలవ వసుదేవుడు, ఆ వచ్చినవారందరికి స్వాగత సత్కారం జరిపాడు. తగు విధాన విడిది నేర్పాటు చేసాడు. జరాసంధుని అనుసరించిన వారిలో -

ఛేది మహారాజు దమఘోషుడు, విదర్భ యువరాజు రుక్మి, శేబ్య యువరాజులు "విందాను, విందులు", దంతవక్రుడు, దరదుడు వగైరాదులు వున్నారు. మార్గమధ్యంలో చక్రవర్తి దమననీతికి వెరచి మరికొందరు కలిసారు. విదర్భ నుండి ఎత్తైన కొండలు, దట్టమైన అడవులలో ప్రయాణం కాస్త కష్టసాధ్యంగానే సాగింది. ఆ సమయంలో మౌనంగా ఓర్పు వహించడం తప్ప మరో మార్గమెరుగని మిత్ర, సామంతులు, అతికష్టమైనా ఇష్టంగానే మగధ చక్రవర్తిని అనుసరించాల్సి వచ్చింది.

జరాసంధ చక్రవర్తి, తన మిత్ర సామంతులతో గోమంతక పర్వత పాదభాగాన విడిది చేసాడు. ఆ పిల్లకాయల్ని రెండు దినాలలో "మట్టు"పెట్టి తిరిగి వెళ్ళవచ్చున్నది, చక్రవర్తి ఆశ. ఆ ఆశయానికనుగుణంగా ఇతర రాజులు వున్నారు. అక్కడ అడుగు పెట్టినప్పటి నుండి పీఠభాగం నుండి, శిఖరాగ్రానికి చేరే విధానాన్ని విస్తృతంగా పరిశీలిస్తున్నారు.

ఎవరో కొందరు పీఠభాగానికి వస్తున్నారు. దొర్లిస్తున్నట్లు బండరాళ్ళు దారి మూసేస్తున్నట్లు పడుతున్నాయి. అడుగు ముందుకు వెయ్యాలంటే భయం, ఈ మధ్యలో క్రిందకు జారితే అంతే సంగతులు. పైన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అక్కడుండేవారు వీరికి లొంగరు. వారిని కట్టడి చెయ్యడం కష్టం. కొండను చుట్టుముట్టడం. అక్కడ వున్నారనుకున్న బలరామ, కృష్ణులను పట్టడం, అనుకున్నంత సులభం కాదని జరాసంధునికి అర్థమయింది.

ఆ దిక్కుతోచని విషమ పరిస్థితిలో మౌనంగా ఛేది దేశాధిపతి ఒక్కడే వున్నాడు. మిగిలినవారు ఏదో రకంగా తమ అసహనాన్ని, అశక్తతను వ్యక్తబరుస్తున్నారు. బలవంతులతో విరోధం పనికి రాదని ఒక ప్రక్క, ఆపద సమయంలో తమ రాజ్యాన్ని ఆదుకున్నాడనే కృతజ్ఞత మరొక ప్రక్క దమఘోషుని, జరాసంధునికి సామంతుని చేసింది. అయితే, ఈ చక్రవర్తికి తగు ధీరుడు దీటుగా వుండాలి.

లేకపోతే పాంచాల హస్తినాపురాలను కూడా తన సామ్రాజ్య విస్తరణ కార్యక్రమంలో భాగంగా కలుపుకుని, ఆర్యావర్తానికి ఎదురులేని చక్రవర్తిగా మిగిలిపోతాడు. అలాగ కాకూడదు. అందుకే ఆతనిని ఎదిరించక, అతని ఆనుపానులను శాంతంగా భరిస్తూ మరీ ముందుకడుగు వేస్తూ ఈ సమయంలో ఇతర రాజ్యాధిపతుల భావజాలాన్ని కనిపెట్టిన దమఘోషుడు -

ఇప్పుడు మగధ సామ్రాజ్య విస్తరణ, కంసుని పరాక్రమానికి అడ్డుకట్ట వెయ్యగల్గిన వారు, బలరామ-కృష్ణులుగా దమఘోషుడు భావించాడు. తగు సమయం కోసం ఎదురుచూడటం, బుద్ధిమంతుల లక్షణమన్నది ఛేది దేశాధిపతి భావన.

“మిత్రులారా! ఇంతవరకు వచ్చి ఇప్పుడు వెనుకంజ వేయడం తప్పు మంచో, చెడో ముందుకు సాగుదాం. జయాపజయాల గురించి ఆలోచన తగదు. మన ప్రవర్తన వలన మన చక్రవర్తికి అపవాదు రాకూడదు. ప్రతిజ్ఞా భంగానికి మనం కారకులం కారాదు. విషయాన్ని వివరించి చెప్పాడు. అంతావిన్న జరాసంధుడు, రుక్మి గూడ “ఇప్పుడేం చేద్దాం, ముందుకు ఎలాగ వెళ్ళగల్గుతాం. మనం వచ్చిన పని సానుకూలమెలాగ చేసుకోగల్గుతాము” అడుగుతున్నారు. ఇది అందరిలోను గల ఆశ. “చెప్పండి” అడుగుతున్నారందరూ. అందుకు సమాధానంగా - దమఘోషుడు -

“ఇది ఎండాకాలం. ఒక్క నిప్పురవ్వ పడిందో ఎండిన చెట్లు పండిన చెట్లు వలన, పచ్చి-పిచ్చి మొక్కలు కూడా మాడిమసవుతాయి. కొండచుట్టూ మనం వుంటున్నాం. పైన వున్నవాళ్ళు క్రిందకు రావాలంటే, మన పాలపడతారు. లేదంటే ఆ మంటల్లో కాలిపోతారు. ఇంతకుమించిన సులువైన తెలివైన మార్గం మరొకటి ప్రస్తుతానికి మనముందు లేదు. తన ఆశావాదాన్ని, అవకాశవాదాన్ని వినిపించాడు. అందరు విన్నారు. జరాసంధుడు విన్నాడు. ఆలోచనలో పడ్డాడు.

ఇందులో ఏదైనా మెలిక వుందా ? ఎందుకంటే బలరామ కృష్ణులు. దమఘోషునికి మేనల్లుళ్ళు. ఎంతయినా మమకారం వాత్సల్యం, పెళ్ళాం మీద ప్రేమతో తెలియకుండానే పుడుతుంది. సావకాశం లేక రాక తనను విధిలేక అనుసరిస్తున్నాడు తప్ప, అదను దొరికితే తిరిగి ఎదురు దెబ్బ తియ్యగల సాహసి, తెలివిపరుడు ఈ దమఘోషుడు.... అందుకు ఇది ఆలోచన, కాదు కదా!

చక్రవర్తితోపాటు, విన్న మిగిలిన వారందరు ఛేదిరాజు సలహాకు సంతోషించారు. "అమలు చేద్దాం" అందరు అంగీకరించారు. చక్రవర్తి కూడా "సరే"నన్నాడు. పథకం అమలుపరిచారు. అంతే!

గరుడుడు రెక్కలు టపటపలాడిస్తూ అరిచాడు. ఉలిక్కి పడలేదు కానీ, నిద్రపోతున్నవాడు ఉన్నపాటున లేచి "ఏమయింది గరుడా ?" కృష్ణుడడిగాడు. మనల్ని పట్టుకోవడంలోని పథక భాగంగా, కొండకు నిప్పంటించారు. ఎటూ దిక్కుతోచని మనల్ని మంటల్లో మాడ్చి చంపాలన్నది వారి ఆలోచన! తన ఉద్దేశం చెప్పాడు.

బలరామ, కృష్ణ, గరుడ నాయకుడు, ఒక్కొక్కరే గుమికూడారు. పరిస్థితిని గమనించారు. అగ్నికి వాయువు తోడయ్యాడు. మంటలు తొందర, తొందరగా విస్తరిస్తున్నాయి. తాము తగలబడి పోతామనుకున్న గరుడ వంశాధిపతి ఆర్తేయుడు "కృష్ణా! పాహిమాం, పాహి... పాహి... నీవు దేవాధిదేవుడవు. అవతారపురుషుడవు. మమ్మల్ని అందర్ని రక్షించగల సర్వసమర్థుడివి" అని ప్రార్థిస్తూంటే, కృష్ణుని లీలావిశేషాలను అంతకుముందే కథలు, కథలుగా ఎన్నో విన్న గరుడులు "శరణు, శరణు కృష్ణా!" అని శరణాగతులయ్యారు.

భయపడకండి. మీ మీ ఆయుధాలను తీసుకోండి. అన్నా! మన ఆయుధాలను కూడా అందుకుందాం. వైనతేయా ? నిన్న మనం వెళ్ళిన మార్గం గుండా సముద్రాన్ని చేరుదాం. మీరంతా దీపాలు పట్టుకుని ముందు నడవండి. తప్పక మీరు రక్షించబడతారు. ఇది నా కర్తవ్యమని హెచ్చరించి, వినతాసుతునితో కృష్ణుడు కదిలాడు.

అందరు అనుసరిస్తున్నారు. కృష్ణుడు ఇప్పుడు శాసనకర్త. గోమంతకానికి సదా నీటినిచ్చే రెండు జలాశయాలు, ఆ కొండకు ఇరుప్రక్కలా వున్నాయి. ఇప్పుడు వాటి ఆనకట్టలను కనుక కొంతమేర కూలిస్తే ఆ నీరు కొండ పాదభాగానికి వెళ్ళి అక్కడ వరద ఉధృతి ఏర్పడుతుంది. దాని పరిసరాలలో వున్న వారందరు కొట్టుకుపోతారు. ఆ ఆలోచనను కృష్ణుడు అమలుపరుప చేసాడు.

అంతవరకు ఎంతో ఉల్లాసంగా, బలరామ, కృష్ణులు ఆ కొండ మీద గల ఇతర గిరిజనులు మాడి మసయిపోతారని తలచి, హాయిగా నిద్రకుపక్రమించిన

జరాసంధుని పరివారము, మిత్రసామంతులు, "హోరు"మని కట్టలు తెంచుకుని వచ్చే వరద నీటి తీవ్ర శబ్దానికి ఉలిక్కిపడి లేచారు. సముద్రపు నీరు తీవ్రవేగంతో పరుగెత్తుకు వస్తుంది. అరక్షణం ఆలస్యం చేస్తే తాము మొత్తం ఆ వరద తాకిడికి ఎలాగ కొట్టుకుపోతారో, వుంటారో, వుండరోనన్న భయంతో గిజగిజలాడుతున్నారు.

"కృష్ణా! అసాధ్యుడివి. జరాసంధుడే కాదు అందరు అనుకున్నారు."

మంటలు ఆరిపోయాయి. మంట పెట్టిన వారిని వరద భయపెడుతుంది. "ఏం చెయ్యాలో ?" అని అనుకునేలోగా, ఆ గిరి పుత్రుల నుండి, బల్లాలు, బాణాలు, తరిమికొడుతూ, తమ ఆయుధాలను అందుకోవడానికి గాని, ప్రాణాలు దక్కించుకుని, పారిపోవడానికి గాని సమయం లేకుండా చేస్తున్నాయి. ఆ గరుడులు విజృంభిస్తున్నారు. పెద్ద నాగలి, ముసలాలతో ఓ భారీ శరీరం, అతడు బలరాముడై వుండాలి.

మరొక ప్రక్క ధనుష్టంకారం చేస్తూ, నీల మేఘశ్యాముడైన కృష్ణుడు, ప్రతి బాణం వ్యర్థం కావటం లేదు. దాని ధర్మమది నెరవేరుస్తూ, దాని పరువు, వేసిన వారి ప్రతిష్ట నిలబెడుతూ సాగుతున్నాయి. ఇటు వెల్గురేఖలు అటు గ్రద్ద జాతి వారితో కలిసి, బలరామ-కృష్ణులు జరిపే సమరం. పరిస్థితిని గమనిస్తూన్న రుక్మి "అడుగో కృష్ణుడు" అని తనకు తెలిసిన ఆ వ్యక్తిని తన వాళ్ళకు చూపాడు.

ఎవరి మట్టుకు వారు తాము కల్పించిన ఉపద్రవం నుండి అవతలివారు బయటపడి తమను ముప్పతిప్పలు పెడుతూంటే, తమ తమ పద్ధతులలో ప్రత్యర్థులను ధీటుగా ఎదుర్కొని చిత్తు చెయ్యాలని తలుస్తున్నారు. ఇది రెండు పక్షాలలోను బలీయమైన ఆశ, గెలవాలనే ఉత్కంఠ!

కృష్ణుడు తన విల్లంబులను గరుడ యువరాజు కొసగి, తాను చక్రం స్వీకరించాడు. పగతురను చీల్చి చెండాడగల అపురూప శక్తివంతమైన సుదర్శన చక్రం. అట్టహాసంతో కృష్ణుని ఢీకొట్టాలని తలచిన యువరాజు గోనర్థుడు ముందుకు వస్తూంటే, అతని ప్రాణం తీసింది. తల తెగి నేలమీద బడటంతో, అనువిందుడు మొదట్లో బిత్తరపోయినా, తన తత్తరపాటును కప్పి పుచ్చుకుంటూ ధనువు అందుకున్నాడు.

దానిని చూసిన కృష్ణుడు “అనువిందా! మనమిరువురము. సాందీపుల వారి “గురు” శిష్యులం. అంటే “సోదరులం. మనలో మనం యుద్ధం చెయ్యరాదు” అని సుదర్శనాన్ని విడిచాడు. అది అనువిందుని చుట్టు తిరిగి, అతన్ని భయ కంపితుడిని చేసి, తిరిగి తిరిగి కృష్ణుని చేరింది. అనువిందుని చేతిలోని ధనువు అలాగే జారిపడిపోయింది.

రుక్మి ముందడుగు వేసాడు, అతని చేతిలోని వింటిని, అమ్ముల్ని చక్రం ముక్కలు చేసింది. కృష్ణుడు “కైశికుని మనుమడివి కావున బ్రతికిపోయావు. వెళ్ళు. సాహసాలు విడిచి మరీ బ్రతుకు” గట్టిగానే హెచ్చరించాడు. అదే క్షణంలో పాంచ జన్య ఘోష “అదెక్కడ నుండి అని ఆ శబ్దం వైపు చూస్తే శంఖమూదుతూ ఉద్ధవుడు కనబడ్డాడు.

సూర్యసంచారం, గ్రద్దల స్వైర విహారం, ఆటవికులనబడే వారి నుండి విల్లమ్ములు, బల్లేలు, అరుపులు, కేకలు, అందర్ని భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. మరియొక ప్రక్క ఎంత ఎత్తున వున్నా సముద్రపుఘోష. ఉవ్వెత్తున లేచే అలల తాకిడి. ఆటవికులలో ఇంతటి ప్రతాపాన్ని ప్రేరేపించిన బలరామ-కృష్ణులంటే ఛేది దేశాధిపతికి చూస్తూండగా భక్తి, గౌరవాలు ఏర్పడ్డాయి. ఇదే సమయంగా “జై, వాసుదేవా” జైజై! వాసుదేవా!” అంటూ తన సేనలతో కృష్ణునివైపు పరుగుదీసాడు.

బలరాముడొక ప్రక్క. కృష్ణుడొక ప్రక్కన వున్నారు. బలరాముడు ఎర్రటి కళ్ళతో ఎక్కువగా త్రాగి వున్నాడు. అయినా అతని హలాయుధం, తన ప్రతాపాన్ని ప్రదర్శించాలని చూస్తుంది. ఢీకొన్న దరదుని తన సంవర్తకంతో ఒక్క దెబ్బ తీసాడు. అతడు తల పగిలి చచ్చాడు. ఆ వెంటనే “ఎక్కడ జరాసంధుడు ? రా! రమ్మంటూ రెచ్చిపోయి పిలుస్తున్నాడు. ~~ఈ~~ పిల్లలతో ఇలాగ పోరు వుంటుందని, పోరవలసి వస్తుందని తలవని జరాసంధుడు ఆగ్రహంతో తన దండంతో ముందుకు వచ్చాడు.

బలరాముడు తన హలాయుధాన్ని ప్రక్కనున్న వారికిచ్చి దండ మందుకున్నాడు. ఇద్దరు, ఇద్దరే. ధీటుగా, ధాటిగా పోటీ పడుతున్నారు. ఎటొచ్చి

జరాసంధుడే అవమానం పాలవ్వాల్సి వస్తుంది. బలరాముడు కుర్రవాడు. జరాసంధుడు జగజెట్టి. ఓడిపోయాడో ఆ చక్రవర్తి తన వారందరిలో గల పరువు ప్రతిష్ఠలకు చెల్లుచీటి వ్రాయించుకోవాలసి వస్తుంది.

జరాసంధునిలో ముందుకన్న వెనుకడుగే బాగా కనబడుతుంది. బలరాముడు ఢీకొట్టడంలో అతని దండం చేజారిపోయింది. జరాసంధుడు అసహాయుడయ్యాడు. పాంచజన్యం ధ్వనించింది. అదొక విజయ సూచక సంకేతం. కృష్ణుడు అన్న బలరామునితో - "అతన్ని విడిచిపెట్టు. ఇంకా అతని చావుకు దేవుడు ముహూర్తం పెట్టలేదు'' గట్టిగా చేతిని పట్టుకున్నాడు.

అప్పుడు, అప్పుడు... జరాసంధుడు, బలరాముని పట్టుకు గింజుకుంటూ కృష్ణుని చూసాడు. ఇదే చూడటం. అయినా తెలియని ఆసక్తి, ఆనందం. అప్పుడు. జరాసంధునికి కృష్ణుని గొప్పదనం అర్థమయింది. అన్నగారి ఉడుం పట్టునుండి జరాసంధుని రక్షించి, "అనువిందా! చక్రవర్తిని నీ రథంలో త్వరత్వరగా తీసుకు వెళ్ళు!'' ఎవరికివ్వాల్సిన గౌరవం వారి కివ్వాలన్నట్లు కృష్ణుడు ప్రవర్తించడంతో, జరాసంధుడు నిజంగా కృష్ణ రాజనీతిత్వానికి అవాక్కయ్యాడు. తెలియకుండగానే అంజలి ఘటించినంత పని చేసాడు.

మరుక్షణం ఒక వీరాధివీరుడు, చక్రవర్తి, మగధ సామ్రాజ్యధీశుడు, జరాసంధ చక్రవర్తి, ఎవరినైతే చంపాలనుకున్నాడో ఆ గోపాలుని వలన సంరక్షించ బడటంతో, తల ఎత్తుకోలేక పోతున్నాడు.

# ఉద్ధవుడు

**కృ**ష్ణుని చూడాలనే తహతహ నరనరాలలో పెరిగి, పెరిగి - చేరాలనే ఉత్కంఠ చెలరేగి, చెలరేగి కృష్ణుడికై ఉద్ధవుడు పరుగు పరుగున వచ్చేసాడు. తను విడలేని బంధంతో కృష్ణునికి తనను తాను అర్పించుకున్న ఉద్ధవుడు, కృష్ణుడు మధురను

వీడి సహ్యాద్రికి రావడానికెంతో కృషి చేసాడు.

భీష్మకుల వారి తండ్రికి సర్వం వివరించి, ఆయన సహాయంతో, కృష్ణుడు విదర్భ దాటడానికెంతో కృషి చేసాడు. అలాగే దమఘోషుని ఏకాంతంలో కలుసుకుని, పరిస్థితిని వివరించి, బలరామ-కృష్ణుల కరవీరపురం, అక్కడనుండి గోమంతక యాత్రకు పునరావాసానికెంతో సహకరించాడు. ఆ రకంగా ఉద్ధవుడు, ఆతని ద్వారా బంధుప్రేమతో దమ ఘోషాదులు తగు విధంగా సహకరించారు. అందుకే అందరిలోను ఛేది దేశాధిపతి, పరిస్థితిని బట్టి పథక రచనను చేస్తూ - కృష్ణ ప్రేమను పొందడానికి, తద్వారా జరాసంధుని జైత్రయాత్రకు అడ్డుకట్ట వేయడానికి తగు విధంగా స్పందించాడు.

దమఘోషుడు అనుకున్నట్లే వూహించని విధంగా ఆ రాజపథకం పారింది. జరాసంధుడు, తన మిత్ర సామంతులతో వెనుదిరుగాల్సి వచ్చింది. అప్పుడు, ప్రత్యక్షంగా కృష్ణ యుద్ధ నైపుణ్యాన్ని, చతురితను గమనించిన దమఘోషుడు శ్రీ కృష్ణునికి, చిన్నవాడైనా బహుపరాకులు పలికాడు. ఆ జయ జయ ధ్వానాలు కొందరికి ఆనందం, ఇంకొందరికి ఖేదమై కూర్చున్నాయి. ప్రత్యక్షంగా కృష్ణశక్తిని గమనించిన ఛేది దేశాధిపతి, బలరామ-కృష్ణులను, ప్రత్యేకించి ఉద్ధవుని ప్రస్తుతించకుండా వుండలేకపోయాడు.

కృష్ణుని చేరి "కృష్ణా! అందరు అనుకుంటున్నట్లు నువ్వు దేవుడివా ? అవతారపురుషుడివా ?" ప్రేమ - ఆప్యాయతలు కలబోసిన మమతానురాగాలతో అడిగాడు. సముద్రాన్ని శాసించావు. గ్రద్ద జాతి పక్షులను మహావీరులుగా రూపొందించావు. చక్రవర్తికి ప్రాణభిక్ష పెట్టావు. "అనగా" మామా! నాకెవరిమీద కోపం లేదు. కోపం పెంచుకుంటుంది మీరు. ఆ పాపం నుండి ప్రాయశ్చిత్తంగా మిమ్మల్ని సరిదిద్దడము, కాదని మూర్ఖిస్తే, కాలం మూడితే అవతలివారిని వారి పాపానికి పణంగా గురిచేయడం, నా లక్షణం. ఇది యుగధర్మం. అధర్మనాశనానికి, ధర్మ ప్రకాశానికే నేనీ లోకానికి వచ్చాను." తన ధర్మాన్ని కృష్ణుడు, ప్రభువుగా ప్రకటించాడు.

కృష్ణుని సారధ్యంలో గరుడుల ఘనవిజయానికి ఆబాలగోపాలం

సంతోషించారు. ఆ ఆనందోత్సవాలలో బలరామ-కృష్ణులు కూడా పాల్గొన్నారు. రెండు దినాలుపాటు దమఘోషుడు ఆతని సైన్యం కూడా గోమంతక పాదభాగంలో వున్నారు. తమ కృష్ణునిపై ఛేది దేశాధిపతి చూపించే ప్రేమాభిమానాలకు గరుడులు సంతోషించి, ఆ రాజుకు రాజమర్యాదలు నడిపించారు. ఎటొచ్చీ జరాసంధుడు, అతన్ని అనుసరించిన ఇతర రాజులు చిన్నబుచ్చుకున్నారు. చిన్నపిల్లల వద్ద తన అనాలోచిత నిర్ణయాలు, ప్రవర్తనతో తలదించుకోవాల్సి వచ్చినందులకు జరాసంధుడు కుపితుడయ్యాడు.

మూడోనాడు శ్రీకృష్ణుని ప్రతినిధిగా ఉద్ధవుడు కరవీరపురాధిపతికి, తమ రాకను తెలియబరుస్తు కబురు పంపాడు. బలరాముడు అది తగదని శ్రీ గాలవ్యుడికి అంతటి అర్హత, గౌరవం తగదని శ్రీకృష్ణునికి చెప్పాడు. అన్నగారి హెచ్చరికను కాదనకుండా “అన్నా! మన మర్యాద, గౌరవం మనం ప్రకటించుకుంటున్నాము. నిలుపుకుంటే అదృష్టవంతుడు కాదంటే ఆతని కర్మమన్నాడు.

“నీ ఇష్టం. నేను చెప్పిన ప్రతిదానికి ఔనంటూ కాదనడమే కదా - నీచర్య, ప్రతిచర్యలు! భార్గవుల వారు చెప్పినా ఇంకా ఆ దుర్మార్గుని గౌరవిస్తాననడం నీకే చెల్లింది. నువ్వు మంచివాడివిగా మిగిలిపో. నన్ను చెడ్డవాడంటే కర్మగా భరిస్తానన్నాడు.

అన్నా! నా వుద్దేశం నిన్ను కాదనడం కాదు. కరవీరపురంలో ఎందరో మహనీయులైన ఆచార్యులు, ధర్మ ప్రకాశకులు వున్నారు. వాళ్ళ దర్శనం కోసం, వాళ్ళ ఆశీస్సుల కోసం, నా - ఈ - ఆరాటమంతా అంటాడు. కృష్ణుని ఆదేశం ప్రకారం, ఉద్ధవుడు, వైనతేయుడు, ఇతర గరుడులతో కృష్ణ సందేశంతో కరవీరపురానికి వెడితే, కోట గుమ్మంలోనే వారిని, రాచ సైనికులు నిలువరించారు.

ఉద్ధవుని రాకను, కృష్ణ సందేశాన్ని వైనతేయుడు చెబితే, లోపలికి వెళ్ళి, ఉద్ధవాదులు వచ్చిన విషయాన్ని తెలియబరిస్తే, ఒక్క ఉద్ధవునే రమ్మన్నారన్న వార్తతో అతడు వచ్చాడు. మిగిలినవారు బయట వుండిపోతే, నిరాధారుడై తన ఆయుధాలనన్నింటిని, అచ్చటి అధికారుల కప్పగించి ఉద్ధవుడు రాజమందిరానికి బయలుదేరాడు. దుర్గమంగా వున్న నగర ప్రాంతం, కోట పరిసరాలు చాలా అందంగా వున్నాయి. అన్ని రకాల వస్తువులు వెండి, బంగారం, రత్నమాణిక్యాలు

అన్నీ అక్కడ లభ్యమవుతాయన్నట్లు దుకాణాలు అందంగా తీర్చిదిద్దబడ్డాయి.

నగరమంతా అందంగా అలంకరించబడి వుంది. ఇది నిత్యోత్సవ సంబరాల నగరమో... లేక.... ఆశ్చర్యంగా చూస్తున్న ఉద్ధవుని చూసిన రాజద్యోగి - ఈ నగర సోయగ సంరంభం వచ్చే జరాసంధ చక్రవర్తి కోసం తీర్చిదిద్దబడ్డది. వింటున్న ఉద్ధవుడు చిరునవ్వులు చిందించాడు. ఇంకా వీరికి జరిగింది తెలియదను కుంటాను. ఇంకా మగధ చక్రవర్తి వస్తున్నాడనే భావిస్తున్నారనుకుంటున్నాడు.

ఉద్ధవుడు కోటలో అడుగుపెడుతూనే, నాల్గుచక్రాల రథం లాగుతున్న ఎందరినో చూసాడు. పొట్టిగా అవయవాలన్నీ ఎక్కడివక్కడ అతుకున్నట్లు వున్న చిక్కని చక్కని అందమైన గడ్డం గల మనిషి అందులో వున్నాడు. బంగారు ఆభరణాలు, రత్న కిరీటంతో, ఆతడా దేశపు రాజని, ఆ ఠీవి, ఆ స్థితి - పరిస్థితి చెప్పకనే తెలుపుతున్నాయి.

వారి వారి పద్ధతులలో, భాషలో వారు తమ రాజును కీర్తిస్తున్నారు. వివిధ భాషలు, భిన్న సంస్కృతుల సమాహారమైన ఈ భారతంలోని ఒక తెగవారి, దేశ మీ కరవీరపురం. అంతా చూస్తూ తన ధర్మంగా ఈయనేనా మీ రాజు. "ఉద్ధవుడు" అడిగాడు. సమాధానంగా ఆ అధికారి ఎంతో వినయంగా "ఈయన రాజు కాదు. వాసుదేవుడు. దేవాధిదేవుడు" అన్నాడు.

"ఓ! నేను దేవాధిదేవుడనని చెప్పుకునే వసుదేవుని కుమారుడు కాని వాసుదేవు డితడేనా ?" కొంతలో కొంత విషయం తనకు తెలుసన్నట్లు సాలోచనగా అడిగాడు.

"నువ్వు పరదేశివి కదా మా దేవుని గురించి నీకు కొంచెం కూడా తెలియదు. మాకు తెలిసిన ధర్మం, శాస్త్రాలను బట్టి, ఈ వాసుదేవుడు సర్వాధికారి. దేవతా ప్రముఖుడు." అని చూపుడు వ్రేలితో కనురెప్పలను తాకి, తన భక్తి భావాన్ని ప్రకటించుకున్నాడు. ఈ మాటల్లోనే ఆ దేవుని రథం వీరి ముందునుండి సాగింది. అందరివలెనే ఆ అధికారి సాష్టాంగ నమస్కారమర్పించాడు. ఉద్ధవుడు తనదైన పద్ధతిలో వందనమాచరించాడు. దానిని గమనించిన శ్రీ గాలవ్యుడు ఒక్కసారి తేరిపార చూసాడు. రథం సాగిపోతుంది. ఉద్ధవుని అతిథులకు ప్రత్యేకించి రూపొందించిన అతిథి గృహానికి తీసుకువెళ్ళారు. ఈ మర్యాదలకన్న శ్రీ గాలవ్యుని

దర్శించడమే ముఖ్యోద్దేశం కల ఉద్ధవుడు ఆ రోజు అతి భారంగా గడిపాడు.

ఆ మర్నాడు ఉద్ధవుని శ్రీ గాలవ్యుని చెంతకు తీసుకు వెళ్ళారు. మందిరం వంటి ఆ అందాల రాతి భవనంలో అపురూప రత్న సింహాసనంపై శ్రీ గాలవ్యుడు నిజంగా దేవునివలెనే కూర్చుని వుండటాన్ని చిత్రంగా చూసాడు. ఆయన ప్రక్కన కొయ్యలాగ భయంతో బిగ్రబిగుసుకున్న ఆయన రాణీ, వారి సేవల నిమిత్తం సుందరమైన సుందరాంగులు. ఆమె ప్రక్కనో కుఱ్ఱవాడు. అతను యువరాజు అయుండాలి. ఆ ప్రక్కన వందిమాగధులు. ఇటు ప్రక్కన భజనరాయుళ్ళు - భక్తి - అర్చనా - కార్యక్రమాలు. ఆరతి పాటలు, దీప హారతులు.

ఉద్ధవుడు చిత్రంగా చూస్తున్నాడు. అపర పరమాత్మ లాగ, పరమాత్మకు జరిపే షోడశోపచారాలు చేయించుకుంటున్నాడు. అన్నీ చూస్తున్నవాడు, వున్నట్టుండి అదిరపడ్డాడు. వేదవేదాంగవేత్తలు, తమతమ స్వధర్మాలను విడిచి, ఈ "నర" రాజుకు, ఆ పరమాత్మను అర్చిస్తున్నట్లు వేదసూక్తాలతో ఆరాధించడమే అర్థంకాక క్షణకాలం గుండె ఆగినట్లయింది. ఏమిటీ చిత్రం ? ఆ మహాపండితుల, వేదమూర్తుల విన్యాసం. షోడశోపచార పూర్తయ్యాక, మరో అధికారి ఉద్ధవుని, వాసుదేవునిగా చెప్పుకునే ఆ పరమాత్మ సన్నిధికి తీసుకు వెళ్ళాడు.

సభా మర్యాదగా ఉద్ధవుడు నమస్కరించాడు. అందరికి భిన్నంగా నడిచే అతని నడతకు ఒక్కసారి తేరిపార చూసాడు. ఆపాదమస్తకం అతన్ని గమనించిన, ఆ దేవుడు "విదేశీ, నువ్వెవరివి ? ఎక్కడనుండి వచ్చావు ? ఈ వాసుదేవుని నుండి ఏమర్థిస్తున్నావు ? భయం లేదు, చెప్పు." అడుగుతున్నాడు.

అందుకు సమాధానంగా, "నా పేరు ఉద్ధవుడు. నేను శూరవంశీయుడు వసుదేవుని సోదరుడైన దేవభాగుని కుమారుడను. నేను, మా సోదరుడు వసుదేవ సుతుడు కృష్ణుడు పంపగా, ఆతని దూతగా, వారి సందేశంతో ఇక్కడికి వచ్చాను. నేను మీ నుండి ఏమీ కోరడం లేదు. ప్రస్తుతానికి అవసరం కూడా లేదు.

"కృష్ణుడు! వసుదేవసుతుడు. ఆ మధురవాశి. అతనితో మాకేం పనిలేదు. మాతో అతనికేం పని ? అవును. అతను గొల్లల కాపరి కదూ! మేనమామను చంపాడుట. ఆ అనాగరికుడు, చేసినదానికి భయపడి, నా మిత్రుడు జరాసంధుని

బారిపడక పారిపోయి, ఆ గోమంతకానికి వెళ్ళి శరణార్థి అయ్యాడు. ఇప్పుడా పునరావాసికి ఏం కావాలట ?

నిజంగా తను భగవంతునివలె, ఉద్ధారకుని వలె మర్యాదహీనుడై మాట్లాడుతున్నాడు. ఆ విధంగానే ప్రవర్తిస్తున్నాడు, అవును. అతనీపాటికి చచ్చిపోయి వుండాలే!'' తనకేదో తెలుసున్నట్లు మాట్లాడుతున్నాడు. అందుకు ప్రతిగా ఉద్ధవుడు "రాజా!'' అనగా, "ఏవిటీ !'' మేము రాజులమా ? ఎవరు చెప్పారు ? ఇక్కడున్నది జగదేక ప్రభువు వాసుదేవుడు. అది నీకు తెలియదా ?'' అని అందర్నీ ఒక్కసారి కలయ చూసాడు. అందరు అతడు భగవంతుడన్నట్లు ఎంతో వినయవిధేయతలతో చేతులు మోడ్చి వందనం చేసారు.

"క్షమించండి ప్రభూ. మీరు చెప్పినట్లు నేను పరదేశిని. ఇక్కడి ఆచార అలవాట్లు తెలియనివాడిని'' అన్నాడు.

"క్షమించండి. అంటే సరిపోదు. ఇక్కడికి వచ్చినప్పుడు ఈ దేశ అలవాట్లు, ఆచార సాంప్రదాయాలు వగైరాలు తెలుసుకుని మరీ రావాలి. ఏదో వచ్చాను. నాకు తెలియదు'' అనడం సమంజసం కాదు. "సరే క్షమించాను. ఇంతకీ నువ్వెందుకు వచ్చినట్లు, నీకేం కావాలి ?'' కొద్దిగా శాంతపడి, శ్రీ గాలవ్యుడు అడిగాడు.

"అయ్యా! నేను కృష్ణవాసుదేవుని దూతను. వారి ఆదేశంతో, వారి సందేశమందించ వచ్చాను. వారు తమను చూసి తమ అభివాదములు అర్పించుకుంటారుట. అందుకు మీ అనుమతి కోరి వచ్చానన్నాడు.

"ఈపాటికా కృష్ణ వాసుదేవుడు మరణించి వుండాలే ?''

"లేదు ప్రభూ! మా కృష్ణవాసుదేవుడు జరాసంధుని తరిమిగొట్టాడు. వారి అన్నగారు బలరామునితో విదర్భ రాజకుమారుడు రుక్మి, వగైరా, జరాసంధ మిత్ర సామంతులను గాయపరిచాడు. మహారాజు దరదుని వధించాడు. ప్రస్తుత పరిస్థితి ఇది.... !'' ఉద్ధవుడు చెప్పేదంతా విన్న శ్రీ గాలవ్యుడు - "ఉద్ధవా! భగవంతుని ఎదుట అబద్ధాలు చెబితే ఆ పాపం నిన్ను మసి చేసి వేస్తుంది. జాగ్రత్త. ఆ జరాసంధుడు ఏ క్షణంలోనైనా మా అతిధ్యమొంద ఇక్కడికి రావచ్చును. కనుక

అబద్ధాలు మాని నిజం చెప్పు.

"నేను చెప్పేది నిజం ప్రభూ. జరాసంధుడు అత్యంత వేగవంతమైన అశ్వ రథములో మగధకు తన వాళ్ళతో పలాయనం చిత్తగిస్తున్నారు. జగద్రక్షకులు, జగదేక ప్రభువైన మీకు తెలియని విషయం కాదే" వినయంగా ఉద్ధవుడు వివరిస్తున్నాడు.

ఇక అనవసర వాదం చెయ్యకూడదని తలచినా శ్రీగాలవ్యుడు "సరే, వెళ్ళు. వెళ్ళి నీ మిత్రుడు ఆ వసుదేవసుతుడు కృష్ణుడు మమ్మల్ని చూడ అనుమతించామని చెప్పు "ఇది మా కరుణకు చిహ్నమన్నాడు. మమ్ము విశ్వ ప్రభువైన "వాసుదేవుని"గా తలచి, పూజించాలని చెప్పామని కూడా చెప్పమన్నాడు.

"కృష్ణ వాసుదేవుడు...!" బుద్ధిలేని ఈ రాజును కృష్ణుడు ఎందుకు చూడదలిచాడో అర్థంకాని, అసహనంతో వూగిపోతూంటే, ఉద్ధవునో కుఱ్ఱకుంకగా చూసిన శ్రీ గాలవ్యుడు -

"ఉద్దవా! నీకు బుద్ధి లేదు. ఉండవలసిన వినయ విధేయతలు ముందే లేవు. విశ్వాత్ముడైన వాసుదేవుడెక్కడ వుంటే, అక్కడెవరో కృష్ణ వాసుదేవుడు. అతనికి భక్తుడనై నీ అహంకార ఆవేశాలు. వెళ్ళు - వెళ్ళి విద్యాబుద్ధులకన్న, ముందు వినయ విధేయతలు ముఖ్యమని తెలుసుకుని లేదా ఆ కృష్ణ వాసుదేవుని చేత చెప్పించుకుని, రా ? పో!" క్షమిస్తున్నానన్నాడు. అనవసరంగా మాకు కోపం తెప్పించి, ప్రాణాల మీదకు తెచ్చుకోకు!" ఆ మాటతో అక్కడున్న వారందరు తమ వాసుదేవునికి అంజలి ఘటించి నిల్చారు. ఉద్ధవుని చూసి ఇకిలించారు.

మరొక్కడప్పుడైతే, ఈ మొత్తానికి ఉద్ధవుడు ఆనందించేవాడు, ప్రస్తుతం... ఆ రాజమూర్ఖుని మూర్ఖత్వంతో కృష్ణునితో వైరమొంది ప్రాణాలకు చెల్లు చీటీ వ్రాయించుకుంటాడేమోనన్న భయంతో, అక్కడినుండి అనవసరంగా మరొక్క మాట వినడానికిష్టపడక కదిలాడు.

ఉద్ధవుని బాధించిన ఒకే ఒక్క విషయం - లోకంలో ఇద్దరు వాసుదేవులు లేరు. వుండతగదు. ఆ వున్నది నేనే.... నన్నే జగదేకప్రభువు. విశ్వాత్ముడు అన్న వదరు మాటలే నచ్చక, అక్కడ నుండి కదిలాడు. "సరే. ప్రభూ, మీ ఇష్టం!" అన్నాడు. ఆ మాటకు కస్సుమని, ఇతనికి పుణ్యలోకాలకన్న పాపలోకాలే

అవసరమనుకుంటాను. ధర్మమెరుగని, సత్యం తెలియని ఇతనికి సత్య ధర్మాలను రుచి చూపించి, ఇక నరక దారివైపు వెళ్ళనని చెప్పించండి. తీసుకువెళ్ళండి.

అంతవరకు అతన్ని కరుణించినట్లు పేక్షించిన అభినవ వాసుదేవుడు శ్రీ గాలవ్యుడు చెయ్యి వూపాడు. దాదాపొక ఇరవైమంది రాజులు (వాసుదేవ భక్తులు) ఇతన్ని తీసుకుపోయారు. ఈ మూర్ఖుడు కృష్ణునితో గూడా ఇదే విధంగా ప్రవర్తిసాడా ? అని అప్పుడనిపించింది. పరశురాముల వారు హెచ్చరించినప్పటికి బలరాముడు కాదంటున్నప్పటికి కృష్ణుడిక్కడకు వస్తాడనే సరికి ఉద్ధవుడు ఫలితమెలాగ వుంటుందోనని కలవరపడుతున్నాడు.

ఉద్ధవుని దిగుడు బావిలా వుండే ప్రదేశానికి తీసుకువెళ్ళి అందులో పడేసారు. ఆ బావిలోపడ్డ తర్వాత ఉద్ధవునికి తెలిసింది. అది బావికాదని, ఏదో గుహ మార్గమని, అదెక్కడికి పోతుందోనని ఆలోచనలో కృష్ణుని తలచుకుంటూ ముందుకడుగు వేసాడు. అడుగు పడుతుంది. అదేమిటో అర్థం కావడం లేదు. శ్రీ గాలవ్యుడు చెప్పిన నరకమై వుంటుందనుకుంటున్నాడు.

నాలుగడుగులు వేసేసరికి, సూర్యునికి అర్ఘ్య ప్రదానమిచ్చే ఋషి ప్రముఖులు దరిశనమిచ్చారు. పరుగు పరుగున వెళ్ళి వారి పాదాలపై పడ్డాడు. వారు మౌనంగానే తమ అభయమిచ్చారు. అర్ఘ్య ప్రదాన కార్యక్రమం జరుగు తున్నందువల్ల ననుకుంటాను.... వాళ్ళు మౌనంగా వున్నారు. ఆ మహనీయు లందరు చూడటానికి అస్థిపంజరాల వలె ఎముకల గూడుతో వున్నా, వారి ముఖాలలో ఎంతో తేజస్సు తొణికిసలాడుతుంది.

ఆ సమయంలో "ఉద్ధవా...!" అన్న ఎంతో ప్రేమామృత స్వరాన్ని ఉద్ధవుడు విని అటువైపు తన చెవులను నిక్కించి, దృష్టిని సారించాడు. అక్కడ చిరునవ్వులు చిందిస్తూ ఆచార్య సాందీపులవారి పుత్రరత్నం.... పునర్ధత్తుడు... అత్యాశ్చర్యకరంగా కనుపించాడు. అతన్ని సమీపించి, తన రాకలోని ఆంతర్యాన్ని తెలిపి, "అవును, నువ్వెందుకిక్కడ వున్నావని ? ఎంతో ఆతృతగా అడిగాడు.

అప్పుడు పునర్ధత్తుడు. కర్మ బలీయమైనది. ధర్మము వర్జించవీలుకానిది. ఈ శ్రీ గాలవ్యుడు వర ప్రసాదుడు. పూర్వం ఒకనొక సమయంలో, గాలవ్య

మహర్షి యాదవవీరులతో జైత్రయాత్రలో భాగంగా ఇక్కడికి వచ్చాడు. కరవీరపుర సంస్థానమేర్పడింది. ఈ దేశపు రాజు గాలవ్య మహర్షి కరుణతో సంతానం పొందాడు. మహర్షి కరుణకు, అదే వరప్రదానికి చిహ్నంగా, ఆ పుట్టిన బిడ్డకు శ్రీ గాలవ్యుడు" అని పేరు పెట్టుకున్నారు. వీరంతా విష్ణుభక్తులు, వాసుదేవుని ప్రియులై, ఆ స్వామి అర్చనాదులలో తరిస్తున్నారు.

తండ్రి మరణంతో రాజ్యానికి వచ్చిన - ఈ శ్రీ గాలవ్యుడు కలి ప్రభావంగా, ఆచార్యులను, ఋషి - ముని ప్రముఖులను, సంస్కృతీ సాంప్రదాయాలను కాలదన్ని, అనాదిగా పూజించే ఆ వాసుదేవుడు తానేనని, అందరు తనను ఆరాధించాలన్న పంతంతో, రెచ్చిపోయి, కొందర్ని ప్రలోభాలతో, కొందర్ని దండించి, కొందర్ని మందలించి సామ దాన భేద దండోపాయాల నుపయోగించి తన మార్గానికనుగుణంగా చేసుకున్నాడు.

సాంప్రదాయాలకు తిలోదకాలిచ్చేవారు సిరిసంపదలకు తలవొగ్గి ఈతని అడుగులకు మడుగులొత్తుతూ ఇతన్నే అనాది సిద్ధ - దేవాధిదేవుడు - వాసుదేవునిగా తలంచి పూజించసిద్ధబడ్డారు. కాదన్నవారికీ నరకం శరణ్య మయింది. మా దురదృష్టం కొద్ది మా తాతగారు రుద్రాచార్యుల వారు ధర్మం సత్యం, సత్యం శాశ్వతమైనదని, సిరిసంపదలు తృణప్రాయమని తలచే మనస్తత్వంతో, ఈ వాసుదేవుని త్రోసి రాజనేసరికి, కోపించిన శ్రీ గాలవ్యుడు, మా తాతగార్ని భయభ్రాంతులకు గురి చేసాడు.

విద్యార్థులను బెదరగొట్టి వెళ్ళగొట్టాడు. ఆశ్రమాన్ని ధ్వంసం చేసాడు. మా మేనమామలలో ఒకడు పారిపోయాడు. ఇంకొకడు విధి లేక శ్రీ గాలవ్యునికి శరణాగతుడయ్యాడు. కుమారుని కోసమైనా మా తాతగారు, గాలవ్యుని కీర్తిస్తాడని తలచాడు. అయినా రాజు ఆశ అడియాస అయింది. దాంతో ఆచార్యులు, ఋషివర్యులను లేకుండా చెయ్యాలని తలచాడు. మొట్టమొదటిగా తన నరకానికి మా తాతగార్ని, ఆ తదుపరి మిగిలిన ఆచార్యులను, ఋషి ప్రముఖులను వరుసగా ఈ నరకానికి పంపుతున్నాడు. ఈ రకంగా పదిహేడుమందికి ఈ నరకాన్ని చూపించాడు. అందులో మా తాతగారొకరు.

నేను నాగలోకం నుండి వచ్చాక జరిగింది తెలుసుకుని మా తాతగారి బదులు శ్రీ గాలవ్యుని ప్రార్థించి, వారిని కరుణించమని, మధ్యవర్తిగా వచ్చాను. తప్పక మీ తాతను వదిలేస్తాను. నువ్వు మాత్రం నన్ను ఆ పరబ్రహ్మగా భావించి, అనుక్షణం వేదోక్తుల కీర్తించాలన్నాడు. ఇది నాగలోకం కంటే నరకం కాదని, స్వయంకృతాపరాధంగా కాకపోయినా, నా అంతట నేను స్వతంత్రించి, ఈ నరకం పాలయ్యాను. ఏమైనా, నా తాతగారితో వుండగల్గినందులకు నాకెంతో ఆనందంగా వుందని చెప్పాడు.

పరలోకం నుండి నిన్ను సంరక్షించి తెచ్చిన ఆ కృష్ణుడే ఇప్పుడు, తన ధర్మావతార కార్యక్రమంలో భాగంగా ఈ నరకం నుండి, మహామహులనందర్ని రక్షించాలని మనస్ఫూర్తిగా వేడుకున్నాడు.

పునర్దత్తుడు, ఉద్ధవుని తాతగార్కి, ఇతర ఆచార్యవర్యులకు చూపించి, ఇతడు కృష్ణ భక్తుడు, ఆనాడు నా రక్షణకు వచ్చిన కృష్ణునికి, నీడగా వున్నాడని, విషయం వివరించి చెప్పాడు. అందరు కృష్ణలీలతో పాటు, ఉద్ధవుని రాకలోని ఆంతర్యాన్ని గూడా తెలుసుకున్నారు. అక్కడి పరిస్థితులను బట్టి ఆలోచిస్తే, ప్రతి నాల్గు రోజులకొకసారి ఇద్దరు అధికారులు వచ్చి "మీరు" శ్రీ గాలవ్యుని "వాసుదేవు"డని అంగీకరిస్తారా ? అని అడుగుతారు.

ఒప్పుకుంటే మోక్షం అంటే ఇక్కడనుండి విడుదల. కాదంటే వాళ్ళు తెచ్చిన ఆ పనికిరాని ఆహారం తీసుకుంటూ నరకబాధల ననుభవించాలి. గమ్యమెరుగని ఆ బ్రతుకు నుండి బయటపడి కృష్ణుని చేరితే, ఈ ఆచార్య ప్రముఖులు రక్షించబడతారు. "వాసుదేవుని"గా చెప్పుకునే ఈ మూర్ఖుడు నిజమైన శాశ్వత నరకాన్ని పొందుతాడు. కనుక తెలివిగా ఇక్కడనుండి తప్పించుకోవాలని పునర్దత్త, ఉద్ధవులు తలిచారు.

ఆ రోజు రానే వచ్చింది. దాదాపు మధ్యాహ్న సమయంలో ఇద్దరు అధికారులు, ఒక బుట్ట పట్టుకుని తొంగిచూస్తూన్నారు. ఉద్ధవుడు తెలివిగా వారిలో ఒకతన్ని పట్టుకు లాగాడు. ఆ ఉద్ధవ పట్టు ఉడుం పట్టుకు ఆ కుర్రవాడు క్రిందబడి పోయాడు. ఆ శబ్దానికి రెండవాడు ఎదురు తిరిగితే, ఉద్ధవుడు తనకు తెలిసిన

"ఇది సాందీపుల పట్టు" అని చిత్రంగా అతన్ని కదలకుండా చేసాడు.

"సాందీపుల వారి పట్టు" అనేసరికి అవతలివ్యక్తి "ఎవరు నువ్వు ? సాందీపులవారు నీకెలాగ తెలుసు ?" ఆత్రంగా అడిగాడు.

"నేను సాందీపులవారి శిష్యుడను!" అనేసరికి కళ్ళల్లో కళ్ళుపెట్టి చూసిన అతను "ఉద్ధవా, నువ్వా ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వా" అంటూ అతన్ని పట్టుబట్టి చూసిన ఉద్ధవుడు "మాకు వేదాలు నేర్పిన శ్వేతకేతూ, నువ్వా!" అంటూ అమితాశ్చర్య పోయాడు. ఆ రకంగా ఒకరి నొకరు పలుకరించుకున్నాక, నా ప్రక్కన, శ్రీకృష్ణ రక్షతో, నాగలోకం నుండి బయటపడిన పునర్దత్తుడు వాని మాతామహుల కోసం, ఆ తాత గారితో కలిసి, ఇక్కడ - ఈ నరకాన్ని చూస్తున్నాడు. ఎందరో ఆ శ్రీ గాలవ్యుని కాదన్న ఆచార్యవర్యులు, పరమపూజ్యులు ఇక్కడ బందీలై గడుపుతున్నారు. అన్నీ వివరంగా తనకు తెలిసినవి ఉద్ధవుడు చెప్పాడు -

అంతా విన్న శ్వేతకేతు, "ఎవరో క్రొత్తవారు వచ్చారు ? ఒక్కసారి వెళ్ళు, చూసి, రా!" అంటే ఇలాగ వచ్చాను. చూస్తే అందరు మనవాళ్ళే. చాలా సంతోష మన్నాడు. అతనిక్కడకు రావడానికి, ఈ భోగాలు పొందడానికి గల కారణం, ఉద్ధవుడు అడిగాడు. ఇటువంటి నీచపు బ్రతుకు, ఆ దుష్ట - మూర్ఖ - దేవాధిదేవుడననే దుర్మార్గుని సేవ చెయ్యడానికి, మహామహులు - ధర్మ వర్యులు- ఆచార్యులు జీవితాలతో ఆడుకోడానికి సిగ్గులేదూ ?

ఎందుకీ ఊడిగం ? ధనం కోసమా, అధికారం కోసమా ? వేదాభ్యాసం చేయించే నాటి తేజస్సు ధర్మస్వరూపం, ఈ అధర్మ ప్రవర్తనం ద్వారా మసిబాసి మాడిపోయింది. ఈ మాటల్లో ప్రక్కనెవరో కదులుతున్న అలికిడి. శ్వేతకేతు "ఉష్". జాగ్రత్త!" అంటూ హెచ్చరిక చేసాడు. అతనికి మెలకువ వస్తే, మనమంతా ఒక్కటనే గుట్టురట్టువుతుంది. శ్వేతకేతు ఎంతో మెల్లిగా చెప్పాడు.

అతనే మళ్ళీ "నా సంగతి సరే. మీరిక్కడకెందుకు వచ్చారు ? మీ కథేమిటి ఎంతో కుతూహలంగా అడిగాడు.

చెప్పడానికేముంది, ఇదేం చరిత్ర కాదు. వినడానికేముంది, ఇవేం లీలలు గావు. కంస మరణానంతరం, ఆ వసుదేవ సుతులపై జరాసంధుడు కోపమొంది, వాళ్ళ తలల కోసం తహతహ లాడుతూ మధురపై దండయాత్రకు సర్వసన్నద్ధ మౌతుంటే, అనసవర ప్రజానాశనం, నగర నాశనం ఇష్టం లేని కృష్ణుడు, బలరామునితో కలిసి కొన్నాళ్ళెక్కడైనా అజ్ఞాతవాసం గడిపితే, కాల ప్రభావంలో జరాసంధ చక్రవర్తి శాంతిస్తాడని, ప్రజా నాశనముండదని తలచి, చేసిన ప్రయత్నంలో భాగంగా, గోమంతకంలో పునరావాసమొందితే -

ఆ విషయం తెలుసుకున్న మగధ చక్రవర్తి జరాసంధుడు తన మిత్ర సామంతులతో ఇక్కడికి వచ్చి బలరాముని చేతిలో దెబ్బతిని, ఆతని పరివారంతో పారిపోతే, ఎలాగో... ఇంతవరకు వచ్చాము. కాబట్టి, కరవీపురాధిపతుల దర్శనం చేసుకుందామని, కృష్ణుడు వాంఛించి, నన్ను దూతగా అనుమతి కోసం పంపితే శ్రీ గాలవ్యులను రాజుగా కాక, జగదేక ప్రభువైన వాసుదేవునిగా కీర్తించాలని చేసిన సూచనను, నేను కాదన్నానని, నరకం చూపిస్తే, నేను మారిపోతానని చేసిన ప్రయత్న భాగం-ఈ నరక సందర్శనం. పునర్దత్త రుద్రాచార్యుల వారి దర్శనం. తదుపరి తమ ఆగమనమన్నాడు.

నా ఉద్దేశం.... ఇదంతా శ్రీకృష్ణ లీలే అయుండాలి. దేవుడు కాననే ఆ పరంధాముడు మానవునిగా సల్పే క్రీడోత్సవాలే, ఈ లీలా విశేషాలు, మన అదృష్ట సౌభాగ్యాలని - ఉద్ధవుడు - తన రాకలోని కథనాన్ని ముగించి, శ్వేతకేతో పాఖ్యానం... కోసం అదే శ్రీ సాందీపుల వారి పూర్వ - శ్రేష్ఠ - శిష్యునిగా అతని కథనానికి ఎదురు చూస్తున్నాడు. పునర్ధత్తుడు తాతగారి కోసం వచ్చి, ఆ వాసుదేవుని అభ్యర్థనం కాదని, నిజవాసుదేవుని కోసం ఎదురు చూస్తూ తాతగారి సేవలలో తరిస్తున్నాడు. కృష్ణ రక్షణకై, తన కోసం కాదు..... తనలాంటి వారినెందర్నో ఉద్ధరించగల, ఆ ధర్మమూర్తి - ఈ ధర్మవర్తనుని సంరక్షిస్తాడని ఎదురుచూస్తున్నా డన్నాడు. అంతా విన్న శ్వేతకేతు తలదించుకున్నాడు. తన ప్రవర్తనకు తానే సిగ్గుపడ్డాడు.

"అసలేం జరిగిందో చెప్పు !!" ఉద్ధవుడు అడిగాడు.

"ఏం చెప్పమంటావు ? అంతా నా కర్మ అని తన కథ మొదలు పెట్టాడు.

ఒకనాడు నేను శివ దర్శనార్థం సోమనాథ దేవాలయానికి వచ్చి, దర్శనానంతరం, సముద్రపు అలలను చూస్తూ.... ఎందుకో... అలాగ చూస్తూ.... కూర్చుండిపోయాను. అనుకోకుండా అప్పుడు నా కళ్ళల్లో ఒక అపురూప, అతిలోక సౌందర్యవతి కనుపించింది. ఆమె సముద్రంలోంచి వచ్చిందో, సముద్ర స్నానం చేసి వచ్చిందో, నా కర్థం కాలేదు, అసలామెను చూస్తూ, నా చూపుల్ని క్షణకాలమైనా మరల్చుకోలేక పోయాను. ఆమె కూడా నన్ను అలాగే చూసింది. నా చూపుల్లో చూపులు కలిపింది. ఆ చూపులు తూపులు.... అనకూడదు కాని, నన్ను కట్టి పడేసాయి.

అంతే! ఆమె చూపులకు బందీనైపోయాను. ఆమె నన్ను స్వాగతించి రమ్మని పిలిచింది. చూపులు త్రిప్పుకోలేక అనుసరించి వెళ్ళాను. తీరా కొంత దూరం వెళ్ళేసరికి అక్కడ కొన్ని గుడారాలు, మంత్రముగ్ధుడినై అనుసరిస్తున్నాను. భార్యతో... అదీ అవసరమైనప్పుడు తప్ప, ఆడవాళ్ళ చూపులలో చూపులు పెట్టి, ఆ ఆకర్షణకు లొంగిపోరాదన్న గురుదేవుల సూక్తి, ఆ గుడ్డి అనుసరణంలో గుర్తుకు రాలేదు. తీరా గుర్తుకొచ్చేసరికి నేను వున్నది -

కరవీరపురం నుండి శివదర్శనార్థం వచ్చిన రాజ పరివార సమూహంలో. ఆమె పేరు "శైబ్య" అనీ ఆమె మహారాజు శ్రీ గాలవ్యుల సోదరుని కుమార్తె యనీ, యువరాణి అని తెలిసింది. వారందరు ఈ ప్రభాస తీర్థంలోని పరంపరా అర్చిత దేవదేవుడు వాసుదేవుని భక్తులనీ, ముఖ్యంగా ఆ ఆరాధన కోసమే వారు వచ్చారని అర్థమయింది. మేము.... అంటే నేను, ఆ యువరాణితో అక్కడికి వచ్చేసరికి సాయం సమయమైంది. సంధ్యా ఆరతి కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

యువరాణి శైబ్య ఈ హారతి కార్యక్రమానికి ముఖ్య అధిపతి. అన్ని ఏర్పాట్లు చేస్తే ఈమె హారతి కారక్రమం నిర్వర్తిస్తుంది. జగదేక ప్రభువైన వాసుదేవునిగా - శ్రీ గాలవ్యులకు ఈ హారతులు.... దేవునికి కాదన్నమాట మనసులో అనుకున్నాను. ఆమె కోరిక ప్రకారం, సహజవేదాధ్యయనపరుడినైన నేను మంత్రోచ్చాటనచేసాను. ఆమె ప్రసాదమిచ్చింది. అప్పటికా కథ పూర్తయింది. ఇదే దురదృష్టమంటే....

ఆశ్రమవాసానికి, ఈ రాచరికానికి ఎంతో తేడా వుంది. కాలం కలిసొస్తే... ఇక్కడ వుండగల్గితే, ఆ అప్సరస కరుణిస్తే.... ఆ జీవితాన్ని తలచుకుని వూహా

లోకంలో విహరించాను. ఆమె వుద్దేశమేమిటో కాని, వాసుదేవుని కరుణతో ఇంచుమించు ఆ రాత్రి భాగమంతా ఆమె నాతో గడిపింది. త్రాగాం, ఆడాం, పాడాము. ఆమె ఇచ్చిన మధువుకన్న ఆమె మాటలు, చేష్టలు నన్ను నిజంగా మత్తెక్కించాయి. పిచ్చివాడిని చేసాయి. తెల్లవారింది యధాప్రకారం ఆశ్రమానికి వచ్చేశాను. "రాత్రంతా ఎక్కడున్నావు ?'' గురువుగారు అడిగారు. జరిగిన నిజం చెప్పలేని పిరికిపందగా అబద్ధమాడాను.

ఎందుకో నా మాటలు గురుదేవులకు నచ్చలేదు. అబద్ధం చెబుతున్నాననే తలచారు. రాత్రి జరిగింది మరచిపోదామనుకున్నాను. మధ్యాహ్నమయ్యేసరికి తెలియని అలజడి. కాళ్ళీడ్చుకు వెళ్ళాయి. వెళ్ళి నిన్న ఎక్కడ కూర్చున్నానో అక్కడే కూర్చున్నాను. చూపులు శైబ్య కోసం వెదకుతున్నాయి. నిన్నటిలాగే ఆమె వచ్చింది. స్నానం పూర్తి చేసుకుని నాతో మాట్లాడింది. ఆ చూపులు మాటల వలలో పడకూడదు. ఆమె వెంట వెళ్ళకూడదనుకుంటూనే ఆమె ననుసరించాను.

యధాప్రకారం సాయం హారతి, రాత్రి భాగాన ఆమెతో ముచ్చట్లు. తెల్లవారి ఆశ్రమాన్ని చేరడం. అంతా యాంత్రికంగా జరిగిపోయింది. నిన్న నా గురించి అడిగిన గురుదేవులు ఈనాడు నన్నేమీ అడగలేదు. వారేదో హృదయవేదనతో బాధపడు తున్నారు. మాటల్లో అర్థమయిందేమిటంటే, చూస్తూ.... చూస్తూ... ఉద్ధవ, కృష్ణులను బలిపశువులను చేస్తున్నానా ? .... అన్నది. అప్పటివారి బాధ. దాంతో పరిసరాల్ని, నావంటి వారిని గమనించే స్థితిలో గురుదేవులు లేరు.

దాంతో.... నాకదొక ఆట విడుపయింది. ఇలాగ మూడురోజులు గడిచాయి. నాల్గవనాడు శైబ్య - మాతో కరవీరపురానికి వచ్చేయమని అడిగింది. అప్పుడు నా పరిస్థితి అగమ్యగోచరమైంది. గురుదేవులను విడువలేను. ఆ అందాల యువతిని కాదనలేను. పైగా ఆనాడు అనుకోకుండా ఆమె సర్వావయవాలను చూసిన కళ్ళను కాదనక, మనసు శ్రీ గురువులకు వదలక భలే విషమపరిస్థితి ననుభవించాను.

ఆనాడు ఆమె వెళ్ళిపోతుంది. గుండె బరువుతో ఆమెను అనుసరించలేని, శ్రీ గురువులను విడువలేనని పరిస్థితి మొత్తం వివరించాను. ఆమె నాపై ఎంతో మమకారం పెంచుకుందనుకుంటాను. ఆ అనురాగం ఆమె కంటి నుండి అశ్రు బిందువులుగా జారి నన్ను కుదిపేసాయి. ఆడదాని దగ్గరనున్న అద్భుతమైన

అస్త్రము అదేనని ఆ తర్వాతి కాలంలో తెలుసుకున్నాను. ఇంకేముంది, ఆమెకు శరణాగతుడను, ఆమె మనసుకు బందీనయిపోయాను.

అంటే అన్ని ధర్మాలను మరచి ఆమెను అనుసరించాను. ఆ తర్వాత తెల్సింది - నేనెంతటి మూర్ఖుడను, ధర్మభ్రష్టుడనయ్యానో.... వేదం చదివిన నేను, వేద ధర్మాలను మరచి, ఇహవాసం, సుఖ సంతోషాల కోసమెంతటి భ్రష్టుడనయ్యానో అర్థమయ్యేసరికి, శ్రీ గాలవ్య వాసుదేవ భజన - శైబ్యకు - సర్వస్య శరణాగతి అయిపోయింది.

ఒకనాడు అనుకోకుండా ఆమెను అక్కున చేర్చుకోబోయాను - ఎంతో ప్రేమను ఒలికించే ఆమె ఒక్క తోపు తోసింది. ఆ తర్వాత - శైబ్య - తనను భగవంతుని కంకితురాలుగా, ఆస్తిగా ప్రకటించుకుంది. ఆ భగవంతుని కరుణ నీపై ప్రసరించే వరకు నన్ను ముట్టుకునే సాహసం చేసి ప్రమాదంలో పడబోకని హెచ్చరించింది. నిజంగానే నేనెంత తొందరపడి నా జీవితాన్ని నాశనం చేసుకున్నానో, నాకు అప్పుడు, అప్పుడర్థమయింది. ఆమె ఒక మిణుగురు పురుగు. తన కాంతితో ఆకర్షించడం, దరి చేరిన వారిని కాల్చడం, - తన ధర్మంగా బ్రతుకుతుంది. శ్వేతకేతు, చెప్పుకుపోతున్నాడు.

కాకపోతే నా వృత్తికి విరుద్ధంగా వేదాధ్యయనం చేయించడానికి బదులు- శ్రీ గాలవ్య వాసుదేవుల సంరక్షణంలోని సైనిక పాఠశాలకు అధిపతిని చేసారు. అస్త్ర, శస్త్రవిద్యలు నేర్పడం నాకు బాధ్యత అయింది. అక్కడ రత్నాలు, మణులు లెక్కకు మించి వున్నాయి. అన్నీ అడవుల నుండి సేకరిస్తారుట. ఎలాగ లభిస్తాయో ఆ వివరమొక్కటి నాకు తెలియదు.

అలాగ ప్రారంభమైన, ఆ ఆధునిక జీవితం, అనుకోకుండా మమ్మల్ని కలిపిందంటావు. అది సరే. ఇప్పుడు మేము మీ శ్రీ గాలవ్యవాసుదేవులకు శరణాగతులమై, వారి భజనలతో బయటపడాలి. అవునా ?" ఉద్ధవుడు ప్రశ్నించాడు.

కానీ, శ్వేతకేతు ఏ విధంగాను సమాధానమివ్వలేక, మౌని అయిపోయాడు. "ఉద్ధవా! క్షమించు. నేను కేవలం పాపిని కాను, గురుద్రోహిని, ధర్మద్రోహిని కూడా! నన్ను క్షమించు. ఇకపైన ఇక్కడికి రాను!" రుద్ధకంఠంతో, కన్నీరు మున్నీరయి చెబుతున్నాడు.

"అదికాదు ఇప్పుడు చెయ్యాల్సింది. జరిగిపోయిన దానికి ప్రాయశ్చిత్తంగా, జరగబోయే పాపపరిహారార్థం, చేయగల్గిన ఉపకారం చెయ్యి. శరణాగతులకు రక్షకుడైన కృష్ణ కరుణతో, అందరం హాయిగా వుందాం. కాదంటే.... వైవస్వత పురానికి వెళ్ళి యమధర్మరాజును ఆ లోకమాతను నిగ్రహించిన కృష్ణుడు, ఈ లోకంలోని మిమ్ములను దండించడం పెద్ద కష్టం కాదు. ఆలోచించుకోమన్నాడు.

ఉద్ధవుని మాటలలో ఆశావాదము కనుపించినా శ్వేతకేతు శ్రీ గాలవ్య వాసుదేవుని కాదనలేనని తన అసమర్థతను - యమపురిలోని, నాటి పునర్దత్తుని వలె, ఆసహాయతతో చెప్పుకున్నాడు. నిజం గురుద్రోహికి, ధర్మద్రోహికి భయమెక్కువ. అందుకే ఆ పాపపు చక్రం నుండి బయటపడటానికి, శ్రీకృష్ణ చక్రరక్షను పొందడానికి భయపడుతున్నావని, ఉద్ధవుడు ఎద్దేవా చేసాడు.

ఇది జరుగుతున్న తరుణంలో అక్కడికి వచ్చిన పునర్దత్తుని తాతగారు శ్రీ రుద్రాచార్యులవారు "నాయనా! అధర్మానికి తాత్కాలికంగా విజయం లభించ వచ్చును. కానీ, ధర్మం శాశ్వతం - నిత్యం - సత్యం. నువ్వు యధాప్రకారం నీ యజమాని శ్రీ గాలవ్యుని - "జగదేక ప్రభువుగా, శ్రీ వాసుదేవునిగా ఒప్పుకుని కీర్తించి, పూజిస్తారా ?" అని అడగడానికి వచ్చివుంటావు. అది నీ ఆశ్రిత ధర్మ"మనే సరికి శ్వేతకేతు తలదించుకున్నాడు.

"ఎందరో మాయాలో, అసత్య - అధర్మ మర్మాలలో బ్రతుకుతున్నారు. అటువంటి వారిలో మీ రాజొకడు - అనివార్య మరణము సంభవించే వరకు అందరు విశ్వవిజేతలు, వీరాధివీరులు, ఆ భగవత్స్వరూపులే. మరొక విషయం. అవతారపురుషుడు కూడా, తన అవతార సమాప్తి కోసం, మరణాన్ని ఆశ్రయించక తప్పదు. కారణం ? కాలము, కాలపురుషుడు - అతడే కనుక! కాబట్టి అశాశ్వతుడు, తాను శాశ్వతుడనని అనుకోవడం తప్పుకాదు. అది భ్రమ. అర్థమయిందా ?

అంతా విన్న శ్వేతకేతు సమాధానం చెప్పలేక పోతున్నాడు. ఆచార్యుడై ఎందరికో, ఆరాధ్యనీయునిగా బ్రతకాలనుకున్నా, అపుడు కాలం వంచించినట్లు, దురదృష్టం వరించి, ఇలాగ బానిసగా బానిస బ్రతుకు బ్రతుకుతున్నాడు. నమస్కారమొందవలసిన వ్యక్తికి తాను శరణాగతుడై, క్షణక్షణ ఆరాధనాలు,

వందనాలతో బ్రతుకు తున్నాడు. అప్పుడు... అప్పుడు... తెలివి తెచ్చుకుని "ఉద్ధవా", తప్పక సాయపడతాను, ఏం చెయ్యమంటావో చెప్పు, అర్థించాడు.

""""""""

# కరవీరపురం

**య**థాప్రకారం, అర్చనా, ఆరాధనా సంబరాలలో శ్రీ గాలవ్యుడు - "జగదేక ప్రభువు, వాసుదేవునిగా మున్గి తేలుతున్నాడు. అందరితోపాటు అక్కడ శ్వేతకేతు వున్నాడు. అధికారహోదా దుస్తులలో ఒక అధికారిగా సమయం కోసం ఎదురుచూస్తూ - ఉద్ధవుడు వున్నాడు. దేవునికి జరిపే షోడశోపచార పూజా కార్యక్రమం, దానికి తగ్గ ఏర్పాట్లు, వస్తువులు, సమస్తం శ్రీ గాలవ్య వాసుదేవుల వారికోసం ఎదురుచూస్తూన్నాయి. ఆ దేవుడు రానే వచ్చాడు.

వంధిమాగదుల స్వస్తివాచకాలు, అర్చన, ఆరాధనా ప్రియుల మంత్రపూరిత కీర్తనాదుల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబడ్డాయి. మోయలేని బంగారు, రత్నాభరణాల ధగధగతో ఆ ప్రభువు ప్రకాశించిపోతున్నాడు. మంగళ వాయిద్యాలు, శంఖధ్వానాలతో ఆ ప్రాంతమంతా మిన్నుముట్టుతుంది. జగదేక ప్రభువుగా కీర్తించే ఆ కీర్తనలకు శ్రీ గాలవ్యుడు పొంగిపోతూ, మందహాసంతో, అక్కడున్న ప్రతి ఒక్కరు చేసే సాష్టాంగ నమస్కారాలకు ఆశీస్సులంద చేస్తున్నాడు.

అప్పుడు మహారాణి, ఆమెతోపాటు అద్భుత సోయగాల మరో అందమైన యువతి, ఆరతి పాటతో, శ్రీ గాలవ్యుని కీర్తిస్తూ వచ్చింది. ఆమె శైబ్య. ఆమె ప్రక్కన మహారాణి - పద్మావతిదేవి. ఆమెను చూసి, ఈమెనా శ్వేతకేతు కొంప ముంచిందనుకున్నాడు. ఆమెను చూసిన మరుక్షణం అతనిలో గొణుగుడు పోయింది. అలజడి ప్రారంభమయింది. ఇందుకేనా శ్వేతకేతు తన స్వధర్మాల నన్నింటిని గాలికి వదిలేసిందనుకున్నాడు.

ఇప్పుడు ఉద్ధవుని దృష్టిలో శ్వేతకేతు నిరపరాధి. ఆకర్షణ - అందం - అతన్ని సమ్మోహితుడిని చేసి, ఈ పరిస్థితికి తెచ్చింది. ఎక్కడో నిగ్రహమూర్తులు తప్ప, సర్వులు ఈ అందానికి, సౌందర్య ప్రలోభానికి తప్పక తలవొగ్గుతారని, అది ప్రకృతి ధర్మమని సర్ది చెప్పుకోవడం కాదు, ఖచ్చితంగా నిర్ధారించుకుని మరీ

తీర్మానించుకున్నాడు. ఎందుకో... మహారాణి పద్మావతిలో వుండవలసిన మెరుపు, మైమెరుపులు లేవు. జాలిగా, ఏదో పోగొట్టుకున్న దానిలాగ, దయావిహీను రాలుగా కనబడుతుంది. శైబ్య మాత్రం - తనను తాను అంకితం చేసుకున్న పరమ భక్తురాలు. అందరు శ్రీ గాలవ్యుని షోడశోపచార పూజలో భాగంగా, అర్ఘ్య పాద్యాదులతో అర్చిస్తున్నారు.

ఇటువంటి సమయంలో కోట రక్షకుడు పరుగు పరుగున వస్తున్నాడు. జరిగే కార్యక్రమమైన తదుపరి ఆతన్ని ప్రవేశపెట్టవచ్చని, మహారాజు దర్శనం చేయించవచ్చని శ్వేతకేతు తలుస్తున్న తరుణంలో, అతని హడావుడికి జరిగే అర్చనా కార్యక్రమం, ఇంచుమించు పరాకాష్టకు వచ్చినది, ఆగిపోయింది. శ్వేతకేతు అతన్ని శ్రీ గాలవ్యుని ముందు హాజరుపరిచాడు.

"ఏమిటా హడావుడి ?" అందరు తనకు పాదాభివందనం చేసిన తదుపరి, శ్రీ గాలవ్య వాసుదేవుడడిగాడు. వందిమాగధల పొగడ్తలు, భట్రాజుల జయజయ ధ్వానాలు మిన్నుముట్టుతున్నాయి. అప్పుడా కోట రక్షకుడు "జయము, జయము వాసుదేవ మహాప్రభూ! జయము, విజయము" అన్నాడు.

"విషయం చెప్పు." చెయ్యెత్తి ఆశీర్వదిస్తున్నట్లడిగాడు.

"కృష్ణ వాసుదేవుడు... అదే మధుర యాదవుడు వచ్చాడు. కోటగుమ్మం వద్ద వున్నాడన్నాడు. తమ దర్శనం కోరుతున్నాడని చెప్పాడు. ఆ మాట అక్కడే వున్న ఉద్ధవుడు విన్నాడు. క్షణకాలం గుండె చప్పుడాగి పోయినట్లు తలంచాడు. ఆ మహానుభావుడిక్కడికి వచ్చి అవమానాల పాలవుతాడా ? లేక.....

సరిగ్గా అప్పుడు "అటువంటి వారిని మనం చూడం. మనకు చూడవలసిన అవసరం లేదు" అని శ్వేతకేతును దగ్గరకు రమ్మని పిలిచాడు. కృష్ణుని రాకను విన్న శ్వేతకేతు క్షణకాలం మూగబోయాడు. శ్రీ గాలవ్య వాసుదేవుని పిలుపుతో ముందుకు వచ్చిన శ్వేతకేతు యధావిధి వందన మాచరించగానే, వెళ్ళు. చెప్పవలసింది, చెప్పి వెంటనే తిరిగిరా! ఇది భగవదాజ్ఞ చెప్పాడు.

అప్పుడు ప్రక్కనే వున్న మహారాణి పద్మావతి దగ్గరకు వచ్చి గొంతు సవరించుకుని, సన్న స్వరంతో, వచ్చిన అతిథులను, అదే భక్తులను

అనుగ్రహించడం భగవంతుని పని. అది నెరవేర్చకపోవడం.... వణుకుతున్న గొంతుకతో, తడబడుతున్నట్లు చెప్పింది. ఆ మొత్తం శ్వేతకేతు విన్నాడు. మహారాణి ఆంతర్యం మొత్తం విని, పాలిపోయిన మొహంతో ఆమె కళవళ పడుతుంది. ఇంచుమించు స్పృహ తప్పినట్లయిందామెకు! ప్రక్కనే వున్న శైబ్య మహారాణి మాటలు విందే కానీ, "ఆమెను" ఆమె మాటల్ని సమర్థించలేదు. నిజానికామె సమర్థించి వుంటే, మహారాణికీ దురవస్థ సంప్రాప్తించేది కాదు. దీనిని బట్టి మహారాణి ఏ విధంగా మానసిక క్షోభననుభవిస్తుంది, ఉద్ధవుడు అర్థం చేసుకోగల్గాడు. సాటి మనుష్యులను హింసించేవాడు దేవుడా ? పెదవి విరుచుకున్నాడు.

శ్వేతకేతు బయలుదేరాడు. పూజ పూర్తయిందన్నట్లు ప్రసాదం అందరికి పంచి పెడుతున్నారు. వెళ్ళినవాడు వెళ్ళినట్లే తిరిగి వచ్చాడు. అతన్ని చూస్తే ఆందోళన పాలయినట్లు కనబడుతున్నాడు. దేవుడు వరమివ్వకుండా భక్తుడు భగవంతుని బదులు మాట్లాడకూడదు. ప్రస్తుతించలేడు కూడా! అదే ప్రస్తుత శ్వేతకేతు స్థితి. శ్రీ గాలవ్యుడు అడిగితేనే సమాధానం చెప్పాలి. అదీ అక్కడి నియమ నిబంధనలు.

"ఏమంటాడా మధుర మానవుడు ? ఇప్పుడు వివరంగా చెప్పు" అడిగాడు. అందుకు సమాధానంగా శ్వేతకేతు - "ఓ దేవాధిదేవా, జగదేక ప్రభూ, వాసుదేవ! ఆ వచ్చిన వ్యక్తి క్షణమాగాడు." ఫర్వాలేదు చెప్పు. అనడంతో, ఆ వచ్చిన వ్యక్తి -

'నేను కృష్ణుడను. వసుదేవుని కుమారుడను. శూర వంశీయుడను, శూరుడను. మా అన్న బలరాముని, ఛేది దేశాధిపతి దమఘోషుని, ఇతర మిత్రులను విడిచి ఒంటరిగా వచ్చాను. మీ ప్రభువు శ్రీ గాలవ్యులను ఆలోచించుకుని, నా మిత్రుడు - "సోదరుడు ఉద్ధవుని, మహామహులైన పూజ్యులను, ఆచార్యవరులను త్రిప్పి మర్యాదగా పంపమను. కాదంటే....!" శ్వేతకేతు చెప్పలేనట్లు చెప్పడం ఆపేసాడు.

"నువ్వు అతనికి, అదే ఆ పశువుల కాపరికిచ్చిన సమాధానం చెప్పు." శ్రీ గాలవ్యుని ప్రశ్న.

"కృష్ణా, ఓ యాదవా! మా ప్రభువు రాజు కాదు. ~~ఈ~~ విశ్వానికే ప్రభువు

వాసుదేవుడు. ఆయన గొప్పతనాన్ని గుర్తించి కీర్తిస్తే ఒక్క ఉద్ధవునే కాదు, యీ వాసుదేవుని కోపానికి గురయిన ప్రతి వ్యక్తిని క్షమించి వదిలేస్తాడు.'' అని ఖచ్చితంగా చెప్పానన్నాడు.

"ఆ గొల్లడే మన్నాడు ?'' వెటకారంగా అడిగాడు.

"వెళ్ళు, మీ రాజుకు నా హెచ్చరికను చెప్పు. క్షణాలమీద నా సోదరునితో పాటు పూజనీయులందర్ని సగౌరవంగా విడిచిపెట్టాలి. కాదంటే జరిగేది తెలుసుకోవాలంటే, తన శక్తితో చచ్చిన కంసుని, మా అన్న చేతిలో చావు దెబ్బతిని, నా కరుణతో నిలుపుకుని, పలాయనం చిత్తగించిన జరాసంధుని అడగమను. ఈ కృష్ణుని లీలా విశేషాల చరిత్ర అర్థమౌతుందన్నాడు.

అంతే. కస్సుమన్నాడు. బుస కొట్టాడు. ఎంత కండ కావరమని ఎగిరి త్రుళ్ళాడు. తాను దేవుడనన్న సంగతి ఆ క్షణంలో మరచిపోయాడు. మామూలు బుద్ధిలేని మనిషై పోయాడు. ఆరాధకులు అదిరిపోయారు. "ఆరాధన'' అంటే అదేమిటో తెలియని పరిస్థితికి జారిపోయారు.

అప్పటి స్థితి మొత్తం అర్థమైన మహారాణి పద్మావతి "ఓ జగదేక ప్రభూ! కరుణించండి. ఆ కుర్రవాడు కోరినట్లు పూజనీయులను సగౌరవంగా సాగనంపండి.'' బ్రాహ్మణో మమ దేవతా'' అన్న పరమ పురుషుని స్వరూపమని చెప్పుకునే మీరు, ఆ పూజ్యులను గౌరవించి, ధర్మస్థాపనం చెయ్యండి. "వణికే గొంతుకతో, ఎంతో దీనంగా ప్రార్థిస్తుంది. ఆ ప్రార్థనలో శ్రీ గాలవ్యుని ప్రాణ సంరక్షణం, తన మాంగల్య సౌభాగ్య పరిరక్షణం, కలిసి వున్నాయి.

మతి స్థిమితం లేనట్లు, మహారాణి మాట్లాడే మాటలకు, ఆమె పన్నెండేళ్ళ కుమారుడు, శుక్రుడు "అమ్మా!'' అంటూ, తల్లిని అంటి పెట్టుకుని ఏడుస్తున్నాడు. మహారాణి శైబ్య చేతులలో వుంది. అసహనంతో, తన దైవత్వాన్ని ధిక్కరించే కృష్ణునిపై పూర్తి అక్కసుతో "శ్వేతకేతూ, వెళ్ళు. మన పవిత్రమైన ఈ ధర్మభూమిని, పుణ్యభూమిని అతడు, ఆ - మేనమామ - మాతృవంశ హంతకుడు, చేరకుండా, తొందరగా వెళ్ళి, ఆతని తలతో తిరిగి రండి. అప్పటికి గాని ధర్మ సంస్థాపనం పూర్తి కాదు. "వెళ్ళు. చెప్పు. మనం గొల్లలం కాదు. పిరికిపంద జరాసంధులం

కాదు. ధర్మ సంరక్షకులం. పాపనాశకులం. అతన్ని తప్పక శిక్షించాలి. అప్పుడే ధర్మం సుప్రతిష్ట మౌతుంది.'' అరచినట్లు చెప్పాడు.

ఆ మాటలు విన్న శ్వేతకేతుకు ముచ్చెమటలు పట్టాయి. స్వస్థత కోల్పోతున్నాడు. శ్రీ గాలవ్యుని గంభీర వదనం, శైబ్య అహంకారపూరిత చూపులు, ఉద్ధవుని ఆతృత, మహారాణి మనోవేదన - సర్వం గ్రహించి, తను వేదం చెప్పి అన్నగా గౌరవించబడి, ఈనాడు, తన అధర్మ, అజ్ఞాన, వర్తనం వలన, ఎవరి శ్రేయస్సు కాంక్షించాడో, ఎవరు ఘనులు - శ్రేష్ఠులని లోకం కీర్తించిందో, ఆ మహనీయుని, ధర్మమూర్తిని అవతార పురుషుని, ఢీకొనడం, శ్రీ గాలవ్యుని కోరిక నెరవేర్చడం, సాధ్యమా ?'' ఆ ఆందోళనలో తన వునికిని కోల్పోతున్నాడు.

ఎంతో ప్రేమతో, "సోదరా! శ్వేతకేతూ! ఏమిటీ దీనస్థితి ? వేదవేదాంగ మూర్తివి, ధర్మ సంరక్షకుడివైన నీవు, మమ్ము... నీ గాలవ్యుని, జగదేక ప్రభువుగా, వాసుదేవునిగా పిలవమనడం, తలవమనడం తగునా ?'' అని అడిగిన, ఆ మాటలు, కృష్ణుని ప్రేమామృత వచనాలు, వదనం... ఇంకా.. ఇంకా శ్వేతకేతును పరవశింపచేస్తూంటే, చేసిన ధర్మ శపథాలు, మార్గాలు మరచి, విడిచి, ఎదురు తిరగడం వలన, ఎవరికి ప్రమాదం ? తనకా, శ్రీ గాలవ్యునకా.. ? లేక....!'' తనలో తను తల్లడిల్లిపోతున్నాడు.

కృష్ణుని విద్యాభ్యాసం అతని వినయవిధేయతలు, ధర్మబుద్ధి, ఈశ్వరార్పణ దృష్టి - బాల్యంలో జరిపిన, విన్న లీలా విశేషాలు, శ్వేతకేతును కదిలించి వేస్తూంటే, ధైర్యం తెచ్చుకుని "ఓ, జగదేక ప్రభూ! వాసుదేవా, దయచేసి నన్ను కరుణించండి. అర్థించే క్షమను ప్రసాదించండి. కృష్ణునితో పోరాడి, నేను బ్రతుకలేను. మీకు అపకీర్తి తేలేను. నన్ను విడిచిపెట్టడండి.'' అర్థిస్తున్నాడు.

ఆ మాటలకు సభా భవనంలోని భక్తజనం యావత్తు, శ్రీ గాలవ్యునితో కలసి అదిరిపోయారు. ఆశ్చర్యపోయారు. ఇప్పుడు పరిస్థితి ఏ రకంగా పరిణమిస్తుందో, అర్థం కాని సమయంలో, ఎంతో కొంత విచక్షణా జ్ఞానమున్నట్లు శ్రీ గాలవ్యుడు "నీకు కృష్ణుడు తెలుసా ? ఎలాగ ?'' అడిగాడు.

మేమిరువురుము. శ్రీ సాందీపులవారి శిష్యులం. ఆ రోజుల్లో అతని ప్రేమ

తత్వానికి, ధర్మ తత్పరతకు సంస్కృతీ సాంప్రదాయ పరిరక్షణాబుద్ధికి, అందరితో పాటు నేను ఆకర్షితుడనయ్యాను. అతని అభిమానిగా ఎంతో ఆనందం పొందాను.

"అలాగా! అయితే నువ్వు చావాలి. లేకపోతే ఆ - ధర్మమనే అధర్మం పెరిగిపోతుంది. పడేయండి. నరకవాసంలో, బుద్ధి వికసించి, చేసిన మేలుకు కృతజ్ఞతను ప్రకటించుకుంటాడో, శాశ్వత కృతఘ్నుడై పోతాడో, వాని కర్మ మంటాడు." నరకవాస అధికారులను చూస్తూ! అప్పుడర్ధమయింది. తన కర్మమెలాగ కాలిపోయిందో ? ధర్మహాని ఎలాగ ఎదురు తిరిగిందో ? విధి లేక చేతులు చాపాడు. శ్వేతకేతును బంధించారు. అప్పటికే అధికార దుస్తులలో వున్న ఉద్ధవుడు తప్పించుకున్నాడు.

రాజుగారి కోప ప్రభావం, అనురాగంతోపాటు ఆపదలు తెచ్చే ప్రభువు, రాజరిక మనస్తత్వం అర్థం చేసుకున్న, ఉద్ధవుడు, కోపం పరిసరాల నుండి దాటి కృష్ణుని చేరి, ఆపదలో పడకుండా వుండాలని, కోట ముఖద్వారం చేరుకున్నాడు.

"నా రథం, తెండి. ఆయుధాలు తీసుకు రండి. మనమే వెళ్ళి, ఆ గొల్లవాడి గొంతు నులిమి చంపుదాం!" పదండి." దేవుడనేననే వాసుదేవుడు మానవునికన్న హీనమై రంకెలు వేస్తున్నాడు. అందంగా రత్నాలు, మణులతో తీర్చిదిద్దబడ్డ, తన ఆయుధాలతో, తన ప్రత్యేక రథంలో -

తనకై వున్న ప్రత్యేక ఆసనంలో, శ్రీకృష్ణునికై ఎంతో ఆర్భాటంగా, అట్టహాసంగా, తొందర, తొందరగా కృష్ణుని చూడాలని ఉవ్విళ్ళూరుతూ, కృష్ణునికై బయలుదేరాడు. పరుగు, పరుగున ఆ రథం, కోట గుమ్మం దాటింది. కోట గుమ్మంలో సమాధానం కోసం ఎదురుచూసే కృష్ణుడు, అట్టహాసంగా వచ్చే ఆ రథాన్ని చూసాడు. ఆ రాజు వస్తున్నాడని తలచాడు. వెంటనే తన రథాన్ని ముందుకు దూకించాడు. పాంచజన్యాన్ని పూరించాడు. అది మిత్రధర్మ శబ్దాన్నే తప్ప యుద్ధవాతావరణ ధ్వనిని ప్రతిబింబింప చెయ్యడం లేదు.

కృష్ణుడు యధావిధి తన చిరునవ్వులు చిందించే వదనంతో, "ఓ కరవీర మహారాజా, శ్రీ గాలవ్య వాసుదేవా! కృష్ణ వాసుదేవుడు, మధుర శూర యాదవ శ్రేష్ఠ ప్రముఖ సుతుని వందనం స్వీకరించుము. నా అభివందనాల నందుకొనుము!"

ఆ మాటలు, అభివందనం శ్రీ గాలవ్యునికి నచ్చలేదు. తన బంగారు అమ్ముల పొది నుండి బాణమందుకుని ఈ విశ్వంలో వున్నది, ఒకే ఒక్క వాసుదేవుడు. అతడు ముల్లోకాలకు ప్రభువు. జాగ్రత్త. అనవసర అభిజాత్యంతో రెచ్చిపోకు!'' అని బాణం విడువబోతున్నాడు.

విషయం గ్రహించిన కృష్ణుడు, తెలివిగా రథాన్ని తప్పిస్తూంటే, చక్కగా గురిపెట్టబడ్డ ఆ బాణం దారి తప్పినట్లు భుజాన్ని తాకుతూ పలుకరిస్తున్నట్లు ప్రక్కకు తప్పుకుంది. దాంతో వైనతేయుని ఆగ్రహం పెరిగి, చేసిన ఘోషణం మనుషులనే కాదు, పక్షి జాలం మొత్తాన్ని గందరగోళ పరచింది. కృష్ణుని రథం చూడటానికి చిన్నగా, తేలికగా వున్నా, గుఱ్ఱాలను ఒడుపుగా నడపడంలో సిద్ధహస్తుడైన కృష్ణుని స్వైర లాఘవం, దానిని శ్రీ గాలవ్యుని రథం చెంతకు చేర్చడం, దానినొకసారి గుద్దుకోవడంతో -

ఎంతో అట్టహాస, ఆర్భాటమున్న ఆ బంగారు రథం, బెదరిన గుఱ్ఱాల పరుగుకు, రహదారి కడ్డంగా తిరిగింది. జరిగేది తెలుసుకునేలోగా శ్రీ గాలవ్యుడు మరో బాణమందుకున్నాడు. కృష్ణుడు తన చక్రాన్ని అందుకున్నాడు. ఈ చక్ర ప్రయోగాన్ని గమనించని శ్రీ గాలవ్యుడు శరసంధానంలో మున్గి పోయాడు. సుదర్శనం అమితవేగంతో రావడం శ్రీ గాలవ్యుని శిరస్సు ఖండించడం తిరిగి శ్రీకృష్ణుని చేరడం జరిగిపోయింది.

అధర్మవర్తనుడు, భగవద్వేషి గురు - బుధ - జన ద్రోహి అంతమయ్యాడు. అందరు ఆశ్చర్యపోయారు. ఈ దుష్టవధానంతరం, కృష్ణుడు కోటలో ప్రవేశించాడు. ఈలోగా దమఘోషుడు, బలరాముడు నగరంలో ప్రవేశించారు. శ్రీ గాలవ్యుని మరణ వార్త కోటలో గుప్పుమంది. కొందరు రాజభక్తులు కృష్ణ ప్రవేశాన్ని శాయశక్తులా నిరోధించారు. వెనుకనే వస్తూన్న బలరామ, దమఘోషులు, వీళ్ళ నెదుర్కొన్నారు. ఎక్కువమంది శ్రీ గాలవ్యుని చేరితే మిగిలినవారు, వీరికి శరణాగతులై ప్రాణాలు రక్షించుకున్నారు. శ్రీ గాలవ్యునిచే బంధించబడినవారు- బలవంతంగా తేబడినవారు, నరకంలో పడిపోయినవారు, శ్రీ కృష్ణ కరుణతో స్వేచ్ఛా జీవులయ్యారు. శ్వేతకేతు, పునర్దత్తులకు మళ్ళీ పునర్జన్మ లభించింది.

ఉద్ధవుడు కృష్ణుని చేరి కరవీరపుర పరిస్థితులను ఏకరువు పెట్టాడు.

తీసుకోవలసిన చర్యలను, జాగ్రత్తలను సమీక్షించమని కోరాడు. అప్పటికి గాని బలరామునికి తమ్ముని కరవీరపుర యాత్రలోని ఆంతర్య అర్థం కాలేదు. అందుకేనేమో, కృష్ణుని అవతారపురుషుడని భావించి, ప్రార్థించేది'' అని అప్పుడు తనలో తాను అనుకుని శ్రీకృష్ణ దివ్యశక్తిని "కృష్ణం వన్దే జగద్గురుం'' అని కొనియాడాడు.

ఇక కృష్ణుడు ప్రప్రథమంగా మహారాణి పద్మావతిని దర్శించి, వినయ విధేయతలతో వందనాలర్పించాడు. అప్పటికే తన భర్త తన మూర్ఖ ప్రవర్తనకు, బుధ-గురుజనుల దారుణ దండనకు, అవతారపురుషుడు కృష్ణునిచే సంహరించబడ్డాడని తెలుసుకుని కొంచెం స్థిమితపడింది. తేరుకుంది. తన కుమారుడు శక్రదేవుని తలచుకుని, రాజ్యవిహీనుడౌతాడేమోనని కొద్దిగా బాధపడింది.

"అమ్మా! మహారాణీ, మాతృమూర్తి పద్మావతీదేవీ, ఈ కృష్ణుని క్షమించు. మహారాజు తన దుష్ట ప్రవర్తనకు తగు మూల్యం చెల్లించుకున్నాడు. లోకకంటకుడని, బుధ-గురు-జనుల పీడామూర్తని తలచి, శిక్షించవలసిన ప్రయత్నంలో అసువులు బాసాడు. నా చేతిలో మరణించిన కారణాన సర్వపాపాలను పరిహరింపచేసి పుణ్య లోకాలను ప్రసాదించాను. మిత్రత్వం కోరాను. శత్రువై చంపవస్తే, తగు శిక్షను పొందాడని "కుమార శక్రదేవుని దగ్గరకు తీసుకుని, "ఈ యువరాజు, ఇప్పుడు ఈ దేశానికి రాజు. ఈతను సన్మార్గుడై వున్నంతకాలం మా అండదండలు, సంపూర్ణంగా లభిస్తాయి. సన్మార్గగామిగా తీర్చిదిద్దవలసిన బాధ్యత, తల్లిగా నీదని'' ఆమెను అనునయించాడు.

శ్రీ గాలవ్యునికి రాజుగా సలుపవలసిన అంత్యక్రియలు రాజమర్యాదలతో సాగాయి. కొన్ని గంటల ముందు వరకు దైవమని, దేవునిగా పొందిన ఆరాధనా కార్యక్రమాలన్నీ రద్దు చేయబడ్డాయి. ఆ దేశంలో సుస్థిర శాంతి, ధర్మాలు, స్వతంత్ర జీవనం, రాచరిక పరిపాలనా పద్ధతులన్నీ శ్రేష్ఠ - ధన్య ధర్మమార్గ జీవనమార్గంతో కల్పి మరీ పునరుద్ధరించబడ్డాయి.

రాజుకు సలుపవలసిన సంస్కారాలు పూర్తయ్యాక కృష్ణ, ఉద్ధవ, పునర్దత్తులు మాట్లాడుకుంటున్న సమయంలో, శైబ్య ప్రవేశించింది. పట్టరాని కోపంతో వూగిపోతూ వీలు చిక్కితే కృష్ణుని సంహరించాలన్నంత తీవ్ర కోపంతో వుంది. శ్రీ గాలవ్యుని అంతిమ సంస్కారానికి తీసుకుపోతుంటే, నిజంగా ఆమె వేదన వర్ణనాతీతం. ఆమె

వలె బాధపడిన వ్యక్తి మరొకరు ఆ రాజ్యంలో లేరనే చెప్పుకోవాలి.

"హంతకుడా! నా పినతండ్రిని - జగదేక ప్రభువు వాసుదేవుని చంపి సుఖంగా వుండగలవా ?" అని మతిభ్రమణం కల్గినట్లు రెచ్చిపోతూ, తన ఒరలోంచి కత్తి తీసి, కృష్ణుని చంపబోతున్న తరుణంలో - "శైబ్య" అంటూ శ్వేతకేతు పరుగు పరుగున వచ్చాడు.

"మన్నింపరాని మహా అపరాధం చేస్తున్నావు. ఎంతటి వారినైనా క్షమించగల కృష్ణుడు నిజమైన పరమాత్మ. ఆయనకు ద్రోహం చేసి, బ్రతుకలేవు. అందుకు మీ పినతండ్రే, సాక్ష్యం" అని ఆమెచేతి, కత్తిని లాక్కుని విసిరేసాడు.

ఆ సంఘటనకు ఆడుబెబ్బులి అయింది. "శ్వేతకేతు"ను క్షమించలేనన్నట్లు అరిచింది. వగలాడివలె వలపులు కురిపించి, ఆశ్రమ జీవితం నుండి, అధమాధమ స్థితికి తెచ్చిన శైబ్య - శ్వేతకేతును చంపుతానని గాండ్రించి గర్జించింది.

ఆమె మాటలతో శ్వేతకేతులోని స్థైర్యం దెబ్బతింది. కట్టలు త్రెంచుకున్న క్రోధంతో, ఆమె మణికట్టును పట్టి, మెలిపెట్టి, కత్తిని జారవిడిపించే ప్రయత్నంలో పెనుగులాటై శైబ్యను, తన ఇనుపపిడికిలిలో, బిగించిన, శ్వేతకేతు మధ్యకు, "వద్దు - వద్దు" అంటూ ఉద్ధవుడు రాగా, నీకు తెలియదు" అంటూ అతన్ని త్రోసి, పిచ్చి కోపంతో-

"ఏవిటి నువ్వు నన్ను ఉద్ధరించావా ? ఏది మోహం ? ధర్మభ్రష్టుని, కర్మభ్రష్టుని, గురుద్రోహిని చేసావు. అధమాధముని చేసి "ఆదిదేవుని ప్రస్తుతింప వలసిన నన్ను మాయమాటలు, వలపుచూపుల ఆందచందాలనెరపెట్టి ఉత్తమోత్తమైన ఆచార్య స్థితి నుండి బానిస బ్రతుక్కి బందీని చేసిన నిన్ను వదలకూడదు. మా అదృష్టం కాబట్టి, ఈ నిజమైన భగవానుడేతెంచి, ఎందరినో వధించి, ఉద్ధరించి, మమ్మ కరుణించాడు. మీ ఉక్కు కౌగిలి, ఇనుప చట్రాల బందీ బందిఖానా నుండి విడిచి, సద్ధర్మమూర్తిని చేసాడు. నిన్ను....!" శ్వేతకేతు, ఆవేశంతో, పట్టరాని ఆగ్రహంతో తమాయించుకోలేక పోతున్నాడు.

పరిస్థితిని చక్కబెట్టే వుద్దేశంతో, కృష్ణుడు "సోదరా! ఎందుకీ అనవసర ఆగ్రహం, వ్యర్థ ప్రసంగం." తప్పు నీది. ఆమె మాయలో బడ్డావు. సర్వధర్మాలను

విడిచి పెట్టావు. నీ తప్పుకు మరొకర్ని నిందించడం తగదు. మనిషి బలహీనత ఎటువంటి వారినే స్థితికి తీసుకు వస్తుందో, నిన్ను చూసిన వారికి, నీ కథను విన్నవారికి ఒక గుణపాఠం. స్వయంకృతాపరాధానికి మరొకర్ని నిందించడం తగదు. వెళ్ళు." అని క్షణమాగి -

"సోదరా! నీ మీద ప్రేమతోనే ఆమె కొంత నాటకం, కొంత వలపు చూపింది. అయితే మాయ, ప్రేమను వంచించింది. ప్రేమ దగా పడింది. అదే ఆమె నిన్ను ప్రక్కన పెట్టక అలరిస్తే, ఈ పరిస్థితి లేదా ? అదృష్టం నీకు దక్కేదా ? భగవంతుడేం చేసినా మన మంచికే. దైవ నిర్ణయం దగా చేయక, ధర్మ - కర్మ భ్రష్టుని చెయ్యక, నిన్ను ఉద్ధరించింది. అందుకు సంతోషించి, ఈమెను వివాహం చేసుకుని, ధర్మబద్ధ దాంపత్యంతో ఆచార్యుడివై యధావిధి ప్రకాశించ" మన్నాడు.

కృష్ణుని మానసం, ఆయన దివ్య సందేశాన్ని గమనించిన శైబ్య నిజంగా, కృష్ణునికి శరణాగతురాలయింది. కృష్ణ ఆజ్ఞను అమలు చెయ్యడానికి సంసిద్ధురాలయింది. మంత్రముగ్ధవలె అతన్ని చూస్తూంటే కృష్ణుడు -

"శైబ్యా! శ్వేతకేతు కుండినపురానికి వెడతాడు. ధర్మపత్నివై అతన్ని అనుసరించు. పతివ్రతా శిరోమణిగా ప్రసిద్ధరాలవవుతావు. కాదనుకుంటే మాతో మధురకు రా! నీ జీవితం నీక్కావాల్సిన విధంగా తీర్చిదిద్దుకుందువుగాని!" ఎంతో ప్రేమతో, ఆమె స్త్రీ ధర్మాన్ని గుర్తు చేస్తున్నట్లు చెప్పాడు. అంతా విన్న ఆమె తను చంపబోయిన "దుర్మార్గుదు, ద్రోహి, హంతకుడు, వంచకుడు" అనుకునే కృష్ణుని ప్రేమామృత చూపులకు, మాటలకు అవాక్కయింది. తొందరపడా లనుకున్నా తొందరపడలేని స్థితికి గురయింది. దీనంగా చూస్తూ - సమాధానం చెప్పలేక గమ్యం తెలియక కలవర పడుతుంది.

ఆమె పరిస్థితిని గమనించిన కృష్ణుడు, ఆడదాని అసహాయత, నిస్సహాయత తెలిసినవాడు కనుక "వెళ్ళు. వెళ్ళి, ముందు మొహం కడుక్కో" ప్రశాంతతతను పొందు. ఆ తర్వాత నీ జీవితాన్నెలాగ తీర్చిదిద్దుకోవాలో, తేల్చుకుందువిగాని." ఓదారుస్తున్నాడు.

కానీ, ఇంకా మూర్ఖత్వం శైబ్యలో వదలలేదు. "నేను లేవను" ఖచ్చితంగా చెప్పింది. మహామహుల్నే ధిక్కరించగల ధర్మపరుడిని, నిన్ను లేపడం,

సంస్కరించడం నాకొక లెక్కా. వెళ్ళు'' గట్టిగానే హెచ్చరించాడు. అయినా శైబ్య లెక్కచేయక పోయేసరికి - కృష్ణుడు నవ్వుతూ -

"వయస్సులో నువ్వు పెద్దదానివే గాని, నా చిన్న చెల్లెలుగా వున్నావు. నాతో మధురకు రా! నా తండ్రి వసుదేవుడు, నా తల్లి దేవకిమాత నిన్ను ఎంతో ఆదరంగా చూస్తారు.'' అన్నాడు.

"నేను రాను'' మళ్ళీ మొండికేసింది.

అయితే శ్వేతకేతును వివాహం చేసుకుని హాయిగా జీవించు!'' కృష్ణుని మాటల చమత్కారం ముగ్ధ మోహనత్వానికి, కొంతలో కొంత గురయిన శైబ్య అయిష్టంగానే లేచింది. ఉద్ధవుని పిలచి ఆమెను అంతఃపురానికి తీసుకువెళ్ళమని కోరాడు. ఉద్ధవుడు ఆమెను లేపాడు. అప్పుడు తెలియని కృష్ణ సహకారంతో లేచిన ఆమెకు కృష్ణ ప్రేమలోని శక్తి ఆమెను ఆవరించినట్లు తెలియని ఆనందానికి గురయింది. అదొక క్షణకాలం.

శ్రీ గాలవ్యుని దశదిన కర్మాదులు, ఇతర సంస్కారాలు పూర్తయ్యాయి. ఇప్పుడు అధికారికంగా శక్రదేవుని రాజుగా ప్రకటించి పట్టాభిషేకం చేసారు. పునర్ధత్తుడు, శక్రదేవునికి అధ్యాపకునిగాను, రుద్రాచార్యులవారిని, రాజగురువు-సలహాదారుడు - సంరక్షకునిగా, కృష్ణుడు అనుగ్రహించినట్లు నియోగించాడు.

అక్కడి పరిస్థితిని, ఒక్కొక్కటిగా సరిచేసి సామాన్య ప్రజలు సర్వులు ఆనందంగా - స్వతంత్ర జీవనం, సుస్థిర రాజపాలనంలోని ఆనందాన్ని పొందు విధంగా, రాజ్యం సుస్థిరం చేయబడింది.

దమఘోషుడు సంపూర్ణ రాచరిక వ్యవస్థకు తగు ఏర్పాట్లను రూపొందించాడు. పథకాలు, పద్ధతులు ప్రజలకు అందుబాటులో నుండునట్లు ఏర్పాట్లు చేసారు.

ఈ విషయంలో ఛేది దేశాధిపతి, దమఘోషుడు, కృష్ణుడు - శ్వేతకేతుతో సుదీర్ఘ మంతనాలు జరిపారు. ఒక నిర్ణయానికొచ్చినవారు - శ్వేతకేతును, సాందీపుల వారి ప్రముఖ - శ్రేష్ఠ ఉపాచార్యునిగా తలచి, అవంతీపుర యువరాజులైన విందాను విందులకు కులాచార్యులుగా వుండమని జరాసంధుని వెళ్ళే దారిలో, తీవ్ర వేగంతో సాగే అశ్వాలపై - బయలుదేరి కలువమని సూచించారు.

సుద్రవత తల వూపింది.

"అసలా వివాహమే జరుగకపోతే....!" అందుకుంది రుక్మిణి. ఏ గొడవ వుండదు. రాదు... అవునా ?" మొత్తానికి తాను విజయం సాధించినట్లే రుక్మిణి పలికింది.

"అంటే..." ఆసక్తిగా అడిగింది సుద్రవత.

"ఏముంది. నేను శిశుపాలుని వివాహం చేసుకోను. ఆ నల్లనయ్య కృష్ణుని పరిణయమాడతాను. నిన్నీ ప్రమాదం నుండి బయటపడేస్తాను. కనుక మౌనంగా వుండు. శతథా నాకు సహకరించు. సహస్రథా ఆనందబరచు." అర్థించింది.

రుక్మిణిని అర్థం చేసుకుంటుంది సుద్రవత.

"అమ్మ నా రాచపట్టీ....!" అని అనుకోకుండా సుద్రవత వుండలేకపోయింది. ఈ మొత్తం వృద్ధ పితామహుడు కైశికునికి తెలిసింది. ఎంతో ఆనందంగా విరగబడి నవ్వుకున్నాడు. కొవ్వు బలిసి, కొట్టుకునే జరాసంధునకు బలంతాముని ద్వారా ప్రాణహాని రావడం, కృష్ణుడు ప్రాణదానం చెయ్యడం - వీరాధివీరుడనని విఱ్ఱవీగే జరాసంధ చక్రవర్తి తోకముడుచుకుని వెనుదిరగడమెంతో ఆనందమనిపించింది. ఇప్పుడు నిజంగా కృష్ణుడు అవతారపురుషుడు, ధర్మస్వరూపమని ఖచ్చితంగా నమ్మగల రనుకుంటాడు.

విషయమంతా చెప్పిన రుక్మిణి, తాతగారి సహాయ సహకారాల నర్థిస్తుంది. కానీ అంతా విన్న కైశికుడు కృష్ణునికి స్వయంవరానికి రమ్మనమని, ఆహ్వానం పంపే విషయంలోనే వెనకడుగు వేసాడు. అతను రాజు కాదు, యువరాజు, లేదా రాజప్రతినిధి కూడా కాడు. అటువంటప్పుడు స్వయంవరాహ్వానం పంపడం కుదరదు. ఆతడు శూరవంశీయుడే కావచ్చును. శూరుడు కావచ్చును. కానీ, యాదవుడు. అతన్ని పిలువనంపడం కుదరదు. తన అశక్తతను ప్రకటించు కుంటాడు. ఏం చెయ్యాలి ? ఎలాగ దీనిని పరిష్కరించుకోవాలి. ఇది - రుక్మిణిలోని ఆలోచన.

మొత్తానికి - కొంత విషయ నిర్ణయం, ఇంకొంత వర నిర్ణయం చేసిన తదుపరి రాజులందరు వారి వారి దేశాలకు వెళ్ళిపోయారు. శ్వేతకేతు మాత్రం ఇక్కడుండి పోయాడు. శ్వేతకేతును ఆశ్రమం ఏర్పాటు చేసుకుని, తమ యువరాజునకు విద్యాబోధనంతోపాటు అస్త్ర, శస్త్ర విద్యాభ్యాసమివ్వమని - కైశికుల వారు కోరారు. ఆ తర్వాత శ్వేతకేతులవారు రుక్మిణి ప్రార్థనతో, సుద్రవతా దేవిని

కలుసుకున్నాడు. మాటల మధ్యంలో - గోమంతక - కరవీరపురాల కథనాల ప్రస్తావన వచ్చింది. అదృష్టవశాత్తు కృష్ణుడు కల్పించుకోవడంతో ఇటు యువరాజు రుక్మి, చక్రవర్తి జరాసంధులవారు ప్రాణాలు రక్షించుకున్నారని వివరంగా వివరించి చెప్పాడు. అంతా విన్న సువ్రత, భర్త అసాంఘిక వర్తనంగా చెప్పే అబద్ధాలకు కుపితురాలయింది. అంతే తుఫాను వాతావరణం. తదుపరి నిశ్శబ్ద యుద్ధం. ఎవరు ఎవర్ని చూడటం లేదు. మాట్లాడటం లేదు. అదో భయంకర మహా ప్రళయానికి సూచనగా మొత్తానికి ఆ వాతావరణం మారిపోయింది.

ఈలోగా గాలిదుమారంలాగ మరో వార్త. ఈ జరాసంధ, మిత్ర సామంతులనే కాకుండా, గోమంతకంలోని కృష్ణుడు - "వాసుదేవునిగా, జగదేక ప్రభునిగా ప్రగల్భాలతో ప్రకటించుకునే శ్రీ గాలవ్యుడు పరాజితుడవడం, అతని చెరలో (నరకంలో) వున్న ఆచార్య పరమాచార్య, శ్రీ గురువులందరు కృష్ణ వాసుదేవునిచే రక్షింపబడటంతో విడువకుండా, శ్రీ గాలవ్యుని కృష్ణుడు అతి సునాయాసంగా సంహరించాడనే వార్త... అనకూడదు కాని, తీవ్ర మనో వాయువేగాలతో గుప్పుమని ప్రసరించడం మొదలుపెట్టింది. ఈ మొత్తం విదర్భాధీశులు, ప్రజలు కూడా, వీనులారా విన్నారు.

రుక్మిణి పొందిన ఆనందం అవ్యక్తం. ఈ పరిస్థితులలో ప్రజలు, అయిన వాళ్ళ చూపులనుండి బయటపడటానికి గాను రుక్మి, ఛేది దేశానికి, శిశుపాలుని కలుసుకోవడానికి బయలుదేరాడు. అక్కడ జరుపవలసిన సంప్రదింపులన్ని జరిపి, రాజధానికి తిరిగి వచ్చిన రుక్మి, చెల్లెలు స్వయంవరానికి తగు ఏర్పాట్లు, రాజ్యాలకు, రాజకుమారులు - రాజులకు స్వయంవరాహ్వానాలు పంపించాడు. మార్గశిర మాసంలో మృగశిరా నక్షత్రం నాడు స్వయంవరానికి ఏర్పాట్లు చేయబడ్డాయి.

రుక్మిణి సంతోషాన్ని హరిస్తూ వూహించని విధంగా ఆశించని పేరుకు బహిరంగ స్వయంవరం ఏర్పాట్లు, అంతరంగంలో చెల్లెల్ని శిశుపాలునకిచ్చి వివాహం చేయడం, తాను జరాసంధ చక్రవర్తి మనుమరాలి భర్తయై ఆ రాజ్యంతో విడదీయలేని అనుబంధమొందడమొక నిర్ణయించబడిన అంతర్నాటకం. ఇది రుక్మిణి ఆశాసౌధాన్ని కూల్చివేసింది. చస్తాను కానీ, ఈ వివాహానికి తలవొగ్గ ననేసింది. తలుపులు బిగించుకుని తన భవనంలో ఎవర్ని చూడకుండా, అంతరాంతరాలలో ఆమె కుమిలిపోతుంది.

ఇదే సమయంలో ఆచార్య శ్వేతకేతుల వారు తన వివాహ నిశ్చితార్థం నిమిత్తం కరవీరపురానికి బయలుదేరారు. రాజభవనంలో నిర్ణయించిన వార్తా - సిద్ధాంత స్వరూపంగా రుక్మికి - జరాసంధ చక్రవర్తి మనుమరాలితో పరిణయం, రుక్మిణికి - శిశుపాలునితో వివాహ నిర్ణయం - దావానలంగా రాజ్యంలో విస్తరించింది. అందరిలో ఆతృత తెలుసుకోవాలనే కుతూహలం బాగా విస్తరించింది. అయినా కాదంటారు అధికారులు.

ఇదిలావుంటే, అక్కడ కరవీరపురంలో రాణీపద్మినీదేవి కోరిక మేర ఆమె ఇచ్చిన కానుకలు, బంగారు, వెండి రత్నాభరణాలతో రకరకాల ఆయుధ సంపత్తితో రథ, అశ్విక, పదాతి దళాలతో, బలరామ-కృష్ణులు, దమఘోషుడు, శైబ్య ఆమె పరిచారకులు, మధురకు బయలుదేరారు. ఉద్ధవుడు బహుమతుల భోషాణ రథయాత్రకు సారథ్యం వహిస్తూ అశ్వంపై, ఇతర సైనిక సిబ్బందితో కలిసి ప్రయాణం ప్రారంభించాడు.

మహారాణి, బాల ''రాజు'' శక్రదేవుడు, ఆచార్యుడు, సర్వాధికారి పునర్దత్తుడు, యావత్ ప్రజానీకం, కృష్ణాదులకు వీడ్కోలు పలుకుతున్నారు. అందరిలోను తెలియని దుఃఖం పెల్లుబుకి వస్తుంది. ఎందుకంటే తమకు స్వతంత్రము, సకల యోగ్యమైన ప్రజారాజ్య - రాజరికాన్ని ప్రసాదించిన మహాదేవుడు, దేవాధిదేవుడు "శ్రీకృష్ణ" ప్రభువు. ఆయనను విడిచి వుండలేమన్నట్లు ఆ కొద్ది రోజుల్లో ఎడబాయని అనుబంధాన్ని పొంది, అశ్రునయనాలతో, మళ్ళీ తమ దర్శనాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తూ - సాదరంగా వీడ్కోలు పలుకుతున్నారు.

పెద్దవాడుగా దమఘోషుడు, అభిమానానికి లొంగిన వారుగా బలరామ - కృష్ణులు అందరికి అభినందనాలను తెలిపి బయలుదేరారు. గరుడుడు మాత్రం కృష్ణుని విడువలేక, విడువలేక - గోమంతకానికి వెళ్ళాడు. అక్కడ గరుడుని తండ్రి ఆత్రేయునికి అకస్మాత్తుగా సుస్తీ చెయ్యడం, గరుడుని అవసర మక్కడ అత్యవసర మవడంతో, విధిలేక వెనుదిరిగాడు. మిగిలినవారు బలరామ-కృష్ణులను అనుసరించారు.

వార్తాహరులు శ్రీకృష్ణుని రాకను, వారి విజయయాత్రను ముందుగానే అందరికి తెలియబరుస్తూ, ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా - ఎందరినో బాధలకు గురిచేసిన "వాసుదేవ" నామాంకిత, శ్రీ గాలవ్యుని మరణం, విన్న వారందర్ని ఆనంద ముద్రల తేలియాడింప చేసింది. ధర్మం నిలబెట్టడానికి వెలసిన అవతారపురుషుడు-

శ్రీకృష్ణ ప్రభువని - ప్రతి ఒక్కరు శ్లాఘించారు. ఎక్కడో- ఒకటి - అరా - శ్రీ గాలవ్య అభిమానులు మాత్రం తమ అధికార దర్పాలకు విఘాతం కల్గిందని, తమకెదురు లేదని తలచిన ప్రతి ఒక్కరు - తమ జీవితాలకేవిధమైన ప్రమాదమేర్పడుతుందోనని, అప్రమత్తంగా వుండాలని, తగు జాగ్రత్తలు పడుతున్నారు.

శరణార్థులవలె పునరావాసానికి పారిపోయిన బలరామ - కృష్ణుల - విజయయాత్ర - కథలు కథలుగా - గాథలుగా - ప్రతి ఒక్కరిని పులకరింప చేస్తూంటే, ప్రతి ఒక్కరు ఆ దయామయుని, లోకరక్షకుని దర్శించాలని తహతహ లాడుతున్నారు. ప్రతి మార్గం ప్రత్యేక మార్గమయింది. అందరు ఆహ్వానించేవారే. ఆరాధించేవారు. ఆ బాలగోపాలం "ఆ గోపాలకృష్ణుని" కథలు, కథలుగా అంతకు మునుపే విని వున్నందువల్న, "ఈతడేనా ఆ గోపబాలుడు, నందనందనుడు, యశోదకృష్ణుడు, దేవకీసుతుడు, "వసుదేవ" వాసుదేవుడని కేవలం -

ఆశ్చర్యంతో చూడటం కాదు. అంజలి ఘటిస్తున్నారు. హారతులిస్తున్నారు. తమకు తెలిసిన కథలను - చిలవలు - పలవులుగా చెప్పుకుంటూ తాము మురిసి పోతున్నారు. ఇతరుల నెందరినో మురిపింప చేస్తున్నారు. అందుకేనేమో ఆ పరమాత్మ-

**"ఎప్పుడెప్పుడు ధర్మమునకు హాని కలుగో, భారత,**
**అప్పుడప్పుడు నేనవతరింతునీ అవనియందు"**

అన్నది. అలాగే -

**"పరిరక్షించ సాధువుల వినాశమ్ము చేయు దుష్టుల**
**ధర్మ సంస్థాపనార్థమై - సంభవింతు - నే - యుగ యుగమ్ముల**

అని - అభయం ప్రసాదించినది.

అందుకు నిదర్శనంగా - ఈ "కృష్ణ" వాసుదేవుడు సల్పిన లీలలు - బహు జన్మ పాపముల పారద్రోలు - పరమపుణ్యములు.

రథం అవంతి చేరింది. దారి పొడుగునా నిజమైన భగవంతునికి లభించే ఘనస్వాగతం కృష్ణునికి లభించడం... ఆతనికోసం ఆచార్య పరమాచార్యుల వారి వంటివారు ఎదురు చూడటం, శ్రీకృష్ణుడు సంధ్యావందనాది కార్యక్రమాలలో పాల్గొనడం, ఋషి, ఆచార్య వర్యులతో కలిసి చేసే మంత్రానుష్ఠాన జపాలు...

సర్వం - చేది దేశాధీశుని ఆశ్చర్యంలో ముంచడమే కాదు, శ్రీకృష్ణుడు నిజంగా అవతారపురుషుడు, ధర్మ పరిరక్షకుడని నిర్ధారించుకున్నాడు. చెరగని చిరునవ్వు, చెదరని ఓర్పు నిష్ఠలు, తరగని ప్రశాంతత సామాన్యులకు సాధ్యం కాదన్నది నిర్వివాదాంశమయింది. అంతెందుకు - బలరామునికి - శ్రీకృష్ణునికి మధ్య వారి వారి ప్రవర్తనలో ఎంతో వ్యత్యాసం చూడగల్గాడు. ఇదంతా కూడా,... ఇంకా, ఇంకా చూడాలని, కృష్ణునికి చేరువలోనే ఎప్పుడు వుండాలనే ఆలోచన క్రమక్రమంగా దమఘోషునిలో పెరుగసాగింది.

ఉద్ధవుని సారధ్యంలో, ఆ బహుమతుల భోషాణ రథం, అంచెలంచెలుగా ప్రయాణించి, ఉజ్జయినిని చేరింది. ఆచార్య సాందీపులవారు జయసేన మహారాజు, ఆయన పుత్రులు విందానువిందులు ముందుగా, మహారాజు దమఘోషునికి ప్రత్యేకించి బలరామకృష్ణులకు, స్వాగత సత్కారాలను నడుపడానికి బయలుదేరి, వీరికోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు అనువిందుడు కృష్ణభక్తుడు - ప్రియుడు అయ్యాడు.

ఆ మర్నాడు బలరామ - కృష్ణులు, ఒక దినం ప్రత్యేకంగా సాందీపుల ఆశ్రమంలో శ్రీ గురు సన్నిధిలో గడుపాలని తలంచారు. అయితే ఉద్ధవుడు మరోరోజు ఇక్కడ వుండి ఆశ్రమాభివృద్ధి వగైరా ఇతర కార్యక్రమాలను పరిశీలించి మరీ వెడదామంటే శ్రీకృష్ణుడు సరేనని మరోదినం వుండటానికి సిద్ధపడ్డాడు.

ఉభయకుశలోపరి తదుపరి శ్రీ గురుదేవులు ఆ కారణజన్ముల వివరాలు అడిగి మరీ తెలుసుకున్నారు. వాళ్ళెంతో వినయంగా, "మీ దయ - ఆశీస్సులు" అని చెబుతూనే జరిగినదంతా వివరించి చెప్పారు. వీళ్ళిల్లాగ మాట్లాడుతున్న తరుణంలో ఇద్దరు వ్యక్తులు మంచినీళ్ళివ్వడానికని వచ్చారు. అందులో ఒకరు చూడచక్కగా వుంటే, రెండవ వ్యక్తి బంగారు వర్ణంతో, పొడుగ్గా చాలా అందంగా, ఎంతో ఆకర్షణీయంగా వుంది.

వాళ్ళను పట్టి పట్టి చూస్తున్న బలరామునితో ఆచార్య సాందీపులవారు, వారిలో ఒక అమ్మాయిని చూపుతూ, ఈమె వాసంతిక, మన శ్వేతకేతు సోదరి. నువ్వు గుర్తుపట్టలేదా ?" అడిగాడు. మంచినీళ్ళిచ్చి వెళ్ళిపోయిన, పొడుగాటి అందాల భామినిపై మాత్రం బలరాముడు దృష్టి మరల్చకుండా, అలాగే చూస్తుండి పోతుంటే పరిస్థితిని గమనించిన కృష్ణుడు "అన్నా" అన్నా ఫలితమొందక "గురుదేవా, ఆమె...!" అని ఆగాడు.

సమాధానంగా సాందీపులవారు "కృష్ణా! ఆమె రేవతి. అదొకకథ" అన్నారు. ఆ వెంటనే కృష్ణుడు "అలాగా. గురుదేవా!" అని, ఆ కథనాన్ని వివరంగా చెప్పమని కోరాడు. కృష్ణుని ఆసక్తికి, ఏదో శక్తి వుందని, వుంటుందని తెలిసిన సాందీపులవారు "రేవతి" కథనమందుకున్నారు.

ప్రభాస తీర్థం సమీపంలోని, కుశస్థలి గూర్చి విని వుంటావు. అది సముద్ర రేవు, సం॥ల క్రితం దానిని పుణ్యాజనరాక్షసులు.... అందులో ముఖ్యంగా వ్యాపారి (మన పునర్దత్తుని అదృశ్యాపహారణలకు మూలరూపుడైన) పాంచజన్యునికొక "పీఠ"భూమి అయింది. ఆ కుశస్థలిని, ఆనాడు ఈ రేవతి తండ్రి కకుద్మంతుడు పరిపాలిస్తూండేవాడు.

ఈ రాజు కూడా దురదృష్టవంతుడే. ఆ పుణ్యాజన రాక్షస "సంహార" క్రీడలో భాగంగా, ఈ కకుద్మంతుడు తన ముప్పై మంది సోదరులను, ఏడుగురు కుమారులను పోగొట్టుకున్నాడు. కళ్ళముందే అంతఃపురజనం, రాజ పరిజనం - చచ్చినవాళ్ళు చావగా మిగిలిన వాళ్ళు నానావిధ హింసలతో అగచాట్ల పాలయ్యారు. ఆ పరిస్థితిలో రాజు తన పసికందు పిల్లతో కొందరి నమ్మకస్తుల సహాయంతో కొండలలో తలదాచుకున్నాడు.

అయితే కకుద్మంతుడు దెబ్బతిన్న పులి అయ్యాడు. తన కులదైవమైన బ్రహ్మ ముందు "ఎలాగైనా సరే, తిరిగి కుశస్థలిని సాధించి, రాజ్యస్థాపనం చేస్తానని" శపథం చేసాడు. పట్టుదలతో ఎన్నో రాజ్యాలు తిరిగాడు. వాళ్ళ సహకార మర్థించాడు. రాజ్యము, విభవము పోయిన వారందరికీ, చరిత్ర గతిలో ఎలాగ నిరాదరణ పొందారో, అంతే అయింది, ఈ కకుద్మంతుని పరిస్థితి గూడా! ఆశ్రితులు, వంశీకులు అనుయాయులు... పోయినవారు, పోయారు. వున్నవారు వృద్ధులయ్యారు. దాంతో ఆ మహారాజు నిరాధారుడు నిరాశ్రయుడయ్యాడు.

దాంతో తనకున్న ఒక్క ఆధారము, తనతోనున్న ఒకనాటి పసికూన. ఇప్పుడు దానిని సర్వవిధాల - అస్త్రశస్త్రాలతో వీరత్వంతోపాటు తగుశిక్షణ తాను ఇచ్చాడు. పరశురాముల ద్వారా మరింత తీర్చిదిద్దాడు. ఇప్పుడు వారిరువురు కలిసి, తిరిగి తమ రాజ్యాన్ని పొందాలన్నది ఆకాంక్ష. అందుకు సర్వవిధాల శ్రమిస్తున్నారు.

అందులో భాగంగా - ఆ రేవతీ కుమారి, నా వద్దకు.... అదే మన ఆశ్రమానికి తీసుకురాబడింది. తండ్రీ, కూతుళ్ళిక్కడే వుంటున్నారు. చివరిగా, కొన్ని మెళుకువలను

చెప్పి ఆమెను సర్వశక్తి స్వరూపిణిగా తయారు చెయ్యమన్న ఒకనాటి మహారాజు ఆకాంక్షను, ఒక గురువుగా నెరవేరుస్తున్నానన్నారు. ఈ కథనాన్ని ఎంతో ఆత్రంగా - ఆసక్తిగా వింటున్న శక్తి బలశాలి - బలరాముడు - తెలుసుకోవాలనే తలంపుతో "పొరపాటున వారు కనుక కుశస్థలిని సంపాదించుకోలేకపోతే..."

"తండ్రి - కూతురు ఆత్మాహుతికి సిద్ధమని ప్రతిజ్ఞ చేసుకున్నారు."

ఆ మాటతో కృష్ణుడు - అన్నగారినొకసారి చూసి "మేము కకుద్మంతుల వార్ని చూడవచ్చునా ?" అవతలి వారికి మంచిరోజులు వచ్చినట్లు అడిగాడు.

అందుకు పరమానందభరితుడైన సాందీపులవారు "తప్పక. అవశ్యం" అన్నారు. వారిక్కడ దగ్గరలోని ఒక గుహలో వుంటున్నారు. మీరు రండి వచ్చేముందు ఒక్క విషయం, మీరు గుర్తుంచుకోవాలి. అది... ప్రస్తుతం ఆ మహారాజున్న పరిస్థితులలో, తన కూతురి సహచర్యం తప్ప - ఇతరుల సాంగత్య సహచర్యాల నిచ్చగించడం లేదు..... అంటే నా వుద్దేశంలో మీరక్కడ ఏ విధమైన ఇబ్బందులు లేదా నిర్లక్ష్యానికి గురయినా బాధపడరాదన్నది "నా మనోగతాభి ప్రాయం." సాందీపులవారు విషయం తెలియబరిచారు. తలవూపి అన్నదమ్ములు బయలుదేరారు.

# రేవతి

**క**కుద్మంతుడు ఆజానుబాహువు. తాళవృక్ష ప్రమాణుడు. ఆ బలశాలి, దీర్ఘకాయుడు, సాందీపులవారు బలరామ-కృష్ణులతో, ఆయన దగ్గరకు వస్తూంటే- జడస్వరూపంగా, ఎటో చూస్తూ... అచేతనుడై వున్నాడు.

"రాజా! శుభమస్తు" చెయ్యెత్తి దీవించిన సాందీపులవారు, బలరామ- కృష్ణులను, ఆయనకు, తన శిష్యులుగా పరిచయం చేసారు. కకుద్మంతుడు, తదేక దీక్షతో చూస్తుంటే, తానొక ప్రక్కగా కూర్చుని, ఆ శిష్యులను గూడా కూర్చొనమని బలరామ-కృష్ణుల గూర్చి వివరంగా చెప్పసాగాడు. ఈ సమయంలోనే అక్కడికి రేవతి వచ్చింది. తండ్రిని ఆ వచ్చినవారిని ఆసక్తిగా గమనిస్తూంది.

బలరాముని మనసును సంపూర్ణంగా గ్రహించిన కృష్ణుడు అన్నగారు మనసు పారేసుకోవడంలోని మర్మాన్ని గ్రహించాడు. ఆ కార్యాన్ని సానుకూలం

చెయ్య తలుస్తున్నాడు. అయితే ఆ వీరనారికి తగ్గ వరుని తప్ప ఇతరులను గమనించని మహారాజు మనస్సును గ్రహించిన కృష్ణుడు ''రాజా! రేపు గురుకులంలో, సర్వ సమర్థులు సుశిక్షుతులైన విద్యార్థులతో ఒక "యుద్ధ" విద్యా ప్రదర్శనమేర్పాటు చేసాం. అభ్యంతరం లేకపోతే, తమ కుమార్తె గూడా అందులో పాల్గొనవచ్చును'' విషయం వినయంగానే చెప్పాడు.

ఇది విన్న రేవతి అసహనంగా చూసింది. తనను పరిక్షిస్తున్నారో, పనికిరాని దానిగా వారు తలుస్తున్నారో ఆమెకు అర్థం కాలేదు. ఆ విషయాన్ని గ్రహించినట్లు లీలాకృష్ణుడు "ఈ వీరనారి మహాశక్తివంతురాలు, సమర్థురాలని గురుదేవులు చెప్పారు. కాబట్టి.....!" ఆమెకే సమస్యనిచ్చినట్లు, సమాధానం కోసం ఆగాడు. అందుకు కకుద్మంతుడు స్పందించి -

"రేవతి కనుపించిన బృందాలతో యుద్ధం చెయ్యదు. చెయ్యవలసిన అవసరం కూడా లేదు. సమయం వచ్చినప్పుడు ఎవరి పీచమణచాలో, వారితో యుద్ధం చేస్తుంది. పీచమణుస్తుంది. రాజులు రాజసంతో, రాజులతో తప్ప ఇతరులతో యుద్ధాలు చెయ్యరు. ఆ రాజు నిరంకుశంగా, కర్కశంగానే పలికాడు.

దానికి సమాధానంగా "రాజా! మా అన్నగార్కి, కొన్ని అద్భుతమైన మెళకువలు తెలుసును. దాంతోనే అవక్ర పరాక్రముడినని విర్రవీగే జరాసంధ చక్రవర్తిని మట్టిగరపించి, ప్రాణాలు తియ్యబోతుంటే - "ఇది సమయం కాదని, అన్నగార్ని వారించి, అవతలవార్ని పంపించేసాను.'' దీనిలో ఇరువురి గొప్పతనం చెప్పనట్లు చెప్పి, తమ తమ ప్రతాపాలను ప్రకటించాడు.

అది విన్న కకుద్మంతుడు "అయితే, తప్పక మా రేవతి కుమారి, రేపు బలప్రదర్శనంలో పాల్గొంటుందని ప్రకటించాడు. అమ్మాయిని చూసాడు. తలవంచుకుని "పితృపాదుల'' ఆజ్ఞ అంది. ఆ విధంగా కొంతముందుకు కృష్ణ రాయబారం - వారి ధీశక్తుల ప్రతాపం - కొద్దిగా కదిలింది. ఇరువురిలో "ఆశ" తగు ఆసనమొందింది.

ఇప్పుడు వారి ఆలోచన - కుశస్థలిని సంపాదించడం - కకుద్మంతుని ఆరాధనలు పొందడం, ఆ రేవతీ కుమారిని, "రేవతీ'' మహారాణిని చెయ్యడం. ఈ విషయంలో అన్నదమ్ములలో కొన్ని భిన్నాభిప్రాయాలున్నాయి. అయినా

కార్యసాధనకు ఇద్దరు చెరొక విధంగా నడుంకట్టి ముందుకు సాగాలని తలుస్తున్నారు. అప్పుడు కృష్ణుడు -

"సరే. ఓ పనిచేద్దాం. నువ్వు మధురకు వెళ్ళు. నేను, ఉద్ధవుడు, పుణ్యాజననౌకా సరంగు భిక్కుతో కలిసి వారి ఆసరాతో కుశస్థలిని, కకుద్మంతుని నేతృత్వంలో పోరాడి నాటి రాజును, నేడు మహారాజుగా ప్రతిష్ఠిస్తాను. అప్పుడు, ఆ మహారాజు తన ఆనందంతో, నీ కోరిక నెరవేరుస్తాడు. అప్పుడు కుశస్థలి నీకు అత్తగారిల్ల వుతుంది. మనం పొరపాటున పారిపోవాల్సి వస్తే గోమంతకం వరకు వెళ్ళి, గరుడాదుల రక్షణను పొందవలసిన అవసరముండదు. తన ఆలోచనను కృష్ణుడు వివరించి ఎంతో వివరంగా చెప్పాడు. బలరాముడు, కృష్ణుని భుజంపై చరచి, "అసాధ్యుడివే కానివ్వు" అంటాడు. కానీ, కృష్ణుడు "అలాగని మమ్మల్ని విడిచి, మరచినట్లు మధురలో పీఠం వెయ్యకూడ"దంటాడు. సమాధానంగా బలరాముడు పకపక నవ్వుతాడు. తమ్ముడు తన మనోభీష్టాన్ని నెరవేరుస్తున్నాడనే ఆనందం, బలరాముని నరనరాల్లో తొంగి చూసినట్లు పొంగి ప్రవహిస్తుంది.

ఆ మర్నాడు - అనుకున్నట్లు - సాందీపులవారి శిష్యుల మధ్య - మల్లయుద్ధ ప్రావీణ్య ప్రదర్శనం. తనకనవసరమన్నట్లు కృష్ణుడు, మొదటి క్రమంలోనే ప్రక్కకు త్రిప్పుకున్నాడు. ఇప్పుడు పులిచర్మం చుట్టుకున్న ఆడపులి "రేవతి"తో, తాళ వృక్ష సమానుడైన బలరాముని బలప్రదర్శనం. "ఆడది" అనేసరికి, బలరాముడు మొదట్లో కొంత కంగారుపడ్డాడు. "అన్నా! కుశస్థలి" అనేసరికి కృష్ణుడు బలరాముడు పుంజుకున్నాడు. ముందుకు దూకారు.

ఇద్దరు సమవుజ్జీలుగానే రంగంలో దిగారు. తమ తమ ప్రతాపాలను చాటుకుంటున్నారు. ఎక్కడా ఎవరికి అపకారం కాకుండా, అవతలివార్ని చిత్తు చెయ్యాలనే తలంపుతో తెలివిగా, ఒడుపుల్ని ప్రదర్శిస్తూ - తమ ఘనతను చాటుకుంటున్నారు. అయితే, అసమర్థుడైన మగవాడిని ఆడది దరిచేరనివ్వదని తలచిన బలరాముడు, "యుద్ధం" కాదు - బలప్రయోగ ప్రదర్శనం కాదు - బుద్ధి సూక్ష్మంతో, కౌశల్యాన్ని ప్రదర్శిస్తు ప్రదర్శనను రక్తి కట్టించాలి. అవతలివారి ఆటకట్టించాలనే వుద్దేశంతో -

బలరాముడు కొన్ని మెళకువల్ని ప్రదర్శించి, అత్యంత లాఘవంగా ఆమె ఆట కట్టించాడు. రేవతి నిజంగా ఆశ్చర్యపోయింది. ఆకారమే కాదు, ప్రతాపం

ప్రదర్శనా తీరు - ప్రశంసనీయమని పొంగి పరవశించింది. అయితే, మనసుకు సర్ది చెప్పుకోగల్గిందే కాని, బయటికి అది పరాజయం కాకపోయినా, విఫల పరాక్రమంగా తలచి కొద్దిగా ఖిన్నురాలయింది. అప్పుడు - కృష్ణుడు - తెలివిగా- ఆమెతో “ఇది ఒత్తిత్తి - ఆట” అన్నాడు. ఆమెను ఆట పట్టించాడు.

అందరు జయజయ ధ్వానాలు చేస్తున్నారు. ఆ ఓటమిని భరించలేని రేవతి కన్నీటి పర్యంత మయింది. అక్కడనుండి, అనకూడదు కానీ, అపజయానికి తల వంచుకుని వెనకడుగు వేసింది. ఆ దృశ్యంతో బలరాముడు క్షణకాలం దిగ్భ్రమ చెందాడు. తను ఓడిపోయి వుంటే - బాగుండేదన్న ఆలోచన కూడా ఆ క్షణంలో అతనికి వచ్చింది.

ఆ క్షణంలో కృష్ణుడు, అన్నగారిని సమీపించి “ఇలాగ బొమ్మలాగ నిల్చోడం కాదు. వెళ్ళు. వెళ్ళి ఆమెను ఓదార్చు. ఎదుటివారిని నిగ్రహించు వీలుగా ఎన్నో పట్లు, మెళుకువలు; ఇబ్బందికరం కాని విధంగా చెబుతానని వూరడించు. అప్పుడు కాని....” పరిస్థితినర్థం చేసుకున్న బలరాముడామెను అనుసరించాడు. కానీ, ఆ పరిస్థితిలో ఎలాగ ప్రవర్తించాలో తెలియక, కలవరపడుతున్నాడు.

ఆమె పరుగు, పరుగున వెళ్ళి బోర్లాపడుకుని తన కన్నీళ్ళతో తండ్రి పాదాలను అభిషేకిస్తు “నాన్నా! నన్ను క్షమించు. నేను ఓడిపోయాను. నీ ఆశల నడుగంట చేసాను. నన్ను క్షమించు” వెక్కి వెక్కి ఏడుస్తూ పరి పరి విధాల ప్రార్థిస్తుంది. ఆ రకంగా ఆమెను చూసిన బలరాముడు కరగిపోయాడు. తాను జావగారిపోయాడు.

తండ్రిగా కకుద్మంతుడు తల నిమురుతూ ఓదారుస్తున్నాడు. “అమ్మా! జయాపజయాలు దైవాధీనాలు. మనం విజయగర్వంతో మందహాసం చెయ్యడానికీ ప్రదర్శనంలో పాల్గొనలేదు. మెళకువలు తెలుసుకుని, మన పగ - ప్రతీకారాలు తీర్చుకోవడానికి, ఆ దిశలో ఇది అపజయమైనా, ఒక విధంగా విజయమే. మరికొన్ని ఆయువుపట్లు, మెళుకువలు నేర్చుకోవచ్చును.” తండ్రిగా వూరడిస్తున్నాడు.

ఆ స్థితిలో అక్కడ అడుగుపెట్టిన బలరాముని, అప్పుడు కకుద్మంతుడు చూసాడు. “క్షమించండి” బలరాముడు మెల్లిగా అన్నాడు. “వెళ్ళు...!” తనదైన పద్ధతిలో కకుద్మంతుడు అరిచినట్లు మాట్లాడాడు.

“నిజానికి రేవతి ఉత్తమ వీరనారి ? మెల్లిగానే అన్నా - ఓదార్పుకాని, దృఢచిత్తంతో బలరాముడు చెప్పాడు.

"అయితే, ఎందుకు ఓడింది" అది కకుద్మంతుని "ప్రశ్న." అప్పుడే పరాజితయైన రేవతి ఉక్రోషంతో బలరాముని చూస్తూంది.

"నిజం చెబుతున్నాను. ఆమె వీరనారి. యోధురాలు. అయితే. ఈ శక్తి, బలదర్పాలు, కుశస్థలిని సంపాదించలేవు. అందుకు, కొన్ని మెళుకువలు తెలుపాలని, అందుకు మీ అనుమతి కోసం, ఇటు వచ్చానని, ఎదురుగా నిల్చున్నాడు ధడాలున ఓ ప్రక్కకు తిరిగి మరీ చెప్పాడు.

"మరో విషయం. ఆమెను అభినందించడానికో, ఆశ్రయించడానికో లేక నా బలదర్పాలు ప్రకటించుకుని "విజేత"గా నిలిచానని చెప్పడానికో ఇక్కడకు రాలేదు. అసలు మా సంగతి తెలిసి వుంటే, మీరిలాగ ప్రవర్తించరు. ముందు మా గురించి, గురుదేవులు "ఆచార్య సాందీపుల" వారినడిగి తెలుసుకోండి. ఆ తర్వాత మన "మిత్ర" సమాగమ"మన్నాడు.

అంతేకాదు. మీ అమ్మాయి రేవతి, మీతో కలిసి కుశస్థలిని సంపాదించు కోవాలంటే, ఈ శక్తి సామర్థ్యాలు చాలవన్న సంగతి తెలుసుకుని మరీ ముందడుగు వేస్తే మంచిది. కోపం పరాజయానికి చిహ్నమే తప్ప, విజయానికి "వివేకం" కావాల్సి వుంటుందన్న సత్యం మరువకండి!" బలరాముడు గట్టిగానే హెచ్చరించాడు.

"నువ్వు...!" కోపం పట్టలేకపోతున్నాడు. తనను తమాయించుకోలేక పోతున్నాడు. రేవతి కూడా తండ్రి పంథాలోనే వున్నట్లు కనబడుతుంది. "వెళ్ళిపో...!" గట్టిగానే అరిచాడొకనాటి రాజు.

కృష్ణ సోదరునిగా, కార్యశూరునిగా ఆయన మనసును పూర్తిగా అర్థం చేసుకున్న బలరాముడు "చూడండి. ఇది కోపం కాదు. ఒక రకమైన ఆందోళన. ఇది తగ్గాలంటే మీకు కుశస్థలి దొరకాలి. అది దొరకాలంటే ఎవరో ఒకరి సాయం కావాలి. అదివ్వడానికి, ఆ కుశస్థలిని సాధించి పెట్టడానికే నేను వచ్చాను. కనుక కాస్త శాంతం వహించండి. కార్యం సానుకూలమౌతుంది." అరిచే శక్తి వుండి కూడా, ఎంతో సౌమ్యంగా చెప్పాడు.

ఎవరో తెలియకపోయినా, దేవతల సాక్షిగా మిమ్ము సింహాసనాధీశుని చేస్తాననే బలరాముని, చిత్రంగా చూస్తూ బొమ్మలాగ నిలబడిపోయాడు.

ఆ బలరాముని కళ్ళలో పట్టుదల, కార్యసాధనం చెయ్యగల స్థితప్రజ్ఞత్వం కనబడుతుంది. ఎందరో రాజన్యులు, కాదని కసరి కొడితే, తమనీడే పీడగా తలిస్తే, ఈ కృష్ణ సోదరుడు, వసుదేవ - "బలరాముడు" తనను సింహాసనాధీశుని చేస్తానని, సింహాసనంపై మిమ్ము చూసి గాని నేను తిరిగి వెళ్ళననడం - అత్యంతా శ్చర్యము - దైవలీలగా భావించి శాంతుడయ్యాడు.

"చూడండి. బలముండటం వేరు. దానికి బుద్ధి జతచెయ్యడం వేరు. నాకు బలము, శరీరముంది. కానీ నా తమ్మునికి అమేయ మేథస్సు అప్రతిహతమైన, వ్యూహాతీతమైన శక్తి - యుక్తులున్నాయి. బలానికి, బుద్ధితోడైతేనే కార్యసాధనం జరుగుతుంది. అప్పుడు వివేకవంతులకు విజయం, పిలిచినట్లు వచ్చి మరీ గౌరవిస్తుంది. ఇది చరిత్ర, కాలంతో కల్పి చెప్పిన - నేర్పిన సత్యం.

శాంతమెరుగని బలరాముడు, తను నమ్మిన సత్యం - ఆ "రేవతి" కోసం, కృష్ణ సూచనతో శాంతుడయ్యాడు. సహనశీలంతో ముందడుగు వెయ్యాలని తలంచాడు తప్ప మొండితనంతో కాదు.

యుద్ధం అందరు చేస్తారు. చేసే విధానం తెలిస్తే బలదర్పాలతో పని వుండదు. యుక్తి "శక్తి"తో అఖండ విజయాన్ని అనాయాసంగా పొందవచ్చును. కాబట్టి మీ అమ్మాయికి కొన్ని పట్లు - మెళుకువలు తెలుపుతానన్నాడు. బలరాముని మాట తీరుకు, "బలపరాక్రమాలకన్న" అన్న "పట్టుదల" తీరుకు, కకుద్మంతుడు ప్రశంసించకుండా వుండలేకపోయాడు. ఆతని శిక్షణలో తన కూతుర్ని జగజెట్టిగా తయారు చెయ్యాలని కూడా నిశ్చయించుకున్నాడు. బలరాముని సమయోచిత సలహా, సహకారానికి ధన్యుడనన్నాడు. అప్పుడు మళ్ళీ బలరాముడు ప్రశాంతంగా, మా సోదరులం ఎలాగో కుశస్థలిని చేజిక్కించు కోగలం. కానీ, అదే మీరు మేము చెప్పినట్లు వింటూ, మా చెంత వుంటే, ఆ విజయం - కుశస్థలి మీదవుతుందని గట్టిగా చెప్పాడు.

ఆ మాటలకు ముగ్ధుడైన కకుద్మంతుడు "ఆ భగవంతుడు నాకిచ్చిన అదృష్టము. సావకాశమని, బలరామునితో చెయ్యి కలిపాడు."

★★★★

లీలామానుష విగ్రహుడైన కృష్ణుని మనస్సు ఉద్ధవుని పైకి మళ్ళింది. తను సుఖపడుతూ వుంటే, ఉద్ధవుడు - తనకోసం, ఎంతో శ్రమిస్తున్నాడు. అలుపెరుగని వాడై, గుట్టంపై "ధనాగారము" వంటి పెద్ద "భద్రభోషాణరథాని"కి అంగరక్షకుడై అలిసి పోతున్నాడని క్షణకాలం బాధపడ్డాడు.

తనొక రథంపై, శైబ్య ఆమె పరిచారకులు మరొక రథంపై, ఆచార్య - పూజ్యవర్యులు ఇంకొక రథంపై ప్రయాణం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఉద్ధవుడు తన విడదీయరాని అనుబంధాన్ని బాధ్యతల మూలంగా దూరం చేసుకోవడం, పగలు కుదరకపోయినా, కనీసం రాత్రిళ్ళయినా కృష్ణుని కలుసుకుని ముచ్చటించే మహద్భాగ్యాన్ని కోల్పోతున్నామేనని బాధపడుతున్న తరుణంలో ఆనాటి రాత్రి...

బలరాముడొక ప్రక్క, కృష్ణుడొక ప్రక్క నిద్రకుపక్రమిస్తున్నారు. లోకాలకు జోలపాడే కృష్ణుడు, చూపులకు కళ్ళు మూసుకుని నిద్రకుపక్రమించినట్లు నటిస్తున్నాడు, ఉన్నట్టుండి, తన చేతిని ఆ ప్రక్కనే పడుకున్న ఉద్ధవుని భుజంపై వేసాడు. కృష్ణ కర స్పర్శతో వులికిపడకపోయినా, ఆశ్చర్యంగా కళ్ళు తెరచిన ఉద్ధవుని నవ్వుతూ చూస్తు కృష్ణుడు "రా! నీతో మాట్లాడాలి!" అని లేవదీసాడు.

కొద్ది అడుగులు వేసాక, కృష్ణుడే "ఉద్ధవా! ఈ మధ్య నీలో కొంత సంఘర్షణ జరుగుతుంది. అది దేనికో, దేనివలన వచ్చిందో - నేను తెలుసుకోగోరుతున్నాను."

"అబ్బే. అదేం లేదు. నువ్వు అనవసరంగా అనుమానిస్తున్నావు."

"సోదరా! ఈ కృష్ణునికి విశ్వమే వూపిరి అయినప్పుడు - నీ మనస్సు - అందులోని ఒంటరితనం, పొందే సంఘర్షణ - ఇవి ఎక్కడికి పోతాయి. నానుండెలాగ దూరమౌతాయి ? ఎందుకా - ఏదో తెలియని అంతరంగ మథనం. ఆత్మ సంఘర్షణ. నా సంగతి నీకు తెలుసు. దేనినైనా పరిష్కరించగల శక్తి గల నేను - నిన్నుపేక్షించి - విడిచి పెడతాననుకున్నావా ?" అడుగుతున్నాడు కృష్ణుడు.

"అబ్బే. అదేం లేదు. అంతా బాగానే వుంది. నేను బాగానే వున్నాను." అది ఉద్ధవుని తొట్రుపాటు సమాధానం. కానీ కృష్ణుడు నమ్మలేదు. ఒక్కసారి ఆపాద మస్తకం నిశితంగా చూసాడు. "నిజం చెప్పు" మాయా మర్మాలకు తాను అతీతుడనన్నట్లు పలికాడు.

క్షణమాగిన ఉద్ధవుడు నిజం చెబుతున్నాను అన్నాడు, తానే మళ్ళీ "ఈ జీవితంతో నేను విసుగెత్తిపోయాను. అనకూడదు కానీ అలసిపోయాను కూడా! కనుక సర్వసంగపరిత్యాగినై బదరికాశ్రమానికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను." దాచకుండా తన వైరాగ్యాన్ని చెప్పేసాడు.

"అయితే సన్యాసివవుతానంటావు. ఇప్పుడేమంత అవసరమొచ్చింది ? అంత వైరాగ్య మొందించే ప్రబల కారణమేమిటో ...?!" కృష్ణుడు గుచ్చి గుచ్చి అడుగుతున్నాడు.

"ఈ సుఖదుఃఖాలు, కష్టనష్టాల - బాధామయ జీవితం నాకవసరం లేదు. దీనిని భరించే ఓపిక, ఆసక్తి కూడా లేదు. కనుక...." చెప్పలేకపోతున్నాడు. క్షణకాలమాతని పరిస్థితిని గ్రహించిన కృష్ణుడు "అయితే, ఈ శైబ్య ప్రవర్తనం, నీలో ఇంతటి మార్పును తెచ్చిందన్నమాట!"

"అదికాదు" ఉద్ధవుడేదో అనబోతున్నాడు.

"చూసావా." లోకంలో దేనినైనా లొంగదీసుకునే శక్తి ఒక్క మన్మథునికే వుంది. అతడు తన పుష్ప బాణాలను నీపై ప్రయోగించాడు. దాని ఫలితంగా నువ్వు వివశుడవైయ్యావు. తెలియకుండా శైబ్య మాయలో పడిపోయావు. ఆమెపై నీవనుకున్న కల, నెరవేరదు గాన, విరాగిగా బదరికాశ్రమానికి వెడదామను కుంటున్నావు. అవునా ?"

"నైరాశ్యం జీవితం సుఖ"మన్నది నిజమే కావచ్చును. ఎవరికి.... అంటే... ఆశలేనివారికి. ఆశలలోవున్నవారికి, అందనిపండు, తక్షణ వైరాగ్యాన్నిస్తుంది. అదే ఆశ నెరవేరితే, మళ్ళీ జీవితం పుష్పించి, ఫల భరితమౌతుంది. నీది రెండోరకం. అసలు సిసలైన వైరాగ్యం కాంతా - కనకాలను, మట్టిబెడ్డ వలే చూస్తుందే తప్ప, వాటికై ఆరాటపడి, ఆ నిర్వేదంలో నైరాశ్యమొంది పొందే సన్యాసం చూడదు. ఇది తాత్కాలికం. దుఃఖ స్వరూపం తెలిసిందా ? చెప్పుకుపోతున్నాడు కృష్ణుడు. వింటున్నాడు ఉద్ధవుడు. "శైబ్య" - శ్వేతకేతువుకు చెందినది. ఆమెపై నువ్వు ఆశ పెంచుకుంటు న్నావు. అది నెరవేరదు. కాబట్టి సన్యాసం.... అవునా ? తన ధోరణిని కృష్ణుడు ముగించాడు. ఉద్ధవుడు తలదించుకున్నాడు, క్షణమాగి "నీలాగ నేను ఇటు ప్రేమించి, అటు వదులుకోలేను. అందుకనే ఆ కామాగ్ని నన్ను దహింప చేసే ముందు, నేనే నిష్కామాగ్నికి అంకితమవుదామనుకుంటున్నాను."

"అది మూర్ఖత్వం. అనుభవించేది శరీరానికని, మనస్సుకే విధమైన అనుభవముండదని, అది "అనాసక్త" అని తెలుసుకున్నప్పుడే నువ్వు తరిస్తావు. నన్ను ప్రేమద్రోహిగా పలికావు. నిజానికి కార్యకారణ స్వరూపానికి భోక్త, భోగ్యములు నేనే. నేను ఎవరిని ప్రేమించను. అలాగని త్యజించను. ప్రేమ, త్యాగాలు అవిభక్తాలు. భిన్న స్వరూపాలుగా కనుపించే ఆ అవిభక్త కార్యాలు, కారణరూపాలు.

ఈ సత్యం తెలుసుకున్నవారు ధన్యులు. తెలుసుకునేవారు జీవన్ముక్తులు, కాబట్టి అనసరమైన వ్యర్థాలోచనములతో సంగస్వరూపిడివి కావు. నిస్సంగుడవై చరించు. అనుభవించే శరీరానికి అనుభవాలనివ్వాల్సిందే. కాదని మూర్ఖిస్తే - ఆ కోర్కెల స్వరూపమొక సమయం చేసుకునిప్పుడు అగ్నిపర్వతమై - ఆకాంక్షల "లావా"లో సర్వదా మనలను నాశనం చేయ చూస్తుంది. కాబట్టి....

"కృష్ణా...!" తన కసాధ్యమన్నట్లు ఉద్ధవుడు బావురుమన్నాడు.

"ఉద్ధవా! ఉద్ధరించడానికి వచ్చినవాడిని. తప్పక ఉద్ధరిస్తాను. ఇంతకీ నీకు శైబ్య కావాలా ? ఆమె శరీరం కావాలా ?" ఆ ప్రశ్నకు ఖంగుతిన్న ఉద్ధవుడు. ఏం చెప్పాలో తెలియక మూగవాడయ్యాడు.

"చెప్పు నీకు కావల్సింది - శైబ్యా - ఆమె శరీరమా ? ఇది చెప్పు. అప్పుడు నీయొక్క వేదనను తీర్చి నిన్నుద్ధరిస్తాను" కృష్ణుడు అభయమిస్తున్నాడు. ఉద్ధవుడు ఏం చెప్పాలో తెలియని పిచ్చివాడిలాగ చూస్తున్నాడు. సందేహమ్ము వలదన్నట్లుంది కృష్ణుని ధోరణి.

"కృష్ణా! నువ్వు దేవుడవు, అవతారపురుషుడివని నీ తత్వమెరిగిన ప్రతి ఒక్కరు ప్రకటిస్తున్నారు. నా వుద్దేశము అదే. అయితే నేను జీవుడను. కాకపోతే శైబ్య అందం ఆరాధ్యనీయం. అది శరీరానిది. ఆ శరీరం, మన సోదరుడు శ్వేతకేతు మోహించినది. అందం జడం. శరీరం, చైతన్యం. నీ దారిలోకే వస్తున్నాను. మోహించిన అందం యొక్క మోహం, శరీరం లేనిదో లభ్యం కాదు. అలాగని ఆ శరీరంపై ఆశ, ఒకనాటి ఉపాచార్యుడు కోరుకున్నదయింది. కనుక -

ఈ ద్వంద్వం నుండి బయటపడటానికే వ్యాకులత చెందిన మనస్సును, చింతా శోకాల ముంచడమిష్టం లేక వైరాగ్యమొంది, ఆశ్రమజీవనం గడపాలన్నదే నా వుద్దేశం.... విడమరచి చెప్పాడు.

"అందం జడం - ఆకర్షణ స్వరూపం" అన్నావు చూడు. అది నిజంగా నిజం. శరీర వ్యామోహం కోర్కెల స్వరూపం. ఆస్వాదించే అందం ముగ్ధమోహనం. నా దారిలో వస్తున్నానన్నావుగాని, నా దృష్టి అలవరచుకోవడం చాలా కష్టం. ప్రకృతిలోని అందం ఆస్వాదించదగ్గదే తప్ప అనుభవానికి రాదు. అనుభవానికి రావాలంటే సృష్టి నాశనానికి మూలమౌతుంది. అప్పుడు మిగిలేది/కనుపించేది బూడిద లేదా ఎడారి.

అందం ఆస్వాదించ దగ్గదే తప్ప అనుభవానికి రాదు. అందంగా వున్న ముగ్ధ మోహన రూపాన్ని, దేవుని దివ్య స్వరూపాన్ని, వూహించుకున్న వూహల మధురా నందాన్ని, ఆరాధించడానికి వుపయోగిస్తున్నాం తప్ప అనుభవించడానికి గాదు. ఇది సత్యం. మన సోదరుని మభ్యపెట్టవద్దు. మోసం చెయ్యవద్దు. మోహంలో పడవద్దు. ఆస్వాదించే అందం, అందంగా - ఆనందంగానే తలచి, ఆరాధనా భావంతో, అడుగువెయ్యి. కోర్కెలు నిగ్రహించుకో. అప్పుడు కోపం రాదు. విరక్తి పుట్టదు. వియోగ బాధ వుండదు. వివేకం నశించదు. నైరాశ్య ముదయించదు. అసలు సిసలైన సత్యాన్ని ఆరాధనా విధంగా కృష్ణుడు తెలిపి ఉద్ధవుని ఉద్ధరిస్తున్నాడు.

"అది సాధ్యమా, కృష్ణా....!" అమాయకంగా ఆక్రోశాన్ని చంపుకుని మరీ అడుగుతున్నాడు. అందుకు కృష్ణుడు యధావిధి తన మందహాసంతో అసాధ్యం మాత్రం కాదంటాడు. "చూడు ఉద్ధవా! ప్రతివ్యక్తి పర స్త్రీ లో తన తల్లిని, ప్రతి స్త్రీ పరపురుషుడిలో తన తండ్రిని చూడగల్గినపుడు ఈ లోకం ఆనందమందిరం. స్వర్గం. అందలి దేవతలు, ఆ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, ఈ దేవతామూర్తులకు దాసానుదాసులు, బానిసలైపోతారు.

ఈ శరీరం - జననమరణ దుఃఖ స్వరూపం - జరావ్యాధుల శోకసముద్రం. ఇది ఎప్పుడూ అశాశ్వతమే శాశ్వతం కాదు. శాశ్వతమైనది - మనం ఆరాధించే ఆరాధనం. అందులోని అందం, ఆనందం. ఎవరైనా నీతో మీ అమ్మ చాలా అందంగా వుంది. ఇప్పుడే ఇలాగవుంటే నడివయస్సులో....! అంటే నువ్వేం సమాధానమిస్తావు ? మా అమ్మ దేవతరా.... అంటావు. అందుకే ఆ దివ్య స్వరూపం, తేజస్సుతో వెలుగొందుతుందంటావు. కాని ఆమెకు జనన మరణాలు, జరావ్యాధులు, దుఃఖసంతోషాలు... అందరివలె వున్నాయి. అవన్నీ అనుభవిస్తూనే

తన భర్తా పిల్లల కోసం ఆనందంగా, అందంగా వున్నట్లు ప్రవర్తిస్తుంది. అంతే! ఇది జీవితం. జీవించడానికే తప్ప -

జన్మ ఎత్తిన ఏ వ్యక్తి ~~ఈ ఈ~~తిబాధలనుండి తప్పించుకోలేడు. నిజంగా తప్పించుకోవాలంటే సర్వపాపహరుడు, సంరక్షకుడైన ఆ శ్రీహరిని చిత్తంలో నిల్పి, ఆరేళ్ళ ధ్రువుని వలె అఖండ తపస్సు చేసి అనాయాస మరణం పొందగల ఆనంద జీవితాన్ని - సుఖ స్వరూపంగా పొందగలగాలి. అందుకు సాధన అవసరం, శరీరంలోని ఏ భాగం జడం కాదు. అది అంతా చైతన్య స్వరూపమే. కాని మోహభ్రాంతి మయం. దీనినుండి దూరమైతే అది దగ్గరై మనల్ని వెంబడిస్తుంది. అందుకు మౌనంగా దానికి దూరమవడం వలన లాభం లేదు. దానిని మన వూహలలో లేకుండా చేసుకున్నప్పుడే జన్మ సాఫల్యత, కర్మ సార్థకత, ధర్మస్థాపనం జరుగుతుంది. ఇది "గీత" కాదు. అయినా ఉద్ధవా! ఏ వ్యక్తి అయినా ముందు ముందు ఉద్ధరించబడాలంటే కావలసిన బుద్ధి-సిద్ధి మార్గమిది" అని కృష్ణుడు ముగించాడు.

ఉద్ధవుడు అర్థం కానట్లు చూస్తున్నాడు. "మరి.... ఉద్ధవుడు అడగ బోతున్నాడు. కృష్ణుడు అర్థం చేసుకున్నాడు. ప్రేమ - ప్రేమను కాక త్యాగాన్నే కోరుతుందా ?" ఇదేగా నీ ప్రశ్న. ఉద్ధవుడు తలూపాడు. అందుకు సమాధానంగా కృష్ణుడు. "నీకు - పెద్దన్నకు" ఆలోచనలు కన్న ఇటువంటి సందేహాలే వస్తాయి.

"ఇది నిజంగా అమాయికమైన ప్రశ్న. ఉద్ధవా! రాధ నన్ను ప్రేమించింది. ఆ అమాయకురాలు ప్రేమించినదని నేనెవరినో తెలుసుకున్న నేను ఆమె ప్రేమకు తలవొగ్గి, అదే స్వర్గము, సర్వస్వమనుకుని బృందావనానికి బందీ అయిపోనా ? లేక బాధ్యత నెఱింగిన వ్యక్తిగా, నా అవతార లక్ష్యాన్ని, ధర్మాన్ని నెరవేర్చనా ?"

"ఈ ఇల్లు, వాకిలి - సంసారము, ప్రేమలు" సామాన్యులకు గాని నావంటి వారికి గాదు. అదే నిత్యము - సత్యము అనుకుంటే, ఉద్ధవా! సాందీపులవారి ఆశ్రమాన్ని చేరేవాడినా ? వైవస్వతపురానికి వెళ్ళి పునర్దత్తుని తెచ్చేవాడినా ? కంసాదులను పరిమార్చి, జరాసంధుని రెచ్చగొట్టి ప్రజానాశనం తగదని గోమంతకానికి వెళ్ళి గరుడాదుల సాయంతో జరాసంధునికి బుద్ధి, శ్రీ గాలవ్యునికి సిద్ధి లభింపచేసే వాడినా ? ఈ శైబ్యను నీ ప్రాణాలకు తెగని పాశం చేసే వాడినా ? ఆలోచించు.

"నువ్వు కోరుకునే శైబ్య దావాగ్ని. ఇంకా చెప్పాలంటే కార్చిచ్చు. అది సర్వనాశనం చేసే వరకు నిద్రపోదు. రాజభక్తి దైవభక్తితో, శ్వేతకేతు వంటి వ్యక్తి తమ వద్ద వుండాలని తలచి, తన అందాలు ఆరబోసి కరవీపురానికి తీసుకువెళ్ళిందే తప్ప కాపురం చెయ్యడానికి, ప్రేమను పంచడానికి కాదు. అటువంటి దావాగ్నిని నువ్వు కొంగున కట్టుకోవాలనుకుంటున్నావు. అది నిన్నే కాదు, నిన్ననుసరించే వారి నందరిని కూడా నాశనం చెయ్యగల ప్రళయాగ్ని, విలయాగ్ని. ఎటొచ్చి, నా గురించి తెలిసుండి, నా వద్ద దాని ఆటలు సాగక, బుసకొట్టే భుజంగంలాగ కుపితయై, కాలానికి ఎదురుచూస్తుంది. మహారాణి పద్మావతికి దీని సంగతి తెలుసుండి వదిలించుకొన చూసిందే తప్ప నిప్పును, అందులో ప్రళయాగ్నినెవరు కొంగున కట్టుకోరు. అందుకే శ్వేతకేతు, కాలానికి తలవొగ్గి, నామాటకు కట్టుబడి మిన్నకున్నాడు. అర్థమయిందా ? అర్థమయేటట్లు చెప్పిన కృష్ణుడడుగుతున్నాడు. తలూపాడు ఉద్ధవుడు.

"రేపో, ఎల్లుండో... అన్న బలరాముడు, కకుద్మంత, రేవతిలతో కల్సి కుశస్థలికి వెడతాడు. నువ్వు అన్నను అనుసరించు. అక్కడ గల పుణ్యాజన నావికులతో కలిసి, అన్నకు సాయం చెయ్యి. కుశస్థలి పునర్నిర్మాణంలో పునాది రాయివి కమ్ము. పరిస్థితులన్నీ వాటంతటవే సర్దుకుంటాయి. మనసు కుదుట పడుతుంది.

బ్రద్దలయే అగ్నిపర్వతము, కురిపించే, ఆ ఎర్రటి అగ్ని ద్రవమై ప్రవహిస్తూ, కనుపించినంతమేర దాని ప్రభావంతో భూపొరలలోకి చొచ్చుకువెళ్ళి ప్రమాదాన్ని కల్గిస్తుంది. నీరు, నిప్పు మనకు అవసరమే. అవి మోతాదు దాటితే ప్రాణాంతకం. పరిస్థితి చెయ్యి దాటితే, ప్రళయాంతకం. మన శైబ్య అటువంటిదే.

సంపూర్ణంగా కృష్ణుని మాటల్ని అర్థం చేసుకున్న ఉద్ధవుడు... అన్నా! నీ మాట వేదవాక్కు. అసలు నువ్వే వేదం. అర్థం చేసుకోలేని అజ్ఞానిని. క్షమించు, కరుణించు. శరణాగతుడయ్యాడు. తప్పక "ఉద్ధవా! ఉద్ధరిస్తానని అభయప్రదానం చేసాడు - ఆ - "కృష్ణం వన్దే జగద్గురుం" - అనే జగదాచార్యుడై విలసిల్లబోయే కృష్ణుడు.

# కుశస్థలి

**బ**లరామ, ఉద్ధవులు - గతంలో కృష్ణుడు సూచించిన ప్రకారం, కకుద్మంత, రేవతిలతో కలిసి, కుశస్థలికి బయలుదేరారు. దమఘోషునికి, బలరామ - ఉద్ధవుల- కుశస్థలి ప్రయాణం గూర్చి తెలిసి, తన వద్ద గల "ఉద్దండ - పిండాల" వంటి మహాయోధులను కొందరిని, వారికి బాసటగా పంపాడు.

అలాగే సాందీపులవారి గురుకులం నుండి మరో నల్గురు - సర్వ సమర్థులు బలరాముని అనుసరించారు. వీరందరు జయశేనుల వారు ఏర్పాటు చేసిన రథాలలో భృగుతీర్థం వరకు వెళ్ళి, అక్కడనుండి పడవులలో ప్రభాస తీర్థానికి బయలుదేరారు.

ప్రభాస తీర్థ మహారాజుకు, జరాసంధుని నిగ్రహించిన బలరాముడు, తన ఆశ్రితులతో ప్రభాసతీర్థానికి "సోమనాధుని" దర్శించడానికి వస్తున్నట్లు ముందుగా వార్తాహరులను పంపారు. వారికి తగు ఏర్పాట్లు చూడమని కూడా వర్తమానం పంపబడింది.

అప్పటికే బలరామ-కృష్ణుల లీలా విలాసాలను కథలు, కథలుగా విన్న ప్రజలు, మహారాజు కూడా బలరాముడికి, వారి ఆశ్రిత గణానికి తగు విధమైన రాజమర్యాదలు జరుప ఏర్పాట్లు చేసి, రాబోయే అతిథులకై ఎదురు చూస్తున్నాడు. అలాగే కుశస్థలిపై పోరాట విషయంలో, ఒకప్పటి కుశస్థలికి పెట్టని కోట అయిన గిరినగర్, పాలనా పగ్గాలు స్వీకరించడంలో తగు విధంగా సహకరిస్తానని కూడా వాగ్దానం చేసాడు. అందుకు సిద్ధంగా వున్నాడు కూడా!

ఆ ప్రయాణంలో అడుగువేసే ప్రతిక్షణం ఉద్ధవుని ఆశ్చర్యానికి అంతులేదు. కృష్ణుడు.... నిజంగా కృష్ణుడే. ఎటువంటి అవాంతరాన్నైనా, ఛేదించగల, సాధించగల స్థిత ప్రజ్ఞుడని మనస్సులోనే వేనవేల వందన శతాలర్పించుకున్నాడు. బలరాముడు మాత్రం క్షణాలలో ఆ పుణ్యజన రాక్షస కోటనాక్రమించుకోవాలని తహతహలాడి పోతున్నాడు. ఉద్ధవులు, కకుద్మంతులు వ్యూహరచనతో ముందుకుసాగుతున్నారు. ఈ సాగతీత బలరామునికి రుచించడం లేదు.

ఒకనాటి కుశస్థలి. ఇప్పుడు మూడు రక్షణ వలయాల వంటి ప్రాకారాలతో, భూభాగం నుండి ఎవ్వరు ఏ విధంగాను అటకాయించి, ఎదుర్కోలేని విధంగా తయారయింది. ఉద్ధవ, కకుద్మంతులు సముద్రమార్గంలోనే ఆ కోటను ఛేదించాలని తలుస్తున్నారు. అదే సమయంలో వారికో శుభవార్త. నమ్మకస్థులైన వేగుల ద్వారా అందింది. పాంచజన నావ అక్కడికి రాబోతుందన్నదా శుభ సందేశం, ఉద్ధవునికి అది అమితానందదాయకమయింది.

భిక్కు, కక్కుర.... అందరు ఉద్ధవునికి తెలిసినవారే. ఆత్మీయులే. వారి నుండి ఆశించినదానికన్న ఎంతో ఎక్కువైన సహకారం తప్పక లభిస్తుంది. అదొక శుభసూచకం. నిజం చెప్పాలంటే, అదే... శుభసూచకం. ఇక "కుశస్థలి" మనదేనన్న సంపూర్ణ విశ్వాసమొందారు వారు.

కుక్కుర ద్వారా, ప్రత్యేకంగా ఉద్ధవ, బలరాములు ఉద్ధవునికి పాత మిత్రుడైన అతని తాత పెద్దాయన భిక్రూను కలుసుకున్నారు. బలరాముడు, తన దేవుడు - ప్రాణ ప్రదుడైన కృష్ణుని అన్నగారని తెలిసి, ఆ పడవలోని మొత్తం పరిజనం, బలరామునికి తమ వినయ విధేయతల వందన శతాలర్పించారు. కృష్ణుని గూర్చి అడిగారు. అంతా బాగుందని ఏదో చెప్పబోతూంటే -

అనవసర తాత్సర్యానికి, అసహనానికి గురౌతూ బలరాముడు, "చూడండి. మేమిక్కడికి వచ్చింది. కుశస్థలిని జయించడానికి. అందుకు మీ సహకారం కావాలి." విషయాన్ని సూటిగా చెప్పేసాడు.

"కుశస్థలా.... ?! ఆ మాటతో భిక్కు గుండె జారినంత పనయింది. అది అసాధ్యమని, అంత సాహసం చెయ్యలేమని పెద్దాయన పెదవి విరిచేసాడు. అమ్మో! వాళ్ళు పరమ దుర్మార్గులు. వాళ్ళను జయించడం కుదరదు!" నీరసించిపోయాడు.

"చూడు పెద్దాయనా! ప్రతీదీ అసాధ్యమంటే ఏదీ సాధ్యం కాదు. మేము ఇటు భూ మార్గంలోను, అటు సముద్రమార్గంలో కూడా దానిని నిర్బంధించి స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నాము." దృఢ నిశ్చయంతో చెప్పాడు.

కృష్ణునికి అన్నగారవడంతో, ఎదురాడలేక "ప్రభూ! మా వుద్దేశంలో ఇది అత్యంత సాహసమైనది. ప్రమాదకరమైనది." ఎంతో వినయంగా చెప్పాడు.

"అది సామాన్యులకు. అసామాన్యుడైన కృష్ణుని వంటి ధర్మమూర్తులకు గాదు. కృష్ణుడు వచ్చి కదులు అంటే, ఈ సముద్రం కదలుతుంది. మాకు మార్గం, ఇతరులకు "మారకం"గా ప్రవర్తించాలంటే, ఈ సముద్రుడు తన సిద్ధాంతానికి వ్యతిరేకమైనా, ప్రకృతిధర్మం కాకపోయినా, కృష్ణుని ఆదేశానికి తలవంచుతాడు. గోమంతక సంఘటనమును వారికి చెప్పి ధైర్యం నూరిపోసాడు.

"అది నిజం" కృష్ణునికి ఈ విశ్వమే దాసురాలన్న విషయాన్ని వినయంగా ఒప్పుకున్నాడు.

"మరో మాట చెప్పడం మరచిపోయాను. కృష్ణ ప్రభువు సందేశం కాదు కానీ, నీకో విషయం చెప్పమన్నారు." అనగా "ఉద్ధవుడు" చెప్పండి. కృష్ణ ప్రభువుల ఆదేశం, సర్వదా శిరోధార్యమన్నారందరు.

"పెద్దాయన భిక్రుకు చెప్పు. అలాగే సోదరులు కుక్కుర, రడ్డా అలాగే మిత్రులు హుకుక్క, ముల్లులను గూడా జాగ్రత్తగా, మా అన్నగార్కి సహకరించి, వారికి విజయలక్ష్మిని కీర్తి ప్రతిష్ఠలను సంపాదించి పెట్టాలని కోరానని మరీ మరీ చెప్పు. ఈ రాష్ట్రంలో ధర్మం నిలబెట్టాలని, కుశస్థలిని పౌరసామ్రాజ్యంగా చెయ్యాలన్నది మా ఆకాంక్షయనీ, ఇందుకు మీరందరు తప్పక సహకరించ కోరానని చెప్పమన్నాడు.

అంతే. "ప్రభూ! మీ ఆజ్ఞ శిరోధార్య"మంటూ కృష్ణ సోదరునికి శిరసు వంచి అంజలి ఘటించారు. పదండి యుద్ధభేరిని విజయభేరిగా మ్రోగిద్దామన్నా రందరూ. బలరాముని నేతృత్వంలో విజయం సాధించగలమనే విశ్వాసం ప్రతి ఒక్కరిలో పొంగిపొరల సాగింది. అయినా - భిక్రూలో కొంత వెనుకంజ తెలియకుండా మనసులో ఎక్కడో దాక్కున్నట్లు కెలుకుతుంది. దానిని పసిగట్టిన ఉద్ధవుడు -

"ఓ, పెద్దాయనా! బలరామ, కృష్ణులు దేవాధిదేవతలు. అనంతుడు, అమేయుడైన వేయితలల ఆదిశేషువే ఈ బలరాముడనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ దేవదేవునికి, అనంతునికి, అవ్యక్త శక్తునికి సహకరించే సావకాశం గల్గడం, రావడం, నిజంగా మనందరి అదృష్టమన్నాడు. "ఔనౌను" అంటూ ప్రతి ఒక్కరు నేను సిద్ధమంటే నేను సిద్ధమని, తమ అంగీకారాలను అడగకుండానే ప్రకటించేసారు. భిక్రూలోని సర్వ సంశయాలు, ఆ క్షణంలో దూదిపింజలాగ ఎగిరిపోయాయి. మాయ తొలగి ధన్యుడయ్యాడు.

ఓడలు సర్వసన్నద్ధంగా బలరాముని వ్యూహం ప్రకారం ముందుకు సాగుతున్నాయి. పాంచజన్య ఓడలో ఓ ప్రక్కన చిద్విలాసంతో బలరాముడు, మరొక ప్రక్క కకుద్మంతుడు, రేవతి నిలబడి వున్నారు. ఉద్ధవుడు, భిక్రు ఇంకొక ప్రక్క విజయాన్ని కాంక్షిస్తూ వినయమూర్తులై నిలిచారు. నావ పయనం ప్రారంభించింది. అందరు జయ జయ ధ్వానాలు చేస్తూంటే బలరామునిలో విజయ గర్వం తొణికిసలాడింది.

# పునరాగమనం

**కం**స మరణంతో మధురను వీడిపోయిన యాదవులు ఒక్కొక్కరే తిరిగి వస్తున్నారు. వసుదేవ, అక్రూరుల సాయంతో, మహారాజు ఉగ్రసేనులవారు రాజ్యం పరిపాలిస్తున్నారు. కాని పరిస్థితులు దారుణంగా వున్నాయి.

జరాసంధుని దండయాత్రను నిలువరించడానికి ప్రజలకు శాంతిని ప్రసాదించడానికి బలరామకృష్ణులు గోమంతకానికి వెళ్ళిపోవడం, రాజు దుర్బలుడవడంతో గడ్డిపోచ కూడా గడ్డపలుగుగా తయారయింది. కదలలేనివాడు కర్రసాముకు సిద్ధపడుతున్నాడు. తిరిగి వచ్చిన ప్రతి యదుప్రముఖుడు, ప్రతిఘటించేవారు లేకపోయేసరికి, పెత్తనం తమ చేతుల్లోకి తీసుకుని మహారాజు పెద్దరికానికి, సామ్రాజ్య సంరక్షణకు సవాలుగా నిలిచారు.

ఇక రాజ భవనంలో కూడా అంతర్యుద్ధం వంటి అసహనం - అసమానతలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా పెద్దది, వసుదేవుని సోదరుడు దేవభాగుడు వివాహం చేసుకున్న "కంస'కు తండ్రి అంటే ఎంతో ప్రేమ, ప్రాణం. తండ్రిని ఎన్నో రకాలుగా చెఱసాలలో వున్న సమయంలో గూడా ఎంతో ప్రేమతో చూసుకుని సేవలు చేసింది. కంసుని మరణంతో సహజ మహారాజు సేవలను మరింత భక్తితో నిర్వహిస్తుంది. అయితే ఆమెకు ముగ్గురు కుమారులు. పెద్దవాడు చిత్రకేతు, శూరవంశీయులు గర్వించదగ్గ శూరుడు. ఆఖరివాడైన ఉద్ధవుడంటే ఆమెకు, ఎందుకో తగని చిరాకు. అందుకే అతన్ని బృందావనానికి పంపించింది. ఆ సాధు పురుషుడు, రాజవంశీయుడైనప్పటికి, ఆ రాచరిక రక్తం కాక, సాధు - సన్యాస రక్తమొంది, తమకు తగని శూరవంశీయుల ఆఖరి తరానికి బానిసగా బ్రతుకడం లేదా మారడం, ఆతని తల్లి "కంస"కే మాత్రం నచ్చలేదు. అందుకే అతనంటే చెప్పలేని చిరాకు. ఓర్వలేని అసహనం.

ఇక మిగిలినది మధ్య కుమారుడైన బృహద్బలుడు. అతనిపై ఆమెకెన్నో ఆశలు. కంసుని మరణానంతరం, మాతామహుల రాజరిక వారసుడు "బృహద్బలుడే" నన్నది ఆమె ప్రగాఢ, గాఢ విశ్వాసం. గుడ్డి నమ్మకం కూడా! పైగా మహారాజు ఉగ్రసేనులవారికి కూడా, కుమార్తెతోపాటు, తననంటిపెట్టుకుని వున్న బృహద్బలుడంటే కొంతలో కొంత అభిమానం. అభిమానం వేరు, అనురాగం వేరు. తనను చెరసాల నుండి రక్షించి, రాజ్యమొసగిన కృష్ణుడంటే, మహారాజుకు

వల్లమాలిన ప్రేమ. అది కంసకు నచ్చలేదు. ఈ సమయంలో బలరామకృష్ణులు గోమంతానికి వెళ్ళడం ఆమెకెంతో వుపకారి అయింది. ఇక బలరామకృష్ణులు జరాసంధునికి భయపడి రారు కాబట్టి తన కొడుకుదే రాజ్యమనుకుంటుందా పిచ్చితల్లి! తల్లి కదా మరి, ఆ మాత్రం ఆశ వుండడం సహజమే!

ఇందుకు గాను తనవారికెవ్వరికి తెలియకుండా, మగధకు తానొక సామంతునిగా వుండటానికి తెలివిగా జరాసంధ చక్రవర్తితో బేరసారాలు కూడా బృహద్బలుడు మొదలు పెట్టాడు. ఈ విషయాన్ని కర్ణాకర్ణిగా విన్న అక్రూర, గదాదులు అధిక్షేపించారు. ఇది తగని ఆలోచనమని నిరసించారు.

"కంస" పెద్దదానిగా, తన కుమారుని విషయం చెప్పి మీరందరు సహకరించి, మాతామహుల రాజ్యవారసునిగా బృహద్బలునికి వత్తాసునిమ్మని కోరింది. కానీ మిగిలిన ఆమె చెల్లెళ్ళు - వారి పతిదేవుళ్ళు. అవతార పురుషులైన బలరామ కృష్ణులను కాదని, అక్క కోసం, ఆ మూర్ఖ బృహద్బలుని, కుత్సిత, కుతంత్రమూర్తి రాచరికానికి సంహరించక, తగదని ప్రతిఘటించారు.

అయితే బృహద్బలుడు, అత్యాశాపరులైన యాదవ ప్రముఖులతో చేతులు కలిపాడు. తమ పన్నాగాలు, పథకాలు నెరవేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, మథుర రక్షకులైన బలరామ - కృష్ణులు ప్రవాస జీవితం గడపడం, ఆ నగరంలోని చాలామంది యదు ప్రముఖులకు, విషయం తెలిసిన నగర ప్రజలకు కూడా బాధాకరమనిపించింది. ముఖ్యంగా సత్రాజిత్తు, యుయుధానుడు మరింత కలవరపడుతున్నారు.

ఎదిరించేవారు లేకపోయినా తన కుమారునికి యువరాజ పట్టాభిషేకంలో జరిగే ఆలస్యానికి, ఎదురొచ్చే అడ్డంకుల నధిగమించలేకపోవడానికి తల్లిగా కంస, అసంతృప్తికి గురయింది. తండ్రిని ఏదో విధంగా మెప్పించో, ఒప్పించో తన కుమారునికి యువరాజ్య పట్టాభిషేకం జరిపించాలని అంతకంటే నమ్మకస్తు డెవరుంటారని, ఉత్తర రాజ్యాధికారిగా ఆ కుమారుని చూడాలని సమయం దొరికినప్పుడల్లా నూరిపోస్తుంది.

మహారాజు వింటున్నాడు తప్ప సమాధానమివ్వడం లేదు. ఆ మౌనాన్ని "కంస" భరించలేకపోయింది. ఎవరి ఆలోచనలు వారివి. మహారాజు దృష్టి అంతా బలరామకృష్ణుల మీద వుంది. వారి వివరాలు బొత్తిగా తెలియడం లేదు. ఈలోగా

వర్షాకాలం వచ్చింది. ముసలి మహారాజు అస్వస్థుడయ్యాడు. ఇదే తగు సమయమని, తన కుమారుని యువరాజును చెయ్యమని పెద్దకూతురు, విశ్వాసపాత్రురాలిగా కంస మళ్ళీ మొదలుపెట్టింది.

గతాన్ని సమీక్షించి, బలరామ-కృష్ణుల జాడ తెలియని మధుర ప్రముఖులు, వసుదేవునితో కలిపి, కంస సూచనను, బృహద్బలుని సకల రాజ్య రక్షణమును గుర్తుంచుకుని, తగు విధంగా స్పందించ సిద్ధపడ్డారు. మహారాజు ఇష్టపడితే, తమకు అభ్యంతరం లేదని తెలిపారు. కాని మహారాజు మనసు మరో విధంగా వుంది. మృత్యుదేవత తనను ముద్దాడేలోగా, తన ప్రాణ రక్షకులు, మధురాపుర వీరులైన బలరామ - కృష్ణులను చూడాలని వారి అనుమతితోనే, సర్వ-రాచకార్యాలను చక్కపెట్టాలనే దృష్టిలో వున్నాడు. ఇది కంసకు రుచించడం లేదు.

ఇటువంటి తరుణంలో, మహారాజు గర్గులను వారిని రావించారు. ఇది దక్షిణాయనం కనుక, పితృదేవతలకు చేయవలసిన కర్మలను నిర్వర్తించాలన్నారు. కులగురువు సూచనలకు, మహారాజు "గురుదేవా! మీ ఆజ్ఞ శిరోధార్యం. పితృపితామహులకు సలుపవలసిన కర్మలను నిర్వర్తిద్దాం. ఈ సమయంలో నన్ను బాధపెట్టేది ఒకటే - అది - నా కుమారుడు కంసుని ప్రవర్తన.

"అయిన వాళ్ళని చూడకుండా, పెద్దా - చిన్నా తారతమ్యం విడిచి, అతని ప్రవర్తించిన తీరు సర్వులకు అధిక్షేపణీయం, ఆక్షేపణీయమైంది. అందుకే మనుమడు కృష్ణుడు అతన్ని చంపినా ఆ సమయంలో బాధనిపించలేదు. కృష్ణుడు రాజ్యభారం వహిస్తాడేమో, నా ప్రజలు, మేము సుఖంగా వుంటామని తలిచాను. కాని విధి వైపరీత్యం. మాకాదృష్టం కలుగలేదు.

మహారాజు ఆవేదనను అర్థం చేసుకున్న గర్గులవారు "మహారాజా! భయపడకండి. కృష్ణునికేమీ కాదు. అతడు త్వరలో తిరిగి వస్తాడు. ధైర్యంగా వుండండి" వూరడించాడు. అప్పుడా ప్రక్కనే వున్న కంస -

"అతను రానివ్వండి. సంతోషం. కానీ అతను నా కుమారుని భావి జీవితానికి అడ్డంగా రావడమే నేను సహించలేకపోతున్నాను.

"చాలా పొరపాటు. నీ ఆలోచన సమర్థనీయం కాదు. యాదవులకు ఊపిరి, ప్రాణభిక్ష నిచ్చినది ఆ "గో"పాలకృష్ణుడు. ఆ కరుణామయుని సాహసమే లేకుంటే, నేను ఇప్పటికే చెరసాలలో వుండేవాడిని. మీరంతా, ఇంత స్వతంత్రంగా నోరు

తెరవగలిగేవారు కాదు. మరోమాట. కృష్ణుడు లేకుండా, అతను చిన్నవాడైనా అతని సలహా సంప్రదింపులు లేకుండా యువరాజ్య పట్టాభిషేకమెవరికి జరుగదు. ఇది అర్థం చేసుకుంటే సంతోషిస్తాను. "మహారాజు తన మనసు విప్పి చెప్పేసాడు. కంస నిర్ఘాంతపోయింది. క్షణమాగి కాస్త తేరుకుని - పొరపాటున కృష్ణుడు రాకపోతే..." అనేసింది.

గర్గాచార్యులు నవ్వుకున్నారు. మహారాజు ఏదో అనబోతున్నారు. ఆ క్షణంలో రాజ్య రక్షకుడైన శంకు, గబగబ వచ్చాడు. రొప్పుతూ మహారాజా! అతడు వస్తున్నాడు" అని చెప్పాడు.

"అతనంటే..... ఎవరు ?" మహారాజు ప్రస్తుతం మృత్యువును ఆహ్వానిస్తున్న తరుణంలో ఆ వచ్చే వ్యక్తి ఎవరో తెలుసుకుందామని, ఆసక్తిగా అడిగాడు. "ఇంకెవరు, మన వసుదేవసుతులు కృష్ణులవారు. ఆ దేవాధిదేవుడు జరాసంధుని పీచమణిచాడు." తమకికి భయం లేదన్నట్లు ఎంతో వుత్సాహంగా, వుద్రేకంతో చెబుతున్నాడు.

"భగవాన్! నిజంగా నేను అదృష్టవంతుడిని. ఈ చివరి సమయంలో నాకు మోక్షమివ్వడానికి ఆ దేవుడు వస్తున్నాడన్నమాట." తృప్తిగా నిట్టూర్చాడు. గర్గులవారు మనస్సులోనే ఆ పరమాత్మకు అంజలి ఘటించారు. ఇందరికి ఆనందదాయకమైతే "కంస", శ్రీకృష్ణుడు వస్తున్నాడనేసరికి "కర్మ, కర్మ" అని తలబాదుకుంది. కన్నీళ్ళ పర్యంతమై, ఏడుస్తూ బయటికి వెళ్ళిపోయింది.

బృహద్బలుడు, తాను యువరాజయినట్లే, ఆడుతు, పాడుతూ, త్రాగుతూ, తూలుతున్నాడు. ఇష్టమొచ్చినట్లు వాగుతున్నాడు. ఆ సమయంలో హడావుడిగా వచ్చిన సాత్యకి "నోర్మూయండి." అని గట్టిగా అరుస్తుంటే - "రా! సోదరా, రా!" ఈ మధువు...!" వాగుతున్నాడు. అతని మిత్రులు "రా! రా! యువరాజు ఆదేశిస్తున్నారు" అన్నాడు. "అనవసరంగా పగటి కలలు కనకండి. బృహద్బలుడు యువరాజు కాడు, కాలేడు.". సాత్యకి నిక్కచ్చిగా చెప్పేసాడు. "ఏమన్నావు ?"

మూర్ఖుల్లా మాట్లాడకండి. తాగిన మత్తు దిగినట్లు అరుస్తున్నాడు. ఏం జరిగిందో చెప్పు!" అతడే అసహనంగా అడుగుతున్నాడు.

"ఇంకేమిటయ్యేది. అతడు వస్తున్నాడు." "అతడంటే... ?!" "ఇంకెవరు. ఆ కృష్ణుడు... ఆతని సలహా సంప్రదింపులు లేకుండా నీకు యువరాజ్య పట్టాభిషేకం జరగడం కలలోని మాట. అతనెప్పటికి వస్తే అప్పటి వరకు నిన్ను

యువరాజును చెయ్యాలనే మహారాజు, కృష్ణుడొస్తున్నాడనేసరికి పొంగిపోతున్నాడు. అదేదో బాధాకర విషయంగా సాత్యకి చెబుతున్నాడు. అందరు బొమ్మలయి పోయారు. ఆశలు అణగారిపోయాయి.

“ఇంకో విషయం. అతను సామాన్యుడు కాడు. అన్నదమ్ములిద్దరు కలిసి, బలరాముడు జరాసంధుని నిగ్రహిస్తే, ఈ కృష్ణుడు గాలవ్య వాసుదేవుని తుద ముట్టించాడు. బలరాముడు కుశస్థలిని జయించాడు.. ఇప్పుడు మనం తెలుసుకోవల్సిన అసలు విషయం. కరవీరపురాన్ని జయించి, శ్రీ గాలవ్య వాసు దేవుడనే దురాత్ముని వధించినందుకు కృతజ్ఞతగా, వారు కృష్ణునికి సామంతులై, కప్పం చెల్లించారు. ఆ కప్పం మొత్తం ఈ మధురా నగరానికి ఉద్ధవుని నేతృత్వంలో, ప్రత్యేక వాహనంపై ఇక్కడికి వస్తున్నదట!?

సాత్యకి మాటలలో అందరిలో మత్తు దిగిపోయింది. నేలమీద చతికిలబడి పోయారు. అయితే కృష్ణుడు చనిపోలేదా ?” నీరసంగా బృహద్బలుడడిగాడు.

మనం చావకుండా వుంటే మంచిది” ఆ సంభాషణనంతటితో సాత్యకి ముగించాడు.

## భవిష్యత్తు..... ?!

**కృ**ష్ణుడు తన అన్నగారితో కలిసి మధురను విడిచివెళ్ళిన సమయంలో, హస్తినాపురం నుండి పాండుపత్ని కుంతి ఒక వార్త పంపింది. అందులో పాండురాజు మరణం, హస్తిన చేరడం, ధృతరాష్ట్రుడు వగైరా పెద్దలు పాండుపుత్రులను ప్రేమిస్తూంటే, దుర్యోధనాదులు అనుక్షణం ద్వేషించడం వగైరా వివరాలు వివరంగా వున్నాయి.

ఆ పరిస్థితులను పెద్దల ద్వారా చక్కబెట్టాలని తలచిన వసుదేవుడు, అక్రూరుని పంపాడు. అతను హస్తినకు వెళ్ళాడు. భీష్మాదులను కలిసాడు. తమ ఆందోళనను వివరించాడు. పెద్దలు మీరు ఆ కుంతీపుత్రులను జాగ్రత్తగా చూడాలని అభ్యర్థించాడు. వారందరు ఇచ్చిన అభయంతో అటునుండి కురుక్షేత్రానికి వెళ్ళాడు. సరస్వతీ నదీ తీరంలో ఆశ్రమ జీవితం గడుపుతున్న వేదవ్యాసులవారిని దర్శించాడు. ఆ తదుపరి మధురకు వచ్చి ఉగ్రసేనులకు, వసుదేవునికి జరిగినదంతా వివరించి చెప్పాడు.

అందర్ని కలుసుకున్న అక్రూరుడు చివరిగా దేవకి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో ఆమె బంగారు కృష్ణ విగ్రహాన్ని ఊయలలో వుంచి పరవశించి

పాడుకుంటుంది. అప్పుడొచ్చిన అక్రూరులవార్ని చూసిన దేవకి నమస్కారం చేసింది. "ఏం తల్లీ! ఇంక ఈ విగ్రహారాధనలోనే వున్నావా ?" నవ్వుతూ అడిగాడు.

"మా ప్రాణరక్షకుడు. వంశోద్ధారకుడు. అనుక్షణం ఆయనతోడిదే నా జీవితం. క్షమించండి. మీకది విగ్రహంలాగ కనబడవచ్చును. నాకు మాత్రం....!"

"చాలా సంతోషం." అన్న అక్రూరుడు సుభద్ర వగైరా అందరి యోగక్షేమాల నడిగాడు. అందరు క్షేమమని చెప్పింది దేవకి. కృష్ణునిపై గల ఆమె భక్తితత్పరతకు అలాగే ఆడపిల్ల పైగల ప్రేమాదరాలకు మురిసాడు. అందరు నిన్ను పిచ్చిదంటే కాబోలుననుకున్నాను. గానీ, నువ్వు అవధూత స్థితికి చెందిన పరిపక్వావధూతవు. మహాభక్తురాలి"వని, అక్రూరుడు ఆశీఃపూర్వకంగా ప్రశంసించారు.

"అంతా మీ దయ," ఆశీస్సులందామె.

"కాదమ్మా! దీనినే "నారదభక్తి" లేదా "అంకిత భక్తి" అంటారు. ఇది చాలా ప్రశంసనీయం, ప్రశస్తనీయం" అని, దీనిని ప్రజాపతి - వైవస్వత మనువు, ఇక్ష్వాకులకు సమయ సందర్భాలను బట్టి తెలియబరిచాడంటాడు.

"దీనిని నారదుడు కూడా, ఎంతో భక్తితో గ్రహించాడు. ఒకసారి నారదుడు, నరనారాయణాశ్రమానికి వెళ్ళి, నారాయణునకు నమస్కరించి, ఆ "మహామునిని స్వామీ! అందరు నిన్ను ఆరాధిస్తూంటే, నువ్వెవర్ని ఆరాధిస్తున్నావని ?" అడుగుతాడు. నారాయణుడు చిరునవ్వులు చిందిస్తూ" నారదా! అన్ని తెలిసిన నీవు నాకంటే మేరు (పర్వతరాజు) వు దగ్గరకు వెళ్ళు. విషయం గ్రహించగల్గుతావని చెప్పాడు. అక్కడనుండి శ్వేత ద్వీపానికి వెళ్ళు అక్కడ బృహస్పతి, ఏకత, ద్వైత, త్రేత "ఉపరిచరవాసు"లను దర్శించి, నీ సందేహం చెప్పి, సమాధానం తెలుసుకో మంటాడు. నారదుడు అలాగేనని తన పర్యటనలో భాగంగా ముందుగా బృహస్పతినడిగితే -

"సరిపోయింది. బ్రహ్మమే అవగతం కావడం లేదు. ఇక పరబ్రహ్మమా ?" అని నీళ్ళుగారిపోతాడు. ఏదో వేదాలు, వేదార్థాలు గ్రహించ గల్గుతున్నాము. కాని, అదికూడ పరిపూర్ణం కాదన్నదే నా భావన అంటారు.

ఈ ఏకత, ద్వైవత, త్రైతలు, నారాయణుని గుర్తించలేక, ఇంకా తపోమూర్తులుగానే జీవిస్తున్నారు. ఇక ఉపరిచరవాసువు, నారాయణ తత్వాన్ని గ్రహించగలిగాడు కాని, వ్యక్తపరుచలేడు. ఇదంతా వేదవ్యాసులవారు చెబుతూంటే, నీ పరమభక్తి తలచుకుని మరీ మురిసిపోయాను!" అంటాడు.

ఈ మాటల్లో హడావుడిగా వచ్చిన వసుదేవుడు "దేవకీ, యువరాణీ!" అన్నాడెంతో ఉత్సాహంగా -

గబుక్కున లేచి "ఏవిటండీ ?" అంది. ఏముంది... అతను వచ్చేస్తున్నా డన్నాడు. అతనంటే.... ఆసక్తిగా అడిగింది. ఇంకెవరు... మన కృష్ణుడు...! సమాధాన మిచ్చాడు వసుదేవుడు. ఎంత సంతోషవార్త...! "కృష్ణుని రాకను తలచుకుని మురిసిపోయిందా పిచ్చిభక్తి" తల్లి. కృష్ణుడు, అతనితోపాటు దమఘోషుడు కూడా వస్తున్నాడనగా, "ఓ భగవాన్!" నమస్కరించింది. ఆ విషయం విన్న అక్రూరుడు "నిజం. అతడు నాధుడు. నారాయణుడు. వాసుదేవుడు. ఉద్ధారకుడు" అని మనస్సులోనే కళ్ళు మూసుకుని అంజలి ఘటించాడు.

వసుదేవుడు ఎంతో ఉత్సాహంగా, కృష్ణుడు ఇక్కడినుండి వెళ్ళినప్పటి నుండి, ఇక్కడికి తిరిగి వచ్చేవరకు విన్నదంతా, జరిగింది జరిగినట్లు తను చూడక పోయినా, చూసినట్లు దేవకికి వర్ణించి చెబుతున్నాడు. ఆసక్తిగా వింటుందామె.

అది మథురానగరి గాథయితే...

అంచెలంచెలుగా ప్రయాణం చేసి, వర్షాకాలం కాబట్టి మార్గమధ్యంలో కలిగే ఇబ్బందుల నధిగమిస్తూ దమఘోషాదులతో కలిసి కృష్ణుడు ప్రయాణం సాగిస్తున్నాడు, చివరకు మథురలో అడుగుపెట్టాడు.

మహారాజు ఉగ్రసేనుడు, ముఖ్యసలహాదారు వసుదేవుడు, ఆదిగా గల వారందరు దమఘోష, కృష్ణాదుల నాహ్వానించడానికి స్వాగత సత్కారాలు సలుపడానికి, ఆబాల గోపాలంతో కలిసి సిద్ధంగా వున్నారు. వచ్చే కృష్ణునికి ఇప్పట్లో చూడలేమనుకున్న కృష్ణునికి, ఘనంగా స్వాగతమివ్వడానికి మథురాపురవాసులు ఆనందోద్రేకాల మున్గిపోయారు.

అసలిటువంటి ఎదురుచూపులు, స్వాగత సత్కారాలు, స్వచ్ఛందంగా ప్రజలు కదలి వచ్చే శుభముహూర్తం, వూహ తెలిసి నాకు తెలియదన్నట్లు ప్రతి వయస్సులోని ఒక్క మధుర పౌరుడు అనుకుంటూంటే, వృద్ధులు అప్పుడెప్పుడో... అనగనగా, అప్పుడు ఒక కథలాగ గతాన్ని నెమరువేసుకుంటున్నారు.

రథాలు, గుఱ్ఱాలు, పెద్ద పెద్ద భారీ రవాణా వాహనాలు అట్టహాసంగా వస్తూంటే, పురప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. కృష్ణుడు కనుపించాడు. ఒక్కసారి పుర ప్రజలు "జయ జయ శ్రీకృష్ణ, జయశ్రీగోపాలకృష్ణ! యదువంశోద్ధారకా, జయము, విజయము"

పెద్ద పెట్టున జయజయ ధ్వానులు అప్రయత్నంగా మొదలుపెట్టారు. ఆ క్షణం అందరికి ఎంతో సంతోషదాయకమయింది. ఏ కొద్దిమందో.... (వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చును.) తప్ప అందరు హర్షధ్వానాల మున్గి తేలుతున్నవారే.

రాజభవనం ముందుకు, అదొక వూరేగింపుగా, కృష్ణుడు దమఘోషాదులతో కల్సి రథం దిగాడు. ముందుగా తన కోసం ఎదురుచూసే పెద్దాయన, తాతగారు, అంతకుమించి మహారాజు ఉగ్రసేనులవారికి ఎంతో వినయ విధేయతలు భక్తితో సాష్టాంగ నమస్కారం చేసాడు. తదుపరి వరుసగా తండ్రి వసుదేవునికి కుల గురువులు గర్గాచార్యులవారికి, అటునుండి అక్రూరులు వగైరా పెద్దలందరికి వందనాలర్పించాడు. ఆ తదుపరి మాతృమూర్తికి, ఇతర తల్లులకు, నమస్కరించదగిన ప్రతి పెద్దవారికి వందనాలర్పించాడు.

త్రివక్ర మాత్రం కృష్ణునికి పాదాభివందనం చేసింది. ఆమెతో మిగిలిన వారెందరో........ ఇటు హర్షధ్వానాలు, అటు పాదాభివందనాలు చేసారు. అది నిజంగా శుభ సమయం.

కృష్ణునితోపాటు, ఆచార్య సాందీపులు, ఛేది దేశాధీశుడు దమఘోషులకు, వారి వారికి సలుపవలసిన తీరున, రాజ, వేద మర్యాదలు జరుపబడ్డాయి. అందరు ఆనందిస్తున్న తరుణంలో దమఘోషుని రథం నుండి దిగే, అందం, ఆకర్షణ కల్గిన ఆ నల్లని అందాల పిల్లను ఆసక్తిగా "ఎవరీమె ?" అన్నట్లు చూస్తుంటే, దమఘోషుడు ఆమెను పరిచయం చేసి, దేవకి యువరాణికి అప్పగించాడు.

తల్లికి మాతృవందనం చేస్తూ కృష్ణుడు "అమ్మా! నీకొక కూతురిని తెచ్చానన్నానే... ఇదే ఆ కూతురు శైబ్య. అందాల సాంప్రదాయ బొమ్మ" అంటూ త్రివక్రను చూసి "ఈమె దేవకి రాణి కుమార్తె. ఎంత మంచిదో, అంత భయంకరమైనది కనుక ఈమెను జాగ్రత్తగా చూసుకో. ఈమె అక్కడా, ఇక్కడా ఎక్కడైనా యువరాణే తెలిసిందా ?" జాగ్రత్తగా సేవించుకోమని హెచ్చరించాడు.

అంతా గమనిస్తున్న కృష్ణుడు, అందర్నీ పలుకరించి, దగ్గరకు తీసుకునే కృష్ణుడు, అందరికి పెద్దదైన పెదతల్లి కంస, సోదరుడు బృహద్బలల మనఃస్థితిని గమనించాడు. వారెంత దగ్గరకు రావాలని శారీరకంగా ప్రయత్నిస్తూన్నా, మనసులు మాత్రం సంకుచిత, సంకటస్థితి నెదుర్కుంటున్నట్లు గ్రహించాడు. కనుక తానే ముందుకు నడిచాడు. పలుకరించాడు.

అందరు, కృష్ణుని రాకతో విజయోత్సవాలు చేసుకున్నారు. కొన్నాళ్ళు అందరితో ఆనందంగా గడిపిన చేది దేశాధిపతి తన రాజ్యానికి బయలుదేరాడు. ఇప్పుడు కృష్ణుడు వచ్చాడు. పరిస్థితులు చక్కబడతాయి. కృష్ణుడెలాగ చక్కబెడతాడు. ఆతనితో ఎలాగ ప్రవర్తించాలి. ఇదో సమైక్యతారాగం. కొరుకుడు పడని, వారికి, రాజ్యకాంక్షతోనున్న బృహద్బలుడు, ఆతని మిత్రులకు, ఆతని తల్లి కంసకు - అర్థంకాని స్థితి అయింది. అదే సమయంలో -

కృష్ణుడు నగరంలోని వారందరు కూడా సమయానికి తగు విధంగా స్పందించడానికి వీలుగా రకరకాల యుద్ధ లేదా పోరాటవిద్యలో ప్రవేశమొందాలని, ఆత్మరక్షణ పద్ధతుల నెరగాలని, అందుకు తగిన శిక్షణ పొందాలని చెప్పగా, ఆచార్య సాందీపులవారు అందుకు తగ్గట్లు శిక్షణాలయం యమునానది తీరంలోని మామిడి తోపులో ప్రారంభించారు. కృష్ణుడు చెప్పాడనేసరికి అందరు శిక్షణ పొందడానికి తహతహలాడుతున్నారు.

దీనితోపాటు, వచ్చే కార్తీక పౌర్ణమినాడు విజయోత్సవాలుగా, అశ్వ, రథ, పదాతి, విల్లు, మల్ల... రకరకాల విద్యలలో ప్రావీణ్యత పొందినవారికి పోటీలు నిర్వహిస్తామని, సమర్థులకు పతకాలు, బహుమతులు.... వగైరా ప్రదానం చేస్తామని కూడా మహారాజు తెలుపుతున్నారని ప్రకటన వెలువడింది. మారుమూల ప్రాంతాలకు గూడా అందేటట్లు చాటింపులు వెయ్యబడ్డాయి.

ఇదంతా చేసేది కృష్ణుడే. కాని... ఆజ్ఞలో... మహారాజువి. కాబట్టి అందరు శిరసావహించవలసిందే. ఇటు కృష్ణ ప్రేమ, అటు రాజాజ్ఞ వెరసి - యువకులలో ఆత్మరక్షణా, రాజ్యరక్షణా స్ఫూర్తి మొదలయింది. అయితే కొందరు యాదవ ప్రముఖులలో ప్రస్తుత బలరామ, కృష్ణుల ప్రాభవానికి, తర్వాతి కాలంలో జరాసంధుని - పగ, పట్టుదలల ప్రతీకారవాంఛకు, తామేమవుతామో అర్థం కావటం లేదు. ఎలాగ స్పందించాలో తెలియడం లేదు.

మరో ప్రక్క అందరు కృష్ణుని గొప్పగా చెప్పుకునేవారు. గోమంతకంలోను, కరవీరపురంలోను జరిగిన సంఘటనలు విన్నవారందరు, తాము ప్రత్యక్షంగా చూసినట్లు, తమకే తెలిసినట్లు, ప్రముఖంగా ప్రతి ఒక్కరితో చెప్పుకుని ఆనందిస్తుంటే... "ఔనౌను" అంటూ అందరు తలూపేవారు. తమ ఆనందాన్ని ఇతరులతో పంచుకునేవారు. ఇది కొందరికి భరించలేనిది, కంటగింపు అయింది.

కాకపోతే స్వతంత్రేచ్ఛా, పిపాస తప్ప మరోభావ, భాషెరుగని కృష్ణుని వెక్కిరించే వారుకన్న సమర్థించేవారే ఎక్కువైయ్యారు.

కానీ కృష్ణుడు 'మధురాపురవాసులకు, మనమెంత మాత్రము మరొకరికి బానిసగా బ్రతుకరాదని, అసమర్థులముగా తలంచరాదని, ప్రతి ఒక్కొరు అజాత శత్రువుగా, అవసరమైతే, ప్రాణ రాజ్య రక్షకులుగా విజృంభించాలే తప్ప ఎవరైనా మనమీదకు అన్యాయంగా దండయాత్రకు వస్తే "అయ్యబాబోయ్!" అని పరుగెత్తుకుని పోరాదని, గతంలో విక్రదులవారు మధుర రక్షణం మన చేతుల్లో లేదు. మనకు చాతకాదు" అన్నమాట సంపూర్ణంగా తుడిచేసి, రండి. మీ భరతం పడతామని ప్రగల్భాలు చెప్పడం కాదు. సమయానికి స్పందించాలని ప్రతి ఒక్కడు వీరుడు, ప్రతి ఒక స్త్రీ - వీరనారి, వీరమాత కావాలనే సందేశాన్ని అందరికి అందింప చేసాడు. అందర్ని కర్తవ్యతామూర్తులుగా మార్చి వేసాడు. నిజానికీ సలహా సర్వజనామోద దాయకమయింది.

"అమ్మో! కృష్ణుడు. అతి "రథుడు", మహా"రథుడు" అని ప్రతి ఒక్కరు ఆలోచనలో పడ్డారు. అతన్ని అనుసరిస్తే బానిస బ్రతుకవుతుంది. కాదని విరోధిస్తే మహారాజు దృష్టిలో రాజద్రోహ నేరమౌతుంది. అప్పుడు పడే శిక్ష.... అమ్మో! బృహద్బలుడు, ఆతని మిత్రబృందం వూహించుకోలేకపోతున్నారు . ఇటు నుయ్యి, అటు గొయ్యి లాగ వుంది వారికీ ప్రస్తుత పరిస్థితి. కంస పరిస్థితీ సరేసరి. ఆమె ఆశలన్నీ అడియాసలైనట్లు ఆ తల్లి భావిస్తొంది. అన్యాయంగా - అసూయాద్వేషాలకు గురయి, బ్రతుకు, దుర్భరం చేసుకుంటుంది. శాంతిని నాశనం చేసుకుంటుంది.

వృష్ణివీరుడు సాత్యకి కూడా పరిస్థితులను సమీక్షిస్తున్నాడు. మళ్ళీ పాత స్థితి పునరావృతమయ్యి, తమకు మహర్దశ కలుగుతుందా ?" అన్నది అతని ఆలోచన. ఇటు శైబ్య గూడ, అస్వతంత్రురాలైనట్లు, ఇచ్చటి పరిస్థితులకు ఇమడలేక పోతుంది. ఇక్కడ ఆమెకు నచ్చిన విషయమొక్కటే - అది - దేవకీమాత చేసే శ్రీకృష్ణ పూజ. గతంలో తాను తమ పినతండ్రిని అభినవ జగదేక ప్రభువుగా చేసిన ఆరాధనా అర్చనా కార్యక్రమ విభాగ భాగమవడమే, అది - ఆమెకు నచ్చడానికి గల ముఖ్య కారణం.

అక్కడి సర్వస్వతంత్రురాలు, ఇక్కడ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించలేకపోవడం, నోటిని అదుపు చేసుకోలేకపోవడం ఆమె అసహనానికి మొదటి బలహీనత. ఎంతో ఓర్పుతో, నేర్పుగా దేవకీమాత, ఎంతో సహనం స్నేహంతో త్రివ్రక ఆమెను

చూసుకుంటున్నారు. దేన్నయినా సహించే త్రివక్ర "కృష్ణుడు..." అని శైబ్య నోరు పారేసుకుంటూంటే, "ఆ మహనీయుని గొప్పతనం నీకేం తెలుసని, కృష్ణలీలా విశేషాలతో, ఆమె నోటికడ్డు వెయ్యడంతో ఆమెకు పాప ప్రక్షాళనం చెయ్యకుండా మాత్రం వుండేది కాదు. మిగిలిన విషయాలన్ని త్రివక్ర దృష్టిలో క్షమార్హాలే!

కాలమిలాగ నడుస్తుండగా - ఒకనాడు అంతఃపుర స్త్రీలు, ముఖ్య కాంతలందరు కూర్చుని వుండగా, మనసు స్థిరంగా లేని "శైబ్య" అమ్మా! ఈ విగ్రహానికి సేవలు చెయ్యడం తప్ప నీకు మరొక పనిలేదా ?" నిష్ఠూరంగా అడిగింది.

"ఇతడు దేవుడు, నా పిల్లవాడు. ఈతడు నా ప్రాణానికన్నా ముఖ్యుడు." చెప్పవలసిందేదో ముక్తసరిగా ముక్కుకు సూటిగా మూడు ముక్కల్లో చెప్పింది.

"ఎవరో, ఆ దేవుడు - కొడుకు!" వెటకారం కల్పిన ఎకసక్కెం. "ఇంకెవరు, మీరందరు ఆరాధించే ఆ కృష్ణుడు. నా కృష్ణుడు. నా దేవుడు!"

"ఇతడు నీ కొడుకా ? అలాగ లేడే ? నువ్వు చెప్పే కృష్ణుడు పెద్దగా, పిడుగులా వున్నాడు. ఇతడో ఎదగని వ్రేలెడంత వున్నాడు ? అది ఎత్తిపొడుపో, పరిహాసమో! తనిష్టం వచ్చినట్లు శైబ్య మాట్లాడేస్తుంది. ఆమె మాటలకు, దేవకి భక్తి, ఆరాధన తెలిసినవారలు; దేవకితో శైబ్య అలా మాట్లాడటం చూసి విస్తుపోతున్నారు.

"చూడమ్మాయి. అతడు నా బాలకృష్ణుడు. వాడెప్పుడు అలాగే వుంటాడు. ఆరాధన వేరు, అభిమానం వేరు. నా పిల్లవాడు నాకెప్పుడూ బాలకృష్ణుడే. పిపీలికాది బ్రహ్మపర్యంతం విస్తరించిన ఆ భగవంతుడెప్పుడు ప్రళయాంతమందు, కల్ప ప్రారంభమందు "వటపత్రశాయే!" నవ్వుతూ చెప్పింది.

"నీ కొడుకు - ఈ - ఆరాధనకు ఒప్పుకున్నాడా ? అక్కడ కరవీరపురంలో, నా పినతండ్రి గాలవ్యుని జగదేక ప్రభువుగా, వాసుదేవ ప్రభునిగా ఒప్పుకోని నీ కుమారుడు, ఇక్కడ, ఆరాధనా, అర్చనాదికాలను ఎలాగ "ఒప్పుకుంటున్నాడు!" ఏం మాట్లాడుతుందో తెలియని విధంగా వున్నాయా శైబ్య మాటలు.

"చూడమ్మాయి. నీ పినతండ్రి తననందరూ అరాధించాలని కోరుకున్నాడు. కాదన్నవారిని శిక్షించాడు. "నరక" మని అందులోకి త్రోసేసాడు. నా కృష్ణుడు, తనను ఆరాధించమని ఎవర్నీ నిర్బంధించలేదు. ఆరాధించే వారిని వలదనలేదు. వారి వారి వ్యక్తిగత విషయాలలో కృష్ణుడెన్నడు వేలు పెట్టలేదు. కాబట్టి.... దేవకి మాటలను ఖండిస్తూ శైబ్య -

"నీ కొడుకు నా ప్రభువు వాసుదేవుని చంపి నన్ననాధను, నిరాధారిని చేసాడు!" వలవల ఏడ్చేసింది. అదే అదనుగా కంస, ఆమెను సమీపించి "వూరుకో తల్లీ, వూరుకో. కాలం, కర్మమంటాము. విధివ్రాతకు ఎదురు తిరగలేము. నువ్వు నాతో.... రా!" అని ఆమెను ఓదార్చుతూ, తనతో తీసుకు వెళ్ళింది.

ఆ మర్నాడు, శైబ్యను కలవాలని కృష్ణుడు, ఆమెకోసం త్రివక్రతో కలిసి పెదతల్లి భవనానికి వెళ్లాడు. అక్కడ శైబ్య ఆకాశాన్ని నిర్లిప్తంగా చూస్తూ నిలబడి వుంది. ఒకమూల గతం జ్ఞాపకం వస్తూ ఇక్కడ అస్వతంత్రంగా బందీకానీ, బందిఖానా జీవితమనుభవిస్తుంది. కాలమహిమకు చిత్రానికి, చిత్రంగా ఆలోచిస్తూ చిత్తరువులా వుండిపోయింది.

అటువంటి సమయంలో "శైబ్యా!" ఎంతో మధురమైన కృష్ణుని పిలుపు. ఆ పిలుపుకు ఆరాధకులు శరణాగతులౌతారు. విరోధులు బిక్క చచ్చిపోతారు. "ఏమిటది ?" అప్రయత్నంగా వెనుదిరిగింది. కృష్ణుని చూసింది.

"నిన్న నా మాతృమూర్తి, తన వూహల బాలకృష్ణుని బంగారు విగ్రహాన్ని పూజించడం నీకు నచ్చలేదన్నావు. ఇప్పుడు నేను నీకు నువ్వు అమితంగా ఆరాధించే నీ పినతండ్రి బంగారు విగ్రహాన్ని తెచ్చాను. ఇప్పుడు దానిని నువ్వు నిరాటంకంగా నీ మనోభీష్టం మేరకు అర్చించుకోవచ్చును.

ఆ మాటలలోనే త్రివక్ర ఓ వెండిపెట్టెలో నుండి పూజించవీలైన ఓ బంగారు విగ్రహాన్ని తీసింది. దాన్నందుకున్న కృష్ణుడు శైబ్య చేతిలో ఆ విగ్రహాన్ని పెట్టాడు. శైబ్య మొహం విప్పారలేదు. ప్రాణమున్న మనిషిని నిర్జీవం చేసి, ఈ బొమ్మను నాకిస్తే నేనానందిస్తాననుకున్నావా ? ఉక్రోషం, కసి, పగ, ఎన్నో కలిసిన మనస్సుతో అడిగింది.

"చూడు, శైబ్యా! మూర్ఖత్వం విడిచిపెట్టు. ఆరాధన వేరు, అభిమానం వేరు. నిజంగా నీ భక్తే కనుక సత్యము, నిత్యమైతే, ఈ బంగారు విగ్రహం, నీ సర్వ మనోవాంఛితాలను, సద్భావనలను నెరవేరుస్తుంది. అదే భక్తి కనుక లేకపోయినా, దుష్టవాసనలు చెలరేగినా, ఫలితం ప్రమాదకరంగా వుంటుంది. ఆలోచించుకో! ఆలోచించుకుని ఆ ప్రకారంగా నడచుకుని, సత్ఫలితాలను పొందు. అనునయం, శాంతి-ప్రేమలు మేళవించిన స్వరంతో కృష్ణుడు చెప్పాడు.

"నువ్వు కపటివి, మోసగాడివి!" కృష్ణుని మాటలు నమ్మలేనట్లుంది. ఆ మాటలకు కొంటెచూపులు చూస్తూ కృష్ణుడు -

"నేను చిన్నపిల్లవానిగా వున్నప్పుడు, మా ప్రేమతత్వం, అందులోని ఆనందం అనుభవించలేని మూర్ఖులు, అందరు నీలాగే మాట్లాడారు. పెద్దయ్యాక కదా, నా ప్రతాపం, గొప్పతనం, విజయగాథలు లోకానికి అందాయి. అల్లాగే, నీ మూర్ఖత్వం వదలి, సత్యం గ్రహిస్తే నీవెవరో, నేనేమిటో అప్పుడు... అప్పుడు నీ కర్థమౌతుంది.'' చెరగని దరహాసంతో, చిద్విలాసంగా చెప్పాడు.

"నువ్వు హంతకుడివి. దారుణంగా నా దేవుడిని చంపావు!'' భోరుమని విలపిస్తుంది.

"ఇంకా మూర్ఖంగా మాట్లాడకు!'' శాంతం స్థానే కృష్ణునిలో కోపం మొదలయింది. "నిజంగా నీ ప్రభువు దేవుడయితే, అన్ని దారుణాలు చెయ్యడు. తనను ఆరాధించమని, దేవుడనేవాడు లేడని, ప్రగల్భాలు పలికి, వినలేదని, "నరక'' మంటూ ఓ కూపంలో త్రోసి హింసించాడు. అసలు హింసించేవాడు దేవుడు కాడు. దేవుడంటే ప్రేమాస్పదుడు, కరుణామయుడు, శరణాగత రక్షకుడు. తెలిసిందా!

"ఇంతవరకు మరణించినవార్ని దూషించకూడదని, ఉత్తమగతుల బదులు, నిజమైన నరకదారికి పంపరాదని తలంచాను. నీ మూర్ఖంతో, ఆతని వలెనే, అతని అదృష్టాన్ని జారవిడిపించావు. వెళ్లు. వెళ్ళి. నీ భక్తిని ప్రకటించుకుని, నీ దేవునికి ఉత్తమగతుల నాపాదింపచెయ్యి. వెళ్ళు!'' గట్టిగా హెచ్చరికగానే చెప్పాడు.

"ఇంకో విషయం. నువ్విలాగ శోకమూర్తిగా, అనాచారిగా వుండి చేసే పూజాదికాలు, అవతలివారికి ఆనందదాయకం కావు. వారికి ఆనందం కల్గాలన్నా, సంపూర్ణ మోక్షం రావాలన్నా, చింతా-శోకాలను విడిచిపెట్టాలి. అర్థమౌతుందా !?

"త్రివక్ర మంచిదుస్తులు, ఆభరణాలు తీసుకు వచ్చింది. వాటిని అలంకరించుకో. శుభ్రంగా వుండు. నువ్వు ఆరాధించే వారికి ఆనందం, శాశ్వత ముక్తి మోక్షం కలగాలని, రాగద్వేషాలను విడిచిపెట్టి ప్రశాంత హృదయంతో ప్రార్థించు. ఆరాధించు. అంతా మంచే జరుగుతుంది!'' చెప్పవలసినది, చెప్పవలసిన విధంగా గట్టిగానే చెప్పాడు. కాదంటే..... చివరగా, కృష్ణుని ప్రేమ ఇప్పుడు చూసావు. కరకుదనమెప్పుడో గుర్తించావు. ఒకసారి గతం గుర్తుచేసుకో. అంతా అదిలించి విదిలించినట్లు చెప్పాడు. అర్థం చేసుకోమన్నాడు. ఇందులో ఆజ్ఞ వుంది. అభ్యర్థన వుంది. అది వారి వారి మానసిక పరిపక్వతను బట్టి ప్రసన్నమవుతుంది.

"అన్నంత పని చెయ్యగల సర్వ సమర్థుడు'' కృష్ణుడని తెలిసిన శైబ్య క్షణకాలం అతన్ని చూసింది. ఇందులో అనురాగ-మమకారాల ప్రేమ తప్ప మరేవిధమైన వికారము,

ఏవగింపు లేదు. తాను, తన ప్రవర్తన తెలుసుండి కూడా, తనపై కేవలం ఆదరపూర్వకమైన అభిమానం తప్ప మరేమీలేని, పగతురను చీల్చి చెండాడగల ఆ జగజెట్టి - శాంతాన్ని పరీక్షించకూడదని, ఆ క్షణంలో నిర్ణయించుకుంది.

"అలాగే! తలవాల్చుకుని చెప్పింది. ఇదంతా నీకోసం కాదు, నా ప్రభువు, నా జగదేకవాసుదేవుని కోసం ధరిస్తాను!'' అంది. ఇదంతా చూస్తున్న త్రివక్ర, ఆ మాటలకు రెచ్చిపోయింది.

"జనులను పీడించేవాడు జగదేక ప్రభువా ? లోకాలను రక్షించే ఈ వాసుదేవుడు నీకు శత్రువా ? ఇది ఆ ప్రభువు కాబట్టి నిన్ను క్షమిస్తున్నాడు. అదే నేనయితే, నీకంటే పెద్దదానిగా, ఇంకా చెప్పాలంటే నీ వాసుదేవునిగా శిక్షించేదానిని. నీలోని మూర్ఖత్వం, అవిద్య నాశనమైతే తప్ప, అసలైన జగదేక ప్రభువు "వసుదేవ'' సుతుడైన వాసుదేవుని గుర్తించలేవు. చిటెకెనవ్రేలుపై ఏడు రోజుల గోవర్ధనగిరి నెత్తినవాడు, ఇంద్రుని గర్వమణచినవాడు, శ్రమ లేకుండా జరాసంధాదులను శిక్షించి, మన్నించినవాడు, నీ పినతండ్రి చేసే దురంతాలను మాన్పి, శాశ్వతముక్తి సత్రాన్ని ప్రసాదించినవాడు, నీ కంటికి, ఒంటికి, మనసుకు వందనీయుడు కాడా ?'' ఆపుకోలేక, "కృష్ణం వన్దే జగద్గురుం'' అని ప్రస్తుతి కాని విధంగా ప్రస్తుతించింది. శైబ్య మూర్ఖత్వానికి నిరశించి, నిలదీసింది.

అంతా ప్రశాంతంగా విని, పరిస్థితిని గమనించిన కృష్ణుడు "శైబ్యా! నువ్వు నువ్వే. నేను నేనే. త్రివక్ర త్రివక్రే! ఆమె మాటలు పట్టించుకోకు. నీ పద్ధతిలో నువ్వు ముందుకు సాగు. ఎవరి నమ్మకం వారిది!'' అనునయంగానే చెప్పాడు. తన సోదరప్రేమను యధావిధి కురిపించారు.

మొత్తానికి శైబ్య మెత్తపడుతున్న సమయంలో, నిజమైన మరొక శుభవార్త అందింది. అది బలరాముడు కుశస్థలిపై విజయం సాధించి, కకుద్మంతుల వారికి రాజ్యాభిషేకం చేయించాడని. ఆ శుభవార్తతో మధురానగరం మొత్తం ఆనంద మూర్తయింది. అన్నదమ్ములు బలరామ-కృష్ణుల వీరోచిత జైత్రయాత్రలకు మధురాపురవాసులందరు జయ జయ ధ్వానాలతో విజయోత్సవాలకు సన్నద్ధమవు తున్నారు. గిరి నగరం కూడా గెలిచారనే శుభవార్త, అందరికి నిజమైన శుభవార్త అయింది.

కొద్దిరోజులలో బలరాముడు, ఉద్ధవుడు విజయోత్సాహంతో మధురాపుర ప్రవేశం చేసారు. పౌరుల, బంధువుల, ముఖ్యంగా మహారాజు, ఉగ్రసేనులు,

ముఖ్య సలహాదారు, తండ్రి వసుదేవుడు, అక్రూరాదులు, తల్లి దేవకి, ఇతర యాదవ ప్రముఖుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

ఎటొచ్చీ వార్త నచ్చనిది ఒక్క కంసకు, ఆమె కుమారుడు బృహద్బలుడు, అతని మిత్రబృందానికి మాత్రమే! ఇక్కడ పరిస్థితులన్నీ ఒకసారి చక్కబరచి, కుశస్థలి పునర్నిర్మాణానికి వీలుగా ఇక్కడ నుండి తగు సిబ్బందినక్కడకు పంపాడు. అదే సమయంలో బలరాముడు రేవతికి సందేశాన్ని కూడా పంపాడు.

ప్రస్తుతం ఉద్ధవుడు బాంధవ్యాన్ని విడిచి కేవలం ప్రాణస్నేహితుని పాత్రకే పరిమితయ్యాడు. ఇతర విషయాలపై ఏ విధమైన ఆసక్తిని చూపడం లేదు. అయితే తన తల్లి కంస, సోదరుడు బృహద్బలుని ప్రవర్తనను మాత్రం అర్థం చేసుకోలేక పోతున్నాడు. శైబ్యను దగ్గరకు తీసుకోవడం, కృష్ణుని విరుద్ధంగా ప్రవర్తించే తీరును బలపరచడమతనికి నచ్చలేదు. దాంతో సమయంచూసి తల్లి ప్రవర్తనను ఖండించాడు. శైబ్య వంటి వాళ్ళకు కుత్సితమూర్తులుగా వత్తాసు పలకడం తగదని కూడా హెచ్చరించాడు. శైబ్య చాలమంచిదని, తన మిత్రుడైన శ్వేతకేతును అతి త్వరలో వివాహం చేసుకోబోతుందని కనుక తప్పుడు సలహాలు, విషపూరిత ఆలోచనలతో ఆమె జీవితాన్ని పాడుచెయ్యవద్దని గట్టిగానే వాదించాడు, హెచ్చరించాడు. దాంతో కంస కన్నీరుమున్నీరయింది.

దేవుడు కూడా తమపై కక్ష గట్టాడని, ఒకప్పుడు ఎంతో ప్రేమమూర్తిగా వుండే మహారాజు, ఇప్పుడా కృష్ణుని మాయలోబడి, తనను, తన కుమారుడు వీరాధివీరుడైన బృహద్బలుని చిన్నచూపు చూస్తున్నాడని వాపోయింది. రుద్ధ కంఠంతో ఉద్ధవుని కోపంగా చూస్తూ.

“నువ్వా కృష్ణుడికి బానిసవయిపోయావు. అన్న, తల్లి విషమయ్యారు. ఆ దేవకి కొడుకుని ఆ “గో”పాలకృష్ణునికి వత్తాసు పల్కుతూ, స్వంత అన్నకు అన్యాయం చేస్తున్నావు. కృష్ణుడు స్వార్థపరుడు. తన కీర్తి ప్రతిష్ఠల కోసం ఏమైనా చెయ్య సాహసిస్తాడు” అని గట్టిగా ఓ ఏడ్పు ఏడిచి -

“కుమారా, ఉద్ధవా! నీ అన్న బృహద్బలుడికి రాచరికం లభించేటట్లు చూడలేవా ? అందుకా కృష్ణుని విడచి నీ అన్నకు సహకరించలేవా ? స్వంత అన్నగారిపై అంత నిర్దయా ? దయచేసి నా కోర్కెను మన్నించి, నీ అన్నకు.... స్వంత అన్నకు...!” ప్రార్థిస్తూంది. దీనంగా వేడుకుంటుంది. సమాధానంగా

"అమ్మా! కృష్ణుని మనస్తత్వం ఇంకా నువ్వు అర్థం చేసుకోలేకపోతున్నావు. అతనికి రాజ్యమే కావాలంటే, తాతగారు ఉగ్రసేనులవారిని కాదని ఏనాడో ఈ మధురాపుర సామ్రాజ్యాన్ని హస్తగతం చేసుకునేవాడు. అతను సద్ధర్ముడు. ధర్మానికి ధర్మం. సత్పురుషులకు, సద్బుద్ధులకు ప్రాణమిత్రుడు, ప్రాణప్రదుడు.

"నువ్వు....!" ఉద్ధవుని మాటలకు కృద్ధురాలయింది.

"అమ్మా! తొందరపడకు. నీ కొడుకు రాజ్యమెవరు అపహరించరు!" అని వెళ్ళిపోయాడు. ఆ తర్వాత జరిగిందంతా మాటల మధ్యంలో కృష్ణునికి చెబుతాడు. అవును. నా కంతా తెలుసు. ఆ పెదతల్లి ప్రవర్తన, అన్న బృహద్బలుని మనసు నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను. వారి వుద్దేశం మంచిదే, కాదనను. సమయం వచ్చినపుడు తగు విధంగా స్పందిద్దామని కృష్ణుడు, ఉద్ధవునికి సూచించాడు.

# ముందుచూపు

ఈ సమయంలోనే బృందావనంలోని పెంపుడు తల్లిదండ్రులు నంద - యశోదల నుండి, అచ్చటి ప్రజల నుండి బలరామ-కృష్ణుల రాకను కోరుతూ వర్తమానం అందింది. వెంటనే బలరాముడు "వెళ్ళిపోదాం, కృష్ణా, అక్కడే బాగుంది ? ఇక్కడేముంది ?" ప్రశ్నిస్తాడు.

"అన్నా! నువ్వు తప్పకుండా వెళ్ళు. నేను కాదనను. నాకిక్కడ కొన్ని ముఖ్యమైన రాజకార్యాలున్నాయి. వాటిని చక్కబెట్టాలి. నేను రాలేను." తన అశక్తతను వెలిబుచ్చుతాడు.

"సరిపోయింది. నువ్వు లేకుండా నేనెక్కడికి వెడతాను ? అందులో బృందావనానికా ? అది జరిగేపనా ?" తన అసమర్థతను వెలిబుచ్చుతాడు.

"లేదు, నా మాటవిని నువ్వు వెళ్ళు. యమునను కోపం నుండి తప్పించు. నువ్వు సమర్థుడివే. ఈ మధ్య ఆడవాళ్ళను అలరించడంలో, అలకలు తీర్చడంలో ఆరితేరావు!" నవ్వుతూ వెళ్ళి యమునానది కోపాన్ని తగ్గించి, గోపీ బృందాలకు, ఆనందం కల్గించమని, అన్నగారు కదా! కృష్ణుడు బలరాముని వేడుకున్నాడు.

"వెళ్ళమంటే తప్పనిసరిగా వెడతాను కానీ, ఆడవాళ్ళను అలరించగలనంటే మాత్రం, అది అబద్ధం. ఆడవాళ్ళ ననునయించడం, నీ కోసం తహతహలాడింప చేసుకోవడం, నీకు వెన్నతో పెట్టిన విద్య. నా మొరటుతనానికి....

"అలాగనకు! ప్రభాసతీర్థ పరిసర ప్రాంతాలలోని అందమైన యువతులు నువ్వెప్పుడు వస్తావా ? అని నీకోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నారంటాడు, కృష్ణుడు. మొత్తానికి అన్నదమ్ములు స్త్రీల విషయంలో.... అదే కన్యామణుల విషయంలో ఒకరినొకరు పొగుడుకుంటున్నారు.

"నువ్వు, రా! రాధ నీ కోసం.... ఎదురుచూస్తూంటుంది" బలరాముడు పిలుపు.

"అందుకే నేను రానంటున్నాను. వున్న నాల్గురోజులు బాగానే వుంటారు. ఆ తదుపరి మళ్ళీ బాధలు. దానిని నేను చూడలేను." తను రాకపోవడానికి గల అసలు విషయాన్ని కృష్ణుడు బయటపెట్టేస్తాడు.

"ఎంత నిర్దయ...?!" అంతకు మించి మరోమాట అనలేకపోతాడు బలరాముడు. వెళ్ళు. వెళ్ళి యమునను బృందావనానికి మళ్ళించు. వారి కష్టాలు తీర్చిరా! ఈ గోవిందునిపై గల ప్రేమతో తీపి జ్ఞాపకాలతో బ్రతికే వారిని, ఆ ప్రేమలోనే వుండనివ్వు. అతి త్వరలో వస్తాననే సందేశం వారికొసగి, ఆనంద సముద్రంలో తేలింప చెయ్యి! "కృష్ణుడు మీ వాడు... మీలో మీతో వున్నాడు. ఇది నిజమని, వాళ్ళను వూరించడం కాదు. ఉత్సాహింప చెయ్యి!"

తమ్ముని సందేశంతో బలరాముడు బృందావనానికి బయలుదేరాడు. ప్రజాక్షేమం, ధర్మరక్షణ గురించి ఆలోచించే పుణ్యమూర్తులకు చేతినిండా పనే" అన్నట్లు, బలరాముడు బృందావనానికి బయలుదేరాడో లేదో, ఉపకులపతి శ్వేతకేతు మథురకు వచ్చాడు. అక్కడ జరిగిందంతా చెబుతూ, జరాసంధుడొక అపూర్వ పన్నాగం పట్టాడు. దాంతో యదువంశం ఇంచుమించు, జరాసంధునికి వెన్నుదన్నుగా నిలుస్తుంది.

ఏమీ తెలియని వాడివలె కృష్ణుడు, అమాయకంగా "అలాగా....!" అన్నాడు.

"ఏమలాగా... ? రుక్మిణిని, శిశుపాలుడికి ఇచ్చి వివాహం చెయ్యడమొక ఎత్తు. రుక్మికి తన మనుమరాలికిచ్చి వివాహం చెయ్యడం మరొక ఎత్తు. ఈ పథకం పారిందంటే భోజ, ఛేది దేశాధీశులు, దానితో వారి మిత్ర-సామంతాదులు, వార్ని అనుసరించే బంధుమిత్రాదులు వీరికోసం, జరాసంధ "చక్రవర్తి"కి శరణాగతులౌతారు. అప్పుడతడు "ఆడింది ఆట, పాడింది పాట...!"

"ఇది అందరికి సమ్మతమయింది. ఒక్క రుక్మిణికి తప్ప. ఆమెకు, శిశుపాలుని వివాహం చేసుకోవడం ఏ మాత్రం ఇష్టం లేదు. జరిపేది పేరుకు స్వయంవరమే తప్ప, నిర్ణయం - శిశుపాలునికిచ్చి రుక్మిణీ కల్యాణం జరుపడం. అతి త్వరలో స్వయంవరం జరుగబోతుంది. అందుకు తగ్గ సన్నాహాలు ప్రారంభించారు. రుక్మిణి ప్రాణాలు, ఆశలన్నీ నీ మీదే వున్నాయి. నువ్వెవరివని ? నీకు ఆహ్వానం పంపడానికి, రుక్మి, వగైరాదులు నిరశిస్తున్నారు. కానీ, విషయం తెలిస్తే నువ్వు తప్పక వచ్చి ఆమెను కరుణించి, కాపాడతావని అందరికి బుద్ధి చెప్పి, తననెత్తుకుని పోయి గాంధర్వ విధిన వివాహం చేసుకుంటావని, పాపం... రుక్మిణి తలుస్తుంది. కాబట్టి...! శ్వేతకేతు ఆగాడు.

"కాబట్టి....!" కృష్ణుడు అడుగుతున్నాడు.

"ఏముంది ? నువ్వే కావాలని కోరుకునే ఆ పిల్లను తెచ్చి వివాహం చేసుకో. నీ వీరత్వం శుల్కంగా, ఆ రుక్మిణిని, బలవంతంగానైనా సరే ఎత్తుకొచ్చి ఆమెను వివాహం చేసుకో. ఆమె కాత్మానందాన్ని కల్గించు! కోరిన నీవారిని సంరక్షించే సర్వాభీష్ట ఫలప్రదాతవు!" అని, తను చెప్పవలసింది చెప్పాడు. కృష్ణుడు కూడా నేనూ, అదే ఆలోచిస్తున్నానన్నాడు. కానీ...!"

"మళ్ళీ ఏమిటి ?" శ్వేతకేతు అడుగుతున్నాడు.

"నీకు తెలియనిదేముంది ? గోమంతకంలో జరిగిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచనతో జరాసంధుడున్నాడు. అందుకు తగ్గ ఏర్పాట్లు ఇక్కడ చూడాలి. అలాగ కాకుండా వివాహాలు, విందులు - వినోదాలనుకుంటూ, తిరిగితే, మళ్ళీ యాదవులకు, గతంకన్న భరించరాని దుర్భరస్థితి, పగ, ప్రతీకార, ద్వేషాల కసితో, అతి భయంకరంగా ఎదురౌతుంది. కనుక, ప్రస్తుతం, వివాహాన్ని గురించి ఆలోచించే సమయం సందర్భం లేదు.

"నీకు లేకపోవచ్చును. కానీ, అక్కడ రుక్మిణి, శరణమో, మరణమో... ఏదో ఒకటి ఎంచుకునే స్థితిలో వుంది. లీలామానుష విగ్రహుడవైన నీకు అసాధ్యం లేదు." "సంభవామి యుగే యుగే...!" అన్నది నీ పాలిట సత్యము, నిత్యము. కావున "కృష్ణా! కరుణించు. కనికరించు. రుక్మిణిని ఆదరించు!" ఆమె బదులు ప్రార్థిస్తున్నట్లు శ్వేతకేతు వేడుకుంటున్నాడు.

భక్తపరాధీనుడైన కృష్ణుడు నవ్వుకున్నాడు. చిరునవ్వు వెన్నెలలు చిందిస్తూ "చెప్పానుకదా, ఆమె మరెవర్ని వివాహం చేసుకోదు. సరేనా ?" అభయ మిచ్చినట్లు చెప్పాడు.

అక్కడ రుక్మిణికి స్వయంవర హడావుడి అలాగ వుంటే, ఇక్కడ మహారాజు ద్వారా, ప్రతి కుటుంబం నుండి కొందర్ని మథుర సంరక్షణకు గాను వీరాధి వీరులుగా తయారుచేయాలన్న కృష్ణుడు పథకానికి తూట్లు పొడవాలని, అతని ఆలోచనలు మనపై రుద్దుట తగదని, మహారాజుకా మాత్రం లోక జ్ఞానం లేకపోవడం శోచనీయమనే వాదన ఒక వర్గం నుండి బయలుదేరింది.

సోమరిపోతులు, సుఖలాలసులు, "తేరగా తిని కూర్చోక, దొరికిన దాంతో సంతోషాన్ని పొందక, ఈ వీరత్వ ప్రదర్శనలు, శిక్షణ, పందాలు ఏమిటి ? వీరిలో వీరే వాదనం. కంస మరణానంతరం తిరిగి వచ్చిన యదువీరులు, రాజరిక వ్యవహారాలలో కృష్ణుని పాత్రపై నీలినీడలు, పలు సందేహాలు.

ఈ విషయంలో - బృహద్బలుడు. ఆతని మిత్రబృందం. అలాగే మథురకు తిరిగి వచ్చిన సత్రాజిత్తాది వర్గం - ముఖ్యమైనవి. సత్రాజిత్తు వర్గంలోని వీరాటుడు, "అతడు దేవుడు కదా! మరీ కార్యక్రమాలు మన కోసమా, ఆయన కోసమా ? అంటే...

"అనవసర చొరవ తగదంటాడు సత్రాజిత్తు."

"అవసరమో, అనవసరమో... మనమాట ఎవరు వింటారు., యాదవ పెద్దలందరు కృష్ణుని పక్షమే కనుక అతను "నంది" అంటే... నంది "పంది" అంటే "పంది". కాదనే వారెవరు ?" అంటాడు విరాటుడు.

"నువ్వో పిరికి సన్నాసివి ?" భద్రకుడందుకున్నాడు. "ఇలాగ మాట్లాడుకున్నా, పోట్లాడుకున్నా ఫలితముండదు. అతన్ని నిరోధించాలంటే అందరు సమిష్టిగా ధ్వజమెత్తాలి ?" అని ఒకరంటే... "అయితే ఏం చేద్దాం....!" ఇంకొకరి సందేహం.

"ఏముంది ? రాజులాగ ప్రవర్తించకు. మాకొక మహారాజు వున్నాడు. నీకింకా ఆధిపత్యం, అధికారాలు కావాలంటే, వెళ్ళు. వెళ్ళి, ఆ గోమంతకంలో నీ ప్రతాపం చూపమని హెచ్చరిద్దాం!" అందుకున్నాడు సత్రాజిత్తు.

"అవన్నీ అనవపరం. ఈ రథోత్సవాలు, విజయోత్సవాలు, పోరాటాలు, సాముగరిడీలు మనకనవసరం. కావాలంటే ఆ నల్లదాన్ని తీసుకుని, ఈ నల్లవాడు

ఎక్కడికైనా పోవచ్చును. ఈతను సహాయం కావాలని, మనల్ని రక్షించమని ఎవరేడ్చారు ?'' భద్రకుడు మహావీరుడిలాగ వదరుతున్నాడు.

ఇటువంటి సమయంలో పిలిచినట్లు కృష్ణుడు, అక్కడ అడుగుపెట్టాడు. చిరునవ్వులు చిందిస్తూ అందరికి అభివాదం చేసాడు. "మీ కోసమే వచ్చానన్నాడు. సమాధానంగా వాళ్ళు'' మేము మాత్రం నిన్నాహ్వానించడానికి నీకోసం సిద్ధంగా లేము. నిన్ను సాగనింపడానికే మేము సిద్ధంగా వున్నా''మన్నారు.

"చాలా సంతోషం. మా కంసమామ కనుక బ్రతికుంటే, మీరెక్కడో, నేనెక్కడో.. ఒకరినొకరు తలుచుకుని పలవరించే స్థితి తప్ప, ఒకరినొకరు పలుకరించుకునే స్థితి కలిగేది కాదు. అయినా అదృష్టవంతులం. భగవదేచ్ఛతో అదృష్టంగా కలుసుకున్నాం...!'' నవ్వుతూ చురక అంటించినట్లు చెప్పాడు. ఆలోచిస్తే.... అది నిజం, అయినా నిజాన్ని ఒప్పుకునే సహనం, శీలం వాళ్ళకు లేవు.

"సోదరా, బృహద్బలా... నువ్వు నీ మిత్ర పరివారం నన్ను కలవాలని వుందని సాత్యకి చెప్పాడు. దాంతో ఇలాగ బయలుదేరి వచ్చానన్నాడు. చెరగని తరగల వంటి దరహాసం తన వదనంపై చిందిస్తూ... "కూర్చో'' సాత్యకి కోరాడు. కృష్ణుడు కూర్చుంటూ "చెప్పండి. నేను చేయగల సహాయం.. లేదా, సేవ... తెలియబరిస్తే, తప్పక నా ధర్మం నేను నిర్వర్తిస్తానని ఎంతో వినయంగా చెబుతాడు.

అందరు ఒకరిమొహాలొకరు చూసుకుంటున్నారు. సత్రాజిత్తు కల్పించుకుని "ముందు రథోత్సవాలనాపు. సంతోషిస్తామన్నాడు.

"తప్పక. అయినా ఆపడానికి నేనెవర్ని ? ఈ దేశంలోని ఒక సామాన్య పౌరుడిని. మహారాజు ఆజ్ఞను ఉల్లంఘించి, రాజదండన పొందే శక్తి నాకు లేదు. ప్రభువును ధిక్కరించిన వారికీ దేశంలో లభించే శిక్షేమిటో నాకు బాగా తెలుసు. ఆ మరణదండ ననుభవించే ఉత్సాహం నాకు లేదు.'' ఎంత ప్రశాంతంగా, ఏ విధమైన అరమరికలు లేకుండా చెప్పాడు.

"ఇవన్నీ యుద్ధ సన్నాహాలా... ?!'' బృహద్బలుడు అడుగుతాడు.

"మనపైకి ఎవరైనా దండయాత్రకు వస్తే మనల్ని మనం రక్షించుకునే స్థితిలో మనం లేమని గతంలో జరాసంధ చక్రవర్తి మనపై దండయాత్రకు సమరశంఖం పూర్తిస్తే, గౌరవనీయులైన మన వికద్రులవారు శెలవిచ్చారు.

అటువంటి దుస్థితి భవిష్యత్తులో మనకు రాకూడదన్నదే మహారాజు అభిలాష. ఆ ఆశయసిద్ధికి ఈ ప్రయత్నం.

"అంటే... మేమంతా అసమర్థులమనా నీ వుద్దేశం ? ఉక్రోషంతో సత్రాజిత్తు అడుగుతున్నాడు.

"అయ్యా! తమను అసమర్థులనడం లేదు. సమర్థతకు మెరుగులు పెట్టుకుని సాహసిగా వుండాలన్నదే మన మహారాజు ఆశ, అభిలాష. ఇందులో నన్ను తప్పు పట్టడానికి, నా ఆలోచనలని, నన్ను నిందించడానికి... చెప్పాను కదా, నేనొక సామాన్యపౌరుడి స్థాయి వ్యక్తినని!" నోటితో నవ్వుతూ నొసలుతో వెక్కిరిస్తు న్నట్లున్నాయి - ఆ - కృష్ణుని మాటలు!

"నువ్వు, నీ మాటలు చిత్రంగా వున్నాయి. జరాసంధుడు "మధుర" అనే దేశం కనబడకుండా నాశనం చేస్తానన్నాడంటావు. మధురకు వినాశనం రాకుండా ఇక్కడి నుండి వెళ్ళిపోయిన మీరు, గోమంతకంలో మీ పాలబడిన జరాసంధుని, మీ అన్న చంపబోతుంటే, వద్దని ఎందుకు ఆపావు ? ఇప్పుడు జరాసంధుడే కాదు, ఎవరైనా సరే, మనమీదకు దండయాత్రకు వస్తే, వాళ్ళను తరిమిగొట్టగల "దండు" తయారుకావాలంటున్నావు ?"

ఉద్యోతుని మాటలన్ని విన్న కృష్ణుడు." భగవంతుడిచ్చిన బుద్ధిని వికసింప చెయ్యాలి. ధర్మాన్ని గుర్తించాలి. కర్తవ్యాన్ని గౌరవించాలి. మనం మనంగా బ్రతకాలి. అంతేకాని, కంసమామ తంతే పారిపోయి... ఇప్పుడు, అతను లేడు కాబట్టి, వీరాధివీరులమంటూ ప్రగల్భాలు పలికినా, పెద్ద పెద్ద మాటలు చెప్పినా, "నవ్వరే ఈ మధురాపుర ప్రజలు, పెద్దలు, చిన్నలు విషయమెరిగిన విజ్ఞులు...?!" అది ఎత్తిపొడుపో, వెటకారమో... పరిహాసమో... ఏ ఒక్కరికి అర్థం కాలేదు. కానీ, అంతవరకు ఎత్తిన తలతో విర్రవీగే వారందరు, తలవంచుకోవాల్సి వచ్చింది.

"కాబట్టి....!" అంటూ తానుగా అందుకున్న, కృష్ణుడు..

"మరొక్క విషయం. జరాసంధుని గోమంతకంలో మనం హత్యచేస్తే... ఆ విషయం విన్న చక్రవర్తి - మిత్ర, సామంతులీ పాటికి మధురకు సమాధి కట్టేవారు. దీన్నొక స్మశానంగా మార్చేసేవారు. అది గుర్తుంచుకుంటే, చాలా బాగుంటుంది. ఆవేశం ఎంత ముఖ్యమో, ముందుచూపు అంతకంటే ముఖ్యం....!" కృష్ణుని మాటలన్నీ సమర్థనీయాలే, ఆలోచింపదగ్గవే! అయితే...

"అయితే ఏమిటి, నువ్వు దేవుడివి కదా! ఇంద్రుడితో చెప్పి ఒక్క పిడుగు వేయిస్తే, ఈ భయాలు, కష్టాలు వుండేవి కాదుగా!" ఒక్క పెట్టున, అందరు విరగబడి నవ్వారు.

"నిజం. ఆ పనిచేస్తే, మీరు మాట్లాడే సావకాముండేది కాదు. ఇక్కడీ రాద్ధాంతం జరిగేది కాదు!" కృష్ణుని హెచ్చరిక వంటి సమాధానం. దానికి సంతృప్తి పడినట్లు కనుపించిన సాత్యకి "ఆగండి. ఆలోచనా, ముందుచూపు, మంచి - చెడు లేకుండా ఈ వదురుడు తగదు. కృష్ణుడు చెప్పినదంతా సత్యమే. కాస్త బుర్ర-బుద్ధి పెట్టి ఆలోచిస్తే, మనం మనుషులమౌతాం. అన్నాడు వెంటనే "కృష్ణా! మనకీ జాగ్రత్తలు అవసరమా!" సాత్యకి అడుగుతున్నాడు.

"రాబోయే కాలంలో, ఎదురొచ్చే ఆపదలనధిగమించడానికి, యుద్ధాలు నివారించడానికి, మనం సన్నద్ధమవడమెంతో అవసరం. మీరు ఆలోచించండి. ఎంతసేపు కృష్ణుడు.... అనే బదులు, మీ బుద్ధితో మీరూ ఆలోచించండి. ఆ మాటతో సాత్యకి, ఆలోచనలో పడ్డాడు.

బానిస బ్రతుకు, భయంకర జీవితం కావాలంటే నా మాటలు నమ్మకండి. కాదంటే, నా మాటలు విశ్వసించి అడుగు ముందుకు వెయ్యండి. ఆ తర్వాత మీ ఇష్టం.

"అలాగా!" అన్న సాత్యకి తలవూపి, "అటువంటప్పుడు నువ్వు ఏదో స్వబుద్ధితో లేదా మరో ఆలోచనతో బృహద్బలుడు యువరాజు కాకుండా చూస్తున్నావని విన్నాము. అలాగెందుకు చేస్తున్నావు. ఇందులో నీకేమైనా స్వార్థముందా.... నిజం చెప్పు". కృష్ణుని మనసు తెలుసుకోవాలని అడిగాడు.

"చూడు సాత్యకీ! నేనేనాడు మహరాజుతో ఈ విషయం మాట్లాడలేదు. ఆయనెవర్ని యువరాజు చేసుకుంటాడో, ఆ వారసుని నిర్ణయం ఆయనిష్టం" మరోమాట. ఇందులో నా ప్రమేయం లేదు, వుండదు కూడా. కోరి వచ్చిన రాజ్యలక్ష్మినే కాదనుకున్న వాడిని, ఈ యువరాజు పట్టాభిషేకం, పన్నాగాలు పన్నడం, పథకాలు వెయ్యడం, ఎంత హాస్యాస్పదంగా వుందో.... వుంటుందో ఆలోచించు.

"అవునవును. మరి....!" సాత్యకి నసుగుతున్నాడు. "అతను కాదంటే.... విరాటుడు అడుగుతున్నాడు.

"మరొకరు....ఎవరైతే నాకేమిటి ? అయినా.... సోదరుడు బృహద్బలు డెప్పుడు కోరితే, అప్పుడు మా సహకారం మేమందిస్తాము. ఇందులో సందిగ్ధత

లేదు. దీనికి సమాలోచనమనవసరమంటూ, గంభీర స్వరంతో, అంత గంభీరంగా, కృష్ణుడు ప్రతిజ్ఞ చేసినట్లు చెప్పాడు.

"అయితే, బృహద్బలుని యువరాజ్య పట్టాభిషేకానికి నీ కభ్యంతరం లేదంటావు?" సందేహ నివారణ సంపూర్ణంగా తొలగిపోవాలని వుద్దేశంతో సాత్యకే అడిగాడు.

ధర్మం తప్పనంతవరకు, ఈ కృష్ణుడెవ్వరినైనా సమర్థిస్తాడు. సంరక్షిస్తాడు. అధర్మమార్గం పెట్టారో, ధర్మరక్షణకు, అవసరమైతే వారిని శిక్షిస్తాడు. ఇది నా ప్రతిజ్ఞ. ఇందుకు అనుగుణంగా నడిచేవారందరికి - ఈ - కృష్ణుడు ప్రాణప్రదుడు.

దీంతో అందరిలోను ఆనందం. పట్టపగ్గాలు లేని ఉత్సాహం. అయితే - అందరు సమరోత్సాహంతో ముందుకు సాగుదాం. జయకృష్ణ, "జై జై కృష్ణా" అని అక్కడున్న వారందరు హర్షధ్వానాలు, జయ జయ ధ్వానాలతో ప్రస్తుతించారు. కృష్ణుడైతే పెద్దరికానికి, పెద్దలకు - ధర్మానికి గౌరవమిచ్చే ఘన ప్రభువు, పెదతల్లి కుమారుడు, పెద్దవాడైన బృహద్బలునికి అంజలి ఘటించాడు. ఆనందమయునిగా "సోదరా!" అంటూ హృదయానికి హత్తుకున్నాడు. అందర్ని ఆశ్చర్యంలో ముంచాడు. అప్రతిభుల్ని చేసాడు.

"కృష్ణుని తాను తప్పుగా అర్థం చేసుకున్నానా..... లేక...." బృహద్బలుడు ఆలోచనలో పడ్డాడు.

ఆనాటి రాత్రి యాదవ ప్రముఖులు మహారాజు ఉగ్రసేనులవార్ని, రాజ భవనంలో కలుసుకున్నారు. మహారాజును దర్శించిన ఉపకులపతి శ్వేతకేతు, సాధికారంగా, బలరామ-కృష్ణుల గోమంతక ప్రవేశం, జరాసంధుని రాక, ఆతని నిగ్రహణం, కృష్ణుడు ప్రాణమొసగడం, పౌండ్రక వాసుదేవునిగా విఖ్యాతి చెందిన శ్రీ గాలవ్యుని దురంతాలకు, దుష్టశిక్షణలో భాగంగా ఆతని వధ.... ఛేది దేశాధిపతి దమఘోషులు కృష్ణుని చెంతచేరడం, దాంతో జరాసంధుని ఉక్రోషం, యాదవులలో చీలిక తేవడానికి....

ఇటు ఛేది దేశాధిపతి, అటు భోజ వంశస్థులను మధురకు దూరం చెయ్యాలని, తద్వారా చీలికలు తేవడమొక పథకంగా ఎత్తువేసాడు. అందులో భాగంగా, మథుర మహారాజును, యదు ప్రముఖులను పరిగణించకుండా, స్వయంవరం పేరిట జరిపే శిశుపాల - రుక్మిణీ కల్యాణం, అలాగే రుక్మి తన పట్టు నుండి జారకుండా, తన మనుమరాలితో పరిణయం నిర్ణయం చేసాడు.

అయితే "విదర్భరాజపుత్రి, రాచరికం లేకపోయినా రాజాధిరాజు అయిన మన వసుదేవసుతుడు కృష్ణుని పరిణయమాడాలని, కాదంటే మరణించాలనే నిశ్చయానికొచ్చేసింది." వివరంగా శ్వేతకేతు చెప్పాడు.

పెద్దలందరు ఆలోచనలో పడ్డారు. ఒకనాటి ప్రధాన మథుర రక్షకుడు, వికద్రుడు, ప్రస్తుత రక్షకుడు శంకు వగైరాదులు - మథురను చిన్నచూపు చూడటం భరించలేకపోయారు. యాదవులంటే వెట్టిగొల్లలు కాదని, తమ ప్రతాపాన్ని వాళ్ళకు రుచి చూపించాలనే స్థిర నిశ్చయానికొచ్చారు.

దాంతో అందరు ఒకటయ్యారు. ఏకత్రాటిన నిలచి, అవసరమైతే కుండినపురానికి వెళ్ళి ఆ యువరాణి నెత్తుకొద్దాం. మనమేమిటో.... ఆవేశంతో వూగిపోతున్నారు. అంతా విన్న మహారాజు, మౌనంగా వున్న కృష్ణుని చూసారు. ఎందుకంటే... ఇంతవరకు తన అంతరంగాన్ని కృష్ణుడు ప్రకటించలేదు. ఏం చెయ్యాలో, విధివిధానాలను తెలుపలేదు. దాంతో.... "కృష్ణా...!" అన్నారు. కృష్ణుని అభిప్రాయం కోసం.... అగారు.

"మహారాజా! ఇందరి పెద్దల ముందు నేను, నా తెలివితేటల్ని ప్రదర్శించడమతి సాహసమౌతుంది. చూడగా, నా వుద్దేశంలో, భీష్మకులవారి ఆలోచనా సరళి నిజమేననిపిస్తుంది. (మన దగ్గర అంతటి మగవీరులు, ధీరులు లేనట్లుందన్నది వారి ఆంతర్యమని కృష్ణుని తాత్పర్యం.) ఈ మాటతో బృహద్బలుడు, అంటే మనమంతా చాతకాని వాళ్ళమా ? మనము, మన పౌరుషాలు మట్టికొట్టుకుపోవాలా....?! ప్రశ్నిస్తున్నాడు.

"ఇందుకు మనమంత రెచ్చిపోవలసిన పనిలేదు. కంగారు పడవలసిన అవసరం లేదు. మహారాజా! మీకు సత్యం బాగా తెలుసు. అయినా సాహసించి ధర్మం చెబుతున్నాను. క్షమించండి. సాధారణంగా స్వయంవరానికి, రాజులను, యువరాజులను ఆహ్వానిస్తారు. ఇక్కడ మన రాజ్యానికి వస్తే మీరు పెద్దవారు, వృద్ధులు. మనకు వారసులైన యువరాజులు లేరు. కనుక ఎవర్ని పిలుస్తారు ? మనల్ని పిలువలేదని బాధపడడం సబబా ? ఇది నా అభిప్రాయం. ఆలోచించండి!" వినయంగా కృష్ణుడు విన్నవించాడు.

"మనం, మన పరిధిలో మండలాధీశులం, రాజ వంశీయులం. ఇంకా...!" ఇంకా చెప్పబోతూంటే -

"విదర్భాధీశులకు కావలసింది. రాజవంశీయులు కానీ, వారి ఒకనాటి వీర విక్రమాలు కావు. ప్రస్తుత రాజ్యాధిపత్యం. ఇది మనం ఆలోచించాల్సిన విషయం." అందుకున్నాడు కృష్ణుడు.

కృష్ణుడు చెప్పిన ప్రతి అక్షరం సత్యమే. ఆలోచించదగినది. కనుక, ఈ విషయంలో ఇక తర్క - వితర్కాలకు తావులేదన్నట్లు సభాభవనంలో మహారాజుతో సమావేశమైన, యాదవ ప్రముఖులు, మౌనముద్రలను దాల్చారు.

క్షణం గడిచింది. అప్పటి నిశ్శబ్దాన్ని చీలుస్తూ మహారాజు ఉగ్రసేనులవారు "కృష్ణా! నీకు రాజ్యము, కిరీటాదులు లేకపోయినా, ఈ విశాల విశ్వంలోని ఏ మహారాజు నీకు తగరు. కనుక ఇప్పుడే ఈ రాజ్యానికి, అధిపతిని చేస్తాను.

ఆ మాటకు బృహద్బలుడు ఖంగుతిన్నాడు.

నిన్నటి వరకు నాకు వద్దన్న కృష్ణుడు, ఇప్పుడు అయాచితంగా లభించే రాజ్యానికి మహారాజయి పోతాడా ? కోపంతో, పరిస్థితి నర్థం చేసుకోలేక వుడికి పోతున్నాడు.

"మహారాజా! మీరంతటి సమర్థులు. ప్రేమమూర్తులే, కాదనను. నాకే మీరిస్తారన్నా, నా అర్హత తెలుసుకోకుండా, ఈ రాజ్యానికి రాజును కాలేను- నేనెవరో నాకు తెలుసు. నేను.... నంద గోకులంలో అందరితో ఆడిపాడి, పెరిగిన "గో"పాలకుడను. పశుసంరక్షణం తప్ప, ప్రజాసంరక్షణం తెలియని "పశు" పాలకుడను. కనుక ఈ సింహాసనమొందడానికి, మీరు దయతో, ధర్మంగా ఇచ్చినా, నేనందులకు అర్హుడను కాను. దయచేసి, అర్హులను చూసి వారిని అందలమెక్కించండి. మీ దయాదృష్టి వారిపై ప్రసరింపచెయ్యండి. అది సమంజస" మంటాడు, ఓరకంట బృహద్బలుని చూస్తూ!

కృష్ణుని ఉపదేశ, సందేశాన్ని చెవులు రిక్కించి వింటున్న వారందరూ, కృష్ణుడు చేసిన సూచనకు సంతోషించారు. విజ్ఞులు, ఒక నవ్వు నవ్వి వూరుకున్నారు. "రాజ్యం వీరభోజ్యం కాని, దయాలబ్ధత్వం" కాదన్న సందేశం, అందుకునేవారికి కొరడా దెబ్బ. అర్థం చేసుకోలేని వారికి, అందలమెక్కాలనే తాపత్రయానికి, వెటకార "వాత." విస్తుపోయే వారినందర్నీ, చిరునవ్వుల చూస్తూ,

"కనుక ఓ ప్రభూ! మీరు భీష్మకుల వారికి బృహద్బలుల వారు యువరాజుగా పట్టాభిషేకమొందారని వర్తమానం పంపండి. దాంతో మనకు ఆహ్వానమొస్తుంది.

సాధికారికంగా, మన యువరాజు స్వయంవరానికి వెళ్ళ వచ్చును. “ఇది వింటూనే బృహద్బలుడు పరమానందభరితుడయ్యాడు. “తమ్ముడూ!” అంటూ కృష్ణుని అక్కున చేర్చుకున్నాడు.

“భీష్మకులు కాదంటే...!” “ఏముంది. కుండినపురానికి, మధుర మగతనం, సత్తా లోక విఖ్యాతిగా ప్రకటించబడుతుంది” ముక్తసరిగా ముగించాడు, కృష్ణుడు!

“నిజం. మన సత్తాను మనం చూపాలి. ఇందుకు తగిన ఆయుధ సంపత్తి, ప్రజ్ఞా పాటవాలు, ముఖ్యం.” “ప్రతి దానికీ యుద్ధమేనా ?” సత్రాజిత్తు అందుకున్నాడు.

యుద్ధం అనివార్యమైతే, మగధ సేనలు చీల్చి చెండాడ నిశ్చయిస్తే, పగతురకు వెన్నిచ్చి పారిపోవడమా లేక నిలువరించి, ఆనాడు భీష్ముల వారు, కాశీరాజు కన్యలను స్వయంవర సభా భవనము నందుండి, మగటిమితో తెచ్చు కున్నట్లు, తెచ్చుకోవడమే చెయ్యాలి. ఇందుకు బలపరాక్రమాలు, సైనిక పాటవం, ఆయుధ సంపత్తి అత్యంతావశ్యకం” కృష్ణుడు చెప్పాడు, సత్రాజిత్తు ఒప్పుకున్నాడు.

అంతా విని, బృహద్బలుడు నేలచూపులు మొదలుపెట్టాడు. వింటున్న కృష్ణుడు “సత్రాజిత్తు చెప్పింది సత్యం. మన బృహద్బలుడు అందర్నీ నిరోధించి, విదర్భ రాకుమారిని తేగలిగితే..” తేగలడా ?” అన్నది సందేహమన్నట్లు కృష్ణుడు చెబుతున్నాడు.

“అది సాధ్యం కాకపోతే...!” వికద్రుడు తన అనుమానాన్ని వ్యక్తం చేసాడు.

“మనము, మన హద్దుల్లో వుంటే అందరికి శ్రేయస్కరం. ప్రాణాలు దక్కుతాయి, పరువు పోదు!” కృష్ణుడు ముగించాడు. మళ్ళీ కృష్ణుడే “ఇందుకు ముందుగా మనం, ఆచార్య సాందీపులవారి సారథ్యంలో తగు ఉత్తమ శిక్షణను పొందాలి. రథ చోద్యంలో కూడా పూర్తి మెలకువలను గ్రహించాలి. మనము నిర్ణయించిన - రథచోదనా పందాలకు, మనం తప్పక సిద్ధపడాలి” ఆ మాటవింటూ “నీ సంగతి” అడిగాడు బృహద్బలుడు.

“నాదేముంది, ఉద్ధవుడు నిన్ననుసరిస్తాడు. అన్నగారు కూడా వస్తారేమో, తెలియదు. ఇక నా విషయం, అందులో పాల్గొని అంటే, నేను యువరాజును కాను, సామ్రాజ్యాధిపతిని కాను. కనుక స్వయంవరానికి రావడమన్నది, అంత ధర్మం కాదు. కారణం, ఈ కృష్ణుడు ధర్మవిరోధి కాడు కాబట్టి, ఒకరి ప్రమేయం, ఆహ్వానం లేకుండా అందులో అడుగు పెట్టాడు. ఆహ్వానం వస్తే మాత్రం వెనుకంజ

వేయడు. ఆ హరిహరాదులు వచ్చినా సరే. సకల దేవతానీకాన్ని నిర్జించి, మరీ నా విజయోత్సహాన్ని, ఉత్సవంగా లోకానికి అందిస్తాను. అంతే తప్ప, నాకుగా నేను, ఇందులో పాల్గొనను. ఆ ఉత్సాహం కూడా నాకు లేదు. ఆసక్తి సరేసరి...!'' పూర్తిగా తన అభిప్రాయాన్ని చెప్పేసాడు.

అందరు మాటలు వింటున్నారు. ఆలోచనలు చేస్తున్నారు. కాని కృష్ణుని మాటల్లోని శ్లేష మాత్రం ఎవరికి అర్థం కాలేదు. అసలు కృష్ణతత్వమే వారికర్థం కావడం లేదు. ఆ సమావేశం అప్పటికి ముగిసింది. ఎవరి దారిన వారు వెళ్ళిపోతు న్నారు. శ్వేతకేతువు, కృష్ణుడు బయలుదేరారు. వారిలో ఉపకులపతి "కృష్ణా! పొరపాటున బృహద్బలుడు, స్వయంవరంలో విజయం సాధించినా, రుక్మిణి యువరాణి అతన్ని వరించదు. అది సత్యం.

ఆమెను బృహద్బలుడెత్తుకొస్తే వూరుకుంటుందేమో! ఇదంతా సహజం.'' తనదైన పద్ధతిలో చిరునవ్వులు చిందిస్తూ కృష్ణుడన్నాడు.

"మరి నీ సంగతి. ఆమె నిన్ను కోరుతుంటే, నువ్వు ఆమెను చేపట్టవా ?'' శ్వేతకేతు సందేహం. "నేనటువంటి వ్యర్థ ప్రయత్నాలుకు చాలా దూరం. చెప్పానుగా, నాకుగా నేను దేనికి లొంగను. అంతా కాల నిర్ణయం, ధర్మ సిద్ధాంత ప్రకారం జరుగుతుంది.

ఇది వీరి సంభాషణం, సరాసరి సమావేశ మందిరం నుండి, బృహద్బలుడు తల్లిని చేరాడు. ఆ తల్లి ఈ పిల్లవాని కోసం ఎదురు చూస్తుంది. కుమారుని చూస్తూనే, ఎంతో ఆశగా, ఏదో అడగబోతూంటే "అమ్మా! ఆ గోపాలుడు కముకు దెబ్బ కొట్టాడు. అది పైకి కనబడదు. కానీ, బాధో.... అనంతం...!''

"అంటే... ఏమయింది ?'' ఆ తల్లి ఆతృత.

దాంతో సమావేశంలో జరిగింది ప్రతి అక్షరం, ప్రత్యక్షంగా తన తల్లి దర్శించేటట్లు విడమరచి, వివరించి - మరీ బృహద్బలుడు చెప్పాడు. చివరగా నేనే యువరాజునట. స్వయంవరానికి వెళ్ళాలిట. విధి వెక్కిరిస్తే జరాసంధుని సేనలను ఢీకొనాలట. అప్పుడు అవసరమనుకుంటే, తనను కోరితే, తాను వచ్చి తగు సహాయం చేస్తాడుట.

పెద్దరికం నాది. పేరు ప్రతిష్ఠలు అతనివి. అప్పుడు నేను వాజమ్మనవుతాను. అతడు కథానాయకుడు, వీరాధివీరుడౌతాడు! ఎవరికీ తెలియనివి వెట్టి తెలివి

తేటలు...!'' ఇంకేముంది, అంతా అయిపోయిందన్నట్లు ఆ తల్లి కొడుకులు, వుసూరుమంటూ, చతికిల బడ్డారు.

యువరాజ పట్టాభిషేకమొందితే ఓ గొడవ. పొందకపోతే మరొక గొడవ. కృష్ణుని తెలివితేటలను గమనించుకోని, ఆ బుద్ధిలేని సాత్యకి, "కృష్ణుని ఉదార త్వానికి, ధర్మపరతత్వానికి పొంగిపోతున్నాడే తప్ప, ఇందులోని కిటుకును గ్రహించ లేకపోతున్నాడు!'' బృహద్బలుడు విసుక్కున్నాడు.

"కంగారుపడకు. ఆలోచిద్దాం. నారుపోసిన దేవుడు నీరు పోస్తాడు. ఇంత వరకు వచ్చాక, కథ అడ్డం తిరగదు.'' అని తల్లి అంటూంటే "అమ్మా! జరాసంధు డంతటివానినే తలెత్తుకోలేకుండా చేసిన కృష్ణుడు, అతి సామాన్యుడిని, వారసత్వం కోసం పెనుగులాడే నన్ను, సుఖసంతోషాలు మరచి కత్తిపట్టు. స్వయం వరమో, సామ్రాజ్యమో తేల్చుకోమంటే.... ఈ రెంటిని వదులుకోవాల్సిన స్థితి ఏర్పడుతుంది తప్ప, వీరాధివీరుడినని విర్రవీగే పరిస్థితి రాదు, రాదు, రాదు!'' ఖండితంగా చెప్పేసాడు. తన ప్రాప్తానికి చింతించాడు.

తల్లినలాగ విడిచిపెట్టి బృహద్బలుడు, భార్య విశాఖ వద్దకు వెళ్ళాడు. సమావేశ మందిరంలో జరిగింది యావత్తు వివరించి, ఆమె సమాధానం, సలహా కోసం, ఆగాడు. విశాఖ తక్కువదేమీ కాదు. అంథక వర్గ ముఖ్య నాయకుడైన, ఒకనాటి కంసుని ముఖ్య - నమ్మక అనుచరుడైన ప్రద్యోతుని కుమార్తె. అపారమైన తెలివితేటలు, మేధాసంపత్తి గల స్త్రీ.

అంతా విన్న విశాఖ "చూడండి. మీరు, తమ్ముళ్ళు ఉద్ధవునితో కలిసి, బలరామ-కృష్ణుల సహాయాన్ని కనుక, తప్పక పొందగల్గితే, విజయం మిమ్మల్నే వరిస్తుంది. నా మాట వినండి. నమ్మండి! "అయితే వాళ్ళ కాళ్ళు పట్టుకోవాలా ? లేక వాళ్ళ కుయ్యుక్తులకు బలయి పోవాలా ?'' క్షణాల్లో ఆగ్రహమొంది, అసహనంతో అరిచాడు. "అదే తొందరపాటంటే!'' అందుకుంది విశాఖ.

ఆ రాత్రికి ఏదో రకంగా, మధురానందంలో మున్గిపోయిన బృహద్బలుడు, తెల్లవారి శాంతంగా తల్లిని దర్శించాడు. ఆమె అంతా విని, ఏ నిముషంలో పుట్టానో అంతా... తన దురదృష్టమని, ఎప్పుడు పుట్టి మునిగినట్లు ఏడవడం నా బ్రతుకయింది!'' అని ఏడుస్తూంటే, అక్కడనుండి తన సహచరులైన సాత్యకి విరాట, సత్రాజిత్తు, భద్రకులను దర్శించి, మరల సమాలోచనలు ప్రారంభించాడు.

"కృష్ణుడు... అబ్బో! తెలివైన గుంటనక్క" అంతకు మించి మరొక మాట బృహద్బలుడు అనలేకపోయాడు.

"ఏమయింది ?" అనగా వాళ్ళు, నిన్న సమావేశంలో జరిగింది, వున్నది వున్నట్లు బృహద్బలుడు చెప్పాడు. ఒక్కొక్కరు ఒక్కొక్క మాట అంటున్నారు. యువరాజుగా నువ్వు పీఠమెుందవచ్చునుగానీ, స్వయంవరం సాహసం చెయ్యకుండా వుంటే మంచిది. లేదంటే, ఆ కృష్ణుని కుయ్యుక్తులకు, బలి అయిపోవడం తథ్యం.... ఇలాగ ఒక్కొక్కరు వాగుతూంటే -

"ఆగండి! సాత్యకి గట్టిగా గదిమినట్లు అరిచాడు. ఎంతసేపు అధికారం, ఆనందం, ఒకరిపై ఆధారపడటం, వీరత్వం, మగతనం చూపకుండా ఒకరినొకరు ఆడిపోసుకోవడం, సమంజసమా ? కృష్ణుడేమన్నాడు ? అన్న ధర్మంగా వుంటే, అన్నమాట ప్రకారం, తప్పకుండా యువరాజ సింహాసనంపై, ఈ అన్న బృహద్బలుని కూర్చోపెడదాం" అన్నాడు. అందుకు తన సంపూర్ణ సహకార మందిస్తానన్నాడు.

"ఇవన్ని విడిచి, స్వయంవరం. అందులో అతను వీరత్వం చూపి, భీరువులాగ, ఆ పిల్లను మీకు అర్పించాలా ? అడగడానికి సిగ్గులేదూ ? మూతి మీద మీసం లేదూ ?" ఎంతో కోపంతో ప్రశ్నిస్తున్నాడు. అందరు ఆ మాటలు విని అవాక్కయిపోయారు. సాత్యకి చెప్పినదంతా నిజమవడంతో, ఇప్పుడేం చేద్దాం!" అడిగారందరు.

బృహద్బలుని యువరాజును చేద్దాం. వీరుల వలె స్వయంవరానికి వెడదాం. ఆ తర్వాత అదృష్టాదృష్టాలు. అంతే తప్ప.... తేరగా, చాతకాని మగాడివలె, ఆడదాన్ని తెచ్చి మీకెవ్వడు ఇవ్వడు. అలాగ ఇచ్చాడంటే, అతడు నంపుసకుడైనా కావాలి. లేదా నీకు తొత్తయినా అయి వుండాలి! పౌరుషం పెరిగేటట్లు సాత్యకి మాట్లాడుతున్నాడు. నిజానికి అవి మాటలు కావు. మంత్రపూరిత బాణాలు.

"అయితే, ఇప్పుడు మీరు నన్ను యజ్ఞపశువును చేస్తారన్నమాట. ఈ రకంగా ఆ పశువుల కాపరి, ఆ "గో"పాలుడు, తన గొప్పతనాన్ని ప్రకటించు కుంటూంటే, మీరు సమర్థిస్తున్నారన్నమాట..." ఇంచుమించు బృహద్బలుడు ఏడుపు మొహం పెట్టేసాడు.

"వద్దంటే... ఏం గొడవో"నని కృష్ణుడు తెలివిగా, తన కుమారుని సమర్థించి, మరీ ఇందులో ఇరికించాడు. ఇది చాలా ప్రమాదకరం. జరాసంధుని ముందర,

నా కొడుకు.. అమ్మో!'' భయపడిపోతుంది. నిన్నటి వరకు యువరాజు పదవి దక్కలేదని ఏడ్చిన కంస, ఇప్పుడు ప్రశాంతంగా ప్రాణాలుంటే చాలనే స్థితికి వచ్చేసింది. అనుకోకుండానే కృష్ణుని తెలివితేటలకు జోహార్లర్పించింది.

ఆనాటిరాత్రి సుదీర్ఘంగా ఆలోచించిన బృహద్బలుడు తాతగారి శయనమందిరానికి వెళ్ళాడు. "మహారాజా! క్షమించండి!'' అని తాతగారి శ్రీ చరణాలకు, సాష్టాంగ నమస్కారం చేసాడు. ఈ సమయంలో మీకు ఇబ్బంది కల్గించాను. కృష్ణాదులు నాకు యువరాజు పట్టాభిషేకమన్నారు. కానీ, దీర్ఘంగా ఆలోచిస్తే అసలా పదవి చేపట్టడానికి తగిన అర్హతలెక్కడా లేవు. కనుక క్షమించి, శ్రీ కృష్ణునికి యువరాజ్య పట్టాభిషేకం చెయ్యండి. అలాగే స్వయంవరానికి వెళ్ళే ప్రయత్నాలకు కూడా శ్రీకారం చుట్టండి. ఇది నా విన్నపమని పరిపరి విధాల ప్రార్థించాడు. అందుకు మహారాజు సరే చూద్దామని సమాధానమిచ్చి పంపాడు.

తెల్లవారి, ఎంతో బరువుగా లేచిన కంస, మనసు కుదుటపరచుకుని, దేవకి మందిరానికి వెళ్ళింది. అక్కడ శైబ్య కూడా వుంది. వారు, వారి ఆరాధ్య దైవాలకు పూజలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా శైబ్యను మనసును కంస బాగా గ్రహించింది. అప్పుడే సమయం దొరికింది, కదా! యని శైబ్యకు లేనిపోని మాటలు, అల్లి-గిల్లినట్లు మరీ చెప్పింది. దాంతో, శైబ్య కుబుసం విడిచిన "నాగు'' అయింది. ఆ రకంగా శైబ్య చేత పెద్ద తల్లి కంస తను ద్వేషించే కృష్ణుని, మరింత ద్వేషింప చేసింది.

కొంతసేపు వసుదేవ మందిరంలో వున్న కంస, తమ ఇరువురికి, ఏక శత్రువైన - కృష్ణుడిపై నిన్న సమావేశమందిరంలో జరిగేదంతా చెప్పి, ఆమెను రెచ్చగొట్టాలనే ప్రయత్నంలో భాగంగా శైబ్య తన మందిరానికి తీసుకు వెళ్ళింది. నిన్న జరిగినదంతా చెప్పింది. ఆ మాటల్లోనే దుర్విధికి వగచింది. దేవుళ్ళపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ ముహూర్తంలో ఈ భూమి మీద పడ్డానో కానీ, సుఖము, శాంతి కనబడటం లేదు.'' కళ్ళనీళ్ళ పర్యంతమయింది.

నా భర్త, పెద్ద కుమారుడు దేవుళ్ళు. ఆఖరివాడు, ఆ కృష్ణదాసుడు. మధ్యలోని వాడంటే మహారాజుకీ ఇష్టమే. కాని ఏం చేస్తాం. మా మొఖాన రాజ్యాధికారం, రాజమాతనయ్యే యోగం, ఏ కోశానా వున్నట్లు కనబడటం లేదు. ఆ కృష్ణుడు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నాడు. అందిందనుకుంటే, రకరకాల సమస్యలు... ఏడుస్తూ కంస చెప్పుకుపోతుంది. శైబ్య వింటుంది.

ఒక్కసారి ఎలనాగులాగ బుసకొడుతూ "పెద్దమ్మా! భయపడకు, ధైర్యంగా వుండు. నా దేవుడు వాసుదేవుని చంపిన క్రూరుడిని వదలను. ఆతడు తప్పక మరణానికి శరణననాల్సి వస్తుంది. తప్పదు!'' ఓదారుస్తుంది. వళ్ళంతా కసి, పగ, ద్వేషాలు పెంచుకున్న శైబ్యలో నాగజాతి లక్షణాలు బాగా పెరిగిపోతున్నయి.

ఆ రాత్రి శైబ్య నిద్రపోలేదు. పగ-ప్రతీకారాల గూర్చే ఆలోచిస్తుంది. కృష్ణుని తుదముట్టించాలి. అది అసాధ్యం. అయినా తన పగ చల్లార్చుకోవాలంటే ప్రతీకారం తప్పదు. దారికోసం వెదకుతుంది.

ఉదయాన్నే స్నానం చేసింది. తన గదిలో తన దేవుడైన జగదేక ప్రభువు వాసుదేవుని విగ్రహంపై తలవుంచి భోరుమని విలపిస్తుంది. పరిష్కారం ప్రసాదించమని, మరీ, మరీ ప్రార్థిస్తుంది. సరిగ్గా ఈ సమయంలో దేవకీమాత గది నుండి హారతిస్తున్న గంట మ్రోగింది దేవకీమాత హారతిస్తుంది. త్రివక్ర, శ్రీకృష్ణుని ప్రస్తుతిస్తూ పాట పాడుతుంది.

శైబ్య, దేవకీమాత మందిరానికి వెళ్ళింది. ఆ సమయంలో ఆ తల్లి మధ్యాహ్న భోజనానికి తగు ఆదేశాల నిస్తుంది. ఈ వాతావరణం, కరవీరపుర వాతావరణానికి భిన్నంగా వుంది. అక్కడంతా నిరంకుశత్వం. ఇక్కడ అంతా ప్రేమమయం. పెద్దలంటే గౌరవం.. భయభక్తులు, వినయ విధేయతల ప్రవర్తన ప్రతి ఒక్కరిని తెలియని ప్రేమ, చెప్పలేని అనురాగం.

ఇంతమందిలో, ఒక్క కంసమాతే, విరుద్ధంగా, విభిన్నంగా వుంది. దాంతో, ఈమెతోనే తాను తన పరిచయాన్ని పెంచుకుంది. ప్రతినిత్యం, ఈ మధ్యాహ్న భోజన విషయం, ఇతర కార్యక్రమాలలో సహకరిస్తున్నట్లే ఇప్పుడు, ఆమెకు ఏ విధమైన అనుమానం రానివ్వకుండా ఆమెకు సహకరించ సిద్ధపడింది.

రాజప్రాంగణం, యధావిధి హడావుడిగా వుంది. కాని, ఎవ్వరు ఎలాగ వున్నా, కృష్ణుని రాక మాత్రం అందరికి ఆనందదాయకం. ఆ ప్రక్కన మరొక తెలిసిన గొంతుక. ఆ... అది.... శ్వేతకేతువుది. గుర్తుపట్టింది. పరిచారకుల ద్వారా శ్వేతకేతువు వచ్చినట్లు వింది. కాని ప్రత్యక్షంగా చూడలేదు. ఒకప్పుడు ఎంతో ప్రేమగా, మధురంగా కన్పించి, వినిపించే శ్వేతకేతువు గొంతుక ఇప్పుడు విని, భరించలేనట్లుగా వుంది.

తన దైవం, పినతండ్రి శ్రీ గాలవ్యుని మరణానికి శ్వేతకేతువు కూడా కారణమవడం మరొక గుట్టు. భోజనాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారి వరుస క్రమంలో, తమ తమ నిర్దేశిత ప్రదేశాలలో కూర్చున్నారు. కృష్ణుడు, ఉద్ధవునితో కలిసి కూర్చున్నాడు. శ్వేతకేతువు ఉపకులపతి గాబట్టి, కులగురువులు గర్గాచార్యుల వారు వగైరా, ఆచార్యుల సరసన కూర్చున్నారు. ఇటువంటి విషయాలలో వేలు పెట్టి ఎవరు చూపించలేని విధంగా కృష్ణుడు ప్రవర్తిస్తాడు. చమత్కారి.......! అనుకుంది శైబ్య.

చాలాకాలంగా చూడని శ్వేతకేతు, తన కులపతి పద్ధతిలో కనుపించాడు. పరమ ప్రశాంత వదనం, ఏ విధమైన భయాలు లేకుండా, ఎంతో ప్రశాంతంగా కనబడుతున్నాడు. అతని చూపులన్నీ తన పైనే వున్నాయి. తననే వెదకుతున్నాయని శైబ్య గమనించింది. ఇరువురు చూపులు కలిసాయి. కాని అందులో ప్రేమ, స్నేహాలు కనబడలేదు. నవ్వులు పుయ్యలేదు. ఏదో నిర్లిప్తత చోటు చేసుకుంది. ఒకప్పుడు తను గాఢంగా ప్రేమించిన శ్వేతకేతువును, తన పినతండ్రి తన దేవుడైన శ్రీ గాలవ్యుని అనుమతితో వివాహం చేసుకుందామనుకుంది. తన వలెనే శ్వేతకేతు గూడా తన వాసుదేవునికి అంకిత భక్తుడు కావాలని గూడా తలచింది. కాని ఆమె ఆశలన్నీ అడియాసలయ్యాయి.

ఈ శ్వేతకేతు, కృష్ణ భక్తికి లోనుకాకుండా, కరవీరపురంలో వుంటే, తన జగదేక ప్రభువు వాసుదేవుడు, ఈ కృష్ణుని చేతిలో చంపబడకుండా వుంటే.... మేమిరువురము హాయిగా, సంతోషంగా మా దేశంలో వుండేవాళ్ళం కదా! ఇక్కడికి రావాల్సి వచ్చేది కాదుగా!" అని గొణుగుకుంటూ ఎంతో బాధపడింది. అది గమనించిన కృష్ణుడు నవ్వుకున్నాడు.

ఆ కుటుంబంలోని ఇతరులవలెనే శైబ్య కూడ వడ్డన చేస్తూంది. ఆ వడ్డనలో ఇటు కృష్ణుడు, అటు శ్వేతకేతు వద్దకు వచ్చినప్పుడు గుండెల్లోతుల్లో తెలియని అలజడి, ఆందోళన చోటు చేసుకుంది. ఆనాటి రాత్రి వారిరువురిలో ఒకర్ని చంపాలనే వుద్దేశంలో వుంది. ఆ గుండె దడకు చేతులు వణకుతున్నాయి. ఏదో తప్పు చేస్తున్నట్లు కంగారు, దడ ఆమెలో చోటుచేసుకున్నాయి.

"చూడు చెల్లెమ్మా, ప్రశాంతంగా వుండు. కాస్సేపు విశ్రాంతి తీసుకో. మా ఉప కులపతిని తీసుకుని ఆనక నీ వద్దకు వస్తాను." ఆ మాటల్లోని ప్రేమ

నరనరాల్లో ఆనందాన్నెవరికైనా కల్గిస్తుంది. ఈ శైబ్య మాత్రం కంగారు పడుతుంది. కలవరపడుతుంది.

"అవసరం లేదు." కోపం కట్టలు త్రెంచుకున్నట్లు అనేసింది. తను వడ్డిస్తూన్న పళ్ళాన్ని అతని నెత్తిన కొట్టేటట్లుంది. అయినా కృష్ణుడు మందహాసం చేస్తున్నాడు. ఆ దృశ్యాన్ని చూసిన శ్వేతకేతు గుఱ్ఱుమంటున్నాడు. అది శ్వేతకేతువుకు అలవాటు. ఆమె మాట్లాడితే మొదట్లో మొదట్లో బాగానే వుండేది. రాను రాను ముఖం కందగడ్డలా తయారయ్యేది.

అయినా శ్వేతకేతుకు ఆమెంటే ప్రేమ. ఆమె తనను కాదన్నా, నిరాదరణ చేసినా సరే, మొదట్లో కల్గిన ఆ ప్రేమాభిమానాలు తొలగిపోలేదు.

తనను తాను నిబ్బరించుకుంది. తన వడ్డన కార్యక్రమంలో మున్గి పోవడానికి శతవిధాల ప్రయత్నిస్తూంది. ఆమెలో ఏదో దడ, వణుకు, కంగారు. ఎక్కడ పడిపోతాననే భయం కృందీస్తుంది. కదలలేకపోతుంది. అడుగు ముందుకు వెయ్యలేకపోతుంది. చెప్పకూడదు కాని, ఆమె గుండె చప్పుడు అందరికి వినబడుతూందేమోనన్న వేగంగా ఎంతో హడావుడిగా కొట్టుకుంటుంది.

మగవారి భోజనాలు పూర్తయ్యాయి. ఆడవారి పంక్తి ప్రారంభమయింది. అందరు కూర్చున్నారు. భోజనాలు చేస్తున్నారు. శైబ్య బలవంతంగా అన్నం తింటుంది. అంత ఉద్రేకానికి లోనయింది. ఆహారం తీసుకోలేకపోతుంది. బలవంతంగా భోజనం చేసి ప్రతి నిత్యం లాగ ఆ మధ్యాహ్న సమయంలో చిన్న కునుకు తియ్యబోయింది. కాని కన్ను మూతపడటం లేదు.

ఒకప్పుడు ఎంతో అభిమానించిన వ్యక్తి ఇప్పుడు తన శత్రువు, తనను కలవ బోతున్నాడు. అదీ ఆమె ఆందోళనకు ముఖ్య కారణం. ఈ ఆలోచనల్లో ఎవరో వస్తున్నట్లు అడుగుల చప్పుడు. లేచి కూర్చుంది. ఆ వచ్చేది త్రివక్ర. కృష్ణ భక్తురాలు. హమ్మయ్య - ఊపిరి పీల్చుకుంది. లెమ్మంది. బట్టలు మార్చింది. అలంకారాలు చేసింది. సభాప్రాంగణం ముందరున్న గున్నమామిడి చెట్టు వద్ద - కృష్ణుడు, ఉపకులపతి శ్వేతకేతుల వారు తమ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పింది.

ఆ చెట్టంటే కృష్ణునికి ప్రాణం. సమయం దొరికినప్పుడల్లా, ఉద్ధవునితో కలిసి ఆ చెట్టుక్రింద వూసులాడుతూన్నట్లు కూర్చుంటాడు. కృష్ణుడికదొక సరదా. వర్షాకాలం కానప్పుడు, చలిగా లేనప్పుడు పిల్లలు అక్కడ, ఆ చల్లని చెట్టు క్రింద నిద్రపోతుంటారు.

ఇవ్వాళ మాత్రం రాత్రి తాను ఇక్కడికి రావాలని అనుకుంది. రాత్రికి వెళ్ళాల్సిన శైబ్య ఇప్పుడే అక్కడికి వెడుతుంది. ఆమెను చూస్తూనే "చెల్లాయి, చూసావా, ఎవర్ని తెచ్చానో. మా ఆచార్యుని, నీ స్నేహితుని.... అని చెబుతూంటే ఆ ముఖంలో సంతోషఛాయలు ఏ మాత్రం కనబడని శైబ్యను చిత్రంగా చూస్తూ "ఏమయింది నీకు ?'' కృష్ణుడడిగాడు. మా ఉపకులపతి ఆచార్యుడై, కుండిన పురంలో ఆశ్రమం ఏర్పాటు చేసి భోజరాజీయులకు, శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని స్వీకరించారు.

ఆయన నన్ను నీ పెద్దన్నగా భావించి, నిన్ను వివాహం చేసుకునే విషయంలో నా అనుమతిని కోరి మరీ వచ్చారు. ఆయనకు భార్య కావాలిట. ఆమె ఎవరో కాదు, నువ్వేనట. మా ఉపకులపతి అదృష్టవంతుడో, దురదృష్టవంతుడో నాకర్థం కావడం లేదు. ఆ మాటకు సమాధానమివ్వకపోగా, ఓరచూపులు చూడాల్సిన ఆమె, కోరచూపులతో కొరకొరలాడుతూ చూసింది. వాళ్ళు మనుషులే, కానీ కొందరు మనుషులుగా కాక మహనీయులుగా ప్రవర్తిస్తే, ఇంకొందరు మానవత్వం మరచిన దానవులు లేదా మృగాలవలె ప్రవర్తిస్తారు. ఏం చేద్దాం. అదో ప్రపంచం. అప్పుడు కృష్ణుడు శ్వేతకేతువుతో -

"నేను, త్రివక్ర చేయవలసిన పనులు బోలెడు వున్నాయి. వెడుతున్నాం'' అలాగే, శ్వేతకేతూ, మీరిద్దరు పారిపోయినా, లేక బలవంతంగా నువ్వామెను ఎత్తుకుపోయినా నాకేం అభ్యంతరం లేదు. అందుకు నువ్వు సిద్ధమైతే నానుండి నీకే విధమైన ప్రమాదం రాదని మాత్రం వాగ్దానం చేస్తున్నానంటాడు.

శైబ్య మౌనంగా చుట్టూ వున్న రాతిఅరుగు ప్రక్కన వున్న మామిడి నీడలో స్తబ్ధుగా నిలబడింది. అప్పుడు శ్వేతకేతు ధైర్యమొచ్చినట్లు "కృష్ణుడు సరిగ్గా చెప్పాడు. నువ్వు లేకుండా నేను బ్రతుకలేను. కనుక నిన్ను వివాహం చేసుకుని కుండినపురానికి తీసుకువెడతాను. అనుక్షణం నీ గురించి ఆరాటపడే నేను ఒక్క క్షణం కూడా విడువలేను.''

"అబద్ధం. నువ్వు చెప్పేది ఒక్కటి నిజం కాదు. నువ్వు వచ్చింది నీ మిత్రుడు కృష్ణునికి రుక్మిణీ సందేశం తీసుకుని వచ్చావు. అది బట్టబయలు కాకుండా, నాకోసం వచ్చినట్లు నటిస్తున్నావు.'' నిష్ఠూరంగా పలికింది.

"నువ్వు చెప్పిందాంట్లో కొంత నిజం లేకపోలేదు. కాని, నేను నా వివాహం నిమిత్తం వెడుతున్నానని చెప్పి ఇక్కడికి వచ్చాను తప్పు. రుక్మిణికి రాయబారిగా కాదు. అది నా పరిశీలనలోని విషయం కూడా కాదు!'' తేగెసి శ్వేతకేతు చెప్పాడు.

"కాదు. నువ్వొక నయవంచకుడివి. మొదటి నుండి నీ బుద్ధి వక్రమేనని ఇప్పుడు నాకనిపిస్తుంది. నా కోసం, నీ ఆచార్యులను, స్వధర్మాలను విడనాడావు. అనవసర వూడిగం చేసావు. ఈ కృష్ణుని కోసం నిన్ను నమ్మిన నన్ను, నా ప్రభువును మోసం చేసావు. ఇప్పుడు మళ్ళీ ఈ మిత్రునికోసం ప్రస్తుతం నిన్నందలమెక్కించిన భీష్మకులవార్ని వంచిస్తున్నావు. నీదొక బ్రతుకు. నువ్వొక ఆచార్యుడివి. నిన్ను నమ్మి బాగుపడేవారికన్నా, నీ శిక్షణలో నాశనమయిపోయేవారే వుంటారని" తన అక్కసునంతా శైబ్య కక్కేసింది.

"శైబ్యా! అసలు నీ బుద్ధి పూర్తిగా మందగించిందనుకుంటాను. నువ్వు పుట్టి పెరిగి, పుట్టి మునిగించుకున్న కరివీరపురాన్ని చూసావు. ఈ మథుర నగరాన్ని ఇప్పుడు చూస్తున్నావు. ఉభయదేశాల పరిస్థితులను అంచనా వేసుకో. నీవంటివారు ఇలాగే నీ దేశంలో ప్రవర్తిస్తే ఏమవుతుందో గూడా వూహించుకుని జాగ్రత్తగా మసలుకో. నిన్ను నువ్వు తీర్చిదిద్దుకో!" ఎంతో ప్రేమాదరాల అనురాగంతో చెబుతున్నాడు.

"మాకు, మీకు పోలికా!" ఈసడించింది.

"నిజం చెప్పావు. నక్కకు, నాగలోకానికి పోలికా! మనిషిని మనిషిగా ప్రేమించని దేశం, నాయకుడు, నిరంకుశంగా ప్రవర్తించే ప్రభుత్వం, తన ఆలోచనలను అందరిపై రుద్దే ప్రభువు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హరించే దేశం, మా ముందు సభ్య సమాజంగా చెప్పుకునేందుకు కూడా పనికిరాదు. ప్రేమ పేరిట మోసాలు, దారుణాలు ఇక్కడ వుండవు. ధర్మం పూర్తి బాధ్యత ఇక్కడ వహిస్తే, అక్కడ "అధర్మం" అనే నిరంకుశత్వం అంటు వ్యాధిలాగ ప్రబలి ప్రజలను చంపుకుతింటుంది. ఇప్పుడు వెళ్ళి ఆ దేశాన్ని చూడు. సభ్య సమాజంగా మన్ననలను పొందుతుంది. మీ మూర్ఖపు రాజరికం నాశనమైంది. నిజమైన దేవుడక్కడ ప్రతిష్ఠించబడ్డాడు. నిత్యనీరాజనా లందుకుంటున్నాడు.

అతని నోటి నుండి మరొక్కమాట వినదలచని శైబ్య "ధర్మమంటే ఇదేనా ? నమ్మినవారిని వెన్నుపోటు పొడవడమా ?" వ్యంగ్యంగా వెక్కిరించింది. దీనికి ప్రతిగా శ్వేతకేతు నవ్వుతూ "నవ్వే తెలివియని నీకు, ధర్మమంటే ఎరుగని నీకు, ఎదుటి వారి బ్రతుకులతో ఆడుకునే నీకు, ప్రేమ పేరిట వంచించి, బంధించి, బానిసను చేసుకున్న నీకు, ఎదుటివారి సుఖసంతోషాలు ఓర్వని నీకు ....!" చెప్పుకుపోతున్నాడు.

"చాలు, చాలు!" ఆ ప్రక్కనున్నవారు వులిక్కిపడేటట్లు శైబ్య గట్టిగా అరిచింది. "అయితే మీ మిత్రుడు ఈ లోకాన్ని ఉద్ధరిస్తాడా ? ధర్మం నిలబెడతాడా ? ఉక్రోషంతో అడుగుతుందామె.

"చూడు శైబ్యా! కోపాన్ని ప్రక్కనపెట్టి శాంతాన్ని వంట పట్టించుకుంటే విషయమర్ధమౌతుంది. ఈ కృష్ణుడు చూడటానికి మనందరివలె సామాన్యుడే కావచ్చును....!" అంటూంటే... "అదే... అదే.. నేను చెప్పేది. ఏ క్షణంలోనైనా మనలాగ చచ్చే ఈ కృష్ణుడు ధర్మ పరిరక్షకుడా ?" అడుగుతుంది.

"అవుననే కదా, దేవర్షి నారదులు, మహాముని వేదవ్యాసులు, ఇతర ఋషీశ్వరులు..... అనుక్షణం అవతారపురుషునిగా కీర్తించి ప్రస్తుతించేది. మరొక విషయం తెలుసా.... యధాయధాహి ధర్మస్య.... అన్నారు చూడు, దానికి సరైన అర్ధం ఇదిగో - ఈ కృష్ణుడే.... ఎలాగంటే... ?

**"ఎప్పుడెప్పుడు ధర్మమునకు హాని కల్గునో భారత**
**అప్పుడప్పుడు నేనవరింతు "అవని" యందున**
**పరిరక్షించ సాధువుల, శిక్షించ దుష్ట వినాశకుల**
**ధర్మ సంస్థాపనార్థాయ! (అర్జునా) అవతరింతునే యుగయుగమ్మున**

ఇది నిజమైన శ్రీకృష్ణుని తత్వం. ఇది అర్థం చేసుకున్నవారు, చేసుకునేవారు అదృష్టవంతులు. కాని వారు పాపాచారులు, కర్మభ్రష్టులు. ఇది తెలుసుకుంటే జీవితం ధన్యం. జీవనం పుణ్యం.

"ఇవన్నీ నాకనవసరం" అంటుంది మూర్ఖంగా. మళ్ళీ ఆమే - "అయితే నువ్వు నిజంగా నాకోసమే వచ్చావా ?" కుతూహలం లేని ఆసక్తితో అడుగుతుంది. "నిజం. నేను వచ్చింది నీకోసమే. కావాలంటే నువ్వు - కుండినపురానికి వెళ్ళి నేనిక్కడికి ఎందుకు వచ్చానో తేల్చుకో!" చెప్పాడు. అయినా బుద్ది మందగించినవారు నీలాగే ప్రవర్తిస్తారు" మళ్ళీ శ్వేతకేతే అన్నాడు.

"అయితే, నువ్వు నన్ను, నీ మిత్రుడాడమన్నట్లు ఆడుతూ, ఓ కీలుబొమ్మను చేసావన్నమాట!" ఆమె ప్రవర్తనతో సహనం కోల్పోతున్న శ్వేతకేతు "అసలు - నన్ను నువ్వెప్పుడు ? అర్థం చేసుకుంటావు ?" అటువంటి కోపాన్ని అంతకు మున్నెప్పుడు చూడని శైబ్య మొదట అదిరింది. ఇంకో క్షణం బొమ్మయింది. ఆ తదుపరి తేరుకుంది.

"గతం మరచిపో. వర్తమానం ఆలోచించు. భవిష్యత్తు మనకోసం ఎదురు చూస్తుంది. మూర్ఖంగా ప్రవర్తించి, శలభంలా మాడిపోకు. కృష్ణుడు నిన్ను సోదరిగా తలిచాడు కాబట్టి నిన్నుపేక్షిస్తున్నాడు. నువ్వు బ్రతికావు. కాదంటే. ఎప్పుడో పూతన లాగా, నీ పినతండ్రితోపాటు దిక్కుమాలిన చావు చచ్చేదానివి. పాలు త్రాగే వయసులోనే శకటాసుర, తృణావర్తులను పరలోకానికి పంపిన పరమపురుషుడు. ఆయన కరుణకే తప్ప, కోపాగ్ని జ్వాలలకు బలికాకు!" ఆచార్యుడు కదా! తన ధీర గంభీర స్వరంతో బుజ్జగిస్తున్నట్లు చెప్పినా చాలా గట్టిగానే చెప్పాడు.

కనుక.... అన్నీ వింటూ విషయమడిగింది." శైబ్యా! ఇప్పుడు మనమొక మహత్కార్యం చెయ్యాలి. అది మనకు, అంటే మంచివారికి, లోకాలకు కూడా ఎంతో ఉపకారి."

"ఏమిటది ?" అడగకుండా శైబ్య వుండలేకపోయింది.

"జరాసంధుడు వంటి సామ్రాజ్య విస్తరణవాదుల నుండి మనం సామ్రాజ్యాల్ని రక్షించుకోవాలంటే, బలపరాక్రమాలతో పాటు, ఓర్పు, నేర్పు కావాలి." విషయం - ముందు ప్రస్తావనతో ప్రారంభమయింది. ఇవన్ని విడిచి అసలు విషయం చెప్పమంది. సమాధానంగా "నేను చెప్పిన మహత్కార్యం" అంటూ రుక్మిణీ కల్యాణం గురించి చెప్పి, ఇందులో కనుక తెలివిగా మనం ప్రతికక్షులను నిరోధించగల్గితే, అంతా సుఖాంతమౌతుంది. మిగిలిన విషయాలనా కృష్ణుడు, కాలక్రమంలో సరిచేస్తాడు. అంతా విన్న శైబ్య, మనం కృష్ణుడికి పెళ్ళి చెయ్యాలన్నమాట. చాలా బాగుందంది. "అది వెటకారమో, వెక్కిరింపో" అర్థం కాలేదు.

కొంతలో కొంత రుక్మిణీ-కృష్ణుల ప్రేమ విషయం శైబ్యకు తెలుసు. త్రివక్ర కొంత, తన కుమారుని దురదృష్టమంటూ "కంసాదేవి" కొంత తనకు చెప్పారు. తెలుసున్నదే శ్వేతకేతు మళ్ళీ చెప్పాడు. "ఏది ఏమైనా కానీ, ముందు స్వయంవరాన్ని భగ్నం చేయడం, ఆ తదుపరి నీ సహకారంతో వారిరువురికి వివాహం చెయ్యడం - ఇదే ప్రస్తుతం మనముందున్న కర్తవ్యమన్నాడు.

"సరే నీ ఆలోచన బాగానే వుంది. ఇంతా చేస్తే ఆమె మరొకర్ని వివాహం చేసుకుంటే...!?"

"అసంభవం. రుక్మిణి ఆ రకంగా చెయ్యదు. చావనైనా చస్తాను కానీ, ఆ శిశుపాలుడిని... అంటూ ఏనాడో ఆడపులి అయింది. కాకపోతే కాలానికి, ధర్మానికి

ఎదురు చూస్తూంది. పైగా ఆమె అందరి ఆడవాళ్ళ వంటిది కాదు. ఆ విషయం, ఆమె మనస్తత్వం నాకు బాగా తెలుసు.

అప్పుడే "శైబ్య, జరిగిందేదో జరిగిపోయింది. నేను నిన్ను కోరుకుంటున్నాను. నువ్వు నాకు కావాలి. నీ కోసం నన్ను ఎన్ని రకాలుగా అర్పించుకున్నానో నీకు తెలియనిది కాదు. నువ్వు నన్ను కోరావు. నా సహచర్యాన్ని అడిగావు. కాబట్టి అన్నీ మరచి హాయిగా వివాహం చేసుకుని సుఖంగా వుందాం. గతాన్ని మరచిపోదాం!" ప్రార్థిస్తున్నట్లు అర్థిస్తున్నాడు.

అంతా విన్న శైబ్య స్థిరనిశ్చయానికొచ్చినట్లు, మార్పులేని మార్చుకోలేని తన మనస్సుతో -

"శ్వేతకేతూ, నా మాట నమ్మకు. విను. ఎంత తాను సోదరుడినని చెప్పినా, కృష్ణుడంటే నాకు తగని మంట. పగ, ద్వేషం. ప్రతీకార వాంఛ నాలో ఎప్పుడు కుత కుత మని రగులుతుంది. నా పినతండ్రిని చంపిన ఆ హంతకుని చావును నా కళ్ళారా చూడాలన్నది, నా నరనరాలలో పేరుకున్న కసి. కనుక, ఆ కృష్ణుని చేతిలో కీలుబొమ్మయిన నిన్ను నేను వివాహం చేసుకోను. అతన్ని, బ్రతుకనివ్వను. నా కసిదీర్చుకుని, నా పగ చల్లార్చుకుంటాను. ఆడవాళ్ళలో ఇలాంటి "శివంగి" లుంటారా ?" అన్నట్లు శైబ్య ప్రవర్తిస్తుంది.

"అసంభవం. ఇందులో, నీ ఆలోచన ఏదీ ఫలించదు. నువ్వనుకున్నట్లు, నీలాంటి వాళ్ళు భావిస్తున్నట్లు శ్రీకృష్ణుడు సామాన్యుడు కాడు. ముందు ముందు నీకే తెలుస్తుంది. ముందు నీ మూర్ఖత్వాన్ని పారద్రోలుకో. సత్యం బోధపడుతుంది. జ్ఞానం వృద్ధి చెందుతుంది. చివరిగా నామాట కూడా విను. నువ్వు లేకుండా నేను కుండినపురానికి వెళ్ళను. నిన్ను తీసుకునే వెడతాను. ఇందులో ఆవగింజంతయినా మార్పు, చేర్పు రాదు, లేదు" నిక్కచ్చిగా చెప్పేసాడు.

ఉభయులు - ఈసడించుకుంటూ విసురుగా అక్కడనుండి కదిలారు.

# కోపం పోతే - అంతా శాంతమే!

**శ్వే**తకేతు స్థిరనిశ్చయానికి శైబ్య ఆలోచనలో పడింది. కొండల్లో పుట్టి, కొండల్లో పెరిగి అదే ప్రపంచమని తలచే తాను, కారణమేదైనా ఈ నవనాగరిక ప్రపంచంలోకి అడుగుపెట్టాల్సి వచ్చింది. రెండు వేర్వేరు ప్రాంతాలు, చిత్ర - విచిత్రమైన పరిస్థితులు. అటవిక న్యాయమొకచోట. నవనాగరిక సమాజం మరొక చోట.

అనుక్షణం సంభ్రమాశ్చర్యాలు కల్గించే ఈ లోకంలో మానవతా విలువలు, కర్తవ్యబోధలు, ధర్మ సాంప్రదాయ పరిరక్షణలు, ఆచార వ్యవహారాదులు... ఎన్నో... ఎన్నో.... వున్నాయి. అన్నీ ఆనందించదగ్గవి. హర్షించి స్వాగతించదగ్గవి. ఇవన్నీ కాదని కూపస్థ మండూకంలాగ, నేను - నా దేశం, నా ప్రవర్తన, అదే ధర్మమనుకోవడం, ఎవరో చెప్పారని కాదు... ఆలోచిస్తే.... చేసేది, చేసింది, చాలా... చాలా... పెద్ద పొరపాటు.... ఈ రకంగా శైబ్య ఆలోచనలు సాగుతున్నాయి.

ధర్మం తప్పని ఎందరో మహనీయులు, వేదసూక్తులు, ధర్మసూక్ష్మాలు చెప్పారు. వాళ్ళందరు, ఒకళ్ళు కాదు, ఇద్దరు కాదు, పడ్డ బాధలు, తనను కాదన్నారని "నరకం" చూపిస్తానంటూ, ఓ కూపంలో పడేసి, జగదేక ప్రభువు శ్రీ గాలవ్య వాసుదేవాయ నమః" అంటూ కీర్తించిన వారిని విడిచిపెట్టడం కాదన్న వారిని, క్షమార్హం కాని వారంటూ హింసించడం, అంతా నెమరువేసుకుంటుంది. అంతెందుకు .... ?!

తానే తన అందచందాల నెఱవేసి, ఉత్తమ కుల, ధర్మ, సాంప్రదాయా చారాలతో, ఉపకులపతిగా వుండే శ్వేతకేతును, కరవీరపురానికి తీసుకువెళ్ళలేదా? అప్పుడు తెలియని ఆర్షధర్మానికి, తూట్లు పొడవలేదా ?" తనలో తనే తర్కించు కుంటుంది. ఉవ్వెత్తున సాగే అలల వలె, ఉక్కిరి బిక్కిరి చేసే ఆలోచనలతో, ఏ నిర్ణయానికి రాలేక, నిర్ణయాత్మక పథాన్ని అందుకోలేక సతమతమౌతుంది.

ఇక కృష్ణుని గూర్చి ఆలోచిస్తే, "అన్ననన్నాడు. ప్రేమను కురిపించాడు. అమ్మనిచ్చాడు. యువరాణిగా ప్రేమింపచేసాడు. ఇంతటి ప్రేమాదరాల అనురాగాన్ని తనేనాడు, తను పుట్టి పెరిగిన కరవీరపురంలో పొందలేదు, సరికదా, అదొక రకమైన నిరంకుశ వాతావరణానికి అలవాటయిపోయి సదాలోచనలు లేక, రాక వున్న ఆలోచనలన్ని వక్రమార్గంలో, పెడమార్గంలో పయనిస్తూంటే, సంస్కరించడానికన్నట్లు సోదరిగా తీసుకువస్తే ఇందులో అతని స్వార్థమేముంది!

పైగా కరవీరపురాన్ని హస్తగతం చేసుకుని రాజుననలేదే ? తన తమ్మునికి రాజ్యాభిషేకం చేయించాడు. అటువంటి వ్యక్తిని తాను స్వార్థపరునిగా చిత్రీకరించాలా ? మహాశక్తివంతునిగా, సద్ధర్మునిగా కీర్తించాలా ? వీటికి అంతు, అడ్డు - ఆపు కనబడటం లేదు. జోరీగల్లాగ ఆ ఆలోచలు సాగుతున్నాయి.

ఎటుచూసినా, ఇక్కడ, తెలియని నాకు అలవిమాలిన ప్రేమ, గౌరవం, అంతకు మించి అనురాగం ఆశించినదానికన్నా ఎక్కువ లభిస్తూంటే, మూర్ఖత్వంతో, మృగంలా ప్రవర్తించడం తగునా ?'' తనలో తనే ప్రశ్నించు కుంటుంది. సమాధానం కూడా వెంట వెంటనే వెదుక్కోకుండా దొరుకుతుంది. అక్కడికక్కడ, పరిష్కారం లభిస్తుంది.

ఈ సమయంలోనే త్రివక్ర - ఆభరణాలు, దుస్తులు మధుర ఫలహారాలతో విచ్చేసింది. సంప్రదాయం ప్రకారం కృష్ణసోదరిగా, రాజబంధువుగా వందనం చేసింది. దేవకిమాత పంపారంటూ.... ఆ బహుమానాలనిచ్చింది. "ఎందుకివి ?'' అన్యాపదేశంగా శైబ్య అడిగితే త్రివక్ర - "తమకు, ఆచార్యులు శ్వేతకేతుల వారికి నిశ్చితార్థం జరగబోతున్న శుభ సందర్భంలో, దేవకీమాత, తమ ఆశీస్సులతో పంపిన బహుమానాలంది.

"ఏవిటి ? మా కిరువురికి నిశ్చితార్థమా ? మాకు వివాహమా ? ఇది జరిగే పనా ?'' మళ్ళీ మూర్ఖత్వం బలపడుతున్నట్లు, మొండిగా వాదన ప్రారంభించింది.

"కృష్ణుల వారు చెప్పారుటమ్మా!'' కృష్ణ సోదరి కాబట్టి, త్రివక్ర ఎంతో వినయంగా మాట్లాడుతుంది.

"కృష్ణా! కృష్ణా, కృష్ణా! కృష్ణుడట... కృష్ణుడు, ఎవరీ కృష్ణుడు ..... ? తనపై అతనికి అధికారమేమిటి ? అసలీ కృష్ణుడు నన్నెందుకు వదిలించుకోవాలని చూస్తున్నాడు ? ఆ పేరు వింటేనే, నాకు కంపరమే... అటువంటిది...!'' ఈ మూర్ఖత్వం వదలదనుకుంది - త్రివక్ర! ఆ వెంటనే కోపము వచ్చిందామెకు.

"ఆ పనికిరానివాడు, జగదేక ప్రభువు వాసుదేవుడా ? ఈ నిజమైన దేవుడు నీకు సరి తూగడా ? కృష్ణ సోదరివనిపించుకుని నువ్వు బ్రతికి బట్ట కడుతున్నావు. కాదంటే, నీ - ఈ - ప్రవర్తనకు, నువ్వీ మథురలో అడుగుపెట్టిన మరుక్షణం, మా ఆచారం ప్రకారమైతే, చచ్చిపోయేదానివి. ఇకనైనా బుద్ధి తెచ్చుకో. సద్బుద్ధితో దేవాధిదేవుని, నిజమైన ప్రేమమూర్తి "వసుదేవ'' వాసుదేవునికి శరణాగతురాలవై, బ్రతికి

బట్ట కట్టు. చరిత్రలో "కృష్ణసోదరి" అనే మహోన్నత స్థానాన్ని పొందు" హెచ్చరించింది. అందులో అధికారం, శైబ్యపై అసహనం, ఈసడింపు, ఈ మూర్ఖురాలిని ఇంకా - ఆ కృష్ణ ప్రభువు ఎందుకు కనికరిస్తున్నాడన్న సందేహం కనుపిస్తున్నాయి.

శైబ్య స్థితికి తనను తాను నిగ్రహించుకోలేకపోతున్న త్రివక్ర "చూడు. వినదగు నెవ్వరు చెప్పినా" అని మన పెద్దవాళ్ళెందుకన్నారంటే, అందులో మనకు కావాల్సిన మంచి విషయమేదైనా దొరుకుతుందేమో గ్రహించడానికని. అంతే కాని కనుపించిన ప్రతివారు చెప్పే కాకమ్మ కబుర్లు, కల్లబొల్లి మాటలు, కొండెములు, ఇవి మనసుల్ని రంజింప చెయ్యవు సరికదా, మానవత్వాన్ని మరపింప చేసి, మనుషుల్ని పశువులుగా తయారుచేస్తాయి.

ఆ తర్వాత - వారికి ఎవరెన్ని మంచిమాటలు చెప్పినా తలకెక్కవు. వాళ్ళ తలకెక్కేవి తలతిక్క మాటలు తంపుల కోరుల కొండెములు. వీటిని అర్థం చేసుకోగలగడమే జ్ఞానం. ఆచరింపచెయ్యగలగడం విజ్ఞానం. ఇదంతా మనకెందుకులే.... అనుకుంటే, ఆ పశువులు కూడా మనల్ని దగ్గరకు రానీయవు. మనపై గల అసహ్యం, కసితో కుక్క 'మీద పడి మొరగదు' కరచి చంపుతుంది. గాడిద లేవడానికి వీల్లేకుండా వెనుక కాళ్ళతో ఎగిరి ఒక్క తన్ను తన్నితే, ఇక వాళ్ళ పని సరి. ఆ భగవంతుడు, ఇటువంటి వారి రక్షణకు దగ్గరకు రాడు.

ఇక క్రూర జంతువులు సరేసరి. మనమీద గల అసహ్యంతో పెంపుడు జంతువులు ప్రేమను అన్యోన్య భావాలను మరచిపోయి, ప్రకృతి విరుద్ధంగా ప్రవర్తిస్తాయి. ఇటువంటి బ్రతుకు మనకు అవసరమా ? ఆలోచించు. కంసాదేవి వంటి వారి మాటలు, వినదగునా ? కుత్సిత బుద్ధికి, బుద్ధిహీనులమై బ్రతుక వలసినదేనా ? ఆలోచించుకో.

దేవకీమాతతో సహ ఇందరు ఇన్ని చెప్పినా, వినని మూర్ఖత్వానికి, కృష్ణుడు నిన్ను "సోదరి" అన్నందులకు వుపేక్షిస్తున్నాడే తప్ప, నీ కోటగోడలవలె నీ బుజ్జపగిలి పోగలదు. నీ ప్రభువు వాసుదేవునివలె ఎవరు మెచ్చని హీనజన్మురాలివై నిర్ధాక్షిణ్యంగా చచ్చిపోగలవు. ఆలోచించుకో!" అన్న త్రివక్ర........

"ఆ. శైబ్యా! ఇందులో, అదే... ఈ బట్టల్లో కత్తి గూడా వుంది. మాటిమాటికి కృష్ణుడు నా శత్రువు. చంపుతాననే నీవు, ఏ విధమైన ఇబ్బంది లేకుండా, కావలసిన కత్తిని తెచ్చి ఇచ్చాను కాబట్టి, నీ పని నువ్వు నిర్విఘ్నంగా కొనసాగించు. బ్రతికుంటే,

బ్రతుకునిస్తారు. చచ్చిపోతే "అయ్యో!" అని సాటిమనిషిగా తోటి జీవిలా సానుభూతితో రెండు కన్నీళ్ళు కారుస్తారు. ఎందుకంటే - ఇక్కడ మానవత్వం, ధర్మం, ఆచార, సాంప్రదాయాలు మమతానురాగాలు, పుష్కలంగా వున్నాయి కాబట్టి. కృష్ణుని నేతృత్వంలో - ఇప్పుడు బ్రతుకుతున్నాం. కాబట్టి....!" ఆమెను ఆలోచనలలో పడేసి అక్కడ నుండి విసురుగా త్రివక్ర వెళ్ళిపోయింది.

అంతవరకు మరోరకంగా ఆలోచించిన శైబ్య మెదడు మొద్దుబారింది. రక్తనాళాల ప్రసారం కాస్సేపు ఆగిపోయింది. ఆ మొద్దుబారిన బుద్ధితో విషయమందుకోలేని మనసుతో పిచ్చిదానిగా కాస్సేపు చూసి "అవును." అని మళ్ళీ పునరాలోచన కాదు, దీర్ఘాలోచనలో పడింది. పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. కానీ, కానీ.... గాడి తప్పిన మనస్సు, గతి తప్పిన విధంగానే వుంది. మరి చచ్చిపోయిన పినతండ్రి ఆత్మశాంతి పొందాలంటే, అతని కిచ్చిన మాట లేదా నేను చేసిన వాగ్దానం నెరవేర్చుకోవాలి కదా!

మాట తప్పితే, గతి తప్పుతాము. దారి దొరకదు. ధర్మం నాశనమౌతుంది. ఇదే కదా.... ఇక్కడివారు చెప్పే మాటలు. మరి నా వాగ్దానం నిలబెట్టుకోవడం తప్పుకాదు కదా! ఆ తర్వాత ఏం జరగబోతుంది.... అన్న ఆలోచనకన్నా, ప్రస్తుతం కర్తవ్య నిర్వహణం మిన్న. చేతిలోకి కత్తి తీసుకుంది. అదెంతో పదునుగా వుంది. దీనితో బలంగా ఒక్క పొడుపు పొడిస్తే, కృష్ణుడు... ఆ దేవాధిదేవుడు, కృష్ణ వాసుదేవుడు, ధర్మ రక్షకుడు, అవతారపురుషుడు "హరి, హరీ!" అంతే సంగతులు, చిత్తగించవలెను" సంబరపడిపోయింది.

అయినా బయలుదేరింది. గున్నమామిడిచెట్టు చుట్టూ గల రాతి మంటపంలో ఎంతో ప్రశాంతంగా నిద్రలో కూడా చిరునవ్వులు చిందిస్తూ, అచ్చం పసిపాపవలె ఆదమరచి నిద్రపోతున్నట్లు కనుపించే కృష్ణయ్యను చూసింది. మందహాస వదనం చూస్తుంటే, అది ప్రసాదించే మధురానందానికి శరీరం వివశమౌతుంది. ప్రేమ పొంగరిల్లుతుంది. ప్రపంచం మొత్తం - ప్రేమ - దయ - కరుణల పేరున, తన పాదాలచెంత నిల్పుకున్న ఆ "ధర్మస్వరూపుడు అవతార పురుషుడు, తన చిరునవ్వు సమ్మోహనాస్త్రంతో వివశులను చేస్తాడు. కనుక అతన్ని చూడకూడదనుకుంది.

భద్రంగా బట్టల మధ్య దాచిన కత్తిని చూసుకుంది. అటు ఇటు చూసింది. తననెవరు గమనించడం లేదని నిర్ధారణ చేసుకుంది. ఒకటికి మూడుసార్లు

కత్తిపోట్లు బలంగా పొడిచింది. కత్తి విసిరేసింది, పారిపోయింది. పగ చల్లారింది. కసి కరగిపోయింది. ప్రాణం ఇప్పుడు సుఖంగా వుంది. కానీ తప్పు చేసిన భయం వెంటాడుతుంది. తెలియకుండానే దడ, వణుకు.... ఏదో తెలియని ఆందోళన-చెప్పలేని కంగారు. గబగబ తన మందిరానికి వెళ్ళిపోయింది.

మిగిలిన "రాత్రి" ప్రశాంతంగానే వున్నా శైబ్య, భయం భయంగా, భళ్ళున తెల్లారిన ఉదయంతో, ఉలిక్కిపడినట్లు లేచి కూర్చుంది. వాతావరణం అంతా ప్రశాంతంగా వుంది. ఇంకా కృష్ణయ్య మరణ వార్త ఈ లోకానికి అందలేదా ? లేక అంది, అందరు మూగబోయారా ? ఏమీ అర్థం కావడం లేదు.

దేవకిమాత మందిరంలో అడుగుపెట్టిన శైబ్య అవాక్కయింది. తన మూర్ఖత్వం, పెంకితనానికి ఎంతో ప్రేమానురాగాలతో సమాధానమిచ్చి సంతృప్తి పరచే దేవకీమాత కటిక నేలమీద వెల్లకింతలా పడి వుంది. ఆమె గుండెలపై ఆమె ఆరాధించే ఆ చిన్నకృష్ణుని బంగారు ప్రతిమ నిలిచి వుంది. అడుగుపడటం లేదు. కాళ్ళు కదలడం లేదు. నోటమాట రావడం లేదు. దేవకిమాత చచ్చిపడి వుంది. అంటే ఆ తల్లి చచ్చిపోయింది. "అర్థం కాలేదా ?" ఆ బొమ్మ పలుకుతున్నట్లుంది. ఇది ఎవరి పనో తెలుసా ? ఇంకెవరిది శైబ్యది. ఈ శైబ్యే - అమ్మను చంపేసింది. ఆమెను వ్రేలుపెట్టి చూపుతున్నట్లుంది. తలత్రిప్పితే -

ఆ ప్రక్కగా వసుదేవుడు. ఆయన అసహనంగా తిరుగుతున్నాడు. "కృష్ణా! ఓ కృష్ణా!" అంటూ ఏదేదో గొణుక్కుంటున్నాడు. ఈ పరిస్థితి తనవల్లనే వచ్చిందని భావించింది. ఈ సమయంలోనే ఓ పిల్లగొంతుక. అది, ఆ స్వరం.... సుభద్రది. "అన్నా!" అన్నది, కాదు, "గో-విందా! గోవిందా" అని విలపిస్తుంది. ఆ తర్వాత... "అన్నా... అన్నా!" అంటూ ఆపుకోలేని ఏడుపులు. అది వినలేని శైబ్య అక్కడనుండి పరుగెత్తింది.

తీరా చూస్తే అక్కడ రెండు శవాలు. అవెవరివి ? అంతా చిత్రంగా వుంది. ఆశ్చర్యపోతుంది. ఆ శవాలు, ఎవరివో తెలుసుకోవాలన్నదామె ఆరాటం. వంగి చూస్తూంది. ఒకటి - ఉద్ధవునిది. అప్పుడు శ్వేతకేతు నిర్ఘాంతపోయి వున్నారు. "ఇదేమిటి ?" అతని దగ్గరగా రాగా, అమాంతం ఆమెను పట్టుకున్నాడు. పిచ్చివాడిలాగా ఆమెనే చూస్తున్నాడు. "శైబ్యా! నువ్వు.... నీలాంటి వారందరు కలిసి, జగదోద్ధారకుడైన నా కృష్ణుని కసితో చంపేసారు!" బావురుమన్నాడు. అతని ప్రవర్తన ఎవరికి అర్థం

కావటం లేదు. ముఖ్యంగా శైబ్యకు... మొత్తానికి రాజభవనం. పరివారం, యదు ప్రముఖులు, నగరపౌరులు, యమునకుపోతే అచ్చటి జనం, ఎక్కడ చూసినా, ఆ ఘాతకి, ఆశ్రయమిచ్చిన ఆ ఆడపులి, క్రూర జంతువు, మమతానురాగాలు మరచి, ఆ అడవి జంతువు అమానుషంగా ప్రవర్తించింది. ఆమెను.....

ఇప్పటి పరిస్థితిలో శైబ్య ఎవరికి కనుపించినా ప్రమాదమే. ఒక్క పెదతల్లి "కంసా"యే జరిగిన దానికి ఆనందిస్తూంది. శైబ్యను మనసులో అభినందిస్తూంది. తన స్థితి బయటపెట్టకుండా, అది బయటపడకుండా, "అవును. కృష్ణుడు. చంపెయ్య బడ్డాడా ? చచ్చిపోయాడా ? వున్నాడో.... పోయాడో... ఎక్కడికి వెళ్ళాడో.... ఎప్పుడు వస్తాడో.. మహా నటిమాయ వలె, ఆమె నటిస్తుంది.

ఇప్పుడు శైబ్యకు శరణాగత రక్షకులెవ్వరు లేరు. కంటపడితే నిర్దాక్షిణ్యంగా కాల్చో, కొట్టో... చంపేవారే తప్ప - కృష్ణుడు చూపిన ప్రేమామృతం, ప్రసాదించిన అనురాగామృతం - ఇక - ఈ జన్మకు ఆమెకు లేదు. దొరకదు కూడా!

ఆ బాలగోపాలం కృష్ణునికై పరితపిస్తూంటే, అప్పుడు అప్పుడు... తెలిసింది శైబ్యకు. నిజమైన కృష్ణ ప్రేమ. ఆ పవిత్ర ప్రేమామృత రసాస్వాదన రహస్యం. ఇక పారిపోవడమొక్కటే దిక్కుగా పరుగు తీసింది. బలమైన కోటగోడల రాయి రాయి మధ్యనున్న సున్నం "పాపం కష్ణుడు చంపబడ్డాడు. ధర్మావతారుని, అధర్మం నాశనం చేసింది. ఈ ఫలం అనుభవించక తప్పదు. కిరాతకులు, కిరాతక సామ్రాజ్యానికి పోతారు. అష్టకష్టాల పాలవుతారు.

అప్పుడు.... అప్పుడు.... కృష్ణుని ప్రేమ, దయ, కారణ్యం, ధర్మం.... సర్వం అర్థమవుతాయి. అయినా మూర్ఖత్వం కాకపోతే దేవాధిదేవుడైన ఆ కృష్ణుని చంపుతాననడం, చంపాననుకోవడం, ఎంత భ్రమో ? దాని ఫలితమెలాగ వుంటుందో, ఆ జీవునకు, ఈ దేవుడు ఈ రకంగా ధర్మ-కర్మోపదేశం చేస్తున్నాడని మనము అనుకోవాలి. మన కృష్ణుడు, నిత్యుడు, సత్యుడు, శాశ్వతుడు అటువంటి దివ్య పురుషులకు మరణము, సంతాప హరణమే తప్ప, శాశ్వతబంధము శాపము కాదు. దీనిని కేవలం నిస్వార్థపరులైన మహామహులైన తపస్సంపన్నులు, వేదమూర్తులు మాత్రమే అర్థం చేసుకోగల్గుతారు.

ఇది అచ్చటి, అప్పటి పరిస్థితి! అప్పుడు.. ?!

# శైబ్య

ఎక్కడో.... ఒంటరిగా ఎత్తైన ప్రదేశంలో నిలబడి వుంది. రాజభవనం తప్ప ఆమెకేమీ తెలియదు. తానున్నదెక్కడో.... అర్థం కావడం లేదు. వున్నట్టుండి తన ప్రభువు - జగదేకవాసుదేవులు కనుపించారు. వారి ప్రక్కన ఆచార్య సాందీపులు, తమ కులగురువులు గర్గులవారు బంధించబడి వున్నారు. తన ప్రభువు అదిలిస్తున్నాడు. వీరు తమ అహంకారానికి తగ్గ ఫలితాన్ని పొందుతున్నారు.

ఆ దృశ్యం.... శైబ్యకెంతో ఆనందం కల్గించింది. మరో ప్రక్కన చితికాలిన వాసన, పేలుతున్న చప్పుడు, ఎట్టని ఆ చితిమంటలలో అందంగా అలంకరించ బడిన సుందరి, ఓ రాజకుమారి, అగ్ని ప్రవేశం చేస్తోంది. ఆమె ఎవరో చూసినట్లుంది. గుర్తుకు రావడం లేదు. ఆమె మంటల్లో పడిపోయింది, గుర్తుకు రావడం లేదు. ఆ.... జ్ఞప్తికొచ్చింది, ఆమె..... ఆమె... కృష్ణుని ప్రేమించిన రాజకుమారి రుక్మిణి. కృష్ణుని మరణవార్తతో అగ్నిప్రవేశం చేసింది. దానిని సహగమనమంటారని, పతిని ప్రేమించిన సతి, చేసుకునే ఆత్మార్పణమని ప్రక్క నుండి ఎవరో చెబుతున్నారు. శైబ్య ఆశ్చర్యంగా వింటుంది.

అందరు కృష్ణుని కోసం విలపిస్తున్నారు. అందరికి కృష్ణుడు కావాలి. ఎందరివాడు.... అంటే... ఈ బృందావనుడు అందరివాడు. ఈ మధురాధిపతి ప్రతి ఒక్కరివాడు. అందనివాడు కాడు. అంది, ఆదుకునేవాడు. అందుకోదగ్గవాడు అడగకనే వరాలిచ్చే ఆపద్బాంధవుడు. తల్చుకోగానే తరింప చేసేవాడు. తనదైన వరద - అభయహస్తాన్ని కోరినవారికి కొండంతగా అందించేవాడు.

శైబ్య ఆశ్చర్యపోయింది. ఇందరివాడిని, నా ఒక్కదాని కసితో, నా పినతండ్రి శ్రీ గాలవ్యుని కోసం అంతమొందించానా ? అని అనుకుంటున్న తరుణంలో "నారాయణ, వాసుదేవా, గోవిందా, శ్రీహరీ పద్మనాభ...!" ఆ స్మరణ విని తల త్రిప్పింది. ఇది దేవకీమాత గొంతుక. ఆమె.... ఆమె మరణించింది కదా, మరి - ఈ - స్వరం - ఆ రూపం... ఆశ్చర్యం కాదు విస్తుపోతుంది. భయపడి పోతుంది. నిగ్రహించుకోలేకపోతుంది. ఈ స్థితి.. స్వయంకృతాపరాధమా ? దీనినధిగ మించేదెలా ? ఆలోచనలు శూన్యం. అంతా అయోమయం.

చూస్తుంది తప్ప కనబడటం లేదు. వింటుంది తప్ప, విషయమర్థం కావడం లేదు. నడుస్తుంది తప్ప గమ్యం తెలియడం లేదు. కదలుతుంది, చలనం లేదు. అడుగులు పడటం లేదు. మాట రావడం లేదు. నోరు తెరవలేకపోతుంది. అంతా మాయ. ఇది ఏం మాయ ? ఇందులోని మర్మం. ఇందునుండి బయటపడటం ఉహూ... ఏమీ అర్థం కావడం లేదు. చేతనంలో అచేతనం. దానికి అజ్ఞానం, అందుకు బుద్ధిమాంద్యం, వునికి అయోమయం. ఉచ్ఛ్వాసా నిశ్వాసలు... అవి అగమ్య గోచరం. ఆ స్థితి - "అస్థితి - దుస్థితి. అంతే అనుభవించాల్సిందే! ఇది ఇక్కడి వారి కర్మం. తన దేశంలో నిరంకుశత్వం. అందులోని కర్కశత్వం. అంతే! తెలియని స్థితికి తెలిసిన మార్గం లేదా గమ్యం.

ఈ "దిక్కు" మాలిన స్థితిలో - నడి సముద్రంలో దొరికిన ఆధారంగా చెవుల కింపైన పిలుపు. అది విన్నది. అది వింటే ఆనందం కల్గుతుంది. దేహం తేలికవుతుంది. నవరంధ్రాలు, అందులోని సూక్ష్మనాళాలు పరవశత్వంతో పులకరిస్తున్నాయి. దీనికి సమాధానం, ఏ శాస్త్రంలోను - ఆధునిక - ప్రాచీన వైజ్ఞానిక రంగాలలో అఖండ దుర్భిణి వేసినా కనబడదు. అంజనం వేసినా అర్థం కాదు.

"భయపడ్డావా ?" మళ్ళీ విందా చల్లని మాట. అందులో లాలన, ఓదార్పు ఒకింత ప్రేమ. చెప్పరాని ఆప్యాయత. అంతవరకు కళ్ళుమూసుకుని ఆలోచిస్తున్నామె ఆ చిరపరచిత కంఠస్వారానికి అటు ఇటు చూసింది. ఆ మనిషికై, వెదకలేని శరీరానికి ఓదార్పుగా ఆమె కళ్ళు వెదుకుతున్నాయి.

అది సంధ్యా సమయం. గోధూళివేళ. అప్పుడు విన్నది, కన్నది, సర్వము సత్యమని, శాస్త్రం చెబుతుంది. తలుపులలోంచి, తలపులను ధిక్కరిస్తున్నట్లు బంగారు సూర్యకిరణాలు రాగరంజింతం చేస్తున్నాయి. ఆ వెలుగులో పీతాంబర ధరుడు, శిఖి పింఛమౌళి, నీలమేఘశ్యాముడు. సర్వజన - ప్రియ - నయనాభి రాముడు, కృష్ణుడు చెరగని, తరగని యధావిధి చిరునవ్వులు చిందిస్తూ - ఎంతో ప్రేమగా శైబ్యను చూస్తున్నాడు. ఆ పలకరింపుకు - సాధారణంగా ఎందరో పరవశించి పులకరిస్తారు. కాని శైబ్య -

ఆ దివ్యసుందరమూర్తిని, ఆనందమూర్తిని, ఆనందప్రదుని ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నచోటు నుండి లేచింది. ముందు కృష్ణుడు, వెనుక శ్వేతకేతూ.... ఇంకా చిత్రంగా వుంది. "భయపడ్డావా ? అన్న కృష్ణుని ప్రశ్నకు సమాధానంగా -

"కృష్ణా!" అప్రయత్నంగా పిలిచింది. ఆ పిలుపులో ఆందోళన వుంది. ప్రశాంతి వుంది. అంతకుమించిన ఆప్యాయత, తెలియకుండగానే తొణికిసలాడింది.

"నేనే, సోదరీ! నీ కృష్ణుని, నీ దుస్థితికి శత్రువును ? మాటలలో మందహాసం, మార్దవం. చూపులలో అనురాగం. మాటలు వింటుంది కానీ, మనసులోని భయం మనిషిని చూడనివ్వడం లేదు. ఇది మాయా, భ్రాంతా ? లేక భ్రమలోని భ్రాంతా... మళ్ళీ తెగని ఆలోచనలు. తెలియని వూహలు, వూసులు.

"నేను.... నేను...! ఏమీ తెలియని పరిస్థితికి గురయింది. "శైబ్యా! నేను కృష్ణుడను. లే. "ప్రేమతో తట్టి లేపుతున్నాడు. అప్పుడు... అప్పుడు బలవంతంగా లేచింది. కళ్ళు తెరచింది. తనేం చేస్తూంది ? తనే స్థితిలో వుంది. తెలియని అచేతన స్థితిలో, నిద్రలో తనను తాను మరచి, అతి భయంకరమైన - ప్రాణాలు తీసే మహాగ్నిజ్వాలల వంటి కలా........ ? మళ్ళీ ఇప్పుడు మూర్ఛపోయినంత పనయింది శైబ్యకు.

"శైబ్యా!" ఎప్పటివలెనే ఎప్పుడు తానందుకొనే, శ్రీకృష్ణుని పిలుపు. "ఏమయింది, నీకు ?" తట్టి, తట్టి, పట్టి లేపుతున్నాడు, కృష్ణుడు. లేవలేని అతి దయనీయమైన స్థితిలో వున్న శైబ్యను "చెల్లెమ్మా!" అని దగ్గరకు తీసుకున్నాడు, ఓదారుస్తున్నాడు. "భయపడకు. నీకేం ప్రమాదం లేదు. రాదు. ప్రశాంతంగా వుండు. తల అటు ఇటు త్రిప్పింది. అందరు తనను చిత్రంగా చూస్తున్నారు. ఎంతసేపట్నుంచి కంటుందో - ఆ"కల". ఎప్పటి నుండి అలాగ పిచ్చిగా ప్రవర్తిస్తూందో ఆ "పిల్ల".

"సుభద్రా...!" ప్రక్కనున్న చెల్లెల్ని దగ్గరకు తీసుకుని, ఆమె ముంగురుల్ని సరిచేస్తూ నుదుట ముద్దుపెట్టుకున్నాడు. "చెల్లాయి నువ్వెప్పుడు...!" అనగానే-

"పో, అన్నయ్యా. నాకంటె పెద్దది. అక్క శైబ్య వుండగా....!" ఆ ప్రేమలకు, అభిమానానికి చలించిపోయిన శైబ్య మెల్లిగా లేచింది.

"గోవిందా! ప్రస్తుతానికి నువ్వు నన్ను ప్రశాంతంగా స్థిమితపడనివ్వు. ఆ తర్వాత నువ్వు, నీ ఆదేశాలు తప్పక.....!

ఆమె పరిస్థితి తనకు తెలిసినా, జరిగిందంతా తన మహామాయా స్వరూపమైనా, ఆమెను సేదతీర్చి ఓదార్చి "చెల్లీ! ఈ అన్న నీవాడు. నీ ఆజ్ఞా పాలితుడు. నీ సుఖసంతోషాలు కోరేవాడు తెలిసిందా ?" అని యధావిధి తన చిరునవ్వు వెన్నెలలు కురిపింప చేసాడు.

# సందిగ్ధత

**అం**తా గమనిస్తూంది, త్రివక్ర. ఆమె అసాధ్యురాలు. అందుకే ఆమె కంస పరివారంలో తనదైన పాత్రను పోషించింది.తన సుగంధ లేపనాలతో ఆ దుర్మార్గుడినే ఒక ఆటపట్టించిన ఘనురాలు, ఈనాడు కృష్ణ భక్తురాలు. శైబ్యకు శిక్షకురాలు కూడా!

అంతా గమనిస్తున్న త్రివక్రకు, మంచితనానికి కూడా కొంత హద్దు వుంటుంది. ఎంతసేపు అవతలివారిని ద్వేషించే అతిథి కాని, ఆదరణమూర్తి, తనకు లభించిన అదృష్టానికి పొంగిపోక, అనుక్షణం కృష్ణద్వేషియై, ప్రతిక్షణం జీవితాన్ని నరకం చేసుకుంటుంది. పెరిగిన వాతావరణమో, పుట్టిన ఆ జన్మ లక్షణమో కాని, సలక్షణంగా, సద్ధర్మ సదాచార సంస్కృతీ సాంప్రదాయమూర్తిగా బ్రతకడం ఏ కోశానా నచ్చటం లేదు. ఎంతసేపు వింతగా పరమ దుర్మార్గుడైన పినతండ్రి శ్రీ గాలవ్యుని తలచుకుని, కృష్ణుడాతనిని వధించాడని కృష్ణుని చంపుతాననే, ఈ మూర్ఖురాలిని ఈ కృష్ణుడెందుకు ఉపేక్షిస్తున్నట్లో.... అర్థం కాని అంతరంగ మథనం.... చిత్రంగా సాగే ఒకనాటి కుబ్జ, ఈనాటి అందాలరాశి అంతర్మథనం.

సరే మనసుపడ్డా, ఉద్ధవుడు మథురలో వున్నా శ్రీకృష్ణ బోధకు శరణాగతుడై, శైబ్యను చూడటమే తప్పు లేదా పాపంగా తలిచాడు. పొరపాటున కళ్ళుపడ్డా, ప్రక్కకు తప్పుకు వెళ్ళిపోయేవాడు. తన పనిలో లగ్నమవుతూండేవాడు. కృష్ణుడు చాలా తెలివైనవాడు, కదా! త్రివక్రతో, మన సోదరుడు మారిపోయాడు!'' మర్మంగా ఆమెకు చెప్పాడు. విన్న త్రివక్రతో కృష్ణుడు అతి త్వరలో సోదరుడు స్వస్థత పొందుతాడు'' అభయసూచకంగా అన్నాడు.

పరిస్థితులన్నీ గమనించే త్రివక్రకు ఉద్ధవుడు ప్రేమలో పడటం, కృష్ణుడు వారించడం, దాంతో దేహబంధనాలన్ని అశాశ్వతమనే రీతిలో వైరాగ్యభావం పొందడం జరిగింది, ఈ మొత్తం త్రివక్ర గ్రహించింది. అందుకు ఉద్ధవుడు, శైబ్యను-కలవడు, తలవడు. చూడడు. మాట్లాడడు. అయినా త్రివక్ర శైబ్య మనస్సు తెలుసుకోవాలనే ప్రయత్నంలో శైబ్యను కలిసి అడిగింది. సమాధానంగా- శైబ్య -

“సరే. ఆ కృష్ణభక్తుడొక జడస్వరూపం. కృష్ణుడు, ఆయన ఆటపాటలలోని ఆనందాన్ని ఆస్వాదించడం తప్ప, ఆ లీలా మాధురిలో కలిసిపోవడం తప్ప,

ఇతర ప్రపంచమక్కర్లేని వింత వ్యక్తి - పోనీ చెడ్డవాడా ? అంటే. కాడు. కరుణ-దయలకు ప్రతిరూపం. పొరపాటున నేను ఎదురుపడినా, నవ్వడు, ఉలకడు-పలకడు. ఈ రోజుల్లో ఇటువంటి వింత స్వామి భక్తి పరాయణుడైన వ్యక్తిని మనం చూడలేము.

"నువ్వు వున్నావుకా ? ఆడదానికి భర్తా, పిల్లలు సంసారమే జీవితమని తెలిసి, అన్ని మరచినట్లు "నా ప్రభువు, నా ప్రభువు'' అని ఎన్నాళ్ళు గడుపుతావు ? నీలాగే ఉద్ధవునికి అన్నగారంటే ప్రాణం. అంతకుమించిన అవతార విశిష్ఠతను గ్రహించిన విమలపురుషుడు - మన ఉద్ధవుడు.'' చెబుతూంది త్రివక్ర.

గాలి మంద, మందంగానో, తీవ్రంగానో.... ఆ వాతావరణ స్థితిగతుల్ని బట్టి వీస్తుంది కాని, ఒకేచోట నిలకడగా వుండలేదు. అలాగే, ఈ విషయం - అదే - శైబ్య ఉద్ధవునిపై - కొద్దిలో కొద్దిగా ఆశను పెంచుకుంటుందన్నది "గాలి వార్త' గా కాక, గాలితో పాటు శ్వేతకేతు చెవులకు అందింది. "నిజం'' నిర్ఘాంత పోయాడు. "అవునా ?'' ఆశ్చర్యపోయాడు. "అదెలాగ ?'' అసాధ్యమన్నట్లయి పోయాడు.

అన్నీ త్యజించుకుని, తెగించుకుని, ఆమె నీలికళ్ళలోని వెలుగును గమనిస్తూ, వెళ్ళినవాడు, అక్కడ అందమైన బలిపశువుగా వున్నాసరే శైబ్య కోసం, ఏ రకమైన బాధలనైనా అనుభవించడానికి సిద్ధపడిన తనను కాదని, ఆ పిల్ల ఉద్ధవుని పెండ్లి చేసుకుంటుందా ? కృష్ణుడు "నా సోదరి'' అని "శైబ్య''నంటే, ఆమె ఉద్ధవునికీ సోదరే. కనుక, ఓ సోదరిని, ఓ సోదరుడు వివాహం చేసుకుంటాడా ? ధర్మ పరిరక్షకుడననే శ్రీకృష్ణుడు సన్నిధానంలో అన్న-చెల్లెళ్ళుకు వివాహం సంభవమా ?'' ఆవేదన, ఆందోళన. ఆడ బుద్ధిపై ఆక్రోసం ఈగల్లా ముసురుతుంటే, నిలకడలేని మనస్సుతో చెప్పలేని విధంగా శ్వేతకేతువు కలవరపడి పోతున్నాడు.

అంతలోనే కృష్ణమాయగా "అవును, ఉద్ధవుడు కనుక శైబ్యను వివాహం చేసుకుంటానంటే, ధర్మపరి రక్షకుడు, సద్ధర్ముడైన కృష్ణుడు అంగీకరిస్తే, అసలు అది ఆక్షేపణీయ మెలాగవుతుంది. తపస్స్వాధ్యాయనిరతం'' అన్న వాక్యానికి తూట్లు పొడిచి, స్త్రీ చిత్త చాంచల్యంతో ధర్మ భ్రష్టత్వ మొంది, కర్మనాశనం చేసుకుని, అపూర్వ, అమోఘ, అత్యున్నత ఆచార్యస్థానం నుండి, కేవలం "చిత్తం ప్రభూ!'' అనే స్థితికి దిగజారాక, ఓజో - తేజస్సులు, ఎటువంటి వారినైనా, విడిచిపెడతాయి.

ఒక్క శ్రీకృష్ణుడి వంటి సద్ధర్ముడు, ధర్మప్రతిష్టాపనాచార్యుడు మాత్రమే, ఈ సర్వ సందియములను పారద్రోలి, సర్వులను సమాహిత చిత్తమూర్తులుగా చేయగలిగేది. కాబట్టి.... నేను.... ఒక నిశ్చయానికి వచ్చేసాడు. దాంతో, ఉద్ధవుని తనతో రమ్మని పిలిచాడు. యమునా నదీ తీర ప్రాంతంలోని ఇసుక తిన్నెలపై కూర్చుని, అంతవరకు చిక్కపెట్టుకున్న మనస్సును, శాంతపరచుకుని, ప్రశాంత మనసుతో -

"సోదరా! నువ్వు మంచిపని చేస్తున్నావు. నీ ఆలోచన ప్రశంసనీయం. ఆచరణకే మేమందరము ఎదురు చూస్తున్నాము. ఇందులో నా సంపూర్ణ సహకార ముంటుంది. ఒక్క విషయం గుర్తుంచుకో. నీకంటే పెద్దవానిగా, నీ శ్రేయోభిలాషిగా, నా సహకారం నీకెప్పుడు వుంటుందని మాత్రం మరచిపోకు...!" అడ్డు ఆపు లేక చెప్పుకుపోతూంటే, వినడానికే ఉక్కిరి బిక్కిరి అవుతున్న ఉద్ధవుడు -

"అన్నా! నువ్వు అనేదేమిటో, నాకొక్క అక్షరం అర్ధం కావడం లేదు. "దయచేసి ప్రాధేయంగా, ప్రార్ధనా పూర్వకంగా అడిగాడు

"మనం శైబ్య కనబడనప్పుడు ఆమె గురించి తెలియనప్పుడు ఎలాగ వున్నామో, అలాగ గతంలో వలెనే ప్రశాంతంగా, అంతే గౌరవంతో ఉండాలి!"

"తప్పకుండా!" అన్నాడు ఉద్ధవుడు.

"కానీ.... శ్వేతకేతు, విషయం నాన్చుతున్నాడు.

"సోదరా! నువ్వు పెద్దవాడివి. మీదుమిక్కిలి మాకు ఉపకులపతిని, నీ మీద మా అందరికి ఎంతో గౌరవం వుంది. కనుక ఇప్పుడు కూడా - ఆ గౌరవం కొనసాగుతుంది. శైబ్య మనకు ప్రతిబంధకం కాదు. ఇందులో మీరేవిధంగాను ఆందోళన పడవద్దు!" ఉద్ధవుడు తేల్చి చెప్పాడు.

ఇక ఆపుకోలేక - "నువ్వు - శైబ్య" వివాహం చేసుకుంటున్నారని విన్నాను.

"ఎవరు చెప్పారా, గాలి వార్తలు ?! క్షణ క్షణానికి మనసు మార్చుకునే తత్వం మనది కాదన్న సత్యం మీకు తెలియనిది కాదు!" ఏ మాత్రం సందేహ పడవలసిన పని లేదని, నిక్కచ్చిగా చెప్పాడు.

"ఓ కులపతీ!" ప్రస్తుతం మనమిరువురము ఒకరికొకరు, మనల్ని మనం త్యాగం చేసుకుంటున్నాము. దీనిని త్యాగమంటారో! మోసమంటారో.... నాకు తెలియదు.

సరిగ్గా ఈ సమయంలో ఆ పరిసరాల్ని మొత్తం అదే బ్రహ్మాండ భాండాన్ని బ్రద్దలు చెయ్యగల ఓ పిడుగు పడింది. అది.... మీరిద్దరు పరమ మూర్ఖులు. తెలివిగల శైబ్య, మీ ఇద్దర్ని ప్రక్కనబెట్టి, వున్నట్టుండి కృష్ణునిపై మక్కువ పుట్టించుకుంది. అతనిని వివాహం చేసుకోవాలని తలుస్తూంది'' అనగానే "ఆ!'' అని ఆమె అవకాశవాద తత్వానికిద్దరూ నోళ్ళు తెరిచారు.

"ఆడవాళ్ళు.... అత్యంతావకాశవాదులు.'' అద్భుతశక్తి సంపన్నులు. వాళ్ళిద్దరు కూడా అనుకోకుండా వుండలేకపోయారు. ఉద్ధవుడు మాత్రం.... "కృష్ణా!... నిగ్రహించుకోలేని ఆవేనదతో, గిలగిలలాడిపోయాడు. ఆ క్షణంలో - సుభద్ర చెంతనున్న కృష్ణుడు -

"చెల్లి! నిన్ను చూస్తే నాకు మహదానందంగా వుంది. నీకోసం మళ్ళీ పుట్టాలని వుంది!'' చెల్లెల్ని తనతొడపై కూర్చోబెట్టుకుని, ఎంతో ప్రేమగా, లాలనగా పలుకరిస్తున్నాడు. ఆ సమయంలో -

"అన్నా....! అని నేననలేను. జగత్ప్రభువు నీవు.నీకు సోదరి నవడము, నీ చేత చెల్లి'' అనిపించుకోడం, నా జన్మ జన్మల పుణ్యము. ఎన్ని జన్మలలో ఎన్ని నోములు చేసానో.... ఈనాడు...!'' ఆనందబాష్పాలతో కృష్ణుని అనురాగానికి, ప్రేమామృతానికి శైబ్య ముకుళిత హస్తాలతో అంకితమైంది.

"తప్పు. నీలో ఈ మార్పు వస్తుందని నాకు తెలుసు. నువ్వు పాపాత్మురాలినని అనక - ఈ కృష్ణసోదరి పాపాత్మురాలు కాదు, పావనమూర్తి-'' కృష్ణుని మాటలకు అడ్డువస్తూ, శ్రీకృష్ణుని "శ్రీ'' చరణాలమీద తన తలను వుంచి -

"పాపోహం, పాపకర్మాణాం....!'' ప్రాయశ్చిత్తము లభించదు. అంతటి పాపాత్మురాలిని. అయినా నువ్వు నన్ను క్షమించావు. ప్రేమతో, తోడబుట్టిన చెల్లెలు "సుభద్రలె నన్ను దగ్గరకు తీసుకున్నావు. అయినా...! కళ్ళనీళ్ళ పర్యంత మౌతుంది. శ్రీకష్ణ చరణాలకు తన కంటినీరు పావనగంగా జలం చేసింది. ఆ పవిత్ర పాదాలను కడిగింది.

"ఇప్పుడు నువ్వు నిజంగా చెప్పు. నువ్వు వివాహం చేసుకునేది ఉద్ధవునా, శ్వేతకేతునా ?''

"ముందు నీ ఇష్ట"మన్న శైబ్య, తక్షణం "వాడిని చంపుతానన్న స్థితి నుండి "ప్రభూ!" అనే స్థితికి వచ్చిన శైబ్య "నువ్వు కరుణిస్తే - రెండు పేర్లు నువ్వు చెప్పావు. మరి నా ఆలోచన కూడా...!"

"చెప్పు చెల్లీ!" అన్నాడు. "అందరి మనసులను చదివి, అందులో స్థిర నివాశముండే, హృన్నియులడవైన, ఆ హృషీకేశుడివి నువ్వు", నా జీవితానికి మంచిదని నిర్ణయిస్తే ఆ ప్రకారం నడుచుకుని, జన్మసార్థకత్వం చేసుకుంటానంది.

"అలాగా, నిర్ణయాలు చెయ్యగల సర్వశక్తిమంతురాలికి, ఈ "గో"పాలుడు, పశువుల కాపరి, చెప్పగలవాడా ? అనేసరికి "అదే వద్దన్నానని బుంగమూతి పెట్టి" ఇప్పుడు నేను నీకు బానిసను. నీ వలన మార్చబడినదానను కనుక. నిన్నే, వివాహం చేసుకుంటే, ఏ గొడవలు వుండవనుకుంటాను!"

"భలే.. మొత్తానికి నువ్వు జాణవే. తిరిగి, తిరిగి నా పీకకు చుట్టి "అన్నా!" అనే నన్ను, అనక ఒకప్పుడు అన్యాయంగా, ఇప్పుడు - అల్లరి పాల్జేస్తున్నావు కదా! పాపం శమించుగాక!" అన్నాడు.

"చూడమ్మా. ఈ కృష్ణుడు భక్తపరాధీనుడు. భక్త జనదాసానుదాసుడు, సేవలు చేసి వారిని తరింప చెయ్యడమే తప్ప, తనకంటూ ప్రత్యేకతను ప్రకటించుకుని, ప్రవర్తించే - పరమ స్వార్థపరుడు కాడు. ఏకోదరులము కాకపోయినా, ఐక్యతా రంగం కల్గిన అభిమానవంతులమే. అందుకే మనం అన్నా-చెల్లెళ్ళమయ్యాం. ఆ విషయాన్నిక్కడికి ముగింపచేసాడు.

"అయితే నేను, నన్ను కోరుకుంటున్నాననే వారిని బలవంతంగా కట్టుకోవాలా ? ఇది నాకు ఆనందమా..?!

"శైబ్య! ఈ కృష్ణుడు బ్రహ్మచారి, సంసారియైన సంగరహితుడు. ఇతనితో ముందు ముందు చాలా ప్రమాదాలు, అయిష్టాలు. నా మాటవిని, నిన్ను మనసారా కోరే, వాళ్ళలో ఎవరినో ఒకర్ని వివాహం చేసుకో. వారిరువురు కూడ ధర్మమూర్తులు, సదాచార సంపన్నులు.

అయితే.... శైబ్య ఏదో చెప్పబోతుంది.

అప్పటికే - దేవకిమాత, త్రివక్ర - కన్నీరు మున్నీరౌతూ గుమ్మంలో నిల్చున్నారు. కృష్ణుని చూస్తూనే తల్లిగా "కృష్ణా! ఇక్కడేం జరుగుతుంది. నీవపర్తన! ఏదో అనబోతుంది.

"చెల్లీ! చెప్పు. నువ్వెవర్ని పెళ్ళి చేసుకుంటున్నావని నేనంటున్నానో అడుగుతున్నానో, ఆ వివరాలన్నీ... చెప్పు!" చెబుతున్నాడు.

కృష్ణుడు "చెల్లీ" అనడం దేవకి మనసును వూరటపరచింది. శైబ్య, కృష్ణుడి మాటలకు ప్రతిస్పందిస్తూ "అమ్మా! ముందు నేను కరవీరపురానికి వెళ్ళి, మా పిన్ని కరుణను పొందాలి. ఆ తర్వాత, ప్రభువు కృష్ణుని ఆదేశం ప్రకారం, ఆచార్యుల వారిని అనుసరించాలి!" విషయం వివరంగా చెప్పడంతో, తేలికైన హృదయంతో దేవకిమాత... "నువ్వు" అనేసరికి "లేదమ్మా!" ఈ కృష్ణుడు, కొంటె కోణంగి, అల్లరి వాడు, అని వీరందరి బాధ" అని ముగించాడు.

# స్త్రీ బుద్ధి

**రు**క్మిణి మనసు అల్లకల్లోలంగా వుంది.

పరిస్థితులన్ని వ్యతిరేకంగా వున్నాయి.

వ్యవహారం ముదిరింది. విషయం వేడెక్కింది. జరుగవలసిన పనులు అవే స్వయంవర ఏర్పాట్లు చకచక జరిగిపోతున్నాయి. తాతగారు కైశికులవారు, తాను అసమర్థుడినని చేతులెత్తేసారు. మహారాజు భీష్మకులు సరేసరి. తన చేతిలో ఏదీలేదని, తన అశక్తతను బాహాటంగా ప్రకటించేసారు.

ఇక మిగిలిందల్లా, రుక్మిణి గుండెల్లో బరువు తగ్గిపోయేటట్లు బావురుమని ఏడవడం ఒక్కటే! రుక్మిణీ కల్యాణానికి, ఆ తదుపరి మగధ దేశాధిపతి జరాసంధ చక్రవర్తి మనుమరాలితో తన వివాహానికి, సర్వ ఏర్పాట్లు భావి సామ్రాట్టుగా రుక్మి చేస్తున్నాడు. ఈ కల్యాణం తనకిష్టం లేదు. అయినా తను మనసిచ్చిన ఆ గోపాలుడు, నందకిశోరుడు, దేవకీసుతుడు, ధర్మపరిరక్షకుడు తప్పక తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాడు. తనను పెండ్లి చేసుకుంటాడు. స్థిర నిశ్చయంతో వుంది. అయినా ఆమె ఆడది, బేల.... ఆమె అనుమానం ఆమెది. పరిస్థితి చెయ్యిజారకూడదు. అదే ఆమె ఆశ, ఆశయం.

మధుర వెళ్ళిన శ్వేతకేతు తిరిగి వచ్చారు కానీ, ఏ విషయం చెప్పలేదు. పరిస్థితులు చక్కబడతాయన్నది రుక్మిణి ఆశ. అప్పుడామెకు మిగిలింది కేవలం

శ్రీకృష్ణ నామస్మరణం - అంతరాంతరముల అభ్యర్థనము మాత్రమే - అందుకే-

**"ఏనీ గుణములు కర్ణేంద్రియంబులు సోక దేహ తాపంబులు దీఱిపోవు**
**నేనీ శుభాకారమీక్షింప గన్నులక ఖిలార్థలాభంబు గలుగుచుండు**
**నేనీ చరణసేవ లే ప్రొద్దుచేసిన భువనోన్న తత్వంబు పొందగలుగు**
**నేనీలసన్నామ మే ప్రొద్దు భక్తితో దడవి బంధసంతతులు వాయు**

**నట్టి నీయందు, నా చిత్తమనవరతము**
**నచ్చియున్నది నీయాన నానలేదు**
**కరుణ జూడుము కంసారి. ఖిలవిదారి**
**శ్రీయుతాకారా! మానీనీ చిత్తచోర!**

అని సంతత ప్రార్థనము మొదలుపెట్టింది. దీనిని తనదైన తెలుగులో భక్త "పర" తత్వమును, పరమ భాగవతోత్తముడైన పోతన, రుక్మిణి కల్యాణ ఘట్టంలో తెల్పిన - రుక్మిణి - మానసతత్వ - సత్య ప్రార్థనా - విశ్లేషణం!

కరవీరపురానికి వెడుతూ, శ్వేతకేతుతో కల్సి, శైబ్య కుండినపురానికి వచ్చింది. ఇక్కడ కొన్నాళ్ళు వుండాలన్నది శైబ్య ఆలోచన. ఆచార్య శ్వేతకేతువుల పేరుతో రుక్మిణి శైబ్యను కలుసుకుంది. ఆ క్షణంలో తక్షణం ఆమెను అభినందించ లేదు సరికదా, నలుపైనా, చూడచక్కని ఆమె అందానికి క్షణకాలం అసూయ పడింది. ఆ తర్వాత పరస్పరాభినందనలు. తదుపరి శైబ్య యువరాణితో మనసు విప్పి మాట్లాడింది. తన దీన స్థితి యావత్తు రుక్మిణీ సముఖంలో వుంచింది.

యువరాణి మీరు చాల తప్పు చేస్తున్నారు. ఇది, సమంజసం కాదు. మీకో విషయం చెబుతాను. పరిస్థితులు ఏ విషయంలోను రాజీపడవు. చూస్తుండగా మనకనుకూలంగా మారిపోవు. అలాగని మనల్ని అవి విడిచిపెట్టినా మనం విడువరాదు. దూరదృష్టి, శుభసంకల్పం వారథిగా, సదాశయంతో ముందుకు సాగితే ఎంతటి అవరోధాన్నైనా అధిగమించవచ్చును. సకల శుభములు పొందవచ్చును.

ఆమె మాటలకు అడ్డుకట్టవేస్తూన్నట్లు "ఓ కరవీర యువరాణి "శైబ్యా!" ఈ విషయాలన్నీ నాకు తెలిసినవే. నెలరోజులలో అన్నీ సర్దుకుంటాయి. స్వయంవరం మొదలవుతుంది. నా "నాథుడు" వస్తాడు. శుభమే జరుగుతుంది. ఎలాగ, ఏమిటీ అన్నది నిదానంగా గమనించు. "తన రాచరిక దర్పాన్ని" రుక్మిణి రమణీయంగా ప్రదర్శించింది. శైబ్య ఆశ్చర్యపోయింది.

"యువరాణీ, మీరనుకున్నట్లు జరగకపోతే.... ఆగింది శైబ్య -

"ఓ కరవీరపుర యువరాణీ, నా నాథుడు రాకపోతే, ఈ రుక్మిణి ఎవరికి బలిపశువు కాదు. బ్రతుకును - ఆ శ్రీకృష్ణ చరణాలకు అంకితమిస్తాను. దేహాన్ని దైవానికి అర్పించి, ఆయనలో లీనమైపోతాను!" అదొక స్థిర నిశ్చయం. దానిని ఎంతో గట్టిగా ఆమె చెప్పింది.

మళ్ళీ - రుక్మిణే, ఆనాడు ఆ పరమపురుషుని దేవాధిదేవతలే కీర్తించారు. ఇంద్రాది దేవతలు వందిమాగధులయ్యారు. కువలయ పీడనం, చాణూర ముష్టిక సంహరణం, కంస వధ ...... సామాన్య విషయాలు కావు. దేవతలే అసమర్థులై శ్రీకృష్ణ చరణారవిందములను ఆశ్రయిస్తే, ఆ పరాత్పరుడు, పుండరీకుడు, దేవతాప్రియుడు, ధర్మ రక్షకుడు, అవతార పురుషుడు అతి సునాయాసంగా, అలసట వారికి కల్పించి, అంతం చేసాడంటే -

**"ధన్యున్ లోకమనోభిరాము గుణ విద్యారూపతారుణ్యసౌ**
**జన్యశ్రీ బలదాన శౌర్య కరుణా సంశోభితున్ నిన్ను నే**
**కన్యల్ గోరరు, కోరదే మును రమాకాంతా లలామంబు. రా**
**జన్యానేకకు సింహ నావలనెనే జన్మించెన్ మోహముల్!**

ఆ జగదేకసుందరుని, పౌరుషాన్ని, ఎంత సుందరంగా, రుక్మిణి చేత చెప్పించాడు కదా, ఆ మహాభక్తుడు, పోతనా భాగవతోత్తముడు!"

కనుక నేను ఆ, "గోపాల - బాలుని తప్ప ఇతరులను వివాహం చేసుకోను. ఇది నిశ్చయమని, రుక్మిణి తెగేసి చెప్పేసింది.

"సంతోషం" కానీ ప్రస్తుతం కృష్ణుడెవరినీ వివాహం చేసుకునే స్థితిలో లేడు."

"అదేం.... నావల్ల...!

"అదేం కాదు... తనపైనే తాను కొంత.... సందిగ్ధంలో వున్నాడు. మిగిలింది కాలం చూసుకుంటుంది." తనకు ఆ విషయం తెలుసున్నట్లు శైబ్య ముగించింది. దాంతో అంతటి ఆరాధకురాలి మనస్సులో అసూయ, అన్యాయంగా చోటు చేసుకుని "ఇంకా, అల్లరిపిల్లవాడిగా, ఆడపిల్లల ఆటపాటలు మర్చిపోలేదను కుంటాను!"

"యువరాణీ, అలాగనకండి. చెడుగా ఆలోచించకండి, నేను కేవలం ఆ ప్రభువుకు దాసీని నన్ను "సోదరీ" అని ఎంతో ప్రేమగా ఆ ప్రభువు పిలుస్తాడు.

మరైతే, ఎందుకు నా ప్రభువు వివాహానికి విముఖంగా వున్నాడు. అక్కసు - కోపం కల్పి - అడిగింది.

"నిజం చెప్పమంటారా యువరాణి ? మీరు నిజంగా యువరాణులు. ఆయన మీరన్నట్లు "గో"పాలకుడు. అటువంటి గోపాలకులు మీ రాజ్యంలో ఎందరో వుంటారు. ఒక గోపాలకుడు, ఒక యువరాణిని వివాహం చేసుకున్నాడంటే అది అధర్మం. ధర్మపక్షపాతియైన కృష్ణుడు, అధర్మానికి సూత్రధారి కాలేడు కదా! కనుక.... అర్థిస్తే, ప్రార్థిస్తే - ఆదరించే ఆ ప్రభువు, ఆదమరచి వున్నాడని అన్యాయం చెయ్యలేడు. ఇది గ్రహిస్తే చాలు!"

మరి ఆచార్యుల వారు నా మనసు విప్పి చెప్పలేదా ?

"ఆచార్యుల వారంటే ధర్మమూర్తి. మీ మనసు చెప్పారు కానీ, మీరు చెయ్యవలసిన విషయం చెప్పలేదు. స్వయంవరానికి వచ్చే అర్హత లేనివాడు, తగునంటూ వచ్చి అల్లరిపాలవడం లేదా, అధర్మమని శిక్షణా కార్యక్రమం చేపట్టడానికి. తగునా ? మీరు  పెద్దలు చెప్పినట్లు చేది దేశ యువరాజునే వివాహం చేసుకుంటారో లేక మీ మనసుకు నచ్చిన "గో"పాలకునే పెండ్లి చేసుకుంటారో ఎవరికి తెలీదు. కనుక, మీ మనస్సును పూర్తిగా విప్పిచెప్పి నన్ను ఈ రాజపట్టిని చేపట్టి, కృష్ణదాసురాలిగా, పుణ్యసేవికగా తీసుకువెళ్ళి గాంధర్వ విధిన వివాహం చేసుకోమని కోరితే, ఆ ప్రభువు తప్పక వస్తాడు. మీ మనోభీష్టం నెరవేరుస్తాడు. అడగక, విషయం చెప్పక, కాదంటే చస్తానంటే.... ఆలోచించండి. శ్వేతకేతువు ధర్మసూక్ష్మం చెబుతాడు.

అప్పుడు -

శైబ్య - "చూడు, యువరాణీ! నేను కరవీరపుర యువరాణినంటున్నారు కానీ, నిజానికి రాజు మా పినతండ్రి. ఎటొచ్చి. ఆ "గిరి"జన ప్రాంతాలలో పుట్టి-పెరిగిన నాకు, జంతు స్వభావమే తప్ప, మానవతా ధర్మాలైన - ప్రేమ, దయ, కరుణలు, సంస్కృతీ సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మచ్చుకు గూడా తెలియవు. "ధర్మ"మంటే మొదట్లో.... మొదట్లో చాలా కోపం వచ్చేది. కానీ రాను, రాను, ప్రేమాభిమానాలు, మమతానురాగాలు తెలిసాయి.

"చెల్లీ" అని పిలచిన, ఆ "అన్న" గాని "అన్న", ఒక తండ్రిని.... వసుదేవుల వారిని, ఒక తల్లిని.... దేవకీ మాతను, ఒక చెల్లెలు... సుభద్రను, అందరికి మించి

ఓ పెద్దన్న... బలదేవులను ఇచ్చాడు. మానవత్వాన్ని ప్రసాదించాడు. ఎంతసేపు కృష్ణుని చంపాలనే, నాలోని పగద్వేషాలను చంపి, ప్రేమ-అనురాగాలను తొణికి పోయేటట్లు నింపిన తత్వ - సత్వ - సత్యమూర్తి "యువరాణీ" - మా అన్న - శ్రీకృష్ణ ప్రభువు. నిన్నటి వరకు అహంకారినై, అనుక్షణం అసహ్యించుకునే నన్ను, క్షణం - క్షణం ప్రేమించిన పుణ్యపురుషుడు తల్లీ, ఆ పరంధాముడు! అంతా సత్యమని, తన జీవితాన్ని - రుక్మిణి ముందు విప్పి చెప్పింది.

"అదృష్టవంతురాలివి!" నిర్మలమైన మనసుతో రుక్మిణి అభినందించింది.

"ఇది అందరికి కల్గుతుంది. ప్రేమించడం చాతయినవారికి, ప్రేమకు - ప్రేమతో పాటు, ద్వేషానికి కూడా ప్రేమను ప్రసాదించగల పుణ్యమూర్తులకు సర్వం సాధ్యం. కృష్ణుడు, మనకు కనుపించే నీలమేఘశ్యాముడు కాడు. బృందావన ఇందీవర శ్యాముడు. ఆ గోవిందుడు, అందరివాడు. "ఎవరి వాడవి" అంటే ఎవరు నేను కావాలంటే వారి "వాడి"ని. కాదన్నా కనికరిస్తాను. కక్ష గట్టినా ప్రేమిస్తాను. ఈ కృష్ణుడికి ప్రేమించడం మాత్రమే తెలుసు. శిశువులు, పశువులు... ఆఖరికి ప్రకృతి కూడా, కృష్ణుని చూసి ఆ రూపానికి మోహించి ఆనందిస్తే, ఆ అడుగులకు మడుగులొత్తుతూ, మెత్తటి హంసతూలికా తల్పాన్ని కల్పిస్తూన్నట్లు భూమాత, తన మెత్తటి చేతులలో ఆ పరంధాముని, పదారవిందములను అనుక్షణం పట్టుకుని పరవశిస్తుంది. ముట్టుకుని మురిసిపోతుంది. ఆ సేవను సదా ప్రసాదించమని స్వార్థ ప్రార్థనం చేస్తూంటూంది.

శైబ్య మాటల్ని విన్న రుక్మిణి ఆశ్చర్యపోతుంది. ఆమె మాటల్ని బట్టి ఎటువంటి శైబ్య ఎలాగ మారిపోయింది, శ్వేతకేతు గూడా ఆశ్చర్యపోయాడు. మళ్ళీ శైబ్యే -

"చూడు, యువరాణీ! నేను యువరాణిని, శ్రీకృష్ణుని భార్యననుకోకుండా, ధర్మసంస్థాపమునకై వెలసిన దేవదేవుని ధర్మపత్నిని, అధర్మనాశనిని అని తెలిసి, అడుగు ముందుకు వేస్తే అధర్మం నశిస్తూంది. ఆ ద్రోహి నశిస్తాడు.

"ఇంతకీ ఎవరా ద్రోహి.... ?" "మీకు తెలుసు రుక్మిణి కుమారి.... ఆలోచించండి." "మా అన్న రుక్మియా...!"

"పిచ్చితల్లి. మీ అన్న రుక్మి. మన దేవుని ముందర, తల ఎత్తలేని, వరద నీటికి కొట్టుకుపోయే గడ్డిపరక. అసలు దురాత్ముడు... ఆ... జరాసంధుడు. అతన్ని తుదముట్టిస్తే... ప్రస్తుతం సామ్రాజ్య విస్తరణ కాంక్షాపరులకు చావుదెబ్బ. కనువిప్పవుతుంది." చెపుతుంది శైబ్య, వింటుంది రుక్మిణి.

"కాబట్టి.... నను చేపట్టి, ఈ రాజపట్టిని, నీ కరంబున గట్టిగ పట్టి - ముద్దుల పట్టిగ మన్నన సేయవే.... అను - ఎలాగంటే -

**"వ్రతముల్ దేవగురు ద్విజన్మబుధసేవల్ దాన ధర్మాదులున్**
**గతజన్మంబుల నీశ్వరున్ హరిజగత్కల్యాణుఁ గాక్షించి, చే**
**సితినేనిన్ వసుదేవనందనుడు నా చిత్తేశుడౌగాక ని**
**ర్జితులై పోదురుగాక సంగరములో జేదీశ ముఖ్యాధముల్.**

అని పరమపురుషుని ప్రార్థించి, ప్రసన్నమూర్తి చేసుకుని హాయిగా మధురకు సాగుమని, కరవీపుర యువరాణి, నిజమైన శ్రీకృష్ణ సోదరిగా సేవా ధర్మాన్ని, సత్యాన్ని తెలిపింది.

""""""""

# ఆహ్వానం

**అ**నుకున్న ప్రకారం, నాల్గురోజులుండి, తన విధిని తాను నిర్వర్తించి, చెప్పవలసినది చెప్పి శైబ్య - కరవీరపురానికి బయలుదేరింది. నిన్నటి వరకు ఎంతో సంతోషం, ఉత్సాహంగా వున్న రుక్మిణి, శైబ్య వెళ్ళిపోవడంతో, మళ్ళీ ఆలోచనలు, పునరా....లోచనలలో పడింది. ఆశావాదానికి వూతంగా, ధర్మానికి రక్షణగా, సదాలోచనలు దారి చేసుకుంటున్నాయి.

కృష్ణుడు రాజు కాడనీ, అతనికి ఆహ్వానమవసరం లేదనే జరాసంధున కాశ్రితునిగా, అన్న రుక్మి ప్రవర్తించడం ఏమంత సబబు ? దొరికిన సావకాశాన్ని త్యజించాడంటే, అతని వీరత్వానికి, క్షేత్ర తేజానికి వందనాలు సమర్పించే బదులు, మనసులో మర్మం పెట్టుకుని, తన పబ్బం గడుపుకోడానికి జరాసంధుడు "చక్రవర్తి"నని హుంకరిస్తూ ప్రదర్శించే బలదర్పాలు అరిచే అరుపులకు, చాతకాని దద్దమ్మలవలె చేతులు మోడ్చినది కాక, కృష్ణుడు, గో"పాలు"డు. "అనాగరికుడు" అనడం, నాగరికతా లక్షణమా ?

ఏమైనా సరే, నా మనసు తెలుసున్నా "గో"పాలకృష్ణునికి నా విన్నప మాలించమని ప్రార్థించాలి. రక్షించి, కరుణించమని కల్యాణమూర్తియై, తన కరకమలాల నలంకరింప చెయ్యమని అర్థించాలి. కృష్ణుని వంటి ధర్మరక్షకుని,

అవతార పురుషుని, ఆ వయస్సులో, ఎంతటి వారలైనా నిగ్రహించి, అవతలి వారిని శాసించే సద్ధర్మపురుషునికి అంకితమైన జన్మే. "జన్మ"మని పలువిధాల మనసులో మాట్లాడుకుంటుంది. తనకు తాను "ప్రశ్న-సమాధానం"గా విషయం సర్ది చెప్పుకుంటుంది.

త్రివక్ర - వంకరలను తొలగించడం, నాగలోకానికి వెళ్ళి, గురుపుత్రుల (సాందీపులవారి కుమారత్నాన్ని)ను తీసుకురాగల్గడం, గరుడజాతి వారి నుద్ధరించి, మహావీరులను చెయ్యడం, నాగరికులం - ప్రతాపవంతులమనుకునే జరాసంధ చక్రవర్తి - మిత్ర, సామంతులను భయభ్రాంతుల్ని చెయ్యడం, ఇంకా చెప్పాలంటే, ఒక్క పిడిగుద్దుతో చచ్చే జరాసంధుని "ఇప్పుడు కాదు అన్నయ్యా. ఇతనికింకా ఆయువు చెల్లలేదని" భవిష్యత్తు దర్శనం గావింప చేస్తున్న పలుకులు, సత్య-ధర్మ శౌర్య-పరాక్రమ నిబద్ధత, విన్నకొద్దీ అనందానుభూతులను ప్రసాదిస్తుందే తప్ప, "గో"పాలుడనే, ఆ "గో"పాలు"డు, పశువులను-శిశువులను సమానంగా అనునయించడం ప్రకృతిని పరవశింప చేయడం, సాధారణ విషయంగాదు - ఎవరికో చెప్పినట్లు చెప్పుకుంటుంది. కృష్ణునిపై తన మనస్సును లగ్నం చేసింది. ఎంతసేపు అలాగ విన్నవి, కన్నవి తలచుకుంటూంటే, లాభం లేదని, తండ్రిగారిని దర్శించాలని బయలుదేరింది.

రాజప్రాసాద పైభాగంలో నిలబడి మహారాజు భీష్మకులు యువరాజు రుక్మి- స్వయంవర ఏర్పాట్లు గురించి సమీక్షించుకుంటే, ఎందుకో క్రిందకు చూసారు. ఆ ప్రసాదం ముందొక రథం ఆగింది. అందులో నుండి రుక్మిణి దిగింది. ఆమెను చూస్తూనే మహారాజు మనస్సు చివుక్కుమంది.

"ఈ తల్లి వచ్చింది. అన్నకు - ఈమెకు పడదు. ఆమె ఏదో చెబుతుంది. యువరాజుకన్న, అన్నగా రెచ్చిపోతాడు. మాటకు "మాట" బదులౌతుంది. ఆ తల్లి దుఃఖిస్తూంది - ఏడుస్తూ తిరిగి వెళ్ళిపోతుంది."

దీనిని తట్టుకోలేని మహారాజు "ఎందుకొచ్చింది ?" అనుకునే కన్నా "ఏం జరగబోతుంది ?" ప్రశ్నించుకుని, జరిగేది చూడటం కన్నా చెయ్యగలిగిందేమీ లేదన్న పరిస్థితికొచ్చాడు. అప్పటికే రుక్మిణి తండ్రిని సమీపించింది. ధీర గంభీరంగా నిల్చున్న రుక్మిణి - "తండ్రీ! నన్ను స్వయంవరం పేరిట అమ్మకానికి పెట్టారా ? ఇది నిర్ణయమేనా ?" అని ఓ ప్రక్కన అన్నగారిని చూస్తూ తండ్రిని సూటిగా అడిగింది.

"అదేవిటమ్మా! ఆడపిల్లవు. నువ్వు రాజకుమారివైనా, నిన్నొక అయ్యచేతిలో పెట్టాలి. "ఎవరు ?" అని బుఱ్ఱలు బ్రద్దలు కొట్టుకునే బదులు "స్వయంవరం." నిర్ణయించాం. అందులో నీకు నచ్చిన వారిని వివాహం చేసుకోవచ్చును. ఇది రాజధర్మం, లోకధర్మం కూడా! అంతేకాని, నిన్నెవ్వరికో బలవంతంగా అర్పిస్తున్నానని తలవకు.

"తండ్రిని, నా పిల్లల మనోవృత్తులు నాకు తెలియవా ? లోకమర్యాద. ధర్మాన్ననుసరించే కార్యక్రమమే తప్ప....

"తండ్రీ! మీరు చెప్పే మాటలు సత్యమే కానీ. ఈ స్వయంవర నిర్ణయం ప్రకటించే ముందు నన్నొకసారి అడిగారా ? నా మనసు తెలుసుకున్నారా ?

"అమ్మా! ఆడపిల్లవు. ప్రపంచం తెలియని చిన్నపిల్లవు. ఎన్నో ఆశలు, ఆలోచనలు వుంటాయి. అవన్నీ కార్యరూపం ధరించాలంటే, సాధ్యమేనా ? అందుకే అందరం కలిసి, ఈ నిర్ణయం తీసుకున్నాం...!" తన అసమర్థతను కప్పి పుచ్చుకుంటూ మెల్లిగా చెప్పాడు.

రుక్మిణి ఏదో చెప్పబోతుంది. అంతలో రుక్మి కల్పించుకుని "ఆడవాళ్లను అంతఃపురం దాటి పయనింప చెయ్యడం, స్వతంత్రమివ్వడం మేము చేసిన తప్పు పని. ఎవరు ఎక్కడ వుండాలో, అక్కడ వుంటే, అందరికి మంచిది. మన, మన రాజ్య పరువు - ప్రతిష్ఠలు నిలబడతాయి!" అని తండ్రివైపు తిరిగి -

"తండ్రీ! దీని మాటలు మన కనవసరం. ఈమెనిక్కడ నుండి వెళ్ళమనండి."

"అవునవును. మేథావివి, కదూ! నీ అతి తెలివితేటలతో, తోటి రాజులను, తండ్రిని, ఆ జరాసంధుడు చెప్పినట్లల్లా ఆడుతూ, నీ చేతుల్లోకి తీసుకోవాలని చూస్తున్నావు. స్వతంత్ర జీవనం, వ్యక్తిత్వ వికాసం - ఎంతో శ్రేష్ఠమైనది. నన్నొకరికి కట్టబెట్టి, నువ్వొకరికి దాసుడవయ్యి, ఆతని దయా ధర్మ భిక్షతో బ్రతకాలను కుంటూ, మీ ఆలోచనలు, ఆశయాలను మహారాజు గారిపై రుద్ది, నీ ఏకత్వాన్ని ఐక్యతారాగంగా ప్రకటించడం... ఆహా... బహుధా... ప్రశంసనీయం. ఇందుకు కాదనలేని మహారాజు "సై" అంటూ వంత పాడటం, "శహబాష్" ఎవరికైనా చెబితే, వారు బుద్ధిమంతులైతే ఫక్కున నవ్వుతారు. బుద్ధిహీనులైతే, "మహాప్రభో! శరణు, శరణు" అని వందిమాగధ స్తోత్రాలతో, మిమ్మొకాదు, ఆ మాగధుని, చాకచక్యానికి, తెలివితేటలకు, బహుపరాకులతో ప్రస్తుతిస్తారు."

రుక్మిణి మాటలను మహారాజు విస్తుపోయి వింటున్నాడు. మా రుక్మిణీయేనా మాట్లాడేది ? అని చిత్రంగా చూస్తున్నాడు. ఏం చెయ్యాలో తెలియక ప్రక్కకు తప్పుకున్నాడు. మహారాజు స్థితికి రుక్మి మండిపడుతూ "దయచేసి ఆగుతారా ?" మహారాజుకు - మహారాజుగా ఆ యువరాజు గద్దించినట్లు అడిగాడు. ఆ వెంటనే -

"వింటున్నారా..... ?" రుక్మిణి అడిగింది. మరల అన్నగారి హావభావాల ననుకరిస్తు కథ ప్రారంభించింది. ఆ స్థితిని సహించలేని రుక్మి" ఏవిటే నువ్వు చెప్పేది. మర్యాదగా అంతఃపురానికి వెళ్ళు. కాదంటే బలవంతంగా, తీసుకువెళ్ళి చెల్లెలివని కూడా చూడకుండా గృహనిర్బంధం చేయించాల్సి వుంటుంది. తండ్రి ముందరాకొడుకు, తెగ రెచ్చిపోతున్నాడు.

అయినా ఆడదానివి, నిన్నడిగి వర నిర్ణయం చెయ్యాల్సిన దుస్థితి ఇంకా ఏర్పడలేదు. వెళ్ళు. వెళ్ళి అంతఃపురంలో మౌనంగా వుండు, కాదంటే, కనికర మెరుగని ఈ అన్న తప్పక తను పట్టు సాధించుకుంటాడు" తెగేసి చెప్పాడు. రాజు మౌనం వహించాడు. రుక్మిణి నిర్ఘాంతపోయింది. "తండ్రీ!" అతి చిన్నగా అనగలిగింది -

కాని మహారాజుగా కాక, తండ్రిగా రుక్మిణి, అన్నగార్ని అనుకరుణ బాగా నచ్చినట్లు "చాలా బాగుందమ్మా! అన్నయ్యను భలే అనుకరిస్తున్నావు. చెప్పు. చెప్పు" మురిసిపోతున్నట్లు కూతుర్ని అడిగాడు. "తండ్రీ!" తన చెప్పుచేతల నుండి తండ్రి - చెల్లెలివైపు వెళ్ళకుండా చూపులతో గద్దించాడు. "ఇది. తగదు!" చెప్పాడు.

"ఏయ్. బుర్రలేని, బుద్ధిలేని చెల్లెలా, ఇప్పుడు కాదు. రేపు, ఎదిరించినవారిని నేను - జరాసంధ, మగధ మిత్రుల, సామంతులతో పాటు, శిశుపాల, సాల్వ, విందాను విందులు చేది సైన్యాలతో విజృంభించి, లొంగదీసుకుంటుంటే... హు... మూర్ఖురాలా! అప్పుడు... అప్పుడు... ఈ రుక్మి ప్రతాపం, విదర్భరాజు విక్రమం నీ కర్థమౌతాయి. "గుండె చరుచుకుంటూ అచ్చు రుక్మిలాగ, రుక్మిణి చెబుతూంటే, భీష్మకుడు "భలే, భలే" ఆపుకోలేని ఆనందంతో విరగబడి నవ్వాడు.

ఆ పగలబడి నవ్వే తండ్రి నవ్వు, రుక్మికి నషాళానికి అంటింది. అతను నోరు పెగల్చుకునే లోగా "నేను రుక్మిని, భావి సమ్రాట్టును. నన్ను నిలువరించగల వారీ రాజ్యంలో ఒక్కరు... ఒక్కరంటే ఒక్కరు లేరు. ఒక మహారాజు అయి వుండి, మూర్ఖునివలె, కృష్ణునికి వంతపాడిన ఆ దమఘోషుడు - ఇప్పుడు అప్రయోజకుడు. ఇంకా చెప్పాలంటే అసమర్థుడు. నేను చతురంగబలాలతో

మథురపై దండెత్తి ఆ కృష్ణుని తల నరికే రోజు, చెల్లీ.... ఆనాడు, ఈనాడు నా ప్రతాపానికి ప్రతి ఒక్కరు ప్రతిస్పందించాలి. జయ జయ ధ్వనులతో నిత్య నీరాజనాలందించాలి. తెలిసిందా ?

ఒక ప్రక్క వుడికిపోతున్నాడు. మరొకప్రక్క తన మనసును చదివే చెల్లెలి అసమాన్య సామర్థ్యానికి ఆశ్చర్యపోతున్నాడు. ఎందుకంటే, ఆమె చెప్పినదంతా నిజమే. అందుకు - ఈ ఉక్రోషం.... దాంతో... "నిన్ను..." అంటూ రుక్మి లేచాడు. మర్యాదగా తాను లేచి, అన్నగారిని అనుకరిస్తూ "నన్నెవరు నిరోధించలేరు. ఈ తండ్రి ఈ క్షణంతో తన పదవి పగ్గాలు విడుచుకుని తాతగారి ప్రక్క, పెద్దమనిషి వలె కూర్చుండబోతున్నాడు. నేను రాజసూయం చేస్తాను.....!" అతని భావాల నన్నింటిని, అతనివలెనే అనుకరించి, మరీ ఆమె చెబుతుంది.

"ఇక. చాలు.... ఆపు!" గట్టిగా అరిచాడు. సమాధానంగా "అన్నయ్యా! ఇప్పుడే కదా, ఈ చెల్లెలి ప్రతిభను గుర్తించేది. ఆ తర్వాత కుదరదే" దెప్పి పొడుస్తున్నట్లుంది.

"విను...!" అన్న రుక్మిణి కాస్తంత సర్దుకుని "తండ్రీ! పరిస్థితులన్నీ నీకు తెలుసో, తెలియదో నాకు తెలియదు. వర్తమానం దుర్భరం. భవిష్యత్తు శూన్యం. జరాసంధుని మాయలోపడకు. స్వతంత్ర రాజ్యాన్ని తాకట్టు పెట్టక. తలవంపులు తెచ్చుకోక!" అభ్యర్థిస్తుంది.

"అమ్మా! ఇప్పుడంతా జరిగిపోయింది. స్వయంవరం వేళ నిర్ణయమయింది. అతి త్వరలో స్వయంవరంలో పాల్గొనడానికి, రాజులు, వారి వారసులు వస్తారు. ఇది ఆపలేము.

"నిజం, ఆపలేరు. కానీ, నా మనోవిరుద్ధంగా కాక, నాకు నచ్చిన వ్యక్తిని వరించే సావకాశమివ్వండి. చాలు. అంతేకాని, పేరుకు స్వయంవరం. కానీ, వర నిర్ణయం చేసాము. మాలాధారణ చెయ్యమనడం మాత్రం సబబు కాదు!" తన మనసు చెప్పేసింది.

"ఆ వసుదేవ సుతుని, కృష్ణుని ఏ అర్హతతో ఇక్కడకు ఆహ్వానించమంటావు! ఆతడు రాజుకాడు. వారసుడు కాడు. కేవలం "గో"పాలకుడు!

"నాన్నా! వీరులమని విర్రవీగేవారెవరు చెయ్యలేని మహత్కార్యాలు చేసిన మహా మహిమాన్వితుని, "గో"పాలుడు అని తిరస్కరించడం, హీనబుద్ధితో చూడటం తగదు!"

"సరే, నేను బ్రతికుంటే కదా, ఈ స్వయంవరం, సంరంభం. స్వయంవర మంటపంలో, చేతిలో ఇప్పపువ్వు దండంతో, నా ప్రభువును తలచుకుని వూపిరి, విడిస్తే, కథ సుఖాంతమౌతుంది. ఎవ్వరికి ఏ గొడవ వుండదు!" స్థిరంగా - తన దృఢ నిశ్చయాన్ని చెప్పింది.

"అమ్మా! అటువంటి మాటలనకు. శిశుపాలుని కాదంటే, మరొక రాజునో, రాజకుమారునో, తప్పక వివాహం చేసుకోవాలి. ఇది జరాసంధ చక్రవర్తి నిర్ణయం." ఆమె కళ్ళలోకి చూడలేక" నా నిర్ణయం కూడా! ఎంతో మెల్లిగా అన్నాడు.

ఆనాడు రాజ్యాధికారం సంప్రాప్తింపచేసిన జరాసంధ చక్రవర్తి మేలును మరువలేను. కృతఘ్నుడినై బ్రతుకలేను. కనుక ఈ వివాహం జరుగక తప్పదు. తప్పదు. ఇందులో ఏ మాత్రం తేడా వచ్చినా, ఈ "విదర్భ" రాజ్యంగా కాక, స్మశానంగా మారిపోతుంది" చివరిగా తన అభిప్రాయం, మహారాజు సూటిగా చెప్పేసాడు.

# కల్యాణ కాంతులు

**ఆ**నాడు, మాఘశుద్ధ పంచమి, వాతావరణం ఆహ్లాదకరంగా వుండే సమయంలో, సాధారణంగా - వివాహాలు, ఆ వేడుక ఏర్పాట్లు, స్వయంవరాలు జరుగుతుంటాయి. ఇది లోక సహజం. ఆనాడు రుక్మిణికి కల్యాణం.

ఇపుడు - పుష్యమాసాంతం. ఆహ్వానాలందుకున్న వివిధ దేశాల రాజులు, వారి ప్రతినిధులుగా రాజకుమారులు స్వయంవర సమ్మేళానికి, తమ తమ తాహతుకు తగ్గట్లుగా, అట్టహాసంగా, ఆడంబర - విలాసాలతో మీసాలు దువ్వుకుంటూ ఒక్కొక్కరే విదర్భ రాజధానియైన కుండినపురానికి వస్తున్నారు.

సమ్మేళననానికి తగ్గట్లు వచ్చే వీరాధివీరులకు, రాజ్య - రాజ - ప్రతినిధులకు ఏర్పాట్లున్నింటిని మహారాజు భీష్మకులవారు జాగ్రత్తగా పర్యవేక్షింప చేస్తున్నారు. ఎక్కడా ఏ లోటూ లేకుండా, రాకుండా చూస్తున్నారు. సమావేశ మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాడు చేయబడ్డ స్వయంవర మండపం. నయనానందకరంగా అలంకరించబడింది. అది ప్రత్యక్షంగా, వళ్ళంతా కన్నులు చేసుకుని చూడవలసినదే తప్ప - వర్ణించ శక్యము గాదు.

శుభ సంకల్పానికి, సంకేతంగా మంగళవాయిద్యాలు మార్మోగుతున్నాయి. ఈ కార్యక్రమం మొత్తానికి విశిష్ట వ్యక్తి - ప్రత్యేక ఆహ్వానితుడు - మగధ దేశాధీశుడైన జరాసంధ చక్రవర్తి. వారు వారి బృందంతో వస్తున్నారు. ఆ చక్రవర్తికి విడిదికి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఛేది దేశాధీశులు దమఘోషుడు, తమ యువరాజు శిశుపాలునితో కలిసి వచ్చారు. శిశుపాలుడు కాబోయే వరుడు కాబట్టి, వారికివ్వవలసిన ప్రత్యేక పద్ధతిలో మర్యాదలు ఘనంగా జరుపుతున్నారు. సాల్వుడు, తన వద్ద గల “అతిరథ-మహారథు”లను వీరాధివీరులతో విచ్చేసాడు. ఈ సాల్వుడు జరాసంధునికి సామంతరాజు - మీదు మిక్కిలి అత్యంత విశ్వాసపాత్రుడు.

దంతవక్త్రుడు, విందానువిందులు, ఒక్కరేమిటి..... జరాసంధుని ఆజ్ఞాను వర్తులై మెలగు ప్రతి ఒక్కరు సాక్షులుగానే వచ్చారు. మర్యాద కోసం తమతో కొద్దిపాటి సైనిక శక్తితో వచ్చారే తప్ప, స్వయంవర విషయంలో వారెవ్వరికి ప్రత్యేక ఆలోచన లేదు. జరాసంధ చక్రవర్తి - అజ్ఞే వారికి శిరోధార్యము. అందుకు విరుద్ధంగా ప్రవర్తించే శక్తి అక్కడికి విచ్చేసిన వారికెవ్వరికి లేదు.

మహారాజు భీష్మకులు, నామ మాత్ర పాత్రధారి. అంతటికి నిర్ణయాధికారి అటు జరాసంధులు, ఇటు రుక్మి. అన్నీ బాగున్నాయి. ఇందుకు తగ్గట్లు రుక్మిణి కూడా సహకరిస్తే, విదర్భ యువరాజు, చక్రవర్తి ఇంటి అల్లుడు. చెప్పుకోదగ్గ చారిత్రాత్మక వ్యక్తి అవుతాడు. కానీ, ఆ రుక్మిణియే, రుక్మికి కంటిలో నలుసు, చెప్పులో రాయి. చెవిలో జోరీగ అయింది.

శిశుపాలుని వరించడానికి ఎదిరించిన రుక్మిణిని కొంత కాలం గృహ నిర్బంధంలో వుంచారు. దాంతో ఆమె నిరశన వ్రతం ప్రారంభించింది. పాపం.... తల్లిదండ్రులు..... పోనీలే.... అనుకుంటే ప్రతి విషయంలో “ఇది - నా పెళ్ళి, నా ఇష్టమంటూ” జోక్యం చేసుకోవడం, తనను అపహాస్యం పాల్జేస్తు అనుకరించడం భరించలేని పరిస్థితిని కల్పిస్తూంది. ఆమెను అనునయించడం తనదారికి తెచ్చుకోవడం, ఎలాగ ప్రయత్నించినా కుదరటం లేదు. ఇదే అతనికి తలనొప్పయి కూర్చుంది.

ఇదే సమయంలో, రుక్మికి మరో బెడద ఏర్పడింది. మథుర నుండి వచ్చిన వేగులు కొన్నిరోజుల క్రితం వసుదేవుని దాయాదుల పుత్రులలో ఒకరిని యువరాజు చెయ్యాలని తలుస్తున్నట్లు తెలుస్తుంది. అదే కనుక నిజమైతే, వాళ్ళు

స్వయంవరానికి వస్తారు. వాళ్ళు బృహద్బలుని మీదే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, బృహద్బలుడు ఎందుకో యువరాజ పీఠమొద్దన్నాడట. మొదట్లో యాదవ ప్రముఖులు, మథుర నుండి రావచ్చనుకున్నారు. కానీ -

ఈ స్వయంవర సమ్మేళనం పూర్తవుతుందో లేదో అక్కడ వసంతోత్సవాలు. వీటి నిర్వహణలో, తనదైన ప్రత్యేక శ్రద్ధతో, ఏర్పాట్లను సమీక్షిస్తూ, తగు ఆదేశాలనిస్తూ, కృష్ణుడు తల మున్కలై వున్నాడుట. కనుక ఆ గోపాలుడు- ఇక్కడికి రాడు. "హమ్మయ్య!" ఆ వార్త రుక్మికి వూరట.

ఇది ఇలాగ వుంటుండగా మాఘ శుద్ధ పాడ్యమినాడు ఎవరో మహారాజు తన సైన్యంతో, స్వయంవరంలో పాల్గొనడానికి, కుండినీపురం వస్తున్నారని తెలిసింది. కాని, ఆ వచ్చే వారెవరో తెలియదు. రావాలనుకున్నవారు వచ్చారు. రాలేని వారు బహుమతులను పంపారు. అలాగ బహుమతులు పంపిన ప్రముఖులలో హస్తినాపుర చక్రవర్తి ధృతరాష్ట్రులు, పాంచాలాధీశుడు ద్రుపదుడు వున్నారు. ఇంకా ఎవరు వస్తున్నారు ? ఆ వచ్చేవారు, ప్రతి ఒక్కరిలో నలుగుతున్న సందేహం, సమస్య - వెరసి అర్థం కానంత అమోఘమైన ప్రశ్న.

ఆనాడు, ఆచార్య శ్వేతకేతుల వారు యధావిధి తమ ప్రాతఃకాల అనుష్ఠాన కార్యక్రమాలను పూర్తి చేసుకున్నారు. ఆశ్రమంలోని వేదపాఠశాలలోకి అడుగు పెట్టారు. వారిని చూస్తూనే "ఓం శ్రీ గురుభ్యో నమః" అని విద్యార్థులు సాష్టాంగ నమస్కారం చేసారు. నిత్యం జరిపే హోమాలు, అగ్నిసూక్తాల, వేదమంత్రాలు, వైశ్వదేవమాదులు జరిపిన అనంతరం, సాంప్రదాయబద్ధంగా - ఆచార్యులు తన శిష్యులను చేయెత్తి ఆశీర్వదించారు.

"కుమారులారా! సంవత్సరం నుండి మనమంతా కలిసి మెలిసి వున్నాం. ఈ గురుకులాన్ని పావనచరిత్రిగా చేస్తున్నాం. మీరందరు సుశిక్షితులైనారు. ఎక్కువ భాగం ఇటు శాస్త్రాలలోను, అటు శస్త్రాస్త్రాలలోను పాండిత్యం పొందారు. ఇకపైన మీరు జాగ్రత్తగా ఆశ్రమాన్ని నిర్వహించండి." క్షణమాగి అందర్నీ ఒకసారి చూసిన శ్వేతకేతువులు "ఎలాగ మనం కలిసామో, అలాగే విడిపోయే సమయమొచ్చింది. కాబట్టి మనది వియోగమనుకోకుండా, విద్యుక్త ధర్మ నిర్వహణంలో అత్యంత జాగ్రత్త వహించండి. ఇదే నేను మీ నుండి ఆచార్యులుగా కోరే దక్షిణ అని. "ఇక మన మహారాజులు. శాశ్వత కీర్తి గల సద్ధర్ములు. సదాశయ,

సదాచార సంపన్నులు'' కాబట్టి ఆశ్రమ నిర్వహణంలో, చతుర్విధ పురుషార్థాల సాధనలో మీకు ఏ విధమైన ఇబ్బందులు కలుగవని ఆకాంక్షించారు.

"చూడండి. నాకు కోట నుండి పిలుపు వచ్చింది. వెళ్ళక తప్పదు. ధర్మ పరిరక్షణంలో అత్యంత శ్రేష్ఠులైన మహర్షి పరశురాముల వారిని, శ్రేష్ఠాచార్యులు గురు సాందీపులవారిని, అనుక్షణం స్మరించుకోండి. వారి ధర్మ తత్పరత అనుక్షణం కాపాడుతుంది. ధర్మభ్రష్టునికి, దారి దొరకదన్న సత్యం మాత్రం మరువకండి!'' అని క్లుప్తంగా చెప్పవలసింది చెప్పి, తమ ఆశీస్సులను ఆచార్య శ్వేతకేతులు అందించారు.

శిష్యులు దిగ్భ్రాంతి చెందారు. వలవల ఏడుస్తూ "గురుదేవా, మీరు మమ్మల్ని విడువకండి. మేము మీతో వస్తాం!'' "భోరుమని విలపిస్తున్నారు.'' తప్పు నాయనా తప్పు. తల్లిదండ్రుల అనుమతి ముందు కావాలి. ఏ అనుమతి అవసరం లేని ఈ అప్లావుడు, జహ్ను నాతో రావాలనుకుంటే రావచ్చును. కాని మీకు తగదు. ధర్మమొప్పదు. "నన్ను వెళ్ళనివ్వండి. అంతా దైవలీల.'' ఎన్నో మహత్కార్యాలు జరగాలి. జరుగుతాయని'' ఆశిస్తున్నానంటారు.

★ ★ ★ ★

ఆచార్య శ్వేతకేతుల వారు వస్తున్నారనేసరికి ఆంతరంగిక మందిరంలో సమావేశమైన చక్రవర్తి జరాసంధుడు తప్ప, మహారాజు భీష్మకుడు, చేది దేశాధిపతి దమఘోషుడు, సాంప్రదాయబద్ధంగా లేచి నిల్చుని, అంజలి ఘటించారు. శ్వేతకేతు వారినందర్నీ ఆశీర్వదించి, తమ కొసగిన ఉచితాసనముపై కూర్చున్నారు.

"ఆచార్యా ? తమ రాకలోని ఆంతర్యం!'' భీష్మకుడు అడిగాడు.

"నేనీ ప్రాంతాన్ని విడిచి వెళ్ళాలనుకుంటున్నాను. అందుకు ఒక్కసారి మీకు విషయం చెప్పి మిమ్మల్ని ఆశీర్వదించి వెళ్ళాలని వచ్చాను!'' ముభావంగా చెప్పాడు.

"ఈ సమయంలోనా ? మీరు మమ్ము విడిచి వెడుతున్నారా ? ఎక్కడికో తెలుసుకోవచ్చునా ?'' ఆశ్చర్యంగా అడిగాడు.

ఒక్కక్షణం కళ్ళు మూసుకుని ప్రస్తుతానికి కుండినపురం విడువాలని తలంచాను. ఎక్కడికన్నది - ఆ దైవేచ్ఛ. దేవుడు నన్నిక్కడ వుండవద్దంటున్నాడు. కారణం చెప్పలేదు. వెళ్ళిపోమనే ఆదేశం వేగిరపరుస్తుంది. ఆశ్రమంతోపాటు,

దాని అధీనంలోని సర్వసంపదలను, కోట రక్షణాధికారికి అప్పగించాను. ఇక మాకు శెలవు!'' అన్నారు.

“గురుదేవా! మావలన మీకు అమర్యాద జరిగిందా ? మేము కాని, మా ప్రజలు కాని, తెలిసో - తెలియక తమ ఎడ దుర్మార్గంగా, లేదా దురుసుగా ప్రవర్తించామా ?'' బాధపడుతూ భీష్మకుడు అడుగుతున్నాడు.

“మహారాజా! మీ నుండి మాకు ఏ విధమైన ఇబ్బంది, అమర్యాద కలుగలేదు. ఎందుకో భగవంతుడే ఇక్కడనుండి త్వర, త్వరగా బయటపడమని, ఆత్మ సందేశమిస్తున్నాడు. అందుకు వెళ్ళక తప్పదు.

“పోనీ! ఈ స్వయంవర శుభకార్యం జరిగే వరకైనా, తామిక్కడ, మా గురుదేవులుగా వుంటే బాగుంటుందన్నది, మా అభిప్రాయం, కోరిక. మన్నించ ప్రార్థన..''

“మహారాజా! మాకు వుండాలనే వుంది. కానీ, ఆ భగవంతుడు, తక్షణం బయలుదేరమంటే, అశక్తుడినైన మానవుడిని, ఆజ్ఞాబద్ధుడను. తప్పదు. తప్పక బయలుదేరాలి'' అంటూన్న శ్వేతకేతుల వారి మాటకడ్డు వస్తూ -

“క్షమించండి. ఆచార్యా! మన మహారాజు కోరినట్లు తామీ స్వయంవర కార్యక్రమం పూర్తయ్యాక, వెళ్ళవచ్చును, కదా! ఇదీ మా కోరికే ననుకోండి.'' చక్రవర్తి, కోరికగా కోరాడు.

“మన్నించండి చక్రవర్తీ. మానవుడు దైవాధీనుడు. వాడు పల్కిన తరువాత, ఒక్కక్షణం మనం వాని ఆజ్ఞను కాదన్నా, జీవి మనలేడు. జీవితం కనరాదు. అందుకే - అన్నీ తెలిసిన దమఘోషుడు, “ఆచార్యా! అనగా - “రాజా! ఇందరు ఇన్నిసార్లు మాకు చెప్పాల్సిన పనిలేదు. మానవమాత్రులమైన మనం, దైవాన్ని ధిక్కరించి మనగలమా ?'' చెప్పండి ? ఆచార్యులు ఎదురు ప్రశ్న వెయ్యడంతో “చిత్త'' మన్నాడు. తలవంచుకునే, ఛేది దేశాధిపతి.

మళ్ళీ శ్వేతకేతుల వారు “మహారాజా, దమఘోషా! నా గురించి మీకు బాగా తెలుసు. కరవీరపురము నుండి బయలుదేరుతుంటే, ఎక్కడ ధర్మము సుప్రతిష్ఠమై వుంటుందో, అక్కడ నేను తప్పక వుంటాను. అధర్మానికి పట్టం కట్టను. అన్యాయానికి తలవంచను. ఆచార్యునిగా ఇది మా ప్రతిజ్ఞ. ఇందుకోసమే, మేము సర్వసుఖాలను త్యజించి, పూరవతల ఆశ్రమాలు నిర్మించుకునేది. అడవులలో తిరిగేది.

ఇప్పుడు.... ఈ మాటలలో... ఏదో శ్లేష.. కనబడుతుంది దాంతో...

భీష్మకుడు, జరాసంధుడు కొంత తడబడ్డారు. కాస్త తేరుకుని ఇప్పుడు.... ఇప్పుడు... ధర్మానికి వచ్చిన హాని మేము తెలుసుకోవచ్చునా ? నిజంగా, అధర్మము అన్యాయం జరిగి వుంటే, ఆచార్యులుగా, మీరు దానిని సరిచేయవచ్చును కదా!" నిలదీసినట్లు జరాసంధుడడిగాడు.

"ప్రస్తుతం ఇక్కడ నా అవసరం లేదు. నా ధర్మం నేను నిర్వర్తించాను. కనుక, ఇక్కడనుండి వెళ్ళిపోవాలని తలచాను. ఇక స్వయంవరాలు, సంప్రదింపులు, సమాలోచనలతో, మా ప్రమేయమనవసరం. ఎక్కడున్నా సరే, మేము, మహారాజు, మమ్మి సం॥ర కాలం గౌరవ మర్యాదలతో చూసినందుకు, వారి ఆతిథ్యం స్వీకరించినందులకు "సర్వేజనాః స్సుఖినో భవన్తు" అని మనస్ఫూర్తిగా అభినందిస్తాం.

"అలాగ కాదు. మా మాట మన్నించి, అన్నిటా మాకు గౌరవ ప్రతిష్ఠలు సంపాదించిపెట్టిన మీరు, చూస్తుండగా వెళ్ళిపోతాననడం, ఎంతో బాధగా వుంది. మాకోసం మీ నియమాన్ని మార్చుకోలేరా ?" వారి సముఖం ఇక్కడవసరమన్నట్లు భీష్మకుడు ప్రార్థిస్తున్నాడు.

"నియమం" శాసనం వంటిది. నిబంధన చట్టం వంటిది. ఈ రెండు పరస్పర సంబంధీకులు. వీరిని కాదనడమంటే... అని, అక్కడున్న ముగ్గుర్ని చూస్తాడు. ముఖ్యంగా జరాసంధుల వారిని చూస్తూ, మహారాజు నుద్దేశించి -

"అవును మహారాజా! ఇప్పుడు మీరీ స్వయంవరం సంబరాన్ని ఆపమంటే ఆపుతారా ?" అని మెల్లిగా అడిగాడు. భీష్మకుల బదులు, జరాసంధుడు గుఱ్ఱుమని చూస్తు "దీనికి, మీకు ఏవిటి సంబంధం ?" అంటాడు.

"చెబుతాను. మీరు అనుమతించాలి. చక్రవర్తులు కదా, ఆగ్రహించకుండా వుండాలి ?" "నేనెందుకాగ్రహిస్తాను. నేను కేవలం ఒక అతిథిని మాత్రమే" నంటాడు జరాసంధుడు.

"అయితే ఫర్వాలేదు. కాని లోకంలో నేను విన్న ప్రకారమైతే, మీకయిష్టమైన వాటిని వినరని, అంటువంటి వ్యక్తులను క్షమించరని, తెలిసి, అడిగాను తప్ప, మీరంటే గౌరవం లేక కాదు. అధర్మం నెత్తిన మోస్తున్నారని అనను...!" అని అంటూనే, ఆచార్యులు -

"ఇంతవరకు, నేను ఎప్పుడూ - ఎక్కడ అనవసర విషయాలలో తల దూర్చలేదు. అధర్మం వినడం కాని, అన్యాయం చెయ్యడం కాని - కనలేదు, వినలేదు, చెయ్యలేదు. నా దృష్టిలో ప్రస్తుత స్వయంవర కార్యక్రమం నచ్చలేదు. అందుకే దీనిపై భాష్యాలు, మీమాంసలు వ్యక్తబరుచలేదు, ఇది "తప్పు" అని చక్రవర్తి సమక్షంలో చెప్పలేని, నేను, ఇక్కడినుండి వెళ్ళిపోవాలనుకుంటున్నాను!" చెప్పాల్సింది చెప్పారు.

"అధర్మమా ?! ఎవరన్నారు." అసహనంగా లేచాడు. ఇదే మగథలో అయితే, ఇప్పటికే శిరచ్ఛేదనానికి ఆజ్ఞాపించడం కాదు, అమలు జరిగిపోయేది. ఇది తన రాజ్యం కాదు, కాబట్టి - కొంతలో కొంత తనను సమాధానబరచుకుని-

"ఎవరన్నారు ?" గట్టిగా అరిచాడు.

"ఎవరైనా అంటారు. ఎదుటివారి మనసును తెలుసుకోకుండా, ఓ పట్టుదల, పన్నాగాలతో జరిపే దానిని అధర్మమంటారా ? ధర్మమంటారా ? ఆలోచించండి చక్రవర్తీ!" లోకంలో మనం వున్నాము తప్ప, మనలో లోకం లేదు. కనుక జనవాక్యం శిరోధార్యం. విన్నదేదో విన్నాను. నచ్చలేదు. ఇది ఆపలేను. అధర్మమని ఆదేశించలేను. అందుకే నా దారి నాది!" అని ఆచార్య స్థానం నుండి బయటపడి, బయటకు నడవదలిచాను!"

"కరుణామయుడైన భగవంతుడు, భక్తుల కష్టాల తొలగిస్తాడని, ఏదైనా మహాద్భుతాన్ని మహాదేవుడు చేస్తాడని తలిచాను. అద్భుతం, కాదు కానీ, నా పరమ శిష్యుడైన అనువిందుడు విషయం వివరణం చేసాడు. ఇప్పుడు రాకుమారి బలిపశువు, మీకోసం వివాహమైన రుక్మికి, మరల మీ మనుమరాలితో వివాహం. దీనినందరు రాజకీయ దృష్టితో చక్రవర్తి పన్నాగంగా తలుస్తున్నారే తప్ప - ధర్మమని మెచ్చుకోవడం లేదు.

"ఇదేమీ చెప్పకూడదనుకున్నాను. మాటకు మాట తెగులు" అని పెద్దలు అన్నారు. మితిగా వుంటే ప్రాణస్నేహం, అతిగా వుండే ప్రాణహానికి దారవు తుందన్నది - సత్యము. ఇంకా మిమ్ములను ఇబ్బంది పరుపలేను. ఇన్నాళ్ళు నన్ను గౌరవించి, సంభావించిన అందరికి శుభం కలగాలని, "ధర్మానికి జయం, అధర్మానికి అపజయం" శాస్త్రోక్తి కాబట్టి, ధర్మం నిలవాలని తలుస్తూ -

"అభీష్టసిద్ధిరస్తు!" అని మందిరం నుండి బయటికి రాగా -

ఆచార్యులు తమ నగరాన్ని విడిచి వెడ్తున్న వార్త విన్న ప్రతిఒక్కరు భోరు భోరుమని విలపిస్తూ ''వలదు - వలదు'' అని ప్రార్థిస్తూంటే, అందర్ని చిరునవ్వులతో, సమస్త శుభాలు కల్గాలని ఆశీర్వదించారు.

అనాథులైన - తనకే పరిమితమై శిష్యులు - అప్లవ, జహ్నులు, గురువుగారి విల్లంబులు మోసుకుని అనుసరిస్తుంటే, నగరం వీడి, అడవులవైపు అడుగులు వేసారు. అందరు పెద్దపెట్టున "గురుదేవా!" అంటూ రోదిస్తుంటే, కలచివైచే మనసులను, చూసే కళ్ళను చూడనీయకుండా ముందుకు సాగారు.

# సమాలోచనం...!

**ఆ** మర్నాడు జరిగిన ప్రత్యేక సమావేశంలో మహారాజు ఉగ్రసేనుల వారు, బృహద్బలుని అభీష్ఠంతోపాటు విషయాలన్ని వివరించి చెప్పారు. అప్పుడు యదు ప్రముఖులందరూ "రాజా! అన్నిట సర్వ సమర్థుడు, ధర్మరక్షకుడైన, వాసుదేవు డొక్కడే జరాసంధాదులను నిగ్రహించగలడు. కాగల కార్యం పూర్తిచేసుకు రాగలడని, విన్నవించుకుంటారు. అప్పుడు, కృష్ణుడు -

"ఎవరికో భయపడి పరువు ప్రతిష్ఠలు కన్న, కీర్తి కాంతను చేపట్టడానికి ఈ జన్మలు ముగించినా ఫర్వాలేదు. పేరుకు మనకో సామ్రాజ్యము. వీరులు లేని విలాసభూమి. మనవారికి స్వయంవరాహ్వానం రాలేదంటే, అంతకంటే అప్రతిష్ఠ ఇంకేముంది. మనం - మన జీవితాలు, మిగిలిన రాజలోకంలో నిలిచేనా ? ఇన్నాళ్ళు ఒకరి దయాదాక్షిణ్యాలపై బానిసలుగా బ్రతికాం. ఇకనైనా పౌరుషవంతులమై మనలో ప్రవహించేది, "రాజరక్త"మేనని నిరూపిద్దాం.

అశ్వ, గజ, పదాతి దళాలు, రథాలు.... విలాస ప్రదర్శనకు కాదని వీరోచిత పరాక్రమ ప్రదర్శనమునకని నిరూపించాలి. అప్పుడే - "శూరులం, వీరులం" అనుకునే మన నిజమైన శక్తి - పాటవాలు బయటపడతాయి. అందుకే భగవంతుడు కృష్ణుని పంపించాడు. ఇదొక శుభసూచకం. తినడానికి వుందీశరీరమని భావించక, శక్తి స్థోమతల్ని ప్రసాదించే బాహుబలాఢ్యులం, పరాక్రమోపేతులమని, లోకానికి చాటుదాం.

ఇందుకు ముందుగా మనం మన ఈ రథచోదనా పాటవాన్ని ఆటగా కాక, వేటగా నిరూపించాలి. ఈ వార్త అవతలివారికీ తెలిసి, అసమర్థులు - దద్దమ్మలు యాదవులు కారు. మనను మించిన యోధానుయోధులని అదిరిపడాలి.'' అనగా-

“ఇందుకు మేము సిద్ధం. మమ్ము నడిపించు'' అంటూ సాత్యకి, కృష్ణుని వీరోచిత ప్రసంగానికి వత్తాసుగా లేచి నిల్చున్నాడు. దానికి ముందు - రథయాత్రను జాతరగా కాక, శక్తి సామర్థ్యాల సమ్మేళనంగా సంకల్పం చేద్దాం.

“పోనీ మనం రుక్మిణిని ఎత్తుకువచ్చి.... మాజీ రక్షణాధికారి గరుడు అంటూంటే...

“అటువంటి నీచపు పనులు మనం చెయ్యకూడదు. “ధర్మం - ధర్మ'' మనే నేను ప్రేరేపించకూడదు. మరొక్క విషయం, రాజకుమారులు, రాజుల కుమార్తెలను చేసుకోవడం సబబు. విధివశాత్తు - ఆ బంధం తలక్రిందులైతే, అది తర్వాత పరిణామం. అంతేకాని, ఓ రాజకుమార్తెను, ఓ సామాన్య పౌరుడెత్తుకు వెళ్ళితే రాజలోకం హర్షిస్తుందా ? వూరక చూస్తూ కూర్చుంటుందా ? ఆలోచించండి, మీకు కనుక నా మీద నమ్మకం వుంటే ఈ రథ బల ప్రదర్శనమునకు సర్వవిధాల సహకరించండి!'' ఇందులో హెచ్చరిక, వినయం, విధేయత, ఆజ్ఞ - పట్టుదల సర్వం కలిగి వున్నాయి.

“మాకు నీమీద ఎంతో నమ్మకం వుంది'' అక్రూరుడు అనగా.

“కృష్ణా! ఎందులకీ తర్కం. మేమంతా నీవెంట వున్నాం. ఈ మథురాపురి సంరక్షణ విషయంలో నీవేం చెప్పినా, ఏం చేసినా మాకెటువంటి అభ్యంతరం లేదు.'' ఇవి మహారాజు ఉగ్రసేనులవారి అంగీకారం..

ప్రతి ఒక్కరు తమ తమ సహకారాన్నందించ సిద్ధపడ్డారు. నువ్వేం చెబితే... అని వచ్చినవారు వచ్చినట్లు సమావేశం నుండి లేచారు. ఆ తదుపరి - సాత్యకి, తన మిత్రుడు విరాటునితో కృష్ణుని కలిసి “ఈ క్షణం నుండి మేము నీ ఆజ్ఞాపాలితుల''మన్నాడు. ఇక బృహద్బలునితో..... తప్పు. ఆ మాట అనకూడదు. ఎవరి అభిప్రాయాలు వారివైనా, అవసరమైనప్పుడు మనమందరము ఒకటే. ఆపదలో, మనం మనమే తప్ప, ఒకరిందులో వేలుపెట్టరాదు.

రాబోయే కాలంలో సంభవించే పరిణామాల నెదుర్కొనడానికి, పగతురను చీల్చి పోరాడడానికి యాదవ వీరుల యువక వేడి రక్తం అత్యంతావశ్యకం. ఈ

రథోత్సవం వేడుక కోసం కాదు, మన శక్తి, సామర్థ్యాలను ప్రకటించడానికే. మనలోను అతిరథ - మహారథులున్నారని ఎన్నుకుని గౌరవించడానికి. అప్పుడు...

అప్పుడు.. ఈ చిన్న దేశం పటిష్టమవడం మెచ్చుకోలేని జరాసంథుడు, ఆర్భాటంగా వస్తాడు. మన చేత చావుదెబ్బ తిని జారిపోతాడు. ముందు పారిపోవడం ఆతనికి అలవాటే కదా! దానిని యథాప్రకారం అమలు చేస్తాడు.

కృష్ణుడు చెప్పినదంతా నిజం. వీరులమంటూ శౌర్య పతకాలను, దుస్తులకో, గోడలకో లేక పెట్టెలలోనో పెట్టుకునే వారి, ప్రతిభా పాటవాలు, ఇటువంటప్పుడే బయట పడతాయి. మరల, మరల గౌరవ పురస్కారాలు పొంద చేస్తాయి. సాత్యకి పొంగిపోయాడు.

"కృష్ణా!" నిజం. నువ్వు చెప్పిందక్షరాలా నిజం. ఎంతసేపు భుజాలు తడుముకుంటే, మన ఒళ్ళే వాచుతుంది తప్ప, భుజాల తీట తీరదు. తప్పక నువ్వు చెప్పినట్లు అనుసరిస్తాం. అందర్ని కలుపుకుని ముందుకు సాగుదాం. "అనగా -" అన్న బృహద్బలునితో కలిసి తెలిసిందా" కృష్ణుడు హెచ్చరించాడు.

ఆ మర్నాడు మాఘశుద్ధ పంచమినాడు, యమునా తీరంలో రథ బల ప్రదర్శనం జరుగుతుందని, అందులో అందరు పాల్గొనాలని, ముఖ్యంగా యాదవ యువవీరులు - తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాలని, గెలిచిన వారికి శౌర్య పతాకాలు, గౌరవ పురాస్కారాలు వుంటాయని చాటింపు. మథురానగరం, యావత్తు వెయ్యబడింది.  ఆ వార్త అందరిలో సమరోత్సాహం, బల ప్రదర్శనా పాటవోత్సాహం - ప్రస్ఫుటంగా కనుపింప చేసింది.

ఈ తరుణంలోనే బలరాముడు, బృందావనం నుండి అమితోత్సాహంగా అనిర్వచనీయమైన ఆనందంతో మథురకు వచ్చాడు. కానీ, బలరామునికి రథాశ్వ క్రీడలు, ప్రదర్శనలందాసక్తి తక్కువ. అయినా ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా అందర్ని ఉత్సాహపరుస్తూ కార్యక్రమానికి ఉద్యమింప చెయ్య మొదలుపెట్టాడు.

ఇంకో పదిహేనురోజులలో - రథక్రీడలు వున్నాయనగా సాత్యకి సారథ్యంలోని ఓ వందమంది యువ యదువీరులు అర్థరాత్రి పూట అదృశ్య మయ్యారు. దీనికి చిలవలు-పలవలు, రకరకాల వాఖ్యానాలు. బలరాముడు వచ్చాడుగా. అతనికి, సాత్యకికి పడదు. అక్కడే - ఓ మాయ జరిగి వుంటుంది. ఇది ప్రజల అంతర్గత ఘోష.

ఇంకో ఎనిమిదిరోజులు కార్యక్రమముందనగా, తమాషాగా నాల్గువందల రథాలు - ఇద్దరు ఆయుధపాణులైన యదువీరులు అదృశ్యమయ్యారు. ఇది మళ్ళీ మథురలో సంచలన వార్తయింది. కాని తదుపరి తెలిసింది - ఇదంతా కృష్ణలీల కృష్ణమాయ'' అని.. విన్న వాళ్ళందరు సంతోషించారు. అయితే వీరంతా ఎక్కడికి వెళ్ళారు ? తమ వీరత్వాన్నెక్కడ ప్రదర్శిస్తున్నారు ? ఇదొక ప్రశ్న అయింది.

రథ, పదాతి, దళాలు - కుండినపురం వైపు సాగుతున్నాయి. ఈ దళపథ నిర్దేశిత కార్యక్రమానికి ఉద్ధవ - సాత్యకులు - సారథ్యం వహిస్తున్నారు. అవాంతరా న్నెదుర్కోవడానికి కృష్ణుడు కుండిన ముఖ ద్వారాన్ని సమీపిస్తున్నాడు. ఈ సమయంలోనే ఎవరో ఆహ్వానమందని ప్రముఖుడు - ఈ స్వయంవర సమ్మేళనానికి,ససైన్యంతో వస్తున్నాడన్న వార్తా అందింది. ఆ వస్తుంది. ఎవరు ?

ఇది తెలుసుకోవడానికి కోటకు అగడ్తల్లా చుట్టూ సైన్యం మోహరించ బడింది. ఆ వచ్చేది, మిత్రువో, శత్రువో... తెలిస్తే... ద్వారాలు తెరచి వుంచడమో లేక మూసి వెయ్యడమో నిర్ధారణ చేసుకోవచ్చును. ఆ విషయం తెలుసుకోవడానికి గట్టి పహారా, అంతకుమించిన బలమైన కాపలా! ఆయుధాలతో వీరులు. ఎంతటి ప్రమాదాన్నైనా ఎదుర్కోగల ధీరులు...

ఆ వచ్చేవారి వీరావేశము, పద ధ్వనులు... ఇవన్నీ పాంచజన్య సిబ్బందివి. అయితే కృష్ణుడు వస్తున్నాడన్న మాట - తమలో తాము - దమఘోష, విందాను విందులు అనుకుంటున్నారు.

అప్పుడు - ఆ వచ్చే సైన్య - రాజ ప్రతినిధిగా యదు సింహమైన కృష్ణులవారు, గోమంతకానికి వెళ్ళే తరుణంలో తమకు చేసిన సహాయానికి కృతజ్ఞతగా బహుమతలర్పించ వస్తున్నారన్న వార్తను సాత్యకి - ఎదురుచూసే విదర్భీయులకు అందించాడు.

శ్రీకృష్ణులతోపాటు - ఆచార్య శ్వేతకేతువుల వారు శ్రీ కరవీరపుర మహారాజు శక్రదేవులవారు, ఆచార్య సాందీపుల వారి పుత్రరత్నము, కరవీర ప్రధానమంత్రి - పునర్దత్తులవారు, వారితోపాటు, మహారాజు అగ్రావనులు, ద్యుమనులు, గరుడరాజు వైనతేయుడు కూడా - తమ శుభాకాంక్షలనందించ విచ్చేసారు.

అలాగే - దేవభాగుల వారి జేష్ఠ కుమారుడు చిత్రకేతు, మథురాధిపతి ఉగ్రసేనులవారి సమక్షాన కానుకలు తెచ్చారు. మాత దేవకీదేవి కూడా, తన

ప్రతినిధిగా త్రివక్రను - తమ బదులు రుక్మిణీ యువరాణికి బహుమతు లందించమని పంపారు. మా వారందరు కోట కవతల యోజనం దూరంలో విడిది చేసారు. ఈ వార్త మహారాజు భీష్మకుల వారికి తెలిపి శ్రీకృష్ణదూత, కోట ముందు ఎదురుచూస్తున్నారని సత్వరం తెలుపండి.

విషయం విన్న కోట ప్రధాన అంగరక్షకుడు, ద్వారాన్ని మూయించి, మహారాజు సముఖానికి హుటాహుటిన వెళ్ళాడు. విషయం విన్న భీష్మకుడు, చేసేది లేక, తన వారితో కలిసి తండ్రిని చేరి, విషయం విన్నవించాడు. అంతా విన్న వృద్ధరాజు కైశికుడు "భీష్మకా! అసహనం వలదు. కృష్ణుడు సామాన్యుడు కాదు. జన్మించినప్పటి నుండి ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలన్ని, అతన్ని మహనీయునిగా ధర్మావతారునిగా తెలియ చెబుతున్నాయి.

వాళ్ళు యుద్ధానికో, మరోదానికో అయితే ఆలోచించాలి కానీ, తమ కృతజ్ఞతలను చెప్పుకోవడానికి, రాకుమారికి బహుమతులనందించడానికి మధురాధిపతిని, యదు ప్రముఖులను, వచ్చే దూతలను కాదనలేము. అది రాజమర్యాద కూడా కాదు. ఇప్పుడు కాదని, అనవసరంగా ససైన్యంతో వచ్చిన వారితో యుద్ధ వాతావరణం నెలకొల్పరాదు." పెద్దాయన తన సలహా నిచ్చాడు.

అన్ని విషయాలు రుక్మిణికి అందుతున్నాయి. కృష్ణుడు వచ్చాడనేసరికి రుక్మిణి ఆనందం వర్ణనాతీతం. ఆ అవ్యక్తమైన ఆనందంతో తాతగార్ని కలవబోతే, ఆయనకు కృష్ణాదులను ఆహ్వానించడానికి కోట ముఖద్వారానికి బయలుదేరు తున్నారు. రుక్మిణిని, ఆమె పరిస్థితిని గమనించిన కైశికులవారు, ముందుచూపు లేని మనిషిగా ఆ పిల్లను తలంచారు. కాస్త జాగ్రత్తగా వుంటే మంచిది. తెలివి గలవారు తెలివితక్కువ పనులు చెయ్యరాని హెచ్చరించారు.

"తాతగారూ! తన ఆనందంలో పెద్దాయన హెచ్చరికను గమనించలేక పోయింది." చూడమ్మా! ఈ పరిస్థితిని చెడగొట్టనివ్వకు. మమ్మల్ని వెళ్ళనీ...!" అప్పుడా పిల్లకు సత్యం బోధపడింది.

మధుర మహావీరుడు, అవతార పురుషుడు, ధర్మాత్ముడు కృష్ణుని రాక, ఆయనతోపాటు ఆచార్య శ్వేతకేతులవారు, కరవీపుర మహారాజు శక్రదేవులు, వారి మంత్రి - గురుసాందీపుల వారి పుత్రులు పునర్దత్తులవారు, తమ నగరానికి వచ్చారన్న శుభవర్తమానంతో - విదర్భీయులు, ముఖ్యంగా కుండినపుర ప్రజలు, మహదానందమూర్తులయ్యారు.

వీళ్ళందర్నీ చూడాలని, కుండినీ నగరం మొత్తం తమ తమ కార్యక్రమాల నన్నింటిని ప్రక్కన పెట్టి, మరీ పెద్ద సంబరంలాగ తరలి వస్తున్నారు. తిరునాళ్ళ-జాతర్ల జనంలా వున్నవారిని చూసిన ప్రతి ఒక్కరు విషయం తెలుసుకుని, వీరిని అనుసరించడం ప్రారంభించారు.

మహారాజు భీష్మకులు, వారి, రాజబంధువులు, విశిష్ట అతిథులు, ఈ అనుకోని సంఘటనకు, ఏమనుకోవాలో, ఎలాగ తలంచాలో తెలియక తలలు పట్టుకుని, సమాలోచనలు ప్రారంభించారు. అన్నీ తెలిసిన రుక్మి నేలవిడిచి సాము మొదలుపెట్టాడు. జరాసంధునే చేతులెత్తేయించిన బలరామ-కృష్ణుల ముందర తాను కుప్పిగంతులు వేస్తున్నాన్న సంగతి మరచిపోయి, మరీ రెచ్చిపోతున్నాడు. ఎందుకంటే ఇది తన రాజ్యం - వుండవలసిన వారందరు తన వెంటే వుంటారు, వున్నారన్న భావంతో వుంటే - భీష్మకుడు మతిస్థిమితం లేని వాడయిపోయాడు.

కృష్ణుని ఇప్పుడు తప్పకాహ్వానించాలి. ఎందరో భోజ ప్రముఖుల పిల్లలు ఆచార్య శ్వేతకేతులవారి సారథ్యంలో సుశిక్షుతులయ్యారు. ఆచార్యులకు, ధర్మమూర్తి కృష్ణుడంటే గౌరవం. ఈ భోజీయుల పిల్లలు, శ్వేతకేతు శిష్యులు, మహా సంబరంతో కృష్ణుని తమ గురువులను దర్శించ వస్తున్నారు.

ఆ వచ్చేది, ప్రమోదమో.... ప్రమాదమో... ఏ ఒక్కరికి అర్థంకాక అస్తవ్యస్త పరిస్థితిలో తీవ్ర ఆందోళనలలో అందరు మున్గి వున్నారు.

క్షణాలలో యాదవ ప్రముఖుల రాకకు తగ్గట్లు కుండినీపుర సరిహద్దులలోని వృద్ధరాజు కైశికుల వారి భవనం, శ్వేతకేతులవారి ఆశ్రమప్రాంతం, వాటి పరిసరాలు, చక్కగా అందంగా తీర్చిబడుతున్నాయి. అవి - వచ్చే యదు ప్రముఖులు, ఆచార్యుల, కరవీర మహారాజుకు - అతిథి గృహాలు.

కోట ముఖద్వారం వద్ద, కృష్ణుని ఆతని మిత్ర - పరివార బృందాన్ని వృద్ధ మహారాజు, కాబోయే మహారాజు తాతగారైన కైశికుల వారు, ఛేది దేశాధిపతి దమఘోషుడు, అవంతీపుర యువరాజులు విందానువిందులు, పెద్ద పెట్టున "జయ జయ వాసుదేవా", అంటూ హర్షధ్వానాలు చేస్తూ సాదర స్వాగత మొసగారు.

మహారాజు భీష్మకుని తరఫున వారి వృద్ధ మంత్రి వేదవిదులైన బ్రాహ్మణోత్త ములను తీసుకుని పూర్ణకుంభ స్వాగతంతో ఆహ్వానించారు. వందనా లర్పించారు.

"కృష్ణా! ఓ ధర్మావతారా! మహారాజు స్వయంగా రానందులకు మన్నించాలి. స్వల్ప ఆనారోగ్యంతో మహారాజు బాధపడుతున్నారు. స్వస్థత రాగానే తమను కలుసుకుంటామని చెప్పమన్నారు" మహారాజు వాక్యంగా వృద్ధ మంత్రి చెప్పాడు. అందుకు సమాధానంగా కృష్ణుడు -

"మహాత్మా! నాకిప్పటికిప్పుడు వారి దర్శనం చెయ్యాలని, వారిని ఇబ్బంది పెట్టాలనే తలంపు లేదు. వారి వీలునుబట్టి దర్శించుకుంటానని, ఈ వసంతోత్సవాల సంబరం వరకు, ఇక్కడే వుంటానని, మా బదులు మీరు చెప్పండి. స్వయంవరం ప్రసక్తి రాకుండా తెలివిగా కృష్ణుడు తన మనోభీష్టాన్ని తెలియబరిచాడు.

కృష్ణుడు రథం దిగడాన్ని విదర్భ రాజకుమారి రుక్మిణి రాజప్రాసాదం పైనుండి చూసింది. ఆ ప్రక్కనే వున్న వదినమ్మ సువ్రతను గట్టిగా కౌగలించుకొని "చూసావా, ఆ యదు సింహమెంత అందగాడో....నని పొగడుతూంటే, "నాకు తెలుసు" అంటుందామె. కృష్ణుని రాకతో పరమానందభరితురాలౌతుంది. ఆ మరునాడు సాంప్రదాయబద్ధంగా వృద్ధరాజు కౌశికుడు, కృష్ణుని దర్శిస్తాడు. వారు చేసే అతిథిమర్యాదలకు, రాచరిక సాంప్రదాయ గౌరవానికి సంతోషపడుతూ "తాతగారూ" రాజు కాని, యువరాజు కానీ నాకు, ఈ విధమైన మర్యాదలు సముచితం కాదు. ఇది మీ మిత్ర రాజులకు, ఇతర రాజ బంధువులకు కంటగింప వుతుంది. ఒక గొల్లవానికింత మర్యాదా ? అని గొణుక్కుంటారు.

"కృష్ణా! నువ్వెవరో తెలిసినవారెవరు అలాగనుకోరు. నీకు సముచిత మర్యాదలనివ్వకపోతే చివుక్కుమన్న మనసుతో చిన్నబుచ్చుకుని కోప్పడతారే తప్ప, ఇది తగదని, బుద్ధున్నవారెవరు -" అనరంటారు. అది సరేనని మాట మారుస్తూ... "నిన్ను స్వయంవరానికి పిలవకపోతే దానికి నేనెంతో బాధపడ్డాను. భీష్మకుని మందలించాను కూడా!

"తాతగారూ! అన్నీ తెలిసిన పెద్దవారు మీరు. ఎవరైనా పల్లెలలో తిరిగే గొల్లపిల్లలను, ఆవులమందల్ని కాచుకునే పశుల కాపర్లను, యువరాణి స్వయంవరానికి పిలుస్తారా ? పిలువలేదని బాధపడటం తగునా ? అది విన్న ఆ పెద్దాయన "ఎవరో అన్నట్లు అలాగ ఎద్దేవా చేసినట్లు మాట్లాడటం తగునా? సద్ధర్మ రక్షకుడివి, ధర్మమూర్తివి. నీకు లేని అర్హత, ఈ భూలోకంలో మరెవ్వరికి లేదు. ఇంద్రాది దేవతలే, నీ కనుసన్నల మెలగాలని తలుస్తూంటే, మేమెంత ? మా రాజ్యాలెంత ?

"అది... మీ అభిమానము. ఈ కృష్ణుని అదృష్టమని ముగించాడు."

"అలాగనవద్దు. నువ్వు పాల్గొనని స్వయంవరం, "స్వయంవరం కాదు...!" తన వుద్దేశాన్ని వృద్ధ మహారాజు చెప్పగా -

"అదే నేను అంటున్నాను. ఎవరో చెప్పిన మాటలకు వ్యక్తిత్వాన్ని చంపుకుని గంగిరెద్దులా తలవూపి, "డూ-డూ" బసవన్నంటూ తైతక్కలాడటం తగదు. స్వయంవరమంటే "ఇచ్ఛా స్వయంవరం కావాలి. కానినాడు అది స్వయంవరం కాదు. ఆ పేరిట జరిగే అనాగరిక తంతు. బలవంతపు వివాహం. దీనిని తెలుసు కోవాలనే ఇక్కడికి వచ్చాను. మీరా విషయం ఎత్తారు కాబట్టి నా అభిప్రాయం చెప్పానన్నాడు.

ఇది జరిగిన మర్నాడు, మహారాజు భీష్మకుల వార్ని కృష్ణుడు దర్శించాడు భీష్మకుడు - తాను సకాలంలో స్పందించనందులకు, దర్శనం చేసుకోనందులకు సర్ది చెప్పుకున్నాడు. కృష్ణుడి వెంట ఉద్ధవుడు, సాత్యకి, మహారాజు శక్రదేవుడు వారి మహామంత్రి పునర్దత్తుల వారితోపాటు, అగ్రావన, ద్యువన, గరుడాది పక్షిజాతి ప్రముఖులున్నారు.

మహారాజు చెంత, భోజకుల ముఖ్యులు, ప్రధానమంత్రి వగైరాలున్నారు. కాని, ప్రస్తుత యువరాజు, భావి మహారాజు రుక్మి మాత్రం అప్పుడు, అక్కడ కనబడలేదు. అప్పుడే మహారాజు అనుకోని పరిస్థితులలో, మిమ్ములను స్వయంవరానికి పిలువలేక పోయాను. అది తన తప్పిదంగా చెప్పుకున్నాడు.

"బాధపడకండి. నన్ను పిలువలేదన్న బాధ నాలో ఏ కోశాన లేదు. ఎటొచ్చీ, మీరు తలపెట్టిన స్వయంవరమే నిరంకుశమైనదని బుధులు, బుద్ధిమంతుల అభిప్రాయం. స్వయంవరమన్నది పాల్గొనేవారి స్వతంత్రానికి చిహ్నం తప్ప. ఎవరో చెప్పారని తలవూపి తలవంచి, అవతలి వారిష్ట ప్రకారం బ్రతకడం, ఎదుటివార్ని అలాగ బ్రతుకమనడం, ఎంత పెద్ద పొరపాటో ఆలోచించండి. ఇది తగదని చెప్పడానికి నేను వచ్చానన్నాడు.

ప్రజారక్షకులు, సచ్చరిత్రులైన, మీరు ఈ స్వయంవరాన్నాపండి! హెచ్చరికగా కాక, కృష్ణుడు - విషయంగా చెప్పాడు.

అలాగ చేస్తే - "ఈ విదర్భ సర్వ నాశనమౌతుంది. చరిత్ర పుటలలో కనబడకుండా పోతుంది." తన అసమర్థతను, భావిని చెప్పాడు. భగవంతుడు తప్ప దీనినాపడం, పరిస్థితిని తారుమారు చెయ్యడం, సామాన్యులకు సాధ్యం

కాదు!'' అని మొహం ప్రక్కకు త్రిప్పుకొనడంతో, అంతా "దైవేచ్ఛ" అని కృష్ణుడు తన అతిథి గృహానికి వచ్చాడు.

అప్పటికే కృష్ణునికై ఎదురు చూస్తున్న త్రివక్ర, కృష్ణునికి పాదాభివందనం చేసి "దేవదేవా! రుక్మిణీ కుమారి తమకో సందేశం పంపారంది. సంతోషం. నువ్విటువంటి వాటిలో దిట్టవే కదా! ఏవిటో చెప్పమన్నాడు. చుట్టు ఒకసారి చూసి మెల్లిగా "గోవిందా! నువ్వు నా ప్రభువువు. జన్మజన్మలకు నువ్వే నా పతి. గతి. నిన్ను విడిచి నేను మరొకర్ని వరించలేను. కలలో కూడా ఇది సాధ్యం కాదు.

నిన్ను చేపట్టని "అదియొక జన్మమా ?'' అని, ప్రభూ! ఆ పిల్ల రుక్మిణీ రాకుమారి బావురుమంటుందని, ఆమె మనసును కృష్ణునికి విపులీకరించి చెప్పింది.

"అయితే కథ ఇంతవరకు వచ్చిందన్నమాట. చాలా బాగా నడిపావు!'' మందహాస వదనుడయ్యాడు కృష్ణుడు.

"ప్రభూ! ఈ జరిగేదంతా నీకు తెలియనిది కాదు. జరగబోయేది తెలియనిది కాదు. నువ్వు కాదంటే ఆమెకు మరణమే శరణము'' అంది. అందులో ఎంతో బాధ మిళితమై వుంది.

"త్రివక్రా! పెద్ద దానివి. సమర్థురాలవు. ఇది నీకు తెలియని విషయం కాదు. వయసులోని ప్రతి ఆడపిల్ల ఇలాగే మాట్లాడుతుంది. తప్పు లేదు. కాని దీనికి సమయం అనుకూలించాలి. కాలం ఏతెంచాలి ?

"ప్రభూ! ఇప్పుడు మనమిద్దరి మధ్య జరగాల్సింది వాదం కాదు. మీ ఇద్దరికి వివాహం. సద్ధర్మమూర్తిగా ఆమె అర్థిస్తూంది. అభయప్రదాతగా, అర్థిని సమర్థించి రక్షించాల్సింది నువ్వే....!''

"ఇది ఆమె చెప్పమందా ? నీ మాటలా ? అనగా, ఆడదాన్నని నువ్వే చెప్పావు. పెద్దదానిగా, ఓ మిత్రురాలిగా నిన్ను తెలిసిన నాకు తన మనసు విప్పి, సహకరించమని అర్థించింది. నా ధర్మం నేను నిర్వర్తిస్తున్నా''నంది.

అందుకు ప్రతిస్పందిస్తూ, ధీర గంభీర స్వరంతో

"వెళ్ళు! త్రివక్రా వెళ్ళి, నా మాటలు ఆమెకు తెలుపు.'' అంటూ -

"కృష్ణుడు ధర్మపరుడు. తొలిచూపులోనే నువ్వు ఆతని మనసును దోచావు. అవి నీ కళ్ళే తెలిపాయి. నిన్ను వివాహం చేసుకోవడం నాకే కాదు, మా అమ్మగారు

దేవకీమాతకు ఇష్టమే. అలాగని అధర్మవర్తనుడను కాను. ఇప్పుడు నువ్వు నన్ను కోరి, పరిణయమాడ తరలి రమ్మని అడిగావు కాబట్టి, నీ కోసం వచ్చిన నేను, తప్పక - నిన్ను "అధర్మం" నుండి కాపాడతాను. నీ మనోవాంఛితం ప్రకారం నడుచుకునే అవకాశం కల్పిస్తాను. ఇందులో నా మాట ఇప్పుడే కాదు. ఎప్పుడు తప్పదు."

ఆ మాట విన్న త్రివక్ర "ఇంతకీ రాకుమారిని వివాహం చేసుకుంటావా, లేదా ? స్వయంవరం ఆపుతావా ? ఆపవా ?"

"ఎందుకీ ఆత్రుత, ఆందోళన. వెళ్ళు. వెళ్ళి. నేను చెప్పిన మాటల్ని అదే విధంగా చెప్పు. అప్పుడామె ఏం చెబుతుందో, అది నాకు చెప్పు. అధర్మం నశింప చేస్తానన్నాను కానీ, ధర్మ నాశనానికి నడుం కడతాననలేదే ?"

"ప్రభూ!" నిన్ను అర్థం చేసుకోవడం ఆ దేవతలకు కూడా సాధ్యం కాదేమో!"నని నమస్కరించి, వడివడిగా నడక, మనసు వేగం పరులకు తెలియకుండా రుక్మిణి రాకుమారిని చేరింది.

శ్వేతకేతు మనసు, కృష్ణునిరాక, మగధ చక్రవర్తి, ఆతని మిత్ర సామంతులకు ప్రాణాంతకమయింది. ఏదో పదుల్లో స్వయంవర కార్యక్రమానికి వచ్చిన ఈ ఆహ్వానితులు, కృష్ణుడు వేలాదిమంది యదువీరులతో శుభాకాంక్షలు, కృతజ్ఞతలు చెప్పడానికంటూ రావడం. పైగా నువ్వు రాజువా ? అంటే కాదు రాజమిత్రుడను. శ్రేయోభిలాషినని, ఎవ్వరికీ అనుమానం రాకుండా చెప్పడానికి, "కరవీరపుర మహారాజనే కుర్రకుంకతో, వంక పెట్టుకుని, శంకలలో ముంచిన ఆ కంసారిని తలచుకుంటే, తమ పథకాల్ని నీటముంచి, ఎదుటి వార్ని తన తెలివి తేటలతో అతి సునాయాసంగా దెబ్బతియ్యగల - ఆ యాదవుడు కాదు, కాదు గొల్లవాడు, పశులకాపరి, ఇంతమందిని హడలెత్తిస్తున్నాడు. వణికిస్తున్నాడంటే "అమ్మో!" ప్రతి ఒక్కరు ఆలోచనలో పడ్డారు. శతృత్వం కన్నా ఆతనితో మిత్రత్వం మేలనే స్థితికి వస్తున్నారు.

ఏం చేద్దామనుకున్న ఆ ప్రముఖులు, ప్రస్తుతం స్వయంవర కార్యక్రమాన్ని వాయిదా వేద్దామని, తగు ప్రయత్నాలతో, మరోమారు ముందుకు రావాలని తలుస్తున్నారు. కృష్ణుని తప్పు పట్టాలంటే, ప్రతి ఒక్కరిలో భయం. ఎందుకంటే, ఎత్తిచూపగల తప్పు... ఒక్కటీ కనబడితే, కదా! కనుక ఇప్పుడు మనమేమి చేసినా, అది కొరివితో తలగోక్కున్నట్లేనన్న స్థితికి వచ్చేసారు.

పైగా, ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్కరు కృష్ణుని పొగడటానికి, ఆతని దృష్టిలోపడటానికీ ప్రయత్నిస్తున్నారు తప్ప, విరోధించడానికి, విక్రమించడానికి ఎవరు సిద్ధపడటం లేదు. కనుక -

వచ్చే కోపాన్ని దిగమ్రింగుకుని, ప్రస్తుతం మనం ప్రశాంతంగా వుండటం, కృష్ణునికి సల్పే సత్కార సభలో అవసరాన్ని బట్టి పాల్గొనడం సముచిత కర్తవ్యమని, జరాసంథ చక్రవర్తి తన వాళ్ళందరికి సూచించాడు. అయితే -

రుక్మి, శిశుపాలురు మాత్రం, మహారాజు... ఆయనతోపాటు చక్రవర్తి ఆయన మిత్ర సామంతులు భజనప్రియులై, కృష్ణుని సత్కార సభకు, భయపడుతూ వెళ్ళడానికి సిద్ధపడటం, నిజానికి వీరోచిత లక్షణం కాదని, ఇది పిరికిపందలు చేసే పనిగా అభివర్ణిస్తూ ఆవేశపడుతున్నారు. వీళ్ళ వలన మనము, మన పౌరుష పరాక్రమములు, అడవిగాచిన వెన్నెలవుతుందని ఆక్రోశించసాగారు.

ఇటువంటి సమయంలోనే, జరాసంథ చక్రవర్తి అందర్ని పంపించేసి, తనకు ఆంతరంగికుడైన సాల్వుని మాత్రం వుండమని, ఆతనితో దీర్ఘాలోచనం సలిపాడు. సాల్వునితో మనసువిప్పి మాట్లాడాక చిరాకు, విసుగు, కోపం, అంతా తేలికయి పోయింది. మనసు దూదిపింజలా తేలిపోసాగింది.

పంచమినాడు, కుండినపురంలో కైశికుల వారి ప్రాసాద ముందర వసంత వేడుకలు ప్రారంభమయ్యాయి. దానికి ముఖ్య అతిథిగా కృష్ణుని ఆహ్వానించి, అతిథి మర్యాదలతో, ఆ ధర్మమూర్తిని అర్చించాలని, తగు ఏర్పాట్లు చెయ్య బడ్డాయి. వృద్ధ మహారాజు, వాసుదేవుని, దేవదేవుని వలె ఆహ్వానించాడు. అర్ఘ్య పాద్యాదుల అర్చించాడు. ఈ దివ్య మహోత్సవానికి నగర ప్రజలు పరిసర ప్రాంతాల వారు యావన్మంది, ఉరుకులు పరుగుల వచ్చారు. ఆ మహోత్సవాన్ని కన్నులారా దర్శించి తరిస్తున్నారు. నయనానందకరంగా, ఆ ఉత్సవం సాగుతుంది.

అనంతరం, కృష్ణుడు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాజులను, ప్రముఖులను, వారి వారి స్థాయికి తగ్గట్లు గౌరవించాడు. వచ్చిన వారందరు ఎంతో సంతోషించారు. రానివారు ముగ్గురే ముగ్గురు. వారు మగధ చక్రవర్తి విదర్భ యువరాజు, ఛేది దేశ యువరాజులు మాత్రమే!

"జయ జయ గోవిందా! కృష్ణా! వాసుదేవ" అనే కరతాళ ధ్వనులు మిన్ను ముట్టుతూంటే, వృద్ధరాజు కైశికులు, భీష్మకుడు, దమఘోషుడు, అభినందనలతో

ఆలింగనం చేసుకున్నారు. కన్నుల పండువుగా సాగే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వీక్షించి పరవశించారు. మధురగాన, ఆనంద నృత్యాలు, మేళతాళాలు. జయ జయ ధ్వానాలు, కరతాళ ధ్వనులు, నగరం చెవులు మార్మోగేటట్లు ఆకాశాని కంటుతున్నాయి. దేవతలు కూడా ఈ దివ్యానందంలో తప్పక పాల్గొని వుంటారు. తధాస్తు!!

వివిధ శాఖల ప్రదర్శనలు, రంగు రంగుల దుస్తుల స్త్రీ పురుషులు, వీరులు, శూరులు, మల్లులు, భిల్లులు... అబ్బ... నయనానందకరమా వసంత పంచమి దృశ్యం. కృష్ణుడు - కైశిక, శక్రదేవ, ఉద్ధవాదులు వెంబడించగా, ఆ ఉత్సవ సంరంభ-సంబర జనంలో లీలావిలాసంగ కలిసి, అందరికానందం కల్గిస్తూంటే-

ప్రతి ఒక్కరు పరవశించారు. పరమానంద భరితులయ్యారు. అదే కృష్ణ ప్రేమ. ప్రతి ఒక్కరు పాదాలంటి కృష్ణుని అభిమానం పొందాలని ఆత్రపడేవారే. ఆ దృశ్యం - భూలోకానికే కాదు - దేవలోకం మొత్తానికి - పండుగ అయింది. ఆ మధ్యాహ్నం- వృద్ధరాజు అందరికి విందు ఏర్పాటు చేసాడు. అందులో -

ఉదయం రాని వారందరు కూడా వచ్చారు. ఆహ్వానం లేకపోయినా రాజవర్గంలో కరవీపుర మహారాజు శక్రదేవుడు, కలిసి కూర్చోగా గరుడాధిపతులు అగ్రావన, ద్యావనులు మరొక వరుసలో కూర్చున్నారు. ఎదురుగా రాచరిక హోదా లేనివారందరికి, ఆసనాలు కేటాయించబడ్డాయి. కృష్ణుడిక్కడే మధ్యలో కూర్చున్నాడు. ఆ విశిష్ట అతిథికి ఇరుప్రక్కల వృద్ధరాజు కైశికులు, యాదవ ప్రముఖులు కూర్చున్నారు.

ఆచార్యులు, తదితర విశిష్ట శిక్షకులు మరో వరుసలో ప్రముఖంగా ఆశీనులయ్యారు. ఈ వచ్చిన ప్రముఖులకు, అంతఃపుర ముఖ్యరాజ స్త్రీలు, రుక్మి భార్య సువ్రత, యువరాణి రుక్మిణిలు ప్రత్యేకంగా పాయసం వడ్డించడానికి చొరవ తీసుకున్నారు. రుక్మిణి ముందుగా ఆచార్యులకు, ఆ తదుపరి రాజులకు, యువరాజులకు, సాంప్రదాయబద్ధంగా వడ్డించింది. అక్కడనుండి ఎదురుగా వున్న అతిథులు, విశిష్టాతిథులకు వడ్డిస్తూ, కృష్ణుని దగ్గరకు వచ్చేసరికి సిగ్గుతో ఆమె చేతులు వణకసాగాయి. కృష్ణునికి పాయసం వడ్డిస్తుంది. ఆ తొట్రుపాటుతో పరమాన్నం పాత్ర, మొత్తం వొలికింది. అది అరటి ఆకులనుండి కారిజారి పోతూంటే, జరిగిన పొరపాటుకు భయపడి, గట్టిగా అరచి, కళ్ళు తిరిగి క్రిందపడిపోయింది. అలాగ పడిపోతున్న సమయంలో ఆమె అప్రయత్నంగా కృష్ణుని కళ్ళలోకి చూసింది. రుక్మిణి అరుపుకు, అంతఃపుర స్త్రీలు పరుగెత్తుకుని వచ్చి ఆమెను పట్టుకున్నారు. కైశికుడు జరిగిన దానికి

బాధపడుతూ "క్షమించు, కృష్ణా! పొరపాటు జరిగింది. అన్యధా భావించక మరో విస్తరి వేయిస్తాను!" పొరపాటుకు క్షమించమన్నట్లు వేడుకుంటున్నాడు.

"తాతగారూ! పోసింది పాయసమే కదా! మధురాన్నం మధురంగా పడింది. అంతా మంచే జరుగుతుంది. కంగారుపడకండి!" మంచితనానికి మంచితనంగా కృష్ణుడు మాట్లాడాడు. ఇది ఇక్కడి విషయం.

అక్కడ అంతఃపురంలో రుక్మిణిని తన మందిరంలో పడుక్కోబెట్టి సేద తీరుస్తున్నారు. పట్టిన స్వేదాన్ని తుడుస్తున్నారు. మెల్లిగా - సిగ్గు - భయంతో రుక్మిణి, కృష్ణుని అభయపూర్వక చూపులను తలచుకుని, కళ్ళు తెరుస్తుంటే -

అంతవరకు ప్రశాంతంగా వున్న వదిన సువ్రత "ఎంత ఘటికురాలివే. అమాయకురాలిగా నటించి, నీ ప్రేమ పాయసాన్ని కృష్ణునికి ధారగా అర్పించి, ఏ ప్రమాదం రాకుండా, అరుపు, భయం, నటించి, చక్కగా - జరిగిన సంఘటనను సర్దేశావు. "సుకుమారి, మా రుక్మిణీకుమారి" అని బిరుదు కొట్టేసావు.

"అందరి దృష్టిలో పడ్డావు అందని కృష్ణుని దృష్టిలో పడ్డావు. సమాధాన పరిచావు. సమాధాన పడ్డావు" అంటూంటే -

"వదినా, ఓడిపోవడానికి, ఏ రాజకుమారి ఇష్టపడదు. బలిపశువు కావడానికి సిద్ధపడదు. అది తెలుపడానికే కడివెడు పాయసం "మధుర - క్షీరాలు"తో కల్సినది ఆ "మధురాధి"పతికి, క్షీరాబ్దిశయనునికి అర్పించి "నీదే ఆలస్య"మన్నాను. సమాధానపడిన మనసును రుక్మిణి, వదిన "సువ్రతా యువరాణి"కి అందించింది.

"అమ్మ, గడుగ్గాయి!" అని నవ్వుతూ భుజంపై ఒక్కటి చరిచింది. నీ దగ్గర నుండి చాలా నేర్చుకోవాలి" అంది.

"లేకపోతే ఆ జరాసంధ చక్రవర్తి మనుమరాలిగా బానిసగా బ్రతకాల్సి వస్తుంది. జాగ్రత్త." అని ఆమె భవిష్యత్తుకు కూడా, తగు శుభ సంకేతాలనిచ్చింది.

ఇప్పుడు... అదే...

తక్షణ కర్తవ్యం గురించి ఆలోచించాలి!

# జయోస్తు...!

**మొ**త్తానికి దిగ్విజయ యాత్రను పూర్తి చేసుకుని వచ్చినట్లు, అందరు కుండినపురం నుండి మథురకు శ్రీకృష్ణునికి, జయ జయ ధ్వానాలు చేస్తూ వచ్చేసారు. ఇప్పుడు - మథుర "మహదానందంగా" వుంది. ఆటల పాటలతో కేరింతలు కొడుతూ విజయోత్సవాలు, శ్రీకృష్ణునికి దివ్య నీరాజనాలు.

కృష్ణుడు, తాతగారిగా కాక, మథురాధిపతిని దర్శించి, అక్కడున్న వారందరికి భక్తితో నమస్కరించాడు. తండ్రి వసుదేవుడైతే, కృష్ణుని మేథాసంపత్తికి పొగడకుండా వుండలేకపోయాడు. "కృష్ణా!" అంటూ గుండెలకు హత్తుకున్నాడు. తల్లి సరేసరి, యశోద, కృష్ణుని ఆటపాటల్ని చూస్తే, దేవకి - శౌర్య పరాక్రమాల "శౌరి"ని దర్శించింది. నుదుట ముద్దుపెట్టుకుంది. వెన్ను నిమురుతూ గుండెలకు హత్తుకుంది. "కృష్ణా...!" చిన్నపిల్లవలె, ఆ తల్లి పిల్లవానిని చుట్టుకుంది.

ఆ మర్నాడు యాదవ ప్రముఖులంతా సమావేశమై, కృష్ణుని ముఖతః అక్కడ జరిగిందంతా విన్నారు. తక్షణ కర్తవ్యమేమిటని మాత్రమే వారడిగారు. జరిగిందంతా విన్నవారు, మహారాజుతో కలిసి, నిజంగా జయ జయ ధ్వానాలు చేసారు. మథుర పరువును నిలపెట్టిన మహనీయునిగా కీర్తించారు.

"సంతోషం. కానీ, ఈ ఆనందం శాశ్వతం కాదని ముందు మనం తెలుసు కోవాలి. తన ఆలోచనలను భగ్నం చేసిన, ముఖ్యంగా నన్ను, ఆ తదుపరి మిమ్ము, ఈ మథురతో కలిపి మట్టిగరపే వరకు జరాసంథుడు నిద్రబోడు. ప్రస్తుత పరిస్థితి, అక్కడ అతనికి అనుగుణంగా లేకపోవడమే ప్రస్తుతమాతని ఆక్రోశానికి నిదర్శనం. అది బయటపెట్టకుండా సమయం వచ్చిన మరుక్షణం కాలయముడిలా విజృంభించ తలుస్తున్నాడు. జాగ్రత్త!" కృష్ణుడు హెచ్చరించాడు.

"అవునవును" అక్కడి వారందరు అన్నారు. దెబ్బతిన్న పులి. దెబ్బ తీయక మానదు. "అదెలాగ సాధ్యం ?" ఒకరి ప్రశ్న. ఎందుకు సాధ్యం కాదు, ముందు మనవద్దనున్న రోగం అనైక్యత. ముందు దాన్ని ప్రక్కనబెట్టి సమైక్యతారాగం, సందర్భోచితంగా కనుక ఆలాపిస్తే, ఈ కృష్ణుడు మనకండగా వుండగా, ఆ ఇంద్రుడైన పారిపోవాల్సిందే" ఇది - ప్రశ్న - సమాధానాల పరంపరలోని విషయం. విశేషం. అంతా విశదబరచిన కృష్ణుడు పెద్దల నుండి రథికులలో అతిరథులు,

మహారథులను ఎన్నుకుంటూ, తగు విధంగా యోధానుయోధులను, ఎటువంటి వారినైనా నిగ్రహించు విధాన రూపొందించాలని ఏర్పాట్లు ప్రారంభించాడు.

ఇలా వుంటుండగా - ఒకనాడు ఎటువంటి వర్తమానం లేకుండా హస్తినాపురం నుండి అనుకోని అతిథి వచ్చాడు. రావడం, రావడం వసుదేవుని మందిరానికి వెళ్ళాడు. రథం ఆపి, ఆ భారీ విగ్రహుడు, మందిరం ముందు గల సభాస్థలిని చేరి, ఆనందోత్సాహాలతో అరుస్తూ “అత్తా, మామా, బావా, బలరామా, ఉద్ధవా, కృష్ణా.... హహ్హాహ్హా.... రండి, రండి” ఆపుకోలేని సంతోషంతో అరుస్తున్నాడు. ఆ కేకలకు అందరు పరుగెత్తుకొచ్చారు.

చూస్తే - వచ్చినవాడు మనిషిలాగ కాక, ఒక గున్న ఏనుగులా వున్నాడు. వస్తూనే కృష్ణుని దగ్గరకు తీసుకుని తాను బాహుబంధాలలో బిగించాడు. అదొక ఉక్కు కౌగిలి. పదివేల ఏనుగుల శక్తికల, మహాబలాఢ్యుని భుజ బల శక్తికి, సామాన్యులైతే ఇప్పటికే స్మశానానికి చేరి వుండేవారు. కృష్ణుడు కాబట్టి మొహం ఎర్రగా, కంద గడ్డయింది.

“ఆ... ఆ.... ఇలాగే వుండు.” తన బంధంలో నుండి చిన్న బావను విడువకుండా, ఆనందంతో అటు ఇటు వూపేస్తున్నాడు. ఇక ఆ ఆనందానికి ముగింపుగా “భీమసేనా, ఏవిటీ బలపరాక్రమాలు. ఎంత ఆనందమైనా ఇలాగ ప్రవర్తించితే, ఇంతే కదా వారి సంగతులు. కాబట్టి సంతోషాన్ని ప్రక్కనబెట్టి సమాజాన్ని మా దృష్టితో చూడు. బ్రతికిపోతాము!” అన్నాడు. అప్పటికి కాని తన ఆనంద ప్రభావం ఎంత ఇబ్బందికరమైనదో, ఆ భీమునికి అర్థం కాలేదు.

ఆ తర్వాత - పెద్ద బావ బలరాముని వద్ద గదా యుద్ధంలో మెళుకువలు తెలుసుకోవడానికి వచ్చానని చెప్పాడు. కాని కృష్ణుడు ఒంటరిగానున్న సమయంలో “బావా! నన్ను... అంటూ ఒక రహస్య విషయాన్ని మీకు అందించమని, మా పినతండ్రి, మహాధర్మవేత్త విదురులవారు పంపారని చెప్పాడు.

“ఏవిటో అది. రహస్యం.... అంటే ఎంతో మెల్లిగా, సాల్వుడు, కాలయవనుని కలిసాడుట. ఆ సింధు దేశాధిపతి తన అపారసేనతో, ఆర్యావర్తాన్ని హస్తగతం చేసుకోవాలని తాపత్రయబడుతున్నాడు. అతనికి మనవాళ్ళు బాసట. నిజానికి “బాసట” అనేకన్నా, బానిసలంటే చాలా బాగుంటుంది. వాళ్ళ పథకంలో భాగంగా నీవున్న మథురను మట్టిగరపితే, ఏ ఇతర రాజ్యమైనా అతనికి దాసోహమే. కనుక, జాగ్రత్తగా వుండమని తాను హెచ్చరించినట్లు చెప్పమన్నారు.

"బాగుంది - ఈ విషయాన్నింతటితో మర్చిపో. కలలో గూడా నోరు తెరవరాదు. తెలిసిందా!" ఈ మారు కృష్ణుడు గట్టిగానే హెచ్చరించాడు. వెంటనే "బావా!" అన్నాడు భీముడు. తప్పదన్నాడు - కృష్ణుడు.

ఆ తర్వాత పక్షం రోజులకు ఛేది దేశ మహారాణి, కృష్ణుడి రెండో మేనత్త, శిశుపాలుని తల్లి, మామూలుగా అన్నగార్ని చూడటానికి వచ్చింది. "కృష్ణుని చూసింది. ఆనందంగా నుదుట ముద్దుపెట్టుకుని అసాధ్యుడివే" అభినందించింది. ఆ.... ఇంతకీ నేను వచ్చిందంటూ, మహారాణి శ్రుతశ్రవ "కృష్ణా! ఆర్యపుత్రులకు జరాసంధునిపై విశ్వాసం తగ్గింది. భీష్మకుల వారి పైనా అంతే, కాని నా కుమారుడు యువరాజు శిశుపాలుని మాత్రం వారు దగ్గరకు తీసుకుంటున్నారు.

మొన్న వాళ్ళు తిరిగి వెళ్ళిపోతూ, నా కుమారుని పిలచి "ఆందోళన చెందకు. వచ్చే మాఘమాసంలో, మూడో కంటివానికి తెలియకుండా తప్పక నీకు, విదర్భ రాజకుమారితో వివాహం జరుగుతుందని" భుజం తట్టి గట్టిగా చెప్పారు. ప్రస్తుతం, మన ప్రాంతంలో సాల్వుడే ఆయనకు పూర్తి ఆంతరంగీకుడు. ఇది నీకెలాగ తెలిసిందని అడగబోకు. మాటల్లో శిశుపాలుడే దీనిని చెప్పాడు. ఆనందలోకాల విహరిస్తున్నాడు. చివరగా జరాసంధుడు ఒక మాట చెప్పాడు. కృష్ణుడు బ్రతికినా, చచ్చినా - నీకనవసరం. నీకు మాత్రం నేను దగ్గరుండి వివాహం చేయిస్తానని, అభయప్రదానం చేసాడు.

"నిజం. ఎవరున్నా, లేకపోయినా, రాకపోయినా రుక్మిణి వివాహం తప్పక జరుగుతుంది. ఆ విదర్భ రాజకుమారి నాకు హస్తగతమౌతుంది." కృష్ణుడు అత్తకు గట్టిగా తేల్చి చెప్పాడు.

# ప్రమాదం...!

"**పా**పం. జరాసంధుడు. మారని మూర్ఖుడు. ఒక ప్రక్క నుండి తాను, మరొక ప్రక్క నుండి కాలయవనుడు, సాల్వుడు విజృంభిస్తే హహ్హాహ్హా.... మథుర నాశనం, కృష్ణుని వినాశనం తప్పదని విర్రవీగుతున్నాడు. ఇతనికి తగు బుద్ధి చెప్పాలి. అతని కుత్సిత బుద్ధిని ఆనవాలు లేకుండా చేయాలనుకున్నాడు, కృష్ణుడు.

దీనినే అధర్మమంటారు. దీనికి మందు "ధర్మ"మే అంటే శిక్షణేనని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం, తనకీ, అదే తన మనస్సుకు తప్ప మరెవ్వరికి

తెలియనివ్వరాదనుకున్నాడు. ఈ విషయం ప్రజలకు తెలిస్తే.... ఇప్పుడిప్పుడే ప్రశాంత జీవనం గడుపుతున్నవారు, ఆందోళనల పాలవుతారు.

"ధర్మో రక్షతి రక్షితః" అన్న సూక్తిని ఆచరించడమే తన ధర్మంగా అన్ని ఆలోచనలను ప్రక్కన పెట్టేసాడు. కాలచక్ర భ్రమణంలో భాగంగా వర్షాకాలం ముగిసింది. అప్పుడే జరాసంధుడు పెద్దపెట్టున తన సైన్యంతో జైత్రయాత్రకు వస్తున్నాడన్న వర్తమానం వేగుల ద్వారా విన్న కృష్ణుడు..., అయితే తనకు అందిన వర్తమానం ప్రకారం, జరాసంధుడు తానుగా, అటు సాల్వునితో కలిసి కాలయవనుడు వస్తున్నారన్నమాట. వెంటనే మహారాజుకు - ఈ విషయాన్ని చెప్పి మథుర నాశనం కాకుండా తన వారినందర్ని అప్రమత్తం చేయించాడు -

వృద్ధ రాజనీతిజ్ఞుడైన కద్రుడు "అమ్మో!" ప్రమాదంలో పడిపోయాం. ఇదంతా కృష్ణుని వలన - అనుకున్నాడు వెంటనే హస్తినాపుర, పాంచాల దేశాలకు వర్తమానం పంపితే బాగుంటుందన్న అభిప్రాయం బయలుదేరింది. కాని ఎవరి ఇబ్బందులు వారివి. అంతఃకలహాలతో భీష్ముడు, ద్రోణుని వల్ల పాంచాలుడు అశక్తతతో వున్నారు. ఇక్కడి వారెవ్వరికి, ఈ దండయాత్ర గురించి తెలియదు.

ఎందుకంటే వీరిపై విశ్వాసం సన్నగిల్లిన జరాసంధుడు సాల్వుని ద్వారా కాలయవనుని సహాయమర్థించాడు. ఆతను వీరికి తోడుగా వస్తున్నాడనగా కృష్ణుడు, "మరి దారి" రక్షణాధికారి శంఖు నడిగాడు. అందుకు సమాధానంగా "మనం వీరులము కాదా, శత్రువులనెదుర్కొనలేమా ? వీరావేశంతో" వసుదేవుడు హెచ్చరించాడు.

"ఓ పని చేద్దాం. మనవాళ్ళను ఆ వీరులకు అప్పగిద్దాం!" కంసుడు వున్నన్నాళ్ళు తల ఎత్తని సత్రాజిత్తు సలహా అది. ఏదో అదృష్టం అందలమెక్కించిన కుర్రవాళ్ళను పట్టుకుని, నీవే దిక్కంటే... ఇదిగో, ఇలాగే వుంటుంది పరిస్థితి" సత్రాజిత్తు ఆక్రోశిస్తున్నాడు. అతని మాటలకు బలరాముడు ఆపుకోలేక, "నువ్వో వెర్రిగొల్లవన్నాడు. దాంతో రభస, మహారాజు ఆ పరిస్థితిని సరిదిద్ది "కృష్ణా! ఇప్పుడేం చేద్దాం!" అతనొక్కడే రక్షకుడన్నట్లు అడిగాడు.

"మహారాజా! మీరు చూపే అభిమానానికి కృతజ్ఞుడను. కాని నమ్మకం లేనిచోట విశ్వాసముదయించదు. అదే లేకపోతే, ఫలితం - లభించదు!" అందరి విశ్వాసం కావాలన్నట్లు కోరాడు. కానీ ఇదంతా కృష్ణుని వల్లనే వచ్చింది, సత్రాజిత్తు, కద్రుల అభియోగం.

"నిజం. నిన్న మనకు కృష్ణుడు రక్షకుడు. ఇప్పుడు భక్షకుడు. ఏమిటీ మాటలు" అక్రూరుడు నిరశించాడు. అప్పుడే కొందరు మన బృహద్బలుని జరాసంథుని దగ్గరకు పంపుదాం. గతంలో ఒకసారి మనల్ని రక్షించిన అతడు, ఈ మారు తప్పక మనల్ని - ఈ - ఆపద నుండి బయటపడెయ్యగలడు. వాతావరణం వేడెక్కుతుందనటంతో, ప్రస్తుతానికి ఆ సమావేశాన్ని మర్నాటికి వాయిదా వేసారు. అప్పటి పరిస్థితి - ప్రతి ఒక్కరిలో ప్రాణభయం. ఆపద నుండి బయటపడాలనే ఆందోళన కల్గిస్తుంది. చివరికది కృష్ణుని "నా" అన్న స్వంత మనుషులలో కూడా బయలుదేరింది.

"యతోధర్మః తత జయః" అన్న సత్యం మరచిపోయారు. అన్నీ విడచి, మానవత్వం మరచినట్లు మాట్లాడుతున్నారు - ప్రవర్తిసున్నారు. అంతా గమనిస్తున్నా కృష్ణుడు - కృత్రిమాభినయానికి నవ్వుకుంటున్నాడు. వచ్చిన తమాషా.... నమ్మినవారిలోనే ఎక్కువ ఆందోళన. ఎందుకంటే... ఆ వచ్చేది... జరాసంథ చక్రవర్తి. వాడికి బాసటగా - పరమక్రూరుడైన కాలయవనుడు.

ఆ ఉదయం మామూలుగా కృష్ణుడు యమునా స్నానానికి బయలు దేరుతూంటే, తల్లిగా తన బాధను చెప్పి మూర్ఖులైన యాదవులు, తమ మనస్తత్వానికి, నమ్మకానికి విరుద్ధంగా ప్రవర్తించే సావకాశముందని చెప్పి వెళ్ళవద్దంటుంది. కానీ "బావ భీముని కోరిక తీర్చాలి కదా" అంటూ ఉద్ధవునితో కలిసి యమునా స్నానానికి వెడతాడు. దారిలో తానేదో తప్పు చేసినట్లు, నల్గురు కలిసి ఒకచోట చేరి మాట్లాడుకోవడం, వాళ్ల వెర్రితనాన్ని బయటపెట్టింది. నిత్యం తనతో స్నానానికి వచ్చే సాత్యకి కూడా ఆనాడు నదీ స్నానానికి రాలేదు. దాంతో "ఓహో!" విషయం ముదిరింది. "కథ కంచికి చేర్చాలి" అనుకున్నాడు.

ఆ సమయంలో యమునలో స్నానం చేయబోయే స్త్రీలు చంకన తమ పిల్లలతో కలిసి వచ్చి రకరకాల దుర్భాషలు, వ్యాఖ్యానాలు, రుసరుసలు... ఇష్టం వచ్చినట్లు వాగుతున్నారు. అందరి మధ్యలో కృష్ణుడున్నాడు. భీమ-ఉద్ధవులు, ఏం ప్రమాదం జరుగబోతుందోనని భయపడిపోతున్నారు.

ఇంతమందిలో నుండి ఒక పెద్దాయన "మొన్న పారిపోయావు చూడు. అలాగ పారిపోతే, నీవు లేని మమ్ము ఆ చక్రవర్తి కరుణిస్తాడేమో!"

అంతవరకు ప్రశాంతంగా వున్న పవిత్ర యమునా జలాలను చేతిలోకి తీసుకుని "నీతి, ధర్మం-జాతి-ఔన్నత్యం-దైవం మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. జరాసంథుడిక్కడికి రాడు. రాలేడు. వానివలన మీలో ఏ ఒక్కరికి ఒక్క "గీత" అయినా గీసుకుని బాధ పడరు. నా మాట నమ్మండి. మీరు ఔనన్నా, కాదన్నా, ఒప్పుకున్నా, కాకపోయినా... ఇంత జరిగాక కూడ నేను మిమ్మల్ని రక్షించలేకపోతే ధర్మం నశిస్తుంది. దైవం దారి తప్పుతాడు. సూర్య చంద్రులు గతులు తప్పుతారు. అటువంటి దురదృష్టం మీకు రాదు." నిజమైన వాగ్దానం చేస్తాడు. అది విన్నవారిలో కలకలం. అందరూ నమ్మేస్థితికి వస్తే ఈ గోపాలుడిలాగే చెబుతాడు. చివరకు ఎవరికి చెప్పకుండా ఉడాయిస్తాడు. ఒక ప్రక్కన నవ్వులు, మరొకప్రక్క వెక్కిరింతలు. గొణుగుళ్ళు సణుగుళ్ళు. అన్నీ విన్నాడు కృష్ణుడు. అది వారి పిరికితనమని నొచ్చుకున్నాడు.

ప్రతి ఒక్కరు జరగబోయేదానికి కృష్ణునిదే బాధ్యత అంటున్నారు. నిలదీస్తున్నారు. నిందలు ధర్మానికి దర్పణంగా తలిచే కృష్ణుడు భీముని హస్తినాపుర ప్రయాణానికి ఏర్పాట్లు చేసి సాగనంపడానికి ఉద్ధవునితో వెంటరాగా -

"భీముడు! చినబావా! నువ్వేదో ఇక్కడ సుఖ సంతోషాలతో వున్నావను కున్నాను. నీకంటే మేమే నయం. సరే జాగ్రత్త!" అని శెలవు తీసుకున్నాడు. ఆ తదుపరి కృష్ణుడు మనుషులలో శ్రద్ధా విశ్వాసాలు ధర్మంపై ఆసక్తి తగ్గిపోతున్నాయి. నీకు అంతేనా ? కృష్ణుడు, ఉద్ధవుని అడిగాడు.

"కృష్ణా! నువ్వీ ఉద్ధవునికి ఉద్ధారకుడివి. నీపై నమ్మకమేనాడు పోదు. శ్రద్ధా-విశ్వాసాలు తగ్గవు. గట్టిగా చెప్పాడు."

"చాలా మంచిది" అని, తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకో. నా ప్రయాణ మెక్కడికి ? అని అడగకు. ధర్మం తప్పక రక్షిస్తుంది. అదే కృష్ణప్రేమకు నిదర్శనమని ప్రతి ఒక్కరికి చెప్పు. అప్పుడే ధర్మసంస్థాపనం. దుష్టశిక్షణం జరుగుతుంది. నేను చేయబోయేది త్యాగం కాదు. ధర్మం - అది మిమ్మెలాగ రక్షిస్తుందో చూడమని, చెప్పు" అని -

ఉద్ధవుని కౌగలించుకున్నాడు. తన ఆభరణాలు ఆయుధాలనన్నింటిని ఇచ్చి, మిగిలిన కేవలం కత్తి తీసుకుని, చీకట్లో చిత్రంగా కలిసిపోయాడు. చిత్రంగా కృష్ణుడు ఆ చీకట్లో కలిసిపోవడానికి చిత్తరువులా చిత్రంగా చూస్తూ నిలబడి పోయాడు.

తెల్లవారింది. కృష్ణుడెక్కడికో వెళ్ళిపోయాడన్న వార్తా గుప్పుమంది.

ఆ... అని కొందరు, నిజమని కొందరు. అయిపోయిందని ఇంకొందరు, ఇప్పుడెలాగ ? అని మరికొందరు, ప్రాణాలు అరచేతిలోకి తెచ్చుకుని పరిపరి విధాల భయపడు తున్నారు. కాలయవనుని, జరాసంధుని తలచుకుని చెప్పలేని భయంతో గిజగిజ లాడుతున్నారు.

"మామూలే కాదురా ? ఎవరు లేకపోతే, ఎదిరించనవసరం లేకపోతే గొప్పలు. ప్రమాదం వస్తే పరుగుల తిప్పలు. ఇక మాటలనవసరం. రండి. మనమందరం మన బృహద్బలుని కలిసి జరాసంధునితో అతనికి గల - సఖ్యంతో శాంతి ప్రయత్నాలు చెయ్యమని ప్రార్థిద్దాం. ప్రస్తుతం మనకు అంతకు మించి అవకాశం లేదని, బృహద్బలుని చేరితే, వేడితే "ఇంతకుముందు నేను పనికిరాని వాడిని. ఆ కృష్ణుడు దేవుడు. ఇప్పుడతను పారిపోతే నన్ను దేవుడని అంటున్నారు. వెళ్ళండి. వెళ్ళి ఆ గోవిందుని కాళ్ళే పట్టుకోండి. పొండి" కసిరాడతడు.

ఇప్పుడేం చెయ్యాలి. అందరు ఆలోచించి, ఆలోచించి, చివరకు బలరాముని కాపాడమని కోరారు. వీళ్ళను చూస్తేనే కస్సుమన్నాడు. "విశ్వాస ఘాతకులు. బానిసత్వం నుండి, బయటపడేసి, నపుంసకత్వం చెరిపేసి, మగటిమి ప్రదర్శింప చేసిన కృష్ణునిపై నమ్మకం లేనివారిని నేనెలా రక్షించగలను ? మధుర నాశనం కాకుండా ఎన్నిరకాల కాపాడాడు. నిన్నగాక మొన్న. యాదవులని వెక్కిరించిన వారి ముందు పరువు నిల్పి, చక్రవర్తినే దిగ్బంధం చేసిన కృష్ణుడు.... మిమ్ము రక్షించలేడా ?

అవిశ్వాసంతో బ్రతికేవారిని ఆ భగవంతుడే విధంగాను రక్షించలేడు. మాకొచ్చిన నష్టము, ప్రమాదము ఏది లేదు. కర్మ. దురదృష్టవంతులనెవ్వరు బాగుచెయ్యలేరనడానికి మీరే నిదర్శనం. మీ వెనుక పనికిరాని పెద్దమ్మలు, వాజమ్మలు.... నాయకులున్నారు, వెళ్ళండి!" మీ మాటలతో కృష్ణుని గాయపరచి ఇవ్వాళ రమ్మంటే వస్తాడా... ? పొండి. కాలయవనుని చేతిలో చావండి. నేను నా కృష్ణుని వద్దకు పోతున్నాను. "సాత్యకాదుల అభ్యర్థనను కాదన్నాడు. అందరిలో భయం, పెద్దలమనే పిన్నబుద్ధుల వారి వలన మేము అన్యాయమైపోతున్నామని, శ్రీకృష్ణుని గొప్పతనం తెలిసిన సామాన్యుల వేదన!

రోజు గడిచింది. ఇంకో రోజు.... ఇలాగ కాలం గడుస్తూందే తప్ప కృష్ణుని సమాచారం తెలియకపోయేసరికి, అదొక ఆందోళన. కొందరైతే కృష్ణుడు తిరిగి

రావాలని నిరాహారదీక్షలు, మ్రొక్కులు ప్రారంభించారు. ఎక్కడకు వెళ్ళినా, ఎటుచూసినా కృష్ణుని దరహాస వదనం కనబడుతుందే కాని, కృష్ణుని జాడ తెలియక పోయేసరికి..... అందరిలో ఆందోళన, అలజడి.

సత్రాజిత్తు పదిహేనేళ్ళ కుమార్తె సత్య "నాన్నా! కృష్ణుడింక రాడంటే...!" మరొకరికైతే ప్రేగులు తెగిపోయేవి. సత్రాజిత్తు మాత్రం "వాడెక్కడొస్తాడమ్మా. చక్రవర్తి దెబ్బకు దిమ్మతిరిగి, దేశాల పట్టిపోయాడు. వాడింకంతే!" కృష్ణుడంటే గల అసహ్యాన్ని ఆ విధంగా సత్రాజిత్తు ప్రకటించాడు. కానీ అతను కనుక తిరిగి రాకపోతే, అతని కోపం, ద్వేషం మాసిపోతాయి.

గర్గాచార్యుల వంటి ప్రముఖులు, కృష్ణుని క్షేమాన్ని, మధుర సంక్షేమాన్ని కాంక్షిస్తూ యజ్ఞాలు ప్రారంభించారు. పశువుల కన్న హీనమైన - ఈ - మనుషుల ప్రవర్తనకు మండిపడ్డారు కూడా! నలభై ఎనిమిది గంటలు గడిచాయి. జరాసంధుడు తమను చంపుతాడనేకన్నా, కృష్ణుని అదృశ్యం వారికి బాధాకరంగా తయారయింది.

గద, శంఖుల వంటి వారు, మొదట్లో కృష్ణుని నిందించినా, కార్యసాధకుడైన కృష్ణుడు తమని రక్షించేవాడనుకున్నారు. కానీ ఇలాగ జరుగుతుందని వూహించ లేదు. దాంతో యాదవ ప్రముఖులలో ముఖ్యులైన కృతవర్మ, అంథరిష్ట, సాంబ వంటి వారిని సమావేశపరచమని, వారి సలహాలు మనకు సమయోచితంగా వుండగలవేమోనని, మహారాజును ప్రార్థించారు.

అందరు సమావేశమయ్యారు. అందరిని వుద్దేశించి మహారాజు "కృష్ణుని గొప్పతనం తెలుసుండి ఆయనను నిష్కారణంగా నిందించాము. ఒకప్పుడు శవసమానమైన మధుర, ఈనాడు ఇంద్రాది దేవతలకు మిన్నయిన, అమరావతిని మరపింపచేసింది. కృష్ణుని అదృశ్యంలో ఏదో ఆంతర్యం వుండి వుంటుంది. ఆతడు నిజంగా ధర్మపరిరక్షకుడు - భగవంతుడు. కనుక, మనను కరుణించమని, దర్శనాన్ని ప్రసాదించమని, ముక్తకంఠంతో ప్రార్థిద్దామన్నాడు.

అంతా నిశ్శబ్దం -

"చివరిగా చూసిందెవరు ?" అనేసరికి, "ఉద్ధవుడు" అని వసుదేవుడు చెప్పాడు. కృష్ణుడు నీకేమైనా చెప్పాడా ? మహారాజు అడిగారు. జరిగినదంతా - భీమునికి వీడ్కోలు చెప్పడంతో ప్రారంభించాడు. అంతకుముందు యమునకు వెళ్ళడం, అక్కడివారి మాటలు భరించడం. అప్పుడే వారికి అభయసూచకంగా

"ఈ కృష్ణుడు మిమ్ము రక్షిస్తాడని, జరాసంధుడు మిమ్మేమి చెయ్యలేడని అభయమివ్వడం, ఆ తదుపరి రాత్రి, నన్ను ఓదార్చి, జాగ్రత్తగా వుండమని, తనకు వునికి చెప్పక, చేతిలో ఓ చిన్న కత్తితో తాను వెళ్ళిపోయాడని, భోరుమని విలపించాడు. నిజానికి అందరి కళ్ళు కూడా చెమర్చాయి.

"మనకోసం, కృష్ణుడు ప్రాణత్యాగం చేసాడు. ఈ విషయం తెలిస్తే, జరాసంధుడు మనల్ని చంపడు. అతని పగంతా కృష్ణుని మీదే కదా!" ప్రముఖులలో ఒకడైన కద్రు అన్నాడు. కృతవర్మ-అందుకుని "నేనుండగా ఏ ఒక్కరికి అపకారం సంభవించదన్నాడు కాబట్టి, ఆయన ప్రాణత్యాగానికి సిద్ధబడడు" తన అభిప్రాయం చెప్పాడు.

"చాలా తప్పు చేసాను. నేను నిజమైన గోపబాలునిగా, రక్షకుని ఎదుట పిరికివానిగా ప్రయత్నించాను. విశ్వాసంలేని నా వంటివారు బ్రతుకరాదు!" సాత్యకి ఘొల్లుమని ఏడ్చాడు.

అప్పుడు మథుర వీడి మహోపకారం చేసాడు కానీ, ఇప్పుడటువంటి దానివలన ప్రయోజనం లేదు. కాలయవనుడు, జరాసంధుడు కలిసారంటే ప్రళయమే తప్ప, ప్రశాంతి కనబడదు. కృష్ణుడు, జరాసంధుని శరణు పొందడానికి పౌరుషహీనుడు కాడు. మరి.... ఇలాగ సాగుతున్న ఆలోచనలకు "గర్గాచార్యులవారు, సాల్వుని ద్వారా కాలయవనుని కలుసుకోడానికి వెళ్ళాడేమో!" అనగా "కాలయవనుడా ?" వణుకు, దడ.... ప్రతి ఒక్కరిలో కనిపించింది.

పూర్వపు నగర రక్షకుడు గదుడు "ఆచార్యా! క్షమించండి. మిమ్మల్ని ప్రశ్నించాలని కాదు. కృష్ణుడు అక్కడికే వెళ్ళివుంటాడని - "అదా, నీ సందేహం. కృష్ణుడు అదృశ్యమవడానికి ముందు అయిదు రోజులు, ప్రతి నిత్యం నా దగ్గరకు వచ్చి కాలయవనుని గురించి అడిగితే, నా వయసు నాటి విషయాలు చెప్పాను. అంతా విన్న కృష్ణుడు మేమిద్దరము ఏకోదరుల మన్నాడు. అదేమిటంటే - ఇద్దరికి "ధర్మం" సమానం. కాకపోతే ఒకరికి రక్షణ, మరొకరికి శిక్షణ, ఆ భగవంతుడు నిర్దేశించాడన్నాడు కాబట్టి, కృష్ణుడు ఎవరి వల్లనైతే ఉపద్రవముంటుందని తలచాడో, అతన్ని మట్టిగరపడానికి బయలుదేరి వుంటాడు. ఆ విషయం తెలిస్తే ఏ ఒక్కరు వూరుకోరు. తెలియకపోతే ఎక్కడికి వెళ్ళాడోనని ఆందోళన పాలవుతారు, అదే కృష్ణ ప్రేమ - "మాయ" గూడా, లీలా మానుషధారి కదా - ఆ "ప్రభువు' అని ముగించాడు.

"అమ్మో! కాలయవనుని కంటబడితే, అనాంధరిష్టుడు భయపడిపోయాడు. ఇది విన్న బలరాముడు కాలరుద్రుడయ్యాడు. "ఉద్ధవా, లే. కాలయవనుని పీఠం నాకు తెలుసు. తుదముట్టిద్దాం! "ఇదికాదు మనస్థానం. కృష్ణుడెక్కడుంటే అదే మన నిలయం" అన్నాడు. అయితే "అన్నా! నేనూ వస్తానన్నాడు సాత్యకి."

అడుగు ముందుకు వేస్తుంటే "బలరామా, దయచేసి కృష్ణుని కాపద సంభవిస్తే అది మనకే. చస్తే అందరూ చద్దాం. వుంటే, అందరం వుందాం. నా మాట విను!" బలరాముని చెయ్యి పట్టుకుని మహారాజు అర్థిస్తూన్నాడు. అక్కడ సమావేశమైన ముఖ్యమైన యదు ప్రముఖులందరు. "నిజం, నిజం" అన్నారు.

అందుకు మేమందరం సిద్ధం. మరణానికి భయంలేదు. మనకు కావాల్సింది, కృష్ణుడే!" అనగా, "అవునవును" అంటూ జై గీతికల వలె కృష్ణనామం ప్రారంభించారు.

"ముందు మనం బలరామ, సాత్యకి, ఉద్ధవులను కృష్ణుడి జాడ వెదుక్కు రమ్మని పంపుదాం. కృష్ణుడు కనబడగానే మన ప్రార్థనను చెప్పి, అందరం కలిసి, వీరోచితంగా, కాలయవనాదులను ఎదుర్కొందామందాం!" వసుదేవుడు, చేయవలసిన కార్యాన్ని చెప్పాడు. ప్రతిదానికి తలలూపే వారందరు "ఔనౌను" అన్నారు.

అందరిలో ఉత్కంఠ. కృష్ణుడు తిరిగి వస్తాడా ? మనల్ని క్షమిస్తాడా ? మనం మళ్ళీ కలుసుకుంటామా ? రకరకాల ఆందోళన, ముసురుకునే అలల వంటి ఆలోచనలు. మళ్ళీ మనం కృష్ణుని చూస్తామా ? మనకా అదృష్టం వుందా ? తృణీకారభావం, అనవసర విరుపులు, విసుర్లు పోయి గోవిందుని కోసమే హృదయస్పందన వుందని, అది నిలబడగల్గడం - కృష్ణుని సందర్శనం వల్లన'నే అని ప్రతి ఒక్కరు తీర్మానించుకున్నారు.

మూడు నాళ్ళు గడిచాయి. నాల్గవనాడు పాంచజన్యం ధ్వని వినిపించింది. వేసారిన హృదయాలు విప్పారాయి. ఆ శంఖారావం విన్న వారందరూ, కృష్ణుడు వచ్చేశాడనే ఆనందానికి లోనయ్యారు "జయ జయ ధ్వానాలు ప్రారంభించారు. కృష్ణుడు సామాన్య దుస్తులలో గోపబాలుడుగా వున్నాడే తప్ప "గో" సంరక్షకునిగా, గోవిందునిగా లేడు. అయినా ప్రజలలో ఆనందం.

తల్లిదండ్రులకు, మహారాజుకు, తన నిర్ణయం వల్ల కలిగిన పరిస్థితికి క్షమాపణలు చెప్పి "శ్రద్ధా-విశ్వాసాలు నశిస్తే, లభించే ఫలితాన్ని రుచి చూసారు. అదే మనమందరం కలిస్తే కొండలనైనా పిండి చెయ్యగలం. మీ ముందు గోవర్థన

గిరి చాలా తేలిక. అదే విశ్వాస రాహిత్యమైతే, అవసరానికి పట్టుకున్న గొడుగు కూడా బరువే అనిపిస్తుందన్నాడు.

ఆ తదుపరి - ప్రముఖులందరితో సమావేశం ఏర్పాటుచేసారు. దానికి అందరితోపాటు బలరామ-కృష్ణులు, సాత్యకి, ఉద్ధవుడు కూడా యథావిధి హాజరయ్యారు. అందరు జయ కీర్తనలు సలుపుతూంటే "జయము కృష్ణునిది కాదు, ధర్మానిది. దానికి మూలమైన విశ్వాసము, అందుకు ఆధారమైన శ్రద్ధ ఫలించాయి. జయించా"యన్నాడు.

అందరు జరిగిన దానికి బాధపడ్డారు. మేమంతా నీ ఆశ్రితులం. మమ్మ రక్షించడం, మధురను చరిత్రపుటలలో శాశ్వతమొనరించడం - నీ"విధి" అన్నారు. ప్రతి ఒక్కరు పొగడుతున్నారు. లీలా.... అనగానే...

"చూడండి. లీలలనేవి, మన విశ్వాసానికి చిహ్నాలే తప్ప వినోదాలు కావు. అవి మనకు బలహీనతలు కూడా కారాదు. ఎవరో వస్తారని ఎదురు చూడకుండా, ప్రతి ఒక్కరు తమ పౌరుషాన్ని ప్రదర్శిస్తే, ఆ పరాత్పరుడైనా మన ముందు నిలబడలేడు. అదీ ధర్మం. ఇది తెలుసుకుంటే చాలు. ఎంతటి గొప్పవాడైనా అతడు అధర్మపరుడైతే, అతడు శాశ్వతుడు కాడు, కాలేడు. అతని జీవితం అర్థాంతరంగా ముగుస్తుంది. చెప్పుకునే వాళ్ళు లేకుండా మట్టిలో కలిసిపోతాడే తప్ప మనుగడ, ఎప్పుడూ, ఎక్కడ కనబడదు. అది గుర్తుంచుకుటే, మనము - మన జన్మలు ధన్యమంటాడు.

అతి త్వరలో జరాసంధుని కంటే ముందరే కాలయవనుడిక్కడకు వస్తాడు. అతను వచ్చేలోగా ఆత్మరక్షణార్థం - మనమిక్కడనుండి మన సర్వసంపదలతో తరలిపోవాలి" అన్నాడు - ఇప్పటికిప్పుడు ఎక్కడికి పోతాం ?" ఇది మహారాజు ప్రశ్న. నేను ఎవ్వరిని పారిపొమ్మనడం లేదు, మన సర్వస్వాన్ని భద్రపరచుకుని, అప్పుడు కాలయవనుని ఆగడాలను, అతని దిమ్మతిరిగేలా అణిచి వేద్దాం. ప్రస్తుతం అందుకు అనువైన స్థలం కుశస్థలి. అది మన రక్షణ కేంద్రమని చెప్పాడు.

నిజం చెప్పాలంటే, అది అన్న బలరామునిది. అయినా ధర్మ రక్షణా మూర్తిగా, దానిని పూర్వపు మహరాజు కకుద్మంతుని కిచ్చేసాడు. ఆతడు మనకు విధేయుడు. మన ఆజ్ఞాబద్ధుడు. అలాగే ఆ మహారాజు తన కుమార్తెను రాజ్యాన్ని అన్నకివ్వాలనే సంకల్పంలో వున్నాడు. కాబట్టి మనకే సమస్య ఉత్పన్నం కాదు.

"అది దూరం కదా" అంటాడు సత్రాజిత్తు. అందుకు కృష్ణుడు యమలోకం కంటే అదే మనకు దగ్గర, దారి!" అని ముగించాడు.

ప్రస్తుత పరిస్థితులలో ఈ మథుర మనకు అనువైనది కాదు. అందుకే ఇది విడిచిపెడుతున్నాం తప్ప ఇక్కడనుండి పారిపోవడం లేదు. ఆలోచించండి. ఆ మొరటు మూర్ఖుని బారి నుండి బయటపడాలంటే, ఇదే సురక్షితమైన ఆలోచన..!"

"కాదంటే... ? కద్రుని అనుమాన ప్రశ్న.

"ఇక్కడే సమాధి అవుదాం. ఈ శిథిల శకలాలలో ఎవరు కట్టకుండా సమాధి అయిపోదాం!" అన్న కృష్ణుడు "అన్న బలరామునికి, ఉద్ధవునికి, కుశస్థలి దారి తెలుసు. అందర్ని సురక్షితంగా అక్కడికి చేరుస్తారు" అన్నాడు.

"మరి నువ్వో....!" మహారాజు అనుమానంగా అడుగుతాడు.

"మీ అందర్ని - శుభ - శుభ్ర స్థలాలలో వుంచి అప్పుడు నేను ఈ మథురను విడిచిపెడతాను. అంతవరకు పిరికివాడిలాగ, మథురను విడువను. అనుకోని అవాంతర మేర్పడితే, కాలయవనుని చంపి కాని నేను కదలను. మీకందరికి శుభములు కూర్చుటయే, నా అవతార లక్ష్యమంటాడు. కనుక -

"మహారాజా! మీ ఆదేశాలనివ్వండి. కేవలం నాలుగే నాలుగునాళ్ళ సమయముంది. సోమవారం ఉదయం అందరు క్రొత్త జీవితంలో అడుగుపెడ్తారు. ఆనందప్రదులై సంచరిస్తారన్నాడు.

# సురక్షితం - మన జీవితం

**అ**తి ప్రయాసలతో అడవులు, కొండలు, కోనలు పట్టి, కుశస్థలికి, మథుర యావత్తు, ప్రముఖులతో కలిసి బయలుదేరింది.

ప్రతి ఒక్కరు, తమ తమ స్థాయిలో ప్రయాణం ప్రారంభించారు. నిషాదులు, నాగులు, ఇతర సైనిక వర్గాలు, పెద్ద మహోత్సవానికి వెడుతున్నట్లు బయలుదేరారు. దారిలో కొంతమంది, కష్టపడలేనివారు, శ్రమకోర్చనివారు మరణించారు. మొత్తానికి అందరు ఏవో.... కొద్ది.... ఇబ్బందుల నధిగమించి "లవణిక" నదీ తీర ప్రాంతానికి చేరారు.

అందరూ నదిని సురక్షితంగా దాటారు. కాని గోగణాలతో, ఇతర వస్తు సామగ్రితో, ఆ నదిని పూర్తిగా దాటాలంటే కనీసం నాల్గుదినాలు పడుతుంది. రాత్రయింది. కృష్ణుడు సాత్యకిని పిలచి, నేను బయలుదేరు తున్నానన్నాడు. అదేమంటాడు సాత్యకి.

"సాత్యకీ! ప్రస్తుతం ప్రమాదం పొంచి వుంది. ఒకటి రెండు రోజులలో, మనం ఈ నదిని దాటేలోగా, కాలయవనుని సేనలు మనల్ని చుట్టుముట్ట వచ్చును" అన్నాడు. మార్గదర్శకుడు కూడా అదే చెప్పాడు. రాత్రిపూట కనుపించే ఆ కాంతులు - ఉరుములు - మెరుపులు కావు సైనిక సిబ్బంది సంచారం జ్యోతులు. వీళ్ళందరు దాటాలంటే కనీసం నాల్గుదినాలు కావాలి. కాబట్టి వీళ్ళందర్ని విడిచిపెట్టి మనం ముందుకు సాగుదాం.

అదే తప్పు. కృష్ణుడు ధర్మరక్షకుడు కానీ అధర్మ రక్షకుడు కాడు. ఇందులో ఎవరు పరాయివారు కారు. అందరు మనవాళ్ళే. కనుక మీరు మెల్లిగా రండి. ఈలోగా నేను కాలయవనుని కలిసి, చెప్పవలసింది చెబుతాను, చేయవలసింది చేస్తానంటాడు.

ప్రమాదం పొంచి వుందన్నావు. మా ప్రాణాలన్ని మీపైనే జాగ్రత్తంటాడు సాత్యకి. "ఫర్వాలేదు. మీరు జాగ్రత్త," కృష్ణుడు బయలుదేరుతాడు, ప్రభూ, జాగ్రత్త. వాడు దుర్మార్గుడు. చంపేస్తాడు.

"ఫర్వాలేదు. పాతబట్టలు తీసి క్రొత్తబట్టలు కట్టుకున్నట్లు మరో శరీరం దొరకుతుంది. ధైర్యంగా వుండు. ధర్మం జయిస్తుంది. అధర్మం నశిస్తుంది. అతడు నన్నే కాదు మిమ్మల్ని ఏం చెయ్యలేడు. కాలాతీతం పనికిరాదని, భయంవలదని పరుగు పెట్టినట్లు బయలుదేరుతాడు. అందరికి అన్నీ చెబుతాడు. అనునయిస్తాడు. ఆశీర్వదిస్తాడు.

"మీరంతా ఐక్యంగా, ధైర్యంగా వుండాలి. అప్పుడు వెయ్యిమంది జరాసంధులు, పదివేలమంది క్రూర-కాలయవనులైనా మిమ్మల్నేం చెయ్యలేరు. దీనికి శ్రద్ధా - విశ్వాసాలవసరం. అనవసర ఆందోళనలు భయకారకాలే తప్ప - బ్రతుకు విజయాలు కావు! "అని చివరిసారిగా హెచ్చరికగా ఆజ్ఞ జారీ చేసి బయలుదేరుతాడు. ఆ.... ఉద్ధవుడు ధర్మమూర్తి - సాధుమూర్తి. అతని ధైర్యం మీ అందరికి శ్రీకృష్ణ రక్ష. ఎవ్వరు దేనికీ భయపడకూడదు. మృత్యువు కాలం.

దానికి పరిణామం, పరిమాణం. మనం భయపడితే, ప్రతీదీ మనల్ని భయపెడతుంది. అదే ఎదిరిస్తే తోక ముడుచుకుంటుంది. ఇదే నా ఆశీఃపూర్వక ఆదేశం లేదా సందేశం.

తనకై ఎదురుచూస్తున్న గుఱ్ఱమెక్కి రాత్రి భాగంలో కృష్ణుడు చీకట్లో కలిసి పోయాడు. సాత్యకి చెప్పలేని దుఃఖానికి గురయ్యాడు. ఇంతటి ప్రేమమూర్తిని, ఇన్నాళ్ళు... ఆపుకోలేని రుద్ధకంఠంతో, నోరు బిగించి కల్గిన బాధను దిగమ్రింగు తున్నాడు.

తెల్లవారేసరికి కాలయవనుని శిబిరానికి చేరిన కృష్ణుడు, మథురను వశం చేయడానికి వచ్చానని తెలిపాడు. ఈ వార్తను విన్న కాలయవనుడు కంగారు పడిపోయాడు. తన ఎదురుగా నిల్చిన కృష్ణుని కాలయవనుడు ఆశ్చర్యంగా చూసాడు. అతన్ని తేరుకోనివ్వాలని "ఓ యవనరాజా! నేనే కృష్ణుడును, మథుర వాసిని, గర్గాచార్యుల వారి శిష్యుని, శూర వంశీయుడను, వసుదేవ సుతుడను. అన్నీ విన్న యవనుడు -

"ఓహ్! నువ్వే నా జరాసంధుని అల్లుడు కంసుని చంపిన గొల్లపిల్లవాడివి. భలే.... భలే...!" అన్నాడు.

"అవును. నేనే. మథురాపుర యాదవుల తరపున ఆ నగరాన్ని స్వీకరించమని చెప్పడానికి వచ్చాను. ఇందుకు నువ్వు శ్రమపడవలసిన పనిలేదని, మథుర నీకోసం వేచి వున్నదని తెలుపడం నా ధర్మంగా తలచాను. జరాసంధునికి ముందు నువ్వు ఆక్రమించుకున్నావనుకో, అది నీదవుతుంది. కాదంటే, అది ఆతని దవుతుంది. అలా కాకుండా వుండాలంటే మథురకు దారి చూపవచ్చిన నాతోరా, ప్రశాంతంగా యాదవపురాన్ని పొందుదువుగాని!

"నిజమా, నాటకమా ?" ఎందుకంటే నిన్ను నా చేతులతో నలిపి చంపుతానని, మిత్రుడు జరాసంధునికి మాట ఇచ్చాను. దానికి విరుద్ధంగా శ్రమ లేకుండా నువ్వే వచ్చావు. పైగా మథురను ధారాదత్తం చేస్తానంటున్నావు. ఇది నమ్మాలా, వద్దా ? అన్నది, నా ప్రశ్న" అని కత్తిపై చెయ్యి పెట్టాడు. కృష్ణుని మాటలలో మర్మం కనబడలేదు. తన సేనాధిపతులలో, ఒకర్ని - కృష్ణుని జాగ్రత్తగా కనిపెట్టి వుండమని మిగిలినవారిని సంప్రదించాడు. ఆ మర్నాడు, కృష్ణుని

పిలిపించి, జరాసంధునికంటే ముందు మనం ఎలాగ మథురను చేరగలం ? ఆశగా కాలయవనుడు అడిగాడు.

ప్రస్తుతం అతను "నిరాశా నిస్పృహలలో వున్నాడు. మీకు నేను దగ్గర మార్గం చూపుతాను. ఆ దారిలో మనం తొందరగా మథురను చేరవచ్చును. మామూలుగా అయితే ఎంత త్వరగా వెళ్ళిన కనీసం ఇరవై రోజులు కావాలి. నా మార్గంలో అయితే అంతకాలం పట్టదు." అంటున్న కృష్ణునితో - కాలయవనుడు-

"నువ్వు చెప్పేది నిజమని నాకేమిటి నమ్మకం ?"

"నాతో వస్తే, నేను చెప్పింది నిజమని తెలుస్తుంది. ఇక్కడ కూర్చుని నిజమా ? అంటే.... నిజం కూడా... నిజం కాదు. కాబట్టి....

"అయితే వస్తాను. ఇందులో ఏ మాత్రం మాయా మర్మాలున్నా నిన్ను నిలువునా కాల్చేస్తానన్నాడు. ఆ సంగతి నాకు తెలుసు" బయలుదేరమన్నాడు కృష్ణుడు.

"నువ్వు చంపడానికి సిద్ధంగా వుంటే, నేను చావడానికి సిద్ధంగా వున్నా"నన్న కృష్ణుని మాటలకు ఫక్కున నవ్వాడు. నీవంటి ధీరోదాత్తుని నేనింతవరకు చూడలేదని, ప్రశంసించాడు.

రెండురోజులపాటు, కృష్ణుడు, ఆతని మార్గదర్శిగా కాలయవనుని ఆ అడవులలో త్రిప్పాడు. ~~ఈ~~ దారిలో ~~ఈ~~శాన్య దిశగా సాగితే మథుర తొందరలో వస్తుంది. ఇలాగ మూడురోజులు గడిచాయి. ~~ఈ~~పాటికి మన వారందరు నదిని దాటి వుంటారని కృష్ణుడు సంతృప్తిని పొందాడు. ఇలాగ తిరిగి, తిరిగి, అయిదవ నాడు వారు, తిరిగి, కాలయవనుని శిబిరానికి వచ్చారు.

కృష్ణుడు చెప్పినట్లు అందరు దారి మార్చారు. కృష్ణునితో నలుగురు సాయుధులైనవారు ఆతని గుర్రం మీద ప్రయాణిస్తున్నారు. ఏ మాత్రం కృష్ణుడు వాళ్ళకళ్ళ నుండి దాటడానికి వీల్లేకుండా చూసుకుంటున్నారు.

కాలయవనుడు అనుమాన పిశాచి. కృష్ణుడు దెబ్బ తీస్తాడనే భయంతో ముందు జాగ్రత్తలు తీసుకుంటూంటే, ఏ భయం లేకుండా కృష్ణుడు వారినిఅనుసరిస్తున్నాడు.

..........

# కాలయవనుడు

**కొ**న్నాళ్ళు ప్రయాణించిన కాలయవనుని సేనలు మథురకు పోవు ప్రధాన మార్గంలో ప్రవేశించాయి. ప్రతీదీ సూక్ష్మదృష్టితో చూసే కాలయవనుడు గమనించి ఆ ప్రాంతాన్ని ఇక్కడ నుండి ఎవరో పెద్ద గుంపులు, గుంపులుగా వెళ్ళారని గ్రహించాడు. గుర్రాలు, ఏనుగులు, ఇతర రవాణా వస్తువులు, వంట సామగ్రి, పశుసంపద..లతోపాటు, నక్కలు పీక్కుతిన్న శవాలు, ఆహారాన్ని తీసుకున్న ఛాయల్ని గమనించి, తన సైనికులను, ఆ ప్రదేశమంతా జాగ్రత్తగా పరిశీలించమని హెచ్చరించాడు.

ఆ పరిసరాలన్నింటిని వెదకిన సైనికులు, దగ్గరలో ఒక పాకలో వున్న ఇద్దర్ని చూసి, వాళ్ళను తమ రాజుగారి వద్దకు తీసుకు వచ్చారు. వాళ్ళు తిండికి మొహం వాచి, కేవలం చర్మం కప్పిన ఎముకల గూడులా వున్నారు. వాళ్ళు భయంతో వణికిపోతున్నారు. ఇటు ఎవరైనా వెళ్ళారా ?'' అని గద్దిస్తే, ప్రాణ భయంతో వణికేవాళ్ళు "చాలామంది గుంపులు, గుంపులుగా వెళ్ళారు. రథాలు, గుర్రాలు, పశువులు ఇప్పుడు కాదు, ఎప్పుడో వెళ్ళారని చెప్పారు.

"ఎంతమందో చెప్పగలవా ? వాళ్ళెవరో తెలుపగలవా ?'' తెలియదని తల అడ్డంగా తిప్పారు. ఆ రాజెవరో చూడటానికే భయంకరంగా వున్నాడు. చెప్పనలవి కాని సేన. వినసొంపులేని గొంతుక. దీనికి తగ్గట్లు "చెప్పండి.'' అని వీళ్ళు కనుక నిజం చెప్పకపోతే నాలుక కోసెయ్యమని తన సైనికాధికారికి చెప్పాడు.

ఆ భయపడే ఎముకల గూడు మనుషులు, బోర్లా పడుకుని, "మహా ప్రభో ?'' మాకేమి తెలియదు. మా మాట నమ్మండి. మేము నిజమే చెబుతున్నామని ఏడుపు ప్రారంభించారు. కాకపోతే వాళ్ళందరు కూడా, ఒకే ఒక్క పేరును ఉచ్చరిస్తున్నారు. జయ జయ ధ్వానాలు చేస్తున్నారు.

"అలాగా! ఏమిటో ఆ పేరు ?'' కాలయవనుడు అడిగాడు.

"అది, అది... ఆ "కృష్ణ వాసుదేవా!'' చెప్పారు వాళ్ళు.

అది వినడంతో వెర్రెత్తిపోయిన కాలయవనుడు కృష్ణుడెక్కడున్నాడోనని వెనక్కి చూసాడు. ఆ వెంటనే అతన్నిక్కడకు తీసుకు రండి! ఆజ్ఞాపించాడు. కృష్ణుడు తన గుర్రంతో అతని దగ్గరకు వచ్చాడు. ఇతన్ని చూపి, "ఇతనేనా ?'' అని అడిగాడు. తిన్న అన్నం, పెట్టిన ప్రేమ, గుర్తుకు వచ్చిన వాళ్ళు, సమాధానం

చెప్పడానికి తటపటాయిస్తున్నారు. ఇదంతా చూసిన కృష్ణుడు, కాలయవనుని ప్రక్కకు వచ్చి "ఇది పద్ధతి కాదు. అమాయకులైన వారేం చెబుతారు ? నేనిటు వచ్చిన మాట నిజం. అదీ ఒక నెలరోజుల క్రితం'' అంటాడు.

"అప్పుడు నీతో ఎవరున్నారు ?'' కాలయవనుడు అడిగాడు. అతని సమాధానానికి, సమాధానం చెప్పడానికి వీలుగా కత్తిపై తన చేతిని సిద్ధంగా వుంచాడు.

"ఇంకెవరుంటారు, యదువీరులు, మథుర ప్రముఖులు.

"అయితే నువ్వు నాతో అబద్ధం చెప్పావన్నమాట!'' చేతిలోకి కత్తి తీసుకున్నాడు.

"నేనెప్పుడు, ధర్మ విరుద్ధంగా ప్రవర్తించను. అబద్ధం చెప్పను. ఆ సంగతి ముందు ముందు నీకే తెలుస్తుంది. నేను చెప్పింది, నిజం. నీ కోసం మథుర ఎదురు చూస్తాంది. దక్కించుకోమని చెప్పాను. అదీ జరాసంధుడు రాకమునుపు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ అదేమాట.

"అయితే, నువ్వు... అందర్నీ దాటించేసి, ఆ శిథిల - నిర్జీవ మథురను నన్ను చేకొనమంటావా ? ఏం చెయ్యానా "శవ సమాన'' మథురను ?'' కత్తి ఝళిపిస్తూ కృష్ణుని ఎదుర్కొనబోతే, అంతవరకు ఎంతో ప్రశాంతంగా ఓపిక పట్టిన కృష్ణుడు, ఒక్కసారి గుఱ్ఱాన్ని అదిలించాడు. కృష్ణుని కరస్పర్శతో, తల విదిలించింది. గట్టిగా సకిలించింది. ముందుకాళ్ళపై లేచింది. ఎదుటివారు పరిస్థితి నూహించుకుని వెంటబడటానికే మాత్రం సావకాశమివ్వకుండా దౌడు తీసింది.

**"హయరింఖాముఖ ధూళిదూసరః పరిన్యస్తాల కోపేతమై**
**రయజాతశ్రమ తోయ బిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో"**

అని పోతన మహాశయుడు, ఒకానొక సందర్భములో, శ్రీకృష్ణుని కీర్తించి నట్లు, అరివీర భయంకరుడై, అదను చూచి ముందుకు సాగిన కృష్ణుని ప్రయత్నమడ్డలేని కాలయవనుడు, ఆతని సేనావాహిని, నోరప్పగించి చూస్తూ తెప్పరిల్లి ముందుకు చూసేసరికి -

దక్షిణాభిముఖంగా సాగే, ఆ గుఱ్ఱపు దౌడుకు రేగిన దుమ్ము, ఆ ప్రాంతమంతా కప్పబడి, గుఱ్ఱం చప్పుడు, కృష్ణుడు - "ఆతని అశ్వరూపం కనబడక, అయినా పళ్ళు పటపట కొరుకుతూ, కృష్ణుని పట్టుకోవడానికి, గుఱ్ఱాలను "అశ్వ''ధాటితో, అశ్వ శక్తితో, ముందుకురికించారు. అదొక పరుగు పందెం. పట్టుకోవాలని ఒకరు. పట్టుతప్పి వెక్కిరించాలని మరొకరు.

సాయంకాలమయ్యేసరికి కృష్ణుడు కాస్త విశ్రాంతి తీసుకోవడానిక వీలుగా వుండే ప్రాంతంలో ఆగాడు. గుఱ్ఱాన్ని ఒక ప్రక్కన కట్టడానికి కావలసిన గడ్డి, నీరు అందించి మెత్తగా వున్న గడ్డిమీద అలాగ కళ్ళు మూసుకుని పడుకున్నాడు. మాగన్నుగా కునుకు, తీరా కళ్ళు తెరిస్తే, గుర్రం నడక చప్పుడు. సన్నగా వింటున్నా ఆ డెక్కల శబ్దాన్ని బట్టి, దూరంలో గుఱ్ఱమాగి వున్నట్లు, తననెవరో వెంబడి స్తూన్నట్లు కృష్ణుడు పసిగట్టాడు.

రాత్రి అలాగ గడిపిన కృష్ణుడు, వెలుతురు వస్తుంటే అడుగులో అడుగు వేసుకుంటూ, ముళ్ళు, రాళ్ళను దాటి నడుస్తూ, నడుస్తూ, తనను వెంటాడే వారి గుఱ్ఱం సకిలింపును విన్నాడు. ఆ ప్రక్కనే తన గుఱ్ఱం కూడా వుంది. "ఎక్కడికి వెడతావు ?" కోపంగా అరుపు, తనవైపే వస్తూన్న అడుగులు... అవి కాల యవనుడివి. ఇదే సరియైన సమయంగా తలచి, పరుగెత్తాడు, కానీ, సూర్యోదయం కావడం, అడవిలోనే సూర్యకాంతి దారి స్పష్టంగా చూపించడంతో, ఒక ప్రక్కన దాగి క్షణకాలం వూపిరి తీసుకున్నాడు.

ఆ వచ్చేవాడు కాలయవనుడే గట్టిగా తీర్మానించుకున్నాడు. ఆ క్షణంలో అసలే భారీకాయం, దానికి రకరకాల ఆయుధాలు. ఆ బరువు భరించలేక ఒక్కొక్కటే కృష్ణుని వైపు విసురుతున్నాడు. వాటినుండి తప్పించుకుంటూ, ప్రక్కదారి కోసం కృష్ణుడు చూడసాగాడు. కొద్ది దూరంలో ఓ చిన్నకొండ, దానిపై గుహలు. అదేదో బాగుందనుకుని, అటువైపు పరుగు ప్రారంభించాడు.

కృష్ణుని పట్టుకోవాలనే కసి నరనరాల్లో పెరిగిన ఆ భారీకాయుడు కాలయవనుడు "కృష్ణా! ఆగు, ఆగు" అంటూ కృష్ణుని వెంబడిస్తున్నాడు. ముందు కృష్ణుడు ఆ వెనుక కాలయవనుడు.... చూడముచ్చటగా వుంది ఆ పరుగు తీరు. లేడిలాగ ఒకరు దూసుకుపోతుంటే, ఏనుగులా మరొకడు అడుగులు వెయ్యలేక అవస్థ పడుతున్నాడు.

కృష్ణుడు కొండ దిగువ భాగానికి వచ్చి ఆగి వెనక్కి చూసాడు. కాలయవనుడు ఆయాసపడుతూ "కృష్ణా! ఆగు, ఆగు" అంటూ వుసూరుమని వస్తున్నాడు. అదే అదనుగా కృష్ణుడు సునాయాసంగా కొండనెక్కడం ప్రారంభించాడు. అదీ మంచిదేననుకుని కాలయవనుడు కూడా కొండ క్రిందకు చేరి మెల్లగా ఎక్కడం ప్రారంభించాడు.

పూర్తిగా పైకి ఎక్కిన కృష్ణుడు “కాలయవనా, రా!” కొండగుహలోకి దూరాడు.

ఇంక వీడెక్కడికి పోతాడు. నాకు చిక్కినట్లేనని, కాలయవనుడు మెల్లిమెల్లిగా ఎక్కుతున్నాడు. ఆ ఎక్కడంలో బరువు తగ్గించుకోవడానికి, కృష్ణుడు కనబడినప్పుడల్లా తన వద్ద గల వివిధాయుధాలను విసిరాడు. ఇప్పుడు కృష్ణుడు, కాలయవనుడు కూడా నిరాయుధులే!

“కొండపైన ఆరు గుహలు వున్నాయి. వాటి ముందర అగ్ని ప్రజ్వరిల్లించి వుంది. నెమ్మదిగా నడుస్తూ వెనక్కి చూసిన కృష్ణుడు, కాలయవనుడు ఆయాసపడుతూ, కొండ సగభాగంపైకి వచ్చాడు.” వాడు రానీయ్ అంటూ ఆరు గుహల్లోను పెద్దదైన మధ్యగుహ వద్ద ఆగాడు. లోపలికి తొంగి చూసాడు. లోపల తీగ సాగినట్లు ఓ భారీకాయం, పూర్తి నగ్నంగా, నేలను తాకే పెద్ద పచ్చటి గడ్డంతో నిద్రపోతున్నట్లున్నాడు. శరీరమంతా మట్టి కొట్టుకుపోయినట్లు బూడిద రంగులో వుంది. ఓ మూల అగ్నిహోత్రం. పూర్తిగా లోపల అడుగుపెట్టి పరిస్థితిని గమనించిన కృష్ణుడు తన నడుముకు చుట్టుకున్న పీతాంబరాన్ని, ఆ మనిషి వంటిపై కప్పాడు. ఆ గుహలోనే చీకటి ప్రాంతంలో దాగాడు.

కొద్దిసేపు గడిచింది. అతి ప్రయాసతో, అయాసపడుతూ వచ్చిన కాలయవనుడు, కృష్ణుడు అనుకున్నట్లు గుహలో అడుగుపెట్టాడు. ఎదురుగ్గా పడుకున్న వ్యక్తిని చూసి “ఆరి దొంగా! ఇక్కడ, ఇక్కడ పడుకున్నావా ?” అంటూ పిడిబాకును తీసి, ఒక్కపోటు పొడిచాడు. ఆ దుర్మార్గానికి కళ్ళు తెరచిన ముసిలాయన, కాలయవనుని చూసాడు. ఈ పెద్దాయన మణికట్టు నుండి రక్తం కారుతుంది. ఆ పెద్దాయన ఉగ్రుడయ్యాడు. కాలయవనుని చేతిని మెలితిప్పి, ఒక్కతోపు త్రోసాడు. కత్తిలా ఎగిరి, అంతటి భిల్లనాయకుడు, ఎగిరి ఒక మూలపడ్డాడు. ఒక్క నొక్కు నొక్కితే, ఆ పెద్దాయన పట్టును భరించలేక కోపంతో మండిపోతూ అరుస్తుంటే, ఈ హడావుడికి ఓ నల్గురు దిగంబర వ్యక్తులు పరుగెత్తుకుంటూ వచ్చారు. కాలయవనుని రక్తపు మడుగులో పడి కొట్టుకునే వరకు చావగొట్టారు. అంతే, అంతటి వ్యక్తి మారు మాట్లాడక చచ్చాడు.

ఆ పెద్దాయన వీడినెత్తి ఒక్క విసురు విసిరితే, ఆ విసురుడికి కొండ దిగువున పడ్డాడు. చచ్చాడని ప్రత్యేకంగా ఎవరికి చెప్పనక్కర్లేదు. అప్పుడు మెల్లగా ప్రక్కన దాగున్న కృష్ణుడు బయటికి వచ్చాడు. ఈ పెద్దాయనకు వందన

మాచరించాడు. ఆతని వినయ విధేయతల భక్తికి, కొంచెము కోపం తగిన ఆ ముసిలాయన "నువ్వెవరివి, ఎందుకొచ్చావని ?" అడిగారు. తన పీతాంబరం నుండి ఒక పీలికను తీసి, ఆయన మణికట్టుకు కట్టుకట్టి "నా పేరు కృష్ణుడు. వసుదేవ సుతుడిని, లోకులు వాసుదేవు"డని కూడా అంటారన్నాడు.

"కృష్ణుడు, వాసుదేవుడని తనలో తను ఒకసారి గొణుక్కుని, ఈ పేరు ఎక్కడో విన్నాం. ఎక్కడ ? ఎక్కడ ? అని "భద్రా" అని పిలిచాడు. పేరు చెప్పి, ఇదెక్కడ విన్నాం మనమని అడిగాడు. అతను క్షణమాలోచించి "ప్రభూ! దాదాపు రెండు సం॥ల క్రితం, మనం ప్రభాస తీర్థానికి వెళ్ళినప్పుడు, అక్కడివారు ఇక్కడో మహావీరుడున్నాడు. అతడు, మృత్యుదేవతను జయించాడు. అతడు మగధ చక్రవర్తి.... (పేరు గుర్తు రావడం లేదు) అతనికి ప్రాణభిక్ష పెట్టాడు" అని చెప్పారు. అతనిపేరు కృష్ణుడు. వసుదేవసుతుడైన వాసుదేవుడన్నారు. ఆ... ఆ... అది అది విన్న పెద్దాయన.

"నువ్వు వాసుదేవుడివంటున్నావు ? తప్పుకదా.. అన్నట్లు చూసాడు.

"నేను కృష్ణుడను, వసుదేవసుతుడు, వాసుదేవుని, కనుక - అలాగ చెప్పానని అంటాడు. నేను యమపురికి వెళ్ళాను. యముని శిక్షించాను. గురుదేవులు సాందీపుని పుత్రులను తీసుకు వచ్చాను. మీరన్న ఆ మాగధుడు - జరాసంధుని, అన్న బలరాముని చేతినుండి విడిపించి, ప్రాణభిక్ష పెట్టించాను. అయినా వాడికి బుద్ధి రాలేదు. మీరెత్తి పడేసిన కాలయవనుని ద్వారా నన్ను చంపాలని చూసాడు. అన్నీ తెలిసిన నేను, అధర్మ నాశక మూర్తిగా, మీ ద్వారా వాడిని వధింప చేసానన్నాడు.

వాళ్ళందరు చాలా సంతోషించారు. ఆ తదుపరి కృష్ణుడు కొంత సమయం చూసి "మహానుభావా!" తమరి సంక్షిప్త చరిత్ర, ఇక్కడ వుండటానికి గల కారణ మడుగుతాడు.

"వీటిని ముచికుంద మహర్షి గుహలంటారు. మేమిక్కడకు వచ్చేసరికి, బహుశః మీ నాన్నగారు జన్మించి వుండరు. ఈ సత్యయుగపు మహాను భావుడీయన. కుళ్ళు, దుర్మార్గ, కుత్సిత ప్రపంచం నుండి దూరంగా వుండటానికి మేమిక్కడ వుంటున్నాం. ఆ రోజుల్లో ఇంద్రుడికి సాయబడి, అనంతరం విశ్రాంతి కోసమిక్కడకు వచ్చి, ఇక్కడే వుండిపోయాం. ఈ గుహలలో వుంటున్నాను కాబట్టి అందరు నన్ను "ముచికుందుడు" అంటున్నారు. నిజానికా ముచికుందుడిని నేనే.

విన్నాడు. అన్నీ వున్న నేను సర్వసంగ పరిత్యాగినై, యుద్ధాలతో, అలసిపోయి, ప్రపంచానికి, దాని పరిణామాలకు దూరంగా ఇక్కడ వుంటున్నాను. ఈ ప్రపంచంపై గల అక్కసును, ముచికుందుడు ప్రకటిస్తే -

"మన్నించాలి. మీకే చెప్పేటంత సాహసం నేను చెయ్యను కానీ, జీవితం నిస్సారం కాదు, లోకం..... మోహం, మోసం కాదు. ఇది వారి వారి మనో ప్రవృత్తులను బట్టి లభించే ఫలం. ధర్మం శాశ్వతం. దీనినే "అనాది సిద్ధ"మంటారు. దీనికి మార్పు వుండదు. సత్యం - నిత్యం. దీనిలోను మార్పు లేదు. వున్న మార్పు కేవలం బుద్ధులలో మాత్రమే. సద్బుద్ధులు, బుధులు, బుద్ధులు అవుతున్నారు. కాని వారు ఏమి కాకుండా కాలగర్భంలో కలిసి పోతున్నారు. అజ్ఞానులు దీనిని వేదాంతమంటే, బుద్ధిమంతులు "ధర్మ ప్రకాశంగా" అభివర్ణించి ఆనందిస్తారు.

విన్న ముచికుందుడు "కుమారా! ఇంకా పరిపక్వ దశకు రాని వయస్సు నీది. అప్పుడు, ఇందాక చెప్పిన వేదాంతం, నిజ జీవితానికెంతవరకు అన్వయిస్తుందో అనుభవించి చెప్పు. నేను అప్పటివరకు ఇక్కడే వుంటాను. తప్పక ఇక్కడికి రా. ఎప్పుడు వచ్చినా నీకు, నా హార్థిక స్వాగతం లభిస్తుంది. జీవితాన్ని ముగించుకోవాలనే ఆలోచనకు మూలం, దయనీయ రూపం "ధర్మం". ఇది -

"మహానుభావా! మన్నించాలి. మీకు చెప్పేటంత పెద్దవాడిని కాను. కాలమాన పరిస్థితులు కొంత తమ ప్రభావాన్ని మనపై చూపుతాయి. అంతెందుకు, ఇప్పుడు ఒక యుగం గడిచిపోయింది. మీరు చూసిన యుగపు - పరిస్థితులు.... ఈ ద్వాపరంలో సంభవమా ? ఆలోచించండి. ఇది అనర్థకము, అన్వర్థకమైతే, ఆ బ్రహ్మ ఎందుకు సృష్టి కొనసాగిస్తాడు. ఆ పర బ్రహ్మ ఎందుకు అనుమతిస్తాడు ?"

"అలాగా! నువ్వు నీ జీవితాన్నెలాగ గడపాలనుకుంటున్నావు ?"

"ధర్మం నిలిచినంత వరకు - నిలుప గలనన్న కాలం వరకు. అధర్మానికి, అంతంగా, ధర్మానికి - పునరంకితంగా ప్రవర్తిస్తాను. ఇది సత్యం -

**అధర్మానికి హాని కల్గిన, అనఘా! దుష్టుల నాశమ్ము శిష్టుల రక్షణమ్ము**
**అవని చేయగ నిల్చినాను. అదియేనాదు జీవితమ్ము జీవనమ్ము.**
**ఎంతటి వారికైనా, వారి ధర్మము, వినాశము కోరి పొందు**
**సుంత వినుడీ కృష్ణుడు! వాది-ఆశావాది కాడు, కాడు**

అయినా, ఆ పెద్దాయన కృష్ణుని మనసు చదువలేకపోయాడు. అందుకు గల కారణం - కృష్ణునికి గల "భక్తి," పరాభక్తి - లక్షణములే!

నేను చెప్పిన సత్యం తెలుసుకొనుటకు మీరీ ప్రాంతం విడిచిపెట్టి, కుశస్థలికి వెళ్ళండి. అక్కడ మీరనుకున్న ధర్మాన్ని నిలబెట్టండి. ఆ ధర్మ పరిరక్షణా కార్యక్రమంలో ధర్మమూర్తిగా నేను సాయపడతాను. గతంమీది. వర్తమానం నాది. భవిష్యత్ నిర్దేశకుడను నేనే. కాలయవనుని మరణంతో, ఈ అడవి మూర్ఖులు, మిమ్మల్ని ప్రశాంతంగా బ్రతుకనివ్వరు. ఇది మిమ్ము భయపెట్టడం కాదు. సత్య ప్రకటనం.

ప్రస్తుతానికి కృష్ణుడు వారితో వుండదలిచాడు. వారి వలనే ఆకార, వేషభాషలను మార్చి - విభూతి ప్రియుడై, రుద్ర ధ్యానంతో మహాదేవుని స్మరిస్తూంటే, అక్కడున్నవారు, ముచికుందులు ఆశ్చర్యపోయారు. కొద్ది వారాలు గడిచాయి. అందరు కలిసి ప్రభాస తీర్థంలోని సోమనాథుని దర్శించాలని బయలుదేరితే, కృష్ణుడు వారిననుసరించాడు. అందరి వలెనే హిరణ్యానది సంగమ ప్రాంతంలో స్నానం చేసి, శివ దర్శనం చేసాక, అక్కడి ప్రజల మాటల్ని విన్నాడు.

దీంతో, ముచికుందులవారి అనుమతి తీసుకుని, మళ్ళీ తాను కలుస్తానని ఒకనాటి కుశస్థలికి, నాటి ద్వారకకు బయలుదేరాడు. అక్కడ ద్వారకలో, యాదవులలో ఆనందాన్ని, వారి నూతన గృహాలను, అభివృద్ధిని చూసి ఆనందించాడు. ఇదంతా "కృష్ణమాయ" లీల అని ఏ ఒక్కరికీ తెలియదు.

నగర పొలిమేరలకు వెళ్ళేసరికి, "స్మశాన నిశ్శబ్దం" కనబడింది.ఏమై వుంటుంది. ఇది కృష్ణునిలోని ఆందోళనకు కారణమయింది. ఓ మాట, వులుకు పలుకు లేదు. ఏమయింది ? వూళ్ళోకి వెళ్ళాడు. ఎక్కడా అలికిడి లేదు. ఇది నిశ్శబ్ద విప్లవమా ? లేక - ఆలోచిస్తూ.... ఒకచోట ఆగాడు. స్త్రీ - పురుషులు మౌనంగా వస్తున్నారు. కృష్ణుడు నిల్చుని చూస్తున్నాడు. అప్పుడు - అక్కడికో వృద్ధమాత వచ్చింది. ఎక్కడా నవ్వు కనబడటం లేదు. అలాగని ఏడుపులేదు. కడుపులో తీరని దుఃఖం పెట్టుకున్నట్లున్నారు. ఆమెను గుర్తించాడు. ఆమె మరెవ్వరో కాదు. మథురానగర సంరక్షకుడు "శంఖు" భార్య. అప్పుడు -

అప్పుడు - అమ్మా! శూరశ్రేష్ఠుడు. వసుదేవుని ఇల్లెక్కడమ్మా!" అని అడిగాడు. కృష్ణుని వాలకం చూసి "ఓ తపోధనా! అలాగ వెళ్ళి, కుడివైపు తిరగండి.

ఒక పెద్ద భవనం కనుపిస్తుంది. అదే వసుదేవులవారి మందిరం'' చెప్పిందామె! పొరపాటున అక్కడికి వెళ్ళి భిక్ష మాత్రం అడగకండి. వాళ్ళు తెలియని విచారంలో వున్నారు.'' అని ఎవర్నో పిలచి, ఈ మహర్షికి, భోజనాదులు చూడమని కోరింది.

"అసలేం జరిగింది. ఊరంతా ఇలాగ వున్నారంటే, ఏదైనా జరగరాని ప్రమాదం జరిగిందా ? అందరు క్షేమమే కదా!'' వాళ్ళ ఆందోళనకు వత్తాసుగా అడిగాడు. అంతా క్షేమమే ఒక్క మా కృష్ణుడు, తప్ప!

"ఏమయింది, మీ కృష్ణునికి ? వాళ్ళ చర్యకు కారణం తెలిసిపోయింది కాబట్టి, మామూలుగా అడిగాడు. సమాధానంగా ఆ తల్లి -

"మేమంతా మథురలో వుండేవాళ్ళం. మాకందరికి ప్రమాదమని తలచిన మా కృష్ణుడు, మా అందర్ని తెలివిగా ఇక్కడకు చేర్పించాడు. అంతవరకు బాగానే వుంది. రెండునెలల క్రితం, అదృష్టముంటే కలుసుకుందామని, ఆ కాలయవనుని ఢీకొంటానని వెళ్ళిన వ్యక్తి. అంతే! మళ్ళీ మాకు కనబడలేదు. మేమంతా ఇక్కడ సుఖంగా ఆ మా కృష్ణుని వల్ల వుంటే, మా కృష్ణుడు మా నుండి దూరమయ్యాడు. అందుకే ఆ తిరిగిరాని కృష్ణుని తలచుకుంటూ, ఈ సంతాపం.'' ఆమె చెబుతున్న తరుణంలోనే, అయితే మీర్కెడి నుండి వచ్చారని ? అడిగాడు.

"మా మనోమందిరంలో వున్న కృష్ణుని భౌతిక దృష్టితో దర్శించడానికి వీలుగా ఓ కృష్ణ మందిరాన్ని నిర్మించుకున్నాం. అక్కడ నుండే వస్తున్నాం!'' ఆపుకోలేని దుఃఖంతో, రుద్ధకంఠంతో చెబుతుందా తల్లి.

వాళ్ళ ప్రేమానురాగాలకు చలించిపోయిన కృష్ణుడు మాయా మానుష విగ్రహుడు "ఇప్పుడే వస్తా''నంటూ అక్కడనుండి కదిలాడు. చివరి నిముషంలో సాత్యకితో చెప్పిన మాటలు, ఇచ్చిన సందేశం - ఈ విధంగా ప్రేమానురాగాల్ని ప్రభవింప చేసింది. ఆ తల్లి నోట వింటూ పులకించి పోయాడు. చలించాడు కూడా. పైగా ఆ తల్లి అన్న మాటలు -

"మా కృష్ణుడు విదర్భ రాకుమారి రుక్మిణిని ప్రేమించాడు. ఆ తల్లి ఇతనిని ప్రేమించింది. వెళ్ళి ఆమెను తెచ్చుకున్నా బాగుండేది. అలాగ కాక, తన స్వసుఖాలన్ని విడచి, మాకోసం ఆ ఘోర, మొరటు - కాలయవనుని ఢీకొన్నాడు. రెండునెలలు గడిచిపోయింది. వుంటే తిరిగి రాడా ? అదే మా బాధ'' అని వారి బాధను చెప్పిన తీరు, కృష్ణుని కదిలించి వేసింది.

గబగబ తన ఇంటిముందు ఆగాడు. అదొక మందిరంలాగ వుంది. అక్కడ అందరు వున్నారు. కృష్ణుడు ముందుకు వెళ్ళి దర్శనం చేసుకోవచ్చా ? అని అప్పుడు కనుపించిన ఆడవాళ్ళను అడిగాడు. ఆమె ఈ యోగినొకసారి చూసి "వెళ్ళవచ్చును కానీ, పూజ అయిపోయిందే - అంది. "శుభమస్తు" కృష్ణుడు ఆమెను చేయెత్తి ఆశీర్వదించాడు. ఆ తీరు, చూపులు ఎక్కడో చూసినట్లు అనిపించిందామెకు. ఎక్కడ చూశానబ్బా! ఆలోచిస్తుంది.

కాస్త రద్దీ తగ్గాక, దేవకీమాతను చూద్దామనుకుంటూ, విశాలంగా వున్న ప్రక్కగదిలోకి చూసాడు. అందమైన సింహాసనం, దానిమీద పీతాంబరధారిగా, శంఖ-చక్రాలతో, నయనానందకరంగా అలంకరించిన, తన విగ్రహమే! తన ఆయుధాలన్ని కూడా అక్కడ వున్నాయి. అందరు వెళ్ళిపోయారు. ఆ సింహాసనం దగ్గర కేవలం ముగ్గురో - నలుగురో నలుగురు నిలబడి వున్నారు. తీరా చూస్తే వాళ్ళు

అమ్మ దేవకి, పెదతండ్రి అక్రూరులు, త్రివక్ర, అందరు ముక్తకంఠంతో-

**"హే కృష్ణా! గోవిందా, హరే మురారీ**
**హే నాథా! నారాయణ, వాసుదేవ**

గుండె నిండుగా, గొంతు విప్పి పాడుతున్నారు. ఆ గానంలో ఆర్ద్రత, ఆవేశం కల్గి వున్నాయి. నిజానికా హరి, ఈ గానంతో తప్పక ఇక్కడ ప్రత్యక్షమవ్వాలి. అంత మధురంగా, భక్తి భావమయంగా వుందా గానం, ఆ వాతావరణం. అది విని కృష్ణుడు తట్టుకోలేకపోయాడు. ఇక వారిని బాధపెట్టకూడదలిచాడు. వెంటనే-

"అమ్మా! నీ కృష్ణుడు వచ్చాడమ్మా. దేవకీ నందనుడు వసుదేవుల పుత్రుడు, నంద - యశోదల గారాల పుత్రుడు వచ్చి - మీకోసం ఇక్కడే వున్నాడమ్మా!" ఆ అమృతపు జల్లు వంటి మధురవాక్కులకు, ఆ ముగ్గురు విస్మయంతో తలలు త్రిప్పారు. ఈ బాలయోగిని - యోగీశ్వరేశ్వరుని దర్శించారు.

అందరిలో త్రివక్ర చేతిలోని, తాళాలను పడేసింది. పరుగు పరుగున వచ్చింది. కళ్ళు నులుముకుంది. మరల మరల ఆ యోగీశ్వరేశ్వరుని చూసిందే తడవుగా "కృష్ణా! కృష్ణా! యదుభూషణా!" ఆతని పాదాలపై అలాగే పడిపోయింది. ఆమెను లేవనెత్తేలోగా -

దేవకి, అక్రూరుడు - ఒక్క ఉదుటున పరుగెత్తినట్లిటు తిరిగారు. ఏడ్చి ఏడ్చి కళ్ళు వాచిపోయిన ఆ తల్లి "కృష్ణా" అంది. అక్కున చేర్చుకుందామనుకుంది. ఆ ఆనందం అనిర్వచనీయం. అవ్యక్తం.

"గోవిందా!" అంటూ ఒక్క అడుగువేసిన ఆ తల్లి ఆనందంతో స్పృహ తప్పి పడిపోయింది.

ఆ పడిపోయే తల్లిని గట్టిగా పట్టుకుని "వచ్చానమ్మా! ఇక మిగిలింది నీ కానందమేనన్నాడు. తల్లిని పొదివి పట్టుకున్నాడు.

అక్రూరుడు - ఇన్నాళ్ళు పొందిన మానసికవేదనను విడిచి - "గోవిందా, ముకుందా, మురారి" అని సభక్తియుతంగా చేతులు మోడ్చాడు.

# ఆందోళన...!

**జ**రాసంధ చక్రవర్తి, తన ప్రతిజ్ఞానుసారం, మథుర వినాశానికి బయలు దేరాడన్న వార్తా రుక్మిణిని కలవరపరచింది. పరమ దుర్మార్గుడు వాడు. వాడి ప్రయత్నాలు నాశనం కావాలనుకుంది. అయితే.... తన కృష్ణుడు... ఇది ఆమె ఆలోచన. పైగా చక్రవర్తి కాలయవనునితో చేతులు కలిపాడుట. యాదవ నాశనం చూడాలన్నది చక్రవర్తి ధ్యేయంగా కనబడుతుంది.

"తాతగారూ ?!" అంది రుక్మిణి.

"ఏం చేస్తాం ?!" ఆ వృద్ధరాజు మౌన సమాధానం.

ఇది జరిగిన తదుపరి కార్తీక మాసంలో, ఆచార్య శ్వేతకేతుల వారి శిష్యులు అప్లవ, బహ్నులు, కుండినీపురానికి వచ్చారు. వీరిద్వారా కృష్ణుడు యాదవులను మథుర నుండి కుశస్థలి వైపు తరలిస్తున్నారుట. అదీ వార్త! ప్రస్తుతం ఆచార్యులు అవంతిలో - పరమగురు శ్రీ సాందీపులవారి ఆశ్రమ నిర్వహణం చూస్తున్నారు. ఆచార్యులు పంపిన సందేశంతో, రుక్మిణి ఎంతో సంతోషించింది. కాని ప్రస్తుత పరిస్థితి ఆమెకు ఆందోళన కారకమయింది.

కార్తీకం వెళ్ళిపోయింది. మార్గశిరం ప్రవేశించింది. జరాసంధుని ముట్టడి, యాదవుల పరిస్థితి ఏ మాత్రం తెలియడం లేదు. ఉన్నట్టుండి పుష్యమాస

మధ్యలో, జరాసంధుడు నిర్జీవ మధురకు వెళ్ళినట్లు, దానిని మళ్ళీ ఎవరు వుపయోగించుకునే సావకాశం లేకుండా, శిథిలావస్థకు చేర్చినట్లు వుంది. యాదవుల గురించి, ఏమీ తెలియకపోయేసరికి వాళ్ళంతా క్షేమంగా వున్నారని తలచింది. అయితే వాళ్ళెక్కడ వున్నారు ?

పరిస్థితులెంత దారుణంగా తయారయ్యాయంటే, అన్న రుక్మి, వదిన సువ్రతలు అగ్గిగుగ్గిలంగా వున్నారు. మగధ చక్రవర్తితో బాంధవ్యం, వారి మధ్య చిచ్చు పెట్టింది. అయితే ప్రస్తుతానికి, ఆ వివాహ బంధం భగ్నమవడంతో, సువ్రత ప్రశాంతతను పొందింది. భర్తతో సఖ్యంతో, రుక్మిణిని అలక్ష్యం చెయ్యసాగింది. కృష్ణుడు... ఆతని గురించి తెలియలేదు. తాతగారు ఏమీ చెప్పలేని అశక్తు డయ్యాడు. అంతా అగమ్యగోచరంగా వుంది. ఏం చెయ్యాలి ? ఏమిటి నా పరిస్థితి ? ఇది ఆమె ఆలోచన.

ఈ సమయంలో జరాసంధ చక్రవర్తి నుండి సందేశం. అది శుభవార్తగా, తనకు గిట్టనివారు పొంగిపోతున్నారు. "అక్షయ తదియ" నాడు స్వయంవరానికి ముహూర్తమట. వైశాఖ శు. తదియ నాటికి అందరు వచ్చి స్వయంవరంలో పాల్గొనాలని, జరాసంధ చక్రవర్తి కోరిక ప్రకారం, ఆహ్వానాలు పంపబడుతున్నాయి. ఇదే రకంగా చక్రవర్తి, ఛేది దేశాధిపతునికి కూడా వర్తమానం పంపి, స్వయంవరానికి సిద్ధంగా వుండమని వర్తమానం పంపాడు.

అంతా విన్న రుక్మిణి, రక్తం కారేటట్లు పళ్ళు కొరుక్కుంది. ఏం చెయ్యాలి తోచడం లేదు. తనకు రక్షకుడెవరని తీరని దుఃఖానికి గురయింది. చావు తప్ప మరో మార్గం కనబడక నిరాశకు గురయింది. కానీ, ఎక్కడో మిణుకు మిణుకు మనే ఆశ. నా కృష్ణుడు తప్పక వస్తాడు. నన్ను రక్షిస్తాడు. ఈ ఆశ ధైర్యమయింది. దాంతో బహ్ను, ద్వారా కృష్ణునికో సందేశం పంపింది.

అది తీసుకుని అవంతికి వచ్చి ఆచార్యులకిచ్చాడు. ఇంకా ధైర్యం చాలక, కరవీపుర యువరాణి శైబ్యకు వర్తమానం పంపింది. ఆ సందేశాల్ని అప్లావుడు కరవీరపురానికి తీసుకు వెళ్ళాడు. చివరి ప్రయత్నంగా రుక్మిణి అగ్నిజ్యోతుల వారిని తన ప్రతినిధిగా పంపింది. ఆయన ఆఘమేఘాలమీద శ్వేతకేతువు వారి ద్వారా ద్వారకకు వెళ్ళాడు. శ్రీ కృష్ణ ప్రభువును కలిసాడు. విషయాన్నిలాగ వివరిస్తున్నారు.

రుక్మిణీ కుమారి తన సందేశంలో -

**"శ్రీయుతమూర్తియోపురుష సింహము! సింహము పాలిసొమ్ము, గో**
**మాయువు గోరుచందమున, మత్తుడు చెద్యుడు నీ పదాంబుజ**
**ధ్యాయనియైన నన్ను వడిదాఁగొనిపోయెదనంచు నున్నవా**
**డాయధమాధముండెఱుగ డద్భుతమైన భవత్ప్రతాపముల్!**

అంటుంది. అంతేకాదు, గోవిందా...

**వ్రతముల్ దేవ గురుద్విజన్మబుధ సేవల్ దానధర్మాదులున్**
**గత జన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుగాంక్షించి చే**
**సితి నేనిన్ వసుదేవనందనుడు నా చిత్తేశుడౌగాక ని**
**ర్జితులైపోదురుగాక సంగరములోఁ జైదీశముఖ్యాధముల్**

**దేవకీ సుతు కోర్కెతీగలు వీడంగ వెలదికి మైదీగె వీడదొడగె**
**గమల నాభుని చిత్తకమలంబు వికసింప గాంతి నింతికి ముఖకమలమొప్పె**
**వారు విరోధికిలోన మదనాగ్ని వొడచూప బొలతికి జనుదోయి పొడవు సూపె**
**శౌరికి ధైర్యంబు సన్నమైదయ్యంగ జలజాక్షి మధ్యంచు సన్నమయ్యె**

**హరికి ప్రేమమధికంబుగా జేశ**
**బంధమధిక మగుచు బాలకమరి**
**జన్మ నయను వలన బ్రమదంబు నిండార**
**నెలత యౌవనంబు నిండియుండె ॥**

వాసుదేవా అలాగే వింటున్నావా -

**"అంకిలి సెప్పలేదు చతురంగ బలంబులతోనెల్లియో**
**పంకజనాభ! నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా**
**వంకకు వచ్చి రాక్షస వివాహము నన్ భవదీయ శౌర్యమే**
**యుంకువసేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొనిపొమ్ము వచ్చెదన్**

కాబట్టి -

**నెలిమిమావారు పంపుదురేమనట్లు**
**పురము వెలువడి యేతెంచి భూతనాథు**
**సతికి మ్రొక్కంగ నీవు నా సమయమునకు**
**వచ్చి కొనిపొమ్ము నన్నునవార్య చరిత ?**

అంతేకాదు - స్వామీ -

**"ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబులు కలిమి యేల**
**పురుషరత్నమ! నీవు భోగింపగాలేని తనులతవలని సౌందర్యమేల**
**భువనమోహన! నినుబొడగానగా లేని చక్షురింద్రియముల సత్వమేల**
**దయితా! నీ అథరామృతం బానగా లేని జిహ్వకు ఫలరస సిద్ధియేల**
**నీరజాతనయన! నీవనమాలికా**
**గంధమబ్బలేని ఘ్రాణమేల**
**ధన్యచరిత... నీకు దాస్యంబుసేయని**
**జన్మమేల యెన్ని జన్మములకు."**

**"భూషణములుసెవులకు బుధ, తోషణములనే జన్మ దురితాఘునిని**
**శ్శోషణములు మంగళతర, ఘోషణములు గరుడగమను గుణభాషణముల్**
**లోపలి సౌధంబు లోనవర్తింపగ దేవచ్చునే నిన్ను నెత్తునేని**
**గావలివారల గల బంధువుల జంపి కాని తేరాదని కమలనయన**
**భావించితే నిను సాయంబు చెప్పెద నాలింపు కుల దేవయాత్ర జేసి**
**నగరంబు వెలువడినగజాతకును మ్రొక్కఁబెండ్లికి మునవిడ పెండ్లికూతు**

అప్పుడు నన్ను - చేకొని పోవచ్చునంటూ.... రుక్మిణి.

**కన్నియమీద నా తలపు గాఢము కూరుకురాదు రేయినా**
**కెన్నడు నా వివాహము సహింపక రుక్మి తలంచు కీడునే**
**మున్నె యెఱుంగుదున్ బరుల మూకలడంచి కుమారి దెత్తు నీ**
**దృన్నుత! మానుద్రచ్చి నవవహ్ని శిఖన్ వడిదెచ్చు కైవడిన్**

అన్న రుక్మిణీలో మరల సందేహము పెరుగ - సందేశ మందిందో - లేదోనని -

**ఘనుడా భూసురుడేగెనోనడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో**
**విని కృష్ణుండిది తప్పుగా దలచెనో విచ్చేసిన్ యీశ్వరుం**
**డను కూరింపదలచునో తలపడో యార్యామహాదేవియున్**
**ననురక్షింప నెఱుంగునో యెఱుంగదో నా భాగ్యమెట్లున్నదో॥**

ఈ విధంగా క్షణక్షణము, కృష్ణుని తన భాగ్యమును తలచుకుని బాధపడు రుక్మిణిని అగ్నిద్యోతులవారు -

**"విను రుక్మిణీ, భీష్మక పుత్రీ, రుక్మిణీ**
**నిను తప్పక మూడు లోకము లేకమైనను**
**దన ప్రేమను పంచి యిచ్చు వల్లభుడై కృష్ణుడు చే**
**కొను, కరుణగావు, కరము పట్టు సత్యము సుమ్మ!"** అని వూరడించాడు.

స్వయంవర సంబర దినం - అక్షయ తదియ ఇంకా మూడు రోజులు వుందనగా, దమఘోషుడు, వరుడు శిశుపాలుడు అట్టహాసంగా పెద్ద సంబరంగా వచ్చారు. అంత ఘనంగా వారిని స్వాగతించారు. అంతా కోలాహలం. పండుగ వాతావరణం. తండ్రి మనస్తత్వం తెలిసిన శిశుపాలుడు తన జాగ్రత్తలో తాను వున్నాడు.

అవంతీ యువరాజుతో అనువిందుడు, శ్రీ శ్వేతకేతులు వచ్చారు. మరో యువరాజు విందుడు కొన్ని అనివార్య కారణాల వలన రాలేకపోయాడని ఈ యువరాజు తెలిపాడు. వైశాఖ మొదటినాడు, పాడ్యమి నుండే విందులు - వినోదాలు ప్రారంభమయ్యాయి. ఆటపాటలు సరేసరి.

మర్నాడు స్వయంవర మంటపాన్ని వేదవేత్తలైన బ్రాహ్మణులు, తగు పూజాదికాలతో ప్రారంభించారు. జ్యోతిష పండితులు - అభిజిల్లగ్నంలో - స్వయంవరం నిర్ణయించారు. అక్షయ తదియనాడు ఉదయం వివాహ సంబరానికి అంకురార్పణం జరుగుతుంది. కుండినపురానికి యోజనం దూరంలోగల పూర్ణా నదీ జలాలు, తపతీ నదిలో కలిసే సంగమ ప్రదేశంలో అన్నపూర్ణాదేవి మందిరం వుంది. ఆమె భోజుల కులదేవత.

సాంప్రదాయం ప్రకారం, స్వయంవరంలో పాల్గొననున్న రాజకుమారి, ముందు తమ కులదైవాన్ని దర్శించి, అర్చించాలి. ఆ తదుపరే స్వయంవర వేడుకలలో పాల్గొనాలి. ఇది తరతరాల సంస్కృతీ ఆచారం.

సరిగ్గా ఆ ఉదయం వేళ. మధుర నాదం. వీనులవిందైన నాదం. మనసులు కొల్లగొట్టే నాదం. ఇంకా నిద్రలేవని రాకుమారి కర్ణపుటాలకు సోకిందా గాన మాధుర్యం. పెండ్లికూతురుని చేయడానికి తగు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వదిన సువ్రత పెద్దరికం తీసుకుంది. రుక్మిణిని అలంకరించారు. రాకుమారి అందగత్తె. వధువు అలంకరణంలో అందం మరింత ఇనుమడించింది. అందుకు దిష్టి తగులకుండా బుగ్గను నల్లటి దిష్టిబొట్టు పెట్టారు. అందరికి పెడతారు. కానీ, ఇది కూడా అందమైన రుక్మిణికి, మరింత అందాన్ని ఇచ్చింది. వున్న అందాన్ని ఇంకాస్త పెంచింది.

ఇక్కడ శుభముహూర్తంలో, వేదవిదులు స్వస్తివాచకాలు, మంగళ సూక్తాలు చదువుతూంటే, మంగళ వాయిద్యా ఘోష మిన్నుముట్టుతూంటే, రుక్మిణీ కుమారి, అందంగా అలంకరించిన రథమెక్కింది. భావి మహారాణి సువ్రత, ఇతర యువరాణులు కూడా రథాన్నధిష్టించారు.

ముందు ఎనిమిది రథాలలో వివిధ రాజ్యాలకు చెందిన యువరాణులు వివాహ బృంద గీతాలు ఆలాపిస్తుంటే, మహోత్సాహంగా రుక్మిణీకుమారి రథం వయ్యారంగా బయలుదేరింది. ఈ రథానికి ముందు వెనుక గూడా కొందరు సైనికులు రక్షణగా కాలినడకన అడుగు వేస్తున్నారు.

రుక్మిణిని చూసిన సువ్రతా బాధపడుతుంది.అంతా దైవేచ్ఛ. మన చేతిలో ఏమీలేదనే వేదాంతంతో ఆలోచనలు సాగుతూండగానే అన్నపూర్ణాదేవి ఆలయం వచ్చేసింది. అక్కడ తగు మర్యాదలతో పెండ్లికుమార్తైయైన రాకుమారిని కరవీరపుర కులగురువు రుద్రాచార్యులవారు, ఆచార్య శ్వేతకేతులు, గర్భగుడిలోనికి తీసుకు వెళ్ళారు. మిగిలినవారు వారిని అనుసరిస్తున్నారు.

గర్భగుడిలో నేతి దీపాలు తప్ప మరే విధమైన పెద్ద దీపాలూ లేకపోయేసరికి లోపల కొద్దిగా మసక వెలుతురుగా వుంది. పెండ్లికూతురు పూవులు తీసుకుని, మోకాళ్ళ మీద కూర్చుని అమ్మవారిని అర్చిస్తుంటే, వేదమంత్రాలు సుస్వరంగా వినవస్తున్నయి. ప్రదక్షిణ మార్గంలో అమ్మవారి విగ్రహం వద్దకు రుక్మిణిని తీసుకు వెళ్ళారు.

రుక్మిణి ముకుళిత హస్తాలతో "అమ్మా!" అంది మాట్లాడలేక పోతుంది. దీనంగా ప్రార్థించింది. ఆ సమయంలో చిత్రమైన గుఱ్ఱపుడెక్కల చప్పుడు అది.... అది... తేరుకుని అందరు అటువైపు చూసారు.

అదెవరో కాదు. అందరి ప్రాణం, అందరి దైవం. రుక్మిణి ప్రాణమైన నాథుడు - కృష్ణుడు - అది చూసిన శ్వేతకేతు - రుక్మిణి అటు సాగారు. రథం సిద్ధంగా వుంది. రుక్మిణి సిగ్గు విడిచిపెట్టింది. వీరనారిగా, ఆ రాకుమారి పరుగు పరుగున కృష్ణుని రథం చేరింది. ఒక్క ఉదుటున అందులోకి దూకింది. రుక్మిణి నందుకున్నాడు. తన చేతిలో బంధించాడు. ఆమె వున్నపాటున చిత్రంగా కృష్ణుని సన్నిధిలో, చేతిలో వాలింది.

బాహుకుని చేతినుండి పగ్గాలు తీసుకుని గుఱ్ఱాలను అదిలించాడు. ప్రభువు పరాక్రమానికి సంతోషంతో, రుక్మిణి మాతను పొందిన ఆ గుఱ్ఱాలు, రథాన్ని ఆఘమేఘాలమీద తీసుకుపోతున్నాయి. నదిని దాటారు. అప్పుడు.... కృష్ణుడు తన పాంచజన్యాన్ని పూరించాడు.

అంతవరకు కృష్ణుని బెడదలేదని వూరట చెందిన వారందరు, పాంచజన్య శంఖారావంతో తొట్రుపడ్డారు. కృష్ణుడని.... ఒక్క ఉదుటున, ఎలాగ వున్నవారు అలాగే లేచారు. ఈ పాంచజన్యారావం మిత్రులకు ఆనందదాయకం, శత్రువులకు ప్రాణసంకటమై కూర్చుంది.

కృష్ణుడు... కృష్ణుడు... కృష్ణుడు.. ఒకే కంగారు. దడ. వణుకు. ఈ విషయం వచ్చిన వారందరికి తెలిసింది. వున్నవారికి తెలిసింది. ఒకరికి భయం. ఒకరికి మోదం.

# కమనీయ కల్యాణ పండుగ

**రు**క్మిణి సముద్రాన్ని తదేక దృష్టితో చూస్తుంది. ఒకటి కాదు, రెండు కాదు. గడచిన దినాలలో తాను పొందిన అనుభవాలన్ని బొమ్మల వలె కదలాడు తున్నాయి. ఎన్ని చిత్రహింసలు, ఎంత మానసిక సంఘర్షణ, ఎన్ని నిద్రలేని రాత్రుళ్ళు ఎన్నో జన్మల వలె.... బాధల, గాథలు!

కృష్ణుడు ఆమెను ఎత్తి రథంలో వేసుకున్నాడు. గుర్రాలను అదిలించాడు. సకిలిస్తూ, కృష్ణుని కరస్పర్శతో వాయు వేగ, మనోవేగాలతో బయలుదేరాయి. పూర్ణానది రేవు దాటి ముందుకు సాగుతుంది రథం. ఆ వేగానికి రథం అటు ఇటూ కదులుతుంది. కొద్దిగా భయం, ప్రక్కన కృష్ణుడు. చిరు దరహాసం. అదే కొండంత ధైర్యం. ముసిముసి నవ్వులతో ఆనుకుని నిల్చుంది.

ఇక స్వయంవరమనే భయం లేదు. కృష్ణుని కొండంత అండ కోరినట్లు లభించింది. అంతకు మించి ఈ లోకంలో ఏ ఆడపిల్లకు దొరకదు. అది... అది... తనకు లభించింది. రథం సాగుతుంది, బలరాముని సారథ్యంలోని యదువీరుల బృందం కలిసింది. ఎప్పుడు చూడని అందరికి పెద్దన్న బలరాముని,

కృష్ణుని మార్చి మార్చి చూసింది. పెద్దన్న... పెద్దగానే వున్నాడనుకుంది. చిన్నన్న.... చిన్నగానే వున్నాడు. నవ్వుకుంది.

మరదలిని చూసాడు. "పిల్లా, శుభం భూయాత్" ఆశీర్వదించాడు. తలవంచుకుని, తలవూపింది. యాదవులు, తపతీ తీరాన సుదీర్ఘంగా ప్రయాణం చేస్తున్నారు. వారి వెనుకనే విదర్భ యువరాజు రుక్మి, భోజ సైనికులు కూడా వడివడిగా వస్తున్నారు. ఇద్దరు ఒకచోట కలిసారు. అంతే కత్తులు, కత్తులు కలిసాయి. ఆ ఒరిపిడికి నిప్పురవ్వలు మెరుస్తున్నాయి.

అది చూస్తూ రుక్మిణి భయపడుతుంది. ఇరుపక్షాల వారు పోట్లాడు కుంటుంటే, రుక్మి.... కృష్ణుని ఢీకొనడానికి వస్తున్నాడు. ఇప్పుడేం జరుగుతుందో! కళ్ళు మూసేసుకుంది. క్షణమాగి మెల్లిగా కళ్ళు తెరచింది. రుక్మి చేసిన గాయాన్ని చూసి ఆపాదమస్తకం వణికిపోయింది. ''ప్రభూ!'' ఫర్వాలేదు. వూరుకో'' ఓదార్చాడు.

ఇదే అదనుగా రుక్మి బాణాన్ని కృష్ణునికి గురిపెట్టాడు. అన్న మూర్ఖత్వం తెలిసిన ఆ చెల్లెలు భయంతో కళ్ళు మూసుకుంది. కళ్ళు తెరిచేసరికి కృష్ణుడు సుదర్శన చక్రమందుకుంటున్నాడు. అంతే! నవనాడులు బిగుసుకున్నాయి. నావల్ల అన్న చంపబడతాడా ? కూడదు. అమ్మకు, గర్భశోకం, నాన్నకు చేదోడు లేకుండా చెయ్యరాదు. వదిన అమాయకురాలు. అచ్చమైన ఆడపిల్ల లాగ ఆలోచిస్తూ అలాగే క్రిందకు జారింది. "రుక్మిణీ" అంటూ కృష్ణుడు ఆశ్చర్యంగా చూసాడు.

"ప్రభూ! బావమరదిలేని ఇల్లు బాంధవ్యానికి పనికిరాదంటారు. ఉన్న ఒక్క బావమరదిని, కారణమేమైనా, కడతేర్చకండి. పాదాలు పట్టుకుంది. అభయ సూచకంగా పైకి లేపాడు. మళ్ళీ బాహుకునికి పగ్గాలు అప్పగించి, శారంగాన్ని అందుకున్నాడు. బాణం తొడిగాడు. అది వాయువేగంతో రుక్మిని చేరుతుంది. అది అన్నయను చంపుతుందా ? అమాయకంగా అడుగుతూ'' అన్నను మాత్రం చంపకండి!'' ప్రార్థించింది. అంటే మరో రకంగా శిక్షించమన్న ఆమె భావనను గ్రహించిన కృష్ణుడు, అతని గుఱ్ఱాలను, రథాన్ని కూల్చాడు. దబ్బున రుక్మి క్రింద పడ్డాడు. సంధులు జారినట్లున్నాయి. లేవలేకపోతున్నాడు.

అందరు "కృష్ణా! వాసుదేవా, రుక్మిణీ వల్లభా!" జయ జయ ధ్వానాలు ప్రారంభించారు. రథాలన్ని ఆపేశారు. ఉద్ధవుడు వంగి రుక్మిని చూసాడు. కృష్ణుడు రథం దిగాడు. కృష్ణుడు కదలికతో, ఎంతయినా వీరుడు కదా, క్రిందపడిన వాడు లేచి కూర్చున్నాడు. పగ, ద్వేషాలు తగ్గడం లేదు. అవమాన భారంతో ఉడికి పోతున్నాడు. ఈ అట్టహాస వీరుని ఆర్భాటానికి బలరాముడు, పిడుగులు పడుతున్నట్లు విరగబడి నవ్వాడు.

రుక్మి తల కొట్టేసినట్లయింది. ఎవరి తలకొట్టాలనుకున్నాడో, ఆ శత్రువు ముందు తలదించుకోవలసి వచ్చింది. ఎలాగ వున్నావన్నట్లు గోవిందుడు చూస్తుంటే ఉద్ధవుడు, సాత్యకి, అతని గాయాలకు కట్టు కట్టి రథమెక్కించారు. తగిలిన గాయాలకన్న జరుగుతున్న పరాభవమే అతన్ని బాధిస్తూంది. పగను పెంచుతుంది.

కోపమెరుగని కృష్ణుడు - తన ప్రశాంత దరహాసంతో "బావా! రుక్మి! జరిగినదానికి చింతించకు. కాలం మనది కాదు. ధర్మం మాత్రం మనది. మనమా చరించవలసిదే. రక్షించమన్నదెవరైనా సరే, సమర్థులు రక్షించవలసిందే. అందులోని భాగమే ఈ-మీ- రుక్మిణి. ఆమెను క్షమించు. ఆమె చల్లగా వుండాలని నిండు మనసుతో కోరుకో. నీ క్షేమాన్ని ఆమె వదిన - మా చెల్లెలు సువ్రత సౌభాగ్యాన్ని కోరి మాతాపిత - గర్భశోకానికి తను కారణం కారాదనే నీ చెల్లెలి మంచి మనసుకు స్పందించు.

కర్ణ కఠోరంగా వినిపించిన ఆ మాటలకు రెచ్చిపోతూ "ఓ దిక్కుమాలిన అథమాథమ, గొల్లవాడివి. నీవు నాకు నీతులు చెప్పడమా ? దాని దౌర్భాగ్యం కాలి, నీ వెంటబడిందంటే, పితృపితరులకు ఉత్తమగతులు సంప్రాప్తించవు!" వుడికిపోతున్నాడు.

"ఇప్పటికైనా శాంతించడం మంచిది. గాంథర్వ విధిన చేపట్టిన రాచపట్టి, తన ముద్దులు మూటకట్టి, ఆ పట్టి నిన్ను రక్షించమన్న కారణాన బ్రతికిపోయావు కానీ, లేకపోయినట్లైతే - "వూ" అంటే చాలు వీరందరూ, వీరస్వర్గం కాదు, దిక్కుమాలిన నరకం చూపిస్తారు. వారెందుకంటే నేను తలచుకుంటే, నీకు శాశ్వతంగా చిరునామాయే వుండదు. జాగ్రత్త! "కృష్ణుడు" హెచ్చరించాడు. "ఫో" గద్దించాడు. భీష్మకుల వారిని, తాత గార్ని శాంతపరచమన్నాడు.

"వెళ్ళను గాక, తిరిగి వెళ్ళను. నీ తలతో తిరిగి వస్తానన్న నేను, ఆ తల లేక వెళ్ళను.

"నీ తల వుందిగా'' నవ్వాడు కృష్ణుడు.

"నేనూ వెళ్ళలేను. అయితే నాతో ద్వారకకు, రా - అక్కడ విశ్రాంతి తీసుకుందువు గాని. ఈ వాగ్యుద్ధంలో బలరాముడు వచ్చాడు. జరిగేది అడిగాడు. అంతా విని రుక్మీ! నేను తోడు వస్తాను. రమ్మన్నావా ? అయినా ఆ మూర్ఖునికి బుద్ధి రాలేదు. జరగనిది. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం సాధ్యమా ? జరుగుతం దనుకోవడం సబబా ?

అయితే మాతో ద్వారకకు వచ్చేయ్. మా మరదలు రుక్మిణికి అన్నగారిగా, నీ గౌరవానికే భంగం రాకుండా చూస్తాము! మెల్లగా చెప్పాడు. ఆ తదుపరి -

★ ★ ★ ★

అందరు ఆనందంగా సూర్యతీర్థాన్ని చేరారు. అక్కడ నుండి ప్రభాసకు, వెళ్ళి అక్కడ శ్రీ సోమనాథుని అర్చించారు. అక్కడ రుక్మిణీ - కృష్ణులకు, బలరామాదులు ఇతర యదువీరులకు చక్కని స్వాగతం లభించింది.

పుష్పవర్షం కురిసింది. మేళతాళాల మంగళ ధ్వనులు మిన్నుముట్టాయి. జే గంటలు మ్రోగుతుంటే, వీరణాలు వూదుతూంటే, అద్భుతానంద దాయకము, నయనానందకరమా దృశ్యం. ద్వారకలో అడుగుపెట్టారు.

దేవకిమాత ఇదివరకు రాజకుమారిగా అభిమానించిన ఆ తల్లి, ఇప్పుడు కోడలు రుక్మిణిగా గ్రుచ్చి గ్రుచ్చి కౌగలించుకుంది. ఆనందబాష్పాల అమిత పరవశమొందింది. పెంచే అదృష్టం ఒకరికి. పెరిగే పరుగుల ఆనందం మరొకరికి. ఇదే భగవల్లీల. దైవేచ్ఛ.

పెద్ద తోటికోడలు రేవతి, తోటికోడలు రుక్మిణి నుదుట ముద్దుపెట్టుకుని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది. ఆ తదుపరి త్రివక్ర - కృష్ణ భక్తితో, స్నేహితురాలిగా ఆమెను అభినందించింది. ఆనంద తాండవతో ముప్పిరిగొన్న ఆనందంతో రుక్మిణి పరవశించి పోతుంది. అందరి అభినందనలు అందుకున్న

రుక్మిణి పరమభక్తితో మహారాజు ఉగ్రసేనుల వారికి, పెద్ద మామలు అక్రూరులు, దేవభాగ వగైరా పెద్దలందరికి ప్రణతులర్పించింది.

అందరికి అభివందనాలర్పించాక, ఆ పెళ్ళికూతురును దేవకి తన మందిరానికి తీసుకు వెళ్ళింది. ఆలస్యంలేని ఆ సంతోషంగా పెండ్లి ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. ద్వారకకే కృష్ణుని వివాహమొక పండుగ అయింది. నిన్నటి వరకు కృష్ణుని కొరకు చింతించినవారు, చింతవీడి మహా సంతోషంతో, వివాహ సంబరాలలో మునిగిపోయారు.

కరవీరపుర మహారాజు శక్రదేవుడు, అవంతీ యువరాజులు - విందాను విందులు, ఇరుగు పొరుగు రాజ్యాల సామంత రాజులు, ప్రభువులు వచ్చారు. రాజా శక్రదేవునితోపాటు, అత్యంత సాహసంగా, రుక్మిణీ కల్యాణ కథా నాయకురాలు, ఒకనాటి కృష్ణద్వేషి, నేటి కృష్ణ దాసి "శైబ్య", అమితోత్సాహంతో వచ్చింది.

గర్గాచార్యుల వారు వివాహ తంతుకు ఉభయపక్షాల ముఖ్యమూర్తి అయ్యారు. అంగరంగ వైభవంగా నేత్రోత్సాహంగా, వివాహ తంతు ప్రారంభమైంది. అందరి ఆనందోత్సాహాల మధ్య రుక్మిణీ - కృష్ణులు నిజమైన దంపతులయ్యారు. ఇక మిగిలింది మొదటి రాత్రి. ఇది క్రొత్తగా పెళ్ళయిన దంపతులకు, తొలిరాత్రి. మరచిపోలేని మధురమైన రాత్రి. వారు కోరుకున్న తొలి ప్రేమ రాత్రి. పెండ్లి పేరుతో ఆశీర్వదించిన పెద్దలు వారిని మరల ఆశీర్వదించి పంపారు.

గోవిందుని చూసిన రుక్మిణి "గువ్వ" అయింది. కువకువలాడుతూ, కృష్ణుని నులివెచ్చని కౌగిలిలో తల దూర్చింది. కోరిన ఫలితం, కోరినట్లు ప్రసాదించిన ఆ దేవునికి అంకితమై పోయింది. తెల్లవారింది. కృష్ణుడు లేచి తన కార్యక్రమాలలో మునిగిపోయాడు. "రాచపట్టి. ఇన్నాళ్లు పట్టి పీడించిన దుష్టగ్రహ కలల" నుండి బయటపడి అమృతానందమొంది, ఆ రసాస్వాదనంలోని కలల స్వర్గంలో తేలియాడుతుంది. ఆ కోడలి ఆనందాన్ని భగ్నం చెయ్యవద్దని, దేవకి - ఒక మాతగా ఆదేశించింది.

ఆ తర్వాత - చిన్నవాడు - కృష్ణునికి ముఖ్య ప్రాణమైన నిజభక్తుడు - సేవకుడు, ఉద్ధవుడు వదినగారిని చూడాలని వచ్చాడు. రుక్మిణికి అతనంటే

అభిమానం. పుత్ర ప్రేమ. చేతులు కట్టుకుని వదినగారి ముందు నిలబడ్డాడు. అతనలాగ వుండటం రుక్మిణికి సిగ్గనిపించింది. వయస్సులో పెద్దవాడు. కాని అన్నగారి భార్యగా అతను చూపే గౌరవానికి, ఆతనివైపు చూసింది. కళ్ళతోనే అభినందించింది.

★★★★

"వదినమ్మా. కృష్ణుడు ప్రాణిహితుడు. ప్రాణమిత్రుడు. ఈ విశ్వాన్ని ప్రేమించే విమల పురుషుడు. ఆయన ప్రేమ నాకే స్వతమనుకోవడం, క్షమించండి. మనకు తగదు. ఆ విశ్వప్రేమికుడు - విశాల హృదయుడు, విరాట్పురుషుడు. అందరివాడు. ఇది గ్రహిస్తే- "అవునవును. గ్రహించాను కాబట్టే ఆయనతో వచ్చాను. గ్రహిస్తున్నాను కాబట్టే ఆలోచిస్తున్నాను." స్వార్థం పెచ్చుమీరినట్లు ఆమె మాట్లాడుతుంది.

"అమ్మా! భీష్మకపుత్రీ! అందరికన్న అన్నకు నీమీదే ఎంతో అనురాగం, ప్రేమ. కాలయవనుని ఢీకొనడానికి వెడుతూ నిన్ను గూర్చే గొప్పగా చెప్పాడు. నిన్ను రక్షించమని అధర్మాన్ని ఆపమని పెద్దన్న బలరామునికి విన్నవించమని ప్రార్థించాడు. అంతటి ప్రేమాస్పదుడమ్మా - ఈ కృష్ణమూర్తి, మీ ప్రేమమూర్తి" ఈ స్వరంలో కొద్దిగా కాఠిన్యం గాంభీర్యం చోటు చేసుకోవడంతో రుక్మిణి కొద్దిగా తగ్గింది. "ప్రభువు నాకేమైనా చెప్పారా ?" మెల్లగా అడిగింది.

"చెప్పారమ్మా! ఇప్పుడామె యాదవులకు దేవత. నావలె వారి సర్వానర్థాలకు, సంతోషాలకు మూలరూపం కావాలని చెప్పాడు. అలాగే ఆమెను జాగ్రత్తగా చూసుకోమని ఆదేశించాడు.

నిజమైన ప్రేమికుడు కృష్ణుడు. వావి వరుసలు చూడడు. చిన్న పెద్దా చూడడు. అభిమానించేవారినందర్ని ఆదరిస్తాడు. ఆరాధించేవారిని కరుణిస్తాడు. మానవునివలె ఎన్నడు ప్రవర్తించడు. మాధవుడు, మానవుడైనట్లు ప్రకటించు కున్నాడు. ఇందులో డాబు, దర్పం లేదు. ఎంతసేపు ప్రేమ, సేవ, అనురాగం - ఆప్యాయత; కలబోసినట్లు కనిపిస్తాడు. అతడు నిజంగా దేవుడు. అతనిని గురించి చెడ్డగా ఆలోచించడం చాలా పొరపాటు. అది తన అవివేకంగా, దుర్గుణంగా, రుక్మిణి తలంచింది.

పైగా నన్ను దేవతను చేసాడు. మరి నేనో... దేవుడిని దానవుడిని చేసాను. ఇందులో ఎవరు గొప్ప ? అంటే... కృష్ణ ప్రభువే.. చచ్చే జరాసంధుని, అన్న బలరాముని నుండి కాపాడాడంటే ఆతడు "నిజంగా దేవుడే. తెలియకుండా మ్రొక్కింది. "కృష్ణం వన్దే జగద్గురుం" అని పరిపరి విధాల ప్రస్తుతించింది.

అందరి ఆడవాళ్ళకు తనకు ఎంతో వ్యత్యాసముందని, తాను ధర్మావతారుని, ధర్మపత్నినని తలచి మురిసింది. అందరి క్షేమము సదా తాను ఆలోచిస్తూండాలని కూడా నిర్ణయించుకుంది.

పగ, ద్వేషాల్ని - ప్రేమ - అభిమానంగా మార్చగల కృష్ణ"మూర్తి" భార్యగా ధర్మమూర్తిగా వెలుగొందాలని తలచింది. ఆ మగతలో, తనను తాను మరచి-

"గోవిందా! నువ్వే నేను. నేనే నీవు. నీ అభిమానులు ప్రేమికులు, అందరు నా వాళ్ళే. నీవలె ఆరాధనీయులే, అసూయా ద్వేషాలను పరిహరింప చెయ్యి ప్రేమించే మనసును, నిత్యానందాన్ని ప్రసాదించు" గట్టిగా అరుస్తూంటే -

"ఏమయిందమ్మా!" అంటూ దేవకి వచ్చింది. అబ్బే. ఏం లేదు!" సిగ్గుతో చెప్పింది. అయితే, లే. భోజనం చేద్దువు గాని" తలవూపి అత్తగార్ని అనుసరించిన కోడలు "అమ్మా!" అంది. దేవకి కోడల్ని చూసింది. ఆమె చూపులను గ్రహించిన రుక్మిణి "అమ్మా! భోజనం చేసి, ప్రభాస తీర్థానికి వెళ్ళాలని వుంది" అంది.

అలాగే - అందామె. సాయంకాలం రుక్మిణి ప్రభాసానికి వెళ్ళింది

"కృష్ణం వన్దే జగద్గురుం" అంది. కృష్ణ భాగవతానికి, భాగవత్తత్వానికి పరవశించింది - ఇది శ్రీకృష్ణ భాగవతం" "మొదటి భాగం" ఇందులో కృష్ణుని అవతరణ, లీలలు, సాహసాలు ఎన్నో దర్శనమిస్తాయి. ముఖ్యగా రుక్మిణీ కల్యాణం. సర్వ సంపత్ప్రదం. శుభకరం. సర్వమంగళ దాయకం. ఇంకా అందుకోండి. ఆనందించండి.

భారత "భాగ్య" విధాతలుగా తయారుకండి!

**- స్వస్తి -**

శ్రీకృష్ణం వందే జగద్గురుం

# శ్రీకృష్ణ చరిత్ర

## ద్వితీయ భాగం "జ్ఞాన కాండ"

## (లీలలు, ధర్మపరిరక్షణ)



రచన : వ్యోరుగంటి రామకృష్ణ ప్రసాద్

నవరత్న బుక్ హౌస్
28-22-20, రహిమాన్ వీధి, అరండల్‌పేట,
విజయవాడ - 520 002.

**శ్రీ కృష్ణ చరిత్ర**

**ద్వితీయ భాగం "జ్ఞానకాండ"**

**(లీలలు, ధర్మసంరక్షణ)**

రచన

**వొరుగంటి రామకృష్ణ ప్రసాద్**

# ప్రకాశకుల మాట

"శ్రీ కృష్ణ చరిత్ర". దీని మొదటి భాగాన్ని "భక్తి" కాండగా, మా గురుదేవులు శ్రీశ్రీశ్రీ వొరుగంటి రామకృష్ణ ప్రసాద్ గారు, భక్తజనులకందించారు.

ఈ కాండలో వున్నది భక్తే!

భగవదారాధన, భక్తితత్వము, పరతత్వము, విశ్లేషణ, అవతారం, లీలలు, ఎన్నో కలిసి - పతితులను పరమ భక్తులను చేస్తుంది. చరిత్ర తెలిపి, చరితార్థులను చేస్తుంది. "కృష్ణం వన్దే జగద్గురుం" అనాలని ఆ శ్రీకృష్ణుని "యదుభూషణుని" దర్శించ తహతహలాడ చేస్తుంది.

కృష్ణుడు "పుడుతూనే - తానేమిటో చెప్పాడు. చెయ్యవలసింది తెలిపాడు. తన చేష్టలతో పాటు ఇటు దుష్టసంహారం, అటు సజ్జన సంతోషం కల్గించాడు. పుట్టింది చెరసాలలో, పెరిగింది నంద గోకులంలో. కన్నది దేవకి, పెంచినది యశోద. "యశోదా"నంద" నుడుగానే, అందరికి ఆనందాన్ని పంచి ఇచ్చాడు. లోక ప్రసిద్ధ డయ్యాడు.

అల్లరి చేసాడు. తన్నులు తిన్నాడు. మారాం చేసాడు. మన్ను తిన్నాడు. సకల భువనాలు చూపించాడు. ఆ సాహసాలన్ని - వీరోచితాలు. ముక్కు మీద వేలేసుకుని ఆశ్చర్యబోయే "మహాద్భుతాలు - ఆశ్చర్యాలు!".

కాలహరణం చెయ్యలేనట్లు, గోకులం నుండి బృందావనానికి వెళ్లిన, ఆ బృందావన విహారిని కావాలని కంసుడు ధనుర్యాగం

పేరున రప్పించుకుని ప్రాణాలు తీయించుకుంటాడు. ఇక్కడన్నిటా భక్తి భావాలే దర్శనమిస్తాయి. పరమానందదాయకులై పరవశింప చేస్తాయి.

ఇప్పడు - రెండవ భాగాన్ని "జ్ఞాన కాండ"గా అందిస్తున్నాం.

భక్తితో "రుక్మిణీ కల్యాణం" వరకు ప్రకటించిన "భక్తి" పరతత్వానికి, ప్రాణం పోసింది. ఇప్పడు కావల్సింది "భక్తి" తదుపరి జ్ఞానం. ఆ జ్ఞానాన్ని ఒక కాండగా రెండవ భాగంలో "శ్రీకృష్ణా! యదుభూషణా..." అని అందిస్తున్నాం.

అందుకోండి. ఆనందానుభూతుల దివ్య ప్రకాశాన్ని మాకు తెలుపండి.

మహదానంద మొందుతాం.

మరిన్ని దివ్య గ్రంథాలనందించ ముందడుగు వేస్తాం.

ఈ చరిత్ర శ్రీ "కృష్ణ చరిత్ర" మూడు భాగాలలో - ఇది రెండో భాగం...

చదవండి, చదివి తరించండి.

శుభం భూయాత్!

మీ

**- ప్రచురణ కర్తలు.**

# ముందుమాట

ఇది "శ్రీకృష్ణ చరిత్ర"లోని రెండవ భాగం. "జ్ఞాన"కాండ. ఇందులోని కృష్ణుడు, లీలా మానుష విగ్రహుడు. ఆ"నంద"ప్రదాత, ఆ "నంద" నందనుడు. ఇందులో కృష్ణుడు అందరికి ఆరాధ్యుడయ్యాడు.

రుక్మిణి ప్రేమను, జాంబవతి అమాయికత్వాన్ని ఆనందంగా అందుకున్న శ్రీకృష్ణుడు, సత్యభామ, స్వాతిశయాన్ని సాదరంగా ఆహ్వానించాడు. చివరకు అందర్ని కాదన్నట్లు "సత్యాపతి" అని బిరుదును కూడా పొందాడు.

తన మేనత్త పిల్లలు, పాండవులపై దృష్టిని పెట్టాడు. లక్క ఇంట్లో తగులబడిపోయిన వారిని కనిపెట్టి, తన చాతుర్యంతో ద్రౌపదీ స్వయంవరానికి రప్పించి, దుర్యోధనాదులు గుండెలు రగిలించి, సావధానులను చేసాడు.

ఇందులో విదురుడు, భీష్ముడు, మహామాత సత్యవతీదేవుల ధర్మవర్తనం మెచ్చుకుని, వారి ఆకాంక్షల కనుగుణంగా పాండవులను మహావీరులని అర్థం చేసుకునే జ్ఞానాన్ని అందరికి కల్గిస్తాడు. "హస్తి" వంటి మదించిన ఎద్దును మచ్చిక చేసుకుని, మానవులకన్న పశువులే నయమనిపించిన లీలామానుష విగ్రహుని లీలలు అద్భుతం. మహాద్భుతం.

ఎన్నిసార్లు అపరాధాలు చేసినా దుర్యోధనాదులను కానీ, అవమానాల-పాలయి - దుర్భరవేదననుభవిస్తున్నా "కాల, కర్మం, గతి" అంటూ పాండవులకు జ్ఞానబోధ తానుగా చెయ్యకుండా, వారికర్థమయ్యే రీతిగా కథా విధానాన్ని అందించడం, శ్రీకృష్ణుని చిద్విలాసంలో భాగం.

ఎంతసేపు "పాండుకుమారులు" అనే గుడ్డిరాజు ధృతరాష్ట్రుని మనస్సు చచ్చేవరకు మారదన్న నిజాన్ని విశదం చేస్తూ, పాండవులకు ఇంద్రప్రస్థమనే మహాటవిని, ఏలుకోమని ఇస్తే, దానిని మహాద్భుత నగరంగా రూపొందింపచేసి "మయసభ" పేరిట రాజసూయం జరిపిస్తాడు. సర్వరాజులను ధర్మరాజుకు సామంతులను చేయిస్తాడు. విరోధించే దుర్యోధనాదులకు, ముఖ్యమైన పనులు అప్పగింపచేసి, మతులు పోగొడతాడు.

మహాద్భుత మయసభ, లోకాలకతీత వైభవం కౌరవులకు కంటిలో నలుసవుతుంది. కన్ను పోకుండా, దురద, మంట పెట్టించగల శకుని, తన పాచికలను పణంగా పెట్టి, పాండవుల పేరిట కౌరవులను అధములుగా చిత్రీకరింప చేస్తూ అనుక్షణం, తన కుయ్యుక్తులతో, కౌరవులను చిర్రెక్కిస్తుంటాడు.

వీరికి తోడు కర్ణుడు. అందరు కలిసి, దుష్టచతుష్టయంగా పేరు పొందారు. పాండవులను సర్వదా సతాయిస్తూ, వాళ్ళ నాశనానికి ఎన్నిరకాల వీలయితే, అన్ని రకాలుగా ఆరడులు పెడతారు. దీనికి శ్రీకృష్ణుడు తన లీలా విలాసంతో వారిని ఆదుకుంటుంటాడు.

నిండుసభలో ఇల్లాలి వలువలు లాగి వివస్త్రను చేస్తుంటే, అయిదుగురు భర్తలు అడ్డుకోలేని అసమర్థతులౌతారు. అదే ఒకరైతే మర్యాద నిలబడేదంటాడు కర్ణుడు. ఇక్కడే పంతాలు - పట్టింపులు.

అరణ్య-అజ్ఞాతవాసాలు. అపురూప అస్త్రశస్త్రాల సేకరణ, ఇందులో అనుక్షణం పాండవులకు, కౌరవులకు జ్ఞానదోయ సూచనలు ప్రకటితమౌతాయి. అయినా దుర్యోధనుడు మూర్ఖుడౌతాడు. చివరకు అజ్ఞాతవాస సమయంలో విరటుని కొలువులో మారువేషాలలో బ్రతుకుతుంటే - ఇటు కీచకుని దుర్మార్గం ఒక బాధ అయితే - దుర్యోధనుడు -

ఏదో రకంగా పాండవులను బహిర్గతం చేసి మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలకు పంపాలని అజ్ఞానంతో దుర్యోధనుడు ఆరాటపడతాడు. అందుకు వీలుగా సుశర్మతో కలిసి "ఉత్తర-దక్షిణ- "గో" గ్రహణాలు చేయించడం, భంగపడటం.

ఎన్నిసార్లు పరాజయమొందినా అజ్ఞానమొందని, ఆ అజ్ఞానులకు, జ్ఞాన ప్రకాశం కల్గించే ప్రయత్నమే కృష్ణుని ఇటు రాయబారం. అటు హెచ్చరిక!

ఎంత చెప్పినా జ్ఞానం రాని మూర్ఖత్వంతో "పరిత్రాణాయ సాధునాం" అని, శ్రీకృష్ణుని రెచ్చగొడతారు. దీనిని మూడవ భాగంలో దర్శించవచ్చును.

ఇప్పుడు - ఈ భాగంలో జ్ఞాన ప్రకాశ స్వరూపమైన, ఈ రెండవ భాగం సర్వులకు ఆత్మానందం ప్రసాదిస్తుంది.

అజ్ఞానులకు కనువిప్పు కలుగుతుందన్నది - బహిరంగ సత్యం.

చదవండి. పరమానందం పొందండి.

మీ

**- వొరుగంటి రామకృష్ణ ప్రసాద్.**

పారంపర్య పీఠాధ్యక్షులు,
విశ్వమానవతా గురుపీఠం

శ్రీ సాయి సువర్చలా సదన్
రామలింగేశ్వర పేట,
కుడిచేతి 6వ లైను
విజయవాడ - 520 003.
ఫోన్ : **0866-2532139**
**9393007648.**

**web site : www. vorugantiramakrishnaprasad.com**
**e-mail : vorugantiramakrishnaprasad@gmail.com**

# విషయసూచిక

పేజి. నెం.

## నాల్గవధ్యాయం


సాందీపుల సందేశం ........ 9
అసలేం జరిగిందంటే...?! ........ 16
ధర్మం రక్షించాలి ........ 18
ఏం చేద్దాం ?! ........ 23
పాపం, ఏం చేస్తాం..?! ........ 28
రండి, మహాప్రభో...! ........ 54
నాగప్రేమ ........ 65
రాక్షసుడు ........ 69
అంతా మంచే జరుగుతుంది ........ 82
కిం కర్తవ్యం ? ........ 91
ఆహ్వానం ........ 95
వెళ్ళాలా, వద్దా... ?! ........ 99
సాంప్రదాయం ........ 105
సుఖాలు శాశ్వతం కాదు ........ 113
"ధర్మం..." ........ 117
పెళ్ళికి వెళ్ళాలి ........ 120
ఎందుకీ కుట్రలు ? ........ 123
ఎవరు బంధించారు ? ........ 128
ధర్మం నిలిచింది! ........ 132
చెల్లీ...! ........ 139
ద్రౌపదీ స్వయవరం ........ 143
పరిణయ కళ! ........ 147
అంబర సంబరం! ........ 152


## అయిదవ అధ్యాయం


తమ్ముడు ........ 156
తమ్ముడు, వెళ్ళిపోతున్నాడు! ........ 159
మంతనమా... ?! ........ 174
ఏమంటాడు... ?! ........ 181
ధనుర్భంగం ........ 190
అవును, వాళ్ళే...! ........ 194

అంతేనంటారా...?! .......... 200
బయలుదేరుదాం! .......... 214
నగర ప్రవేశం .......... 225
అంతా కుట్ర .......... 235
ఇంతకంటే అదృష్టమేముంది ?! .......... 246
కటాక్షించండి! .......... 250
హమ్మయ్య, కరుణించాడు .......... 256
పాపం, భానుమతి! .......... 259
ధర్మోరక్షతి...! .......... 270
భీమా, ఇది సబబా ?! .......... 282
కొత్తకోట .......... 291
కల ఫలించింది! .......... 294

## ఆరవ అధ్యాయం

అదిగదిగో -సత్యభామ .......... 304
భామనే-సత్యభామనే .......... 316
ఆశ, ఆరాటం! .......... 330
గుణపాఠం .......... 337
ఇదేం పద్ధతి ? .......... 349
శ్యమంతకమణి .......... 353
కృష్ణుని ప్రతిజ్ఞ .......... 362
సత్యసాహసం .......... 366
ప్రసేనుడు, "గోవిందా!" .......... 375
విధి వక్రిస్తే...! .......... 382
ఆదిత్యాయ...! .......... 392
దెయ్యం కాదు, ధైర్యం చేద్దాం! .......... 402
ఎవరు, మీరు ?! .......... 410
అయ్యబాబోయ్! .......... 417
ఇదెక్కడి గొడవ! .......... 429
అంతా గందరగోళం .......... 435
తప్పదు మరి! .......... 438
బయలుదేరండి, శుభం .......... 448
దేవుడే, దిక్కు .......... 461
ఏం చేస్తాం, కర్మ, కర్మ! .......... 468
ఓం నమో భగవతే వాసుదేవాయ .......... 484
ఉపసంహారం .......... 496

## జ్ఞానకాండ - ప్రథమాధ్యాయము

# సాందీపుల సందేశం!

**భృ**గుతీర్థం నుండి సాందీపుల వారు తమ శిష్యులతో సముద్ర మార్గంలో ఓ మధ్యాహ్నంవేళ, ప్రభాస తీర్థానికి బయలుదేరారు.

ఆనాడు కృష్ణుడెందుకో తొందరగా లేచాడు. అందరి సుప్రభాత సూక్తులు అందుకున్న కృష్ణుడు, ఈనాడు గురుదేవులు వస్తున్నారని చెప్పాడు. "అలాగా!" అంది రుక్మిణి. "ఆ...!" అని నువ్వు నీ భర్తను ఎలా గౌరవిస్తున్నావో తెలుసుకోవాలని మరీ వస్తున్నారని అన్నాడు.

"రమ్మనమండి. మేము చెబుతాము. ఈ దేవుడితో వేగడం, వాగడం చాలా కష్టమని....!"

"చెప్పండి.... నా తత్వం తెలిసినవారు, నీ మాటలు నమ్మరన్నాడు. ఆ తదుపరి అన్నగారితో, సాత్యకితో కలిసి సముద్రం వద్దకు వెళ్ళాడు. వీళ్ళక్కడ, యువకులకు ఆయుధాలతో శిక్షణ, అందులోని మెలకువలు నేర్పుతుంటారు. యోగా వలె ఈ శిక్షణ ప్రతినిత్యం అవసరమే. శరీర దారుఢ్యానికి, ఆయుధాలపై, ఆధిపత్యానికి, ఈ శ్రమ - నిత్యం పడక తప్పదు.

అందర్నీ పేరుపేరు పలుకరించడం, ప్రేమను పంచడం కృష్ణునికి అలవాటు. ఆ మందహాసానికి, ప్రతి ఒక్కరు కృష్ణుని ఘనంగా కీర్తించేవారే! ఆ తర్వాత అందరు కలిసి సముద్ర స్నానం చేయడమొక దినచర్య. ఆ తదుపరి సూర్యునికి అర్ఘ్య ప్రదానం.

ఆ రోజు చల్లగా, గజగజ వణికిస్తూ చలిగాలులు వీస్తున్నాయి. కృష్ణుడు, బలరాముడు, సాత్యకుడు, కులగురువులు గర్గాచార్యుల వారితో కలిసి, గురుదేవులు సాందీపుల వారిని స్వాగతించడానికి సముద్రపు రేవుకు వచ్చారు. వీరితో పాటు ఇంకా కొంతమంది యాదవులు కూడా ఆ వచ్చే గురుదేవుల కోసం ఎదురు చూస్తున్నారు.

పడవలు ఒడ్డుకు చేరుకున్నాయి. గురుదేవులు సాందీపుల వారు, ఇతర శిష్యులు దిగారు. గర్గాచార్యులవారు, సాందీపులవార్ని సాదరంగా ఆహ్వానించారు. బలరామకృష్ణ సాత్యకిలు గురుదేవులకు వందనాలర్పించగా, ప్రస్తుత శిష్యులు, పూర్వపు విద్యార్థులకు ముఖ్యంగా బలరామకృష్ణులకు భక్తి నమస్కారా లందించారు.

కృష్ణునితో పాటు అందరిని ఆనందంగా చూసిన సాందీపుల వారు "ఉద్ధవుడెక్కడ, కనబడడే ?" అడిగారు.

బలరాముడు నవ్వుతూ, "కృష్ణుడు వాడిని హస్తినాపురానికి పంపాడు. వాడికీ ద్వారక చాలనట్లు, కృష్ణుడక్కడకు పంపుతుంటాడు." ఇది వెటకారమో, వెక్కిరింపో, అతనికే తెలియాలి. సాందీపులవారు నవ్వుకున్నారు. బలరాముడు పెద్దన్నయ్య. నిజం. కాని కృష్ణుని కరుణ, ప్రేమ, దయల ముందు అంత పెద్ద బలరాముడు ఒక చిన్న దోమ. అందుకేనేమో తమ్ముడంటే, ఆ అన్నకు ప్రాణం. తమ్ముని ప్రతిభకు ప్రతిక్షణం పరవశిస్తాడు.

కృష్ణుడు మథుర నుండి అందరిని ద్వారకకు రప్పించి ఎంతో సుఖ శాంతులను ప్రసాదించాడు. కీర్తి ప్రతిష్ఠలను పెంపొందింప చేసాడు. ప్రభాస తీర్థానికి వచ్చి సోమనాథుని దర్శించిన ప్రతి ఒక్కరు ద్వారకకు రావడం, కృష్ణుని దర్శించి, ఎనలేని ఆనందానుభూతుల్ని మూటగట్టుకుని, అంతులేని ఆ మహదానందసుధ నాస్వాదిస్తూ పులకరించడం పరిపాటయిపోయింది.

ఆ విధంగా లోకానికి, తన వారికి గూడా సుఖసౌఖ్యాలను ప్రసాదించిన, పరమపురుషుడు - శ్రీకృష్ణుడు. అంతే కాదు ఈ ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా, అది కృష్ణుని దృష్టిపథం నుండి తప్పుకోలేదు. అన్నీ తెలిసిన, ఆ ధర్మమూర్తి ఏమీ తెలియనివానివలె, ధర్మపరిరక్షకుడిగానే ప్రకాశిస్తున్నాడు తప్ప, ఎక్కడా స్వార్థానికి ఆశాపాశాలకు తగుల్కొనలేదు. కాని లోకం మాత్రం, శ్రీకృష్ణుడు చేసే పనుల్లో వంకలు, శంకలు కనిపెట్టడం, అందుకు సమాధానం చెప్పాలని జరుగుతుంది. ఉదా - సవాలు విసరడం.

"స్వయంవరం", కృష్ణుడు చెప్పినట్లు అధర్మ స్వయంవరమైంది. అభాసు పాలయింది. అర్థిని రక్షించే అభయప్రదాతగా, కృష్ణుడు అందర్ని మార్చి, ఏమార్చి

మనసు దోచిన రుక్మిణి మనోభీష్టం చెల్లేటట్లు ఆమెను తెచ్చుకుని, అందరి పెద్దల ఎదుట, ద్వారకలో ఘనంగా వివాహం చేసుకున్నాడు. ఇది జరాసంధునికి చెంప పెట్టయింది. ఒకటికి, రెండుసార్లు కృష్ణుని చేతిలో ప్రత్యక్ష పరాజయ మొందడం భరించరానిదయింది.

ఆ అవమాన భారంతో, మిత్ర, సామంతరాజుల ఎదుట తల ఎత్తలేక, తలదించుకుని మగధకు తిరిగి వచ్చాడు. గత మూడు సం॥గా, ఏ రకంగాను, తన ప్రభావాన్ని ఆర్యావర్తంపై చూపలేకపోవడమొక బాధగా వుంటే, కంస మరణంతో మథుర చేతులు దాటిపోవడం, బలరామ, కృష్ణుల వీర విజృంభణం, దమఘోషుడు, అవంతీపుర రాజులు, కరవీరపురం రాజులు దూరమవడం, ఎటు చూసిన అవమానాలు, అభద్రతాభావం పెరిగి "చక్రవర్తి"తనానికి చిల్లుపడు తూందేమో, పరాక్రమానికి తూట్లు పడుతుందేమోనన్న భయం, క్షణ క్షణానికి ఎదిరిస్తున్నట్లు బెదరిస్తూంటే, కళవళపడిపోతున్నాడు. ఇప్పుడు జరాసంధుడు దెబ్బతిన్న త్రాచు కాదు. బుసకొట్టే బురద గొడ్డయిపోయాడు.

దాంతో ప్రస్తుతం కృష్ణుని దృష్టి హస్తినపై మళ్ళింది. ఎందుకంటే అక్కడ ధర్మాత్ముడైన భీష్ముడున్నాడు. విదురుడు వున్నాడు. అంధకుడు - గుడ్డి పితృప్రేమను చూపే ధృతరాష్ట్రుడు, కళ్ళుండి గుడ్డిగా మారిన మాత గాంధారీ, ఎన్ని వున్నా సౌభాగ్య సంపదను పోగొట్టుకున్న మేనత్త కుంతి, పరాక్రమోపేతులు, ధర్మాత్ములని  పేరుబడ్డ - పంచపాండవులనే పుత్రులతో సార్థక నామంతో అస్వతంత్ర జీవితం గడుపుతుంది.

గాంధారీ పుత్రులు నూరుమందికి తోడుగా, గాంధార రాజు శకుని తోడయి, వీళ్ళ సర్వనాశనానికి కంకణం కట్టుకున్నట్లు, అధర్మ ప్రవర్తనకే ఆజ్యం పోయిస్తున్నాడు తప్ప "ధర్మ"మన్న మాట వారి చెంత, మాటకు గూడ కనబడే స్థితి లేదు. ధర్మరాజు "యువరాజు" అయ్యాడు. భీముడు విక్రముడయ్యాడు. అర్జునుడు మహావీరునిగా కీర్తించబడుతున్నాడు. ఇది దుర్యోధనునికి పూర్తిగా కంటగింపయింది. వీరిని వదిలించుకునే మార్గాలు అన్వేషిస్తున్నారు.

ఈ అధర్మం పెరుగుతుంటే, ధర్మ పరిరక్షకుడైన కృష్ణునికి చేతినిండా పని. ఎప్పుడైతే యుథిష్ఠరుడు (ధర్మరాజు) యువరాజ పట్టాభిషేకమొందాడో,

అది ఓర్వలేని దుర్యోధనుడు, గదా యుద్ధ ప్రవీణుడైనా బలరాముని చెంతకు వచ్చి, అందులోని మెళకువులు సులువుగా అందుకుని ప్రావీణ్యం సంపాదించాడు. ఆ సమయంలో కృష్ణునితో మైత్రి చేసుకోవాలని తలచాడు. కానీ, ఆతడి వాలకమే అధర్మ స్వరూపమవడంతో కృష్ణుడాతని స్నేహాన్ని సున్నితంగా మందలించినట్లు కాదని తిరస్కరించాడు. కానీ....

ఒకసారి హస్తినకు వెళ్ళి వస్తే బాగుంటుందని కృష్ణుడు ఆలోచిస్తున్న తరుణంలో యుధిష్ఠిరుడు, కృష్ణుని హస్తినకు ఆహ్వానించాడు. అందుకు ముందుగా ఉద్ధవుడు వెళ్ళాడు, ఆతన్ననుసరించి కృష్ణుడు బయలుదేర సిద్ధమౌతున్నాడు. అది ఇవ్వాళా, రేపా ? అన్నది కృష్ణలీల. ఇలా వుండగా శ్రీ సాందీపుల వారు తనను చూడ తలిచారన్న వర్తమానమందగానే కృష్ణుడు వారిని గర్గాచార్యులవారి ఆశ్రమంలో దర్శించాడు. ఉభయకుశలోపరి తదుపరి, "కృష్ణా! ధర్మరక్షకుడివి కదా, యాదవ కుల సంరక్షణము, తగు భద్రత చేసావు. నీవు నీ వారికే పరిమితం కాదు, కారాదు. ధర్మమూర్తివనే నీవు నీ దృష్టిని ఒక్కసారి ఈ లోకంపై ప్రసరించు. ఎచ్చట అధర్మము విశృంఖలమై విజృంభిస్తుందో, అక్కడ నీవు నీ ఉక్కుపాదంతో, ఆ అధర్మాన్ని పారద్రోలి ధర్మరక్షణం గావించాలి. ఇది నా ప్రార్థన. ఆదేశమన్నా సంతోషిస్తాను'' అనగా -

"అవశ్యం. మీ ఆజ్ఞ శిరోధార్యం. మీరు చెప్పినట్లు నేను ఏ ఒక్కరి వాడను కాను. అందరివాడను. అందనివాడను కాను. అందుకొని ఆదుకునేవాడను. తెలియబరిచాడు.

''కృష్ణా! సహస్రాక్ష సహస్రపాద్!'' అనే విశ్వరూపంతో, ఈ విశ్వాన్ని పరవశింప చెయ్యాలి. ధర్మ ప్రతిష్ఠాపనంతో "ధర'' (భూమాత) పొంగేటట్లు చూడాలి. అంటూ మొన్న... అదే కొద్దిరోజుల క్రితం ద్రుపదుని చూసాను.....!'' అంటూ అక్కడ జరిగినదంతా, అక్షరం అక్షరం, కృష్ణునికి చెప్పాడు.

అంతా విన్న కృష్ణుడు మందహాసం చేసాడు. ఇదొక ఎత్తు గురుదేవా! ఎవరైనా రాజులతో చెలిమి చేస్తారు. కయ్యానికి, వియ్యానికి - సమవుజ్జీలను కోరేవారు, ఒక గోపాలుడిని కోరుకుంటున్నారంటే వింతగా వుంది ? పైగా అర్థ రాజ్యం ఇస్తారా ? వున్నదే సగం. అందులో సగం నాకు ఇస్తే.... ఇటు ద్రోణులు, అటు నా మధ్య ద్రుపదుడు బ్రతికి బట్టకట్టేనా ? పరువు నిలిచేనా ? అన్నీ రాజకీయపుటెత్తులు. కృష్ణుడు క్షణమాగి, అన్నీ మీకు తెలియనివి కావు.

"అదికాదు కృష్ణా! ద్రుపదుడు....!" అంటూంటే,

"అతడు మిత్రద్రోహి. అందుకే ద్రోణుడు అతన్ని బంధింపచేసి, క్షమింప చేసి, మొత్తం రాజ్యం తనదైనా అర్థ రాజ్యాన్నిచ్చి బ్రతుకుమన్నాడు. నిజమైన క్షత్రియుడు "దాతే" కాని యాచకుడు కాదు. కానీ ద్రోణులు, ద్రుపదుని భిక్షుకుని చేసాడు. అది భరించలేని ద్రుపదుడు యజ్ఞం చేసి, తన పగ ప్రతీకారాలను తీర్చగల సంతానాన్ని పొందాడు. ఆ సంతానంలో ద్రౌపతి ఒకర్తె. ఆమెను నేను వివాహం చేసుకుంటే, ద్రోణుని సంహరిస్తే, అర్జునునితోపాటు ఆయన శిష్యులు మొత్తం నా మీదకు దండెత్తి వస్తే వారినందర్ని సంహరించి, యాదవులు క్రూరకర్ములు, ధర్మభ్రష్టులని, "ధర్మమూర్తి" నని పేరు పొందిన నా ద్వారా - అధర్మానికి అజ్యం పోయించదలిచాడు.

"మహాత్మా! ఇదంతా మీకు తెలియనిది కాదు. అయినా నా మనసు తెలుసుకోవాలనో లేక.....!" రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు.

సాందీపుల వారు తల పంకించారు.

"గురుదేవా, పగబట్టినవారు, బ్రతుకు - ద్వేషంతో బ్రతికేవారు మనస్సు లెలాగ వుంటాయో గమనించండి. నా మేనత్తపిల్లలు, ధర్మాత్ములైన పాండవులకు నా సహాయమందకుండా చెయ్యడమొక పథకం. తమ గురుదేవులకు వత్తాసుగా వచ్చే కురువీరులను కూల్చి, అఖండ సామ్రాజ్యమొంద తలవడం మరొక ఎత్తు. ఇవన్నీ అధర్మ స్వరూపాలే! కనుక, మీ శిష్యుడిగా నన్ను ధర్మమూర్తిగా, బ్రతుక మంటారా ? లేక మీరు చెప్పారని, ఆ పాంచాలుని కుమార్తెను వివాహమాడి ధర్మభ్రష్టుడిగా చెలరేగమంటారా ? ఏదైనా గురువాజ్ఞ అన్నాడు.

"కృష్ణా! నువ్వు మూర్తీభవించిన ధర్మానివి. తత్ప్రకాశానివి. నిన్ను శాసించ గలనా ? కాను, ద్రుపదునికి సమాధానం చెప్పాలి. ఏం చెప్పమంటావు ?" అడిగాడు.

"గురుదేవా! అతడు దెబ్బతిన్న పులి. మాటువేసి కాపు కాస్తున్నాడు. సమయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఇప్పుడతన్ని సరైన మార్గంలోకి మళ్ళించాలి. కానీ, రెచ్చకొట్టకూడదు. కాబట్టి, ద్రుపదునితో - కృష్ణుడు హస్తినకు వెడతాడు. ఆ సమయంలో తమ దర్శనం చేసుకుంటానని విన్నవించమన్నాడని చెప్పండి. ఆయన నా కోసం ఎదురుచూస్తూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోడు....." అంటూంటే -

"నిజ"మన్న సాందీపుల వారు "అవును. హస్తినకు దేనికి ?" అడిగారు.

"ధర్మరాజు రమ్మని వర్తమానం పంపాడు. ఒకసారి వెళ్ళివద్దామని, వస్తున్నానని చెప్పడానికి ముందుగా ఉద్ధవుని పంపాను. ఇప్పుడు నేను బయలుదేరు తున్నానన్నాడు.

"అవసరం లేదు. హస్తిన నుండి శ్వేతకేతు వచ్చాడు. అతడు నీకు కావలసిన, సర్వ విషయాలు వివరంగా తెలియబరుస్తాడన్నాడు. కృష్ణుని చూపులను గ్రహించిన శ్వేతకేతు నేను హస్తినకు వెళ్ళాను. అక్కడ ఉద్ధవుడు కలిసాడంటూ -

పాండవులు వారణావతానికి బయలుదేరుతుంటే వారితో వెళ్ళే ప్రయత్నంలో మన ఉద్ధవుడు వున్నాడు. వున్నాడు కదా దుర్యోధనుడు. ఆ గుడ్డిరాజు ఆ కుమారునిపై గల పితృప్రేమతో, ధర్మరాజును పిలచి, నాయనా! నువ్వు నీ తమ్ములు, మాతృశ్రీతో వారణావతానికి వెళ్ళమని ఆదేశించారుట. పెదతండ్రి మాటగా కాక, మహారాజు ఆజ్ఞగా స్వీకరించి, పాండవులు, యువరాజ పదవి విడిచి పెట్టి, తల్లితో కలసి వారణావతానికి బయలుదేరారు. ఇది అన్యాయమని ఎందరో నిరశించారు. కొందరైతే వీరిని కనీసం ఒక యోజనం వరకు అనుసరించారుట.

"ఇది అన్యాయం. ఇలాగ జరుగుతుందని అనుకోలేదు. కురువృద్ధుడైన భీష్ముని కాదని, పిల్లవాడి మాటకు, అదృష్టవశంగా లభించిన, అర్హత లేని రాజ్యంతో, ఈ విధంగా ప్రవర్తించడం దారుణం" అనగా, శ్వేతకేతు "నాకు బాధనిపించింది. అక్కడ వివరాలు సేకరించే సమయం, అవకాశం చిక్కలేదు. కాకపోతే విన్న దానిని బట్టి, ధృతరాష్ట్రుడు, "ధర్మరాజా! మీరు నా మాట విని.... అంటే తప్పక తమ ఆజ్ఞ అన్నాడు. కానీ మిగిలిన సోదరులు తృణీకరించారు. ఎదురు తిరగబోయారు. అయితే, అన్నదమ్ములది ఒకేమాట, బాటగా - అన్నగారి తోడిదే తమ లోకమనుకునే సోదరులు "వద్దు. తప్పు!" అనగానే, మౌనంగా తలవంచుకున్నారుట.

అందరికి ధర్మరాజంటే ఎంతో ప్రేమ, అభిమానం. ఇప్పుడు దుర్యోధనునికి వారసత్వ హక్కుగా యువరాజు పీఠమొసగారు. ఇంకేముంది ? అన్నీ తలక్రిందులు చెయ్యగల సమర్థుడు. తను తలిచిందే ధర్మమనే వితండవాది. ఇక హస్తిన....

"నువ్వు వెళ్ళవలసిన పనిలేదు, కృష్ణా. నేను కాంపిల్యానికి శ్వేతకేతు ద్వారా వర్తమానం పంపుతాను. ఆ తదుపరి నువ్వు అక్కడికి వెళ్ళు. ధర్మ సంస్కరణా మార్గంలో సర్వులను పయనింప చెయ్యమని, సాందీపులవారు కోరారు. ఆ

మాటలు వింటున్నవాడు, ఉన్నట్టుండి గంభీరుడై "గురుదేవా! నేను తక్షణం హస్తినకు వెళ్ళాలి. తప్పదు!'' అన్నాడు.

"నిన్ను వెళ్ళవద్దనను కానీ, నిన్ను ఆ దుర్యోధనుడు గౌరవిస్తాడా ?'' అన్నది నా భావం.

ఒకరి స్వాగత సత్కారాలకు నేను వెళ్ళడం లేదు గురుదేవా, పాండవుల కీర్తి ప్రతిష్ఠలకు గ్రహణం పట్టినట్లు మసకబారుతుంటే తీసుకోవలసిన నిర్ణయం, చేయవలసిన కార్యం నిర్దేశించడానికి, రెండు రోజులలో బయలుదేరుతాను. సాత్యకిని అరవైమంది రథికుల, తగు సదుపాయాలతో, వెళ్ళేది అడవి మార్గం కాబట్టి, దానికి సర్వ సన్నద్ధం కమ్మని చెబుతాను.

''ఎందుకింత హడావుడి ప్రయాణం ? సాందీపులవారు ఆందోళన పడుతూ అడిగారు.

"అనర్థం జరుగబోతుందని నా మనసు చెబుతుంది. అందుకే ఈ హడావుడి ?'' అన్నాడు కృష్ణుడు. గురుదేవా, శ్వేతకేతుల వార్ని పాంచాలానికి పంపకండి. వారు నా వెంట వస్తారు. ఆ తర్వాత ఆయన కాంపిల్యానికి మరో వార్తతో వెడతారు.

"ఏమిటా సందేశం'' సాందీపుల వారి కుతూహలం.

"మీరందించిన వార్తకు సమాధానం స్వయంగా వచ్చి ఇస్తాను. అందరు ఆనందపడే మహద్భాగ్యం పొందుదామన్నది - అందలి సందేశమంటాడు. అర్థం కాలేదు సాందీపులకు "నువ్వు అర్థం కావు. నిన్ను అర్థం చేసుకోవడం చాలా కష్టమంటారు.

''గురుదేవా! మీరు చెప్పినదే, వారికి నేనూ చెబుతాను. అర్థం. ప్రకాశవంతము. దానికి ధర్మం ఆధారం. అదే సత్యం. అదే నిత్యం. అదే - ఈ - కృష్ణుడు!'' అతని తత్వం.

# అసలేం జరిగిందంటే.... ?!

**ధ**ర్మరాజు సమావేశ మందిరంలో విజ్ఞులతో కలిసి వున్నాడు. ధర్మ నిర్ణయం చేస్తున్నాడు. ఆ సమయంలో విదురులవారు వచ్చి మహారాజు రమన్నారని చెప్పాడు. మంత్రిగా వారి ఆదేశాన్ని గౌరవించి, తాత్కాలికంగా జరిపే సమావేశాన్ని వాయిదా వేసి, మహారాజు వద్దకు బయలుదేరాడు. దారిలో - ధర్మరాజా! ఏం జరిగినా బాధపడకూడదు. వారు.... మహారాజు!" అన్నాడు. "చిత్త" మన్నాడు ధర్మరాజు.

మెల్లిగా వాళ్ళు ధృతరాష్ట్రుని మందిరంలోని, మహారాజు గదిలోనికి అడుగు పెట్టాడు. ఆయన బంగారు సింహాసనంపై వున్నాడు. అలిసిపోయిన కురువృద్ధుడు ఆయాసపడుతున్నట్లున్నాడు.

ఆ గదిలో అడుగుపెడుతూనే, ముందు తాతగారికి, ఆ తదుపరి పెదతండ్రికి నమస్కరించాడు.

"నీతో.... మహారాజు అడిగాడు. విదుర మహాశయులున్నారని ధర్మరాజు చెప్పాడు. ఇంకా సహదేవుడు, వచ్చాడా ? అని అడిగాడు. లేదన్నాడు.

"రా, నాయనా! శతమానం భవతి" అని ఆశీర్వదించాడు. అంతవరకు కల్లోల సముద్రంలాగ వున్న భీష్ములు, నిబ్బరించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ వెంటనే - మధ్యాహ్న భోజనానికి వెళ్ళే సమయంలో నిన్ను భోజనం చెయ్యనివ్వకుండా ఇబ్బంది పెట్టాను, కదా" మహారాజు - ఓదార్పు వంటి నిట్టూర్పు.

అందర్ని వారి వారి ఆసనాలను తీసుకోమని -

"యుధిష్ఠరా! మీ పిల్లలందరిలోకి పెద్దవాడివన్న ప్రేమ - అభిమానం నా కన్నబిడ్డలకంటే నువ్వుంటేనే నాకెంతో అభిమానం. అయితే, ప్రస్తుతం కొన్ని అనివార్య కారణాల వలన, దుర్యోధనుడు, ఆతని మిత్రులు నీమీద అసూయగా వున్నారు. ఆ అసూయాపరుల నుండి నువ్వు కొన్నాళ్ళు దూరంగా వుండాలి.

"క్షమించండి. ఎందుకని అడగకూడదు కానీ, కారణం తెలుసుకుంటే, మళ్ళీ అటువంటి తప్పులు చెయ్యకుండా వుండగల్గుతానన్నాడు.

"నిజం. కానీ యుధిష్ఠరా! నువ్వు మంచివాడివి. అర్జునుడు మంచివాడే. నకుల, సహదేవులను నిందించవలసిన పనిలేదు..." ఆగాడు.

"అయితే భీముని వలన ఏదైనా పొరపాటు జరిగిందా చెప్పండి. తప్పక సరిచేయిస్తానన్నాడు.

"నువ్వు సరిచేయిస్తానంటున్నావు. కానీ, ఇదొక విషమ పరిస్థితి. దీనినుండి తప్పించుకోవడం కాదు, బయటపడాలంటే!...

"బయటపడాలంటే... చెప్పండి! ఏం చెయ్యాలి ?

నువ్వు సమర్థుడివే కావచ్చును. నీ సోదరులు ప్రతాపవంతులే కావచ్చును. మీకు ప్రజాబలం వుండవచ్చును. కానీ, అనవసరంగా అసత్య ప్రచారం చేసి నా పరువుదీయడం తగదు. నేను నిన్ను యువరాజు పదవి నుండి తప్పిస్తున్నానని, మిమ్మల్ని హస్తిన నుండి తరిమేస్తున్నానని కొందరు చెప్పుకుంటున్నారు ? ఇందుకు నీ సమాధానం.

"నాకేం తెలియదు, మహారాజా! నన్ను నమ్మండి" అన్నవాడు, మరల -

"నిందమోపబడ్డ ప్రతివాడు ఇదే అంటాడు. ఆతడెంత గొప్పవాడయినా, పేరుకు ధర్మాత్ముడైనా ధర్మం విషయంలో దారి తప్పుతాడు. చెప్పండి. నేనన్నది నిజమా, కా..... ?"

"నువ్వు సత్యమే చెప్పావు. కానీ...!"

"అందుకే... యుధిష్ఠరుని యువరాజు పదవి నుండి తప్పించి, అబద్ధాన్ని నిజం చేస్తున్నాను. మీరిక ఇక్కడ వుండకండి. అభద్రతా వాతావరణంలో భద్రంగా ఎవరు వుండలేరు. సుఖంగా బ్రతుకలేరు. మీకు మనశ్శాంతి వుండదు. మీకు ప్రశాంతి వుండదు. మీ అమ్మతో సహా వెళ్ళిపొండి" మహారాజు నిష్ఠూరంగా వాదించడం తెలియని ధర్మరాజు, పెద్దరికాన్ని గౌరవించి, తప్పు చేయకున్నా తలవంచుకున్నాడు.

మళ్ళీ మహారాజు "కొన్నాళ్ళు అక్కడ ప్రశాంతంగా వుండండి. వాతావరణం సర్దుకున్నాక ఇక్కడికి వద్దురుగాని. అక్కడో మహోత్సవము జరుగుతుంది. పెద్ద తిరునాళ్ళ వంటిది. అది చూడటానికని వెళ్ళండి. వేలాదిమంది సమక్షంలో

కొన్నాళ్ళు గడపండి. ఈలోగా ఇక్కడ ప్రశాంత వాతావరణ మేర్పడుతుంది. ఆ తర్వాత యధాప్రకారం మీరు తిరిగి వచ్చినా ఏ ఇబ్బంది వుండదు. ఇది నా సలహా. ఏమంటావు ?

"మీ ఆజ్ఞ మాకెల్లప్పుడు శిరోధార్యమే. మా క్షేమం సంక్షేమం మీ చేతుల్లో వున్నాయి. అందుకు మీరేం చెయ్యమన్నా చేస్తాము.

"ఆ.... అక్కడ మీ కోసం సర్వ సదుపాయాలతో మందిర నిర్మాణం జరిగింది. అందులో హాయిగా ప్రశాంతంగా వుండండి. ఇందుకు భీమార్జునులు ఒప్పుకుంటారా ?" మహారాజుకు అనుమానం.

"ఒప్పుకోరు. తప్పు చెయ్యని వారిని శిక్షించడం పొరపాటన్నది ధర్మవిదులు చెబుతారు. అయినా పెద్దనాన్నగారి మాటలో, మహారాజు ఆజ్ఞనో, నా నిర్ణయమనో చెబుతాను. వారివల్ల మీకే ప్రమాదం రాదు. పెద్దనాన్నగా మహారాజుకు వందనమర్పించాడు. తాతగారి శ్రీ చరణాలకు సాష్టాంగ నమస్కారం చేసాడు. అప్పుడింక భీష్ముడు ఆగలేక "యుధిష్ఠరా! నీవు నిజమైన ధర్మమూర్తివి. ఇంకా చెప్పాలంటే ధర్మ స్వరూపానివి. మీ ధర్మమే మీకు సర్వజగద్రక్ష అని తల పట్టుకుని నుదుట ముద్దుపెట్టుకున్నాడు.

''''''''''

# ధర్మం రక్షించాలి

సాత్యకి కుమారుడు యుయుధానుడి సారథ్యంలో కృష్ణుడు హస్తినాపురానికి బయలుదేరాడు. ఆ ప్రయాణ మధ్యంలో కృష్ణుని బృందం పుష్కర తీర్థం చేరారు. దానిని చేకితానుడు పరిపాలిస్తున్నాడు. అప్పటికప్పుడు ఓ చిన్న నగరం రూపొందింది. మధ్యలో గరుడధ్వజుడైన శ్రీ కృష్ణుని రథముంది. మూడు సం॥ల క్రితం, మధుర నుండి, ప్రభాసానికి బయలుదేరే మార్గంలో వీరిప్పుడు ప్రయాణిస్తున్నారు.

అప్పుడు పునరావాసం కోసం బయలుదేరిన శరణార్థులైనారు యాదవులు. ఇప్పుడు సర్వవిధాల సమర్థులై సర్వసౌకర్యాలు, రక్షణతో ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో కొంత భాగం సాల్వుని రాజ్యం కూడా వుంది. కాకపోతే యాదవులంటే

ఒకప్పుడు భగ్గుమనే ఆ సాల్వరాజ్యం ఇప్పుడు, యాదవుల వల్ల శాంతి స్వరూప మయింది. వారికున్న ఒంటెరథాలు అప్పట్లో భగ్నం చెయ్యబడ్డాయి. తర్వాత, తర్వాత, సాల్వుడు యాదవుల మిత్రుడయ్యాడు. కృష్ణుని ఆహ్వానించి, ఆతిథ్యమిచ్చే ధర్మరూపుడయ్యాడు.

ఇప్పటికే కృష్ణుడు ఉద్ధవుని పుష్కర తీర్థానికి రమ్మని కబురు పంపాడు. గోవిందుని కబురుతో రెక్కలు కట్టుకుని ఉద్ధవుడు వచ్చాడు. వస్తూనే కృష్ణుని కౌగిలిలో మునిగిపోయాడు. గుఱ్ఱాలు నురుగులు కక్కుకునేటంత వేగంతో వచ్చిన ఉద్ధవుని రాకకు, సాత్యకి, శ్వేతకేతులు ఆశ్చర్యపోయారు. అతని ప్రభుభక్తికి అంజలి ఘటించారు.

క్షణమాగి, తాను తేరుకుని "అన్నా! అపాయం సంభవించింది. మన మేనత్త కుమారులు పాండవులు, అయిదుగురు మరణించారు'' భోరుమని గుండెలు పగిలేలా విలపిస్తూ చెప్పాడు.

"ఆ.... అని ఉద్ధవుని ఓదార్చి, కాస్త తేరుకో. ఆ పైన మాట్లాడుకుందా మన్నాడు కృష్ణుడు. కృష్ణుని చేతినుండి విడిపోయిన ఉద్ధవుడు కుప్పలా ఓ చెట్టు క్రింద కూలిపోయాడు. అతని ప్రక్కన కృష్ణుడు కూర్చుని అనునయిస్తున్నాడు. శ్వేతకేతు మరొక ప్రక్కన ఓదారుస్తుంటే సాత్యకి మంచినీళ్ళు తేవడానికి పరుగెత్తాడు.

కొద్ది క్షణాలు గడిచాయి. ఉద్ధవుడు తేరుకున్నాడు.

అప్పుడు కృష్ణుడు "ఇప్పుడు చెప్పు... ఏం జరిగింది ?'' అడిగాడు.

"మన పాండవులు అయిదుగురు వారణావతంలో కాలి బూడిదైపోయారు. అత్త కుంతీ కూడా....'' భోరుమని విలపిస్తూ ఆపుకోలేక, ఆపుకోలేక.... చచ్చిపోయింది!'' గట్టిగా అరచి క్రిందపడ్డాడు. అతని భుజంపై తడుతూ "ముందు నిబ్బరించుకో. తేరుకున్న తర్వాత మిగిలిన విషయా''లన్నాడు.

ఈలోగా సాత్యకి మంచినీళ్ళు తెచ్చి ఉద్ధవునికిచ్చాడు. మంచినీళ్ళ మొహం తెలియనట్లు గడగడ త్రాగేసాడు. అప్పుడు శ్వాస కుదుట బడింది. మెల్లిగా కుదురుకుంటున్నాడు. ఆపుకోలేని దుఃఖంతో తమాయించుకుంటూ మెల్లిగా చెబుతున్నాడు.

"అప్పుడు హస్తినాపురానికి వచ్చానా ? కోటగుమ్మంలో భీమార్జునులు నన్ను సాదరంగా స్వాగతించి ఇంటికి తీసుకువెళ్ళారు. అత్తయ్య భీమార్జునులు ఎంతో చక్కగా మాట్లాడారు. ఆ తర్వాత కొంతసేపటికి సహదేవుడు, ఆ బావ తర్వాత, పెద్ద బావ, విదుర మహాశయులు వచ్చారు. పెద్ద బావను, మహారాజు రమ్మన్నారని చెప్పాడు. వెళ్ళాడు.

అప్పుడు వాళ్ళంతా కులాసాగా వున్నారా ? కృష్ణుడి ప్రశ్న.

దుర్యోధనుడు, వాడి మామ శకుని, ఆ అంగరాజు కర్ణుడు ద్రోణసుతుడు అశ్వత్థామల ప్రోద్బలంతో మాయోపాయాలు చేసి, మన బావలను చంపాలని పథకం వేసారుట. ఆ విషయం విన్న భీముడు వాళ్ళను పచ్చడి చేస్తానంటే, అర్జునుడు తగిన అస్త్రాలతో వారినెదుర్కోవడానికి సిద్ధంగా వున్నానన్నాడు. సరిగ్గా-అప్పుడు పెద్ద బావ తిరిగి వచ్చాడు.

"మహారాజు ఏమన్నారుట ?"

"ఏమన్నారో కానీ, వస్తూనే, ఆ అస్త్రాలన్నీ తీసెయ్యమన్నాడు. మన మెవరితోను యుద్ధం చెయ్యవలసిన పనిలేదు. ఎల్లుండి బయలుదేరి అమ్మగారితో కలిసి వారణావతానికి వెడుతున్నాం. ఇక ~~ఈ~~ ఆగడాలు, ప్రదర్శనాలు, నిరోధాలు విరోధాలు... అనవసరమన్నాడు. కానీ భీమార్జునులు కొంతసేపు మొండికేసి ఎదురు తిరిగారు.

అప్పుడు పెద్ద బావ నేను మహారాజుకు మాటిచ్చాను కనుక మనం ఎల్లుండి బయలుదేరి వారణావతానికి వెళ్ళిపోతున్నాము. ఇది పెద్దతండ్రికిచ్చిన మాటగాదు. మహారాజు ఆదేశానికి విలువ. అమ్మ కూడా మనతో వస్తుంది. ఇది నా తుది నిర్ణయమనేసరికి, భీముడు, అర్జునుడు, తలవంచి ఆ అస్త్రాలన్ని తొలగించారు.

యుధిష్టరుడు వారణావతానికి వెడుతున్న వార్త క్షణాలలో ప్రజలకు తెలిసి పోయింది. నీతి, న్యాయం, ధర్మం లేని ఇక్కడ మేముండలేము. మహారాజు సరే గుడ్డివాడు. కొడుకులపై గుడ్డిప్రేమ కలవాడు. భీష్మ పితామహులు. వారికందరు ఒకటే కదా! ఏమిటి వ్యత్యాసం. విపరీతమని ప్రశ్నిస్తుంటే, సమాధానం చెప్పేవారు కరువయ్యారు.

నేను వారితో కలిసి వారణావతానికి బయలుదేరాను. కొన్నినాళ్ళు వాళ్ళతో కలిసి వున్నాను. పాండవులెక్కడికి వెళ్ళినా, ఆ అయిదుగురికి అపూర్వ స్వాగత సత్కారాలు లభించేవి. వీరికోసం ప్రత్యేకంగా కట్టిన మందిరం చాలా చిత్రంగా వుంది. అన్ని సౌకర్యాలు వున్నాయి. అతి సున్నితంగా వుంది. "పురోచనుడు" అనే వాడు ఆ భవన సంరక్షకుడు.

నిజానికి వాడు పాండవులకు కావల్సిన సర్వము సమకూర్చాలి. అటువంటిది వాడు సేవకుడిగా గాకుండా ఒక గూఢచారిలా, అధికారిగా ప్రవర్తించడం కొంత అనుమానాస్పదమనిపించింది.

"ఇందులోని మోసాన్ని గమనించినవారు హస్తినాపురానికి తిరిగి వెళ్ళవచ్చు కదా ?" సాత్యకి అమాయక ప్రశ్న.

"వాళ్ళు తిరిగి వెళ్ళే సావకాశమే వుంటే, వారణావతానికి వచ్చి వుండేవారు కాదు." ఉద్ధవుడి జవాబు. "అవును, వారికి తమంతట తాము హస్తినాపురానికి ప్రాణాలతో వచ్చే అదృష్టం లేదు. ఇప్పుడు దుర్యోధనుడు హస్తినాపురానికి యువరాజు. అతన్ని కాదని ఎవరు ఏమీ చెయ్యలేరు. అటువంటప్పుడు వీరిని హస్తినలో అడుగుపెట్టనిచ్చే వారెవరు ? పొరపాటున అడుగు పెడితే ఆ కుత్సిత, కుయ్యుక్తుల దుర్మార్గులు, వీళ్ళనేదో విధంగా చంపడానికి వెనుకాడరు." చెబుతున్నాడు ఉద్ధవుడు.

"సరే. పాండవులు మరణించినట్లు నీకెలాగ తెలిసింది ?" కృష్ణుడు అడుగుతున్నాడు.

"అప్పుడు నేను ఉత్కోచకలో వున్నాను. అక్కడ ఈ వార్త విన్నాను. వెంటనే వారణావతానికి వచ్చి చూసాను. ఆ భవనం మొత్తం ముద్దయిపోయింది. ఆ భవనం మొత్తం ఏ మాత్రం వేడి తగిలినా, మండిపోయే విధంగా కట్టబడింది. ఇదంతా కావాలని జరిగిన కుట్ర. వాళ్ళను చంపాలనే పన్నాగంలో భాగం.

ఆ తర్వాత శాస్త్ర పద్ధతిన ఆ అయిదుగురు, కుంతిమాత, బాగా కాలిపోయి, గుర్తుపట్ట వీలులేనట్లున్నారు. ఆ కళేబరాలను సమాధి చేసారు. అంతావిన్న కృష్ణుడు ఆలోచనలో పడ్డాడు.

అరివీర భయంకరులు, జ్ఞానమూర్తులైన వారు, ఆ భవనంలో అడుగుపెట్టి, ప్రమాదాన్ని కనుక శంకించినట్లైతే తప్పించుకుని వుండేవారు - శ్వేతకేతు బాధ.

ఈ విషయం విదురుని ద్వారా యుధిష్టరునికి తెలిసింది. సొరంగ మార్గం కోసం రహస్యంగా పనులు జరుగుతున్నాయి. అది పూర్తయిందో లేదో తెలియదు. ఆ త్రవ్వకం బహిరంగంగా చేసేది కాదు. పురోచనునికి తెలియకుండా పకడ్బందీగా జరుగవలసిన కార్యక్రమం. అది పూర్తయిందో, వీరు తప్పించుకున్నారో లేదో తెలియదు. వాళ్ళు తప్పించుకుంటే, ఈ చనిపోయినది... ?!'' వూపిరాడని బాధతో, శ్వాసను నిలుపదల చేస్తున్న ఉత్కంఠ.

మొత్తానికి మనం ప్రేమించే, మనను ప్రేమించే పుణ్యమూర్తులు కనుమరుగయ్యారు. ఇదే దురదృష్టమంటే... పాపం, కృష్ణుడు కూడా బాధపడ్డాడు. ఇప్పుడేం చేద్దాం.... శ్వేతకేతు ప్రశ్న.

చేసేదేముంది ? తిరిగి వెళ్ళిపోదాం. కృష్ణుని సమాధానం. ఇది ధార్తరాష్ట్రులకు ఆనందం. మంచివారికి దుఃఖదాయకము. క్షణకాలం, ఉద్ధవుని మాటల్ని విన్న కృష్ణుడు, కర్మమెంత కాఠిన్యమైనది. కాలమెంత బలమైనది. ఎంతటి బలవంతులైనా... అనుకుని క్షణకాలం మౌనం వహించాడు.

ఆ.... కనీసం ఆ పెద్దాయన తాతగారు భీష్ముల వారినైనా పరామర్శించ డానికి నేను హస్తినకు వెడుతున్నానన్నాడు. నువ్వే మార్గంలో వచ్చావని ఉద్ధవుని అడిగాడు.

నేనీ వార్తను ఉత్కోచకలో వుండగా విన్నాను. నాగరాజు ఆర్యకుడు మరియు మన ముత్తాత తోడురాగా సరిహద్దులు దాటాను. మధుర వద్ద యమునను దాటాను.

"మధుర ఎలాగ వుంది ?'' మాతామహుల ప్రాంతమనేసరికి, కృష్ణుడు ఆసక్తిగా అడిగాడు.

మొత్తం మధురను, ఆ క్రూరుడు జరాసంథుడు శిథిలాలుగాను, బూడిద రాశులగాను చేసాడు. మన మందిరాలన్ని బుగ్గిపాలయ్యాయి. ఓ వందమంది పేద యాదవ కుటుంబాలు, మథురకు తిరిగి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ బ్రతుకుతున్నారు. నాగ, నిషాద వర్గాలవారు అక్కడ ప్రస్తుతం తిష్ఠవేసారని చెప్పాడు.

"మధురకు మనం తప్పక పూర్వ వైభవాన్ని తెచ్చిపెట్టాలి. మన మాతామహుల ప్రాభవాన్ని ఇతర దేశాలవారికి తెలియబర్చాలి." అంటూంటే "మరి నేను, పాంచాలానికి వెళ్ళాలా ?" వెళ్ళనా ? అని శ్వేతకేతువడిగాడు.

"వెళ్ళండి. ఆర్యకులవారికి కృతజ్ఞతలు చెప్పండి. మా వందనాలర్పించండి. తప్పక వచ్చి త్వరలో వారి దర్శనం చేస్తానని చెప్పండి. అలాగే పాంచాల భూపతితో, త్వరలో కృష్ణుడు మిమ్మ కలుస్తాడని చెప్పండి!" అన్నాడు. శ్వేతకేతు బయలుదేరాడు.

# ఏం చేద్దాం.. ?!

శ్రీమంతంబైన హస్తినాపురానికి ఒక్క యోజనం దూరంలో ప్రశాంత గంగా నది ఒడ్డున కూర్చున్నారు. కాని వారి మొహాల్లో ఏదో ఆందోళన. మనసులో అలజడి. సుదీర్ఘంగా ఆలోచిస్తున్నారు. వారు - గాంధారి సోదరుడు శకుని, ఇప్పుడే యువరాజ పట్టం పొందిన దుర్యోధనుడు. ఈతనికి మిత్రుడైన రథికుని కుమారుడు, సూతపుత్రుడైన కర్ణుడు. అయితే దుర్యోధనునితో, అదృష్టం కొద్ది ఏర్పడిన ప్రాణస్నేహంతో ఆ కర్ణుడు అంగరాజ్యాధిపతి అయ్యాడు. మైత్రీ ధర్మాన్ని పాటిస్తున్నాడు.

ఆ గొల్లవాడు... అదే... అదే... ఆ కృష్ణుడు వస్తున్నాడుట. అతనెందుకు రావడం ? అతనికి మనకి బంధుత్వం గూడ లేదు. ఎందుకొస్తున్నాడో ఏదో ప్రమాదం తెచ్చి పెట్టేటట్లున్నాడు. ఒక మూల చిరాకు, మరొకప్రక్క భయంతో, దుర్యోధనుడు కొట్టుకుంటున్నాడు.

కపటం కాని వ్యంగ్యంగా నవ్వుతూ "అల్లుడూ అతనిప్పుడే కాదు, ఎప్పుడూ ఇక్కడకు రావడం నాకిష్టం లేదు. కానీ, ఎందుకు నీకీ కంగారు ? అతను వస్తాడు. భీష్ముని చూస్తాడు. పెద్దలనొకసారి పలుకరిస్తాడు, వెడతాడు. దీనివల్ల మనకొచ్చే నష్టమేముంది ? ఎందుకా ఆందోళన! చాలా తేలికగా తీసుకోమన్నట్లు చెబుతాడు. కానీ, ఒక విషయం.... ఎంతయినా పదిమంది ఆరాధించే "పరమాత్మ" అనబడే పెద్దవాడు. కాబట్టి అతనిని గొల్లవాడు, యాదవుడు అనడం బాగోలేదు. ఇష్టంలేదు

కాబట్టి, ఆ అయిష్టాన్ని, అవతలివారికి కష్టం, మనకు "కష్టం-నష్టం" కలుగకుండా, ఒకసారి పొగిడేయ్. దాంతో మన కోపతాపాలు, అవతలివారి అయిష్టాలు సమసి పోతాయి.

అంతేకానీ, ఇష్టం లేదని మొహంమిద ఉమ్మేస్తే ఊరంతా కలిసి మనల్ని, చావగొట్టడమో, వెలివేయడమో చేస్తారు. ఇది సామాన్యుల విషయంలో అనుకో. అయినా, మనం రాజులం, మనకు ఇబ్బంది, ప్రమాదం కలుగనంతవరకు, అందరు ఒక్కటే. ఈ కోపతాపాల ప్రదర్శనను నిలిపివేద్దాం. ఏమంటావు ? ఏడవలేక, అలాగేనంటాడు దుర్యోధనుడు.

"అవును మిత్రమా! ఆ వచ్చే కృష్ణుని వలన మనకొచ్చే నష్టమేముంది ?" ఎందుకు అనవసరాందోళనమంటాడు, కర్ణుడు కూడా!

"మీకు లోకజ్ఞానం తెలియదు. కృష్ణుడు సామాన్యుడు కాడు. ఒకప్పుడు తాడు, బొంగరం లేని యాదవులందర్ని ఒక్క త్రాటిపైకి తెచ్చి తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. ఇప్పుడు కృష్ణుడు వారికి దేవుడు. అతను చెప్పింది వేదం. ఇక్కడా వున్నారు ఆయన భక్తులు, భట్రాజులు. నిష్కారణంగా తన మేనత్త పిల్లలను నగర బహిష్కారం చేసినట్లు యువరాజ పీఠం నుండి తొలగించి, హస్తిన నుండి పారద్రోలడాన్ని వారణావతంలో లక్క ఇంట్లోవారిని చంపించడాన్ని ఆ పెద్దమనిషి సహిస్తాడా.... ఆలోచించు. అతను సామాన్యుడు కాడు, కొంటెచూపులు, కోరనవ్వు. అందుకే నాకు భయ"మంటాడు.

"అదికాదు దుర్యోధనా! అతను చిన్నప్పటి నుండి ఎన్నో సాహసాలు, మరెన్నో మహత్కార్యాలు చేసాడు. వాటి ప్రభావానికి కన్న, విన్న, లోనయిన వారందరు - మహాత్ముడు, ధర్మాత్ముడు, అవతారపురుషుడంటే, కొందరైతే "దేవుడ"ని కీర్తించడం విడిచి, పూజించడం ప్రారంభించారు" అన్న శకుని మాటల్తో-

అసూయాగ్రస్తునివలె సహనం లోపించిన దుర్యోధనుడు "మామా! నువ్వు భగవంతుడివే. కాదా ? అయినా త్రాగేవాడు, తందనాలాడేవాడు, చిన్న పెద్ద తేడా లేకుండా, ఆడేవాడు - పాడేవాడు, వెన్నముద్దలు దొంగిలించేవాడు, కన్నెపిల్లల బట్టలు ఎత్తుకుని పోయేవాడు, వాడు.... దేవుడా.... ఇంకే, నువ్వు దేవుడివే...

భజనపరులను భట్రాజులను పిలిపించనా ? అది సరే. ఇంతకీ అతనెందుకు వస్తున్నట్లో ? శ్రద్ధాంజలి ఘటించడానికా ? పరామర్శించడానికా ??!

"అల్లుడా! అమాయకుడా! నీకంతా తొందరా, ఆవేశమే! అందరు దేవుడన్నారు. నీకు వచ్చిన నష్టమేమిటి ? మనం చెయ్యలేనివి, చాతకానివి, దేవుని మీద పడేస్తాం ? ఆ భారం మొయ్యాల్సిన పని ఆ దేవుడనేవాడిది. ఇప్పుడు ఇక్కడికి, అతగాడు కృష్ణుడిగానే వస్తున్నాడు కానీ, దేవుడిగా కాదులే ?!

దేవుడుగా వచ్చాడనుకో, కాలి బూడిదై, కర్మకాండలైన వారిని బ్రతికించాలి. తన భగవత్తత్వాన్ని నిరూపించుకోవాలి. ఇది జరిగే పనేనా ? జరగదు కదా, కనుక ఎందుకీ ఆందోళన ? అనవసర ఆలోచనా ?! అర్థమయిందా!

"నాకు అర్థమయింది. కాని మన తాతగారున్నారే ఆ వృద్ధ పెద్దమనిషి భీష్ముడు. ఆయన కృష్ణుని కీర్తిస్తూ, దేవునిగా అభివర్ణిస్తూ - వూహ తెలిసినప్పటి నుండి - ఇప్పటి వరకు చేసిన పనులన్నీ లీలలుగా ప్రశంసిస్తూ, మా ముసిలాయన. అదే... మా తండ్రిగారి బుఱ్ఱ తినేస్తున్నారు. పైగా కృష్ణుడు ధర్మరక్షకుడుట. ఈ లోకంలోని దుర్మార్గాన్ని నాశనం చేయడానికి, భగవంతుడిలాగ, రకరకాల రూపాలతో, పేర్లతో అవతరిస్తూం టాడుట. అటువంటి దివ్యరూపమే, ఈ కృష్ణుడని.. ఒకటే రొద..." అంటే!

"అవును. మిత్రమా, ఇవన్నీ తాతగారికెలా తెలుసు ? అంటాడు కర్ణుడు.

"వున్నాడుగా, విదుర మహాశయుడు. ఆయనే తాతగారికి లీలా విశేషాల భక్తినందించి వుంటాడు. వాటిని ఈ వృద్ధ వీరుడు, మా నాన్నగార్కి అందిస్తున్నాడు" ఇదొక రకమైన ఆక్రోశం. అందుకు శకుని, తన సహజ నవ్వుతో

"అల్లుడూ ఇది ప్రపంచం. ఇందులో జరిగే ప్రతిదానికి మనం బాధ్యులము కాము. మనం స్పందించవలసిన పనిలేదు. అసలు విషయం, మెల్లిగా చెబుతాడు. సన్యాసి, సమాజానికి "మసి." అతన్ని పట్టించుకోవలసిన అవసరం లేదు. అతనితో పని వుండదు.... ముఖ్యంగా నీకు...!" ధర్మం సూక్ష్మం చెప్పినట్లు హెచ్చరించాడు శకుని. తలవూపిన దుర్యోధనుడు -

ఎందుకో నాకూ కృష్ణుని ఒకసారి చూడాలని వుంది. ఆయన మనస్సు తెలుసుకోవాలని వుందంటాడు. మరల -

"నాన్నగారు, ఆతనిని గొప్పగా స్వాగతించాలంటారు. ఆతడేమన్నా మహారాజా, రాజమర్యాదలు అందించడానికి, పొందడానికి!

"అల్లుడూ! ఇక్కడ అర్హత ప్రశ్నకన్న, ఆధిక్యతకే విలువ ఎక్కువ. అతను నీకు, నాకు తక్కువవాడు కావచ్చు. కానీ లోకం దృష్టిలో -

జరాసంధుని నిలువరించాడు. శ్రీ గాలవ్యుని సంహరించాడు. కాలయవనుని మట్టిగరిపించాడు. ఆ యమపురికి వెళ్ళి యమునితో పోట్లాడి, తన గురుపుత్రుని బ్రతికించి తిరిగి తీసుకువచ్చాడు. కంస వధతో చేతికి చిక్కిన రాజ్యాన్ని తాతగార్కి దానం చేసాడు. ధర్మమూర్తిగా తనకు యువరాజ పట్టాభిషేకం వద్దని, పెదతండ్రి కుమారుడు బృహద్బలునికి ధారాదత్తం చేసాడు.

ముఖ్యంగా - మహామహులను నిలువరించినట్లు జరాసంధుని కాళ్ళు చేతులు కట్టేసినట్లు తల మరొక్కసారి కొట్టేసినట్లు రుక్మిణీ కల్యాణం చూపించాడు. ఆ రుక్మిణి తనను కోరిందని, బహిరంగంగా ఎత్తుకువచ్చి వివాహం చేసుకున్నాడు. ఈ కథలన్ని విన్నవారు ఆతనినేమంటారు ? రాజాధిరాజు అంటారు. విశ్వకీర్తి మయుడు, విశ్వంభరుడై విక్రమించే కృష్ణునికి, గోవర్ధన గిరిని చిటికెనవ్రేలుతో ఎత్తినప్పుడు, ఆ దేవేంద్రుడే శరణాగతుడయ్యాడుట. చెప్పు. అతను దేవాధిదేవుడు కాదా! అందుకని.... మహాత్ములను, ఆచార్యులను, అధినాయకులైనవారిని ఎలాగ కీర్తించి, ఆహ్వానిస్తామో అలాగే ఆహ్వానించమన్నారు.

అది పెద్దవారి ఆలోచన. నువ్వెలాగ చేస్తావన్న దాన్నిబట్టి నీ భవిష్యత్తు, ఉనికి ఆధారపడి వుంటాయి. ప్రపంచమో, నీవో తేల్చుకో. నీవంటే నీ ఇష్టం. ప్రపంచమంటే.... లోకాభీష్టం" అనగా....

"మామా! దీనికింత కథా....!" అని విసుక్కుంటే...

"తప్పదు, అల్లుడూ, తప్పదు. నేను చెప్పక తప్పదు. నువ్వు వినక తప్పదు. ఆ వచ్చేవానిని, ఆనందంగా స్వీకరించు. ఆదరంతో గౌరవించు. అందరివలె కీర్తించు. మంచివాడని ప్రేమను పెంచు, పంచు.

"ఇదే, ఇదే... నాకు నచ్చదు. కల్లబొల్లి కబుర్లు, మాయమాటలు నాకు చాతకావు. ఆ...! అని గట్టిగా అరిచాడు. మళ్ళీ దుర్యోధనుడే.... అసలు నేను చేసిన తప్పేమిటి ? కురువంశంలో, గ్రుడ్డివాని కుమారునిగా పుట్టడమా ? పాండురాజు వలె పదవీ మోహం, వ్యామోహం లేకుండా తిరస్కరించడమా ?

"రాజును కాబట్టి, రాజ్యం కోరాను. యుధిష్ఠరుడు వయసులో పెద్దవాడు కావచ్చును. కానీ నేను పెద్దవాడి కొడుకును. వారసుడను. చిన్నవాడి కొడుకు పెద్దవాడైనంత మాత్రంలో, పెద్దవాడి కొడుకు చేతులు ముడుచుకుని కూర్చోవాలా! నేనేదో తప్పు చేసినట్లు, ప్రతి ఒక్కరి ముందు తలవంచాలా ? నా వ్యక్తిత్వాన్ని చంపుకుని, వూరి వారికోసం బ్రతకాలా ? కుదరదు. అదెన్నటికి కుదరదు. అభిమానధనుడైన ఈ దుర్యోధనుడు ఒకరికి పాదాక్రాంతుడు కాడు, కాలేడు. తలవంచడు. తల.... వంచడు. వంచలేడు కూడా! ఎదుటి వారెంతటి వారైనా సరే, వారి తలలు వంచడానికి గాని, పాదాక్రాంతులను చేసుకొనడానికి గాను, వెనుకాడడు." వూరికే ఆవేశపడిపోతున్నాడు. దాంతో ఆ ప్రస్తావనకు అక్కడితో తెరదించదలిచారు.

"అదికాదు మామా!" ఆవేశం, అన్యాయమని, దానిని ఆపుకోలేక పోతున్నాడు. నిరోధించలేనందుకు బాధపడిపోతున్నాడు.

చూడు, వాదాలు, వివాదాలు కాదు ప్రస్తుతం మనకు కావల్సింది. వచ్చిన వాడితో ఏ తంటా లేకుండా, మనము అధర్ములమని లోకానికి తెలియకుండా...

"అంటే మేనమామను చంపిన దుర్మార్గుడు, ధర్మమూర్తా ? అతనిని గౌరవించాలా ?

తప్పదు. లేకపోతే ఒక పని చెయ్యి. కృష్ణునివలె పేరు ప్రఖ్యాతులు పొందడానికి, ముందు నువ్వు నన్ను చంపు. ఎందుకంటే అప్పుడతని అడుగుజాడలలో నడిచినట్లవుతుంది. లోకం నిన్ను మెచ్చుకుంటుంది.

"మామా.... ?!"

"మరేమిటి, అల్లుడూ! చెప్పేది వినవు. ప్రతిదానికీ ఆవేశము. అవకాశం దానంతటది తన్నుకు వచ్చినట్లు కృష్ణుడు వస్తున్నాడు. అతన్ని ప్రసన్నం చేసుకో. ధర్మమూర్తివని నిరూపించుకో. నీ వద్ద ఏ తప్పులేదని కృష్ణుడు గ్రహించాడో.... బ్రతికి పోతావు. కాదో.... సమూలం... ఎప్పటికైనా తప్పదు. ఏం చేస్తాం ? అంతా, విధివ్రాత" అంటాడు.

# పాపం, ఏం చేస్తాం... ?!

**కృ**ష్ణుడు హస్తినాపురానికి వచ్చాడు.

సాధారణంగా, భారతావనిలోని సాంప్రదాయం ప్రకారం - ఎవరైనా అయినవారు మరణిస్తే, ఆ ఆత్మీయులను, అంత ప్రేమతో పలుకరించడం.... అదే పరామర్శించడం, ఓదార్చడం, తరతరాలుగా వస్తున్న పద్ధతి - దానినే ఆచారమని కూడా అంటారు. ఇది సాంప్రదాయంలోని, సంస్కృతీ విభాగం.

అందులోని భాగంగా, వచ్చే పెద్దలను ఆహ్వానించడం, గౌరవించడం, మరో పద్ధతి. వసుదేవుని సోదరి కుంతీ పాండురాజు భార్య. ధృతరాష్ట్రునికి మరదలు. వృద్ధమూర్తి భీష్ములవారికి కోడలు. ఇప్పుడా కోడలు, మనుమలు అకస్మాత్తుగా, హస్తినాపురం నుండి ఉత్సవాలు చూడాలని వారణావతానికి వెళ్ళిన కొన్నాళ్ళకే, వారిల్లు తగులబడిపోవడం, తల్లి - అయిదుగురు మహావీరులైన పిల్లలు నిద్రలో... లేవడానికి, పారిపోవడానికి, ఏ మాత్రం సావకాశం లేకుండా ఆహుతవడం.... ఎందరినో కృంగదీసింది. కేవలం కొందరికి మాత్రం ఆనందాన్నిచ్చింది.

కృష్ణుడు, ఉద్ధవుడు, సాత్యకి, ఇతర యాదవ పెద్దలు తెల్లదుస్తులు ధరించి, గంగలో తమవారిని తలచుకుని శ్రాద్ధక్రియలు నిర్వహించారు. శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత, అందరు కలిసి, ఎందరో శ్రీకృష్ణ దర్శనార్థం తహతహ లాడుతూంటే, విషణ్ణవదనంతో రాజప్రాసాదంవైపు నడుస్తున్నారు.

తమను చూస్తూ, కుంతి - ఆమె పిల్లలకై తపించే ప్రజలను చూసి కృష్ణుడు చలించాడు. కళ్ళలో అశ్రుబిందువులు, తెలియకుండా క్రిందకు జారాయి. తానేదో చేద్దామనుకున్నాడు. కానీ భగవంతుని నిర్ణయం చిత్రంగా, చిత్రమయింది. చింతను మిగిల్చింది. ఇదంతా దుర్యోధనుని కుట్రలో భాగంగా కృష్ణుడు తలంచాడు. ఆ విధంగానే వారిని చూస్తున్నాడు. దుర్యోధనుని, శకునిని, కృష్ణుడు చూసాడు. అందరిలో దాగని కుత్సితం, దాగిన విచారం - కనబడుతున్నాయి. కర్ణుడు చూడలేదు, నిజంగానే తన అమాయకత్వాన్ని నటించకుండా ప్రకటించు కుంటున్నాడు. మిగిలిన వారందర్ని దుర్యోధనుని - శకుని పరివారమని నిర్ణయించుకున్నాడు.

అందర్ని పరికించిన - కృష్ణుడు -

మహారాజు ధృతరాష్ట్రుని దర్శించాడు. జరిగిన ఘోరానికి, తన సంతాపాన్ని ప్రకటించాడు. మహారాజుకొక ప్రక్కన దుర్యోధనుడు, మరొకప్రక్క సంజయుడు వున్నారు. మంత్రి కణికుడు, కృష్ణునికి, ధృతరాష్ట్రుల వారికెదురుగానున్న ఆసనాన్ని చూపాడు. కూర్చునేముందు సాంప్రదాయబద్ధంగా అభివందనాలు తెలిపాడు. కృష్ణునికిరుప్రక్కల, ఉద్ధవ, సాత్యకిలు, తాము కూడ మహారాజుకు వందన మాచరించి నిలిచారు.

కృష్ణుని రాకకు, జరిగిన ఘోరానికి మహారాజు నిబ్బరించుకోలేకపోతున్నాడు. "కృష్ణా! తమ్ముడు, ఆతని భార్య, పిల్లలు, అందరు నన్ను ఒంటరివాడిని చేసి వెళ్ళిపోయారు. దురదృష్టవంతుడిని... అసలు.. !" మహారాజు ఏదో చెప్పబోతున్నాడు.

"తండ్రీ! అనవసరంగా బాధపడకండి. కావాలని, అనవసర అసత్య ప్రచారాలు చేసి, కావాలని, అక్కడికి వెళ్ళారు. ఆయువు మూడింది. ఒక్కరు కాదు... అదేమిటో అందరు కట్ట కట్టుకుని, అగ్నికి ఆహుతయ్యారు. వీరాధివీరులు, ధర్మాత్ములన్నారు. వారి వీరత్వం ఏమయిందో ? ధర్మమెక్కడకి పోయిందో. బాధపడుతున్నట్లు, విషయాన్ని సర్దిచెప్పి తండ్రిని ఓదారుస్తున్నట్లు, తన కపట నైజాన్ని దుర్యోధనుడు ప్రదర్శించుకుంటున్నాడు.

కుమారునితోపాటు, ధృతరాష్ట్రుడు కూడా, కుమారుడు చెప్పినట్లు కృష్ణునికి పాఠం అప్పగిస్తున్నాడు. ప్రతాపవంతుల ప్రతాపం అన్యాయమైపోయిందని వాపోయారు. దురదృష్టం. కర్మ, ఏం చేస్తాము ? అంటూనే మహారాజు -

"నాకు సోదర - భార్యపుత్రుల శోకం. నీ తండ్రికి సోదరి, మేనల్లుళ్ళు శోకం. నీకు మేనత్త - బావల శోకం." అని ఏదో చెప్పబోతూంటే...

"మామా! మొత్తానికందరం, ఏదో విధంగా శోకమూర్తులమయ్యాము. శోక సముద్రంలో మున్గిపోయాం. ధర్మానికి దుర్యోధనుడన్నట్లు నాశనం లేదు. ప్రతాపానికి వినాశనం, పట్టపగ్గాలుండవు. ధర్మం జయిస్తుంది. వీరత్వం నిలుస్తుంది. కాలం వంచించదు. మనుష్యులే వంచకులు. వారి అవినీతి తాత్కాలికం. తప్పక వారందరు ధర్మానికి వీరత్వానికి తప్పక తలవంచాలి. అలాగ కాకపోతే, మాటమారుస్తూ - రాజు

"రాజు" కాలేడు. రాజ్యం పాలించలేడు. అంతా అధర్మమంటే, ధర్మం కనబడదు. అంతా ధర్మమనుకుంటే, అధర్మం - అసలు కనబడదు.

ఇది జీవితం కాదు, సిద్ధాంతం. చర్చా కాదు. సన్మతం, సమ్మతం. ఈ ధర్మం పైనే లోకం, అందులో సృష్టి, ఇందులో సకలజీవులు. వీటిలో అత్యుత్తమమైన మానవుడు. మహితా దర్శకులున్నారు. దుర్యోధనా! బాధపడకు. నీ మాట అసత్యం కాదు. ధర్మం, సత్యం వలెనే జయిస్తుంది. మామా! బాధ దిగమ్రింగండి. తప్పక సుఖం - శాంతి. మీకు తప్పక లభిస్తాయి. జరిగిందేదో జరిగింది!" అని ఓదారుస్తాడు.

దుర్యోధనుడొక ప్రక్క, ధృతరాష్ట్రుడొక ప్రక్క... అమ్మో! ఈ కృష్ణుని మనసు అర్థం కాదు. అంతరంగం.... అమ్మో! ఆ బ్రహ్మకు కూడా అర్థం కాదు. వెక్కిరించనట్లు వెక్కిరించి, దెప్పనట్లు దెప్పి, తప్పు కనబడకుండా తప్పించుకు తిరుగువాడు.... ధన్యుడని ప్రకటించే.... కృష్ణుని చతురిత, అనన్యము, అపూర్వము ఎన్ని జన్మలెత్తినా దీనిని సాధించలేము. అందుకే కృష్ణుని దేవుడన్నారు - కాదనుకుంటేనే వారు ఒప్పుకున్నారు. ఓర్పు-క్షమల నిధికి వందనమాచరించారు!

అక్కడనుండి మహామనీషి భీష్ములవారిని కృష్ణుడు సభక్తిపూర్వకంగా కలిస్తే, సగౌరవంగా కృష్ణుని ఆహ్వానించి, ఆయనకు పాదాభివందనం చెయ్యాలనుకుంటే, కృష్ణుడు తెలివిగా, వారి అక్కున చేరాడు. ఆ మహాపరి.... తన దురదృష్టానికి ఖిన్నుడయ్యాడు. విపరీతంగా బాధపడ్డాడు. ఆ బాధలో తాను పాలుపంచు కున్నాడు. కృష్ణుని దివ్యస్వరూపానికి తనను తాను మరచిపోతూ... "కృష్ణా...!" అనగా -

"తాతా! ఇది తప్పు కదూ! అన్ని తెలిసి బాధపడటం, ఏమీ తెలియని నన్ను కీర్తించడం తగునా ? పెద్దలు, ఆశీర్వదించండి. ధర్మప్రతిష్ఠాపనానికి సహకరించండి" అంటూంటే నీతో, ఉద్ధవ - సాత్యకిలు కూడా వచ్చారట. రమ్మన రాదా! అనగా - "మీ ఆజ్ఞ" అని వారిని రప్పించాడు. వారితో విదురుడు కూడా వచ్చాడు. అందరు కలిసి, ఆ మహావీరునికి సాష్టాంగ వందనం కావించారు.

అంత బాధలోను, కృష్ణుని చూడటం, భీష్మునికెంతో ఆనందంగా వుంది. కేవలం, ఒకే ఒక చిన్నమాట "నిన్ను చూడగలిగాను" ఎంతో సంతోషంగా చెప్పాడు.

"నా రాక, మీకు.... ఇబ్బందికరం కాదు, కదా!"

“లేదు. కృష్ణా! లేదు. నిన్ను చూడాలనుకుంటున్నాను. కారణమేదైనా నిన్ను చూడగలిగాను. పరవశించాను. ఇంతకంటే అదృష్టం ఎవరికి లభిస్తుంది ?” భీష్ముడు సంతృప్తిని వ్యక్తం చేసాడు.

“తాతగారూ, మీకీ వయస్సులో, ఇటువంటిదే కాదు, ఎటువంటి కష్టం రాకూడదు. మీరే కాదు, ఏ ఒక్కరు అధర్మానికి గురి కాకూడదు. వీరత్వాన్ని పరిహాసింప చేసుకోరాదు..” అంటే -

“నిజం. కృష్ణా! కానీ, మొదట్నుంచి ఆ భగవంతుడు నన్ను పరిహాసిస్తూనే వున్నాడు. జీవితానికి సుఖము-సంతోషం తెలియదు.” గొంతు వణుకుతుంది. ఇటువంటి జన్మమెవరికి రాకూడదు. తల్లి పవిత్రమైన గంగామాత కంటికి తల్లిగా కనబడదు. పిలిస్తే వస్తుంది. ఇక తండ్రి. కాలం తీరినట్లు వెళ్ళిపోయారు. సోదరులు ఒకరి తర్వాత మరొకరు.... గతించారు. ఇదెంత అన్యాయమో ఆలోచించు.

అదృష్టంకొద్దీ ఆ మహానుభావుడు, వేదవ్యాసుడు సోదరుడయ్యాడు. మాతృశ్రీ సత్యదేవి సలహాతో, విధవరాలైన మరదళ్ళు సంతానవంతులయ్యారు. వంశోద్ధరణకు వ్యాసులు చేసిన ఉపకారం అంతా ఇంతా కాదు. కాని - దురదృష్టం వెక్కిరించింది.

ఒకడు అంధుడు, ఇంకొకడు “పాండు”వర్ణుడు. ఇదేమిటని - అంబికను ప్రార్థిస్తే, ఆమె కరుణించినట్లు నాటకమాడి, తన దాసీని, మహర్షిని కూడమంది. అది అదృష్టమో... దురదృష్టమో.... నాకు తెలియదు. కానీ మొత్తానికి మహానుభావుడు జన్మించాడు. ఎంతో కొంత సంతోషం. అది నిలువరాదన్నట్లు భగవంతుడు, ముందు పాండురాజును, ఆ తదుపరి మాద్రిని బలి తీసుకున్నాడు.

“కర్మమని” ఎంత సరిపెట్టుకుంటాను ?! అయినా నాకు నేను సర్ది చెప్పుకున్నాను. ఇద్దరు భార్యలకు అయిదుగురు పుత్రులు. తండ్రీ - కొందరికి సవతి తల్లి, కొందరికి తల్లయిన మాద్రి మరణిస్తే, అందరికీ, అందనంత గొప్ప మనసుతో కుంతి - తల్లి, తండ్రి - తానే అయి పిల్లల్ని నిజంగా గొప్పగా పెంచింది. వరపుత్రులు కదా! వాళ్ళు అలాగే పెరిగారు.

ఏదో ఆ పిల్లల్ని చూసి కాలం గడుపుతున్నాను. విద్యాభ్యాసం పూర్తయింది. అందరిలోకి పెద్దవాడని యువరాజును చేసాను. ఇది కొందరు మనుషులకు, వారికి తోడయిన, ఆ భగవంతునికి నచ్చలేదు.

ఫలితంగా యుధిష్టరుడు, యువరాజ సింహాసనాన్ని పెదతండ్రికి, వినయంగా, అందిన దానిని అర్పించమన్నట్లే అర్పించాడు. మహోత్సవం పేరిట వారణావతానికి తల్లితో కలిసి వెళ్ళాడు. వీరికోసం ప్రత్యేకంగా నిర్మించిన ఇంట్లో వుంటూ, ఒక అర్థరాత్రి పూట, మంటలు చెలరేగి, అందులో, మిడతల్లాపడి, అంతటి మహావీరులు, గొప్ప తల్లి... కాలి బూడిదయారు. ఇవన్నీ చూడటం, ఆ బాధను.... పదే పదే తలుచుకుని ఏడవమని.......

ఆ విధాత - “విధి” వ్రాతగా నా నుదుట వ్రాసాడు. ఏమీ చెయ్యలేని అసహాయస్థితిలో... ఇలాగ, ఇక్కడ కూర్చుని, గుండె పగిలేటట్లు ఏడుస్తున్నాను. కృష్ణా! ఇంతకంటే వచ్చే ప్రమాదముంటుందా ? స్వచ్ఛందమరణ వరం లేకపోతే, ఈ పాటికి ఎప్పుడో కాలగర్భంలో నా అన్నలవలె కలిసిపోయేవాడిని, చరిత్రలో గొప్పగా చెప్పుకునే చరిత్రగతిని పొందేవాడిని!”

అంతటి పెద్దాయన, గుండె తెరచి చదవమని పుస్తక పుటలను కృష్ణుని ముందర, విడదీసి పెట్టాడు. “పితామహా!” అన్న కృష్ణుడు, విదురుని చూసి “మహాశయా! మీరేమంటారు ?” అన్నాడు.

“కృష్ణా! జగత్ప్రభువు. నీకు తెలియనిదేముంది ? అందరు మంటల్లో పడి మాడిమసయిపోయారన్నాడు. అందుకు నిదర్శనంగా, అక్కడ కాలిన శరీరాలు. వాటిని చూడలేము. కాబట్టి - యధావిధి జరుపవలసిన సముచిత కర్మలు నిర్వర్తించాం. అంతకుమించి ప్రస్తుతం మనం చేయదగ్గదేమీ లేదు. కేవలం విచారించడమే మన దగ్గరున్న ఆయుధం. నీకు చెప్పవలసిన వాడిని కానంటూ... మర్మగర్భితంగా చెప్పాడు.

కృష్ణుడు ఆలోచించాడు. తల పంకించాడు. గమనిస్తున్న విదురుడు - “కృష్ణా! ప్రస్తుత పరిస్థితి.... ?!”

“ఏముంది ? దుర్యోధనుడు చెప్పినట్లు ధర్మాన్ని బ్రతికించుకోవాలి. వీరత్వాన్ని ప్రకటించుకోవాలి. నేను ఎప్పుడూ చెప్పేదదే. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాను. అధర్మం తాత్కాలికంగా విర్రవీగినా, శాశ్వతం - ధర్మం. అది సత్యానికి ఆధారం. విశ్వానికి మూలం.”

“నా వుద్దేశం... ?!”

అర్థమయింది, విదుర మహాశయా! కురువీరుల చేతుల్లో ధర్మం భద్రంగా వుంటుందా ? అనే కదా మీ ఆందోళన....! తప్పక భద్రంగా వుంటుంది. ధర్మం నిలబడుతుంది. ఈ అకృత్యాలు, ఆగడాలు ఆగవు కాని, తాత్కాలికాలు. తప్పక తగు ఫలితమీ దుర్మార్గులు పొందుతారు. సత్యం, సత్యం. పునః సత్యం....!" అంటూ తను కూర్చున్న ఆసనం నుండి లేచాడు.

"పితామహా! తమరు అనుమతిస్తే....!"

"తప్పక వెళ్ళవచ్చును. కృష్ణా! ఇక్కడ నుండి నువ్వు వెళ్ళేది ద్వారకకేనా ?" భీష్ముడు అడుగుతున్నాడు.

"లేదు. ద్రుపదుని కోరిక మేరకు కాంపిల్య నగరానికి వెడుతున్నాను."

"అతడు, మన శత్రువే. అక్కడికి వెళ్ళడం దేనికి ?"

"ధర్మ హాని చేసేవారు తప్ప, అందరు నాకు మిత్రులే. ఆతని ధర్మపథం తెలుసుకుందామని...!"

"అయితే, నువ్వు మాకు మరో విధంగా మిత్రత్వం జరుపవు కదా ?"

"పితామహా! చెప్పాను కదా! అధర్మానికి పూర్తిగా దుర్యోధనుడు పాల్పడితే తప్ప, నేను ఇతరుల సాయమొందను. అధర్మానికి, తలవంచనని, నిష్కర్షగా చెప్పాడు. ఆ తర్వాత....

కృష్ణుడు హస్తినలో రెండుదినాలు గడిపాడు. కలిసే వారిని ఆదరించాడు. తను కలువవలసిన వారిని కలిసి అభివందనాలర్పించాడు. ఈ పద్ధతికి, విధిలేక దుర్యోధనుడు కృష్ణునితో మైత్రికి సిద్ధపడుతున్నాడు.

ఈ సంతాప దినాల సమయంలో, సలుపవలసిన కర్మకాండలు తప్ప, ఇతర కార్యక్రమాలన్నీ వాయిదా పడ్డాయి. అయిదుగురు సోదరులు, కుంతీమాత, మరణించిన మూడునెలల తర్వాత, మళ్ళీ యధావిధి రాచకార్యాలు ప్రారంభ మయ్యాయి.

కృష్ణుడు హస్తినకు వచ్చిన మూడవనాడు, ధృతరాష్ట్రుడు కృష్ణ, ఉద్ధవ, సాత్యకిలను - తనింటికి భోజనానికి రమ్మని ఆహ్వానించాడు. ఆ సందర్భంలో కృష్ణుడు, మహారాణి గాంధారీదేవిని చూసాడు. పలుకరించాడు. నిజానికామె

మహాపతివ్రత. అంధుడైన ధృతరాష్ట్రుని వివాహమాడింది. అంధుడని తెలిసిన మరుక్షణం, తనకీ ప్రపంచంతో పనిలేదని చెప్పి, తాను కళ్ళకు గంతలు కట్టుకుంది. ఈ లోకాన్ని ఇకపై చూడకూడదని నిశ్చయించుకుంది.

రాజ కుటుంబం వారిలోని యువరాణి భానుమతిని కృష్ణుడు "సోదరి" అని పలుకరించాడు. ఆమె నడక నాట్యంలా వుంటుందని ఆమె "నాట్యమయూరి" అని ఎందరో పొగడుతారు. ఆమెవరో కాదు, కాశీరాజు కుమార్తె. పదిహేడేళ్ళ నూత్న వధువు. ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు. అందరు చెప్పినట్లు ఆమె అందగత్తె. ఆమె కూడా కృష్ణుని అంతే ఆరాధనభావంతో చూసి నమస్కరించింది.

కృష్ణుడు భోజనం చేసి వెళ్ళిపోతూంటే, చిన్న పిల్లగా ప్రవర్తించే ఆమె ఇతర యువరాణిలతో కలిసి, వీడ్కోలు చెప్పింది. ఇక్కడ మీకు వసతులు లభించాయి కదా! గాంధారి పెద్ద కోడలుగా గడుసుగా అడిగిందా పిల్ల. అందుకు సమాధానంగా కృష్ణుడు "అందరు నన్నింత ప్రేమగా చూస్తుంటే అసౌకర్యాలకు, ఇబ్బందులకు తావెక్కడ ?" అని ప్రశ్నిస్తాడు.

కాస్సేపు అక్కడ సరదాగా గడపాలని వుంది. కానీ పితామహులు, ఎదురు చూస్తుండటంతో, "వస్తా"నని అక్కడ నుండి కదిలాడు. తన మందిరానికి తిరిగి వచ్చాడు. ఎవరితో మాట్లాడుతున్నా ఆ అమాయకురాలు భానుమతి అందచందాలు ఆప్యాయత... ఆమెను గుర్తుచేస్తున్నాయి.

మర్నాటి సాయంకాలం, విదురుని ఇంట్లో విందుకు వెళ్ళిన, సాత్యకీ, ఉద్ధవులు ఇంకా తిరిగి రాలేదు. చీకటి పడుతుంది. విశ్రాంతి తీసుకుందా మనుకుంటున్నాడు ఆ సమయంలో స్త్రీ పురుషుల నవ్వులు..... ఎవరో వస్తున్న అలికిడి. పడుకుందామని తీసిన కిరీటం, ఆభరణాలు మళ్ళీ తగిలించుకోవడ మయింది. దుర్యోధనుడు, భానుమతీదేవి, దుశ్శాసనుడు, మరో ఇద్దరు యువరాణులు కిలకిల నవ్వుతూ అక్కడికి వచ్చారు.

వాళ్ళను చూస్తూనే "ఇప్పుడే విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నాను' కృష్ణుడు చెప్పాడు.

"క్షమించు. మేము...!" దుర్యోధనుడు అడుగుతున్నాడు.

"ఫర్వాలేదు, రండి!" అనగా కృష్ణుడు. భానుమతిదేవి "సంతోషం. ఎందుకొచ్చారిప్పుడనకుండా, స్వాగతించారు. అదే మహదానందం మాకు!" ఆడుకునే పసిపిల్లలాగ మాట్లాడుతుందామె. పేరుకు యువరాణి అయినా, వయస్సు కేవలం పదిహేడు సం॥లే కదా!

"మీ గురించి ఎన్నో కథలను విన్నాం. గో, గోపబాలురు గోపికలతో ఆడేపాడే, అనందమూర్తియని, ఎందరో చెప్పారు. అప్పుడే ఆమె విసిగిపోయినట్లు పడుకోవడానికి, ఆ గోపికలకంటే తీసిపోయామా, మేము ?" అదొక ప్రశ్నగా అడిగిందామె.

"ఆ రోజులు పోయాయి. అప్పుడు బృందావనంలో వుండేవాడిని. బృందగానాలు సలిపేవాడిని. కాలచక్రంలాగ, లోక పరిణామంలాగా, నాలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. నేను గోపాలుడినే కాదనను. కానీ గోపికాలోలుడిని మాత్రం, కాను! సున్నితంగా మందలించాడు.

భానుమతి - "రండి. అందరు సరదాగా ఆటపాటలతో కాలం గడుపుదాం. ఇప్పుడు సంతాప దినాలు కూడా అయిపోయాయి. కాబట్టి సరదాగా, వుండటంలో తప్పు లేదు. అసలే కోతి, కల్లు త్రాగిందన్నట్లు, అందగత్తె ఆపైన గారం. ఇందుకు దుర్యోధనుడి వత్తాసు. వెళ్ళక తప్పలేదు. వెడుతూ, వెడుతూ, ఉద్ధవ, సాత్యకిలకు తాను యువరాణి భానుమతిదేవి చేసే గౌరి పూజకు దుర్యోధనాదులతో కలిసి వెడుతున్నానన్నది అప్పుడు, కృష్ణుడు అక్కడ వ్రాశిపెట్టిన వార్తా సారాంశం.

ఇందుకు కూడా దుర్యోధనుడు పాల్పడతాడా ? తన భార్య మరొకరిని ఆటపాటల్తో కాలక్షేపం చేద్దాం! రమ్మని పిలిస్తే సహకరించేవాడు భర్తా లేక.... ఛ!" అసహ్యించుకున్నాడు - కృష్ణుడు. అందుకు తగ్గట్లు - ఆమె వస్త్రధారణ యువరాణి స్థాయికి లేదు. కాశీరాజు కుమార్తె ఈ విధంగా ప్రవర్తించడం - సిగ్గుచేటనిపించింది. ఎక్కువభాగం ఆమె శరీరాన్ని అలంకరించడానికి వస్త్రాలకన్న కుందన" పుష్పాలతో చేతులు, నడుము, మెడ వగైరాలు అలంకరించుకుంది.

అది ఆమె అందానికి అలంకారమైతే అవవచ్చును కాని, రాచబిడ్డ, భావి మహారాణి, ప్రస్తుత యువరాణి ఆ విధంగా ప్రవర్తించడం కృష్ణుని కేమాత్రం నచ్చలేదు. నాగరికత - సాంప్రదాయ, సంస్కృతులలో వుండాలి. కాని, అధునాతన మంటూ వస్త్రధారణలో, శరీర వంపు - సొంపులు ప్రదర్శించడంలో వుండకూదన్నది కృష్ణుని అభిమతం.

ఎన్నో సం॥గా తెలుసున్నట్లు ప్రవర్తించే ఆ పసిపిల్ల మనస్తత్వానికి, నవ్వాలో- ఏడవాలో అర్థం కావటం లేదు. పైగా - "కృష్ణా!" నీ గురించి నాకు బాగా తెలుసు. యమునాతీరంలో, ఇసుక కుప్పల మీద, వెన్నెల్లో కన్నె గోపికలతో చేసే ఆటలు గూర్చి విన్నానులే. ఇక్కడ కొన్నాళ్ళుండి, అప్పుడానాడు గోపికలకు ఏం చెప్పావో, ఏం నేర్పావో అవి మాకు నేర్పుదువుగాని!" అంటే...

"చెప్పాను కదా, అవన్నీ చిన్ననాటి ఆటలని....!"

"చిన్నప్పటివో, పెద్దప్పటివో నాకు తెలియదు!" గోముగా అందా పిల్ల.

"మరి నీకేం తెలుసు ?" అడిగాడు కృష్ణుడు.

"ఏం తెలుసా ?" అంటూ - ఆతని చేతిని పట్టుకుని నొక్కుతూ నేనేం చిన్నపిల్లను కాను. మాయమాటలు చెప్పడానికి. మధుర నాశనమయ్యాక, కొందరు గాయనీ నర్తకమణులు మా నగరానికి వచ్చారు. వారి ఆటపాటలతో మమ్మందర్నీ రంజింపచేసారు. అప్పుడే నీ లీలలన్నీ కళ్ళకు కట్టినట్లు, ఆటపాటలతో వర్ణించి, మరీ పాడారు. అప్పుడే వారు కొన్ని రాసక్రీడలను చూపారు. అప్పటినుంచి నిన్ను చూడాలని, నీతో మాట్లాడాలని ఎంతో కోరికగా వుండేది.... అది... ఇన్నాళ్ళకు, ఈ విధంగా తీరింది!" ఎంతో ప్రేమగా మాట్లాడుతుంది.

"నువ్వు ఇక్కడకు వస్తున్నట్లు ఆర్యపుత్రులు చెప్పారు. నిన్ను కలుసు కోవాలని కూడా చెప్పారు. ఇంకో మాట చెప్పనా... ?" అంటూ... నీ లీలలన్ని విన్నాక, నేను కూడా గోపికనైపోతే బాగుండుననిపించింది. సిగ్గుపడుతూ చెప్పిందా పిచ్చిపిల్ల.

పరిస్థితిలాగ వుంటుందనుకుంటే, ఇక్కడికి వచ్చేవాడని కానను కుంటున్నాడు కృష్ణుడు. దుర్యోధనుడు ఏదో మాట్లాడబోతూంటే, భానుమతి కల్పించుకుని

"ఆర్యపుత్రా!" ఎప్పుడు మీరే మాట్లాడుతారు. ఎప్పుడో కాని మాకు సావకాశం రాదు. ఇప్పుడా అవకాశం వచ్చిందంటూ, "కృష్ణా! నీకింకా గోపికలు గుర్తున్నారా ? మరచిపోయావా ?" అదొక అమాయకపు ప్రశ్న.

"వారినెలాగ మరచిపోగలనమ్మా!" వారు నా ప్రాణమంటాడు కృష్ణుడు.

"అయితే, నేను గోపికనైతే, నన్ను అలాగే తలచే వాడివా ?" వయస్సుకన్నా మనస్సు పెరుగని ఆ పిల్ల ప్రశ్నకు -

"నువ్వు గోపికెలా అవుతావు. వాళ్ళు పనిపాటలు చేసుకునే అమాయకపు పిల్లలు. నువ్వో మొన్నటి వరకు రాకుమారివి. ఇప్పుడు యువరాణివి. నీకా అదృష్టం లేదు కదా! అన్నట్లు కృష్ణుడు వివరిస్తాడు.

"చూడు, చూడు, నా మాటల్ని ప్రక్కదారి పట్టిస్తున్నావు. నేను, అన్నదేవిటి? నేను గోపికనయితే.... అన్నాను. అవునా ?"

"అవును."

"అప్పుడు. నువ్వు నన్ను ఇతర గోపికలవలె నీ ప్రాణంగా చూసుకుంటావు. అవునా ?

"నిజం గోపికలను నా ప్రాణంగా తప్పక చూసుకుంటాను. నువ్వు గతంలో గోపికవు కాదు. ఇప్పుడు కాలేవు. అవునా ?" అడిగిందానికి సమాధానం చెప్పమన్నట్లు కృష్ణుడడిగాడు.

ఇక లాభం లేదని - దుర్యోధనా! జాగ్రత్తగా వుండు. ఆ తర్వాత ఏమనుకుని లాభం లేదు. ఈ పిల్ల పరిస్థితి చూస్తే నిన్ను కాదని, నా వెనుక పరుగెత్తుకు వచ్చేటట్లుంది. జాగ్రత్త"ని హెచ్చరిస్తాడు.

"ఆమె విషయంలో నాకే మాత్రం భయం లేదు. ఆమె ఓ వాగుడుకాయ. అలాగ వాగుతుంటుంది. ఏదైనా మనసులో పడితే సరి, ఆ విషయం తేలేవరకు, అలాగ మాట్లాడుతుంటుంది. ఒక్కొక్కసారి ఆమెను చూస్తే, రాను, రాను, పిచ్చెక్కుతుందేమోననిగూడ, అనిపిస్తుంది.

"నాకు పిచ్చిపడుతుందా ? నేను పిచ్చి, వాగుడుకాయనా ? ఆర్యపుత్రుడు అలాగ అన్నారు కాబట్టి "కృష్ణా! ముందు నా మాట విను. నిజానికీయనే పిచ్చివాడు. ఎంతసేపు పదవి - రాజకీయాలు. ప్రత్యర్థుల ప్రాణాలు తియ్యడం. ఎదుటివార్ని ఎలాగ దెబ్బతీయాలా ? అనే ఆలోచనలు...

ఈ పిచ్చి ఆలోచనలు ఈయనతో విడువకుండా అనవసరంగా, అత్తగార్ని, మామగార్ని ఇబ్బందులపాలు చెయ్యడం. ఏడవడం, మొత్తుకోవడం.... ఇది నిత్యం జరిగే పని. ఈ మనిషి మొహంలో కానీ, మనసులో కాని నవ్వు కనబడదు. అనకూడదు కానీ, ఆ భగవంతుడు "నవ్వు" అనే పదం ఈయన జీవితంలోంచి తీసేశాడేమోనన్నది, నా బాధ, భయం. ధైర్యంగా అనేసింది. ఒక్క దుర్యోధనుడు తప్ప, ఆమె మాటలకు అందరు విరగబడి నవ్వారు.

"భానుమతీ, అవి రాజకీయాలు. వాటి గురించి" ఆగమన్నట్లు చెయ్యి పట్టుకున్నాడు.

"నిజం. ఆ కుళ్ళు రాజకీయాలు నా కనవసరమంది. కృష్ణుని చెయ్యి పట్టుకుని" కృష్ణా, వెన్నెల రాత్రుళ్ళు వరకు ఇక్కడే వుండాలి. మాకు ఆ రాసక్రీడల పరమార్థాన్ని తెలపాలి.

"అమ్మా! భానుమతీ, జరగనివి, అడగకూడదు. నిజానికి నా వేణువును బృందావనంలో విడిచిపెట్టేసాను. నాట్యం మరచిపోయాను. ఆనాడు చిన్నతనం. ఏదో ఎగిరాము. అదేం కళ కాదు, శాస్త్రం కాదు. ప్రస్తుతం నేను బృందావనంలో కూడా లేను!" కృష్ణుని మాటకడ్డం పడుతూ -

"మనం వున్నాము. నేను చెబుతున్నాను." పూల తేనె తీపి ఎక్కువైనట్లు మాట్లాడుతుందామె. ఇప్పుడామె పరిస్థితి సంసార జీవితాన్ని కూడా బయట పెట్టేటట్లుంది.

"చూడమ్మా! మనకెన్నో ఆలోచనలు, కోరికలు వుండటం సహజం. అవన్ని ఫలించాలని, ఫలిస్తాయనుకోవడం పొరపాటు. ఇప్పుడు - కాశీరాజు కుమార్తెగా గత జీవితం పూర్తయింది. కురువంశ యువరాణివి, భావి సామ్రాజ్ఞివి. కాబట్టి చిన్నప్పుడెప్పుడో తెలియని వయస్సులో కొన్ని అల్లర్లు - ఆగడాలు చేస్తాము. పెద్దయ్యాక చేస్తే ఒప్పుకుంటారా, నలుగురు వూరుకుంటారా, ఆలోచించు ?!

మనకంటూ కొన్ని ఆచారాలు, కట్టుబాట్లు సాధారణంగా వుంటే, రాచపడుచులకు ఇంకొన్ని కట్టుబాట్లు అసాధారణంగా వుంటాయి. ఆ చట్రం దాటి రాకూడదు. కాదంటే, దేశానికి అప్రదిష్ట. మన మూలాన పదిమంది సుఖసంతోషాలతో వుండాలే తప్ప -

అధర్మ ప్రకరణానికి, ధర్మ నాశనానికి తావివ్వరాదు. మరొక్క విషయం పితామహులు పరమ పవిత్రులు, గంగా పుత్రులు. మహాభీషణ ప్రతిజ్ఞ చేసి "భీష్ములు"గా విఖ్యాతులయ్యారు. వారు నా చొరవను, సాహసాన్ని, నీ మాటతో కనుక ప్రదర్శిస్తే -

ధర్మం దారి తప్పుతుంది. దేశం నాశమవుతుంది.

ప్రకృతి పరిహసిస్తుంది. ప్రళయం విలయతాండవం చేస్తూ వస్తూంది. జాగ్రత్త!" చెబుతూనే, కటువుగా హెచ్చరిస్తాడు.

ఈ దెబ్బకు, భానుమతికే కాదు, దుర్యోధనుని మత్తు దిగిపోయింది.

అయితే - నేను - గోపికను కానా...?! ప్రశ్నించడం కాదు, తనలో తాను గొణుక్కుంటూంటే...

"ఉష్!" అంటూ కృష్ణుడు నడిచాడు.

★ ★ ★ ★

దుర్యోధనుడు కృష్ణుని తోడ్కొని, రాజభవనాలకు చివరగానున్న మందిరానికి వెడుతున్నాడు. ఆ వెళ్ళడంలో ఓ చక్కని ఉద్యానవనాన్ని దాటారు. అది భానుమతీదేవిది. అక్కడ ప్రతినిత్యం గౌరిపూజ జరుగుతుంది. ఆట పాటలతో అమ్మవారిని అర్చిస్తుంది. ఆ ప్రాంతమంతా రకరకాల దీపాలతో కళకళ లాడుతుంది. ఆ ప్రక్కన ఎన్నో బంగారు, వెండి చిన్న మధుపాత్రల వంటివి వున్నాయి. అది చూసిన కృష్ణుడు వాటి నుండి ఓ చిన్నపాత్రను తీసుకున్నాడు. భానుమతి పక్షిలాగ పరుగెత్తుకు వచ్చింది. ఆ వెనుక దుర్యోధనుడు. కృష్ణుని చూస్తూ "ఈనాడు నువ్వు వచ్చావని ఆర్యపుత్రులు వచ్చారు. నేను వారి ఆయుర్వృద్ధికి నా సౌభాగ్యం కోసం ప్రతినిత్యం చేసే గౌరిపూజకు రమ్మంటే రారు. ఇప్పుడు నీ కోసమెలాగ వచ్చారో చూడమని నవ్వుతూ చెప్పింది. ఈ మారు నువ్వు మా హస్తినకు వస్తే తప్పక నీ వేణువును తేవాలంది.

అది బృందావనంలో వాళ్ళకు విడిచిపెట్టేసాను. ఇప్పుడదే లాగ వస్తూంది ? అంటూ తన చేతిలోని మధుపాత్రను క్రిందపెట్టాడు. ఆర్యపుత్రులు ఎందరో వస్తారు కాబట్టి ఎక్కువ మధువును తెప్పించమన్నారు. అదే ఆ పాత్ర, నీకింకా కావాలా ? అడిగింది అక్కడ "ఒక పెద్ద నాలుగయిదు అడుగుల ఎత్తు కనీసం మూడడుగులు వెడల్పు గల పాత్రను చూపించింది. కృష్ణుడు "చాలు" అన్నాడు. అప్పుడు, ఆరు లేదా ఏడుగురు ముఖ్యులు పీకలదాకా త్రాగి, రకరకాల భంగిమలలో నిలబడి, కృష్ణుని అభినందిస్తూంటే, అతడు ప్రత్యభివందనం చేసాడు

ఆరతి కార్యక్రమము అప్పుడే ప్రారంభమయింది. భానుమతి, దుర్యోధనులు కృష్ణుని గౌరీదేవి మందిరానికి తీసుకువెళ్ళారు. అందరు హారతి కళ్ళకద్దుకున్నారు. భానుమతి అమ్మవారికి నివేదన జేసి "మధువు" పాత్రలను కృష్ణునికి, ఆర్యపుత్రులకందించింది. కృష్ణుడు పాత్ర నందుకుని ఒక గుక్క తాగి, సుతారంగా, వద్దంటూ ప్రక్కన పెట్టేసాడు.

ఇప్పుడు మేళాలు, తాళాలు, మంగళవాయిద్యాలు, అమ్మవారి నుద్దేశించి స్త్రీలంతా పాటలు పాడుతున్నారు. కొందరు నాట్యం చేస్తున్నారు - భానుమతి కేవలం పిచ్చి కబుర్లే కాదు. ఆట - పాటలలో దిట్ట. చక్కగా ఆడుతుంది, పాడుతుంది. అంతవరకు బాగానే వుంది. త్రాగడం, ఆడటం - పాడటం చూస్తుంటే... ఇదే దశకు వెడుతుందో, అర్థం కావడం లేదు. నాగరిక సమాజమిలాగే వుంటుందేమో!

ఉన్నవాళ్ళకు ఎగ్గు సిగ్గులు వుండవు. లేనివాళ్ళకూ వుండవు. ఎటొచ్చి మధ్యతరగతి వాళ్ళే అటు ఇటు కాకుండా త్రిశంకు స్వర్గంలో నలిగిపోతున్నారు. ఇది కృష్ణుని మనసు. ఇటువంటి తరుణంలో, భానుమతి రాణి కృష్ణా!" అంటూ మళ్ళీ వచ్చింది. కొద్దిగా మధువు పుచ్చుకో. నా కోసమంటూ పాత్రనిచ్చింది. విధిలేక, మర్యాద కోసం అందుకున్న కృష్ణుడు ఒక గుక్క త్రాగి, మళ్ళీ పాత్రను ప్రక్కన పెట్టేసాడు. ఎంత ఆధునిక, నవ నాగరిక సమాజంలో వున్న, అటవిక సాంప్రదాయాలకు భిన్నం కాని, ఈ ఆటపాటలు, మందు - వినోదాలు కృష్ణునికి నచ్చవు. మానవాళి మనుగడను హరించే కార్యక్రమాలివి. సమాజానికి చేటే తప్ప, మేలు చెయ్యవన్నది - శ్రీకృష్ణుని తత్వం - లేదా - సిద్ధాంతం.

ఇక్కడ జరిగేది పూజకన్నా, ఏదో విధంగా తనను లొంగదీసుకోవడానికి, ఈ విధమైన వలపన్నారని తలిచాడు. అందరు - ఆడారు, పాడారు. అలిసి పోయారు. సొమ్మసిల్లలేదు కాని, మెత్తగా తివాచిలాగ పరచిన గడ్డిపై బడి - వావివరుసలు మరచి, భౌతికానందం కోసం ప్రయత్నం చేస్తున్నారు.

ఇది ముదిరిపోతుంది. ఇక్కడనుండి వెళ్ళిపోవాలనుకున్నాడు, కృష్ణుడు. అయితే, ఈ త్రాగుడు మైకంలో స్వస్థత తప్పిన భానుమతి అన్యాయమై పోతుందని, ఆమె గురించి ఆలోచిస్తూన్న తరుణంలో, ఒక్కసారి అక్కడున్న దీపాలు ఆరిపోలేదు. కానీ, కాంతులు మసకబారాయి.

తూలి క్రిందపడినట్లు దుర్యోధనుడి అరుపు "ప్రియా!" అంటూ ఎవరో తనను మెడచుట్టూ చేతులు వేసి పెనవేసుకున్న పరిస్థితి. కృష్ణుడు త్రోసిరాజని చూస్తే.... ఇంకెవరు ? ఆమె భానుమతి. అంటే ఈ విధంగా తనను లొంగదీసుకుని, తన తొత్తుగా చేసుకోవాలని, దుర్యోధనుడిది పాడు ఆలోచనగా కృష్ణుడు తలంచాడు.

భానుమతి కృష్ణుని మెడ చుట్టు చేతులు వేసి బిగించి "నేను నీ గోపికను.. నీ గోపికను... నువ్వు ... !" అంటూ వళ్ళు మరచి ప్రవర్తిస్తూంది. కృష్ణునిలో కోపం, అసహ్యం వేసింది. ఇవి మనిషి చేష్టలా ? లేక జంతు ప్రవర్తనమా ? వంశం కోసం, తండ్రి కోసం తన జీవితాన్నే బలి చేసుకున్న నిజంగా కురువంశ పితామహుడు భీష్ముడు జన్మించిన పవిత్రవంశంలో, ఈ కుక్కమూతి పిందెలు, భ్రష్ట ధర్మానికి, పిరికి శూరత్వానికి పాల్పడి, కట్టుకున్న భార్యను, పరాయి మగవాడిపైకి ఉసికొల్పుతున్నారంటే ఛీ.... ఛీ.... ఛీ... అనుకున్నాడు కృష్ణుడు.

మత్తు బాగా తలకెక్కిన భానుమతికి తానేం చేస్తూందో తెలియటం లేదు. తారతమ్యాలు, సిగ్గెగ్గులు మరచిపోయి, ఎప్పుడో.... ఏదో విన్న కథనం ద్వారా "నేను నీ గోపిక ననడం బహు విడ్డూరం. వివాహమైన స్త్రీ పతితలాగ, అలాగ ప్రవర్తించవచ్చునా ? ఆమెను మెల్లిగా దుర్యోధనుని మందిరానికి చేర్చాడు. తాను ధృతరాష్ట్రుని మందిరానికి వెళ్ళాడు. జరిగింది చెప్పి పరువు - ప్రతిష్ఠలు నిలుపుకోమని హెచ్చరించడానికి బయలుదేరాడు.

అలాగ బయలుదేరినవాడు క్షణకాలం భానుమతి వద్ద ఆగాడు. చెదురు మదురుగా వున్న వస్త్రాలను సరి జేసాడు. పిచ్చిగా - వెట్టిగా అవతలివారిని ఆకర్షించడానికే అన్న విధంగా వున్న ఆ వస్త్రధారణకు అసహ్యించుకున్నాడు. కాపలా వారికి తనను పరిచయం చేసుకుని, భానుమతీరాణి గౌరిపూజ సమయంలో అస్వస్థతకు గురయిందని చెప్పి ఆమె, తన అత్తగారితో అదే మహారాణితో వుండటం మంచిదని చెప్పడంతో -

అనకూడదు కాని, ఆ స్థితిలో యువరాణిని చూసిన కాపలాదారుడు అదిరి పోయాడు. కాకబోతే ఆమె విషయం తెలుసున్నవాడు కాబట్టి, అతడో సేవికను పిలిచాడు. ఆమె మహారాణికి తెల్పి ఆమెను తీసుకువచ్చింది. ఆ వచ్చింది, వాసుదేవుడని తెలుసుకున్న గాంధారి -

"వాసుదేవా, నువ్వా... ఏమిటీ సమయంలో వచ్చావు ?" ఆశ్చర్యం - ఆసక్తితో అడిగింది. కాపలాదారుని, పరిచారికను వారించి - "అమ్మా! క్షమించు సోదరి భానుమతిని తీసుకువచ్చాను. ఆమె దారుణమైన పరిస్థితిలో వుంది. మీ చెంతవుంటే మంచిదని తీసుకువచ్చాను. తప్పయితే క్షమించు!" ప్రార్థించాడు.

గౌరిపూజ తర్వాత జరిగినదంతా చెప్పి, మన పరువు, నేలపాలు కారాదని, అక్కడ జరిగిన అంతఃపుర విషయం ఇక్కడితోనే సమసిపోవాలని ఆ అమాయకు రాలిని, రక్షించాలని ఇలాగ తీసుకు వచ్చానన్నాడు. ప్రస్తుతం ఆమెకు ఎక్కిన మత్తు దిగే వరకు వూహా ప్రపంచంలో మెదలుతుంది. ఇష్టమొచ్చినట్లు వాగుతుంది. సహనంతో ఆలకించి, క్షమించండి" అన్నాడు.

గాంధారి "మంచి పనిచేసావు" అంటూ ఆ వృద్ధ పరిచారికతో, భానుమతిని తన ప్రక్కన పడుక్కోబెట్టమని చెప్పింది. భర్తకోసం స్వంత అంధత్వాన్ని వహించిన గాంధారి నిజంగా అదృష్టవంతురాలు. అదే కళ్ళారా భానుమతిని, ఆ పరిస్థితిలో కనుక చూసివుంటే, ఆ పతివ్రతా శిరోమణి గుండె ఆగి చచ్చేది.

తెల్లవారింది. మెల్లగా భానుమతి కళ్ళు తెరచింది. తానెక్కడున్నది గ్రహించి తత్తరపడింది. తాను తన అవతారం. ఏమయింది ? గాంధారి జరిగింది చెప్పింది. సిగ్గుతో కుచించుకుపోతున్న ఆమె - చల్లటి నీటితో మొహం కడుక్కున్న తదుపరి, అత్తగారిని కౌగలించుకుని, భోరుమని విలపించింది. అప్పుడామె అత్తగారిగా కాక, ఓ "తల్లిగా" అమ్మాయి ఏమీ జరగలేదు. అంతా మనకు మంచిదే. సమయానికి దేవుడిలా ఆ కృష్ణుడు నిన్ను తీసుకువచ్చి నాకర్పించాడు. లేకపోతే ఈ భరత వంశ పరువు - ప్రతిష్ఠలకు అప్రదిష్ట తోడయి - ఆర్యావర్తం మొత్తం అట్టుడికిపోయేది. అందరం కట్టకట్టుకుని, గంగలో దిగాల్సి వచ్చేది. అదృష్ట-వంతులము కాబట్టి ఆ జగన్మాత మనల్ని కరుణించిందంది.

తెల్లవారింది. గౌరీమందిరం సమీపంలోని దృశ్యం పూజారులను ఆశ్చర్య పరచింది. అందరు త్రాగి, అర్థనగ్న శరీరాలతో, వళ్ళు తెలియకుండా పడి వున్నారు. వాళ్ళను కదుపాలన్నా, మెదపాలన్నా భయం. ఎందుకంటే, వారందరు, ముఖ్యంగా ఆడవాళ్ళందరు యువరాణులు, అంతఃపుర కాంతలు.

దాంతో పూజారులు, హుటాహుటిన విదురులను వారిని దర్శించి, విషయం వివరించి "మహాప్రభో!" అని నిలబడిపోయారు. ఆయన ఇద్దరు ముగ్గురు నమ్మకస్తులతో పూజారులు చెప్పిందంతా విని, జరిగిందానికి, ఆశ్చర్యపోయాడు.

ముందు దుర్యోధనుని అక్కడనుండి, ఆతని మందిరానికి తరలించాలి. అతన్ని లేపి ఎత్తుకోవడమంటే చాలా కష్టం. అయినా అందర్ని తరలించారు. అక్కడ వున్న స్త్రీ, పురుషులందరు ఉన్నత రాజవంశీయులైన అధికారులు.

ఈ జరిగింది భీష్ములవారికి గూడా తెలిసింది. ఆయన ఉగ్రుడయ్యాడు. వెంటనే ధర్మమండలి సమావేశాన్ని ఏర్పాటు చేసారు. జరిగిన దానికి తగు విధమైన ప్రాయశ్చిత్తంగా కొన్ని నిర్ణయాలు చేసారు. అందులో మొదటిది -

దుర్యోధన-దుశ్శాసనులు - కురుక్షేత్రమునకు వెళ్ళి సామాన్య పౌరుల వలె ఒక మాసం తపోమూర్తులు కావాలి. రెండోది : మిగిలినవారు ఒక సం॥రం బదరీనాధకు వెళ్ళి తపస్సు చెయ్యాలి. ఇక మూడవది - భానుమతితో కాశీ నుండి హస్తినాపురానికి వచ్చిన ఇద్దరు యువతులు తక్షణం ఈ దేశం నుండి వెళ్ళిపోవాలి. మరెప్పుడు ఇక్కడికి రాకూడదు.

మిగిలిన స్త్రీలు ప్రతి మాసంలో చాంద్రాయణ వ్రతాన్ని, కురుకుల ముఖ్య పూజారి ఆధ్వర్యంలో ఒక సం॥రం పాటు నిర్వర్తించాలి. భర్తలు కాకుండా ఇతరుల కౌగిలిలో వున్న ఆ ఇద్దరు స్త్రీలు, భర్త, అత్తమామలు కాదంటే, విధిగా అగ్నిప్రవేశం చెయ్యాలి.

భానుమతి ఉద్యానవనం, అక్కడగల - గౌరి, శంకరులకు పవిత్రోత్సవం, ఆలయశుద్ధి కార్యక్రమాలను జరిపించాలి. ఇవి ధర్మమండలి నిర్ణయాలు. ఎవరైనా సరే ఖచ్చితంగా ఆచరించి తీరాల్సిందే.

ఇవన్ని విన్న భానుమతి అదృష్టవంతురాలు. కృష్ణుని "పుణ్యామా" అని, "గోపిక - గోపిక" అన్నందులకు ఆ పరమాత్మ నిజంగా రక్షించి, కరుణించాడు.

★ ★ ★ ★

ఆనాడే కృష్ణుని తిరుగు ప్రయాణం. సాయంకాలం ఆయన బయలు దేరుతాడు. విషయం తెల్సిన విదురుడు వచ్చాడు. ఈలోగా ఒకసారి, రాజమాతను కలుసుకొమ్మని, కోరడానికి వచ్చాడు. సాధారణంగా రాజమాత

ఎవరినీ చూడాలని కోరరు. ఆ వచ్చిన వారు కూడా ఆమె దర్శనాన్ని కాంక్షించరు. కృష్ణుడు కాబట్టి, ఆ ధర్మమూర్తిని చూడాలని రాజమాత సత్యవతిదేవి తలచింది.

జన్మించింది, యమునాతీరంలోని జాలరుల వంశంలో. అప్పుడామె పేరు మత్స్యగంధి. అనుకోని పరిస్థితులలో, మహాఋషి పరాశరుని సంగమంలో ఒక పిల్లవాడిని కంది. అది విధి ప్రేరణ, దైవలిఖితం. అతనిపేరు కృష్ణుడు. ద్వీపంలో పుట్టాడు కాబట్టి ద్వైపాయనుడయ్యాడు. ఆ పిల్లవాడు కురుక్షేత్రానికి తండ్రితో వెళ్ళాడు. ఋషి సాంప్రదాయంలో పెరిగాడు. ఆతడే వ్యాసుడు. వీరిని వేదవ్యాసుడని కూడా అంటారు. ఈయన వశిష్ట వంశోద్భవుడు.

**"వ్యాసం వశిష్ఠ నప్తారం, శక్తేపౌత్రఃమకల్మషం**
**పరాశరాత్మజం వందే, శుకతాతం తపోనిధి"**

అని ప్రస్తుతించి, కీర్తిస్తారు. ఆయన వంశక్రమం.

ముందు బ్రహ్మ - ఆయన నుండి, "వరిష్ఠ, వరిష్ఠ" అంటూ వశిష్ట జననం. ఈయనకు శక్తిపుత్రుడు. ఆయనకు పరాశరుడు. వీరికి కృష్ణుడు - ద్వైపాయనుడు, వేదవ్యాసుడిగా విఖ్యాతుడైన మహాపురుషుని జననం.

తన గురించి, తన తత్వం గురించి, మరొకరు చెప్పలేరని, ఆ నారాయణుడిల వ్యాసుడై - లోకాన్ని, ధర్మాన్ని సముద్ధరించాలని వెలిసాడు. ఈయన కుమారుడు శుకుడు. ఇదీవారి వంశక్రమం. వ్యాసుని తల్లి - మత్స్యగంధి. ఈమె ఎల్లప్పుడు సత్యమే చెబుతుంది. కాబట్టి, ఈమెకు "సత్యవతి"యని మరోపేరు.

ఈయన వేదాలను విభజించాడు. అష్టాదశ, పురాణ, వుప పురాణాలను వ్రాశారు. వీటికి మళ్ళీ సరళంగా ఉపనిషత్తులు, భాష్యాలు కూడా వ్రాసారు. ఇటువంటి మహనీయుని తల్లి మరల కురువంశ ప్రభువును వివాహమాడటం, ఆమెకు - అప్రయోజకులైన - చిత్రాంగ, విచిత్రవీర్యులు జన్మించడం, వారి వారి కర్మల ప్రకారం, పరలోకగతులైతే, పుట్టిన తదాది ఇప్పటివరకు తల్లిని చూడని వ్యాసుని, సత్యవతి, జన్మించిన వెంటనే తపోభూములకు పోతున్నానని, నీకు ఇష్టం - కష్టం కల్గినపుడు తప్పక వచ్చి మాతృసేవ చేసుకుంటానన్న మాట మేరకు, పిలచిన తల్లిని దర్శిస్తాడు.

తల్లి పిలుపుతో వచ్చిన వ్యాసుడు, ఆమె నుండి తనకు తెలిసినదే అయినా, అవతలివారి ఉత్సాహాన్ని, బాధను, కృంగదీయకుండా, అంతా విని "అవశ్యం. నీ ఆజ్ఞాపాలకుడను" అంటాడు.

దీనికి ముందు ఎంతటివారికైనా, విధి విలాసం తప్పదన్నట్లు, అంతటి మహర్షి పరాశరుని వల్ల పొందిన కుమారునితో కలిసి జీవితం గడపకుండా, అంతా రహస్యం చేసి అనుకోకుండా వేటకు వచ్చి, తనను చూసి, వివాహం చేసుకుంటాననంటే, శంతన మహారాజుతో, తాను తండ్రిచాటు పిల్లనని చెప్పి, ఆ తండ్రి కోర్కెల మేరకు - శంతనుడు, భీష్ముని (అప్పటిపేరు గాంగేయుడు, దేవవ్రతుడు) సహకారంతో వివాహం చేసుకుంటుంది.

తండ్రికి పనికిరాని తనయుడెందుకనే ధర్మసూక్ష్మానికి ప్రతీకగా, తండ్రి కోసం - తండ్రి చేసుకునే ఆ తల్లి సంతానానికై, రాజ్యసుఖాల నిమిత్తం, తాను వివాహం చేసుకోనని ప్రతిజ్ఞ చేసి, ఆ భీషణ ప్రతిజ్ఞతో భీష్ముడైన "దేవవ్రతుడు' గంగా పుత్రుని, ఆ తదుపరి సత్యవతి రప్పించి, వ్యాసుని - తన పుత్రునిగా పరిచయం చేస్తుంది.

వారిరువురు ఆలోచించి మాతృశ్రీ కోరిక ప్రకారం, వ్యాసుడు తన మరదళ్ళను అనుగ్రహించాడు. ఆ అనుగ్రహ స్వరూపాలే - గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుడు, పాండువర్ణ పాండురాజు; విధిలేని పరిస్థితిలో తన ఆంతరంగిక దాసీని మహర్షిని సేవించుకోమన్న అంబిక ఆదేశం ఫలితంగా విదురుడు జన్మించాడు.

ఎల్లప్పుడు - సత్యధర్మాలననుసరించే పూజా, ఫలితమామెకు సుపుత్రుల నివ్వలేదు. వ్యాసబంధం కూడా పూజనీయం కాలేదు. గ్రుడ్డివాడైనా పెద్దవాడు కదా, అని రాజును చేసి, అన్నకు తోడుగా పాండురాజును పాలనాపగ్గాలు చేతబట్టమంటే, అధర్మం ప్రకోపంతో, పరిస్థితులు తారుమారయ్యాయి. పెద్దవాడికి అంతా తమదేననుకునే వారు పుడితే....

పాండురాజు భార్య కుంతి యందు - పాండు రాజు ప్రేరణతో - యమ, వాయువు - ఇంద్రుల యందు వరుసగా, ధర్మ, భీమ, అర్జునులు; అలాగే కుంతి నుండి భర్త ప్రేరణతో మంత్రమొందిన మాద్రి యందు అశ్వనీదేవతల వలన -

నకుల, సహదేవులు జన్మించారు. ఎవరికో పుట్టినవారిన, పినతండ్రి పుత్రులనడం తగదని దుర్యోధనుడు, రాజ్యం తనదేనంటాడు.

ఆ రకంగా రాజమాత, సత్యవతీదేవి, కురుకుల పితామహుడు - భీష్ములకు గుండెకోతగా, గర్భశోకంగా పరిస్థితులు ప్రతిక్షణం ఇబ్బంది పెడుతున్నాయి. శాంతి సుఖాలు లేకుండా చేస్తున్నాయి. ఈ దశలో, రాజమాత కృష్ణుని చూడాలని కోరుతుంది.

కృష్ణుడు రాజమాతను దర్శించే సమయంలో, ఆమె ఎప్పటివలెనే, తనకై ప్రత్యేకంగా రూపొందించుకున్న పూజామందిరంలో వుంది. ఆమె పదహారు సం॥ వయస్సులో, ఎంత అందంగా వుందో, ఇప్పుడు అదే అందం, చెదరని సొగసు, సడలని వయస్సు. అవి ఆమె స్వంతాలు. ఎంతో నిండుగా, హుందాగా వుండే ఆ రాజమాత సత్యవతీదేవి, కృష్ణుని చూస్తూనే తన ఎదురుగానున్న పీఠాన్ని చూపింది.

ఆ తల్లిని చూసి సాష్టాంగ నమస్కారం చేసాడు కృష్ణుడు. విదురుని కూడా కూర్చోమనడంతో నేలపై కూర్చున్నాడు. ఒకసారి కృష్ణుని ఆపాదమస్తకం చూసిన ఆమె, మందహాసంతో "కృష్ణా! కాంపిల్య నగరానికి వెడుతున్నట్లు తెలిసింది.'' ఎంతో మధురంగా ఉంది. సుఖదుఃఖాల మిళితమన్నట్లుందామె మాట.

"నువ్విక్కడకు వచ్చావు. ఎంతో ఆనందంగా వుంది. అంతులేని దుఃఖాన్ని పొందే సమయంలో రావడం వలన, సంతోషం సగమే పొందగల్గిగాము. అది మా ప్రాప్తం. ఏం చేస్తాం. అనగా, "ఈ భారత వంశాన్ని, పాండుపుత్రులయిదుగురు చిరస్మరణీయం చేస్తారని తలిచాను. నేను ఒకలా తలిస్తే, పరిస్థితి మరొకటిలాగ తయారయింది అన్నాడు కృష్ణుడు. అందుకు సమాధానంగా రాజమాత నేనూ అలాగే తలచానంది.

"సంతోషం. నువ్వు ద్వారకకు వెళ్ళాక, దేవకీ వసుదేవులకు, బలరామునికి నా ఆశీస్సులందచెయ్యి. అందరు పుత్రులు కారు, తల్లులు కారు. మీ వంటి పుత్రులనుకన్న తల్లిదండ్రులు, నిజంగా ధన్యులు, చరితార్థులు, అంటూ ఆ... కృష్ణా... నీకు పిల్లలా ?'' అడిగిందా తల్లి.

ఒక పిల్లవాడమ్మా. పేరు ప్రద్యుమ్నుడు. అతడు విదర్భరాజ కుమారి సంతానమే కదా!'' ఆ తల్లి క్షణమాగి, "నిజంగా నువ్వు దేవుడివి. కురువంశ

పరువు ప్రతిష్ఠలను, భరతవంశ కీర్తిని నిలబెట్టావు. నువ్వు కనుక ఆ పిల్ల భానుమతిని రక్షించకపోతే ....

"ఇది మీవరకు వచ్చిందా ? ఏదో నా కుటుంబమనుకున్నాను. నా ధర్మం నేను నిర్వర్తించాను. ఇందులో పొగిడే లేదా కృతజ్ఞతలు చెప్పే అవసరం లేదన్నాడు. అందుకే మా కృతజ్ఞత.

"అమ్మా! ఆ సమయంలో ఆ సాహసం చెయ్యవలసి వచ్చింది. అదే మామూలు స్థితిలో అయితే అంతఃపుర స్త్రీలను తాకడమే నేరమౌతుంది. పైగా ఆమె యువరాణి. ఆమెను ముట్టుకోవడం, మహా ఘోరమైన నేరం.... అయినా...!"

అందుకే కదయ్యా, మా కృతజ్ఞతను చెప్పింది. లేకపోతే ఈ వార్త ప్రళయ ప్రభంజనమై ఆర్యావర్తాన్ని కమ్ముకునేది "అని, అవును. దీనికి కారణం, దుర్యోధనుడే నంటావా ?"

"చెప్పలేనమ్మా! ముందామె అమాయకత్వం, పిల్లచేష్టలు కొంత ఇబ్బందికరం. ఎంత మంచివాళ్ళైనా సహవాస దోషంలో కొంత చెడిపోతారు. ఈ విషయంలో తొందరపడి, ఏ నిర్ణయం తీసుకోరాదంటాడు. కాకపోతే నన్ను గొల్లవాడిని, బృందావన కృష్ణునిచేసి ముగ్గులో దింపి, తమకనుకూలంగా త్రిప్పు కోవాలనుకున్నారు. కానీ, భగవంతుడి దయవల్ల, వారి పథకం ఫలించలేదు సరికదా...... వాళ్ళు తీసుకున్న గోతిలో వాళ్ళు పడ్డారు. పదిమంది, పదిమందిలో.... పరిహాస పాత్రమయ్యారు" ముగించాడు కృష్ణుడు.

"నిజం. నువ్వు మంచివాడివని విన్నాను. కానీ, ఇంతమంచివాడి వనుకోలేదు." అంది రాజమాత.

"తల్లీ! నేను మంచివాడనా ? అందరు నన్ను అల్లరి దొంగ, కంసారి... కన్నెపిల్లల మానసచోరుడు.... ఇలాగ రకరకాలుగా నిందిస్తారు. అటువంటి వాడిని...!"

"కృష్ణా! నువ్వెటువంటివాడివో. నీ జీవిత పరమార్థమేమిటో, నా కుమారుడు - వ్యాసుడు వివరంగా చెప్పాడు. నువ్వు లీలాకృష్ణుడివి. మాయా మానుష విగ్రహుడివి. నిన్ను అర్థం చేసుకోవడం, ప్రస్తుతించడం, ఆ ఆదిశేషునికే అసాధ్యం" చాలా...!" అందామె నవ్వుతూ. ఆమే మళ్ళీ -

అందరు "వాసుదేవా" అంటూంటే నేను అంటున్నాను. కానీ, నిన్ను "కృష్ణా!" అని పిలవమంటావా ? అది నాకిష్టమైన పేరు. అలాగే - ఆ పేరుతో పిలిస్తే - నా కుమారుడు. "ద్వైపాయనుని" పిలుచుకుంటున్నట్లుంది. అలాగే నేనొకటి అడుగుతాను. దాచకుండా, "ధర్మావతారుడనని" అనే నీవు, సత్యం చెప్పాలి. చెబుతావా!"

"తప్పక.. అయినా నాపై మీకెందుకంత అనుమానం ? ఎప్పుడైనా.. మిమ్ము....!"

"అదికాదు కృష్ణా.... నిజం"

"తప్పక చెబుతానమ్మా....!

"అయితే నీవు నా ప్రక్కన నిలబడతావా...!"

"అమ్మా! మీరే ఒక మేరునగము. మీకు ఒక ప్రక్కన భీష్ముడు, మరొక ప్రక్కన "వ్యాసో నారాయణో హరిః" అనే వేదవ్యాసుడు.... ఇక.... ఈ గొల్లవానితో...

"కృష్ణా! అంతమాటనకు. నేను ఎప్పుడు నిన్నలాగ చూడలేదు."

"అవునవును. కాని లోకంలో చాలామంది, అలాగేనంటారు. అన్నమాట వినాలి. అనేమాట పడాలి. తప్పదు కదా! అదిసరే. ఎంత భీష్మ, వ్యాసులు నా చెంత వున్నా, కాలం కర్మం. విధివ్రాత.... ఇబ్బంది పెడుతున్నాయి. ఎప్పటికప్పుడు ఏడిపిస్తూనే వున్నాయయ్యా!" దుఃఖితురాలయింది.

"భయపడకు, బాధపడకమ్మా. ఈ కృష్ణుడెప్పుడు అధర్మానికి మ్రొగ్గనంత వరకు, నీవాడు, నీకు తోడు. సరేనా ?" అభయమిచ్చాడు.

"అయితే, ఆ అయిదుగురి సోదరులకు సర్వత్రా అండగా నిలు!" అందామె.

"అయిదుగురు....!" అన్నవాడు క్షణమాగి "వాళ్ళు... జీవించే వున్నారా..?"

"వూ... వూ...! తలవూపి, కళ్ళతో చెప్పిందా తల్లి.

"అది.... !" కృష్ణుడంటూంటే.... "ష్! ష్!" అని సైగలతో పెదవులపై చూపుడు వ్రేలుపెట్టి కళ్ళతో వున్నారు. తప్పించుకున్నారన్నట్లు తలవూపింది.

"అయితే... వాళ్ళు -"

"విదురనీతితో తప్పించుకున్నారు. ఆ శరీరాలు అక్కడ పనిచేసే సేవకులవి. ఆమె పిల్లలు అదృష్టవశాత్తు మనవాళ్ళలాగే వున్నారు. ఇదంతా దైవలీల.

"అయితే ఇప్పుడు... వారెక్కడ... ?!"

"అది దైవానికే తెలియాలి. అందుకే నీకు చెప్పేది. ఇక వారి రక్షణ, ఆచూకీ, సర్వం నీ చేతుల్లో వుంచాము. ఏం చేస్తావో, నీ ఇష్టం....!"

"వారు ఆ తిరుగుడిలో నాగజాతివారికి దొరికితే ఫర్వాలేదు. వారు వీరిని, సంరంక్షిస్తారు. పైగా నీ మాతామహులు ఆర్యకుల కంటబడితే ఫర్వాలేదు. శకుని బృందం - వీరి ఆచూకీని పసిగట్టి, అవతలవారికి లంచమిచ్చైనాసరే, తమ అనుమానాన్ని తీర్చుకుంటారు. అవతలవార్ని - ఇప్పుడెవరు ప్రశ్నించరు. కాబట్టి, దారుణంగా చంపించడానికి వెనుకంజ వేయరు. ఒకటి రాజనీతి, రెండోది దుర్నీతి. కాబట్టి నువ్వు.... ఆ తల్లి అంటుంటే -

రాజమాతకు మనసు నిండుగా కృతజ్ఞతలు చెప్పి "తప్పక మీ ఆజ్ఞ శిరసావహిస్తాను. నా ధర్మం నేను నిర్వహిస్తాను. భరతవంశ కీర్తిని సు-ప్రతిష్ఠం చేస్తానని వాగ్దానం చేసాడు. ఆ తల్లి తల్లిగా తృప్తిగా ఎంతో సంతోషపడింది.

★★★★

కృష్ణుడు మరికొందరితో పడవలలో పాంచాల రాజధాని కాంపిల్య నగరానికి బయలుదేరాడు. కొందరు ఆర్యకుని కలుసుకోవడానికి నాగకూటానికి బయలు దేరారు. ఈయననే తిరుగు ప్రయాణంలో కృష్ణుడు చూద్దామనుకున్నాడు. భగవంతుడీ విధంగా, కృష్ణుని ఆశ నెరవేరుస్తున్నాడు. పడవలలో వచ్చేవారెవరో తెలుసుకున్న, ఆ ప్రాంతాలందు స్థిరపడిన, యాదవులు, ఇతర వర్గాలవారు, ఆ వచ్చేది కృష్ణుడని తెలుసుకుని మురిసిపోయారు. అర్ఘ్యపాద్యాదుల అర్చించడానికి సిద్దపడ్డారు.

మంచితనానికెంత గౌరవమో, పేరు ప్రతిష్ఠలో తెలుసుకోవడానికిదొక నిదర్శనం. ధర్మానికి-సత్యానికి ఏ దేశమేగినా సరే, గౌరవం లభిస్తుంది. అదే దుర్మార్గానికి, ఎక్కడికి వెళ్ళనవసరం లేదు. తమ దేశ పొలిమేరలు దాటకుండానే తగు ఫలితాన్ని పొందుతారు.

కృష్ణాదులు పడవ దిగగానే, అక్కడ వున్న ఋశ్యాశ్రమాలకు వెళ్ళి, అక్కడున్న మహర్షులను దర్శించి, నిత్య అర్ఘ్యాదులను, అగ్నికార్యాలను పూర్తి చేసుకున్నారు ఆ తదుపరి రాజమాత సత్యవతిని దర్శించడంతోపాటు అక్కడ

జరిగినదంతా, ఉద్ధవునకు చెప్పాడు. కర్తవ్యాన్ని ఉపదేశించాడు. సమాధానంగా ఉద్ధవుడు "పోనీ, మనం, మన తాత ఆర్యకులవారి సహాయం తీసుకుంటేనో అంటే..." "తీసుకో వచ్చును. కానీ, ఈ సమయంలో అందర్ని నమ్మడం తగదు. మన జాగ్రత్తలో మనం వుండాలి."

దాంతో, ఓ పనిచేస్తాను. నేను నాగకూటానికి వెళ్ళి ఆర్యకులవార్ని, పరిస్థితిని బట్టి పలుకరిస్తాను. ఫర్వాలేదనుకుంటే ప్రస్తావిస్తాను. కాదనుకుంటే, తిరిగి వస్తానంటాడు. అందుకు సమాధానంగా, కృష్ణుడు "నేనిక్కడే. కాంపిల్య నగరంలో వుంటానంటాడు కొంటె నవ్వులు ప్రదర్శిస్తూ.

పడవ ప్రయాణం సాగుతుంది. వున్నట్టుండి ఆ ఆహ్లాదకర వాతావరణంలో, వేదధ్వనులు వినిపిస్తూంటే, ఆసక్తిగా అటు చూసారు. అవి ఉత్కోచతీర్థం నుండి వస్తున్నాయి. అక్కడ మహర్షి ధౌమ్యులవారి ఆశ్రమముంది. ఆ ప్రాంతమంతా ఎన్నో పడవులు చుట్టుముట్టినట్లున్నాయి. అంటే ఎవరో పెద్దలో, మహనీయులో లేక ఇతర సందర్శకులో వచ్చి వుంటారు.

కృష్ణుడు తమ పడవలను ఒక ప్రక్కగా కట్టించాడు. మహర్షి దర్శనానికి, తన వాళ్ళతో బయలుదేరాడు. ఆశ్రమంలోకి అడుగుపెట్టేసరికి, హోమం చేస్తున్నారు. దాదాపు రెండు వందలమంది నాగాలు, నిషాదులు, వారి వారి నాయకులతో వారి వారి సాంప్రదాయ పద్ధతులలో అలంకరించుకుని, ఆ దివ్య కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

ఎవరో క్రొత్తవాళ్ళు వచ్చారని తెలిసి, ఆహ్వానించడానికి వచ్చిన ధౌమ్యులవారు, ఆ వచ్చింది కృష్ణుడని తెలుసుకుని అపరిమితానందాన్ని పొందారు. పరమానందంతో పలుకరించారు. సాదర స్వాగతమొసగారు.

లోకరీతిలో కృష్ణునికి, వారి పరివారానికి తమ ఆశీస్సుల నొసగారు. మనసులో మాత్రం, "మహనీయా! మహా మహా, ధర్మావతారా ?" అంటూ అంజలి ఘటించారు. వారిని అగ్నిహోత్రం వద్ద తీసుకు వెడుతూ, "కృష్ణా! వేదవ్యాసుల వారు వచ్చారు." వారి రాక, మాకు - మా ఆశ్రమానికి అదృష్టంగా అభివర్ణించి చెప్పారు. మా అదృష్టం కొద్దీ, పుణ్యం పుచ్చినట్లు నీవు వచ్చావు. ఇంతకంటే...!" అని ప్రస్తుతిస్తూంటే...

"మహర్షీ...!" అంటూ కృష్ణుడు వందనమాచరించాడు. వేదవ్యాసులవార్ని దర్శించి, వాసుదేవుడు సాష్టాంగ నమస్కారం చేసాడు. వ్యాసుడు ఆశ్చర్యంతో గుడ్లప్పగించి చూస్తూంటే - కృష్ణుడు.

"మహర్షీ! నా పేరు వాసుదేవుడు, కృష్ణుడు, గోవిందుడని కూడా అంటారు. కొందరు గోపాలుడు అనికూడా అంటారు. వసుదేవసుతుణ్ణి, దేవకి కుమారుడిని. నందయశోదల ముద్దుబిడ్డను. మీ ఆశీస్సుల నపేక్షిస్తున్నవాడిని. ఆశీర్వదించ ప్రార్థిస్తున్నవాడి" నన్నాడు.

"ఇతడు ఉద్ధవుడు, మా పెదతండ్రి దేవభాగుని ఆఖరిపుత్రుడు. ఇతడు యుధానుడు, నా స్నేహితుడు. సాత్యకుని కుమారుడు.." అంజలి ఘటించి, అమాయకంగా చెబుతూంటే, వేదవ్యాసులవారు, తన ఆసనం నుండి లేచి - ఆనందబాష్పాలు రాలుస్తూ - జలదరించిన దేహంతో పరవశమొందుతూ -

"వాసుదేవా, నీకోసమే నేను ఎదురు చూస్తున్నాను. నువ్విక్కడకు వస్తున్నావని తెలుసు. అందుకే వచ్చాను. వర్థిల్లు వం.... కాదు, నూట ఇరవై సం॥లు వర్థిల్లు. చాలా ఆనందంగా వుంది. నేనొకసారి మీ తండ్రిగారిని చూసాను. బహుశః అప్పటికి నువ్వు పుట్టలేదనుకుంటాను."

ఈ మధ్య ఒకసారి మధురకు వచ్చాను. దురదృష్టవశాత్తు అప్పుడు మిమ్మల్ని చూడలేకపోయాను. ఆ సమయంలో మీరు గోమంతకానికి వెళ్ళారుట. "అని ముందీ హోమాన్ని పూర్తి చేద్దాం, తదుపరి!" అనగా, అవశ్యమంటు హోమానికి సమీపంలో, నాగ ప్రముఖుని వద్ద, కృష్ణుడు ఆతని సఖులు కూర్చున్నారు.

హోమం పూర్తయింది. భగవంతునికి నివేదించిన పాలు, రోగగ్రస్తులకు, బాధాతప్త జీవులకిమ్మన్నారు. ఇంకా దీర్ఘరోగులకు, అశ్వినీ దేవతల ఆశీస్సులిప్పిస్తామన్నారు. అందరిని వ్యాసులవారు రమ్మని తమ ఆశీస్సులనిచ్చారు. అందరు సంతోషంగా, తమ ఇళ్ళకు బయలుదేరుతుంటే...

భోజనాలు చేసి వెళ్ళమన్నారు. ప్రతి ఒక్కరు తృప్తిగా భుజించే వరకు వుండి, చివరలో - ధౌమ్యులవారు, వ్యాసులు, కృష్ణుడు భోజనాలకు కూర్చున్నారు. అందరికి పెట్టిన ఆహారమే వీరు తీసుకున్నారు. భోజనాలు పూర్తయ్యాయి. ఓం శాంతి శాంతి శాంతిః" అంటూ స్వస్తి వాచకాలు పలికారు.

ఆ తదుపరి వ్యాసులవారు కృష్ణుని పిలిపించుకున్నారు. కొద్ది క్షణాలా గోవిందుని చూస్తూ కూర్చున్న వ్యాసులవారు "కృష్ణా! నీ హస్తినాపుర రాకలోని ఆంతర్యం తెలుసుకోవచ్చునా ?" అడిగారు.

"మహర్షి! పరిస్థితులు మీకు తెలియనివి కావు. విన్నకొద్దీ ఒక్కొక్కటే బాధిస్తాయి. వాటి పరిష్కారం ప్రయత్నంలో వుంది. అది ధర్మంలో వుంది. చివరకది మనిషి చేతులలో వుంది. పరిస్థితులు విషమించినపుడు, వాటిని సరిచేసుకోగల, వాటిని మార్చుకో గల, మారగలశక్తి - మనిషికి - వాని తెలివితేటలు జ్ఞాన విజ్ఞానాల ద్వారా సంభవిస్తాయి.

అలాగకాక అజ్ఞానంతో మూర్ఖంగా ప్రవర్తిస్తే బ్రతుకు పతనం. భవిష్యత్తు నాశనం. ప్రకృతి ప్రళయం. ఇటువంటి దురవస్థలలో మనుష్యులెన్నడు బ్రతుక రాదని అక్కడికి బయలుదేరాను. చేరి మూర్ఖుల మనసు రంజింప రాదన్నట్లుంది అక్కడ పరిస్థితి. ఏం చేస్తాం. అన్నీ అనుభవించాలి కదా!" ఆగుతాడు కృష్ణుడు.

సమాధానంగా - లోకంలో అధర్మంకన్నా, అసూయ రాజ్యమేలుతుంది. అది నాశన కారణం. అది తెలిసి కూడా మానవులు, మూర్ఖత్వంతో, అందుండి బయటపడలేకపోతున్నారు. దానికి సమాధానంగా కృష్ణుడు -

"మహర్షీ! మీరు సర్వసమర్థులు. స్వతంత్రులు. దీనిని నివారించలేరా ?"

"అది మన చేతుల్లో లేదు. ఈ రాజులు, తత్వాలు, వాళ్ళ ప్రతాపాలు, అశాశ్వతాలు. అందుకే, ఆశ్రమం నుండి, ఆశ్రమానికి వెడుతూ, ధర్మం నిలబడ టానికి, ధర్మోద్ధరణం జరగడానికి ప్రయత్నిస్తున్నాం. అవెప్పుడు శుభఘడియలే. తప్పక వస్తాయి. శాశ్వతమైన ధర్మం - ఎప్పుడు నిత్యము, సత్యము, శాశ్వతమే.

"కాని ఆశ్రమ ధర్మం, జీవితం. రెండు సమాంతర రేఖలు. అవి ఒకదానితో ఒకటి కలువవు. అప్పుడు... ధర్మప్రతిష్టాపనం సాధ్యమా ?"

కృష్ణుని ప్రశ్న, జనవాక్యంగా తలచిన వ్యాసులు "తప్పక". అందుకే గదా, అవతారాలు, అవతార పురుషులు. మంచికి, మంచివారికి తాత్కాలిక ఇబ్బందులు తప్పవు. ఎలాగంటే పగలు వెనుక రాత్రి. చీకటి వెనుక వెలుగు, తప్పదు. ఇది ప్రకృతి ఉత్తేజం. జీవుడు, దేవుడు కూడా దీనికే కట్టుబడి వున్నారు.

ఆచరిస్తే జీవుడు దేవుడౌతాడు. కాదంటే జీవులు, జీవులే, దేవుడు దేవుడే. ఇవన్నీ నీకు తెలియనివి కావు.

అయినా మానవలోకానికి నీ ద్వారా కొంత, నా ద్వారా కొంత సందేశ మందాలి. ఉదా : ధౌమ్యులవారిని చూడు. ఇక్కడ ఆశ్రమం ఏర్పాటు చేసుకుని, తపోమూర్తిగా వుంటున్నారు. వీరి తపశ్శక్తి వలన, ఈ నాగజాతి వారు, సాంప్రదాయబద్ధ ధర్మ జీవనాన్ని సాగిస్తున్నారు. మొదట్లో వీళ్ళే చంపేస్తారని భయపడిన వాళ్ళు, వీళ్ళు మనకంటే క్రూరులు కారని, సందేహం వదలి, సుఖంగా వున్నారు.

"మరి....!"

"గోవిందా! ఆనందుడవు. నీకు కూడా సందేహాలా ?" అంటే - "మహర్షి! మీరే చెప్పారు. దేవుడైనా జీవుడైతే, ఏ జీవమెత్తాడో, ఆ ధర్మానికి అనుగుణంగా నడవాలని, అంతకుమించి, అతను మరే విధంగా ప్రవర్తించినా, "ధర్మం" బద్ధం కాదని, కాబట్టి.. పాండవులు, మరణించారా ? జీవించి వున్నారా ? అనేకన్న, ఏ ధర్మం ప్రాతిపదికగా గతంలో మనువు, వైవస్వతుడు, జనకుడాది ప్రముఖులు జీవించారో, ఆ మార్గమే సత్యము, నిత్యము, శాశ్వతమని, నీవే నిరూపించాలి. అప్పుడే -

"అర్థమయింది. మహర్షీ!" ఆశీర్వదించండి. ధర్మంకై నిలిచిన నేను, తప్పక మీ ఆశీస్సులతో, విజయం సాధిస్తాను. అధర్మ నాశనం. ధర్మ ప్రతిష్ఠాపనం జరుగుతుంది. ఇందుకు ప్రతిక్షణం మీ ఆశీస్సులతోపాటు, సలహా సహాయం కావాలన్నాడు.

ఈలోగా సంధ్యా సమయమైంది. సంధ్య వార్చారు. ఫలపుష్పాదుల నర్పించారు. ఆ రాత్రంతా, మహర్షితో గడిపినట్లు, వారి మాటలను తలచుకుంటూ గడిపాడు. తెల్లవారింది. తమ శిష్యులతో మహర్షి, నాగజాతి ప్రభువు ఆర్యకుని కలవడానికి బయలుదేరాడు. వారితోపాటు ఉద్ధవుడు కూడా వెళ్ళాడుట.

"ఎందుకు వెళ్ళాడుట!" ప్రక్కనున్న సాత్యకిని అడిగాడు. పాండవులు జీవించి వున్నారా ? లేక నిజంగా మరణించారా ? ఆ వివరాలు తెలుసుకోవడానికి వెళ్ళాడుట. మహర్షి మాటలను బట్టి వారు, పాండవులను కలుసుకోవడానికే ఇటు వచ్చినట్లు తెలుస్తూంది." సాత్యకి మాటలకు కృష్ణుడు "అయి వుండొచ్చు" తన సాధారణ సహజ చిరునవ్వును ప్రదర్శించాడు.

# రండి, మహాప్రభో...!

**త**న వాళ్ళతో కలిసి వాసుదేవుడు, ఏకచక్ర తీర్థానికి బయలుదేరాడు. కృష్ణుడు వస్తున్నాడని ముందుగానే తెలుసుకున్న పాంచాలుడు, కుమారుడు దృష్టద్యుమ్నుని, ఆ గోవిందుని సాదరంగా ఆహ్వానించి తీసుకురమ్మని పంపించాడు. కేవలం యువరాజేకాక, ప్రధానమంత్రి ఆచార్య ఉద్బోధనులు కూడా వచ్చారు. అక్కడకు కూడా ముందుగా వెళ్ళిన శ్వేతకేతు అందరితోపాటు కృష్ణుని స్వాగతించాడు.

అందంగా అలంకరించిన నావలలో అందరు పాంచాల రాజధాని కాంపిల్యానికి బయలుదేరారు. తీర ప్రాంతాలలో వుండే స్థానికులను, కనిపించే ఆశ్రమాలను దాని అధిపతులను దర్శిస్తూ - ఆహ్లాదకరంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఎల్లప్పుడు ఏదో సమస్యలతో సతమతమయ్యే కృష్ణుడు, ఈ రమణీయ ప్రకృతి దృశ్యాలు చూస్తూ ఎంతో ఆనందంగా కనుపించాడు.

చివరగా కాంపిల్యానికి చేరారు. చక్కని రాజమర్యాదలతో, రాజు, అధికారులు, పౌరులు ఆహ్వానించారు. మహారాజు ద్రుపదుడు. "మీ రాక మాకు, ఎంతో సంతోషమని" అది ముఖంలో ప్రకటించాడు. పరస్పర అభినందనలు తదుపరి, వారి వారి ఆనందాల్ని ప్రకటించుకున్నారు. రాజభవనాన్ని చేరుకున్నాక, "ఇతడు నా మూడవ కుమారుడు" అని శిఖండిని పరిచయం చేసాడు. మగ వేషంలో, ఆడతత్వంతో వున్న ఆతన్నొకసారి కృష్ణుడు చూసాడు. కృష్ణునికి అభివాదం చేద్దామనుకున్న శిఖండి, ఎందుకో తత్తరపడ్డాడు.

ఆ మర్నాడు కృష్ణుడు, ద్రుపదునితో కలిసి, రాజప్రాసాదానికి వెనుకనున్న మామిడి తోపుల్లోకి వెళ్ళారు. ఎలాగ ప్రారంభించాలో అర్థం కాక, ఆలోచించి, ఆలోచించి, కొద్దిగా తేరుకుని "కృష్ణా! మిమ్ము రమ్మన్న కారణం... అంటూ విషయం చెప్పాడు. విషయం, పూర్తిగా తెలుసుకోవాలనే వుద్దేశంతో కృష్ణుడు రెండు చేతులు జోడించి, "మహారాజా! చెప్పదలచుకున్నదేదో, నిర్మొహమాటంగా చెప్పండి. అంతేకాని మీకు తెలుసు - సాందీపులవారు చెప్పి వుంటారంటే నాకు లక్ష తెలిసి వుండవచ్చును. సాందీపులవారు, మరెన్నో మాట్లాడి వుండవచ్చును. ఇందులో కొన్ని నిత్యకార్యక్రమాలు, మరికొన్ని సమయ సందర్భాలు

వుండవచ్చును. అందులో మీరు చెప్పబోయే విషయం, వుందో... లేదో... నాకు తెలియాలి కదా ?" కనుక, దయచేసి...!" అనగానే, ద్రుపదుడు విషయం చెప్పాడు.

"అవును. ఆచార్యులవారు చెప్పారనగా,

"అయితే మీరు సమ్మతించినట్లేనా... ?" అంటాడు.

"కాదనలేదు, గా! వీటికి సమాధానం కాలం చెబుతుంది. మీ ప్రేమాభిమానాలకు కృతజ్ఞుడిని."

"అంటే... ద్రోణుడంటే భయమా ?"

"కాదు. ఆచార్య స్థానంలో వున్నారు కాబట్టి గౌరవం. రెండోది కౌరవులు-యాదవులు బంధువులు. బాంధవ్యం మనుషులు దూరమైనంత మాత్రంలో పోదు. నా వలన కురు-పాంచాల దేశాల మధ్య యుద్ధం రాకూడదు. ప్రజా నాశనం, అధర్మవర్తనం జరుగరాదు."

"అంటే... ఆనాడు నాకు అన్యాయం జరిగినప్పుడు మాట్లాడినవారంతా, ఇప్పుడు, వాళ్ళకు వత్తాసు పలుకుతారా ? లేక.... నేనే, ఈ మారణకాండకు కారకుడినని నాపై ధ్వజమెత్తుతారా ? ఆవేశంతో ద్రుపదుడు వూగిపోతున్నాడు."

ద్రోణులు - జన్మతః బ్రాహ్మణుడు. కాని వృత్తిరీత్యా - ఆ క్షత్రియోచితమైన విద్యల ప్రభావం వలన, కొద్దిగా క్రౌర్యమేర్పడింది. దాంతో ఆయన తన తత్వాన్ని మరిచాడు. గురుదక్షిణగా మిమ్ము కోరాడు. అర్జునుడు వచ్చాడు. గురువాజ్ఞగా మిమ్ము బంధించాడే తప్ప, వ్యక్తిగతంగా - నిందా, నిష్ఠూరాలు, పలికాడా ? లేదే.... ఇదిగో, మీ గురుదక్షిణ" అంటూ తన ప్రతాపాన్ని దక్షిణగా గురువుల ముందు వుంచాడు. అవునా ?"

ఆ మాటలకు నేలచూపులు చూసాడు. కొద్దిగా ఆవేశం తగ్గింది. కానీ, ప్రతీకార జ్వాల అణిగిపోలేదు. "నువ్వేమైనా చెప్పు కృష్ణా! కురు, పాంచాల దేశాల మధ్య సఖ్యత ద్రోణుడు, ఆతని శిష్యులు - హస్తిననేలుతున్నంత వరకు పొసగదు. కాబట్టి, నాకు వారలను నిలువరించగల వీరుడు, అల్లుడిగా కావాలి. నీవు కాదంటే... ?!" అనగా, ఆ వెంటనే, కృష్ణుడు -

"ద్రుపద రాజేంద్రా, ఒక్కమాట వినండి. ప్రస్తుతం పాంచాలం బలహీనంగా వుంది. విభజించబడకుండా వుంటే, ఇది బలమైన సువిశాల సామ్రాజ్యం, ఈ బలహీనతను గుర్తుపెట్టుకుని, మాపై కోపంతో, పాంచాలాన్ని కలుపుకుంటే, తాను బలంగా వుంటాడని తలిస్తే, ఆ చక్రవర్తి దేనికైనా తెగిస్తాడు. అప్పుడు కారణమేదైనా కురువృద్ధుడు భీష్ముడు, తన కోసమైనా మీకు సాయపడతాడు. కనుక.... ద్రోణుడున్నా, లేకపోయినా, మీకు మేలు జరుగుతుంది. కావున ఇతరాలోచనలు చెయ్యకుండా....!''

కృష్ణుని సూచనను ద్రుపదుడు అంగీకరించలేదు. సరికదా ద్రోణుని మేధాశక్తి ముందు భీష్ముడు కాదు, మరెవ్వరైనా సరే తలొగ్గవలసిందే. ద్రోణుడు సామాన్యుడు కాదు. భీమార్జునులు తన మాట కాదనరు. కానీ, అఖండులు, అసమానులు. వీళ్ళతో ఎప్పటికైనా ప్రమాదమే. రెండోది. ఎంత మొత్తుకున్నా దుర్యోధనుని నుండి వీరికి రాజ్యము రాదు కాబట్టి, దుర్యోధనుని తానుగా కాక, తన కుమారుని, ద్వారా దగ్గరకు తీసుకుంటే సకలభోగాలు లభిస్తాయి. తన మాట చెల్లుబాటవుతుంది. పాండవులు ముఖ్యంగా భీమార్జునుల బెడద వుండదు. కాబట్టి తెలివిగా ద్రోణులవారే తప్పించి వుంటారు. ద్రోణుడు ఆచార్యునిగా నీకు ఇప్పుడు తెలుసు. నాకో.... బాల్యము నుండి తెలుసు. అసమాన ప్రజ్ఞా పాటవాలు, మేధాశక్తి గల మేరు నగధీరుడు. అందుకే పరశురాముల వారిని అనుసరించాడు. వారి అనుగ్రహాన్ని పొందాడు.

ద్రుపదుడు చెప్పిన విషయాలన్నింటిని కృష్ణుడు ఆలోచిస్తున్నాడు. ఇది ఆలోచించవలసిందే తప్ప, ఇందులో ఏ కొద్ది ఆధారంలేనిది కాదు. ఈ ఆలోచనలో వున్న కృష్ణునితో "గోవిందా! నా మాటవిని, అధర్మవర్తనునితో చేతులు కలప నన్నావు. చాలా సంతోషం. నా ఊహ తెలిసి నేనెవ్వరికి అన్యాయం చెయ్యలేదు. అపకారం చెయ్యలేదు'' అంటూ తన గురించి చెప్పుకున్నాడు.

ఏది ఏమైనా ద్రుపద రాజేంద్రా - యాదవులు, మీకెలాగూ వుపయోగపడరు. ఇదంతా అనవసర - వృథా శ్రమ. కాబట్టి....! అంటూంటే, వాసుదేవా! నీకిచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకుంటే సరే సరి లేదంటే జరాసంధుడు కోరినట్లు, వాని మనుమనికి, మా ద్రౌపదినిచ్చి - బంధం బలపర్చుకుంటాను.

"చెయ్యండి. దమఘోషుడు, భీష్మకుడు పొందిన దుర్దశే మిమ్ము వరిస్తుంది. రాజ్యవిస్తరణ కాంక్ష తప్పనను. అడ్డదారిన, అవతలివారి కోసం చేసే ప్రయత్నా లెప్పుడు ఫలవంతం కావు. ప్రాణాంతకంగా కూడా ఒక్కొక్కసారి మారుతాయి. కనుక, ఆలోచించి, మార్గ నిర్దేశకత్వం చేసుకోండి.

జరాసంధుని మనుమనితో, మీ యువరాణి సుఖంగా వుంటుందనుకుంటే ఆ విధంగా చెయ్యండి. కాని ఒక్క మాట. "అవసరం కదా" అని చెయ్యి చాస్తే, స్నేహమైతే శాశ్వతమౌతుంది కాని ఇటువంటి బంధాలు మాత్రం శాశ్వతం కావు. అనైతికం, అధర్మమై ఎలా కూల్చుతుందో, కాల్చుతుందో, ఇప్పుడు మీకర్థం కాదు. అర్థమయ్యేసరికి మొత్తం అనర్థకమే రాజ్యమేలుతుంది. జాగ్రత్త! మిమ్మల్ని నేను హెచ్చరించడం లేదు కానీ, తగు జాగ్రత్తలు తీసుకోమని సూచిస్తున్నాను.

"గోవిందా! నన్ను ఆలోచించుకోమన్నావు. చాలా బాగుంది. మాలో... అంటే కుటుంబంలో అందరికి ద్రోణుని మీదసూయ. ఆయన్ను సర్వవిధాల నాశనం చెయ్యడానికి, దేనికైనా మేము వెనుకంజవేయం. ఇక మేఘసంధి.... ఇతను గూర్చి ఆలోచన అనవసరం. ఎందరో దుర్మార్గులను, స్త్రీలు తమ వివాహమైన తదుపరి తమకు అనుగుణంగా మార్చుకున్న సందర్భాలు లేకపోలేదు. అందువలన.... కావాలంటే, నువ్వొకసారి మా యువరాణితో మాట్లాడితే, పరిస్థితి మొత్తం నీకర్థమౌతుంది.

"తప్పకుండా! మీ ఆదేశానుసారం నడుస్తాననగానే ధ్రుష్టద్యుమ్నుని రప్పిస్తానంటాడు. వాళ్ళు లేస్తారు. అప్పుడు ఏదో అలికిడి.... అంటే ఎవరో తమను గమనిస్తున్నారన్న మాట.... ఎవరు ?" సభా భవనానికి వెడుతూ, ఎందుకో వెనక్కి తిరిగిన కృష్ణుడు, శిఖండి తమను చాటుగా అనుసరించడం గమనించాడు.

మొత్తానికిదంతా కలుషిత వాతావరణంగా కృష్ణుడు తలంచాడు. ద్రౌపదితో ప్రారంభించి అసూయాద్వేషాలను తొలగించి, ప్రేమాభిమానములను పంచాలి అని తలంచాడు. "యతో కృష్ణ, తతో ధర్మః". ఆ అమ్మాయి ఆ యువరాణి పేరు "కృష్ణే" కాబట్టి, ధర్మం గెలుస్తుంది. నా ప్రయత్నం ఫలిస్తుందనుకున్నాడు.

ద్వైపాయనుడు కృష్ణుడు ధర్మమూర్తి. తను ధర్మం కోసం జన్మించాడు. అలాగే "కృష్ణ" అనే యాజ్ఞసేని, ద్రౌపది" - తప్పక ధర్మరక్షణకు ముందుకు

వస్తుందన్నది గోవిందుడాలోచన. వాసుదేవ మంత్రమెంతవరకు ఫలిస్తుందో, గమనిద్దాం - అనుకున్నారు సాత్యకి, శ్వేతకేతువులు.

ఆ రోజు సాయంకాలమయింది.

దృష్టద్యుమ్నుడు ఆందోళనలో వున్నాడు.

మహారాజు అనుకోకుండా అస్వస్థతకు గురయ్యారు, కాబట్టి ఆనాటి సమావేశాలన్నీ రద్దు చెయ్యబడ్డాయి. అంతకంటే ముందు, తన చిన్నతమ్ముని మామగారు మహారాజు హిరణ్యవర్మ ఏదో అత్యవసరం విషయం మాట్లాడాలని పనికట్టుకుని వచ్చారు. మహారాజు ద్రుపదుని అనార్యోగంతో, హిరణ్యవర్మ చికాకుగా వున్నాడు. కనుక - ప్రియమైన, గౌరవనీయులైన అతిథి కృష్ణుడు మన్నించాలని తలుస్తూ, పరుగు, పరుగున వచ్చాడు.

కాకపోతే, వినికిడిని బట్టి శిఖండి - విషయంలో ఏదో కొంత పరమ రహస్యముందని మాత్రమే అతిథులకు అర్థమయింది.

ఆ రాత్రి అతి భారంగా గడిపిన ద్రుష్టద్యుమ్నుడు తెల్లవారి కృష్ణుని కలిసి, తమ సోదరితో మాట్లాడ రమ్మని కోరాడు. వాళ్ళ నాన్న, పాంచాలుడు, కృష్ణుడు సమావేశమైన గున్నమామిడితోపుల వద్ద కలిసారు.

అందరికి నమస్కారం కృష్ణుడు చెప్పాడు. రాజకుమారి, ఆమె సోదరులు కూడా అభివందనలు చేసారు. అప్పుడు - కృష్ణుడు ఇలాగ కలవడం పద్ధతి కాదు. కానీ, మహారాజు ఆజ్ఞాపాలితుడినై యువరాణిని కలువడానికి వచ్చాను. "అనగా" మీరు మాకు సహాయపడటానికి వచ్చినట్లు తెలిసి, ఆ వివరాలు తెలుసుకునేటందుకు మిమ్మల్ని కలవాలని తలిచాను. మీరు నిజంగా మాకు సాయపడతారా ?

"యువరాణీ మీరు కోరారు కానీ. నేనెలాగ సాయపడతారని తలిచారు ? యువరాణీ మీ సమస్యలు మీవి, మా సమస్యలు మావి. యాదవులు.. అని అందరు మమ్మల్ని వెక్కిరించారే తప్ప, మమ్ము, మా ఇబ్బందులను ఎవరైనా గమనించారా ? కరుణించి కాపాడారా ? అలాగే -

"ఏ బంధం లేకుండా, నా నుండి మీరెలా సాయం పొందాలని తలిచార ?" నిర్మొహమాటంగా అడిగేసాడు.

"నిజం. మీ వీరత్వం, ప్రజ్ఞా, రక్తపాతం లేకుండా మధుర నుండి కుశస్థలికి, ప్రజలను, యదువీరులను మార్చడం మాకందరికి ఎంతో నచ్చింది. దాంతో మా బాధల నుండి తప్పించి, గుండె బరువు తగ్గించి, రక్షిస్తారని, ఎంతో ఆశగా వున్నాం. అదే మహారాజు ఆచార్య సాందీపుల వారికి చెప్పారు. అంతమాత్రంతో బంధం బలపడుతుందని చెప్పలేము కానీ బలహీనపడుతుందని మాత్రం తలువలేదు."

"మీరు తలవడం తప్పు కాదు. కానీ, తరతమ భేదాలు ఆలోచించాలి. నన్ను అందరు - కిట్టనివారనను కానీ, "గొల్లవాడు" అని అంటారు. నిజం నేను, గొల్లవాడిని, గోపాలుడను అప్పుడు. ఇప్పుడు - అందరు - గోవిందుడు, కృష్ణుడు, దేవుడు వాసుదేవుడు - అని అంటున్నారు. ఎవరు ఏమన్నా.... నేను నేనే. ధర్మమూర్తిని. అన్నమాట నిలబెట్టుకోనివారికి అగ్నిని.

"నేను తప్పు చెయ్యలేదు. అన్యాయం చెయ్యలేదని" అందరు అంటారు ధర్మమూర్తినని... అనడం వేరు. ఆచరించడం వేరు. కానీ మీరు మహారాజులు, రాజవంశీయులు. మనకు పొత్తెలా పొసగుతుందో ఆలోచించండి" అనగానే -

"అయితే మీ నుండి మాకు సాయం రాదా ?"

"ఎందుకు రాదు, వస్తుంది. కాని మీరు కోరుకున్నట్లు కాదు, ధర్మం ప్రకాశించినట్లు..."

"మేము ధర్మపరులంకామా ? ద్రోణులు మమ్మల్నెంత హీనంగా చూసారో, మీకు తెలుసా ?"

"చూడు, యువరాణీ ఎవరెవర్ని, ఎలాగ చూసారో..., ఎప్పుడూ అది అవతలవారు చెప్పాలి. కలిసి చదువుకుని, ప్రాణమిత్రులుగా మెలిగి, ప్రతిజ్ఞలు చేసుకుని, రాచరికం చేతికి వచ్చాక, అన్నమాట మరచిపోతే... దానిని ధర్మమంటారా ? అవతలి వారెవర ? అన్నీ తెలిసిన అస్త్రవేది. బహుశస్త్రాస్త్రవేది. అటువంటప్పుడు. ఎలాగ ప్రవర్తించాలి ? ముందుగా మనం, మంచికాని, చెడుకాని మాట అనరాదు. అన్నాక, ఆడినమాట తప్పరాదు. ఇప్పుడదే తెచ్చింది ప్రమాదం. చేసింది, ప్రాణసంకటం.

ఇవన్నీ నీకు తెలియవు. కొన్ని మాత్రమే తెలుసు. నిజం నిష్ఠూరం. బాధ భరింపరానిది. అవమానం తల ఎత్తలేనిది. దీనికి పరిష్కారం నా సాయం. మొదట్లోనే చెప్పాను. సాయం రెండు రకాలు. అది ధర్మం. అధర్మం - పేరుతో ప్రకటించబడుతాయి.

మీ నాన్నగారు కోరినట్లు చేస్తే, నేను అధర్మ వర్తనుడనౌతాను. నా పద్ధతి ప్రకారమంటే, అది ధర్మబద్ధమైనప్పుడు, తప్పక నా సాయమందుతుంది. కానీ, మీ నాన్నగారు చెప్పినట్లు, నేను కాదన్నానని, జరాసంధుని మనుమని కనుక వివాహం చేసుకుంటే, ఇంతవరకు సావకాశం దక్కలేదని బాధపడే జరాసంధుడు బలవంతుడౌతాడు. ఈ ఆర్యావర్తాన్ని ఖచ్చితంగా బూడిదరాశిగా మారుస్తాడు. ఆలోచించండి. చావో... బ్రతుకో! అంతకుమించి నేను చెప్పేదేమీ లేదు. కొండనాలుకకు మందువేస్తే వున్న నాలుక వూడినట్లవుతుంది. ఫర్వాలేదనుకుంటే, ముందుకు వెళ్ళండి. అమ్మో! అంటే ఆగిపోండి. జరిగేది జరుగుతుంది. మీ ధర్మం తప్పక జయిస్తుంది.

"నా మాట మీద నమ్మకముంచండి, నేను మీ వాడిననుకుంటే నీ చెయ్యి కాదు, మీ అందరి చెయ్యి పట్టుకుంటాను. చేయవలసిన సహాయం చేస్తాను. కాదనుకుంటే మీ ఇష్టం." ఆ మాటతో ద్రుపదుడు ముందుకు వచ్చాడు. ద్రుష్టద్యుమ్నా.... అన్నాడు.

ఆ అరుపుకు ద్రుష్టద్యుమ్న, సత్యజిత్, ద్రౌపది బొమ్మల్లాగ నిలబడి పోయారు. శిఖండి పారిపోయింది. ఎక్కడికి పోయిందో తెలియదు. అంతా వెదికించాను. శిఖండి కనబడటం లేదు. ఆ మాటకు ద్రౌపది కూలబడింది. ఇటువంటివాళ్ళు పుట్టకూడదని తలపట్టుకుంది. ఇక ఇది సమయం కాదని, కృష్ణుడు అక్కడనుండి జారుకున్నాడు.

ఆ మర్నాడు... కొద్దిగా తేరుకుని "కృష్ణా" అన్నాడు ద్రుపదుడు.

"రాజా! చెప్పవలసింది చెప్పాను. ఆలోచించి నిర్ణయం మీరు తీసుకోవాలి. బంధమనేది - వివాహంతోనే కాదు. వివేకంతోను వస్తుంది. నేను మీవాడిని. కృష్ణుడు మాకోసం వున్నాడు. అనుకుంటే వచ్చే ఫలితం స్పష్టంగా వుంటుంది. ఇంకో రకంగా ఆలోచించేది అధర్మం. అది స్వార్థపూరితమౌతుంది. ఆలోచించుకోండి. నా ధర్మం ప్రకారం చెప్పవలసింది చెప్పాను. మిగిలినది, మీ చేతుల్లోనే వుంది. వివాహం మాట మాత్రం దయచేసి ఎత్తవద్దు."

"ఆమె సామాన్యురాలు కాదు. యువరాణి. అవసరమైతే యుద్ధరంగంలో ప్రత్యర్థుల భరతం పట్టగల వీరనారి. ఆవిడకు కావల్సింది పనికిరాని నమస్కారాల కృష్ణుడు కాదు. విశ్వాన్ని శాసించగల వీర పురుషుడు. ఆమె మనసు తన తండ్రి పరువు నిలబెట్టడం, ద్రోణుని నిర్బంధించగల్గడం... ఆ వ్యక్తితో, ఇతర వివరాలతో

అవసరం లేదు. అటువంటి వ్యక్తిని చూసి, కావాలంటే స్వయంవరం ఏర్పాటు చేసి, ఆ మహావీరునికి, ఈ రాజకుమారినిచ్చి వివాహం చేద్దాం. వారికి నేను సర్వదా బాసటగా వుంటాను. నా సోదరిగా నిలబడి రక్షిస్తాను. దానిని నా కర్తవ్యంగా భావిస్తాను!'' అని ఇంచుమించు ద్రుపదునికి వాగ్దానం చేస్తాడు.

పాంచాలుడు ఆలోచనలో పడ్డాడు. ఇది మంచి ఆలోచన. నిజమైన వీరుడు తనకల్లుడౌతాడు. ఆతని ద్వారా తన పంతం నెగ్గించుకోవచ్చును. ఇందుకు రాజకుమారి సర్వవిధాల సహకరిస్తుంది. కాబట్టి స్వయంవరం... ఆలోచన చాలా బాగుందని ద్రుపదుడు సంతోషించాడు. తన నిర్ణయం చెప్పి - "వాసుదేవా!'' నువ్వు నాకొక సాయం చెయ్యాలి.

స్వయంవరంలో ఎవరు వీరులైనా, ఎవరిని ద్రౌపది వరించినా, నువ్వు మాత్రం నాకు శాశ్వత మిత్రునిగా వుండాలి. కోరిన వెంటనే నీ సహకారమందించాలి. ఇంచుమించు ద్రుపదుడు ప్రార్థిస్తాడు. అలాగేనని కృష్ణుడు వాగ్దానం చేసాడు.

"మరో విషయం. ఈ స్వయంవర సంరంభం చూడటానికి, శ్వేతకేతుల వారిక్కడే వుంటారు. ఆచార్య సాందీపులు వచ్చి, ఏ విధమైన విలువిద్యా పాటవాన్ని ప్రకటించి, ప్రదర్శించాలో తెలుపుతారు. స్వయంవరం జరిగేది మాత్రం - ధనుర్విద్య కౌశలంలో మాత్రమేనని మాత్రం మరువకూడదు.

ఆ విలువిద్యా ప్రదర్శనంలో గెలుపొందిన వ్యక్తిని ద్రౌపది భర్తగా వరిస్తుంది. కథ సుఖాంతమౌతుంది. మీ శక్తియుక్తులు తెలుస్తాయి. పరువు ప్రతిష్ఠలు పెరుగుతాయి. నిన్నటి వరకు పొరపాటున చులకనగా చూసినవారు, నేడు వంది మాగధుల వలె కీర్తిస్తారు. గౌరవిస్తారు.'' అనగా -

"యాదవులు కూడా వస్తారా ?'' వారి సహాయం కూడా కావాలన్నట్లు పాంచాల భూపతి అడుగుతాడు.

"బలరాముడుతో సహా ముఖ్యులు, ప్రముఖులు అందరు వస్తారని'' చెబుతాడు.

"అయితే, నా ప్రతిజ్ఞ నెరవేరుతుందా, గోవిందా ?''

"తప్పక, ద్రుపద రాజేంద్రా! సదాలోచనలకు సత్ఫలితాలు తప్పక లభిస్తాయి'' అంటాడు. ఇన్ని చెప్పినా తనను విడువని ద్రుపదుని చూసి,

నవ్వుకుంటాడు. అప్పుడు - “కృష్ణా! స్వయంవరానికి సిద్ధమౌతాను. ఏర్పాట్లు ప్రారంభిస్తాను” అంటాడు.

తప్పకిది విజయం సాధించాలని కృష్ణుడు తలుస్తానంటాడు. మీకు విజయం, నాకు జయం. కాదంటే నేను ఘోరపాపిని, మాట తప్పినవాడినౌతాను. మిత్రద్రోహి నౌతాను. ద్రౌపదిని అవమానపరచినట్లు భావిస్తాను.

“లేదు. నీకు అపజయం రాదు. ఇప్పుడు ఈ మొత్తం కార్యక్రమం నీ చేతుల్లో పెట్టాను. దీనిని నిర్వహించి, సమయం చూసి నా ప్రతిజ్ఞా పాటవానికి తగిన సాయం చెయ్యమని కోరాడు.

అయితే రేపు స్వయంవరం విషయం కృష్ణుడు ప్రకటించమంటాడు. కృష్ణుడు - ఎప్పుడైతే పంచపాండవులు, జీవించి వున్నారని, వారి వునికి తెలుసు కోవాలని సూచనప్రాయంగా చెప్పాడో, అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చిన ఉద్ధవుడు, తమ తాత, నాగజాతి ప్రభువైన ఆర్యకుల వారిని కలవాలని తలిచాడు. వ్యాసుల వారు నాగకూటానికి వెడుతున్నానంటే, ఉద్ధవుడు మహర్షిని అనుసరించాడు.

ఆచార్య జైమినులవారి నేతృత్వంలో పదిమంది శిష్యులలో ఒకడిగా, ఉద్ధవుడు - వ్యాసులవారితో బయలుదేరాడు. మూడురోజులు సుదీర్ఘ ప్రయాణం చేసి వారలు ఏకచక్రతీర్థాన్ని చేరారు. వ్యాసులవారితో రావడం, తన అదృష్టంగా ఉద్ధవుడు భావించాడు. ఎక్కడికక్కడ వ్యాసులవారి రాకను తెలుసుకున్న తీర్థ ప్రజలు, ఆ తీర ప్రాంతాలలో స్థిరపడినవారు చూపే -

అపూర్వ ప్రేమాదరాలకు, ఉద్ధవుడు, చలించి మురిసిపోయాడు. చిన్నప్పటి నుండి మహర్షి పేరు వినడం తప్ప, ఇంతవరకు చూడలేదు. మొట్టమొదటిసారిగా ఆ భగవానుని దర్శించి, పరమానందంతో పులకరించాడు. కేవలం చూడటం కాదు, వారితో కలిసిమెలిసి నడిచే అదృష్టాన్ని, అపూర్వ సాంగత్యాన్ని పొందాడు. ఇదంతా కృష్ణుని ప్రేమ ఫలిత, ఆశీర్వచనమని మురిసిపోయాడు.

నాల్గునాళ్ళు, కాలినడకన ప్రయాణం చేసిన తదుపరి వారు నాగకూటాన్ని చేరారు. మహారాజు ఆర్యకుడు, యువరాజు కర్కోటకుడు. తమ రాజ్య పొలిమేరకు వచ్చి, ఆ మహామునిని, అపూర్వ స్వాగతంతో తీసుకువెళ్ళారు. ఆ తదుపరి వృద్ధ మహారాజు మెల్లిగా వచ్చి, వారికి అభివాదం చేసి, వారిని అనుసరించాడు.

వ్యాసులవారు, ఉద్ధవుని, వారికి, వారి మనుమనిగా పరిచయం చేయడంతో, మహారాజు అతన్ని పిలిచి, దగ్గరకు తీసుకుని అక్కున చేర్చుకున్నాడు. కర్కోటకుడు కుమారుడు మణిమంతునికి అప్పగించాడు. ఉద్ధవుడు, పునర్దత్తుని రక్షించడంలో, కృష్ణునితో కలిసి నాగలోక భాగమైన యమపురికి వచ్చాడు. కానీ, నాగవంశ వివరాలు, - వగైరాలేమీ తెలియవు.

నాగరాజు తిరుగు ప్రయాణంలో, తన ఏడు తలలతో పశుపతిని దర్శించుకోవాలని, ఈతనిని కూడా తీసుకువెళ్ళాడు. అప్పుడు ఉద్ధవుడు తన తాతగారు, "శూరుడు", నాగకన్యను వివాహం చేసుకోవడం వగైరా... కథా వివరాలను అడుగుతాడు.

అనగనగా... ఎప్పుడో... పూర్వకాలంలో యాదవ వంశ ప్రముఖులైన, వృష్ణి, శూర, అంథకులు, యమునాతీర ప్రాంతంలోని అడవులను సరిచేస్తుంటే, శూరుడు, అనుకోకుండా తోడేళ్ళ బారినపడ్డాడు. తలవని తలంపుగా, ఆ సమయంలో అటు వచ్చిన నాగప్రముఖులు, మీ తాతను రక్షించారు. నా దగ్గరకు తీసుకువస్తే, ఆ వీరుడిని ప్రత్యేకంగా నా వద్ద వుంచుకున్నాను. నా పెద్దకూతురు మహీష ఆయనకు సేవలు చేసింది.

శూరుడు కోలుకున్నాక, నా కూతురు ప్రేమకు దాసుడయ్యాడు. సరిగ్గా ఈ తరుణంలో, యదువీరులు, మీ తాతను వెదుక్కుంటూ వచ్చి, అతన్ని తీసుకు వెళ్ళారు. ఆ తర్వాత కొంతకాలానికి, ఆరోగ్యం కుదుటపడ్డాక శూరసేనుడు నా వద్దకు వచ్చి, నా కుమార్తెనిమ్మని అడిగాడు. నాతో నాగకూటానికి వచ్చి నా కుమార్తెను వివాహం చేసుకుని వెళ్ళాడు. ఆ తర్వాత, మీ పినతండ్రి వసుదేవుడు జన్మించినప్పుడొకసారి వాళ్ళింటికి వెళ్ళాను." అన్నాడు. నిజానికి -

వాళ్ళ ఆచార, వ్యవహారాలు చాలా సాధారణంగా వుంటాయి. వాళ్ళకు, నాగరికులమనే ఆర్యులవలె ఆశలు, ఆశయాలు వున్నట్లు కనబడవు. అట్టహాస, పటాటోపాల దృష్టి ఏ మాత్రం కనబడదు. అందుకేనేమో, ఆదిపురుషుడి వలె కనుపించే, మహాత్మ, వ్యాసులవార్ని గౌరవిస్తారు. పశుపతినాథుని పూజిస్తారు. వ్యాసులవారు ఇక్కడకు వచ్చినపుడు వారు సలిపే హోమాది కార్యక్రమాలకు, నాగరాజు, ఆ వంశ పెద్దలు, పూజారులు చక్కగా కూర్చుని ఆ జరిగే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో గమనిస్తారు.

తపోమూర్తి, నారాయణ స్వరూపుడైన వ్యాసులు, తమ మంత్రశక్తితో వారి, వారి బాధలను తీర్చడం, చిరునవ్వులతో గుర్తుపట్టి పలుకరించడం వలన, ఆ నారాయణ స్వరూపుడు వాళ్ళందరికి పరమ ఆప్తుడయ్యాడు. మహర్షి తపోదీక్ష, ధర్మనిరతి, శ్లాఘనీయము. ఎక్కడికి వెళ్ళినా వారి ప్రేమతత్వానికి, ప్రతివారు ఆకర్షితులౌతారు. దర్శనానంతరము, ధన్యత చెందామని తలుస్తారు.

వారి ఆచారాలు, వ్యవహారాలు, ఆకృతీ, సాంప్రదాయాలు భిన్నమైనా తమ మాతామహ వంశీయులతో గడపటం ఉద్ధవునికి ఎంతో ఆనందదాయకమైంది. ముఖ్యంగా కర్కోటకుని కుమారుడు మణిమంతుడు వద్దనున్న కత్తి - ధనుర్బాణాలను చూసాడు. అవన్నీ మొరటు ఆయుధాలు వారివి. మొండి పోరాటాలు. ఉద్ధవుని వద్ద వున్నవి నాగరిక ఆయుధాలు.. కాబట్టి..... వాటిలో శిక్షణను పొందాలని మణిమంతుడు ఉవ్విళ్ళూరుతున్నాడు. విందులు, వినోదాలు... చాలా సంతోషంగా వుంది వాతావరణం. కానీ వచ్చిన పని కాలేదు. ఈ నాగజాతివారు బలాఢ్యులు కూడా. పులులు, సింహాలతో ప్రత్యక్షంగా ఢీకొని, వాటిని చంపగల నేర్పరులు. చూసేవాళ్ళు "అమ్మో" అంటే ఇదే వీరత్వం, మగతనమంటారు తప్ప భయపడరు.

వాళ్ళు నాగరికులమనే మన సమాజంలోని కుయ్యుక్తులు, కుతంత్రాల దుష్టబుద్ధులను, ధర్మభ్రష్టులను, గుణహీనులను క్షమించరు. అందుకే తొందర పడకుండా, జాగ్రత్తగా వుండాలని ఉద్ధవుడు నిర్ణయించుకున్నాడు. తమవాడని తెలుసుకున్న మణిమంతుని సోదరీమణులు కూడా, ఉద్ధవుని ఎంతో అభిమానంతో - గౌరవంగా, ప్రేమగా చూస్తున్నారు.

మూడురోజులు గడిచాయి. ఎంత జాగ్రత్తగా వున్నా విషయం తెలియక, అసహనం పాలయిన ఉద్ధవుడు, వ్యాసులవారిని కలిసాడు. "నీ రాక నాకు తెలియదనుకున్నావా ? విషయం అర్థం చేసుకోలేననుకున్నావా ?" అని మందహాసం చేసి, కర్కోటకుడు, ఈ విషయంలో తన వేటను ప్రారంభించాడు. అంతా శుభమౌతుందన్నారు, కురువంశ పరిరక్షణా బాధ్యత, తనకు - వున్నట్లు ప్రకటించుకుంటున్నట్లు...! మళ్ళీ మహర్షే -

ఓ పదిరోజులకు మించి నేనిక్కడ వుండలేను. పదోరోజు నాటికి నేను అహిచ్ఛత్రలో వుండాలి. నువ్విక్కడ వుండు. విషయాలు తెలుసుకో. నీకే విధమైన

ఇబ్బంది వుండదు. అందుకే నీవెవరో, వారికి తెలియబర్చానన్నాడు. సరిగ్గా -ఆ సమయంలో కొన్నాళ్ల క్రితం, మావాళ్ళు అయిదుగురు ఆర్యసంతతి వారిని చూసారుట. అందులో ఒకతను ఏనుగులా వున్నాడుట. పెద్ద పెద్ద అంగల్తో, ఒక పెద్దావిడను తన భుజంపై మోసుకు వెడుతున్నాడుట...!'' అనేసరికి -

ఉద్ధవునికి అపరిమితానందం కల్గింది. అతడు మన భీముడై వుంటాడు. “ఇది మా “సిగూరి'' (అతనిపేరు) పంపిన సమాచారం. ఇంకా వివరాల కోసం, ఎక్కడైతే వీళ్ళను చూసాడో, ఆ గ్రామం “లాహురి''కి వెళ్ళి, మనకు కావలసిన మిగిలిన వివరాలు సేకరించి, పంపుతాడట...

''''''''''

# నాగప్రేమ!

**“పిం**గళ, కపిల - కర్కోటకుని పుత్రికలు. మణిమంతునికి సోదరీమణులు. ఇద్దరు చూడటానికి ఒకేలా అంటే ... కవలలు వలె వుంటారు. క్రొత్తవాళ్ళు చూడగానే కనుక్కోవడం చాలా కష్టం. వీళ్ళు ఎల్లప్పుడు, సావకాశం దొరికినప్పుడల్లా, ఉద్ధవుని చెంతనుండి, అతనికి కావాల్సిన సపర్యలు చేయడం, ఇష్టం తెలుసుకుని, దానిని నెరవేర్చడం ప్రధానంగా, అతనిని అంటిపెట్టుకుని వుండ సాగారు. ఇంకా చెప్పాలంటే వీళ్ళ మనసును అతనికిచ్చేసారు.

కృష్ణలీలలన్ని వాళ్ళు తెలుసుకున్నారు. ఉద్ధవుని వెంటపెట్టుకుని, గోవిందుడు చేసిన లీలావిశేషాల సాహసాలను తెలుసుకుని, ఒక మూల ఉక్కిరి బిక్కిరయ్యారు. మరొకమూల ఉబ్బితబ్బిబ్బయ్యారు. వాళ్ళ ప్రపంచంలో ఇటువంటి విశేషాలు వినబడవు. అదే బృందావన - గోపికల ప్రేమ, వెన్నెల విహారాలు, వగైరా అమాయకులైన వారికి, ఉద్ధవుడు, అందంగా, ఆనందంగా వర్ణించి చెప్పాడు. కృష్ణలీలలు వాళ్ళకు గుర్తింపు, గౌరవం, ఉత్సాహం కల్గించాడు. కృష్ణభక్తుడు కదా, ఉద్ధవుడు. అందుకే “కృష్ణం వన్దే జగద్గురుం'' అని కృష్ణ లీలా ప్రేమికుడై తాను పరవశించాడు. వారిని మురిపింప చేసాడు. ఆ కథలు, ఆనందంతో, ఎందుకో ఆ రాత్రంతా మధురంగా గడిచింది. ఆ రేయి, నిద్ర మత్తులో కృష్ణుడు, మణిమంతుడు కలుసుకున్నట్లు, కృష్ణుని చూసి కర్కోటకుని పుత్రికలు, రాజకుమారీలు ఆనందించినట్లు కల వచ్చింది. అంతవరకు బాగానే వుంది.

అప్పుడే.... ఎవరో తనను చుట్టుకుంటున్నారు. ఆ సుకుమార హస్తస్పర్శకు, కరగిపోతున్నాడు. ఏదో తెలియని మధురానుభూతి. ఏవిటది... ? తెలుసుకునేలోగా కల చెదరింది. ఎవరో నిజంగా, చుట్టేసుకుంటున్నారు. ఉలిక్కిపడి, ఉద్ధవుడు, కళ్ళు తెరిచాడు. భయపడిపోయాడు. స్త్రీ జాతిని తన మాతృమూర్తిగా, సోదరీమణులుగా తలంచే ఉద్ధవుడు, ఈ పిల్ల చాపలా చుట్టుకుపోతే "కృష్ణా! యదుభూషణా, సోదరా! దేవా, పాహిమాం పాహి! పాహి! రక్షించుమని" మనసులో పదే పదే ప్రార్థిస్తున్నాడు. గుండె దిటవు పరచుకున్నాడు. స్థాణువులా వుండిపోయాడు.

ఉద్ధవుని ప్రేమను పొందాలని తలచి, వలచి, వచ్చిన యువతి, కర్రలా - బిర్ర బిగుసుకునిపోయిన ఉద్ధవుని చూసి, ఆమె ఉద్రేకం చల్లారిపోయింది. మనసు చల్లబడింది. చలనం లేని ఈ మనిషిని చూసి కళ్ళనీళ్ళ పర్యంతమయింది. అప్పుడు - ఉద్ధవుని మనస్సు నీరుగారిపోయింది. నేను.... అసాధారణంగా ప్రవర్తించాను. ఏమో... కృష్ణా... ఆపన్న రక్షకా!" అనుకున్నాడు, మళ్ళీ!

అప్పుడే... మరో భామ... తనను చుట్టుకుంటుంది. అంటే... "పింగళ, కపిల" లన్నమాట. నన్ను పరీక్షిస్తున్నారా ? ప్రేమలో పడేస్తున్నారా ? అంతా కృష్ణమాయగా, దైవలీలగా వుంది. పనిలేని కామదేవుడు, నన్ను పాడుచెయ్యాలని చూస్తున్నాడు. ఉద్ధవుడు భయపడిపోతున్నాడు. ఆ రాత్రి ఎంతో భారంగా గడిపాడు. తన శీలం కాపాడుకోగల్గినందులకు సంతోషం, వారిని నిరాశపరచి నందులకు దుఃఖం మొదలయింది.

మొత్తానికి కృష్ణుడు దగ్గర లేకపోవడం, తను వచ్చిన పని పూర్తికాకుండా, మధ్యలో - ఈ ప్రేమాయణం... ఎలాగ మొదలౌతుందో, ఎలాగ ముగుస్తుందో అర్థం కాక బాధపడిపోతున్నాడు. ఈ ఆలోచనలతో తెల్లవారడం మధ్యాహ్నా మవడం కూడా జరిగిపోతుంది. ఆచార్యులు, జైమిని మహాశయులు, వేదవ్యాసుల వారు రమ్మన్నారని వచ్చారు. వారిని ఉద్ధవుడు అనుసరించాడు. అక్కడ - వేదవ్యాసులవారి సన్నిధిలో మహా ముత్తాత ఆర్యకులవారు కూడా వున్నారు. చూడటానికాయిన, ప్రస్తుతానికి కసాయివాని చేతికి చిక్కిన బలి పశువులా కనబడ్డాడు. ఒక ప్రక్కన నాగరాజు, ఇరుప్రక్కల వాని కుమారులు, కర్కోటకుడు, కోడలు రవిక, వున్నారు. వారి ప్రక్కన ఇంకో ఇద్దరు స్త్రీలు, మణిమంతుని భార్య, వారి ప్రక్కన దెబ్బతిన్న పాములుంటాయి. అలాగ పింగళ, కపిలలు - ఎర్రటి కళ్ళతో వున్నారు. అప్పుడు, అక్కడికి ఉద్ధవుడు వచ్చాడు.

పరిస్థితి దారుణంగా కనుపించింది. ఉద్ధవుడు భయపడలేదు. సత్యమే జయిస్తుందనుకున్నాడు. ధర్మమూర్తి వ్యాసభగవానులవారి నీడలో, అధర్మం జరగదని ధైర్యంగా వున్నాడు. ఇతన్ని చూస్తూనే వ్యాసులవారు చిరునవ్వులు చిందిస్తూ కూర్చోమన్నారు. ఆ నవ్వు కొంత ధైర్యమిచ్చింది. ధర్మం గెలుస్తుందనుకున్నాడు. మెల్లిగా వ్యాసులవారు -

"చూడు, చిరంజీవి! ప్రతివారికి సాంప్రదాయం కొన్ని ఆచార పద్ధతులుంటాయి. అలాగే వీరికి.... ఆర్యుడను. ఇదే నా సాంప్రదాయమనకు. ఆచరించే వాటిని ఆచారాలన్నారు. అనుసరించే వాటిని సాంప్రదాయమన్నారు. నిన్న - ఈ పిల్లలు, నిన్ను కోరారుట. నువ్వు చలించలేదట. ఇది వారికి అవమానంగా వుంది. వారికి, కాదు, వారి వంశానికి మచ్చగా తలుస్తున్నారు.

"కానీ, తప్పు చెయ్యని నేను, ఎవరికి ఎందుకు భయపడాలి ? నేను ఏ తప్పు చెయ్యలేదు, కదా!"

"నిజమే ఉద్ధవా! ముందే చెప్పాను. ప్రతి జాతికి, వంశాచారాలు, కులాచారాలు, మతాచారాలుంటాయి. అలాగే - మీకు, వారికి కూడా!" అని నవ్వుతూంటే, యువరాణి రవిక "మహర్షీ! ముందు మా పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించండి. మావాడని, మరులు పెంచుకున్నారు. మనసు పడ్డారు. అతనితో జీవితం పంచుకోవాలనుకున్నారు.

ఇప్పుడితడు కాదన్నాడు. వారి బ్రతుకు, ఒకరు త్రోసి రాజంటే, మరొకరు చెయ్యి పట్టరు. ప్రతి ఒక్కరు అసహ్యించుకుంటారు. అది ఆడతనానికే మచ్చ. ఇప్పుడు ఉద్ధవుడు చెయ్యిపట్టుకోవడమో, వారు ప్రాణత్యాగం చెయ్యడమో ఏదో ఒకటి జరగాలి. లేదంటే, ఈ సంఘటన మా జాతికి, వంశానికే మచ్చ. ఆ తర్వాత జరిగే పరిణామాలకు, మేమెవ్వరం బాధ్యులం కాము." ఖచ్చితంగా చెప్పేసింది.

ఇరుకున పడ్డాడు ఉద్ధవుడు. "కృష్ణా!" అనుకోవడం తప్ప, అంతకుమించి మరో గతి లేదు. వ్యాసులవారు ఆలోచిస్తున్నారు. వారు క్షణమాగి, నా మాటవిను. "నువ్వు వీరిని వివాహం చేసుకుని, నీ మహా మాతామహునివలె ద్వారకకు తీసుకు వెళ్ళు. ఎవరు కాదనరు. ఇది నా నిర్ణయం కాదు. సలహా. బాగా ఆలోచించు. పరిస్థితులు దిగజార్చుకోకు. ఇది బలవంతం కాదు. వర్తమానానికి వర్తించే సలహా, భవిష్యత్తుకొక సూచన, మాత్రమే!

"మరి నేను - ఈ లోకంలోని స్త్రీల నందరిని మాతృమూర్తులుగా, దేవతలుగా చూస్తానని ప్రతిజ్ఞ చేసాను. ఇప్పుడా ప్రతిజ్ఞా భంగానికి సిద్ధపడనా ? ఇందుకు ధర్మమొప్పుతుందా ? ఆవేదనతో అడుగుతున్నాడు.

"ఉద్ధవా, ఇటువంటి పరిస్థితి ఎవరికి రాకూడదు. వచ్చింది కాబట్టే చెబుతున్నాను. నేను పుట్టు సన్యాసిని. కాని సంతాన వాంఛ.... ఎప్పుడు... ? వేద విభజన, పురాణ, ఉపపురాణాలు వ్రాశాక, కల్గింది. శంకరుని తపస్సు చేసి శుకుని పొందాను. ఇది వాంఛితమా ? సద్వాంఛితమా ? వ్యాసులిలాగ చెయ్యడం... తగునా ? అంటే సమాధానం దొరకదు. ఆ సంఘటన పూర్వాపరాలను తెలుసుకుంటే సత్యం బోధపడుతుంది. బయట పడుతుంది.

జన్మించిన ప్రతి వ్యక్తి, ధర్మార్థకామమోక్షాలనే, చతుర్విధ పురుషార్థాలను సంపాదించుకోవాలి. అందుకు భార్య కావాలి. భార్యా విహీనుడు, అవసరార్థం వివాహం చేసుకునేవాడు, కర్మగామే తప్ప ధర్మగామి కాలేడు! కనుక వివాహ మవసరం. సహజీవనం ధర్మపత్నితో జరిపేవాడు కూడా పరస్త్రీలను మాతలుగా, తన సోదరీమణులుగా చూడవచ్చును. ఇక్కడ ధర్మభ్రష్టం కాని, సంకరం కాని జరుగదు.

మహర్షి చెబుతున్నారు. ఆలోచిస్తున్న ఉద్ధవుడు, కొద్ది సమయమన్నాడు. ఆలోచించాడు. ఆలోచిస్తున్నాడు. నాకో అవకాశం ఇవ్వండి. మీ ఆజ్ఞ అనుల్లంఘ నీయం. కాదనను. కృష్ణుడు కూడా ఇక్కడికి వస్తున్నాడు. అతడే నా గురువు, దైవము, సర్వస్వము. నా గోవిందుడు రాగానే సమాధానం పడటమో, సంబంధ మొందడమో... ఏదో ఒకటి తప్పక జరుగుతుంది.

అది జరుగరానిది. ఇటువంటి కుట్రలు - కుతంత్రాలు అమాయకులైన మా మీద ఎన్నో జరిగాయి. అందుకే ఆర్యులంటే మాకు, మంటయి, ఇలాగ అడవులపట్టి, మా బ్రతుకు బ్రతుకుతున్నాం. మహర్షి చెంత లేకపోతే నువ్విక్కడ అడుగుపెట్టేవాడివి కావు. నువ్వు మావాడివని మహర్షి చెప్పడంతో, నీమీద కొంత అభిమానం కల్గింది. కనుక -

"వచ్చే గోవిందుడు... మీ మనుమడే. దేవకీ పుత్రుడు వసుదేవ సుతుడు. "శౌరి" అనబడే శూరసేనుని మనుమడు." అనగా, నిజమన్నారు, మహర్షి. ఆ వెంటనే "రవికా, నువ్వు నా మాట విను. వింటావా ?" అనగా వింటానందామె.

ఉద్ధవుని వెన్నులో చలి మొదలయింది. గడగడ వణుకుతున్నాడు. పాండవుల పేరుతో తాను బ్రతుకు గండంలో పడిపోయానని, భయపడిపోతున్నాడు.

"స్వామి! ఉద్ధవుడు ఏదో చెబుతున్నాడు. కానీ, ఆ మాటలు పూర్తి కాలేదు. అప్పుడెవరో "రాక్షసులు, రాక్షసులు" అని బయట గట్టిగా అరుస్తున్నారు. అప్పుడు, వీరుడైన ఉద్ధవుడు, ధర్మమూర్తి సోదరునిగా ధైర్యమొందాడు. ధనుర్బాణాలు పట్టుకుని, బయటికి పరుగెత్తాడు.

''''''''''

# రాక్షసుడు

**శి**గూరు నాగా మరికొందరు రాక్షసుడంటూ ఒక పిల్లవాడిని తీసుకు వచ్చారు. అతడు మానవ లక్షణాలకు, అతి విశ్వాసపాత్రమైన పెంపుడు కుక్కలా వున్నాడు. అందరు రాక్షసుడంటూంటే, ఒక్క ఉద్ధవుడు మాత్రం ముందుకు వచ్చి అతన్ని దగ్గరకు తీసుకుని గాయాలకు మందు రాసి కట్టుకట్టాడు. అప్పుడు వచ్చిన వేదవ్యాసులు "ఈ పిల్లవాడిని చూసి, భయపడక"మన్నారు. అతడు తన బెదురుతనాన్ని, భయాన్ని, పిరికితనాన్ని కొద్ది కొద్దిగా విడిచిపెడ్తూ "భీమా!" అన్నాడు.

అది ఉద్ధవునికి ఆశ్చర్యం వేసింది. "భీమా! నువ్వు చూసావా, నాలాగ వుంటాడా ?" అడిగే ఉద్ధవుని మొదటి ప్రశ్నకు, అవునన్నట్లు తలవూపాడు. రెండోదానికి, తల అడ్డంగా తిప్పాడు.

భీముళ్ళెంతమంది. అయిదుగురా.. ? అని తన వ్రేళ్ళను మహర్షి చూపారు. పిల్లవాడు నవ్వి, అవునన్నట్లు తల వూపాడు. అప్పుడు ఉద్ధవుడు, నేను భీముని, బావ నన్నాడు. అవునని మహర్షి తలూపారు.

"నువ్వు భీముని దగ్గరకు వెళ్ళిపోతావా ?" ఉద్ధవుడు అడిగాడు. ఒక్క భీముడు విషయంలో బొటనవ్రేలును, మిగిలిన భీముల విషయంలో ఇతర వ్రేళ్ళను చూపాడా పిల్లవాడు. అయితే, "భీముడెక్కడ వున్నాడు ?" మహర్షి అడగగా, దక్షిణ దిక్కును చూపాడతడు. కొంతలో కాస్తంత ఆశ కల్గిన ఉద్ధవుడు, మహర్షి... ఇతను నా వద్ద వుండటానికి అనుమతించండి" అని అడిగాడు.

భగవంతుడు నా యందున్నాడు. ప్రమాదం నుండి బయటపడేశారనగా, ఎలాగంటాడు, కర్కోటకుడు.

మా బావలయిదురుగు బాగున్నారు. అదే బ్రతికి వున్నారు. కనుక, ఇతనితో రాక్షసారణ్యానికి వెళతాను. వారినిక్కడకు తీసుకువస్తాను. ఈ లోగా నా ప్రభువు, సోదరుడు గోవిందుడు వస్తాడు. మొత్తం పరిస్థితి చక్కబడుతుంది. ఎంతో ఆశాజనకంగా చెబుతున్నాడు.

ఆ మాటలు విని ఉద్ధవుని పిచ్చిగా జమ కట్టారు. కర్కోటకుడు వెళ్ళమన్నాడు. ఎలాగ వెడతాడండి అన్న, "యువరాణి రవిక" ఇతనికేమైనా అయితే, నా పిల్లలు అన్యాయమౌతారు" దిగులు పడుతు చెప్పిందామె.

"చూడమ్మా! నాకేం కాదు. నాకు కావాల్సింది, నా బావల క్షేమ సమాచారం, వారి వునికి. అందుకే నేను మహర్షితో ఇక్కడికి వచ్చింది. మీ విందు భోజనాలు, చిందులకు, నేన్కిడికి రాలేదు. ఇక్కడకు రాక మునుపే, నా దేవుడు కృష్ణునికి, నాకు, ఆర్యకులు మా ముత్తాతగారని తెలుసును. వారు ఎక్కువ భాగం అడవులలో సంచరిస్తారు కాబట్టి, క్రొత్తగా వచ్చిన వాళ్ళను గుర్తించి, వారి క్షేమ సమాచారములు తెలుపుతారనే గంపెడు ఆశతో వచ్చాను. విషయం తెలిసింది. నాకు ప్రాణభయం లేదు. నా భగవంతుడు, నాకెప్పుడు ఏదోరకంగా తోడునీడగా వుంటాడు. ఇంతవరకు మహర్షి రూపంలో వున్న నా ప్రభువు, ఇప్పుడు మీరనే రాక్షస రూపంలో వచ్చాడు. ఆ తర్వాత ఆయనిష్టం." ఎంతో హుందాగా, ధైర్యంగా చెప్పాడు.

వారి దగ్గర శెలవు తీసుకుని సిగూరు నాగా, ఈ క్రొత్త కుర్రవాడితో కలిసి లాహూరియా పొలిమేరలకు, ఆర్యకుల ఆఖరి సరిహద్దు ప్రాంతానికి వచ్చాడు. శిగూరికి వీడ్కోలు పలికి, గ్రామంలోకి వెళ్ళాడు. కృష్ణుడు ఆదేశించినట్లు ఉద్ధవుడు పంచపాండవుల వునికిని తెలుసుకునే స్థితిలో వున్నాడు. అందరు రాక్షసుడనే క్రొత్త కుర్రవాడి పేరు నికుంభుడు. ఇద్దరు కలిసి, ఆ ఎత్తుపల్లాలలో, ముళ్ళరాళ్ళతో, సూదిమొనలతోనున్న బండలలో, నడుస్తున్నారు.

నికుంభుడికి అలవాటు కాబట్టి, వాటిపై పరుగెత్తుతున్నట్లు నడుస్తున్నాడు. ఉద్ధవుడు, నడవలేక అవస్థ పడుతున్నాడు. ఆ సమయంలో అతని వద్ద వున్న పట్కాకత్తి, విల్లంబులు, అన్నీ బరువుగానే వున్నాయి. వాటిని మొయ్యడం చాలా కష్టంగా వుంది.

మధ్యాహ్నానికి కొంతదూరం నడిచారు. కాని ఆ ఎండలలో, కొండలలో నడవడం ప్రాణాంతకమైంది. పళ్ళు బిగించి, వూపిరి బిగపట్టి, తప్పదన్నట్లు నడుస్తున్నాడు. ఎక్కడ ఆగుదామన్నా, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుందామన్నా ఏ మాత్రం అనువైన ప్రదేశం, అవకాశం కనబడటం లేదు. అంతా రాళ్ళు సూదిమొనలు, కత్తుల వంటి ప్రమాదకర కొండ - శిలలు ప్రాణభయం కలిగిస్తున్నాయి.

సాయంకాలమయింది. చీకటి పడుతుంది. నికుంభుడు తనకు అలవాటైన అడవిదారి పట్టాడు. ఆ చీకటిదారిలో నికుంభుడు నడవగలడు. ఉద్ధవుడు చతికిల బడినంతపని చేసాడు. చీకటి బాగా ముసురుకుంది. దారి తెలియడం లేదు. ఒక చెట్టు దగ్గర జాగ్రత్తగా చూసి పడుకున్నాడు. పడుకున్న నికుంభుడు లేచి కూర్చున్నాడు. తన మీద నికుంభుని చెయ్యిపడగానే ఉద్ధవుడు గబుక్కున లేచాడు.

ప్రమాదం లేదు. కానీ, "నరవాసన" రాక్షసులు వస్తున్నారు. అదొక్కటే ప్రమాదమన్నాడు. ఎక్కడికి పోదామని ఉద్ధవుడు, చెయ్యి పట్టుకుని ఒక ప్రక్కకు లాగిన నికుంభుడు కొద్దిక్షణాల తర్వాత తిరిగి వచ్చాడు. దగ్గరవుతున్న రాక్షసుల డోళ్ళు, నగరాల శబ్దం రాను రాను అవి దగ్గరగా వినిపిస్తున్నాయి. నగారా, దుందుభుల శబ్దం వున్నట్టుండి ఆగిపోయింది. వాళ్ళు ఆగిపొయ్యారా ? లేక నెమ్మదిగా వస్తున్నారా!..? ఇదొక శంక, రాను, రాను ఆ అనుమానం బలపడ సాగింది. చుట్టుముట్టుతున్నట్లుంది. ఆ రాక్షసుల ప్రయత్నం. అప్పుడు, అక్కడ విడిచిన ఉచ్ఛ్వాసనిశ్వాసలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

అతి భయంకరమైన ప్రదేశంలో, రాక్షసకోనలో, భయంకర రాక్షసుల మధ్య, భయం, భయంగా, చెట్టుమీద చిటారుకొమ్మన కూర్చున్నాడు. దానిక్రిందే రాక్షసులు, ఆడుతున్నారు. పాడుతున్నారు. తమకై కొంత మాంసాహారాన్ని తయారు చేసుకుంటున్నారు. ఇదంతా చూస్తున్న ఉద్ధవుడు, ఏ క్షణంలో క్రింద పడిపోతాడో అర్థం కాక, ఆవేదన పొందుతున్నాడు.

మొత్తానికా కుర్రవాడు - నికుంభుడు, తెలివిగా తననిక్కడకు తీసుకువచ్చి విడిచాడు. అతన్ని వెళ్ళిపోయి, ప్రాణాలు రక్షించుకోమన్నాను. అతను వెళ్ళిపోయాడు. ఇప్పుడు నా పరిస్థితి...?! నీరుగారిపోతున్నాడు. కాళ్ళు, చేతులు ఆడటం లేదు. ఆ సమయంలో ఉద్ధవుడు -

**"హరే కృష్ణా! గోవిందా! హరీ, మురారీ!**
**గోవర్ధన గిరి పాలక, గోపాల బాలా!**
**కరుణాలవాలా, మురళీ, హే వాసుదేవా!"**

అని స్మరణం మొదలుపెట్టాడు.

మనసులో అనుకుంటున్నాడు. ఏదో మగత నిద్ర. గట్టిగా నిద్రపోతే చెట్టుమీద నుండి క్రిందపడతాడు. చెట్టు క్రింద వున్న రాక్షసులు బెదరి పారిపోవడమో, చంపుకు తినడమో ఏదో చేస్తారు. శరీరంలో ఏ మాత్రం సత్తువ లేదు. నరాలు బిగుసుకు పోతున్నాయి. చేతులు పట్టు తప్పుతున్నాయి. ఏ క్షణంలో క్రిందపడిపోతాడో... తెలియదు.

మళ్ళీ మనసులో కృష్ణనామం.

చావు గురించి భయపడటం లేదు. అది వీరోచితమైతే ఆనందం. పిరికితనంతో బ్రతుకడమనవసరం. దొంగచాటు దెబ్బతో చావడం, మహా ఘోరం. ఇప్పుడు ఏమిటీ నా పరిస్థితి - కృష్ణా! ఈ దిక్కుమాలిన చావుకు బలికావాలా ? "రక్షమాం, రక్ష" అనుకుంటున్నాడు.

తెల్లవారింది. చుట్టు వున్న రాక్షసులు, పైన ఎవరో వున్నారన్న వాసనతో, చుట్టు చెట్టుకొమ్మలు తెచ్చి వెలిగించారు. ఆ పొగ భరించలేక చెట్టుమీదవాడు క్రిందపడతాడు. కాల్చుకు తినేయొచ్చు. ఆ సమయంలో "ఉద్ధవా, నేనుండగా, నిన్ను చావనిస్తానా ? జరగదది" అన్నమాటలు స్పష్టంగా, ఎంతో స్పష్టంగా, ఒకటి రెండుసార్లు వినిపించాయి. ఆ సమయంలో, ఈ రాక్షసులు వచ్చేటప్పుడు వినిపించిన నగారా, దుందుభుల శబ్దం గతం కంటే పెద్దగా వుంది. అమ్మో! ఎవరో వస్తున్నారని, పొగపెట్టి ఉద్ధవుని చంపుదామనుకున్న దుర్మార్గులు పారిపోయారు.

ఇంతలో ఓ పెద్ద భారీకాయం. చిత్రంగా వున్నాడు. చెట్టుపైన కూర్చున్న ఉద్ధవుని ప్రాణాలు, పైపైకి పోతున్నాయి. గట్టిగా ఆ రాక్షసుడు అరిస్తే, అతని సేవకులు పరుగెత్తుకు వచ్చారు. వారిలో కుర్రవాడు నికుంభుడు కూడ వున్నాడు. తన స్వామిని చూసి నవ్వుతూ, చెయ్యి పట్టుకుని పైకి చూపాడు.

"ఆరి పాపి. తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టావు కదురా" అంటూ ఉద్ధవుడు. ఆ పిల్లవాడిని తిట్టుకున్నాడు. ఈ పెద్ద ఆకారము అటు యిటు చూసింది.

మొహాన నవ్వు పులుముకుంది. మరుక్షణం "ఉద్ధవా, క్రిందికి దిగిరా, ఏవిటలా కోతిలాగ చెట్టుకు పట్టుకుని వ్రేలాడుతున్నావు ?" ఆ మాటకు మరింత అదిరిపోయాడు. నా ఊరు, పేరు, గోత్రం.... అన్ని సంపాదించినట్లున్నారని హడిలిపోతూ విధిలేక క్రిందికి దిగబోతున్నాడు. మళ్ళీ "దిగు క్రిందకు. దిగలేకపోతే, దూకు. నిన్ను నేను రక్షిస్తాను!" ఆ మాటలు, ఆ గొంతు చిరపరచితమైనవిగా అనిపించింది. అప్పుడనుకున్నాడు. "నువ్వు ఎక్కడున్నాసరే. నిన్ను నేను, రక్షిస్తాను. అది నా కర్తవ్య"మన్న భగవంతుని మాటలు గుర్తుకు వచ్చాయి.

"కృష్ణా! దయామయా, అనాధరక్షకా, ఆపద్బంధూ!" అని పరిపరి విధాల కృష్ణునికి శరణాగతిని పలికాడు.

అతడెవరో కాదు. మహాబలుడు, భీముడు. పదివేల ఏనుగుల శక్తి కలవాడు.

"ఉద్ధవుని! చెట్టుమీద నుండి క్రిందకు దింపిన అతడు, "నేను వృకోదరుడిని". నన్ను భీముడని కూడా అంటారు. పరమ దయామయుడు, కృపాకరుడైన, శ్రీకృష్ణుడు పంపగా నీకోసం వచ్చాను. రా!" అని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు.

"భీమా!" అంటూ ఉద్ధవుడు, ఆతని కౌగిలిలో ఒదిగా పోయాడు. ఇప్పుడు భయమంతా పోయింది. భగవంతుడు కరుణామయుడు, నమ్ముకున్న వారిని నట్టేట్లో ముంచడన్న వాక్కు ఇక్కడ సత్యమయింది.

ఉద్ధవుడు స్వస్థతకు వచ్చాడు. ఆకలి, దాహం అతన్ని పీక్కు తింటున్నాయి. బాగా నీరసించిపోయాడు. లేచి కూర్చునే ఓపిక కూడా కనబడటం లేదు. లేవలేక పోతున్నాడు. లేస్తే చతికిలపడిపోతున్నాడు. ~~ఈ~~లోగా నికుంభుడు, కొన్ని ఫలాలు తెచ్చి యిచ్చి తినమన్నాడు.

ఆహారం తీసుకున్న కొన్ని క్షణాలకు కొద్దిగా ఓపిక వచ్చింది. అత్తయ్య, మిగిలిన బావలు, అనగానే... "అందరు సుఖంగా వున్నారు" అన్నాడు. అప్పుడు భీముడు (ప్రస్తుత నామం వృకోదరుడు) కొందరు రాక్షసులను తలక్రిందులుగా వ్రేలాడ తీస్తున్నాడు. "చూసావా ?" అంటు ఉద్ధవుని చూసి, వీళ్ళందరికి నరమాంసమంటే ఇష్టం. వీరు, వారని విచక్షణ లేకుండా చంపుకు తినేస్తారు. వద్దంటే వినరు. అందుకిది తగిన శిక్ష.

గతంలో - వాళ్ళు తిన్నది మొత్తం కక్కేసి, మనుషులను తినడం మాని, దొరికింది తిని, సాధుజీవుల్లా బ్రతుకుతున్నారు. కాదని ఎదురు తిరిగారో.... నా చేతుల్లో నలిగి చస్తారు. అందుకని, ఏది కావాలో నిర్ణయించుకోమని చెప్పకుండా, వాళ్ళే నిర్ణయించుకోవడానికి వీలుగా, ఈ రకమైన శిక్షను అమలుపరుస్తున్నానన్నాడు.

ఆ తర్వాత ఇద్దరు కలిసి (అదే వృకోదరా, ఉద్ధవులు) కుంతి దగ్గరకు బయలుదేరారు. దారిలో అదికాదు బావా, ఈ అధినాయకత్వం నీకెలాగ వచ్చిందో తెలుసుకోవాలని వుంది'' ఉద్ధవుడు మెల్లిగా అడిగాడు.

"అదా...! రెండురోజులు సుదీర్ఘంగా ప్రయాణం చేసి, ఒక పెద్దచెట్టు నీడను ఆశ్రయించాం. దొరకిన అడవి ఫలాలు తింటూ కాలం గడుపుతున్నాం. ఒకనాడు "హిడింబ'' వచ్చింది. "వూ... ఆ...!'' అంటున్న ఉద్ధవుడు, "ఎవరా హిడింబ ?'' అని అడిగాడు.

"నీకు తెలియదా ? సరే. అతని పేరు హిడింబాసురుడు. రాక్షసరాజు యోజన దూరంలో వున్న మనుషుల జాడ పసిగట్టి వారిని అన్యాయంగా చంపి భక్షించే రాక్షసులు వీరు. మమ్మ్మ పసిగట్టి, మాకోసం చెట్టు చుట్టు తిరగడం ప్రారంభించాడు. అప్పుడు మావద్ద ఆయుధాలేమీ లేవు. మా అన్నదమ్ముల నలుగురి మధ్య, మా అమ్మను వుంచి, ఆమెను జాగ్రత్తగా చూసుకోమంటూ, ఆ హిడింబుని ఢీకొన్నాను. అటువంటి వారిని ఢీకొట్టడం నాకు భలే సరదా.

వాడు "నేను రాక్షసుడిని, మొనగాడినని అనుకుంటున్నాడు. వెడుతూనే ఎగిరి ఒక్కటిచ్చాను. దిమ్మ తిరిగి క్రిందపడ్డాడు. లేచేలోగా మరో తోపు. లేవడను కుంటున్న సమయంలో లేచి, వెనుకనుండి నన్ను పట్టుకున్నాడు. అలాగే ఎత్తి, ఎత్తి క్రింద పడేశాను. ఆ దెబ్బకు ముక్కువెంట, నోటి వెంట రక్తం కారింది. దాంతో వుగ్రుడయ్యాడు. రెచ్చిపోయాడు. వాడు రాక్షసుడు. నేను మానవుని. నా చేతిలో పరాభవం, భరించలేకపోయాడు. వున్న బలం కొద్ది ఎగిరి నన్ను తన్నాడు. ఇద్దరు పిడిగుద్దులతో బాగానే గుద్దుకున్నాము. వాడు రాక్షసుడు. రాత్రి పెరిగే కొద్ది వాడికి బలం పెరుగుతుంది. వాడిని వుపేక్షించవద్దన్నాడు మా అన్నయ్య.

మా పోట్లాటకు నిద్రపోతున్న భయంకర జంతువులు - సింహాలు, పులులు బెదరి పారిపోయాయి. ఏ ఇతర జంతువు, మా చెంత లేదు. ప్రాణభీతితో అన్ని

పిక్కబలంతో పరుగెత్తాయి. అవి ఎందరినో చంపి వుంటాయి. ఎందరినో చూసి వుంటాయి. వాటి ప్రాణాలకు యముడివైన నన్ను చూడటం, వాటికి కొంత భయం కూడా కల్గించింది.

ఒక్కటిచ్చాను. ఆ దెబ్బకు హిడింబడు వెల్లకింతలా పడిపోయాడు. పదిమంది ఓ మాదిరి వస్తాదులు ఎత్తలేని బండరాయి ప్రక్కన వుంది. దానిని సునాయాసంగా ఎత్తి వాడిమీద పడేశాను. ఆ దెబ్బకు వాడు పచ్చడి, పచ్చడై చచ్చాడు.

అంతవరకు బిక్కుబిక్కుమంటు ఎక్కడో మూలల్లో దాక్కున్నవాళ్ళు "చచ్చానురోయ్!" అన్న హిడింబాసురుని అరుపుకు కొంత, చచ్చిన గావుకేకకు మరికొంత బెదరిపోయారు. ఆ విధంగా హిడింబాసురుడు చావడంతో, ఆతని పరిజనం పరుగు పరుగున వచ్చి, జయ జయ ధ్వానాలు చేసి, నన్ను వారి రాజుగా వుండమని కోరారు. లేకపోతే వారి బ్రతుకు దిక్కులేని చావని, మరీ, మరీ - కోరారు. విధిలేక, నాకు అనుచర గణం కావాలి, కాబట్టి" సరేనని అంగీకరించాను.

ఇదీ - ఈ వృకోదరుల కథ - తెలిసిందా అన్నాడు.

"చిత్త"మన్నాడు ఉద్ధవుడు.

ఒకళ్ళిద్దరు, తోకఝాడించదలిచారు. అందులో ఒకడిని పసిగట్టి, బంతిని విసిరినట్లు గాలిలోకి విసిరాను. అలాగ ఎగిరినవాడు, ఎగిరి, ఎగిరి - చివరకు క్రిందపడి - శరీరంలోని ఏ భాగం - గుర్తుపట్టలేనంత ఓ ముద్ద అయిపోయాడు. దాంతో ఏ ఒక్కరు నన్ను ఎదిరించడానికి, పోట్లాడటానికి సిద్ధబడరు. పది వేల ఏనుగుల శక్తి గల నా బలం ముందు, వీరంతా అల్పులు... అంటూంటే, ఆశ్చర్యంగా, నోరు తెరచి మరీ ఉద్ధవుడు నిలబడిపోయాడు.

"అది సరే. నీకు ఈ రాక్షసరాజ్యమెలాగ సంక్రమించింది" తెలుసుకోవాలనే కుతూహలంతో ఉద్ధవుడు అడుగుతున్నాడు.

"పిచ్చి బావా! నీకు లోకం తెలియదు. నీ ఆకారము చిన్న, బుద్ధి చిన్న. సరే విను. హిడింబాసురుడు మరణించాడు. అతనికో చెల్లెలు వుంది. ఆమె పేరు "హిడింబి". ఆమె నా వీర విక్రమాన్ని విని "వీరా!" అంది. "ఛ, ఫో" అన్నాను. "నాధా" అంది చంపుతానన్నాను.

భయపడి మా అమ్మను చేరింది. శరణాగతురాల్ని. రక్ష.... రక్ష... అంది. అమాయకురాలు మా అమ్మ. ఆ రాక్షసి, హిడింబి మాయలో పడిపోయింది. ఈలోగా ఏం జరిగిందంటే, కేవలం హిడింబాసురుని చంపడం. ఒక గౌరవం కాదని, రాక్షస రాజ్యానికి రాజవ్వాలంటే, అంటూ కొన్ని పరీక్షలకు గురి చేసారు. అందులో ముఖ్యమైనది "తిండి." వారిలో ఒక పెద్ద రాక్షసుడున్నాడు. వాడెంత తింటాడో, వాడికే తెలియదు. వాడు నాకెదురుగా కూర్చున్నాడు. నా తిండికి తోడు, వాడు తినే ప్రతిముద్దతో, నాకు ముద్ద పెట్టేవాడు.

దీనికేదో ముగింపు చెప్పాలనుకున్నాను. నీ తిండి నువ్వు తిని చావు. నీ సంగతి చెబుతానని, ఆహారాన్ని అరలు, అరలుగా కడుపులోకి ఎక్కించాను. వాడు తింటున్నాడు. కానీ, నాతో పోటీపడటం మానేసి, పెద్దముద్ద చేతిలోనికి తీసుకుని, తినలేక ఏడుస్తున్నాడు. "వూ" అని గట్టిగా అరిచాను. బావురుమని ఏడుస్తూ క్రిందపడిపోయాడు. అప్పుడు వాళ్ళంతా నన్ను చూసి, గుటకలు మ్రింగారు.

తిండికి మొహం వాచేటట్లు తినేవాడు, వృకోదరుడైన భీముని చేతిలో పరాజితుడయ్యాడు. ఒక ముద్ద కూడ పట్టుకోలేక వెనక్కి పడిపోయాడు. అంతే మిగిలిన రాక్షసులు, వాళ్ళు తినే తిండి మానేసి, వాళ్ళు బాన పొట్టగాడి బాధ, చివరకు నేలకు వాలిపోవడం గమనించి, ఒక్కసారి కాళ్ళమీద పడ్డారు. మహాప్రభో! మమ్మ రక్షించు!!" మని ప్రార్థించారు.

మరి ఆ పూజారి... అడిగాడు ఉద్ధవుడు.

ఏముంది, నన్నేదో భయపెట్టాలని, వాడు అతిగా తిని, ఆ మర్నాడు... ఇంకేముంది... గాలిలో కలిసిపోయాడు. ఆ తర్వాత చేసేదేముంది ? అమ్మ కాళ్ళు పట్టుకుని కరుణించమని, వరం కోరిందా రాక్షసి హిడింబ. తెలియక అమ్మ అభయమిచ్చింది. దాంతో ఏ భయంలేని రాక్షసి హిడింబ నన్ను వెంబడించే సరికి, విధిలేక - అందరి అనుమతితో ఆ రాక్షసిని వివాహమాడాను. అదీ కథ. అదొక చిత్రమైన కథ. భీముడు నవ్వుతూ ముగించాడు.

అప్పట్నుంచి, నరమాంసం తినరాదని శాసించాను. పొరపాటున ఎవరైనా తిన్నట్లు తెలిస్తే, వాళ్ళనో చెట్టుకు తల క్రిందులుగా కట్టి, తినాలన్న ఆశ లేకుండా చేసి, తిన్నదంతా కక్కించేవాడిని.

నిజానికి హిడింబ చాల మంచిది. రాక్షస జాతిలో అటువంటివారు అరుదు. దాని అన్నను చంపగానే వాని తల పుర్రెను ముక్కలు, ముక్కలు చేయమంది. ఎందుకు, వద్దు పొమ్మన్నాను. "నాథా! నీకు తెలియదు. నువ్వు కనుక దానిని ముక్కలు చేసి నువ్వు ధరించకపోతే, అమ్మో! వాడిలోని దుష్టశక్తులు నిన్ను - నన్ను ముప్పతిప్పలు పెడతాయి. కనుక, తప్పదు." అంటూ ఎంతో గారం చేసింది. నిజమైన భర్త ప్రేమకోరే పతివ్రత వలెనే ప్రవర్తించింది.

దాంతో తప్పు చేసామనే భావన కన్న, రక్షణ కల్గిందన్న తృప్తి దక్కింది.

ఆ మాటల్లోనే వారు - కుంతి, మిగిలిన పాండవులు వున్న ప్రాంతానికి వచ్చారు. నేలమీద ఏ ఇల్లు లేదు. అన్ని చెట్ల మీదే. అదంతా రాక్షస ప్రాంతం. ప్రతివాడికి, వాడి నీడచూసి వాడికే భయం. అందుకు భద్రంగా చెట్ల గుబురులపై గూళ్ళవలె గడ్డి, వెదురు కర్రలతో పొదరిళ్ళవలె, ఇళ్ళు కట్టుకున్నారు. ఒక్కొక్కటిగా, అక్కడి వింతలు చూపిస్తుంటే, రాజమాత కుంతీదేవి వచ్చింది.

చూస్తూనే, తల్లికి వందనమాచరించి, "అమ్మా! ఇడుగో ఉద్ధవుడు మేనబావ. మనల్ని వెదుక్కుంటూ వచ్చాడన్నాడు. కుంతిని చూస్తూనే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆనందం పట్టలేకపోయాడు. వెంటనే మేనత్త పాదాలపై "అమ్మా!" అంటూ పడ్డాడు. తన మేనల్లుడు, కృష్ణప్రియుడు - భక్తుని చూసి కుంతి, ఎంతో ఆనందపడింది. ప్రేమగా చేతులతో ఎత్తి పట్టుకుని, నుదుట ముద్దాడిందా తల్లి.

అప్పుడే భర్తను చూసిన హిడింబ, పరుగు-పరుగున వచ్చి భర్తను ఆహ్వానించింది. నమస్కరించింది. ఆమెను చూసి ఉద్ధవుడు ఆశ్చర్యపోయాడు. అలిసిపోయిన ఉద్ధవుని చూసిన కుంతి "తల్లో - మేనత్త" అన్న సామెతను సత్యం చేస్తూ ఇప్పుడు ఉద్ధవుని కదిలించకండి. అతన్ని విశ్రాంతి తీసుకోనివ్వండి. అతని మొహం చూడండి. ఎంత నీరసంగా వుందో! పేరుకు మేనత్తయినా, తల్లిలా మాట్లాడటం ఉద్ధవునిలోని, మమతానురాగాలను పెంపు చేసింది.

ఒక పెద్ద చెట్టు. దానిపైన - చిన్న కుటీరం. అందులో కుంతి, ధర్మరాజు. దాని క్రిందనున్న కుటీరంలో నకుల, సహదేవులు. చివరి దానిలో, తాను, అర్జునుడు. ఆ ఏర్పాట్లన్నీ చూసి, చాలా బాగున్నాయనుకున్నాడు. భగవంతుని కరుణ పుష్కలంగాకల

వీళ్ళను, ఆ కాలయముడు కూడా కళ్ళెత్తి చూడలేడని, జగన్నాథుడైన శ్రీ కృష్ణుడు, సదా పరిరక్షించే వీళ్ళు అదృష్టవంతులని మరొక్కసారి, అనుకున్నాడు.

ఆ మర్నాడు, ధర్మరాజు "ఉద్ధవా, ఏమిటి విశేషాలు. నీ గురించి చెప్పు"మని అడిగితే, కుంతి సకల జనోద్ధారకుడు ప్రేమమూర్తి, కరుణామూర్తి... కృష్ణలీలా విశేషాలను చెప్పమని కోరింది. హస్తినలో విదుర దేవుడు, పితామహుడు భీష్ముడు, మా బావగారు, ఇతర పెద్దలు, రాజమాత... అనగానే, భీముడు కోపంతో వూగిపోతూ...

"ముందా విషయం చెప్పు. అప్పటికి గాని ఆమె మనసు చల్లారదు." అది వెక్కిరింపో, ఎత్తిపొడుపో! తెలియకుండా నవ్వుతూ భీముడు అన్నాడు. ముందు మా అమ్మకు, వాళ్ళందర్కి... అదే మా పెదతండ్రి వారి పిల్లల క్షేమం కావాలి. మమ్మల్ని నిప్పుల్లో పడేసి శలాకలా కాలుస్తున్నా, సరే - ఈ తల్లివారి క్షేమాన్నే కాంక్షిస్తుంది" ఇందులో సత్యమైన కోపముంది.

"భీమసేనా! మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తి ఎదుటివారి క్షేమాన్ని సదా కాంక్షించాలి. మన కోసం.... ఎవరు నాశనం కారాదు. ఎవరి నాశనాన్ని మనం కోరరాదు.

ఆ మాటలకు వుడికిపోతూ "చాలు, తల్లీ, చాలు!" ఉద్ధవా, కానివ్వు -

తనకు తెలిసినదంతా ఉద్ధవుడు, వివరించి చెప్పాడు. తన ఆవేదన, కృష్ణుని ఓదార్పు, తదుపరి ఆ గోవిందుడు హస్తినకు వెళ్ళడం... సర్వం - విన్నది విన్నట్లు, చూసింది చూసినట్లు, వారికి వివరించి చెప్పాడు. చివరిలో రాజమాత సత్యవతీ దేవిని కలుసుకోవడం, ఆ తల్లి ఆకాంక్ష, ఏమీ చెయ్యలేని తన అశక్తత, కృష్ణునికి వివరించి చెప్పి, వాసుదేవుని అభయాన్ని కోరడం, పూసగ్రుచ్చినట్లు చెప్పాడు.

ఇక్కడే - మరో కుతూహలం. రాజమాత మన గోవిందునితో -

"వాసుదేవా, ఎందరు ఎలాగ నిన్ను పిలిచినా, నాకు మాత్రం నిన్ను "కృష్ణా" అని పిలవాలని వుంది. నా కుమారుడు పేరు "కృష్ణుడే!" నీ పేరు కృష్ణుడే. కాకపోతే కొందరు గోవిందుడు. గోవర్ధనదారి, యశోదానందనుడు, నంద నందనుడు, దేవకీసుతుడని, చివరకు.... వసుదేవసుతుడివి గాబట్టి, "వాసు దేవుడ"న వచ్చును. నాకు మాత్రం కృష్ణుడవే. అలాగ పిలవాలనుందని, ఎంతో

ప్రేమతో అడిగిందట. ఆమె ప్రేమకు మురిసిన కృష్ణుడు "అవశ్యం మీ ఆనందం" అన్నాడట ఆ రాజమాతతో".

ఆ తర్వాత అసలు విషయం. నా ప్రభువు, నా గోవిందుడు, మిమ్మల్నందర్నీ తీసుకుని, నన్ను ద్వారకకు రమ్మన్నాడు. తాను నాగలోకంలోని మహామాతా మహులు ఆర్యకులవారిని దర్శించి, బృందావనానికి, త్వరలో వస్తాడుట!" విషయం, వివరించి చెప్పాడు. కృష్ణుడి ఆహ్వానాన్ని వారికి - సగౌరవంగా, అందించాడు.

హస్తినలో మా గురించి ఆలోచించేవారు ముగ్గురే. ఒకరు రాజమాత, రెండోది పితామహులు, మూడు విదుర మహాశయులు. మిగిలిన వారందరు ఆలోచిస్తారు, మా సౌభాగ్యం కోసం కాదు. మా నాశనం నిమిత్తం. అయినా ఎవరిని నిందించను ? విధి వంచితులం. ఆ భగవంతుని దయ సంపూర్ణంగా వుండాలి. అప్పుడే మేమీ భూమికి వచ్చిన కార్యం నెరవేరుతుంది.

కృష్ణుడిచ్చిన ఆహ్వానానికి కృతజ్ఞులం. పరిస్థితులు చక్కబడేవరకు, మేమిలాగ వుండటమే మంచిది. కాదంటే, ఆ దుర్యోధనుడు తన బృందంతో కలిసి, మరో ఆలోచన చేస్తాడు. మట్టుపెట్టే మార్గానికి మార్గం వెదకుతాడు. ధర్మపరుడిగా యుధిష్ఠరుడు చెబుతాడు. అర్జున, నకుల సహదేవులు, తమ తమ బాధల్ని ఏకరువు పెట్టుకుని బాధపడుతుంటారు. నిరాశా - నిస్పృహలకు గురైనవారు, ఒక్క భీముడు తప్ప, మిగిలినవారు అంటే అర్జున, నకులులు కృష్ణుని పిలుపు మేరకు, ద్వారకకు వెడితే బాగుంటుందంటారు.

భీముడు నా రాజ్యం నాకుంది. నాకేం అవసరం లేదంటాడు. ఏ ఒక్కరు సంతోషంగా లేరు. ఉమ్మడి నిర్ణయానికి రాలేకపోతున్నారు. అందరు ఏదో ఒకటి అంటున్నారు కానీ, సహదేవుడు మౌనంగా వుండేసరికి, "సహదేవా! నువ్వేమీ మాట్లాడటం లేదు" అన్నాడు యుధిష్ఠరుడు.

"మీరందరు పెద్దలు. ఆలోచనలు చేస్తున్నారు. నిర్ణయాలు తీసుకుంటున్నారు. అందరికంటే చిన్నవాడిని. అడగకుండా మాట్లాడాననుకోండి. వూరుకో. కుర్రకుంకవంటే" సమాధానం దొరకదు. అందుకే మౌనం వహించాను. ఇప్పుడు అడిగారు కాబట్టి నా ఆంతర్యం మీకు వివరిస్తాను.

"ప్రతి నిత్యం నేను నక్షత్ర దర్శనం చేస్తుంటాను. తద్వారాకొన్ని విషయాలు తెలుసుకోవచ్చును. నేర్చుకోవచ్చును కూడా. మనకు భవిష్యత్తు ఆశాజనకంగా వుంటుంది. రోహిణీ నక్షత్రంలోని వ్యక్తి మనకు ఉపశమనం కల్గిస్తాడు. బ్రతుకు ధన్యం గావిస్తాడు. మనలో వున్న అటువంటి వ్యక్తి, మనవాడు, మన శ్రేయోభిలాషి ఆ వాసుదేవుడు, గోవిందుడు ఒక్కడే. అందుకే కృష్ణుని దూతగా ఉద్ధవుడు వచ్చాడు.'' తన ఆంతర్యాన్ని ప్రకటించాడు.

"ముందెందుకు చెప్పలేదురా ?'' అన్నాడు భీముడు.

"అడగకుండా, నదురు బెదురు లేకుండా, పెద్దలముందు మాట్లాడరాదనే సిద్ధాంతం గల వాడిని కాబట్టి....!'' ఆగాడు.

''ఇదా సంగతి. ఏవిటో, ప్రతిరాత్రి నక్షత్రాలను చూస్తుంటే, ఏం చూస్తున్నావో, ఏం చేస్తున్నావో తెలియదు. సరి, సరి'' అన్నాడు నకులుడు.

"అయితే, ఇప్పుడేం చేద్దామంటావు ?'' చిన్నవాడని అనకుండా పెద్ద మనసుతో యుధిష్ఠరుడడిగాడు.

"ఉద్ధవులు, గోవిందుని దగ్గరకు వెడతారు. ఇది తథ్యం. ఇక ఆయన ఏం చెయ్యమంటే అదే చేద్దాం. ఇప్పుడు నక్షత్రాలన్ని శుభసూచకంగా, వున్నాయంటాడు.

అందరు ఆ సూచన చాలా బాగుందంటారు.

ఉద్ధవులు, శ్రీకృష్ణుని కలుస్తారు. మన గురించి చెబుతాడు. ఆయనెప్పుడు వస్తే అప్పుడు, వాసుదేవుడు ఎప్పుడు రమ్మంటే అప్పుడు బయలుదేరుదా మంటాడు. ఆ సమయంలో - ఒక వింత ధ్వని. అదేమిటోనని ఆ ధ్వని వచ్చినవైపు తల త్రిప్పుతారు.

అది - తన భర్త - భీముని రమ్మని పిలిచే హిడింబి పిలుపు...

"హూ'' అని కుంతి, ఓ నవ్వుతో ధర్మరాజు పెదవుల రాగంతో అర్జునుడు, ఏవిటోనని నకులుడు, ఇది సహజమని సహదేవుడు, అనుకుంటారు. భీముడు కళ్ళు పెద్దవి చేసుకుని, ఆనందంతో అటువైపు తిరుగుతాడు. ఆమెను చూసి అడుగు ముందుకు వేస్తాడు. ఆ ప్రేమ భార్యాభర్తలకు మాత్రమే తెలుస్తుంది. మిగిలిన నలుగురు బ్రహ్మచారులు కదా, వారికేం తెలుస్తుంది ? ఎలాగ తెలుస్తుంది ?!

ఈ సమయంలో భీముడు, ఇది రాక్షసభూమి. అసురేశ్వరుడు విరోచనుని ఆజ్ఞకు విరుద్ధంగా ఇక్కడకు వచ్చినవారు తిరిగి వెళ్ళలేరు. మన ఉద్ధవుని వెళ్ళమనండి. మిగిలినది కాలం నిర్ణయిస్తుంది. కనీసం మనమిక్కడో సం॥రం వుండాల్సి వస్తుంది. తప్పదన్నాడు.


అలాగనకంది కుంతి.

కృష్ణుడా, కాదా ? వ్యాస పితామహులా, కాదా ? అన్న విషయాలతో పనిలేదు. మనకు మనం ఖచ్చితంగా ఈ రాక్షస రాజ్య నిబంధనల మేరకు ఒక సం॥రం తక్కువ గాకుండా గడపాలి!"

"ఎందుకు.... అసలేమయింది ? నీ వుద్దేశం... ?"

ఏమీ కాలేదు. ఇంకో అయిదు నెలలలో నేను తండ్రిని కాబోతున్నాను. ఈ సమయంలో హిడింబను విడువడం తగదు. ఆ పిల్లవాడికి కనీసం ఆరునెలలు వచ్చేవరకైనా నేనిక్కడ వుండాలి. నేనక్కర్లేదనుకుంటే, మీరు వెళ్ళవచ్చును. నేను కావాలంటే, మీరందరు ఇక్కడ వుండక తప్పదన్నాడు.

"భీమా...!" అతడు తండ్రి కాబోతున్నందులకు, కురువంశానికి వారసుడ నిస్తున్నందులకు, తల్లిగా కుంతి ఎంతో సంతోషించింది. చతుస్సముద్ర పరీత భూవలయాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించిన, చక్రవర్తి - "భరతుల" వారికి వారసుడు లభిస్తున్నాడని సంతోషించింది. అప్పుడు భీముడు "అమ్మా! నీ కోడలు అసాధ్యురాలు. నీ సంతోషం చూసి, తన మాయతో కడుపులోనున్న శిశువును ఆడపిల్లగా మార్చిందనుకో. "గోవిందా!" ఆ కృష్ణుడే మనల్ని రక్షించాలన్నాడు.



# అంతా మంచే జరుగుతుంది

ఉద్ధవుడు నాగకూటాన్ని విడిచిపెట్టాక - కపిల, పింగళులు తమ అస్తిత్వాన్ని కోల్పోయారు. ఇక జీవితం లేదనే స్థితిలో పూర్తి నిరాశకు గురయ్యారు. దిగులుతో స్వస్థతను కోల్పోతున్నారు. ఎంతో ప్రాణప్రదంగా ప్రేమించిన వారలు, తమ నాథునిగానే తలచిన ఉద్ధవుడు - రాక్షస రాజ్యంలోకి అడుగుపెట్టడంతో, చైతన్యం కోల్పోయినంత పనయింది వారికి.

ఆ రాక్షసుల చేతిలో పడ్డ తమ భర్త తిరిగి వస్తాడా ? మనం చూడగల్గు తామా ? అక్కడే దిగులు వారికి. ఆ దిగులుతో బ్రతుకుపై ఆశ, సుఖంగా వుంటామనే సంతోషం ఆవిరైపోతుంటే, ఏం చెయ్యాలో అర్థం కాక, కలవరపడి పోతున్నారు. వాళ్ళ చిత్రమైన స్థితికి తల్లి రవిక, కోపం, చిరాకుతో, వాళ్ళ బ్రతుకులను ఈసడించుకుంటూ - "ఎవరో పోయినట్లు, కట్టకట్టుకుని ఎందుకలా ఏడుస్తారు. ఉద్ధవునికేం కాదు. అతను తప్పక తిరిగి వస్తాడంది.

మణిమంతుడు "నిజం సోదరీ! అమ్మ చెప్పింది నిజం. తప్పక అతను తిరిగి వస్తాడ"న్నాడు.

"ఎలాగ తిరిగి వస్తాడు ? రాక్షసుల చేతిలో పడితే, ఏ భాగానికాభాగం విరగదీసి లొట్టలేసుకుని తినేస్తారు. మాకు....!" భోరుమని, మొదలుపెట్టింది. రెండోది కపిల కలుగచేసుకుని "అన్నా! ఇక్కడిలాగ మాట్లాడుతూ కూర్చునే బదులు, మహావీరుడవు కదా, ఆయనతో వెళ్ళకపోయావా ? నీ సహాయమందించక పోయావా ? కబుర్లు చెప్పడం వేరు - పనిచెయ్యడం వేరు. హు...!" నిరశించింది.

అప్పుడు... ఉద్ధవుడు తిరిగి వస్తాడు. పోనీ రాకపోతే, కాస్త అటు, ఇటుగా మరుగున పడిపోతాడు. అప్పుడు మనస్థాయికి తగ్గట్టు మరొకరితో వివాహం జరుగుతుంది.

"ఏమన్నావు ? త్రాచులా కస్సుమని లేచింది."

"ఏమిటేమిటి, కాబోయే మహారాజుగారు, ఇప్పటి నుండే క్రొత్త శాసనాలు చేస్తున్నారు. వున్నవాటిని తిరగ వ్రాస్తున్నారు." వ్యంగ్యంగా అంది.

"అదికాదు." అంటూ తల్లి - "మీరు అనవసరంగా ఆందోళన పడకండి. అతని వాలకాన్ని బట్టి ఉద్ధవుడు తిరిగి రాకపోవచ్చును. దానిని దృష్టిలో పెట్టుకునే,

మీ అన్నయ్య అలాగ మాట్లాడాడు. మీకంటే, మీ భవిష్యత్తుకంటే, మాకేమీ అవసరం లేదు. విధి విచిత్రమైనది. దానిని తెలుసుకోవడం ఆ బ్రహ్మకు గూడ సాధ్యం కాదు. మనమెంత ?'' అని ముక్తాయించింది.

“అవన్నీ జరగవు. రెండు నెలలు చూస్తాం. మా పతి వస్తే సరేసరి. లేదంటే మా దారి మేము చూసుకుంటాం. ఇందులో మరో ఆలోచన లేదు, రాదు'' తెగేసి చెప్పింది. పింగళ. అవునని తలూపింది - కపిల. ఆ పిల్లల మాటలకు తల్లి తల్లడిల్లింది. ఏం చేస్తారే..! అంటూ చెయ్యెత్తింది. “అమ్మా!'' అంటూ ఆపాడు మణిమంతుడు.

మణిమంతుడు, ''అమ్మా! అనవసరంగా ఆందోళనపడకండి. ఈ విషయాన్ని నాన్నగారితో చెప్పాను. తాతగారితో సంప్రదించమని కూడా చెప్పాను. వారు మహర్షి వేదవ్యాసుల వారితో గూడా మన పిల్లల మానసిక పరిస్థితి గూర్చి చెప్పి వుండవచ్చును.

“అయితే తాతగార్ని, మహర్షిని మా మీదకు వుసిగొల్పుతున్నారా ? తాతగారి సంగతి తెలియదు కాని, ఆ బ్రహ్మ మూర్తి రెండు పున్నమిలలోపు కనుక ఉద్ధవుడు తిరిగి రాకపోతే తాను మిమ్మల్ని ద్వారకకు తీసుకువెడతానన్నారు. అప్పుడు జరిగేది చూద్దామన్నారు, కాబట్టి .....

అంటే మీరు, మనదేశం, పద్ధతులు, ఎల్లలు దాటి మరో దేశానికి వెడతాం? వాదోపవాదాలు జరుగుతున్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలో కృష్ణుడు వస్తున్నాడని వార్త తెలియ చేయడానికి ముందుగా, కృతవర్మ కొందరు యదు ప్రముఖులు వచ్చారు. వారు తమ మహామాతామహులుగా ఆర్యకుల వారిని దర్శించి, సాష్టాంగ నమస్కారాలు సమర్పించారు. ఆర్యకుడు చాలా సంతోషించాడు.

ఇది ఆ కవల యువరాణులకు ఆనందం కల్గించింది. కానీ ఉద్ధవుడు, ఆ పిల్లరాక్షసి కథనం, నాగకూటమిలో, చాలామంది మరచిపోయారు. యువరాజుకు ఆర్యులంటే ఇతరులనేడిపించేవారు, పరమ దుర్మార్గులని విన్నాడు కానీ, యాదవుల వంటి ప్రేమమూర్తులు, మంచివాళ్ళుంటారని వీళ్ళను బట్టి తెలుస్తుంది. వీళ్ళంతా కృష్ణుని మనుషులు. ఇంకా చెప్పాలంటే కృష్ణుని సేన.

ఆయన ఉద్ధవుడిని భీముని కోసం వెళ్ళమన్నారుట. ఈయన వెళ్ళి రాక్షసరాజ్యంలో పడ్డాడు. కృష్ణుడు నిజంగా ఆయన్ని వెళ్ళమంటే తప్పక

తీసుకువస్తాడని, ఆ కవలలు ధైర్యము, ఆనందమొందారు. కృష్ణుడు, వస్తున్నాడు కాబట్టి, ఆయనను స్వాగతించే వుద్దేశంలో ఈ కవలలు పొలిమేరలకు వెళ్ళారు. ఆ నాగ రాజ్యంలో పండుగ వాతావరణం మొదలయింది.

అందరు సాంప్రదాయ పద్ధతులలో కృష్ణుని స్వాగతించారు. సరాసరి కృష్ణుడు, ప్రపితామహులను సందర్శించాడు. అంజలి ఘటించాడు. కవలలు కృష్ణుని చూసి నోరు తెరిచారు. కృష్ణుని రూపం, ఆ చల్లని చిరునవ్వు పున్నమి వెన్నెలకన్న పరవశత్వాన్ని కల్గిస్తూంది. అందర్ని పరిచయం చేసారు. అందర్ని పలుకరిస్తున్నాడు. ఈ కృష్ణుడు తాతగారికి ఏం చెప్పాడో... నవ్వడం చూడని వారు, తాతగారి నవ్వుకు ఆనందించారు. పైగా తాతగారిని నవ్వించిన ఆ ఘనునికి, వందనాలర్పించారు.

పశుపతినాధుని దర్శించి, కృష్ణుడు భక్తితో అర్చించాడు - అక్కడ నుండి తాతగారి మందిరానికి వచ్చాడు. తన కుమార్తె మరీష మనుమని చూసి ఆర్యకుడు, తమ ఆత్మబంధువును చూసి, ఇతరులు ఎంతో సంతోషించారు. సరిగ్గా ఆ సమయంలో కృష్ణుడు కర్కోటకుని ఉద్ధవుని గురించి అడిగాడు. ఇక్కడ లేడన్నాడు, "ఎక్కడికి వెళ్ళాడు ?" కృష్ణుడు అడుగుతున్నాడు.

సమాధానంగా కర్కోటకుడు, ఉద్ధవుడు ఇక్కడలేడని ఆతడు భీముని వెదుక్కుంటూ, మా శిగురి నాగకు దొరికితే ఇక్కడకు తీసుకువచ్చిన పిల్ల రాక్షసునితో, రాక్షస రాజ్యానికి వెళ్ళాడని, అక్కడ కుంతీమాత, పంచపాండవులు క్షేమంగా వున్నారని తెలిసి వారికోసం వెళ్ళాడని చెప్పాడు.

"నిజమా ?" అనగా "వెళ్ళడం, నిజమే" నన్నాడు కర్కోటకుడు. అప్పుడే తొంగి తొంగి చూస్తున్న ఆ కవలల్ని చూసాడు. వారి ఆతృతను గాంచి "ఏం పిల్లలు ? ఏమిటి వెదుకుతున్నారం"టాడు, కృష్ణుడు. ఆ కవలలు, నీళ్ళు నములుతుంటే, భావి మహారాణి కల్పించుకుని - వారు మా పిల్లలు. పేర్లు కపిల, పింగళ" అంటుంది.

వాళ్ళు భోరుమని ఏడ్పు మొదలెట్టారు. "ఏమయింది ? ఎందుకా ఏడుపు ?" కృష్ణుడు మెల్లిగా అడుగుతున్నాడు. సమాధానంగా వారిలో ఒకతె

"రాక్షసు లాయనను తినేసి వుంటారు" మళ్ళీ గట్టిగా ఏడుపు మొదలుపెట్టింది. ఆమే, అతన్ని అన్యాయంగా ఆ రాక్షసులకప్పగించి, ఈ పిరికి పందలు, చేతులు ముడుచుకుని కూర్చున్నారు. తన అక్కసు కక్కేసింది.

దాంతో కృష్ణుడు వివరం అడిగాడు. కర్కోటకుడు జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పేసాడు. అంతా విన్న గోవిందుడు, "ఉద్ధవుని అలాగ ఏ వీరుడు విడిచిపెట్టడు. తెలియని ప్రాంతానికి అతను బయలుదేరాడు. తెలిసిన మీరు ఆ పిల్లలు చెప్పినట్లు పిరికిపందలయ్యారు.

"నేను చెప్పలేదా తాతగారూ, ఒకరివెనుక మరొకరు మొదలుపెట్టారు. వాళ్ళను ఓదార్చి, ధైర్యం చెప్పే వుద్దేశంతో "సోదరీమణులారా, ఎప్పుడు చెడును గూర్చి ఆలోచించకండి. ఉద్ధవుడు ధర్మాత్ముడు. ధర్మానికి, ధర్మాత్ములకు ఎటువంటి ఆపదా రాదు. నా మాట నమ్మండి!" అని కృష్ణుడు వూరడిస్తున్నాడు. అప్పుడే మణిమంతుడు గూడా, రేపు కృష్ణునితో, తాను రాక్షస రాజ్యానికి వెడుతున్నట్లు చెప్పాడు.

ఇప్పుడెందుకు ... అన్నారు సోదరీమణులు. ఇది ఎప్పుడో చెయ్యవలసిన పని, యని వెక్కిరించారు. ఇప్పటికయినా పౌరుషం ముంచుకొచ్చింది. చాలా సంతోషమన్నారు. ఇప్పుడు - కృష్ణుడు బయలుదేరుతాననేసరికి ప్రతి ఒక్కరు, నేనంటే, నేనని, కృష్ణుని అనుసరించ సిద్ధపడుతున్నారు.

కృష్ణుడు మహాశూరులనే అయిదుగురు గరుడులను తీసుకుని, శుభముహూర్తంలో, శిగూరునాగ తోడురాగా, రాక్షస రాజ్యానికి బయలుదేరాడు. ఆర్యకుడు కొంతదూరం, కర్కోటకుడు, తమ రాజ్య సరిహద్దుల వరకు తోడు వెళ్ళారు. అంతా బాగానే వుంది. ఇంతవరకు వచ్చాక - ఆ కవలలు తాము వస్తామని కృష్ణుని ప్రార్థించడం మొదలుపెట్టారు. మీరన్నట్లు, ఉద్ధవుని రాక్షసులు తినేస్తే, నేను తిన్నవాళ్ళ దగ్గరకు వెళ్ళి, తిన్నదంతా కక్కిస్తాను. ఉద్ధవుడిని క్షేమంగా తీసుకువస్తాను. సరేనా ?" అన్నాడు.

"అలాగేనని తలూపినవారు, మమ్మల్నెందుకు తీసుకువెళ్ళరు. మాకు, మా....!"

ఇప్పుడు కాదు. ఆ తర్వాత.... అంటూంటే

"అవును. పొరపాటున ఉద్ధవుడిని, ఆ రాక్షసులు తినేస్తే,

"నేను వాళ్ళను తినేస్తానంటాడు కృష్ణుడు. ముందుకు సాగుతాడు. శిగూరునాగు - రాతి దారివరకు వెడతాడు. ముందు సాత్యకి, వెనుక కృష్ణుడు, తగు సన్నాహంతో బయలుదేరారు. ఆ ఎత్తు పల్లాలు, వంకర టింకర్ల రాతి దారిలో నడుస్తూంటే, తడబడే తన వాళ్ళను ఉత్సాహపరచడానికి గాను కృష్ణుడు, కదనకుతూహల రాగమందుకున్నాడు. ఆ రాగ నడవడికకు, అందరు ఉత్సాహంతో, నడకలోని అలసటను, ఆయాసాన్ని పోగొట్టుకుంటూ నడుస్తున్నారు.

అందరిలో తెలియని ఉత్సాహం, ఆనందం. కొంత ఎత్తుకు వెళ్ళేసరికి, శారంగాన్ని చేతిలోకి తీసుకున్నాడు. పాంచజన్యాన్ని పూరిస్తున్నాడు. ఆ పాంచజన్యధ్వని అడవి, అడవి మార్మ్రోగి ప్రతిధ్వనించడం ప్రారంభించింది. ఆ పిలుపు రాక్షసులకు భయాన్ని, తనవారికి ఉత్సాహాన్ని నింపేటట్లుగా వుంది.

ఆ ధ్వనిని ఉద్ధవుడు విన్నాడు. నికుంభుడు ఉద్ధవుని అనుసరించాడు. ఆధ్వని చిరపరచితం. ఎవరో లీలామాత్రంగా కనబడుతున్నారు. వారిలో కృష్ణుడున్నాడా ? ఉద్ధవుడు పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. కృష్ణుడు అతన్ని చూసాడు. ఉద్ధవుడు కృష్ణుని చూసాడు. ఇద్దరు కలిసారు.

అవి మధుర క్షణాలు. అందరు "జయ జయ శ్రీకృష్ణ, జయ శ్రీ వాసుదేవా, జయహో, జయహో...!" అనే జయ జయ ధ్వానాలు అక్కడ మిన్నుముట్టుతున్నాయి. అందరు క్షేమమే కదా వాళ్ళను చూసిన కృష్ణుడు అడుగుతున్నాడు.

అందరు క్షేమమన్నాడు. అదే సమయంలో, రాక్షసరాజు వృకోదరుడు, నాగరాజు ఆర్యకులకు ఓ అపూర్వ బహుమతి సమర్పించాడు. అది - ఇప్పటినుండి నాగ, రాక్షస జాతుల మధ్య వైషమ్యాలు వుండవని, ఇరువురు మైత్రీభావంతో వుంటారని ప్రకటించాడు.

ఈ శుభవార్తకు అందరు... ఎంతో... ఎంతో... సంతోషించారు. అప్పుడు ఉద్ధవుడు "కృష్ణా!" వృకోదరుడెవరో కాదు, మన భీముడే. మన వాళ్ళందరు ఆనందంగా, సంతోషంగా జీవించి వున్నారు. మనం ఔనంటే, తప్పక ద్వారకకు వస్తామన్నారంటాడు.

వద్దు, వచ్చే సం॥రం మార్గశిర మాసం వరకు వాళ్ళిక్కడే వుండాలి. పాంచాల రాజు కుమార్తె ద్రౌపదికి స్వయంవరం పుష్యమాసంలో, జరుగుతుంది. వీళ్ళందులో పాల్గొనాలి. అంతవరకు వాళ్ళిక్కడే వుండాలి. ఆ తర్వాత వారు ఎక్కడికైనా

వెళ్ళవచ్చును.'' అంటూ చిరునవ్వులు చిందించాడు. "భీమా! అసాధ్యుడవు.'' అని అభినందించాడు.

ఇప్పుడు, నాగులు ఎంతో ఆనందంగా వున్నారు. కారణమో, వరమో, మొత్తానికి రాక్షసపీడ వదిలింది. ఈ వార్త వారికి అంతులేని ఆనందాన్ని కల్గించింది. ఉద్ధవుని పరిస్థితి అయోమయంగా వుంది. ఇప్పుడు తను నాగకూటానికి వెళ్ళి, ఆ కవలలను వివాహం చేసుకోవాలా ? కృష్ణుడి వుద్దేశం తెలుసుకోవాలని తహతహ లాడుతున్నాడు.

ఉద్ధవుని మనసును గ్రహించిన మాధవుడు, కర్కోటకునితో మాట్లాడటం ఆపి, "ఉద్ధవా! ఆ కవలలిద్దరు నీ కోసం తపిస్తున్నారు. ఇక్కడకు తీసుకువెళ్ళమని నన్ను దీనాతిదీనంగా ప్రార్థించారు కూడా! అంతెందుకు, వారు నిన్ను ఆహ్వానించ డానికి, పొలిమేరలలో సిద్ధంగా వున్నారని చెప్పాడు. అది సరే. వాళ్ళకెందుకు కోపం ?' అడుగుతున్నాడు.

"కోపమా, నాపైనా, ఎందుకు ? నేనేం చేసాను ?'' మళ్ళీ అదే పిచ్చి ప్రశ్న.

"నువ్వేం చేసావు, నువ్వేం చెయ్యలేదు. కేవలం రెచ్చగొట్టడం, ఆ తర్వాత ఇబ్బంది పెట్టడం. ఇదే కదా నువ్వు చేసింది...?!

ఉద్ధవుడు ఏదో చెప్పబోతున్నాడు.

"సోదరా, నాకన్ని తెలిసాయి. ప్రస్తుతం నువ్వు నా ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నావు. వారు కూడా, అదే స్థితిలో వున్నారు. ఇంకో విషయం. ఆ పిల్లలు... నిన్ను తమ భర్తగా ధ్యానిస్తున్నారు. ఆరాధిస్తున్నారు. నువ్వు నా ప్రేరణతో భీముని కోసం వెళ్ళి, ఈ రాక్షసుల చేతిలో పడి ప్రాణాలు పోగొట్టుకున్నావేమోనని, భయం, బాధతో వాళ్ళు వాళ్ళ వాళ్ళందర్నీ,... పిరికి పందలుగా, మగతనం లేనివారిగా తిట్టి పోస్తున్నారు. ఇప్పుడు చెప్పు. నీ కర్తవ్యమేమిటి ?

"అయితే, గోవిందా! నేను వాళ్ళను వివాహం చేసుకోక తప్పదా ? గోతిలో దిగవల్సిందేనా ?'' ఏడవలేదు కాని ఏడ్చినంత పన్జేస్తున్నాడు.

"తప్పదు. వలచి వచ్చిన దానిని కాదన్నవాడి బ్రతుకు మహా... మహా దుర్లభమని చెప్పి, మణిమంతుని వైపు తిరిగి "ఈయనను తీసుకువెళ్ళు. మీ చెల్లెళ్ళ కప్పగించి, ఈయన వీరోచిత, బాధలు - గాధలు విని, తిరిగి దక్కినందులకు, ఆనంద్రోద్రేకాలతో కలిసి, ఏడుస్తారు ఏడవనీ.

ప్రస్తుత పరిస్థితిలో నాగరాజు ఆర్యకునికి కావల్సింది “కవలల ప్రేమ - ఉద్ధవుని పెండ్లి కాదు. పుష్కరతీర్థ ప్రభువైన చేకితానుడు, తనను తాను రక్షించుకునేందుకో, లేక నాగజాతిపై ద్వేషమో... మొత్తానికి, దుర్యోధనుడు పుష్కర్‌పై దండెత్తాడని, చేకితానుడు, ఆతని నిలువరించలేక, యమునను దాటి, అడ్డొచ్చిన నాగవీరులను నాశనం చేసి, పగ-ప్రతీకారాల దృష్టితో, పెచ్చరిల్లుతున్నాడేమోనన్న భావాన్ని కల్గిస్తే -

నాగరాజు ఆర్యకుడు, ఇతరులు, యాదవ సంస్కృతిని నిరశించారు. యాదవులంటే, ఏదో రకంగా దెబ్బ తియ్యాలని తలుస్తున్నారు. అందుకే తన కుమార్తె వంశీకుడైన కృష్ణుని వద్ద చేకితానుడి గురించి, నాగరాజు ఎత్తాడు. అందుకు సమాధానంగా మాలో కొందరు మూర్ఖులు, ఆవేశపరులు, ఇంకొద్దిమంది దుర్మార్గులు వున్నారు. కాదనను.

కొందరి వలన, అందరు అప్రతిష్టపాలవడం, అదే భరించలేనిదయింది. నిజానికి పుష్కర తీర్థ ప్రభువు సహజంగా మంచివాడే. అటువంటివాడిలాగ ప్రవర్తించాడంటే, నాకు ఆశ్చర్యంగా వుంది. నా వుద్దేశంలో దుర్యోధనుడు, తన దుర్బుద్ధితో, పాండవులకిక్కడా చోటివ్వకుండా, పొరపాటున, ఆ చచ్చినవారు, చావక కనుపిస్తే, వారికి రక్షణమివ్వకూడదని, తన బలసత్వాలు ప్రకటించ, దండయాత్ర చేస్తే -

ఆ ఆదేశానికి, అర్భకుడైన యాదవ ప్రభువు చెదిరి పారిపోయి, యమున దాటి, తన భయాన్ని, పరాభవాన్ని ఏదో రకంగా బయటపెట్టుకుని వుండవచ్చును. నేను మాట్లాడతాను. ఇకపై అతడు విరోధించడు. కాబట్టి అవసరమైనప్పుడు, అతనికి, ముఖ్యంగా వర్షాకాలంలో, మీ రక్షణమివ్వండి. ఇకపైన ఇబ్బందులు, మనలో మనకు జరుగకుండా నేను చూస్తానన్నాడు.

కృష్ణుని మాటలకు తలవూపకుండా “ఏమైనా మనం ఆలోచించాలి. మన జాగ్రత్తలో మనం వుండాలి.” కర్కోటకుడు, అన్నాడు. అందుకు కృష్ణుడు -

“పరిస్థితులు మిమ్మల్నా రకంగా భయపెడుతున్నాయి. మాట్లాడిస్తున్నాయి. కనుక - నా అభిప్రాయం చెప్పాను. మీ ఆలోచనలు మీరు చెయ్యండి. మీ జాగ్రత్తలో మీరు వుండండి. తప్పులేదని” ముగించాడు.

"చేకితానుడు ఇక్కడుండటం వలన ఏదైనా ప్రమాదమని శంకిస్తే, మీ సైన్యాన్ని మీరు పంపండి. దానికి ఉద్ధవుడు సారథ్యం వహిస్తాడు. ఎవరైనా సరే, యాదవులు చేసిన తప్పును దిద్దుకునే సావకాశం మాకివ్వమని కోరుతున్నానన్నాడు. కావాలంటే సాత్యకి కూడా వారిననుసరిస్తాడు." పూర్తిగా విషయ వివరం చేసాడు. అవతలివారి భయం పోగొట్టాలంటే కావల్సింది నమ్మకం. దానినే కృష్ణుడు కల్గిస్తున్నాడు.

"అదికాదు. ఆర్యకుడు ఏదో చెప్పబోతున్నాడు.

"తాతగారు, మీ వయస్సు, అనుభవం లేదు కానీ, మీ మనస్సును తెలుసు కున్నాను. ఈ భయం గుప్పెట్లో బాధపడేకన్నా, మొదట పురాతన... అవే పాతకాలంనాటి ఆయుధాలను ప్రక్కనబెట్టి, నేటి జీవన విధానానికి అనుగుణంగా మిమ్మల్ని మార్చుకుంటే బాగుంటుదన్నది, మీ ఆలోచన. అవునా ?

"ఇది చాలా మంచిది. దీనికి కొంత శ్రమ, ధనం, స్థైర్యం, అనువైన కాలం, ప్రదేశం.... ఎన్నో కావాలి. తప్పక ఆలోచిద్దాం. నేను చేయదగిన సహాయం, మా వంశ పురుషునికి, తగిన వారసునిగా అందిస్తాను. ఇందులో, దగా - మోసం లేదు. సరేనా ?" అంటాడు కృష్ణుడు.

"అయితే, ఏం చెయ్యమంటావు.......?" నాగరాజు అడుగుతున్నాడు. కర్కోటకుడు, మణిమంతుడాది, ఇతర ప్రముఖులు, ఈ సంభాషణను వింటున్నారు.

"ముందు, కూపస్థమండూకం వంటి, ఈ ప్రపంచం నుండి బాహ్యా ప్రపంచాన్ని దర్శించాలి. ఎవరో తరుముతారు, తంతార"నే భయం నుండి బయటపడాలి. ఎలాగ బయటి ప్రపంచంలోకి వెళ్ళి, నెగ్గుకు రాగలమో, ముందామార్గా లన్వేషించాలి - ఇది మొదటిది.

"రెండు బలవంతులవ్వాలి. కేవలం - శక్తివలన అంటే శారీర, దారుఢ్యం వలన కాదు. తేజోబలాలు కావాలి. వాటిని శ్వేతకేతువు వంటి మహనీయులు ఇక్కడ వుండి, మిమ్ము సరియైన పద్ధతిలో నడిపిస్తారు. బయట ప్రపంచా న్నెదిరించగల - ధైర్య - స్థైర్యాలను కల్గిస్తారు.

శరీరం వుండటం కాదు. దానికి బలం వుండాలి. అందుకు తగ్గ పరిశ్రమ వుండాలి. అలాగ కాకపోతే, కొండకు - బండకు, మనకు ఏమి తేడా వుండదు. దానిని సరైన పద్ధతిలో శ్వేతకేతువు వంటి మహనీయులు తమ శక్తియుక్తులతో ప్రసాదిస్తారు

"అయితే, ఇప్పుడేం చెయ్యమంటావు. అడవిలో వున్నవాడిని, ప్రజాజీవనంలోకి తెచ్చినట్లున్నాయి కృష్ణుని మాటలు - ఆ చెప్పే పనులు. అవన్ని విన్న ఆర్యకుడు - 'ఏం చెయ్యమంటావు" అడిగాడు - తన మునిమనుమని.

"ముందు మన సాత్యకి, చేకితానుడు దగ్గరకి వెళ్ళి విషయం కనుక్కొని వస్తాడు. ఈలోగా మనం స్థిరంగా వుందాం. మంచిగా వుంటే మనలో కలుపుకుందాం. కాదంటే మన ప్రతాపం చూపుదాం - ఇది మొదటిది.

రెండోది - ధౌమ్యులవారికి కబురు పంపుతాను. వారు కొంతమంది సమర్థులైన శిష్యులను ఇక్కడికి పంపి, ఆశ్రమం ప్రారంభిస్తారు.

నేను ఇరవై అయిదు మగ, పది ఆడు గుర్రాలను ఇస్తాను. అలాగే ఇక్కడ పెట్టబోయే ఆశ్రమానికో వంద - గోవులను పంపించమంటాను. సాందీపులవారు ఆయుధాలను ఉపయోగించగల సమర్థ యంత్రాంగాన్ని తప్పక మనకు అనుగ్రహిస్తారు. మనవాళ్ళకు ఆయుధ శిక్షణ, రక్షణానుభావము కల్గిస్తారు.

"ఇవన్నీ నువ్వు లేకుండానా... ? అమ్మో! కష్టమంటాడు - ఆర్యకుడు!

నేనిక్కడ అదేపనిగా వుండలేను. ముందు నేను అవంతికి వెళ్ళాలి. అక్కడ గురుదేవులు నాకై ఎదురు చూస్తుంటారు. ఆ తర్వాత, మన కవలలతో ఉద్ధవుని వివాహం. అప్పుడు గురుదేవులు ఓం సం॥రం తప్పక వుంటారు.

"అయితే నువ్వు తప్పక వస్తావా, కృష్ణా...!"

"రాను. ఒక్కినే రాను. కొందరు యాదవవీరులను అన్నివిధాల మీకు తోడు-నీడగా వుండేవారిని తీసుకుని మరీ వస్తాను. పనిలో పని మేము, ద్రుపదుని కుమార్తె ద్రౌపదీ స్వయంవరానికి తప్పక, రావాలి. మన మణిమంతునికి కూడా ఆహ్వానం పంపమంటాను. ఇతను వస్తాడు.

అయితే మనమందరము, మన కోసం ఎంతో చేద్దామనే కృష్ణునికి సహకరించాలి. అతని ఆజ్ఞే వేదంగా నడుస్తామని, ప్రతిజ్ఞ చెయ్యాలి. చెయ్యి-చెయ్యి కలపాలి. తెలిసిందా ?" అన్నాడు - కళ్ళు మూసుకుని ధ్యానం చేసిన ఆర్యకుడు ఇది పశుపతినాథుని ఆజ్ఞ అంటూ, విషయాన్ని పూర్తిగా వివరించి చెప్పాడు.

కృష్ణుని స్నేహహస్తానికి వారందరు పలువిధాల కృతజ్ఞతలర్పించారు.

# కిం కర్తవ్యం ?

ద్రోణాచార్యులవారు దీర్ఘాలోచనలో పడ్డారు.

ఒక్క అశ్వత్థామను తప్ప ఆయన ఎవరిని అదిలించలేరు. దుర్యోధనుడు యువరాజు. "అంతా తానేననే" రారాజు. అతనికి అన్నివిధాల సైదోడు కర్ణుడు. అశ్వత్థామ ఆప్తమిత్రుడే కాని, ఆవేశపరుడు. ఆలోచనలు చెయ్యలేని వారికి, ఇతడు ఆప్తుడైనా లాభం లేదు. ఆవేశం ఆలోచనను హరిస్తుంది. బుద్ధి మందగింప చేస్తుంది.

ప్రభాస తీర్థ మహారాజు మిత్రునిగా సలహా ఇస్తే అలాగేనని వెళ్ళినవాళ్ళు, ఏకంగా అతనిని నిరాయుధిని చేసి రాజ్యం నుండి తరిమి వేసారు. ఇప్పుడు యాదవులకన్ని విధాల రక్షకుడైన, కృష్ణునికీ విషయం తెలిస్తే, ఒక్క ప్రక్క సాల్వుడు, మరొక ప్రక్క విరాటుడు, నా పేరు ఎత్తితేనే మండిపోయే ద్రుపదుడు, వీళ్ళకిప్పుడు దెబ్బతిన్న పులి అయిన వీరాధివీర - చేకితానుడు తోడయ్యారు.

మిత్రులను చేసుకోమంటే, కండబలం గల దుర్యోధనుడు, బుద్ధిబలం లేక "సై" అంటే "సై" అను వందిమాగధులవంటి సోదరులు, అతిగా ఆలోచించుకునే కర్ణుడు, వీరిమధ్య అశ్వత్థామ. పైగా కర్ణుడు, వికర్ణునికి రాజ్యమప్ప గించానంటాడు. వికర్ణుడు ధర్మ పక్షపాతి. కానీ, ఏం జరగనున్నదో... నని,..... అనుకున్నారు.

సరే.... ఇప్పుడేం చెయ్యాలి. ఇదొక క్రొత్త ఆలోచన.

తలూపి "శంఖా" అని, యుద్ధశాల శిక్షణా విషయాలను చూసే శిష్యుడిని పిలిచారు. క్రొత్త వారెవరో నలుగురు వస్తున్నారన్నావు. వచ్చారా ?" వాళ్ళ పరిచయం కోరినట్లు అడిగారు. ఆ.... అంటూ, శంఖుడు, ఆ విద్యార్థులను పిలుచుకు వచ్చాడు. వారిలో ఇద్దరు, ఉత్తర కురుభూముల ప్రభువు సంబంధించిన అంగారపర్ణుడు, నాలుగవ వ్యక్తి - చూడటానికి ఆడపిల్లలా వున్న శిఖండి.

"నువ్వెవరు అనగా నేను మీ శత్రువు ద్రుపదుని కుమారుడను. త్రిలోకాలలో మిమ్మల్ని మించిన వీరుడు లేడని తెలిసి..."

"అంటే... ఎవరు చెప్పారు ?" ద్రోణుని ఆసక్తి.

"ఇంకెవరు. వసుదేవ సుతుడు కృష్ణుడు. వాసుదేవుడు..."

ఆ మాట వినేసరికి ద్రోణాచార్యుడు ఉలిక్కిపడ్డాడు. ఇందులో ఏదో తిరకాసు వుంది. కృష్ణుడేదో మాయాజాలాన్ని ప్రయోగిస్తున్నాడు. అని వివరాలలోకి వెళ్ళాడు.

"అలాగా! కృష్ణుడు, కాంపిల్యానికి వచ్చాడా ? ఎందుకు వచ్చాడు ? మీ నాన్నగారు సూచించిన విధంగా మీ అక్కను వివాహం చేసుకుంటానన్నాడా ? వివరాల కోసం శిఖండిని నవ్వుతూ అడిగాడు.

"శిఖండి, అమాయికంగా, ఇవన్నీ మీకు తెలుసా ?" అని అడిగింది. అయితే కృష్ణుడు ఏమన్నాడో, ఆ వివరాలన్నీ కావాలా ? తెలుసుకోవాలని వుందా? ఇప్పుడు శిఖండి ఎత్తులు ప్రారంభించింది. వారి మాటలన్నీ చదరంగపు పావులాటలాగ వుంది.

గోవిందుడు వచ్చాడు. మా నాన్నగారు చెప్పినదంతా విన్నాడు. క్షమించాలి. నేను గోపాలుడిని. బృందావనంలో ఆలమందల మధ్య పెరిగినవాడిని. మీ కుమార్తె సుక్షత్రియ రాజవంశజ. మా ఇద్దరికి పొత్తు కుదరదు. నేను మీ అమ్మాయిని పెండ్లి చేసుకున్నా క్షత్రియుడిని కాలేను. మీ అమ్మాయి నన్ను పెండ్లి చేసుకుంటే, భారతీయ సాంప్రదాయ ప్రకారం, క్షత్రియ పిల్ల గొల్లపిల్ల అయిపోతుంది.

అలాగ కాదంటే, నేను మీ అమ్మాయిని వివాహం చేసుకుని, నన్ను చంపుకుని, తలవంచుకుని, మీకు తొత్తును కాలేను. కనుక, ఈ విషయం విడిచిపెట్టండి. ఇక స్నేహం, నాతోనా ? యాదవులతోనా ? ఏదైనా మీకు లభిస్తుంది. స్నేహం చెయ్యడంలో తప్పు లేదు - అది "అధర్మం కానంత" వరకు.

ఇక బాంధవ్యమంటారా, పొసగదు. కారణం గొల్లపిల్లవాడు, క్షత్రియకన్నె. రాజు కాని యాదవుడు. సుక్షత్రియ కన్యల - దాంపత్యము - బాంధవ్యము హర్షణీయం కాదు. లోకం ఔనన్నా, ధర్మమతిక్రమించి సత్సాంప్రదాయానికి సమాధి కట్టలేనన్నాడు.

"అందుకని ఆమెకు.... అదే మా అక్కకు స్వయంవరం చెయ్యాలని నిర్ణయించారు. ఇదీ ఆ గోవర్ధనగిరిధారే ఇచ్చిన సలహా. దీనికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజులందరికి స్వయంవరంలో పాల్గొని తమ వీరత్వాన్ని ప్రదర్శించుకోమని ఆహ్వానాలు పంపదలిచారు. అయితే వాసుదేవుని కోరిక మేరకు ఇక్కడకు వచ్చావన్న మాట. వాసుదేవుడు నీకేమని చెప్పాడేం" ద్రోణుడు అడుగుతున్నాడు.

ఆయన ప్రత్యేకంగా ఎవ్వరికీ ఏమీ చెప్పలేదు. మానాన్నగారితో మాట్లాడిన పద్ధతి, మాలో అంటే నాకు, మా అన్నయ్యకు, మా అక్కయ్యకు క్రొత్త ఆశలు చిగిరించాయి. చచ్చిపోదామనుకున్న నేను వాసుదేవుని రాకతో మనసు మార్చుకుని మనిషిగా బ్రతకాలనుకున్నాను.

"ఏం చేసాడేం ఆ గోవిందుడు ?" ప్రశ్నించారు ద్రోణులు.

"ఏముంది, తెలియని ఆనందం, ఆ చిరునవ్వులను అలాగ చూస్తూ వుండాలని, పలికే పలుకు, చెప్పేమాట అన్నీ కూడ, అనకూడదు కానీ, ఆనంద పారవశ్యాన్ని కలుగ చేస్తాయి. నాకే కాదు ఎవరికైనా సరే, అదే కృష్ణమాయ. దానినే కృష్ణప్రేమని కూడా అంటారు. ఒకసారి ఒంటరిగా కలవాలనిపించింది. ఆచార్య శ్వేతకేతుల్ని అడిగాను.

ఆనాటి రాత్రి ఒంటరిగా ఆ గోపాలుని దర్శించాను. కృష్ణుడు తన బస నుండి బయటికి వచ్చాడు. ఇద్దరం కలిసి మా విశాలమైన భవంతి ముందరి తోటలో విహరిస్తున్నాం. దారిలో నేను, నా జీవితం, నా వివాహం, నా మావగారి నుండి వర్తమానం... వగైరాలన్ని పూసగ్రుచ్చినట్లు చెప్పాను. మనసులో ఏదీ దాచుకోవాలనిపించలేదు.

ఆ ప్రేమమూర్తి, కరుణామూర్తి, దయానిధిని చూస్తే మనిషన్నవాడు పరవశించకమానడు. అతడు, సద్ధర్మమూర్తి, సహవాసి. సంతోషంగా వుండమన్నాడు బ్రతుకు భగవంతునిది. దానిని అంతం చేసుకోవాలనడం తగదు. ఈ సృష్టిలోని ప్రతిజీవి (అదెవరైనా సరే) ధర్మ-కర్మల ప్రభావంతో నడుస్తుందే తప్ప, స్వయం ప్రకాశం కనబడదు. స్వంత ప్రణాళిక వుండదు.

పిరికిపందలాగ, ఎప్పుడు ఆత్మహత్య చేసుకోవాలని తలంచకూడదు. నిజంగా త్యాగమవసరమైనప్పుడు పరిత్యాగము గూర్చి ఆలోచించవచ్చును. అందుకుని ఆత్మశక్తిని పెంపొందించుకో. ఆత్మోన్నతి, పరిణితి కల్గుతుంది. నిజమైన సుఖ-సంతోషాల్ని పొందగలుగుతావని అనునయించాడు. నిజంగా ఆ మధురమైన ప్రేమ వాక్యాలు అధఃపాతాళానికి వెళ్ళేవాడిని, అమాంతం స్వర్గానికి చేరుస్తాయి.

ఆ తర్వాత.... ?

"వాసుదేవుడు, నా కళ్ళలోకి సూటిగా చూసాడు. భుజాలపై చెయ్యివేసి నువ్వు నిజంగా నిజమైన మనిషిగా బ్రతకాలనుకుంటున్నావా ? అయితే వెంటనే వెళ్ళి "ఓం శ్రీ గురుభ్యోంనమః" అంటూ శ్రీ గురు ద్రోణాచార్యులను శరణొందు. వారు నిజంగా నిన్ను మనిషిని చేస్తారు. తమ శస్త్రాస్త్ర విద్యలతో పూర్ణ పురుషుడిని చేస్తారు.

కనుక నిజమైన పుత్రునిగా సేవచెయ్యి. విద్యనర్థించు. మనిషిగా బ్రతుకు, వీరుడివై వివేకంతో బ్రతుకు. వారు వీర ద్రోణాచార్యుల వారు, కాబట్టి నీకు ధనుర్వేదం లభిస్తుంది. నువ్వు అదృష్టవంతుడవంటాడు. ఆ మాటలు చాలు పిరికివాడు బ్రతుకడానికి, త్వరపడి చావకుండా, మనిషివలె బ్రతుకడానికి!

నువ్వు నిజంగా విద్యార్థిగా వచ్చావా ? లేక కృష్ణుని ప్రేరణతో నీ తండ్రి పనుపున వేగువై వచ్చావో, ఎలాగ తెలుస్తుంది ? ఏది నమ్మాలి ? అంటూంటే..

"గురుదేవా! మీ శక్తి స్థోమతలు అందరికి తెలుసు. మీరు సద్బ్రాహ్మణులు. భరద్వాజ పుత్రులు. చూపులతో అవతలివారి మనసులు చదువగల అపారశక్తి శాలురు. మిమ్ము నేను మోసం చెయ్యాలనుకున్నా, చేయగలనా ? క్షమించండి. నా మనసునర్థం చేసుకుని కనికరించండి.

త్రికరణ శుద్ధిగా శిఖండి ప్రార్థిస్తూంటే, నిన్ను తప్పక పరిపూర్ణ మానవునిగా చేస్తాను. నేను చెప్పినట్లు చెయ్యి. నీకు తప్పక విజయం లభిస్తుందని చెప్పారు. నాకు తెలిసిన యక్షుడొకడున్నాడు. అతను నిన్ను ఇబ్బందులు పాల్జేస్తాడు. ఓర్పుగా సేవచేస్తే నువ్వు మహిళ నుండి పురుషుడివి... పూర్ణపురుషుడివవుతావు" అన్నారు.

తప్పకుండా, మీరు చెప్పినట్లు చేస్తానని, శిఖండి గురుదేవులకు వాగ్దానం చేసాడు.



# ఆహ్వానం

వర్షాకాలం వెళ్ళిపోయింది.

వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

కాంపిల్యం నుండి వచ్చిన పడవలలో, కొందరు బ్రాహ్మణోత్తములు దిగారు. బహుశా వారు ద్రౌపదీ స్వయంవరానికి రమ్మని ఆహ్వానించడానికి వచ్చి వుంటారు. పాంచాలం నుండి ద్రౌపదీ స్వయంవరంతో వేదమూర్తులు వచ్చారన్న విషయం హస్తినాపురం మొత్తం ప్రాకిపోయింది.

దాంతో యువరాణి భానుమతి ఆచార్యులను దర్శించి, యువరాజు, ఆ స్వయంవర కార్యక్రమానికి వెళ్ళకుండా చూడమని ప్రార్థించింది. అమ్మా! భయపడకు. ఇదంతా భీష్ములవారి ఆజ్ఞానుసారం జరుగవలసిందే. దుర్యోధనుడు స్వయంవరానికి వెళ్ళడానికి భీష్ములవారు ఒప్పుకొనరు. కాబట్టి ధైర్యంగా వుండు. ఏదోరకంగా నేను నిరోధిస్తానన్నారు.

అయినా అది విలువిద్యా ప్రదర్శన వ్యవహారం. విలువిద్యా ప్రదర్శనం, దుర్యోధనునికి చెల్లదు గదా. మల్ల యుద్ధాలైతే దుర్యోధనునికి సరిపడతాయి. సరే. నువ్వీ ఆందోళనను వీడు. మిగిలిన విషయాలు నేను చూసుకుంటానన్నారు. ఆచార్యులకు, కృతజ్ఞతలు చెప్పి, భానుమతి తన మందిరానికి వెళ్ళగానే -

ద్రోణాచార్యులవారు, పితామహులను దర్శించడానికి బయలుదేరి వెళ్ళారు. వీరు వెళ్ళే సమయానికి ముఖ్యమైన సమావేశం ఏర్పాటు చేయబడింది. అటువంటి సమయంలో ద్రోణాచార్యులు అక్కడికి చేరారు. వుండవలసిన ప్రముఖులంతా అక్కడ వున్నారు.

"ఆచార్యవర్యా! మనకు మహారాజు ద్రుపదులు, పాంచాలం నుండి ద్రౌపదీ స్వయంవరానికి రమ్మని వర్తమానం పంపారు. మనకు, వారికున్న - ప్రత్యేక పరిస్థితులలో దీనిని ఆమోదించడం తగదని నా వుద్దేశం." అని ధృతరాష్ట్రుడు, "కణికా! వృద్ధమంత్రివి, నువ్వు. మాకేమి చెప్పావో, దానిని ఈ సభ ముందు వుంచ" మన్నాడు.

అందుకు సమాధానంగా కణికుడు, పితామహుల, మహారాజుల అనుమతితో, ఇతర ప్రముఖుల నభ్యర్థిస్తు నేను మహారాజులకు చెప్పిన విషయాన్ని మళ్ళీ వివరిస్తాను.

"పాంచాలానికి, మనకు మధ్య సయోధ్య లేదు. మనతో ఏదో విధంగా పేచి పెట్టుకుని యుద్ధానికి కాలుదువ్వే ద్రుపద మహారాజు, ముఖ్యంగా మనకు ఆచార్యులు, సర్వాస్త్రప్రదాతలైన ద్రోణులవారికి బద్ధ విరోధి. అటువంటి వానితో సఖ్యమనవసరం. వారి పిల్ల అసలే అనవసరం.

ద్రుపదుని కుమారుడు, యువరాజు దృష్టద్యుమ్నుడు కూడా, తన వీరత్వంతో మనతో విరోధించాలనే చూస్తున్నాడు. సరే "కృష్ణ" అనే ద్రౌపది, తన తండ్రికి వారసురాలు. అన్ని విధాల తండ్రిని సమర్థిస్తూ - మనతో - ముఖ్యంగా - ద్రోణులవారిని రప్పించి, పరాజితులను చేసి, పరాభవించాలన్నది ఆమె వుద్దేశం. అటువంటి వారితో బాంధవ్యం మనకనవసరం.

ఇంకో విషయం. ద్రుపదుని సంతానంలోని ఒకరు నపుంసకుడు. మహా గొప్ప వంశమది. అటువంటి వారితో బాంధవ్యాలు ఎంత మాత్రము తగవు అన్నాడు. ఆ వెంటనే దుర్యోధనుడు "కణికా! పెద్దవాడివి. విషయం చెప్పడం వరకే నీ వంతు వివరించడం, వ్యాఖ్యానాలు చెయ్యడం తగదు." అనగానే -

ద్రోణాచార్యులు, దుర్యోధన బుద్ధిని శంకిస్తూ ఆలోచన మొదలుపెట్టారు. అంటే - ఈ దుర్యోధనునికి ద్రౌపదిపై మనసు పోయిందన్నమాట. అందుకే కణికుని కాదనడం. అది అర్థం చేసుకున్న ద్రోణాచార్యులు, తనను కాదని ద్రౌపదిని చేపట్టదలిస్తే, తాను హస్తినాపురం నుండి వెళ్ళిపోవాలని, వాళ్ళ కర్మకు వాళ్ళనే బలి చెయ్యాలని తలిచారు.

ప్రస్తుత పరిస్థితులన్నీ దుర్యోధనాదులు ద్రౌపది స్వయంవరానికి తరలి వెళ్ళడానికే నిశ్చయించుకున్నట్లున్నాయి.

అందుకు తగ్గట్లే దుర్యోధనుడు "కౌరవులు సింహాలు. వారు స్వయం వరంలో ద్రౌపదిని గెల్చుకుంటారు. అప్పుడా పిల్ల, పగపట్టిన నాగు అయినా, గాండ్రించే పులి అయినాసరే, భారతీయ సాంప్రదాయాలననుసరించి పతియే ప్రత్యక్షదైవమని పాదాలు పట్టవలసిందే తప్ప పరాక్రమించి, సివంగి లాగ ముందుకురకులేదు.

వివాహానికి ముందు జీవితం వేరు. అనంతర జీవితం వేరు. పగ, ద్వేషాలతో పెండ్లిండ్లు జరుగవు. స్వయంవరానికి వచ్చాక, అక్కడ జరిగే తంతుకే తలవంచాలి

తప్ప, వీళ్ళు కౌరవులు, వాళ్ళు గాంధారులు, అని వ్యాఖ్యానాలు చేసి, సభామర్యాద నుల్లంఘిస్తే జరిగేది పెండ్లి కాదు. జరిగేది యుద్ధం. ఈ మాత్రం తెలియని మూర్ఖుడు కాడు, పాంచాలుడు.

వివక్షత చూపేటప్పుడు, స్వయంవర సన్నాహం చెయ్యకూడదు. తీరా చేసాక, ఇష్టాయిష్టాలు, కష్టనష్టాలను ప్రక్కనబెట్టి, ధర్మానికి తలవంచాల్సిందే. స్వయంవరంలో గెలిచిన వీరుని వరించవలసినదే. అక్కడ వీరత్వం స్పష్టమౌతుంది తప్ప, ఇతర అనిష్టాలకు, అరిష్టాలకు తావుండదు.'' అని ఆ వెంటనే

''మనం స్వయంవరానికి వెడుతున్నామన్నాడు. వెళ్ళాల్సిందే, వెళ్ళకపోతే ఇంత సువిశాల సామ్రాజ్యాధిపతులు, పిరికివానివలె వెనుకంజ వేసారని ''అవ్వ'' బురదపాములవంటి, చిన్న చిన్న రాజులు కూడా నవ్వుతారు. అదెంత అవమానకరమో ఆలోచిస్తే ఇక ఎవ్వరు మాట్లాడరు. అనవసర ప్రసంగాలు చెయ్యరు'' దుర్యోధనుడు నిక్కచ్చిగా అనేసాడు.

కానీ, అది నచ్చని ధృతరాష్ట్రుడు, పొరపాటున మనమెవరము అందులో నెగ్గకపోతే, అది మరింత అవమానకరం గాదా ? సందేహాన్ని వెలిబుచ్చాడు. అందుకు శకుని స్పందిస్తూ ''రాజా! స్వయంవరానికి వెళ్ళడం సాంప్రదాయం. వెళ్ళిన వాళ్ళందరు గెలవాలని ఎక్కడా సిద్ధాంతం లేదు. దీనికి అనవసరాందోళన మనవసర'' మన్నాడు.

''పూజ్య పితామహా, ఓ మహారాజా! దుర్యోధనుడు కోరుకున్నట్లు స్వయంవరానికి వెళ్ళవలసిందే కానీ ''వెళ్ళాను, వచ్చాను'' అంటే లాభం లేదు. అది నా శిష్యత్వానికి మచ్చ. వెళ్ళడం, వీరోచితంగా ద్రౌపదిని తీసుకురావడం, వివాహం చేసుకోవడం వలన, అవతలివారి ఆశలు అడుగంటుతాయి. వారి ఆలోచనలు భిన్నమై, జీవితాంతం దాస్యం చేస్తున్నట్లు బ్రతుకు చెయ్యాలి. అదీ పౌరుషం. అప్పుడే కురువంశ ప్రతాపం, లోకానికి తెలియడం జరుగుతుంది. అలాగైతే నాకానందమే తప్ప అభ్యంతరం లేదు. కనుక ఆలోచించుకుని ముందుకు అడుగు వేయాలంటాను. దీనికి అంగరాజు కర్ణుడు కల్పించుకుని కురువీరులపై మీకు నమ్మకం లేదా ? కుపితుడైనట్లు అడుగుతాడు.

అందుకు సమాధానంగా, ద్రోణాచార్యులవారు -

"కర్ణా!" "నమ్మకం వేరు, వీరత్వ పౌరుషాలు వేరు. నా దగ్గరకొస్తే.. అంటాడు ప్రతివాడు. తీరా దగ్గరకు వస్తే పలాయనం చిత్తగించడమే, పాదాలు పట్టుకున్నట్లు, తలవంచడమో జరుగుతుంది. అది జరుగకూడదనే నా విశ్వాసం."మంటారు. ఇదే సమయంలో విదురుడు వచ్చి, భీష్ముల వారికేదో రహస్యంగా చెవిలో చెబుతాడు. వారు తలపంకిస్తారు. అప్పుడు మహారాజు వద్దకు వెళ్ళి -

"రాజా! యాదవ ప్రముఖుడు, వసుదేవుని సోదరుడు దేవభాగుని యొక్క కుమారుడు, కృష్ణభక్తుడైన ఉద్ధవుడు వచ్చి లోపలికి రావడానికి తమ అనుమతి కోసం నిలిచి వున్నాడు. లోపలికి పంపించనా ?

"అంటే... నువ్వు మహారాజును ఆదేశిస్తున్నావా ? లేక స్వయం నిర్ణయం తీసుకుంటున్నావా ?" అని మహారాజు అడిగేసరికి, కొంత చిన్నబుచ్చుకుంటాడు. సందిగ్ధంలో పడతాడు. ఆవేశం చల్లారినట్లు క్షణమాగి -

"ఇప్పుడంత అవసరంగా వచ్చి, యాదవ సందేశాన్ని అందించవలసిన అగత్యమేమిటో... తెలుసుకున్నావా ? మహారాజు అడిగాడు. అందుకు సమాధానంగా, విదురుడు - "ఉదయాన్నే ఉద్ధవుడు వచ్చి, కోటగుమ్మం నుండే నా దర్శనాన్ని, పద్ధతి ప్రకారం అపేక్షించాడు.. కృష్ణ సందేశం తెచ్చాననేసరికి, సాదర స్వాగతమిచ్చి నా ఇంటికి తీసుకు వెళ్ళాను.

"కృష్ణ సందేశమనేసరికి, దుర్యోధనుడు, కర్ణుడు, అశ్వత్థామ... ఒక్కొక్కరుగా అదిరారు. బెదరినట్లు వారిలో వారు ఒకమారు చూసుకున్నారు. అటునుండి ఉద్ధవుడు, రాజమాత దర్శనం చేసి, పితామహులను దర్శిస్తానంటే, అదే విధంగా చేసాను. ఇప్పుడు ప్రభువులను కలుసుకుంటానంటే, ముందుగా పితామహులవారి అనుమతినర్థించాను. వారి అనుమతితో, ఇక్కడకు వచ్చి మీ ఆదేశంతో, మిమ్ము దర్శించ నిలిచాడని, విదురుడు ముగించాడు.

అందుకు దుర్యోధనుడు కుపితుడౌతూ ముఖ్యమైన సమావేశం మధ్యలో మనమున్నప్పుడు ఈ కృష్ణుని సందేశం గురించి ఆలోచించాలా ? ఈ ఉద్ధవుడిని, అన్ని రాజమర్యాదలతో ఇప్పుడే ప్రవేశింప చెయ్యాలా ? పేరుకు పెద్దవాళ్ళే తప్ప ఒక్కరికి బుద్ధులు సరిగ్గా పనిచెయ్యడం లేదు అన్న" దుర్యోధనుడు అసహనంగా విసుక్కున్నాడు.

అతని విసుగును ఒక మూలకు త్రోసి, పితామహుడు, తన గొంతు సవరించుకుని -

"ఆర్యులారా! వచ్చినది యాదవ ప్రముఖుడైన దేవభాగుని కుమారుడు. ఆ వచ్చినది కూడా, యాదవుల కారాధ్యదైవమనదగు కృష్ణుడి పనుపున. ఆ యాదవ సంరక్షకుడు మనకు సందేశం పంపించారుట. అది తెలుసుకోవలసిన తక్షణ కర్తవ్యం, ఉద్ధవుని ఉదాసీనంగా చూడకుండా, కృష్ణునికి కోపం తెప్పించకుండా, సత్వరం, ఆ మహామతిని ప్రవేశపెట్టండి" అన్నారు.

ద్రోణాచార్యుల గొంతుకలో పచ్చి వెలక్కాయ పడింది. కురువీరులు, తనను కాదన్నట్లు ప్రవర్తిస్తే, విని, తన మనసు, శపథం - పట్టుదల - వగైరాలు ప్రకటించాలనుకుంటున్న తరుణంలో - వచ్చిన, ఈ విదురుడు, పెద్దాయనతో సంభాషించి, మహారాజుకు విన్నవించి -

ఆ వచ్చినవారెవరో తెలియబరచి, అందరిలో అదే - అన్యాయసక్తులలో తెలియని గుబులు, అదురు - బెదురు - కల్పించాడు. ఈ రాక దేనికి ప్రారంభమో, ఎక్కడ ముగింపో, ఇది ఇష్టంలేని వారికెవరికి అణుమాత్రం గూడా అర్థం కాలేదు.

## వెళ్ళాలా, వద్దా... ?!

**ఆ**చార్యులు యుద్ధశిక్షణాశాలకు విచ్చేసారు. అప్పటికే, కురురాణి, దుర్యోధనుని భార్య అక్కడికి వచ్చి ఆచార్యుల కోసం బిక్కు బిక్కు మంటూ ఎదురు చూస్తుంది. ఆమె ప్రక్కనే ఆచార్యుల వారి ధర్మపత్ని కృపాదేవి కూడా వుంది. ఈమెను ఓదార్చుతుంది.

ఆచార్యులు రాగానే వందనమాచరించి నిలిచింది. "చిరంజీవ సౌభాగ్యవతి, సుఖీభవ'' అని ఆశీర్వదించారు. ''అభీష్టసిద్ధిరస్తు'' అని ప్రత్యేకంగా అభినందించారు. ఆ మాటవిని సంతోషంతో, ఆర్యపుత్రులు, స్వయంవరానికి వెళ్ళడం లేదా'' అంది.

"వెళుతున్నారు. కానీ, అది వృథా శ్రమ. అందులో యువరాజే కాదు. ఇక్కడివారెవ్వరు కూడా విజయం సాధించలేరు.'' అంటారు.

అదేమంటుంది ? అమాయకంగా భానుమతి. మన భయాలు తొలగించ డానికి, గోవిందుడు, దేవుడిలా వచ్చాడు. దాంతో మనకు అనవసర భయం, ఆరాటం, ఆందోళన లేకుండా, ప్రశాంతంగా వుండవచ్చునంటారు. తృప్తిగా వూపిరి పీల్చుకుంటుంది, భానుమతి.

యువరాజు తొందరపడి, పుష్కర ప్రభువు చేకితానుని, పదవీభ్రష్టుని చేసాడు. అది తగదని, అతని రాజ్యాన్ని వెంటనే అతనికివ్వాలని, లేని పక్షంలో యాదవవీరుల శక్తితోపాటు, నా సాహసం కూడా గుర్తించవలసివస్తుందని హెచ్చరిస్తున్నట్లు కబురు పంపాడు.

సభలో ఈ విషయం చెప్పగానే, వెంటనే చేకితానుని రాజ్యం. ఆతనికిమ్మ నడం జరిగింది. నేను వెళ్ళి ఆ కార్యక్రమం పూర్తి చేసుకుని వస్తాను. అప్పుడే - ద్రౌపదీ స్వయంవరానికి వెళ్ళే బలరామకృష్ణులను కూడా కలుసుకుంటాను'' అని ముఖంలో చిరునవ్వు తొంగి చూస్తుండే, యువరాణి భానుమతిని చూస్తూ-

"అమ్మాయి, కొన్నాళ్ళ క్రితం నువ్వొకమాట నాకు చెప్పావు నీకు గుర్తుందా ? అదే... కృష్ణుడు నిన్ను చెల్లెలిగా ప్రేమిస్తున్నాడని, జ్ఞాపకముందా ?'' ప్రేమతో అడిగారు.

"గుర్తుంది, ఆచార్యా! నిజంగా, ఆ కృష్ణదేవుడు, అమ్మవారి కరుణతో, సోదరునిగా కనుక ప్రవర్తించి నా మానమర్యాదలు రక్షించకపోయినట్లైతే నేనెప్పుడో గంగలో దూకి, చేపలకు, మొసళ్ళకు ఆహారమై వుండేదాన్ని. ఆ గోవిందుని, వాసుదేవుని, దేవదేవుని, నా నిజమైన సోదరుని మరువడం తరమా ? జరగదు, జరగనే జరుగదు.''

"అందుకునైనా కృష్ణుడు, దుర్యోధనుడు, ఆతని బృందం - స్వయంవరంలో నెగ్గకుండా తప్పక చూస్తారని, ఆచార్యులవారు ముక్తాయింపు పలికారు. ఆ వెంటనే, నీకో విషయం చెప్పనా ? నువ్వు సత్వరమే రాజమాత వద్దకు వెళ్లి, కృష్ణుడు నీకు చేసిన వుపకారానికి, ఆచార్యులతో కలిసి వెళ్ళి, ఆ గోవిందునికి, నా కృతజ్ఞత లర్పించుకుంటానని చెప్పు. ఆమె తప్పక ఒప్పుకుంటుంది. నువ్వు నాతో రావచ్చును. ఇంకా ధైర్యం చాలకపోతే, విదురుని అనుగ్రహాన్ని అపేక్షించు. తప్పక కార్యం సానుకూలమవుతుందని, కృష్ణుని కలుసుకొనడానికి వీలయిన, పరమ రహస్యాన్ని భానుమతికి, ఆచార్య ద్రోణులు, అంత పరమ రహస్యంగా చెప్పారు.

"వెళ్ళు. ఇదే తగిన సమయం. రాజమాత అంగీకరిస్తే, ఎవ్వరు నిన్ను అడ్డుకోలేరు. అనగా, కృష్ణుడు కరుణిస్తాడంటారా.... ?" అనుమానంగా అడుగుతుంది.

"అమ్మాయి! నువ్వు నా చెల్లివన్న మాట నిజమైతే, దానికి కట్టుబడితే, తప్పక నిన్నుద్ధరిస్తాడు. కాదంటే, అనే... ఆలోచనలనవసరమంటారు."

"కృష్ణుడు - ఆడి తప్పడు. ఆ పరంధాముడు ఆశ్రిత వత్సలుడు, భక్తజన విధేయుడు. తప్పక నన్ను స్వంత చెల్లెలుగానే తలచి కరుణిస్తాడు. అందుకు, గతమే సాక్ష్యం... అనవసరాలోచనలు" చేసానకుంటుంది. ఆచార్యులవారి వద్ద శెలవు తీసుకుని తన మందిరానికి బయలుదేరింది. అలవాటుగా దుర్యోధనుడు, మామ శకునితో పాచికలాడటానికి వెళ్ళాడు. ఎప్పుడో రాత్రికి కాని తన దగ్గరికి రాడు - అంతవరకు వేచి వుండి, ఆచార్యులతో కలిసి పుష్కర తీర్థానికి వెడుతున్నట్లు చెప్పాలి. అందుకే -

ఇంచుమించు అర్ధరాత్రి, అయినా, ఆర్యపుత్రుల కోసం ఆమె ఎదురు చూస్తూ వుంది. దుర్యోధనుడు రుసరుసలాడుతూ రానే, వచ్చాడు. ఏం జరిగిందో ఈ మహానుభావునికి అనుకుంది. దగ్గరకు వచ్చి పలుకరించినా, తన శరీరాన్ని తాకించినా మురిసిపోయే, ఆర్యపుత్రుడు, తనను చూస్తూనే చెయ్యి పట్టుకుని, క్రొత్త నాటకాలు మొదలుపెట్టావా ? ఆచార్యుల వద్దకు ఎందుకు వెళ్ళావని ?" అడిగాడు.

"ఓస్! ఇదా, ఇవ్వాళ క్రొత్తేం గాదు. ఇంచుమించు ప్రతినిత్యం మన ఆచార్యులవారిని, అమ్మగార్ని కలుస్తూనే వుంటాను. ఇందులో క్రొత్తదనం, ప్రత్యేకతా లేదు. అనగానే - "లేదు!" చెయ్యి పట్టుకుని మొండిగ అరచినట్లు గద్దించాడు.

"వెళ్ళి, ఏం చేసావు ? చెప్పు. నన్ను స్వయంవరానికి వెళ్ళనివ్వకుండా, ఆపడమే కదా, నీ వుద్దేశం ?" అడిగాడు.

"అంటే... ఆచార్యులతో మాట్లాడితే, స్వయంవరం ఆగిపోతుందా ? ఆ విషయం మరుగున పడిపోతుందా ? వివరంగా చెప్పండి. దాని గురించి, ఆలోచిస్తా నంటుంది, తెలివిగా...!

"కట్టిపెట్టు. నీ నాటకమంతా శకునిమామ నాకు అంతా చెప్పాడు" -

"అంటే నా మీద అదే మనమీద శకుని మామ గూఢచర్యం చేయిస్తున్నాడన్న మాట. చాలా బాగుంది. రాజ్యం మనది, అధికారం మనది. కానీ ఆధిపత్యం మాత్రం శకునిమామది. అంటే.... మనం... ఈ రాజ్యంలో కేవలం ఉత్సవ విగ్రహాల మన్నమాట. ఇంతకంటే బావగారు యుధిష్టరుల వారి రాజ్యమే బాగుంది. చాలు, చాలు... అసలు విషయాన్ని ప్రక్కనపెట్టి తన నిరసన మొదలుపెట్టింది.

దీంతో అంతటి మల్లుడు, "పిల్లి" అయిపోయాడు. "అదికాదు..!" ఏదో చెప్పబోతున్నాడు.

"చూడండి. నేను మీ భార్యను. యువరాణిని. ఈ రాజ్యం నాది. ఇక్కడున్న వారందరు, అస్వతంత్రులు. నా ఆజ్ఞాబద్దులు. ఆ మేనమామను "మామ"గా కాకుండా, మేనమామలాగే వుండమనండి. నన్ను ఆజ్ఞాపించదగువారు, అత్తమామలు, తాతపాదులు, రాజమాత. అందరిలో రాజమాత మాట వేదం.

ఇటువంటి అసందర్భ ప్రయోగాలు, స్థితి ఏర్పడుతుందని, ఆచార్యులతో కలిసి ప్రభాసతీర్థానికి వెళ్ళి ఆ తీర్థక్షేత్రాటనం చెయ్యాలనే కోరికను, రాజమాతకు చెప్పాను. ఆమె ఆచార్యులతోనే కదా, తప్పక వెళ్ళమని ఆదేశించారు. ఇంతవరకు వచ్చి ఆగడం, దాపరికమనవసరమంది.

"మీరు...!" అని - దుర్యోధనుడు నీరుగారిపోయాడు. ఆ వెంటనే అర్థమయింది. నువ్వు ప్రభాసతీర్థం పేరిట, ఆచార్యులతో వెళ్ళి, ఆ కృష్ణుని కలిసి, నా మీద వున్నవి, లేనివి చాడీలు ఆ ద్రౌపదికి చెప్పించి, నన్ను అసహ్యించుకునేటట్లు చెయ్యాలని నీ పన్నాగం. అవునా ?"

"అసలే ఆచార్యులకు మాపై చిన్నచూపు. ఆ స్వయంవరంలో నెగ్గలేమని, కురువంశ ప్రతిష్ట ఇనుమడింప చేయక, గతకాల కీర్తిప్రతిష్టలను, వర్తమాన కార్యక్రమాలతో ముడిపెట్టి, భవిష్యత్తును నిరాశాజనకం చేసి, భరతవంశాన్ని బజారుపాలు చేస్తామన్నది ఆచార్యులవారి భావన.

"దానికి నువ్వు అగ్నికి - ఆజ్యంలా తయారయ్యావు" అంటు తన అక్కసు, కోపం... ఆమె మీద ప్రయోగించాడు. అమాయకురాలు - కేవలం భర్త ప్రేమను కోరుకునే, ఆ పిల్ల, ఈ మూర్ఖుడి బలసంపన్న - కుత్సిత - దుష్ట ఆలోచనల మధ్య గిజగిజలాడుతుంది.

"చంపెయ్యండి. పీడా పోతుంది. మీకు అలవాటే కదా, పెళ్ళాన్ని - పిల్లల్ని చంపడం ? చంపండి. ఇక మీకు, పెళ్ళాం - పిల్లడు - అవసరం రాడు. మళ్ళీ క్రొత్త పెళ్ళాం... ఇంతే కదా, మీ రాజసం, స్వార్థ" మనేసింది. దాంతో ఖంగుతిన్న దుర్యోధనుడు ఆమెను విడిచిపెట్టాడు.

"ఏమన్నావు ?" అనగానే నీళ్ళు నమిలింది.

"చెప్పు - "కోపం స్థానంలో - బ్రతిమాలుతున్నాడు. తనను సరిదిద్ద మంటున్నాడు. "అంటే...!" తనే అడుగుతున్నాడు.

ఔనందామె." ఎందుకు చెప్పలేదు - దుర్యోధనుడడుగు తున్నాడు.

ఎంతసేపు ఆటపాటలు, పోట్లాటలు, కుత్సితాలు, మాయామర్మాలు తప్ప, పెళ్ళాం - ప్రేమ, అనురాగం, మమకారం.... మచ్చుకైనా కనబడవు. ఈ రాజులకన్న సామాన్య మానవులు ఎంతో ప్రేమానురాగాలతో సంతోషంగా వుంటారు. మనమేదో సుఖపడుతున్నామని "వాళ్ళనుకుంటారు". నిజానికి, సుఖపడటం - సుఖపెట్టడం - సంపన్నులకు అదే మనకు తెలియదు, చాతకాదన్న సంగతి, పాపం... ఆ అమాయకులకు తెలియదు" అంటోంది. తన ప్రవర్తనకు తానే సిగ్గుపడుతూ దుర్యోధనుడు క్షమించమంటాడు.

సంతోషంతో, తనను చుట్టేసుకుంటుంది. నా కుమారుడే భావియువరాజు కావాలి. మరొకరెవరో కారాదు, కాకూడదు అంటూంటే "తప్పక నీ పిల్లవాడే భావియువరాజు" అంటాడు. అయితే నేను పుష్కరతీర్థానికి వెళ్ళను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టనంటుంది.

"మరి, రాజమాత అడిగితే... ప్రస్తుతం నేను వెళ్ళలేనని, తొందరపడి అడిగానని క్షమాపణలు చెప్పుకుంటాను. ఆ తల్లి "తల్లి" కదా, తప్పక క్షమిస్తుందంటుంది. ఇక, ఈ విషయం చెబితే, పుష్కలమైన ఆశీస్సులతో నన్నొక దేవతగా - అపురూపంగా చూసుకుంటుందంటుంది.

సంతోషంతో, తెలియకుండా నిద్రపట్టింది.

అది - తెలియనట్లు - దుర్యోధనుడు "దేవీ!" అని పనిమాలా నిద్రలేపి" వెళ్ళు వెళ్ళి, ఆ గోవిందుని కలు. మనకు కొంత వుపయోగముంటుందని సూచిస్తాడు.

"అబ్బ! నన్ను నిద్రపోనివ్వండి. నేనెక్కడికి వెళ్ళను. ఆ ఆలోచన లేదు, ఓపిక లేదు. ఇక్కడే వుంటాను. దయచేసి....!" అన్నీ విరమించుకున్నాననేసరికి నెత్తి మొత్తుకున్నాడు.

"ఇదే దురదృష్టమంటే, ఏ ముహూర్తంలో పుట్టానో కానీ, ప్రతీది నాకు ఎదురు తిరగడము, ప్రతికూల వాతావరణానికి లొంగడం తప్ప, అనుకూల వాతావరణంలో, హాయిగా వుండడం తెలియదు. కర్మా, కర్మా... అని బాధపడతాడు. విషయమర్థం కాక, కంగారు పడుతుంది. "ఏమయిందండీ ? అంటూ బాధపడుతుంది. తానేం బాధపెట్టానా ? అని ఆలోచిస్తూంది. భర్త మాటల నన్నింటిని విన్న ఆమె ఆలోచనలో పడింది. నిజం. నాకుగా నేను, ఆర్యపుత్రులను దురదృష్టవంతుడని, అనలేను కానీ.. పరిస్థితులన్నీ ఆయనకలాగ ఇబ్బంది పెడుతున్నాయని, గతంలోని ఒక్కక్కటే తలచుకుని బాధపడుతుంది. అందరితోపాటు, తానూ బాధపెట్టానా! ఇది ఆమె మనసులోని బాధ.

వెంటనే దుర్యోధనుని చుట్టేసుకుంది. మీరు చెప్పినట్లే చేస్తానంది. మిమ్మ కాదన్నందులకు క్షమించమంది. ఆ మాటకు, అమాంతం లేచి కూర్చుని "వెళ్ళు, వెళ్ళి, నా చిన్న చెల్లెలివన్నావు కాబట్టి, మాతో స్నేహంగా వుండు. ముఖ్యంగా నా భర్తతో మైత్రీభావంతో వుండి, అన్ని విధాల అండదండలనందించమను. దీనివలన మనకెంతో లాభం, శుభం - కల్గుతుందంటాడు.

అలాగే - నువ్వు మరొక ఉపకారం చెయ్యాలి. మీ అన్నను ఒప్పించు. ఆ పాంచాల రాజపుత్రిక నన్ను వరించేటట్లు చెయ్యమను. దీనివలన, కూతురి పేరు చెప్పి, ఆ పాంచాలుడు కూడా, మనకు బంధువు, హితుడౌతాడు. క్రోధ, క్రౌర్యాలు పోతాయి. ఈ భరతవంశ పేరు ప్రతిష్ఠలు పెరుగుతాయి. మనల్ని నిలువరించ డానికి ఆ హరిహరాదులు కూడా వెనుకంజ వేస్తారు.

నిలువరిస్తారనే పాండవులు....... "మట్టిలో కలిసిపొయ్యారు. కాబట్టి, మనకు భయం లేదు. మన ఆచార్యులు కూడ శతృత్వం పోయిందని సంతోషిస్తారు. ఇంతటి సువిశాల సామ్రాజ్యాచార్యులవారంటే, ఇతర రాజులలో ప్రతి ఒక్కరికి, భయ గౌరవాలు పుష్కలంగా వుంటాయి. కాబట్టి....

క్షణకాలం విస్తుపోయింది. మనిషి స్వార్థమెంతో స్వార్థమైనదని గ్రహించింది. మెడచుట్టు వున్న తన చేతులను కొద్ది కొద్దిగా తప్పిస్తూంటే "ఏం జీవి... ?" అంటాడు.

"ఆర్యపుత్ర! ఈ దేశం చేసుకున్న పుణ్యమో ఆడవారి దౌర్భాగ్యమో - పతిని దైవంగా, వారిమాట వేదంగా తలచి బ్రతకాలి. అందుకే మీ సుఖ - సంతోషాలకు నేనే విధంగా అడ్డురాను." అనగా -

"అయితే ఆచార్యులతో, దేనికి ? మన శకుని మామతో వెళ్ళు. బాగుంటుంది" అంటాడు. విధిలేక నవ్వుతూ అలాగే అంటుంది.

# సాంప్రదాయం

వస్తూన్న ఉద్ధవుని, సభలోని వారందరు స్వాగతించారు. పెద్దలకందరికి నమస్కరించాడు. వారు "ద్వారకలోని వారందరు కుశలమేనా ? అడిగారు. పమాధానంగా తాను ప్రస్తుతం, ద్వారకలో లేననీ, నాగవంశీకులైన మా మామగారింట వుంటున్నానని, వివరించి చెప్పాడు.

"సంతోషం. నీవేదో, గోవిందుని నుండి, సందేశం - తెచ్చావని, విదురుడు అంటున్నాడు. ఆ వివరం తెలుపవలసినదని, పితామహులు అడుగుతారు.

మా ప్రభువు కృష్ణుడే కాదు, పుష్కరదేశ ప్రభువు చేకితానులు కూడా, తమ సందేశంతో కలిపిన మనసును తమ ముందు వుంచమన్నారు." అంటూ, కృష్ణ సందేశాన్ని చెబుతున్నాడు.

"పితామహులకు, పెద్దలకు ప్రతి ఒక్కరికి మా వందన శతాలు. మా అన్నగారు, బలరామునితో కలిసి పాంచాలానికి, ద్రౌపదీ స్వయంవరం నిమిత్తం వస్తున్నాము. ఎందరో యాదవ ప్రముఖులు కూడా వస్తున్నారు. మధ్యే మార్గంలో మాకు, కొంతకాలం పుష్కరతీర్థంలో వుండాలనిపించింది.

మీరు రమ్మన వచ్చును. రాజ్యం వీరభోజ్యమయినా, అది మీది కాదు. క్రిందటి సం॥రం కురుసేనలు చేకితానుని మీ బలదర్పాలతో, నిస్సహాయుడిని చేసి మరీ తరిమి గొట్టారు. ఇది హర్షించదగ్గ పద్ధతి కాదు. మీ అనవసర బలదర్పాలకు, చేకితానుడు, నాగ లోకాధిపతి కర్కోటకుని ఆశ్రయం పొందాడు.

కృష్ణుని శరణు పొందాడు. కాబట్టి, ధర్మమతిక్రమించని శరణాగతులకు, తన రక్ష వుంటుందని తెలిపాడు. కనుక మీరు ఇతరాలోచనములు లేకుండా, మీ సేనల్ని పిలిపించుకోండి. సుఖశాంతులతో వుండండి. ఇతరుల జీవితాలతో ఆటలాడటం, వారి ప్రాభవానికి అసూయపడటం తగదు ? అంటూ కృష్ణుని సందేశాన్ని వారికందిస్తున్నాడు.

ఇందుకు దుర్యోధనుడు, అది మా పరాక్రమానికి చిహ్నమంటే, "నిజ" మంటూ కర్ణుడు తన కరవాలంపై చేతినుంచాడు. అశ్వత్థామ కొరకొరలాడుతూ చూస్తున్నాడు. అప్పుడు ఉద్ధవుడు, "యువరాజా! నా మాటలు, కృష్ణసందేశం పూర్తి కాలేదు. పితామహులకు, మహారాజుకు గోవిందుడు వివరించి చెప్పమన్న ప్రకారం, నా బాధ్యత నేను నిర్వర్తించాలి" అంటూ చేకితానుని అభ్యర్థనను గూడ తెలియబరుస్తాను. ఆలకించండి.

"పితామహా! నేను ఆది నుండి మీకు మిత్రుడను, సన్నిహితుడనే కానీ శత్రువును కాను. అటువంటి నన్ను అనవసరంగా పదవీభ్రష్టుని చేసారు. దీంతో, నేను నా ప్రజలతో నాగులకు శరణాగతుడనయ్యాను. వారు కరుణించి చెంత చేర్చుకున్నారు.

ధర్మమూర్తీ! మీ శక్తి సామర్థ్యాలు, కురుకుల ప్రతిష్ట సర్వులకు తెలుసు. దానికి మసకబారేటట్లు, మీవంటి వారు మావంటి చిన్న చిన్న రాజ్యాలవారిని చితకబాది సార్వభౌములమనడం తగదని, నా విన్నపం. కనుక, దయచేసి...! అంటూంటే దుర్యోధనుడు కల్పించుకుని పితామహా "ఈ సందేశం అర్థరహిత"మన్నాడు.

"ఉ..ఊ అని ఒకసారి తలూపి, "ఉద్ధవా, కర్కోటకులు ఏమంటున్నారు..?" విషయం తెలుసుకోవాలనే వుద్దేశంతో, తన సహజధోరణిలో, అడుగుతారు. కర్కోటకుడు తన సందేశంలో "నా కుమారుడు, యువరాజు మణిమంతుడు, పాంచాలానికి ద్రౌపదీ స్వయంవరం నిమిత్తం వెడుతున్నాడు. ఆ వెళ్ళేముందు చేకితానుని కలిసి, బలరామకృష్ణులకు స్వాగతమొసగి, కాంపిల్యానికి బయలుదేరే మధ్యలో మా నాగకూటమికి తీసుకురావాలి.

చేకితానుడు, ఇక్కడవుంటే, ఆ మహామహులు బలరామకృష్ణులకు స్వాగత సత్కారాలు ఎవరు జరుపుతారు ? వారి గౌరవాన్నెవరు కాపాడుతారు ? బలరామ కృష్ణులు సామాన్యులుకారు, ధర్మపరిరక్షకులు. కనుక, జరిగిందేదో జరిగింది - తాము,

పెద్దలు, కురుకులవృద్ధులు ధర్మమూర్తులు. వారి సామ్రాజ్యాన్ని వారికి పెద్దమనసుతో విడిచిపెట్టి, భరతఖండంలోని ప్రతి ఒక రాజ్యము సుఖ సంతోషాలతో పాడిపంటలతో వుండేటట్లు అనుగ్రహించ కోరుతున్నామన్నాడు'' అని, కర్కోటకుడే కాదు, అందరు ఇదే విధంగా "పితామహా'' మిమ్ము ప్రార్థిస్తున్నారన్నాడు, ఉద్ధవుడు.

"ఏవిటీ విపరీతం, అందరు చిత్రంగా వున్నారే ?!'' వింత మనుషులు, వింత సందేశాలు ? ఇది ధృతరాష్ట్రుని మనసులోని మాట. పుసుక్కున బయటికి అనేసాడు.

"పితామహా, యాదవులలోని అతిరథులు, ఇటు చేకితానుడు, అటు కర్కోటకాదులు, వారిని సదా నడిపించే బలరామ-కృష్ణులు, అందరు కలిసి మెలిసి వుండాలని, ఎవరి బ్రతుకులు వారు బ్రతకాలనే వాంఛిస్తున్నారు తప్ప, ఒకరి జీవితాలతో మరొకరు ఆడుకోవడానికిష్టపడటం లేదు. కనుక - విజ్ఞులైన మీకు విషయం విడిచి పెడుతున్నాం.'' ఉద్ధవుడు విషయం వివరిస్తూ -

ఆ తర్వాత - కాలం - ధర్మం - ప్రధానంగా నడిచే మేము మా ధర్మాన్ని నిర్వరిస్తే - ఆ వచ్చే బాధలకు, మా బాధ్యత లేదని తెలుసుకోమని ప్రార్థనమన్నాడు.

"చూసావా, బెదిరిస్తున్నారు. తాటాకు...!''

"ఆ.. దుర్యోధనా! కుర్రవాడివి, తొందరపడకు!'' అంటూంటే, దుర్యోధనుడు ఆచార్యులవైపు చూసాడు. ఇందుకు సమాధానంగా, ద్రోణాచార్యుల వారు -

"ఓ నా ప్రియపుత్రా, శిష్యరాజమా! మనం చేసేదేదైనా మనను కన్న - మన పూర్వీకుల కీర్తి ప్రతిష్టలకు భంగం కారాదు. ముందు మనం నడిచిన మార్గమన్యాయం. ఆ మార్గంలో వెళ్ళమని ఎవరు చెప్పారు ? ఆలోచనలేని పనులు, ఎంతమందికెన్ని విధాల ఇబ్బందులు కల్గిస్తాయో ఆలోచించావా ? పితామహులకెంత బాధ కల్గిందో గమనించావా ? పెద్దలు, విజ్ఞులు... ఇక విషయం మీ చేతుల్లో వుందంటే... చేకితానుని రాజ్యం అతనికిచ్చేయాలి.

కాదంటే, మన ఔద్ధత్యానికి బిగిసి, ఎక్కడెక్కడి యాదవ ప్రముఖులు, రాజ్యాలవారు మనమీద దండెత్తితే అనేసరికి "మన కర్ణుడు, లేడా ? తాతపాదులు, మీరు, అశ్వత్థామ, కృపాచార్యులు...

"అదే... అదే... ఆ సాహసం అన్నింటికి పనికిరాదు. కృష్ణుడంటే సామాన్యుడా! ధర్మసంస్థాపనార్థం, సంభవామి యుగే యుగే" అన్న పరమ పురుషుడు, విశ్వాత్ముడు, విశ్వేశ్వరుడు అర్థం చేసుకుని అడుగు ముందుకు వెయ్యి. ఆ తర్వాత ఎందరు నీ వెంట వుంటారో, ఒక్కసారి ఆలోచించు.

పరాక్రమం, వీరత్వం క్షత్రియుల సొత్తు. కాదనను. కానీ, ఆవేశం, అసహనం దోష కారకాలు. ఈ తొందరపాటు అప్రదిష్టకు గురిచేస్తుందే తప్ప, ప్రతిష్ఠను పెంచదు. నిదానంగా...!

"నిజం చెప్పారు, ఆచార్యా! కుర్రతనం, మంకుతనం, అసందర్భ ప్రలాపాల, అనవసర స్నేహాలు, అధిక్షేపనీయాలే తప్ప, ఉప్పు తిన్న వ్యక్తికి శోభించని అలంకారాలు. ఆచార్యులుగా మీరందరి మేలు కోరేవారు కనుక, పుష్కరానికి వెళ్ళండి. చేకితానుని తన సింహాసనంపై అధిష్టింప చెయ్యడండి. బలరామ కృష్ణులను తగు విధాన గౌరవించి, సాదర స్వాగత సత్కారాలు జరిపి, అందరం అన్నదమ్ములవలె మైత్రీభావంతో ఉందామని చెప్పండి. వాళ్ళ స్నేహాన్ని అపేక్షిస్తున్నామని మరీ మరీ వివరించండి!' ఇది భీష్ముల వివరణం.

ఈ సమయంలో, ఒక భటుడు వచ్చి "రాజమాత, తమ పూజ ముగించుకున్నారు. ఉద్ధవుని చూడాలంటున్నారు. వారిని ప్రవేశపెట్టమని కోరారంటాడు. అందరు ఆ మాతృమూర్తి, రాజమాతను దర్శిస్తారు. తమ ప్రణతులర్పిస్తారు. ఇరువురు ఉద్ధవ, విదురులు పేరు పేరున పలుకరించిన ఆ తల్లి ద్రౌపదీ స్వయంవరమనేసరికి నవ్వుతుంది. విదురుడు అన్ని విషయాలు వివరిస్తుంటే, ఆ పెద్దావిడ వింటుంది. కొన్ని విషయాలు సందర్భాన్ని బట్టి ఉద్ధవుడు చెబుతున్నాడు.

ఎన్ని చెప్పినా - ఈ - ద్వాపరంలో అన్నదమ్ముల అన్యోన్యతకు ఆ పాండవులే, చక్కని నిదర్శనం. దీనిని మా కృష్ణుడు.. అదే వ్యాసుడు కూడా ఒప్పుకుంటాడు. ప్రస్తుతమతనిక్కడే వున్నాడంటుందా రాజమాత, ఆయన చెబితే యుధిష్టరుడు బయటికి రావచ్చు" అంటూ ఉద్ధవుడు అయితే, భీముడు ప్రస్తుతం, ఆ ప్రాంత విడిచిపెట్టి రానంటాడు. అతను లేనిదే, మిగిలినవారు కదలలేరు.

భీముడి ప్రస్తుత పేరు వృకోదరుడు. ఆ రాక్షస సామ్రాజ్యానికి అధిపతి. అతనికో కుమారుడు. పేరు ఘటోత్కచుడు. పేరుకు ఆరునెలలవాడు. సింహ

గర్జనే అతని కంఠస్వరం. తేరిచూడగలేని తేజస్స్వరూప విగ్రహమాతడు. అందుకు తానే భరతవంశానికి ప్రప్రథమ వారసుడనిచ్చానని భీముడు, పొంగిపోతున్నాడు.

అందరు ప్రేమపాత్రులే. ఒకరినొకరు విడువలేని, విడదీయరాని అనుబంధమూర్తులే'' అన్నాడు. అందరికి శుభం కలగాలన్నదే, నా ఆకాంక్ష! అంది ఆ మాతృమూర్తి - రాజమాత! వ్యాసుడొచ్చాడు. ప్రపంచానికి, నాకు మంచి కుమారుడు, అతనొచ్చాడంటే ఏదో ఒక విశేషమంటుంది. విదురుని పంపి ఆతన్ని తీసుకు రమ్మంది.

తల్లి పిలుపుతో, వ్యాసుడు వచ్చాడు. తల్లికి సాష్టాంగ వందనమాచరించి, ఆమె పాదధూళిని, ముఖాన, శిరస్సున ధరించాడు. ఉభయకుశలోపరి, తదుపరి పాండవుల వృత్తాంతం చెప్పి ఏం చెయ్యమంటావని అడుగుతుంది.

తప్పదు. ఆ పిల్లవాడిని, హిడింబకు విడిచిపెట్టి, వీళ్ళు మన ప్రపంచంలోకి రావాలి. ఆ తల్లి, ఆ పిల్లవానితో భర్తలేని లోటును మరచి బ్రతుకుతుంది. అలాగ కాదు, ఆమె కావాలి, అనుకుంటే, ఇతర పాండవులు, బయటి ప్రపంచంలోకి రావాలనే మాట మరచిపోవాలి. సరే. భగవంతుడు నన్నిక్కడకు తీసుకు వచ్చిందీ అర్థమయింది. నా ధర్మం నేను చేస్తాను. వారు నా మనుమలు. వారి సంక్షేమం చూడవలసిన బాధ్యత నాది. నువ్వు ధైర్యంగా వుండమని, తల్లిని వూరడించాడు.

"నాయనా! నువ్వు సిద్ధహస్తుడవు. సర్వసమర్థుడవంది'' చిరునవ్వులు చిందిస్తూ అతని నుదుట ముద్దుపెట్టుకుంది. మాతృప్రేమ తెలియక, తండ్రిప్రేమలో మురిసిన కృష్ణ-ద్వైపాయనుడు, ఆ తల్లి పెట్టిన ముద్దుకు ఆనంద ముద్రల తేలియాడాడు.

★★★★

వ్యాసులవారు వస్తున్న వార్త తెలిసింది. ఆ మహనీయునకు ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. దారులు, సరిచేస్తున్నారు. అడ్డం రాకుండా చెట్లు నరుకుతున్నారు. ఎటువంటి అసౌకర్యానికి తావీయకుండా, ఆ మహర్షి సత్తముని ఆహ్వానించి స్వాగత సత్కారాలు నడపడానికి సర్వసన్నద్ధ మవుతున్నారు.

ఆ వచ్చే వృకోదరుని తాతగారు సామాన్యులు కారనీ, విరోచన మహారాజు శక్తి యుక్తుల స్వరూపమని, కనుక జాగ్రత్తగా వుండాలని రకరకాల వదంతులు

వ్యాప్తి చెందుతున్నాయి. ఇటువంటి తరుణంలో, వదంతులను, ఇతర గాలివార్తలను, రకరకాల అనుభవాలను ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా చెప్పుకుంటూంటే హిడింబ భయపడసాగింది.

ఆ వచ్చిన తాతగారు తనను, తన బిడ్డను వేరు చేస్తారా లేక తనను - భర్తను వేరు చేస్తారా ? కుంతీదేవి ఆంతర్యం. మనవడిని తీసుకుపోతుందా, లేక తన కొడుకుని తీసుకుని, నన్ను నా కుమారుని విడిచి పెడుతూందా ? ఆ వచ్చే తాతగారే మంటారు? రకరకాల ఆలోచనలు, ప్రశ్నలతో ఉక్కిరిబిక్కి రౌతుంది. అనుకున్న ప్రకారం, అనుకున్నట్లే తాతగారు, ఆ రాక్షస భూమిలో అడుగుపెట్టారు.

అందరు అట్టహాసంగా తాతగార్ని తీసుకురావడానికి పొలిమేరల్లో అడుగు పెట్టారు. అప్పుడే శిగూరునాగ తాతగారు, తమ పూర్వ సంధ్యాది కార్యక్రమాలను పూర్తి చేసుకుని, వీరికోసం ఎదురుచూస్తున్నట్లు ప్రకటించాడు.

అందరు సరిహద్దు దాటి లోపలకు ప్రవేశించారు. పగటిపూట, రాక్షసులు, తమ ప్రాంతంలో అడుగుపెడుతున్నారు. వారిని చూస్తుంటే, ఈ నాగాలకు ఒక మూల భయం, మరొకప్రక్క సంతోషంగాను వుంది. వృకోదరుడు వారితో కలిసి, అరుస్తూ, ఎగురుతూ వస్తున్నాడు. మహర్షి సంధ్యాదికాలు పూర్తి చేసుకున్నారు. జైమిని వగైరా ఋషులతో వారు, వృకోదరుని కలువ సిద్ధంగా వున్నారు.

ఈ రాక్షసులకు తాతగారినెలాగ గౌరవించాలో తెలియదు. కాకపోతే, సాష్టాంగ నమస్కారానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అది అలవాటు లేని రాక్షసులు బోర్లాపడటం, వారికి చాతకాకపోవడం, నాగాలకు తమాషాగా అనిపించింది. ఇందుకు మహర్షి వారిని అభినందిస్తూ వీపుల తట్టడం, వారికెంతో ఆనందాన్ని, క్రొత్త శక్తులను ఇచ్చినట్లయింది. తాతగారి దీవెనలకు వారెంతో సంతోషించారు.

వచ్చిన వారందరికి కుండలలో పాలు ఇచ్చారు. కొన్ని మేకపాలు, కొన్ని ఆవుపాలు. అందరికి ఆవుపాలను సమకూర్చడం కష్టమై అలాగ చేసారు. వ్యాసులవారు, అందర్ని ఆశీర్వదించారు. ఆయురారోగ్యములను ప్రసాదించారు.

తాతగార్ని, ఇతరులను, రాక్షసులు తమ భుజాలపై ఎక్కించుకుని, తమ అలవాటైన పద్ధతిలో, ఆ ఎగుడు దిగుడు కొండలను అలవాటుగా, అలవోకగా దాటుతూంటే, ఒక్క క్షణం - భూమ్యాకాశముల మీద తేలుతున్నట్లనిపించింది.

అందరు హాయిగా, ఆ ఎగుడు దిగుడు కొండల్ని, సెలయేళ్ళను దాటి, పర్వత ప్రాంత పాదభూమి వద్దకు వచ్చారు. ఆ మహనీయునికి ఆనంద బాష్పాలతో కుంతి, ధర్మరాజు, అర్జున, నకుల సహదేవులు సాష్టాంగ నమస్కారాలు చేసారు. కోడలు కుంతిని, మనుమలను దగ్గరకు తీసుకుని ఆశీర్వదించారు.

హిడింబ, కొందరు రాక్షసులను మహర్షిని చూస్తూ ఒంటరిగా, అడుగు వెయ్యలేకపోతూంటే, వారిని చూసిన మహర్షి, ప్రేమతో చేతులు వూపి, దగ్గరకు రమ్మని పిలిచారు. కుంతి వైపు తిరిగి, "ఏదమ్మా కోడలు పిల్ల, మనుమడు... ?" అంటూంటే,

పిల్లవాడు, ఘటోత్కచుని, చేతులలో వుంచుకుని దూరంగా నిలబడ్డ హిడింబ ఆశ్చర్యంగా, తన భర్త, బావ, మరదలు వారిని ఆహ్వానించే తీరుకు కళ్ళప్పగించి చూస్తూంది. ఇటువంటి ఆదరాన్ని, స్వాగతాన్ని ఆమెన్నడూ చూడలేదు. భీముడు, తన భార్యతో "వెళ్ళు. వెళ్ళి తాతగారి పాదాలమీద పడు" అన్నాడు. ఎలాగ పాదాల మీద పడాలి, ఆ వైనం, ఆ పద్ధతి అర్థం కాక, వింతగా- చిత్రంగా చూస్తూంటే, ఆమెకు తెలియని ప్రయత్నానికి చిరాకుపడుతూ "వద్దులే అమ్మా!" అంటూ ఆశీర్వదించారు. మునిమనుమడిని ఎత్తుకున్నారు.

పేరుకు ఆరునెలల పిల్లవాడే కాని, అలాగ లేడు. అయినా అతన్ని దగ్గరకు తీసుకుని నుదుట ముద్దాడారు. గుండెలకు హత్తుకున్నారు. నమస్కారం పెట్టడం తెలియని మనుమరాలితో క్రిందపడి ఏడుస్తున్న మునిమనుమని, చేతులు వుయ్యాల చేసి, అతను నవ్వే వరకు ఈ ముత్తాత ఆడించాడు. అదే మానవ సంబంధాలు, రక్త సంబంధమంటే. ఇది భూలోకంలోని, భరతఖండానికి మిాదు మిక్కిలి భరతభూమికే చెందిన సాంప్రదాయం. చేతులెత్తి నమస్కరించగల సంస్కృతి.

ముత్తాతగారు ఆడిస్తూంటే మురిసిపోయిన ఘటోత్కచుడు, ఆయన గడ్డాన్ని పట్టుకుని లాగుతూ, నోటితో కొంత గడ్డాన్ని కొరుకుతూ ఆడుతుంటే, కుంతి, పాండునందనులు, అదే తండ్రులు, ఆ పిల్లచేష్టలకు నవ్వడం ప్రారంభించారు.

వ్యాసులు, మునిమనుమడిని తల్లి చేతిలో పెట్టారు.

"అమ్మా! నువ్వదృష్టవంతురాలివి. భరత వంశానికి వారసుడైన కుమారుని కన్న గొప్పతల్లివి! అంటూ మునిమనుమని బట్టతలపై చేతిని సుతారంగా రుద్దితే,

ఆ పిల్లవాడు ముత్తాతగారి, తెల్లటి పొడుగాటి గడ్డంతో ఆడుకోవడం అందరికి ఆనందం కల్గించింది. చాలా కాలం తర్వాత ఆ కుటుంబం యావత్తు సంతోషాల తరంగాల తేలియాడింది.

★★★★

ఆ మర్నాడు, అందరు అగ్నిహోత్రం ముందు కూర్చుని వుండగా, వ్యాసులవారు, ఇక మీరు ఈ రాక్షస రాజ్యం నుండి బయటపడే తరుణ మేతెంచిందని చెప్పారు. అందరు సంతోషించారు, కానీ భీముడు అసహనంగా కదిలాడు. భార్యను, పిల్లవాడిని విడిచిపెట్టడానికి వానికి మనస్కరించడంలేదు.

మళ్ళీ - మహర్షి - ఇక్కడ నుండి బయలుదేరండి. స్వయంవరానికి వెళ్ళండి. అక్కడికి ఎందరో రాజన్యులు, వారి ప్రతినిధులు వస్తారు. ఆ సభలో మిమ్ము చూడగానే తప్పక ఆహ్వానించాలి, ఇదొకటి. ఇంకొకటి - విదురుని ద్వారా, పితామహునికి, రాజమాతకు, మీ విషయం తెలుసు. కానీ తెలియనట్లు నటిస్తున్నారు. అయినా వారు మీ రాకకోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. ఇదే తగిన సమయమని చెబుతారు. ఇది రెండు.

కంగారుపడకండి. గోవిందుడు మీకండ. కాలం కలిసి వచ్చేవరకు బ్రాహ్మణ వేషధారులై కాలక్షేపం చెయ్యండి. సమయం వచ్చినప్పుడా గిరిధారి, మీకు కర్తవ్యాన్ని వుపదేశిస్తాడని సూచించారు. ఇక్కడనుండి ఉత్కోచ తీర్థానికి వెళ్ళండి. ధౌమ్యులవార్ని మీ పురోహితులుగా చేసుకోండి. మీరు అయిదుగురు. అయిదు వ్రేళ్ళవలె కలిసి వుండాలి. అప్పుడే పట్టుదొరుకుతుంది. పంతం నెగ్గుతుంది. ఆ పరమాత్మ కృపకు, ఆదరణకు లోనవుతారని హితవు చెప్పి వేదవ్యాసులవారు నాగకూటానికి బయలుదేరారు.

# సుఖాలు శాశ్వతం కాదు

**కృ**ష్ణుడు ద్వారకకు వచ్చేసరికి, పరిస్థితి అంతా అస్తవ్యస్తంగా వుంది. క్రమశిక్షణ, పోరాటదృష్టి తగ్గింది. సుఖలాలాస పెరిగింది. అతిరథ మహారథుల నందరిని, తాను ఏదో రకంగా తనతో తీసుకువెళ్ళడమే, ఈ అలసత్వానికి కారణమైంది. ప్రతివ్యక్తి, ఇదివరకు దొరకని సుఖజీవితానికి అలవాటు పడిపోయారు. ఇప్పుడు వీళ్ళను తిరిగి వారి వారి విధులలోకి తీసుకురావాలన్నది కృష్ణుని అభిప్రాయం. అందుకు కంకణం కట్టుకున్నాడు.

అంతెందుకు, కృష్ణుడు వచ్చాడనగానే, సుఖభోగాలకు అలవాటు పడిన ప్రతి ఒక్కరు వులిక్కిపడ్డారు. ద్వారక, ప్రభాస, సబరకచ్చా దీవులలోకి, ఓడలు రావడం, బంగారం, వజ్రాలు, ముత్యాలు, చందనాదులు లభించడం, దాంతో విలాసాలు, సుఖభోగాలు, దానికి తగ్గట్లు చక్కని పాడిపంటలు గోసంపద, ప్రతి ఒక్కరిని సోమరిపోతుని చేసాయి. దీనివలన తన పథకాలన్నీ నీరుగారిపోతాయని, విషయలోలురైన వీళ్ళ వలన ఉత్తర భారతంలో తను అమలు చేయపట్టిన, శాంతి, ధర్మ ప్రకాశం, వీరోచిత వ్యవహారాలన్నీ యాదవ ప్రభలను చాటకుండా నీరసించిపోతాయని, అలాగ జరుగకూడదనుకుంటున్నాడు కృష్ణుడు.

కాబట్టి మరల వీళ్ళను మేల్కొల్పాలి. కర్తవ్యతాపరాయణులుగా తీర్చిదిద్దాలి. కృతవర్మ, సాత్యకి రంగంలోకి దిగ సిద్ధమౌతున్నారు. మరల ఉదయాన్నే సముద్రపు ఒడ్డుకు వెళ్ళడం, యధావిధి, రకరకాల యుద్ధ కళలలో శిక్షణ, ప్రయోగాలు ప్రారంభించారు. కుర్రకారు చిత్రంగా చూస్తుంటే, ఓ మాదిరి యాదవులు, మనకెందుకనే తిరస్కార భావం ప్రదర్శించారు. దీనిని గమనించిన కృష్ణుడు, వీరిని సరిదిద్దాల్సిందేనని స్థిర నిశ్చయుడయ్యాడు.

ప్రముఖులనందర్నీ సమావేశపరచి పరిస్థితిని వివరించాడు. ఈ ఉదాసీనత పనికిరాదన్నాడు. ఎవరిమట్టుకు వారు సమరానికి, ఎదురయ్యే ఆటుపోట్లకు సర్వసన్నద్ధంగా వుండాలే తప్ప, ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరిస్తారనుకోవడం చాలా పొరపాటు. పొరపాటున ఎవరైనా వస్తే వాడు, కంసుడో, జరాసంధుడో, రుక్మి, శిశుపాలుడో, అవుతాడు తప్ప, సంరక్షకుడు కాడు.

ఒకప్పటి పాంచాలం వారి అంతర్గత కారణాల వలన, ఉత్తర - దక్షిణా లుగా రెండయింది. ఒకదానికి ద్రుపదుడు మరొక దానికి ద్రోణాచార్యులవారు అధిపతులు. ఒకరికొకరికి పడదు. కోపం పగ, ద్వేషాలతో ఒకర్ని మరొకరు నాశనం చెయ్యాలనే తలంపు కల్గి ప్రవర్తిస్తున్నారు. కంస, జరాసంధుల కథ ముగిసిందంటే, మరొకడు తయారౌతున్నాడు. తాత్పర్యం చేస్తే ఇద్దరు పొటేళ్ళ మధ్య చిక్కిన నక్క అవుతుంది మన పని.

అనవసరంగా, చేకితానుడిని పారద్రోలి, పుష్కర తీర్థాన్ని ఆక్రమించు కున్నారు. ఆ దేశం వలన, సరిహద్దు దేశం నాగకూటానికి ఇబ్బంది. ఆ ప్రక్కన పాండుపుత్రుల దయనీయ స్థితి. ఇటువంటి సమయంలో మానవ వనరులు సంపదలు, పుష్కలంగా కల మనం, ఇతరులకు భయోత్పాతాలు కల్గిస్తూ, మనల్ని తేరిపార చూడాలంటే దడ, వణుకులు పుట్టించాలి.

అటువంటిది పోయి, సుఖభోగ విలాసాలకు కాముకత్వానికి లోనయి, మనకు మనం, దడ, వణుకులతో బాధపడుతుంటే, మళ్ళీ ఏ కంసుడో వచ్చి మనల పీచమడుస్తాడే తప్ప - సుఖభోగాలు పొందమని, విలాసాలను అందివ్వడు. "సుదీర్ఘంగా - ఉపన్యాసంగా కాక, విషయాన్ని వివరించి, పెద్దవాళ్ళు మీరయినా, ఒకరిమీద ఆధారపడక, పిల్లల బంగారు భవిష్యత్తును భద్రం చేసుకోవచ్చును, కదా! ధర్మం నిలబెట్టవచ్చును కదా! ఆలోచించండి!!

"అన్నీ కృష్ణుని వల్లనే జరుగవు. కృష్ణుడేమీ చెయ్యడు. చేసేది, ధర్మం. మన విశ్వాసం, మన నమ్మకం" అని చెబుతూంటే, పెద్దలందరు, తాము చేసిన తప్పుకు సిగ్గుతో తలలు వంచుకున్నారు. తమ ధర్మ నిర్వహణకు సమాయత్తమవ సిద్ధపడ్డారు. ఆ తర్వాత ఇదే విషయాన్ని బలరాముడి దగ్గర కృష్ణుడు ప్రస్తావించాడు. బలరాముడు కూడా, తినడం, త్రాగడం, సుఖపడటమనే స్థితికి వచ్చాడు తప్ప, యదార్థస్థితిని అర్థం చేసుకోలేకపోతున్నాడు. పైగా "తమ్ముడూ! స్వయంవరానికి వెళ్ళు. తోడు వస్తాను. కావాలంటే నువ్వు పాల్గో. నాకవసరం లేదు. వున్న గొళ్ళెం చాలు. మళ్ళీ పెళ్ళాం దేనికి ? సరస వచనాలు మొదలు పెట్టాడు. తన బుద్ధిని, శక్తి యుక్తులను ప్రదర్శించేకన్న, యాదవులు వున్నచోట సుఖంగా వుంటే చాలు. వీళ్ళు ప్రపంచాన్ని ఉద్ధరించనక్కర్లేదు. దేశాలు ఏలవలసిన పనిలేదు. ఉన్నది చాలు." అంటూంటే -

"నిజం. ఉన్నది చాలు. దానిని అవతలివారి నుండి రక్షించుకోవడానికి బలదర్పాలు కావాలి కదా! దానికోసమైనా మనం మనల్ని తీర్చిదిద్దుకోవాలి కదా! అన్నగారి బద్ధకము, అలసత్వము కృష్ణునికి నచ్చలేదు. ఆ సుఖబుద్ధి - సమబుద్ధి అయితే మంచిది, కాదంటే కొంప ముంచుతుందనుకున్నాడు.

కృష్ణుడు మళ్ళీ పెద్దలతో సమావేశమైనాడు. మళ్ళీ మనం చేకితానుని పుష్కర పీఠంపై కూర్చోబెట్టాలి. యాదవుల సత్తా చాటాలి. అంతేకాదు, సర్వనాశనం చేసిన మధురను సర్వశోభాయమానంగా తీర్చిదిద్దాలి. అప్పుడే యాదవ వీరులు ప్రముఖులన్నమాటకు విలువ, గౌరవం. జరాసంధుడిని ప్రక్కన పెట్టమని పాంచాల ద్రుపదునికి చెప్పాను. అటువంటివారికి వత్తాసు పల్కిన, సాయమడిగి శరణు పొందినా, వ్యక్తిత్వం నశిస్తుంది. రాజ్యం వీరభోజ్యమంటూ, స్వతంత్రత పోయి, అవతలి వారికి సామంతులవాల్సి వస్తుంది కాబట్టి అటువంటి ప్రయత్నాలు చెయ్యవద్దని హెచ్చరించాను.

మనలో సమర్థులెందరో వున్నారు. ఆ అతిరథ మహారథులు పాల్గొంటే సునాయాసంగా విజయం సాధించగల్గుతారు. శ్రీకృష్ణుని శక్తి, సత్రాజిత్తు ముందు ఫలించలేదు. తాను తన వాళ్ళు, మౌనం దాల్చారు. కంస మరణానంతరం, మధురకు తిరిగివచ్చిన సత్రాజిత్తు, కృష్ణుని ఒక కుర్రవాడిగా చిన్న చూపు చూసాడే తప్ప, కృష్ణుని శక్తి పాటవాల్ని గుర్తించలేదు. అప్పటికి, ఇప్పటికి అతనిలో మార్పు రాలేదు. అతని దగ్గర సూర్య ప్రసాదితమైన శ్యమంతకమణి వుంది. అది ప్రతి నిత్యం బంగారం కురిపిస్తొంది.

"ఆర్యావర్తము" దానిని జయించడం, యాదవులు ఘనులు అన్నపేరు ప్రతిష్ఠలు, సామ్రాజ్య విస్తరణ, ఇటువంటి విషయాల యందు, సత్రాజిత్తుకు ఏ మాత్రం ఆసక్తి లేదు. కాబట్టి కృష్ణుని మాటలకు విలువిచ్చి ఆతనిననుసరించదలచ లేదు. అందుకే తటస్థంగా వుండాలన్నది సత్రాజిత్తు వుద్దేశం. పైగా ద్రుపదుడు తన కుమార్తెను జరాసంధునికిస్తే పాంచాలం ఆతనిదవుతుంది. అప్పుడు భీష్ముడికి తలనొప్పి, మగధకు తలవంచడమా, దాని తల దించడమా ? అన్నది హస్తినాపుర ప్రభువుల బాధ, బాధ్యత. ఇందులో యాదవులకు వచ్చేది లేదు. పోయేది లేదు. అనవసర పితలాటకం, పూర్తిగా అనవసరమౌతుంది. వాళ్ళలో వాళ్ళు కొట్టుకు చస్తారు. ఎవరి బలం ఎంతటిదో, చివర్లో తెలుస్తుంది. ఇక -

కృష్ణుని విన్నపం. ఎవరికోసమో, మనం త్యాగం చేసి మన ప్రాణాలు పోగొట్టుకోవడమనవసరం. ప్రతివాడు యుద్ధం - యుద్ధమంటాడు. అది వస్తే "శాంతి, శాంతి" అంటాడు. ఈ యుద్ధాలు అశాంతిమయమే తప్ప శాంతి స్వరూపం కావు. ఇది యాదవులకనవసరం. తటస్థంగా వుండి మన ధర్మం మనం నిర్వర్తించుకుంటే అదే పదివేలు. ఈ ధర్మం పేరిట మన వాళ్ళనందర్ని చంపుకోవడానికి అనవసర ప్రయత్నాలు చెయ్యకూడదు. అందుకే సత్రాజిత్తు తటస్థుడు, మౌని అయ్యాడు.

కృష్ణుని ఆలోచనలు, ఆశలు - ఆశయాలు ఇప్పుడెవరికీ అవసరం లేదు. ఇప్పుడందరు స్వయం సమృద్ధి సాధించారు. సుఖంగా వున్నారు. ఇప్పుడనవస రాందోళనలకు, ప్రాణాలు తీసుకోవడానికెవరు ముందుకు రావడం లేదు. స్వార్థం బాగా పనిచేయడం ప్రారంభించింది. ఇక కృష్ణుడు లేడు. అతని అవసరం లేదు.

ఉద్ధవుడు దూరంగా వున్నాడు. సాత్యకి ప్రాణమిస్తాడు. కానీ, ప్రాణం తీసుకునే స్థితిలో లేడు. ఎటొచ్చి కృష్ణుని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేది - తల్లి దేవకి, భార్య రుక్మిణి - సోదరి శైబ్యలు.

దేవకికి తెలుసు - గోవిందుడు దేవుడు.

కృష్ణుడు ఉద్ధారకుడు.

పట్టపురాణి - రుక్మిణికి తెలుసు. తన భర్త దేవాధిదేవుడు, ధర్మరక్షకుడు.

ఆ ధర్మం సత్యం నిలబడుతుంది. అందుకే తన భర్త అవతరించింది.

తాత్కాలికంగా, కృష్ణుని కాదన్నవారు, భవిష్యత్తులో శ్రీకృష్ణ చరణ రక్షకై ప్రాకులాడతారన్నది - రుక్మిణి ప్రగాఢ విశ్వాసం.

**అస్తు. సర్వత్ర విజయం.**

**సర్వేజనాః స్సుఖినోభవన్తు**

**తధాస్తు.**

**అస్తు.**

# "ధర్మం..."

**దీ**నికి అర్థం, పరమార్థం కనబడటం లేదు.

"ఇదెలాగ వుంటుంది ?" అంటే సమాధానం దొరకదు.

నిజమైన ద్వేషం ప్రేమనే కోరుతుందనడానికి నిదర్శనంగా, అభిమానం వేరు, ప్రేమ వేరు" అంటూ శ్వేతకేతుని ఆకర్షించి, కరవీరపురానికి తీసుకువెళ్ళిన శైబ్య, తదనంతర పరిస్థితులలో మధురకు వచ్చింది. ప్రతిక్షణం ద్వేషించింది. అందులోనే తెలియని ప్రేమతో, చివరకు "ధర్మం, ధర్మ"మనే కృష్ణతత్వానికి లొంగి, ఆ ప్రేమకు పొంగి, తనను, తెలియకుండానే కృష్ణునికి అర్పించుకున్న సేవిక అయింది.

ఇప్పుడు లోక క్షేమాన్ని కాంక్షించే ఆ గోవిందుని ధర్మం - పన్నాలు అయ్యాయే తప్ప, ఆలోచించి, అడుగు ముందుకు వేసేవాడు, కృష్ణుని ధర్మాన్ని, ధర్మతత్వాన్ని అర్థం చేసుకునేవారు లేకపోవడంతో, మంచికి లభించే చెడును తలచుకుని బాధపడింది. మహానుభావులైనా, కర్మకు - ధర్మానికి దాసులంటే, ఇదేనేమో... అయినా తన ధర్మంగా, శైబ్య వూరడించడానికి సిద్ధపడుతుందంటే...

శ్రీకృష్ణుని, వాసుదేవుని, గోవిందుని, గోవర్థన గిరిధారి, యశోదానంద"నుని, దేవకీ సుతుని, శక్తిని లోకం అర్థం చేసుకోగల్గితే అదృష్టవంతులు, అందుకు ప్రారంభిస్తే పుణ్యాత్ములు, ద్వేషించకుండా వుంటే ధన్య చరిత్రులు.

ఇప్పుడు ధర్మం ఎవరికి అవసరం లేదు. కర్మమెదురు తిరిగితే, అప్పుడు ధర్మం, గోవిందుడు, ఈ కృష్ణుడు కనబడతాడు. కానీ... ఎవరు కాదన్నా - ఇటు తల్లి, అటు భార్య తనను అర్థం చేసుకున్నారు. వసుదేవ, అక్రూరులు, తన వెనుకనున్నారు. కానీ... ఈ యాదవులు అందరు అనుకున్నట్లు, తాత్కాలిక సుఖాలకు, ప్రలోభాలకు పొంగి, వెఱ్ఱివాళ్ళయిపోతున్నారు. వీళ్ళను సంస్కరించి, సముద్ధరించాలి. ఇదొకటి.

స్వయంవరానికి పెద్దమనిషిలాగ వెళ్ళి, పెద్ద మనుషుల బుద్ధులను గమనించి, అక్కడ - అప్పుడు అవసరాన్ని బట్టి యాదవ కుల ప్రతిష్ఠను

పెంపొందింప చేయు చర్యలను చేపట్టాలి. ఉద్ధవుడు వెళ్ళిన పని విజయవంత మవ్వాలి. ఎదురు తిరిగితే చేకితానుడు అన్యాయమైపోతాడు. ఇటు నాగులు ఎంత ఉద్ధవుని సారథ్యంలో నడిచినా, కురువీరుల ముందు, మోకరిల్లవలసిన పనిలేదు కానీ, విజయం సాధించలేరు. ఇక -

పంచపాండవులు, ఇదే సమయంగా వారు, స్వయంవరం పేరిట, ప్రపంచ పటంలో కనిపించాలి. పట్టంగట్టుకోకపోయినా, పట్టమహిషిగా ద్రౌపదిని చేపట్టాలి. అప్పుడు, అజ్ఞాతవాసం వీడుతుంది. దుర్యోధనాదుల దుష్టబుద్ధి లోకానికి తెలుస్తుంది. అప్పుడు బలహీనపడతారు. ధర్మాత్ములైన పాండవుల శక్తి బలపడుతుంది. తప్పక ద్రుపదుడు, వీరికి బాసటగా నిలుస్తాడు. కాదో - దుర్యోధనుడు విజృంభిస్తాడు. ధర్మం నశిస్తుంది. అన్యాయం పెచ్చరిల్లుతుంది.

ఆర్షధర్మానికి విఘాతం కల్గుతుంది. సత్య, తపో యజ్ఞాలు మసక బారుతాయి. ప్రతివాడు స్వార్థపరుడై తన గురించి చూసుకుంటూంటే, విశ్వ కల్యాణం జరిగేదెట్లో ? అందరు గొప్పవాడు, అవతారపురుషుడు, ధర్మాత్ముడంటున్నారు కానీ, చెప్పింది ఆచరించే సత్తా లేక, నేతి బీరకాయ వలె ప్రవర్తిస్తూంటే, ధర్మప్రకాశమెప్పుడు జరుగుతుంది ? తన వాళ్ళే క్రోసి రాజంటే, తన మాటలు బయటివారు వింటారా ?

**"యతో ధర్మః తతో జయః"** అన్నారు కానీ.

"యత్ - అధర్మః - తత్ః అపజయః" అనలేదు. అంటే మొదటిది లేదు. అనేకదా, దాని అర్థం, పరమార్థం!? రకరకాల ఆలోచనలు. మానవజన్మలో మానవుడు పొందే సర్వసంశయాలు, ప్రతిఘటనలు, ఆరాటపోరాటాలు, భగవంతుడైనా, భగవంతుడికైనా తప్పదు.

అందుకేనేమో - బృందావనంలోని ఆటపాటలు, మథురలోని మల్లయుద్ధ, ఆరాట-పోరాట వీరోచితాలు కళ్ళలో మెదల్తూ చిత్రమైన అనుభూతితోపాటు "ధర్మాన్ని" ప్రశ్నిస్తున్నాయి. ఆ ప్రశ్నల్లో వూహలు, దానికి తగ్గ ఆలోచనలు, ప్రతి సంఘటన, ప్రత్యేకంగా "ఇది ధర్మమా ?" అని ప్రశ్నిస్తున్నట్లుంది. ధర్మము మాత్రం దారి తప్పినట్లు", అవును. నా పని ఇంతే!" నన్నట్లు సమాధానం చెప్పలేక చతికిలబడినట్లుంది.

"ఇది ధర్మమా ? ఇది ధర్మమా ?" అని ఒక్కొక్క సంఘటనే తన చుట్టు తిరుగుతున్నట్లనిపిస్తే, మనసు తలుపులు మూసి (ఆలోచనలు ఆపి) కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు తెలియని ప్రశాంతత. అప్పుడు కళ్ళు తెరిచాడు. నవ్వుతూ, ఎదురుగా రుక్మిణి. నవ్వుతూ ఆమెను చూసాడు. ఆ నవ్వులో ఎంతో ప్రశాంతత, చిన్మయానందం. ఏదో చెప్పాలనుకున్నాడు. కానీ -

మనసు తలుపులు తెరుచుకున్నాయి. మళ్ళీ మొదలయింది "ధర్మ" అలజడి. నవవిధ భక్తికి చిహ్నామైన ఎన్నో సంఘటనలు, ఎందరో మనుష్యులు. తన ఆలోచనలు ఆపి, "అసలు ధర్మమంటే మీకు తెలుసా ?" అని కృష్ణుడడిగాడు.

"ఓ!" తెలుసన్నాడొకడు. అతను చూడటానికి సత్రాజిత్తులాగ వున్నాడు. "ధర్మం - ధర్మ"మని బుఱ్ఱపగులగొట్టుకోనక్కర్లేదు. డబ్బు పడేస్తే అది సునాయాసంగా దొరకుతుంది. మామూలు యాయవార బ్రాహ్మణుల నుండి వేదపండితుల వరకు, వారికి మనమిచ్చిన ధనం, మనకు ధర్మాన్ని ప్రసాదిస్తుంది. అందుకే "ధనమూల మిదం జగత్" అన్నారు. ధర్మమూల మీ జగత్తు అని కూడా చెప్పుకొనవచ్చును." ఈ మాటలకు -

"నీ ధర్మం - అసూయా ద్వేషాల బాల్య చేష్టవంటిది. దీనివలన ...!" అంటూంటే,

"నాకు ధర్మ స్వరూపం బాగా తెలుసు" అన్నాడింకొకడు. పవిత్రాంతః కరణము, పాపరాహిత్యము, దొంగతనం, హత్యలు, ఇతర దురాచారాలు జరుపకుండా సచ్ఛీలుడనై వుండటం, నిజమైన ధర్మం" అంటుంటే -

"పిచ్చివాడా, అది భయ స్వరూపం" అంటూంటే కృష్ణుడు -

"నాకు తెలుసు. ధర్మానుసరణంపై నాకొక అవగాహనముంది...." నేను శాత్రవుల నిర్జించాను. ఎవరైతే పాపదృష్టితో వున్నారో వారిని, అదిలించి, బెదరించి నిర్మూలించాను. దానాలిచ్చాను. ధర్మాలు చేసాను. బ్రాహ్మణులను గౌరవించి, సత్కరించాను. వారు నన్ను కీర్తిస్తే, తగు విధాన సంతోషపరిచాను.

ఇది ధర్మం కాదు. స్వార్థం. పతన హేతువని తెలుసుకుంటే, చాలా మంచిది.

ఇలాగ ఒక్కొక్కరు, ఒక్కొక్క విధంగా, తమ తమ ధర్మాలను చెబుతూంటే, అది విశ్లేషించి, మర్మాన్ని చెబుతూంటే, ధర్మంలోని తత్పరత బయటపడసాగింది.

ఒక్కొక్కరు - తమ ధర్మాన్ని గుంటనక్కగా, దగా, మోసం, కోపం, వ్యాపారం... ఇలాగ స్వార్థదృష్టితోనే తప్ప నిస్వార్థంగా - నిజమైన ధర్మం కోసం, ధర్మబద్ధంగా నడిచేవారరుదయ్యారు.

ఇదంతా కృష్ణుడు - తన కలలో పొందిన "ధర్మ" విశ్లేషణ. అప్పుడనిపించింది. ధర్మం యొక్క దారి, నిజంగా "దారి" తప్పి", "ధర్మ"మన్న మాటకు విలువ లేకుండా చేస్తుందనుకున్నాడు.

ఆశ్రితులకు కృష్ణుడు ధర్మమూర్తి. ప్రాణప్రదుడు, గోవిందుడు వాసుదేవుడు. మరి - రుక్మిణికి ప్రాణవల్లభుడే కాదు - ఒకరిలో ఒకరు దాక్కొన్న ధర్మ స్వరూపం. అనాది సిద్ధ - ఆనంద తరంగం, స్వరూపం.

ఇదీ ధర్మం - దీనినే విశిష్ట ధర్మమంటారు.

దీనిని అర్థం చేసుకునేవారు, ఆచరించేవారు నిజమైన ధర్మాత్ములు.

# పెళ్ళికి వెళ్ళాలి!

**వ**ర్షాలు ఎండగట్టాయి. "వాతావరణం ఎంతో ప్రశాంతంగా వుంది. ఆ ఆహ్లాదకర వాతావరణంలో, పాంచాలం నుండి - ద్రుపదరాజు, తనవారితో, అందరిని స్వయంవరానికి రమ్మనమని, మహారాజు ఉగ్రసేనునకు ఇతర ముఖ్యులకు ఆహ్వానాలు పంపించాడు. ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి, కృష్ణుడు సాత్యకి - కృతవర్మలను పంపితే బాగుంటుందని, కేవలం ఆ కార్యక్రమాన్ని చూడటానికే కాని, పాల్గొనడానికి కాదని, సభా సమావేశం, నిర్ణయించింది.

ఇది సాత్యకికి నచ్చలేదు. తాను, తన వీరత్వాన్ని ప్రదర్శించి, ద్రౌపదిని చేపట్టాలని తలిస్తే, ఈ మంత్రిమండలి నిర్ణయం, అశనిపాతమనిపించింది. పిరికిచర్యగా కూడా కనుపించింది. దీనికి కృష్ణుడు అంగీకరించాడు. ఇది సమంజసమా ? స్వయంవరంలో పాల్గొనకపోతే, చూడటానికెందుకు ? అది వీరత్వ లక్షణమా ? సాత్యకి ఆరాటం కాని, అంతఃశ్శోధన. ఇది నవ్వులపాలయ్యే ప్రయత్నం తప్ప, వీరోచితం కాదు, ప్రశంసాపాత్రమసలే కాదు.

ఈలోగా కార్తీకం వచ్చింది. కృతవర్మ, అతిరథ, మహారథులతో తగు మనుషులు తగు సరంజమాతో అగ్రావన మహారాజు చారుధేష్ణుని వద్దకు బయలుదేరారు. యాదవరాజులనందరిని పిలిపించి, ఒక సమావేశం ఏర్పాటు చెయ్యమని, అలాగే కృష్ణునితో కలిసి మార్గశిర శు. ఏకాదశి నాడు జరిగే పవిత్ర కార్యక్రమంలో పాల్గొనాలన్న కృష్ణ సందేశంతో బయలుదేరి, ఆ సందేశ వివరాలను, ఉద్ధవునికి కూడా అందించాడు.

సాత్యకి మాత్రం అసహనానికి గురయ్యాడు. ఆవేశం కట్టలు తెంచు కుంటూంటే, తాను తన అనుచరులతో కృష్ణునికంటే ఓ పక్షం ముందు బయలుదేరి వెడుతున్నానని చెప్పాడు. యాదవ ప్రముఖులొక ప్రక్కన, కృతవర్మ-సాత్యకిలు మరొక ప్రక్కన, ఒకరికొకరు అర్థం కాని విధంగా ప్రవర్తిస్తున్నారు.

జరిగే పరిస్థితులన్నీ సత్రాజిత్తుకు సంతోషాన్ని కల్గిస్తున్నాయి. ఏకైకవీరుడు, యదుప్రముఖునిగా తలచే కృష్ణుని ప్రతిభకు, నీలినీడలు వ్యాపిస్తున్నాయి. ఇప్పుడు కృష్ణుని మాట వినేవారు లేరు. ఇది సత్రాజిత్తుకు - ఎందుకంటే డబ్బున్నవాడు కాబట్టి, ఆతనికి ఆనందకరమయింది. సాత్యకి, ఒక రకంగా, కృతవర్మ మరొక రకంగా ప్రవర్తిస్తున్నారు. వీళ్ళను కాదని అదే వద్దని, కృష్ణుడు చేకితానుని పునః ప్రతిష్టింపచేసి తాను లీలావినోదునిగా, ద్రౌపదిని చేపడతాడా ?

ఏమో... అన్నిటికి సమర్థుడే, ఆ పిల్లవాడు. ఇక్కడ మనం కాదంటున్నా, ఇంకా అతనికి బయట ప్రపంచంలో రాను రాను, అభిమానులు, వీరాభిమానులు పెరుగుతున్నారు. కృష్ణలీలా విలాసానికి పరవశిస్తున్నారు. మొత్తానికి సాత్యకి మార్గశిర శు. పాడ్యమి నాడు, అగ్రావనానికు వెళ్ళి చారుధేష్ణుని కలవాలని ముహూర్తం పెట్టుకున్నాడు.

తొలిచుక్క పొడిచింది. అనుకున్న సమయానికి కృష్ణుడు తన పరివారం (అదే సైన్యం) తో సాత్యకి, తాను కలుద్దామనుకున్న ప్రదేశానికి వెడితే, సాత్యకి లేడు. కాని ఆతని అనుచరగణమైన మహారథులు వున్నారు. సాత్యకి కనబడక పోయేసరికి, కృష్ణుడు ఆశ్చర్యపోయాడు. తన ప్రతిష్టకు పొగబారిందో ? లేక తన ప్రతిభకు మసిబాసిందో - ఒక్కక్షణం అర్థం కాలేదు.

అసలే ద్వారకలో అందరు - కొందరు అసహనంలో వుంటే, ఇంకొందరు పరిహసిస్తున్నారు. మరికొందరు ఉదాసీనత వ్యక్తబరుస్తున్నారు. ఇటువంటి తరుణంలో సాత్యకి ఆదృశ్యం - కృష్ణుని ఆలోచింప చేసింది. అతని మహారథి - ఆహుకిని, సాత్యకి గురించి, కృష్ణుడడిగాడు. గబగబా పరుగెత్తుకు వచ్చి ఎంతో వినయంగా తెలియదన్నాడు. రాత్రి ఇంటికి గూడా రాలేదుట. ఆయన రథమిక్కడే వుంది. ఎక్కడికి వెళ్ళారో తెలియదుట.

ఆహుకుని మాటలకు ఆశ్చర్యపోయాడు. ఎక్కడికి వెళ్ళాడు ? మేనమామ గారింటికి వెళ్ళినవాడు తిరిగి వచ్చాడు. ఆ వచ్చినవాడు ఎక్కడికి వెళ్ళాడు ? శుభముహూర్తంలో బయలుదేరాలి. సరే బయలుదేరండి'' అన్నాడు. బ్రాహ్మణులాశీస్సులందించారు. గుర్రాలు ముందుకురికాయి. రథాలు బయలుదేరాయి.

బయలుదేరండి. సాత్యకి తప్పక కనుపిస్తాడు. అనవసరంగా ఇక్కడ వుంటే, ఈ పనిలేని కొందరు యాదవుల నోళ్ళకు మనమాహారమౌతామన్నాడు. బయలుదేరారు. ఆ తదుపరి కృష్ణుడు "గరుడిని చూసి రేపు రాత్రికల్లా, తగు ఆయుధాలతో నువ్వు నన్ననుసరించాలి'' అన్నాడు.

బాహుకుని ప్రక్కకు త్రప్పుకోమని, రథం పగ్గాలు కృష్ణుడందుకున్నాడు. ఆ చేతి మహాత్మ్యం తెలిసిన గుఱ్ఱాలు, అత్యంత లాఘవంగా, వేగంగా పరుగు ప్రారంభించాయి. ఆ పరుగులో ఆనందం తప్ప అలసట కనబడదు. అలాగ పరుగెడుతున్నాయా గుఱ్ఱాలు, మరుక్షణం తన భవంతి వద్ద ఆగాడు. కృష్ణుని చూసి "ప్రభూ!'' కాపలాదారుడాశ్చర్యపోయాడు.

రుక్మిణి మందిరంలోకి వెళ్ళి "విదర్భ రాజపుత్రీ! నా శారంగం, చక్రం, కౌముదిలు ఇమ్మన్నాడు. వెంటనే వెళ్ళాలి. సాత్యకి కనబడటం లేదు. కారణం తెలియదు. నా జాగ్రత్త నాది. త్వరత్వరగా వెడితేనే తప్ప, సాత్యకి ఆచూకీ కనుగొనలేము'' కనుక క్షణమెక్కడా ఆలస్యం చెయ్యకుండా బయలుదేరాలి.

శుభముహూర్తం దాటిందో, ఆ అపజయమేదో ఇక్కడే అనుభవించాల్సి వుంటుంది. ఇది వీరత్వానికే కాదు, పరువు ప్రతిష్టలకు గూడ - సమయం. అన్నవాడు రుక్మిణి కళ్ళలోకి సూటిగా చూస్తూ "ధర్మం గురించి చెబుతానన్నాను

చూడు. అది ఇప్పుడు చెబుతాను. వెళ్ళి అన్నగారితో, సాత్యకి కనబడటం లేదని చెప్పు. ఇదొక మాయానాటకంగా వుంది.

చేకితానునికి రాజ్యమిప్పిస్తానన్నాను. కర్కోటకుడికి యాదవులు, నాగా ప్రాంత సరిహద్దులు విడిచిపెడతారన్నాను. ద్రుపదునితో, నీ పిల్ల స్వయంవరానికి సాయపడతానన్నాను. ద్రౌపదికి - మంచి భర్తను ఎంచుకోవడంలో సహకరిస్తా నన్నాను. ఇదంతా అతనికే చెప్పు - మెల్లిగా .... అని

రాజమాత సత్యవతీదేవికి, పంచపాండవులు తప్పక, ద్రౌపదీ స్వయం-వరంలో పాల్గొంటారని మాట ఇచ్చాను. నా మాటలు నావయిపోయాయి. యాదవులు మాట తప్పారు. నేను మాత్రం మాట తప్పను. నా విద్యుక్త ధర్మ నిర్వహణం చేస్తాను. ధర్మ పరిరక్షణం గావిస్తాను. ఎత్తిన అవతార కార్యం "ధర్మ" బద్ధంగానే నిర్వర్తిస్తాను.

ఇన్నాళ్ళు నేను ధర్మం కోసం తపిస్తే -

ఇప్పుడు ధర్మం నన్ను తప్పించ - తపిస్తుంది.

ఎవరో ఒకరు ధర్మం విడిచారని, అందులో యాదవులు - ధర్మ విరుద్ధు లౌతున్నారని, నే ధర్మం విడిచిపెట్టను." ఇప్పుడు - నన్ను - నా ధర్మాన్ని తెలుసుకొమ్మని - ముందడుగు వేసాడు.

## ఎందుకీ కుట్రలు ?

**రు**క్మిణిలో తెలియని ఆందోళన. వెంటనే శైబ్య దగ్గరకు వెళ్ళింది. నిద్రపోతు న్నామెను లేపి, జరిగిందంతా చెప్పింది. అపారమైన ఆత్మశక్తి గల శైబ్య "అక్కా! గోవిందుడు చెప్పినట్లు బావగారి దగ్గరకు వెళ్ళి, ఆయన చెప్పమన్నది, చెప్పు. నేను దేవకీమాత వద్దకు, వసుదేవుల వారికి చెబుతానంది.

ప్రస్తుత పరిస్థితిలో దుస్తులు మార్చుకోవాలని కానీ, తల దువ్వుకోవాలని కూడా అనిపించకుండా, హడావుడిగా బయలుదేరి "అక్కా!" అంటూ రేవతిని లేపింది. "ఏవిటంటూ.. రేవతి లేచింది. ముందు బావగార్ని చూడాలి. మీ మరది బయలుదేరి వెడుతూ, మా పెద్దన్నకు... అంటూ సందేశాన్నిచ్చారు. దానిని

బావగారికి తెలపాలి'' అంది. ఆమె కంగారు, ఆందోళనకు క్షణం విసుక్కుంది. ఇప్పుడు...!'' రేవతి నసుగుతుంది. “తప్పదు.'' అంటే రుక్మిణి, ఈ వాదంలో బలరాముడు ఏవిటా గొడవ! అని రేవతిని అరచి, లేచినవాడు, ప్రక్కకు దొర్లాడు. అప్పుడిక విధిలేక “ప్రభూ! మన గోవిందుడు...!'' ఆ మాటతో, ఏమయిందంటూ కళ్ళు తెరచి, లేచి కూర్చున్నాడు.

“రుక్మిణి... ఇక్కడే వుంది. ఆమె ఏదో చెప్పాలిట.'' అనడంతో - బలరాముడు కొద్దిగా శాంతపడి “ఏమయిందమ్మా ?!!'' అనే లోపున, రేవతి.

“వున్నట్టుండి మీ తమ్ముడు, పుష్కర తీర్థానికి వెళ్ళాడుట. సాత్యకి కనబడటం లేదు. ఏం జరిగిందో తెలియదు'' అంటూంటే, రుక్మిణిని పిలు గట్టిగా అసహనంగా చూసాడామెను.

రుక్మిణి జరిగింది చెప్పింది. కృష్ణుడు చెప్పమన్నవి చెప్పింది. యాదవులు, ఆయనపై చూపే నిర్లక్ష్య భావానికి మీ తమ్ముడెంతో బాధపడ్డాడు. ఎవరు ఏమనుకున్నా, ఎలాగ ప్రవర్తించినా సరే..!'' అంటూ చేకితానుని నుండి, సత్యవతీ మాత వరకు సర్వ విషయాలు వివరంగా చెప్పింది.

“మంచిది. గొప్ప పని చేసాడు. ప్రతిజ్ఞలు చెయ్యడం, ప్రాణాలమీదకు తీసుకురావడం పరిపాటయిపోయింది. ఇంకీ అలవాట్లు పోవనుకుంటాను.

“ఎందుకు పోతాయి ? కొందరికి విందులు, వినోదాలే జీవితం. కొందరికి ధర్మమే జీవితం. ఆ ధర్మపథం మీ సోదరునిది. అధర్మపథం మనది. ఎవరు కాదన్నా ధర్మమార్గం మారదు. అందుకు ఈ కృష్ణుడు ముందరుంటాడన్నారు.

అంటే మేం సుఖపురుషులం. అతడు...!'' అని “ఊ...! కృష్ణా!... !'' అని ఏం సమాధానం చెప్పాలో తెలియక సతమతమవుతూంటే, రుక్మిణి మనోవేదనను గమనించిన రేవతి “ఊరుకో!'' అంటూ ఓదార్చసాగింది. అప్పుడే బలరాముడు కూడా రాత్రి త్రాగిన మత్తు దిగడానికి, కుండెడు నీళ్ళు నెత్తిన పోసుకున్నాడు. అప్పుడు, విషయం బోధపడసాగింది.

కృష్ణుని విడిచిపెట్టి, అసలీ సాత్యకి ఎక్కడకు వెళ్ళినట్లు ? ఎక్కడికైనా తానే వెళ్ళాడా... లేక... ఎవరైనా ?'' అనుకుంటూ బుర్రకు పదును పెట్టడం ప్రారంభించాడు. అప్పుడు రేవతి కల్పించుకుని “సాత్యకి పిరికివాడు కాడు.

అతన్నెవరైనా చంపైనా వుండాలి. బలవంతంగా ఎత్తుకునైనా పోయి వుండా"లంది. రేవతి మాటలతో "ఎవరు చేసి వుంటారీ పని!" ఇప్పుడు మత్తు దిగుతున్న బలరామునిలోని ఆలోచన. మత్తు పూర్తిగా దిగి మనిషయిన బలరాముడు -

"రుక్మిణీ, తప్పు చేసాను. అన్నీ తెలిసిన నేనే కృష్ణునికి విరుద్ధంగా ప్రవర్తించడం, నిజంగా తమ్మునికి బాధనిపించింది. అందుకే నాతో చెప్పకుండా వెళ్ళిపోయి, నీ ద్వారా కబురు పంపాడంటే, అతనెంత బాధపడ్డాడో, నేనెంత తప్పు చేసానో, అర్థమౌతుంది.

వెంటనే మంచం దిగాడు. ఒళ్ళు విరుచుకున్నాడు. వరండాలోకి వచ్చాడు. శంఖం తీసుకున్నాడు. ఓపినంత వూదాడు. ఆ శంఖధ్వనికి, బిలబిలమంటూ, బిర బిర వున్నవాళ్ళు వున్నట్లే రాజభవనంలోని సభాప్రాంగణానికి వస్తున్నారు. అది బలరాముని శంఖం. అతడు సామాన్యంగా శంఖమూదడు. ఏదో ప్రమాదం సంభవించి వుండాలి" అని లేచినవాడు లేచినట్లు, లేస్తున్నవాడు అలాగే దొరికిన కండువా భుజానవేసుకుని వురుకుల పరుగల వస్తున్నారు.

మహారాజు ఉగ్రసేనుడు, వసుదేవుడు, అక్రూరుడు, ఇతర యాదవ ప్రముఖులు, అంతా ఉదయమే, సత్వరమే వచ్చి కలిసారు. బలరాముడక్కడే వున్నాడు. గతమంతా, అతన్ని ఆ క్షణంలో పలుకరిస్తుంది. వర్తమానంలో అతను చేసిన బాసలు, భవిష్యత్తుపై ముఖ్యంగా యాదవుల పరాక్రమాలపై గల సదాలోచనలు, ఇన్నీ తెలిసి, అన్నీ తెలిసి, గోవిందుని ఇబ్బంది పెట్టిన తీరు బలరాముని కలచి వేస్తూంది.

యాదవుల ఈనాటి సుఖసంతోషాలకు నిజమైన, మూలపురుషుడు - ఆ - గోవిందుడు. అన్నీ అనుభవిస్తూ,నీతో అవసరమేమిటి ? మా బ్రతుకులు మావని, సత్రాజిత్తు వంటి మూర్ఖులు, తన సంపదలతో, ధనమదంతో, సామాన్యుల కొందరిని, సామరస్య వాతావరణం, గోవిందుని శక్తి కాదని, విరుద్ధ భావాలు కల్పించి, ఆ విధంగా నడిపింప చేయడం.

అందుకు జ్ఞానం గల వారు కూడా, బుర్రను పనిచేయించకుండా, వాసుదేవుడిని ఇబ్బంది పెట్టడం నిజంగా చేసిన పెద్ద పొరపాటు. దీనినుండి నిష్కృతి లేదు. ఇప్పుడు వీళ్ళను తప్పక సంస్కరించాలి. సత్యం బోధించాలి.

జ్ఞానం కల్గించాలి. ధర్మం తెలుపాలి. ఇది గోవిందుని సోదరునిగా తన తక్షణ కర్తవ్యంగా తలిచాడు. ఆ వచ్చిన వాళ్ళందర్ని ఒకసారి చూసాడు.

“మీరంతా పిరికిపందలు, విశ్వాసఘాతకులు, ప్రాణమిచ్చినవాడి ప్రాణం తీయడానికి సిద్ధబడ్డ కృతఘ్నులు. మధురలో మీ పరిస్థితి. ఇక్కడి పరిస్థితి గమనించుకోండి. ఏ అపకారం లేకుండా ఉపకారం చేసిన గోవిందుడు, మీకో ధర్మోపదేశం చేసి, ఆర్యావర్తంలో మిమ్మ, అత్యున్నత స్థానంలో ఉంచాలని తలిస్తే, మీరు చేసింది ఎంత పాపమో, ద్రోహమో ఆలోచించండి. మీ వంటి అందరు కలిసి, గేలిచేసి, సంపదల సుఖాలు మరిగి, ఆతనిచ్చిన ప్రాభవాన్ని అనుభవిస్తూ ఆ వాసుదేవుని లెక్కచెయ్యకపోవడం” క్షణమాగి కృతఘ్నులకు ధర్మం గురించి చెప్పినా అర్థం కాదని, మనలనందరిని విడిచి, తన ధర్మపథ నిర్మాణానికి తగు ఏర్పాట్లు చేయడానికి, తరించదలచిన వారిని తరింప చెయ్యడానికి వెళ్ళిపోయాడు. ఆ క్షణకాలం నిట్టూర్చి “కృష్ణునికి భయపడి ఇక్కడి కెవరూ రారు. పొరపాటున వస్తే సుఖలాలసులము, భోగలాలసులమైన మనం ఏం చేస్తాం ? కాళ్ళు పట్టుకుంటామా ? పారిపోవ దారి చూసుకుంటామా ? చెప్పండి” లేక -

“వచ్చిన వాడికో మందుసీసా యిస్తామా ? లేక వున్న సర్వసాన్ని వాడే దోచుకుని, పో, పొమ్మంటే, సముద్రంలో దూకి ఛస్తామా ?” ఆలోచించండి. తానెవరితో మాటాడుతున్నాడోనన్న సంగతిని విడిచి, మరిచి, శ్రీ కృష్ణుని అంతరంగ బోధను, బాధను, వినిపిస్తున్నాడు. ప్రస్తుతం మనం పిరిపిపందలుగా, ధర్మవ్యతిరేకులుగా, ప్రవర్తిస్తున్నాం. అందుకే - కృష్ణుడు, ఒక సవాలు విసిరి వెళ్ళిపోయాడు. దానికి జవాబు చెప్పాల్సిన బాధ్యత మన అందరిది. ఈ తప్పిదంలో నాకు భాగముంది. నేను కృతఘ్నుడినేన్న వాదనను, వేదనగా వినిపిస్తూన్నాడు.

లేవండి. అతిరథులందరు అప్రమత్తం కండి. మహారథులు బద్ధకం విడిచి, మాన, ధన, ప్రాణ సంరక్షణలకు సిద్ధం కండి. నా ఇల్లు, నా వాకిలి, నా భార్య-పిల్లలనేవారు, అవన్నీ భద్రంగా వుండాలంటే మనం బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఇవన్నీ మరిస్తే భద్రతెలాగ వుండదో, అలాగే మన అలసత్వం మనల్ని బ్రతుకనివ్వదు.

అందరు బయలుదేరండి. అగ్రవనానికి వెళ్ళి చారుధేష్ణను కలుసుకుందాం. అక్కడికి వెళ్ళేపరికి, ఆ గోవిందుడు, మనకు దిశామార్గం చేస్తాడు. ఆ రకంగా

ముందుకు సాగుదాం! మహారాజు ఉగ్రసేనుడైనా, ఆ పరిస్థితులలో ద్వారకా సంరక్షకులుగా మార్గదర్శకునిగా, ఆజ్ఞలు జారీ చేస్తాడు. తప్పదు.

మరి నా కుమారుడో.... సాత్యకుడు అడిగాడు. అదే కదా ప్రస్తుత ఆలోచన. కదిలితే తెలుస్తుంది. ఏం జరిగింది ? ఎలాగ జరిగిందన్నది ? అప్పుడు, బలరాముడు" సాత్యకి చిన్నపిల్లవాడు కాదు. సర్వసమర్ధుడు. అతన్ని అల్లరిపాలు చెయ్యడమంటే కొరివితో తల గోక్కున్నట్లవుతుంది. నిప్పును వళ్ళో మూటకట్టుకున్నట్లుంది. భయపడకండి.

"అయితే మంత్రిమండలిని పిలుద్దామా ?" అన్నారెవరో. చద్దన్నం మాగాయ పచ్చడితో నంజుకుతింటూ కూర్చుంటే, ఆ మండలి ఏం చేస్తుంది ? అందులో వున్నదీ మనమే కదా ?" ఎద్దేవా చేస్తున్నట్లు, విషయం అర్థం చేసుకోలేని, వారితో తను మాట్లాడుతున్నట్లు గట్టిగా అరచి చెప్పాడు.

నిజం, నిజమని - అందరు ముందు కృష్ణునికి, ఆ తదుపరి మహారాజులు, ఆపైన ఇంతటి కదలిక తెచ్చిన బలరామునికి జయజయ ధ్వానాలు చేసారు.

★ ★ ★ ★

సాత్యకి, చేకితానుని, పుష్కర పీఠమెక్కించాలనే ఆలోచనతో, కృత నిశ్చయంతో, అనుకున్న దానికంటే ఒక పూట ముందు బయలుదేరాలని తలిచాడు. ఎవ్వరు ముందుకురాని, కృష్ణుడు మెచ్చే అపురూప కార్యక్రమంలో స్వంతంగా భాగస్వామ్య పొందుతున్నందులకతడెంతో ఆనందంగా వున్నాడు. మొదట్లో కృష్ణుని కాదని ముందుకు వెళ్ళడానికి భయపడ్డాడు.

కానీ, కాలం తెచ్చిన మార్పులు, ధర్మమిచ్చిన ధైర్యంతో "ధర్మమేవ జయతే", సత్యమేవ జయతే" నని మహామూర్ఖులై సుఖసంతోషాలు, భోగలాల సత్వం పొంది స్వప్రయోజనం కోసం బ్రతికే అప్రయోజకులను, చూసి అసహ్యించుకుని, తన మార్గాన్ని తానే నిర్దేశించుకున్నాడు.

ఉద్ధవుడు - గోవిందుని మనసెరిగిన మనిషి. అన్ని విషయాలలో, తలలో నాలిక వలె వుండువాడు, ప్రస్తుతం నాగకూటంలో హాయిగా వున్నాడు. ప్రభూ! అనే గోవిందుని, ధర్మావతారుని విడిచి ఎలాగ వుంటున్నాడో.... అదొక అసూయగా

తయారయింది. ఆ తదుపరి వాసుదేవుని ఆనతికాదని బ్రతుకలేని ఉద్ధవుడు, అలాగే వుంటాడని, తనకు తానే అనుకున్నాడు. సర్ది చెప్పుకున్నాడు.

మర్నాడు తెల్లారేసరికి తాను, అగ్రవనంలో ఉంటాడు. అందర్ని కలిసి కట్టుగా, ఒక కూటమిగా చేసుకుని, పుష్కరంపై ఊహించని దండయాత్ర చేసి, అక్కడ జరిగే జాతరలో పాలు పంచుకోవాలన్నది, సాత్యకి అభిప్రాయం. అందుకనే ప్రస్తుత పరిస్థితిలో వాసుదేవునికి ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా వుండాలని, అకస్మాత్తు నిర్ణయంగా, ఈ విధంగా బయలుదేరాడు. కాకపోతే -

# ఎందుకు బంధించారు ?!

**మే**నమామగారింటి నుండి బయలుదేరిన సాత్యకి, ఆ చీకటి సమయంలో, మెల్లిగా వస్తుంటే ఎవరో పిలిచారు. "ఎవరా ?'' అని ఆలోచిస్తే అది విన్న గొంతుకే అది, అది.... ఆ... ఆలోచించాడు. అది... అది జయసేనునిది. ఇంటికేనా ? అని అడిగాడు. ఇద్దరు కలిసి బయలుదేరారు. కొంతదూరం వెళ్ళేసరికి అక్కడ చీకటిగా వుంది. ఎవరో కొందరు రావడం, కట్టిపడేయడం, రథంలో పడేసి, బలవంతంగా ఎత్తుకు వెళ్ళడం. రథం నడకను బట్టి ఆ వెళ్ళేది - రైవతకాద్రివైపు అని మాత్రం సాత్యకి వూహించు కుంటున్నాడు.

ఆ ప్రాంతమాతనికి కొట్టిన పిండి. పీఠభాగాని కొచ్చారన్న మాట ఎత్తి మూటపడేసినట్లు పల్లకిలో పడేసారు. అంటే - ఎవరో ఎత్తుకు పోతున్నారు. వారెవరో అర్థం కావడం లేదు. దీనిలోని ఆంతర్యమేమిటో కూడా వూహించుకోలేక పోతున్నాడు. కాకపోతే అతన్ని రైవతకాద్రిలోని కోట దగ్గరకు తెచ్చినట్లు, దాని తలుపులు తీస్తున్నట్లు గ్రహించాడు.

అంటే తననిక్కడెక్కడో, బంధించి, మృత్యువుకు గురి చేస్తారా! తన ఆశలు అడియాసలవుతాయా ? ఆ గోవిందుని సాన్నిహిత్యం, చెలిమి, బలిమి మొత్తం వృథాయేనా ? అయిపోయిందా నా జీవితం ? తీవ్రాందోళనకు గురవుతున్నాడు.

తననక్కడ పడేసి గబగబ వెళ్ళిపోయారు. అక్కడ చీకటి రాజ్యమేలుతుంది. కట్లు అయితే త్రెంచుకున్నాడు. కాని, ఆ కటిక చీకటిలో, తన వునికిని మాత్రం

తెలుసుకోలేకపోతున్నాడు. కొద్దిక్షణాలు గడిచేసరికి, సాత్యకి కళ్ళు చీకటికి బాగా అలవాటు పడ్డాయి. స్పష్టంగా ఆ గదిని, అందులో వున్న పురుగులు, వగైరాలను చూడగల్గుతున్నాడు.

అటూ ఇటు కదిలాడాడు. దూరాన మినుకుమినుకు మంటు లోపలికి వస్తున్న అస్పష్ట దీపకాంతి. గట్టిగా తలెత్తితే బుర్ర పగులుతుంది. మెల్లిగా ప్రాకుతూ, కనుపించే అస్పష్టపు వెలుతురు వైపు సాగుతున్నాడు. అది చంద్రకాంతి. తననిక్కడకు చంపడానికి తెచ్చారా లేక కొంతకాలం రహస్యంగా దాచడానికి తెచ్చారో అర్థం కావటం లేదు. ఈ దుశ్చర్యకు పాల్పడినవారు.. ఆ కృష్ణ విరోధు లెవ్వరు ? వీరోచిత పోరాటాలకు వెళ్ళనివ్వకుండా ఆపే మూర్ఖులెవరు ?

ఈ ఆలోచనలలో ఏదో పురుగు కుట్టింది. "గోవిందా" గట్టిగా అరిచి, నన్నీ కూపం నుండి బయటపడెయ్యమని ప్రార్థించాడు.

రాత్రి గడిచింది. తెల్లవారింది. చంద్రకిరణాల బదులు చంద్ర (సూర్య) కిరణాలు. సూర్యకాంతి కళ్ళలో సన్నగా పడుతుంది. అర్ఘ్యమివ్వాలి. నీళ్ళు లేవు. స్నానం చెయ్యలేదు. తిండి, నీళ్ళు లేకపోయినా, కొన్ని దినాలు వుండవచ్చును. మరిక్కడ నుండి బయటపడే మార్గం ?

క్షణాలు గడుస్తున్నాయి. పరిస్థితి అంతా అయోమయంగా వుంది. ఎలాగ బయటపడాలి ? ఈ ఆలోచనలలో ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు. జాగ్రత్తగా ఒక ప్రక్కన నక్కివుండి, చాటుగా, దొంగదెబ్బ తీసి పారిపోవాలన్న ఆలోచనలతో వూపిరి బిగపెట్టి నిలుచున్నాడు. నెమ్మదిగా ఆ బిలం దారి తెరచుకుంది. ఎవరు రావడం లేదు. వచ్చే వారికోసం ఎదురుచూస్తుంటే, ఆ వచ్చిందో, ఆడది. అంటే ఒక స్త్రీ తనను ఎత్తుకొచ్చిందా ? ఆశ్చర్యపోయాడు.

లోపలికి వచ్చినామె, ఓ సాత్యక కుమారా, రా! మేము నిన్నేమి చెయ్య మంటూంటే, ఆ గొంతు విన్నట్లుంది. ఎవరు ? ఇంతవరకు చీకటిలో ఉన్న సాత్యకి కళ్ళు వెలుతురుకు అలవాటు పడటానికి కొంత సమయం పట్టింది. మెల్లిగా బయటికి వచ్చి "ఎవరు నువ్వు. ఎందుకు బంధించావు." కొద్దిగా ఆవేశంతో అడుగుతున్నాడు. చెట్టంత మనిషిని ఆడవాళ్ళు ఎత్తుకుపోవడం, చెప్పుకోవడానికి అమర్యాదకరం కూడా! తలుచుకుని బాధపడుతున్నాడు.

"రా. చెబుతాము" అంటున్నారు. వాళ్ళను అనుసరించాడు. చక్కని అందగత్తె. ఆ నడక, ఆ చూపులు మరచిపోలేకపోతున్నాడు. ఆమె రమ్మంటుంది. ఇతను అనుసరిస్తున్నాడు. పై అంతస్థులోకి తీసుకు వెళ్ళింది. బంగారు, వెండి, వజ్రాలు, రత్నాలు లక్ష్మీదేవి బొమ్మ.... అదంతా ఒక కలగా వుంది. ఆమె ఎవరో తెలీదు. తన పరిస్థితి తనకు అర్థం కావడం లేదు. నడుస్తున్నామె ఆగిపోయింది. వెళ్ళు. స్నానం చెయ్యి. కావల్సింది తిను. సంతోషంగా వుండు. ఆ తర్వాత మాట్లాడుకోవచ్చంది. ఆశ్చర్యపోతున్నాడతడు.

జరిగేది చూస్తుంటే సాత్యకికి పిచ్చెక్కినట్లయింది. నెత్తిమీద చెయ్యి పెట్టుకుని కూర్చున్నాడు. అంతా అయోమయం, అగమ్య గోచరంగా వుంది. ఈమె... ఈమె... సత్యభామా ? సత్రాజిత్తు కుమార్తా ? చూస్తుంటే అవుననే అనిపిస్తుంది. పరిస్థితులు అలాగ వున్నాయి. దానికి తగ్గట్లు, ఆ అమ్మాయి నిజం చెప్పేసింది. ఇచ్చటి బంగారం, నగలు కూడా ఉన్నతస్థాయి స్థితిని చూపిస్తున్నాయి. అంటే సత్రాజిత్తు తననిలాగ చేయించాడా ?

తల కొట్టేసినట్లు అవమానం పాలవుతున్నాడు. ఆమె నవ్వుతూ "మీరు అనవసరంగా ఆలోచించకండి. కొద్దిగా మంచినీళ్ళు త్రాగి ప్రశాంతతను పొందండి. తర్వాత విషయాలు... ఆలోచిద్దాం.

ఇక ఆలోచించేదేమిటి, చేసేవన్నీ చేసేసి ?" కోపంతో వుడికిపోతున్నాడు. ఆమె గలగల సెలఏరులాగ నవ్వుతూ

"పిచ్చివాడా! ఈ పని నేనే చేయించాను. నా తండ్రికి ఇందులో ఏ కొంచెము భాగం లేదు. సరికదా, నువ్వసలిక్కడ వున్నట్లు గూడా ఆయనకు తెలీదు."

"అంటే నా తండ్రి నిన్ను కాదన్నాడని, ఈ రకంగా ప్రతీకారం తీర్చుకుంటు న్నావా ?" ఉక్రోషంగా అడుగుతున్నాడు.

"చూడు సాత్యకీ. నీ మీద నాకు మనసు లేదు. నా తండ్రి అడిగాడు. మీ నాన్న కాదన్నాడు. ఆ విషయం అంతటితో సరి. ఇప్పుడు నేను నిన్ను ఎత్తుకు రావడంలో ఏ స్వార్థం లేదు. నీకు మేలే తప్ప. జయసేన బృందం నిన్నెత్తుకు పోవాలని పథకం వేసింది. వారినుండి నిన్ను తప్పించాను. ఇక్కడ దాచాను. అంతే...!

వాళ్ళ చేతుల్లో పడితే, నీ దూకుడికి వాళ్ళీపాటికి చంపేసి వుండేవారు. ఇక నేనెందుకు రక్షించానంటావా, నీ ద్వారా, ఆ వాసుదేవుడి ప్రేమను పొందాలని,

తెలిసిందా ? ఆ గోవిందుడు, గోవర్ధనగిరిధారి అసామాన్యుడు. ఆ మహామనీషికి, నీవు ప్రక్కన తోడుగా వుండాలి. ఆ ధర్మాత్మునికి కవచంగా నువ్వుండాలి. తెలిసిందా ?

ఆ మాటలతో సాత్యకి చల్లబడ్డాడు. అప్రయత్నంగా "సత్యభామా!" అనేసాడు. అవును తలూపింది, కళ్ళతో సమాధానమిచ్చింది. అంతేకాదు, కృష్ణుని కోసం అనంత సంపదగల నేను, గుర్రాలు, రథాలు, వగైరా ఎన్నో అందిస్తున్నాను. అర్థం చేసుకో. కృతవర్మ కోటీశ్వరుడు కానీ, అతని దగ్గర ఏ ధనం మూలగడం లేదు. అది మూలిగేది మా వద్దనే. మా దగ్గర ఎంత వుందో, మా నాన్నకే తెలియదు. ఎంత వస్తుందో తెలిస్తే, ఎంత పోతుందో తెలుస్తుంది. కనుక, అవనసర వాదులాటలు, చర్చలు మాని, కృష్ణుని సేవకు తరలి, పో" సత్యం చెప్పింది, సత్యభామ.

"నిజం...!" ఆశ్చర్యపోతున్నాడు, సాత్యకి.

"నిజం. నీకు ఇంకో విషయం చెబుతాను. జాగ్రత్త. అది పరమ రహస్యం....!" అనగానే -

"చెప్పు"మని అడిగాడు.

"గోవిందుడు నాకు ప్రాణం. చిన్నప్పటి నుండి ఆ వాసుదేవుని లీలలు - విని, విని, అతనికి భార్య కావాలనుకునే, ఆ కోరిక తీరడం కోసం, ఆ గోవర్ధనగిరి ధారిపై మక్కువతో, ఆ వేణుగోపాలుని చెయ్యి పట్టుకోవాలని చేసే ప్రయత్నమిది. సమయం వచ్చేవరకు ఎవరికీ చెప్పకు. ఇది సాయమను, ప్రేమ అను. కోరిక అను. ఏమైనా, ఏదైనా, ఆ ధర్మమూర్తికి నా ధర్మంగా నేను చేసే సేవ అందామె.

"నిజంగా.....!" ఆశ్చర్యపోతూ "ఇంకా నువ్వు భార్య కావాలనుకుంటు న్నావా ?" అంటూంటే -

"సాత్యకీ! ఆ తర్వాత తీరికగా ఆశ్చర్యపోదువుగాని. నీ కోసం అన్ని విధాల సకల సదుపాయాల రథం సిద్ధంగా వుంది. అది వాయువేగ, మనోవేగాలతో పోతుంది. దానిని అధిరోహించు. తొందరగా ఆ గోవిందుని చేరు. ఆదేశం వంటి అభ్యర్థన."

"ఇప్పుడిలాగ వెడితే -" అని, కంగారుపడక. నీకోసం అందరు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా బలరాముడు. జాగ్రత్తగా వెళ్ళి, నీ కోసం చూసి, చూసి

"పుష్కర" తీర్థానికి వెళ్ళిన కృష్ణుని తొందరగా అనుసరించు. ఆ ధర్మమూర్తికి, అధర్మమూర్తిగా కాక, ధర్మపరిరక్షకునిగా, వూరికి పెద్దన్న బలరాములతో కలిసి బయలుదేరు.

అంతా మేలు జరుగుతుంది. నీకే భయం లేదు. అందరు నువ్వు క్షేమంగా తిరిగి వచ్చినందులకు సంతోషిస్తారు. ఆ తర్వాత, మిగిలిన కథనం. బయలు దేరమని - వీడ్కోలు పలికింది.

''''''''''

# ధర్మం నిలిచింది!

**ధ**ర్మం పరిరక్షించబడింది. అందుకు కారణం కృష్ణుడు. అందుకే ఆ ధర్మం త్వరత్వరగా ప్రతిష్ఠాపనమౌతుంది. తగు పరివారంతో బయలుదేరారు. మూడో నాడు, మహారథి గదుడు, కృష్ణుని కలుసుకున్నాడు. ద్వారకలో జరిగిన ఒక్కొక్క సంఘటనను విడమరచి చెప్పాడు.

మీ సందేశంతో పెద్దన్న బలరాముడు. తీవ్రక్రోధం పొందాడు. అతిరథులను చేర్చి, పుష్కర క్షేత్రానికి బయలుదేరుతున్నాడు. సాత్యకి క్షేమంగా వున్నాడు. అతనినెవరో ఎత్తుకుపోవాలని తలిస్తే సమయానికి, భగవంతుడు పంపినట్లు సత్యభామ అతన్ని రక్షించి, కార్యోన్ముఖుడిని చేసింది. అతడు కూడా బలరామునితో వస్తున్నాడు.

సత్రాజిత్తు సరేసరి. గతంలోని మూర్ఖత్వాన్ని విడనాడి, కావలసిన సర్వ సదుపాయాలు సమకూర్చుతున్నాడు. అవసరమైన మేరకు ప్రతిస్పందించి తగు ఏర్పాట్లు చేస్తున్నాడు. కృష్ణుని రాకకు ముందే అతి వేగంగా వెళ్ళే వార్తాహరులు. ఆయా ప్రాంతాలవారికి అందిస్తున్నారు. ఇప్పుడు కృష్ణుడు.... అనేసరికి ప్రతి ఒక్కరు, అఖండ మర్యాదలతో, అపూర్వ స్వాగతమివ్వడానికి, అదొక అదృష్టంగా, భాగ్యంగా తలుస్తూ ముందుకొస్తున్నారు. ఎక్కడికక్కడ మేళతాళాలతో ఎదురొచ్చి స్వాగత సన్నాహాలు చేస్తున్నారు.

ఒకప్పుడు - కృష్ణుడంటే చీదరించుకునే సాల్వుడు ఇప్పుడు కృష్ణుడు తమ ప్రాంతం గుండా వెడుతున్నాడనేసరికి, కృష్ణుడికి సలుపవలసిన అపూర్వమర్యాదలను

జరుపడానికి తగు పరివారాన్ని పంపాడు. అలాగే తమ రాజ్యంలో విడిది చేసి, ఆతిధ్యమొందమని ప్రార్థన పంపాడు. కృష్ణుడు ప్రస్తుతం విందు వినోదాలకు సమయం కాదని, తరువాత తీరికగా కలుద్దామని, సున్నితంగా తిరస్కరించినాడు, ఆ రాత్రికి మాత్రం అక్కడ బసచేసి, తెల్లవారి ఉదయమే బయలుదేరి ముందుకు సాగుతున్నాడు. అతి త్వరగా పుష్కర దేశానికి చేరాలన్నది కృష్ణుని ఆకాంక్ష.

అగ్రవనంలో - చారుధేష్ణుని కలవడమొక పన్నాగం మాత్రమే. ఈ పేరుతో కృతవర్మ, కృష్ణుని సందేశంతో యాదవ ప్రముఖులనందరిని ఒకచోట చేర్చి, పుష్కర రక్షణలో భాగంగా, దానిపై అకస్మాత్తుగా దండెత్తి, తిరిగి చేకితానుని పుష్కర పీఠంపై కూర్చోబెట్టాలనే పథకాన్ని తెలియబరిచాడు. ఇందులో యాదవ ప్రముఖులతోపాటు నాగయువరాజుగా మణిమంతుని సమావేశానికి, ప్రత్యేకంగా ఆహ్వానించమన్నాడు.

అందరికి వర్తమానాలందాయి. చారుధేష్ణుడు, కృతవర్మ, మణిమంతుడు, హస్తినాపురం నుండి ఉద్ధవుని రాకకోసం ఎదురుచూడకుండా తగు ప్రయత్నంలో తాము వున్నారు. గదుడు తెచ్చిన ప్రత్యేక సందేశంతో, ప్రతి ఒక్కరు సమరమూర్తు లయ్యారు. నిర్దేశిత ప్రదేశానికి, నిర్ణీత సమయంలో వారందరు తమ తమ సేనలతో వచ్చి నిల్చారు. వీరు వచ్చేసరికి గోవిందుడు, ధర్మ ప్రతిష్ఠాపకుడు, వీళ్ళందరి కంటే రెండునాళ్ళు ముందు వచ్చాడనేసరికి, ఆశ్చర్యపోవడం కాదు, కర్తవ్యతా నిర్వహణలో, వాసుదేవుని వలె ఇకపై, తాము ముందుండాలని నిశ్చయించుకున్నారు.

ద్రోణాచార్యులు, తమ పరివారంతో పుష్కరానికి వస్తున్నట్లు వార్తలం దాయి. ఆయనతోపాటు ఎవరైనా కురువీరులు, వస్తున్నారో, లేదో తెలియరాలేదు. కాని ఎవరి ప్రయత్నాలలో వారు, అవతలివారిని ఎదుర్కోవడానికి, తగు సన్నద్ధులై వున్నారు.

మూడోరోజు తెల్లవారేసరికి కృష్ణుడు, వాసుదేవుడు, గోవిందుడు, గిరిధారి, వేణుగోపాలుడు వస్తున్నాడని పుష్కరకోట, ఆ సమీపంలోని గ్రామాలకు ఎంత వేగంగా అందిందో చెప్పలేము. ప్రతి ఒక్కరు కృష్ణుని దర్శించాలని, అమితోత్సాహంతో మేళతాళాలతో, స్వాగత సత్కారాలకు, అపూర్వ ఆదరణకు తరలి వస్తున్నారు.

యాదవ ప్రముఖులందర్ని అక్కడ సిద్ధంగా వుండమన్న కృష్ణుడు, చేకితానుని మాత్రం ఇందులో పాల్గొనవద్దని, తాను చెప్పిన చోట సురక్షితంగా వుండమని కోరాడు. నీ జాగ్రత్తలో నువ్వుండు. మా బాధ్యతలు మేము నిర్వర్తిస్తాము. కురు-యాదవవీరులకు

యుద్ధం కాదు. కావల్సింది - సంయమనం- నీ జాగ్రత్తలో నువ్వుండు. ఈ పేరుతో దుర్యోధనునికి వెన్నులో చలి పుట్టిస్తాను, యాదవశక్తిని, తక్కువ అంచనా వెయ్యకుండా చేస్తాను. అన్న బలరాముడు, అతిరథులతో వస్తాడు. దుర్యోధనుడు, అన్న బలరాముడితో యుద్ధం చేస్తాడా ? ఇంకెప్పుడు ఇటురానని, మైత్రీభావంతో మసలుకుంటానని వాగ్దానం చేస్తాడో, చూద్దాం.

ఇప్పుడు యాదవులకు, ఉత్తరాధిపత్యం కోరే వారికి వారధివి. మీరందరు కాపుకాసుకుని వుండండి. అతను దుర్యోధనుడైనా, ద్రోణాచార్యులైనా ఎదుర్కుంటాను. అప్పుడు.... అప్పుడు, అవసరాన్ని బట్టి మీరు విజృంభించుతురు గాని, అంతవరకు, తగుసన్నద్ధులై వుండండి'' అని రథాన్ని ముందుకురికించాడు.

కృష్ణుడు, కోటముందుకు రాగానే అక్కడా నిశ్శబ్దం. ప్రశాంతత, ఎదుర్కోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు. అంతా స్వాగతించడానికే తప్ప, యుద్ధ ఛాయలేమాత్రం కనబడటం లేదు. కృష్ణుని రథం కోట గుమ్మం వద్దకు వచ్చేసరికి, ఈ రాకకోసమే ఎదురుచూస్తున్నట్లు “జయహో కృష్ణా, జయ జయహో వాసుదేవా!” అంటూ జయ జయ ధ్వానాలతో స్వాగతం పలుకుతున్నారు.

దాంతో రథాన్నాపి, విజయోత్సాహంగా పాంచజన్యాన్ని పూరించాడు. కోట తలుపులు తెరచుకున్నాయి. కృష్ణుని రథం - దానికెదురుగా మరో రథం. దాని ధ్వజంపై బంగారు నగిషీల కుండ కల ''కుంభ'' పతాకం. అది ఆచార్య ద్రోణులవారిది. ఆ వెనుక ఉద్ధవుని రథం. మూడవది గాంధారరాజు శకునిది. ఉద్ధవుని రథం చూస్తూనే కృష్ణుడు పరమానంద భరితుడయ్యాడు. చెప్పిన పని సమర్థవంతంగా చేసుకురాగల దిట్ట “ఉద్ధవుడ''ని మరొకసారి నిరూపించుకున్నాడు.

ముందు రక్షణగా సాగుతున్న గదుని రథం ప్రక్కకు త్రప్పుకుంది. కృష్ణుని రథం ముందుకు వెడుతుంటే, ఆచార్యుల రథం, ఉద్ధవునితో కలిసి ఆహ్వానించ డానికన్నట్లు ముందుకు వస్తుంది. ఎటువంటి ప్రతిఘటన లేకుండా చేకితానుడు, తన రాజ్యాన్ని తాను పొందాడు. కృష్ణుని సందేశం, ఉద్ధవుని రాయబారము, ఫలించాయి. అందరికి ఆనందాన్ని కల్గించాయి. అంతిమ విజయం తనదేనన్నట్లు ధర్మం పునఃప్రతిష్టాపనమయింది. అందరిని ఆనందంగా రమ్మనమన్నానని చెప్పు.

మొదటి రథం ఆగింది. అందులోనుండి రాజగురువు ద్రోణాచార్యులవారు, చిరునవ్వులు చిందిస్తూ, రాజసముట్టిపడేటట్లు దిగారు. "వాసుదేవా! నీ ధర్మం జయించింది. జరిగిన తప్పిదాన్ని సరిచెయ్యమని పితామహులు భీష్ములవారు, మహారాజు ధృతరాష్ట్రుడు నన్ను ప్రత్యేకంగా నిన్ను కలుసుకుని స్వాగతించమని యధావిధి మైత్రీభావం కొనసాగుతుందని తెలుపమన్నారు.

అలాగే చేకితానునికి జరిగిన పరాభవానికి మన్నించమని, వారి రాజ్యాన్ని వారికి అప్పచెప్పమని నన్ను వారి ప్రత్యేక సందేశంతో ఇక్కడికి పంపారని ఎంతో స్నేహపూర్వకంగా, మాట్లాడారు. ఆ బ్రహ్మమూర్తి పలుకులకు ఎంతో సంతోషించిన, గోవిందుడు, రథం దిగాడు. వినయ భూషణుడై, ఆ మహా యోధునికి వీరవరేణ్యునికి సాష్టాంగ వందనమాచరించడానికి ముందుకడుగు వేసాడు.

కృష్ణుని చూస్తూనే అపరిమితానంద భరితుడయ్యాడా బ్రహ్మమూర్తి. అవ్యక్తమైన ఆ ఆనందానికి మురిసిపోతున్నాడు. కొన్ని సం॥గా కృష్ణుని పేరు వింటున్నారు. కొన్ని నెలలుగా కలవాలని తలుస్తున్నారు. కొన్నినాళ్ళుగా చూడాలని ఎదురుచూస్తున్నారు. ఆ శుభఘడియలు ఇప్పుడు వచ్చాయి. శిఖిపింఛము, పీతాంబరము, మెడలో వైజయంతిమాల, చందనలేపనాలతో, ఆ నీలమేఘ శ్యాముడు, చెరగని, తరగని దరహాసంతో కదిలి వస్తూంటే, నయనానందకరం చేస్తుంటే... అనిర్వచనీయమైన ఆనందానికి పరవశిస్తూ - అందుకే అందరు ఆరాధించేదని అప్రయత్నంగా చేతులు జోడించారు.

"వాసుదేవా!" చెమర్చిన కళ్ళతో ఆనందభాష్పాలు వర్షిస్తూ - ఈనాడు ఈ నేత్రాలు పవిత్రమయ్యాయి. దీనితో మనసు పరవశించింది. శరీరం జలదరించింది. రోమ రోమాంచితమై, అపూర్వ - స్వాత్మానందానుభవాన్ని ప్రసాదించిన - నీకు - ధన్యవాదములు, కృతజ్ఞుడనంటూ, నడిచి వచ్చే దేవునికి, పరుగెత్తుకుంటూ ఆచార్యులు హర్షాతిరేకములతో వస్తున్నారు. అదే "కృష్ణం వన్దే జగద్గురుం" అనే శ్రీకృష్ణభాగవతం. "శ్రీకృష్ణా! యదుభూషణా" అనే ఆ దేవదేవుని లీలా మానసం అది అనడానికి, వినడానికి - స్మరణానికి కూడా అదృష్టం కావాలి.

ఉద్ధవుడు సాష్టాంగ నమస్కారం చేసాడు. "ఉద్ధవా! అనగానే "గోవిందా, నీ నామం, నీకన్న మహా పవిత్రమైనది. శక్తివంతమైనది. అసాధ్యాలు సుసాధ్యం చెయ్యగలదు. ఆనందాన్ని ప్రసాదించగలదని, పరమభక్తితో, వినయాంజలితో,

వందనం చేసాడు. మూడో రథం నుండి, గాంధార రాజు శకుని, దొర్లుకుంటూ వచ్చినట్లు, కృష్ణుని చేరి - "మహాపురుషా! వందనం. శక్తి హస్తా! వందనము. నీకు నీవే సాటి, వందనమన్నాడు.

సంతోషమన్నాడు - కృష్ణుడు.

ఎటొచ్చి, యాదవ వీరులే అసంతృప్తితో వున్నారు. తమ ప్రజ్ఞాపాటవాలు చూపి, కురువీరులపై దొంగచాటు చావుదెబ్బ కొడదామని వీరావేశంతో వుంటే, ఏ గొడవ లేకుండా, ఎంతో ప్రశాంతంగా, చాలా సామాన్య విషయంగా, మొత్తం జరిగిపోయి, వందనాలు, ప్రత్యాభివందనాలతో, ఒకరికొకరు - గౌరవమిచ్చి పుచ్చుకుంటూంటే, ఏం చెయ్యాలో తోచని యాదవ అతిరథులు, నీరుగారి పోయారు. పెదవులు విరుచుకున్నారు.

పరమానందభరితులైన ద్రోణాచార్యుల వారు, తమ గుడారంలో కృష్ణునితో మాట్లాడుతున్నారే కానీ, మనసు మాత్రం రెండు రకాల ఆలోచిస్తున్నది. కానీ సర్వాంతర్యామికి ఏమీ తెలియనట్లు ప్రవర్తించాలన్నది ఆచార్యుల వుద్దేశం. వారి ఆలోచనల్లో మొదటిది. అపురూప వ్యక్తిత్వంతో, అత్యంత శ్లాఘనీయమైన స్థానాని కెదిగిన కృష్ణునితో మైత్రీభాగ్యం పొందాలని; రెండోది - ఇంత జరిగినా, తనపై - అధర్మవర్తనునిగా తలచి, తన ఆశలపై నీళ్ళు చల్లుతాడా ?" అన్నది తెలుసుకోవాలని!

ఇలాగ సతమతమవుతూనే, ఆ ధర్మ ప్రతిష్ఠాపకునితో సద్ధర్మమూర్తిగా ప్రవర్తిస్తున్నారు. వారే - ఇంత ప్రశాంతంగా - పుష్కరాన్నందిస్తామని, వాసుదేవా! నీవు తలిచావా ? లేక....!" భగవానుడనే - ఆయన భావానికి ఎదురు చూస్తున్నాడు.

"ఆచార్యవర్యా, అడిగారు కాబట్టి చెబుతున్నాను. చేసింది, తప్పు - దానిని సరిదిద్దాలి. అందుకు ఎవర్నో నిందించడం కాదు. దుర్యోధనునే ఢీకొనాలని తలచాను. అందుకే నేను చేయవలసిన సర్వ ప్రయత్నాలు చేసాను. ఇప్పుడిక్కడ ధర్మానిదే జయం. ఈ విషయం మీకు తెలియనిది కాదు. వియ్యానికయినా, కయ్యానికైనా సాటివారలు కావాలి. అదేం కర్మమో, దుర్యోధనుడికి బుద్ధి మందగించిందో, ప్రక్కనున్నవారు, పాపాచారులై, పాపకర్ములై, పాపానికి ఒడిగట్ట మన్నారో... మొత్తానికి అన్యాయం జరిగింది. అది అధర్మం. తాత్కాలికంగా అది విజయం పొందితే పొంది వుండవచ్చును. శాశ్వతంగా - అంతిమ విజయం

"ధర్మ్మ"నిదే! అది తెలుపడానికే - ఈ జరిగిన తతంగం, యావత్తు..క్షమించాలి. మీకు చెప్పేవాడిని కాదు, మిగిలింది మీకు తెలిసిందే ?! అని సున్నితంగా వినయ విధేయతలను మేళవించి మరీ, కృష్ణుడు చెప్పాడు.

"అవును, శిఖండిని పంపావుట ? నాపై గల అత్యంత భక్తివిశ్వాసాలతోనా...? లేక నన్నాట పట్టించడానికా ?" నవ్వుతూనే అడిగారు.

"వీరవర్యా! విద్యాదానం మీ వంతు. అందుకునే అదృష్టమా అర్థులది. ఆ వరుసలో చెప్పాను. అతడు మిమ్మనుసరించాడు. తరువాత - మీ దయ, ఆతని ప్రాప్తం. అందుకు సమాధానంగా ద్రోణాచార్యులవారు -

"కృష్ణా! నువ్వు చాలా తెలివిగలవాడివి. నా శత్రువు కొడుకుకు, నేను విద్య గరపుతానా ? ఇది సాధ్యమా ?"

"తమరు, పరశురాములవారి శిష్యులంటే, మూర్తీభవించిన ధర్మమన్న మాట. కనుక అపాత్రదానం చెయ్యరు కానీ, అర్థించినవాని, వినయసంపత్తిని బట్టి విద్యాదానం చెయ్యడం మీవంటి సజ్జనుల లక్షణం. అందుకే, అన్ని విధాల ఆలోచించి, మీవద్దకు పంపాను. అది శుభసూచకమౌతుందన్న వుద్దేశం, నాకుంది కాబట్టే, ఆతడు మిమ్మనుసరించాడు."

"ఏమో అనుకున్నాను. ధర్మావతారునికుండవలసిన సర్వలక్షణాలు కల సంపూర్ణ మానవుడివి. అందుకే దేవుడని, అందరు ఆరాధిస్తున్నారంటారు.

"ఆచార్యా! మనిషిని, మనిషిగా ప్రేమించని, మానవత్వం మనకెందుకన్న నడిచే సిద్ధాంతం ప్రకారం వాడిని. అందుకోసం ధర్మంకోసం, నన్ను నేను అర్పించు కోవడానికైనా సంసిద్ధమే నంటాడు. ఆ సమయంలో శిఖండి మీ వద్ద వుండాలి. అది అవసరం. ఇప్పుడు అనవసరం. కాబట్టి నేనతనిని వెనక్కి పిలిపిస్తున్నాను" అన్నాడు కృష్ణుడు.

"అతను వచ్చిన పని పూర్తికాలేదు. అటువంటి అప్పుడు -"

"ఏది ఏమైనా రేపు జరిగే స్వయంవర సమయంలో శిఖండి అక్కడ వుండాలి. ఇది ధర్మం. దీనిని ఉద్ధవునికి అప్పగిస్తాను. ఈ పని అతను చూసుకుంటా డంటాడు. ఒక్క క్షణం సాలోచనగా చూసి "కృష్ణా! ద్రుపదునిపై నీకెందుకంత ప్రేమ" అనగా -

"ధర్మానికి, మానవత్వానికి నేను మారుపేరన్న విషయం ఇప్పుడే చెప్పాను. అది నిర్వహించడానికి, నేనిచ్చిన వాగ్దానం ప్రకారం, ద్రుపదునికి - ధర్మబద్దంగా సహకరిస్తాను. అయినా, మీరూ ధర్మపక్షపాతే కదా! అందుకే మీరన్నా నాకు అభిమానమే. ఎందుకంటే -

శత్రువు - పుత్రుడని తెలిసి కూడా, శిష్యునిగా స్వీకరించారు. అతని అవస్థను బాపడానికి సిద్ధపడ్డారు. అలాగే దుర్యోధనునిపై గల ప్రేమను బట్టి, వెనుకంజ వెయ్యకుండా ఇక్కడికి వచ్చి మీ ధర్మాన్ని మీరు నిర్వర్తించారు. ఇది చాలదా ? మీరు ధర్మపరులని, "లోకాన్ సమస్తాన్ సుఖినో భవన్తు" అనే బ్రహ్మమూర్తులని చెప్పడానికింతకన్నా ఏం కావాలి ?" ఎప్పటి దరహాసంతోనే, కృష్ణుడు, విషయాన్ని విన్నవించాడు.

కాకపోతే, దుర్యోధనుడు స్వయంవరంలో పాల్గొనడానికి ఒప్పుకున్నారు. విజయం వరిస్తుందో, వరించదో ఆ భగవంతునికే తెలియాలి. కాని, విజయం వరిస్తే, ద్రౌపది మీ శిష్యుని భార్యగా మీకు శరణాగతురాలు. అప్పుడు ద్రుపదుడు మన్నుతిన్నపాము. అప్పుడా మన్నుతిన్న బురదపాము మిమ్మల్నేమీ, ఏ విధంగాను చెయ్యలేదు. అవునా...?! కృష్ణుని వ్యూహాశక్తికి, మేధాశక్తికి తలవూపకుండా వుండలేకపోయాడు. అసాధ్యుడు, అవతలివారు తప్పు పట్టలేరు. కన్నెత్తి చేయలేరు. అంత లౌక్యంగా, చాకచక్యంగా కథ నడుపుతాడన్నది - ఆచార్యులకు ఇప్పుడు అనుభవపూర్వకంగా, ప్రత్యక్షంగా అర్థమైంది.

కానీ, "కృష్ణా! దుర్యోధనునికి ద్రౌపది స్వయంవరానికి వెళ్ళాలని వుంది. ఆహ్వానం వచ్చినప్పటి నుండి అదిరిపడుతున్నాడు. నన్నడిగితే వద్దన్నాను. నేను ద్రుపదునితో బాంధవ్యం హర్షించను. అది చివరకెటువైపు మొగ్గుతుందో నాకు తెలుసు. కృష్ణా ఇంకో విషయం. ద్రుపదుడే కాదు, అతని సంతానం, పరివారం మొత్తం. గర్వోన్మత్తులు. ఎదుటివారిని ఈసడించడంలో సిద్ధహస్తులు. ఇది నా ప్రత్యక్షానుభవం.

నా మనోభావాలకు విరుద్ధంగా ద్రౌపది కనుక కురువంశంలో అడుగుపెడితే, నాకయిష్టమైన చోట నేను వుండలేను. నా దారి నేను చూసుకోవాలి. తప్పదు.

ఆచార్యుల మాటకు అడ్డువస్తూ "మహావీరా! ఆమె కురువంశ కోడలవడం తప్పదు. దీనివలన మీకేవిధమైన ఇబ్బంది కూడా కలుగదు. భవిష్యత్తును శాసించే భగవంతుడు, అందరికి ఆనందాన్ని, శుభాన్ని ప్రసాదిస్తాడు. ఇది నిజమంటాడు.

"చూద్దాం.... కానీ... !" ఆచార్యుల సందిగ్ధత.

ఎవరు ఏమన్నా, ఏమనుకున్నా - ధర్మం గొప్పది. దానిని అనుసరించే భరతవంశం గొప్పది. దానికి ఆచార్యులైన మీరు గొప్పవారు. ఇవన్నీ ధర్మ మతిక్రమించని విషయాలు. వీటికి ఆ భగవంతుడు, ధర్మస్వరూపుడు, తన ధర్మ ప్రకాశాన్ని ప్రసాదిస్తాడు.

అందరిని సంతృప్తులను గావిస్తాడు. మీకు తెలియనిదేముంది ? వ్యక్తిత్వం వేరు. ప్రకాశించే ధర్మం వేరు. ద్రోణాచార్యులు వింటున్నారే కానీ ప్రతిస్పందించడం లేదు. జరిగేది, జరుగబోయేది, వారికాత్మ విరుద్ధంగా, భిన్నంగా కనుపిస్తుంది. అయినా ఏం చేస్తాం. కాలమహిమ, భగవన్నిర్ణయం అనుకోవడం తప్ప, శాసించడం కానీ, శాసనోల్లంఘన చేయడం కాని జరుగదు. అందుకే మౌనం. అంతకుమించిన నిశ్శబ్దం మరొకటి లేదు.

## చెల్లీ.... !

**ఆ**నాడు, అక్కడ కృష్ణుడు భానుమతిని చూస్తూనే ఆశ్చర్యపోయాడు. దుర్యోధనుని పట్టమహిషి, కాశీరాజు కుమార్తె అందాల భామ, ఎందుకలాగ వెదుక్కుంటూ తన గుడారానికొస్తుందో.... సామాన్యులు, కంగారుపడతారు. కృష్ణుడు, సర్వ సమర్థుడు. యధావిధి చిరునవ్వులు చిందిస్తున్నాడు.

యువరాణి భానుమతికి తోడుగా, గాంధార రాజు శకుని, ఆయన ధర్మపత్ని కూడా వున్నారు. పాలిపోయినట్లుందామె వదనం. కళ్లల్లో తెలియని భయం. వస్తూనే కృష్ణుడు తానన్న చిన్న చెల్లెలుగా కుడిచేత్తో కృష్ణుని పాదాలు తాకి ఆశీస్సుల నర్థించింది. భానుమతికి ముందే శకుని, "వాసుదేవా! ఈమె నీ చిన్నచెల్లెలు కదా, నిన్ను చూడాలని, నీ ఆశీస్సులు పొందాలని తహతహలాడుతూ వచ్చింది. నువ్వంటే పరమభక్తి - శ్రద్ధలు." అడగకుండా, అనవసర వాగుడుగా చెబుతున్నాడు. అయినా ఈమెను, ఎవరు సోదరిగా స్వీకరించరు ? ఆ ప్రేమ యాదవులకే పుష్కలంగా వుంది ?!

అతని మాటలు పట్టించుకోకుండా భానుమతిని చూసి, "మన యువరాజు ఎలాగ వున్నారు ?" ఎంతో ప్రేమతో అడిగాడు. సమాధానంగా, శకునినోసారి చూసి, ఆ తదుపరి నేల చూపులు చూసింది. "ఆర్యపుత్రులు బాగానే వున్నారు. వారు నీ ఆశీస్సులనర్థిస్తున్నారని - చెప్పవలసినది, చెప్పవలసిన పద్ధతిలో చెబుతున్నానా ? లేదా అన్నట్లు శకునిని చూస్తూ మెల్లిగా చెబుతుంది.

ఆర్యపుత్రులు, నన్ను నా సోదరుడి నుండి ఆశీస్సులు అపేక్షించమని స్వయంగా, ఈ శకుని బాబాయిని తోడిచ్చి నన్ను పంపారు. ఇందులో ఏదో శ్లేష వుందని గోవిందుడు అర్థం చేసుకుంటున్నాడు. ఇందులో ఏదో తిరకాసు వుంది. దేవకిసుతుడు ఆలోచించడాని కేవిధమైన సావకాశమివ్వకుండా -

"నందనందనా! నువ్వంటే యువరాజు దుర్యోధనునికి ఎంతో ప్రేమ, గౌరవం. అందుకే ఇక్కడికి వస్తారని తెలిసి, ముందుగా నీ ఆశీస్సులను నీ సోదరి, భానుమతి ద్వారా అందుకోమని, తన కందించమని నన్ను తోడిచ్చి పంపాడు. అతడు చాలా బుద్ధిమంతుడు. శకుని చెబుతున్నాడు.

కృష్ణుడు గమనిస్తున్నాడు. యువరాణి పెదవులు వణుకుతున్నాయి. ఆమెనేదో చెప్పమని, తగు విధంగా ప్రబోధించి మరీ తీసుకువచ్చారు. అందుకే చిలక పలుకులు చెబుతూ మాటిమాటికి శకునిని చూస్తుంది. ఆమెను పూర్తిగా గమనించిన గోవిందుడు "చెల్లెమ్మా! భయపడకు, బాధపడకు. చెప్పమనే ఆ మనసుకన్నా, చెప్పదలచుకున్న పెదవులను చెప్పవలసింది చెప్పనివ్వు" నిగూఢంగా విషయమడిగాడు.

తలవంచుకునే, తలవూపింది. ఇక తప్పదు చెప్పవలసింది, చెప్పాలి. కాదంటే ఈ - శకుని -"శని" అయి కొంపముంచుతాడు. గొంతు సవరించుకుంది.

"అన్నా! ఆర్యపుత్రులు, ద్రౌపదీ స్వయంవర విషయంలో తమ సహాయమందించమని కోరమన్నారు. వారిందులో విజయం పొందాలిట. అందుకు నీ సాయమవసరం" భానుమతి - చిలకలాగ చెప్పేసింది. దీనికి సారధి, వారధి శకునిగా తలచిన యశోదానందనుడు -

"గాంధార రాజా! దుర్యోధనుడు చెప్పించాడు. భానుమతి చెప్పింది చాలా సంతోషం. ఇది నా పరిధిలోని, లేదా చేతిలోని విషయం కాదు. ఇందులో నేను

చేయదగ్గది ఏమీ లేదు. కేవలం ప్రేక్షకపాత్ర మాత్రమే. ఇక ద్రౌపది, భానుమతి వలెనే నాకు సోదరి. కనుక నాకు ఆమెపై మక్కువ - కేవలం - అన్నాచెల్లెళ్ళ బంధం. నేను ఆమెను పట్టదలచుకుంటే, ఈ తతంగం లేకుండా ఏనాడో చేపట్టేవాడిని. కాబట్టి, నా ప్రమేయం లేని దాంట్లో, నా సాయమంటే, నేనేం చెయ్యగలను ? సాలోచనగా ఆలోచించమని అడుగుతున్నాడు.

"నా వుద్దేశంలో, వారు నీకు అనుకూలురు కాబట్టి, నువ్వు దుర్యోధనుని గూర్చి ఆలోచించమంటే - నీమాట కాదనరు.''

"ఔను. అది మామూలు విషయాల్లో ఇప్పుడు స్వయంవరమని వీరత్వ పరీక్ష పెడుతూంటే, నేను నా ప్రవర్తన, అప్రస్తుత - ప్రవేశమౌతుంది. ఇంకో విషయం నువ్వేలాగ వున్నా, నేను ఆలోచించాలి. "అన్నా! అన్నప్పుడు నా చెల్లెలు జీవితం గురించి ఆలోచించాలి. ఈమెను గంగలోత్రోసి, ఈమెకు సవతిని తెచ్చి, ఈ సోదరిపై ఆమెనెక్కిస్తే - "అన్నా'' అన్న పిలుపుకు, నా ప్రవర్తనకు సంబంధ ముండదు. ఇది మరొకటి. జరగని విషయాలపై ఆసక్తి, అనవసర ఆధిక్యత - సాటి రాజన్య లోకంలో తలవంపులౌతుంది. పైగా అధర్మమవుతుంది. దీనికి నేను తలొగ్గను కదా!'' నవ్వుతూ చురకలా అంటించాడు.

"ఆర్యపుత్రుల కోరికను మన్నించమని నా ప్రార్థన. వారి సంతోషమే, నా సంతోషము'' పెదవులు తడుపుకుంటూ అంది, భానుమతి -

"నీ వరకు నువ్వు నిజమే. నీకు సంతోషమే. ఇందులో నా పాత్రేముంది ? నేను పాల్గొంటే అతనికి నష్టమనుకుంటాడేమో, కేవలం నాది ప్రేక్షకపాత్ర. ఇప్పుడు నీ భర్త కోసం కాదు, ఎప్పుడూ నాదదేమాట.

"అవునమ్మా! వున్న నిన్ను విడిచిపెట్టి, కురువీరుడు మరో యువతిని కోరడం...!''

శకుని, నవ్వుతూ - తనదైన పద్ధతిలో - "కృష్ణా! నీకు తెలియనిదేముంది ? రాజులు, రాజకీయాలు ఇలాగే వుంటారు, వుంటాయి ?! దీనికోసం అనవసర ఆలోచన తగదు. కాశీ రాజకుమార్తె పరువు ప్రతిష్ఠలకే భంగముండదు ?'' యుక్తిగా చెబుతున్నాడు.

"అవునన్నా! ద్రౌపదీ దేవిని నా సోదరిగా ఆహ్వానిస్తాను. ఆమె మర్యాదకు, మన్ననకు లోటు రాదు. ఆర్యపుత్రులు కనుక - ఇందులో గెలవకపోతే నా పరిస్థితి

దారుణంగా వుంటుంది. నేను బ్రతుకలేను. ఆర్యపుత్రులను చూడలేను. అది వర్ణించి చెప్పలేను.'' అంటూంటే.

“అమ్మాయి. కురువీరుని భార్యవు, హస్తినాపుర యువరాణివి. నీ కోసం అదే ఈ చెల్లెలి కోసం, కృష్ణుడు ఏదైనా చేస్తాడు, చేయగల్గుతాడు. భయపడకు, బాధపడకు!'' తెలివిగా శకుని ఓదారుస్తున్నాడు.

“శకునిమామా! ఇది పాచికలాట కాదు. ప్రలోభ పెట్టడానికి, ప్రేరేపించ డానికి. ఒకరి వ్యక్తిత్వ ప్రదర్శనకు. ఇందులో నువ్వు ఫలానా వారిని వివాహం చేసుకోవాలని శాసించడానికి, ఫలానా వారినే'' అని హెచ్చరించడానికి, ముందు మనమెవరమో ఆలోచించండి. ఉన్న చనువుతో “కురువీరా! ఇది మనకనవసర మంటే... దుర్యోధనుడు ఒప్పుకుంటాడా ? ఇలా అనైతికంగా శాసించడం సబబా ? కాబట్టి ఇందులో దానాలు, వాగ్దానాల స్థితిరాదు. దయచేసి, మీవలె వచ్చిన నన్ను అనవసరంగా ఏమీ చెయ్యలేదని, నిందించకండి. అర్థం పర్థం లేని విధంగా, ప్రత్యక్షసాక్షిగా వచ్చిన నన్ను “స్వయంవర వూబిలో'' దింపకండి. “రెండు చేతులెత్తి, వెళ్ళి రమ్మన్నట్లు'' నమస్కరించాడు.

“ఇంతేనా అన్నా!'' అనేసింది భానుమతి.

కావాలంటే... నీ అన్నగా, యువరాజును, ద్రౌపదికి పరిచయం చేస్తాను. అదీ నేను చేయగల ఉపకారం. అంతకుమించి, కృష్ణుడు తన అశక్తతను వ్యక్తబరుస్తాడు. అందుకు వెంటనే స్పందిస్తూ -

“కృష్ణుడు తలచుకుంటే అసాధ్యమన్నది వుండదు. ఆ పరిచయం చాలు. అదే ప్రేమకు, అభిమానానికి మార్గమవుతుంది. వాసుదేవా! దుర్యోధనుడు, నీవానిగా తలచి, చేయగలిగింది, చెయ్యి. తప్పక విజయుడౌతాడు. ఇది శకుని ఆలోచన.

ముగ్గురు, శకుని - ఆతని భార్య - భానుమతి బయలుదేరుతారు. నాలుగడుగులు వేసాక “కృష్ణుడు ఎంతో ప్రేమతో - “చిట్టి చెల్లెలివి, వర్థినే పంపుతున్నాను, రా! బహుమతి తీసుకో!'' అంటే భానుమతి పరుగు పరుగున వస్తుంది. ఆమెకు బహుమతిస్తున్నట్లు కొద్దిగా ముందుకు వంగి, ఆమెకే వినబడునట్లు “నీ అన్న - తన మాట నిలబెట్టుకుంటాడు. నీ కళ్ళలో నీళ్ళు

చూడడు, చూడలేడు. సంతోషంగా వెళ్ళు. అంతా సంతోషమే'' నని అమూల్య హారాన్నిచ్చి పంపుతాడు. ఆమె కళ్ళతో కృతజ్ఞతలు చెప్పుకుంది.

ఇంకో రెండునాళ్ళు పున్నమి వుందనగా పెద్దన్న బలరాముడు వచ్చాడు. యదువీరులు, నాగ ప్రముఖులు రావలసిన వారందరూ, ద్రుపదుని, కృష్ణుని పిలుపుతో ముందు పుష్కరక్షేత్ర విడుదల కోసం ఉత్సాహంగా వచ్చారు. అప్పటికే చేకితానుడు, తన పాలనా పగ్గాలతో హుషారుగా వున్నాడు. ఇక ఆనందమే, ఆనందం.

ఆ రెండునాళ్ళు అక్కడ విందు వినోదాలతో సంతోషంగా గడిపి, అందరు కలిసి, ద్రౌపది స్వయంవర కార్యక్రమంలో పాల్గొనడానికి, ఉత్సాహంగా పాంచాల రాజధాని, కాంపిల్య నగరానికి బయలుదేరారు.

అప్పుడు - వారి ప్రయాణాన్ని గమనించిన ద్రోణాచార్యులు ఆర్యావర్తంలో కృష్ణుని వలన ఎన్నో శుభాలు జరుగుతాయని తలిచారు.

# ద్రౌపదీ స్వయంవరం

ద్రౌపదీ స్వయంవరం నిమిత్తం పాంచాల రాజధాని కాంపిల్య నగరం, అమరావతిని మించి అలంకరించబడింది. పవిత్ర గంగానది ఒడ్డున వున్న ఆ నగరం ఎంతో శోభాయమానంగా, అందంగా వుంది.

వచ్చే వారందరి వసతికోసం, వారి వారి స్థాయిని బట్టి తగు విధమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడికక్కడ శ్రద్ధ, వచ్చేవారిపై గౌరవం. అంతకుమించి, తమ యువరాణి యాజ్ఞసేని స్వయంవరం. సమస్త రాజలాంఛనాలతో సకలా-లంకారాలతో, తీర్చిదిద్దబడింది. ఎటు చూసినా గుఱ్ఱాలు, రథాలు, ఎడ్లబండ్లు... ఒక్కటేమిటి సర్వతోభద్రంగా సకల విలాసవంతంగా వుందిప్పుడా రాజ్యం.

ఎందరో రాజన్యులు వచ్చారు. వంటశాలలతో, విందుభోజనాలతో, వారి డాబు-దర్పాన్ని ప్రదర్శించే అంగరంగ వైభవాలతో కన్నుల వైకుంఠంలాగ, వుందా నగరం. ఇలాగుండగా - ఒక పెద్ద గుడారం వెలిసింది.

అందులో - హస్తినాపుర యువరాజు దుర్యోధనుడు, తన మల్లయుద్ధ క్రీడా నైపుణ్యానికి మెరుగుపెట్టుకుంటున్నట్లు ఆ విధంగా వున్నాడు. ఇద్దరు

మల్లులు దుర్యోధనునికి తగు విధంగా మర్దనా చేస్తుంటే, స్వయంవరంలో ద్రౌపది నేవిధంగా గెలుచుకోవాలా ? అని అవిశ్రాంతంగా ఆలోచనలు సాగిస్తున్నాడు.

కురువంశవీరులు, ద్రుపదుని ఆహ్వానం మేరకు, హస్తినాపురం నుండి, ఈ స్వయంవరానికి వస్తారని, ఎవరూ వూహించలేదు. అందరి వూహలను తలక్రిందులు చేస్తూ, మల్లయుద్ధ సార్వభౌమునిగా, కాంపిల్యంలో, దుర్యోధనుడు అడుగుపెట్టాడు. పెద్దకూటమిగా వాళ్ళు వచ్చారు. కురువీరుడు దుర్యోధనుడు వచ్చాడన్న వార్త, అక్కడి వారికో వింత అయింది. కర్ణుడు, శకుని, అశ్వత్థామ, దుర్యోధనుని మున్ఫైమంది సోదరులు, నల్గురు మేనమామలతో, మహా అట్టహాసంగా వచ్చాడు.

ముఖ్యంగా ద్రోణాచార్యులవారి పుత్రరత్నం - అశ్వత్థామ ఈ స్వయంవర సంబరానికి రావడమొక విశేషంగాను, వింతగాను తలిచారు. ఇది ప్రజల ఆలోచన అయితే, దుర్యోధనుని ఆలోచనలు మరొక రకంగా వున్నాయి. తాను అన్నివిధాల, ద్రౌపదిని చేపట్టే అర్హతలున్నాయని, ఎందుకాసావకాశం తనకు రావడం లేదని "వస్తుందా ? రాదా ?'' అన్నట్లు తలుస్తున్నాడు. అనుకోకూడదు కాని, చిన్నప్పటి నుంచి అతను దురదృష్టజాతకుడేనన్నది, ఆతని భావన. అందుకే "కుట్రలు, కుతంత్రాలు'' అని వూళ్ళో వాళ్ళన్నా, తన దృష్టిలో తాను చేసినదంతా ధర్మమేనన్నది, ఆతని వాదన.

ఇక తండ్రి పరిస్థితి.

అది - ఆయన దురదృష్టం. గ్రుడ్డివాడిగా జన్మించాడు. ఆతని పెద్దరికాన్ని గౌరవించినట్లు పితామహుని ఆదేశంతో తమ్ముడు పాండురాజు పాలనాపగ్గాలు చేపట్టి అన్నీ ధృతరాష్ట్రుని పేరు మీద జరుపుతున్నాడు. నా అదృష్టం కొద్దీ నేను బాగానే పుట్టినా, దురదృష్టం నన్ను వెంటాడింది. మహాబలశాలురైన పినతండ్రి పుత్రులు వారసులుగా, పైగా అందరిలోకి పెద్దవాడిగా యుధిష్టరుడు, తెరపైకి వచ్చాడు. అతనే భావి సామ్రాట్ అని ప్రతి ఒక్కరు తీర్మానించారు.

ఇందుకు వారి అదృష్టంగా, చూడటానికి చక్కగా వుండటం, తండ్రి లేకపోవడంతో, వారికి ప్రజల పెద్దల సానుభూతి లభించింది. దీనినెవరూ కాదనరు. కానీ, పెద్దకొడుకు, ధృతరాష్ట్రుని వారసునిగా తానుండగా, అన్నదమ్ముల సంతానంలో కురువంశ వారసునిగా యుధిష్టరును ఎంపిక చెయ్యడమే నచ్చలేదు.

దాంతో అసూయ, అందులో నుండి పగ - ద్వేషాలు. ఇవి పెరగడానికి "శకుని" అతనికి వత్తాసుగా వీరత్వానికి గౌరవ మిచ్చాడని, ప్రాణదాతగా కృతజ్ఞతతో కర్ణుడు. ఇలాగ ఒక శకం ప్రారంభమయింది.

ఒక శకం - యుధిష్టరులది. ఒక శకం దుర్యోధనునిది. ఈ రెండు వర్గాల ఆధిపత్యపోరు. ఒకే రాజ్యానిది. భరతవంశకీర్తి, ప్రతిష్టలు పెంపొందించాల్సింది పోయి అన్నదమ్ముల పిల్లల మధ్యా ఆగడాలు, అల్లర్లు. నిజానికా పినతండ్రి పిల్లలు, ఆయన రక్తం పంచుకుని పుట్టలేదు. తమ తండ్రుల వలెనే, పాండురాజు పుత్రులు, దూర్వాసుని వరప్రభావంతో కుంతీ, మాద్రులకు - యమ, వాయు, ఇంద్ర - అశ్వినీ దేవతల వలన పుట్టినవారు. వీరికి రాజ్యం... ఇవ్వడం తగదన్నది దుర్యోధనుని ఆలోచన.

కానీ, పాండవులకు వత్తాసు పితామహులు. ఆయనకు విదురుడు, మరి కొంతమంది ధర్మవేత్తలు. ఇక లాభం లేదని వాళ్ళను వారణావతానికి పంపించి, లక్క ఇంట్లో, ఎవరికి అనుమానం రాకుండా, చంపడంతో అన్నీ సమస్యలు తీరాయి. వారివలన భయం లేదు. రాజ్యానికి వారసులుగా గణించనవసరం లేదు. పెద్దలు కిమ్మన కుండా తన సార్వభౌమత్వానికి తలవంచడమే జరుగుతుంది. దానికి తోడు - ఈ ద్రౌపది కనుక లభిస్తే - కురు, పాంచాల దేశాలవైపు కన్నెత్తి చూసేవారు ఎటు చూసినా కనబడరు. అప్పుడు - అనాయాసంగా, తండ్రిని ప్రక్కనబెట్టి చక్రవర్తిత్వాన్ని పొందగల్గుతాడు. ఇప్పుడు.... ఇప్పుడు ఒకనాటి దురదృష్టం, తనను విడిచి, ఆనందలోకాల విహరింపచేసే శుభతరుణ మాసన్నమయిందని వూహలలో తేలిపోతున్నాడు. అదృష్టం అందుకున్నట్లే పొంగిపోతున్నాడు.

మల్లులు మర్దనా చేస్తున్నారు. వున్నట్టుండి ఎందుకో దుర్యోధనునిలో అసహనం. ఈ శకునిమామ ఎక్కడికి వెళ్ళాడు ? ఏమైనా కుతంత్రాలు చెయ్యటం లేదు కదా! నమ్మకూడదు. వీరంతా గుంటనక్కలు సమయంచూసి అవతలి వాళ్ళను మధ్యలో వూబిలో త్రోసి సంబరాలు చేసుకుంటారు. ఇప్పుడు అడుగుల చప్పుడు. అది శకుని మామదే... తనకు చిరపరిచితమైన అడుగులవి.

అందర్నీ పంపి, మామతో ఒంటరిగా విశేషాలేంటి ? అడిగాడు. అందుకు సమాధానంగా, శకుని "నిన్ను ద్రౌపది వద్దకు తీసుకు వెడతాడుట. అంతవరకే ఆతని ప్రయత్నం. ఆ తర్వాత, ప్రయత్నం నీది, అదృష్టం నీదే. అనేసరికి - "ఆ

గొల్లవాడు, పిరికిపందగా ప్రవర్తిస్తూన్నాడే ? తన చాతుర్యంతో మనల్ని బోల్తా కొట్టించాలని చూస్తున్నాడా ?'' దుర్యోధనునిలో, అసహనం, ఆవేశం - కోపంతో కలిసి పరుగులు దీస్తున్నాయి.

"అల్లుడా! నువ్వు యువరాజువే కాని మహారాజువి కావు. చక్రవర్తివసలు కాదు. మన జాగ్రత్తలో మనముండాలి. మన నోటిని మనం అదుపులో పెట్టుకోవాలి. అసలైన పిరికిపంద అతడు కాదు, నువ్వు. నీ వీరత్వం చూపించి గెల్చుకోవల్సింది పోయి, ఇటు పెళ్ళాన్ని అటు మరొకరిని, అడ్డం పెట్టుకుని, వీరుడననిపించుకోవాలని చూస్తున్నావు. చూడు, నిజం చెప్పాలంటే అది హర్షణీయం కాదు. ఆర్య సమ్మతమసలు కాదు.

ఆ కృష్ణుడిప్పుడు ఎందరికో దేవుడు. లోకారాధ్యుడు. నువ్వు కాదన్నా, ఔనన్నా, ఆ వాసుదేవుని గొప్పతనానికి వచ్చినలోటు, ఆవగింజంత లేదు. గుమ్మడికాయంత, పిరికితనంతో ప్రవర్తించే, నీకు, ధైర్యములేదు. అనవసర కోపంతో అల్లరిపాలవుతున్నావు ? జాగ్రత్త! హెచ్చరించాడు - గాంధారుడు.

ఒక్క కృష్ణుని సహకారమే నీకు చాలదు. ఆచార్యులు నీ ఆలోచనలతో ఏకీభవించాలి. పితామహుడు కరుణించాలి. విదుర మహాశయుడు తన వివేకంతో, నిన్ను విశ్వసించి, ఆదరించాలి. రాజమాతతోపాటు నీ తల్లి ఆశీస్సులు, పుష్కలంగా లభించాలి.

అంతేకానీ, నేను, అంగరాజు కర్ణుడు. "సై'' అంటే మనది దుష్టచతుష్టయ మౌతుంది. విఘ్నాలకు వినాయకుడు కంటే ముందు-ఇతరులు పరుగెత్తుకుని వస్తారు. కాబట్టి, దీనికి పరిహారం - కృష్ణుని అభిమానం, ఆయన అండదండలు. అప్పుడే నువ్వు విజయుడవగలవు. అదీ, ఆ పాండవులు బ్రతికిలేరు కాబట్టి. అదే వారు బ్రతికి వుంటే, నీ బ్రతుకు బండబారుతుంది. లోకం నిన్ను అసహ్యంగా చూస్తుంది.

వీరత్వం మరచి, పిరికివానివలె, దొంగచాటుగా లక్క ఇంట్లో కాల్చి చంప ప్రయత్నించావని, ఇందుకు నీతోపాటు, మమ్మల్నందర్ని కూడా తరిమి తరిమి కొడతారు. ఆ.... ఆలోచించుకో. జాగ్రత్తగా అడుగు వెయ్యి. ఈ పరిస్థితులలో, ఈ మామ ఇంతకంటే వివరంగా, విలువైన సలహానివ్వలేడని ముగించాడు.

అంటే - ఈ భరత వంశీయుడు... శకునీ.... కోపంతో వూగిపోతున్నాడు. "అల్లుడూ! ఈ అనవసర ప్రతాపాలు, కోపాలు, కృష్ణుని ముందు దిగదుడుపు. వెళ్ళు.

వెళ్ళి, కృష్ణునితో సంధి చేసుకో. నువ్వు చెప్పినట్లు నడుస్తానని వాగ్దానం చెయ్యి. అలాగే కృష్ణుని ద్రుపదుని వద్దకు పంపు. ఆచార్యులతో సంబంధం లేకుండా, మీ అల్లునిగా దుర్యోధనుడు, మీకు సర్వవిధాల అండగా వుంటాడని, నమ్మకం కల్గ చెయ్యి.

అప్పుడు పరిస్థితి మారిపోతుంది. కురు-పాంచాలాల వైపు ఎవరు కన్నెత్తి చూడరు. స్వయంవర మంటపం, కల్యాణ మంటపమవుతుంది. అంతేకాని, మాటిమాటికి పళ్ళు బిగించడం, కృష్ణుని- ఊ... పిరికిపంద" అని, నీ పిరికితనాన్ని మరొకరిపై రుద్ద ప్రయత్నించడం - తగదని సూచించాడు.

అన్ని విషయాలు విన్న దుర్యోధనుడు ఆలోచనలో పడ్డాడు. ఎదురులేని ఈ స్థితిలో పరిస్థితిని చక్కబెట్టుకోకుండా, అనవసరంగా ఆవేశంలోపడి, అవకాశాన్ని జారవిడుచుకోవడం తగదనే స్థితికి వచ్చాడు. తదనుగుణంగా ముందుకడుగు వెయ్య తలుస్తున్నాడు.

# పరిణయ కళ!

**ఎం**దరిలాగో, జరాసంధుడు తన బృందంతో ద్రౌపదీ స్వయంవరానికి తగు పరివారంతో విచ్చేసాడు. అతనికి ఆర్యావర్తమన్నా, ఆర్యులన్నా కోపం, ఏవగింపు. మూతిమీదనున్న మీసానికి విలువ నివ్వకుండా, పౌరుషాన్ని ఓ ప్రక్కన బెట్టి, అందాలు, అలంకరణకు ప్రాతినిధ్యమిస్తారు. ఇది జరాసంధునికి నచ్చదు. మొలిచిన మీసం మగతనానికి చిహ్నంగా వుండాలని, వక్రబుద్ధులకన్న మీసం దువ్వడానికే పోటీ పడాలన్నది జరాసంధుని వుద్దేశం.

మధ్యలోనున్న గుడారంలో మహారాజులా జరాసంధ చక్రవర్తి కూర్చుని వున్నాడు. ఆతని ప్రక్కన ఆయన కుమారుడు సహదేవుడు. ఆ ప్రక్కన మనుమడు మేఘసంధి. వారిలో ఏ ఒక్కరు తక్కువ కారు. ముగ్గురు, ముగ్గురే. ఏదో నిశ్చయానికొచ్చినట్లు "సహదేవా, వెళ్ళు. వెళ్ళి, మన రాకను చెప్పు. మన మేఘసంధికి, ద్రౌపదినిచ్చి వివాహం చెయ్యమను. ఆ తర్వాత ఏం చెయ్యలో ఆలోచిద్దాం. కాదన్నా మన ఆలోచనలు మనవి." చెబుతూంటే, మెల్లిగా సహదేవుడు-

"తండ్రీ! పాంచాలుడు, మనవాడికి ద్రౌపదినివ్వదలిస్తే ఈ స్వయంవర పటాటోపమనవసరం. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసారంటే, మనం ఆలోచించాలి. తొందరపడి నిర్ణయాలు చెయ్యకూడదన్నది నా అభిప్రాయం.

"మంచిదే కాదనను. కానీ....!" అని, బిగ్గరగా నవ్విన జరాసంధుడు "ఈ ఆర్యులంతా తాము గొప్పవాళ్ళమనీ, తమ పిల్లలు దేవతలనీ తలుస్తారు. ఆ దేవతలు వీరులను, వీరోచితంగా గెలుపొంది, మరీ పొందాలని తలుస్తారు. అలాగే ప్రస్తుత కార్యక్రమం గూడా అయివుంటుంది. కానీ, ఇవి నాకు నచ్చవు. స్వయంవరం పేరిట, ఆ అమాయకురాళ్ళు, చాతకాని చవటల్ని, భర్తలుగా పొంది, ఆ తర్వాత ఏడుస్తారు. వీరత్వం వేరు. మగతనం వేరు.

"మల్లుడుకి ఒళ్ళు తప్ప - బుర్ర వుండదు. బుద్ధి వుండదు. ఎంతసేపు తన బలప్రదర్శనకే ఆలోచిస్తాడు తప్ప, అవతలివ్యక్తి ఆనందం గురించి ఆలోచించడు." అలాగే కొందరు వీరులు. వీళ్ళను లోకం మెచ్చుకోవాలే తప్ప, భార్య గుర్తించి, గౌరవించనక్కర్లేదు. దాని సుఖసంతోషాలతో వీళ్ళకు ప్రమేయ ముండదు. ఎంతటి తెలివిగలవారయినా, ఈ మూర్ఖ స్వయంవరంతో దెబ్బ తింటారు. అందుకే ఇది నాకు నచ్చదు. దీనిని గుర్తించి, గౌరవించవలసిన పని లేదన్నాడు.

పేరుకు స్వయంవరం ధర్మబద్ధమైనా, అందుకు వచ్చిన వారిలో ధర్మంకన్నా, స్వార్థంపాలు ఎక్కువై ఎవరి మట్టుకువారు, తమ తమ పరిధిలో దుష్ట, వక్ర ఆలోచనలు చేస్తున్నారు. అటువంటి వారిలో జరాసంధుని మనుమడు మేఘసంధి కూడా వున్నాడు.

"తాతా! నాకందిన వార్త ప్రకారం, ద్రౌపది యజ్ఞశాల నుండి స్వయంవర మండపానికి బయలుదేరుతుంది. ఆ సమయంలో సామాన్య రక్షకులే తప్ప, పెద్ద మోహరింపు వుండదు. కనుక, ఆ సమయంలో ఆమెను ఎత్తుకుపోవడం చాలా తేలిక. అదేదో, పెద్ద అమోఘమైన ఆలోచనగా చెప్పాడు. "బాగుంది" అన్నాడు జరాసంధుడు.

ఇద్దరు, ముగ్గురు సమర్థులను తీసుకువెళ్ళు. నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. ఆలోచన ఏదైనా చెయ్యడానికి ముందే తప్ప, చేసేటప్పుడు, ఆ తదుపరి ఆలోచన లనవసరమని, జరాసంధుడు, తన సలహానిచ్చాడు. మేమందరం ఆ ప్రక్కనే కాపుగా వుంటాం. నువ్వు విజయం సాధించి, శంఖమూదు. మేం గట్టి కాపలాతో వెంబడిస్తాం. మగధకు సాగుదాం!

ఈ సమయంలో పిలిచినట్లు జరాసంధుని సామంతుడైన - యువరాజు విందుడు, ఆతని కుమారుడు దండుడు వచ్చారు. విందుని చూస్తూనే జరాసంధుడు కళ్ళెర్ర చేసాడు. ఇప్పుడా రావడం ? మేము ఎప్పటినుంచి ఎదురు చూస్తున్నామో తెలుసా ?'' గద్దిస్తున్నాడు.

“క్షమించు, చక్రవర్తి! ముందే బయలుదేరాను. జనం మధ్యలో దిగబడి పోవాల్సి వచ్చింది.''

“అంత జనమా ?''

“ఔను, చక్రవర్తీ! బలరామ కృష్ణులు, తమ అసంఖ్యాక పరిజనంతో రాజభవనం నుండి వాళ్ళు తిరిగి వస్తున్నారు. ఎటు కదలడానికి వీల్లేని విధంగా, దారులు మూసుకుపోయాయి. దాంతో... ఆలస్యమైందని, ఆలస్యంగా వచ్చినందులకు క్షమాపణలు చెప్పుకుంటున్నాడు.

“బలరామ-కృష్ణులా! ఆ యాదవులు రాజులే కాదే, వాళ్ళెందుకు వచ్చారో... రాను, రాను... చెప్పే ధర్మాలకు, ఆచరించే సాంప్రదాయాచారాలకు, ఈ ఆర్యులు తిలోదకాలిస్తున్నారు. ఏం చేస్తారుటా పిరికిపందలు ?'' ఇష్టమొచ్చినట్లు చక్రవర్తి కదా! తన కడ్డం లేనట్లు వదురుతున్నాడు.

“ద్రుపదుడు, వారిని ఆహ్వానించాడా ?'' అనుమానం తీర్చుకోవడానికి జరాసంధుడడుగుతున్నాడు.

ద్రుపదుడు కాదు కానీ, వాని కుమారుడు, యువరాజు దృష్టద్యుమ్నుడు, సత్యాజిత్తులు, బలరామకృష్ణులను ఇతర యాదవ ప్రముఖులను సాదరంగా ఆహ్వానించారు. రాజులకు జరిపినట్లే స్వాగత సత్కారాలు జరిపారు. ఆ తదుపరి వారు మర్యాదపూర్వకంగా పాంచాలుని కలుసుకున్నారు. అయితే కృష్ణుడు కూడా స్వయంవరంలో పాల్గొంటాడా ?

“ఏమో... కానీ చక్రవర్తీ! ఈ స్వయంవర ఆలోచన ఆ కృష్ణునిదే. తనకు వచ్చిన అవకాశాన్ని, కాదని, ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినవాడతడే...

“ఏమో, నా కనుమానమే! ఆ నల్లపిల్లిని నమ్మేవాడెవడు ? చిన్నప్పుడు వెన్నలదొంగ, ఇప్పుడు కన్నెల దొంగ'' అని సహదేవుని వైపు తిరిగి “కుమారా! వెళ్ళు. వెళ్ళి మన మేఘసంధికి... ఊ... ఊ'' ఆజ్ఞాపించాడు.

ప్రస్తుత పరిస్థితులలో నేను వెళ్ళడం బాగుండదు. ఈ వాసుదేవుడు, చేకితానుని కోసం, కురువీరులతో ఏదో ఒప్పందానికి వచ్చి వుంటాడు. ఎందుకంటే దుర్యోధనుడు తాను బలదర్పాలతో ఆక్రమించుకున్న పుష్కర రాజ్యాన్ని అప్పనంగా అప్పగించాడు. ఈ కార్యక్రమానికి ఆచార్య ద్రోణులు, శకుని, ముఖ్యంగా దుర్యోధనుని భార్య భానుమతి వచ్చారట. ఈ మంత్రాగంలో, ఏదో ఒక నిర్ణయం జరిగి వుంటుంది. లేకపోతే సంపాదించుకున్న దానిని, నిస్వార్థంగా మైత్రీభావంతో విడిచిపెడతాడా...?! అసంభవం ?!

"నిజం...!" అనుకున్నాడు జరాసంధుడు.

కంసుని చంపడం, నిరాయుధుని చేసినట్లు గోమంతకంలో తనను చంపే ప్రయత్నం నుండి, సిగ్గుపడి, తలదించుకుని చచ్చేటట్లు, అన్నగారి ఉక్కుపిడికిళ్ళ నుండి తనను రక్షించడం, తన పథకాలు తారుమారు చేసి, చెట్టుకొకపుట్టగా విదర్భ, ఛేది దేశాధీశులను తరిమినట్లు, రాకుమారిని ఎత్తుకుపోయి, వివాహ మాడటం, ఇప్పుడు తనకు "వలదు, వలదు" అంటూ, ఈ స్వయంవర పర్యవేక్షణం, అంతా చూస్తే, నిజంగా, ఈ అసాధ్యుడు కొంపముంచేటట్లున్నాడు. ఈతని ఆలోచనల నుండి బయటపడటం, తమ పథకాలు పారడం జరిగేనా ? ఇదొక పెద్ద సందేహము, సంశయమై కూర్చుంది.

ఏ అధికారంతో, కృష్ణునికి రాచమర్యాదలు, అదీ ఓ చక్రవర్తికిచ్చి నట్లిస్తున్నారో, జరాసంధునికి ఒక పట్టాన అర్థం కావడం లేదు. కుపితుడౌతున్నాడు. ఉడికి పోతున్నాడు. ప్రతిక్షణం ఆ వాసుదేవుని ద్వారా "గొల్లడు, పిరికివాడనే" వాళ్ళ తలలు తన్నేటట్లే పొందే అవమానాలను భరించలేక మార్గమెరుగక తల్లడిల్లిపోతున్నాడు.

ఇప్పుడు జరాసంధుని పరిస్థితి, "చక్రవర్తి" అనడానికి వీల్లేకుండా ముందు నుయ్యి, వెనుక గొయ్యి అయింది. ఏం తొందరపడినా కష్టమే. ఫలితం దారుణంగా వుంటుంది. "కృష్ణా!".... ఏం చెయ్యాలో తోచక, తల పట్టుకున్నాడు. పడే తొందరంతా, తలవంపులకు, వున్న నల్గురు మిత్ర, సామంతులు చేజారిపోవడానికి తప్ప, మరో దారి కనబడటం లేదు.

ఇదిలాగ వుంటే, దుర్యోధనుడికి ద్రౌపదిపై మక్కువ, కర్ణునికి ధర్మంపై ఆసక్తి, అశ్వత్థామకు, పరిస్థితులపై కోపం... అంతా చిత్రంగా వుంది అచటి పరిస్థితి. దుర్యోధనుని గుడారం నుండి వచ్చిన అశ్వత్థామ; కర్ణుడు, బీదలకు అన్నదానం

చేసేవరకు ఆగి, “రాను, రాను ఈ దుర్యోధనునితో చావు వచ్చింది. ఇంత స్వార్థం పనికిరాదు” అంటే, ఏమయిందని కర్ణుడడుగుతాడు.

“ఏముంది ? ఆ గోపాలుని, ద్రౌపది తనను చేపట్టేటట్లు చెయ్యమని కోరాడుట. ఆమె కనుక అతనిని చేపడితే మా నాన్నగారు, పూర్వ వైరాన్ని మనసులో పెట్టుకుని కురు రాజ్యాన్ని వీడకుండా చూడాలిట. నెత్తిన కుంపటి పెట్టి, కాలకుండా జాగ్రత్త తీసుకోండి” అన్నట్లు విరోధి పుత్రికను తెచ్చుకోవడం దేనికి, విద్యగరపిన గురువుకు అన్యాయం చెయ్యడం దేనికి ? ఆయనకు ఆగ్రహం రాకుండా, అభిమానంతో అంటిపెట్టుకున్న నన్ను అవమానపరుస్తూ, దురభిమానం లేకుండా, ప్రవర్తించమనడం హాస్యాస్పదమా ? లేక మీతో నాకేమిటన్నట్లు, ప్రవర్తించడమా ? అసలీ స్వార్థానికి.... ఆవేశంతో వుడికుడికిపోతున్నాడు.

“సోదరా! మనమందరం దుర్యోధనుని యువరాజుగా కాక, సార్వభౌమునిగా చూడాలన్న తాపత్రయంలో వున్నాం. మన తాపత్రయం మనది. మరి, అతను - తానే ఏకైక సార్వభౌమునిగా మనగలగాలని, ఆశ! ఆ ఆశలో ఈ ద్రౌపది. ఇది సంభవమా ? అసంభవమా ? అన్న ఆలోచన... నీకు చెప్పవలసింది కాదు. “కామాతురాణాం, నభయం, నలజ్జ!” అంటారు. అది ప్రస్తుతం మన యువరాజును పట్టుకుంది. ఇందులోంచి బయటపడితే... అన్ని... సమసిపోతాయి.

కొద్దిగా నిదానించండి. దుర్యోధనుడు, ఆతని మనస్తత్వం - శకుని, ఆయన కుతంత్రం, మీ అభిమానం, నా ధర్మపథం.... అన్నీ లోకానికి తెలుసు. ఇందుకు ఆయన తొందరపడితే, మనం ఆవేశపడటం తగదు. అన్ని సర్దుకుంటాయి. విధి బలీయం. కాలం నిర్ణయాత్మకం!” అని సర్ది చెబుతాడు. అశ్వత్థామ కొద్దిగా శాంతపడతాడు.

ఇంకోవిషయం. దుర్యోధనుడు మనకోసం, అయినవారినందర్నీ విడిచి పెట్టుకున్నాడు. బలవంతులైన అరివీర పరాక్రములైన పాండవులతో విరోధం పెట్టుకున్నాడు. మనం తప్ప అతనికి మరెవ్వరు లేనట్లు ప్రాణప్రదంగా తలుస్తుంటే, నిజమైన మిత్రునిగా, అతనికి సాయపడటం మన ధర్మం కాదా! ఆ యువరాజు కోరిన దేదైనా, మనం తెచ్చి యిస్తేనే, మన మిత్రధర్మానికి మనుగడ. లేదంటే, కృతఘ్నులమౌతాం. కాబట్టి అనవసరాందోళనకు గురి కాకుండా, మన మిత్ర ప్రభువు, సోదరుడు - దుర్యోధనుని మనోభీష్టానికనుగుణంగా ప్రవర్తించి, ఆతని ఋణం తీర్చుకుందాం.” కర్ణుడు బుజ్జగిస్తున్నట్లు చెబుతున్నాడు.

"అయితే నువ్వు - విలువిద్యా ప్రదర్శన వుంటే అందులో పాల్గొనవా ? ద్రౌపదిని చేపట్టావా ?" అశ్వత్థామ అడుగుతాడు. పాల్గొంటాను. అది దుర్యోధనుని కోసమైతే. నాకోసం, దుర్యోధనునెదిరించి, దేనిలోను పాల్గొనను. ఏ విజయం నాకవసరం లేదు. సూతపుత్రుడినని అందరు వెక్కిరించి, ధిక్కరిస్తుంటే అంగరాజ్యమిచ్చి అందలమిచ్చిన ఘనుడు, నా ప్రాణమిత్రుడు దుర్యోధనుడు. ఈ ప్రాణమాతనిది. ఆతని కోసమే ఈ కర్ణుడు. ఇది సూతధర్మమన్నా నేను బాధపడను. కారణం - నేను సూతపుత్రుడిని. నా ధర్మం నేను నిర్వర్తిస్తాను. ఇందులో మరోమాట, బాటలేదు!'' ఖచ్చితంగా, అశ్వత్థామ మనసును చదువుతున్నట్లు చెప్పాడు.

ఏదో ఒకరిద్దరికి తప్ప - "ద్రౌపది" స్వయంవరంపై ఎక్కువమందికి ఆసక్తి లేదు. ఇటు జరాసంధుడు, అటు దుర్యోధనుడు మధ్యలో వాసుదేవుడు వారధి, సారథి. పంచపాండవుల సంగతి తెలీదు. తెలిస్తే కథ మరొకలాగ వుంటుంది.

చివరకీ - కథ - ఏ రకంగా ముగుస్తుందో, ఆశావాదులకు - నిరాశే మిగిలిస్తుందో ? నిర్లిప్తులనే చేస్తుందో ? అంతా దైవేచ్ఛే. కాల నిర్ణయం.

## అంబర సంబరం!

**ప**దహారు రోజుల పండుగలో, పదకొండవ నాటి స్వయంవర సంబర మహోత్సవ - శుభదినం దగ్గర పడుతుంది. ద్రౌపదిలో ఆందోళన ప్రారంభ మయింది. అంతా బాగానే వుంది. ప్రతి ఒక్కరు సంబరపడుతున్నారు. ఎంతో కోలాహలంగా, ప్రతి ఒక్కరు ఆశావాదులై, ఆవేశంతో వున్నారు.

ఇప్పుడామెలోని ఆందోళన, ఒక్కటే. తననెవరు వరిస్తారు ? తానెవర్ని వరించాలి ? ఆ వరించినవాడు తండ్రి ఆశయాలకనుగుణంగా వుంటాడా ? లేక ఆందోళనపాలు చేస్తాడా ? ఇవి ఆమె సమస్యలు. అతలాకుతలం చేస్తున్న సవాళ్ళు ? వీటికి పరిష్కారము. సమాధానం.... ఎలాగ లభిస్తుందోనని ఆమె ఆందోళన, కలవరం ?!

ఆచార్య సాందీపులువారు పెట్టే పరీక్షలో నెగ్గిన వ్యక్తిని తాను వరించాలి ? ఇందులో ఏ తిరకాసు వుండదు. అవతలి వ్యక్తి, వీరి ఆలోచనలకు తగ్గట్లు వుండాలి.

ఇది సాధ్యమా ? సాధ్యాసాధ్యాలను పరిశీలించి చేసుకునే వివాహం కాదిది. గెలిచిన వారిని విజయలక్ష్మితోపాటు, తాను వరించి, ఆ విజయుడికి భార్యనవాలి. తప్పదు. దీని పర్యవసానం ? ఆమెలో అంతులేని కలవరం. ఆపుకోలేని ఆందోళన. ఈ స్వయంవరం పేరు చెప్పి సమస్య తీరుతుందా ? అన్న అంతంలేని ఆలోచనతో ఆమెకు నిద్రలేని రాత్రుళ్ళెన్నో.... పరిష్కారం దొరకని పగళ్ళెన్నో... ?!

ఈ స్వయంవరానికి, కృష్ణుడిని ప్రక్కనబెడితే - యాదవ ప్రముఖులలో చెప్పుకోదగ్గ - బలరాముడు, సాత్యకి, కృతవర్మ.... ఎందరో, మరెందరో వున్నారు. ఇటు కౌరవ శిబిరంలో దుర్యోధనుడు, కర్ణుడు, అశ్వత్థామ, కురువీరులు - దుర్యోధన సోదరులెందరో వున్నారు. యధాప్రకారం, తన అలవాటుగా తన తండ్రి పాదాలకు నమస్కారం చేసింది. తండ్రి అదొక రకంగా, అశాంతితో వున్నారు.

అప్పుడు, దుర్యోధన సోదరుడు అక్కడికి వచ్చాడు. తన అన్న ధృష్టద్యుమ్నుడు దుశ్శాసనుని ఆహ్వానించాడు. అతనెన్నో బహుమతులతో వచ్చాడు. వెంట వేదపురుషుడైన బ్రహ్మవేత్త కూడా వున్నారు. ఆ వచ్చిన బ్రహ్మమూర్తి, ముందుగా దుర్యోధనుని, ఆ తదుపరి అంగరాజు కర్ణుని, ఆపైన మహా ధనుర్వేత్త అపర ద్రోణాచార్యుని కుమారుడు, అశ్వత్థామ కీర్తిని కీర్తించాడు. వారి ప్రశంసలతో వాతావరణం కొందరికి ఆహ్లాదరకమైతే మరికొందరికి ఇబ్బంది కరమైంది.

అప్పుడు - ధృష్టద్యుమ్నుడు, వాసుదేవుడు, గాంధార రాజు, దుర్యోధనుని మేనమామ శకునిని తీసుకు వద్దామనుకున్నారుట. దుర్యోధనుని భార్య భానుమతి, కృష్ణుని చిన్న చెల్లెలట. ఆమె మనోభీష్టాన్ని తీరుస్తానని, పెద్దన్నగా గోవిందుడు వాగ్దానం చేసాడుట. నీకు, దుర్యోధనుని మధ్య సమావేశం - అదే సమాగమ మేర్పాటు చేస్తానని చెప్పారుట. అందుకని వీళ్ళు, తగు బహుమతులతో వచ్చారని చెప్పాడు.

ద్రౌపది ఆశ్చర్యపోయింది. దుర్యోధనుని... కృష్ణుడు.. ఏమిటీ విపరీతం ? ఈతనికి కృష్ణునికి వత్తాసు. హస్తినాపురం అల్లకల్లోలమవడం, పాండవులు వారణావతానికి వెళ్ళడం, అక్కడ లక్క ఇంట్లో వాళ్ళు కాలిపోవడం, ఇదంతా దుర్యోధనుని దుష్టపన్నాగమని, అటువంటి నీచుడు మరొకడుండడని లోకం కోడై కూస్తుంది. అతను ద్రోణాచార్యుల శిష్యుడు కదా! అతనికి.... ఇందులో ఏదో తిరకాసు వుంది. తెలివిగా ద్రౌపది, ఆశ్చర్యం నుండి తేరుకుని ఆలోచించడం

మొదలుపెట్టింది. ఇతని ప్రవర్తన మంచిది కాదని పితామహుడు ఒక సం॥రం తపస్సు గడపమని, కురుక్షేత్రానికి పంపాడు. ఇతడు తన స్వార్థం కోసం, భార్యనుపయోగించుకుని ఆమె ద్వారా కార్యసాధన కుపక్రమించాడంటే, ఎంత నీచుడో అర్థమవుతుంది.

అసలు వాసుదేవుని తత్వమర్థం కావటం లేదు. అందర్నీ ఆయన ఆలోచనల కనుగుణంగా "ధర్మ" పథమంటూ, ఆ విధంగా నడిపిస్తున్నాడు. చూడగా, చూడగా మీరు మరోలాగ అనుకోవద్దు. వర నిర్ణయం చేసుకోబోయే వధువుదే - "అంటూంటే" ఎటొచ్చి, వీరత్వ ప్రకటన స్వయంవర లక్షణం. మా అన్నను మించిన...

"వద్దు. ప్రస్తుతం ఆ మాటలనవసరం. విషయం మాది. ఆలోచనలు, ఆచరణ మాది. దయచేసి" సున్నితంగా తిరస్కరించి పంపింది. ద్రౌపది, దుర్యోధనుని వివాహమాడటానికి సిద్ధంగా లేదు. విషయం తెలిసిన ద్రోణుడు, బోనులో బంధించిన సింహంలాగ వున్నాడు. ఎంత అసహనంగా వున్నాడో చెప్పలేని పరిస్థితిలో ద్రుపదుడున్నాడు.

నిజానికి స్వయంవరం పేరిట కీర్తిప్రతిష్ఠలను పొందాడు కాని, ఈ స్వయంవరమే అర్థరహితంగా వుంది. చివరికిదెలాగ పరిణమిస్తుందో, అర్థం కావడం లేదు. మీకెందుకు, నేనున్నానన్న - కృష్ణుని అభయమెలాగ మొదలవుతుందో, అంతమవుతుందో వూహకందడం లేదు. మొత్తానికి తాను ఇరుకున పడ్డట్లు తలుస్తున్నాడు.

ఆ గోవిందుడు - ఆశ, ఆశయం అర్థం కావటం లేదు. ఇప్పుడెట్లాగ ? ఏం చెయ్యాలి. ఆ కురువీరులకు దాసోహమనాలా ? అశ్వత్థామకు వందనం చెయ్యాలా ? ఆ కర్ణునికి నేను దుర్యోధనుని కోసం... తలవంచుకోవాలా ? తలదించుకోవాలా ?" ఇటువంటి పరిస్థితి కల్పించిన కృష్ణునిపై తీవ్రకోపం బయలుదేరింది.

"గిరిధారి" మమ్మ వంచించావన్నట్లున్నాడు, ద్రుపదుడు.

వృద్ధమంత్రి ఉద్బోధనుడు వచ్చి, స్వయంవర మంటప నిర్మాణం పూర్తయిందని, ఒకసారి వచ్చి చూస్తే మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పాడు. ఆ ప్రశాంత వాతావరణంలో, యువరాజును తీసుకువెళ్ళమంటున్న తరుణంలో, మగధ యువరాజు

సహదేవుడు, తమను కలువ నిలిచారని, భటుడు చెప్పాడు. అదే మామూలు పరిస్థితిలో అయితే, ఆ వచ్చిన భటుని తలే నరికేవాడు కాని, ప్రస్తుతం కోపానికి, అసహనానికి సమయం కాదని సర్దుకుని, మగధ యువరాజును కలువదలిచాడు.

అడుగడుగునా అనుమానాలే. అయినా, అతన్ని కలిస్తే చక్రవర్తి తమకో సందేశం పంపారన్నాడు. ఏవిటో వారు పంపిన సందేశ"మనగా" మీరు పంపిన ఆహ్వానానికి సమాధానంగా చక్రవర్తి తమ యువరాజు, మనుమనితో వచ్చారు. మీ కుమార్తె ద్రౌపది మా మనుమడు మేఘసంధిని పరిణయమాడగలదని తలుస్తున్నాము. దీంతో మగధ-పాంచాలదేశాలు మిత్రదేశాలుగా వర్థిల్లుతాయి. సుఖసంతోషాలతో మనగల్గుతాయి" అని అధికార స్వరంతో, చక్రవర్తి కుమారునిగా, భావిచక్రవర్తిగా చెప్పాడు.

మన మైత్రికి చిహ్నంగా, జరిగిన స్వయంవరానికి, కృతజ్ఞతగా, మీ మనోభీష్టం చెల్లించడానికి, మీతో మగధ సైన్యాలు, కలిసి, మీ సారథ్యంలో పోరాడుతాయి. మీకానందం కల్గిస్తాయి." తనను తమాయించుకున్న పాంచాలుడు -

"చక్రవర్తికి మా వందనాలు. వారి అభీష్టానికి ఆనందాలు. కనబరచిన మైత్రికి మరిన్ని కృతజ్ఞతలు. వారి ఆదరాభిమానముల విషయం, స్వయంవరా నంతరం పరిశీలిద్దాం. ప్రస్తుతానికి, మా ఆహ్వానం మేరకు వచ్చిన చక్రవర్తి, ఆనందమూర్తులై మెలంగగలరని విశ్వసిస్తున్నా!" మని లేచాడు. అందీ అందని సమాధాన సరళి అర్థంకాక సహదేవుడు ఆలోచనలో పడ్డాడు. మహారాజు లేవడంతో, తాను వెనుదిరగాల్సి వచ్చింది.

"మరో విషయం. రాజకుమారి, ఎవరో వచ్చాడని, ఆహ్వానించారని కాకుండా, స్వయంవరం నిమిత్తం ఏర్పాటు చేసిన పరీక్షలో విజయమొందిన వీరవర్యుని చేయిపట్ట సంకల్పించింది కాబట్టి, ముందు మేమా ఏర్పాట్లలో తల మున్కలయి వున్నాం. దీనిని సవినయంగా చక్రవర్తికి తెలుప ప్రార్థన"మన్నాడు.

కాదన్నందుకు సహదేవుని మనస్సును చదివిన ద్రుపదుడు, స్థిమితపడ్డాడు. ఆవేశం అనర్థదాయకం. ప్రపంచంలో అడుగుపెట్టి, విజేత కావాలని తలవాలే కానీ, ఎవరో ఏదో అనుకుంటారని మనకు మనం బిడియపడి, వెనక్కి తగ్గితే, విజయం అందనంత దూరంలో వుంటుంది కాని, మన చేతికి చిక్కదు.

"మీ పరిస్థితి అర్థం కావడం లేదు" అన్నాడు సహదేవుడు.

"నాకు అర్థం కావడం లేదు" తనలో తను అనుకున్నాడు, పాంచాలరాజు.

"అయితే, మీరు పెట్టే పరీక్షలో ఎవ్వరు నెగ్గకపోతే, ఇది సహదేవుని ప్రశ్న

"అందుకు పాంచాలరాజు" మా అమ్మాయి సాంప్రదాయబద్ధంగా, తనకు నచ్చినవారిని వివాహం చేసుకుంటుందే తప్ప, ఇంతవరకు వచ్చి వెనుదిరగడం వుండదంటాడు.

సహదేవుడు కోపంగా లేచిపోతాడు.

మహారాజు, లోపలికి బయలుదేరతాడు.

# తమ్ముడు...!!

**తం**డ్రి ఆందోళనకరంగా వుండటం, ఆయన మనస్తాపం - ద్రౌపతి, ద్రుష్టద్యుమ్నుడు, సత్యాజిత్తులను కలచివేస్తూంది. ఆ వచ్చిన వాళ్ళ ఉద్దేశం అర్థం చేసుకోలేకపోతున్నారు. ప్రతివారికి సంతలో సరుకులాగ ద్రౌపది తయారయిందని బాధపడతారు.

ఇదంతా ఆ గోవిందుని పన్నాగమై వుంటుంది. అనవసరంగా మనం ఇబ్బందుల్లో పడ్డాం. "స్వయంవరం" అన్న మాటకు గౌరవంగా, సాటిరాజ లోకంలో భాగంగా ఆర్యావర్తంలోని రాజ్యంలో ప్రముఖునిగా - కురువంశ సామ్రాజ్యానికి ఆహ్వానం పంపాను. నా వుద్దేశంలో వారు రారని, ద్రోణుడు రానివ్వరని తలిచాను, కానీ ఈ విధంగా దుర్యోధనాదులు పరుగెత్తుకు వస్తారని తలువలేదు. వచ్చారు. ఇప్పుడు అంతా గందరగోళంగా తయారయింది.

చివరకీ స్వయంవర కార్యక్రమం ప్రహసనంలాగ తయారయింది. ద్రౌపది స్థిరనిశ్చయంతో, ద్రోణునికి సంబంధించిన వారెవరైనా సరే, వారీ పరీక్షలో నెగ్గినా, నేను చావనైనా చస్తాను కానీ, వాళ్ళను వివాహం చేసుకోను. నా ప్రతిజ్ఞాభంగం చేసుకోను" అంది.

ఒక ప్రక్క వాదన, మరొక ప్రక్క వేదన.

విషయం తెలియడం లేదు. తేలడం లేదు.

విలువిద్యా ప్రదర్శనా పాటవంలో నెగ్గిన వ్యక్తిని "నేను వివాహం చేసుకుంటాను" అంది. ఆ వ్యక్తి ఆమెకు ప్రతిజ్ఞా భంగం చేయకుండా వుండాలిట!" అని ఆ ప్రశ్నను అక్కడ ఆపింది. ప్రతి ఒక్కరు మూలం వెదుక్కుంటున్నారు. కారణం కనపడటం లేదు, దొరకడం లేదు.

ఇందులో ఎవరి బలవంతాలకు, పట్టుదలలకు పరాక్రమాలకు లొంగే స్థితి లేదు. నిర్ద్వంద్వంగా చెప్పింది. ఆ సమయంలో శిఖండి అక్కడ అడుగు పెట్టేసరికి అందరు ఆశ్చర్యపోయారు. వస్తూనే తండ్రికి నమస్కరిస్తే, ఇన్నాళ్ళు ఎక్కడికి వెళ్ళావని ? విస్తుపోతూ అడిగారు.

"తండ్రీ! మన కుటుంబంపై పడిన మచ్చను తొలగించడానికి వెళ్ళాను." తండ్రి భుజంపై తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ చెబుతూంటే, తండ్రిగా బుజ్జగిస్తున్నాడు. అందరికి ఆశ్చర్యాన్ని కల్గిస్తూ - ఇప్పుడు నేను స్త్రీని కాను. నిజమైన పురుషుడినని" చెబుతూంటే, నిజంగా అందరు సంతోషమూర్తు లయ్యారు. "నిజంగా" అప్రయత్నంగా అనేసారు.

"అంతా భగవంతుని కృప. నువ్వు - ఈ శుభ సమయంలో వెంటనే హిరణ్యావర్మకు, తమ కుమార్తెను, చీర సారెలతో కాంపిల్యానికి పంపమని, శుభవర్తమానం పంపు. భర్తగా ఆమెను అలరిస్తాను" శిఖండి, ఒక్కొక్క మాటకు ఒక్కొక్క రకంగా వారు ఆనందపడుతున్నారు.

ఇదంతా మా గురువుగారి ఆశీర్వచన ఫలితమనగానే, "ఎవరా గురువు గారు" ఇంకా ఆశ్చర్యంగా ద్రుపదుడడిగాడు.

"మహావీరుడు, బ్రహ్మమూర్తి, పరశురాముల వారి శిష్యులు, మహాధనుర్వేత్త "ద్రోణాచార్యుల వారు". ఇది నిజంగా వాళ్ళను అప్రతిభులను చేసింది. "నువ్వు.... నువ్వు... నా శత్రువు నుండి, ఈ మగతనాన్ని పొందావా ? ఇంతకంటే చచ్చిపోతే సంతోషించేవాడిని. ఇది నీకు ఆనందము, అదృష్టమేమో కానీ, మాకు మాత్రం మరణాంతకం. శిఖండిని తండ్రి అసహ్యించుకుంటున్నాడు. శిఖండి బ్రతుకు బాగుపడిందనే సంతోషంకన్నా, అదో మహాఘోరంగా తలచి, ద్రుపదుడు రెచ్చిపోతుంటే, పులిమీద పుట్రలాగ వచ్చిన - ఇది - శుభసూచకంగాక, అశాభంగంగా తలుస్తున్నారు. ఈ హడావుడిలో చెదిరి, కళ్ళు తిరిగి శిఖండి పడిపోవడం మరింత హడావుడిని, గందరగోళాన్నిక్కడ సృష్టించింది.

ఎక్కడికక్కడ ముడులుపడి, ఆవేశాన్ని పెంచుతున్నాయి. కొంతసేపటికి కళ్ళు తెరచి, అందర్నీ చిత్రంగా చూసిన శిఖండి "అక్కా! నీకు నా మీద కోపమా ? ఆ బ్రతుకు బ్రతుకలేక, గంగలోదూకి చావాలని తలిచాను. ఆ సమయంలో భగవంతుడు నన్ను కరుణించి, సందేహించక ద్రోణాచార్యుల నాశ్రయించు మన్నాడు. అలాగే చేసాను.

ఆ మహానుభావుడు, "నేను ఫలానా" అని తెలిసి కూడా ఎంతో ప్రేమతో దగ్గరకు తీసుకుని నన్ను ఆశీర్వదించారు. నన్నొక యక్షుని వద్దకు పంపారు. ఆ పుణ్య ఫలితం - ఈ జన్మ. ఆ భగవంతుని మాట నిజమయింది. కరుణించారు. వారి కారుణ్యమే ప్రస్తుత పురుష జీవితమంటూ ఇక్కడికి వస్తే నన్ను చూసి అందరు సంతోషిస్తారని తలిచానే గానీ, మీరందరు, ఉద్విగ్నానికి లోనయి బాధపడతారని, బాధపెడతారని తెలిస్తే - ఈ క్రొత్త జీవితంతో ఇక్కడికి వచ్చేవాడిని కాను. పాతజీవితంలోని స్త్రీమూర్తి వలె - ఎత్తిన జన్మకు ప్రాయశ్చిత్తంగా, ఆత్మహత్య చేసుకుని - ఈ జీవితాన్ని చాలించేవాడిని. మరి, కానీ, అలాగ కానివ్వకుండా, భగవంతుడు రక్షించాడంటే, ఇందులో ఏదో ఆంతర్యముండి వుంటుంది" ముగించాడు.

"ఆచార్యుని గొప్పతనం చెబుతూ, ఇంతకు నన్నిక్కడికి పంపి మనిషిని చేసిన ఆ దేవుడెవరో తెలుసా ? "కృష్ణ, వాసుదేవుడు, గోవిందుడు, గిరిధారి" ఇందులో ఏదో మహత్తర, మహత్కార్యముండి వుంటుందని" అంటూంటే,

"నువ్వు...!" అని, "నిన్ను ... ఆ వాసుదేవుడు, ద్రోణుని వద్దకు పంపి, ఈ రకంగా చేసారంటే, ఇందులో ఏదో కుట్ర వుంది. దీనికి నువ్వు - కృష్ణ బానిసవు, ద్రోణ బానిసవయ్యావు" కోపం ఆపుకోలేకపోతుంది.

"అక్కా! నేనెవరికి బానిసను కాను. లోకానికి నేను ద్రుపదుని కుమారుడను. ఇప్పుడూ అంతే. నా తండ్రి అడుగుజాడలలో, ఆయన మర్యాదకు భంగం రాని రీతిలో ప్రవర్తిస్తాను. ఇది సత్యం. జన్మనిచ్చి, ఇన్నాళ్ళు నన్నెంతో ప్రేమతో కాచిరక్షించిన, తల్లిదండ్రుల పాదాలపై చేసే ప్రతిజ్ఞ. వారి ప్రాణాలు పణంగా తీసుకోను. కృష్ణుడు భవిష్యత్తు తెలిపి, నన్ను నాలోని పిరికితనాన్ని సంస్కరించి మరీ జన్మనిచ్చారు. అందుకు శతకోటి వందనాలు. అందుకు కృతజ్ఞతగా నన్నర్పించుకోను. బానిసగా బ్రతకను"

మళ్ళీ ప్రతిజ్ఞాపూర్వకంగా చెప్పాడు. అయినా ద్రౌపది శాంతించడం లేదు. ఆ కృష్ణుడు మోసగాడు, పిరికిపంద. ఇటు జరాసంధుని, అటు ద్రోణాచార్యుల ద్వారా దుర్యోధనుని ఎగద్రోసి, తాను లీలామానుష విగ్రహుడివలె చోద్యం చూస్తున్నాడు.

అసంభవం. స్వయంవరానికి ముందు బలవంతంగా చావనైనా చస్తాను కానీ, జరాసంధుని బెదిరింపులకు, దుర్యోధనుని ప్రాభవానికి తలవంచను. ఒకడు కులద్రోహి, మరొకడు కృతఘ్నుడు. తమ తమ కార్యాల కోసం ఎంతకైనా తెగిస్తారీ దుర్మార్గులంటూంటే -

తన ప్రాణదాతకు కృతఘ్నుడు కాలేక, జన్మదాతలకు విరోధికాలేక, భగవంతునికి దూరమవలేక, ఎటూ సమాధానం చెప్పలేని - శిఖండి, అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

# తమ్ముడు, వెళ్ళిపోతున్నాడు !

**కో**పం తగ్గిన ద్రౌపది, తమాయించుకుని తమ్ముని చూసింది. అతని రథం వెళ్ళిపోతుంది. "తమ్ముడు వెళ్ళిపోతున్నాడు" ఏం చెయ్యాలో అర్థంకాక మంచంమీద పడుకుని బావురుమంది. ఏమిటీ స్థితి ? దుస్థితి ? ఎడతెగని ఆలోచనలు. చెప్పలేని అంతర్మథనం. తెలియని ఆరాటం. తెగని బాంధవ్యం. "భగవంతుడా!" అప్రయత్నంగా అనేసి దిండులో తలదాచుకుంది. మళ్ళీ మళ్ళీ ఏడుస్తుంది.

ఆ వెక్కి వెక్కి ఏడుస్తున్న తరుణంలో కోలాహలం. ఒకటికి, రెండు రథాలు వచ్చిన శబ్దం. అంతలో జయ జయ ధ్వానాలు. ఎవరు ? అంటే - ఇంకెవరు ? - వాసుదేవుడు. యాదవ రక్షకుడు. ఆ "నంద"నందనుడు. అచ్చటి పరిస్థితిలో తండ్రి, తాను, అన్న, తమ్ముడు సంగతి తెలియదు. కృష్ణుని నిందించ సిద్ధంగా వున్నారు.

ఇటువంటి సమయంలో, ఆ మందహాస వదనుడు, ఆ "నంద"- "నంద"నుడు, విలాసంగా, దిలాసాగా వచ్చాడు. "తండ్రీ ఆ గోవిందుడు "అనగా- ప్రస్తుతం నా మనసు బాగుండలేదు. నువ్వే ఏదో విధంగా కార్యం నెరుపమన్నాడు. అక్కడి పరిస్థితి సంపూర్ణంగా తెలిసినట్లు, కృష్ణుడు రెండడుగులు ముందుకు వేసి "సోదరీ! రాజకుమారీ, ఈ అన్నకు నీ దర్శనమివ్వలేవా, నాతో మాటాడ

రావా ?'' అంటూంటే ఆ మాటలు ముగ్ధత్వానికి, పడుకున్న ద్రౌపది గబుక్కున లేచి, బట్టలు సర్దుకుని, ఓరగా వున్న తలుపులను బార్లాతీసి పట్టుకుంది.

అంతలోనే సర్దుకుంది. పళ్ళబిగువున "అన్నా! నీవా'' అంది. స్వరంలో కొద్దిగా తేడా. కాఠిన్యం లేదు. కాని, మార్దవం కనబడటం లేదు.

కృష్ణుని చూస్తూనే సత్యజిత్తు ఆసనాన్ని అర్పించాడు. "నిన్ను చూద్దామని, ఇటు వద్దామనుకుంటూనే, ఇతర కార్యక్రమాల వలన రాలేకపోయాను. నీ మనోచింతన వీడు. నీకు తప్పక శుభం కల్గుతుంది. నీ మనోరథం, పాతకాలం నాటి ప్రతిజ్ఞలు నెరవేరుతాయి. ఇందులో సందేహం లేదు.'' ఆశావహమాటలు, అభయం. ఏడవాలో, నవ్వాలో అర్థం కావడం లేదు.

కారుచీకటిలో కాంతికిరణంగా, కృష్ణుడు, ఆతని మాటలు కనబడు తున్నాయి. వినబడుతున్నాయి. అంతా ఒకసారి పరకాయించి చూసిన కృష్ణుడు, సత్యజిత్తుతో "చిరంజీవి' ఇది గడ్డు సమస్య కాదు కానీ, నా ప్రశాంతతను భగ్నం చేస్తుంది. గాఢంగా అలిసిపోయాను. ఇందులోంచి బయటపడే మార్గం చూపు.

"నేనా ? మీరు అలిసిపోయారా ?'' సత్యాజిత్తు ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఏం ఎందుకు కాదు, నేనూ మీవలె మనిషినే కానా ? నాకు సమస్యలు, సందర్భాలు వుంటాయి కదా!'' అన్నాడు.

"నువ్వు దేవుడవని, అవతారపురుషుడివని, ఇంకా చెప్పాలంటే, ధర్మ పరిరక్షకుడివని లోకం అంటుంది. అటువంటి నీకు అలసటా ?

"పిచ్చివాడా! దేవుడైనా సరే, మనిషిగా పుట్టాక, మనుషులవలె సర్వబాధలు, చీకాకులు పడాల్సిందే. ఈ లోకాన్ని, మనుషుల్నీ, వారి సమస్యల్ని, సందేహాలను చూసి అనకూడదు కానీ - శారీరక, మానసికంగా అపరిమితంగా అలసిపోయాను.''

ఈ అలుపులో, పిడిబాకు, క్రింద పడిపోయింది. చక్రం సత్యాజిత్తుకిచ్చి పట్టుకోమన్నాడు. "ఓపిక లేదు'' అంటూ మహారాజుకి నాపై కోపం వచ్చింది. దాంతో హృదయ కవాటాన్ని మూసేశారు. నేనేం చేస్తాను. సూర్యాస్తమయాలు ఆగుతాయా ? అసలే అలిసిపోయారు. అందులో - కాలచక్రం కదలకుండా వుంటుందా. మన కోపతాపాలు అలసట, కోణాలు.... ఇవన్ని ప్రకృతి సహజం.

వాటి సమయాన్ని బట్టి అవి వాటంతటే వచ్చి కూర్చుంటాయి'' వాళ్ళను శాంతింపచేసే వుద్దేశంతో, శాంతి ప్రక్రియకు పునాది వేస్తున్నాడు.

"చెల్లెమ్మా! అనారోగ్యం శరీరానికైతే మందు వెయ్యవచ్చును. మనసుకైతే, దానిని శాంతింపచెయ్యవచ్చును. ఏదైనా కాలస్వభావం, ధర్మస్వభావం బట్టే వుంటాయి.

ఆ మాటలు ద్రౌపదికి నచ్చలేదు. ఉక్రోషంతో వుడికిపోతుంది. కోపంతో రగిలిపోతుంది. కృష్ణుడు తమను అడ్డం పెట్టుకుని, అల్లరి పాల్జేయడానికి చూస్తున్నాడనేది, వారి అభిప్రాయం. "మాది కోపం, మాకు కోపం.'' అనే బదులు జరిగేది నీకు తెలియదా. నిష్ఠూరంగా అనేసింది.

"తెలుసు కాబట్టే, ఇంతదూరం వచ్చాను. లేకపోతే పుష్కరక్షేత్రం నుండి వెనుదిరిగేవాడిని. ఆ సంగతి తెలుసా ? మీకోపతాపాలు నామీద చూపుతున్నారు. నేనెవరి మీద చూపను ? ఆ భగవంతుని మీదా ? నా మీదా ?

ద్రౌపది పరిస్థితి గ్రహించిన కృష్ణుడు - "సోదరీ! నన్ను తిట్టినా ఫర్వాలేదు, పడతాను, కానీ, ఆడదాని కంటివెంట అశ్రుబిందువులు చూడను, చూడలేను. అది నాకే కాదు, లోకానికే క్షేమకరం కాదు. నీ వుద్దేశం నువ్వు చెప్పావు. నా మాట విను. అధర్మాన్ని, అన్యాయాన్ని సహించని ఈ వాసుదేవుడు, ధర్మ-న్యాయ పరిరక్షణకు ప్రాణాలిస్తాడు. అవసరమైతే ప్రాణాలు తీస్తాడు.

విను. నా వద్ద దురుద్దేశం లేదు. రెండు నాల్కల ధోరణి అసలే లేదు. నువ్వు తగిన భర్తను పొందుతావు. నీ ప్రతిజ్ఞ నెరవేరుతుంది. ఎన్ని కష్టాలు పడైనా సరే నువ్వు నీ ప్రతిజ్ఞను నెరవేర్చుకుంటావు. దానిని నెరవేరేటట్లు చెయ్యడం నా విధి. గతంలో నామీద నమ్మకం వుంచినట్లే, మీ విశ్వాసాన్ని నాపై వుంచండి.

ఈ జరాసంధులు, దుర్యోధనులు - నిన్ను, నీ తండ్రిని ఏమీ చెయ్యలేరు. ఇది సత్యం. నేను వృథా ప్రసంగాలు చెయ్యను. పరిహాస ప్రసంగాలు అసలే చెయ్యను. ఇది నిజం. ముమ్మాటికి త్రికరణ శుద్ధిగా నిజం. నన్ను నమ్ము శిఖండి పురుషుని చెయ్యడంలో ధర్మముంది. ఇవన్నీ మీకు తెలియడానికి సమయం పడుతుంది. అన్ని సమస్యలను కాలం తప్పక పరిష్కరిస్తుంది. అందుకు నిదానంగా ప్రయత్నించడం, కాలం గడపడమే మన ధర్మం. తెలిసిందా ? అంటాడు. అందులో స్థిర నిశ్చయముంది. ఆలోచిస్తే అర్థమూ అర్థమవుతుంది.

కృష్ణుని మాటలు ఆమెలో అమిత విశ్వాసాన్ని, ధైర్యాన్ని కలుగచేసాయి. చెప్పుకోలేని ధైర్యం వచ్చింది. మనసు స్థిమిత పడింది - దాంతో "వాసుదేవా! నిన్నర్థం చేసుకోవడం, నీ శక్తిని అంచనా వెయ్యడం సాధ్యమయ్యే పనికాదు. ఇంతకీ నువ్వెవరు ? నిన్నేమని తలవాలి ?"

"మట్టి తిని, అమ్మకు, అండపిండ బ్రహ్మాండాలన్ని చూపిన ఘనునికి, ద్రౌపదిని మార్చడం, లోకాల్ని ఏమార్చడం అసాధ్యమా ? అందుకనే, గోవిందుడు "నువ్వెవరు అనగానే ద్రౌపది "నేనా ? నీ సోదరుడిని, నీ బరువు బాధ్యతలు, ఆజన్మాంతం - అదే ఆసాంతం మోసేవాడిని ?" అన్నాడు. ఇక్కడ నవవిధ భక్తిలోని దాసత్వం - దరిశనమిస్తూంది.

"బాధ్యత...?! ఏమిటది ?" కళ్ళు చిట్లించి అడిగింది.

"చెల్లెలమ్మా! నీకు వివాహం చెయ్యడం, అనుక్షణం, నీ మంచి చెడులను చూడటం, అధర్మాన్ని నాశనం చెయ్యడం, పిలువగానే పలుకడం, పలవరించకుండా ప్రమోదాన్ని కల్గించడం - ఇవన్నీ బరువులు, బాధ్యతలే కదా! ఇవి నిర్వర్తించవద్దు!

అర్థం చేసుకోలేని ఆ "పిల్లా, ఏమిటో..." అర్థం కానట్లే గొణుగుకుంది. అంత తొందరగా అర్థమయితే అతడు ధర్మపరిరక్షకుడెలాగ అవుతాడు ? వాసుదేవుడని (వశించే దేవుడని) ఎలాగ చెప్పగలుగుతాం ?!"

ఈ సందిగ్ధంలో కృష్ణుడు మాతృప్రేమను కురిపిస్తు ఆమెతో మాట్లాడుతుంటే, ద్రౌపది అమితానందమొందింది. ఈ గోవిందుడు వచ్చేవరకు, ఉప్పు-నిప్పులాగ వున్న ద్రౌపది, ఇప్పుడు, పాలు-నీళ్ళలాగ కరిగిపోయింది. కృష్ణుని మాటలు వింటూ తనను తాను మరచిపోతుంది. "నాకో సహాయం చేస్తావా ?" వాసుదేవుడు అడుగుతున్నాడు.

నేనేం చెయ్యగల్గుతాను ? చేయగల్గితే చేస్తానంటుంది.

"ధర్మరక్షణకు, కర్తవ్య నిర్వహణకు నీతోడు కావాలి. అప్పుడే నేను, నా విద్యుక్త ధర్మాన్ని నిర్వహించగల్గుతాను. అన్నీ మనమే చేద్దామనుకుంటే చెయ్య లేము. ఉదా : నువ్వున్నావు. అందం వుంది. అహంకారం వుంది. అహంకారం, అందాన్ని మూసేస్తే, ఆడతనం పోయి, అభిజాత్యం పెరిగింది. దాంతో ఎవ్వరు

చెయ్యలేని పని నేను చేస్తాననే, అమిత విశ్వాసం మొదలైంది. విశ్వాసం ఉదయించడం వేరు, పెరిగి, పెద్దదవడం వేరు.

ఈ పెరిగింది, పెళుసుతనంతో! ఒక్కొక్కసారి, సామాన్య గాలి ప్రభావానికి పెద్ద చెట్టు కూడా, విరిగిపోతుంది. అలాగే - నీలో పెరిగిన - అహంకార గర్వం - అతిశయిస్తోందే తప్ప ప్రతిఫలాన్నివ్వడం లేదు. దాంతో కోపం, ఆత్మవిశ్వాసం సన్నగిల్లడం, చివరకు, ఆడవారికి ఆఖరి అస్త్రమైన, ఏడుపే తప్ప, నవ్వించదు. ఇది కాలమహిమ. దీనికి నిజమైన సమాధానం, కాలమే కల్పిస్తుంది.

అందుకనే కోపం, జుగుప్సలను ప్రక్కన బెట్టి, మన ధర్మం మనం నిర్వర్తిసుంటే, అన్ని సర్దుకుంటాయి. దీనిని సంయమనమంటారు. దీనిని పాటిస్తే మనసుకు ప్రశాంతత, జీవితానికి అర్థం - పరమార్థం లభిస్తుంది. అలాగ కాని పక్షంలో కోపము, తాపము, పగ-ద్వేషము అసూయ- - దీంతో ఏమీ చెయ్యలేని అశక్తత, దానివల్ల కొంత ప్రతీకారము అది ఫలించకపోతే చివరకు, విచారము.

ఈ అరిషడ్వర్గాలు, మనను విడిచిపెట్టని శత్రువులు. కనుక మనమే వాటిని విడిచి పెట్టాలి. ఇది నీ తండ్రి, నువ్వయినా, నేనయినా - ఎవరైనా సరే ఆచరించి తరించాల్సిన ధర్మము. నిజానికి ధర్మమంటే - అదేదో గొప్ప ప్రకాశం కాదు. స్వకర్మ నిర్వహణ. దీనిని ప్రతి ఒక్కరు హర్షిస్తారు. రాజు.... రాజ్యాన్ని రక్షించక, పాలించక... వ్యవసాయం చేస్తానంటే.... ఫలితం విరుద్ధమే తప్ప పాలనానుభవం, పంటపొలాల రక్షణకు పనికిరాదు. అలాగే సస్యరక్షణానుభవం, పాలనాపగ్గాలు పట్టుకుందుకు ఉపయోగపడదు.

అన్నీ వింటున్న ద్రౌపది "సత్య"మంది. మనసు తేలికపడింది. ధర్మము అర్థమయింది. ఆవేశం, క్రోధం నశించాయి. పగ-ద్వేషాలు చల్లారాయి. అంతా నీ ఇష్టమని - ఇంచుమించు శరణాగతురాలయింది.

"ఇప్పుడసలు విషయానికి వద్దాం. నువ్వు నా మాట వింటే, నీ ధర్మం - నా ధర్మం నిలబడతాయి. లోకం మిమ్ము కన్నెత్తి చూడలేదు. వచ్చే ఇబ్బందులు దూదిపింజలవలె ఎగిరిపోతాయి. తాత్కాలికంగా "కర్మ"మని కర్మలు - బాధలు- జన్మానుసారంగా పొందాల్సి వచ్చినా - కాలం, తన ధర్మాన్ని నిర్వర్తిస్తూంది.

గాయాలు, సంతోషాలు. బాధలు-బాధ్యతలు. ఇలాగ... ఎన్నెన్నో వస్తాయి, పోతాయి. కాకపోతే శాశ్వత కీర్తి, సత్కీర్తి లభిస్తుంది.

అర్థం కానట్లు, గుడ్లప్పగించి, ద్రౌపది చూస్తుంది.

"నువ్వు నా మాటవిను, ఒక మహావీరునికి భార్యవవుతావు. అలాగే అద్భుత బలసంపన్నులకు మాతృమూర్తి అయిన, ఒక పరమపూజ్యకు కోడలివి కావాలి. అప్పుడు నీ ధర్మం, నా ధర్మం.

విషయం అర్థం కాక చిత్రంగా ద్రౌపది చూస్తూంటే... చెప్పే గిరిధారి క్షణమాగాడు. ఆమె కన్నుల్లోకి చూసాడు. చూస్తున్నాడు. "ఇప్పుడు నాకో పనిచేసి పెట్టాలి నువ్వు'' అడుగుతున్నాడు. ''భరితభారాయనమః'' అనే కృష్ణుని చెప్పమన్నట్లు చూసింది.

"ఇప్పుడు, అశ్వత్థామ, శకుని వస్తారు. మర్యాద సూచకంగా పలుకరించు. ఆ తర్వాత విషయం నేను చూసుకుంటాను. దీనివలన నీకు వచ్చే నష్టమేమీ వుండదు. కేవలం మర్యాదపూర్వకంగా, పలుకరింపు అంతే'' నన్నాడు.

"ఇంకో విషయం. కురు యువరాణి భానుమతి నా చిన్నచెల్లెలుగా ప్రకటించాను. అలాగే ఆమెను సంభావిస్తున్నాను. విషయమెలాగున్నా, ఆ చిన్నపిల్లకు చెప్పిన విషయం నీకు చెబుతున్నాను. అది పరమరహస్యం. ఆ రహస్యాన్ని అలాగే మనసులో దాచుకో. అదేవిటో తెలుసా ? ఎట్టి పరిస్థితులలోను ద్రౌపది నీకు సవతిగా రాదని ఆ చిట్టిచెల్లెలికి మాటిచ్చాను. కాబట్టి, ఎవరొచ్చినా నీకు భయం లేదు.

"వాళ్ళు మర్యాదపూర్వకంగా "ఓహో!" అంటే నువ్వు "ఆహా!" అని ఆ విషయాన్ని విడిచిపెట్టేయ్. అప్పుడే కర్తవ్యము నీవంతు, కాపాడుట నావంతు'' అన్న విలువ, నిబద్ధత, పెరుగుతుంది. నా మాట నిలబడుతుంది.. నీ మనసు కుదుటపడుతుంది.

"నీ మాట నిలబడాలి, నా మాట నేను నిలబెట్టుకోవాలి'' చాలా బాగుంది. నీ లీలలు నీకు తప్ప, నిన్ను నమ్ముకున్న వారికెవ్వరికి అర్థం కావు.

"అన్నీ తెలిస్తే, తలచినవన్నీ విజయం పొందేటట్లు చూసుకుంటాం. అందుకే ఆ భగవంతుడు, మనల్ని - ఏమీ అర్థం కాని అయోమయంలోనో, అగమ్యగోచర మార్గంలోనో పడేసి మన బాధలు మనల్ని పడమని, తాను ప్రశాంతంగా వుంటాడు.'' నవ్వుతూ ఆ విషయాన్ని ముగించాడు.

నీ చిక్కుముడులు, నీ మాయలు అర్థం కావు'' అంటూనే నీకు శరణాగతు రాలిని. ధర్మమూర్తివైన నీవు దారిచూపి, కరుణించు'' మంది.

★★★★

ఆ తర్వాత ద్రౌపది, తండ్రిని కలుసుకుంది.

తనకు, గోవిందునికి మధ్య జరిగిన సంభాషణనంతా విడమరచి చెప్పింది. కృష్ణుడు రక్షకుడే తప్ప భక్షకుడు కాదని, ధర్మా, కర్మాచరణములయందు మిక్కిలి మక్కువ గల కృష్ణుడు, అధర్మమార్గమనుసరించడని, ఉపోద్ఘాతంగా కాక, అన్ని విషయాలను వివరించి చెప్పి తండ్రిని వూరడించింది.

అంతవరకు, తలనొప్పితో సతమతమవుతున్న ద్రుపదుని మనసు తేలిక పడింది. శిరోభారం కూడ తగ్గుతున్నట్లనిపించింది. చివరకు, ద్రౌపది - నా మనస్సు ప్రశాంతంగా వుంది. ఈ తేలికబడ్డ మనసుతో, దేనినైనా ఎదుర్కోగలననే ధైర్యం కల్గిందని సంతోషంగా చెప్పింది. ఏమైనా ద్రుపదునిలో అసహనం తగ్గలేదు. ఆ గిరిధారి మాటలకు తలవొగ్గాలని, అనిపించడం లేదు.

“అయితే - ఈ స్వయంవరం ద్వారా మనకే విధమైన ఇబ్బందులు రావంటావు ?'' సాలోచనగా, కుమార్తెను చూస్తూ ద్రుపదుడడిగాడు.

“అనే, “కృష్ణ'' వాసుదేవుడు, మనకష్టాలన్నీ తీర్చేవానిగా, అభయమొసగాడు. ఆ మాటలలో నాకు పూర్తి నమ్మకం కుదిరిందంది. సుదీర్ఘంగా ఆమెను చూసాడు. యజ్ఞంలో నుండి పుట్టిన, ఈ యాజ్ఞసేని “అగ్నిపర్వతం వలె వుండే ద్రౌపది - ఇంత అకస్మాత్తుగా, ఇంత విశ్వాసం, నమ్మకంతో - ఎంతో ప్రశాంతంగా వుందంటే, “కృష్ణా! (ద్రౌపదికి గల మరో పేరు. ఈ పేరు వేదవ్యాసుల వారికి కూడా వుంది. ఈ పేరంటే, రాజమాత, సత్యవతీదేవికి చాలా ఇష్టం. అందుకే “వాసుదేవా! దేవకీనందనా, అనకుండా, “కృష్ణా'' అనే పిలుస్తానని కోరుకుంటుంది) వున్నట్టుండి, ఇంత అకస్మాత్తుగా ఎలాగ మారిపోయావు ?'' ద్రుపదుడు - ఆశ్చర్యంగానే అడిగాడు.

“నిజం, తండ్రీ! నిజంగానే నాలో మార్పు వచ్చింది. ఇప్పుడు నేనెంతో సంతోషంగా వున్నాను. సర్వసమర్థుడైన, ఆ దేవకీనందనుడు, నన్ను కంటికి

రెప్పలా కాపాడుకుంటానన్నాడు. జరాసంధుని వలన భయంలేదని, దుర్యోధనుడు నన్ను చేపట్టలేడని, ధర్మానికి వున్న విలువతో ధర్మపథంలో, ధర్మబద్ధంగా - నేనుంటానని, తానుంచుతానని చెప్పిన - ఆ - సత్యవాక్యాలు నన్ను పరిశుద్ధురాల్ని చేసాయి'' అని ఎంతో హుషారుగా చెప్పింది.

"తండ్రీ! నా తత్వం మీకు తెలుసు. నా బుద్ధి మీకు తెలుసు. సర్వాభయ ప్రదాతగా, ఆ"నంద"నందనుడు, గోవిందుడు, యోగక్షేమం వహామ్యహం" అంటే, వలదని, కాదని, కాలు అడ్డం పెట్టనా ? అందుకే - అపారశక్తి సంపన్నుడైన - ఆ ధర్మమూర్తికి, శిరసు వంచాను. ప్రణతులర్పించాను. శరణాగతురాలినయ్యాను. సంపూర్ణ శరణాగతితోపాటు, సంతృప్తిని కూడా వ్యక్తం చెయ్యడంతో ద్రౌపది "నీ ఇష్టం'' అని, తండ్రిగా "అభీష్ట సిద్ధిరస్తు'' అని ఆశీర్వదించాడు.

''తండ్రీ! మరో విషయం. కృష్ణ, వాసుదేవుడు, నన్ను శకునిని, అశ్వత్థామను....''

"ఏమన్నావు... ? అశ్వత్థామనా ? ఆ ద్రోణపుత్రునా ? క్షణంలో ఆవేశం ప్రవేశించింది.

"అవును తండ్రీ! అవును... వారు కలుస్తారు. మర్యాదగా పలుకరించమని చెప్పాడు. అలాగే, పొరపాటున, నేను - ఏ కురు వంశవీరుడినైనా వివాహమాడితే, అందుకు నీ తండ్రి, ఆ అస్త్ర విద్యా విశారదుడు, ఆ గురువు, హస్తినను వీడ కూడదు. అభయమని, నిర్భయంగా అడగమన్నాడు. అభయం తీసుకోమన్నాడు. అలాగే చేసాను. అతని నుండి వాగ్ధానం తీసుకుంటానన్నాను.

దీంతో అంతా అయిపోయింది. పరువు గంగ పాలయింది. ప్రతిష్ట బుగ్గి పాలయింది. ఆ కృష్ణుడు - ఈ కృష్ణ. ఒక్కసారి తల విదిలించి, ఒళ్ళు విరుచుకుని "చూడమ్మా! ఏదీ మన చేతులలో లేదు. విధివ్రాత. కర్మ... బుద్ధి... ఇవి అనుసర ణీయాలు, కానీ... అన్నవాడు... ఆ... ఒక్కసారి మీ అన్నను కూడా సంప్రదించు!'' అంతకుమించి తనదేమీ లేనట్లు తన అసహాయతను ప్రకటించాడు. ఒక వెర్రి నవ్వు నవ్వాడు.

"నాన్నా!'' ద్రౌపది మెల్లిగా పిలిచింది.

"ఏం తల్లి!" అంత మెల్లిగానే ద్రుపదుడు అడుగుతున్నాడు.

"ఇప్పుడు - తమ్ముడుగా మారిన శిఖండి వస్తే మీకభ్యంతరమా ?"

"వాడెందుకు ?"

"వాడు మనవాడు. గోవిందుని కరుణతో, బ్రతికి బయట పడ్డవాడు, బ్రతుకును మెరుగుపరచుకున్నవాడు...!" అర్థోక్తిలో ఆగిందామె.

చివరికేం జరుగుతుందో అర్థం కావటం లేదు. అన్నీ తన ఆలోచనలకు భిన్నంగా, తనంటే లక్ష్యం లేకుండా సాగుతున్నాయి. ఏం చెప్పలేక క్షణమాగాడు. వాడిని.... !" ఏదో అనబోతూంటే -

"క్షమించాలి, నాన్నా. తల్లిలేని పిల్లలం. ఎదుగుదల, పెరుగుదల తెలియలేదు. అన్నీ నీవుగా బ్రతికే మాకు, నువ్వు మమ్మ కరుణించకపోతే, మేమేమై పోవాలి ?" క్షణాలలో, ఆమెలో వచ్చిన మార్పుకు ఆశ్చర్యపోతున్నాడు. పరిపూర్ణ మహిళా లక్షణాలు పురుషాహంకార శృంఖలాల నుండి బయటపడి ప్రకాశిస్తూంటే - ఆ స్త్రీత్వానికి మరింత ఆశ్చర్యపోతూ "అమ్మా!" అన్నాడు.

"అవును, నాన్నా! అమ్మయినా, నాన్న అయినా మీరే. అటువంటప్పుడు, మమ్మల్ని మీరే కదా క్షమించాలి. పాంచాల రాజవంశాన్ని, ఆ గోవిందుని సూచనతో, బ్రతుకు పండించుకుని, ధన్యమూర్తిగా సంరక్షించ వచ్చిన తమ్ముని, దగ్గరకు తీసుకోవడం, దయ చూపడం, మీ "ధర్మం" కదా! "ఆ మాటల్ని విన్న ద్రుపదుడు, "ధర్మా"నికి దగ్గరయింది. సరైన గాడిలో పడిందనుకుంటూ, అసహాయుడు, అస్వతంత్రుడయ్యాడు. ఆమె చెప్పినవన్ని నిజమే. ఎలాగ కాదంటాడు ? తండ్రిగా మహారాజు ఆలోచనలో పడ్డాడు.

శత్రువునైనా క్షమించాలనే వేదసూక్తికి, నిదర్శనమైన ఆ బ్రహ్మమూర్తి, భరద్వాజ సుతునిగా, తన బ్రహ్మత్వానికి కట్టుబడి, మన శిఖండిని చావకుండా చేసి ప్రాణమొసగాడు. ఇది ఆ వాసుదేవుని ఆలోచన. భవిష్యత్తు కాలంలో, దీనివలన మేలు జరుగుతుందన్నాడా, దేవకీ సుతుడు. అందుకని... పిల్లమాటలకు తండ్రిగా, ద్రుపద మహారాజు, విధి లేక తలవంచాల్సి వచ్చింది. వంచదలిచాడు!!

అందరు మారిపోతూంటే, తాను ప్రజాపాలకుడు, రాజయి మూర్ఖంగా ప్రవర్తించడం న్యాయమా ?" తనను తాను ద్రుపదుడు ప్రశ్నించుకుంటున్నాడు,

ఇక - మరో సమాధానం చెప్పలేక, తన అభ్యంతరాలన్నీ తాను ఓ ప్రక్కన పెట్టుకుని “నీ ఇష్టం తల్లీ!” అని తనంగీకారాన్ని తెలిపాడు. దాంతో తండ్రికి, మనసు నిండా కృతజ్ఞతలు చెప్పి, మహారాజు గదినుండి బయటికి వచ్చింది. దృష్టద్యుమ్నునితో, తండ్రి గారు శిఖండిని తీసుకురావడానికి ఒప్పుకున్నారు కనుక సత్యాజిత్తును పంపి శిఖండిని తీసుకురమ్మని కోరింది.

“ఏవిటో అంతా మారిపోతున్నారు” అన్నాడు.

“సోదరా! ఇదంతా సహజమంది.”

ఆ తర్వాత, శకుని, అశ్వత్థామలు వచ్చారనేసరికి, ద్రుపద మహారాజు, వారిని తన సభామందిరంలో కలుసుకోవడానికి సిద్ధపడ్డాడు. వారు వచ్చారు. శకుని, మహారాజుకు నమస్కారం చేసి, తనకు చూపిన ఆసనాన్ని అధిష్టించాడు. అశ్వత్థామ, తన సహజ బ్రాహ్మణధర్మంతో “శతాయుష్మాన్ భవ” అని దీవించాడు. ఒక ప్రక్కన, సత్యాజిత్తు, దృష్టద్యుమ్నులు, మరోప్రక్క దూరంగా శిఖండి, ద్రౌపది నిల్చున్నారు.

అశ్వత్థామ, ద్రౌపదిని చూసి ఆశ్చర్యపోయాడు. తీర్చిదిద్దిన ఆమె శరీర సౌష్టవం, అశ్వత్థామను మరోసారి చూసేటట్లు చేసింది. ఉభయకుశలోపరి తదుపరి, తన ధర్మంగా ద్రుపద మహారాజు “చెప్పండి. ఏం కోరి వచ్చారు ? నేను చేయగల్గినది..?!

దానికి శకుని స్పందిస్తూ, అలవాటు ప్రకారం చేతులు రుద్దుకున్నాడు. ఆసనంపై సర్దుకుని కూర్చున్నాడు. కురువంశ సంభూతుడైన యువరాజు పంపగా వచ్చామన్నాడు. మా యువరాజు తమ నమస్కృతులు మీకు అందించమన్నాడు. కురు, పాంచాల దేశాల మధ్య మైత్రీభావం కొనసాగాలని, అందుకు తాను సిద్ధంగా వున్నానని చెప్పమన్నాడు. అలాగే తమరు కూడా అందుకు సంసిద్ధులై వుంటారని తలుస్తున్నానన్నాడు.

అది విన్న దృష్టద్యుమ్నుడు “తమ అభిమానానికి కృతజ్ఞులం. కానీ, మా సోదరి చిన్నపిల్లకాదు, వయసు వచ్చి, ప్రపంచ జ్ఞానమెరిగిన మనిషి. ఆమెకు నచ్చిన వ్యక్తిని స్వయంవరంలో ఎన్నుకుంటుంది. అది మాకు స్వతంత్రేచ్ఛ. దీనికి విరుద్ధంగా మనం నడువగలమా చెప్పండి ?!

శకునికి, గొంతుకలో పచ్చి వెలక్కాయపడ్డట్టయింది. "అవునవును" అని విధి లేక అనాల్సి వచ్చిందా క్షణానికి. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఆ వెంటనే శకునే "మా యువరాజు, ఆర్యావర్తంలో శక్తి సంపన్నుడు. చెప్పుకోదగ్గ వ్యక్తి. కనుక పాంచాల రాజకుమారి, మా యువరాజును వివాహం చేసుకుంటే బాగుంటుందన్నది మా ఆలోచన. అశ్వత్థామ కూడా, అదే ఆలోచనలో వున్నారు. ఏమంటారు గురుపుత్రా!" అనగా -

శకునితో "శుభస్య శీఘ్రం" అదే కదా, మా ఆలోచన. విధిలేనట్లు అశ్వాసించాడు.

మనం, మనం - మన పద్ధతిలో ఎన్నో అనుకుంటాం. అందులో తప్పు లేదు. ఆక్షేపణం అసలు కాదు. కాకపోతే, స్వయంవరమని ప్రకటించి అందరికి ఆహ్వానాలు పంపి, దీనికో ప్రత్యేక పరీక్ష ఏర్పాటు చేసి, అందులో విజయుడైన వారినే మా సోదరి వివాహం చేసుకుంటుందని, బహిరంగంగా తెలియబరచి, కురువంశభూషణుడు కావాలన్నారో, జరాసంధ చక్రవర్తి హెచ్చరించారనో, పద్ధతి మార్చుకుంటే -

సాటి రాజలోకం, ఈ పాంచాల దేశాన్ని, రాజవంశాన్ని - ఎలాగ వూహించుకుంటుందో ఆలోచించండి. పదిమందికి చెప్పవలసిన పాలకులమై వుండి, పాలితుల ముందు పాపాచారులుగా నిలబడితే, మీరైనా - మేమైనా సరే, లోకం నవ్విపోదూ! ప్రజలు అసహ్యించుకోరూ ? ఇంతకంటే అధోస్థితి మరొకటి వుంటుందా ? కనుక - మనం - మనం అనుకున్న ప్రకారం, నిర్ణయించిన విధానంగా, స్వయంవర కార్యక్రమాన్ని నిర్వహిద్దాం. అప్పుడు అందరు సంతోషిస్తారు. ఏ ఒక్కరు తప్పు పట్టరు, ఏమంటారు ? విషయం చెప్పి సలహా అడుగుతున్నట్లు యువరాజు ప్రశ్నించాడు.

"మహారాజా! మీరు," ఇక ఉపేక్షించలేక శకుని అడిగాడు. అశ్వత్థామ తదేక దృష్టితో చూస్తున్నాడు.

"గాంధార రాజా! మీరు చెప్పినవన్నీ సత్యము. యువరాజు గొప్పవాడు. ఆతని మిత్రుడు, అంగరాజు ఆర్యావర్తంలోనే మేటి ధనుర్వేత్త. ఈతనికి సాటి పాండునందనుడైన కుంతీపుత్రుడు అర్జునుడు. అతనేమో...

"అవన్నీ ఎందుకు లెండి....!" అశ్వత్థామ, శకుని ఒకరిముఖాలొకరు చూసుకోసాగారు. ఆ వెంటనే "నిజం. మీరన్నట్లు అంగరాజు కర్ణుడు, మేటివిలుకాడే.

కాదనము. కాని ఆతడు యువరాజుకు ప్రాణమిత్రుడు. తన మాన- ప్రాణాలను, పరువు ప్రతిష్ఠలను కాపాడిన మిత్రుని కోసం, ఆతడేమైనా చెయ్యగలడు. అంతటి మిత్రుడు లోకంలో మరొకరు వుండరు'' అన్న శకుని, ఆ వెంటనే -

పాండుపుత్రులయిదుగురు కూడా సర్వశ్రేష్ఠులు. వారికి వారే సాటి. కురువంశానికి, భరతఖండానికి నిజమైన వీరాధివీరులు. గాంగేయుడి తర్వాత, వారే వీరాధివీరులు. కానీ ఏం చేస్తాం. కాలం కబళించింది. అన్యాయంగా కన్ను మూసారు. దుర్విధి... పాపం'' వాపోయాడు.

విషయం ప్రక్కదారి పడుతుంది. అశ్వత్థామ అసహనంగా, తన ఆసనంపై కదిలాడు. పరిస్థితి అర్థం చేసుకున్న శకుని, "కాబట్టి, ఎవరో మా యువరాజుకు అడ్డం వస్తారని తలువకుండి. అంగరాజు, అసలు కథలోకి రాడు. కనుక....!'' కాబోయే చక్రవర్తికి, తమ శుభాంగినిచ్చి సంబంధం, బంధం ఖాయపరుచుకుంటే బాగుంటుందన్నది మా వుద్దేశం. ఇది ఏ మాత్రము నచ్చని పాంచాల భూపతి "ఎంతసేపు మీవైపు నుండి ఆలోచిస్తూ, మాకడ్డం లేదని అంటున్నారే కానీ, మా స్థానంలో వుండి, తండ్రి మౌనానికి, సహనానికి, సమాధానంగా, యువరాజు, విషయాన్ని వ్యక్తబరిచాడు.

అశ్వత్థామ కల్పించుకుని "రాజా! గతం గతః'' జరిగింది త్రవ్వుకుని బాధపడేకన్న, వర్తమానం శుభదాయకం, ఆనందమార్గమని ఆలోచించుకుని, ముందడుగువేస్తే మంచిదని, మా అభిప్రాయం. దీనివలన ఉభయవంశాలు ప్రశస్తమైనవి - ఇంకా ఖ్యాతిని పొందుతాయి. ఇక మా తండ్రికి గాని, నాకుగాని, ఇందులో ఏ ఇతర ఆలోచన, దురుద్దేశం లేదు. భరద్వాజుల పుత్రునిగా నా తండ్రి, పౌత్రునిగా నేను "సర్వేజనాఃస్సుఖినోభవన్తు, లోకాన్‌సమస్తాన్ స్సుఖినో భవన్తు'' అని, ఆనందముద్రల తేలియాడతాం. ఇది సత్యం.

మీ బాంధవ్యం మీది, మా బాధ్యతలు మావి. ఇందులో ఒకరి ప్రమేయము వుండదు. ఆగ్రహానుగ్రహాలు, పంతాలు - పట్టింపులకు తావుండదు.'' నిర్ద్వందంగా ప్రకటించినట్లు మరీ, అశ్వత్థామ చెబుతున్నాడు. అందుకు స్పందిస్తూ, "అయితే ఆచార్యులకు, మా సోదరి కురువంశవీరులతో వివాహానికి, సింహాసనమధిష్టించ డానికి అభ్యంతరం లేదంటారు ? నిజమేనా ?''

ఆ మాటలు శకునికి మంగళవాయిద్యాలు అమృతధారవలె వినిపించింది. "నిజం. చెప్పు. గురుపుత్రా!" అని తొందరపెడుతున్నాడు. కానీ, ఇదేమి పాంచాల భూపతికి నచ్చలేదు, సరికదా! ఇవన్నీ అప్రస్తుత, అనవసర ప్రసంగాలు. వీటికి స్వయంవరానికి సంబంధమేమిటి ? అనాలోచిత ప్రకటనలు, సంభాషణలు అనుచితమని ఖండిస్తూన్న సందర్భంలో ఎవరి దగ్గర ఏమి మాట్లాడాలో అది మాట్లాడాలి తప్ప, క్రొత్తవారి దగ్గర అవసరంలేనివారివద్ద, ఇవన్నీ "అవసరమా..?! ఆ ప్రశ్న వచ్చినవైపు అందరు చూసారు. ఆ మాటతో శిఖండి, వీరివైపు వస్తున్నాడు. నువ్వు... మా పిల్లవాడు, యువరాజు "శిఖండి" అనేసరికి అశ్వత్థామ ఆలోచనలో పడ్డాడు. ఆడపిల్లగా తమ వద్దకు వచ్చి, ఇప్పుడు ఏకాయికి, యువరాజుగా మాట్లాడుతున్న అతన్నొకసారి తీక్షణంగా చూసాడు.

ఇక సమాధానం దొరకక, పరిస్థితిని విషమింపచెయ్యక "అంతా మంచి జరుగుతుందనే, మా భావన. మళ్ళీ కలుద్దా"మంటూ, వారు నిష్క్రమించారు. ద్రుపదుడు, తన కుమారులు, ద్రౌపదితో తన శయ్యామందిరానికి వెళ్ళాడు. అప్పుడు, అక్కడ శిఖండిని చూస్తే -

"తండ్రీ! ఇది అనాలోచిత ప్రసంగం, ప్రవర్తనగా తలంచకండి" రెండు చేతులు జోడించి, వినయంగా మొదలుపెట్టాడు.

అశ్వత్థామ చెప్పినట్లు, ఆచార్యులవారు, తన హామీ నిలబెట్టుకోలేరు. భానుమతి యువరాణి అంటే... ఆచార్యులకు కన్నబిడ్డకన్న ఎక్కువ. ఆమె మనసుకు కష్టమయే ఏ పని చెయ్యరు. కనుక మన సోదరితో, యువరాజు వివాహమసంభవం. ఇందుకు గురుదేవులు ఒప్పరు. నాకు బాగా తెలుసు. అందుకని అనవసర విషయాలు, అనర్హ విషయాలు ప్రస్తావించరాదన్నది నా వుద్దేశం. అందుకే అలాగ ప్రవర్తించాను.

శిఖండి సందర్భోచిత ప్రసంగానికి, తండ్రిగా, మహారాజుగా ద్రుపదుడు ఎంతో ఆనందించాడు. మిగిలినవారు సరేసరి. ప్రపంచంలోకి వెళ్ళి ఆ గోవిందుని కరుణతో మనిషైన తమ్ముడు మాటలు, అందరికన్న ద్రౌపదికి ఎంతో ఆనందాన్నిచ్చాయి.

దుర్యోధనుడు, ఆతని పరివారము - ముఖ్యంగా శకుని కర్ణ - అశ్వత్థామల దారుణకృత్యం - ఆలోచనల వల్లనే పంచపాండవులు, బలవంతంగా

వారణావతానికి వెళ్ళడం అక్కడవారికి అన్యాయం జరగడం జరిగింది. ఇది దారుణమని గురుదేవులు భావించారు. ఇక అసలు విషయానికొస్తే -

దుర్యోధనుడు వంటి వారలతో మనం సలిపే ఏ ప్రయత్నము, కార్యమైనా సరే జనకంటకమవుతుందే తప్ప, సర్వజనానందకరం, హర్షణీయం కాదు. పైగా ఈ విషయాన్ని నా ప్రాణదైవమైన యక్షుడు కూడా నిర్ధారించాడు.'' అనగా "యక్షుడా... అతనెవరు అన్నాడు, ద్రుపదుడు. ఆయన ఈ క్రొత్త జీవితాన్నిచ్చిన పుణ్యపురుషుడు. బయట వేచివున్నారు. వారిని పిలుస్తానని, బయటికి వచ్చాడు.

కొన్ని క్షణాలలో, చేత త్రిశూలంతో ఒక ఆజానుబాహుడు అక్కడికి వచ్చాడు. "శుభం భూయాత్'' అని అక్కడున్నవారినందర్నీ ఆశీర్వదించాడు. వారిని చూస్తూ "మీరేనా ?'' కృతజ్ఞతతో ద్రుపదుడడిగాడు. యక్ష స్థాన కర్ణుడు తలూపాడు. అప్పుడు శిఖండి కల్పించుకుని వీరు నిత్యం కేవలం, ఇరవై మాటలు మాట్లాడతారు'' అని చెప్పాడు.

"వారు కేవలం మరో అయిదు మాటలు మాత్రమే రేపు సూర్యోదయంలోగా మాట్లాడుతారు. మీరు మీ సంశయాలనడగండి. వారు తగు విధంగా తమ సమాధానమిస్తారు.'' అన్నాడు. అందుకు సంతోషించిన ద్రుపదుడు - ముందుగా-

"మీ పుణ్యం వలన మావాడు మనిషయ్యాడు. అతన్ని రక్షించినందులకు సంతోషమనగా నవ్వుతూ కళ్ళు మూసి తెరిచాడు.''

వారి మధ్య ఈ విధంగా సంభాషణ ప్రారంభమైంది.

వారణావతంలోని లక్క ఇంటిని మీరే నిర్మించారా ?

తలూపాడు.

మిమ్మల్నీ పనికి ఎవరు  పురమాయించారు ?

"దుర్యోధనుడు.''

ఆ భవనానికి నిప్పు పెట్టిందెవరు ?

"పురోచనుడు.''

అతనే పెట్టాడని మీరెలా చెప్పగలరు ?

అది పైనుంచి వచ్చిన ఆదేశాలు.

ఆ ఆదేశాలిచ్చినవారు ?

దుర్యోధనుడే!

మీకెలాగ తెలుసు ?

విన్నాను. కాబట్టి.... ఇక మాట్లాడనన్నట్లు నోటికి చేతిని అడ్డం పెట్టాడు.

అయినా మహారాజు - అడుగుతున్నాడు.

"అదేశాలను మీరు స్వయంగా విన్నారా ?"

"తలూపాడు" ఆ యక్షుడు.

"చాలా సంతోషం. మా సందేహాలను తీర్చినందులకు, కృతజ్ఞులమన్నాడు. పాంచాల భూపతి, గౌరవపూర్వకంగా, వారిని అభినందించాడు.

"శిఖండి, యక్షుడిని, జాగ్రత్తగా తీసుకువెళ్ళి వారి రథంలో కూర్చపెట్టమని, తమ భటులకు తెలిపాడు. అప్పుడు - ద్రుపదుడు -

"ఇటువంటి వ్యక్తితో, పాంచాల రాకుమార్తె వివాహం నిజంగా మహాపరాధం. క్షంతవ్యం కాదు!" అనేసాడు.

ఇది అందరిలోను కొంత గందరగోళం. మరింత ఆందోళనకు కారణమయింది. అయినా, తమాయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

అప్పుడు - శిఖండి - నాన్నగారూ! నాదో విన్నపం. పొరపాటున విలువిద్యా పరీక్షలో దుర్యోధనుడు కనుక విజయుడైతే - నేను నిలువరించదలుచుకున్నాను. అంటాడు.

"ఎలాగ .... ?"

తన దాయాదులకు, ఆ దుర్మార్గుడు చేసిన అన్యాయాన్ని పదిమందిలో బయటపెట్టి, సాటి రాజలోకంలో అప్రదిష్టపాలుచేసి, నీవంటి నీచుని, నా సోదరి... గ్రహించదు. నా సోదరే కాదు, ఏ ఆడది వివాహం చేసుకోదు. గతములో చేసుకుని వుంటే గ్రహపాటుగా, తలుస్తారే తప్ప - "నీవంటివాని పొందు కోరరు. నిన్ను మనిషిగా గుర్తించి, గౌరవించరు" అని హెచ్చరిస్తానన్నాడు.

ఆలోచన మంచిదే, న్యాయం ప్రతిఘటించాల్సిందే. అధర్మాన్నెది రించాల్సిందే. ముఖ్యంగా అక్కడ మన భగవానుడున్నాడు, వుంటాడు కాబట్టి, అంతా మేలే జరుగుతుందని, అక్కడున్నవారందరు శిఖండిది సదాలోచనమని ప్రశంసిస్తారు.

# మంతనమా.... ?!

**అ**ర్థరాత్రి. ...

పున్నమి కళలతో చంద్రుడు తొంగిచూసే ముందు రేయి.

వాతావరణం ప్రశాంతంగా వుంది.

ఇది - మగధ - సామ్రాజ్యం వారి - గుడారం. చక్రవర్తి హాయిగా నిద్రపోతున్నాడు. ఆ ప్రశాంత సమయంలో ఎవరివో అడుగుల చప్పుడు. కాపలాదారులు ఆ అడుగుల చప్పుడు వైపు చూసారు. ఎవరో ఇద్దరు వస్తున్నారు. వీళ్ళు అప్రమత్తమయ్యారు.

ఆ వచ్చేవారిని "ఆగండి" మీరెవరు ? మీకేం కావాలి ? అని ప్రశ్నిస్తూ అడ్డుకున్నారు. ఆ స్వర శబ్దానికి మరికొందరక్కడ గుమికూడారు. వారిలో ఒకతను రెండడుగులు ప్రక్కకు వేసి "నేను, అత్యవసరంగా చక్రవర్తులను చూడాలి" అన్నాడు.

"ఇప్పుడా ? నువ్వెవరివో, మతి వుండే మాట్లాడుతున్నావా ? ఈ సమయంలోనా చక్రవర్తిని చూసేది ?! వెళ్ళు. వెళ్ళు" అధిక్షేపించాడొకడు.

అప్పుడా వ్యక్తి తన ముసుగుని తొలగించే సరికి ఈ కాపలాదారులు, ఆ వచ్చినదెవరో యువరాజుగా తలచి, ఎంతో వినయంగా, నమస్కారం చేసారు. దాంతో కాపలా అధికారి, రెండుచేతులు జోడించి, ఎంతో వినయంగా "యువరాజా! ఇది తగు సమయం కాదు. మాకే విధమైన ఆదేశాలు కూడా, ఈ సమయంలో లేవు. కనుక దయచేసి - ప్రార్థనాపూర్వకంగా విన్నవించు కుంటున్నారు.

"పోనీ యువరాజును పర్యవేక్షించే వారెవరు ? వారినిక్కడకు రప్పించినా సరే, మమ్మల్నాయన వద్దకు తీసుకువెళ్ళినా సరే, సాధికారంగా అడుగుతున్నాడు. యువరాజును మేము అత్యవసరంగా చూడాలి. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలను పరిష్కరించాలన్నాడు.

"క్షమించండి. మిమ్మల్ని విడిచిపెట్టలేము. యువరాజును పిలువనంపలేము నిద్రాభంగం చెయ్యలేమని తమ అశక్తతను వెల్లడించారు.

"మీకేం ప్రమాదం రాదు. తప్పక నిద్రాభంగం చెయ్యండి. ఇది చక్రవర్తి ప్రాణాలకు సంబంధించినది. కాదంటే, ఆ తర్వాత మీరు మరణశిక్ష ననుభవించాల్సి వుంటుంది. జాగ్రత్త"ని హెచ్చరించాడు.

"ఇప్పుడు వెళ్ళి చెబితే మీకే ప్రమాదము రాదు. ఆ తర్వాత... జాగ్రత్త. వెళ్ళండి. వెళ్ళి ముందు యువరాజును పిలవండి. కాదంటే నేను శంఖమూది, వారిని నిద్ర లేపుతాను. ప్రమాదాన్ని పసిగట్టి, రక్షణకు రావాలే తప్ప, ఆ తర్వాత ఏమనుకున్నా లాభంలేదని" గద్దించాడు.

దీంతో వాళ్ళలో వాళ్ళు తర్జన భర్జన చేసుకుని చివరకు, యువరాజు విందుని లేపడానికి, వారిలో ముఖ్యుడు బయలుదేరాడు.

ఆ నిద్రమత్తులోనే వచ్చిన విందుడు "ఇంతకీ ఎవరు మీరు ? మీకేం కావాలి ? ఈ రాత్రిపూట నిద్రాభంగం చెయ్యడానికి కారణం...!" ఆవులిస్తూ అడుగుతున్నాడు.

"ఇప్పుడు అత్యవసరంగా నేను చక్రవర్తిని చూడాలి."

"ఇప్పుడా...ఈ రాత్రిపూట... జరిగే పనేనా ? అడిగేదానికి ఆలోచన వుండాలి."

"వుంది కాట్టే, అడుగుతున్నాననేసరికి, ఈ వ్యక్తి ఎవరా! అని పరీక్షగా చూసి, ఆశ్చర్యపోతున్నాడు. అప్పుడు నా పేరు "కృష్ణుడు వాసుదేవుడని కూడా అంటారు." ఇతడు, దేవభాగుని కుమారుడు, నా సోదరుడు ఉద్ధవుడు అనేసరికి, మళ్ళీ, మళ్ళీ, కళ్ళు నులుముకుని చూసాడు. ఈ మహనీయునా, ఇంతసేపు నిలబెట్టింది. తన కాపలాదారులు, వాదించిందనుకున్నాడు.

"ఇప్పటికయినా, చక్రవర్తిని...!"

"క్షమించు, గోవిందా! చక్రవర్తి ఇప్పుడు లేవడు. మీతో మాట్లాడడు. మన్నించాలి" ప్రాధేయపడుతున్నాడు.

"సరే. మీ చక్రవర్తి నన్ను చూడటానికి ఇష్టపడకపోతే, నా సందేశాన్ని, మగధ యువరాజు సహదేవునికందించి, ఆతని ద్వారా వెంటనే చక్రవర్తికందేలా చూడాలి. వెళ్ళి చెప్పు -

"ఒకసారి గోమంతకంలో, గోవిందుడు నీ ప్రాణాలు రక్షించాడు. మరచిపోయి వుందువు. ఇప్పుడు మళ్ళీ రక్షించే ప్రయత్నం చేస్తున్నాడు. కాబట్టి వెంటనే ఆ వాసుదేవుని దర్శించు. లేదంటే, ఈ మూడు లోకాలలో నిన్ను రక్షించేవారు కనబడనే, కనబడరు. ఆలోచించుకొమ్మను. చెప్పు" అన్నాడు.

అది విన్న విందుడు బిగుసుకుపోతున్నాడు. దీనిని తాను చక్రవర్తి కందివ్వడమంటే.... అమ్మో! నేను చెయ్యలేను. నా వల్ల కాదనేశాడు.

"పిచ్చివాడా! ఇవి బెదరింపులు కావు. ప్రస్తుత పరిస్థితిని వివరించి చెబుతున్నాను. చక్రవర్తి నన్ను కలిస్తే విషయం వివరంగా చెబుతాను. కాదంటే కర్మ"మన్నాడు.

ఏం చెయ్యాలి ? విషయమా ప్రమాదకరమైనది. వచ్చిన వ్యక్తి ఘనత వహించిన ప్రముఖుడు. ధర్మశ్రేష్టుడు. కాదనలేక "ఒక్క నిముష"మంటూ లోపలికి వెళ్ళాడు.

"అసాధ్యుడవని" కృష్ణుని చూస్తూ ఉద్ధవుడు నమస్కరించాడు.

"నిజం ఉద్ధవా, ఇద్దరం వెళ్ళి చేసేదేమీ లేదు. అతడు మూర్ఖుడు. తొందర పడితే, నేను పోయినా, నువ్వు రక్షించబడతావు. విషయం పంచపాండవులకందించే సావకాశముంది. తర్వాత జరిగేది భగవన్నిర్ణయం. అందుకే అలాగ చెప్పాను" అన్నాడు - యధావిధి తన చిరునవ్వులు - పున్నమి వెన్నెల వలె కురిపిస్తూ!

"ఎవరు ? కృష్ణుడా!" అంటూ మగధ యువరాజు సహదేవుడు వచ్చాడు. ఈ సమయంలో చక్రవర్తిని చూడగోరడం....!

"తప్పదు యువరాజా! పరిస్థితులు విషమించినప్పుడు, సమయాసమయ ఆలోచనలు వుండవు. ఆ పరిస్థితి కనుగుణంగా ప్రవర్తించడమే మన "ధర్మం". నేను చక్రవర్తికి మిత్రుడను కాను. సందేహించకు. అయినా ఆయన క్షేమాన్ని కోరుతున్నానంటే... అది మానవత్వానికి ప్రతీక!

అంతేకానీ ఏమీ ఆశించి కాదు. మరే ఆశయంతోనో, ఇక్కడికి రాలేదు. ఈ సమయంలో అంటే.... భావి చక్రవర్తివి, నువ్వే ఆలోచించుకో!

సహదేవుడు క్షణకాలం ఆలోచనలో పడ్డాడు. ఆ వాసుదేవుడు చెప్పేది నిజమై వుండాలి. ఏ మాత్రం సందేహం, సంశయం కనబడటంలేద'' ని మెల్లిగా చక్రవర్తి పడుకున్న శిబిరంలోకి వెళ్ళాడు. విషయం చెప్పి, కృష్ణుని తీసుకు రమ్మంటారా ? అని అడిగితే ''కానిమ్మని'' చక్రవర్తి సమాధానమిచ్చాడు.

చక్రవర్తి ఆదేశంతో, యువరాజు సహదేవుడు గోవిందుని, జరాసంధుని దగ్గరకు తీసుకువెళ్ళాడు. కృష్ణుని చూస్తూనే జరాసంధుడు లేచి కూర్చున్నాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య నిశ్శబ్దం రాజ్యమేలుతుంది. కృష్ణుని చూడాలన్నా, మాట్లాడాలన్నా జరాసంధునికి కిట్టదు. అసలీ స్వయంవరానికి, ఈ గోపాలుడు రావడమే సహించలేకపోయాడు. ఎంతసేపు ఎత్తులు పై ఎత్తులతో అవతలివారిని చిత్తుచేసే ప్రజ్ఞావంతుడు, ఈ కాంపిల్యానికి వచ్చాడంటే, ఏం పితలాటకం పెడతాడో, కార్యక్రమమెలాగ పరిణమిస్తుందోనన్నది జరాసంధుని శంక. ఈ సందేహ ప్రియునికి, అర్థరాత్రి పూట ప్రాణరక్షకుడినంటూ, కృష్ణుడు రావడం, అసలు నచ్చలేదు. అయినా తప్పదు. అందుకని, ఈ సమయంలో ఇలాగ రావడానికి కారణాన్ని అయిష్టంగానే అడిగాడు.

''చెబుతాను. నన్ను గోమంతకంలో కాని, మధురలోకాని ఏం చెయ్యలేక పోయావు. ఇప్పుడు అర్థరాత్రిపూట ఒంటరిగా నిరాయుధుడినై నీ వద్దకు వచ్చాను. ఇంత ధైర్యం చేసినవాడిని చూస్తే....

''నాకు కోపం. నువ్వు నా శత్రువు. నా ఆలోచనలన్నీ తలక్రిందులు చేసి నన్ను....!'' కోపంతో వూగిపోతున్నాడు.

''జరాసంధ చక్రవర్తీ! కోపతాపాలు, ఆవేశ కావేషాలు అనర్థదాయకాలు. ఆరోగ్యప్రదాతలు కావు. పెద్దవాడివి. కోపం తగ్గించుకుని, అంటే.... శాంతం పూని ముందు నా పలుకులను విను. ఆ తదుపరి నీకేది ఆరోగ్యకరమైతే, ఆనంద మయితే, ఆ మార్గంలో ప్రయాణించవచ్చును.

''ఇప్పుడు చెప్పబోయేదేవిటి ?'' ఆవేశపడుతూ అడిగాడు.

''ఇటు విందుడు, అటు యువరాజు వుండగా చెప్పనా ? లేక ఈ ముచ్చట్లు మనలో, మనతోనే వుంటే బాగుంటుందని, ఆలోచిస్తావా... నిర్ణయం నీది.''

ఈ మనిషితో వేగడం కష్టమనుకున్నాడు. వాళ్ళవైపు చూసాడు. యువరాజు, విందుడు బయటికి వెళ్ళిపోయారు. కాని, శిబిరం ముందు ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు, వారు సిద్ధంగా, అప్రమత్తంగా వున్నారు.

"ఎందుకొచ్చావు ?"

"నిన్నో ప్రమాదము నుండి కాపాడటానికి!"

"నీ సహాయము, సహకారము నాకిప్పుడే కాదు. ఎప్పుడు అవసరం లేదు. మా సమయం వృథా చెయ్యక ఇక్కడ నుంచి వెళ్ళిపో.

"నిన్ను నాశనం నుండి కాపాడటానికి వచ్చానే తప్ప, నీ కాలం, నా కాలం వృథా చేసుకుందికి గాదు. తెలిసిందా ?" అది హెచ్చరికలాగే వుంది.

"ఏమిటో అది, చెప్పు...... చెప్పు.....!" ముప్పు తెలుసుకోవాలని అడుగుతున్నాడు.

"నువ్వు చక్రవర్తివి. గుణాలు పెద్దవిగా, ప్రశంసనీయంగా వుండాలే తప్ప, పన్నీటి కంపు విడిచి, బురదగుంటలో దొర్లినట్లుండకూడదు. కనుక, ద్రౌపది నపహరించాలనే కోరిక విడిచిపెట్టు. అది ఘోర తప్పిదమౌతుంది. పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది.

"ఎవరు చెప్పారు నీకు ? మేము స్వయంవరంలో పాల్గొని మేము గెలవాలని వచ్చామే కానీ, దొంగచాటుగా ఆమెనెత్తుకుపోవాలనే తలంపు మాకు లేదు."

"అయితే - ఆ రకంగా వాగ్దానం చెయ్యగలవా ?" కృష్ణుడు సంయమనంతో, సందేహం విడిచి పెడుతున్నట్లడిగాడు.

"నీకెంత ధైర్యం. నేనెవరినో తెలిసేమాట్లాడుతున్నావా! కనీసం యువరాజువు కూడా కాలేని నీవు, చక్రవర్తితో మాట్లాడే తీరు, ఇదేనా ? ఊ...!" కోపంతో వూగిపోతున్నాడు.

"ఈ కోపమే అనర్థదాయకమనేది. ఆనాడు గోమంతకంలో, నాకెందు కనుకుంటే, ఇప్పుడు నీ పేరు ఎవరు చెప్పుకునేవారు కాదు!! ఆనాడు ఏ ధైర్యంతో ప్రాణభిక్ష పెట్టానో, ఇప్పుడదే ధైర్యంతో తప్పు చెయ్యవద్దని హెచ్చరించడానికి,

తప్పు చెయ్యననే వాగ్దానం పొందడానికి వచ్చాను. నువ్వీ వాగ్దానమిస్తే, మళ్ళీ అవసరాన్ని బట్టి, నీ ప్రాణాలు రక్షించే సాహసం చేస్తాను. కాదంటే.... నీ కర్మ మన్నాడు, కృష్ణుడు!

"మరోమాట. ఎప్పటికప్పుడు దయతలచి నిన్ను విడిచిపెడుతున్నాను. నీకు సంబంధం లేని విదర్భ రాజకుమారి విషయంలో వేలుపెట్టి, చెయ్యి కాల్చుకున్నావు. నీ పేరు చెప్పి - రాకుమారుడు "రుక్మి" రాజ్యానికి రాలేక, అవస్థల పాలయ్యాడు. అవమానభారంతో చచ్చిపోతున్నాడు. అనవసరంగా అతన్ని జీవన్మృతుడిని చేసావు.

తప్పు చేసిన అల్లుడిని సరిదిద్దలేక, ఆతడు ప్రజా, బంధు క్రోధంతో మడిస్తే, తప్పు దిద్దుకోలేక యాదవ కులాన్నే నాశనం చెయ్యాలని తలిచావు. ఫలితమేమైంది. కుశస్థలికి వెళ్ళి, ద్వారకను రూపొందించుకుని సిరిసంపదలతో సుఖంగా వున్నారు. మా కోసం మధురను ముట్టడించాలని తలచావు. నీ వందిమాగధులను పెట్టుకుని వచ్చిన నీ పరిస్థితి ఏమయింది ? ఒక్కసారి, ఆలోచించుకో. పరిహాసమైన బ్రతుకుతో, పరువు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడు తున్నావు తప్ప, నీ కీర్తి మసిబారిపోయిందని గ్రహించగలిగావా ? ఇంక ఈ జీవితంపై.... అనవసరాలోచనలు, కోపం వృథా" కాదా! ఆలోచించు.

"ఇవన్నీ ఆలోచించడానికి నువ్వు నాకేం మిత్రుడివా ?. లేక నేను నీ మిత్రుడినా ?" ఇప్పుడే కాదు, ఎప్పుడు కావు. తెలిసిందా ?

"తెలియవలసింది నాకు కాదు, నీవే చేసే తప్పులన్ని చేసేసి, నీ వలన నీ మిత్ర సామంతులకు గూడా తలవంపులు తెస్తున్నావు, ధైర్యం వేరు, దర్పం వేరు. ధర్మం వేరు, దాస్యం వేరు. ప్రతి ఒక్కరిని నీ దాసులుగా తలిస్తే ఫలితమెలాగ వుంటుందో, ఆలోచించుకో! అప్పుడు, అప్పుడు తెలుస్తుంది ఈ కృష్ణుని అవసరం నీకు వుందో లేదోనన్న సత్యం.

"నేను, నేను...... నీ బుర్ర పగులగొడతాను. పో, ఇక్కడనుండి.....!" తట్టుకోలేకపోతున్నాడు.

"చక్రవర్తీ! నీ అసహనాన్ని, అవనసర కోపాన్ని ప్రక్కన పెట్టు. కార్య సాధకులకు వుండవలసిన లక్షణం కాదిది. నా బుఱ్ఱ పగులగొట్టిన మరుక్షణం,

ఒక్క అడుగు వెనక్కి కాని, ముందుకు కాని వెయ్యగలవా ? సాటి రాజన్యలోకం, ఈ ఆర్యావర్తం నిన్ను బ్రతుకనిస్తుందా... కానివ్వు'' నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. అందులో విజయమో, వీరస్వర్గమో తేలిపోతుంది.''

అది నిజంగా అవమానకరంగా వుంది. పడుకున్నవాడిని లేపి, మరీ కృష్ణుడు హెచ్చరిస్తున్నాడు. ఇప్పుడేం చేసినా అది, తన ప్రాణాలమీదకే వస్తుంది. చక్రవర్తినని కూడా చూడకుండా, తరిమి, తరిమి, మరీ చంపుతారు. ఇప్పుడు జరాసంధునికి ప్రాణభయం బాగా పట్టుకుంది. కృష్ణుడిని రెచ్చగొట్టడమంటే, ఆర్యావర్తానికి ఎదురు తిరగడమే, ప్రాణాల మీదకు తెచ్చుకోవడమే'' వణుకుతున్నట్లయింది, జరాసంధ చక్రవర్తి దయనీయ స్థితి, పరిస్థితి.

“నన్ను చంపాలనే ఆలోచనను, ద్రౌపదిని అపహరించాలనే ప్రయత్నాన్ని విరమించుకో. స్వయంవరంలో విజయం మాట దేవుడెరుగు. నీవు ప్రదర్శించే వివేకానికి హాయిగా నీ రాజ్యాన్ని చేరగల్గుతావు. లేదంటే, నీ బ్రతుకు ఈ గంగకే అర్పితమౌతుందో, కుక్కలు - నక్కలు కూడా వాసన చూడని అతి హీనాతి హీనమౌతుందో ఆలోచించుకో!

నీ ప్రయత్నం ప్రాణాంతకమౌతుందని గ్రహిస్తే ఆర్య ధర్మం - “ధర్మం''గా వుంటుంది. కాదంటే, కాలపాశానికి చిక్కనట్లవుతుంది.

“ఇప్పుడు నువ్వు నాకు నీతులు చెబుతున్నావు. కానీ, నువ్వు చేసిందేమిటి? రుక్మిణిని ఎత్తుకుపోవడం తప్పు కాదా ? నీకోధర్మం, నాకోధర్మమా ?'' వూరుకో..

“జరాసంధా! దీనిని బట్టే నీకు బుద్ధిలేదని వున్న బుఱ్ఱ పనిచేయడం లేదని తేలిపోయింది. నన్ను రక్షించమని, ఆ పిల్ల అడిగింది కాబట్టే, రక్షించి ద్వారకకు తీసుకువెళ్ళాను. అక్కడ పెద్దల సమక్షంలో శాస్త్రబద్ధంగా వివాహం చేసుకున్నాను. ఈ మాత్రం తెలియకపోవడం, చక్రవర్తి బిరుదానికే సిగ్గుచేటు. ప్రస్తుత నీస్థితి అటువంటిది కాదు. ఆలోచించు మరీ ముందుకు సాగు!

ప్రతిదీ తనకే ఎదురు తిరుగుతూంటే జరాసంధుడు, వెనకడుగు తప్ప, ముందడుగు వెయ్యలేకపోతున్నాడు.

“జరాసంధా! ప్రశాంతంగా విను. ఇందులో బెదిరింపులు లేవు. తంపులు, తలవంపులు లేవు. వున్న పరిస్థితిని వివరించాను, నువ్వు ఎంతకాదన్నా, ఓ చక్రవర్తివి

అవమానాలపాలు కాకూడదని, ధర్మమెరిగిన - ఆర్య సాంప్రదాయవాదిగా చెబుతున్నానే తప్ప, ఇందులో హెచ్చరిక లేదు. మెరమెచ్చులు లేవు.

ఇక మాటలు పెగలడం లేదు మనసు రగలడం లేదు. అంతా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వుంది. కృష్ణుడు లేచాడు. జరాసంధుడిలో ఏ మాత్రం చలనం లేదు.

చివరిగా ఒక మాట. నేనెందుకీ సమయంలో వచ్చి నిద్రాభంగం కావించి, ఇంతసేపు మాట్లాడి, మాట్లాడించానో తెలుసునా ? ఈ స్వయంవరమెటువంటి పరిస్థితులలోను అభాసు, రసాభాస అవదనీ, అంతా ప్రశాంతంగా జరుగుతుందని చేసిన వాగ్దానానికి, నువ్వు తలబెట్టిన అపహరణ విషయం తెలిసి, అనవసరంగా అన్యాయంగా, ఆపదలపాలు కావద్దని చెప్పడానికే తప్ప మరే దురుద్దేశం లేదని చెప్పి-

జరాసంధుని - వివేకానికి విషయం విడిచిపెట్టి "శుభ"మని కదిలాడు. కృష్ణుడు వెళ్ళిన వైపు అయోమయంగా చూస్తూ, "కళ్ళు, బుర్ర" జరాసంధుడు నిద్రమత్తు వదిలిపోయినట్లు రుద్దుకున్నాడు.

# ఏమంటాడు... ?!

"గోవిందా! జరాసంధుడు, నీ మాట విన్నాడా ? తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడా ?" ఉద్ధవుడు అడుగుతున్నాడు.

జరిగిన సంభాషణాన్ని, ఏర్పడిన పరిస్థితిని బట్టి మగధవీరులు, వీరత్వం విడిచి, పిరికివారిలాగ, ద్రౌపదిని అపహరించే ప్రయత్నం చెయ్యరు. అంతవరకు నమ్మవచ్చును. కాదంటే, తీవ్ర పరిణామాల్ని వాళ్ళు ఒంటరిగా ఎదుర్కోనవలసి వస్తుంది."

తలవూపిన ఉద్ధవుడు "మన పాండవులు వచ్చినట్లు లేదే ? "వస్తారా, రారా ?" అన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఎందుకంటే, వీరి రాకను గూర్చి ఏ మాత్రం సమాచారం దొరకలేదు.

రేపు ఉదయం స్వయంరం సమయానికి కనుక వారు రాకపోతే, మన ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరౌతుంది. మన వూహలు తల క్రిందులౌతాయి.

అంటే... ?!

"ఏముంది. దుర్యోధనుడు పంతం నెగ్గించుకుంటాడు. భానుమతికి నేనిచ్చిన మాట పోతుంది. అసత్య, అధర్మవాదిగా లోకం తలుస్తుంది."

ఇది నీ ఆలోచన. మల్లయుద్ధ, గదాయుద్ధ ప్రవీణుడు. ధనుర్విద్యా కౌశలాన్ని ప్రదర్శించలేడు. అతను కాక మరెవరైనా విజయం పొందితే -

అప్పుడు, ద్రౌపది ఇష్టం. ఎవరిని స్వీకరిస్తుంది. వరిస్తుందన్నది - అసందర్భ ప్రలాపన వంటి ఆలోచనమవుతుంది.

ఈ విలువిద్యా ప్రదర్శనలో మహావీరుడు తప్ప సామాన్యులు నెగ్గడం కుదరదనీ, సామాన్యులు విజయం పొందే సావకాశం లేదని, శ్వేతకేతు చెప్పాడు.

కాని కర్ణార్జునులు సామాన్యులు కాదుగా! "మరో విషయం. కర్ణుడు తన మిత్రుని కోసం సాహసిస్తాడు. పొరపాటున, సాహసించినా, అది తన మిత్రునికే అర్పితమంటాడు. ఇక వున్నవారిలో దుర్యోధనుడే మేటి. ఇక మిగిలింది సాత్యకి, నువ్వు, నేను. నాకిందులో ఆసక్తి లేదు. మిగిలింది.... మీ ఇద్దరు" ఇది ఉద్ధవునికి కృష్ణుని సమాధానం.

ఈ మాటల్లో తమ శిబిరానికి వచ్చారు. కృష్ణుడు సాత్యకిని చూసి "నువ్వు విశ్రాంతి తీసుకో. అవసరాన్ని బట్టి నీ బలదర్పాలు ప్రదర్శించాల్సి వుంటుంది" హితవు పలికాడు.

"నీ దయ వలన నాకేం భయం లేదు. నేను దేనికైనా సిద్ధంగా వున్నాను. అవసరాన్ని బట్టి స్పందించగలను. నా సత్తా చూపగలనన్నాడు. సాత్యకిని పడుకోమని అతనికి నిద్రపట్టాక, కృష్ణుడు తన శిబిరం నుండి బయటికి వచ్చి, ఉద్ధవుని కోసం ఎదురుచూస్తున్నాడు.

ఏమిటింకా ఆలస్యమనుకునే సమయంలో ఉద్ధవుడు వచ్చాడు. "పంచపాండవుల జాడ తెలియలేదుట" సిగూరినాగ చెప్పాడు.

"రాలేదా ? ఏం జరిగింది ? ఎందుకు రాలేదు ?" లోపల అనుకునే మాటలు, బయట కనుకుంటున్నారు. సమాధానం... దొరకడం లేదు.

ఒక్కక్షణం మౌనం.

తర్వాత - కృష్ణా! నాకో ఉపకారం చేస్తావా ? అదొక ప్రార్థన.

"నిన్నెప్పుడైనా కాదన్నానా ? ఏం కావాలో చెప్పు. నీ కోసం ఏం కావాలన్నా చేస్తాను.

"ఏం లేదు. రేపు స్వయంవరంలో పొరపాటున సాత్యకి ఓడిపోతే, నేను పాల్గొనే సావకాశమిస్తావా ? వేడుకుంటున్నట్లుందా అభ్యర్థన.

"నాకేం అభ్యంతరం లేదు. కానీ, ఇంత అమాయకుడివి, సున్నిత హృదయుడివి, ద్రౌపదిని భరించగలవా ? ఆమె ఓ అగ్నిపర్వతం. ఆవిడను భరించడం కష్టం. భరించగలనంటే, నీ ఇష్టం. నాకేమీ అభ్యంతరం లేదన్నాడు.

"ఇందులో ఎవరిని ఇబ్బంది పెట్టడం నా వుద్దేశం కాదు. ఆ అయిదుగురు జాడ తెలియలేదు. దుర్యోధనుడు లాభం లేదు. సాత్యకి... వీరుడే కావచ్చును. కానీ ఏదైనా గ్రహభావం వికటిస్తే, నేను... అన్నాను కానీ... అదే నువ్వు రంగంలో వుంటే ఈ ఆలోచన వచ్చేదే కాదు....!" విషయం విన్నవించాడు.

"ఉద్ధవా! నీవంటి పరమఆప్తుని పొంది నిజంగా నేను ధన్యుడనయ్యాను. నాకోసం "నువ్వు" అని నిన్ను దాచుకోకుండా, నువ్వు చేసే త్యాగాలు ప్రతిక్షణం ప్రేరకాలు, ప్రోత్సాహకాలు. చూద్దాం. కానీ ఏం జరుగుతుందో.....! అంతా దైవేచ్ఛ! అని ఒక్కక్షణం కృష్ణుడు కళ్ళు మూసుకున్నాడు.

నీ ఆలోచనంతా బాగానే వుంది. కాదనను. కానీ మీ ఇరువురు కూడ అపజయమొంది, దుర్యోధనుడు విజయమొందితే -

"అది జరగనే, జరగదు. ఇది సత్యం. అతనికా అదృష్టం లేదు, రాదు. అతన్ని విజయం పొందనివ్వను.

"ఎలాగా!" కృష్ణుని ప్రశ్న.

"నువ్వు నా ప్రభువువు. నేను నీ దాసుడను. నీ ఆశీస్సులు ఇవ్వు. అవే విజయపథానికి తీసుకువెడతాయి!" ఇంకోమాట మేము ఓడిపోయి, దుర్యోధనుడు కనుక విజయుడైతే ఏం చెయ్యాలో నాకు తెలుసు.

"ఏం చేస్తావు ?" ఆసక్తిగా కృష్ణుడడుగుతున్నాడు.

"ఆ ధనువు చాలా అద్భుతమైనది. ఇటు విజయానికే కాదు, అటు వీర మరణానికి కూడా ఉపయోగపడుతుంది. కాబట్టి, దాంతో నన్ను నేను

చంపుకుంటాను. ఆ, అశుభంలో మొత్తం పరిస్థితి తలక్రిందులవుతుంది. స్వయంవర కార్యక్రమం ఆగిపోతుంది.

"ఉద్ధవా! ఇది తప్పు. నాకోసం ప్రతిమాటు నువ్వు చేసే త్యాగాలు - ప్రతిజ్ఞా పాలనం వలన, నా ధర్మం రక్షింపబడటం మాట దేవుడెరుగు కానీ, నేను "అధర్మ"మూర్తినై పోతున్నాను. "ఇది తగదని" వూరడించాడు. అంత సాహసం పనికిరాదని, ఓదార్చాడు.

"దుర్యోధనాదుల వంటివారు విజయమొందకూడ దన్నావు, చూడు. అది సత్యం. అవతలవారి మేలును కాక, కీడును కోరేవారు తమ నాశనానికి కారకులవు తున్నారు. వాళ్ళకు తాత్కాలికంగా విజయం ప్రాప్తించినా, శాశ్వతంగా వారు నరకవాసులు, పాపాచారులౌతారు.

"నీ మాట నిజం కావాలి. నువ్వు లోక క్షేమాన్ని కాంక్షించే ధర్మావతారుడివి. కనుక, ధర్మం పరిరక్షించబడాలి, మేము - దానిని నీవేమన్నా, మా ధర్మం మేము నిర్వర్తించాలి. నీకు విధేయులమై సదా నిలవాలి. అదే మా ఆలోచన. నీ ఆశీస్సుల బలమన్నాడు.

ఆనాడు పౌష్యశుద్ధ ఏకాదశి.

ఉదయాన్నే తన కార్యక్రమాలన్ని పూర్తి చేసుకుంది. జ్యోతిష్యశాస్త్రవేత్తలు, పండితులు గ్రహగతులు, ఆమె జాతకస్థితిని గమనించి, చక్కని జీవితం లభిస్తుందని, లోకోత్తర ఖ్యాతిని పొందుతుందని శుభం పలికారు. దీవించారు.

ఈనాడే స్వయంవరం.

పాంచాల రాకుమారి, నూత్న జీవిత విధానంలో అడుగుపెట్టే శుభదినం. ఈమెను చేపట్టే అదృష్టవంతుడెవరో ? ఈమెను చేపట్టే శుభ్ర మనస్కుడెవరో! ప్రతి ఒక్కరిలో ఆందోళన, కలవరం, ఆరాటం, ఉత్సాహం, ఉద్వేగం.

ద్రౌపదిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పెండ్లి శోభతో కళకళ లాడుతుంది. ఆ అందం, సొగసులు, తళుకుల సౌందర్యం, ఆ ఆనందమే వేరు. పురోహితుల వేదమంత్రాలు, స్వస్తివాచకాలతో, ఆ వాతావరణాన్ని పవిత్ర మొనరిస్తున్నారు. రాజకుమారికి బంగారు భవిష్యత్తు నాకాంక్షిస్తూ - వేదోక్త ఆశీస్సులనందిస్తున్నారు.

యాజ్ఞసేని, యజ్ఞశాలకు వెళ్ళింది. ఆహుతులు అర్పించింది. ఎందుకంటే, అగ్ని ఆమె జన్మకారకుడు. సర్వ పవిత్రుడు. ఆ పావకునికి ప్రదక్షిణం చేసి వందన శతాలర్పించింది. తనను సర్వదా కాచి రక్షించమని శుభం చేకూర్చమని, అగ్నిభట్టారకునికి అంజలి ఘటించి ప్రార్థించింది.

అక్కడనుండి తనకు ప్రాణప్రదమైన గోమాత దర్శనం చేసుకుంది. ఆ గోమాత కూడా రాకుమారిని ఎంతో ఆప్యాయంగా చూసింది. నువ్వు సదా నా వెంట వుంటావు. నీతోడిదే నా జీవితమని, గుండె నిండుగా గోమాతతో చెప్పింది. తానూ వస్తానన్నట్లు గోమాత తలవూపింది.

వేదవిదుల స్వస్తివాచకాలు, ఆడపడుచుల మంగళ కీర్తనలు, మేళతాళాల మంగళవాయిద్యాలతో, రంగ రంగ వైభవంగా, కదిలి, హంసనడకల రాజహంసలా నడుస్తూ ద్రౌపది రాకుమారి స్వయంవరమంటపానికి బయలుదేరింది. వీరణాలు, పూరణాలు, జయ జయ ధ్వానాలు, వందిమాగధుల స్తోత్రాలు, స్త్రీల మంగళ కీర్తనలు అన్నీ "ద్రౌపదీ" పాంచాల రాకుమారికి బ్రహ్మానందం కల్గిస్తూంటే, కదలి వెడుతుందా "కల్యాణ" రాచపడుచు.

ముందు ధ్రుష్టద్యుమ్నుడు, సత్యజిత్తు, శిఖండి వారితో పాటు ఆచార్య శ్వేతకేతులు, గురు సాందీపులవారు.... అటు ఇటు వీక్షకులు, ప్రేక్షకులు అమ్మో.... నయనానందకర, వర్ణనాతీత దృశ్యమై అందరికి, బ్రహ్మానందం కల్గిస్తూంది.

యజ్ఞశాల నుండి, స్వయంవర మండపానికి వెళ్ళే దారిని, ఆ రాచబడుచు, వెయ్యి కళ్ళతో గమనిస్తూ "అన్నా!" అని కృష్ణునికి శిరసువంచి మనసులోనే నమస్కరించింది. పరమానంద భరితురాలయింది.

ఆమె స్వయంవర మండపాన్ని చేరింది.

ఆమెకోసం - ఎదురుచూసే ప్రతి ఒక్కరు నిక్కి నిక్కి చూస్తున్నారు. అసలే రాకుమారి.. అందచందాల మెరుపులు, మెరుగులు, మేని సొగసులతో, చూపరుల కళ్ళను, కట్టేస్తూంది. త్రిప్పుకోలేని కళ్ళతో, ఆ పాంచాల రాజకుమారిని బొమ్మల్లా చూస్తూన్నారే తప్ప, చూపులు త్రిప్పుకోవాలని, అది సభ్యత కాదన్న సంగతి మరిచినట్లు, అక్కడున్న వారందరు ప్రవర్తిస్తున్నారు.

స్వయంవర మంటపంలో ప్రవేశించిన ద్రౌపది, సాంప్రదాయం ప్రకారం, తల్లి-తండ్రి-తానే అయిన, సింహాసనాధీశుడైన తండ్రికి నమస్కరించింది. తండ్రి కిరుప్రక్కల శిఖండి, సత్యజిత్తులు ఆయుధపాణులై రక్షణకవచంగా నిలబడ్డారు.

సింహాసనాని కెదురుగా.. వారి కులదైవమైన అగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఆ హోమగుండం చుట్టూ వేదవిదులు, యాజ, ఉపయజ్వలతో కలిసి అగ్ని కార్యక్రమం జరుపడానికి సిద్ధంగా వున్నారు. అగ్నిహోత్రాన్ని, వేదవేత్తలను చూసిన ఆమె మనస్సు ఆనందభరితమయింది.

ఆ స్వయంవర మంటపం మధ్యలో చిన్న కొలను. అందులోంచి చూస్తే - స్వయంవర నిర్ణయ - యంత్రరాజం "మత్స్యం" కనబడుతుంది. అది స్పష్టంగా చూడవచ్చును. చుట్టు ఆహ్వానితులు, అతిథుల కోసం అందమైన ఆసనాలు ఎక్కడ కూర్చుంటే, జరిగే సభా కార్యక్రమం మొత్తం స్పష్టంగా చూడవచ్చునో. ఆ రకంగా ఆసనాలను ఏర్పాటు చేసారు.

ఇటువంటి మంటపం, ఏర్పాట్లను గతంలో ఎన్నడు చూడని పాంచాల రాజకుమారి సంబరపడింది. ఈ ఆలోచన మొత్తం కృష్ణభగవానునిదిగా తలచి పాంచాలి ఆనందపరవశమైంది. పనిలో పనిగా ఆమె శకునిని, దుర్యోధనుని, అశ్వత్థామను, ఆయన ప్రక్కన కూర్చున్న సూతపుత్రుడు అంగరాజు కర్ణుడుని చూసింది. కర్ణుని చూసీ, క్షత్రియ వంశానికి చెందినవాడుగానే వున్నాడు. కాని, ఏం చేస్తాం. ఏ తల్లి కని విడిచిపెట్టిందో, మొత్తానికి, సూతవంశీయునిచే పెంచబడ్డాడనుకుంది.

కర్ణుడు "మహావీరుడు, దాత" అని లోకం పొగొడుతుంది. ఒకరికి ఇవ్వడమే తప్ప, ఒకరినుండి యాచించే లక్షణం లేని, ఆయన విశిష్ట వ్యక్తిత్వం. క్షత్రియత్వాన్ని తెలియబరుస్తుంది. వీరిలో విరాటుడు, సాల్వుడు, మద్రి, చేది దేశాధిపతులు కూడా వున్నారు. వారిని, పాంచాలి గుర్తించగల్గింది. జరాసంధ చక్రవర్తిని కూడా యాజ్ఞసేని సులువుగా తెలుసుకుంది. అందరు వారి వారి సాంప్రదాయ అలంకరణలతో, ఈ స్వయం"వర" కార్యక్రమానికి అనుగుణంగా, తమను తాము తీర్చి దిద్దుకున్నారు.

అందరిని కలయచూస్తూ, చూస్తూ.... వెదుక్కుంటుంది. ఇంతకీ ఎవరంటే... ఇంకెవరు ? కృష్ణుడు, వాసుదేవుడు, గోవిందుడు, తన అన్న కాని అన్న. అభిమాని.

రక్షకుడు. యదువీరుల మధ్యలో ప్రముఖంగా ఆ శిఖిపింఛ మౌళి కనబడుతున్నాడు. ఆనందంగా చూసింది. కళ్ళతోనే వందనాలర్పించింది. కృష్ణుడు, ఆతని ప్రక్కన, ఓ భారీకాయం. పెద్దన్న బలరాముడయి వుంటాడనుకుంది.

అలా చూపులు త్రిప్పడము, తండ్రిని చూసింది. వారికి మరొక ప్రక్కన, ఋషులు, మునులు, పండితులు, వేదమూర్తులు ఎందరో... ఎందరెందరో కూర్చుని వున్నారు. హోమగుండానికి చుట్టూ వున్న కొందరు, ప్రక్కవారి మాటలు, ఇతర చేష్టలతో, తాము ఆనందకరంగా, స్వయంవర సంబరాన్ని చూడనివ్వరేమోనన్నంత, అసహనంగా వున్నారు.

అగ్నిహోత్రం దగ్గరకు వెళ్ళి వినయమూర్తియై నమస్కరించి, తనకంటూ ప్రత్యేకించిన, ప్రత్యేక ఆసనంపై ఆమె కూర్చుంది. కార్యక్రమం ప్రారంభ సూచికంగా ధ్రుష్టద్యుమ్నుడు, మహారాజు (తండ్రిగారి) వద్దకు వెళ్ళి, వారి అనుమతి ఆశీస్సులతో, స్వయంవర మంటప మధ్యలో గల చిన్నకొలను వద్దకు వచ్చాడు. ఆ కొలను పైన శిఖరాగ్రంలో మత్స్యయంత్రం, నీటిలో కదిలే ఆ మత్స్యయంత్ర బింబాన్ని చూస్తూ, ఈ కొలను వద్ద పెట్టిన విల్లంబులనెక్కుపెట్టి ఆ మత్స్యాన్ని ఛేదించాలి. అలా ఛేదించిన వారిని పాంచాలి స్వయం"వరం"లో వరిస్తుంది. ఇదీ పరీక్ష. దాని ప్రక్కనే, ఈ యంత్ర రాజాన్ని ప్రతిష్ఠింపచేసిన ఆచార్య - గురు - సాందీపులవారు, ఎంతో హుందాగా కనబడుతున్నారు.

ఆ ప్రక్కనే దర్భాసనం. ఓ పెద్ద ధనుస్సు. దానిప్రక్కన అయిదు సర్పాకార బాణాలు. సామాన్యులు, ఊహలలో కూడా తేరిపార చూడరాని విధంగా, ఆ మత్స్యయంత్రం రూపొందించబడింది. మహా మహావీరులు తప్ప, సామాన్య రాజన్యులు, వారసులు, దీనిని ఛేదించడం, పాంచాలిని చేపట్టడం, కలలో కూడా వూహించలేని విషయం. అంత పకడ్బందీగా మత్స్యయంత్ర నిర్మాణం జరిగింది.

ఆచార్య - గురు -శ్రీ సాందీపులవారు తెలిపినట్లు ఆ "ధను"వుకు పూజాదికాలు నిర్వహించబడ్డాయి. ద్రౌపది, అన్న వెనుకకు పోయి నిల్చింది. ఇక రాజులు తమ తమ ప్రతాపాలు ప్రదర్శించడమే తరువాయి. సూర్యకాంతితో ఆ ప్రాంతం దేవసభగాను, ఆ రాజులు - దేవతామూర్తులుగాను ప్రకాశిస్తున్నారు.

శంఖనాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి. దుందుభులు మార్మోగుతున్నాయి. దృష్టద్యుమ్నుడు, ఆ మడుగు వరకు వచ్చి, మత్స్య యంత్రానికి, గురుదేవులకు నమస్కారం చేసి - అందరికి వినిపించునట్లు - దివ్యవేదమూర్తులకు, పూజ్యులకు, ఋషి - ముని బృందాలకు, అధివసించిన ఆహ్వానితులైన ప్రముఖులకు - సాటి మహారాజు లోకానికి, వీరాధివీరులకు, పాంచాల మహారాజుతో పాటు, ఈ దేశం, పాంచాల రాజకుమారి యాజ్ఞసేని స్వయంవర మంటపానికి, సభకు మనసారా ఆహ్వానిస్తూ నమస్కరిస్తుంది.

స్వయంవర కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి, స్వాగతం, సుస్వాగతం. కార్యక్రమం ప్రారంభ సూచకంగా, మంగళతూర్యారవాలు, వేదమంత్ర స్వస్తి వాచకాలు ప్రారంభమయ్యాయి. కనుక వీరులు తమ ప్రదర్శనా పాటవంతో, సభను రంజింప చేయ ప్రార్థిస్తున్నామని ప్రకటించాడు.

దాంతో కలకలం ప్రతిఒక్కరిలో ఆనందం. ఉత్సాహం. తానే విజేతను కావాలని, ద్రౌపదీ రాజకుమారిని అందుకోవాలనే ఆరాటం ప్రతి ఒక్కరిలో ప్రారంభమయింది. చలనం, సంచలనం మొదలయింది. ఆనందోత్సాహాలు, మీసాలు మెలివెయ్యటం, తానే విజేతనని విర్రవీగడం ఒక అలికిడిగా తయారయింది.

మళ్ళీ దృష్టద్యుమ్నుడు - ఇక్కడ పూజ్య ఆచార్యులు మత్స్యయంత్రాన్ని మంత్రోపేతంగా నిర్మించి, బంధించారు. ఆ తిరిగే మత్స్యరాజాన్ని, ఇక్కడ వుంచబడిన ధనస్సు, ఆ ప్రక్కనేనున్న అయిదు బాణాలతో క్రింద కొలను నీటిలో చూస్తూ, శరసంధానం చెయ్యాలని, మొదటి బాణానికే తన ప్రతిభను చాటినవారు వీరాధివీరుడు. అయిదు బాణాలను తొడిగి, శరసంధానం చెయ్యలేనివారు, మామూలు, ఆరంభశూరులు. ప్రారంభించండి'' అన్నాడు.

మళ్ళీ శంఖనాదాలు, దుందుభిధ్వానాలు, వీరణాల స్వనాలు - ప్రారంభ సూచకంగా మ్రోగాయి.

ఆ వీరాధివీరుని అగ్నిసంజాత, మా సోదరి యాజ్ఞసేని, వీరోచితంగా వివాహం చేసుకుంటుంది. ఈ పరీక్షకు వీరత్వం శుల్కం. ప్రయత్నించండి.'' అన్నాడు పాంచాల రాకుమారుడు. ఆ వెంటనే వృద్ధ యజ్ని (యాజి) కుంకుమతో ద్రౌపదినిచేరి, తిలకధారణం చేసి ఆశీర్వదించారు. పూలమాలికనొకటి ఆమెచేత

ధరింప చేసారు. ఇప్పుడీమె వధువు. ఈ కల్యాణిని చేపట్టగల ధన్యచరిత్రులు, తమ వీరత్వాన్ని ప్రదర్శించి చేపట్టవచ్చును. సభనుద్దేశించి, ఆ శ్రేష్ఠ వృద్ధ యజ్ఞి-పెద్దగా అభినందించి, తమ ఆశీస్సులను ప్రసాదించారు.

ఎవరు తొలి సాహసం చేస్తారో... తన వీరత్వాన్ని ప్రకటించుకుంటారోనని, అందరు ఆత్రంగా చూస్తున్నారు. ఆ తరుణంలో - చేది దేశ యువరాజు శిశుపాలుడు లేచాడు. సగర్వంగా అందరిని చూస్తూ తొలిపూజ తనకేనన్నట్లు విర్రవీగుతూ మత్స్య యంత్రం వద్దకు బయలుదేరాడు. అప్పటికే ఆ వచ్చే రాజకుమారుని నామధేయం, రాజ్యం - విలాసం, బిరుదులు - ప్రకాశం వగైరాలన్నీ బిగ్గరగా ప్రకటించబడుతున్నాయి.

కొందరు ఆశ్చర్యంగా చూస్తూంటే, ఇంకొందరు ఈయన.... రకరకాల గుసగుసలు, వ్యాఖ్యానాలు. అయినా ఆత్రం. ప్రతాప ప్రదర్శనకు సన్నాహంగా ముందడుగు.

శిశుపాలుడు, కృష్ణుని చిత్రంగా చూసి మందహాసం చేస్తూ, ద్రుపదుని చేరి, వందనమాచరించి మత్స్యయంత్రం వద్దకు వచ్చాడు. దృష్టి మత్స్యం మీద కాక, చుట్టు వున్నవారిపైన, ద్రౌపది పైన, తన వీరత్వంపై ఆశ, ప్రతాపంపై గర్వంతో, ధనస్సునందుకుని బాణమెక్కు పెట్టాడు. ఆ అల్లె తొడగడంలో కదిలాడు, అదిరాడు, తూలాడు.

అది అందరికి పరిహాస ప్రదమయింది.

పట్టుమని ధనస్సు పట్టుకుని విల్లు ఎక్కుపెట్టలేని వాని ప్రతాపానికి, ప్రేక్షకులతో సహా ప్రతి ఒక్కరు పెద్ద పెట్టున నవ్వారు. తలదించుకుని, వెన్ను చూపాల్సి వచ్చింది. ఇందాకటి నవ్వులు, వీరోచిత నడక, అట్టహాసం ఎదుటివారు గేలిచేసే స్థితికి వచ్చింది.

ద్రౌపది మాత్రం నవ్వలేదు. కారణం....

అది సామాన్యమైనది కాదు. ప్రతిభావంతులు తప్ప - ప్రామాణికంగా చెప్పుకోదగ్గ వీరులకు అసాధ్యమని ఆమెకు తెలుసు, కాబట్టే నవ్వలేదు.

# ధనుర్భంగం

**జ**రాసంధుడు స్వయంవర సభలో కూర్చున్నాడే కాని, మనిషి సభకు, మనసు మరెక్కడికో పరుగులు దీస్తూంది. అందుకుగల ప్రబల కారణం, కృష్ణుడు. రాత్రిపూట వెళ్ళి నీ ప్రాణరక్షణ భాగంలో భాగంగా తాను వచ్చానని, అనవసర సాహసం చేస్తే ఆర్యావర్తానికి కోపకారణమై, ప్రాణాలు కోల్పోవాల్సి వస్తూందని, చేసిన హెచ్చరిక, చెవుల్లో మార్మోగుతూంటే, మనిషి చలన రహితమయ్యాడు. చూడచక్కని చిత్తరువయ్యాడు.

జరాసంధుడుగా తన ప్రతాపం చూపదల్చుకోలేదు. కాకపోతే మనుమడు మేఘసంధి ప్రయత్నం విఫలమైతే, పాంచాలిని అపహరించుకుని పోవడానికైనా సిద్ధపడ్డాడు కానీ, తానుగా - స్వయంవరంలో పాల్గొనదలచలేదు. పరిస్థితులు వికటించి, విషమించి, కనుక పోటీలో పాల్గొని విజేతయితే ఈ ముసిలాడికి, పడుచుభామ కావల్సి వచ్చిందాని వెక్కిరించేవారొక మూల వుంటే, పొరపాటున వయస్సు మీద పడి ఓడిపోతే, ఈ వయస్సులో ఎందుకింత ఆరాటమని మరోమూల వెక్కిరిస్తారు. అన్నీ ఆలోచించి, అడుగు ఏ రకంగాను, అపసవ్య మార్గంలో ముందుకు వెయ్యకుండా వుండటానికే, వాసుదేవుడు తగు హెచ్చరికలు. "నీకోసం, నీ శ్రేయస్సు కోస"మంటూ తెలిపాడు.

ఇది జరాసంధుడు వెయ్యబోయే అడుగుకు బంధనమై కూర్చుంది. ప్రేక్షక పాత్రతప్ప, ప్రతాప ప్రకటనా దృష్టి, ఏ కోశానా కనబడటం లేదు. ఇదిలాగ వుంటే-

ప్రతి ఒక్కరు ముందుకు వస్తున్నారు. ధనువు నెత్తలేక కొందరు, ఎక్కుపెట్టలేక కొందరు, బాణం తొడగలేక మరికొందరు, ఇలాగ.... ఒక్కొక్క ఘట్టంలో ఒక్కొక్క విధంగా అపజయమొందుతున్నారు.

జరాసంధుడు, చక్రవర్తిగా, ఒక పెద్దగా, స్వయంవర మంటపానికి వచ్చి, ద్రౌపదీ, "శతమానం భవతి దీర్ఘాయుష్మాన్ భవ, దీర్ఘసుమంగళీభవ" అని ఆశీర్వదించడానికే వచ్చాను. నీకు విజయం కల్గుగాక, సమ్మోదం కల్గుగాక! వేయేల - శ్రేయాభివృద్ధిరస్తు" అని ఆశీర్వదించేసరికి -

అంతకుముందు వరకు, ఈ ముసిలాడికి స్వయంవర సంబరమా ? అని మూతి, ముక్కు త్రిప్పుకుని, పెదవి విరిచినవారు "జయహో, జయహో! జరాసంధ చక్రవర్తీ జయోస్తు" అని జయజయ ధ్వానాలు పలికారు. ఇక -

కృష్ణుడేమైనా ప్రయత్నిస్తాడా....... ఏమో లీలామానుష విగ్రహుడు, ప్రయత్నించినా ప్రయత్నించవచ్చును. రకరకాల చెప్పలేని ఆలోచనలు, వినబడని గుసగుసలు, వినరాని ప్రకంపనలు, ప్రశంసలు - సందేహాలు, సమాధానాలు.

కృష్ణుడు మాత్రం - అందరు అపజయం పాలవుతున్నారు. చెప్పుకోదగ్గ వారిలో మిగిలిందో మరొక రాచ ప్రతినిధి - దుర్యోధనుడు. ఇలాగనుకుంటూనే వాసుదేవుని కళ్ళు - ఆ స్వయంవరం మంటపం మొత్తం తిరుగుతున్నాయి. ఎక్కడీ మహావీరులు ? ఎక్కడ దాగున్నారు ? వీరి కోసం కనబడని ఆత్రంతో, ఆశగా శ్రీకృష్ణుని కళ్ళు వెదకుతున్నాయి.

చూసాడు. ప్రేక్ష వీక్షక సమూహంలోని బ్రాహ్మణ బృందం మధ్య - మహావీరులు అయిదుగురు పాండుపుత్రులు కనిపించారు. మనసు తృప్తి పడింది. కళ్ళు మిలమిల మెరిసాయి. మెల్లిగా "అన్నా! పాండవులు సజీవులు" అన్నాడు.

"నీకెలాగ తెలుసు ?" అంత మెల్లిగానే బలరాముడు అడిగాడు.

"అటుచూడు. ఆ బ్రాహ్మణ సమూహం మధ్యలో దాచినా దాగని, ఆ వీరాధివీరుల శరీరాలు తేజోరూపంగా ప్రకాశిస్తున్నాయి. చూస్తున్నట్లు కాకుండా బలరాముడు మెల్లిగా అటువైపు చూసాడు. అవునని - తలపంకించాడు. తనలో తాను సంబరపడ్డాడు. ఇదంతా లోపలి కథనమే. బయటికి మాత్రం - సామాన్య ప్రేక్షక జనం - అందులోని ప్రముఖులు - పెద్దమనుషులు. అంతే!

ఇలా వుండగా - సాత్యకి - ధనుర్విద్యా ప్రదర్శనానికి తహతహ లాడుతున్నాడు. కృష్ణుని కంటిచూపు ఆదేశానికి ఎదురుచూస్తున్నాడు. "గోవిందా! నన్ను అనుమతిస్తున్నావా ?" ఉత్సాహంతో కూడిన ఆత్రంతో అడుగుతున్నాడు.

"కంగారుపడక. ఇంకా సమయం రాలేదు.... రాగానే అతని చెయ్యి పట్టుకుని మృదువుగా నొక్కాడు. ఆ ప్రక్కనే ఉద్ధవుడు కూడా వున్నాడు. అతనికి గూడా అర్థమయ్యేటట్లు నేను చెప్పేవరకు, తొందరపడవద్దు, ఏ యదువీరుడు ముందుకు దూకవద్దు!" "ఇది నా కోరిక!" అన్నాడు.

ఇప్పుడు - దుర్యోధనుడు అటు ఇటూ చూసాడు. ఎవరు సాహసించడం లేదు. ఇక పాంచాలి, తనదేనన్నట్లు చూసాడు. తలంచాడు, లేచాడు. తనకెదురు లేదనే ధీమాతో వున్నాడు. కాని, విధి వక్రిస్తే... ఎందుకో దుశ్శంక. లేచేవాడి నెత్తిపై నిప్పులు పోసినట్లయింది. ఈ నీళ్ళు, నిప్పులు తన ఆవేశాన్ని, ఉత్సాహాన్ని చల్లారుస్తున్నాయి'' అనుకున్నాడు. ఇటువంటి సమయంలో, ఈ శంకా సంశయాలకు తావీయకూడదని సర్ది చెప్పుకుంటున్నాడు.

అప్పుడే "మిత్రమా!'' అంటూ ఒక ప్రక్క అశ్వత్థామ, మరొకప్రక్క కర్ణుడు. కావాలంటే.... నీ కోసం.... అవసరం లేదన్నట్లు తృప్తిగా చూసాడు. ఆ బాంధవ్యం, ఆ గౌరవం, ఆ ప్రాణమిత్రత్వం.... అది చాలనుకున్నాడు. ఇప్పుడు అందరి కళ్ళు కురువంశవీరుల పైన వున్నాయి. ముఖ్యంగా దుర్యోధనునిపైన. తన కత్తి, గద, తమ్ముడు దుశ్శాసనునికిచ్చాడు. అందరిని చిరునవ్వుతో చూసాడు. నా ప్రయత్నం నేను చేస్తానన్నట్లు, కళ్ళతో పలుకరించాడు.

వందిమాగధులు, కురుకులాంలకార, అంటూ ప్రస్తుతిస్తున్నారు. ఎదురులేని మొనగాడివలె, హుందాగా అడుగులు వేస్తున్నాడు. అందరు చూస్తున్నారు. తన రాజసం తనది. మడుగు దగ్గరకు వెళ్ళాడు. ఆచార్యుల వారి ఆశీస్సులు అపేక్షించాడు. వినయ విధేయతల సౌజన్యమూర్తి వలె, ఆ క్షణంలో ప్రకాశించాడు. ఒక్క పాండవుల విషయంలో తప్ప - అన్ని విషయాలలోను మంచివాడే; వారికి రాచరిక హోదా నివ్వడం మాత్రమే''. కురువీరునికి నచ్చదు. గిట్టదు; ఎప్పుడు ఒప్పడు, కూడా!!

ద్రౌపదిని కూడా మందహాసవదనంతో పలుకరించాడు.

ఇప్పుడు - ధనువును, మత్స్యాన్ని, అమ్ములను పరిశీలనగా చూసాడు. దుర్యోధనుడంటే ఏవిటో లోకానికి తెలుపాలనే ఆత్రంగా వున్నాడు. ఆ ఉత్సాహం పొంగుతుంది.

ధనువు నెత్తాడు. తన మల్ల - బలమంతా ఉపయోగించాడు. అల్లె బిగించాడు. ఈ సమయంలో గుండెలు చీల్చే పరిహాస, ఎకసక్క నవ్వు. అది చిరపరచితమైనది. దానినెన్నోసార్లు విన్నాడు. విన్నప్పుడు గుండెలు మండి, కండలు పొంగేవి. కాని ఏమీ చెయ్యలేని అసక్తత. ఆ నవ్వును భరించలేను..... అది.... అది... ఆ నవ్వు భీమునిది. తనకు బాగా తెలిసినది.

ఎక్కడనుండి వచ్చినది ? చనిపోయిన వాడు దెయ్యమై పరిహసిస్తు న్నాడా ? పలుకరిస్తున్నాడా ? లేక తన ఆందోళనా ? గతం, వర్తమానమయ్యేసరికి చేతులు వణికాయి. గుండె చిక్కబరచుకుంటున్నాడు. అవును. ఇంతకీ ఆ నవ్వు ఎక్కడ నుండి వచ్చింది ? తననెలాగ కలవరపెడుతుంది ? ఎందుకు తానన వసరంగా ఏదో తలచుకుని కలవరపడుతున్నాడు.

అయినా మనసు కుదుటపరచుకున్నాడు. ధైర్యం పుంజుకుంటున్నాడు.

తన భయం, అనవసర భ్రమగా తలంచాడు. అయినా - చేతులు వణుకుతున్నాయి.

ఏకాగ్రత కుదరడం లేదు. దృష్టి నిలబడటం లేదు. ఈ భయాన్ని ప్రక్కనబెట్టి, జయాన్ని వరించాలనే, ఆతని దీక్ష సడలుతుంది, కాని, అపజయానికి తలవంచే స్థితి కనబడటం లేదు. మనస్సు ఏదో కీడును శంకిస్తుంది.

పాండవులు తిరిగి హస్తినాపురానికి వీరవిక్రములై వచ్చినట్లు, యువరాజ పీఠాన్ని మళ్ళీ యుధిష్టరునకిచ్చినట్లు....ఏవిటీ కీడు ? అపశకునాల దుశ్శంకలు.

ఆలోచనలను, కలవరాన్ని ప్రక్కనుంచి, బాణం తొడగాలని చూస్తున్నాడు. కాని ప్రయత్నంలో ఏదో తెలియని లోపం. చెప్పలేని పాపం చేసిన పాపానికి శాపం.... అది కృంగదీస్తుంది. కొన్ని క్షణాల వరకు విర్రవీగిన దుర్యోధనుడు చతికిలబడి పోతున్నాడు.

ఇటు శకుని, అటు కర్ణుడు, అశ్వత్థామ.... దుర్యోధనునిలోని నీరసానికి కారణం తెలియక కళవళ పడుతున్నారు. నరాలు చచ్చుబడినట్లు బుర్ర పనిచేయక శరీరం మొత్తం చైతన్యరహితమయ్యేసరికి -

అందరు ఆలోచనలో పడ్డారు. కారణం వెదుక్కుంటున్నారు.

ఈ పరిస్థితులలో - మళ్ళీ కొన్నివేల గొంతుకల నవ్వు అపహాస్యంగా ప్రతిధ్వనిస్తుంటే - ఓడిపోయాననుకున్నాడు.

ఏదయితే, తనను వరించదని తలిచాడో, ఆ అపజయం, విజయాన్ని త్రొక్కి పెట్టింది. తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించి, పదిమందిలో పరిహాస మొనరించింది.

# అవును, వాళ్ళే...!

**కాం**పిల్య నగరంలో -

రహస్యంగా కుమ్మరివారింట, జీవనం గడుపుతున్న పంచపాండవులు, పాంచాలి స్వయంవరమనేసరికి తాము - తమ ప్రచ్ఛన్న రూపము నుండి బయటపడే సావకాశంగా తలచారు. ఇంతకుమించి, వ్యాసులవారు తమకు కర్తవ్యబోధ చెయ్యడంతో, ఈ స్వయంవర సంబరమొక సాకుగా వచ్చి, ప్రేక్షకుల మధ్యలో తమ స్థాయికి తగ్గట్లు కూర్చుని జరిగేది చూస్తున్నారు.

కాకపోతే అందరిలోకి కాస్త దుందుడుకు, దుర్యోధనుని గొంతుకలో పచ్చి వెలక్కాయయిన భీముడు, కురువంశవీరునిగా, అతని అట్టహాసానికి, చేసిన వికటాట్టహాసం, దుర్యోధనుని శరీరం చచ్చుబడేటట్లు చేసింది. ధైర్యం సన్నగిల్లి, ఆశ చచ్చి, అపజయం మూట నెత్తిన పూర్తిగా పెట్టుకోకుండా వెనుదిరిగాడు.

ఇదే సమయంలో, సమయ సందర్భాలను బట్టి తన ప్రతాపాన్ని వ్యక్తం చెయ్యాలని పాండవ మధ్యముండు అర్జునుడు తలుస్తున్నాడు. ఎంత ప్రచ్ఛన్నంగా వున్నా, భీముడు చేసే హడావుడి లోకానికి తెలిసి, అననుకూల సమయంలో బయటపడిపోయి, ప్రమాదాలను కొని తెచ్చుకుంటామోనన్న భయం పీడిస్తూంది. మొత్తానికి పితామహ, విదురులు ఆశీస్సులు, ఆకాంక్షల కనుగుణంగా వ్యాసదేవుల కృపతో, శ్రీకృష్ణ కరుణతో, ఇక్కడికి వచ్చారు. ఇకపైన - జరగేదంతా ఆ భగవత్కృప. అర్జునుడు -

అన్నీ గమనిస్తున్నాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. తమ "కృష్ణుడు వాసుదేవుడు'' వూ అంటే రంగంలోకి దిగాలని చూస్తున్నాడు. బ్రాహ్మణ వేషాలలో వున్న వారి కళ్ళు - కృష్ణ - బలరాములపై వున్నాయి. ముఖ్యంగా అర్జునుని చూపులు కృష్ణుని చూపుల ఆజ్ఞ - సైగల కోసం ఎదురు చూస్తున్నాయి.

ఒక్కొక్కరు రావడం, ధనువే ఎత్తలేకపోవడం, "రాజులము'' అనడానికి, చెప్పుకోవడానికి అనర్హునిగా తలిచాడు. విల్లు ఎత్తడమే చాతకాకపోతే, ఎక్కుపెట్టడం, బాణ ప్రయోగం - ఆలోచనలకు రాని మాటగా తలిచాడు. అన్నీ

ఆసక్తిగా గమనిస్తున్న అర్జునుడు, తాము కూర్చున్న బ్రాహ్మణ బృందం నుండి, ప్రక్కనున్న పెద్దాయన, ఒక్కొక్క రాజు గురించి గుర్తించి చెబుతూంటే, తప్పదన్నట్లు వింటున్నాడు. విని తలూపుతున్నాడు.

దుర్యోధనుడుడెప్పుడైతే వెనుదిరిగారో, అప్పుడు కర్ణుడు, కురువంశ యువరాజు ప్రతిష్ఠ నిలిపే ధీరునిగా లేచాడు. అదొక కలకలం. కర్ణుడు, అతని ప్రయత్నం అర్జునునికి నీరసం కల్గించింది. తనకు అన్నివిధాల పోటీగా, దీటుగా వుండే వ్యక్తి - ఈ ఆర్యావర్తంలో వారి తరంలో కర్ణుడొక్కడే. అతను, కదిలాడనే సరికి, అర్జునుని ఉత్సాహం నీరుగారిపోయింది. అతను... అతను.. గొణుక్కుంటు న్నాడు. ఆ ప్రక్కనున్న పెద్దాయన, విషయమర్థంకాక "కర్ణుడు" అంగరాజు, దుర్యోధన మిత్రుడు, సూతపుత్రుడు అడగకుండా, అన్నీ తనకే తెలిసినట్లు చెబుతుంటే విధిలేక, తనకు తెలిసినప్పటికి, తెలియనట్లు తలూపాడు.

అదృష్టం జారిపోతుంది. కర్ణుడు ఓడిపోయి, అర్జునునిగా తాను బయటపడి, ద్రౌపదిని గెలుచుకుంటే బాగుండును. ఇప్పుడేం జరుగబోతుందో! రంగమెలాగ మారబోతుందో ?? రకరకాల ప్రశ్నలు - సూచనలు అందులోనే సమాధానాలు. కలగా పులగంగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

కర్ణుడు ధనువందుకున్నాడు. సునాయాసంగా పట్టుకుని శరసంధానం చేస్తున్నాడు. అటువంటి సమయంలో ఇదంతా బొమ్మలా చూస్తున్న ద్రౌపది సోదరుడు దృష్టద్యుమ్నుని చెవిలో ఏదో చెప్పింది. ఇంకో క్షణమాగితే, బాణం ప్రయోగించబడుతుంది. ఆ తరుణంలో, ద్రుష్టద్యుమ్నుడు కల్పించుకుని - "అంగరాజా! ఒక్కక్షణ! మన్నాడు. ఆలోచనగా చూసాడతను.

"మీరు అంగ దేశానికి రాజును చేయబడ్డారే తప్ప, నిజానికి రాజులు కారు. కనుక తమకీ కార్యక్రమంలో పాల్గొనే అర్హత లేదు. తమరు సూతపుత్రు లన్నాడు. "ఇది అర్జునునికి ఆనందదాయకమే కానీ, నిజమైన వీరునికి అవమానకరం. ఎవరు ఏమన్నా కర్ణుడు అంగరాజ్యాధిపతి. ఒక రాజుకు వుండే సర్వలాంఛనాలు, రాజసాలు శక్తియుక్తులన్నీ వున్నాయి. అవి అతనికి లభిస్తాయి.

దానికి అంగరాజు బిగ్గరగా నవ్వుతూ "పాంచాల రాజకుమారా! నేనేవిటో, నా శక్తేమిటో నాకు బాగా తెలుసు. నా ధనుర్విద్యా కౌశలం ముందు, కాస్త

నిలవగల్గిన వ్యక్తి అర్జునుడొక్కడే. మిగిలినవారు నాతో సరితూగలేరు. ఇప్పుడు ఇక్కడున్నవారంతా గూడా, సామాన్యులే. కాకపోతే, మా దుర్యోధన యువరాజు "అసామాన్యుడు" అని చెప్పటానికే తప్ప - ఇందులో గెలిచి, మీ సోదరిని వివాహ మాడగల్గుతానని నేను పగటికలలు కనడం లేదు అనేసి, ఎంత హుందాగా వచ్చాడో, అంత హుందాగా తన రాచరిక తేజాన్ని ప్రదర్శించుకుంటూ వెళ్ళాడు.

ఈ లోపులో బ్రాహ్మణ వేషధారియైన అర్జునుడు, అన్నదమ్ముల నాశ్చర్యపరుస్తూ బృందం మధ్యలోంచి లేచి వచ్చి, మహారాజు ఎదురుగా నిల్చున్నాడు. ఆ కుర్రవానిని, ఆతని మొహంలోని తేజస్సును చూసిన ద్రుపదుడు, క్షణకాలం నివ్వెరపోయాడు. ఈ అందమైన చురుకుచూపుల ధీరవర్యుడు, నిజంగా బ్రాహ్మణోత్తముడేనా లేకా ఏ ఇంద్రాది దేవతలో లేక ఏ పరశురాములో మారు రూపున ఇలాగ వచ్చారా ? అని విస్తుపోతూంటే -

ద్రుపదుడు రెండుచేతులు జోడించి "ఓ బ్రాహ్మణోత్తమా! స్వాగతం, సుస్వాగతం. మీరు, ఈ స్వయంవర కార్యక్రమంలో నిరభ్యంతరంగా పాల్గొన వచ్చును. మీకు మా హృదయ పూర్వక స్వాగతమన్నాడు - మరొకసారి.

బలరాముడు తన ఆనందాన్ని ఆపుకోలేకపోతున్నాడు. ప్రక్కనున్న కృష్ణుడు, అన్నగారి చేతిని నొక్కిపెట్టి.... నిదానమంటున్నాడు. దుర్యోధనుడు, ఈ వచ్చిన బ్రాహ్మణుని చూసి "ఇతడు అర్జునుడే!" అని అదిరిపడ్డాడు. అయితే పంచపాండవులు అగ్నికి ఆహుతి కాలేదా ? మరి, ఆ చచ్చిపోయినవాళ్ళు.... వున్న బుర్రను మళ్ళీ చెదపురుగులు దొల్చటం ప్రారంభించాయి.

అయితే, ఆ నవ్వి - తనను అపహాస్యం చేసినవాడు తప్పక భీముడే. వీరెలా బ్రతికారు ? ఇన్నాళ్ళు ఎక్కడుండి, ఈసమయానికి ఇక్కడ ప్రత్యక్ష మయ్యారు. అయితే, ఇదంతా, ఏమీ తెలియనట్లు నంగనాచిలా నటించే, ఆ నల్లనయ్య కృష్ణుని పన్నాగమన్నమాట, "ఔరా" ఎంత మూర్ఖులమయ్యాము. శ్రీకష్ణమాయలో పడి, వ్యకిత్వాన్నెలాగ వంచించుకున్నామని వాపోయాడు.

ఆ వెంటనే "చూసావా, మామా! ఆ అయిదుగురు బ్రతికి వున్నారు. ఇక్కడే వున్నారు, "తాము, తమ పన్నాగం విఫలమైనట్లు ఏడుపు మొహం పెట్టాడు. శకుని మొహం పేలవమయింది. నోటమాట రాలేదు. ప్రక్కనున్న దుశ్శాసనుడు

కూడా, అర్జునుని గుర్తించి, "అన్నా!" అన్నాడు. దుర్యోధనుని చేతిపై తన చేతిని వుంచి, "వాళ్ళు బ్రతికే వున్నారు!" నూతిలోంచి వచ్చినట్లు, ఆ మాటలు వచ్చాయి.

ఇటు అశ్వత్థామ, అటు కర్ణుడు, అదిరి ఆశ్చర్యపోయారు. అప్పుడు.... అయితే, ఇదంతా ఆ నల్లనయ్యా... మాయ" అన్నమాట. ఎంత నటించాడు. అమాయకంగా చూస్తూ అందర్నీ మోసగించాడు. ఇదంతా, ఆ కృష్ణునికి తెలిసే సమయం చూసి, వారిని బయటికి తీసుకురావాలనే, వేసిన ఎత్తుగడ, చేసిన పన్నాగం." వాళ్ళంతా కుతకుత వుడికిపోతున్నారు.

ఒక్కసారి అందర్నీ కలయచూసిన అర్జను రూప బ్రాహ్మణుడు, సభా మర్యాద, సాంప్రదాయబద్ధంగా చేయెత్తి ఇటు ధ్రుష్టద్యుమ్నుని - అటు ద్రౌపదిని ఆశీర్వదించాడు. ఆచార్య గురుదేవులు, శ్రీ సాందీపులవారి ఆశీస్సులను అపేక్షించి, సాష్టాంగ నమస్కారం చేసాడు.

శ్రీ సాందీపులు "విజయోస్తు, దిగ్విజయోస్తు" అని ఆశీర్వదించారు. కృతజ్ఞతాపూర్వకంగా మరల వందనం చేసి, మత్స్యయంత్ర నిర్మితమైన చిన్ని కొలను వద్దకు వచ్చాడు. ఆ కొలనును, యంత్ర రాజాన్ని, పట్టి పట్టి చూసాడు. విల్లు ఎక్కుపెట్టడంలో సిద్ధహస్తుడైనట్లు ఆ బ్రాహ్మణోత్తముడు ధనువు మధ్య భాగాన్ని అలవోకగా పట్టుకున్నాడు.

కుడిచేత్తో బాణమందుకున్నాడు. అతి సునాయాసంగా, శరాన్ని తొడిగి, ధనువు ఎక్కుపెట్టి, నీటిలోకి తదేక దీక్షతో చూస్తూ, పైన తిరిగే మత్స్యంపై తన దృష్టిని నిగిడ్చాడు. నారి సారించి, బాణం విడిచాడు. ఆ శరసంధాన నైపుణ్యానికి ప్రేక్షకులు, వీక్షకులతోపాటు కొందరు రాజులు, రాచప్రతినిధులు, హర్షధ్వానాలు చేసారు. నిజానికి పరశురాములవారే, ఈ రూపంలో వచ్చారని కొందరైతే మురిసిపోయారు కూడా!

అస్త్ర విద్యాగురువు, మహాధనుర్వేత్త ద్రోణాచార్యుల వారిని, మనసులో స్మరించుకున్నాడు. బాణం విడిచాడు. అది రివ్వున దూసుకుపోయింది. ఆ శరవేగానికి, ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోతున్న తరుణంలో గిరగిర తిరిగే మత్స్యం కనబడలేదు. అప్పటికే అర్జునుడు విడిచిన శరం, మత్స్యం కంటిని కొట్టి క్రింద పడేసింది. ఇదంతా లిప్తకాలంలో జరిగిపోయింది.

ధనువెత్తడానికి ఆశ్చర్యపడ్డవారు. ఊపిరాడనివారు, ఈ చిత్రహరాత్సం- ఘటనకు తాము పోటీదారులమని గూడ మరచి జయజయ ధ్వానాలు చేసారు,

చేస్తున్నారు. ఇది - ఇది.... దుర్యోధనునికి, ఆతని బృందానికి గొంతుకలో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. గుటకలు మ్రింగుతూ "రాజా!" అనబోతుంటే ఆచార్య-గురు సాందీపులవారు అర్జునుని జయహో, బ్రాహ్మణోత్తమా! జయము, జయమని, ప్రేక్షకులందరితో పాటు తాము ప్రశంసించారు.

ప్రేక్షకులలోని బ్రాహ్మణులయితే సరే సరి. పొంగిపోయారు. మా పరువు నిలబెట్టావని ప్రశంసించి, పరవశించారు. అర్జునుడు దర్భాసనంపై ధనువును వుంచాడు. ద్రౌపది హంసలాగ నడచి వచ్చింది. ఒకే ఒక్క బాణంతో, ఇటు మత్స్యాన్ని, తన మనసును దోచుకున్న ఆ వీరవర్యుని మెడలో పుష్పహారం తాను వరించినట్లు ధరింపచేసింది.

అందరు కరతాళ ధ్వనులే చేసారు. కొన్ని కొన్ని చేతులు కలవలేదు. ~~ఈ~~ సమయంలో కొందరు రాజులు లేచి, తమ కరవాలాలపై చేతులు వుంచి "ఇది మాకు సమ్మతం కాదు. క్షత్రియ లోకానికే అవమానకర"మని ఆక్రోసించారు. యువరాణిని, "అవ్వ ఒక బ్రాహ్మణునికిచ్చి వివాహం చెయ్యడమా ? ఇది విడ్డూరం కాదా ? మాట్లాడరేం. కాదనేవారి కంఠధ్వనికోసం, ఆ కొందరు రాజులు, హడావుడి చేసుకుంటున్నారు.

ఇదే అదనుగా శకుని, "ఇది హర్షణీయం కాదు. ఏమంటావు దుర్యోధనా ? "చెప్పు!" అంటూంటే,

"మనం రాజులము, మొలత్రాడు కట్టుకున్నామనుకున్నాం. మూతిపై మొలిచిన మీసాలను మెలివేద్దామనుకున్నాం. కాని, మనమీసం, క్షత్రియ మగతనం, ధనస్సునే ఎక్కుపెట్టలేకపోయింది. శరసంధానం చేసే మగవాడిని చూపలేకపోయింది.

అటువంటి తరుణంలో, మనకంటే ఉత్తమకుల సంజాతుడైన బ్రాహ్మణుడేతెంచి, పరశురాములవారి ఖ్యాతిని ఇనుమడించారు. పాంచాల పరువు ప్రతిష్ఠలను నిలబెట్టారు. దీనికి హర్షించవలసింది పోయి, ఆట బొమ్మలవలె ఆయుధాల్ని పట్టుకుని, వీరాధివీరులమని విర్రవీగడం, ఎందుకు పనికిరాని, రోషము లేని మీసాలను మెలివేయడం, క్షత్రియపదానికే అవమానకరం." అందరు లోలోపల అనుకుంటున్నారు.

ఇటువంటి సమయంలో శకుని ప్రేరణగా దుర్యోధనుడు లేవబోతూంటే, సోమదత్తుని కుమారుడైన మహారాజు భూరిశ్రవసుడు, దుర్యోధనుని భుజంపై చేతులను

గట్టిగా పెట్టి "ఇది సమయం కాదు. అనవసర పరాక్రమం పనికిరాదు. కాబట్టి అల్లరిపాలు కాకుండా కురువంశ కీర్తిప్రతిష్టలను కాపాడండి'' అని - ఆ మహారాజే -

ఇటు బలరామ-కృష్ణులు, యదు ప్రముఖులు, చేది దేశాధిపతి... ఎందరో, వారి వారి అభిమానులు, ఆశ్రిత - బంధువర్గాలున్న తరుణంలో, అవనసర రాద్ధాంతం చేస్తే - పాండవులను మీరే కాల్చి చంపారన్న మాటకు, అసూయా ద్వేషాలు, పగ-ప్రతీకారాలు జోడయి, కురువంశ ప్రతిష్ట, గంగలో కలిసిపోతుంది. కనుక - "శాంతం పాపం'' అన్నాడు, ఎంతో తెలివిగా!

కొందరు రాజులు, ద్రుపదుని ఎదుర్కొన సిద్ధపడుతూంటే, అంతవరకు బ్రాహ్మణుల మధ్యలోనున్న భీమ, నకుల, సహదేవులు, "చూసారా, మన విజయాన్ని ఈ పిరికిపందలు హర్షించలేకపోతున్నారని, ఒక్కుమ్మడిగా వారిని చుట్టుముట్టారు.

ఈ హడావుడికి, కౌరవులు పోయిన పరువుకు సమాధి కట్టకుండా "రాజా! శెలవు! ఇక మిగిలిన కార్యక్రమాలు, మీ ఇష్ట''మంటూ మర్యాదగా వెనుతిరిగారు.

ద్రౌపది, అర్జునుడు, మహారాజుకు నమస్కరించారు. భీముడు, వీరిద్దరి చేతులను కలిపి "తమ్ముడూ! వీళ్ళ సంగతి నేను చూసుకుంటాను. మీరు మహారాజు ఆశీస్సులు తీసుకోండి!'' అన్నాడు.

బలరామ-కృష్ణులు యాదవ ప్రముఖులు, అతిరథులతో, విరాటాది మిత్ర రాజ ప్రముఖులతో క్రొత్త దంపతుల్ని కలువ ముందుకు వచ్చారు. ద్రౌపది, వాసుదేవుని శ్రీ చరణాలనందుకుంది. అర్జునుడు అలాగే చేసాడు. "చూసావా, నామాట నిలబెట్టుకున్నానన్నట్లు, కృష్ణుడు, కళ్ళతో యాజ్ఞసేనిని పలుకరించాడు. కృష్ణుడు, అర్జుని విడిచి, గౌరవంగా భీమునికి నమస్కరించాడు.

ప్రేక్షకులు, ఈ హఠాత్పరిణామానికి ఇటు, ఆశ్చర్యం, అటు ఆనందం వ్యక్తపరిచారు. వాసుదేవుడు ఈ పెద్ద భారీకాయానికి నమస్కరించడం... అంతా... చిత్రంగా వుంది. వీరితోపాటు ద్రుపదుడు కూడా విస్తుపోతూంటే -

"మహారాజా! వీరలెవరో కాదు. ఇతడు కుంతీపుత్రుడు, మిగిలినవారు పాండవ వీరులు. కురువంశ ధీరులని ప్రశంసిస్తూ - పరిచయం చేసాడు. దానికి ద్రుపదుడు మహదానందపడుతూ "కృష్ణా! వాసుదేవా! నువ్వు నీ మాట నిలబెట్టుకున్నావు. నిజం, నిజంగా, నిజమైన వీరాధివీరునితో బాంధవ్యం కలిపావని హర్షపులకితుడయ్యాడు.

# అంతేనంటారా... ?!

**కాం**పిల్యనగరం మొత్తం పండుగ వాతావరణానికి గురయింది. "అందరిలో ఆనందం, హర్షం, అవ్యక్తమైన అనుభూతి. "ఆ బ్రాహ్మణులు బ్రాహ్మణులు కారా ? పాండుకుమారులా ? కురువంశధీరులా ? రాకుమారి ఎంత అదృష్ట వంతురాలు ? ఒక మహావీరునికి ఇల్లాలవుతుంది." అనిర్వచనీయమైన ఆనందానికి లోనవుతుంది. ఇది పాంచాల పౌర - అధికార - సర్వప్రజానీకం యొక్క ఆనందం.

ఈ హఠాత్సంఘటనకు, ఆహ్వానిత రాజలోకం అసహనం పాలయింది. ఈ అవమానం తలగొట్టేసినంతగా తలుస్తున్నారు. ఎంత ఘోరం ? ఎంత ద్రోహం ఎంత అవమానం ? ఒకటే చింత ?!

అయితే - ఇది కొందరికి మాత్రమే మానసిక సంక్షోభం. ఎక్కువమంది, కురువంశ ధీరులైన పాండుపుత్రులు బ్రతికి వుండటమే కాకుండా, భరతవంశ కీర్తి ప్రతిష్టల నినుమడింపచేసారని మనస్ఫూర్తిగా సంతోషించారు.

ఇక రాజమందిరం - రసమయంగా వుంది. చెయ్యవలసినదేమిటో అర్థంకాక, అందరు పరిస్థితి నెదుర్కొనే విధానానికై ఆలోచిస్తున్నారు. తలలు పగులకొట్టుకోవడం లేదు కానీ, తలపట్టుకుని మరీ ఆలోచిస్తున్నారు. ఇక్కడ -

ద్రుపదుడు, ద్రౌపది, రాజమాత కుంతి, ద్రుపదుని కుమారులు - ధ్రుష్టద్యుమ్న, సత్యజిత్తు - శిఖండులు, పంచపాండవులతో పాటు, తన సహజ మందహాసంతో కృష్ణుడు వున్నారు. ఈ విజయవార్త, కురువంశోద్ధారకుడు, మహర్షి వేదవ్యాసులవారికి గూడా అందింది. మహర్షితో ఇటు పురోహితుడు ధౌమ్యుల వారు, జైమిని కూడా వచ్చారు.

వస్తూనే మహర్షి వ్యాసులవారు "రాజా! మీరంతా ఏదో వ్యాకులతకు లోనైనట్లు కనబడుతున్నారు, కారణం వివరించమని అడిగారు. ఏం చెయ్యాలో, ఈ కార్యక్రమాన్ని ఎలాగ ముగించాలో తెలియక సతమతమయ్యే వారిని వుద్దేశించి "మహారాజా! తీరవలసిన సమస్య తీరిపోయింది. ఇంకాలోచన లనవసరం. ఏ సమస్య లేని తరుణంలో, అనవసరంగా "ఏం చెయ్యాలనే" సమస్య

నెత్తిన వేసుకుని, కృంగిపోవడం లేదా దీర్ఘాలోచన చెయ్యడమనవసరమని నా భావన. నువ్వు కోరుకున్నట్లు, మహావీరుడు, అతనితో మరో నలుగురు మహావీరులు దొరికారు. నీ సమస్యకు సంపూర్ణ పరిష్కారం లభించింది. మిగిలింది. కాలానికి, ధర్మానికి, విడిచిపెట్టు'' తగు విధంగా సూచించారు.

“ఇటువంటి విపత్కర పరిస్థితి నెదుర్కోవలసి వస్తుందని, స్వయంవరమింత ప్రమాదకరమౌతుందని తలువలేదు. ఇది నా ప్రాణానికి విషమమై కూర్చుంది అన్నాడు ద్రుపదుడు'' ఇందుకు స్పందిస్తూ, మహర్షి -

“రాజా! ఇంతకీ నీకు వచ్చిన కష్టం!'' ఎంతో శాంతంగా అడిగారు.

“ఇంకేం కావాలి మహర్షి! స్వయంవరంలో గెలిచింది, అర్జునుడు. కానీ, తల్లిమాట వున్నతం, వృథాకారాదని తలచే, ఈ పిల్లలు - వీరులయిదుగురు నా కుమార్తెను వివాహమాడతారుట. ఇంతకంటే విపరీతం, విడ్డూరం - ఈ లోకంలో ఎక్కడైనా వుందా ?'' అపరిష్కృత - సమస్యకు తల్లడిల్లుతూ చెబుతాడు.

“అసలేం జరిగింది ?'' మహర్షి అడిగేసరికి, కుంతి కన్నీరు కారుస్తూ “ఇదంతా నా వల్లనే జరిగిందని'' వాపోతూ, జరిగిందిలాగ చెప్పింది.

“అప్పుడు అర్జునుడు ద్రౌపదిని తీసుకు వచ్చాడు. విషయం వివరించి చెప్పక, నేనొక అద్భుత ఫలాన్ని తెచ్చానన్నాడు. సంతోషం అన్నదమ్ములందరూ, కలిసి సుఖంగా తీసుకోండి. సంతోషంగా వుండండన్నాను. తీరా చూస్తే, ఆ వెనుక ఈ పిల్ల.... ద్రౌపది. తాము తెచ్చినదీ అపూర్వమని... చెప్పేసరికి నిర్ఘాంతపోయాను. అన్నమాట తప్పరాదు. అది ఆర్యధర్మం, సాంప్రదాయం కాదు. ఇదెలాగ పరిష్కరించుకోవాలో తెలియక, జరిగిన తొందరపాటు నుండి బయటపడే మార్గం తెలియక, సతమత మవుతున్నామని, పాండవమాత కంటినీరుతో చెప్పింది.

“అర్జునా, నీ వుద్దేశం'' వ్యాసభగవానులు అడుగుతున్నారు.

“వీరోచితంగా ఈమెను పొందినది సత్యం. అమ్మ మాటలాగ వుంచండి. అన్నలకు వివాహం కాకుండా నేనే...!'' నీళ్ళు నములుతున్నాడు. ఒక్కొక్కరే తాము, గెలుపొందలేదు, కాబట్టి, అర్జునుడే వివాహం చేసుకోవాలంటున్నారు. విషయం తెలియని తల్లి, అందరూ సమానంగా స్వీకరించండంది. విషయం తెలిసిన సోదరులు, వివేకంతో ప్రవర్తిస్తున్నారు.

"యుధిష్ఠరా! దీనికి నీ పరిష్కారం...?!" అడుగుతున్నారు, వ్యాసులు.

"మహర్షి. మీరు కేవలం పెద్దలు కాదు. కురువంశ దీపకులు, సంరక్షకులు. మా మాతృశ్రీ శక్తియుక్తులు మీకు తెలుసు. మాకు ఆమె మాట అనుల్లంఘ నీయము. కాబట్టి చివరకదే పరిష్కారంగా తలవాల్చి వుంటుందే తప్ప, మాకు తెలియని ధర్మ రహస్యం. మీరు శెలవిస్తే, మీ ఆజ్ఞాబద్ధులమై ప్రవర్తిస్తామని, వినయంగా విన్నవించాడు.

ఆపద సమయంలో, ధర్మరక్షణామూర్తియైన, మహర్షి, మీరే - దీనికి తగు పరిష్కారం చెప్పాల్సి వుంటుంది. ఒకింత అసహాజమైనా, ధర్మప్రతిష్ఠాప నార్థం, అధర్మనాశనార్థం... కొన్ని కొన్ని విషయాలు, విషమంగా కనబడినా, వివేకులా విషయాన్ని తమ వివేకంతో వినయంగా పరిష్కరించుకోవాలి, కాబట్టి.... ఆ మాటలు పూర్తికాలేదు.

"నేనొప్పుకోను!" ద్రుష్టద్యుమ్నుడు.

"అవ్వ. నవ్విపోదురు...!" ద్రుపదుడు.

"అయిదుగురికి భార్యనా... ?!" ఆశ్చర్యపోతూ తలవంచుకు కళ్ళు మూసుకుంది - ద్రౌపది...

వారి వారి మనసులను ప్రకటిస్తున్నారు.

ధర్మరాజు మాత్రం "అధర్మమనను. నా తల్లిని, సంస్కృతీ, సాంప్రదాయాన్ని గౌరవించాలంటే, అసత్యము, అన్యాయము, అధర్మమెరుగని నా మాట వేద విరుద్ధం కాదు. కాదంటే మా వంశ పెద్దలు, మహర్షుల వారి అభీష్ట" మన్నాడు.

"ఇది నిజంగా లోకవిరుద్ధమే" నంటాడు ద్రుష్టద్యుమ్నుడు.

"ఎన్నటికి, ఎప్పటికి కాదు. పూర్వం గౌతమ మహర్షి కుమార్తె "జతిలా"ల, ఋషికుల సాంప్రదాయీకులైన ఏడుగురికి పత్ని అయిది. అలాగే పదిమంది ప్రాచేతసులు, ఒకే భార్యను పరిణయమాడారు. ఇవన్నీ - ఆనాటి ప్రాచీన సాంప్రదాయాలని కొట్టి పారేయకండి. ఆచార సాంప్రదాయాలు ఎప్పుడు ఎన్నదగినవి, కొనియాడదగినవే. కాకపోతే, కాలమాన పరిస్థితులను బట్టి, సమయ సందర్భాలననుసరించి, కొన్ని కొన్ని నిర్ణయాలు లోకోపద్రవకారకం కాకుండా, తీసుకోవలసి వుంటుంది. ఇది ధర్మం.

ఇది అధర్మమని, మా పురోహితులు ధౌమ్యులవారు, మహర్షి జైమిని, మా వంశీకులు, కులపెద్దలు - వేదవ్యాసులవారు - కాదంటే, వారి నిర్ణయానుసారం తప్పక నడుచుకుంటాము. ధర్మమతిక్రమించని విధంగా మా మాతృమూర్తికి తగు గౌరవమిచ్చి, మమ్ము మేము కాపాడుకుంటాం.'' అని ధర్మరాజు ముగించాడు.

అసహనంతో వున్న ధ్రుష్టద్యుమ్నుని ఒకసారి చూసి "యుధిష్ఠిరా, నువ్వు చెప్పిందంతా సత్యం. ఆచార వ్యవహారాలు ఆచరించాల్సినవే. ఆర్య ధర్మం సుప్రతిష్టమైనది. దానిని తప్పక గౌరవించాలి, పాటించాలి!'' అయితే - అంటూంటే -

"ఇది ధర్మమని, ఆచరించాలని నేనొప్పుకోను. ధ్రుష్టద్యుమ్నుడు తెగేసినట్లు చెబుతున్నాడు. ద్రుపదుడు, తలవూపుతున్నాడు. అన్నీ విన్న వ్యాసులు - "చూడండి. సతి ధర్మాలు, పతి ధర్మాలు కొన్ని వున్నాయి. అవన్నీ సామాజిక ధర్మాలు... లోకరక్షణా హేతువులు కూడా!

అన్నీవిన్న ద్రుపదుడు "భగవాన్! మీరు సర్వశక్తిమంతులు. ముఖ్యంగా లోకం మిమ్మల్ని వేదవ్యాసులని సంబోధిస్తూంది. ధర్మరూపమని ప్రశంసిస్తుంది. కాబట్టి తగు విధంగా...

"రాజా! ఇందులో మనం కాదు ఆలోచించాల్సింది. అగ్నిపుత్రిక, పునీత ద్రౌపది, తగు నిర్ణయం తీసుకుంటుంది. ఆమె కారణజన్మురాలు... ఆమె నిర్ణయం, అందరికీ శిరోధార్యం.

అందుకు ధ్రుష్టద్యుమ్నుడు మండిపడ్తూ "మిరెన్నైనా చెప్పండి. ద్రౌపది అయిదుగురు భర్తల్ని వివాహం చేసుకునేందుకు నేను ఒప్పుకోను. అది జరగని పని.'' అనేసరికి -

"అది చెప్పాల్సింది, ఆ "కృష్ణ''. ఆమె నిర్ణయం మనకందరికి శిరోధార్య మంటారు. ఈ పాంచాలి నిర్ణయం దైవ శాసనం. దాని ప్రకారమే - ఈ వివాహం, వర నిర్ణయం జరిగింది.'' అని ఆమె గత జన్మను, ఆమె తపో కారణాన్ని తెలియ బరుస్తారు. దాని ప్రకారం, అగ్నిపునీతగా, యాజ్ఞసేనియై జన్మించింది. ఆలోచనలు వేరు, ఆశయాలు వేరు. ధర్మం వేరు, కర్మ వేరు. ప్రతిజన్మకు కర్మ, ధర్మం, సంస్కృతీ, సాంప్రదాయం... వగైరాలు, వేద ప్రకాశితమై వెలుగొందుతాయి.

మనకు ఆదర్శ - ఆచరణీయమౌతాయి అన్న వ్యాస భగవానులు... ఆమె జన్మ వృత్తాంతమంతా చెప్పి - నీ కోరికయే వీరలు...... అంటారు.

అందుకే ధర్మబద్ధయైన కుంతినోట అయిదుగురని వచ్చింది. అ లభించిన దానిని హాయిగా పొందమని చెబుతుంది. వీటికి మించి, శివుని కోసం ఈమె తపస్సు చేసి, శివుడు ప్రత్యక్షమైన ఆనందంలో "పతిం దేహి, పతిం దేహి.... అంటూ అయిదుసార్లు అనేసి, ఇంకోసారి.... పతిం" అనేసరికి, నీకు అయిదుగురు భర్తలు తప్పక లభిస్తారు. నీవు పరమ పతివ్రతగా భాసిల్లుతావు. ఆరవవాడు వున్నా, నీకు పతికాడు, కాలేడు. అనేసరికి - ఆమె ఆశ్చర్యపోతూ దేవా! అంటుంది. "అవునమ్మా! నీవు పతినిమ్మంటే సరిపోయేది.. ఒకటికి అయిదుసార్లన్నావు. అయిదుగురు భర్తలు లభిస్తారన్నాను. ఆరోసారి అనబోతుంటే - ఆ మాటను పూర్తిచెయ్యకుండా, ఆరవవాడు జన్మిస్తాడు కానీ, నీకు భర్తకాడన్నాను. ఇందులో నా తప్పు ఏ మాత్రం లేదు. అడిగింది ఇవ్వడం నా ధర్మమని, శివుడు అదృశ్యమయ్యాడు.

కాబట్టి - ఈ పరిస్థితి ఏర్పడింది. జరిగింది చెప్పి, మహర్షి ద్రౌపదిని ఆశ్వాసించారు. గతం దర్శించమని దివ్యదృష్టిని కూడా ప్రసాదించారు. గతమంతా దర్శించిన పాంచాలి, తన నిజస్థితికి వచ్చి, మత్స్యయంత్రం ఛేదించిన అర్జునునితో పాటు -

అత్తగారుగా, "రాజమాతగా కుంతి, ఇచ్చిన ఆదేశాన్ననుసరించ నిశ్చయించుకుంది. వింత, విడ్డూరమనుకునే - ఈ ప్రయత్నం - దైవలిఖితమని దీనినెవరు మార్చలేరన్న సత్యం - కృష్ణుని సాక్షిగా అక్కడ సాక్షిభూతమయింది.

అప్పుడామె, పాండవుల వైపు చూసింది. తల్లిమాట నిలబడుతుందా ? లేక కార్యభంగమౌతుందా ? ఒక్కడిగా అర్జునుడు, అతను సాధించుకున్న దానిని ఇతరులు చేపట్టడానికి సిద్దంగా లేరు. అందర్ని చూసింది, అత్తగార్ని చూసింది. తనను సదా కాపాడుతాననే వాసుదేవుని చూసింది.

సకల ధర్మపురాణ స్వరూపుడు వేదవ్యాసులవార్ని చూసింది. ధర్మసూక్ష్మాలు తెలిసిన పండిత, మునివర్యులను చూసింది. చివరకు తన గతమెరిగి, ఇది ధర్మమని నిర్ణయించుకుని, కుంతీమాత అభీష్టాన్ని స్వాగతించింది.

కృష్ణుడు - ఆమె అభిప్రాయాన్ని మన్నించాడు.

ద్రుపద, ద్రుష్టద్యుమ్నాదులు, ధర్మానికి తలవంచారు. ఆర్యావర్తానికిది సద్ధర్మము, ధర్మ ప్రకాశమై నిలుస్తుందన్న, ధర్మసూక్ష్మంతో, వ్యాస భగవానుల, ఆశీస్సులతో, ఈ సంఘటన ముగింపుకు వచ్చింది.

ఆ మోహనాంగి - పాంచాలి, కృష్ణ - ద్రుపదపుత్రి ద్రౌపది, యాజ్ఞసేని, వాసుదేవుని సోదరి - పంచపాండవులకు, వరప్రసాదినిగా - "భార్య" అయింది.

అది పౌష్య మాసాంతం.

చలిగాలులు వీస్తూనే వున్నాయి.

పాంచాల రాజధాని, కాంపిల్య నగరంలో -

అగ్నిపుత్రిక యాజ్ఞసేని, ద్రుపదరాజపుత్రి ద్రౌపదిగా విఖ్యాతమయిన, పాంచాల రాజకుమార్తె పాంచాలి, తన ఏకాంత మందిరంలో, శయనాగారంలో వుంది.

ఆనాటి మొదటిరాత్రి, పాండు భూవరుని జేష్ట కుమారుడు, ధర్మస్వరూప మైన, యుధిష్ఠరుని కోసం, భార్యగా, చెక్కిళ్లపై చేతులు పెట్టుకుని, సిగ్గులు మొగ్గలుగా, బుగ్గలు ఎరుపెక్కి ఎదురుచూస్తోంది.

చూడటానికి కృష్ణుని వలె నల్లగా వున్నా - పోతపోసిన అవయవ సౌష్టవం, మూర్తీభవించిన అందమామెది. అందుకే ఈమెను "కృష్ణా!" అనికూడా ముద్దుగా పిలుస్తారు. ఆమె కళ్ళలో ఎరుపు, బలదర్పాలను ప్రదర్శించే చిన్న గడ్డం. చెక్కిన చక్కని శిల్పంలా వుందామె.

అసలే రాజకుమారి, పెండ్లికుమార్తె. ఇప్పుడు భర్త సమాగమం కోరే నూత్న వధువు. పాంచాలుర రాచ - ఆడబడుచు. ఆ అందాన్ని వర్ణించలేము. ఆమె ఆనందాన్ని లెక్కించలేము.

చందన, అగరు ధూపవాసనలతో, గదిలో అడుగపెట్టగానే మత్తెక్కించే, మధుర సువాసనలు గుబాళిస్తున్నాయి. ఆనంద సమయంలో అలసట తెలియకుండా ఆడుకునేందుకు, జింక చర్మంతో చేసిన చదరంగం, దంతాల పావులు.... ఎంతో మనోహరంగా, ఆహ్లాదకరంగా వుందా శయ్యాగారం. రాజ సాంప్రదాయం ప్రకారం, మొదటి రాత్రి కార్యక్రమం ఈ చదరంగపుటెత్తులతోనే ప్రారంభం కావాలి. అంటే ఒకరినొకరు తెలుసుకునేందుకు - ఇదొక సహజ ప్రక్రియ.

వున్నట్టుండి - గతమనే కాలం - తొలిగా శాపమనుకున్నా - వర్తమానంలో "వరం"లాగ, అయిదుగురు భర్తల్ని చేసిన వైనానికి, ఆశ్చర్యపోతూ, ఒకసారి అనుకోకుండా, ఆలోచనారహితంగానే గతానికి వెళ్ళిపోయింది.

మరచిపోలేని, మరువలేని ఎన్నో సంఘటనలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, కాదనుకుంటేనే, ప్రస్తుత పరిస్థితిని స్వాగతించినా, గతంలోకి, తెలియకుండా అడుగు పెట్టింది. ఆలోచనలు జోరిగల్లాగ ముసురుకుంటున్నాయి.

ఇది ఇప్పటి మాట కాదు. ఎప్పటిదో...

సం॥ల నాటి సంగతి. అనగనగా, కథ వంటిది.

ఒకానొక సందర్భంలో పాంచాల రాజు ద్రుపదుడు బంధించబడి, బందీగా, మహాధనుర్వేత్త, భరద్వాజ కుమారులు, పరశురాముల వారి శిష్యులు, మిాదు మిక్కిలి - కురువంశదీపకులకు ఆచార్యుల సముఖంలో, గురుదక్షిణగా - వారి ప్రియశిష్యుడు నిలిపాడు.

కారణమేదైనా, అది సుప్రతిష్ఠ వంశీకుడైన ద్రుపదునకు తలకొట్టినట్ల యింది. కాలక్రమేణా పగ విషయం తెలిసిన పాంచాలి కూడా రగిలిపోయి, ఆర్యావర్తంలో చెప్పుకోద్గ వీరవర్యుని వివాహమాడి, తన తండ్రి పగ, తన పంతం నెగ్గించుకోవాలని తలచింది. ఆడపిల్లగా కాక, వంశోద్ధారకుడైన కుమారునిగా ద్రుపరాజపుత్రిక తనను తలంచింది.

ఇందుకుగాను సర్వసమర్థుడైన వాసుదేవునికి, ~~ఈ~~మెను ఇస్తాననడం, ~~ఈ~~ కృష్ణను, ఆ కృష్ణుడు కాదనడం, ఆర్యావర్తంలో చెప్పుకోదగ్గ వీరవర్యుల ఇంట నిన్ను వుంచుతానని, సదా నీ సంక్షేమం చూస్తానని వాగ్దానమిచ్చిన కృష్ణుడు, అలాగే చేసాడు. తన పంతం నెగ్గించుకున్నాడు.

స్వయంవరానికి రాజులందరికి దడపుట్టించేటట్లు, సాందీపుల వారు నిర్మించిన స్వయం"వర" మత్స్యయంత్ర నిర్మాణంలో ఎందరో వెనుకంజవేసారు. అందర్ని కాదని, పాంచాలి మత్స్యయంత్ర భేదనంలో మొదట్లో బ్రాహ్మణకుమారునిగాను, ఆ తదుపరి భరత వంశీయుడైన, పాండురాజకుమారునిగాను గుర్తింపబడి, అత్తవారింటికి, విజయునితో వెళ్ళిన యాజ్ఞసేని, ఆఖరికి వ్యాసులు, కృష్ణుడు - యుధిష్టరుని

ధర్మసూక్ష్మాల మేరకు, ఆర్యావర్తంలో, ద్వాపరంలోని తొలి సంఘటనకు బీజంగా అయిదుగురికి అత్యాశ్చర్యకరంగా భార్య అయింది.

తల్లిగా కుంతి, ద్రౌపదికి తన కుమారుల ప్రేమ, ధర్మబుద్ధి, వారి వారి ఇష్టాఇష్టాలు, చేపట్టవలసిన పనులు, చెయ్యదగిన విధి విధానాలను వివరించి చెప్పింది. ముఖ్యంగా అజాతశత్రువు ధర్మబుద్ధితోపాటు, భీమునిలోని ఆకలి, తొందరపాటు, అర్జునుని శూరత్వము, నకుల-సహదేవుల - అమాయక, ధర్మసూక్ష్మబుద్ధి ... అన్నింటిని వివరంగా వివరించి చెప్పింది. ఇంతవరకు తల్లిగా తాను చూసుకున్నవారి ఆలనాపాలనా, ఇప్పుడు ద్రౌపది చేతిలో పెట్టి నీ ధర్మం నువ్వు నిర్వర్తించమంది. ఆ రకంగా అందరి ప్రేమలను గెలుచుకొమ్మని చెప్పింది. విజేతగా వరించిన విజయుడే కాదు. అందరు నీకు సములని, సమ-సమతా బుద్ధితో ప్రవర్తించాలని కూడా - ఆ తల్లి - అత్తగారిగా కాక, ఓ మాతృమూర్తిగా సూచించింది.

ఆ రకంగా, శయనమందిరంలో, ఏకాంతంలో భర్త యుధిష్టరుని కోసం ఎదురుచూసే, యాజ్ఞసేని, తలుపువేసిన చప్పుడవడంతో, తల ఎత్తి చూసింది. ఎదురుగా - యుధిష్టరుడు. సిగ్గుతో - ఆయన రాకను గమనించనందులకు, తలవంచుకుంది. దగ్గరకు వచ్చిన ఆ యుధిష్టరుడు - నీ ఆలోచనలకు, వూహలకు అంతరాయం కల్గించానా ?'' అని ఆమె చెంత చేరాడు. భుజం మీద చెయ్యివేసి దగ్గరకు తీసుకున్నాడు.

అది ఒక మధుర క్షణం. ఆడది తన స్త్రీత్వంతో ఆహ్వానించే తొలి చూపుల, తొలకరి పులకింతల అనురాగ క్షణం. ఆ మధుర క్షణాలలో తానుగా పాలుపంచు కున్నట్లు "రా! కూర్చో!" రాచబిడ్డలోని ఆదేశాహంకారలు లేవు. ఒక భార్యను ప్రేమించే భర్తలోని అనురాగ లక్షణాలు చోటు చేసుకున్నట్లు కనిపించాయి. ఆనందించిందామె.

మెల్లిగా ఆమె భుజం మీద తన తలను బెట్టి, చెవిలో ఆమెకే వినబడేటట్లు "నీరాక, మా హృదయాల అమృతజల్లు. నిరాశా నిర్వేదములతో బ్రతికే రాచరికం లేని మా రాచబ్రతుకు రాగరంజితమయింది. మధురానుభూతిని మిగిల్చింది. అక్షరం అక్షరంలో ఎంతో ప్రేమ, కృతజ్ఞత - ఆప్యాయ-అనురాగాలను మేళవించి ధర్మరాజు ఆ సమయంలో ఆమెను అలరిస్తున్నాడు.

ఆమెలోను ఆనందక్షణాలు వెల్లివిరుస్తున్నాయి. నిన్నవాళ్ళెవరో, అసలీ పాండవులు, బ్రతికి వున్నారో లేదో తెలియదు. అందరు దుర్యోధనాదుల కుతంత్రం వలన, పాండుపుత్రులు, తల్లితో కలిసి లక్క ఇంట్లో కాలిపోయారని చెప్పుకుంటూంటే, ఏం బాంధవ్యం లేకపోయినా, దుర్యోధనాదుల దుష్టబుద్ధికి అసహ్యించుకుంది.

గుడ్డిరాజు తన గౌరవాన్ని నిల్పుకుంటూ, తమ్ముడు చేసిన త్యాగానికి, చూపిన ధర్మానికి పరవశించి, ఆ తమ్ముని కుమారులను, ముఖ్యంగా అందరికి పెద్దవాడైన జేష్ఠుని ప్రేమించి, అక్కున దాల్చే బదులు - గుడ్డివాడు, గుడ్డిప్రేమతో, తన పిల్లలకే రాజ్యమన్నట్లు గుడ్డిగా ప్రవర్తించడం లోకనిందకు, పూర్తి అపనిందకు కారణమయింది. కురువంశ ప్రతిష్ఠకు మాయని మచ్చగా నిలిచింది.

మొత్తానికి దైవం కరుణించినట్లు స్వయంవరం పేరిట, బ్రాహ్మణ బృందంతో ఆ సోదరులు కలిసి రావడం, మహావీరుడు, ధనుర్వేత్తయిన అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించి, తనను గెలుచుకోవడం సాటి రాజుల ముందు వరించడం జరిగింది. ఇంతవరకు ఈ కథ బాగానే వుంది.

ఈ కథానాయకుడు బ్రాహ్మణుడు కాడని, ఆ రూపంలో రహస్యంగా తిరుగుతున్న పాండుపుత్రులనీ పదిమందికి తెలిసింది. ఎందరో ఆనందమూర్తు లయ్యారు. తనను తీసుకుని, మిగిలిన అన్నదమ్ములతో, కుంతిదేవిని చూడటం, "మేమొక అపురూప...."మనేసరికి ఆమె అందరు సమంగా పొందమని కోరడం, అంతా చిత్రంగా జరిగిపోయింది.

చివరకు వ్యాసమహర్షి, గోవిందుడు, ఇతర ధర్మతత్వజ్ఞులు, అంతకుమించి, ఆమె జీవిత రహస్యంలోని పరమగోప్యాన్ని తెలియబరచి "ఇది నీవు కోరిన కోరిక. దీనిని అనుసరించక తప్పదనడంతో, లోక విరుద్ధంగా, ఆ పాంచాలి, అయిదుగురికి భార్య అయింది. నిన్నెవరో తెలియని - పాండవ జేష్ఠుడు నుండి కనిష్ఠుని వరకు తనకు భర్తలయ్యారు. ఇప్పుడు కుంతిజేష్ఠుడు మొదటి భర్తగా, పెద్దాయనగా అలరించి, ఆనందింప చెయ్యడానికి వస్తే...... గతం తల్చుకుని, చిత్రవిచిత్ర జీవన విధానంలోని, విధాత నిర్ణయానికి శిరసు వంచి, ఆ లిఖితాన్ని శిరసావహించింది.

ఈ సమయంలో ఏదో ఆనందకర ప్రస్తావన తీసుకురావడం సమంజసంగా, పరిచయ-పెంపునకు నిదర్శనంగా ఈ సాయంకాలం నిన్ను చూడవచ్చి, ఆశీర్వదించిన మహనీయుడెవరో నీకు తెలుసునా ? యుధిష్టరుడు అడిగాడు. ఆయనే -

"వారు మహామతి, ధర్మవేత్త విదురులవారు మా పినతండ్రి, పితామహుల ఆశీస్సులు, పెదతండ్రి అభిమానాన్ని తీసుకుని వచ్చారు. వారు హస్తినాపురానికి రమ్మని సాదరాహ్వానమిచ్చారన్నాడు.

ఆ మాటలు విన్న ద్రౌపది కూడా, యుధిష్టరునితో సంతోషించింది. గతాన్ని తలుచుకుంటే, వీళ్ళు హస్తినలో అడుగుపెట్టే సావకాశం లేదేమో, ఇక్కడే ఎక్కడో, కాలక్షేపం చెయ్యాలేమోననుకుంది. వీళ్ళ అనుమానాలను తొలగించి, పెద్దాయన, రాజమాత కలిసి, ధృతరాష్ట్రున్ని గుడ్డిప్రేమను నిర్మూలించి, విదురుని ద్వారా - సాదరాహ్వానాన్ని అందించారు. ఇది కనీస ధర్మమని, ఆ తమ్ముని పిల్లలను తగు విధంగా గుర్తించి, గౌరవించాలని అది నీ తమ్మునిపై గల ప్రేమను తెలియబరుస్తుందని పెద్దలు చెప్పగా విని విధిలేక మహారాజు తలవంచాడు.

భర్త మాటలకు సంతోషించినామె, విదురులవారు మాకు పినతండ్రి. మా మహారాజు పెదతండ్రికి, ధర్మసూక్ష్మదర్శి, తత్వవేత్త - శాస్త్రజ్ఞుడు, ముఖ్యమంత్రి వర్యుడు. నిజానికే మాత్రం మేము అజాగ్రత్తగా వున్నా వారణావతంలో, ఆ లక్క ఇంటికి ఆహుతయ్యేవాళ్ళమే, కానీ -

మా పినతండ్రి, మా సోదరుల కుయ్యుక్తులను కనిపెట్టి, ఆ ఇంటినుండి అడవిలోకి రహస్యమార్గ మేర్పాటు చేయించి, మమ్ము సురక్షితంగా, తప్పింప జేసారు. మేము క్షేమంగా వుండటానికి, నిన్ను చేపట్టడానికి కారకుడయ్యారు. ఇంకో విషయం తెలుసా ? మమ్మల్ని తప్పిస్తూ, భీముడే ఆ ఇంటికి నిప్పంటించాడు. కాకపోతే మా తరుపున, ఆ తల్లి తన అయిదుగురు బిడ్డలతో ఆనవాలు లేకుండా ఆహుతయింది. మేము మంటల్లో మాడి మసయినట్లు లోకం నమ్మింది.

మొత్తానికి మా పుణ్యంగా నిన్ను పొందాము. ఇప్పుడీ పితామహులు, రాజమాత ఆదేశాల మేరకు, మాకు మా పెదతండ్రి రాజ్యం కూడా ఇస్తారుట" అనేసరికి చాలా సంతోషం. నా అదృష్టం బాగుందనేసింది. అది స్త్రీ సహజబుద్ధి. అందుకు "నిజ"మన్నాడు పాండు జేష్టుడు కూడా!

"అవును, మీ పితామహులు అంత భయంకరులా ? వారిపేరు చెబితే... చాలామంది...

"వారెంత పరాక్రమవంతులో, దుష్టులకంత చెడ్డవారు. మంచివాళ్ళకంత మంచివారు. నిజమైన దయానిధి వారు. అధర్మాన్ని సహించరు. కాకపోతే రాజ్యకాంక్ష లేనందువలన మేమందరము మా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నామే తప్ప, అదే రాజ్యకాంక్ష కనుక వారికున్నట్లయితే, హస్తిన పొలిమేరలలో కూడా మా మాట కానీ, పెదనాన్నగారి మాట కాని వినబడేది కాదు. అసలు అవతార కార్యక్రమము, అదే మా జన్మమే...... వుండేది కాదు.

ఇక మా తాతమ్మ - "రాజమాత" అయితే మా అందరికి ప్రత్యక్ష దేవత, ప్రతిక్షణం పూజనీయురాలు. అంతెందుకు, సద్ధర్మమూర్తి - పురాణేతిహాస చక్రవర్తి శ్రీ వేదవ్యాసులవారు - మా తాతమ్మగారి పుత్రులే. కురువంశ దీపకులమై వెలగ తలచే మా అందరికి ఆమె పూజనీయురాలు. ఆ తల్లి కరుణే, మా వంశాభివృద్ధికి మూలకారణం" అంటూంటే మిలమిలమెరిసే ద్రౌపది - చిత్రంగా చూసింది.

అందరు నిన్ను హర్షిస్తారు. నిన్ను ఆదరిస్తాను. దుర్యోధనాదులు - నిన్ను కాదన్నా - నీకు వచ్చే నష్టం లేదు. అతను, ఆతని సోదరులు, దురదృష్టవంతుడైన కర్ణుడు - ఏం చేస్తాం. చేరి మూర్ఖుల మనసు రంజింపరాదన్న విధంగా ప్రవర్తిస్తారు కనుక, వారిని గురించి అనవసరంగా ఆలోచించడం తగదంటాడు.

"మరి.... ఆచార్యులు... నన్ను క్షమిస్తారా ?" సాలోచనగానే అడుగుతుంది.

"నీ గోవిందుడు, మా కృష్ణుడు.... అండగా వున్నంతవరకు, ఏ ఒక్కరు మనల్నేమీ చెయ్యలేరు. ఇది సత్యం. ఇవ్వాల్టి ఈ సమాగమం - ఆ వాసుదేవుని కరుణాపూరిత దృష్టికి నిదర్శనం.

★★★★

తెల్లవారింది.

ఎక్కడో.... కాంపిల్యనగరంలో విసిరేసినట్లు ఓ మూల వున్న పాండవులు, పాంచాలితో పరిణయం పేరిట రాజమందిరానికి మారారు. బలరామ-కృష్ణులు, మత్స్యదేశ విరాటులు, ఇతర యాదవ ప్రముఖులు, స్వాయంవరానంతరం,

వివాహానికి వుండి ఆశీర్వదించిన ఇంకొందరు రాజులు, ఎందరో పౌరులు, నగర పెద్దలు, ప్రముఖులు, క్రొత్త దంపతులను కలిసి అభినందనలను తెలపాలని ఆలోచించేవారు కొందరైతే,

ఇప్పుడు - ఇరువురికి బంధువైన కృష్ణ దర్శనంతో తరించాలని మరి కొందరు, మొత్తానికి పాంచాలాన్ని పెండ్లి కళ - హడావుడి, ఆనందంలో ముంచి ఒక మూల పరవశత, మరొకమూల ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

కృష్ణుని చూడాలనే కుతూహలం బాగా పెరిగిన ద్రౌపది, అన్న కోసం బయలుదేరింది. గబగబా వచ్చి, కృష్ణుడున్న గదిలోకి తొంగి చూసింది. ఒక ప్రక్క ఆజానుబాహుడైన భర్త భీముడు, మరొకప్రక్క విరాటరాజు. ముఖ్యంగా కృష్ణుడు, విరాటరాజుతో, మీరు ఎప్పుడు మీ స్నేహహస్తాన్ని పాండవులకివ్వాలి. ఇందులో, ఎటువంటి పరిస్థితులలోను అలక్ష్యం, అశ్రద్ధా పనికిరాదని సూచిస్తే - తప్పక నా మైత్రీ ధర్మాన్ని పాటిస్తానని చిరునవ్వుల కృష్ణునికి వాగ్దానం చేసాడు.

ఆ తదుపరి, విరాటుడు బయలుదేరాడు. భీముడు - ఏ విధమైన ఆసక్తి లేక సామాన్యుడిగానే ప్రవర్తిస్తున్నాడు. యుధిష్టరునితో వున్నంతసేపు ద్రౌపదిని ఇతరులెవ్వరు పలుకరించరు. పరిహాస ప్రసంగాలు చెయ్యరు. అన్నదమ్ములలో ఎవరితోనున్నా, మిగిలినవారు, తమ జాగ్రత్తలో తాము వుంటారే తప్ప ఎకసక్కాలు, పరిహాస ప్రసంగాలు, ఏ విధంగాను చెయ్యరు. తమ పరిధిని తాము అతిక్రమించరు.

ఇప్పుడు, కృష్ణునికై తొంగిచూసి, వెనుదిరిగే సమయంలో ద్రౌపదిని చూసిన భీముడు, ద్రౌపది మణికట్టును పట్టుకున్నాడు. అది ఆతనికి సున్నితమే. ఈమెకు కొద్దిగా ఇబ్బందికరము. "ఆ.... బావా!" కాస్త సున్నితమన్నాడు, కృష్ణుడు. నవ్వుతూ చంటిపిల్లను ఎగరేసుకుపోతున్నట్లు, భీముడు పరుగెడుతూంటే, ఆమె కూడ, ఆ మహాకాయుని అలాగే అనుసరించసాగింది.

"చూసావా, బావా! ఈ కొంటె కోణంగి ఎలాగ తలుపు సందులలో నుండి చూస్తుందో ? ఈ చూపులు నీ కోసమా, నా కోసమా ?" కొంటెగా చూస్తు కృష్ణుడు అడిగినట్లు అంటున్నాడు.

ఆ చూపులను గ్రహించినట్లు భీముడు, తానే "దేవీ! నువ్వు కృష్ణునికోసం వచ్చావని నాకు తెలుసు. ఆ విషయాన్ని నీ చూపులే చెబుతున్నాయి. ఇది నువ్వే కాదు! ప్రతీ స్త్రీ, తన సహజ దృష్టిలో ప్రవర్తించే ప్రవర్తనేలే! అవునా, కృష్ణా! ముందీ స్త్రీలు మనసును దొంగిలిస్తారు. ఆ తదుపరి మనలనే మాయలో పడేస్తారు. ఇది వారి అస్త్రం. వారి వద్దనున్న ఆశ్చర్యకర - తప్పుకోలేని శస్త్రం. విధి విలాసం. లొంగక తప్పదు" అనేశాడు, ఆమె జాణతనానికి, తన మాటల చాతుర్యాన్ని జోడించి గట్టిగా నవ్వేసాడు.

"భయపడకు. మా బావ సామాన్యుడు కాడు. నేను ఆయన ముందు నీ పరువు తియ్యడం లేదు. మా బావ - మానసచోరుడు. ఆ లీలామానుషుని చూపులలో చిక్కుకున్నవారు శరణాగతులు, కాకపోరు. తప్పుగా అనుకోకు. సర్వ సమర్థుడైన - ఆ - శౌరి, ఆనందమూర్తి. ఆనందప్రదాత" అని ఛలోక్తి కల్పిన సత్యాన్ని తెలిపాడు.

కృష్ణుడు మధురంగా నవ్వుతూ -

"బావా! ఫర్వాలేదు. నీకు మాట్లాడటం వచ్చే-" వెటకారం మొదలుపెట్టాడు. ఎంతయిన మేనత్త కుమారుడు. వరుసైనవాడు. ఆట పట్టించదగ్గవాడు. చాలా కాలం తర్వాత, ఆట పట్టించు సమయంలో దొరికినవాడు. కాబట్టే, వాసుదేవుడు, అల్లరి పట్టిస్తున్నాడు.

అప్పుడు - భీముడు - "బావా! నువ్వు, నీ చెల్లెలు ఏమీ తక్కువ తినలేదు. అన్నదమ్ములను హడలగొట్టగల చతురులు" అన్నవాడు కొద్దిగా తమాయించుకుని "ఏదో సరదాగా మాట్లాడుతున్నానులే" అన్నాడు - "ద్రౌపదీ! మీ అన్న వున్నాడేం, ఎంత అల్లరి చేసినా, తెల్లవారి, నాపై పెద్దరికముంచి, నా పాదాలకు వందనం చేస్తాడు. మంచి పిల్లవాడని అంటూంటే -

"ఏం చేస్తాం, చెల్లెమ్మా! ఆ ఆకారం చూసావా, భీకరం. దండంపెట్ట లేదనుకో, "బావా!" అని దగ్గరకు తీసుకుని, అబ్బ! ఎంత ముద్దొస్తున్నావు అని కౌగలించుకున్నాడో, దేవాధిదేవుడైనా, ఈ భీమునికి దాసుడైపోవాల్సిందే. ఎముకలు, ఎక్కడివక్కడ విరిచి పొడిచేసి "భలే దేవుడివి!" అని "ఇవన్నీ నీ ఎముకలు ?" అని లెక్కపెట్టుకోమని పడేస్తాడు.

అంతా అయిపోయాక, అవును. ఇన్నేనా అని బయటివాళ్ళు లెక్కపెట్టి, శాస్త్రం.. తక్కువో, ఎక్కువో.... చెప్పుకుని తేల్చుకోవడమో, సర్దుకోవడమో చేస్తారు. జాగ్రత్తమ్మా! ఎలాగ వేగుతావో, ఈ బండ, మొండి మొగుడితో!" నవ్వుతూ చురకంటించాడు. "అమ్మ, బావా!" నీతో, చాలా కష్టమని, ఆ గోవిందుని, గోలకు నువ్వు దేవుడివి కదా!" అని తిరిగి వందనం చేసేసాడు, భీముడు!" వుండండి. అత్తగారితో చెబుతాను" అంది ద్రౌపది, రాలిన పువ్వులు, చెదరిన జుత్తు సరిచేసుకుంటూ.

"నేనెంత మొండో, మా అమ్మకు బాగా తెలుసు. ఆ రాక్షసి హిడింబ వుందే ? అదొకసారి తన ప్రతాపం చూపాలని ఎత్తి పట్టుకోబోయింది. దాన్నలాగే ఎత్తి బంతిలా పైకి విసిరాను, చస్తుందేమో, ఎముకలు విరిగిపోతాయేమోనని క్రిందపడకుండా పట్టుకున్నాను. అబ్బ! ఎంత బరువుందో, ఆ రాక్షసి" నవ్వుతూ తన బలప్రదర్శనా - కొంటెతనాన్ని ద్రౌపదికి చెబుతూంటే...

"భీమా! భీమా! తొందరపడకు. అది రాక్షసి కాబట్టి ఆ... నా చెల్లెలు తట్టుకుంది. ఈ - నా - చెల్లెలు సుకుమారి పైగా రాకుమారి. మనసే గట్టిది తప్ప, శరీరం డొల్ల - జాగ్రత్త. ఎముకలన్నీ ఏరిపెడితే, చేర్చి కట్టడానికి, కుట్టడానికి, తాతపాదులు - అదే - వ్యాసమహర్షి రావల్సి వుంటుంది!" అన్నాడు.

"అవును. చెల్లెమ్మా. పెద్దబావను..." అడుగుతున్నాడు కృష్ణుడు.

"నిజం. అన్నయ్యా! నారదమహర్షి, కలలో కనుపించి "అమ్మా! నీకు సకల శుభాలు, నిత్య సౌభాగ్యం - సర్వం సంప్రాప్తిస్తాయి. నువ్వెంత ప్రేమ కురిపించినా, నీ భర్తలెంతమంచివారైనా, కాలమహిమగా, అనవసరంగా, చీకాకు పొందవచ్చును. కనుక, అటువంటి వారి నుండి బయటపడటానికిగాను, సంవత్సరానికొకరుతో కాపురం చెయ్యి. ఆ సమయంలో మిగిలినవారు పరాయివారిగానే లెక్క. జాగ్రత్త" అన్నారని అమాయకంగా చెప్పేసింది. దీనినే ఆర్యపుత్రులకు గూడా చెప్పానని చెప్పింది.

"సంగరం. ఈ సంవత్సరం.. ఒక్క సంగరంతో కాదే, అయిదేళ్ళకోసారి, నీ దర్శనం. ఈలోగా నిన్ను మరచిపోవడమైనా చెయ్యాలి లేక హిడింబతోనో, మరో దానితోనో కాపురమైనా పెట్టుకోవాలి. నాకైతే ఫర్వాలేదు. "హిడింబ" వుంది. మిగిలినవారు... నీ పేరు చెప్పి వుసూరుమని అన్యాయమైపోతారు."

"అయినా ఇదెక్కడి సలహా" అని విసుకున్నాడు. పైగా ఆ చెప్పినవానికి పెళ్ళాం, పిల్లలు-ముద్దు ముచ్చట్లు, సరదాలు మచ్చుకు గూడా లేవు. ఉన్నవల్లా తంపులు. తగాదాలు, జగడాలు. అదేమంటే లోకకల్యాణ కారకులు. అంతా... ఇదిగో - ఈ లీలామానుష విగ్రహుడి లీల... అని... మా బావను చూపుతాడు. కాబట్టి...!"

"చూడమ్మాయి. ఈ బావ వ్యవహారం చూడబోతే నీ చేతుల్లో చిక్కి, నీ మాట వినేటట్లు లేడు. నీకో రహస్యం చెబుతాను విను. ఈ బావ తిండిపోతు. వద్దనడు. నీ కొంగు పట్టుకుని తిరుగుతాడు. నువ్వు "నంది"ని చూపి "నంది" అంటే "నంది" అంటాడు. కాదు "పంది" అంటే "పందే" అంటాడు. కనుక...!" అని ముగిస్తూంటే...

తన బలహీనతను చెప్పినందుకు గింజుకుంటు "ఆనక...!" చెబుతానంటాడు.

"ఆనక... కాదు. వచ్చే సం॥రం వరకు ఆగితే, అప్పుడు...

"అప్పుడు.... ఇన్నాళ్ళు విడిచిపెట్టినందుకు నిన్ను... నిన్ను....!" అని మీది మీదకు వస్తూంటే -

"భీమా!" చాలు, నీ ప్రతాప"మని వెనక్కి లాగుతాడు, కృష్ణుడు.

## బయలుదేరుదాం!

**అ**యితే, ఇప్పుడు హస్తినకు వెళ్ళాలి.

అక్కడ తాతమ్మ - రాజమాత సత్యవతీ దేవిని పితామహుడు భీష్ముల వారిని కలవాలి. వారి అండ పుష్కలంగా వున్నందువలన, ప్రస్తుతం మీకు స్వాగత సత్కారాలే తప్ప, ఏ విధమైన ఇబ్బందులు వుండవు.

"హస్తినకు వెళ్ళడమంటే చేతులు నలుపుకుని, రాజకీయ వారసులవలెనే, లేక శరణార్థులగానో వెళ్ళకూడదు. రాజసంతో, పాండుపుత్రులుగా రాజ్యానికి హక్కుదారులుగా వెళ్ళాలి. ఆ అధికారాన్ని స్వంతం చేసుకోవాలి.

"అవునవును." అన్నాడు కృష్ణుడు. ఆ వెంటనే

"బావా! ఈ వృకోదరుడు, ఎక్కడుంటే.. వాసుదేవా! నువ్వక్కడ వుండాలి. అప్పుడే జయసిద్ధి" అన్నాడు.

"అది తప్పు. వాసుదేవుడు ఎక్కడుంటే అక్కడ పాండుపుత్రులు, తమ పత్ని - మీతోనే వుంటారు. "విజయమూర్తులై వర్థిల్లుతారు" అని సత్యసంకల్పాన్ని ప్రకటించింది.

భీముడు, ద్రౌపది వెడుతూంటే, అర్జునుడు ఎదురు వచ్చాడు. అసలైన కథానాయకుడతడు. అందమైనవాడు, తీర్చిదిద్దుండే అవయవ సౌష్టవాల సొగసు కాడు. వరండాలోకి రాగానే ద్రౌపది కళ్ళలోకి చూసాడు. ఆ చూపులలోని తీవ్రతను గమనించిన ద్రౌపది, తలవంచుకుని భీముని అనుసరించింది.

ఇది గమనించిన భీముడు, ఒక్క అడుగు వెనక్కి వేసి "చూశావా, కృష్ణా! గెలుచుకున్న అసలైన వీరుడు అర్జునుడు. మరి నేనామెను ఇప్పుడు వెంటబట్టుకుని పోతున్నాను. పాపం, ఇది అర్జునునికి కాస్త ఇబ్బందికరమేమోనని ద్రౌపది చెయ్యి పట్టుకుని ముందడుగు వేసాడు.

ఆ క్షణంలో తన దగ్గరకు వచ్చిన అర్జునుని చూసి "కృష్ణుడు" "ఏం మహావీరా! ఏవిటీ విశేషం, అలాగ వున్నావు ?" నీ కోసమే ఎదురుచూస్తున్నాను. ఇప్పటికొచ్చావు. సహజంగానే ప్రశ్న, సమాధానాల రూపంగా పలుకరించాడు.

ఏం సమాధానం చెప్పాలో తెలియని అర్జునుడు, క్షణమాగి "మా పెద్దన్నగారో తీర్మానం చేసారు. అదొక ప్రశ్నగానే తప్ప, సమాధానం సరళంగా కనబడటం లేదు.

"చూడు, సమస్యలు వుంటాయి. సమాధానాలు వుంటాయి. కాని అవి అపరిష్కృతాలు కావని మాత్రం ఏనాడు అనుకోకూడదు" అన్నాడు. కానీ, ఇద్దరి మధ్య క్షణకాలం మాటలు లేవు. ఆ తర్వాత - పెద్ద పెద్ద బావ చెప్పిన విషయంలో నీ అభిప్రాయం.... తెలుసుకోవచ్చునా ?

ద్రౌపది ఒక్కొక్కరితో ఒక్కొక్క సం॥రముంటుంది ? ఈ సమయంలో ఏదైనా తేడావస్తే.... అంటూ నారద మహర్షి, మా మధ్య ఏ విధమైన పొరపచ్చాలు లేకుండా వుండాలని, ఈ రకంగా చెప్పారుట." అంటూ విషయం వివరించాడు.

విన్న కృష్ణుడు "విషయం మంచిదే అయినా, ప్రతి వ్యక్తి తన భార్య కోసం, నాలుగేళ్ళు ఎదురుచూడటమంటే చాలా కష్టం. కానీ, జాగ్రత్తగా ఆలోచిస్తే, ఈ నిర్ణయం చాలా మంచిది. లేకపోతే ప్రతి ఒక్కర్ని వారి అభీష్టం మేరకు, ఆనందింప

చెయ్యడం, ఆ భార్యకు చాలా కష్టమౌతుంది. తాను బ్రహ్మచారి అయినా, సత్యాన్ని ప్రకటించాడు. ఆ ఆలోచన సమంజసమన్నాడు, కృష్ణుడు. తన అంగీకారాన్ని కూడా, అడగకుండానే తెలుపుతే...!''

"అవునవును. నీకు ఏ చింతాలేని భార్య వుంది. దీనివల్ల నీకే విధమైన బాధ వుండదు. ఎటొచ్చి మాకే ఏం చెయ్యాలో, ఎలాగ బ్రతకాలో... అర్థంకాని పరిస్థితి మాది. విషయం సత్యం కావచ్చును. కాని ఇప్పుడు అది విషమయి కూర్చుంది. వూహలన్నీ తారుమారాయి. కలలు కల్లలయిపోయాయి'' నిరాశా నిస్పృహలకు అర్జునుడు గురవుతున్నాడు.

భార్య, ప్రపంచము, సంసారము, సంతానం... ఇవన్నీ నాకు ఎండమావులుగా వున్నాయి. మనం అనుకునేదొకటి జరిగేది ఒకటి. భీముడు హిడింబను వివాహం చేసుకున్నాడు. పిల్లవాడిని కనేసి, వాణ్ణి తీసుకుని హిడింబ సంతోషంగా వుందనుకుందాం! అలాగే నువ్వు ఇక్కడ వీరోచితంగా సంపాదించుకున్న భార్యను "అమ్మా! ఇవ్వాళ నేనొక అపురూప.... మనేసరికి, మీ అమ్మ హడావుడిగా, ఇతర విషయాల గూర్చి ఆలోచించకుండా,

"మంచిది, నాయనా! ఆ అపురూప ఫలాన్ని అందరు సమంగా పంచుకుని, ఆనందించండి'' అనేసింది. తీరా చూస్తే ద్రౌపది. దీనిని అదృష్టమనాలా ? దురదృష్టమనాలా ? అన్న కృష్ణుడు తానుగా, రెండూ కాదు. ఇది దైవలిఖితం. "కృష్ణ... అదే ద్రౌపది, తపస్సు చేసి కోరుకున్న కోరిక. తత్ఫలితంగా, వరప్రసాదులైన మీరు ఆమెకు భర్తలయ్యారు.

"ఇప్పుడు ఆలోచించి, పునర్విచారించి లాభం లేదు. అందుకే మీ తాతపాదులు వ్యాసులవారు, ధర్మమంటూ చెబితే, దానిని మీ అన్న యుధిష్ఠరుడు, ధర్మసూక్ష్మమని కథలతో సహా, వ్యాసభగవానులు వ్రాసిన పురాణాన్ని, మీ పెద్దన్నగారు మనకందరికి అర్థమయేటట్లు ప్రవచనం చేసి మరీ చెప్పాడు.

కాబట్టి, అర్జునా! ఇప్పుడు, ఆలోచనలు, ఆవేశాలు కావు. బంధాలు, అనుబంధాలు. ఇవి మీ వద్ద పుష్కలంగా వున్నాయి. ఇది మీ మాతృశ్రీ - మా మేనత్త కుంతి, మీపై విజయంగా సంపాదించుకున్న, సాధించుకున్న అపురూప వరం,

ఐకమత్యం. ఇది ఆడదాని కోసం విచ్ఛిన్నం కారాదని, భవిష్యత్తును దర్శించడమే తప్ప శాసించలేని నారదుడు, ధర్మబద్ధంగా మీకిచ్చిన, కేవలం సలహా.

ఇది ఆలోచించాలో, అవసరమో... నిర్ణయం మీ అన్నదమ్ములది. మిమ్మందర్ని కట్టుకున్న మీ భార్య ద్రౌపదిది. ఆ తర్వాత ప్రతిదీ మీ ఇష్టాఇష్టాల మీదనే ఆధారపడి వుంటుంది. అందరు ఎన్నైనా చెబుతారు. మీ మేలు కోరువారు మీ కోసం కొన్ని చెబుతారు. అది ఆచరణీయమా, అనాలోచితమా ? అన్నది మీ మధ్య, మీ వద్దనున్న సమస్య, పరిష్కారం కూడా ? "ఆలోచించుకోండి. అప్పుడు ఆచరణలోకి రండి...!" కృష్ణుడు సన్నగా, సన్నాయినొక్కులవలె చెప్పిన దానిని విన్న అర్జునుడు -

"బావా! పెద్దవాడివి. సర్వసమర్థుడివి... వాళ్ళు, వీళ్ళు... అంటూ చెప్పవలసినదంతా, సూటిగా, చక్కగా, చురుకుగా, చురకలా అంటించావు. ఇదే ప్రాప్తమంటే..... చాలా మంచిది. "ఆశ నిరాశయి, ఆవిరైపోగా వూహలలో వులికిపాటు కబుర్లు, వుత్తుత్తి ఆలోచనలతో కాలం గడపాలి, ఏం చేస్తాం ? అది... మా అన్నగారితో సహా, అందరు కలిసి చెప్పిన ఆదర్శ ధర్మం" అని నిట్టూర్చాడు.

అర్జునుని మనఃస్థితిని బాగా గమనిస్తున్న వాసుదేవుడు "అయితే ఏం చేద్దాం" అన్నాడు "తనే ఒక పనిచెయ్యి. నాతో ద్వారకకు వచ్చేయ్. ఆ తర్వాత మిగిలిన విషయాలంటాడు. మళ్ళీ కృష్ణుడే "అవును. అన్నలను, తమ్ముళ్ళను, ముఖ్యంగా మీ అమ్మను విడిచి రాగలవా ? వాళ్ళందరూ....!"

"అదే నా ఆలోచన. ఎవరినైనా విడువవచ్చును గానీ, అమ్మ "కుంతి"ని మాత్రం విడిచి రాలేను. వీళ్ళందర్నీ విడిచి నీతో వచ్చేస్తున్నాననేసరికి, పరిస్థితిని అర్థం చేసుకోగల దిట్టయిన మా అమ్మ ఇదంతా తన వల్లనే కదా!" అని గుండె బాదుకుంటుంది. అదే నేను చూడలేనంటాడర్జునుడు. ద్రౌపది కూడా అలాగే బాధపడుతుంది.

"ఫర్వాలేదు. ద్రౌపదిని ఇబ్బంది పెట్టకుండా, ఆమెను నిరాశపరచకుండా, అయిదు సం॥లకొకసారి వద్దువుగాని. దీపివల్న ఎవరికి బాధ వుండదు."

"కృష్ణా! నీ మందహాసం, ఇతర సమయాలలో ఆనందదాయకమేమోకానీ, ఇప్పుడు మాత్రం పుండుమీద కారం చల్లినట్లుంది. నా దయనీయ పరిస్థితి నీకు ఎగతాళిగా వుంది." నొచ్చుకున్నాడు అర్జునుడు.

"అర్జునా! జరిగినదానికి వగచి లాభం లేదు. కాలచక్రం కదలాల్సిందే తప్ప, ఏ ఒక్కరి కోసం ఆగదు. ధర్మం చరించవలసింది, ఆచరించవలసిందే తప్ప మనిషి మనిషికి, మనసు మనసుకు మారదు. ఇందుకు ఏ ఒక్కరికి మినహాయింపు లేదు.

మీ మాటలకు, ధర్మానికి, ఆ పిచ్చిపిల్ల కట్టుబడింది. మళ్ళీ దానికో కథ. దాంతో వ్యధచూసి, కథ ప్రకారం, అందర్ని కట్టుకుంది. నువ్వనుకుంటావు కానీ ఏ ఒక్కరిని పూర్తిగా సంతృప్తిపరచలేకపోతున్నానేమోనని, ఇల్లాలిగా, ఆ పిల్ల ఎంత తల్లడిల్లి పోతుందో ఒక్కసారి ఆలోచించు. అర్థం చేసుకుంటే, అందరు ఆనందంగానే వుంటారు. ఆమెకేం అంటావు, నువ్వు. కానీ, అసలు బాధంతా - ఆమెదే వూరడిస్తూనే సత్యం తెలుపుతున్నాడు - కృష్ణుడు!"

యుధిష్ఠారాదులు, ద్రౌపదితో హస్తినాపురానికి ప్రయాణించడానికి సిద్ధమౌతున్నారు. భీముడు, ద్రుపద మహారాజు వద్దనుండి తిరిగి వస్తున్న సమయంలో, ద్రౌపది మరో పడుచుపిల్లతో తండ్రిని చూడ వచ్చింది. ఆ కొత్త పిల్లనోసారి ఎగాదిగా చూసి, "దేవీ! ఎవరీపిల్ల. ఇలాగ నీ వెనుక వేస్తుంది" ఆసక్తిగా అడిగింది.

సమాధానంగా పాంచాలి "ప్రభూ! ఈమె పేరు జాలంధరా, కాశీరాజు కుమార్తె. తండ్రిగార్ని కలువాలని వచ్చింది."

"అలాగా! ఈమెను మేమెప్పుడు చూడలేదే ?" హుందాగా భీముడు అన్నాడు. అప్పుడా కుమారి -

"మేము, మా అన్న గారు సుశర్మతో కలిసి స్వయంవరానికి వచ్చాము. అప్పటినుండి ఇక్కడే వున్నాము" సమాధానమిచ్చింది.

"వీరు కూడా హస్తినాపురానికి వస్తున్నారు" ద్రౌపది చెప్పింది. కురుక్షేత్రకు యాత్రకు వెడుతూ, మన రాజ్యానికి కూడా వస్తున్నారంది.

"ఓహో! అయితే వీళ్ళు మనతో వస్తున్నారన్నమాట" చాలా గంభీరంగా నవ్వుతూ అన్నాడు.

"లేదు. మేము పడవలో వెడుతున్నాము. మీతో కాదు, గంగ వెంబడి వస్తున్నామంది" కొంటెగా.

"అలాగా, అయితే హస్తినాపురంలో కొన్నాళ్ళుంటారా ?" అడిగే భీమునికి, ద్రౌపది-

"వుంటారుట. ఈమె భానుమతీ యువరాణి గారి సోదరి కనుక, అక్కగారితో కొన్నాళ్ళు అక్కడ వుంటుందంది."

"అయితే విడిగా పడవలూ, ఇతర మార్గాలెందుకు ? మనతోనే రమ్మని చెప్పు!" అన్నాడు.

"లేదు. మా అన్నగారు, నదీ మార్గంలోనే వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. మేమలాగే వెడతామంది" ఈ మాటల్లో, భీముని ఓరగంట ద్రౌపది చూస్తుంది.

అప్పుడా జాలంధరా "అవును, తమరు వృకోదర మహారాజుట కదా! రాక్షసావర్తాన్ని పాలించారుట కదా!" ఆసక్తిగా అడుగుతుంది.

"ఊ.... ఊ...!" గొప్పగా తలూపాడు. ఆ వెంటనే భీముడదరిపోయేటట్లు "మీరు మనుషుల మాంసం కూడా తింటారా ?" మొహం అదోరకంగా పెట్టి అడిగింది.

"నేను ఎప్పుడు తినను. నా పాలనలో రాక్షసులు, మనుష్యుల మాంసం తినడం, రక్తం త్రాగడం చెయ్యకూడదని కట్టడి చేసాను. వాళ్ళు పొరపాటున తొందరపడితే, మీ... అనేసరికి, వాళ్ళు భయపడిపోయేవారు.

"ఆ...!" అంటుందా పిల్ల.

అప్పుడు భీముడు.... నా ఆహారమేమిటో తెలుసా ?" భయపడే ఆ రాచబిడ్డను అడిగాడు.

"వుహు..." తల అడ్డంగా తిప్పిందా అమ్మాయి.

"నేను.... అందమైన కన్నెపిల్లలనే నా ఆహారంగా తీసుకుంటాననేసరికి, ద్రౌపది - "ప్రభూ! ఇక ఆపండి. నాన్నగారు వింటే... ఆగ్రహులౌతారు." అంటూ మెల్లిగా, తండ్రిగారున్న ఆ మందిరంలోకి తొంగిచూసింది. తానూ చూసాడు."

భీముని సరదా, ఆ సరదాకు - మహారాజు కూడా నవ్వుకున్నారు. ఇక బాగుండదని, తన సరదాను ఆపి, తాను వెనుదిరిగాడు.

అక్కడనుండి అన్నగారి దగ్గరకు భీముడు వచ్చాడు. కొంతలో కొంత చలాకితనం, చిలిపితనంలో, నవ్వుకుంటూ వచ్చిన ఆతన్ని వివరమడిగారు. అందులోంచి, అన్నగారు "ఏవిటన్న దానికి, "ఏముంది మహారాజు, మనకు తన కుమార్తెతో పాటు అరణాలుగా, డెభ్భై ఏనుగులు, వందమంది రథికులు, నాలుగు వందల గోవులు, రెండువందల గుఱ్ఱాలు, వాటి పరిరక్షణకు కావలసిన పరివారంతో పాటు ద్రౌపదికివ్వవలసిన ఆభరణాదులు దాసదాసీజన పరివారం, భారీగానే పంపుతున్నారని చెప్పాడు.

"ఇన్నెందుకు మనకు ? నువ్వేమైనా..."

"నేనేమీ అడగలేదు. ఆ మహారాజు, తన కుమార్తెకు, అల్లుళ్ళకు ఇవ్వాలని తలచాడు. ఇస్తున్నాడు. అంతే. ఇందులో నా కోర్కెలకు, బేరసారాలకు తావెక్కడ వుంది, స్పష్టంగానే చెప్పాడు.

"నిజంగానే చెబుతున్నావా ?"

"అన్నా! నాకు వూహ తెలిసినప్పటి నుండి నీతో కాని, మరెవ్వరితోకాని అబద్ధం చెప్పానా" పరిహాసాలాడానా ?" సూటిగా నిష్ఠూరంగా, భీముడ డుగుతున్నాడు.

"ఇవన్నీ తీసుకు వెళ్ళి ఎక్కడ పెట్టుకుంటాం ? ఎలాగ నిర్వహిస్తాం. వీటిని పోషించడం సామాన్యమా ? మనకనవసరమన్నట్లుంది," యుధిష్ఠరుని స్థితి!

మనం హస్తినకు వెళ్ళాలన్నావు ? ప్రయాణపు ఏర్పాట్లు చూడమన్నావు. మనం రాజకుమారులం, మీదు మిక్కిలి వారసులం. ఎప్పుడు తిరిపము నెత్తేవారల్లాగా, కట్టుబట్టల్తో వెళతామా ? మనమెవరము ? పాండురాజు పుత్రులం. పాంచాలరాజు అల్లుళ్ళం. మనకో ఆస్తి, అంతస్థు ఆ దుర్మార్గుల పేరుతో లేకపోయినా మన మామగారి గౌరవంలో, మనకు, కొంత భాగముంటుంది, వుందనే ఈ రకమైన ప్రయాణం ? చిన్నబుచ్చుకోకుండా సత్యం చెప్పాడు.

అయితే, అంతా నిర్ణయం చేశావన్నమాట.

"ఆ.... ?" ప్రయాణ వివరమంటూ మొదలుపెట్టాడు" -

గజరాజులు ముందు నడుస్తాయి. వాటికి నేను అధిపతిని. పదాతి దళంతో గోసంపద, ఆ తరువాత అశ్విక దళం. దీనికి నకులుడు సారథి. ఆ తదుపరి రథికుల బృందం. దీనికి అర్జునుడు నాయకుడు. మీరు జేష్ఠులు, పట్టపురాణిగా ద్రౌపదితో

కలిసి అట్టహాసంగా ప్రయాణిస్తారు. ఈ మొత్తాన్ని విదుర మహాశయులు పర్యవేక్షిస్తారు. మిమ్మల్ని రాజులు, అతిరథ - మహారథులు, మిగిలిన ప్రముఖ వర్గం అనుసరిస్తారు. దీనికి పెద్దబావ బలరాముడు నాయకత్వం వహిస్తాడు.

వీటికి ముందు ఎడ్లబండ్లు, రవాణా ఒంటె వాహనాలు, మన అవసరాలును తీర్చే, మనకు నిత్యోపకరమైన ఇతర సామగ్రి, ఇతర ప్రయాణ వస్తువుల బృందాలు, సహదేవుని ఆధ్వర్యంలో సాగుతాయి. వాటిలో మనుషులుండక పోవచ్చును కానీ, మన అవసరాలు తీర్చే - సర్వానికి సంరక్షకుడు, సహదేవుడు.

"మరి మన వాసుదేవుని విడిచిపెట్టావా, లేక మరచిపోయావా ?" అర్జునుడు అడుగుతాడు. నిజం. నా సంగతేమిటని ?" ఆ గోవిందుడే ప్రశ్నిస్తాడు.

అప్పుడు నిజధర్మ - తత్పురుడైన యుధిష్ఠిరుడు "చూసావా కృష్ణా. మన ప్రయాణానికి ఏర్పాట్లను చూడు భీమా!" అంటే, పాంచాలం మొత్తాన్ని పంచపాండవుల కోసం, ద్రౌపదికి అరణంగా తెచ్చేస్తున్నాడు. ఇదేం విడ్డూరం ?" మనకనవసరమనే భావంతో, బాధతో అంటాడు.

"భగవాన్! మంచికి రోజులు కావు" అని కృష్ణుని చూసి, "బావా! ప్రయాణ సన్నాహం చూడమని బాధ్యతనిచ్చారు. నా ధర్మం నేను నెరవేరుస్తాను. శ్రమించి, మన హోదాకు, ముఖ్యంగా మామగారి పరువు ప్రతిష్ఠలకు భంగంరాని విధంగా, నేను ఏర్పాట్లు చేస్తే "ఇప్పుడేమిటీ - ఈ అన్న ఇలాగ ప్రవర్తిస్తాడని" తానేదో తప్పు చేసినట్లు చూస్తున్నాడని చిన్నబుచ్చుకున్నాడు -

"బావా! నిన్ను మరువడం సాధ్యమా ?! మా కోసం నిన్ను నీవు అర్పించుకున్న దత్తుడవైన దేవదేవుడవు. నువ్వు అమ్మగారితో కలిసి, మహారాజు లాగ రాజులు అనుసరిస్తూంటే, ఆ దివ్యరథంలో గొప్పగా రావాలి. ఇది నా అభీష్టం. అభిలాష" అని తన బావకు, తల్లితో సమానమైన ప్రాధాన్యం, సముచిత గౌరవమిచ్చినట్లు చెబుతాడు.

"అయితే, చిన్న బావను, చివర్లో పడేశారన్న మాట....!"

చివర్లోనా, అర్జునా! కాదు, కాదు. మొదట్లోనే.... అనుకున్నాను. కానీ, ఈ గోవిందుని ముందుపెడితే, ఈ వాసుదేవుడు, తన బావలతో, పాంచాల

రాకుమారి, అదే.... పాండవ పత్ని యాజ్ఞసేనితో వస్తున్న విషయం తెలిసి, హారతులు, నైవేద్యాలు, ఆరాధనలు, భజనలు చేస్తూ - మనల్ని భోజనానికి తప్ప, మరిదేనికి గుర్తించరు. కాబట్టి...

మనం ముందుకు సాగుతూంటే... ఆహా! ఓహో... అన్న వాళ్ళందరు, ఈ గోవిందునితో మమైకమవుతారు. వీళ్ళు ప్రశాంతంగా మనల్ని వెంబడించాలి కాబట్టి, వెంబడించి, వస్తారు. తెలిసిందా ?

ఆ మాటల్ని వినగానే "భలే, భీమా! భలే. బలుడవే గాని, బుద్ధి లేదనుకున్నాను. ఫర్వాలేదు. మీ గొప్పతనాన్ని, నా రక్షణ కవచాన్ని బాగా వుపయోగించుకున్నావు - "ఫర్వాలేదని" కృష్ణుడు ప్రశంసించాడు.

"అన్నా! ఇది తప్పు కాదూ ?" అన్నాడు అర్జునుడు. అందుకు బదులుగా-

కృష్ణుడు, యధావిధి, తన మందహాసాన్ని కురిపిస్తూ అందర్ని చూసి, ఆ తదుపరి-

"అర్జునా! భీముని ఆలోచన సమంజసమే. మొదట్లో నన్ను చూసి గౌరవించే వాళ్ళు, మీ గురించి ఆలోచించరు. ఇప్పుడో... వాళ్ళు, మిమ్మల్ని గుర్తించి, గౌరవిస్తారు ? నాకు చెందవలసిన ఆరాధనాదులు నాకందుతాయి. మీకందవలసిన భజన, భోజనాదులు, మీకందుతాయి. బుర్రలేనివాడనుకున్నాను, కానీ, బాగా ఆలోచన చేసాడని ఈ మారు చక్కగా, కృష్ణుడు భీముని పొగిడాడు.

★★★★

ఆనాటి రాత్రి వాళ్ళు... అదే సుశర్మ. జాలంధరలు తమతో కాకుండా, నదీ మార్గంగా వెడతామనేసరికి ఇష్టంలేని భీముడు, వాళ్ళు నదీమార్గంలో వెళ్ళకుండా సమయం చూసి పడవలకు, చిల్లులు చేసి, ఆ పడవులు కదలకుండా నీటమునిగినట్లు చేసిన భీముడు, సమయం చూసి, ఆ రాత్రిభాగంలో, మునిగే పడవలలోని వారిని కాపాడేటట్లు, ఆకాసంలోకి చూస్తున్నాడు...

వున్నట్టుండి... పడవలు మునిగిపోతూ, హాహాకారాలను చేసే సిబ్బందిని గమనించాడు. పడవ పైభాగంలో రక్షణకై ఎదురుచూస్తున్న యువరాజు, రాకుమారులను చూసాడు. వెంటనే తాను నీళ్ళలోకి దూకాడు. యువరాణీ,

దూకెయ్యి. నేను పట్టుకుంటాను. యువరాజా! నువ్వు దూకెయ్యి. మా వాళ్ళు, మిగిలిన మీ వాళ్ళను రక్షిస్తారంటున్నాడు.

భీముని మాటలు పూర్తి కాలేదు. యువరాణీ జాలంధర దూకేసింది. ఆమెతోపాటు విధిలేక యువరాజు సుశర్మ దూకేసాడు. ఇద్దర్ని ఒడుపుగ పట్టుకుని, భీముడు ఒడ్డుకు చేరాడు. రండి, ఆశ్రమానికి వెడదామంటున్న భీముని చెవిలో "వృకోదరా! ఇదంతా నీ పన్నాగమే కదా!" చాలా సన్నగా - చిన్నగా వినిపించాయి మాటలు. అంటే ఈ జాలంధర కూడా నటిస్తుందన్నమాట. అనుకున్న భీముడు, సుశర్మ నుద్దేశించి "యువరాజా! నీవు నా కుటీరంలోకి వెళ్ళు. నేను ఈ పిల్లను మా మాతృమూర్తి వద్ద వుంచి వస్తానన్నాడు. పరాయివాడు అందునా పగతురుడు తన చెల్లెల్నిలాగ తీసుకువెళ్ళడం ఏ విధంగాను సుశర్మకు నచ్చలేదు.

కానీ, పరిస్థితి తప్పదు. ఇదే విధికి తలవంచడమంటే అనుకున్నాడు. ఇదంతా గమనిస్తున్న -

ఆ తదుపరి కాశీరాజకుమారుని కలిసిన కృష్ణుడు "సుశర్మా, రాత్రి మీ పడవులు నీట మురిగియా ? ఎంతో బాధపడుతున్నట్లడిగాడు.

"అవి క్రుంగలేదు. కృంగచేసారు!" ఆపుకోలేని కోపంతో పెదవులు బిగపెట్టి చెప్పాడు. కృష్ణుడాతని భుజంపై చెయ్యివేసి తట్టుతూ, "జరిగింది నాకు తెలిసింది. నాకు చాలా బాధనిపించింది. నువ్వేమో తొందరగా హస్తినకు వెళ్ళాలి. అవును. మీ బావగారు నిన్ను ముందుగా రమ్మనమని వర్తమానం పంపించారుట ? మాకంటే ముందు తొందరగా రావాలని కూడా అందులో సూచించారుట. అవునా ?" ఎంతో ప్రేమగా, కృష్ణుడడుగుతున్నాడు. అవునని సుశర్మ సమాధాన మిచ్చాడు. కానీ మా దురదృష్టం. అనవసరంగా ఇక్కడ నిలబడి పోయాము. మీతో కలిసి హస్తినకు వస్తే, అయ్య బాబోయ్! ఆ అగ్నిపర్వత ప్రభావం అనుభవించాల్సిందే తప్ప, వూహించి చెప్పలేము" భయపడిపోతున్నాడు, సుశర్మ.

"పరిస్థితి ఇంత దారుణంగా తయారవుతుందని, అనుకోని అవాంతరాలు తలెత్తుతాయని వూహించలేదు!" కృష్ణుడు అతన్ని ఓదారుస్తూ - ఎంత దారుణం ? ఎంత దారుణం ? బాధను, భయాన్ని మళ్ళీ తానే వ్యక్తం చేస్తున్నాడు.

“భయపడకు. దీనికి పరిష్కార మార్గం తప్పక భీముడు కనుక్కుంటాడు. ధైర్యంగా వుండు” అనునయిస్తున్నాడు.

“భీముడా! దీనికి పరిష్కార మార్గం. అతనే కదూ. ఈ నయవంచనకు కారకుడు. మేమతనితో కలిసి రావడంలేదని, ఈ నదీమార్గం గుండా వెళ్ళకుండా, ఈ పాడు పనిచేసాడు ?” తన మనసులోని కోపాన్ని సుశర్మ బయటికి కక్కేసాడు.

“లేదు, నువ్వు చాలా పొరబడ్డావు. మీరు దుర్యోధనుని ముందు తలదించుకునే లేదా తలవొంచుకునే పనాతడు ఏమీ చెయ్యడు.

“ఇదంతా అతనివల్లనే కదా!”

“అక్కడే పొరపడుతున్నావు. జరిగిన దానికి భీముడెంతో వగచాడు. ఆతని తమ్ముని ద్వారా ఏకచక్రపురానికి కబురుపంపి, అక్కడనుండి మీ ప్రయాణం ఏ విధంగాను అపహాస్యం కాకుండా వుండాలని “రాచహంస”పడవ నొకదానిని తెప్పిస్తున్నాడు. అదెట్టి పరిస్థితులలోను రేపు సాయంకాలానికి వచ్చేస్తుంది. రాత్రికి మీ ప్రయాణం మీరు సునాయాసంగా కొనసాగించ వచ్చును!” ఎంతో నమ్మకం, ధైర్యం, విశ్వాసం కల్గిస్తూ - కృష్ణుడు చెప్పాడు.

“నేను నమ్మలేకుండా వున్నాను. భీమునికింత సదుద్దేశముందని తలువను. వుంటే చాలా సంతోషం. కానీ....

“సుశర్మ. కాస్త నిదానించు. నీ శంకల్ని ప్రక్కన పెట్టు. జరిగిందేదో జరిగింది. జరిగిన ప్రతిదానికి ఎవరో కారణమౌతారు. కారణంలేని కార్యముండదు. కార్యం లేక కారణముండదు. కాబట్టి...

“మీ ఇష్టం....!” ఇద్దరు నదీస్నానానికి వెళ్ళారు. హమ్మయ్య. పరిస్థితి సద్దు మణిగిందనుకున్నాడు వాసుదేవుడు. ఇక భీముని చాలా జాగ్రత్తగా వుండమని హెచ్చరించాలి. అలాగే తొందరపాటు నిర్ణయాలు - ఆశలు, ఆశయాలతో కొంపల మీదకు, మనుష్యుల పీకలమీదకు తేరాదని గట్టిగా అదుపు చెయ్యాలి. అమ్మో! ఎంత ఆడదానిపై ఆశ వున్నా, ఆ రాక్షస ప్రేమికుడు కాడు, కాముకుడు, ఈ రకంగా ప్రవర్తించడం ప్రమాదకరమని తలంచాడు.

కాస్సేపటికి వళ్ళు విరుచుకుంటూ బద్ధకంగా కళ్ళు తెరిచాడు భీమన్న. గబగబ లేచి కాలకృత్యాలు తీర్చుకుని గంగా స్నానం చేసాడు. తల్లిని కలిసాడు. అక్కడున్న కాశీ రాకుమార్తె జాలంధరను చూడటమొక నెపంగా ప్రత్యేకించి వెళ్ళాడు.

ఉభయకుశలోపరి, తదుపరి జలాంధర వారి పడవలు మున్గిపోవడం, భీముడు రక్షించడం వగైరాలన్ని చెప్పింది. వారికి కష్టమొచ్చింది. ఇప్పుడెలాగ ? అని ఆ తల్లి బాధపడుతుంటే విన్న భీముడు "నదీ మార్గం కుదరకపోతే మనం వెళ్ళే మార్గంలో వస్తారు. ఇందులో పోయేదేముంది ? అదే తన ఆశగా భీమన్న చెబుతాడు."

"పోనీలే. పరమ కరుణామయుడైన భగవంతుడు మంచిలో మంచి, చెడులో కూడా మంచి చేస్తాడు. అయిన దానికి అనవసరంగా కూర్చుని బాధపడకుండా, నకులుని పంపి ఏకచక్రపురం నుండి, రాజవంశీకులకు తగిన పడవ తెప్పించే ప్రయత్నం చేయడం, ఎక్కడైనా మనము మన ఆధిక్యత చెల్లుతాయనడానికి నిదర్శనమయింది. చాలా సంతోషమంది" సంతృప్తిపడుతూ తల్లి కుంతి.

# నగర ప్రవేశం

**ఆ**కాశం నిర్మలంగా వుంది.

వేదవేత్తలు, పండితులు, వందిమాగధులు కురువృద్ధులు, మల్లులు, సేవకులు, సకల కళా విశారదులు, ఎందరో.... ఎందరో... అక్కడ పాండు పుత్రులను ఆహ్వానించడానికి ప్రత్యేకమైన వేదికపై సిద్ధంగా వున్నారు. అందులో-

ఆచార్య ద్రోణులు,కృపాచార్యులు, కులపురోహితులు, సోమదత్తులెందరో వున్నారు. అందరిలో అక్కడ భీమునికి కనబడనిది, దుశ్శాసన, కర్ణ - ఆచార్య పుత్రులు - దుర్యోధన మిత్రహితుడైన అశ్వత్థామ. వారు గూడా వుండి, ఈ వైభవాన్ని పాండుపుత్రుల ప్రాభవాన్ని చూడాల్సిందని, పాపం.... వాళ్ళనా అదృష్టం వరించలేదని, భీముడు తలిచాడు.

మరోప్రక్క, అంతఃపుర స్త్రీలు, యువరాణి భానుమతీదేవి, ఆమె ప్రక్కన జాలంధర... వగైరా ఎందరో వున్నారు. జాలంధరిని చూసిన భీముని కన్నులు

మిలమిల మెరిసాయి. పెద్ద వుత్సవంలా వచ్చిన - పాంచాలీ సహిత పాండుపుత్రుల రాక పురప్రజలకెంతో ఆనందాయకమైంది. బిగ్గరగా ఎవరో చెప్పినట్లు - "పాండుపుత్రులకు జై! యుధిష్ఠర, భీమార్జున, నకుల సహదేవులకు జై!" అనే జయజయ ధ్వనులు, మిన్నుముట్టాయి.

జాతరవంటి ఈ సంబరానికి, సాంప్రదాయ స్వాగతానికి భీముడు పొంగిపోయాడు. ముందు భీముడు, ఆ తదుపరి రథాశ్వ - గజదళాల వారు ఒక్కొక్కరే క్రిందకు దిగారు. అతిరథ, మహారథులతో బలరాముడు, ఆ తదుపరి కుంతీమాత, యుదిష్ఠరుడు తమ ధర్మపత్ని ద్రౌపదితోనూతన వధూవరుల దుస్తులతో ప్రకాశిస్తూంటే -

యుధిష్ఠరుడు చేతులలో నారికేళంతో రథం నుండి రాగానే, ధర్మవేత్త యుధిష్ఠరులవారికి జయహో, జయహో అనే పొగడ్తలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో, వీరణాలు, పూరణాలు, అలంకరించిన మంగళతోరణాలు, మహాద్భుతంగా తీర్చిదిద్దబడి, స్వాగతిస్తున్నాయి. ఆ సంరంభమే సంరంభము. కోలాహలమే కోలాహలము. అదొక సంబరం. అదొక జాతర. అసూయాగ్రస్తుల కంటిలో నలక. చెప్పులో రాయి. చెవిలో జోరీగ.

కుల పురోహితులు వైదిక మంత్రాలతో ఆహ్వానిస్తూంటే - పూర్ణకుంభాలతో బ్రాహ్మణోత్తములు, ఇటు సోమదత్తులు, అటు ధౌమ్యులవారు వేదమంత్రాలతో ఆశీస్సులనందచేస్తూ

స్వస్తిర్భవతు, శాంతిర్భవస్తు
సకల మంగళమస్తు
కల్యాణమస్తు, శుభమస్తు

శతమానం భవతి, శతాయుఃపురుషః - అని దీవిస్తున్నారు. ఓం రాజాధిరాజాయ... అని సుశ్వర వేదగానం వినిపిస్తూంటే - ఎందరో ఆనందించారు. కొందరు మాత్రమే చూడలేక, కన-వినలేక కలత చెందారు.

దుర్యోధనాదులు సాంప్రదాయబద్ధంగా వంశజేష్ఠుని ఆహ్వానించ, ముందుకు నడిచారు. అన్నగార్కి, వదినగార్కి వందనం. గురుదేవులకు వందనం.

సాంప్రదాయవాదులు ఆచార, ధర్మ-కర్మ పరులకు వందనం" అని మిన్నుముట్టే హర్షధ్వనులు, జయజయధ్వనులతో మార్మ్రోగుతుంటే, విధి లేక అందరితోపాటు కొందరు తమ గొంతుకలను కూడా కల్పి, మర్యాద నిల్పుకున్నారు.

కృష్ణార్జునులు వెంట రాగా, తమ్ముళ్ళు నకుల సహదేవులు అనుసరించగా, భీమన్న ముందుకు ఎంతో ఠీవిగా నడుస్తున్నాడు. దుర్యోధనుని వైపు బాల్య-కుత్ర చేష్టలను మరువనట్లు నడుస్తూ వస్తున్నాడా భీముడు. ఈ సమయంలోనే, భీముని చెయ్యి పట్టుకుని, తన సహజ చిరునవ్వుల మందహాసంతో వచ్చే కృష్ణునిపై అందరి దృష్టి నిలిచింది.

"కృష్ణా! వాసుదేవా! గోవిందా! గోవర్ధన గిరిధారీ, బృందావన విహారీ, ధర్మోద్ధారకా! అని ఎందరో, ఎన్నెన్నో రకాల - ఆ యశోదానందనుని ఆ"నంద" యశోదల ముద్దులపట్టిని, దేవకీసుతుని, యదువంశమౌళిని ప్రస్తుతిస్తూంటే, ఎందరో పులకించారు. మరెందరో హర్షపులకితగాత్రాలతో స్తోత్రపాఠాల నర్పించారు.

బలరామ, యుధిష్ఠరులు, ఇతర పెద్దలను కలువడానికి ప్రక్కకు నడువగా, ఆ ప్రక్కనే వున్న కృష్ణుని సంభావించడానికి దుర్యోధనునికి మనస్కరించలేదు. ఈనాటి తన క్షోభకు కారణం - కృష్ణుడేనని, తన ఆశలన్నీ అడియాసలు చేసి, కుంతీపుత్రులను బ్రతికించి, స్వయంవరానికి రప్పించి, తననవమానపరిచి -

ఈనాడు - ఈ రకంగా వారికి స్వాగత సత్కారాలనివ్వడానికి, ముఖ్య కారకుడైన ఈ నంద నందనుని అందరు మెచ్చుకునే ఆ అవతార - ధర్మమూర్తిని పలుకరించడానికి, దగ్గరకు తీసుకోవడానికి విముఖతను ప్రదర్శిస్తున్నాడు.

సాహసాలలో గొప్పవాడు, వయస్సులో చెప్పుకునేందుకు చిన్నవాడయిన కృష్ణుడు, దుర్యోధనుని కవ్వించడానికన్నట్లు, ఆతని పెద్దరికాన్ని గౌరవిస్తూ అతని పెద్ద మనసుతో, దుర్యోధనుని పాదాలకు నమస్కరించాడు. దీనికి దుర్యోధనుడు అదిరిపోయాడు. ప్రేక్షకులు, వీక్షకులు, సభికులు ఆశ్చర్యపోతున్నారు.

ఇప్పుడు వారి దృష్టిలో తాను స్పందించక దుర్మార్గుడు కాదల్చుకోలేక, ఆ క్షణంలోనే కృష్ణుని విధిలేక దగ్గరకు తీసుకుని, కౌగలించుకుని, ఆతని మెడలో హారముంచాడు. దీంతో "జయజయ కృష్ణా! జయ వాసుదేవా!" అన్న హర్షధ్వనులు, అందరి మనసులలో శాశ్వతానందాన్ని, పులకరింతను కలుగచేసాయి.

మళ్ళీ దుర్యోధనుడికి మరో ఇబ్బంది ఎదురయింది.

కృష్ణుడు తెలివిగా దుర్యోధనుని గౌరవం పొంది, ప్రక్కకు తప్పుకోగానే, మహాబలశాలి, తనకెదురు వీరుడైన భీముడు కంటబడ్డాడు. ఈ పీడనెలాగ వదిలించుకోవాలి. నా ప్రాణానికొచ్చిందన్న అసహనంతో దుర్యోధనుడు కుతకుతలాడుతున్నాడు.

భీముడిదంతా గమనిస్తున్నాడు. ఆ మూర్ఖుని కళ్ళు తెరచుకునేటట్లు చెయ్యాలని, తనే ముందడుగు వేసాడు. తమకేవిధమైన కోపతాపాలు, అసూయాద్వేషాలు లేనట్లు, అక్కడ మల్లులను, ఇతర వస్తాదులను అభినందిస్తూ చేతులు ఎత్తాడు. వాళ్ళందరు కూడ భీముని అభినందిస్తూ హర్షధ్వానాలు చేసారు. అందరిలోకి పెద్దవాడయిన బలియా, భీముని అభిమానము, ప్రేమ, బలశక్తుల దర్పం తెలియబరుస్తూంటే, అందరు భీముని చుట్టుముట్టారు.

ఇదంతా చూస్తూ దుర్యోధనుడు నివ్వెరబోయాడు. తననెటువంటి హీనస్థితి లోకి తన తెలివితేటలతో, బుర్రలేని భీముడనుకునేవాడు, నెట్టాడో, తలచుకుని, సిగ్గుతో కృంగిపోయాడు. అయోమయావస్థకు గురయ్యాడు.

ఎప్పుడైతే తనను బలియా అభినందించాడో, ఆ వెంటనే భీముడు "సోదరా!" అంటూ దుర్యోధనునిపై ఆప్యాయంగా చెయ్యివేసాడు. ఇద్దరు కలిసి నడుస్తున్నారు. భగవంతుడెంత మంచివాడో, మనల్ని మళ్ళీ కలిపాడు. సంతోషాన్ని ప్రసాదించాడు. ఇది విన్నవారందరు కూడా నవ్వకుండా వుండలేకపోయారు.

అటు కృష్ణుడు, ఇటు భీముడు - దుర్యోధనుని అసహాయస్థితిలోకి నెట్టేసరికి, అతనికి ప్రతిస్పందించక తప్పలేదు. ఇదే క్షణంలో అర్జునుడు, పెద్దవాడిగా దుర్యోధనుని పాదాలకు నమస్కరించడంతో, ఆప్యాయంగా అతన్ని దగ్గరకు తీసుకున్నాడు.

ఒకరికొకరు కబుర్లు, పలకరింపులు, హాస్యచతురోక్తులలో కాలం గడుపుతున్న తరుణంలో, యువరాణి భానుమతి, కాబోయే మహారాణి ద్రౌపదిని ఆప్యాయంగా పలుకరించింది, ప్రేమతో దగ్గరకు తీసుకుని సాంప్రదాయ పద్ధతిలో స్వాగతించింది. ద్రౌపది కళ్ళలోకి చూసిన భానుమతి ఎంతో ఆనందపడింది. ఇన్నాల్టికి తనకు తోడు, తోటికోడలు లభించిందని, మురిసిపోయింది.

ఉభయకుశలోపరి పరిచయాలనంతరం, వధూవరుల, వివాహ తతంగ మర్యాదలు ఘనంగా మొదలయ్యాయి. ఇందుకు సంబంధించిన ఆటలు-పాటలు, మేళతాళాల మంగళవాయిద్యాల, రాజోపచారాల మధ్య ఘనంగా ప్రారంభ మయ్యాయి. భరతవంశానికి పెద్దకోడలు కదా, మరి... ఆ మాత్రం... అఖండ గౌరవమివ్వద్దూ! అది సామాన్యం.

ప్రముఖుల మధ్యలో యుధిష్టరుడు, దుర్యోధనుడు, బలరామ-కృష్ణులు కదలిరాగా, రాజకుటుంబరాణీవాసం తరపున భానుమతీ, ద్రౌపది ఇతర అధికార, అనధికార పెద్దలు, వివిధ వాయిద్యాలు, కళాకారులు, ప్రదర్శకులు, వీరులు-శూరులు... అబ్బో, ఎంతో అట్టహాసంగా వుందా సంబరం, సంరంభం.

భీమాదులు ఒక ప్రక్కన, సహదేవుడు మరొక ప్రక్కన, యుధిష్టర, ద్రౌపది, అర్జునాదులొక బృందంగా - ఒక్కొక్కరే తమ తమ బాధ్యతలుగా మహామాతను, పితామహుడు భీష్మలవారిని, పెదతండ్రి-మహారాజు ధృతరాష్ట్రులవారిని, పెద్ద తల్లి మహారాణి గాంధారీమాతను - సభక్తియుతంగా దర్శించి, తమ భక్తిప్రపత్తుల వందనాలర్పించారు. సదా వారి ఆశీస్సులను తమపై ప్రసరింప చెయ్యమని ప్రత్యేకంగా కోరారు.

జాలంధరిని చూడాలి. ఇది భీముని మనసులోని కోరిక. ఆ కాశీరాకుమారి కూడా, మహారాజు వృకోదరుని కలుసుకోవాలని కోరుకుంటుంది.

అర్ధరాత్రి. చల్లని వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా వుంది. బలియాను కలవాలి. అమ్మ పుట్టింటి నుంచి వచ్చిన వ్యక్తి, జన్మించిన తదాది తనను కంటికి రెప్పలా కాపాడిన వ్యక్తి, నిజమైన నమ్మినబంటు, ఆతనింటికి వెళ్ళాడు.

అతని దగ్గర దాచవలసినదేమీ లేదు. అమ్మ పుట్టిల్లు మేనమామకా... అన్నట్లు, ఆ మేనమామకన్న ఈ బలియా - ఎంతో విశ్వాసపాత్రుడు ప్రాణప్రదుడు. అతనికి విషయమంతా చెప్పాడు. తలవూపాడు. తనపై నమ్మక ముంచుకోమన్నాడు.

ఇక్కడ - అందరు మహామాత, అదే.... తాతమ్మను తాతగార్కి, పెద్దతండ్రి, పెద్దమ్మ, విదురాది ఇతర ముఖ్యులను దర్శించి, వారి ఆశీస్సులు అందుకుని పాండుపుత్రులు తమ ధర్మపత్ని ద్రౌపదితో తమ మందిరానికి విచ్చేసారు.

యుధిష్టరుడు, ద్రౌపది తన శయనాగారాన్ని చేరారు. మిగిలినవారలు ప్రత్యేక మందిరంలో నిద్రిస్తున్నారు.

అందరు నిద్రించేవరకు, తాను నిద్రిస్తున్నట్లు నటించిన భీముడు, మిగిలిన సోదరులు గురకలు మొదలుపెట్టగానే, బలియా వద్దకు ఆతని మనుమడు గోపీతో బయలుదేరాడు. అక్కడ, భీముని చూస్తూనే సంజ్ఞతో ఒక గది చూపాడు. అందులో కొందరు పరిచారకల బృందం వుంది. భీమున్ని చూస్తూనే ఇద్దరు నమస్కరించి ప్రక్కకు తప్పుకున్నారు. మిగిలిన వ్యక్తి మెల్లిగా రెండుచేతులతో నమస్కరించి నిల్చుంది.

"ఏమిటీ, నువ్వేనా రాజా వృకోదరుని చూడాలనుకుంది. అతనికి ఆహార మివ్వాలని తలచింది. మెల్లిగా తలవూపింది.

ఎంత సాహసం చేసావు ? ఇంత ప్రమాద బాధ్యత తీసుకోవడానికి గల కారణం ? త్వరగా చెప్పు. ఎవరైనా అనుమానిస్తే, నేను మగవాడిని. నాకేం ఫర్వాలేదు. వచ్చే ప్రమాదమల్లా నీకే. తెలివిగా నిన్ను రక్షించుకోవాలి. విషయ మడుగుతున్నాడు.

"రాజా వృకోదరులు నా చెంత వుండగా, నాకు వచ్చిన ప్రమాదమేమీ లేదని ధైర్యంగా చెప్పిన ఆ జలాంధరిని, ఇంతకి విషయం చెప్పు!" అనగా -

"చెప్పడానికేముంది, చూడాలనిపించింది. ఇలాగ వచ్చాను" అంది.

"ఈ హరికథలు వినడానికి, నేను పిచ్చివాడిని కాను. చెవిలో పువ్వులు పెట్టుకోలేదు. ఇంత ప్రమాదాన్ని మూట గట్టుకుని నువ్వు వచ్చావంటే.... అసలు విషయం చెప్పు." తెలుసుకోవాలని, వీలయితే పరిష్కరించాలనే కుతూహలంతో అడుగుతున్నాడు. మళ్ళీ అతనే - ఆ పెద్దమ్మరేఖ నాకంతా చెప్పింది.

"సరే. వినండి. నేను ఆ వాసుదేవుని కలుసుకోవాలి. అందుకు మీ సహాయం కావాలి ?"

"ఎందుకట.... ?! పైగా. ఇందులో నా అవసరం, ప్రమేయమెందుకు ? వచ్చిన వారినల్లా చిరునవ్వుల వెన్నెలలు చిందిస్తూ, అభిమానించే వాళ్ళను, ఆరాధకులను, సందర్శకులను, సదా పలుకరించే ఆ గోవిందుడు, అందరివాడు. అందని వాడు కాదే ?! మరి....." అన్నాడు క్షణమాగి -

"చాలామంది స్త్రీలు, ఆయనను సందర్శించి, సంతాన వేణుగోపాల స్వామిగా తలచి, సంతానమివ్వమని అడుగుతారు. నువ్వు అందుకేనా... ?"

"చాల్లెండి. వెటకారం. అవతల కొంపలు మున్గుతుంటే, పడవ ముంచినట్లు మమ్మ నట్టేట్లో ముంచి, ఏవిటీ పరిహాసాలు ?" కొద్దిగా కోపాన్ని జాలంధరి అభినయించింది.

"సరి, సరి అసలు విషయానికి, రా!" ఇప్పుడు అలకలు తీర్చే సమయం లేదు. కాదు.

"అయితే ముందు నేనా గోవిందుని దర్శిచి ముందు నాకో భర్తను అత్యవసరంగా ప్రసాదించమని కోరాలి. ఆ తర్వాత.... అసలైన విషయం మా అక్క భానుమతి యువరాణి తన సందేశాన్ని సోదరుడు, ~~ఈ~~ గోపాలకృష్ణునికి అందించి, ఆమెను తన దయనీయ స్థితి నుండి సంరక్షించమని ప్రార్థించాలి.

"అంత కష్టమేమొచ్చిందామెకు ?" భ్రుకుటి ముడివేసి, పరిహాసాలు ప్రక్కనబెట్టి మరీ అడిగాడు.

అప్పుడు జరిగినదంతా మనసు విప్పి భీముని ముందు పరచిందీ కాశీరాజ తనయ. ఇదంతా మూడోకంటివానికి తెలియనంత రహస్యంగా జరిగిపోవాలి. ఇందులో నా పాత్ర, మీ ప్రమేయం, మా అక్క ఆసక్తి - ఏ రకంగా చూసినా బయటికి రాకూడదు. అంత చాకచక్యంగా మొత్తం వ్యవహారం నడిచిపోవాలి.

అంతావిన్న భీముడు "మా బంగారు తల్లీ. వాడెవడో చెప్పినట్లు.... ఇది బంగారు గొడ్డలి. దీనికి వజ్రాలు తాపడం చెయ్యబడ్డాయి. ఇటువంటిది మూడులోకాలలోనే కాదు. ఆఖరికి - ఆ హరి - హరుల వద్ద కూడా వుండదు. అటువంటిది నీకిస్తాను. నీ తల నరుక్కోమన్నాడుట. అలాగ వుంది నీ కథ. చచ్చిన తర్వాత - ఆ గొడ్డలి ఎంత విలువైనదైతేనేమి సర్వలోకాలలోని సంపదలు అందులో నిక్షిప్తమై వుంటే లాభమేమిటి ?

"రాజా! ఫర్వాలేదు. ఎవరో అన్నట్లు మీకు బుర్రలేదనుకోవడం, బుద్ధిలేని వారి ఆలోచన. వుండవలసిన దానికన్నా ఎక్కువే వుంది. అందులో ఎకసక్కాలకు

చోటు వుంది. సమస్యను ప్రక్కకు మళ్ళించే నేర్పు వుంది'' అంది ఆ కాశీరాజు తనయ జాలంధరి! సందు దొరికిందని భీముని ఆట పట్టిస్తూ -

"అది సరే - వాడు, దుర్యోధనుడు నా శత్రువు. జరిగిందేదో జరిగిపోయింది. నిన్న ఎదురుపడితే కనీసం మర్యాదపూర్వకంగా కూడా పలుకరించనే పలుకరించకుండా, సున్నా మొహం పెట్టుకున్నాడా పిడతలో పుట్టినవాడు. అటువంటి వాడి పెళ్ళానికి.....?!''

"ఆర్యపుత్రా! మీరు ఏం చేసినా అది నాకోసం. నాకై చేస్తున్నారు. మిగిలినది గతజలసేతు బంధనాలు. అవసర మంచినీళ్ళు బావుల గూర్చి ఆలోచించకండి. దయచేసి...

"భలే దొరికావు నాకు. అందుకనే ఆడదానిచెంత అధికుల మనరాదన్నది ఆర్యోక్తి కాదు! పెద్దలసూక్తి. ఇంతకీ.... ఏం చెయ్యాలంటావు ? నా తండ్రి సాక్షిగా, నా సోదరికి సాయం చేస్తాను. ఆమె సందేశాన్ని వాసుదేవునకందిస్తానని చెప్పాను. కనుక - ఎవరినైనా రక్షించగల రాజా వృకోదరుడు, తాను పరిణయం చేసుకోవాలనుకున్న - "స్వయం'వర'' - పాణిగ్రాహి - జాలంధారికోసం ఏమైనా చేస్తాడు.

ఆ ఆశతోనే ఇక్కడికి వచ్చాను. అది పేరాశ. కుదరదు వెళ్ళిపొమ్మంటే, ఎవరినీ వట్టి చేతులతో పంపని, వృకోదరుని భీరత్వానికి, అటువంటివానికి మనసు ఇచ్చినందులకు, మరీ మరీ సిగ్గుపడుతూ, మరెప్పుడు జీవితంలో ఇటువంటి సాహసాలు చెయ్యకూడదని బలంగా నిర్ణయించుకుంటూ, నిరాశతో, ఒట్టి చేతులతో, ఆశగా వచ్చినదానిని, అది వమ్మయి వుసూరుమంటూ వెళ్ళిపోతాను. ఆడదాన్ని ఇంతకుమించి -

ఆకారాన్ని చూసి, పేరునుబట్టి.... ఏదో గొప్పవాడు, కొండలు పిండి చెయ్యడంతోపాటు అనాథలను, అసహాయులను, ఆశ్రితులను రక్షిస్తాడని, పొరపాటున - ఆ దురుద్దేశంతో ఎవర్ని రావద్దని - ఆశా - పేరాశలు, నిరాశలు కాకుండా చూసుకోమని, పేరు చెప్పకపోయినా లక్షణాలు చెప్పి, మరీ చేరవద్దని, తెలిసిన వారందరికి, అడిగినా, అడగకపోయినా, తప్పక చెబుతాను. వెడతానని లేచిందా ఆడపులి.

ఆ దెబ్బకు అదిరిపోయి, నోరు వెతకలేసేసాడు, అంత భీముడు ఈ ఆడపులి ముందు - పిల్లిపిల్లగా మారిపోయి... ?! ఇక విధిలేని పరిస్థితులలో

పరువు దక్కించుకోవడానికి - "సరే. ఇంతకు నువ్వు ఆ గోవిందుని కలుసుకోవాలి కదా. రేపు రాత్రి ఆ వాసుదేవుడిక్కడికి వస్తాడు. మరి నువ్వో.... అనగా -

"నేను తప్పక వస్తాను. మా వృకోదర మహారాజు గౌరవానికి తలవొగ్గి ఆయన కనుసన్నలలో నడుస్తానని పొంగి పరవశించినట్లు అంది."

"ఆ బలియా! రేపు సంధ్యాది కార్యక్రమాలు పూర్తయ్యాక నేను గోపీతో కబురు పంపుతాను. అప్పుడు... అర్థమైనట్లు తలూపుతాడు. తప్పక మీ సేవ చేసుకునే అదృష్టం కల్గినందులకు మహాసంతోషంగా వుందంటాడు.

అప్పుడే - వీళ్ళను - ఆ వెళ్ళే ఆడవాళ్ళను గమనిస్తున్నట్లు, అనుసరిస్తున్నట్లుగా ఓ ఆకారాన్ని చూసినవాడు, గబుక్కున అతన్ని ఒడిసి పట్టుకుని ఒక్కటిచ్చాడు. మరొకరు గుర్తుపట్టడానికి వీల్లేకుండా పళ్ళతో, "ఎవరు నువ్వు ? ఎందుకు వాళ్లను అనుసరిస్తున్నావు ?" అడుగుతాడు.

భీమునికి సమాధానమివ్వకుండా, ఆ ఆగంతకుడు, పట్టు తప్పించుకుని పారిపోవాలని ప్రయత్నిస్తాడు. పదివేల ఏనుగుల అద్భుత మహాశక్తి సంపన్నుడైన భీముని "ఉడుం" పట్టునుండి తప్పించుకోవడమా ఆగంతకునికి సాధ్యం కాలేదు.

జాలంధర, రేఖ దూరంగా, వెళ్ళేవరకు అతన్ని ఒడిసి పట్టుకున్న భీముడు ఒక్కటిచ్చాడు. ఆ దెబ్బకు వాడి పళ్ళు కదిలాయి. కళ్ళు పచ్చబడ్డాయి. తలదిమ్మెక్కి, ఏమయిందో, ఏమవుతుందో అర్థంకాని అయోమయంలో పడ్డాడా ఆగంతకుడు.

"చెప్పు.... ఇంకో దెబ్బ పడితే నెత్తురు కక్కుకుని చస్తావన్నట్లు హెచ్చరిస్తున్నాడు. అయినా అప్పటికే భీముని చేతివ్రేళ్ళు, ఆ ఆగంతకుని కంఠం చుట్టూ బిగుసుకుంటున్నాయి. ఇంకొద్దిగా నొక్కాడో వీడిపని, హుష్. కాకి....! జీవుడెక్కడికి పోతాడో, దేవుడో.... దెయ్యమో... ఎవరి పాదాల చెంత వ్రాలతాడో... ఆ దేవునికి గూడ తెలియని పరిస్థితి - స్థితి - అవుతుంది.

అప్పుడిక విధిలేక ... నేను, నేను...!"

"ఊ...!" అన్నాడు.

"శకుని, సేవకుడను. వారి ఆదేశంతో, వీళ్ళను అనుసరించాను. వీళ్ళనే కాదు రాజాంతఃపురంలో, భానుమతి యువరాణి చెంత జరిగే ప్రతి విషయం మాకు తెలుస్తుంది. ఆ రకంగా ఏర్పాట్లు జరిగాయి" దిక్కుతోచని స్థితిలో చెప్పేసాడు.

"ఇక పైన అలాగ చెయ్యకూడదు. అనుక్షణం డేగకళ్ళతో, అదృశ్య రూపంలో నా మనుషులు నిన్ను గమనిస్తుంటారు. పొరపాటు జరిగిందో, గోవిందా! తెలిసిందా!"

"ప్రభూ! నేను నిజం చెబుతున్నాను, నా మాట నమ్మండి."

"మరి వాళ్లెవరో... నీకు తెలుసా ?"

"ఒకరు, ఆ ముసిలి పెద్దమ్మ... రేఖ.... రెండు .... ఎవరామె ?"

"ఏం నాటకాలాడుతున్నావా ?' మళ్ళీ ఓ పట్టుపట్టాడు భీముడు.

"ప్రభూ! ప్రభూ.... రక్షించండి. మిమ్ము రక్షించే మార్గం చెబుతున్నాను."

"నన్ను.... నువ్వు...!" గట్టిగా నవ్వాడు.

"నవ్వకండి ప్రభూ! మీరిక్కడ నుండి అత్యవసరంగా అఘోరి కుటీరానికి వెళ్ళిపోండి. మీరు రక్షించబడతారు. కాదో....రేపు వచ్చే పున్నమి నాటికి, మీ ప్రాణాలు అనంత వాయువుల్లో కలవడం ఖాయం. నా మాట నమ్మండి. నేను నిజం చెబుతున్నాను. సత్యం, సత్యమని ఖచ్చితంగా గట్టిగా చెబుతున్నాడు. చెప్పాడు కూడా!

"అలాగా, అయితే బయలుదేరు. ~~ఈ~~ మధ్యలో ఏమైనా పిచ్చిపనులు చేసావో... నాకంటే ముందు దిక్కులేని హీనాతిహీనమైన చావును పొందడం ఖాయ"మన్నాడు భీముడు.



# అంతా కుట్ర

వీళ్ళు అఘోరి కుటీరానికి చేరారు.

లోపలకొకసారి చూసి ఆశ్చర్యపోయారు.

అక్కడ - దుశ్శాసనుడు, శకుని వున్నారు. వాళ్ళ వద్ద - ఒక చిన్నపిల్లవాడో/ బాలికో... మత్తులో మొత్తానికి ఎవరో వున్నారు. అది నిద్రో, మరొకటో అర్థం కావడం లేదు.

ఆ సమయంలోనే మధ్యవయస్కుడు, విభూతి దేహధారియైన వ్యక్తి - మూడు బొమ్మలను గీస్తూ "చెప్పండి. ముందు మీ మొదటి శత్రువెవరు ?" అడుగుతున్నాడు.

"అతడు వృద్ధ గాంగేయుడు. మా పాలిట శని. వాడు చస్తే, మాకందరికి సుఖశాంతులన్నాడు." అతడు - అదే - ఆ చెప్పినవాడు దుశ్శాసనుడు.

"అతనికి సంబంధించిన ఏదైనా వస్తువు లేదా గుర్తేమైనా మీ దగ్గర వుందా ?" అఘోరి ప్రశ్న -

"ఆ.... ఆ.... వుంది. ఇది అతని తెల్లగడ్డం వెంట్రుక...! దుశ్శాసనుడిచ్చాడు.

"ఇంకో వ్యక్తి....!" అఘోరి అడుగుతున్నాడు.

"అతడు... అందరు ఆరాధించి, ప్రేమించి, పూజించే పరంధాముడనే ధర్మావతారుడు, అనాథ రక్షకుడు...... కృష్ణుడు..... వసుదేవసుతుడు..... వాసుదేవుడు...!" ఇది - అతని మెడలోని పూలహారం నుండి సంపాదించిన పువ్వు.... ఈ మారు అడగకుండానే దుశ్శాసనుడు సమాధానం చెప్పాడు. కృష్ణునికి సంబంధించిన పుష్పాన్నిచ్చాడు.

"ఆ మూడో వ్యక్తి.... గంభీరంగా అడిగాడు, తానేదో ఘనవిజయం సాధించినంత గొప్పగా!"

"అతడు... భీముడు! మహాబలవంతుడు. ఘనభుజుడు. అసామాన్యుడు... అని... ఇది అతని విస్తరిలోని అన్నం మెతుకు." అని దుశ్శాసనుడిచ్చాడు.

అవన్నీ ఒక పద్ధతిలో త్రిశూలం వలె త్రికోణంలో వుంచి - ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు. కొంత తడవాగిన తదుపరి కళ్ళు తెరచి, రేపు పున్నమిలోగా ఇద్దరు మాత్రం తప్పక మరణిస్తున్నారు. వారు... ఇప్పుడు మనం గుర్తించినవాళ్ళు అవునో, కాదో చెప్పలేను కానీ, మొత్తానికి, మీ మాటలలో.... ఇరువురు మాత్రం చంపబడుతున్నారు.

ఇద్దరు మాత్రం ఖాయం. మూడోవ్యక్తి అనుమానం. ఎందుకంటే అతని ప్రాణాలు మన చేతుల్లో లేవు. కానీ ఆతడు శక్తి స్వరూపుడు. జగన్మాత ప్రియుడు. అతని చెంత మన ప్రయత్నాలు ఫలించకపోవును. "సందేహాస్పదంగా చెబుతున్నాడు. ఇవతలి వీళ్ళ ప్రాణాలు కొడిగడుతున్నట్లుగా వున్నాయి." ఆ తల్లి కరుణ లేకపోతే.... సంశయంగా చెబుతున్నాడు.

"ఆ తల్లి కరుణెలాగ లభిస్తుంది ?" శకుని, దుశ్శాసనులు ఆత్రంగా అడుగుతున్నారు. "మన ప్రయత్నం మనం చెయ్యాలి. కైలాస శిఖరానికి వెళ్ళి, అక్కడ ఆ తల్లిని గూర్చి పూజలు చెయ్యాలి. మీరు వెడతానంటే చెప్పండి. మిగిలిన విషయాలు నేను చూసుకుంటానన్నాడా అఘోరి.

"తప్పక. వెడతామన్నారు - అఘోరి సహకారాన్ని - దుశ్శాసన - శకునిలు అర్థించారు.

ఇదంతా చడీ చప్పుడు కాకుండా భీముడు తన కళ్ళతో గమనిస్తున్నాడు.

★★★★

**"అధర్మమ్ము పెచ్చు పెరిగి, హానికలుగ అవనియందు**
**అవతరింతు నీ ధరన, ధర్మరక్షణ మెప్పుడు చేయ!?**

అన్న ఆ భగవంతుడు కూడా, అధర్మానికి తలవంచాల్సి వస్తుందనుకుంటాను. అయినా ధర్మహానికి, అవని నాశనానికి ఏ ఒక్కరు తలపడలేరు. ఏ ఒక్కరివల్లన సాధ్యపడదు. ఇది సత్యం, సత్యం - సత్యం!!

మూడో వ్యక్తి - మన చేతుల్లో హతమవడు కాబట్టి కైలాసగిరికి వెడదాం. అక్కడనుండి అమ్మవారి ఆశీస్సులతో - పట్టిన పట్టు సాధించుకుందామన్న అఘోరి హెచ్చరికతో, దుశ్శాసన - శకుని, అఘోరిలు కైలాసగిరికి బయలుదేరారు.

"ముందు మీకు ధైర్యం, ఆపైన విశ్వాసం, ఆ తదుపరి నమ్మకం కావాలి. అప్పుడే మనమేపనినైనా సాధించగల్గుతాము. వీటికి బహు శ్రమలు పడాల్సి వస్తుంది. తీరా కొంతమేర వచ్చి "అమ్మో!" అంటే నిజమైన అగచాట్ల పాలవుతాం. ఆలోచించుకొమ్మని" అఘోరి హెచ్చరించాడు.

మేము దేనికైనా సిద్ధమన్నారు వాళ్ళు.

అప్పుడు - అఘోరి - ఒక పాత్రలో మరుగుతున్న కషాయాన్ని తీసి ప్రక్కన పెట్టాడు. ఆ వెంటనే ప్రక్కనున్న ఆ పసివాడి గొంతుక కోసి, ఆ వచ్చిన రక్తాన్ని అమ్మవారిపైన, శంకరుని లింగంపైన చిందించాడు. కొన్ని రక్తపుబొట్లను తన నుదుటిపై విభూతివలె ధరించాడు. మరికొంత రక్తాన్ని, ఆ దుశ్శాసన, శకునిల నుదుటిపై వ్రాసాడు.

ఇది జరిగేటంతసేపు, క్షుద్రమంత్రాలేవో చదువుతూనే వున్నాడఘోరి. ఇందాక మరిగిన కషాయాన్ని తాను కొంత త్రాగి, మిగిలింది ఆ దుష్టులచేత త్రాగించాడు. ఇదంతా భయసంభ్రమాలతో భీముడు గమనిస్తున్నాడు. చూస్తుండగా ఈ ప్రక్రియ వలన శకుని, దుశ్శాసనుల కళ్ళు విచ్చుకున్నాయి. ఎర్రగా కాంతివంతంగా తయారయ్యాయి. క్షణమాగి "ఎలాగ వుంది ?" అఘోరి అడిగాడు.

తల తిరుగుతుంది. వెన్నులో చలి పుడుతుందన్నాడు దుశ్శాసనుడు.

"నాకు ఎర్రటి, ఆకుపచ్చ చక్రాలు గుండ్రంగా కనబడుతున్నాయన్నాడు శకుని. తలవూపిన అఘోరి త్రిశూలం తీసుకుని వాళ్ళ నుదుటిని తాకించాడు.

"ఇప్పుడు చెప్పండి. ఏం కనబడుతుంది ? ఏం చూస్తున్నారు ?" అన్నవాడు తానే-

"గాలిలో ఎగురుతూ వచ్చే రథం కనబడుతుంది, కదూ... ?! అది మిమ్మ జగజ్జనని దుర్గాదేవి తీసుకువెడుతుంది దగ్గరకు అవునా ?!"

"ఆ.... ఆ.... వస్తూంది, వస్తూంది." కొండల్లో ప్రతిధ్వనిస్తున్నట్లు వాళ్ళిద్దరూ ఒకేసారి అంటున్నారు. "ఆ రథంలో కూర్చుండి, మీ మనసుల్ని అమ్మవారి పాదాలపై వుంచండి. అమ్మను ప్రార్థించండి" చేతిలోని త్రిశూలాన్ని వాళ్ళ కళ్ల చుట్టు త్రిప్పుతూ హెచ్చరిస్తున్నాడు.

"మరి, మీరో....!" అనుమానంగా శకుని అడిగాడు.

"నేనా.... ? నేను, మీ వెంటే వుంటాను. నా రథం - ఆ అమ్మది. ఆ తల్లితో కలిసి మిమ్మనుసరిస్తాను!" నేను లేనిదే మీరు లేనట్లు చెబుతున్నాడు. అగ్నికుండంలో మరిన్ని కట్టెలను వుంచాడు.

"ఓ స్వామీ! రథం కదులుతుంది. వేగం పుంజుకుంటుంది. గాలిలో తేలిపోతున్నాం." దుశ్శాసనుడు గుండెలదిరేటట్లు అరుస్తున్నాడు.

"నాకేమిటో అయిపోతుంది. వూపిరి అందడం లేదు. ఎగశ్వాసగా వుంది." గొంతు పూడుకుపోతున్నట్లు శకుని గింజుకుంటున్నాడు.

దాంతో అఘోరి తన త్రిశూలాన్ని ఇద్దరి కళ్ళకు తాకించాడు. ఇప్పుడెలాగ వుందనడిగాడు. మేం ఎగురుతున్నాం. తెలీని, చెప్పలేని పారవశ్యంలో మున్గి పోతున్నాం. నాకు బాగా వుంది. ఎంత వేగంగా గాలిలో తేలిపోతున్నామో చెప్పలేము. ఇప్పుడు చాలా బాగుంది. ఆ గాలి వేసే వూళలు తుఫాను వచ్చినప్పుడు వీచే ఝుం ఝూ మారుతంలా వుంది - వివరించి, శకుని చెబుతున్నాడు.

అఘోరి తన త్రిశూలాన్ని వాళ్ళ కళ్ళచుట్టు త్రిప్పుతూ "ఇప్పుడు చెప్పండి, మీరేం చూస్తున్నారు ?"

"మేము పైకి, పైకి.... అలాగలాగ వెళ్తున్నా"మని దుశ్శాసనుడంటే -

"భూమి మా కాళ్ళక్రింద కనుపిస్తుం"దంటాడు" శకుని.

మళ్ళీ త్రిశూలాన్ని అటు ఇటూ అఘోరి కదలించాడు.

"గంగ మాక్రింద, ఒక చిన్న పాయలాగ కనిపిస్తూందంటున్నాడు శకుని."

"అరే, ఎంత అద్భుతమైన దృశ్యం. ఆ సుందర హిమాలయాలను దాటుతున్నాం. అవి నిజంగా హిమాలయాలే. ఆ పర్వత పంక్తులు... అరే... ఎంత అందంగా వున్నాయి ?

ఆ కొండ శిఖరాలు మా పాదాల క్రింద దట్టమైన అడవులతో చిత్రాతి చిత్రంగా వున్నాయి. ఆ కొండలమీద నుండి వీచే గాలి సవ్వడిని స్పష్టంగా వినగల్గుతున్నాం. అరే.... అరే.... భలె, భలేగా వుంది ?" ఇది శకుని ఆశ్చర్యం.

ఆ చెట్ల శిఖరాగ్రాలు ఎలాగ వూగుతున్నాయంటే, అందమైన నాట్యకత్తెల సన్నని నడుములు వయ్యారంగా కదుల్తున్నట్లు మరీ వూగుతున్నాయి.'' ఇది దుశ్శాసనుని ప్రశంసతో కూడిన ఆశ్చర్యం.

“అరే, అరే... ఎంతటి అద్భుతం ? ఎంతటి అద్భుతం ? మేఘాలపై తేలియాడుతున్నాం. ఈ స్థితిని గమనిస్తూంటే స్వర్గం చేరువులో వున్నట్లున్నది.''

“ఘనీభవించిన మంచు శిఖరాల, పంక్తుల, ఆ హిమ సమూహాలు ఎండపడి బంగారు కాంతులు విరజిమ్ముతున్నట్లు, తాము విశ్వాంతరాళాలలో విహరి-స్తున్నట్లు... భలే చిత్రంగా వుంది.''

“నిజంగా స్వర్గం చేరువులో వున్నాం.'' ప్రారంభించాడు శకుని. బంగారు శిఖరం, అచ్చు సదాశివలింగంవలె వుంది. అద్భుత కాంతివంతంగా భలే రూపొందించబడింది. వీళ్ళు ఒకళ్ళ తర్వాత మరొకరు భట్రాజుల వలె పొగడుతూంటే, త్రిశూలం వారి కళ్ళను తాకుతూ, చిత్రంగా అటు ఇటు తిరుగుతూంటే, చిత్రాతి చిత్ర గమనాన్ని మరింత చిత్రంగా తెలియబరుస్తున్నారు.

“అప్పుడు.... అఘోరి.... నవ్వుతూ - అదే కైలాసగిరి. శివ సన్నిధి....'' మొదలు పెట్టాడు.

అదే కైలాస శిఖరము. శివుని సన్నిధి.

అక్కడే జగదంబ - దుర్గామాత కొలువై వుంది.

మీరు అదృష్టవంతులు. మీకన్న మీ కళ్ళు ఇంకా అదృష్టవంతులు. చూడలేని, చూడరాని అద్భుతాన్ని చూడగల్గాయి. రండి. రథం దిగండి. ఆ లయనాథుడు శివునికి ప్రణతులర్పిద్దురుగాని, ఆ శంకరుని కరుణ పొందుదురు కాని. ఆ దేవదేవుని దర్శనంతో సకల పాపములు హరించి, మనోభీష్టములు సిద్ధింప చేసుకుందురుగాని.

ఆ దయామయుడు బోళాశంకరుడు కేవలం దర్శనం మాత్రాన అడగకుండగానే సర్వాన్ని ప్రసాదించగల సిద్ధశక్తి స్వరూపుడు. అభయప్రదాత.'' చెబుతున్నాడు అఘోరి.

"అవును. రథం నుండి దిగుతున్నాం. మనం ప్రార్థిస్తున్నాం. ఆ శంకరుని దర్శనాన్ని అపేక్షిస్తున్నాం. ఆహా! ఎంతటి అద్భుత సంఘటన. మధుర క్షణాలు" స్వగతంగా చెప్పుకుని శకుని మురిసిపోతున్నాడు.

ఇక దుశ్శాసనుడైతే -

అడుగో, అభయంకరుడు. నాగభూషణుడు, గజచర్మాంబరధారి. విభూతి ప్రియుడు. అమ్మ దుర్గమ్మతో, అభయప్రదాయుడై సకలాభీష్టసిద్ధిదాతగా, వరముల నివ్వనిలచిన నిత్య దీన జనోద్ధరణుడు, అ శంకరుడు, ఆ త్రిపురారి" పరిపరి విధాల దర్శిస్తూన్న దృశ్యానికనుగుణంగా ప్రార్థిస్తున్నట్లు వర్ణిస్తున్నాడు.

"నిజంగా మనం ధన్యజీవులం, అదృష్టవంతులం. పార్వతీపరమేశ్వరులు, ఆది దంపతుల దర్శనం పొందగలిగాం. దా, సాష్టాంగ నమస్కారం చేద్దాం. ధన్యజీవులమవుదాం" శకుని, శివుని ముందర భక్తితో పొంగిపొరలుతున్నాడు దుశ్శాసనుడు "స్వామినీ-స్వామికి", ఆ ఆదిదంపతులకు అంజలి ఘటించమని, దొరికిన అదృస్టాన్ని సార్థకం చేసుకోమని మరీ మరీ చెబుతున్నాడు.

"మీకేం కావాలో కోరుకోండి. మీకు అభీష్టసిద్ధిని కల్గిస్తాం." వరప్రదాతలైన ఆ ఆదిదంపతులు అడుగుతున్నారు. ముల్లోకాలను కదిలిస్తున్నట్లుందా ఆది దంపతుల అద్భుత వరదాన కంఠస్వరం.

విన్న భీముడు అదిరిపోయాడు.

అంతా కలగా వుంది. ఏమిటిది ?

ఆ ఆదిదంపతుల వరదాన కంఠస్వరం, త్రిభువనాలను కంపింప చేస్తున్నట్లుంది. కాదు మార్మోగుతుంది. గుండె దడదడ కొట్టుకుంటుంది.

అఘోరి మాటలు కూడా వినబడుతున్నాయి.

"అనండి. ఆ ఆది దంపతులను నేనన్నట్లు అక్షరం, అక్షరం... స్తుతిస్తూ పలకండి" అంటున్నాడు. ఆ స్తోత్రం, అందులోని అక్షరం, అక్షరం, భీముడు స్పష్టంగా వినగల్గుతున్నాడు. అతనన్నట్లే - ఈ దుశ్శాసన, శకునిలు - శివస్తోత్రం చేస్తున్నారు.

**ఓ త్రిభువనేశ్వరా, శివా**
**సృష్టిస్థితి - లయకర్తా - అభవా**
**తాండవ శివా, హరా**
**నీ పదపద్మముల సవ్వడికే శివ**
**సృష్టి జరుగుచుండెను కదా**
**ఓ లయకారక, ఆనందతాండవ**
**మందున జగములు సర్వము**
**పోషింపబడుచు - హరహర**
**ఫాలనేత్ర భగభగజ్వాలల**
**నీలకంథరా, ఎల్ల లోకములు**
**సంహారమొందుట సత్యము కదా**
**హరహర శంకర సాంబసదాశివ**
**శంభో శంకరమహదేవా**
**శంభో శంకర మహదేవ**
**అర్ధనారీశ్వర - అమ్మ కరణుతో**
**అఖిల జగముల పాలన పోషణ**
**చిత్రవిచిత్ర గతుల సాగుట**
**చిత్రము కాదా, ముక్కంటి దేవర**
**శంభో హర హర మహాదేవా!**
**సాంబసదాశివ జగదీశా**

అఘోరితో కలిసి, వాళ్ళిద్దరు ప్రార్థిస్తున్నారు. తెలుస్తుందా ? ఆ... ఆ... అంటూ దుశ్శాసన, శకునిలు, అఘోరితో కలసి, మరల

**సర్వమంగళా, ఆనందకరము**
**అద్భుత దర్శనమమోఘము.**
**కరుణకావుము, వరములనిమ్మ.**
**జగతిన సుఖముగ వర్థిల్లనిమ్మ.**
**ఆది దంపతులు, వరప్రదాతలు**
**మీరే కదా, ఈ భువిలో తల్లి**

**భోళా శంకర భక్తవశంకర**
**అర్ధనారీశ్వర, అర్ధనారీశ్వరి, వందనమమ్మా!**
**జగదంబా, వందనమమ్మా శంకర, శాంకరీ!**
**వందనమమ్మా!**

అఘోరి అన్నట్లే - శకుని, దుశ్శాసనులంటున్నారు. అంతా - స్పష్టంగా, లయబద్ధంగా ఆ స్తోత్రం సాగుతుంది.

"ఇప్పుడడగండి. మీకేం కావాలో. వరాలిచ్చే భవభయహరుడు, శంకరుడు, మిమ్ము కరుణిస్తాడు. ఆ శివుడు తన చేతులలోనే వున్నట్లు - ఆ అఘోరి అరుస్తున్నాడు. వీళ్ళనాదేశిస్తున్నాడు. అఘోరి చేతిలోని త్రిశూలం వాళ్ళ కళ్ళ చుట్టూ తిరుగుతుంది.

ఆ ఆదేశం శిరసావహించి, దుశ్శాసనుడు.

"అమ్మా! కరుణించు. మా ప్రాభవముల నన్నింటిని బలిగొని, మమ్మనాథలను చేయతలంచిన ఆ ముగ్గురిని హతమార్చి - జయము, శుభము- సుఖ సంతోషాల కలుగచెయ్యి.

"ఎవరో వాళ్ళు...!" కోరిన కోర్కెకు తడవుగా - వినిపించిందో గంభీర స్వరం.

ఆ మాటల్ని విన్న భీముడదిరి పడ్డాడు. కళ్ళు నులుముకున్నాడు. శరీరం దులుపరించుకున్నాడు. ఆ సొంతం శరీరాన్ని ఒక్కసారి విదల్చుకుని, నిజం. నిజంగా... వింటున్నా... ఆ మాటలననుకున్నాడు.

ఆ స్వరం దగ్గర లేదు. దూరంగా, సుదూరం నుండి వస్తూన్నట్లుంది. స్పష్టంగా వినిపిస్తుంది. ఎంతాశ్చర్యం. నిజమని, నిజంగా భీముడాశ్చర్య పోతున్నాడు.

"వాళ్ళు నీకు తెలిసినవాళ్ళే కాదమ్మా. అందరూ గుంపుగా చెప్పుకునే - గాంగేయుడు, లోకోద్ధారకుడు - ధర్మ పరిరక్షకుడనుకునే ఆ వసుదేవసుతుడు మాకు అన్నిటా పక్కలో బల్లెంలాగ వుండి - మా ప్రాణాలతో చెలగాటమాడే భీముడు.

ఈ ముగ్గురు... ముగ్గురు కనుక మరణిస్తే మేము అవధ్యులం. మాకు అపజయమన్నది వుండదు. ఇందుకు సదా నీ ఆశీస్సులు, నీ కరుణా - మా అభివృద్ధిలో ప్రతిక్షణం కావాలి ప్రార్థిస్తున్నాడు -

★★★★

దుశ్శాసనుని ప్రార్థన పూర్తయిందో లేదో.... వికటాట్టహాసం - అది మేఘ గంభీర స్వరం.

"ఎవరు గాంగేయుడా ? భీష్ముడా! అతడు మహాభీషణమైన ప్రతిజ్ఞకు ప్రతిరూపం. పవిత్ర ధర్మానికి పర్యాయపదం. ఆశాపాశాలు, రాగద్వేషాలు లేని ఆర్ష ధర్మానికి - నిజమైన నిత్య నీరాజనాలందుకునే దివ్య స్వరూపం. అతడు చావాలా ? అతడు... అతడు.. మళ్ళీ భయంకరమైన నవ్వు. అందులో లాస్యం లేదు. అపహాస్యం చోటుచేసుకుంది. మూర్తీభవించిన ధర్మస్వరూపం, కర్మకొద్ది భూమిపైకి వచ్చాడు. మీ అదృష్టం కొద్ది మీకు తాత అయ్యాడు. అతన్నెవరూ చంపలేరు. అతనికి స్వచ్ఛందమరణ వరముంది.

అతనికిష్టమైనప్పుడు, మీ బుద్ధులన్నీ వక్రించ, దానికి రోసి, తాను తన జీవితాన్ని త్రోసి కాదనుకున్నప్పుడు తప్ప - అతని మరణమనివార్యం. అతడు, త్రిమూర్తులకు, సర్వలోక భువనేశ్వరీ జగదీశ్వరీ. ఆ రాజరాజేశ్వరికే అవధ్యుడు" అనడం -

భీముడు స్పష్టంగా విన్నాడు.

శకుని, దుశ్శాసనులు భయపడ్డారు.

అఘోరికి - జడుసుకున్నంత పనయింది.

ఇటువంటి పనులు తాను చేస్తూంటే, ఎవరో వధింపబడటం కాదు, కాలచక్రంలో - "నేను" అని - తన శకం లేకుండా చేసుకుంటాననుకున్నాడు.

అప్పుడు - "మరి వాసుదేవుడు... అమాయకంగా దుశ్శాసనుడు అడుగుతుంటే... ఎవరు ? ఎవరు? ....కృష్ణుడా ? వసుదేవసుతుడు వాసుదేవుడా ? పిచ్చివాడా!

మీవి, బ్రతికి బాగుపడే తెలివితేటలు కావు.

"అధర్మాన్ని అంతం చెయ్యడానికి, స్వధర్మాన్ని ప్రతిష్ఠింపచెయ్యడానికి, అవతరించిన, ఆదిపురుషుడు.... ఆ పరబ్రహ్మమే - దేవకీనందనుడు, వసుదేవ సుతుడు, నందనందనుడు, యశోదా ముద్దుబిడ్డడు...

కొరివితో తలగోక్కోవడమంటే.... ఇదే.... వినాశకాలే విపరీతబుద్ధి.... అని... ఇటువంటి ఆలోచనలు మానండి. లేదో నేనిప్పుడే మిమ్మల్ని సంహరించి, ఆ దేవదేవుని ధర్మపథానికి, స్పష్టమైన దారి ఏర్పరుస్తాననడంతో -

ఇప్పుడు ముగ్గురు వణకడం ప్రారంభించారు. గొంతు పెగలడం లేదు. మాట రావడం లేదు. అంతా అయోమయం. అనవసరంగా ప్రాణాలమీదకు తెచ్చుకున్నట్లు - శకుని దుశ్శాసనులు భయపడుతుంటే - మూడిందన్నట్లు.... ఇక మూడు... అందా గంభీర స్వరం.

అఘోరి ఆజ్యం పోశాడు. అగ్నిజ్వాలలు పైకి లేచాయి. శకుని, దుశ్శాసనులు.... కొంత నిబ్బరమొంది "అమ్మా! కనీసం, మాకు అనునిత్యం హాని తలపెట్టాలని తలచే, ఆ భీమునైనా....!" మాట పూర్తికాలేదు.

భీముడదిరిపడ్డాడు. ఎంత ఘోరం ? దాయాది అయివుండి, అధర్మంగా రాజ్యం సుఖం, భోగభాగ్యాలు పొందడానికి తన చావును కోరుకుంటున్నాడా ? ఎంత అమానుషం. ఇప్పుడు నిజంగా దురదృష్టవంతుడిని. పితామహుని వలెనే నాకు స్వచ్ఛంద మరణం లేదు.

శ్రీకృష్ణుని వలె ధర్మోద్ధరణకై వెలసిన అవతార పురుషుడిని, ఆ ఆదిదేవుని అంశీభూతుడను కాను. మరి.... నేను... అమ్మో! ప్రతివ్యక్తికి పట్టుకున్నట్లే - తన "చావు" అనేసరికి భీమునిలో భయం పుట్టుకొచ్చింది. పట్టరాని ఆగ్రహంతో, ఈ దుశ్శాసనుడా అమ్మవారిని, కోరిక కోరి, అది సఫలం కాకుండా చెయ్యాలని తలంచాడు.

ఆ వెంటనే, వీళ్ళ అంతం తాను చూడాలనుకున్నాడు. ఆ పర్ణకుటీరానికి ఆధారంగా వున్న వెదురుకర్రలను గట్టిగా పట్టుకుని వూపాడు. భీముని బలశక్తికి, ఆ పర్ణ కుటీరం గజగజలాడింది. మొత్తం వూహించని విధంగా కుప్పలా కూలిపోయింది. ఆ ముగ్గురు మీద, జ్వలించే జ్వాలలబడి, చురచురమని అంటుకుంటుంది. చూస్తూండగా మంటలు రేగాయి.

జరిగింది వూహించలేని విధంగా మొత్తం కార్యం భగ్నమయింది. దృష్టి బెదరింది. శక్తి నశించింది. ఎవరి చావోకన్నా, ఇప్పుడు వీళ్ళ చావు దగ్గర పడిందని, బ్రతుకు భయంతో, వూపిరాడకుండా, ఉచ్ఛ్వాసనిశ్వాసలు తగ్గి - ఎగశ్వాస బయలుదేరింది. ఏ క్షణంలో గుండాగిపోతుందో, ప్రాణాలు వున్నాయో, లేవో... గాలిలో కలిసిపోతాయో... స్తంభించిపోతాయో.... తెలియని అయోమయస్థితికి ముగ్గురు గురయ్యారు.

వున్నట్టుండి జరిగిన ఉపద్రవం, ఆ తల్లి ఆగ్రహావేశాల ఉత్పాతంగా వాళ్ళు తలిచారు. స్వస్థతలోకి వచ్చినవారికి, జరిగింది అర్థమయ్యేలోగా, అగ్నిజ్వాలలు-

ఉవ్వెత్తున పైకి లేచాయి. ప్రాణాలరచేత పట్టుకుని, బ్రతకడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో -

చిరపరిచితమైన భయంకర నవ్వు. అది అమ్మవారిది కాదు. కారణం, వారు స్వస్థతలో వున్నారు. మరెవ్వరిది ? ఈ ఆలోచన తెగేలోగా ప్రాణభయంతో నది ఒడ్డుకు బయలుదేరారు. ప్రాణాలు దక్కించుకునే ప్రయత్నంలో, ఆత్రపడుతున్నారు.

భయం తీరనివాళ్ళు - అప్రయత్నంగా నీళ్ళలోకి దూకారు. ప్రాణరక్షణ కోసం అవతలి ఒడ్డుకు చేరారు. మామా, అల్లుడు, మంటల్లో మాడి చచ్చేకన్నా... అంటూ, ప్రాణాలరచేత పట్టుకుని ఈదుతున్నారు.

ఇక్కడ - ఇప్పుడు -

అఘోరికెదురుగా ఆజానుబాహుడైన భీముడు. అరివీర భయంకరుడు. బలభీముడనే బిరుదు శివునికి గూడా వుంది. ఆ శివ స్వరూపంగా, మహాతేజంగా నిలబడ్డ భీముని కొయ్యబారి, కొన ప్రాణాలతో అఘోరి చూస్తున్నాడు.

"అమ్మా! స్వీకరించు. ఆశీర్వదించమన్నాడే కానీ, ఆ వచ్చినవాడు భీముడు, తన భరతం పడతాడని తలవటం లేదు, ఏడవడం లేదు. తప్పించుకోవాలని ప్రయత్నం చెయ్యడం లేదు.

అప్పుడు వెనక్కి తిరిగి, ఆ ఆగంతకుని భుజంపై భీముడు చెయ్యివేసి "ఇప్పుడు చెప్పు. ఆ చిన్నదాని ననుసరించే వాళ్ళెవరు ?" మిత్రునిగా అడగడం ప్రారంభించాడు.

"చెప్పలేను. కానీ చెప్పక బ్రతుకలేను. పెద్దమ్మ రేఖమ్మతో కలిసి వచ్చినామె పరిచారిక కాదు. నా వుద్దేశంలో రాకుమారి అయి వుండాలి. అలాగని ఖచ్చితంగా చెప్పలేను కానీ "రాకుమారి" అనే నా వుద్దేశమన్నాడా ఆగంతకుడు.

"నీకు తెలుసు చెప్పు... !" ఆ చేతిదెబ్బను ఇంతకుమునుపే రుచి చూసిన ఆగంతకుడు" ఆమె, యువరాణి భానుమతీదేవి సోదరి, కాశీరాజు తనయ జాలంధరి అయి వుండాలి. సందేహ నివృత్తిగా సమాధానమిచ్చాడా, ఆగంతకుడు.

"అయితే నీకు చాలా విషయాలు తెలుసు ?" ఆగంతకుని వెన్ను తడుతూ, మెడమీద ఒక నరాన్ని సన్నగా నొక్కాడు. అది చూసేవాళ్ళకన్న, అనుభవించే

వారికి ప్రాణాంతకం. బుద్ధిగావుంటే దీనిని ఆ తర్వాత సరిచేస్తాను. కాదంటే ఈ వంకర మెడతో, ఓర్వలేని నొప్పితో బాధపడుతూ, బ్రతుకు గడపాలి'' మెల్లిగా భీముడు చెప్పాడు.

"వద్దు. వద్దు'' అనేటప్పటికే వాడు మొద్దులా క్రిందపడిపోయాడు. గోడ ప్రక్కకు లాగి పడేసాడు.

# ఇంతకంటే అదృష్టమేముంది ?!

**తె**లతెలవారకమునుపే, తన భవంతికి చేరి అందరితో కలిసి హాయిగా నిద్రపోతున్నట్లు నటిస్తున్న భీముడు, అందరిలాగే ఆవులిస్తూ లేచాడు. నదీ స్నానానికి బయలుదేరాడు. ఇప్పుడు, ఇక్కడ తాను వాసుదేవుని దర్శనం చేసుకోవచ్చును. అనుష్ఠాన కార్యక్రమాలు పూర్తిచేసుకుని, ఆ దేవకీ నందనునితో (దేవకికి - కృష్ణుడు "దేవుడు'') మాట్లాడవచ్చును'' అనుకున్నాడు -

నదీ స్నానానికి బయలుదేరాడు.

గంగానదిలో మొలలోతు నీళ్ళలో నిలబడి సూర్యునికి అర్ఘ్యప్రదానం చేస్తున్న - శ్రీకృష్ణ సందర్శనార్థం, అసంఖ్యాక జనమక్కడ బారులు తీరారు. ఆ దృశ్యాన్ని చూసి, అప్రయత్నంగా భీముడు రెండు చేతులు జోడించాడు. తన స్నాన సంధ్యాదికాలు ముగించుకుని భీముడు బుద్ధిగా కృష్ణుని అనుసరిస్తున్నాడు.

సభా భవనం ముందర, మరెందరో కృష్ణ దర్శనార్థం వేచి వున్నారు. స్త్రీ, పురుషులు - పిల్లలు... ఆ బాలగోపాలమంటారు. అలాగ ఎందరో.... శ్రీకృష్ణుని కోసం నిరీక్షిస్తున్నారు.

చిరునవ్వులు చిందించే చిన్మయమూర్తి పిల్లల తలలపై చేయిపెట్టి ఆశీర్వదిస్తూ, భుజాలు తడుతూ ప్రేమగా చూస్తూ, అనురాగంతో ఆనంద డోలికల నోలలాడిస్తూ - ప్రతి ఒక్కరిని, తనవాడిగా తలుస్తూ సాగే ఆ దివ్యుని చూడగల్గడం నిజంగా, నిజంగా... అదృష్టమనే అనుభూతిని, అందరు పొందుతున్నారు.

ఎవరిమట్టుకు వారు, వాళ్ళు తరించినట్లు తన్మయులవుతున్నారు. అదే "కృష్ణం వన్దే జగద్గురు'' అంటే... అని ప్రతి ఒక్కరు పరవశిస్తూన్నట్లుందా సమయఘందర్భం-

సందోహం - ఆ విధంగా కృష్ణుడు, యదుభూషణుడు, వారిని కరుణించినట్లు అలరింప చేస్తున్నాడు. అందుకే అతడు భాగవతుడు. ఇది "శ్రీకృష్ణ భాగవతం".

ఆ ఆనందాన్ని - అంతకుముందెన్నడు పొందనంత మధురాతి మధురంగా, ఆనంద పారవశ్యంగా, తన్మయత్వంగా తలచి మురిసాడు. ప్రక్కనున్న భీముడు "కృష్ణుడు నాకు దండం పెట్టాడనుకునే ఆ పిచ్చివాడు కృష్ణతత్వాన్ని అర్థం చేసుకోలేని - అమాయకుడిగా, ఆనందప్రదునిగా కావల్సిన ఆనందబంధువుగా, ఇప్పుడు తలుస్తూ, శ్రీకృష్ణ భాగవత రహస్యాన్ని ఆస్వాదిస్తున్నాడు.

కృష్ణుని ప్రక్కనే - ప్రక్కనే అనుసరించే భీముడు తననను సరించే గోపిని చూసాడు. ఈ అదృష్టాన్ని జారవిడుచుకోరాదన్నట్లు, ఇటు భీముడు, అటు గోపి తహతహలాడుతున్నారు.

ఒకప్పటి హస్తినాపుర తారగా వెలుగొందిన మహామల్లుని కుమారుడు సోమేశ్వరుడు - చక్రాలబండిపై శ్రీకృష్ణ దర్శనార్థం తీసుకు వచ్చాడు. వాసుదేవుని చెంత మహద్భాగ్యంగా కూర్చున్న అదృష్టవంతుడైన భీముడు, మహామల్లుడు ఆ బాహుబలుని చూస్తూనే లేచి, సాదరంగా దగ్గరకు వెళ్ళి, ఆ మహావీరుని, ఒకనాటి తేజశ్శక్తిని తీసుకువస్తూంటే -

సనాతన - సదాచార - సాంప్రదాయాల్ని సదా పరిరక్షించే, ధర్మపరిరక్షకుడు, ఆర్ష ధర్మ నిలయుడైన కృష్ణుడు - ఆ మహావీరునికి గౌరవసూచకంగా లేచి నిల్చుని, తన భుజంపైని ఉత్తరీయాన్ని సరిచేసుకుని ఒక్క అడుగు ముందుకు వేసాడు.

అదొక మహత్తర దృశ్యం. దర్శించే కన్నులకు ధన్యత కల్గించే మధుర క్షణాలు. ఆనంద వీక్షణాలు. బ్రహ్మానందదాయకాలు.

"మహావీరా! నీవెందుకింత శ్రమ తీసుకుని నా వద్దకు రావడం, నీవంటి బాహుబలులను దర్శించి గౌరవించడానికి నేనే వచ్చేవాడిని కదా!" అని ఆప్యాయంగా అంటూంటే - ఆ నేత్రాలు సజల పూరితాలయ్యాయి. ఆనంద బాష్పాలు రాల్చాయి. బ్రహ్మానంద స్థితిన ప్రవేశించాయి.

"దేవా! నీ దర్శనం చేసుకోవాలని, నిన్ను చూసి తరించాలని తహతహ లాడాను. ఇప్పటికి... ఈ రకంగా నిన్ను దర్శించుకునే మహద్భాగ్యాన్ని పొందాను.

అశ్రునయనాలతో, ఆ ఆనందమూర్తిని, బ్రహ్మానందదాయకంగా - బలియా దర్శించాడు. కృష్ణుని సాదర స్వాగతమొందిన ఆ బాహుబలుని, ఆతని కుమారుడు గోపి, భీముడు ముగ్గురు ఎత్తుకు తీసుకువచ్చారు. శ్రీకృష్ణుని సరసన కూర్చోబెట్టారు.

ఇంతటి అదృష్టం పొందగల్గినందులకు బలియా నోటివెంట ఒక్కమాట గూడా రాలేదు. ఆనందవీక్షణాలు, బాష్పాలు, కృష్ణుని ప్రేమ - భీముని ఆసక్తి - తన వాళ్ళ అభిమానం... తన్మయుల్ని చేస్తుంటే, ఆ ఆనంద పారవశ్యంలో, బలియా తలమున్కలయ్యాడు.

"ప్రభూ! నేను బాహుబలుడిని, మహామల్లుడిని కాను. అసలైన మహామల్లుడివి నీవు. పదహారేళ్ళ ప్రాయంలోనే, అరివీర భయంకరులనే కంస, చాణూరులను మర్దించి, వధించిన నీ శక్తి నిరుపమానమనగా, గొప్పవాళ్లలాగే మాట్లాడతారని, అంతటితో ఆ ప్రసంగాన్ని ముగింప చేసాడు.

అప్పుడు భీముడు కల్పించుకుని "గోవిందా! బలియా మనస్సులోని కోర్కెను నీవే సఫలం చెయ్యాలి. చెప్పలేక రకరకాల, తను తడబడుతున్నాడు. అతని మనస్సులో నిన్ను తన "మల్లవీరుల శిక్షణా శిబిరానికి తీసుకువెళ్ళి దానిని పావనం చేయించాలన్నదో కోరిక. దానికి తటపటాయిస్తున్నాడు.

"నిజం. అందుకే నిన్ను నా చిన్న ప్రభువని అంటాను. ఖచ్చితంగా నా మనోభీష్టం శెలవిచ్చావు. ఇక ఆ పరమాత్మ దయ" అని సర్దుకుని కూర్చున్నాడు. మళ్ళీ తనే "ఓ, వాసుదేవా! నీ వీలు చూసుకుని, ఎప్పుడు వీలయితే, అప్పుడొకసారి... నీ పాదంతో దానిని పవిత్రం చెయ్యి. మేము ధన్యులమవుతా మన్నాడు.

ఇక్కడే పవిత్రగంగ వుంటే, ఇంకా ఎక్కడో ఆ పవిత్రగంగకై వెళ్ళడం దేనికి ?" అన్నాడు భీముడు కృష్ణుని చూపుతూ. ఆ వెంటనే బలియా -

"నిజం దేవా! ఇవ్వాళ మల్లులందరికి పరమ పవిత్రదినం. కనుక - ఈనాడు దయ వుంచి, నా శిబిరాన్ని పావనం చెయ్యమని ప్రార్థిస్తూన్నానన్నాడు."

ఇవ్వాళ ఆ జగన్మాతను, శ్రేష్ఠ - జేష్ఠ - మల్లులందరు - దీక్షగా పూజిస్తారు. ఇంతకంటే మాకు మరో మంచి అవకాశం, సావకాశం దొరకదని" వినయంగా ప్రార్థించాడు. శ్రీకృష్ణుని చరణాలపై తన శిరస్సు ఆన్చాడు. ఆతని భక్తికి, ఆనందిస్తూ-

"మహామల్లా! నువ్వు అభ్యర్థించరాదు. ఆదేశించాలి. ఈ క్రీడకు ఆచార్యుడవే కాదు. అనుభవజ్ఞుడైన పూర్వాచారుడివి. కాబట్టి భీముడు, నేను తప్పక వస్తాము. మీ కార్యక్రమాలలో పాల్గొంటామని అభయమిచ్చాడు. భీముని కోరిక అదే. ఈ రకంగా- ఆ ధర్మావతారుడు కరుణించాడు. అప్పుడే ఇదంతా గోప్యంగా జరగాలి. లేదంటే, అక్కడా ఈ తిరణాలే. కాబట్టి.... ఆగి భీముని చూసాడు వాసుదేవుడు.

బలియా ఆనందించాడు.

ఆ వెంటనే భీముడు ఆ మహామల్లుని బంతి ఎత్తినట్లు ఎత్తితే, భీముని సాహసానికి లేదా బలప్రదర్శనకు ప్రతి ఒక్కరు పొంగిపోతే, కృష్ణుడు ఆపి - భీమా! నువ్వు మమ్మల్నందర్ని పసిపిల్లలను, పనికిరాని వాళ్ళుగా చేస్తున్నావు.

ఈ మాత్రం దానికి, నువ్వొక పెద్ద బలవంతుడిగా పేరుకు తగ్గట్లు భీమునిగా - ఈ మహామల్లుని ఎత్తి పట్టుకోవాలా ? ఆ చేష్ఠలవసరం లేదు. శ్రేష్ఠుడు, మహాఘనుడు, వీరుడు తన కాళ్ళపై తాను నడిచి వెళ్ళగలడంటాడు.

"నేనా....!" అసాధ్యమన్నట్లు బలియా చూస్తాడు.

"ఎందుకు నడువలేవు. తప్పక నడుస్తావని భీముని చేతుల నుండి తప్పించి, ఆ మహామల్లును ఆపాదమస్తకం చూసి" నువ్వు నడుస్తావు. నడుస్తున్నావు, నడవగలవు "లే" అన్నాడు.

"ఏదో చెప్పబోయిన బలియా"ను ఆపి పెట్టు ఆ కాళ్ళను, ఓ జేష్ఠ శ్రేష్ట మహామల్లా, భూమిపై పెట్టు. అడుగు వెయ్యి. ఆ తల్లి భూమాత నిన్ను లాలిస్తుందన్నాడు.

చిత్రం. చిత్రాతి విచిత్రం. మహాచిత్రం.

అందర్ని ఆశ్చర్యపరుస్తూ, శ్రీ కృష్ణుని సత్యావాక్కును సత్యం చేస్తూ - మరింత భక్తి శ్రద్ధలను, తనలోను అందరిలోను పెంచుతూ -

"కృష్ణా! నడువగలనా.... నిజమా ?" అడుగుతీసి వేసాడు. కాళ్ళు కదిలాయి. కృష్ణుడు చేతిని మహదానందంగా అందుకుని మరీ అడుగు వేసాడు. అడుగులు తడబడుతూనే కదిలాయి. కళ్ళనీళ్ళు ఆనందబాష్పాలతో తన అంగవైకల్యాన్ని, అసమర్థతను దూరం చేసుకుంటూ "కృష్ణా!" నిజంగా భక్తియుతంగా, ఆ

దేవదేవుని, వాసుదేవుని పాదాలపై వ్రాలాడు. భీముడది చూసాడు. ఇప్పుడు... ఇప్పుడు... చూసే వాళ్ళందరితోపాటు భీమునికి గూడా, గోవిందుని గొప్పదనం వాసుదేవుని సర్వశక్తిత్వం అర్థమయ్యాయి. కృష్ణుడు ప్రేమగా - గోముగా బలియా వీపుపై తట్టాడు. కొండంత ధైర్యం. అమిత విశ్వాసం. ఆనంద తరంగాలు. మధురానంద డోలికలలో బలియా మునిగిపోయాడు.

"జయ జయ కృష్ణా! గోవింద వాసుదేవా! జయహో, జయ జయహో!" ఆనంద ధ్వానాలు - హర్ష పులకిత గాత్ర జయ జయ నినాదాలు. అప్పుడు...

ఇంతలో అక్కడ మిన్నుముట్టినట్లు ప్రతిధ్వనిలు ఆనంద గీతికలు వినిపించాయి. కొందరు మల్లులు.. చంపేస్తున్నారు. చంపేస్తున్నారు. అరుపులు, కేకలు చెదరిన ఎడ్లు. కట్లు తెంచుకున్న ఎడ్లమంద. ప్రాణభయంతో పరుగులు. అంతా గందరగోళంగా వుంది. ప్రశాంతంగా కృష్ణుడు ఆ పరిస్థితిని గమనించి వారిలో ధైర్యం పాదుగొల్ప ప్రయత్నిస్తున్నాడు.

# కటాక్షించండి!

**కా**లం కొన్ని గాయాలు చేస్తుంది. కొన్ని మానుపుతుంది. అన్ని గాయాలకు కాలమే మందు. కాదని మనం కూర్చోలేము. మూర్ఖించి ముందుకు సాగలేము. దీనినే కొందరు విధివిలాసమంటారు.

యుధిష్టరాదులు, ముఖ్యంగా మహాబలుడు భీముడు, మల్లయుద్ధ వీరులతో మచ్చికంగా వుండటం. దుశ్శాసనాదులకు నచ్చలేదు. వాళ్ళను భయభ్రాంతుల్ని చేసి తమకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలనే తాపత్రయంతో, తాము గాంధార దేశానికి వెడుతున్నామన్న మిషతో, తమ సామానులు భద్రంగా తీసుకు వెళ్ళగల, ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల మల్లులను రమ్మని కబురంపారు.

విషయం - రాజకుటుంబానిది కాబట్టి ఆదేశంగా, తమ తమ బండ్లతో బలియాకు సంబంధించిన, గట్టి మల్లులు, ప్రయాణాలు చేయగల, ప్రమాదల నెదుర్కొనగల దిట్టలు బయలుదేరి వస్తే -

"మిమ్మెవరు రమ్మన్నారురా ? మేము పారిపోతున్నామా ? అంటూ, దుశ్శాసన సోదర బృందం దొరికిన వారిని దొరికినట్లు చావగొట్టారు. వారి ఎడ్లబండ్లను విరగ్గొట్టి, ఎడ్లను చావగొట్టి - మహాభీభత్సంగా ప్రవర్తించేసరికి వారందరు భయపడి, దుశ్శాసనమందిరం నుండి, పాండవులున్న భవన ప్రాంగణంలోని సభాస్థలి వరకు "రక్షించండి, రక్షించండి" అని ప్రాణభయంతో పరుగెత్తుకుంటూ వచ్చారు.

అప్పుడు విషయం తెలుసుకున్న భీముడు దుర్యోధనుని మందిరానికి వెడితే "నీకెందుకు, అడగడానికి నువ్వెవరని నిరశిస్తే, నీ అన్ననంటూ, దెబ్బతిన్న వాళ్ళకు, ఎడ్లకు, బండ్లకు తగు పరిహారమివ్వమని కోరతాడు. ఇవ్వను, నీ దిక్కున్న చోట చెప్పుకోమంటాడు.

సరిగ్గా అదే సమయంలో భీష్ముల వారి పంపినట్లు మహామతిమంతుడు, విదురులవారు, వారితో ధనుర్బాణ సహితుడైన అర్జునుడు వచ్చి విషయ మడుగుతాడు. పనిలోపని ఏమయిందని భీముని కూడా అడిగితే జరిగింది చెప్పి, వారికి పరిహారమివ్వమన్నానని, నువ్వెవరని నిలదీసాడని అందుకు నేను కోపించి-

తగు పరిహారం, దీటైన సమాధానమివ్వకపోతే ఇక్కడనుండి కదలను సరికదా, ఇంకా మూర్ఖిస్తే ఈ భవంతిని నేలమట్టం చేస్తానని జరిగింది, జరిగినట్లు చెబుతాడు. బాధితులందరు "నిజం, నిజ"మనడంతో, భీష్ములవారి సందేశాన్ని చెప్పి, వారికి తగు పరిహారమిచ్చి, సమస్యను పరిష్కరించుకోమన్నారని కాదంటే-

"దుశ్శాసనా", నీకు, ఇందులో నీకు సాయపడిన నీ సోదరులకు, కురువంశం తరపున అలాగే - ఈ దేశ ప్రజానీకం ఏ విధంగా సాయపడరని తెలియపర్చ మన్నారని చెబితే, విధిలేక సామరస్య ధోరణికి వాతావరణం సరిచేసుకుంటాడు. ఆ దుశ్శాసన బృందానికి, అన్ని బాధలకు, అసహనానికి, పాండవుల మంచితనం, వీరి కుత్సితం - పులిమీద పుట్రగాను, పుండుమీద కారమయింది.

ఇది సమస్యా పరిష్కారం కాకపోగా, సమస్య తీవ్రతను పెంచింది. యుధిష్టరుని రాజరికాన్ని మన్నించరాదన్న దృఢనిశ్చయానికి మూల బలమై కూర్చుంది.

అప్పటికి పరిస్థితి సద్దుమణిగింది. కానీ, దుర్యోధన సోదరుల మనస్సులలో మాత్రం - మాత్సర్య జ్వరం తీవ్రమై - వాళ్ళు అశాంతికి గురవుతున్నారు. అయినా

పాండవుల మంచితనం, భరతవంశ కీర్తి ప్రతిష్ఠలకు ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ సాక్ష్యం లేదా సత్యదర్పణంగా నిలిచింది.

ఆనాటి రాత్రి అనుకున్నట్లే కృష్ణుడు, భీమునితో కలిసి, ఉద్ధవుడు - సాత్యకి తోడుగా - బలియా మల్లవీర శిక్షణా శిబిరానికి బయలుదేరారు. ముందు బలియా మనుమడు గోపి దారిచూపుతుంటే, గ్రద్ధ వంశానికి చెందిన ఇద్దరు అంగరక్షకులుగా కృష్ణునికి ముందు నడుస్తూంటే - వీళ్ళా శిక్షణా శిబిరాన్ని చేరారు.

కృష్ణాదులు అక్కడికి వచ్చేసరికి - జేష్ఠ - శ్రేష్ట మల్లులు వారి వారి పరివారము, కుటుంబాలతో, వీళ్ళను ఆహ్వానించడానికి, ఎంతో ఆనందంగా సిద్ధంగా వున్నారు. కృష్ణుని ప్రేరణతో ఓపిక, బలం కొంత తెచ్చుకున్న బలియా, ఒకరిసాయం లేకుండానే, లేచి నిల్చుని కృష్ణుని ఆహ్వానించాడు. ఆ దేవదేవుని ధర్మమూర్తి - శ్రీ చరణాలపై తన శిరస్సు వుంచి, వందనం చేసాడు. అది తనకు జన్మజన్మల పుణ్య భాగ్యమని తలచి మురిసాడు.

అందరు - గోదా వద్దకు వెళ్ళారు. అక్కడ జగన్మాత - "అమ్మ" విగ్రహముంది. మామూలు పూజాదికాలన్ని పూర్తయ్యాయి. కృష్ణాదులు అంజలి ఘటించి, అర్చన కార్యక్రమాలు నిర్వర్తించిన పిదప, ఆరతి కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. దానికి తగ్గట్లు మంత్రాలు, ఆరతి పాటలు జరుప బడ్డాయి. ఆరతి అందరికి ఇవ్వబడింది. కళ్ళ కద్దుకున్నారు.

అప్పుడు మహోదానందపడిన బలియా "ప్రభూ! నాదొక విన్నపమంటూంటే, "అది నాకు తెలుసు. రండి. నేను ఎవరిని ఢీకొనాలో, వారు ఆనందంగా రావచ్చన్నాడు. తన మనోభీష్టం నెరవేర్చే ఆ గోవిందుని - బలియా గొప్పగా కీర్తించాడు. ఆతని కుమారుడు - సోమేశ్వరుడు, కృష్ణునితో తలపడటానికి గోదాలో దిగాడు.

పైగా ఇది నాకు అదృష్టం ప్రభూ! నన్నాశీర్వదించమని అర్థించాడు. క్షణాలలో కృష్ణుడు మల్లయుద్ధానికి వీలుగా తన దుస్తుల్ని మార్చుకున్నాడు. చూస్తూండగా ఆ అందగాడు కండలు తిరిగిన మగాడిలాగ కనుపించేసరికి అందరు ఆశ్చర్యపోయారు. అచ్చం నిజమైన మల్లునిలాగే ఆ వాసుదేవుడు భలే ఠీవిగా వున్నాడు.

కృష్ణుడు - సోమేశ్వరుడు దగ్గరకు వచ్చి నువ్వు నన్ను పడేస్తావా లేక నేను నిన్ను పడెయ్యాలా...? కోరిన విధంగా చేస్తానన్నట్లు చెప్పాడు.

"ప్రభూ! నువ్వు నన్ను క్రింద పడేస్తే అది నా అదృష్టం. నేను కరుణించ బడ్డానని తలుస్తాను. అదే నేను నిన్ను క్రింద పడవెయ్యగల్గితే, జగదేకమల్లునిగా గుర్తించి, కీర్తించబడతాను. ఏదైనా అది నాకు వరమే. కాని నాదటువంటి పద్ధతి కాదు. నా శిక్షణలోని మల్లులను వీరులగానే పోరాడమన్నాను తప్ప, ముందు జాగ్రత్తలు, హెచ్చరికలు, ఒప్పందాలతో విజయులవడటం తగదని నేర్పాను.

కనుక, నాదీ.... అదే పద్ధతి.. సమవుజ్జీలుగా పోరాడదాం. ఏదైనా నాకు వరప్రసాదమే. ఆనందదాయకమేనని, పాదాలకు వంగి నమస్కరించాడు. చాలా సంతోషము. మంచి శిక్షణ, మంచి పద్ధతి, మహామల్లుని కుమారుడివి కదా, నీకు వంకర బుద్ధులెందుకు వస్తాయని, కృష్ణుడు ప్రశంసించాడు.

"రా! పట్టు" అని తమ తమ ఇష్టదైవాలను ప్రార్థించుకుని వారు గోదాలో దిగారు. ఒక మూల కృష్ణునితో పట్లు పడుతూనే, పదహారేండ్ల వయస్సులో వీరాధివీరులు, మహావిక్రములుగా, ఆనాడు చెప్పుకునే కంస, చాణూరులను, మర్దించి, వధించాడంటే... అమ్మో! అది సామాన్య విషయం కాదు. కృష్ణుడు సామాన్య మల్లుడు కాడు. అటువంటి త్రిభువనమల్లునితో పోరాడటం, నిజంగా గర్వకారణంగా తలచి పొంగిపోతూ, కృష్ణుని పట్లను అందులోని మెలకువలను, సూక్ష్మాతిసూక్ష్మంగా సోమేశ్వరుడు గ్రహిస్తునట్లు గమనిస్తున్నాడు.

భారీ విగ్రహుడైన సోమేశ్వరుని పట్టునుండి చెప్పుకోదగ్గ శరీరసౌష్ఠవం గల కృష్ణుడు చిత్రంగా తప్పుకుని ఏమార్చుతూంటే, చుట్టూ చిత్రంగా చూసే ప్రతి ఒక్క మల్లుడు ఆశ్చర్యపోతున్నాడు. కృష్ణుడు ఉత్సాహంగా వున్నాడు. సోమేశ్వరుడో... క్షణక్షణానికి నీరసించిపోతున్నాడు.

తను బిగిపట్లతో కృష్ణుని ఎదుర్కోవాలని చూసిన ప్రతి క్షణం, కృష్ణుడు హుషారుగా రెచ్చిపోతున్నాడు. సోమేశ్వరుడు నీరసించిపోతున్నాడు. కృష్ణుని ముందర, తనవి చిలిపి, అల్లరి చేష్టలుగా వున్నాయే తప్ప - విజయుడయ్యే మార్గాలు ఏ కోశానా కనబడటం లేదు.

కాని కృష్ణుడు తనదైన పద్ధతిలో బిగించిన పట్టుకు సోమేశ్వరుడు బంతిలా ఎగిరి నేలకు కరుచుకున్నాడు. అబ్బ! అసామాన్యమా పట్టు, దెబ్బ - అనుకున్నాడు బలియా కొడుకు. అందుకే కృష్ణుడు, ఆ చిన్న వయస్సులోనే ఆ మహామల్లులను ప్రతిఘటించి, మర్దించి, వధించాడనుకున్నాడు.

అందరు కృష్ణుని అపురూప మెలుకువలకు, అలుపెరుగని గెలుపుకు "జయహో, జయహో అన్నారు. కృష్ణుడు అక్కడనుండి బయటికి ఎగిరి గెంతగానే సాత్యకి కృష్ణుని ఒంటిపై గల దుమ్ముధూళిని దులుపబోయాడు. సోమేశ్వరుడు శ్రీకృష్ణుని దివ్యచరణాల వ్రాలి,

"ప్రభూ! అమోఘం నీ మల్లయుద్ధ ప్రావీణ్యం. దయచేసి నాకు ఆ పట్లు నేర్పి నన్ను ఉత్తమోత్తమునిగా తీర్చ ప్రార్థిస్తూన్నానన్నాడు. అప్పుడు నవ్వుతూ - కృష్ణుడు -

సోమేశ్వరా! నువ్వే పదిమందికి శిక్షణనిచ్చేవాడవు. నీకు నేను నేర్పడమా ? ఎవరైనా వింటే నవ్వుతారు. ఇదేం కాదు కానీ, వీలు చూసుకుని మనం తరువాత కొన్ని విషయాలను మట్లాడుకుందామంటాడు.

ఇదంతా చూస్తున్న భీముడు, మీదపడి చూసే మల్లులను ప్రక్కకు త్రోసి, కృష్ణుని బలియా కుటీరానికి తీసుకువెళ్ళి, అక్కడ కృష్ణునిపై బడిన ఇసుక, దుమ్ము తుడవడం ప్రారంభించాడు. అంతవరకు వూపిరి బిగపెట్టి వున్న భీముడు "కృష్ణా, మనం ప్రక్కగదిలోకి వెడదాం. అక్కడా నీ కోసం ఒక యువతి వేచి వుంది. ఆమెతో నువ్వు కాదు. ఆమె నీతో మాట్లాడాలిట."

అప్పుడు కృష్ణుడు నవ్వుతూ - "ఇంతరాత్రివేళ నువ్విక్కడకు తీసుకువచ్చిన ఆంతర్యం - ఇప్పుడు.... ఇప్పుడు నా కర్థమయింది. నేనూహించినట్లే చేసేవంటాడు. తన సహజ కొంటె చూపులు, నవ్వులతో చమత్కరిస్తూంటే... దయచేసి... అని భీముడు రెండు చేతులు జోడిస్తాడు.

"పొరపాటున ఆమె... జాలంధరి కాదు కదా!" కృష్ణుడలాగనేసరికి, భీముడు అప్రతిభుడవుతాడు. అతనికి అవతారపురుషుడు, ధర్మస్వరూపుడన్న అమ్మవారి మాటలు జ్ఞప్తికొచ్చాయి. ఆ వెంటనే సర్వజ్ఞుడవు, సర్వ హృదయాంతర్వర్తివి. నీకు నేను చెప్పగలవాడినా ? అంటూ ప్రక్క గదిలోకి త్రోస్తాడు.

అందులో ఇద్దరు ఆడవాళ్ళున్నారు. కృష్ణుని చూస్తూనే తలవంచి నమస్కరించారు. కృష్ణుడు వారిని ఆశీర్వదించాడు. ఇది సహజంగా సాగే క్రియ- ప్రక్రియలు.

"నానుండి ఏం కోరుతున్నారు ?" అడుగుతున్నాడు. ఆ వెంటనే వారిలో ఒకామె బయటికి వెళ్ళి తలుపులు జార వేసింది. దాంతో "ఎవరు ? కాశీరాజ తనయ కాదు కదా!" తన సహజ ధోరణిలో నవ్వుతూ అడిగాడు.

"క్షమించండి వాసుదేవా! మీ వూహ నిజమే. కానీ. నేనింత ప్రమాదకరమైన అర్ధరాత్రి సమావేశానికెందుకు తెగించానో మీకు తెలిసి వుంటుందంటూ, మా అక్క, మీ చిట్టిచెల్లెలుగా చెప్పమన్న విషయాలంటూ ఆమె పరిస్థితిని మొత్తం, ఆమె సందేశంతో కల్పి విడమరిచి, వివరించి చెప్పింది. మిమ్మ్మి స్వయంగా కలువ లేనందులకు క్షమించమని కూడా కోరిందంది.

అంతావిన్న కృష్ణుడు, ఇది ఎంత తప్పో. అర్థం చేసుకుందా ? అభిమానించి నందులకు, తన భర్తకోసం ఇతరుల నైతిక స్థైర్యాన్ని, ధర్మబద్ధ జీవితాన్ని, నమ్మినవానిగా నేను నాశనం చేసి, అనుక్షణం ఎవరైతే అన్యాయంగా, అధర్మంతో బ్రతకాలని కోరుకుంటున్నారో.... వారికి, వారికి.... అనుగుణంగా ప్రవర్తించమని తాను కోరడం, అందుకు నేను సిద్ధపడడం "ఎంత అన్యాయమో, దారుణమో ఆలోచించమను. అభిమానం వేరు. స్వార్థం వేరు. ప్రేమ త్యాగాన్నే కోరుతుంది తప్ప స్వార్థమవదు. నాశనం కోరదు. అది తెలుసుకోమను" కోపంతో గట్టిగా హెచ్చరించాడు.

పైగా - ఇది నీ జీవితాన్ని కూడ నాశనం చేస్తుందని తెగేసి కృష్ణుడు చెబుతాడు.

"అవును జలాంధరీ. నువ్వు అడిగిన దాంట్లో, మీ అక్క అడగమన్న దాంట్లోని, అర్థం పరమార్థాలు తెలుసుకున్నావా ? లేక ఆలోచించావా ? నీవు అభిమానించే వృకోదరుడు యువరాజు నిన్ను చేపట్టాలని చూస్తుంటే, మీ అక్క కోరిక నీ కోర్కెను, నీ బ్రతుకును శాసించి, నాశనం చేస్తుందని తెలుసుకోలేక పోయావు ? తెలుసుకుంటే.... వూ..." సాలోచనగా అడుగుతున్నాడు కృష్ణుడు.

అప్పుడు.... అప్పటికిగాని ఆ కాశీరాజు తనయకు, కురువంశ యువరాణి కోరిక పేరుతో, తనకు లభించే దురదృష్టాన్నెలాగ చేజార్చుకోబోయిందో కాని అర్థం కాలేదు.

క్షణకాలమాగింది. మనసు చిక్కబెట్టుకుంది. చిక్కబెట్టుకున్న మనసుతో సహాయం చేస్తా"నన్నా! మాటనిచ్చా! ఇప్పుడు వెనుదిరగడం ధీరుల లక్షణం కాదు" తన గట్టి సంకల్పం చెప్పింది.

అయితే నిన్ను నీవు అన్యాయం చేసుకుంటావన్నమాట. చాలా బాగుంది. "తన తలూపి", కృష్ణుడు, జాలంధరీ నీ మాట నువ్వు నిలబెట్టుకో. యువరాజయ్యేక

నువ్వు జాలంధరిని వివాహం చేసుకుందువుగాని. అంతవరకు తొందరపడవద్దని భీమునికి చెప్పిన మాట - నేను నిలబెట్టుకుంటాను'' నిండు అభయసూచకంగా చెప్పిన కృష్ణుడు -

ధర్మం నిలబడుతుంది. నిన్ను నిలబెడుతుంది. ధైర్యంగా వుండమన్నాడు.

అందుకు పూర్తిగా స్పందించలేని జాలంధరి ''గోవిందా! నువ్వు ఆపదోద్ధారకుడవు. నీ అండ, ఆశీస్సులు, అభిమానం.... అందరు కోరుకుంటారు. అభ్యర్థనను మన్నించు. అండదండల నొసగుము'' అని అర్థించింది.

వెంటనే భీముని పిలిచాడు.

ఈ పిల్ల.... అన్నాడు, కృష్ణుడు. నన్ను తన సోదరునిగా చేసుకుంది. తనను రక్షించాలిట. నిన్ను రక్షించాలని నువ్వు, ఎవరి మట్టుకు వారు, తమ తమ రక్షణ కవచాల్ని నా నుండి కోరుతున్నారంటే..... వారిని రక్షించడం వారి వారి కోర్కెలను మన్నించి కాపాడటం నా కర్తవ్యం గదా! కర్తవ్యము నీ వంతు, కాపాడుట నా వంతు.... నా మాటను నా పీకకు చుట్టి ఆనంద పారవశ్యంలో మున్గి తేలే మిమ్ములను, ఆ ఆనందంలోనే ముంచాలి, వుంచాలన్నది నా భావం అని ముగించాడు.

# హమ్మయ్య, కరుణించాడు

**జా**లంధరి మాటకు భానుమతి పరవశించింది

''అన్న'' నన్ను కరుణించాడు. అభయ మొసగాడు. మురిసిపోయింది. ఇప్పుడు ప్రకృతే కాదు, ఇప్పుడెటువైపు ఆమె తల తిప్పినా - దేనిని చూసిన అక్కడ అమృతధారవలె ఆనందం తాండవిస్తుంది. నవ్వు తప్ప మరొకటి తెలియడం లేదు. భానుమతికి కనబడటం లేదు.

కృష్ణుని మాటమీద భానుమతికి అంతవిశ్వాసం. నమ్మకం. ఇంకా చెప్పాలంటే ''అంధ'' విశ్వాసమన్నా తప్పులేదు. గర్భస్థ శిశువు కూడా, ఆమె సంతోషంలోని బలాన్ని, సంబరాన్ని, అంబరాన్ని చుంబింప చేస్తూంటే ''అమ్మా!'' అని తెలియక కారణమడుగ పిలిస్తే - ''అదృష్టవంతుడివి. మామయ్య కృష్ణుడు మనల్ని కరుణించాడు. తన ఆశీస్సులు అభయమొసగా''డని పొంగిపోయేది.

"ఇంక దీనినెవరితో చెప్పుకొని మురిసిపోవాలి" అనుకుంది. భర్తకన్న యోగ్యుడు. ఆనందప్రదుడు మరెవ్వరుంటారన్న ఆశతో, తన రాణీవాసం నుండి భర్త కోసం బయలుదేరింది. వరండా దాటుతుంది. అప్పుడు... భర్త కంఠస్వరం. కళ్ళు చిట్లించింది. అవతలి వ్యక్తి తన సోదరుడు సుశర్మ. అనుకోకుండా ఆగి పోయింది. భర్త మనసు స్పష్టమయింది. ఆమె ఆశలు ఆవిరయిపోయాయి. అవి-

"మీరు అనుమతిస్తే" వచ్చే సం॥రం వర్షాకాలం తర్వాత, ప్రశాంత వాతావరణంలో మా చెల్లెలు జాలంధరి స్వయంవరమేర్పాటు చేద్దామంటున్నాడు సుశర్మ.

"మీ ఇష్టం. మీ తండ్రిగారి అభీష్టం మేరకు చెయ్యండి." అన్నాడు దుర్యోధనుడు. అప్పుడు సుశర్మ.

"నా సోదరీమణులిరువురు ఒకేచోట వుంటారు. ఏ విధమైన ఇబ్బందులు వుండవు. పైగా మీకు కూడా జాలంధరి... అంటే ఇష్టం కాబట్టి, ఆలోచనా పునరాలోచనం చెయ్యవలసిన అవసరముండదు!"

అంటే అన్న - చెల్లెల్ని తనకు సవతిగా తేవాలని చూస్తున్నాడన్న మాట అమ్మో! వీళ్ళు నా కొంప ముంచుతున్నారు. గుండెల్లో మంటలు రేపుతున్నారు. "నిజం. ఆమె తత్వం నాకు తెలుసు. నేను జాలంధరిని పూర్తిగా అర్థం చేసుకున్నా నంటాడు."

అయితే - ఇప్పుడెలాగ వున్నా, వివాహానంతరం, తప్పక - ఆడపిల్ల - ఈ దేశంలో పుట్టిన పుణ్యమాని, భర్తకనుగుణంగా మారుతుంది. ఇందులో సందేహించాల్సిన పనిలేదంటాడు. ఇంతవరకు తన అదృష్టానికి తానే మురిసి పోయిన భానుమతి, గుండె గుభేలుమంది. అగాధంలో పడిపోతున్నట్లనిపించింది.

ఇప్పుడు అభయం స్థానంలో భయం చోటు చేసుకుంటుంది. హస్తినా పురంలో తన భర్త వుండాలని కాదు. తానుండకూడదని, తనకు సవతిగా తన చెల్లెలు జాలంధరి రాకూడదని.... మనస్ఫూర్తిగా మనసులోనే ప్రార్థించాలి. అభయమివ్వాలని నేనుగానే కోరాలి. విధి వైపరీత్యమంటే.... ఇదేనేమో! తన భర్త సుఖం కోరి, తాను, ఆ గిరిధారి అభయాన్ని కోరితే, ఈ మూర్ఖులు తన జీవితాన్ని బలి కోరుతున్నారు. ఆవేశం కాదుకాని, ఇప్పుడు అర్థరహితమైంది, తన బ్రతుకని భానుమతి బయటికి చెప్పుకోలేని బాధతో లోలోపల బావురుమనసాగింది.

ఈ సమయంలో ఏదో నీడ. భయంకర క్రీనీడ. ఆ వ్యక్తిని తాను చూడలేదు కాని, ప్రాణాలుతీసే యముడంటారే. అలాగ వున్నాడనుకుంది. అంతే ప్రాణ భయం పట్టుకుంది. మృత్యుదేవత తన నెత్తి నెక్కినట్లు తలచిన భానుమతి భయంతో విలవిలలాడిపోయింది.

బలిపశువై పోయిన భానుమతి "గోవిందా - గోవిందా! రక్షించు. రక్షించు!" అసంకల్పితంగా అరుస్తుంది. ఏడుస్తుంది. ప్రార్థిస్తుంది. ఆమె అరుపులకు పెద్దమ్మ రేఖ పరుగెత్తుకుంటూ వచ్చి, క్రింద అచేతనంగా పడివున్న తన యజమానురాలిని చూసింది. మంత్రసానిని, ఇతర పరిచారకులను పిలవడం ప్రారంభించింది.

ఇదే సమయలో నదీ స్నానానికి వెళ్ళి వచ్చిన చెల్లెలు జాలంధరి, అక్కగారి అరుపులు, మూలుగు విని అలాగే అర్ధనగ్న దుస్తులతో ఆమె గదిలోకి వచ్చింది. తలుపులు వేసి వున్నాయి. దబదబ బాదింది. సమాధానం లేదు. ఖంగారు పడుతున్న తరుణంలో లోపల, తలుపులు తెరచుకున్నాయి. లోపల నుండి ఎవరో క్రొత్త వ్యక్తి - లావుగా - బొద్దుగా వున్న ఒక పెద్దావిడ వచ్చింది. అక్క బట్టలు చిరిగి వున్నాయి. అస్తవ్యస్తంగా వున్న దుస్తులతో, నిస్పృహతో, అదేపనిగా "గోవిందా! నా శిశువును రక్షించు, వాడిని బ్రతికించు!" బిగ్గరగా అరుస్తొంది.

పాలిపోయినట్లు తెల్లబోయిన మొహంతో జాలంధరి ఆమెను చూసింది. నువ్విక్కడ వుండకూడదు. పిల్లలు వుండే ప్రదేశం కాదు" వెళ్ళిపో అందామె.

భయంతో, శారీరకంగా వణికిపోయే తన అక్కనింక ఆ భగవంతుడు వాసుదేవుడే రక్షించాలి. ముందు తను బట్టలు మార్చుకుని, తల దువ్వుకుని వస్తా.... నని.. తన గదిలోకి పరుగెడుతుంది. ఆమెను, ఆమె కంగారును చూసిన దుర్యోధన, సుశర్మలు "ఏమయింది ? ఎందుకలా కంగారుపడుతున్నావు ?" భయపడుతున్నావని అడుగుతున్నారు.

"నాకు తెలియదు. ఆవిడెవరో నువ్విక్కడ వుండకూడదని చెప్పి తలుపులు మూసేసుకుంది. ఏం జరిగిందో, జరుగుతుందో... నాకర్థమవటం లేదు, అందా పిల్ల జాలంధరి - కంగారు, భయం నింపుకున్న మనసుతో!

"ఏవిటి చచ్చిపోయిందా ? చచ్చిపోతుందా ? అదో రకంగా చూస్తూ దుర్యోధను డడుగుతూంటే, సమాధానం చెప్పలేని, తన భావాలన్నింటిని మనసులోనే దాచుకుంటూ -

"పొరపాటున అదే కనుక జరిగితే, మీ జీవితంలో ఇక ఇటువంటి మంచి భార్య - మరెక్కడా, మరెప్పుడు, మరెన్నడూ దొరకదు. మీ వంటి దురదృష్ట వంతులు, ఈ విశాల విశ్వంలో మరొకరుండర"నేసింది. ఆవేశం చంపుకోలేని ఆక్రోశంతో - నరనరాల్లో తన అన్నరూపం, వేదన స్థిరమవడంతో!

సభామందిరం దాటి ఒక్క అడుగు వేసిందో, లేదో.... మహారాణి గాంధారి, ఇరువురు పరిచారకులతో కలిసి తన కోడల్ని చూడాలని వస్తూంది.

జాలంధరి పరుగెత్తుకుంటూ కృష్ణమందిరానికి వెళ్ళింది. అప్పుడక్కడా సమయంలో విరాటరాజు కృష్ణునితో కొలువు తీరి వున్నాడు. దాంతో గబగబ పాండవుల మందిరానికి వెళ్ళింది. పరిస్థితి చెప్పింది. కృష్ణునికి పరిస్థితి తెలుపుమని ప్రార్థించింది.

కుంతి, భానుమతి అస్వస్థత గురించి తెలుసుకుని దుర్యోధనుని మందిరానికి బయలుదేరింది. అత్తగార్ని ద్రౌపది కూడా అనుసరించింది.

ఇక్కడ భానుమతి పరిస్థితి దయనీయంగా తయారయింది. ఇందులో పరిస్థితికి తగ్గట్లు జ్వరం కూడా వచ్చింది. ఆమె మనఃస్థితి అయోమయంగా వుంది. పిచ్చి ప్రేలాపనలు.

మంత్రసాని నుండి - రాజవైద్యుల చికిత్స మొదలయింది. అంతా అయోమయం. అగమ్య గోచరం. అస్తవ్యస్తంగా వుంది.

# పాపం, భానుమతి!

అనూహ్య సంఘటన జరిగింది. పరిస్థితి చెయ్యి దాటిపోయింది.

జరిగిన ఘోరానికి బాధపడుతూ మహారాణి గాంధారీ, దుర్యోధనునికి, సుశర్మకు రమ్మని కబురు పంపింది. భానుమతి మందిరానికి వచ్చి, జరిగింది తెలుసుకుని వాళ్ళెంతో బాధపడ్డారు.

పండంటి పిల్లవాడినిస్తుందనుకున్న భానుమతి అననుకూల అస్వ్యస్త పరిస్థితులలో, భయానక వాతావరణానికి గురయి గర్భస్రావ మొందింది. మాతృత్వం పొందలేకపోయిన, కురువంశోద్ధారకుని ప్రసాదించలేకపోయిన భానుమతి భోరుమని విలపించింది.

"దేవీ!" అని పిలచిన భర్త పిలుపు అరకళ్ళు తెరచిన భానుమతి "స్వామీ! దురదృష్టవంతురాలను. వంశాంకురాన్ని అందివ్వలేకపోయాను. అనుక్షణం నా వల్న మీకు, అశాంతే తప్ప, ప్రశాంతి కనబడటం లేదు. అంతటి పాపినైపోయాను. నన్ను క్షమించండి!" ఆ స్థితిలో ఆమెకు కన్నీరు మున్నీరయింది.

భగవంతుడా! నన్ను రక్షించు. గోవిందా ? నన్ను కరుణించుమని ప్రార్థించిన భానుమతి "ప్రభూ! మీ హృదయం నాకు తెలుసు. తప్పక జాలంధరిని చేపట్టండి. ఆమె మిమ్ము సుఖపెడుతుంది. మన పిల్లవాడిని గూడా జాగ్రత్తగా చూస్తూంది" మతిస్థిమితం లేని ఆ మాటలకు ప్రతి ఒక్కరు తల్లడిల్లిపోతున్నారు.

దుర్యోధనుని పరిస్థితి సరేసరి.

ఈ సమయంలో మళ్ళీ "గోవిందా! గోపాలకా! గోపికా ప్రియ, బృందావన విహారీ!" నన్ను రక్షించు. కరుణించి, కాపాడు!" దీనంగా అరుస్తుంది, ఏడుస్తుంది, ప్రార్థిస్తూంది.

ఆమె విన్నపమాలించినట్లు, ఆ గోవిందుని కందినట్లు ఆ గది తలుపులు తెరుచుకున్నాయి. ముందు జాలంధరి, ఆమె వెనుక - భానుమతి పిలిచే గోకుల విహారీ! గిరిధారీ, గోవిందుడు. ఆర్తజన సంరక్షకుడు - అరుదెంచాడు. ఎంతో సామాన్యంగా ఆ ఆనందప్రదాత కనుపించాడు.

ఆ సమయంలో కృష్ణుని చూసిన దుర్యోధనునిలో ఆవేశం కట్టలు త్రెంచుకుంది. కోపం దిగమింగరానిదయింది. అయితే, అది సమయం కాదు. దీనావస్థలో భీతహరిణిలాగ, క్షణక్షణం అయోమయావస్థలో, అత్యంత దయనీయంగా ప్రవర్తించే భార్య భానుమతి కోసం తనను తాను నిబ్బరించు కున్నాడు.

ఆ క్షణంలో ఏ పరిస్థితిని ఎప్పుడూ లెక్కచెయ్యని ఆ దీనజనబాంధవుడు, మెల్లిగా, ఆమెను చేరాడు. అభయప్రదానంగా అనునయిస్తున్నట్లు తన చేతిని ఆమె శిరస్సుపై వుంచాడు. ఆ పరిస్థితిని చూసి మంత్రసాని తట్టుకోలేకపోయింది. ఆర్య సాంప్రదాయానికి, మానవులకు ఆ పరిస్థితి భిన్నం కావచ్చును. కానీ దేవునికి అసహాయ సహాయునికి, అనాధరక్షకునికి ఇది ఏ మాత్రం, నిబంధన కాదు. విరుద్ధం కాదు. ఆ చల్లని చేయి తగులగానే, భానుమతి భయం పోయింది. కరుణ వెల్లివెరిసే ఆ అభయప్రదాత కన్నులలోని కాంతి ఆమెకు అలౌకిక ఆనందం

కలుగచేసింది. "అన్నా!" అంతటి దుస్థితిలోను అన్న కాని ఆ అన్న ప్రేమకు తల్లడిల్లిన ఆ చెల్లెలి మనసు కుదుటపడినట్లు, పిలచిన పిలుపుకు స్పందిస్తూ వచ్చిన అన్నను కృతజ్ఞతగా చూసింది. అప్పుడు కృష్ణుడు మంత్రసానితో,

"చూడమ్మా! ఈ కృష్ణుడు అధర్మపరుడు. అన్యాయవాది కాదు. ఈ సమయంలో పరపురుషుడు ప్రసూతి గృహంలో - ఆ సమయంలోని స్త్రీని ముట్టుకోడు. "అన్నా" అని పిలిచింది. అభయం కోరింది. ఆ అభయాన్ని నిర్భయాన్ని ప్రసాదించడానికి వచ్చిన నన్ను ఈ విశాల విశ్వంలోని ఏ దుష్టశక్తి అడ్డుకోలేదు. అధర్మమని నిరశించలేదు. ఈమె నా చిట్టి చెల్లెలు.

భానుమతి మెల్లిగా కళ్ళు తెరచింది. కృతజ్ఞతతో కృష్ణుని చూసింది. "అన్నా! నాకు వంశోద్ధారకుడు పుట్టాడు. అతడే భావి కురుసామ్రాజ్య సార్వభౌముడంది. మాటలు సన్నబడుతున్నయి. కళ్ళు మూతలు పడుతున్నయి. చలనరహిత మవుతుంది.

కొన్ని నిముషాలు గడిచాయి. అప్రయత్నంగా ఆమే కళ్ళు తెరచింది. "అన్నా! క్షమించు. కరుణించు. కంటివెంట నీళ్ళు.... నీ వద్దకు రాలేకపోయాను. నిన్ను చూడలేకపోయాను. దురదృష్టవంతురాల్ని. అయినా నీ... చిన్ని చిట్టిచెల్లెల్ని కదా! క్షమించు" అన్నది. ఇంకో క్షణమాగింది.

కొంతలో కొంత నిబ్బరం కల్గుతుంది.

"ధన్యురాలను. నా ప్రభువు ఈ హస్తినాపురాన్ని పరిపాలిస్తాడన్నావు. అది చాలు. అదే నాకు తృప్తి, ఆ వరం చాలు, ఈ చిట్టి చెల్లెలికి!" మళ్ళీ మగత చెదరు మదురు మాటలు.

"అన్నా! నీ మాట నిలబెట్టుకో. ఈ చెల్లెలి ప్రాణాలు నిలబెట్టు. నీపైనే అన్ని ఆశలు పెట్టుకున్న నన్ను నీ వాగ్దానంతో తరింపచెయ్యి." అర్థపర్థంలేని మాటలుగా దుర్యోధనుడు తలుస్తున్నాడు. ఈతని వాగ్దానం. ఆమె సంతోషం. అది నిలబడటం. తాను హస్తినాపుర ప్రభువు నవడం. అంతా అయోమయం. గందరగోళంగా వుంది. భానుమతికి కాదు - ఇప్పుడు తనకు పిచ్చిపట్టి, మతి భ్రమించేటట్లుంది. దుర్యోధనుడచేతనుడవుతున్నాడు.

కృష్ణుడు ఆమె చేతిని పట్టుకునే వున్నాడు. కళ్ళలో వింత కాంతి - తెలియని ఆత్మీయత, చెప్పలేని అనుభూతి. చెప్పుకోలేని మధురానందం.

ఇప్పుడు ఆస్థాన వైద్యులు కల్పించుకుని "ప్రభూ! వాసుదేవా! రోగి మానసిక పరిస్థితిని బట్టి ఆమెకు వుద్రేకం కలుగనీయరాదు. తమకు...!"

ఆ వైద్య శిఖామణినొకసారి పరిశీలనగా చూసిన కృష్ణుడు -

"ఈ సమయంలో మీరెవరు ఆమెకు వూరట. తృప్తినివ్వలేరు. స్వస్థతకు తీసుకురాలేరు. నేను తీసుకురాగలను. అది నా వల్లనే సాధ్యమన్నాడు" "చిత్త"మని ఆ వైద్య శిఖామణి నోరు మూసేసాడు.

కృష్ణుడు తన వరద - అభయ హస్తాన్ని ఆమె నుదుట, కళ్ళమీద వుంచాడు. చిత్రంగా కళ్ళు తెరచింది. మళ్ళీ చక్కగా భానుమతి మాట్లాడటం ప్రారంభించింది.

"అన్నా! ఆర్యపుత్రులు చాల మంచివారు. గుణవంతుడు. ధైర్యవంతుడు. అతని కుమారుడు కూడా అంతటి గొప్పవాడే అవుతాడు. భరతవంశ కీర్తి ప్రతిష్టలను దశదిశలకు వెదజల్లుతాడు. అవునా, అన్నయ్యా" అన్న ఆమె -

ఆ కుమారుడు నన్ను ప్రేమిస్తాడు. గౌరవిస్తాడు. అంతటి బుద్ధిమంతుడు, వీరవర్యుడు, శూరుడు మరొకడు వుండడని నువ్వే చెప్పాలి. అప్పుడే నాకు తృప్తి-సంతోషమంటుంది.

"నిజం. నీ ఆశలు, ఆశయాలు సర్వం సత్యం. తప్పక నీ భర్త హస్తినాపుర ప్రభువవుతాడు. నా మాట నేను నిలబెట్టుకుంటాను. నీకు సత్కీర్తి కల్గిస్తాను. ఆ మాటలను భానుమతికన్న దుర్యోధనుడు ఆశ్చర్యంగా విన్నాడు. అప్రతిభు డయ్యాడు. మళ్ళీ నిజం. గోవిందుని మాటలు - తనను తానే నమ్మలేక పోతున్నాడు.

ఆ క్షణాలలో - భానుమతి "ఆర్యపుత్రా! ఆర్యపుత్రా! ఆర్ద్రంగా పిలుస్తుంది. దుర్యోధనునికై దిక్కులు చూస్తుంది. చుట్టూ వెదుకుతుంది.

"దేవీ! నేనిక్కడ... అన్న దుర్యోధనుడు - "ఇప్పుడు గోవిందా! నువ్వే మాకు దిక్కు. ఆమె లేనిదే నేను బ్రతుకలేను. నేను లేను. ఆమెను రక్షించు. నన్ను మన్నించు." ప్రాధేయపడుతున్నాడు. ఆ శరణాగతికై భగవంతుని నిరీక్షణ. అది ఫలించింది. భగవంతుని కరుణ లభిస్తుంది.

అప్పుడు - ఆమె పెదవులపై అద్భుతమైన చిరునవ్వు.

అటువంటి దానిని, దుర్యోధనుడు - తానెప్పుడూ చూడలేదనుకున్నాడు. అంత అందంగా, ఆనందంగా వుంది. ఆ సమయంలో పాలిపోయిన ఆమె ముఖం ఎంతో అందంగా కనుపించింది, మాట మధురం, చూపు మధురం. అధరం మధురం. ఆమే మధురమన్నంత మధురంగా వుంది.

అలాగ బొమ్మలాగ చూసిన ఆమె క్షణమాగి,

"గోవిందా! గోకులసంరక్షకా! గోపాలనందనా! నీ సఖ్యం నాకు తప్పక, మళ్ళీ, మళ్ళీ లభిస్తుందని వాగ్దానం చెయ్యి. నీ అభయంతో, ఏ భయం లేకుండా నిర్భయంగా ఈ శరీరాన్ని విడుస్తాను.

"చెల్లెమ్మా! ఎప్పుడూ - ఈ - కృష్ణుడు నీవాడే. నీకు తోడూ - నీడే - ఇది సత్యమన్నాడు."

"ఎందుకంత భయం, బాధ. తప్పక నీకు సంరక్షకుడనౌతాను." గట్టిగా వరదానమిస్తున్నట్లు చెప్పాడు.

మెల్లిగా నవ్వుతుంది. ఆ నవ్వు పేలవంగా, చిత్రంగా వుంది. అనవసర ఘర్షణ చెందకు. జన్మజన్మలకు ఈ గోవిందుడు నీకు సోదరుడు, సంరక్షకుడు. మళ్ళీ మళ్ళీ చెబుతున్నాడు. ఇదే ఆమె చెవిలో గట్టిగా కృష్ణుడు చెప్పాడు.

దుర్యోధనుడు జావగారిపోయాడు.

అసహాయుడయ్యాడు. గుండె బ్రద్దలవుతుంది.

తీరని దుఃఖం తొంగి చూస్తోంది.

అమాయకురాలు... అనవసరంగా... తట్టుకోలేకపోతున్నాడు. నిలద్రొక్కుకోలేకపోతున్నాడు. గోడకానుకుని, తట్టుకుని, పట్టుకుని, అతి బలవంతంగా నిలబడ్డాడు. జాలిగా, ఆర్ద్రతతో భానుమతిని చూస్తున్నాడు. దుర్విధి తనను వంచించింది.

మూసుకుపోతున్న కళ్ళు కొద్దిగా, "తెరవనా, వద్దా ?" అన్నట్లు తెరిచింది. "గోవిందా!" అనబోయింది. కృష్ణుని కంటితో చూస్తుందే కాని, నోటితో పిలువలేకపోయింది. పరిస్థితిని గమనించిన కృష్ణుడు ఆమె చెవివద్ద తన నోటిని "సదా నీకు తోడుగా వుంటానని" చెప్పాడు. నవ్వుతూ, కృతజ్ఞతతో కళ్ళు మూసుకుంది.

అదే ఆమె ఆఖరి చూపు, నవ్వు - పలుకు - పిలుపు.

"అక్కా!" జాలంధరి, భానుమతి దేహంపై బడి భోరుమని విలపించింది. కృష్ణుడు ఆమె భుజంపై చెయ్యివేసి "జాలంధరీ" ఓదార్చుతున్నాడు. దుర్యోధనుడు చేతుల్లో మొహం పెట్టుకుని విలపిస్తున్నాడు. మృతురాలిని వీడి, కృష్ణుడు దుర్యోధనుని భుజంపై చెయ్యి వేసాడు. వీపుపై గోముగా తట్టాడు. ఇద్దరు గది బయటకు వచ్చారు.

అంతర గదిలో పెద్దమ్మ రేఖమ్మ శరీరం వణుకుతుంది. చేతిలో మూటలాగ వున్న శిశువు గట్టిగా పట్టుకుంది.

"రేఖా. విచారించి ఏం లాభం ? పెద్దదానివి. ఓదార్చవలసిన దానివి. వూరుకో! చివరిక్షణాలు భర్తపై ప్రేమను, భగవద్భక్తిని కల్గించాయి. ధన్యాత్మురాలు. ఉత్తమ లోకాలు సంప్రాప్తిస్తాయి. ధైర్యంగా వుండు. వూరట చెందు!" అందరికి అధినాధుడు, ప్రతి ఒక్కరిని వూరడిస్తున్నాడు. ఓదార్చుతున్నాడు.

భానుమతీ యువరాణి మరణం అందర్ని కలచి వైచింది. పదిరోజులు సంతాపదినాలు గడిచిపోయాయి. రాజధాని అంతా శోకసముద్రంలా వుంది.

పదకొండోనాడు కర్మకాండ మొదలుపెట్టారు. పన్నెండోరోజు పిండప్రదానం జరిగింది. ఇక ఆమె తృప్తిగా, మహామహులు, పరమ పవిత్రులు నివశించే పరలోక (పితృలోక) వాసి అవుతుంది. జన్మధన్యత చెంది, తరిస్తుంది.

★★★★

ఆమెను చూచింది తక్కువే అయినా ఆ మధురస్మృతులు ఆమె అందం అనిర్వచనీయం. మరువలేని మధుర, మరపురాని స్మృతులయ్యాయి. ఆమె దర్శన-వీక్షణ దృశ్యాలు. "హాటకేశ్వర్" గుడి నిర్మాణంలో ఆ యువరాణి చూపిన శ్రద్ధ - భక్తి విశ్వాసాలు, ప్రశంసనీయమే కాదు, అనుక్షణస్మరణీయమై పోయాయి. ఎంతో మంచిదైన ఆ తల్లి సద్గుణాలతో ఏదో ఒకనాడు తప్పక దుర్యోధనుడు సన్మార్గుడౌతాడని అందరూ తలిచారు.

కాని విధి వక్రించింది. అతని పాపం పండలేదు. పుణ్యం వరించలేదు. పెద్ద పొరులకు తీరని దుఃఖం మిగిల్చి మరీ ఆ తల్లి పుణ్యలోకాలకు శాశ్వతంగా వెళ్ళిపోయింది. భానుమతి మరణించిన మర్నాడు - సుశర్మ, జాలంధరిలు తగవు

పడ్డారు. జరిగిందేదో జరిగిపోయింది. నువ్వు దుర్యోధనుని వివాహమాడమంటాడు. అన్నగా సుశర్మ. "ఆ మూర్ఖుని, దుర్మార్గుని తెలిసి తెలిసి ఏ ఆడది వివాహం చేసుకోదనీ, నువ్వసలు ఎట్లాగ ఇటువంటి నిర్ణయానికొచ్చావని ప్రశ్నిస్తుంది. "మనిషి" అన్నవాడికి పుట్టని దుర్బుద్ధి లాంటి, ఇటువంటి సలహానివ్వడానికి, అసలు - నీలో అంతో - ఇంతో మానవత్వ - ముందా ? నువ్వు మనిషివేనా ? అక్కసు దాచుకోలేక అడిగింది.

జరిగిందేమిటో తెలుసుకోకుండా, పగ-పంతాలతో ఎంతసేపు అవతలివారి నాశనంతోపాటు తనతో సమానము, అర్ధ శరీరమైన భార్య సుఖదుఃఖాలను గురించి ఆలోచించకుండా, ఆమెను హింసించి, చావుకు కారకుడైన, బుద్ధిహీనుడు అతనెవరైనా కావచ్చును. అతనిని వివాహం చేసుకోవడం ఎటుచూసిన సమర్థ నీయం కాదు. ఇప్పుడసలు ఆలోచించదగ్గ విషయమసలే కాదు. బ్రతికుండగానే "వుందా, చచ్చిందా ?" అని భార్యను చంపేసిన ఆ భర్తతో ఏ ఆడది సుఖపడుతుంది. ధర్మపత్నిగా, పతివ్రతగా నిలబడుతుంది" అక్కను చంపిన బావపై తన అక్కసునంతా ఇన్నాళ్ళు దాచుకున్న దాని భొళ్ళున కక్కేసింది. ఛీత్కారం కొట్టింది. బావతోపాటు, అన్నను కూడా బుద్ధిగా బ్రతకమని జాలంధరి హెచ్చరించింది.

అంతటితో విషయం విడిచిపెట్టకుండా పెద్దమ్మవంటి వృద్ధ పరిచారిక రేఖమ్మతో కలిసి కృష్ణుని శరణు వేడారు. ఇక్కడనుండి కాంపిల్యానికి వెళ్ళి అక్కడ స్థిరపడాలని కూడా తలిచారు. దుర్యోధనుల ప్రవర్తనతో అంతటి అసహ్యం కల్గిన చాలామందిలో వీళ్ళొకళ్ళు.

పదమూడు రోజులు గడిచిపోయాయి.

ఆనాడు భీముని శరీరాన్ని మర్దనా చేసే గోపు "ప్రభూ! నేను లేకుండా, మీరు వారణావతానికి వెళ్ళి చాలా పెద్ద పొరపాటు చేసారు. ఆలనా పాలనా లేకుండా, మీ శరీరమేమై పోయిందో చూడండి." అదో కబుర్లాట. లోకాభి రామాయణంలో భారతమంత కథను తనకు తెలిసిన విధంగా గోపి, భీమునికి చెబుతున్నాడు.

ఇంకో విషయం. పరమ రహస్యంగా గోపి అంటున్నాడు. "మన వాసుదేవస్వామి, ఆ భానుమతీదేవికి తప్పక నీ భర్త హస్తినాపుర ప్రభువవుతాడు. ధర్మం తప్పనంత వరకు నేనాతనికి తోడుగా, నీడగా వుంటాను. నీ మాట చెల్లిస్తానన్నారుట!"

"విన్నారా! ఇందులోనే మా బావ పెద్ద తిరకాసు పెట్టాడు" అన్నాడు భీముడు బిగ్గరగా నవ్వుతూ, అతనే మళ్ళీ "అదేవిటో తెలుసా.... ? ధర్మం తప్పనంత వరకు నేను తోడుగా వుంటానన్నాడు. వాళ్ళు ధర్మానికి నిలబడరు. మా బావ తనమాట నిలబెట్టుకోడు. ఇదే పరమ రహస్యం.. అర్ధమయిందా ?" భీముని మాటలలోని పరమార్థాన్ని పరమరహస్యాన్ని - వినే - ఆ గోపీ. నోరు తెరిచాడు.

పోయి, అతన్ని పడుక్కోమని, భీముడు నిద్రకుపక్రమించాడు. ప్రక్కకు ఒత్తిగిల్లి పడుకున్న భీమునికి చూస్తుండగా, చిత్రంగా ఓ కల వచ్చింది. అందులో తన బావ కృష్ణయ్య, తన దాయాది దుష్ట దుర్యోధనుని, హస్తినాపుర సింహాసనంపై కూర్చుండ బెట్టాడు. దాంతో అదిరి, బెదరి "అదేం కాదు. అలాగ చెయ్యకూడదు. తప్పు, తప్పు.... తప్పు" అంటూ కళ్ళు తెరిచాడు. గుండె దడదడ కొట్టుకుంటుంది. ఉచ్ఛ్వాసా నిశ్వాసాలు గుండె ఆగిపోతుందేమోనన్నంత అమిత వేగంతో కొట్టుకుంటున్నాయి.

లేచి కూర్చున్నాడు. చుట్టు చూసాడు. తను పడుకున్న చోటునే వున్నాడు. అయితే ఇదంతా కల. తను కలగన్నాడన్నమాట. ఎంత భయంకరమైన కల. ఎంత నిజంగా వుంది. ప్రక్కనే వున్న పాత్రలోని నీరు మరో చిన్న పాత్రలోకి వంచుకుని త్రాగాడు. క్షణకాలం ఆగాడు. మనసు కుదుటపడింది.

అయినా తెలియని దడ. ఎందుకు వచ్చిందీ కల ?

మెల్లి మెల్లిగా, నెమ్మది, నెమ్మదిగా హస్తినాపురం, భానుమతి మరణమనే భయంకర పీడకల నుండి తేరుకుని బయటపడుతుంది. రెండురోజులు గడిచాయి.

మూడవనాడు వేదవ్యాస భగవానులు వస్తున్నారని, పితామహుల తరఫున పౌరులందరికి, మహర్షి రాకను తలుపుతూ చాటింపు వేసారు. అలాగే - ఈ శుభ సమయంలో జరిగే యుధిష్టరుని - సింహాసనోత్సవాన్ని - అదే పట్టాభిషేకాన్ని నిర్వహించడానికి, వేదవిదులైన బ్రాహ్మణోత్తములు, శాస్త్రవేత్తలు, మరెందరో బుధజనులు వస్తున్నట్లు కూడా తెలియచేయబడింది.

వేదవ్యాసులవారు వచ్చారని, పొలిమేరల్లో వున్నారని తెలిసి ధృతరాష్ట్ర మహారాజు, మహామంత్రి - ముఖ్యసచివుడు విదురుని, పురోహితులు ధౌమ్యులు సోమదత్తులవార్ని, మహర్షిని పూర్ణకుంభంతో - వేదోక్త స్వాగతులతో స్వాగతించి తోడ్కొని రమ్మని పంపారు.

ఈ శుభ సమయానికి, మహర్షిని ఆహ్వానించడానికి, పౌరులందరు జయ జయ ధ్వానాలతో తరలి వెళ్ళారు. కురుక్షేత్రం నుండి ఈ మహాముని హస్తినాపుర ప్రజల నాశీర్వదించడానికి, యుధిష్ఠరుని మస్తకాభిషేక కార్యక్రమాన్ని వీక్షించి, ఆశీర్వదించడానికి-

అంతకుమించి మహామాత, రాజమాత - తన - మాత - సత్యవతీదేవిని దర్శించి, ఆమె శుభాశీస్సులనొందడానికి, ఇతరులకు తమ ఆశీస్సులనంద చేయడానికి, త్రిపురపురధారి ఆ అపర శివుని వలె -

**వ్యాసాయ విష్ణురూపాయ, శివరూపాయ వైష్ణవే**
**నమోవై బ్రహ్మనిధయే, వాసిష్ఠాయ నమో నమః**

అన్నట్లు పరంజ్యోతి స్వరూపుడు, కురుక్షేత్రం నుండి - తమ శిష్య బృందంతో తరలి వచ్చారు.

వీరిననుసరించి, వీరి ఏకైక తపో కుమారుడు శ్రీ శుకులు వచ్చారు. నిజంగా అది - మహాద్భుత సమాగమం. వీరితోపాటు ముఖ్య శిష్యులైన వైశంపాయన, పైలులు, మరో యాభైమంది శిష్యగణం అనుసరించి వచ్చారు. వారలనందర్ని దర్శించవలసిన మధుర సమయమది.

పితామహుడు భీష్ముడు, "అంధ" మహారాజు ధృతరాష్ట్రుడు, మంత్రి సంజయుడు, ధర్మమూర్తులు బలరామ - కృష్ణులు, విరాట, సునీధ, మణిమంతాది రాజేంద్రులు, మరెందరో అధికార, అనధికార ప్రముఖులు, ఆ ధర్మజ్యోతికి సాష్టాంగ వందనమర్పించారు. ప్రణమిల్లి ప్రణతులనొసగారు.

**"వ్యాసం వశిష్ట నప్తారం, శక్తేః పౌత్ర మకల్మషం**
**పరాశరాత్మంజం వందే, శుకతాతం తపోనిధి."**

అని - పురాణ పురుషుని, వేదకర్తకు, శృతి-స్మృతి పురాణేతిహాసములను, పంచమవేదంగా భారతంతో కల్పి - ఈ లోకానికందించిన, ఆ హరి హరాత్మజునకు, పరబ్రహ్మకు - సాదర స్వాగతంతో అర్ఘ్య ప్రదానాది షోడశోపచార, రాజోపచార, భక్త్యోపచార, సర్వోపచారాలను సశాస్త్రీయంగా అందించిన -

ఆ మహత్తర దృశ్యం. ఆస్తికులకు ఆత్మానందదాయకం. నాస్తికులకు నయనానందకరం. సమాజానికి సంపద్కరం. జనతకు శ్రేయస్కరం, శోభస్కరం,

వెరసి శుభంకరమై నిల్చింది. మొత్తానికి హస్తిన యావత్తు - ఈ మహర్షి ఆశీస్సుల చల్లని చూపులకు అంజలిబద్ధయై నిల్చింది.

"అందరి అభిమాన స్వాగతమందుకుని, ఆశీస్సుల నందించిన మహర్షి ప్రప్రథమంగా, తన తొలి వందన మర్పించడానికి మాతృశ్రీ మందిరానికి వెళ్ళారు. ఆ తల్లికి "మాతృదేవోభవ" అని వందనమాచరించారు. ఆ తదుపరి అలనాడు ప్రతీప మహారాజు ప్రతిష్ఠించిన శివాలయం "ప్రతిష్టేశ్వర్" సమీపంలో విడిది చేసారు.

ఆశ్రితుల నాదరించడం, అభాగ్యులను కరుణించడం, ఆపన్నులకు శరణొసగడం, కోరిన వారికి కోరినట్లు శుభములొసగడం, తన ధర్మంగా, తలిచి, చరించే పుణ్యజ్యోతి - ఆర్ష ధర్మాన్ని - ఆర్యావర్తం యావత్తులో ప్రతిష్ఠింపచేసే కార్యక్రమంలో భాగంగా చేసే పలు ధర్మ, సేవా కార్యక్రమాలనిక్కడ మహర్షి తాము, తమ శిష్యుల ద్వారా, అందించ - సకల విధ ప్రయత్నములు చేస్తున్నారు. "లోకాన్ సమస్తాన్ స్సుఖినోభవన్తు" అనడం కాదని, ఆచరణే ముఖ్యమనే మహనీయుని నేతృత్వంలో - సర్వజనానందదాయకంగా, సేవలు నిర్వహించబడు తున్నాయి. స్వస్తి ప్రజాభ్యాం.. ఇక్కడ సత్యమయింది.

అందర్నీ ఆశీర్వదించి, కాస్సేపు విశ్రాంతి తీసుకోదలచిన మహర్షి - కొద్దిక్షణాలు కళ్ళు మూసుకుని - సుఖమూర్తులైన తరుణంలో వచ్చిన పాండు పుత్రులు యుధిష్టరాదులు, మహర్షి దివ్య"శ్రీ" చరణాల చెంత కూర్చున్నారు.

కొంతసేపటికి కళ్ళు తెరచిన వ్యాసభగవానులు తన పాదాలచెంత, తమ్ములతో కూర్చుని వున్న యుధిష్టరుని చూసి, మందస్మిత వదనంతో, దరహాస రేఖలు పెదవుల వెల్లివిరియ, ప్రశాంతంగా వీక్షించిన ఆ పరమపురుషుడు - చేయెత్తి యుధిష్ఠరుని తమ్ములతో సహా ఆశీర్వదించిన తదుపరి -

"శుభమస్తు నిత్యం" అని, పట్టాభిషేకానికి సన్నద్ధమవుతున్నావా ?" అని అడిగారు.

"పితామహులు, పినతండ్రి - వంశ పెద్దలు, పరమపూజ్యులు... మీరుండ, మహామాతశ్రీ దివ్యాశీస్సులు సదా వర్షిస్తూంటే, మహారాజు పెదతండ్రి, మహారాణి పెదతల్లి - నిండు మనస్సుతో ప్రసరింపచేసే అనురాగ వీచికలతో -

చేయవలసిన ధర్మాలను, కర్మలను, శ్రేయోదాయకంగా, ఆర్ష ధర్మ సమ్మతంగా నిర్వర్తింప సిద్ధంగానున్న నాకు, తగు విధముగా మార్గోపదేశమొసగి,

ధన్యుని చెయ్యి ప్రార్థనమన్నాడు, వినయ విధేయతల సౌజన్యమూర్తిగా - ఆ వంశ జేష్ఠుడు, శ్రేష్ఠుడు - యుధిష్టరుడు. కేవలం "చిత్తమనకుండా, ఇంత తడవు ప్రకటించిన అతని ప్రకాశ విధానానికి, వదనానికి మురిసిన మహర్షి "అస్తు" అన్నారు. "తథాస్తు" అని దీవించారు.

దుర్యోధనుని బుద్ధి, ద్రోణాచార్యుల మనస్సు, పితామహుల ఆలోచన, మహామాత - అభిమతం అన్నీ తెలియబరచి - "నువ్వు..... సింహాసనాధీశుడవవ డానికి సిద్ధంగా వున్నావా ?" అని అడిగితే - "రాజు" - తన రాజధర్మాన్ని నిర్వర్తించాలి. ఆ శ్రేష్ఠమైన ధర్మాన్ని విడిచి, మరోవిధంగా ప్రవర్తించడానికిది ఆపద్ధర్మ సమయం కాదు. అందుకు ఆస్కారం లేదన్నాడు - ఎంతో ప్రశాంతంగా యుధిష్టరుడు....!"

యుధిష్టరునితోపాటు, వ్యాసులవారు, అన్నదమ్ములందర్నీ - వారి వారి అభిప్రాయాలను అడిగారు. వాళ్ళు వాళ్ళ వుద్దేశాలను తెలియబరిచారు. చివరగా-

"యుధిష్టరా!... నీ వుద్దేశమంటూంటే -

"క్షమించు భగవాన్. లోకంలో పెచ్చురిల్లుతున్న అధర్మనాశనానికి, ఈ తరం వంశ జేష్టునిగా అన్నగారు సింహాసనమధిష్ఠించడం, ధర్మప్రకాశానికి, ఆర్ష ధర్మనిరతిని - సదాచార సంపత్తిని నిలబెట్టడం, తక్షణ కర్తవ్యమన్నది - నా వుద్దేశ"మన్నాడు, భీముడు.

అంతా విన్న మహర్షి - యుధిష్టరుని చూసాడు. మహర్షి మనోగతం, అవగతం కానట్లు "తమ ఆజ్ఞ" అన్నాడు - ఈ తరం వంశ - ఆ పెద్ద కుమారుడు.

"అలాగ చేతులెత్తేయడం ధర్మం కాదు. సమయ సందర్భాలననుసరించి, ప్రవర్తించగల్గడం ముఖ్యం, అదే సర్వ శ్రేయోదాయక మార్గం. సుఖాలు మనకు, దుఃఖాలు ఇతరులకు కాకూడదు. సుఖదుఃఖాలు రెండూ మనవే. ఆ బరువు బాధ్యతలు మనవే.

కాలం మనది కాదు, ధర్మం మనది కాదు.

ఈ రెండూ పరమేశ్వరాధీనమే. వాటికనుగుణగా - మహావృక్షంలాగ కాక, గడ్డిపరకలాగ తలవంచుకుని వినయవిధేయతల సహజస్ఫూర్తితో, శాంతి పథంలో సాగితే... సర్వం శ్రేయోదాయకమే.... మనకే కాదు. లోకాలకు గూడా!

కనుక.... లభించినదేదైనా అనుభవించడం, ఆచరించి తరించడం - జీవి జన్మకు సాఫల్యం. ఇందులో ఎన్నో ఇబ్బందులు, బంధకాలు, ప్రతిబంధకాలు.. చెప్పనలవి కాదు. జీవితమే సుడిగుండమైతే.... రాజ్యం.. పూబి. జాగ్రత్త... సమాధాన చిత్తంతో ముందుకు సాగితే అంతా సుఖము, శుభమే.. కాదంటే - విచారము, అమంగళమే.

జాగ్రత్త.... పలుమార్లు హెచ్చరించి, మహర్షి కర్తవ్యాన్ని బోధించారు. చివరకు కాలానికి తలవొగ్గడం వివేకుల లక్ష్యము, లక్షణమని ముగించారు.

# ధర్మోరక్షతి...!

**అం**దరు సమావేశ - సభామందిరంలో సూర్యోదయానంతరం, ఆరు ఘడియలకు, సమావేశమవ్వాలని, భీష్మలవారు - అందరికి తాఖీదులు పంపారు. ఆనాటికి యువరాణి భానుమతి గతించి ఇరవై దినాలవుతుంది.

ఎన్నెన్నో వ్యాఖ్యలు, గాలి - నీలి వార్తలు - గుప్పుమంటున్నాయి.

ఉదయాన్నుండే - రాజ్యసభకు వచ్చే మహామూర్తులను, ప్రముఖులను చూడాలని ప్రజానీకం తహతహలాడుతుంది, భవన ప్రాంగణ పరిసరాలలో ఆతృతగా అందరు ఎదురు చూస్తున్నారు.

ఆ ప్రాంగణమంతా సర్వతో భద్రమైన రక్షణ ఏర్పాట్లు చేయబడ్డాయి. అందంగా అలంకరించబడిన ఏనుగులు "హస్తినాపుర" ప్రాభవానికి తగ్గట్లున్నాయి.

సమస్త రాజలాంఛనాలు, మంగళవాయిద్యాలు వందిమాగధులు, రాచరిక ప్రాభవానికి చిహ్నంగా ఎన్నో... ఎన్నెన్నో... ఏర్పాట్లు. అట్టహాసాలు ఎందరో విచ్చేస్తున్నారు. ఆ వచ్చే అతిథులను రాజసభా భవనంలోకి విదురుని సారథ్యంలో వీరాధివీరులు ఆహ్వానిస్తున్నారు. వారి వారి భద్ర ఆసనాలవద్దకు తీసుకు వెడుతున్నారు.

సమావేశస్థలికి ప్రక్కన, ముఖ్య ప్రవేశ ద్వారానికెదురుగా ఎత్తైన వేదిక - అచ్చట తొమ్మిది సింహాసనాలున్నాయి. ఇందులో అయిదు కుడివైపున, నాలుగు ఎడమభాగంలో వున్నాయి. మధ్యలో జింకచర్మం పరచిన ప్రత్యేక సింహాసనం, వ్యాసులవారికోసం కేటాయించబడింది. ఇటు, అటు ఒక్కొక్క వెండి సింహాసనం మిగిలిన ఏడు బంగారు సింహాసనాలు వున్నాయి.

ప్రతి ఆసనం వెనుక, ఒక అందమైన చెక్కబడిన మంగళ తోరణాలు, వీరణాలు, పూరణాలు.... మనోల్లాసంగా వుంది - ఆ సభ, వాతావరణం. గోడలకు ఆనుకుని ఎటువంటి అవాంతరాన్నైనా ఎదుర్కొనగల, కండలు తిరిగిన రక్షణశ్రేణి మల్లులు, వీరులు, తమ సేవలను వినియోగించ సంసిద్ధంగా వున్నారు.

శ్రేష్ఠ - జేష్ట మల్లు బలియా అగ్రస్థానంలో మల్లులందరికి అధిపతిగా వున్నాడు. అతని కుమారుడు సోమేశ్వరుడు - మనుమడు గోపి వగైరా వీరవిక్రములందరు అక్కడ తమ సేనలందించ సిద్ధంగా వున్నారు.

మొదటి వరుసలో కుడివైపున బ్రహ్మవేత్తలు, వేదవిదులు, రెండవ భాగంలో పండితులు, ప్రముఖులు వుండగా, మొదటి వరుసలోని సింహాసనాల వెనుక కురువీరులు, క్షత్రియులు.... వాటి వెనుక ఇతర అనధికార ప్రముఖులు, వాణిజ్యవేత్తలు సంపన్నులు.... తమ తమ హోదాలతో, వాళ్ళ వాళ్ళ స్థాయికి తగ్గట్లు ఆసీనులయ్యారు.

చివరలో- కళాకారులు, శిల్పులు.... ఇతర సాంకేతిక వర్గాలు వుండగా -

ముఖ్యమైన ప్రవేశద్వారము నుండి ఎత్తైన వేదికకు వెళ్ళే మధ్యేమార్గంలో అగ్నిహోత్రముంది. అక్కడ పైల, వైశంపాయనులు, వ్యాసభగవానులవారి ముఖ్య శిష్యులు, సోమదత్త, ధౌమ్యులు, ఆ అగ్నిహోత్రం చుట్టూ కూర్చుని వైశ్యదేవం సలుపుతున్నారు.

ఆ వేదమంత్రోచ్ఛారణల సుస్వరగానం, ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తూ పవిత్ర వాతావరణాన్ని అప్రయత్న భక్తిని తమ కర్మలచేత అగ్నిని ప్రేరేపించి, ఆ జ్వాజ్వల్యమైన అగ్నిలో వేసే ఆజ్యాలతో ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మికతతో పులకరింప చేస్తుంది.

సింహాసనాలకు కుడివైపున గల వేదికపై శ్రీ వ్యాసభగవానుల తపోశక్తి మూర్తి శుకబ్రహ్మ ఆసీనులై వున్నారు. వారిప్రక్కన ఆచార్య ద్రోణులు, వారి ప్రక్కన కృపాచార్యులు కూర్చుని వున్నారు.

పంచపాండవులలో యుధిష్టరులు తప్ప మిగిలిన నలుగురిలో - మహాబలుడు ఆజానుబాహుడైన భీముడు, ఆతని ప్రక్కన పీతాంబరధారియై విల్లంబులు తన సహజ కవచంగా అర్జునుడు, అందర్ని చూస్తున్నట్లు కాక, వారి

వారి మనోభీష్టములను గమనిస్తున్నట్లు డేగకళ్ళతో చూస్తూ నకులుడు, ఏ ఒక్కరి భిన్న ప్రవృత్తి, ప్రకృతి భీభత్సానికి దారి తియ్యకుండా సర్వం గమనిస్తూ - సహదేవుడు, ఉద్ధవ, సాత్యకిలతో కలసి కూర్చుని వుంటే -

వామభాగంలోని ఆసనాలలో మంత్రులు కణిక, విదుర, సంజయులు కూర్చొను వీలుగా కేటాయించబడ్డాయి. వీరికి కొద్ది దూరంలో కుయ్యుక్తుల శకుని, స్వాభిమాని ప్రాణమిత్రునికి పర్యాయపదమైన కర్ణుడు తదేక దీక్షతో పాండుపుత్రులను చూస్తూ కూర్చోగా, అశ్వత్థామ గురుపుత్రునిగా - అందరిపై ఒకే ఒక్క సమతా సోదరభావంతో కాక, దుర్యోధనాశ్రితునిగా గుర్రుమని పాండవులను గమనిస్తున్నాడు.

వీరి వెనుక దుశ్శాసనాది, ధృతరాష్ట్ర పుత్రశతం కూర్చుని వుంది.

ఈ సింహాసనాలకు మధ్యభాగంలోని ద్వారం వద్ద ఇద్దరు బంగారు వేత్రహస్తులు నిలబడి వున్నారు. వంధిమాగధుల ప్రశస్తులతో, యుధిష్టర, దుర్యోధనులు వస్తున్నట్లు ప్రకటించగా, వారు సభాస్థలికి సహజ రాజఠీవితో కలిసి, నడిచి వస్తున్నారు.

యుధిష్టరుడు దక్షిణాన వున్న రజిత సింహాసనంపైన దుర్యోధనుడు ఉత్తరాన గల రజిత సింహాసనంపైన ఆసీనులయ్యారు. వారలు కూర్చోగానే, చేతిలో వింజామరలు దాల్చిన అంగనామణులు తమ కార్యక్రమం - వీచడం ప్రారంభించారు.

నాగరాజు మణిమంతుడి రాకను వందిమాగధులు ప్రస్తావించగా, ఆర్య సంప్రదాయ, ఆ ఆర్షభూమిపరుల పుణ్య కార్యక్రమంలో శ్రీకృష్ణుని మాతృవంశ మూర్తులలో ఒకనిగా వచ్చి, దుర్యోధనుని ప్రక్కనే గల బంగారు సింహాసనాన్ని అలంకరించాడు. వరుసగా, విరాట, సునీధ, రాజేంద్రులు సభాస్థలిని ప్రవేశించారు. విరాట మహారాజు, యుధిష్ఠరుని చెంత ఆసీనుడవగా, తరువాత వ్యక్తి సునీధ మహారాజు, మణిమంతుని ప్రక్కనాశీసులయ్యారు.

అతిథులు, విశిష్ట అతిథులు, ప్రముఖులు, ఆహ్వానితులు, సభాస్థలిలో తమ తమ ప్రత్యేక ఆసనాలనలంకరించారు. వున్నట్టుండి వాద్యఘోషలు ఆగిపోయాయి. సభాసదనం యావత్తు నిశ్శబ్దమైపోయింది.

పితామహుడు భీష్ములవారు, విదురుడు వెంటరాగా, ఆ సభాస్థలిని ప్రవేశించారు. యాదవ ప్రముఖుడు కృష్ణాగ్రజుడు బలరాముడు కూడా వారితో వచ్చాడు. ముందు భీష్ములవారు తదుపరి బలరాముడు తమ ఆసనాలనలం కరించారు. వీరు సభాస్థలిలో అడుగుపెడుతూనే, కురుకులవీరునికి మహాబలుడు, గాంగేయునికి, భరతవంశకీర్తి ప్రతిష్టలకు దిగంతఖ్యాతి కల్గించిన, మహోగ్ర తేజస్వికి, పరశురామ శిష్యునికి జయజయ ధ్వానాలు సలిపారు.

వీరి తదుపరి మహారాజు ధృతరాష్ట్రుడు. మంత్రి సంజయుడు. చేయి పట్టుకు తీసుకురాగా, జయజయధ్వానాల మధ్య సభాస్థలిలోని, వ్యాసభగవానుల ఆసనం ప్రక్కన ఆశీనులయ్యారు.

ఆ తదుపరి - ధర్మపురుషుడు, అవతార శ్రేష్టుడు, లీలామానుష విగ్రహుడు దేవకీనందనుడు యశోదా ముద్దుబిడ్డడు, నందకిశోరుడు, వసుదేవసుతుడు, వాసుదేవుడు, తన మందస్మిత వదనంతో, ఎల్లరను సమ్మోహితులను చేస్తూ, సర్వజనుల జయజయ ధ్వానాలు, కీర్తనల మధ్య - సభాస్థలిలోని తనకై ప్రత్యేకించి కేటాయించిన ఆసనం వరకు రావాలి. ముఖ్యప్రవేశ ద్వారం వద్ద ఆగి అందర్ని చూస్తూ - వారి ప్రశంసల కీర్తనలకు కనులతో పలుకరిస్తూ - చేతులనాశీర్వదిస్తూ-

హర్ష పులకిత మనస్కుల నానందింప చేస్తున్న తరుణంలో ఈ ఆదిదేవుని, ఆ వేదమూర్తి కురుకుల క్షేమజునిగా, క్షేమంకరునిగా వంశప్రాభవ చక్రవర్తిగా వ్యాసభగవానులు, దగ్గరకు వచ్చి, సభక్తియుతంగా వేదసూక్తుల - శాంతి సూక్తాలు సలుప, మంగళ వాయిద్యాల ఘోషలతో ఆ ప్రాంతమంతా మిన్నుముట్టింది.

పండితులు, శాస్త్రకారులు, వేదమూర్తులు, బుధులు, గురులు, జనులు.. ఒక్కరేమిటి... సర్వులు ఈ శిఖిపింఛమౌళికి స్వాగత సత్కారపూర్వకంగా లేచి నిల్చున్నారు. అంజలి ఘటించిన వారందర్ని కనుల ఆశీర్వదిస్తూ - తన కమనీయ రూపంతో - అడుగులు వేస్తూంటే, లయబద్ధంగా సాగే, ఆ మువ్వల నడక - సకల జనమన సమ్మోహనకరంగా, మధురానందాన్ని, హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పదిలపరుస్తూంటే- వర్ణించనశక్యము కాని అనిర్వచనీయమైందా దృశ్యము, అందలి భావము, సమ్మోహనము, అలవికానిది. అనుభవానికే యోగ్యమైనదయింది.

రాజర్షులకు, తాపసోత్తములకు, మహామహులకు - అలభ్యమైన తన దివ్య దర్శనాన్ని నయనానందకరంగా అందరికి ప్రసాదిస్తూ - తనదైన ప్రత్యేక శైలిలో తనకై కేటాయించిన ఆసనంపై కృష్ణుడు ఆసీనుడయ్యాడు.

ఆ వెంటనే పుష్పాక్షతలతో శ్రీకృష్ణుని అర్ఘ్యపాద్యాదుల పూజించారు. తదనంతరం, యుధిష్టర, దుర్యోధనులు, "పితామహులు, మహారాజు, వేదవ్యాసులు కృష్ణుడాది ఇతర పుణ్యమూర్తుల ఆశీస్సులు" స్వీకరించారు.

అప్పుడు - భీష్మలవారు తనదైన సహజ పద్ధతిలో చెయ్యెత్తగా నిశ్శబ్దం మూర్తీభవించింది. ప్రశాంతత అలుముకుంది. అటువంటి సమయంలో...

ఆ రాజసభను... అలంకరించిన ప్రతి ఒక్కరిని పరీక్షగా చూసిన తదుపరి, తగు సంతృప్తిని పొందిన పిదప పితామహుడు భీష్మలవారు తన గంభీర స్వరాన్ని సవరించుకుని సభికులనుద్దేశించి -

"ప్రముఖులకు, పురాణవేత్తలకు, వేదమూర్తులకు, ధర్మపరిరక్షకులకు, అర్ష ధర్మ - కర్మ సంస్కృతీ పరిరక్షకులకు, ముఖ్యంగా కురువంశ ప్రాభవానికి మూలరూపులైన - భగవాన్ వేదవ్యాసులకు, ధర్మరక్షణా అవతార పురుషుడు శ్రీకృష్ణ, వాసుదేవునకు, ఇతరులకు -

ఆ భగవంతుని వుద్దేశించి చేసే ప్రణామాలు స్వీకరించండి. కురువంశ కీర్తిప్రతిష్టలు, భరతవంశ ఖ్యాతి ఇనుమడింపచేసే విధంగా, ఆ భగవానుని సాక్షిగా, ధర్మప్రతినిధిగా నేను, మహారాజుగా చిరంజీవి ధృతరాష్ట్రుడు - సమిష్టిగా తీసుకొన్న సముచిత ధర్మ నిర్ణయం -

అన్నగారిని మహారాజుగా సుప్రతిష్ఠమొనర్చి తమ్ముడైన పాండురాజు ధర్మతత్పరుడై పాలనమ్ము చేసిన దివ్యఖ్యాతి - జీవనము - ఈ - హస్తినాపురానిది. ఇందులో ఆనాడు వంశజేష్ఠునిగా ధృతరాష్ట్రుడు మహారాజు అయ్యాడు. తమ్ములుగా పాండురాజు, విదురులు, ఆ ధర్మానికి "ధర్మకర్త"మూర్తులై నిలిచారు. ఇలాగే -

ఇప్పుడు కూడా - ఈ తరవంశ జేష్ఠుడైన "యుధిష్టరు"నాముడు, ధర్మరాజుగా కీర్తి వహించిన దివంగత పాండుపుత్రుడు, వరప్రసాదిని, మహారాజుగా సుప్రతిష్టమొనరించి, పట్టాభిషిక్తుడైన మహారాజుగా - దేశ ప్రజలకు, అందించదలిచాం. అప్పుడే భరతవంశ శాశ్వత విఖ్యాత కీర్తి - ఈ వసుధలోనే కాదు, విశ్వవిఖ్యాతమౌతుంది.

ఈ మాట వినడంతో "జయహో-జయహో" మని జయజయ ధ్వానాలు చేసారు. సర్వులు భీష్ముడు పితామహునిగా రాజ్యసంరక్షకునిగా చెప్పే ప్రతిమాట, చేసే ప్రతిపని బహుజన ఆమోదయోగ్యమనే వారి ప్రసంగానికి - సభికుల, పౌరుల- ప్రేక్షకుల, వీక్షకుల మిన్ను ముట్టే హర్షధ్వానాలే తార్కాణం. అందుకు నిదర్శనంగా ఇప్పుడు మరల ధర్మరాజు పట్టాభిషేకమనే శుభవార్తను - శుభ - శుభ్రదివ్య స్పందనం.

దుర్యోధనుడు ఎప్పటివలెనే యువరాజ పీఠమధిస్తాడు. ప్రజల మన్ననలు పొందుతాడు. వారి బాగోగులు చూసే యువరాజుగా కీర్తి గడిస్తాడు. ఈ దివ్య శుభవార్తకు, పితామహుల ఆశీఃపూర్వక - అభిప్రాయ ప్రసంగానికి, సర్వజనులు హర్షపులకిగాత్రులయ్యారు. మిన్నుముట్టే కరతాళ ధ్వనులు, జయజయ ధ్వనులు ఆ పరిసరాలు మొత్తం - ప్రతిధ్వనించాయి. ప్రతి ఒక్కరి ముఖాలలో, మనసులలో హర్షాతిరేకాలు కల్గించాయి.

అయితే - దుర్యోధనుడు ఎప్పటివలెనే యువరాజ పీఠమధిస్తాడు అన్నమాట, దుర్యోధన సోదరులకు, మేనమామ శకునికి, అంగరాజు కర్ణునికి, గురుపుత్రుడు - దుర్యోధన హితుడైన అశ్వత్థామకు నచ్చలేదు. పితామహుని గుర్రుగా, కోరగా చూస్తారు.

వీటినెన్నింటినో... అధిగమించిన వయస్సు, మనస్సుతో పితామహులు, భీష్ములు-

"ఇప్పుడు - ఈ సింహాసనాధిపత్య, కిరీట ధారణ మహోత్సవ కార్యక్రమాన్ని పరమపూజ్యులు, ఆర్షధర్మనిరతులు, అపర హరిహర బ్రహ్మ స్వరూపమైన వేదవ్యాసులు నిర్వహిస్తారు. తమ పర్యవేక్షణలో కొనసాగిస్తారని ప్రకటించి కూర్చుంటారు.

ఎప్పటికీ మీరందరు, కురువంశ, భరత జాతి ఖ్యాతి కీర్తి ప్రతిష్ఠలకు మచ్చలేని విధంగా, నూతన మహారాజు యుధిష్టరునికి కూడ తమ సహాయ సహకారాల నందించమని, చివరగా వ్యక్తీకరిస్తారు.

ప్రతిధ్వనించే కరతాళధ్వనులు. జయ జయ ధ్వానాలు. అందుకు శుభ సూచకంగా మంగళ వాయిద్యాలు. ఇది శుభసూచకమని, ఈ తరుణంలో మా జేష్టుడు, మహారాజు ధృతరాష్ట్రుడు ప్రజలకు తన సందేశాన్నిస్తాడు." అన్నారు.

అప్పుడు - ధృతరాష్ట్రుడు - అందర్నీ వుద్దేశించి - ధర్మబద్దంగా ప్రసంగిరచ తలుస్తూ - జ్ఞాన వయో వృద్ధులు కురుకుల పితామహులు, భీష్ములుగా

విశ్వవిఖ్యాతులైన గాంగేయులు, తీసుకున్న సముచిత ధర్మ నిర్ణయం శిరోధార్యం. రాగద్వేషాలకతీతుడైన, నా సోదరుడు పాండురాజుపుత్రుడు - సద్ధర్మమూర్తిగా సకలజన హితైభిలాషిగా సర్వప్రజలను సంరక్షించి, ఆర్ష ధర్మ నిరతికి, మహా స్వరూపంగా వెలుగొందగలడని - మధ్యలో గొంతు గీరపోయింది.

చూపులకు గుడ్డివాడైనా, కుమారులపై గుడ్డి ప్రేమకు దాసుడైనా, తెలివితేటలు తన స్వంతమైనట్లు - తెలివిగా తమ్ముడిని తలపుకు రాగానే గొంతుక గాద్గదికమయింది. నా దురదృష్టం కొద్దీ అతన్ని పోగొట్టుకున్నానన్నాడు.

చెమర్చే కళ్ళతో - నా తమ్ముడి ప్రతిరూపమైన ఈ యుధిష్టరుడు - ధర్మస్వరూపమైన రాజుగా "ధర్మరాజుగా" సకల పౌర జన శ్రేయోమూర్తిగా వర్థిల్లగలడని తలుస్తూన్నాను.

ఈ కిరీట ధారణలో - బాంధవ్యాలకు మమతానురాగాలకు - ఏ విధమైన సావకాశమివ్వకుడా, తరతరాల ఖ్యాతికి నిలువెత్తు సాక్ష్యంగా - లోకపూజ్యు డవ్వాలని మనస్ఫూర్తిగా తలుస్తున్నా"నంటూ - "ధృతరాష్ట్రుడు" ముగించాడు.

ఈ ప్రసంగంతో - ధృతరాష్ట్రుడు అందరి మన్ననలు అందుకున్నాడు.

అప్పుడు యుదిష్ఠరుడు లేచి - అందరికి పేరుపేరున అభివాదములు తెలిపాడు.

"అందరి కరుణ ప్రేమాభిమానములతో, పెద్దల ఆశీస్సులతో - ప్రజాహితమే ధ్యేయంగా, స్వార్థ రాహిత్య దివ్య రూపంగా భాసిల్లుతానని, సమదృష్టి, సమతా భావంతో నడువగలనని, ప్రతి ఒక్కరికి అభినందనలు, అభివాదములు తెలుపుతూ, వాగ్దానం చేస్తున్నానన్నాడు.

ధర్మకంకణుడినై - భరతవంశ కీర్తిప్రతిష్టలకు దీటుగా మెలగగలనని మళ్ళీ మళ్ళీ చెబుతున్నానన్నాడు. అలాగే -

దుర్యోధనుడు నా పెద్దతమ్ముడు. మిగిలిన వారందర్ని నిజంగా నా తోడబుట్టిన వారితో సమానంగా ప్రేమించి గౌరవిస్తాను. అభిమానిస్తాను. ఇవి ఎవరి మెప్పుకోసమో చెప్పే మాటలు కావు. మా తండ్రి, పెదతండ్రి ఏ విధంగానైతే కలిసి మెలిసి సర్వవిధాల సహజీవనం గావించారో, ఆ విధంగానే మేమందరము కలిసి మెలిసి జీవిస్తాం. ఇది సత్యం. అది తన సంకల్పం - ధర్మబద్ధ నిత్య - సత్య - శాశ్వతమైనదని ఎల్లరకు ఎరుకబరిచాడు.

రాజసభ సమావేశాలు పూర్తయ్యాయి. అర్జునుడు పేరుపేరున ప్రతి ఒక్కరిని కలుసుకుని తన అభినందనలు, అభివందనాలు తెలుపుతున్నాడు. ఆ సమయంలో "అన్నా!" అంటూ నకులుడు, అర్జునుని ప్రక్కకు పిలిచి, "భీమన్న కనబడటం" లేదన్నాడు.

"కనబడటం లేదా ?" ఆశ్చర్యంగా అడిగిన అర్జునుడు "ఇప్పటివరకు ఇక్కడే మనతోనే వున్నాడే ? ఈలోగా అర్థం కానట్లు - ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

లేదు, పితామహులు, ఇతర ప్రముఖులు లేవడంతో అసహనంగా భీమన్న లేచి, ప్రక్కదారిగుండా వెళ్ళిపోయాడని" చెప్పాడు.

"అయితే, ఇంటికి వెళ్ళి వుంటాడు." ఇందులో కంగారుపడవలసినందే ముందన్నట్లు అర్జునుడు మొహం పెట్టాడు.

"లేదు. అన్నయ్యకు చాలా కోపం వచ్చింది. ఆ కోపం ఆపుకోలేక అందర్నీ త్రోసుకుంటూ వెళ్ళిపోయాడు. నాకెందుకో భయంగా వుంది" పైగా పెద్దన్న వాగ్దానం, అభయహస్తం కూడా భీమన్నకు కోపం కారణమై వుంటుంది" తన భయాన్ని నకులుడు వెల్లడి చేస్తున్నాడు.

"అయితే, ఏదో గొడవ మొదలైంది. భగవాన్'" అని నిట్టూర్చి, అన్నకోసం అర్జునుడు బయలుదేరాడు.

జాలంధరి, కృష్ణునికోసం ఆయన మందిరంలో ఎదురు చూస్తుంది. వాసుదేవుని చూస్తూనే "అన్నా! ఆయన వెళ్ళిపోయాడు" అంది.

"ఆయనా ? ఆయనెవరు ?" కళ్ళు చిట్లించి అడిగాడు.

"ఇంకెవరు, మహారాజు వృకోదరులవారు" అంది బేలగా.

"ఇప్పటివరకు మాతోనే వున్నాడే, ఎక్కడికి వెళ్ళుంటాడంటావు ?"

"అది నాకు తెలియదు" తన భయాన్ని కృష్ణుని ముందు వ్యక్తపరచింది.

"ఎక్కడికి వెళ్ళుంటాడంటావు ?" ఆమెకేమైనా తెలుసేమోనని కృష్ణుడు సాలోచనగా అడిగాడు.

"అది నాకెలాగ తెలుస్తుంది ?" భయంతో గోముగా మూతి పెట్టింది.

బహుశా, ఆయన తిరిగి రాకపోవచ్చును. పెద్దమ్మ రేఖమ్మను చూస్తూ - చెప్పు - ఆయన పంపిన విషయం వివరంగా చెప్పుమని, గోపి ద్వారా - ఈ విషయం మాకు పంపించారందామె.

"నీ స్వయంవరానికి నేను రాను. రాలేను. పరిస్థితి మొత్తం రేఖమ్మకు తెలుసు. అని చెప్పి నేలకూలిందామె. దురదృష్టవంతురాల్ని నాకు చావు తప్ప భగవంతుడు మరేమీ దక్కించలేదనుకుంటాను" వలవల ఏడుస్తూంది. కన్నీరు మున్నీరౌతుంది.

ఇదే సమయమంలో అత్త కుంతి, అర్జున, నకుల, ద్రౌపదులు అక్కడకు వచ్చారు. పరిస్థితి వివరించారు. "అన్నా!" అంది ద్రౌపది. పరిస్థితి అంతా చూస్తూండగా గందరగోళమయింది.

"ఎక్కడికి వెళ్ళాడో, వెడతానన్నాడో, మీకెవరికైనా తెలుసా ?" కృష్ణుడు అడుగుతున్నాడు. అప్పుడు గోపి, "మాలా" అయ్యగారు ఏం చెప్పారో, చెప్పుమన్నాడు. "ఏమన్నారు ?" కృష్ణుడు అడిగాడు.

"చెప్పు. అమ్మకు - ఇక మిగిలింది నలుగురు కుమారులేనని." అయిదుగురు అని గొప్పగా చెప్పుకోవద్దని, మనకు ఋణం తీరిపోయిందని, తనను మరచిపొమ్మని," చెప్పమన్నాడంది.

అప్పుడు ద్రౌపది కూడా, నిబ్బరించుకోలేక "ఇకపైన నీకు అయిదుగురు కాదు, నల్గురే భర్తలని నాకు వర్తమానం పంపించారంది.

ఇదంతా చూస్తే నాకెందుకో భయంగా వుంది. భీమన్న పిరికివాడిలా ఏదో అఘాయిత్యం చేస్తాడనిపిస్తూంది" వాపోతున్నాడు నకులుడు.

అందర్ని ఒకసారి చూసి, భీముని అంతరంగాన్ని తల్చుకుంటున్న వాసుదేవునితో "అన్నా! ఎట్లాగైనా, ఆయనను తిరిగి తీసుకు, రా" ప్రార్థిస్తూంది.

"భయపడకు పాంచాలీ, భయపడకు ధైర్యంగా వుండు. పెద్దన్న, సహదేవుడు, భీమన్నను వెదకడానికి వెళ్ళారు. ఏ ప్రమాదము జరుగదు. వాసుదేవుడు తోడుండగా, ఆ దేవదేవుడైనా ఏమీ చెయ్యలేడు. ఏ విధమైన ఈతిబాధలు, అవాంతరాలు మనదరి చేరవని" అర్జునుడు ధైర్యంగా చెబుతున్నాడు.

కృష్ణా! వాడు ఆత్మహత్య చేసుకున్నాడంటావా ? భయంగా అడిగింది.

"అత్తా! నీ కొడుకంత పిరికివాడా ? ఆ.... చెప్పు. కొండల్ని పిండి చెయ్యగల వాడు, ఏనుగుల్ని బంతుల్ని చేసుకొని ఆడుకోగలవాడు, కేవలం... ఒక పదవి... యువరాజ పదవి కోసం, మూర్ఖంగా - అలాగ ప్రవర్తిస్తాడని అనుకోను. నువ్వు అనుకోకు!" ఓదార్చుతున్నాడు.

తల్లిగా - "అర్జునా!" అంది కుంతి,

"అన్నా! రక్షించుమని" జాలంధరి.

"వాసుదేవా!" అని ద్రౌపది -

ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా తమ భయాన్ని వెలిబుచ్చుతుంటే - అందర్ని కంగారుపడవద్దని ఓదార్చి సర్దుబాటు చెయ్యబోతూంటే -

"అన్నా! ఈ విషయం ప్రజలకు తెలిస్తే ఏమని ? సమాధానం " చెబుతామంది.

"ఏమనా... ?! అన్నా... వారు వేటకు వెళ్ళారని చెప్పు. మిగిలిన విషయాలు నేను చూసుకుంటానన్నాడు. అభయప్రదాత - ఆ కృష్ణ - మూర్తి!

"వాడు కనుపించే వరకు... నేను...

"అన్నం ముట్టనంటావు, అంతేనా, అత్తా ?! ఇది నీ కలవాటే కదా! నీ గురించి తెలిసినవారెవరు అనవసరంగా బాధపడరు. ఏదో కారణం చెప్పి, నీ బాధను నువ్వు పదిలంగా దాచుకో. నా బాధ్యతను నేను నెరవేరుస్తానంటాడు, ముక్తాయింపుగా కృష్ణుడు.

ఏ ఒక్కరి మనస్సు స్థిమితంగా లేదు.

అందరిలోను ఆందోళన.

అనవసర వృథా ప్రసంగాలు.

కృష్ణుడు అందర్ని వారించాడు. జరిగినదానికన్న మీ వాగుడు, వాదులు- అధిక ప్రమాదాలంటాడు. ముఖ్యంగా మాటిమాటికి "ఆయన రాడు. రాడు" అనవద్దని జాలంధరిని గట్టిగా హెచ్చరించాడు. నీది ప్రేమ మరి అత్తది - కన్న ప్రేమ. కనుక శాంతం వహిస్తే అందరికి మంచిదంటాడు.

ఇప్పుడే యుధిష్టర - సహదేవులు వచ్చారు. ఏరి భీముడని ? వారిని, అసలేం జరిగింది ? అని వాళ్ళు అడుగుతారు.

జరిగింది, జరిగినట్లు, ప్రతి ఒక్కరు వారి భావావేశంతో కల్పి, విషయ వివరణం చేస్తారు. యుధిష్టర, సహదేవులు మౌనంగా వింటున్నారు.

అంతా విన్న యుధిష్టర, సహదేవులు, ఏమిటీ విపరీతమని తలలు పట్టుకుంటారు. కుంతి కొంత బాధపడి "అధికార పగ్గాలు చేతిలో పడేసరికి అనాలోచిత ఆలోచనలు చోటు చేసుకుంటాయన్న మాట. పెదనాన్నగారూ! మీ నిర్ణయాలకనుగుణంగా మేము నడుచుకుంటామని ఒక్కమాట చెప్పి వూరుకుంటే ఈ గొడవ వుండేది కాదు!! అనవసర రాద్ధాంతానికీ కిరీటధారణ మహోత్సవ కారణమైందని, తల్లిగా, ఆ తల్లి బాధపడింది.

ఇప్పుడు పరివర్తన చెందినట్లు, నేను అక్కడ చేసిన వాగ్దానం అందరికి, మా అన్నదమ్ములు అయిదుగురికి చెందుతుందే తప్ప, ఏ ఒక్కరికో చెందదు. కనుక, భీముడు లేని రాజ్యం, అధికార పగ్గాలు నాకొద్దు" అంటాడు.

"ఇవే అనాలోచిత నిర్ణయాలంటే... ఇటువంటివే, ఇష్టమొచ్చిట్లు ప్రకటించరాదు" పెద్దవాడివి తొందరపడవద్దని కృష్ణుడు వూరడిస్తాడు. ఆ వెంటనే సహదేవుని వైపు తిర్గి "సహదేవా! భగవంతుడు నీకు భవిష్యద్దర్శన శక్తి ప్రసాదించాడు కాబట్టి, భీమన్న ప్రయాణవైనం గమనించి చెప్పమంటాడు.

కృష్ణుని ఆదేశంతో క్షణకాలం కళ్ళుమూసుకుని "బావా! భీమన్న తూర్పు దిక్కుకు బయలుదేరాడు అంటే... అంటూ... అదే మనం కాంపిల్యం నుండి ఇటు వచ్చిన మార్గంలో..." అన్నాడు. తక్షణం "గరుడా" అని తన అంగరక్షకులుగా వున్నవారిలో ఒకని, తన ఆయుధాలను తీసుకురమ్మన్నాడు. రథం సిద్ధం చెయ్యమన్నాడు.

ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా చెబుతూంటే అందరి మాటల్ని విన్న కృష్ణుడు "మీ మాటలు సరేసరి. మరి నేనేం చెప్పను. నువ్వు కనుక తిరిగి రాకపోతే నేను బృందావనానికి వెళ్ళిపోతాను. ఆవుల్ని కాచుకుంటూ బ్రతకుతానని చెప్పనా ?" అందులో నవ్వు, వెటకారం కలిసి వున్నాయి. ఆవేశాలు, అనర్థాలోచనలు, ఇలాగే వుంటాయనడానికీ సంఘటనొక నిదర్శనమైంది.

అప్పుడు జాలంధరి ఆపుకోలేక "ఇదంతా నీ మూలానే వచ్చింది. ఏదో మూర్ఖత్వం.... అడిగింది, బుద్ధిలేక నీకు నేనా సమాచారం మోసుకువచ్చి అందించాను. నవ్వుతూ కాదంటూనే, చివరి క్షణాలలో మా అక్క భానుమతికి, ఆత్మశాంతికి గాను నీ భర్త దుర్యోధనుని హస్తినాపుర సింహాసనంపై తప్పక కూర్చుండబెడతానని వాగ్దానం చేసావు. అది....

అదీ... ఇప్పుడు మా కొంప ముంచింది. మమ్మల్ని దిక్కులేని బికారీలను తెలిసింది. చేసేవన్నీ చేసేసి, ఏమీ తెలియనివాడిలా, ఇంకొకర్ని నిందిస్తే ఎట్లాగ...?!" నిలదీసినట్లడిగింది అమాయకురాలు, చిన్నపిల్ల... అనుకునే కాశీరాజ తనయ.

దానికి నవ్వే సమాధానంగా క్షణకాలం వూరుకుని "నా నుండి వాగ్దానాలు ఎవరు కోరలేదు ?! ప్రతి ఒక్కరు కోరారు. వారి వారి ప్రమాణాలు లేదా ఇబ్బందుల నుండి బయటపడ్డ వారందరు, ఇప్పుడే కాదు, ఎప్పుడు సమయం దొరికితే, అప్పుడు నన్ను నిందిస్తారు. ఇంకా చెప్పాలంటే నిలదీస్తారు కూడా!" అనేసాడు.

"నువ్వు సామాన్యుడివి కావు" జాలంధరి ఆవేశపడుతూ అంటూంటే, తప్పన్నట్లు ద్రౌపది ఆమె చేతిని పట్టుకుంది.

"నాకేం భయం లేదు" వెనక్కి తగ్గనట్లు జాలంధరి మాట్లాడుతుంటే...

"నేను, అన్నీ వినడానికి సిద్ధంగా వున్నానన్నాడు" కృష్ణుడు.

"నువ్వు ఇప్పుడు నిజంగా కనుక వృకోదర మహారాజుతో తిరిగి రాకపోతే, నా నాలుక తెగ కోసుకుంటాను. నీ పాదాలకు నా ప్రాణాలనర్పిస్తాను. ఇది నిజం. ఇందులో ఏ మాత్రం వెనక్కి తగ్గను" ప్రతిజ్ఞ చేసేసింది జాలంధరి.

"ప్రేమ ఎంత పిచ్చిదో చూసావా ?" అన్నాడు కృష్ణుడు, ద్రౌపదిని చూసి, ఆ అమాయకురాలను - ఓదార్చబోతూ...!!!

# భీమా, ఇది సబబా ?!

భీముడు అగ్గి గుగ్గిల మౌతున్నాడు.

"ప్రభూ!" గోపీ అభ్యర్థిస్తున్నాడు.

"చెప్పింది, చెయ్యి. మాతృశ్రీకి, ద్రౌపదికి, జాలంధరికి, రేఖమ్మ, మాలకు-నే చెప్పినట్లు విషయమందించు!" అన్నాడు భీముడు.

ఏదో అడగబోయాడు.

అసలే భీకరాకారము. అందులో కోపము. ఇంకోమాట మాట్లాడితే, ఒక గ్రుద్దు గ్రుద్దితే తను క్రిందపడినవాడు పైకి లేవలేడు. దాంతో మౌనం వహించాడు. కానీ ఆపుకోలేక, భీముని వదలలేక "నేనూ మీతోనే వుంటాను. మీతో వస్తానన్నాడు. ఈమారు మిమ్మ ఒంటరిగా విడవను. నా ప్రభువు నాక్కావాలి. నేనాయన వెంట వుండాలి. అంతే...!" ఇంకేమీ వినదలచుకోలేదన్నట్లుంది, గోపీ వాలకం.

"చూడు. నేనెక్కడికి వెడతానో నాకే తెలియదు. అటువంటప్పుడు... నిన్ను తీసుకుని....

"ఎక్కడికంటారేమిటి ? మీరెక్కడికి వెడితే అక్కడకు. నేను మీతోక నన్నాడు.

ఇక వాడితో వాదించలేక - సరే వెళ్ళి, నా ఆయుధాలు వగైరా అవసరమైన సరంజామా తీసుకుని, రా!" ఆదేశించాడు. అదొక వరంగా, గొప్ప అదృష్టంగా గోపి పరుగుదీసాడు.

కొద్దిసేపటికి వాళ్ళు రథంలో బయలుదేరారు. భీముని తీవ్ర వేగానికి, రథం మాట దేవుడెరుగు. గోపీ ప్రక్కటెముకలు, "టప-టప"మంటాయేమోనన్న భయం కల్గి, "ప్రభూ!" మెల్లిగానే అన్నాడు. కానీ, ఆ స్వరంలో ఆందోళన తొంగి చూస్తోంది.

కోపం చల్లారలేదు. ప్రస్తుతానికి తగ్గదు. అటువంటి సమయంలో "ఏమిటీ ?" సమాధానం చెప్పకుండా కోరగా చూసాడు. ఆ చూపులకు గోపీ దడదడలాడుతూ - గుటకలు మింగాడు. మెల్లిగా -

"ఏం లేదు, అంత గట్టిగా కొరడా ఝళిపిస్తే ఆ గుర్రాలు...!" నసుగుతున్నాడు. ఆ నస భరించలేనట్లు - "నోర్మూసుకుని కూర్చుంటే నీకు చాలా మంచిది. లేదంటే ఎడంచేత్తో ఎత్తి అవతల పడేస్తాను. ఈ నస నాకు తప్పుతుంది" అనడంతో గుటకలు మ్రింగుతూ, గుండె చిక్కబట్టుకుని, మరీ ఒదిగి, ఒదిగి పడిపోతానేమోనన్న భయంతో భయం భయంగా గట్టిగా పట్టుకుని కూర్చున్నాడు.

"ఏం ఇంటికి పోతావా ?" కోపంగా చూస్తు అడిగాడు.

"ఇంటికి కాదు, ఇలాగే మీరు మీ రథాన్ని పరుగెత్తిస్తే, కాటికి పోవాల్సి వస్తుంది. అయినా మాటిమాటికి ఇంటికి పో! అంటారు. ఇంటికి, వెళ్ళినా, ఎముకలు విరిగి ఇక్కడే చచ్చిపోయినా.... అన్నాడు గుడ్లనీరు కక్కుకుంటూ -

"మిమ్ము భక్తితో సేవించుకునే అదృష్టాన్ని కోల్పోతాను. నన్నటువంటి దురదృష్టవంతుని చెయ్యకండి!" ఆ మాటలకు భీముడు కరగిపోయాడు. "వూ" వుక్రోషంగా అన్నాడే తప్ప వాడి ప్రేమకు లొంగి "సరిగ్గా కూర్చోమని" హెచ్చరించాడు.

సూర్యాస్తమయమయింది. "రథాన్ని! గుర్రాలను జాగ్రత్త"ని తన పరివారానికి, చెప్పి, ఆ రాత్రి మకాం చేయడానికి వీలుగా గుడారాలు ఏర్పాటు చేయమన్న భీముడు, "గోపీ, నువ్వు వూళ్ళోకి వెళ్ళు, పాలు సంపాదించుకు రమ్మన్నాడు.

రాజా వృకోదరుడు, పాండుపుత్రుడు తమ వూరిలోకి అడుగుపెట్టాడని తెలుసుకున్న గ్రామస్థులు పరుగు పరుగున వచ్చి, వృకోదరునికి సాదర స్వాగత మొసగారు. వారికి కావల్సిన సదుపాయాలను చూడటంలోను, రాత్రికి మహారాజు విందు ఏర్పాట్లు చేయడంలో మహా సంతోషంగా మున్గిపోయారు.

రాత్రికి విందు పూర్తిచేసుకున్న భీముడు తన రథం ప్రక్కన, నది ఒడ్డున నిద్రపోతే, అతనికి రక్షణకవచం వలె, అతని చుట్టూ, గోపితో కలిసి, అతని బృందం, వలయాకారంలో పడుకున్నారు.

★ ★ ★ ★

సూర్యరశ్మి మొహంపై పడుతూంటే కళ్ళు తెరచిన వారికి కృష్ణుడు, సహదేవుడు, సాత్యకి కనుపించారు. అక్కడ భీముడు కనబడలేదు. అతని గూర్చి అడుగగా ప్రాతః సంధ్యావందనానికి వెళ్ళారని చెప్పారు.

దాంతో వీళ్ళు కూడా నదీతీరానికి వెళ్ళారు. అక్కడ గోపీ ఒక్కడే కనబడ్డాడు. ఎక్కడ నీ ప్రభువు ?'' కృష్ణుడడిగితే, గోపీ సమాధానమివ్వలేదు సరికదా, గుడ్లు మిటకరిస్తూ కూర్చున్నాడు.

“నిన్నే... ఈ మారు” కృష్ణుడు గట్టిగా అడిగాడు. సమాధానమివ్వక చూపుడు వేలితో చూపాడు. అక్కడ - ఎదురుగా, భీముడు కనుపించాడు. సరిగా ఈ సమయానికి, తమ ప్రభువుకు ఉదయం ఫలహారాదులు, పండ్లు పాలు తీసుకువచ్చిన గ్రామస్థులు, మరికొన్ని రథాలను చూసి, కళ్ళు చిట్లించి పరీక్షగా వాటిని పరికిస్తూంటే -

“ఎదురుగా.... వాసుదేవుడు...!”

ఈ గోవిందుని, కొద్దిరోజుల క్రితమే హస్తినాపురం వెడుతూంటే, చూసి, మురిసిపోయాం. ఇప్పుడు, అనుకోకుండా మళ్ళీ శ్రీకృష్ణ దర్శనం మురిసి ముదమొందారు. పొంగి పులకరించారు. ప్రభూ! తమ అదృష్టానికి మురిసి ప్రతి ఒక్కరు వంగి, వంగి, పాదాలకు నమస్కరించారు.

ఇప్పటికే - కృష్ణుని వెంట వచ్చిన అనుచరబృందం, అక్కడ వుండటానికి వీలుగా గుడారాదులు ఏర్పాటు చేస్తున్నారు. అందర్నీ అభినందించి, ఆశీర్వదించిన కృష్ణుడు, సాత్యకాదులతో స్నానసంధ్యాదికాలు చెయ్యడానికి నది వద్దకు వెళ్ళారు.

దూరంగా భీముని చూసిన కృష్ణుడు తన సహజ మందస్మిత వదనంతో “భీమా, నీకోసం వచ్చేసా”మన్నాడు కానీ, సంధ్యావందన సమయంలో అర్ఘ్య ప్రదానం చేస్తున్న భీమునిలో చలనం లేదు. ఉలుకు పలుకు కనబడలేదు.

భీముడు నదిలోంచి బయటకు వచ్చేవరకు నిల్చున్న కృష్ణ, సాత్యకి, సహదేవులు, గౌరవపురస్సరంగా పాదాభివందనం చెయ్యబోతే వెనకడుగు వేసాడు.

కృష్ణుడు.... “బావా!” అన్నాడు ప్రేమతో, గోముగా.

“వద్దు.. ఆ పిలుపులతో, ఆ మాయ కబుర్లతో నన్ను బురిడి కొట్టించకు. నాకు తెలుసు. నువ్వు వస్తావని, నన్ను తీసుకువెడతావని. చూడు. నేను వెనక్కి రాను. నీతో అసలు రాను. వెళ్ళండి. ఈ మాయమాటలు విని, విని - నన్ను నేను మోసం చేసుకున్నాను.

మీసమున్నవాడు ప్రవర్తించాల్సిన పద్ధతిలో ప్రవర్తించకుండా, రోషం చంపుకుని, దాయాదుల అడుగులకు మడుగులొత్తే దురదృష్టానికి తలదించుకోదలచుకోలేదు. తాడో పేడో తేల్చుకోవల్సిన సమయంలో - దాసానుదాసుడనని - కృష్ణా....!

నన్ను నేను మోసం చేసుకోలేను. మగతనాన్ని చంపుకుని పేడివానిలాగ బ్రతుకలేను. "ఆవేశం ఆపుకోలేక, పిడుగులు గర్జిస్తున్నట్లు, ఉరుములు ఉరుము తున్నట్లు భీముడు వురిమాడు.

"తత్వం నారాయణం హరిః" అని అన్నీ తెలుసున్న ఆ పరమాత్మ - వాసుదేవుడు, భీముని వదరనిచ్చి, వాగనిచ్చి... చివరగా...

"అయిందా, ఆవేశం చల్లారిందా. ఆక్రోశం తగ్గిందా ?" అన్నాడు, మెల్లిగా సంయమనాన్ని పాటిస్తూ -

"బావా, వృకోదరా, భీమసేనా!" నిన్ను పురుషాహంకారమైన పౌరుషాన్ని చంపుకుని పేడివానివలె బ్రతుకమని నేనేడైనా చెప్పానా ? అహ... చెప్పానా ? ఆలోచించి, మరీ చెప్పమన్నాడు. భుజం మీద చెయ్యి వేసాడు. అయినా భీమునిలో ఆవేశం తగ్గలేదు. అయినా కృష్ణుడు -

"బావా! పంతంమాను. పగవలన ఏ ఉపయోగముండదు. కావల్సినవి తెలివితేటలు. తెలివిగా పరిస్థితులనెదుర్కోవాలి. నువ్విలాగ మొండికెత్తావనుకో, అక్కడ మా మేనత్త, నీ తల్లి కుంతి అసువులు బాస్తుంది. అది తగునా ? నీవంటి విజ్ఞులు అజ్ఞులవలె ప్రవర్తించుటవసరమా ? ఆలోచించు. కర్తవ్యబోధగా చెబుతున్నాడు.

"చూడు. కృష్ణా. ఈ కల్లబొల్లి, తియ్యటి కబుర్లకు కరగిపోయే స్థితిలో నేను లేను. ఇక మీ మేనత్త, మా మాతృశ్రీ చచ్చిపోతుందంటున్నావు. నిజానికి, అటువంటి పనికిరాని పిల్లల్ని కన్నందులకు ఆ తల్లి ఏనాడో మరణించాల్సింది. కానీ దురదృష్టంగా ఇంతవరకు ఆ పని చెయ్యలేకపోయింది. ఇప్పుడైన చేస్తే ధన్యురాలు. ఎందుకట, ఏమాశించి ఆ బ్రతుకు ? పరాయి వాళ్ళింట్లో పాచిపనులు చేసుకుంటూ, నా కుమారులు వీరాధివీరులని ఎందుకా గప్పాలు, డబ్బాలు కొట్టుకోవడం. దానివలన ఎవరికి లాభం ?" ఇక.. వీడున్నాడు... అని, సహదేవుని

చూపి... వీడికన్నీ తెలుసుట. నేను యువరాజునౌతానుట. భలే గొప్పగా చెప్పాడని, బిగ్గరగా నవ్వాడు. చూడు, ఎలాగ నంగనాచిలాగ వున్నాడో.... చూస్తూన్నావా..?'' దెప్పి పొడుస్తున్నట్లు మాట్లాడుతున్నాడు.

“భీమా! ఆగాగు. నువ్వు లేకుండా పెద్దన్న సింహాసనాధిపత్యాన్ని స్వీకరించడు!'' కృష్ణుడు పరిస్థితిని వివరిస్తూంటే -

“సరిపోయింది. అతడికి కావల్సింది దొరికింది. ఇప్పుడతడు ఆ గుడ్డి రాజుకు, దుర్యోధనునికి అమ్ముడయిపోయాడు. నాతో వాళ్ళకు ప్రాణాంతకం తప్ప, మరేం లేదు. అతను పేరుకు “యుధిష్టరుడు''. ప్రపంచానికి “ధర్మరాజు'' కనుక, అతని వలన వారికెవరికి, భయము - బాధ - నష్టము - కష్టము వుండదు కాబట్టి అందరు హాయిగా వుంటారు.

“ద్రౌపది... అయిదుగుర్ని వివాహం చేసుకుంది కానీ నలుగుర్ని కాదు. కాబట్టి పాంచాలానికి వెళ్ళిపోతానంటుంది.''

“భలే మంచి పని చేస్తూంది. తొందరగా వెళ్ళిపొమ్మను. ఆ పనికిరాని, పిరికి పందలను మగాళ్ళు కాని మొగుళ్ళుగా పొంది, ఏం బావుకుంటుంది. వెళ్ళిపొమ్మను!''

ఏమాటకామాట చెబుతూ, అగ్గిగుగ్గిలమయ్యే భీమసేనుని, శాంతపరచడం సాధ్యం కావడం లేదు. ఇప్పట్లో సాధ్యం కాదని కూడా అనిపిస్తూంది. అంత ఆవేశంగా భీముడు వున్నాడు.

“ఇంకెందుకు, నాతో, వెళ్ళండి'' గద్దిస్తున్నట్లు భీముడు గర్జిస్తున్నాడు.

“భీమా! నువ్వు లేకుండా నేను హస్తినాపురంలో అడుగుపెట్టడమే ?! అది సాధ్యమయ్యే పనేనా ? ఒక్క క్షణం. నా మాట విను!'' అన్న కృష్ణుడు “అసలు విషయం చెప్పడం మరిచాను.'' అని భీమునొకసారి చూసి, “ఆ కాశీరాజ పుత్రిక వుందే... జాలంధరి... అదొక భయంకరమైన ప్రతిజ్ఞ చేసింది. అదేవిటో... తెలుసా...

“నువ్వు లేకుండా, నేను హస్తినలో అడుగుపెడితే తన నాలుక కోసుకుంటుందిట. తన ప్రాణాలు నా పాదాలవద్ద తీసుకుంటుందిట. ఇటువంటి పరిస్థితులలో అక్కడకు వెళ్ళి నేను ఏం చెయ్యాలట ?!

"మీ అమ్మ, జాలంధరి.... బ్రతుక భంగపడే ద్రౌపదిని చూస్తూ... నేనెలాగ బ్రతుకగలను ? కాబట్టి.... ద్వారకకు కూడా వెళ్ళను. వెళ్ళకుండా ఇక్కడే.... నీతో ప్రాయోపవేశం చేస్తూ కూర్చుంటాను. పొరపాటున ద్వారకకు వెళ్ళానో.... అక్కడా.. హస్తిన తంతే. నాకు ప్రాణాంతకమే.... కాబట్టి... తన నిర్ణయాన్ని చెప్పి అక్కడే ఆ ఇసుకలో చంటిపిల్లాడి వలె కృష్ణుడు చతికిలబడిపోయాడు.

"అంతవరకు కృష్ణునిపై అలిగి, ఆతని మాటలకు గుర్రుమనే భీముడు, ధడాలున కృష్ణుడు ఇసుకలో చతికిలబడటంతో, సమాధానం చెప్పలేక నిలబడిపోయాడు.

"చూడు భీమా! నేను మాయగాడిని కాను, మోసగాడినసలు కాను. నేనెవర్ని మోసగించలేదు. ధర్మానికి ధర్మరక్షకుడను. ఆవేశంతో వున్నవారికి, ఆలోచనా రహితులకు నా మాటలు అర్థం కావు. అయినా నేనెప్పుడు సత్యవాదినే.

"భానుమతికి, నీ భర్త - హస్తినాపుర ప్రభువు తప్పక అవుతాడని వాగ్దానం చేసాను, ఎప్పుడు ? ధర్మం విడనాడనప్పుడు. అధర్మానికి గొడుగు పట్టనప్పుడు మాత్రమే. పిచ్చిపిల్ల. ఆ భానుమతికి ఈ సత్యం తెలుసు. అలాగే జాలంధరికి నా మాటల అర్థం తెలుసు. అజ్ఞానంలో వున్నవారు, ముందు వారు తమ జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలి. అంతేకాని అర్థరహిత ఆలోచనలతో, ఎంతసేపు అవతలివారిని నిందించడం కాదు. ఆవేశం వీడి, కాలమాన పరిస్థితులననుసరించి ప్రవర్తించాలి. ప్రజాభిమానం పొందాలి.

"అంతేకాని, ఎవరో కిరీటం నెత్తిన పెడితే బాగుంటుందనుకోవడం చాలా పొరపాటు. పొంగిపోవడం మరింత మూర్ఖత్వం.

"ఇవన్నీ ప్రక్కన పడేసి కృష్ణుడు మోసగాడు అనడం, అనుకోవడం ఎంత పెద్ద తప్పో ఆలోచిస్తే, బుద్ధి వికసిస్తే, బుర్ర పనిచేస్తే సత్యం బోధపడుతుంది, ధర్మప్రకాశమై, నిజమైన జ్ఞానం లభిస్తుంది. ఆలోచించు. ఏమైనా కానీ.... అన్నాడు. నేను హస్తినకు తిరిగి రాలేనన్న భీముడు, చూస్తుండగా ఆలోచనలో పడ్డాడు. అతని బుర్ర పనిచెయ్యడం ప్రారంభించింది.

"సరే, ఇప్పుడేం చేద్దామంటావు ? భీముని, కృష్ణుడడిగాడు.

"ఏముంది ? నీ దారి నీది, నా దారి నాది. ఇంతే సంగతులు."

"అయితే మీ అన్నను మహారాజుగా చూడవా ?"

భీముడు మాట్లాడలేదు.

అతని మౌనాన్ని ఆసరాగా తీసుకుని -

"ధృతరాష్ట్రుడు వుండాలా ? వద్దా ??

దుర్యోధనుడు వుండాలా, వద్దా ??"

నీవెలాగ కావాలంటే, అలాగే, జరుగుతుంది. ఇప్పుడు మనకు, పాంచాల, విరాట, సునీథలతో పాటు యాదవ ప్రముఖులు, అతిరథ - మహారథులు అండగా వుండ, వారందరు, పితామహులకు పెట్టని కోటలాగ నిలువ, భయం లేదు. అసాధ్యమసలే, లేదు కాదు" అంటూంటే -

"అంటే... మళ్ళీ మొదలుపెట్టవా, నీ మహామాయా స్వరూపాన్ని, ఆ తియ్యని, తీయని మాటల్ని...!" అనేసాడు, భీముడు.

దాంతో కృష్ణుడు - కృత నిశ్చయుడయ్యాడు.

"భీమా! నా మాటలు అసత్యం కావు. అధర్మానికి దారి చూపవు. పరిహాసాలు వీడు. కోపతాపాలు మాను. ఫలితం దారుణంగా వుంటుంది. దుర్యోధనాదులు చస్తారు. ధృతరాష్ట్రుడు అడవులు పట్టిపోతాడు. అతనితోపాటు ఆతని భార్య - పిల్లలపై గల ప్రేమతో, వాళ్ళందరు చావడంతో గుండె పగిలేలా రోదిస్తూంది. ఆశోకమూర్తి తప్పక భర్తననుసరించి, దారుణ వనవాసమొంది. కారడవుల బ్రతుకు గడపాల్సి వస్తుంది. ఇదంతా నిజం.

ఇవన్ని భవిష్యత్తు సూచికలు.

తొందరపడి కృష్ణుడు మహామాయా "స్వరూపమనకు. నిజంగా నాది "మహామాయా స్వరూపమే" నన్ను సామాన్యులెవరు గుర్తించలేరు. గ్రహించి, తరించలేరు. వ్యాస, నారదాదులు నన్నర్థం చేసుకునే ప్రయత్నంలో కొంత సఫలీకృతులౌతారు. గంగాపుత్రుడు అంతే.... గర్హనీయంగా నన్ను తలచిన వారందరు, కాలగర్భంలో, కాలునితో కలిసిపోతారు. నన్ను తలచే అదృష్టం, తపించి, తరించే అదృష్టం - మరెప్పుడు వారికి సంభవించదు!" అన్న కృష్ణుడు

తక్షణం శాంతి వహించాడు. క్షణమాగి - ఇది నా ఆలోచన, మీకు చేయవలసిన ఉపకృతి. ఇందుకే  నా ప్రయత్నమని'' చాలా తెలివిగా ముగిస్తాడు.

మాటల మాయ, మర్మ రహస్య వివరణలోని సత్యాన్ని భీముడు గ్రహించలేకపోతాడు. అయితే -

కనుక ముందు మనమందరిలో ఎంతవరకు ఇమడగలమన్న విషయం తెలుసుకుంటే -

ఈ మాటలతో భీమునిలో వివేకం మొదలైంది.

మొదట్నుంచి నేను చెప్పేదదే కదా ? అంటాడు. అంటే అతనికి హస్తినకన్న ఓ ప్రత్యేక ప్రాంతం కావాలి. అది తమదై వుండాలి. కాబట్టి మనం ఒక క్రొత్త నగరాన్ని నిర్మించుకోవాలి. ఇదే కదా, నీ వుద్దేశం, కృష్ణుని ముక్తాయింపుతో భీముడాశ్చర్యపోయాడు.

ముందు మనం మూర్ఖంగా ఇతరాలోచనలు చెయ్యకుండా ద్రుపదుని దగ్గరకు వెడతాం. యమునాతీర సువిశాల ప్రాంతంలో ఒక మహాద్భుత నగరాన్ని మనకనుగుణంగా నిర్మించుకుందాం. ఆ పాత, నరక సామ్రాజ్యాన్ని, ధృతరాష్ట్ర- దుశ్శాసనులకు విడిచి పెడదాం. ఈ మాటలకు భీమునిలో ఆనందముదయించింది.

“ఇటు నాగరాజు మణిమంతుడు వగైరా ఇతరుల సహకారం కూడా మనకు లభిస్తుంది. అప్పుడిక ఆలోచనలో పడ్డాడు. ఇదంతా నిజమా ? లేక మళ్ళీ నన్ను ఆటపట్టిస్తున్నాడా ?'' ఈ ఆలోచనలకు సమాధానంగా కృష్ణుడు “భీమా! నీ బలమైన గద తీసి నా తలపై ఒక్కటి మోదు. అప్పుడా ముక్కలు చెప్పే మాటలు సత్యమో, అసత్యమో తేలిపోతాయన్నాడు.

ఇప్పటికి తృప్తిపడినట్లు, నా మనస్సు నీకర్థమయింది. సంతృప్తిగా నిట్టూర్చాడు. చిరునవ్వు ఇప్పుడు భీముని ముఖంలో కూడ కనబడింది. అందుకు వాసుదేవుడు సంతోషిస్తు -

“గోపీ, గులకరాళ్ళు, నత్తగుల్లలు వగైరాలు ఏరుతూంటే, నీ మనస్సు నేను గ్రహించాను. అందుకనే నీ ఆలోచనకొక రూపమిచ్చి ఆ ప్రకారంగా నడుద్దామని చెప్పాను.'' విషయం ముగించాడు.

అపురూపమైన నందనోద్యానవనం వంటి అద్భుత నగర నిర్మాణానికి శ్రీకారం చుడదాము. ఆ బాధ్యత నాకు విడిచిపెట్టు. వూహలలోని బొమ్మలు, కలలు, వాటి సౌందర్య శోభలు, సాకారమైనట్లు కృష్ణుడు వివరించి చెపుతూంటే, భీముడు మురిసిపోతున్నాడు. ఊహా నగరంలోని ప్రతి అంగుళాన్ని, దాని అందమైన స్వరూపానికి తలుచుకుని పరవశించిపోతున్నాడు.

మేము నిర్మించలేదా ? ఆలోచించు. గతంలో అక్కడేముంది ? ఓ పాతపడిన రాక్షసశక్తుల కూటమైన కుశస్థలి. మరి ఇప్పుడు... ?!

జరాసంధుడు మథురపై పగపట్టి యాదవులను, నా పేరిట నాశనం చెయ్యబోతే ఆలోచించి, రూపొందించిన కలల నగరమే ద్వారక. ఇప్పుడది సుసంపన్నమైన దేశం. మథురకన్నా మిన్న. పోతుటీగ కూడా ద్రోహబుద్ధితో చొరరాని సురక్షిత ప్రదేశం.

అలాగే మీ నగరం, అపురూపంగా - అదెక్కడైనా సరే. నిర్మించబడుతుంది. ఆ నగరం ముందు, భూతలంలోని ఏ రాజ్యం సరిరాదు. స్వర్గమే దిగదుడుపు. సరేనా?

అంతా కృష్ణునిది సత్యభాషణమే. అందులోని ఆంతర్యం, తమకోసం ఆ వాసుదేవుడు పడే ఆరాటం గమనించిన భీముడు, తొందరపడినందులకు, భారీ శరీరం తప్ప, అంతటి ప్రశస్తమైన బుద్ధిలేనందులకు సిగ్గుతో తలవంచుకుని-

"బావా!" అన్నీ తెలుసుండి, తొందరపడ్డాను. క్షమించు .... !" మరి మాట్లాడలేక, వూరుకున్నాడు.

"నిజంగా నువ్వు తలిస్తే - ఆ స్వర్గమే ఇక్కడ సాకారమౌతుందని మాత్రం" చివరిగా అనగలిగాడు.

అదృష్టవంతుడినన్నాడు, కృష్ణుడు.

# కొత్తకోట

ఇప్పుడు ఆ అద్భుత నగరాన్నెక్కడ నిర్మించాలి. ఇదే ప్రస్తుతం వారి ముందున్న ఆలోచన.

దుర్యోధనునికి, దుష్టబుద్ధులకు దూరంగా, సుదూరంగా -

యమునాతీరంలో నిర్మిద్దాం... సరేనా ?'' ఇదే చివరి ప్రశ్న - సమాధానంగా కృష్ణుడు ముగించాడు. భీముడు, సంతోషంతో తలవూపాడు. కానీ, భీమునిలో, ఆనంద తరంగాల ముందర తొందర తగ్గక - నీ వుద్దేశంలో మధురను పునర్నిర్మిద్దామా ?'' అంటాడు.

అప్పుడు - భీముని తొందరపాటును పరిహసిస్తున్నట్లు నవ్వుతూ -

“ఇంతేనా నీ బుర్ర పనిచేసేదన్నట్లు చూసి'' మధుర మాది, యాదవులది. అది ఎప్పటికి మీది'' కాదు. యాదవ నగర పునర్నిర్మాణంపై నీతో సంప్రదించ వలసిన అవసరం, నీ సాయమనవసరం. నా వుద్దేశంలో ఇప్పుడు నిర్మించబడేది పాండుపుత్రుల స్వంత - ప్రధాన నగరం. ప్రపంచ పటంలో అది ప్రభావ నగరమౌతుంది. కావాలి! అదే నా ఆకాంక్ష'' అన్నాడు.

“ఖాండవప్రస్థం'' - మీకు సురక్షితమైనది. ప్రస్తుతమది ఘోర అటవీప్రాంతం. దానికొకసారి చూడమని, మణిమంతునికి చెప్పాను. పూర్వం - దీనిని మీ పూర్వీకులు పరిపాలించారు. అక్కడ మనం నగర నిర్మాణానికి శ్రీకారం చుడదాం.''

“కళ్ళన్నీ ఇంతింత వెడల్పు చేసి “ఏమిటి ? ఆ ఘోరారణ్యంలో మహానగర నిర్మాణమా ? అక్కడ సుందర సౌధాలా ? అద్భుత శిల్పాలా ? బావా! నువ్వు నిజం మాట్లాడుతున్నావా. నా చెవిలో పువ్వు పెడుతున్నావా ?'' ఆ మాటలకు, అదే మరొకరైతే కృష్ణుడు ఆగ్రహం వ్యక్తం చేసాడు. ప్రస్తుతం భీముని మనస్తత్వంలో మమేకమైన కృష్ణుడు - “భీమా, ఆ తొందరపాటే వలదన్నాను. ముందు చెప్పింది విను. ఆ తర్వాత జరిగేది చూడు. ఆ జరిగింది చూసి చెప్పు.... వూ...!'' కొంచెం గట్టిగానే హెచ్చరించినట్లు చెప్పాడు.

“భీమా! ఈ అపూర్వ నగర నిర్మాణం, నేనే కాదు మీరెవ్వరు వూహించ లేనంత వేగంగా, అపురూపంగా ఒక సం॥ర కాలంలో నిర్మించబడాలి. అది నా

ప్రతిజ్ఞ. అందుకే ఆలోచన.... అంత స్థిర సంకల్పంతో చెప్పే కృష్ణుని వదనంలోకి ఎంతో ఆశగా చూస్తుంటే, ఆ వదనంలో క్రొత్తకాంతులు, వింతలు.

తెలియని సుందర నగరం, ఆలయాలు, ఆ అపురూప భవనాలు, శిల్పాలు, సౌధాలు, వనాలు కళ్ళు గిర్రున తిరిగేటట్లు, మహానందకరమైన ఉద్యానవనాలు, పూలశోభలు, ఆ తెమ్మెరల గాలులు... ఇటు పులకితుడౌతున్నాడు. అటు వుక్కిరి బిక్కిరౌతున్నాడు. అవును కృష్ణుని మాట నిలబడుతుంది. మహాద్భుత నగరం అపూర్వంగా రూపుదిద్దుకుంటుంది.

తెలియని ప్రగాఢ విశ్వాసం.

అంతకు మించిన చెరగని, తొలగని నమ్మకం. శ్రద్ధా - విశ్వాసాలు భీమునిలో చోటు చేసుకుంటున్నాయి.

కనుక హస్తినకు వెడదాం. పెద్దలకు విషయం చెబుదాం. హస్తినను వారినే వుంచుకోమందాం. ఆ సిరిసంపదలతో వారినే వూరేగమందాం. మనం ఖాండవ ప్రస్థాన్నిమ్మందాం. అపురూప నగర నిర్మాణానికి, అకుంఠిత దీక్షతో ముందుకు సాగుదాం. అది నా పని. బయలుదేరు...!"

ఆ గోవిందుని మాటలు అమృత గుళికలయ్యాయి. మహాద్భుత రసాయన మయింది. మనసు పరశించింది. దేహముప్పొంగింది. నరనరాల్లో తెలియని శక్తి, బలం, తేజస్సు.... క్రొత్తగా వూపిరి పోసుకుంటున్నాయి.

ఇదంతా కలల ప్రపంచమా ? సత్య ప్రపంచమా ? ఒక ప్రక్క ఆనందం, మరొకప్రక్క అనుమానం. వుయ్యాలూగుతున్నట్లుంది. మళ్ళీ ధైర్యం ప్రక్కనే భయం, అనుమానం. ఇప్పుడు "బావా! మనం కనుక ఈ విషయంలో విఫలమైతే ప్రపంచం మనల్ని పిచ్చివాళ్ళను చేస్తుంది. వేలుపెట్టి చూపి, మరీ, మరీ వెక్కిరిస్తుంది. నిజమైన పిచ్చివాళ్ళుగా ముద్రపడిపోతాము. కృష్ణుని శక్తి సామర్థ్యాలను అఘోరి పేరున, ఆ జగదంబ చెప్పినా, మానవ జన్మనెత్తినందులకు, ఈ గాలిదేవుని పుత్రుడు గాలివాటు కబుర్లతో, అల్లల్లాడిపోతున్నాడు.

మనం అడిగిన ప్రదేశాలు, ధృతరాష్ట్రుడు ఇవ్వనంటే, లోకం అతన్ని అసహ్యించుకుంటుంది. ఎందుకంటే, పుత్రునిపై గుడ్డిప్రేమ తప్ప, ఆ మహారాజు చేతిలో ఏమీ లేదు!! ఇది భీమునిలో కల్గిన అనుమానం.

"సరే.... ఇవన్ని ముందు ప్రక్కనబెట్టు. మనం హస్తినాపురానికి వెడుతున్నాం!" కృష్ణుని స్థిర సంకల్పం.

మళ్ళీ మొదటికి వచ్చావు. భీముని గగ్గోలు.

"ఇంత చెప్పినా నీకు అర్థం కావడం లేదు. అక్కడికి వెళ్ళి తెలివిగా మన పథకాలను పారించుకోవాలి. అప్పుడు.... అప్పుడు... మన ఆలోచనల్ని సఫలీకృతం చేసుకుని మన విశ్వరూపాన్ని ప్రదర్శించాలి. అంతేకాని ఓ వాయువరప్రసాదీ మహా భీమా! గాలిలో మేడలు కడితే, అవి గాలిమేడలే అవుతాయి తప్ప, కార్య సానుకూలత కాదు. బయల్దేరు. ఇటువైపు మళ్ళీ రావాలి. అప్పుడు వద్దామంటాడు.

"నువ్వు చెప్పింది నిజమే. నన్ను చూస్తే ఆ ముసిలి, నన్ను కాదనలేడు. తన పిల్లలు సుఖంగా వుండాలనే బుద్ధితోఅడిగింది, అడిగినట్లిచ్చేస్తాడు." అన్నాడు క్షణమాగి - "అది సరే, గోవిందా! ఇన్ని తెలివితేటలు ఎక్కడ నేర్చుకున్నావు ?" అమాయకంగా అడుగుతాడు.

కృష్ణుడు తెలివిగా, భీముని మనస్తత్వం తెలిసినవాడుగా "ఇవన్నీ నీ సహచర్యంలోనే నాకు వచ్చాయి. ఇక్కడికి బయల్దేరి వచ్చేముందు, ఎలాగ నిన్ను వెదకి పట్టుకోవాలా ? అన్న ఆలోచనే తప్ప, నీ కలల మహానగరాన్ని నిర్మించాలని, ఆ అపురూప సామ్రాజ్యంలో మిమ్ములను చూసి పరవశించాలనే ఆలోచన కలుగలేదు. కానీ, ఇక్కడ - ఇక్కడికి వచ్చానే...." అని, ఆ ఆలోచన కల్గిందంటాడు. భీముడు ఉబ్బితబ్బిబ్బవుతాడు.

వెంటనే "గోపీ....!" అంటాడు.

ప్రభూ! అని పరుగెత్తుకు వస్తాడు.

రథాన్ని సిద్ధం చెయ్యి, బయలుదేరుదాం.

హస్తినాపురానికా ? ఇదిగో చూడండి. ఈ అందాల నగరి మనది. ఇది ఎంత అందంగా వుందో. మురిపిస్తున్నట్లు మాట్లాడుతున్నాడు.

ఇక ఆ గాలిమేడలు, పేకమేడలు, గుజ్జనగూళ్ళు తీసిపారెయ్యి. వెంటనే మనం బయలుదేరుతున్నాం. ఈ కలల నగరం కాదు, నిజమైన మహానగరమే మనం నిర్మిస్తున్నాం. పద!" ఆదేశించాడు.

చేసేదిలేక "చిత్త"మన్నాడు గోపీ.

"అక్కడికి వెళ్ళాక, ఏమైనా ఇబ్బందులనెదుర్కోవలసి వస్తుందేమో... వాళ్ళు...!" నసుగుతూ అన్నాడు.

"ఇప్పుడు వెళ్ళి, మనం ప్రమాదాల నుండి బయటపడుతున్నాం. ప్రమోదాల నగరికి పయనమౌతున్నాం. తన ఆదేశాన్ని అమలుపరచమని హెచ్చరించాడు.

"అనుకున్నాను. ఈ వాసుదేవుడు వచ్చాడంటే విపరీతాలు, విడ్డూరాలు తప్పవని. అల్లాగే మిమ్మల్ని తన మాటల మాయా, తీపి శక్తితో హస్తినకు తీసుకు వెడుతున్నాడు. కానీ అంతా దైవేచ్ఛ. నిన్న ఇక్కడికి వస్తామనుకోలేదు. ఇవ్వాళ ఇక్కడనుండి భూమి గుండ్రంగా వుందని చెప్పి - మరల హస్తినాపురానికి తిరిగి వెడతామని అనుకోలేదు" అని గొణుగుకుంటూ -

తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు ప్రారంభించాడు.

# కల ఫలించింది!

సమావేశస్థలికి, సభామంటపానికి ఎదురుగా కట్టిన, ప్రత్యేక మంటపవేదికపై, తొమ్మిది దినాలపాటు యుధిష్టరుని మహారాజ పట్టాభిషేక మహోత్సవాలు ఘనంగా జరిగాయి.

ఋషులు, మునులు, బ్రాహ్మణోత్తములు, పండితులు, శాస్త్రకారులు, సకల కళాకారులు ఒక్కరేమిటి.... ఎందరో....ఆ మహదానందకర మహోత్సవంలో, మహోత్సాహంగా పాల్గొన్నారు. నిత్యహోమాలు, అగ్నిప్రతిష్ఠా కార్యక్రమాలు, భారత వంశ ఖ్యాతి పరిమళాలను దశదిశలకు విస్తరింప చేస్తున్నట్లు ఎంతో ఘనంగా జరిగాయి. ఆబాలగోపాలం, ఆ పట్టాభిషేకోత్సవాలలో పాల్గొన్నారు. ఆనందించారు.

ధర్మరాజుగా విఖ్యాతుడైన యుధిష్టరుని చూస్తే కొందరి పెద్దలకు పాండురాజుని చూసిన భావనే ప్రస్ఫుటంగా కనబడసాగింది. పాండురాజు సేవలకే తాము తరలివస్తున్నట్లు ప్రతిఒక్కరు తలిచారు. పరమానందభరితులౌతున్నారు.

విందులు - వినోదాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, ఆటలు, పాటలు, ఎంత అట్టహాసమంటే వర్ణించనలవికాని పండుగ వాతావరణంలో ఆనందబడనివారెవరు.. అంటే.. ఎవరో శకుని, దుశ్శాసనుల వంటివారు కొందరు

తప్ప - హస్తినాపుర ప్రజానీకం మొత్తం, భరతవంశ చక్రవర్తుల పరిపాలనలో పొందిన సుఖసంతోషాలు గతంలో తమ పెద్దలు ప్రవచించిన అదృష్టాన్ని వల్లెవేసుకుంటూ బ్రహ్మానందభరితులౌతున్నారు.

మధ్యముడు గెలుచుకున్న ద్రౌపది, మహారాణిగా పట్టాభిషిక్తురాలయింది. ఒక్క దుర్యోధన శతానికి అతనిననుసరించే ఏ కొందరికో తప్ప అందరికి ఆనందధామము, నిజం చెప్పాలంటే అదొక మహా జాతర. ఇంటింటి పండుగను మించిన భారతదేశ, ఆర్యావర్త ఆనంద సంబర వేడుకలవి.

సింహాసనాధిపత్యమొందిన తొమ్మిదవనాడు ధర్మరాజు, వేదవ్యాసులు వెంటరాగా, పితామహుడు, భీష్ముడు, పురోహితులు ధౌమ్య, సోమదత్తులు, ఇతర ముఖ్య ప్రముఖులు వెంటరాగా, ఏనాడో ప్రతీప మహారాజు నిర్మించిన, పురాతన-కులదైవము ''శంకరుని'' మందిరం ప్రతిష్టేశ్వరుని సందర్శించాడు. అర్చనాదికాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించాడు.

ఈ కార్యక్రమానంతరం, గతంలో మధ్యలో ప్రత్యేకంగా కేటాయించబడిన వేదవ్యాసులవారి పీఠం, ప్రక్కకు మార్చబడింది. రత్నఖచిత స్వర్ణ సింహాసనం మధ్యలో-భరతవంశ కీర్తి ప్రతిష్టల నినుమడించేటంత గొప్పగా - సింహభాగంలో వుంది. మిగిలినవారి ఆసనాలు, వారి వారి స్థాయిని బట్టి, రాజసభలో ఏర్పాటు చేయబడ్డాయి.

అటు, ఇటు పితామహులు, వేదవ్యాసులుండగా మహారాజు "ధర్మరాజు సభా భవనంలోకి అడుగుపెట్టడం.... మంగళవాయిద్యాలు, వీరణాలు, పూరణాలు, జయ జయ ధ్వానాలు, వంధిమాగధుల స్తోత్రాలు... కరువు తీరా, కంటి నిండుగా చూడవలసిందే తప్ప, ఆ దృశ్యం వర్ణించడమసాధ్యం. అంత నయన మనోహరంగా వుంది.

సింహాసనం వద్దకు రాగానే పురోహితులు ధౌమ్యులవారు, నుదుట చందనం దిద్దారు. నమస్కరించిన ధర్మరాజును, మంత్రాక్షతలతో ఆశీర్వదించారు. ముఖ్య సచివుడు, మహామంత్రి విదురుడు, ఆనాడు శంతన మహారాజు ధరించిన, విల్లంబులును, సదాచార సంపత్తికి, మహారాజ వైభవానికి చిహ్నంగా ఆ చక్రవర్తి కిరీటంతో కలిపి, బంగారు పళ్ళెరంలో పట్టుకుని నిల్చున్నాడు.

భరతవంశ కీర్తిప్రతిష్టలను జాజ్వల్యమానం చేసిన, ఆ పారంపర్య వంశ కిరీటాన్ని పితామహుడు భీష్ముడు నూతన మహారాజు ధర్మరాజుకు అలంకరించారు. ధనుర్బాణాలను చేతికి అందించారు.

వాటిని సింహాసన సముఖంలో స్వీకరించిన ధర్మరాజు భక్తిశ్రద్ధల వినయ మూర్తియై కనులకద్దుకున్నాడు. వేదవ్యాసులు స్వస్తి - శాంతిసూక్తాలతో అఖండ కీర్తి ప్రతిష్టలతో శాశ్వతానంద మూర్తియై మెలగమని ఆశీర్వదించారు.

మహామల్లుడు బలియాతో కలిసి సోమేశ్వర్ సింహాసనానికి ప్రక్కన భరతవంశ దీప్తులను వెదజల్లిన బంగారు, రత్నాలతో పొదగబడిన ఛత్రము, రాజసానికి చిహ్నంగా, పట్టుకుని నిల్చున్నాడు. పాండురాజు మరణానంతరం ఒక ప్రక్కగా వుంచబడిన ఆ ఛత్రము నేడు మళ్ళీ వెలుగులోకి వచ్చింది.

సింహాసనంపై ఆసీనుడవడానికి ముందు యుధిష్టరుడు, ముందుగా వేదవ్యాసులకు, తదుపరి పితామహుడు గాంగేయులకు, ధృతరాష్ట్రులకు, తదుపరి బలరాములకు సాధికారం వందనం చేసాడు. ఆ వెంటనే ఆచార్యులు, ద్రోణ - కృపులకు, కుల గురువులకు, సాష్టాంగ నమస్కారం చేసాడు. తన ధర్మ కార్య నిర్వహణలో సర్వదా తోడు వుండమని, దివ్యులు నడిచిన ధర్మ, కర్మ, పుణ్య మార్గంలో నడిపించమని కోరాడు.

అక్కడనుండి కృష్ణుని వైపు నడవగా ఆతనిని చూస్తూనే పెద్దబావకు సాదరాహ్వానంగా రెండు చేతులతో, ఆలింగనం చేసుకుని, అభినందించదలచిన కృష్ణుని, సద్ధర్మమూర్తికి, ఆర్షధర్మనిరతునికి అంజలి ఘటిస్తున్నట్లు, శ్రీకృష్ణ గాఢ పరిష్వంగనంలో మున్గి - హృదయాంజలి ఘటించాడు. అప్పటికి ఆ తంతు ముగిసింది.

కురువృద్ధుడు, క్షేమంకరుడు, పితామహుడు ఒక్కసారి చేతిని పైకెత్తేసరికి, సభ యావత్తూ, ఆ మహానుభావుని ఆదేశాలకు అప్రమత్తమయింది. అందర్నీ ఒకసారి చూసి, సభనుద్దేశించి, తన సహజ గంభీర స్వరంతో -

"చిరంజీవీ! భరతుడాది మహనీయులు అధివశించిన, ఈ దివ్య సింహాసనాన్ని అధిష్టిస్తూన్నశుభ తరుణంలో నిన్నాశీర్వదించగల్గడం, భగవంతుడు నాకొసగిన అపురూప సావకాశంగా తలుస్తున్నాను. పితృపితరులు, పూర్వ చక్రవర్తులు, ధర్మనిరతులై ఈ పుణ్యభూమిని తమ పాలనతో ఏ విధంగా ప్రకాశింప చేసారో ఆ ధర్మం తప్పక - అధర్మపరుడివి కాక, సద్ధర్మయుతంగా, విజ్ఞుల - అభివృద్ధి కారుల సమయోచిత సలహాలతో, అఖండ కీర్తిప్రతిష్టలు, కేవలం నీకే కాకుండా, తరతరాల కురువంశ దీప్తులను, భరత (జాతి) ఖ్యాతికి వన్నె తెచ్చునట్లు ప్రకాశింపచేసెదవు గాక!

"పూర్వులు ధర్మబద్ధంగా, ప్రజాహితం కోరి సల్పిన, రాజసూయ, అశ్వ మేధాది యజ్ఞములు సల్పి, భూరి దక్షిణలతో, భూసురులను, వేదమూర్తులను తృప్తిపరచెదవు గాక!

అఖండలక్ష్మి నీచెంత సుసంపన్నయై నిల్చుగాక.

ధరణీసురలెల్లరు, నీ ధర్మ దీక్షకు సర్వదా మిత్రహిత, సామంతులై వర్థిల్లెదరు గాక!

ప్రకృతి, పరమాత్మ! సర్వదేవతానీకము నీ ధర్మ దృష్టికి, సమతాపాలనకు మెచ్చి, పాడిపంటలతో నిన్ను - నీ ప్రజలనాశీర్వదించెదరు గాక!" అనగా

"అస్తు - తధాస్తు" అంటూ మహర్షి వేదవ్యాసులవారితో పాటు సర్వులు, శుభాశీస్సులను శుభ్రమనస్కులై అందించారు.

ఆ వెంటనే - "రాజా!" అనగా ధృతరాష్ట్రుడు, సంజయుని హెచ్చరికతో-

"చిరంజీవీ! మహారాజుగా కురుకుల వంశదీప్తులను ప్రకాశింపచెయ్యి. భరతవంశ ఖ్యాతి పరిమళింప చెయ్యి. నీకు మా ఆశీస్సులు, మన పూర్వీకులు ధర్మపరులైన పుణ్యమూర్తులైన చక్రవర్తుల కరుణ సదా నీపై వర్షించుగాక!

గొంతులో ఇమడనట్లు పైపైన పలుకుతున్నాడు. ధృతరాష్ట్రుడు చెప్పేది వినడానికి ప్రతిఒక్కరు వళ్ళంతా చెవులు చేసుకోవాల్సి వచ్చింది. రాజుకు అందరు సమానులే. నాకు అంతే! నీవు, నీ సోదరులు, నీ దాయాదులైన నా కుమారులు, అందరు సంతోషంగా, సామరస్యంగా వుండటమే, ఒక మహారాజుగా నా ఆశయం, నా ఆకాంక్ష.

ఈ సమయంలో రాజ్యాధికారము క్రొత్తగా చేపట్టే నీకు, వారసత్వ హక్కుకన్న, ధర్మనిరతి శ్రేష్టమని చెప్పడానికి గర్విస్తున్నాను. నెమ్మదిగా గొంతు పెగల్చుకుని, అయిష్టాన్ని ఇష్టంగా ధృతరాష్ట్రుడు చెబుతున్నాడు. సర్వేజనాస్సుఖినో భవన్తు" అనే రాజు, అందరితోపాటు తన వారితో కూడా ధర్మమూర్తియై చరించాలి. ప్రతిదానికి కొన్ని హద్దులు, నియమ నిబంధనలు వుంటాయి. వాటిని నీకు అత్యావశ్యకంగా తెలియబర్చ సంతోషిస్తున్నాను."

"యుధిష్టరా! పెద్దవాడివి. సకలజన ప్రేమపాత్రుడివి. సర్వధర్మ నిరతుడివి. ఆర్ష ధర్మ ప్రకాశకుడివి. ఇవి నా మాటలు కావు. లోకం సదా ప్రకటించి, ప్రవచించే-సత్యసూక్తుల వంటి నిత్యసత్యాలు. ఈ సమయంలో నీకొక ముఖ్య విషయం.

మన రాజ్యం హద్దులు, మన హద్దులు మనం తెలుసుకోవాలి. యమునా పర్యంతం మనదే రాజ్యం. ఈ సువిశాల భారతావనికి ఒకప్పుడు ఖాండవప్రస్థం రాజధాని. దానిని మన పూర్వీకులైన పురూరువులు, నహుషుడు, యయాతి వగైరా ఎందరో ప్రముఖులు, సర్వలోక జనహితంగా పరిపాలనం చేసారు. ఇప్పుడంటే ఈ హస్తిన రాజధాని అయింది కాని. అక్కడనుండే చారిత్రక, ప్రశస్త సిద్ధాంతాలు, మహాద్భుత చరిత్రకు రూపురేఖలు దిద్దబడ్డాయి!'' ధృతరాష్ట్రుడు క్షణమాగాడు.

ప్రముఖులు, ప్రేక్షకులు, సభికులతో పాటు సర్వులు ఉత్కంఠతో చూస్తున్నారు. వింటున్నారు.

అది మన ప్రాచీన మాతృభూమి. ఇంకా చెప్పాలంటే పుట్టినిల్లు. దానిని నువ్వు నీ సర్వ సమర్థతతో, పాలనా పటిమతో మరల, లోక విఖ్యాతం చెయ్యాలి. అర్థమైం దనుకుంటాను. ఆ మాటలకు అందరు ఘొల్లుమనలేదు. కానీ బొమ్మ లయ్యారు. అవాక్కయ్యారు. అచేతనులయ్యారు. వినేది కలా ? నిజమా ?? అక్కడ.... అక్కడ పాలించడానికేముంది ? అడవి, క్రూర - మృగాలు, విషసర్పాలు తప్ప.

ఈ మాట ప్రతి ఒక్కరిని కదిలించింది. కలచివైచింది. ఆహా.... రాజ్య బహిష్కారం కన్న భలే గొప్ప బహిష్కారం. ఎన్ని తెలివితేటలు, క్రూరబుద్ధి కుమారులకు, ఈ గుడ్డి తండ్రి వత్తాసు. అహ.... భలే... భలే... ఎంత దారుణం..?! రకరకాల వ్యాఖ్యలు గుసగుసలు.. రుసరుసలు. అశాంతి వాతావరణం. దుర్యోధనాదులు సంతుష్టులయ్యారు.

జరిగే హడావుడిని చూడకపోయినా అర్థం చేసుకోగల ధృతరాష్ట్రుడు, అవాక్కయిన ప్రజలతో కలిసి మిన్నకున్నాడు. ఇక -

పితామహుడు భీష్ములైతే "బుద్ధిః కర్మానుసారణి. వినాశకాలే విపరీత బుద్ధిః అని, చేజేతులా పాపం చేస్తున్నారు. ఫలితమనుభవించ సిద్ధపడుతున్నారని అంతటి కోపంలోను, చేతులతో పెంచిన పిల్లల్ని చేజేతులా శపించలేక అవాక్కయ్యాడు. "భగవాన్'' అంటూ ఒక్కసారి కళ్ళు మూసుకుని, ఫలితం పర్యవసానం కాలానికే అప్పగించినట్లు మౌనం దాల్చాడు.

యుధిష్టరుని మొహం వాడిపోయింది. స్పృహతప్పి క్రిందపడిపోతానేమోనన్న క్షణాల ఆందోళనకు గురయ్యాడు. అసహాయుడై, నిస్సత్తువతో తేలిపోతున్నాడు. జరిగేదేమీ గ్రహించలేకపోతున్నాడు. ఇంతటి దారుణానికి, పెదతండ్రి పాలుపడతా

డని, తడిగుడ్డతో గొంతు కోయ సిద్ధపడతాడని, దీని పరిణామమెంతవరకు పోతుందో, అర్థం కాక సింహాసనం చేతుల్ని పట్టుకుని కృంగిపోయాడు.

ఈ పరిస్థితిలో తన సోదరులనెవర్ని చూడదలచని ధర్మరాజు, తలవంచు కున్నాడు. తన చూపులవలన, తమ్ముల వలన ఎటువంటి ప్రమాదము సంభవించ కూడదని, ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాడు.

అందర్ని చూస్తున్నాడు. ఇది అదృష్టమో, దురదృష్టమో అర్థం కావడం లేదు. నిన్నగాక మొన్న అలిగి వెళ్ళిపోయిన భీముడు, ఏ అఘాయిత్యం చేస్తాడోనని యుధిష్టరుడు భయపడిపోతున్నాడు. ఒక్క విదురుని పెదవులపై నవ్వు కనబడుతుంది. మిగిలినవారు, వారి మనస్తత్వాలు, కాగల కార్యం, చేయవలసిన ధర్మం.... అన్ని అగమ్యగోచరాలే!

సభికులు దీనంగా చూస్తున్నారు. ధర్మరాజా! మమ్మల్నీ దుర్యోధనుని పాలపడేసి, నువ్వు నీ సుఖం చూసుకో అన్నట్లున్నాయి వారి చూపులు. అప్పుడు బెరుకు, బెరుకుగానే భీముని వైపు చూసాడు. అతనిలో ఏ విధమైన భీభత్స దృష్టి కనబడలేదు సరికదా, ఇదేదో తమ మేలుకే వచ్చినట్లు సంతోషిస్తున్నాడు.

ధర్మానికి నిలబడినవాడు, ధర్మాన్ని అనుసరించదలచిన వాడు, సర్వ ధర్మాలను ఆ భగవంతుని కర్పించి, తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించాలన్నట్లు, వేదవ్యాసులు కనుపించారు. చివరకు విధిలేక, అన్నమాటకోసం, ధర్మప్రతిష్టాపనా మూర్తిగా, ధృతరాష్ట్రుల వారిని, అతను చూడలేకపోయినా, రెండుచేతులు జోడించి, వందనమర్పించి, తప్పక పెద్దలైన మీ మాట శిరసావహిస్తానన్నాడు.

"హమ్మయ్య!" తృప్తికర నిట్టూర్పులు వినిపించాయి.

అప్పుడు - ఆ సమయంలో -

అందరిని ఆశ్చర్య చకితుల్ని చేస్తూ, కృష్ణుడు తన ఆసనం నుండి లేచాడు. తన వంతుగా ఏదో చెప్పబోతున్నాడు. అది - ధర్మరాజు పక్షమా ? మిగిలిన సోదరుల పక్షమా ? లేక.... ఎవరికీ అర్థం కావడం లేదు. అటువంటి సమయంలో-

"పరమపూజ్యా, గాంగేయా!" మీ అనుమతితో.... అన్నాడు. పితామహులు, తలవూపారు. అప్పుడు ఆ సభలో - అందరిని ఉద్దేశించి -

"కురువంశ ప్రముఖులారా! ఓ ధృతరాష్ట్ర మహారాజా! మీ తెలివితేటలకు, సమయ స్ఫూర్తికి, సకాల సూచనకు నమోవాకములు. మీరు విచిత్రవీర్యుల

కుమారులు కదా! మీ ఆలోచనలు, ఆశయాలు అన్ని విచిత్రంగా వుంటాయి. అయినా హర్షింపదగ్గవి. ఇంతకాలం ఏకచ్ఛత్రాధిపత్యంగా నడిపిన, ఈ భరతవంశ కురుసామ్రాజ్యాన్ని, సర్వజన సమ్మతమైనా, కాకపోయినా -

మీ పిల్లలు, మీ తమ్ముని పిల్లలకు మధ్య సారధిగా, వారధిగా నిల్చి చక్కగా విభజించారు. చాలా సంతోషం. కనీసం దీనితోనైనా మీ పిల్లలు, శాంతమొంది, దాయాదుల మధ్య సామరస్య ధోరణి, సృహద్భావ వాతావరణం, ప్రశాంత జీవనం... ఇప్పటికైనా కల్గి వుంటారని, కల్గుతాయని ఆశిద్దాం.

ఈ కృష్ణుని మాటలు, పాండవ పక్షపాతిగా, శ్రేయోమూర్తిగా చాలామందికి నచ్చలేదు. అడివిలో ఏమున్నాయని పాలించడానికి, సుఖపడటానికి అందరు నిరుత్సాహంతో... కృష్ణుని ప్రవర్తన నచ్చక, ఆతనినెదిరించలేక మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే -

ధర్మరాజు తృప్తిగా, హృదయభారమంతా దిగిపోయినట్లు, గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు. రాజ్యంతోపాటు రాజ్యంలోని సర్వసంపదలు ఇరువురు చక్కగా పంచుకుంటారు. ఇది విధి విధానం. అందరు హర్షించదగినది. పదుగురు మెచ్చుకునేది.

ఇంతవరకు - కృష్ణుని మాటలకు సంతోషించిన దుర్యోధనుడు, బుస్సుమని లేవబోయాడు. కానీ అతని గొంతుక పెగలలేదు. ఏదో చెప్పాలని ఏమీ చెప్పలేక డీలా పడిపోయాడు. అలాగే చతికిలబడిపోయాడు. ఆ సమయంలో గాంగేయుడు తల వూపాడు.

ఈ పరిస్థితి ఏర్పడుతుందని తలవని ధృతరాష్ట్రుడు "వాసుదేవా, నువ్వు చెప్పింది నిజం. కేవలం పరిసరాలు సరిహద్దులు మాత్రమే కాదు, సంపదలు కూడా ఎవరికి చెందవలసినవి, వారికి చెందాలి!" ఒప్పుకున్నాడు. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారన్న సత్యం, ఇక్కడ నిజమైనందులకు, వ్యాసులవారు ముసి ముసి నవ్వులతో తమ ఆమోదాన్ని తెలిపారు. "పుత్రా! ధృతరాష్ట్రా! ఇప్పుడు సత్యవాదివి, ధర్మవాదివయ్యావన్నారు.

కృష్ణుడు, ధృతరాష్ట్రుని భుజంపై తన చేతులను వుంచి అభినందిస్తూ "మీ నిర్ణయం. భరతవంశఖ్యాతిని ఇనుమడింప చేసిందని, పితామహులవైపు తిరిగి -

"పితామహా! యాదవ అతిరథ, మహారథులెందరో ఇక్కడ వున్నారు. మా అగ్రజుడు, బలరాముడు, నేను, విరాట, సునీధాది మహారాజులు, ఇతర

ముఖ్యులు, పాండురాజు అభిమానులు, అందరం, ఈ క్షణమే ఖాండవ ప్రస్థానికి బయలుదేరుతాం. ఇందుకు తమరి అనుమతి నభ్యర్థిస్తున్నా''మన్నాడు. సమాధానంగా, భీష్ములు -

"గోవిందా'' సర్వజ్ఞుడవు. నీకు నా అనుమతా ? వలదు, వలదు. సర్వాభీష్ట ప్రదాయకుడివైన నీవు మాకు ఆదేశించు. శిరసావహిస్తా''మన్నాడు. అప్పుడు మళ్ళీ కృష్ణుడు -

"పితామహా! పాండురాజు అభిమానులు, పాండుపుత్రులు శ్రేయోభిలాషు లెందరో వున్నారు. వారందరు కనుక పాండవులను వెంబడించదలిస్తే, తమరు అనుగ్రహించి, అనుమతించాలి. ఇది నా అభ్యర్థన'' వాసుదేవుడు వేడు కుంటున్నాడు.

ప్రజలు - హర్షధ్వానాలతో ఆ సలహాకు ఎంతో స్పందించారు. ఆనందించారు కూడా! ఇదో పెద్ద పిడుగుపాటయింది. కానీ, దుర్యోధనుడు మాత్రం కృష్ణుని ఎదురుగా ప్రతిఘటించడానికి గాని, ప్రతిస్పందించడానికిగాని సాహసించలేదు. కారణం, తనకు తెలుసు. తెలిసినదానికి, తెలివిగా మెలికపెట్టి పీకలమీదకు తెచ్చుకోవడం ఇష్టంలేక, ఆ పిడుగు ప్రక్కకు తప్పుకున్నట్లు తలవంచాడు.

శకుని మాత్రం, దుశ్శాసనునితో "చూసావా, ఆ పిరికిపంద ఎలాగ కవ్విస్తున్నాడో....!'' మరో విప్లవానికి మార్గం చేస్తున్నట్లు మాట్లాడుతున్నాడు.

అప్పుడు గాంగేయులు, కురుకుల శ్రేయోభిలాషిగా లేచి,

"ఎవరైనా సరే, యుధిష్ఠరుని అనుసరించే వారు, వారి సిరిసంపదలతో కదలి వెళ్ళవచ్చును. ఇందుకు ఏ విధమైన అభ్యంతరముండదు. ఎవరు వెడుతున్నారని గూడా, ఆలోచించడం, ప్రశ్నించడముండదు. ఎవరిష్టం వారిది.'' ఇందుకు ప్రతి ఒక్కరు సంతోషించారు.

కృష్ణుడు, అగ్రజుడు బలరాముడు వద్దకు వెళ్ళాడు. ఏదో సంభాషించాడు. అర్జునుని వద్ద గల అక్రూరుని పిలచి, విషయం ముచ్చటించాడు. ఈ సమయంలో, సమావేశం అర్థాంతరంగా మధ్యలో ఆగిపోయినట్లనిపించింది. వారి సంభాషణ ముగిసింది. కృష్ణుడు అక్రూరుడు, తమ తమ ఆసనాలనలంకరించారు. అప్పుడు బలరాముడు లేచి -

"పరమ పవిత్ర శంతన పుత్రా! గాంగేయా! పాంచాల రాజు ఆహ్వానం మేరకు, మేమందరము, కాంపిల్యానికి వచ్చాము. అక్కడ మంటల్లోపడి మాడిపోయి

చనిపోయారనుకున్న, మా మేనత్త కుమారులు, బావలు, బ్రతికి వున్నారని, అక్కడకు వచ్చి, ఈ స్వయంవర సంబరంలో పాల్గొంటారని వూహించనైనా వూహించలేదు.

కానీ భగవంతుని కరుణతో వారు బ్రతికి బట్టగట్టారు. వారు స్వయంవరం చూడటానికే వచ్చారు. కాని అచ్చటి పరిస్థితులను గమనించి, వీరాధివీరుడు, ధనుర్వేత్త, ద్రోణాచార్యుల ప్రియ శిష్యుడైన అర్జునుడు, స్వయంవరంలో పాంచాల రాకుమార్తెను గెలుచుకున్నాడు. ఆ తదుపరి జరిగినదంతా లోకానికి తెలిసిందే.

గాంగేయుడు, తమ మంత్రి విదురుని ద్వారా పాండవుల్ని హస్తినాపురానికి ఆహ్వానింపచేసారు. సాంప్రదాయబద్ధంగా, కురువంశ - ఈ తర జేష్టుడైన మా పెద్దబావ యుధిష్టరునికి, కిరీటధారణం గావించి రాజును చేస్తారన్నారు. ఈ మహోత్సవం కూడ దర్శించవచ్చని, పెళ్ళివారితో కలిసి అట్టహాసంగా ఇక్కడికి వచ్చాము.

ఇక్కడ అన్ని "అపశకునాలే" అన్నీ అపశృతులే! అనేమాటకు చేసే పనికి పొంతన లేదు. ఎంతసేపు ఎదుటి వారిపై పగ-ద్వేషాలు, పంతాలు-పట్టుదలలు, దాయాదులు అన్నదమ్ముల వైపుండి, ప్రేమాభిమానములతో కలిసి వుండక ఒకరినొకరు చంపుకుని, పీక్కుతినాలని జంతువులవలె ప్రవర్తించడం, నిజంగా జుగుప్సాకరం. చెప్పుకోవడానికి సిగ్గుచేటు. సభ్యసమాజానికి తలవంపులు.

అయినా పాండవుల మాతృవంశ బంధువులుగా వివాహ సమయంలో ఇవ్వని బహుమానం, ధృతరాష్ట్ర మహారాజు, మా బావకిచ్చిన బహుమాన శుభ సందర్భంలో - అంటుంటే - కృష్ణుడు కల్పించుకుని, మా అన్నగారి అనుమతితో ఒక చిన్నమాట.. ఈ శుభ సమయంలో ద్వారకాపురంలో, మా యదు ప్రముఖులు, యాదవుల పనుపున, ఒక సముచిత బహుమానాన్ని పంచపాండవులకు, మా అన్నగారు ప్రకటించి ప్రసాదిస్తారంటాడు.

ఏమిస్తారో తెలియని, ప్రముఖులు, ప్రేక్షకులు ఆ ఇవ్వబోయేది, ప్రకటించ బోయేదేమిటో తెలుసుకోవాలని, వూపిరి బిగపెట్టి, చెవులు రిక్కించి, వినడానికి, ముందుకు వంగి మరీ, విన సిద్ధమౌతున్నారు.

ఆ - బహుమానం - అని కృష్ణుడు, తన సహజ మందస్మిత వదనంతో - అనగా...

ఈ శుభ సమయంలో, మా మేనత్త కుంతిమాత కుమారులైన, పాండురాజ నందనులకు, మేము, మా యదు, యాదవ ప్రముఖులు, వీరులు, ద్వారకలో కల్గియున్న

సంపదలో అయిదవవంతు బంగారం, పశు సంపద, అశ్వ, గజ, రథ, మడిమాన్యాలు సర్వం... కానుకగా అందిస్తున్నామని ప్రకటించాడు. అవి దుర్యోధనాదులకు ఊపిరి సలుపకుండా చేస్తే - మిగిలినవారు హాయిగా వూపిరి పీల్చుకున్నారు.

ఆ ప్రకటన విన్న మరుక్షణం, శ్రీకృష్ణునికి అగ్రజుడు బలరామునికి, మహారాజు ఉగ్రసేనులకు, ముఖ్య సలహాదారు వసుదేవునకు, ఇతర యాదవ ప్రముఖులకు, వీరులకు, ప్రజానీకానికి, హర్షోల్లాస మనసుతో జయజయధ్వానాలను, కరతాళ ధ్వనులను ఆ సభ మిన్ను ముట్టించింది.

ప్రతి ఒక్కరు కరతాళధ్వనులతో మురిసి ముదమొందారు. అప్పుడు మళ్ళీ-వాసుదేవుడు చెయ్యెత్తి ఆపమన్నట్లు వారిస్తూ -

మరొక విషయం. నూతన రాజధాని నిర్మాణ విషయంలో, ఇతర సాంకేతిక సలహా సంప్రదింపుల విషయంలో, మా అన్నగారితో కలిసి మేమందరము కూడా పాండుపుత్రులకు బాసటగా నిలుస్తాం. అద్భుత నగర నిర్మాణానికి శ్రీకారం చుట్టడమే కాదు, అతి త్వరలో పూర్తి చేయించి మా ఏలుబడిని కొనసాగిస్తాం. ముందుకు పురోగమిస్తామన్నాడు.

ఆ వెంటనే వ్యాసులవారివైపు నడిచి "మహామునీ! మీ ఆశీర్వాదం, అమోఘ శక్తియుక్తులు, కురువంశ వృద్ధి స్వరూపంగా వారికి ప్రసాదించండి." అభ్యర్థించాడు కృష్ణుడు.

ఇంద్రాది సర్వదేవతానీకం నీకు తోడుగా నిలచి, నీ సత్య - ధర్మ - ప్రకాశానికి సర్వదా సహకరించుగాక! అని వ్యాసులవారు ఆశీర్వదించారు.

ఇదంతా కృష్ణుని - ఆలోచనా ప్రతిభకు, శక్తి సామర్థ్యాలకు ప్రతీకగా ప్రతి ఒక్కరు తలిచారు. సంతోషంతో ఒక్కొక్కళ్ళే కదుల్తుంటే భీముడు పరుగు పరుగున వచ్చి, కృష్ణుని ఆలింగనం చేసుకుని "నిజంగా నువ్వు సత్య - ధర్మపరుడివి. నీ మాట నిలబెట్టుకున్నావని పలువిధాల కీర్తించాడు.

తొందరపడకు. ఇంకా నా బాధ్యత పూర్తి కాలేదు. అప్పుడు... అని చిరునవ్వులు చిందిస్తూ ముందుకు కదిలాడు.

## ఆరవ అధ్యాయము

# అదిగదిగో - సత్యభామ

**అ**ది మధ్యాహ్న సమయం.

ద్వారకలో - ఆ శ్వేతసౌధం - ఎంతో విశాలమైనది. చుట్టు బహిరంగ ప్రదేశంతో, అందంగా వుండే - అది సత్రాజిత్తు మందిరం. దానిచుట్టు పరిచారకుల, సహాయకుల ఇళ్ళు, కుటీరాలు వున్నాయి. గుర్రాలశాల, ఆలమందలకు కావలసిన అన్ని వసతుల పశుశాల, ఇతర సదుపాయాలున్నాయి.

"సత్యా" అని ముద్దుగా పిలువబడే, సత్రాజిత్తు మగపిల్లవాడివంటి ఏకైక కుమార్తె. ప్రస్తుతం పెరటి గుమ్మం ద్వారా తండ్రి సత్రాజిత్తు భవంతిలోకి అడుగుపెడుతుంది. తెల్లని కలువలాగ వుండే ఆమె ముఖబింబం కంది, ఎర్ర కలువలా మారిపోయింది. అయినా కళ్ళలో కాంతి, వయ్యారాల నడకతో, ఎంతో విలాసంగా వస్తుందామె.

కూనిరాగాలతో, ఆనందడోలికలల తేలియాడుతూ వస్తుందా బంగారు పిల్ల "సువర్ణ" సత్యభామ. సముద్రం పైనుండి వచ్చే అలల సయ్యాటలు, తన మనోవీథిలో పొంగిపొరలే ఆనందకెరటాలు ఆమెను వుక్కిరిబిక్కిరి చేస్తూంటే, ఎంతో మధురంగా ముగ్ధ మనోహరంగా వుందా పిల్ల నడకలు, హొయలు - సొగసులు.

అంతఃపురంలో సవతి తల్లితోపాటు, స్త్రీలెవరు లేరు. అందరు భోజన శాలలలో అతిథి అభ్యాగతులకు, బ్రాహ్మణులతోపాటు, యజమాని సత్రాజిత్తుకు భోజన వడ్డన కార్యక్రమంలో వున్నారు. సత్య మంచినీళ్ళకోసం లోపలికి వెళ్ళి బంగారు పాత్రలో జలగృహం నుండి జలం సేకరించింది. తనతో తీసుకువెళ్ళింది.

ఆ భోజనాల సమయంలో వెళ్ళి సవతి తల్లి, ఆయాలతో కలిసినందువల్ల లాభం లేదు. దాంతో వరండాలో వున్న బంగారు గొళ్ళెం, గొలుసులతో వ్రేలాడ దీసిన తూగుటుయ్యాలపై కూర్చుని విశ్రాంతి తీసుకోసాగింది.

"ఊరి" ముద్దుగా పిలిచే పిల్లి పిల్ల, దాని అసలుపేరు "ఊర్వశి" ఈ సత్యభామను చూసి, ఆమెవలె వయ్యారంగా పరుగెత్తుకుంటూ వచ్చింది.

సత్య దానిని తన చేతిలోకి తీసుకుంది. అది గోముగా ఆమెను చూస్తుంది. "ఏయ్! ఎవరు వచ్చారో నీకు తెలుసా ?" ఆప్యాయంగా అడిగింది. సమాధానం చెప్పడం చాతకాని ఆ పిల్ల "ఊరి" తన భాషలో "మ్యావ్"మంది. దాని మొహాన్ని తన చేతితో గోముగా రుద్ది "ఇవ్వాళ" ఆయనను చూసానంది - అర్థోక్తిగా.

అదే మనమైతే ఎవరంటాము. కాని ఆ పిల్లి ఊరి, కళ్ళు తమాషాగా చిట్లించి, చిలిపిగా సత్యను చూసింది. ఆ చూపులలోని భావం, ఆ భగవంతునికే తెలియాలి. మళ్ళీ ఇంకొకసారి "మ్యావ్" అంది. సత్య చెప్పిన దానికి సమాధాన భావమో లేక "అమ్మో! ఆకలిగా వుంది. రా, భోజనం చేద్దామనే పిలుపో ? చూచేవారలకన్న, పెంచిపోషిస్తూన్న సత్యకు, ఆ పిల్లి "ఊరి"కే తెలియాలి.

సత్య తన సంతోషాన్ని ఆపుకోలేక, తన తొడపై కదలకుండ వుండిపోయిన, ఊరిని మాటిమాటికి తడుతూ, ఆపుకోలేని ఆనందంతో - ఉదయం నుండి, ఇప్పటి వరకు, తన వూహలు, ఆలోచనలు - చిత్రాతిచిత్రంగా వర్ణించి చెబుతుంది. ఆ వచ్చిన బలరామకృష్ణులు, ఇతర యాదవ ప్రముఖులకు స్వాగతమివ్వ నిలబడిన యాదవ స్త్రీలతో కలిసిపోయి, తలపై కడవలతోనున్న వారితో తాను సమానంగా స్వాగతించింది. ఆ సంబరాలలో మున్గిపోయింది. ఆ తరువాత - మెల్లిగా -

ఇది నాన్నగారి ఆలోచనలలో తప్పుకావచ్చును. మనం సంపన్నులం. చాలా గొప్పవారము. అధికారం, హోదాలో మనను మించినవారు లేరనుకోవచ్చును. కానీ ఒసేయ్ "ఊరి" - ఓ పిల్లీ!" అతడు - అందగాడు. కాదు, కాదు... నయన మనోహరుడు. ఆ శిఖిపింఛమౌళి, ఆ పీతాంబరధారి, వనమాలి... అందంగా, సుందరంగా, అలాగ... అలా.... అలా.... నడిచివస్తూంటే...

మొద్దుమొహం పలుకరించవే; పులకరించనివారు, పలుకరించనివారు, మోహావేశములకు లొంగని వారుండరే!" అనేసి, గోముగా తలపై ఒకటేసింది.

"మొద్దు మొహం. నీకేం తెలుస్తూందే అందం ఆనందం, ఒక్కసారి నా కళ్ళతో చూడు. ఆ నయన మనోహరుని, మాటలు రాక, తడబడుతూ, సత్య పరవశించి పోతుంది. వూరంతా పండుగే. మనము మన బ్రతుకులే దండుగ. అందరికి కావల్సిన వాళ్ళు మనకవసరం లేదు. మనకు పనికి వచ్చేవాళ్ళు ప్రపంచాని కవసరం లేదు.

కర్మ, కర్మ... ఆ పిచ్చిపిల్ల "సత్య" తల బాదుకుంటూ, తండ్రి ప్రవర్తనకు తనలోని తనను గుర్రుగా చూసుకుంటుంది. మళ్ళీ ఆ... వెంటనే సత్య -

"కృష్ణుడు... అందగాడే కాడే... అవతార పురుషుడు ధర్మమూర్తి "ఆర్ష సనాతన వాది. అఖిల లోకాలరాధ్యుడు" అని పిల్లి వీపును గోముగా నిమురుతూ నెత్తిపై ఒక్కటేసి "ఓ పిచ్చిమొహమా! అటువంటి వారితో సంపర్కము, అదృష్టవంతులకే తప్ప మన బోటివారికి రాదే"నని పెదవి విరిచి,...

"అఖిల లోకారాధ్యుడిగా, దేవదేవునిగా అందరు పొగడుతూంటే, మాట్లాడటమే చాతకాని మనం, ముఖం ముడుచుకుని, అవతలివారి గొప్పతనాన్ని, గుర్తించడానికి, గౌరవించడానికి, వెయ్యేల.... అసూయద్వేషాలలో మున్గిపోయి, కర్మ... వెనకడుగు వేస్తున్నాము. మన చాతకానితనాన్ని, వెనుకబాటుతనాన్ని అందరిలోకి, గొప్పగా - స్పష్టంగా ప్రకటించుకుంటున్నాము. "అవ్వా!" ఎంత అవమానమో ఆలోచించావా!"

పాపం అర్థంకాని ఆ పిల్లి, "వూ" అనే బదులు మధ్యమధ్యలో మ్యావుమంటూ, సత్య చేతి చిట్టి చిట్టి దెబ్బలు తింటు, వీపుమీద ప్రేమతో, గోముగా రాయించుకుంటూ, ఎప్పుడు యజమానురాలు లేస్తుందా, భోజనశాలలో పడదామా ? అని, అసహనంగా, అటు ఇటు కదులుతుంది.

దాని పరిస్థితిని గమనించిన సత్య "లే! తిండిపోతు!" అని దానిని తిట్టి తాను లేచింది.

సత్యభామ కృష్ణలీలలెన్నింటినో వింది. చిన్నప్పుడు చేసిన అల్లరి, జరాసంధాది మహామహుల నాడించిన విధం, అంతకుమించి, శ్రీకృష్ణుని కోసం ద్వారకనే నాశనం చేయబోయిన, జరాసంధుని బలదర్పాలనణచే విధంగా, రూపొందించిన ఈ ద్వారక అన్నీ మహాద్భుతలీలలే. ఆ వయస్సులో తనకంటే పెద్దవారిని ముప్పతిప్పలు పెట్టిన వైనం ఆమెకు అనుక్షణమానందదాయకం.

రాజ్యము లేకపోయినా చక్రవర్తులను శాసించే శ్రీకృష్ణచరిత్రలీలామధురం, ఆ భగవత్తత్వము, శ్రీకృష్ణ భాగవతము సర్వదా ప్రశంసనీయమన్నది, సత్యభామ హృదయాంతర్గత సత్యం. సరే ఎప్పటికో ఎందుకనుకుంటే... ఇప్పుడు, చేకితానునికి

రాజ్య ప్రదానం, ద్రౌపదీ స్వయంపేరిట లేరనుకున్న పాండవుల ప్రత్యక్షపరచడం హస్తినాపురంలో అఖండ సన్మానం.... అక్కడనుండి "అమ్మో! అనకూడదు కాని "కృష్ణం వన్దే జగద్గురుం'' అని ఆధ్యాత్మికవాదులు, భక్తి భావ ప్రియులనేది నిజం. సత్యం. అంతటి భాగవతమూర్తి ఈ - శ్రీకృష్ణమూర్తి.

వీటన్నిటితో కృష్ణుడు నిజంగా దేవుడేనన్నది ద్వారకావాసుల నిశ్చితాభిప్రాయం. ఇందులో సందేహమే లేదు. కొందరు మెచ్చుకోవడం, కొందరు తిరస్కరించడం, ధిక్కరించడం, ఏవిటో ఈ మనుషులు సత్యభామ నొచ్చుకుంది. సత్యాన్ని గ్రహించలేని మూర్ఖులుగా తలచింది. అందులో ఆమె తండ్రి కూడా వున్నాడు. ఇంత పెద్దవాడైనా, బుద్ధి-జ్ఞానం లేకుండా, అహంకరించి, హుంకరించే తండ్రి అంటే ఆమెకు రాను రాను కోపం పెరుగసాగింది.

తనపై గల అసూయాద్వేషాలతో తనను శత్రువుగా భావిస్తూన్నారంటాడు సత్రాజిత్తు. కానీ అది తప్పు. ధనం సంపదల అహంకారంతో, కన్నుమిన్ను గానక ప్రవర్తించే సత్రాజిత్తే, అందర్నీ చులకనచేస్తూ తన అహంకారాన్ని ప్రదర్శించుకుంటున్నాడు తప్ప, అందరు అందరితో వున్నట్లే తమతో ప్రవర్తిస్తున్నారు. ఇది సత్యకు తెలుసు. కానీ సత్రాజిత్తు అర్థం చేసుకోలేకపోతున్నాడు.

కృష్ణుని బంధువైన "సాత్యకుని'' కుమారుడు యుయూధనునితో సంబంధం కలుపుకోవాలని కబురు పంపితే, ఆ సాత్యకుడు నిర్ద్వందంగా, ఈతని బంధాన్ని - సంబంధాన్ని కాదని, సత్రాజిత్తు అహంపై దెబ్బ కొట్టాడు. అది మరింత కోపకారణమై ప్రతిదానికి గుర్రుమనడం ప్రారంభించాడు. సత్రాజిత్తు ప్రవర్తన, వేళ్ళమీద లెక్కపెట్టగల ఏ కొద్దిమందికో తప్పక మిగిలిన వారందరికి సుతరాము గిట్టదు. అందుకే అందరు దూరంగా వుంటున్నారు. అది తన ప్రవర్తన వల్లనేనని సత్రాజిత్తు అర్థం చేసుకోలేకపోతున్నాడు.

సాత్యకుడు, సత్రాజిత్తుతో సంబంధం కాదనడం సత్యకు ఎంతో ఆనంద దాయకమయింది. ఎందుకంటే వూహ తెలిసినప్పటి నుండి సత్య, కృష్ణునిపై మరులుకొంది. తన మనసునెప్పుడో, కృష్ణుని మనస్సుతో అనుసంధానం చేసింది. ఇప్పుడు "వూ'' అని చెంతకు తీసుకోవలసింది కృష్ణుడు మాత్రమే. ఆ శుభముహూర్తానికై సత్యభామ ఎదురుచూస్తుంది. కానీ, ఆ విషయాన్ని తండ్రికి

చెప్పడమెలాగ ? ఇదే ఆమె ముందు వున్న సమస్య. కారణం.... లోకానికి గొప్పవాడయిన కృష్ణుడు. తన తండ్రి దృష్టిలో మాననీయుడు కాడు. పైగా ఇప్పుడు వివాహితుడు. ఒకనాటి విదర్భ రాజకుమారి కోరి, ప్రేమించి, మరీ ఈ పెద్దమనిషిని పెండ్లి చేసుకుంది. ఇటువంటివానికి పిల్లనివ్వడమన్నా, బాంధవ్యం కలుపు కోవడమన్నా.... జరిగేపనా ?... చూద్దాం.. ఇది సత్యభామ... అంతరంగ ఆలోచన!!

నిజానికి, ఆలోచిస్తే.... సత్రాజిత్తు చాల సంపన్నుడు. మహారాజంత గొప్పవాడూ - పైగా సూర్యవరప్రసాది. ప్రభాస తీర్థానికి అధినాయకుడైన సూర్యుడు, సత్రాజిత్తు భక్తిశ్రద్ధలకు సంతసించి "శ్యమంతకమణి"ని ఇచ్చాడు. అది ప్రతిరోజు ఎనిమిది బారువుల బంగారాన్నిస్తుంది. అంతేకాదు, దానిశక్తికి లోనయిన ఏ వస్తువైనా చూస్తుండగా బంగారంగా మారిపోతుంది. ఇది ఎనలేని సిరిసంపదలకు, సత్రాజిత్తు గర్వాహంకారాలకు నిలయమయింది.

దీనికోసం కొందరు సత్రాజిత్తు చుట్టూ చేరి ఆయనను భజన చేస్తూ, భట్రాజులవలె తమ పొగడ్తలతో మురిపిస్తారు. దీనికి - నా పిచ్చితండ్రి కరగి పోతాడని, సత్యభామ అనుక్షణం బాధపడుతుంది. సత్యదర్శనం చెయ్యలేని తండ్రిని చూసి జాలిపడుతుంది. ధర్మమార్గమెరుగని తండ్రిగూర్చి చింతిల్లుతుంది.

ఎంతయినా సత్రాజిత్తుకు సత్యభామంటే ప్రాణం. ఆ ముద్దుల కూతురి కోసం ఏమైనా చేస్తాడు. అంతటి మమతానురాగప్రియుడు. అయితే ఈ పిల్ల కూడా తండ్రికోసం ఏమైనా చేస్తుంది. కానీ జీవితం విషయంలో మాత్రం రాజీ పడదు. ఆ - శ్రీకృష్ణదర్శనం చెయ్యాలన్నదామె అంతర్గతాభిలాష. ద్వారకలో కృష్ణుడు వుంటే, ఏదోరకంగా ఆమె, ఆ వాసుదేవ సందర్శనం చెయ్యవలసిందే!

అందుకుగల ప్రబల కారణం.

సత్యభామ తన ఆరేళ్ళ వయస్సులో, కృష్ణుడు తన మేనమామతో పోరాడటం చూసింది. ఆ పటిమకు, శక్తియుక్తులకు, కంసమర్దనానికి పొంగి, ఆ క్షణం నుండి గోవిందాభిమానియై కూర్చుంది. అందరు అనే ఆ వెన్నదొంగ, కన్నెల దొంగని చూడని బ్రతుకు బ్రతుకే కాదన్నది. ఆమె నిశ్చితాభిప్రాయమయింది.

ప్రత్యక్షంగా చూసి, చూచేది లేక వూహాలలో తలపిస్తే తలచో, ఆ దేవకీసుతుడు, కలలోకి కూడా రావడం, ఈ పెళ్లి కూతుర్ని అలరించడం జరుగుతుంటే, ఆ

సంఘటనలను తలుచుకుని ఈ పిల్ల సిగ్గుమొగ్గల్ని పూయించుకుంటూ, మురిసి పోవడమొక తంతయి కూర్చుంది. తాను తప్పక కృష్ణుని వివాహమాడతాననుకునే ఆ కలల రాణి కలలు, కొందరు యాదవ ప్రముఖులు - కృష్ణ ద్వేషుల మూలాన కల్లలయి కూర్చున్నాయి.

ఇప్పుడేం చెయ్యాలి ? ఎలాగ తన పంతం నెరవేర్చుకోవాలి ? ఇది సత్యభామ సత్యసంకల్పం. నిత్య నీరాజనా విధిపూర్వక అర్చనా విన్నపం. దాంతో అన్నగారు భంగారునికి విషయం చెప్పి తనకు సహకరించమని ప్రార్థించింది. పరిస్థితులన్నీ తెలుసుండి, ఈ విధమైన మూర్ఖ మంకుపట్టు నిరాశకే తప్ప, ఆశకు దారి చూపదు. ఆశయాన్ని ఫలింపచెయ్యదు కనుక, నీ ఆశను చంపుకోమంటాడతడు.

అప్పుడా పిల్ల సత్య, "చావనైనా చస్తాను కానీ, కృష్ణుని విడిచి అన్యుల చేపట్టను. నా ఆరాధ్య దైవం ఆ వాసుదేవుడే నా గతి, ఆ గోవిందుడేనా పతి, ఇది నా ప్రతిజ్ఞ" అన్నట్లు మొండిపట్టు పట్టుకుని కూర్చుంది.

తెలిసి కొంత, తెలియక కొంత, కృష్ణునికి, ఆతని జైత్రయాత్రలకు ఎన్నో విధాల సహకరించింది. సమయం వచ్చినప్పుడు తన సాహసాన్ని, సంకల్పాన్ని, ఆ గిరిధారి చెంత నుంచి , తనను వుద్ధరించమని అర్థించనుంది. ఈ సమయం లోనే భగవంతుడు, ఆమెను కరుణించినట్లు, తన తండ్రి, తన పినతండ్రి ప్రసేనజిత్తు ద్వారా, జయసేనుడి వంటి పోరంబోకులను చేర్చి, సాత్యకి, శ్రీకృష్ణునితో కలిసి, ఆయన కార్యకలాపాలలో పాల్గొనకుండా చూడమని, నియోగించాడు. అందుకు "వారి విలాసాల"కు తగ్గట్లు, ఈ పెద్దమనిషి, తనకెంత వుందో తెలియని డబ్బును దుబారా చేయించడం ప్రారంభించాడు.

అప్పుడా సత్యం తెలిసిన సత్యభామ తెలివిగా, తండ్రి కుయ్యుక్తులను భగ్నంచేసి, కృష్ణుని ప్రేమకు పాత్రురాలయింది. ఇప్పుడాయన కరుణనామె అభ్యర్థిస్తుంది.

ఏదో రకంగా కృష్ణుని భార్య - రుక్మిణి సానుభూతి, ప్రేమను పొందడానికి ప్రయత్నించింది. అందరు "పాపం పిచ్చిపిల్ల, చిన్నపిల్ల" అని ప్రక్కన పెట్టేసారు. పోనీ, దేవకీమాత పంచను చేరి ఆ తల్లి అభిమానం పొందాలని తలిస్తే, ఈ సాహసవంతురాలి సాహసంకన్న, సౌకుమార్యానికి ప్రాధాన్యమిస్తూ - ఆ తల్లీ, ఈ పిల్లను ప్రక్కన బెట్టింది.

ఇంకెలాగ, తన ఆశయాన్ని సాధించుకోవడం ? ఇది ప్రస్తుతం సత్యభామ ముందున్న ప్రశ్నకాదు. సమస్య. దీనినెలాగ పరిష్కరించుకోవాలి ? నిరంతరా లోచన. పట్టుదల, పెంకితనానికి, మొండి-జగమొండి అయిన సత్యభామ, తన పంతం నెగ్గించుకునే మార్గానికై అన్వేషిస్తూంది. అందులో భాగంగా మొత్తానికి, కృష్ణుని చెల్లెలుతో, ఆమెతో పరిచయం పొందింది. అనుబంధం పెంచుకుంటుంది.

ఆమె ద్వారానే శ్రీకృష్ణుని రాకను తెలుసుకుని, సుభద్రతో కలిసి, ఆ యాదవేంద్రుని స్వాగతించడానికి వెళ్ళింది. ఇదంతా రహస్యం. అలాగే జరిగిపోయింది. ఆ తర్వాత అక్రూరుని ద్వారా, యాదవులు, తమ సంపద నుండి అయిదవ వంతు బంగారం, గుర్రాలు, రథాలు, ఇతర సంపదలిస్తానని వాగ్దానం చేసారని, ఇందుకు మీరు సహకరించాలని సత్రాజిత్తును కోరితే -

ఏమిటీ, అయిదవ వంతు సంపదలనా ? పాండుపుత్రులకు ధార పొయ్యాలా? వారేమైనా సామ్రాజ్యవాదులా ? మనమేమైనా సామంతులమా ? ఆ పెత్తందారీలకు, ఆ గుత్తాధిపత్యులకు, మన సంపదలను పంచిపెట్టడం లేదా దోచిపెట్టడమెందుకని ? ప్రశ్నిస్తాడు. అసలు అక్రూరునికి బుద్ధిలేదు. పెద్దవాడే కానీ ఏం లాభం ? పెడబుద్ధుల మా తండ్రితో వ్యవహరించు తీరిదేనా ? ఆ మాత్రం ఆలోచించకుండా...

కృష్ణుడు, బలరాముడు నిండు సభలో చేసిన వాగ్దానాన్నిక్కడ గొప్పగా చెప్పేకన్నా, నాతో ఒక్క నిముషం, ఈ విషయం ఓపిగ్గా చెప్పి వుంటే బాగుండే దనుకుంది. పేరుకు పెద్దలే తప్ప బాధ్యతారహిత్యంగా ప్రవర్తించి, సమస్యను పెంచి పెద్ద చేసారు. తన సంపదలనన్నింటిని, ఆ కృష్ణుడు, బలరామ, అక్రూరాది స్వార్థపరులు, తమ లేనిపోని పెద్దరికంతో అసలైన పెద్దలను, ప్రముఖులను అగచాట్లు పాలు చెయ్యాలని, సభ్య సమాజంలో తలవంపులు తేవాలని చూస్తున్నారని కోపించాడు. ఈ సత్రాజిత్తు ప్రవర్తన సత్యకే మాత్రం నచ్చలేదు.

బలరామ కృష్ణుల విజయానికి చిహ్నంగా, గొప్ప విజయోత్సవం జరిగింది. అందులో మహారాజుతోకల్పి, యాదవ ప్రముఖులందరు పాల్గొన్నారు. ఒక్క తన తండ్రి, పినతండ్రి, ఆయన పరివారము, దురదృష్టవంతురాలైన తను మాత్రం పాల్గొనలేకపోయారు. అందుకు సత్య ఎంతో బాధపడింది.

నగరంలో ఓ మహోత్సవంలా, ఆ సంబరం సాగుతుంది. ఆడవాళ్ళకు కృష్ణుని చెల్లెలు సుభద్ర నాయకత్వం వహిస్తుంది. తనకాదృష్టం లేదు. తను దాని దగ్గరుంటే, అట్టహాసంగా, ఆ కార్యక్రమాన్ని నడిపేది. ఒక్కసారి మూలిగింది. ఆ తరువాత నీలిగింది. ఏం చేస్తాం. ఇంతే ప్రాప్తమనుకుంది.

ఆ సంబరం, వూరంతా తిరిగి, తిరిగి వసుదేవుని నివాసం ముందాగింది. తమ అభిమానాన్ని చాటుకున్నవాళ్ళు ఒక్కొక్కళ్ళే వెనుదిరుగుతున్నారు. సుభద్ర పరుగు పరుగున అన్న వద్దకు వెళ్ళింది. చెయ్యి పట్టుకుని, తన చేతిలోని పూర్ణకుంభాన్ని ప్రక్కనున్న వాళ్ళకిచ్చి, ఆ అన్న చేతిలో గువ్వలా ఇమిడి పోయింది. ఈ అదృష్టమెంత మందికి లభిస్తుంది ? దానిని సుభద్ర స్వంతం చేసుకుని, హక్కు భుక్తంగా ఆనందిస్తూంది.

కాని కొందరు పెద్దలు చిరాకుపడ్డారు. పదిహేనేళ్ల పిల్ల, అలాగ.... వాళ్ళకు నచ్చలేదు. కృష్ణుడు ఆమె తలపై ప్రేమగా దువ్వుతూ, చెవులు మెలిపెడ్తూ "ఏయ్! ఇంకా నువ్వు చిన్నపిల్లవేనా ? పెళ్ళయితేనే కానీ, పెద్ద పెద్ద లక్షణాలు రావా ?" అని అడిగాడు. కాని స్వరంలో మాధుర్యం. అంతులేని ప్రేమ. సమ్మోహనమైంది సుభద్రకు. అది అలభ్యం. నాకు దక్కింది. నేను అదృష్టవంతురాలిని. ఎన్నడైనా, ఎప్పుడైనా కృష్ణుడు నా అన్న. నేనాయన చేతులలో ఒదిగిపోయే చిన్న పిల్లను. దీనికిక ఆలోచనలనవసరమనుకుంది. తన అదృష్టానికి, తానే పొంగిపోయింది.

ఆ పిచ్చిపిల్ల అమాయకత్వానికి కృష్ణుడు లొంగిపోయాడు. ఆ పిల్లను ప్రేమతో ఆశీర్వదించాడు.

అప్పుడు అక్కడ, అనుకోకుండా సత్యభామ నిలిచింది. కృష్ణుని ప్రేమ తత్వానికి పొంగిపోయింది. శరణన్న వారిని కరుణించే కరుణామయుడు, ఆశ్రిత వత్సలుడు, ప్రేమమూర్తి, ఇహపరదాత, ఈ కృష్ణుని ప్రేమను పొందగల్గడం నిజంగా అదృష్టం.

ఈయన ప్రేమను పొందిన గోపికలు, సుభద్రాది సోదరీమణులు, భర్త ఛాతిపై తమ తలను పెట్టి, తరించే తరుణీమణి రుక్మిణి, ఎంతో, ఎంతో అదృష్టవంతురాలు. ఈ అదృష్టం నాకు రాసి వుందో లేదో... అని కృష్ణుని సుదీర్ఘంగా సత్యభామ నొకసారి చూసి నిట్టూర్చింది. అప్పుడు సాత్యకి - కృష్ణునితో -

ఈమెనెప్పుడైనా చూసావా ? ఈమెవరో తెలుసా ?'' అని గుచ్చి గుచ్చి, ఆమెను చూపి మరీ వాసుదేవుని అడుగుతాడు. అప్పుడు కృష్ణుని సూటిగా చూడలేని ఆమెను చూసిన కృష్ణుడు - "ఈమె సత్య. సత్రాజిత్తు కూతురు. నా అభిమాని''. ఈమె బంగారు పూర్ణకుంభంతో నన్ను స్వాగతించి చూడటానికి.... వచ్చింది అవునా ?'' అంటాడు. అప్పుడు "అన్నయ్యా! ఈమె నీకు తెలియదూ ? నా స్నేహితురాలు, యాదవ ప్రముఖుడు సత్రాజిత్తులవారి కుమార్తె సత్యభామ'' అనగా,

"అవునని'' సాత్యకి వైపు తిరిగి, ఈమె కదా నిన్ను ఎత్తుకుపోయిందన్న వాడు, "కాదు, కాదు - ఎత్తుకు పోయిన వారినుండి రక్షించి, నా వద్దకు పంపిం దంటాడు. ఆ మాటకు సత్య పొంగిపోతుంది. "కానీ మొండే... అంటాడు కృష్ణుడు... ఆ వెంటనే! సత్య మూతి ముడుచుకుంటుంది. ఓరగా, కోరగా చూస్తుంది. కానీ దానినేమీ గమనించకుండా - కృష్ణుడు -

"చెల్లీ! ఇక మీరు వెళ్ళండి. నేను అమ్మా, నాన్నలను సందర్శించడానికి వెళ్ళా''లంటాడు. బయలుదేరుతాడు. అయితే ఇక్కడ సత్య మాత్రం తాను కృష్ణుని దృష్టిలో పడినందుకు తనను, ప్రత్యేకంగా వాసుదేవుడు గుర్తుంచు కున్నందులకు, మురిసిపోతుంది.

ఇదంతా సత్య వూయలలో వూగుతూ గతాన్ని స్ఫురణకు తెచ్చుకుం టూంటే, ఆ పెదవులపై ఆనందం అలాగ నిలువనివ్వకుండా "అమ్మా! నాన్నగారు మిమ్ము పిలుచుకు రమ్మన్నారు. మీ కోసం ఎదురు చూస్తున్నారని'' చెప్పింది.

విజయోత్సవానికి వెళ్ళింది వెళ్ళినట్లు ఇక్కడ చతికిలబడింది. బట్టలు మార్చుకోలేదు. ఉత్సవం కోసం పెట్టుకున్న ఇతర నగలు తియ్యలేదు, ఆలస్యం చేస్తే నాన్నగారికి కోపం. అందుకు హడావుడిగా, అలాగే పరుగెత్తిందామె.

సత్య - తన తండ్రి కోపంగా వున్నారా ? శాంతంగా వున్నారా ? అని తెలుసుకుని, ఆమెకా విధంగా ప్రవర్తించడం మొదట్నుంచి అలవాటు. అలాగే తను పెంచుకున్న పిల్లి "ఊర్వశి''లాగ, మెల్లిగా అడుగులు వేసుకుంటూ, బంగారు ముద్దగా వున్న ఓ సింహాసనంపై, తన సార్వభౌమత్వాన్ని చాటుకుంటూ, ఒక మహారాజులాగ కూర్చున్న తండ్రిని సమీపించింది.

అంతవరకు కుమారుడు భంగారకునితో మాట్లాడుతున్న సత్రాజిత్తు చేతి సంజ్ఞతో అతన్ని పంపించేసాడు. తండ్రిని చూస్తూనే వంగి నమస్కారం చేసి, ఏమీ ఎరుగని దానిలాగ నిలబడింది. ఆమెనొకసారి చూసి "ఏమిటీ వినయ విధేయతలు ? ఎక్కడ నేర్చుకున్నావు ? ఇప్పట్నుంచే మొదలుపెట్టావా ?" అని.... కాస్త గంభీరంగా అన్నాడు, రెండు చేతులు చాచి, దగ్గరకు రమ్మని పిలిచాడు.

మెల్లిగా వెళ్ళి ప్రక్కన నిల్చుంది.

"కూర్చో..." అన్నాడు.

"ఇంకేం, ఎందుకు కూర్చోను!" అంటు ప్రక్కన చతికిలబడింది.

"ఎక్కడికి వెళ్ళావు ?" తుది, మొదలు లేకుండా అడగడం ప్రారంభించాడు.

"....." ఏం చెబుతుంది. మాట్లాడలేదు.

"నిజం చెప్పు" గట్టిగా అరిచాడు.

"సుభద్ర రమ్మంటే వెళ్ళాను."

"ఎక్కడికి రమ్మంది ?" కొంత కోపం.

"అదే అందరు విజయోత్సవానికి వెడుతున్నారు. మనము వెడదామంటే, కాదనలేక, మర్యాద కోసం వెళ్లాను. ఒక వయసు వాళ్ళం. ఒక వూరివాళ్ళం. కాదంటే.... బాగుండదని...

"ఆ ఉత్సవానికి వెళ్ళానంటావు ?"

"వూ... వూ... తలెత్తి చూడకుండా తలవూపింది.

"ఆ దరిద్రుడు సాత్యకి, ఎలాగున్నాడో, చూడాలనేకదా!" ఆ మాటతో "హమ్మయ్య" అనుకుంది. కాని బయటికి "అదేం కాదు. సుభద్ర...!"

"చాల్లే వూరుకో! నీకసలు పిచ్చేమైనా పట్టిందా ? కోపంగా సత్రాజిత్తు అడుగుతున్నాడు.

"ఎందుకు -..?!" అమాయకంగా అడుగుతుంది.

"నీకు తెలియదా ? నువ్వసలు ఆడపిల్లవేనా . నీకసలు సిగ్గుందా ?" అన్నాడు క్షణమాగి "రెండేళ్ళనాడు వాడిని దొంగిలించావు. వాడితోపాటు నా

రథాశ్వాలు, వాటి సరంజామా, వాడి కప్పచెప్పావు ? వాడిమీద ఎందుకంత మోజు ? కసురుకుంటున్నాడు.

అంతవరకు ప్రశాంతంగా తండ్రి మాటల్ని విన్న సత్య...

"ఏమిటీ... వాడిపై మోజా... ?! కాదు. కానే కాదు. నీ మర్యాద దక్కించడానికి, పరువు ప్రతిష్టలు పోకుండా వుండటానికి, అసలే నీపై కారాలు మిరియాలు నూరే - ఆ పెద్దన్న బలరాముని బారి నుండి నిన్ను రక్షించడానికి సాహసించానే తప్ప...

నాకా పనికిరానివాడిపై ప్రేమా లేదు. దోమా లేదు. నిజానికా సమయంలో నీ దుశ్చర్యకు సమానంగా, ఈ మొత్తం పెద్దన్న బలరాముని కంటపడితే, ఏమయ్యేదో వూహించుకో! వూహించుకుని నేను మేలు చేసానో... కీడే చేసానో... నిర్ణయించుకో ?" ఇంక బుంగమూతి పెట్టి, మాటల ఆటలు ప్రారంభించింది.

ఇంకేముంది ? అంతటి అజానుబాహుడు, అధిపుడు, అధికుడు, ఎవరికీ తలవంచని శూరాగ్రణి, కుమార్తె సత్య ముందు, ఊర్వసి" అనే ఆమె పెంచుకునే పిల్లి కన్న "పిల్లి" అయిపోయాడు. పిల్ల దృష్టిలో చిన్న పిల్ల వాడయిపోయాడు. ఆ వెంటనే "అవును నేను తప్పు చేసాను. నువ్వు మాత్రం జాగ్రత్త, అనగానే" అవును. అన్నావు కదా! ఇక నీ పెండ్లి విషయంలో నిర్ణయం నీదే. నేను వేలు పెట్టనన్నావు, గుర్తుందా ?" అడుగుతుంది.

"అవును గుర్తుంది."

"కదూ. అటువంటప్పుడు, వాడిపై నాకు ప్రేమా ? లేకదృష్టా.... ఏముంటుందీ. ఏదో కృష్ణ సోదరి సుభద్ర రమ్మంది. అందరితోపాటు, ఆ దేవుడు, ధర్మమూర్తి" అనే కృష్ణుని కూడా చూడవచ్చునని బయలుదేరాను. ఊరందరిది ఒకదారి, ఉలిపికట్టెదొకదారి" అని ప్రజలలో వుంటూ, మన గిరి మనమే గీసుకుంటూ, బ్రతకలేము కదా! చెప్పు...!" ఇంతకుముందు, మొదట్లో పిల్లిలాగ వచ్చిన పిల్ల ఇప్పుడు తండ్రిని పిల్లి చేసి మరీ ఆడిస్తుంది.

ఈ సమయంలోనే పెంపుడుపిల్లి ఊర్వశి వచ్చి సత్య కాళ్ళ మధ్య పడుతూ వుంటే, దానిని చేతిలోకి తీసుకుని "చూడు నాన్నగారు. సమయం దొరికితే నన్ను

తిట్టాలని, బాధపెట్టాలని తలుస్తున్నా''రనిఅరువు రాగం మొదలుపెట్టింది. దాంతో అది క్రిందకు దూకి, ఆమె చుట్టు తిరుగుతూ, ప్రదక్షిణాలు చేస్తూ - సత్యభామను వూరుకోబెట్టాలని ప్రయత్నిస్తూంది. అది చూసిన సత్రాజిత్తు "పిల్లికన్న తను హీనమా'' అన్నట్లు కరగిపోయాడు.

కానీ, పిల్లిని పెంచడం, యజమానిని ద్వేషించే దానిని అభిమానించడం మాత్రం, మొదట్నుంచి సత్రాజిత్తు కిష్టం లేదు. పిల్లి యజమానికి సుఖం కన్న, కీడే కోరుకుంటుందన్నది పెద్దల సూక్తి. అందుకే, అతను "దాన్ని పెంచవద్దన్నా''నా అన్నాడు.

"మీరెవరు నన్ను అభిమానించరు. నా మాట వినరు. నా ఇష్టాఇష్టాలతో పనిలేదు. ఇది కూడా నా దగ్గర వుండటం, నేను పెంచడం మీ కిష్టం లేదు. ఇక మిగిలింది చావడమే నాకు మిగిలింది!'' ఏడుపు నిజం చేసింది. కోపం పెంచేసింది.

"పోనీ మీరు చెప్పారు కదా అని ఎక్కడ విడిచిపెట్టినా, అర్థరాత్రో.... తెల్లవారేసరికో, మళ్ళీ ఏదో రకంగా నావద్దకు వస్తూంది. అది నన్ను విడువలేదు. నేనూ దానిని విడువలేను'' అంది.

"అలాగా, అయితే అక్కడా, ఇక్కడా దేనికీ తీసుకువెళ్ళి ఆ సముద్రంలో పడెయ్యమన్నాడు.

సరేనని. ముందా పిల్లిని తీసుకువెళ్ళి బయటపడేసింది. ఈలోగా తండ్రి కోపం, తన కన్నీరుకు ముక్తి వస్తూందని తలంచింది. అలాగే సత్రాజిత్తు శాంతమొంది -

"సత్యా! కొన్ని విషయాలు నీకర్థం కావు. కొన్ని మామూలు విషయాలు. కొన్ని రాజకీయాలవంటివి. నీవు ఏమీ అనుకోవద్దు. ఆ తర్వాత బాధపడవద్దు. అనవసరంగా - సాత్యకి విషయంలో మా రాజకీయాలలో వేలు పెట్టవద్దు. ఆ తర్వాత నీ ఇష్టం!'' అని ముగించాడు.

"చెప్పాను కదా! నేను సాత్యకి కోసం వెళ్ళలేదు. సుభద్ర రమ్మనమందని వెళ్ళాను. తీరా అక్కడికి వెళ్ళాక దేశమంతా మెచ్చుకునే ఆ గోవిందుని సంబరంలో పాల్గొందామంది. "నలుగురితో నారాయణ, కులంతో గోవిందా!'' అంటారు కదా! ఆ రకంగా ప్రవర్తించానే తప్ప, నాకు మరో వుద్దేశం లేదు'' ఖచ్చితంగా చెప్పింది.

నవ్వలేదు. మెచ్చుకోలేదు. కానీ.... మరో విషయమన్నాడు.

"ఈ యాదవ ప్రముఖులకు, ఎవరికివారు, వాళ్ళు తప్ప, మిగిలినవారు వారికి బానిసలుగానో, వారిపై ఆధారపడిన వారిగానో తలుస్తున్నారు. ఆ అహంకారులకు తగు సమాధానం చెప్పాలి. వాళ్ళ గర్వమెలాగ నణచాలో నాకు బాగా తెలుసు. కనుక నువ్వీ విషయంలో కూడా వేలుపెట్టకుండా వుండటం చాలా మంచిదన్నాడు.

తండ్రి సత్రాజిత్తు అభిప్రాయంతో ఏకీభవిస్తు "నాన్నా! రాజకీయాలు వేరు. పరిచయాలు, ఉభయకుశులోపరి వేరు. ఒకదానికొకటి సంబంధం లేని విషయాలలో వేలుపెట్టడం నాకు నచ్చదు. నాది సామాన్య జీవితం. అసలే సత్రాజిత్తు కూతురు "సత్య" భామ అహంకారి" అని నాకో బిరుదు వుంది. దానిని పోగొట్టుకోవాలన్నది నా తాపత్రయం.

నల్గురిలో నేనూ ఒకటిగా వుండాలి తప్ప. నేనొక్కదానినే అనుకుంటే, ఈ ప్రపంచంలో బ్రతకడం చాలా కష్టం. మనమిద్దరము ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటూ కూర్చోవాలి. అప్పుడు మనమీ ప్రపంచానికి పీడాకారమవుతాము. అలాగ కాకూడదన్నది. "నా భావన" అంది.

అవునన్నట్లు తలవూపాడు. అది, అదనుగా.. సత్యభామ - ఇటువంటి సందర్భంలో వాసుదేవుడేమన్నాడో... తెలుసా ?" తండ్రి మనోభిప్రాయాన్ని తెలుసుకోవాలన్నట్లు అడిగింది.

ఎవరా వాసుదేవుడు ? బలరాముడా, కృష్ణుడా ? సాలోచనగా అడిగాడు.

"ఇంకెవరు కృష్ణుడు" ఠక్కున అనేసింది. కానీ. కృష్ణుడు... అనే ముందు, ఆ మాట ఆమె ఉచ్ఛరించడానికి పడ్డ తంటా, నిజంగా ఆ వాసుదేవునికే తెలియాలి. పెనిమిటిగా తలుస్తూ పేరుపెట్టి పిలువడం, లేదా ఇతరులకు చెప్పడం ఆర్ష సాంప్రదాయ సంస్కృతి కాదు. అందుకే తటపటాయించింది. అయినా, అనుమానం రాకుండా, విషయం చెప్పింది.

కృష్ణుడు పేరెత్తడం ఇష్టంలేని సత్రజిత్తు "అతడు పెద్ద మోసగా"డన్నాడు. పైగా తననో దేవునిగా, ధర్మావతారునిగా ప్రకటించుకుంటున్నాడనేసరికి -

"నాన్నా! "అవును, కాదు" అని, మనకు అవసరం లేదు. అతడు నీపై గౌరవముంచి, మైత్రీభావంతో నిన్ను కలుస్తానన్నాడు. అవునా ?" అంది.

“అతను మిత్రుడైనా, శత్రువైనా నాకనవసరం. అతనితో నాకు పని లేదంటాడు. అయినా ఇది నీకెలాగ తెలుసు ?'' సత్రాజిత్తు ప్రశ్న.

ఆయన సుభద్రను ''ఎవరీమె ?'' అని అడిగితే, ఆమె, యాదవ ప్రముఖుడైన శ్రీ సత్రాజిత్తులవారి కుమార్తె. “సత్యభామ'' ఈమెని చెప్పింది. దాంతో చాలారోజులయింది. నాన్నగార్ని చూసి, ఒకసారి వీలు చూసుకుని, వస్తానని చెప్పారు'' అంది.

ఆ మాటవింటూ సత్రాజిత్తు “అబ్బో! ఆతని మాటలు వెన్న. మనసు మాత్రం విష''మంటాడు. యాదవులనందర్నీ తన నాయకత్వంలోకి తెచ్చుకుని ఎందుకు పనికిరానివారిగా చేసాడు. తను తప్ప మిగిలిన వారలందరు అసమర్థులు, అప్రయోజకులన్నది ఆతని భావం. చెప్తాను. చెప్తాను. రానీ, ఆతనితో ఎలాగ ప్రవర్తించాలో నాకు బాగా తెలుసంటాడు.

“నాన్నా! మీరు కోప్పడను.... అంటే నాదొక మాట. అతను కంసుడిని కనుక చంపకపోతే మనం మధుర మొహం చూడగలిగేవాళ్ళమా ? అందరితో కలిసి ఇక్కడకు వచ్చేవాళ్ళమా ? ఇంత ప్రశాంతంగా వుండేవాళ్ళమా ? కోప్పడ వద్దన్నాను కాబట్టి శాంతించి, కొద్దిగా ఆలోచించండి!'' అంది.

గోమంతకానికి వెళ్ళినవాళ్ళు తిరిగి రాకపోతే, జరాసంధుని ప్రతిఘటించక పోతే, ఆ జరాసంధుడు మనలను బ్రతుకనిచ్చేవాడా ? చెప్పండి.'' అనగా, “అంటే... అందరితోపాటు నన్ను ధిక్కరిస్తూ వాళ్ళను బలపరుస్తావా ?''

“ఇక్కడ బలపరచడం, అవతలివాళ్ళ నెత్తికెక్కించుకోవడం కాదు నాన్నా, అసలు విషయం. మంచిచెడుల సమీక్ష. అంతేకాని వాళ్ళెవళ్ళైతే మనకెందుకు ? పలకరించారు. పలుకుదాం. కావాలంటారు దగ్గరౌదాం. వద్దంటారు మన పని మనది, మన బ్రతుకు మనది. దీనికోసం కోపతాపాలు, పగద్వేషాలు అవసరమనే తప్ప.... నాకు మరో ఆలోచన లేదు. గతంలో మీరే ఎన్నోసార్లు, ఆ కంసుడు చచ్చాడు కాబట్టి, మధురకు రాగలిగాం. మన ఆస్తులను పొందగలిగా మన్నారు. మీరన్నదే నేను చెబుతున్నాను తప్ప, గతం నాకెట్లా తెలుసు ? దీంతో సత్రాజిత్తు పని నోటికి తాళం వేసినట్లయింది.

కొద్దిక్షణాలు వూరుకున్న సత్రాజిత్తు "చూడమ్మా! కొన్ని వినడానికి బాగుంటాయి. కొన్ని చూడటానికి బాగుంటాయి. కొన్ని చెయ్యడానికి బాగుంటాయి. ఏది ఏమైనా ముందు ముందు కొన్ని మంచిరోజులున్నాయి. అవి నీకు చెబుతాను. అల్లాగే, నిన్న నిన్ను కాదన్న ఆ సాత్యకుడు, రేపు తానంతట తాను వచ్చి "మీ అమ్మాయినివ్వండి. మా కోడలిగా చేసుకుంటానని బ్రతిమాలుతాడు. అప్పుడు కదమ్మా! మీ నాన్న గొప్పతనం, లోకానికి, నీకు తెలిసేదంటాడు.

ఆ అమాయకత్వానికి, నిజాన్ని ఒప్పుకోలేని దుర్బలత్వానికి సత్యభామ తండ్రిని చూసి నవ్వుకుంటుంది.

# భామనే - సత్యభామనే

**తం**డ్రి పిచ్చితనానికి నవ్వుకున్న సత్యభామ, ఇక సాత్యకిని హెచ్చరించి, కృష్ణునిపై గల ప్రేమను ఆతని ద్వారా వాసుదేవునికెరుక పరచి తన జీవితాన్ని సుస్థిరమొనర్చుకోవాలని నిశ్చయించుకుంది.

ఆనాటి సాయంకాలం యథాప్రకారం తన తండ్రి నిర్మించిన సూర్య దేవాలయానికి, తన మిత్రురాలు సుభద్రను కలుసుకోవడానికి వెళ్ళింది. అక్కడ మధ్యలో "నువ్వు నాకొక వుపకారం చెయ్యాలని," సత్య, సుభద్రను కోరింది.

"ఏవిటో... ?!" చురుకుగా చూసింది. ఒకే వయసు గల పిల్లలు కదా, సరదాగా సత్యను సుభద్ర అడిగింది.

నేను వెంటనే సాత్యకిని కలుసుకోవాలి. అతనితో చెప్పి నన్ను కలుసు కునేటట్లు చూడు. ఈ సాయంత్రమే నేనతన్ని కలవాలి" అంది.

"తప్పకుండా చెబుతాను. అతను వాళ్ళను, వీళ్లను అదే ఎవరెవరో... పెద్దల్ని కలుసుకునే ప్రయత్నంలో వున్నారు. అటువంటప్పుడు వెంటనే నువ్వు చూడాలన్నా, అతన్ని నిన్ను కలుసుకోమన్నా కుదురుతుందా ? ఒకటి, రెండురోజులు ఆగవచ్చు కదా!" అంటుంది.

ఈలోగా పొరపాటున వాళ్ళ తండ్రి సాత్యకుడు, నన్ను ఆతని కోడలుగా నిర్ణయించుకుంటే.... అమ్మో!" తన భయాన్ని సత్య బయటపెడుతుంది.

"ఓ! అదా నీ భయం. అంటే ఎవరి ప్రమేయం లేకుండా, నీ అంతట నువ్వు, మా సాత్యకిని...

వెంటనే "నోర్ముయ్!" అంది సత్య. విషయం తెలియకుండా చిన్నపిల్లలా మాట్లాడకు. సత్వరమే నేను కలవమన్నానని చెప్పు. ఆ తర్వాత విషయం నీకు తెలుస్తుంది. ఏదో ఓణీవేసుకునేసరికి అప్పుడే పెద్దదానివయ్యావనుకుంటున్నావేమో, ఇంకా చిన్నపిల్లవే. నీ పెళ్ళి నేను చెయ్యవలసిందే!" గట్టిగా హెచ్చరించిన సత్య.

"ఇంకో విషయం. నా సమస్యను ఆతనితో చెప్పాలనే తప్ప, సాత్యకిని వివాహం చేసుకోవాలని కోరిక నాకే కోశానా లేదు. కనుక దయచేసి నన్ను వెక్కిరించి, వేధించకు" కళ్ళనీళ్ళ పర్యంతమయింది, సత్య. ఇదిలాగ వుంటే...

★ ★ ★ ★

మహారాజు ఉగ్రసేనుడు అందర్ని రావించి, సభనేర్పాటు చేసాడు. వీరాధివీరులు, శూరులైన యాదవులు చేతినిండా తగిన పనిలేక, కాలక్షేపం కోసం తమ శక్తియుక్తులన్నిటిని పశుపోషణం, వ్యవసాయంపై నిలిపారు. అశ్వశిక్షణ - రక్షణ - పోషణ కూడా ఒక సవాలుగా స్వీకరించారు.

ఎలాగో యుద్ధాలు లేవు. కాబట్టి, మధ్య మధ్యలో రకాల పందెములు కూడా నిర్వహించుకుంటున్నారు. ఆ రకంగా తమ వీరత్వ - శూరత్వాలను దాచుకోలేక పదును పెట్టుకుంటున్నారు.

వాళ్ళలో వాళ్ళు కొన్ని వర్గాలుగా వీడిపోయారు. అతిరథులు... "రథ" నిర్వహణలో శ్రేష్టులు. ఈ యదు వంశీయులు, తమ - తమ శక్తి సామర్థ్యాలను బట్టి వర్గాలుగా, తరచు మారిపోతూండేవారు. ఎందుకంటే వీరత్వం, శూరత్వం-ఒకరి సొత్తు కాదు, కదా!

ఈ అతిరథ వర్గంలో కొంత సైన్యముంటుంది. వీళ్ళు మహారథులు, రథులు. ఇది ఎవరికివారు నియమించుకునే స్వంత, స్వతంత్ర సైన్యం. కాని అవసరాన్ని బట్టి - రాజ్యశ్రేయస్సుకు, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడతారు.

ఇప్పుడు ఈ సైన్యం మొత్తం బలరామ-కృష్ణుల సారథ్యంలో చెప్పుకోదగ్గ ఘనత వహించిన సేన అయింది.

రెండు సం॥ల క్రితం బలరామకృష్ణులు, పదిహేనుమంది అతిరథులతో, ఆర్యావర్త పర్యటనకు వెళ్ళారు. అప్పుడు, వీరితో కలువకుండా ద్వారకలో వుండిపోయింది ఇద్దరే - ఇద్దరు. వాళ్ళు - సత్రాజిత్తు కుమారుడు భాంగారకుడు. ఆతని మిత్రుడు శతధన్వుడు. ఒకప్పుడు సత్రాజిత్తు మహారధి స్థానం వరకు ఎదిగాడు. కానీ అతిరధుడు మాత్రం కాలేకపోయాడు.

ఇప్పుడు - మహారాజు బలరామ-కృష్ణాదులతో ఆర్యావర్తంలో అత్యంత సాహసాలు జరిపి తిరిగి వచ్చిన తమ బృందం గౌరవార్థం మరియు జరిగిన సంఘటనలన్నీ తెలుసుకోవడానికి వీలుగా, ఈ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసాడు.

ఇది పేరుకు "రాజసభే" తప్ప, కురుసభకు గాని, ద్రుపదుని - కాంపిల్య సభకు గాని, ఏ మాత్రము సరికాదు. సరిరాదు కూడా!

ఇందులో - ఉన్నత - ప్రత్యేకాసనం - ఉగ్రసేన మహారాజుది. దానికిరు ప్రక్కల చెరో రెండు సింహాసనాలున్నాయి. కుడిచేతివైపునున్న మొదటిది - బలరామ కృష్ణుల తండ్రి "వసుదేవు"నిది. ఆ తర్వాతది - కులగురువులు గర్గాచార్యులవారిది. ఎడంచేతివైపునున్న దానిలో ఒకటి మహాత్మా అక్రూరులది. దాని తర్వాతది. "సాత్యకి" తండ్రి సాత్యకులది.

ఆ తర్వాత ఆసనాలు బ్రాహ్మణోత్తములు. ఇతర ప్రముఖులవి. అతిరథులు, మహారథులకు గూడా ప్రత్యేక ఆసనాలు ఏర్పాటు చెయ్యబడ్డాయి. మహారాజు ఉగ్రసేనులవారు రావడానికి కొద్ది నిముషాలముందు యాదవ ప్రముఖుడైన సత్రాజిత్తు, తన పెద్ద కుమారుడు భంగాకారుడు, ఆతని మిత్రులు శతధన్వ, జయసేనులతో వచ్చాడు.

సూర్యవరప్రసాదమైన శ్యమంతకమణి ప్రభావంతో, మహాసంపన్నుడైన సత్రాజిత్తు తన వైభవమంతా, అలంకారాలు, హారాలు, ఆభరణాలు, కిరీటాదులలో ప్రకటించుకుంటూ సభలోకి అడుగుపెట్టాడు. అతన్ని చూడటం తోనే, ఈ సంపన్న యాదవ ప్రముఖుని, అక్కడున్న మిగిలిన వారందరు అభినందిస్తూంటే, నవ్వుతూ అటు ఇటూ తన ప్రతిభను, ప్రముఖత్వాన్ని చాట చూస్తున్నాడు.

సత్రాజిత్తు పెద్దకుమారుడు భంగాకరుడు, మొదటి వరుసలోని రాజకుటుంబాల సరసవర్గంలో కూర్చున్నాడు. సత్రాజిత్తు మాత్రం - ఇంకా ఎటూ కూర్చోకుండా, కృష్ణుని కోసం వెదుక్కుంటున్నాడు. కృష్ణుడు కనబడకపోయేసరికి, తాను, మొదటివరుసలోని రెండవ ఆసనంలో కూర్చుని, అక్కడి మిత్రులతో పిచ్చాపాటి మొదలుపెట్టాడు. కళ్ళు మాత్రం కృష్ణునికోసం వెదకుతున్నాయి. ఈ రెండు సం॥లలో అతను పొందిన సంపదను, సంపన్నత్వాన్ని కృష్ణుడు గుర్తించి, గౌరవించాలన్నదాతని తాపత్రయం. అందుకే - ఆ చూపులు.

సరిగ్గా - ఈ సమయంలో -

"బహుపరాక్! అని మహారాజు రాకను, దౌవారికుడు ప్రకటిస్తున్నాడు. ఈ హెచ్చరికతో ఒక్క సత్రాజిత్తు తప్ప అందరు గౌరవ సూచకంగా లేచి నిల్చున్నారు. మహారాజు, తన చేతిని తన కుమార్తె పుత్రుడు బృహద్బలుని కుడిభుజంపై వుంచి, మరీ సమావేశం మందిరంలో అడుగుపెట్టారు. కాకపోతే, లౌకిక మర్యాదగా మహారాజు కూర్చొనబోయే సమయంలో కొద్దిగా లేస్తున్నట్లు సత్రాజిత్తు నటించాడు.

మహారాజు వెంబడి శూరవంశీయుడు, మహారాజుకు ప్రధాన సలహాదారుడైన వసుదేవుడు, వచ్చాడు. ఈ వసుదేవునితోపాటు యాదవకుల గురువులు గర్గాచార్యులవారు, వారివెనుక అక్రూరుడు, ఆ తదుపరి సాత్యకుడు సమావేశస్థలిలో, తమకు కేటాయించిన ఆసనాలపై కూర్చున్నారు. వీరితో, బలరామ, కృష్ణులు కూడా రాజఠీవితో వచ్చారు.

అందరు కూర్చున్నాక, మహారాజు ఉగ్రసేనులవారు అతిరథులనందర్ని ఒకసారి చూసి, అతిరథులకు, మహారథులకు స్వాగతం, సుస్వాగతం. ఆర్యావర్తంలో మీరు సల్పిన అద్భుత విజయ విశేషాలను విన్నాం. చాలా సంతోషించాం. ఇప్పుడు మేము, మిమ్మల్ని కోరేదేమిటంటే.. ముఖ్యంగా మీరు ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను, దానిపై మీరు సాధించిన విజయాల్ని విశద బరచండి. అవి ముందు ముందు ఇతరులకు మార్గదర్శకమౌతాయి. మనకు గూడా కనీస జాగ్రత్తలు హెచ్చరికలౌతాయి...." అని మహారాజు కృష్ణునివైపు చూడగా, కృష్ణుడు.... పెద్దవాడైన అన్నగార్ని కదిపాడు.

అప్పుడు బలరాముడు, అందర్నీ ఒకసారి కలయచూసి, "ఓ మహారాజా! యాదవ ప్రముఖులారా! అందరికి వందనం. మీ అందరి అనుమతితో జరిగిన విషయాల్ని విన్నవిస్తాం.

"ఇక్కడనుండి మేము పుష్కరతీర్థానికి వెళ్ళాం. అక్కడ చేకితానుని పుష్కర ప్రభువుగా ప్రతిష్ఠింపచేసే విషయంలో, కురువంశ ప్రతినిధులతో యుద్ధం చెయ్యవలసి వస్తుందేమోననుకున్నాం. కానీ, మన గోవిందుని సమయస్ఫూర్తి యుద్ధాన్ని నివారింప చెయ్యడమే కాకుండా, ఎటువంటి శ్రమ లేకుండా, అప్రయత్నంగా, అనాయాసంగా చేకితానుడు, తన పదవిని రాజ్యభోగాలను దత్తరహితంగా పొందాడు. ఆతనికెంతో ఆనందం లభించింది.

ఈ మాట వినడంతో మహారాజు "అద్భుతం. మహాద్భుతం" అన్నాడు. వసుదేవుని ఆనందం సరే సరి. చెప్పవలసిన పని లేదు. బలరాముడు తన ప్రసంగాన్ని కొనసాగిస్తున్నాడు. ఆ సమయంలోనే మాకు, దుర్యోధనుని దుర్బుద్ధి వలన, పాండవులు తమ తల్లితో మంటల్లో మలమల మాడిపోయారనే విషయం తెలిసింది.

వింటున్న వసుదేవుడు "దుర్యోధనుడే - ఈ దారుణం జరిపించాడని మీకెలాగ తెలుసు ?" ఆసక్తిగా అడుగుతున్నాడు. అందుకు బదులుగా, బలరాముడు -

"ఇందుకు ఏ యక్షుని సహాయమపేక్షించి, ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేయించాడో ఆ యక్షుడు అనుకోకుండా, పాంచాలంలో ద్రుపదులవారి సముఖంలో బహిరంగంగా ప్రకటించాడు.

"ఎంత దారుణం ?" గర్గాచార్యులవారు, తన ఆవేదనను తెలిపారు. అప్పుడు మళ్ళీ - బలరాముడు -

"ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్ధవుడు ఇక్కడే వున్నాడు. ఆతని నుండి సత్యం గ్రహించవచ్చును. ఆ తదుపరి మన అదృష్టం, కొద్దీ, రాక్షసావర్తంలో కృష్ణుని సూచనతో మన వుద్ధవుడే, అతి ప్రయాసలకోర్చి వెళ్ళి, వారిని చూసి, ఆ భగవంతుని దయవలన వారందరు సజీవులుగా వున్నట్లు తెలియబరిచాడు.

ఇందులో నాగరాజు ఆర్యకుడు, యువరాజు కర్కోటకుడు, వాని కుమారుడు మణిమంతుడు చూపిన ఆదరాభిమానములు అపూర్వము, అపురూప, అనన్యం.

అందుకే కర్కోటకులవారి కుమార్తెలు కపిల, పింగళలను మన ఉద్ధవుడు వివాహం చేసుకోవాల్సి వచ్చింది. వాళ్ళను వివాహం చేసుకున్నాడు. ద్రుపదుడు, తన పరువు ప్రతిష్ఠలు, పగ-పట్టుదలలు, నిలుపుకోవడం కోసం ద్రౌపదిని, కృష్ణుని వివాహం చేసుకోమన్నాడు. అదికాదు. ఆమెకు మహావీరుడు భర్తవుతాడు. స్వయంవరం ప్రకటించమన్న ప్రకారం, పుష్కరం నుండి మేమందరం కలిసి, కాంపిల్యానికి స్వయంవర కార్యక్రమం దర్శించడానికి బయలుదేరాం.

ఆహుతులందరి మధ్య ఏర్పాటు చేసిన మత్స్య యంత్రాన్నెవరు ఛేదించలేక పోయారు. ఇక వీరులెవరూ లేరా ? అని చింతిస్తూన్న తరుణంలో, ఆశ్చర్యంగా బ్రాహ్మణుల సమూహం నుండి ఒక ఆజానుబాహుడు లేచి వచ్చాడు. ఆతను చూడటానికి బ్రాహ్మణునిగా వున్నా, శరీర లక్షణాలు మాత్రం, విప్రకుల సంజాతునిగా కనబడటం లేదు. చాలామంది పరశురాముడే అలాగ వచ్చాడేమో నని తలచి దిగ్భ్రమ చెందారు. వుక్కిరి బిక్కిరయ్యారు కూడా!

ఇక్కడ జరిగిన విచిత్రమేమిటంటే.... మగధ చక్రవర్తి జరాసంధుడు, తన మనుమని కోసం, అవసరమైతే బలవంతంగానైనా సరే ద్రౌపదిని ఎత్తుకుపోవాలని తలుస్తుంటే అది పద్ధతి కాదని, అంతకుముందే అభయ ప్రదానం ద్రౌపదికి చేసిన మేరకు, మన కృష్ణుడు రాత్రికి రాత్రి జరాసంధుని కలిసి చేసిన మంత్రాంగ ఫలితంతో, మాగధులెవ్వరు ఆ స్వయంవరంలో పాల్గొనలేదు.

ఇటు మన కురువీరులలో ఒకడైన దుర్యోధనుడు ఏదో రకంగా ద్రౌపదిని గెల్చుకోవాలనే తపనతో, ఆతని భార్య కాశీరాజ తనయ యువరాణి భానుమతి ద్వారా కూడా రాయబారం నడిపి ఏదోరకంగా ఆమెను కురువంశ యువరాణిని చెయ్యమని కోరాడు.

నవ్వి వూరుకున్న నందనందనుడు "యతో ధర్మః తతో జయః" అన్నాడు. దీనికి నిదర్శనంగా, ఆ బ్రాహ్మణవీరుడు తన వీరత్వాన్ని ప్రకటించి, ద్రౌపదిని గెల్చుకున్నాడు. తీరా చూస్తే అతను కుంతీపుత్రుడైన అర్జునుడు. మా బావ.... ఇవన్నీ నాకు తెలియవు. చతుర్దశ భువన సమ్రాట్టుగా - అందరు తలిచే ఈ కృష్ణుడు జరిపిన కృష్ణ భాగవత లీలావిలాసంలో అదొక భాగం.

ఆ తర్వాత విషయాలు తెలుసుకున్న నేను, మేనత్త కుంతీదేవి సంతానం, పంచపాండవులు బ్రతికి వున్నందులకు బ్రహ్మానంద భరితుడనయ్యాను. అంటూ అక్కడనుండి, వాళ్ళ వివాహం, హస్తినకు వెళ్ళడం సర్వం అందరికి విడమరచి చెప్పిన బలరాముడు -

మరో విషయం. మన భీముడు అనుకోకుండా హిడింబాసురుడనే రాక్షసుని చంపాడు. దాంతో కామరూపిణియైన వాడి చెల్లెలు హిడింబ, అత్త చెంత చేరింది. ఆమె అభయమొందింది. మనవాడు భీముని పెండ్లి చేసుకుంది. వాళ్ళకో పిల్లవాడు. వాడి పేరు ఘటోత్కచుడు. అసామాన్యుడు. అసాధారణుడు.

దాంతో మనవాడు ఆ రాక్షస రాజ్యాన్ని కుమారునికప్పగించి, మనవాడి (కృష్ణుడు) పథకం ప్రకారం, ద్రౌపదీ స్వయంర సంబరంలో పాల్గొన్నారు.'' అంటూ వివరించి విపులంగా చెప్పాడు.

"ఆశ్చర్యపోయినవారు, ఆశ్చర్యపోయారు. కొందరు పొంగిపోతే, కొందరు నిశ్చేష్టులయ్యారు. మొత్తానికి మన కృష్ణుడు యాదవులకు, యదువంశ శూరులకు-వీరులకు అఖండ పేరు ప్రతిష్టలనార్జించి పెట్టాడు. కాకపోతే...

"అనుక్షణం ఆపదలతో ఆడుకున్నారన్నమాట. ఎందుకా వీరవేషాలు, ప్రమాదాలన్న" వుద్దేశంతో సత్రాజిత్తు యదువీరునిగా కాక, ఓ సంపన్నుడిగా చమత్కరించాడు.

"నిజం. ఆడవారిలాగ, ఆడవాళ్ళ మధ్య కూర్చుని అధికులమని పించుకోకుండా, అచ్చమైన మగవారిలాగ మీసాలు త్రిప్పుతూ, రోషాలు ప్రకటిస్తూ, ఆ మృత్యుదేవతనే శాసించి వచ్చాం. ఇప్పుడా మృత్యుదేవత, మా పేరు చెబితే ఆమడదూరంలో వుంటుంది. పొరపాటున మేము రమ్మని పిలిచినా, మా వద్దకు రావాలంటే, దానికి ప్రాణాలు పోతాయి. అదీ మా వీరత్వమని "బలరాముడు" ఎద్దేవా చేసిన సత్రాజిత్తుని గేలిచేసాడు.

దాంతో అందరిదృష్టి ఇటు సత్రాజిత్తుపైన, అటు మగవాళ్ళుగా మీసాల్ని మాటిమాటికి త్రిప్పుకుంటూ లేని పౌరుషాన్ని, వున్నట్లు ప్రకటించుకునే సత్రాజిత్తు కుమారుడు భంగాకరుని, వాడి మిత్రుడు శతధన్వుడిని విచిత్రంగా చూసారు.

అప్పుడు పరిస్థితి విషమించకుండా వసుదేవుడు "ఆ తర్వాత.....!" అన్నాడు బలరాముని చూస్తూ. తండ్రి వుద్దేశాన్ని గమనించిన బలరాముడు, కొద్దిగా తగ్గాడు.

చూస్తుండగా మామూలు స్థితికి వచ్చాడు. ఎందుకంటే తండ్రితోపాటు, ప్రక్కనే వున్న తమ్ముడు గోవిందుడు కూడా, "సంయమన"మంటూ చేతిని పట్టి లాగడంతో, అప్పటికా విషయం సద్దుమణిగింది.

అప్పుడు మళ్ళీ సత్రాజిత్తు - చెప్పే బలరాముని కడ్డువేస్తూ - స్వయంవరంలో గెల్చుకున్న అర్జునుని కాక, ఆ పాంచాలి, పాండవులు అయిదుగుర్ని, "ధర్మబద్ధమను వ్యాసుడి, మాతృ వచనమన్న కుంతి, పూర్వజన్మ వరప్రభావ ధర్మం - ద్రౌపది"దనే - వివరణలతో వివాహం చేసుకుందా ? ఇది ఆర్య సమ్మతము, సాంప్రదాయమా ? పరిహసిస్తున్నట్లు పకపక నవ్వాడు.

బలరాముడికి కోపమాగలేదు. వీడికి ధనమదం తగ్గించి, తగు బుద్ధి చెప్పాలని తలుస్తున్నాడు. అయినా తమాయించుకుంటూ "వేదవ్యాసులకన్న మనం గొప్పవాళ్ళమైతే, "సత్రాజిత్తూ!" మీరు నవ్వినట్లే నవ్వుదాము. నిలిచి పరాక్రమం చూపలేని మనం, ప్రక్క వూరికి పారిపోయి - మరొకరి దయాభిక్షతో బ్రతికే స్థితికి వచ్చి, ఇప్పుడు - ఇటువంటి తర్కవితర్కాలకు, కుతర్కాలకు లోనుకావడం, మంచిది కాదన్నది నా వినతి!"

దీంతో సత్రాజిత్తు నోరు మూసేసాడు.

మిగిలిన కథనాన్ని బలరాముడు అందుకుంటున్నాడు. అప్పుడు వసుదేవుడు "అయితే కురు - పాంచాల దేశాల వారు. సఖ్యంగా వున్నారన్నమాట. చాలా సంతోషమని" ఆ విషయాన్ని అక్కడ త్రుంచేశాడు.

మన కృష్ణుడు, బుద్ధిమంతుడైన విదురులు, మహాశక్తిమంతుడు గాంగేయుడు.. వున్నచోట కోపతాపాలకు, అనర్థాలకు, అరిష్టాలకు తావుండదు. అందరు సంతోషంగా వున్నారని ముగించాడు. కాకపోతే సాంప్రదాయం ప్రకారం, ధర్మరాజును, కురువంశ జేష్టునిగా పట్టాభిషిక్తుని చేద్దామన్నారు. అందుకు -

అన్ని సన్నాహాలు జరిగాయి.

మకుటధారణ జరిగే సమయంలో, గాంగేయ పరిరక్షిత శూరుడైన అంధరాజు ధృతరాష్ట్రుడు, తమ్ముని పిల్లవాడైన యుధిష్టరుని ఆశీర్వదిస్తూ "నాయనా! ఎవ్వరికీ ఏ ఇబ్బంది లేకుండా, ఈ అవిభాజ్య - కురు సామ్రాజ్యాన్ని-ప్రస్తుత పరిస్థితులను బట్టి - మీకు, నా కుమారుల మధ్య విభజిస్తున్నాను.

మీరు అన్యధా భావించక. మన పూర్వీకుల రాజధాని, వారి శ్రేయోభివృద్ధికి మూలకారణమైన ఖాండవప్రస్థాన్ని... రాజధానిగా చేసుకుని సుఖంగా వుండమన్నారు. అప్పుడు మన కృష్ణుడు "రాజా! రాజ్యంతోపాటు సంపదలను కూడా సమానంగా పంచమన్నాడు. మహారాజు విధిలేక తలవూపాడు. దుర్యోధనుని గొంతుకలో పచ్చి వెలక్కాయ పడింది. ఆ సమయంలో -

వివాహ సమయంలో కూడా, యదువంశీయులమైన మనము, మీ చెల్లెలు, మా మేనత్త పిల్లలకు కట్నకానుకలు ఇవ్వలేదు. ఇప్పుడీ నూతన రాజ్య ప్రదానోత్సవ కిరీటధారణ సమయంలో - మేము, మా మహారాజు, యదువంశ ప్రముఖుల తరఫున - మా సంపదల నుండి అయిదవ వంతు బంగారము, సిరిసంపదలు రథాశ్వగజాది ... ఇతర సైనిక సంపత్తి, సహాయ సహకారాలు, సర్వదా మీకు అందిస్తామని, నిండు సభలో వాగ్దానం చేసాము" అనేసరికి -

రాజ్యసభ యావత్తు హర్షధ్వానాలు, కరతాళ ధ్వనులతో మిన్నుముట్టినట్లు పొంగిపోయింది. కానీ సత్రాజిత్తు పరిస్థితే వారికగమ్య గోచరంగా తయారయింది. ఎంతసేపు నాకుంది, నేను సంపన్నుడను. వున్నవాడనన్న... ఆలోచనే తప్ప - సభ్య సమాజ దృష్టి, మానవత్వం మచ్చుకైనా కనబడటం లేదు.

"అంటే..నీ కోసం, మేము మా సంపదల్ని వాళ్ళెవరకో ధారపొయ్యాలా ?" వుక్రోషంతో అడుగుతున్నాడు. బలరాముడు అగ్గిగుగ్గవుతున్నాడు. ఇప్పుడు కావల్సింది కోపం కాదు, శాంతం. దాంతో కృష్ణుడు మెల్లిగా లేచి, ఎంతో ప్రశాంతంగా తన దరహాస వదనంతో -

"సత్రాజిత్తు మహాశయా! తమరు యాదవ ప్రముఖులు. సుసంపన్నులు కాదనము. అది మాకు గర్వకారణం కూడా! యాదవులలో మీవంటి పరమ భక్తులు, పూజ్య సంపన్నులుండడం, అందరికి ఆనందదాయకం. పాండవులెవరో కాదు. మన భాగినీ పుత్రులు. వారిని లోకమర్యాదానుసారం గౌరవించి, మన ప్రేమను చాటుకోవడం, సద్ధర్మమని, సాహసించి, నిండు సభలో, పరువు ప్రతిష్టలను పెంపు చెయ్యాలనే వుద్దేశంతో ప్రకటించామే తప్ప, ఎవరి సంపదలనో, వాళ్ళ వాళ్ళ కష్టార్జితాలనో దోచుకుని, కుంతీపుత్రులకు ధారాదత్తం చెయ్యాలన్నది మా వుద్దేశం కాదు.

ఇందులో - అదే మా వాగ్దానంలో మీకేదైనా కష్టం కల్గినా, మీ మర్యాదకు భంగం వాటిల్లినా, మహారాజు తదుపరి అంతటి ప్రముఖులైన మీరు మన్నించి, జరిగిన దానికి కోపగించక, మీ సహకారమందించ కోరుతున్నాను. ఇందులో అన్నీ వున్నాయి. కోపం, హెచ్చరిక, దర్పం, శాంతం.... ధర్మ, సాంప్రదాయం, సంస్కారం ఎన్నో మిళితం చేసి మరీ కృష్ణుడు చెప్పాడు.

సత్రాజిత్తుకు తల వంచడమే తప్ప, మాట్లాడే సావకాశం కనబడటం లేదు. ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇందుకు దీటుగా మనమిప్పుడు సామాన్యులం కాము. ఆర్యావర్తానికి ధర్మ ప్రబోధకులం, మార్గదర్శకులమయ్యాము. కాబట్టి, కౌరవ సామ్రాజ్యం నుండి పాండవులకు అర్థభాగమొచ్చినా, ద్రుపద మహారాజు భూరి కానుకలొసగినా, వారందరికి ఏ విషయంలోను, ఏ విధంగాను తక్కువ కాని మనం, మన ధర్మాన్ని మరొకరు వేలెత్తి చూపకుండా నిర్వహించాలనే ఆ రకంగా ప్రకటించామన్నాడు, బలరాముడు.

ఏది ఏమైనా కాని, ఇది యాదవులకు అంగీకారం కాదు. కనుక దీనిని గురించి బాగా ఆలోచించాలి. తొందరపాటు, దిద్దుబాటు చర్యలు, ఆ తదుపరి పనికిరావు! అంటూ - ఒక పెద్దాయన -

"ఏదో ఇవ్వాళింత తింటున్నాం. అంతా బాగా వుంది. ఏదో కొంత కూడబెట్టుకుంటున్నాం. సంతోషం. కానీ, ఈ స్థితిలో సాల్వుడు లాంటివాడు మనపై దండెత్తి, మన సంపదలను దోచుకుంటే యాదవులు, ఎంత దారుణమైన దయనీయస్థితికి గురవుతారో, ఒక్కసారి ఆలోచిస్తే....!" ఆ మాట పూర్తికాలేదు.

"ఆ వచ్చేవాడిది, గుండా, చెరువా ?" అన్నాడు కృష్ణుడు. ధర్మపరి రక్షకులను, ధర్మ నాశకులు నిర్జించలేరు, ఎదిరించి బ్రతుకలేరు, అనవసర భయాలు ప్రక్కన బెట్టి, అవసర విషయానికి రండి!

"మన దగ్గర ఏమున్నాయని అవతలివారి నెదిరించడానికి, పోరాడి గెలవడానికని ? " సత్రాజిత్తు ప్రక్కనే కూర్చున్న వృద్ధ యాదవ ప్రముఖుడడిగాడు. మన వద్దనున్న వనరులు అతికొద్దివేగా ? వాటితో...

"చూడు. ధర్మానికి ధనం కాదు ముఖ్యం. గుణం. చెడ్డగుణం లేకపోవడమే విజయ లక్ష్యానికి చేరువవడం" కృష్ణుడు చెప్పాడు.

కానీ కృష్ణా, ధనమున్నంత మాత్రంలో అది ధర్మానికి దారితీయదు. వున్న దర్పం తాత్కాలికమౌతుంది. సంపాదించేవాళ్ళ సంపాదన తాత్కాలికమని, అది అపవిత్రమైన మరుక్షణం లభించిన సంపదల లక్ష్యసిద్ధినివ్వకబోగా, ప్రాణాంతకమై కూర్చుంటుంది. దీనికి సంబంధించి మన చరిత్రలో ఎన్నో కథలు, కథనాలు వున్నాయి. కాబట్టి...

ఇదంతా సత్రాజిత్తుకు నచ్చడం లేదు. కానీ ఆ సమయంలో, సూర్య భగవానుడు, తన భక్తికి మెచ్చి, శ్యమంతకమణిని తన చేతులలో పెట్టేటప్పుడు చెప్పిన మాటలు, ఇప్పుడిక్కడ జ్ఞప్తికొచ్చాయి.

"అనంత సంపద అహంకారానికి దారివ్వరాదు. అధర్మ అపవిత్ర సిద్ధాంతాలకు దారి చూపకూడదు. సర్వేజనాః స్సుఖినో భవన్తు" అని తను సంపాదించిన సంపాదన తనకు, తన సభ్య సమాజానికి గూడా వుపయోగపడాలి. ఇప్పుడు అన్యాపదేశంగా కృష్ణుడు, ఇదే చెబుతున్నాడు. దాంతో ఆలోచనలో పడ్డాడు. పడుతున్నాడు కూడా!

అయినా అక్కడి వాతావరణం అతనికి నచ్చలేదు. దాంతో సత్రాజిత్తు తన వునికిని, స్థైర్యాన్ని స్థితిని కూడా కోల్పోయాడు. దాంతో వున్నట్టుండి గట్టిగా అరుస్తూ "మనం కష్టపడి మన సంపాదనను పెంచుకున్నాం. అధర్మమార్గంలో ఎవరి కొంప కూల్చి సంపాదించలేదు. కనుక ఆ పంచ పాండవులకు కాని, మరొకరి కాని మనం తేరగా పంచవలసిన అవసరం లేదు. ధర్మాత్ములమని, ఎవరో మెచ్చుకుని మేకతోలు కప్పనవసరం లేదు." ఉద్రేకంతో అంటున్నాడు.

"సత్రాజిత్తు" పెద్దవారు మీరు. మీకు తెలియనిది లేదు. సంపద ఒకరి వద్దే నిలిచిపోయినా, అది మరెవ్వరికి వుపయెగపడకపోయినా, దానిని సంపద అనరు. దాని వలన ఎవరికి సుఖసంతోషాలుండవు" ధర్మంగా చెబుతున్నాడు.

వినే మనస్తత్వం లేని సత్రాజిత్తు "ఏదో మహారాజు రమ్మన్నారని, యాదవ ప్రముఖునిగా వచ్చాను కానీ, ఇక్కడ నాకేం పనిలేదు. ఎవరికో నేను, నా సంపాదన ధారాదత్తం కావాలనే నిబంధన కుదరదు. అయినా ఆ కురువంశీయులకు నాకు ఏం సంబంధమని, బంధాలు పెంచుకుని, ధనాన్ని ధారపోయాలి. ఆ...!" నిగ్రహం కోల్పోతున్నాడు.

ఎటు చూసినా, ఎలాగ చెప్పినా పరిస్థితి అర్థం చేసుకోక, మూర్ఖంగా ప్రవర్తించే సత్రాజిత్తు మాడుపై ఒక్కటివ్వాలనిపించింది బలరామునికి, కాని అది

రాజసభ అయిపోయింది. లేకపోతే.... ఈ పాటికి సత్రాజిత్తు అదిరిపడటం, ఎగిరిపడటం మాని, అరవడం, ఏడవడం - చేస్తుండేవాడు.

ఇంక సత్రాజిత్తుకు అనవసరంగా మాట్లాడి గొడవ తెచ్చుకునేందుకు కాని, పెంచుకునేందుకు గాని సిద్ధంగా లేక - "సరే సమయం చూసుకుని దీని గురించి, ఆలోచిద్దా"మని, ప్రస్తుతానికా సమస్యను దాట వేశాడు.

అయితే రేపు, పుదయం నేను మిమ్మ, మీ ఇంట్లో కలుసుకుంటాను. అప్పుడు వివరంగా మాట్లాడుదురుగాని" తన అంగీకారాన్ని, కృష్ణుడు తెలిపాడు.

అప్పుడిక ఆగ్రహం ఆపుకోలేని సత్రాజిత్తు "చూడండి. ఎవరి బ్రతుకులు వారివి. ఒకరి బ్రతుకులపై మరొకరు నిర్ణయాలు ప్రకటించడానికి, ధర్మపన్నాలు చెప్పడానికి నేను ఒప్పుకోను!"

"సంతోషం. కానీ మహారాజు ముందర ఇటువంటి అనుచిత ప్రవర్తనము, ప్రసంగము మంచిది కాదని తెలుసుకుని, మహారాజు ఆదేశం ప్రకారం నడుచుకుంటే, మనం పౌరులమవుతాము. కాదంటే రాక్షసులమౌతాము. అప్పుడు మహారాజు మనల్ని తప్పక దండించాల్సి వస్తుంది" కటువుగా చెప్పాడు బలరాముడు.

అందరు కృష్ణుడు కోపంతో రెచ్చిపోతాడనుకున్నారు.

కానీ, అందరి ఆశలకు విరుద్ధంగా, బలరాముడు అగ్నిహోత్రుడవు తున్నాడు. అవసరమైతే బుద్ధి చెప్పడానికి గూడా సిద్ధంగా వున్నాడు.

"ఓ యాదవ ప్రముఖా! ఎవరు ఎవర్ని నిరోధించలేరు. బలవంతం చెయ్యలేరు. విషయం వింటాం. విన్న విషయాన్ని చర్చించుకుంటాం. చర్చలలోని సారాంశాన్ని బట్టి చర్యలుంటాయి. అంతేకాని వూరికే కుమ్ములాడుకోవడంలో, సత్య - ధర్మాలు రెండూ కనబడవు. సరికదా, సభ్య సమాజం, అందులోని ప్రజలు, మనల్ని చూసి నవ్వమని చెప్పకుండానే నవ్వుతారు. తిట్టమని, కొట్టమని చెప్పకుండానే, తిడతారు. కొడతారు కూడా!

ఈ సమయంలో వసుదేవుడు, మహారాజు చెవిలో ఏదో చెప్పాడు. అది వింటూనే, ప్రస్తుతానికా వాతావరణం చల్లబడే స్థితికి వస్తుందని ఆశిస్తూ - చెయ్యెత్తి సభను ముగిద్దామన్నారు. దానిని ముగించారు.

# ఆశ, ఆరాటం!

**స**త్యభామ పడుక్కుందన్నమాటే గాని, నిద్రరావడం లేదు. ఎందుకో మనస్సు "అతను వస్తున్నాడు, అతను వస్తున్నాడని" చెబుతుంది. అదొక తెలియని ఆనందం. సత్రాజిత్తు - రాజసభ నుండి రాగానే - ఇంట్లోని వారికి, తన పురోహిత బృందానికి, రేపు వుదయం తనను చూడటానికా వాసుదేవుడు వస్తున్నాడు, ఎంతో ఘనంగా, అది ఒక ఘనతగా చెప్పుకున్నాడు. ఇది సత్యభామకు సంతోష, గర్వ కారణమయింది.

దాంతో కృష్ణుని రాకను తలచుకుంటూ, ఊహాలోకంలో విహరిస్తూంటే దాంతో నిద్ర ఆమెను ఆశ్రయించడం లేదు. కనురెప్ప మూతబడటం లేదు. దీంతో ఆ ఇంట్లోని వారందరు కృష్ణుడు, తప్పక" సత్రాజిత్తు - సాత్యకుల" మధ్య సయోధ్య కుదురుస్తాడని తలుస్తారు.

తెల్లవారింది. సత్యభామ తన కాలకృత్యాలు తీర్చుకుని, కృష్ణుని రాకకై ఎదురు చూస్తుంది. అది ఆమె ఉత్కంఠ. తన ఇంద్రియాలన్నింటిని, కృష్ణుని కోసమప్పగించి, కూనిరాగాలతో, చూస్తున్నట్లు కాక, ఆ వాసుదేవుని కోసము, ఆ చూపుల గిలిగింతల కోసం ఎదురు చూస్తుంది.

అందంగా అలంకరించుకుంది. చూపులన్నీ తూపులు చేసి, సమయాన్ని బట్టి అతనిపై సంధించాలని తలుస్తూంది. కృష్ణుడు ఎందుకు వస్తున్నాడు. తనకోసమా ? లేక తాను విన్నట్లు - సాత్యకి సంబంధం ఖాయపరచ్చుడానికా ? లేక ? పంచపాండవులకు తమ అయిదవ వంతు సంపద ఇస్తానని చెప్పినందులకు నాన్నగారిని ఒప్పించడానికా ?

ఏ ఒక్కటి ఆమె కర్థం కావడం లేదు. ఆత్రం మాత్రం ఆమెను అల్లరి చేస్తూంది. వెయ్యి కళ్ళతో ఎదురు చూసేటట్లు చేసింది. అప్పుడు - అవును, నా పద్ధతిలో, కృష్ణునితో ప్రవర్తిస్తానన్న తన తండ్రి కొంపదీసి, కృష్ణునితో యుద్ధకాండకు సిద్ధపడడు కదా!

"తన తండ్రి పరువు పోగొట్టుకోదలిచాడా ? తన పెద్దరికాన్ని పెంచుకో దలిచాడా ? సత్యభామకు ఏమీ అర్థం కావడం లేదు. ఊరికే ఆలోచనలు ఉత్తేజమైన ఎదురు చూపులు. క్షణమొక యుగంలా గడుస్తూంటే.... ఇంకా,

రాడేం ?'' విసుక్కుంటుందామె. ఈ గొడవలలో తనను శతధన్వునికి కాని, జయసేనుడికి కాని ఇచ్చి పెండ్లి చేయడు కదా! ఇది మరో ఆలోచన.

అమ్మో!... ! ఆ మాట తలచుకోవడం కాదు. అనుకుంటేనే గుండె దడ, భయము, వణుకు గొంతు తడారిపోవడం. అనకూడదు కానీ, అన్నీ అవలక్షణాలు ఆమెను పట్టుకున్నట్లయింది. దాంతో ముఖంపై చెమటలు. వూపిరాడకపోవడం. ఈ నిరీక్షణలో, వూహించుకుంటున్న కలల రాజకుమారుడు దేవకీసుతుడు, కృష్ణుడు - దేదీప్యమానంగా వెల్గుతూ, చిరునవ్వు మల్లెల వికసిత దరహాసంతో రాజువలె ఠీవిగా, రాజసంతో అడుగుపెట్టాడా రాజీవలోచనుడైన, కృష్ణుడు!

వస్తూనే, వాసుదేవుడు రెండు చేతులు జోడించి, తండ్రిగారి పెద్దరికాన్ని గౌరవిస్తూంటే, తండ్రిగారు కూడా, ఆ వచ్చిన గోవిందునికి తగు మర్యాదలు సలిపాడు. పురోహితులు, వేదమంత్రాల మధ్య స్వాగతించారు. మంత్రాక్షతల నొసగారు. కృష్ణుడు కూడా ఓ కొబ్బరికాయను, అగ్నిదేవునకర్పించాడు. అంతా ఎంతో సంతోషంగా, మంగళదాయకంగా వుంది. ఆ పైన -

సత్రాజిత్తు తన సమావేశ మందిర ప్రదేశానికి తీసుకు వెళ్ళాడు. స్త్రీ లందరు, ఈ వసుదేవసుతుని చూడాలని ఆత్రపడుతూంటే, ఏ ఒక్కరికి ఆ అవకాశ మివ్వకుండా, సమావేశ స్థలానికి బయలుదేరడం, చాలామందికి ఇబ్బందకరమైంది. వాళ్ళే మాట్లాడుకుంటున్నారో వినాలన్న ఆశకు గండి పడినట్లయింది. ఇది బహిరంగ ప్రదేశమయ్యేసరికి, కులస్త్రీలు అందునా సత్రాజిత్తు ముఖ్య పరివారం, సత్రాజిత్తును కాదని కృష్ణుని దర్శనం ప్రత్యేకంగా చెయ్యలేకపోయింది. అందరికీ, ఇదొక నిరాశ, నిస్పృహల సమాగమమై కూర్చుంది. వరండా వైపు వెడుతూ, వెడుతూ....

నవ్వులరేడు కృష్ణుని చూస్తూ, తన దర్పం ప్రదర్శించాలన్నట్లు సత్రాజిత్తు-చెయ్యెత్తి తన పశుసందను గొప్పగా ప్రకటించుకుంటున్నట్లు చూపెడుతున్నాడు. అంతటా అతిశయము, స్వాతిశయమే తప్ప, వినయవిధేయతలు ఎటు చూసిన సత్రాజిత్తు ఇంట్లో లేవన్నట్లుంది, ఈ ప్రముఖుని ప్రవర్తన.

"ఆ కృష్ణా.... నేనేదో రోజున అశ్వమేధం చేస్తాను. నువ్వు చూస్తా"వన్నాడెంతో గొప్పగా.

"అశ్వమేధమా ? అదిచేసి మీరు చక్రవర్తి కావాలని తలుస్తున్నారా ? సంశయం తీర్చుకోవాలన్నట్లు అడిగాడు.

"నేనవరైనా, ఇది సూర్యభగవానుని ఆకాంక్ష, ఆశీర్వచనమనగా, కృష్ణుడు చాలా సంతోషమన్నాడు. అతి త్వరలో తన అభిలాష నెరువేరుతుందనీ, చక్రవర్తులకే చక్రవర్తిగా తాను విరాజిల్లుతానని కూడా సత్రాజిత్తు చెప్పాడు.

వారిద్దరు సమావేశ మందిరాన్ని ప్రవేశించారు. కృష్ణునికి తగు ఆసనమొసగి, తాను తన సింహాసనంపై కూర్చున్నాడు. కొద్దిక్షణాలు ఇద్దరి మధ్య మౌనం. ఇంటికి వచ్చిన అతిథిని గౌరవిస్తూ, ముందు తాను పలుకరించడమే సభ్యతగా తలచిన సత్రాజిత్తు -

వాసుదేవా! నిన్న నువ్వు నాతో ఏదో మాట్లాడాలని ఆసక్తి కనబరచి, మీ ఇంటికి వస్తానన్నావు. ఏ విషయం మాట్లాడదామనుకుంటున్నావు ?" ప్రసంగానికి ప్రారంభోత్సవం చేసాడు. అందుకు సమాధానంగా, ఈ గోవిందుడు -

"కారణము.... అంటే అందరు కలిసి వుండటమే తప్ప ప్రత్యేకించి, ఏ కారణము లేదు. మీరు యదువంశ ప్రముఖులలో సంపన్నులు. ప్రముఖులైన ఆ అధికులు కొందరికి గిట్టకపోవచ్చును. అలాగ కాకుండా, యాదవులందరము ఒకే త్రాటిపైన, ఒకే వర్గంగా అన్ని విషయాలలో, అభిప్రాయాలు వ్యక్తిగతమైనవే అయినా, సమిష్టి కార్యనిర్వహణంలో, సంప్రదింపులతో, సమస్యలకు తావులేని విధంగా, సంతోషంగా వుండాలన్నదే నా ఆలోచన, అభిప్రాయం.

పెద్దవారు, మీ సూచనలు కావాలి. సలహాలు కావాలి. అంతకుమించి, మీ ఆశీస్సులు అపేక్షణీయం.

ఆ విషయంలోనే మిమ్మల్ని కలుద్దామని తలంచాను. వచ్చానన్నాడు. అందుకు సత్రాజిత్తు, సాలోచనగా కృష్ణుని చూస్తూ "అది - ఒక కారణం కావచ్చును, కాదనను. కానీ, నీ రాకలో ఏదో ఆంతర్యముంది. అది తెలుసుకోవాల నను కుంటున్నాను" అన్నాడు. ఆ వెంటనే "నిజం. ఎంతయినా మీరు పెద్దలు, అనుభవజ్ఞులు. ఆ మాత్రం తప్పక గ్రహించగలరన్నాడు. నేను చెప్పేది, మీకభ్యంతరమౌతుందేమోనని.... !" తన యధావిధి మందహాసంతో కృష్ణుడు... అంటూంటే -

"నాకభ్యంతరమా ? అలాగనుకోవద్దు. విషయం చెప్పు!" ప్రసన్న వదనంతో, వాసుదేవుని అడిగాడు. అయినా మనసులో శంక. అంటే నిన్నటి సమావేశంలోని,

సందర్భానికనుగుణంగా, మళ్ళీ ఆ పాండవులకు, బహుమాన మరియు.... సాయం కోరడానికి వచ్చావా ?'' అని పరీక్షగా కృష్ణుని చూసి'' కానీ -

"అదే.... ఆ పాండవుల విషయం.... అవునా ?'' అన్నాడు.

తలూపాడు కృష్ణుడు. "ఆదేశిస్తున్నావా ?'' ధిక్కరిస్తున్నాడు, సత్రాజిత్తు.

"లేదు. అర్థిస్తున్నాను'' కృష్ణుని సమాధానం.

"ఏది ఏమైనప్పటికి నా సంపాద, సంపదలు యావత్తు భగవత్ప్రసాదితము. ఇందులో ఎవరి దయా, దాక్షిణ్యాలు లేవు. కాబట్టి నేనెవరికి భయపడనవసరం లేదు. ఆ బెంగతో కృంగి చావవలసిన పని లేదు. ఇంకా చెప్పాలంటే ఇది స్వార్జితం. ఇందులో అన్యాయార్జితం ఏ కోశానా లేదు కాబట్టి అనవసరాలోచనలు, అప్రస్తుత ప్రసంగాలు, విచారణలు, సభలు - సమావేశాలు, సంప్రదింపులకు తావు లేదు,'' మొహమదోలాగ పెట్టి -

కనుక దీనిపై వాదోపవాదముల కవకాశం లేదు. నిష్కర్షగా చెప్పాడు. మళ్ళీ సత్రాజిత్తే "నా మాటలు కొందరికి కష్టమనిపించవచ్చును. బాధా కల్గించ వచ్చును. కానీ యదార్థం. "యదార్థవాది బంధువిరోధి'' అన్న సామెత, నా యందు నిజమవవచ్చును. కానీ, నేను - నా మాటలు - సర్వం సత్యం - అదురు బెదురు లేకుండా చెబుతున్నాడు.

"మీరు చెప్పినదంతా నిజమే కాదనను'' నవ్వుతూ సత్రాజిత్తుకు, వాసుదేవుడు సమాధానమిస్తున్నాడు. ఎవరు, ఎలాగ సంపాదించినా, అది స్వార్జితమే, పరార్జితం, వంచన, మోసం, దగా, మరేమీ కాదు. కాకపోతే - ధనం సంపాదించవచ్చును. అధికులుగా ప్రకటించుకోవచ్చును. ప్రముఖులుగా చెలామణి కావచ్చును. ఇది సమాజంలో - ప్రత్యేకతకు కారణమౌతుంది. కానీ-

"ఈ సంపదలను - వాళ్ళు, వాళ్ళ పరిధిలో సంపాదించుకుంటారు. దీనినెవరు, ఎలాగ సంపాదించినా సమాజదృష్టి - సేవారక్తి, ధర్మార్థముల యందాసక్తి - వితరణ, వివేక - జ్ఞానాదులవసరం. అతిధి - అభ్యాగత సేవ, అదునులో ఆదుకోవడం, అవసరాన్ని తీర్చడం.... కూడ - సమాజసేవగాను, భగవత్ప్రియంగాను వుంటుంది.

ఆర్జనకు - ధర్మార్థ కామమోక్షములు పట్టుకొమ్మలు. దీనిని విస్మరిస్తే ఎత్తిన జన్మ వృధా అవుతుంది. సంపాదన అన్యాయార్జితమౌతుంది. ఇవన్నీ పెద్దలుగా మీరు మాకు చెప్పవలసిన విషయాలు. కనుక....!''

"అంటే... ?'' వాసుదేవుని ధిక్కరిస్తున్నట్లు సత్రాజిత్తు ప్రశ్న. "క్షణమాగి'' వాసుదేవా! ఈ విషయంలో నా అభిప్రాయం నిన్ననే చెప్పాను. ఎవరేమనుకున్నా, నా నిర్ణయం నాది. అది మారదు!'' ఆ మాటతో అంతవరకు చిరునవ్వులు చిందించే వాసుదేవుడు.

"సత్రాజిత్తూ! పెద్దవాడివి. వయస్సులో, సంపదలో కూడా! పేదవాడివి ఏ రకంగాను కాదు. అయినా నీకొక విషయం గుర్తుచేస్తున్నాను. ఆనాడు ఇచ్చిన దేవుడు, నిన్నిప్పుడాదేశిస్తే... ఇస్తావా ? కాదని, ధిక్కరిస్తావా...!''

"ఏ దేవుడు తానిచ్చినది మరల తీసుకోడు ? అలాగ తీసుకుంటే వాడు దేవుడు కాదు. దానవుడు అవుతాడు.

"నిజం. అందుకు నిన్ను మానవునిగానే వుండమంటున్నాను. దానవునిగా కాదు! ఆలోచించుకో.'' అదొక రకమైన హెచ్చరిక. కానీ ఒక విషయం. మనుషులలో ఎన్ని వర్గాలెలాగ వున్నా కానీ, యాదవులు ధర్మపరులు. ధర్మమూర్తులు. ఇది మాత్రం సత్యం. ఒకరి వలన "ఈ సత్యం మాసిపోదు. ఇంకొకరి వలన అధర్మం, ధర్మమవదు. దారి మారదు. అది గుర్తుంచుకుంటే చాలు.'' అని ఇక తాను అక్కడ వుండటమనవసరమని, చెప్పి, లేచాడు.

దీంతో సత్రాజిత్తు ఏమనుకున్నాడో, ఏమో... వెంటనే ముఖంలోని అసహనం బదులు, సహనం, శాంతి, నవ్వులు పులుముకుని, "కూర్చో! కృష్ణా!'' అని ప్రీతిగా పలికాడు.

"కృష్ణా! ఒక్కమాట. జాగ్రత్తగా విను. యాదవుల ధర్మం, నీ ధర్మం. లోకధర్మం... వీటి వివరాలు నాకు తెలియవు. నాకు తెలిసిందల్లా, నా ధర్మం. అందరి నుండి అంతో, ఇంతో.... సహాయక చర్యలలో భాగం, వసూలు చేస్తున్నావు. అలాగే నన్ను అడిగావు. చాలా సంతోషం. కాని దీనికి రెండు షరతులున్నాయి.

మొదటిది. అనవసర విభేదాలతో మనలో మనం గొడవలకు పోయి, వారి ఆధిక్యాన్ని ప్రదర్శించే స్థాయికి చేరడం. దీనికి నేను సర్వ సన్నద్ధంగా వున్నాను.

నువ్విక్కడకు రాకుండా, లేదా పొరపాటున వచ్చినా, నీ అస్తిత్వాన్ని, ఆధిక్యతను నిలబెట్టడమే, నా ఆలోచన లేదా పగ - ప్రతీకార - ఆలోచన...!

ఇది వింటూనే "నన్నెదుర్కోవడం ఆ విధాతకే సాధ్యం కాదు!" కాబట్టి - రెండో విషయం చెప్పమన్నాడు.

"నేను మీరు కోరినట్లు నా భాగం నేను ఇస్తాను. అయితే దీనికి వెలకట్టి చెల్లించాలి" అన్నాడు. కృష్ణుడు చూస్తున్నాడు.

"ఎంత ఇవ్వాలి. ఎలాగివ్వాలి ?" ఇది కృష్ణుని ప్రశ్న.

ఈ మొత్తం సంభాషణాన్ని సత్యభామ వింటుంటే ఆమె వుద్దేశం - సాత్యకుడు, తనను కాదన్నాడు కాబట్టి ఏదో రకంగా కృష్ణుని ఒప్పించి, తననిచ్చి పెండ్లిచెయ్యాలని తండ్రి తలుస్తున్నాడేమోనన్న వుద్దేశంతో, ఆ సంభాషణలను వినసాగిందే తప్ప, వారిరువురి ఆరాట, పోరాట, కోపతాపాల ప్రదర్శన లేదా ప్రవర్తన ఆమెకు అవసరం లేదు.

"నేనడిగేది నువ్వు తప్పక ఇవ్వగలవు. సాధ్యమైనదే తప్ప అసాధ్యం కాదు!" సామరస్యపూర్వకంగా సమాధానపరచి, సందిగ్ధంలేని, సహాయమపేక్షించాలన్నది సత్రాజిత్తు ఆలోచనగా వుంది. ఆ వెంటనే కృష్ణుని ప్రశ్నలకు, అవసర ప్రసంగాలకు తావివ్వనీయకుండా -

"మా అమ్మాయి. సత్యభామ వుంది కదా ?" ఆ మాట వినడంతో -

నా తండ్రి ఇప్పుడు సరైన దారిలోకి వచ్చాడని, సంబరపడుతూ సత్య - ఆసక్తిగా మిగిలిన సంభాషణం కోసం చెవులు రిక్కించి, మరీ వింటుంది.

"మా అమ్మాయి సత్యభామకు వివాహం చెయ్యదలిచాను. అది - మీ స్నేహితుడు, నీ అనుచరుడు అభిమాని "సాత్యకి"తో. కాబట్టి, నువ్వు, నీ పలుకుబడిని, మైత్రీ ధర్మాన్ని వుపయోగించి, ఈ వివాహ కార్యక్రమం, దిగ్విజయం చేయించాలి. అదే నువ్వు నాకిచ్చే ధర. దాంతో వుభయులం సంతోషచిత్తుల మవుతాం...!" తన నిశ్చయాన్ని పూర్తి చేసాడో... లేదా... దబ్బున శబ్దం చేస్తూ సత్యభామ క్రింద పడిపోయింది. ఆ పడటంలో కొద్దిగా వరండా వెనుకనున్న తలుపు తెరుచుకుంది. అక్కడే సత్యభామ నిలబడి, చాటుగా, జరిగే యావత్తు దృశ్యంగా కాకపోయినా... సంభాషణల రూపంగా వింటుందనిపించింది.

"సాత్యకి మీ అమ్మాయిని వివాహం చేసుకోడేమో! మెల్లిగా అంటున్నాడు.

అది గమనించిన కృష్ణుడు "అది నాకనవసరం. నీ అవసరాన్ని బట్టి నువ్వు ముందుకడుగు వెయ్యి...!" కటువుగా కాదు కానీ, సమాధానం స్పష్టంగా వుంది.

అయిపోయింది. తన ఆశలన్ని అడియాసలైపోయాయి. కృష్ణుడు తప్పకుండా, నేను ప్రయత్నిస్తానంటే, ఇక ఈ జీవితం ఆఖరు. కాదంటే... అదొక యుద్ధం. ఇదేం బ్రతుకురా. భగవంతుడా" అనుకుందామె.

చేసేదేమీ లేదు. దాంతో మనస్సులో -"కృష్ణా! గోవిందా! వాసుదేవా, గిరిధారీ! నన్ను ఉద్ధరింపుము. ఈ అయోమయం నుండి బయటపడవేసి, విదర్భ రాజపుత్రికను స్వీకరించినట్లు నన్ను స్వీకరించు. నిన్ను ద్వేషించిన శైబ్యను, క్షమించినట్లు నన్ను కరుణించుము. కరుణాంతరంగా! నీ దయ, అత్యంతా వశ్యకము" అని ప్రార్థించసాగింది. అంతకుమించి మరో ప్రత్యామ్నాయం సత్యకు కనబడటం లేదు.

"ఇంతకీ సాత్యకుడు, నీ సంబంధమెందుకు వద్దన్నాడో తెలుసుకున్నావా?" ఇంతవరకు వచ్చి సత్రాజిత్తు - సాధించేదేముందన్నట్లు అడిగాడు.

"నాకు బాగా తెలుసు. ఆ ముసిలాడో మూర్ఖుడు. అతనో "అధికారి" అని, నన్ను నిగ్రహించగల శక్తివంతుడనని, ఆ మూర్ఖుని ఆలోచన. ఇప్పుడేదో నాకు ఆస్తి, అంతస్తులు లభించాయి తప్ప, ఏమీలేని అధికారం, వ్యక్తిత్వం లేని, పారుబోతు, పిరికిపందగా ఆ ముదుసలి తలుస్తాడు." అని గట్టిగా వూపిరి పీల్చుకుని -

నీ ద్వారా, సాత్యకిపై స్నేహ-బలదర్పాల శక్తిని ప్రదర్శించి, "సత్యభామతో వివాహం జరిపించి, ఆ ముసిలాయనను దెబ్బతియ్యాలన్నది నా పట్టుదల. ఇందులో కనుక విజయం సాధిస్తే, నీ ఆశయం సిద్ధిస్తుంది. నా పట్టుదల నెరవేరుతుంది" ఆవేశంతో సత్రాజిత్తు చెప్పుకుపోతున్నాడు.

"ఓ పెద్దాయనా! నీ ఆలోచనకు, నువ్వన్న ఆ ముసిలాయన ఆలోచన - నేరారోపణలకు సహస్రాంశం తేడా వుంది. అది నువ్వు తప్పక తెలుసుకోవాలి. అప్పుడే కార్యసాధన. కార్యసాధకులకు సంతృప్తి.... తెలిసిందా!" అన్నాడు. అదేదో తెలుసుకోవాలని సత్రాజిత్తు తహతహలాడుతున్నాడు.

# గుణపాఠం

**ము**ందు నిన్ను నువ్వు సంస్కరించుకో. నువ్వు అహంకారివి. సూర్య భగవానుడు కరుణించాడనే దురహంకారివి. నిత్యం బంగారమొసగే శ్యమంతక మణిని పొందాననే గర్వం, అయాచిత సంపదలపై ఆధిక్యత. నీకన్న యాదవులలో, ప్రముఖుడెవరూ లేరనే దుశ్చింత.

దీంతో నువ్వు అందరిలో అలుసైపోయావు. ఎవ్వరితోను కలువక, నీకు నువ్వే అధికుడననుకునే ఆత్మాభిమానం కాని, దురభిమానం, స్వోత్కర్ష - ప్రమాద స్థాయికి చేరి, ఎదుటివార్ని గడ్డిపరకగా చేసి చూసే స్థాయికి వచ్చావు.

అంతెందుకు, నిన్న మహారాజు సభలో వస్తుంటే అందరు లేచి నిల్చుని సాదర స్వాగతమొసగారు. మరి నువ్వో.... అందుకు విరుద్ధం. ఇదే యాదవులలో నీ స్థాయిని తగ్గించి, నిన్ను చికాకుపరిచేదయింది. అందరికి తెలియకుండా చులకనై పోతున్నావు.

"మీ అమ్మాయి మంచిదే. మొన్న విజయోత్సవంలో చూసాను. ఎంతమంచి పిల్లయినా తండ్రిచాటు పిల్ల. దాంతో తండ్రి మంచి చెడులన్నీ ఆమె మీద పడతాయి. ఆర్ష సంస్కృతిలో వివాహానికి ముందు తండ్రి ప్రభావం వివాహానంతరం భర్త ప్రభావం ఆడపిల్లమీద పడతాయి. ఈ కారణంగా, ఆ పిల్ల ఎంతమంచిదైతే ఏం లాభం, అది సత్రాజిత్తు కూతురురా ? అంటే నీలోని మంచి, చెడులన్నీ ఆ పిల్ల పరమేకా ?

సాత్యకుడు, వీరుడు క్షాత్ర ధర్మ పరిరక్షకుడు. నీలో ఆ ధర్మాలు లేవే ? ఎంతసేపు, "నేను, నా ఆస్తి" అనే అభిజాత్యం తప్ప - వీర - శూరత్వాల దర్పమేది ? అందరు తమ వీరత్వాన్ని ప్రకటింప పరుగెడితే, నీ కొడుకు, ఉన్నవాళ్ళ పిల్లవాడిలా ఇంట్లో కూర్చున్నాడు. గాజులు, పసుపుముద్ద - వేపాకులు, ఏ గంగమ్మ జాతరలో పాల్గొనే ఆడవాళ్ళకో ఇచ్చినట్లు, ఇన్ని కుంకుమ - పసుపు నీళ్ళతో ఇవ్వాలి. దీనికి తోడు ఆతని మిత్రులు ఆడంగులే. ఎదరించలేరు. వీరులవలె ముందుకు రాలేరు. ఎటు చూసినా నేను అవతలివారితో సమానమనడానికి, బంగారం, లెక్కలు తెలియని సంపద కొలమానం కాదు. అవి మన ఆధిక్యతను చాటుతాయే తప్ప, మానమర్యాదలను

రక్షించవు. గౌరవాదరాలను పెంపొందింప చెయ్యవు. ఇప్పటికైనా నీ స్థితి అర్థమైతే సంతోషం. ఇటువంటి దుస్థితి నుండి బయటపడవెయ్యడానికి, సమాజంలో నీకో వున్నత స్థానమివ్వడానికి, ఇంకా చెప్పాలంటే నిన్ను సంస్కరించడానికి వచ్చాను. ఇక్కడికి వచ్చి నేనెంత తప్పు చేసానో... అని... ఇప్పుడు బాధపడుతున్నాను.

“సత్రాజిత్తు! పిల్ల పెండ్లిని కూడా వ్యాపార దృష్టితో చూసి, అల్లుని నీ ఇంట పశువులా కట్టేసుకోవాలనే ఆలోచన వుంది. చూడు ?! అది అధిక్షేపణీయం. ఇది తెలిసిన ఎవ్వడు నీకు అల్లుడు కాడు. అప్పుడు నీ పిల్ల స్థితి ఏమవుతుందో ఆలోచించుకో. పొరపాటున ఎవరైనా వచ్చినా, నీ సంపద కోసం వస్తారు. పెళ్ళి చేసుకుని నిన్ను చావగొట్టి నీ సంపద తీసుకుని పారిపోతారు.

“అందాల సుందరి, నా “బంగారే” అనుకున్న నీ బంగారు సత్యభామ బ్రతుకు బండ బారుతుంది. ఆలోచించుకో, ఆలోచించుకుని ఆమెకు నచ్చిన వానికిచ్చి వివాహం చెయ్యి. తద్వారా నీ పెద్దరికాన్ని నిలబెట్టుకో, వస్తా”నని లేస్తాడు.

“వెళ్ళవచ్చును. అభ్యంతరం లేదు. కానీ ఒక విషయం. సమాజంలో బ్రతుకాలంటే సంపద కావాలి. క్షాత్రము - ధర్మము - అది ఒక్కటే బ్రతికించదు. నువ్వు చెప్పినట్లు నా పిల్ల చాలా మంచిది. పరిస్థితుల కనుగుణంగా తప్పక మారుతుంది... కాదంటే అవతలి వ్యక్తినన్నా తన దారికి తెచ్చుకుంటుంది. అంత...

“అవునవును. సంపదలలో పెరిగిన ఆ బంగారు పిల్లకు, బంగారు గ్లాసులలో నీళ్ళు త్రాగే ఆ పిల్ల సాత్యకుని సంబంధం కలుపుకున్న మరుక్షణం “మనమిక్కడ వుండలేము. హాయిగా మా ఇంటికి మా నాన్నగారింటికి వెడదాం. అక్కడ మనకు కావలసినవన్ని దొరకుతాయి. మనం మహారాజులవలె బ్రతుక వచ్చునని, ఆ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసి, వారి గుండెలు బ్రద్దలు కొట్టి, నీ దగ్గరకు వస్తుంది. అదే కదా నీ ఆలోచన!

“సత్రాజిత్తూ! మీసమున్నవాడు, రోషమున్నవాడు, అసలు సిసలైన మగవాడు, భార్యతో తన స్వతంత్ర జీవనంతో బ్రతుకాలనే తలుస్తాడు తప్ప - ఏ దౌర్భాగ్యుడో తప్ప - నీవలె మరెవ్వరు ఆలోచించరు.

“కాకపోతే...!” ఇది కృష్ణుని సందిగ్ధత...

“కాకపోతే, చెప్పు. ఏం చెయ్యాలి ?”

"ఏమైనా చేస్తావా ?"

"తప్పక చేస్తాను... నా కూతురి కోసం...!"

ఒక్క క్షణమాగాడు. సత్రాజిత్తును ఎగాదిగా చూసాడు.

"నీ కూతురి కోసం...!" మెల్లిగా చెబుతున్నాడు.

"ఆ... నాన్నుడు, నసుగుడిని భరించలేని సత్రాజిత్తు... "నా కూతురి కోసం...!" చెప్పు... వినడానికి హడావుడి పడిపోతున్నాడు.

"సూర్యభగవానుడు నీకిచ్చిన శ్యమంతకమణిని విడిచిపెట్టుకోగలవా...!" అతి ప్రశాంతంగా... అడుగుతుంటే...

అదొక పెద్ద పిడుగుపడ్డట్లు తలంచి "కృష్ణా!" గట్టిగా, ఆ ప్రదేశమంతా అదిరిపోయేటట్లు అరిచాడు.

"అవును, కృష్ణుడినే. నీ ఆశామూర్తినే.... ఆలోచించుకుని...!" అంటూంటే...

"వద్దు, ఆలోచన వద్దు. దీనిని అవకాశవాదమంటారు. ఈ విధంగా నన్ను దెబ్బతియ్యాలని మీ అందరి ఆలోచన. పిల్లపేరు చెప్పి, భగవంతుడు నాకు ఎంతో ప్రేమతో ఇచ్చిన వరాన్ని - సంతానం కోసం... ఇవ్వను. ఇవ్వలేను. ఈ ఆలోచన తగదు....!" తనను తను మరచి పిచ్చివాడివలె, రెచ్చిపోతున్నాడు.

"సత్రాజిత్తూ! పెద్దవాడివి, కంగారుపడక. నీ అభీష్టానికి విరుద్ధంగా ఏమీ జరుగదు. నీ అవసరానికి నువ్వొక బేరం పెట్టావు. నా ధర్మానికి నేనొక పద్ధతి చెప్పాను. ఇది ఇరువురికి ఇష్టమైనప్పుడే కదా, సిద్ధాంతాలు కలవడం. ఒక అంగీకారానికి రావడం. అప్పుడా బేరం కుదరడం.

"అయితే...!"

"అయితే...నని, మేమైనా అన్నామా, చెప్పామా ? నువ్వేకదా... దీనికి సిద్ధమైతే... అని... ఒప్పంద విషయం చెప్పావు నీ పిల్లంటే నీకు ప్రాణం. ఆమె సుఖంగా వుండాలన్నది నీ ఆలోచన. అది నెరవేరాలంటే, అంతా నువ్వనుకున్నట్లే జరగాలంటే, నేను చెప్పినట్లు చెయ్యి. కాదంటే నీ ఇష్టం. ఇందులో ఎవరి బలవంతము లేదు. పిల్లలకంటేనా, సిరిసంపదలు... ఇతర...!"

"అంటే.... నా శ్యమంతకమణి, శ్యమంతకమణిని పణం పెట్టమంటావా...?"

"నాకెందుకయ్యా నీ శ్యమంతకం, నీ సత్యభామ. ఒక ఒప్పందానికొచ్చిన వాడవు నువ్వు. అది కావాలో, అక్కర్లేదో కూడా తేల్చుకోవాల్సినవాడవు నీవు. అంతే కాని మేమేదో నిన్ను ఇబ్బంది పెడుతున్నట్లు మాట్లాడటం, సభ్యత, సంస్కారం కాదు.

నీవంటివారి వద్దకంటే ఆ శ్యమంతకం, అక్రూరుల వంటి పుణ్యాత్ముల వద్దనో, మహారాజు ఉగ్రసేనుల వద్దనో వుండటం చాలా మంచిది. లేదంటే రాను రాను అది నీ ప్రాణాలకే ప్రమాద కారణమౌతుందది.

"అంటే... నువ్వు నన్ను చంపుతావా ? అప్పుడు నిన్ను బ్రతుకనిస్తానా!" ఆవేశం, ఉక్రోషంతో తనను తాను మరచిపోతున్నాడు. తరతమ భేదాలు విడిచిపోతున్నాడు.

"నీ శ్యమంతకంతో నాకవసరం లేదు, రాదు కూడా! నీవంటివారి మనస్తత్వమే, ప్రాణానికి ప్రమాదకారిగా, ఆ శ్యమంతకం తయారు చేస్తుంది. "కృష్ణుని మాటలు వినలేక, "నిన్ను.... నిన్ను...!" సత్రాజిత్తు రెచ్చిపోతున్నాడు.

ఆ పరిస్థితి శృతి మించుతుందని తలచిన సత్య "నాన్నా, ఏవిటి ? ఎవరితో మాట్లాడుతున్నావు, నీవు ? ఈ గోవిందునితోనా ? ఇతడు సామాన్యుడను కున్నావా ? పసితనంలోనే ఘోర రాక్షసులను చంపి గోకులాన్ని, గోప బాలురను రక్షించిన ఘనుడు.

ఇంద్రుని ఎదిరించి, ఏడురోజులపాటు చిటికెన వ్రేలుపై గోవర్ధన పర్వతాన్నెత్తిపెట్టడం ఇంద్రజాల, మహేంద్రజాల విద్యలు కావు. కంస, చాణూరాదులను వధించడం, దిక్కు లేకుండా ఎందరో యాదవులను మళ్ళీ మథురకు రప్పించిన, మహనీయ చరితుడు. అటువంటి గోవిందుని....!" తప్పు చేస్తున్నావని, తండ్రిని హెచ్చరిస్తుంది.

సత్యభామ పెంకితనం తెలుసుకాని, ఇంత కోపాన్ని సత్రాజిత్తు, ఆమెలో ఎప్పుడు చూడలేదు. ఆశ్చర్యపోయాడు. అంతముందు వరకు, అగ్గిగుగ్గిలమైన సత్రాజిత్తు తక్షణం ఏం సమాధానమివ్వాలో తెలియక తికమక పడటం ప్రారంభించాడు.

"సత్యా!" ఆ పిలుపుకు, భామ పరవశించి పోయింది. మీ నాన్నగారు నన్నేదో చేద్దామనుకుంటున్నారు. చెయ్యనీ. ఇప్పుడు నువ్వు అడ్డం పడ్డావనుకో,

అత్తమీద కోపం దుత్తమీదన్నట్లు.... నీపై విరుచుకుపడతాడేమో, నిజమేనా సత్రాజిత్తు, మహాశయా!"

అంతకుముందు వరకు కృష్ణుని కదలకుండా చేసి, వాసుదేవుడు అసమర్థుడనుకుని తన ప్రతాపం చూపుదామనుకున్న సత్రాజిత్తు - ఇటు కుమార్తె ఆగ్రహం, అటు ఆ వసుదేవసుతుని నిగ్రహం, వ్యంగ్యం, నిరాశా నిస్పృహలకు గురి చేసింది. అసమర్థత, చోటు చేసుకుని, అశక్తతను ప్రకటించుకుంది.

సత్య తండ్రి ప్రక్కనే కూర్చుంది. ఆమె ప్రక్కన ఆమె అభిమాన ప్రియమైన పిల్లి కూర్చుంది. భామ ఎప్పుడైతే, తండ్రి ప్రక్కన కూర్చుందో, అప్పుడు, వారింట్లోని స్త్రీ జనమంతా కృష్ణుని చూడాలని గబగబ తలుపులు తెరచుకుని వచ్చారు. ఆవేశంలో తండ్రి చేతులు వణకడాన్ని గ్రహించిన సత్యభామ, ఆతన్ని పట్టుకుంది. మెల్లి మెల్లిగా స్వస్థతకు వస్తున్నాడు. ప్రస్తుతం ఆవేశం సత్రాజిత్తులో తప్ప ఇంకెవరిలోను లేదు. వాతావరణం ప్రశాంతంగా వుంది. ఈ హడావుడికి భంగాకరుడు, శతధన్వుడితో పాటు, వైదిక కార్యక్రమాలను నిర్వహించే బ్రాహ్మణోత్తములు పరుగు పరుగున వచ్చి, కృష్ణునితో, సత్రాజిత్తు ప్రవర్తించిన తీరుకు నిరసనగా అతన్నే చూసారు.

దీంతో అందరు, మౌనంగా నిలబడిపోయారు. ఇది కృష్ణునికెంతో వుపకారి అయింది. కోపం కార్యనాశనానికి, ధర్మనాశనానికి దారి చూపుతుందన్న సత్య మెరిగిన, ధర్మపరిరక్షకునిగా ముద్రపడిన వాసుదేవుడు,.... తాను క్షణకాలం మౌనంగా వుండిపోయాడు. ఆ తదుపరి -

"యాదవ మహారథి, సాత్రాజిత్తూ! అజ్ఞానం వలన, నిన్ను - నువ్వు మరచిపోతున్నావు. ధర్మానికి హాని సల్పుతున్నావు. నీ వరకు అది మంచిదవ వచ్చును. కానీ అది తగదు. కొద్దిగా నిన్ను నీవు నిగ్రహించుకుంటే నిజం బోధపడుతుంది. అజ్ఞాన అంకురాలు నశిస్తాయి. జగత్ప్రసిద్ధుడవవుతావు. నిన్ను, నీ గొప్పతనాన్ని, ద్వారకలోని యాదవులందరు మెచ్చుకుంటారు.

తద్వారా, ఎక్కడెక్కడి యాదవులు నిన్ను గుర్తించి గౌరవిస్తారు. ఇది సత్యం. కనుక...!" కృష్ణుని, సత్య ప్రవచనానికి, సత్రాజిత్తు స్పందించలేకపోతున్నాడు.

మాట్లాడాలని వుంది కాని, మాట రావడం లేదు. ఇక అక్కడ వుండటమనవసర మనుకున్నాడు కృష్ణుడు.

"సత్రాజిత్తు! పరిస్థితి అర్థం చేసుకో. కార్యసాధకులకు ఆవేశం తగదు. ఆలోచన ముఖ్యం. నీ మనోభీష్టం నెరవేరాలంటే, రేపు సాయంకాలంలోగా శ్యమంతకమణిని అక్రూరుల వారికివ్వు. నువ్వు సంరక్షించబడతావు. లేదంటే, నేను దానిని తీసుకుని, వారికందించాల్సి వస్తుంది. ఆలోచించుకో, ఆవేశం తగదు." అని రెండు చేతులు జోడించి నమస్కరించి వెనుదిరిగాడు.

మర్యాద పూర్వకంగా శ్రీకృష్ణుని, ద్వారం వరకు వెళ్ళి సాగనంప భంగాకరుడు బయలుదేరాడు. అది గృహస్థ ధర్మం. ఇంటికి వచ్చిన వారిని ఆహ్వానించడం, వెళ్ళే ముందు కొన్ని అడుగులు వేసి సాగనంపడం, సాంప్రదాయం.

వీళ్ళతో సత్యభామ బదులు, ఆమె ప్రియమైన పిల్లి ఊర్వశి కృష్ణుని అనుసరించి, తన అభిమానాన్ని చాటుకుంది.

సత్రాజిత్తు నిగ్రహించుకోలేకపోతున్నాడు. శరీరమంతా వణుకుతుంది. పరిస్థితినర్థం చేసుకోలేని పరిస్థితిలో వున్నాడు. దాంతో, ప్రక్కన కూర్చుని తండ్రి చెయ్యి పట్టుకుని ఓదారుస్తూంది.

కొన్ని నిముషాలు అలాగ వుండిపోయిన సత్రాజిత్తు భయంకరమైన కల నుండి బయటపడినట్లు తెప్పరిల్లి, తన మెడలోని శ్యమంతకాన్ని చూసుకున్నాడు. స్థిమిత పడ్డాడు. తేరుకున్న కొద్దిక్షణాలకు సత్రాజిత్తు, కొద్దిగా ధైర్యం పుంజు కున్నాడు. "అమ్మా! నన్ను దేవాలయానికి తీసుకువెళ్ళమని అడిగాడు.

"అలాగే" నందామె. ఇద్దరు లేచారు.

సత్య భుజంపై చెయ్యివేసి, సత్రాజిత్తు మెల్లిగా నడుస్తున్నాడు. ఇద్దరు గర్భగుడిలోకి వెళ్ళారు. పూజారులను వెళ్ళిపొమ్మని తలుపులు మూసుకున్నాడు. సూర్యగాయత్రిని మెల్లిగా స్మరిస్తున్నాడు.

**"భాస్కరాయ విద్మహే, మహోద్యుతికరాయ ధీమహి,**
**తన్నో ఆదిత్యః ప్రచోదయాత్!"**

మంత్రానుష్ఠానం జరుగుతుంది. అస్తవ్యస్త అయోమయ, అగమ్య పరిస్థితులలో వున్న ఆతని మానసం, ప్రశాంతతను పొందడానికి, సత్యాన్ని గ్రహించ డానికి, ఇంతకంటే మరొక మార్గం దొరకక మంత్ర పునశ్చరణం చేస్తున్నాడు.

ప్రక్కన వున్న సత్యను, లేచి వెళ్ళిపొమ్మని చేతితో సంజ్ఞ చేసాడు. అది గ్రహించిన భామ, అక్కడ నుండి బయటికి వెళ్ళింది. ఒక్క ఇరవై నాల్గు నిముసాలు గడిచాయి. అతనికి కావలసిన ప్రశాంతత, స్థిరత్వము లభించాయి. ఇక ఒకరితో పనిలేనట్లు మెల్లిగా లేచి నడుస్తున్నాడు. ఇప్పటికి, ఇందాకటికి ఎంతో తేడా. ఆందోళన, ఆవేదన స్థానంలో ఇప్పుడు ప్రశాంతత చోటు చేసుకుంది. సత్రాజిత్తుకు ఆనందంగా వుంది.

"రా, అమ్మా! బయలుదేరుదాం. సత్య, తండ్రి పరిస్థితికి సంతోషించింది. ప్రశాంతత పొందినందులకు పరవశించింది. మామూలుగా వాళ్ళు బయలు దేరారు. తొందరగా ఇంటికి వెళ్ళి అందరు, మామూలుగా, భోజనాలకు కూర్చున్నారు. అందరిలో ఆందోళన స్థానంలో, ఆనందం పురి విప్పింది. అందరు సంతోషంగా భోజనాలు చేసారు. ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

సత్య, ఆమె పిల్లి ఊర్వశి, తమ గదిలోకి వెళ్ళారు. అప్పుడు, సత్య, ఊర్వశి, చెవి పట్టుకుని మెలివేస్తూ "ఏవిటే వేషాలు వేస్తున్నావు ? నన్ను కాదని నేను అభిమానించే ఈ కృష్ణుని వెనుకబడి, నన్ను వెనుకబడేసావా ? అవునే - ఈయన మీ పిల్ల చాలా మంచిపిల్లని మెచ్చుకున్నాడు కదా! క్షత్రియ ధర్మాలంటే అవేమిటో... మనం తెలుసు కోవాలి. ఆ రకంగా వుండాలి" అంటూ చెవి పట్టుకుని నులుముతూ, వాసుదేవుడు, తెలిపిన విధంగా వుండాలనుకుంటుంది.

అప్పుడే కదా, ఆయన మానసచోరిణిగా వుండగల్గుతాను. అలాగే వీరనారి కుండవలసిన లక్షణాలు కూడా నేర్చుకోవాలి. మరి గోవిందుడు మహానుభావుడే కదా! మరీ ఆయనను అనుసరించాలంటే, అందుకు తగిన వాతావరణమేర్పాటు చేసుకోవాలి కాదా! లేకపోతే సపత్నుల మధ్య చులకనైపోతాం కదా!

ఆమె విదర్భ రాజకుమారి, పట్టమహిషి. మరి, నేను ఎటొచ్చి సామాన్యురాలిని. డబ్బు వుండటం వేరు. దర్పం వేరు. ఇవన్నీ మా నాన్నకు తెలియవు. చెప్పిన అర్థం చేసుకోని మూర్ఖత్వంతో, నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళంటాడు. వుంటే రెండు వుంటాయి. లేకపోతే నాలుగు వుంటాయి. మూడు వుండవు కదా! ఆ మాత్రం లోకజ్ఞానం లేని పెద్దాయన ఆయన.

చెబితే వినడు. అర్థం చేసుకోడు. కర్మ. కర్మమని స్వగతం మొదలు పెట్టుకున్న సత్య, ఆ ఆలోచనలతో సాయం సమయమయింది. మామూలుగా అలంకారం చేసుకుని ముందు దేవాలయానికి, తదుపరి పినతల్లి ఇంటికి వెళ్ళడం ఓ నిత్య కార్యక్రమం. బట్టలు మార్చుకునే సత్యభామకు ఉదయం జరిగిన సంఘటనలు... అందులో ముఖ్యంగా తండ్రి ఆ గోవిందుని, చంపాలనో లేక దెబ్బతియ్యాలనో చేసిన ప్రయత్నం, నిజంగా క్షమించరానిదనుకుంది.

దేవుడనే వాళ్ళిలాగ ప్రవర్తిస్తారో లేదో కానీ కృష్ణుడు మాత్రం నిజంగా దేవదేవుడు. ఎంత శాంతమూర్తి ఎంత వినయ, వివేకమూర్తి కాకపోతే ఏ మాత్రం కోపం తెచ్చుకోకుండా, తొందరపడిన నా తండ్రిని క్షమిస్తాడా ? నిజంగా కృష్ణుడు చాలా గొప్పవాడు. ఇంకా చెప్పాలంటే, నిజంగా దేవతాశ్రేష్ఠుడే!

తండ్రిది ఎంత తప్పో. కృష్ణుడు కూడా కొంతవరకు కష్టపడి తపస్సు చేసి సంపాదించుకున్న శ్యమంతకమణిని, రాజుగారికివ్వు. లోకక్షేమమంటే, వచ్చే సంపదను పోగొట్టుకోవడానికి ఏ వెర్రివాడు ఒప్పుకుంటాడు. అయినా ఇందులో కృష్ణుని తప్పు లేదు. ఎందుకంటే, పాండవుల కిమ్మన్న సంపదకు సాత్యకితో తనకు వివాహం చేయిస్తే, నీవడిగినదిస్తానంటే కదా, ఈ సమస్య ఏర్పడింది. ఇది నిజంగా మా నాన్న తప్పే.

సాత్యకునికివ్వనంటే, మహారాజుకిమ్మని కృష్ణుడు నీ సమస్యకు తప్పక పరిష్కారం లభిస్తుందన్నాడు. పిల్లల మీద ప్రేమ వేరు. నిత్యం పొందే ఎనిమిది బారువుల బంగారం వేరు. నిత్యం ఎనిమిది బారువుల బంగారమంటే..మాటలా ? అంతటి విలువైనది పిల్లల ప్రేమ కోసం పణంగా పెడతామా ? మాటలు వేరు, చేతలు వేరు.

అదే మా నాన్న నిరూపించి, కృష్ణుని అనవసరంగా రెచ్చగొట్టాడు. పైగా మంచి చెప్పబోయి, మంచి చెయ్యబోయి, పదిమందిలో పరువు నిలబెట్ట దలచి, సభ్య సమాజంలో ఓ మనిషిగా గుర్తింపునివ్వాలని వస్తే -

ఆ మహనీయుని, ఈ తండ్రి కొట్టబోవడం నిజంగా తల్చుకుంటే మహా ఘోరం. మనిషి జన్మకు అవమానకరం. ఇంత నీచంగా, అనవసర ఆవేశం కోపతాపాలతో, మానవత్వం మరచి, తన తండ్రి ప్రవర్తిస్తాడని, తాను ఏనాడు అనుకోలేదు. అంతటి నీచాతినీచంగా ప్రవర్తించాడు. విన్నవారెవ్వరు హర్షించరు సరికదా! పెద్దన్న బలరాముడికి తెలిస్తే...

అసలే నాన్నంటే అగ్గిగుగ్గిలమయ్యే అతడు, తప్పక చావగొడతాడు. ఒక్క పిడికిటిపోటు చాలు మా నాన్న చావడానికి. ఈ ఆలోచనలతో దేవాలయానికి, అటునుండి కృతవర్మ వాళ్ళింటికి వెళ్ళింది. అప్పటికే సత్రాజిత్తు నీచప్రవర్తన అందరికి తెలిసిందనుకుంటాను. రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు. సత్యభామను చూడగానే, మాట్లాడకూడదన్నట్లు, అసహ్యంగా చూసారు.

కృతవర్మ ఇంటికి వెళ్ళేసరికి సత్యభామను పురుగులా చూడటం ప్రారంభించారు. ఒకరిద్దరు మాత్రం "నిజమేనా, మీ నాన్న కృష్ణునితో అంత మూర్ఖంగా ప్రవర్తిస్తాడా ? నిప్పును మూటకట్టుకుంటున్నానని తెలుసుకోవడం లేదేమో! ఇలాగ చేసే కదా కంసుడు తన చావును కొని తెచ్చుకున్నాడు.

ఆ మాటల్ని వినలేకపోతుంది.

ఎంతయినా తండ్రి. అయినా మహా పాపాత్ముడు. ఉదయం కృష్ణుడు చెప్పినట్లు, తండ్రి పేరున, తాను అప్రదిష్ట పాలవుతున్నానని బాధపడింది. కృతవర్మ ఇంట్లో అందరు కూడా సత్యను నిరశించేవారే. ఇంతటితో పోలేదు. వూళ్ళో ఎక్కడికి వెళ్ళినా "ఈ మహాతల్లి" పరమపాపి సత్రాజిత్తు కూతురు. అవ్వ - ఆ సత్రాజిత్తుకు సూర్యుడు శ్యమంతకమణిని ఇచ్చాడని...

దానిపేరుతో నాకు నిత్యం ఎనిమిది బారువుల బంగారం లభిస్తుందని, నా వంటి గొప్పవాడు, సంపన్నుడు మరొకరు లేడని ఇంకా చెప్పాలంటే, ఆ మహారాజు సంపదలు కూడా నా ముందు దిగడుపని విర్రవీగుతున్నాడురా. ఎంత సూర్యుడు శ్యమంతకమణినిచ్చినా, ఈ సూర్యునికే దేవుడైన మన కృష్ణయ్యను, లోకరక్షకుని, అవతార పురుషుని, ధర్మమూర్తిని నిరశిస్తాడా...

పోనీ నిరశించాడంటే, పోనీ వాడి కర్మమనుకోవచ్చును. కానీ, కానీ, కృష్ణుని కొట్టడానికి సిద్ధపడ్డాడంటే వాడికి పోగాలము దాపురించైనా వుండాలి. లేక శ్రీకృష్ణుని దివ్య చరణారవిందముల అన్ని రకాల గర్వమణిగిపోయి, అతి విశ్వాసమొందే రోజులైనా దగ్గర పడి వుండాలి" అనే రకరకాల వ్యాఖ్యానాలను...

సత్యభామ వినలేకపోతుంది. తల ఎత్తి ఇదివరకటిలా ఛెంగు, ఛెంగుమని లేడిపిల్లలా ఎగురుతూ వెళ్ళలేక పోతుంది. ఇదంతా కేవలం కొన్ని గంటల

సమయంలో తనకు పట్టిన దురదృష్టమని బాధపడింది. ఇక ఎటు తిరగలేక ఇంటికి వచ్చిందే కాని, ఆ ఇంట్లో కూడా, స్మశాన నిశ్శబ్దం. ఎటు చూసినా క్షణాలలో ఏర్పడిన వూళ్ళోని ఉద్రిక్త పరిస్థితికి, ఇంట్లోని అప్రకటిత నిశ్శబ్దానికి - శాంత యుద్ధ వాతావరణానికి తల్లడిల్లిపోతుంది.

ఇక ఈ ఇంట్లో కృష్ణుని, తన భర్తగా వూహించుకోవడం, తన తండ్రి ఆయనను వరునిగా తలవడం జరగదన్నట్లుంది పరిస్థితి. ఆ ఇంటి నాలుగ్గోడలు దాటితే, వీళ్ళు... ఫలానా... అని చెబితే కూడా బ్రతికి బట్టగట్టే స్థితి కనబడటం లేదు. ఇంత దారుణ విపత్కర పరిస్థితి నెదుర్కోవలసి వస్తుందనీ ఏ విధంగాను తలంచని సత్యభామ -

ఆ కుటుంబ సభ్యుల మాట ఎట్లాగున్నా, పరిస్థితులీ విధంగా విషమిస్తాయని తలవకపోయిన సత్యభామ, ఆ మర్నాడు - అతి కష్టం మీద తన నెచ్చెలి సుభద్రను, ఒక్కసారి కృతవర్మ గారింట్లో కలుసుకొమ్మని కబురంపింది. ఉదయమల్లా వూరుకుని, సాయంకాలం - ఇటు సూర్యదేవాలయం, అటు పిన్ని గారింటికని బయలుదేరింది.

దారి పొడుగునా అవమానాలే అన్నట్లు, ప్రతి ఒక్కరు వెక్కిరించినట్లు గ్రుచ్చి గ్రుచ్చి చూసేవారే. చివరకు ఆ వూళ్ళో సత్రాజిత్తు పరిస్థితి ఎంత దయనీయంగా మారిపోయిందంటే, కత్తులు - కర్రలు పట్టుకున్న యాదవ బృందాలు "మహారాజా! సత్రాజిత్తును మీరు శిక్షిస్తారా ? లేక మేము కలుగ చేసుకోమా ? అని అడుగుతున్నారు.

కృష్ణుని ధిక్కరిస్తే, పోనీలే పొరపాటో, గ్రహపాటో అనుకోవచ్చును. కృష్ణునిపై చెయ్యి చేసుకునే స్థితికి వచ్చాడంటే నెత్తిన కొరివిని పెట్టుకోవడమో, ఒడిలో నిప్పుల మూట గట్టుకోవడమో చేసినట్లు, తన పరిస్థితిని తనంతట తానే దిగజార్చు కున్నాడు. ఇక వాడికి అతి త్వరలో బ్రతుకుపై ఆశ చల్లార్చుకున్నట్లే!

సత్రాజిత్తును ఆ సూర్యుడు కూడా రక్షించలేడు. ఏ దేవుడు దగ్గరకు రాడు, కూడా! ఇవన్నీ వింటూన్న సత్యభామ గడగడ వణుకుతుంది. ఈ పేరుతో తనను కూడా "అమ్మో!" భయపడిపోతుంది. దడతో గడగడ లాడుతుంది. ఇక కృతవర్మ గారింట్లో సుభద్రలో గతంలోని చిలిపితనం లేదు. చిర్రెత్తి తాను కనబడితే, మీదపడి పీక కొరికే ఆడుపులివలె వుందామె.

చూస్తుండగా పరిస్థితి ఎలాగ దిగజారిపోయిందో తలచుకుని సత్యభామ డీలా పడిపోయింది. అసలు నీ మొహం చూడకూడదు. కానీ, నీ తండ్రి దుడుకు ప్రవర్తనకు నువ్వు అడ్డుకట్ట వేసావన్న కొద్దిపాటి గౌరవంతో నిన్ను చూడటాని కిష్టపడ్డాను.'' నిక్కచ్చిగా చెప్పింది. ప్రస్తుతానికే సమాధానం చెప్పలేని సత్య మౌనవ్రతం దాల్చింది.

మహాత్ముల - సత్వగుణమూర్తుల కోపం క్షణకాలమన్న సత్యానికి నిదర్శనంగా కొద్దిసేపట్లోనే సుభద్ర శాంతించడంతో, మెల్లిగా ఆమెతో వీరుల భార్యల విజయగీతాలు, వీరగీతాలు పాడుతారుట, అవి నీకొచ్చా...?! అడిగింది. సుభద్ర అదోలాగా చూసింది. ఆ చూపుల్ని గమనించిన సత్య - ఎందుకంటే నిన్న ఉదయం...

మా నాన్నగారి ప్రవర్తనను అధిక్షేపిస్తూ మీ అన్నయ్య - క్షత్రియ ధర్మాలు, వీరుల విజయగీతాలు, వీరగీతాలు. నీకు తెలుసా ? నీ పిల్లకు తెలుసా ? అందంగా వున్నంత మాత్రంలో అణకువ, చిత్తశుద్ధి వుండాలన్న నియమేమీ లేదు'' అని వెక్కిరించారు.

మీ అన్నయ్య చెప్పింది అక్షరాలా నిజం. నాకేమీ రాదు. తెలియదు. నాకు తెలిసింది డబ్బుందన్న పొగరు తప్ప, కాకపోతే, ఈ మధ్య మీతో చేసిన సహవాసం వలన కాస్త మనిషినయ్యాను. సత్య సత్య మొప్పుకుంది.

అందుకే - "అవి నీకు తెలిస్తే నీ ద్వారా తెలుసుకుని నేర్చుకుందామని అడిగాను. ఎంత పెంకిపిల్లనయినా, ముందు ముందు మీ అన్నయలాంటి వారిని కట్టుకుంటే వాటి అవసరముంటుందని అడుగుతున్నాను. ఇదివరకు దూకుడుగా ప్రశ్నించి, పలకరించే సత్య, పిల్లి పిల్లయిపోయింది. మెల్లగా ప్రార్థిస్తున్నట్లు అడుగుతుంది.

సుభద్ర వీరగీతాలు, విజయగీతాలు అయిష్టంగానైనా పాడి వినిపించింది. విన్న సత్య ఆవేశంతో పులకరించింది. పాడటం పూర్తి చేసిన సుభద్ర "అయినా నీకెందుకీ వీరగీతాలు. హాయిగా మీ నాన్నగారి దగ్గర మూలిగే డబ్బుమూటలను లెక్కపెట్టుకుంటూ కూర్చోక!'' అంది.

ఇదే మరొకప్పుడైతే దీటుగా సమాధానమివ్వగల సత్య - ప్రస్తుతం నోరు మెదపలేక, అక్కడ వుండలేక ఇంటికి బయలుదేరింది. తీరా ఇంటికివస్తే ఇదో

నరకంలాగ వుంది. ఎవ్వరు నోరు విప్పరు. మాట చెప్పరు. అందరు గొణుగుళ్ళే. తండ్రయితే ఎవరికి ముఖం చూపడం చెల్లక, పూజామందిరంలో తలుపులు బిగించుకుని కూర్చున్నాడు.

అప్పుడామెకు డబ్బున్నవారి పిల్లల బ్రతుకులిలాగే వుంటాయేమోనని అనిపించింది. ఇక ఆమెకు నేస్తం - ఆ పిల్లి ఊర్వశి. ఇదీ లేకపోతే తానేమయ్యే దాన్నో అనుకుంది. అంతలో -

ఓ గాఢ నిట్టూర్పు! బరువుగా నడిచే, గడిచే కాలం!

★ ★ ★ ★

ఉన్నట్టుండి, ప్రక్కనే పడుకున్న పిల్లి లేచి పరుగెత్తింది. సాధారణంగా ఎలుకల వాసనను బట్టి పిల్లులలాగ పరుగెడతాయి. కానీ ఇప్పటి పరిస్థితి వేరనిపించింది సత్యకు. ఈ ఊర్వశికి ఏదైనా ప్రమాద సంకేతమనిపించినా కూడా అలాగే అదిరిపాటుతో పరుగెడుతుంది.

ఆ పిల్లిని, ఈ పిల్ల, మెల్లిగా పిల్లిలాగే అనుసరించింది. రాత్రి భాగం కదా, కొద్దిగా చీకటి, అస్పష్టంగా ఏవో రెండు ఆకారాలు. దాంతో, స్తంభం చాటున నక్కి నక్కి చూస్తుంది. ఆ ఆకారాలు, ఒకటి తన తండ్రిది. రెండోది, పినతండ్రి ప్రసేనునిది. ప్రక్కనే రెండు గుర్రాలు.

ఆ పరిస్థితేమిటో.... వాళ్ళేం చెయ్యదలచుకున్నారో. జరిగిన అవమానం చాలక, ఇంకే అప్రతిష్ట కొనితెచ్చుకోదలిచారో, సత్యకు అర్థం కావడం లేదు. బొమ్మలాగ చూస్తుంది. పినతండ్రి తన తండ్రితో ఏదో మాట్లాడాడు. వెడుతున్నట్లు చేతులు వూపాడు.

ఒక గుర్రాన్ని తాను ఎక్కాడు. మరో గుర్రం మీద ఎవరో అడ్డంగా పడి వున్నారో... అవి కదలడంతో, సత్రాజిత్తు వెనుతిరిగాడు. తన గదిలోకి వెళ్ళాడు. ఏం జరుగుతుంది ? ఇది సత్యలోని ఆలోచన.

సాధారణంగా ప్రతి పున్నమికి తండ్రి అడవులలోకి వెళ్ళడం అక్కడ గల సూర్యదేవుని అర్చించడమొక ఆనవాయితీ. కానిప్పుడు అది కాదే. తండ్రి వెళ్ళలేదు. పినతండ్రి కొంపలంటుకుంటున్నట్లు గుర్రంపై, గుర్రంలాగ పరుగెత్తాడు.

ఆలోచిస్తూ వెనుదిరిగింది. ఆలోచనలు తెగటం లేదు. చాలాసేపటి వరకు నిద్రపట్టలేదు. మొత్తానికి అలసి నిద్రను ఆహ్వానించింది. కానీ సత్య ఆ అదృష్టానికి నోచుకోలేదన్నట్లు నిద్ర రావడం లేదు.

తెల్లవారక మునుపే అడవికి వెళ్ళే తండ్రి, ఇవ్వాళింత రహస్యంగా, హడావుడిగా తను వెళ్ళకుండా పినతండ్రిని పంపించాడంటే, కొంపదీసి, మళ్ళీ ఏదైనా గూడుపుఠాణీ చేస్తున్నాడా! నెత్తిమీదకు తెచ్చుకుంటున్నాడా ? తెగ భయపడి పోతుంది, సత్యభామ.

# ఇదేం పద్ధతి ?

**లో**కోత్తర ధర్మమూర్తి, అవతార పురుషుడని ఎందరో మెచ్చుకున్న తన ప్రాణమైన కృష్ణుని, ఆ సత్రాజిత్తు కొట్టాడనే సరికి బలరాముడు కోపంతో వూగిపోతున్నాడు. మృత్యువు నెత్తిన తాండవం చేస్తున్నందువల్లనే వాడలాగ రెచ్చిపోయాడని, దెబ్బకు, కోలుకోని దెబ్బతియ్యాలని బలరాముడు వుద్రిక్తుడౌ తున్నాడు.

వెంటనే తండ్రిని సమీపించి, విషయం చెప్పాడు. తాను సత్రాజిత్తుకు తగు విధంగా బుద్ధి చెప్పాలని తలుస్తున్నట్లు కూడా తండ్రికి వివరించాడు. అంతా విన్న ఆ తండ్రి వసుదేవుడు "కుమారా! తొందరపడకు. తమ్ముడిని రానివ్వు. ఆ తర్వాత తీసుకోవల్సిన చర్యలు తీసుకుందాం. వాడు మూర్ఖంగా ప్రవర్తించాడని మనం వాడికంటే మూర్ఖులౌదామా ? లేక...

బలరాముడు ఏదో చెప్పబోయాడు. కాని వసుదేవుడు శాంతించమన్నట్లు కళ్ళతో చేసిన సూచనకు ఆ పెద్దన్న కట్టుబడిపోయాడు.

వెంటనే వసుదేవుడు, తాను మహారాజు మందిరానికి వెడుతూ, పెద్దలు, ప్రముఖులు అక్రూరుడు, సాత్యకుడు, గర్గాచార్యులవారిని, రాజమందిరానికి రమ్మనమని వర్తమానం పంపించాడు. అలాగే కృష్ణుని కూడా, ఆ ముఖ్యమైన సమావేశానికి రమ్మనమని కబురు పంపాడు.

సత్రాజిత్తు ప్రవర్తన, కృష్ణుని ఉదాసీనత, ద్వారక మొత్తం తెలుసుకుంది. ప్రస్తుతానికి అది గాలి వార్తగా వుంది. అదే నిజమైతే, చాలా పెద్ద ప్రమాదంసత్రాజిత్తు

కుటుంబం సర్వనాశనమవడం ఖాయం. దాంతో అందరు రాజమందిరం చుట్టూ చేరుతున్నారు. విషయం తెలుసుకుందామని కొందరు హడావుడిగా సమాచార సేకరణకు సిద్ధపడుతున్నారు. మొత్తానికో గందరగోళ పరిస్థితి. అధిగమించాల్సిన స్థితి.

తండ్రి, మహారాజుకు ముఖ్య సలహాదారు కనుక వసుదేవుని వర్తమానంతో, కృష్ణుడు యథాప్రకారం తన చిరునవ్వులతో, సమావేశస్థలికి వచ్చాడు. ఇక్కడ ఎందరో కృష్ణుని చూడాలని, పాదాభివందనం చెయ్యాలని గుమికూడారు. అందర్నీ ఆనందంగా చూసిన కృష్ణుడు, తన సహజ చిరునవ్వులతో, అందరు తెలిసినవారే కాబట్టి పేరు పేరునా పలుకరించాడు. అంత ప్రశాంతంగా వుండే కృష్ణునిపై, ధర్మరక్షకునిపై సత్రాజిత్తు తిరుగుబాటుచేసినా సంతోషించేవారు.

కానీ, ఇంటికి, పెద్దలుగా మిమ్ములను చూడాలని, మీతో మాట్లాడాలని వచ్చిన వ్యక్తిపై, కనీస మర్యాద, పరువు ప్రతిష్టలు మరచి, ఆ సత్రాజిత్తు ప్రవర్తించిన తీరుకు అందరు గర్హించారు. అయితే ఆడపిల్లయినా సత్యభామ ప్రవర్తనను ప్రతి ఒక్కరు శ్లాఘించారు.

కొందరు ఆపుకోలేకపోయారు. వివేకాన్ని మరచి సత్రాజిత్తుపై తిరగబడక, ఏం జరిగింది ? ఆ మూర్ఖుడినేం చెయ్యమంటారు. తమ "ఆజ్ఞ" అన్నట్లు ఒక్కొక్కరు కృష్ణుని పలుకరిస్తున్నారు. అందర్నీ చిరునవ్వులతో మరొకసారి చూసి, వారికి అభివాదము చేసి "లోపల మహారాజు...!" అంటూ లోపలికి నడిచాడు.

ఆ మందిరంలో మహారాజు ఉగ్రసేనులు, ప్రధాన సలహాదారు, తండ్రి వసుదేవుడు, గర్గాచార్యులవారు, అక్రూర మహాశయులు, సాత్యకులు, పెద్దన్న బలరాముడు కూర్చుని వున్నారు. వారిని చూస్తూంటే తనకోసమే ఎదురు చూస్తున్నట్లు వాళ్ళు కనిపించారు. అందరికి వినయ విధేయతల వందనమర్పించి, ప్రక్కగా కూర్చున్నాడు.

"కృష్ణా.... ఏం జరిగింది. ఆ.... జరిగింది వివరంగా చెప్పు. మహారాజు...!" విషయాన్ని వసుదేవుడడుగుతున్నాడు.

చెదరని తన సహజ సుందర వదనంతో నవ్వుతూ "చెప్పడానికేముంది. సత్రాజిత్తు తన పశుసంపదనంతా చూపించాడు. తన విలువైన గుర్రాలను గూర్చి చెప్పాడు. ఆ తర్వాత లోపలికి వెళ్ళి కూర్చున్నాము. నేను అతి త్వరలో అశ్వమేధం

చేస్తానన్నాడు. నాకు నవ్వొచ్చింది. "చక్రవర్తినవ్వాలని కోరికా ?" అని అడిగాను. ఈ మాట విన్న సాత్యకుడు - "ఏమిటి అశ్వమేధమా ?" అని ఆశ్చర్యపోయి, ముందో రాజును కమ్మను. ఆ తర్వాత అశ్వమేథం, చక్రవర్తిత్వం గురించి ఆలోచించ వచ్చును అన్నాడు. ఆ తర్వాత ఇంతకీ నన్నెందుకు కలవాలను కున్నావంటే విషయం చెప్పాను.

ఎవరికోసమో నేను నా స్వార్జితాన్ని త్యాగం చెయ్యాలా" అంటూ జరిగింది, వివరంగా కృష్ణుడు వాళ్ళకు చెప్పాడు. అప్పుడు, అంతా విన్న సత్రాజిత్తు ఓ షరతు పెట్టాడు. మన బాబాయి, వాళ్ళ అమ్మాయిని తన కోడలుగా అంగీకరిస్తే, తప్పక నేను కోరినట్లు కోరిన సంపద, పాండవుల పురోభివృద్ధికిస్తారుట. కాదంటే, కలలో గూడా తననుండి, ఏ విధమైన సహాయమాశించవలదని తెగేసి మరీ చెప్పాడు.

అప్పుడు మళ్ళీ సత్రాజిత్తుతో, నీ స్థితి మంచిదే కావచ్చును. కానీ ఆమె నీ పిల్లగా ఆమెకు కొన్ని సమాజమంగీకరించని కొన్ని అవలక్షణాలను, అలాగే నీ దుర్లక్షణాల ప్రభావంతో, కొంత గౌరవం, ప్రజల విశ్వాసం కోల్పోయింది. అటువంటి పిల్లను సుక్షత్రియుడెవరు వివాహం చేసుకుంటాడు ? ఆ ఇంటి పెద్దలు ఈమెను కోడలిగా స్వీకరించరు.

పొరపాటున ఎవరైనా స్వీకరిస్తే, నిన్ను చంపి నీ ఆస్తిని పొంది, నీ పిల్లను చేస్తే కట్టుబానిసగానైనా చేస్తారు. లేదంటే మెడపట్టి బయటకు గెంటుతారు. అటువంటి దుస్థితి నీవు తెచ్చుకోకు. నీ పిల్లకు రానివ్వకు. అంటూ జరిగిన మిగిలిన కథ యావత్తు జరిగింది, జరిగినట్లు చెప్పాడు.

చివరగా నేను, ఇన్ని చెప్పినా, ఇంకా నీ పిల్ల, సాత్యకికిచ్చి వివాహం చేయదలిస్తే, ప్రజోపకరార్థం నీ శ్యమంతకమణిని మహారాజుకివ్వు. అప్పుడు లోకోపకారం జరుగుతుంది. అందరికోసం సాత్యక మహాశయులు, నీ పిల్లను తన కోడలిగా తప్పక స్వీకరిస్తారన్నారు. 'పిల్లకోసం, శ్యమంతకమా ? చచ్చినా ఇవ్వను' అన్నాడు.

"ఇవ్వకపోతే నీ కర్మ. అదింకెన్నాళ్ళో నీ వద్ద వుండదు. అనైతిక, అధర్మ ప్రవర్తనం వలన అది నిన్ను నాశనం చేస్తుందన్నాను. దానికి వుగ్రుడై.... విషయం చెప్పడమాపేసాడు.

దాంతో తప్పు చేసాడని వారందరు తలిచారు. ఆ సమయానికి సత్యభామ వచ్చి, తండ్రిని నిందించి, నన్ను రక్షించింది. తన ప్రేమాభిమానములు, గౌరవ భక్తి ప్రపత్తులను నాపై ప్రకటించింది. లేకపోతే పరిస్థితి.... ఎలాగుండేదో...!"

"కృష్ణా! నువ్వు చాలా పొరపాటు చేసావు. ఒక్కటిస్తే వాడు చచ్చేవాడు. సమస్య తీరిపోయేది." అన్న బలరామునితో -

"లోకం మనల్ని హీనంగా, క్రూరులను చూసినట్లు చూసేది. ఇన్నాల్టి ధర్మం, ఆ ప్రవచనాలు నీటిమూటలు, గాలి మాటలుగా మిగిలేవి" ఆ మాటలను అందరు ఒప్పుకున్నారు. అప్పుడు సాత్యకుడు -

"గోవిందా! మా కోసం నీవు అవమానాలను పొంది ఆ మూర్ఖునిచేత...!"

"మీరు పెద్దలు. మీ గౌరవం, నా గౌరవం క్రింద లెక్క. డబ్బుకు గడ్డి తినేటట్లు మాట్లాడుతుంటే, అతన్ని మాటలతో బలహీనపర్చ దలిచాను. కానీ, అర్థం చేసుకోలేని ఆ పెద్దమనిషి తొందరపడ్డాడు.

"ఏది ఏమైనా ఒక రకంగా అదృష్టవంతులం. అతను నీ సలహాకు మెచ్చుకుని, శ్యమంతకాన్నిస్తానంటే, క్షాత్రానికి, క్షత్రియ ధర్మానికి విఘాతం కలిగేది. ఇన్నాళ్ళుగా కాపాడుకుంటూ వస్తున్న ధర్మతేజానికి తూట్లు పడేది" సాత్యకుడు చాలా నొచ్చుకున్నాడు.

"క్షమించండి. సమయోచితంగా సల్పిన ధర్మ ప్రసంగమది. నన్ను విడిచి పెట్టండి. మీకు బాధ కల్గించినందులకు మెచ్చుకునే మనసు, నొచ్చుకునేటట్లు చేసినందులకు కృష్ణుడు సిగ్గుపడ్డాడు. ఆ తర్వాత - "జరిగింది మర్చిపొండి. ఎవరు ఆవేశపడకండి. ధర్మం నిలుస్తుంది. కాలం కలిసి వస్తుంది. అందరి క్షేమం కోసం, ఆ శ్యమంతకం - తప్పక మన మహారాజు నాశ్రయిస్తుంది. అందరికి మేలు జరుగుతుంది" అని ముగించిన కృష్ణుడు.

"ఆవేశం అనర్థదాయకమని నిదానం ప్రధానమని అప్పుడే సత్యధర్మాలు, తప్పక గెలుస్తాయని నొక్కి చెప్పాడు. అందరు తలలూపారు. ఆ విషయాన్ని అంతటితో అందర్ని విడిచిపెట్టమని కృష్ణుడు సూచించాడు. మిగిలింది కాలం తప్పక పరిష్కరిస్తుందని వివరించాడు.

అక్కడ కొన్ని క్షణాలు మౌనం.

"జరిగిన పరాభవాన్ని నేను మరచిపోలేను. ఆ సంఘటనను, ఆ వ్యక్తిని క్షమించను. అసలతనిపై ఈపాటికే చర్య తీసుకోవలసి వుంది. అనసరంగా

వుపేక్షించావు. ఇటు కృష్ణుని కాదనను. అటు బలరామునికి వత్తాసు పలకను. నేనేం చెయ్యాలో నాకు తెలుసు. ఒకరితో ప్రమేయం లేకుండా నా ధర్మం నేను నిర్వర్తిస్తానంటాడు ఆపుకోలేని ఆవేదనతో'', యదు ప్రముఖుడు సాత్యకుడు.

“అందుకే నేనలాగ స్పందించాను. కనుక నాకు కొద్దిగా అవకాశమివ్వండి. నేను కనుక నా ప్రయత్నంలో విఫలమైతే, తప్పక మీరు... మీ అభిప్రాయాల మేరకు ముందుకు సాగుదురుగాని'' కృష్ణుడర్థిస్తున్నాడు.

ప్రతి ఒక్కరు - ఇంత శాంతి, సహనాలు పనికిరావంటున్నారు. కానీ, కృష్ణుడు వాళ్ళందర్ని వూరడిస్తూ - కొద్ది కాలముపేక్షించండి. ముందు మనకు కావల్సింది - వాడి అహంకార పతనం! గర్వ నాశనం. అప్పుడా శ్యమంతకం తప్పక మహారాజును చేరుతుంది. సమస్య పరిష్కరించడుతుంది.

కాదన్నా, నా మాట నెగ్గకున్నా, నేను ప్రక్కకు తప్పుకుంటాను. ఆ తరువాత మీ ఇష్టం. నేనెవరికి అడ్డుపడను. సరికదా, మీకు తప్పక సహకరిస్తానంటాడు.

# శ్యమంతకమణి

ఉన్నట్టుండి ఆ తొలిఝాములో వాతావరణ ప్రశాంతతను భగ్నపరుస్తూ-

“దొంగ.. దొంగ....!'' గట్టిగా అరుపులు, కేకలకు వులిక్కిపడినట్లు అందరు పరుగెత్తుకు వచ్చారు. మళ్ళీ మళ్ళీ వినబడిన ఆ కేకలు అవి... వాళ్ళ యజమానివి. అవి సత్రాజిత్తు భవనం నుండి వస్తున్న దురహంకార అరుపులు.

ఈ సమయంలో సత్య నిద్రపోవడం లేదు. కొన్ని క్షణాల క్రితం జరిగిన సంఘటనను తలచుకుని, అందులోని మర్మానికై - ఈ మాయల మరాఠీల ఆలోచనకై తెగ ఆలోచిస్తుంది. ఇటువంటి సమయంలో, ఈ అరుపులు. ఇవి ఎవరివో కావు. తన తండ్రివి.

అందరు గబగబ వరండాలోకి పరుగెత్తారు. దొంగకోసమన్నట్లు తన తండ్రి పరుగులు పెడుతూ సూర్యమందిరంవైపు దొంగ వెళ్ళినట్లు సాగుతుంటే అందరు ఆశ్చర్యపోతున్నారు.

భంగాకరుడు, వటపతి, తపస్యంతులు, ఇతర కాపలాదారులు, వరండాలో గుమికూడారు. మిగిలిన కుటుంబసభ్యులు కూడా అక్కడ చేరారు. అందరు శ్యమంతకమణి పోయిందని తెలుసుకుని బిత్తరపోయారు ? ఇంత కట్టుదిట్టమైన కాపలా వుంటే ఆ మణి ఎలాగ పోయింది ? ఇదొక ప్రశ్న కాదు. అందరిలో పుట్టిన అనుమానం. ఈ సందేహానికి సమాధానం దొరకడం లేదు కానీ. నిన్నింత గొడవచేసినా కృష్ణుడే దీనిని దొంగిలించాడని - అక్కడ వినిపించే విషయం.

ఈ సమయంలో, సత్య - కొన్ని నిముషాల ముందు తండ్రి ప్రవర్తనను అనుమానాస్పదంగా గమనించిన ఆమె, ప్రహరీ ద్వారం వద్ద, ఏదో పడవేయడం, వంగి తియ్యడం గమనించింది.

అక్కడనుండే సత్రాజిత్తు "ఇదిగో. ఇదిగో, ఇవి, ఆ దొంగ" కుండలాలు... గట్టిగా అరుస్తు పట్టి పట్టి అందరకు చూపుతున్నాడు. సత్య ఆ స్థితిని గుచ్చి గుచ్చి చూస్తుంది. మా నాన్న భలే నాటకాలాడుతున్నాడనుకుంది.

"వాడే ఆ దొంగ, చిన్నప్పుడు వెన్న దొంగ. ఆ తర్వాత కన్నెల దొంగ. ఇప్పుడు....!" వదరి మరీ అరుస్తున్నాడు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. బండబూతులు తిడుతున్నాడు. ఇదంతా నిన్న తనకు జరిగిన పరాభవం నుండి బయటపడటానికి వేసిన ఎత్తులాగ కనబడుతుంది.

ఈ అరుపులకు గబగబ తండ్రిని చేరిన సత్య "నాన్నా! నువ్వు పూజమందిరం వద్దే కదా వున్నావు. అదెలాగ పోయిందంటావు. ఆ వెంటనే ఆ కృష్ణుని పట్టుకోవల్సింది!" అడుగుతుంది. ఇందులో వ్యంగ్యం వుంది. తండ్రి ప్రవర్తనపై అనుమానముంది.

ఈ మధ్యలో కొన్ని నిముషాలు బయటికి వెళ్ళాల్సి వచ్చింది. తీరా తిరిగి వచ్చి చూస్తే పూజగది తలుపులు బ్రద్దలు కొట్టబడి వున్నాయి. అప్పుడు అనుమానమొచ్చి లోపలికి వెళ్ళి చూస్తే శ్యమంతకం కనబడలేదు. ఆ కృష్ణుడు అన్నంత పనిచేసాడు. నా శ్యమంతకాన్ని దొంగిలించాడు.

"ఓ భగవాన్! సూర్యదేవా! ఆ దుష్టుడిని సంహరించు. నీ వేడివేడి సూర్యకిరణాలతో అతన్ని దహించు. ఆ పాపి, ద్రోహి, మోసగాడు, వంచకుడు కృష్ణుని....!" ఆపుకోలేక అడ్డదిడ్డంగా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. అప్పుడు భంగాకరుడు తండ్రిని, తన మందిరం దగ్గరకు మెల్లగా తీసుకువచ్చాడు.

"నాన్నగారూ! మీరు దొంగ... దొంగ... అంటున్న ఆ దొంగను కళ్ళారా చూసారా ?"

"అప్పుడు గదిలోకి వచ్చేసరికి ఇంకా చిమ్మచీకటిగానే వుంది. ఎవరో పరుగెడుతున్న అడుగుల చప్పుడు. అస్పష్టంగా కనుపించిన ఆకారం ముందెవరో పనివాడయి వుంటాడనుకున్నాను. ఆ తరువాత అనుమానమొచ్చి పరుగెడితే, అప్పటికే, ఆ మనిషి, మన సూర్యదేవాలయంవైపు పరుగెడుతున్నాడు. ఈ హడావుడిలో అతన్నైతే చూడలేదు కానీ, అతను మాత్రం నిన్న అంత హడావుడి చేసి నన్ను బెదరించిన ఆ కృష్ణుడే, తప్పక అయి వుంటాడు. అందులో సందేహం లేదు. అంతకుమించి ఇంకొకరికి, ఈ పని చేసే సావకాశం లేదని -" అంతా తనకు తెలుసున్నట్లు చూడకపోయినా చూసినట్లు స్పష్టంగా చెబుతున్నాడు.

నా శ్యమంతకం నాకు కావాలి. నా దగ్గరకు రావాలి. రాలేదో, యాదవుడన్న వాడు లేకుండా సర్వనాశనం చేస్తాను. అప్పుడు కాని ఈ సత్రాజిత్తు... అంటే ఏమిటో, అతని పగ ప్రతీకారాలెలాగ వుంటాయో, ఈ లోకానికి తెలియదు. "సహనం కోల్పోతున్నాడు. అర్థం లేకుండా వాగుతున్నవాడు, కొడుకుని చూసి- ఏమిటలాగ చూస్తున్నావు ?" అన్నాడు. మళ్ళీ ఆ వెంటనే -

"నా రథం, పెద్దది సిద్ధం చేయించు. సంజయుని, శతధన్వుని రమ్మని కబురు పంపు. నువ్వు సిద్ధమవు. నా సత్తా చూపిస్తాను. మూడు లోకాలలో ఎక్కడున్నా సరే నా శ్యమంతకాన్ని సంపాదించుకుంటాను. ఇందులో తిరుగులేదు" అన్నాడు, వెనుదిరిగి.

"ఎందుకలా చూస్తారు ? దున్నల్లా వున్నారు. దొంగను పట్టుకోలేదు. ఆకారం వుండగా సరికాదు. నా శ్యమంతకం దొరకలేదా, మీ తలలు తాటిపళ్ళు తరిగినట్లు తరుగుతాను" గద్దిస్తున్నాడు.

అన్నీ విన్నా భంగాకరుడు "తండ్రి! ముందు స్నానం చెయ్యండి. మీ పూజాదికాలను నిర్వర్తించుకోండి. అప్పుడు తప్పక బయలుదేరి వెడదాం!" సమాధానపరుస్తున్నాడు. కానీ, సత్రాజిత్తు అరుపులకు కుటుంబ సభ్యులతో సహా పనివారలందరు, ఇతర వ్యక్తులు విపరీతంగా భయపడిపోయారు.

అతి బలవంతం మీద తన నిత్య కార్యక్రమాలను పూర్తి చేసుకున్న సత్రాజిత్తు, నా నాలుగ్గుర్రాల రథాన్ని వెంటనే తీసుకురండి!'' గట్టిగా అరిచాడు. ఈ గొడవ ఇలాగ వుంటే, సత్యభామలో ఇంకొన్ని అనుమానాలు మొదలు పెట్టాయి.

“అసలు ప్రొద్దున్నే నాన్న బాబాయి నెక్కడకు పంపించాడు ? దేనికి పంపించాడు ? అంత అత్యవసరమైన పనేమి వచ్చింది ? అసలు నాన్న ఆడే నాటకాలకు కారణమేమై వుంటుంది ? నాన్న ఆరోపించినట్లు కృష్ణుడు మూడో కంటి వానికి తెలియకుండా వచ్చి నిజంగా శ్యమంతకమణిని దొంగిలించాడా ? ఇవి నమ్మదగిన విషయమా ?

“తండ్రి'' అంటే ఎంతో ప్రాణమైన సత్యభామ, కృష్ణుడంటే మక్కువ పెంచుకుని తన జీవితాన్నే అర్పించదలచిన సత్యభామ - బాగా ఆలోచనలో పడింది. “ఏది సత్యం ? ఏదసత్యం.'' భగవాన్! నన్ను కరుణించి శాంతిని ప్రసాదించు. దైవసహాయాన్ని కోరుతుంది.

నిన్న సావకాశముండి ఎదురు తిరిగి ఏమీ చెయ్యని కృష్ణుడు, ఎవరికంట బడకుండా, ఇంట్లోకి ఇచ్చి పూజగది తలుపులు పగులకొట్టి, శ్యమంతకమణిని ఎత్తుకుపోవడం నమ్మశక్యంగా లేదు. ఇంతటి భవనంలో, అంతటి కాపలాలో, ఇక్కడ దొంగతనం జరిగిందంటే ఏ ఒక్కరు నమ్మరు సరికదా. నిన్నటి తన తప్పును కప్పిపుచ్చు కునేందుకు సత్రాజిత్తు ఆడుతున్న నాటకంగా తలుస్తారు.'' అని ఆలోచించే సత్య క్షణమాగి -

ఆ వుద్దేశంతో, ఈ వీరాధివీరుడు, ధర్మరక్షకుడు. ఆర్ష సంస్కృతీమూర్తి-అనే కృష్ణుడు, ఈ పథకం పన్నాడా ? మాయలమారి, అందర్నీ తన మహామాయలో ముంచుతున్నాడా ? రకరకాల ఆలోచనలతో, సత్య బుర్ర వేడెక్కిపోతుంది.

రథం సిద్ధమయింది. శతధన్వుడు వచ్చాడు. యుద్ధ వాతావరణానికి వీలయినట్లు పలు ఆయుధాలతో, మహారథులతోకలిసి బయలుదేరుతున్న శుభ సందర్భంలో చేతులు కట్టుకుని ఎంతో వినయంగా నిల్చున్న భంగాకరుడు, సాష్టాంగ నమస్కారం చేసి నిల్చున్నాడు.

“బయలుదేరు'' అది తండ్రి ఆజ్ఞ.

"ఆజ్ఞ..! అన్నాడు "తండ్రీ! యుద్ధానికి సిద్ధమైనట్లు ఇలాగ మహారాజు దగ్గరకు వెళ్ళడమవసరమా ? ఇది సముచితమా ?" అని అడుగుతాడు.

కుమారునోసారి కోరగా చూసి "శ్యమంతకం నాకు భగవంతుడిచ్చాడు. దాని నా కృష్ణుడు దొంగిలించాడు. ఇప్పుడు నా చేతులతో అతన్ని స్వయంగా శిక్షించి, నా శ్యమంతకాన్ని తెచ్చుకోవాలి. అప్పుడు నేను, నా ప్రతాపం, ప్రవర్తన లోకవిదితమౌతుంది. అలాగ కాకుండా "నాయనా! బాబూ" అంటే నన్నెవరు లక్ష్యపెడతారు ? నా శ్యమంతకమెలాగ దొరుకుతుంది. బయల్దేరు!" హెచ్చరిస్తున్నాడు.

"మీరు నిందవేసిన కృష్ణుడు సామాన్యుడు కాడు. లోకోత్తరుడు. ఈ ఆర్యావర్తంలో ప్రసిద్ధుడు. ఆయనకు సాగిలపడని చక్రవర్తి లేడంటే అతిశయోక్తి కాదు. మహావీరుడు భీష్ముడే, కృష్ణునికి అంజలి ఘటిస్తాడు. అటువంటిది....

"అయితే ఏమంటావు ?" సత్రాజిత్తు సహనం కోల్పోతున్నాడు.

"కాస్త శాంతంగా ఆలోచించ" మంటూ భంగాకరుడు ప్రార్థిస్తున్నాడు.

"పోరా! పిరికిపంద. ఈసత్రాజిత్తు సామాన్యుడు కాదు. అవసరమైతే అడ్డువచ్చినవారిని నరికైనా సరే, తన పట్టుదల సాధించుకుంటాడు" ఏ మాత్రం రాజీ ప్రసక్తి లేకుండా మాట్లాడుతున్నాడు. మళ్ళీ అతనే - "నా కొడుకు మగాడు అనుకున్నాను. కానీ, ఇలాగ ఆడ వేషం వేస్తాడనుకోలేదు. మగాడివైతే బయల్దేరమంటాడు.

నిందలు, నిష్ఠూరాలతో, సత్రాజిత్తు బృందం రాజప్రాసాదాన్ని చేరింది. అప్పటికే తన నిత్య కృత్యాలు తీర్చుకుని, వృద్ధుడైన మహారాజు విశ్రాంతి తీసుకుంటున్నాడు. సత్రాజిత్తు రాకను బృహద్బలుడు మహారాజుకు తెలియబర్చ, మహారాజు వాళ్ళను తన శయనాగారానికి రమ్మని కోరాడు. వాళ్ళు వచ్చారు. ఆ వచ్చినవాళ్ళు సర్వాయుధధారులై వున్నారు. ఆ విధంగా మహారాజు నెవరు దర్శించకూడదు. అది పద్ధతి.

అందుకు విరుద్ధంగా సత్రాజిత్తు, మహారాజు ఆదేశం మేరకు శయన మందిరానికి వచ్చాడు. కనీస మర్యాదివ్వకుండా, వస్తూనే 'నా శ్యమంతకాన్ని నీ కృష్ణుడు

దొంగిలించాడు. అతడు కనుక దానిని మర్యాదగా తెచ్చి ఇవ్వకపోతే చంపేస్తాను. ఈ విషయం చెప్పడానికే వచ్చాను తప్ప మీతో నాకేం పనిలేదు. మీ అవసరం నాకు లేదు.'' అమర్యాదకరంగా వున్నాయి సత్రాజిత్తు మాటలు, ప్రవర్తన.

"సత్రాజిత్తూ, ముందు నువ్వు కూర్చో! అని మిగిలినవార్ని చూసి, మీరు కూర్చోండి. మెల్లిగా జరిగిందేమిటో చెప్పండి!'' ఎంతో మర్యాదగా - ఓర్పుతో - సహనంతో మహారాజు అడుగుతున్నాడు,

విధిలేక సత్రాజిత్తు కూర్చున్నాడు. ఆవేశంతో వూగిపోతు తను వచ్చిన కథనం చెబుతున్నాడు. చివరకు - కృష్ణుడీ దొంగతనం చేసాడని అంతా ప్రత్యక్షంగా చూసి తీర్మానించినట్లు చెప్పాడు. కాబట్టి మీరతనిని ఆదేశించి, నా శ్యమంతకాన్ని నాకిప్పించండి. లేదంటే, పరిణామం దారుణంగా వుంటుంది. "అంతా ఆవేశమే. ఎక్కడా ప్రశాంతత కనబడటం లేదు.

సత్రాజిత్తు నేరారోపణ పూర్తయ్యేసరికి బృహద్బలుడు, సభాముఖ్యులను, తీసుకుని వచ్చాడు. వారిలో ముఖ్యంగా వసుదేవుడు, సాత్యకుడు, వారితో సాత్యకి వచ్చారు. మహారాజు అనుమతితో, ప్రక్కమీద ప్రక్కగా కూర్చున్నారు.

"సత్రాజిత్తు తన శ్యమంతకం పోయిందని, దానిని కృష్ణుడే దొంగిలించాడని చెబుతున్నాడు. దానిని తిరిగి ఇప్పించమంటున్నాడు. కాదంటే, మన మధ్య యుద్ధం గూడ అనివార్యమంటున్నాడు. మహారాజు ఆతని సముఖంలోనే నేర విషయాన్ని వాళ్ళకు చెప్పాడు. జరిగింది తెలిపి, కృష్ణుని కూడా వెంటనే రమ్మన్నానని చెప్పమంటాడు.

అంతావిన్న సాత్యకుడు "సత్రాజిత్తు. నీ నేరారోపణం కేవలం అనుమానం, అయి వుంటుందనే తప్ప, నీవు కృష్ణుని చూడలేదు - ఇది మొదటిది. రెండోది ధైర్యంగా ఎదుటపడి ఏ పనైనా చేస్తాడు కానీ, కేవలం ఒక శ్యమంతకం కోసం, ఎవరి కళ్ళబడకుండా దొంగిలించాల్సిన పని మా కృష్ణునికి లేదు.

"శ్యమంతకం పోతే పోవచ్చును అది అబద్ధమనను. నీ చుట్టు వున్న వాళ్ళలో దానిపై ఎవరి కన్నుపడిందో, మాటిమాటికి ఎవరు ఆత్రపడుతున్నారో, అది నువ్వు తెలుసుకోకుండా, ఎందరికో ఆరాధ్యుడైన కృష్ణునిపై నిందమోపడం తగదు. ఇది లోకం హర్షించదు. దైవం-ధర్మం, సత్యం అసలు క్షమించరు.''

"అయితే నేను అబద్ధాలకోరునా ? చివరకు నన్ను అసత్యవాదిగా నువ్వు చిత్రీకరిస్తున్నావా ? ఇదేనా నా పెద్దరికానికి విలువ ?'' సాత్యకుని ప్రశ్నిస్తున్నాడు. అసలు నిన్నని పనేముంది ? మొదట్నుంచి నన్ను నిరశించి, అణగదొక్కాలన్నదే నీ వుద్దేశం. అన్నీ తెలిసి నీతో మాట్లాడాను చూడు, అది నేను చేసిన పెద్ద తప్పు!'' నిరశించాడు.

"సత్రాజిత్తు.. నువ్వు, నీవున్న పరిస్థితిలో ఏమనుకుంటున్నావో నాకనవసరం. సత్యధర్మాలు విడదీయరానివి. వాటిని ధర్మావతారుడైన కృష్ణుడు అతిక్రమించడు. ఇది లోకవిదితం. నీలాంటి వాళ్ళు నలుగురు ఏనుగు వెనకాల, అరచినట్లు, కృష్ణుని కాదంటే వచ్చే నష్టమాతనికి లేదు. ఆలోచించకుండా చేసే అవమానాల పర్యవసానానికి, భారీ మూల్య చెల్లించాల్సి వస్తుంది. అది గుర్తుంచుకుంటే చాలా చాలా సంతోషం. భవిష్యత్తు ప్రశ్నార్థకం కాదు.

ఇదే మీ నిర్ణయమైతే నా నిర్ణయం నాది. నా పద్ధతి ప్రకారం న్యాయాన్నన్వేషించుకుంటాను. తగు విధంగా ప్రయత్నిస్తానంటాడు. ఇప్పుడే కృష్ణుని మందిరానికి వెళ్ళి దానిని తగులబెడతాను. ఎవరు అడ్డమొస్తారో చూస్తానని లేచాడు. అప్పుడు ఇక్కడిలాగ వుంటే, రాజభవనం ముందు, కృష్ణునిపై బడ్డ నింద నిజానిజాలు తేల్చుకుందామని భారీ సంఖ్యలో ప్రజలు గుమికూడారు.

కృష్ణుడు సమావేశభవనానికి వస్తుంటే అక్కడున్న సత్రాజిత్తు మనుషులలో కొందరు "అడుగో దొంగ, దొంగ'' ఎలాగ వస్తున్నాడో - అని అరుపులు, కేకలు మొదలుపెట్టారు. రకరకాలుగా తిట్లు ప్రారంభించారు. దీంతో సత్రాజిత్తు వర్గానికి, మిగిలిన యాదవులకు మధ్య వాదాలు, సంవాదాలు చెలరేగాయి. అటువంటి సమయంలో కృష్ణుడు మహారాజున్న శయనమందిరానికి విచ్చేసాడు.

సాత్యకి, తండ్రి, మహారాజు ప్రక్కమీద, సత్రాజిత్తు నిలబడి, ఆతని ప్రక్క భంగాకరుడు, శతధ్వనుడు అందర్ని చిత్రంగా చూసాడు. కృష్ణుని చూస్తూనే సత్రాజిత్తు "చూడండి. దొంగ గారు ఎంత గొప్పగా, అమాయకంగా వస్తున్నారో!''

"దొంగా! మరియాదగా మాట్లాడు నేనేం దొంగిలించాను!'' కాస్త కటువుగానే కృష్ణుడు అన్నాడు.

"నా శ్యమంతకమణిని నా పూజామందిరం నుండి దొంగిలించి, ఎంత నంగనాచిలాగ మాట్లాడుతున్నావు - ఇది సత్రాజిత్తు ఆరోపణ.

"ఈ రోజు ఉదయం నీ శ్యమంతకాన్ని నేను దొంగిలించానా ?" ఆశ్చర్యంగా కృష్ణుడడుగుతూంటే -

"అవును. ఈ రోజు ఉదయమే నా శ్యమంతకాన్ని.... !" నొక్కి నొక్కి సత్రాజిత్తు చెబుతున్నాడు.

"ఏమిటి మాట్లాడుతున్నావు ? దొంగలాగ మీ ఇంటికి, ఇవ్వాళ ప్రొద్దున్న వచ్చి, నీవు లేని ఆ కొద్ది నిముషాల సమయంలో, ఎవరికి కనబడకుండా, చప్పుడు కాకుండా, నీ పూజామందిరం తలుపులు పగులగొట్టి, శ్యమంతకాన్ని తీసుకుని పారిపోయానా ?"

సత్రాజిత్తూ! మనిషి మీద కోపముండవచ్చును. అది శారీరక ధర్మం. నేను స్మరిస్తే నీ సూర్యుడే వచ్చి, నీకిచ్చిన శ్యమంతకాలు ఎన్నైనా నాకిచ్చి వందనం చేసి మరీ వెడతాడు. అందరిలోకి ధనికుడైన ఆ కుబేరుడు తన సంపదనంతా నాకర్పించి వెడతాడు. అటువంటి నేను నీ ఇంటికి వచ్చి...

మాట్లాడే మాటకు హద్దు పద్దు వుండాలి. చేసే నేరారోపణకు నీతి, న్యాయం వుండాలి.

"హాయ్! హాయ్! వద్దు, వద్దు.. మాటల గారడితో మహామాయవై మమ్మ్మి బురిడి కొట్టించకు. నీ మాయలో పడటానికిక్కడ అమాయకులెవరు లేరు - పూలు, గాజులు తొడుక్కునే ఆడవాళ్ళు అసలు లేరు. వాళ్ళ ముందు చెప్పు. ఈ కొక్కెర సమాధానాలు. నక్క వినయాల తిక్క కబుర్లు...!

నువ్వు నన్ను చూసావా ? చూస్తే ఎందుకు పట్టుకోలేదు. అంతమంది రక్షకులు, కాపలాదార్లు వుండగా, ఏ ఒక్కరు సాహసించలేదా ? మరెందుకా అంగరక్షకులు, భట్రాజు పొగడ్తలకా ?"

వీటికి సమాధానం చెప్పలేకపోతున్నాడు.

నిన్న లోకహితం కోరి మాట్లాడిన మాటలను ఇవ్వాళ స్వార్థ ప్రయోజనాలకై వినియోగించుకునే నిన్ను చూస్తే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదు." అనగా-

"అవేమీ వద్దు కానీ, నా శ్యమంతకాన్ని నాకిచ్చేయి, పోతాను. కావాలంటే ఈ వూరు విడిచిపొమ్మన్నా పోతాను. మీలాంటివాళ్ళ మధ్య వుండేకన్నా, వున్న

ఆస్తులను వదిలించుకొని నా దారిన నేను పోవడం చాలా మంచిది. ముందు నా శ్యమంతకమిచ్చేయి'' మళ్ళీ మొదలు పెట్టాడు. అధర్మం పెచ్చరిల్లుతుంటే భగవంతుడూరుకోడు. అధర్మానికి, అటునుండి నాశనానికి దారి చేసుకోకు. నీ శ్యమంతకంతో నాకు పనిలేదు. నాకవసరములేదు. ఆ సంగతి నిన్ననే ఖచ్చితంగా చెప్పాను. ఇప్పుడు నువ్వు నీ పిల్ల, శ్యమంతకం ఎవరికీ అవసరం లేదు. మర్యాదగా-

వెళ్ళిపోతాను. నా శ్యమంతకం....

అర్థం చేసుకోకపోతే అవస్థలపాలవ్వాల్సి వస్తుంది. నువ్వు జరాసంధ చక్రవర్తి కంటే ఘనుడవు కావు!''

అలాగ వురిమితే భయపడను. నువ్వు కాదంటున్నావు. మరెవ్వరు తీసారు ?'' మళ్ళీ ప్రారంభించాడు.

సత్రాజిత్తూ! మాటిమాటికి నువ్వు తీసావంటూ నా సహనాన్ని పరీక్షించకు. నువ్వు నన్ను చూడలేదు. నీ వాళ్ళెవరు చూడలేదు. నేను తీసానని ఎలాగ నిందిస్తావు?''

మళ్ళీ సమాధానం శూన్యం.

“నువ్వే తీసావు. అందుకు ఇది సాక్ష్యం!'' చెవి కుండలాన్ని చూపాడు. నీదేకదా ?'' అడిగాడు. నాదేనన్నాడు కృష్ణుడు. మరిప్పుడు చెప్పు.

“చెబుతున్నాను విను. ఆగ్రహం పట్టలేక నువ్వు నన్ను నిన్న త్రోసావు. నేను శాంతం వహించి, వూరుకున్నాను. ఆ సమయంలో జారి క్రిందపడింది. ఆ తర్వాత దీనిని భద్రంగా నీ వద్ద వుంచుకుని ఈ నాటకం మొదలుపెట్టావు ?

“విన్నారా! విన్నారా... ఎలాగ మాటలు మారుస్తున్నాడో మాయావి. మహామాయ.....'' మళ్ళీ వదరుడు.

మరి బయట -

రెండు వర్గాలవారి మధ్య కలహం.

అనవసర రగడ.

అదెంతవరకు దారితీస్తుందో తెలియని అయోమయం!

# కృష్ణుని ప్రతిజ్ఞ

ఇక్కడ ఈ గందరగోళం జరుగుతున్న సందర్భంలోనే బృహద్బలుడు, అక్రూర, బలరామ, ఉద్ధవ, యుయుధాన, సాత్యకిలతో వచ్చాడు. మహారాజు, మిగిలిన ప్రముఖులు - అక్రూర, సాత్యకి, వసుదేవులు, మరో మందిరంలో చర్చించుకుంటున్నారు.

అందరు వరండాలోకి వచ్చారు. సాధారణంగా బృహద్బలుని భుజంపై చెయ్యివేసి నడిచే మహారాజు ఇప్పుడు కృష్ణుని భుజంపై చెయ్యివేసి వరండాకు బయలుదేరారు. వీరితోపాటు సత్రాజిత్తు, శతధన్వ భంగాకరులు కూడా వరండాకు బయలుదేరారు.

రాజప్రాసాదంముందు చేరిన ఇరుపక్షాల వారి అరుపులు, కేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతుంది. అటువంటి సమయంలో మహారాజు, సభా ప్రముఖులతో వరండాలో అడుగుపెట్టేసరికి, ఒక్కసారి నిశ్శబ్దమావరించిందక్కడ.

ఇంత సమూహం, వచ్చే అతిరథులకు దారి ఇచ్చింది. అందరికి సత్రాజిత్తు అనైతిక నింద, పరుష మాటలు తెలిసి, రాజభవనానికి త్వరత్వరగా కదిలి వచ్చారు. వరండాలోకి రాగానే మహారాజు కృష్ణుని భుజంపై చెయ్యి తీసివేసారు. ముందు మహారాజు, వెనుక రాజుప్రముఖులు, వారి ప్రక్కన బలరాముడు, ఆతని ప్రక్కన కృష్ణుడు. సభామర్యాదపూర్వకంగా నిలబడ్డారు.

ఆ సమయంలో సత్రాజిత్తు వర్గంలోని ఒక మహారథి గబగబ ముందుకు వచ్చి "ఇతడు పెద్దమనిషి, ధర్మావతారుడా ? పెద్ద దొంగ. శ్యమంతకాన్ని, అతి తెలివిగా దొంగిలించాడు" కృష్ణుని చూసి వదరుతున్నాడు.

బలరాముడు కోపం పట్టలేకపోతున్నాడు. అసలే అగ్ని. అందులో గుగ్గిలం వేసినా, నెయ్యి పోసినా దాని ప్రతాపం పెరిగేటట్లున్నాడు. పెద్దన్న వెంటనే అలాగ అన్న, అతన్ని ఎత్తిపెట్టి "ఏమిటిరా నువ్వు వాగుతున్నావు." అని అలాగే కత్తి సత్రాజిత్తు బృందంవైపు విసిరాడు. దాంతో -

"బలదేవా జయము, జయము. పెద్దన్నా జయము, జయమనే" కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. ఇక ఆ సమావేశాన్ని ఆవేశాలకు తావివ్వకుండా

"చూడండి. అందరు సావధానులై వినండి. మహారాజుగారి ఆదేశం వినిపిస్తున్నాను. ఆ ప్రకారం మనమందరం నడుచుకోవాలి!" గొంతు సవరించుకుని, వృద్ధవీరుడు, యాదవ ప్రముఖుడు సాత్యకుడు చెబుతున్నాడు.

"సంపన్నుడైన సత్రాజిత్తు - లోకపూజ్యుడైన గోవిందుని పైన నిందారోపణం చేసాడు. అది ఆరోపణమే. ఈనాటి ఉదయం, తన ఇంటికి వచ్చి, తను ఆ సమయంలో కొద్దిక్షణాలు బయటికి వెళ్ళడం కనిపెట్టి, తన పూజా గది తలుపుల తాళాల ఎవరికి వినబడకుండా పగులగొట్టిన కృష్ణుని రాక కాని, వెళ్ళడం కాని ఎవ్వరికి తెలియకుండా...

"ఏ విధమైన అనుమానం రాకుండా శ్యమంతకంతో పారిపోయాడుట. ఈ ఆరోపణతో ఇక్కడికి వచ్చాడు. తన శ్యమంతకాన్ని తెచ్చి ఇమ్మంటున్నాడు. కాదంటే యుద్ధానికైనా సన్నద్ధమని, విల్లంబులు, ఈటెలు, కత్తులు మహారథులతో సర్వసన్నద్ధంగా వచ్చాడు. అదిగో, అతని అరాచక రాజ్య సంపద" అని వాళ్ళ రథాల్ని, ఆయుధాలను చూపించాడు.

"మహారాజు, ఏదో మాట్లాడి, అవతలివాళ్లు నేరం చేసారని, ఆరోపించడం కాదు. నిన్న వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణలో ఏర్పడిన స్తబ్ధత, వైరం మనసులో పెట్టుకుని, ఈ రకంగా ప్రవర్తించడం తగదు. అది నీకైనా, నాకైనా సరే!" అని సూచించారు.

ఇప్పుడు జరిగిందేమిటో ముందు సత్రాజిత్తు ఆ తదుపరి, కృష్ణుడు చెబుతాడు. అది ముందు వినండి. ఆ తరువాత మీ అభిప్రాయాలు చెప్పండన్నాడు. దాంతో సత్రాజిత్తు "పౌరులారా!" అని ముందడుగు వేసి తన కథనం ప్రారంభించాడు.

అంతా చెప్పి - ఇదిగో ఇది కృష్ణుని చెవి కుండలం. ఇది నాకు, అతను పారిపోయిన ప్రాకార ద్వారం వద్ద దొరికింది. ఇంతకుమించి సాక్ష్యమేం కావాలి ? ప్రజల్నే సూటిగా ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా సాత్యకుడు -

"పౌరులారా! నిన్న సభాప్రముఖులందరం గోవిందుని పిలిచి, వారింట్లో జరిగినదేవిటో అడిగాం. ఎందుకు మీరడగాల్సి వచ్చిందని మీరడుగ వచ్చును.

నిన్న మన కృష్ణుడు, సత్రాజిత్తు ఇంటికి వెళ్ళాడు... అక్కడ జరిగిందంటూ, అక్షరం విడువకుండా, కృష్ణుడు చెప్పిన ప్రతి అక్షరం - సభకు వివరించాడు. ఇంకో పరమ రహస్యం. సత్రాజిత్తు దుష్టప్రవర్తనను పసిగట్టి గోవిందునితో తగవు వద్దని సత్యభామ ఆపింది కాబట్టి సరిపోయింది. లేకపోతే మన కృష్ణుని పీక పిసికి చంపడానికి ఈ మనిషి, కృష్ణుని మీద పడ్డాడు.

కృష్ణుడు ఇప్పుడు కాదు. చిన్నప్పటి నుంచి నాకు తెలుసు. కంసుని దెబ్బలకు భయపడి పారిపోయి, కంసుని మరణానంతరం, మధురకు వచ్చిన సత్రాజిత్తు కృష్ణుని గురించి అన్నది వినడం తప్ప, ప్రత్యక్షంగా చూసినవేమీ తెలియవు.

కృష్ణుడు గొప్పతనం - ఎంత గొప్పదంటే, తన మీదపడి చంపబోయిన సత్రాజిత్తును మన్నించి యాదవ కులక్షేమం కోసం, నా పిల్లవానికి, వాని పిల్లనివ్వ డానికి షరతు పెడితే, పాండవులకు నువ్వు అడిగిన సంపదను దానం చేస్తానంటే అది జరగదన్నందులకు, కుపితుడై చివరికింత నీచానికి, ఇలాగ దిగజారాడని, తనకు తెలిసింది, కృష్ణుడు సభలో అందరికి విశదబరిచాడు.

మేమడ్డం పడకపతే, బలరామాది, అతిరథ మహారథులు, కృష్ణునిపై అతను చేసిన ఘోరానికి ఈపాటికి చచ్చిపోయి వుండేవాడు. ఇవ్వాళ రెండోదినంగా చెప్పుకునేవారు. గోవిందుడు, పరమ కృపాళుడు కాబట్టి, అతన్ని క్షమించి ప్రాణదానం చేసాడు. అందుకు సత్రాజిత్తు చేసే ప్రత్యుపకారమిది” అని సాత్యకుడు ముగించాడు.

అక్కడ చేరిన వారిలో ఎక్కువమంది కృష్ణుని కీర్తిస్తూ జయజయ ధ్వనులు చేస్తుంటే, అతికొద్దిమంది, సాత్రాజిత్తు విసిరేసే ఎంగిలి మెతుకులు తినేవారు “దొంగ”, “దొంగ” అంటూ తమ అభ్యంతరాలను ప్రకటించారు.

అప్పుడు కృష్ణుడు ముందుకు వచ్చాడు. యధావిధి మందహాసంతో, ఆవేశం అనర్థదాయకమని నిన్ననే చెప్పాను. నువ్వు నా ముందు చాలా అల్పుడివని, అయినా పెద్దవాడిగా గౌరవించి నమస్కరిస్తున్నానని, ఎంతో వినయంగా, శాంతంగా, బుజ్జగిస్తూ మరీ విషయం వివరణం చేసాను. అయినా తన మూర్ఖత్వంతో ప్రశాంతతను భగ్నం చేసాడు. అడవిలో పుట్టిన దావాగ్ని అడవిని, సముద్రంలో పుట్టిన బడబాగ్ని సముద్రాన్ని అల్లకల్లోలం చేస్తూంది. పరిసర ప్రజానీకానికి ప్రాణసంకటమౌతుంది. అలాగ వుంది - ప్రస్తుతం - సంపన్నుడు,

గొప్పవాడినని, యాదవకుల వినాశనానికైనా సిద్ధపడతాననే - ఈ పెద్ద మనిషి సత్రాజిత్తు కథనం.

ఇది హర్షణీయం కాదు. ఆ శ్యమంతకాన్ని మహారాజుకివ్వు. అందరు క్షేమంగా, సిరిసంపదలతో హాయిగా వుంటారు. లేదో, లేనిపోని ఆపదలకు గురవుతారు. అఖరికి ప్రాణహాని కూడా జరగవచ్చని సూచించాను. అయినా తొందరపడి నన్ను కొట్టబోయాడు. ఆ ఫలితమిప్పుడే - శ్యమంతకమణి - అదృశ్యమై ఆరని అగ్ని రగిల్చింది. చిచ్చు పెట్టింది. చివరికిది ఎంతవరకు వెడుతుందో, ఆ భగవంతునికే తెలియాలి.

నేను సమాజ సంక్షేమం, లోక కల్యాణం ఆలోచించేవాడినే తప్ప, నా కంటూ నాకేమీ అవసరం లేదు. అడిగితే ఇవ్వడానికి, ఈ ఆర్యావర్తంలో ఎందరో రాజులున్నారు. అందరికీ ఇచ్చే నాకు వారేమివ్వగల్గుతారు. ఈ మూర్ఖత్వం సత్రాజిత్తు విడిచిపెడితే బ్రతుకుతాడు. లేకపోతే, గతంలోని దుర్మార్గులవలెనే ఇతడూ కాలగర్భంలో కలిసిపోతాడు.

ఇంతావిని, ఇంకా నేను తప్పు చేసానంటే మీ ఇష్టం. మీలో ఎవరు ఏ శిక్ష విధించినా తప్పక, ఆనందంగా స్వీకరిస్తాను క్లుప్తపరిచాడు వాసుదేవసుతుడు.

"నేను నిర్దోషిని. ధర్మానికి బానిసను. అందరి ఆనందం కోరేవాడిని. అయినా ఈ సత్రాజిత్తు స్వార్థంతో నన్ను నిందించాడు. దీనికి తగిన సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాపై వుంది.

సత్రాజిత్తు వేసిన నిందను నేను పోగొట్టుకోవాలి. నాతో కలిసి వచ్చే వాళ్ళందరు రండి. అతని శ్యమంతకాన్ని సాధించి, అతనికిద్దాం. నేనొక్కడినే వెడితే, ఇంత జరిగింది కాబట్టి నాల్గురోజులక్కడెక్కడో దాగి, నా శ్యమంతకాన్ని తెచ్చి నా కిచ్చాడంటాడు.

కాబట్టి, నాతో మీరెంతమంది వస్తారో, అంతమంది రండి. మళ్ళీ శ్యమంతకంతోనే ద్వారకలో అడుగుపెడుదాం. మహారాజును దర్శించి, దానిని వారికిద్దాం. దానిని మహారాజు ప్రజలందరి సమక్షంలో అతనికిస్తారు. ఆతడిలో నిజమైన క్షత్రియ రక్తమెక్కడైనా పారుతుంటే తనకు తానుగా చస్తాడు. కాదంటే,

మొహం చాటు చేసుకుని, తన అంతఃపురంలో, అందరు బహిష్కరించినట్లు కుమిలి, కుమిలి చస్తాడు. ఇది నా ప్రతిజ్ఞ'' అన్నాడు.

దాంతో అందరు బయలుదేరుదాం, బయలు దేరుదాం!! అని కృష్ణప్రియులైన ఆ ద్వారకాపురవాసులు ముందుకొచ్చారు.

# సత్యసాహసం

**అం**దరు రాజమందిరానికి వెళ్ళారు. ఈ పరిస్థితులలో తన ఆశలు అడియాసలే. కృష్ణునితో పెండ్లి జరుగదు. ఆ ఆశలిక అనవసరం. కనుక తను బ్రతకడమనవసరం. తన రక్షణకెవరు రారు. తన కలలన్ని కల్లలైపోయాయి కనుక ఇక తను బ్రతకడమనవసర మనుకుంది.

వెనుక ముందులాలోచించకుండా, తన కుయుక్తులతో, నేనెలాగ అతనితో ప్రవర్తిస్తానో నీకు తెలియదు. నా ఆలోచనలు నావి'' అన్న తండ్రి అవివేకిగా మారాడు. అన్యాయంగానే కృష్ణునిపై యుద్ధం ప్రకటించాడు. కనుక నా ఆశ నిరాశ. నేను బ్రతుకడమనవసరం.''

లోకమంతా మెచ్చుకునే లోకారాధ్యుని, ధర్మపరిరక్షకుని, సత్యమూర్తిని, తన కలల రాకుమారుని "దొంగ''గ ముద్రించాడు. ఈ తండ్రి ప్రవర్తనతో పౌరులలో అల్లకల్లోలం, అరాచకం. తన ఆశ నెరవేరదు. కనుక తాను బ్రతకడ మనవసరం.

ఎంతోమంది తన తండ్రి నిందలకు తల్లడిల్లిపోయారు. తమాయించుకోలేక ఆవేశంతో పోరాటానికి దిగుతారు. అప్పుడు అల్లకల్లోలం. దీనికోసమే ఎదురుచూసే సంఘవిద్రోహ, అరాచకశక్తులు విజృంభిస్తారు. ఆ అంతర్యుద్ధాలు ప్రజా నాశనం, ఆస్తులు నష్టం. దౌర్జన్యాలు, దురాక్రమణల పర్వంలో ఆకతాయిల ప్రవేశం.

దాంతో సర్వానర్థాలు. తన ఆశలు అడియాసలు. కాబట్టి బ్రతకడ మనవసరం. సంపద పెరిగే కొద్దీ తండ్రి బుద్ధి వక్రిస్తుంది. కృష్ణుడు లేని ఈ రెండేళ్ళలో, ఇష్టారాజ్యంగా బ్రతికిన తన తండ్రి, కృష్ణుని రాక ఆతని ధర్మపరిరక్షణా దృక్పథం, సామాజిక దృష్టి, సాహస పరాక్రమాలు, నా తండ్రి గొంతుకలో పచ్చి వెలక్కాయయింది.

ఇటువంటి అవాంతరమేద్దైనా సంభవిస్తే దానిని దీటుగా ఎదుర్కొని, యాదవకులంలో ముసలం పుట్టించైనా సరే, తన ప్రాభవం నిలబెట్టుకోవాలని, రాజదర్పాలతో, ఓ మహారాజుగా వెలుగొందాలని తలిచాడు. అందుకే కృష్ణునితో అశ్వమేథం చేస్తానన్నాడు - దానిని కృష్ణుడు ప్రతిఘటించలేదు కానీ రాజులు చక్రవర్తిత్వ మొందడానికి ఆ యజ్ఞాలు చేస్తారని, మరి నువ్వు దేనినాశించి చేస్తున్నావని అడుగుతాడు. అది తన తండ్రికి కోపకారణం. అందుకే ఈ దారుణం. తన ఆశలు అడియాసలవడం. బ్రతుకు బండబారడానికి కారణ మవడం. చావుకు దారి తీయడం, ఏం చేస్తాం. విధివ్రాత అలాగ వుంది. విధి బలీయమనుకుంది, ఆ పిచ్చిపిల్ల నిరాశల నిట్టూర్పుల బడబాగ్నిలో సతమతమవుతూంది...?!

ఇంచుమించు భోజనాల సమయానికి ఇంటికి వచ్చారు. ప్రొద్దున్ననగా వెళ్ళిన వాళ్ళు అక్కడ జరిగిందంతా ఘనకార్యంగా తెలిపారు. కృష్ణుడు చేసిన ప్రతిజ్ఞను కూడా చెప్పారు. ఇదంతా విన్న సత్య ఒక ముద్ద కూడ ముట్టలేక పోయింది. వాసుదేవుని, ప్రాణనాథునిగా భావించి, పూజించే సత్యభామ, తండ్రి ప్రవర్తనతో తల్లడిల్లిపోయింది. చివరకు తానేమౌతుందో, ఆమెకు అర్థం గావడం లేదు. తిండిలేదు, నిద్రరాదు. ఇదో... దిక్కుతోచని, దిక్కుమాలిన స్థితి.

తన పరిస్థితిని వివరిస్తూ సత్యభామ, తన దాదిని సుభద్ర వద్దకు పంపింది. అలాగే కృతవర్మకు కూడా ఒక్కసారి సాత్యకిని ఆలయం వద్దకు పంపమని ప్రార్థించింది. ఉదయాన్నుంచి జరిగిన ప్రతి సంఘటన సత్యకు వూపిరాడనీయకుండా ప్రాణాంతకమై కూర్చుంది. దాంతో బ్రతుకాలనే ఆశలకు తిలోదకా లిచ్చేసింది.

ద్వారకాలో వాతావరణం కూడా బాగోలేదు. ప్రజాజీవనం స్తంభించడమో, అస్తవ్యస్తమవడమో జరిగేటట్లుంది. ద్వారకలోని దాదాపు తొంభైశాతం మందికి పైగా, కృష్ణునిపై తన తండ్రివేసిన నిందకు, కుతకుతలాడుతున్నారు.

ఈ పరిస్థితిని గమనించే కృష్ణుడు ఎవర్ని తొందరపడవద్దని, ఇది కేవలం తన వ్యక్తిగతం, పరువు ప్రతిష్టలకు సంబంధించినదని శాసించడంతో మిన్న కున్నారు. కాకుంటే ఈపాటికి తండ్రి, ఆతని అనుచరుల, అనుయాయుల శవాలు ఇంటిముందు దిక్కు మొక్కు లేకుండా కుప్పలా పడివుండేవి.

అన్ననడిగింది. అక్కడ జరిగిందేమిటో వివరించమంది. భంగాకరుడు మొత్తం వివరించి చెప్పాడు. మన తండ్రిగారి నిందారోపణ అసహనంతో కూడినదని, ప్రతి ఒక్కరు కొట్టిపారేసారు. ఆ వాసుదేవుడు వారించకపోతే, ఈ పాటికి మేమందరం, ఆ మృత్యుదేవత సన్నిధిలో రకరకాల నీచశిక్షలతో, నరకానికి ప్రత్యేకహ్వానితులమై వుండేవాళ్ళం.

ఆ యముడు గూడా మాకు జరిపించాల్సిన శిక్ష కంటే కృష్ణనిందకు మరిన్ని రెట్లు శిక్ష విధించి వుండేవాడని వాపోయాడు. ఇటువంటి పరిస్థితి నెదుర్కోవాల్సి వస్తుందని ఏనాడు తలంచలేదని కృంగిపోయాడు. అప్పుడు సత్య కనిపించింది. ఇదంతా తన తండ్రి కావాలని ఆడుతున్న నాటకమని, అందుకే తెల్లవారకుండానే తమ్ముడిని ఎక్కడకో పంపించి వుంటాడని, ఈ రకంగా కృష్ణునిపై కక్ష సాధించ వచ్చని నిర్ణయించుకున్నాడు. కృష్ణుడన్నట్లు, ఆ కుండలం నిన్నటి హడావుడిలో ఇక్కడ పడిపోతే, దానిని ఆధారం చేసుకుని, ఇంత హడావుడి నాటకం నడిపించాడని ఆమె తలచింది. దీనికి పరిష్కారమాలోచిస్తుంది.

సత్య పంపిన దాది నిరుత్సాహంగా తిర్గి వచ్చింది. నిన్న కొట్టినందులకే బాధపడ్డ సుభద్ర, సత్రాజిత్తు వంటి పరమదుర్మార్గుని కూతురు ముఖం తానిక చూడదలచుకోలేదని, ఇక తననెప్పుడు ఒక స్నేహితురాలిగా తలువవద్దని హెచ్చరించినట్లామె చెప్పింది.

సూర్యాస్తమయం వరకు వూపిరి బిగపెట్టుకుని కూర్చున్న సత్య ముందుగా సూర్యదేవాలయానికి అటునుండి కృతవర్మ ఇంటికి వెళ్ళింది. ప్రస్తుతం తన ఇల్లు ఇల్లుగా లేదు. అదొక నరకం. ఒక అన్న భంగాకరుడు మినహా అందరు సత్రాజిత్తును కాదనలేక నమ్ముతున్నారు. అతడు తండ్రి నిందల్ని ఒప్పుకోక పోయినా, ఒక్క భంగాకరుడు మాత్రమే, ఒక మంచి కుమారుడిగా తండ్రి ఎడ ప్రవర్తిస్తున్నాడు. అది పుత్రధర్మం. అనుసరించక తప్పదు.

కృతవర్మ ఇంటికి వెళ్ళి. అక్కడ తన మనఃస్థితిని పరిస్థితిని తెలియబరచి, బాధను వదిలించుకుని ఇంటికి వచ్చింది. ఇప్పుడు... ఆమెకొక ఆలోచన. దాని ప్రకారం, తన కలల రాకుమారునికి, ప్రభువుకు వీరోచిత మర్యాదపూర్వక వీడ్కోలివ్వాలని తలచింది.

ఆ తదుపరి, ''సత్యభామ, తన దాదిని పిలిచి, సుభద్ర దగ్గరకు వెళ్ళి నేను చెప్పినట్లు అక్షరం పొల్లుపోకుండా చెప్పు'' అంటే అలాగే చెబుతానంది.

"నువ్వు నిందించడంలో తప్పు లేదు. ఈ ఆలోచన ఖచ్చితంగా సబబైనది. నన్ను కలవడం, నాతో మాట్లాడటం నీవంటి వారికి తగనిదే కాదనను. కాని అంతో ఇంతో తెలియకుండా ప్రేమను పెంపొందించుకున్నాము. ఆ చొరవతో...

నా వీరునికి - వీరోచిత వీడ్కోలు ఇవ్వదలచుకున్నాను. అందులో కొన్ని వాక్యాలు మరచిపోయాను. దయచేసి వాటిని నాకు తెలియబరచు. నా ధర్మం నేను నా ప్రభువు కోసం నిర్వర్తిస్తాను. ఆ మాత్రం వరమివ్వు!'' నేను అర్థించినట్లే ఆమెతో మరీ మరీ చెప్పమంది. ఆమెను పంపింది.

అందరు భోజనాలు చేసారు. ప్రతి ఒక్కరు నిద్రకుపక్రమిస్తున్నారు. అందరిలాగే తాను నిద్రపోలేదు. కాని, పోయినట్లు నటిస్తుంది. అర్థరాత్రి సూచిస్తు నగారా మ్రోగింది. వెంటనే పరిచారికవలె దుస్తులు మార్చుకుంది. పిల్లిని తీసుకుని జాగ్రత్తగా బయటపడింది. చీకటిలో కలిసిపోయిందామె. ఆమే సత్యభామ.

★ ★ ★ ★

తల్లిదండ్రులకు తన వందన శతాలర్పించిన కృష్ణుడు తన మందిరానికి వచ్చాడు. రుక్మిణి, కృష్ణుని చూసి గాఢంగా నిట్టూర్చింది. బంగారానికి, తుప్పు పడుతుందంటే ఏమోననుకున్నాను. అది ఇప్పుడు కలి రాకముందే గ్రహించ గలిగాను. ఎంతో బాధపడిందామె.

అంతా మౌనరోదనే తప్ప, మాటలుకు తావు లేకుండా పోయింది. ఇటువంటి విపత్కర పరిస్థితిని కృష్ణదేవుడు ఎదుర్కోవలసి వస్తుందని, ఎప్పుడు ఎవరు తలంచలేదు. అటువంటి స్థితి కృష్ణుని తాకింది. మధ్యాహ్న భోజనాల తదుపరి కృష్ణుని దర్శించడానికి, పరిస్థితినధిగమించడానికి, కృష్ణ సన్నిహితులైన యాదవ ప్రముఖులు వచ్చారు. దీనినెలా అధిగమించాలి ? ఇదొక ప్రశ్న కాని తీవ్రమైన సమస్య. పరిష్కారంగా సమాధానం దొరకడం లేదు.

"జరిగిందేదో జరిగింది. నిజం నిలకడ మీద నిగ్గు తేలుతుంది. అంతవరకు ఓపిక పట్టండి. ఎటువంటి దురాగతాలకు పాల్పడకండి. ఇది నా ప్రార్థన'' కృష్ణుని

అభీష్టాన్ని విన్న అందరు తలలూపారు. ధర్మం నావైపు వుంది. ఆ దేవుడు తప్పక దయ తలుస్తాడు. ఇది సత్యమన్నాడు.

"నువ్వంత కఠిన నిర్ణయం....!" కృతవర్మ ఓదార్పు.

"అయ్యా! తమరు పెద్దవారు" కృష్ణుడు కదా... అని వుపేక్షించకుండా, ధర్మం కోసం మనం తపిస్తే తప్పక దారి దొరకుతుంది. ధర్మం రక్షింపబడుతుంది. అప్పుడది తప్పక మనల్ని రక్షిస్తుంది. ఇచ్చిన వస్తువు తీసుకోవచ్చును. ఆడినమాట, చేసిన పాపం వెనక్కి తీసుకోలేము. అది అనుభవించవలసిందే. తప్పదు"అందర్ని సమాధానపరిచాడు. ఒక్కొక్కరే, వరుసగా వెళ్ళిపోయారు.

మిగిలిందల్లా.... ఉద్ధవుడు, ఆతని ఇరువురు భార్యలు "కపిల - పింగళు"లు మాత్రమే. వీళ్ళు కృష్ణునికి కల్గిన బాధకు, వచ్చిన నిందకు, నిలువునా కదలి పోయారు. దేవదేవుడైనా, మానవుడైనందులకు, ఈ నిందలు, నిరసనలు తప్పావి? అని ఎంతో బాధ పడిపోయారు. శోకమూర్తుల వలె వున్నారు.

"ఇదేదో కుట్ర సత్రాజిత్తు దాన్ని తనే మాయం చేసి, నిన్ను....!" ఆవేశ పడిపోతున్నాడు, ఉద్ధవుడు.

"బాధపడకు. భయపడకు. ఆ దేవాధిదేవుడు ధర్మపరిరక్షకుడు. తప్పక మనల్ని కరుణిస్తాడు" అని కృష్ణుడు ఉద్ధవుని వూరడిస్తున్నాడు.

"ఇక్కడ ఉదయం నుండి ప్రసేనజిత్తు కనబడలేదు. నువ్వు గమనించావా?!" వున్నట్టుండి కృష్ణుడు అడిగాడు. అవునన్నట్లు ఉద్ధవుడు తలూపాడు. "వాడసలే పేచీకోరు. ఎక్కడ ఏ గొడవల్లో ఇరుక్కున్నాడో, ముందు వాడి గురించి ఆలోచించాలి. వాడు కనిపిస్తే కొన్ని విషయాలు బయటపడతాయి"

"ఉద్ధవుడు ఆశ్చర్యపోయాడు. ఇదొక రకంగా ఆలోచించవలసిన విషయమే. అందుకే కృష్ణుని దేవుడననేది. ధర్మానికి మారు పేరనేది" అని నీకు వచ్చినట్లుగానే నాకు ఆలోచన వచ్చింది. అతన్ని గురించి వాకబు చేసాను. రాత్రి వరకు వున్నాడు. తెల్లవారి కనబడటం లేదుట. తెలుసుకున్న విషయాన్ని ఉద్ధవుడు వివరించి చెప్పాడు. వాళ్ళలాగ మాట్లాడుకుంటున్న సమయంలో" అన్నా! ఎందుకంత తొందర పడ్డావు. ఆ శ్యమంతకం.... దొరకకపోతే మా గతి ?" సుభద్ర బుంగమూతి పెట్టి తన బాధను వ్యక్తం చేసింది.

పిచ్చిపిల్లా! "అంతా మన మంచికే" అంటారు చూడు. అదే ఇది. ఆ దేవుని మనోగతాభిప్రాయం మనకెవరికి తెలియదు. ఇందులో ఎంత ఉపకారమో, ప్రజలకెంత లాభదాయకమో...!" అంటూంటే...

"ఈ లాభనష్టాల గురించి తర్వాత, నిన్నా పెద్ద పిల్లి కబురు పంపింది. నీ ముఖం నేను చూడనని కబురు పంపాను.

"ఎవరమ్మా ఆ పెద్దపిల్లి...... "ఆ సత్రాజిత్తు కూతురేనా ?" ఆవేశాన్ని తగ్గిస్తూ కృష్ణుడు అడిగాడు.

"ఆ.... అదే.. అంది గోముగా.

"చూడు. ఎవరో తప్పు చేసారు. మరెవ్వరో నిందింపబడుతున్నారు. నాలాగే... నీ బాధలాంటిదే కదా ఆమె బాధ....!"

"అ....న్న...య్య....!"

"అవునమ్మా. ఇంతకీ ఏమంటుంది ?"

"ఏమంటుంది ? నీకు వీరగీతంతో వీడ్కోలిస్తుందిట. తనకు తెలిసిన పాటలో కొన్ని వాక్యాలు మరచిపోయిందట. అది పూరించమని, దాని దాదితో కబురు పంపింది.

"చూసావా, ఆ పెద్ద పిల్లకి మనమంటే ఎంత ప్రేమో.... మరి, పంపించావా. ఆ వీరగీతంలోని మరచిన వాక్యాలను.....!" నవ్వుతూ అడిగాడు. అందులో పరిహాస ముంది, పరిచయానికి తగ్గ పరవశత్వానికి తగు సందర్భోచిత ప్రసంగముంది.

**"ప్రభూ! నువ్వు విజయుడవు.**

**వీరనారి, తన వీరుని విజయాన్ని కాంక్షిస్తుంది.**

**భయపడకు, నువ్వు విజయుడివవుతావు.**

**వీరవిక్రమునికి, ధర్మ పరిరక్షకునికి అపజయముండదు.**

**"ధర్మో రక్షతి రక్షిత" అన్నారు.**

**"అన్నది నువ్వే, అనిపించి, వినిపించేది నువ్వే.**

నీ కోసం నేను ఆరతి కర్పూరం.

**వెయ్యి కళ్ళతో వేదన విడిచి ఎదురుచూస్తా.**

**విజయుడివై తిరిగిరా, విశ్వమోహన మూర్తీ**

**అపజయమెరుగని సద్ధర్మమూర్తీ**

**"జయహో! జయహో! జయము జయము జయహో!" -**

ఇది - ఆ పాట" అంది సుభద్ర.

"ఇందులో నీకేమర్థమయింది ?" కృష్ణుడు సుభద్రను అడుగుతూంటే -

"ఏముంది, నాకు. ఆ కొంటె కోణంగి పాటలెలాగ పాడాలో పాఠాలు నేర్పుతుం"దంది.

"నా వుద్దేశమది అయి వుండదు" అన్న కృష్ణుడు, అనవసరంగా, ఆ విషయాన్ని పొడిగించదలచక, ఇప్పటికే ఆలస్యమైంది. నిద్రపొండి!" అని ఆ పాటల కథను ముగించాడు.

బ్రాహ్మి ముహూర్తంలో మేలుకొన్న కృష్ణుడు, తన నిత్య సంధ్యావందనాది కార్యక్రమాలను ముగించుకుని, కాస్సేపు యోగాను చేసి, ఉద్ధవునితో కాస్సేపు మల్లయుద్ధం చేసాడు. ప్రతి దినము సాత్యకితో యుద్ధం చేసే కృష్ణుడు ఈనాడు, సాత్యకి రాకబోయేసరికి, ఉద్ధవునితో పోరాడి, శరీరాన్ని క్రమపద్ధతిలో వుంచుకున్నాడు.

ఆ తర్వాత మళ్ళీ స్నానంచేసి ఇంటికి వచ్చేసరికి ఉద్ధవుని భార్యలు దిగులుగా కనిపించారు. విషయమడిగితే "ప్రభూ! సత్రాజిత్తు కుమార్తె "సత్య" కనబడటం లేదట!" ఆమె దాది ఏడుస్తుంది. ఆ అమాయకురాలు ఎక్కడికి వెళ్ళిందో, ఏమైందో.... మీతో చెబుదామని వచ్చిందిట."

కృష్ణుడు ఆశ్చర్యపోయాడు. ఏమిటిదంతా! అంతా మాయగా వుందనుకున్నాడు. ప్రక్కన వున్న దాదినడిగితే, నిన్న మధ్యాహ్నం నుండి జరిగినదంతా, తానే ప్రత్యక్షసాక్షిగా, విషయవివరణం చేసింది. ఇంట్లోని పరిస్థితి, సత్య బాధ మొత్తం విపులంగా చెప్పింది.

తెల్లవారి లేచి "అమ్మా!" అంటూ వెళ్ళాను. ఆమె ఆనవాళ్ళే కనబడలేదు. ఇల్లంతా తిరిగాను. చూడవలసిన ప్రదేశాలు చూసాను. సత్య మనసు నాకు

తెలుసు కదా! తండ్రి ప్రవర్తనతో ఆ పిల్ల నరకయాతన పడుతుంది!'' ఆ పిల్ల బాధను దాది పెంచిన తల్లిగా, విడమరచి చెప్పింది.

ఈ సమయంలోనే ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు. అవి ఎంతో భారంగా వున్నాయి. "ఎవరా ?'' అని ఆలోచిస్తున్న సందర్భంలో, ఆ వచ్చింది సాత్యకులవారు. ఎంతో కోపంగా వున్నారు. ఏ అలంకారాలు లేకుండా సాదాసీదా పౌరులు వలె వున్నారు. ఏదో అపకారం, ఆయనకు జరిగిందని, వారిని చూస్తేనే తెలుస్తుంది.

మరో మాట లేదు. "కృష్ణా! యుయుధనుడెక్కడా ? అన్నది ఆయన ప్రశ్న, చింతకు కారణం ?

అతను మాతో లేడు. కనీసం మల్లయుద్ధశాలకు కూడా రాలేదు.

"అయితే అతను కనబడటం లేదు.''

"ఆ... అన్నారందరూ!

"ప్రతి నిత్యం, మల్లయుద్ధశాలకు వచ్చే అతను రాకపోయేసరికి, కొద్దిసేపు ఆలోచించి, ఉద్ధవునితో యోగా చేసినట్లు పరిశ్రమ చేసి తిరిగి వచ్చాను.

"అతను నిన్నెప్పుడు కలుసుకున్నాడు ?'' సాత్యకుని ప్రశ్న.

"నిన్న సాయంత్రం, కృతవర్మ ఇంటికి వెడుతూ నాకు కనిపించాడు.''

"ఇప్పుడతడక్కడా లేడు. ఎక్కడా లేడు. ఏమై వుంటాడు ?'' పెద్దవాడు, వృద్ధవీరుడు. తెలియని, చెప్పరాని ఆందోళనతో వున్నాడు. అప్పుడక్కడే వున్న దాది "శివా! కరుణించవా! ఏదో జరిగింది. అమ్మాయి కనబడక, ఇతను కనబడక...!'' అని ఘొల్లుమంది. ప్రక్కకు పడిపోయింది.

రుక్మిణి, ఆ దాదిని పట్టుకుంది. కొందరు మంచినీళ్ళు తేవడానికి పరుగెత్తారు.

"ఎవరీమె... ?'' సాత్యకునికి తెలియని ప్రశ్న.

"సత్యభామ, పెంపుడు తల్లి ప్రొద్దున్నుండి సత్యభామ కూడా కనబడటం లేదుట. ఆ విషయం చెప్పడానికి పరుగెత్తుకు వచ్చింది.

కొద్దిగా తేరుకున్న ఆ దాది శోకాలు ప్రారంభించింది. అయ్యో, నా పిల్లా ? ఎక్కడికి వెళ్ళావు తల్లీ! ఇప్పుడర్థమవుతుంది. ఇప్పుడు నాకర్థమయింది. మీ

ఇద్దరు కలిసి పారిపోవడమో లేక నిజం నిగ్గు తేల్చడానికో వెళ్ళి వుంటారు. ఓరి భగవంతుడో....!'' పెద్ద పెట్టున దీర్ఘాలు, రాగాలతో శోకాలు పెడుతుందామె.

“వాళ్ళిద్దరు కలిసే వెళ్ళి వుంటారు, మహాప్రభూ'' తీరని ఆ రాగాలకు, శోకాలకు, సాత్యకుడు కళవళపడ్డాడు. వీళ్ళిద్దరూ... నమ్మలేకపోతున్నాడు.

“అంతే. అయుండాలి మహాప్రభూ! ఎందుకంటే ఇద్దరూ ఒకేసారి కనబడటంలేదంటే...!'' గట్టిగా అనలేక మధ్యలో ఆగిపోయింది దాది.

“ఇందులో ఏదో కిటుకు వుంది. నా కుమారునికి సత్యపై మనసు లేదు. కాబట్టి.... ఇది సాత్యకుని అనుమానమైతే...

“నాకూ అలాగే అనిపిస్తుంది. సత్య, సాత్యకి కలిసి వెళ్ళడంలో ఏదైనా తిరకాసయినా వుండాలి లేక... మరేదైనా కారణమైనా వుండి వుండాలి తప్ప, వారిరువురు లేచిపోయి వివాహం చేసుకునే కార్యక్రమానికి మాత్రం శ్రీకారం చుట్టరు!'' అది అసంబద్ధ ఆలోచనగా కృష్ణుడు కొట్టిపారేసాడు.

సాత్యకుడు ఆలోచనలో పడ్డాడు. “చూద్దాం. వాడు పారిపోయి, ఆ దుర్మార్గుని పిల్లను పెళ్ళి చేసుకుంటే, పరువు ప్రతిష్టలు పోయాక, వాడున్నా ఒక్కటే చచ్చినా ఒక్కటే. ఈ గుంజాటనలో వాడు మిమ్మల్ని చంపేకన్నా వాడే చావడం మంచిది. వస్తా''నంటూ ఆ పరిస్థితిని తట్టుకోలేక, అంతటి నిగ్రహుడు తన స్థితిని మరచి, అరచి బయలుదేరాడు. దాదితో, కపిల పింగళులు కూడా అక్కడ నుండి వెళ్ళిపోయారు. అప్పుడు రుక్మిణి కల్పించుకుని -

“ఏమయ్యుంటుందంటారు ?'' కృష్ణుని ఆసక్తిగా కాక, అనుమానంతో అడుగుతుంది.

రుక్మిణి ప్రశ్నకు క్షణకాలం మౌనం వహించిన ఆ పతి “పెద్దాయన అనుమానం నిరాధారం. నాకు తెలుసు. యుయుధానుడు (సాత్యకి) ఎటువంటి తొందరపాటు నిర్ణయం తీసుకోడు. సత్యతో లేచిపోయి, పెండ్లి అసలు చేసుకోడు. ఇది సావధానంగా ఆలోచించాల్సిన విషయమంటాడు.

అలాగంటూ తల ఎత్తి చూసిన కృష్ణుని దృష్టిలో సముద్రుడు పడ్డాడు. అంతలో కళ్ళు మిలమిల మెరిశాయి. మనసు కుదుటపడి, పరవశించింది.

"విదర్భీ! సత్య పాడిన పాటలోని సందేశమర్థమయింది. అది మీకు పాఠం కాదు. దాని మనసును పరచి చెప్పింది.

"దానర్థమేమిటంటారు ?" రుక్మిణి ఆసక్తి.

"చెబుతాను" అని - తనలో - స్వగతంగా" ఇంతటి మూర్ఖులనుకోలేదని" గొణుక్కున్నాడు.

# ప్రసేనుడు, "గోవిందా!"

**స**త్రాజిత్తు ఆలోచనలన్నీ భగ్నమవుతున్నాయి. ఎందుకంటే, అవి దురాలోచనలు కాబట్టి. తల పట్టుకుని కూర్చున్నాడు. కొండ నాలుకకు మందువేస్తే వున్న నాలుక వూడిపోయినట్లు. నిన్న తాను కృష్ణుని నవ్వులపాలు జేస్తే, ఇవ్వాళ సత్య తనను, నవ్వులు, అల్లరి పాల్జేసింది. కర్మ, కర్మ. ఇప్పుడెలాగ ? సమాజంలో తలెత్తుకుని తిరగడమెట్లాగ ? తలెత్తుకోలేని ప్రశ్న, పరిస్థితితో తలక్రిందు లయ్యాడు

దీనికి తగ్గట్లు ప్రసేనుడింకా తిరిగి రాలేదు. ఈ పాటికి రావాల్సిందే. వాడు రాలేదంటే, తన ఆలోచనలు ఆ విషయంలో కూడా భగ్గుమన్నాయా జరగరానిది జరగలేదు కదా! శ్యమంతకం భద్రంగా వుందా ?" ఇవి మరొక ప్రక్క సతాయించే ఆలోచనలు.

నిత్యానుష్ఠానానికి కూర్చున్నాడన్నమాటే కాని కుదురు కనబడటం లేదు. తమ్ముడు రావటం లేదు. మాటిమాటికి లేచి ఎదురు చూస్తుంటే సత్రాజిత్తు కంగారు, ఆదుర్దా... ఎవ్వరికి అర్థం కావడం లేదు. తెలిసి సత్రాజిత్తు, తెలియక ఆతని పరివారం, కంగారు పడుతున్నారు. ఎవరికోసమీ ఆరాటం ?!

పురోహితులు వచ్చారు. తమ పూజాదికాలు నిర్వహిస్తున్నారు. నా పరిస్థితే... అయోమయంగా వుంది. ఏమిటీ ఆందోళన... ? తనతో పాటు కుటుంబ సభ్యుల ఆవేదన. అంతా అయోమయం. ఎవరు తీసుకున్న గోతిలో వారు పడతారన్నట్లు నా దుష్ట తలంపులు, నన్నే గోతిలో పడవేసినట్లున్నాయి. గొణుక్కుంటున్నాడు.

తెలియని భయం. చెప్పలేని శంక. తీరని ఆవేదన. నెరవేరని కోరిక. మధ్యలో ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన కూతురు సత్య అదృశ్యం. అయితే, ఈతని పరిస్థితికి బాధపడేవారికన్న "మా బాగా అయింది" అని సంతోషించేవారే ఎక్కువగా వున్నారు.

మొన్న ధర్మపరునిగా వచ్చిన కృష్ణుని, నిన్న అల్లరి పాల్జేసిన పాపం... ఈనాడు.. ఇలాగ పరిణమించిందని.. తమలో తాము, బయటకు అనలేక, అనుకుంటున్నారు.

కార్చిచ్చులా, సత్య - సాత్యకిలు పారిపోయారన్న వార్త వెంబడి వెంబడే... వెంబడించినట్లు గాలికన్నా వేగంగా వూరంతా ప్రాకిపోయింది.

లేచిపోయి పెళ్ళి చేసుకున్నారేమో... అని కొందరు.

"ఎవరైన లేపేసారేమో... ఇంకొందరు.

"కలిసి వెళ్ళారా, విడివిడిగా వెళ్ళారా... ? లేక ఇదేమైనా - నాటకాల సత్రాజిత్తు... మరో వింత నాటకమా ?"

"తన మీద పడిన నింద కోసమైనా సాత్యకి ఆమెను పెళ్ళి చేసుకుంటాడేమో!"

ఇలాగ రకరకాలు పుకార్లు, ఆలోచనలు. మొత్తానికి సత్రాజిత్తుకు ప్రాణ సంకటమై కూర్చుంది. ప్రతి ఒక్కరు "సత్రాజిత్తుకు తగిన శాస్తి జరిగింది. నిన్న భగవంతుని దూషించిన పాపం, నేడు తక్షణం అతని పీకకు చుట్టుకుంది. గతి లేని వాడి మతి పోగొట్టింది. భలే, భలే!" అనుకుంటున్నారు.

సూర్యుడు కరుణించి రత్నమిచ్చి, ధర్మబద్ధంగా నడువమన్నాడే తప్ప ధర్మమూర్తిని తూలనాడమనలేదు. సానుభూతి వచనాలకన్న, ఈ రకమైన నిష్ఠూరాలు ద్వారక మొత్తం దావానలంలా వ్యాపించాయి. ఇది ఇలాగ వుంటే..

తెల్లవారి లేచిన రుక్మిణి, ప్రక్కన భర్త లేకపోవడంతో కళ్ళు చిట్లించింది. అటు ఇటు చూసింది. ఇంత ప్రొద్దున్నే తనను లేపకుండా, తాను లేవకుండా ఈ దేవదేవుడు ఎక్కడికి వెళ్ళినట్లు ? సముద్ర స్నానానికి వెళ్ళారా. ఇది - ఈమె ఆలోచనలు. లేక...

క్షణం, రుక్మిణి గుండె వేగంగా కొట్టుకుంటుంది.

తానన్న మాట ప్రకారం, ఎవ్వరికి చెప్పకుండా, శ్యమంతకాన్వేషణకు వెళ్ళలేదు కదా! ఏమో, మగమహారాజు ? తన పరువుకన్న, యాదవుల పరువు

ప్రతిష్టలు నిలుపడానికి ఏమైనా చెయ్యగల సర్వసమర్థులు, ఆలోచన... ఆందోళన... ప్రశ్న.. పరిష్కారం, తన తెలివితేటలతో ఆమే పరిష్కరించుకుంటుందిసమాధానం చెప్పుకుంటుంది. ఆమె, తెలివైన రాజకుమారి కదా!

అయినా ఎందుకైనా మంచిదని, శైబ్య మందిరానికి వెళ్ళింది. చెల్లీ "ఆయనిటు వచ్చారా ?"

"లేరే! ఎందుకక్కా!" అంటూ శైబ్య కంగారుగా అప్పుడే నిద్రలేస్తూ వచ్చింది.

"స్వామి కనబడటం లేదు" రుక్మిణి ఆరోపణ.

"కనబడలేదా ? ఎక్కడికి వెళ్ళి వుంటారు ?" శైబ్య ఆలోచన, అనుమానం!

ఆ దేవదేవునికే తెలియాలి. మనమెంత ?" రుక్మిణి, సమాధాన వచనం.

"ఓ పనిచేద్దాం. స్వామి ఆయుధాగారానికి వెళ్ళారేమో, వెళ్ళి ఒకసారి చూద్దామంది" ఆ మాటతో రుక్మిణి కన్నీరు కురిపించింది. ఆయన దుస్తులు, ఆయుధాలు అన్నీ శయనమందిరంలోనే వున్నాయి. మొల నూలు బంగారు త్రాడు మంచం ప్రక్కనే వుంది!" కన్నీరు ఆపుకోలేక, ఆ ధైర్యవంతురాలు గొంతుక గద్గదికమవుతూంటే, ఒకసారి పెద్దన్నయ్యను చూద్దామంది.

విషయం విన్న రేవతి హడావుడిగా, తన స్వామిని లేపింది. ఏమండీ, మన కృష్ణుడు కనబడటం లేదట. రుక్మిణి, శైబ్య బాధపడుతున్నారు!" వాళ్ళు వచ్చినంత హడావుడిగా, ఈ వదినమ్మ, ఆ పెద్దన్నతో చెప్పింది. ఒక పట్టున, బ్రాహ్మీముహూర్తంలో లేవని బలరాముడు కనబడటంలేదూ, ఏమయింది ?" తమ్మునికి ప్రాణమిచ్చే ఆ అన్న, అంత హడావుడిగా లేచాడు.

"ఆయన వంటిమీద వస్తువులన్నీ గదిలోనే వున్నాయి. నిద్రలోనే ఆయనెవరో... కన్నీరు మున్నీరౌతుంది రుక్మిణి.

"ఎవరమ్మా... నిప్పును మూటగట్టుకున్నట్లు కృష్ణుని ఎత్తుకుపోయేది?" ఆందోళనను విడిచి బలరాముడు ఓదారుస్తు అడుగుతున్నాడు.

"ఇంకెవరు, వున్నాడుగా మనపాలిట శని, ఆ సత్రాజిత్తు. ధర్మవిరోధి, అసత్యవాది" శైబ్య, తన అక్కసునాతనిపై కక్కింది. దీంతో బలరాముడికి రాత్రి

త్రాగిన మందు నిషా మొత్తం దిగిపోయింది. "వూరుకో! వూరుకో" నేను వెళ్ళి తమ్ముడెక్కడున్నా సరే, తీసుకువస్తానని ఆమెను వూరడించాడు.

గబగబ స్నానంచేసి, బట్టలు వేసుకుని బయలుదేరబోతూంటే, ఇంత ప్రొద్దున్నే బలరాముని చూసిన వారందరు ఆశ్చర్యపోయారు. ఆ పెద్దన్ననే నోరప్పగించి చూస్తున్నారు. చేతిలో హలాయుధంతో విరుచుకు పడుతున్నట్లు బయలుదేరాడు.

ఆ వెళ్ళడం, వెళ్ళడం, సత్రాజిత్తు భవనం ప్రాంగణాన్ని చేరి, ఒక్కతాపు తన్నాడు. ప్రాకార తలుపులు తెరచుకున్నాయి. ఆకారం, జాజ్వల్యమానంగా మంటలతో ఎగిసిపడే అగ్నిహోత్రుని వలె బలరాముడున్నాడు. "భళ్ళు"మన్న ఆ తలుపుల శబ్దానికి, బలరాముని వుగ్రరూపాన్ని చూసిన కాపలాదారులు, భవన రక్షకులు గిజగిజ లాడుతున్నారు. సందులలోంచి చూస్తున్న ఆ భవన రక్షకులను-

"తియ్యి, తలుపు" మేఘగర్జన. ఆ గర్జింపుకు వణుకుతూ, తలుపులు తీసి, రెండు చేతులు జోడించి, బొమ్మలయిపోయారు" అయ్యగారి అనుమతి.... సన్నగా, అన్నారెవరో!

అవసరం లేదు అని, నాగలితో ఒక్కసారి తాడించి, ఆ భారీ శరీరం, పెద్ద పెద్ద అంగలు వేస్తూంటే - గుటకలు మ్రింగడం తప్ప మరేమీ చెయ్యలేక పోతున్నారా రక్షణ సిబ్బంది. ప్రాంగణంలో అడుగుపెట్టిన బలరాముడు "వెళ్ళు. నేనొచ్చానని చెప్పు. ఎలాగ వున్నవాడిని, అలాగే పరుగెత్తుకు రమ్మనమను. లేదో... నేను లోపల అడుగుపెడితే, మీ యజమాని, ఈ వరండా ముందు పడుక్కోవలసి వస్తూందని చెప్పు. వెళ్ళు" ఆ గద్దింపుకు ఆమడదూరమెగిరి, ఆ భవన రక్షకుడు అలాగే హడావుడిగా లోపలకు పరుగెత్తాడు.

ఈ హడావుడిని గమనించిన భంగాకరుడు, "రండి. ప్రభూ!" లోపలకు ఆహ్వానించాడు. మీరు వచ్చారంటే నాన్నగారెంతో సంతోషిస్తారు" వినయ విధేయతలు తన సొత్తుగా, ఆ అహంకారి సత్రాజిత్తు కుమారుడు, పెద్దన్న బలరాముని స్వాగతించాడు.

"సంతోషం. వెళ్ళి. వున్నవాడిని వున్నట్లే, రమ్మనమను, మీ... నాన్నను!" పిడుగు పడ్డట్లుందా, ఆదేశం. ఈ వార్త సత్రాజిత్తు కందింది. మరో కుమారుడు వాతపతిని తీసుకుని, సత్రాజిత్తు - ఈ వుగ్రమూర్తి ఎందుకొచ్చాడో అర్థంకాక, పరుగు పరుగున కంగారు, కంగారుగా వచ్చాడు.

అసలే బిక్కచచ్చివున్న సత్రాజిత్తుకు, బలరాముని చూడగానే పై ప్రాణాలు, పైనే పొయ్యాయి. వెంటనే రెండు చేతులు జోడించి "ఓ మహావీరా! బలరామా! స్వాగతం, సుస్వాగతం. లోపలికి దయచేయండి. మమ్మ కరుణించి, కటాక్షించండి" వినయ విధేయతలు తన సొత్తును చేసుకుని మరీ ప్రార్థిస్తున్నాడు.

ఆపాదమస్తకం సత్రాజిత్తును చూసిన బలరాముడు మరింత వుగ్రుడయ్యాడు. నీ నక్క వినయాలు కట్టిపెట్టి, నేను నీ ఇంట్లోకి రానని నీ కొడుకుతో చెప్పాను. అలాగ రావడమే సంభవిస్తే - నీ బుర్ర పగులగొట్టడానికే తప్ప, ఇతరత్రా కాదు - చెప్పు... మా కృష్ణుడెక్కడున్నాడో, తొందరగా... లేకుంటే... నీ బుర్ర ఇక్కడే కొబ్బరి పుచ్చెవుతుంది. అసలే సమస్యలతో సతమతమయ్యే సత్రాజిత్తు ఈ ఆరోపణతో నీరుగారిపోయాడు. బుర్ర పట్టుకున్నాడు.

"కృష్ణుడా... అతడెక్కడున్నాడో నాకేం తెలుసు ? నా దగ్గర లేడు. నా దగ్గరకు రాలేదు. నేను చూడలేదు." దడ, వణుకు పట్టుకున్నట్లు మాట్లాడు తున్నాడతడు.

"తెలియదు. ఒక్కటిస్తే... నువ్వే కాదు, నీ తాత కూడ పరుగెత్తుకు వచ్చి సత్యం చెబుతాడు.

ఆ మాటలు, ఆ దిక్కుతోచని పరిస్థితికి సత్రాజిత్తు నిజంగా మూగబోయాడు. క్షణకాలం గడిచింది. మెల్లిగా గొంతు పెగల్చుకుంటూ -

"మహావీరా! నీ మాటలొక్కటి నా కర్థం కావడం లేదు. నిన్న నేను తప్పుచేసి వుండవచ్చును. అంతమాత్రంలో కృష్ణుని దాచిపెట్టగల లేకపోతే ఎత్తుకురాగల ధైర్యం, సత్తా నాకుందా ? నా మాటలు నమ్ము. నిజం. నిజంగా నాకేమీ తెలియదు". భంగపడి బ్రతిమాలుతున్నట్లున్నాయి సత్రాజిత్తు మాటలు.

కాకపోతే.... గొంతు పెగల్చుకుని, "కృష్ణుడు కనబడటంలేదా ?" నీరసంగా అడిగాడు. అవునని తలూపిన బలరాముడు, మొన్న చంపాలనుకున్నావు. చాతకాక నిన్న నిందవేసావు. ఇవ్వాళ ఏకంగా మాయం చేసావు. నువ్వు నయవంచకుడివి. నిన్ను..."

అది నిరాధారమైన నింద. అయినా పడక తప్పదు. తప్పు తనది. అనవసర ఆవేశంతో చేసిన తప్పు పాపంగా పీకకు చుట్టుకుంది. అనుభవించాల్సిందే, ఆ అంతర్మథనాన్ని భగ్నమొనరిస్తూ "బయలుదేరు. మహారాజు ముందర నీ సమాధానమివ్వు. ఆయన తృప్తి పడితే సరి. లేకపోతే తగిన శిక్షను భరించాల్సి వుంటుంది." హెచ్చరించి, పదమన్నాడు.

"అదికాదు మహావీరా! నా అనుష్ఠానం మధ్యలో వుంది. మీరొచ్చారని తెలిసి.... పరుగెత్తుకుంటూ వచ్చాను." అని నసుగుతూంటే -

"నేను రావడమే అనుష్ఠానం పూర్తి. నువ్విప్పుడు రాలేదనుకో, అది నిజంగా అసంపూర్తి. ఇంకెప్పుడు చెయ్యలేవు. నీకా అదృష్టముండదు. బయలుదేరు!" బలరాముడి మాటే భయపెడుతుంది. ఆ హలాయుధంతో ఒక్కటిస్తే, ఇంతే సంగతులు. యమలోక యాత్ర సత్వరం ప్రారంభించవలెను "ఇది మనస్సులోని సంఘర్షణ. మరి...!" ఏదో చెప్పబోతున్నాడు.

"మాట్లాడకుండా బయలుదేరితే చాలా మంచిది." అది బలరాముని ఆజ్ఞ. వస్తే మంచిది. తీసుకువెడితే చెప్పానుగా, ఇంతేసంగతులు! ఆ తర్వాత ఆలోచించడం లేదు, నా వెనుకాల పరుగెత్తడమౌతుంది. తెల్సిందా ?"

ఇన్నాళ్ళుగా తను పెంచుకున్న నిగ్రహం, డాబు దర్పాలు, అహంకార-గర్వాలు... అదృష్టంగా పొందిన సిరిసంపదలు, సుఖాలు, దుఃఖానికి - బాధలకు గండాలకు గురవుతున్నాయని, తన బ్రతుకు చేజేతులా నాశనమయిందని వాపోయాడు. విధిలేక బయలుదేరుతున్నాడు.

ఈ సమయంలో, సత్రాజిత్తు ఇంటిముందు గుమికూడిన జనాన్ని తోసుకుంటూ, ఉద్ధవుడు వచ్చాడు. మెల్లిగా బలరాముని చెవిలో ఏదో చెప్పాడు. పరిస్థితి అర్థం చేసుకున్న బలదేవుడు, మనసులో ఆనందించాడు. సత్రాజిత్తును ముప్పతిప్పలు పెట్టినందుకు, బయటకు కనబడనీయని మహదానందం పొందాడు.

ఆ వెంటనే - ఉద్ధవునితో "ఈ సత్రాజిత్తును నా వెంటరమ్మని, మహారాజును దర్శించి, తన గోడు విన్నవించుకోమని ఆదేశించాను. నా ఆదేశం శిరసావహించాలి. మహారాజు దర్శనం సత్వరం చేసుకోవాలి!" గట్టిగానే చెబుతున్నాడు.

ఇటువంటి విపత్కర పరిస్థితులలో, కొందరు రక్షణ సిబ్బంది గుండెలు బాదుకుంటూ పరుగెత్తుకుని వచ్చారు. "ప్రభూ! ప్రభూ!" గగ్గోలు పెడుతున్నారు. ప్రసేనజిత్తుతో వెళ్ళిన అశ్వికుడు రక్తసిక్తమై వున్నాడు. బిక్కు బిక్కుమంటున్నాడు. అలాగే మన ప్రసేనజిత్తు స్వర్గస్థుడయ్యాడు" ఆ మాటకు అదిరిపోయాడు సత్రాజిత్తు.

"ప్రసేనజిత్తు స్వర్గస్థుడయ్యాడా ? ఎక్కడ నా తమ్ముడు!" గుండెలు బాదుకుంటూ సత్రాజిత్తు అరిచాడు.

ఈ అరుపులు కేకలకు, సత్రాజిత్తు సంతాన మొత్తం పరుగెత్తుకుంటూ వచ్చింది. అశ్వికుని ప్రతి అవయవం వణుకుతుంది. దడ తగ్గడం లేదు. ప్రభూ! మన ప్రసేనులవారిని సింహం చంపేసింది. ఆ మాటలు సత్రాజిత్తు వినలేక పోతున్నాడు. మరొకప్రక్క వినబడటంలేదు కూడా! చెప్పిందే చెబుతున్నాడా, అశ్వికుడు.

ప్రసేనులవారు ముందు, నేను వెనుక... ప్రయాణిస్తున్నాం. వున్నట్టుండి ఒక సింహం, మన ప్రసేనుల వారిపై దూకింది. గోళ్ళతో చీల్చి చంపింది. వివరించి చెబుతున్నాడు. ఇదంతా విన్న సత్రాజిత్తు మొహం పాలిపోయింది. దిగులుపడి అలాగే కూలబడిపోయాడు.

"నువ్వు! సింహం, ప్రసేనుల వారిని చంపడం చూసావా ? నూతిలోంచి వస్తున్నట్లున్నాయా మాటలు. వాటిని, అశ్వికునికి అర్థం కావడం కోసం, భంగాకరుడు, రెట్టించి, గట్టిగా చెప్పాడు. ఎందుకంటే, వాడు కొన ప్రాణాలతోనే వున్నాడు. ఏ క్షణంలో చస్తాడో, అర్థం కాని స్థితిలో వున్నాడు.

మొత్తం నేను చూడలేదు. సింహం భయంకరంగా గర్జిస్తూ - ప్రసేనుల వారిపై పడటం చూసాను. వారు గుర్రం మీద నుండి క్రిందపడటం చూసాను. ఆ సింహగర్జనకు, నా గుర్రం బెదిరింది. భయంకరంగా సకిలించి, వెనక్కి తిరిగి నన్ను క్రింద పడవేసి దౌడో-దౌడు" పరిగెత్తింది. ఆయాసపడుతూ, వాడు చెబుతున్నాడు.

ఓ సూర్యదేవా, ప్రసేనుడు చచ్చిపోయాడు, చచ్చిపోయాడు. నా శ్యమంతకం... గొణుక్కుంటున్నాడు. భంగాకరుని భుజాపై చేతులు వేసి, లేవబోయినవాడు, అలాగే కూలిపోయాడు.

ఇదంతా చూస్తున్న బలరాముడు "భంగాకరా! ఇప్పుడు నేను వెడుతున్నాను. నీ తండ్రిని వచ్చి మహారాజును దర్శించమను. అతని కోసం మళ్ళీ నేను వచ్చే పరిస్థితి మాత్రం కల్పించవద్దని, నేను హెచ్చరించినట్లు చెప్పు. జాగ్రత్త" మనసులో ఆనందపడ్తూ - ఎవరి కర్మ వారనుభవించాలనడానికిదే కారణంగా తలచి, మరీ అక్కడనుండి కదిలాడు.

భంగాకరుడు, తన సోదరులు, కాపలాదారులతో, తండ్రిని, ఆయన శయన మందిరానికి తీసుకువెళ్ళారు.

# విధి వక్రిస్తే...!

**సూ**ర్యోదయం కావడానికి, ఇంకా సమయముంది. అయినా కృష్ణుడు సముద్రస్నానానికి వెళ్లాడు. నిత్యానుష్ఠాన కార్యక్రమాలు, సంధ్యోపాసన పూర్తి చేసుకున్నాడు. తన గదికి వచ్చి, మామూలుగా తను ధరించే దుస్తులు, ఆభరణాలను, అక్కడే వుంచాడు. సాధారణ సిపాయిలాగ తయారయ్యాడు. విల్లంబులు తీసుకుని బయలుదేరాడు.

పనిలోపని ఎందుకైనా మంచిదన్నట్లు, నవ్వు విరాజిల్లెడు ముఖంతో, చేతిలో కొడవలి, నడుముకు కట్టుకున్న కండువాలో చిన్ననాడు, అనునిత్యం వాయించే మురళితో, చిద్విలాసంగా కదిలాడు. అక్కడనుండి వంటింట్లోకి వెళ్ళి, కొన్ని మధుర పదార్థాలతోపాటు కొన్ని అటుకులు మూట కట్టుకుని, దానిని భుజంపై వేసుకుని, హాయిగా అడివి దారి పట్టాడు. ఇదొక లీల.

గత మూడు దినాలుగా జరుగుతున్న వింత వింత సంఘటనలు, విస్మరించనీయకుండా, అనుక్షణం హెచ్చరిస్తుంటే, ఒక్కొక్కటే, గుర్తుకు వస్తున్నాయి. కొంత కలవరాన్ని, కొంత అసహ్యాన్ని, మరికొంత అసహనానికి గురి చేస్తున్నాయి. అంతకుమించి సత్య, సాత్యకిల అదృశ్యం, కృష్ణుణ్ణి మరికొంత ఆలోచింపచేసింది.

ఈ గందరగోళం నుండి బయటపడాలంటే “ఏం జరిగింది, ఎలా జరిగింది ? ఏం చెయ్యాలని ?” గోళ్ళు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చోడం కాదని, తాను మామూలుగా బయలుదేరితే, అందరు కాకపోయినా కొందరు తన ననుసరిస్తారని, ఆ బెడద తప్పించుకోవడానికో రకంగా, సాదా-సీదా వ్యక్తిగా సాధారణంగా ఎవరు గుర్తు పట్టడానికి వీలులేని విధంగా బయలుదేరాడు.

ఇప్పుడు అసలు, సిసలైన ఆలోచనలు కృష్ణునిలో బయలుదేరాయి. సత్యకు, ఆమె తండ్రి చేసే కుట్రలు కుతంత్రాలు బాగా తెలుసు. అందుకే ఆమె ఆ నరకం నుండి బయటపడటానికి వీలుగా సుభద్ర ద్వారా తనను చేరాలని, తన తోడు పొందాలని తలచేదని అనుకున్నాడు. కాబట్టి భామకు, శ్యమంతకమణి విషయం కూడా తెలిసి వుండాలి.

ఇందుకు నన్నాశ్రయించేకన్నా సాత్యకిని తీసుకువెళ్ళి, నిజం నిరూపిస్తే, తాను - నాకు చేరువవుతుంది. సత్రాజిత్తు దుష్ట ప్రవృత్తి లోకానికి అర్థమౌతుంది. ఇకపైనా అతను ఎంతో జాగ్రత్తగా వుంటాడని తలచిన "సత్య", సత్యాన్వేషణకు, సాత్యకిని తీసుకుని బయలుదేరి వుంటుందనుకున్నాడు, కృష్ణుడు. ఇది వూహే అయినా, సరిగ్గా ఆలోచిస్తే - ఇది చాలా ఖచిత్భుతమైన అభిప్రాయంగా తలచి, యధాప్రకారం అడుగులు వేస్తున్నాడు.

అందుకే ఆమె - సుభద్రతో పెంచుకున్న చనువు, ఆమె ద్వారా పంపిన పాట సారాంశం... చిత్రంగా భామ ఆటలాడుతుందని నవ్వుకున్నాడు. ప్రసేనుడు శ్యమంతకంతో వెళ్ళిపోయాడు. అది ఈమెకు తెలుసు. తండ్రిచాటు పిల్లగా, తండ్రిని కాదని బహిరంగంగా ప్రకటించలేదు.

మరి... ఈ ప్రసేనుడేమయ్యాడు, ఎక్కడికి వెళ్ళాడు. ప్రస్తుతానికిదో అనూహ్య పరిణామం, వూహకందని ప్రశ్న, వెరసి వింత సమస్య. ఎక్కడో గుహలో తాను వుండి పదివేలసార్లు సూర్యగాయత్రి చేసిన పుణ్యం వలన తనకీ అదృష్టం శ్యమంతకమణి రూపంలో లభించిందని, తరుచు సత్రాజిత్తు చెప్పేవాడు.

అదెక్కడుంది ? ప్రసేనజిత్తు అక్కడికే వెళ్ళాడా ? మరెందుకు తిరిగి రాలేదు ? ఇవి తెలియని, తెలుసుకోవలసిన ప్రశ్నలు. వీటి సమాధానమే ఇప్పుడు, ఈ సమస్యకు పరిష్కారంగా కృష్ణుడు తలిచాడు.

ఉజ్జయంత పర్వతాలకు వెళ్ళే తన చిరపరిచితమైన దారిలో కృష్ణుడు నడుస్తున్నాడు. సూర్యాస్తమయానికి ఆ పర్వత పాద ప్రాంతంలో, యాదవ ప్రముఖులు విహారార్థమై వచ్చే యాత్రికుల కోసం కట్టిన యాత్రిక కుటీరాలను చేరాడు. ఇక్కడున్న సత్రాజిత్తు విశ్రాంతి కుటీరం మాత్రం మూసి వుంది.

కొంతదూరం వెళ్ళేసరికి పర్వతంవైపు వెళ్ళే దారి కనుపించింది. ఆ వైపు కొన్ని గుర్రాలు, మనుషులు ఈ మధ్యనే వెళ్ళిన జాడలు కనుపించాయి. సూర్యుడు బాగా కనుపిస్తున్నాడు. అడవి ప్రకాశవంతమయింది. అంగుళం, అంగుళం, స్పష్టంగా చూడగల్గుతున్నాడు. ప్రశాంతమైన వాతావరణం, చల్లని గాలి, పక్షుల కిలాకిలారవములు, ప్రకృతి రమణీయకత మానసోల్లాసం కల్గిస్తుంది.

ఈ ఆనందకర వాతావరణంలో, సత్రాజిత్తు ప్రవర్తన కృష్ణుని బాధించింది. సుఖంగా వుండక, భగవంతుని కరుణకు సంతోషించక, ఇతరులపై బురదజల్లి, వారి జీవితాలతో ఆడుకోవాలనే వింత మనస్తత్వానికెంతో బాధపడ్డాడు.

ఒకదానికొకటి పొంతనలేని సమస్యలు, సందర్భాలు, షరతులు, ఒడంబడికలు, ఒప్పందాలు... వీటివలన సత్రాజిత్తు సుఖంగా వుండగల్గుతాడా ? దురదృష్టవంతుడు. కోరి, కోరి మృత్యువును నెత్తికెక్కించుకుంటున్నాడు. వినాశకాలే, విపరీత బుద్ధి - అంటే ఇదేనేమో!

ఆ ధర్మపరిరక్షకుడు, అధర్మపరిరక్షకుని వింత మనస్తత్వానికి చాలా నొచ్చుకున్నాడు. అంతలోనే తను, తన జీవితం, తనపై గ్రహ నక్షత్రాల ప్రభావం.... తలచుకుని మరీ ఆశ్చర్యపోయాడు. జన్మించినప్పటి నుండి ఇప్పటివరకు తాను పడ్డ బాధలు, ఎదుర్కొన్న సమస్యలు... విపరీత, విధి... వెక్కిరింపులు... అన్నీ గుర్తుకొచ్చి, ఇదే విచిత్రమనుకున్నాడు.

అలా నడుస్తూ, ఆలోచిస్తూ - అడవిలో దొరికిన పక్వఫలాలను తిన్నాడు. స్వాదుజలాలను త్రాగాడు. ఇప్పుడెంతో హాయిగా వుంది. కొద్దిదూరం వెళ్ళేసరికి రెండు మృతకళేబరాలు. గ్రద్దలు, చిన్న చిన్న పిట్టలు, వాటిని తింటున్నాయి. గుంటనక్కలు కూడా అక్కడ కనబడ్డాయి.

ఇంకాస్త ముందుకు వెళ్ళాడు. అది గుఱ్ఱపు అస్థిపంజరం. ఆ ప్రక్కన గుఱ్ఱపు జీను. ఇంకొద్ది అడుగులు వేసాడు. అక్కడో మనిషి శవం. చేతిలో కొడవలి వూపుకుంటూ వెళ్ళి ఆ శవాన్ని పరికించి చూసాడు.

చెదరిన జుట్టు, భయంకరమైన ముఖం. చిందరవందర దుస్తులు, చెదరి అటు ఇటు పడ్డ కొన్ని అవయవ భాగాలు. అప్పుడు మళ్ళీ పరకాయించి చూసాడు. అది... అది...

మళ్ళీ మళ్ళీ చూసాడు.

ఆ దుస్తులు, మెడలోని కొన్ని ఆభరణాలను బట్టి, దీర్ఘంగా ఆలోచిస్తే - అది ప్రసేనజిత్తు కళేబరం. ఆ గుఱ్ఱమతనిది. అతను దారుణంగా చంపబడ్డాడు.

"హతవిధీ" అనుకున్నాడు కృష్ణుడు. ఆ క్షణంలో, సత్రాజిత్తుకు కల్గిన బాధకు సాటి మానవునిగా కృష్ణుడు దుఃఖించాడు.

పరిస్థితులన్ని సమీక్షిస్తే తన ఆలోచనలన్నీ సక్రమమేనని కృష్ణునికి అనిపించింది. ఆ దేవతల విహార వనాలలో గల గుహలోని సూర్యమందిరంలో ప్రసేనజిత్తును, సత్రాజిత్తు శ్యమంతకాన్ని వదిలి రమ్మనమని చెప్పి వుంటాడు. నన్ను ఇరకాటంలో పెట్టి యాదవులను అప్రదిష్టులను చెయ్యాలనే పథకంలో భాగంగా ఈ ఆలోచన చేసి వుంటాడు. అది బెడిసికొట్టి ప్రసేనుని ప్రాణాలను తీసిందనుకున్నాడు.

అక్కడ చెల్లాచెదురుగా పడివున్న ప్రసేనుని వస్తువులనన్నింటిని చూసాడు. శ్యమంతకమణి జాడ మాత్రం, ఎటుచూసినా కనబడలేదు. బంగారు గొలుసులోని కొంత భాగం కనుపించింది. అంటే దానికే శ్యమంతకముండి వుంటే, దానినెవరు తీసుకున్నారు ?

అసలు ప్రసేనుని చంపినదెవరు ? మనిషా! మృగమా ? వాళ్ళెవరో, ఈ శ్యమంతకాన్ని చేజిక్కించుకుని వుంటారు. అర్థం కావటం లేదు. చెల్లాచెదరుగా వుండిన అతని నగలు, ఆయుధాలను భద్రపరచి, ప్రసేనుని కళేబరమున్న ప్రాంతంలో కొన్ని బండరాళ్ళు గుర్తుగా పెట్టాడు. ముందుకు బయలుదేరాడు.

ఆ దారంతా సన్నగా, ముళ్ళపొదలతో నిండి వుంది. సూర్యకిరణాలు, చెట్ల ఆకులగుండా పడటం లేదు. దాంతో అడుగు వెయ్యడం చాలా కష్టంగా వుంది. అసలీ దారి ఎక్కడికి వెడుతుంది ? ఏది ఏమైనా ముందుకు వెడితే తప్ప విషయం తెలియదు. కారణం, శ్యమంతకం జాడ తెలుసుకోవడం కష్టం గనుక ముందుకు వెళ్ళాల్సిందే ననుకున్నాడు. అడుగు ముందుకు వేస్తున్నాడు.

చేతిలోని కొడవలితో అడ్డమొచ్చిన చెట్లు నరుకుతూ, దారి చేసుకుని మరీ అడుగు వేస్తున్నాడు. అలాగ ధైర్యం, చొరవచేసి వెళ్లడంలోని కొన్ని అడుగు జాడలు కనుపించాయి. వాటిని సింహపు కాలి ముద్రలుగా కృష్ణుడు తలిచాడు. అక్కడక్కడా పక్షులు తిన్నట్లు కనుపించే కొన్ని మాంసఖండాలు.

మళ్ళీ కొంతదూరం వెడితే పక్షికి సంబంధించిన తిని పారేసిన అవశేషాలు, ఇంకా ముందుకు వెడితే సింహపు శరీరావశేషాలు. ఇంకాస్త ముందుకు వెడితే మృగరాజు కాలి గుర్తులకు బదులు, పెద్ద పెద్ద అడుగు జాడలు.

మృగరాజు అస్తి పంజర అవశేషాలలో ప్రసేనుని నడుముకు కట్టుకున్న ఉత్తరీయం ముక్క, దాని పంజాలో చిక్కుకుని వుంది. ఇదేదో కొంత సత్యం

బయటపడుతుందని తలచి, దానినే జాగ్రత్తగా పరిశీలిస్తే, మరొక పంజాకు నల్లటి వెంట్రుకలున్న చర్మం కనబడింది.

దానిని జాగ్రత్తగా చూస్తే అదేమైనా ఎలుగుబంటి చర్మమై వుండాలనుకున్నాడు. ఒకటో రెండో ఎలుగుబంట్లు, కట్ట కట్టుకుని దీని మీదపడి చంపి వుంటాయి. ఆ పెనుగులాటలో, దీని పంజాకు, దాని చర్మపు అవశేషం చిక్కి వుంటుందనుకుని, ఇంకొద్ది రుజువులుకన్న, శ్యమంతకం సాధించాలనే పట్టుదలతో పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

ఇంకొద్దిగా అటు ఇటు చూస్తే ఈ సింహం ఎవరితోనో, ఈ సింహంతో ఎలుగుబంట్లు ఒకటో రెండు పోట్లాడిన గుర్తులు కనుపించాయి. దాంతో శ్యమంతకాన్నికై వెదకడం ప్రారంభించాడు. ఆ దరిదాపులలో ఏ విధమైన జాడ దొరకలేదు.

తప్పక ప్రసేనుడు, ఆ శ్యమంతకమణితో వచ్చాడు. దానికోసం సింహం వీడిమీదపడి చంపి దానిని నోట కరచుకుని వుంటుంది. కొంతభాగమక్కడ క్రిందపడింది. మిగిలింది, అది నోటకరచుకుని వస్తూంటే, అదేమిటో తెలియక పోయినా దానికోసం ఈ సింహం, ఆ ఎలుగుబంట్లు కోట్లాడుకుని వుంటాయి. సింహం చచ్చిపోయింది. దానినోట వున్న శ్యమంతకాన్ని ఆ ఎలుగుబంటి/బంట్లు తీసుకుని వెళ్ళుంటాయి.

ఇంకొద్ది అడుగులు వేస్తే వాటి వివరం శ్యమంతకమణి జాడ తెలుస్తుందని, జాగ్రత్తగా పరిసరాలను చూసిన కృష్ణుడు, ముందుకు వెళ్ళడానికి దారి చూసుకుంటున్నాడు.

దాని విలువ, ఈ జంతువులకేం తెలుస్తుంది. కాకపోతే దాని కాంతి, వీటిని ప్రభావితం చేసి వుండాలి. దానికి ఆకర్షించబడి, అవి ఇలాగ ప్రవర్తించి వుండాలి. వూహా ప్రశ్నలకు సమాధానం చెప్పుకుని పరిసరాలను గమనిస్తున్నాడు. ఆ ఎలుగుబంట్లు ఎక్కడికి తీసుకువెళ్ళి వుంటాయి. వాటి ఆనుపాన్లు తెలుసుకోవడమెలాగ ?! అనుకుంటున్న శ్రీకృష్ణునికి, సత్య-సాత్యకి జ్ఞప్తికొచ్చారు.

అవును, వీళ్ళెక్కడికి వెళ్ళారు ? వీళ్ళు శ్యమంతకమణినో, ప్రసేనజిత్తునో వెదకుతూ వుంటే, నాకు కనబడేవారు కదా ? వీళ్ళేమయ్యారు ? మధ్యలో ముంచుకొచ్చిన ప్రశ్న ఇది. ఆ పరిసరాల్ని గమనిస్తే, ఒక ఎలుగుబంటి అడుగులు కనుపించాయి.

అయితే అంత పెద్ద మృగరాజును, ఒక్క ఎలుగుబంటి ఎదిరించి చంపిందా ? అలాగనుకుంటూ కొంతదూరం వెళ్ళినవాడు, చీకటిపడినట్లు, దారి ఏ మాత్రం కనబడకపోయేసరికి శాఖోపశాఖలుగా విస్తరించిన ఒక పెద్దచెట్టు ఎక్కి ఆ రాత్రి గడపాలని,తెల్లవారి తన అన్వేషణ మళ్ళీ ప్రారంభించాలని తలచి అటు ఇటు చూసి జాగ్రత్తగా ఒక మంచి చెట్టెక్కి కూర్చున్నాడు.

అప్పుడు - సరదాగా ఒకనాడు వేదవ్యాసులవారు పిలిచిన సంబోధన గుర్తుకొచ్చింది. వారి ఆంతర్యమేమో కాని "హృషీకేశా!" అని ఆనాడు వారు పిలిచారు. ఆ పిలుపును భీముడు సరదాగా పట్టుకుని నీకసలు నిద్రాసుఖం తెలుసునా ? అని మాటిమాటికి వెక్కిరించడం మొదలుపెట్టాడు.

ఆ చెట్టెక్కి కూర్చున్న కృష్ణుడు కులాసాగా వున్నాడు. చిక్కు ముడులు ఒక్కొక్కటే విడిపోతున్నాయి. తెల్లవారి లేచి, తాను మరికొన్ని సాక్ష్యాలు సేకరించ గలను. తనమీద పడ్డ అపవాదు తొలగించుకొనగలనని సంతోషిస్తున్నాడు. పాపం. సత్రాజిత్తే అన్యాయమైపొయ్యాడు. అనవసరంగా తమ్ముని పోగొట్టుకున్నాడు.

అనవసర నిందారోపణలు, అకారణ కలహాలతో కన్నకూతురికి, ఆమె ప్రేమకు, దురదృష్టవంతుడు దూరమయ్యాడనుకున్నాడు. ఆ రాత్రల్లా గడిపాడు. ఆ భయంకరమైన చిట్టడవిలో ఒకరాత్రి అందునా చెట్టుమీద గడపడం చాలా కష్టం.

తెల్లవారుతూనే చెట్టు దిగాడు. దారిప్రక్కనే గల ఏటిలో స్నానం చేసాడు. తన నిత్యానుష్ఠానాలను పూర్తి చేసుకున్నాడు. తనతో తెచ్చుకున్న ఆహారాన్ని అక్కడ దొరికే పండ్లతో కలిపి కొద్దిగా తీసుకున్నాడు. ఇక కార్యసాధన కుపక్రమించాడు. ఈ పగటి వెలుగులో, ఎలుగుబంటి అడుగులు గుర్తుపట్టి, ఆ జాడ ప్రకారం వెదకులాట మొదలుపెట్టాడు.

కొద్దిదూరం వెళ్ళేసరికి, మరికొన్ని అడుగులు కనుపించాయి. అంటే సత్య-సాత్యకిలు కూడా ఈ మార్గంలోనే వున్నారన్నమాట. దాంతో తెలియని సంతోషం. అయితే ఈ దారి ఆ పవిత్ర సూర్యనారాయణుని గుహకు దారితీస్తుందను కున్నాడు. ముందుకు సాగుతున్నాడు. ఈలోగా పిల్లి అరుపు.

అది కేవలం అరుపు కాదు. ప్రాణభయంతో రక్షణకోసం అరుస్తున్నట్లుంది. అప్పుడే ఒక తోడేలు అరుపు. దాంతో తన వద్దనున్న బాణం వేసాడు. తోడేలు

చచ్చినట్లు, పిల్లి పరుగెత్తుకు వెడుతూ చేసే గోల. కొద్దిదూరం వెళ్ళేసరికి బాణం తగిలి చావు బ్రతుకులలోనున్న తోడేలు కనుపించింది. పిల్లి మ్యావు కూడా వినిపించింది.

తలపైకెత్తి చూస్తే పిల్లి, వణుకుతున్నట్లుంది. "ఫర్వాలేదు, రా! తోడేలు చచ్చిపోయింది. మనుషులతో మాట్లాడుతున్నట్లు, దానిని పిలిచాడు. నిజంగా మ్యావు అంటూ అది క్రిందకు వచ్చింది. కృష్ణుడి చుట్టు ప్రదక్షిణం చేస్తుంది. అంటే ఇదే సత్యభామ పిల్లి. ఊర్వశి అన్నమాట. అయితే సత్యభామ కూడా ఈ పరిసరాలలో ఎక్కడో వుండి వుంటుందనుకున్నాడు.

అది ముందుకు నడుస్తూంది. దాంతో ఎలుగుబంటి అడుగుజాడలకన్న, ఈ పిల్లి ఆగడమెక్కువయింది. దీనిని అనుసరించాల్సి వచ్చింది. అది ముళ్ళలోంచి పొదలలోంచి వెడుతూంటే, తన చేతిలోని కొడవలితో దారి చేసుకుంటూ వెళ్ళేసరికి, కొన్ని చీర గుర్తులు. అవి... అవి సత్యావై వుంటాయను కుంటూంటే, ఈ పిల్లి ఇంకాస్త ముందుకు వెళ్ళింది.

అది కొండవాలు ప్రాంతంగా కనుపిస్తూంది. అక్కడ నుండి అది తొంగిచూస్తూ, కృష్ణుని చూసి మ్యావు మ్యావుమంటూంటే కొద్దిగా వంగి చూసాడు. ఆ వాలులోంచి, జారిపడిన స్త్రీ శరీరం. అది సత్యదే. అందుకే ఈ పిల్లి హడావుడి. కొంపదీసి, అంత బ్రతుకు బ్రతికి రాజసంగా వెలిగిన సత్య.... కృష్ణుని గుండె అదిరింది. పిల్లి చూపినట్లు ఆ లోయలోకి చూసాడు. ముందుకడుగు వేసాడు.

జాగ్రత్తగా ఆమెను చేరాడు. ఉచ్ఛ్వాసనిశ్వాసల కదలికనుబట్టి, ఆమె ప్రాణాలతో వుందని, అక్కడే ప్రథమచికిత్స చేసాడు. జాగ్రత్తగా చేతుల్లోకి తీసుకున్నాడు. మృదువైన సుకుమార శరీరంపై గాట్లు, రాళ్ళదెబ్బలు, ముళ్ళు చీరుకున్న రక్తపు మరకలు, శరీరంపై చినిగిన అస్తవ్యస్త దుస్తులు.

ఎంతటి దయనీయమైన స్థితి. ఇంత జరిగాక ఈమెకు వివాహం కాదు. ఏ యాదవవీరుడు కనికరించాడు. రాజభోగాలతో మహారాణిలాగ బ్రతికిన సత్య, పనిమనిషికన్న హీనంగా, దిక్కులేని దయనీయస్థితిలో కొట్టుకుంటుందని, తన తలకు చుట్టుకున్న అంగవస్త్రం తీసాడు. ఆమెను చేతులతో ఎత్తుకున్నాడు. ఏటివద్దకు తీసుకు వెళ్ళాడు. నీటితో ఆమె గాయాలు కడిగి, సేదతీర్చాడు.

కొంతసేపటికి సత్య స్వస్థతకు వచ్చింది. బలవంతంగా కళ్ళు తెరచింది. తను మరో లోకంలో వున్నట్లు తలచింది. కానీ నమ్మలేనట్లు, తనకెదురుగా తన ఆరాధ్య దైవం, తన ప్రభువు - గోవిందుడా ? వళ్ళంతా నొప్పులు. కదలలేని స్థితి. తల బరువుగా వుంది. అటువంటి పరిస్థితిలో నమ్మలేనట్లు... బ్రతికానా ? చచ్చానా ? ఎక్కడున్నాను ? ఏమీ అర్థం కావడం లేదు.

ఎవరో తనను గాయాలను శుభ్రపరుస్తున్నారు. ఎవరితను ? ఓ పరాయి వ్యక్తి. సిగ్గుపడుతుంది.కాని కదలలేని స్థితి. కాదనలేని స్థితి. ఆ స్థితిలో కూడ తండ్రి చేసిన అకృత్యం ఆమె మనసును కలచివేస్తుంది. ఓ చెవికుండలాన్ని గేటు వద్ద పడేయడం, ఇదిగో దొంగ. దొరికాడు. ఇది కృష్ణునిదే. అతడే దొంగని అరవడం అన్నీ గుర్తు వస్తున్నాయి. తన అసహాయ స్థితికి, సత్యాన్ని చెప్పలేని దుస్థితికి తల్లడిల్లిపోతుంది.

తన ఊర్వశి (పిల్లి) ఉన్నపాటున పరుగెత్తడం, తన తండ్రి తొందర చేసి పంపించడం, చెయ్యి వూపడం ఆ వెనుక ఇంకో అశ్వికుడు... అన్నీ గుర్తుకొస్తున్నాయి. ఎంత దారుణం. ఎంత వంచన ? ఇప్పుడు... ఇక్కడికి ఆమె ఆలోచనలు వచ్చాయి. ఎలుగుబంట్లు సాత్యకిని మోసుకువెళ్ళడం, తాను పరుగెత్తుకుంటూ వచ్చి ఈ లోయలో పడటం, అంతవరకే జ్ఞాపకముందామెకు. ఇప్పుడు... ఇక్కడ, ఈ పరాయి మనిషి.. తన తలకు కట్టు కడుతున్నాడు. మొదట్లో కాదనుకున్నా, ఎవరో ఈ దేవుడు ?'' కృతజ్ఞత చెప్పకుండా వుండలేకపోతుంది.

ఇది కలకాదు కదా! బ్రతికి బట్టకట్టిన సత్య ఆలోచన. ఆకలి వేస్తోంది. ఈ పెద్దమనిషెవరో కాని, తన శరీరంలోని గాయాలు కడిగి, శుభ్రపరచి బ్రతుకు నిస్తున్నాడు. ఇది కల కాదు, నిజమే. నిజానికి పర పురుషుడు. ముట్టుకోవడం, పట్టుకోవడం, శరీర గాయాల్ని శుభ్రం చేయడం తగని పనే. కానీ, పరిస్థితిని సమీక్షిస్తే - ప్రాణాపాయ సమయంలో ఇద్దరే సంరక్షిస్తారు. అది -

ఒకరు తండ్రి. రెండు భర్త.

అప్పుడు, శరీరంలో కొంత బాధ, సేదతీరినామె కళ్ళు తెరచి చూసింది. ఆశ్చర్య పోయింది. ఈతనెవరో మహాత్ముడు దేవదేవుడు. అందుకే ఆయన సేవల ఫలితం

కనబడటం లేదు. కానీ ఏదో వూరట హస్త స్పర్శ అంత హాయిగా వుంది. బాధలను మరిపించి, ప్రశాంతతను ప్రసాదింప చేస్తుంది. అహా! ఇదే అదృష్టమంటే...

అడవిలో, చావు బ్రతుకుల మధ్యనున్న తనను సంరక్షించింది. ఇంకెవరు ఆ దేవదేవుడే. తను నమ్మిన ధర్మమే. ఎన్నడు పురుష స్పర్శ ఎరుగని సత్య. ఆ వ్యక్తి కరస్పర్శతో తీయటి అనుభూతి పొందుతుంది. ఆ స్పర్శానందం, అవ్యక్తం. అనూహ్యం. వర్ణనాతీతం. సిగ్గుతో కళ్ళు మూసుకుపోతున్నాయి. కానీ, ఆ దేవుడిని చూడాలి.

ఇదంతా కలేనేమో! అందుకే అంతటి దివ్యానుభూతిని పొందుతుంది. కానీ, ఆ వాతావరణం, తను వచ్చిన ప్రదేశము. ఇది కలకాదు. బలవంతంగా కళ్ళు తెరచి చూసింది.

ఆశ్చర్యం. అద్భుతం, మహదానందం. అంతలో మగత.

"గోవిందా! బ్రతుకు భగ్నమయింది. నా ఆరాధ్య దైవానివి కాబట్టి, కనీసం కలలో కనుపించి, ఈ కలల రాణిని కనికరిస్తున్నావు. ధన్యురాలను. ఇదొక అదృష్టం కలవరిస్తున్నట్లు మాట్లాడుతుంది. అది కలవరింతా ? ఏమో!

"సత్యా!" తియ్యగా, ప్రేమగా, సత్యమైన పిలుపు. స్పష్టంగా వింటున్న పిలుపు.

"గోవిందా, ఇది కలకాదా ? నిజమా! నిన్ను చూస్తున్నానా ?"

"నిజం. సత్యా! ప్రస్తుతం నీవు ప్రాణగండం తప్పి నా రక్షణలో వున్నావు. నీ కలల రాజు, నీ సేవచేస్తున్నాడు. నిజం......!" ఆమెకు నమ్మకం కల్గేటట్లు స్పర్శానుభూతిని ప్రసాదిస్తు కృష్ణుడు చెబుతున్నాడు.

ఆ మాటకు సత్య వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఎందుకేడుస్తావు ?" నేను నీ దగ్గరే వున్నాను. నిన్ను రక్షించి నీ సేవలు చేస్తున్నాను. ఇంకెందుకు ఏడుపు ? ఏడవకు గద్దించినట్లుంది.

దాంతో నిజంగా స్వస్థతకు వచ్చింది. కల కాదు. నిజమే. నా ప్రభువు నా చెంత వున్నాడు. నేను నా స్వామి సంరక్షణంలో వున్నాను. ఆ స్థితిలోను సిగ్గు పడింది. చేతులలో మొహం దాచుకుని ఏడుస్తూంది. లేవడానికి ప్రయత్నిస్తుంది.

"ఎందుకేడుస్తావు ? ఇప్పుడు నీకేం కష్టమొచ్చింది. అలాగ వెక్కి వెక్కి ఏడిస్తే బాధ పోతుందా ? లేవకు. ప్రస్తుతం నువ్వు లేచే స్థితిలో లేవు. నడిచే

స్థితిలో అసలు లేవు. నీ మడమ చిట్లి, వాచింది. నువ్వు అనవసరంగా తొందరపడి పరిస్థితి దిగజార్చుకోకు. నాకు మరింత ఇబ్బంది కల్గించకు!'' కసురుతున్నా... ఇష్టమైనవాడు కదా! ఆ మాటలు ఓదారుస్తున్నట్లే వున్నాయి. తన బాగుకోసం హెచ్చరిస్తున్నట్లే వున్నాయి.

మెల్లిగా వూతమిచ్చి ఆమెను కూర్చోపెట్టాడు. పండ్లనిచ్చి తినమన్నాడు. తను తెచ్చిన మధుర పదార్థాలిచ్చాడు. సేకరించిన దుంపలను కాల్చి ఇచ్చి తినమన్నాడు. తనను మాత్రం కాల్చుకు తినవద్దన్నాడు. చెప్పింది వినమన్నాడు. ఆ పరిస్థితులలో ఆమెకు అంతకుమించి మరోమార్గం లేదు. తల వూపింది. తాను స్వాధీనంలోకి వచ్చేవరకు, తనను, ఆతని అధీనంలో వుంచింది. అతని ఆజ్ఞాపాలితురాలయింది.

మెల్లిగా ఇక్కడనుండి బయలుదేరి, ఈ ప్రక్కనున్న ఏ గుహో చూసుకోవాలి. రాత్రిపూట తాను ఒంటరిగా నిన్న గడపగలిగాడు కానీ, ఇవ్వాళ ఈ పిల్లతో, ఇలా వుండగా గడపడం చాలా కష్టమనుకున్నాడు.

ఈ పిల్లి ఎక్కడికి పోయింది. దాని పిల్లను తన దగ్గర వుంచి వెళ్ళింది. సత్యా నడవలేదు. ఆమెను ఎత్తుకుని తీసుకు వెళ్ళాలి. దీనిని విడువలేడు. దీనిని రక్షించాలి. క్షణమాలోచించి, ఆ పిల్లికూనను నడుంకు చుట్టుకున్నాడు. సత్యను చేతులలోకి తీసుకున్నాడు.

అప్పుడు ఆ పిల్లి ఊర్వశి, మ్యావుమంటూ వచ్చింది. ఎక్కడికి వెళ్ళావే... అంటే మళ్ళీ మ్యావుమంది. ఆ చిట్టడివిలో సత్యను కొంత దారి కనుపించే వరకు మోసుకొచ్చిన కృష్ణుడు - నడవడానికి వీలైన దారి కనబడటంతో, మెల్లగా నా భుజంమీద చెయ్యివేసి, నడువ!''మన్నాడు. ఎడంచేత్తో సత్యను పట్టుకున్నాడు. కుడిచేత్తో కొడవలి పట్టుకుని దారి చేస్తున్నాడు.

నిన్నటి వరకు కృష్ణుని చూస్తూనే సిగ్గుపడే సత్య, ఆ భామ ఇవ్వాళ కృష్ణుని భుజంపై చేయివేసి, తన ప్రాణాధారంగా, నడుస్తూంది. ఎంతలో ఎంత మార్పు. ఆ భగవంతుడెంత కరుణామయుడు. కారణమేదైనా, నా ప్రభువు నా వద్దకు వచ్చాడు. నన్ను రక్షించాడు. నన్ను సంరక్షిస్తున్నాడు. మనసులో చెప్పలేని ఆనందంతో సత్య పొంగిపోతుంది.

తన కలల రాజు కరుణించాడు.

తన బ్రతుకు పండింది.

ఇక ఎవరు ఏమనుకున్నా, ఈ లోకం ఏమనుకున్నా సరే - ఇక గోవిందుడే నాకు దిక్కు. నా ప్రభువే నాకు సర్వం. పొంగిపోతుంది.

కొండకొనకు మలుపు తిరిగారు. అంతవరకు కృష్ణుడి భుజంపై చెయ్యి వేసిన సత్య, తన చేతిని తీసేసింది. అదే, ఆ పవిత్ర - సూర్య దేవాలయ గుహ." సంతోషంగా చెప్పింది. ఎప్పుడైతే, కృష్ణుని భుజం పైనుండి తన చేతిని తీసిందో, తన కాళ్ళమీద తాను నిలబడలేక, క్రింద పడింది. అయినా తనచేత్తో, ఒక ప్రదేశాన్ని... అదే గుహను చూపిస్తు అదే... ఆ ప్రకాశవంతమైన సూర్యమందిర ప్రదేశమంది.

సత్య వేలుపెట్టి చూపే ఆ ప్రదేశాన్ని కృష్ణుడు చూసాడు.

అంత ఎత్తున, సూర్యకిరణ సముదాయంతో, సూర్య స్థానమనడానికి, ఆ ప్రత్యక్ష భగవానుని అంతః, బహిః స్వరూపమనడానికి, వీలుగా మకుటాయమాన స్వరూపంగా మణిమయ కాంతుల రూపంగా మెరిసి, వెల్గుతుంది.

''''''''''

## ఆదిత్యాయ.... !

"ఇదే నా ఆ పవిత్రమైన గుహ!" నీకెలాగ తెలుసన్నట్లు కృష్ణుడడిగాడు.

"అవును. ఇదే మేము ప్రత్యక్షదైవంగా పూజించే ఆ సూర్యనారాయణమూర్తి పవిత్ర ప్రదేశమంది సత్య.... . నా చిన్నప్పుడోసారి ఇక్కడికి వచ్చాను. ఈ ప్రాంతమంతా నా మదిలో ముద్రితమై వుంది. ఇక్కడే మా నాన్న -

**"జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః**
**నమో నమః సహస్రాంశో, ఆదిత్యాయ నమోనమః"**

అని ఆ ప్రత్యక్ష భగవానుని గురించి తపస్సు చేసింది. ఆ ప్రభాకరునితో, నిత్యం ఎనిమిది బారువులు బంగారాన్నిచ్చే, ఆ శ్యమంతకమణిని వరప్రసాదంగా పొందింది.

"చాలా సంతోష" మంటూ కృష్ణుడు ఆమెనెత్తుకుని ఆ గుహ దగ్గరకు తీసుకు వెళ్ళాడు. ఈ రాత్రి ఇక్కడే ఈ సూర్యనారాయణమూర్తి సన్నిధిలో ప్రశాంతంగా

గడుపుదామన్నాడు. పరిశోధకుడు, పరిరక్షకుడైన కృష్ణుని దృష్టి - తమకంటే ముందు ఈ గుహవైపు ఎవరో వచ్చారని, ఆ వచ్చిన వారెవరో తెలుసుకోవాలని - ఆ పరిసరాలను గమనిస్తూనే వున్నాడు.

ఏమైనా ఆనవాళ్ళు కనబడతా యేమోనని, పరిశీలనగా చూస్తున్నాడు. ఆ చూడటంలో ఎలుగుబంటి అడుగు జాడలు కనిపించాయి. దీనిని బట్టి చూస్తే ఒకటి సూర్యుని గుహకు, మరొకటి అడుగులు బట్టి చూస్తే - ఎలుగుబంటిదే కాని, అదొక భారీ కాయపు ఎలుగుగా తలుస్తున్నాడు. ఆతని గుహకు దారిలాగ వుంది.

ఆ ఎత్తైన గుహను చూసాడు. అది తప్పకుండా సూర్యనారాయణ మూర్తి వున్న పవిత్ర గుహ. **"సప్తాశ్వరథమారూఢం, ప్రచండం కశ్యపాత్మజం; శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహం"** అన్నట్లు సూర్యదేవుని విగ్రహం పై శ్లోకానికి తగ్గట్లు చెక్కబడింది.

సాత్యకిని ఎవరు తీసుకుని వెళ్ళారు. ఎక్కడికి తీసుకు వెళ్ళారు ? ఈ గుహ సంరక్షకులెవరు ? ఆ శ్యమంతకమణి ఎక్కడా ? ఒక మూల సత్యభామను ఎత్తుకునే, నడిచేదారి స్థితిగతులను పరికిస్తూ, నడిపించవలసిన కార్యం గురించి, గోవిందుడాలోచిస్తున్నాడు. గండం గడిచి అందరు సుఖంగా వుండే మార్గాన్ని కృష్ణుడు తనదైన శైలిలో, అన్వేషిస్తున్నాడు.

"సూర్యు డస్తమించబోతున్నాడు.

ఇక ఆలస్యం చెయ్యకూడదని, సత్యను ఆ గుహముందు వుంచి, సూర్య గాయత్రిని స్మరించాడు.

**"భాస్కరాయ విద్మహే మహాద్యుతికరాయ ధీమహి**
**తన్నో ఆదిత్యః ప్రచోదయాత్"**

అని అస్తమించే సూర్యునికి అర్ఘ్య ప్రదానం లాగ, సూర్య గాయత్రితో, ఆ ప్రత్యక్ష భగవానుని, కృష్ణుడు భక్తితో అర్చించాడు. అప్పుడు లోపలికి వెళ్ళి, ఆ వాతావరణాన్ని ఆ గుహను మొత్తం పరిశీలనగా గమనిస్తున్నాడు.

గుహ లోపల అనుకున్నట్లు చీకటిగా లేదు. ఆ నిర్మాణ శైలి ఎంత గొప్పదో, ఆ చిట్టడవిలో, ఆ గుహలో సూర్యదేవాలయాన్నెలాగ చెక్కారో, తలుచుకుని,

మనవారి శిల్పకళా చాతుర్యానికెంతో సంతోషించాడు. పైగా గుహలోకి సూర్యకాంతి పడేటట్లు, ఆ గుహను తొలవడం నిజంగా మెచ్చుకోదగ్గ విషయం.

అంతా అటు ఇటు చూసిన కృష్ణుడు చివరకు, "ఎవరు లోపలా ?" గట్టిగా అరిచాడు. ఒకటికి రెండుసార్లు అరిస్తే, కృష్ణుని పిలుపే ఆ గుహలో ప్రతిధ్వనించింది.

ఈ గుహనెవరో ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకుని, ఇక్కడ వున్నట్లు, ఆ గుహలో పడుకుందికి వీలుగా ప్రక్క పరచిన దాఖలాలు అక్కడ కనుపించాయి. రాత్రి పడుకునేటప్పుడు వెచ్చగా వుండటానికి వీలుగా మంటలు వెలిగించినట్లుగా వుంది. మరి వాళ్ళెక్కడ వున్నారు. ఎక్కడికి వెళ్ళారు ? అసలు వాళ్ళెవరు ?

సమాధానం కోసం గట్టిగా, మళ్ళీ మళ్ళీ అరిచాడు కృష్ణుడు. తన మాట తనకు ప్రతిధ్వనించి వినబడటం తప్ప సమాధానం లేదు. ఇందులో మానవులు మసలుతున్నారా లేక సత్రాజిత్తు చెప్పినట్లు దేవతలు కాపలా కాస్తూ, ఇక్కడ వుంటున్నారా ? ఆలోచించాల్సిన విషయమనుకున్నాడు, వాసుదేవుడు.

అటు తిరిగి, ఇటు తిరిగి పరిశీలిస్తూంటే, ఆ గుహలోని ఒక గోడలో ఒక అర కనిపించింది. అదొక చిన్న మందిరంలాగ వుంది. కొన్ని పూవులు కూడా కనబడ్డాయి. బంగారపు ధాన్యపు గింజలు కూడా కనబడ్డాయి. ఇవన్నీ చూస్తూ ఆశ్చర్యపోయిన కృష్ణుడు, బహుశా, ఇదే సత్రాజిత్తు పూజించిన ప్రార్థనా మందిరమని తీర్మానించుకున్నాడు.

ఇక అక్కడ ఎవరు లేరని నిశ్చయించుకున్న కృష్ణుడు, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసాడు. చక్కగా ఆకులతో, సత్యకు పడుకునేందుకు ప్రక్కను ఏర్పాటు చేసాడు. చలి నుండి కాచుకోవడానికి నెగళ్ళు వేసాడు. అక్కడ అన్నీ చూసిన కృష్ణుడు, ఆ గుహ మొత్తం కలయ చూసాడు.

ఇప్పుడు మనం వచ్చిందే ప్రవేశ ద్వారమా ? లేక మరో మార్గముందా ? భద్రత కోసం పరికించాడు. ఆ గుహ ముందుకు సాగి, రెండడుగులు క్రిందకు దిగింది. మలుపు తిరగడానికి వీలుగా కనిపించింది. ఆ నిర్మానుష్య ప్రాంతంలో ఏ జంతువైనా మీదపడవచ్చని తలచి చేతిలో కత్తితో బయలుదేరాడు. అంతా చూస్తున్నాడు.

కొద్ది అడుగులు ముందుకు సాగేసరికి, మడమలు మునిగేటట్లున్న నీళ్ళ మడుగు కనుపించింది. అందులో తేట నీరు ప్రవహిస్తుంది. దానిలోతుతెలుసుకోవాలని

అందులోకి రాయి విసిరాడు. బుడుంగుమని అది మున్గిపోయింది. దానిని బట్టి ఈ మడుగులో నీరు మొలలోతు వుంటుందని భావించాడు.

ఆ వాతావరణానికి వాసుదేవుని కళ్ళు బాగా అలవాటు పడ్డాయి. ఆ కొలనుపై రాళ్ళ వంతెన వున్నట్లు గమనించాడు. దానిని జాగ్రత్తగా అడుగులో అడుగువేసి దాటుకుంటూ అవతలివైపుకు వెళ్ళి చూస్తే ఆ సొరంగం అక్కడితో ఆగిపోయినట్లుంది. కాకపోతే ఒక మనిషి లేదా పెద్దమృగం సునాయాసంగా అందులోకి వెళ్ళేటట్లు అక్కడొక బిలం కనుపించింది.

ఆ బిలమార్గంలోంచి వెడితే, ప్రక్కన ఎత్తుగా వున్న మరో కొండలోకి వెళ్ళవచ్చును. కొద్ది కొద్దిగా సూర్యకాంతి వచ్చే విధంగా, ఒక గదిలాగ వుందా ఎత్తైన సొరంగ బిల ప్రాంతం. ఇక్కడినుండో సన్నటి దారి. ఆ దారి ఈ పవిత్ర గుహతో సంబంధమున్నట్లు కనిపిస్తూంది.

సాత్యకిని బంధించినవాళ్ళు, ఈ మార్గం ద్వారానే వెళ్ళి వుంటారు. ఎవరికైనా ఏదైనా ప్రమాదం ఈ మార్గం గుండానే సంభవించవచ్చును.

సత్యభామ పిల్లి ఊర్వశి, ఈ దారిగుండా సునాయాసంగాఅటువైపు వెళ్ళి, కృష్ణుని కోసం ఎదురు చూస్తుంది. ఇలా వచ్చేయ్. నేను వెడుతున్నాను. తర్వాత దీని సంగతి చూద్దామని, కృష్ణుడు గట్టిగా అరిచాడు.

నోట్లో ఏదో పట్టుకుని అది వచ్చింది. తీరాచూస్తే అదొక బంగారు గొలుసు. తనకు దొరికిన దానిలో కొంతభాగం.

అయితే, ఆ ఎత్తయిన గుహలోకి వెళ్ళిన వాళ్ళే ఈ శ్యమంతకమణిని అపహరించడమో, ఎత్తుకు పోవడమో చేసి వుంటారని కృష్ణుడు నిశ్చయించు కున్నాడు. ఇలాగ ఆలోచిస్తూ తిరిగి వచ్చిన కృష్ణుడు, సత్య ప్రశాంతంగా నిద్రపోవడంతో సంతృప్తి పడ్డాడు.

ఆ తర్వాత చిన్న పిల్లికూనను, సొరంగం మొదట్లో వుంచి, "వూరి"ని కాపలా వుండమన్నాడు. కాని దాని ప్రాణమంతా తన యజమానురాలి మీద వుండటంతో, పిల్లతో సహా యజమానురాలి దగ్గరకు వచ్చింది. చివరకు కృష్ణుడు చూపిన సంకేతానికి తలవొగ్గినట్లు తన పిల్లికూనతో, సొరంగం ముందు పడుకుంది.

మొత్తానికి ఆ రాత్రి ప్రశాంతంగా గడిపిన కృష్ణుడు తెల్లవారి లేస్తూనే మడుగులో స్నానంచేసి సూర్యభగవానునికి అర్ఘ్యమిచ్చాడు. తన నిత్యానుష్టాన కార్యక్రమాలు జరుపుకున్నాడు. సూర్యోదయంతో ఆ కాంతి పడిన బయటి గోడలు అద్భుతంగా ప్రకాశిస్తున్నాయి. ఆ దృశ్యం చూసి ఆనందించవలసిందే తప్ప వర్ణించడమసాధ్యం.

ఆ నిర్మాణశైలికి ఆశ్చర్యపోయిన కృష్ణుడు, ఆనందపడుతూ, సంతోషంగా లోపలికి వచ్చినాడు, సత్యలేచి కూర్చుని, మోకాళ్ళపై తలపెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్వడం చూసాడు.

"ఎందుకేడుస్తున్నావు ?" కృష్ణుడడిగాడు.

"పెద్దపిల్లి ఊర్వశి, తన ఆహారం కోసం అడవిలోకి వెళ్ళింది. భయపడుతూ చెప్పింది.

"అంతేకదా! నువ్వు కులాసాగా వున్నావు కదా!" అని కృష్ణుడు దగ్గరకు వస్తూంటే, వున్న ఆ కొద్దిపాటి బట్టలను సర్దుకుని కూర్చుంది.

"చిన్నపిల్లలా ఏడవడం ఆపితే చాలా బాగుంటుంది. ప్రతిదానికి ఈ ఆరున్నొక్క రాగాలు ప్రాణం తీస్తున్నాయి. ప్రశాంతతను, ఆలోచనల్ని భగ్నం చేస్తున్నాయి. జరగబోయే కార్యక్రమాన్ని ఆలోచించకుండా ఏవిటీ ఏడుపు ? దేనికసలు ? ఎందుకు ఇల్లు వదిలి వచ్చావు ? ఇక్కడికొచ్చి అనవసరంగా ఏడిచే బదులు, ఇంట్లో కూర్చుని తీరిగ్గా స్వర, రాగ యుక్తంగా ఏడిస్తే ఎంతో బాగుండేది కదా!" ఓ ప్రక్కన ఓదార్పు, మరో ప్రక్కన దెప్పి పొడుపు కూడా, ఆ మాటల్లో కలబోసుకున్నాయి. ఇలా ఏడుస్తూ కూర్చుంటే ఇక్కడే కూర్చోవడమౌతుంది తప్ప, ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేవు.

అసలే ఆడపిల్లవు. అందులో ఈ కనుపించీ కనిపించని కముకు దెబ్బలు, గాయాలు. కాబట్టి, ఈ పైపంచను నీళ్ళలో తడిపి తెచ్చాను. కాబట్టి,, సిగ్గును కాస్త నీ పరిస్థితి చక్కబడే వరకు ప్రక్కనపెట్టిన నీ ఒంటిని శుభ్రం చేసుకో! మీ కుల దైవమైన ఆ సూర్యభగవానునికి అంజలి ఘటించు.

ఆరోగ్య ప్రదాత, ఆయుష్షు ప్రదాత కూడా - ఈ భాస్కరుడే... కనుక.. అర్థమయిందా, కృష్ణుడు ముగించాడు. బుద్దిగా బుర్ర వూపింది. ఒకదానిలో మరొకటి వున్నట్లు, వున్న బుర్రకు పదునుపెట్టింది. కానీ, కృష్ణుని ఎదుట... ఈ

తుడుపులుకుంటే, అభ్యంతరం లేకపోతే నన్నా కొలను వద్దకు తీసుకు వెడితే స్నానం చేస్తాను. అరచేతుల్లో మొహం కప్పుకుంటూ అడిగింది.

ముసిముసి నవ్వులతో ఓ క్షణం గడిపిన కృష్ణుడు "సత్యా! చెప్పిన మాట విను. పరిస్థితి నర్థం చేసుకో. అవాంతరాలను అధిగమించాలే తప్ప, అందులో కూరుకుపోకూడదు. ప్రస్తుతం, అడవిలో, అగమ్య గోచరమైన ప్రదేశంలో, ఈ ప్రత్యక్ష నారాయణుని సన్నిధిలో వున్నాం.

ఏ క్షణంలో ఏమొస్తుందో తెలియదు. పుట్టి ఎలాగ మున్గుతుందో అర్థం కావటం లేదు. అటువంటి పరిస్థితులలో ఈ రాగాలు, శోకాలు, సిగ్గులు, మొగ్గలు, భయాలు పనికిరావు. అర్థమౌతుందా ? నీకంతగా ఇష్టమైతే ఇంటికి వెళ్ళాక ఇలాగ క్రమం తప్పకుండా రాగ లోపం లేకుండా, స్వర బద్ధంగా, ఓపికగా, కొన్ని రోజులు రాత్రింబగళ్ళు సాధన చేసినట్లు ఈ శోకాలాపన చేద్దువుగాని. వినిపిస్తుందా! అంతవరకు ఓపికపట్టు" గట్టిగా అరిచి చెప్పాడు. అది తప్పనిస్థితి. అలాగ చెప్పక తప్పదు.

ఇలాగ చెబితే తప్ప, ఆ మొండి, పెంకి పిల్లకు ఒక విధంగా అర్థం కాదు. అందుకే అంత మొండిగా గట్టిగా కృష్ణుడు చెప్పాడు. చివరిగా "వింటున్నావా... ?!" కసిరాడు.

"నువ్వు తెలివైనదానివైతే జరిగింది చెప్పు. వున్నట్టుండి మీరిద్దరు మాయ మయ్యారు. అది నా ప్రాణానికి వచ్చింది. "పెద్దవాడు కదా" అని వూరుకుంటుంటే... మీ నాన్న క్షణం క్షణం, నన్ను రెచ్చగొట్టి ప్రాణం మీదకు వస్తున్నాడు. అసలు నువ్వెందుకింట్లో నుండి బయటికి వచ్చావు ? ఏం సాధిద్దామని.... !"

"చద్దామని...!" బుంగ మూతి పెట్టి చెప్పింది.

"చచ్చావా, లేదే... అటు, ఇటు కాకుండా, మీ నాన్నే కాదు అందరు కూడా ? "పీడాకారం... పిల్లి" అంటారు, బ్రతికి బట్టకట్టావు, కానీ దానివలన చూడు ఈ రకంగా వున్నావు. కనీసం ఓ రెండు, మూడు రోజులు జాగ్రత్తగా వుంటే తప్ప కదలలేవు.

అసలింతకీ సాత్యకి ఎక్కడో నీకేమైనా తెలుసా ? వున్న తలనొప్పికి తోడు, ఇదో క్రొత్త సమస్య. వీటిని పరిష్కరించాలి, ఎలాగ ? అజాగ్రత్తగా వుంటే, ఏ

ఎలుగుబంటో, తిన్నా, తినేస్తుంది. సరే, అవన్ని ప్రక్కనపెట్టి నేను చెప్పినట్లు చెయ్యి. లేదంటే, ఇక్కడ విడిచిపెట్టడమో లేక ఏ పెద్దపులో, సింహాన్నో పిలిచి, నిన్ను దానికి ఆహారం చెయ్యడమో చేస్తాను ?" అని ఆగాడు.

"అర్థమవుతుందా ?" గట్టిగా గదిమాడు.

"ఎందుకలా మాటిమాటికి కసురుకుంటావు ?" రాగాలాపన ప్రారంభించింది.

"మొదలు పెట్టావు. ముందు ఏడుపు మాను. ఆ తర్వాత నేను చెప్పినట్లు వినాలి" అడుగుతున్నాడు.

"ఏం చెయ్యాలి ?" చెప్పమని కృష్ణుని తలవంచుకుని వోరగా చూసింది.

మొదటిది. చీటికి మాటికి ఆ ఏడుపు మానాలి. ఏం జరిగినా సరే. ధైర్యంతో వుండాలి.

రెండు - ఏం చేసినా నోర్మూసుకుని కూర్చోవాలి.

మూడు - నీ శరీరాన్ని శుభ్రం చేసేవరకు కదలకుండా కూర్చోవాలి.

నాలుగు - నేను చెప్పేవరకు లేచి నిల్చోకూడదు.

అదికాదు, ఇదికాదు - అంటూ మొండికెత్తడం, రాగాలాపనకు సిద్ధపడడం చెయ్యకూడదు.

"అర్థమయిందా... ?" గట్టిగా అరిచినట్లు చెప్పాడు. అంతకుమించి గత్యంతరం లేదు. బలవంతంగా కాదు కానీ, చంటిపిల్లలాగ, బుద్ధిగా తల వూపింది. "నేను చెప్పినట్లు వింటే, ఇద్దరం బ్రతికి బట్టకడతాం. ఈ అడవిలోంచి బయటపడతాం. లేకపోతే ఇద్దరం ప్రమాదంలో పడతాం. తెలిసిందా!" కృష్ణుడు చెబుతున్నాడు. "వూ" అని తలూపింది సత్య.

తలవంచుకునే "దయచేసి నన్ను, సాత్యకిని క్షమిస్తావు కదూ!" గోముగా అడిగింది. ఆమే మళ్ళీ ఇద్దరం కలిసి నిన్ను ఇబ్బంది పెట్టాం. నీ మీద పడ్డ నింద, మా నాన్నవేసిన, ఆ అబద్ధపు నింద నుండి నిన్ను బయటపడవెయ్యాలని చేసిన సాహసం ఈ రకంగా పరిణమిస్తుందనుకోలేదు." ఎంతో బాధతో చెబుతుంది.

ఈ విషయం నాకు తెలియబరిస్తే నీకీ ఇబ్బంది రాకుండా, నేను సాత్యకి, ఈ సాహసం చేసేవాళ్లం కదా!" ఆ అమాయకపు పిల్ల సాహసానికి ఆశ్చర్యపోతూ అన్నాడు.

"అదికాదు. మా నాన్న ఏదో నాటకమాడుతున్నాడనిపించింది. ప్రొద్దున్నే మా బాబాయిని పంపించాడు. కాస్సేపాగాక, వున్నట్టుండి "దొంగ, దొంగ" అంటూ దొంగాట మొదలుపెట్టాడు. ఆ చెవి కుండలం తానుగా, ప్రాకార ద్వారం వద్ద పడేసి, ఇదిగో దొంగ దొరికాడని, నాటకం మొదలుపెట్టాడు.

మా నాన్నంటే నాకు ప్రాణం... ఈ నాటకం చెప్పలేను! నీపై పడ్డ నింద భరించలేను. అందుకే సాత్యకిని కల్సి, ఆతని ద్వారా నీపై బడ్డ, ఆ అపనిందను తుడిచి వెయ్యాలని, ఇంతసాహసం చేసాను.

ఈ పవిత్ర గుహ గురించి, సాత్యకికి చెప్పి ఇక్కడకు రమ్మన్నాను. శ్యమంత కాన్నిక్కడ భద్రంగా, మానాన్న, మా బాబాయిని దాచి పెట్టమని పంపాడనుకుని సాత్యకితో, ఇక్కడికి రమ్మనమని చెప్పాను. అంతే!

"మరి ఆ సాత్యకి ఏమయ్యాడు, వచ్చాడా ?"

అదే అర్థం కావడం లేదు. ఖచ్చితంగా చెప్పలేను. కాకపోతే, ఓ రెండు ఎలుగుబంట్లు కనుపిస్తే వాటి నుండి తప్పించుకోవడం కోసం, పరుగెత్తి పరుగెత్తి ఓ గోతిలో పడ్డాను. అంతవరకు గుర్తు వుంది. ఆ తర్వాత....!" అనేసరికి.

"ఏడవకపోయావు ?" అందామనుకున్నాడు. కానీ, నువ్వే ఏడవమన్నావు కదా!" అని మళ్ళీ శోకాలు పెడుతుందేమోనని భయపడి ఆగిపోయాడు.

"అయితే నువ్వు, మీ బాబాయి ప్రసేనుడిది, ఆతని గుర్రం మృత కళేబరాలు చూసావా ?" కృష్ణుడడిగాడు.

"లేదు. నేను చూడలేదంది" సత్య.

అప్పుడు, వాసుదేవుడు, తన దగ్గరనున్న రెండు బంగారు గొలుసు ముక్కలను చూపి దీనిని గుర్తుపట్టగలవా ? అడుగుతాడు.

ఇది నాకు బాగా తెలుసు. "ఇది శ్యమంతకమణికున్న గొలుసు. దీనిని మా నాన్న ధరిస్తుంటాడు, కదా!" ఖచ్చితంగా చెప్పింది.

ఆ ఎలుగుబంట్లు ఎటునుంచి వచ్చాయో, ఎటువైపు వెళ్ళాయో, నీకు తెలియదంటావు ? విషయ సేకరణకై, తన ప్రయత్న ప్రారంభానికి కృష్ణుడు అడుగుతున్నాడు.

నేను జాగ్రత్తగా, ఆ ఎలుగుబంటి అడుగులు గుర్తు పట్టాను. అవి ఈ గుహ వరకు వచ్చి ఆగిపోయాయి. ఆ జాడొక్కరిదే కాదు. ప్రక్కన ఇంకెవరెవరో వున్నారు'' ఇది వాసుదేవుని అనుమానం.

“ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే, కాలక్షేప, కాలాతీతమే తప్ప, కార్యసాధనం కాదు. తొందరగా తయారవ్వు. మనం విషయసేకరణ ప్రారంభిద్దా''మన్నాడు, గోవిందుడు.

ఆ గుడ్డను నిషాద యువతి (కోయవాళ్ళు కట్టుకున్నట్లు) వలె కట్టుకో. కదులు. ఇప్పుడు నీ అందాలు, అలంకారాలు గురించి, ఆలోచించకు. నువ్వెలాగున్నా ఇక్కడ అడవిలోని, ఇతర జంతువులలాగే చూసారు. తప్ప'' అందం చూడవయ్యా, ఆనందించవయ్యా'' అని ఎవరు పాటలు పాడరు. పరవశించి నీ వెనుక పరుగెత్తరు. అర్థమౌతుందా... ?''

“వూ... అని... ? అదేదో మెల్లిగా చెప్పవచ్చును కదా'' అంటుందీ పిల్ల “సత్య''. కోయపిల్ల అవతారమెత్తడానికి సిద్ధపడింది.

ఇప్పుడు మనముందరున్న సమస్య. ఒకటి - సాత్యకిని వెదకి పట్టుకోవడం. రెండు - ఆ శ్యమంతకాన్ని, మీ నాన్నకు, ఏ పదిమందిలో నన్ను అల్లరి పాల్జేసాడో, ఆ పదిమందిలో, మహారాజు గారి ద్వారా అందివ్వడం, నిన్ను భద్రంగా, ఆ ఇంట్లో చేర్చడం.

“అంటే, నన్ను విడిచి పెట్టేస్తావా ?'' బుంగమూతి పెట్టేసింది.

“ఇప్పుడు ఎత్తుకు తిరుగుతున్నాను కదా!'' అని, అప్పుడు నెత్తిన పెట్టుకుని వూరేగమంటావా ?''

“పెట్టుకుంటే తప్పా! అందుకు నేను తగనా ?''

సరే. ముందా కథలు కట్టిపెట్టి తయారవు. ఇక్కడనుండి కదులుదా మన్నాడు.

మీ నాన్న చెప్పినట్లు... దీనినెవరో సంరక్షిస్తున్నారు. ఇప్పుడా దేవతలు కనుక వస్తే, వాళ్ళతో మనమిప్పుడు యుద్ధకాండ ప్రారంభించాల్సి వుంటుంది. ఆ ఇబ్బంది, ప్రమాదం రాకుండా, తొందరగా బయటపడుదాం!'' చంటిపిల్లకు చెబుతున్నట్లు కృష్ణుడు చెబుతున్నాడు.

అలాగేనని సత్య విన్నది, వూరుకోకుండా,

"యుద్ధమా, అది నేనెలాగ చేస్తాను. కదలలేను కదా! ఆ మాటలకు ఏమనాలో తెలియని నందనందనునికి కొద్దిగా కోపమొచ్చింది." నా నెత్తినెక్కి... అన్నాడు. అప్పటికైనా నోరు మూస్తుందనుకుని.

"అలాగ, బాగుండదు. అయినా కుదరదు. నీ కుదుపుళ్ళకు, నేను క్రింద పడిపోతే...!"

"అంటే, నా నెత్తినెక్కి తొక్కాలని వుందా ?"

"నువ్వే అన్నావు కదా!" అందుకనే అలాగన్నానంది.

"సరే. ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం. ముందు నా చెయ్యి పట్టుకుని నడు. నీ శరీరాన్ని శుభ్రం చేస్తాను! భలే చిత్రంగా వుందీ సత్య, దీని మాటలను కున్నాడు - దేవకీసుతుడు.

ఆమెకు చేయూతనిస్తున్నాడు.

ఆ సమయంలో వున్నట్టుండి సత్య - దెయ్యం దెయ్యమంటూ వెనక్కి విరుచుకుపడిపోయింది. ఆ చేతిని సారంగంవైపుకు చూపుతుంది.

ఆమె చూసినవైపు తలత్రిప్పి చూసిన కృష్ణుడు, ఆమె భయకారణాన్ని గ్రహించ సిద్ధపడుతున్నాడు.

ఓ పొడుగాటి ఆకారం. వళ్ళంతా జుట్టు పరచుకుంది. దీర్ఘ కేశాలతో, భయంకరంగా కనిపించింది. అది - సారంగమార్గం ప్రక్కకు తిరిగిపోయింది. దాంతో తన కొడవలిని పుచ్చుకుని ఆ ఆకారం వెళ్ళినవైపు, గబగబ పరుగెత్తాడు.

ఆ పరుగులో.... క్షణాలలో ఆ ఆకారాన్ని గుర్తుపట్టడమో లేక కలబడటమో చెయ్యవచ్చున్నది - కృష్ణుని ఆలోచన. అది.....!

# దెయ్యం కాదు, ధైర్యం చేద్దాం!

కృష్ణుడు, ఆ ఆకారం పరుగెత్తుకుంటూ, ప్రక్కనున్న ఎత్తైన గుహలోకి వెళ్ళడం చూసాడు. సొరంగ మార్గం గుండా ఆ ఆకారం, ఆ గుహలోకి వెళ్ళి అదృశ్యమయింది. అది మనిషి కాదు. జంతువు కాదు. మనిషి పోలిన ఆకారంగా వుంది. మనిషిలాగే పరుగెత్తింది.

దాని వెనుక కృష్ణుడు పరుగెత్తాడు. ఆ గుహలోంచి పాట వస్తుంది. దానికా గుహ ప్రతిధ్వనిస్తుంది. ఆ గుహలోకి వెళ్ళి, ఆ సాంతం వెదికి, అది జంతువో, మనిషో తేల్చుకోవాలనుకున్నాడు. కానీ, సత్యను అర్థాంతరంగా విడిచి తాను పరుగెడితే, ఆ అమాయకురాలికేదైనా... కనుక.....

ఆమె కోలుకునే వరకు కొంత సాహసం చెయ్యకూడదని తలిచాడు. పాపం పిచ్చిది. శ్యమంతకం దొంగిలించాడనే నింద మోపిన తన తండ్రికి బుద్ధి చెప్పాలని, తన కోసం అతి సాహసం చేసిన సత్యభామను మధ్యలో విడువడమంటే, నట్టేట్లో ముంచినట్లే. కావున తొందరపడకుండా, నిదానంగా శ్యమంతకోపాఖ్యానానికి, ముగింపు చెప్పాలనుకున్నాడు. దాంతో వెనుదిరిగాడు.

కాబట్టి, సత్యను తీసుకుని మెల్లిగా శ్యమంతక, సాత్యకిలను అన్వేషించ డానికి, ఇరువురు కలిసి ప్రయత్నించాలని, ఆ వాసుదేవుడు నిర్ణయించుకున్నాడు.

కృష్ణుడు తిరిగి వచ్చేసరికి సత్యభామ విపరీతంగా వణుకుతుంది. మాటలు పెగలడం లేదు. అయినా కృష్ణుడు తన ప్రక్కనున్నాడనే ధైర్యంతో "అది దెయ్యమేనా ?" అడిగింది.

"ప్రమాదకరం కాని దెయ్యమయుండాలి. మనలాగే కొలనుకు వచ్చి వుంటుంది. నీ అరుపుకు భయపడి పారిపోయుంటుంది. నిజం చెప్పాలంటే అసలు సిసలైన దయ్యాలం మనమే. మనవలన లోకాలకు ప్రమాదం తప్ప, ఆ లోకాలలో వుండే ఏ జీవి మనకు ప్రమాదకారి కాదు, అంటూంటే -

"కాదు, అది దెయ్యమే." అది... అది... ఆమె వణుకుతుంది. శరీరం మొత్తానికి ప్రాణభయం చుట్టుకుంది.

"అది, ఈ గుహ సంరక్షకులలో ఒకటయి వుండవచ్చును. దేవతలు కాపాడతారని మా నాన్న అన్నాడు. ఎవరో కాని, మొత్తానికి... పూర్తిగా భయపడి పోతుంది. మాటలు రావడం లేదు.

"ఎందుకు దాని గురించి అనవసర ఆలోచన. భయపడకు. కొద్దిగా తేరుకోగానే, ఇక్కడనుండి వెళ్ళిపోదాం. అంత వరకు నీకు నేనున్నాను. నిన్ను విడువను, సరేనా... ?" అభయమిచ్చాడు.

అయినా భయం తగ్గని సత్య -

"నువ్వెక్కడికి వెళ్ళకు. ఇక్కడే వుండు. నేను ఒంటరిగా వుండలేను. ఇటువంటి దీర్ఘకేశాలు గల ఆకారాన్నింత వరకు నేను చూడలేదు. అది జంతువో, మనిషో, దెయ్యమో, దేవతో నాకు తెలియదు. నువ్వు మాత్రం నన్ను విడిచివెళ్ళక! వణికిపోతుంది. కృష్ణుని అండ, రక్షణను కోరుతుంది.

ఆమెనోదార్చిన కృష్ణుడు మంట చేసాడు. అందులో కందమూలాదులు కాల్చుకుని తిన్నారు. ఆకలిమంట తీరడంతో మనసు కొద్దిగా కుదుటపడింది. నీరసం కూడా తగ్గింది. దీంతో సత్య కృష్ణుని భుజంపై చెయ్యివేసి నాలుగడుగులు నడువసాగింది. మధ్యాహ్న సమయంలో -

గుహ బయటికి వచ్చి, తాము తెచ్చిన పండ్లను సూర్యునికి నివేదన చేసారు. సూర్యగాయత్రిని ఎంతో భక్తితో గోవిందుడు ఉచ్చరించాడు. ఆ సమయంలో గుహ వెలుపలి దృశ్యాన్ని చూసి తీరవలసిందే. సూర్యకాంతి పడిన ఆ గుహ గోడలు, రత్నాలు, మణులు తాపినట్లు మహోజ్వలంగా మెరిసిపోతుంది. ఆ కమనీయ దృశ్యం మరువలేనిది. మరువరానిది, కూడా!

సాయంత్రంవేళ ఆ ఎర్రటి, సంధ్యా అస్తమయ కిరణాలతో, ఆ గుహ లోపలి భాగమంతా, బంగారుపూత పూసినట్లు ప్రకాశిస్తుంది. ఆ నిర్మాణశైలికి వుభయులు ఆశ్చర్యపోయారు.

ఆ ఆనందమనుభవించిన, సత్యా-కృష్ణులొక ప్రక్కగా కూర్చున్నారు. పిల్లికూన, సత్య దగ్గర కూర్చున్నది కాస్తా కృష్ణుని చేరింది. సత్యమూతి ముడిచింది. ఏమిటో అలక... అనుకుంటున్నాడు. "ప్రభూ! నిన్ను చూస్తే నాకు అసూయగా వుంది." పాఠం మొదలుపెట్టిందిరా అనుకున్నాడు.

"ఎందుకు ?" అని కళ్ళతోనే అడిగాడు. అందుకు సత్య -

చిన్నప్పటినుంచి పెంచి పెద్దచేసిన నన్ను విడిచి, అది నీ ప్రక్కన చేరింది.

"అంటే... నీలాగా... !"

"ఏయ్!" అనేసింది. ఆ వెంటనే నాలిక కొరుక్కుంది. అవునా ? అన్నట్లు కృష్ణుడు చూస్తున్నాడు.

"మా నాన్న పిల్లిని పెంచకు. అది పీడాకారం. యజమాని మేలుకన్న కీడే ఎక్కువ కోరుకుంటుందంటే, కాదని, ఏం చెయ్యను, నాన్నా! ఎక్కడ విడిచినా సాయంకాలమయ్యేసరికి నా దగ్గరకు వచ్చేదాన్ని నేను, సముద్రంలో పడేసి లాభం లేదు. పీకపిసికి చంపాలి, అనేదాన్ని.

అప్పుడు కాని, అది నన్ను వదలదు. చంపిన పాపంతో నేను సతమత మవుతాను. అది మళ్ళీ ఏ రూపమెత్తినా, ఆ రూపంతో నన్ను హింసించడమో, పెంచుకున్న ప్రేమను పంచడమో చేస్తుందని, కడుపులో పెట్టుకుని పెంచాను.

ఇప్పుడది, నిన్ను చేరి, నన్ను మరిచింది" వుడుక్కుంటూ చెప్పింది.

"రేపు నువ్వు అంతేకదా! ఇన్నాళ్ళు పెంచి పెద్దచేసిన తండ్రిని కాదని, ఎవడినో కట్టుకుని, వాడే నా ప్రాణం, పెన్నిధి "అంటూ పోతావు. అప్పుడు ఇప్పుడు నీకు, ఈ పిల్లికి వున్న తేడా ఏమిటి ?"

"ఎవరినో కట్టుకుని పోతావు" అన్నమాట వరకు విని, దానినే పట్టుకుని, కష్టమో-సుఖమో, నీతోనే నా లోకమంటూ, ప్రక్కన కూర్చున్నది కాస్తా అలాగే కృష్ణునిపై వాలిపోయింది.

"మొదలయ్యాయి, నీ సరసాల"న్నాడు, సత్య నింకేమీ చెయ్యలేని, ఆ అల్లరి కృష్ణుడు, గోవిందుడు.

ఆ రాత్రి ప్రశాంతంగా గడిచిపోయింది.

తెల్లవారి తేలికగా, కులాసాగా సత్య లేచింది. తనంతట తాను, కృష్ణుని తోడులేకుండా, మడుగు వద్దకు వెళ్ళి స్నానం చెయ్యగల్గింది. ఆమెను మడుగు వద్ద దింపిన కృష్ణుడు, మళ్ళీ సూర్యగుహకు వచ్చి, ఆ పరిసరాలను శుభ్రం చేసాడు. వుండటానికి, పరుండటానికి వీలుగా ఏర్పాట్లు సరిచేసాడు. అప్పుడు -

ఆ ప్రశాంత వాతావరణాన్ని భగ్నంచేస్తూ సత్య గావుకేక! వెంటనే మడుగు దగ్గరకు గోవిందుడు పరుగెత్తాడు.

కొలను ముందు కూర్చుంది. పాదాలు నీళ్ళలో వున్నాయి. శరీరమంతా వణుకుతుంది. వాసుదేవుడు దగ్గరకు రాగానే గట్టిగా ఆతని పాదాలు పట్టుకుంది, మొహం భయంతో పాలిపోయింది. కనురెప్పలు టపటప కొట్టుకుంటున్నాయి. మడుగు అటు ప్రక్కకు చూపి "దెయ్యం, దెయ్యమని" బిగ్గరగా అరిచింది.

కృష్ణుడు పరుగెత్తుకుని, వారధిలాగ వున్న రాళ్ళను గబగబ దాటి, అటువైపు వెళ్తే, ఆ ఆకారం, సన్నని ఇరుకుదారి నుండి, అవతలి గుహలోకి వెళ్ళడం చూసాడు.

ఆ సన్నటి, చిన్న కన్నం గుండా చూస్తే, ఆమె దెయ్యం కాదు. అందమైన వయసులో వున్న చిన్నది. ఆమెను అలవోకగా చూసాడు. ఆమె కూడా ఎవరైనా తననుసరిస్తున్నారేమోనని భయంతో, వెనక్కి, వెనక్కి తిరిగి చూస్తుంది. ఎవరి ప్రాణం వారిది, ఎవరి భయం వారిది.

కాస్సేపు అలాగ వుండిపోయిన కృష్ణుని చెవులకు పక్షులు కూస్తున్నట్లు, చక్కనిపాట వినడానికి సొంపుగా వుంది, వినబడింది.

మొదట్లో గుహలోపలికి వెళ్ళి, వాళ్ళెవరో తెలుసుకుందామనుకున్నాడు. కానీ, ఈ భయపడే, గుండె దడ, పిరికి పిల్లను విడిచి వెళ్ళడమిష్టం లేక వెనుదిరిగాడు.

ఆ మడుగు దాటుతూ చూస్తే, ఆ నీళ్ళలో బంగారు ధాన్యపుగింజలు, సూర్యుని గుహలోని ప్రార్థనా మందిరంలో చూసిన విధంగా కనబడ్డాయి. తన ఆలోచన విరమించుకుని... ఆశ్చర్యంగా చూస్తూ సత్య దగ్గరకు వచ్చి, నీళ్ళలో తాను చూసిన బంగారు గింజలవంటి, ఇసుకరేణువుల గురించి చెప్పాడు. ఆ తర్వాత వాళ్ళిద్దరు తమ గుహకి వెళ్ళారు.

సత్య పక్క సర్దుతూంటే, ప్రక్కన నిల్చుని ఆమె ఒక అందమైన ఆడపిల్లనీ, నీలాగే బెదురుతుందని, నువ్వు కాస్త నడవడానికి సిద్ధపడ్డాక, ఆ గుహలోకి వెళ్ళి ఆమెను పరిచయం చేసుకుంటే ఆమె శ్యమంతకమణి జాడ తెలుపవచ్చునని, తన అభిప్రాయాన్ని సూచన మాత్రంగా తెలియబరిచాడు. మళ్ళీ, తానే -

"కాస్సేపు పడుకో. భయం తగ్గుతుంది. ధైర్యమొస్తుంది. ఆ తర్వాత మిగిలిన విషయాలు!" అన్నాడు బయటికి వెళ్ళి కొన్ని ఆకులను తెచ్చాడు. గుహలో వెచ్చదనం కోసం వేసిన నెగళ్ళపై ఆ ఆకులను కాల్చి సత్య మడమకు కట్టాడు. ఫర్వాలేదు. రేపటికి బాగా కోలుకుంటావు" అన్నాడు చిలిపిగా సత్య కళ్ళలోకి చూసి -

"పరుగెత్తడం మాత్రం చెయ్యకే! నిన్ను పట్టుకోవడం, నా వల్లకాదు" అన్నాడు, నేను పట్టుకుంటానులే" అని అందామనుకున్న సత్య, మరీ అంత పెంకి, పెడసరం పనికిరాదనుకుంది.

మధ్యాహ్నం భోజనం వంటి ఆహారం తీసుకున్నాక సత్య విశ్రమించింది. కృష్ణుడు తన వేణువును తీసుకుని ప్రక్కనున్న గుహ సన్నని దారి ముందు నిల్చుని వూదుతున్నాడు. ఆ వేణువు శబ్దానికి, లోపల చిలకపాటలు పాడే, ఆకారం, ఈ వేణువుకు తగ్గట్లు సన్నగా - పాడుతూ, దగ్గరకు వస్తుందని తలిచాడు.

ఎందుకంటే దూరంగా వినబడే ఆ చిలకలపాట, రాను రాను దగ్గరవడడమే, ఈ ఆలోచనకు బలమైన కారణం. తను వేణువు ఆపుతున్నాడు. ఆ క్రొత్త వ్యక్తి పాడుతుంది. ఇతను పాడుతున్నాడు. ఆమె ఆపుతుంది. ఆమె పాడుతూంటే, దానికను గుణంగా, కృష్ణుడు వేణువూదడం, అవతలి వ్యక్తికి కొంత ఆనందమనిపించింది.

ఎందుకో కళ్ళు తెరచిన సత్య, కృష్ణుని వేణుగానం వింటూ, అతని దగ్గర కొచ్చింది. ఆ దయ్యాన్ని చూసావా ? అని అడిగింది.

ఆమె దెయ్యమైతే, ఆమెకు సంగీతం గురించి ఆలోచన వుండదు. మనతో సమానంగా స్పందించే ఆమె దయ్యమై వుండదు. ఎవరో కనుక్కోవాలి. కాకపోతే, ఆమె వరుసను బట్టి చూస్తే నాగరికత తెలియని అడివి మనిషేమోననిపిస్తుంది.

వెళ్ళి, ఆ ఊర్వశిని, దాని కూతురు మేనకను మన వస్తువులను తీసుకుని, రా. ఏదీ మరచిపోకు. ఈ బిలం గుండా మనం ఆ గుహలోకి వెళ్ళి, ఆమెను పరిచయం చేసుకుందాం, వివరాలు తెలుసుకుందామన్నాడు.

అలాగేనన్న సత్య ఈమె వ్యవహారంలో పడి "ప్రభూ! సాత్యకిని, శ్యమంతకాన్ని మరచిపోకూడదు!" అంటే, "నిన్ను గూడా" అందుకున్నాడు. తప్పకుండా అంటూ, పవిత్ర గుహలోకి వెళ్ళి, కృష్ణుని సూచన ప్రకారం, వారి వస్తువులన్నీ తీసుకువచ్చింది.

సత్య ఆ సొరంగ మార్గానికి వచ్చేవరకు ఆమె... అదే, ఆ అడివిపిల్ల పాట పాడుతూనే వుంది. ఆమెను చూస్తూనే -

"నా కత్తివ్వు!" కృష్ణుడడిగాడు.

"ఎందుకు ?" సత్య ప్రశ్న.

"ఈ బిలం ద్వారా, తల పెట్టి లోపలికి వెడతాను. ఆ శత్రువుని ఎదుర్కుంటాను. నీకేదైనా అనుమానమొస్తే నీ బలం కొద్దీ నా కాళ్ళు పట్టుకుని లాగు. ఏ ప్రమాదం లేదూ, నా విల్లంబులు, కొడవలి ఇవ్వు ముందుకు సాగుతాను. తర్వాత విషయం... తర్వాత" అన్నాడు. ఆ తర్వాత నువ్వు. దానికి ముందు మన వూర్వశి" వివరించి వాసుదేవుడు చెబుతున్నాడు.

ఇక విషయం తేల్చుకోవడానికి వేణుగానం మొదలుపెట్టాడు. అది విన్న ఆ అడవిపిల్ల ఆనందిస్తుంది. నువ్వు దాన్ని అదే వేణుగానాన్ని ఆపడానికి ప్రయత్నం మాత్రం చెయ్యకు. ఆ పిల్ల మనల్ని శత్రువులుగా తలంచరాదు. జాగ్రత్త.. అన్నాడు.

మెల్లిగా ఆ బిలం లోపలకి దూరుతున్నాడు. సత్య తన బలం కొద్దీ అతనిని తోస్తుంది. కృష్ణుడు వేణుగానం మాత్రం విడువలేదు. ఆ పిల్ల ఈ గానానికి పరవశించి పులకరిస్తూంది. కొద్దినిముషాలలో, అతనా ఎత్తైన గుహలో ప్రవేశించాడు.

సత్య విల్లంబులను అందించిది. వాటితో మేనకతో, ఊర్వశి దడాలున దూకేసింది. ఇప్పుడు సత్య పరిస్థితే ఆలోచించాలి. ఈమెకు ఆ దెయ్యాన్ని చూడాలన్నా, దానికి ఎదురుపడాలన్నా, దడ-వణుకు. భయం. అయినా కొంత ధైర్యం పుంజుకుంటూ "ప్రభూ" అంది.

"ఫర్వాలేదు. భయపడకు. నువ్వన్నట్లామె దెయ్యమయి వుండదు. మీ నాన్న చెప్పినట్లు దేవతా కాపలామూర్తులై వుండాలి. మానవలోకానికి వాళ్ళా విధంగా, వింతగా కనుపిస్తున్నారన్నాడు.

వీళ్ళలో ఎవరో సాత్యకిని అపహరించి వుంటారు. అవును, అదే అటువంటి వాళ్ళెవరైనా కనుపిస్తే నువ్వు గుర్తు పట్టగలవా ?" కృష్ణుని ప్రశ్న.

అవును. వాళ్ళిద్దరు. ఒకళ్ళు పొట్టిగా, లావుగా ఒత్తయిన జుట్టుతో, ఎంతసేపు వెనుక కాళ్ళు పైన నిల్చుని వుంది. రెండోది బలంగా, పెద్దగా వుంది. దానికి నాలుగు కాళ్ళు పనిచేస్తాయి. చిత్రమేమీ లేదు. మామూలుగానే వుంది." చెప్పింది.

అయితే నీ దెయ్యం ఎలుగుబంటి కాదు. ఎలుగుబంట్లు పాటలు పాడతాయని నేనెక్కడా వినలేదు. కాబట్టి అది ఆడపిల్లే కాని, దెయ్యము కాదు, ఎలుగు కాదు, వాసుదేవుడు తేల్చి చెప్పాడు.

ఆ గుహాముఖద్వారం, చిట్టడవిలోకి వుంది. కొద్దికొద్దిగా, గుహ లోపలికి సూర్యకాంతి పడుతుంది. దాని ప్రక్కనే లోపల వున్న మడుగు కొలనులాగ పారుతుంది. అప్పుడెందుకో వాసుదేవుడు ఆశ్చర్యంగా సత్యను చూసాడు.

"భామా!" అన్నాడు.

"ప్రభూ...." అంది - ఆశగా ఏం చెబుతారో విందామన్న ఆసక్తితో!

"ఈ విధంగా మీ నాన్న నిన్ను చూస్తేగుండాగి చచ్చిపోతాడు. అవునా...?! అన్నాడు, మరల తానే -

అస్తవ్యస్తంగా ఆ వంటిమీది బట్టలు శరీరం మొత్తం కనుపించే అందచందాలు, ఈ తిరుగుబోతు భుజంపై, సిగ్గులేకుండా ఆసరా చేసుకుని నిల్చున్న నీ వైనం... అబ్బా! ఇదంతా చూసాడో, ఇక - ఈ జన్మకు మాట్లాడే సావకాశం, చూసే సావకాశం, పాపం - ఆ జీవి కోల్పోతాడు. సానుకూలంగా స్పందిస్తూ సానుభూతిగా చెబుతున్నాడు.

ఈ మాటలు వింటుంది. సమాధానమివ్వడం చాతకానట్లు, తాను బయట పడకుండా "ఓ, దేవా! ముందీ కబుర్లు కట్టిపెట్టండి. ఆ దెయ్యం మీద పడిందో.... అమ్మబాబోయ్!" అంటూ అలాగే దేవకినందనుని వాటేసుకుంది.

"చచ్చిపోతావనే, ఆ భయం.... అటువంటప్పుడు, ఇంత సాహసమెందుకు చేసావు ?" తన నానుకున్నామెను కొంటెగా పలుకరించాడు.

"నువ్వొచ్చి కాపాడతావని ? ఇలాగ పట్టుకుంటానని తెలిసి మాటకు, మాటకు, తాను తుంటరిగా సమాధానమిస్తూ" అవును, నీకు భయం లేదా ? తెలియదా ? అడుగుతుంది.

"భయమా ? అదెందుకు, అదెలాగ వుంటుంది ? బుగ్గల దగ్గరికి, తన నోటిని పెడుతూ అంటాడు. "పో! తుంటరి" అంటూ, అలాగే భుజం మీద వాలిపోతుందామె.

చక్కగా ఈలలు వేస్తున్నట్లు గాలి, ఆ గాలికి లయబద్ధంగా వూగే చెట్లు అనుకుంటే భయం, కాదంటే సంతోషం. ప్రకృతి పరవశత్వానికి పరాకాష్ఠ ఈ వనాలు, కారడవులు. నగరాలలో, పట్టణాలలో వున్నది. కాలుష్యం. దౌర్భాగ్య, దౌర్జన్యాలు తప్ప ప్రశాంతత కనబడదు.

ఒకమూల "భయం"గా, భయంకర విషయాలు మాట్లాడుకుంటూనే అడుగులు వేస్తున్నారు. సత్యా, దెయ్యం - ఈ చెట్టుమీద నుండి, ఆ చెట్టు మీదకు వుయ్యాల వూగుతుంది. క్రొత్తవాళ్ళకు భయమే కానీ, చూడటానికి కనువిందుగా వుంది.

ఆ పాట వింటూ అది మనిషిదా ? పిట్టదా ? అడిగింది సత్య.

ఏదీకాదు, వాసుదేవుని నాదం. ఇది మన లాంటి లేదా మనకంటె వింత స్వరూపమై వుండాలి. ఇలాగంటూనే "ఎలుగు ? ఎలుగు ? అని దగ్గరై పోయింది." బాగున్నాయియా కౌగలింతలు ?" దగ్గరకు వచ్చినామెను మరింత దగ్గరకు తీసుకుంటూ అన్నాడు కృష్ణుడు.

అటు ఇటూ అసహనంగా చూస్తూ, నడిచే ఆ ఎలుగును చూసి విల్లంబులు అందుకున్నాడు. కానీ దాని వాలకం చూస్తే, ప్రమాదకరమైన మనుష్యుల జోలికి వచ్చే సూచనలేమాత్రం కనబడటం లేదు. అదే సత్యకు చెప్పాడు.

అదో చిత్రమైన పాటలు పాడే దెయ్యం తప్ప ప్రమాదకరం కాదు. సునాయాసంగా కోతివలె అంత పెద్ద దెయ్యంవంటి ఎలుగు, ఈ చెట్టునుండి, ఆ చెట్టుకు భలే తమాషాగా ఎగురుతూ వూయల వూగుతుంది.

దానికి రెండే కాళ్ళున్నాయన్నాడు గోవిందుడు. అది దెయ్యము కాదు రక్తపిశాచి కాదని చెబుతూంటే, ఊర్వశి వూరికే "మ్యావు. మ్యావు" మంటుంది. తీరా చూస్తే ఎవరో మనిషిలాగ వున్నాడు. ఆ వ్యక్తెవరో, తమవైపే వస్తున్నాడు.

ఆ వచ్చేదెవరో తెలియక సత్య వణుకుతూ వూ... వూ... అంటుంది. ఆమే మళ్ళీ "వీళ్ళే సాత్యకిని ఎత్తుకు పోయింది" వేలి పెట్టి చూపింది.

అప్పుడే అసలైన ప్రమాదమెదురైందని తలచిన కృష్ణుడు విల్లంబులను, కొడవలిని, కత్తిని పట్టుకుని, ఏది వీలైతే, అది వుపయోగించడానికి సిద్ధమయ్యాడు. నువ్వు నా వెనుకాల వుండు. సత్యకు ధైర్యాన్నిస్తున్నాడు.

వాళ్ళు దగ్గరకు వస్తుంటే గోవిందుడు చూసాడు. సత్య చెప్పినట్లు, వారిలో ఒకటి నిజంగా ఎలుగు - రెండు ఎలుగుబంటివలె కనుపించే మనిషి - నెత్తి మీద ఎలుగు, మనిషి ముఖంలాగ కనుపించే తొడుగుతో భయాన్ని సృష్టిస్తున్నట్లు కనబడ్డాడు.

చేతులు పొడుగ్గా వున్నాయి. ఆ వ్యక్తి బలంగా, దృఢంగా వున్నాడు. తెల్లగా నడుం వరకు పెరిగిన గడ్డం. నడక మాత్రం - ఆ అడవిమనిషి - ఎలుగులాగే నడుస్తున్నాడు.

పల్చటి ముఖం. మాంసపుముద్ద వంటి ముక్కు, ఆతని పెద్ద పెద్ద కళ్ళు, సమయ సందర్భాలను బట్టి, దయను ప్రసరించే, దయాపూరితంగా కనుపిస్తున్నాయి.

ఒక భుజంపై కట్టు వుంది. రెండో చేతిలో రాతి గొడ్డలి వుంది. చూడటానికి భయంకరంగా, భయంగొల్పుతున్నాతని, చూస్తూనే - సత్యకు దడ, వణుకు ప్రారంభమైంది.

# ఎవరు, మీరు ?!

**స**త్య చెప్పినట్లు -

ఒకటి ఎలుగుబంటి. మరొకరు ఎలుగులాంటి మనిషి. ఆ ఎలుగు మనిషి, సత్యా-కృష్ణులను చూసి సంతోషించాడు. భయపడవలదని సూచించాడు. అప్పుడు సత్య చేతిలోని గుడ్డి - పిల్లికూన, వున్నట్టుండి ఆమె చేతులనుండి క్రిందకు దూకింది. అన్నీ కనబడుతున్నట్లు ఎగురుతుంది.

దీనినా ఎలుగు మనిషి - నోట్లో వేసుకుని చప్పరిస్తాడేమోనని, తల్లి ఊర్వశికీ భయం. ఆ ఎలుగు మనిషి నవ్వుతున్నాడు. రమ్మని మేనకను పిలుస్తున్నాడు. అది స్పష్టంగా దారిచూసి పరుగెడుతూంటే, సత్య ఆశ్చర్యానికి అంతులేదు. భయపడకు. సత్యను వూరడిస్తున్నాడతడు.

"ఎలుగు సోదరా! నీ సోదరుడు ఎలుగా ?" అని ఆసక్తిగా ఎంత భయం లేదన్నా గుటకలు మ్రింగుతూ అడిగింది.

"అవును. వీడి తండ్రి, నేను మంచి స్నేహతులం. మేమిద్దరము కలిసే పెరిగాము" అన్నాడాతడు. ఈ మాటలు జరుగుతున్నాయి. కృష్ణుడు ఆ ఎలుగు మనిషి భుజం మీద చర్మం తోలు వూడిపోయినట్లుంది. అది తాను చూసిన సింహపు పంజాకు చిక్కుకున్న ఎలుగుచర్మమై వుండవచ్చుననుకున్నాడు.

మీ సోదరుని కుమారుడు మహా భయంకరుడనుకుంటాను. అవసరమైతే, సింహాన్ని కూడా చిత్తు చెయ్యగల ధీరుడు'' అని పొగడుతున్నట్లు నవ్వుతూ అభినందించాడు.

"నిజం. మావాడు అసాధ్యుడు'' దానిని అర్థం చేసుకున్నట్లు తానూ - నవ్వాడా ఎలుగు మనిషి. కృష్ణుడు, వాళ్ళ పరిచయానికి, ఆహ్వానానికి సంతోషించాడు.మరకత్తిని బొడ్లో దోపుకున్నాడు. అతడు కూడా తన రాతిచేతి గొడ్డలిని బొడ్లో దోపుకున్నాడు.

కృష్ణుణ్ణి ప్రేమగా చూసి, అతని చేతిలోని మేనకను ఇమ్మని అడిగాడు - కృష్ణుడు దానిని ఒక చేత్తో పట్టుకుని, రెండో చేత్తో గోముగా నిమురుతున్నాడు. మొత్తానికి భయపడ్డ వాతావరణం ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా మారిపోయింది.

కొద్దిసేపు అతను దానితో ఆడుకుని, ఇప్పుడు సత్య చేతికిచ్చాడు. చిత్రంగా అరిచాడు. దానికి, సమాధానంగా ఇద్దరు మనుషులు వచ్చారు. వాళ్ళనో ఎలుగు అనుసరించి వచ్చింది.

"సత్రాజిత్తు ఎక్కడా ?'' అనుమానంగా సొరంగ ముఖద్వారం వైపు చూస్తూ అడిగాడు. అతడు కూడా మీతో వున్నాడని తలిచాను. ఈ రాత్రికి పూర్ణ వధువులా చంద్రుడు నిశిరాత్రిని చీకటిని చీల్చుకుని మరీ అందగాడిలా వస్తాడని చెప్పాడు.

"సత్రాజిత్తూ'' అనేసరికి కృష్ణుడాశ్చర్యపోయాడు. అంటే మనమెవరో వస్తామని వీళ్ళకు తెలుసన్నమాట. సమాధానం చెప్పాలి కాబట్టి "సత్రాజిత్తు రాలేదు. బహుశా ఇకపై రాడు కూడా. మెల్లిగా చెప్పినవాడు సత్యను చూపించాడు. ఈ చిన్నది సత్రాజిత్తు కూతురు.''

ఆ మాట విని నిట్టూర్పు విడిచిన ఆ ఎలుగు మనిషి "నువ్వెలాగ వచ్చావిక్కడికి ?'' అడిగాడు. దానికి సమాధానంగా, "పవిత్రమైన సూర్యుని గుహలోని సొరంగ మార్గంగా ఇటు వచ్చామని చెప్పాడు. మళ్ళీ వాసుదేవుడే "ఇక్కడికి రావడం, మిమ్మల్ని చూడటం మాకెంతో ఆనందంగా వుందన్నాడు''- ఈ పవిత్రమైన గుహను, మీరు, మీ వంశీకులు భద్రంగా కాపాడటం గర్వించదగ్గ విషయమన్నాడు.

దానికి సమాధానంగా, వచ్చినవాళ్ళు వచ్చినట్లే ఇక్కడ వుండిపోవాలి తప్ప, దీనిని దాటి ఎక్కడికి వెళ్ళలేరు. ఇది ఎలుగుల రాజ్యం. ఆ ప్రభువు అనుజ్ఞ అయితేనే, మీరిక్కడ నుండి కదలగల్గుతారు. ఆ మాటలకు ముందు సత్యకు, ఆ తదుపరి కృష్ణునికి గుండెల్లో రాయిపడింది.

మాది మైత్రీపూర్వక పర్యటనే తప్ప, ఇక్కడ వుండటం తగదు. కుదరదు కూడా! అలాగే మీ ప్రభువును చూడదలిచామన్నాడు, వాసుదేవుడు.

అంటే ఆ రాజును కలవడానికి వచ్చారా ? అని హహ్హాహ్హా పెద్దగా నవ్వాడు. నేనే... ఆ ప్రభువును. నా పేరు జాంబవంతుడు. అని గుండెలపై బలంగా చరచుకుంటూ, నువ్వెవరు ? నాతో నీకేం పని ?'' అని అడిగాడు. ఆ గొంతు గంభీరంగానే వుంది.

“నా పేరు కృష్ణుడు వసుదేవసుతుడను, కృష్ణ -వాసుదేవుడని కూడా అంటారు. ఓ ఎలుగుల రాజా! నీకు నా వందన'' మన్నాడు. అతని పెద్దరికానికి గౌరవ సూచకంగా పాద నమస్కారం చేసాడు. సత్యభామ కృష్ణుడు చేసినట్లే తాను వందనం చేసింది.

“మా మహారాజు పేరు ఉగ్రసేనుడు. నా తండ్రి పేరు వసుదేవుడు. శూర వంశీయుడు. వారి బదులు కూడా నా వందనాలు స్వీకరించమని, ఎంతో వినయంగా చెప్పాడు.

కృష్ణుని మాటలకు జాంబవంతుడెంతో సంతోషించాడు. ఇవి మా మహారాజు తమకు సమర్పించనున్న ఆయుధాలనేసరికి, వారి మైత్రికి సంతోషంగా ఆ ఆయుధాలనందుకున్నాడు. తన పరిజనానికిచ్చాడు.

“రండి'' తను ప్రేమగా పలుకరించి, జాంబవంతుడాహ్వానించాడు. అతను ముందు నడుస్తూంటే జాంబవంతుడు అనుసరిస్తున్నాడు. సన్నటి దారిగుండా అడవిలో ప్రవేశిస్తున్నారు. అడుగు ముందుకు వేస్తే, చిలకపాట వినిపిస్తూంది. దానికి ప్రతిగా కృష్ణుడు తన వేణువు మీద ఆ పాటను అనుసరిస్తున్నాడు.

కృష్ణుని ఈలపాటకు సంతోషించే జాంబవంతుడు వేణువును కృష్ణుని నుండి లాక్కుని, తను వూదడానికి ప్రయత్నించాడు. సరిగ్గా రాలేదు. దాంతో కృష్ణునికిచ్చేసాడు. కృష్ణుడు వేణుగానం మొదలుపెట్టాడు.

కృష్ణుడు ఆపాడు. చెట్టుమీద నుండి సత్య చెప్పిన దెయ్యం పాట మొదలు పెట్టింది. జాంబవంతుడు దీనికి గల ప్రతిస్పందనను చూసాడు. సంతోషించాడు. అలాగ వాళ్ళొక పీఠభూమిని చేరారు. అక్కడ దాదాపు నలభైకి పైగా గుహలు కనుపించాయి.

ఏ విధమైన భయం లేకుండా, ఆ ప్రాంతంలో పెద్దా - చిన్నా కలిపి చాలా ఎలుగులు సంచరిస్తున్నాయి. అది ఎలుగుల రాజ్యం. రెండు ప్రక్కల పెద్ద పెద్ద కొండలు

ఎల్లలుగా, పెట్టని కోటగోడలుగా వున్నాయి. మూడోప్రక్క లోయ, బయటి ప్రపంచంలో నుండి రావాలంటే ఇక్కడికి దారి - మార్గం - ఆ పవిత్ర గుహే ?!

అలా గుహల మధ్యలోకి వెళ్ళేసరికి దాదాపు, అరవైమంది స్త్రీ, పురుషులు, పిల్లలు చక్కని స్నేహితుల వలె కలిసి మెలిసి కనబడ్డారు. వాళ్ళందరు గుండ్రంగా కూర్చున్నారు. మధ్యలో నెగడు.

ఆడవాళ్ళ జుత్తుతో వాళ్ళ శరీర భాగాలు మూసుకొని వున్నయి. వాళ్ళు నడుముకు గుంటనక్క చర్మాలు చుట్టుకున్నారు. పిల్లలు మాత్రం ఇంచుమించు నగ్నంగా ఆడుకుంటున్నారు.

పందులు, గుంటనక్కలు, కుందేళ్ళు అలాగే కందమూలాదులు కూడా ఆ మంటల్లో కాలుస్తున్నారు. అంతా ముగ్గిన పండ్లు సేకరించి, తినడానికి వీలుగా వుంచుకున్నారు. నాగరికత ప్రపంచంలో లేని సంతోషం, అక్కడ కొట్టవచ్చినట్లు కనబడుతుంది.

జాంబవంతుడు, ఎవరో ఇద్దరితో రావడం వారికొక మాటల సందర్భ మయింది. గట్టిగా నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. కొందరు వీళ్ళను స్పష్టంగా చూడాలని కూర్చున్నచోటు నుండి లేచారు. వెనుక కూర్చున్నవారు, వారి ఆహారం కోసం కొందరు ఎలుగుజాతి వారు, అక్కడ వున్నారు.

వాళ్ళలో కొందరి నోళ్ళు కట్టబడి వున్నాయి. మొత్తానికి అక్కడ మనిషికి, మృగానికి - గొప్ప సఖ్యత ఏర్పడిన స్నేహ ప్రపంచమది. "జంతు-మిత్రలోక"మని కూడా చెప్పుకోవచ్చును.

కృష్ణ, సత్యలు - మొత్తానికి, ఆ వాతావరణానికి సంతోషించారు. అక్కడ సాత్యకి వున్నాడు. దూరంగా వీళ్ళు సాత్యకిని చూసాక, పరమానందభరితు లయ్యారు. సైగలతోనే పలుకరించారు. కంగారు పడవద్దని తలూపారు. జాంబవంతుడు వీళ్ళను, అక్కడ గల మధ్య వయస్కునికి చూపాడు. అతని వాలకాన్ని బట్టి చూస్తే అతనీ ప్రాంతానికి, ముఖ్యాధికారిగా కనబడ్డాడు.

ఈయన సాంబుడు. ఈయనే సామ్రాజ్యాధిపతికి వారసుడు. జాగ్రత్తని పరిచయం చేసాడు. పరస్పరభినందనలు, అభివాదములు వారి సాంప్రదాయం ప్రకారం

జాంబవంతుడు, సాంబుడు సల్పుకున్నారు. వీళ్ళను గురించి అడిగాడు. జాంబవంతుడు వివరించి చెబుతున్నాడు. అంతవరకు వీరికి స్వాగత - సత్కారాలు లేవు.

కాని, సాంప్రదాయాన్ని గమనించాడు. మన సాంప్రదాయం ప్రకారం, వాసుదేవుడు, సాంబునికి పాదాభివందనం చేసాడు. అతడు బలవంతంగా పెదవులపై నవ్వు పులుముకుని, కృష్ణుని మెడ మీద మెల్లిగా ముద్దుపెట్టుకున్నాడు. సత్యను కూడా అలాగ చెయ్యబోతే ఆమె వెనుకడుగు వేసింది. దాంతో అతని ముఖంలో రంగులు మారడం కృష్ణుడు గమనించాడు.

జాంబవంతుడు, సాంబుని ప్రక్కన కూర్చుని వాసుదేవుని కూర్చోమని పిలిచాడు. సాంబునికి అటుప్రక్కన లావుగా, మధ్య వయస్సు గల స్త్రీ వుంది. ఆమె సత్యను వచ్చి తన ప్రక్కన కూర్చొనమని పిలిచింది. అప్పుడా లావు మనిషి, పిల్లి కూన మేనకను, ఊర్వశిని చూసింది. నిప్పుల్లో కాల్చి తినడానికి తియ్యబోయింది.

ఆ మనిషి బుద్ధి గ్రహించిన సత్య మేనకను కృష్ణునికిచ్చింది. ఊర్వశి, పరుగు పరుగున వాసుదేవుని చెంతకు చేరింది. తన చేతికి చిక్కిన వాటిని సత్య లాక్కోవడం, ఆ పుణ్యమూర్తి ప్రక్కన కూర్చున్న స్త్రీకి నచ్చలేదు. తన భాషలో తిడుతూంటే, విషయాన్ని, కృష్ణుడు జాంబవంతునికి వివరించి చెప్పాడు.

అవి పెంపుడు జంతువులన్నీ సదా మాకు తోడుగా వుంటాయని, మరీ మరీ వివరించి చెప్పాడు. వాళ్ళు పవిత్రప్రేమను, స్నేహాన్ని గమనించినా పుణ్యమూర్తి, అవి వారి మిత్రులని  చంప తగదని సూచించాడు. మొత్తానికా వాతావరణం సత్యకు నచ్చలేదు. సాత్యకి కోసం, ఇక్కడికి వచ్చి ఇరుకున పడ్డట్లు ఆమె తలుస్తుంది.

ఇప్పుడు మళ్ళీ వాళ్ళ అసహనాన్ని తొలగిస్తున్నట్లు చిలకపాట. ప్రతిగా వాసుదేవుని వేణుగానం. ఆ గాన మాధుర్యానికి, తమ చిలక "పాట"కు అందరు మురిసారు. ఆ చిలకపాట మరీ, మరీ దగ్గరయి, చిలకలాగ, ఆ పిల్ల దిగింది. పుణ్యమూర్తికి, రాజుకు నమస్కరించింది.

అప్పుడు జాంబవంతుడు ఈమె నా కుమార్తె "రోహిణి" అన్నాడు. ఆమె కృష్ణుని చూసింది. చేతిలోంచి వేణువు లాక్కుంది. దాన్నొకసారి అటు ఇటు చూసి మళ్ళీ కృష్ణునికిచ్చేసింది.

ఆమె సత్య దగ్గరకు వచ్చింది. సత్యకు, తన అక్కకు మధ్య నిల్చుంది. మధ్యలో నిల్చున్న ఈ రోహిణి తన రెండు చేతులను ఇద్దరి భుజాలపై వేసింది. ఎంతో ఆప్యాయత కనబరిచింది. ఇంకా తమాషా ఏమిటంటే ఆమె, తమ భాషలో మాట్లాడటం కృష్ణుని కాశ్చర్యాన్ని కల్గించింది.

కాల్చిన మాంసం, ముక్కలు చేసి అందరికి ఇచ్చారు.

పుణ్యమూర్తి అందర్ని దగ్గరకు రమ్మని పిలిచాడు. ఓ మహోత్సవంగా దుందుభులు వంటివి మ్రోగాయి. ఆ పరమాత్మకు, నీలమేఘశ్యామునికి వందనాలన్నాడు. వాళ్ళ పద్ధతిలో కాస్సేపు నాట్యం చేసారు. ఈ సాంప్రదాయాల లక్షణాలు ప్రశ్నించదగినవి కావు. ఆనందంతో చూసి కొంత నేర్చుకోవచ్చును. సంతోషంతో వాతావరణాన్ని బట్టి ఆ సంబరాలలో పాల్గొనవచ్చును.

అదంతా ఒక క్రమపద్ధతిలో జరిగే విన్యాసం వంటి సంబరం, సందర్భం. ఆ వెంటనే అతను సంతోషంతో, ఎలుగు చర్మం, ముఖానికి వేసుకున్న తొడుగు, వారి సాంప్రదాయ ప్రకారం మృదంగం, వగైరా సంగీత వాయిద్యాలను విడిచి పెద్ద పెద్ద అంగలతో, అడవిలోకి వెళుతుంటే, మిగిలిన వారిలో చాలామంది సంతోషంగా, ఆ పుణ్యమూర్తిని అనుసరించారు.

జాంబవంతుడు, వృద్ధులు తప్ప మిగిలిన ఎలుగు మనుష్యులు కూడా. ఆవలివైపు నడిచారు. వాళ్ళ వెనుక ఎలుగులు. ఈ సమయంలో సత్యకు ధైర్యం కల్గించడానికి ఆమె నడుం చుట్టు గోవిందుడు తన చేతిని వుంచాడు. దూరంగా సాత్యకి కూర్చున్నాడు. ఈ చిలకపిల్ల రోహిణి కూడా అడవిలోకి పరుగెత్తింది. కొన్ని క్షణాలలో తిరిగి వచ్చింది. మోకాళ్ళపై కూర్చుని కృష్ణునికి అభివందనం చేసింది. అలాగ చెయ్యడంలో ఆమె చెవినుండి ఒక పువ్వు జారిపడింది. ఆమె అభిమానానికి కృతజ్ఞతగా గోవిందుడు, దానినందుకున్నాడు. తిరిగి ఆమెకే ఇచ్చాడు.

రోహిణి, ఆనాడు జరిగే పూర్ణచంద్రోత్సవంలో పాల్గొనడానికి చెయ్యి పట్టుకుని లాగబోయింది. కృష్ణుడు, నిరాసక్తత చూపడంతో ఆమె నిరుత్సాహంతో అడవిలోకి వెళ్ళిపోయింది.

పూర్ణచంద్రోదయం జరిగింది. అప్పటికి సాంబ వచ్చేశాడు. అతడు సత్య చెయ్యి పట్టుకుని అడవిలోకి తీసుకు వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాడు. దానికి సత్య

భయపడిపోయింది. బెదిరిపోయింది. నిజానికతనిలో ఏ చెడు తలంపు లేదు. వాళ్ళు సాంప్రదాయం ప్రకారం గౌరవించాలన్నదాతని ఆశ.

వెంటనే కృష్ణుడతని చేతిని గట్టిగా పట్టుకున్నాడు. ఆ పట్టుకు మణికట్టు నరాలు సడలినట్లు తూలాడు. అతడు ఎలుగుల సాంప్రదాయ పూజారి. ఆయనంటే అందరికి ఎంతో గౌరవం, భయభక్తులు. ఆ పవిత్రమూర్తిని పట్టుకోవడం, నిరోధించడం తగని పని.

ఆడా, మగ, అందరు, ఈ పవిత్రమూర్తి ఆదేశంతో సాంప్రదాయ బద్ధంగా పండుగ చేసుకుందామనుకున్న వాళ్ళు, ఈ క్రొత్తవ్యక్తి, వింత ప్రవర్తనకు విస్తుపోయారు. అంతవరకు దూరంగా కూర్చుని జరిగేదంతా చూస్తున్న సాత్యకి అవసరమైతే తన సహకారాన్నందించడానికి లేచి నిల్చున్నాడు.

కృష్ణుడు, సాంబ - సత్యల మధ్య నిల్చున్నాడు. అంతవరకు నిగ్రహిం చుకున్న సాంబ, తన శక్తినంతా కూడగట్టి, ఆ గట్టిపట్టుతో వాసుదేవుని ఎముకలు టపటప విరిగేటట్లు చెయ్యాలని తలిచాడు. పరిస్థితిని గ్రహించిన గోవిందుడు, సామాన్యంగా చూస్తూ నిల్చుంటే ఆ ఎలుగు మనిషి సాంబుని పట్టు, తన సంధులు విరగగొట్టగలవని తలిచాడు.

ముందతన్ని విజృంభింపచేసి, అప్పుడతనికి మరణ శాసనం రాస్తున్నట్లు, గట్టిగా ఆయువుపట్టు బిగించాడు. ఇది అవతలి వారి ప్రాణాలను అతి సునాయాసంగా తీసే మృత్యుఘాతం. కృష్ణుని చాలా సామాన్యుడిగా తలచిన సాంబుడు, తన పట్టుపట్టి గట్టిగా బిగదీస్తూంటే, అంతకంటే విచిత్ర పట్లు తెలిసిన కృష్ణుడు ఒక్కసారి ఎత్తి క్రిందపడేసాడు. సాంబుడు తలక్రిందులుగా క్రింద పడ్డాడు. చుట్టు వున్న వారందరు అదిరిపోయారు.

అదొక అనూహ్య సంఘటన.

అలాగ జరుగుతుందని అనుకోలేదు. ఇదే విధి విపరీతమంటే... ?!

సాంబ, తనను ఓ క్రొత్త వ్యక్తి, తన సీమలోకి వచ్చి, తన వాళ్ళందరిముందు ప్రతిఘటించడం భరించలేకపోయాడు. అతను దులుపుకుని లేచి, కృష్ణుని మాడు పగుల గొట్టాలన్నట్లు పిడికిలి బిగించాడు.

ఇటువంటివెన్నో చూసిన, తెలిసిన గోవిందుడు, తన గుప్పిటిని బిగించాడు. తన నరాల సత్తువ మణికట్టుకు సంధించాడు. ఆ పవిత్రమూర్తి మెడపై కత్తిలాగ ఒక్కటి వేసాడు.

అది కత్తికన్న బలంగా సాంబుని కదిలించింది. ఇటువంటి స్థితి రాకూడదు. వచ్చాక వెనుకంజ వెయ్యకూడదు. తను ఆశించిన పరిస్థితికి దీటుగా నిలచి, జుత్తు పట్టుకుని లాగాడు. క్రింద పడేసాడు. ఆ దెబ్బకు సామాన్యులైతే, తమ పితృపితామహుల సన్నిధిని తప్పక చేరేవారు. అంతటి ముష్టిఘాతమది.

ఆ పవిత్రమూర్తి నేలకు కరుచుకున్నాడు. అతని మెడ విరిగిపోయింది.

## అయ్యబాబోయ్!

**వా**ళ్ళు ఆనాడు చేసుకోవల్సిన పున్నమి ఉత్సవమాగిపోయింది.

సంతోషం కాస్తా, విషాదమై కూర్చుంది.

కృష్ణుని ప్రతిఘటనకు, పరాక్రమానికి అక్కడ ఆ సమయంలో వున్న ప్రతి ఒక్కరు భయపడిపోయారు. కొందరైతే కొయ్యబారిపోయారు. ఆ చుట్టూ వున్న వారంతా అదొక రకమైన స్వరంతో, గట్టిగా కూస్తూ, కూనిరాగాలు మొదలు పెట్టారు.

ఆ పవిత్రమూర్తి, ఆ దేవతాశక్తి, ఆ విధంగ కూలుతాడని, ఏ ఒక్కరు, ఎప్పుడు తలువలేదు. అనుకోకుండా, అటువంటి ఘోరమిప్పుడు జరిగింది. ఇదా నల్లనయ్య, తమ దేవతామూర్తి కరుణ లోపించినందువల్ల జరిగిన పెనువిషాదంగా వారు తలిచారు.

జాంబవంతుడు, సాంబుని, అటునుండి కృష్ణుని చూసాడు. అనుకోకుండా సాంబుని నైతిక ప్రవర్తనకు, ఆదిదేవుని, ఆ నల్లనయ్య శక్తిగా తలచి, ఇన్నాళ్ళు ఆతనికి దాసులైనవారు, ఈనాడు, అతని శక్తి తొలగించి, అతనితో మీకు పని లేదని చెప్పడానికన్నట్లు ఈ నీలమేఘశ్యాముని రూపంలో తానే వచ్చాడని కొందరనుకున్నారు. వారిలో జాంబవంతుడు కూడా ఒకడు.

అయితే ఈ పరిస్థితి చెయ్యిదాటిపోరాదు. తమ అధీనంలోనే వుండాలి ? అందుకు రాజుగా, జాంబవంతుడు కఠిన నిర్ణయం తీసుకున్నాడు. ఆ

నల్లనయ్యను ప్రార్థించాడు. సాంబ వాయించే మద్దెల వంటి వాయిద్యాన్నందు కున్నాడు. రెండు మూడు భంగిమలలో నృత్యం చేసాడు. దానికి అందరు తలలు వంచారు. తమ చేతుల్ని గుండెలపై పెట్టుకుని నమస్కరించారు.

ఈ మొత్తం జరిగేటప్పుడు అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది. తర్వాత జాంబవంతుడు, అందర్నీ ఉద్దేశించి

“భగవంతుడు తన అనుగ్రహాన్ని మన పుణ్యమూర్తి పరమ పవిత్ర సాంబ నుండి తప్పించాడు. అందుకనే అతను హతుడయ్యాడు. దైవలీల అనూహ్యం. ఇప్పుడు మనకు మళ్ళీ మార్గదర్శి కావాలి. అందుకు మనం ఆ నీలమేఘశ్యామునే ప్రార్థించి, ఆయన అనుగ్రహం పొందాలన్నాడు.

“మనల్నా భగవంతుడు సదా సంరక్షించుగాక!” అందరు మూకుమ్మడిగా అర్థించారు.

ఆ సమయంలో, అకస్మాత్తుగా జాంబవంతుని పెద్ద కుమార్తె, సాంబ తల్లి, ఆ గుంపులో నుండి బయటికి వచ్చింది. గుండెలు పగిలేలా రోదిస్తుంది. ఆ మృత కళేబరాన్ని చేరింది. ఇప్పుడీ అపవిత్ర శరీరాన్ని ముట్టుకోవడం తగదు. ఇది భగవత్కరుణ కోల్పోయిన నిర్జీవకాయం.

ఇది ఇక్కడ ఇలాగ వుంచకూడదు, మన పద్ధతి ప్రకారం దీనిని, మన ఎలుగులకు ఆహారం చెయ్యాలంది. ఆ మాటకు అక్కడున్న పెద్దలందరు వచ్చి ఆమెను ఓదార్చసాగారు. ఆమె బాధను తీర్చదలిచారు. ఒక్కసారి వాళ్ళను విదిలించి కొట్టింది. క్రింద పడిపోయింది. ఆమెను ఆ సంఘ పెద్దలు అక్కడనుండి తీసుకువెళ్ళిపోయారు.

జాంబవంతుని ఆదేశం ప్రకారం అయిదుగురు మనుష్యులు కృష్ణ, సత్య, సాత్యకిలను, ఖాళీగా వున్న ఒక గుహకు తీసుకువెళ్ళారు. ఆ నల్లనయ్య పూని ఇచ్చిన ఆదేశం ప్రకారం, జరిగిందంతా వాళ్ళిక్కడ కూర్చుని చర్చించుకుంటున్నారు.

వాళ్ళున్నది భయంకర స్థితిలో అయినప్పటికి, సత్య సంతోషంగా వుంది. ఆమె మనస్సు ఎంతో ప్రశాంతంగా వుంది. వాళ్ళకి తోడుగా సాత్యకి కూడా దొరికాడు కాబట్టి, వాళ్ళిద్దరు ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొంటారు. పరిస్థితులను చక్కబెడతారని ఆమె తలిచింది.

వీళ్ళనిక్కడ విడిచిపెట్టి వెళ్ళడంతో, సాత్యకి-కృష్ణలు, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, సంతోషమొందారు. ఆ కలయికకు సత్య సంతోషించింది. నన్ను జాంబవంతుడెందుకు ఎత్తుకొచ్చాడో అప్పుడు తెలియదు కానీ, ఇప్పుడు మాత్రం మనం ప్రమాదపుటంచున వున్నాం.

ఆ పవిత్రశక్తి సాంబను ప్రతిఘటించడం ఇప్పుడు మన ప్రాణానికి చుట్టుకున్న ఆపద. వాళ్ళందరూ ప్రమాదకారులు. ఎలాగ ప్రవర్తిస్తారో, ఏం చేస్తారో... !'' సాత్యకి భయపడుతున్నాడు. ఇంతవరకు అతనిలో వున్న ధైర్యం అడుగంటిపోయింది.

మనల్ని ఎలుగులకు ఆహారమైనా చెయ్య వచ్చును. లేదా ఆ నల్లనయ్యకు బలియైనా ఇవ్వవచ్చును. తన అనుమానం, భయాన్ని సాత్యకి కనబరుస్తున్నాడు. వీళ్ళు పరమ భయంకరులు. మనం ఎటువంటి పరిస్థితి నెదుర్కోవాలో.... భయపడిపోతున్నాడు.

"ఆ చెట్ల మీద ఎగిరే పిల్ల ఎవరు ?'' కృష్ణుడడిగాడు.

ఆమె జాంబవంతుని ప్రియ పుత్రిక. అతని ప్రాణం. ఎక్కువ కాలమామె అలాగ, అలాగ చెట్లమీదే వూగుతూ కాలక్షేపం చేస్తుంది. చిలకలాగ పాటలు పాడుతుంటుంది. కోతుల్ని పక్షులను అనుకరిస్తూ, హాయిగా కాలం గడుపుతుంది.

"రోహిణి చాలా చిత్రంగా వుంటుంది. భలే చిత్రమైన పిల్ల'' అన్నాడు వాసుదేవుడు.

"సరే. శ్యమంతకమణి విషయం తెలిసిందా ? సాత్యకిని అడిగాడు. తెలియదన్నాడతడు.

"నాకు తెలుసు. అదిక్కడే వుంది. దానికి సంబంధించిన గొలుసులో కొంత భాగం నాకు దొరికింది. అది తప్పక ఇక్కడే వుండి వుండాలి. ఎందుకంటే-

ప్రసేనుడిని, సింహం చంపింది. వాడి మెడలోని శ్యమంతకాన్ని అది నోట కరుచుకుంది. దానిని ఈ జాంబవంతుడు చంపాడు. దానినుండి శ్యమంతకాన్ని తను గ్రహించి వుంటాడు. అతని భుజంపైన సింహం చేసిన గాయం కనబడింది. కాబట్టి జాంబవంతుడు ఆ సింహాన్ని చంపి, దానిని పొంది వుండి వుండాలి.

"అయితే, ఇప్పుడు మన పని ఏమవుతుందంటావు ? సాత్యకి భయపడుతూ అడుగుతున్నాడు.

"ఏముంది, అతని ఎలుగు మేనల్లుడు వున్నాడు కదా! దానికి మనల్ని ఆహారంగా వేస్తాడు. సత్య వంటి అందమైన అమ్మాయి, రుచికరమైన మాంసం, వాడి జన్మలో తిని వుండడు. ఇప్పుడు హాయిగా, సంతోషంగా ఆరగిస్తాడు" అన్నాడు, కృష్ణుడామెను కొంటెగా చూస్తూ!

మనం అందరం హాయిగా వాడి కడుపులో ఇరుక్కుంటాము. ఏ మాత్రం తొణకకుండా, బెణకకుండా చెప్పాడు. ఆ చిలక పిల్ల నిన్ను ఎత్తుకు పోకుండా వుంటే....." వెటకారంగా అంటుంది సత్య. ఎంతసేపు ఆమె చుట్టు నీ కళ్ళు తిరుగుతున్నాయి. చెవులు నీ పాటలకు రిక్కించి వింటున్నాయి. నీ వేణుగానం ఆమెకు ఆనందంగా వుంది.

అది సరే - మన "వూర్వశి-మేనక"లు అనుకుంటూంటే అవి వచ్చేసాయి. ఆకులుపరచిన ప్రక్కలమీద అలిసిపోయినట్లు పడుకున్నాయి. మొత్తానికి ఏది ఏమైతేనేం, రాత్రి చాలా ప్రశాంతంగా, సుఖనిద్ర పోయారు.

తెల్లవారుతూనే, రోహిణి - ఆ చిలకల కులికి పాటను విన్న కృష్ణుడు ఆమెకు సమాధానంగా తన వేణువునూదాడు. సూర్యోదయం కాగానే, దాని కాపలా- దారులు, ఆ గుహకు అడ్డం పెట్టిన రాళ్ళను తొలగించారు. వాళ్ళ ముగ్గుర్ని ఆ కాపలాదారులు ఏటి ఒడ్డుకు తీసుకు వెళ్ళారు.

సాత్యకి, కృష్ణులు స్నానం చేసి సూర్యునికర్ఘ్యమొసగారు. తిరుగు ప్రయాణంలో కొందరు ఎలుగు మనుషులు, మోకాలు లోతు ఆ ఏటినీటిలో బంగారపు ఇసుక రేణువుల కోసం ప్రయత్నిస్తున్నారు. వాళ్ళు చేసే పనిని గమనించిన సత్య, మనమా పవిత్ర గుహలో చూసిన ఆ బంగారపు గింజలు ఈ ఏటిలో దొరికినవని, తానేదో - సత్యాన్నో - సిద్ధాంతాన్నో కనుగొన్నట్లు చెప్పింది.

మీ నాన్నగారు శ్యమంతకం నుండి పొందానన్న బంగారం వీళ్ళే ఇచ్చి వుంటారు. ఈ వాతావరణాన్ని గమనిస్తే అలాగే అనిపిస్తుందన్నాడు, వాసుదేవుడు వీళ్ళకు బంగారంపైకన్న ధర్మంపైనే ఆసక్తి బాగా కనిపిస్తుంది. మనకున్న ఆశ, పేరాశ, దురాశలు వీరివద్ద కనబడటం లేదు.

వీళ్ళు గుహకు రాగానే, కాపలాదారులు ఆహారం తెచ్చి ఇచ్చారు. మధ్యాహ్నం ఒక పెద్దాయన వచ్చి సాత్యకిని తనతో రమ్మనమని ఆహ్వానించాడు. వెళ్ళు జాగ్రత్త. ఆవేశం పనికిరాదు" గోవిందుడు హెచ్చరించాడు.

పరిస్థితులన్నీ తెలిసినవాడివి, మన స్థితిని మనఃస్థితిని అదిమిపెట్టుకుని, తెలివిగా వాళ్ళతో ప్రవర్తించు. అతి తెలివి, ఆవేశం అనర్థదాయకం. అది మరచిపోవద్దని హెచ్చరించాడు.

మధ్యాహ్నంవేళ, సత్య-కృష్ణుడు కూడా జాంబవంతుని వద్దకు తీసుకు వెళ్ళబడ్డారు. ఈ గుహకెదురుగానున్న స్థలంలో ఎంతో హుందాగా, ఆ ఎలుగుల రాజు కూర్చున్నాడు.

ఆరుగురు ఎలుగు మనుష్యులు, తెల్లటి గడ్డం, ముడతలుపడ్డ చర్మంతో, రాజుకు సమీపంలో, ఇరుప్రక్కల చెరో ముగ్గురు వున్నారు. సాత్యకి మహారాజుకు ఎదురుగా కూర్చున్నాడు. అతని వెనుక రాజు ఎలుగు మేనల్లుడు వున్నాడు.

స్త్రీ-పురుషులు సమీపంలో కూర్చున్నారు. అప్పుడు వచ్చిన సత్య, కృష్ణులు యధావిధి నమస్కరించి నిల్చున్నారు. జాంబవంతుడు వాళ్ళను సాత్యకి వద్ద కూర్చోమని సూచించాడు.

సత్య తొడమీద కూర్చున్న పిల్లికూన మేనక కాస్సేపు అలాగ కూర్చుని, తిరిగి ఎలుగు మేనల్లుని వద్దకు వెళ్ళింది.

ఓ వసుదేవ సుతా! నువ్వు నన్ను కలుసుకోవాలని ఇక్కడకు వచ్చినట్లు చెప్పావు. చాలా సంతోషం.

“నిజం ఎలుగులరాజా! మిమ్మల్ని చూడటానికి మా మిత్రుడు సాత్యకిని తిరిగి తీసుకువెళ్ళడానికి వచ్చాను.” అనగా, అదివిన్న జాంబవంతుడు, కృష్ణుడు అర్థం చేసుకోవడానికి వీలుగా, వారి భాషలోనే ప్రశ్నలనడిగాడు.

ఈ వాసుదేవుడు చెప్పిన విషయాలన్నీ తనవారికి తిరిగి తన భాషలో జాంబవంతుడు చెబుతున్నాడు.

“వసుదేవ సుతా! నువ్వు శ్యమంతకమణిని ఇక్కడ నుండి తీసుకు వెళ్ళదలచినట్లు చెబుతున్నావు. అదిక్కడ వుందని ఎలాగ చెప్పగల్గుతావు ? జాంబవంతు డడుగుతున్నాడు.

నాకెలాగ తెలుసన్నది నాకన్నా, సత్రాజిత్తు కుమార్తె నీకు వివరించి చెబుతుంది. ఆమె మాటలను జాగ్రత్తగా వినమని నా కోరిక” అన్నాడు.

సత్యను చూసిన జాంబవంతుడు “అతడు నిన్ను పంపించాడా ?” అడిగాడు.

"లేదు. నా తండ్రి, నా పినతండ్రి ప్రసేనుని శ్యమంతకంతో ఇక్కడికి పంపాడు. ఇది ఈ పవిత్ర గుహలో కొన్నాళ్ళుండాలని ఆయన భావన. ఈయన పేరుకు కృష్ణుడు - వసుదేవసుతుడు. ఈయనకు వాసుదేవుడు, గోవిందుడు, గిరిధారీ, ధర్మమూర్తి, అవతారపురుషుడు... అని రకరకాల పేర్లు, ఆర్యావర్తంలో నూటికి తొంభైమంది ఈయనను అభిమానించి, గౌరవిస్తారు. నా తండ్రిని ఏ కొద్దిమందో తప్ప మరెవ్వరు గౌరవించరు. ఎందరో అసహ్యించుకుంటారు.

వూళ్ళకు వూళ్ళే ఈ మహాప్రభువు దర్శనంకోసం తపిస్తాయి. అంతటి మహానుభావుడీయన. చిటికెన వ్రేలితో ఒక పెద్ద పర్వతం గోవర్ధనగిరిని ఏడు దినాలు గొడుగులాగ పట్టుకున్న ఘనుడు అప్పటికి గాని ఇంద్రునికి అహంకారం తగ్గి, ఈ ప్రభువుకు శరణనలేదు. అని కృష్ణలీలా విలాసాలను ఎంతో భక్తియుతంగా....

తాను విన్న ప్రతి అక్షరం, కళ్ళకు కట్టినట్లు అవతలివారు తాము చూసినట్లు ఆనందం పొందే విధంగా వర్ణించి, చూడు ఎలుగల రాజా! నా "తండ్రి" అంటే నాకు ప్రాణం. ఆయనకు అంతే. అటువంటి నా తండ్రి నా మనస్సు తెలుసు కోకుండా, సంపద, వైభవాలే జీవితంగా, ఈయన చెప్పే మంచిని, ధర్మాన్ని ప్రక్కన పెట్టి, శ్యమంతకాన్ని ఈయన దొంగిలించాడని కేవలం ప్రచారం చెయ్యడం కాదు. మా మహారాజు ముందు నేరారోపణం చేసి తన శ్యమంతకం తెచ్చి ఇమ్మని, లేదంటే ఇతడు "దొంగ" అని బాహాటంగా ప్రకటించాడు.

ఆ పరిస్థితులలో, నా పేరు "సత్య"భామగా సత్యం తెలుసుకోవడానికి, మా దూరపుబంధువు, సాత్యకి. ఇతనికే నన్నిచ్చి పెళ్ళి చేయడానికి, ఈ వాసుదేవుని, ఈయన ధర్మాన్ని అడ్డం పెట్టుకుని, ఒక పావుగా నా తండ్రి చేసుకున్నాడు. అందులో భాగంగానే ఈ అల్లరి. అయితే శ్రీ వాసుదేవుని వలె, కోపం, పెంకితనం, నా ఆస్తి అయినా, ధర్మం కోసం, నిజం తెలుసుకోవాలని ఇక్కడికి వచ్చాను. మా తదుపరి ఈ వాసుదేవుడు - మిగిలిన కథ, ఆయన, మీకు తెలిసిందేనని, సత్య ముగించింది.

"కృష్ణా! మా మిత్రుడు నువ్వు అవతారపురుషుడివని, ప్రత్యక్ష దైవానివని నీవు సల్పిన లీలా విశేషాలన్ని మాకు వివరించి చెప్పాడు" అన రాజు, "జాంబవంతా! ఆయన మంచివాడు కాబట్టి, ఆయనకు లోకమంతా మంచిగానే కనుపిస్తుంది. అది ఆతని దృష్టి ధర్మమని తన అభిప్రాయాన్ని సాత్యకి తెలియబరిచాడు.

"అసలు నువ్వెందుకు మా పవిత్రమూర్తిని చంపావు ? ఎలాగ చంపావని ? అడిగాడు.

"జరిగింది మీరు చూసారు. ఇందులో మాయమర్మం లేదు. ప్రతివారికి కొన్ని ధర్మాలుంటాయి. వాటిని మనం గౌరవించాలి. కాదంటే పరిస్థితులిలాగే వుంటాయి. ధర్మమతిక్రమించరానిది. సత్యం శాశ్వతమైనది.

ఇది తెలుసుకున్నవారు, తెలుసుకునేవారు ధన్యులు. కాదని మూర్ఖించేవారు చెప్పుకునేందుకు చరిత్ర లేకుండా కాలగర్భంలో కలిసిపోతారు. దైవం ధర్మానికి ప్రతి రూపం. సత్యం శాశ్వతానికి, ఈ సృష్టి ప్రారంభం, నిర్మాణ, వుపసంహారాలకు ఆధారం.

అహంకారం పనికిరాదు. ఆత్మవిశ్వాసం మంచిదే. అది మించి పోరాదు. మన అహంకారమే మనలను నాశనం చేసేది. దేవుడు వేరు. దైవాంశ సంభూతుడు వేరు. ధర్మ ప్రతిష్టాపనకు దైవం, తనను ఈ సృష్టి అంతటా నిలుపుకుంటాడు. వాడు జీవుడు, అనిత్యుడు. శాశ్వతుడు పరబ్రహ్మ.

అనిత్యానిత్యాలు రెండు పరబ్రహ్మమే అయినా ఒకటి సత్యం, మరొకటి అశాశ్వతం. కనుపించే సత్యధర్మాలు వేరు. ఆచరించే సత్యధర్మాలు వేరు. ఒకటి బాధ్యత. మరొకటి చరిత్ర. ఒకటి జీవింప చేస్తుంది. మరొకటి జీవిస్తుంది. ఇందులో భాగమే మీ సాంబ.

మీరందరు ఆతనిని ఘనుడని పొగిడారు. అది మీ వివేకం. నేను గొప్పవాడినని అహంకరించడమాతని అవివేకం. అందరు గొప్పవాళ్ళే. కొందరు గొప్పవాళ్ళుగా ప్రకటించబడితే, ఇంకొందరు ప్రకటింప చేసుకుంటారు. ఇవే నిత్యానిత్యాలు. ధర్మాధర్మాలు. ఒకటి శాశ్వతం. మరొకటి అశాశ్వతం. ఒకటి నిలుస్తుంది. మరొకటి కూలుస్తుంది.

ఇందులో కొంతమాటలగారడి వున్నదన్నది మాత్రం సత్యం. ఆచరణీయ ధర్మమాచరించాలి. ప్రవచనా ధర్మం వినడానికే బాగుంటుంది. వీరుల బుద్ధులు, విశ్లేషించి వాటిని మహా గొప్పగా చెబుతారు. కానీ ఆచరించుదాం, "రండి" అని పిలిస్తేనే, అసలైన తంటా!

ఓ భల్లూక రాజా! ఎంతటి పవిత్రుడైనా, అపవిత్ర కార్యంతో నాశనమై పోతాడు. ఆనాడు రావణ కుంభకర్ణులు, ఈనాడు కంస, చాణూరాది ఇతర రాక్షసబుద్ధులు. వారి సాంప్రదాయం తెలియకుండా ఆడవారిపై చెయ్యి వెయ్యడం తగదు.

దేవుడు గొప్పవాడే. ఆశ్రితవత్సలుడే. అలాగని కనిపించిన ప్రతివారిని అక్కున చేర్చుకుంటాడా ? తన ప్రేమ తత్వాన్ని ప్రకటిస్తాడా ? అడగకుండా వరాలనిచ్చి గర్విష్ఠిని చేస్తాడా ? అదే జరిగింది మీ సాంబా, మా సత్యభామ విషయంలో.

శ్రీ గురుముఖతః నేర్చుకున్న విద్య-వినయాన్ని ప్రదర్శిస్తుంది. స్వార్జితం సమూల నాశనానికి దారి తీస్తుంది. ప్రస్తుతదశ - దిశ - ఈ మార్గంలోనే నడుస్తుంది. "ధర్మం, భల్లూకరాజా!'' అంటూ వాసుదేవుడు చెబుతున్నాడు. ఆతడు వింటున్నాడు. ఆశ్చర్యపోయి సత్య వింటుంది. అదృష్టం కలిసి వచ్చినట్లు సాత్యకి, సంతోషిస్తున్నాడు.

"వాసుదేవా! గత రాత్రి మేమా జగత్ప్రభువును, నల్లనయ్య''ను ప్రార్థిస్తే, ఆ దేవదేవుడు నిన్ను చూపాడు. మాతో వుండు. మమ్మల్ని సంస్కరించు. ధర్మ మార్గం దర్శింప చెయ్యి. శాశ్వత కీర్తి ప్రతిష్టలను ప్రసాదింపచెయ్యి, లేచి ఎంతో వినయంగా ఆ భల్లూకరాజు ప్రార్థిస్తున్నాడు.

భల్లూకరాజా! నేనిక్కడే వుండాలి. మిమ్మల్ని సంస్కరించాలి. అంటే అది కుదరదు. తప్పదంటే, నేనా జగదోద్ధారకుడైన, ఆ నల్లనయ్యతో మాట్లాడి చెబుతానంటాడు.

"తప్పు - అలా మాట్లాడకూడదు. అతను అద్భుత శక్తివంతుడు. కాదని నిరాకరిస్తే, ఇందాక నువ్వు చెప్పావే. కాలగర్భంలో చెప్పుకునేందుకు చరిత్ర లేకుండా కలిసిపోతారన్నావే ఇక్కడ ఇప్పుడు అది జరిగి తీరుతుంది. వాళ్ళా విశ్వాసాన్ని ప్రముఖంగా ప్రకటించి చెబుతూంటే... "జాంబవంతా! వూరట చెందు!'' నా ధర్మం నేను నిర్వర్తిస్తాను. ఆవేశపడకు. సత్యం బోధపరుస్తానంటాడు - ఆ - గోవిందుడు - సర్వ ధర్మ సంరక్షకుడు!!

అందుకు సమాధానంగా - జాంబవంతుడు - అయితే...

"మా నల్లనయ్య ఆదేశాలను పాటించు. ఈ భల్లూక ప్రపంచానికి వచ్చిన వారు, ఆ పరమాత్మ ఆదేశం ప్రకారం నడుచుకోవల్సిందే తప్ప, వారిష్టమొచ్చినట్లు ప్రవర్తించలేరు. వారెంతటి వారైనా సరే! అందుకే పవిత్రమైన గుహకు వచ్చే సత్రాజిత్తు అక్కడ దర్శించుకుని వెళ్ళిపోయేవాడు, తెగించి, ధైర్యం చేసి మా ప్రపంచంలోకి అడుగుపెట్టలేదు.

అతనికి పర్యవసానం బాగా తెలుసు కాబట్టి. సావాసం తప్ప అనవసర సాహసం చెయ్యలేదు. ప్రాణాల మీదకు తెచ్చుకోలేదు.'' భల్లూకరాజు మాటలలోని అంతరార్థాన్ని గ్రహించిన గోవిందుడు -

"ఏది ఏమైనా నేనిక్కడ వుండటమసాధ్యం. మీ ప్రపంచం మీది, మా ప్రపంచం మాది. ఎవరి లక్షణాలు వారివైనప్పుడు ఒకరినొకరు అభిమానించుకోవడం, గౌరవించుకోవడం, సాంప్రదాయం. అంతేకాని ఒకర్ని మరొకరు నిరోధిస్తానన్నా, నిగ్రహిస్తానన్నా, ప్రతిఘటిస్తానన్నా... తగదు. మీ నల్లనయ్య కూడా ఒప్పడు.

ఇంకో విషయం, నీకు తెలుసా, భల్లూకరాజా! నా తల్లిదండ్రులు, నా భార్య, సంతానం, మిత్రహితులు మా అన్నదమ్ములు, శ్రేయోభిలాషులు, అభిమానులు ఎందరో నాకోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తుంటారు. అనుకున్న ప్రకారం, సమయానికి అక్కడలేకపోతే ఒక్క ద్వారకే కాదు.....

ఆర్యావర్తంలోని అతి ముఖ్య రాజులు, వారి ప్రతినిధులు నా కోసం వస్తారు. ప్రశాంతంగా వుండే ఈ పీఠభూమి, మీ భల్లూకరాజ్యం, అనవసరంగా అశాంతి నిలయమౌతుంది. అరాచకాల పాలవుతుంది. దయచేసి నా మాటవిను. నేను చెప్పినట్లు చెయ్యి. సర్వ జీవహితైభిలాషిని, సత్య - ధర్మమూర్తినైన నేను సర్వదా సామరస్యానికి, సాంప్రదాయ, సదాచారాల నిబద్ధతకు మాత్రమే తలవంచుతాను. నా సహకారమందిస్తానని, స్పష్టంగా సూటిగా చెబుతాడు.

"మా భల్లూక రాజ్యంకంటే పవిత్రమైనది, గొప్పది, సమున్నతమైనది - మరొకటి ఈ భూమండలంపై లేదు. అది తెలుసుకుంటే చాలా మంచిది'' అవి జాంబవంతుని మాటలుగా లేవు. ఇందులో అభ్యర్థన, ప్రార్థన కనబడటం లేదు.

ఒకరాజుగా హెచ్చరికలు, శాసన సిద్ధాంతాలుగా వుందాతని వర్తనం. మమ్మల్ని సంతృప్తిపరచడమే ప్రస్తుతం నీ ముందున్న కర్తవ్యమంటాడు.

"సంతోషం, భల్లూకరాజా! నీ కర్తవ్యం నువ్వు చెప్పావు. నా కర్తవ్యం నేను నిర్వహించాలి. అందుకే మీ నల్లనయ్యతో మాట్లాడతానంది. ఇందుకు నీకెందుకు అభ్యంతరం ?'' ఆతని హెచ్చరికకు సూటిగా ప్రశ్నిస్తూ సమాధాన మడుగుతాడు-

"అది అసంభవం...!''

"కాదు, ప్రతీదీ సంభవమే. ఇన్నాళ్ళు మీ శక్తులను మరుగుపర్చుకుని, మరొకరి ధర్మాధికత్యకు తలవొంచారు. ఇప్పుడు మీ నల్లనయ్యను, తన శక్తులను నీకు ప్రసాదించమని, నిన్ను తన అభిమానపుత్రునిగా చేసుకొనమని, ధర్మబద్ధుడై నన్ను విడిచిపెట్టమని, ఆ ధర్మమూర్తి నడుగుతాను. ఇందుకు నీకేమభ్యంతర ముంది ?'' అందరు ఆశ్చర్యపోయేటట్లు, ఆ భల్లూకరాజునే ప్రశ్నిస్తాడు, మన నల్లనయ్య - కష్ణయ్య!

కృష్ణుడు చెప్పినదంతా అక్షరం పొల్లుపోకుండా తన వారందరికి జాంబవంతుడు తెలియబరిచాడు. ఆ మాటలకు వారందరిలో తెలియని మార్పు వచ్చింది. ఎంతో వినయ విధేయతలతో, అణుకువ భక్తిశ్రద్ధలు అక్కడ చోటు చేసుకున్నాయి.

"వీల్లేదు. నేను మా దేవునికి ముద్దులకొడుకును కాలేను. నీకే శక్తి వుందని, మా దేవుని విశ్వాసం. కనుక నువ్వు కాదనడానికి వీల్లేదు.'' మళ్ళీ క్రొత్తగా మొదలైంది పాతకథ.

"క్షమించండి. నా పరిధులు నాకు తెలుసు. నా శక్తులు పరిమితులు మీకు తెలియవు. కనుక నన్ను విడిచిపెట్టి, మీ బాగు మీరు చూసుకోండి'' నా మాట వినండి. జరగని దానికి, అనవసరాలోచనమనవసరమంటాడు - ఆ - దేవకీసుతుడు!

కృష్ణుని వాగ్ధాటికి, ఆలోచనాశక్తికి చలించి మురిసిన జాంబవంతుడు "మీ అభ్యంతరం నాకర్థం కావడం లేదు.''

"చెప్పాను కదా. అభ్యంతరమనేది ధర్మ - కర్మానుసరణం. జరిగేది ఆలోచించాలి తప్ప, అనవసర చర్యలు, ఆలోచనలనవసరం. నా ప్రార్థన మీ భగవంతునికి, ఆ నల్లనయ్యకందించండి. అతడు తప్పక కరుణిస్తాడు.

"ఓ జగత్ప్రభూ! ఉద్ధారకా! భల్లూకప్రియ, రాజ్యరక్షకా! దేవదేవా! సర్వము తెలిసిన నీవు కరుణించు. ఈ భల్లూకరాజు జాంబవంతునికి నీ శక్తులను ప్రసాదించు. నీ పవిత్ర ముద్దుబిడ్డగా స్వీకరించు.

ఈ భల్లూక ప్రజలకు, రాజ్యానికి, ఇక్కడ వుండే, ఇతర ఎలుగులకు ధైర్య సాహసాలను ప్రసాదించు. అపమృత్యు భయం తొలగించు. అపకారబుద్ధి పారద్రోలు. సత్య ధర్మమూర్తులై తమ తమ నియుక్త కార్యక్రమాలను చేసుకుంటూ, సర్వలోక - ప్రాణహితులై వర్థిల్లునట్లు, ఆశీర్వదించు.

**"సర్వేజనాః స్సుఖినోభవన్తు**
**లోకాన్ సమస్తాన్ స్సుఖినో భవన్తు"**

ఇదే అందరం కాంక్షించే - సర్వ శ్రేయోదాయక సౌభాగ్యదాయక ప్రార్థన.

**"యతో ధర్మః తతో జయః"** అన్న సత్యాన్ని సార్థకం చేయించు. అందరిని కరుణించి కాపాడు.''

ఇది నా ప్రార్థన. దీనిని మీ దేవదేవునికి అర్పించండి. అందరు సంతోషంగా వుండండి. దయచేసి నన్ను వెళ్ళనివ్వండి!'' ఆ ధర్మమూర్తి ఎంతో శాంతంగా, సహనంతో, స్పష్టంగా విడమరచి ధర్మ ప్రకాశం చేసాడు.

~~ఈ~~ మొత్తం జాంబవంతుడు తమ వారలకు అనువదించి చెప్పాడు. ఆ ప్రార్థనకు అందరు సంతోషించారు.

అంతటి మహనీయుని సఖ్యం కల్గినందులకు ప్రతి ఒక్కరు సంతోషించారు. అంతవరకే వారి విధి, ఆనందం. అందరు కృష్ణుని చూస్తున్నారు.

జాంబవంతుని వదనం గంభీరమైంది. ఏదో స్థిర నిశ్చయానికొచ్చినట్లు కనబడుతున్నాడు. వాసుదేవుడు "భల్లూకరాజా!" అన్నాడు, చెరగని మందహాసంతో- శాంతం- తన స్వభావంగా, అది ఆదర్శంగా ప్రకటించుకుంటూ! కానీ....

"ఇక మాటలనవరసం. ఆ దేవదేవుని శాసనం అనివార్యం. అనుసరించి తీరవలసిందే. కాదనే హక్కు, ధైర్యం ఎవరికి లేదు. ఇది లక్ష్మణరేఖ. ఇది దాటడం తగదు!'' నదురు, బెదురు లేకుండా తమ అభిప్రాయాన్ని స్పష్టంగా, వాసుదేవుని ముందు, మళ్ళీ మా అధిదేవత ఆ దేశమిచ్చేవరకు ఇందులో ఏ మాత్రం సడలింపు లేదన్నాడు. నీవు అనుసరించక తప్పదన్నట్లు జాంబవంతుడు, ప్రకటించాడు.

"అంతేనా... ఇంకేమైనా వుందా... ?... సాలోచనగానే, అతని గంభీరత్వానికి సమానంగా సమాధానంగా అడుగుతున్నాడు.

"చెప్పడానికి ప్రత్యేకంగా ఏమీలేదు. మా శాస్త్ర సిద్ధాంతం ప్రకారం, మా అమ్మాయి రోహిణిని వివాహం చేసుకోవాలి. ఇది మీరరానిది. మా సాంబ పుట్టినప్పుడే, మా రోహిణి అతని భార్య అనుకున్నాము. ఇప్పుడతని స్థానంలో వచ్చే నీవు, మా సిద్ధాంతాన్ని తప్పక గౌరవించాలి.'' తప్పదన్నట్లు చెబుతున్నాడు.

"జాంబవంతా! నువ్వు ధర్మ మతిక్రమిస్తున్నావు. నేను కాదంటే నువ్వేం చేస్తావు ?... వూ...!"

"ఆమెను మా దేవదేవునికి అర్పించాలి. అది మా శాస్త్రధర్మం. ఆచార" మన్నాడు.

"ఇదేం ఆచారం, మానవత్వం, మమతానురాగాలు వుండవా ? ఓ....... మీరు మానవులు కారు కదా! మా గురించి మాట్లాడే హక్కు, శాసించే శక్తి మీకెక్కడ ?" అని నిర్ద్వంద్వంగా ధిక్కరించాడు.

"కృష్ణా... ఏది, ఏమిటో... నిర్ణయించే అధికారం, శక్తి నాకు లేదు. ఆచరించడం, అనుసరించవలసినది, అనుసరించమనడమే నా ధర్మం. నాకున్న అధికారం. దీనిని మీరలేనట్లు మాట్లాడుతుంటే, విషమించిన పరిస్థితికి వాసుదేవుడు బాధపడ్డాడు. దీనిని గురించి రేపు ఆలోచిద్దామంటాడు.

రేపు మధ్యాహ్నానికల్లా, నీ సమాధానం మాకు రావాలి. అది రాలేదంటే ?! పర్యవసానం, వూహాతీతంగా వుంటుందన్నాడు. దీనినే తన వారందరికి వారికర్థ మయ్యే విధంగా జాంబవంతుడు అనువదించి చెప్పాడు.

అప్పటితో ఆ సభ ముగిసినట్లు ఎలుగులరాజు లేచాడు. తన గుహకు బయలుదేరాడు. అతన్ని ఎలుగు మేనల్లుడు అనుసరించాడు. తమాషాగా ఆ పిల్లికూన మేనకగూడా అతన్ని అనుసరించింది.

భల్లూకరాజు దానిని తన చేతులలోకి తీసుకున్నాడు. ముద్దుగా దువ్వాడు. రాజు వెళ్ళిపోవడంతో, పెద్దలు కూడ బయలుదేరి వెళ్ళిపోయారు.

కృష్ణుని అర్థం చేసుకోవడం కష్టంగా వుంది.

సాత్యకి సరేసరి - విషమించిన పరిస్థితికి తల్లడిల్లుతున్నాడు.

పెండ్లి చేసుకుని తీసుకు పొమ్మంటే మరో సవతి వచ్చిందని ఒకటే గొడవ. ఇక్కడే ఈ భల్లూకాలకు, భల్లూకంలా వుండటమే ప్రాణాంతకం. ఈ వూహలతో సత్య స్పృహ తప్పే స్థితికి వచ్చేసింది.

# ఇదెక్కడి గొడవ!

పేరుకు సత్య, కృష్ణ - సాత్యకిలు స్వతంత్రులుగా వున్నారే తప్ప, వారికి కొద్ది దూరంలో, అంగరక్షకులవలె, కాపలాదారులు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలను జరుగకుండా దేనినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా వాళ్ళు కనబడుతున్నారు.

కానీ, వాళ్ళలోను భయముంది. నిన్న అంతటి శక్తివంతుడైన దేవపుత్రునే మట్టి గరపించిన కృష్ణుడు, సామాన్యులైన మనల్ని, చిటికెలో చిత్తు చేస్తాడని, ఎదురు తిరిగితే చావు దెబ్బలు తినాల్సి వస్తుందేమోనని భయపడి పోతున్నారు.

ఆ ప్రక్కన గల ఏటిలో స్నానం చేసి, సేదతీర్చుకుని తమ అనుష్ఠానాల్ని పూర్తి చేసుకుని ఒక్కసారి ఆ ప్రాంతమంతా కలయ చూసాడు. ఇక్కడినుండి బయటపడటానికి, ఆ పవిత్ర గుహ తప్ప మరో దారి, మార్గం కనబడటం లేదు.

అంతటి అవధ్యం, అభేద్యంగా వుందా ప్రాంతం, వాళ్ళ స్థావరం. అప్పుడను కున్నాడు. ఇలాగ కనుక లేకపోతే, ఈ పాటికి వీళ్ళు ఈ నవనాగరిక ప్రపంచ దుర్వాసనల దుష్ట బుద్ధితో పూర్తిగా చెడిపోవడమో, చెడగొట్టబడి వుండటమో జరిగేదనుకున్నాడు. భగవంతుడు వీరిపట్ల కరుణామయుడని, ఇప్పుడు స్పష్టంగా అర్థమయింది, అది వారి అదృష్టం.

ఇప్పుడు - వీళ్ళ పరిస్థితి, అగమ్యగోచరమయింది.

వున్నది ఒక్కటే దారి, అది మూసుకుపోయింది. లెక్కకు మించిన భల్లూకాలు, ఏ విధంగాను పారిపోవడానికి వీల్లేకుండా, కాపలా కాస్తున్నారు. దీంతో ఈ దారి మూసుకుపోయింది. ఎటు చూసినా మరో దారిలేదు.

ఇప్పుడు వీళ్ళకు శరణాగతా ? ఇక ఆ జగద్రక్షునకు శరణాగతో! అర్థం కావడం లేదు. ఈ ఆపదనెలాగ గడుస్తాం... ఇది సాత్యకుని, సత్యను పట్టుకున్న ప్రశ్న. ఈ సమస్య నధిగమించడానికి - ఆ గోవిందుడే - ధర్మ సంరక్షకునిగా ధర్మం కోసం బయలుదేరిన వారికి, తమ ధర్మపథంగా కాపాడాలి.

కాళ్ళు చేతులు వణుకుతున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. మనస్సు స్వాధీనంలో లేదు. శరీరం అలసిపోయింది. అలవాటు లేని జీవితం - శిక్ష, కక్షలు. “భగవంతుడా!” ఒక్కసారి గట్టిగా శరణాగతులయ్యారు.

"ఏం చేస్తాం. నువ్వు దేవుడివి. ధర్మ సంరక్షకుడైన అవతార పురుషుడివి. కాబట్టి - ఆ రోహిణిని వివాహం చేసుకుంటే మనమిక్కడ నుండి బయట పడవచ్చును. సాత్యకి - సందేహం వంటి సలహా!

"ప్రాణం పోతే పోవచ్చును!" జరగబోయే ఆలోచనకు అది మూలం.

"మరేం చేద్దాం." సాత్యకికి ప్రాణసంకటంగా వుంది.

"ఆ కొండకెక్కి దారి వెదుక్కుందాం!"

"అక్కడేముంది ? ఆ నల్లనయ్య ఎవరో తారసపడి మన తాట ఒలవ వచ్చును!"

"పిచ్చివాడా! అప్పుడు వాడు దేవుడెందుకు అవుతాడు ?! కాబట్టి, మనం ఆ మార్గంలోనే వెడదాం. ఆ నల్లనయ్య - ఎవరో తెలుసుకుందాం! అప్పుడతనితో ఈ కార్యక్రమానికి భరతవాక్యం పాడిద్దాం. అర్థమయిందా ? సాహసమే నా ఊపిరి, వూహ, జీవితం అన్నట్లు వాసుదేవుడు ప్రకటించాడు. మరోదారి కనబడక సాత్యకి, తల తాటించాడు.

"అక్కడనుండి మనం తిరిగి వెళ్ళిపోవడానికి దారి వుందంటావా ?" సాత్యకి అడుగుతున్నాడు.

ప్రాణాలకు తెగిస్తే... పరిస్థితి అదే అర్థమవుతుంది. దారిలేదంటే.. గత్యంతరం లేదు" అన్నాడు, "బయలుదేరండి. ఇక్కడ నిల్చుని చేసే సుదీర్ఘా లోచనలవల్ల ఫలితం లేదు. ముందు మన గుహకు వెళ్ళి విశ్రాంతి తీసుకుంటూ బుర్రకు పదును పెడదా"మన్నాడు.

సూర్యాస్తమయమవుతున్న సమయంలో, కృష్ణుడు చిలకపలుకుల - రోహిణి గానాన్ని విన్నాడు. ఎందుకైనా మంచిదని వేణువు తీసుకుని తన గానం ప్రారంభించాడు.

రోహిణి దానికి స్పందించింది. కాని ఎందుకో మధ్యలో ఆమె స్పందన - అదే గానమర్ధాంతరంగా ఆగిపోయింది.

స్వయంకృతాపరాధమో, దైవనిర్ణయమో.... తనకిలాగ అయిపోయిందని సత్య బాధపడుతుంది. ఆమె కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీరు కారుస్తుంది. ఇక తమకు దిక్కులేదని, అన్యాయంగా ముగ్గురు, ఆ నల్లనయ్య... ఎవరో ఆ దేవుడు, ఆతనికి అర్పణ కాక తప్పదని వెక్కి వెక్కి ఏడుస్తూంది.

వీరనారి, వీరమాతగా వుండ తలచిన సత్య, ఇప్పుడు - ఇక్కడ, పరమబేల, భీతహరిణి అయిపోయింది. సత్య ప్రక్కన పడుకున్న ఊర్వశి, తన యజమానురాలు పడే బాధకు అసహనంగా కదులుతుంది. పిల్లికూన మేనక, కృష్ణుని వద్దకు వెళ్ళి అతని ప్రక్కన పడుకుంది.

"మేనకకు, మీరంటే చాలా ఇష్టం. అందుకే మీ ప్రక్కకు చేరింది" బాధను తగ్గించుకోవాలన్నట్లు గోవిందునితో కబుర్లు మొదలుపెట్టింది. ఆమె మనసు గ్రహించినట్లు -

"మీరందరు కూడా ఆ మేనకలాగే వుండాలన్నది నా ప్రయత్నం. భావన, ఆలోచన, ఆశయం, ఆశ. జరిగేది ఆగదు. అందుకు భయపడటం, ఏడవడం తగదు. అందుకే కదా, "అవశ్యమనుభవోక్తం, శుభాశుభ''మని పెద్దలు చెప్పింది! అన్నాడు మేనక మెడపట్టుకుని సత్య దగ్గర విడిచిపెడితే, అది పరుగెత్తుకుంటూ వచ్చి మళ్ళీ కృష్ణుని ప్రక్కనే పడుకుంది.

ఈ విశ్వాసం, నమ్మకమే - భగవంతుని దగ్గరకు చేర్చేది. భక్తుని కరుణించి, కాపాడేది... ఇంతకంటే ప్రత్యక్ష ఋజువు ఏముంటుంది ?" అని వాసుదేవుడు అనుభవామృతాన్ని ప్రసాదించాడు. ఆ కబుర్లతో మనసు తేలికపడింది.

అందరు - వారు ముగ్గురు - వూర్వశి, మేనకలు సుఖనిద్రలోకి జారిపోయారు.

తెలతెలవారుతుండగా, లేపినట్లు అందరు మేల్కొన్నారు. యధాప్రకారం స్నానం చేసి అర్ఘ్యప్రదానం గావించారు. గుహకు తిరిగి వచ్చారు. అక్కడొక యుద్ధకాండ, ప్రారంభమవడానికి సిద్ధంగా వుంది.

"ఇదెక్కడి గొడవరా భగవంతుడా!" సాత్యకి, సత్య దిగులుతో, డీలా పడిపోయారు. మరుక్షణం సత్య వీరనారిగా మారిపోయింది.

"ప్రభూ...!" అని మొదలుపెట్టింది. ఆమె మనసును గ్రహిస్తున్నట్లు, వాసుదేవుడు చెప్పమన్నాడు.

"ప్రస్తుత పరిస్థితిలో, ఈ అవాంతరాలు, గండం గడవాలంటే, తాము తప్పక, భల్లూకరాజు కూతురు రోహిణిని పెండ్లాడండి. తప్పు లేదు. దీంతో మనం ఏదో విధంగా ఇక్కడినుండి కదలవచ్చును. ఇంతకుమించి మరో ప్రత్యామ్నాయం లేదంది. మీరు తప్పక ఆ భల్లూకరాజు, జాంబవంతుని కోరిక తీర్చమని ప్రార్థించింది.

సాత్యకి కలిపించుకుని "నాకు, అదే అనిపిస్తోంది. కాదంటే మనం ముగ్గుర్ని, ఏ క్రూరజంతువుకో ఆహారంగా పడేస్తారనిపిస్తోందన్నాడు.

"దయచేసి కాదనవద్దు - కాదన్నారో.... జంతువుకు కాకపోతే అగ్నికైనా ఆహుతి చేస్తారంటూ సత్య విపరీతంగా భయపడిపోతుంది. ఏదో రకంగా ఇక్కడనుండి వెళ్ళిపోవాలనే ఆలోచనకామె వచ్చేసింది.

రోహిణిని పెండ్లిచేసుకుంటే "ప్రభూ! నీవు రక్షింపబడతావు. నీవు రక్షింపబడితే, మేము బ్రతికి బట్టకట్టినట్లే" ఒక మూల ఎంత భయమున్నా, మరొక మూల ధైర్యాన్ని పుంజుకుంటూ సత్య చెబుతుంది.

"నిజ"మన్నాడు, ఆ ప్రక్కనే వున్న సాత్యకి. అప్పుడు కృష్ణుడు వాళ్ళతో "మన ముగ్గురం కలిసి ఒక కార్యక్రమం మీద ద్వారకను విడిచిపెట్టాం. వెడితే కలిసి వెడదాం. లేదా... అందరూ... ఇంతేసంగతులు అంతే తప్ప - ఒకరికి సుఖం, మరొకరికి దుఃఖం సంప్రాప్తించ కూడదు "ధైర్యంగా వుండండి" ఓదారుస్తూనే అసలు విషయాన్ని చెప్పాడు.

ఆ తర్వాత చాలాసేపు వాళ్ళు మౌనంగా కూర్చున్నారు... అటువంటి సమయంలో, నిన్న వచ్చిన పెద్దాయన వచ్చి భల్లూకరాజు, జాంబవంతుడు రమ్మన్నారని చెప్పాడు. అందరు లేచారు. అప్పుడు - వాసుదేవుడు.

"మన బాధ మనది. దానిని మనసులో దాచుకోండి. పైకి ఎంతో సంతోషంగా వుండండి. ఏడుపులు, రాగాలకు తావివ్వద్దు. భయమన్నదెరుగని మహావీరులవలె దేనినైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా వుండాలి తప్ప...

"అయ్యో! ప్రాణం పోతుందేమో! వాళ్ళు చంపేస్తారేమో!" అని రకరకాల దిగులు, ఆలోచనలతో క్షణం క్షణం చావకూడదు. చస్తే ఒకసారే చద్దాం. బ్రతికితే, ముగ్గురం సంతోషంగా, సాధించిన దానికి సంతృప్తిని పడి సుఖంగా బ్రతుకుదాం. తెలిసిందా!" చెప్పవలసిన రీతిలో వాళ్ళకు చెప్పాడు.

ఉన్న బాధనంత, అక్కడే విడిచి, జాంబవంతుడుండే రాజ గుహకు బయలుదేరారు. గుహను చేరేసరికి, జాంబవంతుడు తన రాతి సింహాసనంపై కూర్చున్నాడు. మనిషి గంభీరంగా వున్నాడు. మొదటిరోజు కలుసుకున్నప్పుడు

కనిపించిన అప్యాయత - ఇప్పుడు కనబడటం లేదు. అప్పుడు దారిలో కనుపించిన బాటసారి. మరి... ఇప్పుడో... తన గుహలో, తన స్థానంలో ధీరగంభీరంగా కూర్చున్న రాజు, ఆయన రాచరికం, పరివారం!!

అక్కడ వుండవలసిన లేదా ఇంచుమించు వున్న భల్లూక ప్రజలు వలయంగా కూర్చున్నారు. జాంబవంతుని ప్రక్కన ఆరుగురు పెద్దలున్నారు. వాళ్ళను చూస్తూనే కూర్చోమని సైగ చేసాడు. మొదటిసారిగా భల్లూకరాజు కొద్ది క్షణాలు కళ్ళు మూసుకున్నాడు. అందరు నిశ్శబ్దంగా వున్నారు. క్షణం తర్వాత, వాళ్ళ దేవుడు ఆ నల్లనయ్య ఆవేశించినట్లు తలూపుతున్నాడు. తన భయంకరమైన చూపుల్ని అగ్నిగోళాలవంటి కళ్ళతో, కృష్ణునిపై నిలిపాడు.

ధ్యానంలోను, తాదాత్మ్యంలోనో, పారవశ్యంలోనో వున్నట్లు మాట్లాడు తున్నాడు. "ఓ అపరిచితుడా! నా ఆదేశం నీకర్థమయిందా ?"గంభీరంగా వుందా స్వరం.

పారవశ్యానికి కాక, భల్లూకరాజుకు సమాధానంగా "అర్థమయింది. ప్రభూ!" అన్నాడు. అప్పుడు భల్లూకరాజు తన ప్రశ్నను, కృష్ణుని సమాధానాన్ని ప్రజల ముందర వుంచాడు.

"మా పవిత్రమూర్తి సాంబుని వధించావు. దీంతో నువ్వు నా బిడ్డవయ్యావు. ఇది నా శాసనం. తిరుగులేనిదిది.." అన్నాడు, మరుక్షణం రాజుగా మారిపోయాడు. ఇక్కడి ఆచారం ప్రకారం, మూడుదినాల తదుపరి - నువ్వు దేవుని వద్దకు తీసుకువెళ్ళబడతావు. అక్కడ ఆయన నిన్ను స్వీకరిస్తే నీవు పవిత్రాత్మవు. దేవుని బిడ్డవు. అర్థమయిందా ? జాంబవంతుడడిగాడు.

అర్థమయింది. ఇది కృష్ణుని సమాధానం.

"ఆ రకంగా నడుచుకోమన్న - భల్లూకరాజు ఇప్పుడు సాంబుడు మరణించాడు కాబట్టి, నా బిడ్డకు నువ్వే భర్తవు. ఇది ఆ భగవంతుని ఆజ్ఞ. కాదనడం మహా నేరం. ఏమాలోచించావు ?" సాధికారంగా అడుగుతున్నాడు.

"మరి, ఆమె ఒప్పుకుందా ?" ఇది కృష్ణుని ప్రశ్న.

"ఇందులో ప్రశ్నా - సమాధానాలకు తావు లేదు. చెప్పినది వినడం, విని ఆచరించడం - ఇక్కడి సాంప్రదాయం. దీనికి అందరు బద్ధులే. నీవు కాదన్నా, ఆమె తనకు తాను కాదనుకున్నా, ఆ అగ్నిదేవునికి ఆహుతి కావాల్సిందే. ఇందులో తిరుగులేదు. సమీక్ష లేదు." గుండె నిబ్బరం చేసుకుని, జాంబవంతుడు సమాధాన మిస్తున్నాడు.

ఆ మాటవిని, తనకు తెలియకుండగానే సాటి ఆడదిగా సత్య, వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది.

"మరి శ్యమంతకమణి...!" తన ధీర గంభీర స్వరంతో, భల్లూకరాజుని ప్రశ్నించాడు.

"దానికి మేము రక్షకులం. అది మాది. అదృష్టవశాత్తు సూర్యుని గూర్చి సత్రాజిత్తు చేసిన తపో ఫలితంగా, ఆ భగవంతుడు దానిని, ఆతనికిచ్చాడే తప్ప, అది మాది. మేము దాని సంరక్షకులమని," ఇచ్చేది లేదన్నట్లు చాలా కటువుగా చెప్పాడు.

అయినా ఈ విషయం కూడా మేము, మా నల్లనయ్య నడగాలి. ఆ ప్రభువు ఇష్టమే మా ఇష్టం. ఆయన ఆనతి మేరకు మేము చెయ్యాల్సింది, చేస్తామన్నాడు కృష్ణుని ప్రశ్నను తన వాళ్ళకు చెప్పాడు. వాళ్ళతో సుదీర్ఘంగా సంభాషించాడు. ఆ తర్వాత-

"ఇక మీరు వెళ్ళవచ్చును" అది జాంబవంతుని ఆదేశమో, సందేశమో... అభ్యర్థనో - ప్రార్థనమో.... లేక రాచరిక శాసనమో... మొత్తానికి అనుజ్ఞ. మళ్ళీ సాయంకాలం కలుద్దాం!" అది విన్నపమో, విధి నిర్ణయమో........ అంతా అయోమయంగా వుంది.



# అంతా గందరగోళం

**సా**యంకాలం మళ్ళీ పిలుపు.

ఈ ముగ్గురు రావడం. అందరు కలవడం. వారి సాంప్రదాయబద్ధ విందుకు ఆహ్వానం. అందరు మాట్లాడుకుంటున్నారు. అరుచుకుంటున్నారు. అంతా తమాషాగా వుంది.

అప్పుడు నలుగురు మనుషులు, ఒకప్పుడు సాంబ ధరించిన పెద్ద ఎలుగు చర్మాన్ని తీసుకు వచ్చారు. కృష్ణుని ధరించమన్నారు. అది ఆనాటి కార్యక్రమ ప్రారంభ సూచకం. స్త్రీ - పురుషులు పాడటం ప్రారంభించారు. ఇంకేముంది, దేవుడు పూనినట్లు వూగడం కూడా ప్రారంభించారు.

జాంబవంతుడు లేచి విభూది కృష్ణుని నుదుట రాశాడు. బిగ్గరగా "ఓ ప్రభూ! సర్వాంతర్యామి, సర్వహృదయాంతర్వర్తి, జగదుద్ధారక, ఈ కృష్ణవాసుదేవుని నీ పుత్రునిగా స్వీకరించు! నీవు అంగీకరించిన నాల్గవనాడు - ఈ పవిత్రమూర్తి నీ సన్నిధానంలో నిలుస్తాడు. నీకు ప్రీతిపాత్రమైన అర్చనాదులు కొనసాగిస్తాడు."

ఆ స్థితిలో - ఆ స్మశాన విభూది కృష్ణునికి దాల్చక, తప్పలేదు. ఇదే విధి వైపరీత్యమంటే. ఒక వూరి రాజు, మరో వూరికి అనామకుడంటే ఇదే కాబోలు. ఆర్యావర్తానికే మకుటాయమానంగా భాసిల్లే కృష్ణ వాసుదేవుడిక్కడ అనామకుడు, అసహాయుడయ్యాడు.

ఆ తరుణంలో - ఎలుగుబంటి దంతాలతో చేసిన ఒక హారాన్ని, అదొక శుభసూచకంగా జాంబవంతుడు, కృష్ణుని మెడలో ధరింపచేసాడు. ఆ వెంటనే చెప్పు. ఆ దేవదేవుని ఆజ్ఞలను శిరసావహిస్తానని" భల్లూకరాజు అడుగుతున్నాడు.

విధిలేక, అప్పటికి - ఆ రకంగా వాసుదేవుడు చెప్పగా, భల్లూకరాజు, గతంలో పవిత్రాత్ముడైన, ఆ దివ్యుడు కూర్చునే ప్రదేశంలో, ఈ కృష్ణుని కూర్చోపెట్టాడు. "తీసుకురండి" తన ఆదేశాలను జారీ చేసాడు. వెనువెంటనే ఎలుగుబంటి చర్మంతో ఆపాదమస్తకం కప్పబడిన ఆ చిలక పలుకుల - చిన్నారి - రోహిణిని తీసుకు వచ్చారు. ఈమెను వివాహం చేసుకుంటావా ? దేవా!" అని అడగడం, ప్రారంభించాడు.

అందుకు సమాధానంగా -

"ఇప్పుడు నేను పవిత్రాత్మను. దేవుడిని. ఈ పిల్లకు నాతో వివాహం చెయ్యరాదని నా ఆదేశ"మన్నాడు.

భల్లూకరాజు ఖంగుతిన్నాడు.

ఆ తిరస్కార ధోరణికి ఉగ్రుడౌతూ "ఇది ఆ సర్వాంతర్యామి నిర్ణయానికి విరుద్ధం. ఆయన ఆదేశంలేనిదే, ఈ పవిత్రాత్మకుడు పలుకడు. తన ఆదేశాలు జారీ చేయడు. అది సర్వాంతర్యామి శాసనానికి విరుద్ధం. కాబట్టి - ఆ సర్వేశ్వరుని ఆదేశం ప్రకారం, మా సాంప్రదాయాన్ననుసరించి, పవిత్రాత్మకుడైన, ఆ దేవకుమారుడు సాంబ, అకస్మాత్తు మరణంతో, తదనంతర పీఠమెక్కిన వ్యక్తి, ఈ పిల్ల రోహిణిని వివాహం చేసుకోవాలి. తప్పదు."

"కాదంటే, ఈ పిల్ల - ఆ సర్వేశ్వరునికే అంకితమౌతుంది. అగ్నిలో హతమయి, ఆ సర్వోత్తముడైన - సర్వాత్మకుని చేరుతుంది. ఇది మా చట్టం. సిద్ధాంతం, సాంప్రదాయ"మన్నాడు, ఆవేశంతో వూగిపోతూ, భల్లూకరాజు, జాంబవంతుడు.

సర్వేశ్వరుని శాసనం, సర్వులకు శిరోధార్యం.

"వివాహమనేది, రెండు జీవితాలకు సంబంధించినది. ఇందులో ఎవరు కాదనుకున్నా, మరొకరు బలవంతం చేయరాదు. దీనినా భగవంతుడు. ఒప్పుడు. మన సర్వాత్మకుడు అసలు ఒప్పడు. భగవంతుడు, కరుణామయుడు. సదాచార సంపన్నుడు. సద్ధర్మ రక్షకుడు. కాబట్టి దీనిగురించి అనవసర ఆందోళన చెయ్యడం. రాద్ధాంతం చెయ్యడం ఎవ్వరికీ తగదు." అది తన నిశ్చితాభిప్రాయమన్నట్లు కృష్ణుడు చెప్పాడు.

"ప్రభూ!" నీ ఆదేశం, శాసనమంటూ జాంబవంతుడు తన చేతిని పైకెత్తాడు. ఆదేశాన్ని ఆవేశంగా అర్థిస్తున్నాడు.

"ఇదే చివరిసారిగా నేనడగడం, చెప్పు. ఈమెను నీ భార్యగా అంగీకరిస్తావా లేక అగ్నిదేవుని ద్వారా ఆ సర్వేశ్వరునికి అర్పించమంటావా ?

ఎవరికైనా అది విచిత్రమైన పరిస్థితి. బలిపశువుకుమల్లే అలంకరించి, యూపస్తంభానికి కట్టినట్లు ఓ పిల్లను తీసుకువచ్చి, పెండ్లి అనే "కత్తి"ని పీకలకు పెట్టి "ఇప్పుడు చెప్పు" అంటే ఏం చెయ్యాలి. అలాగ వుంది - వాళ్ళ పరిస్థితి.

ఆ చిలకపలుకుల రోహిణిని చూసాడు. ఉద్విగ్నంగా వుంది. కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీరు, బ్రతుకు అయోమయం. అదేమంటే సాంప్రదాయం. భయం భయంగా చూస్తుంది.

అప్పుడు - ఇంకా - గట్టిగా - జాంబవంతుడు - అరుస్తూ -

"పడెయ్యండి ఆమెను ఆ నిప్పుల్లో, మలమల మాడిపొమ్మనండి. ఆ సర్వేశ్వరునికి అర్పించిన సంతోషంతో మన సంబరం చేసుకుందాం!" అన్నాడు పిల్లమీద ప్రేమ పొంగినట్లు, ఇంకా కాల్చి చంపడమిష్టం లేనట్లు -

"పవిత్రాత్ముడా, చెప్పు. ఈ భల్లూకరాజు జాంబవంతుని కుమార్తెను పరిణయమాడతావా ?" అలాగడుగుతుంటే -

జాంబవంతుని చూసి చిలకపలుకుల పిల్ల రోహిణి వణికింది. స్వస్థత తప్పుకుంది. నేలమీద పడేటట్లుంది. ఆమె పరిస్థితిని గమనించిన ఓ పెద్దావిడ వచ్చి ఆమెను పడకుండా పట్టుకుంది.

ఆ సమయంలో సత్య గబగబ రోహిణిని పట్టుకుని మట్టిపాత్రలోని నీరు కొద్దిగా ఇచ్చింది. నీళ్ళు త్రాగినామె, ఆ నీళ్ళిచ్చిందెవరో చూసిన రోహిణి "నువ్వు చాలా మంచి పిల్లవు" అభినందించింది. ఆమెను అక్కున దాల్చింది. వెక్కి వెక్కి ఏడుస్తుంది.

కొద్దిగా తేరుకున్నాక రోహిణి తండ్రితో మెల్లిగా అంది "తండ్రీ! నన్నా పవిత్రాగ్నికి, ఆ సర్వేశ్వరునికే అర్పించు. ఎవరో తెలియని ఈయనను నేను కట్టుకుని సుఖపడేదేముంది ? జాలిగా చూస్తూ చెప్పింది.

ఆమె మాటలను విన్న వాసుదేవుడు, ఆ పిల్ల తెలివితేటల్ని అభినందించకుండా వుండలేకపోయాడు. వచ్చిననాడు "పండుగ" అంటే తాను కాదన్నాడు. అది అర్థం చేసుకుంది. బలవంతంగా చేసుకునే వివాహంలో సుఖసంతోషాలుండవని కూడా ఆ పిల్లకు తెలుసు. తన అంగీకారానికి బాధపడకుండా, స్థిరనిశ్చయంతో సర్వేశ్వరునికి ప్రతిరూపమైన సర్వభక్షకుడు అగ్నికి, తనను అర్పించమని కోరింది.

"ఏమంటున్నావు ?" పిల్లను కోపంగా చూస్తూ అరిచాడు. పరిస్థితినధిగమించలేనని ఊహించుకున్న ఆమె గద్గద స్వరంతో - "నిజం తండ్రీ! నన్నా సర్వాత్మకుని పేర సర్వభక్షకునికి సమర్పించు! ప్రార్థిస్తుంది!"

# తప్పదు మరి!

రోహిణి హృదయవిదారక నిర్ణయానికి వాసుదేవుడు స్పందించాడు. ఆమెను కరుణించాలని తలిచాడు. ఆమె చేతిని పట్టుకుని -

"బాధపడకు. భయపడకు. నిన్ను నేను రక్షిస్తాను. కాపాడతాను. నీకు జీవితమిస్తాను. ఈ గోవిందుడు ధర్మరూపే కాని, అధర్మవాది, అధర్మపరుడు కాడు" అని ఆమెను అనునయించాడు.

తలవూపింది. తన చేతిని కదపాలని చూసింది. కాని కృష్ణుడు పట్టుకున్న చేతి పట్టు విడిపించుకోలేకపోయింది. "వద్దు, వద్దు అంతటి త్యాగం. నువ్వు నన్ను వివాహం చేసుకుంటే సుఖపడలేవు. నీకు శాంతికరవవుతుంది. దయ చేసి నన్ను మరచిపో...!! దీనంగా ప్రార్థిస్తుందామె.

ఆమె పరిస్థితిని సంపూర్ణంగా అర్థం చేసుకున్న వాసుదేవుడు, ఎంతో ప్రేమగా ఆమె భుజంపై చెయ్యి వేసాడు. ఆమెను ఓదారుస్తున్నాడు.

"ఓ చిలకపలుకుల రాణీ! నా భార్యగా వుండటానికి భయమేస్తుందా ? ముందది చెప్పు. నాకు నీ వల్ల సుఖముండదన్నావు. అదీ చెప్పు!" ఆ చూపులలోని స్వాంతనకు చిక్కబడుతుంది.

ఈ కథ అక్కడున్న వారికెవరికి అర్థం కావటం లేదు. తెలుసుకోవాలని వుంది. అడగాలంటే రాజు, అతనే చెప్పాలి తప్ప, వాళ్ళడగకూడదు. అందుకని, గుడ్లప్పగించి చూస్తున్నారు. ఏదైనా చెబుతారేమోనని చెవులు రిక్కించి, వినడానికి సర్వసంసిద్ధంగా వున్నారు.

ఇంకా వాళ్ళకానందదాయకమైన విషయమేమిటంటే, ఆమెను - సర్వాత్మకుడైన ఆ నల్లనయ్య కర్పిస్తానంటున్నాడు, రాజు. అదే వారికన్నివిధాలా ఆనందదాయకం. అందులోని సంతోషమేమిటేటో... ఆ సర్వాత్మకునికే తెలియాలి.

కొంతసేపు మౌనంగా వున్న రోహిణి వెక్కి వెక్కి ఏడుస్తుంది. తన దీన పరిస్థితికి, దయనీయ స్థితికి కదలిపోతుంది. సత్య గట్టిగా పట్టుకోకపోతే మళ్ళీ ఆ చిలకపలుకుల - రాణి - రోహిణి క్రింద పడిపోయేది - క్షణమాగిన ఆమె -

"నా తండ్రి నన్ను సర్వాత్మకుని పేరు అగ్నిగుండంలో పడవెయ్యదల్చు కున్నాడు. కనుక విలవిలలాడుతూ అతని ఆశయానికి విరుద్ధంగా, అయిష్టంగా ప్రవర్తించలేక, అలాగ అగ్నిగుండానికి ఆహుతవదల్చానని చెప్పింది.

అప్పుడు కృష్ణుడు జాంబవంతుని తీక్షణంగా చూస్తాడు చెప్పు. నేను చెప్పినది అక్షరం పొల్లుపోకుండా, నీ వాళ్ళందరికి విడమరచి చెప్పు. తేడా వచ్చిందో, నువ్వు రాజువని కూడా చూడకుండా సాంబునికి పట్టించినగతే పట్టిస్తాను.

ఇంతవరకు ఉపేక్షించినందులన చాతగాని వానివలె నన్ను తలుస్తున్నావు కాబోలు. తెలిసి నేను ధర్మానికి హాని చెయ్యకూడదని శాంతంగా వున్నాను. అదే క్రోధించి, ఎదురు తిరిగితే, ఆ హర-బ్రహ్మలు, సకల దేవతానీకము, నీ నల్లనయ్య ప్రత్యక్ష సూర్యుడు, సర్వులు చేతులు కట్టుకుని

**"ఓం సహస్రాశీర్షాః పురుషః సహస్రాక్షః సహస్రపాద్.**
**సభూమిం విశ్వతో వృత్వా... అని సాగిలపడవలసిందే తెలుసా ?**

కృష్ణ వాసుదేవునిలోని ఆ క్రోధాన్ని జాంబవంతుడే కాదు, సాత్యకి-సత్యలు కూడా అంతకుముందు ఎన్నడూ చూడలేదు. దాంతో జాంబవంతుడు పైకి భయపడకపోయినా, దడతగ్గని గుండెతో విషయం వివరిస్తున్నాడు.

"నేను నిన్ను వివాహం చేసుకుంటాను. నిన్ను నా భార్యగా చేసుకుంటాను" అనమన్నాడు. ఆ మాటల్ని రోహిణి వింది. ధైర్యం-బలం పుంజుకుంటుంది. ఆ వెంటనే కృష్ణుడు - "జాంబవంతా! ఇక మిగిలిన కార్యక్రమం పూర్తి చేయించు"మన్నాడు.

రోహిణి వైపు తిరిగి "నువ్వు నన్ను వివాహం చేసుకుంటావా ? నా భార్యగా వుంటావా పుట్టింటిని విడిచి నాతో వుండాలి. వుండగలవా ?" మళ్ళీ మళ్ళీ అడిగాడు. అప్పుడు మెల్లిగా కృష్ణుని చూసింది.

"ఆర్యపుత్రా! నాకో అనుమానం. నన్ను వివాహం చేసుకుని నువ్విక్కడ వుండలేవు. నేను నీతో వస్తే నీ వాళ్ళు నన్ను తమతో కలుపుకోలేరు. అందుకనీ...!" ఆగిందామె.

ఆ మాటలకు సత్య కళ్ళనీళ్ళు పెట్టుకుని రోహిణిని పొదివి పట్టుకుంది. రోహిణీ "చెప్పు. నమ్మమంటావా ?!" అని అడిగింది.

కృష్ణుడిక ఆమెకు మనోధైర్యమివ్వాలని తలిచాడు. "చిలకపలుకుల రాణీ, రోహిణీ. నువ్వెప్పుడు నాతో వుంటావు. నేనెక్కడ వుంటే అక్కడ వుంటావు. ఇది నమ్ము. నిన్ను నేనెంత ప్రేమించానో, నా వాళ్ళందరూ గూడా అలాగే ప్రేమిస్తారు. నీకు భయం లేదు. మరి నువ్వు నా భార్యగా వుండటానికి మాట ఇస్తావా...?!" చాలా స్పష్టంగా అడిగాడు.

అంగీకారంగా, చిలకపలుకులరాణి, రోహిణి సిగ్గుతో తలవంచుకుని తలూపింది.

"ఓ వాసుదేవా, అపరిచితుడివైనా నీవు చూపిన ఆదరాభిమానములు అభినందనీయం. నా పిల్లను జాగ్రత్తగా చూసుకుంటానని మాట ఇవ్వు. అది చాలు - ఆమెకు, మాకు కూడా!" కృతజ్ఞతతో పలికాడు.

"ఓ! చిలకపలుకుల రాణీ, నువ్వు నాదానివి. నేను నీవాడిని. నేనెక్కడ వుంటే, అక్కడ నీవు నాతో వుంటావు. నా మాటనమ్ము" ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

అప్పుడు-ఆనందంతో "వాసుదేవా!" మా పద్ధతిలో నేను చెప్పినట్లు చెయ్యి.

"ఓ సర్వాత్మకా, సర్వేశ్వరా! నా వాగ్దానం నేను నిలబెట్టుకుంటాను. భల్లూకరాజు కూతురు జాంబవంతుని కూతురు రోహిణిని నా భార్యగా స్వీకరిస్తున్నాను. మాట తప్పిన మరుక్షణం నువ్వు నన్ను నీ కరుకుకోరల మృత్యు ముఖానికి తీసుకు" వెళ్ళమని ఎలుగెత్తి చెప్పాడు.

అలాగే "అమ్మా" అంటూ - తన పిల్ల రోహిణితో గూడా - చెప్పు. నేను చెప్పినట్లు చెప్పమన్నాడు.

"ఓ! సర్వేశ్వరా, సర్వాత్మకా! సర్వవ్యాప్తా! నా భర్తకనుగుణంగా, వారికనుజ్ఞ గీటు దాటకుండా త్రికరణశుద్ధిగా పాటిస్తానని వాగ్దానం చేస్తున్నాను. నా ప్రభువు నన్ను తన ప్రేమమూర్తిగా ప్రేమించి లాలించునట్లు నన్నాశీర్వదించుము" ఆ విధంగానే రోహిణి చెప్పింది. అందరు సంతోషించారు. అప్పుడు మళ్ళీ - ఆ చిలకపలుకుల రాణి - కృష్ణుని చూస్తూ -

"ఓ అపరచితా, అనాధరక్షకా! మరొక్కసారి ఆలోచించండి. నన్ను కనుక కాదంటే, ఆ అగ్నిగుండమే నా జీవితమౌతుంది. ఆలోచించమని ప్రార్థించింది.

"పిచ్చిదానా! వాగ్దానం చెయ్యను. చేసానో... ఆ హరబ్రహ్మలు కూడా నేను గీచిన గీటు దాటలేరు. అది సత్యమన్నాడు. అప్పుడు తండ్రి చెప్పమన్నట్లు చెప్పింది. నువ్వే నాతోడు - నీడా. నీతోనే నేను, నా జీవితమని పునరుద్ఘాటించింది.

ఒకటికి రెండుసార్లు అన్నమాటలను విన్న జాంబవంతుడు, తన వాళ్ళందరికి విడమరచి విపులంగా చెప్పాడు. వారి చేతులను కలిపాడు. సత్య కొద్దిగా సిగ్గుపడింది. తన చేతిని చూసుకుంది.

శ్యమంతకమణి పేరుతో, నా కలల రాజు, భల్లూకరాజ పుత్రిక "రోహిణి" చిలకపలుకల రాణి "జాంబవతి"ని చిత్రంగా పెండ్లి చేసుకున్నాడు. ఇదే అదృష్టమంటేను. విధి రాత అంటేనని" తనకు తాను సర్ది చెప్పుకుంది.

ఈ క్షణం నుండి మీరిద్దరు భార్యాభర్తలని తన వాళ్ళవైపు చూసాడు. వీళ్ళిద్దర్నీ వారి జీవిత గుహకు తీసుకువెళ్ళమని ఆదేశించాడు.

పురుషులు కృష్ణుని, స్త్రీలు రోహిణిని ఎత్తుకున్నారు. ఒక సంబరంగా ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఆనంద నృత్యాలతో తమాషాగా కదులుతున్నారు.

అందరు వెళ్ళిపోయారు. ఆ గుహలో వాళ్ళిద్దరే వున్నారు. కొంతసేపటికి చంద్రోదయమైంది. కృష్ణుడు తన ఎలుగు చర్మాల దుస్తుల్ని తీసుకున్నాడు. ఇంతవరకు ఆడుతూ పాడుతూ సాగే తన జీవితమేమవుతుందో భయపడే - ఆ చిలుక పలుకల రాణి రోహిణి ఆ మసక చీకట్లో గోడకానుకుని, తల పట్టుకుని దుఃఖిస్తూంటే....

చంద్రకాంతి ఆ గుహలో పడటంతో, రోహిణిని చూసిన కృష్ణుడు, మెల్లిగా ఆమె దగ్గరకు వెళ్ళి చెయ్యిపట్టుకుని ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు. ఆమె భుజంపై మెల్లిగా నిమురుతూ "భయపడకు. ఇప్పుడే కాదు. ఎప్పుడూ నీకు అన్యాయం చెయ్యను. జరుగదు. నా మాటవిను. మనమెక్కడున్నా నువ్వు కోరినట్లు ఆనందంగా వుంటావు. నీ జీవితం సుఖంగా, సంతోషంగా సాగుతుంది. సరేనా...?!

మొహాన్ని చేతులలో దాచుకుని విలపిస్తుంది. ఆమె అలాగ ఏడుస్తుంటే కొంత హృదయభారం తగ్గుతుందని తలచి, ఆమెను కొంతసేపు ఏడువనిచ్చాడు. అలాగ కొంతసేపు ఏడ్చిన ఆమె "ఆర్యపుత్రా! నాకు బ్రతకాలని లేదు. గాలిలో వూగుతూ ఆ లోయలో పడి చచ్చిపోవాలని వుంది" వెక్కి వెక్కి ఏడుస్తూ అంది.

"ఎందుకమ్మా!" ఆమె మూతి పట్టుకుని ఓదార్చుతూ అడిగాడు. కొద్దిసేపు అలాగ ఏడ్చిన ఆమె కళ్ళు తుడుచుకుంటూ -

"నాకు అమ్మలేదు. అన్నదమ్ములు లేరు. అప్పచెల్లెళ్ళు లేరు. వున్నదో సవతి సోదరి. అదే సాంబతల్లి. నేనంటే దానికి అసహ్యం. మా నాన్నకు నేనంటే ప్రాణమే. కానీ పరిస్థితుల ప్రాబల్యం వలన నన్ను అసహ్యించుకుని, చివరకీ రకంగా అగ్నిగుండంలో తోసెయ్యాలని తలిచాడు. మా అమ్మతో నేను చచ్చిపోయి వుంటే బాగుండేది -

చెప్పి - చెప్పి, చెప్పిందే చెప్పి, వెక్కి వెక్కి ఏడుస్తూంది. ఆ పిల్ల అమాయికత్వానికి, దురదృష్టానికి బాధపడ్డ వాసుదేవుడు ఆమెనోదార్చుతున్నాడు.

"ఫర్వాలేదు. నేనున్నాను. నా తల్లి నీ తల్లి. నీ బరువు బాధ్యతలు నావి. నీ సుఖ సంతోషాలు నావి. ఇక్కడనుండి మన రాజ్యానికి వెళ్ళి పోదాం. అక్కడ ఈ సత్యతో కల్సి అందరు నిన్నెంతో ప్రేమగా చూసుకుంటారు. నీకు అక్కడ అన్నదమ్ములు, అప్పచెల్లెళ్ళు ఎందరో వున్నారు. వారు ప్రేమించి, లాలిస్తారు!"

ఏదో నన్నిక్కడ చూసాను. నువ్వెంతటి అదృష్టవంతురాలివో నీకు తెలియదు. నీకు చెట్టుపుట్టలు తప్ప ఇక్కడెవరు లేరు. అక్కడ ద్వారకలో ఎందరు వున్నారో. కావాలంటే రేపు మన సత్య నడుగు. ఆమె అన్నీ నీకు వివరించి చెబుతుందని ఓదార్చాడు. దగ్గరకు తీసుకున్నాడు. ఇప్పుడు నీ పేరు "జాంబవతి" అన్నాడు.

ఆతని ఒడిలో, కృష్ణుని లాలనలో జాంబవతి మురిసి, ఆ ప్రేమలో తనను మరచిపోయింది.

ఆ పిల్లకు సంతోషం కల్గించాలనే వుద్దేశంతో, వున్న సత్యాన్ని, తన కుటుంబ వివరాలతో, ఎంతో వివరంగా చెబుతున్నాడు. మా అన్న, వదినలకు నేనంటే ప్రాణం. నీ పేరే ఆమెది. అందుకే ఆమె మీద గౌరవంతో నిన్ను పేరుపెట్టి పిలవకుండా "జాంబవతీ!" అన్నాను. ఇది నీకు సంతోషమే కదా!

నీకు నీ తండ్రి మీద వున్న ప్రేమకు అనుక్షణం నువ్వు ఆనంద సాగరంలో మున్గవచ్చును. అక్కడ నాకు భార్య, ఒక చెల్లెలు వుంది. వాళ్ళెంత నిన్ను ప్రేమగా, ప్రాణంగా చూసుకుంటారో, అక్కడికి వెళ్ళాక నీకు తెలుస్తుంది. సాత్యకి నీకు అన్న.

ఇక - సత్య - ఆ ప్రేమ నీకు తెలుసు. నీలాగే నన్ను ఆరాధిస్తుంది. ఇదంతా నేను ఆమె కోసమే చేసాను. ఏమీ దాచకుండా, అన్నీ వివరంగా చెబుతున్నాడు.

నాకో తమ్ముడున్నాడు. వాడి పేరు ఉద్ధవుడు. వాడికి నేనంటే ప్రాణం. నా మాట వేదం. వేదమంటే తెలుసు కదా! ఇక పిల్లలు, నీ ఆటపాటలకు ఎంతో ఆనందిస్తారు. వాళ్ళకు చెట్లపై వూగడం నేర్పుదువుగాని. మా మహారాజుకు నేనంటే ఎంతో ఇష్టం.

అంతెందుకు. మా ద్వారకలో నూటికి తొంభైమందికి, నేనంటే గౌరవం, ప్రేమ. అభిమానం. నిన్ను నాలాగే దేవతలాగ చూసుకుంటారు. ఆమెలో ఆత్మవిశ్వాసం, అనంతప్రేమశక్తి నింపుతున్నాడు.

అంతావిన్న జాంబవతి, పాలిపోయిన ముఖం తేలిపోతున్నట్లు నవ్వింది. కానీ, వీరా "నువ్విక్కడ నుండి వెళ్ళలేవు. మా వాళ్ళు నిన్నీ సీమను దాటనివ్వరు. ఈ భల్లూక ప్రపంచమెంత భయంకరమైనదో, ముందు ముందు నీకు తెలుస్తూంది. నిజానికి నాకిక్కడ వుండాలని లేదు. కాని తప్పదు!" సంతోషం నా ముఖానికి లేదన్నట్లామె చెప్పింది.

"పిచ్చిదానా! ఈ దయ, జాలి, ప్రేమ లేని మనుషుల్తో నువ్వు వేగడం చాలా కష్టం. దయాదాక్షిణ్యాలు లేని వీళ్ళు మనుషుల్ని చంపడానికి, మంటల్లో త్రోయడానికి గూడా వెనుకంటజ వేయరు.

"జాంబవతీ! మృత్యుదేవతకు, నా పేరు చెప్పినా ముఖ్యంగా మా అన్న పేరు చెప్పినా, మా దరిదాపులలోకి రాదు.

"నేను కూడా తప్పు చేసాను. నా క్రూరత్వం కాని మూర్ఖత్వం కాని క్షమించరానిది. నా తప్పుకు శిక్ష లేదు.

"నువ్వు తప్పు చేసావా ?" ఏం తప్పు చేసావు ?"

"మిమ్మల్ని ఆకర్షించి, ఇక్కడకు రప్పించేటట్లు చేసాను. కాని నువ్వు చాలా మంచివాడివి. ఉదార, కరుణా దయా సముద్రుడివి. స్వభావుడివి. నీ పట్ల నేను చేసిన ద్రోహం క్షమించరానిది చేసిన తప్పుకు బిగ్గరగా ఏడ్చింది. నాకు చివరకు మిగిలిందిదేనన్నట్లు బాధపడుతుంది.

"మమ్మల్నిక్కడకు తీసుకురమ్మని" ఎవరు చెప్పారు.

"నా తండ్రి. మిమ్మల్నేదో రకంగా తీసుకురమ్మని చెప్పాడు."

"ఎందుకు ?"

"మా నాన్నకు కొన్నాళ్ళ క్రితమొక కల వచ్చింది. అందులో సత్రాజిత్తుకు సూర్యప్రసాదిత శ్యమంతకమణి తన వద్దకు చేరినట్లు కల వచ్చింది. అప్పటి నుండి తన కల ఎప్పుడు సాకారమౌతుందా ? అని నా తండ్రి ఎదురు చూస్తున్నాడు. సత్రాజిత్తు ఇక్కడకు వస్తాడేమోనని వూహిస్తూ ఆ పవిత్ర గుహపై కన్నువేసి వుంచామన్నాడు.

ఆ కథనాన్ని వింటూ ఆత్రంగా వింటున్న కృష్ణుడు "ఆ తర్వాత...!" అన్నాడు.

"ఏముంది. నా తండ్రి దృష్టి పూర్తిగా శ్యమంతకమణిపై లగ్నమయింది. అదెలాగ వస్తుందో తెలియక, ప్రతిక్షణం ఆలోచిస్తున్నాడు. అడవి అంతా వెతుకు తున్నాడు. అందులో భాగంగా, ఒకనాడు ~~ఈ~~ శ్యమంతకాన్ని ఓ సింహం నోట కరుచుకు రావడం చూసారు. వెంటనే మహా బలపరాక్రమశాలియైన నా తండ్రి దానిని చూసి, మా ఎలుగు బావను దానిపైకి వుసికొల్పాడు. అతడు సింహాన్ని చంపి, ఆ శ్యమంతకంతో వచ్చాడు.

"అంటే - మీ ఎలుగు మేనల్లుడు అంత స్నేహ స్వభావా ?"

"అది, మా వద్ద మాత్రమే. అతనికి ఏ జంతువునైనా, మనిషినైనా చూపితే, అది ఎంత భయంకరంగా విక్రమిస్తే, దాని క్రూరత్వము చూస్తే మన ప్రాణాలు ఎవ్వరు తియ్యక్కర్లేదు. వాటంతటవే గాలిలో కలిసిపోతాయి. అంతక్రూరుడు, భయంకరమా - ఎలుగు -

దీంతో మా అదృష్టం తన్నుకుంటూ వస్తుందని నా తండ్రి విశ్వాసం - చెబుతుంది జాంబవతి.

"ఆ తర్వాత -" అడుగుతున్నాడు వాసుదేవుడు.

ఆ మర్నాడు - అదృష్టమో, మరొకటో తెలియదు. మీ స్నేహితునిక్కడికి తీసుకువచ్చారు. మళ్ళీ నా తండ్రి ఆ పవిత్రగుహకు వెళ్ళమన్నాడు. తీరా అక్కడికి

వస్తే మీరు, ఆమె పిల్లి కనుపించాయి. అదే మా నాన్నగారితో చెప్పాను. వాళ్ళను ఏదోరకంగా ఇక్కడికి తీసుకురమ్మన్నాడు.

"నా ప్రయత్నం ఫలించింది. అనుకున్నట్లే మీరు నన్ననుసరించారు. ఇక్కడికి వచ్చారు'' అనగా -

"నీ చేతుల్లో బందీనయ్యా''నని ముగించాడు, కృష్ణుడు. ఆ వెంటనే - జరిగింది నాకనవసరం. మనమెవరము చచ్చిపోము. అలాగని ఇక్కడ అసలు వుండము. నా మాట నమ్ము. మనం మన నగరానికి, ద్వారకకు వెడతాం. సుఖంగా వుంటాము,'' వాసుదేవుడు భరోసాగా చెప్పాడు.

"అసంభవం వాసుదేవా! ఆ రోజు రాత్రి ఏం జరిగిందో తెలుసా ?''

"ఏ రాత్రి'' అని కృష్ణుడు అడుగుతున్నాడు.

"అదే నువ్వు సాంబను చంపిన రాత్రి. మా వాళ్ళందరు నీ స్నేహితుని, ఆమెను, మీ పిల్లిని కణకణలాడే ఆ మంటల్లో త్రోసేయాలని ఆవేశపడితే, మా నాన్న వాళ్ళను వారించాడు.

ఇప్పుడు మనకో పవిత్రాత్ముడు కావాలి. అది ఈ అపరిచితుడు. ఇతనిని మన అమ్మాయిని వివాహం చేసుకోమందాము. కాదన్నాడో, నా పిల్లను నిప్పుల్లో తోసేద్దాము. అతను మనిషి. తప్పక స్పందిస్తాడు. మనవలె మూర్ఖునిగా ప్రవర్తించాడు. ఆ తర్వాత అతను మన చేతుల్లో బందీ! ఆ తర్వాత ఏం చెయ్యాలో ఆలోచిద్దా''మన్నాడు.

"అంతా ఆయననుకున్నట్లే జరిగింది కదా! ఇక మనల్ని విడిచిపెట్టడానికి అభ్యంతరమేమిటి ?

"ఇంకో నాల్గురోజులలో నిన్ను మా నల్లనయ్య అనే మా మాంత్రిక దేవుని వద్దకు తీసుకువెడతారు. సామాన్యులు ఆతన్ని చూసి గుండాగి చస్తారు. అదే ఆయన అభిమాని, ముద్దు బిడ్డడైతే సుఖంగా వుంటారు.

అతడు మహాభయంకరుడు. చూపులకే గుండాగి చస్తారు. హుంకరించా డంటే, ఆ వ్యక్తి లేదా వ్యక్తులేమవుతారో, ఆ భగవంతుడికే తెలియాలి'' అంటూ మొదలు పెట్టింది.

అప్పుడనుకున్నాడు వాసుదేవుడు. ఏడవడంలో ప్రథమస్థానం - సత్యదే ననుకున్నాను కానీ, ఆడవాళ్ళ నెత్తిమీద గంగ, అతివేగంగా ప్రవహిస్తుండాలి. లేకపోతే, ఈ ధారాపాత కన్నీరు, వరదలాగ, ప్రవహించదనుకున్నాడు. మళ్ళీ కృష్ణ వాసుదేవా!'' అందామె.

"చూడు జాంబవతి. చూడు నీ పేరేదైన, నేను నిన్ను "జాంబవతి'' అంటున్నాను. నువ్వు కూడ, సత్య - నా భక్త మిత్రుడు సాత్యకివలె "ప్రభూ!'' అని పిలు. లేదంటే, నాలాగే నీ కిష్టమైన ఓ పేరు పెట్టుకోమన్నాడు. ఈ మాటల్లో అతి ప్రయాసపడి పిల్లికూన, మేనక వచ్చింది. వస్తూనే కృష్ణుని ప్రక్కన చేరింది.

ఆమె నడుంచుట్టు చెయ్యివేసిన వాసుదేవుడు "ఇప్పుడు నువ్వు నిజం చెప్పు. ఎందుకలా చెట్లు, పుట్టలు తిరిగి ఎగురుతున్నావని'' అడిగాడు.

"చిన్నప్పుడు ఈ భల్లూకాలతో, ఇక్కడి మనుషులు, వీరి ఆదేశాలు, చట్టాలతో విసిగిపోయి మనశ్శాంతి కోసం చెట్లు పట్టుకుని వూగుతూ, పక్షులు కోతులతో మచ్చిక పెంచుకున్నాను. అదే అలవాటు నాకు నచ్చింది వచ్చింది. చివరకు ఈ వాతావరణంలో నేను బ్రతుకలేను. విముక్తి కావాలంది.

"మరి ఈ విషయంలో మీ నాన్నగారు ? అనేసరికి "దేవా! మా నాన్నగారికి, మా అమ్మంటే, చనువు, ఇష్టం. అలాగే నేనన్నా ఆమెకెంతో ఇష్టం.''

"నా వుద్దేశంలో మీ నాన్న చాలా మంచివాడే. ఎందుకంటే నన్ను గౌరవించాడు. నాపై ఎంతో అభిమానం కురిపించాడు. అటువంటి మనిషి నాపై దౌర్జన్యం చెయ్యడు. లేదా నాతో క్రూరంగా ప్రవర్తించడని, నా వుద్దేశ్య''మంటాడు.

"అయుండొచ్చు. మా అమ్మకు నేనంటే చాలా ప్రేమ, ప్రాణం. నన్ను క్షణం కూడా విడిచిపెట్టకుండా, చెట్లపై వూగుతుండేది. అదే నాకు బాగా అలవాటయింది. చివరకు అదే... ఆనందరూపమయింది ?

"నిజానికి "సాంబ'' అంటే నాకిష్టం లేదు. అతడు దేవుడు బిడ్డడంటారు. కానీ అతని ప్రవర్తన, నాకేమాత్రం నచ్చలేదు. కానీ మా సాంప్రదాయం ప్రకారం, అతన్ని పెండ్లి చేసుకోవాలి. అతన్ని వివాహం చేసుకోవడమిష్టంలేని నాకు, భగవంతుడు నిన్ను పంపి నన్ను కరుణించాడు'' తన ఆనందం చెప్పుకుందామె.

మీ మిత్రుడు సాత్యకి వచ్చాడు. మా వాళ్ళు అతన్నే ఎత్తుకు వచ్చారు. ఇదంతా మా నాన్న కల ప్రభావం అతన్ని బంధిస్తే, అసలు విషయం తెలుస్తుంది. అప్పుడే "ఆర్యపుత్రా!" మీరిక్కడికి వస్తారని, మీరు కనుపించే ప్రత్యక్షదైవమని, మీరు చేసిన సాహసాలను కొన్నింటిని అభివర్ణించి చెప్పాడు. మమ్మానంద సముద్రంలో ముంచాడు.

మా నాన్నకు వచ్చే అదృష్టం నాకు తెలియదు కానీ, మాకు శ్యమంతకమణి దొరకడం, ఆ పేరుతో మీ మిత్రుడిక్కడికి రావడం, మీ గురించి చెప్పడం, దేవ కుమారుడు - పరమ పవిత్రాత్మకుడనే - ఆ సర్వేశ్వర మహామాయా మాంత్రిక స్వరూపం - ప్రతిరూపంగా తలిచే సాంబుని మరణం - "ఆయాసం తీసుకుంటున్నట్లు క్షణకాలమాగి -

"నాకు వరప్రసాదమయింది." అంది.

ఆ అదృష్టంలోనే నిన్ను చేపట్టాను. ఇది ఒక భాగం.

ఇకపైన - ఏం జరుగుతుందో, ఆ సర్వాత్మకునికే తెలియాలి. సర్వశక్తి మంతుడివి, అవతారపురుషుడివైన - నా ప్రత్యక్షదైవం నన్ను కరుణించి, ఈ అడవి నుండి, మొరటు - మూర్ఖ - క్రూర దుర్మార్గులనుండి తప్పించి, కరుణిస్తే-

అంతకంటె అదృష్టం, ఆనందం మరొకటి వుండదు.

ఈ శుభ ఘడియలకే ఎదురుచూస్తున్నాను. నీ సంగతి నాకు ఏమీ తెలియదు. నా దృష్టిలో ఇక్కడనుండి కదలలేమోనన్నది నా భయం. వీళ్ళను నిరోధించి కదలగల్గితే, ఆ ఆనందం అవ్యక్తం. వర్ణనాతీతం కూడా!

ఈ మాటల్లో చంద్రకాంతి ఆ గుహను ప్రకాశింప చేస్తూంది. పిల్లికూన మేనక నిద్రపోయింది. ఇక మనమే మిగిలామన్నాడు. కబుర్లు కట్టిపెట్టి, మనసులు కలిసిన మనం హాయిగా నిద్రిద్దాం. నువ్వు ధైర్యంగా వుండు. మనమిక్కడ నుండి తప్పక బయటపడతాం" అన్నాడు.

ఆ గుహ పశ్చిమాభిముఖంగా వుండటంతో, చంద్రకాంతి మాత్రం బాగా పడుతుంది. ఆ గుహలో వెలుతురు నింపుతుంది. ఆ ప్రశాంత వాతావరణంలో నిద్రకుపక్రమించారు.

వున్నట్టుండి కృష్ణుడికి తెలివి వచ్చింది. ఏదో ప్రమాదాన్ని పసిగట్టినట్లు, తల్లి నుండి వారసత్వంగా వచ్చిన శక్తితో మేనక గూడా వులిక్కిపడి లేచి, గబుక్కున పరుగెత్తింది. మెల్లిగా పిల్లి కదా. పిల్లిలాగే మ్యావుమంది.

ఎవరివో అడుగుల చప్పుడు. భయంతో చెవులు రిక్కించింది. తోక పైకెత్తింది. మూపున నిటారుగా నిల్చింది. ఈ సవ్వడికి లేచిన కృష్ణుడు గుహాముఖ ద్వారం వద్ద కదలకుండా నిల్చున్నాడు. ఎటువంటి అవాంతరాన్నైనా, ఇట్టే ఎదుర్కోగల స్థిత ప్రజ్ఞుడు ఈ వాసుదేవుడు.

సరిగ్గా అటువంటి సమయంలో, అడుగులు ఆగిపోయిన సవ్వడి.

"కృష్ణా! వాసుదేవా! తెల్లవారింది. నిద్రలేచావా... !" ఎవరిదో పిలుపు.

శ్రద్ధగా విన్నాడు, ఆ కృష్ణ! వాసుదేవుడు.

# బయలుదేరండి, శుభం

**ఆ** స్వరం విని ఆశ్చర్యపోయాడు.

అదెవరిదో కాదు. భల్లూకరాజు, జాంబవంతునిది. ఎంతో తియ్యగా, ప్రేమగా, కమ్మగా వున్నాయి ఆ పలుకులు. గత రెండు, మూడు రోజులుగా వున్న కాఠిన్యం. ఆతని మాటల్లో లేదు. ఎంతో మృదుత్వం చోటు చేసుకుంది.

"ఆ...! అనేసరికి భల్లూకరాజు లోపలికి వచ్చాడు. అతని ఎలుగు మేనల్లుడు బయట కూర్చుండిపోయాడు. మేనక, తన భల్లూక మిత్రుని వద్దకు వెళ్ళిపోయింది.

లోపలకు వచ్చిన మామగార్ని కృష్ణుడు సాదరంగా ఆహ్వానించాడు. "మీ రాక మాకు ఆనందదాయకం". చిరునవ్వులతో స్వాగతించినవాడు! "ఈ రాక మామూలు గౌరవసూచకమైనదా ? లేక - మా సర్వేశ్వరుడు సర్వాత్మకుడు, మా మంత్రాలదేవుడు...!" అనే వార్తనందించడానికా... ?! సరదాగానే అడిగాడు.

అప్పుడే నిద్రలేచిన జాంబవతి, తండ్రి - తన నాథుడు - ప్రేమగా మాట్లాడుకోవడం, సఖ్యంగా వుండటం చూసి, కృష్ణుని ప్రక్కనే వచ్చి కూర్చుంది.

"అమ్మా! సంతోషంగా వున్నారా ?" ప్రేమను కురిపిస్తు - అడిగాడా తండ్రి.

"నా ప్రభువు - వసుదేవసుతులు నన్ను కరుణించారు. వారి రక్షణలోకి తీసుకున్నారు. ఇక ఈ భూలోకంలోనే కాదు, నాకే లోకంలోను భయం లేదు. నన్ను ధిక్కరించి, నిరశించే వారుండరు. అంతటి ప్రతాపశాలి, నా ప్రభువు" అని చిరునవ్వులు చిందించింది.

"ఈ అదృష్టమెన్నాళ్ళో నీ అదృష్టమెలాగ వుందో!" గట్టిగా నిట్టూరుస్తు చెప్పాడు. భగవంతుడు నిన్నెలాగ అనుగ్రహిస్తాడో...! కృష్ణునివైపు చూసి అంటున్నాడు.

"చూడు భల్లూకరాజా! నీ మనసు నాకు అర్థమయింది. మూడునాళ్ళ తర్వాత మీ దేవుడి దగ్గరకు తీసుకువెడితే, నన్నునుగ్రహిస్తే ఈమెనాది. ఒకరి కొకరం కలిసి వుంటాము. కాకపోతే ఇద్దరు దురదృష్టవంతులౌతాము. అవునా ?

అవునన్నట్లు తలూపినవాడు, "నీ మిత్రుడు నిన్ను ప్రత్యక్షదైవమంటాడు. నీవెన్నో అద్భుతాలు చేసావంటాడు. మరి దాని ప్రభావం, మా ప్రపంచంలో ఎలాగ వుంటుందో, ఏమో...!" తాను అశక్తుడనన్నట్లుగా, భల్లూకరాజు మాట్లాడుతున్నాడు. అందుకు ప్రతిగా - వాసుదేవుడు, "నువ్వు ఆ దైవకుమారునివవడం చాలా మంచిది" అన్నాడు. అందుకు స్పందిస్తూ - "నా గురించి ఆలోచించే ముందు నిన్ను వదిలించుకోవాలి కదా!" గట్టిగా నవ్వుతూ అన్నాడు. మళ్ళీ అతన్ని "నిన్ను ప్రేమవలలో వెయ్యమని, భల్లూక రాజ్యానికి లాక్కుని రమ్మనమని చెప్పింది నేనే. ఆ సంగతి నీకు తెలుసా ?" తానేదో ఘనకార్యం చేసినట్లు కథనం ప్రారంభించాడు.

"అది నాకు తెలుసు" అనేసరికి, కృష్ణుని కళ్ళలోకి సూటిగా చూసి "నీకు తెలుసా ?" అన్నాడు. "ఊ..ఊ" అని తలూపాడతడు. మళ్ళీ ఎలాగా అని అడగడానికి సావకాశమివ్వకుండా, నా భార్య నాకు అంతా చెప్పేసింది" అనగా- "అలాగా ?!" అని తన పిల్లవైపు చూసాడు.

"నేనెందుకలా చేసానో, నీకు తెలుసా ?" కృష్ణుని కళ్ళలోకి చూస్తు అడిగాడు.

"ప్రేమతో...!" నవ్వుతూ చెప్పాడు.

"కాదు, స్వార్థంతో చేసాను. నా పిల్లతో నీకు పెళ్ళి చేయాలన్న కసి, కోపంతో చేసాను."

"అంటే... అన్నాడు, నీ మాటలు చాలా చిత్రంగా వున్నాయి. నువ్వొక వింత వానిలాగ కనిపిస్తున్నావు. అంతే నీ కోపంతో పెళ్ళి చేసి, ఆ కసితో చంపేసి, నీ కూతుర్ని విధవను చెయ్యాలనుకున్నావా ? భలే చిత్రంగా వుంది. నీ ప్రవర్తన ?!"

"అవును. దీనికోసం ఎన్ని పున్నమిరాత్రుళ్ళు నేను నిరీక్షించానో నీకు తెలియదు." అందులో ఏదో పరమ రహస్యమున్నట్లు నిగూఢంగా మాట్లాడుతున్నాడు.

"నా కోసమా ?.... కృష్ణుడు ఆశ్చర్యపోయాడు.

"అవును. నీకోసమే! ఎందుకో చెబుతాను విను. దీని తల్లి, నా భార్య - ఈ క్రూర, దుష్ట ప్రపంచం నుండి బయటపడాలని తలచింది. కాని కుదర్లేదు.

"కుదరలేదంటే నువ్వు ప్రయత్నించలేదా ? లేక... కథ ఆసక్తిగా వుండటంతో, అంత ఆసక్తిగా కృష్ణుడడుగుతున్నాడు. ప్రక్కనున్న రోహిణి చిత్రంగా వింటుంది.

ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చిన జాంబవంతుడు.

"మాకు మా ప్రపంచం తప్ప మరొకటి తెలియదు. ఇదే ప్రపంచంగా తలిచి బ్రతికే జీవితాలలోకి, సత్రాజిత్తు తొంగిచూసేవరకు - మేమున్నది ప్రపంచమే కాదన్న సంగతి తెలియలేదు.

సత్రాజిత్తు వచ్చాడు. పవిత్ర గుహలో తపస్సు చేసాడు. సూర్యదేవుడు కరుణించి, ప్రతి నిత్యం ఎనిమిది బారువుల బంగారమిచ్చే శ్యమంతకమణిని వరప్రసాదంగా ఇచ్చాడు. దాంతో అతనికి అదృష్టం పట్టింది. వచ్చింది బంగారు ఆభరణం, ఇచ్చేది బంగారం. దాంతో అతడు పట్టిందల్లా బంగారమయింది.

అసలు ఆ బంగారానికి అంత విలువ వుంటుందని దానికోసం మీ మనుషులు, పీకలు కోసుకుని చస్తారని కూడా మాకు తెలియదు. ఆ సత్రాజిత్తే మమ్మల్ని చూసి నిరశిస్తున్నట్లు, బయటి ప్రపంచం గురించి, చెప్పాడు. దాని ఆకర్షణకు మమ్మ గురి చేసాడు. దాంతో మాలో ఆశ బయలుదేరింది.

అక్కడికి రావడానికి, మాకు తగు విధంగా సహకరిస్తానని మాయమాటలు చెప్పాడు. వాగ్దానం చేసాడు. దానికి మేము మురిసిపోయాం. మమ్మ మేము మరచిపోయాం. ఆ దివ్యమైన శుభదినం కోసం ఎదురుచూపులు మొదలు పెట్టాం.

"అంటే.... అతను మీకే విధంగాను సాయపడలేదా ?" వాడు అందర్ని మోసంచేసే మోసగాడని కృష్ణుడు తెలుసుకుంటున్నాడు.

"లేదు. ఆశలుపెట్టే ఆ పరమ దుర్మార్గుడు మా ఎలుగులకన్న హీనుడు. ఇక్కడ ప్రతి పున్నమినాటి రాత్రి చేసే పూజా ఫలితంగా ప్రకాశించే పసుపు పచ్చ ఇసుక దొరుకుతుంది. దానిని తీసుకురా. నీకు తప్పక సాయపడతాను. అసలైన ప్రపంచంలో నిన్ను నిల్పుతానన్నాడు.

"ఇదా సంగతి. ప్రతి పున్నమినాడు రాత్రి మెరిసే ఆ పసుపుపచ్చ అక్షంతల్ని-శ్యమంతకమణి పూజకు నది నుండి సేకరించి వుపయోగిస్తారన్నమాట." సత్యం గ్రహించినట్లు కృష్ణుడు తలూపాడు. ఆ తర్వాత ఏం జరిగింది ?

ఈ రోహిణి తల్లి ఎంతో మంచిది. అందగత్తె ఎంతో ప్రేమమూర్తి, మృదుభాషిణి. దురదృష్టవశాత్తు చనిపోయింది. "కళ్ళలో తిరిగిన నీటిని జాంబవంతుడు తుడుచుకున్నాడు. కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. అప్పుడిది.... చిన్నపిల్ల.

దీనిని సంరక్షించుకోవాలి. ఈ భల్లూకరాజ్య ప్రజలకు కూడా నాతో అవసరముంది. "దైవకుమారుడైన సాంబ, దినదినానికి పరమక్రూరుడు, దుర్మార్గుడౌ తున్నాడు. అతని ప్రవర్తనతో వీళ్ళందరు విసిగిపోయారు.

ఆ తల్లి పోలికలే ఈ పిల్లకి వచ్చాయి. ఈ వాతావరణం దీనికి నచ్చలేదు. దాంతో తల్లివలె చెట్లపై వూగుతూ, కోతులతో ఆడుతూ, పక్షులతో పాడుతూ చిద్విలాసంగా బ్రతకడం నేర్చుకుంది. ఆమెకు ఇష్టమైతే తండ్రిగా నా ఆజ్ఞ పాలిస్తుంది. ఇక -

ఆమెపై ఎవరికి అదుపు, ఆజ్ఞ లేదు. ఆమెను ఈ భల్లూక ప్రపంచం నుండి బయటికి పంపించాలని తలిచాను. ఆమె భల్లూక ప్రపంచాన్ని విడిచి ప్రకృతి పరవశత్వంతో, తనను తాను మరచే ప్రకృతి లోకానికి దాసురాలయి కాలం గడుపుతూంది.

అందుకే ఆమెకు ఆర్యుల కలవాటయిన భాషను వినడం, అనడం నేర్పాను. మంచిరోజులు వస్తాయని తలిచాను. నిజం చెప్పాలంటే ఆ సత్రాజిత్తు పెద్ద మోసగాడు. ప్రతి పున్నమికి - పూర్ణచంద్రారాధనమని వచ్చేవాడు. శ్యమంతకాని కిక్కడ పూజ చేసేవాడు.

మేము పిచ్చివాళ్ళం, అమాయకులం. దానిని ఆసరాగా తీసుకుని, నదిలో నుండి మేము ఏరి తెచ్చిన పసుపుపచ్చ ఇసుక తీసుకుని, మా ఆతిథ్యం స్వీకరించి

వెళ్ళిపోతూండేవాడు. తప్పక నా కుమారునితో నీ కుమార్తె రోహిణికి వివాహం చేద్దామని భరోసా యిచ్చినట్లు ఆశ పెట్టేవాడు.

మా బ్రతుకులకది "ఆశ" కాకుండా, మాకు పేరాశగాను, ఆ సత్రాజిత్తుకు దురాశగాను తయారయింది. కాలం గడుస్తూంది కాని, అతని మాటలు ఫలించే సూచన ఏ మాత్రం కనుపించడం లేదు.

ఎన్నోసార్లు సత్రాజిత్తు నడిగాను. అడిగాను. అడిగాను. అడుగుతూనే వున్నాను. ఏదో వంక చెబుతున్నాడు. మాలో ఆశ పెంచుతున్నాడు. చివరకు ఆతడు అవకాశవాది" అని తేలిపోయింది. మా వద్ద నుండి వచ్చే ఆ పచ్చ ఇసుకు కోసం మమ్ము మభ్యపెట్టి మోసగిస్తున్నాడని వూహించాను.

అనకూడదు కాని, ఒక్కొక్కసారి కోపం పట్టలేక, నన్ను నేను నిగ్రహించు కోలేక, వాడి మాయ మాటలకు మండిపోయి, మా ఎలుగును వాడి మీదకు వుసి గొల్పాలని కూడా తలిచాను. మళ్ళీ కొంతలో కొంత ఆశ. నా చేతులతో, చేతలతో మా రోహిణి అదృష్టాన్ని హరించి వేస్తున్నామోనన్న అనుమానం. ఇలాగ రోజులు గడిచిపోతున్నాయి.

"మరి మా సాత్యకి, మీకెక్కడ తగిలాడు. అదే ఎలాగ దొరికాడు ?"

"ఓహ్ - అదా! కొన్నాళ్ళ క్రింత నాకోకల వచ్చింది. అందులో శ్యమంతక మణి నాకు దొరికింది. ఇది శుభసూచకమనుకున్నాను. నా కూతురుకు మంచి రోజులు వస్తాయని, భవిష్యత్తు బాగుంటుందని తలిచాను. ఇక అక్కడ నుండి, శ్యమంతకమణి ఎలాగ దొరుకుతుందో దానికోసం, ఈ అడవి గాలిస్తున్నాను.

ఆ తిరుగుడులో ఎవరో కనబడవచ్చును. నా కల నిజమవవచ్చును. అదొక ఆశ. ఈ సంచార"వేట"లో నాకో సింహం కనుపించింది. దాని నోట్లో శ్యమంతకముంది. ఇది దీనికెలాగ వచ్చిందనే ఆలోచనను ప్రక్కనబెట్టి ముందు దానిమండి అది సంగ్రహించాలని, నా ప్రక్కనే వున్న ఎలుగు వీరుడిని రెచ్చగొట్టాను. వాళ్ళిద్దరు కలియబడ్డారు." ఆ మాట విని ఎంతో ప్రేమగా తన మేనల్లుని చూసాడు.

వాడు, వీళ్ళ ప్రపంచంతో సంబంధం లేనట్లు మేనకతో ఆడుకుంటున్నాడు. అటువంటి ప్రేమ, వినయ సౌజన్యమూర్తి, ఆ ఎలుగులలో ఇంకొకరు వుండరు. అంతటి విశ్వాసపాత్రుడనే చెప్పాలి. కాదు నమ్మకస్తుడు.

ఒంటినుండి రక్తం కారిందో, ఇక రెచ్చిపోవడం ఖాయం. అంతటి పిచ్చి కోపం. ఆ రకంగా వాడు దానిని చంపాడు. శ్యమంతకమణి నా చేతికి వచ్చిందన్నాడు ఎలుగుల... అదే భల్లూకరాజు జాంబవంతుడు.

"అయితే, ఆనాడు, నీకు, మా వాడు కనబడలేదన్న మాట.." విషయం కోసం అడుగుతున్నాడు.

"లేదు. శ్యమంతకమణి నా చేతులలోకి రావడమొక అదృష్టంగా తలిచాను.' దశ తిరుగుతుందనుకున్నాను. మర్నాడు... మనుష్యుల కోసం వేట మొదలు పెట్టాము. ఆ సింహపు దెబ్బతినో, పారిపోయో... లేక చేజారిన అదృష్టం చిక్కించుకోవాలనే ప్రయత్నంలోనో...

ఎవరైన దొరకవచ్చని తలిచాను. అలాగే మీ స్నేహితుడు దొరికాడు. అతడు, తను దారి తప్పినట్లు తనతోపాటు ఒక స్త్రీ కూడా వచ్చిందని, ఆమె వద్ద పిల్లి వుంటుందని, వాళ్ళను మనం, అత్యవసరంగా వెదుకాలని చెప్పాడు. దాంతో మా అడవి పిల్ల, మా అమ్మాయి, చిలకపలుకుల రాణి, యువరాణిని, విషయం చెప్పి వెదకమని కోరాను. ఎగువ గుహ, పవిత్ర గుహ ప్రాంతాల వారు వుండవచ్చునని సూచించాను. నా ఆలోచన ఫలించింది. ఆమె మిమ్ము గమనించి, ఆ విషయం నాతో చెప్పింది.

ఏదో రకంగా మభ్యపెట్టి, వారిలో ప్రేమో, ఆసక్తో కలిగించి, ఇక్కడకు తీసుకు రమ్మన్నాను. ఆమె కృషి ఫలించింది. మీరు ఇక్కడికి వచ్చారు. దీంతో నాకర్థమయింది.

మీ మిత్రుడు చెప్పిన మాటల్ని బట్టి మీరు మహనీయులని తెలుసుకున్నాను. మెల్లిగా సాంబ గురించి చెప్పి, అతన్ని శిక్షించమన్నాను. భగవంతుడు కరుణించినట్లు, అప్రయత్నంగా వాడు, వాడి చావును కొని తెచ్చుకున్నాడు. "అదృష్టవంతుడిని" అన్నాడు.

"మూడు రోజుల తర్వాత నన్ను మీ దేవత దగ్గర పెట్టి, ఎందులో, నా అదృష్టాన్ని పరీక్షిస్తారు. చావో బ్రతుకో... అక్కడ ఎలాగ తేలుతుంది. పొరపాటున విధి వక్రిస్తే మీ అమ్మాయికి, అదే... ఆ దేవతాకుమారునితో వివాహం చేస్తారు.

"ఇందుకు మీ అమ్మాయి ఒప్పుకుంటుందా ? ఆర్యపుత్రుని భార్యగా వుంటుందా ? లేక గాలి తిరుగుళ్ళు తిరిగే పిల్లగా, ఒకరి తర్వాత మరొకర్ని అలాగ పెళ్ళి చేసుకుంటూ వుంటుందా ? చెప్పు!" అని రోహిణివైపు తిరిగాడు.

వెంటనే ఆమె కృష్ణుని గుండెలపై తల వుంచి "నువ్వే" నా సర్వస్వం. నీతోనే నా జీవితం ఏ దేవుడిని లెక్కపెట్టను. నా దేవునిగా నువ్వు చెప్పేదే ఆచరిస్తాను. అదే నా జీవితం" అంది.

ఆ తర్వాత కృష్ణుడు జాంబవంతుని చూసి "అవును. భల్లూకరాజా! నిన్న నువ్వెందుకలా బిసుగుకుపోయి నేను రాజునన్నట్లు ప్రవర్తించావు."

"వాసుదేవా! నా ఆనందం నాది. నా పిల్ల జీవితం నాది. నా నిశ్చయం, నా మనసులోనే వుండాలి తప్ప ఆనందంతో, తప్పెట్లు, తాళాలు పట్టుకుని ఎగురుతూ నాట్యం చేస్తే నా ప్రజలేమనుకుంటారు, మమ్మ్మ వంచించి, ఈ రాజు నాటక మాడుతున్నాడని, అందరు కలిసి ఎదురు తిరిగితే ఒక్కసారి ఆ క్రోధాన్ని తట్టుకోవడం కష్టం. అందుకని - "సత్య"మంటూ అసలు విషయం బయట పెట్టాడు.

రోహిణితోపాటు కృష్ణుడు కూడా ఆశ్చర్యపోయాడు. నువ్వు నిజంగా మహా నటుడివేననుకున్నాడు, కృష్ణుడు.

అన్నీ మనసులో దాచుకోకుండా, వివరంగా చెప్పి, మీరు ముగ్గురు... అదే నల్గురు, ఇక్కడనుండి పారిపోయే ప్రయత్నం చెయ్యండి. నా సహకారం నే నందిస్తాను. తొందరగా తప్పించుకుని, మీ రాజ్యం చేరండి. ఆ తర్వాత.... నా సంగతి" అన్నాడు.

ఇప్పుడు, ఇంకా ఆశ్చర్యపోయాడు. నోటిమాట రావడం లేదు. వారికి అది నిజమో, కలో... అర్థం కావడం లేదు. అంత ఆనందంగా, చెప్పనలవికాని సంతోషం నరనరాల్లో పుట్టి పెరిగి పెద్దదవుతుంటే ఆ మహదానందంలో, మహారాజుగా కాక, ఒక ధర్మమూర్తి, ప్రేమమూర్తి అయిన, తండ్రిగా ప్రవర్తించిన, జాంబవంతునికి వాసుదేవుడు, తన శిరసు వంచాడు.

తప్పించుకోవడమెలాగ ? ఆ పవిత్రగుహ చుట్టు కాపలా వుందే ?" మార్గమడుగుతున్నాడు.

"అటునుండి వెళ్ళడం కుదరదు. పవిత్ర గుహ నుండి ఇటువైపు రావడం గానీ, అటువైపు వెళ్ళడం గానీ జరగదు. అది సిద్ధాంతం. విధి విధాయక నిర్ణయం."

"ఇంకెలాగ వెళ్ళాలి..?" కృష్ణుని ప్రశ్న.

"కొండపైకి దారి వుంది. అక్కడనుండి వెనుకగా దారి వుంది. ప్రయాణం చాలా కష్టం. అనుక్షణం ప్రమాదమయం. అయినా సాహసించాలి. పైన వున్న క్షుద్ర

మాంత్రికుడు కరుణించాలి. నీ సాహసంపై వున్న నమ్మకంతో ప్రోత్సాహిస్తున్నా నన్నాడు.” తలూపాడు కృష్ణుడు.

“ఇక, ఇక్కడ ఎంతో సేపు వుండటం తగదు. భల్లూకరాజు లేచాడు. కృష్ణుడు తన కృతజ్ఞతలు చెప్పాడు.”

“సంతోషం. అనవసర ఆలస్యం చెయ్యకండి. మీ ప్రయత్నం మీరు చెయ్యండి. ఆ తర్వాత భగవంతుని దయ, మీ అదృష్ట”మన్నాడు.

“ఎప్పుడు బయలుదేరమంటారు ?”

“ఇప్పుడే తక్షణం బయలుదేరండి. ఈ సమయంలో మా వాళ్ళందరు ఇంకా నిద్రలో వుంటారు. వూ....!” తొందరపెడుతున్నాడు. ప్రస్తుతానికి వారితో ప్రమాదం లేదు. రేపంటే, ఎలాగుంటారో... తెలియదు. కనుక ఆలస్య మనవసరమన్నాడు.

వాళ్ళకు కోపం వచ్చిందో. మీ వూహ తెలుసుకున్నారో, అందర్ని కట్టకట్టి అగ్నిగుండంలో తోసేస్తారు. ఇప్పుడైతే భగవంతుడు మిమ్ము రక్షిస్తాడు. శ్యమంతకం దరి చేరుస్తుంది. నా నమ్మకం తప్పు కాదంటున్నాడా భల్లూకరాజు.

“శ్యమంతకమో...!” అడుగుతున్నాడు కృష్ణుడు. అది లేకుండా, చావనైనా చస్తాను కానీ, ఇక్కడనుండి కదలలేను. ద్వారకలో అడుగుపెట్టను. ముందు అది...!” అంటూంటే..

“కృష్ణా! అన్నీ నీ మిత్రుడు - భక్తుడు నాకు చెప్పాడు.” అని బొడ్డులో భద్రంగా దాచిన దానిని కృష్ణుని చేతిలో పెట్టాడు. సంతోషంతో అందుకుని కళ్ళ కద్దుకున్నాడు - కృష్ణుడు. ఇక బయలుదేరండి. ప్రాణాలు దక్కించుకోండి. ఆ భగవంతుడు సదా మిమ్ము కాపాడుగాక!” చెయ్యెత్తి రాజుగా కాక, ఓ మామగా, ఓ తండ్రిగా ఆశీర్వదించాడు.

సత్య - సాత్యకి సిద్ధం కాగానే అరక్షణం కూడా ఆలస్యం చేయను.” అన్నవాడు తిరిగి “మా ఆయుధాలు” అన్నాడు. అందుకు నవ్వుతూ కృష్ణుని భుజంపై చెయ్యివేసి, తట్టి -

“అసాధ్యుడివి, కృష్ణా! నీకు మరుపులేదు. ఏ ఒక్కటీ మరువవు. నీ దృష్టిలో పడినదేదైనా తప్పక ధన్యత్వమవుతుంది” గొప్పగా అల్లుని భుజం తట్టి మరీ పొగిడాడు.

"అవి, మీ స్నేహితునితో గుహ బయటపెట్టాను. "తీసుకో"మన్నాడు. ఈ చకోరి నీకు సర్వదా తోడుగా వుంటుంది. దారి కష్టం. జాగ్రత్త!" అన్నాడు.

సూర్యోదయానికి, నువ్వా సర్వేశ్వరుడి దగ్గరకు వెళ్ళు. శ్యమంతక మహత్వంతో మీరన్ని అవాంతరాలు అధిగమించి, ముందుకు సాగగలరు." ఆ మాటలకు ఒక ప్రక్క భర్తతో వెడుతున్నందులకు ఆనందం. తండ్రిని విడిచి పెడుతున్నందులకు బాధ. ఒక్కసారి కావులించుకుంది. "తండ్రీ!" అని విలపించింది.

జాంబవంతుడు ఆమె మొహం పట్టుకున్నాడు. నుదుట ముద్దు పెట్టుకున్నాడు. భగవంతుడు కరుణామయుడు. సుఖంగా వెళ్ళిరా. ఈ దేవుడు నీకే కాదు లోకానికే దేవుడు. "జాగ్రత్త" అని హెచ్చరించాడు - కృష్ణునికి ఆమెను అప్పగించి, వెనుదిరగకుండా వెళ్ళిపోతూంటే,

"నాన్నా! నువ్వు! మాతో రావచ్చుగా!" అంది.

"లేదమ్మా! తరతరాలుగా ఈ సామ్రాజ్యం నాది. వీళ్ళందరు నా వాళ్ళు. ఓపిక లేకపోయినా ఇక్కడే వుంటాను. ఎన్నాళ్ళో తెలియదు. పెద్దవాడినైపోయాను. ప్రాణలరచేతిలో పెట్టుకున్నాను. ఆ పరమాత్మ పిలిచిన మరుక్షణం ఆయన సన్నిధానంలో వ్రాలతాను. శుభం భూయాత్" అని, జాంబవంతుడు, ఆ భల్లూక రాజు, ఆర్య సాంప్రదాయానికి అద్దం పట్టినట్లు అర్థవంతంగా మాట్లాడాడు.(**★ఈ కథ ఉత్తరాదివారిది, దక్షిణాది వారి కథనంలో కొంత తేడా. కొంత కాదు. ఎంతో తేడా వుంది. దానిని ప్రత్యేకంగా ఇక్కడే ఇస్తున్నాము. గ్రహించ ప్రార్థన**).

ఇకపైన ఒక అక్షరం కూడా, జాంబవంతుడు మాట్లాడలేకపోయాడు. అక్కడ మౌనమే మూగభాషగా - ఎన్నో అర్థాలు, పలికించింది. తండ్రి పాదాలకు నమస్కరించింది. వాటిని కళ్ళకద్దుకుంది. ఇంతటి అభిమాన పాదాలు, తన మేలుకోరే పాదాలు, తనను గుండెల్లో ప్రేమను దాచుకుని - పైకి కఠినంగా - రాయిలాగ ప్రవర్తిస్తూ - అమృతానందాన్ని ప్రసాదించిన పాదాలు.

ఒకటికి రెండుసార్లు ఆ పాదాలను కళ్ళకద్దుకుంది. ఆ అదృష్టం మళ్ళీ దొరుకుతుందో, దొరకదు. కళ్ళలో సుళ్ళు తిరిగే నీళ్ళు అతను భల్లూకరాజే కావచ్చును. మమతానురాగాలకు పుట్టినిల్లుగా, అష్టైశ్వర్యాలను ప్రసాదించే

భగవంతుని శ్రీ చరణాలకు పూజా పుష్పంగా తన కూతురునర్పించిన ఘనుడు పుణ్యశ్రేష్ఠుడు, ధన్యుడు!!

తండ్రి కూతుళ్ళలో దుఃఖావేశం. అవ్యక్తమైన ఇటు ఆనందం. అటు దూరమవుతున్నాననే తీరని దుఃఖం. ఒక ప్రక్క తియ్యదనం. మరొకప్రక్క చేదుతనం. ఆమె జీవితానికానాడు అది ఉగాది. నూత్న జీవితావిష్కరణకు సంకేతం. శుభసూచకం. శుభప్రదం. తండ్రి ఆకాంక్ష నెగ్గిన దినం. పిల్ల ఆకాంక్షకు ఆనందభరిత జీవనం, జీవితం -

నాగరికత జీవిత ప్రపంచంలో - ఇది సహజం. ఇక్కడ -

వీరి మధ్య కూడా ఇంతటి అభిమానం, అనుబంధం. ఆర్య సాంప్రదాయ, అర్ష ధర్మనిరతికి చిహ్నంగా ప్రవర్తించే తీరు -

ఆ ముగ్ధమోహనుని, ముగ్ధుడిని చేసింది.

జాంబవంతుడు - ఆపుకోలేని ఉద్వేగంతో చెప్పిందే చెబుతున్నాడు. అది అతని ధర్మం.

ఇన్నాళ్ళు పెరిగి - ఒక్క రాత్రి అనుభూతితో ప్రేమకు - దాంపత్యం పేరిట లొంగి, బయలుదేరుతుంది. చివరగా - జాంబవంతుడు

గద్గదస్వరంతో, తడబడు మాటలలో, వణికే కంఠంతో.... అక్షరం, అక్షరం అంటున్నాడు. దుఃఖమాపుకోలేక పోతున్నాడు.

"అమ్మా! మమ్మ మరచిపో. నువ్వీ అడవిలోనే పుట్టావు. భల్లూకరాజు పుత్రికగా పెరిగావు. ఇది మరచిపోవాలి. నీ నాథుడు సహృదయుడు. అక్కడున్న ప్రపంచమంతా, ఈ అడివి కాదు. జాగ్రత్త... అక్కడున్న నీ వాళ్ళందరిలో ఆప్యాయత వుంది. అనురాగముంది.

ప్రేమతో దానిని పెంపొందింపు చేసుకో. ఇక అన్నీ వాళ్ళే నీకు. "ఒక్కొక్కమాట అంటున్నాడు - చెప్పలేకపోతున్నాడు. కళ్ళలో నీళ్ళ పొర. పిల్ల కనబడటం లేదు.''

భుజం మీద తట్టి బయలుదేరబోతూంటే -

"నాన్నా! నా పక్షులు, నా కోతులు...! కేవలం ప్రకృతి మాతలాగ, తన వడిలోని పిల్లలాగ వాటిని తల్చుకుంటూంటే...

"నేనున్నంతవరకు ఫర్వాలేదు. ఆ తర్వాత ఆ దేవుని దయ. నువ్విక్కడే వుంటే, ఆ పక్షులు, కోతులు వుంటాయి కాని బ్రతుకు వుండదు. పండదు. చివరగా - సర్వేశ్వరునికి, అర్పితమవ్వాలని'' ఇక మాట్లాడలేను, మాట్లాడకుండా వడివడిగా అడుగులు వేసాడు.

"జాంబవతి'' నాన్నా అని పిలువబోయింది. కృష్ణుడు ఆమెను అక్కున దాల్చాడు. దగ్గరకు తీసుకుని ఓదారుస్తున్నాడు.

సాత్యకికి, తనకు కేటాయించిన గుహలో రాత్రి రంగు రంగుల కలలు కంటూ సత్య సుఖంగా నిద్రపోయింది.

ఆమె ఎంతో సంతోషంగా వుంది. ఆమెను, కృష్ణుని ఆ క్షుద్ర దేవత చంపేసిందంట. ఇద్దరు యమాలయానికి వెళ్ళారు. కృష్ణుని చూడగానే, యముడు ఎంతో గౌరవించి "మహాపురుషా! నువ్వు రావలసిందిక్కడకు కాదని, కైలాసానికి తీసుకు వెళ్ళాడుట. ఆ పవిత్రమైన ప్రదేశంలో శివసన్నిధిలో, రాత్రింబగళ్ళు మీరు సంతోషంగా వుండమని విడిచి పెట్టాడుట.

తన దేవునితో రాత్రింబగళ్ళు కలిసి ఆ విధంగా వుండటం ఆమెకెంతో సంతోషాన్ని కల్గించింది. తన సంరక్షకుడిగా ఆ ప్రభువు తన నాదరించిన తీరు మరువరానిది. తనను భార్యకన్న ఎంతో మిన్నగా, భార్యగానే తలచి, భార్యగా రక్షించిన తీరు, చేపట్టిన పద్ధతి సర్వదా ప్రశంసనీయం.

రుక్మిణి, కేవలం సాన్నిధ్యాన్నే పొందింది. మరి నాకో ఆయన సంపూర్ణ సహచర్యం లభించింది. నిజంగా నేను అదృష్టవంతురాలినని సత్య పులకరించి పోతుంది.

దుర్మార్గమో, అదృష్టమో... కట్టకట్టుగా ఆ క్షుద్ర దేవతకు పడేస్తే, అది తినిస్తే... ఆహా నిజమైన భాగ్యము, సౌభాగ్యము తనదవుతుంది. ఇంతకన్న ఏ స్త్రీ అయినా కోరేదేముంటుంది ? విడువరాని ఆ మధురానుబంధం ప్రసాదించే అదృష్టం పరమార్థమే తప్ప, ప్రాణాంతకం కాదు.

ఇదంతా నిద్ర. ఆ నిద్రలో "లే. సత్యా! లే'' అనే చిరపరచితమైన పిలుపు. అది, అది తన ప్రభువుదే. ముఖద్వారం వద్ద నిల్చుని "లే, లెమ్మని పిలుస్తున్నాడు.

గబుక్కున లేచింది. కళ్ళు నులుముకుంది. తన ప్రభువే. ప్రక్కకు చూస్తే సాత్యకి లేచి సిద్ధమవుతున్నాడు.

"తొందరగా, రా!" మెల్లిగా పిలుస్తున్నారు. అందులో అధికారం వుంది. ఆ పిలుపులో ఆనందముంది. ఇక్కడనుండి పారిపోవాలి. తొందరగా రా!"

"పారిపోవడమా ? ఎలాగ ?"

"దారిలో చెబుతాను ముందు బయలుదేరు. కబుర్లు కాదు. ఎంత తొందరగా వీలయితే, అంత తొందరగా, ఈ భల్లూక ప్రపంచాన్ని దాటాలి!" అదొక ఆదేశం!

ఆ హడావుడి తొందర, ఆదేశం... ఆమెకేమీ అర్థం కాలేదు. కృష్ణుడు తన ప్రాణం. గోవిందునిపై అపరిమిత నమ్మకం. విపరీతమైన మక్కువ. క్షణం కూడా విడువకూడదు. ఇప్పుడు ప్రతిక్షణం మనకు విలువైనదన్నాడు.

దుస్తులు సరిచేసుకుంది. జుత్తు ముడివేసుకుంది. "వూ" అంది. ముగ్గురు, రోహిణి వున్న గుహ దగ్గరకు వెళ్ళారు. అక్కడ వున్న ఆయుధాలు, అవసరమైన పట్కా వగైరాలు కృష్ణుడు చూపాడు. అవన్నీ తీసుకున్నాడు. సంతోషంతో బయలుదేర సిద్ధమౌతున్నారు.

ఇదివరకు ఒకదానితోనే బాధ. దానిని రక్షించాలి. ఇప్పుడు వీళ్ళ బాధ్యత తనది. నవ్వుకున్నాడు. ఇవి నావని, తన పిడికత్తి, కొడవలి, విల్లంబులను తీసుకున్నాడు.

"ఇవెలాగ వచ్చాయి ?' ఆసక్తిగా సత్య అడిగింది. "ష్" అంటూ నోటిమీద చెయ్యి వుంచి, బయలుదేరమని చేత్తో సైగ చేసాడు.

పరిస్థితి అంతా కలగా వుంది. పరిస్థితి అర్థం కావడం లేదు. ఏమీ అర్థంకాక తల పట్టుకున్న ఆమె "ప్రభూ! శ్యమంతక"మంది.

"ఇదిగో.... అని దానిని చూపాడు. ఒక్క రాత్రిలో ఇంతమార్పా" జాంబవతిని చిత్రంగా చూసింది. - మొత్తానికి మన అదృష్టం బాగుందనుకుంది. సూర్యుడు మీ నాన్నకిస్తే, నీ దేవుడు నీకిచ్చాడు తీసుకో. ఆ మాటకు సంతోషంతో ఆమె కళ్ళు చెమర్చాయి. ఎక్కడికక్కడ ఇద్దరిగా వచ్చి, ఇప్పుడు నల్గురయి బయలుదేరారు.

నడుస్తున్నది కాస్త ఆగిపోయి, "మన వూరి, మీనులు" అంది. వస్తాయి. వాటికోసం ఎదురుచూస్తే లాభం లేదు. ప్రతిక్షణం అత్యంత విలువైనది. నది ప్రక్క నుండి నడక మొదలుపెట్టారు. కృష్ణుడు ముందు నడుస్తున్నాడు. ఇరుప్రక్కల సత్య, జాంబవంతులు వారి వెనుక సాత్యకి.

"పరిస్థితి అర్థం చేసుకో. అవెక్కడైనా సుఖంగా వుంటాయి. ఎలాగో అలాగ మనల్ని కలుస్తాయన్నాడు. అడుగులు వేస్తున్నారు. ఆ మాటకు పిల్లుల్ని పిల్లల్ని విడిచిపెట్టినట్లు బాధ, కళ్ళలో నీళ్ళు. వాటిని పోగొట్టుకుంటున్నాననే బాధ కలిసివచ్చి, రోహిణిని తన ప్రభువుకు, "ఊరి, మీను"లను, ఈ భల్లూక ప్రపంచానికి అర్పించానని బాధపడసాగింది. ఇంతలో అసూయ.

నిన్నటివరకు చిలక-పలుకుల రాణి. ఇప్పుడు చెలియ. తనతో సమానం. కాదు, కాదు - తనకంటే ఎక్కువైపోయింది. తన బాధల్లో పంచుకుని, చనువు తీసుకుని, చనువుగా వుండే రోజులలో, నేను నీ భార్యగా వుండాలని చొరవ చేసుకుని అడగలేకపోయాను. లేదా, నువ్వే నా ప్రాణనాథుడవని చెప్పలేకపోయాను.

ఇప్పుడు భవిష్యత్తంతా సత్యకు అంధకారంగా కనుపిస్తుంది. ఇన్నాళ్ళు "నా ప్రభువు" అంటూ కలిసి మెలిసి తిరిగిన తను, ఇప్పుడు తిరిగి ద్వారకకు వెడితే, తండ్రిగారు రానిస్తారా ? యాదవులు మనిషిగా గుర్తించి గౌరవిస్తారా ? సాత్యకితో వెళ్ళిపోయి, ఇన్నాళ్ళు ఎక్కడ గడిపావంటే ఏం చెప్పాలి ?

ఇన్నాళ్ళు - గతం మరచి సుఖంగా గడిపాను. ఇప్పుడు - అసలైన దురదృష్టం- తనను సాదరంగా స్వాగతిస్తుంది. ఈ విశాల విశ్వంలో తననభిమానించే "వూరి" తప్పిపోయింది. ఇక నాకు దిక్కెవరు ? ఇది సత్యలోని ఆందోళన!

ఇక ప్రస్తుతం నాకు దేవుడే దిక్కు - ఆ సర్వాత్మకుడనే "క్షుద్ర మంత్ర దేవత నన్ను కరుణించి ఆరగిస్తే, నా ప్రభువు కృష్ణుని విడిచి పెడ్తే, వాళ్ళందరు సుఖంగా వుంటారు. ఈ భవబంధజలధి - అష్టకష్టాలను దాటి తాను సుఖంగా వుంటాననుకుంటుంది.

ఈ ఆలోచనల్తోనే ఏటిని దాటారు. ముఖాలు కడుక్కుని చల్లటి నీటిని తాగారు. ఇక అక్కడనుండి సుదీర్ఘ ప్రయాణం ప్రారంభం.

"ఎక్కడికి వెడుతున్నాం!" సత్య అడిగింది. కృష్ణుడు వేలితో గిరిశిఖరాన్ని చూపాడు. అది - ఈ భల్లూక ప్రపంచానికి తలమానికం వంటిది అన్నాడు. ఎక్కడం ప్రారంభించారు.

ఏటవాలుగా, ఎగుడు దిగుడుగా - ఎక్కడానికి కష్టంగానే వుంది. కృష్ణుడు, దారిచూపించే జాంబవతిని పట్టుకుంటే, సత్య ప్రక్కనే వుంది. సాత్యకి ఆమెకు సాయం చేస్తున్నాడు.

# దేవుడే, దిక్కు

తెల్లవారేసరికి వారు మొత్తానికి పాదపైభాగానికి వచ్చేసారు. అప్పుడు జాంబవతితో "ఇక భల్లూక రాజ్యం దాటాము. ఆ ప్రపంచం నుండి బయట పడ్డాము. నీ దీర్ఘకేశాల తలను సత్యకివ్వు. ఆమె దాన్ని ముడిగా చుడుతుంది. అప్పుడు నీ నడకకు, నీ జుత్తు అడ్డం రాదని చెప్పాడు. "అయితే జడవెయ్యి!" సత్యను చిన్నపిల్లలా అడిగింది. వంటిమీద ధరించడానికేమీ లేదు.

"ఎలాగుంది, ఈ పిల్ల అవతారం ?" చాలా బాగుంది కదూ, సత్య నడిగాడు.

"అవునవును. వుండవలసినట్లే వుంది. చాలా బాగుందంది సత్య. ఆ ప్రపంచమంతే కనుక, ఆక్షేపణ, అధిక్షేపణలక్కడ వుండవు.

ఆ వెంటనే సాత్యకిని అతని నడుమునున్న పంచను సత్యకిమ్మన్నాడు. ఆమె దానిని రెండు ముక్కలు చేసింది. ఒకటి నడుముకు, రెండోది వక్షాన్ని కప్పినట్లు కట్టింది.

రోహిణి, తెల్లబోయినట్లు - ఇటు కృష్ణుని, అటు సత్యను చూసింది. ఆయన చెప్పడం. ఈమె చెయ్యడం. అంటే...... ఈవిడ కూడా.......! అటు ఇటు తల త్రిప్పుతూ చూస్తుంది.

కృష్ణుడు సత్యను జాగ్రత్తగా చూస్తున్నాడు. ఆమె భుజంపై ప్రేమగా తన చేతిని వుంచి ఆమె అంతర్గత సంఘర్షణ నర్థం చేసుకోగల్గుతున్నాడు. "సత్యా! ద్వారకకు వెళ్ళేవరకు ప్రశాంతంగా వుండు. ఆ తర్వాత నేను నీకు కావల్సినంత సావకాశమిస్తాను. అప్పుడు, నీ ఇష్టం.

జాంబవతికి ఒక్కమాట అర్థం కాలేదు. మళ్ళీ మళ్ళీ కళ్ళు చిత్రంగా త్రిప్పుతూ మార్చి మార్చి చూస్తుంది.

"ద్వారకకు చేరాక.... కృష్ణుని మాటలు అర్థం కాలేదు. పెదవులు వణుకుతున్నాయి. అతడు కొంటెగా చూస్తున్నాడు. నవ్వుతున్నాడు. ఇక తాత్సార్యం చెయ్యకూడదని తలచాడు. బయలుదేరండి" హెచ్చరించాడు.

ఈ ప్రయాణం మార్గం చాలా దుర్గమంగా వుంది. సాత్యకీ నువ్వు ముందు నడు. విల్లంబులు సిద్ధంగా వుంచు. నేను "వూ" అంటేనే వుపయోగిద్దువు కాని. జాగ్రత్త అన్నాడు.

ఫర్వాలేదు. నేను అన్నింటికి సిద్ధంగా వున్నాను. ఏ దేవుడు వచ్చినా ఎదుర్కొంటాను. మీరు నిశ్చింతంగా వుండండన్నాడు. తెలియని ఉత్సాహం, తెలియని నిశ్చింత చెప్పలేని ధైర్యం పుంజుకున్నాడు.

ఆ దేవుడు - అదే సర్వాత్మకుడనే - క్షుద్రదేవత కనుపిస్తే - ధైర్యంగా ఎదుర్కొందాం. ఆ విషయం నాకు విడిచిపెట్టమన్నాడు. జాంబవతీ నువ్వా అన్నయ్య చెయ్యి పట్టుకో. సత్య నువ్వు ఒక చేత్తో జాంబవతిని, మరొక చేత్తో నన్ను పట్టుకో. జాగ్రత్తగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం.

ముందు సాత్యకి, వెనుక నేను - మీకే భయం లేదు. నడవండి. గొలుసు కట్టుగా నడిచే మనం ఏం జరిగినా చేతులు మాత్రం విడువకూడదు. ఏం జరిగినా అది మనమందరము కలిసే అనుభవిద్దాం. జాగ్రత్త.

"ఎవరైనా తడబడితే, విధిగా ప్రక్కనుండే వాళ్ళు ఆసరగా నిలబడాలి. ఊతమివ్వాలి. కనుక - ఈ గొలుసు ప్రయాణం క్షేమకరమని చెప్పాడు. సత్య దృఢంగా వుంది. ఎగిరే చిలకకు తోడుగా వుంటుంది. వీళ్ళకేదైనా అపకారం జరిగితే నేను ఆసరాగా వుంటాను." అన్నాడు. వాళ్ళు కలిసికట్టుగా నడుస్తున్నారు.

రాను, రాను పైకి వెళ్ళేసరికి, పచ్చదనం పోయి, ఎండి మోడువారిన, పొదలు, చెట్లు కనబడసాగాయి. వెడుతున్న కొద్దీ, కొండ భాగంలో మార్పు కనబడుతుంది. శిఖరాగ్రానికి చేరే దారి, ఎర్రటి రాతితో, వెడల్పైన మెట్లు కనబడుతున్నాయి.

పైకి శిఖరాగ్రాన్ని చేరేసరికి వాతావరణంలో చాలా మార్పు కల్గింది. నేలంతా జిగురుగా, వేడిగా వుంది. దూరంగా బుడబుడమనే నీటి శబ్దం. ఆగి ఆగి -

బుసకొడుతున్నట్లు శబ్దం. ధైర్యవంతుడైన సాత్యకి, ముందుకడుగు వెయ్యలేక ఆగిపోయాడు.

"గోవిందా - కింకర్తవ్యం. ఈ వాతావరణం...! నన్ను క్రిందకు లాగుతున్న ట్లుందన్నాడు. మాటలో తేడా - భగవంతుడు సదా మనల్ని రక్షించు గాక! నా కళ్ళు చాలా చురుకుగా పనిచేస్తున్నాయి ఆ పరమేశ్వరుడు మూడోకన్ను తెరచినట్లుంది. మన రక్షణకు వచ్చినట్లుంది. క్షణమాగారు.

"జాంబవతి కళ్ళు మూసుకో" అన్నాడు. తన నడుముకున్న పంచ నుండి గుడ్డముక్కను చింపాడు. జాంబవతి కళ్ళకు కట్టాడు.

లావాను కురిపించే అగ్నిపర్వతపు రాతిని చేరారు. మధ్య శిఖరం నుండి, కోణంగా - అదే శంఖంలా వున్న చోటునుండి, బుడ బుడ మని నీళ్ళు జాలువారే శబ్దమనుకుంటా, వస్తొంది. ఇప్పుడేం చెయ్యాలి ? పళ్ళెంలాగ, గుండ్రంగా వున్న ప్రాంతం నుండి, క్రింద లోయలోకి పడుతుందనుకుంటాను.

ఆ ప్రక్కనే మనుష్యుల, జంతువుల అస్థిపంజరాలు కనుపించాయి. అవన్నీ క్షుద్రదేవతకు, దఫదఫాలుగా అర్పించినవనుకుంటాను. కొన్ని కుళ్ళి, కంపు గొడుతున్నాయి.

తెలియని వణుకు, దడ ప్రారంభమయ్యాయి.

వాళ్ళిప్పుడు - ఆ దేవుడనబడే క్షుద్రదేవత మందిరం ప్రక్కనుండే నడుస్తున్నారు.

ఎంతో ధైర్యం, అయినా కొంత భయం. అలాగే నడుస్తున్నారు.

★★★★

కృష్ణుడు, అతిరథులుపయోగించే మహాధనస్సు, ఇనుపకొన గల అంబులున్న అమ్ములపొది, సాత్యకి నుండి తీసుకున్నాడు.

నడుస్తున్నారు.

ఉన్నట్టుండి సత్య, కృష్ణుని చెయ్యి పట్టుకుంది.

"ప్రభూ! అటు చూడండి" అంది. ఆమె కళ్ళు విచ్చుకున్నాయి. వేలి పెట్టి చూపుతూ, అది లోయలోకి క్రిందకు దిగడానికి వీలుగా వున్న దారిలా కనుపిస్తుందంది.

సత్య చూపిన ప్రాంతాన్ని కృష్ణుడు దీక్షగా చూసాడు. ఒక పెద్ద... ముప్ఫయి, నలభై అడుగుల వున్న నల్లటి పాము, దారికడ్డంగా, ఎటు కదలడానికి వీల్లేకుండా, తలను, బద్ధకంగా కదలిస్తుంది.

పొదల వెనుకగల నలుగుర్ని చూసి బుస కొడుతున్నట్లు, కోపంగా చూస్తుందది. పసుపుపచ్చగా సూదిగా, పొడుగుగా గల నాలికను మాటిమాటికి ఆడిస్తుంది.

కళ్ళకు గంతలు కట్టుకున్న జాంబవతి, సర్వాత్మకుని రక్షణను కోరుతూ వందనం చేసింది. సత్య కళ్ళు తెరవడానికిష్టపడటం లేదు.

ఆ పాము మనల్ని చూసిందా ? అదెంత పొడుగుంది ? భయంతో వణుకుతూ, సత్య అడుగుతుంది.

దానిని పరశీలనగా చూసిన సాత్యకి "అది, ఈ భూమండలాన్ని తన శిరస్సున మోసే అనంతుడై వుండాలని" చేతులు మోడ్చాడు.

"నిజంగా అనంతుడే - అయితే వీని దర్శనంతో మనం ధన్యులమయ్యా" మన్నాడు కృష్ణుడు.

అయితే ముందు అందరం కదలకుండా, మాట్లాడకుండా నిల్చుందా మన్నాడు. అలాగ కనుక చెయ్యకపోతే, మనం పిచ్చివాళ్ళమై పోతాము. మనకు తెలియకుండానే నోటికి ఆహారమైపోతామన్నాడు. దానితో -

సత్య, కృష్ణుని ప్రక్కన నిల్చుంది. ఎందుకంటే ఆ దేవుడు, కృష్ణునితోపాటు ముందు తనను మ్రింగేయాలన్నది సత్య ఆలోచన. ఇద్దరం విడిపోకూడదని, కనీసం, ఈ దేహ విసర్జనానంతరమైనా, శ్రీకృష్ణుని సన్నిధిలో, హృదయంలో శాశ్వత నివాసమొంది వుండాలన్నది సత్యభామ - భావన.

ఈ ఆలోచన ఇలాగే వుంది. కృష్ణుడు తామున్న పొదలనుండి ముందుకు వచ్చాడు. ముందుకు వెడుతున్నాడు. సత్య, సాత్యకి - గుండెల్లో దడ, గుబులు. తీవ్రంగా చూస్తూ వాసుదేవుడలాగ వెడుతూంటే, గుడ్లప్పగించి వాళ్ళు చూస్తున్నారు.

కృష్ణుడు బొమ్మలాగ నిల్చున్నాడు. చేతిలో విల్లంబులు. చుట్టు వలయాకార కాంతి, చిత్రమైన మాటలు.

"వేయి నాల్కల ఆదిశేషా!

నువ్వు నిజంగా ముల్లోకాలను భరించే శేషుడివే అయితే, ఒక్కసారి ఇటు చూడు.

నువు కాలమైతే, ముల్లోకాలు ప్రళయకాలంలో విలయంగా కలిసిపోతాయి.

అప్పుడు వెలిగి నివసించేది వటపత్రశాయి.

ఆ "శాయి" ఇక్కడ నిల్చున్నాడు.

దారిచ్చి - ప్రక్కకు తొలగిపో!

కృష్ణుని చూపులు, హెచ్చరిక, చూపులలోని కాంతి, సూటిగా అనంతుని - కాలాత్ముని, కాలపురుషుడిని చేరాయి.

ఆ కాలపురుషుడైన - కాలాత్మక, సర్వేశ్వరుడు కనురెప్పలు లేని కళ్ళతో కృష్ణుని చూసాడు. కొన్ని క్షణాలు అలాగ చూసి, అడ్డంగా పడుక్కుని ఆ తదుపరి గుండ్రంగా, ఆ భయంకరరూపం తల అటు, ఇటు త్రిప్పింది. పెద్ద శబ్దం చేస్తూ బుసకొట్టింది.

అమ్మో!, ఆ కాలాత్ముడు, నోరు తెరిస్తే, వాసుదేవుడు, దాని నోట్లోకి జర్రున జారిపోతాడు. నేను ద్వారకకు వెళ్ళను. నాకెవరు వద్దు. నేనే ముందు ఆహారమవుతాను. సంతోషంగా నా జీవితాన్ని నా దేవుని కోసం చాలించు కుంటాను" సత్య, అనుకుంటుంది.

అవయవాలు వణుకుతున్నాయి. కళ్ళు ఆ కాలపురుషునిపై పెట్టింది. ధైర్యం తెచ్చుకుంది.

"ఓ కాలపురుషా! నన్ను నీ ఆహారంగా స్వీకరించు. ~~ఈ~~ కృష్ణుని, వసుదేవ సుతుని, సద్ధర్మమూర్తికి ఏ అపకారం చెయ్యకు." అది ప్రార్థన. మనసులో నిర్విరామంగా చేస్తుంది.

ఆ పాము పెద్దగా బుస కొడుతుంది. పొద నుండి బయటికి వచ్చింది. ఆమె మనసులో జరిగే సంఘర్షణను గోవిందుడు చాలా బాగా గుర్తించాడు. మనసులోని భావాన్ని తెలుసుకున్నాడు.

తల త్రిప్పలేదు. కళ్ళు కదపలేదు. శరీరమలాగే నిశ్చలంగా వుంది. గట్టిగా ఆమె మణికట్టును పట్టుకున్నాడు. ఒక్కతోపు వెనక్కి తోసాడు. నువ్వు

నాయకురాలివి కావాలంటే, నాలోని నాయకత్వాన్ని సవాలుగా స్వీకరించి ఆనందించు! నా శక్తిని చూడు! హెచ్చరించాడు.

ఆ తోపుకు వెల్లకింతలా పడింది.

శరీరంలోని అణువణువు - శక్తివంతమైనట్లు అయింది.

అందరు నిలబడే వున్నారు. నిశ్చలంగా వున్నారు. పర్యవసానానికై ఎదురు చూస్తున్నారు. అలాగ ఎన్నాళ్ళు నిలవాలో - అన్నట్లుంది. కృష్ణుని నిశ్చల రూపానికి, క్రూరంగా - భయంకరంగా విషజ్వాలలు చిమ్మేటట్లు చూస్తూందా సర్పం.

క్షణాలు గడుస్తున్నాయి.

ఏ ఒక్కరు కదలడం లేదు.

అప్పుడు - ఆ పాము...

కృష్ణుని మీదకు రాకుండా, గుండులాగ మధ్యలో వున్న శిఖరకొనవైపు సాగుతుంది. అటునుండే బుడ బుడ మనే శబ్దంతో నీళ్ళు - పొగలు చిమ్ముతూ వస్తున్నాయి.

ఉచ్ఛ్వాసానిశ్వాసల శబ్దం లేకుండా, వూపిరి బిగపెట్టి, అసహనంతో, అగ్నికీలలు ప్రసరించే ప్రాంతానికి వెళ్ళడం గమనిస్తున్నారు. అలాగ ముందుకు వెళ్ళిపోయింది. అలా వెళ్ళి వెళ్ళి - అదృశ్యమైపోయిందది.

అది నీళ్ళ అడుగులోకి జారిపోయిన పెద్దశబ్దం వినిపించింది. అది నీటిలోని తన స్వస్థానానికి వెళ్ళిపోయింది. అప్పుడు - కృష్ణుడు -

సాత్యకి - వాళ్ళవైపు తిరిగాడు. "సాత్యకి - ఈ కొడవలి తీసుకో. సిద్ధంగా వుండు. సత్యను పట్టుకో. నేను జాంబవతిని పట్టుకుంటాను. మనం ఏ మాత్రం తొట్రుపడకుండా జారకుండా నడవాలి.

ఆ కాలాత్ముని శరీరం విడిచిన ద్రవంలో పడి జారకుండా జాగ్రత్తగా అడుగు వెయ్యాలి అంటున్నాడు. కదలడానికి సిద్ధపడుతున్న తరుణంలో - వాళ్లకు చిరపరచితమైన శబ్దం "మ్యావు" వినిపించింది. అది స్పష్టంగా లేదు. సగమే వినిపిస్తుంది.

కొన్ని క్షణాలకు వూరి, తన నోటిలో మేనకను పట్టుకుని అతి ప్రయాసతో కొండనెక్కి వీళ్ళ దగ్గరకు వచ్చింది. వాటిని చూడగానే అంతవరకు పడ్డ శ్రమ

తొలగిపోయింది. భయం పారిపోయింది. "వూరి" అన్న సత్యభామ ఆనందానికైతే హద్దులే లేవు.

అది నిజంగా సత్యభామ ప్రాణదాత. ఆ అడవిలో తన దేవుడు కృష్ణుని చూసి, కరుణించి, తనకు బ్రతుకునిచ్చిన, నిజమైన దేవత. అందరికళ్ళలో ఆనందం. ద్వారకలో అడుగుపెట్టినంత ఆనందం. ఇక ప్రాణాపాయం లేదన్న మహా - మహా - మనోధైర్యం కలిగింది.

వూరి - తన నోటిలోని "మిను"ను విడిచి సత్య దగ్గరకు పరుగెత్తింది. ఆమె దానిని చేతులలోకి తీసుకుని, వీపు రుద్దింది. ముద్దు పెట్టుకుంది. ఇప్పుడు సత్య ప్రాణం నిజంగా లేచి వచ్చింది. బ్రతకాలనే ధైర్యం కలుగసాగింది.

"ఊర్వశి" సత్య చేతులలో "మ్యావు"మంటూంటే, మేనక - కృష్ణుని చేరింది. అతని పాదాలను రుద్దడం మొదలుపెట్టింది. నిజంగా అద్భుత సమావేశమది. మహాద్భుత సంఘటన, కూడా!...

"ప్రభూ! చూసారా ఆ మేనకను. అది నీకు శరణాగతురాలంది" నవ్వుతూ.

అదే - నా దురదృష్టమని దానిని ఓ చేత్తో ఎత్తి పట్టుకున్నాడు. ఇది నేను లేకుండా బ్రతుకలేదు. మేనక లేకుండా ఊర్వశి బ్రతుకలేదు. ఊర్వశి లేకుండా నువ్వు బ్రతుకలేవు. ఇక - ఆ మేనక శాశ్వతంగా వుండాలంటే... చేయవలసింది ఒక్కటే!" అని ఆగాడు.

"చెప్పు వాసుదేవా!" ఏమిటో తెలుసుకోవాలని అడిగింది.

"ఒకరికోసం మరొకరిమయ్యాము. కాబట్టి, నన్ను విడువలేని మేనక కోసం, నేను నిన్ను విడువకుండా వివాహం చేసుకుంటే, అందరం హాయిగా వుంటాము.

ఈ ఆరాట-పోరాటాలు మనల దరిచేరవు. అంతకు మించి మరో మార్గం లేదన్నాడు. నవ్వుతూ - నవ్వులరేడు, ఆ గోవిందుడు!

అందరు నవ్వులు చిందించారు.

ఇక ముందుకు సాగాలి.

ఆ ప్రయాణానికి శుభసూచకంగా ఊర్వశి, తన సంతానమైన మేనకతో వచ్చింది. మేను పులకరింపచేసింది.

ఇప్పుడందరిలో ధైర్యం వచ్చింది.

అంతకుమించి - కృష్ణుడలాగ బొమ్మలా నిలబడడం, ఆ అనంతునితో గొణుగుతూ మాట్లాడటం, కాస్సేపు భయంకరంగా చూసి, బుసలు కొట్టి, అందరిలో భయాన్ని రేకించిన ఆ పెద్ద - విచిత్రమైన పాము, చివరకు కృష్ణుని ఆజ్ఞను శిరసావహించినట్లు, విధిలేక కదలడం ఇదంతా చూస్తే - ముందు జాంబవతి, ఆ తదుపరి సత్య ఆవేశానందాలకు పొగడ్తలు చేయడానికి ఏ మాత్రం వీలు కల్పించకుండా, విశ్వాత్మకుడైన ఆ వాసుదేవుడు -

ఇటు వూర్వశి - మేనకలను రప్పించి, వారి ప్రేమలో వారందర్నీ ముంచి మురిపింప చేసి -

నవ్వుల పువ్వులు కురిపించాడు.

ఇక అందరి ప్రయాణమిపుడు ద్వారకకే!

ఇదిలా వుంటే - ఆ ద్వారకలో...!

# ఏం చేస్తాం, కర్మ, కర్మ!

**అ**ది మధ్యాహ్న సమయం.

శ్యమంతకమా; నాకొద్దు!

విశ్రాంతి తీసుకుని నిద్రలేచిన సత్రాజిత్తు కళ్ళు నులుముకున్నాడు. గతం గుర్తుకు చేసుకుంటున్నాడు. గత కొద్ది వారాలలో, సత్రాజిత్తులో తెలియని మార్పు చిత్రమైన స్థితి. అతన్ని చూసినవాళ్ళు, "ఇతడు నిన్న, మొన్నటి సత్రాజిత్తేనే" అని అనుకుంటున్నారు. కొట్టవచ్చినట్లు అతనిలో మార్పు చోటు చేసుకుంది.

నిద్రకు దూరమయ్యాడు. ఉదయం వేళలో కొద్దిపాటి నిద్ర నాశ్రయిస్తున్నాడు. ఒక్కొక్కసారి సాయంకాలం తీసుకునే, ఆ కాస్త విశ్రాంతికి కరువయ్యాడు. రాత్రిళ్ళు సరేసరి. భయంకరమైన కలలతో వులికి, వులికి పడుతున్నాడు. నిద్రలేమికి దగ్గరయ్యాడు.

ఆకలి వుంది, తినలేడు. అసహనం. ఎవరిని చూసినా విపరీతమైన కోపం. భార్యలు, పిల్లలు బద్ధ శత్రువులుగా కనిపిస్తున్నారు. అది నిద్రయినా మెలకువ అయినా, గతాన్ని మరచిపోలేకుండా వున్నాడు. అసలే వయసు వచ్చిన పెద్దవాడు. గత వారం రోజుల క్రిందట జరిగిన సంఘటనలొక్కొక్కటి గుర్తుకు వచ్చి అతన్ని భయపెడుతున్నాయి. బాధపెడుతున్నాయి.

వరండాలో కూర్చోవడం. మగతతో తూలడం. మతిమరుపు. శూన్యం వైపు చూపులు. చెబుతున్నది వినలేకపోవడం, కనుపించిన వారిపైబడి, కరచినట్లు అరవడం... మొత్తానికి పరిస్థితి దారుణమయింది. అసలే అసహనం. అది పెరిగి పెద్దదయింది.

ఎవర్ని చూసినా, ఏదో తప్పు చేసినట్లు కసురుకోవడం. బయటికి చెప్పుకోలేని బాధతో కుమిలిపోవడం. ఈ పరిస్థితులలో అయినవాళ్ళందరు దూరమయ్యారు - ఎవరైనా పిలిస్తే వెళ్ళడం, చెప్పేది వినడం. చెయ్యమన్నది చెయ్యడం. అది ప్రస్తుతం వారి నిత్యకృత్యమైంది.

ఎప్పుడు అవే ఆలోచనలు, అవే సంఘటనలు.

ప్రతిదీ గుర్తుకు రావడం. కళ్ళకెదురుగా కనుపిస్తూ - అవి ప్రతిఘటిస్తూ- హెచ్చరిస్తూంటే చెప్పలేని వేదన. ముఖ్యంగా -

“యాదవుల సంక్షేమానికి, సత్రాజిత్తూ! యదుకుల ప్రముఖునిగా, శ్యమంతకమణిని మహారాజుకివ్వు. అది మహామనిషి అక్రూరుల వారి వద్ద భద్రంగా వుంటుంది. నీకు పేరు ప్రతిష్ఠలు. సమాజానికి సంక్షేమసూచిక అవుతుంది. ఆలోచించుకో! అందులో హెచ్చరిక వుంది. అందరికి అందాల్సిన సంపద, కొందరి చేతులలోనే మూలిగితే, సమాజ వినాశనానికి దారి తీస్తుందన్నాడు. రేపటి సాయం కాలంలోగా -మహారాజుకు నీకుగా నీవివ్వకపోతే - దానిని వారికందేటట్లు చేస్తాను. చూస్తాననడం...

గుండె దడ పుట్టించి, తన వైభవమంతా కోల్పోయినట్లు బాధపడటం... కళ్ళకు ప్రత్యక్షంగా, నిజంగా చూస్తున్నట్లు కనబడుతుంది. ఇది ఒక నేరం.

“మహారాజు ముందర నిలబెట్టి, నువ్వు దొంగవని పదిమందిలో అల్లరి పాల్జేయడం, మరొక నేరం. ఇదీ కళ్ళకు కనబడుతుంది. ఇది రెండవది.

ఇక - మూడవది. తన మూర్ఖ ప్రవర్తనకు కోపించినట్లు, సత్యభామ తనను కాదని, ఇంట్లోంచి వెళ్ళిపోవడం.

నాల్గవది - జరిగినదానికి సాత్యకుని నిలబెట్టి పరువు తియ్యాలనుకుంటే, అతని పిల్లవాడు యుయుధాను సాత్యకికి కనబడకపోవడం... వూరంతా, సత్య - సాత్యకిలు - కలిసికట్టుగా లేచిపోయారనే ప్రచారం.

దీనికి తోడు, తానన్నమాట నిలబెట్టుకునేందుకు కృష్ణుడు ద్వారకని విడిచి పోవడం, అదేదో తన వల్లనే జరిగిందని, బలరాముడు నిగ్రహించడం... ఒక్కొక్కటి కళ్ళకు కనబడుతూంటే, హృదయంలో ఆరనిమంటలు రగులుతూంటే -

శ్రీ సూర్యదేవుడిచ్చిన శ్యమంతకమణి, తన మూర్ఖత్వం-పొరపాటుతో ఇన్ని అవస్థలు తీసుకురావడం, తననుండి దూరమవడం గుండెను పిండి చేస్తూంది.

కృష్ణుని బలపరాక్రమాల శక్తి తెలిసి, అతని గుప్పిట నుండి శ్యమంతకాన్ని దక్కించుకోవాలని తమ్ముడు ప్రసేనునితో, ఆ పవిత్ర గుహకు పంపితే, తమ్ముడు- సింహం చేతుల్లో దారుణంగా చావడం, శ్యమంతకమణిపోవడం....... దారుణ దుఃఖాన్ని, తీరని వ్యథను కల్గించింది. మతిభ్రష్టుడిని చేసింది.

ఇన్ని దురాగతాలు, తన మూర్ఖత్వం, మొండితనం గర్వాహంకారాలతో జరిగి, సమాజంలో పరువు ప్రతిష్ఠలను కోల్పోవడంతోపాటు, ఇల్లు విడిచి బయటికి వెళ్ళలేని దుస్థితి బయటివారితో తలెత్తి పలుకరించలేని దుస్థితిని కల్గించింది. ఇక ఇలాగే మగ్గి మగ్గి చావాలని, ఆ భగవంతుడు నా మొహాన రాశాడని, ఆ పరమ మూర్ఖ - వంచక - మోసక - సత్రాజిత్తు కుళ్ళి కుళ్ళి - ఏడుస్తున్నాడు.

సుఖంగా వున్న ప్రాణం దుఃఖానికి గురయిందంటే, ఇదేనేమో... సమాజ సంక్షేమానికై రాజు వద్ద వుంచమన్న కృష్ణుని కోరిక తీరిస్తే -

తనకు గౌరవం దక్కేది. తమ్ముడు చచ్చిపోయేవాడు కాడు. తన చేష్టలతో విసిగిన కుమార్తె - ఇల్లు విడిచి పారిపోయేది కాదు. పోనీ... ఇవన్నీ కాదనుకున్న...

అందరు మెచ్చుకునే కృష్ణుడు, పాండవుల కోసం, నగరాభివృద్ధకి చేయూత నిమ్మని అడిగితే, దానికి సహకరిస్తే అసలీ - శ్యమంతకోపాఖ్యానం వచ్చేది కాదు.

అన్నీ తను చేజేతులా చేసుకున్న దుష్కర్మలు. అందుకేనేమో... నవ్వుతూ చేసిన పాపం ఫలితం, ఏడుస్తూ అనుభవించాలనే.... సామెత చెప్పింది.

మొత్తానికి తాను అన్యాయమైపోయాడు.

తమ్మునితో వెళ్ళిన అశ్వికుడు వచ్చి ప్రసేనులవారు సింహం చేతులలో చచ్చిపోయారంటే, పరుగు పరుగున వెళ్ళి, ఆకారంలేని, ఆ అస్తిపంజరా న్నిక్కడకు తీసుకు రాలేక అక్కడే ఖననం చేసి వచ్చాడు. అది మహాదారుణం, వూహించరాని భీభత్సం.

ఇంత పెద్ద శిక్ష పడుతుందనుకుంటే, అనుభవించాలని అనుకుంటే, ఈ తప్పు చేసేవాడు కాదు. ఇప్పుడు చెప్పుకోలేక లోలోపలే కుళ్ళి కృశించిపోతున్నాడు.

ఈ బాధకు తోడు, తనకింత వైభవాన్ని, గర్వాహంకారాలను తెచ్చిపెట్టి, సమాజభ్రష్టునిగా తయారవడానికి కారకమైన ఆ శ్యమంతకమెక్కడ ? దానికోసం తాను ఎంత ప్రయత్నించాడు. అతను నడుముకు పెట్టుకునే ఒక గొప్ప ఆభరణం, ఇతర నగలు దొరికాయే తప్ప శ్యమంతకం జాడ కనబడలేదు.

అది ఏమయినట్లు ?

సింహపు పాదముద్రలను బట్టి వెళ్ళాడు. అయితే ఏం లాభం. దానిని గ్రద్దలు వగైరా క్రూరజంతువులు తింటున్నాయి. అటువంటప్పుడు, శ్యమంతకం జాడ ఎలాగ తెలుస్తుంది. ఆచూకీ ఎవరు చెబుతారు!

సింహం దానిని తీసుకువెళ్ళిందా ? ఆ సింహాన్ని చంపిన ఎలుగు, ఆ శ్యమంతకాన్ని తీసుకువెళ్ళిందా ?

అక్కడ ఎన్నో అడుగుజాడలున్నాయి. చాలామంది వచ్చినట్లు తెలుస్తూంది. ఆ అడుగుజాడలెవరివి ? సింహాన్ని చంపిన ఎలుగు అడుగుజాడ ఒకటే లేదు. దానితో మరొకటి అంటే - రెండు భల్లూకాలు సింహాన్ని చంపాయంటే, అవి నిజంగా భల్లూకాలా ? లేక... ?!

ఆ పాదముద్రల్ని బట్టి అది మనిషిదో, జంతువుదో అక్కడున్న పరిస్థితిలో, నిర్ధారించడం కష్టం. అవి జాంబవంతుడివా ? అది జాంబవంతుడివే అయితే ఆ ఎలుగు, అతని సహచరుడై వుండాలి.

ఆ పరిసరాల్ని గమనించడంలో, కొన్ని గుడ్డపీలికలు ముళ్ళపొదల్ని తగుల్కొని కనుపించాయి. అవి ఆడవాళ్ళవి. ఆమె లోయలో పడి వెళ్ళి వుండాలి. ఎవరో, ఏవిటో తెలుసుకొనాలని, ఖంగాకరుతో వెళ్ళాడు. కానీ, అక్కడే ఆడది దొరకలేదు. కేవలం కొన్ని పాదముద్రలు కనుపించాయి.

ఆమె సత్యభామా ? ఏమయినా ప్రమాదానికి గురయిందా ? దాంతో గుండెదడ. ఆ బట్టలు చూస్తే భామవిలాగే వున్నయి. అంటే సింహాన్ని చంపిన, జాంబవతాదులు, ఈమెను చూసి అపహరించుకుపోయారా ?

అక్కడ కనుపించే అడుగుజాడల్ని బట్టి పరిశీలనగా చూస్తే, చాలామంది, పవిత్ర గుహలోకి వెళ్లినట్లు తెలుస్తుంది. వెళ్ళాడు. ఆ ప్రాంతమంతా చూసాడు. ఆ గుహకు వెళ్ళిచూస్తే, అతని ఆలోచన ప్రకారం, కొంతమంది ఆ గుహలోకి వెళ్ళారన్నది నిజమయింది.

చాలారోజులుగా ఆ గుహలో ఒక ఎలుగుబంటి వుంటున్నట్లు - అక్కడ దొరికిన సాక్ష్యాలను బట్టి తెలుసుకోవచ్చును, కొంతమంది మనుష్యులు కూడా వున్నారు. వాళ్ళెవరు ? ఎలుగుబంటి అక్కడెందుకుంది ? సమాధానం దొరకని ప్రశ్నలు ?

భల్లూకరాజు జాంబవంతుడు, శ్యమంతకమణిని తన కూతురు సత్యభామను తీసుకుపోయి వుంటాడు. అతని దగ్గరకు వెడదామనుకున్నాడు. కానీ -

జాంబవంతుడు కొన్ని సం॥గా, అక్కడి పరిస్థితుల్ని వివరించి, తన కుమార్తెను, తన కొడుకుకిచ్చి, వివాహం చేయించమని కోరుతున్నాడు. మొదట్లో ఒప్పుకున్న తాను రాను రాను కాదనలేక ఇదిగో, అదిగో... అంటూ తానుగా కాదనలేక వాయిదా వేస్తున్నాడు.

ఆ ఆశలతోనే జాంబవంతుని ప్రలోభపరచి తాను బంగారు ఇసుకను సంపాదిస్తున్నాడు. శ్యమంతకం పేరిట, తాను సంపన్నుడౌతున్నాడు.

ఇప్పుడు తాను కనుక... అతని దగ్గరకు వెడితే...

ఆ ఆలోచన సత్రాజిత్తును భయపెట్టి దడదడ వణికిస్తుంది. అయినాసరే, తెగించి పవిత్ర గుహకు బయలుదేరాడు.

★★★★

జాంబవంతుడు పిచ్చివాడు, అమాయకుడు.

తన మాయమాటలన్నీ నమ్మాడు. అతని కుమార్తెను ఆ బానిసను, భల్లూక పుత్రికను, నాగరికుడు, మేధావంతుడు, అతిరథుడు, ఆర్యపుత్రుడైన, భంగాకరుడు వివాహం చేసుకోవడమా ?

అది జరగని పని.

అయినా ఆతడు ఆశపడుతున్నాడు.

అతని అమాయికత్వం నాకు ఆస్తి అయింది. అతనికి ఆశ అయింది. పెద్దా చిన్న, మంచి మర్యాద, అంతరం చూడకుండా, ఆ ఆశపోతు అడగడమేనా ? కార్యసాధకుడు తెలివిగా ప్రవర్తించాలి.

నేను, అదే చేసాను. నా పంట పండించుకున్నాను. నాది ఆశకాదు. కానీ, అతనిది పేరాశ, దురాశ. ఎవరికి తగ్గ సంబంధ వాళ్ళు చూసుకోవాలి. కానీ, ఉట్టికెగురలేమన్న, స్వర్గానికి... ఎగిరిందన్నట్లు ప్రవర్తించడం, తగునా ?

ఏది ఏమైనా ప్రస్తుతం నేను దురదృష్టవంతుడనయ్యాను.

దురాశ దుఃఖహేతువని, బంగారు ఇసుక కోసంపడ్డ పేరాశ ప్రయత్నం, బెడిసికొట్టిందనుకున్నవాడు తనను తాను సమర్థించుకుంటూ.... నా అదృష్టం బాగుంది కాబట్టి, ఈ మారు భంగాకరుడిని నాతో తెచ్చుకున్నాను.

భల్లూక భూమికి వెళ్ళి భంగాకరుడితో జాంబవంతుని కుమార్తెతో వివాహం చేయించి, తన శ్యమంతకాన్ని, సత్యభామను తెచ్చుకోవాలని తలచి బయలు దేరాడు. తీరా, అక్కడికి వెళ్ళి మడుగు దాటితే, ఆ ప్రాంతమంతా బండరాళ్ళతో మూసెయ్యబడింది. ఎగువ గుహ కూడా రాళ్ళతో కప్పబడి వుంది.

అయిపోయింది. తన ఆశ పేరాశ అయిందని నిరుత్సాహంతో కృంగి పోయాడు. తలబాదుకున్నాడు. ఇక భల్లూకరాజ్యానికి వెళ్ళలేడు. వాళ్ళతో సంబంధ బాంధవ్యాలు పెంచుకోలేడు. వచ్చే బంగారపు ఇసుక పోయింది. మూర్ఖంతో ఇటు శ్యమంతకమణి, అటు సత్యభామ సర్వం కోల్పోయి, అసలు సిసలైన దురదృష్టవంతునిగా మిగిలిపోయాడు.

సత్రాజిత్తు - తన కుమారునితో రెండురోజులపాటు, ఆ పవిత్ర గుహలో వున్నాడు. ఏదైనా మంచి జరుగుతుందని తలిచాడు. జాంబవంతుడీ సూర్య గుహకు రాలేదు. ఏ మేలు కలుగలేదు.

శ్యమంతకం పోయింది. సత్యభామ పోయింది. భల్లూక రాజ్యానికి వెళ్ళే దారి మూసుకుపోయింది. బంగారు ఇసుక పోయింది. కొన్ని సం॥ల శ్రమ కాల గర్భంలో, చెప్పలేని చిరునామా తెలియని చరిత్ర అయిపోయింది.

పదుగురిలో పరువు పోయింది. సమాజం చిన్నచూపు చూస్తుంది. యాదవ ప్రముఖునిగా, మహారాజుతో సమానంగా, విలసిల్లాలనే అతని కోరిక అడుగంటి పోయింది. ఇన్నాళ్ళు విర్రవీగిన సత్రాజిత్తు - ఇప్పుడు సామాన్యుడు. సమాజద్రోహి. నిరాధారుడు. ఎవ్వడు లెక్కచెయ్యని, పరమర్శించరాని, పరమపాపి, కృతఘ్నుడు అయిపోయాడు.

ఇప్పుడిక సూర్యుని కరుణ తొలగిపోయింది.

ఇక ఆ భగవానుడు కనికరించడు.

గత ప్రాభవమంతా చరిత్ర. ప్రస్తుత దశ - హీనచరిత్ర.

ఆ పవిత్ర - సూర్య గుహముందర కూర్చుని గుండె పగిలేలా ఏడ్చాడు. ఇక మిగిలింది-జీవితానికంతా తొలగని విచారం. ఆగని దుఃఖం. అనంత శోకం.

తండ్రి స్థితిని గమనించిన కుమారుడు భంగాకరుడు, తండ్రి భుజంపై చెయ్యివేసి ఓదారుస్తున్నాడు. ఉన్నది చాలు, దాంతోనే తృప్తి పడమని వూరడిస్తున్నాడు. తండ్రి ఆ విధంగా బాధపడటం కొడుకుగా చూడటమిదే మొదటిసారి.

నిజమే, ఇది చాలా పెద్ద దెబ్బ, వూహించని కముకు దెబ్బ. దీనినుండి తేరుకోవడం చాలా కష్టం. అచేతనుడై - సదా - దుఃఖించడమే ఈ దెబ్బకు పరిష్కారం. అంతకుమించి మరో మార్గం లేదు. ఇటువంటి దుస్థితి మరెవ్వరికి రాకూడదు. ఇది కుమారుని ఆలోచన!

ఆ భగ్నహృదయుడు అతి భారంగా ద్వారకలో అడుగుపెట్టాడు. నిజానికీ ద్వారక, కృష్ణుడు పెట్టిన భిక్ష. లేకపోతే మధురలో అడుగుపెట్టలేనివాడు, కంస

మరణంతో, యాదవులకు చేరువయ్యాడు. అది మరచిన ఫలితం - ప్రస్తుతం సత్రాజిత్తుకు దాపురించిన, దురవస్థ కథనమయింది.

ఇన్నాళ్ళ తన పూజ నిరర్థకమయింది. తన బ్రతుకు నాశనమయింది. ఒకటికి - రెండు, కోలుకోని దెబ్బలు. మానని గాయాలు. రాత్రింబగళ్ళు - ఏడవటమే ఒక కార్యక్రమమై పోయిందతనికి! సూర్యుని కరుణ తప్పిన తనకు ముక్తి లేదు. మోక్షం రాదు.

ఈ స్థితిలో సత్రాజిత్తు పెద్దభార్య ద్వారవతి భయపడుతూ, ఆహార పళ్ళెం తెచ్చి ఆయన ముందు పెట్టింది. ప్రక్కకు జరిగి, మౌనంగా, మర్యాదగా నిల్చుంది. ఆహారం తీసుకుంటాడని, అలాగ ఎదురుచూస్తుంది. కానీ ఆయనలో చలనం లేదు. నిర్వికారునిగా నిలిచిపోయాడు.

ఈలోగా కొన్ని గొంతుకలు మాట్లాడుతున్నాయి. కొంత గందరగోళం. తెలియని అశాంతితో వున్న సత్రాజిత్తు, ఆ గొడవకు రెచ్చిపోయాడు. "నోర్మూసుకుని వుండలేరా......!" ఎంతో గట్టిగా అరిచాడు. కాని అది ఆతని గొంతులోనే ఆగిపోయింది.

అందర్ని త్రోసి రాజంటూ, అడ్డమొచ్చినవార్ని కాదంటూ, అతిశ్రమలకోర్చి వచ్చిన సత్యభామ తండ్రిని చూడబోయింది. ఆ పరిస్థితి ఎలాగ వుంటుందో తెలియని వారంతా ఎంతో భయపడిపోతున్నారు. కొన్ని వారాలుగా తాను పొందిన కష్టాల నుండి విముక్తి పొంది, తృప్తిగా - ఇంటికి వచ్చిన ఆమెకు, ఎంతో సంతోషంగా వుంది.

ఇన్నాళ్ళు ఒంటిమీద గుడ్డ - "వుందో లేదో" అన్నట్లు బ్రతికిన ఆమె వంటినిండా బట్టలు కట్టుకుంది. మనస్సెంతో సంతోషంగా వుంది. ఆమె కూడా ఎంతో అందంగా తయారయింది. తండ్రిని సమీపించింది.

ఆ రకంగా పిల్లను చూసిన సత్రాజిత్తు - అది కలో, నిజమో... వూహించలేక పోతున్నాడు. తన సత్య తిరిగి వచ్చిందా... ? ఇది కలకాదు కదా! - లేక - తాను భ్రమిస్తున్నాడా... ఏమీ అర్థం కావడం లేదు. అందుకనే "అమ్మా" అని పిలిచాడు.

"నాన్నా!" ఎంతో సంతోషంగా తండ్రిని చేరింది, సత్యభామ!

చూస్తున్నాడు. చూసినవాడు “నిజం” కూతురు వచ్చిందనుకున్నాడు. ముఖంలో రంగులు మారుతున్నాయి. భయంకరంగా తయారయింది. వున్నట్టుండి క్రూరుడై పోయాడు. క్రూరంగా చూస్తూ ఆమెను పిలువకుండా వచ్చిన, అపరిచితునిగా తలిచాడు. ఎందుకొచ్చావన్నట్లు మొహం ప్రక్కకు త్రిప్పుకున్నాడు.

తండ్రి మొహం చాటేసుకోవడానికి, సత్యభామ భయపడలేదు. యధా ప్రకారం తండ్రి పాదాలకు నమస్కరించింది. పాదాలను పట్టుకోవడానికి ప్రయత్నిస్తుంది. బొమ్మలా వుండిపోయాడు. త్రాచుపాము చెంతకు వచ్చినట్లు బెదిరిపోయాడు.

“నాన్నగారూ. మీ ఆశీస్సులనివ్వండి!” ప్రార్థించినట్లడిగింది.

భంగారకుడు వచ్చి తండ్రి వద్ద కూర్చున్నాడు. తన చేతిని తండ్రి భుజంపై వేసాడు. సత్రాజిత్తు ముఖం ముడతలు పడింది. సాలోచనగా చూస్తున్నాడు. కళ్ళు చిత్రంగా త్రిప్పుతూ -

“వెళ్ళవే, వెళ్ళు - నీలాంటి త్రాచుపాము ప్రక్క నేనుండలేను. నీవు నా వద్ద వుండవద్దు. నువ్వు విషనాగుకన్న ప్రమాదమైనదానవి. పోవే, పో. ఇక్కడ నుండి...ఫో!” నీ నీడ మాకు వద్దు!” ఛీత్కరించుకుంటున్నాడు.

అయినా సత్య భయపడలేదు.

మోకాళ్ళ మీద కూర్చుని రెండు చేతులతో తండ్రిని ప్రార్థించింది. పాదాలు ముట్టుకోనివ్వమని కోరింది. అయినా సత్రాజిత్తు మూర్ఖుడు. అన్నీ తెలిసి, కూతుర్ని కాదంటున్నాడు. క్షమ తెలియని పరమ పాపాత్ముడు.

తన పాదాలు ముట్టుకోకుండా వెనక్కి లాగాడు. కళ్ళు మూసుకుని, కొద్దిసేపు బాధపడినవాడు, ఆవేశం చంపుకోలేక, కళ్ళు గిరగిర త్రిప్పుతూ “అందర్ని కాదని ఆ దురాత్ముడితో వెళ్ళిన నీవు -

“మళ్ళెందుకొచ్చావే, సిగ్గులేనిదానా! నీవంటి ఆడది వంశానికే కళంకం. నిన్ను తిరస్కరించాలి. నన్ను కాదని అవమానించిన ఆ పాపిని పెళ్ళి చేసుకుని ఘనకార్యం చేసినట్లు చెప్పడానికి వచ్చావా ?” అడగడం కాదు, గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు.

“నేను సాత్యకిని పెండ్లి చేసుకోలేదు. నీ అభీష్టానికి విరుద్ధంగా ప్రవర్తించ లేదు. అతడు నాకు సోదర సమానుడు. ఇప్పుడే కాదు, ఎప్పుడు అతనిని వివాహం చేసుకోను.” సత్యభామ స్పష్టపరిచింది.

“ఏయ్! అబద్ధాలు కూడానా ? పోవే, పో” కసురుకుంటున్నాడు. తన పిల్లను తానే నమ్మలేకపోతున్నాడు. పై నుంచి క్రిందకోసారి చూసి

“మరీ, దుస్తులు, ఆ అలంకారం ఏమిటి ? ఆ.... ఎవరిచ్చారే, ఇవి. సిగ్గుమాలినదానా, సిగ్గుమాలిన పనేమైనా చేస్తున్నావా... ?” కోపంతో వూగి పోతున్నాడు. అసహనంతో అరుస్తున్నాడు.

కళ్ళనీళ్ళ పర్యంతమయింది. తను అనుకున్నట్లే జరిగింది. తను పాపాత్ముడు, దుష్టాత్ముడై వుండి అందర్ని అలాగ తలవడం, సబబా... ?” అడగలేదు. బాధపడటమొకటే, బరువు తీరేదానిలాగే కనుపిస్తూంది. అప్పుడు -

తన గోవిందుడు అన్న మాటలు జ్ఞప్తికొచ్చాయి. కొన్నాళ్ళు దాచుకో. ఆ తరువాత, రాత్రింబవళ్ళు ఏడిచే సావకాశమిస్తానంటే... ఇదేనా, ప్రభూ! కరుణించు. కాపాడు!” విలవిలలాడే హృదయంతో, లోలోపలే ప్రార్థించింది.

“పరిస్థితులీ స్థితికి వచ్చాక గూడా, నీలో మార్పు రాలేదంటే, ఏడవాలో... నవ్వాలో... నాకర్థం కావటం లేదు. సరే, అసలు విషయం చెబుతాను. విను. నీ ఆశలు, ఆశయాలు నాకు తెలియదు. అయితే -

నా మనస్తత్వం ప్రకారం “నేను గోవిందుని పరిణయమాడాను. నీ ఆశీర్వచనం కోసం ఇక్కడికి వచ్చాను. కాదన్నా భయం లేదు. ఋణమెప్పుడో తీరిపోయింది. బంధాలు మాసిపోయాయి. బాధ్యతలు విడిచిపెట్టాయి.

“ఏమిటి కృష్ణుని వివాహం చేసుకున్నావా ? ఇది మరో అబద్ధమా ? అసలు నేనే తప్పు చేసాను. నీకు “సత్య”భామ” అని పేరు పెట్టకుండా “అసత్య” భామ” అని పేరు పెట్టి వుంటే, ఎంతో బాగుండేది. ఎందుకే - ఈ రంపపు కోత, చంపుకు తింటున్నావు ?”

ఏం మాట్లాడుతున్నాడో తెలియడం లేదు. అంతటి దుఃఖంలో మున్గి పోయాడు. ఆడదాని లాగ వల, వల ఏడుస్తున్నాడు.

"నేను నిజమే చెబుతున్నాను. నాతోపాటు మీ ఆశీస్సులకోసం ఆర్య పుత్రులు వద్దామనుకున్నారు. కానీ నీ మనస్తత్వం తెలిసి, నీతో ఘోరపరాభవమో లేక - వాగ్వివాదమో... చెయ్యడమో పొందడమో... ఇష్టంలేక బయలుదేరినవారే ఆగిపోయారు.

ఏవిటీ... ఇప్పుడు మళ్ళీ మాట మారిపోయింది.

"ఎవరు వాసుదేవుడు, కృష్ణుడు ఆ దేవకి సుతుడు. నిజమా ? అని మరుక్షణం- చివరకు నన్ను కాదన్నవాడిని, కొడతానన్నవాడిని వివాహం చేసుకున్నావా ? భేషుగ్గా వుంది. ఆ ద్రోహిని, దుర్మార్గుని, శ్యమంతకమణిని దొంగిలించిన వాడిని, అది లేకుండా... శ్యమంతకమణి లేకుండా ద్వారకలో అడుగు పెట్టనన్నవాడిని -

ఎవరు ? నువ్వు మాయచేసి మభ్యపెట్టి ప్రేమలోకి దించావా ? లేక వాడే- ఆ దొంగ నిన్ను ప్రేమలో ముంచాడా ?.. ఏమో అనుకున్నా... నిజంగా నువ్వు సిగ్గుమాలినదానివి. సత్రాజిత్తు కుమార్తెగా చెప్పుకోదగని దానివి. ఛీ... ఛీ..!" చీదరించుకుంటున్నాడు.

అంతావిన్న సత్య "అయిందా ?" నవ్వుతూ అడిగింది.

"అన్నీ తెలిసి నీ దగ్గరకు రావడం నా బుద్ధి పొరపాటు. పెద్దవాడివని గౌరవించడం మరొకటి చెయ్యకూడని పొరపాటు. చూడండి.

"ఆర్యపుత్రులు శ్యమంతకమణిని దేశ ప్రయోజనాల కోసం అడిగారే తప్ప, నీలాగ స్వార్థప్రయోజనాలకోసం అడగలేదు. ఎవర్నీ మోసగించలేదు. ఇంకా నిన్ను- "తండ్రీ" అని నీ ఆశీస్సులకోసం వచ్చానంటే, అది - ఈ జన్మ పొందినందులకు కేవలం కృతజ్ఞతగా మాత్రమే.

ఎక్కడ ఆర్యపుత్రులు మళ్ళీ వచ్చి అడుగుతారేమోనని, నీ తమ్ముడి ప్రసేనజిత్తుతో, మరొకడిని తోడిచ్చి ఆ పవిత్ర సూర్యగుహకు పంపావు. పాపం. దురదృష్టం వెంటాడినట్లు, నీ తమ్ముడు ఓ సింహం చేతిలో చచ్చాడు.

దానిని జాంబవంతుడు చంపి, ఈ శ్యమంతకమణితో పాటు, నాకు తోడు వచ్చిన సోదరుడు సాత్యకిని తీసుకువెళ్ళి బంధించాడు. ఆ హడావుడిలో నీవు చిరాకుపడి, బయటపడ వెయ్యమనే నా పిల్లి "ఊర్వశి" పుణ్యమా ? అని, శ్యమంతకం కోసం ప్రతిజ్ఞ చేసి అడవులు పట్టిన నా ప్రభువు నన్ను రక్షించాడు.

అటునుండి జాంబవంతుని దగ్గరకు వెళ్ళాము.

పున్నమి పూజలు, బంగారు, ఇసుక, నీ వాగ్దానాల బ్రతుకు సర్వస్వం చెప్పి ఆతని కుమార్తె రోహిణిని ఆర్యపుత్రులకిచ్చి నా ప్రభువుకిచ్చి వివాహం చేసాడు. ఈ శ్యమంతకాన్నిచ్చాడు. మేము తప్పించుకునే దారి చూపి సాహసం చేసాడు.

నీవంటి పరమ దుర్మార్గునకు కుమార్తెనైయినందులకు ముందు, నేను సిగ్గు పడుతున్నాను. డబ్బుకోసం గడ్డితిని, అయిన వాళ్ళను నమ్మిన వాళ్ళను మోసం చేసే నీచ, పాప, దుష్ట దుర్మార్గుల పంచన, "మనిషి" అన్నవారెవరు వుండరు.

ఇక ఎలాగ బ్రతుకుతావో, నీ బ్రతుకు నీది. వింటున్నావా...

ఆనాడు నా ప్రభువును కొట్టావు. నేనొచ్చిఆపాను. ఆ ప్రతిఘటనలో ఆయన కుండలమొక్కటి ఇక్కడ పడింది. దానిని భద్రంగా దాచి, ఆ మర్నాడు నీవాడిన దొంగనాటకంలో ఆ కుండలాన్ని, ముఖద్వారం వద్ద పడేసి "దొంగ-దొంగ" అని అరచి,....

తరగని పాపం చేసావు. చెరగని ద్రోహం చేసావు. నీ జన్మకిక నిష్కృతి లేదు. నిన్ను రక్షించువారు కూడా ఎవరు లేరు. నీ కర్మమని.... సత్యభామను కాబట్టి సత్యం చెబుతున్నాను. కాదంటే అసత్యం చెప్పేదానినని - ఈసడించింది.

"ఇదిగో శ్యమంతకమని, అతని ముఖాన పడేసింది. అందుకుని చూసాడు అది శ్యమంతకమే.

సత్య మాటలతో పెద్దరికం పోయింది. గౌరవమెప్పుడో పోయింది. పురుగును చూసినట్లు అందరు చూస్తున్నారు. ఇప్పుడేడ్చినా ఓదార్చేవారు లేరు. దగ్గర కూర్చున్న పుత్రుడు లేచిపోయాడు. అంతా దూరం. తన స్వయంకృతా పరాధం. ఏమీ చెప్పుకోలేని దురవస్థ. ఇప్పుడేం చెయ్యాలి ? సత్య చెప్పినట్లెలాగ బ్రతకాలి ?

ప్రశ్నలపై ప్రశ్నలు సమాధానం రాని ప్రశ్నలు అయిపోయాయి. భారంగా కళ్ళు మూసుకున్నాడు.

★★★★

**ఇంతవరకు మనం ఉత్తరాది ప్రముఖుడు, భారతీయ విద్యాభవన్ సృష్టికర్త! "భవాన్స్ జర్నల్" పత్రిక ముఖ్య సంపాదకులు శ్రీ కె.యం. మున్షీగారు, నూత్న కథాపోకడలతో అందించిన కథా విధానాన్ని చదివాము. అయితే, దక్షిణాది వారు ప్రముఖంగా, ముఖ్యంగా "వినాయకచవితి" శుభ సందర్భంలో నీలాపనిందలు తొలగడానికి వీలుగా, "శ్యమంతోపాఖ్యాన" కథను చదువుకుని అక్షింతలు వేసుకుంటారు. అది అందరికీ తెలిసినదే అయినా, అవసరార్థం, అపనిందలు తొలగడానికి చెప్పుకునే "వినాయకచవితి" వ్రతకథను చేసారు.**

ఇందులో - సత్రాజిత్తు - తన తమ్ముడు ప్రసేన జిత్తును కృష్ణుడు చంపి, ఆ శ్యమంతకమణిని, తేరగా వచ్చే బంగారం కోసం, రాజుగారికి ప్రజాసంక్షేమం పేరిట అర్పించమని చెబుతూ, మరీ అపహరించాడని నిందిస్తాడు. చిన్నప్పటి నుండి వస్తున్న ఆ దొంగబుద్ధి ఎక్కడికి పోతుంది. చిన్నప్పుడు వెన్న, పాల దొంగ, ఆ తరువాత వివేకం నశించినట్లు, పెద్దా చిన్నా తేడా లేకుండా, అందరితో ఆటపాటలు.

ఆడపిల్లల బుగ్గలు కొరకడం, ముద్దులు పెట్టడం, జడలు పట్టి లాగడం, వస్త్రాలు దొంగిలించడం, శీలవతుల ధన, మానాలతో ఆడుకోవడం, అలవాటైన ఆ కన్నెల, వెన్నదొంగ పెద్దయినా, అందరు మెచ్చుకుంటున్నా బుద్ధిరాక నా తమ్ముడిని చంపి, ఆ శ్యమంతకమణిని దొంగిలించి, పైకి పెద్దమనిషిలాగ ప్రవర్తిస్తున్నాడని, నిండుసభలో, ఒక ఆగడంలాగ, ఆగడం మొదలుపెట్టి కోపంతో వూగిపోతూంటే, కృష్ణునిపై సత్రాజిత్తు చేసిన అపవాదుకు ప్రతి ఒక్కరు చలించి, ఆశ్చర్యపోయారు. విన్న ప్రతి ఒక్కరు, ధనమదంతో బలిసి, ఉచ్ఛనీచాలను మరచి సత్రాజిత్తు పీకల మీదకు తెచ్చుకున్నాడని తలిచారు. కొందరు పైకి అనేసారుకూడా!

అప్పటికింక మౌనం పనికిరాదని తలచిన కృష్ణుడు "సత్రాజిత్తూ! ~~ఈ~~ ద్వారకలోని ఒక యాదవ ప్రముఖునిగా నిన్ను గుర్తించాను కనుక నిన్ను గౌరవిస్తున్నాను. నిజానికీ ద్వారక నాది. నిలువ నీడలేక మధుర నుండి కొన ప్రాణాలతో కట్టుబట్టల్తో పారిపోయిన నీవు, నా మూలాన, నా మామ కంసుని మరణంతో, తిరిగి మావాడివలె మధురకు వచ్చావు. పోయిందనుకున్న బ్రతుకును, ఆస్తిపాస్తులను పొందావు. మగవాడిననుకుంటున్నావు.

కారణమేదైనా, జరాసంధునికి మిమ్ము విడిచి పెడితే, ఆ మధుర వలె సర్వ నాశనమయ్యేవారు. కానీ "అవతార వరిష్ఠాయ "రామ, కృష్ణాయ"తే నమః" అన్న వచనం మేరకు, ఎత్తిన అవతార లక్ష్యానికి అనుగుణంగా ధర్మమూర్తిగా అందరిని రక్షించాను. అందులో నీవు ఇక్కడికి వచ్చి మొనగాడివయ్యావు కానీ, మగాడివి మాత్రం కాలేదు.

అయినా నీ నింద భరిస్తున్నాను. ఇది లోకనింద కాకుండా, నిన్ను సంస్కరించడం కోసం, శ్యమంతకమణిని తెచ్చి నీకప్పగిస్తాను. ఇక చరిత్రలో నీవు ఎటువంటి పరిస్థితులలోను తలెత్తుకోకుండా చేస్తాను. సూర్యభగవానుడు, ఈ శ్యమంతకాన్ని నీకిస్తూ - ఏం చెప్పాడో గుర్తు తెచ్చుకో.

అధర్మవర్తనానికి, ధర్మశీల నాశనానికి నడుం కట్టునంతవరకు నీవు అదృష్టవంతుడవు. ఈ శ్యమంతకం నిన్ను కుబేరుని మించిన సంపన్నుని చేస్తుంది. ఎప్పుడైతే అధర్మవర్తనానికి అడుగువేస్తావో, అప్పుడు నీకు సుఖసంతోషాలు వుండవు. బ్రతుకు పండదు. ఇన్నాళ్ళు నీకు అదృష్టమిచ్చిన శ్యమంతకం ప్రాణాంతక మవుతుందన్నాడు. అవునా ?" శ్రీకృష్ణుడు అడిగాడు. సత్రాజిత్తు సమాధానం చెప్పక తలవంచుకున్నాడు.

అయినా "ధర్మం-ధర్మ"మనే ధర్మ పరిరక్షకునిగా ఈ నింద బాపుకుంటాను" అని బయలుదేరాడు. శ్యమంతకాన్ని తప్పక తెస్తానన్నాడు. అయితే, అసలు ప్రసేనజిత్తు ఆ హారాన్ని ధరించాడా ? లేక తనపై నేరారోపణం చేయించదలచి, వీళ్ళు నాటకమాడుతున్నారా ? ఏదైనా సరే... నని, ప్రసేనజిత్తును వెదుక్కుంటూ బయలుదేరాడు. పరిసరాలలో అడవులలో కృష్ణునితోపాటు మరికొందరు అభిమానులు కూడా సాక్ష్యంగా బయలుదేరారు. ఇది వెదుకులాట కాబట్టి, అనుమానం తీర్చుకునే మేర, ఆ అడవిని అంగుళం అంగుళం వెదకుతున్నారు.

కొంతదూరం వెళ్ళేసరికి గుర్రపుడెక్కల గుర్తులు కనబడ్డాయి. దాని ననుసరించి ముందుకుపోతే ప్రసేనజిత్తు, గుర్రాల కళేబరాలు కనుపించాయి. ప్రసేనుని ఎవరో చీల్చి చంపినట్లు గుర్తులు. దాని ప్రకారం చూస్తే అది సింహం పంజా గుర్తు. దానిని నిశితంగా పరిశీలిస్తే ముందుకు సాగితే సింహపు కళేబరం.

పెద్ద పెద్ద అడుగులు. అవి మనిషి అడుగుజాడల లాగలేవు. దాని ప్రకారం ముందుకుసాగితే, ఆ అడుగులుఒక గుహ వద్ద ఆగిపోయాయి. దాంతో తనతో వచ్చినవారిని అక్కడే ఆగమని, కృష్ణుడు లోపలికి వెళ్ళగా, వెళ్ళగా, ఒక ప్రాంతంలో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఆ కాంతిలో ముందడుగు వేసాడు. అక్కడో పిల్ల హాయిగా, శ్యమంతకంతో ఆడుకుంటుంది. హమ్మయ్య అని అడుగేసిన ఈ క్రొత్తవ్యక్తిని చూసి, ఆ పిల్ల కెవ్వుమని భయంతో కేక వేస్తుంది. ఆ అరుపుకు "ఏమయిందమ్మా!"ని ఎలుగువంటి మనిషి, ఆమెను సమీపిస్తూ, ఈ వ్యక్తిని చూసి కోపంతో "ఎవరు రా?" ఆగ్రహిస్తాడు.

కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ "జాంబవంతా!" నువ్వు నన్ను గుర్తు పట్టలేదు. నేను... నీ... "రాముడి" ననబోయి, అందరు పిలిచే కృష్ణుడను, గోపాలుడ" నంటాడు. దానికి రెచ్చిపోతూ"ఓరీ ధూర్తా! ప్రాణాలపై ఆశ వుండే నా గుహలోకి అడుగుపెట్టావా ? నీకు బ్రతకాలని లేదా వీరవిక్రముడివలెఅతను వదరుతున్నాడు. కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తున్నాడు.

అప్పటికీ, కృష్ణుని అర్థం చేసుకోలేని జాంబవంతుడు నిరశించడంతో, ఆ "శ్యమంతకమివ్వు" వెళ్ళిపోతానంటాడు. అది అసంభవం. చాతనైతే నన్ను జయించి తీసుకు వెళ్ళమంటాడు. ఎంతో పరిచయమున్నవాడిలా "నీ ఇష్టం. నీ కోరిక నేనెప్పుడు కాదన్నాను. కానివ్వమంటాడు. కృష్ణుని మాటలు జాంబవంతుని కర్థం కావడం లేదు. పైగా ఎంతో బాగా పరిచయమున్నవాడిలా "జాంబవంతా!" అని ప్రేమగానే పిలుస్తున్నాడు.

ఇందులోని తిరకాసు అర్థంకాక, కృష్ణప్రేమను తెలుసుకోలేకపోతాడు. కృష్ణుడు, జాంబవంతుని కోరిక మేరకు అతనితో యుద్ధం ప్రారంభిస్తాడు. అస్త్రాలు, శస్త్రాలు పోయి ముష్టి ఘాతాలతో బాహాబాహీగా ముష్టియుద్ధం చేస్తున్నారు. కృష్ణుడేమాత్రం అలువలేదు. జాంబవంతుడు మాత్రం బాగా అలిసిపోయాడు. క్రిందపడ్డవాడు లేవలేని అశక్తతో నేలను కరుచుకుంటే ఎంతో ప్రేమతో తన చేతిని వూతమిచ్చి "జాంబవంతా చాలా! లేక ఇంకా యుద్ధం చెయ్యాలని వుందా ?" తన చెరగని చిరునవ్వు అలాగే కురిపిస్తు అంటాడు, అప్పుడాతడు, గతంలోకి వెళ్ళి, స్వగతంతో సర్వం దర్శించి -

"రామా! ఈ దాసుని కోరిక తీర్చడానికి, ఈ రకంగా వచ్చి, నా బులబాటం తీర్చావా ? నీ సర్వశక్తిత్వాన్ని ప్రదర్శించావా ? ధన్యుడను, రామా, ధన్యుడను. ఎవరికి తలవంచని నేను, నీకే తల వంచాను. దించుకున్నాను. ఓడిపోయానని ఒప్పుకుంటున్నాను. ఓ కరుణామయా! ఆశ్రితపాలా, భక్తవత్సలా, కరుణాసింధు, ఇంక ఈ జీవితానికేమీ అవసరం లేదు.

ఎందుకోసము ఎదురు చూస్తున్నానో, అది లభించింది. నీ దర్శనం, నీతో యుద్ధం రెండు ఫలించాయి. నన్ను ధన్యుడిని చేసాయి. ఇదిగో ఇది నా కుమార్తె. దాని పేరేదైనా నీకు "జాంబవతి". దానిని స్వీకరించు. ఆ కన్యామణిని, నీవు కోరివచ్చిన శ్యమంతకమణిని స్వీకరించి ధన్యుడిని చెయ్యమంటాడు.

వాటిని గ్రహించి కృష్ణుడు బయలుదేరుతాడు. శ్యమంతకాన్ని నిండుసభలో యాదవ ప్రముఖులందరి ముందర, సత్రాజిత్తు జన్మలో తల ఎత్తలేని విధంగా, తీసుకోమంటాడు. అప్పుడు, తన తొందరపాటుకు చింతించి, అందరి ముందర క్షమించమని ప్రార్థించి, నా కుమారీమణి "సత్యభామ"ను, ఈ మణిని గూడా స్వీకరించమంటే, "సత్యను స్వీకరిస్తాను కానీ, నీ శ్యమంతకం నాకు వద్దంటాడు."

ఇది దక్షిణాది వారందరికి తెలిసిన కథ.

అయితే, శ్రీ మున్షీగారు, ఏదో అడవి, గుహ అనకుండా, విషయాన్ని ఆలోచింప చేసారు. ఆ కథకు ఓ సార్థకత నొసగారు. అందుకే ముందు శ్రీ మున్షి గారి మరో "కథ"ను (మనస్సును) ఆ తదుపరి మనకు తెలిసిన కథ నివ్వడం జరిగింది. నిజానికి శ్రీ మున్షీగారి ఆలోచనా "మనస్సు" గూడా ఆలోచించదగ్గదే. త్రివిక్రమవతారం నాటి జాంబవంతుడు, రామాయణంలోని నాయకుడు, సర్వసామాన్యుడు కాదని తలచి, అతని వ్యక్తిత్వానికి, దీటుగా, రాజ్యము, ఆలోచనలు, వారికిగల సాంప్రదాయాలను, సుదీర్ఘ కథనంగా తమ పత్రికలో అందించారు. ఆ తదుపరి "కృష్ణావతారం" మరి కొన్ని భాగాలు, చరిత్రగా ఆంగ్లంలో ప్రకటించారు. ఎందరినో ఆలోచింప చేసారు. అవునని ఒప్పుకోలేక పోయినా కాదని వాదించలేకపోయిన కథనమిది. పఠించి పరమానందం పొందండి.

# ఓం నమో భగవతే వాసుదేవాయ

1) **"దశవతార" శ్రీ కృష్ణ విలాసము :**
**"ఓం"** నమో నారాయణ "మీన" రూపా
**"న"**గధర "కచ్ఛప" అమృతమూర్తీ
**"మో"**హాంధకారహర "వరాహ" రూపా
**"భ"**క్తప్రహ్లాద సంరక్షక వరదా, "నరహరి"
**"గ"**ర్వించు బలినణచి కాచిన "వామనా"
**"వ"**రబలగర్వ నృపాంతకా "భృగురామ"
**"తే"**లించు జగతిని ధర్మపు "శ్రీరామ"
**"వా"**సుదేవాగ్రజా ఘన "బలరామ"
**"సు"**రుచిర లీలా మోహన "కృష్ణా"
**"దే"**వకి తనయా, దేవాదిదేవా
**"వా"**సుదేవ ప్రభు "శ్రీ కల్కి" రూపా
**"య"**దువంశమౌళీ, ప్రభవించు కరుణించు!!!

2) **హరినామామృతము :**
**"ఓం"** అని హరినీ కీర్తించి ప్రభునీ
**"న"** రుడై వెలసిన హరినీ అర్చించి
**"మో"**హము విడచి, మోదముతోను
**"భ"**గవానుని స్మరణ, సన్నిధికోరి
**"గ"** రుడగమన ఘనశక్తిని వేడి
**"వ"**ర "రామ-కృష్ణ" నామమునొంది
**"తే"** టతెన్నగ భగవత్కధను
**"వా"**సుదేవుని కృప విరచించే

**"సు"**జ్ఞానఖనియా శ్రీ శుకయోగి
**"దే"** వ దేవుని చరిత పరీక్షితు
**"వా"**సనలన్నీ విడచీవినగా - తెలి
**"య"** చేసిన యదువర చరితను ।

ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ

**1) ప్రథమ స్కంథము :**

**"ఓం"** అని ప్రణవము స్మరణే స్మరణము
**"న"** ర రూప శ్రీహరిగానమే గానము
**"మో"** క్షమొసగు శ్రీ శ్రీకృష్ణ నామము
**"భ"** గవానుని భక్తుల కథన మే కథనము
**"గ"** ర్వము విడచే హరిస్మరణ మే శ్రవణము
**"వ"** సుధను హరినామ జీవమే, జీవము
**"తే"** లించు శ్రీహరిసర్వము; "హరి" యన
**"వా"** సుదేవ యన ముక్తిని యొసగు
**"సు"** జ్ఞాను డారీతి పరీక్షిన్న రేంద్రుడు
**"దే"** వాది దేవుని గాథలు విన శ్రీ శుకులు
**"వా"** సుదేవుని హృదిలో స్మరియించి
**"య"** దు వంశమౌళి కథలను వినిపించే...

**2) ద్వితీయ స్కంథము :**

**"ఓం"** అని ప్రణవముపట్టీ శ్రీహరి - ఘ
**"న"** నామము దాల్చి జపించు చుండే
**"మో"** హమువీడ విదురుడు రాగా

**"భ"** గవానుని లీలలు విన మైత్రేయుని
**"గం"** గయొడ్డున దర్శించమనెను
**"వ"** చ్చిన విదురుని చూసిన ఘనయోగి
**"తే"** ల్చగ ఈ నర జీవిత చక్రము
**"వా"** సు దేవుడే గతియని నమ్ముము
**"సు"** జ్ఞానులైనను తెలియగ నేరరు
**"వా"** రాహరూపము దాల్చెను శ్రీహరి
**"య"** నుంగు భక్తుని కాచెను నరహరి...

3) **తృతీయ స్కంధము :**
**"ఓం"** అని పిలిచే భక్తులగాచే
**"న"** ర హరిరూప శ్రీహరి భక్తుల
**"మో"** దము నొసగ విచిత్ర రీతుల
**"భ"** గవానుడు లీలగా ఆవిర్భవించే...
**"గ"** రుణన తత్వము తెలుపగకోరి
**"వ"** సుధను జనియించే కపిలుండాయే
**"తే"** ల్చగ భవబంధ జలధిన జనుల
**"వా"** సనలన్నీ దేహము వరకని
**"సు"** జ్ఞాని దేహపుబంధము లంటడు
**"దే"** వాదిదేవుని స్మరియించినిలచు
**"వా"** సనలన్నీ వర్జించి బ్రతుకు
**"య"** ని తెల్పెను కపిలుడు యోగిగ ధరకు

4) **చతుర్ధ స్కంధము :**
**"ఓం"** ని తలచే అత్రికి శ్రీహరి
**"న"** రునిగ సుతుడాయే హరబ్రహ్మలతో

**"మో"** హము వీడి దక్షుడు యజ్ఞము
**"భ"** గవానుని ప్రీతిగ చేసెడు తరిని
**"గ"** ర్వము నణచి రుద్రుడు కరుణించే
**"వ"** రము నొసగి తన భక్తుని ధ్రువునీ
**"తే"** లించే ఆనంద సంద్రమునా హరి
**"వా"** డ వాడలా దుష్ట చేష్టల
**"సు"** జ్ఞానమూర్తుల హింసించు వేనుని
**"దే"** హము మర్దించ పృధువు జనించే
**"వా"** ని పాలనన జగతి మురిసెను - విష
**"య"** వాసనల వింత కథనము "పురంజనమ్ము".

5) **పంచమ స్కంధము :**

**"ఓం"** అను హరినామ స్మరణే శ్రేష్ఠము
**"న"** రునికి శ్రీహరి స్మరణమే జీవము
**"మో"** హము వీడిన యోగి ఋషభుడు
**"భ"** రతుని కొసగీ రాజ్య సుఖంబులు
**"గ"** డుపగ కాలము తరలిపోయెను
**"వ"** సుధను సర్వకర్మలు జరిపి
**"తే"** ల్చెడు వాడు శ్రీహరియనుచు
**"వా"** సనలన్నీ విడిచిన భరతుడు
**"సు"** జ్ఞానమొందియు లేడికోసమై
**"దే"** హము దాల్చే వాసన మేరకు
**"వా"** సుదేవుడే సర్వము యని పలుకు
**"య"** వ ధూతాయే, తత్వము పిదపాసగే.

6) **షష్ఠమ స్కంధము :**

**"ఓం"** అని పలికే జన్మమే జన్మము
**"న"** రుడా శ్రీహరి స్మరణమే ధన్యము - దా
**"మో"** దరుడే దిక్కని తెలుపగ
**"భ"** గవంతుని చేరె అజామీళుడై
**"గ"** ర్వముతో గురునవమానించిన - కా
**"వ"** ర మణగే - పదవేపోయె
**"తే"** రి పారగా చూడగచాలని
**"వా"** డౌవృత్రాసురు పరి మార్చగదలచి
**"సు"** ధర్ముడౌ త్యాగి దధీచి మహర్షి
**"దే"** హ శల్యము వజ్రాయుధంబాయే - దే
**"వా"** సుర పోరున ఇంద్రుడు తనదు
**"య"** దృష్టమనగా వానిని కడతేర్చే!

7) **సప్తమ స్కంధము :**

**"ఓం"** అని హరినామ స్మరణే సల్పెడు
**"న"** రుడే శ్రేష్ఠుడు రాజేంద్ర ధరను
**"మో"** హముతో ధరబంధించి దాగిన
**"భ"** గవానుడు యజ్ఞవరాహమాయే
"గ" ర్వముతో చను హిరణ్యాక్షుని నిర్జించే
**"వ"** ర బలగర్వము అణువణువున
**"తే"** లగ, కొమరుని సైతం కరుణించ లేని
**"వా"** నిని మార్చ ప్రహ్లాదు హరినామ
**"సు"** గమ మార్గమున చనగాకోర

**"దే"** వాధిదేవుని శత్రువు యనుచు
**"వా"** దించి పోరుకు పిలచిన హిరణ్యాకశిపుని
**"య"** ంతముచేసే నరహరియైహరి!

8) **అష్టమ స్కంథము :**
**"ఓం"** అను హరియే దైవము జగతికి
**"న"** రులకు, సర్వజీవరాసులకు
**"మో"** క్షమొసగె గజరాజుకు శ్రీహరి
**"భ"** గవంతుని కరుణకు సర్వులు అర్హులే!
**"గ"** జరాజు ప్రాణము కాచిన ఆ హరి - దే
**"వ"** దానవులు అమృతము కోర
**"తే"** ల్చె మంధరము మూపునమోసి
**"వా"** సవాదులకు అమృతమొసగే
**"సు"** రలను కాచ వామనుడాయే
**"దే"** వతాదులకు సౌఖ్యములొసగే
**"వా"** రిజనేత్రుడు వేదాలు రక్షించ, ప్రళ
**"య"** మందున మత్స్యపురూపొందే!

9) **నవమ స్కంథము :**
**"ఓం"** అను హరియే సర్వము జగతి
**"న"** శ్రీహరినామము జగతికి రక్ష!
**"మో"** దముతో ప్రభు శ్రీహరి స్మరణ
**"భ"** క్తితో సల్పెడు అంబరీషుడు
**"గ"** ర్వి దుర్వాసుడు హింసించ తలువ
**"వ"** దిలి సుదర్శన మాతని హరికాచే

**"తే"** ల్చగ నరులను, నిల్పెను ధర్మము
**"వా"** రిజనేత్రుడు, పరశురాముడై
**"సు"** గుణచరిత్రుడు, సుధర్మరూపుడు
**"దే"** వాదిదేవుడు, దశరధరాముడు
**"వా"** సనలింకా తీరని యయాతి
**"య"** దువంశకథనము, పుణ్యప్రదము.

10) **దశమ స్కంథము :**

**"ఓం"** అను ప్రణవ బ్రహ్మగ తలచెడు
**"న"** ంద నందనుడు నారాయణుడు
**"మో"**హము కూల్చుచు తాజనియించే
**"భ"** గవానుడు దేవకీ గర్భము నందు
**"గ"** ర్వమునణచీ దుష్టుల పరిమార్చి
**"వ"** ంకర నడకల కుబ్జనుకాచి
**"తే"** రిపారగా శక్యము కాని
**"వా"** సుదేవుడు రుక్మిణి చేపట్టి
**"సు"** దుర్లభమ్మౌ దర్శన మొసగి
**"దే"** వాదిదేవుడు నరకుని పరిమార్చి
**"వా"** సుదేవుడే తమగతియని తలచు - ప్రి
**"య"** భక్తులకాచిన దశమ స్కంథం.

11) **ఏకాదశ స్కంథము :**

**"ఓం"** అని హరినీ తలచెడు మౌనులు
**"న"** రరూప శ్రీహరి హృది దర్శించు
**"మో"** హము విడిచిన ముని శ్రేష్ఠులకు

**"భ"** గవానుడు అర్ఘ్యపాద్యము లొసగే
**"గ"** రుడ గమనునీ దర్శించివారలు
**"వ"** సు దేవసుతుని శెలవుచేకొని
**"తే"** లించగ ధర సంసారసంద్రం
**"వా"** సుదేవ ఇకనీవే దిక్కను
**"సు"** డిగుండములో చిక్కిన వారలు
**"దే"** వాది దేవా తేలించరమ్మన
**"వా"** సుదేవుడే యుగధర్మము నెఱిగి
**"య"** దుకులమౌళిగ రక్షించె, జగతి!

**12) ద్వాదశ స్కంథము :**

**"ఓం"** అను సర్వము బ్రహ్మము హరియే
**"న"** రేంద్ర విను మీ, భావికాలము
**"మో"** సముదాల్చి, సత్యము, దైవము
**"భ"** గవానుని స్మరణము పూర్తిగామరచి
**"గ"** ర్వముతోడ తామే గొప్పగ
**"వ"** సుధను వరలును మూర్ఖమనుజులు
**"తే"** లును, తూగుచు సుఖసంపదుల!!
**"వా"** సుదేవుడే సర్వము యనుచు
**"సు"** జ్ఞాని శుక మౌని తెల్పిన శ్రీహరి
**"దే"** వాదిదేవుని గాథలు తలచెడు
**"వా"** నిని కడతేర్చ తక్షకుడే తెంచే
**"య"** దుమౌళి తలచుచు హరిచేరెయతడు!!

★ ★ ★ ★

## హరినామామృతము :

1. ఓంనమో భగవతే వాసుదేవాయ
ఓంనమో హరే, అనాధరక్షకా...
శరణు శరణు కరుణాల వాలా
అశ్రితపాలక, అంబుజనాభా...

జవసత్వములు వుడిగెను నాకు
జలచరము తో నే - నికపోరలేను
జలజాక్ష, పంకజనయనా పాహి
అనంతశయన, ఆదిదేవ శరణు... **జవ...**

ఎంతో ఓర్పుతో, నేర్పుగ మకరితో
ఎంత పోరిన, పట్టే విడువక
ప్రాణముతీయుచు బరబర లాగుచు
నను కృంగదీసే, నారాయణా, హరి... **జవ...**

అభవా "అధముడ" నని ఊరకుండుక
అభయము నీయవ, హరి శరణంటిరా,
అనాధనాథా, అద్భుత శరణా
అవధరించి నను ఆదరించరా... **జవ...**

రాజును నేనని మత్తిల్లిమడుగున
రాజసంబున చొచ్చిన ఫలమిది
రాజీవలోచన, రాకేందువదన
రయమున రావా, రక్షించవేగ... **జవ...**

హరినీవే గతియని నెఱనమ్మి
హరి నను వేగరక్షించ వేడితి
హరియించి నాదుపాతక మెల్ల
"హరి" యని పిలుపునే"హరి' కావుమయ్యా...

2. పావనగుణధామ, పతితపావన
పరమాత్మా ప్రభూ, పన్నగశయన
కరుణను బ్రోవర, కర్మలు కూల్చర
పరమశరణ్యా నీవేగతిరా...

అది వ్యాధులు హరించువాడవు
హృది నైర్మల్యము చేసెడివాడవు
"హరి" యని శరణని పదములపట్టితి
హరి జాగుచేయక, ప్రధముడు కావర... **పతి...**

ఈ నామపానము నీమముగాను
నీ దయలేకున్న సలుపగ చెల్లదు
నీరజాక్ష నీకరుణే గాదా
నీచులు ఘనులుగ ధరలో... వెల్గుట **పతి...**

ఏ పాపమొనరించ ఎదనిడుకొనక
ఎందరినో కాచు వేదాంతవేద్య
ఎంత హీనుడని ఎవరేమి యన్న
ఎదలొగొనకా, యదువర కావరా... **పతి...**

3. ఎంతవాడినని యదువర కోపించి
ఎన్నుట తప్పులు ఇది మరియాదా ?
శ్రీహరినామము "హరి, హరి" యనుచు
శ్రీపతి స్మరియించు భాగ్యము నొసగవా ?

నారాయణా యని నోరార పిలువక
నారాయణా యని పుత్రుని పిలువగ
నారాయణ నువు బ్రోచిన కథనము
నారాయణ-నే-వింటిని విశదము ...ఎంత...
తలక్రిందులుగా జపించి శ్రీహరి
ధర మాణిక్యమాయెను ఆ వాల్మికి
ఆతడు చేసిన పాపముతో నను
తూచిన ఎవరిది ఘనమౌ పాపము ? ...ఎంత...

నామము చేయగ నిను ధ్యానించగ
నారాయణ - నీ - సన్నిధి పొందగ
నాలోవున్న కోర్కెనువిడచి
నారాయణ నను పాపిగ చూతువా ? ...ఎంత...

నరజన్మపుణ్యము, హరియనుభాగ్యము
నరహరి నిను తలువ బూనుటే ఘనము
నారాయణా - ఈ - లోకపు నైజము
నరవర, హరి, హరి వేగమేకావుము ...ఎంత...

4. భాగవతమ్మని పలువురుపలుకు
భగవత్కధలను ఏదో నెపమున
ఎదలో తలచుచు ఏమర కేను
యదువరతలువ, ఎదచేకొనరా...
శ్రీమన్నారాయణ, శ్రీమన్నారాయణ,
శ్రీమన్నారాయణ, శ్రీచిద్విలాసా...

లీలామానుష రూపుడ వీవని
దివ్యమంగళ నీఘన చరితను
దీనులు భక్తులు నిరతముతలువ
దీన బాంధవా - నే - వ్రాయబూనితి
శ్రీహరిశరణం, శ్రీహరిశరణము
శ్రీహరిశరణం, నీదివ్యచవరణము

భాగవతమ్మని పలికిన పలుకుల
భాగవేతశ్వర, సత్యము చేయుచు
పలువిధముల - ఆ - పరిగెడు లీలల
పరమపావన, దృశము చేయర
లీలాసుందర, లీలాసుందర
లీలాసుందర, లిఖియింతు"నీ"చరిత
నీ దివ్యచరిత!!

★★★★

# ఉపసంహారం

ఇది - శ్రీ లీలా విశేషాల మధురిమా చరిత్రలో రెండవ భాగం. “జ్ఞానకాండ”. భారత, భాగవతాదులలో వ్యాసులచే నిక్షిప్తం చెయ్యబడిన దివ్య చరిత్రకు - ఓ ప్రతిరూపం.

“శ్రీమద్భాగవతం” కేవలం - కృష్ణచరిత్ర”. అది మహాభక్త చరిత్ర. భాగవత- “భగవత్” తత్త్వాలకు మరోరూపం. ఇటువంటి ఆనాటి దివ్యచరిత్రలు - ఇంకా వుంటే - ప్రచురించే నవరత్న “మూర్తు”లు, రచియించే “రామకృష్ణ” ప్రసాద్”లు- ఘనులుగా కీర్తింపబడతారు. ఇది సత్యం.”

ఒకానొక సందర్భంలో - శ్రీ ఉషశ్రీ అన్నట్లు అప్పుడు - ఇప్పుడు - ఎప్పుడు- అది బంగారమే. “బంగారం” బంగారమే. వస్తు గుణంలో మార్పు లేదు. ఎటొచ్చీ ఆకారంలో తేడా. రకరకాల “రూపా”లు, రూపాంతరాలు. “రూపాయి”ల వలే మార్పులు చేర్పులు.

ఆనాడు కంటెలు, కట్లకాసుపేరులు, వడ్డాణాలు, వంకెలు - వంకీలు, శంకలు లేకుండా “వంశ”వారసత్వంగా, పారంపర్యంగా, సలక్షణంగా చేయించు కున్నారు, ఆ బరువులను మోయగల్గిన వారు - ధాన్యాన్ని - స్వయంగా దంపుకుని, బియ్యం చేసుకుని, ఆ దంపుడు బియ్యంతో అరవై ఏళ్ళు వచ్చినా ఏ ఢోకా లేకుండా హాయిగా బ్రతికిన, ధర్మబద్ధజీవులైన మహాతల్లులా - సాంప్రదాయ స్త్రీలు -

పధ్నాలుగు, ఇరవైమంది పిల్లల్ని కన్నా జిర్రుమని చీరకుండా, ఎంతమంది వచ్చినా, వండి వడ్డించ సత్తాగల ఆనాటి “అన్నపూర్ణ”మ్మలు” ఈనాడు ఆకాశంలో నక్షత్రాలు.

ఇక ఇప్పటివాళ్ళు -

వీళ్ళు కదలలేరు. మెదలలేరు. చాలినంత కట్నం పోసి, ఎద్దునో, గుఙ్జాన్నో, దున్ననో కొనుక్కున్నట్లు ఓ మగాడిని కొనుక్కుని, వాడి ద్వారా - విలాసవతులుగా- తమ సరదాలు తీర్చుకుంటూ, కష్టపడకుండా దొరుకుతున్న - పూటకూళ్ళ పెద్దమ్మలు విడిచిన - ఆ ఆప్యాయ అన్నశాలలు, “రూపాయల” భోజనాలయాలు, ఫలహారాల రకరకాల రుచి, రూపాశాలలు విచ్చలవడిగా -

ఎక్కడపడితే అక్కడ, ఏ మూలపడితే ఆ మూల తిన్నవాడు చచ్చినా, వున్నా సంబంధం లేకుండా, ఎప్పటికప్పుడు వండి వడ్డించడం పోయి, ఎప్పటిదో, ఎప్పుడో ఒక పద్ధతి లేకుండా తినేవాళ్ళను రోగకారకులు చేసి - వీధికో ఇద్దరు డాక్టర్లకు జేబులు నింపుకునేటట్లు చేస్తున్నారు. అడ్డమైన మందులు, తిళ్ళతో ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఈ డాక్టరు - ప్రతివాడు - ప్రత్యేక వ్యాధిపై పరిశోధన చేసానంటూ, ఆ వచ్చిన ప్రతి రోగికి ప్రాణ సంకటమౌతున్నాడు. రోగిని ప్రయోగశాలగా మార్చి, వాడు చూడని, వాడికి తెలియని విషయాలకు, తన శోధనలతో యంత్రాలతో ఈ రోగికి ప్రాణాంతకమౌతున్నాడు.

ఇటువంటి రోజులలో -

కదలలేని, మెదలలేని అతి సుకుమారులు, అర్భకులు, ఒక పిల్లనో పిల్లవాడినో కని, ఇక కనలేననీ, ఈబ్రతుకు బ్రతుకలేననీ - ఈ అర్భకులు, అశక్త శక్తిహీనులు, ఈ జాతికిచ్చే వారసులు మేథావులు కారు. సంకరజాతి వంగడాల వలె - వ్యాసుని తర్వాత - నాళికలతో పుట్టించిన సంకరజాతి జీవులు (పిల్లలు).

ఈ దౌర్భాగ్యులు - కౌరవశత, దుర్యోధనాదులకు నిజమైన వారసు లౌతున్నారే తప్ప, ధర్మం-ఆచారం, సాంప్రదాయ సంస్కృతికి వారసులు కావడం లేదు. వారి వంశ, వారసత్వ విశిష్టత గుర్తించగలిగే స్థితిలోను లేరు.

ఇంకొంతమంది ఆ బ్రిటిషువాడు... ఓ వ్యాపారిగా వచ్చినవాడు ఈ దేశం నాశనం చేసాడని తెలియని శృత పాండిత్యంతో చెబుతారు. అందువల్లనే మన ప్రతిభా-పాటవాలు దెబ్బతిన్నాయని చెప్పే వీరు "ఇంట్లో - ఆ పిల్లలు (మనుమలో) సంతానమో) ఎవరైనా "తండ్రీ! అన్నా - "నాన్న"గారూ అన్నా "తాతగారూ" అన్నా... ఛీదరించుకుని, విసుక్కుంటూ..

అంతంత డబ్బుపోసి చదివిస్తున్నాం. ఏవిటో వెధవ పిలుపులు.... అని విసుక్కుంటారు. ఆ దరిద్ర పిలుపులు, పిలువవద్దని తిట్టి, కొడతారు. దీనికి - ఈ సాంప్రదాయ నాశనానికి, బ్రిటిషువాడిదా తప్పు. వాళ్ళు ఈ దేశాన్ని వదిలి వెళ్ళిపోయినా, ఆ సాంప్రదాయాన్ని వదలని మనదా ? తప్పు. చెప్పండి. అందుకు- ఇప్పుడు ఇక్కడ వ్యాస చరిత్ర - సాంప్రదాయాలను ఒక్కసారి గమనిద్దాం.

మోటు నగలని చీదరించుకునే వారు, నాజూకు బంగారు నగలను ధరించలేక, పుట్టు దరిద్రులైనట్లు, కట్టు తీగల బంగారాన్ని మరపించే - మాయా (కృత్రిమ) నగలతో నవనాగరికులమని, బట్టలు కూడ తగ్గించుకుని - కళాశాలలను అందులోని - ఆచార్యులను - కాముకులుగా చేసే సాంప్రదాయాన్ని తిరస్కరిద్దాం.

"ధర్మో" రక్షిత" రక్షతి" అన్నారు.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ" పనికిరాని తండ్రి, తాత అన్నాడేమో భారత, భాగవతాది - పద్దెనిమిది పురాణ, ఉప పురాణాలను వ్రాశిన వ్యాసుడు, మనల్ని మారిపొమ్మని చెప్పలేదు. "ఇలాగ మారిపోతారని" మారిపోయే వారి దౌర్భాగ్యాన్ని - మన దౌర్భాగ్యంగా లోకానికి విడమరచి చెప్పి - తను వ్రాశిన ప్రతి పురాణంలో కలి ధర్మాన్ని నిరశిస్తు - ఇది కాదు బ్రతుకంటే - అదే బ్రతుకుగా మనం బ్రతుకుతున్నాం. ఇందులో తప్పెవరిది ? ఆలోచించండి! మా ఆవేదన అర్థం చేసుకోండి!

ఇక వ్యాసుని చరిత్రలోకి వస్తే -

**"వ్యాసం వసిష్ఠ న ప్త్రారం, శక్తే పౌత్రః మకల్మషం**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం"** అన్నారు.

ద్వాపరంలో - కలి ప్రభావ దుష్టత్వాన్ని ప్రతిబింబింప చేసిన విధి విధానంలో ఈ వ్యాస చరిత్రమొకటి. మన పరంపర చాలా శ్రేష్ఠమైనది. ఉత్తమ వంశ సంజాతునిగా - ఉత్తమ "కుల" వ్యవస్థ తీర్చి దిద్దువానిగా, ప్రభవించిన తదుపరి- ఆ పరాశర పుత్రుడు - ప్రకాశిస్తాడు.

కథ - కథ"లో"ని కథ, గతం - అంతర్గతాలను ప్రక్కనబెడితే -

వశిష్ఠుని పుత్రుడు శక్తి. "అతనికి పరాశరుడు, ఆయనకు మత్స్యగంధికి నేటి పౌరాణికులకు - మంత్ర తంత్ర - శాస్త్ర - సాహితీవేత్తలకు మార్గదర్శకుడై- "వేద" విభజనం చేసి, ప్రత్యేకంగా - ఒక కులంవారే - శాస్త్రాభ్యాసం చెయ్యాలనే షరతులు విధించకుండా, అందరికి తన అపార అనుభవ జ్ఞానాన్ని - ఒక శాస్త్రంగా అందించిన - ఘన - అభినందనీయుడు - వ్యాసుడు. అందుకే ఆయనను భగవానులున్నారు.

నిజానికి రచయితకు - చదువులేకపోయినా - తెలియనిదంటూ వుండదు. విన్నవి, కన్నవి, చదివినవి, కనబడినవి - అన్నీ తన రచనల్లో ప్రతిబింబింప చేస్తాడు. ఇది లోక సహజం. సమాజం ధర్మం కూడా!

అందులోని - ఈ లోకచరిత్రయైన "వ్యాస" చరిత్రం. సరే సరి.

పరాశరులకు జన్మించి, పుడుతూనే శక్తివంతుడై తల్లికి "మాతృదేవోభవ" అని తొలి వందనం చేసి, దాని విశిష్టతను లోకానికి తెలియబరుస్తూ -

"అమ్మా! ఎప్పుడైనా సరే" నాయనా! కృష్ణ ద్వైపాయనా! అనో... "వ్యాసా.. అనో" పిలువు. నువ్వు "నాయనా" అనగానే నీ పిలుపు కోసమే ఎదురుచూసే నేను, నీ పాదాల నిలచి ప్రణమిల్లుతానన్నాడు.

**ఇది - ఎప్పటికీ - ప్రతి మగ సంతానం తెలుసుకోవాల్సిన విషయం. ఆచరించవలసిన ధర్మం. దీనిని మరిచినవారికి జీవితం లేదు. ప్రాణంలో - ప్రాణంగా వూపిరి పోసుకున్న జీవికి - తన ప్రాణాలను పణంగా పెట్టి, ప్రాణమిచ్చే తల్లికి, అనుక్షణం చూపవలసిన ధర్మం - తీర్చుకుందామన్నా తీరని ఋణం. మరచిపోతే- అది దాఋణం. వాళ్ళకు బ్రతుకు మహాభయంకరం.**

శ్రుతి చెప్పిన రెండో వాక్యం. "పితృదేవోభవ".

అది స్వార్థమైనా, పరార్థమైనా, ధర్మం కోసం అష్టకష్టాలుపడి, ఆ వంశాన్ని విస్తరింప చెయ్యడానికి "అతనా... ఫలానా... అని గొప్పగా చెప్పుకునే.. అదేనండి... పాశర్లపూడి రామకృష్ణయ్యగారు లేరండి. వారి పెద్దకుమారుడు, మేనమామ నూకల సూర్యనారాయణ గారి వద్ద కొన్నాళ్ళుండి... చదువుకున్నారు" అనగానే, ఆ తెలిసినవారు "సూరీడు" అంటారు. అవునా ? ఆ... ఆ..." అంటూ..

ఆ సూరీడు - అనే వ్యక్తి విజయవాడ వచ్చి రకరకాల జీవిత మార్పులతో, చివరకు ఆయుర్వేద డాక్టరుగా స్థిరపడిన వెంకట సూర్య ప్రసాదరావుగారు లేరా ? వారి కొడుకండీ... ఈయన ఇప్పుడే నూటికి పైగా ఆధ్యాత్మిక గ్రంథాలు, ఆంధ్ర- కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో, మన ఆంధ్ర దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఆధ్మాత్మిక (సాయి) తత్వోపన్యాసాలనివ్వడం, సాయి వ్రతాలు

నిర్వహించడం. కొన్ని షిర్డీసాయి మందిరాల ప్రతిష్ఠలో పాల్గొన్న వోరుగంటి రామకృష్ణ ప్రసాద్ - ఆయన వ్రాస్తున్న అపురూప గ్రంథమిదండీ - అనగానే -

"ఆ... ఆ.... తెలిసింది. వీరు ఏనుగుల మహల్ రాణీవారు, అయిదు తరాలుగా - సన్యాసాశ్రమం స్వీకరించి, తమ వంశాన్ని, తరాల్ని తరింపచేసుకున్న పుణ్యమూర్తులు, ముఖ్యంగా -

"శృంగేరీ - విరూపాక్ష పీఠాధిపతులు" -

జగద్గురు శ్రీశ్రీశ్రీ బోధానంద భారతీ మాంధాచార్యులవారు (పూర్వా శ్రమంలో రాణీ నృశింహ చయనులవారు), మన గురువుగారికి, అదేనండి రామకృష్ణ ప్రసాద్ గారికి, పూర్వాశ్రమ మహామాతామహులు, అవునా ?".

"అవునండి. నిజం. శ్రీవారి" పుత్రులు విజయవాడలోని - శ్రీ నోరి రామశాస్త్రి ఆయుర్వేద కళాశాలలో - ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన -"

"వైద్యవల్లభ "రాజ్ఞీ" (రాణి) వేంకటా చలపతి ప్రసాద చయనులవారు (వీరూ ఆశ్రమస్వీకారం చేసారు. ఈ శ్రీవారి ఆశ్రమ నామధేయం "పరిపూర్ణ ప్రకాశానంద భారతీ స్వామి) మన గురువుగారికి మాతామహులు -

వారి స్వహస్తాలతో "అక్షరాభ్యాసం" చేయించిన పుణ్యమేనండి. ఈనాడు మనకందరికి విశిష్ట వ్యక్తిగా - కనుపించే - శ్రీ సాయిభక్తి ప్రచార సమితి వ్యవస్థాపకులు, "విశ్వమానవతా గురుపీఠం" పారంపర్య పీఠాధ్యక్షులు, అంతకుమించి -

అరవై (60) సం॥గా శ్రీ షిర్డిసాయి నామం వింటున్న "శ్రీ సాయి" నామ శ్రవణానందులు, నలభై సం॥గా శ్రీసాయినామ స్మరణం చేస్తున్న "శ్రీ సాయి" నామస్మరణానందులు "గత ఇరవై సం॥గా, తన గ్రంథాలతో తత్వోపన్యాసాలతో ఎందరికో దగ్గరై, శ్రీ గురువులుగా, అభిమానులుగా విఖ్యాతులైన శ్రీ రామకృష్ణ ప్రసాద్. మరొక్క ముఖ్య విషయం, విశేషం.

1971 సం॥లో జనవరిలో షిర్డి వెళ్ళి శ్రీ సాయినాథుడు కరుణించినట్లు, అచ్చటి నుండి వచ్చి, సికింద్రాబాదు నుండి - విజయవాడకు బదిలీపై వచ్చిన శ్రీ వడ్లమాని జగదీష్‌తో పరిచయం చేయించి, ఆతని ద్వారా - శ్రీ గుణాజి

మహాశయులు ఆంగ్లంలో వ్రాసిన - శ్రీ సాయిబాబా చరిత్ర నిప్పించడం, వెంటనే అనువదించడం -

ఆ సం॥ర ఉగాది నుండి శ్రీరామనవమి వరకు, తండ్రినుండి సంక్రమించిన భక్తితో రంజిల్లే శ్రీ పంచాగ్నుల నటరాజ్ ప్రేరణతో, పారాయణం చేసి, వసంత నవరాత్రులు జరపడం... ఇప్పటికది వ్రాశి నలభై సం॥ల చరిత్ర - చారిత్రక "శ్రీ సద్గురు సాయిబాబా జీవితచరిత్ర"గా ఘనత పొందింది. అప్పుడు ముద్రణ కోసం కూడా పాటుపడ్డాము. కానీ - అది

1990 సం॥ వరకు ముద్రణ కాకుండా ఆగి, ఆ సం॥ర విజయదశమి నాటికి, సద్గురువుల ప్రేరణ, సాయిభక్తుల నిర్వహణలో ప్రచురించబడటం 1990 డిసెంబరు - ఒకటవ తేదీనాడు, పరమపూజ్యులు, దత్తావతారులు శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మాస్టారు వారి కరకమలాలతో, వారి కార్యక్రమంగా - ప్రధమ ముద్రణ ఆవిష్కరించబడటం జరిగింది.

అంటే ఇరవై సం॥ల అద్భుతచరిత్ర పొందింది. అప్పటినుండి ఇప్పటి వరకు ప్రతి సం॥రం ఆ గ్రంథం ముద్రించబడుతుంది. ఇప్పుడది 18వ ముద్రణకు పరుగులు తీస్తుంది. ఇన్ని ముద్రణలు తమ జీవితకాలంలో కళ్ళతో చూసుకున్న అదృష్టం ప్రసాదించిన సాయినాథ సద్గురువులకు, శ్రీ సాయిభక్తులకు కృతజ్ఞుడినంటాడు.

- ఈ అపర వ్యాసుడు, శ్రీరామకృష్ణ ప్రసాద్, ఇదండి వారి కథనం."

ఇలాగ ఆ రోజుల్లో ఘనంగా చెప్పుకునేవారు. మరి, ఈ రోజులలో, తన తాతల పేర్లు, గోత్రాలు తెలియని దౌర్భాగ్యులు, అధినాయకులై విలసిల్లుతున్నారు.

ఇక వ్యాస కథనం -



## ఇక "వ్యాస" కథనంలోకి వస్తే -

తనకు జన్మనిచ్చిన సత్యవతి - మహాముని పరాశరుల కరుణ వలన - వ్యాసుని పొందినప్పటికీ, కన్యగానే జీవిస్తుంది. ఆమెను అనుకోని పరిస్థితులలో-

అంతకుముందు గంగను వివాహం చేసుకుని, పుట్టిన ఎనిమిదిమంది పుత్రులలో ఒక్కడు మిగిలి, దేవవ్రతుడనీ, గాంగేయుడనీ పేరు పొందాడు. వాడొక్కడే మిగిలాడు, కారణాంతరాల వలన గంగ, అప్పటికి పిల్లవానితో అదృశ్యమై, వయస్సు వచ్చాక విద్యాబుద్ధులు నేర్పి శంతనుని కర్పిస్తుంది.

ఈ శంతనుడు, ఒకనాడు, అనుకోకుండా సత్యవతిని చూస్తాడు. మనసు పారేసుకుంటాడు. విషయం తెలుసుకున్న గంగాపుత్రుడు "దేవవ్రతుడు" ఆమెతో తండ్రికి వివాహం చేసి, ఆ తల్లిని, తల్లిగా చేసుకుంటాడు. ఈ సందర్భంలోనే దేవవ్రతుడు భీష్ముడౌతాడు.

ఈ శంతనునికో ఇద్దరు మగపిల్లలు కలిగారు. ఈ శంతన కుమారులలో పెద్దవాడైన చిత్రాంగదుడు అనుకోని పరిస్థితులలో అతని పేరేగల గంధర్వుని చేతిలో మరణిస్తే, రెండో వానికి కాశీరాజు పుత్రికలతో భీష్ముడు వివాహం చేస్తాడు. అతడు కామవిలాసుడౌతాడు. అర్థాంతరంగా మరణిస్తాడు.

అప్పుడు వంశం నిర్వంశమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది, ఆ సమయంలో, భీష్ముడు తాను తన ప్రతిజ్ఞను తప్పనంటే అప్పుడు కుమార ద్వైపాయనుడు చెప్పిన విషయం జ్ఞప్తికొచ్చి "నాయనా!" అంటుంది. అన్నీ తెలిసిన ఆ దివ్యమూర్తి తల్లి పిలుపుకోసమే ఎదురుచూస్తూ, సర్వతీనదీ తీరంలో, ఆశ్రమ మేర్పరుచు కుంటాడు. ఎప్పుడైతే తల్లి - "నాయనా" - అందో.... ఆ వెంటనే -

"అమ్మా!" అంటూ మాతృ చరణాల నిలిచాడు. తల్లి ఆశీస్సుల నందుకున్నాడు. అప్పుడు "తల్లి" సత్యవతికి నిజమైన పుత్రదర్శనంలోని ఆనందం పొందగల్గింది. ఇతడు సద్ధర్ముడు. శంతనుని వలన కలిగిన వారలు కాముకులు. ఆ క్షేత్ర బీజశక్తులటువంటివని బాధపడుతుంది. అమ్మా! అంటాడు. జరిగిందంతా, ఆ తల్లి విపులంగా విడమరచి చెబుతుంది.

అంతా విన్న వ్యాసుడు - సమయం చూసుకుని.. తప్పక నీ ఆజ్ఞ శిరసావహిస్తానంటే.... కాదు... నా ముద్దు చెల్లించమంటుంది. మాతృవాక్యాన్ని శిరసావహిస్తాడు. ఆవేశం అనర్థదాయకం - క్షేత్ర - బీజ - పవిత్రతాలోపం, ఉత్తమ సంతానం బదులు, ఎటువంటి దుష్కర్మకు, సర్వులను బలిచేస్తుందో అనడానికి...

వ్యాసవీర్యంలో జన్మించినప్పటికి, సంకరక్షేత్రంలో - గుడ్డి ధృతరాష్ట్రుడు, (తెల్ల) పాండురోగి'' పుడతారమ్మా అంటాడు - కాదంటే, అంబిక చేసిన పొరపాటు వలన, ఆమె దాసిదానికి - "విదురుడు'' - సద్ధర్ముడు జన్మిస్తాడు. మొత్తానికి.

సంకరసృష్టికి - తల్లిగా, ప్రేరణ, వ్యాసుడాద్యుడయ్యాడు.

అక్కడనుండి - పాండుపత్నులలోని కుంతి, మొదటగా వర ప్రభావంతో యమ, వాయు, ఇంద్రాదులద్వారా సంతానమొందితే, పాండురాజు మరో భార్య మాద్రి అశ్వినీ దేవతల శక్తితో సంతానమొంది, ఆ శుభవార్తను, ధర్మరాజు... అదే యుధిష్ఠరుని జనన సంతోషం వినలేని, లేని గుడ్డితనాన్ని పొందిన గాంధారీ, అసూయ - ద్వేషంతో - గర్భవిచ్ఛిత్తికి, పాల్పడితే ఆ అండాన్ని -

నూట ఒక్కముక్కల్ని చేసి వాటిని నేతికుండలలో వుంచి - కాలానికి ఎదురు చూడమంటాడు. ఆ రకంగా పుత్రులను, మనుమలను చెప్పుకోవడానికి పొందుతాడు.

దీనివల్న - తల్లి ఆదేశం పేరిట సంకరజాతి సృష్టికి, ఆ వంశాభివృద్ధికి కారకుడైన వ్యాసుడు - అండజ సృష్టికి ఆద్యుడు అవుతాడు.

ఈ రకంగా వృద్ధి చెందిన వంశాన్ని, తన కర్తవ్యంగా మమతానురాగ రూపమై- సంరక్షించదలుస్తాడు. ఈ కథనాన్ని తాను వ్రాసిన - అన్ని గ్రంథాలలో, లోక తీరును తెలిపే విధంగా భవిష్యద్దర్శనంతో కల్పి మరీ లిఖిస్తాడు. మానవాళి మహోజ్వల కీర్తి ప్రతిష్టలు - విశ్వవ్యాప్తం కావాలని, ఆ నారాయణ స్వరూపుడు తలుస్తాడు.

ఇదే పెద్ద మహాభారతమయింది. ఇందులో ఎన్నో చరిత్రలు. ధర్మ రక్షణ లీలలు వున్నాయి. అందులో చెప్పుకోదగ్గది - గుది గుచ్చి చెప్పిన కృష్ణ చరిత్ర, అది ఇప్పుడు - ధర్మ, తత్వ నిత్య సత్య వివరాలతో ఒక మహాగ్రంథంగా అందిస్తున్నాం.

అందులోని రెండవ భాగమిది. ఇది "జ్ఞాన''కాండ అయితే ఇందులో కేవలం కృష్ణచరిత్రే తప్ప భాగవతంలోని ఇతర కథలు కనబడవు. "కృష్ణం వన్దే జగద్గురుం''

అంటూ- దీనిని అక్షరజ్ఞానులు సైతం చదివి తనవలె తరించాలన్న కోరికతో వ్యోరుగంటి వంశజుడు, కౌండిన్యస గోత్రీకుడు ద్రవిడ శాఖా జనితుడు, పారంపర్య మహా మాతామహుల శ్రీదేవి ఉపాసన శక్తిబలంతో, సకలార్థ సాధకము, భక్తజన ప్రియంకరముగా -

నూటికి పైగా వ్రాసిన ఆధ్యాత్మిక గ్రంధాల జాబితాలో ఇదో కలికితురాయిగా అందిస్తున్నారు.

ఇది - తన "నిత్య పారాయణ" గ్రంధాలు, ఇతర ఆధ్యాత్మిక, వేదాంత, ధర్మ గ్రంధాలతోపాటు, సర్వభక్తజనులను ఆనందింపచేసి, అత్యంత కీర్తి ప్రతిష్టలను కల్గించి, జన్మించిన వంశానికి, జననీజనకులకు శాశ్వత పుణ్యశీలత్వాన్ని, లోకాలను ప్రసాదిస్తూందనీ -

"అమ్మా! ఈ ద్రవిడ బాలుడు. నీ పాలుత్రాగి - ఇంతటి వాడయ్యాడని- ఎలాగ పొంగిపోతారో... అలాగే - ఆదిశంకరులవలె ఈ ద్రవిడ బాలుడు -

శ్రీ సాయినాథ సద్గురువుల కరుణ, జగదంబ ఆశీస్సులు - వంశ వర్థనుల "శ్రీల" పరమ పవిత్ర ధర్మం - సర్వరక్షగా - జగద్విఖ్యాతి పొందానని తలవడం-

ఆ తల్లి "శ్రీ" పదాంబుజములకు, ప్రసాదించిన దివ్యశక్తి -

సదా శిరస్సువంచి వందన శతాలు, సహస్రాలనందిస్తూ - స్వస్తి -

**ఓం శ్రీ మాత్రే నమః**

*ఇది - "శ్రీకృష్ణ చరిత్ర"లోని జ్ఞానకాండ. మీరు చదవబోయేది "శ్రీకృష్ణ చరిత్ర"లోని "ముక్తి"కాండ. దీనిని "వైరాగ్య"కాండగా కూడా చెప్పవచ్చును.*

*త్రికాండ యుతమైన ఈ - "శ్రీకృష్ణ చరిత్ర" భక్తజనులకు, మహాభాగవతులకు కైవల్యదాయకం.*

*అస్తు, తధాస్తు...*

**- మీ -**

**- వ్యోరుగంటి రామకృష్ణ ప్రసాద్.**

శ్రీకృష్ణం వందే జగద్గురుం

# శ్రీకృష్ణ చరిత్ర

## తృతీయ భాగం "ముక్తికాండ"

## (ముక్తి, వైరాగ్యము)



రచన : వొరుగంటి రామకృష్ణ ప్రసాద్


నవరత్న బుక్ హౌస్

28-22-20, రహిమాన్ వీధి, అరండల్‌పేట,

విజయవాడ - 520 002.

**శ్రీ కృష్ణ చరిత్ర**

**తృతీయ భాగం "ముక్తికాండ"**

**(ముక్తి, వైరాగ్యము)**

రచన

**వొరుగంటి రామకృష్ణ ప్రసాద్**

# ప్రకాశకుల మాట

ఆస్తిక, భక్తవర్యులారా!

ఇది "శ్రీకృష్ణ" చరిత్ర. ఇదే "శ్రీకృష్ణ భాగవతం" కూడా. అడుగడుగునా, జన్మించిన తదాది, తాను అవతార పరిసమాప్తి చేసే వరకు "మానవాళి మనుగడపై - ధర్మప్రతిష్ఠాపనకై" తహతహ లాడిన, దివ్యశక్తి స్వరూపుడు శ్రీకృష్ణుడు.

"గొల్లడు, గొల్ల పిల్లవాడు, పశుల కాపరి" అనిపించుకున్న నందకిశోరుడు, యశోదా "నంద"నుడై ఆనందాలను పంచాడు. ఆపదలలో మున్గి, వాటి నధిగమించి అందరికీ తన దైవత్వాన్ని ప్రకటింపచేసాడు.

అయినా మానవులు, మాధవుడు మనతో తిరుగుతున్నాడు కాబట్టి, అతని శక్తిని అర్థం చేసుకోలేకపోయారు. మా కృష్ణుడేనని మాయలో పడిపోయారు. వయసుకు మించిన ఆలోచనలు, అద్భుతాలు. అటువంటి వెన్నలమనోదొంగ, అందరికి ప్రేమ ప్రదాత, ప్రాణ స్వరూపుడయ్యాడు.

బృందావనానికి వెళ్ళడానికి ముందే "రాధ" ప్రేమను పొందాడు. ఆ "రాధ"నీయుడయ్యాడు. బృందావనంలో ప్రతి ఒక్కరి మనసు దోచాడు. శాశ్వత ప్రేమతత్వాన్ని వారికందించాడు.

అటునుండి మధురకు వెళ్ళాడు. పెద్దవాడయ్యాడు. పెద్ద పెద్ద పనులు (లీలల్ని) చేసాడు. ప్రతి ఒక్క దుర్మార్గునికి వణుకు పుట్టించాడు. సన్మార్గులకు శాంతిని ప్రసాదించాడు. ఎందరికో ఆరాధ్యుడయ్యాడు. ఏ కొందరికో తప్ప అందరికి అభిమానుడయ్యాడు.

అటు నుండి - విర్రవీగే జరాసంధుని దర్పమణచడం, యాదవ ప్రాభవం ప్రపంచానికి తెలియబరచడం, రుక్మిణీ కల్యాణంతో,

ప్రేమించే వారికి ప్రాణసంకట పరిస్థితిలో నుండేవారికి "సంకట" హరుడు, ప్రాణప్రదుడు అయ్యాడు.

మొదటి భాగంలో "భక్తి"ని,

రెండవ భాగంలో - జ్ఞానాన్ని - అందించవలసిన విధంగా, అందించిన, ఆ పరంధాముడు చివరకొచ్చేసరికి -

ఈ మూడవ భాగంలో "జగదాచార్యుడయ్యాడు. "దేవా"ది దేవుడు" అయ్యాడు. తన ధర్మ ప్రతిష్ఠాపనమాగదని, ఆ సత్యం గ్రహించమని, నరుడైన అర్జునుని "నారాయణ స్వరూపుడు, "ముక్తి" లేదా "వైరాగ్య బోధగా" జన్మ సాఫల్యాన్ని, కర్తవ్యాన్ని, దీక్షను, దక్షతను ప్రకటించాడు. కర్తవ్యమూర్తిని చేసాడు.

ఇటువంటి దివ్యగ్రంథాన్ని కేవలం చరిత్రగా కాక ఒక మహాభాగవతంగా "శ్రీకృష్ణ చరిత్ర" పేరిట మా గురుదేవులు, శ్రీ వోరుగంటి రామకృష్ణప్రసాద్ అందించారు.

మా ఆకాంక్షకు, ఆశయానికి తగ్గట్లు, మహాద్భుత గ్రంథాన్ని మీకందించే ప్రయత్నాన్ని ఫలవంతం చేసారు.

అందుకోండి. ఆనందించండి.

"సర్వే జనాః స్సుఖినోభవన్తు" అని చెప్పే - దివ్య చరిత్రకారుడు శ్రీకృష్ణుని "శ్రీకృష్ణ చరిత్ర"లో దర్శించి, పరవశించండి.

మమ్ము ధన్యులను చెయ్యండి.

శుభం భూయాత్!

మీ

**- ప్రచురణ కర్తలు.**

# ముందుమాట

"శ్రీకృష్ణం వన్దే జగద్గురుం" అని ప్రారంభించిన "శ్రీకృష్ణ చరిత్ర" భక్తి, ముక్తి, జ్ఞాన, వైరాగ్య స్వరూపమైన మూడుకాండలలో మూడవదిది.

"యదాయదాహి ధర్మస్య, గ్లానిర్భవతి భారత" అన్న జగదాచార్యుడైన శ్రీకృష్ణుడు, మామూలు కృష్ణుడుగాను, వున్నాడు. భగవంతుడై భాగవత, భగవత్తత్వాల్ని లోకానికి అర్జునుని "నరుని" చేసి, నరలోకానికి అందించిన దివ్యుడూ అయ్యాడు.

"అభ్యుత్థానమధర్మస్య...!" అన్నది శృతివాక్యం చేసి, ఎందరో కోరిన కోర్కెలు, భూదేవి ప్రార్థన, బ్రహ్మాది దేవతల, అభ్యర్థనం మేరకు, ఆదిలక్ష్మి తన శేషునితో కలిసి, బలరాముడు, కృష్ణుడైనాడు. వృష్ణి వంశ యదు వీరుడై, ధర్మ సంస్థాపనకు నడుం కట్టాడు.

"కృష్ణ చరిత్ర" మొదటి భాగం భక్తి భావాన్ని ఎందరిలోనో పెంచింది. అందర్నీ ఆశ్చర్య చకితులను చేసింది. చివరకు పెంచిన తల్లి చేతనే "బాలకుడెంత, అజాండంబులెంత ?" అని అనిపించి, "కృష్ణం వన్దే జగద్గురుం" అని అందరు ఆరాధించే, దివ్య చరిత్రను లీలా విలాసాలతో భక్తజనుల కందించాడు.

నిజానికి, "కృష్ణచరిత్ర" భాగవతంలోనిదే అయినా, "మహాభాగవతం" భగవత్తత్వాన్ని భక్తజనుల లీలా విశేషాలను, తొమ్మిది స్కంధాలలో తెలిపి "దశమ" "పూర్వ" - "ఉత్తర" భాగాలలో శ్రీకృష్ణచరిత్రను అందించి, భక్తి పారవశ్యంలో ముంచుతుంది. కానీ, ఈ "కృష్ణ చరిత్రలో "శ్రీకృష్ణ అవతారం, లీలలు", ధర్మ పరిరక్షణా విషయాలను, "విషయాలుగా" వివరించి భక్తజనుల నానందలోకాలలో విహరింప చేస్తాయి - ఇది భక్తికాండ.

ఇక చివరిదైన, ఈ "కృష్ణ చరిత్ర" మూడవ భాగం - వైరాగ్య సూచిక. ఇందులోనే పరమాత్మగా, యశోదా "నంద", దేవకీ, వసుదేవసుతుడు, "మిత్రవింద"తో ప్రారంభించి, "అర్జునుని" నిలదీసి, ఉద్ధవాదుల కరుణించి, "జ్ఞాన" మార్గాన్ని, తరుణోపాయాన్ని, హెచ్చరికగా తాను చెబుతాడు.

మహాభక్తుడు, స్వచ్ఛంద మరణ వర శ్రేష్ఠుడైన భీష్ముని చేత చెప్పిస్తాడు. అంతేకాదు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అని అంటే చాలు, వైరాగ్యమొంది తరిస్తారన్న భీష్ముడు "చాతకానివాడు "దేవుడా" అంటే, ఆ ప్రభువు కరుణిస్తాడు. అదే సర్వసమర్థుడు జ్ఞానశ్రేష్ఠుడైన వ్యక్తి, తన శక్తిని నిర్వీర్యం చేసుకుని -

"ప్రభో!" అంటే, "లబో-దిబో"మని ఏడవమంటాడే తప్ప - కరుణించడు. అందుకే - ఈ మూడవ "ఆఖరి భాగమైన "శ్రీకృష్ణచరిత్ర"ను "పరిత్రాణాయ సాధునాం" అని ప్రారంభించి, భక్తజన మనోరంజకంగా అందించడానికి కృషి జరిగింది.

"కర్తవ్యము నీవంతు, కాపాడుట నావంతు" అన్న శ్రీకృష్ణ వాక్యమే ఈ గ్రంథ రచనకు, ఈ జీవికి ఆ భగవంతుడు ప్రసాదించిన మహద్భాగ్యం. అందుకే ఆ భగవంతుని కరుణతో దీనిని "వైరాగ్య"కాండగా అందించడమైనది. దీనిని "ముక్తి" కాండగా కూడా చెప్పకోవచ్చును.

ఈ సర్వ అదృష్టానికి మూలపురుషులు, మా మాతృశ్రీ, పితృదేవులు, మా మాతామహులు, వారి "దివ్య" వంశరక్ష, అందుకే కన్న తల్లిదండ్రులకు, తమ దివ్య రక్తంతో ధన్యుల్ని చేసిన మా వంశపెద్దలు మాతామహ, మహామాతామహులకు -

అభిమానులకు, ప్రచురణకర్తలకు, సర్వులకు, అభినందనలు, "అభివందనములు చేస్తూ - "మన"స్సుమాంజలితో

శ్రీ సాయి సువర్చలా సదన్
రామలింగేశ్వర పేట,
కుడిచేతి 6వ లైను
విజయవాడ - 520 003.
ఫోన్ : **0866-2532139**
**9393007648.**

మీ
**- వోరుగంటి రామకృష్ణ ప్రసాద్.**
పారంపర్య పీఠాధ్యక్షులు,
విశ్వమానవతా గురుపీఠం

**web site : www. vorugantiramakrishnaprasad.com**
**e-mail : vorugantiramakrishnaprasad@gmail.com**

# విషయసూచిక

పేజి. నెం.

## మొదటి అధ్యాయం


| | | |
|---|---|---|
| పరిత్రాణాయ సాధునాం | ........................................ | 9 |
| కాళింది | ........................................ | 17 |
| మిత్రవింద | ........................................ | 22 |
| ప్రద్యుమ్నుడు | ........................................ | 29 |
| కృష్ణార్జునులు | ........................................ | 34 |
| నాగ్నజిత్తు | ........................................ | 38 |
| పారిజాతం | ........................................ | 49 |
| ''నరకాసుర'' సంహారం | ........................................ | 61 |
| ఇంద్రలోకం | ........................................ | 79 |
| పాహిమాం-శ్రీకృష్ణ | ........................................ | 84 |
| రాజసూయం | ........................................ | 91 |
| యజ్ఞ సన్నాహం | ........................................ | 98 |
| సాల్వుడు | ........................................ | 110 |
| గురువుల సన్నిధి - సుదామ పెన్నిధి | ........................................ | 118 |
| ఆనందోపరబ్రహ్మ | ........................................ | 136 |
| ఆనంద సమాగమం | ........................................ | 140 |
| హే కృష్ణా... ముకుందా మురారీ! | ........................................ | 156 |
| కర్మ, తప్పదు | ........................................ | 170 |


## రెండవ అధ్యాయం


| | | |
|---|---|---|
| కృష్ణప్రేమ | ........................................ | 175 |
| ధన్యులయ్యా! | ........................................ | 184 |
| తప్పమ్మా...! | ........................................ | 188 |
| దూర్వాసులు | ........................................ | 193 |
| గోగ్రహణం | ........................................ | 195 |
| ''ఉత్తర'' - కర్తవ్యం | ........................................ | 199 |
| ''సంజయ రాయబారం'' | ........................................ | 207 |
| ఇప్పుడేం చెయ్యాలి ? | ........................................ | 212 |
| ఏమంటారు ? | ........................................ | 218 |

ఉపశమనం! ........................................................ 230
శ్రీకృష్ణోయుద్ధోపదేశం! ........................................................ 232
యుద్ధోపదేశం ........................................................ 233
ప్రక్షాళనం ........................................................ 244
వింటున్నారా..?! ........................................................ 257
నేనంటే తెలుసుకో! ........................................................ 259
అర్థం చేసుకో! ........................................................ 263
కదులు ముందుకు ........................................................ 273
నాలుగవ నాటి యుద్ధం ........................................................ 282
పద్మవ్యూహం ........................................................ 306

## మూడవ అధ్యాయం

యుద్ధం-మోసమే! ........................................................ 316
నిజంగా దుర్దినం ........................................................ 343
ధర్మసూక్ష్మం ........................................................ 370
పట్టాభిషేకం ........................................................ 374
భీష్మని ధర్మబోధ ........................................................ 377
ఉదంక మహర్షి ........................................................ 396
బాణుడు ........................................................ 402
పరిక్షిత్తు ........................................................ 409
అశ్వమేథం ........................................................ 416
యజ్ఞ రక్షణ ........................................................ 425
యజ్ఞం ........................................................ 428
జైత్రయాత్ర-ప్రమీల ........................................................ 441
భభ్రువాహనుడు ........................................................ 445
మగధ ........................................................ 465
శ్రీకృష్ణం శరణం మమ ........................................................ 476
అనిరుద్ధుడు ........................................................ 482
యాదవ కులం ........................................................ 486
అవతార పరిసమాప్తి ........................................................ 490
కృష్ణ నిర్యాణం ........................................................ 493
ఉపసంహారం ........................................................ 495
చివరిగా... ........................................................ 501

## శ్రీ కృష్ణం వన్దే జగద్గురుం

## ప్రథమాధ్యాయము

# పరిత్రాణాయ సాధూనాం

ప్రభాస తీర్థానికి ఎవరో మహనీయులు వచ్చారుట. అందరు అనుకుంటున్నమాట కృష్ణుని చెవులపడింది. ఎవరా మహానుభావుడు, చూడాలని బయలుదేరాడు, చూసాడు. ఒక నవ్వు నవ్వాడు. నువ్వేనా ? అనుకున్నాడు. కృష్ణుని చూసి మహనీయత్వం వుట్టిపడేటట్లు కనులతో అంజలించాడు. ఎవ్వరి కంటపడకుండా కృష్ణ దర్శనం చెయ్యాలంటే ఇదే సులభమార్గమని గ్రహించిన అర్జునుడు, కపట యతి వేషదారియై ప్రభాసానికి వచ్చాడు.

యాదవులకు "యతులు, సాధు సత్పురుషులు మహనీయు"లంటే ఎంతో గౌరవం. అందుకే ఈ వేషం అర్జునుడు దాల్చాడని కృష్ణుడు గ్రహించాడు. అతనిలాగే కనులతో ఆశీర్వదించాడు. అక్కడెవరు లేరు. దాంతో అర్జునుడు "బావా! ద్వాదశమాస వ్రతం చెయ్యాల్సి వచ్చింది. అందులో భాగమీ యాత్ర." అని తన రహస్యం చెప్పేసాడు.

"నువ్వు ద్వారకకు రా. నీకో ప్రియమైనది, నాకు ప్రియమైనది కానుకగా ఇస్తానన్నావు కదా! అందులకీ యాత్ర, ఈ రాక!" అన్నాడు. నీ మనసు నాకు తెలుసులే. తప్పక... అభీష్టసిద్ధిరస్తు" అన్నాడు వాసుదేవుడు. రైవతాద్రికి తీసుకువెళ్ళి అక్కడో సముచిత ప్రదేశంలో ఈ యతిని వుంచి, చాలా కాలానికి కలుసుకున్నట్లు ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకున్నారు. ఆ మాటల్లో -

ప్రస్తుత నీ రాకకు కారణం ? అడిగాడు కృష్ణుడు.

నీకు తెలియనిదేమున్నది వాసుదేవ! నారద మహాముని సలహా మేరకు, అందర్ని సమదృష్టితో చూసే ద్రౌపదిని, మాలో మాకు వాదాలు, ఏ భేదాలు రాకుండా సం॥న కొకరితో వుండేటట్లు ఆ సమయంలో పొరపాటునెవరైనా వారికి ప్రతిజ్ఞా భంగం కావించినట్లయితే, వారు పాపపరిహార్థం పన్నెండు మాసాలు తీర్థయాత్ర చేసి ప్రాయశ్చితమొందాలని నిర్ణయం చేసుకున్నాం.

ఇలాగుండగా, ఒకనాడొక బ్రాహ్మణోత్తముడు తన హోమధేనువును దొంగలపహరించారని దూడ తల్లికోసం అరుస్తూందని తెలుపడంతో, ఆయుధాగారము వైపు వెళ్ళాల్సి వచ్చింది. ఆ సమయంలో ద్రౌపది - యుధిష్టరులు విశ్రాంతి తీసుకుంటున్నారు. అక్కడికి వెళ్ళకూడదు. ఒక ప్రక్క ప్రతిజ్ఞా భంగము. మరొక ప్రక్క ధర్మభంగము. ఇటువంటి తరుణంలో - ధర్మం సుప్రతిష్టమైందని తలుస్తూన్న మాకు, ఈ దొంగలు, దొంగతనం అధైర్యాన్ని, అప్రమత్తతను ప్రశ్నిస్తూంటే ఏం చెయ్యాలి ?

నిష్ఠూరాలు - నిందారోపణలతో వున్న తరుణంలో విధిలేక, తీర్థయాత్రాభి ముఖుడినవ సిద్ధబడి ఆయుధాగారం చేరి, నా ధనువందుకుని క్షాత్ర ధర్మమైన సుధర్మాన్ని నిలబెట్టాను. చోరులను శిక్షించి, హోమధేనువును రక్షించి, మాపై బ్రాహ్మణుడు పెట్టుకున్న విశ్వాసాన్ని నిలబెట్టాను.

ఆ తర్వాత - అనుకున్న మాట ప్రకారం, తీర్థయాత్రాభిలాషుడినైతే, అన్నగారు నీవు చేసింది తప్పు కాదన్నారు. కాని తప్పదు. మనం చేసుకున్న ప్రతిజ్ఞలను మనమే వమ్ము చేసుకోరాదన్నాను. బయలుదేరాను. అన్నగారు సరేనన్నారు. అలాగ తిరిగి తిరిగి, ఈ ప్రభాసానికి వచ్చాను. నీ దర్శనం చేసుకున్నాను. ధైర్యమొందాను. అంతా వివరంగా చెప్పాడు. నువ్విచ్చే కానుకని తీసుకుని ఇంద్రప్రస్థానికి ప్రయాణించాలని వచ్చానన్నాడు.

"చాలా సంతోషం బావా! ఏ సమయానికేది ఇవ్వాలో అది ఆ భగవంతుడు తప్పక ఇస్తాడు. దేనికీ మనం తొందరపడకూడదు." కృష్ణుడు చెబుతున్నాడు. అపుడు అర్జునుడు నవ్వుతూ "నీకో విషయమన్నాడు" చెప్పమన్నాడు కళ్ళతోనే.

గంగా ద్వారంలో మేమున్న రోజులలో ఒకనాటి ఉదయం నేను అలవాటుగా నదీ స్నానానికి వెళ్ళాను. అక్కడో నాగకన్య నన్ను చూసి కామపరవశురాలయింది. ఏముంది - తన నగరానికి ఎత్తుకు పోయింది. ఒక బ్రహ్మాండమైన మందిరంలో నన్ను వుంచింది. అక్కడ నిత్యాగ్నిహోత్రాలు జరుగుతున్నట్లు అగ్నివేదిలో ప్రజ్వరిల్లుతుంది. హోమధూమం దూలాలనంటుతుంది. అక్కడ నన్ను వుంచి, వెళ్ళిపోయిన నాగకన్య, సర్వాలంకార భూషితయి వచ్చింది. ఆ కవ్వించే చూపులకు కరగిపోయాను. ఆ కళ్ళలోని మత్తుకు లొంగిపోయాను.

"ఇంతకీ నువ్వెవరు ?" ఎంత ప్రేమ పుట్టినా తెలియనివారితో అప్పటి సమాగమం, ప్రణయానికో, ప్రళయానికో దారి తీస్తుందేమోనన్న భయం వెల్లడించాను. నా అందాన్ని కళ్ళతో జుర్రుకుంటున్నట్లు, తన అందాలను పండువెన్నెల చేసి పరచింది.

నా పేరు, నాగకన్య "ఉలూచి" అంది.

"నేను... !" ఏదో అనబోతున్న నాతో నీవెవరో నాకు తెలుసు. అందుకే నిన్ను వెంబడించా. నా చేతిలోకి తీసుకున్నాను. ఇప్పుడు ఈ లోకంలో మనం - మనమే అంది. నీ పేరు విన్నాను. నీ వీరత్వానికి నన్నెప్పుడో అర్పించుకున్నాను. సమయం కోసం ఎదురు చూస్తున్నాను. అది లభించిందంది.

"నేను వ్రత నియమము గలవాడిని. నాకు వ్రతభంగం చెయ్యడం తగునా ?" అడిగాడు.

"చూడు, పాండవ మధ్యమా. నీది భూలోకము. నాది నాగలోకము. ఇప్పుడు నువ్వున్నది నా లోకంలో. ఇక్కడ భూలోక నియమాలు పనికిరావు. పైగా కామపీడితను. బహుకాలంగా నీకోసం ఎదురుచూస్తున్నదాన్ని. వ్రతమంటు నన్ను వుసురుపెడితే, నాకు మరణము తప్ప మరో మార్గం లేదు.

అప్పుడు స్త్రీ హత్యాపాపం నీకు చుట్టుకుంది. దీనికి ప్రాయశ్చిత్తము లేదు. దానివలన ఎన్నో అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. వలచి వచ్చిన ఆడదానిని కాదనడం మహాపాపం. మరి నేను... అనకు... వీరత్వంతో పొందిన యువతిని, తల్లిమాట అంటూ అందరు పంచుకుంటున్నారు. దీనికో నియమం పెట్టుకుని, ఎటువంటి గొడవలు రాకూడదన్న లక్ష్యం కారణంగా, జరిగిన దానిలో ధర్మం తప్ప, అధర్మం లేకపోయినా, యాత్రామూర్తివయ్యావు.

నీ కోసం ఎదురుచూస్తున్న నా కళ్ళలో పడ్డావు. కనికరించు. కాదంటే జరగబోయే అనర్థం మిమ్మల్నందర్ని బాధిస్తుంది. అన్నింటికి కృతనిశ్చయురాలై నట్లు ఆమె చెబుతుంది, అంతేకాదు చేసే ప్రతి మంచి, చెడులకు తగు విధమైన ప్రాయశ్చిత్తాలుంటాయని ధర్మసంకటంలోకి నెట్టేసరికి ఆమెకు లొంగిపోయాను.

ఆ రాత్రి అక్కడ గడిపి, తెల్లవారేసరికి మరల గంగా ద్వారానికి వచ్చేసాను. వారు కామరూపులు కదా. మాకొక కుమారుడు కలిగాడు. వాడిపేరు ఇరావతుడని చెప్పాడు. అంతా విన్న కృష్ణుడు "అమ్మ, బావా! భలే అసాధ్యుడివి" అన్నాడు.

ఇరవై నాలుగ్గంటలు నన్ను చూడకపోయేసరికి తీవ్రాందోళనమునకు గురయిన బ్రాహ్మణోత్తములు, మరునాడు ఉదయం నన్ను చూడగానే దరిచేరి విషయ వివరమడిగారు. చెప్పాను. ఇక అక్కడనుండి హిమవత్పర్వత ప్రాంతానికి బయలుదేరాము. హిమబిందు, నైమిశారణ్యములను చూసుకుంటూ, గంగా సంగమం ప్రాంతం చేరాము.

అటునుండి కళింగం. ఇక్కడే నాతో వచ్చినవారలలో కొందరు మమ్ము విడిచి ఉత్తర భారతంవైపు సాగారు. గోదావరి స్నానం, శ్రీశైలదర్శనం, వేంగీ దేశాదులను చూస్తూ, ఎక్కడికక్కడ దానధర్మాది విశేష కార్యక్రమాలను పవిత్రంగా సాగిస్తూ మణిపుర ప్రాంతానికి చేరాము. ఇక్కడికి పన్నెండు మాసాలు పూర్తయి, పదమూడో మాసంలో పడ్డాము.

ఈ మణిపురాన్ని చిత్రవాహనుడు పరిపాలిస్తున్నాడు. అతని కుమార్తె చిత్రాంగద. ఆమె అందానికి ఎంతయినా భ్రమిసాను. ఆమెను పెండ్లాడాలని, నా గురించి వివరాలు వాళ్ళకందచేసాను. ఆ రాజు చాలా సంతోషించాడు. తప్పక తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తానన్నాడు.

"అయితే....... !" అంటూ ఆగాడు అర్జునుడు.

"ఏమయింది బావా ?" కృష్ణుడి పరిహాసం వంటి ఆందోళన ప్రకటించాడు.

వారి వంశాచారం ప్రకారం... అంటే వారి వంశీకుడు ప్రభాకర మహారాజు చేసిన తపస్సుకు మెచ్చిన పరమశివుడు నీకు సంతానము కల్గుతుంది. ఇకపై నీ వంశీకులకు ఒక్కొక్క పుత్రుడే జన్మిస్తాడని వరమిచ్చాడు. అందువలన చిత్రాంగద ఒక్కతే నా సంతానం. ఆమెకు పుట్టిన వ్యక్తి ఈ రాజ్యానికి వారసుడు. అతన్ని మాకు విడిచిపెడతానంటే...

తప్పక నీవంటి వీరాధివీరునికి భరతకులైకభూషణునికి, నా కుమార్తెనిచ్చి వివాహం చేస్తానంటాడు. అందుకంగీకరించి ఆమెను వివాహం చేసుకున్నాను. ఇలా కొన్నాళ్ళు గడిచాయి. చాలా సంతోషంగా వుంది. ఇటువంటి తరుణంలో-

ఒకనాడు బ్రాహ్మణ, ముని బృందాలతో కలిసి పరిసరప్రాంతాల తీర్థక్షేత్రాలను దర్శించాలని బయలుదేరిన నేను సౌభద్ర తీర్థానికి వచ్చాను. ఆ

క్షేత్రంలోని తీర్థంలో స్నానము చెయ్యబోతే అక్కడివారు వలదని వారించారు. కారణమడిగితే - ఇదే కాదు. ఈ ప్రాంతములో ఇటువంటివి మరో నాలుగు మడుగులు వున్నాయి. ఇవన్నీ పాపపరిహారకాలే అయిన, గత వంద సం॥ల నుండి మొసళ్ళు వీరవిహారంతో ఏ ఒక్కరు వీటిని వుపయోగించడంలేదని బదులిచ్చారు.

"తన లక్ష్యము తీర్థక్షేత్ర సందర్శనము, స్నానతర్పణాదులని, ఇప్పుడు మొసళ్ళు అంటూ వెనుదిరుగడం తగదన్నాను. అయినా వారు భయపెడు తున్నారు. నాలో పట్టుదల పెరిగింది. ఆ నీటిలో కాలు పెట్టానో లేదో ఒక మొసలి నా కాలు పట్టుకుంది.

నా రెండుచేతులతో దాని నోటిని విడదీసి గట్టుపైకి బంతిలా విసిరాను. ఆశ్చర్యం అందరు చూస్తుండగా అది దేవకాంతగా మారిపోయింది. నాకు ఆశ్చర్యం వేసి వివరమడిగాను. సమాధానంగా ఆమె నాకు కృతజ్ఞతలను చెప్పి "మహానుభావా! తాము నరులన్న సంగతి నాకు తెలుసు. నా పేరు - "నంద". నేనొక అప్సరసను. నావలెనే నా సఖులు - మరో నల్గురు కూడా ఇక్కడ మొసళ్ళయి, ఈ తీర్థాలనాశ్రయించి వున్నారని చెప్పింది. మేము శాపగ్రస్తులము" వాళ్ళను కూడా రక్షించమని ప్రార్థించింది. అప్పుడు - శాపకారణమడిగాను.

"ఓ భరతవీరా! మేమయిదుగురం కలిసికట్టుగా దిక్పాలకపురాల్ని చూద్దామని వచ్చాము. ఆ రావడంలో ఒకచోట అగ్నికల్పుడనే బ్రాహ్మణోత్తముడు ముక్కు మూసుకుని తపస్సు చేసుకుంటూంటే, మాలో దుర్బుద్ధి కాదు కాని, తమాషాగా ఆయనకు తపోవిఘ్నం కల్పించాలనిపించింది. దాంతో ఏముంది ? దేవకన్యలం కదా - అహంకారంతో మా ఆటపాటలు మొదలుపెట్టాం.

ఆ మహానుభావుడు మా ప్రయత్నాలకు అణుమాత్రం కూడా చలించలేదు. దాంతో వికారచేష్టలు మొదలుపెట్టాం. అందుకా తపోధని కోపిస్తే దానిని మా విజయంగా తలిచామే తప్ప రాబోయే ప్రమాదాన్ని ఊహించలేక పోయాం. ఎర్రని కళ్ళతో నిప్పులు కక్కుతూ "మీరు చేసిన ఈ మనోవికార చేష్టలకు, మకరు లవ్వమని" శపించాడు.

అప్పుడు, అందరివలెనే కాళ్ళమీద పడ్డాం. క్షమించమని ప్రార్థించాము. మీవల్ల పట్టుబడిన మహావీరుడెవరైన మిమ్ము బయట విసిరేస్తే మీకు తప్పక

శాపవిముక్తి అవుతుందన్నారు. కాబట్టి...!'' కళ్ళనీళ్ళ పర్యంతమయిందామె. ఆ తర్వాత నారదమహర్షి కనబడగా, మా తప్పును చెప్పుకుని బాధపడితే, ఆ మహర్షి భయపడకండి. కారణాంతరముల వలన, పాండు నందనుడు ఇటువైపు వస్తాడు. మీకు శాపవిమోచనం కల్గిస్తాడని వూరడించారు. కనుక....

మిగిలిన తీర్థాలతో కూడా స్నానమాడి తనవారిని రక్షించమంది. అలాగే చేసాను. అలాగ తిరిగి తిరిగి కొన్నాళ్ళకు మణిపురానికి వచ్చాను. చిత్రాంగదకు పుత్రోదయమైంది. వాడిపేరు భభ్రువాహనుడు. వాడిని అన్నమాట ప్రకారం మహారాజుకు అర్పించి, అక్కడనుండి గోకర్ణానికి బయలుదేరాను. అక్కడ చూడవలసిన ప్రదేశాలను చూసి, నీవు జ్ఞాపకం రాగా, నీ దర్శనంతో తరించాలని, ప్రభాసానికి వచ్చాను. మిగిలింది తమరెరిగినదే''నని రెండుచేతులు జోడించి నమస్కరించాడు.

“చిత్తమని'' చిరునవ్వులు చిందించే కృష్ణుడు అయితే, నేను.......... తీర్థయాత్రలు చెయ్యనా ?'' అంటాడు. వెంటనే అర్జునుడు “వద్దు'' బావా, వద్దు. నీ అలౌకిక దివ్యశక్తులకు, ఆ దేవతలే వరుస కడతారు. ఆ మొత్తాన్నీ భూమి భరించలేదేమో!''

“అబ్బో! భలే ప్రేమే!'' ఆ రాత్రంతా చతురోక్తులతో గడిపినవారలు, తెల్లవారి కృష్ణుడు తన నగరానికి బయలుదేరాడు. అర్జునుడు కపట యతిధారియై భద్రస్థానంలో బలరామాదులకోసం నిరీక్షిస్తున్నాడు. ఇదిలాగ వుండగా, నగరంలో కృష్ణుడు పెద్దలందర్ని చూసి మనం “రైవతకాద్రి'' ఉత్సవం చెయ్యాలి, గుర్తురాదా?'' అడిగాడు. అవునవునని తలలూపారందరు.

కృష్ణుడు - రుక్మిణి, జాంబవతి, సత్యభామలతో మంతనాలు సలిపాడు. ఆ తర్వాత వారు రేవతీ బలరాములు, దేవకీవసుదేవులు మొదలగు పెద్దలతో బయలుదేరారు. ఎవరి ఉత్సాహములో వారుండగా ముందుగా కపటయతిని చేరి, అక్కడి ప్రాంతాలను చూపి, వివరములు చెప్పి, రమణీయ భద్రవేదికపై కూర్చుండబెట్టి, రహస్య సమాలోచనం వలె కబుర్లు మొదలుపెట్టారు.

అందరితోపాటు రైవతకాద్రికి సుభద్ర కూడా వచ్చింది. గిరి ప్రార్థనలు చేసి, గిరిజను, తన బావ అర్జునుని పతిగా చెయ్యమని మనోప్రార్థన చేసింది.

ఈ మొత్తాన్నీ అర్జునుడు చూస్తున్నాడు. దానిని కృష్ణుడు గమనిస్తున్నాడు. ఆత్రం తగ్గించుకోమని చేతితో హెచ్చరిస్తున్నాడు. అర్జునుడిక్కడికి వచ్చినట్లు ఇంద్రప్రస్థానికి కృష్ణుడు కబురుగూడా పంపాడు. తన ఆలోచనలు ఫలించకముందే అర్జునుడు తొందరపడటం తగదని సూచిస్తున్న తరుణంలో, బలరామాదులు యతీశ్వరుని సందర్శనానికి వచ్చారు.

ఆయన నుండి ఆశీస్సులు, తత్వజ్ఞానాన్ని అభిలషిస్తున్నవారిని చూసి, ఓరకంట అర్జునుని చూస్తూ "మహాత్ములు, మన్నించి, మేము కృతార్థులను చెయ్యండని" లేచాడు. బలరాముడు, ఆ కపటయతిని, తమకు తెలిసిన తీర్థక్షేత్ర వివరాలను చెప్పమని అడగగా, శ్రీ కృష్ణుని మనస్సులో ధ్యానించి, ఆ క్షేత్ర వివరాలను ఆసక్తిదాయకంగా చెబుతున్నాడు.

వింటున్న బలరాముడు "మహాత్మా! మీరు చెప్పే తీరు మాకు బాగా నచ్చింది. కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి మమ్ము తరింపచెయ్యమని అభ్యర్థించాడు. తమకిక్కడ ఏ లోటురాదని చెప్పాడు. తమతో ద్వారకకు తీసుకువచ్చి వారికి సకల సదుపాయాలను సమకూర్చాడు.

"కోటలో పాగా వేసావంటూనే" కృష్ణుడు - రుక్మిణి సత్యలకు యతివర వివరము చెప్పి, ఆ అర్జునునికి మన పిల్ల సుభద్రనిచ్చి వివాహం చేద్దామన్నాడు. అంతా రహస్యమన్నాడు. సుభద్రను స్వామివారికి అర్పించారు. ఆ పిల్ల స్వామి సేవలో మున్గిపోయింది. కాకపోతే ఆమెకు ఆతడే తన స్వామియని తెలియదు.

ఈ సేవలు ఇరువురిలో కలవరము, అలజడి కామవికారాలు సృష్టించడం-కృష్ణుడు కూడా గమనించాడు. ఇక దీనిని పెంచకూడదని నిర్ణయించుకుని తల్లి దండ్రులకు, సాత్యకాదులతో సహా చెప్పవలసినవారికి రహస్యమని చెప్పాడు. వారి అంగీకారమందుకున్నాడు. పాండవులకన్న కౌరవులతో మైత్రిని కోరే పెద్దన్న బలరామునికి మాత్రం ఈ విషయం చెప్పలేదు.

కారణం - సాంప్రదాయ జాతర కార్యక్రమం బలరాముని, ఆధ్వర్యంలో జరుగుతుంది కాబట్టి అందరు అటువైపు వెళ్ళారు. సుభద్ర వెళ్ళలేదు. మాయ యతి సేవల కోసం ఆమె అక్కడ వుండిపోయింది. పైగా కృష్ణుడు ఎప్పుడు "వూ" అంటే అప్పుడు వాళ్ళ వివాహం జరుగుతుంది. కాబట్టి వారిరువురు క్షణాలు


యుగాలలాగ గడుపుతున్నారు. "అన్నా!" సుభద్ర అనుకుంది. కృష్ణుడు వచ్చాడు. ఇంద్ర వరప్రసాది కాబట్టి అర్జునుడు, ఇంద్రుని తలుచుకోగానే ఆయన వచ్చాడు. అమరేశ్వరుడు కాబట్టి ఆయనతో కొందరు సిద్ధసాధ్య ముని బృందాలు, దేవగురువు బృహస్పతుల వారు వచ్చారు.

వివాహ లగ్నం నిశ్చయమయింది. దిక్పాలకులు అత్రి, భృగు, వసిష్ట, వామ దేవాది మహాఋషులు వచ్చారు. కశ్యప ప్రజాపతి హోమ కర్తయ్యారు. అరుంధతి, శచీదేవి, సత్య, రుక్మిణి, అప్సర కన్యలు... చూస్తుండగా మహదానందముగా సుభద్రార్జునుల వివాహం జరిగిపోయింది. అందరు ఆశ్చర్యపోయారు. వారి వారి స్థాయికి తగ్గట్లు బహుమతుల నాదంపతులకిచ్చారు.

అపూర్వ రథాన్ని అర్జుననకిచ్చి, సుభద్రతో వేగిరం మీ ఇంద్రప్రస్థానికి వెళ్ళమన్నాడు. ఆ తర్వాత వ్యవహారం తాను చూసుకుంటానన్నాడు. రథం ముందుకు సాగింది. కృష్ణుడెవరికి కనబడలేదు. సుభద్రార్జునులను కావలివారు అడ్డగించారు. అప్పుడు యుద్ధం. వారి ఓటమి. విషయం బలరామునకందింది. ఆగ్రహంతో బుసకొడుతున్నాడు.

చివరకు వారి వివాహం జరిగిపోయిందని తెలుసుకున్నాడు. ఇదంతా కృష్ణుని లీలా నాటకంగా గ్రహించిన బలదేవుడు "మంచిది. ఇందుకింత వంచనవసరం లేదు. అసలు విషయం చెబితే, అందరు ఆశీర్వదించేవాళ్ళ"మన్నాడు. కోపాన్ని తగ్గించుకున్నాడు. మరల జాతర కార్యక్రమాలలో పాల్గొన్నాడు.

మొత్తానికి - శ్రీకృష్ణుని దయతో కథ సుఖాంతమయింది.



# కాళింది

**త**న లీలలలో భాగంగా కృష్ణుడు ఇంద్రప్రస్థానికి అన్న వదినలు, తల్లి దండ్రులతో, ఇతర సోదరులతో వచ్చి సుభద్రకు అరణములనిచ్చారు. ఆడ పెళ్ళివారిగా అందర్ని సముచితంగా గౌరవించారు. అందరు వెళ్ళిపోయినా కృష్ణుడు కొన్నాళ్ళు అక్కడ వుండిపోయాడు.

ఈలోగా సుభద్ర గర్భవతి అయింది......... ఆ వార్త విన్న కుంతి ఆనంద డోలికలలో తేలియాడింది. నిజానికి తన వంశానికి మొదటి మనుమడు ఘటోత్కచుడు. కాకపోతే ఆనాటి పరిస్థితుల కారణంగా వంశాంకుర జననానికి ఆనందించలేకపోయింది. అర్జునుడు - ఉలూచీ, చిత్రాంగదలకు, ఇరావతుడు, భభ్రువాహనుడు పుట్టినా వాళ్ళను చూడని కారణంగా మనుముల ముద్దు ముచ్చట్లను కుంతి పొందలేకపోయింది. ఇక -

అయిదుగురికి ద్రౌపది భార్య అయినప్పటికి, వారి కాలవ్రత నియమము వలన పంచపాండవులు కారణజన్మురాలైన ద్రౌపదితోపాటు, ఇతరులను గూడా వివాహం చేసుకున్నారు. వారు -

ధర్మరాజు, శిబిరాజు కుమార్తె "దేవకి" ని పెండ్లి చేసుకొనగా; భీముడు - కాశీరాజు కుమార్తె జలంధరును పెండ్లాడాడు. ఇతనికంటే అందరికంటే ముందు హిడింబతో వివాహమయింది. ఆమె ద్వారా ఘటోత్కచ కుమారుని పొందాడు. అర్జునుడు, ఉలూచి - చిత్రాంగదలతో పాటు సుభద్రను వివాహం చేసుకున్నాడు. ఉలూచియందు ఇరావతుని, చిత్రాంగద యందు భభ్రువాహనుని పొంద, వారి వారి మాతామహులింట వారు పెరుగుతున్నారు.

నకులుడు - రేణుమతిని వివాహం చేసుకుంటే సహదేవుడు - "విజయ"ను పెండ్లాడాడు. ఈ రకంగా సంసారము సామ్రాజ్యము వలె విస్తరించింది. ఈ సమయంలోనే సుభద్ర నెల తప్పడంతో, తనకు వంశాకురము లభిస్తున్నాడని పొంగిపోతుంది. అర్జునుడు సరేసరి. భార్యే ప్రాణంగా ముద్దుమురిపెములతో క్షణం విడువకుండా ఆమెను అలరిస్తున్నాడు.

కృష్ణ సోదరి కదా - బలరామ, కృష్ణులను మించిన వీరవర్యుడు తనకు పుత్రుడిగా లభించాలని ఆ ఇంద్ర తనయుడు మురిసిపోతూ, ఎక్కడలేని వీరత్వం గర్భస్థ శిశువుకు నూరిపోస్తున్నాడు. చివరకా వీరప్రేమ ఎంతవరకు వెళ్ళిందంటే, యుద్ధరహస్యాలతో పాటు, ముఖ్యమైన పద్మవ్యూహం - అందు ప్రవేశం చెప్పేసాడు. నిర్గమం (తిరిగి రావడం) చెప్పబోతూంటే ఈ అర్జునుడు కొంప ముంచుతున్నాడనుకున్న కృష్ణుడు -

"బావా! అత్యవసర"మంటూ పిలిచాడు. ఎంతసేపు ఆడవాళ్లతోనేనా నీ వీరత్వాలు, రా! రమ్మంటూ, వేట నెపంతో ఒకసారి రాజ్యపరిస్థితులను గమనిద్దాం. అవసరమైన వీరత్వం అక్కడ ప్రదర్శించాలి తప్ప, అదే భార్య వద్ద, బ్రతుకు బండి నడిపింప చేసే అమ్మవద్దనా ? ఊ... !" అన్నవాడు.

"చెల్లెమ్మా! తగదు. అన్న వున్నాడు" అనీ, అతన్ని విడువలేకపోయావా . సరే. సరి....!" అన్నాడు. సుభద్రార్జునులు సిగ్గుపడ్డారు. అర్జునుని తీసుకుని, గోవిందుడు, రథమధిరోహింప చేసాడు. నగరం చూడటం, రాజ్యసంరక్షణం వేట పేరున తీవ్రవేగంతో సాగే భద్రాశ్వములతో వేటకు తగు సిబ్బందితో వెళ్ళారు. వేట ప్రారంభించారు.

ఆ నరనారాయణులు మహోత్కంఠతో పోటీపడి మరీ వేటసాగిస్తున్నారు. దొరికిన ప్రతి జీవమును పరివారం ఒకచోట చేరుస్తున్నారు. కృష్ణార్జునులు అలిసి పోయారు. "బావా!" అన్నాడు దృష్టి మళ్ళిన అర్జునుడు. "వుండుండు" అని యమునానదిపై నుండి వచ్చే శీతలగాలులకు మురుస్తూ చెట్టునీడన విశ్రమిస్తున్నారు.

ఆ సమయంలో - కృష్ణుని కంట ఒక అందమైన స్త్రీ కనబడింది. ఆ వాతావరణము కృష్ణునికెంతో ఆహ్లాదాన్ని కల్గిస్తుంది. ఆ యువతి మదన మనోహరిణి వలె కనబడుతుంది. అర్జునుడు, కృష్ణుని చూపులను చూస్తున్నాడు. ఎందుకో ఆ చూపులు, మదనుని తూపులు వలె వున్నాయి. ఇందుకా... నన్ను... అనవసరంగా తీసుకువచ్చి శ్రమింపచేసాడు. ఆయన ప్రణయంలో పడితే నేనేం చెయ్యాలి ? ఇందుకు ఇద్దరెందుకు ?" అది స్వగతము.

అతని మనసును గ్రహించినట్లు "బావా! అక్కడో అందాల భామ వుంది. ఆమె ఎవరు, ఎందుకోసమక్కడ వుంది ? ఏం కోరుతుంది ? వగైరా వివరాలు

తెలుసుకుని రమ్మన్నాడు. అతడు బయలుదేరాడు. తనవైపు వచ్చే ఆ వ్యక్తిని చూసి ఆడపిల్ల కదా, సిగ్గుతో తలవంచుకుంది. ఆమెను సమీపించి "ఎవరివమ్మా నీవు! ఎందుకిక్కడ వున్నావు ?" అని అడుగుతూంటే, ఆమె -

"ఆమె మహావీరా! నా పేరు కాళింది. నేను సూర్యుని పుత్రికను, అయోనిజను. కృష్ణదేవుని పతిగా బడయదలచి, ఇచ్చట తపోమూర్తినయ్యాను. నా తండ్రి సూర్యభగవానుడు, ఈ యమునలో నేనుండటానికి వీలుగా నివాస మేర్పరిచాడు. శ్రీ మహావిష్ణు స్వరూపమైన కృష్ణుడు ఇక్కడకు వస్తాడని, ఆ ప్రభువు నీ కోరికను మన్నించి పరిణమయమాడుతాడని చెప్పాడు. అప్పటినుంచి, ఆ ప్రభువు కోసం నా నిరీక్షణ"మంటుంది.

అంతావిన్న అర్జునుడు "సోదరీ నా పేరు అర్జునుడు. నేను కృష్ణుని మేన బావను. ఆయన చెల్లెలు సుభద్ర భర్తను. మేమిరువురము, నీ కోసమేనన్నట్లు వేటకు వచ్చాము. నిన్ను చూసి వివరములు తెలుసుకు రమ్మని మా బావ పంపగా, ఇటు వచ్చానన్నాడు. అక్కడ కృష్ణుడు ఆ వటవృక్షం క్రింద విశ్రాంతి తీసుకుంటున్నట్లు చెప్పాడు. ఇప్పుడే వెళ్ళి నీ వివరము చెప్పి, బావను తీసుకు వస్తానని, వెనక్కి తిరిగాడు. పరుగు నడకతో కృష్ణుని సమీపించాడు.

"బావా! అదృష్టమన నీదే కదయా! ఎక్కడికి వెళ్ళినా, అది అడివో, అమర పురమో, ఏదైనా సరే నిన్ను ప్రార్థిస్తూ, నిన్ను కాంక్షించే ఇటు భక్తులు, అటు ప్రేమికులు, అభిమానులు... ఆహా... ఆహా!" అంటూ ఆ చిన్నది...!" అని ఆమె వివరాలనందించాడు. లే, లెమ్మని, ఆయనను ఆమె చెంతకు తీసుకు వెళ్ళాడు.

దేవదేవుడైన కృష్ణుని దర్శనం ఆమెకు అనిర్వచనీయమైన ఆనందాన్నిచ్చి, యమునా జలాలలో శ్రీకృష్ణుని పాదస్పర్శతో తాను వులిక్కిపడి శ్రీ స్వామి కోసం వచ్చింది. ఇప్పుడు స్వామిని చూడటం, ఎంతో భక్తి వినయాంజలి భూషితయై, ఆ కన్య తన సహజ స్త్రీ లజ్జతో తలవంచుకుంది. ఆమెను భుజాల చేతులు వుంచి పొదివి పట్టుకుని పైకి లేపిన కృష్ణుడు "చాలా! ఇదే కదా నీ కోరిక. అది తీరింది కదా! ఇంకేల సిగ్గు" అని దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకున్నాడు.

ఆ గాఢపరిష్వంగం ఆ సమయంలో కల్గిన అనుభూతి అవ్యక్తము. అయినా కాళింది తలవంచుకుని "ఆర్యపుత్రా! నేను సూర్యపుత్రికను, కాళిందిని. నీకై

తపిస్తున్న దానను. తపోమూర్తిని, నా తండ్రి నీ గురించి చెప్పి, ఈ యమునలో నాకు నివాసము ఏర్పరచి, నీకై తపించమన్నాడు. దాంతో తపోమూర్తినై నీ రాకకై ఎదురు చూస్తున్నాను.

"సంతోషం. నీ కోరిక ఫలించుగాక." కాకపోతే...

"చెప్పండి, స్వామి!" ఆయన సందేహము తెలుసుకోవాలని ఆత్రంగా అడిగింది.

"ఏమీలేదు. ఇప్పటికి ముగ్గురు భార్యలు, వారికి పుత్రులు కూడా వున్నారు. మరి నువ్వు... నీ జీవితాన్ని పండిచుకోగలవని తలిస్తే నా కభ్యంతరం లేదు. ఆలోచించుకోవల్సింది నీవు...!" అని ఆగాడు.

"సర్వహృదయాంతర్వర్తీ, వాసుదేవా! నీవు జగద్రక్షకుడివి. ఈ వివాహాలు, విలాసాలు కేవలం నీ లీలలో భాగాలు. నిజమైన ఆర్యపుత్రికి "నేను శ్రీకృష్ణుని ఇల్లాలి"నని, అనుకోవడం, అనిపించుకోవడం మహత్తర వరం. అది నాకు ప్రసాదించ మని" వెనకటి వినయంతో ప్రార్థించింది.

"అస్తు" అని శుభం పలికి, కాళింది సహితుడై కృష్ణుడు అర్జునునితో కోటలో ప్రవేశించాడు. రథమాగింది. కాళిందీ, కృష్ణులు దిగుతున్నారు. భీమసేనుడు చూసాడు. "బావా! వేటకు వెళ్ళి ఏ జంతువునో తెస్తావనుకుంటే, నాకో సోదరిని తీసుకువచ్చావు. అసాధ్యుడవు" గట్టిగా నవ్వాడు. వినడానికది వికటాట్టహాసం లాగ వుంది.

అర్జునుడు, కుంతీ, ద్రౌపది, సుభద్రలకు కాళిందీ చరిత్ర చెప్పి, బావ సూర్యునికి అల్లుడయ్యాడంటాడు. ఆ అయోనిజను చూసిన ద్రౌపది భక్తిపార వశ్యంలో మున్గింది. అందరు ఆమెను సాదరంగా ఆహ్వానించారు. మిక్కిలి గౌరవించారు. సుభద్రయితే, ఈ క్రొత్త వదినకు తెలియకుండానే భక్తిశ్రద్ధలతో, వినయమూర్తియై వందనమొసగింది. కృష్ణుడు అందర్నీ పరిచయం చేసాడు.

అప్పుడు సుభద్ర "పెద్ద వదిన రుక్మిణి - సాక్షాత్ ఆ ఆదిలక్ష్మే!" మహాభక్తురాలు కాబట్టి తనని దత్తం చేసుకున్న ఆ అతిలోకసుందరి, మా అన్నను తన వద్దకు రప్పించుకుని, సగౌరవంగా అత్తవారింటికి తెప్పించుకుంది. మహాభక్తురాలు వినయ సంపన్న.

రెండు - జాంబవతి. ఈ వదిన, అందగత్తె. అమాయకురాలు. శ్రీరామ మహాభక్తుడైన జాంబవంతుడు తన కోరిక తీర్చినందులకు మా అన్నయ్యకు సమర్పించిన అపురూప కానుక. ఇక మూడు - ముల్లోకాలనేలగలననే మహాశృంగారస దేవత. వీరనారి "సత్య" ద్వేషించే తండ్రికి, ప్రహ్లాదునివలె భక్తి పుణికి పుచ్చుకుని కోరి అన్నయ్యను వివాహం చేసుకున్న సౌందర్య రసాధి దేవత. ఆమెకు స్వాతిశయం ఎక్కువే, అభిమానము ఎక్కువే. కృష్ణునికి అన్నిట సమర - శృంగార- హితైభిలాషిణి.

ఇప్పుడు నువ్వు నాల్గవదానివి. సూర్య మిత్రమువలె, యమునలో జన్మించి, తపో సిద్ధమూర్తివై, మా అన్నగారిని సాధించుకున్న - సిద్ధ - సాధ్య - తపో స్వరూపిణివి. పైగా సూర్యపుత్రివంది. ఈ కాళింది, అందరికి వాసుదేవుని వలె వందనీయురాలయింది.

అందరిలో కుంతి "వాసుదేవా! అప్పుడు యశోదకు ఇప్పుడు మాకు చూడటానికి పిల్లవాడివనిపిస్తున్నావు కానీ, జగత్తుకే పెద్దదిక్కువు. బ్రహ్మకే తండ్రివయిన, ఆ పరబ్రహ్మనివి. నిన్ను తెలుసుకోవడం, తెలుసుకోగల్గడం, నీ మహామాయా స్వరూపంలో మాకు అసాధ్యం" అని శ్రీకృష్ణశక్తిని పలువిధాల పొగిడింది.

అంతా విన్న కృష్ణుడు "అత్తా! ఇంత అభిమానం భరించగలనా ?" అన్నాడు నవ్వుతూ.

"నిజం! లోకాలకు ప్రేమను పంచేవాడికి ఇది "ఇంత" అభిమానమే. ఇంతకు మించి, ఈ "అత్త"యిన కుంతి ఏమివ్వగలదంది ? రెండు చేతులు నుదుట పెట్టుకొన ప్రయత్నిస్తూంటే, వలదన్నట్లు చెయ్యి పట్టుకుని.

"ఈ అభిమానం దాచుకుంటాను. నా ధర్మం నిలుపుకుంటాను. నా బావలను నడిసముద్రంలో ముంచకుండా, నల్గురు మెచ్చుకునేటట్లు భరత కులైక భూషణులను చేస్తానన్నాడు." అందుకు ఎంతో సంతోషించిన కుంతి "అదే నేను, కోరేదంది" మృదువుగా కృష్ణుని చేతులను పట్టుకుంది.

కాళిందితో, కృష్ణుడు.... అక్కడున్న తరుణంలోనే సుభద్ర ప్రసవించింది. మేనల్లుని ఆశీర్వదించిన కృష్ణుడు "సుభద్రా! ఇప్పటివరకు వీరపత్నివి. ఇకపై వీరమాతగా కూడా వర్ధిల్లుతా"వని దీవించాడు.

కొన్నాళ్ళు అక్కడ గడిపిన కృష్ణుడు, కాళిందితో ద్వారకలో అడుగుపెట్టాడు. రుక్మిణి కాళిందిని స్వాగతించింది. శ్రీకృష్ణుని యశోకాంతులకు లీలావిలాసాలకు, వివరం తెలియని సత్యభామే కాదు, ఎవరు విస్తుపోలేదు. ఆ లీలా మానుష విగ్రహునికి అంజలి ఘటించారు. అందరివాడైన గోవిందుడు అందరికి ఆనందప్రదుడే!

# మిత్రవింద

**కా**ళిందితో కమనీయంగా, ద్వారకాధీశుని వివాహం జరిగింది. కాళిందిని చూసిన ప్రతి ఒక్కరు ఆమె దివ్య తేజోస్వరూపానికి, హృదయానందులౌతున్నారు. ఆత్మానందంతో మురిసి, కాళిందిని చూడటంలో ఏదో అనిర్వచనీయమైన ఆనందం పొందుతున్నారు. ఈ సమయంలో శ్వేతకేతులవారు వచ్చారని ద్వారపాలకులు తెలిపారు. కృష్ణుడు ఎదురువెళ్ళి, చిన్ననాటి స్నేహితులు, ఆచార్యులు - శ్వేతకేతులవారిని సాదరంగా ఆహ్వానించాడు. రుక్మిణీ-కృష్ణులు అర్ఘ్యపాద్యాదులతో పూజించారు.

తదనంతరం కుశల ప్రశ్నలు, అవంతి పరిస్థితిని గురుదేవుల వార్ధక్యాన్ని, జయసేనుడు మరణించాక మిత్రానువిందుల రాజ్యపాలనా సరళిని వివరించి చెప్పారు. ఇప్పుడు జరాసంధుడు చచ్చినపాము. అయినా విందానువిందులు, స్వతంత్ర రాజ్యంగా బలిష్ఠంగా, పటిష్ఠంగా రూపొందించుకోలేకపోతున్నారు. వారి పరిస్థితి అర్థం కావడం లేదు. పైగా -

ద్రౌపదీ స్వయంవరం తదుపరి కురురాజు దుర్యోధనునిపై వారికి ప్రత్యేకాభిమానం కల్గింది. అంతటి వీర విక్రముడు పరాభవం పాలయ్యాడంటే, ఏదో అతీతమైన శక్తి అతన్ని వంచించిందని తలిచారు. మరో విషయం శ్రీకృష్ణ ప్రేరణంతో హస్తిన విడగొట్టబడటం, సువిశాల సామ్రాజ్యంలోని అపార సంపద చెరిసగమవడంతో, అయిదుగురు సోదరులతో, నూరుగురు సోదరులు ఆస్తిపాస్తులను సమానంగా పంచుకోవడమన్యాయమని, పేరుకు అయిదుగురే

అయినా, నూరుమందిని అతి సునాయాసంగా నిర్జించగల ప్రతిభావంతులైన పాండునందనులు, తమ బాంధవ్యంతో, భుజం కలిపే యాదవులు, ఇతర కృష్ణ-పాండవ మిత్రుల బలాధిక్యతో....

"పాపం.. దుర్యోధనాదులు అన్యాయమైపోతారని వారికి వెన్నుదన్నుగా నిలచి, హస్తిన ప్రాభవాన్ని ఇనుమడింప చెయ్యాలనే ఆలోచనకు, ఆ అవంతీ నాథులు వచ్చేసారన్నాడు.

అంతా విన్న గోవిందుడు "ఆచార్యవర్యా! మీరు చెప్పినది, సమర్థులఎడ సమంజసమే. కానీ అసమర్థ అప్రయోజకులైన విందానువిందులు, ఎదురొచ్చిన అవకాశాన్ని గూడా సద్వినియోగం చేసుకోలేని వారు తలెత్తడమన్నది జరుగదు. పొరపాటున అటువంటి దుర్నీతికి సిద్ధబడితే, ఒక్క దుష్టద్యుమ్నుడు చాలు వారి బలదర్పాల నణచడానికి!

అంతట తలూపిన ఆచార్యులవారు "కృష్ణా! నేనిప్పుడు వచ్చిన పని, అతి రహస్యమన్నట్లు మెల్లిగా చెబుతున్నాడు. ఈ విందానువిందులకు, "మిత్రవింద" అను ఒక సోదరి వుంది. ఆమె అద్భుత అందగత్తె. నీ భక్తురాలు కూడా. ప్రస్తుత పరిస్థితులలో ఆమెను నువ్వు వివాహమాడాలి. తప్పదు.

మీ మేనత్తయిన రాజమాత, తమ రాకుమారి మిమ్మ్మ కోరుకుంటున్నారు. మేనల్లుని అల్లునిగా చూడాలన్నది ఆమె ఆశ. మన గురుదేవులు కూడా అదే వుద్దేశంలో వున్నారు. కాకపోతే, విందానువిందులు మాత్రం తమ సోదరిని, దుర్యోధనునికిచ్చి, వారితో బాంధవ్యం పెంచుకోవాలని తద్వారా తాము బలపడాలని కురువంశ బంధువులుగా విఖ్యాతులవాలన్నది వారి ఆలోచన.

అయినా స్వయంవరాహ్వానం తెచ్చాను. తమరు బయలుదేరండి. మీ వీర విక్రమంతో, మిత్రవిందను మీ స్వంతం చేసుకోండి. ఆకతాయిలు, దుర్మార్గులుగా, దుర్యోధనాదులను తలచే మీ మేనత్తగారి మనసుకు శాంతి కల్గించండి. వారి తరుపున వేడుతున్నట్లు, కృష్ణుని, ఆచార్య శ్వేతకేతులు ప్రార్థిస్తున్నారు.

"బాగుంది, వరుస" అనుకున్నాడు కృష్ణుడు.

నీ భక్తురాలైన మిత్రవింద కూడా నీ రాకకై ఎదురు చూస్తోందన్నాడు. అక్కడ కొన్నాళ్ళు వుండి యదుకుమారుల విద్యాపాటవానికి మెరుగులు దిద్ది ధనుర్వేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు.

విషయం తెలుసుకున్న రుక్మిణి, ఆచార్యులను యథావిధి గౌరవించిందే తప్ప, మరో సవతిని తెస్తున్నందులకు భయపడలేదు, బాధపడలేదు కూడా. అంతా ఆ దేవుని చిద్విలాసం. ఈ వాసుదేవుడు, సర్వహృన్నివాసుడు. లీలామానుష విగ్రహుడని, ఆ దేవకీసుతుని వందనాలర్పించింది. తనకేదైనా లోటు జరిగితే కదా, అవతలవారి గురించి ఆలోచించేది, వ్యాఖ్యానించేది, వెక్కిరించేది!

సాత్యకి, ఉద్ధవ, కృతవర్మలను కలుపుకుని, కృష్ణుడు ఆచార్య శ్వేతకేతువు వెంటరాగా అవంతికి వెళ్ళాడు. గురుదేవులు సాందీపులవారితో కొన్నాళ్ళు గడిపే అదృష్టం కల్గినందులకు కొంత సంబరపడ్డాడు. కృష్ణుని రాక తెలుసుకున్న విందానువిందులు, గురుదేవులు సాందీపులవారు, కోటముఖద్వారం వద్దనే నిల్చుని, ఎదురేగి స్వాగత సత్కారాలు నడిపారు. గురుదేవులు పొందిన ఆనందం వర్ణనాతీతం. వయస్సు మళ్ళినా పేరు పేరున తలుచుకు మరి పలుకరించి, వారి వివరాల నడిగారు.

పాదాలకు నమస్కరించే కృష్ణుని బిడ్డగా గుండెలకు హత్తుకుని, ఇన్నాళ్ళకు మళ్ళీ చూడగలిగానని పొంగిపోయారు. వారి ఆప్యాయతకు ప్రతిస్పందిస్తూ "పునర్దత్తుని నుండి వర్తమానాలు అందుతున్నాయా ?" అని అడుగుతాడు.

కృష్ణా! నీవు రక్షకుడివైనప్పుడు ఎల్లరు కుశలమే అని ఆ పెద్దాయన పొంగిపోయారు. ఇక విందానువిందులు పేరుకు మేనత్త పిల్లలు. కానీ ఆనాడు జరాసంధునికి వత్తాసుదారులు. కృష్ణునికి సాందీపాశ్రమములో సహాధ్యాయులు, కాకపోతే తాము పాలకులం - కృష్ణుడు పాలితుడు" అన్నట్లుంది వారి మనసు. అలాగని కేవలం తమ మేనబావగా చూడలేరు. ఆర్యావర్తం మొత్తం కృష్ణునికి అగ్రపూజ సల్పుతుంటే, తాము కాదనడం, ఈ గోపాలుని రాక తగదనడం తగదు.

జరాసంధుడే కృష్ణునికి సలుపని శరణాగతుడు.

ఏది ఏమైనా విందానువిందులకు కృష్ణుని రాక కొంత ఇబ్బందిగానే వుంది. అయినా దానిని బయటికి చెప్పుకోలేక, పాంచాల ప్రభువు తన పిల్లనిస్తానంటే వద్దని స్వయంవరమేర్పాటు చేయించిన కృష్ణుడు తమ చెల్లెలు స్వయంవరానికి రావడం కొంత విస్తు గొలుపసాగింది.

ఒక మూల స్వయంవర సంరంభం సాగుతుంది. దుర్యోధనశతం, జరాసంధుని మనుమడు మేఘసంధి వచ్చారు. విదర్భ యువరాజు రుక్మి రానున్నాడు. వీరితో పాటు, వివాహంలో పాల్గొనకపోయినా అతిధులుగా వారి పెదతల్లి కుంతీదేవి కుమారులు కూడా వస్తున్నారు. విందానువిందులు ఆలోచనలో బడ్డారు. మేనత్త కూతురని కృష్ణుడు సాహసిస్తే, ఆతన్నాపగల్గిన వారెవరు లేరు. తాము దుర్యోధనునికిద్దామనుకున్న వారి ఆశయం అడవిని గాచిన వెన్నెలే అవుతుంది. ఇప్పుడు -

"కిం కర్తవ్యం... ?!" చేయవలసిన పనేమిటి ?" ఇది ఆలోచన. దీనికి సమాధానం, ఆ సర్వేశ్వరునికే తెలియాలి. అయినా అనువిందుడు రహస్యంగా గురుదేవులను సందర్శించి తన భయాన్ని తెలుపుకున్నాడు.

"అనువిందా! భయపడక. అంతా ఆ దేవుని ఇచ్ఛ. మహామహుడని, కావలసినవాడని, కృష్ణునికి కబురు పంపించాను. అయినా మన ఆశలు మనవి- దైవ నిర్ణయం ఆ దేవునికే తెలియాలి" అన్నారు.

"అన్న.... భయపడిపోతున్నాడన్నాడు, అనువిందుడు. అతనికి ధైర్యం చెప్పారు. మనమందరము ఎన్నో అనుకున్నాం. కృష్ణుని ముందర అవన్నీ కుప్పిగెంతు లయ్యాయి. కాబట్టి.... జరిగే దానిని దైవానికి, మీ సోదరి మనసుకు విడిచిపెట్టి, ఆ మనువును, ఆ జగన్మాతకు అర్పించు." ఓదార్చారు.

"అయినా ఇది స్వయంవరం. మిత్రవింద ఇష్టం ప్రకారం జరుగుతుందా ? లేక వర నిర్ణయం మీారు చేసి ఆమె మెడను వంచుతున్నారా ? రెండోదే... అయితే ద్రౌపది స్వయంవరంలో పొందిన పరాభవం, అదే రాజుల ప్రేక్షకపాత్ర ఇక్కడ చర్విత చరణమౌతుంది. కృష్ణుడు ఆశించాక, ఆ దేవదేవుడు కూడా ముందుకు రాడు. ఆయన అక్కర్లేదనుకున్నా, ఆ పిల్ల మీా ఇష్టమనుకున్నా ఏ

గొడవ రాదు. కనుక శాంతించు. కృష్ణుడు లోకారాధ్యుడు. చక్రవర్తులకే చక్రవర్తి ఇంద్రాదులు, బ్రహ్మాది సర్వదేవతలు ఆయన కనుసన్నల ముందు నడుస్తారు.

అటువంటి కృష్ణుడు, అవంతికి.... పొరపాటున అల్లుడయితే, అంతకు మించిన అదృష్టం, అవంతీపురవాసులకు వుంటుందా ? ఒక్కసారి ఆలోచించు. కనుక, అనవసర భయాలు ఆలోచనలు చెయ్యకు. ప్రశాంతంగా వెళ్ళమని కోరారు.

ఇది ఇక్కడిలాగ వుంటే -

అక్కడ, అంతఃపురంలో రాజమాత, కుమార విందుని, స్వయంవరాని కెవరెవరు వచ్చారు ? ఆసక్తిగా అడుగుతుంది. అందరు వచ్చారమ్మా, ప్రత్యేకాహ్వానంపై దుర్యోధనుడు, వారి సోదరులు..., అంగరాజు, శిశుపాలుడు, పాండునందనులు... వచ్చారమ్మా!

"మరి ద్వారకనుండి...!" "అక్కడ నుండి కూడా, మన ముఖ్య సలహాదారు రెండో కుమారుడు కూడా వచ్చారమ్మా!" అతని సాగతీతలోని వ్యంగ్యాన్ని గ్రహించుకుంటూ... అంటే... అడిగింది రాజమాత.

"అదేనమ్మా! ఆ గోపాలుడు ఏ ప్రాభవంలేని మహా ప్రాభవ విలాసుడు... వచ్చాడమ్మా!

"గోవిందుడు... వచ్చాడా ?" సంబరపడుతూ రాజమాత అడిగింది. ఆ సంబరాన్ని గమనించిన విందుడు "అమ్మా!" అన్నాడు. ఇప్పుడు తాను విషయం తెలుసుకోవాలని.....! రాజమాత సమాధానమిచ్చేలోగా... "ఆ గోవిందుడు వచ్చాడంటే, ఆ అతి సామాన్యుని కోసం, ఇంత ఆరాటమా!"

"అవును నాయనా! ఆతడు లోకేశుడు. సర్వ విశ్వాత్మకుడు. నువ్వు అన్నట్లు- ఏ ప్రాభవంలేని మహాప్రాభవ సంపన్నుడు. సర్వ శాసనకర్త. లోకమిత్రుడు, ధర్మమూర్తి... అతనికి ఏమిలేదు.... ? అని ప్రశ్నించుకుంటే, తలచిన తక్షణం బ్రహ్మమహేశ్వరులు, ఇంద్రాది దిక్పాలకులు ముంగిట నిలచి, ఆ మోహనమూర్తికి నీరాజనాలు సల్పుతారు. శిరసువంచి ప్రణతులర్పిస్తారు.

"పిచ్చివాడా! ఈ రాజులు, రాజ్యాలు ఆతని కొనగోటికి చాలవు. ఇంకా ఎదగని పసితనం. బాల్యంలో రాజ్యమొందిన, వైభవ సుఖమూర్తివే తప్ప, ప్రాభవం...

దాని ప్రస్థానం తెలియని సామాన్యుడివి. ఎంతటివాడో తెలియక, ఆ యదు"నంద" నందనుని చూసి, "అవ్వ" అమాయకంగా నవ్వి, ఎవరినో చూసి తొందరపడి..." మరుక్షణం గుడ్లనీరు కక్కుకుంటూ,

ఆ వాసుదేవునితో వైరమొందకు. విందా! నాకు గర్భశోకం కల్గించకు. శతృవునైనా క్షమించగల ఆ దేవదేవుడు ధిక్కారము సలుప, ఒప్పడు!" రాజమాత "మాత" అయింది. తన భయ సంతోషాలను చెప్పేసింది. జాగ్రత్త! అని హెచ్చరించింది. ఇదంతా మిత్రవింద చాటుగా వింటుంది. ఫర్వాలేదు. ఇక తాను నిర్భయంగా, ఆ యదుమౌళిని వరించవచ్చును. వర నిర్ణయిం చేసేసుకుంది.

మొత్తానికి రాజమాత నిర్ణయం, ఆహ్వానిత రాజులందరికి తెలిసింది. అంతా నిర్ణయం చేసి లోకం కళ్ళు తుడవడానికా, ఈ "స్వయంవర ప్రకటన" అని కొందరు కుపితులయ్యారు. మరికొందరు, ఇతర రాజులు కొందరి వత్తాసుతో కత్తులు నూరుకుంటున్నారు. ఇవన్నీ విందానువిందులకు తెలిసింది. ఇటు తల్లి, రాజమాత. అటు లోకం. మొత్తానికి అయోమయం.

ఏర్పాట్లు జరుగుతున్నాయి.

స్వయంవర మంటపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. వచ్చిన రాజులందరిలో నిరాశ పెల్లుబుకుతుంది. తల్లి తన మేనల్లుని రప్పించుకుంటే, కుమారులు భవిష్యత్తు రాజ్యకాంక్షతో దుర్యోధనునికి చేరువవడానికి ఆతనిని పిలిపించుకున్నారు. ఈ సమయంలో "గోవిందా!" కార్యక్రమాన్నెలాగ నిర్వహింప చేస్తావో... ప్రజలకు ప్రశాంతిని ప్రసాదిస్తావో... ఇది కొందరి ఆవేదన. ముఖ్యంగా గురుదేవులు, శ్రేయోభిలాషుల ప్రార్థన.

స్వయంవర మంటపంలో సర్వులు ఆశీనులయ్యారు. ఆహూతులైన రాజప్రముఖులు అర్థచంద్రాకారంగా మంటపంలో సముచితాసనాలలో సుఖాసీనులై వున్నారు.

వేదబ్రాహ్మణుల స్వస్తివాచకాలు.

అంగరక్షకుడిగా, రాకుమార్తె మిత్రవింద ప్రక్కన యువరాజు అనువిందుడు. ఆ ప్రక్కన ఆచార్య శ్వేతకేతువుల వారు. వారి ప్రక్కనే పూలమాలలు చేత

దాల్చిన పుణ్యాంగనలు. అధ్యక్షస్థానంలో అవంతీపుర మహారాజు విందుడు. ఇది అక్కడి సమావేశమైన స్వయంవరమంటప - రమ్య - చిత్రపటం.

వస్తూనే రాకుమార్తె అన్నగారికి నమస్కరించింది.

అప్పుడు -

అప్పుడామె - రాజలోకం మొత్తాన్ని ఒక్కసారి చూసింది. అప్పుడా రాజులు, రాజకుమారులు మిత్రవిందను చూసి ఆశ్చర్యపోయారు. ఎవరో ఈ పట్టిని చేపట్టే, పట్టగల చరితార్థుడు. ఆమె ప్రభువు. ప్రతి ఒక్కరు తమలో తామనుకుంటున్నారు. అందరితోపాటు దుర్యోధనుడు కూడా మిత్రవింద తన భార్యవుతుందని సంతోషిం చేసాడు. అందుకు గల ప్రబల కారణం... అతను ప్రత్యేకాహ్వానితుడు కావడమే.

మరి శ్రీకృష్ణుడు గూడా ప్రత్యేకాహ్వానితుడన్న సంగతి దుర్యోధనునికి తెలియదు. ఈ దుర్యోధనునికి కెదురుగానే ఆ వాసుదేవుడు తన చిద్విలాస వైభవంతో, చూసేవారి మనసులను రంజింపచేస్తూ కూర్చున్నాడు. రాజకుమార్తె పూలహారం పట్టుకుని హంసలా అడుగులు వేస్తూంటే ఆమె ప్రక్కనే వున్న మాగధులు, ఆ రాజు పేరు, వారి వివరములు వివరంగా తెలుపుతున్నారు. ఆమె ముందుకు సాగుతుంది.

అలాగ నడచి, నడచి ఆమె దుర్యోధనుని సింహాసనం వద్దకు రాగానే యధావిధి, వాని వంశం, వీరశౌర్యాలు అన్నీ చెబుతున్నారు. ఇటు మహారాజు విందుడు, అటు దుర్యోధనుడు కూడా, ఇక ఏ మాత్రం ఆలోచించకుండా, పూలహారం మెడలో వేసి వరిస్తుందనుకుంటున్న తరుణంలో వాని గురించి, పూర్తిగా వినకనే ముందుకడుగు వెయ్యడం దుర్యోధనుడు ముందు చిన్నబోయాడు. తదుపరి పెద్ద అగాధంలో పడిపోయినట్లు కుచించుకుపోయాడు. ఆ జరిగిన దానికి మహారాజు విందుడు, యువరాజు అనువిందుడు తలలు దించుకున్నారు. దుర్యోధనుడు తన పరిస్థితి నూహించుకునేలోగా ఆమె ముందుకు వెళ్ళడం, తలకొట్టేసినట్లుయింది. తల లేదేమో. అందుకే ఆమె మెడలో హారం వెయ్యలేదనుకున్నారు - కొందరు.

ఆ వెళ్ళడం, వెళ్ళడం ఒక్కొక్కరినే చూసుకుంటూ, చూసుకుంటు కృష్ణుని దగ్గర ఆగింది. ఆయన పేరు, యాదవ యశోగానం, కృష్ణచరితం వర్ణించి

చెబుతూంటే, అన్నీ తెలిసిన విషయాలు వినడానికి ఇష్టపడక, పూలహారం తీసుకుని, ఆ గోవిందుని మెడలో వేసి, ఆయన పాదాలకు నమస్కారం కూడా చేసేసింది. అంతవరకు పడిన ఉత్కంఠకు తెరపడింది.

అప్పుడిక ఆచార్య శ్వేతకేతులు, అనువిందుడు, పురోహితవర్గము వేద సూక్తాలతో వారిని ఆశీర్వదించారు. అక్షతలు జల్లారు. కృష్ణప్రియులైన ఆర్యావర్త రాజవర్గంలో, వచ్చిన వారిలో ఎక్కువమంది జయ జయ ధ్వానాలు చేసారు. దుర్యోధనుని ముఖం చప్పట్లు కొట్టేవారిని చూసి ముడుచుకుపోయింది. ఒకదాని మీద మరొకటి, ఎదురొచ్చే పరాభవాలకు దుర్యోధనుడు కుళ్ళిపోతున్నాడు.

కులగురువులు, పెద్దలు, ఆచార్య సాందీపులవారి నేతృత్వంలో మిత్రవంద-కృష్ణుల కల్యాణం కమనీయంగా జరిగింది. స్వయంవరానికి వచ్చినవారందరు, కల్యాణంలో పాల్గొన్నారు. తమ స్థాయి బహుమతులను ప్రకటించి విందు వినోదాలలో పాల్గొని తమ తమ రాజ్యాలకు తిరిగి వెళ్ళారు.

ఇది - శ్రీకృష్ణ భాగవతంలోని మరొక కమనీయ "కల్యాణ" ఘట్టం.

- శుభం -

# ప్రద్యుమ్నుడు

**కా**లచక్ర గమనంలో భాగంగా ఒకనాడు నారద మహర్షి సర్వదేవతలు ఏదో రూపంలో, కారణంతో నిలిచివున్న ద్వారకకు విచ్చేసారు. అందరి గౌరవాలను అందుకున్న తదుపరి మహర్షి "ప్రద్యుమ్నా!" అన్నారు. చెప్పండి. కృష్ణసుతుడు కదా, ఆ మహానుభావుడు తను పెద్దల ఎడ, గురువుల ఎడ ప్రకటించే వినయ విధేయతలు పుణికి పుచ్చుకున్నాడు.

"నీకో రహస్యం చెప్పాలి!" అంటూ.... "నువ్వు పేరుకు ప్రద్యుమ్న రూపంలో వున్నావు తప్ప నిజానికి నువ్వు మన్మధుడివి" అంటూ నారద మహర్షి, ఆతని జన్మ వృత్తాంతము, ఆతని భార్య రతీదేవి, శంబరాసుని చెరలో "మాయావతి" పేరున బందీ అయినదని, నువ్వు అత్యవసరంగా శంబరుని వధించి నీ భార్యను

నువ్వు తెచ్చుకోవాలని, ఇది వీరత్వానికి, మానవత్వానికి.... ఒక ఉదాహరణంగా వుండటమే కాకుండా నువ్వు లోక ప్రసిద్ధుడవుతావని తెలిపారు.

"ఎట్లాగ అక్కడికి చేరడం ?" విషయం విన్న ప్రద్యుమ్నుడు మహర్షిని అడుగుతాడు.

"నువ్వు సిద్ధమవుతే దారి అదే దొరుకుతుంది. నేనున్నానుగా, మిగిలిన విషయాలు నేను చూచుకుంటానన్నాడు. వెంటనే తన ధనస్సు, అక్షయ తూణీరములు తీసుకుని, మహర్షిని వెంబడించాడు. ఇరువురు వుత్తర క్షణంలో శంబరాసురుడుండే ప్రాంతాన్ని చేరారు.

ప్రద్యుమ్నుని చూస్తూనే మాయావతి పేరుతో వున్న రతీదేవి భర్తను గుర్తించి కళ్ళనీళ్ళు ధారాపాతంగా గుర్తించింది. ఇన్నాళ్ళు నన్ను విడిచి మరచి ఎలాగ వుండగలిగారు ? ఆమె రోదిస్తుంది. జన్మ మారి సాధారణ మానవుడినయ్యేసరికి, మహర్షి తెలిపే వరకు నాకు గతం గుర్తుకు రాలేదు. ఇప్పుడా రాక్షసుని వధించి... ఆవేశుడౌతున్నాడు.

"చూడండి. అతడు మహామాయావి. ముల్లును ముల్లుతోనే తియ్యాలి. కత్తితో తీస్తే ముల్లు రాకపోగా, ఒక్కొక్కసారి ఆ అవయవాన్నే కోల్పోవల్సి వస్తుంది. నా వద్ద మహామాయా విద్య వుంది. అది స్వీకరించండి. దాంతో ఆ రాక్షసుని చంపండి. అప్పుడు కాని నాకు విముక్తి లభించదు. నేను మిమ్ము చేరలేనంటుంది.

రతీదేవి నుండి మహావిద్యను పొందిన ప్రద్యుమ్నుడు సర్వసన్నద్ధుడై సింహనాదం చేసాడు. ఆ విచిత్రరవానికి ముందు ఆశ్చర్యపోయినా, తదుపరి ఎవరో ధూర్తుడు, పిల్ల చేష్టలతో, రెచ్చిపోతున్నాడనుకున్నాడు. ప్రద్యుమ్నుడి పిలుపుకు స్పందించాడు. యుద్ధభేరి మ్రోగించాడు. ఇరువురు చేతులు కలిపారు.

ఒకడు మాయావి. మరొకరు మహామాయావి శ్రీకృష్ణసుతుడు. ఎవరి మట్టుకువారు ప్రత్యర్థులను చిత్తు చేయాలన్నట్లు రెచ్చిపోతున్నారు. వీళ్ళ సింహ నాదాలు, రంకెలకు, ఆ నేల అతలాకుతలమయింది. శంబరాసురుని ఏ మాయాశక్తి, శ్రీకృష్ణ- సుతుని వద్ద ఫలించలేదు. అన్ని విఫలమవడంతో ఆశ్చర్య పోతున్న శంబరాసురుని లాగి క్రింద పడేసిన ప్రద్యుమ్నుడు, తన చేతి వాడి కరవాలముతో ఆతని కుత్తుకనుత్తరించాడు.

విజయదుందుభులు. పూలవాన. ప్రద్యుమ్నుని ఆనందరవళి. కోటను చెల్లాచెదరు చేసింది. దేవతలు పరవశించారు. లోకాలు మురిసిపోయాయి. అందరు ఆనందముద్రల తేలియాడారు.

రతీదేవి, ప్రద్యుమ్నులు, గగన మార్గాన ద్వారకకు చేరారు. "ఆకాశ మందుండి, రుక్మిణీ మందిరాన్ని గమనించి, అందు దిగారు. ఆకారం చూడటానికి అచ్చు తండ్రివలె వున్న కుమార ప్రద్యుమ్నుడు, రతీదేవిలను చూసి అందరూ శ్రీకృష్ణుడు మరో భామినిని వివాహం చేసుకుని వస్తున్నాడని తలిచారు.

ఈ రతీ ప్రద్యుమ్నులు, రుక్మిణీ కృష్ణులకు ముందు తొలి వందనం చేసారు. ఆ తర్వాత వివరాలు తెలియచేసారు. ప్రద్యుమ్న-రతీదేవిల కథనం, తండ్రివలె - ఈ కుర్రవాడు చేసిన సాహసం, నేర్చుకున్న మాయలు, సలిపిన లీలలు ద్వారక మొత్తానికి తెలిసింది. ఆ తదుపరి కులగురువులు గర్గాచార్యుల వారు శుభముహూర్తంలో వీరి కల్యాణం జరిపించారు. కృష్ణుడు తన దేవేరు లందరితో కలిసి ఈ యువజంటను ఆశీర్వదించారు.

కాలం గడుస్తూంది.

ఒకనాడు విదర్భ నుండి బ్రాహ్మణోత్తముడు రుక్మిణీదేవిని దర్శించాలని వచ్చాడు. భూసురుల ఎడ అపార భక్తి వినయములు కల్గిన శ్రీకృష్ణ పట్టపురాణి రుక్మిణి, ఆ వచ్చిన విప్రవర్యుని అర్ఘ్య పాద్యాదులర్పించి అందరి కుశలము అడిగింది.

"అమ్మా! తమ వదిన సువ్రతాదేవి ముందు తమ ఆశీస్సులనిమ్మంది. ఆ తదుపరి మీ అభీష్టాన్ని బట్టి, తన సందేశాన్ని వినిపింపమంది.

చేతులు మోడ్చి "చెప్పండి!" అంది.

"అమ్మా! తమ మేనకోడలు, రూపలావణ్యములలోను, హావభావముల లోను, అచ్చు మిమ్ములనే పోలియున్నదని (ఇది తమ వదినగారి మాటకాదు, మామాట కూడా) ఆ రాకుమార్తెను, తమ కుమారుడు ప్రద్యుమ్నుల వారికిచ్చి వివాహం జరిపించాలని, వారి సంకల్పం.

అన్నిట తమకు మారురూపుగా వుండే రాకుమారి రుక్మవతి, మిమ్ములనే తలపింప చేస్తుందని, తండ్రి చేయు వివాహ ప్రయత్నముల ప్రతిఘటించుచున్నది

కావున.... తమరు మనసున ఏ భావము పెట్టుకోకుండా, ఆ పిల్లను మీ కోడలును చేసుకోమని ఆమె విన్నపము.

మీ అన్నగారి సంగతి తెలిసిందే. ఇన్నాళ్ళయినా గతాన్ని మరువలేకుండా వున్నాడు. రుక్మవతి మాత్రం తన బావ గురించి విని వుండటం వలన ఆతని చేతిని పట్టుకోవాలనుకుంటుంది. కాబట్టి మీ పట్టుదల, మీ అన్నగారి పట్టుదల రెండు నాకు తెలిసినవే. ప్రస్తుతము పట్టుదల విషయంలో మిమ్ములను మించిన మీ మేనకోడలిని, మా సోదరుడు శ్రీకృష్ణుని వలెనే, ప్రద్యుమ్న కుమారుడు వచ్చి, ఈమెను చేపట్టాలని వదినగారు తలుస్తుంది.

ఆ సందేశమంతా, రుక్మిణీ - కృష్ణులు విన్నారు. ప్రద్యుమ్నునికి తెలిపారు. ఆ వచ్చిన బ్రాహ్మణోత్తముని ఘనాతి ఘనంగా సత్కరించారు. తప్పక ప్రద్యుమ్నుల వారొస్తారు. ఆమెను అనుగ్రహిస్తారని తెలుపమంది. ఈ విషయం అవతలివారికి తెలిసింది.

ఎప్పుడో జరిగినదే అయినా, తన జీవితాశయములన్నింటి భగ్నం చేసిన ఆ రుక్మిణీ కల్యాణ గాధను, ముఖ్యంగా కృష్ణుని, ఒక గోపాలుని, రాజ్యవిహీనుని దుందుడుకుతనాన్ని నిలుపలేనందులకు రుక్మి, తలచి, తలచి మరీ బాధపడు తున్నాడు. ఇప్పుడు అదే పరిస్థితి.

తండ్రి, భార్య, తనయ ముగ్గురు శ్రీకృష్ణప్రియులే. ప్రద్యుమ్నుని శంబరాసురుని వధించి, మహామాయా స్వరూపమై వచ్చిన లీలలన్నీ సుగంధ వాయువుల విస్తరణంతో హృదయాలానందమొందునట్లు, తెలిసిన వారందరు తెగ పొగుడుతుంటే... పరాభవాగ్ని చేసే మంటను చల్లార్చుకోలేక, మేనల్లుని వీరత్వాన్ని పొగడలేక రుక్మి సతమతమయిపోతున్నాడు. తన ఆలోచన ప్రకారం స్వయంవర ఏర్పాట్లు చకచక జరిగిపోతున్నాయి. రాజులందరికి ఆహ్వానాలు వెళ్ళాయి. రాజు కాని ఈ ప్రతాపశీలి ప్రద్యుమ్నునికి మాత్రం ఆహ్వానం వెళ్ళలేదు. అయినా ఆ వీరుడు విదర్భకు వచ్చాడు.

స్వయంవర మంటప ప్రదేశం చేరాడు. ఈయన కృష్ణుడా... కాదు... కాదు. ఆ పోలికలు చాలా వున్నాయి. అంటే ఆయన కుమారుడు, శంబరాసురుని

మహామాయా విద్యతో ఓడించిన... చూస్తున్నారు. ఆశ్చర్యపోతున్నారు. విషయం చెప్పుకుంటున్నారు. ఆతడు ప్రద్యుమ్న కుమారుడనని ప్రకటించుకున్నా, కానీ, చూసినవారెల్లరు దిగ్భ్రమ నుండి తేరుకోవడంలేదు.

"అందరికి నమస్కారమన్నాడు. ఎందుకు వచ్చావని ఎవరు అడగకండి. నా మరదలు నన్ను కోరుకుంటుంది. ఆమె నాది. పరిణయమాడాలని వచ్చాను. ఆమె కోరుకుంటున్నప్పుడు, దీనికి మరొకరి ఆమోదము, ఆహ్వానమనవసరము... అంటున్నాడు. రుక్మావతి గబగబ నడిచి వచ్చి, బావ మెడలో హారం వేసింది. ఆతను రమ్మనకుండానే రథమెక్కింది.

అదొక విచిత్ర సన్నివేశంగా అందరు ఆశ్చర్యపడి చూస్తున్నారు. ఎటునుండి ప్రతిఘటన లేదు. ఎవరి నుండి ఒక్కమాట లేదు. కానీ నిరశన కాని, ఆశ్చర్య సూక్తుల చూపులు. "శాంతించండి" రాణిగా సువ్రతాదేవి ఆశ్వాసనం.

రథం మనోవేగమందుకుంది. రుక్మావతి, ఏ ప్రతిఘటన లేకుండా, హాయిగా, సంతోషంగా, తాను కోరుకున్నట్లు, బావతో, మేనత్తను అత్తగారిని చేసుకోవడానికి వెళ్ళిపోయింది.

ప్రద్యుమ్నుని రాకకంటే, విషయం ద్వారకకు చేరింది. వచ్చే కొత్త కోడలికి, కొడుకుకు, సాదర మంగళ స్వాగతమివ్వడానికి, నిత్యమంగళ, కల్యాణ శుభ స్వరూపుడైన కృష్ణుని సన్నిధానంలో సర్వ ఏర్పాట్లు జరిగాయి. ఆ తదుపరి -

వారి వివాహం అత్యంత ప్రశంసనీయంగా జరిగింది.

# కృష్ణార్జునులు

**అ**ప్పుడు కృష్ణుడు ఇంద్రప్రస్థంలో వున్న తరుణం.

ఇటు మేనల్లుడు అభిమన్యుని ముద్దు ముచ్చటలు.

అటు ప్రియ - భక్త - సోదరి ద్రౌపది సంతానంతో కొన్నాళ్ళు గడిపిన కృష్ణుడు - ఈ వాతావరణం వేడెక్కుతుంది. కొన్నాళ్ళు అలా అలాగ... వనసీమలలో, ప్రశాంత వాతావరణంలో గడుపుదామని అర్జునునితో చెప్పి, వారిరువురు బయలుదేరారు.

కృష్ణుడు వేసే ప్రతి అడుగులో ఏదో లీల, మహత్కార్యమో వుంటుందన్న సంగతి తెలిసిన అర్జునుడు బావను అనుసరించాడు. ఇద్దరు ఖాండవ వన సమీపంలో తమ గుడారాలేర్పరుచుకుని ఆ పరిసరాల సుందర ప్రకృతిని దర్శిస్తూ చల్లగాలుల నానందిస్తున్నారు.

ఒకనాడు చల్లగా వున్న ప్రాంతం చూసుకుని అక్కడగల రాతిపై ఇరువురు ప్రకృతి పులకరింతను ఆస్వాదిస్తున్నారు. ఆ సమయంలో, పిలిచినట్లు "మహాప్రభూ!" అంటూ ఎవరో వచ్చారు. వెంటనే కూర్చున్న తాము లేచి, ఆ విప్రోత్తమునికి అంజలి ఘటించారు.

"మహాశయా! తామెవరు ? ఈ అకాల ఆగమనానికి గల కారణం, ఈ అడవిలో ఎందుకున్నారు ? ఇక్కడ మేమున్నామని మీకెలాగ తెలిసింది ? మాతో మీకు గల పని ?" తొందర, తొందరగా అడిగేసారు. ఆ వచ్చిన బ్రాహ్మణుడు ముందు చేయెత్తి ఆశీర్వదించిన తదుపరి -

"మహాప్రభువులు మీరు. మీ దర్శనాన్ని కాంక్షించాను. కృపతో దయ చేసారు. నేనొక బ్రాహ్మణుడను. అగ్ని సమానుడను. విపరీతమైన ఆకలితో బాధపడుతున్నాను. దీనికి సామాన్య భోజనం పనికిరాదు. మీరు కరుణించి, రక్షిస్తానంటే, మృష్టాన్నము పెడతానంటే, నా సమస్య తీరుస్తానంటే....

"ఇందుకోసం, ఈ అడవికి రావలెనా ? నగరంలో మీకు మృష్టాన్నమే లభించదా ?! ఎంత దారుణం ?" అనగా -

"అయ్యలారా! తమరు కృష్ణార్జునలన్న సంగతి నాకు తెలుసు. నా పేరు అగ్ని. హవ్యవాహనుడని కూడా అంటారు. నాకు సామాన్య భోజనం కాదు కావల్సింది. ఇందులో మహౌషధులున్నాయి. మీరు ఊ... అంటే దీనిని భక్షిస్తాను. నేనెప్పుడు దీనిని భక్షించాలని ప్రయత్నించినా, అమృతభాండంపై కూడ చూపనంత శ్రద్ధ, ఆ ఇంద్రుడు, తన మిత్రుడు తక్షకుడిందు వున్నాడని, చూపుతున్నాడు. నా ప్రయత్నానికి తీవ్ర విఘాతం కల్గిస్తున్నాడు.

"పూర్వము శ్వేతకి అను రాజర్షి దీర్ఘకాల అంటే శత వార్షిక సత్రయాగం ప్రారంభించాడు. ఆతను వ్రేల్చే నిరంతర అజ్యధారలను జీర్ణించుకోలేక బ్రహ్మను ప్రార్థిస్తే "ప్రస్తుతానికి వాటిని స్వీకరించు. భవిష్యత్తులో లోక కల్యాణము, ధర్మ స్థాపనార్థము, నరనారాయణులు కృష్ణార్జునులై జన్మిస్తారు. వారి సహాయంతో, ఆ ఖాండవాన్ని దహించమని బ్రహ్మ సూచించారు. ఆ ఆదేశంతో, తమ రక్షణ కోరి ఇక్కడికి వచ్చానని" ముగించి, "తమ ఆనతి" అని నిల్చున్నాడు.

కృష్ణార్జునులిరువురు ఒకరి మొహం మరొకరు చూసుకుంటున్నారు.

అది గమనించిన అగ్ని "చెప్పండి." ఎంతో వినయంగా అడిగాడు.

"హుతవాహనా! నీవు సర్వభక్షకుడివని ఈ ఖాండవాన్ని దహింప చెయ్యకుండా అడ్డుపడే ఆ ఇంద్రుని ఎదిరించాలంటే, అందుకు తగ్గ ఆయుధ సంపత్తి కావాలి. అవి ప్రస్తుతం మావద్ద లేవు. తీవ్ర వేగంతో సాగే అశ్వరథం, అపూర్వ శరసంపద... ఎన్ని కావాలో ఆలోచించు.

"నీకు సాయపడటానికి మాకేమీ అభ్యంతరం లేదు. వున్న ఇబ్బందల్లా, అక్షయతూణీరాలు, అమోఘమైన ధనువు లేకపోవడమే. అవి లేకుండా గాలిలోకి చేతులు విసిరితే నీకు రక్షణ లభిస్తుందా ? ఆలోచించు." మర్మంగానే అడుగుతున్నాడు, కృష్ణుడు.

"అర్థమయింది వాసుదేవా, నీ భావమర్థమయింది. జగజెట్టి అయిన ఈ అర్జునుని వీరత్వానికి తగ్గ ధనువు, అపురూప శరసంపద, నా మిత్రుడు వరుణుని సహకారంతో నీకిప్పిస్తాను. విజయుడవై నీ వీరవిక్రమాన్ని ప్రదర్శించుమని, అపురూప ధనువును, అక్షయ తూణీరములను, గంధర్వాశ్వములు పూన్చిన మహత్తర రథాన్ని బహూకరించాడు.

అలాగే వాసుదేవునికి అపురూప చక్రము, గదలను బహూకరించాడు. వాటి విశిష్టతను వివరించి చెప్పి వరుణుడు అదృశ్యమయ్యాడు. వీరు యుద్ధ సన్నధులు అయ్యారు. "అగ్నిదేవా! ఇక నీ ఇష్టం. నీ పని నువ్వు కానివ్వు, మా పని మేము చేస్తామన్నారు. అందుకు సంతోషించిన అగ్నిదేవుడు, రేపు ఉదయమే నా దహన కార్యక్రమమన్నాడు.

ఖాండవ వనానికి నలుప్రక్కల నుండి తన తేజస్సును ప్రసరింప చేసాడు. ఏ విఘాతము రాకుండా అర్జునుడు ధనుర్ధారి అయ్యాడు. కృష్ణుడు ఆర్తత్రాణ పరాయణుడయ్యాడు. ఆ అడవిలో ఎన్ని జంతువులో, వాటిలో చాలామట్టుకు పారిపోవడానికి ప్రయత్నం చేసాయి. కొన్ని దారిలేక మలమల మాడిపొయ్యాయి. ఎన్ని ఓషధులున్నాయో, ఆ ఓషధీపతికి చంద్రునికి గూడా తెలియవు. హాయిగా సహస్ర జిహ్వుడయ్యాడు.

వేయి నాల్కలు సాచి, ఓషధులను కడుపార భక్షిస్తున్నాడు. అగ్ని ప్రతాపంతో, ఖాండవ వనం అకాల ప్రళయానికి దారి చేసింది. కొన్ని జంతువుల హాహాకారాలు, కాలిన పీనుగుల వాసనలు, ఆ ప్రాంతమంతా అగ్నికీలలకు, తీవ్రతకు గురయింది. ఓ ప్రక్కన "ఇంద్రా!" అంటూ విషనాగుల హాహాకారము.

పరిస్థితినర్థం చేసుకుని ఇంద్రుడు, అకాలమేఘాలు క్రుమ్మరించు వర్షంతో, ఖాండవాన్ని, తన మిత్రుడు తక్షకుని కోసం రక్షింపసిద్ధబడుతున్నాడు. ఇంతవరకు తన వీరవిక్రమం ప్రదర్శించడానికి సావకాశం లభించని అర్జునుడు, వీరుడు, విక్రముడయ్యాడు. ఒక్క నీటిబొట్టు కూడా క్రిందపడకుండా, ఖాండవ వనానికి గొడుగు పట్టాడు.

ఈ హడావుడిలో తక్షకుని జాడ తెలియలేదు కాని వాని కుమారుడు, అశ్వసేనుడు, తన తల్లితో ఆ విలయం నుండి తప్పించుకోవాలని ప్రయత్ని స్తున్నాడు. తల్లి కుమారునితోక పట్టుకుని బయటపడబోతుంటే అర్జునుడొక బాణం వేసాడు. ఆ దెబ్బకు తల్లి శిరము, అశ్వసేనుని తోక అగ్నికి ఆహుత య్యాయి. అశ్వసేనునిపై మరో బాణం అర్జునుడు సంధిస్తున్నాడు.

ఈ ఉపద్రవాన్ని గమనించిన ఇంద్రుడు, "మోహిని" శక్తిని ప్రదర్శించాడు. దాంతో క్షణకాలం విభ్రమం. ఈ సమయంలో అశ్వసేనుడు తప్పించుకున్నాడు. ఇంద్ర - కృష్ణార్జునుల మధ్య ఆధిపత్య పోరు నడిచింది. సురాసుర, యక్షగంధర్వాది, గణాలన్నీ కూడా, కృష్ణార్జునులను చూసి, వందన మొనరించి పారిపోతుంటే వాళ్ళు నరనారాయణులు కాబట్టి అవధ్యులయ్యారనుకున్నాడు.

అయినా వీని చాతకానితనము, వారి విక్రమము లోకవిదితమగునట్లు, మందర శిఖరాన్ని తెచ్చి ఖాండవవనంలో పడేస్తే మంటలు ఆరిపోతాయని తలిచాడు. ఇంద్రుని ప్రయత్నాన్ని వమ్ము చేస్తూ, కొండల్ని పిండి చెయ్యగల వజ్ర బాణంతో, ఆ మందరశిఖరాన్ని చూర్ణం చేసాడు.

ఈలోగా ఆకాశవాణి హెచ్చరిక "ఇంద్రా!"అనవసర ప్రయత్నంతో, బ్రహ్మ శాసనాన్ని ధిక్కరించి ప్రమాదము కొని తెచ్చుకోవద్దు. ఈ కృష్ణార్జునులు అజేయులు. కనుక అనవసర వృధా, వ్యర్థ ప్రయత్నాలతో పరువు తీసుకోకు"మని హెచ్చరించింది.

దాంతో జరిగింది మరచిపోయినట్లు ఇంద్రుడు వెనుక తిరిగితే, కృష్ణార్జునులు సింహనాదం చేసారు. సరిగ్గా ఈ సమయంలో "నముచి" అను రాక్షసుని సోదరుడు మయుడు, ప్రాణభీతితో బయటపడబోగా, కృష్ణుడు చక్రం తీస్తాడు.

"అర్జునా! శరణు, శరణు" అన్నాడు వాడు.

"బావా! కృప చూపమన్నాడు" అర్జునుడు.

అంతటిలో ఖాండవ దహనం పూర్తయింది. అగ్నికి మాంద్యంకూడ తొలగింది



# నాగ్నజిత్తు

**ఖాం**డవ దహనమయింది. కృష్ణార్జునుల కీర్తి దిగంతాలకు వ్యాప్తి చెందింది. ఆ విజయోత్సవ సంబరంలో అర్జునునిచే ప్రాణరక్షణం చెయ్యబడ్డ మయుడు, తన కృతజ్ఞతగా వందనములర్పించాడు. కృష్ణార్జునులను చూస్తూ -

"దివ్యోత్తములారా! నేను దానవశిల్పి మయుడను. నా ప్రాణరక్షకులకు ఏదైనా నా శక్తి మేరకు బహుమతినివ్వాలని బహు కోరికగా వుంది. మీరు చేసిన ఉపకారానికి, ప్రత్యుపకారం నేనేం చేసినా తీరదు. అయినా నా ఉత్సాహాన్ని మన్నించి అనుజ్ఞ, ఆజ్ఞా ఇవ్వండి. శిల్పకళా చాతుర్యముపయోగించి, ఇంద్రాదులను మించు ఈ వైభవమూర్తికి యశోదాయకమైన అపురూప బహుమతి నివ్వగలవాడ!" తన ప్రతిభను చాటుకుంటూ, ఎంతో వినయంగా చెప్పాడు. అర్జునుడు, కృష్ణుని చూసాడు.

క్షణకాలమాగి "ఓ మయాసురా! నీ శిల్ప చాతుర్యాన్ని బహు చక్కగా చెప్పావు. ఇంద్రాదుల పురాలను తలదన్నే మహా వైభవమూర్తి. ఈ ఇంద్రప్రస్థం, ఈ రాజు అన్నావు. కనుక, ఈతనికి కీర్తిదాయకమౌ మహాద్భుత సభను...

"తప్పక మీ ఆజ్ఞ శిరోధార్యము. పూర్వము రాక్షసరాజు వృషపర్వుని కోసం సేకరించిన ఎన్నో మణిమయాదులున్నాయి. వాటిని అప్పుడు వుపయోగించ లేకపోయాను. ఇప్పుడు వాటితో గూడా కల్పి, మహాద్భుత, అపురూప సభా సదనాన్ని రూపొందిస్తానని, కృష్ణార్జునుల అనుమతితో తన కార్యక్రమంలో మునిగి పోయాడు.

అప్పుడే మయాసురుడొక వాగ్దానం చేసాడు. ఈ మహావీరుడు బాహుబలుడైన భీమునికి తగు గదను, అర్జునునికి దేవదత్తమనే దివ్యశంఖాన్ని కూడా అర్పించుకుంటానన్నాడు. ఆ తర్వాత -

ఒకనాడు కృష్ణార్జునులు ఉద్యానవనంలో కూర్చుని కబుర్లాడుకుంటుంటే, వున్నట్టుండి అర్జునుడు "బావా! చిన్నప్పుడు నువ్వు "హస్తి" అనే వృషభరాజ మదమణిచావని అంటారు. నిజమేనా" ఆసక్తిగా, వివరం తెలుసుకోవా లన్నట్లడిగాడు. సమాధానంగా నేన్కొడినే కాదు. రాధ కూడా ఆ ప్రయత్నంలో పాల్గొందంటాడు.

"అయితే! నీకటువంటి మరోసావకాశం లభించబోతుంది. భరతం పడతావా ?" అంటాడు. కష్ణుడు నవ్వుతూ అంత అవసరమా ? అయితే అప్పుడు చూద్దామంటాడు.

"అదికాదు బావా! కోసల రాజ్యంలో, మన హస్తి వంటివి ఏడు మదించిన ఆంబోతులున్నాయట. ఆ పొగరుబోతులను పట్టలేక, దాని వాతపడి ఎందరో మరణించారు. అటువంటి వాటిని..!" అర్జునుడు చెబుతున్నాడు.

"ఇంకా....!" అంటున్నాడు కృష్ణుడు.

"ఇంకా, ఏముంది ? ఆ అయోధ్యాపతి, వాటి పొగరణచిన వారికి, తన అందాల సౌందర్య ధామిని, సుకుమారి నాగ్నజిత్తును వరణంగా ఇస్తాడుట. ఇది అందుకోవాలని ఎందరికో, ఆశ. కాని, నిరాశ... ఏ కొందరు, సాహసించ లేకపోతుంటే, ఆ అయోధ్యాధిపతి నగ్నజిత్తు నీరసించిపోతున్నాడుట.

"ఓస్! ఇంతేనా ? అయితే ఆలోచించవలసినదే!" అంటాడు, కృష్ణుడు.

ఎంతయినా బావ కాబట్టి, అర్జునుడు పరిహాసం మొదలుపెట్టాడు. "అవును బావా! అప్పుడు వేణువు వుంది కాబట్టి, ఆ "హస్తి"ని బంధించగలిగావు. ఇప్పుడు వేణువు లేదు కదా! ఏం చేద్దాం! క్రొత్తది తెప్పించనా ?" అంటాడు.

"మరి రాధకూడా కావాలి కదా, ఆమె నెట్లాగ తెప్పిస్తావు ?" అన్నాడు, యధావిధి మందహాసం చేసి "అర్జునా! నాదం ఎక్కడ నుండి, ఎలాగ వస్తాయి ?" అడిగాడు.

"అదా! వాయు ప్రసరణంలో, వాయు తరంగం శబ్ద తరంగమౌతుంది.

"అంటే, నాదానికి ప్రాణం వాయువు. అవునా ? ఇది వేణువులోనే కాదు, ప్రతి జీవిలోను వుంటుంది. మనం చేసే స్వరశబ్దం - నాదశబ్దం. ఆ శబ్దం - నాదమై, ఓంకారంగా మారితే, పరిస్థితులన్ని శాంతించి, ప్రణవంతో పరబ్రహ్మాన్ని కట్టెయ్య కల్గుతుంది. కాబట్టి వున్న వూపిరి చాలు. దానికి మరో కర్ర వేణువు, కుర్రచేష్టలనవసరమంటాడు. సుతి మెత్తగా వారిస్తాడు.

సర్వ శాసనకర్త గదా, "కృష్ణ వాసుదేవుడు" సృష్టి సర్వము ఆయనే అయినప్పుడు, నాదం కోసం వాదనమనవసర మనుకున్నాడు, అర్జునుడు.

ఆ జగదోద్ధారకుని మాటలతో అర్జునుడిలోని వెక్కిరింత ధోరణి పోయింది. అయితే నువ్వుచేసే నాదబ్రహ్మోపాసనను పశువులు గ్రహించగలవా ?'' ఆశ్చర్యంగా అడుగుతాడు. "ఎందుకు కాదు ?'' అన్న వాసుదేవుడు -

"అర్జునా! వేద సుశ్వర శబ్దానికి, ప్రణవ నినాదానికి పోయిన ప్రాణం లేచి వచ్చినట్లు, స్థితి స్థిమితపడి "ఓం'' కారంతో, శరీరమంతా పరవశించినట్లు బ్రహ్మానందమొందే వారలెందరో వున్నారు. సప్త బీజాలు, స్వర శబ్దాలు "స, రి, గ, మ, ప, ద, ని, స...!'' ఎంతటి మధురానుభూతిని ప్రసాదిస్తున్నాయి. ఈ స్వరంలోనే రాగరంజితులౌతున్నారు. అందులోని భయ, రౌద్రాది ఇతర ప్రేరణములు, శరీరం పొందుతుంది కదా! అవునా !''

"ఇంకా చెప్పాలంటే... నాదమే వేదం, ఆ వేదమే శబ్దమని, అది "లయ'', తాళ, వృత్త....!'' అర్థమౌతుందా ? శిశుర్వేత్తి, పశుర్వేత్తి... అన్నారు. ఆ శబ్ద ప్రాధాన్యం గ్రహించావా ... ?'' ఆ పెంకివానికి అంత రెట్టింపు రణపెంకిగా సమాధానమిస్తూంటే...

"అయితే మనం, అయోధ్యకు వెడుతున్నామన్న మాట... ?'' "అన్నమాట కాదు. వెడుతున్నాము. అది వున్నమాట...!'' "బావా! ఎంత జగద్రక్షకుడివైనా, వున్న అయిదుగురు భార్యలు చాలదా ? ఇంకా... ఈ... క్రొత్త... !''

"నీకెందుకా, నసుగుడు, సణుగుడు ? ఇది కామ వికారంతోనో ప్రకోపంతోనో జేసే పనులు కావు. గత జన్మలలో నన్ను భర్తగా పొందతలచి, విఫలమైన వారి వేదన తీర్చడానికి మాత్రమే తప్ప, నా ఆలోచనలో అధర్మం లేదు, వుండదు. ఆశ లేదు, తృష్ణా లేదు. నిష్కాముడను. నిర్మోహుడను. కాబట్టి, ఈమెయే కాక, ఇంకా కొందరు నా రాణీవాసం చేరతారు. శ్రీకృష్ణుని భార్యలమైనామని ప్రీతితో పరవశించి పోతారు.

ఆ ఆనందం బ్రహ్మానందం. జీవాత్మ, పరమాత్మల చిదానందం. ఆ భగవంతుని చిద్విలాసమనేసరికి, మరోమాట చెప్పలేక పాండవ మధ్యముడైన కుంతీ'' పుత్రుడు, అర్జునుడు - "వందనం వాసుదేవా!'' అంటాడు. చిత్రంగా శ్రీకృష్ణుని చూస్తున్నాడు. కృష్ణుడు యధావిధి తన చిరునవ్వులు చిందిస్తున్నాడు. అతని మమేకాన్ని గుర్తించిన కృష్ణుడు "పార్థా!'' అన్నాడు. "ఏవిటా వెఱపు, మరపులు.''

"అదికాదు బావా! జగన్నాటక సూత్రధారి", అంటూంటే ఎప్పుడు మాతో సన్నిహితంగా వుండే నిన్ను చూస్తూ కొన్ని కొన్ని మాటలు వింటూ "అజ్ఞాన జనిత మానవులమై మేము చేసే మా ప్రయత్నాలను" గోవిందా! మన్నించి కరుణించుము. కారుణ్యతిలకా! నిన్ను, నీ లీలలను, తత్త్వాన్ని, నా వంటి వాళ్ళకే అవగతము కాకపోతే ఇంకా సామాన్యులు... "స్వామి! అర్థం చేసుకోగలరా ?" శిఖిపింఛమౌళీ, శరణు, శరణు, శరణాగతుడను" అంటే -

"బావా! ధర్మం నిర్వహించడంలో ఆనందం, ఆ"నందు"డనై నేను వివరించి చెప్పానే తప్ప, ఇందులో ఏమాయా, మర్మం లేదు. అయోధ్యకు బయలుదేరుదాం, బయలుదేరుమనగా "చిత్తం, నీ ఆజ్ఞ" అంటాడు, అర్జునుడు. అయితే నగరంలోకి వెళ్ళి పురోహితుల వార్ని సంప్రదించి మంచి శుభముహూర్తం పెట్టమందామంటాడు.

"యదు సింహమా! కాలానికి పురుషుడివి, కాల స్వరూపుడివైన నీకు "సు"ముహూర్తమా! నీ సంకల్పమే లోకాలకు శుభ, శాంతిదాయకం. శుభస్య శీఘ్రమంటాడు, తత్వమర్థం చేసుకున్నట్లా గాండీవి. అందుకు నవ్వుతూ -

"విజయా! వెడదాం. విజయంతో తిరిగి వద్దాం. కానీ ఇలాగ పరుగెత్తడం కుదరదు. దారులు, వూరులు, ప్రజలు, ప్రదేశాలు, మకాములు... ఎన్నెన్ని చూసుకోవాలి. పురమాయించాలి. కనుక, ఈ క్షణమే కుదరదు. మరుక్షణం, తప్పక బయలుదేరుదాం. ప్రజాపీడనం గావించే ఆ వృషభరాజాల గర్వం సర్వం పటాపంచలు చేసి, ప్రజలను కాపాడుదాం. ధర్మ పరిరక్షణ గావిద్దాం!" స్థిర సంకల్పంగా తెలిపాడు.

ముహూర్త నిర్ణయం జరిగింది. కృష్ణునితోపాటు అర్జునుడు బయలుదేరు తున్నాడు. ఏర్పాట్లు జరుగు తున్నాయి. వాసుదేవుడు క్రొత్త భార్య మిత్రవిందతో తన ప్రయాణం గురించి, ఏడు ఆంబోతుల గురించి గూడా చెప్పాడు.

ఆమె కృష్ణునికి ప్రేమగా నమస్కరించింది. స్వామి విజయులై తిరిగి రండి. గురుసాందీపుల వారు వాసుదేవుడంటే... అంతట నిండివున్నవాడనీ, కేవలం వసుదేవుని సుతుడు కాబట్టి "వాసుదేవుడ"ని పేరు రాలేదని శ్రీకృష్ణుని లీలా విశేషాలను కేవలం ఆత్మవిదులు యోగులు తప్ప, ఇతరులా యోగీశ్వరేశ్వరుని అర్థం చేసుకోలేరని -

తమ గురించి ఎంత గొప్పగా మమ్మల్ని పరవశింపచేసారో! నిజానికి ఆ శ్రీ గురుదేవులకు, మీ యొక్క గొప్పతనం చెప్పినందులకు శిరసువంచి నమస్కరించాలి. ఎన్ని జన్మలలో చేసుకున్న పుణ్యమో "ప్రభూ! మీ భార్యను కాగలిగాను. మీ సేవసంతృప్తికరంగా చేసుకునే అదృష్టాన్ని ప్రసాదించి, జన్మధన్యం చెయ్య ప్రార్థన. అదే నా జీవితేచ్ఛ!" - "శ్రీ"పతి "శ్రీ" చరణాల, అంజలి ఘటించి నిలబడిందామె.

ఆమె పతి భక్తికి సంతోషించిన శ్రీకృష్ణుడు "మిత్రా! నేను రావడానికి కొంత ఆలస్యం పట్టవచ్చును. ఒంటరిగా...!" ఆమె మనోభావము తెలుసు కొనుటకై అడుగగా "స్వామీ!" నేను ఒంటరినా ?" మీరు ఎల్లప్పుడు నాతోనే వుంటారు. వుంటున్నారు. అప్పుడు ఒంటరిని, తుంటరి మనస్సు అన్నభయము లేదు. బాధ లేదు. నిలువెల్ల, నరనరాలలో నా స్వామి నిండియుండగా, నాకు నిత్యానందమే తప్ప భయాందోళనలకు తావు లేదంది.

ఆ మర్నాడు వుదయం, కృష్ణార్జునులు తమ పరివారంతో బయలుదేరారు. కొంతదాక బాగానే వుంది. తానున్నది ఆడుబిడ్డ సామ్రాజ్యంలో. తన రాజ్యంలో కాదు. ద్రౌపది సుభద్రలు బాగుగానే చూసుకుంటున్నారు. పెదతల్లి కుంతీదేవి ప్రేమ, తన తల్లిని మరపింపచేస్తుంది. అయినా ఒంటరితనం. తెలియని దిగులు.

రాత్రి బింకమంతా ఏమయిపోయింది ? క్షణం గడుస్తున్న కొద్ది, తనమాట తనకే అబద్ధంగా స్వామివారికోసం తపిస్తుంది. ఇప్పుడు తను క్రొత్త పెళ్ళాం. ఇంకో నాల్గురోజులు పోతే నాగ్నజిత్తు వస్తుంది. అప్పుడు తాను పాత భార్య. ఇప్పటికే నలుగురు రాణులున్నారు. తాను అయిదవది. గోకులంలో వుండగా "రాధ అనే గొల్లపిల్లను స్వామి వివాహం చేసుకున్నారుట. ఇంతమంది వుండగా, మరల మరో భార్య. ఆరవది .... అవసరమా ? ఏమో స్వామి లీలలు. ఎవరికి అర్థం కావు. ఆ హర బ్రహ్మలు అర్థం చేసుకోలేరంటే, నేను ..., ఏదో అదృష్ట వశమున స్వామి పొందు, పొందగలిగాను, ఆ స్వామిని అర్థం చేసుకోవడం వేదాలకే సాధ్యం కాదుట. ఆ ఆదిశేషుడికే తరంకాదుట.

అయినా... ఈ జీవితం... స్వామి లేని ఒంటరితనం, తెలియని తాపత్రయం.. ఎందుకో తెలియని విచారం, తలదిండును తడిపేసే కన్నీళ్ళు

ఈ స్థితిలో తలుపులు తడుతున్నారెవరో. కళ్ళు తుడుచుకుని వెళ్ళి చూసింది. ఇంకెవరు... స్వామే! ఆశ్చర్యపోయింది.

రాత్రి అన్ని కబుర్లు చెప్పి, నిలువెల్ల నాతో వున్నానన్న నీవు, ఈ బేలతన మేమిటి ? ఈ విచారమేమిటి ? అడుగుతున్నాడు. ఆమె చిత్రంగా చూస్తుంది. స్వామీ, ప్రయాణమంది.'' ఆగిపోయి తనకోసం తిరిగి వచ్చారేమోనన్న ఆందోళనతో!

"లేదు, మిత్రా! ప్రయాణం కొనసాగుతుంది. నిలువెల్ల నేనే వున్నానన్నావు కదా! అందుకుని, నీ విచారం చూడలేక, నీ ఎదుట నిలిచాను. నిన్ను సంతోష పెట్టడమే నా ధర్మము తప్ప, నా వలన, నా మిత్రవింద శోకించరాదు. బాధపడరాదు.

ఆ మాటలు వింటూ పరవశించినామె, "ప్రభూ! మరి ప్రయాణం ?''

"మిత్రా! ఈ లోకం కాలానికి, కర్తవ్యానికి, ధర్మానికీ సమాధానం చెబుతుంది. మన బాధలవలన కాలం ఆగిపోదు. ధర్మం మారిపోదు. ఉదా : సూర్యుని చూడు. మనం ఆనందంగా వున్నామని, అతను ఎగురడు. విచారిస్తున్నామని అతడు ఏడుస్తూ కూర్చోడు. తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తిస్తున్నాడు. అలాగే భగవంతుడు. అతని సృష్టిలోని జీవరాశి. ఈ సత్యం గ్రహించిన వారు ధన్యులు. వారు పరమేశ్వరుని తప్పక దర్శించగలరు.

"అంటే.... ?!'' "అంటే ఏముంది, మిత్రా ?! ఆ వాసుదేవుడు సర్వవ్యాప్తుడని శ్రీగురువులు చెప్పారన్నావు కదా! ఇతడు అక్కడా వున్నాడు, ఇక్కడా వున్నాడు. "అయితే.. ద్వారకలో... ?!....... "ఆ ద్వారకలో... అక్కడున్న రుక్మిణితోపాటు, నీ సోదరీమణులందరి వద్ద, క్షణమెడబాయక నీ ప్రభువు సరససల్లాపాలాడుతు, వారిని అలరిస్తున్నాడు, ఆదరిస్తున్నాడు. అక్కడ వుండి, అర్జునునితో ప్రయాణం చేస్తూ, ఇక్కడ నీ చెంత వుండి, నీ చింత తీరుస్తున్నట్లు...!

"తమరు....!'' ఆశ్చర్యం నుండి తేరుకోలేకపోతుంది. "అవును, మిత్రా! అక్కడ ద్వారకలో వున్నాను. బృందావనంలో, నా అభిమానిగా, గోపికల మధ్య, రాధ వద్ద వున్నాను. అర్జునునితో కలిసి ప్రయాణం చేస్తున్నాను. రేపు ఆ ఏడు ఆంబోతుల మదమణచి, నాగ్నజిత్తుతో కూడీ వస్తాను.

మరొక విషయం. భార్యాభర్తలు... అంటే అర్థనారీశ్వరులు, శ్రీపతివలె, హృదయరాణులు. ఈ సత్యం మరచి నా భర్త నాకు దూరమయ్యాడనుకోవడం చాలా పొరపాటు. ఇంకో విషయం తెలుసా ?

రాధా-కృష్ణులు - రెండు కాదు. ఒక్కటే, ఒక్కరే అలాగే - రుక్మిణీ కృష్ణులు; సత్యాకృష్ణులు; జాంబవతీ కృష్ణులు; మిత్రవిందా కృష్ణులు కాళిందీ కృష్ణులు;... వుండగా ఇప్పుడు - నాగ్నజితే కృష్ణుడు కాబోతున్నాడనుకుంది. సర్వాంతర్యామి నా ప్రభువు... అనుకుంది. ఎంత కృష్ణుని ఇల్లాలయినా, మానవ సహజ సందేహాలు ఆమెను అమాయకురాలిని చేసి, అనుమానం కాదుకాని సంశయంలో పడవేస్తున్నాయి.

"మిత్రవిందా! ఈ కనుపించే "నేను" ఎవరో నీవు తెలుసుకుంటే, నీలో సందేహాలు రావు. సంశయానికి తావు లేదు. "నేన"ంటే ఏమిటో తెలుసుకున్నవాళ్లు నన్నర్థం చేసుకోగల్గుతారు. ప్రస్తుతానికీ సర్వాంతర్యామిని నమ్ము. ఆ తదుపరి పరమ భాగవోత్తోత్తమురాలు రుక్మిణిని అడుగు. అతిశయ, స్వాతిశయములున్నా "నేనెవరో" తెలుసుకున్న సత్యభామను అడుగు.

జాంబవతి, కాళింది కూడా... నా తత్వం నీకు ప్రబోధిస్తారు. శ్రీ గురుదేవులు, "ఓం నమః శివాయః" అని రాయిస్తే, ఆ తదుపరి... విద్య, జ్ఞానం, బుద్ధి కలిగే విద్యను, వివేకాన్ని, నిజగురువులు తెలియబరుస్తారు. జీవిని ధన్యుని చేస్తారు. ఈ సత్యం తెలుసుకున్న సర్వులు. ధన్యులు. జగత్ప్రసిద్ధులని అర్థం చేసుకో"మన్నాడు. సుఖంగా నిద్రపోయారు.

తెల్లవారింది. కళ్ళు తెరచి చూస్తే స్వామి కనబడలేదు. అంటే.... రాత్రి తనను, అలరించి మరల అదృశ్యమయ్యారన్నమాట. ఆహా... ఏమి లీల... అవును, నిజమా! ఇది కలా!... ఏమో... స్వామి వచ్చారు. అది నిజం. ఇప్పుడు.... అదృశ్యమయ్యారు. ఇక్కడ లేరు, ఇది నిజమే.... ననుకుంది.

కృష్ణార్జునులు, తమ దేశంలోని బలిష్ట పొగరుబోతు ఆంబోతులను మదమణచడానికి వస్తున్న వార్తతో కోసల రాజు నగ్నజిత్తు, ఆ మహామహులను స్వాగతించడానికి, వారితో మైత్రి నొందడానికి ఎంతో సంతోషించాడు. వారి రాక తనకు, తన ప్రజలకు అదృష్టమని మురిసిపోయాడు. తగు ఏర్పాట్లు చేయిస్తున్నాడు.

రాజకుమారి నాగ్నజిత్తి కూడా శ్రీకృష్ణ ప్రభువు యొక్క లీలా విశేషాలను, కథలు, కథలుగా విని తన మనసుని శ్రీకృష్ణ దివ్యచరణారవిందముల యందుంచింది. ఆయనను భర్తగా పొందినవారు అదృష్టవంతులని తనలో తను, తల్చుకుని, తల్చుకుని పొంగిపోతుంది. తనకా అదృష్టాన్ని ఆ ప్రభువు ప్రసాదిస్తాడో... లేదో... తెగ బాధ పడిపోతుంది.

అందుకుగాను శ్రీకృష్ణ నామాన్ని అత్యంత భక్తియుక్తంగా బాహ్యాంభ్యం-తరాల పూజలతో, స్మరణంతో పులకరిస్తుంది. తనను కరుణించి చేపట్టుమని ప్రార్థిస్తుంది. ఆ మర్నాడుదయమే, నాగ్నజిత్తి, రాజ పురోహితులను కలుసుకుని "గురుదేవా!" అంటూ తన మనసు చెప్పిన శ్రీకృష్ణ గాధలు, లీలలు విని, విని మనసు శ్రీ స్వామికి అర్పించుకున్నాను. దీనిని సత్యవంతం చేయించి, ఆ ప్రభువును, నాకు ప్రభువును చెయ్యమని ప్రార్థించింది.

ఆమెను అనునయిస్తూ "రాకుమారీ! నీకో రహస్యం చెబుతున్నాను, విను. ఈనాటి ఉదయం, ఆ ప్రభువు, మీ నాన్నగార్ని కలిసారు. తను వచ్చిన వుద్దేశం తెలియబరిచాడు. అందుకు నీ తండ్రి గారు కూడా ఎంతో సంతోషించారు. మహద్భాగ్యమని పొంగిపోయారు. నిన్ను మించిన ధీరుడు, వీరుడు, ఈ మూడు లోకాలలోను దొరకడు. అయితే -

ప్రస్తుత మా రాజ్య పరిస్థితిని బట్టి, మా రాజ్యంలో వున్న ఏడు పొగరుబోతు వృషభాలను, మదమణచిన వానికి, నా పిల్లనిచ్చి వివాహం చేస్తానని ప్రతిజ్ఞ చేసాను.

ఇప్పుడు నీవు వచ్చావని మాట తప్పనా ? అది మర్యాదా భంగం కాదా ? అది లోకం హర్షిస్తుందా!! ధర్మమూర్తివైన నీవు క్షమిస్తావా... ?!" అని ఆవేదన చెందుతున్నాడు. క్షణమాగిన తదుపరి -

"వాసుదేవా, నీ వీరత్వము ముందు, ఈ ప్రపంచమే క్షణికం. నీ సర్వశక్తిత్వంతో, వాటిని అదుపు చెయ్యి. నా కుమార్తెను స్వీకరించు. ఉభయ తారకంగా నా జన్మను ధన్యమొనర్చు!" నగ్నజిత్తు రాజుగా కాక ఒక భక్తునిగా ప్రార్థిస్తున్నాడు.

"తథాస్తు...!" అని స్వామి అభయమొసగారని రాజ గురు(దే)వులు, పురోహితులు చెప్పగా, కృష్ణుడు తనను చేపట్టినట్లే సంబరపడిపోయిందా పిల్ల.

మర్నాడు - కృష్ణుడు - ఆ వృషభరాజముల మదమణచుతాడనే వార్త, రాజ్యమంతా తెలిసిపోయింది. ఆ వింతను, కృష్ణలీలను చూడాలని ఎక్కడెక్కడి వారు అక్కడ గుమికూడారు.

మహారాజు, కృష్ణుని తీసుకుని, మహా వృషభములను బంధించిన కొట్టంలో అడుగుపెట్టాడు. ఆ కొట్టంలోకి అడుగుపెడుతూనే కృష్ణుడు వాటిని పరిశీలనగా చూసాడు. ఇవి సామాన్య వృషభములు కావు. గతంలో బృందావనంలోని తన అనుభవాల్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. పెదవుల చిరునవ్వులు చిందిస్తూ పంచె పైకెగకట్టాడు.

వాటి శక్తిని గ్రహించినట్లు, కృష్ణుడు - లీలా మానుష విగ్రహుడై, ఏడు రూపాలతో, ఏడింటి ముందర, ఓ మహాశక్తిగా నిలిచాడు. అదొక అద్భుతం. అందరికి ఆశ్చర్యం. అందరితోపాటు అర్జునుడు ఆశ్చర్యంగా చూస్తున్నాడు - "అంతకు ముందు" బావా! నువ్వు "హస్తి" అనే ఆంబోతును, వేణుగానంతో బంధించావుట కదా అని - చమత్కరించిన, అర్జునుడు!

పిడిగుద్దులు గుద్దుతూ, కొమ్ములను పట్టి గుంజుతూ బొమ్మలకు త్రాళ్ళు కట్టినట్లు, ఆ ఏడింటిని బంధించి బొమ్మల్లాగ, సాధుమూర్తులను తీసుకు వస్తున్నట్లు ఆ ఆంబోతులను తీసుకు వస్తుంటే, పౌరులకన్న అర్జునుడు అవాక్కయ్యాడు. కృష్ణుడు.. దేవదేవుడు, మా బావ........ అనుకోవడానికేమీ కనబడకుండా, ఆశ్చర్యపోతున్నాడు. అందర్నీ మించి, ఆంబోతులను బంధించిన ఆ ఆదిదేవునికి శిరసు వంచాడు. మహోత్సాహ - జయ జయ ధ్వానాలతో, కోసల పులకరించేటట్లు విజయదుందుభులు మ్రోగిస్తున్నారు.

అయితే - కృష్ణుడు - ఏడు రూపాలతో ఆ ఆంబోతులను చేరడం, తన ఆధిక్యతను ప్రదర్శించడం, నాగ్నజితి, ప్రత్యక్షంగా తన కళ్ళారా దర్శించింది. రాజగురువులు చెప్పిన ఏ మాట అసత్యం కాదని, తన ప్రభువు దేవాధిదేవుడని స్థిర నిశ్చయమొంది. తనకు ప్రభువు అవుతున్నందులకు, ఆ దేవదేవునికి ప్రణతు లర్పించింది.

మహారాజు సరేసరి.

తన ప్రతిజ్ఞ ప్రకారం, నాగ్నజితి, శ్రీకృష్ణుల వివాహం మహావైభవంగా నిర్వహించాడు. కొన్నిదినాలు అక్కడ గడిపిన వారలు, ఇంద్రప్రస్థానికి బయలుదేరారు.

కోసలాధిపతి తమ కూతురు, అల్లుడికి అరణంగా పదివేల గోవులను, మూడు వేలమంది పరిజనాన్ని, తొమ్మిదివేల ఏనుగులను, లక్ష రథాలు, అశ్వకులను పంపాడు. ఆ ప్రయాణంలో భాగంగా ఒకనాటి రాత్రి ఒక కొలను గట్టున నాగ్నజితి, కృష్ణులు ఏకాంతవాసం చేస్తున్నారు. వున్నట్టుండి నాగ్నజితి ఆలోచనలో పడింది. ఆమెను అలాగ కొంతసేపు చూసిన గోవిందుడు "ఏమిటీ? సపత్నులను తలచుకుని వారితో ఎలాగ వేగాలా ?'' అని ఆలోచిస్తున్నావా ?'' అని అడుగుతాడు.

"అందులో నాకేమాత్రం భయ, సంశయాలు లేవంటుంది.'' అదేమంటాడు కృష్ణుడు. సప్త వృషభాలను సప్త రూపాలలో విభేదించి బంధించిన ప్రభువు విషయంలో, నా అనురాగానికి ప్రణయ పిపాసకు ఎటువంటి అవరోధము వుండదు. రాదు!'' అని మహాధైర్యంగా పలికింది. ఆ రాత్రి గడిచింది. యధావిధి తెల్లవారి ప్రయాణం.

ఇంద్రప్రస్థాన్ని చేరారు. సప్తవృషభాల్ని మధించి, నాగ్నజితితో వచ్చిన వాసుదేవుని, అర్జునుని, ఇంద్రప్రస్థమే స్వాగతించినట్లు మర్యాదలు జరిపారు. క్రొత్తదనం వసివాడి పోకుండా, వెంటనే వచ్చిన ~~ఈ~~ క్రొత్త పెండ్లికూతురును , ఇంద్రప్రస్థం ఎంతో అనురాగంతో దగ్గరకు తీసుకుంది, ప్రేమతో ఆలింగనం చేసుకుంది. ఇలాగ రోజులు గడుస్తున్నాయి. ~~ఈ~~ కాలగమనంలో, లోకరక్షణార్థం వెలసిన ధర్మమూర్తి, శ్రీ వాసుదేవుడు -

గతంలో తనను కోరుకున్న వారలను, వరప్రసాదులను, ద్వాపరంలో కృష్ణునిగా జన్మించిన తరుణంలో కటాక్షించెదనని చేసిన వాగ్దానంలో భాగంగా, వాగ్దాన భంగం చెయ్యకుండా మద్రరాజేశ్వరుని తనయ లక్షణను, కేకేయ రాజపుత్రి భద్రను కూడా వివాహం చేసుకున్నాడు.

అష్ట భార్యామూర్తయిన ఆ యశోద తనయుడు తన భార్యలతోను, అత్తవారు తమ కూతుళ్ళకిచ్చిన అరణాలతోను ద్వారకాపురికి ప్రయాణం ప్రారంభించాడు. ఒక సామ్రాజ్యం కదిలి వెడుతున్నట్లుండే ఆ సంబర సంరంభానికి సాత్యకి, ఉద్ధవ, కృతవర్మలు ప్రయాణపు ఏర్పాట్లు అట్టహాసంగా చేసారు. దారిపొడువునా అవసరాన్నబట్టి విడిదలు, చూడవచ్చిన వారి కుశలప్రశ్నలు, వారికి తగు మర్యాదలు... అన్నీ క్రమపద్ధతిలో వాళ్ళు రూపొందించారు.

ఈ వచ్చిన యశోదానందనునికి, దేవకీదేవి క్రొత్తకోడం(డ్రకు బ్రహ్మాండమైన స్వాగతం లభించింది. కాళిందీ దేవిమందిరం ప్రక్కన మరో నాలుగు మందిరాలు ఏర్పడ్డాయి. అందరికి అద్భుతమైన వసతులతో అందమైన మహాద్భుత మందిరాలలో, కథలలో చెప్పుకునే దేవతా మందిరాలను తలదన్నేటట్లు రూపొందించబడ్డాయి.

అష్ట భార్యలు, శ్రీకృష్ణ - వాసుదేవునికి భార్యలై అష్టైశ్వర్యములను, అనంత సుఖములను, బృందావనమది అందరిదే అయినా, "గోవిందుడు" నా వాడనుకుంటూ ఆ ఇల్లాండ్రు - ఎనిమిదిమంది, అమితానందమూర్తులై సుఖ-సంతోషాల తేలియాడుతున్నారు.

అందరికి ఆ ప్రభువు సంతానాన్ని ప్రసాదించాడు. ప్రతి ఒక్కరికి తన ప్రేమను పంచి పెడుతున్నాడు. రాగద్వేషాలు, అసూయా క్రోధాలకు తావు లేకుండా, వాసుదేవుడు ప్రసాదించే ప్రేమలో, ఆయన రాణులే కాదు, ద్వారకాపురి ప్రజలు ధనధాన్య విశేష సంపత్తిలు పొంగిపొరలుతున్నారు. కేవలం ఆ వైకుంఠం, అందులోని నిత్యానంద, బ్రహ్మానంద, చిదానందాలు, ఈ ద్వారకావాసులకు, శ్రీకృష్ణ ప్రభువు ప్రసాదించాడు.

కాలమిలాగ వుంటూండగా, అష్టరాణులలోని అహంకార, స్వాతిశయ మూర్తయిన సత్యభామ సర్వదా తన ప్రత్యేకతను ప్రకటించుకోవాలని సపత్నులందరు తననాశ్రయించాలన్నది ఆమె వుద్దేశం. అందుకు తగ్గట్లు అపార ధనవంతురాలు, గజ, తురగ, రథ సంపత్తి విశేషంగా కల్గిన సత్యభామ కృష్ణుని తన కొంగును కొట్టుకోవాలని తపించేది.

పరమాత్మ పరమ ప్రసన్నుడు. భక్త పరాధీనుడు భక్త జనహితైభిలాషి కూడా! ఎవరిదీ తన వద్ద వుంచుకోడు. ఎవరిది వారికి, అణా పైసల్తో... వడ్డితో సహా తిరిగే ఇచ్చే మనస్తత్వం కలవాడు. అది భక్తులైన ఒక్కటే, భార్యలైనా ఒక్కటే. ఆ నటన సూత్రధారి. తన వారలైనా, కానివారలైనా, కరుణించే విధానాన్ని గమనిద్దాం.

# పారిజాతం

**ఒ**కనాడు కృష్ణుడు, రుక్మిణీదేవి మందిరంలో వున్న సమయంలో, దేవర్షి నారదుడు, నిత్య హరినామప్రియుడు, వారి మందిరానికి విచ్చేసాడు. వచ్చిన మహర్షిని ఆ దంపతులు అర్ఘ్యపాద్యాదుల పూజించారు. మహాత్ముల్ని వూరక దర్శించ రాకూడదనే సిద్ధాంతానికి నిదర్శనంగా, నారదమౌని, దేవపారిజాతాన్ని తీసిచ్చాడు. నమస్కారం చేసాడు.

కృష్ణుడు దానిని ప్రక్కనే వున్న రుక్మిణి కిచ్చాడు. "మాధవా! ఇది అపురూపము. దేవతా పుష్పము. ఎప్పుడు వాడదు. అపురూప సువాసనలిలాగే విరజిమ్ముతుంది." అని దాని గొప్పతనాన్ని ప్రశంసించి, ప్రశంసాపూర్వకంగా చెప్పాడు. ఈ కథన లీల వాసుదేవునికి అందనది కాదు. ఈ పేరుతో కొందరి గర్వాహంకారాలను అణచిపెట్టడానికి, లీలామాత్రంగా సల్పే క్రియగా నారదుని మనసునుబట్టి కృష్ణుడు గ్రహించాడు. ధర్మరక్షకుడు కదా! ధర్మ పరిరక్షణ తన ధర్మం, నైజమని తలిచాడు.

నారదుని రాక, పారిజాత పుష్ప ప్రసాదం, రుక్మిణి కివ్వడం, నారదుని పుష్ప ప్రశంస, మొత్తానికి సత్యభామకందింది. కృష్ణుని తన కొంగులో కట్టుకోగల అనంత సౌభాగ్యరాశివి, అగ్రగామి నవుతావంటూ, ఆ పువ్వును నారదుడివ్వడం, ఈయన రుక్మిణికివ్వడం ఏ మాత్రం నచ్చని సత్యభామకు అశనిపాతమయింది. అలుక పూనింది.

అయినా, తనను విడిచి, ఒక్కొక్కరి వ్యక్తిత్వాన్ని బేరీజు వేసుకుంటుంది. తనకన్న ఏ విధమైన అధిక్యత వారికుందో తేల్చుకుంటుంది. పెద్దావిడ రుక్మిణి రాచబిడ్డేకాని, కోరి ఈ గోవిందుని పెండ్లి చేసుకుని రాచరికానికి దూరమయింది. చాలామంది పిల్లలకు తల్లి, ఈమెకో ఇద్దరు కోడళ్ళు. ఇంతకంటే... చెప్పుకోదగిన ఘనత ఆమె వద్ద ఏముంది ? రెండోది - జాంబవతి, అడవిపిల్ల. ఇక్కడికొచ్చి నాగరికత నేర్చుకుంది. వెనుకముందు కృష్ణుడు ఆతని సఖులే తప్ప మరెవ్వరు లేరు. మరేమీ లేదు.

కాళింది - సూర్యపుత్రిక అయోనిజ. అదే ఓ ప్రత్యేకార్హత తప్ప, అయిన వాళ్ళెవరున్నారు ? నీళ్లు, నిప్పులు తప్ప.... అదేమంటే సూర్యుడు, పరుగెత్తే

యమునా జలాలు. అడవిపువ్వు వంటి అందాలభామ. కాకపోతే ఎప్పుడో చెప్పిన ఆదేశంతో, తపస్సు చేసి, ఇదిగో - ఈయనను.. అదే మా ఆయనను... "గో"పాల-కృష్ణుని, "గో" - గోపీ" ప్రియుని వరించి, వివాహం చేసుకుంది.

ఇక - మిగిలిన నల్గురు - మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణలు... పేరుకు రాజకుమార్తెలే కానీ, చెప్పుకోదగ్గ ఘనవంశీయులుకారు. మీసాలు త్రిప్పుకోవ డానికి మాత్రం పనికి వస్తారు. ఇందరిలో నాకున్న అర్హత... ఎవరికి వుంది ? సంపద - భోగభాగ్యాలు ఎవరికి వున్నాయి ?! ఆ.... అన్నీ నాకే వున్నాయి. నన్ను మించి... పూర్తిగా కృష్ణుని దయతో స్వాభిమానము, స్వాతిశయము బాగా తలకెక్కించుకుంది.

పురుగు పుట్టకూడదు. అది తొలిచి, దొలిచేస్తూంది. అలాగే దురాలోచనలు రాకూడదు. వస్తే అవి దూరమయ్యే వరకు, ఆ వచ్చిన వారికి, వారితోపాటు వారి ప్రక్కననున్న వారికి ప్రాణాంతకమే. కాబట్టి..... అని నిర్ణయానికొచ్చింది. తన ఆధిక్యతను నిలుపుకోవాలనే తలంపు బలీయమవసాగింది. అలక పూనింది. అలక గృహాన్ని ప్రవేశించింది.

"వస్తానని" నారదుడు వెళ్ళాడు. వాసుదేవుడు సత్యా భవంతికి, తరలి వెళ్ళాడు. జరగవలసిన అగ్నికార్యము ప్రారంభమయి వుంటుంది. "కోప"మనే ఆజ్యధారలను అధికంగా పోసీ, పూర్ణాహుతికి గూడ తయారయి వుంటుందని, ఇప్పుడా ఫలితం అది ఏమైనా - కర్తగా అందుకోవాల్సి వస్తుందని అనుకుంటూనే బయలుదేరాడు.

ఎక్కడ చడి - చప్పుడు లేదు. తన వూళ్ళో, తన భవంతులలో, తన పరిచారకులలో పలుకరించేవారు లేరు. ప్రసన్న హృదయంతో తన ఆధిక్యతను గుర్తించేవారు లేరు. మొత్తానికి కథ మొదలయిందనుకున్నాడు.

అలుక గృహం తలుపులు తీసాడు. సత్యభామ వేడినిట్టూర్పులా గృహంలో భుజంగ బుసలు వలె వినిపిస్తున్నాయి. మెల్లిగా "సత్యా!" అన్నాడు. వులుకు పలుకు లేదు. ఏమిటి నువ్విక్కడ పడుకున్నావా ? గాలి వెలుతురు లేని, దిక్కుమాలిన గది నీకెందుకు నచ్చింది ? ఎవర్నడిగినా, అదేం చిత్రమో, అన్నంపెట్టే వాడి చెయ్యికరచినట్లు, నా మాటకు ఒక్కరు సమాధానం చెప్పరు. వాళ్ళు అలిగారా ?

అవును. అసలు కోపమెందుకు వస్తుందంటావు ? కారణం కోసం కాదు. కార్యభంగం కాకుండా తెలుసుకుందామని, ఏ మాత్రం వేళాకోళం, వెక్కిరింపులు

కనబడకుండా అడుగుతున్నాడు. ఇంకో సమయంలో అయితే విరగబడి నవ్వే సత్యభామ, ఇప్పుడు నవ్వకూడదనుకుందేమో! పళ్ళు బిగించి మరీ పడుకుంది.

మన శృంగారానికి అడ్డమనా, అలాగ నగలన్నీ క్రింద పడేసావు. సౌభాగ్యవతి సౌశీల్య చిహ్నాలను, వద్దంటే భద్రంగా దాచుకోవాలని, సిరిసంపదల్ని ప్రసాదించే, ఆ ఆదిలక్ష్మినిలాగ నేల వేయవచ్చునా ? ఆ తల్లికి కోపం వస్తే - అధిక ప్రేమ ఎక్కువయి, నీ తండ్రి ఎలాగ, తన జీవితాన్ని కష్టబెట్టుకుని, అపాయాలపాలు చేసుకున్నాడో ఆ విధంగా మనం కూడా కష్టాల్ని కోరి తెచ్చుకోవలసి వస్తుంది. అనునయిస్తున్నాడు. దగ్గరవ ప్రయత్నిస్తున్నాడు. ఆమె వినడం లేదు సరికదా, ఒక్క విదిలింపు విదిలించింది.

అయినా కష్ణుడు, సత్యభామ ఎడ శాంతమూర్తి.. కోపమెప్పుడు తెచ్చుకోడు. తాను మరింత శాంతుడౌతూ "సత్యా! విషయం చెప్పకుండా నువ్వు బాధపడితే, అది నేను భరించగలనా ?'' అంటాడు, వూరడిస్తాడు.

"ఈ మాయమాటలు, కల్లబొల్లి కబుర్లు అనవసరం. మీరు నాకు ద్రోహం చేసారు.'' అనగానే "నిన్ను పెళ్ళి చేసుకుని నీకు ద్రోహం చేసాను. అయినా ఆ విషయం ముందే చెప్పాను ఆలోచించుకోమని! అయినా నీవు తొందరపడ్డావు ?

"అందుకనే సపత్నులందు చులకనయి....!" ముక్కు చీదుకుని కళ్ళు తుడుచు కుంటుంటే కృష్ణుడు "చాలా తొందరపడుతున్నావు ? ఎవరెవరో, వారి వారి అర్హతలు, ఈ కృష్ణునికి తెలుసు!'' అన్నాడు. "అందుకే కాబోలు. ఆ పారిజాతాన్ని రుక్మిణికి ఇచ్చి వట్టి చేతులతో విందు చేయవచ్చారు. "విందు కాదు సత్యా! కనువిందు...!''

ఈ మాటలే వద్దన్నాను. "అభినయించాల్సిన అవసరం లేకుండా కోపం పెల్లుబుకుతుంది. "సత్యా! అందరు గూర్చి తెలిసే, అందరికోసం ఆరాటపడుతూ, ఈ రకంగా వున్నాను. సరే. రుక్మిణికి ఒక పూవే దక్కింది. నీకు పారిజాత వృక్షమే లభిస్తుంది కాస్త ఓపికపట్టు'' అన్నాడు.

దాంతో సత్య శాంతించింది. సంబరపడింది. ఆ మధుర ఘడియల కోసం ఎదురుచూస్తుంది. ఇది జరిగిన కొన్నాళ్ళకు రుక్మిణీదేవి పుట్టినరోజు వచ్చింది. అందరికి అక్కడ విందుభోజనాలు ఏర్పాటు చేయబడ్డాయి. పెద్దవాళ్ళు దేవకి-వసుదేవులు, రోహిణి-బలరాములు, అక్రూర, కృతవర్మాది యాదవ ప్రముఖులను

వచ్చి తననాశీర్వదించమని రుక్మిణి అభ్యర్థించింది. సపత్నులకు తెలియబరచింది. సత్యభామను ప్రత్యేకంగా పిలిచింది.

కృష్ణుడు భర్తగా, ఆ వచ్చినవారిని, గౌరవించవలసి వుంటుంది. అందరు వచ్చారు. సత్యభామే వెనుకడుగు వేస్తూంది. మామూలుగా అయితే సత్యభామ వచ్చేది. ఈ పారిజాత పుష్పం, ప్రస్తుతమొక సమస్యయి కూర్చోవడంతో, భీష్మక రాజపుత్రి, శ్రీకృష్ణుని పెద్దరాణి పుట్టినరోజుకు మూడోభార్య మోకాలు అడ్డడం ప్రారంభించింది.

ఇది ప్రతి ఒక్కరికి బాధకన్న, కోప కారణమయింది. ఇంగితజ్ఞానంలేని ఇటువంటి వాళ్ళవల్లనే భర్త పరువు, వంశ ప్రతిష్ఠలు మంటగలిసిపోతాయి. ఏం చెయ్యాలి ? వెళ్ళాలా ? వద్దా ?? ఈ సమస్యలో వుండగా, సత్య ఆంతరంగిక దాసి, "అమ్మా! ఈ రోజు మీ మెట్టిన దినం. రుక్మిణీదేవి వలెనే తమరు పండుగ చేసుకోవాలి కదా! అందర్ని పిలవాలి, ఆదరించాలి. మీ తాహతుకు తగ్గట్లు విలువైన బహుమతుల నివ్వాలి. ఇవన్నీ మరచిపోయారా ?

"అవునే, ఏవిటో, ఆ పారిజాత పుష్పం గొడవలో పడి అన్నీ మరచిపోయాను. అందుకే నీవంటి ఆంతరంగిక దాసీలుండాలనేది. భలే సమయానికి జ్ఞాపకం చేసావు. వెళ్ళు. వెళ్ళి నా ప్రత్యేక పిలుపుగా అందర్ని ఆహ్వానించు. అందరికి విలువైన బహుమతులున్నాయని కూడా చెప్పు." అని పంపింది. ఇక్కడ వున్న కృష్ణుని "నాధా!" అంటూ తన మెట్టిన దినం పేరుతో కట్టిపడేసింది.

అందరు వచ్చారు. పెద్దన్న బలరాముడు. "మా కృష్ణుడు..." అని అడుగుతున్నాడు. మీ కృష్ణుడు, మా సత్యభామ మాత్రం రాలేదని చెప్పి, పరువు నిలుపమని ప్రార్థించడానికి రుక్మిణి, జాంబవతి, సత్యభామ మందిరానికి వెళ్ళారు. వాళ్ళను చూస్తూనే "వచ్చావా, అక్కా! రా! నీ కోసమే ఎదురుచూస్తున్నా, ఇవ్వాళ నా మెట్టిన దినమని విందు ఏర్పాటు చేస్తున్నాను. అందరు రావాలి. నీతో చెప్పితే, మన సపత్నులందరితో చెప్పినట్లే. నువ్వందరికి నాయకురాలివి కదా!

"అవునమ్మా! నవ్వే వారికందరిరి నాయకురాలిని. నిన్న వచ్చి పిలిచాను. నా పుట్టిన దినమని కోరాను. ఈనాడు నా మెట్టినదినమంటున్నావు ?" కొంచెం

బాధ పడింది. పిలువడానికి వచ్చిన నన్ను, అందరికి నాయకురాలివి కదా, అంటున్నావు'' అంది.

"అవునక్కా!'' సత్య చెప్పింది నిజమే, అందరికి నాయకురాలివి కాబట్టి సత్యను, స్వామిని, మాట్లాడకుండా రమ్మనమని, మనవెనుక తీసుకు పోదాం!'' అంది.

"జాంబవతీ! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా ? ఇది అడవి కాదు. వున్నది ఎలుగులు కాదు. ఇది నాగరిక సమాజం. అందరికన్న ఆస్తి అంతస్థుల అధికురాలయిన సత్యతో మాట్లాడుతున్నానని గుర్తుంచుకుంటే చాలా మంచిది.

"అవునవును. నాగరికత పేరుతో, పెద్దా-చిన్నా గౌరవం, భయభక్తులు లేకుండా మాట్లాడడానికి, నీకున్న ధన మత్తు, అహంకారం, నాకు లేవు. అందుకనే వినయంగా చిన్నగా నీ ఇంటికి, మర్యాద తెలిసిన వారము కాబట్టే'' నిలుపుకోమని చెప్పడానికి వచ్చాము!

"జాంబవతీ... వద్దమ్మా! మన ప్రభువు చెంత మన సపత్నిని అధిక్షేపించి, ప్రపంచానికి, మనకు లేని భేదభావాలను ప్రచారం చెయ్యవచ్చునా ? తప్పుకదూ!''

"క్షమించు...!'' అక్కా, తన తొందరపాటును జాంబవతి మన్నించమని అడిగింది.

"సత్యా!'' అంది సానుకూల ప్రేమ వచనాలతో రుక్మిణి.

"చెప్పాను, కదా! అయినా... నీ చతురిత, నాయకత్వం నా వద్ద కూడా ప్రదర్శించావు'' ఎత్తిపొడుపు.

ఆ దెప్పి పొడుపులు వినలేని జాంబవతి, రుక్మిణి బదులు సమాధానమివ్వ బోయింది. అంతకుముందే పెద్దదానిగా ఆమె తగదంది. ఇప్పుడు కళ్ళతో చూసింది. దాంతో జాంబవతి మౌనం వహించింది. అప్పుడు కృష్ణుడు - "అక్కడ పెద్దలందరు. కాదని వెళ్ళకపోతే, ఆగ్రహిస్తారు. బయలుదేరన్నట్లు చూసాడు. "ఆ కోపగించేవారిక్కడా వున్నారు. అది గ్రహిస్తే అందరికి మేలు...!'' స్వాతిశయ ధోరణిలో కటువుగా పల్కింది సత్యభామ.

"సత్యా! పరిస్థితినర్థం చేసుకో. నా తల్లిదండ్రులు, అన్న వదినలు, పెదతండ్రులు, అక్కడ వుంటే, ఇంటి యజమానిగా నీ వద్ద వుండటం, నేను

వెడితే మా ఆవిడకు కోపం వస్తుందని భయపడటం లోకవిరుద్ధం. సమయ పరిజ్ఞానంతో తెలివిగా ప్రవర్తించాలి తప్ప.... అంటూ కృష్ణుడు, ఇరువురు పత్నులతో రుక్మిణీ మందిరానికి వెళ్ళిపోతుంటే - తానంటే కృష్ణునికి ఏమాత్రం అభిమానం లేదని తేలిపోయిందని వాపోయింది.

ఇక ఇక్కడనుండి అనవసరాలోచనలు. అక్కర్లేని అనుమానాలు. సందేహాలు. నా దగ్గర వుంటే నన్ను కాదనలేని ఈ కృష్ణుడు, రుక్మిణి.... అంటే, ఎందుకంత లొంగిపోతాడు. ఎలాగాలోచించిన సత్యంకర్థం కాలేదు. ఈమెను పరమభాగవతోత్తమురాలుగా, మిగిలిన సపత్నులు, భట్రాజులవలె భజన చేస్తారు. ఈమె చెప్పింది వేదమని భావిస్తారు. నాకు మాత్రం వేదన మిగిలిస్తున్నారు.

అసలీ రుక్మిణిలో ఏముంది ? ఎందుకామంటే, ఈ గోవిందుడు గువ్వ-పిట్టయిపోతాడు. ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. లేచి వచ్చిన ఆమె, పరువు ప్రతిష్టలను మంటగలిపిన ఆమె, అన్నగారికి అవమానము కల్గించినామె, ప్రేమంటూ వచ్చిందే తప్ప - ఆ వచ్చి ఏంచేసింది. అందరికి తలలో నాలుకయింది. ఒకరికైతే మందు పెడుతుంది. అందరికి... అసాధ్యం... ఏమో... ఏమీ అర్థం కావడం లేదు.

ఈ ఆలోచనలతో, పొందిన అవమానంతో కళ్ళనీళ్ళ పర్యంతమయింది. గుండె బరువెక్కింది. ఈ కృష్ణుని నా కనుసన్నలలో వుంచుకోవాలంటే ఏం చెయ్యాలి ? అదే ప్రస్తుతానికి సత్య సమస్య. సమాధానం కోసం, వెదుకులాట. అగ్గిగుగ్గిలమౌతుంది. ఆ సమయంలో -

"నారాయణ!" అంటూ పిలిచినట్లు వచ్చాడు, నారద మహర్షి. "వచ్చారా, మహర్షీ! మీరే తక్కువ........ దయ చేయండి" వెటకారం, ఎత్తి పొడుపులతో స్వాగతం. "ఏమయిందమ్మా!" నారదుని సాగతీత.

"ఏమయిందా ? నా కొంప కూలింది. కాపురం బండబారింది. ఇదంతా తమ ప్రభావమేగా అన్నది మహర్షీ! సత్యను శాసించాలనా ? లేక శాశ్వతంగా తొలగించాలనా ? చెప్పండి, ఏమిటో తమరి వుద్దేశం...!" నిప్పులు త్రొక్కు తున్నట్లుంది.

"సత్యా! చాలా పొరబడుతున్నావు. నా చేష్టలన్ని లోకకారణ హేతువులే తప్ప, కోప కారణాలు, కొంప ముంచడాలు కావు. ఏదో... ఆది దంపతులు కదా!" అని చూడటానికి వెళ్ళాను. వాళ్ళ భక్తికి పొంగిపోయాను.

"మీ వద్దనున్న పారిజాత పుష్పమిచ్చారు. ఆమె ఆధిక్యతను పెంచారు. నా కాపురం కూల్చారు. అసలే కృష్ణుడు... ఆరాటపరుడు. ఆడది కనబడితే చాలు, తన భార్యను చేసేసుకుంటాడు. "అమ్మో! కృష్ణుడు, నా భర్త" అనుకుంటుందా వెర్రిది. ఆమె "హమ్మయ్య!" అనుకునేలోగా మరొక్కత్తె. ఈ నాటకానికి తెరలేదు. మా బ్రతుక్కు సరదా లేదు.

అటువంటివానికి, దేవపారిజాతమని ఇచ్చి వున్నారుగా! మీ అభిమానవతి, ప్రియ.... రకరకాల వ్యాఖ్యానాలూ ఆ పుష్పం రుక్మిణి స్వంతం. ఇంతమంది వున్నాం కదా! ఆ తెచ్చేదేదో...!"

"అది కాదమ్మా! ఆది దంపతులు కదా!" అని... "మరి మేమెవరము, సోది దంపతులమా ? మహర్షీ! తాటిచెట్టు ఎందుకెక్కావంటే... అని మొదలు పెట్టకండి. మొదటికి రాకండి."

"ఇక లాభం లేదు." అని తన నటనా సార్వభౌమత్వాన్ని ప్రకటించ సిద్ధమయ్యారు, నారదమునీంద్రుడు. కాస్త బాధపడుతున్నట్లు ముఖం పెట్టాడు. అంతా గమనిస్తున్న సత్య క్రొత్త నాటకానికి తెర తీస్తున్నాడనుకుంది.

"అదికాదు సత్యా! ఇంత ఘోరం జరుగుతుందని అల్లరి పాలవుతావని అనుకోలేదు. అయినా వాసుదేవుడు పారిజాత వృక్షాన్నే నీ పెరటిలో వుంచుతా నన్నాడు, కదా!"

"ఆ... ఆ... అంటాడు. ఆడది కనుపిస్తే దాని మెరమెచ్చుల కోసం ఇలాగే క్రొత్త క్రొత్త కథలు చెబుతాడు. వాళ్ళను బుట్టలో వేసుకుంటాడు. పిచ్చివాళ్ళు అది బూరెలబుట్టనుకుంటారు. తీరా చూస్తే.... అది... మిరపకాయల తట్ట...!"

"అమ్మో! ఈ సత్య అసాధ్యురాలే. ఎలాగ వేగుతున్నాడో ఆ ప్రభువు...!" అనుకున్నాడు. "అదిసరే....!" ఏదో చెప్పబోతూంటే...

"ఏది సరే. ముందు నాకిది చెప్పండి. ఈయనను నా వెంట త్రిప్పుకోవా లంటే.... పూజలో, వ్రతాలో... మరొకటో చెప్పి కనీసం.... ఆ పుణ్యమైనా కట్టుకోండి. కూలే కాపురం కూలకుండా వుంటుందంది.

అదే కావలసిన నారదుడు "వచ్చావా, నా దారిలోకి.... అనుకున్నాడు.

"అమ్మా! సత్యాదేవి, వ్రతాలు, మంత్రవ్యవహారాలు ఎన్నో వున్నాయి. నాకు తెలిసినంతవరకు చెబుతాను. చేసుకోవడం నీ బాధ్యత. చేసుకోవడం సరిగ్గా చాతకాక "అదో నారదుడు... అంటే... మాత్రం వ్యవహారం ముదురుతుంది. ప్రమాదంలో పడతావు'' హెచ్చరించాడు.

"పుణ్యకవ్రతమని ఒకటుంది. చెయ్యడానికి, చూడటానికి.... అదే చాలా తేలిక. ఎటొచ్చీ ఉద్యాపనమే కాస్త ఇబ్బందికరమైనది.''

"ఫర్వాలేదు మహర్షి! నా భర్త నాకు అనుకూలుడవడం కోసం ఏదైనా చేస్తాను. నన్ను నమ్మండి. కరుణించి ఆ వ్రతం విధానం తెలిపి, దగ్గరుండి జరిపి, నన్ను ఆశీర్వదించండి. దరిచేర్చండి'' ప్రాధేయపడుతుంది.

"తప్పక, తల్లీ! నా విధి నేను నిర్వర్తిస్తాను. ఎటొచ్చీ నువు ఒకటికి రెండుసార్లు ఆలోచించి, మరీ నిర్ణయం తీసుకో''మంటాడు.

"మీరెందుకు భయపడతారు, మహర్షీ! ముందా వ్రత విధానం చెప్పండి!'' కృష్ణుడు తన వెంట తిరుగుతున్నట్లు తలచి, అడుగుతుంది.

''ఒక ఏకాదశినాడు, లక్ష్మీనారాయణులను, షోడశోపచార విధాన పూజించాలి. పూజానంతరం, సద్బ్రాహ్మణునకు దానమివ్వాలి.

"ఓస్. ఇంతేనా.... ?! దీనికా కంగారు ? ఇంతకీ ఏం దానమివ్వాలి ?'' అసక్తిగా అడుగుతుంది.

"భర్తృ దానమమ్మా!.... భర్తృదానము!''

"భర్తృ దానమా ? అదే అయితే... ఇక ఈ పూజలెందుకు ?'' నిరుత్సాహం, అమాయకత్వం జతపోసుకున్నట్లు అడిగింది.

"పిచ్చితల్లీ! చెబుతున్నాను విను. ఆ తర్వాత భర్తకు సరిపడా కాంచనాదుల నొసగి, నీ భర్తను నీవు తీసుకోవచ్చును. ఇది వ్రతకథ. మరి నీవు ఇందులో పాల్గొనగలవా ?

"ఎందుకు మహర్షి, అంత సంశయం. ఈ వ్రతం నేను తప్పక చెయ్యగలను.'' "చెయ్యలేవని కాదు. నీ భర్తను తూచ, సరిపడ కాంచనాదులు నీ వద్ద వున్నాయా ? ఆ తర్వాత, నారదుడు... మోసమనకూడదన, "మహర్షి!

అపార ధనరాశులిక్కడ నా చెంత వుండగా నా ప్రభువును తూచుట కెందుకంత అనుమానమంది. "ఏమోనమ్మా నీ ధైర్యం నీది, నా అనుమానం నాది" అన్నాడు.

సత్యభామ పకపక నవ్వేసింది. "మీరు వ్రతం చేయించడానికి సిద్ధంగా వుండండి" అంది. మిగిలిన పని నాదంది. అయినా - నారదుడు తటాపటాయిస్తూ-

"మళ్ళీ చెబుతున్నాను. ధనమైనా, ధనేతరమైనా సరే. నీవు తూచి, నీ భర్తను తిరిగి పొందగలగాలి. కాదని, నువ్వు ఓడిపోయి, ఇతరులు కనుక నీ నాధుని కనుక గెలుచుకుంటే... "సత్యాపతి" కాస్తా, ఆ గెల్చుకున్న వాళ్ళ పతయి పోతాడు. ఆయన వెనుక నువ్వుపడి, ఆయన ప్రేమను అర్థించుకోవాలి. ఆలోచించి, మరీ నిర్ణయం తీసుకుంటే బాగుంటుందన్నది, నా సలహా!" అంటాడు.

మొండి ధైర్యంతో, తను తూచగలనని తలుస్తూ - "మహర్షీ! భయపడకండి. మన ప్రభువు మనతోనే వుంటాడంది "తథాస్తు" అన్నాడు నారదుడు. మొత్తానికి కథ రక్తి కట్టింది.

సత్యభామ - తన మొండి, పెంకితనంతో, పరమ రహస్యమంటూ కృష్ణుని ఒప్పించింది. అందర్నీ మెప్పించు రీతిలో కార్యక్రమం జరగాలని, తగు ఏర్పాట్లు చేసుకుంది. తెల్లవారే వ్రతం. కృష్ణుడు, నారదుడు... ఆలోచించుకోమంటారు. ఫర్వాలేదని, వారికే ధైర్యం చెబుతుందామె.

పూజ పూర్తయింది. దానం దగ్గరకు వచ్చేసరికి... కృష్ణుడు "నన్నిచ్చేస్తావా, సత్యా! ఇదెక్కడ విడ్డూరము ? ఇదేం దానమని" మారాం మొదలుపెడతాడు.

"వుండండి. స్వామీ! ఈ పూజ కాస్తా పూర్తయితే, ఆ తర్వాత నా బంగారంతో మిమ్ము కొనుక్కుంటాను. ఆ తర్వాత మనలనెవరు విడదీయలేరు. కాస్సేపు వూరుకోండి!" చంటిపిల్లవాడిని ఓదారుస్తున్నట్లు, ఈ లోకనాథుని ఓదారుస్తుంది. కృష్ణుడు, ఆతనితోపాటు నారదుడు నవ్వుకున్నారు.

"అవును సత్యా, అసలీ వ్రతం ఎందుకు చెయ్యదలచుకున్నావు. ప్రస్తుతం నీకొచ్చిన కష్టమేముంది ? ఈ వ్రతం చెయ్యకపోతే వచ్చే నష్టం ?" కృష్ణుడు బుంగమూతి పెట్టి అడుగుతున్నాడు. నీకు పుట్టి మునిగే రోజులు దగ్గర్లోనే వున్నాయన్నట్లు చూస్తూ!

"స్వామి! ఇంతవరకు వచ్చి ఏమిటిలా మారాము చెయ్యడం. అయినా మిమ్మని ఏం లాభం ? ఆ యశోదమ్మననాలి. చిన్నప్పటినుంచే, గొల్లవాడిగా పెరిగి, గొల్లల ఇండ్ల పాలు, పెరుగు, వెన్నలను దొంగిలించి, అమ్మ కొడుతుందేమో నని, బుంగమూతి పెట్టి, మారాము చేసిన కథలింకా మరచిపోలేదనుకుంటాను. నా దగ్గరా, ఆ నయగారాలు పోతున్నారు. ఒక్కటివ్వడానికి, ఆ బుంగమూతి చూసి పరవశించి పోవడానికి, నేనా పిచ్చి యశోదనుకాను.

"అవునవును. ఆ సంగతి తెలుస్తూనే వుంది. అమ్మ, ప్రేమ తెలిస్తే - ఇలాగ మాట్లాడవు. ఆ కొరకరాని కొయ్య, అయ్య చేతిలో పెరిగిన పెంకితనం, మంకుతనం, ఎలాగ మరువగలం ? అనగా, "స్వామి... మీ చరిత్ర లోకవిదితం. అయినా నన్ను... నన్ను.." హేళన చేస్తున్నారని సత్య బాధపడుతుంది.

"నా చరిత్ర లోకవిదితము. నీ చరిత్ర శోక సముద్రం. ఏం చేస్తాం. కానీ. బుద్ధిః కర్మానుసారిణీ... అన్నారు. ఆ తర్వాత నన్ననవద్దు. మహర్షిని తిట్టవద్దు" అన్నాడు. సత్య బుద్ధిమంతుడివని భర్తను మెచ్చుకుంది.

"మహర్షీ! మీకంటే సద్బ్రాహ్మణుడెక్కడ దొరకుతాడు. నిత్య నారాయణ స్మరులైన హరిభక్తులు, ఆజన్మ బ్రహ్మచారులు" స్వీకరించండని భర్తను దానం చేసింది.

"కృష్ణా! భక్తజన దాసానుదాసుడనన్నావు కదా! ఇక నాకు దాసుడవు" అన్నాడు "సత్యా! ఈతని ఇంకా ఏడుగురు పెండ్లాడిన, మొగుడిని, ఈ యాదవ ప్రముఖులు, ప్రజల పెన్నిధిని, నేను మోయలేను కానీ, "తల్లీ! ఆ తులాభారం ప్రారంభించ"మన్నాడు.

"అలాగే! స్వామి" అంది. కృష్ణుని ఒక ప్రక్క కూర్చోపెట్టింది. తన వద్దనున్న బంగారు కణికల నుంచింది. ఒకటికి రెండు కాదు. మొత్తం ఇంట్లోని బంగారం, తనవంటి మీద బంగారం రాశులు రాశులుగా క్రుమ్మరించింది. అయినా త్రాసు అంగుళం కూడా కదలలేదు. ఎక్కడెక్కడనున్న బంగారం, వెదకి, వెదకి మరీ అర్పించింది. అయినా కదలలేదు." అప్పుడు బిక్కమొగం వేసింది "మహర్షీ!" అంది. లోలోపల నవ్వుకుంటూ ప్రయత్నించమ్మా... అన్నాడు. అంతా అయోమయం. ఇక తన దగ్గర తూచడానికేమీ లేదు. చూడవచ్చిన వాళ్ళందరి ఆభరణాలు త్రాసులో వుంచారు. కృష్ణుడు తలెత్తడం లేదు. త్రాసు కదలడంలేదు.

"మహర్షి! ధనము, ధనేతరములన్నారు...!" "అన్నాను. మరి.... నీ ఇష్టం. ఏదైనా సరే నీ చెంతనున్నది వుంచి, తూచు." ఇల్లు తప్ప - అది కృష్ణుని సొత్తు. అన్నీ వేసింది. కృష్ణుని తూచలేకపోయింది. "అయిందా, ముందే చెప్పాను. వినకుండా, మీకెందుకు మహర్షీ! అని నవ్వావు. నవ్వకు నవ్వుల పాలవుతావన్నాను. అవునా... ?" ప్రశ్నిస్తున్నాడు.

"అడిగారు... అదే చెప్పారు... అయినా కృష్ణుడింత బరువుంటాడని, నా సంపద ఈయనకో పంటి క్రిందకు రాదని, అర్థం చేసుకోలేకపోయాను.

"అదేనమ్మా కృష్ణలీల. తాను వద్దన్నాడు. విన్నావు కాదు. త్రిభువనాలనే కాదు, ఈ రేడు పధ్నాలుగు లోకాల్ని తన బొజ్జలో కల్గిన ఆ భువనైక చక్రవర్తిని, నువ్వు తూచగలవా ? అర్థరహితం కాదా నీ ఆలోచన...!" ఆమె వెర్రితనానికి నవ్వుతూ, వెక్కిరింతగా మాట్లాడాడు.

"మహర్షీ! మీరేనా ?"

"అవును. నేనే. ఎన్ని రకాలుగా చెప్పినా వినని నీ వంకర శంకల బుద్ధికిదొక సంకెల. లేవయ్యా కృష్ణా, లే. నేను నిన్నెక్కడ భరిస్తాను ? ఎవరికైనా అమ్మి నా బరువు తీర్చుకుంటానన్నాడు. కృష్ణుడు లేచాడు. "స్వామీ!" అంది సత్య. అనవసరం - వృథా ప్రసంగాలు మాని చాతనయితే దక్కించుకో. లేదా, నా బరువు దించుకునే విధం నేను తేల్చుకుంటానన్నాడు.

"విన్నావు కాదు!" కృష్ణుని వెటకారం.

మొత్తానికి - ఈ - కథ సపత్నులందరికి తెల్సింది.

ప్రతి ఒక్కరు ఎంత మూర్ఖంగా ప్రవర్తించావు. ఎనమండుగురి భర్తను, నీ ఒక్కదాని ఆస్తివలె కొంగున కట్టుకోవాలను కోవడమెంత దురాశ. పెండ్లి చేసుకునే ముందు తెలియదా ? నిన్నెవరైన బలవంతం చేసి, మా ప్రభువును అంటగట్టారా ? నువ్వే కదా, కావాలని వెంటబడి, వివాహం చేసుకుని, ఇప్పుడిలాగ దుర్మార్గంగా ప్రవర్తిస్తావా ? ఒక్కొక్కళ్ళు, విరుచుకు పడుతున్నారు. రుక్మిణి మాత్రం మాట్లాడటం లేదు.

"ప్రభూ!" అన్నది, మరుక్షణం మహర్షిని చూసి, కర్తవ్యముపదేశించమని కోరింది.

"ఏముందమ్మా. ధనం కాని, ధనేతరం కానీ అన్నాను. పత్రం, పుష్పం, ఫలం, తోయమని ఆ ప్రభువు భక్తితో ఏమిచ్చినా పుచ్చుకుంటాడు. అందుకు వందరెట్లు ప్రసాదిస్తాడు. ఇందులో ఆధిక్యతకు తావు లేదు. భక్తి వినయాలకే ప్రాధాన్యం. శ్రద్ధా-విశ్వాసాలకు చోటు'' అంటాడు.

అప్పుడు - పట్టమహిషి రుక్మిణీదేవి "ఇప్పుడే వస్తా"నంటూ బయలుదేరింది. విషయం తెలియక, అందరు ఆమె కోసమే ఎదురుచూస్తున్నారు. ఇంతలో వురుకుల పరుగులమీద ఆ తల్లి వచ్చింది. కృష్ణునికి నమస్కరించింది. నారదుని చెంత చేరింది.

"మహర్షి! మీ అనుజ్ఞయితే....!" వినయం తన భూషణంగా అడుగుతుందా తల్లి. "అమ్మా! నిన్నాజ్ఞాపించేవాడినా. మీ ఇష్టం ప్రకారం కానివ్వు!" అన్నాడు.

రుక్మిణి ఏం తెచ్చిందో తెలియదు హడావుడిగా వెళ్ళింది - వెళ్ళినట్లు తిరిగి వచ్చింది. వెనుక ఎవరు లేరు. ఏ వస్తువు లేదు. భారకులు లేరు. అందరు ఆశ్చర్యపోతున్నారు. శ్రీకృష్ణుని, తులసీమాతను తల్చుకుంది. ఒక దళాన్ని త్రాసులో వుంచింది. అప్పటికందరు పెదవి విరిచారు.

విరిచిన పెదవి విచ్చుకోలేదు. అందర్ని ఆశ్చర్యబరుస్తూ ఆ తులసిదళానికి, అంతటి కృష్ణుడు తేలికగా లేచాడు. జయ జయ ధ్వానాలు మిన్ను ముట్టాయి. రుక్మిణమ్మ కళ్ళలో మెరుపు, ఆనందం. సపత్నులు... అక్కా అంటూ అమెను చుట్టుముట్టారు. సత్య... అవమానంతో తలదించుకుంది. అహం నశించింది. అహంకారం తొలగింది. అవమానమని తలచక, తన స్వాతిశయాన్ని ఆమె పాదాల ముందువుంచి, "మనసారా, అక్కా!" అని పిలిచింది. తనను క్షమించమని ప్రార్థించింది.

"నారదుడు - ఆదిదంపతులంటే... నేను కాదా! అని అనుకున్నానే కానీ, పరమ వైష్ణవి, ఆ మహాలక్ష్మివైన నిన్ను అర్థం చేసుకోలేకపోయాను. అన్యాయంగా అహంకరించి తప్పుచేసానని పరిపరి విధాల వేడింది. అప్పుడందరు, కృష్ణుని వద్దకు వచ్చారు. అందర్ని ఒకే దృష్టితో వాసుదేవుడు చూసాడు. సత్యభామ - స్వామి పాదములపై బడి - ఒరిగింది పరాభవమనుకోను. జ్ఞానోదయం. నన్ను కరుణించండంది. సపత్నుల తనను మన్నించమని కోరింది. అప్పుడు - కృష్ణుడు నవ్వుతూ -

"సత్యా! తులలేని సిరిసంపదలకు నిలయము. కాబట్టే, ఆమె తులసిగా విఖ్యాతి చెందింది. ఆదిలక్ష్మికన్న అధికురాలనిపించుకుంది. ఆధిక్యతంలో అహంకారం కాదు. శ్రద్ధా - విశ్వాసాల భక్తి - వినయ విధేయతల బుద్ధి వుండాలి. అప్పుడే ధర్మం నిలబడుతుంది. సత్యా "సత్యం" గెలుస్తుంది.

ఈ సత్యం తెలుపడానికే, అర్థం చేసుకోలేని "సత్యా!" నీకు, ఈ సత్యాన్ని అర్థమయ్యే పద్ధతిలో అందించాం." అని వూరడించాడు.

"అవును ప్రభూ! నా అహంకారం నశించింది. సత్యం బోధపడింది. అందరు ఒకటేనని, గోవిందుడు అందరివాడునని, ప్రతి ఒక్కరు "నా వాడే" అనుకుంటే, ఆ విధంగానే అలరిస్తాడని తెలిసింది. ధన్యురాలనంది.

ఇది కృష్ణలీలలో ఒక భాగం. ఏ క్షణంలో ఎవర్ని ఏ విధంగా కరుణించి, అనుగ్రహిస్తాడో.... అది ఆ ప్రభువుకే తెలియాలి. అప్పుడు, ఆమె ఆధిపత్యానికి గండి కొట్టిన కృష్ణుడు - ఇప్పుడు... ఇదే సత్యకు సాధికార స్వాగతమిప్పిస్తాడు. అందరిలో ఘనతను కలిగిస్తాడు. గమనించండీ కృష్ణలీల! దీనినే "శ్రీకృష్ణ భాగవత" మంటారు.

పఠించి, పరమానందం పొందండి!

# "నరకాసుర" సంహారం

**అ**ప్పుడు శ్రీకృష్ణుడు రుక్మిణీ భవనంలో వున్నాడు. ఆయన చెంత - ఉద్ధవ, సాత్యకి, అక్రూరాదులతో ఈ జగన్నాథుడు, వాసుదేవుడు సంభాషిస్తున్న తరుణంలో - ఉన్నట్టుండి దేదీప్యమైన కాంతులు. ఆ వెలుగు రేఖలలో, అపూర్వ కాంతి. అదొక తేజోరూపమై, ఆకారం దిద్దుకుంటుంది. ఆ వింతను, కృష్ణుడు తప్ప, అందరు చిత్రంగా చూస్తున్నారు. చూస్తూండగా ఆ కాంతి రూపము, చివరకు ఇంద్రుడై కూర్చుంది. వస్తూనే -

"జయము, జయము వాసుదేవా! జగదోద్ధార!" అని ప్రస్తుతిస్తూ, ఇంద్రుడు ఎదుట ప్రత్యక్షమయ్యాడు. వచ్చిన సురరాజును ఆహ్వానించి పలుకరించాడు.

తగు ఆసనం చూపాడు. ఆ దేవతా ప్రభువుకు తగు రీతిన రుక్మిణీ సహితుడై తగు స్వాగత సత్కారాలను జరిపాడు. అక్కడున్న వారినందర్నీ పేరుపేరునా పరిచయం చేసి "చెప్పండి. తమ రాకలోని ఆంతర్య" మడిగాడు.

"వాసుదేవా! నరకుని ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఎంతసేపు దేవతలను అల్లరిపాల్జేయడం తప్ప మరో ధ్యాసలేని ఆతడు, చెప్పుకుందుకు మహనీయుల సంతానం. కాని వీడి ఆగడాలను ఆ తల్లి భరించలేకపోతుంది. ఆనాడు శ్రీహరి వరహావతార మెత్తినప్పుడు, భూదేవి - శ్రీహరిల సంతానం వీడు. వీడికితోడు, వాడి తమ్ముడు మురాసురుడు. ఈ మురాసురునికి ఏడుగురు కుమారులు. ఈ మొత్తం దేవతలనల్లరిపాలు చెయ్యడం, స్త్రీలను చెరపట్టడం, తనకేం బాధలేదని, ఎవ్వరు నిలువరించలేరని విర్రవీగడం. ప్రాగ్జోతిషపురాధినేతగా వాడు సల్పే ఆగడాలు అంతా ఇంతా కావు. పదహారువేలమంది స్త్రీలను చెరపట్టిన నీచుడు. ఇష్టమై వలచి వచ్చినవారిని స్వీకరించడంలో తప్పులేదు. కాని బలవంతంగా...

ఆ వింటున్న వాసుదేవుడు "సరి, సరి...!" అన్నాడు.

"కృష్ణా... అదితిమాత కుండలాలను అపహరించాడు. వరుణుని వెల్ల గొడుగును, అమరాధి స్థానమైన మణిపర్వతమును హరించాడు. అదేమిటంటే... తాను వరాహావతారుని కొడుకునని, తన తండ్రి తనను చంపడనే మొండి ధైర్యంతో పేట్రేగిపోతున్నాడు.

"ధర్మరక్షకుడివి, దుష్టశిక్షకుడివైన నీవు, ఈ నరకుని బారినుండి దేవతలను రక్షించాలి. వారి వారి వైభవాలను పునరుద్ధరించాలి!" ఇంద్రుడైనా, గోవిందునికి విషయం విన్నవించి ప్రార్థిస్తున్నాడు. విషయం విన్న వాసుదేవుడు "వాసవా! నిర్భయంగా వుండండి. తప్పక నరకుని నుండి మీకు రక్షణం లభిస్తుంది. నా కర్తవ్యం నేను నిర్వర్తిస్తా"నని వాగ్దానం చేసాడు.

కృష్ణుని అభయం విన్న ఇంద్రుడు "ఓ దేవదేవా! ప్రాగ్జోతిషపురానికి భూమార్గాన వెళ్ళడం చాలా కష్టం. గరుడుని ప్రార్థించాం. మీరు తలచిన తక్షణం ఆతడు వచ్చి సాయపడగలడు. అలాగే మీ సర్వసేనను మేము ఆకాశమార్గాన, నరకుని రాజధానికి చేరుస్తాము. అదృశ్యంగా మేము మా శక్తులన్నీ నీకు అర్పించుకుంటాము. నీ అధీనంలో వుంటాము. దయవుంచి" మరల ప్రార్థించాడు.

"అవశ్య"మన్నాడు కృష్ణుడు.

"తథాస్తు" అన్నాడు ఇంద్రుడు.

ఈ సంభాషణమునకు సందర్భానికి సాత్యకి విస్తుపోయాడు. అక్రూరాదులు ఆశ్చర్యపోయారు. "మీ అందరికి పని కల్గిందని - సూచనగా హెచ్చరించాడు, ఇంద్రుడదృశ్యుడైనాక" కృష్ణుడు చెప్పాడు. ఎప్పటికప్పుడు క్రొత్తే. మా కృష్ణుడింత గొప్పవాడా ? అందరికి, అందరిలో కలిగే ప్రశ్న.

ఆ తర్వాత కృష్ణుడు మహారాజు ఉగ్రసేనులవారిని దర్శించి, విషయం చెప్పి, అనుమతిని వేడాడు. అందుకు కన్నుల ఆనంద బాష్పాలు రాలుస్తూ "కృష్ణా! ఈ మొత్తం నీ దయా లబ్దం. నువ్విచ్చిన్న గౌరవాన్ని నువ్వే పెంచుతున్నావా!

"మహారాజా! పౌరునిగా, మీ అనుమతి మాకు అవశ్యం, అవసర"మన్నాడు వినయంగా, విశ్వకీర్తిని ప్రసాదించుమని, పెద్దవాడిగా ఆకాంక్షించాడు. బలరామ, ప్రద్యుమ్నులను నగర రక్షణకు వుండమని కోరాడు. సాత్యక, ఉద్ధవాదులు, వీరులను నిర్ణయిస్తున్నారు. రేపు సోమవారం మన ప్రయాణమన్నాడు.

మళ్ళీ చెప్పలేదని గొడవ పెట్టకుండా, విషయం విన్నవించడానికి సత్యా మందిరానికి, ఆమె పతిగా వెళ్ళాడు. విషయం చెప్పబోతుంటే, విన్నాను. నేను సిద్ధం. అయినా, సురరాజుననుకునే ఇంద్రుడు తాను చెయ్యలేని పనికి తమను ఆహ్వానిస్తున్నాడా ? ప్రోత్సాహిస్తున్నాడా ? ఇందులో ఇసుమంతయినా మర్మముందా ? ధర్మమే వుందా ?

తన యధాపూర్వక పద్ధతిలోనే ఆమె అడుగుతుంది. సమాధానంగా, లోకానికి మనం వీరత్వం తెలిసేటట్లు అవకాశం మనకు వచ్చింది. అందుకున్నాడు. ఉదయాన్నే ఇంద్రుడు వచ్చాడు. విషయం చెప్పాడు. అంటూంటే "జరిగింది నేను విన్నానని" ముగించింది. "అవును. ఇంద్రుడు చెయ్యలేని అసాధ్యము మీకు సాధ్యమా ?" సాలోచనగా అడిగింది. "అని.. ఇంద్రుడు చెప్పాడు. నేను తలవూపాను." "ఎలాగ వెడతారు... ?" గరుడుడు వస్తాడు. అతనికి విషయం చెప్పారుట. ఆ విష్ణువాహనుడు తప్పక, కృష్ణునికి సాయపడతానన్నాడుట. కనుక గరుడ సాయంతో నేను నరకుని ప్రాగ్జోతిషపురం సునాయాసంగ చేరగలనన్నాడు.

"అయితే, నేనూ వస్తున్నా"నంది సత్య.

"నువ్వా...!" ఆశ్చర్యం ప్రకటించాడు కృష్ణుడు.

"ఏం. రాకూడదా ? ఇక్కడ ఇంట్లో అలంకారాలు చేసుకుని భర్తను అలరించడానికో అల్లరి చెయ్యడానికో తప్ప, ఆడది... వీరత్వం చూపలేదా ? ఇతరత్రా సిద్ధహస్తురాలని నిరూపించదల్చుకోకూడదా ?

"అని... కాదు. అది యుద్ధభూమి, ఉద్యానవన విహారము, అందంగా, పువ్వులు ముడుచుకోవడం, మూతి బిగింపులు ప్రకటించడం కాదు.

"కాదు, ఆ సంగతి నాకు తెలుసు. సామాన్య యాదవుడినీ, మానవుడిననే, మీ సమరోత్సాం, కాదు... కాదు... ఆ ప్రతాపం కళ్ళారా దర్శించి, ఆనందించి, అందరికి అదే నా సపత్నులకు, కథలు కథలుగా, లీలలుగా, చెప్పే సావకాశం నాకు కల్గనీ - మానవుడు, దేవుడు, రాక్షసుల మధ్య జరిగే సంకుల సమరమెలాగ వుంటుందో తిలకించనివ్వండి...!" విషయం వివరించానంది. కొంగు నడుముకు బిగించింది. బయలుదేరండి...!" తను సిద్ధమయింది.

"సత్యా!........!" వారిస్తున్నట్లు మాట్లాడబోతుంటే - "ఏమిటి సత్యా! ఇందులో అసత్యం లేదు. మనము, బయలుదేరుతున్నాము!" అక్షరం అక్షరం నొక్కి చెబుతుంది. అర్థమవుతుందన్నట్లు ఆ మాటల్ని, మాధవుడు విన్నాడు. ఆమె ఉత్సాహాన్ని గమనించిన కృష్ణుడు, నీ వరుస చూస్తుంటే - "నీవు యుద్ధం చేసేటట్లు కనబడుతున్నావు ?" అన్నాడు.

"ఏం నాథా! చెయ్యకూడదా, యుద్ధం ?! ఆడవాళ్ళు.. వంట యింటికి, పడకటింటికేనా పరి...మితం... అంటూంటే, కృష్ణుడాశ్చర్యపోయి" సరే. నీ ఇష్టం. ధైర్యం చేసుకోమని "ఆమె తన ప్రాణరాణి అన్నట్లు గుండెకు హత్తుకున్నాడు. అదొక అనిర్వచనీయమైన ఆనందం. తెలియని శక్తి ఆమెలో ప్రవహించింది. నరనరాల అద్భుతశక్తి, ఆనందంతో... నేను సిద్ధమని నిల్చుంది. యుద్ధానికి సన్నద్ధమయింది.

"సత్యా!" కృష్ణుడు పిలువగానే, యుద్ధానికి వెడుతున్నాననే సంబరంలో మున్గిపోయిన సత్య, "ఏమిటి ప్రభూ!" అంది.

"ముందుగా అమ్మ దర్శనం చెయ్యి. ఆ తర్వాత వీరనారీమణులు, పెద్దలైన రేవతీ, రుక్మిణిల ఆశీస్సులు పొందు. వారంతా పెద్దమనసు గలవారు. నీ క్షేమాన్ని కాంక్షించేవారు. సోమవారం ఉదయమే మన ప్రయాణం. నీ సామానులకు, పరిచారికలకు సరిపడు రథాలను సిద్ధం చేయించమని, సాత్యకికి కబురు పంపించు."

భర్త సూచనకు "తప్పక మీ ఆజ్ఞ శిరసావహిస్తానంది. భర్త చెప్పినట్లు, పెద్దలందరి ఆశీస్సులు తీసుకుంది. రుక్మిణిని చేరి "అక్కా!" అంది. విజయోస్తు అని ఆ విదర్భ రాకుమారి, దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకుంది. నుదుట ముద్దాడింది. సత్య ఆమె పవిత్ర "శ్రీ" చరణాలకు నమస్కరించింది.

ఆనాడు సోమవారం. ఉదయాన్నే... చిత్రమైన గాలి. ఉక్కిరిబిక్కిరయ్యే వాతావరణం. ఉన్నట్టుండి... అది అనుకుంటున్న వారికి, గరుడుడు వస్తున్నాడని, కృష్ణుడు చెప్పాడు. వస్తూనే, తన స్వామికి వందనమర్పించాడు. గరుడుని కృష్ణుడు ప్రేమగా పలుకరించాడు. స్వామిని చూసిన ఆనందంలో గరుడుడు తన్మయుడౌతుంటే - "గరుడా! బయలుదేరుదామా... ?" అన్నాడు.

శుభస్య శీఘ్రమన్నాడతడు.

తన ఆయుధాలైన శంఖ, చక్ర, గదా, ధనస్సు, అక్షయ తూణీరాలు, చేతిలో కత్తి ధరించి, ప్రయాణుడయ్యాడు. సత్య నారిగా అనుసరించింది. వారిరువురు గరుడునిపై కూర్చున్నారు. విజయోత్సాహం కన్న, సమరోత్సాహంతో, కృష్ణుడు శంఖమూదాడు. గరుడుడు తన విశాలమైన రెక్కల్ని ఆడించాడు.

ఆతడు చూడటానికి పక్షివలె లేడు. ఒక మహానగరంలాగ వున్నాడు. ఆ రెక్కల సవ్వడికి చిన్న చిన్న ఇళ్ళు సామాన్యులు, తప్పక గాలికి కొట్టుకు పోతారనుకుంది సత్య.

"సత్యా! భయపడకేం." ఆమెకు ఆ అనుభవం లేనట్లు చెప్పాడు. మొదట్లో కొద్దిగా కంగారుపడ్డాను. ఇప్పుడు అలవాటయిపోయింది. అయినా మీరు ప్రక్కనుండగా నాకేం భయమంది" ఆ గడుసు సత్య.

ప్రయాణ బడలిక తెలియకుండా "మాతృశ్రీని దర్శించావు కదా! అమ్మగారు ఏమన్నారు ?"

"ఏమంటారు, నా సంగతి తెలుసు కాబట్టి, ఏమిటి విశేషమన్నారు. విషయం చెప్పాను. ఆశీస్సుల నడిగాను. అందుకు మాతృశ్రీ "అమ్మా! అదీ రణభూమి అన్నారు. మీ సుతుడు, నా నాథుడు, ఆ దేవతోత్తముడు దగ్గరుండ భయమేమిటమ్మా!" అన్నాను. ఆ వెంటనే అమ్మ "విజయోస్తు వీరనారీ!" అని ఆశీర్వదించారు.

"మరి... రేవతి వదినా... ?!"

"అందరికి నేనంటే హడలేమో! నన్ను చూడగానే ఏమిటమ్మాయి ?" అంది. విషయమంతా చెప్పాను. తాను బావగారితో యుద్ధం చేసి, అప్పుడు ఓడిపోవడం, ఇప్పుడు గెలిచి బందీ చెయ్యడం... అన్నీ చెప్పి... అవక్ర పరాక్రమంతో విక్రమించు. విజయశ్రీని వరించు"మని ఆశీర్వదించి...

"రుక్మిణీ...!" సత్యమనసుకై ఆగాడు.

"నన్ను చూస్తూనే, విజయోస్తు" అని అక్క అంది. చెల్లీ... మనకు నాథుడనే ప్రభువు జగన్నాథుడు. ఇందులోని పరమార్థం వారికే తెలియాలి. అందుకే నిన్ను ప్రేరేపించారు. జరిగిందిక్కడే... అయినా నిన్ను ఉత్సాహింపచేసారు. సంతోషంగా వెళ్ళిరా!" అంది. "నీ ఆశీర్వచనమని, ఆ పరమ వైష్ణవి పాదాలను పట్టాను. అప్పుడామె నాథుడే నీ ప్రక్కన వున్నాడు. నేను నా దృష్టి మీ చెంతనే వుంటాయి. అద్భుతమైన ఆనందాన్ని, అనంతకీర్తి ప్రతిష్టలను పొందమని దీవించింది.

ఈ కబుర్లు సాగుతూనే వున్నాయి. ప్రథమ దుర్గమైన - మొదటి కక్ష్యను చేరారు. అక్రూర, కృతవర్మ, ఉద్ధవ, సాత్యకాదులు, కృష్ణుని చేరారు. అప్పుడు గరుడుడు, అన్నీ తెలిసిన తన ప్రభువు పేరున మిగిలినవారికిలాగ చెప్పాడు.

"ప్రభూ! ఈ ప్రాగ్జోతిషపురము - గిరి, శస్త్ర, అగ్ని, వాయు, జలదుర్గాల అగడ్తలతో - అభేద్యంగా నిర్మించబడింది. వీటిని అధిగమించి సాగితే శస్త్రదుర్గం. అడుగువెయ్యడానికి వీలు లేకుండా, ఒక మైలు ఎత్తున భూమిలో దిగవేసిన ఆ పదునైన కరకు ఆయుధాలను దాటుకుని ముందుకు సాగితే - మహాగ్ని కీలలు. మలమలమాడ్చేస్తాయి. ఈ మొత్తానికి మూలపురుషుడు మురాసురుడు. ఇవి అవధ్యాలు. దేవతలెవరు కూడా వీటిని భేదించలేరు.

అన్నీవిన్న కృష్ణుడు "గరుడా! ఆగుదామా ? ముందుకు సాగుదామా ?!" అన్నాడు. వెంటనే బయలుదేరుదామన్నాడు. ముందు గరుడునిపై కృష్ణా సత్యలు. వెనుక మిగిలిన యాదవ అతిరథ ప్రముఖులు.

గరుడుడు బలంగా తన రెక్కల్ని టపటపలాడించాడు. ఆ ధాటికి కొన్ని దుర్గములు కదిలాయి. ఆతని దూకుడుకు తగ్గట్లు, తన గదతో, ప్రతి దుర్గమును పిండిపిండి చేస్తున్నాడు. వీలు కానిదంటూ ఏమీ లేకుండా, మురాసుర ప్రచ్ఛన్న పాశములన్నీ రూపుమాపాడు. మురాసుర, నరకాసురులను రక్షించే దుర్గములన్ని, చెప్పుకోవడానికి ఆనవాళ్ళు లేకుండా పొయ్యాయి.

ఆ విజయానికి చిహ్నంగా కృష్ణుడు తన పాంచజన్యాన్ని తీసాడు. దుష్టులకు హృదయ విదారకంగా, నవరంధ్రాలు పగిలిపోయేటట్లు, శిష్టులకు శ్రవణానందం కల్గించే విధంగా, పాంచజన్య ధ్వని మార్రోగుతుంది. వున్నట్టుండి ఏర్పడిన ఉత్పాతానికి, పురమధ్యంలోని జలాశయంలో నిద్రిస్తున్న మురాసురుడు ఉలిక్కిపడి లేచాడు. ఎవరిదా యుద్ధకండూతి ?" అని బద్ధకాన్ని ప్రక్కనబెట్టి, యుద్ధసన్నద్ధుడయ్యాడు. ఆ శంఖధ్వని వైపు సాగాడు.

ఎదురుగా - భామాసహితుడైన ఓ నల్లనయ్య. వున్నది గరుత్మంతునిపై. అయితే, ఆదిదేవులైన ఆ లక్ష్మీనారాయణులయుంటారు. లేకపోతే ఇంతవరకు రాలేరు. అయినా ఎవరైతే నాకేమిటని ? తన ధర్మాన్ని తాను నిర్వర్తించి కాచుకోండి. ~~ఈ~~ దెబ్బతో మీ పని సరి" అన్నాడు. విజృంభించాడు.

అతన్ని అట్టహాసాన్ని చూసిన కృష్ణుడు, మురాసురుని మాటలు వింటూ, ఆతని పంచశిరముల ప్రతాపాన్ని చూస్తూ - "ఒరేయ్, నువు మూర్ఖుడవు. ఇంతవరకు వచ్చామంటే, నీ చావు నిన్ను వరించినట్లే కదా. వదరకు! అన్నాడు.

మురాసురుడు తీవ్ర కోపంతో, గరుడుడి పైకి శూలం విసిరాడు. కృష్ణుడు, దాన్ని నేర్పుగా ఒడిసి పట్టుకుని మూడు ముక్కలు చేసి వాటిని మురాసురునిపై విసిరాడు. ధనువందుకున్నాడు. శరములు, పరంపరంగా ఆతని ముఖాలపైకి సంధించాడు. వాటికి కుపితుడైన మురుడు, గదను కృష్ణునిపై విసిరాడు. వాసుదేవుని గద, మురుని గదను వెయ్యి ముక్కలు చేసింది.

రెచ్చిపోయాడు రాక్షసుడు. ఆ శ్రీకృష్ణుని తన చేతులతో బంధించి, పిసికి ముద్ద చెయ్యాలని ఎగిరాడు. ఆ దుందుడుకుతనానికి, కృష్ణుడు చక్రప్రయోగం చేసాడు. అతని అయిదుతలలను తాటిపండ్లను తరిగినట్లు తరిగించేసాడు. మురాసురుడు ఒక పర్వతంలా నేలకూలాడు.

మరల విజయశంఖము.

ఈ మొత్తం చూస్తూన్న సత్యభామ, బొమ్మలాగ బిగుసుకుపోయింది. అక్రూరాదులలో కదలిక లేదు. కృష్ణుడు... కృష్ణుడు కాదు. విష్ణువు. ఆ మహావిష్ణువే మన అదృష్టం కొద్దీ మనతో కలిసి తిరుగుతున్నాడు. అప్రయత్నంగా చేతులు జోడించారు. తదుపరి అది యుద్ధరంగమని తలచి, కృష్ణునితో వారలు కూడా, సింహనాదాలు చేసారు.

తండ్రి నేలకూలడం గమనించిన అతని కుమారులు ఏడుగురు - తామ్రుడు, అంతరిక్షుడు, శ్రవణుడు, విభావనుడు, వసుడు, అభిన్నంత, అరుణులు.. రెచ్చిపోయారు. కృష్ణునిపై తిరగబడ్డారు. సేనాధిపతి కూడా వాళ్ళతోపాటు యుద్ధరంగంలో నిలిచాడు. దాదాపు ఏడువందల మందికి పైగా వున్న సేనను, అక్రూర, ఉద్ధవ, కృతవర్మ సాత్యకాదులు... ఢీకొట్టారు.

మరొకప్రక్క విష్ణువుగా మురాసురుడు తలంచిన కృష్ణుడు తన దివ్యాస్త్రములతో వైరివర్గం, అటుఇటుచూసే సావకాశమివ్వకుండా, తన వద్దనున్న దివ్యాస్త్రముల విడుస్తున్నాడు.

ఇదంతా నరకునికి తెలిసింది.

తన ప్రథమ దుర్గాన్నే నిగ్రహించలేని, దేవతలను మించి, ఈతడు విక్రమిస్తున్నాడంటే... లాభం లేదు. తాను ముందుకురకాలి. ఉపేక్షించకుండా తనవారిని రక్షించుకోవాలి. ఆ వచ్చిన కృష్ణుని, అతని వర్గాన్ని అంతం చెయ్యాలనుకున్నాడు. యుద్ధరంగం చేరాడు.

ఏనుగుల దండుతో వస్తున్న వ్యక్తిని చూచింది. "ఎవరతడు, నాథా!" అని అడిగింది, సత్య. "ఇంకెవరు ? మనం చంపడానికి వచ్చిన, ఇంద్రుడు దుర్మార్గుడన్న, ఆ నరకాసురుడు, ప్రాగ్జోతిషాధిపతి" చెప్పాడు. వెంటనే గబగబ తన దుస్తుల్ని

సరిచేసుకుంది. జుట్టు ముడిపెట్టుకుంది. పైటకొంగు నడుముకు బిగించింది. చీర గోచీ గట్టిగా వుందో, లేదో చూసుకుంది. "ఏవా, విల్లంబులు ?" అంటూ, క్రోధారుణ చూపులతో, ధనువును, అక్షయతూణీరాలను అడిగి తీసుకుంది.

"ఏమిటి వాడిని చంపేస్తావా ? ఎందుకు కోపం ?" అడుగుతున్నాడు కృష్ణుడు.

"నాథా! ఇది పరిహాసాలకు సమయం కాదు. వాడిని చంపాలి. చెరబట్టిన వారినందర్ని రక్షించాలి. లోకాలకు శాంతి చేకూర్చాలి." ఒక మూల కృష్ణుడిని హెచ్చరిస్తున్నట్లు శరములు విడిచిపెడ్తూంటే, వస్తూన్న నరకుడు, ఆ దృశ్యాన్ని చూసాడు.

"అమ్మ, బాబోయ్!" అనలేదు. ఆడదాన్ని అడ్డం పెట్టుకుని, ఈ మగాడు యుద్ధానికి వచ్చాడన్నమాట" ఈసడించుకున్నాడు. కానీ, సత్యా శరపాటవానికి, ఆమె ధైర్య సాహసాలకు, చిన్ననాటి ఉండి ఆమెను చూసిన అక్రూరుడు ఆశ్చర్య పోయాడు. ఈ పిల్ల... ఇంత గడుసుదా ?" అని నివ్వెరపోతున్నాడు.

అయినా అక్రూర వరదుని సన్నిధిలో గడ్డిపరక కూడ గడ్డపలుగవుతుంది, అవసరమైతే ఆ గడ్డిపరకే బ్రహ్మాస్త్రమవుతుందని తెలిసిన అక్రూరుడు, మహావీరుడే కాదు దేవదేవుడైన కృష్ణునికి అంజలి ఘటించాడు.

ఆ యాదవ ప్రముఖులందరు "శృంగార రాణి, సుకుమారి" అని చెప్పుకునే పెంకి మొండి సత్య, వీరరసంతో, మహారౌద్రంగా మారడం. ఈ వాసుదేవుని మహాశక్తికి నిదర్శనమనుకుంటున్నారు.

ఆ దృశ్యాన్ని చూస్తున్న నరకుడు "నువ్వు హరివై వుండాలి. అయినా, ఆడదాన్ని వెంటపెట్టుకుని వచ్చినవాడివి నీవేం మగాడివి. యుద్ధం చేయడం చాతకాక ఆడదాన్ని చూపి, అవతలివార్ని వశవర్తులను చేసుకోవడానికి, ఇంద్రజాల మహేంద్రజాలాలు ప్రదర్శించడానికి - ఇది వినోద ప్రదర్శనం కాదు.

వీరరసముగ్గడింపు చెయ్యు రణరంగం. ఇక్కడ మగతనం పౌరుషాల్ని ప్రదర్శించాలి. పేడి దానివలె ఆడుది బాణాలు వేస్తుంటే "బాగుంది, బాగుంది" అని చప్పట్లు కొట్టి సంబరపడే నువ్వేం మగాడివి. మగతనం, పౌరుషం ప్రదర్శించడం చాతకాకపోతే, ఈ వీరరాణిని నాకు విడిచి వెనుదిరిగి, పో! ఇంత అందమైన ఆడదాన్ని నాకు విడిచిపెట్టినందులకు నిన్ను కనికరించి క్షమిస్తాను.

అయినా నీ వంటి మగాడిని, ఈ అబల పెళ్ళి చేసుకుని, పాపం, అనవసరంగా అన్యాయమైపోయింది. పాపం. సానుభూతి వచనాలతో, ఏం మాట్లాడుతున్నాడో తెలియని విధంగా వదరుతున్నాడు. కృష్ణా-సత్యలిరువురు క్రోధమూర్తులయ్యారు.

"నరకా...!" సత్య గద్దించింది.

"అబ్బ! ఎంత అందంగా వుందా పిలుపు ? మధురం, అతి మధురం, మహామధుర"మంటూంటే...

"వదరకు, నా శస్త్రాస్త్ర సంపద నిన్ను...!" కృష్ణుని మాటలు పూర్తి కాలేదు.

"ఛీ... నువ్వా ఒక మనిషివే!" కసురుకున్నాడు నరకుడు.

"కాదు కనుకనే హెచ్చరిస్తున్నాను" అని శతఘ్ని అనే దివ్యాస్త్రాన్ని విడిచాడు. దాని ప్రభావానికి, దానవ సేన మొత్తం చెల్లాచెదరయిపోయింది. దిక్కు తెలియని రీతిలో పిచ్చిగా అరుస్తూ - దారి తెన్ను ఎరుగనట్లు పరుగులు దీస్తున్నారు.

కొందరు యుద్ధం చేస్తున్నారు. గరుడుడు కూడా తన స్వామిని - సత్యభామా సహితంగా మోస్తూ, రెక్కలు, గోళ్ళు, ముక్కుతో రకరకాల హింసకు రాక్షసులను గురిచేస్తూంటే, ఇటు కృష్ణుడు, అటు గరుడుని చూసి, గమ్యం తెలియని నరకాసుర బృందం, కళ్ళుండి గుడ్డివారయిపోయారు.

పరిస్థితి చెయ్యి దాటింది. ముందు గరుడుని పీచమణిస్తే - "శక్తి" అనే మహాయుధాన్ని నరకుడు ప్రయోగించాడు. కానీ, గరుడుని ఒక్క ఈక కూడా కదలలేదు. దాని ధాటికి నరకుడు నివ్వెరపోయాడు. ఆ వెంటనే కృష్ణునిపై శూలం విసిరాడు. కృష్ణుడు చక్రం విడిచాడు. ఆ చక్రధాటికి, నరకుడు, ఏనుగు మీద నుండి అలాగే నేలకూలాడు.

కృష్ణుడు విజయశంఖమూదాడు.

మనుమనితో, భూదేవి, ఆ విజయోత్సాహంలో తన స్వామిని దర్శించింది. ఎంత దుర్మార్గుడైనా కుమారుడు, కుమారుడే! గొంతు జీరపోయింది. కళ్ళవెంట తెలియకుండగానే అశ్రుధారలు "ప్రభూ!" అంది. ఆ సమయంలో ఆమెనలాగ చూడటం, కృష్ణునికి బాధగానే అనిపించింది.

మరి లోకకంటకుడు. ఉచ్ఛనీచాలు మరచినవాడు. ఇంద్రాదులను భయపెట్టడం, స్త్రీలను చెరపట్టడం, చేయని ఘాతుకం లేదు. అందుకే తను దేవతల పిలుపుతో యుద్ధానికి రావలసి వచ్చింది. అదే - ఇంద్రుడు రాకపోతే, తానీ యుద్ధానికి సత్యా సమేతుడై వచ్చేవాడు కాదు.

"వీడు మన మనుమడు భగదత్తుడు. సన్మార్గుడు. కరుణించి రాజ్యాభి షిక్తుని చెయ్యండి." సామాన్యులతో కలిసి మెలిసే తిరిగేది కదూ, కనుక ఆ విధంగానే మమతానురాగాల అసలు సిసలైన మాతృమూర్తిగా, శ్రీకృష్ణుని అర్థించింది. అప్పుడే అదితి కర్ణకుండలములను వైజయంతిమాలను, వరుణుని తెల్లగొడుగును, మణిమాలను తెచ్చి స్వామి ముందర వుంచుతుంది. వీటివల్లనే మన పిల్లవాడు వధించబడ్డాడు. తల్లిగా రోదించింది.

"దేవీ! వాడు పెడదారి పట్టాడు. అందరి జీవితాలతో ఆడుకున్నాడు. అందువల్ల...!"

"నాకూ బాధనిపించింది. కానీ తల్లిని కదా! తొందరపడలేకపోయాను. వీడినైనా... తప్పక..కనికరించండి.

"అవశ్య"మన్నాడు కృష్ణుడు. సత్య చిత్రంగా చూస్తూంది. ఈ ప్రేమలు, వివాహాలు అంతా సత్యకు అయోమయంగా వుంది. కృష్ణునితో, మనుమనితో కలిసి ఆ తర్వాత నగరంలోకి నడిచింది.

నరకుని చెరలోని వారిందర్ని విడిచిపెట్టేసారు. కానీ.. నరకుడు చెఱపట్టిన దేవ, యక్ష, గంధర్వ మానవ కాంతలొక్కరు కదలడం లేదు. అందరు కృష్ణుని చూస్తూ నిలబడిపోయారు.

కృష్ణుడు భగదత్తుని, ప్రాగ్జ్యోతిష్యపురాధిపతుని చేసి, ధర్మవిరుద్ధవడవు కానంతవరకు, ఎవరివల్ల నీకే ప్రమాదము వుండదు. ఈ సత్యం గుర్తించి మరీ మసులుకో. మా ఆశీస్సులు నీకెల్లప్పుడు వుంటాయి" అన్నాడు.

తాతగారిగా, ధర్మమూర్తిగా, శ్రీకృష్ణునికి సాష్టాంగ నమస్కారం చేసాడు. ఇదంతా చూస్తున్న ఆ పదహారువేల నూటొక్కమంది కన్యలు, ఓ నిండు సముద్రం వలె బయటపడ్డారు. అప్పుడు శ్రీకృష్ణుడు సత్యను చూసాడు. సమస్యా పరిష్కారము చేయమన్నాడు.

వెళ్ళింది. వాళ్ళందర్నీ కలవడానికి, సమస్యా పరిష్కారానికి, శ్రీకృష్ణుడు, అక్రూరాదుల సహాయము కూడా అర్థించాడు. సత్య ఆ అబలలను కలవడానికి ప్రారంభించింది. పదహారువేల నూటొక్కమంది, ఎన్నాళ్ళు పడుతుందో. ఈ లోగా తన వూపిరెంత వుంటుందో ఆమెకు అగమ్య గోచరము, అయోమయ మనిపించింది.

ఈమె అడిగే లోపుగా, జనసముద్రంలాగ వున్న వారందరు, నాలుగు జాతులుగా విడిపోయారు.

ఆ బృందాలుగా వాళ్ళు, నిన్న, మొన్న కాదు. ఎన్నేళ్ళ నుండి ఇక్కడ వుంటున్నామో ఆ భగవంతునికే తెలియాలి. ఇప్పుడు మేము తిరిగి మా లోకాలకు" అని కొందరు, "మా రాజ్యాలకు" అని మరికొందరు, ఎలాగ వెళ్ళగలము ? ఎవరు మమ్మల్ని రానిస్తారు ? బ్రతుకు ఇక్కడే సమసిపోవాలి తప్ప, మరోదారి లేదనుకున్న మాకు -

ఈ దేవదేవుడు "కృష్ణ - వాసుదేవుడు" మమ్మల్ని కరుణించాడు. ఇక ఆ ప్రభువే మాకు శరణ్యము. ఆయనే మమ్ము చేపట్టాలి. కాదంటే మరణమే మాకు తరుణోపాయమంటున్నారు.

"ఇంతమందినా ?" ఆశ్చర్యపోయింది సత్య. వున్న ఎనిమిదిమందితోనే, ఈ దేవుడెక్కడున్నాడో తెలియక తపించే మేము, ఇంతమందిని వివాహమంటే ముందు సాధ్యమా ? అనుకుంది. ఇది మొదటి ప్రశ్న. రెండవది - వీళ్ళనెక్కడ వుంచాలి. అదే... నివాసాలు. మూడవది - ఈ రకంగా మొదటివారు మళ్ళీ భర్త మొహం చూడాలంటే ఎన్నేండ్లు పడుతుంది. ఇదెక్కడి విడ్డూరంరా బాబూ, ఎరక్కపోయి వచ్చాననుకుంది.

అందుకనే మగవాళ్ళు మగపనులు, ఆడవాళ్ళు ఆడపనులు చెయ్యాలనేది. భీష్మరాజపుత్రికలాగా పెద్ద మనసుతో వున్నచోట వుండి పోయినా, జాంబవతిలా... స్వామి కరుణామయుడు, ఆయనే చూసుకుంటాడనుకున్నా, ఈ గొడవ దాపురించేది కాదు.

వీరత్వం-శూరత్వమంటూ మగనాలిగా ప్రవర్తించి పీకలమీదకు తెచ్చుకున్నా ననుకుంది. ఆమె వారికేదో చెప్పబోయింది. వాళ్ళు కృష్ణా! వాసుదేవా గోవిందా, గోవర్ధన గిరిధారీ, బృందావనవిహారీ!" స్తుతి, స్తోత్రాలు ప్రారంభించారు.

"అమ్మా! ఒక్క క్షణం ఇంతమందిని ప్రభువు, ఎక్కడ-ఎలాగ, సంరక్షిస్తారు.. అని అంటే "అమాయకురాలా! నువ్వు నిజంగా కృష్ణసతివా ? లేక మావలె బ్రతుకుతున్న అనాధవా ? ఆ వాసుదేవుడు. సర్వాత్మకుడు. సర్వ వ్యాప్తి. పధ్నాలుగు లోకాలకు ప్రభువైన ఆ పరంధామునికి మనమెంత ? ఒక చీమో... దోమో...! తెలిసిందా!

ఇంత సృష్టిని కడుపులో పెట్టుకున్నవాడికి ఈ పదహారువేల నూటొక్క మంది...!" అంటే, అసలైన అమాయకురాలు, ఇంతవరకు గడుసు దాన్ననుకున్న సత్య, తానుగా తలచి, తరింపచేసారని, వాళ్ళందరికి చేతులెత్తి మ్రొక్కింది. తన అజ్ఞానాన్ని మన్నించమన్నట్లు ప్రవర్తించింది. ఇక -

రోహిణీ - అనే కన్యక - ఇక మాకు వాసుదేవుడో అనంతసాగరమో లేక ఈ నరకుని అగడ్తలో శరణ్యంగ ప్రవర్తిస్తామన్నారు. ఇక -

ఇక తనవల్లకాదని, కృష్ణుని చేరింది. వాళ్ళు తననలాగ విసిగిస్తూంటే, ఆదిమధ్యాంతరహితుడనబడే, ఈ దేవదేవుడు, లోకాలకు ప్రభువు... ముందు ఇప్పుడు తన ప్రభువు, హాయిగా విశాల వటవృక్షనీడలో, ఉద్ధవ, సాత్యకి, కృతవర్మలతో కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

రెండు చేతులెత్తి, తన అయోమయానికి తానే విస్తుపోతూ, ఏవిటో అనుకుంది. ప్రభువును చేరింది. ఓ ప్రక్కన సత్య, మరొక ప్రక్క భూదేవి, ఇంకో ప్రక్క అక్రూరుడు.. కనుపించారు. అప్పుడు -

"పెదనాన్నా! అందరిని పలుకరించి, వారి మనసులను తెలుసుకున్నారా ? చాలా తొందరగా వచ్చారు. అప్పుడే అయిపోయిందా ?" అడుగుతున్నాడు అక్రూరుడు ఆపసోపాలు పడుతున్నాడు. సత్య కాళ్ళీడ్చుకుంటూ నీరసంగా కనుపించింది. ఒక్క భూదేవి... అనంతభారంలో కొంత తగ్గినట్లు, తన ప్రభువు చెంతనున్నందులకు చింతవీడి సంతోషంగా వుంది. ముగ్గుర్ని అటు ఇటు చూసి "ఇంతకీ ఏం చేసుకొచ్చారని" అడిగాడు.

"అయ్యా! చెప్పడానికేముంది ? అందరికి నువ్వే కావాలిట. నీ అనంత విభూతులతో, సర్వాంతర్యామివి సర్వాత్మకుడవు, భద్రాత్మకుడవు, ... నువ్వు వాళ్ళను కరుణించి, కటాక్షించాలిట. అదే వారి తాత్పర్యము. ఇందుకు అర్థాలు, శ్రుతిపదార్థాలు,

వ్యుత్పత్తులు, సంధి-విగ్రహాలు, సమాసాలు.. ఏమి లాభం లేదు. ఒక్కమాటలో “అదే మహాశయా! వారికి కావలసింది నీతో వివాహమని” అని సత్య చతికిలబడింది.

తలవూపింది భూదేవి. ఇంతే సంగతులు. చిత్తగించవలెనన్నాడు, అక్రూర మహాశయులు. “అదేవిటి సత్యా!”

అంతకుమించి మరేమి లేదు ప్రభూ! జగదేక సార్వభౌముడివి, పదునాల్గు లోకాలకు ప్రభువువు. నీకు తప్పదట. ఇది వారి వ్యుత్పత్తి. ప్రతిపదార్థమంది. ఇందులో పెడసరం లేదు కాని. మాకు ప్రాణాంతకము కానివ్వకు మహాప్రభో! అన్న ప్రార్థనే నిండి వుంది.

సత్యమాటలకు గోవిందుడు గలగల నవ్వాడు. మరుక్షణం - తేరుకుని “నువ్వేమంటావు ?” కృష్ణుడడుగుతున్నాడు.

“అయ్యా! తమరు జగదేక ప్రభువు. పధ్నాలుగు లోకాలు భరిస్తున్నారుట. కనుక మీకు తప్పదు. పెండ్లి చేసుకునేది మీరు. చూసి ఆనందించడమో, ఆ తర్వాతది... అనుభవించడమో మా పని” అంది.

“ఇది అసాధ్యం. ఎలాగ జరుగుతుంది ?” ప్రశ్నిస్తున్నాడు కృష్ణుడు.

“వాళ్ళు సాధ్యమంటే, కాదనడానికి నేనెవర్ని. కట్టుకునేది మీరు. కాపురం చేసేది మీరే! కనుక పరిష్కారం మీదే. మనసున్న మహారాజులు. వలచి వచ్చిన వారిని వద్దనడం తగునా ? తెలిసి ఇక్కడకు వచ్చి, వీళ్ళను విడిపించి, ఇప్పుడు మీ దారి మీదంటే మాకు మిగిలింది అధోగతి... అంటున్నారు. కాబట్టి....

“అక్రూర మహాశయా! పెదతండ్రి! వింటున్నారా, ఈ సత్య పితలాటకం. మీరైనా...?!” అభ్యర్థిస్తున్నాడు.

“కృష్ణా! ఇప్పుడు నాకు జ్ఞాపకమొస్తుంది. నీవు పుట్టిన క్రొత్తల్లో... నీ గురించి మాకేమీ తెలియని సమయంలో వ్యాసులవారు మాకో మంత్రముపదేశం చేసారు. అదేవిటో తెలుసా ? తెలియదన్నట్లు కృష్ణుడు అడ్డంగా తలత్రిప్పాడు. అది -

**“హే కృష్ణా! ముకుందా మురారీ**
**జయ గోవింద, బృందావిహారీ...!”**

అన్నది. ఇది తలుచుకోండి. ఆ జగదుద్ధారకుడు, అందరిలోను గల మనల్ని తప్పక ఉద్ధరిస్తాడన్నారు. ప్రస్తుతమదే శరణ్యం. అంతకు మించిన కర్తవ్యం - ఏదీలేదనేకన్న - వున్నది -

"హే కృష్ణా! ముకుందా! మురారీ!" అని నమస్కారం చేసాడు!! అప్పుడే మహర్షిని దీని అర్థమడిగాను. ముందు-ముందు తెలుస్తూందిలే. ఏదో కొద్ది, కొద్దిగా తెలుసుకుంటున్న మాకు "మురారీ"కి అర్థం, నీ రాకతో, ఇప్పుడు, ఇక్కడ ఇలాగ అర్థమయింది. ఇక నా పని -

"నామం జపం చేస్తూ" అక్రూరుడు నాట్యం చేసాడు.

"భూదేవీ...!" మిగిలిన మాట పూర్తిగానివ్వకుండా "ప్రభూ!" అందరిదీ ఒకటే మాట. సామాన్యుడు మమ్మల్ని రక్షించలేడు. ఇంద్రాది దేవతలకే అవధ్యమైన ఈ అగడ్తలు ఛేదించాడంటే, ఇవి పొగడ్తలు కావు. ఆ దేవుడు సాక్షాత్తు ఆ జగన్నాథుడు. అందుకే ఇది సాధ్యమయిందనీ, వారందరు తమనే కోరుకుంటున్నారని" చెప్పింది.

అందరి మాటలు వింటుంది. పరిస్థితి, అందులోని అంతరార్థము, అవగతం కావడం లేదు. ఆ స్థితిలో వున్న సత్యను - "సత్యా! నువ్వే దీనికి పరిష్కారం చూపాలి" తన ప్రభువు మాటల్తో, "ఆ...!" అని నోరు తెరిచేసింది.

"చెప్పడానికేముంది ప్రభూ! వీరందరు నిన్ను కోరుతున్నారు. మనసా... వాచా.. కర్మణా... నీ వాళ్ళుట. ఇక నీకు తప్పదు!" అనేసింది.

"అదేమిటి సత్యా, అలాగంటావు ?"

"ఇంకెలాగ అనాలో తెలియక....!" అనేసింది.

"ఒక్కరు కాదు, ఇద్దరు కాదు. ఎనమండుగురు రాణులతో, వూపిరాడని నేను, ఈ పదహారువేల వందమందిని కట్టుకోవడం... వూహల్లో కూడా సరదా కాదు. సభ్యత అసలు కాదు.

"సభ్యత మాట తర్వాత ఆలోచిద్దాం. ప్రస్తుతం మనముందున్న సమస్య- వీళ్ళను రక్షించడమా ? చంపడమా ? అన్నది. మనం రక్షకులమైతే రక్షిద్దాం. భక్షకులమైతే చంపేద్దాం."

"అంతేనంటావా ? అయితే...!"

"మళ్ళీ మొదటికి వచ్చారా ? ముందు వీళ్ళను ద్వారకకు తరలిద్దాం. ఆ తదుపరి అక్కడకు వెళ్ళి హాయిగా పెండ్లాడండి.

"ఆ... తర్వాత... ?!" "ఏముంది, అనుభవించడమే... ?" "ఏమిటీ...!" జావగారిపోతున్నట్లు, ఆ నటనసూత్రధారి నటిస్తున్నాడు.

"మీ హృదయంలో ఎంతో విశాలత వున్నదని, సర్వలోకారాధ్యులని, మీ పాదములే శరణమన్న వారిని, కరుణించడము, ఆ హృదయంలో ఇంత చోటివ్వడము. ఇంతే సంగతులు!" "సత్యా ?" ఎంత సరదాగా చెబుతున్నావు ?

"అంతకుమించి మరో మార్గం కనబడటం లేదు. నవ్వు రావడం లేదు. ఏడుపు రావడం లేదు. దీనినే ఏడవలేక నవ్వడమంటారు. చూడండి. దానిని అభ్యాసం చేస్తున్నాననంటుంది.

"తప్పదా ?" అడుగుతున్నాడు, కృష్ణుడు. "తప్పదు" చిరునవ్వులతో సత్య.

"సరే. నీ ఇష్ట"మన్నాడు, చిద్విలాసుడు, చిదానందుడైన - ఆ కృష్ణుడు! మొదలయింది కృష్ణలీల!

అందరిలో ఆనందం! నారీ-నారీ-నడుమ మురారి!

ప్రతి ఒక్కరి ప్రక్కన కృష్ణుడు. దేవేరి మధ్య దేవుడు. ఒక్కొక్కరిని ఒక్కొక్క రకంగా అలరిస్తున్నాడు. వెనుదిరిగింది సత్య.

విశాల వృక్షనీడన - ఉద్ధవ, సాత్యకి-కృతవర్మలతో కృష్ణుడు. ఈ ప్రక్కన నాట్యంచేసే అక్రూరులు, వారితో కృష్ణుడు. "ఎంత చిత్రం ?" ఆశ్చర్యపోతూ, సత్య కనులు మూసుకుంది.

రుక్మిణీతో రుక్మిణి వల్లభుడు. జాంబవతీ కృష్ణుడు. మళ్ళీ చూస్తే

సత్యతో సత్యాపతి.. ఒక్కొక్కరే చిత్రంగా కనుపిస్తున్నారు. కనువిందే కాదు ఆత్మానందం కూడా కల్గిస్తున్నారు. అందరితో కృష్ణుడు. దగ్గరకు వెళ్ళి, ఆయన హృదయంపై తల ఆనించింది. కానీ, అక్కడ వున్నది - అనంతలక్ష్మి-సత్య - నిత్య - దివ్యస్వరూపమైన రుక్మిణి. ఆమెకు తప్ప - అక్కడ మరొకరికి తావు కనబడటం లేదు.

గ్రుచ్చి, గ్రుచ్చి చూస్తూంది. రుక్మిణిలో జాంబవతి, ఆమెలో తాను - సత్య. మిగిలిన దేవేరులు. అంటే తామందరూ, రుక్మిణీ అంతరాత్మలా ? ఆమెలోని అంతర్భాగములా ? వ్యక్తిత్వం తెలియని విశిష్ట - శిష్ట - ఘనతను - దర్శించింది. శరీరం గగుర్పొడిచింది.

అప్పుడే భూదేవి కూడా కనుపించింది అంటే.... ఆమె మనసు కుదుట పడేలోగా - దేవకిమాత, యశోదమ్మ - కుంతి, ద్రౌపది, సుభద్ర. వీళ్ళందరితోపాటు ఉద్ధవుడు, సాత్యకి, అక్రూరాదులు.... వసుదేవుడు, ఉగ్రసేనుడు పెద్దన్న బలరాముడు.. ఒక్కరేమిటి, ఆ పదహారువేల వందమంది చెప్పినట్లు, సృష్టి సర్వస్వం - లోకాలు, లోకేశులు.... అన్నీ... అన్నీ... స్పష్టంగా సత్య చూడగల్గుతుంది.

ఇప్పుడామెలోని అజ్ఞానం పూర్తిగా నశించింది.

పుణ్యకవ్రతం పేరిట కొంత. ఇప్పుడు పూర్తిగా ఆమె ధన్యురాలయింది. వాళ్ళను - రుక్మిణీ కృష్ణులను లక్ష్మీనారాయణులుగా దర్శించి, పులకించిన సత్య, ఇన్నాళ్ళు - తాను రుక్మిణీదేవిని, సాధారణ సపత్నిగా తలచినందుకు చింతిల్లింది.

అప్పుడు... అప్పుడామె కనులు తెరచుకున్నాయి.

ఆనందాశ్రువులు వర్షిస్తూ - "ప్రభూ!" అని తను ప్రాణనాథునిగా, "మీరజాలగలడా, సత్యాపతి.. అని విర్రవీగినందుకు, శ్రీకృష్ణుని పాదాలపై తన శిరమును వుంచి, కటాక్షించమని ప్రార్థించింది. కన్నీటితో, ప్రభువు పాదాలను, నిష్కల్మష హృదయంతో కడిగింది.

మళ్ళీ మాయ.

"సరే! వున్న పేరు "సత్యాపతి" అలాగే వుంది. "మీరజాలగలడా, నా ఆనతి" అని నువ్వు హెచ్చరించడం ఈ లోకానికి తెలుసు. నా తలనొప్పి అన్ని లోకాలకు తెలుసు. నిన్ను కాదని, ఈ పతి "సత్య"మంచినీళ్ళయినా త్రాగగలడా ?" అని నటన సూత్రధారి తన పాత్రను రక్తి కట్టిస్తూంటే, మాయలో బడ్డ - సత్య -

"పాపం - అమాయకులు" నే గీచిన గీటు దాటలేరు. మళ్ళీ మొదలు... చిన్ననాటి దొంగాటలు, కపట మోసాలు....!"

"ఆపాపు నీ వరకు బాగానే వుంది. తీరా ద్వారకకు వెడితే, వీళ్ళందర్నీ చూసి, జాంబవతాదులు, నన్ను-నిన్ను ... నాన్చుతున్నాడు.

"స్వామి! మీ దయ వలన నాకు పట్టిన మాయా గ్రహణం తొలగింది. ఈ సత్యకు "సత్యం" బోధపడింది. ఏదో మూర్ఖత్వం కాని నిన్నెదిరించేవాళ్ళు, నిలువరించేవాళ్ళు, ఈ లోకంలోనే కాదు. ఏ లోకంలోను లేరు. అందరిలో వున్నది నువ్వు - రుక్మిణిలే ఆమెలో వున్నది నీలో వున్నది మేమే. నీవే - ఇన్ని రూపాలుగా, రకాలుగా లోకాలనాడిస్తున్నావు. పుట్టించి పెంచి పోషిస్తూన్నావంది.

"అయితే నువ్వు అమాయకురాలివి కాదన్నమాట.

"నీ దయవల్ల స్వామీ... నేను నిజమైన "సత్య" నయ్యానంది.

అప్పుడు - కృష్ణుడు అందర్ని పిలిచాడు.

"ఉద్ధవ - సాత్యకి, కృతవర్మలారా! అక్రూర మహాశయా! మీరు వీళ్ళందర్ని తీసుకుని ద్వారకకు వెళ్ళండి. నేనూ, సత్యా, ఇంద్రలోకానికి వెళ్ళి-ఈ కర్ణకుండాలను అదితీమాతకు అర్పించి మరీ వస్తాము. ఈలోగా విశ్వకర్మ వచ్చి వీరలకు తగు సౌకర్యాలు కల్పించేవరకు జాగ్రత్త" అని బయలుదేరబోతూంటే -

"ప్రభూ! ఇక్కడ అనంత సంపదలున్నాయి. ఇవన్నీ ఆ దేవ, యక్ష, గంధర్వ-మానవ కన్యలతోపాటు తెచ్చినవి. వీటన్నింటిని కూడా తీసుకు వెళ్ళండి. ఇవన్నీ మీరు తీసుకు వెళ్ళినా తరాలు తిన్న తరుగని అనంత సంపదలు మన మనుమడు భగదత్తుని వద్ద వున్నాయంది భూదేవి.

వాటిని గూడ తరలించుకుని వెళ్ళమని చెప్పి భగదత్తాదులకు తన ఆశీస్సుల నిచ్చి భూదేవిని శాంతపరచి "నీవు లేనిదెక్కడ ? నిన్ను నేను విడిచినదెక్కడ ?" అని ఆమెను పలుకరించి, సత్యతో గరుడునిపై ఇంద్రలోకానికి బయలుదేరాడు.

# ఇంద్రలోకం

"అవును ప్రభూ! తమరు వాసుదేవుడని, సర్వలోకేశ్వరుడని, ఆ పదహారువేల వందమందీ అన్నారే. అది నిజమా ? అదెట్లాగ ? తెలుపగలరా ?" లాలననగా అందులో సత్యం నిండి వున్నట్లు అడిగింది, సత్య.

"అవును. నీవు నన్ను అందరిలోను దర్శించానన్నావు. నిజమేనా ?" ప్రశ్నకు ప్రశ్నగా అడిగాడు కృష్ణుడు.

"దర్శించాను స్వామీ, అది నిజమే..."

"ఎట్లాగా ?....

"అందరి అభిమానవతులందరి ప్రక్కన చెరొక రూపం, వారిని పలువిధాల అలరిస్తూ కనుపించారు. వాళ్ళు పరవశించారు."

"అప్పుడు నీ ప్రక్కన వున్నానా ?"

"అదే అర్థం కావడం లేదు."

"ఇంకా...!" అడుగుతున్నాడు కృష్ణుడు.

కళ్ళు మూసుకున్నాను. "మీరు, రుక్మిణి కనుపించారు. కళ్ళు మూసుకున్నాను. జాంబవంతీ మీరు కనుపించారు. కళ్ళు తెరచి మూసుకున్నాను మీరు, నేను... కనుపించాము. అలాగే - మీరు కాళింది, మిత్రవింద, నాగ్నజిత్తి, లక్షణ, భద్రలతో కనుపించారు. ఆ తర్వాత చూస్తే మీరు, రుక్మిణియే కనుపించారు.

ఆ రుక్మిణిలో మేమందరము వున్నాము. మేమే కాదు పెద్దక్క రోహిణి, దేవకిమాత, యశోదమ్మ సుభద్రా, ద్రౌపది, కుంతీ అత్త.... ఇలాగ అందరు కనుపించారు.

"ఆ తర్వాత....!" కృష్ణుడడుగుతున్నాడు.

"మీ తండ్రి వసుదేవులు, అక్రూరుడు, పెద్దన్న, మన మహారాజు, ఉద్ధవ, సాత్యకీ, శతధన్వుడు. నా తండ్రి ఇలాగ.... ఎందరో కనుపించారు.

"అంటే... దీని వుద్దేశమేమిటి ? అంతట వుండే వాసుదేవుడు అన్నిరూపాలు తానయి, ఎన్నెన్ని రూపాలతో ఈ లోకాలనడయాడుతున్నాడో తెలిసింది. అంటే

లోకంలోని ప్రతీదీ ఆ భగవంతుడేనని, ఆతను లేదనిదేమీ లేదని, "సర్వదేవ నమస్కారం" కేశవం ప్రతిగచ్ఛతి!" అని అనవరతము, మనం ఆ భగవంతునికి శరణాగతులమై వుండాలన్న సత్యం, "సత్యా!" బోధపడుతుంది. అవునా ? "మరిప్పుడు నీవెవరు, నేనెవరు ? అందరు ఆ భగవత్స్వరూపమే కదా!" అనగా-

"నిజంగా, ధన్యురాలను స్వామీ! తరించాను. ఈ సర్వసత్వాలు తెలుసుకునేందుకు రాజ్య, విభవ సంపన్నురాలు, ప్రథమ పట్టమహిషి అయిన రుక్మిణి, నిజంగా "దేవేరి" గా నిల్చుంది. ఉత్సవ విగ్రహాలమైన నాబోటివాళ్ళు, దొరికిన అదృష్టానికి సంతోషించక, మిడిసి పడుతున్నాము. అవును స్వామి, ఆనాడు నారద మహర్షి "ఆది దంపతులు కదా! అని ముందు దర్శించ వెళ్ళానన్నాడు. అర్థం కాలేదు. వాళ్ళు ఆదిదంపతులంటే.... మూర్ఖంగా నేను మూలదంపతులము మేమన్నాను. కానీ, స్వామీ! ఇందాక మీరు, అక్క రుక్మిణి - ఆ లక్ష్మి నారాయణుల వలె దర్శనమొసగారు. నా అజ్ఞానాన్ని బాపారు అంది.

ఈలోగా వాళ్ళు - ఇంద్రలోకంలోకి అడుగుపెట్టారు.

వీళ్ళ రాకను గమనించిన ఇంద్రాది అష్ట దిక్పాలకులు, స్వాగత సత్కారాలు నడిపించారు. "అమ్మా ?" అంటూ, వెడుతూనే అదితి మాతను దర్శించాడు. "మాతృదేవోభవ" అని ఆ తల్లికి, మాతృశ్రీకి వందనాలర్పించాడు.

తన పేరు కృష్ణుడని, వసుదేవ సుతుడినని,ఈమె తన మూడోభార్య "సత్య" యని పరిచయం చేసాడు. "ఇవిగో కర్ణకుండలములు. నరకునిచే సంగ్రహించబడినవి. దేవేంద్రుని కోరికపై సత్యాసహితుడనై, మా యాదవ ప్రముఖులతో వెళ్ళి, అందరి సహకారంతో, ఆ రాక్షసుడు నరకుని వధించానని, వినయం తన భూషణంగా, ఆ దేవమాత అదితికి, వాసుదేవుడు వివరించి చెప్పాడు.

"విన్నానయ్యా, వాసుదేవా, నీ లీలలు. విశ్వంభరుడివి. దేవతల కసాధ్యమైన ఎన్నో కార్యాలను అవలీలగా చేసావని "అమ్మ"గా మురిసాను. ఆనందించాను. "విజయోస్తు, సుఖీభవ" అని అమ్మను కదా, అర్హత గురించి ఆలోచించకుండా ఆశీర్వదించా"నంది ఆనందాశ్రువులను వర్షిస్తూ -

వచ్చిన సత్యా, కృష్ణులకు ఇంద్ర - శచీదేవిలు ప్రత్యేకంగా మర్యాదలు సలిపారు. తమ కృతజ్ఞతలను వెల్లడించారు. అప్పుడే, వరుణదేవుని వెల్లగొడుగు,

మణి'' అని వాటిని ఇంద్రునికిచ్చాడు. నరకుడు చెరపట్టిన పదహారువేల వందమంది కన్యలను వారి అభ్యర్థన మేరకు ద్వారకకు పంపాను. వారిక "కృష్ణ దాసీలు'' ఈ కృష్ణుడు వారలకు దాసుడు.

ఇప్పుడు విశ్వకర్మ సహాయం కావాలి. ఆతనిని ద్వారకకు పంపితే, ఆ క్రొత్త రాణులకు తగు విధమైన వసతి సౌకర్యాలను, సముద్రుని సాయంతో నిర్మిస్తాడు. మనసువిప్పి మాట్లాడే గోవిందునికి, పరిపరి విధాల వందనములర్పించి

"కృష్ణా.... నీ వల్ల సకల దేవతానీకము సంతృప్తిగా వూపిరి పీల్చుకుంటుంది. అందుకు ఎంతయినా కృతజ్ఞులమని, మరొక్కసారి చెప్పాడు.

ఆ ఆనంద సమయంలో "ఇంద్రా! మా సత్య నీ నందనవనం చూడాలని కుతూహలపడుచున్నది. ముఖ్యంగా అందలి పారిజాత వృక్షాన్నంటాడు. అది చూసి మేము తిరిగి ద్వారకకు బయలుదేరుతాము. సత్య కోరిక నెరవేరిస్తే నా భాధ్యత తీరుతుంది. ద్వారకకు వెళ్ళి, ముందు మహారాజును, ఆ తదుపరి జననీ జనకులను, అక్కడనుండి పెద్దన్న వదినలను, ఇతర ప్రముఖులను దర్శించి, వారి నానందపరచా'' లంటాడు.

"తప్పక. రండి'' అటూ ఆ నందనవమును తానే చూప ఇంద్రుడు బయలుదేరాడు. ఏ ఋతుకాల ప్రమేయం లేని, ఆ దేవతావనాన్ని చూసి సత్య అబ్బురపడింది. ఆమె పొందిన ఆనందం వర్ణించనలవికానిదయింది.

అంతా చూస్తున్న సత్య, తను పారిజాతం వద్దకు రాగానే "ఇదే సత్యా! ఇదే నీకు, నేను తెచ్చి యిచ్చెదనన్న" పారిజాతమని పెకలిస్తాడు. వెంటనే వాసవుడు కలుగచేసుకుని, "వాసుదేవా, అది తగదు. అది దేవపారిజాతం. ఇక్కడే వుండాలి. మీ భూలోక పారిజాతం వేరు. పైగా ఇది శచీదేవికి అత్యంత ప్రియమైనది. వలదు, వలద''ని అడ్డుపడ్డాడు

"నీ భార్యకు ఇష్టమైనదని, నీకు లభించిన దానిని, ఇక్కడ ప్రతిష్టించుకుని మురిసిపోతున్నావు. నీవలెనే, నా భార్య. ఆమెకు వృక్షరాజమే తెచ్చి ఇస్తానని మాట ఇచ్చాను. ఆ మాట ప్రకారమే, నిస్వార్థముగా నరకుని చంపాను. అదితి మాతకు కుండలాలను తెచ్చి ఇచ్చాను. రాక్షసపీడ నుండి మిమ్మల్ని రక్షించి, మహోపకృతి చేశాను.

ఇప్పుడు ఇక్కడికి వచ్చింది. నా లక్ష్యమైన సత్య కోరికను మన్నించడానికి. సమయం వచ్చి నాకు లభించిన పారిజాతాన్ని తీసుకువెళ్ళడానికి...!'' నవ్వుతూనే, తన దరహాస చంద్రికలను విరియ చేస్తూ చెప్పాడు.

దాంతో ఇంద్రుడు తనను మరచిపోయాడు. అవకాశవాదంతో రెచ్చిపోయాడు.

"కృష్ణా! ఇంతవరకు మాకు, లోకాలకు వుపకారం చేసావని తలచి, శాంతించాను. ఇప్పుడు నువ్వు తెగిస్తే, అనవసర దేవతా యుద్ధానికి బీజం వేసిన వాడివవుతావు.'' తానొక ప్రతాపవంతునిగా, ధీరునిగా, శూరునిగా, ఇంద్రుడు హెచ్చరిస్తున్నాడు.

''ఇంద్రా! ఇంతదనుక, నేనే ఉపేక్షించాను. ఉపేంద్రుని కాదను శక్తి సామర్థ్యములు, ఆ హరబ్రహ్మలకు గూడా లేవు. గోవర్ధనగిరి దృశ్యము - ఒక్కసారి గమనమొందు. అంతెందుకు ? ప్రథమ దుర్గమును కూడా చొరలేని మీ శక్తిని గుర్తు తెచ్చుకో ?  తదుపరి వినాశమే కోరుకుంటే, ఈ వాసుదేవుడు, వాసవుని నిర్జించగలడు ?! నీ ఇష్టం'' అన్నాడు.

ఇంద్రుడు ఆలోచనలో పడ్డాడు. ఇప్పుడే పొగిడిన నోటితో తెగనాడలేడు. ఇంకా చెప్పాలంటే తన దుస్థితికి దిక్పాలకులే వెక్కిరిస్తారు. కనుక, తెలివిగా ఇంద్రుడు - "ఉపేంద్ర! తీసుకు వెళ్ళండి. తమ అవతార కార్యక్రమము పూర్తగు పర్యంతమిది భూలోకాన వుంటుంది.... ఆ తదుపరి యథావిధి ఈ దేవలోకం చేరుతుంది'' అనగా -

సంతోషమన్నాడు, కృష్ణుడు. సత్యతో భూలోకానికి బయలుదేరాడు. "బ్రతుకు జీవుడా! మరొక ప్రమాదము రాలేదని'' ఇంద్రుడు సంతోషించాడు. గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు.

గరుత్మంతుడు, సత్యాదేవి భవనము వద్ద ఆగాడు. విషయము తెలిసిన దేవేరులు, జననీ జనకులు, రుక్మిణి, పెద్దన్న-వదినలు, ఆ వీరులకు స్వాగత సత్కారాలు నడిపించ వచ్చారు.

కృష్ణుడు చేసిన వాగ్దానం ప్రకారం పారిజాత వృక్షము సత్యభామ వనంలో నాటబడింది. ఈ మారు గర్వాహంకారాలు లేని విధంగా, పెద్దభార్య, యోగిని పరమ భగవతోత్తమురాలని త్రికరణశుద్ధిగా వందనమాచరించింది. ఆమె ఆశీస్సుల నపేక్షించి తీసుకుంది.

ఇప్పుడు - సత్యలో - సపత్నులపై ప్రేమ, గౌరవాలే తప్ప - ఇతర రాగద్వేషాలు లేవు. అందరు కలిసి హాయిగా విందు భోజనాలు చేసారు.

ఇక్కడే "లోకాన్ సమస్తాన్ స్సుఖినో భవన్తు" అంది రుక్మిణి. ఏతత్ఫలం శ్రీ పరమేశ్వరార్పణమస్తు" అంది - వినయ - విశ్వాస - శ్రద్ధా - భూషితురాలైన సత్య.

★★★★

ఆ తర్వాత దేవేంద్రుడి ఆదేశం, శ్రీకృష్ణుని కోరిక మేరకు విశ్వకర్మ, నరకుని చెరనుండి బయటపడ్డ పదహారువేలమందికి, అతని నుండి సంపాదించిన అపార ధనరాశులు, కాంచన - మణిమయాదులతో అపూర్వంగా, సాగరుని తోడ్పాటుతో భవనాలు రూపొందించాడు.

మానవసృష్టికతీతమైన దేవతా నిర్మాణశైలిలో అలరారుతున్నాయవి. ఆయా భవనాలలో ఆ లలనామణులు ప్రవేశించారు. వారికి కావలసినవన్ని కూడా, ఒకరిని మరొకరు, అవసరమని అడుగ వీలులేని విధంగా, ఏర్పాటు చేయబడ్డాయి.

ఆ తదుపరి - వీరందరి వివరాలను, వారి వారి తల్లిదండ్రులకు తెలిపి ద్వారకకు రమ్మనమని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

కులగురువులు - గర్గాచార్యులు నిర్ణయించిన దేవతా శుభముహూర్తంలో, వారి వారి తల్లిదండ్రులు, బంధుమిత్రుల సన్నిధిలో, ఏక రూపుడైన ఆ పరమాత్మ, దివ్యాత్మ - సర్వాత్మ స్వరూపుడై - నారీ, నారీ నడుమ "మురారై"నాడు. అందర్ని వివాహం చేసుకున్నాడు. ఏ ఒక్కరినీ కటాక్షించలేదనుకుండా, తన పత్నుల యందు బద్ధానురాగుడై జరుపవలసిన కార్యక్రమములన్నీ తానుగా సలుపుతున్నాడు. నా మగని ప్రేమ నాకే స్వంతమన్నట్లు వాళ్ళానంద డోలికలలో తేలియాడుతున్నారు.

స్వస్తి ప్రజాభ్యాం పరిపాలయంతాం...! నిజమైంది. సర్వేజనాః స్సుఖినో భవన్తు" నిత్య సత్యమయింది. "సత్య" ఆలోచనలు సమసిపోయాయి. ఎవరి అనురాగము వారు పొందుతూ రాగద్వేషాలకు అతీతులై అందరు సుఖంగా వున్నారు.

**- స్వస్తి -**

# పాహిమాం - శ్రీకృష్ణ

**ఒ**కనాడు అందరితో కలిసి యధావిధి తన సూచనలు, సలహాలను, వాసుదేవుడు అందిస్తున్న తరుణంలో "ప్రభూ!" అంటూ ద్వారపాలకుడు వచ్చాడు. గిరివ్రజపురము నుండి, ఒక బ్రాహ్మణుడు తమ దర్శనార్థం వచ్చారని తెలిపాడు.

"బ్రాహ్మణో మమదేవతా...!" అనే కృష్ణ వాసుదేవుడు, వెంటనే "ఉద్ధవా ? నీవు వెళ్ళి ఆ మహనీయుని, స్వాగత సత్కారాలతో తీసుకురమ్మని చెప్పాడు. ఉద్ధవుడు, కృష్ణుని ఆదేశము మేరకు, ఆ బ్రాహ్మణోత్తముని, సకల విధ మర్యాదలతో, గోవిందుని వద్దకు తీసుకు వచ్చాడు.

ఆ భూసురోత్తముని చూస్తూనే కృష్ణుడు, తను లేచాడు. వందన మర్పించాడు. తగు ఉన్నతాసనాన్నొసగాడు. తాము వచ్చిన పని... కొంతసేద తీరిన తదుపరి అడిగాడు.

"ఓ గోవిందా! గిరిధారీ, శిష్టజన రక్షకా, దుష్టజన శిక్షకా! కటాక్షించాలి. నీ కరుణ కోరి వచ్చాము. మా ప్రభువు జరాసంధుడు, తమకు తెలిసినవాడే. ఆర్యావర్తముపై ఆధిపత్యమపేక్షించి "రాజమేధము" జరుప సిద్ధపడుతున్నాడు.

మధురానగర విధ్వంస సమయంలో, ఆతనికెవరో భైరవుడు దర్శనమొసగి, నూట ఎనిమిదిమంది రాజుల తలలను బలి ఇస్తే, తప్పక - ఈ మహీమండలానికి ఏకైక సార్వభౌముడివవుతావని చెప్పాడుట. అప్పటినుండి మా చక్రవర్తి... ఇందుకు సిద్ధమవుతున్నాడు.

అలాగా...! "అని తలవూపిన కృష్ణుడు - అయితే మాగధునికి భైరవ దర్శనమయిందన్నమాట" సంతోషమన్నట్లు మాట్లాడాడు.

"వాడు భైరవుడో, యక్ష, రాక్షస, పిశాచాలలో ఒకడో... ఎవరికి తెలుసు. మొత్తానికి అతనికి బద్ధులైన రాజులెందరో బందీలయ్యారు. అతి త్వరలో బలి కాబోతున్నారు. ఈ ఉపద్రవం నుండి ఆ అమాయకులను రక్షించాలి. ఇందుకు తమరే తగినవారు.

మరొకమాట. జరాసంధునెదిరించగల వారందరు పరస్పర విద్వేషములతో మెలగుతున్నారు. పాంచాల, ఇంద్రప్రస్థ, హస్తినాపుర, అవంతీ, విదర్భ రాజన్యులు ధైర్యం చెయ్యడం లేదు. జరాసంధుని వునికినే మరచిపోయారో.. లేక వాడెంత?'' అని నిరసిస్తున్నారో ఆ దైవానికి తెలియాలి.

అందరు తలిస్తే, కలిస్తే... ఈ జరాసంధుడెందుకు పనికిరాడు. "నేను'' అని తల ఎత్తలేడు. ఎటొచ్చి మీ యాదవులు మాత్రమే, జరాసంధునికి వెన్నులో చలి పుట్టిస్తున్నారు. ముఖ్యంగా - కృష్ణుడన్నా, బలరాముడన్నా, ఆ చక్రవర్తికి భయం. అందుకే ప్రస్తుత పరిస్థితిని వివరించి, తమను కల్పించుకోమని, రాజలోక రక్షణానికి కదలి రమ్మనమని ప్రార్థించాలని వచ్చానని'' చెప్పాడు.

అంతా విన్న వాసుదేవుడు -

"భూసురోత్తమా! తప్పక మీ మానసం, అభ్యర్థన సాటి రాజన్యుల ఆక్రందన సర్వం గ్రహించాను. తప్పక మీకు పరిష్కారం లభిస్తుంది. వారికి ప్రాణభయం తప్పుతుంది. అనకూడదు కాని.... మీ రాజు, అవని పాలవుతాడు. ఆతనికి నూకలు చెల్లుతాయి'' ప్రతిజ్ఞ చేసినట్లు చెబుతున్నాడు.

తన కృతజ్ఞతలను, బ్రాహ్మణోత్తముడు చెబుతుంటే అలసి వచ్చిన మీరు కొన్నాళ్ళిక్కడ వుండి, విశ్రాంతి తీసుకోండి. అంతా ఆ భగవంతుడు చూసుకుంటాడని ఆ భూసురుని పంపించాడో... లేదో...

**"నారాయణ, మము కావ నీకిదె తరుణం**
**నీ నామస్మరణమే, మాకు మహా భాగ్యం"** అని

పాటలు పాడుకుంటూ, నిత్య హరినామప్రియుడు, అనుక్షణ నామ సంస్మరణుడైన నారద మహర్షి విచ్చేసాడు.

అందరు లేచి, ఆయనకు తగు అర్ఘ్యపాద్యముల నొసగి, స్వర్ణ సింహాసనం చూపారు. అందరిని ఆశీర్వదించగా - కృష్ణుడు -

"మహర్షీ! తమ రాకలోని విశేషం. తెలుసుకోవలసిన విషయ, వివరాలు.. ఆగాడు. చెప్పవలసినవి వున్నవి, లేనివి... ఏవీ విడుచిపెట్టకుండా భగవంతుని ముందు వుంచే ఆ భాగవతోత్తముని తన మనసు విడిచి, అడిగాడు.

ప్రస్తుతం నేను ఇంద్రప్రస్థం నుండి వస్తున్నాను. నీవు ఆదేశించిన ప్రకారం, మయుడు పాండవుల కోసం, ఒక మహాద్భుత సభా భవనాన్ని నిర్మించాడు. ఆ "మయసభ" మహాద్భుతంగా వుంది. నేను ఇంద్ర, యమ, కుబేరాది... ఎన్నెన్నో సభలెన్నో చూసాను. అవన్నీ ఒక ఎత్తు. ఈ ధర్మరాజు సభ ఒక ఎత్తు. దీని నిర్మాణానికి, ఆ మయునకు పధ్నాలుగు మాసాలు సమయం పట్టిందిట.

అదెంత చిత్రమైనదంటే, దానిని "మయసభ" అనేకన్నా "మాయాసభ" అనడం చాలా సముచితంగా వుంటుంది. వున్నది లేనట్లు, లేనిది వున్నట్లు భ్రమించే మహాద్భుత మందిరమది. బంగారం, రత్నాలు, వజ్రాలు, పొదిగి, పాలరాతి గోడలతో, ఏది నేలో, ఏది గోడో, ఏది నీరో, ఏది మడుగో తెలుసుకోలేని విధంగా, ఆ మయుడు, తన చాతుర్యమంతా వుపయోగించి మరీ నిర్మించాడు.

దానిని, ఎనిమిదివేలమంది, మహాకాయులైన అంతరిక్షంచరులైన, మాయారాక్షసవర్గం భద్రంగా తీసుకువచ్చి, ఇంద్రప్రస్థంలో ధర్మజుని కోట ఆవరణంలో నిల్పారుట. ఈ మయసభతోపాటు ఆ మయుడు భీమునికో గద, అర్జునునికో శంఖము ఇచ్చాడుట. ధర్మరాజు మయుని అద్భుత శిల్పకళా నైపుణ్యానికి, ఎంతో ఘనంగా సత్కరించాడుట.

అయితే ధర్మరాజు సభా ప్రవేశం గావించాడన్నమాట. మాటవరుసకన్నా తనకు తెలియనట్లు కృష్ణుడడిగాడు. ఆ.... ప్రవేశంగావించారు. ధౌమ్యులవారు నిర్ణయించిన శుభముహూర్తంలో ద్రౌపదీ సమేతుడై యుధిష్టరుడు సభా భవన ప్రవేశం గావించాడు.

భూసురులకు వేయేసి గోవులను సాలంకృతంగా నొసగి, వారిని అపూర్వ రీతిన గౌరవించాడు. సుబల, మార్కండేయ, శాండిల్య, మందపాల, యాజ్ఞవల్క్య, వ్యాస, జైమిన్యాది మహర్షులెందరో వచ్చారు. వారందరిని సముచితరీతిని అర్ఘ్యపాద్యాదులతో అర్చించి, తన భక్తి ప్రపత్తులను చాటుకున్నాడు. వీరితోపాటు ఎందరో రాజులు తమ భూరి కానుకలతో, ఆ మహోత్సవాన్ని దర్శించి, తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

అందర్నీ వారి వారి స్థాయిని బట్టి యుధిష్టరుడు గొప్పగా సత్కరించాడు. అయితే, వాసుదేవా! ఈ మయుడు, ఈ మందిరాన్ని గొప్పగానే నిర్మించాడు

కాని, నిష్కల్మష హృదయంతో మాత్రం కాదు. ఇందులో వాస్తు విరుద్ధంగా నైఋతిలో కొలనును నిర్మించాడు. అది దోషభూయిష్టమే కాదు, సకలారిష్ట దాయకం. దీనివలన ఆ యజమాని దారుణ దుఃఖానికి గురవుతాడు. అతనితోపాటు ఆతని ఆశ్రితులు.

కారణం... అర్జునుని వీర విజృంభణం, ఖాండవ దహన సమయంలో తన వారినందర్ని నిర్జించగా, నీవాతనిని దండించబోతే అర్జునుడు అడ్డుపడ్డాడు. ఆ కృతజ్ఞతకు ఈ మందిర నిర్మాణం జరిగింది. మనసులో మాత్రం తనవారి దుర్మరణానికి కారకుడైన వారి నాశనార్థం, పగ-ప్రతీకారాలతో నిర్మితమయింది.

"దీనినెవరు గుర్తించి, వారించలేదా ?" కృష్ణుడడిగాడు.

"ప్రభూ! అందరిలో ఆనందమే తప్ప ఇతరాలోచనములు లేవు. యుధిష్ఠరుడు చేసిన దానధర్మాలవల్ల, పెద్దలాశీస్సులవలన, భూసురుల సంతృప్తి పరచినందువలన, ఈ ప్రమాదం... అదే దోషపరిహారమౌతుందని తలిచారు తప్ప ఏ ఒక్కరు - అది దోషమని తలచలేదు, ప్రకటించలేదు.

అయినా జరగాల్సింది, జరగాలి కదా! ఆపగలిగే వారెవరు ? నిర్ణయం - ఆ పరమాత్మది. విధి బలీయం. అనుభవం - అవశ్యం. ఇందుకు పరిహార ముండదు. ప్రాయశ్చిత్తం కనబడదు. ఇవన్నీ నీకు తెలియనివి కావు. నీకు చెప్పేటంత ఘనుడిని, మహాపురుషుని కాదని, చెప్పవలసింది, అర్థమయేటట్లు ఏదో రకంగా నారద మహర్షి చెప్పేసాడు.

ఇప్పుడు నేను వచ్చిన అసలు విషయం. ఈ మధ్య నేను యమసదనాన్ని దర్శిస్తే అక్కడ పాండురాజు కనబడ్డాడు. ఎంతో అసంతృప్తిగా వున్నాడు. యుధిష్ఠరుడు కనుక, రాజసూయ యాగం చేస్తే, ఆ పుణ్యంతో తాను పునీతుడ నౌతానని, పుణ్యలోకాలను పొందుతాననే భావనలో వున్నాడు. ఈ విషయాన్ని తన కుమారులకు చెప్పమన్నాడు.

మొన్న వెళ్ళిన సందర్భంలో ఇది చెప్పాను. అందరు ఎంతో ఆనందించారు. కానీ... "కానీ...!" ఆ సంశయమేమిటో...

"మా బావ, కృష్ణుని ఆదేశం లేకుండా, వారి సహకారం లేకుండా, ఇది సాధ్యమా ?" అని ప్రతి ఒక్కరు సందేహించారు. అయినా నేడో, రేపో నీ వాళ్ళు

నీ దగ్గరకు రావచ్చును. నీ సాయము కోరవచ్చును. నీవు లేక వారేమీ చెయ్యలేరన్నది జగమెరిగిన సత్యమని చెప్పి వూరుకున్నాడు.

సరిగ్గా - ఇదే సమయంలో, ఇంద్రప్రస్థము నుండి వచ్చిన వార్తాహరులు,

"జయము, జయము వాసుదేవా! జయము, జయము. మా మహారాజు యుధిష్ఠరులు, యువరాజు భీములవారు తమ ఆశీస్సులనంద చేయమన్నారు. అర్జున, నకుల సహదేవులు, మామహారాణి ద్రౌపదీదేవి, రాజమాత కుంతీదేవి తమ సోదరి సుభద్రలు, సర్వులు తమకు వందనములర్పించమన్నారు.

"ఓ దేవ దేవా! నారదమహర్షి ద్వారా, స్వర్గీయ పాండుభూపతి, తమ కుమారులను రాజసూయ యాగము చేయనాదేశించారు. ఇందుకు తమ అనుమతి, ఆశీస్సులు కావాలి. తమరు ఔనన్న, ఈ క్రతువును, నిర్విఘ్నముగా నిర్వహింపచేయ, మా సార్వభౌముడు తమకు విన్నవిస్తున్నాడు.

తాము తమ దేవేరుల సహితముగా, వచ్చి ఈ క్రతువును సర్వతోభద్రముగా నడిపింప, జరిపింప, తమ మేనత్త, రాజమాత కుంతీదేవితో పాటు, సర్వులు అభిలషిస్తున్నారు. తమ రాకకై ఎదురు చూస్తున్నారు. ఈ విజ్ఞప్తిని ఆహ్వానముగా చేసుకుని, తమను కృతార్థులను చేయ మరీ మరీ ప్రార్థిస్తున్నారని, దూతలు వినయముగా చెప్పి ప్రక్కన నిలిచారు.

"ఉద్ధవా! మన కర్తవ్యము" వాసుదేవుడడిగాడు.

"ప్రభూ! నేను కేవలం సేవకుడను. సర్వ సమర్థుడవు, సర్వాంతర్యామి, సర్వ హృదయాంతర్వర్తియైన నీ ఆదేశము తలదాల్చువారిమే తప్ప, నిర్ణయము, స్వయంగా చేయు సామర్థ్యము మాకెక్కడదని ? రెండుచేతులు జోడించి నమస్కరించాడు. మరల ఉద్ధవుడు -

"కాదు, మామాట తెలియబరచాలి" అంటే... అందరిలోకి గర్వాహంకారాలు పెచ్చుమీరి సాటి రాజులను, పావులుగా వాడుకునే జరాసంధుని ముందు నిగ్రహించాలి. ఆ తదుపరి సర్వము సానుకూలమని, నా భావన. మిగిలిన విషయాలన్ని తమకు తెలిసినవే" అన్నాడు.

మొత్తానికి గిరివ్రజపుర భూసురోత్తముని కోరిక నెరవేరబోతుందను కున్నాడు, కృష్ణుడు. సరే దైవ నిర్ణయమన్న వాసుదేవుడు, పట్టమహిషి రుక్మిణితో కలిసి దేవఋషి నారదుల వారిని అర్ఘ్యపాద్యాదుల పూజించాడు. కృష్ణునికి - మహర్షుల ఎడగల భక్తికి సంతోషించిన నారదుడు దేవలోకానికి బయలుదేరాడు.

ఇప్పుడు కృష్ణుడా భూసురోత్తముని పిలిపించి, వారిని తగు విధమున సత్కరించాడు. అయ్యా! తమరు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటూ వుండండి. అత్యవసరంగా మేము, ఇంద్రప్రస్థానికి వెళ్ళాలి. అక్కడ మా బావ, సార్వభౌముడు, తన తమ్ముళ్ళతో కలిసి, తమ తండ్రిగారి ఆనతి ప్రకారం రాజసూయ యాగం చేయతలపెట్టాడు.

దానికొక రూపము నొసగి, కర్తవ్యమాలోచించి, ఆ పనిలో పనిగా తప్పక, మీ గిరివ్రజపురానికి రాగలము. జరాసంధుని చెరలోని రాజులు తప్పక రక్షించగల వారమని తెలియబర్చండి "అని సకల దేవతాస్వరూపుడైన ఆ శ్రీకృష్ణుడు, "గో, బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్య"మన్న వాక్యానికి నిదర్శంగా రెండుచేతులు జోడించి, శిరమును తాకించుకుని మరీ వందనం చేసాడు.

ఆ భూసురోత్తముడు ఆనందపరవశుడయ్యాడు.

వరుసగా వాసుదేవుడు మహారాజును దర్శించి విషయ వివరం చేసాడు. అలాగే తల్లిదండ్రులకు, పెద్దన్నకు చెప్పవలసినది చెప్పి, ముందుగా తాను కొందరు ముఖ్యులు తన దేవేరులతో వెడుతున్నానని, యాగసమయానికి తాము జననీ జనకులు, ఇతర ముఖ్యులతో రావలసినదని చెప్పాడు. ఈ పనిలో పనిగా, రాజసూయం పేరిట, జరాసంధుని దర్పానికి, దురహంకారానికి చెల్లు పెట్టాల్సి వస్తుందని, ఉపేక్షిస్తే - నూట ఎనిమిదిమంది రాజుల తలలు ఆ భైరవునికి అర్పణమౌతాయని చెప్పాడు. అందుకైనా - ఈ రాజసూయ యాగం జరుగ వలసిందేనని కృష్ణుడు తీర్మానించాడు.

ఈ విషయాన్ని మళ్ళీ మళ్ళీ మహారాజుతోపాటు తల్లిదండ్రులకు, పెద్దన్నకు వివరించి చెప్పాడు. మహారాజుకు, తన ప్రయాణ వివరం మొత్తం తెలియ బరిచినట్లు చెప్పాడు.

కృష్ణునితో ఆయన ఎనిమిదిమంది దేవేరులు, వారి సంతానము బయలు దేరారు. రుక్మిణీ సుతుడైన ప్రద్యుమ్నుడు తాతగారితో కలిసి వస్తానని ద్వారకలో వుండిపోయాడు. వీళ్ళు ఆ వర్తక, సౌవీర, కురుదేశాలను, ఇందుమతి, వృషద్వతి, సరస్వతి నదులను దాటి ఇంద్రప్రస్థాన్ని చేరారు. అక్కడినుండి వీరి రాకను సార్వభౌమునికి తెలియబరిచారు.

వాసుదేవుని రాకకై ఎదురుచూస్తున్న పాండవులు, ఆయన పొలిమేరలకు వచ్చినట్లు తెలియగానే భీమార్జున నకుల సహదేవులు, అభిమన్యుడితో కలిసి ఆ వనసీమల కలుసుకున్నారు. ఉభయకుశలోపరి తదుపరి భీముడు “అవును బావా! నీ దేవేరులందరు.... అంటే... ఈ ఎనిమిదిమందేనా ?” అడిగాడు.

అందరు.. అదే పదహారువేల వందమంది వస్తే.... మాకు వసతి సేవలు చెయ్యడానికి, మళ్ళీ ప్రత్యేకంగా ఒక నగరాన్ని నిర్మించాలి. రాజసూయం మాట మరచి “కృష్ణప్రియ”ల సేవతో తరించాల్సి వస్తుందన్నాడు.

అప్పుడు భీముడు నవ్వుతూ, మెల్లగా “ఆ పదహారువేల నూరుమంది పేర్లు నీకు తెలుసా ?” అన్నాడు. అందుకు సమాధానంగా - గోవిందుడు -

“చాలావరకు తెలుసు. లెక్కలో తేడా వస్తే ప్రక్కనే వుంది కదా, పోరి కోరి సవతులను తెచ్చుకున్న సద్ధర్మరాలు మా సత్య” అన్నాడు.

ఆ కబుర్లతో ఇంద్రప్రస్థము చేరారు.

యుధిష్టరుడు, ద్రౌపదీ సహితుడై, కృష్ణునికి, ఆతని దేవేరులు, సంతతికి, తగు విధమైన స్వాగతాంజులులర్పించాడు. వెంటనే కృష్ణుడు తన కుటుంబంతో మేనత్త కుంతిని దర్శించి ఆమె ఆశీస్సులనందుకున్నాడు.

కృష్ణుని, ఆతని కుటుంబాన్ని చూసి నవ్వుకున్న కుంతిని చూసి “ఏమిటత్తా!” అంటాడు. “ఏం లేదయ్యా! పదహారువేల వందమందిని..

“నువ్వు మొదలుపెట్టావూ ?”

“తప్పదు. ఎలాగ వివాహం చేసుకున్నావు ? ఎలాగ చూసుకుంటున్నావు ? ఇదే కదా మా అందరి సందేహ”మంటుంది.

"ఇందుకు సమాధానం చెప్పగలిగింది సత్య మాత్రమే. ఈ కథానాయకురాలి పర్యవేక్షణలోనే, ఆమె సత్యాపతి, వారందరికి గూడా పతి అయ్యాడు! ఇక వారిని చూసుకోవడమంటావా ? వారంతా తపోసిద్ధులు. సంకల్పబలులు. వారికి అసాధ్యమన్న దెక్కడా వుండదు. లేదు కూడా.

వాళ్ళు తమ తపోశక్తితో సర్వము సాధించుకున్నారు. శుభ, సుఖమూర్తులై చరిస్తున్నారని ముగించాడు. ''తపోశక్తి, సిద్ధు''లనే సరికి ''నిజ''మని ఆ సంభాషణమునంతటితో కుంతి ఆపేసింది.

# రాజసూయం

**"చె**ప్పుబావా!" అన్నాడు, తన నర్చించి, తన అభిమానాన్ని ప్రకటించుకున్న యుధిష్టరుని చూస్తూ.

నారద మహర్షి రాక, తండ్రిగారి ఆదేశం చెప్పి, నీ కరుణ నభ్యర్థిస్తున్నా నంటాడు.

"తప్పక నీ మనోభీష్టం, నీ తండ్రిగారి మనోభీష్టం త్వరలో నెరవేరుతాయి. గతంలో పరశురాముని అవక్ర పరాక్రమానికి, ఈ భూతలంలోని క్షత్రియ వంశాలన్నీ నశించి, కేవలం రెండే రెండు మిగిలాయి. అవి హైహేయ, ఇక్ష్వాకు వంశాలు వీటినుండి కాలక్రమంలో నూటొక్క వంశాలు రూపొందుకున్నాయి. వీటిలో యదు, యయాతి, భోజ వంశాలు, మొత్తం పధ్నాలుగు.

ఇందులో చాలావరకు జరాసంధుని ప్రాభవానికి తలఒగ్గాయి. ఇతడు సామాన్యుడు కాడు. వజ్రశరీరుడు, మహాబలసంపన్నుడు, మీ పినతల్లి కుమారుడు, ఛేది దేశాధిపతి శిశుపాలుడు, ప్రస్తుతం జరాసంధుని సర్వ సైన్యాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నాడు. కొందరు జరాసంధునికి నిజమైన విధేయులైతే, అదే.... సామంత రాజులైతే, మరికొందరు ఆయన వీరవిక్రమానికి భయపడి తల వంచుతున్నారు.

ఈ సమయంలో నీవు రాజసూయ యాగం చేయడం చాలామందికి ఆనందదాయకం. ఎటొచ్చి నాపాత్ర వుందంటే కొందరికి ప్రాణాంతకం. ఇంకొందరిక

భయానకం. చాలామందికి ఆనందదాయకం. ముఖ్యంగా జరాసంధుడు, ఒంటి కాలిపై లేస్తాడు. రాజసూయానికి, తానుగా, తన సామంతులతోనో లేక మరో మార్గంలోనో ఏదో విధంగా అడ్డు తగులుతాడు. నీ సార్వభౌమత్వానికి గండిపెడతాడు.

నా మీద గల విరోధమందరికి తెలుసు. అవతలివాడెంతటివాడైనా, అదే... ఎన్ని తప్పులు చేసినా, సమర్థించడం దక్షతగా తలిచే కొందరు, అపాయాల నుండి బయటపడి, ఉపద్రవాల నెదుర్కొని, పిలిచి ప్రాణం తీయించుకున్న మా కంసమామపై సానుభూతి, అన్ని రకాలుగా అధిక్షేపించబడిన నాపై కోపం.

"కంసుని" కంసునిగా చూడక, తన అల్లుడిగా తపించి తలచే జరాసంధుడు, తన కూతుళ్ల సౌభాగ్యం హరించుకుపోయిందని నాపై కక్ష గట్టాడు. మధుర వినాశానికి దోహదపడ్డాడు. కానీ ధర్మం తప్పని నేను, దుర్మార్గుల మదమణచడానికే జన్మించిన నేను, ఎప్పుడు "పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతాం" అంటూ, వాళ్ళ తప్పులకు వాళ్ళనే బలి చేస్తున్నాను తప్ప, నాకు ఒకరిపై ప్రేమ లేదు. మరొకరిపై ద్వేషం లేదు.

సర్వభూతాత్ముడను, సమాహిత చిత్తుడనైన నాకు ఎవరిపైన కోపం ? వస్తే, అది నా పైనే రావాలి. ధర్మరక్షణం, సరిగ్గా చేయలేకపోతున్నందులకు. ఈ కంసవధ గాథలో కొందరు, అయినవాళ్ళే శత్రువులయ్యారు. వీరిలో కొందరు కాలక్రమంలో తమ అనవసర కోపాన్ని వదులుకుని. నాకు మిత్రులయ్యారు. ఈ మిత్ర-శత్రువులంతా - కార్యకారణ స్వరూపులే తప్ప కాలపురుషులు కారు.

జరాసంధుడు ఎన్ని రకాల మమ్ము మట్టుపెట్టదలిచాడో లోకాలకే తెలుసు. అయినా కోపం లేదు. నా వాళ్ళను (నన్ను నమ్మిన వాళ్ళందరు నా వాళ్ళే) చంపుదామనేసరికే, నేను నా ప్రయత్నాలను ప్రారంభించి రక్షించుకున్నాను. ద్వారకాపురివాసులుగా చేసుకున్నాను.

చివరకు మమ్మెదిరించలేక, మధురలో ఆ జగజ్జెట్టి నూట ఎనిమిదిమంది రాజుల తలలను ఆ భైరవునికి బలి ఇస్తానని శపథం చేసాడుట. ఆ నూట ఎనిమిదిమంది రాజులు ఇప్పుడు జరాసంధుని చెఱలో మగ్గుతున్నారు. వారిని సత్వరం రక్షించుకోవాలి. ఆ ప్రయత్నానికి వూతంగా ఆ భగవంతుడే యజ్ఞ

కార్యక్రమానికి శ్రీకారం చుట్టించాడు. ఇప్పుడు మన ధర్మం - అవతలివారెవరు అని చూడకుండా, వారిని రక్షించడం.

అంతా వింటున్న భీముడు "భలే బావా!" అని భుజం చరచుకున్నాడు. అన్నను యాగానికి సన్నద్ధం కమ్మన్నాడు. ఇక జరాసంధుడా... ? మన బావ అండదండలు నీ ఆశీస్సులు, అర్జున, నకుల, సహదేవుల సహకారంతో ఈ రాజసూయ క్రతువు, మహాభేషుగ్గా జరుగుతుంది. నేను ఆ జరాసంధుని - ఓ ముద్దగా చేసి విడదీస్తానన్నాడు.

కృష్ణునికి కావలసిందదే. జరాసంధుడు సామాన్యంగా చావడు. అందుకు భీముడు కావాలి. ధనసంపత్తిని, అర్జునుడు సాధించి "ధనంజయుడు" కావాలి. నకుల సహదేవులు, తమ తమ ధర్మాలను నిర్వర్తిస్తారు.

నీవు సత్వరము, భీష్మద్రోణాది మహామహులకు, వ్యాసులకు, కురు వంశ-మహామాతకు, ధృతరాష్ట్ర - గాంధారీలకి నీ సోదరులు దుర్యోధనాదులకు, కర్ణ, శకుని, ఏ ఒక్కరిని విడువకుండా అందరికి వర్తమానం పంపు. పెద్దల ఆశీస్సుల నపేక్షించు. చిన్నల సహకార మర్థించు. నీ ఆశీస్సులు ప్రసాదించమన్నాడు.

★ ★ ★ ★

కృష్ణ, భీమార్జునులు, ఉద్ధవాదులతో సుఖాసీనులైన వారలు, తర్జన భర్జనలు చేస్తున్నారు. ఉద్ధవుడిక్కడ, కేవలం ఉత్సవ విగ్రహమైనాడు. ఆ ముగ్గురు జరాసంధునెలాగ వధించాలా ? అని ఆలోచిస్తూంటే -

ఉద్ధవుడు - 'జరాసంధుని ఆయుధాలతో చంపడం కష్టం. అతడు వజ్ర శరీరుడు. వరప్రసాది. కనుక జరాసంధుని ద్వంద్వ యుద్ధంలో చంపాలి. అందుకు సమవుజ్జి మన భీమసేనుడు. అతడందుకు ఒప్పుకుంటే, కార్యం సానుకూల మౌతుంది. దీనికి, "ప్రభూ!" మరి మన బావ ఏమంటాడు. అనగా -

"అవును భీమా, నీ వుద్దేశం ?" కృష్ణుడడుగుతున్నాడు.

"బావా!" ఈ భారం నీది. బాధ్యత నీది" అంటే నీవు ప్రసాదించే పేరు ప్రతిష్టలకు, ఆ ఘనకీర్తికి ఈ భీముడు దాసుడు. నీ ఆజ్ఞానువర్తుడంటాడు.

"శుభస్య శీఘ్రం" మంటారు, ఉద్ధవ - వాసుదేవులు, అర్జునుడు, అవసరమున్నా లేకపోయినా, అవసరముంటుందని ధనుర్బాణాలను సరిచూసుకున్నాడు. అప్పుడు కృష్ణుడు భీమసేనుని చూసి -

"బావా! మామూలుగా అయితే, ఆ శివభక్తుని, వరప్రసాదుని ఎవ్వరు చంపలేరు. కాకపోతే అతను చేసే అల్లర్లు - ఆగడాలు, పాపపు పనులకు, అతని ఆయువు మూడింది. చివరి క్షణాలు వస్తున్నాయి. కాబట్టి, నువ్వా మహావీరుని, బాహుబల భీముని తప్పక వధించగలవు" అని ధైర్యమిస్తాడు.

ఒక శుభముహూర్తంలో వారు, తగు నిర్ణయం చేసుకుని, తీసుకుని గిరివ్రజపురానికి బయలుదేరారు. అది దుర్గమము. శత్రువులెవ్వరు అందు ప్రవేశించలేరు. అంతటి శక్తివంతం చేసాడా నగరాన్ని. ఆ పట్టణమెంత అందమైనదో, దాని నిర్మాణశైలి కూడా - అంత గొప్పది. అయిదు పర్వతాలు - గోరథము, ఋషభము, వైహారము, ఋసిగి, చైత్యక గిరుల మధ్యలో, అత్యంత రక్షణా, శక్తి స్వరూపంగా, దుర్భేద్యమూర్తిగా - ఆ గిరివ్రజపురి నిర్మాణం సాగింది.

ఇందులోని విశేషం. సింహద్వారం గుండా లోపలకడుగు పెట్టినవారెవరు విజయులు కాలేరు. ఆ రహస్యం తెలిసిన కృష్ణుడు వారిని వెనుక ద్వారమైన - చైత్యాకగిరికి తీసుకు వెళ్ళాడు. అక్కడ - ఆ కొండపై మూడు భేరీలు వున్నాయి. మిత్రులు కానివారెవరు, ఆ పురంలో ప్రవేశించినా, అవి వాటంతటవి మ్రోగుతాయి. భయానక వాతావరణాన్ని సృష్టిస్తాయి. కనుక భేదించాలంటాడు.

భీముడు పిడికిళ్ళు బిగించి, వాటిని భగ్నం చేస్తాడు. ఆ ధక్క పైతోలు చిల్లులు పడి మ్రోగడానికి వీల్లేకుండా పోయింది. ఆ తదుపరి బ్రాహ్మణ పక్షపాతియైన జరాసంధుని అనుగ్రహ కోసం, విప్రమూర్తులై, విరుద్ధ ద్వారం గుండా నగరం ప్రవేశం చేసారు. కోటను చేరారు.

ఎవరో విప్రవర్యులనే సరికి, కాలంతో సంబంధం లేకుండా, ఆ వచ్చిన వారిని సాదరంగా ఆహ్వానించి, తగు మర్యాదలు చెయ్యకపోతే "వలదు. మాకివి వలదని' వారు, జరాసంధుని అర్ఘ్యపాద్యాదులనందుకొన తిరస్కరించారు.

ఆశ్చర్యంగా జరాసంధుడు చేసాడు. తన వద్దకు వచ్చి తనను కాదన్నవారిని, ఇంతవరకు చూడని ఆ మగధ చక్రవర్తి, పరిశీలనగా చూస్తూ "ఓ! విప్రోత్తములారా! మీకేం కావాలి, ఏమాశించి వచ్చారు ? నేను చేయదగినది, ఇవ్వదగినది... బ్రాహ్మణ సేవలో వైఫల్యమొందినట్లు బాధపడుతూ అడిగాడు.

కానీ, మీ పద్ధతి, మీ ఆకారాలు.... అన్నీ అనుమానాస్పదంగా కనుపిస్తున్నాయి. బ్రాహ్మణుల రూపంలో వచ్చారు కాబట్టి బ్రతికిపోయారు. మీరెవరు ? వచ్చిన కారణం ?" అడుగుతున్నాడు.

కృష్ణుడు తన మందస్మిత వదనంలో నవ్వులు పూయిస్తూ.

"రాజా! నీ అనుమానం సత్యమే. మేము యాచకులైన నిజమైన బ్రాహ్మణులము కాదు. ఆ రూపంలో నిన్ను చూడవచ్చినవారలము. నీకు శత్రువులం. అందుకనే వెనుక ద్వారం గుండా వచ్చాము. నీవు మాకు హితుడవు కావు. కనుక నీవు క్షమార్హుడవు కాదు.

"ఏమన్నావు ? బ్రాహ్మణరూపంలో వున్నావు కాబట్టి బ్రతికిపోయావు. లేదో... అర్భకుడా ? ఈ పిడికిలి దెబ్బతో, ఆ స్వర్గాన్ని ప్రవేశించేవాడివన్నాడు. దానికి భీముడు అగ్గిగుగ్గిలమయ్యాడు.

"వదరకు. నీ పిడికిలికి , నా పిడికిలి తగు సమాధానమివ్వగల శక్తి వుంది. తొందరపడి ప్రాణాలు తీసుకోకు!" హెచ్చరించాడు. మొత్తానికి అది యుద్ధ వాతావరణానికి దారిచూపుతున్నట్లుంది. ఆ సంఘటనకన్న - ప్రస్తుతం వారి మాటలు ప్రమాద కారణంగా కనుపిస్తున్నాయి.

"మీరు నాకు శత్రువులా ? నేను మీకు శత్రువునా ? అసలు మీరెవరు ? ఎందుకీ అనవసర రగడ... బ్రాహ్మణ రూపానికి శాంతిరూపునిగా మాట్లాడు తున్నాడు.

"నిజం, జరాసంధ చక్రవర్తీ. మనము ఒకరికొకకు శత్రువులం. ఎందుకంటే, ఆర్యావర్తంలో అఖండ సార్వభౌమునిగా, ఈ ధరాతలానికి, సామ్రాట్టుగా వుండగోరి, నువ్వు చేసే రాజ(నర)మేధానికి, జడిసి కాదు. కోపించి, మరీ ఇలాగ వచ్చాము. ఒకరు కాదు, ఇద్దరు కాదు. నూట ఎనిమిదిమందిని, రోజుకొకని హత్యచేస్తే ఆ దేవుడు కరుణించి, సంపూర్ణ సార్వభౌమత్వాన్నిస్తాడా ? ఎవరు చెప్పారు ?

లోకవిరుద్ధమైన కార్యక్రమాలను చేసేవాడు ప్రజావిరోధి. అతనిని బుద్ధిమంతులైన వారెవరైనా సరే, వధించవచ్చును. లోకానికి మేలు చేకూర్చ వచ్చును. ఆ పనిలో భాగంగా వచ్చిన మాతో యుద్ధం చెయ్యి!'' కృష్ణుని ఆ మాటలకు జరాసంధుడు పకపక నవ్వాడు.

మీ ముగ్గురిలో ఇద్దరు అర్భకులున్నారు. ఒకడేమొ గాడిదలాగా కనుపిస్తాడు. ఇందాక నాతో వదిరాడేవాడు... వాడితో యుద్ధం చేసి, ఓడించి, మిమ్ము ముగ్గురిని ముందుగా, నా రాజమేధానికి బలిపశువులను చేస్తానన్నాడు.

"సంతోష''మన్నాడు కృష్ణుడు.

తాను నిర్వర్తించవలసిన కార్యక్రమములన్నీ పూర్తి చేసుకుని యుద్ధానికి వచ్చాడు.

జరాసంధ, భీముల మధ్య - గదలు - ఖణేల్, ఖణేల్‌మని మ్రోగుతున్నాయి. యుద్ధం ప్రారంభమయింది. వీళ్ళ బలప్రతాపాలకు, ఆ గదలు ఎందుకు కొరగాకుండా పోయాయి. దాంతో మల్లయుద్ధాన్ని మొదలుపెట్టారు.

ఎవరికివారే తగు యోధుడు. ధీరుడు, వీరుడు, శూరుడన్నట్లు జబ్బలు చరచుకుంటున్నారు. ముష్టి ఘాతాలతో విజృంభిస్తున్నారు. అధర్మయుద్ధం మాత్రం అక్కడ జరగడంలేదు. వారి యుద్ధకండూతికి, కృష్ణార్జునులు ప్రేక్షకులయ్యారు.

కార్తీక శుద్ధ పాడ్యమినాడు ప్రారంభమైన యుద్ధం, చతుర్దశి వచ్చినా కొనసాగుతుంది. వయసు మళ్ళిన జరాసంధునిలో కొద్దిగా అలుపు. ఇదే తగిన సమయము. వాయుపుత్రా, విజృంభించు'' ఉత్తేజపరుస్తున్నాడు కృష్ణుడు.

దాంతో, తన తండ్రి వాయుదేవుని తలచుకుని జరాసంధుని ఎత్తికుదేసాడు. ఆ దెబ్బకు అంగసంధులు సడిలాయి. ముక్కువెంట, నోటివెంట రక్తం కారుతుంది. క్రిందపడిన జరాసంధుడు లేవలేకపోతున్నాడు.

అదే అదనుగా, కృష్ణుడు ఒక గడ్డిపరకను తీసుకుని చీల్చి అటు ఇటు తలక్రిందులుగా పడేసాడు. ఆ సూచనను భీముడు గ్రహించాడు. లేవబోతున్న జరాసంధుని గుండెపై కాలువేసి తొక్కిపట్టాడు ? ఒక కాలును తీసి, శరీరాన్ని రెండుగా చీల్చాడు. కృష్ణుడు పడేసినట్లు ఆ భాగాలను అటు ఇటు పడేసాడు. దాంతో, అంతటి వజ్రకాయుడు, వరప్రసాది ఘోర మరణాన్ని పొందాడు.

జరాసంధుని అంగసంధులు సడలి, తలక్రిందులై మరణించడంతో, తానేదో ఘనకార్యం చేసినట్లు భీముడు సింహనాదం చేశాడు. అస్త్రం పట్టకుండా, శస్త్రం తియ్యకుండా, జరాసంధుని మరణానికి కారకుడైన శ్రీకృష్ణుని, భీమార్జునులు పలు విధాల ప్రశంసించారు.


కృష్ణుడు భీముని భుజంపై చరుస్తూ "భలే భీమా! అద్భుతం సాధించావు. ఎందరి ప్రాణాలనో రక్షించావు'' అని పొగిడాడు.

అందుకు భీముడు వినమ్రుడై "బావా! ఇదంతా నీ దయ. నువ్వే లేకపోతే ఇది అసాధ్య''మని తన కృతజ్ఞతను చాటుకున్నాడు. అప్పుడు -

జరాసంధుని కుమారుడు, సహదేవుడు వచ్చి "కృష్ణా!" శరణాగతుడనన్నట్లు నమస్కరించాడు. అతనికి అభయమొసగి, నీ తండ్రి చెరపట్టిన రాజులందర్నీ విడుదలచేసి, ధర్మబద్ధంగా పాలనం చేసినన్నాళ్ళు, ఈ వాసుదేవుడు, సదా నీకు తోడుగా వుంటాడని, గోవిందుడు అభయమొసగాడు.

సహదేవుడు, భక్తితో అంజలి ఘటించాడు. కృష్ణుని ఆదేశం ప్రకారం, తన తండ్రి బంధించిన వారినందరిని "శ్రీకృష్ణః శరణం మమ'' అనిపించాడు. అందరికి అభయప్రదానం చేసి, "మీ మీ రాజ్యాలకు వెళ్ళండి. సుఖంగా వుండండి. ధర్మపాలనం చెయ్యండి. కీర్తివంతులై మెలగండి!'' అని అనునయించాడు. ఆనందమూర్తులను కావించాడు.

శ్రీకృష్ణుని, భీమార్జునులను, తలుచుకుంటూ తమకు ప్రాణభిక్ష పెట్టిన వారిని స్తుతిస్తూ, సకల రాజమర్యాదలతో, ఆ రాజులు తమ రాజ్యాలకు బయలుదేరారు.



# యజ్ఞ సన్నాహం

శ్రీకృష్ణుడు సూచించిన ప్రకారం, యుధిష్టరుడు దీక్షాధారుడైనాడు. అన్నదమ్ములు నల్వురు నాల్గుదిక్కులకు బయలుదేరారు. దిగ్విజయ యాత్రతో అపార ధనరాశులను తీసుకు వచ్చారు. యాగం దిగ్విజయమయింది. ఈ రాజసూయం పేరిట సర్వ రాజ్యాలవారు, యుధిష్ఠరుని ఆధిపత్యాన్ని ఇంద్రప్రస్థ సార్వభౌమాధికారాన్ని గుర్తించారు. అనంత ధనరాశులతో యుధిష్ఠరుని కోశాగారం శ్రీ "లక్ష్మి"యై శోభిల్లుతుంది.

ఇంతటి పుణ్యకీర్తి, శ్రేయము సాధించి పెట్టినవారు - నారదుడు, ఆతని పేరున తండ్రి. ఈ రంగం దిగ్విజయమొనర్చిన సూత్రధారి శ్రీకృష్ణుడు. పాత్రధారులు భీమార్జున నకుల సహదేవులు. సహకరించింది పెద్దల ఆశీస్సులతో సర్వరాజలోకము.

వ్యాసులవారి సలహా సంప్రదింపులతో యాగ నిర్విఘ్నానికి కావలసిన సూచనలను పొంది తరించమని కృష్ణుడు సూచించాడు. తన వంశాంకురాలు తలపెట్టిన మహత్కార్యానికి శ్రీవేదవ్యాసులు శ్రీకారం చుట్టారు.

కుంతి - కోడలుగా - ఆ ధర్మమూర్తికి అంజలి ఘటించి, కార్యక్రమమును దగ్గరుండి జరిపించమని ప్రార్థించింది. అందుకు వ్యాసుడు సమ్మతిస్తూ వాసవాదులను నిగ్రహించగల్గిన వాసుదేవుడుండగా సర్వము శుభము - పూర్ణమౌతుందని ఆశ్వాసించాడు.

ఒక్కొక్కరిని పేరు పేరున, వాళ్ళెంతవరకు వెళ్ళారో, ఏ విధమైన లాభములు పొందారో, అన్నదమ్ములు నలుగురిని వ్యాసులవారడిగారు. వారు చెప్పినది విని అభినందించారు. ఇదంతయు శ్రీకృష్ణ-వాసుదేవుని అనుగ్రహమని, జరాసంధ వధతో మాకు దారి చూపాడని, పాండునందనులు తమ కృతజ్ఞత తెలిపారు. నిజమేనయ్యా, భగవత్సంకల్పము, అనుగ్రహమే సర్వకార్యసాధన. సర్వార్థ సాధకము తారకమౌతుందని వారి సత్యవాక్కును ప్రశంసించారు.

వారి అపారధనరాశుల, మణిమయభూషణాల కోశాగారమును చూసి సంతోషించిన వ్యాసభగవానులు ఈ మొత్తం కార్యక్రమం దిగ్విజయము -

పూర్ణము కావలెనన్న - నిరతాన్నదానమే ముఖ్యాంగం. అందులో మనం సఫలీకృతులమయితే, విజయం సంపూర్ణఫల మొసగుతుంది. పూర్ణాహుతి, పూర్ణ ఫలాన్ని ప్రసాదిస్తుందన్నారు.

ఇది అపురూపమైన సభ. ఇది అందరికి ఆనందదాయకం కాదు. అసూయాగ్రస్తమౌతుంది. రకరకాల ద్వేషభావాలు బయలుదేరుతాయి. వీటినుండి పరిష్కారము, దోషపరిహారము, కేవలం మృష్టాన్న భోజనము వలనే సంభవం. ఎవరికి ఏమిచ్చినా ఇంకా కావాలనే అసంతృప్తే తప్ప, "చాలు"ననే సంతృప్తి లభించదు.

ఈ అన్నదాన విషయంలో అలాగ కాదు. కడుపుకు పట్టినంత తిని "చాలు బాబోయ్!" అని తృప్తిగా అరిచేస్తాడు తప్ప, ఇంకా కావాలని గొణుగుడు. దాచుకునే ప్రయత్నం చెయ్యడు. ఏదైనా దాచుకోవచ్చును. ఈ తృప్తిని మాత్రం దోచుకోవడం జరుగదు. ఇంకో ముద్ద, ఇంకో బూరె, ఇంకో గారె.... అంటే. తినలేను. ఏ మాత్రం ఖాళీలేదు. చాలు బాబోయ్" అంటాడే తప్ప, అలాగే ఇంకో రెండివ్వు అనడు.

పొరపాటున ఎవరైనా, రెండో, మూడో - గారెలో, బూరెలో అడిగి తీసుకు వెళ్ళి, ఆ సమయంలో సకాలంలో కనుక తినకపోతే, పారెయ్యాలే తప్ప దాచుకునే సావకాశం లేదు. అదే వెండి, బంగారు, రత్నమాణిక్యాలు ఇతర విలువైన వస్తువులైతే ఏదో రకంగా సంపాదించి, ఎక్కడో అక్కడ ఎవరు దోచుకోకుండా దాచుకునే ప్రయత్నం చేస్తాడు. అదే ఈ సంతృప్తికర భోజనంతో, ఆ తృప్తి అక్కడికక్కడే తేలిపోతుంది. నిత్యం మృష్టాన్న భోజనాలు చేసేవారికి, వారికి కావలసిన వస్తువులు తినుబండారాలు, కావలసినంత దొరుకుతుంటే, "రేపు" అని ఆలోచించరు. అసంతృప్తికి గురికారు కనుక -

ఆ వచ్చిన వాళ్ళెవరైనా భగవత్స్వరూపంగా భావించి, ఆ దేవతలను పూజించినట్లు, విందు భోజనాలతో పసందుగా వడ్డిస్తే - అంతకుమించిన ఆశీర్వచనం దొరకదు. ఆ తృప్తి - సంతృప్తులు పొందిన దివ్యమూర్తుల ఆశీర్వచనాలు - సర్వపాప - దోష పరిహారాలై సమస్త శుభములను, సుఖములను ప్రసాదిస్తాయి, అన్నారు - అన్నదానంపై అడిగిన వివరణకు సంతృప్తికరంగా - వేదవ్యాసులవారు, తమ వివరణనిస్తూ.

అందరికి ఆహ్వానాలు పంపండి. తగు ఏర్పాట్లు చేయండి. ఎవరిని అసంతృప్తిపాలు కానివ్వకండి. ఇక్కడ తన - పర భేదాలుండవు. అందరు మన వాళ్ళే. ఆ దైవస్వరూపాలే. ఈ భావం నీ అన్నదమ్ములు సంపూర్ణంగా విశ్వసించి, ఆ విధంగా ప్రవర్తిస్తే, చెబుతున్నాను కదా, సర్వము శుభమే అవుతుంది. మిగిలిన విషయాలు వివరించేందుకు, ఎటువంటి ప్రయత్నాన్నైనా సాధించి పెట్టేటందుకు, ఆ వాసుదేవుడు - చిన్మయానందుడై మనచెంత వున్నాడు. చింతలన్నీ తీరుస్తాడని, వేదవ్యాసులవారు మళ్ళీ మళ్ళీ చెప్పారు.

వేదవ్యాసులవారి సూచన ప్రకారము, రాజపురోహితులు, పాండవ పురోహితులు ధౌమ్యులవారికి సర్వబాధ్యతల నొసగారు. వేదవేదాంగవేత్తలను, యజ్ఞసంరక్షకులను, నిర్వాహకులను పిలిపించారు. వారికి తగు వసతి ఏర్పాట్లు చేసారు.

వివిధ వస్తువులతో - అమూల్య వింత విచిత్ర వస్తువులతో దుకాణాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఎవరికి, ఎటువంటి ఇబ్బంది - ఇటు అతిథులకు గాని, చూడవచ్చిన వారికిగాని, స్థానికంగా వున్నవారికి కానీ, రాకూడదు. ఆ విధమైన ఏర్పాట్లు చెయ్యాలి. ఎవరికో హెచ్చరిక చెయ్యడం కాదు. బాధ్యతాయుతంగా చూసుకోవడం, ఈ అపురూప నిర్వాహకుల యజ్ఞదీక్షితుల బాధ్యత.

శాస్త్ర ప్రకారం యజ్ఞవేదిక నిర్మాణంతో మొత్తం వేదవ్యాసులవారు, ఇంద్రప్రస్థములో ఒక అపురూప యజ్ఞనగరాన్నే నిర్మింప చేసారు. ఇక ధర్మరాజు, ద్రౌపదీ సమేతుడై - దీక్ష తీసుకోవడమే తరువాయి. ఆ రకంగా అన్ని ఏర్పాట్లు ప్రతి విషయంలో ఏమరుపాటు లేకుండా చేయబడ్డాయి.

సహదేవుడు పంపిన ఆహ్వానాలను అందుకున్న రాజులు, తమ తమ పరివారాలతో వైభవ చిహ్నాలతో, అట్టహాసంగా అప్పుడే రాకను ప్రారంభించారు. విరాట, గాంధార, ప్రాగ్జ్యోతిష, అవంతీ, మగధ, విదర్భ దేశాధీశులు, ఆర్యావర్తంలోని ఇంచుమించు ప్రతి ఒక్కరు పేరుకు, అది యుధిష్ఠరుని రాజసూయమయిందే కాని, శ్రీకృష్ణుని అభిమాన, వాత్సల్య - అప్యాయ, ప్రాణరక్షణా దీక్షాశక్తికి ధీటుగా, ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాలతో వస్తున్నారు.

నకులుడు, ప్రత్యేకంగా - యుధిష్టరుని దూతగా హస్తినకు వెళ్ళి వంశవృద్ధులను, పెద్దలను, పెదతండ్రి, పితామహులను, సోదరులను, పేరు

పేరునా పలుకరించి, రాజసూయానికి రమ్మనమని, సాదరాహ్వానం, స్వాగతంగా పలికాడు. ముందుగా వచ్చి ఆశీస్సులు, తమ అభిమానాన్ని ప్రకటించి, తగు రీతి సూచనలు, సలహాల నొసగి, యజ్ఞం దిగ్విజయ మొనరించమని, యుధిష్టరుని పనుపున ప్రార్థించాడు.

అందరు బయలుదేరి వచ్చారు.

పితామహుని చూస్తునే యుధిష్టరుడు భార్యా సహితుడై పాదాభివందనం చేసి, ఆ పెద్దాయనను అర్ఘ్యపాద్యాదుల పూజించి, ముందు ఆశీస్సుల నపేక్షించాడు. ఆ తదుపరి జరిగింది యావత్తు పూసగుచ్చినట్లు చెప్పాడు.

పితామహుని ఆశీస్సులు తీసుకున్న తదుపరి ద్రోణాచార్యులను సందర్శించి, తమరు పెట్టిన విలువిద్య భిక్షయే అర్జునుని ద్వారా నాకింత అదృష్టం కల్గించిందని, వినయపూర్వకంగా చెప్పిన యుధిష్టరుడు "గురుదేవా! ప్రతిపనిలో నాకు తెలుసనుకుంటాము. విచక్షణా జ్ఞానం విడిచిపెడుతాము. అలాగకాకుండా, ఈ మొత్తం మీ కార్యక్రమముగా సర్వము సమీక్షించి, ఈ క్రతువు దిగ్విజయం చేయించమని ప్రార్థించాడు.

కృపాచార్యులను దర్శించి, సాష్టాంగ నమస్కారారం చేసి "మీవద్ద అక్షరాలు నేర్చుకున్న ఈ పిల్లవాడు చేసే ఈ కార్యక్రమాన్ని తాము జయప్రదం చేయించా లన్నాడు. అలాగే -

విదురుదేవుల వద్దకు వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేస్తే - ఒక సామ్రాట్టు, ఒక మంత్రికిలా పాదాభివందనం చెయ్యరాదేమో!" అనగా -

"తండ్రీ! నీవు పినతండ్రివి, ధర్మమూర్తివి. నీ దయాదాక్షిణ్యాల కృప కాదా. ఈ మా జీవితాలు. దయచేసి.... ప్రార్థించాడు. "అస్తు" అని విదురుడు ఆశీర్వదించాడు. ఆ తదుపరి -

పెదతండ్రిని, పెదతల్లికి వందన శతాలర్పించి చిన్నగా దుర్యోధనుడి దగ్గరకు వెళ్ళాడు గాఢాలింగనం చేసుకున్నాడు.

"తమ్ముడూ! అందరిలోను నువ్వే పెద్దవాడివి. ఈ భరతవంశ కీర్తి ప్రతిష్టలు సర్వము నీ భుజస్కందములపై వున్నాయి. ఆ వచ్చే వాళ్ళందరు మన అతిధులు

పూజనీయులు. తన - మన భేదంలేని ధర్మబుద్ధివి. వారిచ్చు కానుకలు, సూచనలు సలహాలను స్వీకరించి, ఈ అన్నను ప్రేమించి, ఈ యజ్ఞాన్ని దిగ్విజయమొనర్చ కోరుతున్నాను.'' అన్నాడు.

ఆశ్చర్యపోతున్నాడు దుర్యోధనుడు. స్వంత తమ్ములకెవరికి ఇటువంటి అపురూప బాధ్యతల నివ్వకుండా, తనకిస్తున్నాడంటే.... ఈతడు నిజంగా ధర్మాత్ముడు. ఈ అన్న అజాతశత్రువని - నిర్ధారించుకున్నాడు.

"తప్పక... అని, వెంటనే ఆ అన్నగారికి తెలియబరిచాడు. ఇంకా నీ ఆజ్ఞ నాకు వేదమన్నాడు.

దుశ్శాసనుని సమీపించిన యుధిష్టరుడు "తమ్ముడూ! అందరు సంతృప్తు లయ్యారన్నమాట, వారి ముఖమున నీ ద్వారా వినాలి. మనమందరం సుఖించా లన్నాడు. ఆ తదుపరి -

అంగరాజు, కర్ణుని చేరి "నీవు నాకు సోదరుడి వంటి వాడవు - వైదిక కర్మలలో పాల్గొన్న వారికందరికి ఇచ్చు, రక్షణ విభాగాన్ని మన గురుదేవులు కృపాచార్యులవారు చూస్తారు. మిగిలినవారిని సముచిత రీతిని తృప్తిపరచే బాధ్యత నీదన్నాడు.

"అవశ్య"మన్నాడు అంగరాజు కర్ణుడు.

ఇదంతా కృష్ణమాయ - లేదా - లీల. ఆయన సూచన ప్రకారమే, ఈ విభాగాలు విభజింపబడ్డాయి. వారి వారికి నిర్ణయింపబడ్డాయన్న సత్యం -ఎవ్వరికి తెలియదు. ఒక్క ఆ సోదరులకు, కృష్ణునికి తప్ప.

అందరికి అన్ని బాధ్యతలు ఇచ్చేసారు.

ద్రౌపదీ సమేతుడై - యుధిష్టరుడు దీక్షామూర్తవుతున్నాడు. సోదరులను, తల్లిని, ద్రౌపదిని పిలిచాడు. తాను చేసింది, వేదవ్యాసులవారి సూచనను, పెద్దల సమయోచిత సలహాలను తెలియబరిచాడు. ప్రత్యేకంగా "భీమా! మన వంశమూర్తి వేదవ్యాసులవారి సూచనను గ్రహించి వుంటావు. కనుక అన్నదాన విషయంలో తగు శ్రద్ధగా ప్రవర్తించి, మన పితృ పితామహులకు శాశ్వత కీర్తిని ప్రసాదించి పెట్టాలి. ఇది మన ధర్మమన్నాడు. ఆ తదుపరి - అర్జునుని పిలిచాడు.

"అర్జునా! ఆ గోవిందుడు మనకు ఆప్తుడు, బంధువే కాదు. మనకు నిత్య మంత్రమూర్తి. శాశ్వత సిద్ధపురుషుడు. యజ్ఞేశ్వరుడైన ఆ వాసుదేవుని దీక్షాధరుడినై-నేను మంత్రముల అర్చిస్తే, బాహ్యంగా ఆ దేవదేవుని, నీ సేవలతో సంతృప్తి-పరచాలని హెచ్చరించాడు.

"నకులా! యజ్ఞ దీక్షితుడినైన నా చెంత నీ అవసరమెంతో వున్నది. సర్వ సంబారములు శ్రద్ధతో, బుద్ధితో సమకూర్చుకుని, సమయానుకూలముగా అందించ సిద్ధంగా వుండవలెనన్నాడు.

"సహదేవా! చిన్నవాడివే కాని స్థితప్రజ్ఞుడవు. దేవ, గురు, పూజ్యుల, ప్రముఖులు, మునులు, భూసురులు నీ సేవలతో సంతృప్తి చెందాలి. వారి నిరంతరాశీస్సులు మనపై వర్షించబడాలి. అది నీ బాధ్యత" అని చివరగా - పాంచాలిని చూసి -

"దేవీ! యజ్ఞదీక్షితురాలివైనను, మిగిలిన సమయాలలో మన అతిథి అభ్యాగతుల, పెద్దల తృప్తి నీకు విధించిన బాధ్యత" అని బాధ్యతాయుతంగా అందరికి అన్నీ సూచించాడు. ఆ వెంటనే తల్లితో -

"అమ్మా! ఇదంతా నీ పుణ్యము. ఇన్నాళ్ళకు... నీ... అని తృప్తిగా పరవశించే రోజును ఆ వాసుదేవుడు ముఖ్యంగా నీకు, ఆ తదుపరి మనకు ప్రసాదించాడు. వీరిని పలుకరించుకుని, రాక రాక వచ్చిన సావకాశాన్ని సద్వినియోగం చేసుకోమని ప్రార్థిస్తున్నానన్నాడు. కుమారుని పలుకులకు -

కుంతి కళ్ళలో కోటి కాంతులు వెదజల్లాయి. పరమానందమూర్తయింది. "తప్పక నా ధర్మం నేను నిర్వర్తిస్తానంది. ఇంక-మళ్ళీ-పెదతండ్రి వద్దకు వెళ్ళి -

"తండ్రీ! ధర్మరాజు నీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాడన్నాడు. "ఆ మాటలతో దగ్గరకు తీసుకుని అక్కున చేర్చుకున్నాడు. "సంతోషం, తండ్రీ!" కుమారుని ప్రతిభకు ఆనందపడుతున్నట్లు ప్రకటించాడు.

"ఇదంతా తమ ఆశీస్సులు. పెంపకం వలన లభించిన అదృష్టం!" అనగా-

"సంతోషం, నాయనా! యజ్ఞదీక్షితుడివి కమ్ము. భరతవంశ కీర్తి బావుటా దిగంతములకు వ్యాపింప చేయుమన్నాడు. తన ఆశీస్సుల నొసగాడు. యుధిష్టరుడు వెళ్ళిన తదుపరి -

"చూసావా, విదురా! ఈ పాండుకుమారుల వైభవ" మన్నాడు. కానీ, తన తమ్ముని బిడ్డల ప్రాభవమని అనలేకపోయాడా గుడ్డిరాజు. అతడు దేహాంధుడు కాడు - మానసికాంధుడు కూడా!

ఆ మాటలకు విదురుడు, తన సంతోషాన్ని వ్యక్తబరుస్తూ "నిజం మహారాజా! మీ వాక్కు సత్యము. మీ తమ్ముని పిల్లలీనాడు ప్రాజ్ఞులయ్యారు. సకల వైభవమూర్తులయి, మహాయజ్ఞ నిర్వాహణకు అందరి సహకారంతో ముందడుగు వేస్తున్నారు.

ఈ మాటలు మాత్రం ధృతరాష్ట్రునికి రుచింపలేదు. ఇక విదురుని విడిచి పెట్టి, "సంజయా! అదృష్టవంతులనెవరిని ఎవ్వరూ ఏమీ చేయలేరు. నేను వాళ్ళకు అడవులనిచ్చి, అనాథలను చేస్తే - ఆ కృష్ణభగవానుని కరుణతో, ఆ అడవులు, మరుభూములను, అమరపురిని మించి సౌభాగ్యవంతం చేసారు. ఎవరి అదృష్టం వారిది.

ఎంతసేపు మనవాడు, అవతలవారిని ఈసడించుకోవడం, నిరాదరించడం - అపహాస్యాల పాలవడం తప్ప అభాగ్యుడు, ఆ కృష్ణ వాసుదేవుని ప్రాపకం పొందమనీ సుఖసంతోషాల తేలియాడమని చెబితే వినడు. ఏం చేస్తాం!" - ధృతరాష్ట్రుడు - అవతలివారి అదృష్టాన్ని - సుఖసంతోషాలను చూడలేనట్లు బాధపడి పోతున్నాడు.

సమాధానం చెప్పకపోతే, ధృతరాష్ట్రుడు వూరుకోడు. అది మరొక నేరమయి కూర్చుంటుంది. కనుక - "యతో ధర్మ తతో జయః" అన్నారు కదా! ధర్మబద్ధులకు, ఆ దేవతల ఆశీస్సులు తప్పక లభిస్తాయని, సంజయుడు చెప్పాల్సి వచ్చింది. "అంతే మరి" గాఢంగా ధృతరాష్ట్రుడు, తన మనసును ప్రకటించుకుంటూ నిట్టూర్చాడు.

★★★★

యజ్ఞదీక్షితుడయ్యాడు - యుధిష్టరుడు.

వేదఘోషలు, స్వస్తివాచకములు, మంగళవాయిద్యాలు.... నభోవీధికంటుతున్నట్లున్నాయి.

పైల - ధౌమ్య మహర్షులు హోతలుగా, యాజ్ఞవల్క్యుడు - ఆధ్వర్యునిగా, వేదవ్యాసులు, బ్రహ్మగా, ఉద్గాతగా - సునాద మహర్షి, వారి శిష్యులు ఇతర

ఋత్విక్కులుగా, నారదాది మహర్షి పుంగవులు సదస్యులుగా, భీష్మాది రాజర్షులు సహాయకులుగా శ్రీ వాసుదేవ రక్షితమైన రాజసూయా యాగం ప్రారంభమయింది.

యజ్ఞ ముఖమున మంత్రాధిపతులైన సకల దేవతలు సంతృప్తి పొందినట్లు, గగనవీధిని చేరిన ఆ హోమధూమం జ్వాలలే తెలియబరుస్తున్నాయి.

ఈ యజ్ఞ కార్యక్రమాన్ని దర్శించిన వారందరు తృప్తి పొందారు. ఇటువంటి అపూర్వ యజ్ఞము నభూతో న భవిష్యతి - అని ప్రతి ఒక్కరు ప్రశంసించారు. దేవ, గరుడ, గంధర్వ, యక్ష - సిద్ధ - సాధ్యాదులు సర్వులు మహదానంద పడ్డారు.

రాజలోకము - అతిథి - అభ్యాగతులు సరేసరి. వంశ పెద్దగా - భీష్ముడు, వేదవ్యాసులు కూడా తృప్తి జెందారు. ఇంతటి కార్యక్రమం నిర్వహించినందులకు తగు విధంగా, అగ్రపూజ చెయ్యాలి. దీనిని పెద్దలను పూజించాలనడం కూడా కద్దు.'' అన్న భీష్ముడు - స్నాతక, ఋత్విజ, సద్గురు, దేవ, ఇష్ట - ఇలాగ ప్రముఖులందరూ, అగ్రపూజకు అర్హులే. కనుక,.....

"పితామహా! మీరు వుండగా, నేను నిర్ణయం చేయడం తగదు. తమరు ఆదేశించండి, వంశపెద్దలుగా మిమ్మా ? వంశకర్తలుగా వ్యాస భగవానులా... ?'' చెప్పండి. ఎవరికి అగ్రపూజ చెయ్యాలో సెలవిస్తే, వారిని సముచితరీతి గౌరవించుకుంటామంటాడు.

"యుధిష్టరా! ఇప్పుడు కాలము, కర్మము, దేశము, ఆదేశము, క్రతువు - సర్వము - ఈ వాసుదేవుడు, నా వుద్దేశంలో వాసుదేవుని పూజించడమే సద్ధర్మము. సనాతన విధి కూడా! ఇంద్రాదులే కాదు. బ్రహ్మాది దేవతలు సర్వులు పూజించే, ఈ వేదవేద్యుని అర్చించు''మనగా -

సహదేవుడు అర్ఘ్యమునందించాడు. యుధిష్టరుడు వాసుదేవుని, వేదశాస్త్ర ప్రకారము పూజించాడు. అర్ఘ్యప్రదానం చేసాడు.

ఇదొక శుభపరిణామమని, దీనిని గాంచగల్గడం తమ అదృష్టమని అందరు భావించారు. కానీ శిశుపాలాది కొందరు మాత్రం చిర్రున లేచారు. అధిక్షేపించారు. ఆ పూజను సహించలేక -

“యుధిష్టరా! బుద్ధిమంతుడివనుకున్నాను కానీ, వయస్సు మళ్ళిన మందబుద్ధులు చెప్పిన సూచనను ఆసరాగా తీసుకుని, దానినామోదించినట్లు ఏవిటీ పాట్లు ? ఆలోచించు, ఇది ధర్మసమ్మతమా! బుద్ధి వికసిస్తే ఆ ప్రకారంనడుచుకో, సుతిమెత్తని హెచ్చరిక ఆవహేళనలతో ప్రారంభించాడు. అసలు నాకు అర్థం కాదు, కృష్ణుడెవరిని అగ్రపూజ చెయ్యడానికి ?

రాజ్యాధిపతా, క్షత్రియుడా ? కాదే. పోనీ వేదమూర్తా! కాదే! సద్బ్రాహ్మణుడా, అది కాదే. బుద్ధి మందగించిన ఆ ముసిలాయన, గాంగేయుడు చెప్పాడని, ఈ బుర్రలేనివారి అనాలోచిత సలహాలకు తలవొగ్గి, గంగిరెద్దులా తలవూపడం, ఆ వెఱ్ఱిగొల్లడు, లేనిపోని భేషజాలతో అవతార పురుషుడు, ధర్మమూర్తి అని విర్రవీగడం, హ్హా.... చాలా బాగుంది.

ఇతరుల ఇంటికి వెళ్ళడం పాలు, వెన్న దొంగిలించడం పరకాంతల శీలాలతో ఆడుకోవడం, కనుపించిన దానినల్లా అది శరణు కోరిందంటూ పెండ్లి చేసుకోవడం హర్షణీయమా ? ఆతని ధర్మత్వం, మంచితనం, మానవత్వం - మేనమామ కంసుడిని చంపినప్పుడే తెలిసిందా ? అదంతా మాయా, బూటకమని!

జరాసంధ చక్రవర్తిని, దొడ్డిదారిన దొంగలుగా చేరి మాయచేసి చంపినప్పుడే, ఆ వెర్రిగొల్లని మానవత్వం, ధర్మతత్వం లోకానికి అర్థమయింది. నాకు నిర్ణయించిన కన్యను, అపహరించడం; అడ్డువచ్చిన బావమరిదిని, తలగొరగడం, మాననీయుల లక్షణమా ? మహితమహాపురుషులు ప్రశంసించే పెద్ద తనమా!

ఇన్ని ఘాతుకాలు చేసి, మంచికి సమాధి కట్టి, వంచనతో జీవితం గడిపే, ఈ మాయావి, మోసగాడు, శీలరహితుడు, గుణరహితునికి అగ్రపూజా! అది భీష్ముడు చెప్పడం. సద్ధర్మమూర్తిగా, వినయ విధేయతల సౌజన్యమూర్తిగా కీర్తి గడించిన ఈ యుధిష్టరుడు, వివేక, విజ్ఞానాలను మరచి ఆ పశుల కాపరికి పాదపూజ చెయ్యడం, అగ్రపూజను స్వీకరించమని ఆహ్వానించడం, ఈ చోరుడు, ముందుకు రావడం.

వచ్చిన పెద్దలకు, పిలిచిన రాజులను ఆహ్వానించి అవమాపరచడం కాదూ? దీనిని వయసు మళ్ళినవాడి, మతిలేని “మతి”కి, తగుదునంటూ, ఈ వచ్చేవాడికి బుద్ధుండొద్దూ ? పిలవడం వారి సౌజన్యం. అర్హతానర్హతలు, ఉచితానుచితములు తెలుసుకోవాలని పూజలనందుకునేవాడికి వుండొద్దూ ?”

శిశుపాలుని ధిక్కారానికి సహదేవుడు ఆవేశంతో వూగిసలాడుతున్నాడు. ఎర్రటి కన్నులతో, ఆ ఆగ్రహావేశాలతో - "శిశుపాలా! నిన్ను పిలచింది కార్యక్రమం వీక్షించడానికి కానీ, సమీక్షించడానికి కాదు. నీకంటే పెద్దలున్న ఈ సభలో, "తగుదునమ్మా" అంటూ, నీకు నీవే లేని పెద్దరికాన్ని నెత్తిన వేసుకని, సభ్యతా సంస్కారములంటూ వాటిని మరచి, సంస్కృతీ సాంప్రదాయాలను కాదంటూ వదిరే ఈ ధిక్కార ధోరణికి నిన్ను ఏంచేసినా పాపం రాదు.

అయినా మానవత్వం మాయని, సభ్యతా సంస్కారాలు, సాంప్రదాయం వీడని ఓ సద్ధర్మమూర్తికి తమ్మునిగా, ఓ ధర్మస్వరూపునికి బావగా, నిన్ను మన్నించడం జరుగుతుంది. లేదా.... ఇంతవరకు నిగ్రహం మరచి, ఆగ్రహంతో అనవసర వ్యర్థ ప్రలాపాలు పేలిన, నీ నాలుక చీరబడదా ? నీ శిరస్సు - తాటిపండు కాకపోయినదా ?" తమాయించుకోలేక, అనవలసినవన్నీ, చెప్పవలసినవవన్నీ పదుగురి ఎదుట ప్రకటించేసాడు.

"ఔరా! కుర్రకుంకవై వుండి, యజ్ఞ దర్శనానికి వచ్చినందులకు, భలే జ్ఞానోదయం చేసావు. ధర్మం నిలబెట్టుకున్నావు. ధిక్కారమట, ధిక్కారం ?! తలవూపే ప్రతివాడు మహాత్ముడు, ధర్మాత్ముడు - అయితే అటువంటివాళ్ళు ఇక్కడెందరో వున్నారు. వారలనందర్ని పూజించి, మీ సమతాభావాన్ని చాటుకో వచ్చును!"

ఇంకా ఆపలేదు, శిశుపాలుడు ఆగలేకపోతున్నాడు కూడా! వరుసగా యుధిష్టరుడు, గాంగేయుడు సద్బుద్ధి కల్గించబోయారు. సర్ది చెప్పబోయారు. ఊహు... వినలేదు. సహదేవుడు కల్పించుకున్నాడు. అయినా రెచ్చిపోతున్నాడు. అయినా, సభాసదులెల్లరు, సహదేవుని మాటలకు జయ జయ ధ్వనులు చేసారు. నారదుడైతే, "నారాయణ, నారాయణ - శ్రీమన్నారాయణ!" అని పులకరించినట్లు భజన చేస్తూ, తనను తాను మరచి నాట్యమే చేసాడు.

పరిస్థితి విషమిస్తుందేమోనని, యుధిష్టరుడు భయపడుతున్నాడు. తాతగారూ! పూర్ణాహుతి కన్న ప్రాణాహుతులతో, యజ్ఞం పూర్తయ్యేటట్లుంది.

"కుమారా! యుధిష్టరా, కలతపడకు. యజ్ఞేశ్వరుడే ఇక్కడ వుండి, స్వయంగా, సర్వం పరిరక్షిస్తుండగా, "ఎందులకయ్యా, నీకు భయం. సర్వం శ్రీమన్నారాయణామర్పణమస్తు" అన్న ఆ వాసుదేవుడే చూసుకుంటాడు.

ఈ మాటలకు శిశుపాలుడు నిగ్రహించుకోలేకపోతున్నాడు. తన అభిమాన వర్గంతో కలిసి, యుద్ధానికి సిద్ధబడటమా ? లేక ఈ అధర్మ ప్రవర్తనమునకు కోపగించినట్లు, నిరసనగా ఈ స్థలాన్ని విడిచిపెట్టడమా ? ఆ క్షణంలో ఆలోచనలో పడ్డాడు.

భీమునిలో సహనం చచ్చిపోయింది. హిడింబ, బకాసుర, జరాసంధులను మట్టి గరపించిన, నన్ను మరచిపోయావేమి! నేను ఇక్కడే వున్నాను. ఇంతవరకు పినతల్లి కుమారుడివని, అభిమానించి గౌరవించినందులకు హద్దులు మరచి పోతున్నావు. ఇంకోమాట అదనంగా మాట్లాడితే నీ ఆయువు చెల్లుతుందని హెచ్చరించాడు.

భీష్ముడు "భీమసేనా ? సర్వజగద్రక్షకుడు గోవిందుడు ప్రశాంతుడై యుండ, మనకెందులకయ్యా అనవసర వాగ్యుద్ధము. ఆ మహానుభావుడు ఆగ్రహించనంతవరకే ఎవరి ప్రతాపాలైన, పౌరుషాలైనా ? సింహము విజృంభిస్తే నక్క ప్రక్కదారి పడుతుంది, ప్రాణరక్షణకు ప్రయత్నిస్తుందే తప్ప, ఎదురు తిరిగి పరాక్రమించదు. తన ప్రతాపం ప్రకటించుకోదు. కనుక... శాంతి వహించమని సూచించడంతో -

"అంతటి మొనగాడా, ఈ గొల్లవాడు....!" అని శిశుపాలుడు పకపక నవ్వాడు. మరుక్షణం కృష్ణుణి చూసి "గొల్లబావా! నేనేం పిల్లను కాను. ఎత్తుకు పోవడానికి, ఏడిపించడానికి ?! పరాక్రమించగల మీసమున్న రోసంగల మగవాడిని... అర్థమయిందా ?" ఆ వెక్కిరింతకు అతను అభిమానులందరు పగలబడి నవ్వారు.

"చాలా సంతోషం. కనీసం చివరి క్షణాలలోనైనా ఈ గొల్ల బావను తలుచుకున్నావు. దురహంకారి, మరణాంతమున మనుధర్మములే కాదు, మన ధర్మములేవీ రుచింపవు. అత్తకు ఇచ్చిన గడువు తీరింది. నీకు బ్రతుకు చెల్లింది. రక్షించుకో!" అంటూ చక్రము విడిచాడు. ఆ సుదర్శనం నిప్పులు గ్రక్కుతున్నట్లు, కనులు మిరుమిట్లు గొలుపుతూ, తిరుగుతూ, శిశుపాలుడిని సమీపిస్తుంది.

"హహ్హాహ్హా.....!" ఒక పెద్ద వికటాట్టహాసంతో ఆ చక్రానడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అది ఆరని దావాగ్నిలా, నిప్పులు కక్కుకుంటూ విజృంభించి మీద, మీదకు వస్తుంటే, తనను రక్షించుకునే ప్రయత్నమా శిశుపాలుడు ప్రారంభించాడు. అయినా, అది ఆయుధమైనా దాని ధర్మము నిర్వర్తించింది. శిశుపాలుని శిరము ఛేదించింది. ఆతని నుండి వెలుగొకటి బయలుదేరి కృష్ణుడి హృదయాన్ని చేరింది.

ఆ దృశ్యాన్ని చూసిన వారందరు లేచి నిలబడి, శ్రద్ధా-విశ్వాసాల భయభక్తులతో-

**"హే కృష్ణా, వాసుదేవా, ముకుందా మురారీ**
**గోవింద, గోపి జనరక్షక, గోవర్ధనగిరిధారి.**
**శరణాగత వత్సల, కరుణాకర, భవభయహార దీనబంధూ,**
**దయాసింధూ, కృపాసింధూ! శరణు శరణు"**

మని - శరణాగతులయ్యారు.

ఎందరో జయ జయ ధ్వానాలు చేసారు.

శిశుపాలుని, వంతదార్లు, అభిమానులు మాత్రం, గుండెలవిసి, దిగజారి పోయారు. గుండెలు బిక్కుబిక్కుమంటూంటే, ప్రాణభయంతో గిజగిజ లాడుతున్నారు.

కానీ, యజ్ఞమీ రకంగా, నరబలితో ముగియడం, కొంతమందికి బాధనిపించింది. నిర్వాహకుడు యుధిష్టరుడే అయినా, ఫలప్రదాత - ఆ పరమేశ్వరుడు, జగద్వంద్యుడు, యజ్ఞపురుషుడనుకునే, వాసుదేవ కృష్ణ ప్రభువు ఆ "నంద"నందనుడు, యశోదాకృష్ణుడు, దేవకీసుతుడు, వసుదేవ కుమారుడు ఈ లోకానికి తెలిసిన యజ్ఞేశ్వరుడు. నిర్వాహకుడు, కథానాయకుడు. ఆ తదుపరి అందర్ని సముచితరీతిని గౌరవించారు. సత్కరించారు. ఎంత స్వాగత మర్యాదలు నడిపించారో, అంతగొప్పగా వీడ్కోలు నొసగారు. ప్రతి ఒక్కరు పరమానంద భరితులయ్యారు.

పాంచాలుని ఆనందానికి అవధులు లేవు. తన అల్లుడు సార్వభౌము డయ్యాడు. తన కుమార్తె మహాసామ్రాజ్ఞి అయింది. ఈ మొత్తానికి కర్త ఆనాడే, వాగ్దానం చేసిన చరిత్ర ప్రసిద్ధినొందగల - వానితో నీ పిల్లకు వివాహం చేయించి, అన్నగా, అభిమానచెల్లిగా ఆదుకుంటానన్న, శ్రీకృష్ణుడు, సత్యవాక్యాన్ని సత్యవంతం చేసాడు. నిశ్చయంగా ఆదుకున్నాడు.

ఒక్కొక్కరినే, పేరు పేరున పలుకరించి, వీడ్కోలు నొసగే ధర్మరాజు, ద్రోణ-కృపాచార్యులను సమీపించి వినయవందన మర్పించాడు. గురుదేవా! ఇకనైన ప్రతిఘటించి, రాజుల్ని ప్రజల్ని పీడించే దుర్మార్గులు నశించారు. కాబట్టి, లోకంలో, శాంతి వాతావరణమేర్పడుతుందా ?

"యత్ర యోగీశ్వరఃకృష్ణో....!'' అన్నది ఆర్యోక్తి.

ఇక కాలము - చక్రభ్రమణ స్వరూపము.

'ఇది' అని నిర్ణయించగల్గడం, నిమిత్తము మనమై అయినట్లు ఆలోచనలు సాగించడము, తగని పని. ఆ పరబ్రహ్మ - జగత్పత్తి కూడా కాలానికి, దాని ఫలనిర్ణయానికి, నిర్ణయాత్ముడు - "అనుభవ''మూర్తే తప్ప, అధిగమించగల శక్తి స్వరూపుడు కాదు. ఈ సార్వభౌమత్వం - నిజం చెప్పాలంటే ముళ్ళపోగు. ఇదివరకు నీ ఆలోచన - మీ అయిదుగురు - మీ ఇల్లాంద్ర గురించే!

ఇప్పుడో - వీళ్ళను విడచి, ప్రజలు సామంతరాజులు అభిమానులు, పరస్పర సహకారమూర్తుల గూర్చే నీ రాజ్యపాలనం తెలిసిందా ?! యుధిష్టరుడివైన - ధర్మరక్షకుడు, తత్ప్రకాశకుడివి కావాలి. అప్పుడు దైవం - కాలం - తమ ధర్మాలు, నిర్ణయాలు అవి చేస్తాయి నిమిత్తమాత్రంగా అనుభవించడం మనం నేర్చుకోవాలి. స్వస్తి "అని శుభ భాజ్యం చేసారు. అస్తు - శుభమస్తు'' అని ఆశీర్వదించారు.

# సాల్వుడు

**వి**చిత్రమైన కృష్ణచరిత్రలో లీలలు వున్నాయి. ఇదొక మహామహా "విశ్వ'' యజ్ఞం. దీనికి జీవులు సమిధలు. కర్మగతులు ఆజ్యాలు. పాప, పుణ్యాలు, స్రుక్ స్రువాలు. కాల-ధర్మాలు బలిపశువులు. ఈ మొత్తం నిర్వాహకుడు, ఆ సర్వేశ్వరుడు. అందుకే -

కృష్ణుడు చిన్మయానందుడు, లీలామానుష విగ్రహుడయ్యాడు. ఇది కొందరి అభిప్రాయం. ఇంకా కొందరు, ఏ అధికారం లేకుండా, ఒక సామాన్య యాదవుడు, శూరవంశీయుడనంటూ, ''కృష్ణవాసుదేవు''డనే పేరుతో తమపై పెత్తనం చలాయించడం సహించలేకపోతున్నారు. ఏదో రకంగా ఆతనిని నిరోధించాలని, పరాక్రమానికి పగ్గాలు వేయాలని తలుస్తున్నారు. కారణం... ?

మొన్న జరాసంధుని వధ. నిన్న శిశుపాలుని వధ. ఆతని వర్గానికిదొక అశనిపాతం. ఈ గొడ్డలిపెట్టయిన పరిస్థితినెదుర్కోవడమెలాగ ? ఇది జరాసంధ...

శిశుపాల వర్గాలవారి ఆలోచన. ముఖ్యంగా సన్నిహితుడు, విశ్వాసపాత్రుడు, మధురానగర నాశనానికి కాలయవనుని రెచ్చగొట్టి, కృష్ణుని నాశనం చెయ్యాలని జరాసంధ - కాలయవనులకు రాయబారం నడిపి, సంధి చేసిన సంధాన కర్త. సాల్వుడు. అతనికీ పరిస్థితి కొరకరాని కొయ్య అయింది.

దీనినెదుర్కోవాలనే పట్టుదల పెరుగసాగింది.

మొత్తానికి మధుర సామ్రాజ్య పతనమైతే అయింది కానీ, కృష్ణుని, ఎవ్వరూ ఏమీ చెయ్యలేకపోయారు. కాలయవనుడు చచ్చాడు. జరాసంధుడు పలాయనాన్ని పఠించి, స్మశాన మధురను చూసుకున్నాడే తప్ప, తన ప్రతిజ్ఞను చెల్లించుకోలేక పోయాడు. ఈలోగా ఈ అనవసర యుద్ధాలకు తెరతీయాలన్నట్లు, కృష్ణుడు, సముద్రుని ప్రార్థించి స్థలమడిగి, విశ్వకర్మను పిలిపించి, అపూర్వ ద్వారకానగర నిర్మాణానికి శ్రీకారం చుట్టడమే, అనుక్షణం ప్రాణసంకటంగా బాధపడే మధురా నగరవాసులందర్ని ద్వారకాధీశుడు సురక్షిత ద్వారకాపురీవాసులను గావించాడు. కృష్ణ, యాదవ శత్రువులకు ఇదొక కంటకమైంది. వారిపై పగ తీర్చుకోవాలనే కోరికకూ చిల్లు పడింది. ముఖ్యంగా శ్రీకృష్ణుని నాశనం చెయ్యాలనే కోరిక, ప్రతి సమయంలోను, వమ్మౌకావడంతో జరాసంధుడు, అతని అనుయాయులు, సామంతులు, చివరకు తమ మగధీశునికి, చక్రవర్తిత్వానికి భంగమేర్పడు తుందేమోనని భయపడసాగారు.

చివరకు సాల్వుడు - దిక్కులేనివాడై పోయాడు. కృష్ణుని నిగ్రహించలేక మైత్రి చేయవలసి వచ్చింది. ద్వారక నుండి యాదవులటు వెళ్ళాల్సి వచ్చినా, తన రాజ్యంగుండా వెళ్ళాలి కాబట్టి, వారి ప్రయత్నాలన్నీ భగ్నం చేస్తూ వారిని ఓడించి, బందీలుగా చేస్తే, యాదవ బలం నశించి తన ప్రాభవం పెరుగుతుందని తలిచాడు.

అయితే, ఈతని ఎత్తులకు, ఎవరూ కలిసి రాలేదు సరికదా, చివరకు ఒంటరివాడైపోయాడు. కోలుకోని దెబ్బతిన్న జరాసంధ చక్రవర్తి, అనవసరంగా తన పదవిని, హోదాను, పోగొట్టుకోవడమిష్టంలేక, సాల్వునికి తాను సాయపడలేదు సరికదా, తన వర్గం వారిని గూడా ప్రోత్సహించలేదు.

దీంతో సాల్వుడు - కృష్ణ - యాదవ మిత్రుడు కావాల్సి వచ్చింది. కాదని విభేదిస్తూ, జరాసంధ చక్రవర్తి పొందిన భంగపాటో లేక శిశుపాలుడు పొందిన

మరణమో పొందాల్సి వస్తుంది. కనుక ఏ విధమైన దుస్సాహసం చెయ్యక, మిత్రమూర్తియై మెలిగాడు కానీ శిశుపాలుని వధ మాత్రం సాల్వుని శాంతబరుచ లేకపోయింది. వీరత్వానికి సవాలుగా నిలిచింది.

దీంతో తన రాజ్యంలోని వేదవేదాంగవిత్తులను పిలిపించాడు. తన కోరికను చెప్పి, కృష్ణుని ఓడించగల దివ్యశక్తి పొందే విధానము చెప్పమని అడిగాడు.

సులభుడు, సుశీలుడు, సౌమ్యుడు, తక్షణ భక్తజన రక్షకుడు, భక్తవ శంకరుడైన, శంకరునికై తపము చేయమన్నారు. వారి మాటను మన్నించి, ప్రాణం నిలుపుకోవాలనే తపనతో, శంకరుని గూర్చి తీవ్రతపము చేయగా, శంకరుడు ప్రత్యక్ష్యమయ్యాడు.

"సాల్వా! నీ తపస్సునకు మెచ్చాను. నీకేం వరం కావాలో అడుగు. తప్పక ప్రసాదిస్తా"నన్నాడు. శంకరుని దర్శనంతో, ఎంతో పరమానందం పొందిన సాల్వుడు-

"ఓ శంకరా, నమః శంకరా, భక్తవశంకరా, దిగంబరా, హర, శంభూ! మహదేవ, దేవాధిదేవా, నీలకంఠా, సహస్రాక్షా, అణిమాది అష్టసిద్ధి నవనిధి ప్రదాతా!" అని పరిపరి విధముల ప్రస్తుతించగా - స్తుతి, స్తోత్ర - ప్రీతింకరుడైన భక్తవశంకరుడు, పరమప్రసన్న భావంతో -

"సాల్వా! అడుగు. నీ అభీష్టమేదైనా సరే. తప్పక ప్రసాదిస్తాను" అన్నాడు. శంకరుని అభయంతో పులకించిపోయిన సాల్వుడు ఒక క్షణమలాగ వుండిపోయాడు.

"అడుగు, భక్తా!" భగవంతుని అభయప్రదానం.

మెల్లిగా "ప్రభూ! ఈరేడులోకాలలోని వారెవరు ప్రతిఘటించలేని, ఏ లోకంలోనైనా, ఏ స్థితిలోనైనా సంచరించగల అపురూప వాహనాన్ని ప్రసాదించ మన్నాడు. తనకు సర్వత్రా విజయము లభించాలని అర్థించాడు. శివుడు వెంటనే మయుని పిలిచి, సాల్వుని కోరిక చెప్పి, ఒక అపురూప విమానాన్ని రూపొం దించమని ఆదేశించాడు. మయుడలాగే తయారుచేసాడు. దానికి సౌభకమని పేరు పెట్టాడు.

అది రాజసూయ యాగ సమయం. ప్రముఖులెవరు ద్వారకలో లేరు కాబట్టి, ఆ సమయాన్ని తనకనుకూలం గావించుకోవాలని, విమాన మార్గంలో, సాల్వుడు

ద్వారకను ముట్టడించాడు. కృష్ణుని కుమారుడు, వున్న యదుప్రముఖులతో సాల్వుని ఢీకొన్నాడు. ఇరుపక్షాల మధ్య మహాపోరు ప్రారంభమయింది. ప్రద్యుమ్నుని యుద్ధనైపుణ్యం తండ్రిని తలపించ చేస్తుంది. మరొక ప్రక్కన జాంబవతి తనయుడు సాంబుడు. ఒక్కొక్కరే, ఆ వచ్చిన వారి పీచమడచాలని, తమ శక్తి సామర్థ్యములు ప్రకటించుకోవాలని తహతహలాడుతున్నారు.

మహావీరుడు గదుడు, భానువింద, చారుధేష్ట శుక సారణులు తీవ్రంగా ప్రతిఘటిస్తు శత్రువర్గాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. కృతవర్మ - తన శక్తియుక్తులతో, బాణములు విడిచి, సాల్వుని రక్తసిక్తుడిని చేసాడు. భూతలయుద్ధమతనికి అసాధ్యమనిపించింది. తన వీరులనేకులు గాయాలపాలవడమో, యాదవ సైన్య శక్తికి, ప్రాణాలర్పించడమో జరుగుతుండటంతో -

శివప్రసాదం ద్వారా లభించిన సౌభకంతో మాయా యుద్ధం చెయ్యాలని నిర్ణయించుకున్న సాల్వుడు గగనవీధికెగిరాడు. యదువీరులకందక, వారలను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. ఒకచో కనిపించి, మరొకచోట అదృశ్యమై, గందరగోళం సృష్టించే సాల్వుని ఎదుర్కోవడం కష్టమనే భావాన్ని యదువీరులలో కల్గించాడు. మాయా యుద్ధాన్నెదుర్కోనలేని విధంగా ముప్పుతిప్పలు పెడుతున్నాడు.

సాల్వుని మంత్రి ద్యుముని గదాఘాతానికి, మూర్ఛిల్లిన ప్రద్యుమ్నుడు తెలివివచ్చి, తాను యుద్ధరంగం నుండి మళ్ళింపబడ్డట్లు తలంచాడు. రథసారథిగానున్న దారుకుని కుమారుని ప్రయత్నానికి బాధపడి దారుకాసుతా! ఇది వీరత్వము కాదు, శూరత్వము కాదు. పారుబోతుతనం. ~~ఈ~~ అప్రదిష్ట నాకు కాదు, నా త్రండికి. కృష్ణ తనయుడు ప్రద్యుమ్నుడు వెన్నిచ్చాడు. అందుకు కృష్ణుని రథసారథియైన దారుకసుతుడు తగు విధమైన స్పందనతో, సాయబడ్డాడంటే ఎంత అప్రదిష్టో... ఆలోచించండని నొచ్చుకున్నాడు.

"కుమారా! ఇది యుద్ధనీతిలోని మర్మరీతి. దీనివలన అవతలివారి ఆనుపాన్లు, ఆయువుపాట్లు తెలిసి, ఇవతలివారు విజృంభించి, నిగ్రహించడానికి వీలవుతుంది. ఇదొక రాజనీతి. ఇది అందరికి తెలిసినదే. కాకపోతే మేధావివర్గంలోని కొందరు మాత్రమే ఇటువంటి ఆలోచనలు చేస్తారు.

మీ తండ్రి ధర్మరక్షకుడు. మహాశక్తివంతుడు. కనుక అన్యధా తలంచకండి. వెన్నునిచ్చానని బాధపడకండి'' అని దారుకాసుతుడు వూరడించాడు.

వెంటనే ప్రద్యుమ్నుడు, మరో మహాశక్తివంతమైన ధనువు నందుకున్నాడు. టంకారము చేసాడు. ఇది యాదవులకు ఆనందదాయకం. సాళ్వసేనలకు భయానకమై కూర్చుంది.

అతడు మహామాయావి శంబరాసురుని గెల్చిన మహామాయావి. ఆతని ముందు ఈ సాల్వుడా! దారుకా! మన రథాన్ని ముందు కురికించాడు. శత్రువుల నంతమొనరిద్దా''మన్నాడు. ప్రద్యుమ్నుని దెబ్బతీసానని మురిసే సాల్వసేనాని ద్యుముడు రెచ్చిపోతూంటే అరివీర భయంకరుడైన ప్రద్యుమ్నుడు ఎనిమిది బాణాలతో శరీరాన్ని జల్లెడ చేసాడు. మరో నాల్గు బాణాలతో సారథిని, రెండు బాణాలతో, అతని పతాకను, ఇంకో బాణంతో అతని ప్రాణాలను హరించి, తన సోదరుల, ప్రముఖుల హర్షధ్వానాలను పొందాడు.

తన మాయా విద్యతో సాల్వుడు రెచ్చిపోతూంటే, మహామాయావి శంబరాసురుని ఢీకొని, హతమార్చిన ప్రద్యుమ్నుని మాయాశక్తి ముందు సాల్వుడు తలవంచుకోవాల్సి వస్తుందనే పరిస్థితికి గురయ్యాడు. మొత్తం వారికి - ఇరవై ఏడు రోజులపోరు సాగింది.

ఇంద్రప్రస్థ నుండి ద్వారకకు బయలుదేరిన కృష్ణునికి దారిలో తెలియని దుశ్శకునాలు కనబడసాగాయి. దారుకునితో, ఆ దుర్నిమిత్తాల గూర్చి కృష్ణుడు సంభాషించాడు. నేను నగరంలో లేనని తెలిసి, శిశుపాల మిత్రవర్గీయులెవరైనా, ఆ.... పిల్లలే కదా, నిరోధించవచ్చునని యుద్ధం చేస్తూండి వుండాలి. ఎందుకయినా మంచిది. రథం వేగాన్ని పెంచమని కోరాడు.

వాయువేగ, మనోవేగాలతో ద్వారకను చేరి గగనమండలంలో తిరిగే సౌభకాన్ని చూసిన కృష్ణుడు "దారుకా'' అన్నాడు. తక్షణం వీరి రథం ఆకాశమార్గం పట్టింది. సౌభకానికి ఎదురు నిల్చుంది.

వాసుదేవుని రాకనుగని యాదవసేనలు ఉప్పొంగి పోతున్నాయి. కృష్ణుడు లేకపోయినా ఇంతవరకు ప్రతిఘటించి యుద్ధము చెయ్యలేని సాల్వుడు అతని

సేనలతో సమానంగా నీరసించిపోయాడు. ఒక మహాశక్తి ఆయుధాన్ని దారుకుని పైకి సాల్వుడు విసిరాడు.

దానిని గమనించిన కృష్ణుడు, మధ్యలోనే ఆ శక్తిని నేల రాల్చాడు. కృష్ణుని ముందర తానొక మాయాశక్తిగా రెచ్చిపోయి, వాసుదేవుని గందరగోళంలో పడేయాలనే విశ్వప్రయత్నాన్ని సాల్వుడు కొనసాగిస్తున్నాడు. సౌభకాన్ని కృష్ణుడు గురిచేస్తూంటే, సాల్వుడు కృష్ణుని గురిచేసి, ఆతని ఎడమ భుజాన్ని గాయపరిచాడు.

ఆకశాన వున్న దేవతలు "అయ్యో!" అన్నారు.

సాల్వుడు ఇంగితాన్ని మరచిపోయి, శిశుపాలుని వలె వదరసాగాడు. అమాయకుడైన నా మిత్రుని చంపావు. ఇప్పుడు - నా - మాయా సౌభకంతో, నిన్ను ఎగిరెగిరి పడుతున్నాడు. తప్పక - అని - కృష్ణుడు తన గదను గిరగిర త్రిప్పి - సాల్వుని పైకి విసిరాడు. ఆ దెబ్బకు ముక్కు చిట్లి రక్తం కారుతూ, మూర్ఛపోయాడు. అయితే ఆతడు, ఆతని విచిత్ర విమానంతో సహా మాయమై పోయాడు.

ఈ సమయంలో, గగనవీధి నుండి ఒక వ్యక్తి వాసుదేవుని ముందర, చేతులు కట్టుకుని నిలిచినాడు.

"ప్రభూ! ఘోరం జరిగిపోయింది. బలదేవుల సన్నిధిలోనే మీ తండ్రి వసుదేవుల వార్ని సాల్వుడు బంధించి తీసుకుపోయాడని" చెప్పాడు. ఇది విన్న గోవిందుడు, ఆశ్చర్యపడి, అందులోనుండి తేరుకునేలోగా -

"మాయా వసుదేవుని సృష్టించి, బంధించి, కృష్ణునికి చూపిస్తూ! నీవు వీరుడవు, శూరుడవు, ధర్మపరుడవు. అవతారపురుషుడు. ఇడిగో నీ తండ్రి వసుదేవుడు. ఇదిగో చంపుతున్నాను. నువ్వు నిజంగా మగవాడివైతే నీ తండ్రిని రక్షించుకోమని, ఆ వసుదేవుని తలనరకి, వికటాట్టహాసం చేస్తూ - తన సౌభకంలోకి దూరాడు. మాయమయ్యాడు.

జరిగినదానికి, కృష్ణుడు బాధపడబోతుంటే "ప్రభూ! ఇదొక మాయ. సర్వం అబద్ధం. మోసం"మని హెచ్చరించారు. ఈ సమయంలోనే ఇంతకుముందు దేవకీదేవి నుండి సందేశం తెచ్చిన వ్యక్తి, ఈ మాయా వసుదేవుడు, ఇద్దరు మాయ మయ్యారు. అప్పుడిక ఇంతకు తెగించి, నన్నే మనస్తాపానికి గురి చేసిన నీవు...

శరపరంపరగా బాణాలు విసిరాడు. సాల్వుని విల్లువిరిచి, మరో చాపమందుకునే లోగా తన దివ్యగదతో సౌభకాన్ని నుగ్గు నుగ్గు చేసాడు. ఆ విమానశకలాలతో సమానంగా అతను క్రిందబడ్డాడు. కృద్ధుడయ్యాడు.

కోపంతో, తన వద్దనున్న భయంకరమైన గదను కృష్ణునిపై ప్రయోగించాడు. మాయ తొలగి, మహామాయ అదృశ్యమై, భూమి మీద భారంగా పడి, తన గదతో కృష్ణుణి ఎదిరించబోయిన, అతని చేతిని తనవాడి కరవాలంతో కృష్ణుడు నరికాడు. ఇక అతను విశ్రవీగ నివ్వకుండా, చక్రాన్ని అతనిపై ప్రయోగించాడు. శిశుపాలాది దుష్టులను సంహరించిన ఆ చక్రం సాల్వుని కూడా బలిదీసుకుని, తిరిగి శ్రీ కృష్ణుని చేరింది.

అందరు ఇటు కృష్ణుని, అటు ప్రద్యుమ్న కుమారుని, ఇతర ప్రముఖ వీరులను పలురీతిల కీర్తించి ప్రశంసించారు.

ఈ సాల్వుని మరణగాథ - దంతవక్త్రునికందింది.

ఇటు సోదరుడు శిశుపాలుని మరణం, అటువైపు ఆప్తమిత్రుని వధ... దంతవక్త్రుడు భరించలేక, కుపిత భుజంగమయ్యాడు. మిమ్ముల చంపిన ఆ వాసుదేవుని తప్పక అంతం చేస్తానని ప్రతిజ్ఞ చేసాడు.

అంతే. ఒకనాడు, విపరీత పదఘట్టనలతో భయంకర గదతో, పండ్లు పటపట కొరుకుచూ, “కృష్ణా! మనకేవిధమైన బంధుత్వము లేదు. వున్నది వైరము. ఈ దెబ్బతో నిన్ను సంహరించి, నా వాళ్ళకు రక్తతర్పణం చేస్తాను. అశ్రుతర్పణ మిస్తా”నని అరచుకుంటూ వస్తున్నాడు.

ఈ హంగామాను కనిపెట్టిన వాసుదేవుడు ద్వారకాపురి, ముఖద్వారము వద్దకు వచ్చాడు. దంతవక్త్రునికి ఎదురు వచ్చే కృష్ణుని చూసి పకపక నవ్వాడు. చావుకోసం, భలే పరుగెత్తుకుని వస్తూన్నావు. చాలా సంతోషం. నాకు బంధువువే అయినా ఆ బాంధవ్యం మన మధ్య లేదు. ప్రస్తుతమే కాదు, మనమెప్పటికి విరోధులమే.

నాకు ప్రాణమైన జరాసంధుని, సోదరుడు శిశుపాలుని, పరమ ఆప్తుడు సాల్వుని వధించావు. ఇక నాకు నీతో బంధుత్వమేమిటి ? వున్నది పగ. దానిని

తీర్చుకోవాలి. అందుకు నిన్ను చంపాలి. అందుకే ఈ గదతో నిన్నంతం చెయ్యాలని వడివడిగా వచ్చా"నన్నాడు.

"సంతోషం, కానివ్వు!" అంటూ, ఆ పరుగెత్తుకు వచ్చేవాని తలపై తన గదతో ఒక్క మోదు మోదాడు. ఆ దెబ్బకే వాడి శిరస్సు పగిలింది. రక్తము ధారగా కారుతుంది. క్రింద పడ్డాడు. గిలగిల కొట్టుకున్నాడు.

అంతే, ప్రాణాలు విడిచాడు. అనంత వాయువుల్లో కలిసిపోయాడు.

పుణ్యమో, పాపమో... ఏ రకంగా తనను స్మరించినా వారి వారి ప్రాప్తాల ప్రకారం ఫలితాలను పొందుతారనడానికి నిదర్శనంగా, దంతవక్రుని, గావుకేకలు, అనవసర ప్రతిజ్ఞలే నిదర్శనం.

మొత్తానికి ఇతడు శ్రీకృష్ణ ప్రభువులో లీనమైపోయాడు. ధన్యుడు. ఈతని వెనుకనే వచ్చిన తమ్ముడు విదూరథుడు, అన్న అకాల మరణమునకు చింతిస్తూ, గుండెలు పగిలేలా రోదించాడు.

ఇదంతా కృష్ణుని కుట్రలో భాగంగా, కత్తి తీసుకున్నాడు. వాసుదేవునిపైకి లంఘించాడు. భగవంతుని వద్ద ఒక సద్గుణముంది. ఎవరేమి ఇచ్చినా ముందు పుచ్చుకోడు. పొరపాటున పుచ్చుకున్నా తన దగ్గర వుంచుకోడు. అలాగే అన్న మరణానికి చింతిస్తూ తన పైకి కత్తి ఎత్తిన తమ్ముడు విదూరథునికి, ఎందుకు అనవసర శ్రమ, బాధ.... అని తన చక్రం విడిచాడు. కత్తి ఎత్తిన పుణ్యానికి తనలో ఇముడ్చుకున్నాడు.

సాలవ దంతవక్రుల మరణానికి దేవతలందరు సంతోషించారు. కృష్ణునికి జై గీతికలు, ప్రజలకు "స్వస్తి ప్రజాభ్యాం...! అని స్వస్తి - వాచకాలు శుభాలు పలికారు.

**- స్వస్తి -**

# గురువుల సన్నిధి - సుదామ పెన్నిధి

కృష్ణ చరిత్రలో తెలుసుకోవలసినవి రెండే రెండు. ఒకటి కృష్ణ అవ్యాజ ప్రేమ. మరొకటి భక్తులపై ఆ ప్రభువుకు గల అవినాభావ సంబంధము. ఈ రెండు అందుకోని భక్తుడు వుండడు. ఇది - ఆ దేవదేవుని పరిజనానికి తెల్సిన అపూర్వ "భక్తి" తత్వం. ఈ సమాహారమే "శ్రీకృష్ణ భాగవతం".

ప్రభాస తీర్థ నివాసియైన "సుదాముడు" బలరామ, కృష్ణులకు బాల్య సహవాసి. శ్రీ గురుసాందీపులవారి సంచార విద్యాలయంలో, విద్యాభ్యాస మొందిన బలరామకృష్ణులకు, పూర్వమునుండే శ్రీ గురువుల వద్ద విద్యనొందే భాగ్యశీలి.

సుదాముని తండ్రిగూడా మహావిద్యావేత్త. ఎక్కువ భాగమితడు తన విద్యాభ్యాసాన్ని తండ్రి వద్దే పూర్తి చేసాడు. కానీ గురుశుశ్రూష, అందలి భాగము, శ్రీ బలరామకృష్ణుల సహవిద్యాభ్యాసము నొంది, ఆప్తమిత్రులవలె మెలగాలన్నది ఆ దేవుని నిర్ణయమై వుంటుంది! అందుకనే, సుదాముడు, వారితో చెలిమి కోసమన్నట్లు, వీరికి ముందుగా సాందీపులవారి సంచార గురుకులానికి వచ్చాడు.

విద్యార్థులుగ - బలరామ, కృష్ణులు రాగానే గురు సాందీపులవారు, సుదామునితో, "సుదామా! నేటి నుండి వీరికి, వీరికన్న పూర్వ విద్యార్థిగా - సర్వ విషయాలలో సహకరించాలి. జాగ్రత్త!" అని హెచ్చరించారు.

ఈ అన్నదమ్ములు శ్రీ గురువుల సన్నిధిలో వున్నది కేవలం అరవై నాల్గు రోజులు. ఈ కొద్దికాలంలోనే ఈ అపూర్వశిష్యులు శ్రీ గురువుల వద్ద గల చతుష్షష్టి కళలను ఆసాంతం గ్రహించారు. అపూర్వ శిష్యులై నిలిచారు. ముఖ్యంగా అన్నతమ్ములలో, కృష్ణునికి సుదాముడంటే విపరీతమైన మక్కువ. ఎందుకంటే, ఈ సుదాముని సామగానలోలతకు, కృష్ణుడెంతో పరవశించాడు. ఇందుకు గాను నీవు భగవత్ప్రియుడవు, ధన్యుడవవుతావని మెచ్చుకున్నాడు. కాస్త ఎప్పుడైనా కొద్ది విరామం దొరికితే "సుదామా ?" అని పిలచి, ఆ సుస్వర వేదగానానందంలో మున్గిపోయేవాడు. ఇవన్నీ తెలుసుకున్న సాందీపులవారు కూడ కృష్ణ భక్తికి తాను తన్మయులయ్యేవారు.

సుదాముడు కూడా, ఆ అన్నదమ్ముల సునిశిత సూక్ష్మబుద్ధికి, ధారణాశక్తికి ఆశ్చర్యపోయాడు. ఇలాగే కృష్ణలీలల్ని కూడా విని, ఈయనతో కలిసి విద్యాభ్యాసం చేయగల అదృష్టం దొరికినందులకు, తానెంతో భాగ్యవంతుడినయ్యానని పొంగిపోయాడు.

కంస-చాణూర మర్దనమిప్పటి కథయితే, పసిప్రాయంలోనే పూతన, తృణావర్త, ధేనుకాసుర, శకటాసుర సంహార గాథలను, కాళీయ మర్దనం, చిటికెనవ్రేలిపై ఏడు రోజులు గోవర్థనగిరిని పుట్టగొడుగులా పట్టుకోవడం, తన వేణుగానంతో - అమాయిక అల్లరిపిల్లవాడై గోగోపగోపికలను, ఆనంద పారవశ్యంలో ముంచడం.... ఒకటా... రెండూ...

ఎన్నో.... ఎన్నెన్నో.... అద్భుత గాథలను విన్నాడు.

కేవలం వేణుగానంతో, కేవలం బలిసి, మొరాయించిన, వృషభరాజాలను బెంబేలెత్తించిన "హస్తిని"అనే పొగరుబోతును పట్టి, ఆ చిన్న వయస్సులో బంధించ గల్గడమెంతటి అపూర్వమని పెద్దలు చెప్పుకుంటుంటే "అవునని" తాను ముక్కున వేలేసుకుని, అబ్బురపడ్డ సంఘటనను - నెమరు వేసుకున్నాడు.

దీనినిబట్టి - ఆతడు ధర్మమూర్తి దేవదేవుడు అవతారపురుషుడన్నది, తన విశ్వాసం చేసుకున్నాడు. కానీ, బాల్యం... మానవ సహజ చాంపల్యం" అవశ్యం అనుభవోక్తం కృతం పాపం - శుభాశుభం' అని భవిష్యత్తులో గ్రహించగల్గుతాడని, ఈ బాల్యంలో అనుకోలేదు. ఈ బాల్యంలో అనుకున్నది - కేవలమొక మహాపురుషుని సాంగత్యమొందితినన్న సహజ సత్యము మాత్రమే!

మొత్తానికి బలరామకృష్ణుల విద్యాభ్యాసం పూర్తయింది. గురుదక్షిణగా - గురుదేవులనర్థించి, వారి కోరిక మేరకు వారి పుత్రుడైన పునర్దత్తుని తీసుకువచ్చి ఇవ్వగల్గడం. దీనితో సుదాముడు, శ్రీకృష్ణునికి అప్రయత్నంగానే చేతులు జోడించాడు. "తండ్రీ!" అని పునర్దత్తుడు శ్రీ గురువులను కలుసుకునే దృశ్యం మహాద్భుతం. వూహాతీతం కూడా!

శ్రీ గురువుల ఆశీస్సుల పొంది, సహవిద్యార్థుల అభిమాన వీడ్కోలుతో, మధురానగరానికి బలరామకృష్ణులు వెళ్ళిపోయారు. ఈ వియోగము - అరవై నాల్గు రోజులదని, ఎవ్వరికి అనిపించలేదు. ఏండ్ల తరబడి పెంచుకున్న మమతాను

బంధమయి కూర్చుంది. ఆ తదుపరి సుదాముడు కూడా తన విద్యను పూర్తి చేసుకుని శ్రీ గురువుల ఆశీస్సులతో తన నిజనివాసానికి వెళ్ళిపోయాడు.

"అవస్యం... పితురాచారం, ధర్మ-కర్మ సంగ్రహ సాంగత్యమనుకునే సుదాముడు, పితృదేవుని ఆచార వ్యవరాహాలను, సద్ధర్మ నిరతిని పాటిస్తూ, ధర్మమూర్తియై అయాచిత భిక్షతో, ధర్మకార్య నిర్వహణంగావిస్తూ నిరంతర భగవన్నామ చింతనముతో కాలక్షేపం చేస్తున్నాడు.

ఈ తరుణంలో "సుశీల" అనే సుశీలను వివాహం చేసుకున్నాడు. ఆ అనురాగవతియైన భార్యతో జీవనం సాగిస్తున్నాడు. ప్రేమాభిమానములు పెన్నిధిగా, "వుంది - లేదన్న" భావాన్ని విడిచి, మరచి, తృప్తికర జీవితాన్ని గడుపుతున్నాడు.

వివాహము, సంతానము, బరువు బాధ్యతలు పెరుగుతున్నాయి. ఉదాసీనత, ఉద్ధరించు ఆ భగవంతునిపై అపేక్ష - పెరుగుతుంది. కానీ ఎవ్వరిని ఆశ్రయించలేదు. అధర్మబద్ధార్జనకు నడుం బిగించలేదు. రాను రాను ఆతని ఇంట, పిల్లలకు ఇంత తిండి పెట్టే పరిస్థితి కూడా కనబడకపోయినా, భర్తను నిరాదరణ చేయని పరమ సుశీల, సుదాముని భార్య నిజ "సుశీల."

చివరకు కట్టుబట్టలకు, యజమానిగా ఆతడు నోచుకోక, అతుకుల బొంత వంటి చినిగిన పంచ, ఉత్తరీయంతో కాలం గడపడం, ఆ వేదమూర్తికి లభించ కూడని దురదృష్టంగా ఆ ఇల్లాలు బాధపడసాగేది. బయటికి అనలేక లోలోపల కృంగిపోయేది. భగవంతుడెప్పటికయినా కనికరించి కరుణించలేక పోతాడా ? అని తనలో తను వూరడిల్లేది. పైకి మాత్రం, ఏ బాధ లేనట్లు గాంభీర్యాన్ని ప్రకటించేది.

కృష్ణుని దివ్యప్రభ, లీలావిలాసాలు, ఎన్నెన్నో సుదామునికి తెలుస్తున్నాయి. అయినా ఏనాడు "మిత్రమా!" అని కృష్ణుని అర్థించలేదు. తన పేదరికాన్ని మనసు విప్పి చెప్పలేదు. ఆర్యావర్తానికే ఆధిపత్యం లేని అధిపతి. రాజ్యంలేని రాజాధిరాజు. అంతెందుకు - దేవతా చక్రవర్తి. తనను అభిమానించే -

తన సామగానామృతానికి పరవశించే పరమపెన్నిధి. అడగక్కర్లేదు. తన గానామృతం వింటే చాలు. ఆ పరంధాముడు పరవశించి పరుగెత్తుకుంటూ వస్తాడు. తనను చూసి అడుగకుండానే కరుణిస్తాడు. అయినా తుచ్ఛ ఇహలోక

సుఖసంతోషాలకోసం, ఆ దేవదేవుని దివ్యామృతమైన - సామగానం... ఊహు... సుదామునికి ఆ ఆలోచన నచ్చలేదు.

ఈ కాలచక్రంలో ఏదీ ఆగదన్నట్లు, తను అవసరాలను చంపుకున్నా, పిల్లలు పెద్దవారగుతున్నారు. ఆకలిదప్పులు పెరుగుతున్నాయి. అవసరాలు తీరడం లేదు. అయినా కొండంత ధైర్యం. "నారు పోసినవాడు, నీరు పొయ్యక మానుతాడా? నా ధర్మం నేను నిస్వార్థంగా నిర్వర్తించేటప్పుడు, తన ధర్మం తాను అంత ఉదారంగా ప్రకటించడా ? దీని కోసం అడగడం, ఆలోచించడం "శుద్ధ తప్పు" అన్నది - ఆ శ్రోత్రీయుని, వేదమూర్తి విమల భావం.

రానురాను కాలం గడపడం కష్టమనిపించి సుదాముని భార్య... భర్తను చేరి, తెలిసినా, ఉదాసీనంగా వుండే భర్తకు విధిలేని పరిస్థితిలో ఇంటి స్థితిని ఏకరువు పెట్టి "అమ్మా! అన్నమంటే" నా కడుపు తరుక్కుపోతుందని వలవలమని గట్టిగా ఏడ్చింది.

భార్యను సుఖపెట్టాల్సిన తాను, ఆమె కర్మముగా ఏడిపిస్తున్నానని, కొంచెము బాధపడి "ఇల్లాలా! బ్రాహ్మణునిగా నేను చేయదగ్గ ఏ కార్యముకైనా సంసిద్ధుడను. ధర్మనిరతికి బద్ధుడను. అయినా పురాకృతపాప విశేషమో, నా అధర్మ వర్తనమో.... మొత్తానికి అందర్నీ బాధ పెడుతున్నాను. కట్టుకున్నందుకు నీవు, కన్నందులకా పిల్లలు, సగం సగం చచ్చి బ్రతుకుతున్నారు" తాను ఎంతో విలవిలలాడిపోయాడు.

"ప్రభూ! జరిగిన దానికి, జరుగుతున్న దానికి నేను బాధపడటం లేదు. భవిష్యత్తు - అంధకారమయమై, ఈ పిల్లలు ఆకలిదప్పులతో మరణించరాదు. ఆకలి దప్పికలు తీర్చలేని తల్లిదండ్రులుగా మనం చరిత్రలో మిగిలిపోరాదు. ఇదీ - నా ఆవేదన" అంది.

విన్న సుదాముడు కూడా బాధపడ్డాడు. నువ్వు చెప్పిందంతా సత్యమే, కానీ, ఎవరి నాశ్రయించను ? ఏమని, ఎటులాశ్రయించను ? ఇది ధర్మవిరుద్ధమే...! కానిపని చెయ్యలేనని మిమ్మల్ని పస్తులుంచలేనని దిగులు చెందుతూంటే...

"స్వామీ నాదొక విన్న"పమందామె. చెప్పమన్నట్లు చూసాడు. చొరవ తీసుకుంటున్నందులకు క్షమించండి. అమ్మతనం నన్ను అర్థింపచేస్తుంది." చెప్పమన్నట్లు చూస్తున్నాడు సుదాముడు.

"ఈనాడు మీ బాల్యమిత్రుడు - శ్రీకృష్ణుడు ఆర్యావర్తానికే ఆరాధ్యుడు. ఆయన ధర్మమూర్తి, ధర్మపక్షపాతి. బ్రాహ్మణో మమ దేవతా"... యని అర్థించ కుండానే ఆదరించే ఘనుడు పరమ భాగవతోత్తములైన, మీవంటివారలనెందరినో కరుణించి, సంతృప్తి పరచగల సద్ధర్ముడు. కనుక...

ముందు చూడటానికి వెళ్ళండి. సమయం వచ్చి మీ వివరాలడిగితే, అన్నీ తెలిసిన, ఆ పరమపురుషునికి వివరించి చెప్పండి. ఆ తదుపరి మన అదృష్టం. కర్మ పరిపక్వమైతే కరుణిస్తాడు. కాకపోతే కనీసం చూసామన్న తృప్తియైనా మనకు దక్కుతుంది. స్త్రీ బాలవృద్ధులను, బ్రాహ్మణులను, యతీశ్వరులను ఒట్టి చేతులతో పంపరాదను సత్యమెరిగిన, ఆ జగద్వంద్యుడు తప్పక మనల్ని కరుణించగలడు.

ఆ మహామహుని కరుణతో మనమందరము తరిస్తాము. మన పిల్లలందరి ఆకలిదప్పులు, కూడు-గుడ్డల సమస్యలు సర్వం తీరుతాయని, అనుకూలవతి యైన భార్యగా, సద్ధర్మ సహధర్మచారిణిగా, 'కరుణేషు' మంత్రిగా, ధర్మబద్ధంగా సూచించింది. సుదాముడు సంతోషించాడు. కనీసం కృష్ణ దర్శనమైనా లభిస్తుంది. ఆ పుణ్యం చాలు మన పాపాలు పరిహరింపబడటానికనుకున్నాడు.

"కానీ, సుశీలా.....!" ఏదో చెప్పబోతున్నాడు.

"స్వామీ! సంశయం విడిచిపెట్టండి. స్వామిని దర్శించడమనే ధైర్యంతోనే బయలుదేరండి. కర్తవ్యము నీ వంతు, కాపాడుట నావంతు" అనే ఆ పరమేశ్వరుని చెంతకు వెళ్ళడం తప్పు కాదు. అక్కడికి వెళ్ళాలంటే శరీరం వుండాలి. మనోబుద్ధులు వికసించాలి. దీనికి ఆహారం కావాలి. అప్పుడే ఏ దేవుడినైనా దర్శించగల్గుతాం. ధర్మప్రకాశానికి పొంగిపోయి ఆలోచించగల్గుతాం.

"ఇవేమీ అవసరం లేదంటే, ఈ శరీరమనవసరం. అప్పుడు మన వునికే అనవసరం. దీనికిన్ని ఆలోచనలు చెయ్యకుండా, ఇది భగవన్నిర్ణయమేనని "రండి" అందరం ఆ కైవల్యమొసగే పరమాత్ముని సన్నిధికి చేరుదాం. అప్పుడే బాధ మనదరికి రాదు. దరిద్రం గురించి ఆలోచన అసలు రాదు" అనగా -

"ఆత్మహత్య" నేరం కదా! తప్పుకదూ, చేయవచ్చునా ?

"ఓ, నా పిచ్చి స్వామీ! ఇలాగంటున్నానని ఏమీ అనుకోకండి. ఆద్యంతము లేని, అంతటా విస్తరించి వున్న సర్వవ్యాప్తమయిన, ఆత్మను చంపగలమా ? మనమీ

ప్రాకృత - భౌతిక శరీరాన్ని విడిచిపెడుతున్నామే తప్ప అనంతమైన ఆత్మను కాదు. జనన మరణాలెరుగని ఆ ఆత్మను చంపేదెవరు ? చచ్చేదెవరు ?

కాబట్టి - ఈ శరీరాన్ని రక్షించుకోవాలంటే పోషణం, దానికి ఆహారం, అప్పుడు మానమర్యాదలు, దానిని రక్షించుకోవడానికి వస్త్రాలు... అప్పుడు కోర్కెలు అవి తీరే ఆలోచనలు. ఇవన్నీ భవబంధాలు. భౌతిక బంధాలు, అవసరాలు. వీటిని నిగ్రహించాలంటే మునివృత్తి సాగిస్తే ఆగదు. నిగ్రహించినకొద్దీ - శరీరావసరాలు భౌతికవాసనలు పెరుగుతాయే తప్ప, తీరవు.

అందుకని ఇంతటి సత్యాన్ని తెల్పిన సుశీల - ఆ క్షణంలో శ్రీకృష్ణ "పరమాత్మ" గానే కనుపించిందతనికి. ఇదే సహచర్యం. ఈ ఆత్మతత్వం తనకు తెలిసినా, అనంతాత్మ స్వరూపంలో ప్రకృతిబంధనంలో, భౌతిక చట్రమనే దేహంలో ఇరుక్కుపోయి, సత్యాన్ని గ్రహింపలేకపోయాను. గృహిణిగా వుంటూ, నిజమైన మంత్రివలె కర్తవ్యం బోధించిందనుకున్నాడు. ఎంతో సంతోషించాడు. కర్తవ్యము నిర్వహించ సిద్ధపడ్డాడు. అయితే బయలుదేరుతానన్నాడు.

"అవశ్యం, స్వామీ! ఆ తరువాత భగవదేచ్ఛ" అందా సుగుణవంతురాలైన తల్లి.

"మరి... తీసుకువెళ్ళడానికేముంది, మన దగ్గరున్నట్లు.... నీళ్ళు నములుతుంటే, నిర్మలమైన భక్తి, పరిశుద్ధమైన ప్రేమ ఆ భగవంతుడు మనకిచ్చిన సిరిసంపదలు. వాటినే పూజాకుసుమాలుగా అర్పిద్దాం. మన భక్తిప్రపత్తులను చాటుకుందా"మంది.

"అదికాదు. అంటున్నాడు. సరే..... నని ఒక్కక్షణం ఇల్లంతా వెదకింది, ఆమె. అటుకుల కుండలో, పిడికెడు అటుకులు, పాతవి వున్నాయి. వాటిని తెచ్చి పరమభక్తితో, "సుశీల"మ్మ, చినిగిన భర్త ఉత్తరీయం, చివరన కట్టింది. ఇదే మనకు ఆ భగవంతుడిచ్చిన పుణ్య ప్రసాదమంది. నిరుత్సాహపడవద్దంది.

ఆ దీనబంధువు, దయాళుడు, కరుణాసింధువు, భక్తవత్సలుడు, అభయప్రదాత, ఆనందమూర్తి, నిర్వికార నిరంజనుడు, తప్పక వీటిని గ్రహిస్తాడు. మనం ధన్యులమౌతామని చెప్పింది. భార్య - సహధర్మచారిణి, సద్ధర్మమూర్తిగా- ఇచ్చిన, సలహా - ప్రోత్సాహాలతో...

తనకు తెలిసిన, తను విన్న కృష్ణలీలలన్నింటిని మననం చేసుకుంటూ, ఆ సామగానమూర్తి, సామగాన ప్రియుని చెంతకు బయలుదేరాడు. శుభం

పల్కింది భార్య. భగవన్నామోచ్చారణ - శ్రవణ - మనన - కీర్తనాది నవవిధ భక్తి "నిధి" ధ్యాసతో, తనను తాను మరచిపోతున్నాడు. ఎవరో చెయ్యి పట్టుకుని తీసుకు వెడుతున్నట్లు, నడుస్తున్నాడే తప్ప, తిండి లేక మలమల మాడే - నకనకలాడే - కడుపుతో బాధపడే బ్రాహ్మణునివలె అడుగులు వేయడం లేదు.

అంతటా పరదైవంగా, శ్రీకృష్ణుడే కనువిందు చేస్తూంటే, శ్రమ తెలియడం లేదు. అలసట కల్గడం లేదు. ఆకలి-ఆయాసము. నీరసము, నిస్త్రాణ ఏమూల కనబడటం లేదు. అదే కృష్ణలీల. భక్తుని తన వద్దకు రప్పించుకునే భగవల్లీల!

ఆ నడకలో - ఏమీ తెలియని సుదాముడు, అది ద్వారకాపురి పొలిమేరలను తెలిసేసరికి, కృష్ణలీలగా సుదాముని నడక మారింది. సాధారణుడయ్యాడు. మళ్ళీ సహజ ఆలోచనలు. అవును...! ఒక మూల ఆలోచిస్తున్నాడు. మరొకమూల తన చిత్త ప్రవృత్తికి నవ్వుకుంటున్నాడు.

"నక్కకు - నాగలోకానికి వున్నంతదూరం" వుందనుకున్నవాడు - కానీ - భక్తునిది - భగవంతునిది అవినాభావ సంబంధం. దానిని విడమరచి చెప్పడం కానీ, వర్ణించడం కాని ఆ భగవంతునికి లేదా ఆ భక్తునికి తప్ప మరొకరికి సాధ్యం కాదు. తీరా నగరం ప్రవేశించి, కృష్ణమందిర ప్రాంతానికి వెళ్ళి నేను శ్రీకృష్ణుని చూడాలంటే, నన్ను, నా వాలకం చూసి నవ్వుకుని కాదు పొమ్మంటారా లేక మెడపట్టి త్రోసి పడేస్తారా ? - లేక -

శ్రీకృష్ణ మనోగతానికి దర్పణంగా సాదర స్వాగతమొసగి, ఎంతో మర్యాదగా లోపలికి తీసుకువెడతారా ? లేక నా రాకను గ్రహించిన, నా మిత్రుడు, ఆ దేవకీసుతుడు తానుగా స్వయంగా వచ్చి తీసుకువెడతాడా ? ఎడతెగని రకరకాల ఆలోచనలు. గందరగోళ మనసు. ఇప్పుడు ఎట్లా.... ?! అంటుంది. ఇంతవరకు వచ్చి నామిత్రునెలాగ కలుసుకోవాలి! ఇప్పుటి ఆలోచన అది. అన్నింటికి ఆ పరంధాముడే వున్నాడు. ఆదరించే ఆప్తమిత్రుడు కృష్ణుడే వున్నాడనుకున్నాడు. ఈ ధైర్యమే కదా తనకు సుశీల యిచ్చింది. ఇంతవరకు వచ్చి ఇతరములేల ?

శ్రీకృష్ణునికిష్టమైన సామగానంతో, ఆ ప్రభు నామతో ముందుకు సాగాలనుకున్నాడు. తక్షణం తన నిర్ణయాన్ని అమలుపరిచాడు. సామ, గానాలు ప్రారంభించాడు. అడుగు ముందుకువేస్తున్నాడు. అడ్డాలేమీ, ఎదురవడం లేదు.

ఇవన్నీ - శ్రీకృష్ణుని రాణుల భవనాలు. అష్టమహిషిలకు తోడుగా, పదహారు వేల ఒక్కమంది భార్యలకు, అన్ని వసతులు గల అపురూప భవనాలను నిర్మింప చేసాడు. కృష్ణా! నీవేకదా అవతార పురుషుడవు. సర్వసమర్థుడివి, మనసులోనే వందన శతాలర్పించుకుంటూ, కృష్ణనామ, సామగానాలతో తపిస్తూ ముందుకు సాగుతున్నాడు.

అలాగ నడుస్తున్న సుదాముడు.... ఈయననే కుచేలుడని కూడా అంటారు. ఇన్ని మందిరాలను చూస్తూ "నా మిత్రుడే మందిరంలో వున్నాడో ఎక్కడికి వెళ్ళాలి. ఎలాగ కనుక్కోవాలి... ఆలోచించుకుంటూ, ఒక భవనం ముందు, ఇదేదో అపురూపంగా కనుపిస్తూందే అనుకుంటూ నిలబడిపోయాడు. ఆ భవనాన్ని చూస్తుంటే, తెలియని ఆత్మానందం - భక్తితత్పరత. తప్పక - ఆ భవంతిలో బ్రహ్మానందం లభిస్తుందన్నట్లుందా భవనం.

అలాగ చూస్తూ - అక్కడ ఉన్న ద్వారపాలకుని శ్రీకృష్ణ - వాసుదేవుడు - ఈ భవనంలో వున్నాడా ? అని ఆసక్తిగా అడిగాడు.

"ఉన్నారు, స్వామీ!" అన్నాడాతడు.

తలవూపి, ఆ ద్వారపాలకునితో "నాయనా! శ్రీ కృష్ణ ప్రభువును దర్శించాలని ప్రభాస తీర్థము నుండి వచ్చాను. నా పేర సుదాముడు. "కుచేలుడు" అని కూడా అంటారు. నేను పేద బ్రాహ్మణుడను. సామగాన ప్రియుడైన ఆ వాసుదేవ సందర్శనార్థం వచ్చిన, విమలచిత్తుడనన్నాడు. లోపలికి వెళ్ళాలి!" అడిగాడు.

ఒక్క క్షణమంటూ - ఆతడు లోపలికి వెళ్ళి "దయచేయండి...!" అని స్వాగతించాడు.

లోపలికయితే అడుగుపెట్టాడు కాని, ఎలాగ ఎటు వెళ్ళాలో, తికమక పడుతూ, అటు ఇటు చూస్తుంటే, ఒక పరిచారిక వచ్చి, ఆతని వివరాలనడిగింది. తన పేరు, వివరములు చెప్పాడు. "రండి!" అని లోపలికి తీసుకువెళ్ళింది.

ఆ... వెళ్ళడం, వెళ్ళడం... ఒక అపురూప మందిరంలో అడుగుపెట్టారు. అది శయనాగారం. అందులో హంసతూలిక తల్పం. దానిపై శేషశయనుడైన ఆ లక్ష్మీనారాయణ, స్వరూపుడు. నేటి జగత్ప్రభువు. శ్రీకృష్ణుడు, వసుదేవసుతుడు. చిద్విలాసంగా పడుకున్న, తన బాల్యమిత్రుని చూస్తూ, ఆ ఇందిరారమణుని కిష్టమైన సామగానం ప్రారంభించాడు.

అది చెవుల పడుతూనే ఆ గాన ప్రియుడు “సుదామా!” అంటూ వులిక్కిపడి లేచాడు. సుదాముని చూస్తూనే ఒక్క ఉదుటున లేచి, ఆ భక్తజన బాంధవుడు, ధర్మరక్షకుడు, సమతామూర్తి, “శ్రీ” సచ్చిదానందుడు జగత్ప్రభువు- పరుగు, పరగున తన బాల్యమిత్రుని దగ్గరకు తీసుకుని కౌగలించుకున్నాడు.

“సుదామా! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు. ఇన్నాళ్ళకీ మిత్రుడు జ్ఞాపకమొచ్చాడా ?” అని గుండెలకు హత్తుకుని శ్రీలక్ష్మి నిలయమైన ఆ హృదయంపై, తను నిత్యమారాధించి, పూజించే బ్రాహ్మణోత్తముని, ముఖ్యంగా వేదపురుషుని, సామవేద గానుని, అక్కున దాల్చాడు. తాను ఆనందభరితుడయ్యాడు. ఆ వచ్చిన కుచేలునికి మహదానందాన్ని ప్రసాదించాడు.

శ్రీకృష్ణుని, ఆ గోవిందుని, ఆ రక్షకుని, రాజాధిరాజును దర్శించగలనా ?” అని అనుకున్నందులకు, ఆ దేవదేవుని గుండెలపై ఆని తన శ్రమను మరిచాడు. జన్మ ధన్యత్వమొందాడు-పరమాత్మునికి-పరమబంధువైన-ఆ పుణ్య భాగవతోత్తముడు.

“సుదామా...!” ఆప్యాయంగా పిలిచే ఆ పిలుపుతో అనిర్వచనీయమైన ఆనందమొందే, ఆ కుచేలుని, ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని, నడుంచుట్టు చేతులువేసి నడిపించుకుంటూ, తన బంగారు, హంసతూలికా తల్పంపై కూర్చుండ బెట్టాడు. ఆ జీర్ణవస్త్ర రూపునికి, ధీరునికి, ఇంతటి అదృష్టమా ? అని ఎవరైనా ఆశ్చర్యపోతారు.

కృష్ణప్రేమలో తన అనుమానాలన్ని మరచి, అమితానందమొందాడు. ఇంతటి అదృష్టాన్ని, మహద్భాగ్యాన్ని కల్గించిన తన భార్య సుశీలకు, మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

ఒక అపురూప, మహత్తర సంఘటనలో మురిసి ముద్దవుతున్న ఆ పిచ్చి బ్రాహ్మణునికి, అపార, ఆనందాన్ని ప్రసాదించ సిద్ధబడిన - ఆ దేవకీసుతుడు, రుక్మిణిని చూసాడు. ఆమె సిద్ధంగా వుంది.

బంగారు పళ్ళెరం, కలశంతో అర్ఘ్యపాద్యాదులర్పించ సిద్ధంగా వుంది. అప్పుడు చిరునవ్వులు చిందించే శ్రీకృష్ణుడు -

"రుక్మిణీ, ఇతడే నేను చెప్పే సుదాముడు. చాలా చిన్ననాటి, సాందీపుల వారి వద్ద విద్యాభ్యాసం చేస్తున్న తరుణంలో దొరికిన ఆప్తమిత్రుడు. ఇతడు సామవేదాన్ని గానం చేస్తూంటే "ఓ! విదర్భ రాజకుమారీ! నేను ఈ సర్వలోకాలలో జరుపవలసిన ఏ క్రియనైనా మరచిపోతాను! అంత గొప్ప గానం చేస్తాడితడు" అని కొనియాడుతుంటే,

ఆ పిచ్చి బ్రాహ్మణుడు సిగ్గుతో తలదించుకున్నాడు. ప్రక్కన నిల్చునే అదృష్టం గూడా లేని ఈ పేదబ్రాహ్మణునికి, స్వామి మిత్రధర్మంగా తన తల్పాన్నిచ్చాడు. "రా" అంటూ రుక్మిణిని పిలిచి, అతని పాదాలను బంగారు పళ్ళెరంలో వుంచి, పట్టపురాణి పవిత్ర గంగాజలాన్ని, పసిడి కలశంతో పోస్తూంటే, ఆ దేవదేవుడు, పాదాలు, కడిగి తన బంగారు ఉత్తరీయంతో, పాదాలు తుడిచి, గంధపుష్పాక్షతలతో అర్చించి -

కడిగిన ఆ పాదజలాన్ని "బ్రాహ్మణో మమ దేవతాః" అని తన శిరమున, తన పత్నులందరి శిరములపై చల్లి, ఆ స్వయం విష్ణుడు, సర్వేశ్వరుడు - జగత్ప్రభువు తన భక్తపరాధీనతను చాటుకున్నాడు. పట్టువస్త్రాలనర్పించి షోడశోపచార పూజ సల్పి, వేదమూర్తుల ఎడ, పవిత్ర బ్రహ్మమూర్తుల యందు తనకు గల భక్తిని ప్రకటించుకున్నాడు.

"రుక్మిణి, ఈ లోకంలో నిష్కాములైన ఇటువంటి బ్రాహ్మణోత్తములు చాలా అరుదు. ఇతడు తన సుశ్వర సామవేదగానంతో, నన్ను సామగాన ప్రియుడిని చేసాడు. గురుకులంలో సమయం దొరక పుచ్చుకొని, కొంతసేపు ఈ పుణ్యాత్ముని గానమాధురిలో నన్ను నేను మరచిపోయేవాడిని. నా అభిలాషను గమనించిన గురుదేవులు కూడా, నాకా వినే సావకాశాన్నిచ్చేవారు.

ఇంకో విషయం తెలుసా ? ఈయనకు ముక్కు మూసుకుని అనుష్ఠానాలు చేసుకోవడం తప్ప నేర్చుకున్న విద్యను అమ్ముకోవాలని, ధనం సంపాదించాలనే ధ్యాస ఏ కోశానా లేదు. ఇప్పుడైనా - ఆ తల్లి - పరమ సుశీలయైన మా వదినమ్మ, పిల్లలు "అమ్మా! ఆకలే...!" అంటే ఆ ఆర్తిని చూడలేక, ఒక్కసారి వెళ్ళి దర్శనం చేసుకు రమ్మంటే వచ్చాడు కాని...

వ్యక్తిగతంగా ఇక్కడికి రావాలనే ధ్యాసలేదు. శ్రద్ధలేక కాదు. నను గురించి తెలుసుకుంటూంటాడు. నా లీలల వింటుంటాడు. ఆ మహానుభావుడికి బాల్య చెలికాడిననుకుంటాడు. కానీ, ఈ పేదబాపడు శ్రీ కృష్ణ సఖుడంటే, ఎవరైనా విని, నవ్విపోరా!'' అనే బిడియం నరనరాలలో జీర్ణించుకునిపోయి....

సకల లోకాలకు సర్వాన్ని ప్రసాదించే ఆ ప్రభువు, ఆతని పరివారంలో వాడినైన, నేను ఇది కావాలని అడగాలా ? ఆయనే కరుణిస్తాడను "తత్వ'' స్వరూపి. నిజంగా, ఏ బంధం లేకపోయినా బాంధవ్యం చెప్పుకునే బ్రతికే ఈ రోజులలో, ఇంకా ఇటువంటి వినయశీలురు, ధర్మమూర్తులు వున్నారు. కాబట్టే, ఈ లోకమిలా చల్లగా వుంది. ఈ మాత్రమైనా సుఖజీవనం, గడపగల్గుతున్నారు, ప్రజలు'' అంటూంటే,

అది వెక్కిరింతో, పొగడ్తో అర్థం కాని, ఆ వేదమూర్తి సిగ్గుతో ముడుచుకు పోతున్నాడు. సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి అన్నట్లు, రుక్మిణి మాత, వింజామరతో వీచుతుంటే సర్వలోకాలవారు శ్రీకృష్ణ చరణారవిందములకై తపిస్తూంటే ఆ దేవదేవుడు తన చరణాలను పూజించి అలసట తీరు పాదసేవనం చేస్తున్నాడు. తానెంతటి మహాత్ముని మిత్రునిగా పొందానని, పరవశించుతుంటే -

ఆ దృశ్యాన్ని చూసిన పరిజనం, ఇతర దేవేరులు, ఆ వచ్చిన పేద కుచేలుని, ఈ ప్రభువు - ఆ తల్లి చేసే సేవలకు ఆశ్చర్యపోతున్నారు. తమకు తెలియకనే అంజలి ఘటించి నిలిచారు. ఆ సమయంలో అక్కడుండు వారికి మరింత సంభ్రమాశ్చర్యాల్ని కల్గిస్తూ, సుదాముని చేతిని తన చేతుల్లోకి తీసుకుని మృదువుగా స్పృశిస్తూ -

"సుదామా! ఇన్నాళ్ళకు కలుసుకున్నాము ? నువ్వు బాగున్నావా ?'' అని అడగను. నిన్నుచూస్తే నీ సంసార పరిస్థితి అర్థమౌతుంది. ఆ ఇల్లాలు, మా వదినమ్మ.... ఎంత శాంత చిత్తురాలో! లేకపోతే నీలాంటివాడిని కట్టుకుని, ఆ పరమ పవిత్ర, నాలాంటి వాడిని కట్టుకుని, ఈ పుణ్యస్త్రీలు... అంటూంటే,

అమాయకుడైన ఆ పిచ్చి కుచేలుడు, వెఱ్ఱిగా నవ్వుతూ "నీ అభీష్టం, ఆజ్ఞ ఇప్పుడు వచ్చాయి, అదీ నా భార్య రూపంలో. నువ్వు చెప్పినట్లు ఆమె ప్రేరణతోనే బయలుదేరాను. మన శరీరాలు వేరైనా, అంతరంగమొక్కటేనన్న తత్వ నారాయణుడివి నీవు. నీకు భక్తుడను, "అభిమాన'' పాత్రుడను.

"అవునవును. ఇప్పుడు చెప్పింది మాత్రం కచ్చితంగా నిజం. ఆ అభిమానం నశిస్తేనే గదా, ఎవరైనా చెంతకు తీసేది. చింతలు తీర్చేది. అయినా నిష్కాముడివి- నిర్వికార, నిరంజనుడివి. నీకేం కావాలి చెప్పు. ఏదో ఆ ఇల్లాలి పుణ్యమా... అని రోజులు గడుస్తున్నాయి.... గడిపేస్తున్నావు" అన్నాడు -

"సుదామా! అది సరే. ఇన్నాళ్ళకు కలుసుకున్నాం కదా! నా కోసం ఏం తెచ్చావు? పోనీ, నా వదినమ్మ, నాకేమిచ్చింది ? సిగ్గుపడకు. భయపడకు. కావాల్సింది ప్రేమ, అభిమానం, భక్తిశ్రద్ధలు. అందుకే పత్రం, పుష్పం, ఫలం, తోయ''మన్నది.

నీవేమిచ్చినా, తెచ్చినా - దానిని తప్పక స్వీకరిస్తాను. ఆ తల్లి ప్రేమకు పరవశిస్తాను. అయినా ఆరగించినవాడి తృప్తే కదా, అవతలివారికి సంతృప్తి. అది మీకు తప్పక లభిస్తుందన్నాడు. మళ్ళీ మాటమార్చి, మన శిష్య ప్రముఖులలో ముఖ్యుడైన, ఆచార్య శ్వేతకేతువులు గుర్తున్నారా ?''

"ఆ.... ఆ... నీవు, ఉద్ధవుడు పుణ్యాజన ఓడలో వెళ్ళిన సమయంలోనే ఈ శ్వేతకేతువు కూడా కనీసం గురువుగారితో వెళుతున్నానని కూడా చెప్పకుండా కరవీరపురవాసులతో వెళ్ళిపోయాడనుకున్నారు.

"అనుకోవడం కాదు. నిజమే వెళ్ళిపోయాడు. తన జీవితాన్నక్కడ బందీ చేసుకున్నాడు. వేదవిరుద్ధ పద్ధతులలో, పాపం.... ఆ అమాయక ఆచార్యులు... ఆడదాని ప్రేమకు పొంగి, లొంగి, బానిసైపోయాడు. కాకపోతే ఆ తర్వాతికాలంలో, ఆతడు, కరవీరపురవాసుల చెఱనుండి బయటపడటమే కాదు... ధర్మమూర్తి అయ్యాడు. చివరకు - "ఇదిగో... ఈ పిల్లతో నాకు పెళ్ళి చేసాడు.

"పెండ్లి'' అనేసరికి, అంతటి పట్టపురాణి, మనుమల నెత్తుకున్న ఆ నాయనమ్మ సిగ్గు-మొగ్గలు ఏరుకుంది. అందులో నుండి వచ్చిన సుగంధాన్ని బుగ్గలకు పూసుకుంది, కూడా! ఆ "అవును, సుదామా! నీవు శ్వేతకేతువుని మరల... ఎక్కడైనా, ఎప్పుడైనా కలుసుకున్నావా ?''

"లేదు సోదరా...!'

"కానీ, శ్వేతకేతువు నీ గురించి ఆరా తీస్తున్నాడు. నువ్వొక సుగుణశీలిని వివాహం చేసుకున్నావని. నీ పిత్రార్జిత గృహంలోనే వుంటున్నావని, తరచు నాతో

అంటూంటే, "మానవులం, కర్మజీవుల"మని వూరుకున్నాను. అంతకుమించి ఏం చేస్తాం, చెప్పు!" ఆశలు పెంచని రీతిని, ఆ నిష్కాముని హృదయాన్ని, ఈ గోవిందుడు, చదువుతున్నాడు.

"సర్వాత్మకుడివి. నీకు తెలియనిదేముంది ? అంతా నీ కృప, సంకల్పమే కదా!"

"ఏవిటీ వేదాంతం. ఈ వైరాగ్యం కడుపు నింపుతుందా. ఇదంతా చూస్తుంటే, పిల్లలకింత తిండికూడా పెడుతున్నట్లు లేదు.

"కృష్ణా! అన్నీ తెలిసిన ఆనందరూపుడివి. ఇటు బ్రహ్మానందం, అటు ఆశాపాశాలు చూపి, జీవుని, అడకత్తెరలో పోకచెక్కను చేసి ఆడుకోవడం నీకు లీల. అందుకనే లీలామానుష విగ్రహుడవనేది.

ఇందులో ఎత్తిపొడుపులు, దెప్పిపోతలో కాని... మొత్తానికి వారి సంభాషణ వీనులవిందుగా, కమనీయంగా - ఓ మృష్టాన్న భోజనం వలె వుంది.

"ఈ వేదాంతం కడుపు నింపుతుందా ? ముందు నువ్వు చెప్పు." అన్నాడు రుక్మిణిని చూసి "ఏం దేవీ! పరమ భాగవతోత్తమురాలివి, నువ్వు చెప్పు!"

"ఏం చెప్పమంటారు. కమనీయమైన ముచ్చట్లు ప్రసాదించే, ఆ అద్భుత వేదాంతసారం, ఆత్మానందాన్ని కల్గిస్తుంది. పుట్టించినవాడికి, బ్రతికించడం, చంపడం - కూడా తెలుసు. అది వేదాంతమైతే, ఈ జన్మ బ్రహ్మానందం. అన్నీ ఇచ్చేవాడివి నీవైనప్పుడు, నేను మరొకర్ని కానీ, నిన్ను కానీ అడగాలా ? అన్నది - మీ బ్రహ్మమూర్తి. సదాలోచన!

"సత్యం చెప్పావు తల్లీ" అంటూ సంతోష తరంగాలలో ఆ భక్త సుదాముడు తేలాడు.

"సరిపోయారు" అన్నాడు, ఆ రుక్మిణి వల్లభుడు.

"అది సరే సోదరా! ఎంతటి పరాభక్తి - భక్తుడవైనా, విత్తులు, ఓ ప్రక్కనపెట్టి, నీటిని మరొక ప్రక్కన పెట్టి మధ్యన కూర్చుని ఆలోచిస్తుంటే, విత్తులు, నీళ్ళు తామంతటవి కలిసి, పంటను పండిస్తాయా ? ఫలితాన్నిస్తాయా ? అలాగే కర్మ జీవులైన ఈ శరీరధారులు, తమ కర్తవ్యం తాము నిర్వహించాలి కాని, ఎవరో వస్తారని, ఎదురుచూస్తూ, మన బాధ్యతలను మరొకరిపైకి రుద్దడం, బాహ్య, అభ్యంతరాలను దాటిన జడమైన - ఉన్మత్తదశ. ఆ దిశ - అందరికి ఆరాధనీయమా ?

ముఖ్యంగా - సంసారికిది - ప్రకృతి సహజ.... అదే ధర్మ విరుద్ధ - వేద విరుద్ధ సాంప్రదాయమౌతుంది. దీనిని ఆ వేదాలు, ఆ భగవంతుడు హర్షించడన్న సత్యం నీకు తెలుసుండి, సంసారంలో వుండి, ఈ వైరాగ్యమిప్పుడు అవసరమా? ఎప్పుడు అవసరమో ? కాస్త నిదానంగా ఆలోచిస్తే - ధర్మ ప్రకాశంతో - నీవు ధన్యుడివవుతావు!

ఇద్దరు క్షణకాలమాగారు. వింటున్నవారు బొమ్మల్లా నిలబడిపోయారు. కదలికలన్నీ యాంత్రికాలుగా వున్నాయి. అప్పుడు - వున్నట్టుండి -

"సోదరా! నీకో సత్యం చెప్పనా ? నీ ధర్మం నువ్వు చెయ్యాలి. నా ధర్మం నేను చెయ్యాలి. ఇది వదలరాదు. మరువరాదు. రోజు గంగకు వెళ్ళి కుండెడు నీళ్ళు తెచ్చి, దోసిడి నీళ్ళు నాకు పోసి, "ఇవే పంచభక్ష్య పరమాన్నాలు, షడ్రసోపేత భోజనంగా తలువు!" అంటూ ఆనాడు తృప్తిపరిస్తే దేవుడు కాని పిల్లలు కానీ, ప్రతి నిత్యమలాగ చేస్తూంటే - "ఏవిటీ మంచినీళ్ళు కడుపు నింపుతాయా ? కడుపులో తిప్పుత్రాయని అంటారే తప్ప, తృప్తిపడరు. కనీసం ఏటికెళ్ళి నీరు తెచ్చినంత శ్రమైనా పడితే, ఆ పరమాత్మ తప్పక అన్నపానాదులు ప్రసాదిస్తాడే?

"అభ్యుత్థాన మధర్మస్య.... అన్నాడు. "యద్య దాచరతి శ్రేష్ఠః" అన్నాడు.

ఇందులో - అవతరణకు సావకాశం లేదు. ఆచరణకు అవకాశం లేదు. కాబట్టి...!" అన్న కృష్ణుడు అటు, ఇటు చూసి -

"ఇంతకీ నువ్వు నాకేమీ తేలేదా ?" అంటాడు. ఇప్పటికైనా ధర్మమర్థం చేసుకుని, ఫలితం పొందుతాడనే సదుద్దేశంతో. ఆ వెర్రిబాపని మనసు తెలుసు కోవాలనే సంకల్పంతో.

పసందైన ఆధ్యాత్మిక విందును మధ్యలో ఆపి "మళ్ళీ నాకే"మిచ్చి, భౌతిక ప్రపంచంలోకి వచ్చేసరికి, ఆ దేవుని వాక్కు, నిత్యసత్యంగా తలవంచు కున్నాడు. అప్పుడు గతాన్ని జ్ఞప్తిస్తూ - ఆ కుచేలుడైన సుదామునికి సత్యబోధ - తత్వబోధజ్ఞాన మందిస్తున్నాడు.

అలాగే సుదామా, దేవుడైనా సరే, ఈ లోకంలోకి వస్తే ఈ లోకాచారా న్ననుసరించి బ్రతకాలి తప్ప, "నేను దేవుడిని. వేదవేద్యుడిని. సర్వలోక శాసనకర్తను.

సర్వాంతర్యామిని, సర్వాత్మ స్వరూపుడినని - విర్రవీగలేడు. అందరు దేవుడనని గొప్పగా పొగడబడే "నేను" అనే ఈ వసుదేవసుతుడు పడ్డ బాధలు పొందిన అవమానాలు, అనంతం.

కనుక. మనిషి "మనిషి"గానే బ్రతుకుతూ "మనీషి" కావాలే తప్ప, అంతా మిథ్య అంటే... ఆకాశానికి, భూమికి మధ్యలోనున్న మనం, ఆధ్యాత్మికానికి, భౌతికానికి మధ్యలోనున్న మనం, ఆశావాదానికి - నిరాశావాదానికి అటు ఇటు కాని మనం - ఏమవుతామో, ఏమవ్వాలో, ఓ వేదమూర్తీ, మాకు తెలిపితే, ధన్యుల మంటాడు.

పరమేశ్వరుడి ప్రతి మాటలోని హెచ్చరికకు, తలవూపాల్సి వస్తుంది. ఇటువంటి సమయంలో కృష్ణుడు ఆత్మోద్ధారకునివలె, మళ్ళీ చిన్ననాటి గురుకుల వాసానికి తీసుకువెళ్ళి, మాయలోబడేస్తాడు.

"అవును. సోదరా! ఆ గురుకులంలో గడిపే దినాల్లో ఒకనాడు - మన గురుపత్ని - మమ్ము సమిధల కోసం అడవికి వెళ్ళమన్నారు. అన్నా! నేను బయలు దేరాము. ఆ తర్వాత కొంతసేపటికి నీవు వచ్చావు. గుర్తుందా ?....

"ఆ.... ఆ.... అవును అప్పుడు నీవు నన్ను సామగానం చేయమన్నావు. ఆ ఆ గానం వింటూ ఇద్దరం ఈ లోకాన్ని కాదు, మన వునికినే మనం మరచి పోయాము. అంతలో ఆకాశం, నల్లని మేఘాలు. చూస్తుండగా వర్షం. తడవకుండా వుండటానికి ఒక పెద్ద చెట్టు నీడకు చేరాము. కుండపోత వర్షము. దానినుండి ఏదో విధంగా రక్షించుకున్నాము."

"అప్పుడొకచోట, ఆ వటవృక్ష ఛాయలో కూర్చున్నాం. నేను అలసట చెందాను. నీ వడిలో పడుకున్నాను. గుర్తు వస్తూందా ?

"గుర్తు రావడమేమిటి ? అంతా గుర్తుంది. ఈలోగా కొద్దిగా మత్తూ... అదే తూలుడు వచ్చింది. ఆ క్షణకాల నిద్రలో ఏదో టకటక చప్పుడు. ఏమిటని అడిగాను. ఏముంది చలి. సూర్యాస్తమయం గూడా అయింది. చలికి పళ్ళు టక టక కొట్టుకుంటున్నాయి. అన్నావు నీవు. అప్పుడు నేను -

"ఏం లేదు సోదరా! చిత్రంగా ఈ కొద్దిసేపట్లో.... నాకొక కల వచ్చింది. అందులో ఒకతను, తన తిండి తాను తినవచ్చును. ఇతరుల కివ్వమని చెప్పిన

ఆహారాన్ని, తనది కానిదాన్ని తాను తింటున్నాడు. ఏమిటో ఆ కల. చిత్రంగా వుందన్నాను. అవునా ? అప్పుడే - ఏవిటో ఈ మనుషులు ధర్మానికి చిల్లులు పెడుతూ, ఆ ధర్మానికి బందీలవుతున్నారు. ఇలాగైతే వాళ్ళ బ్రతుకు అంధకారమే. ఆ పరమాత్మ సృష్టిలో ఎంతటి సద్గుణమూర్తియైనా, కేవలం ఈ కొద్ది అపరాధానికి, స్వయంగా తాను అనంత కష్టాలను కొని తెచ్చుకుంటున్నాడన్నాను. అవునా ?"

"అవును, నువు చెప్పిందంతా నిజమే" అన్నాడు సుదాముడు.

"అప్పుడు నిన్ను నేను అడిగాను. నువ్వేమైనా తింటున్నావా. అని?! అందుకు నువ్వు... నా దగ్గరేముంది తినడానికి, బూడిద ? చలికి నా దంతాలు కొట్టుకుంటున్నాయి....!" అని ఏదో చెప్పావు... గుర్తుందా ?!

"ఏవిటో ఈ కలలు, జీవితాలు. ఆనాటి రోజులు ఆ ప్రేమలు... అనుబంధాలు.. ఈనాడు మచ్చుకు గూడా కనబడటం లేదు. ఎంతసేపు కపట ప్రేమలు, మాయా వేషాలతో... ఆ భగవంతుని మోసం చేస్తున్నారు. వీళ్ళ బ్రతుకులను పాడు చేసుకుంటున్నారు. సరే...

"ఈ కబుర్లకేం కానీ, ఇవన్నీ ప్రక్కనబెట్టి నాకేం తెచ్చావు ? అతను పడుతున్న కష్టాలకు సమాధానంగా పై కథనాన్ని చెప్పి, అధర్మవర్తనమెంత దురదృష్టకరమైనదో కృష్ణుడు భగవానునిగా, సత్యశోధనం - బోధనలతో సుదాముని కరుణిస్తున్నాడు. అనుగ్రహింప ప్రయత్నిస్తున్నాడు.

కృష్ణుడు తెల్పిన ధర్మసూక్ష్మంతో, ఆనాడు గురుపత్ని తనకు, బలరామ కృష్ణులకు ఇచ్చిన శనగలు, వారికి పెట్టకుండా, తాను ఒంటరిగా తిన్న ఫలితమీ బాధలకు కారణమని, సర్వాంతర్యామియైన, ఆ సర్వేశ్వరుడు జేసిన హెచ్చరికకు, సిగ్గుతో ముడుచుకుపోయాడు. అయినా అపారప్రేమను పంచుతూ, గౌరవాదరాభిమానముల తాను సేవించడమే కాకుండా, తన పత్నుల చేత సేవలు చేయించే ఆ పరంధామునికి మనస్సులో, మనస్సుమాంజలులర్పించాడే తప్ప, చిరిగిన తన ఉత్తరీయపు కొంగు చివర్లో కట్టిన పిడికెడు అటుకులను తీసి ఇవ్వలేక పోతున్నాడు.

ఇంతటి దేవునికి, ఆ ముక్కిన, చిరుగుల గుడ్డలో కట్టిన అటుకులా ?

ఇక్కడ - ఒక సత్యం ప్రతి ఒక్కరు గ్రహించాలి. ప్రతి వ్యక్తి నిష్కాముడై- తాను భగవదర్పితంగా సమర్పించిన దేనినైనా సరే, అన్నీ ఇచ్చే ఆ పరమాత్మ స్వీకరిస్తాడు. తాను తీసుకున్న దానికి, ఎన్నో రెట్లు ఆ భగవంతుడు ప్రసాదిస్తాడు. అది ఆ అగణిత గుణకర్మునకే తెలియాలి తప్ప, ఎంతటి వేదవేదాంగవేత్తయైనా ఆ ధర్మసూక్ష్మాన్ని గ్రహించలేడు. పరమేశ్వరశక్తి నెన్నలేడు. కేవలం ఒక్క భక్తి మాత్రమే, ఆ శక్తిని - నిలువరించగలదు, పెంపొందింప చెయ్యగలదు. సమూలంగా తుడిచి వేయగలదు.

అందుకే - ఆ వాసుదేవుడు, ఆతని భార్యా కోరిక మేరకు అనంత వైభవాల నివ్వాలి. ఆమె వాక్కును సత్యం చేయాలి. దానికే ఈ తాపత్రయం. అనుక్షణ ఆరాటంతో అడగడం.

ఇక లాభం లేదనుకున్నాడు, కృష్ణుడు. ఆతని సిగ్గు ఆతనికే విడచి, ఆతని భార్య భక్తికి పరవశిస్తూ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మా వదినమ్మ అంటూ ఆ కుచేలుని ఉత్తరీయాన్ని చూస్తూంటే - ఓ మూలగా చిన్నమూటగట్టిన వైనం కనుపించింది.

"అమ్మదొంగా! ఇక్కడ దాచావా ?!" చంటి పిల్లవాడు కేరింతలు కొడుతూన్నట్లు ఎగిరి, ఆ మూటను అందుకున్నాడా గోవిందుడు - భక్తజన విధేయుడు" చూడు సుదామా! మా వదిన సాంప్రదాయవాది, ధర్మమూర్తిణి, సదాచార సాంప్రదాయాలామెకు ఉగ్గుతో పెట్టినట్లు లభించాయి. మిగిలిన శాస్త్ర వాక్యమెట్లాగ వున్నా....

వెళ్ళక, వెళ్ళే,.... రాక... రాక... వెళ్ళే ఆ అపురూప బాల్యస్నేహితునికి... ఇది... ఇష్టమనిపంపింది' అంటున్నాడు. ఆ చిన్నమూటను విప్పాడు. "అటుకులు.." ఆ భవంతి అదిరేటట్లు అరిచాడు. అక్కడున్నవాళ్ళు ఉలిక్కిపడ్డారు.

ఇంతమంచి ప్రసాదం తెచ్చి, తెచ్చిన దానినివ్వకుండా మా వదినమ్మను, అవమానంపాలు చెయ్యాలనుకున్నావు. నీ ధర్మం నాకు తెలిసిందే కదా! కనీసం ఆ ఇల్లాలి మనసునైనా గుర్తించి, గౌరవించవద్దూ!" అటుకుల మూట విప్పాడు. అందులోనుండి ఓ గుప్పెడు తీసి నోట్లో వేసుకుని "సర్వ లోకాలు శాంతించుగాక! సర్వ సుఖాలు - శుభాలు ప్రసాదించుగాక!" అన్నాడు. తొందర తొందరగా నమిలి, మిగిలిన అటుకులలో కొన్ని తీసుకున్నాడు.

అంతవరకు కృష్ణలీలలకు నవ్వుకుంటూ, మా అమ్మ పెట్టిన అటుకుల్లాగ, మా వదినమ్మ పంపిన అటుకులున్నాయని, సంబరపడిపోతూంటే, అందులో పాలుపంచుకున్న రుక్మిణి - మిగిలిన అటుకులను తీసుకుని తినబోతుంటే -

"మరీ ఇంత భక్తపరాధీనత, అనంతప్రేమ పనికిరాదు. ఇవ్వవలసినదానికన్న ఎక్కువ, కావలసిన దానికన్న ఎక్కువ, ఇంద్రాదులను మించిన వైభోగాలతో, అనంత ప్రేమను, సిరిసంపదల్ని ప్రసాదించే మీ పరమ"భక్తి" ప్రేమకు, నా మనస్సుమాంజలులు. దయచేసి.... !" చెయ్యి పట్టుకుని ఆపిందా తల్లి.

"సరే, వీటిని నువ్వే తినమని.... ఆమె ఇచ్చిన మంచీళ్ళ చెంబునందుకుని, ఈ అటుకులను వారికిచ్చాడు. అంతవరకు సిగ్గుపడ్తూ, మెలికలు తిరిగిన కుచేలునికి, ఆ భార్యాభర్తల సంభాషణమేమాత్రం అర్థం కాలేదు. అర్థమయిందా... కేవలం కృష్ణప్రేమ. ఆ తల్లి అనురాగం, ఆప్యాయత మాత్రమే.

కానీ, తన ఇల్లాలిచ్చిన ఆ అటుకులను, అపురూపంగా నా మిత్రుడు శ్రీకృష్ణుడు గైకొన్నాడని, నా భార్య సుశీల అడగకుండానే చెప్పాలి. ఆమెను ఆనందపర్చాలని, మరచిపోరాదని అనుకుంటున్నాడు. శ్రీకృష్ణ ప్రియ - మిత్ర తత్వానికి మురిసిన ఆ సుదాముడు.

ఇటువంటి మిత్రుని పొంది, ఇన్నాళ్ళు అజ్ఞానంలో కర్మబంధం పేరిట బ్రతికిన అజ్ఞానం, ఈనాడు నా భార్య వలన పోయిందని మురిసిపోయాడు. ఇదే ఆత్మానంద ప్రసాదింపచేసే, జ్ఞానాభిలాషకు తార్కాణమని పరవశించాడు. పులకరించాడు. అయినా -

ఆతని మనసును గ్రహించినట్లు, వాసుదేవుడు -

వినయం భూషణంగా, సహజశ్రద్ధా విశ్వాసాల ధర్మమూర్తిగా - కృష్ణదేవుడు "సోదరా! ఇకముందు ముందు, ఈ జగత్పరిణామాలు. పరిమాణాలు తెలియచేసే కొన్ని విషయాలను, నీకంటే నాకు బాగా తెలుసని కాదు. మొత్తానికి ఈ క్షణంలో మన పెద్దలు చెప్పిన సుద్దులను గుర్తుచేసుకుంటూండు" అంటాడు.

# ఆనందో పరబ్రహ్మ

**సు**ఖనిద్రతో, ఆదమరచి నిద్రించిన సుదాముడు సకాలంలో లేచాడు. సంధ్యానుష్ఠాన కార్యక్రమాలను పూర్తి చేసుకున్నాడు. మిత్రుని బిగియార కౌగలించుకుని, పరి పరి విధాల కృతజ్ఞతలను చెప్పాడు. ఆ దంపతులు కొంత దూరం, వెంటరాగా - ఆనంద డోలికల తేలియాడుతూ అడుగు ముందుకు వేసాడు.

నమస్కార, ప్రతి నమస్కారాలతో, ఇరువురు మహదానందభరితులయ్యారు. అదృష్టవంతుడని - సుదాముని చూసినవారనుకుంటే -

"నిజంగా, తాను అదృష్టవంతుడనని, కృష్ణుని వంటి పూర్ణపురుషుని, బాల్య స్నేహితునిగా పొందగల్గడం, తన అదృష్టమని, మరల మరల మురిసిపోయాడు. అడుగులు ముందుకు వేస్తున్నాడు. కానీ, కృష్ణుని విడిచి, ముందుకు కాళ్ళు వెళ్ళమన్నట్లు మొరాయిస్తుంటే, మనసంతా నింపుకున్న కృష్ణుని రూపంతో, మహనీయుడు, ఆ సుదాముడు... ప్రయాణం ప్రారంభించాడు.

కృష్ణనామం, రూపం, ఆ ప్రేమలతో పరవశిస్తూ తన ఇంటివైపునకే వచ్చాడు కానీ, తన ఇల్లు-వాకిలి లేదు. అదే ప్రాంతమో, ఎవరి ఇల్లో, ఎలాగ దారి తప్పి పోయాడో తెలియక, అడుగులు తడబడుతూ, అటు ఇటు చూస్తుంటే - అంతా మాయగా వుంది. తాను ద్వారకలో లేడు. వున్నది ప్రభాస ప్రాంతంలోనే. చూసేది రుక్మిణిదేవి మందిరం కాదు. తన నివాస ప్రాంతం ఏమిటో...... అంతా అయోమయం, గందరగోళంగా వుంది. దిక్కు తోచడం లేదు.

సరిగ్గా - ఆ సమయంలో -

"స్వామీ!" అన్న పిలుపు విని వెనక్కి చూసాడు.

దేవతలవంటి వ్యక్తులు మంగళవాయిద్యాలతో, వినయ విధేయతలు ప్రకటిస్తూ - తనవైపే వస్తున్నారు. కదలబోయిన తనను మిమ్మల్నే స్వామి!" పిలిచి, మరీ తన దగ్గరకు వస్తున్నారు. ఏమిటీ లీల, చిత్రం...... అంతా భ్రాంతి స్వరూపంగా వుందనుకుంటున్నాడు.

వాళ్ళు దగ్గరకు వచ్చి వినయవిధేయలతలో వందన మాచరించారు. "స్వామి! ఇది తమ భవనమే!" దయ చేయండని స్వాగతమిస్తున్నారు. ముఖద్వారం వద్ద పాదప్రక్షాళనం చేసారు. పాదాలు తుడిచి, పువ్వులు జల్లారు. లోపలకు నడిపించుకుని వెడుతున్నారు.

రెండుచేతులు జోడించి, మందహాస వదనంతో, లక్ష్మీదేవి యను, ఓ దివ్యాంగన ముందుకు వచ్చింది. నిన్నటిదినం బంగారు పళ్ళెరంలో, తన పాదములుంచి, కృష్ణదేవుడు పాదములు కడుగ వీలుగా, బంగారు కలశ జలమిచ్చిన రుక్మిణీదేవి - ఆ దృశ్యం యావత్తు కనులముందు వెలిసింది.

ఆమె అర్ఘ్యపాద్యముల అర్చించి, షోడశోపచారపూజను సల్పి, కుచేలుని పాదములకు వందనమిచ్చింది. అప్పుడామె - కళ్ళ నిండు కృతజ్ఞతను ప్రకటిస్తూ-

"మన పరంధాముడు, తమ బాల్యమిత్రుడు శ్రీకృష్ణ వాసుదేవుల కరుణా ఫలితమీ - సంపదలు, భోగభాగ్యములని" పలుకగా - ఆనందాశ్రువులు రాలుస్తూ ఆ పేద బ్రాహ్మణుడు. ఆమెను తన భార్యగా తలిచాడు.

"కృష్ణా! అడగకనే, మానవులు పొందలేని మహా వైభవాన్ని ప్రసాదించావు కదయ్యా!" గొంతుక వణుకుతూ, శరీరం జలదరించి, అంగాంగాల - నరనరాల కృష్ణప్రేమను - వ్యక్తీకరించలేని దేహంతో, మాటలు రాని - సామగానవేత్త" రెండు చేతులను శిరమునకు పెట్టుకుని - క్షణకాలమలాగ వుండిపోయాడు.

వాసుదేవుని వాత్సల్యానికి మరి మరి మురిసాడు. ఎన్నిమార్లు ప్రస్తుతించినా, తరగని నిండుభక్తిని, "శ్రీ" పాదాలపై వుంచి "అనన్యాశ్చింతయంతోమాం... అన్నట్లు ఆ ప్రభువును స్మరిస్తూ - జీవితమంతా కృష్ణనామంతో గడపాలను కుంటున్నాడు. ఆమె భర్తను లోపలికి తీసుకువెళ్ళింది. శీతలోపచారములను చేసింది.

నిన్నటి వైభవము తాత్కాలికమనుకున్న తనకు అది శాశ్వతమనిపించ లేదు. కానీ శాశ్వతత్వాన్ని ప్రసాదించాడు. అపారభక్తితో, అనుక్షణ నామ స్మరణంతో నిల్చి, ధర్మ - కర్మానుష్ఠానములతో భగవంతుడు సూచించినట్లు సదాచార, సద్ధర్మ ప్రకాశానికి అంకితమివ్వాలని నిర్ణయించుకున్నాడు.

★★★★

భర్త సుఖించిన తదుపరి, విశ్రాంతి నొందుతుంటే -

"స్వామీ! ఆ భగవానుని లీలావిశేషాలను మధురిమ నందించమని, ఆ పుణ్యశీల "సుశీల" కోరింది. అవశ్యమని సుదాముడు, తను ద్వారకకు ఎలాగ వెళ్ళాడో తెలియదుకానీ, వెళ్ళినప్పటి నుండి, ఇప్పటివరకు జరిగిన లీలావిలాసాన్ని మొత్తం - సవివరంగా ఆమెకు ఆనందదాయకంగా,తాను ఆనందపరవశుడౌతూ మరీ, మరీ, తలుచుకుని, ఉద్వేగ - ఉత్సాహముల నొందుతూ, కృష్ణభక్తిలో తాదాత్మ్యం చెందుతూ - ఒక్కొక్కటే వివరంగా చెబుతున్నాడు. అత్యంతాసక్తి దాయకంగా, ఆ తల్లి - సుశీలమ్మ వింటుంది.

అసలు నీకు చెప్పాల్సిన విషయమంటూ, ఆ ధర్మమూర్తి, అనుగ్రహ - ప్రేమ పూర్వకంగా, సుశీలమ్మను దగ్గరకు తీసుకుని "నీ పుణ్యమున, నేనా దేవదేవుని సేవలనొందగలిగాను. అంతటి పరమపూజ్యుని ఆనందానికి కృపకు పాత్రుడ నయ్యాను. మరో విషయం తెలుసా ?

ముక్కిపోయిన, ఆ పాతచిరుగు గుడ్డలో కట్టిన అటుకులను, నా వదినమ్మ ఒట్టి చేతులతో పంపదు. ఏదో పంపిందంటూ - వళ్ళంతా తడిమి, ఆ పాత చిరుగుల ఉత్తరీయం చివరలోనున్న ఆ చిన్ని పిడికిలి అటుకుల మూటను విప్పి-

"అమ్మదొంగా, ఏం తేలేదన్నావు. ఇవేమిటి ?" అని ఒకసారి...

"అమ్మో! అటుకులు... అంటూ మరొకసారి ఆ భగవానుడు చిన్న పిల్లాడివలె కేరింతలు కొడుతూ ఆ పరమపురుషుని దివ్యలీలా విలాసాలను అనుక్షణం గమనించి, పొందే, ఆ అపరలక్ష్మిదేవి, రుక్మిణీమాత పొందిన ఆనందం, వింజామరలను వీస్తూ స్వయంగా చూపించిన గౌరవాదరములు! "వశి" సుశీల! "ఇదంతా నీ పుణ్యమే కదా!" అంటూ అశ్రుధారలతో మిలమిల మెరిసే నేత్రాలతో, నీకేమిచ్చి ఈ ఋణం తీర్చుకోగలనని, పరిపరి విధాల ప్రస్తుతిస్తాడు.

భర్త చెప్పే - ఆ దివ్యానుభూతికి, ఆ పరమాత్మ "వదినమ్మ" అనే అనంతా ప్యాయ అనురాగపూరిత పిలుపుకు స్పందిస్తూ - స్వయంగా ఆ పిలుపును తాను విన్నట్లే ఆనందపడింది. పైగా - నా మిత్రుడు, కృష్ణుడు -

"సోదరా! నీవలె విరాగి, ఆశావాది కాదు, నా వదినమ్మ. ఎందుకు అనవసరంగా చెప్పుకునే ప్రేమానుభూతులు. ఆమెవల్లనే నీవు నా దగ్గరకు వచ్చావు. నేను నిన్ను చూడగలిగానని, ఆ పరంధాముడు, పాదసేవనం చేస్తుంటే నిజంగా ఎత్తిన నా జన్మ అప్పటి వరకు నిరుపయోగమయిందనిపించింది.

నేడు నీ వలన పరిపూర్ణ ధన్యత్వముంది. ఆమె వలన లభించిన పుణ్యానికి పులకితుడౌతున్నాడు. ఆమెను పులకరింప చేస్తున్నాడు. కానీ నాకో విషయం అర్థం కాలేదంటాడు, కుచేలుడు.

ఆ కొద్దిపాటి అటుకులతో కొద్దిగా తీసుకుని నోటిలో వేసుకుని "సర్వ లోకాలు శాంతించుగాక! సర్వసుఖాలు, శుభాలు సంప్రాప్తించుగాక!" అన్నాడు- అదే అర్థం కాలేదు. అలాగే రెండో పిడికిలి కాదు, కానీ మరో విడత అటుకులు తింటుంటే మరీ అంత భక్తపరాధీనత పనికిరాదు. ఇచ్చిన అదృష్టం, చేసిన సేవలు చాలు!" అంది. ఇదీ అర్థం కాలేదు. ఇంకో విషయం అర్థరాత్రి వరకు ముచ్చట్లు చెప్పుకున్నాం. ఆ ఆదిదంపతుల సేవలనందుకున్నాను. మా కృష్ణుని ఇతర దేవేరులు కూడా, పోటీపడి "ఎంత అదృష్టవంతుడో, ఈ బడుగు బాపడ"ని స్వయంగా తమ సేవలతో సంతృప్తి పరిచారు.

పరిచారకులను నాదరి కేమాత్రం రానివ్వలేదు.

తెల్లవారి లేచాను. నా అనుష్టానం పూర్తి చేసుకుని బయలుదేరాను. బయటికి వచ్చి, తమ పరివారంతో, ఆ ఆదిదంపతులు వీడ్కోలు పలికారు. అప్పుడు మాత్రం అనిపించింది, అడిగి అటుకులు తిన్నాడు. కానీ, అరటి పండయినా ఇవ్వలేదునుకున్నానా క్షణంలో. కానీ, నా ఆలోచన ఎంత తప్పయిందో. ఇక్కడకు వచ్చిన తదుపరి అర్థమయింది. నేను ఇచ్చేది, ఈ బాపడేమి మోయగల డనుకున్నాడనుకుంటాను.

ఆనందాన్ని ప్రసాదించాడు. అఖండ సేవలనందించాడు. అడగకుండానే, మనో మాలిన్యాన్ని తొలగిస్తూ - అనంత సంపదలను ప్రసాదించాడు. అందుకే ఏం తెచ్చావు, ఏం తెచ్చావంటూ, మరి మరి అడిగి ముక్కిపోయిన అటుకులకు, ఇంద్రాది దేవతలను తలదన్నే - అపూర్వ శాశ్వత వైభాన్ని ప్రసాదించాడు.

అందుకే మానవుడు అజ్ఞాని. సుజ్ఞానిననుకునే నిజమైన అజ్ఞానికి - జ్ఞాన నేత్రమొసగి - ధర్మతత్వాన్ని ప్రసాదించిన ఆ పరమాత్మకు తదుపరి, ముందు నీకు నా కృతజ్ఞతలు తెలుపుకోవాలి'' అన్నాడు. ఇప్పుడు నిజమైన ధర్మావలంబీకుడ నయ్యానని, నిజమైన తృప్తి పొందాడు - సుదాముడు.

అనంత సంపదలనొసగి, ఆర్ష ధర్మాన్ని తెలియబరచి, ధర్మ ప్రచార సత్యాన్ని, పరమ రహస్యమని ప్రకటించిన ఆ పరమపురుషునికి, ప్రతి క్షణం స్తోత్రములు ప్రకటిస్తూ - శ్రీకృష్ణ ఆదేశం ప్రకారం, సత్య-ధర్మ-శాంతి వేద, వేదాంత రీతులను, సర్వులకు అందించ ఆ దంపతులు స్థిర నిశ్చయులయ్యారు.

"శ్రీకృష్ణః శ్మరణ, మమ'' అన్నారు. ఇది - "శ్రీకృష్ణ భాగవతం'' లోని కుచేలోపాఖ్యానం.

# ఆనంద సమాగమం

**ప**రమాత్ముని యొక్క ప్రతి లీల పరమాద్భుతమే.

ఆ సమయంలో కృష్ణుడు నాగ్నజితి మందిరంలో వున్నాడు. స్వామికి సేవచేసే నెపంలో, తన మనోగత అభిప్రాయాన్ని భర్తకు తెలియచేయాలని, ప్రయత్నం చేస్తున్న అలంకార ప్రియుడైన హరి, ఆమె "సేవలందుకుం''టూనే....

"చెప్పు దేవీ, నా వద్ద ఎందులకు సంశయం, సందేహము'' అన్నాడు ప్రేమగా ఆమెను చూస్తూ.

ఆమె భర్తకు అనుకూలవతి. కాకపోతే భర్త అభీష్టముతోపాటు, తన వుద్దేశం తెలియచేయాలని - తండ్రిగారు సందేశం పంపారంది.

"ఏమని దేవీ!'' లాలనగా అడిగాడా ప్రేమమూర్తి.

మాఘ బహుళ అమావాస్యనాడు సూర్యగ్రహణమని శ్యమంతక పంచకాని కెందరెందరో రాజులు కూడా వస్తున్నారని, వీలు చూసుకు నీవు, అల్లుని గారితో

కలిసి రావలసినదని కబురు పంపారు. అది చెబుదామని - ఆ చెప్పవలసింది చెప్పేసి, పరమాత్మ ఆదేశానికి ఎదురుచూస్తుందా ఇల్లాలు.

"మంచిమాట. శ్యమంతక పంచ మధ్యభాగమే కురుక్షేత్రం. ఇది తప్పక దర్శించ తగిన ప్రదేశము. దుర్మదాంధుడైన కార్తవీర్యార్జునుడు, అపర శివ స్వరూపుడైన జమదగ్ని మహర్షిని అకారణంగా వధిస్తాడు. అది పరశురామునికి ఆగ్రహ కారణమయింది. ఆ పరశురాముడు విష్ణ్వాంశ సంభూతుడు, అవతార పురుషుడు.

జరిగిన ఘోరాన్ని తెలుప, తల్లి రేణుకా మాత ఇరవైయొక్క మార్లు "రామా, పరశురామా! ఈ దారుణమాపమని ఆక్రందన చేసింది. అతను వచ్చేసరికి జరుగ వలసిన ఘోరం జరిగిపోయింది. అందుకుగాను తల్లి చేసిన ఇరవైయ్యొక్క మారుల ఆక్రందనకు నిదర్శనంగా, అన్నిసార్లు భూలోకంలోని అంగుళం అంగుళం వెదకి, రాజన్నవాడు లేకుండా వంశ నాశనం చేసాడు.

ఆ తర్వాత వాని పాప పరిహారం వలన రూపొందిన మడుగులే "శ్యమంతక పంచకంగా" ప్రసిద్ధి గాంచాయి. ఇక్కడ చేసే దాన తర్పణాదుల వలన పితృదేవతలు ప్రీతిచెందుతారు. సమస్త పాపములు క్షయమవుతాయి.

అయితే ఆ పవిత్ర ప్రదేశాన్ని మనం దర్శించాలనే ఆకాంక్షను వ్యక్తబరు స్తుందామె. అలాగే భద్ర, లక్షణలు, ఇతర దేవేరులు తమ కోర్కెను వ్యక్తం చెయ్యగా మహారాజు, తల్లిదండ్రులు, ఇతర ముఖ్య బంధువులు, తన కుటుంబ పరివారములతో ఒక జాతరకు వెడుతున్నట్లు శ్రీ సూర్యగ్రహణానికి బయలు దేరారు.

వచ్చే రాజులు, అన్నదానాదులకు గూడా తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎందరో ప్రజలు, పుణ్యతీర్థ స్నాన దాన ధర్మాదులకు వస్తున్నారు. కాబట్టి ఇందుకు విస్తారంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏకాదశి వచ్చింది. కురుక్షేత్రం - సంక్షిప్త భారతదేశమయింది. సర్వవర్ణాల వారి, వారి వర్గాలతో నిండిపోయింది.

పాండవ సోదరులు, ఇతర రాజ్యాధినేతలు వచ్చారు. వారి - వారి బంధువులతో ఆనంద సాగరంగా వుందా ప్రాంతం.

వ్యాసభగవానులు విచ్చేసారు.

యాదవ తాత్కాలిక నివాసాలకు, విదర్భ, అవంతీ, కోసల, హిమాచల ప్రభువులు, మద్రదేశాధీశుడు, పాంచాలరాజు దిగారు. పరస్పరాలింగన, అభిమాన, ప్రణామాలతో, అందరు ఆనందమూర్తులయ్యారు. ఇక్కడే కృష్ణలీల ప్రారంభమయింది.

పాంచాల రాజును చూసి, “మీరు ఇంకా గోవిందుని దర్శించలేదా ?” అనగా - ఇప్పటివరకు అక్కడనే వున్నాను. యజ్ఞ కార్యనిర్వహణంపై తమ తండ్రి, పెద్దన్న బలరాములతో సంభాషిస్తుంటే, నేను వారితో వుండిపోయాను. నా అదృష్టం కొద్దీ చూడవలసిన వారినందర్ని చూసానన్నాడు.

“భలే. చిత్రంగా వుందే. నేను ఇప్పుడే రుక్మిణీ నివాసం నుండి వస్తున్నాను. మా అల్లుడు అక్కడ వున్నాడు. మేము ముగ్గురు అరమరికలు లేకుండా మాట్లాడుకున్నా మంటూంటే, ఎదురుపడ్డ విందుడు -

“ఇప్పుడు నేను, మా సోదరి, బావగార్లతో మాట్లాడి వస్తున్నానంటాడు. అప్పుడు అవంతీశ్వరుడు కనబడ్డాడు. రేపు మధ్యాహ్నం రెండు గం॥కు విందుకు వీరు పిలవడం, శ్రీకృష్ణుడు వస్తానని వాగ్దానమివ్వడం జరిగిందిట.

ఒక్కొక్కరు విస్తుపోతున్నారు.

అసలు శ్రీకృష్ణుడు మావాడు అనుకుంటున్నారే తప్ప పదహారువేల వందమందిని వివాహమాడిన ఆ వాసుదేవ తత్వం, భగవత్తత్వం,.... ఏ ఒక్కరికి అర్థం కాలేదు. వీళ్ళు అర్థం చేసుకున్నదేమిటి ? వాళ్ళ కోరిక మేరకు వివాహం చేసుకున్న ప్రభువు, అందర్నీ ఆనందంగా చూస్తున్నాడంటే..

ఆ పరమాత్ముడే వీరిని సముద్ధరించి, తత్త్వబోధ చేయాలి. వారి శంకా, సంశయాలు రూపుమాపాలి. మీరిక్కడే వుడండి, వారు వారి అభిప్రాయాలకు, తాము తెలుసుకున్న ప్రదేశాలకు వెళ్ళారు. తాము గతంలో చూసిన విధంగానే స్వామి అక్కడే వున్నారు. అదే తిరిగి కలుసుకుని, మళ్ళీ మళ్ళీ చెప్పుకున్నారు.

ద్రుపద మహారాజు - తన తోటి రాజ్యాధినేతలందరితో “ఆ ప్రభువు లీలామానుష విగ్రహుడు. సర్వాంతర్యామి, సర్వాత్మ స్వరూపుడని” ఆనంద బాష్పాలను కండ్ల వెంట జారుతూంటే, వందన మొనరించి మరీ చెప్పాడు.

అందరు "అస్తు" అని తమ ఆనందాన్ని యధాగతంగా తెలియబరిచారు. ఆనందడోలికల తేలియాడారు. సరిగ్గా - సమయంలో పవిత్ర గ్రహణ స్నానం కన్న - శ్రీకృష్ణ సందర్శనం కోసం, బృందావన వాసులు, నంద-యశోదలు కలిసి వచ్చారు. ఆ వచ్చినవారి కండ్లు, ఎవరు పలుకరించినా, ఆ పలుకరించిన వారివైపు చూడటం లేదు. నోరు పలుకరించడంలేదు.

అవి చూస్తున్నాయి - తమ కంటిదీపం - నేత్ర జ్యోతి - దివ్య స్వరూపుడైన - ఆ"నంద" - యశోదా" "నందుని"కై వెదక్కుంటున్నాయి. వెదికేవారి కండ్లకు నాల్గు గుర్రములు - ఒక ప్రత్యేక రథంపై విలాసంగా వీరికోసమన్నట్లు వస్తూన్న శ్రీకృష్ణుని చూసారు.

సజల నేత్రాలతో, ఆనంద బాష్పాలతో "బృందావన కన్నయ్యకు జై! గోపకుల మౌళికి జై! గోవర్థన గిరిధారికి జై!' ఎవరిష్టమొచ్చినట్లు, వారు వారి వారి అభీష్టం మేరకు, ఆ వెర్రిగొల్లలు ఈ పిచ్చిగొల్లడికై గొల్లుమంటున్నారు. కంటినిండుగా చూస్తూ, గుండె నిండుగా జయ జయ ధ్వనులు చేస్తున్నారు. అందర్ని చూసాడు. కళ్ళతో పలుకరిస్తూ ఆ కళ్ళతో ఆత్రంగా అమ్మకై ఎదురు చూస్తున్నాడు.

గోపకులెందరో కృష్ణుని చూసారు. పల్లె నుండి పట్నానికి వచ్చిన పరమాత్ముడైన ఆ వాసుదేవుడు, కన్నయ్య నుండి కృష్ణుడు వాసుదేవుడు" అయ్యాడు. యశోదా తనయుడు నందకిశోరుడని ఈ నగర జీవితంలో కొందరే పిలుస్తారు. తలుస్తారు. తననే చూస్తున్న, గోపకులకై రథం దిగి, ప్రతి ఒక్కరిని పేరు పేరున పలుకరించాడు. ఆప్యాయంగా అక్కున దాల్చాడు.

దారుకుడు వెళ్ళి నందయశోదలను "అమ్మా! ఇది నీ కృష్ణుని రథ" మంటూ ఎక్కించుకుని వచ్చాడు. వారికై ఎదురుతెన్నులు చూసే బలరామకృష్ణులు, నంద యశోదలున్న రథం చూస్తూనే, చిన్నపిల్లల వలె పరుగెత్తుకుంటూ వెళ్ళారు.

నందుడు, ముందు ఆనందంగా దిగి, తన కృష్ణుని, తదుపరి బలరాముని గాఢాలింగనం చేసుకుని, మనసులోని మమతను, కళ్ళలో దాచుకోలేక, కన్నీటిని కురిపిస్తూ "కృష్ణా! ఇన్నాల్టికి....!" అని బిగియార కౌగలించుకున్నాడు.

యశోద రథం దిగలేదు. అది గమనించిన కృష్ణుడు రథం దిగని తల్లిని చూస్తూ, ఆమె పాదాలను పట్టుకుని "ఎప్పుడూ తప్పుచెయ్యను కొట్టమ్మా!" అని కిరీటాన్ని క్రిందపడేసి, ఆమె పాదాలపై తన శిరమును వుంచాడు.

అంతవరకు ఎంతో కోపంతో కృష్ణున్ని చూడను. కృష్ణునితో మాట్లాడ గూడదనుకున్న ఆ తల్లి, చిన్నప్పుడు తన చేతులలో పెరిగి, ఏ విధముగా, మారాం చేసాడో, ఆ రకంగా అల్లరిపిల్లవానిగా కనిపించిన కృష్ణునిపై కోపం పోయింది. "కన్నా! అని అలాగే క్రిందకు జారి అతడిని గుండెలకు హత్తుకుని, నోటమాట రాక, జలదరించే శరీరంతో, అప్పటి చిన్నపిల్లవాడిగానే వూహించుకుంటు ముద్దులతో ముంచెత్తింది.

ఇది చూసిన దేవకి ఎంతటి అదృష్టవంతురాలు, ధన్యజీవో యశోదనుకుంది. ఇంతటి కృష్ణప్రేమను పొందిన, ఆ తల్లి నిజంగా వందనీయురాలిగా, తెలియ కుండానే నమస్కరించారు. ఇది వారెవరికి తెలియదు. ఈ లోకంతో, ఆ తల్లి పిల్లవాడికి సంబంధం లేదు. అంతటి అనురాగంలో మున్గిపోయారు.

మెల్లిగా రథం దిగింది. లోపలకు నడిచారు. ఆ తల్లి బిడ్డల ప్రేమలో - ఒకరికొకరు చూపుకునే ఆ ప్రేమ - పరస్పర సేవలు - ఇన్నాళ్ళు ఎక్కడ దాచారో అక్కడున్న వారెవ్వరికి అర్థం కాలేదు. కానీ ఆ ప్రేమకు పరవశించి మాత్రం చూస్తున్నారు.

కాస్త తేరుకున్నాక యశోద "అది కాదురా, కృష్ణా!" అంటూంటే, "నువ్వేం చెప్పకు. నువ్వు చెప్పేదేదో నాకర్థమయింది. అనవసరంగా ఆ అక్రూరుల వారితో కంసమామ పిలిచాడని, పంపకుడా వుంటే, ఈ గొడవలు బెంగలు వుండేవి కావు. బృందావనంలో ఇష్టమొచ్చినట్లు తిరిగే వాడిని, ఇంకా అల్లరి చేస్తున్నానని తలిస్తే, నువ్వు రోటికి కట్టేస్తే హాయిగా కదలకుండా ఒకచోట పడివుండేవాడిని. ప్రాణం సుఖంగా వుండేదని "తల్లి వద్ద మారాము పోతుంటే, "అమ్మో! అల్లరి గడుగ్గాయే... ఎవర్ని ఎలాగ మెప్పించాలో బాగా తెలుసనుకున్నారు." అక్కడవుండి చూసేవాళ్ళందరూ.

బలరామకృష్ణులు - తల్లితో దోబూచులాడుతున్నట్లు చిన్ననాటి ముచ్చట్లతో పలుకరించుకుంటుంటే, వినే వారి ఆనందం, అవ్యక్తమయింది. నందుడి పలుకరింపులను ఆపాలని తలచి - "కృష్ణా! ఇంకా పిల్లవాడివేనా లోకం నిన్ను... అంటున్నాడో, లేదో -...

"అమ్మా! చూడవే, మన పెద్దయ్య నందయ్య, నన్ను పుత్రుడిగా కాక, పెద్దవాడిగా చూస్తున్నాడు. నేను చిన్న పిల్లవాడిని, కదా! అంతలో ఆమెకు మాయ, తన చిన్నవళ్ళో పడుకుని పాలుతాగే కృష్ణుడు, అల్లరి కన్నయ్య గొడవచేసే గోపబాలుడు, కళ్ళలో కనుపించాడు. ఆమె తనను మరచి, ఇంత పెద్దవాడిని, మనుమలెత్తిన వానిని, పిల్లవాడిగా దగ్గరకు తీసుకోకూడదనిపించలేదు.

"నిజం, రా - కన్నా! నువ్వు నా కన్నవే. నా పిల్లాడివే. ఆ పెద్దయ్య మాటలు పట్టించుకోకు!" అంటూంటే, ఈ అల్లరి పిల్లవాడి చిన్ననాటి ఆగడాలు తలుచుకుని తనలో తను నవ్వుకోసాగింది. ఆ క్షణం - తానెక్కడుందో తెలియని తన్మయత్వానికి గురయింది.

"అమ్మా!" కృష్ణుని లాలన. అప్పుడు నువ్వు వాళ్ళ మాటలు, వీళ్ళ మాటలు విని దండిస్తావేమోనని భయముండేది. దాంతో అటు ఇటు పరుగులు తీసి పారిపోయేవాడిని, నిన్ను అల్లరి పెట్టేవాడిని. ఇక్కడా....

ఈ అమ్మ నన్నేమీ అనదు "హరీ, కృష్ణా! వాసుదేవా!" అంటూ ఎప్పుడు భజన చేస్తూంటుంది. దీంతో నేను ఒక్కచోట వుండక, దేశాలు పట్టి తిరుగుతున్నా నంటాడు. "అవును. నాయనా! ఆవిడ చదువుకున్న జ్ఞాని. నేను పల్లెటూరి, పశువుల జాతికి చెందిన అజ్ఞానిని"నంది. ఆ మాటకు, ఆమె పెదవుల్ని, తన చేతితో ఆపుతూ,

"అమ్మా! భక్తి తొమ్మిది రకాలు. భగవంతుని చేరడానికి షోడశోపచారే పూజే అవసరం లేదు. శ్రవణం, మననం, కీర్తనం, సేవనం, సఖ్యము, అర్చనం,.... ఇలాగ వున్న తొమ్మిది రకాలలో ఏదో ఒకటి తీసుకుని ధన్యులం కావచ్చును. కనుక - ఎవరు అజ్ఞానులు కారు. పల్లెటూళ్ళు, పట్నవాసాల ప్రసక్తి రాదు. అమ్మా! నిజానికి ఆ పల్లెటూళ్ళే భక్తికి పట్టుగొమ్మలమ్మా. అక్కడ వాత్సల్యం, ప్రేమ, ఆరాధనం, వినయ విధేయతలు వుంటే -

ఇక్కడ రాగద్వేషాలు పెరిగి, పెరిగి, సాటివాళ్ళు తోటి వాళ్ళనేమమతలు, మానవత్వాన్ని మరచి, మారణహోమానికి తయారవుతున్నారు. ఈ నగర జీవితంకన్న అమాయికత్వానికి మూలస్వరూపమైన బృందావనమే మేలన్నాడు.

అతని కబుర్లు వింటూ పరవశించిపోతున్న యశోద "కన్నా! మనం బృందావనంలో ఏటా ఇంద్రోత్సవం చేసే వాళ్ళం. అది వద్దని నీవు గిరి, గో ఉత్సవము చేయించావు. అప్పుడు ఇంద్రుడలిగితే, గోవర్థన గిరిని గొడుగులాగ ఎత్తి పట్టుకుని అందర్ని కాపాడావు.

"అదేముందమ్మా! ఈ మధ్య నేను-అర్జునుడు, విహారంగా ఖాండవవనం వైపు వెళ్ళాము. అప్పుడు అగ్ని వచ్చి అనగా - "మనం పూజించే అగ్నిదేవుడా ?!" అంది. అవునమ్మా, ఆతడే వచ్చి, శ్వేతకి అనే మహారాజు సల్పుతున్న యజ్ఞంలో నేతిని త్రాగి, అజీర్ణ వ్యాధితో బాధపడుతున్నాను. అప్పుడు బ్రహ్మదేవుని సంప్రదించాను. నేను ఖాండవ వనం దహిస్తాను. ఎన్నో ఓషధులు వున్నాయి. అన్ని జీవులు వున్నాయి. ముఖ్యంగా ఇంద్ర మిత్రుడైన తక్షకుడుంటున్నాడు. కనుక, నేనెప్పుడు ప్రయత్నం చేస్తున్నా, ఆటంకబరుస్తున్నాడు. ఇప్పుడు నాకు మీ సహాయం కావాలి" అన్నాడుట.

అప్పుడు మాతో, నేను ఖాండవాన్ని దహిస్తూంటే, మీరు దేవేంద్రుడు నన్నడ్డకుండా కాపాడాలని, ఈ రథం, శంఖ, సుదర్శనాలు నాకు, గాండీవం - అక్షయతూణీరాలు అర్జునునికిచ్చాడని, ఎంతో గొప్పగా చెప్పాడు. ఆ తల్లి ఆనందం, నా కన్నే అని... పొగిడిన విధం, వర్ణనాతీతం.

అప్పుడు అగ్ని, ఆ అడవిని కాల్చుతుంటే, అర్జునుడు బాణాలతో, అడివికి సరిపడ్డా పందిరిలాగ వేసాడు. ఒక్క నీటిబొట్టు కూడా పడి, అగ్నికేవిధమైన అవాంతరం రాకుండా చూసామని సంతోషంగా చెప్పాడు. ఆ తల్లి మరీ సంతోషించింది.

"అవును, కన్నా... సముద్రం మీద ప్రయాణించి, అదేదో లోకానికి వెళ్ళావుట... అమాయకంగా అడుగుతుంది. "అదా! సాందీపులవారని, మన గర్గాచార్యుల వారితో పాటు, ఒక గురువు గారు బృందావనానికి వచ్చేవారు. జ్ఞాపకముందా ? మాకు యుద్ధవిద్యలు కూడా నేర్పారు. గుర్తొచ్చిందా ?"

"అవును. గోవర్థన గిరి క్రింద, మనతోపాటు వారు కూడా రక్షణ పొందారు." "ఆ... వారే, వారి దగ్గరకు నన్ను, పెద్దన్నను, తమ్ముడు ఉద్ధవుని విద్యాభ్యాసానికి పంపారు. ఆయన కుమారుని పంచజనుడనే రాక్షసుడు యమధర్మరాజుకు

అమ్మేసాడుట. ఆ సంగతి వారికి తెలియదు. కానీ, పిల్లవాడిని తలుచుకుని వారు బాధపడటం గమనించి విషయమడిగాను. వివరం చెప్పారు. నేను, ఉద్ధవుడు వెళ్ళాము. శ్రీ గురువుల ఆశీస్సులతో వాళ్ళ అబ్బాయి దొరికాడు. గురువు గారికి అప్పగించాను. గురుపత్ని... తల్లిగా ఎంతో సంతోషించింది.

“పోనీలే తండ్రీ! ఒక తల్లి కడుపుకోతను బాపావు. అయినా, అదేమిరా కన్నా, మథురలో వుంటే మాటిమాటికి రావల్సి వస్తుందనా ? నా మాట కూడా వినబడనంత దూరం వచ్చావు” అంది. “చూడమ్మా! అమ్మ పిలుపు పిల్లవాడికి, పిల్లవాడి పిలుపు అమ్మకు, ఎప్పుడు వినబడుతుందమ్మా. ఎక్కడున్నా, ఎలాగ వున్నా.... అనేసరికి “నా తండ్రీ!” అని ఆ పిచ్చితల్లి పొంగిపోయింది.

అక్కడనుండి, కృష్ణుడు, యశోదమ్మకు రేవతిని చూపించి “ఈమె మా అమ్మ యశోద. నా అల్లరితో, విసుగెత్తి, ఒకసారి వూళ్ళోని తాళ్ళన్ని తెచ్చి నన్ను రోటికి కట్టింది.

“అవునమ్మా! ఆ రోటితోనే కదిలి వెళ్ళి తాతల నాటి మద్దిచెట్లను నేలకూల్చాడు. నా అదృష్టం బాగుంది. అవి వీడి నెత్తిన పడలేదని” కృష్ణుని దగ్గరకు తీసుకుని, ఆ సంఘటన, అప్పుడు జరిగినట్లు కృష్ణుని ముద్దుపెట్టుకుంది.

“అమ్మా! ఈమె పెద్దన్న బలరాముడి ఇల్లాలు” అనగానే “నమస్కార మంటూ” పాదాలు పట్టింది. అమ్మా! వదిన ఇలాగ వుందని పిల్లి అనుకునేవు. పులి, ఈమె, పెద్దన్న గదాయుద్ధ ప్రభావమే, ఈ కుశస్థలి, ఈ ద్వారక. ఈమె గదా యుద్ధంలో పెద్దన్ననే భ్రమ్మరపరచింది. అనగా - యశోదమ్మ నవ్వుతూ. “అందుకనే, అతనికి ఇల్లాలయిందంది”.

“ఇది శశిరేఖ. చిన్నది. దండం పెట్టు నాన్నమ్మకు అన్నాడు. ఎంతో వినయంగా నమస్కరించింది. నందయశోదలు ఆమె నుదుట ముద్దు పెట్టుకున్నారు.

“రా! అమ్మా! ఈమె రుక్మిణి. విదర్భ రాజకుమారి. మామ నన్నక్కడకు రమ్మన్నాడు. తన ప్రతాపాన్ని చూపటానికి, ఈమె అన్న రుక్మినీ రమ్మన్నాడు. అన్నా వదినలతో వచ్చిన ఈ పిల్ల కంసమామ మరణం వగైరాదులు చూసి నాపై మనసు పారేసుకుంది. తన వూరికి వెళ్ళింది. అన్న పెండ్లి ప్రయత్నాలు ప్రారంభిస్తూంటే, కాదని నన్ను రప్పించుకుని, ఇక్కడకు తెప్పించుకుని నన్ను కట్టేసుకుందన్నాడు.

"అత్తా! మీ అబ్బాయి అల్లరి మీరెరిగిందే, కదా!? అని ఆమె పాదాల వద్ద కూర్చుంది. "పిల్లా! మనుమలు అంటూంటే, పెద్దవాడు ప్రద్యుమ్నుడు. ద్వారకానగర రక్షణలో వున్నాడు. అతనికిద్దరు. వాళ్ళు ద్వారకలోనే వున్నారు. వీళ్ళు వాళ్ళ పిల్లలు, నాతో వచ్చారని, ఆ పిల్లల్ని "తాతమ్మకు నమస్కరించమంది. కృష్ణుని మనుమలుగానే ఎంతో వినయ విధేయతలతో నమస్కరించారు. అచ్చు వాళ్ళ తాతలాగే వున్నారు'' గుండెకు హత్తుకుని మురిసిపోయింది.

రుక్మిణి అటు ఇటు చూస్తూంది. ఏవిటమ్మా ? అంది యశోద, అదే మా అక్క రాధమ్మ రాలేదా ? అని అడిగింది.

"సరి, సరి. ఆ పిల్ల ఓ యోగీశ్వరి. నా కృష్ణుడు లేని ప్రదేశమెక్కడ ? ఇక్కడ వున్నవాడికోసం ఎక్కడికో వెళ్ళడమేమిటి ?'' అని ఆ తపోమూర్తి ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక ఇలాగ వచ్చేసామంది.

మనసులోనే ఆ యోగినికి వందన మర్పించింది. ఇక ఆ విషయానికి స్వస్తి చెప్పి, "అమ్మా రా! అన్నాడు. రుక్మిణీ నీ చెల్లెళ్ళందర్ని చూపుమన్నాడు. అందరు బయలుదేరారు.

"అమ్మా! ఇది జాంబవతి'' అన్నాడు. "అత్తగారు'' నమస్కరించమంది - రుక్మిణి. అప్పుడు కృష్ణుడు, రామాయణ గాథలో, జాంబవంతుడని, ఒక ఎలుగుల రాజు వున్నాడు. విన్నావా ?''

అవును. నాయనా! అంది యశోద. ఆతని పిల్లే - ఈమె.... అని చెప్పాడు కృష్ణుడు. ఎంత అదృష్టవంతులు మీరు... అని ఇద్దర్ని పొగిడి, నీ పిల్లలంటే... వీడు సాంబుడమ్మా. మిగిలిన వాళ్ళు ద్వారకలో వున్నారంది.

అక్కడనుండి - సత్య గుడారానికి బయలుదేరారు. వెడ్తూనే సత్యా! నిన్ను చూడటానికి అమ్మానాన్నలు బృందావనం నుండి వచ్చారనగా, వారి పాదాలకు ఆ అందాల రాణి వందనం చేసింది. మా బంగారుతల్లే అంది యశోదమ్మ.

"అమ్మా! నువ్వు చెప్పిందక్షరాలా నిజం. ఈమె వద్ద సూర్యుడిచ్చిన శమంతకమణి. దాని ద్వారా ప్రతినిత్యం ఎనిమిది బారువుల బంగారం పొందుతుంది. దాంతో ఈమె ఈ ప్రపంచాన్నే కొనగలదన్నాడు.

"మిమ్ము మాత్రం కొనలేనంది."

"అది, నిజం తల్లీ. బ్రహ్మాదులకే అలభ్యమైనవాడు మన అదృష్టంకొద్దీ మనకి దక్కాడు."

"మీరు చెప్పింది నిజమేకాని అత్తయ్యా! మీ అబ్బాయి, బంగారం, మణిమయ భూషణాలు, రత్నమాణిక్యాలకు అందడు. తులసి ఆకులు, గరికిపూలు, గడ్డిపోచలకు అత్యంత సులభంగా దొరికిపోతాడు" అంటే ఆ సంగతి నాకు తెలియదే! యశోద అంది. ఆ మాటకు రుక్మిణి తలవంచుకుంది.

ఆ పరిస్థితిని గమనించిన సత్య "క్షమించక్కా! భక్తి ప్రకటనకే ఆ మాట అన్నాను తప్ప, నాకు మరో వుద్దేశం లేదు" అంది.

"నిజమే చెల్లీ! భార్యాభర్తల మధ్య ఎన్నో వుంటాయి. వాటిని, అత్తమామలని, వారి ఎదుట దాచుకోగలమా ? అంది రుక్మిణి. అయినా మన భాగవతం ఎవరికి తెలియదు" అందుకుంది జాంబవతి.

మొత్తానికి గడుసుపిల్లలే... అని నవ్వుకుంది అత్త గారంటున్న యశోదమ్మ. అక్కడనుండి కాళింది దగ్గరకు వెళ్ళారు. ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని "అమ్మా! ఈమె సూర్యపుత్రిక, కాళింది. నా కోసం తపస్సు చేసి, అందులో నన్ను గెలుచుకుంది" అన్నాడు "వీరు మా అమ్మ - నాన్నలు - నంద - యశోదలు. బృందావనం నుండి వచ్చారనేసరికి, ఆ అయోనిజ, తపస్విని వీళ్ళకు పాదాభివందనం చేసింది.

అక్కడనుండి మిత్రవింద వద్దకు వెళ్ళారు. ఈమె నా మేనత్త కూతురే. ఇంతమంది పెళ్ళాలున్నవాడిని ప్రేమించి మరీ పెళ్ళి చేసుకుందన్నాడు. వాళ్ళను పరిచయం చేసాడు. ఈపిల్ల వారికి, అందరివలె పాద నమస్కారం చేసింది.

అక్కడనుండి నాగ్నజితి వద్దకు వెళ్ళారు. ఈమె కోసల యువరాణి. మన వూళ్ళో "హస్తి" అనే బలిసిన ఆంబోతు వుండేది. దానిని నేను చిన్నప్పుడు లొంగతీసానన్న కథనం విన్న అర్జునుడు, పరిహాసం మొదలుపెడితే, వీళ్ళ దేశం వెళ్ళి..... అక్కడ ఒకటి కాదు. ఏడు పొగరుబోతు ఆంబోతులుంటే, వాటి మదమణిచి, ఈమెను పొందాల్సి వచ్చింది.

ఆ మాటతో ఎంతో చనువుగా, మనిషిని చూస్తే మీద పడి కుమ్మే వాటిని, మీ అబ్బాయి. అబ్బ భలే అదృష్టం. ఏడు రూపాలలో వాటి మదమణిచి నన్ను గెలుచుకున్నారు. శ్రీకృష్ణ పత్నిని చేసుకున్నాడని పొంగిపోతూ చెప్పింది.

"ఏడు రూపాలత్తయ్యా!, ఏడు రూపాలు" ఆ అమాయకపు పిల్ల ఆనందానికి, ఆశ్చర్యానికి యశోద మరింత సంబర పడిపోయింది. ఈలోగా భర్త ఆదేశం ప్రకారం, రుక్మిణి "భద్ర, లక్షణలను "కపిల, పింగళ"లను తీసుకు వచ్చింది.

"అమ్మా! ఈ భద్రను, శుభ్రంగా, ఏ ఇబ్బంది లేకుండా పెండ్లి చేసుకున్నాను. ఈమె హిమాలయ రాజకుమార్తె. ఇహ లక్షణ.... వెంటనే ఇది లక్షణంగా వుందంది యశోద.

ఈమె లక్షణంగానే వుంది. ఈమెను పెండ్లాడడమే పెద్ద గందరగోళ మయింది అని, "అది సరే కాని. అమ్మా! వీళ్ళెవరో తెలుసా ?" అన్నాడు. తెలియ దన్నట్లు తల అడ్డంగా తిప్పింది. చాలా బాగున్నారని మాత్రం ప్రశంసించింది.

"ఇది కపిల, ఇది పింగళ. కవల పిల్లలు, మా నాయనమ్మ బంధువులు. మేనమామ కూతుళ్ళు. నాగరాజు కర్కోటకుడి పిల్లలు వీళ్ళు. వీళ్ళ అన్న మణిమంతుడు, నాగరాజ్యం చేస్తున్నాడు." అనగా.. ఇంతకీ వీళ్ళంది..!" ఆ తల్లి.

"ఇంకెవరు ? మన ఉద్ధవుని భార్యలమ్మా!" అని ఆమెకానందం కల్గించు రీతిలో పరిచయం చేసాడు.

అప్పుడిక ఆపుకోలేక, "అవునుకన్నా. నీకింకా భార్యలున్నారని తెలిసింది. వాళ్ళు-

ఇక్కడికి రాలేదమ్మా! ద్వారకలోనే వున్నారు. అదో పెద్ద కథ. ఇంద్రుడు కోరిక మేరకు నేను, సత్యా నరకుని చంపడానికి ప్రాగ్జోతిషపురానికి వెళ్ళాము. అక్కడ నువ్విందాక "గడుసు పిల్ల!" అన్న సత్య యుద్ధం చేసి వీళ్ళను తారెత్తించింది. మొత్తానికి నరకుడు మరణించాడు. అతని వద్ద బందీలుగా దేవ, యక్ష, గంధర్వ, మానవ కాంతలు, పదహారువేల వందమంది వున్నారు. వాళ్ళను వాళ్ళ వూళ్ళకు వెళ్ళమంటే లాభం లేదు. ఇన్నాళ్ళు ఇక్కడ వుండి అక్కడికి వెడితే మా మొహాలు ఎవరు చూస్తారని మొండికేసి, ఇంచుమించు వాళ్ళు సత్యకు ఎదురు తిరిగితే, విధిలేక సత్య ఆజ్ఞానుసారం వీళ్ళను పరిణయమాడాల్సి వచ్చింది. ఆ తర్వాత

విశ్వకర్మను పిలవడం, వీళ్ళందరికి భవనాలు నిర్మించడం, చివరకు - పిల్లా పాపల్తో వాళ్ళు సుఖంగా వుండటం, అదొక చరిత్ర!

**"నీ చరిత్ర - "శ్రీకృష్ణభాగవతం" లోకానికే పరమ సంతోషదాయకం. అదివిన్నా, చదివినా - సకల సౌభాగ్య సేతువు. సిరి సంపదలకు, సుఖ సంతోషాలకు హేతువవుతుంది. అంతేకాదు - నీవు, నీ చరిత్ర - నిజంగా ఇహపరదాత, ఇది సత్యం!" గుండెలమీద చెయ్యి వేసుకుని, సత్యం చెబుతున్నానందా తల్లి. శపథం చేస్తున్నట్లు చెప్పింది.**

★★★★

ఆ తర్వాత విందు భోజనాలు, కులాసా కబుర్లు. ఎన్నాళ్ళ నుండో ప్రేమకు దూరమైన ఆ తల్లి యశోదమ్మ ఇప్పుడు - పరిపూర్ణ అనురాగమూర్తయింది. కోడళ్ళు, మనుమలు, మునిమనుమలు.... .తన జన్మకిక ఈ సంతోషం చాలనుకుంటుంది.

కోడళ్ళు వడ్డిస్తున్నారు. తల్లి ప్రక్కన కూర్చున్న కన్నయ్య "అమ్మా! జాగ్రత్త. చూసేందుకు అమాయకురాలిగా కనబడే రుక్మిణి. అమ్మో! గడుసుపిల్ల జాగ్రత్తగా వుండు'' అన్నాడు. "ఏమయిందిరా ?!'' అందామె.

"ఒకసారి నేను వీరి వూరు వెళ్ళాను. జరాసంధ చక్రవర్తి గౌరవార్థం వీళ్ళ నాన్నగారు, ముఖ్యంగా వాళ్ళ అన్నయ్య గొప్ప విందు చేశాడు. రాజులకొక ప్రక్కనా, నా వంటి వారికింకొక ప్రక్కన.. కాకపోతే వీళ్ళ తాతగారు, నా మీద అభిమానంతో నా ప్రక్కన కూర్చున్నారు.

"ఏం చెప్పనా ?'' రుక్మిణిని చూసాడు. ఇంక ఆగేదేముంది! పూర్తి చేయండంది. ఈ పిల్ల వాళ్ళందరికి బాగానే వడ్డించింది. నా దగ్గరకు వచ్చేసరికి, చేతిలోని పాయసం మొత్తం విస్తట్లో వంపేసి, తూలిపడబోతుంటే, వాళ్ళ వదిన పట్టుకుంది.

అప్పుడీ పిల్ల - ఓరకంట, కొంటెగా నను చూస్తు కనుబొమలు త్రిప్పుతూ "ఎలాగ వుందంది!'' ఇలా వుందనుకున్నాను. అది ఆమె ప్రేమట. ఇది ఇంకొకరికి దక్కరాదట. అదమ్మా ఆమె ఘనతని.... నీ ప్రేమకు బందీనే కానీ, మా అమ్మను మాత్రం ఇబ్బంది పెట్టకే...! అన్నాడు. ఇది విన్న సత్య "అమ్మ, నా అక్కా!''

అయితే గడుసురాలివేనని, చెవిలో గొణిగింది. "ఏ మాత్రం తేడా వచ్చినా, అమ్మ రోటికి కట్టేస్తుంది జాగ్రత్త!" కొంటెగా అన్నాడు.

"పోన్లెండి. ఈ పేరునైనా వెళ్ళి, మా అక్క రాధమ్మను చూసి వస్తాననేసరికి, "ఆరి పిడుగా" అనుకుని "ఎలాగ వేగుతున్నావురా, వీళ్ళతో" అప్రయత్నంగా యశోదమ్మ అనేసింది.

"ఇంతేనా! మొన్న ఒక చిన్ననాటి స్నేహితుడు వచ్చాడు. చూడక, చూడక, ఎన్నాళ్ళకో చూసాను. అతడు అటుకులు తెచ్చాడు. అది చినిగిన ఉత్తరీయమే అనుకో. అంతేనా, నువ్వు పెరుగులో కలిపిపెట్టే అటుకులు జ్ఞాపకమొచ్చి, మా అమ్మ రోజూ నాకు పెట్టేదంటూ ఓ పిడికెడు తిన్నాను. బాగున్నాయి. ఇంకో పిడికెడు తినబోతుంటే - ససేమిరా వద్దని, నన్ను తినకుండా చేసింది. ఇక్కడ నాకు ఇష్టాలు లేవు. వారిష్టాలతోనే బ్రతకాలి.

"అయిందా! ఇంకా వుంటే గుర్తు చేసుకుని మరీ చెప్పుకోండి!" అని అత్తగారివైపు తిరిగి "చూడండి. ఎవరి జాగ్రత్త వాళ్ళది. మీ అబ్బాయికి, పరమ భక్తులు కనబడితే, అన్నానని కాదు కాని, ఒళ్ళు తెలియదు. మొదట తిన్న అటుకులకే అయనకు, ఇంద్ర వైభవములను తలదన్నే, తరాలు తిన్నా తరగని సిరిసంపదల నిచ్చారు.

ఇప్పుడు - ఈ - అటుకులు కూడా తింటే, ఈ ద్వారక మొత్తం వారింటి ముంగిట నిలచి, సేవలు చెయ్యాల్సి వచ్చేది. అందుకనే ఆపాను!" శ్రీకృష్ణుని సత్యతత్వం తర్కవితర్కాలకు అందని విధంగా ఆ తల్లికి తెలియచేసింది.

అప్పుడు యశోద భక్తి నిమీలిత నేత్రాలు "తన కన్నయ్య విశ్వాత్ముడు, విశ్వాత్మకుడు - అని తెలియని తన్మయత్వంలో మనసులోనే "శ్రీకృష్ణం శ్మరణం మమ" అని ఆనందంగా దర్శిస్తూ తనను అర్పించుకుంది. "అదేమిటమ్మా! చాలా చిత్రంగా వుందే" నందుడు అడుగుతున్నాడు.

"అదేకదా మామయ్యా! ఆయన, ఈయన బాల్య సహ విద్యార్థి - ఈ భక్తవత్సలుడు, ఆ భక్త పరమాణువుకు ఏమిచ్చినా తప్పు లేదు. ఏదో ఒకనాడు నాతో సేవ చేయించినా ఒప్పుకుంటాను. కానీ, ఆజన్మాతం నేను, నా పిల్లలు, మనుమలు, మునిమనుములతో సేవ చెయ్యడమంటే చాలా కష్టం.

నిత్య దరిద్రుడైన ఆ సామగానమూర్తికి, ఈ సామగానప్రియుడు, మొదటి పిడికెడు అటుకులతో, ఇచ్చిన భోగభాగ్యాలు, సమస్త సిరిసంపదలకు నిలయుడైన కుబేరుడే - ఆతని ముందు దిగదిడుపు. ఇప్పుడు... ఈ రెండో పిడికెడు... అమ్మో! తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది.'' ఈమె చెబుతుంది. నందరాజు నోరు తెరచుకుని వింటున్నాడు.

యశోద మాత్రం ''ఏమోనమ్మా, అంతా విష్ణుమాయ. అందులోని పరమార్థం, ఆ ''లక్ష్మీ-నారాయణు''లకే తెలియాలి అంటే, ''అవునవును. కొడుకని అలాగే వెనకేసుకు రండి!'' అంది చమత్కరిస్తూనే రుక్మిణి.

ఇలాగ కురుక్షేత్రంలో - శ్రీకృష్ణ సన్నిధిలో - ఆ ''నంద-యశోదలు మూడు నెలలు గడిపారు -ఈ మధురస్మృతులను మననం చేసుకుంటూ బృందావనానికి బయలుదేరుతుంటే - శ్రీకృష్ణుడు నయగారాలొలికిస్తూ -

''అమ్మా! ఈ పిల్లవాడిని మరువకండి. వీడెప్పుడు మీ పిల్లవాడే. మీరు పిలిస్తే పలుకుతాడు. దూరంగా వున్నామని ఎప్పుడు తలవకండి. సదా మీ హృదయంలో నిలిచి వున్నాను. మీరు ''కన్నా!'' అంటే, మీ కనులముందర వుంటాను. వుండగల్గితే, వుండగల్గినన్నాళ్ళు బృందావనంలో వుండండి. కాదంటే, ఇక్కడకు వచ్చేయండి.

ఈ కోడళ్ళు, మనుముల, మునిమనుమలుతో ఆనందంగా వుందురుగాని. అంతేకాని, నా కన్నయ్య దూరమయ్యాడని ఏనాడు బాధపడకూడదు. అతడెప్పుడు మీలో, మీతో వుంటాడు. ఇది నిజం. కావాలంటే, ఒకసారి ద్వారకకు వచ్చి, అక్కడున్న పదహారువేల వందమంది మీ కోడళ్లను అడగండి. సత్యం తెలుస్తుంది.

''వద్దురా కన్నయ్యా, నీ ముద్దు మాటలే మాకు వేనవేలు'' అని అందరికి, తమ ఆశీస్సులనిచ్చారు. కృష్ణుడు తన మొత్తం పరివారంతో వీడ్కోలు పలుకగా, ఆనందంగా బృందావనానికి బయలుదేరారు. తనను చూడవచ్చిన వారినందరిని, వారి అభీష్టాల మేరకు, అత్యుత్తమ కానుకలతో సత్కరించాడు. మరువలేని మమతానురాగాలు నింపిన నిండు మనసుతో వీడ్కోలొసగాడు.

అక్కడనుండి, లీలామానుష విగ్రహుడు, తన కుటుంబ పరివారంతో, యుధిష్టరుడిచ్చే విందుకు వెళ్ళాడు. అందర్ని పేరు పేరున పలుకరించాడు. ద్రౌపదే - కాస్త కలవరంగా వుంది. ఇలాగంది - "అన్నా! నీ దయ వలన అన్నీ బాగున్నాయి. కాని, హస్తినే - అవకాశవాదతత్వము ఎంతసేపు మమ్మలెలాగ, ఢీకొనవలెనను ప్రయత్నములు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి."

ఆమె బాధను గమనించిన కృష్ణుడు "సోదరీ! ఆందోళనమనవసరం. జరుగనున్నది జరుగకమానదు. అంతా కర్మగతం. ఎవరు, ఎవర్ని, ఏమీ చెయ్యలేరు. అలాగ చెయ్యగలననుకోవడ మజ్ఞానం. వాళ్ళను వూరడించాడు. ఆ మర్నాడు, బంధువుగా, గౌరవ పురస్కరంగా దుర్యోధనుడిచ్చిన విందుకు వెళ్ళాడు. కృష్ణునితో ఆతని కుమారుడు సాంబుడు కూడా వెళ్ళాడు.

అందర్ని పలుకరించాడు. అందరు తగు మర్యాదలు సలిపారు. ధృతరాష్ట్రుడు "వాసుదేవా!' అన్నాడు. సమాధానంగా, అతడు "మేము కూడా, హస్తినలో పాండవుల వలె ఒక అత్యద్భుత మందిర నిర్మాణం గావిస్తున్నాము.

"చాలా సంతోషం. అయినా సర్వసమర్థుల కసాధ్యమేమున్నది" అన్నాడు. అత్త గాంధారీ వద్దకు నడిచాడు. కృష్ణుని భార్యలనందర్ని ఆమె ఎంతో ప్రేమగా పలుకరించింది. "అవును. మీ వివాహాలు జరిగిన తీరును...!" సరదాగా అడగడం మొదలుపెట్టింది.

"ఇంకా మా వివాహాల విశేషాలేమున్నాయత్తయా! మా మనుమలు వివాహాల కొస్తున్నారంది" రుక్మిణి.

"అలాగ తప్పించుకోకండి. లీలామానుష విగ్రహుడైన ఆ జగన్నాధుని భార్యలు మీరు. కనుక మీరు చెప్పవచ్చును. మేము వినవచ్చునంది - గాంధారీ. ఇక ఆమెను కాదనలేక వారి వివాహ సంబరాలు చెప్పడం, ఈమె వినడమొక కథ అయింది.

ఒక్కొక్కరు తమ వాళ్ళను పిలుచుకుని విందులు చేసుకుంటూంటే, కృష్ణుడు కూడా తన మామగార్లను, మహర్షాదులను, బ్రాహ్మణముని తపోమూర్తులను పిలిపించాడు. వాసుదేవుని విందు అనేసరికి - వ్యాస, కణ్వ, నారద, గౌతమ, చ్యవన, వసిష్ఠ, మృకండు, అత్రి, అగస్త్య, అంగీరస, యాజ్ఞవల్క....

ఒక్కరేమిటి, విశ్వామిత్రునితో కలిసి అందరు వచ్చారు. వారందరికి తన దేవేరుల సాయంతో, అర్ఘ్యపాద్యాదులను సమర్పించి తగు రీతిన సత్కరించాడు. ఇది తమ అదృష్టంగా వారందరు భావించారు.

"మహర్షులారా! ఎప్పుడో కాని ఇటువంటి సందర్శన భాగ్యం రాదు. మా అదృష్టంకొద్దీ - ఈ భాగ్యం మాకు లభించింది. మీ నామస్మరణమే, సర్వపాప హరం. దర్శనం - శాశ్వత పుణ్య అక్షయలోకాలను, దర్శించిన వారందరికి లభింప చేస్తూంది." అని వినయంగా తన భార్యలందరితో కలిసి వందనమాచరించాడు.

"నీకోసమే మా జపతపాలు. అందుకునే నీవు విందు ఇస్తున్నావని, తెలిసి, ఇంత తొందరగా వచ్చాము. లోకానికి నీ మాటలు ప్రశస్తం కావచ్చును. మాకు మాత్రం అలభ్య - అవ్యక్త పరిపూర్ణానందం లభించిందని ప్రస్తుతించారు.

మహర్షులను రాకను తెలుసుకున్న వసుదేవుడు, ఇతర పుణ్యమూర్తులు, యాదవ ప్రముఖులు వచ్చి, వీరిని దర్శించి, ధన్యులమనుకుని వందనాలు చేసారు. వసుదేవుడు మాత్రం శ్రద్ధామూర్తిగా -

ఓ తాపసోత్తములారా! మీ నామమే సర్వపాపపరిహారము. అయినా, ఈ యుగధర్మంగా - మేము ఏం చేసిన మా పాపములన్ని తొలగి, శాశ్వత - ఆ - శ్రియః కాంతుని పదాంబుజములను పొందగల్గుతామో, అటువంటి పుణ్యకార్య ధర్మ వివరములు తెలియబర్చమని ప్రార్థించాడు.

"వసుదేవా! సకల శాసనకర్త. సర్వేశ్వరుడు, యజ్ఞేశ్వరుడైన ఆ విష్ణుమూర్తికి ప్రీతికరమైన యజ్ఞములు నిర్వహించండి. సర్వఫలములు ఆ దేవదేవునికి అర్పించండి. సర్వ కర్తృత్వము తొలగి, శాశ్వత భగవన్నామ దృష్టి - అక్షయ పుణ్యలోకాలు, అయాచితంగానే లభిస్తాయి అన్నారు మహర్షులు.

అయితే - ఈ శుభ సమయాన్ని పురస్కరించుకుని, ఇక్కడే, నా చేత, మీరు సకర్మకంగా ఏదైనా యజ్ఞం నిర్వహింపచేసి, ధన్యుని చేయండి. ఇంతకంటె శుభసమయం, సంకల్పం రాదని మీ అందరి సందర్శనం - సర్వులను పునీతుల్ని చేస్తుందని అర్థించాడు.

వాసుదేవుడు మందహాసం చేసాడు. మహర్షులు అంగీకరించారు. చకచక ఏర్పాట్లు జరిగాయి. తన పదముగ్గురు భార్యలతో వసుదేవుడు యజ్ఞ దీక్షితుడయ్యాడు. సాంగోపాంగంగా యజ్ఞం పూర్తి చేయబడింది. సర్వులకు - భూరి దక్షిణల నొసగి, తనను ధన్యుని చేసినందులకు ప్రతి ఒక్కరికి, తన కృతజ్ఞతలను తెలిపాడు.

ఓ పవిత్ర సమయంలో - ఒక పవిత్ర యజ్ఞం జరిగింది.

సర్వులు కలిశారు. ఆనందడోలికలలో తేలియాడారు. సంతృప్తితో - కృష్ణుడు ఆయన కుటుంబ సభ్యులు, యాదవ ప్రముఖులు, ఇతర ముఖ్యులతో పెద్దన్న బలరాముడు, తల్లిదండ్రులతో, ద్వారకాధీశుడు, ద్వారకకు బయలుదేరాడు.

**ఈ ఘట్టం - నిత్య సంస్మరణము వలన, సర్వాపదలు తొలగి, మనశ్శాంతి, అలౌకికానందం, సర్వసంపదలు, ముఖ్యంగా - అనంత"తృప్తి" లభిస్తుంది.**

- స్వస్తి -

# హే కృష్ణా.... ముకుందా మురారీ!

**పాం**డవులు రాజసూయం చేయడం, హస్తినలో కేవలం పితామహుడు, రాజమాత, విదురుడు మినహా, ఏ ఒక్కరు సంతోషించలేదు. గుడ్డిరాజు సరేసరి. గాంధారీ తగదంది. కానీ ఇటు భర్త, అటు కుమారుడు. కాలానికి విషయం విడిచిపెట్టింది.

ఏది ఏమైనా అనంత సంపదలకు, సామ్రాజ్యత్వానికి శాశ్వతుడైన, యుధిష్టరుని, ఆ పాంచాలీ సహిత పాండుపుత్రులను నాశనం చెయ్యాలనే, అసూయా ద్వేషాలు కుమారునితోపాటు, మహారాజులోని మహావటవృక్ష మవసాగింది. దాంతో అపురూప సభ నిర్మాణం గావించి, వారందరిని రప్పించి, కపట జ్యూదంలో ఓడించి, వారి సర్వ సంపదలను హరించి, కట్టుబట్టల్తో, అకారణంగా- కారడవులకు పంపి - వారికి గుర్తింపు లేకుండా చెయ్యాలనే కుటిలనీతిలో వున్నారు.

వీళ్ళ పాపాలను మోయడానికి, నమ్మకస్తుడు, నమ్మకంగా - కార్యం - దుష్కార్యమైనా చేయగల సమర్థుడైనా విదురుని పావును చేసారు. పాపం మోయడానికి కౌరవులు, మహారాజుతో కలిసి సిద్ధమౌతున్నారు. మొత్తానికి పాపం పండుతున్నట్లు, విదురుని పాండవుల వద్దకు మహారాజు పంపాడు. పిల్లలు అందరు కలవాలని వుబలాటపడుతున్నారు. వెళ్ళు. మధ్యలో నీకేమిటి వచ్చిన నష్టమని - గసిరి పంపారు.

ఆ అధర్మాన్ని, ధర్మమూర్తి చెయ్యలేక, వారి ఉప్పు తిన్న పాపానికి, రాజాజ్ఞతో బయలుదేరాడు. పెదతండ్రి ముఖ్యంగా - పెద్దలు - భీష్మ - ద్రోణ- కృపాచార్యులున్న సందర్భంలో, ఇచ్చిన ఆదేశానికి, తెచ్చిన సందేశానికి సార్వభౌముడు యుధిష్టరుడు, సామ్రాజ్ఞి సహితంగా సోదరులతో హస్తినకు వెళ్ళాడు.

అప్యాయతలు వెల్లి విరిసాయి. "కపటం" యుధిష్టరుడు కనుగొనలేక పోయాడు. మొత్తానికి, కాదనని యుధిష్టరుని మనసు తెల్సిన శకుని నేతృత్వంలో ద్యూతక్రీడకు ఆహ్వానించారు.

అది సరదా సమయం. ఆడవచ్చు తప్పు లేదన్నది కొందరి పెద్దల సూచన. మొత్తానికి జూదం ప్రారంభమయింది. నవ్వుతూనే ఆట ప్రారంభించారు. మాయజూదం ప్రారంభమయింది. శకుని, వివశంత, చిత్రసేన, వికర్ణులు పాచికలతో సిద్ధంగా వున్నారు. అందరిని ఒకసారి చూసి ఇప్పుడు నేను ఎవరితో ఆడాలని యుధిష్టరుడు అడిగాడు.

"అన్నా! మా బదులు శకుని మామ ఆడతాడు. కాబట్టి నీవాతనితో ఆడాలి" అన్నాడు.

"దుర్యోధనా - ఇందుకు పద్ధతులు ఒప్పుకోవు" ధర్మరాజు సూచన.

"మనం ఒప్పుకుంటే, అన్నీ సమాధాన పడతాయి" శకుని అందుకున్నాడు.

వచ్చినవాడు, కాదని, వెనుదిరగడమిష్టం లేక ఆటకు కూర్చున్నాడు. పందెం లేని ఆట రాణించదు. అది నియమమని, పందాలతో ఆటమొదలు పెట్టారు. మొదట్లో ఏదో ఒకటి, రెండు పందెములను గెలచినా మొత్తానికి, శకుని మాయలో ధర్మరాజు సర్వం కోల్పోతున్నాడు. పరిస్థితిని - ప్రమాదానికి తీసుకు వెళ్ళకుండా

చూడమని, విదురుడు, మహారాజును హెచ్చరించాడు. "నువ్వూరుకో!" అని తానూరుకున్నాడు. ఆపుకోలేని విదురుడు, పెద్దలందరికి తెలిసే విధంగా దుర్యోధనుని హెచ్చరించాడు. అడగని పెద్దరికం, అనవసరంగా నెత్తిన వేసుకోకు. నీ శాపాలు, ఎంత అభిమానమున్నా పాండవులకు తప్ప మమ్మ కాల్చవని, కూర్చోమని, ధిక్కరించాడు. అక్కడ విదురుడు చెబుతున్నాడు. ఇక్కడ ధర్మరాజు ఓడిపోతున్నాడు. సంపదలు పోయాయి, రాజ్యము పోయింది. ఆవేశం పెరిగిపోతుంది. గెలవాలనే పట్టుదలతో భీముని పందెం పెట్టాడు. ఓడాడు. మీసం మెలివేస్తూ, "రా! రా! బానిసా" అన్నాడు దుర్యోధనుడు.

"అర్జునుడు, నకులుడు, సహదేవుడు.... అందరు ఓడిపోయారు. ఇంకేముంది, నీ దగ్గర ?" శకుని వెక్కిరించాడు. "నేనున్నానని", తనను ఓడిపోయాడు. మహారాజులో తన పిల్లవాడు గెలుస్తున్నాడనే ఆనందం పెరిగి పోతుంది. ప్రమాదాన్ని గ్రహించలేకపోతున్నాడు.

"ఇంకేముంది ?" అడిగాడు శకుని. "ఏమీ లేదు....!" అన్నాడు ధర్మరాజు. "వుందిగా, ద్రౌపది. ఆమెను పందెం పెట్టు. పోయినవన్ని - రాజ్యంతో సహా సర్వం గెలుచుకోవచ్చున్నాడు. ఆశ చావని ధర్మరాజు పందెం పెట్టాడు. అయిపోయింది. ఆమెను ఓడిపోయాడు. భరతకుల పరువు ప్రతిష్ఠలు వీధిన పడ్డాయి.

అట్టహాసం, ఆనందం, కలకలం "ఏమయింది ?" మహారాజు ఆత్రంగా అడిగాడు. "సంతోషంతో" అన్నీ పోగొట్టుకుని, ఈ పాండుకుమారులు నాకు బానిసలయ్యారు. వీళ్ళే కాదు. ఆ పంచభర్తల ద్రౌపది కూడా నాకు దాసీ అయింది. సుద్దులు చెప్పిన ఓ పెద్ద విదురా! వెళ్ళి ఆ బానిసను తీసుకునిరా. ఈ ధర్మజ్ఞులనబడే అధర్మల వర్తనంతో, ఈ సభా భవనం అపవిత్రమయింది. దీనిని కడుగు. వెళ్ళ"మన్నాడు.

ధృతరాష్ట్రుడు విన్నాడు. మౌనం వహించాడు.

"ఈడ్చుకురండి... ఆ దాసీని...!" ఇదే వినాశనానికి, అసలు సిసలైన ఆరంభం. ఈ విషయం, విదురుడు కాదనేసరికి, అక్కడి భటులతో చెప్పి, ఆమెను లాక్కుని రమ్మన్నాడు. ఆతడు అంతఃపురానికి, ఈ సమాచారమందించాడు.

ద్రౌపది యాజ్ఞసేని. అగ్నిహోత్రి అయింది. అంతావిని, ఆ వచ్చిన వానితో "నన్నోడి తన్నోడెనా ? లేక తన్నోడి నన్నోడినా ?'' వెళ్ళి, తెలుసుకునిరా! అంది. తిరిగి - వచ్చిన ప్రతిహారి - దానినే చెప్పాడు.

"దాసీదానికెంత పొగరు. అదేదో ఇక్కడ తేల్చుకుందాము. రమ్మనమను. కాదంటే, జుట్టుపట్టుకుని ఈడ్చుకురా, రా!'' ఎంత అన్నమీద గౌరవమున్నా, ఇంత పరాభవానికి, భీమసేనా అర్జున, నకుల సహదేవులు కుతకుత వుడికి పోతున్నారు.

"ఏమిత్రా! బానిసలకింత కండకావరమా ? తల ఎత్తారో, ఆ తల తెగుతుంది. జాగ్రత్త!'' పకపక నవ్వుతూ దుర్యోధనుడు హెచ్చరిస్తున్నాడు.

అయిపోయింది. పోగాలముదాపురించింది. ఇది భరతవంశ ప్రాభవానికొక మచ్చ. కురుకుల నాశనానికి ప్రతీక. ఎందరు ఎన్ని చెప్పినా, ఆ మూర్ఖుడు వినడం లేదు. అన్నా! నేను వెడతానంటూ, దుశ్శాసనుడు, ద్రౌపదిని సభకు లాక్కొని రావడానికి వెళ్ళాడు. జరిగినది - అన్యాయమైతే, ధర్మరాజు నిగ్రహించేవాడు. అది న్యాయం కాబట్టే, అతడు వూరుకున్నాడని, అందరు వూరుకున్నారు. ఎంత బ్రతిమాలినా, వేడినా, కులకాంత మర్యాదలన్నీ కూలద్రోసి, కౌరవులు, తాము గెల్చిన కులకాంతను దాసీగా, జుట్టు పట్టుకుని, బరబర ఈడ్చుకు వచ్చాడు. ఆ సభలో పడేసాడు. ఇప్పుడు చెప్పవే...! ఇష్టమొచ్చినట్లు వదురుతున్నాడు.

ఇది భరించి ఎదిరించలేని అసహాయులైన పాండవులు, పళ్ళు బిగపెట్టి, కళ్ళు మూసుకుని, తలలు వంచుకుని కూర్చున్నారు.

ఒకడిని మా దుర్యోధనుని పొందితే నీకు మర్యాద మిగిలేది. ఈ అమర్యాద తప్పేది. అయిదుగుర్ని కట్టుకున్నావు అనుభవించు. ఆ దౌర్భాగ్యులు మా దాసీలు తలలెత్తలేరు. నిన్ను రక్షించుకోలేరు'' అన, పగలబడి నవ్విన దుర్యోధనుడు -

"తమ్ముడా! మానం లేనిదానికి మర్యాదలెందుకు ? ఆ కట్టుకున్న బట్టల్ని విప్పి - ఆ దాసీదాన్ని ఏడుస్తూ కూర్చోమను.

"అలాగే... అంటూ ముందుకురికాడు. "దుశ్శాసనా, వద్దు. నేను మీ వదినను'' ప్రాధేయపడుతుంది. "దాసీలతో మాకు బంధుత్వము లేదు'' రా!'' అన్నాడు.

"నేనున్నానుగా!" విదురుడు లేవబోయాడు. "మాట్లాడకుడా వుంటే మర్యాద నిలబడుతుంది." దుర్యోధనుని హెచ్చరిక. కౌరవశతం పరిహాసాలు. అన్నీ వింటున్న ధృతరాష్ట్రునిలో చలనం లేదు. భీష్మాదులు ధర్మరాజు మౌనానికి తలలు వంచారు.

ద్రౌపది రోదనము, అరణ్య రోదనమే అయింది. వికర్ణుడు లేచి, ద్రౌపది ప్రశ్నకు సమాధానమడిగాడు. ఎవ్వరు ఉలకడం లేదు. పలకడము వినబడటం లేదు. ఏదో చెప్పబోయాడు. నీవు మాట్లాడకూడదు" కూర్చోమన్నాడు-కర్ణుడు.

కర్ణుని వాదంతో, సంతోషించిన దుర్యోధనుడు "దుశ్శాసనా! ఈ ఏకవస్త్రను, కర్ణుడు చెప్పినట్లు వివస్త్రను చేసినా తప్పులేదు కానీయ్" మీసం దువ్వాడు. పాండవులనల్లరిపాలు, అవమానాలపాలు చెయ్యడమే లక్ష్యం గల కౌరవులలో, అధర్మం ప్రకోపించింది.

వీర ఉత్సాహంతో - "రావే, పంచభర్తృకీ! అని ఆమె చీరను వూడదీయ సిద్ధమౌతున్నాడు. ఇక ఇటువంటి అసహాయ స్థితిలో "హే కృష్ణా! గోవిందా, వాసుదేవా, మురారీ!" అని మొరబెడుతుంది. చాతనైనతంవరకు, తనను రక్షించుకోవాలని ఒక మూల ప్రయత్నిస్తుంది.

ఇక్కడ - సత్యభామతో చదరంగపుటెత్తులు వేసే కృష్ణుడు. "భామా! క్షణమాగ" మన్నాడు. నా కోసము ఒక దుస్థిత - రక్షణ కోరి మొరలిడుతుంది" చెప్పాడు. ఆట ఆపేస్తూ "ఎవరండీ, అంది" సత్య.

"ఇంకెవరు, మన ద్రౌపది. కౌరవుల దౌష్ట్యానికి బలి అవుతుంది. ఒకప్పుడు, ఒకానొక సమయలో సర్వాపదల నుండి, మమ్ములను నువ్వే రక్షించాలంది. అలాగే అన్నాను. కౌరవుల నుండి నువ్వే మమ్ములను రక్షించాలంది. అలాగే అన్నాను. ఇప్పుడు కౌరవులు మయసభ మాయలకు భ్రమిసి, ఒక సభను కట్టుకుని, వీరిని పిలిచాడు. మాయాద్యూతంలో శకుని ద్వారా వీళ్ళను ఓడించాడు. చివరకా, ధర్మజుడు, తనతోపాటు తమ్ములను గూడా పోగొట్టుకుని, ఆఖరి అస్త్రంగా ఆశతో ద్రౌపదిని కూడా పణమొడ్డి, మీ అన్న సంపూర్ణ బానిసయ్యాడు. ఈ దురదృష్టానికి, ఏక వస్త్రయైన ద్రౌపదిని బంధించబోతే, తగదని ఆమె వేడింది. బానిసలకు కులకాంతలవలె విధి నిర్ణయాలు లేవు. ఆ ఏక వస్త్రనిక్కడికి తీసుకురా,

వివస్త్రను చేద్దామంటే, దుశ్శాసనుడామెను జుత్తు పట్టుకుని, భీష్మాది కురు వృద్ధులు గురువృద్ధులున్నా సభకు, ఈడ్చుకు వచ్చాడు.

ఇప్పుడు వస్త్రాపహరణం జరుగుతుంది. నన్ను పిలిచింది. లేద్దామంటే తన ఆత్మరక్షణం తాను చేసుకుంటుంది. "అనన్యాశ్చింత యంతోమా....?'' రక్షించవలసిన బాధ్యత నాది!'' అంటు. ఒక్క క్షణమాగు అన్నాడు. ఇక్కడవుండే, అక్కడ ద్రౌపదీకాంత పిలుపుకు స్పందించి, ఆమె మానం కాపాడాడు. కులసతిని గౌరవించాడు. అక్షయ వస్త్రాలతో కరుణించాడు. ఆ దివ్య దృశ్యానికి సభలోని ధర్మాత్ములు సంతోషించారు. వివస్త్రను చేసిన చీర తన చేతిలోనే వుంది. ఆమె వంటిమీద చీర వుంది.

"కరుణామూర్తిని, భక్తజనరక్షకుని, ఆర్తత్రాణపరాయణుని అభయమిమ్మని అడుగుతుంది. దుశ్శాసనుడు చీరలు ఒలుస్తున్నాడు. ఆమె వంటిమీదనున్న వస్త్రం అలాగే వుంది. కృష్ణ రక్షణకు అందరు - ముఖ్యంగా - భీష్మాదులు, పాండు నందనులు సంతోషించారు. జరిగిన అవమానానికి కారణమైనా అన్నను అధిక్షేపించకుండా ఆ తమ్ములు వుండలేకపోయారు.

"ఒరేయ్! కులసతి మర్యాదను మంటగలిసిన నీ గుండెలు చీల్చి రక్తం త్రాగుతానన్నాడు - ఒళ్ళంతా వుడికిపోతూ భీముడు.

"ఛ! చాతకాని చవట దద్దమ్మ. ఇప్పుడు భార్యను రక్షించుకోవడం చాతకాక, రేపెప్పుడో, గుండెలు చీల్చి, రక్తం త్రాగుతాడుట, రక్తం......!'' కౌరవాదులు రెచ్చిపోతున్నారు. విదురుడు ధర్మనిర్ణయం చెయ్యమంటే- "విదురా! మన మెవరము ? మనకసాధ్యమన్నది. భీష్ముని వాదన. "విన్నావా ? ఇంతమంది పతులు వుంటే, ఇదే ఆడదానికి కలిగే మర్యాద ?'' అన్నాడు కర్ణుడు.

"రా! ఫర్వాలేదు. తప్పులేదు'' అని తన తొడను చూపాడు దుర్యోధనుడు.

అదిచూచి పట్టరాని ఆగ్రహంతో, రాబోయే యుద్ధంలో నీ తొడలు విరచి... భీముడు ఆవేశంతో వూగిపోతున్నాడు. అర్జునుడితో సహా అందరు ఆవేశభరితులౌతున్నారు.

"ఛీ.... అసందర్భ ప్రలాపీ!'' అన్నాడు, తన సాహసానికి, తనను తానే అభినందించుకుంటూంటే ఈ కలకలాన్ని విన్న గాంధారీ "ఏమిటి స్వామీ!''

అంది. జరిగినదంతా మహారాజు చెప్పాడు. సరదా.... ఈ రకంగా సవాళ్ళకు మూలమౌతుందనుకోలేదు. "తనవాళ్ళు చంపబడతారనే బాధను వ్యక్తపరుస్తుంటే పరమ పతివ్రత, పవిత్రయైన గాంధారీ -

"ఏమిటి - భరతవంశ పెద్దకోడలు పాంచాలిని ఇంతమంది పెద్దల సమక్షంలో, ఏక వస్త్రయైన ఆమెను వివస్త్రను చెయ్యదలిచారా ? ఇందుకు మీరు ఆమోదించారా ? ఎందుకీ కులనాశనానికి ఒడి కట్టారు. వంశఘాతుకానికి సిద్ధపడ్డారు. ఇది పిల్లల సరదానా ? ఇందుకు మీరు ఆమోదమా ?

ధృతరాష్ట్ర కుమారుల వంశనాశనమాగదు. రేప్రొద్దున్న ఇన్ని నీళ్ళు పోసేవాళ్ళు లేకుండా ఏడవాల్సి వస్తుంది. ధర్మపరురాలైన, ముఖ్యంగా అయోనిజ యైన యాజ్ఞసేని - పవిత్ర జీవనానికి మన కోడళ్ళందరూ, నిర్వంశీయులై ఘోరపాతకానికి పోతారు.

ఎందుకంటే...!" అని ఆమె భవిష్యత్తును తలచుకుని బాధపడుతూంటే-

"దేవీ, ఎందుకీ అనవసర మనస్తాపం. నువ్వు కోరితే వారిని కరుణిస్తాను. శాంతబరుస్తాను.

"ఇది తాత్కాలికమండి. ఒడిలో కట్టుకున్న నిప్పు కాల్చక మానదు. మన రాతలు మారకపోవు. శ్రీకృష్ణ - ప్రేమాభిలాషులు, దయాలబ్ధలైన పాండవులతో ముఖ్యంగా - ప్రేమతో "చెల్లీ!" అని పిలిచే, ద్రౌపది జీవితంతో ఆటలాడుకున్న ఆ అమర్యాదే, ఆ అధర్మవర్తనం, తప్పక కురువంశనానికి, మనకు దుర్భర సంతాపాన్ని ఇవ్వక తప్పదండి!" అని చెప్పి - గుండెలు పగిలేలా ఏడుస్తుందా తల్లి, ఇల్లాలు, గాంధారీదేవి!

దుర్యోధనుని పిలిపించాడు. తల్లి బాధను తెలిపాడు. శాంతం వహించమని కోరాడు. ముందు నా నిర్ణయానికి తలఒగ్గమని, తండ్రిగా కోరుతున్నానన్నాడు. మహారాజుగా నన్ను గౌరవించమన్నాడు. ఆ వెంటనే - ఆమె బాధను శాపాల్ని, వినలేని మహారాజు "ఇదంతా నీ తమ్ముని ప్రతాపమే నన్నాడు. మన కర్మమని ఏడ్చిందా తల్లి. ద్రౌపదిని పిలిచాడు. అమ్మా! జరిగినదానికి నన్ను క్షమించు. శాంతించి, నా పిల్లలను కనికరించు. కోడళ్ళలో పెద్దదానివి. నీవేనని వూరడించాడు. నువ్వు ఏం కోరుకున్నా ఇస్తాను. వరం కోరుకోమన్నాడు.

"మహారాజా! అజాతశత్రువు. అధర్మము - కుట్ర కుతంత్రాలు, మాయలు తెలియని ధర్మ ప్రభువు ధర్మరాజు విడుదలైతే, అంతకుమించిన ఆనందం, లోకానికి అశాంతి వుండదని, ప్రార్థించింది.

"అస్తు!" అన్నాడు ధృతరాష్ట్రుడు.

"ఇంకో వరమడుగు" మహారాజు కోరాడు. అన్నదమ్ముల ప్రేమకు- సన్మార్గంలో - సద్ధర్మంలో - నా భర్తలు నిలువెత్తు సత్యాలు. వాళ్ళందర్ని - తమ తమ ప్రాభవాలతో కరుణించమని కోరింది. తప్పక - నీ అభీష్టం సిద్ధిస్తుంది. అని మరో వరం కోరుకోమన్నాడు.

"మీ అభిమానానికి కృతజ్ఞురాలను. నేను క్షత్రియ కాంతను. ఇస్తున్నారు కదా.... అని తేరగా వచ్చే వరాలు పొందే అర్హత నాకు లేదు" అంది.

అప్పుడు - ధృతరాష్ట్రుడు, కళ్ళు లేకపోయినా అందర్ని చూసినట్లు పేరు పేరునా పలుకరించాడు. ఎంతో అభిమానాన్ని ప్రకటిస్తూ - "ధర్మరాజా! మీరు పిల్లలు. ఏదో ఆడుకున్నారు. అందులో జరగకూడనిది, జరిగిపోయింది. ధర్మాన్ని, పెద్దలను సదా నిలబెట్టే నీవు - వాళ్ళందరు - నీ తమ్ములు. నీ తమ్ముల వలెనే క్షమించి, ఆదరించు. అది మహారాజు మనవి. జరగబోయేది మహారాజుకు తెలుసు. అందుకే ఆ పరిస్థితి రానివ్వకూడదని, ధర్మజుని అర్థించాడు.

అక్కడ ఒక క్షణం కూడా పాండునందనులు వుండలేకపోయారు. ముఖ్యంగా భీముడు తనను తాను నిగ్రహించుకోలేక పోతున్నాడు.

వాళ్ళు వెళ్ళగానే, దుర్యోధనుడు తండ్రిని సమీపించి, "ఏమిటి నువ్వు చేసింది. వాళ్ళనేదో రకంగా పీడ వదిలించుకోవాలని నేను చూస్తుంటే, వరాలంటూ వాళ్ళనుద్ధరించావు. రేపు నన్ను, నా తమ్ములను వాళ్ళు బ్రతుకనిస్తారా ? పైగా ఆ కృష్ణుడు వారికండగా వుండ, వాళ్ళు...!" మాటలు రాక వుడికిపోతున్నాడు.

"కుమారా! ఆవేశం, ఎల్లవేళలా తగదు. నిన్ను మెచ్చుకున్న వాళ్ళెవరు చెప్పు. ఒక్క కర్ణుడు తప్ప. అది - అతనికి రాజ్య ప్రదానం చేసిన విశ్వాసం. అది సూత ధర్మం. అది తాను నిర్వర్తించాడు. ఇక -మీ- మామ శకుని - గాంధారాన్ని గాలికి వదిలి, మన ప్రాపును చేరాడు. ఎందుకు, మంచికి ముందుకు

రానివ్వకుండా, పాండవుల వలెనే భగవత్కృపను పొందనీయకుండా, నిరంతర శాపదగ్ధుల్ని చేస్తూన్నాడే తప్ప, మీ మేలును ఏనాడైనా కోరాడా ?

ఇప్పుడు జరిగినదంతే. ఈ పగలు - ప్రతీకారాలు పెంచరాదు. పట్టుదలలకు పోరాదు. పర్యవసానమెంత దారుణంగా వుంటుందో ఆలోచించు. నిన్నగాక మొన్న పాండవులు చేసిన రాజసూయానికి సహకరించిన వారందరికీ నీవు, నీ ప్రవర్తన తెలుసు. వాళ్ళందరు ఒక్కటైతే మిగిలేది - నువ్వు - నీ నూరుగురు తమ్ముళ్ళు. ఆ పాచికల శని - శకుని - సూతవృత్తికి నిదర్శనమైన కర్ణుడు. కనుక తొందరపడకు. నిదానించు. సమయం వచ్చినప్పుడు కీలెరిగి వాతపెట్టాలి తప్ప, ప్రతిదానికి పట్టుదల పనికిరాదు. పగ - ప్రతీకారాలు పనిచెయ్యవు. ముఖ్యంగా మన పెద్దలముందు. జాగ్రత్త'' అని అనునయించాడు. విధిలేక దుర్యోధనుడు వెనుదిరిగాడు.

కొన్నాళ్ళు గడిచాయి. తండ్రిని ఏదోరకంగా ఒప్పించి - అపాయంలేని ఉపాయంతో, పాండవుల పీడ వదిలించుకుని, వాళ్ళా రాజ్యాన్ని - సర్వ సంపదలను హరించాలని నిర్ణయించుకున్నాడు. విషయం చెప్పాడు. ధృతరాష్ట్రుడు ఒప్పుకున్నాడు. ఇంద్రప్రస్థానికి కబురు పంపాడు.

విధి బలీయం.

పెదనాన్న రమ్మనేసరికి, భార్యా సోదరులతో హస్తినకు బయలుదేరాడు. ఉభయకుశలోపరి. వాతావరణమెంతో ఆహ్లాదంగా వుంది. ఆ సమయంలో ఈ పాండవులు, తండ్రి వద్ద వున్న సమయంలో, గాంధారీతో ద్రౌపది వున్న తరుణంలో-

"తండ్రీ! నాదొక కోరిక" అన్నాడు దుర్యోధనుడు. పుత్రప్రేమ పొంగి పోతూంటే "చెప్పు! నాయనా" చెప్పమని కోరాడు ధృతరాష్ట్రుడు. "నీకంగీకారమైతే, అన్న కిష్టమైతే సరదాగా ద్యూతమాడతామన్నాడు. తప్పేముంది ? ఆడుకోమన్నాడు. తప్పేదేముంది ? ఆడతానన్నాడు ధర్మరాజు. ఎప్పటిలాగే శకుని ప్రత్యక్షం.

"అల్లుడూ! ఇప్పుడు మనం, ఆస్తులు - రాజ్యాలు అనవసరంగా పందెం పెట్టవద్దు. కాకపోతే.. "చెప్పు. అల్లుడూ!'' దుర్యోధనుని చూసాడు.

"అవునన్నయ్యా! అనవసర కోపతాపాలకు తావీయకుండా, అపాయంలేని, వుపాయంగా - ఒక పందెం పెట్టుకుందాం. అది....!" చెప్పనా, వద్దా ? అన్నట్లు నాన్చుతున్నాడు. "చెప్పు, తమ్ముడూ! ధర్మరాజు అభయం. వెనుక భీమార్జున నకుల సహదేవుల, మనోభయం పెదతండ్రి - అనగానే వచ్చి - ఇక్కడ కూర్చున్నాడు. ఈయన చేసేతప్పు - ఈయనతోపాటు పోవడంలేదు. బంధుమిత్ర సపరివారంగా అన్నట్లు - ఆ బాధలను అందరు అనుభవించాల్సి వస్తూం" దను కుంటున్నారు.

"ఏం లేదు. అన్నయ్యా...!" అంటూంటే, "ఎందుకు నాన్పుడు... నేను చెబుతానంటూ శకుని "చూడు పెద్ద అల్లుడూ! గెలిచినవారు హాయిగా రాజ్యభోగాలతో వాళ్ళ సర్వసంపదలను అనుభవిస్తారు. ఎటొచ్చి ఓడిపోయిన వాళ్ళు, పధ్నాలుగు సం॥ల అరణ్యవాసం, ఆపైన ఒక సం॥రం, అజ్ఞాతవాసం చెయ్యాలి. అజ్ఞాత సమయంలో పొరపాటున బయటపడిపోయారో, మళ్ళీ పధ్నాలుగు సం॥ల అరణ్యావాసము, ఒక సం॥ము అజ్ఞాతవాసం. ఇలాగ సాగుతుంటుంది. ఇది ఆట.

"అమ్మ! శకునీ" అనుకుంటున్నారు పాండునందనులు. అయిపోయాం, గోవిందా! ఇక ఆ గోవిందుడే, మనకు దిక్కు" అని చేతులు ఎత్తేసారు.

"సరేనా... ?" వెనక్కి తిరగకుండానే "సరే" నన్నాడు యుధిష్టరుడు. పందెం ప్రారంభమయింది. శకుని పాచికలు వేసాడు. ధర్మరాజు ఓడిపోయాడు. "ధర్మరాజా! నారబట్టలు, నీకు - నీ తమ్ముళ్ళకు, మీ అయిదుగురు భార్యకు - మేమిస్తాము. మీ నగలు, ఆయుధాలు తప్ప - అన్ని ఇక్కడ విడిచి, బయలుదేరండి.

"ఏం చేస్తాం. ధర్మపరులే. అధర్మం పైచేయి చేసుకుంది. మిమ్ము పాతాళంలోకి, లేవకుండా త్రొక్కింది." శకుని పరిహాసం.

దురదృష్టంతో పుట్టినందులకు, ఇది ప్రతిఫలం ఎంత గోవిందుడు చెంతనున్నా, ఈ చింతలు మావే మేమే అనుభవించాలి!" అనుకుంటున్నారు. ఇది విన్న వాళ్ళందరు ముక్కున వేలేసుకున్నారు. కాలం, కర్మమన్నారు. అనుభవించక తప్పదేమో!

భీముడు మాత్రం - ఆవేశంతో వూగిపోతున్నాడు. తల్లి మనసు కష్టపడ కూడదని, ఐకమత్యమాయుధంగా బ్రతికే మనకు, కలతలు రాకూడదన్న ధర్మమే తప్పదనిదయింది. లేకపోతే, తన గదాఘాతంతో భీముడు, యుధిష్ఠరుని, ఆ యమపురికి పంపి వుండేవాడు.

అస్తమానం, అవమానాలేనా... ?! గోవిందా ? ఈ పరీక్ష.... ప్రతి ఒక్కరి కళ్ళలో నీళ్ళు. రాజసూయావ బృధంతో పవిత్రమైన యాజ్ఞసేని, తన దురవస్థకు తల్లడిల్లుతూ, జుత్తు విరబోసుకుని నడుస్తూంటే కౌరవులకు పోగాలము దాపురించినదని, తప్పక తనవలె, ధృతరాష్ట్రుని కోడళ్ళ.... జడలు విరబోసుకుని శోకతప్త హృదయులై, భర్తలను వెదక్కుంటూ పీనుగల పెంటవలె వున్న రణభూమిలో తిరుగక తప్పదని, బాధపడింది.

నిప్పును మూటగట్టుకుని, చందనం చెక్కలు పట్టుకున్నట్లు ప్రవర్తించినా, దహించే గుణం అగ్నికి పోదు. దాహకశక్తి చావదు. అనుభవించాల్సిందే. ఇందుకు గాంధారీదేవి శాపం కూడా తప్పక తోడవుతుంది. అనుకుంది ద్రౌపది.

జరిగే ఘోరాలతో గాంధారి తల్లడిల్లుతుంది. ఎంతటి గుడ్డి పుత్రప్రేమయితే మాత్రం - వంశ నాశనానికి తలపడటం - దురదృష్టంగా తలుస్తూంది. దానికితోడు దుర్నిమిత్తాలు. ఇది కర్మ అనుభవించాలి. ఆనాడే వీడిని, రాజ్యం కోసం వదిలించుకుంటే, మిగిలిన వారయినా బాగుండేవారు, వంశం నిలబడేది. ఇప్పుడు- దుర్యోధనుడు, శకుని, అతనికి తోడుగా, కర్ణ - అశ్వత్థామలు - వంశనాశనానికే ప్రయత్నిస్తున్నట్లున్నారు.

"హా... హతవిధి" అనుకుంది గాంధారీ. అప్పుడు జ్ఞానోదయమయినట్లు ధృతరాష్ట్రుడు "విదురా! పాండుపుత్రులు, ఎలాగ వనవాసానికి వెళ్ళారు ?" విచారిస్తున్నట్లడుగుతున్నాడు.

"మహారాజా! వాళ్ళు పాండుపుత్రులే తప్ప, జేష్ఠుడని గౌరవించి, నీకు రాజ్యమొసగి, నీకు ప్రతినిధిగా నిలిచి, తన సర్వశక్తులొడ్డి నిన్ను కాపాడుకున్న నీ తమ్ముని పుత్రులు కారన్నమాట. ఇన్నాళ్ళు బాహ్యంగానే గ్రుడ్డివాడివనుకున్నాను. మీ అంతఃకరణం కూడా రాగద్వేషాలతో గ్రుడ్డియిందని మీ మాటలు తెలియకనే తెలియబరుస్తున్నాయి.

"విదురా! అసలు విషయం విడిచి, ఎందకీ కొసరు మాటలు ?" అది తన అసమర్థతగా ప్రకటించుకుంటూ కోపగించుకున్నాడు.

"చెబుతాను, మహారాజా! ఈ దారుణాలు చూడటానికి, భగవన్నామమనే నోటితో, ఈ దారుణాలు చెప్పడానికి, నన్నా భగవంతుడు పుట్టించి, నియోగించి వుంటాడు - వినండి. "యుధిష్టరుడు, ముఖాన గుడ్డ కప్పుకుని వెళ్ళాడు. రెండు చేతులు బారసాచి, పెద్ద పెద్ద అంగల్తో భూమి అదిరేటట్టు నడస్తూ భీముడు వెళితే, అర్జునుడు సిగ్గుతో తలవంచుకుని, ఇసుకను అటుఇటు జల్లుతూ కోపంతో కదిలాడు. నకులుడు తలదించుకుని, సహదేవుడు కృంగిపోయి కదిలితే, ద్రౌపది జుట్టు విరబోసుకుంది. ధౌమ్యులవారు సామవేదగానం చేస్తూ నడిచారు.

అంటే... !" అనే ధృతరాష్ట్రునికి. "ఏముంది ? రేపు అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తి చేసుకున్నాక, వాళ్ళ చేతులలో మన వాళ్ళు పొందే, చివరి క్షణాలను సూచిస్తూ కదిలారు. ఇప్పుడు మృత్యువు మనందరి నెత్తికెక్కి కూర్చుంది. అనుభవిద్దాం. పట్టండి. "నా కర్థం కాలేదు. నీ విశ్లేషణలను విడిచి, కాస్త వివరంగా వాళ్ళ ప్రవర్తనను చెప్పవచ్చును, కదా!" "తప్పక" అన్నాడు విదురుడు. "మహారాజా! ఎవరికి మొహం చూపుకోలేని దుస్థితి కౌరవులకు దాపురిస్తుందన్నది. అది, ధర్మరాజు ఆవేదన. భీముడైతే తన బాహుబలం తప్పక తన ధర్మం నిర్వర్తిస్తుందని ప్రకటించాడు. ఇక - అర్జునుడు - ఇసుక ఎలాగైతే- గుప్పెడు గుప్పెడు విసిరితే, ఎడబాయక, విడదీయక వుంటుందో, అలాగ నా శరపరంపరతో, ఈ దుష్టాత్ముల వధిస్తానని శపథం చేస్తున్నట్లు నడుస్తున్నాడు.

ఎంతటి అందమైన శరీరమైనా చివరకు భూమిని ఆశ్రయించక, తప్పదని, శరీరమెల్ల, మట్టి దుమ్ము పూసుకుని, మా బ్రతుకులింతేనని చెప్పక - చిచ్చు పెడతానన్నట్లుగా నకులుడు  నడిచాడు. తన దీన వదనాన్ని చూసి ప్రజలు జాలిపడకుండా వుండవలెనని సహదేవుడు తలదించుకుని వెడుతున్నాడు.

అందరిలోకి - ఆఖరిదైన ద్రౌపది - తనవలె జుట్టు విరబోసుకుని, కౌరవ కాంతలు, దిక్కులేని దీనావస్థకు గురవుతారని ప్రకటిస్తున్నట్లు నడిచింది. ధౌమ్యులవారయితే, అపర కర్మలిలాగ చేయబడుతాయి. ఏడిచేవారెవరు వుండరని సూచిస్తూ - ఆ మహానుభావుడు - నడిచాడని తెలిపాడు.

అందరు మా నాశనం కోరుకునేవారే. విదురా! జరిగిందేదో జరగిపోయిది. ఈ అపాయం నుండి బయటపడే వుపాయం నీవే సూచించమని అడిగాడు.

మహారాజా! ఇక చేయగల్గిందేమీ లేదు. నీవు చేయగల్గింది కూడా ఏమీ లేదు. గుడ్డి ప్రేమ నిన్ను సంపూర్ణ గుడ్డివాడిని చేసింది. ఆ పుత్రప్రేమను కాదనలేవు. ఎంతసేపు "పాండుపుత్రులనే" నీవు వారల నేవిధంగా వుద్ధరిస్తావు. అమాయకుడైన యుధిష్టరుడు నిన్ను విశ్వసించవచ్చును. భీమార్జున నకుల సహదేవులెవ్వరు, నిన్ను - నీ కుమారుని ముఖ్యంగా - ఆ కర్ణ - శకునులు వెంట వున్నంతవరకు విశ్వసించరు -

వాళ్ళు లేకపోతే అసలు కథే లేదు. కనుక విచారించి లాభం లేదు. నిర్ధనుడు ధనవంతుడు కావచ్చును కానీ, అధర్మం ధర్మం కాదు. అది మరువని సత్యం. చివరకు నువ్వు చెయ్యగల్గిందొక్కటే. నీ పిల్లల్ని కాదని, వాళ్ళేమైనా బాధపడకుండా, నీ తమ్ముని పుత్రులను పిలచి, మీ రాజ్యం మీది. అది మీ దత్తము. దానిని కొల్లగొట్టే హక్కు మాకు లేదు" అని విధి విధాయక నిర్ణయాలు చేసుకుని, ఎవరి బ్రతుకులు వారు బ్రతకండి.

కాదంటే.... కాల గర్భంలో హీనచరిత్రులై నీవు, నీ సంతానం, మిమ్మాశ్రయించినందులకు మేము "భరతవంశ ఖ్యాతికి - నాశకులమై మెలుగుదా" మంటాడు.

ధృతరాష్ట్రుడు విన్నాడు. గుడ్డి ప్రేమ పొంగి పొర్లుతూంటే, విదురుని వాక్కు వినలేకపోయాడు. అలాగే చేద్దామని.... అనలేకపోయాడు.

# కర్మ, తప్పదు

ఉద్ధవా! గతంలో పాడవులు లక్కయింట్లో మరణించారనుకున్నప్పుడు వారిని గూర్చి వివరాలు తెల్పి ఎందరినో వూరట పరిచావు. ఇప్పుడు వీళ్ళు వనవాసం పేరిట అడవుల పాలయ్యారు. వాళ్ళ పరిస్థితిని గమనించి, నా అవసరమున్నచో, తెలియచెయ్యి. వారలను రక్షించుకొనుట మన బాధ్యత అని కృష్ణుడు హెచ్చరించాడు.

వాసుదేవుని ఆదేశంతో... అడవుల పాలయిన, వారి దురదృష్టానికి చింతిస్తూ వారి వివరాలకై బయలుదేరాడు. హస్తినకు వెళ్ళి, విదురుని కలిసాడు. ఆయన జరిగినదంతా చెప్పాడు. పాండవులకు జరిగిన దారుణానికి, ప్రజలందరు మూకమ్మడిగా దుర్యోధనాదులను, గుడ్డి మహారాజును తీవ్రంగా నిందిస్తున్నారు. అంతేకాదు. హస్తినలో వుండువారంతా, నగరం విడిచి, పాండవుల వెంట వెళ్ళడానికి సిద్ధమవుతున్నారు. వారి బాధను, జరిగిన కథనాన్ని వివరించాడు. వచ్చే వాళ్ళందర్కి నచ్చచెప్పి పంపేసారు, చాలామంది వెనుదిరిగారు. కొంతమంది తప్పదని వెంబడించారు. అలాగ ప్రయాణం చేసి, చేసి వారు - గంగాతీరమందలి విశాల వటవృక్షం చెంత ఆగారు. ఇక్కడే ఇంద్రప్రస్థ బ్రాహ్మణీకం వచ్చి, యుధిష్టరుని కలిసి, తమ మద్దతును ప్రకటించారు.

అందరిని చూసి చలించిన యుధిష్టరుని ఆశ్చర్యపరుస్తు వచ్చేవాళ్ళు వస్తూంటే, అందరికి రెండు చేతులు కలిపి జోడించి -

“అయ్యా! ఇదొక దురవస్థ. స్వయంకృతం. దీని వలన అన్నదమ్మలను, వరప్రసాదంగా లభించిన భార్యను కష్టాలపాల్జేశాను. ఇప్పుడు మేము బ్రతకడమే కష్టం. మిమ్మ సంరక్షించలేము. అగ్నిహోత్రాలతో సహా వచ్చిన భూసురోత్తము లారా! మాపై సదా ప్రేమాభిమానములు ప్రకటించు, ప్రజలారా!

క్షమించండి. దయచేసి మీ మీ గ్రామాలకు వెళ్ళండి. మీరు చెయ్యగల్గినది ఒక్కటే ఒక్క ఉపాయం. మేము ఏ విధమైన ఈతిబాధలకు గురి కాకుండా, మా అరణ్య అజ్ఞాతవాసములను ముగించుకుని, జ్ఞాతుల నిర్జించైనా సరే, మా ధర్మబద్ధ - రాజ్యాన్ని పొందాలని, అటువంటి అదృష్టాన్ని ప్రసాదించమని, ఆ పరమాత్మను ప్రార్థించండి. వెళ్ళిరమ్మని కోరాడు.

కాదని కొందరు అనుసరించ సిద్ధబడితే, శౌనకులవారు, "రాజా! ఇటువంటి సమయంలోనే అంతఃశుద్ధి, బాహ్య శుద్ధిలకు తోడు యోగసిద్ధి కావాలి. అప్పుడే ఎటువంటి స్థితిలోనైనా ధీరత్వం మరువలేము. కాబట్టి...

పరిస్థితినర్థం చేసుకున్న యుధిష్టరుడు "కృష్ణా! నీవే మాకు సదా రక్ష" అని మనసులో ప్రార్థన చేసి ధౌమ్యుల వారిని కలిసాడు. ఇప్పుడు మనమేమి చెయ్యలేము. ఎక్కడో అక్కడ స్థిరనివాసమేర్పరచుకున్న తదుపరి మిగిలిన విషయాలనాలోచిద్దామన్నారు.

ఆ మర్నాడు - తెల్లవారి లేచి, ఎండ వచ్చేవరకు తిరిగి, తిరిగి ఒక ప్రదేశం బాగుందని అక్కడ స్థిరపడ్డారు. దుంపలు సేకరించి, వున్న దానిని అందరు పంచుకుని తిన్నారు. ఇక్కడ వుండవచ్చును. ఈ వాతావరణం మంచిదేనని మునిజనులు తెలిపారు. అక్కడ వుంటే బాగుంటుందని ఆ రాత్రికి అక్కడ విశ్రమించారు.

అర్థరాత్రి వేళ... భయంకర గర్జన వులిక్కిపడి లేచారు. వాడు రాక్షసుడు, వాడిని చూసి కొందరు భయపడుతుంటే, పాండుకుమారులు ధైర్యం చెబుతున్నారు. ఆ రాక్షసుడు రెచ్చిపోతున్నాడు. అతని వివరమడిగాడు ధర్మరాజు. నీవెవరన్నాడా రాక్షసుడు. నా పేరు ధర్మరాజు, అదిగో - ఆ దృఢకాయుడు, భీభత్స కాయుడు, నా సోదరుడు భీముడన్నాడు.

భలే. భ.లే - చక్కని వాళ్ళు, కావలసినవాళ్ళు దొరికారు. నా పేరు కిమ్మీరుడు. నేను బకాసురుడి సోదురుడనన్నాడు. ఇది నా వనం. ఇక్కడికెవరు రారు. వచ్చినవారు ప్రాణాలతో పోరు. హెచ్చరిస్తున్నాడు.

ఎందుకుపోరు. మా "భీముడు" వున్నాడు కదా! ఇందాక సరిగ్గా వినని కిమ్మీరుడు, ఎవరతడు ?" అన "భీముడ!"ని మళ్ళీ మళ్ళీ చెప్పాడు ధర్మరాజు.

"ఆ.... అతడే మా అన్నను చంపినవాడు. ఇంక నేను వూరుకోను, అతన్నే కాదు. మిమ్మల్నందర్ని చంపుకు తింటాను. అతన్ని... అతన్ని...!! "రా... తిందువుగాని అన్నాడు. "రా... రా!" అని వాడు తొడగొడుతున్నాడు. ఇక్కడ స్త్రీలు, అర్భకులెందరో వున్నారు. మన హడావుడికి అనవసరంగా గుండాగి చస్తారు. రా!" అన్న భీముడు వాడిని దూరంగా తీసుకుపోయాడు.

ఇద్దరు "హుం...!" అనుకున్నారు. చెరొక చెట్టు తీసుకున్నారు. ఎవరికెవరు తీసిపోనట్లు కొట్టుకుంటున్నారు. ఇద్దరు చెప్పుకోదగ్గ శారీరులే. చెట్లు, చిన్న చిన్న కొండలు, పెద్ద పెద్ద బండలు ఆయుధాలుగా విజృంభిస్తున్నారు. చెట్ల యుద్ధమయింది. మల్లయుద్ధంలో తన ముష్టి ఘాతాలతో కిమ్మీరుని తలపైన అరచేత్తో మొహంపైన, పిడికళ్ళతో గుండెలపైన గుద్దిన ఆ గుద్దులకు, వాడు - ఆ కిమ్మీరుడు, అమాంతం వెనక్కి విరగబడి చచ్చాడు.

అక్కడనుండి, ఇంకాస్త లోపలకు వెళ్ళి కామ్యకవన ప్రవేశం చేసారు. తగు విధంగా కుటీరాలు ఏర్పాటు చేసుకున్నాక - ధౌమ్యుల వారిని దర్శించి ధర్మరాజు "గురుదేవా!" అన్నాడు.

ప్రసన్న వదనంతో గురుదేవా అనగా, "రాజా! ఆదిత్యుడు సకల ప్రాణి నివాసుడు. సర్వమంగళుడు. శక్తి ప్రదాత ఆతనిని ప్రార్థించు. సకల జీవులకే కాదు సృష్టికే ప్రాణప్రదాతయైన ఆ సూర్యుని -

**"జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమోనమః**
**నమోనమః సహస్రాంశో, ఆదిత్యాయ నమోనమః"**

అని పూజించు. ఆతడు కరుణించి, నిన్ననుగ్రహిస్తాడు. శ్రీమన్నారాయణుడైన, ఆ కృష్ణ భగవానుని కరుణ కల్గిన మిమ్ము తప్పక, సూర్యుడనుగ్రహిస్తాడన్నారు. ఆ రకంగా, గురుదేవుల అనుమతితో, శ్రీకృష్ణుని స్మరించుకుని, సూర్యనారాయణుని ప్రార్థించాడు.

సూర్య "ఆ - నారాయణుడు", కరుణించి దర్శనమొసగి, "ధర్మరాజా! ఇది అక్షయపాత్ర. ఇది ఎందరికైనా తృప్తిపరుస్తుంది. ఒక్కసారి శుభ్రం చేసి, ప్రక్కన పెడితే, ఇక అది ఆరోజుకేమి ప్రసాదించదు. శుభ్రం చేసి, పూజా మందిరంలో వుంచే వరకు కోట్లమందికైనా ఆహారం సమకూర్చగల దివ్య ప్రభావ శాలి. శుభమస్తు' అని తన ఆశీస్సులతో, ఆ అద్భుత - అక్షయ పాత్రనిచ్చాడు.

దానిని ద్రౌపదికివ్వగా - పరమభక్తితో, ఆమె దానిని గ్రహించి, ఆదిత్య దేవునికి, పరిపరి విధాల మంగళాంజలులర్పించింది. ఆ రకంగా క్షుద్బాధా కార్యక్రమం తీరింది.

ఇదంతా విదురుని నుండి గ్రహించిన ఇంద్రప్రస్థ సార్వభౌమునికి కల్గిన ఉపద్రవ, బాధలకు, చలించిపోయిన ఉద్ధవుడు "మహాత్మా! ఒక్కసారి వారలను సందర్శించి, శ్రీకృష్ణునికీ విషయాలన్ని తెలియబరుస్తానని బయలుదేరాడు.

★ ★ ★ ★

ఉద్ధవుడు చెప్పినవన్ని విన్నారు. కొందరైతే ఆవేశంతో అట్టుడికిపోతూ, ఇప్పుడే వెళ్ళి.... ఉద్రేకపడిపోతున్నారు. కృష్ణుడు వాళ్ళను శాంతబరిచాడు. ఉద్ధవుని చూసిన వసుదేవుడు "ఇంతకీ నా చెల్లెలు కుంతి ఎక్కడుంది ? ఆ రాజమాత, తన పిల్లలతో అడవులకు వెళ్ళిందా ?" ఆమె కుశలమే కోరుతున్నట్లడుగుతున్నాడు.

ఎంతటి మహాసామ్రాజ్ఞి అయినా - ఇంతటి దురవస్థ పొందినందులకు బాధపడుతూ "అమ్మా! శ్రీకృష్ణ పరిరక్షితురాలయి, నీ కోసం, నా మేనల్లుడు, ఆ దేవదేవుడు, అన్న గాకపోయినా, అన్నగా తోడు వుంటాడు. జరగబోయే మహా సంగ్రామానికి ఆజ్యం నీవయ్యావు. కురు, పాండవ యుద్ధం తప్పదు.

ఎంత కాదనుకున్నా, మీరు కోరుకున్న యుద్ధం వస్తుంది. చెప్పుకునేందుకు చరిత్ర లేని విధంగా వారలు వధించబడతారు. ఇందుకు కృష్ణుడు నీకన్ని విధాల తోడునీడగా వుంటాడు. ఇది సత్యం. పాపం పండనిదే, కర్మం కాలనిదే, చెట్టునున్న పండైనా, మరి ఏమైనా సరే... ఫలాన్ని, ఫలితాన్ని ప్రసాదించదు.

జాగ్రత్త. ఒక మహాసామ్రాజ్ఞివి నీవైతే, ఒక మహోన్నత శక్తివంతురాలైన రాజమాతవై వుండి "ఇదిగో, ఇలాగ పరాయి యింట వుండగల్గడమా, ఇరువురికి శ్రేయస్కరం కాదు. ఇందుకు, బరితెగించినవారు, ప్రోత్సహించినవారలు - సర్వ నాశనమై పోతారు. కులస్త్రీని పెట్టిన వుసురు, చేసిన అవమానము క్షంతవ్యం కాదు. దానికి పరిహారము లేదు. ప్రాయశ్చిత్తమెక్కడా కనబడదు."

ఇక తొందరపడలేక, కళ్ళనీళ్ళను పమిటకొంగుతో తుడుచుకుని, తన్ను తాను నిగ్రహించుకుని కొంత తడవాగిన కుంతి - "అమ్మా! తెలియదనికాదు. తల్లిని కాబట్టి తల్లిగా చెబుతున్నాను. నీవు తల్లివే... అయినా...!" అత్తగారితో పాటు, తనూ ఉద్విగ్నం నుండి బయటపడి శాంతమొందిన ద్రౌపది" చెప్పండంది.

"అందర్ని - జాగ్రత్తగా చూసుకో. అందరికి ఇప్పుడు నీవే పెద్ద దిక్కువు ? భీముడు ఆకలికి ఆగలేడు. జాగ్రత్త. సహదేవునికి ఆకలి తెలియదు. అన్నం తినమంటే తినే బుద్ధిమంతుడు. వాళ్ళను నీవే జాగ్రత్తగా చూసుకోవాలని" చెప్పి, పమిటచెంగు నోటికడ్డం పెట్టుకుని, లోలోపల కుమిలిపోయిందత్తయ్య. అక్క గూడా "అలాగే"నని చెప్పలేక, వలవల ఏడ్చేసింది." ఇది విన్న వారందరు, ఉద్ధవునితో కలిసి "భగవంతుడా, ఎందులకీ కష్టం. వాళ్ళేం పాపం చేసారని" దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు.

"మరి, ఇప్పటి వాళ్ళ పరిస్థితి......!" ఆ దారుణ దుఃఖాన్ని ఆపుకోలేక దేవకి అడిగింది.

"అమ్మా! అన్నయ్య తోడు వుండగా, ఎవరికీ ఏ బాధ, భయము లేదు. వుండదు కూడా! అన్నయ్య అనుగ్రహంతో సూర్యదేవుడు కరుణించి, వారికి అక్షయపాత్ర నిచ్చాడు. దాంతో రాజభోగాలు, హంసతూలికా తల్పాలు లేకపోవచ్చును కానీ, వేదగోష్టులు, బ్రాహ్మణ సమారాధనలతో బాగానే వున్నారు.

"అవునవును. వారి సద్గోష్ఠులకు, సంతర్పణలకు - పులులు, సింహాలు, శరభ శార్దూలాది మృగాలు కూడా వస్తున్నాయి. ఎందుకంటే వారికాహారం వీళ్ళే కాబట్టి." ఇందులో ఎత్తిపొడుపు వుంది. చెప్పుకోలేని బాధ వుంది.

ఈ పరిస్థితినర్థం చేసుకున్న కృష్ణుడు "అమ్మా! నేను వెళ్ళి, అన్నీ చూసి, ఏం చెయ్యాలో అది చేసి వస్తానని తల్లికి చెప్పాడు. సాత్యకి, కృతవర్మలను ప్రయాణానికి తగు ఏర్పాట్లు చేయమని కోరాడు.

వడివడిగా కామ్యకవనానికి చేరుకున్నారు.

ఆనాడే కాంపిల్యం నుండి శిఖండీ, దృష్టద్యుమ్నులు తగు సేనా పరివారంతో వచ్చారు. కుమార ఘటోత్కచుడు కూడా వచ్చాడు. అలాగే - ధర్మజ, భీమ, నకుల, సహదేవుల, మామగార్లు కూడా వచ్చారు. చూడటానికి వీళ్ళందరు కూడబలుక్కుని వచ్చినట్లుంది.

అందరిని చూసిన వాసుదేవుడు, ఓదార్చాడు. జరిగిన దానికెంతో బాధ పడ్డాడు. తానక్కడ వుంటే, ఈ పరిస్థితి జరిగేది కాదు అన్నాడు. ఆ వెంటనే దృష్టద్యుమ్నుడు

"అన్నగా, మేము చెయ్యలేని మహోపకారాన్ని చేసావు. ఆమె మానాన్ని కాపాడావు. మాయచేసి పొందినవారి సిరిసంపదలకన్నా ఇప్పుడు పోయిన పరువు ప్రతిష్ఠలను తిరిగి పొందడానికి ఏం చెయ్యాలో... ఆజ్ఞాపిస్తే...!" ఆవేశపడి పోతున్నాడు.

ధర్మరాజును చూడవచ్చిన వారందరు యుద్ధానికి సిద్ధమే. కానీ, ఇచ్చిన మాటకిది తగదు. అయినా వాళ్ళ వాళ్ళ కోపాల్ని వాళ్ళు ప్రకటిస్తూంటే, ఆవేశం పట్టలేని భీమ కుమారుడు -

"మామా! వూ" అను. ఆ దుర్మార్గులను తెచ్చి ముందు మీ పాదాల వద్ద పడేస్తాను. ఆ తదుపరి చిత్రవధ - చిత్రమైన వధ గావిస్తాను. నా తల్లిదండ్రులకు చేసిన అవమానానికి తగు ప్రతీకారం తీర్చుకుంటానన్నాడు.

అందరి మాటల్ని విన్న వాసుదేవుడు "సార్వభౌమా! మీ ఆజ్ఞే ఆలస్యం. ఇక్కడ నుండి.... ఇప్పుడే బయలుదేరి కార్యం సానుకూలం చేసుకుని వస్తాము. ధర్మ ప్రతిష్టాపన గావిస్తా"మన్నాడు.

"గోవిందా! నీ ఘనత, సమర్థత తెలియనిది కాదు. మాటకు కట్టుబడి, అడవులకు వచ్చాము. మన మాటకు మనమే విలువనివ్వకపోతే, వాళ్ళకు, మనకు తేడా ఏముంటుంది ? ప్రతిజ్ఞా భంగము తగునా ? ఆలోచించు సర్వ సమర్థనీయ మంటే.... ముందుకు కదలండి. నాకభ్యంతరమే మాత్రం వుండదని చెప్పాడు.

అదివిన్న దుష్టద్యుమ్నుడు "ఇది మీ పగ, ప్రతికారేచ్ఛ కాదు. మా ఆడబడుచుకు, బావలకు, ఆ దురాత్ములు చేసిన ఘోరకిరాతకం. దీనిని వుపేక్షిస్తే దీనిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకుని,... !"

"దృష్టద్యుమ్నా... కాస్త శాంతించు. మామాట నిలబెట్టు. లేకపోతే, మాతోపాటు మిమ్మల్ని కూడా ఈ లోకం ఆడితప్పినవారని నిందిస్తుంది. అది మనం భరించగలమా ?" లాలించాడు. నిజమైన శాంతస్వరూపునిగా, శాంతి వాతావరణాన్ని సృష్టించాడు.

ఒక్కొక్కరు, వారి వారి పద్ధతులలో వూరడిస్తున్నారు. తమ సహాయ మెల్లప్పుడు మీకు సిద్ధమని సూచించారు. ఒకటి, రెండు దినాలు గడిచాయి. కొద్దిగా ఆవేశం చల్లబడింది. వాసుదేవుడు అన్నదమ్ములనందర్నీ కలుసుకున్నాడు. ఓదార్చాడు. తగు

విధముగా బుజ్జగించాడు. చివరిగా ద్రౌపదిని కలిసాడు! "అన్నా" అని బావురుమందా పిల్ల. అన్నగా వూరడించాడు.... నేను, నా పరిస్థితి... నీవు లేకుంటే, తలచుకుంటే...! గుడ్లనీరు కక్కుకుంటూ రోదించింది. "అమ్మా! వూరుకో. ఈ అన్న వుండగా నిన్నెవరు ఏమీ చెయ్యలేరు. ఇవన్నీ తాత్కాలికం. తప్పక నీ మనస్సు వూరట చెందుతుంది. శాంతి నొందుతావు. అంతగా తట్టుకోలేకపోతే "అన్నా!" అను, ఆ క్షణంలో నీ చెంత వాలుతాను" అనునయించాడు.

ద్వారకలో నీవు. వనముల మేము. మా పిలుపు! అనగా

"చెల్లీ! అందరు నన్ను "వాసుదేవు"డంటారు. అవునా ? "వాసుదేవుడంటే" అంతట వశించేవాడు. అవునా ? కనుక, నన్ను నమ్మమంటాడు. ఊరడిస్తాడు. ధైర్యమొసగుతాడు.

# కృష్ణప్రేమ

**ఇ**వన్నీ గ్రహిస్తున్న నారదునికి వున్నట్టుడి ఒక పెద్ద అనుమానమొచ్చింది. అసలు అనుమానం రాకూడదు. వస్తే అది దాచుకోకూడదు. వెనువెంటనే తీర్చుకోవాలి. అదులో భాగంగా - నారదుడు - "అవును. స్వామి నరకాసురుని వధించాడు. ఆతని చెఱలోవున్న పదహారువేల వందమందిని విడుదల చేసాడు. చివరకు వారిని వివాహం చేసుకున్నాడు. ఇదంతా బాగానే వుంది.

విశ్వకర్మను పిలిపించాడు. సముద్రుని అదిలించో, బెదిరించో, స్థలం సంపాదించాడు. వాళ్ళందరికి వాళ్ల వాళ్ళ స్థాయిని బట్టి, ఒకరితో ప్రమేయం లేని విధంగా నివాసాలు ఏర్పాటు చేసాడు. సంతోషం. ఇప్పుడింత మందిని, ఆయన ప్రేమగా చూసుకుంటున్నాడా ?

ఇదో సమస్య. దీనికి పరిష్కారం కావాలి. ఎలాగ ? ఎలాగంటే, ఎలాగ ? ఏముంది ? కష్టమో, నిష్ఠూరమో.... ఒక్కొక్క ఇంటికే వెళ్ళడం, వాళ్ళ కష్టసుఖాలు తెలుసుకోవడం. ఆ తదుపరి వాసుదేవుడనే - వసుదేవసుతుని భరతం పట్టడం.... అస్తు... అనుకున్నాడు. అన్వేషణకు - బయలుదేరాడు. కృష్ణతత్వం - నారదునికి

తెలియనిది కాదు. అయినా - సంశయం, సందేహం. ఇది తెలుసుకోవాలి. తేల్చుకోవాలి. అప్పుడు కాని... నా మనసు కుదుట పడదనుకున్నాడు. ఇదొక కృష్ణలీల!

చిన్ననాడు బృందావన సీమలలో కృష్ణుడు విహరించడం, కుమారుడైన బ్రహ్మ, తండ్రి మానవుడిగా పుట్టాడు కాబట్టి, ఆయన మహాత్మ్యం తెలుసుకోవాలనుకుని గోవులను, మాగాయవేళ్ళకు పెట్టుకుని చల్దులనారగిస్తూ, ఆ మాగాయవేళ్ళను చప్పరించే గోపాకులను, హఠాత్తుగా మాయం చెయ్యడం జరిగింది.

విషయం తెలుసుకున్న - ఆ"నంద"బాలుడు తానే, గో - గోపబాలురు, వత్సములయి, ఎవ్వరికీ ఏ అనుమానం, రాకుండా సం॥ర కాలం గడపటం తనకు తెలుసు. అవును... అప్పుడు, మా నాన్న బ్రహ్మ, కృష్ణుడెలాగ వున్నాడని, భూలోకానికి తొంగిచూసి ఏ అలజడి లేకపోవడంతో, తాను గుహలో దాచిన గో-వత్సముల, బాలురను - అక్కడా ఇక్కడా చూసి ఆశ్చర్యపోవడం జరిగింది. ఈ సంగతి నారదునికి తెలుసు.

ఇది జరిగింది - కృష్ణుడు - బాలకృష్ణుడిగా వున్న రోజులలోనే! ఇప్పుడో... లోకారాధ్యుడు. అయినా తన విషయంలో, ఎలాగ వుంటాడో... తెలుసుకోవాలని తన - మన - స్వ పర భేదాలు తెలియని - కృష్ణుని పరీక్షించడానికే బ్రహ్మ మానసపుత్రుడు బయలుదేరాడు. కృష్ణతత్వం పూర్తిగా తెలిసినా, అవన్ని వందలలోనే. ఇప్పుడో వేలల్లో.... వున్నాయి. మరి ఆ వాసుదేవుడు అంతట తన చమత్కారాన్ని చూపిస్తున్నాడా ? ఇది ప్రస్తుతానికి - తాత్కాలికంగా తన కోసమే అయినా, ఆ లీలావిలాసం - విశ్వానిది, విశ్వానికి! కృష్ణ తత్వానికి! మనకి!

ద్వారకలో దిగాడు. పదహారువేల వందమంది రాణుల సౌధాలను చూసాడు. మహాద్భుత నిర్మాణం. అపురూప శోభలు - శిల్పకళా సదృశాలు. అన్నీ బయట నిల్చుని చూస్తున్నాడు. చందనాగరు ధూపాల సుగంధ వాసనలు దశదిశల వెదజల్లు తున్నాయి. ఆ ధూపవాసనలు ఆఘ్రాణిస్తూ - ఆనందపరవశుడౌతున్న - ఆ నారదుడు, తన వీణ మహతిని మీటుకుంటూ "నారాయణ" అని ఒక భవనంలో అడుగు పెట్టాడు.

కృష్ణుడు విలాసంగా కనకపు సింహాసనమున కూర్చుని వున్నాడు. పూర్ణ చంద్రబింబమువంటి యువతి, వింజామర వీస్తుంటే, ముంగురులు గాలికి

అల్లల్లాడుతుంటే, వచ్చిన నారదుని చూసి "మహర్షి! దయచేయండి!" సాదరంగా ఆహ్వానించాడు. అర్ఘ్యపాద్యముల అర్చించాడు. "మహర్షి" తమరు వచ్చిన కార్యమడుగుతున్నాడు.

"దుష్ట శిక్షకుడైన నీ దర్శనంతో తరిద్దామని... !" అప్పటికా సమాధానం చెప్పుకున్నాడు.

అక్కడనుండి మరో ఇంటికి వెళ్ళాడు! అక్కడ ఉద్ధవునితో, ఆలోచనం చేస్తూన్న కృష్ణుని చూసాడు. మహర్షిని చూస్తునే, కృష్ణుడు లేచి "దేవర్షులకు స్వాగతం, సుస్వాగత"మన్నాడు. కృష్ణ మర్యాదలు స్వీకరించిన, నారదుడు - మరో భవనంలో అడుగుపెట్టాడు. "నారాయణ" అనగానే - రత్నకంబళిపై భార్యతో కూర్చుని, పిల్లల్ని ఆడిస్తున్న ఆ దేవుడు, ఈయనను చూడగానే తటాలున లేచి అర్ఘ్య పాద్యాదుల పూజించాడు - ఆ మహర్షికి సలుపవలసిన మర్యాదలన్నీ జరిపించాడు.

అక్కడనుండి - ఇంకో ఇంటికి వెళ్ళాడు. అక్కడ పరిజనానికి తగు పనులను పురమాయిస్తూ హడావుడిగా వున్నాడు.

ఇంకోచోట సంధ్యావందనం చేస్తూ - మరొకచోట, ముద్దుగుమ్మతో ముచ్చట్లు ఆడుతున్నాడు. అటు చూస్తే ఉద్యానవనంలో, ఇటు చూస్తే... పురాణ కాలక్షేపం. ఎటు చూసినా తానై, ఆ పదహారువేల వందమంది ఇండ్లలో, ప్రతి భార్యతో, అనురాగమూర్తియై - ఆ లీలామానుష విగ్రహుడు జరిపే చమత్కారాలకు - నారదుడు... "కృష్ణా... లీలా మానుష విగ్రహా! పరంధామా, పరాత్పరా! సర్వాత్మకా, భద్రాత్మకా! సర్వాంతర్యామి" అని వందన శతాలర్పించి, ఆ కృష్ణమాయ నర్థం చేసుకోలేక -"వాసుదేవా!" అని చతికిలబడినంత పనిచేసాడు.

"దేవదేవా! నీవు మహామాయవు. నిన్ను తెలుసుకోవడం నీకు తప్ప, అన్యులకు సాధ్యం కాదనుకుని మహతి మీటుకుంటూ, మిత్రవింద మందిరంలోకి అడుగుపెడుతూంటే, భార్యాసహితుడై ఎదురొచ్చిన వాసుదేవుని చూసి "అమ్మా! ఈ ప్రభువు ఇక్కడికి వచ్చి ఎంతసేపయిందని అడుగుతాడు.

అలాగడుగుతారేమిటి స్వామీ! నా దేవుడు రాత్రి నుండి ఇక్కడే, నా చెంతనే వున్నాడు, "ఊ" అంది.

అప్పటికి సంపూర్ణ జ్ఞానోదయమయిన నారద మహర్షి "జగన్నాథా! నువ్వు నిజంగా వాసుదేవుడవు. నీవు వసించనిచోటు, మనసు, జీవి - ఈ లోకంలో వుండరని" "నారాయణ నీలీల తెలియగ తరమా! నీవు లేని ఈ జగము కానగ గలమా ?" అని పరవశించుకుని, పాడుకుంటూ - వెడుతుంటే అమాయకంగా మిత్రవింద "నాధా!" అంది. కృష్ణుడు తన సహజ చిరునవ్వులు చిందిస్తూ " -

ఆ మహనీయుని భక్తి పారవశ్యాన్ని ఎవరు తెలుసుకోలేరు. అంతటి పరమ భక్తుడు కాబట్టే, సర్వలోకాల సంచరించగల్గుతున్నాడని "ఆమెకు సత్యం చెప్పాడు. అంతేకాదు, నా వునికిని తెలుసుకోవాలని, పదహారువేల వందమంది ఇండ్లకు వెళ్ళాడు. అక్కడ అన్నిచోట్ల నాతో సత్కారముల నొందాడు. ఇక్కడికి వచ్చాడు. ఇక్కడా, నా లీలనుగ్రహించాడు.

అనగా - "రాత్రి నుండి మీరు ఇక్కడే వున్నారు కదా!" అంది. "వున్నాను. ఇక్కడ - అక్కడ - సర్వత్ర వున్నాను. అదీ, నారదుడు గ్రహంచిన పరమ సత్యం. అతడు మహాభక్తుడు. అందుకే ఈ వాసుదేవుని అంతటా దర్శించాడు. మీరు, మీ వద్దనున్న భర్తగానే తలిచారు. మీ దృష్టిలో అలాగే వున్నాను.

నారదుడో... అంతటా "నేను" వున్నానో, లేదోనని వెదుక్కున్నాడు. యద్భావం తద్భవతి - అని - ఆతని మనోభీష్టం ప్రకారం, అంతటా నిలిచి, ఆయనను కరుణించాను. సత్య దర్శనం చేయించాను. నన్ను - "నన్ను"గా తలిస్తే - "నేను" నేనే తప్ప "నేనెవరో" ఎవరికి తెలీదు. అలాగ కాక సర్వాంతర్యామి సర్వాత్మస్వరూపిగా, సర్వవ్యాప్తునిగా తలిస్తే, అలాగే కనుపిస్తాను. అందుకే - "భావనా భావనా గమ్యా, "భవారణ్య కుఠారికా" అనేది. ఇది తెలుసుకున్నవారు ధన్యులు. తెలుసుకునే వారు ప్రపన్నులు. తెలియదలిచే వారు "పిపాసులు."

ఇది వారి వారి బుద్ధి ప్రకాశాన్ని బట్టి వుంటుంది. ధర్మ ప్రకాశం వలన, జ్ఞాన ప్రకాశం. దానివలన ఆత్మ ప్రకాశం. అందుండి - వ్యక్తి - ప్రకాశం. ఆ తదుపరి సమిష్టి ప్రకాశం. ఇది గుర్తించగల్గితే - చిదానందం. తెలుసుకుంటే

సదానందం. తెలుసుకోవాలనుకుంటే పరానందం. ఇతరాలోచనములు లేకపోతే- అదే బ్రహ్మానందం. ఇది ఆ "లలిత" కైనా, ఈ కృష్ణుణికైనా ఒకటే!

ఇది అందిరికి అలభ్యం. దీనికోసం - ప్రతి జీవి సాధనమో - వైరాగ్యమో పొందాలి. ఇదే భగవంతుడు చెప్పే మాట - దానినే "గీత" అంటారు. ఇది మన రాతను బట్టి వుంటుంది. ఇది గ్రహించగల్గడమే మోక్షము.

"మిత్రా! నీకొక సత్యం చెప్పనా ? జీవుడు అస్వతంత్రుడు. స్వతంత్రుడు పరమాత్మ. ఈ జీవాత్మ - పరమాత్మల సంయోగము - మహాద్భుతం. ప్రకృతి- పరమేశ్వరుడు, చూడటానికి విడివిడిగా వుంటారనుకుంటాము. ఇందులో ప్రకృతి కనిపిస్తే, పరమేశ్వరుడు కనుపించడు. కర్రలోని అవ్యక్తాగ్నివలె వుండే పరమేశ్వరుడు అంతటా వున్నాడు. అతడులేని స్థలమే లేదు. దీనినే ప్రహ్లాదుడు "తండ్రీ! ఆ భగవంతుడు - అంటూ, ఆ తండ్రికి-

**"అందుగలడిందు లేడని సందేహంబు వలదు**
**చక్రి సర్వోపగతుండు, ఎందెందు వెదకిచూచిన**
**అందందే కలడు, దానవాగ్రణీ. వింటే!"** - అని చెప్పాడు.

ఇక్కడ చిత్రమేమిటంటే - తాను తండ్రి "అయినా, తాను కుమారుడైనా తారతమ్యం కనబడదు. ఇద్దరు ఒకటే. ఎటొచ్చి - జీవుడు వేరు - దేవుడు వేరు "అనుకుంటేనే, సత్యం బోధపడదు. దేవుడు స్వతంత్రుడెలాగయ్యాడంటావు ? భవబంధరహితుడై నందువల్ల. జీవుడు బంధహితుడై - ఎంతసేపు, సంసారం సంతానం, సుఖదుఃఖాలనబడే వూబిలో పడిపోతున్నాడు.

అది "వూబి" అని తెలిసినవాడు, విముక్తుడు, ముక్తుడౌతున్నాడు. దీనిని తెలుసుకోవాలన్నదే నారదుని ప్రయత్నం. నీకో **ఉదా** : చెబుతున్నాను. ఆకురాలు కాలంలో ఏ చెట్టయినా, మోడు అయిపోతుంది. అలాగని అది మాడిపోయిందా? లేదు. అదే వసంతం వచ్చింది. చిగురుస్తుంది. ఎక్కడనుండి... అంటే... మోడులాగ వున్న కర్ర నుండి. అలాగే జీవులు - జీవితాలు, దేవుడు, లీలలు.

ఆ చిగిర్చింది ఆకులు, అక్కడనుండి పువ్వులు, అందుండి మొగ్గలు, అందులోనుండి పిందెలు, అటు నుండి కాయలు ఆ తర్వాత పండ్లు. కొన్ని

చెట్టునే పండుతున్నాయి. కొన్ని బలవంతంగా కొన్ని కొన్ని పద్ధతుల ద్వారా "పండు" చేస్తారు. అలాగే జీవితం. కొందరు తమంతట తమ భవబంధ భేదనం చేసుకుంటారు. ఇంకొందరు అంటే కొన్ని కొన్ని ప్రయత్నాల ద్వారా, మరికొందరు బలవంతంగా, ఇంకొందరు ఏం చేసినా భవబంధ జలధిని దాటలేరు.

ఈ సంసారం, భవబంధాల నుండి పారిపోమనడం లేదు. ప్రతీదీ సుఖ స్వరూపమే. కాకపోతే అందులోని సుఖాన్ని అర్థం చేసుకుని ఆనందించడంలోనే సత్యముంది. ఇది గ్రహించినవారు ధన్యులు. ఇది అందరికి లభిస్తుందా ? అంటే అది వారి ప్రాప్తం. మనం కృత్రిమంగా, ఏదైనా కాయను పండిద్దామనుకుంటే, అది పండవచ్చును. పండక, కుళ్ళిపోవచ్చును. అలాగే ఈ జీవితం, జీవుడు కర్మబంధం తొలగితేనే తప్ప, జన్మబంధం తెగదు. ఒక్కసారి ఆ బంధనం తెగిన తరువాత, "జ్ఞాని' మరల-ఈ- బంధచక్రానికి బానిస కాడు. "మనుష్యాణాం సహస్ర" మన్నట్లు ఏ ఒకరో తప్ప.

అలాగ ఎవరైనా - తిరిగి బానిసయ్యాడంటే, అతనికి ఇంకా కర్మబంధ శేషం, అనుభవించడానికి వుంది అని తలవాలి. **ఉదా** : జడభరతుడు. కనుక ఓ! మిత్రవిందా!" ఎంతటి జ్ఞానియైనా నారదుడు జ్ఞానాన్వేషణకు నన్నే ఆయుధంగా వాడుకుంటాడు. అంతటా నన్ను దర్శించి, అందులోని బ్రహ్మానందాన్ని తానను భవించి, అనుభవించగల వారలకందివ్వాలనే తాపత్రయమే ఈ ప్రయత్నం తప్ప- నారదుడెన్నడు అజ్ఞాని కాడు. నారదుడే కాదు, నా భక్తుడెవడు, ఎన్నడు అజ్ఞాని కాడు. కాలేడు. కాబోడు కూడా! అన్నాడు.

ఆ దివ్యోపదేశాన్ని, నారదుని అన్వేషణా ఫలితంగా పొందిన మిత్రవింద ఎంతో సంతృప్తిని పొందినట్లు - "స్వామీ! మీకు భార్యనవడంకన్నా, మిమ్మల్ని భర్తగా పొందగలగడం, నిజంగా మా అదృష్టమని" సత్యాన్వేషణంలో తరించినట్లు, ఆ ఇల్లాలు భక్తి వినయాలతో, నమస్కరించింది. పరిపూర్ణ శరణాగతురాలిని కావాలంటే, కొన్ని సిద్ధులు కావాలిట. వాటిని ప్రసాదించరా, స్వామీ! భక్తి - ప్రేమలతో, అడిగిందా ఇల్లాలు.

"మిత్రా! ఇవి ఒక్కరిస్తే వచ్చేవి కావు. దీనికి యోగం తెలియాలి. దీనిని - శ్రీ గురువుల ద్వారానే పొందాలి. అందుకు సేవ, ఆ తదుపరి సాధన కావాలి.

ఇవేమీ లేకుండా యోగసిద్ధులు లభించవు. దీనికి అకుంఠిత దీక్ష, అపార కృషి కావాలి. ఇది శ్రీ గురుకరుణతోనే లభిస్తుంది.

**ప్రతి జీవి "కర్మ"జీవే. ఈ కర్మలు... కొన్ని ఆచరణీయాలు. మరికొన్ని అనుభవనీయాలు. ఆచరణలో అనుభవం లేదా ? అని ప్రశ్నించకు. ఆచరణ అందరూ చేయడం లేదు. ఉదా : తూర్పు సంధ్యన - తొలిచుక్క పొడిచే వేళను లేచి, తన నిత్య - సంధ్యానుష్టాది కార్యక్రమాలను ప్రారంభించాలి. ఎంతమంది చేస్తున్నారు ? అదేమంటే సవాలక్ష కారణాలు చెబుతారు. ఇటువంటి వారి వలన సమాజం భ్రష్టు పడుతుంది.**

*పూజ చేస్తే పుణ్యమొస్తుందా ? అని ప్రశ్నించకు. పుణ్యం కోసం కాదు - మనం చేసే కర్మలు. అవి ధర్మాలుగా నిర్వర్తించాలి. ఆయురారోగ్యాలు పెంపొందడానికీ, ఈ అనుష్ఠాన కార్యక్రమాలను చెయ్యమన్నారు. ఈ సాధన వలన తెలియని ఆత్మశక్తి కలుగుతుంది. దానిని పెంపొందించుకుంటే, ఆ ఈశ్వర సాక్షాత్కారం ముందు తదుపరి - తానే - ఆ ఈశ్వరుడనే తత్వం అర్థమౌతాయి.*

**ఇది విడిచిపెట్టి - ఏదో కొద్దిగా ఆత్మశక్తి లభిస్తే - తానొక దేవుడనని, అద్భుతకలశక్తులు కలవాడినని, మీ కర్మలను పరిహరింప చేస్తానని, శక్తిపాత మిస్తానని, రకరకాల ప్రలోభాలతో, అమాయకులైన మనుష్యులను కొందరు...**

సోమరుపోతులై, పరాన్నంతో బ్రతికేటట్లు డబ్బిచ్చి - ఇతరుల ద్వారా సాధన చేయించుకుని ఫలితం పొందాలని తాపత్రయవాదులు, డబ్బుకోసం, అడ్డమైన గడ్డితినే ఆచారవాదులు - ఈ లోకానికి - భ్రష్టమార్గ సూచికలు - భ్రష్టులే.

చేయవలసిన ధర్మాలను నిర్వర్తించకుండా కర్మమనో, దుష్కర్మయనో... రకరకాల పేర్లును పెట్టి, వాటిని డబ్బుతో పరిహరింప చేసుకోవాలనుకోవడం సాధన కాదు."పేరాశ - దురాశలు". వీళ్ళు తరించడమంటే, బురదగుంటలో సీసాలకొద్ది పన్నీరు-సుగంధ ద్రవ్యాలను పోసి, ఫలితం పొందాలనుకోవడం వంటిదే.

అన్నానని కాదు - కాని, వీళ్ళు తరతరాలుగా దుష్కర్మలకు బందీలవుతారే తప్ప, తరించడమన్న మాట, వీరివద్ద పుట్టదు - పెరగదు - చెల్లదు. ఆ కాలిపోయే కర్మజీవులనే దేవుడు కరుణించడు. కాకపోతే కొందరు గురువులు ఉద్ధరిస్తామని,

ఉద్ధరణ కార్యక్రమాలను చేపడతారు. అది - ఆ గురువుల స్వార్థం కోసం, వారి అవసరాల నిమిత్తం "మాత్రమే" అవుతుందని గ్రహించాలి.

అలాగని గురువులను నిందించరాదు. అందరు స్వార్థపరులు కారు. కొందరు మంచివారు వుంటారు. వీళ్ళను కూడా ఆ స్వార్థపరుల గాటిలోకట్టి, దుర్మార్గులనడం చాలా తప్పు. డబ్బుకోసం బ్రతికే గురువులకు సంచులతో ధనమిచ్చేవారు, నిస్వార్థంగా బ్రతికేవారివల్ల ఫలితం పొందుతూనే, నిలువనీడ లేకుండా చేస్తారు. ఈ పాపం ఒట్టినే పోదు. మన నిప్పే కదా అని పొట్లం కట్టి జేబులో భద్రంగా పెట్టుకుంటే ఎలాగ కాలుస్తుందో, అలాగే ఆచారవంతులను అవహేళన చేసిన, నిజగురువులను వంచించి ధూర్త - మోస - గురువులను అందలమెక్కించినా, దరి - దారి లేకుండా - ధర్మ - కర్మభ్రష్టులౌతారు.

ఇంకో విషయం తెలుసా ?

మనం కొందరిని కారణజన్ములంటాము. కొందరు కాదు, అందరు కారణజన్ములే. కారణం లేని జన్మలు - కర్మలు వుండవు. కర్మకొద్ది జన్మ - జన్మ బట్టి - కర్మ, దేవుడు - జీవుడు వలె అవినాభావ సంబంధం కల్గి వుంటాయి. కనుక మనం మనం ఎత్తిన జన్మలను సార్థకం చేసుకోవాలి.

*దీనికి ముందుగా తల్లి-దండ్రులు, ఆ తదుపరి గురువు అనుగ్రహం కావాలి. ఇది ఫలిస్తే, బ్రహ్మజ్ఞానం కల్గుతుంది. అప్పుడు బ్రహ్మ సాక్షాత్కారం. చివరకు తానే - బ్రహ్మమనే - బ్రాహ్మీభూత స్థితికి రావడం జరుగుతుంది.*

*ఇవన్నీ అనుగ్రహం వలన లభించేది. ఈ అనుగ్రహం కొనుక్కుంటే వచ్చేది కాదు. అది వచ్చేది - సేవల ఫలితం వలన, తల్లిదండ్రులకు సేవ చెయ్యనివాడు, గురువును గౌరవించని వాడు, ధనంతో లోకాన్ని శాసించగలననుకునేవాడు పరమ మూర్ఖుడు కాదు - "భ్రష్టుడు". వీడివలన ఈ వ్యవస్థే చిన్నాభిన్నమవుతుంది. అలాగ కాకుండా చూడటానికే సత్కర్మలు, అనుష్ఠానాది ఆచార వ్యవహారాలు అనుకుంటే, అమ్మ, అమ్మమ్మ, తాతమ్మ, తాత చెప్పేవి "హుష్" కాకి అయితే, నీ బ్రతుకు చీకాకు. కాబట్టి - "బహుపరాక్" అనే ధర్మాన్ని ఆశ్రయిస్తే తరిస్తావు. లేదో.... ఎందుకు కొరగాకుండా పోతావు" -*

అలాగ చేసుకోవాలంటే - "ముందు మన ఆచార సాంప్రదాయాలు, ధర్మ కర్మలు - తెలుసుకోవాలి. వాటిని అనుష్టించాలి. నిప్పు - నీళ్ళు - ఆహారం వున్నాయి. అవి కలిస్తే ఆహారమవుతుంది. ఎలా కలుస్తుంది. అంటే వాటిని మనం కలపాలి. ఇవేమీ లేకుండా కందమూలాదులు తింటామంటారు. మంచిదే. ఎలాగ తింటారు.

దానికైనా అన్వేషణ తప్పదు. భూమిలో వున్న దుంపలు. చెట్టునున్న పండ్లు - కర్ర - పలుగు - పళ్ళెం లేదా - ఆకు, ప్రక్క, ప్రక్కన వుంటాయి. తినాలనుకునే వాడిక్కడ. తినే పదార్థాలక్కడ ఎలాగ లభిస్తాయి. దీనికి ప్రయత్నం చెయ్యాలి. కొందరు ప్రయత్నం చేసినా ఫలితం లభించదు. ఇవన్నీ కర్మానుగతాలు. జీవప్రారబ్దాలు. వీటిని తెలిపేవారు - శ్రీ గురువులు. ప్రతి సమస్యకు - పరిష్కారముంటుంది. ఆ పరిష్కారాన్నాధారం చేసుకుని సమస్య వుంటుంది. కాబట్టి -

*ఆనాడు తన అదృష్టంగా ముందు నారదమహర్షికి తదుపరి - తన స్వామికి- మిత్రవింద - వందన శతాలర్పించింది. "నిజం. ఎంతటి చీకటయినా, ఒక వత్తి వెలుగు వలన పటాపంచలవు తుంది. అలాగే అజ్ఞానం కూడా, ఒక సద్బుద్ధి సహవాసం వలన తొలగిపోతుంది. ఈ వెలుగు క్షణికం కాకుండా, నిరంతరం వెలగాలంటే, జ్ఞానాభివృద్ధికి, తద్వారా జ్ఞానాన్వేషణకు ముందడుగు వెయ్యాలి.*

దీనిని ప్రసాదించగలవారు. ముందు - తల్లి - అందుకే - "మాతృదేవోభవ" అనేది. ఇది మనుశృతి చెప్పి. ఆ తదుపరి! "పితృదేవోభవ" అంది.

ఈతడు - జీవన - జ్ఞానప్రదాత. ఆ తదుపరి - గురువు - "ఆచార్య దేవోభవ" ఈ ప్రభువు - భుక్తిముక్తి ప్రదాత - చివరగా - "అతిథి దేవోభవ" ఈతడు - "భక్తి"మార్గ ప్రదాత.

వీరల సహవాసం. స్వర్గాన్ని మించిన సుఖాలను ప్రసాదించడమే గాదు. అతను వున్న ప్రతి ప్రదేశము "భూలోకవైకుంఠ"మవుతుంది.

*వీటిని త్రికరణశుద్ధిగా ఆచరించి, అమలుపర్చినవారు - ఈ "విశ్వానికి మిత్రు"లు. ఆ విశాలాక్షునికి సాక్షులు. లోక ధర్మ - కర్మ - దివ్యజ్ఞాన మార్గ హేతువులు. అప్పుడు "దేవుడు" అని ప్రత్యేకంగా ఎక్కడో వుండడు. మన ఎదుటనే మనలో, మనతో వుంటాడు.*

మన కోసం పరిశ్రమిస్తాడు. అందుకే - భక్తజనదాసానుదాసుడనని, ఆ పరమాత్మ తనను - పదే పదే చెప్పుకునేది. గజేంద్రమోక్షం చూడు. వామనావతారం చూడు. అంతెందుకు నా పూర్వ విభూతులైన - కంస, చాణూరాదుల వధ, కాళియ మర్దనం. కుచేల సంరక్షణం, మీకు అనుగ్రహణం. ఇవన్నీ - ఈశ్వర కల్పిత లీలలు- నిస్వార్థ సేవలు. ఇవి తరించడానికే కాదు, "దరి... దారి" చూపడానికి కూడా మార్గదర్శకా లన్నాడు, యోగీశ్వరీశ్వరుడౌ- శ్రీకృష్ణ - వాసుదేవ - ప్రభువు.

''''''''''

# ధన్యులయ్యా!

**అ**మోఘమైనదీ "కృష్ణ"చరిత్ర - "కృష్ణ" అనగానే సర్వబంధములు తొలగి, భక్తజన బాంధవుడైన ఆ పరమాత్ముని సన్నిధిని అనాయాసంగా పొందగల్గుతాడు. భక్తజన దాసానుదాసుడననే దివ్యతత్వానికే "కృష్ణ" శబ్దం ప్రతీక.

అటువంటి దివ్యచరిత్రను, మన అదృష్టం కొద్దీ గ్రహించి, గ్రోలగల్గు తున్నాము. కృష్ణుడే లేకపోతే మనము లేము. మన చరిత్రములు లేవని... నిష్కల్మష భక్తి భావంతో, అర్జునుడు ప్రకటించాడు. "నిజమని, ఆ పాండునందను లందరు కృతజ్ఞతాభి వందనము లర్పించారు. ఇలాగ వుండగా - కాలప్రభావంగా, కృష్ణుడు, తన ప్రియ అర్జునుని, పరాక్రమ విశేషాలను చూడాలని కామ్యకవనానికి బయలుదేరుతుంటే, అన్నిట అడుగు ముందు పెట్టే సత్య, నేను వస్తాను...అంటూ వెంటబడేది.

శ్రీకృష్ణచరిత్రకు, అష్టభార్యలలో ఒకత్తయిన సత్యభామకు ఎంతో సంబంధ- అనుబంధాలున్నాయి. అందరిలోలేని విశిష్టత ఈమె స్వంతం. అల్లరి - కోపం - పెంకితనం, మొండితనం, పట్టుదల - పరాక్రమం... ఒక్కటేమిటి... అన్నీ ఈమె విశిష్టతలే. అయినా కృష్ణుడామె అభిమానిగా, ఆమె నెన్నడు కాదనడు.

ఎంతమంది భార్యలున్నా - తన భర్త తనకే స్వంతమన్నట్లు ప్రవర్తించే వింత మనస్తత్వ మామెది. అందుకు - అదే ఆ భర్తను తన కొంగును కట్టుకునేందుకు దేనికయినా సిద్ధం. ఈ బుద్ధి మార్చాలనే గోపాలుడు, నారదునితో కల్సి ఆడిన "పుణ్యకవ్రత"మనే నాటకం. దీని ద్వారా "సత్య" నిజంగా సత్యాన్ని

గ్రహించి, ధన్యురాలయింది. అయినా నా భర్త... నా స్వంతమనే దృష్టి పూర్తిగా తగ్గలేదు. ఇంకా కొద్దిగా వుంది.

అయినా, అయిదుగురు భర్తల భార్య ద్రౌపదిని దర్శించి, ఆమె నుండి భర్త వశీకరణ కిటుకులు తెలుసుకోవాలనే వుద్దేశంతో - భర్తతోపాటు "నేనూ వస్తానని" కృష్ణుని వెంబడించింది. సత్యను శ్రీకృష్ణుడు అనుసరించాడు. ఇది భార్యాభర్తల బంధం. కాదనడ ధర్మం కాదు.

భర్తతో కలిసి కామ్యకవనానికి వచ్చిన సత్యను అందరు అభిమానించారు. ద్రౌపది మరువలేని ప్రేమాభిమానములను పంచి ఇచ్చింది. ఆ సాదర స్వాగతానికి, సత్య మురిసింది. ఉభయకుశలోపరి తదుపరి - కృష్ణభగవానుడు.

"బావా! యుధిష్టర సార్వభౌమా, ఏమయినా నీవు అదృష్టవంతుడివని" అభినందించాడు. నీ ధర్మమే నిన్ను రక్షించిందని, పార్థునకు విజయం ప్రసాదించిందని, ప్రశంసించాడు. భవిష్యత్తు మీకు శుభ స్వరూపంగా గోచరిస్తుంది. అనకూడదు కానీ, ఈ అరణ్యావాసం మీకు, "ధర్మమూర్తు"లను పేరును సార్థకం చేసింది. ధర్మార్థ కామ్యమోక్షాల నిజస్వరూపాన్ని రుచి చూపింది.

కష్టాలు మీకు వ్యక్తిగతంగా, క్రొత్త కాకపోవచ్చును. సంసారంతో, భార్యలు, సంతానంతో, కలిసి వుండవలసి మీరు అన్ని విడిచినట్లు వైర్యాగ జీవితమొందడం, నూతన జీవిత శుభారంభానికి తార్కాణం. ఇప్పుడే - ఎవరెవరో తెలుస్తుంది. కష్టాలు అనుభవించడానికి, అందరి పేరుతో ద్రౌపది కారకురాలయింది. మిగిలినవారు, సుఖస్వరూపులై, తమ బ్రతుకులు తాము దిద్దుకుంటున్నారు. చిత్రంగా లేదూ! ఇదే సంసారమంటే, జీవితాలంటే....!

అదిసరే. కారణమేదైనా - అర్జునుడు భవిష్యద్భాగ్య ప్రదాతయ్యాడు. భీముడు సరేసరి, అడ్డమొచ్చిన యక్ష, రాక్షసాదులను హతమార్చి, తన శక్తికి పదును పెట్టుకుంటే, ఈ పాండవ మధ్యముడు, శివుని మెప్పించడం, పాశుపతాస్త్రాన్ని సంపాదించడమొక ఎత్తు.

ఇంద్రలోకానికి వెళ్ళి, మహేంద్రుని ఆదరణను పొంది, అనుకోకుండా ఊర్వశిని తృణీకరించి, అవసరార్థ వరం పొందడం మరొక ఎత్తు. నివాతకచులను

హరించడం. యమ, వరుణ, కుబేరాది - అష్టదిక్పాలుర ఆదరంతోపాటు వారి అస్త్ర శస్త్ర విద్యలను అందుకోగల్గడం చెప్పుకోగల్గిన ఘనత.

ఇక - ఈ భీముడయితే, కారణం సౌగంధికమైనా పురాణ పురుషుడు, మహాభక్తుడైన శ్రీరామదూత "ఆంజనేయుని" కలుసుకోవడం, మిమ్ము సదా రక్షిస్తాననే అభయాన్ని... ఆ వాయు వర ప్రసాదుడు, హనుమంతుని నుండి పొందడం... ఇవన్నీ చూస్తుంటే -

వీటికి మూలపురుషుడవు, ముఖ్య కర్తవు నీవు. అదే జూదమాడి, మీరు అడవులు పట్టకపోతే, సుఖభోగలాలసులై పొరపాటున, ఏ అర్ధరాత్రో శతృవులు, మిన్ను కూలి పడినట్లు, మీదపడితే "కృష్ణా! యదుభూషణా బావా!" అంటూ భజన చెయ్యాల్సి వచ్చేది. ఇప్పుడా భయం లేదు. ప్రతి ఒక్కరు - వీర, శూర, ధీరులయ్యారు. ధర్మము, దాని గతి, కాలము - కాల గతి సర్వమెరిగేరు. సమర్థులయ్యారని" ప్రశంసించాడు.

మొత్తానికి - నీ తండ్రి ఆశయం కారణగా, అది సిద్ధించడంతో, ఆర్యావర్తంలోని రాజలోకం మొత్తం నీకు తోడుగా నిల్చింది. ధైర్యం, ధర్మం ప్రకాశిస్తున్నాయి. విజయలక్ష్మి మిమ్ము తప్పక వరిస్తుంది. మొత్తానికి "ధర్మో రక్షిత రక్షతి" నీ ఎడ సార్థకమయింది. నిజమైన "ధర్మ" రాజుగా ప్రకాశిస్తున్నావు. "శుభం భూయాత్" అని అభిలషించాడు. మంగళాశాసనం చేశాడు.

ఆ తదుపరి ఒక్కొక్కరిని ఆశ్వాసించ సమకట్టిన వాసుదేవుడు ముందుగా, సహదేవును చేరి మెల్లిగా "చిట్టిబావా! నీ నక్షత్రము లేమంటున్నాయి ?" అని ముద్దుగా అడిగాడు. "రంగంలోకి దిగమంటున్నాయా ? లేక స్వప్రకాశానికి ఇంకా సమయముందంటున్నాయా ?' ఇంకా ముక్కు మూసుకుని తపం చేయాలంటు న్నాయా ?" సర్వజ్ఞుడని తెలిసి చమత్కరిస్తూన్న కృష్ణుడు - ఆ తదుపరి -

భీమార్జున, నకులలను చూసాడు. పేరు పేరునా పలుకరించాడు. వాళ్ళ భవిష్యద్భాగ్యాన్ని ప్రశంసిస్తూ - "శుభ"మని, చేసిన మంగళాశాసనానికి, ధర్మజ్ఞునితో సహా సర్వులు, సంతోషచిత్తులై వాసుదేవునికి, అభినందనీయాలనర్పించారు. అప్పుడు - కృష్ణుడు ద్రౌపదిని చేరి -

"చెల్లీ! భయపడవలదు. అంతా మంగళమే అవుతుంది. శోభిల్లుతావు. ఇది నిజం. నీ పిల్లలు నా వద్దనే వున్నారు. ప్రద్యుమ్నుడు వారిని యుద్ధ విద్యలలో ప్రవీణుల్ని చేస్తున్నాడు. సుభద్రా, రుక్మిణిలు తమ ప్రేమామృతంతో, తల్లి కనబడని లోటును దీరుస్తున్నారు.

"నువ్వు ప్రస్తుతం వీరనారివి. వీరమాతగా విశ్వవిఖ్యాతి నొందుతావు. ద్రౌపదీ! నీ కుమారులు ఉప పాండవులుగా ప్రశస్తి గాంచుతారు. ప్రతి వ్యక్తి మరువలేని రీతిలో నీకు పేరు ప్రతిష్టలను తెస్తారు.

ప్రస్తుతం వారికి యుద్ధశాల. వివిధ శాఖలలో ప్రావీణ్య దృష్టి తప్ప - మరో ఆలోచన లేదు. తన తల్లిదండ్రులకు కల్పించిన అవమానాల భారం నుండి వారిని రక్షించుకోవాలని తలుస్తున్నారు, వారి పరువు నిలపాలని తలపిస్తున్నారు.

వీళ్ళ మాటలు సాగుతున్నాయి.

ఈ తరుణంలో - ఆహ్వానించినట్లు, మార్కండేయ మహర్షి వచ్చారు. కృష్ణుడు, పాండవులు ఆ మహర్షికెదురేగి, స్వాగతమొసగి, అర్ఘ్యపాద్యాదుల - అర్చించారు. మహాపురుషా! తమరి రాక అందరికి ఆనందదాయకం. తమ ముఖతః వెలువడే దివ్య సందేశాన్ని విని తరించాలని, మేమందరం, ఉవ్విళ్ళూరుతున్నామన్నాడు.

ఈ సమయంలో ధర్మనందనుడు, గతాన్ని తలచుకుని బాధపడుతూ "స్వయంకృతమే కానివ్వండి. భగవత్కారుణ కల్గి కూడా, లభించిన అదృష్టాన్ని చేతులారా పోగొట్టుకున్నాను. నావలన ఈ సోదరులు, ఈ మహాదేవీ, కష్టాల పాలవుతున్నారు. సర్వపాపాలు, ద్రోహాలు చేసే, నా పెదతండ్రి కుమారులు, సర్వసుఖాలను పొందుతున్నారు...

ఎప్పటిలాగే - తన ఆవేదనను చెప్పుకుంటున్నాడు.

"ధర్మరాజా! ఇవన్నీ కర్మగతులు. మట్టిలో దొరికే బంగారంతో, అలాగే తీసుకువెళ్ళి నగలు చేయించుకుంటున్నామా, లేదే ?! అలాగే - ఈ జీవితాలు, జీవన బంధాలు - కర్మలు, గతులు. అన్నీ తెలిసిన నీవిలా ఆవేదన పొందడం తగదు. ఇది ఆవేశ - అనర్థాలకు దారి తీస్తోంది.

# తప్పమ్మా...!

**అ**క్కడ వాళ్ళ చర్చ జరుగుతుంది. ఇక్కడ సత్యా - ద్రౌపదిల సమావేశం. "వదినా!" అంది సత్య. "చెప్పమ్మా!" అంది ద్రౌపది. ఆ బంధం, అనుబంధం - అద్వితీయం." "నాకో ధర్మ సందేహముంది" అంటుంది సత్య.

"లోకానికి ధర్మమందించే - ధర్మ పురుషుని గారాల - ముద్దు భార్యకు ధర్మ సందేహమా ?! అడుగవమ్మా, తల్లీ! అడుగు" అంది. అందులో ఎకసెక్కం, అనురాగం, ప్రేమ - ఆప్యాయత.. ఆ వదిన - మరదళ్ళు పరిహాసాలు, ఆనందం కావలసినవన్నీ వున్నాయి.

"నీ భర్తలు - అతి శూరులు, వీరులు, ధర్మమూర్తులు అకలంక చరిత్రులు, మీదు మిక్కిలి ప్రేమమూర్తులు. అవునా ?....

"అవును. ఇందులో సందేహించడానికేముంది ?" ఇది ద్రౌపది ప్రశ్న.

"ఒకరైతే ఫర్వాలేదు. సర్దుకోవచ్చును. ఇది నా అనుమానమే సుమా!" మొదలు పెట్టింది సత్యభామ. వారందరు అరివీర భయంకరులే. అయినా, నీ ఎడల పరమ ప్రసన్నులు. ఇది చోద్యం కాదా! ఏ ఒక్కరు, ఏదో రకంగా నిన్ను నిలదీసినవారు కారు, నిరశించి, నిరాదరించినవారు కానీ లేరు. ఇది, అందరికీ కాదు, ముఖ్యంగా నాకూ ఆశ్చర్యకరము, అసూయాగ్రస్తమయింది. దీనికి కారణమేమిటి ? ఇది మొదటి సందేహము.

రెండోది. ఇందుకుగాను నీవేమైనా పూజలు చేసావా ? వ్రతాలు సలిపావా? మంత్రాలు పఠిస్తున్నావా ? మందులుపయోగిస్తున్నావా ? అసలు కీలక మేమిటి ? ఆ పరమ రహస్యం తెలుసుకోవాలనే ఆకాంక్షే - నా - ఈ - రాకకు మూలకారణం ?

ఇక మూడు - భర్త ఒక్కడు భార్యలనేకులు. ఈ భర్తను కొంగును కట్టుకోవాలంటే సాధ్యపడటం లేదు. ఇక్కడ భార్య ఒక్కత్తే భర్తలు అయిదుగురు. వీళ్ళతో కుదురైన - అనురాగ జీవితమెలాగ సాధ్య.."మని, ముగించింది.

క్షణం గడిచింది. "అయిందా ? అని అడిగింది, ద్రౌపది. తలత్రిప్పి, నీదే ఆలస్యమన్నట్లు సత్య చూస్తుంటే - నిష్కర్షగా -

"అదృష్టవంతురాలివి. ఈ ప్రశ్న నువ్వడిగావు కాబట్టి సరిపోయింది. ఇదే మరొకరైతే - ఏమయ్యేదో నాకే తెలియదు. అయినా.... సత్యభామను సూటిగా చూస్తూ - "వదినా! నీ కంటికి నేను మంత్ర తంత్రాల ప్రయోగాలు చేసే, వశీకరణ శక్తి తెలిసిన దుష్టభార్యలాగ కనబడుతున్నానా ?" సత్య - సమాధానం చెప్పలేక పోయింది. మళ్ళీ - ద్రౌపదే - కల్పించుకుని -

"వదినా! మంత్ర, తంత్రాల వలన ఏ ప్రయోజనం వుండదు. మందులు, మనుషుల్ని - మనసుల్ని పాడుచేస్తాయే తప్ప, భర్త ప్రేమను పొందడానికి సహకరించవు. పొరపాటున, ఈ విషయాలేమైనా, వారికి తెలిస్తే ఆ భార్యతో కాపురం కాదుకదా, మాట్లాడటానికే భయపడతారు. ప్రక్కలో త్రాచుపామున్నట్లు వణికిపోతారు.

ఇవన్నీ సంసారులు చెయ్యాల్సిన పనులు, పద్ధతులు కావు. భర్తను మనం ప్రేమించడం కాదు, వాళ్ళచేత ప్రేమింపబడాలి. అందుకు ధర్మ-కర్మ మార్గం వెదుక్కోవాలే తప్ప, ఇతరత్రా ఎలాగ ప్రవర్తించినా, ఆ బ్రతుకు... బ్రతుకుగాదు. ఆ స్థితి వందనీయం కాదు. మహాభయంకరం.... అంటూంటే...

"అవును. వదినా! ఒకసారి నేను అసూయాగ్రస్తనై నాథునిపై ఆధిపత్యాన్ని సంపాదించాలని తలిస్తే, నన్ను సంస్కరించడానికి, నాథుడు, నారదుని ద్వారా పుణ్యక వ్రతం చేయించారు. ఎనిమిదిమందిలో నేనొకత్తెను. ఆ విషయం మరచి పోయి, ఆధిపత్యం కోరి, అభిజాత్యంతో ప్రవర్తించిన ప్రవర్తనకు, యదుకులమంతా నన్ను తిట్టింది. అగచాట్ల పాలు చేసింది. చేతులారా నా పరువు ప్రతిష్ఠలను, గౌరవాన్ని చేజార్చుకున్నాను.

ఆ తదుపరి అక్క రుక్మిణి కరుణతో నేను సంస్కరింపబడ్డాను. మనిషి నయ్యాను. అయినా మానసిక దౌర్బల్యం - మనుష్యులనిలాగే పట్టి పీడిస్తుందన డానికి, నేను కారణము, నిదర్శనమవుతున్నానని, సత్యభామ - నిజం చెప్పింది.

అంతావిన్న ద్రౌపది - ఇంకా నీవు "వ్రత విధానమే గుర్తుంచుకున్నావు తప్ప, "ఓ! వదినా "సత్యా!" అందులోని సత్యాన్ని మాత్రం గ్రహించలేకపోయావు. నువ్వు ప్రపంచాన్ని కొనగలవు - అంత సంపద నీ వద్ద వుంది. కానీ, ప్రపంచమే తానైన, మా అన్న కృష్ణుని మాత్రం, ధన-దర్పాలతో కొనలేకపోయావు.

డబ్బుకన్న ముఖ్యమైన ప్రేమ - భక్తి - శ్రద్ధా - విశ్వాసాలను పుష్కలంగా కల్గి వున్న రుక్మిణమ్మ - ఆ ఆదిలక్ష్మి. ఆ తల్లి - పధ్నాలుగు లోకాలకు రాణి, తానని నిరూపించింది.

నా అన్నను “వాసుదేవు”డని ఎందుకు అంటున్నారు. వసుదేవుని కుమారుడని కాదు. ఈ భౌతిక బంధాలు, బాంధవ్యాలు - మా అన్నకు సరిపడవు. అతనిని కట్టడి చేయలేవు. ఎందుకంటే, అంతట వున్న వాడు. అన్నింట వున్నవాడు. వసించేవాడు కాబట్టి వాసుదేవుడయ్యాడు.

ఇక రుక్మిణి. తనలో తనను చూసుకోదు. తనలోను, ఇతరులలోను, అందరిలోను - అన్న వాసుదేవుని, వారి పరాభక్తిని - భాగవతోత్తమురాలిగా దర్శిస్తుంది. అందుకే తులలేని సిరులనొసగే తులసిదళంతో అన్నను, నారదునికి స్వంతం కానివ్వకుండా, నీ నుండి తప్పించి, భక్తజనుల కర్పించిన మహాభక్తురాలు. ఇది నీవు గ్రహించలేకపోయావు. చాలా శాంతంగా, ద్రౌపది చెబుతూంది.

“వదినా!” అంటూ, సత్య - ఆ సత్యాన్ని వింటూ ఆశ్చర్యపోతూ.

“అవునమ్మా! భార్యాభర్తలిరువురు ఒక్కటే. రుక్మిణి వేరు - కృష్ణుడు వేరు కాదు. ఇరువురు ఒక్కటే. అలాగే నువ్వు - అన్నయ్య మిగిలిన భార్యలు - అన్నయ్యే. దీనినే సుదర్శనమంటారు. ఇది కలిగినవాళ్ళు అదృష్టవంతులు.

ఇంతా విన్న - “సత్య” ఆశ్చర్యపోతుంది. అందరు మహాత్ములు. మహానుభావులే. తానే మూర్ఖురాలనుకుంది. ఈ క్షణం నుండి - వదినమ్మ ద్రౌపది చెప్పినట్లు - సత్యపథం తెలుసుకుని కృష్ణ పథంలో మహాభక్తితో ముందుకు సాగాలని స్థిరసంకల్పం చేసుకుంది. అస్తు. ఇది అందరికి అవశ్యం. ఆచరణీయం! అదే కృష్ణ చరిత్ర - కృష్ణ లీలామృతపానం, శ్రీకృష్ణ భాగవతం.

ఆ తదుపరి - “వదినా! ఇంతవరకు ధర్మం తెలుసుకున్నావు. ఇప్పుడు - బాధ్యతలు... అవి చేయవలసిన సేవలను అదే విద్యుక్త ధర్మాన్నంటూ తెలుపసాగింది.

“నువ్వు ఏమైనా చెప్పు. నేను వారికి దాసీని. వశవర్తినిని. ఇది వారికెంతో ఆనందాదాయకం. నా భార్య అనుకుంటారే తప్ప - ఇతరత్రా ఆలోచించరు. అనుకోరు. నిన్ను అన్నయ్య ఎప్పుడైనా సత్రాజిత్తీ అనవచ్చును. కానీ నా భర్తలు నన్ను “పాంచాలీ” అని మాత్రం పిలవరు. అందరిలో నేనలాగ కలిసిపోయాను.

నా భర్తలందరికి విడివిడిగా భార్యలు వున్నారు. అయిన నా స్థానం నాది. దానిని పదిలపరచుకున్నాను. నా భర్తలకు నాపై వున్న అనురాగానికి తగ్గట్లు వారి ఎడల సద్ధర్మంగా వుంటాను. శయన, భోజనాదులే సరికాదు. ప్రతి విషయంలోను వారి తదుపరే నేను, నా జీవితం. నాడు నేను పాంచాలరాజు ముద్దుల కూతుర్ని, ఇప్పుడు వీరనారిని, వీరపత్నిని, వీరమాతను కూడా!

అయినా అతిశయం లేదు. అహంకారం రాదు. అది మన పతనానికి దారి చేస్తుంది. ఇది గ్రహిస్తే స్త్రీ జీవితం ధన్యం. ఏ విషయంలోను నా భర్తలపై నాకు, ప్రేమానురాగాలే తప్ప - రాగద్వేషాలకు, అసూయ - పగలకు చోటు లేదు.

ఆదాయ వ్యయాలు చూసుకుంటాను. అనవసర వాదులాటలకు దిగను. వచ్చిన వాళ్ళందరు నా వాళ్ళే. తన - మన - స్వ, పర భేదాలు లేవు. పరాయి వారితోనే కాదు, నా పతులతో కూడా, అనవసర విషయాలలో తలదూర్చను. పరిహాస ప్రసంగాలు చెయ్యను. అసందర్భ సంభాషణలలో పాలుపంచుకోను. నాది కాని విషయంలో ఏ విధంగాను వేలు పెట్టను.

నాకందరు ఒక్కటే. మత్స్యయంత్రం కొట్టి గెల్చుకున్న వీరుడైనా ఒక్కటే. మహాధర్మవేత్త ధర్మజ్ఞుడు, అతి బలశాలి భీముడు, అసమాన తేజోవిలాసులు - నకుల సహదేవులు ఒక్కటే. ఆ అయిదుగురు నాకు పంచేంద్రియాలు. పంచ ప్రాణాలు.

ఆ రోజుల్లో - మహాధర్మవేత్త, ధర్మజ్ఞుని పంక్తిన ఎనిమదివేలమంది తక్కువ గాకుండా బ్రాహ్మణోత్తములు కూర్చుని, బంగరు పళ్ళెరాలలో భోజనం చేసేవారు. వీరితోపాటు పదివేలమంది యతులు కూడా ఆహారం స్వీకరించేవారు. ఎందరు పరిచారకులున్నా, అందరితోపాటు నేను సహధర్మచారిణిగా, నా ధర్మం నిర్వర్తించే దానిని, అది నా బాధ్యతగా తలిచేనే తప్ప, "పీడ"గా ఏనాడు అనుకోలేదు.

ఎవరెవరు ఏ పనులు చెయ్యాలో నిర్ణయించేదాన్ని. అవసరాన్ని బట్టి, అందులో నేను పాలుపంచుకునేదాన్ని. ఆ రోజుల్లో మాకు లక్ష ఏనుగులు, లక్ష గుఱ్ఱాలు వుండేవి. వాటి పోషణభారం నా పర్యవేక్షణలోనే సాగేది, గజపోషకులు, అశ్వశిక్షకులు, ఇతర శిక్షణా సిబ్బంది, నా ఆజ్ఞానువర్తులై ప్రవర్తించారు. ఇది నాకు గర్వం - గర్వకారణం కాదు. నా విద్యుక్త ధర్మ నిర్వహణలో ఒక భాగం. దానిని చెయ్యగలిగాననే సంతృప్తి. ఇదే వదినా, ఏ ఆడదైనా కోరుకునేది.

అన్నీ విన్న సత్యభామ ఆశ్చర్యపోయింది. సిగ్గుతో - తలవంచుకుంది.

"వదినా! నువ్వు అడిగావు కాబట్టి నాకు తెలిసిన మరికొన్ని ధర్మాలు చెబుతున్నాను, వినమంది.

"ఆడదానికి, భర్తకు మించిన దైవం లేదు. అతడెవరైనా సరే, ఆరాధ్య నీయుడు. ఆ భర్తవల్లనే స్త్రీకి శీలము, సౌభాగ్యము, అలంకారాలు, ఆభరణాలు, సంఘంలో గౌరవం కలుగుతాయి. వంశ ప్రతిష్ఠ పెరుగుతుంది.

ఒక అనసూయ, ఒక సుమతి, సావిత్రి, శర్మిష్ఠ వీరలు చూపిన బాట మనకు దివ్యమార్గం. ఆ మార్గంలో నడిచేవారు త్రిమూర్తులు, త్రిమాతలను సైతం నిలువరించి, ధిక్కరించగల్గుతారు.

కృష్ణభగవానుడు, నీ మందిరానికి వస్తున్నాడన్నమాటను వినగల్గడమే మహత్తర అదృష్టం. ఆ క్షణమే, భర్త సేవకు సమాయత్తం కమ్ము. నీ కోపతాపాలు, అసహనం - ఆ సమయంలో పరిచారికల మీద కూడా చూపకు. అది మన మనస్తత్వాన్ని దెబ్బతీస్తుంది. అది తననేమో అనుకుని, ఆ భర్త మనసు విరిగే ప్రమాదముంటుంది.

ప్రేమకు మించిన పెన్నిధి లేదు. భర్తను మించిన దైవం లేదు. భర్త లేడనుకో ఆ స్త్రీ పొందే నిరాదరణమింతా, అంతా కాదు. కన్న సంతానమే కసురుకుంటారు. అదే భర్త వుంటే... ఆ పిల్లలు "అమ్మా! నాన్నగారితో చెప్పి.... నీ కోసం ప్రాకులాడుతారు.

ఎవరితో పడితే వాళ్ళతో స్నేహం పనికిరాదు. మన స్నేహాన్ని బట్టి, మన ప్రవర్తన లోకవిదితమౌతుంది. ఇవన్నీ....."

ఆమె తెలిపిన విషయాలకు సత్యభామ ఎంతో సంతోషించింది. పరిపరి విధాల కృతజ్ఞతలను తెలిపింది. "వదినా! మీ ధర్మమే మిమ్ము తప్పక కాపాడుతుంది. తప్పక మీరు మీ రాజ్యమొంది సర్వశ్రేయములు పొందుతారు. అన్యాయార్జిత భోగభాగ్యముల నొందిన ఆ కౌరవ హీనులు, దుర్యోధనాదులు అచిరకాలంలోనే, తగు శిక్షలననుభవిస్తారు" అని - శ్రీకృష్ణపత్ని "సత్య", శ్రీకృష్ణపత్నిగానే, ఆశ్వాసించింది.

అప్పటికే - "సత్యా!" అంటూ కృష్ణుడు వచ్చాడు. అందరికి వీడ్కోలు తెలిపి, ద్వారకకు బయలుదేరారు.

# దూర్వాసులు

**కా**లచక్రం పరిభ్రమణంలో భాగంగా ఒకనాడు ద్వైతవనంలోని ధర్మరాజాశ్రమానికి, దుర్యోధనుని ప్రేరణతో, అపర శివావతారమనబడే దుర్వాసులవారు, తమ వేయిమంది శిష్యులతో వచ్చారు. అప్పుడు మధ్యాహ్న సమయమయింది.

వచ్చిన మహర్షిని ఆహ్వానించి, సాదర స్వాగతమొసగి, "తప్పక, తమ మధ్యాహ్నికములు పూర్తి చేసుకుని దయ చేయండి. తమకు తమ శిష్యులకు ఆతిధ్యం లభించగలదని'' మనవి చేసాడు.

వాళ్ళ స్నానాలకు, వీళ్ళు ఆహ్నికాలకు వెళ్ళారు. ద్రౌపది తను కూడ భోజనం చేసి, అక్షయపాత్రను శుద్ధిచేసి భద్రపరచింది. విషయం వింది. "భగవాన్! అన్నా! వాసుదేవా! ఆపద.. మహర్షి తన వేయిమంది అనుచరణగణంతో వచ్చారు. ఆహ్నికాలకై వెళ్ళారు. కిం కర్తవ్యం... అని కళ్ళుమూసుకుని మనసులోనే నమస్కరించింది. ప్రార్థన మొదలు పెట్టింది. వాసుదేవుడు, తాను చెప్పినట్లు, ఆమె ఎదుట నిలిచాడు. "భయపడకు సోదరీ!'' అభయమొసగాడు. ముందు నాకు ఆకలి వేస్తుంది కానీ, ఏదైనా పెట్టమని చంటిపిల్లవాడివలె గొడవ.

"ఏ ప్రమాదం నుండి బయటపడదలిచానో, ఆ ప్రమాదం "అన్నా!'' కళ్ళ నుండి నీళ్ళు జలజల కార్చింది. వచ్చిన ప్రమాదం చెప్పింది. ఆపన్న శరణ్యుడివై రక్షించవలసింది పోయి "నీవే! ఆకలి.... అంటే.....!'' గుడ్లనీరు కక్కుకుంటుంది.

"అదేకదా నీ భయం. తప్పక అది తొలగిపోతుంది. పత్రం, పుష్పం, ఫలం, తోయమనే అల్ప సంతోషిని. చూడు. ఆ పాత్రలో... ఎక్కడైనా ఒక మెతుకు వుందేమో చూడు.

"లేదన్నా! ఇప్పుడే కడిగి శుభ్రం చేసాను.'' అంది.

"లేదనకమ్మా! వుంటుంది. ఎంత శుభ్రం చేసినా, నీ భక్తి, భగవంతునికి అన్నం మెతుకవుతుంది. భక్తురాలిని, కరుణించి, కాపాడుతుంది. జాగ్రత్తగా చూడు'' ధైర్యంగా చెబుతున్నాడు. "నీకు చాతకాకపోతే, ఇలాగివ్వు. ఆ మెతుకు నేనే కనుక్కుని, తిని, నీకు, ఆ వచ్చినవారలకు తృప్తి కల్గిస్తానన్నాడు. అక్షయపాత్ర నందుకున్నాడు.

"నేను చెప్పానుగా! ఇదిగో, ఇక్కడో మెతుకు వుందని, దాన్ని నోట్లో వేసుకుని, సర్వలోకాలు తృప్తి - శాంతి పొందును గాక ?'' అన్నాడు. ఆ ముఖంలో అలసట లేని ఆనందం, చెరగని చిరునవ్వుతో "ఇదిగోనమ్మ నీ పాత్ర.... జాగ్రత్త''ని ఆమెకిచ్చాడు.

మధ్యాహ్న ఆహ్నికాలకు వెళ్ళినవారు ఎంతసేపటికి తిరిగి రాలేదు. స్నానం చేసారు. ఆచమనం చేసారు. అనుష్ఠానం పూర్తి చేసుకున్నారు. అలసట, ఆకలి, నీరసం... వాళ్ళను పీల్చుకుతింటున్నాయి.

వున్నట్టుండి, భయంకరమైన త్రేన్పులు. పిండివంటలతో భోజనం చేసిన తృప్తి. విపరీతమైన ఆయాసం. కదలలేని అశక్తత. అడుగు వెయ్యలేక అలాగే చతికిలబడిపోయారు. అమ్మో'' ఇప్పుడు అక్కడికి భోజనానికి వెళ్ళాలా ? కడుపు లుబ్బరించుకుని, గుక్కెడు నీళ్ళు లేదా - రెండు వాము పరకలు తినలేని భుక్తాయాసంతో క్రిందపడి అటు ఇటు దొర్లుతున్నారు.

ఇది శిష్యులబాధ. "ఏమర్రా! మనం అక్కడికి వెళ్ళలేము. ఆకలి లేదు. కడుపులో ఖాళీ లేదు. వెళ్ళి వాళ్ళను అల్లరి పాల్జేస్తే శ్రీకృష్ణ రక్షకులైన వారి కోపానికి బలయిపోవాల్సి వస్తూంది. కొంచెంసేపు, ఇక్కడెక్కడైనా దొర్లి, వాళ్ళ కంటబడకుండా వెళ్ళిపోదాం. మహర్షి - ఆ శిష్య బృందం తమలో తాము చేసుకున్న ఒప్పందమది!

★★★★

విషయం తెలుసుకున్న శకుని - దుర్యోధనులు తలలు పట్టుకున్నారు.

"ఇదేమిటి మామా! ఏది మొదలుపెడితే అదే మొదటికి, మన పీకలకు వస్తుంది. ఇలాగైతే ఎలాగ ? ఆ పాండవుల్ని - "అపాండవం'' చెయ్యలేమా ?'' చింతాక్రాంతుడవడం కాదు, ఏడుపుముఖం పెట్టాడు.

ఏం చేస్తాం. అల్లుడూ! మన విధి వక్రిస్తుంది. వాళ్ళకు వక్రించినట్లు కనబడుతూ, విశేష ఖ్యాతిని అశేష ప్రజాభిమానాన్ని పొందచేస్తుంది. ఇప్పటికి పదకొండు సం॥లు గడిచాయి. ఇంకో సం॥రం గడిస్తే ఆపైన అజ్ఞాతవాసం. అది పూర్తయితే మనం చావడం ఖాయం.

"అంతేనంటావా, మామా!'' అని వుసూరుమన్నారు.

"అంతకంటే మనకు మిగిలేదేముంది ? ఆర్యావర్తంలోని రాజులలో, ఏ పదిమందో తప్ప, అందరు ఆ కృష్ణ పక్షపాతులు. పాండవ వీరాభిమానులు. మొన్ననే తెలిసింది కదా! రాజసూయం చేసినవాళ్ళు సార్వభౌములట. మనం సామంతులమట. వాళ్ళ ఆజ్ఞానువర్తులమై సేవలొనరించిన మనం, నిజంగా సామంతులమేనట.

# గోగ్రహణం....!

**కా**లం గడుస్తోంది.

పాండవులు అజ్ఞాతవాసం చేస్తున్నారు.

వాళ్ళను కనిపెడితే - మరల - అరణ్య - అజ్ఞాతవాసాలు చేయించవచ్చును. అందుకు కౌరవులందరు, కారడవులే కదూ, కొండ కోనలు కూడా పాండు నందనుల కోసం వెదకుతున్నారు.

దేవదత్త శంఖధ్వని.... కురువీరుల గుండెలలో కుంపటి అయింది. ఆ తాళధ్వజం, ఆ దివ్య శంఖారవం. విన్న ద్రోణుడు "జాగ్రత్త" వాదములు చేయకండి. ఏదో ఆవేశంగా చెబుతున్నాడు. అది వినకుండా "హమ్మయ్య" దొరికి పోయాడనుకున్నాడు, దుర్యోధనుడు.

భీష్ముడు చిన్నగా నవ్వి "పాండవులు నీవనుకున్నంత మూర్ఖులు, కాలమాన పరిస్థితి తెలియనివారు కారు. కాల నిర్ణయమునకు లొంగినవారు జ్ఞాత అజ్ఞాతం విడిచిపెట్టడు. అంతేకాని నీకు దొరికిపోయి అడవిలో ఆకులలములు తింటూ, శౌర్యప్రతాపాలు చంపుకుని బ్రతకాలని బయటపడలేదు.

బహుళ సప్తమితో పదమూడవ సం॥ము పూర్తయింది. ఈ రోజు నవమి.... అంటే... ఇంకో మాసం వుంది కదా! అన్నాడు దుర్యోధనుడు. ఈ పదమూడు మాసాల సమయంలో, ప్రతి అయిదేండ్లకు వచ్చే అధికమాసాన్ని మరచిపోయి లెక్కలు గడితే ఇలాగే వుంటుంది. రెండవ సం॥లో అధికమాసం వచ్చింది. అధిక-క్షయాలన్నీ కలిపితే - వారికి విధించామనుకున్న, వారు విధించుకున్న పదమూడు సం॥ల కాలం పూర్తయింది, కాబట్టే అర్జునుడు ధైర్యంగా బయటికి వచ్చాడు.

ఇప్పుడు మనం ఆ లెక్కలు మాని, వున్న లెక్కలు చూసుకోవాలి - అన్నది భీష్మ పితామహుని సూచన. ఇక అక్కడ యుద్ధ వాతావరణం కన్న, వాదనాశరములు ప్రయోగింపబడుతున్నాయి. మనం వచ్చింది గోవుల కోసం కాదు, పాండవులను బయటపెట్టడం కోసం. వారిలో ఒకడు బయటపడ్డాడని సంతోషిస్తూంటే, కాలమాన అధిక క్షయాలన్నీ లెక్కవేసి గడువు తీరిపోయిందంటున్నారు.

ఎలాగో వచ్చాము కదా! విజృంభిద్దామా ? లేక ఆలమందలను విడిచి, గోలచేస్తూ పారిపోదామా! చెప్పండి. అక్కడ కప్పలతక్కెడ వ్యవహారంగా అసందర్భ వాదనలు సాగుతున్నాయి.

అర్జునుడు రానే వచ్చాడు. ధనుష్ఠంకారం చేసాడు. అభయమిచ్చిన ప్రకారం ఆంజనేయుని, కపిధ్వజుని చేసాడు. అసలు విషయం సమసిపోయింది. అశ్వత్థామ-కర్ణులు, తమ తమ పౌరుష ప్రతాపాలను వెక్కిరించుకుంటున్నారు. ధిక్కరించు కుంటున్నారు. ఆ వచ్చేది... "అర్జునుడు" అన్నాడు అశ్వత్థామ.

"అహా... ఆ వచ్చేదో ఆడపిల్ల అనుకున్నాను. "రగడ కాస్తా... చిలికి, చిలికి.. గాలివాన అయింది. చివరకు భీష్మదేవుని శాంతి వచనాలతో ఇరువురు శాంతించారు.

"సంధికి సందర్భం లేదు. యుద్ధానికి సిద్ధం అదే సముచితమన్నాడు దుర్యోధనుడు. అయితే వినండి. అంటూ, సైన్యాన్ని నాల్గు భాగాలుగా చేయండి. నాలుగో భాగముతో రారాజు, ఆతని వెనుక గోగణము వాటికి రక్షణ మరో నాలుగో భాగము. మిగిలిన సేనలతో మనం వెనుక వుండి, వచ్చేవాళ్ళను ఎదుర్కోవాలి. ఇది యుద్ధ రహస్యమన్నారు, ఆచార్య ద్రోణులు.

అడుగు పెడుతూనే ఆ సేనా... విభాజనం, దాని ఆదిమూలాలను అర్జునుడు గ్రహించాడు. రాకుమారా! ఈ సేనతో మనకనవసరం. ఓ ప్రక్కగా ఈ సేన ముందుకు పోనీమ్ము. గోగణమునకు ముందో, ప్రక్కనో రారాజు వుంటాడు. అతన్ని నిలువరిస్తే ఈ మొత్తం సేన విజృంభించడమో - వివాదాస్పదం కాకుండా వెనుదిరగడమో చేస్తుందన్నాడు. అంత తొందరగా దుర్యోధనునికి బుద్ధి రాదు. చావుదెబ్బలు తిన్నా, కొన ప్రాణముంటే... దానితో కూడా... "పగ, పగ" అని చస్తాడు తప్ప ధర్మాన్నెరుగడు. దానిని గౌరవించడు" అంటాడు.

రాకుమారుడు, రథం పరుగెత్తిస్తున్నాడు. బాణ పరంపర ప్రయోగించడానికి అర్జునుడై సన్నధుడై వున్నాడు. ముందుకుసాగి, పశువులను వెనక్కి త్రిప్పి పంపి, ఇప్పుడు పాండవుల ప్రతాపం, మరచిపోయిన దుర్యోధనాదులకు చూపుదామని తన బాణ పరంపరతో, కొందర్ని పలుకరిస్తున్నాడు. కొందర్ని నిలువరిస్తున్నాడు.

ఆతని - వీర - శూర లక్షణాలకు, భక్తి వినయాలకు పెద్దలందరు సంతోషిస్తే, చిన్నలు కృద్ధులయ్యారు. తమ ప్రాణాలకెక్కడ ఎసరు పెడతారోనని తీవ్రంగా భయపడుతున్నారు. పరమ శివ పాశుపతాస్త్ర విజయుని ముందు ప్రతిజ్ఞలు చేసిన వారెవరు నిలువలేకపోతున్నారు. ఇక - ఈ అనవసర యుద్ధానికి ముగింపు చెప్పాలని సమ్మోహనాస్త్రం ప్రయోగించాడు. ఆ దెబ్బకు అందరు తలలు వాల్చారు. అప్పుడు అంతకుముందు ఒక్కొక్కరినే పరిచయం చేసిన అర్జునుడు-

"రాకుమారా! మా పితామహులు భీష్ములవారిని విడిచి, మిగిలిన వారి తలపాగా కుచ్చులు, తొందరగా కత్తిరించుకు, రా! మీ చెల్లెలికిస్తే చాలా సంతోషిస్తుంది. ఆమె కోరిన కోరిక, అదే కదా!'' అన్నాడు. అతడు త్వరత్వరగా వెళ్ళి, తలపాగా కుచ్చులు తెచ్చాడు. సమ్మోహనాస్త్ర ప్రభావం తగ్గుతుంది. నగరానికి తిరుగు ప్రయాణం పట్టారు.

"తండ్రీ! మీరు చేయగరాని మహా తప్పును చేసారు. వీరు పరమపవిత్రులు, మహనీయులు. వీరి దూషణలు కూడా, మనకు ఆశీస్సులే''నని మరొక్కసారి కంకుభట్టారకుని పాదలపైబడి, తామందర్ని క్షమించమని ప్రార్థించాడు.

నిజానికి విజయుడిగా నేను చెప్పబడుతున్నాను. అసలు విజయుడు, నిజమైన "విజయుడు'' మరొకరు వున్నారు. ఆయన శక్తి సామర్థ్యాల దయాధర్మ భిక్ష మనకు విజయాన్ని, సామ్రాజ్యాన్ని మరల అర్పింప చేసాయి'' అని తన కృతజ్ఞతలను, ఆ మహనీయునికి మనసులోనే చెప్పుకున్నాడు. అప్పటికా విషయం సద్దు మణిగింది.

ఆ మరునాడు మహారాజు సభకు వచ్చేసరికి - కంకుభట్టారకులు, విరటుని సింహాసనంపై కూర్చున్నారు. విరటుడు చూసాడు. మహారాజని తెలిసి గూడా లేవకపోయేసరికి "ఏమిటీ విపరీతం ? నేనెవరో తెలుసా ?'' అడిగాడు, విరటుడు.

అప్పుడు ప్రక్కనేవున్న అర్జునుడు - "మహారాజా! మీరు మహారాజు సరే. వారెవరో మీకు తెలుసా ? అన్నాడు. ఇంకెవరు... కంకుభట్టు....

"కాదు. రాజసూయ యజ్ఞంతో సార్వభౌముడై అరివీర భయంకరులైన నల్గురి తమ్ములతో విరాజిల్లే ధర్మమూర్తి "ధర్మరాజు." యుధిష్ఠరుడనే సరికి, ఆ... అని తడబడ్డాడు. తప్పును క్షమించమన్నాడు.

ఎంత విచిత్రం ? తను, రాజసూయ యాగము వరకు ఎంతో సన్నిహితంగా మెల్గిన ఆ మహనీయుని గుర్తుపట్టలేకపోయానా ? ఎంత పొరపాటు... అని, మిగిలిన సోదరులు... భీమార్జున నకుల సహదేవుల వివరము, ఆసక్తిగా విరాటు డడిగాడు.

"వలలుడనే" ఈ పాకశాస్త్ర ప్రవీణుడు, అరివీర భయంకరుడైన భీమసేనుడు. సింహబల నాముడైన, మీ కీచకుని మదమణిచినవాడు. ఈ తామ్రగ్రంథి నకులుడు, తంత్రీపాలుడు సహదేవుడు... నేను.... సిగ్గుపడుతూ నిల్చున్నాడు. "అర్జునుడివి. బాగుందయ్యా కథ!

"నిజం. ఆ మాలిని - ద్రౌపదీ మహాసామ్రాజ్ఞి" ఇటు ఆశ్చర్యం - అటు భయం..

అప్పుడే అక్కడికి వచ్చిన కుమారుడు "తండ్రీ! ఈ మహావీరుడు - విజయుడై - మనకు విజయాన్ని చేకూర్చిన "విజయుడు" పాండవ మధ్యముడని సత్యము ప్రకటించాడు. వెనువెంటనే, అర్జునుని పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసి, నా వలన మీకందరికి కల్గిన అవమానానికి క్షమించమని ప్రార్థించాడు. అతన్ని లేపి, అక్కున దాల్చుకున్న అర్జునుడు "కుమారా! ఇది విధివైపరీత్యం. ఇందులో నీ తప్పు" లేదన్నాడు.

ఆ వెంటనే ఉత్తర కుమారుడు అంతఃపురానికి వెళ్ళి - సైరంధ్రిని సమీపించి "అమ్మా! మమ్మ్మ క్షమించు. నీవెవరివో తెలియక మేము చేసిన తప్పులను నీ పిల్లలుగా తలచి, క్షమించి, కరుణించు" సాష్టాంగ నమస్కారం చేసాడు.

# "ఉత్తర" - కర్తవ్యం

**త**న బావల, అజ్ఞాతవాసం పూర్తవడం, ఉత్తరాభిమన్యుల వివాహం - శుభవార్తలతో - బలరామకృష్ణులు, సుభద్రాభిమన్యులు, కృతవర్మ, సాత్యకాది యాదవ ప్రముఖులతో - సాంబ, ప్రద్యుమ్నాది రాకుమారులు, అక్రూరాది పెద్దలతో - ఎంతో అట్టహాసంగా బయలుదేరి వచ్చారు. వారందరిని పాండవులు, ద్రౌపదీ సమేతులై స్వాగతించారు. కష్టాల నుండి బయటపడిన తన బావలకు చెల్లెలకు, బలరామకృష్ణులు, ఈ శుభ సందర్భాన్ని గూడా పురస్కరించుకుని, మణిమయభూషణాదులను ఇచ్చారు. ద్రుపద మహారాజు, తన కుమారులతో వచ్చారు. ఇటు అటు బంధువులు, కాశీరాజుతో సహా వచ్చారు. అందరిలో సంతోషం. విరాటుడు, తరుణంలో వివాహానికి తరలి రమ్మని ప్రార్థించాడు.

అభిమన్యుని భద్రగజముపై వుంచి, తామందరు, రథ, గజ, అశ్వములపై, మంగళ తూర్యరవాలు మిన్నుముట్టుతుండగా, బలరామ కృష్ణాదులతో కలిసి వివాహమంటపానికి విచ్చేసారు.

అందర్ని - తన ధర్మంగా - పెద్దలందరితో కలిపి, గొప్పగా విరటుడు, స్వాగతించి అర్చించాడు. వివాహ తంతు ప్రారంభమయింది. అంతులేని సంతోషం. ఉత్తరాభిమన్యులు - తలంబ్రాలు పోసుకుంటున్నారు. ఇన్నాళ్ళకో శుభకార్యం చేస్తున్నామని పాండు కుమారులందరిలో అవ్యక్తానందము.

శ్రీకృష్ణచక్ర రక్షతో శుభకార్యం పూర్తయింది. అల్లునికి ఘనంగా విరాట మహారాజు, ధన, కనక వస్తు వాహనాల నొసగాడు. తనను కరుణించి, కటాక్షించమని, ముఖ్యంగా యుధిష్టరుని విరాటుడు సామంతునిగా అర్థించాడు.

★★★★

వివాహం జరిగిపోయింది. పెద్దలందరు సమావేశమయ్యారు. ఉత్తర కర్తవ్యం గురించి ఆలోచిస్తున్నారు. అప్పుడు - బలరాముని నేతృత్వంలో యదు ప్రముఖులతో కలిసి, అందరు - పాండవుల పరిస్థితి సమీక్షిస్తున్నారు. ధర్మపరులై- నియమిత ప్రతిజ్ఞకు తలవంచి, అరణ్య, అజ్ఞాతవాసాలు పూర్తి చేసారు.

ఇప్పుడు - ధూర్త దుర్యోధనుని ప్రమేయం లేకుండా, పెద్ద మనసుతో, పెద్దవాడైన ధృతరాష్ట్రుడు తాము స్వయంశక్తితో భగవత్కరుణతో నిర్మించుకున్న ఇంద్రప్రస్థానికి సగౌరవంగా ఆహ్వానించి, వారి రాజ్యం నుండి తప్పుకోవాలి.

ఈ ఛాయలెక్కడా కనబడటం లేదు.

పైగా - ఎంతసేపు అవతలివారిని తప్పుపట్టి, అన్యాయం చేద్దాము, ఆపదలు పాలుచేద్దామనే కుమారునికి వంతగా, ఆ అంధరాజు ధృతరాష్ట్రుడు తలవూపుతున్నాడే తప్ప - పాండవులు తనను నిలబెట్టి - మహారాజును చేసి గౌరవించిన తమ్ముని తనయులని, ఏనాడు అనుకోవడంలో లేదు.

కాబట్టి... సమర్థుని దృతరాష్ట్రుని చెంతకు పంపి, వారి రాజ్యాన్ని మీరు విడిచి పొమ్మండని హెచ్చరించాలని తలుస్తున్నారు. ఎవరా సమర్థుడు... ఇది, ఇప్పుడు ప్రస్తుతం వారి ఆలోచన. అప్పుడు బలరాముడు లేచి -

"అటువంటి వాళ్ళెవరున్నారు. వుంటే... ఆ వ్యక్తి అవతలివారికి అంగీకారం కావాలి కదా!" అక్కడున్న వారిలో ఎవరో అన్నారు. వాళ్ళెవరని చూస్తే కనుపించేది మౌనం. దెయ్యాలు వేదాలు వల్లెవేసినట్లు ధర్మం గురించి దుర్యోధనాదులను కాని, వారి ఆశ్రితులను కాని అడిగితే సమాధానం లభిస్తుందా ? ఆలోచించండి!" అందుకున్నాడు మళ్ళీ సాత్యకి.

ఉత్తర గోగ్రహణం తప్పు కదూ! ఇందుకు కురువృద్ధుడు, పితామహుడనబడే భీష్ముడు, ఆచార్యులు కృప, ద్రోణులు, వారి కుమారుడు బ్రహ్మమూర్తి అశ్వత్థామ ఎలాగంగీకరించారు. ఇందులో ధర్మమెక్కడుంది. ఇది తప్పని చెప్పలేని ఆ అసమర్థులా ధర్మపరులు ?

ద్రుపదుడు లేచాడు. తన అభిప్రాయం చెప్పాడు. పరిస్థితిని చక్కదిద్దమన్నాడు. పాండవులు నాకు అల్లుళ్ళయితే దుర్యోధనాదులు నాకు అల్లుళ్ళే. కాదనను. కానీ... నిండుసభలో కులస్త్రీని - అందునా ఏకవస్త్రను, వివస్త్ర అయినా ఫర్వాలేదని, వలువలూడబెరుకు సిద్ధబడ్డ ఆ తులువలు క్షమించరాని నేరం చేసారు. ఇది భరతవంశ కీర్తి ప్రతిష్ఠలకే మాయనిమచ్చ.

ఎవరి సామ్రాజ్యం వారనుభవిస్తూ సుఖసంతోషాలతో వుంటే అందరికి ఆనందమే, అలాగ కాదని, అధర్మయుక్తంగా - ఇరువురిలో ఎవరు ప్రయత్నించినా, ప్రవర్తించినా - అధిక్షేపణకు గురవుతారు. ఆ తదుపరి ఆ అన్యాయం జయించ డానికి, మరో మార్గం కలుగుతుంది. దైవం సహకరించాలని కోరుకుందామని, ఎవరి మట్టుకువారు, వారి వారి రాజ్యాలకు వెళ్ళిపోయారు.

ఆ తదుపరి ద్రుపదుడు - తన అల్లుడు యుధిష్టరుని పనుపున, హస్తినకు తమ ముఖ్య ఆచార్యులను, సంధానకర్తగా పంపాడు.

తమ మహారాజు ఆదేశం ప్రకారం హస్తినాపురాన్ని చేరిన పాంచాల భూసురోత్తముడు, ముందుగా ధృతరాష్ట్రుని, ఆ తదుపరి భీష్మ, ద్రోణ, కృపాచార్యులను విదురుని, విడివిడిగా కలుసుకున్నాడు. తను వచ్చిన విషయాన్ని- తమ మహారాజుతో కలిసి - యుధిష్ఠర సార్వభౌముని హృదయాన్ని వాళ్ళకు తెలియబరిచాడు. దాంతో రాజసభ ఏర్పాటు చేయబడింది. రాజదూతగా వచ్చిన ఆ భూసురోత్తముడు, వినయ విధేయతలు, చాకచక్యంతో సమర్థవంతంగా విషయాన్ని సభ ముందు వుంచాడు.

“జరిగింది, జరుగుతుంది మీకందరికి.... అదే ఈ సభకు, సభాసదులకు స్పష్టంగా తెలుసు. కౌరవ, పాండవులు క్రొత్తవారు కారు. అన్నదమ్ముల బిడ్డలు. వీరివలన ప్రస్తుతముత్పన్నమైన పరిస్థితిని చక్కదిద్ది - ఎవరి సామ్రాజ్యమును, వారు సమర్థవంతంగా నిర్వహించుకుంటే బాగుంటుందన్న భావనతో పంపారు. ఇందుకు తమ సహాయ సహకారాలవసరం. అనవసర కాలహరణం. ఇతర వాదోపవాదములు... మనశ్శాంతిని, ప్రజాశాంతిని కూడా కూలదోస్తాయి. కాబట్టి... గాంగేయుడు, వంశపెద్దగా కల్పించుకుని -

భూసురోత్తమా! మీరాక, మృదు వచనములు ఆనందదాయకం. జరిగిందానికి కర్తలెవరూ అనేకన్న... కర్తవ్యాన్ని ఆలోచించడం శుభమన్నారు. అది శుభ శుభ్రమార్గం. ఇందులకు రాయబారాలనవసరం. ఎవరి రాజ్యం వాళ్ళు...

“పితామహ! పేనులా ప్రవర్తించకండి. పెద్దరికం నిలుపుకోండి. జయించుకున్న దానిని, ధర్మము - ధర్మమంటూ ఎవరో చెప్పారని ధారపొయ్యము.

దానమివ్వవలసిన పనిలేదు. పౌరుషహీనుల ప్రతాపాలను చూసి భయపడేవారు లేరు. చేసిన తప్పుకు శిక్షననుభవించాల్సినదే. ఇందుకు ఎవర్నో బాధ్యులను చేయడం, నిందించడం తగదు.

ధర్మరాజు ఇష్టమై సర్వస్వతంత్రుడై జూదమాడాడా ? లేక ఎవరైనా బలవంతంగా బెదిరించి తెచ్చి, జూదమాడించి, అన్యాయంగా వారి రాజ్యాన్ని దోచుకున్నారా ? పెద్దవాళ్ళు వాళ్ళ వాళ్ళ పెద్దరికాలు, పెద్దలుగా వుంచుకుంటే చాలా మంచిది. కుపిత భుజంగమయ్యాడు, కర్ణుడు.

“కర్ణా! నీకు బుద్ధి - జ్ఞానం, సిగ్గు - లేదు. నలుగురు నవ్వుతారనే బాధ కూడా లేదు. నిన్నగాక మొన్న ఉత్తర గోగ్రహణంలో తగిలిన గాయాలు, జరిగిన పరాభవం మరచిపోతే ఎలాగ ? అదృష్టం బాగుండి, ఆనాడు కనికరించాడు. కానీ, అదే అర్జునుడు - ఉత్తర కుమారుని ప్రేరేపించి, మన కుత్తుకలుత్తరిస్తే - ఇక్కడ ఇప్పుడిలాగ మాట్లాడే సావకాశముండేదా! అయినా - సూతవృత్తికి తగ్గట్లు, నీ ధర్మము నీవు నిర్వర్తించావు. అందుకు అభినందించాలి. రాజ్యము వీరభోజ్యము కాని, అసహ్యాభక్షణం కాదు. అయినా రాజ్యము, దాని విలువలు, ధర్మము - దాని గతి, తేరగా రాజ్యమొందిన నీకేం తెలుస్తుంది” తప్పయినా, తప్పదన్నట్లు భీష్ముడు హెచ్చరించాడు.

పితామహా! తమరు.. కర్ణుడు వెర్రెక్కిపోతున్నాడు అప్పుడు - ఆ పరిస్థితి విషమించకుండా, గుడ్డిరాజు - గాంగేయుని, కర్ణుని సమాధానపరచి -

“భూసురోత్తమా! మీ ధర్మం మీరు నిర్వహించారు. చెప్పవలసింది మీ సత్యధర్మంగా చెప్పారు. మాకు కొద్ది సమయం కావాలి. తదుపరి బాగా ఆలోచించుకుని సర్వజనామోదకరమైన మా అభిప్రాయాన్ని తెలియబరుస్తామని- ఆ వచ్చిన బ్రాహ్మణోత్తముని తగు విధాన సత్కరించాడు. మీరు యుధిష్ఠరుని కలుసుకుని, మేము చెప్పిన విషయాన్ని ఆయనకు తెలియబర్చమన్నాడు.

★★★★

ఆ తర్వాత మహారాజు, తెలివిగా విదురుని తుదకు కర్తవ్యం ఉపదేశించమని కోరాడు. వారి రాజ్యం వారికి విడిచిపెట్టడం మంచిదంటాడు. అసమాన

బలతేజోవీరులైన వారితో మిత్రత్వమే తప్ప శత్రుత్వం వలదన్నాడు. కయ్యానికి నీవు, నీ పిల్లలే తప్ప, వాళ్ళు కాలుదువ్వడం లేదు. కాబట్టి, కురువంశ ప్రతిష్ఠ - భరతకుల పరువును నిలబెట్టవలసిందని కోరాడు.

ధృతరాష్ట్రుడు ఆలోచనలో పడ్డాడు! "నాయనా పాండవులతో విరోధం వలదంటే వాడు వినడు. మా రాజ్యం మాదే నంటారు. ఇవ్వవలసిందేనని, పాండుపుత్రులంటారు. ఏది ధర్మం ? ఏదధర్మం ? గుడ్డివానిగా పుట్టడం అధర్మమా ? నా దురదృష్టమా ? పాండురాజు మరణించడం, వారి పిల్లలు రాజ్యాన్ని కోరడం, అనుచితమా, అది వారి దురదృష్టమా!" సమాధానం చెప్పుకోలేకపోతున్నాడు -

తరుణం మించకూడకుండా, బలాబలాల సమీకరణంలో ముందుగా వుండాలని, త్వరపడమని, మేనమామగా ఆతని క్షేమం కోరేవానిగా, శకుని అభిలషించాడు. "అల్లుడూ! ఇన్నేళ్ళుగా అనుభవిస్తున్న రాజ్యమివ్వడం కష్టమే. ఈ విషయంలో పరస్పర వైరుధ్యభావాలు, ప్రకటనలతో యుద్ధమే రావచ్చును. అప్పుడు నా వెనుకెవరు... అనుకుంటే - నేను, కర్ణుడు, సోదరులు వందమంది తప్ప మరిలేరు. అంతకుమించి, మనలను గురించి ఆలోచించేవారు, మనల్ని దుష్టులని" అనేవారే తప్ప - పాండవులకెదురు నిలబడగల వారసలు లేరు.

ఎందుకంటే - అక్కడ కృష్ణుడుంటాడు. ఈ ఆర్యావర్తంలో కృష్ణుని కాదని విర్రవీగే రాజు లేనేలేడు. అందరికి ఆయనే ఆరాధ్యుడు కాబట్టి, ముందుగా మనం మేలుకుని శ్రీకృష్ణుని సాయం కోరుదాం. రేపు మీరడగలేదనే మాట మనపై రాకూడదు. కాబట్టి...

ముందు నేను ద్వారకకు వెడుతున్నానంటాడు. మంచిపని చేస్తున్నావు. వెళ్ళు వెళ్ళి వాసుదేవానుగ్రహం పొందు. నీ బ్రతుకు ధన్యమౌతుందంటాడు. మళ్ళీ క్షణమాగి ధృతరాష్ట్రుడు -

"నాయనా! ఈ ప్రపంచంలో నేను భయపడేది కేవలం ముగ్గురికే. వాళ్ళెవరో తెలుసా.... భీముడు, కృష్ణుడు, అర్జునుడు. వీళ్ళతో మంచిగా వున్నావనుకో. ఈ భరతావనిలో నీకెదురులేదు" అంటాడు. "సరే. వెళ్ళి వస్తానని" తండ్రితో చెప్పి,

అతివేగంగా వెళ్ళే గుర్రాలు పూన్చిన రథంపై ద్వారకకు బయలుదేరతాడు. అర్జునుడు కూడా అప్పటికే ద్వారకను చేరి, రుక్మిణీ మందిరాన్ని ప్రవేశించి, తన బావను గూర్చి అడుగుతాడు.

ఆయన నిద్రిస్తున్నారని, నీవలెనే దుర్యోధనుడు కూడా వచ్చి అడిగి, ఆయన కోసం, శయన మందిరానికి వెళ్ళాడని చెబుతుంది. వెంటనే కృష్ణుని శయన మందిరానికి వెళ్ళగా, తలవైపునున్న ఒకే ఒక ఆసనంపై దుర్యోధనుడు కూర్చుని వున్నాడు. మరో ఆసనం లేక వినయభూషితుడై అర్జునుడు ప్రక్కగా నిలబడ్డాడు.

కొన్ని క్షణాలు గడిచాయి. కృష్ణుడు ఆవులిస్తూ లేచి కళ్ళు తెరువగా, ఎదురుగ్గా చేతులు కట్టుకుని విజయుడు కనుపించాడు "బావా!" అన్న కృష్ణుడు లేచి, అర్జునుని పలుకరిస్తూ - తలవైపున కూర్చున్న దుర్యోధనుని చూసాడు.

"ఆహా! దుర్యోధనా! రారాజువి. నీవు వచ్చావా ? చాలా సంతోషమన్నాడు. నిలబడిన అర్జునుని తన ప్రక్కన కూర్చొనమని చెప్పాడు. ఇప్పుడు చెప్పండి. మీ రాకలోని కారణం, ఇరువుర్ని ఒకేసారి సంబోధించి అడిగాడు.

పెద్దవాడిగా, దుర్యోధనుడు గొంతు సవరించుకుని - "కారణమేదైనా, కురు పాండవుల మధ్య, యుద్ధం జరిగేటట్లుంది. ఈ అనివార్యమైన యుద్ధంలో నీ సాయం కోరి ముందుగా వచ్చాను. ధర్మాత్ముడివి, ధర్మ పరిక్షకుడివి. మొదట వచ్చిన నాకు, సహాయమొసగుట, నీకు తెలియని ధర్మం కాదు" తన రాకను వివరించాడు.

"నిజం. నువ్వు చెప్పింది, అక్షరాలా నిజం. కాదనను. తప్పక సహకరిస్తాను. ముందుగా వచ్చింది నీవయినా, నేను చూసింది అర్జునుని. పైగా నీవు స్వతంత్రుడివి. అతడో అన్నచాటు తమ్ముడు. అయినా - సహకారమిప్పుడు ఉభయుల కవసరము. నీవు చెప్పినట్లు నేను ఉభయులకు సంబంధించిన వాడిని. కనుక నేను చేయదగ్గ సహాయం తప్పక అందించెదనంటాడు.

"నా వద్ద నారాయణ సేవాభిలాషులు, నాతో అన్ని విధాల సరిసమానమైన ధర్మయుద్ధమూర్తులు పదివేలమంది వున్నారు. వారొక పక్షము వహిస్తారు. నేనొక్కడినీ ఇంకో పక్షము వహిస్తాను. కానీ, నేను ఆయుధము పట్టను. యుద్ధము చెయ్యను. అవసరమై నప్పుడు - సహాయము "సలహా" రూపంలో ఇస్తాను.

కనుక దీనిని గ్రహించి, మీ మీ అభిమతాల మేరకు కోరుకోండి. "అన్న కృష్ణుడు, ఇద్దర్ని చూసి "మీ ఇద్దరిలో చిన్నవాడు అర్జునుడు కాబట్టి, ముందుగా ఆతని ముద్దు చెల్లిస్తాను. ఆ మిగిలినది, నీది" అన్నాడు.

దుర్యోధనుడు, ఇరుకున పడ్డాడు. ఏం కోరుకుంటాడో. తాను ఏం పొందాలో, అర్థంకాని అయోమయంలో తలవూపక తప్పలేదు. "అర్జునా! అన్నాడు ఆపద్బాంధవుడు. రెండుచేతులు జోడించి కృష్ణునికి నమస్కరించి" నీవు నా చెంత వుంటే, పధ్నాలుగు లోకాలను, కళ్ళు మూసి తెరిచేలోగా, నీ పాదాక్రాంతం చేస్తానంటాడు.

"సంతోష"మని దుర్యోధనుని చూస్తే, మనసులో "హమ్మయ్య" అనుకుని!" సరే! చిన్నవాడు ఆడిగాడు, కదా! "ఆతని ముద్దు చెల్లించు. మిగిలినది నాకివ్వు!" అని వందనం చేసి, "ఒకసారి, శ్రీ గురువులు, బలదేవులను కూడా సందర్శించి వెడతానని, దుర్యోధనుడు లేచాడు."

అతడు వెళ్ళగానే "అదేమిటి అర్జునా! ఆయుధం పట్టనన్న, ఓ విగ్రహం వంటి నన్ను కోరుకున్నావు. నా వల్ల.... అన్నగారితో నీకు...!" అర్జునుని మనసు గ్రహించడానికన్నట్లు - సందిగ్ధుడిని చేస్తాడు.

"కృష్ణా! ఈ ఆయుధాలకు ఆధారం నీవు. నీవే నా దగ్గర వుంటే, ఈ ఆయుధాలు, వాటి ఆధారాలు అన్నీ నా వద్ద వున్నట్లే! నీవు "వూ" అంటే మిడతల్లా మాడిపోయే లోకాలు నాకెందుకు ? ఆ లోకేశ్వరుడు నా చెంత వుంటే, సర్వలోకాలకు నేనే అధిపతిని నన్నెవ్వరు అధిక్షేపించలేరు. నేను చేసినది నా అన్నదమ్ములకు, నా భార్యకు ఆనంద, గర్వకారణమౌతుందని, సంతృప్తిని వ్యక్తబరిచాడు.

"శుభ" మన్నాడు. చిరునవ్వుల వాసుదేవుడు.

కృష్ణుని నుండి బలరాముని వద్దకు, దుర్యోధనుడు వెళ్ళాడు. ఏమిటి నీ రాక ? అనగా విషయం చెప్పాడు. విన్న బలరాముడు "దుర్యోధనా! నీవు నా శిష్యుడవు. ఆ వాత్సల్యము సదా నాకు కలదు. కానీ.... సాంబుని విషయంలో, లక్ష్మణ కుమారుని విషయంలో, నాకు కోపకారణమయ్యావు.అయినా శిష్యుడవన్న అభిమానంతో వున్నాను. ఇక ధర్మాధర్మాలు. మంచి- చెడులు. అవి నా పరిధిలోని

విషయాలు కావు. అవి కృష్ణునివి. అతని నిర్ణయమేదైనా యాదవజాతి యావత్తు శిరసావహిస్తుంది. జాతి వైరం వేరు. కుటుంబ కలహం వేరు.

నీ కోసం, మొన్న జరిగిన అభిమన్యుని వివాహ సమయంలో - తప్పొప్పుల సమీక్ష కాని విధంగా, నా వుద్దేశం ప్రకారం పరిస్థితిని సమీక్షించాను. అయినవారు, ఆప్తుల నిరాదరణ పొందాను. కనుక, ఈ విషయంలో, ఎంత శిష్యుడివని అభిమానమున్నా... నీకు నేనేమీ సాయం చెయ్యలేను.

అలాగని పాండవులకు మద్దత్తు పలుకను. నాకు వుభయులు సమానులే. ఇటు వాత్సల్యం. అటు రక్త సంబంధం. రక్తం ఏరులై ప్రవహించడానికి, ఎంత కోపిష్టి వాడినైనా, మొరటు మొండి - ముఖస్థితికి లొంగేవాడినైనా - ఈ విషయంలో నేను వేలుపెట్టను. ఎవరి పక్షం వహించను "వెళ్ళిరా!' నిష్కర్షగా తన అభిప్రాయం చెప్పి వెళ్ళమన్నాడు.

★ ★ ★ ★

అక్కడ "అమాయకుడివి, అర్జునా ?'' అంటాడు వాసుదేవుడు.

"అది నీ అభిమానమంటాడు'' అర్జునుడు. బావా! నాదొక కోరిక నీవే తీర్చగల, నేను అడగవలసిన కోరిక.

"అడుగు. తప్పక చెల్లిస్తానంటాడా యశోద నందనుడు. "నీవు నాకు సారథివై - నన్ను నిజమైన "విజయుడిని'' చెయ్యమని నా ప్రార్థన.

పిచ్చివాడా! ఈ అభయం ఎప్పుడో ఇవ్వబడింది. దీనినిప్పుడు ప్రత్యేకంగా అడుగవలసిన పనిలేదని'' మళ్ళీ చెప్పాడు. మంగళాశాసనం చేసాడు!



# "సంజయ రాయబారం"

నిండుసభలో వున్న ధృతరాష్ట్రునితో, "మహారాజా!" అన్నాడు సంజయుడు,

తాము ఆదేశించినట్లు ఉపప్లావ్యంలో మాధవుని కలుసుకున్నాను. ఆ సమయంలో వాసుదేవుడు - సత్యభామ, ద్రౌపది, అర్జునులతో కలిసి ఆంతరంగిక సమావేశంలో వున్నాడు. అయినా నా రాకను గమనించి, మీ పెద్దరికాన్ని గౌరవించి లోపలికి రమ్మన్నారు. వెళ్ళాను.

వారంతా మహనీయులు. దేవతామూర్తులు. వారి సమక్షంలో ద్రౌపదీదేవి చూపించిన, బంగారుపీఠముపై కూర్చొనగల్గడం నా అదృష్టం. ఇంకా చెప్పాలంటే నా సుకృతం. ఏ మాత్రం రాగద్వేషాలు, మదమాత్సర్యాలు లేకుండా, ఇతరులకెవరికి వారి కుమారులకు గూడా సంభవం కాని, సభామర్యాదను నాకు ప్రసాదించి, గౌరవించారు. ధన్యుడను.

వెళ్ళినవారికి, వచ్చినవారి మానసం తెలుసు. కూర్చోగానే "చెప్పండి" అన్నారు. ఆ మర్యాదకు పొంగిపోయాను. ఆ గోవిందునికి, మీరు చెప్పవలసినట్లా దేశించిన, మీ మనసును పూర్తిగా, ఆ దేవకిసుతుని వద్ద ఉంచాను. అంతావిన్న ఆ వాసుదేవుడు-

"సంజయా!" చాలా సంతోషం. అజాతశత్రువు ధర్మరాజు. అతనిని రెచ్చగొట్టకండి. మహాబలుడు, వాయు సమానుడు భీముడు. కౌరవ పర్వతాలను పీఠభాగంతో సహా కుదిపి, కదిపి వేయగల సమర్థుడని చెప్పు. పరమశివకరుణా కటాక్ష లబ్ధుడు, ఇంద్రాది అష్టదిక్పాలుర, ప్రియ అభిమాని, సకల శస్త్రాస్త్రవేది అర్జునుడు, గాండీవ "టం"కారము చేయనంత వరకు, కౌరవులు "నరసింహాలై" మెలిగేది. నకుల సహదేవులు అపార శక్తివంతులు, అన్నగారికై అడ్డము వచ్చిన వారిని ఆనుపానులు లేకుండా చెయ్యగల దిట్టలు. జగజెట్టీలు.

ఒక్క కురు శిబిరమైన హస్తినలోని కొద్ది వర్గానికి తప్ప పాండవ శక్తి సామర్థ్యములు అందరికి తెలుసు. మాయలు పన్నడం మాటలతో మభ్యపెట్టడం, కొంపలు కూల్చడం, "నా" అనే అభిమానం లేకుండా, స్వాభిమానంతో విర్రవీగే వారికందరికి, వారెవరైనా సరే.... పుత్రమిత్ర బంధు సమేతంగా, నాశనం తప్పదు.

దుర్మార్గంగా సాగించే యజ్ఞంలో సమిధులౌతారు. శలభాలై మలమల మాడిపోతారు. ఇది జరుగబోయే సత్యం. చేతులారా చేసుకున్న దుష్కర్మ ఫలితం. అనుభవిస్తారో.... వారించుకుంటారో... ఆలోచించుకోమను. కోరి నేనెవరి పక్షం వహించలేదు. అడిగి నా సాయము, తెచ్చుకున్న ఫలితము - పాపచింతనే అయితే, కాల్చి మసి చేస్తుంది. ధర్మ రక్షణమే అయితే, కవచమై - సదా వెన్నంటి నిలుస్తుంది. ధర్మరక్షణకు నడుం కడుతుంది. విజయాన్నావరింప చేస్తుంది. అందరికి కావలసిన వానిగా నా అభిప్రాయమిది. ఇప్పుడు మహారాజు సముచిత నిర్ణయం తీసుకుంటే అందరు సుఖిస్తారు. కాదంటే, ఎందరో, చరిత్ర తెలియని కాలగర్భంలో, లేకుండా పోతారు. కొందరే సుఖసంతోషాల తేలియాడుతారని చెప్పాడు.

"ఇది సత్య"మన్నాడు, ముక్తాయింపుగా, శ్రీకృష్ణుణి సమర్థిస్తూ - సంజయుడు. ఆ మాటలకు "సంజయా! నీవే నా మాట్లాడుతుంది ?" ధృతరాష్ట్రుడు ఒక ప్రక్క నిర్ఘాంతం, మరొకప్రక్క - ఆశ్చర్యపోతున్నాడు.

"అవును. ప్రభూ! వాసుదేవుడు చెప్పిన సత్యాన్ని మీ మనసును వారి ముందుంచినట్లు, ఆ దేవదేవుని మాటలు సభకు అందిస్తున్నాను. నేను అక్కడికి వెళ్ళగానే కృష్ణుడు "ఇక్కడ రాజకీయాలు లేవు. మేము రాజకీయాలు చెయ్యడం లేదు కాబట్టి, మీకు మా ఆహ్వానమందింది. పెద్దల మాటలలో, పిల్లలు కలుగ చేసుకోకూడదు కాబట్టి, వారికి అంతరాయ కారణమైంది సత్యాన్ని చెబితే - "ప్రభూ! ఆ పరంధాముని పవిత్ర శీలానికి, శిరసువంచి నమస్కరించకుండా, మనస్కరించలేదన్నాడు.

సభ కాస్సేపు నిశ్శబ్దం. ఆ నిశ్శబ్ధాన్ని చీలుస్తు, గాంగేయుడు తన చేతిని పైకెత్తాడు. వెంటనే ప్రతి ఒక్కరు సావధానులయ్యారు. భీష్ముడు - తన పెద్దరికపు హోదాతో, కురుకుల వృద్ధునిగా - "విన్నారు కదా! సభకు సంజయుడందించిన విషయము. వినడానికది విచారకరమైనది. ఇప్పుడు చేయవలసింది విమర్శలు కావు. విషమించిన ఈ పరిస్థితిలో విన్న విషయాన్ని, విషమం చేసుకోకుండా ఎలాగ నెగ్గాలి ? ధర్మం విడిచి, మరచిపోయిన "యుద్ధం" అనివార్యంగా కనడుతుంది.

ఇది గతంలోను, ఇప్పుడు - ప్రస్తావించిన, వాసుదేవుని ప్రస్తావనలలో కనబడుతుంది, వినబడుతుంది. కనుక.... పితామహుడు ఆగాడు. ఒక్కొక్కరు

వారి వారి అభిప్రాయాలను చెబుతున్నారు. నిర్లక్ష్యం..... నా లక్ష్యమన్నట్లు దుర్యోధన చతుష్టయం తలుస్తూంది.

అందరితోపాటు, "అధర్మ" కాలాగ్ని నెత్తిన పెట్టుకుని కొడుకులతోపాటు, దానిని పాపంతో ప్రజ్వలింప చేస్తూ, ధృతరాష్ట్రుడు - మహామూర్ఖత్వం నరనరాల జీర్ణింప చేసుకుని "సంజయా! ఇంతమంది యోధానుయోధులు, అప్రతిహత-శూరులున్న -ఈ కురు సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయడం, వీరులను అంతమొందించ గలననుకోవడమంటే.... ఎంతకు తెగించారయ్యా, ఆ పాండుపుత్రులు! ఏం చూసుకుని వీరావేశాలు, బీరాలు" అనేసరికి, సంజయుడు నిర్ఘాంతపోయాడు. "మహారాజుగా!" గతరాత్రి తను చెప్పగా కన్నీరు కార్చిన ధృతరాష్ట్రుడేనా.... అని అనుకున్నాడు. అప్పుడు - "మహారాజా!" అన్నాడు, చాలా ప్రశాంతంగా సంజయుడు. "అసలు ధర్మరాజు, యుద్ధానికే సిద్ధబడటం లేదు. పొరపాటున నా మాటలలో, యుద్ధం వలన అందరికీ నష్టమేనంటే, ఆ మహానుభావుడేమన్నాడో తెలుసా... ?! "ఏమన్నాడే...!

"సంజయా! ఎందుకు అనవసరంగా యుద్ధ ప్రస్తావన తెస్తున్నావు. మనమధ్య జరిగిన మాటలలో, ఆ మాట దొర్లలేదే! అటువంటప్పుడు "యుద్ధ"మను ఆ మాటెందుకొచ్చింది ? మాటిమాటికి ఆ విధంగా ప్రశ్నిస్తుంటే, సమాధానం చెప్పుకోలేక సిగ్గుతో చచ్చిపోయి, ఆ మాట, మాట మాత్రంగానైనా మార్చాల్సి వచ్చిం"దన్నాడు.

ఇప్పుడు మహారాజు సిగ్గుతో తలవంచుకోవాల్సి వచ్చింది. అయినా, అహంకారం తరగటం లేదు. అధర్మ ప్రవర్తనం పెరుగుతూనే వుంది. ఇతడే ఇంత మూర్ఖుడైతే ఈతని కుమారుడు, ప్రపంచంలోనే కాదు, ఈ పధ్నాలుగు లోకాలలో ఎవరు చెప్పినా వినని మొండి, పరమమూర్ఖుడు. వీరి సహవాసంతో... తన తప్పును కప్పుకోలేక పోతున్నాడు. తనను, తాను దెప్పుకోకుండా వుండలేక పోతున్నాడు -

"మహారాజా! ప్రతిబంధకాలన్నీ మన వద్దనే వున్నాయి. ప్రతిచర్య "ప్రతి" చర్య - మన మధ్యనే వుంది. మనమీదే ఆధారపడి వుంది. అవతలివారిలో సామరస్య వాతావరణం, మనలో సాహసిక యుద్ధ వాతావరణం. కనబడు తున్నాయి. మీరన్నట్లు మనవాళ్ళు చెప్పుకోవడానికి ప్రతిభావంతులే. కానీ చేతలలో శూన్యం. ఇది జగద్విదితం. వారిది జగద్వందితము.

ఒక్క కృష్ణుడు హుంకరిస్తే చాలు. మన వాళ్ళందరు, ఆయన కంటిమంటల్లో మిడతలవలె మలమల మాడిపోవడానికి. ఈ మాటలు వింటున్న దుష్టత్రయంలో, మహారాజులో అసహనం బయలుదేరింది. మనసెంత వరకు వచ్చి ఆగిందంటే...! ఇవన్ని చెప్పడానికి, నీకెంతిచ్చారను వరకు వచ్చి, సభా మర్యాద కోసం, టక్కున ఆగింది. ఆలోచిస్తే... విదుర, సంజయులు చెప్పినదంతా సత్యమే. వారిద్దరు, గాంగేయులు, సత్యవతీమాత కురుకుల క్షేమాభిలాషులు. భరతవంశ కీర్తికి పరాకాష్ఠలు.

నిజమైన వీరులు, పాండుపుత్రులు.. అవకాశం దొరికిందని, దుష్ట చతుష్టయం చేసే ఆగడాలు పిరికిపందల బీరాలు. ఇన్నీ తెలిసి గుడ్డిప్రేమ నరనరాల్లో జీర్ణించుకుపోయి, తను తొందరపడుతున్నా, సేవా ధర్మానికి కట్టుబడి, ఆనాడు పాండురాజు, ఈనాడు - ఈ మహాప్రముఖులు శాంతి వహిస్తున్నారు. శాంతనవుడు, విక్రమిస్తే... ఈ ధరాతలమాయన వశం కాదా! ధర్మం నిలబడదా! ఇది ధర్మాత్ముల మదిలో మెలుగుతున్న ధర్మసూక్ష్మం!!

''వాదాలు, ప్రతివాదాలు'' అన్నట్లు కురుసభలో తమ గొప్పలు, ధృతరాష్ట్రుడు, దుర్యోధనాదులు ఘనంగా చెప్పుకుంటూ, అవతలివారిని నిరశిస్తూంటే, మధ్యలో ఈ మహావీరులు, తమలో తాము ధిక్కరించుకుంటూ, వెక్కిరించుకుంటూ, తర్కించుకుంటూంటే.... పాండవులతో యుద్ధంకన్నా, వీరిలో వీరు కొట్టుకు చచ్చేటట్లు కనబడుతున్నారు. దుర్యోధనుని ఆలోచనలు, శకుని కుయ్యుక్తుల, కర్ణుని ఆర్భాటం... వెరసి... అపహాస్యంగా ప్రతి సమయంలో, సంఘటనా పరంగా, ఎదురు తిరుగుతుంటే, ఇంకా ఎదుటివారినేదో చేస్తానను కోవడం, పొరపాటని పెద్దలందరు మందలించారు.

చివరకు ధృతరాష్ట్రుడు - "కుమారా! తప్పు జరిగిపోయింది. ఒప్పుకుని సరిదిద్దుకుంటే అది మెప్పుదలకు కారకమౌతుంది. పెద్దవాళ్ళు పలుకరించలేదు." అంటే... అది వారి అనుభవ స్వానుభవాలతో, ఎదుటివారి శక్తిని లెక్కించుకుని మరీ అడుగు ముందుకు వెయ్యాలంటారు.

**ఉదా :** మన కర్ణుడున్నాడు. అంగ రాజ్యమిచ్చావు. అభిమానించావు. నేను కాదనలేదు. కానీ, అతను నిన్నెన్ని సందర్భాలలో రక్షించాడు. విజయుడయ్యాడో... ఆలోచించు. దూరంగా నిల్చుని చూసేవాడికి, వాడికల్లంత దూరంలో వున్నవాడు


చెయ్యెత్తి నిల్చుంటే, ఆకాశం అందుతున్నట్లే కనబడుతుంది. అదే వాస్తవానికి వచ్చి, దగ్గరగా చూస్తే, ఆ ప్రయత్నం - గగన కుసుమం. అది అందదు కానీ అందినట్లు కనుపిస్తుంది. ఆశలతో వూరిస్తుంది. అంతే! ఈ కర్ణుని ప్రగల్భాలు.. పరాక్రమం.

ఇందుకోసం... అయినవాళ్ళతో విరోధాలు పెట్టుకోవడం, అనవసర యుద్ధాలకు దిగడం, అవమానం పొందడం తగదు. నిదానించమని చెబుతున్నాడు. శాంతము లేక సుఖం లేదని, పెద్దలను ధిక్కరించి ప్రమాదాలు తెచ్చుకోవద్దని, ఆకతాయి పనులతో అవమానాలపాలు కావద్దని చెప్పాడు.

అభిమానం వేరు. ఆశవేరు. ఆశించినవన్నీ లభిస్తే... అంతకంటే అదృష్ట మేముంటుంది ? ఆలోచించుకో.....!'' సభ్యతకొద్దీ చెబుతున్నాడు ధృతరాష్ట్రుడు. ఒక్కటీ, దుర్యోధనునికి - వినబడటం లేదు. సరికదా, తన దుష్ట చతుష్టయంతో లేచిపోదామనుకుంటున్నాడు. అది కర్మ. దానినెవరూ నివారించ లేరు. అనుభవించాల్సిందే!

ఈ పరిస్థితులలో, పరిస్థితులను చక్కబెట్టడానికి, సంజయుడు - నాకన్న మీకు సకల సహాయము, సమయోచిత సలహానివ్వగలవారు, ఈ వంశకర్త వేదవ్యాసులవారు, అలాగే మహారాణీ గాంధారీదేవిని గూడా పిలవండి.

మీ కుమారునితో, అతని చతుష్టయాన్ని గూడ రప్పించండి. మహర్షి చెప్పిన మాటలు విని, వారి సలహా, సూచన ప్రకారం నడవండి. వారిమాటలే వినసొంపుగా లేక, విన రుచించకపోతే - ఈ కౌరవ వంశాన్ని - ఏ భగవంతుడు సంరక్షించలేడు, సంరక్షించడు కూడా!



# ఇప్పుడేం చెయ్యాలి ?

**సం**జయ రాయబారం విఫలమయింది.

ఎక్కడికక్కడ ధార్తరాష్ట్రులు యుద్ధానికే సిద్ధమవుతున్నారు. కురువంశంపై యుద్ధమేఘాలావరించాయి. ఉరుములు, మెరుపుల, పిడుగుల - అస్త్రశస్త్రాల ధాటి మాత్రం మిగిలి వుంది.

అవి కౌరవ వంశాన్ని నాశనం చేస్తున్నట్లు ఏ క్షణంలో ఉరిమి, ఉత్పాత - ఉల్కలతో, పీకమీదకు తెస్తుందో తెలియడం లేదు. చివరిగా, సంజయునికి ప్రయత్నానికి, సమాధానంగా, పాండవులు తమ దూతగా, తమ రక్షకుడు, తమ బంధువైన యదుకులమౌళిని రాయబారానికి పంపదలచారు. అప్పుడు -

రాయబారిగా వెళ్ళేముందు, కృష్ణుడు ఒక్కొక్కరినే వారి వారి అభిప్రాయములను అడిగి, అక్కడ సమర్థ రాయబారిగా నిలవాలన్న వుద్దేశంతో సమావేశాల్ని ప్రారంభించాడు. కానీ మళ్ళీ ఇక్కడ తర్జన భర్జనలు. "బావా! అన్ని తెలిసిన ఆ మూర్ఖులు - నిన్ను, నీ రాయబారాన్ని మన్నిస్తా రంటావా ? లేక విరుద్ధంగా ప్రవర్తించి నిన్ను అవమానబరుస్తారంటావా ?" సందేహాస్పదు డయ్యాడు ధర్మరాజు. భీమార్జున నకుల సహదేవులు... ప్రస్తుతం శాంతబడ్డారు. అన్నగారు అడిగినట్లు, తమ రాజ్యం తమకు ఇవ్వదలచనప్పుడు, మా బ్రతుకులు మేము బ్రతుకడానికి వీలుగా, అయిదుగురికి, అయిదు వూళ్ళను స్వతంత్రాభిలాషతో ఇమ్మన్నారు.

మూర్ఖులు దీనిని కాదంటే యుద్ధమనివార్యమౌతుంది. దానికి మేము సర్వదా సంసిద్ధము. పాండవులు పిరికివారిగా కాని, అధర్ములుగా కాని బ్రతకాలని తలవడం లేదు. అలాగే - రక్త పిపాసులన్నమాట విన తలవడం లేదన్నారు - కనుక, బావా! సర్వ సమర్థుడివైన నీ సమయోచిత నిర్ణయం, మాకు సర్వదా శిరోధార్యమన్నారు. ప్రక్కనే వుండి అంతా వింటుంది ద్రౌపది. ఆమె శరీరంలోని రక్తం కుతకుత వుడుకుతుంది. తనను తను నిలువరించుకోలేకపోతుంది. ఆ సంగతి కృష్ణునకు తెలుసు. అందుకే -

"చెల్లీ! మరి నీ...వు......!" ఆగాడు కృష్ణుడు.

"అన్నా! అన్నీ తెలిసిన నీకు, ప్రత్యేకించి నా మనసు అందలి భావం, బాధ చెప్పాల్సిన పని లేదు. ఏదో ఒక భర్త అవధ్యుడో, అసహాయుడో...., పనికిరాని వాడైతే ఫర్వాలేదు "కర్మ"మని వూరుకోవచ్చును. జగద్విఖ్యాతులైన, మహాబల పరాక్రమ అస్త్ర శస్త్ర వీరులైన.. అయిదుగురు.. అయిదుగురు భర్తలుండి, ఆ... స్త్రీ... పరాయివారి చేతులలో నిండు కొలువులో, జుట్టుపట్టి ఈడ్చబడి, బట్టలు వూడదీయబడిందంటే...

ఇదెంతటి దౌర్భాగ్యమో, ఆలోచించు. ఆ సమయానికి, తోడబుట్టక పోయినా, తోడుగా వుంటానని వాగ్దానం చేసినా నువ్వు అడ్డుపడకపోతే, ఈ వీరాధివీరులు, వారి కుమారులు, ఈ తల్లిని చూసి బ్రతకాలా, చావాలా ? పుట్టినది పరువు ప్రతిష్టలకు నిలయమైన పాంచాలంలో.......

కానీ, మెట్టినది భరతవంశంలో. ఇప్పుడు ఇంత... ఇన్ని జరిగాక, ఈ వంశానికి పరువు ప్రతిష్ఠలు, మానమర్యాదలు, వీరశూరాలు ఇవన్నీ వున్నాయని... కాస్త.. కాస్త.. ఇంగిత జ్ఞానమున్నవారు తలుస్తారా ? క్షమిస్తారా ? చెప్పు, సోదరా, చెప్పు. ఎందుకీ కీర్తి ప్రతిష్ఠలు, గతజలసేతువు వంటి వైభవాలు, చెప్పుకోవడానికి వీరావేశాలు, త్రిప్పడానికి మీసాలు. రోషం లేకపోతే.. ఏముంటే... ఏముంది ? ఏడుస్తూ కూర్చోవడం తప్ప... ఇక...

ఈ అవమానాలు భరించలేను. ఈ జుట్టు విరబోసుకుని, ఇలాగ ఉన్మత్త లాగ, ఒక దెయ్యంలాగ బ్రతుకలేను. వినదగ్గవాడివి కాబట్టి చెబుతున్నాను. వీళ్ళు, ఈ మహావీరులు, శూరులు అయిదు వూళ్ళతో ఏం బ్రతుకుతారో.. ఎలాగ బ్రతుకుతారో, నాకనవసరం.

ఈ బావలకన్న ముఖ్యము మేనల్లుడు. అందుకనే కదా, అసలుకంటే "వడ్డీ' ముద్దనేది. వాళ్ళు... వాళ్ళు... అడుక్కుతినవలసిన పనిలేదు. ఒకర్ని కాళ్ళుమ్రొక్కి ప్రాధేయపడవలసిన పనిలేదు. నీవున్నావు. నా తండ్రి, సోదరులు ఇంకా బ్రతికే వున్నారు. నీ మేనళ్ళుళ్ళున్నారు. యదువీరులు కొదమసింగాలవలె వున్నారు. కనీసం వీరితోనైనా యుద్ధం చేయించి, ఆ దుర్మార్గులను నాశనం చేసి, ఈ చెల్లెలి పరువు నిలబెట్టు. కనీసం వీరపత్నిని కాకపోయినా - "వీర"మాతగానైన బ్రతుకుతాను.

"అన్నా! ఈ దౌర్భాగ్యాన్ని సుభద్ర భరించగలదా ? నీ మేనత్త - కుంతీమాత భరించగలదా ? అటు ఉత్తర, ఇటు సత్య..... వీరనారీమణులు, వీరమాతలు, వీరపత్నులు.... తమ కళ్ళతో చూసి, మమ్మ బిచ్చగాళ్ళుగా తలచి, వాళ్ళతో బాంధవ్యాన్ని, కొనసాగించగలరా ?

"వద్దన్నయ్యా! వద్దు. ఈ అవమానాల కోసమే అయితే, వీళ్ళ వెనుకబడి పన్నెండేళ్ళ అరణ్యవాసం, మరొక్క సం॥ము అజ్ఞాతవాసం చేసి, మర్యాద మన్ననలు లేక, మతిమాలినట్లు మరొకరికి వూడిగం చేసేకన్నా, నీతో వచ్చినా లేక మా పుట్టింటికి వెళ్ళినా గౌరవంగా ఇంతముద్ద పడేసేవారు, పోయిన మానం దాచుకోవడానికి కొంతగుడ్డనిచ్చేవారు కానీ, కానీ... వీటికోసం బ్రతుకలేదన్నా! భవిష్యత్తు బాగుంటుందని, గొప్పగా బ్రతుకవచ్చునని ఆ శుభాన్నే తప్ప, ఇలాగ-అడుక్కుని తినవల్సి వస్తుందన్న అశుభాన్ని కలలో గూడా వూహించలేదు.

ఎంతో భారంగా, రక్తం వుడికిపోతుంటే, రక్తం వుడికిపోయేటట్లు చెప్పింది. దీనికి సమాధానం ఎక్కడా లేదు. అది వుందంటే, ఆమెను "మహా సామ్రాజ్ఞి"గా సింహాసనమధిష్ఠింప చెయ్యడమే. ఆమెను వూరడించాడు. ఫలితం నీ ఆశలకు భిన్నంగా వుండదు. నీవు జయిస్తావు. మహాసామ్రాజ్ఞి వవుతావు, ఇది సత్యమని ఆమెను వూరడించి, ఓదార్చి మరీ హస్తినకు బయలుదేరాడు. శ్రీకృష్ణుని "రాయబార" రాక, హస్తినకు అంది. అందరు సంతోషించారు కాని, అది... అదే ఆ రాక "వృథా"యన్నది ముఖ్యుల మనోగతం.

"నాయనా!" కృష్ణుడు వస్తున్నాడు. "రానీ, రాజ్యం నాది. అనుభవించాల్సిన వాడిని నేను. వాళ్ళ సంగతి ఎరిగి, రాజ్యమివ్వడమా ? అసంభవం..." అనకు. "నాయనా, కృష్ణుని మంచి చేసుకుని, ధృతరాష్ట్రుడు చెబుతున్నాడు.

"తండ్రీ! ఇప్పుడేం చేసినా ఒక్కటే. ఈ రాయబారం నడుపుతున్నందులకు, ఆతనిని కట్టిపడవెయ్యడ మొక్కటే. మార్గ"మన్నాడు, అసహనంగా! ఇంక వీడిని బాగుచెయ్యడం. వీడు భూమిపై బ్రతుకు గడపగల్గడం... పేరాశే" ననుకున్నాడు, గుడ్డిరాజు ధృతరాష్ట్రుడు. కానీ, శకుని, మేనల్లుని మెత్తబరుస్తున్నాడు. ముందు నువ్వు సమాధానపడు. మాటిమాటికీ... ఆ గొల్లవాడు.. అనకుండా జాగ్రత్తపడు.

నీ ఇష్టం ఏమి చెయ్యమంటే, అది చేస్తానన్నట్లు పాండవులవలె ప్రవర్తించు. ఆ తర్వాతి విషయాలు చాకచక్యంతో నడుపుకోవాలి. అంతేకాని, అనవసర కయ్యాలు, పోట్లాటలు, వృథా ప్రసంగాలు... సూటి మాటలు, తూట్లుపడే చూపులు.. ఇవి మన సమస్యను పరిష్కరించవు. సరికదా, అవతలివారి మంచితనాన్ని పెంచుతాయి. అర్థమవుతుందా ?" చెప్పవలసినవి, మేనమామగా శకుని చెప్పాడు. దుర్యోధనుడు, విధిలేక అప్పటికి తల వూపాడు.

★★★★

కృష్ణుడు - "వాసుదేవుడై" సభా భవనాన్ని ప్రవేశించాడు. సభికులందరు లేచి నిలబడి సత్కరించారు. వారందరి గౌరవాలు, కృష్ణుడు వినయపూర్వకంగా స్వీకరించాడు. అందరికి ఈ వసుదేవ సుతుని వందనాలని చెప్పుకున్నాడు. అప్పుడు - "కృష్ణుడు" కృష్ణుడేననుకున్నారు. తదుపరి -

"మహారాజా! కురుకుల పితామహ, ద్రోణ, కృపాచార్యులారా! గురుపుత్రా, అశ్వత్థామా! సోదరా దుర్యోధన, దుశ్శాసనాదులారా, మిత్రమా కర్ణా, మామా - శకునీ...! అంటూ అందరికి పేరు పేరున యుధిష్టరుడు, తన సోదరులతో కలిసి తన అభివందనాలర్పించమన్నాడు. మీ అభిమానం, ఆశీస్సులు... అర్థిస్తున్నానని చెప్పమని కోరాడు..

"విదుర మహాశయా! మీకు గూడా... యుధిష్ఠరుడు... తమ కుశలమడుగ మన్నాడు. "మహారాజా! ఇక అసలు విషయానికొస్తానని, జరిగిన దానికి, విచారము, వాదోపవాదముల వలన ఏ లాభము లేదు. జరిగిందేదో జరిగింది. మేము సంపాదించుకున్న మా రాజ్యం మాకివ్వడం, అడగకుండా, మీ మరియాద! చేసిన ప్రతిజ్ఞలు చెల్లించుకున్నాం. సమయపాలనం నిర్వహించాం. కర్తవ్యం నుండి, ఏనాడు వైదొలగలేదు" అని కృష్ణుడు - ఆగాడు. అంతవరకు నిశ్శబ్దంగా వున్న సభలో కలకలం.

భీష్ముడు - వారిస్తున్నట్లు చేయి ఎత్తాడు. మళ్ళీ సభలో ప్రశాంతత! వింటూ వూరుకున్నా మహారాజు "ఏం చెయ్యమంటావు కృష్ణా...!" అడుగుతున్నాడు. "నా విన్నపంలోనే సమాధానం, సమస్య-పరిష్కారం అన్నీ వున్నాయి. దానిని నిర్వర్తిస్తే చాలు. "కాదంటే.... !" అడుగుతున్నాడు - మూర్ఖంగా ధృతరాష్ట్రుడు.

"చెప్పడానికేముంది. చెయ్యవలసినదే ముందు వుంది ? అజాత శత్రువు అలుగుతాడు. భీముడు భుజాలు చరుచుకుంటాడు. అర్జునుడు గాండీవమెక్కు పెడతాడు. నేను సారథిగా ముందుకురుకుతాను, నకుల సహదేవులు రెచ్చిపోతారు. బ్రతుకు భయంకరం. యుద్ధమనివార్యం. జననాశనం, కురువంశ నాశనం. పాండవ సామ్రాజ్యం విలసిల్లడం ఖాయమంటాడు. ఈ మాటతో దుష్టచతుష్టయం కుపితమైపోతుంది. అంతే...!

"కృష్ణా...!" దుర్యోధనుని ఏకవచన ప్రయోగం. బ్రతుకు బండలు చేసుకునే తొలి ప్రయత్నానికి, సోపాన నిర్మాణం. ఆ పిలుపుకు తన మందహాసంతో కృష్ణుడు పలుకరించాడు. అతనేదో చెప్పబోతున్నాడు. నేను చెప్పవలసినవి చెప్పాను. మిగిలినవి రేపు ఆలోచించుకుని మీరు సమాధానమివ్వండి. నేను విదురుని ఇంటికి వెడతానన్నాడు. "ఎందుకు ? నీకు మేము... !"

"చాలా సంతోషం. రాయబారిగా వచ్చినవాడు, ప్రభువుల ఆతిథ్యం తీసుకోకూడదు. ప్రభువులతో సమానమైన రాచమర్యాదలను పొందరాదు. నాకీ విదురుడున్నాడుగా; ఇది చాలు!" అన్నాడు. ముందు మా మేనత్తను చూడాలి. విదుర మహాశయా! ఎక్కడుందామె!" అడిగాడు.

"ఆమె, మహా సామ్రాజ్ఞి - రాజమాత "సత్యదేవీ" భవనంలో వుంటుం దన్నాడు. కృష్ణ-విదురులు అక్కడికి వెళ్ళారు. అత్తకు పాదాభివందనం చేసాడు. ఆమె పుత్రుల కుశలవార్తలు, ఆమె చెవిని వేసాడు. విన్న ఆ తల్లి, "ఏమిటో.. కృష్ణా!" అంది.

"కాలమత్తయ్యా! తప్పదు. ఆ మహావిష్ణువు కూడా, అవతారాల పేరిట ఎన్ని అగచాట్లు పడ్డాడో నీవు వినలేదా ? తప్పదత్తయ్యా, తప్పదు. కాకపోతే, ఆవేశంతో దేవుడు మనల్ని కరుణించలేదని ముందు తిడతాము, ఆ తర్వాత బాధపడతాము. ఆపై కర్మమింతేయని సర్దుకుంటాము. ఇది విధివిలాసం. అవశ్యం... అనుభవించాల్సిందే తప్ప, కాదని ముందుకు సాగలేం. సరే ఇంతకీ, నువ్వు, నీ ఆరోగ్యం...

అన్నీ బాగున్నాయి. ఎండని మోడులాగ బ్రతుకుతున్నాను. ఎండితే రాలిపోతాను. ఎందుకో ఆ భగవంతుడు నాకా అవకాశమివ్వడం లేదు. అది సరే. నీ బావలేమంటున్నారు. బావురుమంటున్నారా ? బాధ్యతగా ప్రవర్తిస్తామంటున్నారా ?"

తెలుసుకోవాలనే కుతూహలంతో, ఆ తల్లి వివరాల నడుగుతుంది. "అదిసరే! నీ వుద్దేశమేమిటో ముందు చెప్పు. ఆ తర్వాత వాళ్ళ గురించి" ఆలోచిద్దామన్నాడు.

"చూడు కృష్ణా! నేను సుక్షత్రియ శూరవంశంలో పుట్టాను. భోజులకు దత్తత వెళ్ళాను. పిడికెడు అన్నం కోసం అడ్డమైన వాళ్ళ కాళ్ళు పట్టి దేవురించాల్సిన దరిద్ర వంశాలు కావవి. మెట్టినది - భరతవంశం. భారతజాతికి ప్రతీక.

"అయినా, ఈ దౌర్భాగ్యమేమిటి ? ఈ పిల్లలేమిటి ? క్షత్రియ మాత బ్రతికే బ్రతుకు వారికి తెలియదా ? వారు నా సంతానమే అయితే తల్లినిలాగ వుసురుపెట్టి ఏడిపిస్తారా ? ఏ క్షత్రియమాతా, పరాయి ఇంట పిడికెడు మెతుకులకై అఘోరించదు. వీరత్వంతో, ఆ మాతృత్వంతో, వీరులైన పిల్లలతో, వీరనారి, వీరపత్ని, వీరమాతగా బ్రతుకాలనే తలుస్తుందే తప్ప, పుత్రులతో కలిసి, అడుక్కుని తింటూ, కడగండ్ల పాలవుతూ, పౌరుషం చచ్చి, వున్నదానిని చంపుకుని, బ్రతకడమంటే.. వాళ్ళు నా పిల్లలైతే ఆలోచించమను.

కాదంటే... చచ్చిన తండ్రితోపాటు, తల్లిగూడ చచ్చిందని తలచి, భార్యలను, పిల్లలను వారి వారి పుట్టిళ్ళకు పంపి, ఎండిన మోడులవలె బ్రతుకమను వాళ్ళు అడుక్కు తింటారో, ఆత్మవంచనతో బ్రతుకుతారో... తేల్చుకోమను. ఇంతకుమించి నా వద్ద, వారి ప్రస్తావన అనవసరమని - నిక్కచ్చిగా, నిష్ఠూరంగా చెప్పింది.

"అర్థమయిందత్తా! నీ మనోగత మర్థమయింది. తప్పక అది నెరవేరుతుంది. వీరమాతగా, వీరత్వంతోనే బ్రతుకుతావు. నీ కోడళ్ళు, మనుమలు కూడా వీరమాతలు, వీరపుత్రులై విఖ్యాతులౌతారు. మిగిలిన విషయాలు, నాకు విడిచిపెట్టమని" ఆ తల్లిని... అదే మేనత్తను ఆశ్వాసించాడు. శుభమని ప్రకటించాడు.

కుమిలి, కృంగిపోయే మేనత్తను ధైర్యవచనాలతో భవిష్యత్తును చూపుతూ, తప్పక మంచి జరుగుతుందన్నాడు.

# ఏమంటారు ?

సభ ప్రారంభమయింది. అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

"మామా! ధృతరాష్ట్ర సార్వభౌమా!" అన్నాడు, కృష్ణుడు.

"కృష్ణా! నీవు వాసుదేవుడవు. గోవిందుడవు. గిరిధారివి... నీకు తెలియనిదేమీ లేదు. ఆపద్బాంధవుడవు. ఆశ్రిత పక్షపాతివి." నీవు కనుక కటాక్షిస్తే! ధృతరాష్ట్రుడు అర్థిస్తున్నాడు.

"ఏం చెయ్యమంటావు, మామా!" కృష్ణుడు. "ఈ అకాల యుద్ధమాపింప చెయ్యి. పదుగుర్ని బ్రతికించు." ధృతరాష్ట్రుడు.

"అదే కదా, నా సంధి సారాంశము. అందుకే నేను వచ్చాను. వారి అభిప్రాయము చెప్పారు. నీ అభిమానాన్ని కూడా ప్రకటించు. అన్నీ సమసిపోతాయి. అందరు సుఖంగా వుంటారు. "అది నువ్వు చెయ్యలేవా... ?!

"ఎలాగ... ఎలాగో నీవే చెప్పు!" "ఏముంది యుద్ధమాపడం, ఎవరి బ్రతుకు వారిని బ్రతుకమనడం." "అందుకే కదా, నేను వచ్చేది. వారి బ్రతుకు వారు బ్రతుకడానికి, మీ సలహా అవసరం లేదు. మీ బ్రతుకు మీరు బ్రతికితే చాలు. "అంటే.... వారి రాజ్యం అక్రమంగా తీసుకున్నారు. దానిని విడిచిపెట్టి వెళ్ళిపొండి. అప్పుడెవరికి ఎవరు అపకారికారు, అడ్డంకి కారు. వాళ్ళ వాళ్ళ బ్రతుకులను, మరొకరు నిర్దేశించవలసిన పనిలేదు.

"అది అసంభవం. అందుకు నా కుమారుడు ఒప్పుకోవడం లేదు." "అయితే, అప్పుడు "యుద్ధం" సంభవం. జయాపజయాలు జాతకాలు చెప్పడం, కాలనిర్ణయం చెయ్యడం కాదు. పర్యవసానాన్ని - అది సుఖమైనా - దుఃఖమైనా అనుభవించాలి. అందుకు సిద్ధపడండి. నేను వెడతాను" చెప్పవలసింది చెప్పాడు. "అదేమిటి కృష్ణా! అలాగంటావు. నీవు వచ్చింది యుద్ధ వాతావరణం పెంచడానికా? నిలురించడానికా ?" అనగా -

"అవి మీ మాటలు, చేతల్ని బట్టి వుంటాయి. అందరు కత్తులు పట్టుకుని మీద పడుతుంటే, చాతనై వుండి కూడా చాతకాని వానివలె" సహనావవతు"

అని శాంతి మంత్రాలు వల్లిస్తే చంపడమాపరు. కాబట్టి - విషయం మీ దగ్గరే వుంది. సమస్యా - పరిష్కారం కూడ, మీ వద్దనే వున్నాయి. అదేదో తేల్చుకుని, ఆలోచించుకుని, మరీ చెప్పండి. కావాలంటే, మధ్యాహ్నం... కలుస్తానంటాడు.

“అవసరం లేదంటాడు” దుర్యోధనుడు. “అయితే, వెళ్ళిపోనా... ?!” “వెళ్ళనిస్తే కదా! వెళ్ళేదీ... చూస్తారేం!” తన వాళ్ళను గద్దించాడు. “దుర్యోధనా! ఏం చేస్తున్నావు ? చెప్పు తప్పించుకోవడమో, శరణననడమో చేస్తాను. ఇలాగ ఒంటరిని చేసి...!” కర్ణ శకునాదులు పగులబడి నవ్వారు.

“నిప్పును మూటగట్టుకుంటున్నారు” అని ఒకరంటే, కొంపలంటించు కుంటున్నారని మరొకరు, మొత్తానికి - దుర్యోధన శతం మొత్తం దుష్టచతుష్ట యంతో కల్సి - కృష్ణుని బంధించ సిద్ధమయ్యారు. “పోగాలము దాపురించిన వారికి.... హిత వాక్యములు, సూక్తి-ధర్మాలు పనికిరావు...!” అన్నాడు.

ఒక్కసారి హుంకరించాడు. “రండి” ముందుకు అన్నాడు. అంతవరకు - కృష్ణుని సామాన్యునిగా తలచిన వారందరికి జ్ఞానోదయమయేటట్లు, శ్రీకృష్ణుని శరీరం తేజోమయమయింది. విశ్వాన్ని తాకుతుంది. ఆద్యంతాలు తెలియని ఆ దివ్యరూపం, కేవలం జ్ఞానులు తపో శ్రేష్ఠులు, నారదాది మునులు తప్ప, అన్యులు చూడలేరు.

ఈ దివ్యతేజానికి, ఆ దుష్టచతుష్టయం వారి వర్గం... తల తిరిగి క్రిందపడి పోయింది. కురుసభ నలంకరించిన, మహామునులు, ఋషులు, వేద(ఋక్కులు) గానం ప్రారంభించారు. ఆ సంరంభం - ఓ సంబరంగా భావించి, “విదురా! ఏం జరుగుతుంది” ఆత్రంగా అడుగుతాడు.

మా అదృష్టం బాగుంది. ధర్మం సాక్షాత్కరించింది. స్వాప్నిక జగత్తు సత్యమై కూర్చుంది. అర్థం కాలేదన్నాడు, ధృతరాష్ట్రుడు.

“కృష్ణ భగవానుడు, వాసుదేవుడయ్యాడు. విశ్వరూపం చూపిస్తున్నాడన్నాడు. ఆ... వెంటనే “గోవిందా, వాసుదేవా! కృష్ణా! జగదాధారా, ముకుందా, మాధవ, మురారీ! ఈ దురదృష్టవంతుడికి మీ దర్శన భాగ్యమనే అదృష్టాన్ని ప్రసాదించు. తరింప చెయ్యమని ప్రార్థిస్తూంటే -

"ధృతరాష్ట్రా! మహామహుని రక్త బాంధవ్యం వృథా కాలేదు. నీ అదృష్ట మనగా, దేవతాదులెవ్వరు దర్శించలేని, ఈ మహత్తర దివ్యరూపాన్ని దర్శించి, తరించు"మని నేత్రాలనొసగాడు. "కృష్ణా! వాసుదేవా, జగత్ప్రభూ! జగదుద్ధారా! ధన్యోస్మి!" అని ఆ గుడ్డిరాజు నేత్రాలు పొంది మరీ దర్శిస్తున్నాడు. కొన్ని క్షణాలు చూసి "చూసింది చాలు. నా అంధత్వం నాకిచ్చేయి. ఈ బంధకదశలో, నిన్ను చూసిన నేత్రాలతో ఈ భౌతిక బాంధవ్యాల దురదృష్టాన్ని దర్శించలేనన్నాడు. యధావిధి కృష్ణుడు, ధృతరాష్ట్రునికి అంధత్వమొసగాడు.

నారదాది మహామునులు, భీష్మాది సత్యమూర్తులు, కృప, ద్రోణ, అశ్వత్థామాది పుణ్యమూర్తులు... చేసుకున్న పుణ్యంగా, శ్రీకృష్ణుని విశ్వరూప దర్శనం చేసుకున్నారు. విన్నవారు పులకరించారు. కన్నవాళ్ళు వాళ్ళ అదృష్టంగా భావించారు.

మొత్తానికి సర్వులకు తన దర్శనం ప్రసాదించి, తానేమిటో, భవిష్య త్తేమిటో... ఓ హెచ్చరిక చేసాడు. ధర్మం తన వద్ద తానై వుందని, మీరు మిడతల వలె మాడి, నాశనమై పోతారని, మరచిపోలేని హెచ్చరికను చేసాడు! తల్లితండ్రి, గురువులు, పెద్దలు... ఎవరి మాటలు వినకుండా చేసిన దౌర్భాగ్యపు పనికి అందరు బాధపడ్డారు. ఇక శ్రీకృష్ణ దర్శనం కోసం, జరగబోయే ఆ దారుణాన్ని ఆపడానికి వచ్చిన నారదాది మహర్షులందరు -

"దేవాధిదేవా! విశ్వశాంతిని నెలకొల్పడానికి నీవు చేసినదంతయు ప్రశంసనీయం. నిన్ను యుద్ధపిపాసి, రణపిపాసి, అనడం, తగదు. కాలం, ఆ దుర్యోధనుని రూపంలో రక్తం కోరుతుంది. దీనినెవరు ఆపలేరు. ఇందరి మరణం- ఒక మహాప్రళయంలాగ, ఈ యుద్ధరూపంలో దాపురిస్తుంది. ఇది దైవ నిర్ణయము, కాలమహిమ అయినప్పుడు.... జరగాల్సింది... జరగవలసినదే. ఇందులో ఇంత.. అదృష్టవంతులం..."

నీ విశ్వరూపం చూడగలిగాము. నీ దివ్య వాక్కులను వినగలిగాం. వీళ్ళ అధర్మం. వీళ్ళను సంబాంధవముగా తుడిచిపెట్టుకుపోతుంది. వంశనాశనం, జన నాశనం తప్పదు. మమ్మ సదా కరుణించమని" ఆ మహర్షి పుంగవులు శ్రీకృష్ణ జగన్నాధుని, స్తుతి - స్తోత్రములతో ప్రశంసించి వెళ్ళిపోయారు.

గాంధారీ, మిగిలిన వారందరు... ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు. మహారాజు వెళ్ళే వాసుదేవుని వెంబడించి "గోవిందా! నా మనోగతాభిప్రాయాన్ని తెలుసుకుంటే

చాలు. అనివార్యమైన యుద్ధాన్నెవరు ఆపగల్గుతారు ? అయినా నా ప్రయత్నము మీరర్థం చేసుకుని వుంటారు. వాడి ప్రవర్తనం తప్పు. నేనేం చేస్తాను!"

వీరి వెంబడే వస్తున్న గాంగేయులను చూసి "వింటున్నారుగా, వారనే మాటలు. వారికి బాధ్యత లేదు. బంధుప్రీతి లేదు. వారు ప్రజలకు మహారాజు కారు. వారికి పుత్ర ప్రీతి తప్ప - మరే ప్రీతి లేదు. ఈయనను, వీని పిల్లల్ని నేను క్షమించాలి. పాండుకుమారులు, వాళ్ళు సంపాదించుకుని వచ్చి - ఈ రాబందులకు పెడితే -

వున్నది చాలక, వీళ్ళు రక్తపు కూటికి ఎగబడుతున్నారు. ఇందులో మాత్రం రాజుకు ఏ ప్రమేయం లేదు. తాను తన దుష్టసంతానం సంతోషంగా వుండాలి. పెద్దవాడని గౌరవించి, ఆనాడు ధిక్కరించకుండా, గుడ్డిరాజుకు రాజ్యార్హత లేదని చెప్పకుండా, సేవించాడు చూడండి, ఆ పాండురాజు; వారి పిల్లలు మట్టిగొట్టుకు పోవాలి. వీళ్ళు తేరగా వచ్చిన రక్తపు కూటితో, విందులు, వినోదాలు చేసుకుంటారు. ఇక నా వునికి - ఇక్కడనవసరం. అధర్మం తాండవించే స్థానం నాశన మవడం తథ్యం. ఇది నివారింపలేని సత్యమని కృష్ణుడు బయలుదేరాడు.

మేనత్త కుంతిని చేరాడు. జరుగబోయేది చెప్పాడు. ఆమె, రాజమాత, పరాయి ఇంటి భిక్షాటన్నము తినదని, కనీసం మీరయినా, మీ నాయనమ్మను, మీ అమ్మను, ఈ దుర్నీతికి, దౌర్భాగ్యానికి చిక్కుకోకుండా చూడమని, తన మనుమలందరికి పేరుపేరునా చెప్పి ప్రతాపం చూపించుకోమంది.

ఇందుకు నీవు వెంటవుండి ఈ మేనత్త గౌరవాన్ని భరతవంశ గౌరవ ప్రతిష్ఠలను, ఆ దుష్టుల చేతిలో ఇకనైనా పరాభవింపబడకుండా చూడమని చేతులెత్తి మ్రొక్కుతున్నానని ప్రార్థించింది.

అక్కడనుండి బయలుదేరి "అంగరాజా!" అంటూ కర్ణుని కలుసుకున్నాడు. "బావా! ఈ రకంగా కలువడం ఉభయులకు దురదృష్టం. చేతులెత్తి యుధిష్టరునిచేత సైతం వందనాలు పొందవలసిన వందనీయుడవు. ఇక్కడిలాగ- ఈ శిబిరంలో నిలబడి, నీ వాళ్ళను అల్లరి - ఆరడి చేసుకుంటున్నందులకు సిగ్గు పడాలి. ఈ పరిస్థితులు కల్పింపబడినందులకు మేము సిగ్గుపడాలి.

"వాసుదేవా...!" అన్నాడు కర్ణుడు. "అవును. కర్ణా! నీవు బావవే, ఆ కుంతి జేష్ఠ కుమారుడివి, సూర్య వర ప్రసాదివి. యుధిష్ఠరునకు అగ్రజుడవు. బాల్య

చాపల్యంతో చేసిన చేష్ట, ఇలాగ - నిన్ను నిరశనలకు, దుర్వ్యవస్థకు దారి తీస్తుందని కలలో కూడా వూహించలేదు. అంతా ఎవరికి తెలియని దైవనిర్ణయం.

"ఎవరికి తెలియకపోయినా, అన్నీ తెలుసుకోగల ప్రజ్ఞ - పాటవం గల - దివ్యశక్తివంతుడవు. నీకసాధ్యమేముంది ? ఇంతకు వచ్చిన పని...!" ఒక్క అర్జునునిపై తప్ప - ఇతరులెవ్వరిపై - పగద్వేషాలు లేని పరమసాధువై - సూతపుత్రునిగా, రాధేయునిగా కీర్తి వహించిన సూర్యపుత్రుడు, అంగరాజు, కవచ-కుండలధారి, కర్ణుడు వుండాలి. అంతేనా.." అని అడుగుతాడు.

రాబోయేది అనివార్యయుద్ధం. దీనినెవరు ఆపలేరు. అది విధి నిర్ణయం. ఇందులో నీవు మలమలమాడిపోకూడదన్న వుద్దేశంతో ఇక్కడికి వచ్చాను. సత్యం తెలుసుకో. నీ తమ్ముళ్లను కలుసుకో. ధర్మ ప్రతిష్టాపనం చెయ్యి.

నేను గౌరవనీయుడను, ఉత్తమ కులసంజాతుడని తెల్పినందులకు చాలా సంతోషం. కానీ, ఈ సమయంలో ఏరుదాటి తెప్ప తగుల వెయ్యడం సమంజసము కాదు. ధర్మము కాదు. నా మీద ఆశను రారాజు పెట్టుకున్నాడు. విజయమో, వీరస్వర్గమో, ధర్మమో - అధర్మమో ప్రస్తుతానికి, ఈ జీవితానికి, ఒప్పందం ప్రకారం కలిసి అనుభవిస్తున్నాం.

పాండవులు, పంచపాండవులు. ఇది లోక విదితం. ఇది శాస్త్ర విదితం గూడ అవుతుంది. అర్జునునిపై తప్ప నాకు మర్వెరిపైన కోపం లేదు. అసూయా ద్వేషాలు లేవు. కాబట్టి - నేను ఢీకొంటే, ఆ అర్జునునితోనే! మిగిలినవారు నిజంగా సోదరులే. ఆ రకంగానే ప్రవర్తిస్తాను.

మా ఇరువురిలో ఎవరు వున్నా, పాండవులు అయిదుగురే. "ఎంతో వినయంగా, కృష్ణుడంతటివాడు, తన వద్దకువచ్చి చేసిన అభ్యర్థనకు, దీటుగా ఆ - పాండవ ధర్మరక్తం తనలో మిగిలి వున్నట్లు, కుంతీపుత్రునిగానే మాట్లాడాడు.

"నీవు...!" కృష్ణుడు - ఏదో చెప్పబోతున్నాడు.

"వాసుదేవా! నీవు చతురుడవు. మహామాయవు. నీవు, నా తండ్రి సూర్యునికే వందనీయుడవు. ఆయన కాలగతి నీపై ఆధారముందన్న సత్యం జగద్విదితం. ఇంక మాయలు, ప్రలోభాలు అనవసరం. దయచేసి నన్ను కరుణించు. మన

మెప్పటిలాగే వుందాము. నీవు చెప్పినట్లు ఎవరి ధర్మం వాళ్ళు నిర్వహిద్దాం. ధర్మో రక్షిత "రక్షతి" శాశ్వతమౌతుందన్నాడు.

కృష్ణుడు అబ్బురపడ్డాడు. ఎంతైనా వారసత్వం. రక్త ప్రభావం. ఘనచరిత్రకు వారసుడు. కర్మకొద్ది సూర్యపుత్రునిగా విఖ్యాతి చెందవలసినవాడు, సూత పుత్రునిగా ప్రశస్తి నొందాడు. కౌంతేయునిగా విరాజిల్లవలసినవాడు, రాధేయునిగా స్మరింపబడుతున్నాడు.

కర్ణుని ధర్మానికి ప్రశంసించకుండా వుండలేకపోయిన కృష్ణుడు "శుభ" మన్నాడు. కానీ, మరొక్కసారి ఆలోచించమన్నాడు. సదా స్మరిస్తే నీవెంట వుంటానన్నాడు.

ఇక వాసుదేవుని రథం పరుగు తీసింది. పాండవులను చేరింది. విషయం తెలిసింది. యుద్ధ సంరంభం - ముహూర్త నిర్ణయం జరిగింది.

అవతలివారి బలాబలాలు తెలిసిన కృష్ణుడు, కర్ణుని మాటల్ని గూడా మనసులో పెట్టుకున్నాడు. ఇక్కడ - యుద్ధసేనలోని యోధానుయోధులను నిర్ణయించి, వారి వారి పాత్రలను వారికి ఆధిపత్యమొసగదలిచాడు. ఆ సమయంలో - చెయ్యవలసిన సేనా - విభాగ - గణనం గూర్చి ఆలోచిస్తూంటే, బరువు బాధ్యతలు మోయలేనివానిగా -

"కృష్ణా! అన్నీ తెలిసిన నీ ఆదేశం మాకు శిరోధార్య"మన్నాడు. అందరిని కూర్చోమని - ప్రస్తుత పరిస్థితిలో - దీర్ఘకాల యుద్ధానికి సరిపడా నిలబడగల వీరుడు, ప్రత్యేకించి - ద్రోణ మరణం కోసం యజ్ఞవేదిక నుండి, రథకవచాదులతో జన్మించిన దృష్టద్యుమ్నుని - పాండవసేనా వాహినికి సేనాధిపతిని చేద్దామన్నాడు.

అందరు జయ జయ ధ్వానాలు చేసారు.

అప్పుడే శ్రీకృష్ణుడు - మనలోని మహావీరులయిన - పాంచాల, మత్స్య ప్రభువులను; సాత్యకిని జరాసంధ తనయుడు సహదేవుని, యాదవ శిరోమణి చేకితానుని, శిశుపాల కుమారుడు దృష్టకేతుని, భీష్మునికై - తనను అర్పించుకుని వీరత్వమొందిన - శిఖండిని - మూర్ధాభిషిక్తుల్ని చేయండి. ఆ తదుపరి - వసుదేవసుతుడు - వరుసగా చెబుతున్నాడు. పాండుకుమారులు చకచక అవలంబిస్తున్నారు. కావల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్కడ -

ఇప్పుడు తన పిల్లలు - సుఖశాంతులతో బ్రతకాలంటే కర్ణుని ప్రశాంతం చేసుకోవాలి. ఇది కుంతి ఆలోచన. అందుకు కార్యక్రమం ప్రారంభమయింది.

★★★★

"జయము, జయము అంగరాజా!"

"ఎవరు ?" ఆ వచ్చినదెవరో తెలియక ఆశ్చర్యంగా అడిగాడు.

"తమ అనుగ్రహం కోరి వచ్చానంది." చూసాడు. "చెప్పమ్మా! ఈ దాసుడు, తన ధర్మాన్ని తప్పక నిర్వహిస్తాడు. ఏం కోరి వచ్చావని - ఎంతో మర్యాదగా అడుగుతాడు. ఆ మాటలు, మన్నన - తీరు ఆమెను ఆశ్చర్యచకితురాల్ని చేసాయి.

అప్పుడామె "అంగరాజా! నేను రాజమాత కుంతీ మహారాణి పరిచారికను. మా మహారాణి, తమతో మాట్లాడవలెనట. అందుకు తమ అనుమతి కావాలి" ఈమెలో వినయం, వివేకం బాగా వున్నాయి.

"ఆ తల్లి... నాతో సంభాషించాలా..?' తప్పక ఈనాడు, రాజకుమారు లందరు, భోజనాలకు వెళ్ళిన తరుణంలో, నేనే వచ్చి ఆ పాండవమాత దర్శనం చేసుకుంటానని విన్నవించు" ప్రార్థనాపూర్వకంగా చెప్పాడు. అదే చెప్పింది పరిచారిక.

రాజమాత కుంతీదేవి, కర్ణునికై ఎదురు చూస్తుంది. ఆ మధ్యాహ్న సమయంలో, కర్ణుడు కుంతీదేవి భవనానికి వచ్చాడు. అతనికోసమై ఎదురుచూసే, ఉదయం వచ్చిన ఆంతరంగిక పరిచారిక, మహారాణి, ఆంతరంగిక మందిరంలో వున్నారని లోపలకు తీసుకు వెళ్ళింది.

ఆ వచ్చిన కర్ణుని చూస్తూనే, ఆ తల్లి పుత్ర ప్రేమను దాచుకోలేక, వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ "రా! నాయనా!" అని ఆహ్వానించింది. "పాండవుల మాతకు, ఈ రాధేయుడు కర్ణుడు సాష్టాంగ వందన మర్పిస్తున్నాడు. తాము పిలిచిన కారణం శెలవియ్య ప్రార్థనమన్నాడు. ఆ వినయ భూషితుని చూసి, హృదయాంతర్గత బాధను ఆపుకోలేక - తడబడే గొంతుకతో, దుఃఖంతో మాట రాక, క్షణమాగి గొంతు పెగల్చుకుని "నాయనా! ఆ మాటకు. నీవు రాధేయుడవు కావు. ఈ కుంతీపుత్రుడవు. సూతపుత్రుడవు కావు - సూర్యపుత్రుడవు.

నాకర్మకొద్దీ నిన్ను జారవిడుచుకున్నాను.'' ఆపుకోలేని దుఃఖంతో, రాజమాత కనుక బావురుమని ఏడ్వలేక - గొంతులోని దుఃఖాన్ని దిగమ్రింగింది. కంటిలోని దుఃఖాన్ని ఆపుకోలేక జలజల రాల్చేసింది.

"తెలుసమ్మా! నిన్ననే కృష్ణుడు, అంతకుముందు నా తండ్రి సూర్యుడు, ఈ పరమ రహస్యాన్ని బయటపెట్టారు. ఏది ఏమైనప్పటికి లోకానికి ఈతడు సూతపుత్రుడు, రాధేయుడు. ఇప్పుడు చేయవలసింది చెప్పండి. ఆజ్ఞాపించే అదృష్టాన్ని మీరు, ఆదేశాల్ని విని, ఆచరించవలసిన అదృష్టం - నేను - కోల్పోయాము. అయినా - అన్యధా భావించక, నా బ్రతుకును కొద్దిగా తెల్పితే - ఆ దురదృష్టాన్ని పొందవలసిన దౌర్భాగ్యాన్ని తెలుసుకుని, హీన చరిత్రుడను, నేను కానని, సమాధానం చెప్పుకుంటానన్నాడు. అప్పుడామె -

"ఒకనాటి వుదయం, సూర్యదేవుని చూస్తూ దుర్వాస మహర్షి ఇచ్చిన మంత్రాన్ని పరీక్షించబోయినందులకు, సూర్యుడు కరుణించి, నిన్ను ప్రసాదించాడు. కాని కన్యను, కులకాంతను బ్రతుకు నడుపుకోవడం చాతకాక చేసిన పాపం - నీకీ దురదృష్టాన్ని కల్గించింది.

"లేదమ్మా!'' అంతమాటనకు. పిల్లలు లేని, వారు చేసేది సూతవృత్తయినా, ధర్మంగా, దర్పంగా పెంచారు. ఎటొచ్చి కాలమే నన్ను కనికరంచలేదు. కాలాధిపతి, నిర్ణయాత్మకుడైన నా తండ్రి సూర్యదేవుడు నన్ననుగ్రహించలేదు.

"సరే... జరిగిందేదో జరిగింది. దీనిని మన మధ్యలోనే వుంచుకుందా! ఈ సత్యం తెలిస్తే పాండవులు యుద్ధం చెయ్యరు. పొందిన అస్త్రశస్త్రాలు అవమానాల పాలవుతాయి. నీరసించి - నిగ్రహం కోల్పోతాయి. నా వలె అవి కూడా, వ్యర్థ జీవితమౌతాయి.

పాండవులు ఎప్పుడూ పంచపాండవులే తప్ప ఆరుగురు కారు. లోక విరుద్ధంగా ప్రవర్తించరని మనస్ఫూర్తిగా, తల్లికి, నమస్కరించి, వచ్చిన దారిన, వచ్చినట్లే - పరమశాంతమూర్తిగా, ఆ కుంతీపుత్రుడు వెనుదిరుగుతాడు.

★★★★

కురువంశ యువరాజు దుర్యోధనుడు తన తండ్రి రాజయినప్పటికీ తానే రాజుగా కర్ణునికి కబురు పంపుతాడు. సైన్యవిభాగం వగైరా వివరాలన్నీ మాట్లాడతాడు. పితామహుడు భీష్మలవార్ని సర్వసైన్యాధ్యక్షునిగా చేస్తాడు. అక్కడనుండి సైన్యం విభజన - అతిరథ, మహారథుల ప్రకటన, వగైరాలన్ని జరుగుతాయి. ఇది ఇక్కడ సమాచారం.

అక్కడ - బలరాముడు - తానెవరి పక్షం వహించనని, నేనెవరికి ధర్మాధర్మముల గురించి సూచనలు చెయ్యనని, కృష్ణునికి చెప్పవలసింది చెప్పాడు. అయినా జరగవలసినది జరిగిపోయిందని, ఇప్పుడు కృష్ణుని నిర్ణయమే తన నిర్ణయమని, అతడు - ఆయుధము పట్టక, పార్థునికి సారథిగా నిమిత్తమాత్రుడిగా జరిగేదానికి సాక్షిభూతుడవుతాడని, నేను - అదీ చెయ్యలేక - ఇరుపక్షముల నాశనం చూడలేక- నా దారిని నేను తీర్థయాత్రలు చేసుకుంటూ వుంటానని, తన నిర్ణయం చెబుతాడు.

పెద్దన్నగా - పెద్దాయనగా - వారికి సముచిత రీతిని వీడ్కోలు పలుకుతారు. ఆ తర్వాత -

అక్షౌహిణి సైన్యంతో, పాండవులకు బాసటగా విదర్భ యువరాజు రుక్మి వస్తాడు. తన సహాయం మీకు అవశ్యం లభిస్తుందని. ఆతని ప్రతాపం బావ ద్వారా తెలుసుకున్న అర్జునుడు "ప్రస్తుతానికి మేము శ్రీకృష్ణ చక్ర రక్షణలో వున్నాం. అది మాకు శాశ్వతం" ఇక్కడే భయాలు లేవు. వాసుదేవుని అభయం లేకుండా అవతలి కూటమి వుంది. మీ మిత్రులు విందానువిందులు కూడా ఆ కూటమిలో వున్నారు. కాబట్టి నీ అవసరము వారికేమయినా అవసరమౌతుందో ప్రయత్నించమన్నాడు.

విధి వెక్కిరించినట్లు రుక్మి వెనుదిరిగాడు. దుర్యోధనుని శిబిరం చేరాడు. అక్కడ - ఇలాగే - సుతిమెత్తని అపహాస్యం - ఎదురయ్యేసరికి, అనవసరంగా వచ్చానని తన రాజ్యానికి తిరుగు ప్రయాణం చేసాడు.

ధృతరాష్ట్రుని పరిస్థితి దయనీయంగా వుంది.

కంటిమీద రెప్ప పడటం లేదు. కునుకురావడం లేదు. అనవసరంగా పుత్ర ప్రేమతో - ఈ పరిస్థితిని తెచ్చుకున్న మహారాజు, వ్యాకుల చిత్తంతో

సంజయుని రప్పించుకున్నాడు. తన ఆవేదన తీరు విధంగా కురుక్షేత్రంలో జరుగుతున్న విశేషాలను తెలిపి తన ఆందోళనను తీర్చమన్నాడు.

"మహారాజా! ఇది స్వయంకృతాపరాధం. మీ ప్రాణ జన్మదాత వ్యాస భగవానులవారే, హెచ్చరించినా, కావాలని కాలాగ్నికి గురయ్యారు. ఇక అది ఆరదు. అది దావాగ్నియై దాని పరిధిలోని అడవినంతంచేసేవరకు, ఇక కాల్చడానికేమీ లేదని తేల్చేవరకు, అలాగ విస్తరిస్తూనే వుంటుంది. అలాగే - మీ ఆలోచనలు - పెంచుకున్న పుత్రప్రేమ - చేసిన దుర్మార్గాలు.

ఇప్పుడు జరుగుతుందేమిటో తెలుసా ? అందరు అనే అక్కడున్న దుష్టచతుష్టయం బాగా ఆలోచించి, మీ వంశ నాశకుడైన శకుని కుమారుడు ఉలూకుని- పాండవుల వద్దకు రాయబారిగా పంపారు. "ఉన్న ఆవేశం పెంపు చేయడానికి. అవతలివారు దయామయులైతే, వారిని దయనీయులుగా చేద్దామనే దురాలోచనతో!

కర్మనెత్తి మొత్తుకున్నాడు. అయినా కుమారునిపై ప్రేమ చావక, 'ఏమిటా... సందేశం ?'' అడిగాడు. ఉలూకుడు, వెళ్ళిన వ్యవహారం, చేయబోయిన రాయబారం, ఇవ్వబోయిన యుద్ధ సందేశం... అంతా... వివరంగా చెప్పాడు. ఇక ఇప్పుడు సంధికాదు కదా! వెళ్ళినవారి అంగసంధులు విడదీసి - మరీ ఆ పాండవులు త్రిప్పి పంపుతారు.

"అంతమాటనకు. సంధిపొసగుతుందేమో!'' అనుమానం వ్యక్తం చేసాడు.

మహారాజా! పిచ్చివాడివో, అనకూడదు కాని వ్యాసులవారు చెప్పినట్లు మూర్ఖుడవో అర్థం కావడం లేదు. మహానుభావుడు, దేవదేవుడు. ఆ వాసుదేవుడు చెబితే వినని మీరు - ఈ నక్కజిత్తుల - కుయ్యుక్తుల - మీ వంశ నాశక - శకుని - కుమారుడు - దుర్భాషల సందేశాన్ని వాళ్ళు గౌరవిస్తారా ? ఆవేశంలో చంపకుండా త్రిప్పి పంపితే చాలు!''

"సంజయా! నువ్వే అంటున్నావా, ఈ మాటలు ?!''

"నేనే కాదు, ఈ రాజ్యంలోని జనాభాలో తొంభై శాతం మంది ఇదే అంటున్నారు. మిగిలిన పదిశాతంలో ఎనిమిది శాతం తటస్థులు, మిగిలిన రెండు శాతం మీకు భట్రాజులు, భజనపరులన్న సంగతి ఇప్పటికైనా అర్థం చేసుకుంటేఅందరికి మంచిది.

"ఇక ఇప్పుడేం చేస్తాం. కర్మమనివార్యం. విధి ప్రతికూలం, అనుభవిం చాల్సిందే!" అంటాడు.

ఆ తర్వాత - దుర్యోధనుడు - తమ సేనలోని వీరాధివీరులు తాత, సర్వసైన్యాధ్యక్షుడైన గాంగేయుని ద్వారా తెలుసుకున్నాడు. అందరి గురించి, వారి వీరత్వ లక్షణాల గురించి చెప్పి - అన్నీ బాగుంటే - మన కర్ణుడు గూడా చెప్పుకోదగ్గ రథుడే - కాని.

అతని కవచకుండాలు పోయాయి. శాపం పైన శాపాలు. దాంతో.... అతడు... దుర్బలుడయ్యాడు. నిజమన్నారు ద్రోణాచార్యులవారు కూడా. అదొక వాదమయింది. అప్పటి పరిస్థితికి వణికిపోయిన దుర్యోధనుడు, ఇరువురిని శాంతించమని ప్రార్థించాడు. కొంత తడవాగాడు.

"పితామహా! మన గురించి చెప్పారు. మరి - ఆ పాండవుల బలం కూడా మనం తెలుసుకోవాలి కదా! చెప్పమన్నట్లు ఆగాడు. అతని అభిప్రాయాన్ని గ్రహించిన గాంగేయుడు -

"కుమారా! నా ధర్మంగా నేను చెబుతాను. అవతల వులిక్కి పడకూడదు. నన్ను నిందించరాదు. నా అనుభవంలోని పరిస్థితిని బట్టి - నేను అంచనా వెయ్యగల సామర్థ్యంతో విషయం వివరిస్తాను. తప్పయితే మన కృప, ద్రోణాచార్యులవారు సరిదిద్దుతారంటాడు.

అందుకు అంగీకరించినట్లు దుర్యోధనుడు చెప్పమని అడుగుతాడు. అప్పుడు శాంతనవుడు "దుర్యోధనా నిజం నిష్ఠూరంగా వుంటుంది. అయినా, చెబుతున్నాను. వినమంటాడు.

"యుధిష్ఠరుడు, అతిరథుడు, అగ్ని సమానుడు. భీముడు, అతిరథ శ్రేష్ఠుడు. నకుల సహదేవులు సమరథులు, సాహసికులు. అర్జునుడు - అతడు శివ సమానుడు. కృష్ణార్జునుల్దిరు కలిస్తే - అక్కడ విజయం తథ్యం. వారినెవరూ ఎదిరించలేరు. నిరోధించి నిర్జించలేరు. నిజం చెప్పాలంటే - ఆ విజయుడొకడు చాలు. మన వీరుల పనిబట్టడానికి. ఇక - ద్రౌపదీసుతులు - మహారథులు. సమర స్వరూపులు.

అభిమన్యుడు, అతిరథ శ్రేష్టుడు. తండ్రి మామలకు దీటైన జన్మతః వీరుడు. సాత్యకి రథోత్తముడు. పాంచాల, విరాటులు మహారథులు. పాండవుల కోసం వాళ్ళు ప్రాణాలను తృణప్రాయంగా విడువగల సమర్థులు. దృష్టద్యుమ్నుడు సరేసరి. మహాగ్ని కుంతిభోజుడు అతిరథుడు. భీమసేన సుతుడు - ఘటోత్కచుడు, వీరలందరికి తలమానికము. ఇది విన్న దుర్యోధనునిలో కొంత కంపరం బయలుదేరింది. "తాతా! వాళ్ళను నిర్జించాలంటే, నీకెంత కాలం పడుతుంది" అడుగుతాడు. అర్జునుడు నన్ను నిలువరించే వరకు - దినానికో వెయ్యిమందిని కూల్చ గలను. మొత్తం పాండవుల బలం కూల్చడానికి, నాకొక మాసం చాలు. అయితే విధి వెక్కిరించకూడదు. అప్పుడు నేను అసహాయుడనంటాడు.

"మీరో గురుదేవా! అనగా - "నాకూ వయసు వస్తూంది. తాతగారి వలె విక్రమిస్తాను. కృపాచార్యులు రెండు నెలలంటే, అశ్వత్థామ నాకు పదిరోజులు చాలంటాడు. నాకు అయిదే రోజులు చాలు - కర్ణుడంటాడు. గాంగేయునితో కలిసి అందరు ఫక్కున నవ్వుతారు.

ఇదంతా చారులవలన తెలుసుకున్న ధర్మరాజు "అర్జునా!" అంటాడు. నీకెన్ని దినాలు పడుతుంది! ఆశగా అడుగుతాడు. అప్పుడు -

"అన్నా! నీవు వాసుదేవుడు కరుణించి, ఆశీర్వదిస్తే - ఆ పాశుపతాస్త్రం ఉపయోగిస్తే ఒక్క రోజు చాలు. ఒక్క క్షణంలో అది సర్వ శతృసంహారం చేస్తూంది. అది కాదనుకుంటే మన ధర్మం మనల్ని రక్షిస్తుంది. వీరవిహారం చేస్తాము. విజయం తప్పక వరిస్తుంది. పాండునందనల ధర్మవర్తనం లోకానికి ఆదర్శమౌతుంది. నీవు సార్వభౌమునిగా కీర్తి గడిస్తావు! ఇది "తథ్య"మని - కృష్ణవాసుదేవుని కృప నర్థిస్తూ ముందుకు సాగుదాం. విజయాన్ని మూటగట్టుకుందాం. విజయ ధ్వజమెగుర వేద్దామంటాడు.

# ఉపశమనం!

**నే**డో, రేపో... ఏ క్షణమో చెప్పలేము. యుద్ధభేరీలు మ్రోగుతాయి. పరిస్థితులను సమీక్షిస్తే మేము అధర్మపరులమని, తమ నాశనం తథ్యమని ఆర్యావర్తమంతా శపిస్తున్నట్లు పలుకుతుంది. ఆ సమయంలో - అంధరాజు - తన గ్రుడ్డితనానికి తోడు, మానసిక వైకల్యమొందాడు. ఏం జరుగుతుందో, ఏం వినాలో.... ఆత్రపడుతున్నాడు. అప్పుడు.. ఆ కుమారుని వేదనను గ్రహించినట్లు, వేదవ్యాసులవారు వచ్చారు.

"నాయనా, భయపడకు. బాధపడకు. ఈ యుద్ధం చేసేవారిలో తొంభై మంది ఆయుర్దాయం తీరిపోయింది. వారీ విలయంలో ప్రాణాలు పోగొట్టుకొనక తప్పదు. అందరితోపాటు, నీకు అంధత్వదోషం కనుక లేకపోతే, అనునిత్యం నా తమ్ముని పిల్లలనే బదులు, పాండుపుత్రులనే వారిపై శరసంధానం చేసేవాడివి. నీ కుమారునివలె నీ, పగదీర్చుకొనెడివాడవు.

ఇష్టమున్నా లేకపోయినా, మీ మోచేతి నీళ్ళు త్రాగుతున్నందులకు, ప్రతాపం, మమతానురాగాలను చంపుకుని - బాహ్లిక, భీష్మ - ద్రోణ, కృపులు అధర్మ యుద్ధమని తెలిసీ కూడా, ఆయుధాలు పట్టారు. అవతలివారు నిరపరాధులని తెలిసికూడా, అస్త్రాలనుపయోగించబోతున్నారు.

కావాలంటే... చెప్పు. కళ్ళిస్తాను. నీవు వెళ్ళి నీ ప్రతాపం చూపు. లేదా నీ పిల్లలు, పాండుపుత్రుల మధ్య నీవు కోరుకున్న యుద్ధం - విజయాన్నే ప్రసాదిస్తుందో, విషాదాన్నే మిగులుస్తుందా, స్వయంగా చూసుకుందివిగాని!"

వ్యాసుని మాటలకు ధతరాష్ట్రుడు గుడ్డివాడైనా "అంత మాటనవద్దు. నాకు నేత్రాలు వద్దని ఆ గుడ్డి నేత్రాలను అలాగే మూసుకున్నాడు. అయితే ఈ సంజయునికి దివ్యశక్తి - దృష్టి ప్రసాదిస్తాను. అక్కడ జరిగేది, జరుగుతున్నట్లు - ఎక్కడ ఏ మూల, ఎలాగ జరిగిన ఇతనికి తెలుస్తుంది. అతను నీకు వివరించి చెబుతాడు. సరేనా ?" అంటాడు. అందుకు, ధృతరాష్ట్రుడు ఒప్పుకుంటాడు.

ఆ వెంటనే వ్యాసులవారు - సంజయా! జాగ్రత్త, దొరికిన అదృష్టాన్ని జారవిడుచుకున్నా, దురభిమానమును ప్రకటించుకున్నా దిక్కుమాలిన చావు

చావాల్సి వస్తుంది. కనుక జాగ్రత్తగా చూసింది చూసినట్లు, జరిగింది జరిగినట్లు, ఈ కుమారునికి తెలియబరచు.

"విధివిపరీతం!" ఏం చేస్తాం... విని... ఆ దౌర్భాగ్యాన్ని - కళ్ళారా చూడలేక పోయినా, విని, విని ఏడుస్తుంటాడు. ఎందుకంటే ఇతడు వజ్రశరీరుడు. చావడు. ఎన్ని దుర్మార్గాలనైనా వింటాడు. బాధను అనుభవిస్తూ బావురుమంటాడే తప్ప గుండె పగిలి చచ్చే దిక్కులేనివాడు కాడు. ఇది - ఆతని జన్మరహస్యం.

"గురుదేవా!" తండ్రి అయినా - ఆ బీజస్తుడైనా, తండ్రిగా చెప్పుకోలేక- "ధృతరాష్ట్రా! ధర్మాన్ని నిగ్రహించలేరు. అధర్మాన్ని బలపర్చలేరు. యుద్ధానికి వెడుతూ కుమారుడు ఆశీర్వదించమంటే, ఆ తల్లి గాంధారి ఏమంది" అడుగుతాడు.

"యతో ధర్మః తతో జయః" అంది అంటాడు. అది సత్యం నాయనా! అసత్యమెన్నడు కాదు.

రేపు అమావాస్య. యుద్ధం ప్రారంభమౌతుంది. గుండె చిక్కబెట్టుకో. ఆ భగవంతుని ధ్యానం చేసుకో. చివరకీ, చివర రోజులైనా... ఏ చింత లేకుండా, ప్రశాంతంగా బ్రతికే అదృష్టమిమ్మని ఆ దివ్యపురుషుని ప్రార్థించుకో! కావలసినది కాక మానదు. జరుగవలసినది జరుగకమానదు." అన్నాడు.

దుర్యోధనుని శిబిరంలో యుద్ధ సంరంభం. దుర్యోధనుడు, తమ్ముడు దుశ్శాసనుని పిలిచాడు. మనమందరం పితామహులకు కవచంగా వుండాలి. ఆ గొల్లవాడు మాయగాడు. ఆ పశువుల కాపరి తన తెలివితేటలతో మనల్ని దెబ్బతియ్యాలని చూస్తాడు. అందులో భాగంగా, ఆ మాయగాడు శిఖండిని, ముందు పెట్టుకుంటే, పితామహులు యుద్ధం చెయ్యరు. అప్పుడు విజయం వారిదవుతుంది. మరణం మనదవుతుంది. కనుక. ఎట్టి పరిస్థితులలోను శిఖండి బయటపడకుండా, తాతగారు - తమ విజృంభణం కొనసాగించేటట్లు చెయ్యాలి. వచ్చిన, కోరుకున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి! హెచ్చరించాడు.

# శ్రీకృష్ణోయుద్ధోపదేశం!

**వా**ళ్ళ వాళ్ళ ఉత్సాహులతో సమరసేన సిద్ధంగా వుంది. ఈ సమయంలో సాంప్రదాయబద్ధంగా "ఇరుపక్షాల వారు, తమ తమ అభిప్రాయాల మేరకు, తాము కోరిన పక్షంలోనికి మారవచ్చును. లేదా... వారి వారి పక్షాలలోనే వుండ వచ్చును. సమరశంఖం వూదేలోగా - ఈ మార్పులు జరగాలని తెలియచేసారు.

ఈ ప్రకటన వెలుడే సరికి, అంతవరకు, బలవంతంగా, నిరుత్సాహంగా కౌరవసేనలో వున్న ధృతరాష్ట్రునికి మరో భార్య యందు జన్మించిన "యయుత్సు"డను వాడు, తన సేనా సమేతంగా ధర్మజుని చేరాడు. ఆ వచ్చిన సోదరుని, ధర్మరాజు ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు. తన సేనలో కలుపుకున్నాడు.

ఇది విన్న దుర్యోధనుడు మండిపడ్డాడు. తన కుల, గురు, పెద్దలందరు - శతృవు విజయం పొందాలని దీవిస్తే -

ఈ సోదరుడొకడు, తనను కాదని ధర్మరాజుతో కలిసినందులకు కుపితుడౌతూ, భీష్మద్రోణులను విడిచి, తాను సమరశంఖం - పూరించి వుండాల్సిందని - అప్పుడనుకున్నాడు.

సరిగ్గా - ఇదే సమయంలో రథం దిగి, యుధిష్టరుడు వడివడిగా వెడుతుంటే, సోదరులందరు ఆశ్చర్యపోతున్నారు. కృష్ణుడు మందహాసం ప్రకటిస్తున్నాడు.

"అన్నా... ఒక్కొక్కరు అతన్ని వెండిస్తున్నారు. ధర్మరాజు - ఒక విగ్రహము వలె నిగ్రహంతో పితామహులు - భీష్ముల వారిని దర్శించాడు. వారి పాదాలకు నమస్కరించాడు. "తాతగారూ! మీ చేతులలో, తండ్రి ప్రేమ తెలియకుండా పెరిగిన మేము, ఈనాడు విధివిలాసంగా యుద్ధం చేయవలసి వచ్చింది. క్షమించండి. నిండు మనస్సుతో విజయులం కావాలని దీవించండి.

"తప్పక... సంతోషంతో పొంగిపోతూ... ఇక్కడికి రాకుండా, సమరశంఖం పూరిస్తే, నా చేతులలో అప్పుడు పెరగడం కాదు ఇప్పుడు మరణించడం జరిగేది. ధర్మం మీ వైపున్న ధర్మమూర్తులు, స్వయాన ధర్మజుడివి, తప్పక విజయం

సాధిస్తా వన్నారు. అన్నతో సమానంగా మిగిలిన సోదరులు తాతగారికి నమస్కరించారు. దీవెనలందుకున్నారు.

అటునుండి - గురుదేవులు, ద్రోణాచార్యులను, అక్కడ నుండి కృపాచార్యుల వారిని దర్శించారు. ఆశీస్సులనపేక్షించారు. శత్రువులు కూడా పాండవులు నిజమైన ధర్మమూర్తులని ఆశీర్వదించే విధంగా నడుచుకుంటున్నారు.

తిరిగి వస్తున్న సమయంలో ఓ ప్రక్కగా నిల్చున్న కర్ణుని వాసుదేవుడు చూచి "రంగంలోకి దిగాలంటే కొన్నాళ్ళు మాతో వుండు. ఆ తదుపరి నీ ధర్మం నీవు నెరవేర్చుదువు గాని. ఈలోగా కొన్ని మెళకువలు తెలుసుకుందువుగాని'' అనగా, "నా ప్రాణం. దుర్యోధనుని వద్ద. కట్టె ఇక్కడ వుంది. కర్ణుడు గూడా అధర్మపరుడుగాడు. ఆ సంగతి నీకు తెలియనిది కాదని, కృష్ణునికి నవ్వుతూ చెప్పాడు.

# యుద్ధోపదేశం

ఉభయ సైన్యాలు - తమ తమ వైపుల నుండి సమరశంఖం వినబడగానే ముందుకు వురకడానికి సిద్ధంగా వున్నారు.

"ధర్మక్షేత్రే... కురుక్షేత్రే...!'' కృష్ణుడు - ఈ యుద్ధ సమయంలో - భగవద్గీతగా - ఈ విశ్వానికి అందించిన విమల సందేశం, ఇక్కడ నుండే వచ్చింది.

శారీరక - మానసికంగా గుడ్డివాడైన ధృతరాష్ట్రుడు, వ్యాసశక్తితో, సర్వాన్ని దర్శించగల - దివ్యదృష్టి గల సంజయునితో.... సంజయా... "ధర్మక్షేత్రే... కురుక్షేత్రే సమవేతాయుయుత్సవః!'' "ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో - యుయుత్సవునితో కలిసి -'' అన్నాడు వెంటనే- "మామకాః'' అని తన స్వార్థాన్ని - సంకుచిత మనస్తత్వాన్ని "నా వాళ్ళు...!'' అనేశాడు.

"పాండవశ్చైవ...!'' పాండు పుత్రులు... తనకు తగనివారు, ఆ పాండు కుమారులని, వారిని విరోధులుగా, మనస్సంతా నింపుకున్నట్లు...ఆ పాండవులు... "కిమకుర్వతి... సంజయా!'' అనేసాడు.

"సంజయా! అని ముందుగానే అడగడానికి ప్రారంభించిన - ఆ శారీరక, మానసిక అంధరాజు ధృతరాష్ట్రుడు... "కిమకుర్వతి... అంటే ఏం చేస్తున్నారు ?" మహారాజు మనస్తత్వానికి సంజయుడు నవ్వుకున్నాడు. ఇక అతనికి సుద్దులు - సూక్తులు చెప్పవలసిన పనిలేదని అర్థమయింది. విన్న ఆ సంజయుడు... తనకు వ్యాసభగవానుడు ప్రసాదించిన - శక్తితో -

"నీ కుమారుడు, దుర్యోధనుడు, ద్రోణాచార్యులవార్ని దర్శించి, గురుదేవా! మీ శిష్యుడు, ద్రుపదరాజు కుమారుడైన దృష్టద్యుమ్నుడు కలిసి మహాద్భుత వ్యూహాన్ని పన్నారు. అందులో ఎందరో అతిరథులున్నారు. మన పక్షంలో అరివీర భయంకరులైన తాతగారు భీష్మలవారు సైన్యాధ్యక్షునిగా, తమ నేతృత్వంలో, గురుదేవులు కృపాచార్యులవారి సహకారంతో అగ్నిసముడు, అపర మహేశ్వరుడైన నా మిత్రుడు, తమ కుమారుడు అశ్వత్థామ సారథ్యంలో... మహామహులు వున్నారు.

అందరం కలిసి, ఒక్క ప్రక్కన మన సర్వ సైన్యాధ్యక్షులైన పితామహులు భీష్మలవారిని పరిరక్షించుకుంటూ శత్రుసేనను కకావికలు చేద్దాం. వూదండి విజయశంఖం... అర్థించాడు. ఈ మాటలన్నీ వింటున్న పితామహులు భీష్మలు సింహనాదం చేశారు. సమరశంఖమూదారు.

ఆ వెంటనే గురుదేవులు, మిత్రులు, హితులు, సర్వులు శంఖధ్వనులు చేస్తూంటే... మంగళతూర్యారావాలు, యుద్ధభేరీలు - తప్పెట్లు - కొమ్ము బూరాలు... ఆ యుద్ధభూమి అదిరిపోయేటట్లు పలికిస్తున్నారు. వినిపిస్తున్నారు.

ఇది దుర్యోధనుల ఉత్సాహం. ఇక -

పాండవసేనలో, కృష్ణుడు - "పార్థ" సారధి అయ్యాడు. తెల్లటి గంధర్వాశ్వములు పూన్చిన రథముపై కపిధ్వజంతో అర్జునుడు శంఖమూదించ సిద్ధంగా వున్నాడు. ఒక్కసారిగా రణభేరీలు, దుందుభులు... వీరణాల వాతావరణంతో, అర్జునుడు.... మొత్తం రణరంగాన్ని కలయచూసాడు.

శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు.

అర్జునుడు దేవదత్తాన్ని పూరించాడు. పాండవ సేనలలో విజయోత్సాహం, వీరోత్సాహం బయలుదేరింది.

అదే సమయంలో - ధర్మరాజు - అనంత విజయాన్ని, భీముడు "పౌండ్రకాన్ని"; నకుల సహదేవులు - సుఘోష, మణి పుష్పకములను పూరించారు. ఆ వెంటనే కాశీరాజు, పాంచాల కుమారుడు శిఖండి, విరాటరాజు, ద్రుపదుడు ద్రౌపదీ కుమారులు, అభిమన్యుడు... వరుసగా తమ తమ శంఖాలను పూరించారు. కురుసేనలో గుబులు పుట్టించారు.

ఆ శంఖధ్వనులు - సింహనాదాలకు కురుక్షేత్రమంతా సమరశంఖంతో మార్మోగింది. కౌరవవీరులు, సేనల గుండెలు ఝల్లుమన్నాయి.

అర్జునుడు గాండీవం పట్టుకున్నాడు. ధనుష్టంకారం చేస్తున్నాడు. ఇక బాణం విడిచిపెట్టాలి.. ఎవరిమీదకు ? ఇలాగ ఆలోచిస్తూ "బావా! మన రథాన్ని ఉభయసేనల మధ్యకు తీసుకువెళ్ళమని అడిగాడు. అప్పుడు యుద్ధం చెయ్య ఎవరెవరు వచ్చారో తెలుస్తుంది. ఉత్సాహంగా యుద్ధం చేయ ఉవ్విళ్ళూరు తున్నాడు.

అర్జునుడు కోరిక ప్రకారం - రథం - ఉభయసేనల మధ్య నిలిచింది. అందరిని ఉత్సాహంగా అర్జునుడు చూస్తున్నాడు. ఒక్కొక్కరే కనుపిస్తున్నారు. ముందు భాగంలో - ఎదురుగ్గా తమను పెంచి పెద్ద చేసి, విద్యాబుద్ధులు గఱపి, రాజ్యభాగమిచ్చిన తాతగారు, భీష్ములవారు కనబడ్డారు. ఆ ప్రక్కన గురుదేవులు ద్రోణాచార్యులవారు, ఆ ప్రక్కన కృపాచార్యుల వారు. కులపెద్ద బాహ్లికులవారు. ఒక్కొక్కరే కనుపిస్తున్నారు. చూసేకొద్దీ అర్జునునిలో ఉత్సాహం సన్నగిల్లుతుంది. ఉద్వేగం ఉబికి, ఉబికి వస్తుంది.

ఎటుచూసిన బంధువులు, బాంధవులు, తాతలు, తండ్రులు, మామలు, మేనమామలు,... అందరు తనవాళ్ళే తనవాళ్ళను తాను, శతృవులుగా తలచి యుద్ధం చేయటమా ? చంపడమా ? అందుకిది సన్నద్ధమా ? దడ, భయం, వణుకు. గొంతు తడారిపోవడం కళ్ళ వెంట నీళ్ళు ఏదో అయిపోతుంది.

వీరత్వం స్థానంలో దయ, ఆవేశం స్థానంలో జాలి, కోపం స్థానంలో - కరుణ.... ఒక్కొక్కటే చెప్పకుండా, చిత్రంగా అర్జునునిలో వచ్చి చేరుతున్నాయి. వీరుడు భీరువయ్యాడు. మానవత్వం పెల్లుబుకుతుంది. నరాలు పట్టు తప్పాయి. గాండీవం జారిపోతుంది. "బావా!" అలాగే క్రిందకు జారిపోబోతున్నాడు. ఆ తర్వాత మాట లేదు.

"అర్జునా...!" ఉలుకు - పలుకు - కదలిక లేదు. కళ్ళప్పగించి బొమ్మలాగ చూస్తున్నాడు. ఏమయింది ? కృష్ణుడు ప్రశ్నిస్తున్నాడు. నోట్లోంచి మాట వచ్చే సావకాశం కనబడటం లేదు.

పరిస్థితి వూహించుకున్నాడు. ధైర్యము తావులు తప్పింది. పిరికితనం ప్రోగు చేసుకుంది. మమతానురాగాలు పెరిగాయి. అసూయ ద్వేషాలు తరిగాయి. ఏదో చేస్తాడు. వుద్ధరిస్తాడనుకున్న అర్జునుడు, ఊకదంపుడు కబుర్లతో భీకరాస్త్రాలను సంపాదించాను. బావా! నీవు ఆశీర్వదిస్తే శత్రుమూకలు, ఒక్క క్షణంలో నాశనం చేస్తానన్న అర్జునుడు ఇదిగో ఇలాగ జారిగారి పోతున్నాడు. బాగుందనుకున్నాడు. ఇప్పుడు వెన్ను చూపకుండా, అర్జునుడిని కాపాడుకోవాలి. అప్పుడు -

వీళ్ళంతా నా బంధువులు. నా రక్తం పంచుకున్న అన్నదమ్ములు. వారు రక్తమిచ్చిన తాతలు, తండ్రులు. ఇంతమందిని చంపితినే ఆ రక్తపు కూడు నాకు వద్దు. అడవులలో ఇదివరకటి వలెనే ఆకులలములు తింటూ బ్రతుకుతాను. అంతా చచ్చిపోయాక, ఎందులకీ రాజ్యం, ఇది ఎవరి కోసం ? ఈ శవాలు, పీనుగులపై - ఆ తర్వాత పొందే ఆధిపత్యం, అధికారమదం, నాకు వద్దు. ఈ రాజ్యము వద్దు - ఆ సుఖములు వద్దు. వంశకర్తలు, విద్యగరపిన గురువులు, పెంచి పెద్దచేసిన తాతలు, ప్రేమించే తండ్రులు.... ఒక్కరేమిటి - వీరినందరిని చంపాలా...!

"గోవిందా! నేను అస్త్రము విడువను. ధనువును పట్టను. అతి పిశాచులై, ఆ దుర్యోధనాదులు నాపైబడి చంపనీ. సుఖంగా చచ్చిపోతాను. వాళ్ళు చెడ్డవాళ్ళే కాదనను. వాళ్ళను చంపితే.... మనము అదేకదా! వారికి, మనకి తేడా ఏముంది ? పెదతండ్రి వుసురులు తియ్యడం తప్ప" ఆ తర్వాత -

వంశనాశనం జరుగుతుంది. కులాచారాలు భ్రష్టమౌతాయి. భర్త విహీనులైన కులకాంతలు దారి తప్పుతారు. అప్పుడు వర్ణసంకరం, కులక్షయం. పితృపితరులు పిండోదకాలు లేక అలమటిస్తారు. ఇందరిని చంపి పొందే రాజ్యం, ఆ లాభం... నాకు వద్దు.

ధర్మ నాశనమైతే పాపం పెరుగుతుంది. దానికి కారణం, మేమవుతాం. కనుక అధర్మం. ఆ ధర్మనాశనం మాకు వద్దు. నన్ను క్షమించు! "ఇక ఆయుధమ్ములు పట్టుకోను. విడిచిపెడుతున్నాను. అంతకంటే ముందు భయంతో, అవే జారిపోతున్నాయి." చతికిలబడిపోతున్న అర్జునునిచూసి -

"ప్రతాపవంతుడవు. శీలసంపద గలవాడివని, నిన్ను చెంత చేర్చుకున్నాను. చేరదీసాను. నీకంటే" ఆ దుర్యోధనుని దగ్గరకు తీస్తే బాగుండేది.

"నువ్వు ఏమైనా అను, నా మనసు వివశమవుతుంది. ఈ తండ్రి, తాత, గురువులు, హితులు, బుధులు, శ్రేయోభిలాషులను చంపలేను. గతంలో నువ్వెం-దుకన్నావంటావేమో ఇంతటి దారుణ దుఃఖం పొందవలసి వస్తుందని తలచక, లేనిపోని ప్రతిజ్ఞలు, ప్రయత్నాలు చేసాను.

అన్న, యుధిష్టరుడు, అంటూనేవున్నాడు. ఎవరి శత్రువులు, ఎవరు మిత్రులు. ఎవరికెవరు ? ఇంత ఆలోచన చెయ్యలేదు - చేసి వుంటే...

"ఆ... చేసి వుంటే, మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలకు వెళ్ళి వుండేవాళ్ళం. ఎక్కడో. అక్కడ, ఈ రక్త, హత్యవంటి యుద్ధం, దీని భయం లేకుండా చేసేవాణ్ణి. అనవసరంగా, నేనోదిక్కని, మా అయిదుగురు కోసం, ఇంతమంది దారుణ వధకు గురవడం "ధర్మమా" నీవు ధర్మమూర్తివి కదూ!".

"పిచ్చి కుదిరింది, తలకు రోకలి చుట్ట"మన్నట్లు తయారయిందా అర్జునుని పరిస్థితి. ఇక లాభం లేదు. నలుగురు నవ్వే ముందు, ఈతని ఉన్మాద-పైత్యం శత్రువులకు తెలిసిపోయేముందే, ఇతన్ని సంస్కరించాలి. లేదంటే... ఇతనిమీద పెట్టుకున్న ఆశలు, భ్రమలు - ఎండమావులై పోవడమొకటి.

అర్జునుడే - సత్యం తెలుసుకున్నాడంటే. "నేనేమిటి... ?!" అని పెద్దబావ మొదలెడితే ఆ ప్రక్కన రంకెలు వేసి, జబ్బలు చరచుకునే భీమయ్య, వారికి మరితోడు, దారి తెన్ను లేని నకుల సహదేవులు... అమ్మో... అంతా... ఈనగాచి నక్కల పాల్జేసినట్లవుతుంది. ఉత్తిష్ఠ! తవ అర్జున...! అని ఈ మోహావేశముల నుండి బయటపడడు, కర్తవ్యమూర్తిని చెయ్యాలి, కాదో, కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లు, ఈ అర్జునుని పేరు చెప్పి నేను అప్రతిష్ఠ పాలవుతాను. అవతారమూర్తి కాదు. "అధర్మ"మూర్తినైపోతానని - స్థిరసంకల్పం చేసుకున్న వాసుదేవుడు -

"అర్జునా!" అని అతన్ని విషాదయోగం నుండి బయటపడవెయ్యాలని తలిచాడు. కర్తవ్యబోధనం ప్రారంభించాడు. "ఏమిటీ శోకం, ఎక్కడనుండి వచ్చింది ? దీనికెవరు కర్తలు, ఇప్పుడిది అవసరమా ? ఇది నల్గురు మెచ్చుకునే, నిను కన్నవారికి పేరు ప్రతిష్ఠలు - సంపాదించిపెట్టే పనికాదు. ముందీ పిరికితనాన్ని

పోగొట్టు. కర్తవ్యం గురించి ఆలోచించు. నిన్ను తలచుకుని, నీకు అండగా నిలిచిన వాళ్ళందరు నవ్వుల పాలవుతారు. నీకు ముందు బ్రతుకు వుందేమో గానీ, వారికి ఈనాటితో ఆయువు చెల్లినట్లు బ్రతుకు కథ పూర్తవుతుంది. చావలేక, బ్రతికే ఆ దిక్కుమాలిన చావుకు పణంగా పెట్టిన-

పౌరుష ప్రతాపాలు, నవ్వబడిపోతాయి. గౌరవ మర్యాదలు నశించి పోతాయి. పొరపాటున నీ గొప్పతనానికి పొంగిపోయి, వారి పిల్లలకు నీ పేరు పెట్టుకుంటే, ఇది విన్న మరుక్షణం - ఇటువంటి పిరికిపంద, అసమర్థుడని తలచుకోకూడదని, క్రొత్తపేర్లు పెట్టుకుంటారు. ఇంత బ్రతుకు బ్రతికి ఇంటివెనుక చావడమంటే, ఇదే....!

ఈ చావు నీతో పోవడం లేదు. నీ అన్నదమ్ములను బలి తీసుకుంటుంది. బ్రతుకు దుర్భరం చేస్తుంది. ఇన్ని అవమానాలకు మూలకారణం నీవే కావాలా ? ఆలోచించు. సర్వవిజయాలకు విజయుడవవుతావని, ధనుంజయా, నిన్ను శత్రుంజయునిగా తలచినవారు బ్రతికి వుండగానే, ఉత్తరగతులను చేసే దిక్కుమాలిన స్థితికి రాకు. రాబోకు.

"అదికాదు బావా! భీష్ములవారు మాకు తాతగారే కాదు. మమ్ము చేరదీసి, విద్యాబుద్ధులు చెప్పించి పెంచి పెద్ద చేసినవారు. అటువంటి....

ఇంక మాట్లాడకుండా వుంటే చాలా మంచిది. ఇప్పుడా తాతగారు, నువ్వు నోరుమూసుకుంటే అస్త్రం పట్టారా ? శస్త్రం వదలరా ? ఏమిటి మూర్ఖత్వం బేలతనం. ఆ తాతగారు నీ అసమర్థతను, ప్రగల్భాలను తలుచుకుని ప్రస్తుత పరిస్థితికి తలవంచుకుంటారు. ఆ సంగతి నీకు తెలుసా ? ఆ మహావీరునికి మనుమడినని అవమానం తెస్తావా ?" మగవారికి వుండవలసిన లక్షణం ఒక్కటీ కనబడటం లేదు.

బహుశ ఒక సం॥రం, అటు ఇటు కాని పేడిగా వున్న పరిస్థితి. ఇంకా నీ నుండి విడిపోలేదనుకుంటాను. అందుకునే - ఓ నపుంసకుడివై పోయావు. నీ ధర్మాన్ని నువ్వు మరచిపోతున్నావు.

"అర్జునా! చావు పుట్టుకలు అనివార్యమైనవి. పుట్టినవారు మరణించక తప్పదు. మరణించినవారు జన్మించక తప్పదు. కాలచక్రంగా ఈ జన్మజన్మల చక్రం తిరుగుతూనే వుంటుంది. తెలివిగలవారు దీనిని గురించి శోకించరు. మూర్ఖులు మాత్రమే శోకిస్తారు. ఇది తగదు. కనుక ప్రతివ్యక్తి జన్మరాహిత్యానికి ప్రయత్నించాలి. అయినా చావు తప్పదని తెలిసి భయపడట మనవసరం.

కర్మ గతిననుసరించీ సాగే, ఈ జనన - మరణచక్రం నుండి ఏ ఒక్కరు బ్రతికి బయటపడలేరు. నువ్వు చంపుతున్నానంటున్నావు. కేవలం అది ప్రయత్నం మాత్రమే. ఈ ప్రయత్నమే పరమార్థమనుకుంటే, అది మూర్ఖత్వం. అందులో నుండి బయటపడాలంటే జ్ఞానం కావాలి. ఇది జన్మ సంస్కారం వలన లభిస్తుంది. దీనికి విచక్షణ - మవసరం. వివేకహీనుడు, గుణశీలకర్మ భ్రష్టుడౌతాడు. భ్రష్టాచారానికి నువ్వే కారణమౌతావో, దానికి తెరేదించుతావో... అది నీ ఇష్టం. ప్రస్తుతమది నీ చేతులలో వుంది.

జన్మ కర్మచేయడానికే తప్ప, ఆ - "కర్మలు". అకర్మలు కాకూడదు. జన్మలకు తావీయరాదు. మరణమనేది జీవి ప్రయాణానికి కారణం మాత్రమే. ఇది శరీరం వలన వచ్చిన దుర్గతి. అయితే శరీరమున్ననాళ్ళు శరీరధర్మం నిర్వర్తించాలి. భౌతికంగా మనం లేకపోవచ్చును. మన పేరు ప్రతిష్టలు, మంచిచెడులు, చేతలు-చేష్టలు నడవడిక "సత్య"ము నిత్యమౌతాయి.

మీ తండ్రి "పాండురాజు" వున్నాడంటావా ? లేడంటావా ? లేడంటే నువ్వెక్కడ నుండి వచ్చావు ? ఆ మాటవిని నీ తల్లి వూరుకుంటుందా ? నీ తండ్రి లేకపోతే, నిన్ను... మరోపేరు పెట్టి పిలువకుండా పాండుకుమారులని, ఎలాగ పిలుస్తున్నారో...

పుట్టిన ప్రతిజీవి తన వునికిని తాత్కాలికంగా కోల్పోవచ్చును కానీ, శాశ్వతంగా వుండేది మనం పెంచుకున్న పేరు ప్రతిష్టలు. ఇక శరీరమంటావా ? దీని అవస్థ నుండి వ్యవస్థ మారిపోతుంది.

పుడుతుంది. పుట్టడానికి దీనికి ముందు రూపం. కేవలం ఒక బొట్టు శుక్లం. అది ఎన్ని రకాలుగా పరిణామం చెందుతుంది. చివరకో జీవిరూపం. అది పెరగడం, పెద్దదవడం, చివికి, జీర్ణమవడం, మళ్ళీ పనికిరాని శరీరాన్ని వదలడం.

ఇది పాతచొక్కా చిరిగిపోతే, క్రొత్తచొక్కా తొడుక్కున్నట్లేదూ ? నువ్వు ఏడిచేది - ఈ శరీరం కోసమా ? దీనివల్ల లభించిన బాంధవ్యం కోసమా ? ఆ బాంధవ్యమే సత్యమనుకుంటే, కనీ-పెంచిన తల్లిదండ్రులను విడిచిపెట్టి, కనిపించినవాళ్ళ కాళ్ళకల్లా మొక్కుతూ, వాళ్ళను కనికరించమంటే, కరుణిస్తారా? కాపాడతారా ? చెప్పు.

వాళ్ళకేం అవసరం ? అలాగే - నిన్ను కన్న తల్లిదండ్రులకు, నీవే దిక్కని, నీపై ఆశలు పెట్టుకున్న వారిని గాలికొదలి, తాతముత్తాత, పినతండ్రి, గురువులు, దేవుడు. అసలు - శాశ్వతమైన ధర్మాన్ని విడిచినవానికి, ఈ కొసరు బంధుత్వాలు పనికిరాని బాధ్యతలు బ్రతికి, బట్టకట్టనిస్తాయా ? ఆలోచించు.

శరీరం చస్తుంది కానీ, అందులోని ఆత్మ చావదు. చావడానికి దానికి ఆకారం లేదు. అనారోగ్యం వుండదు. ఈ రెండు వున్నది శరీరానికి. అందుకనే వాడిని"శరీరి" అనేది. ఈ దేహి, గతాన్ని మరచిపోతాడు. భవిష్యత్తును గ్రహించడు. వర్తమానం గురించి వలవల ఏడిచేస్తాడు.

"ఏడిస్తే ఏమొస్తుంది ?" కంటి నుండి నీళ్ళు కారడం, కళ్ళు మొహం వాచడం. చూసేవాళ్ళకు అసహ్యం. అవునా ? వుందిగా బుర్ర. దానికి పదును పెడితే బుద్ధి వికసిస్తుంది. జ్ఞానం కల్గుతుంది. ధర్మం తెలుస్తుంది. దరి, దారి అర్థమవుతాయి. అప్పుడిది - కర్మ జన్మో - జన్మ కర్మో... తెలుసుకోగల్గుతాము.

ఈ సమయంలో ఇంత వేదాంతమేమిటనకు ? సుఖంగా బ్రతికేటప్పుడు, బ్రతుకు గూర్చిన ఆలోచన రాదు. అవగాహన కుదరదు. అదే కష్టాలలో వుంటే... అరణ్యాలలో మీరు వున్నప్పుడు, మిమ్ము ఓదార్చడానికి వచ్చిన వారిని "మహాశయా! ఇది దుర్భరం... అన్నీ వుండి నావలే... మావలే....నని యుధిష్టరుడు చాలాసార్లు..." అన్నాడు. కాబట్టి -

ముందు కర్తవ్యం ఆలోచించు. అది శ్రేష్ఠమైనదైతే... తప్పక ఆ భగవంతుడు కరుణిస్తాడు. కార్యకారణ స్వరూపుడు - కర్తవ్యాన్నెరుకబరుస్తాడు. అర్థమవు తుందా... ఇంతకుమించి నీకెవరు చెప్పరు. నిన్ను సంస్కరించినందులకు వారికేమీ రాదు కనుక, బరువు - బాధ్యతలు పంచుకోరు - పెంచుకోరు!

ఎత్తిన జన్మను బట్టి కర్మ నిర్దేశించబడింది.

బ్రాహ్మణులు వేదాభ్యాసం చేసి - వైదిక కర్మల నాచరిస్తూ - "పురో"(పుర) హితులై బ్రతకాలి. నిస్వార్థమైన సేవ చేసే వాళ్ళ ఆలనా-పాలనా, ఈ సమాజమంటే. ఈ ప్రజలు చూడాలి. నీకు దొరకని వస్తువులు, వారికీ దొరకవు. కాబట్టి, వున్నదానిలో వున్నంత వారికి అర్పించాలి. ఎవరి కర్మలను ఉచితంగా తీసుకోరాదు. ఇవ్వవలసిన దానికన్న తక్కువ ఇచ్చి లోభిగా బ్రతికేవాళ్ళు,

జన్మజన్మల కర్మ చక్రంలో పడి - దరిద్రమైన - అంతకంటే హీన జన్మలేదన్న స్థితిలో జన్మనెత్తి - ఈ పాపపు కర్మలనుభవిస్తారు.

క్షత్రియులు. వారిది రాజధర్మం. ప్రజాసంక్షేమం వారి నియమిత వృత్తి. రాజు, రాజుగానే బ్రతకాలి. కాని, సూతవృత్తిని స్వీకరించి, చేయకూడని పనులు చెయ్యరాదు. క్షత్రియునిగా పుట్టి, అడుక్కు తింటాను. అడవులకు పోయి గడ్డి తింటానంటే, అది నీ కర్మ కావచ్చును. ఆ వంశంలో మహావీరులుగా పుట్టి - సుక్షత్రియునిగా - వీర మహేశ్వరుడిగా పేరుప్రఖ్యాతులు పొందినవారు - నిన్ను చూసి అసహ్యించుకుంటారు.

నీవంటివాడు తమ వంశంలో పుట్టాడంటే, ఇదేదో వర్ణసంకరమో, కుల సంకరమో.... అయియుంటుందని వాడినాక్షణం నుండి, వారి వంశం నుండి వెలివేస్తారు. అప్పుడు...

అంతకుముందు వరకు, మహావీరుడనుకున్న వాని గతి, "అధోగతి" అవుతుంది. అంతకుముందు తెలియక బిచ్చం వేసినవాళ్ళు, నీకు బిచ్చం వేస్తే పాపమొస్తుందని, నిన్ను చూసి దూరంగా పారిపోతారు. వైశ్యులు - వ్యాపార - *గోపాల వృత్తులను స్వీకరించాలి. శూద్రులు.... అసలు సిసలైన - నిస్వార్థసేవకులు. నమ్మకస్తులు. వీరు జన్మతో భ్రష్టులు కాలేదు.*

*మనం చెయ్యకూడని పనులన్నీ వారిచేత చేయించి వాళ్ళను పనికిరాని వారు, అంటరానివారనే, మనమే నిజమైన పనికిరానివారము, అంటరానివారము. ఈ సత్యము తెలుసుకుని ప్రవర్తించేవారు ధన్యులు" మహానుభావులు, ఇంకా చెప్పాలంటే.... ఆ దైవస్వరూపులు.*

రథసారధ్యం ఎవరు చెయ్యాలి ? నేనెందుకు చేస్తున్నాను.... ఆలోచించు. నీపై గల అభిమానంతో, నీకు గౌరవ ప్రతిష్టలను సంపాదించి పెట్టాలనే వుద్దేశంతో నేను చేయవలసినది కాకపోయినా చేస్తున్నాను. ఇది జీవితధ్యేయం కాని. కర్మకు పరిష్కారం కాదు. ఇది ధర్మానికి గౌరవం. సత్యానికి సన్మానం.

ఇది తెలుసుకుంటే, గాండీవం విడిచి పెట్టవు. నీ ధర్మాన్ని నీవు మరిచిపోవు. నిజంగా మరచిపోయావే అనుకో.... కులదైవాన్ని, స్వధర్మాన్ని విడిచి, ప్రవర్తించేవారు ఏ పాపకూపంలో పడతారో, వంశనాశకులనబడతారో, ఆ కీర్తి ప్రతిష్ఠలను స్వంతం చేసుకుని, భరతవంశ కీర్తిప్రతిష్టలకు మాయని మచ్చగా నిలిచిపోతావు.

కనుక - నపుంసకుడవు కాకు. కర్తవ్యాన్ని మరువకు. నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు. స్థితప్రజ్ఞుడవు కమ్ము. అప్పుడు ఆ భగవంతుని కరుణ, నీ పెద్దల ఆశీస్సులు తప్పక లభిస్తాయి.

నీవు చెయ్యకూడని పని చేయ తలబడితే గాంగేయుడు నిన్ను ఆశీర్వదిస్తాడా? తప్పక నా విజయ రహస్యం తెలియబరుస్తానని - అభయ మొసగుతాడా ? ఇది జీవుల ధర్మం. ఈ జీవి జీవితం కర్మలు చేయాలి. ఈ కర్మలు చేయాలంటే జవసత్వాలు కావాలి. దీనికి ఆహారం. ఇది యజ్ఞం వలన లభిస్తుంది. యజ్ఞాలకు మూలం కర్మ. ఇది అనుసరణీయం. ఆహారం లేకుండా, ఏ జీవి బ్రతుకలేదు.

కనుక ప్రతివ్యక్తి - పోషితార్థం. కొన్ని కర్మలను చేయాలి. అధర్మనాశనానికి జరిగే ఈ ధర్మయజ్ఞం పూర్తిగా నీ చేతులలో లేదు. నీవు కారణం మాత్రమే! కార్యం - క్రియ - ఆ భగవంతుడిది. కనుక - కర్మలను చేయాలి. ఇది కామ్యకం ధార్మికం.... అని రెండు రకాలు. తన క్షేమం కాంక్షించి, చేసేవి కామ్యాలు. లోక క్షేమాన్ని గురించి చేసేవి ధార్మికాలు. ఈ రెండు ఫలాలనిస్తాయి. మొదటిది స్వార్థం. రెండవది నిస్వార్థం.

స్వార్థం - శరీరానిది.... అంటే... భౌతికం. నిస్వార్థం - లోకానిది - అంటే ధార్మికం. ఈ కర్మలను చెయ్యాల్సిందే. కర్మలు చేయకుండా ఏ ఒక్కరు కాళ్ళు చేతులు కట్టుకుని కూర్చోలేరు. అలాగ కూర్చునేవారికి కోరికలుండవు. వారు దేహత్యాగం గురించే ఆలోచిస్తారు తప్ప - కర్మ త్యాగం గురించి ఆలోచించరు.

ఇంత వేదాంతమిప్పుడవసరమా, అనకు ?! కర్తవ్యపరాయణుని చెయ్యాలన్నా, ధర్మం గురించి తెలియబర్చాలన్నా, ఈ బోధ తప్పదు. ఇది చర్చించడానికి కాదు. ఆచరించడానికి! అనుభవించడానికి, ఆరాధ్యమొనరించ డానికి. కావున, ఓ అర్జునా! కర్తవ్యతామూర్తివి కమ్ము. ధర్మం నిర్వర్తించు. బాధ్యతెరిగి ప్రవర్తించు. తెలిసిందా ?! ఇందుకు నీవు త్రిగుణా తీతుడవు కావాలి. సత్వ రజో గుణాల వల్లనే కోరికలు పుడతాయి. ఇవి ఇంద్రియ లోలత్వానికి దారి తీయరాదు. అలాగని - కేవలం - ధర్మానికి అంటిపెట్టుకోరాదు.

మన బాధ్యతలను మనం నిర్వర్తించాలి. సర్వసంగ పరిత్యాగం కాదు కావాల్సింది. అహంకార మమకారాదులను విడిచి కర్తవ్యతామూర్తిగా సలిపే

కర్మలు శ్రేష్ఠం. ఇందులో కోరికలకు తావివ్వరాదు. "బుద్ధిః కర్మానుసారిణి" అని, ప్రతిదానికీ ఈశ్వరేచ్ఛ..... అంటే... కుదరదు.

**ఉదా :** ద్రౌపది నిండుసభలో తనకు జరిగే పరాభవాన్ని తెలుపుతూ నన్ను పిలిచింది. వెంటనే స్పందిస్తున్నాను. ఈలోగా తన ఆత్మరక్షణం తాను చేసుకో సాగింది. అప్పుడు నా అవసరం లేదు. చెయ్యి దాటిపోయింది. చేతులెత్తి పిలిచింది. అక్కడ "నేను" అనే తాను లేదు. అసహాయతకై అలమటిస్తూ - పరమాత్మను కోరింది. అప్పుడా పరమాత్మ- తన ధర్మం తాను, నిర్వర్తించాడు.

నదిలో ఈదే వాడితో ఒడ్డున వుండేవాడు, ఈ నది .... ఒడ్డున వున్నది దేనికంటే, ఆ ఈదేవాడి ఆపద తొలగించడానికి. అలాగే పరమాత్మ. తనను శరణుకోరినవారిని, సర్వదా రక్షిస్తానన్నాడు కానీ - నీతో నాకెంత ? అని నువ్వంటే ఆయన అదేనంటాడు. నీతో నాకెంత ?" అని. ఇది ధర్మమా అంటే అధర్మం మాత్రం కాదు. ఆ ధర్మం తెలుసుకోవాలంటే అధర్మం గురించి తెలుసుకోవాలి. అందుకు అజ్ఞానం పోవాలి.

అజ్ఞానం పోతే జ్ఞానము లభ్యమైనట్లు, అధర్మవర్తనం పోతే, "ధర్మ" మదే ప్రకాశిస్తుంది. ఇంద్రియ వ్యాపారాల నరికట్టడం కాదు కావాల్సింది, వాటిని తొలగించడము చెయ్యాల్సింది. ఎప్పుడైతే గర్వాహంకారములు నశించాయో, ఇంద్రియాలు - అవలీలగా తమ వ్యాపారాన్ని మూసేసుకుంటాయి. అవతలి వాళ్ళ వద్ద తరగని సంపద వుందంటే.... దొంగలు వస్తారు. దోచుకుంటారు. ఏమీ లేదంటే, ఎవరురారు.

ఇది తెలుసుకోవడమే "విషాద పరిహారం." ఇది పోయిందంటే సంతోషానికి స్వాగతం! అప్పుడు ధర్మబుద్ధి లభిస్తుంది. ధర్మం జయిస్తుంది. కర్తవ్యం గుర్తుకు వస్తుంది. కార్యం ఫలిస్తుంది. తెలిసిందా ? శ్రీకృష్ణోపదేశములోని ఇది - అర్జున విషాద యోగం.

# ప్రక్షాళనం

"అర్జునా"- "నేను" సనాతనుడను. సదా ప్రకాశించువాడను.

"నేను" - బావా! కృష్ణా! నీవు కాదా ?.... అంటే "నేను" నేనే. తప్ప "నేను" కాదు. "ఏమిటీ తికమక...!" అనకు. ఇది దివ్యోపదేశం. ఎటొచ్చి యుద్ధభూమిలో చెయ్యవలసి వచ్చింది. ఇదే బాధాకరం. ఇప్పటికైనా సత్యం తెలుసుకోగల్గుతున్నందులకు - సంతోషించు.

ఇదొక అద్భుత యోగం. గతంలో - మొట్టమొదటిగా - ఈ దివ్యయోగం (అదృష్టాన్ని) సూర్యునకు చెప్పాను. అతడు ఇక్ష్వాకునికి చెబితే, ఈ ఇక్ష్వాకుడు, మనువుకు చెప్పాడు. ఆ రకంగా ఇది - మానవలోకానికి అందింది. కానీ, కాలక్రమంలోని మార్పుల వల్ల, ఈ యోగశాస్త్రం మరుగున పడిపోయింది.

మరల ఇన్నాళ్ళకు - నీ పేరున - ఈ లోకానికి అందించాల్సిన అవసర మేర్పడింది. చెప్పడానికి, వినడానికి, విమల - విశుద్ధ - వ్యక్తి కావాలి కాబట్టి, ఇప్పటి నీ అశక్తతను గుర్తించి, ఆ "శక్తి"ని, "ఆసక్తి"ని కల్గునట్లు చెబుతున్నాను. శ్రద్ధగా విను.

చేయవలసిన కర్మలు చెయ్యాలి. చెయ్యకూడనివి, విడువాలి. అంతేకానీ-

కర్మలు చెయ్యమన్నారు కాబట్టి - ఏ పని పడితే ఆ పని చెయ్యకూడదు.

బ్రాహ్మణులు - వేదకర్మలను; క్షత్రియులు - సంఘ - సమాజ - రాజ్య పాలనమును; వైశ్యులు - వ్యాపారాది, సమాజహిత కార్యక్రమాలను - నిర్వర్తిస్తుంటే

నాలుగో వర్ణమైన - సేవా లక్ష్యమూర్తులైన శూద్రులు, పశుపోషణ, సస్యరక్షణ.... ఒక్కటేమిటి సమాజాభివృద్ధికి - కావలసిన ప్రతి ముఖ్యమైన పని వారికే అప్పగించబడింది. దీనిని బట్టి జాగ్రత్తగా ఆలోచిస్తే - ఆ పరమేశ్వరుని దృష్టిలో అందరు అధికులే తప్ప ఏ ఒక్కరు తక్కువ గాదు.

ఇది గ్రహించినవారు ధన్యులు. విషయం ఎవరికి చెప్పామన్నది కాదు ముఖ్యం. ఎందుకు చెప్పామన్నది - కారణం. తదనుగుణంగా నడుచుకోవడం ధర్మం. ఇది గతి తప్పితే - కాలం కూడా మార్పులను పొందుతుంది. ఆ మార్పే

చివరకు - "ప్రళయ"మౌతుంది. విలయాన్ని సృష్టిస్తుంది. ఇది ఆపడానికి - భగవంతుడి నుండి వెలువడిన వేదం - "ధర్మోపదేశం" చేసింది. తదనుగుణంగా ప్రవర్తించమని కోరింది. జన్మమనేది - ప్రతి ఒక్కరికి వుంటుంది. దాని వివరం కొందరికే తెలుస్తుంది. ఫలితం కూడా కొందరికే లభిస్తుంది.

పండించిన పంట రైతు ఒక్కడే తిననట్లు, ఆ సంపదను యజమాని ఒక్కడే అనుభవించనట్లు - భగవంతుడు కూడా - తన ఇచ్ఛాశక్తులను, అందరికి వారి, వారి కర్మలను బట్టి పంచుతున్నాడే తప్ప, తానుగా ఏదీ అనుభవించడం లేదు. ఎందులోను, దేనిలోను భగవంతుడనని తగుల్కొనడం లేదు.

అందుకే ఆ భగవానుని - నిరంజనుడు, నిర్వికారుడు, నిష్కాముడు, నిరాసక్తుడని ప్రశంసిస్తారు. ఇలాగే జీవుడు కూడా వుండాలి. అప్పుడే "నేను" అనే భావం పోయి, సదా - సర్వసృష్టికి మూలమై ఆ "మూలం" గురించే ఆలోచిస్తుంటాడు. అందులోనే లీనమైపోతాడు. అలాగకానినాడు - పునరపి జననం, పునరపి మరణమని - ఈ చావు పుట్టుకల - జన్మచక్రానికి దాసుడై పోతాడు. ఆశలకు లొంగక, కోర్కెలకు పొంగక, నియమిత కర్మలను నిష్కామ బుద్ధితో - ఈశరార్పణంగా చేసేవి సుఖకర్మలై జీవుని జ్ఞానిని చేస్తాయి. మిగిలినవి- అజ్ఞానమార్గంలో పయనింప చేస్తాయి.

యజ్ఞం చెయ్యడం తప్పుకాదు. అది ఈశ్వరార్పణ దృష్టితో చెయ్యాలి. అప్పుడది లోకక్షేమమవుతుంది. ఆ లోకంలో తాను వున్నాడు. కాబట్టి, తనకోసమంటూ - ప్రత్యేకంగా ఏమీ చెయ్యవలసిన పనిలేదు.

సర్వ సమర్పణ భావంతో చేసే యజ్ఞాలు ఎంత శ్రేష్ఠమో జ్ఞాని నిష్కాముడై చేసే కర్మలు కూడా అంత శ్రేష్ఠమైనవి. కర్రలో నిప్పు వున్నట్లే - జీవుడిలో దేవుడున్నాను. దేవుడు - "దేవు"రించి చూసుకున్ననాడు, వారికేమీ తెలియని దశలో ఏడిస్తే కాని తల్లిదండ్రులు ఏమీ ఇవ్వరు. అలాగే భగవంతుడు కూడా కర్తృత్వము తన పైవుంచి చేసే కర్మలకు చక్కని ఫలితమిస్తాడు.

జీవునిపై వేసుకుని చేసే కర్మలకు - వండుకున్న అన్నాన్ని ఎవరికీ పెట్టకుండా తానే తిన్నట్లు - ఆ యా ఫలితాలను కూడా, ఆ దేహియే పొందుతాడు. జీవి సర్వ స్వతంత్రుడు. దేనికి తగుల్కోడు. దేహి - ఇంద్రియలోలుడు. అన్నిటా తానే వుంటాడు.

జీవహింసతో చేసే యజ్ఞంకన్న - జ్ఞాన యజ్ఞం శ్రేష్ఠమైనది. మిగిలిన యజ్ఞాలకు ద్రవ్య శుద్ధి వుండాలి. ఫలాపేక్ష రహితము కావాలి. కోరికలు లేకుండా, ఎవ్వరు ఏ పనిచేయరు. కనుక ఫలితాలు కూడా, ఆయా విధంగానే లభిస్తాయి. ఈ జ్ఞాన యజ్ఞం వలన, ప్రతి ఒక్కరిలోని ఆజ్ఞానం నాశనం చేయబడి "ఆ - "జ్ఞానం"తో, తెలుసుకోదగ్గది చేయదగ్గది - అనబడే ఫలితాన్ని సత్వరం పొందుతాడు. కావున - అన్నిటిలోను జ్ఞానయజ్ఞం సర్వోత్కృష్టమైనది.

కనుక - "అవును - కాదు" అనే సందేహాలను, "చెయ్యాలి - కూడదనే" సంశయాలను ప్రక్కనపెట్టు. నీ ధర్మం నీవు నిర్వర్తించు. ఇందులో పాపం రాదు. విధి నిర్వహణను నిర్లక్ష్యం చేసినా, ఆ కర్తవ్యాన్ని విస్మరించినా, ఘోరపాపాన్ని చేసిన వారందరు పొందే ఆ మహాభయంకర నరకాన్ని పొందాల్సి వుంటుంది.

ఈ వున్న దేహం ధర్మ నిర్వహణమునకు మాత్రమే. ఇది లేకపోతే జీవుడు అస్వతంత్రుడౌతాడు. గాలిలో తేలేవాడు, గాలివాటుగా వుంటాడే తప్ప కర్మలను చెయ్యలేడు. జన్మ ధన్యం చేసుకోలేడు.

ఎనభై నాల్గు లక్షల జీవరాశులలో - ఈ మానవ జన్మ అత్యుత్తమమైనది. అందులో శ్రేష్ఠమైనది "పుర"హితమైన బ్రాహ్మణ జన్మ. ఇందులో అందర్ని రక్షించే క్షత్రియ జన్మ అత్యుత్తములు. జీవుల భాగ్యాన్ని పండించే వైశ్యజన్మ. ఫలాన్ని ప్రసాదించే, వర్ణవ్యవస్థలోని నాలుగవదైన - శూద్ర - జన్మలు, శ్రేష్ఠములు వరుస వెంబడి శ్రేష్ఠతమములు. ఇది గ్రహించి, అడుగుముందుకు వెయ్యి. అది కర్మ నుండి, జన్మ రాహిత్యానికి దారి తీయిస్తుంది.

అన్ని జీవులలోని "ఆత్మ"ను "జీవాత్మ" అంటాము. అది అస్వతంత్రము. ఒక ప్రక్కన దేవుడు, మరొక ప్రక్కన - ఆ దేవుని అధీనంలోని - కొన్ని జన్మ కర్మలు ఇంద్రియాల పేరుతో, అరిషడ్వర్గాల పేరుతో వివేక భ్రష్టుల్ని గావిస్తుంది.

వీటి ప్రతాప ప్రకోపంలో - బుద్ధి మందగిస్తుంది. విచక్షణ కోల్పోతుంది. స్వార్థం పెరుగుతుంది. అది లోభం. అందులోనుండి మదం, అక్కడ నుండి మోహం, దాని నుండి మత్సరం, దీనివలన కోర్కెలు. దానినే "కామ"మంటాము. అది తీరకపోతే - కోపం ఈ అరిషడ్వర్గాలు - ఆరుగురు శత్రువులు - పంచేంద్రియాలను కట్టడి చేస్తాయి.

ఇది పరస్పర శత్రువులై - ఒకరినొకరు ఎలాగ నాశనం చేసుకోవాలా ? అని చూస్తాయే తప్ప దేహిని వుద్ధరించవు. బుద్ధిమంతుడు, జ్ఞాన ప్రకాశితుడైన, నిష్కామ యోగియైన, జీవుడు దేహభావంతో - స్వతంత్ర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టుతాడు.

ఎంతవరకు.... అంటే... "శ్రీ" కారంపోయి, ఛీత్కారం, వెంబడిస్తుంటే, అందులోనుండి బయటపడలేక, ఆశ్రయమొసగేవారు కనబడక అలమటిస్తాడు. అప్పుడు - ఆ ఏడుపులో - దేవురింపులో "దేవుడు" జ్ఞాపకమొస్తే కొంతలో కొంత ధన్యుడౌతాడు.

కాదంటే - కాలాగ్నికి నాశనమౌతాడు. ఇవన్నీ "సన్యాసం" వలన లభించేవి.

సన్యసించేది "సంసారాన్ని". ధరించవలసిన ఎదురులేని ఎఱ్ఱగుడ్డల కోసం కాదు. సన్యసించవలసినది - కామ క్రోధాధి - అరిషడ్వర్గాలను, పంచేంద్రియ ప్రకోపాలను... విడిచిపెట్టడానికి!

అంతేకాని నేను "సన్యాసి"నని ఎర్రగుడ్డ కట్టుకుంటే, సామాజికంగా ఎదురు లేకపోవచ్చును కాని. ధారణ దృష్టిలో మాత్రం. ధర్మం కనబడదు. సన్యాసం సాంప్రదాయం కాదు. విసర్జించవలసిన - కోర్కెలసాంద్ర సముద్రం. ఇందులో జాగ్రత్తగా ఈది, ఆవలి ఒడ్డును చేరాలంటే - మకర, తిమింగిలాల స్వరూపమైన అరిషడ్వర్గాలను జయించాలి. అప్పుడు జ్ఞాన సముద్రంలో. దైవ సాన్నిధ్యమొంది తరిస్తాము. లేకపోతే... దేవుడా! అని ఆయన తరింప చేసేవరకు తపించాల్సిందే.

యోగులు కానివారు సదా కర్మలను చేస్తుండాలి. "యోగ"మనేది - పొందే అదృష్టానికి మార్గం. "రాముడా, దేవుడా ?" అనలేనివాడు "రానురా, వదలరా!" అని ఏడుస్తాడు తప్ప - చేరవలసిన గమ్యానికి దారి తెలుసుకోడు. గమ్యం - చేరబోడు.

మట్టిని, బంగారాన్ని - ఒకే విధంగా చూచువారు, శునకము, దానిని వండుకుని తినేవాడిని, బ్రాహ్మణుడు, వీరందరిపై సమదృష్టి కలవారు నిజమైన జ్ఞానులు, యోగులు. అతిగా తినక, మితాహారము తీసుకుంటూ, పరిమిత సమయాలలో నిద్రిస్తూ - తమ తమ విద్యుక్తధర్మాలను నిర్వరిస్తూ - లోకసంక్షేమ కారకులుగా వుండేవారు తప్పక ధన్యాత్ములౌతారు. గాలిలేని ప్రదేశంలో దీపమెలాగ నిశ్చలంగా వుంటుందో, అలాగ

యోగి మానసం - ఎటువంటి ప్రలోభాలకులోను కాక, ఈశ్వరుడిపై తమ దృష్టిని వుంచి - సమతామూర్తిగా విరాజిల్లుతాడు.

"గాలికి వూగులాడే దీపం వలె, మనస్సు చంచలమైతే, మనం సాధించ గలిగేదేమిటీ... ఏ కర్మకు కర్తగాకుండ, వుండుటమెట్లాగా ?" అర్జునుడు అడుగుతుంటే-

"పార్థా! ఇంద్రియలోలుడైన జీవి లేదా దేహి ఇంద్రియ నిగ్రహుడవడం కష్టమే. కానీ, దీనిని సాధించాలంటే, ఆ దేహి... సాధనమో, వైరాగ్యమో స్వీకరించాలి. అది - ఎవరో చెయ్యమన్నారనే దృష్టితో కాకుండా - తన ప్రగతికని చేసే - ఇచ్ఛాపూర్వక సాధన - ఆ జీవుని - దేవుని చేస్తుంది.

కొందరు కర్మలు చెయ్యాలని అదొక ధర్మంగా చేస్తారు. అందులో ఆసక్తి-అనాసక్తి వుండదు. ఫలితంపై ఆశ - దురాశ - పేరాశలు కూడా వుండవు. లభించిన దానితో తృప్తిపడతారు. రాలేదు.... దాని గురించి ఆలోచించరు, ఆశపడరు. అలాగే యోగులు, బుద్ధిజీవులు కూడా!

వీరికి యోగభ్రష్టత్వమనేది కూడా వుండదు. యోగభ్రష్టత్వమంటే, ఏమిటి అనకు... **ఉదా :** ఒక దేహి తాను చెయ్యవలసిన కర్మలు తాను చేస్తుంటాడు. దుర్విధివశాత్తు, కర్మవశాత్తో ఆ విద్యుక్త ధర్మాన్ని.. అదే కర్మలను చెయ్యడం మానేస్తాడు. దీని వలన లాభమా ? నష్టమా ? అంటే, రెండూ కాదు. కారణం -

ఒక వ్యక్తి.... వేదం కాని, మరొకటి కాని కొంతవరకు చదువుకుంటాడు. ఆ తర్వాత మానేస్తాడు. కాలచక్రభ్రమణంలో భాగంగా, ఎంతవరకు చదువుకున్నాడో, తెలుసు కాబట్టి, అక్కడి నుండి, తానెంతవరకు చదువుకోవాలనుకుంటున్నాడో అంతవరకు మరల చదువుకుంటాడు. లేదంటే మొదట్లోనే ఆగిపోతాడు. అలాగే -

"ఉభయభ్రష్ఠు"డనే వాడుండడు. పై విద్యార్థి చదువు వలెనే, ఈ వ్యక్తి జీవితము, ఆ ప్రకాశము వుంటాయి. దీనిని గ్రహించినవారు ధన్యులు. కనుక ఎప్పుడు విద్యుక్త ధర్మాలను - వివేకంతో, నిగ్రహంతో, నియమిత బుద్ధితో సాధించుకోవాలి, సత్ఫలితాలనొందాలి.

ప్రతి వ్యక్తిలోను - స్థూల - సూక్ష్మశరీరాలుంటాయి. కనుపించేది స్థూలము. కనుపించనిది సూక్ష్మము. స్థూలము నాశనభూతము, అధిపతిదేహి. సూక్ష్మము,

ఆ పరమేశ్వర స్వరూపము. అధినాయకుడు ఆ పరమేశ్వరుడు. అందుకే "జీవాత్మే-పరమాత్మ'' అనేది అనంతము సర్వవ్యాప్తమైన ఆత్మకు చావు పుట్టుకలు లేవు. ఇది దేహికి మాత్రమే.

ప్రకృతి - పరమేశ్వరుని వలె - జీవుడు - దేవుడు ఏకాత్ముడు. విడదీయరాని సంబంధీకులు. ఇది రహస్యము. బుద్ధిమంతులు మాత్రమే దీనిని, తమ దృష్టితో గ్రహించ గల్గుతారు. మిధ్యావాదులకు, హేతువాదులుకు కనుపించేది డొల్లశరీరం మాత్రమే.

కొంతమంది బ్రతకడం కోసం వేషాలు వేస్తుంటారు. వీరి బ్రతుకు తమ కడుపు నింపుకోవడం మాత్రమే. నాటకంలో, ఆ సమయంలో చక్రవర్తి పాత్ర ధరించేవాడు, ఆ కొద్ది సమయంలో, ఆ నాటకానికి సంబంధించి, ఏమి ఆదేశించినా "చిత్త''మని సిద్ధమౌతుంది. ఆ తర్వాత.. ఆ "మొత్తం'' విత్తమౌతుందే తప్ప - నిజమైన చిత్తంగాదు.'' అంటూనే కృష్ణుడు -

"అర్జునా! నా మాటను విను. గాండీవం పట్టుకో. బాణం విడు. అది నీ కర్తవ్యం. నిర్వహించు. ఆ బాణం తగిలి చావాలని లేదు. అవతలివాడు చస్తాడనో, నిరోధించబడతాడనో... నీవు శరసంధానం చేస్తున్నావు. ఆ లాఘవం ఫలించ వచ్చును. ఫలించకపోవచ్చును. అందుకే ఫలితమాశించక, అధర్మనాశనానికి వుపయోగించే బాణం, అందుకే వుపయోగబడుతుంది. అంతే తప్ప మరెందుకు కాదు. దీంతో ధర్మనాశనం - ధర్మ ప్రతిష్ఠాపన జరిగినట్లే, కదా! ఆలోచించు.

ఇది అపూర్వమైన జ్ఞానం. దీనికై కొందరు జీవితాంతం శ్రమిస్తారు. లభించ వచ్చును లేదా లభించకపోవచ్చును. కొందరు మధ్యలో పరిశ్రమిస్తారు, వీరికీ ఇంతే. ఇంకొందరు కారణజన్ములవలె, చివరి రోజులలో ప్రయత్నిస్తారు. వీరికే పై సమాధానమే అయితే. ఈ ప్రయత్నాలన్నీ కాలగతులు - కర్మగతులు.

వీటి లక్ష్యం తెలిస్తే, మోక్షం లభిస్తుంది. ఇది లభిస్తే - జన్మ ధన్యమయిందని కొందరు తలుస్తారు. లభించడానికి తెలియాలి.'' అంటూంటే -

"కృష్ణా..... కృష్ణా.... ఒకసారి అవునంటావు. ఇంకోసారి కాదంటావు. కాదన్నది ఔనంటావు. ఔనన్నది కాదంటావు. ముందు - ఈ - ఔను - కాదన్నల

మీమాంస ఏమిటి ? ఎందుకీ తర్జన భర్జనలు. ఆటు - పోట్లు'' అని అర్జునుడు తడబడుతుంటే -

"అర్జునా! అందరు రాజులైతే, మోసే బోయీలు వుండరు. అలాగే కర్మలు. అన్నీ సత్ఫలితాలనిస్తే - దుష్ఫలితాల ఆలోచన వుండదు. అందుకే సమదృష్టి - సమతా దృష్టి - అనేది. ముందు నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తిస్తే నీకు అన్నీ తెలుస్తాయి'' అంటాడు "కష్ణుడు'' భగవానుడు జగద్గురువై. ఈ విద్యాబోధన మానవాళి అదృష్టంగా అర్జునుని పేరున లోకానికి అందిస్తూ, అర్జునా! నేను చెప్పే విషయాలనన్నింటిని ముందు శ్రద్ధగా విను.

సర్వవ్యాప్తుడు. సర్వశక్తిమంతుడు పరమాత్మ. అతనే, నిర్ణయాత్మకుడు. ఆయననే "కాలుడు, కాలకాలుడు, మహాకాలు''డని గూడా అంటారు. అంతటా వుండేవానికి, అన్నిటా వుండేవాడికి ఆకారము లేదు... మనకు ఆకారము వుంది కాబట్టి, ఆ పరమాత్మ ఈ విధంగా వుంటాడని ఆలోచనం చేస్తాము. ఆ ప్రకారము రూపమిస్తాము. రూపమే లేనివానికి, రూపురేఖలు దిద్దడం సాధ్యమా ?

చీకటి - వెలుగులు, వుంది - లేదు, అవును - కాదను - భ్రాంతులవలెనే ఈ భగవంతుడు కూడా "వున్నాడు - లేదు'' అని ఆస్తిక - నాస్తిక వాదులు. వుంటే ఎలాగ వుండని, దానికి కారణమెక్కడని ? హేతువాదులు ప్రశ్నిస్తుంటారు.

ఈ "లేడు'' అని నువ్వు (నాస్తిక వాదులు) చెప్పినట్లే "వున్నా'' డని ఆస్తికవాదులు చెప్పుకుంటున్నారు. "లేడు'' అని ఎంత గట్టిగా చెప్పగల్గుతున్నారంటే "లేడు'' కాబట్టి అంటావు. లేకుండా ఈ కనుపించే సృష్టి, ఈ "కనీ - పెంచే'' ఆ సృష్టి.. అందుకు మార్గము, ఆ సృష్టి జరిగే విధానము నీవు నిరూపించగలవా ?

అంటే "వితండవాద''మంటారు. తెలిసింది చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్లే... తెలియనివి - చెప్పకుండా దాటవేస్తున్నారు. కొమ్మ - చాలా సామాన్యంగా వుంది. రెండు రోజులకు చిన్నగా చిగుళ్ళు - ఆ తర్వాత కొన్నాళ్ళకు చిగురు, ఆ తదుపరి పిందో, పువ్వో... దానికి సంబంధించినది ఆకారమేర్పాటు చేసుకుంటున్నాయి. పుట్టుక తెలియదు, పెరిగిన పద్ధతి తెలియదు. "ఫల'' రూపము తెలియదు. ఫలితము తెలియదు. కానీ....

చెప్పడానికి మాత్రం... అన్నీ తెలుసు. ఇది... సృష్టి.... దీనికి మూలం కాలమంటే. ఆ కాలం "కాలుడు! అతడే పరమాత్మ" బ్రతికించవా వైద్య శిఖామణీ అంటే ఈ యుద్ధంలో చచ్చిన వారినందరిని బ్రతికిస్తాడా ? లేక - బ్రతుకగల్గిన వాడిని, బ్రతుకుతాడనుకున్నవాడిని తన ప్రయత్నంతో ప్రాణరక్షణకుపక్రమిస్తాడు కానీ, చచ్చిన ప్రతివాడిని బ్రతికించడు. అలాగ బ్రతికిస్తూ పోతుంటే ఈ సృష్టి ఆగదు. కనుక -

కనీ - పెంచిన దైవాలే... కొన్ని సమయాల్లో కనుపించని దైవాలై - కొన్ని కొన్ని సమయాలలో ప్రాణమిస్తున్నాయి. కొన్ని కొన్ని సమయాలలో ప్రాణం తీస్తున్నాయి. ఇది సత్యం. ఇదే సృష్టి రహస్యం. ఏదీ మన చేతిలో లేదు. అంతా... దేవుడనుకుని మనం దేవురించే "ఆ దేవుడు" లీల - అర్థమవుతుందా ? అడుగుతున్నాడు. వింటున్నాడు. తలవూపుతున్నాడు - అర్జునుడు.

అర్జునా! సంశయాత్ములు... అనకూడదు కానీ అలాగ అనుమానలతోనే చావాలి. కారణం.... వారికి.... ఏ కారణము తెలియదు. కార్యమసలు అర్థం కాదు. విత్తులేని చెట్టును వూహించుకోలేనట్లే - చెట్టులేని విత్తును కనుగొనలేము. అన్నీ విత్తులకే పుట్టవు. కొన్ని కొమ్మలకు, కొన్ని స్వయం. పరస్పరాకర్షణకు... మన వివాహాల వలె రకరకాల పద్ధతులలో ఆయువు పోసుకుంటున్నాయి. **ఉదా :** మీ అన్నయ్య పుట్టాడని గాంధారీ అసూయతో గర్భం విచ్ఛిన్నం చేసుకుంది.

వ్యాసదేవుడు... వూరుకున్నాడా ? ఇంత జరగాలని తెలుసు ? ఇన్ని బాధలు పడాలని తెలుసు ? ఇక్కడ యుద్ధం జరుగుతుందని తెలుసు. ఎంతోమంది చావాలని తెలుసు. అది యుగధర్మం. దానిని ఆపడమిష్టంలేక, ఆ వచ్చిన వేదవ్యాసుడు, విచ్ఛిన్నమైన పిండాన్ని - నూటొక్క అండాలలో పెట్టి.. నేతిలో వుంచాడు. జాగ్రత్త.... అని హెచ్చరించాడు. అప్పుడే వూరుకుంటే, ఆపద... ఇలాగ వచ్చేది, ఇందరి చావుకు కారణమయ్యేది కాదు. "జరగ"వలసింది - జరుగవలసిందే!

వాటిని ముట్టుకోవద్దన్నాడు. సమయం రాగానే ఆ ఘృత ఘటాల నుండి ఆకారమొందిన జీవులు జన్మిస్తారని తెలిపాడు. తాను వెళ్లిపోయాడు. ఇదెందుకు జరిపాడు. సత్యం తెలిసి ఆపలేకపోయాడా ? అంటే...కాలం...! అది కాలుని, ఆశ్రయించి, తనకో గతిని రూపొందించాడని "కాల - కాలాయ"నమః అని సాగుతుంది. ఎందుకు... అంటే... అది దాని ధర్మం.

"సూర్యుడు - ఎవరికోసం ఆ భ్రమణం ? అంటే కాలం కోసం, కాలం... కాలుని కోసం... కాలుడు... లోకం కోసం... లోకం - సృష్టి కోసం... సృష్టి... సృష్టించడం కోసం... ఇందులో స్వార్థం లేదు. ఈ చక్రమిలాగ సాగుతూ పోవాల్సిందే. ఇదెప్పుడు ఆగుతుందంటే... ప్రళయమప్పుడు.... అంటే... విలయ మేర్పడినప్పుడు... అంటే... అంటే, విశ్వరూపుడు ఎప్పుడు తలుస్తాడంటే... కాలసమాప్తి అంటే... కదలలేని సమయమొచ్చినప్పుడు...

ఇదంతా నిర్విరామంగా జరిగే గతి.. ఇది ఆపలేనిది, ఆగలేనిది. ఆపరానిది. ఆగరానిది! అంతే ! సరే - మొదటి అండం నుండి, పిండం రూపు చేసుకుని జీవుడు బయటపడ్డాడు. అప్పుడు - హస్తిన అతలాకుతలమయింది.

పుట్టేవాడు... దౌర్భాగ్యుడు, వాడివలన వంశ నాశనమౌతుందంటే, పెద్దలు చెప్పినా నీ పెదతండ్రి విన్నాడా ? నీ పితామహుడు ఆ పుట్టినవాని పీడవదిలించ గలిగాడా ? అలాగ - జరిగితే - ఇవ్వాళ - ఈ యుద్ధం - ఈ ఘోరం జరిగేది కాదు, కదా! మరి! అంతే... అదే....! దీనినే.... సృష్టి.... లేదా.... సృష్టి రహస్యం. భగవదేచ్ఛ... విధివిలాసం, కర్మమని కూడా అంటూంటాము. ప్రతీదీ "అవశ్యం అనుభవోక్తం, కృతాకర్మ - "శుభ" అ"శుభం" అని సర్దిచెప్పుకుంటాం.

కర్మమనేది ధర్మం. జీవికి విద్యుక్తధర్మం. చేయవలసిన పని చేయకపోవడం నేరం. చేయించకపోవడ మధర్మం. మమతానురాగాలు వేరు, "మాన"వధర్మాలు, వేరు. మానావమానాలు, గౌరవమర్యాదలు, బుద్ధిమంతులు లెక్కపెట్టరు.

ఈ మాయను, మానవుడు జయించలేడు. దీనికి నిగ్రహం కావాలి. ఇది మాటలతో రాదు. మనసుపెట్టి, ఆలోచించాలి. కర్మలను తెలుసుకోవాలి. విధిగా ఆచరించాలి.

నాకేం కర్మలు - చేయడానికి లేవని - నేను కదలకుండా కూర్చొనవచ్చును. లోకరక్షణ, ధర్మరక్షణ, సత్సాంప్రదాయాల నిర్వహణం కోసం అవతరించిన నేను, సోమరిపోతువలె వుండరాదు. అందుకనే త్రికాలసంధ్యలను, త్రికరణశుద్ధిగా త్రిగుణాతీతుడనై, నియమ నిష్ఠలతో, ఆ సమయాలలో నిర్వహించేది. మన శ్రీకృష్ణుడే చేస్తుంటే మనకు తప్పదని... నన్ననుసరింప చేయాలన్నది నా బాధ. అనుసరింపచేయడం నా ధర్మం. ఇందులో కనుక విఫలుడనైతే, నన్ను ధర్మ

పరిరక్షకుడు, అవతారపురుషుడనరు. సాధుజన పీడితుడు, అధర్మవర్తనుడని... లోకం పరిహసిస్తుంది.

కావున, అర్జునా! సర్వ ధర్మములను నాకు విడిచిపెట్టు. భయభ్రాంతులు, శోకమోహాలను నాకు వదలిపెట్టు. నన్ను శరణు పొందు. నా మాటలపై విశ్వాసముంచుము. అప్పుడు... ఇప్పుడు... నీ ఇతర విషయాలలో నిన్నెలాగ, ఉద్ధరించి, రక్షించానో.... అలాగే, నీ సర్వబాధ్యతల యందు నిలిచి, నిన్ను సర్వదుష్కర్మల నుండి బయటపడవేస్తాను.

సంశయాలు వదులు. సన్మార్గుడివిగా! గాండీవం పట్టు, బాణం విడిచిపెట్టు. ఇదంతా, అవతలివారు... ఇదేమిటి ? అని ఆలోచించి వారు శరసంధానం చేసేలోగా జరిగి పోవాలి జాగ్రత్త! అన్నాడు. మోహభ్రాంతులలో మున్గినవారు మోహాతీతులు కాలేరు కాబట్టి, నీవు ధైర్యమొందు. విజృంభించు'' తక్షణ కర్తవ్యానికి ధైర్యం. ధర్మంతో కలిపి - అందిస్తున్నాడు!!

అర్జునా! అధిక్షేపించకు. అడుగు ముందుకు వెయ్యి. విధి ప్రేరితమిది. వినాశకాలము దాపురించింది. విధి విధానముగా, వినాశనము జరుగాల్సిందే! దీనినెవరు ఆపలేరు! పంచభూతాలను చూడు. అందులోని ఆకాశము వేరు, వాయువు వేరు కాదు. అయిదు కలిస్తే - ప్రకృతి. అది సృష్టికి మూలం. అందుండే సర్వజీవరాశులు, ఈ మానవుడు కూడా. మానవుడంటే, తెలుసా ? "మననీయుడు, మానవీయుడు - "మన'' అంటే తను, "మాన... ?!'' తన ధర్మము తెలుసుకున్నవాడు.

ఇన్ని ధర్మాలు తెలిసి, ఇంకా.... గాండీవం.. పట్టుకోను... అనే నిన్ను క్షమించను. ఈ విధి, దాని విధానము క్షమించదు. జరుగవలసిన వినాశనం జరుగవలిసిందే. నేను ఆయుధం పట్టుకుంటే కేవలం లిప్తకాలం. కళ్ళు మూసి తెరచేలోగా ఏమీ వుండదు. మళ్ళీ సృష్టికి - పునఃప్రతిష్ట జరుగుతుంది. అందుకు నేను ఆయుధమును పట్టనన్నాను.

మీరెవ్వరు కూడా మిగలరు. అన్ని ధర్మాలలోని ధర్మంగా, స్వధర్మంగా కూడ "ధర్మా''నికి లొంగి, దాని ధర్మం - అది నిష్కర్షగా - నిర్మోహమాటంగా

నిర్వహిస్తుంది. రాగద్వేషాలు, పాపపుణ్యాలు తెలియని సృష్టి - ధర్మ స్వరూపం. కనుక విక్రమించు.

ఎవరు, ఎవర్ని చంపడంలేదు. ఎవరు, దేనికి కారణం కారు. ఎవరు ఉపేక్షించినా ప్రళయమందు సర్వ జీవరాశిని లయం చేసుకునేవాడిని. అందరికి ప్రాణాధారమైన "నీరము"న నిలిచి "నారా"యణుడనౌతాను.

కనుక - "నేను", చంపుతున్నానని మాటమరచి, ప్రతిజ్ఞ చేసిన విధంగా, నీ ధర్మం నిర్వర్తించు. అన్నదమ్ములకు ఆనందం కల్గించు. ఆశావాదుల జీవితాలకు, వారి జీవితాలపై పెంచిన ఆశను పెంపుచేయి తప్ప - త్రుంచివేయక.

అందుకే మాట్లాడేటప్పుడు "జాగ్రత్త"గా వుండాలనేది. మాటను "వాచక" మంటారు. అది వాచక తపస్సు - మౌన తపస్సు వలె సర్వశ్రేష్ఠమని మునులు అనవసరంగా మాట్లాడారు. వారు మాట అన్నారో... అది సత్యము . దేవుడి కసాధ్యమైన విషయాన్ని కూడా సాధ్యం చెయ్యగల సత్య - సంకల్పులు, ఆ మునిశ్రేష్ఠులు.

అందుకే - మునియైన మనకు తెలిసిన "నారదుడు" అంత గొప్ప వాడయ్యాడు. సర్వలోకాల సంచరించగల త్రికాలవేది. ఆయన ఆశ్వాసము - నీకు తెలుసు. ధర్మం జయిస్తుంది. నాకు ధర్మమే ఆధారము. అందులో పుట్టి పెరిగే నేను, అధర్మాన్ని ఆలోచించను. ఆలోచించిన వారి కర్మనుపేక్షించను.

ఉదాసీనత - కర్తవ్య నిర్వహణకు బంధము కాని భారము, "అపమృత్యు"వు వంటి - "ఉరి". ఇది అనుభవించాలంటే, ఎంత కష్టమో ఆలోచించు. అవతల వారిని చంపడం తేలికనుకున్నప్పుడు, ఈ "ఉరి" లేదా - ఆత్మహత్యల యొక్క బాధ కూడా తెలిసి వుండాలి.

అది "పుండు - లేక "గాయం". ఎన్నేళ్ళు దానికి ముద్దు చేస్తూ, మిఠాయిలు పెడుతు కాలక్షేపం చేస్తావు. ఆ ముద్దువలన రసికారి, ఆ ప్రక్కనుండి మరో కురుపు వెయ్యడమో లేక వున్నది పెద్దదవడమో చేస్తే... అప్పుడు మందులు సరిపడవు. శస్త్రచికిత్స చేయాలి. వైద్యుడును సమీపిస్తావు. అతడు కత్తిని తీస్తాడు.

నిన్ను శిక్షించడానికా ? రక్షించడానికా ? ఆలోచించు. రక్షణలో "శిక్ష" - శిక్షణ వుంటాయి కానీ "శిక్ష"లో రక్షణ వుండదు. వున్నాదాని అర్థం సామాన్యుల కర్థం కాదు. అలాగే -

**ఉదా :** ఈ యుద్ధమే తీసుకో. కొందరు బల్లెములు, కొందరు శూలములు, కొందరు కత్తులు, కొందరు బాణములు, అలాగే ఇంకొందరు రకరకాల ఆయుధాలను తీసుకుని యుద్ధరంగంలో తమ నేర్పును ప్రదర్శించాలని అవతలివారి "వుసురు"లను తియ్యాలని ప్రతి ఒక్కరు తపిస్తారు. అంతేకాని -

ఓడిపోవాలని, చచ్చిపోవాలని, పారిపోవాలని యుద్ధంరంగంలో అడుగు పెట్టరు. అలాగ చేసేవారు పారుబోతులు, భీరులు. వీళ్ళు ఆయుధాలు పట్టరు. కాని కబుర్లతో కోటలు బీటలు తీయిస్తారు. భూమ్యాకాశాలు కలిపేస్తారు. సర్వ దేవతలను పిలిచేస్తారు. ఆఖరికి - ఆ హరిహరాదులను కూడా "ఇది చెయ్యాలని" ఆదేశిస్తారు.

ఇదెప్పుడు... ?! అంటే... తనవరకు రానంతవరకు... వచ్చిందో... ఓరి నాయనోయ్, దేవుడోయ్, రండర్రా.. రక్షించండర్రా.. అని అందరిలాగే శోకాలు పెడతారు. ఇప్పుడు చెప్పు - ఏది సత్యం, ఏదసత్యం, ఏది నిత్యం, ఏది అనిత్యం ? ఏది శాశ్వతం, ఏది అశాశ్వతం!"

కావున, ఓ శత్రుంజయా! నీ బిరుదును సార్థకం చేసుకో! నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు. రాయబారానికి వెళ్ళే సమయంలో, ద్రౌపది ఆక్రోసాన్ని గుర్తుచేసుకో. అప్పుడు కర్తవ్యం బోధపడుతుంది. అలాగకాక - నీ బుద్ధితో నీవు ఆలోచిస్తే - స్వబుద్ధి ఫలితము - మీ అన్న దుర్యోధనుని వలెనే ఒక్కొక్కసారి సర్వనాశనానికి దారితీస్తుంది.

సమస్త ప్రాణులు నాకు సమానమే. ఎవరిపైన నాకు రాగద్వేషాలు లేవు. కోపతాపాలు లేవు. కోర్కెలు లేవు. అంతేకాదు - ఎవరి నాశనంతోను నాకు సంబంధం లేదు. ఎవరి నాశనానికి వారు, వారి వారి కర్మలతో కర్తలౌతున్నారే తప్ప, ఎవరికెవరు కర్తలుకారు. కర్మలతో పనిలేదు.

భక్తి - అది చిత్రమైనది. గురు - భక్తి - లేదా - సేవా - అది మరింత చిత్రమైనది. వీటికి అభ్యాసం అవసరం లేదు. ప్రత్యేక అనుసరణం, షోడశోపచార, విధానం వుండదు. వుండేది వారి నిష్కల్మష చిత్తానికి - అనువైన సంకల్పం. దానినే విధానమనవచ్చును. ప్రధాన సేవగా, తలంచ వచ్చును. ఈ సేవా విధానం ఆలోచించదగ్గది కాదు. కేవలం అనుసరించదగినది మాత్రమే ఈ "అనుసరణం" మన చిత్తం ప్రకారం, దాని యిష్టం ప్రకారం జరుగుతుంది.

వాళ్ళ, వాళ్ళ సేవల భక్తి, వారికి శాంతిని, అభీష్టాన్ని కల్గిస్తాయి. నా మాటలు శ్రద్ధగా విను. ద్రోణులవారి వద్ద విద్యనొందావు, వారు పరీక్ష పెట్టారు. అందులో నిశితదృష్టి - లక్ష్యసిద్ధి - ఎవ్వరికి లేదు. నీకు అది లభించింది. అది గురుశుశ్రూష వలన, వారి అనుగ్రహం వలన, నీవు చేసిన సాధన వలన సిద్ధింప చేసుకున్న శక్తి. దాంతో చిటారుకొమ్మన వున్న చిలకను చూడగలిగావు. లక్ష్యసాధనంతో దానిని ఛేదించావు. అందరితో ప్రశంసించబడ్డావు. నీ సాధనకు తగ్గ విశిష్ట గౌరవాన్ని పొందగల్గావు. అంటే - ఏకలవ్యుడు - లక్ష్యసాధనపై దృష్టి పెట్టి స్వప్రయత్నంతో, అపూర్వ ఫలితాన్ని పొందాడు. కానీ,

కారణమేదైనా దురదృష్టవంతుడు. లక్ష్యసిద్ధినైతే పొందాడు కాని, గురువనుగ్రహం పొందలేక, తన అంగాన్ని పోగొట్టుకున్నాడు. భరతజాతి ఒక మహావీరుని పోగొట్టుకుంది. ఇలాగ జరుగుతుందని, అతనే కాదు - మనమేమైనా వూహించామా? ఈ పాపం నుండి "శ్రీ" గురువులుగా ద్రోణాచార్యులవారు తప్పించుకో గల్గుతారా ? ఆలోచించు. ఇందులో ధర్మాధర్మ విచక్షణముంది. ఒకరికి తామిచ్చిన మాట ప్రకారం మరొకర్ని బలి తీసుకోవడం. పరువు ప్రతిష్ఠల పరాక్రమాన్ని నిలబెట్టుకోవడం, అవతలివార్ని అధో పాతాళానికి దిగజార్చడం జరుగుతుంది. దీనినే కాలగతి - "ప్రాప్త"మని రకరకాలుగా చెబుతారు. కనుక కర్తవ్యపరాయణుడివై విజయాన్ని ప్రసాదించు. ఆపన్నులను, విపన్నులను రక్షించు.

కనుక - ఓ సవ్యసాచీ! నాకు బిరుదులున్నాయని పొంగిపోకు. అవి శాశ్వతమైనట్లు కృషి చెయ్యి. అప్పుడే నీ వీరత్వానికి విలువ. శూరత్వానికి తగు ప్రశంస లభిస్తుంది. మా తాతలు నేతులు త్రాగారు అన్నాడనుకో... మరి నీవు అంటే... మూతులు నాకాలనాలి. అంతకంటే గత్యంతరం లేదనకూడదు. నిన్ను విజయుడిని చెయ్యాలని, నేనెంత ప్రయత్నిస్తున్నానో... అందుకు నీ కృషి ప్రయత్నించాలి.. అప్పుడు - నీ కృషి - నా ఆలోచనం, ఆంజనేయుని తీవ్రదృష్టి వాయుదేవుని వేగము, ఇంద్రాది దేవతల ఆశీస్సులు ఫలించడం కాదు -

పరమశివుడు ప్రసాదించిన పాశుపతాస్త్రానికి వన్నె - విలువ పెరుగుతుంది. లేకపోతే వలలుడిగా మీ అన్న పట్టిన గరిటకు, గాండీవం ప్రక్కనబెట్టి, నాట్యాచార్యునిగా నీవు సల్పిన నటనమునకు - ఆ విలువలే నిలబడతాయి తప్ప గౌరవము పెరగదు.

వంశ ప్రతిష్ఠ మిగలదు. కనుక - పార్థా! పెద్దల ఆశీస్సులు, దేవతల అభీష్టం మీదుమిక్కిలి నీ సోదరుల ఆశలు నపుంసకుడి రంభాసంయోగం వలె చెయ్యకు. పేడివాని ప్రేమ కేవలం ప్రేమే తప్ప - ప్రణయానికి పనికి రాదు. ఇంతెందుకు చెబుతున్నాను... అంటే...

నీలోని నిజమైన స్థితిని గుర్తింపచేసి, జ్ఞానమొసగి, జన్మధన్యము చెయ్యాలనే తపనే తప్ప, ఇందులో నా ప్రమేయము స్వార్థము లేదు. లేదంటే మా అన్నవలె నేను వెళ్ళిపోయేవాడినే కాని, "నాకు సారథియై నన్ను విజయుడిని చెయ్యమన్న ప్రార్థనకు నిలచి ఇంత సుదీర్ఘ చర్చ, యుద్ధంలో "ధర్మ" యుద్ధోపన్యాసం చెయ్యవలసి వచ్చింది. అర్థం చేసుకో, పరమాత్మ చెప్పేది ఒక్కటే.

**చెప్పింది వినమంటాడు. విన్నది ఆచరించమంటాడు. ఆ తదుపరి తరించడం - "అప్పుడే మోక్షం అనాయాసంగా లభిస్తుందంటాడు. కనుక శరసంధానం చెయ్యి. ఇది ఆవేశం కాదు. ఆదేశ"మంటాడు.**

## వింటున్నారా..?!

"**మ**హారాజా! శ్రద్ధగా వింటున్నారా ?"

అస్త్ర సన్యాసం చెయ్యబోయి, గాండీవాన్ని చేజార్చిన అర్జునునికి, శ్రీకృష్ణుడు కర్తవ్యబోధ చేస్తున్నాడు. అది కేవలం అర్జునునికి చెబుతున్నట్లు లేదు. జగదాచార్యుడైన ఆ బోధ - లోకాలకు అందిస్తున్నట్లుందని" వివరం చేస్తున్నాడు సంజయుడు.

ఆ వెంటనే ఆ గుడ్డిరాజు మనసులో కొంచెం సంతోషం కల్గింది. "అయితే, అర్జునుడు, అస్త్రసన్యాసం చేసి, యుద్ధరంగం నుండి వెళ్ళిపోతున్నాడన్నమాట." "ప్రస్తుత పరిస్థితి అలాగే వుంది. కానీ కృష్ణుడు కర్తవ్యబోధను చేస్తున్నాడు."

ఎందుకు అనవసరంగా, అర్జునుడు మంచి ఆలోచన చేస్తున్నాడు. చాలా సంతోష"మని ధృతరాష్ట్రుడు అంటూంటే - మహారాజా అన్నాడు. "సంజయా!" ఇంకేం జరిగింది చెప్పమని ఆత్రంగా అడుగుతున్నాడు.

"మీరు కూడా ఒక పని చెయ్యకూడదూ ?" అనగా సంజయుడు, కళ్ళు లేకపోయినా చిట్లించి "ఏమిటని ?" అడుగుతున్నాడు.

"నాయనా! అనవసరంగా యుద్ధం చేసి ఇందరి ప్రాణాలు తియ్యకు. అర్జునడెలాగో వెనుదిరుగుతున్నాడు కాబట్టి, యుద్ధ వాతావరణం ఆగిపోతుంది. కాబట్టి, నీవు కూడా అస్త్రశస్త్రాలు విడిచి, తిరిగి వచ్చేయ''మని చెప్పకూడదా ?!

"సంజయా!'' ఒక్కసారి గట్టిగా అరచినవాడు, మరుక్షణం తమాయించుకుని "ఇటువంటివి నీవు అనకూడదు. నేను వినకూడదు. అయినా మన పిచ్చి కాకపోతే, మన మాటను వాడు వింటాడా ? వినడయ్యా! వినడు. పోనీలే. అర్జునుడు మంచిపని చేస్తున్నాడు. అతన్నాతని అన్నదమ్ములు అనుసరిస్తారు'' అన్నాడు. ఆ వెంటనే సంజయుడు, "కృష్ణుడు, యుద్ధరంగంలో వుండగా అది జరగదు.''

"అదేకదా, నా బాధయ్యా!'' ధృతరాష్ట్రుడు ఇంచుమించు ఏడ్చాడు.

"మహారాజా! మీ పిల్లలు యుద్ధం చెయ్యాలి వాళ్ళకు రాజ్యం భోగభాగ్యాలు.. అన్నీ కావాలి. నీ తమ్ముని పిల్లలకు, అదే... పాండవులు అడవులకు శాశ్వతం కావాలి. మీరు అడవి ఇస్తే - దేవతల, శ్రీకృష్ణుని కరుణతో అపురూప నగరంగా మార్చుకుంటే అక్కసుపడి, మోసగించి, వారి ఇంద్రప్రస్థాన్ని అంద బుచ్చుకున్నారు.

దాంతో విడువక అరణ్యాలకు పంపి, వారికి దిక్కు లేకుండా చెయ్యాలని ఎన్నో దుష్ప్రయత్నాలను చేసారు. చివరకు అజ్ఞాతవాస సమయంలో వారి అచూకీ తెలియలేదని, అందుకు - సస్యశ్యామలము - సర్వసుభిక్షమైన మత్స్య నగరంపై - ఉత్తరగోగ్రహణం, దక్షిణ - గో - గ్రహణాల పేరిట, ఇరుపక్షాల నుండి, ఆ రాజ్యాన్ని అడకత్తెరలో పెట్టి,

ఉంటే.... పాండవులు బయటికి వస్తారు. మాటతప్పినవారిని, మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలకు పంపవచ్చని కుత్సితంవలన ఏం సాధించారు ? పిల్లలు చెడ్డవాళ్ళయితే, తల్లిదండ్రులు, మంచిమాటలు, కర్తవ్యబోధనం చెయ్యాలి. ఇక్కడ తల్లిదండ్రులే దుష్టచరిత్రులు, అసూయాగ్రస్తులైతే - వాళ్ళను నిలువరించడానికి భగవంతుడు తన ప్రయత్నం చేస్తున్నాడు. మహాఋషి, మీ వంశకర్తలు వేదవ్యాసులవారిని మీ కులపతి గాంగేయుల్ని కాదన్నాక మీకు నూకలు, సవ్యమైన జీవితం ప్రాప్తిస్తుందని - వూహించడం మహానేరం కదూ. ఆ పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. పుణ్యలోకాలు రావు. దిక్కుమాలిన చావు చచ్చి, భరత వంశ గౌరవానికి తీరని మచ్చగా నిలబడి పోతారు.

"సంజయా!" అనగా అంధరాజు, "జరగబోయే, ధర్మమదే మహారాజా! మీరు అరచినా, నేను మాటమార్చినా మీకుగాని, మీ సంతానానికి గాని పూరట లభించదు. ఇన్ని నీళ్ళు విడిచిపెట్టే వాళ్ళు లేక... నిర్వంశమై... ఇప్పుడు పాండుపుత్రులు అప్పుడు తమ్ముని కుమారులైన వారి దయాలబ్ధ జీవితం - తథ్యం. దీనికి తిరుగులేదు. అందుకే ఈ - చావు తెలివితేటలతో, నీ పిల్లల్ని కట్టడి చెయ్యలేక, నీ తమ్ముని పుత్రులను "ధర్మం పేరున, మంచివాళ్ళు" అని బిరుదునిచ్చి అడవుల పట్టి వెళ్ళమంటున్నావు. శ్రీకృష్ణ ధర్మ పరిరక్షకుడు. అవతార పురుషుడు, లీలామానుష విగ్రహుడు. ఆయన హుంకరించనంత వరకే - నువ్వు, నీ పిల్లల జీవితాలు!

"సంజయా! ఎందుకలా బెదిరించి, భయపెడతావు." ఇది భయపెట్టడం కాదు, ఆ జగదాచార్యుడై అర్జునునికి వినిపించే అద్భుత బోధను విను." కనీసం కొంతలో కొంత కర్మ పరిపక్వమౌతుంది!

# నేనంటే తెలుసుకో!

**"అ**ర్జునా! నేను కానిదేదీ లేదు." ఇంతవరకు నీవు కేవలం శ్రద్ధా భక్తులు, పృధ్వీతత్వం విన్నాను. ఇప్పుడు నేనేమిటో తెలుసుకో! పిపీలికాది బ్రహ్మపర్యంతము నేనే. నేను కానిది, నేను లేనిదీ - ఈ సృష్టిలో ఏదీ లేదు. అయితే - నేను - "సృష్టిలో" లేను. సృష్టి నాలో వున్నది. ఈ సృష్టి - ఉచ్ఛ్వాసనిశ్వాసల వంటిది. కనురెప్పల టప - టప - వంటిది. మాయా - మోహాలు ఆవరించినవారు - ఈ సత్యమెరుగలేరు. కేవలం నిష్కాములు, నిస్వార్థపరులు మాత్రమే - తమ శ్రద్ధా విశ్వాసాల - అకుంఠిత భక్తితో నన్ను తెలుసుకోగల్గుతారు.

తెలుసుకోవడం వేరు. చేరడం వేరు. "మనుష్యాణాం సహస్రేషు...." అని అందరు జ్ఞానులు కాలేరు. భగవంతుని చేరలేరు. ఆ "జ్ఞానం" అజ్ఞానం తొలగితేనే లభిస్తుంది. లేని ఎడల జీవుడు జన్మజన్మల - జన్మచక్రానికి దాసుడు కావాల్సిందే! వింటున్నావా ? ఇక్కడ కృష్ణుడు.... అక్కడ సంజయుడు అడుగుతున్నారు.

★ ★ ★ ★

నిరాకార, నిర్వికార, నిరంజనుడైన "నేనే" ఈ జగన్నియంతను. సృష్టిస్థితి లయములకు కారకుడను. నా ఉచ్ఛ్వాసనిచ్ఛ్వాసాలే - ఈ అనంత సృష్టికి ఆయువు. ధర్మానికి అన్యాయం జరుగుతున్నప్పుడలా, ఈ భూమి మీద అవతరిస్తుంటాను. ఎక్కడున్నాడో తెలియని దేవుడు, ఇక్కడున్నా కూడా అర్థంకాని విధంగా, అర్థం చేసుకోలేని విధంగా ప్రవర్తిస్తుంటాను. అందరు కనబడనంతవరకే "దేవుడు, దేవుడు" అని దేవురిస్తారు. ఎదుటపడితే ఇంతే సంగతులు...

ద్వారకలోని వారందరికి నేనంటే అభిమానం - ఎప్పుడు ఎదుట నుండే వ్యక్తిని కదా! ఎదురుపడితే తప్పక నమస్కరిస్తారు. అదే ద్వారక విడిచి, ధర్మ-కార్యనిర్వహణార్థం కదిలాననుకో - అడుగడుగు దండాలు, అఖండ స్వాగతాలు. ఏమవుతాయి ?!

ఇది మానవలోక పద్ధతి. జీవిజీవనం విధానంలోని మార్పుల వలన, ఆ వ్యక్తికి వ్యక్తిగతంగా, గౌరవ లభిస్తుందే తప్ప, పుట్టిన ప్రతివారిని, చూసే ప్రతివ్యక్తిని గౌరవించరు. అభిమానించరు. అభినందించరు. ఇది సత్యం. అందుకే అందరిలో వున్న నన్ను గుర్తించి, తెలుసుకోలేకపోతున్నారు.

అది ఈనాటి కృష్ణుడైనా - ఒకనాటి మత్స్యావతారమైనా, అంతే!

**ఎటొచ్చి - ఆధ్యాత్మిక వాదులలో అందరు నన్ను తెలుసుకోరు. "డు, ము, వు, లు... ప్రథమా విభక్తి. అని... ఆ వ్యాకరణ సూత్రం వచ్చేవరకు ఎలాగ పఠిస్తారో... అలాగే... నన్ను, వారి, వారి అవసరాల నిమిత్తం ఆరాధిస్తారు. అవసరం తీరిన తర్వాత... ఓడదాటే వరకు ఓడ మల్లయ్య - ఆ తరువాత బోడి మల్లయ్య" అంటారు చూడు. అంతే, ఆ దేవుడు, నేనూ కూడా! అందుకే - ఆ దేవుడు ఎవరి కోసం దేవురించడు-దేవురించారు కదా. అని, పిలిచిన వెంటనే పరుగెత్తుకురాడు.**

ఎప్పుడే పని చెయ్యాలో, అప్పుడా పని చెయ్యాలి. మహావీరుడవని, ద్రౌపది చెప్పినట్లు మీసాలు, అందంగా పెంచుకుని ఒకనాడు మెలేసి, ఈనాడు పిరికివాని లాగ, స్వధర్మం మరచి, పరధర్మమూర్తివై, వెన్ను చూపి పరుగెడుతుంటే దైవం మెచ్చుని, ధర్మం ఒప్పుని, కర్మభ్రష్టుడైన వానిని ఎవరు చూడకూడదు. వారిని గూర్చి పలుకరాదు. ఆలోచించరాదు. ఆఖరికి వాడి ప్రక్కన కూర్చుని మంచినీళ్ళు కూడా త్రాగరాదు.

కాబట్టి - అటువంటి దుస్థితి, నీకు రాకుండా వుండాలనే ప్రయత్నమే ఈ సత్యబోధ. ఇది తత్వబోధ కాదు. ధర్మబోధ - కర్మబోధ! తెలిసిందా...!'' అంటూంటే..

"మహారాజా! ఇప్పుడు మన గుణ ధర్మాలు, కులకర్మలు... అర్ధమయ్యా యనుకుంటాను. మనల్ని లోకం, కృష్ణుడు చెప్పినట్లు, చెంత చేర్చుకోదు. చెంత నిలచి, గుక్కెడు మంచినీళ్ళు మనకివ్వరాదు. వాళ్ళు త్రాగరాదు. కనుక, ఇకనైనా... కర్తవ్యమెరిగి, పాండవాదులు విజృంభించే లోగా...

"సంజయా!" ఎందుకలా మాటిమాటికి బెదిరిస్తావు, బ్రతుకు బ్రతుకుకాదు, బ్రతుకలేవని చెబుతావు. "అన్నాడు, ఆ వెంటనే, కొంత తమాయించుకుని ఇప్పుడు అర్జునుడేమంటున్నాడు, ఎంతో ఆసక్తిగా అడుగుతున్నాడు.

''మహారాజా! స్వతః నాకు లేకపోయినా, వ్యాసదేవుడు ప్రసాదించిన మహత్తర శక్తితో, నీ మనసును చదువగల్గుతున్నాను.

మీ ఆలోచనలు మారాలి. ధర్మభ్రష్టులు, కర్మభ్రష్టులు, లోకనింద్యులైన నీ పిల్లలకు బుద్ధి రావాలి. వాళ్ళు బ్రతుకాలి. నిన్ను కడతేర్చాలని వాళ్ళ మంచికోసం భగవంతుని ప్రార్థించకుండా "ధర్మపరులు. వాళ్ళెక్కడైనా బ్రతుకుతారు. రాజ్యం లేకపోతే మా మహాసామ్రాజ్ఞి ''సత్యవతీమాతే'' అసహ్యించుకుంటుంది. అంటే - అది సత్యం.

లోకనాశనానికి, స్వార్థంతో మీరు కోరుకుంటే, ప్రజలు లోకక్షేమం కోరి, మీ నాశనాన్ని కోరుకుంటున్నారు. మీరు చేసే పని (మీరు - మీ పిల్లలు) మీ ఇంట్లో ఎంతమంది అభినందిస్తున్నారు ? చెప్పండి. పైకి చెప్పుకోలేకపోయినా, మీ రాజమందిరాలలోనే మీ వినాశం కోరేవారు. చాలామంది వున్నారు. అయినావారు తమ ధర్మంగా ఓర్పు సహనాలతో, మీకు సేవలను విధిలేక చేస్తున్నారు.

అనుక్షణం అవమానాలు అపమృత్యు భయం నుండి, ఆ భగవంతుని కరుణతో బ్రతికి బయటపడి, కష్టపడి, మీరిచ్చిన ఘోరాటవిలో మహాసామ్రాజ్యం నిర్మించుకుంటే, అవ్వ. నలుగురు నవ్విపోతారనే కనీసజ్ఞానం కూడా, లేకుండా- అసూయా ద్వేషాలతో, మాయచేసి, జూదం పేరున, మీరు పిలిచారని పిలిపించిన మోసం... ఇప్పుడు మహాపాపమై, అన్నాడు, మెల్లిగా - నీకు, పిల్లలకు తప్పని ఉరిశిక్షయై కూర్చుంది. వారి దిక్కుమాలిన చావులు -

"మహారాజా! మీరు చూడక తప్పదు. మీ ఉప్పు తిన్నందులకు మేము బాధపడకు తప్పదు. అవసాన దశలో ఉద్ధరిణెడు తులసీ తీర్థం పోసే దిక్కులేక, ఆ పొందే చావు.. ఎంత దిక్కుమాలినదో, ఒక్కసారి వూహించుకోండి. అప్పుడు... అప్పుడు... ఇష్టం లేకపోయినా, తన తమ్ములు... ముఖ్యంగా భీముడు కాదంటున్నా, గొంతులో ఇంత తులసీ తీర్థం పోసేవాడు, పెద్దవాడైన యుధిష్టరుడౌతాడు కానీ, నీ కొడుకు దుర్యోధనుడు కాడు. అనురాగం, ప్రేమ బంధాలు వుండాలి. అవి ప్రాణాంతకం కారాదు. పీకల మీదకు తేరాదు. ఎంతో గౌరవ ప్రతిష్ఠలతో, భరతవంశ కీర్తిప్రతిష్ఠలకు, ఉభయ సంతానం (మీ పిల్లలు, తమ్ముని కొడుకులతో)తో నిజమైన చక్రవర్తిగా లోకానికి, మగమహారాజుగా ఇంటికి... అదే వంశానికి, వెలుగు కావలసినవారు, వెలుగవలసిన మీరు...

ఇప్పుడు - అనుక్షణం ఆరిపోయే దీపమయి, దానికెవరో చెయ్యి అడ్డుపెడితే, ఆ రక్షణంలో గొప్పవారిగా విర్రవీగాలని తలువడం, ఎంత అవివేకమో, బాధాకరమో, అవమానకరమో... ఆలోచించండి, ఇకనైనా... మేలుకొండి!

ధృతరాష్ట్రుడు వినలేకపోతున్నాడు. ఇటువంటి సలహాలు, సూచనలు, కథలు గాథలు, నీతి - న్యాయ - ధర్మాలు - మర్మాలు... చెప్పనివారు లేరు. ఇన్నీ విని బుద్ధిమారని వారు వీరు. వీరికి చెప్పడం అనవసరం, అయినా అక్కడ కృష్ణుని వలెనే ఇక్కడ సమయం దొరికినప్పుడల్లా వ్యాసశక్తితో సంజయుడు - ధర్మార్థములు తెలియబరుస్తున్నాడు. ఉపేక్షించక, మేలుకుని, నిన్ను - నీ వంశాన్ని రక్షించుకోమని ప్రార్థిస్తూంటే, దానిని విడచిపెట్టి, మరింకేదైనా చెప్పమని కోరుతున్నాడు. బుద్ధిలేని, మతిమందగించిన, ఆ ముసలి - గుడ్డి మహారాజు ధృతరాష్ట్రుడు. వినరని తెలిసి, వివేకహీనులకు, సద్బుద్ధి కలగాలని, చాతనయినంత ప్రయత్నించాను. ఎందరు చెప్పినా వినని ఈ మూర్ఖులకు, ఆ కాలము, "కాలుడే" సమాధానపరచాలని, చివరకు... విధిలేక, ఏదో విధంగా మారణహోమదృశ్య కథనాలను, విని... ఆ నాశనమయ్యే కొడుకులతోపాటు, ఈ కుమారుడు నాశనమవకుండా, కనీసం - "మానవుడు" అనిపించుకుంటాడనుకుని వ్యాసులవారు ప్రసాదించిన ఫలితమీ-సంజయుడు. ఎక్కడో జరిగిన - ఎంతటి పరమ రహస్యాలనో, మహర్షి - మనసు తత్త్వము తెలిపి, ధృతరాష్ట్రునికి తెలుపుతున్నాడు.

# అర్థం చేసుకో!

"అర్జునా! - ఇది కేవలం "నరుడైన" అర్జునునికే కాదు. ఈ మానవాళి మొత్తానికి, జగదాచార్యుడై - పారంపర్య గురుపీఠానికి ప్రతీకగా అందించిన మహాద్భుత - దివ్య సందేశం. సదా శ్రవణ, మననాల సంస్మరించదగ్గ దివ్యోపదేశం.

"అశాశ్వతమైన - ఈ లోకాన్ని - ఇందలి సృష్టిని శాశ్వతమనుకునే వారు మూర్ఖులు. వారి నేదేవుడు కరుణించలేడు, సంస్కరించడు కూడా! సదా ప్రకాశించే సూర్యుడే కొన్ని కొన్ని సమయాలలో అజ్ఞాతానికి వెళ్ళినట్లు కనబడతాడు. ఉదయాస్తమానాల ప్రాతిపదికతో, అనుక్షణ సంచారమూర్తి అవుతున్నాడు. దీనినెవరైనా ఆపగలరా ? చెప్పు" అన్న కృష్ణుడు, ఆ... వెంటనే -

"ఆపగలరు. ఎవరో తెలుసా ? నియమిత కర్మల దృష్టి పెట్టి - ధర్మకర్మలు- తమ ధర్మంగా తలచి, సర్వమానవాళి సంక్షేమం కోరుతూ, తమకోసమని ఏ ఆలోచన లేని పుణ్యమూర్తులు. ఈ సూర్యసంచారాన్ని ఆపగలరు. లోకోపద్రవానికి కారకులు అవుతారు. పరమశాంతికి, ప్రాతిపదిక లవుతారు.

"నన్ను విడచి, గురుపథం మరచి, వ్యక్తిగత జీవనం గొప్పగా తలచి, తను తలచిందే సద్ధర్మమనే మూర్ఖులు తప్ప - మిగిలిన ధన్యాత్ములందరు నన్ను తెలుసుకుని తరిస్తారు.

"అనన్యాశ్చింతయంతోమాం....!" అన్నారు చూడు. ఆ రకంగా ఎవరైతే తమ సర్వబాధలు, చింతలు, ఒక్కటేమిటి వారి సర్వం నాకు సమర్పించి... అంటే "సర్వస్య శరణాగతి"యని శరణుజొచ్చుతారో, వారి సర్వబాధ్యతలను నేను స్వీకరిస్తున్నాను. వారి యొక్క యోగక్షేమాలను నేను చూస్తాను. ఇది నా ప్రతిజ్ఞ! ఇందులో ఎటువంటి అలక్ష్యం, అలసత్వం వుండదు.

"ఇది తెలుసుకున్ననాడు, పరమకృపామయుడు, కరుణాళువుయైనవాడు, తన సంతానమైన సర్వసృష్టిని సదా సంరక్షిస్తూనే వుంటాడు. ఇవన్నీ కర్మగతి ననుసరించి జరిగే చర్యలు. వీటికి విధి విధానాలు, విధి నిషేధాలు వుండవు.

"వేదవేత్తలు నన్ను స్మరించే సర్వదా, వారి వారి సర్వ కామ్యములను పొందుతున్నారు. వేదయజ్ఞాది భగవత్ప్రియ కార్యక్రమములను సల్పువారు, వారి వారి ధర్మాలు, కర్మల - కనుగుణ్యమైన ఉత్తమ లోకాలను పొంది అనుభవించ వలసిన సర్వసుఖములననుభవించి తిరిగి, ఈ లోకమునకు వస్తున్నారు. తిరిగి వారి వారి ధర్మముల నిర్వహిస్తున్నారు. ఇది నిరంతర కాలచక్ర భ్రమణంలో భాగం. అయితే-

"నన్నే కోరువారు, ఏ విధమైన "ఇహ-పర" ప్రలోభాలకు లోను కాకుండా, నన్నే స్మరిస్తూ, నాయందే మనసు నిలిపి, నేను తప్ప ఇతరములయందనాసక్తితో పుణ్యకర్మలు సల్పుతారో - వారు - వారు నన్నే చేరుతున్నారు. నా యందు లయమవుతున్నారు. ప్రళయ కాలమందు కూడా ఏ విధమైన భయము లేకుండా నిర్భయముగా భగవన్నామం జరుపుకుంటూ పుణ్యమూర్తులై ప్రకాశిస్తున్నారు. కనుక - ఓ! అర్జునా!

"ముందు నా భక్తుడవుకమ్ము. నా తత్వం తెలుస్తుంది. నాకు నమస్కరించు. దాని విలువ తెలుస్తుంది. అనుసరించు, ఆ ధర్మమార్గమర్థ మవుతుంది. అప్పుడు నాలో - సముద్రంలో నదులు కలసిపోయినట్లు కలిసి పోతావు. ఆలోచించడానికేమి వుండదు. వున్నది - వుండేది ఆ పరమాత్మ... అందులో నీవు. ఇప్పుడు - జీవాత్మ - పరమాత్మలొకటా... రెండా ?... అంటే... ఒక్కటేనని సమాధానం తెలుస్తుంది.

"జిజ్ఞాసాపరులై జ్ఞానులకు, భగవద్భక్త పరాయణులకు, పరమభాగవ తోత్తములకు అందని, ఈ తత్వం - నిన్ను నా శిష్యునిగా, భక్తునిగా, నా ప్రాణంగా, ధర్మంగా- కర్మగా - సర్వంగా తలిచాను, కాబట్టే - యుద్ధ సమయమైనా, ఈ దివ్యోపదేశం పొందగలిగావు. కేవలం - నాకు ప్రతిరూపులైన మహాత్ములకు, మహాఋషులకు పరతత్వమెరిగిన పుణ్యమూర్తులకు తప్ప ఇతరులకిది అలభ్యం. ఈ సత్యం తెలుసుకున్నవాడు దీని ప్రకారం నడిచేవాడు పుణ్యుడు. వారికి ఉత్తమలోకాలు శాశ్వతం.

"ఎవరు ఏ రకంగా పూజించినా, ఆరాధించినా, ప్రేమించినా - చివరకు ద్వేషించినా సరే, వారికి వారి, వారి ధర్మకర్మల ప్రకారం, వారికివ్వవలసినది ఇవ్వబడుతుంది. నన్నెలాగ పూజించాలి. ఇదొక సమస్య కాదు. ఉత్పన్నము కాని

ప్రశ్న కాదు. ఎవరే విధంగా నన్ను పిలిచినా, కొలిచినా వారినా విధంగా ఆదుకుంటాను. పత్ర పుష్పం ఫలం తోయమని ఏమిచ్చినా పుచ్చుకుంటాను. కానీ ఆ పుచ్చుకున్న దానిని నా వద్ద వుంచుకోను. నన్ను ఆశించి మీరు చేసే కర్మలకు తగ్గ ఫలితంగా, పుచ్చుకున్న దానికి, వందరెట్లు ఇవ్వాలనే నా కనీస సంకల్పాని కనుగుణంగా, ప్రసాదంగా, ఫలంగా, ఫలితంగా వారికిస్తున్నాను.

అంతేకాని భగవంతునికింత ఇస్తున్నామని "ఇంతకి - అంత" అని లెక్క లేసుకునే వారికి, అంతకంత ఇచ్చేస్తున్నాను. తప్ప నా దగ్గర ఏమీ వుంచుకోను. ఇది జ్ఞానులు, పరమయోగులు తెలుసుకున్న సత్యం.

అందుకే - వారు నా నుండి "నన్ను" తప్ప మరేమీ ఆశించరు. ఆశాపాశాల కతీతులు ఆ మహర్షులు. అందువలననే - వారు - నిత్య, సత్య శాశ్వత పుణ్యమూర్తులై ప్రళయకాలమందు కూడా, ఆ విలయంలో చిక్కుకొనకుండా ప్రకాశిస్తున్నారు.

కొందరు, వారి వారి అభీష్టాలను బట్టి, ఆయా ఫలితాలను ప్రసాదించే దేవతల గురించి అర్చన, ఆరాధనలు జరుపుతారు. వారికి ఆ యా దేవతలు ఆ యా ఫలాలను ప్రసాదిస్తారు. అందరిలో, అన్నింటిలో వున్న నేను, వారి వారి ప్రాప్తాలను బట్టి ఆ యా ఫలాలనిస్తుంటాను తప్ప, అడిగారని అర్హత లేకుండా, అడిగినదిచ్చి, వారికి ప్రమాదం తెచ్చిపెట్టను.

"అర్థమవుతుందా..... ?! ఈ ప్రశ్న అర్జునునికే కాదు, అటు ధృతరాష్ట్రునికి వర్తిస్తుంది. కృష్ణుని ప్రేరణ - ధృతరాష్ట్రుని చింతాక్రాంతుని చేస్తుంది. "సంజయా!" ఏదో చెప్పబోతున్నాడు మహారాజు. అప్పుడు -

"మహారాజా!" ఈ సమయంలో - శ్రీకృష్ణ భగవానుడు ఏమంటున్నాడో.. తెలుసా......! "చెప్పు.....!" నిరాసక్తునిగా అడుగుతున్నాడు. "వినమని" సంజయుడు - ఆసక్తిగా చెబుతున్నాడు. "నన్ను తెలుసుకోవడం కష్టం. నేను లేనిదేదీ లేదు. ఈ సృష్టి యావత్తు నేను ప్రకాశించే అగ్ని, ఆరిపోయే ధూమం. వెలిగే సూర్యుడు, ప్రకాశించే చంద్రుడు.

సర్వప్రాణి - ఆహారాది అవసరాలను తీర్చే భూమి, అందలి జలము, ప్రసరించే వాయువు, ప్రకాశించే తేజము, వ్యాప్తించిన ఆకాశము నేనే. జీవాత్మ

నేను. పరమైన - ఆ"పర"మాత్మను నేనే. ఆది మధ్యంతములు నేనే. తేజోరూపమై ప్రకాశించి, దివి, భువి, సర్వత్రకల్గే కాంతివంతము, ఆయుర్వంతము, చైతన్యవంతము, సర్వము నేనే.

కొండలు - గుట్టలు, స్థిర - జడ - చైతన్య - అచలములన్నీ నేనే. ఇంద్రియములలో మనసు, ప్రాణానికి చైతన్యము, రుద్రులలో శంకరుడు, యక్ష రాక్షసులలో కుబేరుడు, వసువులయందు అగ్ని, మేరు పర్వతము, బృహస్పతి, కుమారస్వామి, గణపతి, సముద్రము భృగువు, ఓంకారము, ఓజస్సు, తేజస్సు నేనే.

యజ్ఞముల - జపయజ్ఞము, పర్వతముల హిమవత్పర్వతము, అశ్వత్థామ, దేవర్షి నారదుడు, గంధర్వుల - చిత్రరథుడు, కపిలముని, ఉచ్చైశ్రవము, ఐరావతము, వజ్రము, కామధేనువులను నేను. అటు మన్మధుడు, ఇటు వాసుకి, ఇంకా అనంతుడు, వరుణుడు, యముడు, భక్తులలో ప్రహ్లాదుడు నేను.

కాలము, గరుడుడు, సింహము, వాయువు, మొసలి, గంగానదే కాదు, ఆధ్యాత్మిక విద్య, ఓంకారము, అటు మత్స్య, కూర్మ, వరాహ, నృశింహ, వామన, భృగురామ, రాములేకాదు, బలరాముడు, ఇప్పుడు మీరందరు చూసే శ్రీకృష్ణుడు- అంతా ఒక్కటే. విరాట్పురుషుడినైన, నేను, లోక, కాల సందర్భములను బట్టి, అవతరించుట, అలాగ - వచ్చిన అవతారముతో, అందరిని అలరించటం (ఇందులో దుష్టశిక్షణ, శిష్టరక్షణం కూడా కలిసి వుంటుంది) నావిధి.

"మహారాజా! శ్రీకృష్ణ పరమాత్మ చెబుతూంటే, అర్జునుడు ఆశ్చర్యంతో వింటున్నాడన్నాడు. ఇక్కడ ధృతరాష్ట్రుడు - తమకెవ్వరికి లభించని అదృష్టం అర్జునునికి లభించిందని కుళ్ళిపోతున్నాడు. కృష్ణునితో పరిచయం పెంచుకున్నా, దుర్యోధనుడు బ్రతికేవాడనుకున్నాడు.

"రాజా!" తన పరిస్థితి తానే దుఃఖిస్తూ అన్యమనస్కుడైన, ధృతరాష్ట్రుని గట్టిగా పిలిచాడు. "చెప్పు!" సంజయా!" వులికిపడిన ఆ ధృతరాష్ట్రునికి, ఎన్నో ధర్మాలను చెప్పిన శ్రీకృష్ణుడు తను చెప్పిన విషయాలకు సత్య స్వరూపంగా లోకాలు, లోకేశులు, సిద్ధ - సాధ్య మహర్షి సంఘములు, దేవతలు, ఋషులు, బ్రహ్మరుద్రులు, దర్శించలేని.... మహాద్భుత విశ్వరూపాన్ని - ఆ - శ్రీకృష్ణ

భగవానుడు, అర్జునుడికి చూపిస్తున్నాడన్నాడు. మళ్ళీ ఆ అదృష్టం మాకు లేదేనని, ధృతరాష్ట్రుడు, బాధపడుతూంటే -

"రాజా! అనంతము, అవ్యక్తములయిన విభూతులను, అదృష్టంగా, ఆ మహానుభావుని నోటి నుండి వినగలిగాము. అదే జన్మసాఫల్యమనుకుంటూంటే ఇప్పుడా దేవదేవుని విశ్వరూపము...!" అనగా, అర్జునుడు అదృష్టవంతుడంటాడు, మహారాజు.

"కాదు. అసలు సిసలైన అదృష్టం నాది. గ్రుడ్డితనం నుండి బయటపడి, నీ ఇష్టం ప్రకారం యుద్ధభూమిలో వీరవిహారం చెయ్యమని ఆదేశిస్తే, ఆ స్వైర విహారం వలదని, నిన్నలాగే వుంచమని, మీరు కోరారు. దాని ఫలితంగా, ఆ మహర్షి వేదమూర్తి - తమ శక్తితో నాకు, దివ్యదృష్టి, కథా సృష్టి - ఇక్కడ వుంటూ అక్కడ సంచరిస్తూ, అన్నీ తెలుసుకుంటూ, తెలుపవలసిన దానిని తెలుపుతూ... అక్కడ జరిగేది, యావత్తు ప్రత్యక్షంగా దర్శించాను. చూడండి. ఆ అనుగ్రహం నన్ను ధన్యుని చేసింది. ఆ దేవదేవుని దర్శించి, వారి మాటలను వినే మహత్తర అదృష్టం కలిగించింది. ధన్యుడనన్నాడు!

**"సహస్ర శీర్షః పురుషః సహస్రాక్షసహస్రపాత్**
**స భూమిం విశ్వతోవృత్వా, అత్యతిష్టదశాంగులం**
**పురుష ఏ వేదగ్ంసర్వం, యద్భూతం యచ్ఛభవ్యం**
**ఉతామతత్వస్యేశానః యదన్నానేతి రోహితి...**

అహా! మహాద్భుతమైన వేదబుక్కులు కర్ణపేయం గావిస్తుంటే, శ్రవణానంద కరమైన, ఆ దివ్యమంత్రం ఆత్మానందం కల్గిస్తూంటే - ఆ దేవదేవుడు, ఆ దేవకీసుతుడు, జగదుద్ధారుడు, జనార్దనుడు, సర్వశక్తి స్వరూపుడు, ఆ యశోదానందనుడు... అలా... అలాగ... అలాగ... పెరుగుతూ విరాట్పురుషుడై ప్రకాశిస్తూంటే - "సహస్ర శీర్షాః పూరుషః" అన్నది, ఆ అనంతశక్తి సమన్వితుని బాహువులు, పాదములు శిరములు, వివిధాయుధములు, అర్భకులు, దుర్బలులు చూడలేని రీతిగా- తత్త్వవేత్తలు, పుణ్యమూర్తులు, మహాభాగవతోత్తములు, పరమ మహర్షులు... ఒక్కరేమిటి... సర్వలోకాలలోని సత్వ, సత్యమూర్తులు... కేవలం భక్తితో తప్ప, ఇతరత్రా దర్శించలేని విధంగా తేజోమయుడై, అనంతుడు, ఆది

మధ్యాంతరహితుడై, భూ-నభోంతరము లందు నిలచి వెల్గుతూంటే, తలచి - తరచి, చూడలేని ఆ దివ్యశక్తిమూర్తి...

"అర్జునా! అనగా, ఆ కంఠధ్వని భూనభోంతరాలముల ప్రతిధ్వనిస్తుంటే, గర్జిస్తున్న ఆ పిలుపు కేవలం మహాభక్తులు తప్ప ఇతరులెవ్వరు వినలేరు. ఆ ధ్వనికి కర్ణపుటాలు పగిలాయన్నా తప్పు లేదు. "భవుడు, ఆనందుడు" భయంకరుడు, భవబంధరహితుని, హుంకరింపే చాలు. మరే ఆయుధంతోను పనిలేదు. దుష్టులకు, దుర్బలులకు, అంత భయంకరంగా వున్నాడు... మహాభక్తులకు, భాగవతోత్తములకు, మహర్షి సంఘాలకు!" అంత ఆనందమూర్తిగా వున్నాడు. అంటూ - సంజయుడు "రాజా!" అన్నాడు. "మా వాళ్ళు వున్నారా ?" తాను భయపడుతూ, ధృతరాష్ట్రుడడుగుతున్నాడు.

"ఇంకా వున్నారు... చావలేదు. ఆ దివ్య తేజస్సును చూడలేకపోతున్నారు. కళ్ళు లేక కాదు, చూసే శక్తి లేక!"

"అవును. పాపాత్ములు!" ఇప్పుడనుకోకుండా, ధృతరాష్ట్రుడు, వుండలేక పోతున్నాడు. ఇప్పుడే -

"ఓం - **నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే సహస్రపాదాక్షిశిరోరుబాహవే**
**సహస్రనామ్నే పురుషాయశాశ్వతే సహస్రకోటీయుగధారిణే నమః**

అని వేదవేత్తలు - ఆ పరమాత్ముని స్తుతిస్తున్నారు.

**"సహస్ర శీర్షం దేవం, విశ్వాక్షం విశ్వశంభవం**
**విశ్వంనారాయణం, దేవ, అక్షరం పరమంపదం**
**విశ్వతః పరమాన్నిత్యం విశ్వంనారాయగ్ంహరిం**
**విశ్వమేవేదం పురుషస్త ద్విశ్వముపజీవతి**

ఈ వేదబుక్కులం మహాప్రార్థనం - యుద్ధభూమిలో వున్న అందరికి తెలియదు.

అసలు - కృష్ణార్జునులు, అక్కడేం చేస్తున్నారో... ఏం జరుగుతుందో.... వారికెవ్వరికి తెలియదు. వారికే కాదు. వారిరువురికి, వేదవ్యాసులకు, ఆ మహాదేవుని కృపతో నాకు, వినే మీకు తప్ప.... మరెవ్వరికి తెలియదు. ఇది మహా అదృష్టం.

జన్మజన్మల పుణ్యాకర్మను బట్టి, పుణ్యాశీలుర సహవాసం బట్టి, ఆ దేవదేవుని కరుణ బట్టి లభించిన అద్భుత సావకాశం.

**"వ్యాసాయ విష్ణురూపాయ, వ్యాసరూపాయ విష్ణవే**
**నమోవైబ్రహ్మనిథయే, వాసిష్ఠాయ నమోనమః"**

అని - ఆ పరమపురుషుడు ప్రసాదించిన దివ్యశక్తిన, ఆ పరమాత్మకు, వందన శతాలర్పిస్తున్నానని, సంజయుడు ఆత్మానందభరితుడయ్యాడు.

★★★★

"అర్జునా! చూస్తున్నావా!" ఆ పరమాత్మ అడుగుతున్నాడని, సంజయుడు-ధృతరాష్ట్రునకు చెబుతున్నాడు.

"నిన్నటిది, కలగా చెప్పడంలేదు. నేటిది సత్యంగా చెబుతున్నాను. నేనెవరో తెలుసుకో! "నువ్వు "నేనే", "నేను" నేనే! ఈ నేన్నది తెలుసుకోవడం కోసమే వేదవిదులు, తపోమూర్తులు తలక్రిందులుగా తపస్సు చేసే వాలఖిల్యాదులు. అనుక్షణం శ్రీహరి దర్శనం, లీలావిభూతులకై తపించే సనకసనందనాదులు.... తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

అయినా "నేను" నేనే. నన్ను తెలుసుకోవడమసాధ్యం. అన్న - ఆ జగద్గురువు....!" అనగా... "ఇంకేమంటున్నాడు... ?!" ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. అక్కడ అర్జునుడు ఆశ్చర్యపోతూ, వింటున్నాడు.

"వృష్ణివంశ - వాసుదేవుడను, యదువంశ బలరామకృష్ణుడను, నన్ను ప్రేమించే రాధ. ఆరాధించే అసంఖ్యాక భక్తజనులు, పాండవులలోని అర్జునుడు, మునుల - వేదవ్యాసుడు, కవుల - శుక్రచార్యుడు, దండనలో శిక్షను, దమములోని నీతి, మోసము... అన్నీ నేనే!

అర్జునా! ఇది నా విశ్వరూపము. చూడు. నీవు చూడగోరినవి, నీకు తెలియనివి, తెలుసుకోదగ్గవి ఎన్నో వున్నాయి. అనంతవిభూతులు, ఆశ్రిత వత్సలులు, హీనులు, వీరులు, శూరులు, రిపులు - ఈ విశ్వంలోని ప్రతి అణువణువు, విశ్వేశ్వరుడినైన నాలో వున్నాయి. సూర్యుడు, వసువులు, రుద్రుడు,

అశ్వనీదేవతలు, మరుత్తులు. ఇంద్రాది దిక్పాలకులు, హరి-హర-బ్రహ్మలు... చూడు. నీవు చూడలేననుకునే వారందరు, నా యందు కలరు.

పధ్నాలుగు లోకాలు, రాక్షసులు, పన్నగులు, యక్షులు, చెట్లు చేమలు, స్థావర జంగమములు పశుపక్ష్యాదులు, గిరులు, కొండలు.... చూడు... చూడు... మని, ఆతడు చూడగల్గిన నేత్రాలను ప్రసాదించి మరీ, తన దివ్యరూపాన్ని దర్శింప చేస్తున్నాడు. అది - అర్జునుని పులకరింప చెయ్యడమే కాదు. నరనరాలలోని అణువణువు పలకరింప చేసింది. ఆ దివ్యదర్శనం దర్శిస్తున్న అర్జునుడు "ప్రభో, కృష్ణా!" అంటూ శరణాగతుడైనాడు. తాను చూసేది చెబుతున్నాడు.

"దేవతలు, ఋషులు, సిద్ధ-సాధ్యులు కాదు. అనంతసృష్టితోపాటు, అందులోని మా తాతపాదులు భీష్మలవారు, మా సోదరులు దుర్యోధనాదులు, కులగురువులు కృప, ద్రోణాచార్యుల వారలు, కర్ణుడు, శకుని, దుర్యోధనుని అనుసరించిన ఇతర రాజులు, సేనలోని ప్రముఖులు, అందరూ నీలో చేరి పోతున్నారు.

"ఇంకొందరు నీ పళ్ళసందులలో ఇరుక్కుని నలిగి చచ్చిపోతున్నారు. వారి శిరస్సులు ఛిద్రమౌతున్నాయి. ఈ కురుక్షేత్ర మహాసంగ్రామం పేరిట ఈ రాజలోకంలోని చాలా భాగం, నీ కోరలలో చిక్కుకున్నారు. కొందరు పళ్ళ మధ్య నలిగిపోతున్నారు. వీళ్ళు చూడటానికెలాగ వున్నారంటే - మహాగ్ని జ్వాలలతో రగిలే అగ్నిలో పడ్డ మిడతలదండులా వున్నారు.

ఒక్కొక్కరే కాదు, పుంఖానుపుంఖాలుగా ఓ దండుగా అగ్నిజ్వాలలోపడి మాడిపోతున్నారు. ఆ భయంకర తేజో అగ్ని స్వరూపానికి స్వ - పర భేదాలు కనబడటం లేదు. ఈ పోరాడే వారందరు కూడా, మరణాన్ని ఆహ్వానిస్తున్నట్లు గబగబ పరుగెత్తి నీలో లయమైపోతున్నారు తప్ప చావు నుండి తప్పించుకోగలమని ఏ ఒక్కరు తలవడం లేదు. ఓ దేవదేవా! నీకు నమస్కారము. నీ శక్తికి నీ తేజో స్వరూపానికి, నమస్కారము, నమస్కారము.

"అర్జునా!" ఆ జగాలు దద్దరిల్లే గర్జన ప్రతిధ్వనులవంటి ఆ మాటల పిలుపుకు అర్జునుడు తలపైకెత్తి చూసినవాడు. "మహానుభావా!" అని ప్రార్థించాడు.

"నన్ను కాలస్వరూపుడంటారు. నేనే కాలాన్ని, దాని నియంతను కూడా. కాలము తీరినవారిని లయం చేసుకోవడం నా ధర్మం. నా కాలాగ్ని రుద్రస్వరూపం.

తల ఎత్తి చూడసాధ్యం కాదు. మంచికి - మంచి, చెడుకు - "చెడు" ఈ స్వరూపం. ఇందులో ప్రేమానుబంధాలకు, మమతానురాగాలకు చోటు లేదు. కాలంగా నేను చేసే నిర్ణయం మేరకు, "కాలుడి"నై, కాలము తీరినవారిని, ఏమీ ఎరగనట్లు, వారికి కూడా తెలియకుండా, కాలాగ్నిలో ఆహుతి చేస్తాను.

ఆ తదుపరి - వారి వారి కర్మలు, అనుసరించిన ధర్మాల ప్రకారం - జన్మలు, జన్మకర్మలు... ఆ సృష్టి విచిత్రం - అది ప్రత్యేకం.

నీకు నా యందు గల అనన్య భక్తి వలన, ఈ దివ్యరూపం చూడగలిగావు. విశ్వదేవతలకు కూడా కొన్ని సమయాలలో, ఈ అపురూప సందర్శనమసాధ్యం. "వేదాధ్యయనము, యజ్ఞయాగాదులు, క్రియలు, దానములొనర్చెడు వారలు, ఈ రూపము చూడలేరు. అందరు చూడగలిగింది - ఇదిగో ఈ చతుర్భుజ రూపమనీ, (ఆ సహస్ర భుజుడు, సహస్ర శీర్షుడు, పాదుడైన ఆ పరమాత్ముడైన) చూసి తరించడమనీ, తన తీవ్రతను తగ్గించాడు.

భగవంతుని చూచాననడం తప్పు. సహస్ర సూర్యకిరణ తేజోసంజాతుడైన ఆ దేవదేవుని కోట్యంశములలో, ఒకానొక అణువును దర్శించి దైవ సాక్షాత్కార మొందానంటారు. కొందరు ఆ అణుదర్శనానికే, మతిభ్రమించి, చిత్తచాంచల్యంతో పరుగులు తీస్తారు. ఇంకొందరు అవధూతలై తాము ఎత్తిన జన్మను, అందలి కర్మరూపాన్ని మరచి చరిస్తారు.

కనుక - అర్జునా ? మనం చూసేది, చూసామని చెప్పేది - భగవంతుని స్వస్వరూపంలోని, కోట్యంశ భాగ అణురూపం మాత్రమే, అర్థమవుతుందా. దీనికి, కొన్ని సిద్ధులు సిద్ధిస్తే వారంతా దేవతామూర్తులుగా భజనలు చేయించుకుని, సుఖభోగలాలసులై నన్ను మరచిపోయి, హీన - కారణ దుర్భర జన్మలకు దారి చేసుకుంటున్నారే తప్ప దైవభక్తులై నిలువడం లేదు.

ఇప్పుడు చెప్పు. డబ్బుకు దాసోహం... దేవుడా ?... మానవుడా!!

కర్మ నియతిని సాగే జగతిలో, దేవుడు - ధర్మము, సత్యము నిత్యము - శాశ్వతము. అతనేప్రలోభాలకు లొంగడు. లొంగేది కేవలం "పరమాత్మా! అని నిండు భక్తితో చేసే నమస్కారానికే. దానికే ఆ దేవదేవుడు పరమప్రీతితో, ఈ భక్తుని వీని పేరున వారి తరాలను సంరక్షించ సిద్ధపడేది!

ఇంత చెప్పినా అర్థంకాపోతే, నీకు చేయవలసింది బోధలు కావు. కర్తవ్యానికి వీలయిన ధర్మశాస్త్రి. లే! లేచి, ఆయుధం పట్టు. గాండీవం సరిచెయ్యి. శరం పట్టు. ఈ టంకారంతో జగము ప్రతిధ్వనించాలి.

అన్నీ చూసిన నీవు, ఏదీ అపలేవు. నీవు చంపినా, చంపకపోయినా, నీ చేతులలోని కర్మం ప్రకారం, వారి ధర్మంగా మరణిస్తారు. నీవు లోకదృష్టిలో వీరుడవు. నా దృష్టిలో కాదు, నాకు చాతకాదు. అనడానికి వీల్లేదు. నిన్ను నిలబెడతాను. ధనస్సు పట్టిస్తాను. శరాన్ని సంధింప చేస్తాను.

ఇది యుద్ధం కోసం చేసిన ఉపదేశం కాదు. ధర్మం కోసం చేసిన ధర్మోపదేశం. ఔనన్నా, కాదన్నా, కాలుడినైన నేను సర్వనాశనం చేసేస్తాను. ఆ పేరు, పరువు నీవు నిలబెట్టుకో. కృష్ణార్జునులు వున్నారంటే విజయమక్కడ సిద్ధమన్నమాట నీ వలన ఆ సత్యం, అసత్యం కారాదు. బుద్ధిమంతుల లక్షణమేమిటో తెలుసా ?

**చెప్పింది వినడం; విన్నది ఆచరించడం; ఆచరించి, తరించడం**
వీటిని విస్మరిస్తే, కాలక్రమంలో కాలుడు నిన్ను వదలడు. జాగ్రత్త'' అని హెచ్చరిస్తాడు.

అది "మహారాజా!'' ఇంతవరకు మాటలు, సూక్తులు - బోధలు చేసిన పరమాత్మ - చివరకు అర్జునుని హెచ్చరించవలసి వచ్చింది.

"చంపేవారెవరు ? చచ్చేవారెవరు ? అంతా నీ చేతిలో వుందను కుంటున్నావు, అర్జునా! అన్నింటికి మూలపురుషుడిని, కాలపురుషుడిని నేనే. ఇప్పటికైనా సత్యాన్ని గ్రహించి, సాహసిస్తే మంచిది. కాదంటే బొమ్మలలో యంత్రాన్ని పెట్టి - జంత్రగాడు (బొమ్మలనాడించేవాడు) వాటినే విధంగా ఆటలాడిస్తాడో.... ఆ విధంగా నేను... నిన్ను నిమిత్తమాత్రం చేసి నాలీలను నేను సలుపుతాను.

ఎవరి ధర్మం వారు చెయ్యాలి. మన కర్తవ్యం మనం చేస్తే - మిగిలినది ఆ భగవంతుడు, తన ధర్మంగా తన సృష్టి క్రమాన్ని, ధర్మ-కర్మ-చక్రానుగతంగా నడుపుతాడు. ఇక వాదన, వేదన విడిచిపెట్టుము.'' అని హెచ్చరిస్తాడు - కనుక ఆయువు మూడిన వారందరు చావాలి, చస్తారననా ? చద్దామననా.... ?? అయితే

మళ్ళీ మొదటికొచ్చాడు, ధృతరాష్ట్ర మహారాజు. "కాలోస్మి!'' అన్న ఆ పరమాత్మ కూడా, ఈ మూర్ఖ మానవులను సరిదిద్ద లేరనుకున్నాడు.

ఆ వెంటనే మహారాజా! ఆ విధంగా కృష్ణుడు - అందర్నీ ఒకసారి అర్జునునికి చూపించినట్లు, చూపించి "ఏం చేస్తాం, బావా! తప్పదు. కర్మమనుభవించాల్సిందే!" తప్పదని తెలివిగా గాండీవం పట్టించి, శరమాతని చేతిలో పెట్టి - "విడిచావో... జాగ్రత్త, నేను చంపుతానని, వురిమి వురిమి చూస్తూ సహజ చిరునవ్వుల - ఆ సుందర - మందస్మితవదనుడు, ఆ చెరగని చిరునవ్వుతో ఇంకా పూర్తిగా జ్ఞానోదయమొందని, అజ్ఞాన అర్జునుని పట్టుకుని, రథం వద్దకు తీసుకు వెళ్ళాడు.

అంతవరకు జరిగిందేమిటో తెలియని ఉభయసేనలు, జయ, వీర ధ్వానాలు చేసారు. గుఱ్ఱాల సకిలింపులు, ఏనుగుల ఘీంకారాలు పదాతిదళాల "పదండి. ముందుకు. పడదాం... ఒక పట్టు" అనే - వీరాలాపాలకు... తానుగా పాంచజన్యం పూరించి, "శతృవులు" అనుకునే వారి వారి గుండెల నదరగొట్టి, ఆంజనేయుడు "కపిధ్వజుడై తన ఘోషలతో దద్దరిల్లచేయ "నీ ఆజ్ఞ" బావా! అన్నాడు- బుద్ధిమంతుడౌతూ, అర్జునుడు!!!

# కదులు ముందుకు

**శం**ఖధ్వానాలతో యుద్ధం ప్రారంభమయింది.

ఇటు - విజయునితో - పార్థసారథిగా కృష్ణుడు. అటు - దుర్యోధనుని ప్రేరణతో, భీష్మని సారథ్యంలో ఉత్సాహంగా ముందుకురికిన - కౌరవసేన. యుద్ధం - ప్రారంభమవుతూండగానే - ఒక ప్రకటన -

వాళ్ళు - వాళ్ళ స్థాయి వారితోనే యుద్ధం చెయ్యాలి తప్ప - స్థాయి మరచి ప్రవర్తించరాదు. సంధ్యా సమయం యుద్ధ విరమణను పాటించాలి. అనవసర దూషణలు చేయకూడదు. అనివార్య యుద్ధం చేయవలసిన ప్రకారం- అవతలివార్ని చంపడానికి కాదు, పరాజితుల్ని చేయడానికీమాత్రం ప్రయత్నించాలి. అందరు - ఈ సూత్రానికి ఒప్పుకుని - ధర్మబద్ధ యుద్ధానికి సాగుతూన్నట్లు, ఉత్సాహంతో ముందుకురికారు.

ఎవరు - ఎవరితోననే - నియమ నిబంధనలు లేకపోయినా, అందరికి అక్కసైన భీముని మీద కొందరు గుంపుగా చుట్టుముట్టారు. ఉపపాండవులు

నకుల - సహదేవులు - కౌరవసేనలపై విరుచుకుపడ్డాడు. భీష్ముడు ప్రచండ సూర్యుడయ్యాడు. అర్జునుడు తాత నెదుర్కొన్నాడు. తప్పదు ఈతనితో పోరుతూనే, భీమ పరాక్రమానికి దుశ్శాసనులు పారిపోతూంటే, ఇటు అర్జునుని నిరోధిస్తూ, అటు భీమునిపై తన ప్రతాప బాణశక్తిని ప్రయోగిస్తున్నాడు.

భీష్మ భీములు - పోరుతుంటే - తిరిగి దుశ్శాసనాదులు నకులుడిపై పడ్డాడు. అతని ధ్వజాన్ని విరగ్గొట్టారు. సహదేవుని, దుర్ముఖుడు అడ్డగించాడు. ధర్మరాజు, శల్యుడిని ఢీ కొన్నాడు.

తన బలపరాక్రమాలతో శల్యుడు, యుధిష్ఠరుని విల్లు ఒకే ఒక్క బాణంతో విరగ్గొట్టాడు. అందుకు కుపితుడు కాకుండా, ధర్మరాజు నవ్వుతూ నకుల సహదేవుల మామ - శల్యుడు - వూహించని విధంగా బాణ ప్రయోగం చేసి, ఆమద్రేశ్వరునికి, ఆతని సేనకు విస్మయం, భయం కల్గించాడు.

దృష్టద్యుమ్నుడు - ద్రోణుని, మగధ సహదేవుడు భూరిశ్రవుడిని ఎదుర్కొంటే... భయంకరాకారుడైన అలంబుసుని, భీమసేన కుమారుడు ఘటోత్కచుడు, ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నట్లు ఒక పట్టు పట్టాడు. అంతా బాగానే వుంది.

ప్రళయతాండవం చేసే శివుని వలే, తాత చేసే యుద్ధం పాండవులలో భయాన్ని రేకెత్తించసాగింది. ఇలాగైతే - ఆయన బలపరాక్రమాలతో, ఈ వయస్సులోనే - ఇంతమందిని నేలకూల్చుతున్నారంటే - నడి వయస్సులో - "అమ్మో!" అది వూహించుకుని ప్రతి ఒక్కరు భయపడి పోతున్నారు. "తాతా" అంటే... "తంతా" అన్నట్లుంది, భీష్ములవారి విజృంభణం.. అయినా తన తండ్రుల పరువు నిలబెట్ట అభిమన్యు కుమారుడు, ముత్తాతను ఢీకొన్నాడు.

వీర ప్రముఖుడు కదా! చిత్రవిచిత్రంగా బాణాలు వేస్తూ - ఆనాడు గంగా ప్రవాహంతో ఆడుకుంటూ, శంతనుని ఆశ్చర్యపరచిన ఆ పిల్లవాడివలె, ఈ వీర అభిమన్యుడు చూడముచ్చటగా, చిత్రవిచిత్ర శరసంధానం చేస్తూ, ముత్తాతను ముద్దు గొలుపుతున్నాడు. చెంతకు తీసుకుని నుదుట ముద్దుపెట్టుకోవలసిన ముత్తాత, కాలధర్మంగా, తన ప్రతాపం చూపుతుంటే, ముత్తాతకు దీటుగా, ఆ మునిమనుమడు అభిమన్యుడి చేసే లాఘవం, శక్తి ప్రదర్శనకు, ఒకరి వెంబడి -

అందరు - భీష్ముతో కలిసి, ఎందరో అడ్డుకుంటే, ఏ మాత్రం - విసుగు - అలుపు, అధైర్యం చూపకుండా, విక్రమించి, తన ముత్తాతగారి తాళధ్వజాన్ని కూల్చాడు. పాండవసేన ఆశ్చర్యపోయింది. కురుసేన భయపడింది. "భళా!" అన్నారు ముత్తాత తన మునిమనుమని - వీరత్వానికి అభినందిస్తూ!

ఇది చూసి పాండవయోధుల సింహనాదాలు. భీముడు, అభిమన్యునికి బాసట. ప్రస్తుతానికి, చూడటానికి అందంగా, ఆనందంగానే వుంది. అయితే - భీష్ముని చండ ప్రతాపం - ఎక్కువభాగం - పాండవుల శిబిరంలో కలకలం లేపుతుంది. కురువీరుల గుండెల్లో ఆనందం పాదుకొలుపుతుంది.

మద్ర, పాంచాల, కేకేయ సైన్యాలు, భీష్ముని ముందు తలవంచాయి. ఆయన పరాక్రమానికి, ప్రాణాలర్పించడం తప్ప, మరో గతి లేనట్లు, చావు కోసమే ఇక్కడికి వచ్చినట్లయింది - వారి పరిస్థితి. ఆ దీనస్థితికి పాండవ శిబిరం దిగులు చెందింది. ఈలోగా సూర్యుడస్తమించాడు.

యుద్ధ నియమం ప్రకారం - ఆ మహాసంగ్రామం ఆపివేయబడింది. ఆ రాత్రి, ధర్మరాజు, తమ సోదరులతో కృష్ణుని దర్శించాడు. "బావా! తొందర పడ్డామా ?" భీష్మునితో యుద్ధం చేయడం సాహసమేనా ?" అడుగుతున్నాడు. అనవసరంగా ఇంతమందిని చంపేబదులు, యుద్ధ విరమణం చెపుతాము. అస్త్ర సన్యాసం చేస్తాము. ఎక్కడో అక్కడ కాలం గడుపుతాము" అన్నాడు.

"యుధిష్ఠిరా! పెద్దవాడివి. తొందరపడకూడదు. ఇది ఒకనాటితో సాగే యుద్ధం కాదు." ఇంతమంది మహావీరులు, ఉభయపక్షాలలో తమ ప్రాణాలు త్యాగం చెయ్యడానికి, సిద్ధంగా వుండి పోరాడుతుంటే, మొదటినాటి యుద్ధానికే, జావగారిపోతే విజయం... ఊ.. నిన్ను విడిచిపెడుతుందా ? వారిని వరిస్తుందా ? తొందరపడకు.

అవతలి శిబిరంలోకి చొచ్చుకుపోవాలి. వారి వారి ప్రతాపాలను గమనించాలి. అది చూడకుండా అడుగు ముందుకు వేస్తే....! "భయపడకు. మిమ్మల్ని, నేను విడువను. విజయం మీది, రాజ్యం మీది. నా మాట నమ్ము. విశ్రాంతి తీసుకో!

తెల్లవారి యథావిధి యుద్ధంలో ధైర్యంగా విజృంభించు..!" వాసుదేవుడు ధైర్యం చెప్పాడు. ముందుకురకమని సూచించాడు. ఇది మొదటి రోజు సంక్షిప్త యుద్ధ విశేష చిత్రం ?!

రెండవనాటి యుద్ధం ప్రారంభమయింది.

శ్రీకృష్ణుని ఆశీస్సులను తీసుకుని, ద్రోణ వధ కోసమే పుట్టిన, పాండవ సర్వసైన్యాధ్యక్షుడు - దృష్టద్యుమ్నుడు క్రౌంచవ్యూహం పన్నాడు. దీనికి అర్జునుడు ముక్కు, కుంతిభోజుడు శైబ్యుడు నేత్రాలు, ద్రుపదుడు శిఖ, దశార్ణ - శూరసేన, కిరాత రాజులు కంఠసీమ అయ్యారు. భీమ, దృష్టద్యుమ్నులు దక్షిణ, వామ భాగ రెక్కలుగా నిలిచారు. అభిమన్యుడు, సాత్యకి, ఉపపాండవులు, పౌండ్ర - చోళ - పాండ్యరాజులు, భీమునికి సహాయకులయ్యారు. నకుల సహదేవులు, ఘటోత్కచుడు, శంబరాది ఇతర రాజులు, సర్వసైన్యాధ్యక్షునిగా బాసటగా నిలిచారు.

కేకేయ, విరాట, కాశీరాజులు నడుము, ధర్మహూణ పతులు వెన్ను అయ్యారు. ఈ మొత్తం దుర్యోధనుడు చూసాడు. మీరందరు మహామహులే. కానీ పాండవుల క్రౌంచ వ్యూహాన్ని మీరు ఛేదించాలి. అందుకు - మన సేనను మూడు భాగాలుగా విభజిద్దాం.

మొదటి భాగంలో - విందానువిందులు, శూరసేన, యవన త్రిగర్త దేశాధీశ్వరులు - దుశ్శాసనుడు వుంటారు.

రెండవదానిలో - ద్రోణ, కుంతల, దశార్హ, విదర్భ దేశాధీశులు, గాంధార, సింధు, సౌరాష్ట్రీయులు వుంటే -

మహాసేనతో భీష్ముడు, కృతవర్మ, రుద్రేశ్వరులు, తన తమ్ములతో దుర్యోధనుడు - వుందామన్నాడు. యుద్ధభేరీలు మ్రోగాయి.

"సంజయా! భయంగా వుందయ్యా! ఇది ఎటు తిరిగి ఎటు మారుతుందో, ఏమవుతుందో.... అంతా భయం, బెంగ, బెదురులతో... ఈ ముసలి ప్రాణం కొట్టుకుంటుందయ్యా!" అంటే - "ఇప్పుడెందుకు భయము, భీతి ? ఇక చేయగల్గిందీ, చూడగలిగేదేమీ లేదు. వినగల్గడమొక్కటే మనకు మిగిలినది, అది అదృష్టమైనా - దురదృష్టమైనా, మంచయినా - చెడయినా, వినకా తప్పదు. ఆ ఫలితమనుభవించకా తప్పదు!" అన్నాడు.

"సంజయా! సరే! ఇప్పుడక్కడేం జరుగుతుందో... చెప్పు!" ఆ అడగడం, ప్రార్థిస్తున్నట్లుంది. అప్పుడు - పేరుకు పితామహులు సర్వసైన్యాధ్యక్షు లయినప్పటికి,

పరిస్థితుల సమీక్షించడం, ఆజ్ఞాపించడం దుర్యోధనుని పనే... అయింది. “సరే, ఆ తర్వాత... ఎంతసేపు, తన పిల్లల విజయవార్తలను వినాలనే, ఉత్సాహంతో వున్న ధృతరాష్ట్రుడు, సంజయుని, కసురుకున్నట్లు, విసుగ్గా అడిగాడు.

“ఏముంది ? దుర్యోధనుడు ఆదేశాలిచ్చాడు. ఉభయసేనలు విజృంభించాయి. ఎవరెవరితో పోరుతున్నారో అంత తొందరగా అర్థం కావడం లేదు. సేనలు ముందుకు దూకడం, వీరుల పరుగుళ్ళు - అశ్వాల సకిలింపులు, ఏనుగుల ఘీంకారాలు, కత్తులు ఒరుసుకున్న శబ్దాలు, ఖణేల్, ఖణేల్మనే గదాయుద్ధాల శబ్దం....

భీష్ముడు - తేరిపార చూడరాని పరాక్రమంతో మధ్యాహ్న సూర్యుడయ్యాడు. తాత ప్రతాపాన్ని అడ్డుకోవాలన్నట్లు, అర్జునుడు సాగాడు. శూరసేనుడి సేనలు అతడిని ముందుకు వెళ్ళకుండా చెయ్యాలని తలిస్తే తన శరసంపదతో వాటిని కదిలించి ముందుకు రథం నడిపింపచేసాడు.

ఒకటి రెండు కాదు. డెబ్బై ఏడు నిశిత బాణాలతో భీష్ముని అర్జునుడు బాధించాడు. అర్జునుని రాకను గమనించిన ద్రోణ, కృప, వికర్ణశల్యులు.... అదే పనిగా బాణాలు ఒక్కుమ్మడిగా విచ్చలవిడిగా ప్రయోగించి వూపిరాడకుండా చేస్తున్నారు.

వాళ్ళందరు - అర్జునుని శరవేగం ముందు సామాన్యులయ్యారు. ఈ సమయంలోనే సాత్యకి, విరాట దృష్టద్యుమ్నుడు, ఉపపాండవులు, అభిమన్యుడు, పార్థునికి బాసటగా నిలిచారు.

ఇదొక విజయంగా, అర్జునుడు, తన వీరావేశంతో కౌరవసేన మధ్యకు వెళ్ళి వీరవిహారం చేసాడు. రథికుల్ని కూల్చి, సారథులను త్రుంచి, విజృంభణం చేస్తుంటే, ఆ విజయుని ధాటికి, కురుసేనలు బెదరిపోతున్నారు.

అప్పుడు - దుర్యోధనుడు కంపిస్తు - “తాతా! అర్జునుడిలాగే విజృంభిస్తూంటే, మన సేనలు కూలిపోతూంటే... నీవు వుపేక్షిస్తున్నావు. సమయానికి ఆదుకోవడానికి కర్ణుడు కూడా లేదు. అనేసాడు. శాంతనవుని మనసు నొచ్చుకుంది. హాయిగా విశ్రాంతి తీసుకునే, ఈ వయస్సులో శ్రమకు - శ్రమ, అవమానాలకు - అవమానం, ఆ భగవంతుడు, నా నుదుట వ్రాశాడని, ఆ గంగా పుత్రుడు బాధపడ్డాడు.

నాయనా! పెద్దవాడిని. ఆశలు నువ్వు పెట్టుకున్నావు. అవి నేను పెంచలేదు. అయినా, నా శక్తి కొద్దీ వీరధర్మం నిర్వర్తిస్తాను!'' అని కోపంతో రథాన్ని అర్జునుని వైపు నడిపించమన్నాడు. అది గమనించిన కృష్ణుడు -

"అర్జునా! మీ తాతగారు, ఆ వీరాధివీరుడు దుర్యోధనుని మాటలకు కృద్ధుడై వస్తున్నాడు. జాగ్రత్త!'' అని హెచ్చరించాడు.

ఇదే సమయంగా, జరిగిన యుద్ధంలో భీష్మ భీషణ ప్రతాపానికి, అనుకోకుండా, కృష్ణుని శరీరం కూడా రక్తసిక్తమయింది. విజయుడు, నిజంగా విజయుడు కావాలంటే, ఆతనిలో పౌరుషం పెగలాలి. అది... ఏ అస్త్రము పట్టని కృష్ణుని బాధిస్తే - ఇటు వాసుదేవుడైన, అటు శత్రుంజయుడైన అర్జునుడైనా వీరవిహారం చేస్తారు. దుర్యోధనుని ఆశలు వమ్ము చేస్తారు.

కాళ్ళు చేతులు విరగనంతవరకే... ఎవరి ప్రతాపమైనా... అలాగే... తన వాళ్ళు చావనంతవరకే దుర్యోధనుని పరాక్రమ ప్రకటన. అందర్ని రెచ్చగొట్టడం. అవమానపర్చడం, ఆది నుండి అలవాటయిన, దుర్యోధనుడికి "చచ్చినా బుద్ధిరాదంటామే'' అది నిజమయితే తప్ప - అతనికి బుద్ధి రాదు.

అంతే! కృష్ణుని శరీరం నుండి చిందిన రక్తం బిందువుకు, కనీసమొక వెయ్యిమందినైనా హతమార్చాలనే పట్టుదలకు అర్జునుడు లొంగిపోయాడు. ఇక ఎటు చూడలేదు. గురి చేసి - శర పరంపరతో అల్లకల్లోలం సృష్టిస్తున్నాడు.

ఇది ఇలాగ వుంటే - మరొక ప్రక్కన - దృష్టద్యుమ్న - ద్రోణాచార్యులు. వారు తమ పద్ధతి ప్రకారం యుద్ధం చేస్తూ - ఒక మహా సంగ్రామానికి ఆజ్యం పోస్తున్నట్లు రెచ్చిపోతున్నారు. ఈ కుర్రవాని అస్త్రశక్తిని నిర్వీర్యం చేస్తూ - ఆచార్యులు వీరవిక్రమం చేస్తూంటే - పాంచాల యువరాజు ప్రతాపం దెబ్బతింది. ఈ సమయంలో భీముడు అక్కరకు నిలబడ్డాడు. ఇది సాకుగా దుర్యోధనుడు, కళింగరాజును, భీమునిపైకి వుసిగొల్పాడు. ద్రోణుడు - ద్రుపద - విరాటులతో, కళింగులు - భీమునితో... శత్రుత్వం నిజంగా లేనివారు, దుర్యోధనుని పుణ్యమా ?... అని పరమ శత్రువుల వలె, మహా భయంకరంగా కొట్టుకుని చస్తున్నారు.

భీముని విజృంభణం గమనించిన, భీష్ముడు తన రధాన్ని ఆతనిపైకి పరుగెత్తించాడు. అటు భీముడు, ఇటు అర్జునుడు.. మరొక ప్రక్కన దృష్టద్యుమ్నుడు....

వాళ్ళు - వీళ్ళని ప్రత్యేకంగా చెప్పలేము. అందరు వారి వారి శక్తులతో సంకుల సమరం సాగిస్తున్నారు. అది చూడ భయానకంగా వుందన్నాడు - సంజయుడు.

రెండవనాటి యుద్ధంలో - అనకూడదు కానీ అన్ని విధాల - పాండవులకే అనుకూలమయింది. ఇక మూడవనాడు - తమ ప్రతాపం చూపమని, దుర్యోధనుడు, అందర్ని ప్రార్థిస్తున్నట్లు, కోరుతున్నాడు. కౌరవసేనలు గరుడవ్యూహం దాల్చాయి. దీంతో తాము గెలుస్తామని, దుర్యోధనాదుల ఆశ. ఇటు పాండవ శిబిరంలో, రెండవనాటి యుద్ధం. మహోత్సాహం కలిగించింది. ప్రతి ఒక్కరు ధర్మం కోసం, న్యాయం కోసం, ప్రాణాలొడ్డి - విజయ పరంపరకై విజృంభిస్తున్నారు. తమ వ్యూహానికి తగ్గట్లు గంగాపుత్రుడు - ద్రోణ, శకుని, సైంధవులను తోడు చేసుకుని, ఎదుటి సైన్యాలపై దాడి చేసాడు. అయితే భీమసేన, ఘటోత్కచ, సాత్యకి, శైబలు - వారిని ప్రతిఘటించి నిలువరించారు.

ఇప్పుడు దుర్యోధనుడు ముందుకు వచ్చాడు. భీముడు "సై" అన్నాడు. వారిరువురి మధ్యలో, దుర్యోధనుని కోసమై, భీష్మ-ద్రోణులు తోడు వచ్చారు. దాంతో భీమునికి తోడుగా, ముందు అర్జునుడు వాళ్ళను నిరోధించాడు. అనకూడదు కానీ మహారాజా! భీమ సాత్యకి, అర్జునులు పరాక్రమిస్తుండగా, ఆ పరాత్పరుడు కూడా ఎదురు నిలవలేరు.

ఇప్పుడు శకుని, సాత్యకి రథాశ్వములను కూల్చాడు. సాత్యకి, అభిమన్యుని రథమధిరోహించాడు. ధర్మరాజు తాతగారిని ఢీకొన్నాడు. ఇటు దుర్యోధన-భీములు గదలతో మోదుకుంటున్నారు. భీముని దెబ్బకు దుర్యోధనుని తలదిమ్మె తిరిగి పడిపోతే, సారథి రథాన్ని మళ్ళించాడు.

అది పాండవ శిబిరంలో ఆనందోత్సాహాలను నింపింది. కౌరవసేనలు వెనుదిరిగి పారిపోతున్నాయి. వాళ్ళను భీమాదులు చావు దెబ్బకొడుతుంటే, భీష్మ ద్రోణులు "తగదు - ఆగు"మని అరుస్తున్నారు.

అప్పుడు రారాజు తెలివొందాడు. యుద్ధోన్ముఖుడయ్యాడు. దుర్యోధనుని చూడగానే పారిపోయే సేన పరాక్రమించింది. భీష్మద్రోణులపై కోపం వచ్చింది. "ఇది మీకు తగునా ? వీరాధివీరులమంటారు. విశ్వాన్ని జయిస్తామంటారు. "అటువంటి గొప్పలు చెప్పే మీరు మాకు అప్పగించే తిప్పలివేనా ?" ఆక్రోసించాడు.

అతని మాటలకు మొదటిసారి ద్రోణుడు నొచ్చుకున్నాడు. ఈ మూడు రోజుల్లో, ప్రతిరోజు ఏదో సమయంలో, ఈ మాట అంటున్నాడు. అందుకు ఆ పెద్ద వాళ్ళిద్దరు నొచ్చుకుంటున్నారు. ఇదీ మహారాజా! పెద్దల ఎడ మనవారి ప్రవర్తన.

"అవును, మహారాజా! నాకు తెలియకడుగుతాను. "దుర్యోధనా ? పాండవులను మోసం చెయ్యి. వాళ్లను లక్క ఇంట్లో పెట్టి కాల్చు. భీమునికి విషాన్నం పెట్టించు. వారు తమ స్వశక్తితో సంపాదించుకున్న ఇంద్రప్రస్థాన్ని మాయ చేసి, జూదంలో సంపాదించుకో. అరణ్యాలకు పంపు. వారి పీడ వదిలిపోతుంది.

ఆ తర్వాత, వాళ్ళు ఎదురు తిరిగితే - "మహామహులము, మేమున్నాము. రక్షిస్తామని ఏనాడైనా అభయమిచ్చారా? ప్రతిజ్ఞలు చేసారా ? ఋషులు, ఆచార్యులు, ఆఖరికి శ్రీకృష్ణుడు, వంశకర్త - వేదవ్యాసులవారు.... ఇంకెందరో మహర్షులు చెప్పినా - మూర్ఖంగా - ఇలాగ రెచ్చిపోయి, "ఇవాళ, అనాడే మీరు కాదంటే - కర్ణుడు తోడుగా, ఈ యుద్ధం నడిపేవాడినంటాడే, మూర్ఖంగా. మీ కుమారుడు, కర్ణుని ప్రతాపం, పాండవుల వీరవిక్రమం, ఎన్నోసార్లు రుచిచూసి... "ఆడలేక మద్దెల ఓడు" అన్నట్లు, ఇవ్వాళ ఏనాడు విక్రమించి, విజయాన్ని ప్రసాదించని ఆ కర్ణునితో యుద్ధం చేయించుకునేవాడిననడం... ఎంత తప్పు ? ఏం మహారాజా! చెప్పండి. ఇవి అనవలసిన మాటలా ? అది ప్రవర్తించవలసిన విధానమా ?" అని సంజయుడు హెచ్చరిస్తూంటే - "ఏం చేద్దాం, అది వాడి కర్మ"మని ధృతరాష్ట్రుడు నెత్తి మొత్తుకుంటాడు.

అప్పుడు - పితామహుడు. "దుర్యోధనా! అన్ని తెలిసి, పెద్దల ఎడ ఈ విధంగా ప్రవర్తించడం తగదు. శారీరకంగా, మానసికంగా మమ్మల్ని బాధపెడు తున్నావు. వాళ్ళనెవరు నిరోధించగలరు ? ఆ సంగతి తెలియదా ? నిన్నెవరైనా వారిపైకి ప్రేరేపించారా... లేదే! కావాలని చేసుకుని మమ్మల్ని.... !" ఇక మాట్లాడదల్చుకోలేదు.

కారణమేదైనా, ఓపినంతా పోరాడుతాం. ఆ పైన నీ కర్మమని, తమ ధర్మం నిర్వర్తించడానికి వాళ్ళు ముందుకురికారు. అసలే మహావీరుడు. అవమాన భారంతో కుమిలిపోయాడు. మహాస్త్ర సంపన్నుడు. తమ గురువైన పరశురామునే నిగ్రహించినవాడు. ఉగ్రుడయ్యాడు. పరాక్రమించాడు. అంతే! అది పాండవులకు "దుర్దశ" అయింది. "అర్జునా!" అన్నాడు కృష్ణుడు. "బావా!" మన రథం అటు

పరుగెత్తించు. లేకపోతే వీరాధివీరుని ముందు మన సేనలు బలాదూర్!” అన్నాడు. రథం అటువైపు కృష్ణుడు పరుగు దీయించాడు.

మహావీరుడు, శూరుడు, యుద్ధనిపుణుడు. కృష్ణార్జునుల రాకను గమనించాడు. నిరోధించ తీవ్రమైన బాణాలను విడిచాడు. ఆ దెబ్బకు అర్జునుడు, కృష్ణుడు, అశ్వాలు రక్తం చిందింపబడ్డాయి. కృష్ణుడు క్షణమాగి, అశ్వాలను తన మృదుహస్తంతో ప్రేమగా నిమిరి, కళ్ళెం బిగించాడు. అశ్వాలు ముందుకురికాయి.

ఇప్పుడు అర్జునునిలో ప్రతీకారవాంఛ బయలుదేరింది. తాత ఆట కట్టించాలి. ఆ ఆశ బలమయింది. అపూర్వ బాణాలతో, భీష్ముని చాపాన్ని విరిచాడు. ఇంకోటి అందుకునేలోగా అది అంతే, విరిగిపోయింది. ఇంకొకటి అందుకున్నాడు. కృష్ణార్జునుల గురి చేసాడు. ఒక పరి ఇటు, ఒక పరి అటు... అన్నట్లు -

భీష్మావేశానికి, పాండవసేన పీనుగుల పెంటవుతుంది. పరుగెత్తేవాడు లేడు. ప్రాణాలు కోల్పోయిన వాళ్ళే కనబడుతున్నారు. అది కృష్ణునికి ఆగ్రహం కల్గించింది. “ఏం అర్జునా ?” తాతగారు అనా ఈ భయభక్తులు, ఉపేక్ష. ఇలాగైతే ఓ రెండురోజులలో మనం అందర్నీ పోగొట్టుకుని అడవులకు పోవచ్చునన్నాడు.

వీరునికా మాటలు అవమానం.

సుదర్శనం స్మరించాడు. ఈ దెబ్బతో మహావీరుల మస్తకాలు, సమస్తం సుదర్శనానికి కృష్ణుడు ఆహుతి చెయ్యదలిచాడు. అప్పుడు అర్జునుడు “బావా! వద్దు. నీ ప్రతిజ్ఞ నీవు నిలబెట్టుకో. ఇక ఎటు ఆలోచించకుండా విక్రమిస్తానన్నాడు. సుదర్శనమెప్పుడైతే కృష్ణుని చేతికి వచ్చిందో, అప్పుడు భీష్ముడు రెండు చేతులు జోడించాడు. ఇంతకి మించిన అదృష్టం మరి రాదు. నన్ను వధించి, ఈ దుష్కర్మ నుండి బయటపడవెయ్యమని శరణాగతుడయ్యాడు.

ఆ సంఘటనకు దుర్యోధనాదులు బిత్తర పోయారు. నిశ్చేష్టులై చూస్తున్నారు. అప్పుడొక ప్రక్క అర్జునుడు, మరొక ప్రక్క భీష్ముడు ఒకరు కడదేర్చమని ప్రార్థిస్తుంటే, మరొకరు - శాంతించి, మాకు విజయాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తున్నారు.

ఇది మూడవనాటి యుద్ధ విశేషాల సంరంభ - సమాహారం.

# నాలుగవ నాటి యుద్ధం

అర్జునుడు విజృంభించాడు. శ్రీకృష్ణ శక్తి ఆతనిలో ప్రసరించినదను కుంటాను. అరివీర భయంకరుడయ్యాడు. అమ్మో! మహామహులు కూడా ఆ సమయంలో, అర్జునుని ముందు నిలువలేరన్నది నిజమయింది -

చెబుతున్నాడు సంజయుడు. వింటున్నాడు ధృతరాష్ట్రుడు. మహారాజా! ఇప్పుడు మరొక కలకలం. ఇప్పుడు - ఈ రాత్రిపూట మన శిబిరంలో అశ్వత్థామాదులు, తర్జన భర్జనలు పడుతున్నారు. అప్పుడు... అప్పుడు వారికి, అర్జునుడు... సామాన్యుడు కాడని అర్థమయింది.

అయితే - శకుని... తనొక తెలివితేటలు గల పెద్దమనిషిగా - "కర్ణుడు - కనుక రంగంలో వుంటే ఇలాగ జరిగి వుండేది. కాదు" అనేసాడు. అనవసరంగా నోరు జార్చుకున్నాడు. అది అశ్వత్థామకు కోపకారణమయింది. అంటే.... నా తండ్రి, పితామహుడు... పరాక్రమించలేదంటావా ?" తీవ్ర స్వరంతో అడిగాడు. "అని కాదు...నా వుద్దేశంలో, కర్ణుడు కూడా... అని.. అంతే! సర్దుకో బోయాడు. దానికి కోపం తగ్గని అశ్వత్థామ "ఈ దరిద్రానికి, దారుణానికి, కారణం నువ్వు... కదూ! అనవలసి వచ్చింది" అనేసాడు.

దుర్యోధనునికి, అందరిని సర్దుకోవాల్సి వచ్చింది. విషయం ప్రక్కకు రాకుండా చేసి, "రేపు ముందు భీమునికి కనుక, ముగింపు చెబితే, యుద్ధం సగం పూర్తవుతుంది. పాండవుల గుండె జారిపోతుంది. మన విజయానికి, సర్వం సిద్ధమౌతుందని, కోపతాపాల నుండి ఆశ - పేరాశలకు వచ్చి నిద్రకుపక్రమించారు. దుర్యోధనునికి నిద్రపట్టడం లేదు. "పితామహ" అంటూ తాతగారిని దర్శించాడు. పరిస్థితిని సమీక్షించాడు. భీమార్జునులకు గర్వభంగం కావాలి. పొగరణగాలంటే, ఆ అభిమన్యుని చంపితే.... సర్వం సుగమమవుతుంది" అన్నాడు.

"ఆ ముక్కుపచ్చలారని పిల్లవాడినా ?" అవును. మీరే చెప్పారు కదా, తాతగారు! ఇది యుద్ధరంగమని భవబంధాలకు తావు లేదని. "నిజం కానీ, ఆ కృష్ణార్జునులు అడ్డుపడకపోతే, తప్పక నీ కోరిక నెరవేరుతుంది. చూద్దా!"మన్నాడు పెద్దాయన! ఒక్కరికీ ప్రశాంతంగా నిద్ర పట్టడం లేదు.

తెల్లవారింది. మళ్ళీ యుద్ధ ఛాయలు. నరనారాయణులు విజృంభిస్తున్నారు. నిన్నటి వధ కొనసాగుతుంది. గత రాత్రి తామనుకుంటున్నట్లు పెద్దలందరు అభిమన్యుని ఢీకొట్టారు. అభిమన్యుడు సామాన్యుడు, కాడు. ఏదో రకంగా న్యాయాన్యాయ విచక్షణ లేకుండా, అభిమన్యుని చంపాలి. ఇది దుర్యోధనుని ఆలోచన. అభిమన్యుని చుట్టుముట్టడం, ఆ వీరుడు విజృంభించడం అర్జునుడు గమనించాడు. ఆ దుర్మార్గులపై శరసంధానం చేసాడు.

వారి లక్ష్యం అభిమన్యుడు. ఎదురొచ్చిన ప్రతివారిని, ప్రతిఘటించి, ఒక్కొక్కరి నొక్కొక్క విధంగా నిరోధించాడు. అర్జునుడు ప్రయత్నాని వమ్ము చేస్తున్నారు. కుమారునికి బాసటగా అర్జునుడు వస్తే వారిని నిలువరించడం ఎవ్వరికి, సాధ్యం కాదు. వాళ్ళకు సాధ్యమైనది - చావడమే!

గురి చూసింది అభిమన్యునిపైకి. కాని, ఈ ప్రతిఘటనలో, రుద్రభూపతి శల్యుని కుమారుడు దారుణంగా మరణించాడు. అభిమన్యుడు, తన విరోధులను నిరోధించి, దృష్టద్యుమ్నునికి బాసటగా వచ్చాడు. అప్పుడు దుర్యోధనుని సోదరులు ఎనమండుగురు, అభిమన్యునిపై విరుచుకుపడ్డారు. ఈ విజృంభణలో, నకుల - సహదేవులు తమ మేనమామకు, ఎదురు నిల్చారు. అభిమన్య కుమారుని దృష్టద్యుమ్నుని రక్షించుకోవడం వారి చర్యగా తలిచారు.

భీముడు, ఎప్పుడు కోరేది దుర్యోధనుడు. అతను దొరికాడు. ఇదే అదనుగా, తనను భీముడు ప్రతిఘటిస్తే ఏనుగులమందను ఆతనిపైకి తరమాలని నిర్ణయించుకున్న ప్రకారం, ఆ పని చేసారు. భీముడు, గదతో రథం దిగి, వాటిని ఢీకొట్టాడు. అతనికి తోడుగా అభిమన్య, దృష్టద్యుమ్న, నకుల సహదేవులు భీకరపోరు సలిపారు.

అందర్ని కుమ్మి చంపుతాయనుకున్న ఏనుగులు పీనుగులవుతున్నాయి. అయ్యబాబోయ్! వీరు అసాధ్యులనుకున్నాడు, దుర్యోధనుడు. ఇదే - సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పాడు. మహారాజు కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. మహారాజా! తన సేనలను, భీమాదులపైకి నీ కుమారుడు. వుసిగొలిపాడు. ఇది చాలదన్నట్లు, పెద్దాయన తాతగారు భీష్ముడు వారిపై తన ధర్మంగా విజృంభించాడు. సాత్యకి, ఆ పెద్దాయనను ఎదిరించాడు.

భీముడు, దుర్యోధనుని ఎదుర్కున్నాడు. ఆ పోరులో దుర్యోధనుడు భీముని గాయపరిచాడు. దాంతో అభిమన్యాదులు, దుర్యోధనునిపై శరసంధానం చేసారు. ఇదే సమయంగా అన్నగారికై దుర్యోధన సోదరులు పధ్నాలుగుమంది వీళ్ళను ఢీకొన్నారు.

ఈలోగా భీముడు స్పృహలోకి వచ్చాడు. శల్య, దుర్యోధనులపై తిరుగుబాటు చేసాడు. అలాగే దుర్యోధన సోదరులలో, అన్నగారికి, రక్షణగా వచ్చిన పధ్నాలుగు మందిలో, ఏడుగుర్ని భీముడు చంపేసాడు. తనకోసం ఏడుగురు చనిపోయారు. గాయాలతో ఏడుగురు వెనుదిరిగిపోయారు. దుర్యోధనునికదో పెద్ద దెబ్బ. గుండెమంట. దీనికి ప్రతీకారంగా భీముని చంపాలనే... బాధ... పెరిగిపోసాగింది. అప్పుడే తన తమ్ముల ఆత్మకు "శాంతి"గా తలిచాడు.

ఈ సమయంలో నరకుని కుమారుడు భగదత్తుడు తన ఏనుగుతో పాండవ సైన్యాలను అల్లకల్లోలం చేస్తుంటే ఘటోత్కచుడు, తన మాయాబలంతో దానిని చీకాకు పరిచాడు - ఆ వెంటనే దుర్యోధనునిపై విరుచుకుపడ్డాడు. ఆ ఘోర యుద్ధంలో కౌరవ సైన్యం అల్లకల్లోలమయింది. ఆనాటికి, యుద్ధం పరిసమాప్తమయింది. పితామహుని, దుర్యోధనుడు సంప్రదిస్తాడు. "ఇప్పటికైనా అర్థమయిందా, పాండవులు అవధ్యులని! కనుక మనకన్న బలవంతులతో విరోధం పెట్టుకోకూడదు. కనుక, ఈ విషయాన్నిక్కడితో విడిచిపెట్టి, కృష్ణుని కలుసుకో! సంధి విషయం చెప్పు. అందరు బ్రతికిపోతారు.

ఆయన మాటలు వినలేదు. సరికదా! ఒకసారి యుద్ధరంగంలో అడుగు పెట్టాక - విజయమో, వీరస్వర్గమో తేల్చుకోవాలి తప్ప, తప్పయినా - ఒప్పుకోనన్న వాడిని నేను, వెళ్ళి వాళ్ళకాళ్ళు పట్టుకోవాలా ? అది జరిగే పనికాదు.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. మీరు, గురుదేవులు, మీ అభిమానాన్ని వారిపై నుండి, మాపైకి త్రిప్పితే - "విజయం మనదే!" అన్నాడు. నొచ్చుకున్న భీష్ముడు, గురుదేవులు - ఈ మనిషికిక బుద్ధిరాదనుకున్నారు. ఆనాటికి ఆ యుద్ధకాండ ముగిసింది. అయిదవనాడు - తమ ప్రతాపాలు ప్రకటించుకోవడానికి, ప్రతి ఒక్కరు తహ, తహ లాడుతున్నారు.

★ ★ ★ ★

మకరవ్యూహం రచించి, రణరంగములో - అయిదవనాటి యుద్ధానికి, నీ పిల్లలు సిద్ధమయ్యారంటూ, సంజయుడు ఎప్పటికప్పుడు జరిగే విషయాలను అప్పటికప్పుడు ధృతరాష్ట్రునికి అందిస్తున్నాడు.

కౌరవులు మకర వ్యూహాన్ని రచిస్తే - పాండవులు "శ్వేన" వ్యూహాన్ని రూపొందించారు. ఈశ్వేనముఖానికి, భీముడు; నయన స్థానాలలో దృష్టద్యుమ్న శిఖండులు, శిరస్సున - సాత్యకి, కంఠమున అర్జునుడు, వామపక్షములో విరాట ద్రుపదులు, రక్షణ భాగంలో కేకేయులు -

వీపున అభిమన్యుడు, "ప్రతివింధ్యాది" ద్రౌపదీ పుత్రులు పుచ్ఛభాగమున- నకుల, సహదేవులు, ధర్మరాజుతో కలిసి, ఎటువంటి అవాంతరస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధమయారు.

యుద్ధ సమయమయింది. ఉభయసేనలు - ఢీకొన్నాయి.

శ్యేనముఖాన గల భీముడు, మకర వ్యూహాన్ని ఛేదించుకుని, ముందుకు సాగాడు. భీష్ముడు, భీముని ప్రతిఘటించాడు. అప్పుడు అర్జునుడు కాచుకున్నాడు. భీష్మార్జునులు - ఒకరితో మరియొక్కరు పోటీపడుతున్నారు. భీమార్జునుల ధాటికి, భీష్ముడు వెనుకంజ వెయ్యాల్సి వచ్చింది. శత్రు సైన్యం వారి ధాటికి కుప్పకూలిపోతుంది.

అప్పుడు పరిస్థితిని గ్రహించుకున్న దుర్యోధనుడు ద్రోణాచార్యులవారిని ప్రార్థించాడు. ఇలాగ ఉపేక్షిస్తుంటే మేము యుద్ధం చెయ్యదలవడం, మీ మీద ఆశలు పెట్టుకోవడమనవసర" మనేసాడు.

"మహారాజా! వింటున్నారా.... ఇదే మీవాడి కొంపముంచుతుంది. నీకు గర్భశోకం కల్గిస్తుంది. ఈ యుద్ధం కాదు కానీ, ఈ సంజయుడు నా ప్రాణం తోడేస్తున్నాడనుకుంటున్నారేమో.... చేసుకున్న కర్మ, మిమ్ము, నన్ను... లోకుల... దేశాల వారిని భూమిని కరుచుకోమంటుందే తప్ప - మీకింకా నూకలున్నాయని చెప్పలేకపోతుంది." అని దెప్పిపొడుపులు కాదు. చెప్పేది సత్యమే. కాని ఆ సమయంలో, ఇంకొకరికైతే చెప్పగల మహారాజు, వినలేకపోతున్నాడు.

కుమారుని మీద అభిమానం కొద్దీ, అతను మిత్రత్వం. ప్రేమను పెంచుకున్న అశ్వత్థామ కోసం, ద్రోణాచార్యుల వారు శాంతి వహించారు. అయినా

వారి కోపం తగ్గలేదు. "దుర్యోధనా! అందర్ని నీవు కాదనుకుని, మమ్మా నిప్పుల కుంపటిలో, ఈ వయస్సులో త్రోస్తున్నావు. భీమార్జునుల గెలవడం దుస్సాధ్యమని ఏనాడో చెప్పాను. అయినా మొండికెత్తావు. ఇన్నాళ్ళు నీ ఉప్పు తింటూ, చివరి నిముషంలో నిరాధారుని చేసి విడువకూడదనీ... లేని ఓపిక మొత్తం తెచ్చుకుని పోరాడుతున్నాం. మా మీద పెట్టుకున్న విశ్వాసానికి, చివరి "నిశ్వాస" కూడా నీకే అవుతుంది. గురువులు విద్యాబుద్ధులు గఱపేవారే కాని, అస్త్రశస్త్రాలతో అవతలివారి ప్రాణాలు తియ్యరు.

మాటి మాటికి మమ్ము దెప్పి పొడవడం, మీరు మహావీరులే... అయినా...!" ఇది పద్ధతి గాదు. శిష్యునికి వుండవలసిన విధేయత, పెద్దలపై వుంచగల గౌరవం కాదు. దానిని గర్వమంటారు - అని తన రథాన్ని భీమార్జునులపైకి పరుగెత్తించారు.

సాత్యకి, ఆ మహాశక్తిని, ఎదుర్కొన్నాడు. అవమానభారంతోనున్న ఆచార్యులు, అటు వున్నదెవరని కూడా ఆలోచించకుండా, తన అస్త్ర పాండిత్య మొత్తాన్ని పదునుపెట్టినట్లు ప్రదర్శిస్తున్నారు. భీముడు, సాత్యకి, ద్రౌపదీయులొక ప్రక్కన... ద్రోణ - భీష్మ - శల్యులు ఇంకొక ప్రక్కన తీవ్రంగా పోరుతున్నారు.

ఇది ఇలాగ వుంటే, అభిమన్య, శిఖండి కురుసైన్యాన్ని చీకాకు పరుస్తున్నారు. "తాతా!" అన్నాడు దుర్యోధనుడు. శిఖండిపై తాను యుద్ధం చేయనన్నాడు, భీష్ముడు. అప్పుడు "గురుదేవా!" తమరైనా, ప్రార్థించి పంపాడు.

రణరంగం, "రణరంగం" వలెనే వుంది. భీష్మ - భీములు, వారి మనోవిక్రమంతో పోరుతుంటే, కుత్సితబుద్ధియైన దుర్యోధనుడు, కళింగుల గజసేనను భీమునిపైకి ఘీంకరింపచేసాడు. అటునుండి దుర్యోధనుని సోదరులు తమ బలగాలతో భీముని చిక్కుల్లోపడేసి, చంపాలని ఆత్రపడుతున్నారు. అందరు భీముని చుట్టుముట్టారు. ఇది గ్రహించిన అర్జునుడు, వారికి తగిన బుద్ధి చెప్పేసరికి వీరాధివీరులుగా విర్రవీగినవారు, భీష్ముని వెనుకకుపోయి దాక్కున్నారు. "ఛీ! భీరులు" అన్నాడు అర్జునుడు. పారిపోయే తమ్ముళ్ళను ఉత్సాహపరుస్తున్నాడు. కాంభోజ, గాంధార, సింధు, సౌవీర, త్రిగర్తా, కళింగ సైన్యాలతో శకుని, దుశ్శాసన, సైంధవులు - భీమార్జునులపైకి బయలుదేరారు.

కొందరు పాండవులను లక్ష్యం చేసుకుంటే, ఇంకొందరు, పాండవ సైన్యాన్ని లక్ష్యం చేసుకుని, వీర విజృంభణం చేస్తున్నారు. విరాటుడు కూడా వీరావేశంతో భీష్ములవారినెదిరిస్తూ, అర్జునుడికి తోడుగా బయలుదేరాడు. అశ్వత్థామ నిరోధించబోయి, భంగపడ్డాడు.

అభిమన్యుని పోరాట పాటవం మెచ్చదగినదయింది. భీముని వీరవిక్రమం సాటిలేనిదయింది. ఎంతసేపు తమను రక్షించుకోవడమెట్లాగనే - ప్రయత్నమే జరుగుతుంది తప్ప, అవతలివారిని నాశనం చెయ్యగల్గాననే తృప్తి - ఎటునుండి కనబడటం లేదు. వినబడటం లేదు.

సాత్యకి వీర విజృంభణానికి కురుసేనలు కలవరపడుతున్నాయి. దాంతో భూరిశ్రవుడు, భీష్ముడు, అర్జున-సాత్యకిలతో పోరు సల్పుతూంటే, సాత్యకి పదిమంది కుమారులు భూరిశ్రవుని - "మాలో ఒకరినైనా చంపగలవా ?" అని అవహేళన చేస్తే, కుపితుడైన ఆ మహానుభావుడు కుమారులు పదిమందిని హత మార్చాడు.

సాత్యకి కృంగిపోయాడు. మధ్యాహ్నం దాటింది.

ఆ చండ ప్రచండ - సూర్యతేజమునకు తాను సమమన్నట్లు, అర్జునుడు రెచ్చిపోతున్నాడు. ఇరవై అయిదు రథాలతో, కురుసేన విజృంభిస్తే, మంచి సావకాశము లభించిందని, ఆ కుంతీ కుమారుడు, తన ప్రతాపంతో వారినందర్ని- ఎటుపోనివ్వకుండా, నేల కూల్చాడు.

ఒకటి కాదు, రెండు కాదు.... ఎనిమిది రోజులు గడిచాయి. పాండవ సైన్యంలో కురు సైన్యంలో ముఖ్యంగా దుర్యోధనుని సోదరులు, శకుని కుమారులు, శల్యుని కుమారుడు.... ఎందరో, అనుకోకుండా వచ్చి కొందరు, ఆదుకుని, ఆదుకుంటామని వచ్చినవారు కొందరు వీరస్వర్గమలంకరించారు.

దీనినే "తాతా!" ఇది దారుణం. మీ మీద కొండంత ఆశ పెట్టుకున్నాను. అది కాస్త వమ్మయింది. ఫర్వాలేదు. దయచేసి మీరు తప్పుకోండి. నా కర్ణునితో నా లక్ష్యము నెరవేర్చుకుంటానంటాడు. దుర్యోధనుని, ఆ మాటలకు అమిత కృద్ధుడైన భీష్ముడు "దుర్యోధనా! కనీసం తాతననే అభిమానమైనా వుండాలి. కురువృద్ధుడిననే గౌరవమైనా లేకుండా, ప్రతిరోజు.... ఇటువంటి మాటలు వుపయోగించవచ్చునా ?

యుద్ధమంటే ద్యూతము కాదు. శకుని పాచికలు అసలే కావు. ప్రాణాలొడ్డి-పరాక్రమాన్ని ప్రదర్శించాలే తప్ప - ఉచ్ఛ నీచాలు మరచి, వున్న అక్కసుతో, ఇంటి కోడలు బట్టలు వొలువడం కాదన్న సంగతి గుర్తుంచుకో. వెళ్ళు. రేపు చూద్దువుగాని ఈ తాత ప్రతాప'' మంటాడు.

“మహారాజా! ఈ రోజు ఉదయం నీ కుమారుడు ఎంతో సంతోషంగా వున్నాడు. తాను తప్పక ఈనాడు నీకు విజయం ప్రసాదిస్తానని, గంగాసుతుడు భీష్ములవారు గతరాత్రి నీ కుమారునికి అభయప్రదానం చేసారుట.

దాంతో ఉత్సాహభరితుడైన రారాజు, తన వారినందర్నీ ఉత్సాహ పరుస్తున్నాడు. విజృంభించండి. మనదే విజయం. ఉత్సాహమే వీరులకు కావల్సింది. “సంజయుడు చెబుతున్నాడు. ధృతరాష్ట్రుడు ఆనందడోలికలల తేలియాడుతూ, సంబరం చేసుకోవడానికి సిద్ధంగా వున్నట్లు కనబడుతున్నాడు.

“దీనిని విన్న పితామహుడు, ఆశ్చర్యపోయారు. ఇటువంటి మాయ, కల్లబొల్లి మాటలతో, పరిస్థితి ఇంతవరకు దుర్యోధనుడు తెచ్చాడని, శాంతనవుడు ఆగ్రహుడయ్యాడు. ఇదే మరొక సమయంలోనైతే, పిలిచి చివాట్లను పెట్టగల ఆ పెద్దాయన, సంబాళించుకున్నాడు.

దుశ్శాసనాదులను పిలిచాడు. మనమందరము ఈనాడు తాతగారి, వెనుకనే వుండాలి. విజయలక్ష్మిని కైవశం చేసుకోవాలి చెప్పాడు. అది ఎందరికో ఆదేశం. కొందరికి మాత్రం - ఆవేశం, అభ్యర్థన. ఇంకా చెప్పాలంటే ప్రార్థన.

పీకమీద కత్తికట్టి విజయం కోరే మనుమనికి ఊరటగా, శాంతనవుడు “సర్వతోభద్ర'' వ్యూహాన్ని రూపొందించాడు. కౌరవుల వ్యూహమర్థమయిన పాండవులు, తమ సేనాధ్యక్షునికి, ఆ మహావీరుని నిరోధించగల వ్యూహం రూపొందించమని కోరారు. ఉభయసైన్యాలు అశ్వ, గజ ఘోషలతో, రథాల చక్రధ్వనులతో, కత్తులు రాసుకున్న నిప్పులు, గదల చప్పుళ్ళతో... యుద్ధం ప్రారంభమయింది. ఆకొన్న బెబ్బులివలె, పాండవ బెబ్బులి అభిమన్యుడు రణరంగ ప్రవేశం చేసాడు. ఎదురు పడినవారికి, తిరిగి లేవకుండా దెబ్బతీస్తున్నాడు.

“వీడెక్కడరా, బాబూ! మధ్యలో....!'' అలంబసా! అభిమన్యుని ఒక్కచూపు నువ్వే చూడాలని దుర్యోధనుడు అడిగాడు. అప్పుడతడు, ముందుగాపాండవసేనపై

పడ్డాడు. రాక్షసుడు కదా! తన మాయలతో, తన వద్దనున్న రాక్షసులతో, ఆ సేనను చీకాకు బరుస్తున్నాడు. ఇది చూసే అభిమన్యుడు, అలంబసుని ఢీకొన్నాడు.

అదే, అలంబసునికి కావల్సింది. ఒక ప్రక్కన ద్రౌపదీపుత్రులు, మరొకప్రక్క అభిమన్యుడు. వీరి శక్తుల ముందర, రాక్షస మాయలు ఫలించడం లేదు. అభిమన్యుని దెబ్బకు అలంబసుడు, పరుగుపెడితే, ఆతని సేనలు అతన్ని అనుసరించాయి.

అప్పుడు భీష్ముడు, తన ప్రతాపాన్ని ప్రకటిస్తున్నాడు. మరొక ప్రక్కన సాత్యకి, కురుసేనను, కృంగ చేస్తున్నాడు. ఈ సమయంలో పార్థుడు, పాశుపతాస్త్ర విజేత, ద్రోణాచార్యులనెదిరించాడు. ఇరువురి మధ్య ధర్మబద్ధమైన మహాసంగ్రామం మొదలయింది. ఒకరికొకరు దీటుగా, ఒకరికింకొకరు సాటిగా... తమ అస్త్రాలతో ఆడుకుంటున్నట్లు వుంది కానీ -

ఎక్కడా యుద్ధం చేస్తున్న ఛాయలు లేవు. విజయంపై - ఇరువురికి ఆసక్తి కనబడటం లేదు. కేవలం - ప్రతాప ప్రకటనకై - తాతలు ప్రాముఖ్యమిచ్చినట్లు కనిపిస్తున్నారు. అయినా ఓపిక కొద్ది ద్రోణులు పోరాడుతున్నారు. అర్జునుడు ఎదిరిస్తున్నాడు. ఇంకో ప్రక్కన -

ధర్మజ, భీష్ముల మధ్య యుద్ధం. ఇంకో ప్రక్క ఇతర రాజన్యులు, భీముని ప్రతిఘటించే ప్రయత్నం. అన్నిచోట్ల దిగ్బంధనాలు కనుపిస్తాయి. విజేత "విశ్వ" రహస్యమై కూర్చుంది. ధర్మజుని రక్షణకై భీముడు, శిఖండి వగైరా ఎందరో ప్రముఖులు వచ్చారు. ఒక్క శిఖండిని విడిచి, అందర్నీ భీష్ముడు గాయపరిస్తే, భీమ రక్షణకు, సాత్యకీ - ద్రౌపదీ తనయులు వచ్చి, అస్త్రాస్త్రశక్తిని ప్రకటించుకుంటున్నారు.

ఎదుటవారిని చీల్చిచెండాడాలనే పరాక్రమంతో విక్రమిస్తున్న సేనల మధ్యనున్న దుర్యోధనుడు వున్నట్టుండి వూపిరి పీల్చుకుంటున్న ఆ యుద్ధ సమయంలో, ఇద్దరు సైనికులు "కర్మ కాకపోతే! మహావీరులని తెలుసుండి, ఆ గుడ్డిరాజు, ఈ దుర్యోధనుడు కలిసి - అత్యాశా ప్రలోభాలతో మనల్ని చంపుకు తింటున్నారు. మహావీరులైన ఆ పాండుపుత్రులను వధించడం వీళ్ళ తరమా ? వీళ్ళ పేరు చెప్పి, వీళ్ళతోపాటు మనం కూడా భూమి మీద లేకుండా చేసుకోవాలి!" ఆ మాటలకు అవాక్కయ్యాడు. అయినా అతనికి, తాను చేస్తున్నది "తప్పు పని" అని అనిపించలేదు.

ఓ ప్రక్కన భీష్ముడు రెచ్చిపోతున్నాడు. ఆయనను ప్రతిఘటించే సత్తా, పాండవ శిబిరంలో కనబడటం లేదు. "చూసావా! అర్జునా!" నీవు అలక్ష్యము చేయరాదన్నది గోవిందుని సందేశం. రథం భీష్మని దగ్గర ఆగింది. వీళ్ళను చూస్తే భీష్ముడు తన శరసంపదను ప్రయోగించాడు. ఆ మహాస్త్ర ధాటికి అర్జునుడు, గోవిందుడు, వాళ్ళ అశ్వములు గాయపడి రక్తం కారుతుంటే,

కృష్ణుడు తలపైకెత్తి అర్జునుని చూసాడు. ఆ చూపులలోని శక్తి - తీవ్రమై అర్జునుడు వీరమార్తాండుడయ్యాడు. పట్టుకున్న భీష్మని చాపాన్ని విరగ్గొడితే, ఆ మహావీరుడు, మరొకటి అందుకున్నాడు. దానిని అర్జునుడు విరిచాడు. తాత మనుమని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు.

ఒకళ్ళు గౌరవాదరముల భక్తిని ప్రకటిస్తుంటే, మరొకళ్ళు ఇందుకేనా నిన్ను నమ్ముకున్నదని, వెక్కిరించి అగౌరవంగా నిరశిస్తున్నారు. మరో చాపము తీసుకున్నాడు. అర్జునునిపై సంధించారు. ఆ దెబ్బకు అర్జునుడు తూలి వెనక్కి పడ్డాడు. ఆ సమయంలో అతన్ని ఆదుకునేవాళ్ళు లేకపొయ్యేసరికి -

కృష్ణుడొక బాణం తీసుకుని, రథం దిగి భీష్మని పైకి దూసుకు వెడుతున్నాడు. ఈ హడావుడిలో తేరుకున్న అర్జునుడు, కృష్ణుని వెంటబడ్డాడు. మహాభక్తులకు, దివ్యశక్తులకు అదొక అద్భుతమైన ఆనందకర దృశ్యం.

ఇంతలో సూర్యాస్తమయం. యుద్ధ విరామం.

"బావా!" అందరు ఒకచోట చేరి కృష్ణుని ఏం చేద్దామని సలహా అడిగితే, "చూడు, మీరు ఆశీస్సులడిగిన సమయంలో "తాతా! మాకు విజయమంటే, ఆ తర్వాత చెబుతాను! అన్నాడు కాబట్టి, యుధిష్ఠరా! నీవు వెళ్ళి.... అంటే నువ్వురా...!" అంటారు. అంతా మారువేషాలలో భీష్మని దర్శించి, ఆయన దయను ప్రార్థిస్తారు.

"యుధిష్ఠరా! నన్ను నిలువరించడం, విజయమొందడం ఆ త్రిమూర్తుల కసాధ్యం. ఎటొచ్చి మగవాళ్ళతోనో, ఆడవాళ్ళతోనో యుద్ధం చేస్తాను. అటు ఇటు కానివాళ్ళతో, అటు ఇటు - అయినవారితో యుద్ధం చేయను. అటువంటి వ్యక్తి ఓ శక్తిలాగ, నన్ను చంపడానికే పుట్టి మీ వద్ద వున్నాడు. అతన్ని ముందు పెట్టుకుని యుద్ధం చేయండి. నేనెవర్ని నిరోధించను కనుక, నన్ను చంపడం తేలిక.

అయినా, ఇంకో విషయం. నాకు నా తండ్రి స్వచ్ఛంద మరణవరం ప్రసాదించాడు. ఇందువల్ల గూడా నన్నెవరు చంపలేరు. వెళ్ళిరండి. వాసుదేవుడు, మీరు ఆరాధించే - ధర్మము, దారి, దైవము ఆయనే! ఆ తర్వాత ఏం చెయ్యాలన్నది, ఆ దేవదేవుని అభీష్టమన్నాడు.

★★★★

ఇక యుద్ధానికి ముగింపు లేదా "స్వస్తి" పలకాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. కౌరవసేన వారి పద్ధతిలో వ్యూహం చేస్తుంది.

పాండవసేన - ఇప్పుడు శిఖండిని తమ ఆయుధంగా అటు ఇటు భీమార్జునులు, అభిమన్యు, ద్రౌపదీసుతులు, నకుల సహదేవులు, పాంచాల వీరులు - దృష్టద్యుమ్నుడు, ధర్మరాజు... తమ తమ పద్ధతిలో రక్షణ పాటవాన్ని కవచంగా మార్చుకున్నారు.

శిఖండిది - పగ, పట్టుదల. దానిని నెరవేర్చుకునే సమయమిప్పుడు వచ్చింది.

శిఖండిని చూసి, భీష్మడు తల ప్రక్కకు త్రిప్పుకున్నాడు. "వీరుడా!" వీరుడవయితే ముందుకు, రా! ధనువు ఎక్కుపెట్టు" అంటున్నాడు. శిఖండిని చూసి దుర్యోధనాదులు అదిరిపోయారు.

"ఔరా!" ఎంతకు తెగించారు. అనుకున్ననాడు, "తాతా! చూసారా! తాతగారని కూడా గౌరవమివ్వకుండా, ఇలాగా.... !" అంటున్నాడు.

"చూడు, దుర్యోధనా! మాటిమాటికి పిలిచి, వెక్కిరించి, దూషించేదానికన్న- ఇది చాలా ఉత్తమం. మంచో, చెడో..... ఒక్క దెబ్బతో తేలిపోతుంది. నన్నడిగితే, ఇది చాలా మంచిపని" అంటానని, పాండవుల ప్రవర్తనను - దుర్యోధనుడు అధిక్షేపిస్తే పితామహులు మెచ్చుకున్నారు.

వెంటనే - "ఇది అన్యాయం. ఇది మీకు తెలిసే జరుగుతున్న "కుట్ర" అన్నమాట. నేల విడిచి, దుర్యోధనుడు సాము మొదలుపెట్టాడు. దుశ్శాసనుడు రెచ్చిపోతున్నాడు. అతన్ని అర్జునుడు అడుగడుగునా నిరోధిస్తున్నాడు. భీష్మనితో పోరాడుతున్న అర్జునుని, నిలువరించాలని ద్రోణాచార్యులు రథమటువైపు త్రిప్పుతూంటే, గురుదేవులను కదలనీయకుండా ధర్మరాజు అడ్డుకున్నాడు.

ఎవరెవరు, ఎవరితో యుద్ధం చేస్తున్నారో విడమరచి చెప్పడం కష్టం కాని, ఉభయుల మధ్య యుద్ధం తీవ్రస్థాయిలో సాగుతుంది. భీష్ముని, అందరు చుట్టుముట్టారు. అందరి మధ్య నవ్వుతూ, శరపరంపరతో శిఖండి -

అప్పుడు - ద్రోణాచార్యులు - ఇదేదో వినాశానికి వచ్చింది. ఇవ్వాళ పాండవులు వారి సేనలు - అందరు కూడా, కౌరవసేనను, అందలి ముఖ్యవీరులను హతమార్చుతానని, శపథం పట్టినట్లు వుంది - అంటూనే 'కుమారా! అంతా అయోమయంగా వుంది. చేతులు వణుకుతున్నాయి. మంత్రాలు గుర్తుకు రావడం లేదు. ఈ దుర్దశ నుండి ఎలాగ బయటపడాలో కూడా, అర్థం కావడంలేదని బాధపడ్డాడు.

ఎందుకో వున్నట్టుండి భీష్మునిలో నిరాసక్తత. వాళ్ళను, వీళ్ళను ప్రతిఘటిస్తున్నట్లు, ఆ మహావీరుడు ధర్మజునితో యుద్ధం చేస్తూనే "ఇక నాకు యుద్ధం చెయ్యాలని లేదు. జరిగిన మారణహోమం చాలు. ఆ శిఖండిని ఎదుట వుంచుకుని నాతో యుద్ధం చెయ్యండి. అలిసిపోయిన నాకు ఇంత విశ్రాంతి లభిస్తుంది" అని మెల్లగా చెప్పి...

అటు, ఇటు, ఎటుపడితే, అటు కనిపించినవారినెల్ల నెదుర్కొంటుంటే, ఆ మహావీరునికి, మనుమలపై గల ధర్మానికి, వందన శతాలర్పిస్తున్నట్లు మనసుపడే మరో సత్యాన్ని ప్రకటించాడు. ధర్మజుడు తలవూపి తదుపరి కార్యక్రమానికి సిద్ధమౌతున్నాడు.

భీష్ముడి కళ్ళల్లో శిఖండి పడ్డాడు. అతను బాణం వేసేసరికి, భీష్ముడు అస్త్ర సన్యాసం చేసాడు. దుశ్శాసనులాదులు, కౌరవసేన యందలి మహావీరు లెందరో, తాతగారి కోసం తీవ్రంగా పోరాడుతున్నారు. ఇక్కడ - ఇప్పుడు - యుద్ధం ఏకపక్షంగా సాగుతుంది. శిఖండి విజృంభిస్తుంటే, పారిపోవడం కూడా తగదన్నట్లు, అస్త్రం విడిచి, ఆయుధం పట్టక నిలబడిపోతే, ఆయనను రక్షించుకోవడం, దుర్యోధనునికి, అతన్ని అనుసరించి వచ్చిన ఇతర రాజులకు సాధ్యం కాలేదు.

వర ప్రభావుడు. వరమడిగావు. దారుణమే. కారణమేదైనా సంహరిస్తానన్నావు. ఇప్పుడు నీ స్థితి నీకు లభించింది. విజృంభించు "నూరి పోస్తున్నాడు, అర్జునుడు. బాణపరంపరను, కొనసాగిస్తున్నాడు శిఖండి. అర్జునుడు అభయమిస్తున్నాడు. భీష్మ రక్షణమునకు వచ్చిన ప్రతి వ్యక్తిని అర్జునుడు, ముందుకు రానివ్వకుండా ప్రతిఘటిస్తున్నాడు.

ఎదురుగా శిఖండి ప్రక్కనుండి, వెనుక నుండి ఇతర శక్తులు, తనను కూల్చ సంసిద్ధమౌతున్నాయి. వయసు మళ్ళినా శాంతనవుని వీరప్రకాశముందు, ఈనాటి వారందరు దిగదుడుపే. ఆయనను ప్రతిఘటించలేక అస్త్రములు పోయో శస్త్రములు, తగిలి - గాయమాయో....... తమ తమ పరువు ప్రతిష్ఠలను దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ముందునుండి శిఖండి... వెనుక నుండి అర్జునుడు... ముందు బాణపు శక్తి భీష్మునికి తెలుసు. వెనుకవచ్చే బాణపు శక్తిని తెలుసుకున్న మహావీరుడు, భీష్ముడు.... అస్త్ర సన్యాసం చేసినట్లు నిలబడిపోయాడు. అప్పుడు - ఆ - గంగాసుతుడు -

"చూసారా! చేసే పాపంలో కూడా, పుణ్య-ధర్మాలు చూసే దివ్యులు పాండవులు. ఇది సర్వలోకాలవారికి తెలుసు. వున్నట్టుండి అబ్బా!" అన్నారు - ఇది అర్జునుని బాణం. శిఖండి చేతుల మధ్య నుండి వచ్చింది. ఇరువురి శక్తి నాకు తెలుసు. ఒకరిది భక్తి. మరొకరిది ప్రతీకారము, భక్తి ముందు భగవంతుడు తలవంచుతాడన్నట్లు ఆ భగవంతుడు భక్తునికి శరణాగతుడౌతాడు. ఇది సత్యం.

నేలకు రాలిపోతున్నట్లుంది, భీష్ముని పరిస్థితి. కనిపించేవి శిఖండి బాణాలు. కాని, వెనుకనుండి అర్జునుడు, ఆ మహామహుడు సామాన్యుని శరముల కందకూడదన్న శ్రేష్ఠ అభిప్రాయంతో శిఖండి వెనుకనుండి బాణపరంపర వస్తుంది. ఆ బాణం తగిలి "అబ్బా!" శాంతనవుడు నొచ్చుకున్నాడు.

అది యుద్ధ "ధర్మ"మన్నట్లు, అదే "ధర్మ"మన్నట్లుందచటి ప్రవర్తన. ఆ దెబ్బకు విలవిలలాడుతూ "దుశ్శాసనా! ఈ తాత ఇక శరచాపాలతో మీకోసం యుద్ధం చెయ్యలేడు. ఇప్పుడు కార్చిచ్చు వంటి బాణాలు నన్ను మండిస్తున్నాయి. ఇక నేను, పరమ రహస్యం తెలుసుకుని, నా జీవన "క్రీడ"ను ఆపాలి.

అయినా "శక్తి" కొలది, అస్త్ర ప్రయోగం చేసాడు. భీష్ముడు చేసిన ప్రయోగాలు, చూపిన ప్రతాపం, శిఖండి, వెనుక - ఆ తదుపరి తానుగా అర్జునుడు ఖండించాడు. దానిని నిర్వీర్యం చేసాడు. మరో బాణాన్ని భీష్ముడు ప్రయోగించాడు. అది అంతే! దివ్య కార్ముకాలతో, అర్జునుడు, అతనితోపాటు పాండవసేన, పాండవులకింత అపకారం చేసిన "ఒక ప్రభంజనం" భీష్ముని, మీది మీదకు వస్తుంది.

అపుడు - సూర్యాస్తమయమౌతుంది.

దైవ నిర్ణయం పూర్తయింది. ఒక మహానుభావుడు, సామాన్యుని చేతిలో నేలబడరాదన్న సత్యధర్మాన్ననుసరించి, అర్జునుడు, శరసంధానం చేస్తున్నాడు. దుర్యోధనా! ఇక నేను విశ్రమించాలి. అందుకు.... బాధను... తట్టుకోలేక, స్వచ్ఛందవర ప్రభావము గల నేను, ఈ దక్షిణాయనంలో శరీరం విడువను.

ఉత్తరాయణం వరకు ఆగాలి. కాబట్టి వచ్చే బాధను దిగమ్రింగుకుంటూ, నేలమీద వాలకూడని ఆ దివ్యాత్ముడు శరతల్పంపై వ్రాలాడు. "దుర్యోధనా!" అన్నాడు. అప్పటి కానాటి యుద్ధం పూర్తయింది. ఉభయులు, తాతగారిని చేరారు. ప్రతి ఒక్కరు అమిత బాధపడుతున్నారు.

అడిగి పాండవులు ప్రాణం తీసారు. చెప్పి మరీ భీష్మలు తమ ప్రాణాలు తీయించుకున్నారు. ఈ ఉభయులు మనుమలే. తన చెంత తన చేతులలో పెరిగినవారే. ఒకరిని నెత్తిపైన, మరొకర్ని చేతులతో పట్టుకునే తత్వం లేని ఆ గంగాసుతుడు, ఇరువురిని సమంగా చూడలేక, ఒకరికోసం మరొకరిని బాధపెడు తున్నాననే, నరకయాతన అనుభవించలేక, "సమయం వచ్చినపుడు కలుసుకోండి. పరమ రహస్యం చెబుతానని, తన మరణ రహస్యాన్ని - ధర్మాత్ములనబడే, పాండవులకు తెల్పి" మరీ అంపశయ్యనెక్కాడు.

ఇటువంటి, మహావీరుడు మరొకరు వుండరని ప్రశస్తిని, యశస్సును పొందిన శాంతనవుడు క్రిందపడకుండా, తన శరీరానికి గుచ్చుకున్న శరములను, శయ్యగా చేసుకుని ప్రక్కకు ఒరిగాడు. అది సుఖంగా లేదు. అప్పుడు -

"నాయనా, దుర్యోధనా!" అనగానే, "ప్రతినిత్యం నిన్ను నమ్ముకుని... అనే ఆ అహంకార మనవడు, అతనితో అవసరం తీరినదనో, లేక, అటువంటి త్యాగమూర్తి తాతగా లభించాడనో... పరుగు పరుగున వచ్చాడు. అందరు తనకోసమే, ఆ విధంగా నిలబడటం కొంతలో కొంత శాంతనవునికి ఆనందం కల్గించింది. తన వద్దకు వచ్చిన దుర్యోధనునితో "నాయనా! ఈ తల కాస్త కదులుతూ ఇబ్బంది పడుతుంది. కొద్దిగా ఎత్తు కావాలనగా, "వెళ్ళండి పట్టు తలగడమెత్తలు తీసుకురండి! అన్నాడు. అప్పుడు అర్జునుని చూసాడు.

తాతగారి మనసును అర్థం చేసుకున్నట్టు శరతల్పగతుడైన తాతను చూసి వలవల ఏడ్చాడు. తప్పు నాయనా! అది వీరుడు కోరేది, కాదనగా, తన శరాలతో తల వద్ద కొంత ఎత్తు వాలును చేసి, శరములతో తలగడను రూపొందించాడు.

కొంచెం సేపయింది. గొంతు తడారిపోతుంది. దాహం వేస్తుంది.

"నాయనా! దుర్యోధనా ?" వారి ఆధీనుడు కాబట్టి, అతనిని "దాహ"ం అడిగాడు. వెంటనే మధుర సువాసన జలాల్ని తెమ్మన్నాడు. అవికాదు నాయనా నాక్కాల్సిందంటూ, అర్జునున్ని చూడగా, అతడొక బాణం వేసాడు. పాతాళగంగ వుబికి వచ్చింది. ఆ జలధార పితామహుని నోటికందేటట్లు గురి మార్చాడు.

అది చూసిన దుర్యోధనుడు అక్కసు నొందాడు. ఇది ప్రేమ - లేక - మాపై అక్కసా ? మాకు అవమానం చెయ్యాలనే పథకమా! అడగడం - మేము సమకూర్చే వాటిని కాదన్నట్లు చూసి "అర్జునా!" అనడం, వాడు పుట్టలోంచి పాముల్ని తీసినట్లు, అమ్ములపొదినుండి బాణం తీసి వదలడం, ఈ తాత మురవడం, అసలు... ఇందులోని ఆంతర్యం.... మమ్మల్ని అవమానించాలనా...

మా వల్లనే ఈ దౌర్భాగ్యం సంప్రాప్తించిందని లోకానికి చాటాలనా ? పాండవుల... అందులో మీకు అవధ్యుడు... అనే... అర్జునుని గొప్పతనం శరసంధాన లాఘవం, లోకానికి తెలియబర్చాలనా... చివరి క్షణాలలో కూడా... తాతగారి మనసు నొచ్చుకునేటట్లు అసహనాన్ని, దుర్యోధనుడు ప్రదర్శించాడు".

అప్పుడు - "ఇక వీడు మారడు." ఈ మాటను ఇక్కడ భీష్ములవారు, అక్కడ - ధృతరాష్ట్రుడు కూడా, ఏకకాలంలో అనుకున్నారు. క్షణంలో వీరి మనోగతాభిప్రాయాన్ని, వ్యాసశక్తితో గ్రహించే సంజయుడు "అది, మహారాజా! దీనినేమనాలి ? ఇప్పటికీ పెద్దలను ధిక్కరించడమే తప్ప, గౌరవించడం చాతకాని వానికి "విజయం" గగన కుసుమము. అవునా ? -

ఇది నా మాట కాదు. మీ మనసులోని మాట. "అవునా" మహారాజుకు ఆశ్చర్యాన్ని కల్గిస్తూ సంజయుడడుగుతున్నాడు.

★★★★

భీష్మునికి తగు రక్షణం కల్పించి అందరు తమ తమ గుడారాలకు వెళ్ళారు. దారిలో కృష్ణుడు "ధర్మరాజా! అజేయుడు, తన విజయాన్ని మీకు అర్పించాడు. ధర్మస్వరూపుడు కాబట్టి ధర్మము నిలబెట్టాడంటున్నాడు.

"బావా! ఇదంతా నీ కరుణ, అనుగ్రహం. సర్వమెరిగిన నీ శక్తి, ధర్మం.... మమ్ము కరుణిస్తుందని, కృతజ్ఞత చెప్పాడు. ఇది దారిలోని కథ - అక్కడ -

ఎవరు లేకపోవడంతో కర్ణుని వ్యథ అనంతమయింది. విచారంతో, తన తొందరపాటుకు చింతిస్తూ అందరు వెళ్ళిపోయిన తదుపరి, కర్ణుడు తాతగారిని చూసాడు. అతన్ని చూడగానే "రా! కర్ణా! రా!" ఎంతో ప్రేమతో పిలిచాడా తాత.

"మహావీరా! మీరు అందరికి తాతగారే. నా తప్పుల్ని క్షమించమని, ఈ సమయంలో నడుచుకోవల్సిన - విధి విధానం, తెలియబర్చండి!" కన్నీళ్ళతో ప్రార్థించాడు.

"పిచ్చివాడా! నీపై నాకెందుకు కోపం. నీవెవరివి, నా కుంతీపుత్రుడవు. జేష్ఠుడవు. ఎటొచ్చి చేరకూడని చోటున చేరి, అనవసరంగా అప్రదిష్టపాలవు తున్నావనే బాధతో, తెలిసి కూడా నిన్ను నిందించాను. నిజం చెప్పి నీ ధర్మానికి, సత్య మార్గానికి సమాధి కట్టలేకపోయాను. అందుకు చిన్నవాడివైనా! నీవే క్షమించాలి!

"తాతా....!" కన్నీటితో చేతులను కడిగి పాదాల తన శిరమును వుంచి, "తమను కించపరచిన ఈ నాలుక, ధర్మహాని కాదు కాబట్టి నిలబడింది. అయినా మీరే నన్ను క్షమించాలి" అన్నాడు. ఆ తర్వాత, భీష్ముడు చెప్పవలసినవి చెప్పాడు. సేవా ధర్మం వేరు, స్వధర్మం వేరు. కనుక ఏ విషయంలోను తొందరపడకమని, తగు సూచలను చేసారు.

అంతా విన్న కర్ణుడు "తాతగారూ! సత్యము నాకు తెలుసు. కారణమేదైనా నేను శాపదగ్ధుడను. వారు వర ప్రసాదులు. జరగవలసింది, జరుగవలసిందే తప్ప, కాలచక్ర విధాత, తన విధేయతను కొనసాగించ వలసిందేనన్నట్లు, ఒకనాడు - తన అవమానాన్ని, కారణమేదైనా కాపాడిన ఓ ప్రభువుగా ఒక సూతునికి పుత్రునిగా నిర్వహించాల్సి వచ్చింది. "క్షమించండని" తాతగారిని పరిపరి విధాల ప్రార్థించాడు. అనంత యశోకాముడివై విరాజిల్లుతావని, తాతగా, ఆ మహామహుడు ఈ "దాన" కర్ణుని ఆశీర్వదించారు.

★ ★ ★ ★

పదకొండు రోజులు గడిచాయి.

ఒక మహామహుని చేజార్చుకున్నారు. కొందరు వీరులను, శూరులను, తన సోదరులను చేజేతులా చంపుకున్న దుర్యోధనునితో, తాతగా, పెంచిన "ప్రేమ" మీర...

"నాయనా ? ఇప్పటికయినా మించిపోయింది లేదు. జరిగింది మరచిపో. వున్న తమ్ములను, నిన్ననుసరించి వచ్చిన వాళ్ళ ప్రాణాలను, ప్రజలను - మొత్తానికి, కురురాజు సంరక్షించాడనే పేరు తెచ్చుకో ? వున్న రాజ్యాన్ని ఇరువురు సమానంగా పంచుకోండి. ఎవరి బ్రతుకువారు వున్నన్నాళ్ళు - మీ మట్టుకు ఆస్తులు పంచుకున్నా లోకాని మాత్రం, మహావీరులుగా, అరివీర భయంకరులుగా, తేరి చూడరాని దివ్యశక్తులుగా ఈ చరిత్రలో నిలబడండి"

పెద్దాయన, అభిమానం ఆపుకోలేక చెబుతున్నారు. దేవతలే జయ జయ ధ్వానాలు చేసారు. ఇది "కృష్ణుని మాయ" అంటాడే కానీ, నీ కుమారుడు సత్యం తెలుసుకోలేకపోతున్నాడు. ధర్మ రక్షణకు అడుగు ముందుకు వెయ్యలేకపోతున్నాడు.

ఆ మహావీరుని చివరి కోరిక కూడా తీర్చలేని, దౌర్భాగ్యస్థితిలో, తననీ దుస్థితికి తెచ్చిన మనుమలున్నారని, ఆ గంగాసుతుడు పొందిన బాధ -

"మహారాజా....!" మీరెవరు అర్థం చేసుకోలేరు. శరతల్పగతుడై వుండి, నిరంతరం ఆ విష్ణునామంతో, రూపంతో తపించే ఆ పరమ భాగవతోత్తముని వాక్కులను వృధా చేసాడు.

ఆ గంగాపుత్రుని ఈ క్షణంలో కూడా బాధకు గురి చేసాడు. ఇది క్షంతవ్యమా....!" అడుగుతున్నాడు - సంజయుడు. సమాధానం చెప్పక మౌనంగా వుండిపోయాడు, ఆ - ధృతరాష్ట్రుడు.

★★★★

భీష్మదేవుడు శరతల్ప గతులయ్యారని.... తాము రావల్సిందని... కర్ణునికి వర్తమానం అందింది. ఎరుపెక్కిన కళ్ళతో, జీరబోయిన గొంతుకతో కళ్ళవెంట అశ్రుధారలు ధారాపాతంగా వర్షిస్తూంటే - బరువెక్కిన హృదయంతో, పడని అడుగులతో, కాళ్ళు సాగక... ఎంతో భారంగా వచ్చాడు. దుర్యోధనుని ఎదుట నిలిచాడు. కర్ణుని చూసి, అందరు... ఆశ్చర్యపోయారు.

"తొందరపడ్డాను. అందరితోపాటు వారి నీడలో నేను వుంటే, మనకీ దౌర్భాగ్యం సంప్రాప్తించేంది కాదు. నా తొందరపాటు ఒక దేవతామూర్తిని పోగొట్టుకునేందుకు, మూలకారణమయింది.

కర్ణుడు - ఆ విధంగా విచారించడం, చాలామందికి ఆశ్చర్యం - ఆలోచన రేకెత్తించింది. కొందరు మాత్రం కర్ణుడు - వీరుడు "వీరుడే". సాటి మహావీరుని గుర్తించి, గౌరవించాడని, శిరసు వంచి అంజలి ఘటించారు.

★★★★

ఇప్పుడు ద్రోణాచార్యులవారు సర్వసైన్యాధ్యక్షులయ్యారు.

ఇక వీరి ప్రతాప పౌరుషాలు, పరాక్రమం, వ్యూహాలు నడుస్తాయి. తనను సైన్యాధ్యక్షుని చేసినందులకు పరమానందభరితుడైన ద్రోణులు - అడుగు. అది ఎంత కష్టసాధ్యమైనా, ఓ వరాన్ని నీకు ప్రసాదిస్తానంటారు.

అయితే "ఆ - "ధర్మ"తనయుని, ప్రాణాలతోపట్టి నాకు అప్పగించండి. ఆ మాటకు ఎంతో సంతోషించిన గురుదేవులు "అస్తు" అన్నారు. కానీ, మళ్ళీ అనుమానం. అవును దుర్యోధనా, ధర్మరాజును చంపకుండా, నీ కప్పగించమన్నా వెందుకు ? పౌరుషం కోసం పాండవులను జయించి, వారి రాజ్యం వారికిచ్చేస్తావా ?

"కాదు, గురుదేవా! ధర్మరాజు చేత మళ్ళీ జూదమాడించి, శాశ్వతంగా వనవాసానికి పంపి, ఇక జన్మలో యుద్ధమన్న మాట రాకుండా చెయ్యాలని" - ఆ మాటవిని - ద్రోణాచార్యులవారు... అవాక్కయ్యారు. ఇంత కుటిలాత్ముడవని, అనుకుంటే... నీతో పొత్తు పెట్టుకునేవాడిని కాదనుకున్న మహానుభావుడు. అన్నమాటను నిలబెట్టుకోవాలనే ధృఢసంకల్పంతో - "సరే!" నన్నారు.

"రారాజా! అర్జునుడు కనుక అడ్డుపడకపోతే, ఆ యుధిష్టరుని బంధించడం ఘనకార్యమేమి కాదు! ఆ విజయుడు విజృంభిస్తేనే, పరిస్థితి ఎదురు తిరుగు తుందంటారు. ఆతనిని మేము కట్టడి చేస్తామని, కురుకుమారులు ఎగిరి గంతేసినంత పనిచేసారు. కానీ, ఈ రహస్యమంతా చారుల వలన ధర్మరాజుకు తెలిసింది. జాగ్రత్తపడాల్సిందిగా వాళ్ళు, తమలో తాము సంసిద్ధులౌతున్నారు.

మళ్ళీ క్రౌంచవ్యూహము.

ధర్మ పరిరక్షణానికి, తెలిసినట్లు, పలు ఏర్పాట్లు. దీనికి ప్రతిగా - కౌరవుల చేత గురుదేవులు "శకట" వ్యూహమేర్పాటు చేసారు. అందులో రాధేయుని చూసిన పెక్కుమంది సైనికులు ఉత్సాహంతో పొంగిపోయారు.

యుద్ధం ప్రారంభమయింది. ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న కర్ణార్జునులు సింహనాదం చేసారు. ద్రోణులు సేనను ముందుకు నడిపారు. చెప్పలేని దుశ్శకునములు. అయినా ద్రోణులు - వీరవిజృంభణముతో - ఎటు చూసిన తానై ప్రకాశించడం కాదు, పరాక్రమం చూపి, అవతలివారిని పరాజితులను చెయ్యడమో, ప్రాణాలు హరించడమో, జరిగిపోతుంది.

క్షతదేవుడు, చేకితానుడు - లక్ష్మణ, అనువిందులతో పోరాడితే, శల్యుని అభిమన్యుడు, విరాటరాజు - కర్ణునితో, భీమసేనుడు, తన గదతో ద్రోణుల వ్యూహానికి, ప్రతివ్యూహం కాకపోయినా, యుద్ధరంగంలో వీరుడనేవాడు, ఎలాగ పోరాడాలో, అలాగ ప్రతివీరుడు, ప్రతిస్పందిస్తున్నాడు.

ఇప్పుడు - ద్రోణుడు - ధర్మరాజుని "రా!" అని ఢీకొన్నారు. ఇద్దరిమధ్య-పగలేని "పంతం - పట్టుదల"ల యుద్ధం మొదలయింది. అడ్డువచ్చిన ప్రతి వ్యక్తిని ద్రోణులు అటకాయిస్తున్నారు. ధర్మజుని రక్షించుకోవాలని, పాండవ సేనలోని ప్రతి ఒక్కరు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు.

అయినా ధర్మరాజు, ద్రోణునికి బందీ అయ్యాడు. ఇది కౌరవసేనకు బ్రహ్మానందదాయకం. ఈ శుభవార్తను తండ్రికి తెలియచెయ్యాలని, యుద్ధాన్ని తనవారికి వదిలి, దుర్యోధనుడు హస్తినాపురం వెడుతున్నాడనేది - ఇంకొక వార్త!

ఈ సమయంలో మళ్ళీ కలకలం. "గురుదేవా!" అంటూ అర్జునుని రాక. పుంఖానుపుంఖాలుగా - శరాలు. గురు-శిష్యులిద్దరు-తీవ్రాతి తీవ్రంగా ఢీకొన్నారు. గాండీవ "టం"కారంతో, ఆ శరపరంపరంతో ఎవరు చస్తున్నారో, ఎవరిదా రక్తమో తెలియడం లేదు. తలలు తెగి, గుండెలాగి, పీనుగులపెంటలాగ ఆ ప్రదేశం తయారయింది. ఇంతలో సూర్యాస్తమయం.

కౌరవులలో నిరాశ. పాండవులలో - జయత్సోహం!

★★★★

మళ్ళీ ఆ రాత్రి అందరు ద్రోణాచార్యుని శిబిరంలో కలుసుకున్నారు. "గురుదేవా!" యధాప్రకారం చేతులు మోడ్చాడు.

అర్జునుడు - ఆ ప్రదేశంలో వుండగా ధర్మజుని బంధించడమసాధ్య మనేస్తారు. అది త్రిగర్త దేశాధిపతి సుశర్మ విన్నాడు. వెంటనే రారాజును సందర్శించి పరమ రహస్యమందించాడు. "భలే" అని అతని భుజం చరచి, అతని పథకాన్ని ఆమోదించాడు. గురువులకు చెప్పాడు. వారు ఒప్పుకున్నారు.

ఇచ్చినమాట నిలబెట్టుకోవడానికి ద్రోణులకు అంతకు మించిన అవకాశం రాదు. అందుకే అది అధర్మమని తెలిసినా సహవాస దోషంగా, తాము అందులో వేలు పెట్టారు. ఆ రాత్రి గడిచింది. తెల్లవారి పథకరచన ప్రారంభమయింది.

కౌరవులు గరుడవ్యూహం పన్నారు.

త్రిగర్తాదులు, దక్షిణభాగానికి పోయి, అర్జునుని రెచ్చగొడుతున్నారు. ఇటు ద్రోణులు, ధర్మరాజును ప్రాణాలతో పట్టి యిస్తానని, దుర్యోధనునికి శపధం చేసారు. ఇదో సంకటస్థితిగా తయారయింది. అర్జునుడు ధర్మరాజు వద్దకు వెళ్ళి పరిస్థితిని వివరించి చెప్పాడు. అప్పుడు - యుధిష్టరుడు, అసహాయుడే!

అయితే అర్జునుడు సత్యజిత్తుని చూపి, అన్నా! నీకు ఈ సత్యజిత్తు తోడుగా వుంటాడు. అతడు నీ ప్రక్కనున్నంత వరకు భయము లేదు. అతనికేదైనా సంభవిస్తే, మరుక్షణం నీవక్కడ నుండి తప్పించుకో. ఈలోగా అసంశప్తక శక్తులనో భరతం పట్టించి వస్తానన్నాడు.

ధర్మరాజు అంగీకరించాడు. "హమ్మయ్య" మన ప్రయత్నం ఫలించిం దనుకున్నారు, దుర్యోధనాదులు! కౌరవుల ఎత్తుకు పైఎత్తుగా - వీరు గరుడ వ్యూహాన్ని ఏర్పరిస్తే, పాండవులు మండాలార్థ వ్యూహాన్ని పన్నారు. దృష్టద్యుమునితో త్రిగర్తా సుశర్మ, దుర్యోధనాదుల పథకాన్ని వివరించి చెప్పి, నీవు ద్రోణవధ కోసం పుట్టినవాడివి నన్ను రక్షించుకోవాలి" ధర్మరాజు అడిగాడు.

సంశప్తకశక్తులు రెచ్చిపోతూంటే, వ్యర్థ బాణమన్నది లేకుండా, వాళ్ళందర్ని పీచమణిచాడు. అయినా ఇచ్చిన మాటకు సుశర్మాదులు ప్రాణాలకు తెగించారు. ఇప్పుడు చెయ్యాల్సింది యుద్ధం కాదు "యుక్తి" అనుకున్న అర్జునుడు, అదే కృష్ణునితో చెప్పాడు.

రథం వారి మధ్య నిలిచింది. కృష్ణుని గోపాలక శక్తులు, సంశప్తక శక్తులతో కలిసి అర్జునుని ఎదిరిస్తుంటే, మహాస్త్రమొకటి ప్రయోగించాడు. దాని ప్రభావంతో, ఎదిరించే వాళ్ళందరు, బెదిరి వారిలో వాళ్ళు కొట్టుకోవడం ప్రారంభించారు.

ఆ అస్త్రం తగ్గింది. అంతవరకు కొట్టుకుని, చావగా మిగిలినవారు, మళ్ళీ అర్జునునిపై ధ్వజమెత్తారు. అర్జునుని కట్టడి చేసారు. అంతటితో విడువకుండా, కృష్ణుడు, జిష్ణుడు "గోవిందా" అని రంకెలేస్తూంటే, అర్జునుడు అనిలాస్త్రం ప్రయోగించాడు. ఒక్క దెబ్బకు ఎగిరి అవతలపడ్డారు. అప్పుడు తన అస్త్ర చాతుర్యంతో వాళ్ళందర్ని వివిధ రకాలుగా, ఖండించి, గుర్తుపట్టలేని పీనుగుల పెంట చేసాడు. అక్కడో -

దుర్యోధనునికిచ్చినమాట ప్రకారం, ద్రోణులు సర్వశక్తులను ఒడ్డుతున్నారు. శివమెత్తినట్లు ద్రోణుడు ఇచ్చినమాట కోసం ఇష్టమొచ్చినట్లు అడ్డదిడ్డంగా విజృంభిస్తుంటే, సత్యజిత్తు శతవిధాల పోరి మరణించాడు. దాంతో, అర్జునుడు చెప్పినట్లు ధర్మజుడు ప్రక్కకు తప్పుకున్నాడు.

విరాటుని సోదరుడు, ద్రోణుని ఎదుర్కొన్నాడు. ~~ఈ~~ మహాస్త్రవేది ముందు, ఎంతటి సాహసికులు, శౌర్యవంతులైనా ఆగుట కష్టం. అలాగే జరుగుతుంది. పాంచాలసేనలను కూల్చి, ధర్మరాజును తరుముతుంటే, ఎందరో ధర్మజుని కోసం, అడ్డంగా నిలిచి, ద్రోణుని క్రోధానికి బలి అయ్యారు.

చావగా మిగిలిన సేన పిక్కబలము చూపుతుంటే, "అబ్బ" మహానందకర మంటూ సుయోధనుడు వికటాట్టహాసం, మొదలుపెట్టాడు. మరోప్రక్క భీముడు ఒంటరిగా పోరాడుతుంటే, ఆనందమింకా పోనీ రారాజు "కర్ణా! వీడికి రాజ్యము, రాజవైభవాలు కావాలిట. ఒక్క శరంతో, వాడి శిరం లేపెయ్యి! అప్పుడు..." పగులబడి నవ్వడం ప్రారంభించాడు.

అందుకు కర్ణుడు "నీ ఆశ సమంజసం కావచ్చును కానీ నీ ఆజ్ఞ అనుచితం. ఎవరి ప్రమేయం లేకుండా పోరాడే ఆ వీరాగ్రణి కాదు మనకు ముఖ్యం. ఎందరినో ఢీకొంటున్న గురుదేవులు ముఖ్యం. ముందు వారిని రక్షించుకుందాం. తదుపరి- ఇది నీకు ఇష్టం కాకపోవచ్చును. ఇప్పుడు ఇక్కడది, ధర్మమన్నాడు. పాండవ బలం, ధర్మజుని కోసం ప్రాణాలొడ్డి పరాక్రమిస్తుంది. మధ్యలో గురుదేవులు...

ఇందరు చుట్టుముట్టడంతో, వున్నారో... లేక అదో పెద్ద అనుమానం. ఈ సంశయం రాగానే దుర్యోధనుడు తనవారిని రెచ్చగొట్టాడు. ఇరుసేనలు మధ్య భయంకర యుద్ధం. ఎందరు పోయారో, ఎన్ని గుర్రాలు, రథాలు, ఏనుగులు.... ఆ తర్వాత చూసుకోవాలి. లెక్క తెలియనంత, భయంకరంగా, దారుణంగా వుందాయుద్ధం, అప్పటి పరిస్థితి.

అయితే - ఎప్పుడెప్పుడా... అని అవకాశం కోసం ఎదురుచూసే భీముని, దుర్యోధనుడెదుర్కున్నాడు. దొరికింది రా సావకాశమని, తనకున్న దివ్యశస్త్రశక్తితో దుర్యోధనునికి ఇబ్బంది కలుగచేస్తున్నాడు. రారాజు భీమ ధాటిని తట్టుకోలేక పోవడం గమనించిన వంగరాజు -

తన ఏనుగుని భీమునిపైకి వుసిగొల్పాడు. పదివేల ఏనుగుల దివ్యశక్తి కల్గిన మహాబలవంతుడు, విషహర దివ్యపానంతో వజ్రశరీరుడైన భీముడు, వజ్రముఖ బాణంతో, వంగరాజును ఆతని ఏనుగుతో సహా కూలిస్తే, నేల కరచు కున్నాడు.

"అమ్మో! ఇతడసాధ్యుడు. అనవసరంగా ఇతన్ని కవ్వించానని, తన దుందుడుకుతనానికి తానే బాధపడుతూ, నరకుని కుమారుడు భగదత్తుని, అతని సుప్రతికమనే ఏనుగుతో భీముని ఎదుర్కోమని పురిగొల్పాడు.

వాడు చేసే బీభత్సాన్ని దూరం నుంచి గమనించిన పాండవ మధ్యముడు "బావా! తన కోసం ఎంతసేపు ఎదుటివారి నాశనాన్ని కోరుకునే దుర్యోధనుడు, ఆ భగదత్తుని ఏనుగుతో మనవాళ్ళందరిని దెబ్బతీస్తున్నాడు. మనం అటు వెడదాం. అలాగేనని పార్థసారథియైన కృష్ణుడు వెడదామని రథం పగ్గాలు అదిలించాడు. అప్పుడు అదే సమయంలో, సంశప్తక శక్తులు, వీర్ని ముందుకు వెళ్ళనీయకుండా అడ్డుపెట్టారు.

అర్జునుడప్పుడు అటూ, ఇటు.... ఎటో దారీ చేసుకోలేని అయోమయానికి గురయ్యాడు. అక్కడి భగదత్తునికన్న - ఈ సంశప్తకశక్తులు, ప్రమాదకరాలని తలచి, విజృంభించగా, ఎంత హడావుడితో యుద్ధానికి వచ్చారో, అంత హడావుడిగానే వీరస్వర్గమలంకరించారు.

ఇక రథాన్ని భగదత్తుని పైకి మళ్ళించమని చెప్పే సమయంలో త్రిగర్త దేశాధీశుడు సుశర్మ, పకపక నవ్వుతూ, "పారిపోతున్నావా ? యుద్ధానికి రమ్మనమని పిలిచింది నేను. యుద్ధం చేయకుండా ఇలాగ పారిపోవడం నిజమైన వీరవర్యుల

లక్షణమా ?' ఎక్కసెకాలు మొదలుపెట్టాడు. అతని పరిహాసాన్ని మన్నించలేని అర్జునుడొక దివ్యాస్త్రము ప్రయోగించాడు.

ఆ అస్త్ర శక్తికి, వారందరు మూర్ఛపోయారు. ఆ వెంటనే, అర్జునుడు, బావా! మనవారందరు ప్రాణభయంతో పారిపోతున్నారన్నాడు. పార్థుని రథం భగదత్తుని ముందు నిలిచింది. తను శరసంధానం చేస్తున్నాడు. భగదత్తుడు కూడా, తన దివ్య గజంతో, అస్త్ర పరంపరతో, కృష్ణార్జునులను తీవ్రమైన బాధకు గురి చేస్తున్నాడు.

భగదత్తుడు తన శక్తినంతటిని కూర్చుని, చేసే ప్రయోగాలన్ని అర్జునుని ముందు నిరర్థకమౌతున్నాయి. ఏమీ అర్థంకాని భగదత్తుడు, మంత్రించి, తన అంకుశాన్ని అర్జునునిపై ప్రయోగించాడు. దాని శక్తి గ్రహించిన కృష్ణుడు లేచి నిలబడ్డాడు. అది వాసుదేవుని తాకి, ఆతని మెడలో పూలదండగా మారిపోయింది.

భగదత్తా, విజయులిద్దరు ఆశ్చర్యపోయారు. "అర్జునుడైతే"నీ అపూర్వ ఆదరణ ఆశీస్సులు అనుక్షణ ప్రశంసనీయం. మహామహుడివి, ఈ విజయునికి విజయాన్ని ప్రసాదింప "పార్థసారధి" వయ్యావు. హనుమంతుని ధ్వజమును చేసావు. నీ అపూర్వ అభయ, అభిమానాలతో అనుక్షణం కంటిరెప్పలా కాపాడు తున్నావు. ధన్యుడ"నని శిరసువంచి ప్రణామం చేసాడు.

అది వైష్ణవాస్త్రమని - దాని నెదుర్కొనుటమెవరికి సాధ్యం కాదని, ఒకప్పుడు ఎంతో ప్రేమతో, ప్రాణరక్షకంగా కుమారుడు , కదా! అని భూదేవి కోరిక మేరకు నరకుని కిచ్చాను. ఆతని నుండి, అది, ఆతని కుమారుడు భగదత్తునికి లభించింది. అది నిన్ను తాకిందో, ఇక యుద్ధంతో పనిలేదు. ఆ మహావైష్ణవం, అందరి ఆశలను, ఆశయాలను భగ్నం చేస్తూ సర్వనాశనం చేస్తుంది. ఆ ప్రమాదాన్ని నివారించడానికే, నేనలాగ చెయ్యాల్సి వచ్చిందన్నాడు. తదుపరి వజ్రతుల్య, అర్ధచంద్ర - అపూర్వాస్త్రాలను అర్జునుడు ప్రయోగించ, భగదత్తుడు, ఆతని ఏనుగు సుప్రతీకము - స్వర్గమలంకరించడం జరిగిపోయింది.

ఇదేదో ఘోరంగా శకుని తమ్ములిద్దరు, అర్జునునిపై తిరగబడితే, ఒకే ఒక్క బాణంతో వారినిద్దరిని యమపురికి చేర్చడం చూసి, శకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. ఆ కన్నీటిని, శకుని మాయల్ని చూసిన, పార్థుడు, వాడి బాణాలతో

అతన్ని గాయపరచి, నీకు ఏడవడం, బాధపడటం కూడా తెలుసా ?! ఇది రణభూమి. ఇక్కడ వీరత్వం తప్ప - పాచికలు, కుట్రలు - కుతంత్రాలు పని చెయ్యవు" అన్నాడు.

ఇటు మాటలు, అటు బాణాలు శకునిని తీవ్రంగా బాధపెట్టాయి. ఇప్పుడు మరో గండం. కురువీరులకు ప్రాణసంకటం. భీముడు, సాత్యకిని ద్రోణ-దుర్యోధనులెదుర్కొంటున్నారు. ఇక్కడ శకుని భరతం పట్టి, శ్రీకృష్ణుడు తమ రథాన్నటు మళ్ళించగా అర్జునుడు ద్రోణులవారిని చేరాడు. వీళ్ళ కలయికతో, పాండవసేన ఉత్సాహంగా ముందుకు కదిలింది.

వాళ్ళ మధ్యలోనున్న దుర్యోధనుడొకవైపు, ధర్మరాజు మరొకవైపు తమ తమ సైన్యాలను ఉత్సాహపరుస్తున్నారు. పాండవసేనాని మెరుపువేగంతో, కురుసేనానిని ఢీకొంటున్నాడు. పోరు ఘోరంగా సాగుతుంది. ఇప్పుడు మూర్ఛపోయిన సంశప్తక శక్తులు తెలివొంది, శక్తిని పెంపొందించుకుని "అర్జునా!" అని అరిచారు.

"వస్తున్నా"నని, బాణం తీసాడు ప్రయోగించాడు. ఆ దివ్యాస్త్ర శక్తికి, వాళ్ళు "ఠా" అన్నారు. కృష్ణార్జునులు, భీమ ధర్మరాజులను చేరారు. అందరు కలిసి "ద్రోణాచార్యులను బంధిస్తారా ?" అన్నట్లుంది అక్కడి స్థితి. అక్కడ పడిన ఖండిత శరీరాలు, ఏనుగులు, గుర్రాలు, యుద్ధకండూతి, ఆ పరాక్రమ ప్రకటనంలో గమనించలేకపోతున్నారు కానీ, సామాన్యులైతే ఇప్పటికే, ఒక్కొక్కరు గుండె పగిలి చచ్చేవారు. అంత భయంకరంగా వుంది - అచటి వాతావరణం!

భీమ, సాత్యకులకు తోడు, అర్జునుడు కూడా కలవడంతో ద్రోణులు నీరసించారు. ఆయన కోసం, అందరు కర్ణుని రక్షించమని కోరుతున్నారు. ఒకటే అరుపులు, కేకలు. ఇప్పుడు - చిరకాల ప్రత్యర్థులైన కర్ణార్జునుల మధ్య యుద్ధం ప్రారంభమయింది. ఎవరికెవరు తక్కువ కాదు. అయినా అర్జునుడు అత్యంత లాఘవంగా తన శర పరంపరతో కర్ణుణి నొప్పించాడు. భీముడు అర్జునునికి బాసటగా వచ్చిన వారినందరిని చంపాడు.

పరిస్థితి ముదిరింది. ఆ సమయంలో, దుర్యోధన అశ్వత్థామలు కర్ణునికి కవచమయ్యారు. ఆనాటికా యుద్ధం ముగిసింది.

రాత్రి భాగంలో యధావిధి రారాజు, ద్రోణులను కలుసుకున్నాడు.

“ఆచార్యా! ఎంతయినా బ్రాహ్మణులు. వేదం వల్లెవేసినట్లో, బాణాలు విడిచినట్లో మాట్లాడతారు. ఆ వేదం వేదన, బాణం ఆవేదన మిగులుస్తాయే తప్ప, వ్యవహార జయానికి ఉపయోగపడవు. అధ్యక్ష పదవి పొందిన ఆనందంలో ఏ వరం కావాలో కోరుకొమ్మన్నారు. అడగమన్నారు కదా! అని ఆశతో నోరు తెరచి అడిగాను.

తెల్లవారితే మూడవరోజు. అసలింతకి మనం....

ఆ మాటలకు నొచ్చుకున్న ద్రోణులు.... బాధను వ్యక్తం చెయ్యలేని, ఎంతో బాధతో కళ్ళు మూసుకున్నారు. అప్పుడేం సమాధానం చెప్పినా మూర్ఖుడి తలకెక్కదు. నోరు ఆగదు. ఆ క్షణంలో - “ఏం చేద్దాం...!” అని, దుర్యోధనుడు అగాడు.

“రేపు ప్రళయం సృష్టిద్దాం... సరేనా ?” ఆవేశం ఆపుకోలేక, అవమానం పొందలేక అనేశారు. అప్పుడే “కానీ యువరాజా! ఎవరెంతటి వీరులైనా కాలగతికి అందరు సమానులమే. ప్రతి వ్యక్తి నమ్ముకున్న వారికి శాయశక్తులా తోడు వుండాలని తలుస్తాడు. అంతెందుకు.... మన కర్ణుడు నిన్న... తెగించి పోరాడాడు. ఎందుకు.... అది తన ధర్మమని భావించాడు.

కానీ ప్రాణాపాయంలో పడటం గమనించి, సమయానికి మనం వెళ్ళకపోతే... కనుక, అవసరం మనదీ, అవకాశం... మనదీ. అనుకోరాదు. సమయం వచ్చినప్పుడు, మన ప్రతాపాన్ని ప్రకటించాలి. సరే, వెళ్ళి విశ్రాంతి తీసుకో. రేపు కూడా! అన్నానని బాధపడకు. అర్జునుడు మనకెంత దూరంగా వుంటే, అంత పని సులువవుతుంది. అది చూసుకో...!” అని పంపించి, రాత్రంతా సుదీర్ఘంగా ఆలోచించారు. తెల్లవారింది. అనుకున్న ప్రకారం... పద్మవ్యూహం రచింపబడింది.

దుర్యోధనా! దీనిని అర్జునుడొక్కడే ఛేదించగలడు. ఇప్పుడా అర్జునుడు సంశప్తక శక్తులతో పోరాటానికి కదిలిపోయాడు. ప్రతి వ్యక్తి మహారాజువలె ఇందులో ప్రవేశించవచ్చును. కాని తిరిగి వెళ్ళడం సాధ్యం కాదు. ఇక కాచుకోండి. నా మాట నిలబడుతుంది. నీ పగ చల్లారుతుందన్నారు.

# పద్మవ్యూహం

ఈ విషయం మొత్తం ధర్మరాజుకు తెలిసింది. ఆనాడు యుద్ధం చెయ్యడమా? మానడమా ? యుద్ధానికి వెడితే అందరు ఆ పద్మవ్యూహంలో చిక్కుకోవడం ఖాయం. వెళ్ళకపోతే పరాజయం ప్రముఖం. ఎటు చూసిన, ఈ ద్విముఖం - పిరికితనం కలుగ చేస్తుందే తప్ప - దీనిని ఢీకొనే శక్తి కనబడటం లేదు.

అందరు తలలు పట్టుకుని కూర్చున్నారు. అప్పుడు ధర్మరాజుకు.... ఆశ, ఆలోచన కలిగాయి. అభిమన్యుని పిలిపించాడు. వస్తూనే ఆ వీర కిశోరం, పెదతండ్రికి పాదాభివందనం చెయ్యగా యుధిష్ఠరుడు గాఢంగా కౌగలించుకుని నుదుట ముద్దుపెట్టుకుని -

"నాయనా! ద్రోణులవారు నన్ను బంధించడంలో భాగంగా పద్మవ్యూహం పన్నారు. అది నీ తండ్రికి, మేనమామ కృష్ణభగవానునికి, ప్రద్యుమ్నునికి తెలుసు. వారివురు ఇక్కడలేరు. కాకపోతే నీకు కొంత తెలుసని విన్నాను." అని ఆగాడు.

"అవును. పెదనాన్నగారూ! నా తండ్రిగారి నుండి ప్రవేశమొక్కటే తెలుసుకో గలిగాను" అనగా, ధర్మరాజు ఆనందంతో - "అది చాలు నువ్వు ప్రవేశించు. నీ వెనుక మేముంటాము" అంటాడు.

"ఆ ధైర్యమివ్వండి. ఆ కురుహంతకులను, కూకటి వ్రేళ్ళతో, కూలుస్తా నంటాడు. అందరు వెంటనున్నారు. కురువీరులను ద్రోణ, దుర్యోధన, కర్ణులను ఆశ్చర్యపరుస్తూ, అభిమన్యుడు పద్మవ్యూహం ప్రవేశిస్తున్నాడు. మహామహులందరు అభిమన్యుని అనుసరిస్తున్నారు. అతని మెరపువేగానికి, శ్రద్ధాసక్తికి, ద్రోణులవారు శిష్యకుమారుని అభినందించకుండా వుండలేకపోయారు.

అభిమన్యుడు, కౌరవసేనకు కార్చిచ్చు అయ్యాడు. అతని ప్రతాపానికి, అడ్డు వచ్చినవారు, అలాగే హతమౌతున్నారు. అంతటి వీరవిక్రమం ప్రదర్శిస్తున్నాడు. ఆ మాట వినగానే, ధృతరాష్ట్రుడు "అయితే మనవారందరిని అలుపు లేకుండా చంపేసి, తన తండ్రులకు గెలుపు కల్గిస్తాడంటావా ?" అని ప్రశ్నిస్తాడు.

పరిస్థితి అలాగే వుందని, సంజయుడు, సమాధానమిస్తాడు. “ఆగండి!” అంటు మీ కుమారుడు, రారాజు, తన పరాక్రమంతో, అభిమన్యుని ఎదిరించాలని పోయి, అడకత్తెరలో పోక చెక్కయి పోయాడు. తండ్రి, మామలను మించిన మహాశౌర్యాన్ని ఆ శౌరి, మేనల్లుడు ప్రదర్శిస్తున్నాడు.

ఆ దృశ్యం చూసిన ద్రోణులు “వెళ్ళండి. రారాజును” రక్షించండన్నాడు. అంతే - ఒక్క బాలునిపై, వీరులనుకునే వారందరు పడ్డారు. అభిమన్యుడు చలించలేదు కదా! చిత్ర విచిత్ర గతులలో, ఆ బాణాలెటు నుండి వస్తున్నాయో, ఎలాగ వస్తున్నాయో తెలుసుకోలేని విధంగా, అర్జున కుమారుడు ప్రయోగిస్తుంటే-

“ఏమయింది ?” ఆత్ర పడిపోతున్నాడు గుడ్డి మహారాజు.

ఏముంది, నీ సేన పలాయనం చిత్తగిస్తే ఇక అక్కడ గురుదేవులు, తన శిష్యకుమారుని ప్రతిఘటించ ప్రయత్నిస్తున్నారు. వున్నవాళ్ళందరు మహావీరులు, శూరులు. శస్త్రాస్త్రశక్తి సమన్వితులే, ఎందుకో.... వీడి కర్మ కాకపోతే... వున్న దానితో తృప్తిపడక, వాళ్ళను పట్టుకుని, వాడికి శాంతి, మాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడు. ఇదంతా చూస్తుంటే, చివరికిది ఏమవుతుందో.... వాపోతున్నాడా - గుడ్డి మహారాజు!

“మహారాజా! నీ కుమారులలో ధర్మం కనబడటం లేదు. నూనూగు మీసాల నూత్న యవ్వనంలో ఆ వీర కిశోరాన్ని తన వీరులనొక మూల ఎదుర్కొనమంటూ, సిగ్గూ, మగతనం లేనట్లు, తన సేనను కూడా శౌరి మేనల్లునిపై ఉరికిస్తున్నాడు.

“సంజయా! ఏమిటా మాటలు ?” ఏ గడ్డిగరచైనా తన పిల్లలు విజయ మొందాలన్న మహారాజు మనస్సు చివుక్కుమని, వ్యాసశక్తితో తనకు వివరాల నందించే, సంజయుని కసురుకున్నాడు. అందుకు సంజయుడు నవ్వుకుంటూ-

అలాగా, ఎదుట నొప్పి మనకెందుకు తెలుస్తుంది. మన నొప్పే ఘనంగా అనుకుంటాము, విజ్ఞత మరచిపోయిన - మూర్ఖత్వంతో” అని సంజయుడు ముగించాడు. మహారాజు, ఏదో అనబోయి... నోరుమూసుకున్నాడు. ముఖమూ ముడుచుకున్నాడు. ఇక యుద్ధరంగంలోకి వస్తే...

అభిమన్యుని ముందర, అందరూ వ్యర్థులు, అసమర్థులయ్యారు. శిష్యకుమారుని విజయానికి పొంగిపోయిన, గురుదేవులు ద్రోణాచార్యులు కాస్సేపు, తాను సైన్యాధ్యక్షుడినన్న సంగతి ప్రక్కన పెట్టి అందరూ వినేలాగ, ముఖ్యంగా దుర్యోధనుడికి తెలిసేటట్లు బావగారు కృపాచార్యులతో -

“ముందు గౌరవం ఇవ్వాలి. దానిని తమ శక్తితో ఆ గౌరవాన్ని గౌరవించాలి. పిల్లవాడు... ఈ బుడతడు, తండ్రులు - తాతలు, అన్నతమ్ముళ్ళు, మిత్రహితులు, అందరు పరవశించి, పులకరించి పొంగిపొయ్యేలాగ, వీరత్వానికి ప్రతిరూపు అయ్యాడు. ధర్మం తప్పని, మగతనంతో, శౌరి మేనల్లుడు, శౌర్య ప్రతాపుడిగా వెలుగొందుతున్నాడు.

అది ఆపుకోలేని ఆనంద - అభినందన. ఆశ్రిత - శిష్య వాత్సల్య - పుత్ర ప్రతాప వీరత్వానికి పరవశత్వం! ఆ మాటలు దుర్యోధనుడు, విన్నాడు. అధర్మం తెలియని మగతనంతో ప్రకాశిస్తున్నాడు. అది తనకు హెచ్చరిక, సవాలు, చచ్చిపోయే అవమానంగా తలిచాడు.

గౌరవాన్ని, గౌరవించుకోవడం చాతకావాలని ఆచార్యుల మరో చురక. రారాజు ముఖంలో కత్తివాటుకు నెత్తురు లేదు. అలాగే పాలిపోయాడు. అరమరికలు లేక, అధిక్షేపానికి, అవనత వదనుడయ్యాడు. అంతలో కుటిలాత్ముడు కదా! అక్కసుతో ఆతని మనసు రుసరుసలాడుతుంది. “బురదపాములు బుసకొడుతున్నాయి.” కర్ణ - శల్యులతో, ఆచార్యుల వలెనే బిగ్గరగా అనేసాడు.

“చూసారా! ఆయన వయసు, మనసు. నమ్మి చేరదీసినవారికి వెన్నుపోటు. విల్లు పట్టుకుని దగ్గరకు వస్తే, వారెవరైనా సరే విద్య నేర్పుతానంటాడు. ఎంతో ప్రతాపవంతుడను, ఆ దేవతలే నన్ను గెలువలేరనే, ఈ మహావీరులు, శతృస్తుతి చేస్తూ అతన్ని చంపలేకపోవడానికి కారణం -

అర్జునునిపై ప్రేమా ? ఆతడు తిర్గి వచ్చి వీళ్ళందర్ని.... అదే... ఈ గురుకులాన్ని, కూకటి వ్రేళ్ళతో కూల్చేస్తాడేమోనన్న భయమా ? అయినా ఆచార్యులను అధ్యక్షులుగా అందమెక్కించినందులకు, నన్ను నేను నిందించుకోవాలి! ఈ మాటలు కర్ణకఠోరాలు. చేసింది అన్యాయం. జరిగేది అన్యాయం. “కురుక్షేత్రే - ధర్మక్షేత్రే!” ధర్మం చేయడానికి

వీలయిన నేల... ఏమీ చెయ్యడానికి, అదే - సత్య - ధర్మాలను ఆశ్రయించడానికి పాపపు, అన్యాయ పనులు చేసే, "అధర్మ" క్షేత్రమై కూర్చుందీ క్షేత్రం. ద్రోణులు వాపోయారు. పళ్ళు బిగువుతూ కళ్ళు మూసుకుని ధనుష్టంకారం చేసారు.

అది పాండవసేనకన్న, కౌరవసేనకే భయ కారణమయింది.

"ఊఁ.. విజృంభించండి!" ద్రోణులు ఆదేశించారు. దొరికిందే అలుసుగా, అందరు అభిమన్యుని చుట్టుముట్టారు.

"ఆగండి!" నేను - ఈ కుర్రకుంకను, రెచ్చిపోతూ దుశ్శాసనుడు ముందుకడుగు వేసాడు. బాణం సంధించాడు. దుర్యోధనుడు, ఆ తదుపరి కర్ణుడు... వెనుదిరిగారు. అభిమన్యుని ముందర ఏ సైనికశక్తి ఆగడం లేదు. కుమారవీరుడు ముందుకు సాగుతుంటే, భీమాదులు, అతన్ని అనుసరిస్తున్నారు. కాని కేవలం ఒకే ఒకనాడు - పాండవుల్ని ఆపగల వరాన్ని శివుని నుండి పొందిన సైంధవుడు, వీళ్ళను నిలువరించాడు. ఆ శూరుడు, వీళ్ళు వెనుకాల వస్తున్నారనే తలచి అతడు ముందుకు పోతున్నాడు.

ఇరుపక్షాల ఘోరయుద్ధం, చనిపోతున్నారు.

పాండవులు ముందుకు కదలలేకపోతున్నారు. అభిమన్యునిపై దొంగ దెబ్బకు, కుటిల యత్నాలు తమ ధ్యేయంగా, ధర్మంగా తలిచే దుర్యోధనాదులు కుట్రలు - కుతంత్రాలు పన్నుతున్నారు. ఈ స్థితిలో తన పరువు నిలబెట్టు కోవలసిన పరిస్థితి ద్రోణులకు వచ్చింది. దాంతో, అందర్ని పిలిచారు.

"అప్పుడేమయింది ?" వింటున్న ధృతరాష్ట్రుడు వళ్ళంతా చెవులు చేసుకుని అడిగాడు. "ఏమవుతుంది "యతో ధర్మః తతో జయః" అనే ఆ పెద్దలు, అధర్మం-కుట్ర -కుతంత్ర - కుయ్యుక్తులలో పుట్టి పెరిగినట్లు ఆ - అధర్మానికి, నరనరాల కలుషిత తిండితో, ఆ అపవిత్ర శరీరం, అది తప్పుగా తలంచలేదు.

"అంటే.....!" కృద్ధుడౌతున్న ధృతరాష్ట్రుని చూసి ఏవగించుకున్న సంజయుడు. "జరిగేది, వినండి మహారాజా! అనవసర ప్రశ్నలు, సమాచారాలతో, రక్తం ప్రసరణ అధికం కానివ్వకండి. అది మీ మాట. మాకు తెలియదు, కానీ, మాకు అనారోగ్యకారక"మని, తదుపరి విషయమందుకుంటున్నాడు.

"మహారాజా! దురదృష్టం." అధర్మం! రాజ్యమేలుతుందనడానికి, నిదర్శనంగా- అందరు కలిస్తే - అప్పుడు ద్రోణాచార్యులవారు - తిన్న అధర్మకూటికి కృతజ్ఞతతో, కర్ణుని బాధకు, సమాధానంగా -

కర్ణా! అర్జునుని భక్తిశ్రద్ధల, వినయ విశ్వాసానికి పరవశించి, "కవచధారణ" మనే విద్యను ప్రత్యేకంగా ప్రసాదించాను. దీనిని, ఆ తండ్రి నుండి ఈ వీరకిశోరం పొందింది. ఇతడు అవధ్యుడు.... అన్నాడు.

చాతనయితే, మోసం చేసి ధనస్సును విరవండి. సూతుని కూల్చండి. రథాశ్వములను చంపండి. మీరేం చేసినా, ఆతని చేతిలో ధనువున్నంతవరకు అతడు అజేయుడని చెప్పారు. కర్ణునికా అధర్మ ప్రవర్తన నచ్చలేదు. తలవంచుకున్నాడు.

దుర్యోధనునికి మాట ఇచ్చిన సేవాధర్మ- లక్షణానికి తప్ప, ఏ ధర్మానికి ఒడిగట్టాడతడు ? వెనుకనుండి బాణం వేసి, ధనస్సును విరిచి, ఆచార్యులు అశ్వాలను కూల్చారు. కృపాచార్యులు సారథిని చంపారు. ఇప్పుడు అభిమన్యుడు నిరాయుధుడయ్యాడు. అతనిని ఈ మహావీరులనే - "మహారాజా! వింటున్నారా...

"నీవాళ్ళు, తమ నిత్య కర్తవ్యము, ఆ రక్త లక్షణమైన నీచకృతమైన అన్యాయం చేసి, అధర్మాన్ని గౌరవించి, దొంగచాటు దెబ్బతో, చెయ్యకూడని విధంగా, యుద్ధ పద్ధతులకు విరుద్ధంగా - ఆ ఒంటరిని, ఈ దుర్మార్గులు.... ముందు జరగబోయేది వూహించుకోకుండా చంపేసారు.

అదివిన్న ధర్మరాజు "విచారించకండి. ఆతడు భీష్ముని మించిన మహావీరుడు. రక్షించుకోవడం చాతకాని అసమర్థులం మనం. మన బ్రతుకులను తలచుకుని మనం ఏడవాల్సిందే తప్ప - ఆ వీర కిశోరం "విశ్వవీరుడు" అని పొగిడాడు.

సంధ్యా సమయమయింది. పాండవ శిబిరాలు బోసిపోతున్నాయి. విచారంతో, తలఎత్తలేక, అందరు తమలో తాము కృంగిపోతున్నారు. సంశప్తక శక్తులను - కూల్చి వచ్చే విజయుడైన అర్జునునికి అన్నీ దుశ్శకునాలే. "బావా! ఏమయ్యుంటుంది ?" అన్నాడు. "వెడుతున్నాం కదా! కంగారుపడకు!" అంటున్నాడు కృష్ణుడు.

బోసిపోయిన శిబిరంలో దుఃఖం పొంగిపొరలుతుంది. జరిగినదంతా పెద్దన్న యుధిష్ఠరుడు ఏడుస్తూ చెప్పాడు. ఇదంతా ఆ సైంధవుని వల్ల జరిగింది'' అయినా మా దౌర్భాగ్యం. ఇంతమందిమి వుండి, పిల్లవానిని చంపుకున్నాం.'' అని ఏడుస్తుంటే, ఈ మొత్తానికి కారణమైన సైంధవుని ఎవరు అడ్డగించినా కూడా వదలకుండా చంపి, ఆ నెత్తుటితో నా కుమారునికి రక్తతర్పణ మొసగుతాను. ఇందుకు కారణమైన ఆచార్యులతో సహా అందర్ని - ఈ యుద్ధంలో సమిధలను చేస్తానని - ప్రతిజ్ఞ చేసాడు.

ఈ మొత్తం దుర్యోధనునికి తెలిసింది. "బావా!'' అన్నాడు సైంధవుడు. భయపడకు. మేమున్నామన్నాడు - దుర్యోధనుడు.

సూర్యాస్తమయం వరకు జాగ్రత్తగా కాచుకుంటాం. ఆ తర్వాత అర్జునుడు అగ్నిప్రవేశం చేస్తాడు. యుద్ధం ఆగిపోతుంది!'' అని దుర్యోధనుడు ధైర్యం చెబుతున్నాడు. ధృతరాష్ట్రుడు - విన్నాడు. వూరుకోకుండా - "సంజయా! ఎంతమంచి మాట చెప్పావు. నాకు చాలా సంతోషంగా వుంది'' అంటూ మెడలోని ముత్యాలహారం తీసి, సంజయునకిచ్చాడు.

"మహారాజా! మీ సంతోషం మీకు సగంబలం. ఈ రోజు గడవాలి కదా! ఇప్పుడే తెల్లారింది. యుద్ధకాండ ప్రారంభం కాలేదు. సాయంకాలం జరిగే జాతరకు, ఇప్పటినుండే సంబరాలా ? కంగారుపడకండి. ఆ తర్వాతది వినండి.

చేయవలసిన ఏర్పాటు చేసారు. సైంధవునికి రక్షణ కవచం ఏర్పాటు చేసారు. ఎటువంటి పరిస్థితులలోను నీ తల కనపడరాదు. అది కనిపిస్తే.... "మా బాధ్యత లేదు'' అని ప్రతి ఒక్కరు హెచ్చరించి చెప్పారు. ప్రాణభయంతో సైంధవుడు... కొట్టుకుంటున్నాడు.

ఇప్పుడు - ఇక్కడ మూడు సమస్యలు కనబడుతున్నాయి. మొదటిది - ద్రోణులు - ధర్మరాజును ప్రాణాలతో పట్టి, దుర్యోధనునికివ్వడం. రెండవది - సూర్యాస్తమయంలోగా సైంధవుని అర్జునుడు వధించడం.మూడవది - అర్జునుడు కనుక సైంధవ వధ చెయ్యలేకపోతే అగ్నికి ఆహుతవడం.

అందుకని - ధర్మరాజు రక్షణం తనవారలకందరికి అప్పగించి, తాను సైంధవ వధకు బయలుదేరాడు. విజయ ధ్వనులు, వీరవిహారాలు, ఉభయపక్షాలలో గుబులు - ఆందోళనలు.

సైంధవుని చేరాలి. అతని ఆచూకీ తెలియడం లేదు. ఎదురుగ్గా గురుదేవులు. అపర మహేశ్వరులవలె ప్రకాశిస్తున్నారు. "గురుదేవా! సైంధవుడు" అర్జునుడు ప్రార్థించినట్లు అడిగాడు. జయించి వెళ్ళమ్మా!" అని గురువుదేవులు సమాధానమిచ్చారు. మళ్ళీ అర్జునుడు నమస్కరించి "తండ్రిని ధిక్కరించాలంటే, ఆ తనయునికి, తండ్రి ఆశీర్వాదం కావాలి" అనగా -

అది నీకు తప్పక లభ్యమయిందన్నారు. వెంటనే అర్జునుడు ధనుష్టంకారం చేసాడు. తన దివ్యాస్త్ర సంపదను, అలక్ష్యించక ప్రయోగిస్తున్నాడు. అతని వీరవిక్రమానికి, ఆ సైన్యంలో నుండే "నిన్న కుమారుడు. ఇవ్వాళ తండ్రి. మనల్ని చంపికాని, మరలరేమో!" అనుకుంటున్న వారి మాటలను విని పౌరుషం పెరిగింది.

సవ్యసాచి కాబట్టి, ఎడపెడా బాణవర్షంతో అందర్ని అదరగొట్టేస్తున్నాడు. దారి చేసుకుంటున్నాడు. ఒక్కొక్కరినే చూసుకుంటూ, దూసుకుంటూ ముందుకు పోతుంటే, అర్జునుని వెనుక పడటమే తప్ప, నిరోధించి నిలువగల మగాడు ఒక్కడు కనబడటం లేదు.

"శ్రుతాయువు" అనేవాడు వరుణ పుత్రుడు. అతని వద్ద అమోఘమైన గద వుంది. అది చాలా గొప్పదని తెలుసు, మిగిలిన వివరాలు తెలియని శ్రుతాయువు, అసలు కృష్ణుని లేపేస్తే.... కథ కంచికి పోతుందని, తలచి, ఆ గదను తెలివిగా కృష్ణుని తలపై గట్టిగా మోదాలని తలంచాడు.

చూస్తుండగా అది కృష్ణుడి మెడలో పూలహారమై కూర్చుంది. భలే మాయగా వుందనుకున్నాడు, ఆ వెర్రివాడు. కృష్ణునిపై గద ప్రయోగించినందులకు అర్జునుడు శృతాయువు చేతులు నరికాడు. ఈలోగా కృష్ణుని మెడలో పూలహారమైన గద, మళ్ళీ గదగా మారింది. శృతాయువు బుర్రపగుల గొట్టింది. ఎదురు తిరిగి అతని గద అతన్ని సంహరించింది. ఈ గద విశేషం. నిరాయుధునిపై దీనినెప్పుడు ప్రయోగించరాదట. ఇది తెలియక నిరాయుధుడైన కృష్ణునిపై ప్రయోగించి, తన ప్రాణం తానే తీసుకున్నాడా - పిల్లవాడు!

అర్జునుడు రెచ్చిపోవడం భరించలేని దుర్యోధనుడు "గురుదేవా! సైంధవుని బ్రతికిస్తారా ? లేక ధర్మరాజును ప్రాణాలతో పట్టినట్లే, అర్జునుని బాణాలకు అర్పిస్తారా ? భరించలేని ఆ మాటలకు, ద్రోణులు అస్త్రసన్యాసం చేస్తే - తాను, తన వాళ్ళు - ప్రాణాలతో వుండరు'' అని సమాధానపరచుకుని - "అదికాదు గురుదేవా...! అర్జునుడు'' అర్థమయినట్లు గురుదేవులు తలవూపారు.

"రారాజా! నీ పైన నాకెప్పుడు కోపం లేదు. అదే వుంటే నువ్విలాగ వుండేవాడివి కాదు. నా కుమారుడు అశ్వత్థామతో సమానంగా చూసాను. అర్జునుని అస్త్రపాండిత్యం, శ్రీకృష్ణుని రథసారథ్యం. ఈ రెండూ కలిసి, మనకు ప్రాణాంతక మౌతున్నాయి. నిన్నటిరోజున వీళ్ళు లేరు. వుంటే అభిమన్యుడు కాదు. మనమందరము, ఈ యజ్ఞానికి, నీవు కోరి తెచ్చుకున్నదానికి - సమిధల మయ్యేవాళ్ళ''మన్నారు.

సరే. నీకు కవచధారణమంత్రమిస్తాను. దాని ప్రభావంతో, సమ వయస్కుడైన అర్జునునితో పోరాడమని మంత్రోపదేశం చేసారు. అందుకుని యుద్ధం మొదలు పెట్టాడు. మధ్యాహ్నమయింది. ద్రోణ, దృష్టద్యుమ్నులు చండ భాస్కరులయ్యారు. కోపం పట్టని ద్రోణుడు, దృష్టద్యుమ్నుని వధించాలని, వజ్రబాణం ప్రయోగించబోతుంటే...

ఆ ప్రమాదాన్ని గ్రహించిన సాత్యకి, ఆతనిని గురుదృష్టిని తప్పించి, తాను విజృంభించాడు. సాత్యకిని కొట్టటం ద్రోణులకు చాతకాలేదు. చూసేవాళ్ళందరు "భళి, భళి'' అన్నట్లు, సాత్యకి శరలాఘవం నుండి ద్రోణులు బయటపడలేక పోతున్నారు. ఇదిలాగ వుంటే -

కృష్ణార్జునులు సైంధవుని సమీపిస్తున్నారు. అడ్డంగా వచ్చాడు, దుర్యోధనుడు.

"ఇంకెందుకు, కానివ్వ''మన్నాడు కృష్ణుడు. ఇరువురి మధ్య ఘోరయుద్ధం. అర్జునుని ప్రతాపం, కవచధారణా మంత్రమొందిన దుర్యోధనుని ఏమీ చెయ్యలేకపోతుంది. అన్నీ అస్త్రాలు వ్యర్థమౌతున్నాయి. ఈ సమయంలో, ఆలోచించి శత్రుంజయుడైన అర్జునుడు, అరచేతిలోకి బాణాలు వేసాడు. అక్కడ కవచ ప్రభావముండదు. దాంతో ధనస్సు క్రిందకు జారింది. సారధిని చంపి, గుర్రమును కూల్చి, ఆ భీభత్సుడు - భీభత్సం చేస్తున్నాడు.

ఎక్కడికక్కడ - రక్షణ - ప్రతిజ్ఞలు - శక్తి సామర్థ్యాల ప్రదర్శన, అస్త్రా విద్యా పాటవం... దీనికెదురులేదన్నట్లు వ్యూహ, ప్రతివ్యూహాలు.

ఇదే సమయంగా, ఘటోత్కచుడు, తన తమ్ముని చంపిన వారిపై ప్రతీకారంగా ప్రభంజనుడయ్యాడు. అతనికెదురు అలంబసుడు. అది నిజమైన వీరవిక్రమ ప్రదర్శనంలాగ సాగుతుంది. జరిగే దారుణం అనంతంగా వుంది. ఈ యుద్ధమేమిటో... ఆ వైరమేమిటో... ఈ మిత్ర - శత్రువులు, శత్రుమిత్రులు. అంతా... వారి వారి ఓపికను బట్టి, ఎదుటివారిని నిరోధించాలని, లేదా చంపాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అర్జునుని లక్ష్యం సైంధవుడు. ద్రోణుని లక్ష్యం ధర్మరాజు.

ఒకరు చంపేవారు. ఇంకొకరు పట్టి బంధించి తన శిష్యునికి కానుకగా ఇచ్చేవారు. ఈ సంకుల సమరములో సంధ్య ముగియడానికి సిద్ధపడుతుంది. కొండంత ఆశ, దుర్యోధనునిలో కలిగింది. "కర్ణా" జాగ్రత్త! కాస్సేపు మనమా సైంధవుని రక్షించుకోగల్గితే ప్రతిజ్ఞాభంగమైన అర్జునుడు అగ్నిప్రవేశం చేస్తాడు.

మనమందరము హాయిగా వుంటామని చెప్పాడు. నవ్వాడు కర్ణుడు. దానిని తనకభినందనగా తీసుకుని దుర్యోధనుడు, లోలోపల సంతోషించాడు.

శత్రు ప్రభంజనం ఒకవైపు, సూర్యాస్తమయం మరొకవైపు - అర్జునునిలో ఆందోళన కల్గిస్తుంటే "కంగారుపడకు. సూర్యుడస్తమిస్తాడు. సైంధవుడు జయ జయ ధ్వానాలతో బయటికి వస్తాడు. అప్పుడు బాణం వెయ్యి. వాడు చస్తాడు. నువ్వు దివ్యాస్త్రంతో సిద్ధంగా వుండమన్నాడు.

అలాగే జరిగింది. పాండవులలో హాహాకారాలు. కౌరవులలో, విజయధ్వానాలు.

"హమ్మయ్య!" బ్రతికానంటూ సైంధవుడు బయటికి రావడం వచ్చినవాడు వూరుకున్నాడా ? లేదు. "అర్జునా! నేను రక్షింపబడ్డాను. అగ్నిప్రవేశం చెయ్యి. సరిగ్గా ఆ సమయంలో పారిపోవడానికి ఏ మాత్రం తావివ్వకుండా అస్తమయ సూర్యదర్శనమిటు, అటు అర్జునుని బాణం సైంధవ శిరాన్ని త్రుంచడం జరిగిపోయింది.

"అర్జునా! ఆ శిరము నేలపడకుండా, గాలిలోనే పల్టీలు కొట్టనివ్వు!" ఆదేశించాడు. ఆ తల అలాగ గాలిలో తిరుగుతుంది. "ఔరా! దీనినేం

చెయ్యాలంటాడు." "దానినలాగే తిరగనివ్వు. ఆ తలక్రింద పడిందో తల వెయ్యి ముక్క లౌతుంది. కాబట్టి "తల" జాగ్రత్త అంటాడు.

"నాదా, సైంధవుడిదా ?" అమాయికంగా అడుగుతాడు, అర్జునుడు.

"రెండు" అంటాడు కృష్ణుడు.

సైంధవుని తలను గాలిలో తిరగనిస్తూ "దీనినేం చెయ్యమంటావు ?" "ఒక్క ప్రక్కన భయం, మరొకప్రక్క ఆందోళనా ఫలితంగా" అది క్రిందపడిందో నీ తల పగులుతుందనేసరికి, ఏం చెయ్యాలో సతమతమవుతుంటే -

"అర్జునా! ఈతని తండ్రి వృద్ధక్షత్రుడు శ్యమంతకంలో తపోనిష్ఠలో వున్నాడు. దీనిని ఆతని ఒడిలో పడేటట్లు చెయ్యి. సర్వం సుఖవంతమౌతుంది" కృష్ణుడు చెప్పాడు.

వెంటనే దివ్యాస్త్రాన్ని సంధించి, ఈ సైంధవశిరము తపము చేసుకునే ఆతని తండ్రి "వృద్ధక్షత్రుని" ఒడిలో పడేటట్లు కొడతాడు. ఒక్క ఉదుటున మీదపడేసరికి, కళ్ళుమూసుకుని తపము చేసుకునే ఆయన అదేమిటో చూడకుండా విసిరేస్తాడు. అది క్రిందపడటం, ఈయన తలపగలడం, ఏకకాలంలో జరుగుతుంది.

నిన్న అభిమన్యుని మరణానికి విజయోత్సాహంతో పొంగిపోయిన కురువీరులు, వారి సేన, నేడు సైంధవుని మరణంతో దిగాలు పడిపోయారు. అభిమన్యుని పేరున, తమ బావను చంపుకున్నామని బావురుమన్నారు. ఇది దుస్తంత్రమని - అర్జునుని ఢీకొనబోతే, ఎదురుపడినవారిని ఎదురు పడినట్లే ఎదిరించగా, కొందరు మరణించారు. కొందరు గాయపడ్డారు. కొందరు పారిపోయారు. కొందరు మూర్ఛితులయ్యారు. మొత్తానికి - కురు శిబిరంలో చీకట్లు ముసురుకున్నాయి.

పాండవ శిబిరంలో, శ్రీకృష్ణుని పుణ్యమున పంతం నెగ్గించుకున్న అర్జునుడు, ఇతరులు - నిన్నటి బాధను కొంతలో కొంత దిగమ్రింగుకోగలిగారు.

## మూడవ అధ్యాయము

# యుద్ధం - మోసమే!

**వి**జయం వరించిన ధీమా - ఒకవైపు - కుయ్యుక్తుల - మోస పరాజయాల పరాభవం మరొకవైపు. ఎంతసేపు ఇతరులను నిందించడం తప్ప, ఈ రాజుకు మరో పనిలేదు. వీళ్ళందరూ "నిన్ను రక్షిస్తాం. భరత సామ్రాజ్యానికి కిరీటులం చేస్తా" మని ప్రతిజ్ఞ చేసారా ? లేక... అవాస్తవ జగత్తులో విహరించి ఇందరి ప్రాణాలు తీస్తున్నాడో... ఒక్కసారి ఆలోచించుకుంటే, సత్యం బోధపడుతుంది. ఇదే ద్రోణులు చెప్పారు. అయినా మూర్ఖత్వం తొలగదు. మనిషిలో వివేకం జనించదు. ద్రోణుల వలన లాభం లేదనుకుంటు, కర్ణుడితో అంతా చెప్పాడు. విన్నాడతడు. వెంటనే సమాధానమివ్వక ఒక్కక్షణమాగాడు.

ఎన్నో ఆశలు పెట్టుకున్న మిత్రునిగా "కర్ణా.... ?!" అన్నాడు, దుర్యోధనుడు.

"అదే ఆలోచిస్తున్నాను. మనం తొందరపడడం మంచిది కాదేమో! ఎందుకంటే ఆయన పెద్దవాడు. అరివీర భయంకరుడు. పైగా అస్త్ర విద్యాగురువు. సైంధవ మరణం మనలనందర్ని కృంగదీసింది. కాదనను. దీని నిమిత్తం శ్రీ గురువులను నిరశించడం మంచిది గాదు. ఆలోచించు. అర్జునుడు మహావీరుడని, మనకాల్బంటును అడిగినా చెబుతాడు. ఆతడెటువంటి పరిస్థితిలో వున్నాడు. అతి దారుణంగా మనమందరము కల్సి, మూకుమ్మడి హత్యచేసిన కుమార మరణం విషాదంలో వుండి జరిపిన ప్రతిజ్ఞాకాండ ఇది. ఇందులో కృష్ణుని పట్టుగూడా ఎక్కువై వుండవచ్చును.

కొద్దిగా నిదానంగా ఆలోచించు. ఆ చంపబడ్డ వాడు తన మేనల్లుడు. తన ముద్దుల చెల్లెలు కుమారుడు. దాంతో సహజంగా వాళ్ళు అగ్నివలె ప్రజ్వరిల్లుతారు. ఆ సమయంలో, మనమైనా సరే అలాగే ప్రవర్తిస్తాం. అతడు సామాన్యుడు కాదు. పర ప్రశంసలనకుండా, "రాజా! సామాన్య దృష్టితో ఆలోచించు. తండ్రిని మించిన ఘనుడు కనుక కొద్దిగా వూరట చెందు. మనం చెయ్యవలసింది మనం చేద్దాం... అంటాడు. విధిలేక రాధేయుని మాటలకు తల వూపుతాడు.

అతని తెలివితేటలను మెచ్చుకుంటూ, ప్రశాంతంగా దుర్యోధనుడు ఆలోచన మొదలుపెట్టాడు. ఈనాడు - ప్రత్యేకంగా రాత్రి పోరు ప్రారంభ మయింది. ఎందుకో ఈ రాత్రిపూట యుద్ధమంటే భీమునికి ఆనందం. పొంగే ఆవేశంతో, ఎలా స్వైర విహారం చేస్తున్నాడో ఆ విజృంభణమేమిటో, ఆశ్చర్యకరంగా వుంది. ప్రతి ఒక్కరు ఆతని వీర ప్రతాపానికి భయపడిపోతూంటే, ద్రోణులు రంగప్రవేశం చేసారు. ఉభయుల మధ్య పోరు భీకరంగా సాగుతుంది. యుద్ధరంగమంతా భీభత్సంగా వుంది.

రాత్రి యుద్ధమనేసరికి భీమకుమారుడు ఘటోత్కచుడు చిత్రవిచిత్ర గతుల, ప్రతి ఒక్కరిని, భ్రమ, మాయలలో పడవేసి, తన మాయా చాతుర్యంతో కురువీరుల గుండెలవిసేలా చేస్తున్నాడు. కొందరైతే... ఘటో...!" అని వినబడేసరికి, ఇంకా తదుపరి మాట వినలేక అలాగే ప్రాణాలు వదులుతున్నారు.

అందరు బెంబేలెత్తి పారిపోతూంటే, అశ్వత్థామ నిలబడి, ఘటోత్కచుని మాయను ఛేదిస్తూ తీవ్రబాణాలతో నొప్పించాడు. ఈ ఘటోత్కచుని కుమారుడు కూడ తండ్రిని మించిన తనయుడై విజృంభిస్తుంటే, ఈ యుద్ధకాండంలో అతను చేసే ప్రతి ప్రయత్నాన్ని అశ్వత్థామ ప్రతిఘటించాడు.

దీంతో అంజనపర్యుడు, అశ్వత్థామను విడిచి, ఆయన తండ్రి శ్రీ గురువులను ఢీకొన్నాడు. ఆయన యుద్ధరంగానికి ప్రేమ - మమకారాలు వుండవని, ఎదుటివారిని తెగనాడడమే ముఖ్యమనే లక్ష్యానికి వచ్చినట్లు, ఘటోత్కచు కుమారుని తలను తన తీవ్ర బాణాలతో నరికి చంపారు.

ఘటోత్కచుడు దాంతో - మరింత రెచ్చిపోయాడు. ఆ విజృంభణంలో కౌరవసేనలు కకావికలౌతున్నాయి. పగలే అంతంతమాత్రం. ఈ రాత్రిపూట ఈ రాత్రించరుని ప్రతాపం మరింత భయంకరమైంది. అతిరథ మహారథులందరు ఢీకొంటున్నారు. ఇటు అశ్వత్థామను, అటు కౌరవసేనలను భీభత్సుని అన్న కుమారుడు మట్టిగరపుతుంటే -

ఆ దృశ్యాన్ని చూసి సహించలేని రారాజు, తన వాళ్ళందర్నీ మూకుమ్మడిగా, భీమ కుమారుని చంపెయ్యమన్నాడు. అతన్ననుసరించి, సాత్యకి, వాళ్ళ సర్వసేనాని, పొంగి పరుగులు దీసే మహావీరులతో.... రణరంగం, రణగొణ ధ్వనులతో, పిచ్చెక్కిస్తుంది. ఎవరున్నారో ? ఎవరు చస్తున్నారో ఒక్కటి అర్థం కావడం లేదు.

ఒక మూల కుమారుడు, మరొక ప్రక్క భీముడు, ఎదిరించిన వాళ్ళనందర్నీ యమపురికి పంపుతున్నారు. ఎవరిమట్టుకు వారు పూనకం వచ్చినట్లు ఆవేశంతో రెచ్చిపోతున్నారు. అప్పుడు దుర్యోధనుడు "కర్ణా! ఇక నీ మీదే నా ఆశ. మన వాళ్ళందరు.... రారాజు కంటివెంట అర్ద్రత చూడ తలవని కర్ణుడు "సై" అన్నాడు. ఒక్కసారి దుర్యోధనుని పొగిడి, నీకు విజయం తప్పదని, అభినందించి, ఆశగా ధనుష్టంకారము చేసాడు. వస్తున్నాడు, మగాడు... వాళ్ళలోని వాళ్ళు వ్యంగ్యంగా అనుకున్నారు. కృపాచార్యులైతే, ఆపుకోలేక పకపక నవ్వేసారు.

"కర్ణా.... నీవా....! సరి, సరి...!"

ఆ కృపాచార్యుల మాటలకు కృద్ధుడౌతూ "బ్రాహ్మణోత్తమా! వాయన మెవరిస్తే వారిని "మనోవాంఛా ఫలసిద్ధిరస్తు" అను, ఓ బ్రాహ్మణుడా! జాగ్రత్త. అనవసర ప్రసంగాలు మాని చాతనైతే అస్త్రమో, శస్త్రమో పట్టి, రారాజుకు విజయం చేకూర్చు. "వెళ్ళు!"

ఈ మాటల్ని అశ్వత్థామ విన్నాడు. వెంటనే - ఎవరెవరు, ఏ హద్దుల్లో వుండాలో, అలాగ వుండాలి. కాళ్ళు పట్టే నీవు, అదృష్టం కొలదీ అందలమెక్కి మమ్మ పరిహసించే స్థాయికి వచ్చావా ? ఊ...! నీ శూరత్వం - వీరత్వం ఎన్నిసార్లు చూడలేదు. ఎన్నిసార్లు విజయపథంలో నీవు నడిపావు.... ఆ...!" అటువంటి నువ్వు రారాజును -

ఇప్పుడు... రారాజు, ముగ్గురి మధ్య నిలిచాడు.

ఆర్యులారా! ఒకరు పెద్దలు. మిగిలినవాళ్ళు, నాకోసం మిమ్మల్ని మీరు పణంగా పెట్టుకున్న మిత్రులు. ఈ సమయంలో దయచేసి... అందరికి సర్ది చెప్పాడు. కర్తవ్యాన్ని కరుణించి నిర్వహించమని కోరాడు. అయినా కృప-కర్ణులు తగ్గడం లేదు.

"గురుదేవా! మిత్రమా! సోదరా! నేను విజయుడవ్వాలన్నది మీ ఆకాంక్ష. అది తీర్చమని ప్రార్థించే సమయంలో ఈ అనవసర వాదులాటలు... దయచేసి నన్ను కడతేర్చండి. లేదా నాచేత రాజ్యమేలించండి!" అని విడివిడిగాను, కలివిడిగాను - కలిసి ప్రార్థించాడు.

దీంతో వికలుడైన కర్ణుడు, యుద్ధంపై మనసు పెట్టలేకపోయాడు. వీరత్వం చూపిస్తున్నాడు కానీ, శూరత్వం కనబడటం లేదు. కర్ణుని బాధను, మనోస్థితిని

తెలిసిన రారాజు, అర్జునునిపై విక్రమించ సిద్ధబడుతుంటే కృపాచార్యులు "అల్లుడూ! రారాజు...!" అన్నాడు.

అశ్వత్థామ రారాజును వెంబడించి, "సోదరా! నువ్వు నిలు. ఆ అర్జునుని ప్రతాపానికి నేను అడ్డుపుల్ల వేస్తానని ముందుకురికాడు. ఆ సమయంలో కూడా రారాజు సహనం కోల్పోయాడు. "గురుపుత్రా! మిమ్ము పోషిస్తూన్న మాకంటే గురువు, గురుపుత్రుడని అభిమానించే ఆ పాండవులే మీకు అభిమానులు. ఇది చెప్పకనే కనబడుతుంది. మీరు పాంచాలుర విషయం చూసుకోండి. వాళ్ళు మీ పగ-ప్రతీకారాలకు సమిధలు. నేను, పాండవుల సంగతి చూసుకుంటా" ననేసరికి కదిలే రథమాగింది.

"దుర్యోధనా!" అతని మాటలకు చివుక్కుమన్న మనసుతో - "రారాజా! మాకు ముందు మీరు శిష్యులు. నా తండ్రి మీ ఇరువుర్నీ సమానంగానే ప్రేమించారు. అభిమానించారు. నాకూ అంతే -

ఒక్కొక్కరిపై గురువుకు, అటునుండి శిష్యునికి అమితప్రేమ వుంటుంది. అది వారి శిష్యరిక ప్రభావం వలన లభించే వాత్సల్యం. ఆ రకంగా అర్జునుడు తన విద్యాపాటవంతో, శ్రీ గురువులకు అభిమానపాత్రుడయ్యాడు. అసమర్థుని అందల మెక్కిస్తే బాధపడాలిగాని, సమర్థులకు అన్యాయం జరుగుతుంటే... ధిక్కరించాలి.

పోనీలే. మమ్మల్ని మా సేవలను బాగా గుర్తించావు. అయినా, రారాజువు కదా! నువ్వు చెప్పినట్లు లేదా చెప్పించినట్లు మీ వద్దనుండి తీసుకునే భిక్షకు, తప్పక "మనోవాంఛా ఫలసిద్ధిరస్తు. అఖండయశో కీర్తి వృద్ధిరస్తు!" అని మా ధర్మంగా మేమాశీర్వదించాలి కదా! అది మాత్రం మళ్ళీ భిక్షనియ్యవని కాకుండా, శాశ్వత దాన వ్రతపరాయణుడివై వెలుగొందు"మన్నాడు.

"ఆ చంద్రార్క వంశాభివృద్ధిరస్తు, కీర్తిరస్తు, శుభమస్తు. అస్తు. విజయోస్తు" అని తప్పక ఆశీర్వదిస్తాం. మా ధర్మం మేము నిర్వర్తిస్తామని రథాన్ని దూకుడిగా ముందుకు నడిపించమన్నాడు. ఆ కోపంతో సాగిన అశ్వత్థామ, అరివీర భయంకరుడు, మహారుద్రుడు అయ్యాడు. అతడు యుద్ధం చేస్తున్నట్లు లేదు. ప్రళయతాండవం చేస్తున్న పరమశివుడి వలె - ఆ క్షణంలో కనబడుతున్నాడు.

యుద్ధపాటవం గమనిస్తున్న కృష్ణుడు - తన పనిలో తాను నిమగ్న మవుతూనే సహస్రాక్షుడైన ఆ శ్రీహరి ధర్మరాజును "బావా! ఎందుకలకనవసరంగా

ఒంటరిగా ప్రాణులనెదుర్కుంటావు. దానికి తగ్గవారు దానికున్నారు. నీవు భీమ సాత్యకాదులున్న చోటుకు వెళ్ళు. అది అందరికి మంచిదంటాడు. పరిస్థితిని అర్థం చేసుకుని ధర్మరాజు తలవూపి, భీమాదులకు సహాయంగా కదిలాడు.

దివిటీల వెలుగులో, రాత్రి యుద్ధం - నిజంగా నిశిరాత్రి యుద్ధంగా తయారయింది. ఏ మాత్రం వెలుగు కనబడకపోయినా ఆ చచ్చిందెవరో అర్థం కాదు. ఆ రకంగా పోరాటం జరుగుతుంది. మరోప్రక్క - దుర్యోధనుడు, తన ఆశలు నీరు కాకూడదని "వీరులారా! గురుదేవులు జాగ్రత్త. వారి రక్షణ వారే చేసుకోగలనని వూరుకోరాదు. మన బాధ్యత మనం నెరవేర్చాలి" హెచ్చరిస్తున్నాడు. ఆ మాటల్లో తన బాధ్యతను తాను గుర్తించినట్లే ప్రవర్తిసున్నాడు!

దృష్టద్యుమ్నుడు - ద్రోణాచార్యులు సరిజోడులాగ పోరాడుతున్నారు. ద్రోణవధ కోసమే - ఈతడు యజ్ఞవాటిక నుండి జన్మించాడు. ఇతనితో కలిసి, అర్జునుని కోసమన్నట్లు, మహాశక్తి ద్రౌపది జన్మించింది.

అటువంటి వీరుడు, సాత్యకి, అర్జునుడు, ఒక్కోసారి యుధిష్ఠరుడు, భీముడు పరాక్రమించి, విక్రమిస్తూంటే - ద్రోణవధ కోసం ఆవురావురుమంటున్నాడు. అసామాన్య విలుకాడు అరివీరభయంకరుడైన ద్రోణవధ సామాన్య విషయం కాదు. వాళ్ళ కళ్ళముందు పుట్టిన పాండవులెంతటి మహావీరులు, వరబల సంపన్నులో... అంతటి శక్తిమంతులు, ద్రోణ, భీష్మాది కొందరు మహామహులు.

ఎవరిమట్టుకు వారు తమ ప్రతాపాగ్నితో అవతలివారిని దహించాలని ఆత్రపడుతున్నారు. ఈ హడావుడిలో అర్థరాత్రి అయింది. ఇప్పుడు నిశాచర బలము క్షణక్షణానికి పెరిగే సమయం కాబట్టి, భీమ కుమారుని పైకి కర్ణుని పంపితే మనపని సులువవుతుందని, ఘటోత్కచుని కర్ణునిపైకి ప్రేరేపించారు.

"వూ...!" అని ఆ మహావీరుడు పొంగి, రెచ్చిపోతున్నాడు. ఆ రాక్షసమాయకు ఉక్కిరిబిక్కిరౌతుంది కౌరవసేన. వీళ్ళకు అలంబసుడున్నాడు. వీడికి పాండవులంటే మంట కనుక. ఈ అలంబసుడు ఘటోత్కచునిపై విరుచుకుపడ్డాడు.

చిత్ర విచిత్ర గతుల సాగే ఆ యుద్ధం. కొందరికి ప్రాణాంతకం. మరి కొందరికి ఆనందదాయకం. "నువ్వెంతరా!" అని ఘటోత్కచుడు, అలంబసుని

క్రింద పడేసి ఒక తొక్కు తొక్కి చంపాడు. వాడి శరీరాన్ని ఒక గదను విసిరినట్లు "దుర్మార్గుడా! ఏడు" అని రారాజు రథంపై పడేసాడు. దీనికి కుమిలి "కర్ణా!" అంటే ఇరువురు భీకరపోరు ప్రారంభించారు.

ఇదే సమయంలో బకుని సోదరుడొకడు దుర్యోధన పక్షంలో చేరాడు. మళ్ళీ మాయాయుద్ధం మొదలయింది. భీమకుమారుడు, కర్ణుని మతిభ్రమింప చేస్తున్నాడు. అమ్మో! పాండవులు, వారిపుత్రులు. ఒకరిని మించినవారు మరొకరు... అన్నట్లు మీదకురుకుతుంటే "భళా" అని తెలియకుండానే అనుకున్నాడు.

కారణం... వాళ్ళందరు తనవాళ్ళే కదా! ఇది లోపలి మాట. బయట - రారాజుకు ఇచ్చినమాట. తనపై ఆశలు నింపుకుని... ఈ మహాయజ్ఞానికి దిగిన మాట - ఆట, ఈ పూట నిలువరించాలని తలచి, తాను వుద్రేకం చెందుతున్నాడు. ఈ తరుణంలో - బకుని సోదరుడు, ఘటోత్కచుడు రాక్షసమాయలలో మున్గి యుద్ధం చేసుకుంటున్నారు.

భీమాదులు, కర్ణుని భరతం పడుతున్నారు. "అర్జునా! ఇది రాత్రి సమయం. రాక్షసులకు మహా అనుకూలం. ఇది మనం ఉపయోగించుకోవాలి. యుద్ధానికి దిగిన తరువాత ముందుకు వెళ్ళడమే కాని వెనుకంజ వెయ్యరాదు. వాళ్ళను ప్రక్కదారి పట్టించాలి. వీరివైపు నకుల, సహదేవ, సాత్యకిలను, కర్ణుని మీదకు శిఖండి వగైరా వీరులను పంపుము.

కర్ణ, ఘటోత్కచుల యుద్ధం భీకరంగా సాగుతుంటే అలాయుధుడను రాక్షసుడు భీమునిపై పడ్డాడు. నువ్వు అతన్ని పీచమణచమని, కృష్ణుడు పంపాడు. ఓ ప్రక్క కర్ణుడు వీరావేశంతో, రారాజు క్షేమమే తన బాధ్యతన్నట్లు రెచ్చి పోతున్నాడు.

అలాయుధ, ఘటోత్కచులు గగన యుద్ధం పూర్తిచేసినట్లు భూమికి దిగారు. ఆ పోరులో అతని రథం, సారథి, గుర్రాలు అన్నీ పోగా, ఒంటరిగా ఘటోత్కచునితో పోరి, పోరి... ఈ భీమ కుమారుని చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

ఇక ఘటోత్కచుడు, కర్ణుని గందరగోళంలో పడేసాడు. అతని మాయలన్ని పటాపంచలు చేస్తున్నాడు. అయినా రాత్రి సమయం. చిత్రవిచిత్ర గతుల యుద్ధం.

ఇతన్ని ప్రతిఘటించడానికి కర్ణునికి సాధ్యపడటం లేదు. అయినా తన బలమంతా వుపయోగించి, పుంఖానుపుంఖాలుగా శరాలు గుప్పిస్తున్నాడు.

ఆ ప్రయత్నంలో అంత పెద్ద భారీకాయ ఘటోత్కచుడు సొమ్మసిల్లిపోతే, అమాయకులైన కురుసేన అతడు చచ్చిపోయాడని తలిచి ఎగరడం ప్రారంభించారు. వున్నట్టుండి పిడుగులా ఎగిరాడు. ఉరుములా ఉరిమాడు.

ఆ హడావుడికి - "అమ్మో!" అని కొందరు సామాన్య వీరులకు గుండాగి చచ్చినంత పనయింది. ఆ వెంటనే ఇతన్ని ఉపేక్షిస్తే కౌరవకులమే ప్రాణాలు పోగొట్టుకుంటుందని, అనుకుంటూంటే, ఇంద్రుడిచ్చిన శక్తి, అర్జునుని కోసం దాచిన మహాశక్తివంతమైన, "ఇంద్రశక్తి" అస్త్రాన్ని ఘటోత్కచుడిపై ప్రయోగించాడు.

కర్ణుని - ఆ అస్త్రం వలన, అరివీర భయంకరుడైన ఆ భీమనందనుడు, అలాగ - కుప్పకూలి పడ్డాడు. పిడుగుపడ్డ తాటి చెట్టయ్యాడు.

"హమ్మయ్య!" గోవిందుడు పరమానందభరితుడయ్యాడు. అర్జునుడు, ఘటోత్కచుని మరణానికి, వలవల ఏడుస్తూంటే, ఆ మహాదానందమేమిటో అర్థంకాక - "బావా! ఇది అన్యాయ"మన్నాడు.

"కాదు న్యాయం. ఆ "శక్తి" అస్త్రం ఇంద్రుడు కవచకుండలాలకు బదులు ఇచ్చినది. అది నీకోసం కర్ణుడు దాచిపెట్టాడు. ఇప్పుడు భీమసుతుని పేరున అది వ్యర్థమయింది. ఇప్పుడు నీ ప్రాణాలు నిలిచాయి. అందుకే, నా ఈ ఆనందమన్నాడు కానీ, ఘటోత్కచుని మరణం విన్న యుధిష్టరుని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఇదంతా నా మూలాన కదా! ఆనాడు అభిమన్యుడు. ఈ రాత్రి ఘటోత్కచుడు.. ఇంకెందరి ప్రాణమూర్తులను పోగొట్టుకోవాలో అని దుఃఖిస్తు ధర్మరాజు, ముందు వాళ్ళ పని చెబుతాను. అదే ఆ కర్ణ, ద్రోణులనని ప్రతిజ్ఞ పూనినట్లు బయలుదేరాడు.

"అర్జునా! నువ్వు సిద్ధమవు! లేదంటే మీ అన్న వాళ్ళను చంపడం మాట దేవుడెరుగు. అతను కష్టాలలో పడితే కాపాడటం కాస్త కష్టం"అన్న తరుణంలో ధర్మరాజుకు వ్యాసులు దర్శనమిచ్చారు. అతనిని ఓదార్చారు.

"ప్రతీదీ భగవత్సంకల్పమే. మనమంతా నిమిత్తమాత్రులమే. అన్నదమ్ముల మధ్య ఇటువంటి యుద్ధ సంకల్పం, జననాశనం... దైవేచ్ఛ. దానికనుగుణంగా

మనం ప్రవర్తించి, దీనికంతా మనమే కారకులమనుకుంటాము, తగదు. ఆ శక్తిని కర్ణుడు ఘటోత్కచునిపై ప్రయోగించకపోతే నీ ప్రాణాలు తీసేది. ఫలితం మరొక విధంగా వుండేది. ఇది దైవసంకల్పం.

అనవసర ఆరాటం వీడి, నీ ధర్మం నువ్వు నిర్వర్తించు. జననాశనం, దుష్టశిక్షణ జరగాల్సిందే. నీకు విజయము తప్పదు. నీ పట్టాభిషేకం నేను చూస్తానని'' ఆశీర్వదించి, ఆ వేదవ్యాసులు అదృశ్యమయ్యారు.

ఆ రాత్రి గడిచింది. తెల్లవారింది. మళ్ళీ మహాయుద్ధానికి అంకురార్పణం.

"ఆచార్యా!'' మళ్ళీ మొదలుపెట్టాడు. "చూడు. దుర్యోధనా! ఎంతసేపు అవతలివార్ని "నువ్వెంత ?'' అని అనేటప్పుడు "ముందు మనమెంతో తెలుసు కోవాలి. అన్నీ తెలిసి, కళ్ళతో చూస్తూ, ఇంకా నువ్వు... అని అవతలివారిని పరిహసించే బదులు, ~~ఈ~~ పరిహాసమెందుకు తలకెత్తుకోవాల్సి వచ్చిందో తలచుకుంటే, అంతకంతా నీకు జ్ఞానోదయమవుతుంది.

"అర్జునుడు నీ దృష్టిలో ఏమనుకుంటున్నావో... కాని అతడు ఓ సమిధ కాదు. శలభము కాదు. ఒక శరభము. అది అంత తొందరగా అందేది కాదు. లొంగేది కాదు.'' అనగా - "సరే. మీకు కావలసిన సేనతో, మీరు చేయగలిగినది చెయ్యండి. నేను, దుశ్శాసనుడు, శకుని, కర్ణులం - "అర్జునుని సంగతి చూసుకుంటాము!'' అన్నాడు - కృద్ధుడౌతూ!

"మహావీరునికి కావల్సింది - అవతలివారి శక్తిని తెలుసుకుని మన్నించగల, అసలు సిసలైన వీరత్వం కాని, చీటికి, మాటికి చీదరించుకునే అల్పత్వం కాదు.'' చాలా బాధతో తన మనసు విప్పి చెప్పారు. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండని మూతి బిగించుకున్నాడు, ఆ - రారాజు'' అది మహారాజా! నీ కొడుకు అవతలి వారికిచ్చే గౌరవమన్నాడు, సంజయుడు.

"మహారాజా! మొత్తానికి రారాజు, పెద్దలు, పూజ్యులు, గురుదేవులని చూడకుండా, ఏదో విధంగా వారిని అవమానబరుస్తుంటే, దానిని భరించలేక నీకుగా శక్తిలేక, ఇతరులను తూలనాడటం మంచిదేనా ? అని అడుగుతారు.

యుద్ధాన్ని పౌరుషప్రతాపాలతో గెలవాలే కాని పరిహాసాలు, పరస్పర దూషణలతో విజయం సాధించగలమనుకోవడం, నా అధికారం వీళ్ళను

బానిసలుగా చేస్తుందనుకోవడం, ఎంతో పొరపాటు... ఇప్పటికైనా మీ కర్థమయి వుంటుంది. ఇక వాళ్ళ నేభగవంతుడు రక్షించలేడు.''

సంజయుని మాటలకు రవ్వంత మనసు చివుక్కుమనినా, అది "సత్యం'' మని మాటలలో అబద్ధం లేదనుకున్నాడు. అసలు వాడికర్మ కాకపోతే... ఏనాడైతే వాడు వాసుదేవుని కట్టడి చెయ్యాలనుకున్నాడే, ఆనాడే, నిప్పులను మూటగట్టుకున్నాడు. అది వాడికర్మ... నా ప్రారబ్ధ''మనుకున్నాడు.

"మహారాజా! ఘటోత్కచుని చంపిన వారలను మట్టి గరపవల్సిందే. అర్జునా! ఆనాడు అభిమన్యుడి వధకు రెచ్చిపోయావే, వీడు, నా కుమారుడు ఘటోత్కచుడు, భరతవంశానికే ప్రప్రథమ మనుమడు. వీడిని చంపినవారలను, వృకోదరుడు ఆవేశపడుతున్నాడు.

అనుకున్న ప్రకారం ద్రోణుడు పాంచాలసేన వైపు నడిచారు. దుర్యోధనుడు తన వారలతో పాండవులవైపు సాగాడు. యుద్ధం ప్రారంభమయింది. రెండు వర్గాలు గతరాత్రి విజయదీక్షతో కొందరు, తమ అభిమాన ఘటోత్కచుని మరణంతో, ఇంకొందరు... ఇలాగ... తమ విజృంభణ మొదలుపెట్టారు.

ఎందుకో ద్రోణుడు మహాపౌరుషంతో, ఎదురులేనట్లు పోరుతున్నాడు. ఆ మహామహుని ఎదుర్కోవడమసాధ్యమన్న పరిస్థితికి వచ్చేసారు. ఆ దేవుడిలాగా విజృంభిస్తే, పాండవసేన తప్పక, ఎందరున్నారో, శేషించిన వారిని లెక్కపెట్టుకోవల్సి వస్తుంది అన్న కృష్ణుడు. మీకో పరమ రహస్యం చెబుతాను.

"అశ్వత్థామ ఆయనకు ప్రాణం. అతనికేదైనా అయిందంటే, ముఖ్యంగా అతను మరణించాడంటే, ఈ ధనుర్వేత్త యుద్ధం చెయ్యడు. కాబట్టి...

అతను మరణించాడని చెప్పాలి. అంటే... "ఓ!'' అని భీముడు "హహ్హహ్హా! అని నాటకీయంగా వికటాట్టహాసం చేసి "అశ్వత్థామ'' చచ్చిపోయాడు'' అన్నాడు.

అది విని కూడా, ద్రోణుడు - దృష్టద్యుమ్నునితో మహాపోరు సల్పుతున్నాడు. బాణం ఎక్కుపెట్టి, దానిని సంధించే సమయంలో -

గగన మండలంలో విశ్వామిత్ర, వసిష్ఠ, జమదగ్ని, భారద్వాజ, కశ్యప, గౌతమాది "సప్తర్షులు'' లు నిలచి "ఆచార్యవర్యా!'' అనేసరికి అవాక్కయ్యాడు.

"సప్తర్షులారా! క్షమించండి. మహానుభావులైన మీకు, అర్ఘ్యపాద్యాదుల నివ్వలేని పరిస్థితిలో వున్నాను. ఈ దీనుడిని కనికరించండి!

"ద్రోణా! ఎందులకయ్యా - ఈ శోభానాశక ప్రయత్నం. బ్రాహ్మణ ధర్మంగా ధనుర్వేద మభ్యసించావు. అభ్యసింప చేసావు. క్షత్రియ ధర్మమైన, ఈ యుద్ధకాండ నీకవసరమా ? విద్యలు నేర్చిన గురువై, క్రోధమూర్తివియై అనవసరంగా, ఒక శిష్యుని కోసం, మరొక శిష్యుని సామాన్యునివలె చంపుట న్యాయమా!

ఉభయులు గురుదక్షిణనిచ్చారు. వారి నాశీర్వదించావు. అంతే అంతటితో అయిపోయిన దానిని, "పెద్దరికమిచ్చారు గదా" అని యుద్ధభూమిలో, నీవు చెయ్యరాని, చెయ్యకూడని, "అబ్రాహ్మణ వ్యాపారము" చేయుట తగునా ? శోభస్కరము కాని విధులు నిర్వహించుట తగునా ? జరిగిందేదో జరిగిపోయింది.

ఇక ఆ హత్యలు ఆపుచేసి, ఆ భగవన్నిర్ణయాన్ని గౌరవించి, నీ కర్తవ్యం - నీవు నిర్వహించు. అవమానాల పాలవుతూ, ఒకరికి వూడిగం చెయ్యవలసిన దుస్థితి, నీకవసరమా ?" ఆలోచించుకోమని అదృశ్యమయ్యారు. సంధించిన బాణం క్రింద పడేసాడు.

మహర్షులు చెప్పింది సత్యమని తలచాడు. అప్పటికే కృష్ణ ప్రేరణంతో ధర్మరాజు అబద్ధం కాని నిజం "అశ్వత్థామ హతః" ఎంతో గట్టిగా చెప్పాడు. దానికి పాండవ వీరుల నుండి స్పందనా విజయ దుందుభులు, వీరణాలు, తప్పెట్లు కొమ్ము బూరలు - ఈ సందడిలో "కుంజరః" అని చిన్నగా చెప్పాడు. అంతే - ద్రోణుడు పద్మాసనం వేసుకుని యోగనిష్ఠుడయ్యాడు. ఆతని నుండి మహాతేజమొకటి బయటికి వచ్చింది.

ఆ దివ్యతేజాన్ని - కృష్ణ - అర్జున - యుధిష్ఠర, కృపాచార్యులు, సంజయులు చూసారు. భక్తితో వందనం చేసారు. ఇది తనవలన కాకపోయినా, రెచ్చిపోయి, ఆనంద పరవశుడై నాట్యం చేస్తూ - దృష్టద్యుమ్నుడు, గురుని శిరము ఖండించాడు. ఉన్మత్తుని వలె ఎగరడం ప్రారంభించాడు.

ఈ హఠాత్సంఘటనకు - కురుసేనలు తిరుగుముఖం పట్టాయి. అప్పుడు - మరో వంక యుద్ధం చేస్తున్న అశ్వత్థామ ఈ హఠాత్పరిణామానికి,

కలవరపడుతూ, ఏమయిందంటాడు ? అందరు తలలు వంచుకున్నారే తప్ప, అసలు విషయమెవరు చెప్పరు.

చివరకు, మేనమామ - కృపాచార్యులు, అశ్వత్థామను చేరి, వూరడిస్తూ- జరిగింది చెప్పాడు. అప్పుడు ఆ త్రిమూర్తులేకమైనా సరే, ఇంత క్రూరంగా ఆ మహామహుని చంపించిన ధర్మరాజును, ఇందుకు ప్రేరేపించిన, ఆ కృష్ణుని - పాండవులను, మొత్తం... మొత్తం... భస్మం చేస్తాను'' అని ప్రతిజ్ఞ చేసాడు.

ఈ మొత్తం పాండవులకు తెలిసింది. రోజు గడిచేకొద్ది, జరిగిన ప్రమాదంకన్నా, జరగబోయే దనంతమన్నట్లు కనబడుతుంది. రెండువర్గాలలో తర్జనభర్జనలు. పరస్పర నిందలు - శాంతివచనాలు. అక్రోధ కారణాలు - పరిరక్షకులు. పగ చల్లారితే, అశ్వత్థామ బ్రాహ్మణుడౌతాడు. లేక పగ - పట్టుదలల నిలయమైన - మహాక్షాత్రుడవుతాడు. తక్షణం - తన పగకు ప్రాణం పోసాడు.

"రారాజా! ఇది నారాయణాస్త్రం... ఇది అజేయం. దీని ప్రభావం చూడు'' మని విడిచాడు. దాని ప్రభావంతో పాండవులలో ప్రతి ఒక్కరు వివేక భ్రష్టులయ్యే స్థితి కల్గిస్తుంది. వెంటనే కృష్ణుడు - పెద్ద గొంతుకతో "సైనికులారా! మహావీరులారా! ఎవరి ఆయుధాలు వారు విడిచిపెట్టండి. నేలమీద సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్లు బోర్లా పడుకోండి. ఆలస్యం చేయకండి. అప్పుడు మనకెవ్వరికి ఏ ప్రమాదం జరుగదని రథాలమీద వున్నవారు, వాటిని దిగి నమస్కరిస్తూ నిలబడండి. నిరాయుధులను నారాయణాస్త్రం ఏమీ చెయ్యదని మరీ గట్టిగా అరచి చెప్పాడు.

అందరు కృష్ణుని సూచనను అమలుపరిచారు. ఒక్క భీముడు మాత్రం గర్వోన్నతుడై, ఈ అశ్వత్థామ భరతం పడతానని, అతనికెదురు తిరిగాడు. అందర్ని విడిచి, ఆ అస్త్రం భీముని పట్టుకుంది. అతని రథం అగ్నిజ్వాలలను చిమ్మసాగింది. అర్జునుడు వారుణాస్త్రం ప్రయోగించాడు. కానీ, ఫలితం కనబడలేదు.

"భీమా! ఇది వీర-శూరత్వాలకు సమయం కాదు. అస్త్రశక్తి చాలా గొప్పది. దానిని నిరోధించడం చాతనైతే, నేను వూరుకుంటానా ? జరిగింది మరచిపోయి,

రథం దిగి, ఆ అస్త్రాన్ని గౌరవించు. అప్పుడే ప్రమాదము వుండదు. అరచి చెప్పాడు. అయినా వినలేదు.

ఇక్కడ ఇప్పుడు... భీముడు మూర్ఖుడయ్యాడు. పైగా శూరత్వానికి అవమానమంటాడు. అదేం కాదు. దిగమంటే, వినక పోవడంతో - పొంచివున్న ప్రమాదాన్ని గ్రహించిన కృష్ణార్జునులిరువురు, ఆ భీమ బలుని క్రిందకు లాగారు. అప్పుడా అస్త్రం, శాంతించింది. భీముడు, రక్షింపబడ్డాడు.

అశ్వత్థామ తలదించుకోవాల్సి వచ్చింది. “అదేవిటి, సోదరా! ఎందుకా ఆలోచన... మళ్ళీ!...!” అన్నాడు.

“సుయోధనా! మీరు నేర్చుకునేవారు. మేము నేర్పేవాళ్ళం అస్త్రమహిమ మాకు తెలుసున్నంత మీకు తెలీవు. ఒకసారి ప్రయోగించి, వ్యర్థమైన అస్త్రం మరొకసారి ప్రయోగిస్తే, అది ప్రయోగించిన వారినే చంపుతుంది.

గెలుపు ఓటములెవరివైనా, అస్త్రానికి దాసులైన పాండవులు - నిజానికి ఓడినట్లే లెక్క. సర్వజ్ఞుడైన వాసుదేవుడు, ఆ అస్త్రశక్తిని తెలిసి, ముందే హెచ్చరించి, వారందర్ని రక్షించాడు. దీనివలన - భగవంతుని రక్షణ పొందినవారిని, ఈ మానవులు - మంత్ర-తంత్రాలు దుష్టశక్తులు కుట్రలు-కుతంత్రాలు ఏమీ చెయ్యలేనివని మర్కొసారి రూఢి అయింది.

దుర్యోధనుడు నిరుత్సాహపడ్డాడు. “నీవే!” ఇతరాస్త్రములనుపయోగించి, మన ప్రత్యర్థుల సేనలను నాశనం చెయ్యమని కోరాడు. అందుకు ప్రయత్నిస్తా నన్నాడు, అశ్వత్థామ!

అశ్వత్థామ విజృంభించాడు. అతని వాతపడిన వారందరు, ఏదో రకంగా దెబ్బ తింటున్నారు. అతని ఆధిపత్యాన్ని తగ్గించాలన్నట్లు అర్జునుడు ఎదురుపడ్డాడు. అతన్ని చూస్తూనే కోపంతో అశ్వత్థామ ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. అది పాండవసేననే కబళించాలన్న తీవ్రంగా వస్తుంది. దానిని బ్రహ్మాస్త్రంతో అర్జునుడు నిరోధించాడు. దీంతో -

అశ్వత్థామలో నిరాశా నిస్పృహలు చోటు చేసుకున్నాయి. “నా దివ్యాస్త్రాలన్నీ నిర్థకమయ్యాయి. ఇక నేను యుద్ధం చేయలేనని రథం దిగాడు. అప్పుడు వేదవ్యాసులు అశ్వత్థామకు దర్శనమొసగారు.

ఆ వేదవేద్యునకు - అశ్వత్థామ శిరసువంచి నమస్కరించాడు. అతనిలోని నిర్వేదాన్ని గమనించి ఓదార్చబోయిన వ్యాసుని, అశ్వత్థామ - తనకు తానుగా "మహర్షీ! నా అస్త్రం ఎందుకు వ్యర్థమయిందంటారు ? బాధగా అడిగాడు. ఆ దేవతలే దానిని అడ్డలేరు. అటువంటిది, మానవులైన - ఈ కృష్ణార్జునులు.....

"చిరంజీవీ! నీవనుకున్నట్లు కృష్ణార్జునులు, నరులు, సామాన్యులు కారు. "ఇది" విను. నీకో పరమరహస్యం చెబుతానన్న వ్యాసులవారు -

"ఆదిదేవుడైన ఆ శ్రీమన్నారాయణు"డు" "హరి-హర" భేదమెరుగని ఆత్మస్వరూపుడు. లోకరక్షణా దీక్షలో భాగంగా ఒకసారి శ్రీహరి, శంకరుని గూర్చి తపస్సు చేసాడు. పరమ శివుడు ప్రత్యక్షమయ్యాడు. శ్రీహరి శివుని పలురకాల ప్రస్తుతించాడు. అపురూపమైన వరమిమ్మని కోరాడు.

అందుకు - ప్రతిగా, పరమశివుడు "నారాయణా! నీవు అసమాన దివ్యతోజో ప్రభువుడవు. నిన్ను ఏ లోకములోను ఎవ్వరు ప్రస్తుతించడం తప్ప నిరోధించలేరు. ఏ అస్త్రమైనా నీకు దాసోహమంటుందే తప్ప, నీ వైపు రాకపోవడం కాదు. నీ పేరు స్మరిస్తేనే, అది ఆ ప్రాంతంవైపు రాదు. ఎవరికి అపకారం చెయ్యదు.

"అంతెందుకు, నన్ను కూడా గెలిచి అసమాన ప్రతాపవంతుడవవుతావు. లోకోత్తరుడవని కీర్తి నొందుతావని" అమోఘ వర మొసగాడు. ఆ ఆదిదేవుని నుండి, నరుడు జన్మించాడు. ఇక ఆ నారాయణుడే - సమయ సందర్భాలను బట్టి, అవతారమెత్తి అవతరించడం, ధర్మ ప్రతిష్ఠాపనం చేయడం జగమెరిగిన సత్యం. ఆ రకంగా, ఈ ద్వాపరంలో దుష్టజనశిక్షణ, శిష్టజనరక్షణకోసం అవతరించిన, ఆ నర-నారాయణులే ఈ కృష్ణార్జునులు. వీరలు అవధ్యులు, అజేయులు. ఇదంతా వాసుదేవుడు సల్పిన గత లీలా విశేషాలలో మనం గ్రహించ గల్గుతామన్నారు.

ఆ తరువాత - వేదవ్యాసులు - తన మహిమా సంపత్తితో అర్జునునికి దర్శన మిచ్చారు. ఆ పుణ్యామూర్తికి అంజలి ఘటించి, వినయవిధేయతలతో, "పురాణ పురుషా!" నేను ధన్యుడను' అని భక్తియుక్తుడై పలికాడు.

మీ అందరికి శుభం కల్గుతుంది. విజయులౌతారని ఆశీర్వదించాడు. అప్పుడు అర్జునుడు. "తాతా! నాకొక సందేహ"మన్నాడు. ఆయన అడగమని చూసారు.

నేను యుద్ధరంగంలో నిలబడి బాణం వెయ్య సిద్ధపడుతూంటే, ఒక దివ్యతేజోమూర్తి, నా బాణాన్ని అనుసరించి, దానికంటే ఆయన - అవతలవారిని నిరోధించడమో, నిర్బంధించడమో, చంపడమో జరుగుతుంది. ఆ తదుపరి నా బాణము వెడుతుంది. అది నా ప్రతాపంగా నేను తలుస్తున్నాను.'' ఇందలి పరమ రహస్యం తెలిపి, నా సందేహము తీర్చి కరుణించ ప్రార్థన'' మంటాడు.

"అర్జునా ? అదృష్టవంతుడివి.

"నేను చంపుతాననే భావాన్ని పోగొట్టి, భాగవతత్త్వాన్ని తెలియబర్చి, ఆ పరమశివుడే సంహారుడై తాను ముందు జరుపవలసింది జరిపి - నిన్ను వీరుడిని చేస్తున్నాడు. నిజానికి చంపలేనివాడిని చంపినట్లు నువ్వు భ్రమిస్తున్నావు. భగవంతుడు తన పనిని తాను చేస్తు జీవులకు కీర్తిప్రతిష్టలు, గౌరవ పురస్కారాలు జరుపుతున్నాడన్న సత్యం - నీవు చెప్పిన ఈ సంఘటన ద్వారా లోకవిదిత మౌతుందని చెప్పారు. శుభమస్తు - అని ఆశీర్వదించారు.

"ఈనాడు... నీకు అర్జునుని రూపుమాపిన శుభ సమాచారమిస్తానని ప్రతిజ్ఞ చేసిన కర్ణుడు తన వ్యూహం ప్రకారం, ఆ పదహారవ నాటి రణరంగం ప్రవేశించాడు. ఇప్పుడు కర్ణుడు - సైన్యాధ్యక్షుడు. రంగంలోకి శరములను గుప్పిస్తు వచ్చాడు. పాండవసేనలోకి చొచ్చుకు పోతున్నాడు. కర్ణుడు తనకు "రాజ్య భాగము'' ప్రసాదిస్తాడని, రారాజు పొంగిపోతున్నాడు. ఆతని ఆశకు తగ్గట్లు కర్ణుడు, పుంఖానుపుంఖాల - బాణ ప్రయోగాలు చేస్తున్నాడు. పాండవసేనను కల్లోల బరుస్తున్నాడు.

అశ్వత్థామ - భీముడు, నకుల-కర్ణులు, దుర్యోధన-ధర్మరాజులు, ఒకరితో... అని లక్ష్యం లేకుండా, అవసరమైన చోటల్లా ప్రత్యక్షమయి, ప్రతి ఒక్కరు తమ తమ ప్రత్యర్థులను, కూల్చాలని, సహజయుద్ధ ధర్మంగా తలుస్తున్నారు.

యుద్ధరంగంలో - "ధర్మం''కన్న, విజయలక్ష్మిని కైవసం చేసుకోవాలన్న కుతూహలమే ముందుంటుంది. దాని ప్రకారమే వీరులు - శూరులే కాదు. ప్రతి భటుడు కూడా పరాక్రమిస్తాడు. అటువంటి యుద్ధంలో -

ఎవరిమట్టుకు వారు అవతలవార్ని చంపాలని తలుస్తూంటే - ఇక్కడ - ధృతరాష్ట్రుడు "సంజయా!'' అని భోరుమన్నాడు. "ఆ అర్జునుడు - అంత ధీరోదాత్తుడు.

పరాక్రముడా ? అతన్ని నిరోధించలేమా ?" జరిగే సంఘటనల్ని తలుచుకుని బాధపడుతున్నాడు. కర్ణుడు తన శక్తిని ఉపయోగించి, మరీ పోరాడుతున్నాడు.

ఈ సమయంలో, దుర్యోధనుడు పూర్తిగా నీరసించిపోయాడు. జయము తన దగ్గరకు రాదన్న సత్యం స్పష్టంగా కనుపిస్తుంది. అయినా, ఎందరో పోరుతున్నారు. ప్రాణాలు ఒడ్డుతున్నారు. ఏమీ లాభం కనబడటం లేదు. అప్పుడు కర్ణుడు -

రారాజును ఓదార్చాడు. ఇంతవరకు వచ్చి, ఇప్పుడు దేనికి బాధ ? విజయమో, వీరస్వర్గమో... అది దైవలిఖితం. కానీ ఒక విషయం - ఈ "నరు"డైన అర్జునుడు సామాన్యుడు కాదు. ఆతనికి తోడు - ఆ నారాయణుడు. వారిరువుర్ని నిలువరించడం చాలా కష్టం. ఆ అర్జునుడే - మేధావి. అతనికి దోహదకారి - ఆ వాసుదేవుడు. అగ్నికి - వాయువు తోడయినట్లు వారు విహారం చేస్తున్నారు. అయినా, మన ప్రయత్నం మనది.

నేను - ఈ శరీరాన్ని దాచుకోకుండా, అర్పించిన మనసుకనుగుణంగా నా ధర్మం నిర్వర్తిస్తాను. విరోధులనువారు లేకుండా చేస్తానని - అభయమిచ్చినట్లు వూరడించాడు. దాంతో మనోప్రశాంతతను పొంది, తమ తమ శిబిరాలకు - బయలుదేరి వెళ్ళారు.

★★★★

తెల్లవారింది. యుద్ధరంగంలో అందరు మోహరించారు.

"రారాజా! నా ప్రయత్నానికి తోడుగా ఎవరైనా మహావీరుడు సారధ్యం వహిస్తే, శ్రీకృష్ణునివలె సారథ్యము నడిపించు, ఆ మహనీయుని తోడుతో, నేను వర్థిల్లగలను. ఎన్ని సమకూర్చుకున్నా, ఎంత అదృష్టమున్న సారథిలో నైపుణ్యం లేకపోతే, ఆ పరాక్రమం శోభించదు" అనగా - శల్యుని సమీపించి,

దుర్యోధనుడు "మామా! నన్ను మన్నించి అర్జునునికి శ్రీకృష్ణుని వలె, అర్జున సమానమన కర్ణునికి, తాము సారథ్యం వహించి, విజయం చేకూర్చ ప్రార్థన. ఇందుకు సందేహించరాదు. సహకరించవలెను. సంశయించరాదు. సారథ్యము వహించవలె"నంటాడు. సమాధానంగా శల్యుడు -

"సుయోధనా! నువ్వు అడిగావు కాబట్టి నీ కోరిక మన్నిస్తాను. నాకు "మంచి" అనిపించిన దేదైనా చెబుతాను. అందుకాతడు వినకపోయినా, కాదని నన్ను ధిక్కరించినా, సారథ్యమునకు, ఇంతే సంగతులు" అంటాడు.

అవసరం తనది కాబట్టి దుర్యోధన కర్ణులు "సరే" నంటారు, అప్పుడు విజయగర్వంతో - "ఏమైనా సరే, ఇవ్వాళ అర్జునుని అంతమొందించాలి!" అదో భయంకర ప్రతిజ్ఞ. అక్కడేవున్న శల్యుడు, వూరుకోకుండా "నువ్వే!" అన్నాడు. "మద్రీశ్వరా! అన్యాయాన్నెదుర్కోవడానికి, విజయం పొందడానికి...!" "సరి,... సరి... నీవే చెబుతున్నావా నీతులు ? నీవు చెప్పడం, నేను వినడం... అది నా కర్మ"మన్నాడు. వ్యవహారం ముదురుతుంది.

ఇటువంటివాని రథసారథ్యంలో నేను, ఎలా నెగ్గుకు వస్తాను ? ఇది కర్ణుని భావన. దొరికారురా బాబూ! ఇన్నాళ్ళకు ఎదురుచూసిన సావకాశమొచ్చింది. ఈ దెబ్బతో నిన్ను స్వర్గానికి, నా వారికి విజయన్నందిస్తానని మద్రదేశాధీశుడైన నకుల-సహదేవుల మేనమామ "శల్యుడు" లోలోపల ఆనందపడిపోతున్నాడు.

కర్ణుడో.... "ఇక్కడే - ఇప్పుడే మొదలుపెట్టాడు - ఇదెక్కడ గొడవరా!" అనుకుంటున్నాడు. అయినా అతనికి, కావాల్సింది, "రారాజు" తనపై ఎంతో అభిమానంతో అంగరాజ్యాభిషిక్తుని చేసిన, ఆ ప్రాణదాతకు - తగు విధంగా ఋణం తీర్చుకోవడం, తన ధర్మంగా కర్ణుడు తలుస్తాడు.

అందరిని ఉత్తేజపరుస్తాడు. రథం ముందుకు సాగుతుంది. మాటలు, ఈటెలను చేసి, శల్యుడు, ధర్మరాజుకిచ్చిన వాగ్దానం ప్రకారం, కర్ణుని, అంతర్ముఖంగా కృంగ దీస్తున్నాడు. కర్ణుడు సహించలేకపోతున్నాడు. శల్యుడు అలాగ, అనవసరవాగుడు, వాగుతూనే వున్నాడు. వున్నట్టుండి కొంపలంటుకు పోయినట్లు శల్యుడు గట్టిగా అరిచాడు. ఆ అరుపును -

ఏవిటో.... అనుకునేలోగా, "కనబడుతున్నాడా, అడుగో! నువ్వడిగిన అర్జునుడు సంశప్తక శక్తులతో పోరాడుతున్నాడు. చూసావా ?

"ఆ... ఆ... చూసాను. సంశప్తక శక్తులను నిగ్రహించలేక, ఆ అర్జునుడు ఎలాగ వాలిపోతున్నాడో, చూడు మహాశయా!"

"ఏవిటీ అర్జునుడు వాలిపోతున్నాడా ? ఆ మహావీరుడు సోలిపోతున్నాడా ? అది సరే... నీకు నేత్రదృష్టి బాగానే వుందా ? లేక మందగించిందా ? అర్జునుడు వాలిపోవడమేమిటి ? కర్ణా! ఇప్పుడు నీ గురించి కాస్త ఆలోచించాలి. ఇలాగయితే, ఆ దుర్యోధనుడు..... కర్మ, కర్మ.... విజయం సాధించినట్లే. అయినా........ నా తెలివివితక్కువతనం గానీ, ఆ మహావీరుని, నిలబెట్టడం, చంపడం... అది నేను చూడటం -ఈ సేన పరాక్రమించడం.... సరిసరి... ఇదంతా జరిగేనా... ?!

"మద్రేశ్వరా! అన్నానని కాదు కానీ, సందర్భం లేని-ఈ అసందర్భ ప్రలాపాల వల్ల, నీలాంటి వారి గౌరవం నేలపాలవుతుంది. అది తెలుసా...?!

"ఆ... తెలుసు, రారాజు నీకు నన్ను సారధ్యం చెయ్యమన్నప్పుడే, నా పరువు నేలరాలింది. ఇంకేముంది పోవడానికి!

- ఇది వీళ్ళ వాదన. ఈ సమయంలోనే - ధర్మరాజు అర్జునుని పిలిచి, కర్ణుని వ్యూహాన్ని గమనించావా ? అన్నాడు. చూచానంటూ, అర్జునుడు ఏమయినా, ఈ రోజు మనం కర్ణుని నిర్జించాలన్నాడు.

"అలాగే - నువ్వు రాధేయుడి సంగతిచూడు, భీముడు ఆ రారాజును, నకులుడు వృషసేనుని, సహదేవుడు శకునిని సాత్యకి, శతానీక దుశ్శాసనులను, కృపవర్మను మన సైన్యాధ్యక్షుడు అశ్వత్థామను ద్రౌపదీయులు, శిఖండి ఇతర కురుకుమారులను ఢీకొంటారని, చెయ్యాల్సింది ధర్మరాజు తెలియచేసాడు.

ఆ విషయాన్ని అర్జునుడు తమ వారికి తెలియబరిచాడు. అనుకున్నదొకటి జరిగినదొకటి అన్నట్లు, పథకం తలక్రిందులయింది. త్రిగర్త సంశప్తక - శక్తులు అర్జునుని మేమున్నామన్నట్లు అడ్డగించాయి. కర్ణుడు తదితరులు - మత్స్య, విరాట, కోసల, పాండ్య వగైరా రాజులను, సేనలను అడ్డుకున్నారు.

దుర్యోధనుడు, సమరోత్సాహంతో, అన్నివిధాల రారాజు, కర్ణునికి తోడుగా చెంత నిలిచి తన పరాక్రమాన్ని, కర్ణునికి బాసటగా తెలియబరుస్తున్నాడు.

ఆకాసాన దుర్నిమిత్తాలు. ఏదో ప్రమాదం... ?! ఏవిటా ప్రమాదం ? కర్ణుడు అసలే వీరుడు. ప్రక్కన, కొండంత అండగా రారాజు. మహాగొప్పగా విక్రమిస్తున్నాడు. అతనికి ఆతని కొడుకు రక్షగా నిలిచాడు. పాండవ ప్రముఖులు

అతనిని గాయపరుస్తున్నారు. తమ తమ ప్రతాపాలను ప్రకటించుకుంటున్నారు. ఇది కర్ణ ప్రజ్ఞాపాటవం.

అటు భీముని - శకుని, ఆతని కుమారులు, దుర్యోధన - దుశ్శాసనులు, ఏ మాత్రం సందు చిక్కినా అంగసంధులు కలిపి, ముద్దముద్దగా చెయ్యాలని విపరీతంగా ఆరాటపడుతున్నారు.

పార్థసారధిగా కృష్ణుడు - అవసరమైన సమయంలో, నేనున్నానంటు తన ఉనికిని ప్రకటిస్తున్నాడు. ఇటు రారాజు, అటు కర్ణుడు, అతను వెనుకబడు తున్నట్లున్న సమయంలో కర్ణకుమారుల, కృపాదుల రక్షణం.

ఇటు అటు ప్రయత్నిస్తూనే, కర్ణుడు తన ప్రతాపాన్ని ధర్మరాజుకు చూపాలని తలిచాడు. ధర్మరాజు, కర్ణుడు హోరాహోరీ పోరు. కర్ణునిపై శక్తివంతమైన దివ్యాస్త్రాన్ని ధర్మరాజు ప్రయోగిస్తే దానిని మధ్యలోనే కర్ణుడు కూల్చేసాడు. అనేక బాణాలతో కర్ణుని బాధించ వాటినన్నింటిని ఛేదించి, ధర్మజుని సూతుని చంపి, ఒంటిరిని చేయ తన రధాన్ని తాను నడుపుకుంటూ తప్పుకోవాల్సి వచ్చింది.

ఆతని రాక - పోకలను కర్ణుడు పరిహసించాడు. "వేదాంతాలు చెప్పేవాడు, ఆ విధంగా ధర్మబద్ధంగా జీవించాలి తప్ప, ఎందుకీ యుద్ధాలు, అవతలివాళ్ళ ప్రాణాలు తీయడాలు ? తల్లికి ఇచ్చిన మాట ప్రకారం, ఒక్క అర్జునుని తప్ప, కర్ణుడు మరెవ్వరిని చంపదలచలేదు.

అన్నకు జరిగిన పరాభవానికి ఉగ్రుడౌతూ భీముడు మదించిన మత్తగజం లాగ కర్ణుని మీదకు వస్తున్నాడు. అదే చెప్పాడు శల్యుడు.

"అవును. మహావీరా! మీరు చెప్పింది నిజం. ఇతనికి శారీరక బలం తప్ప బుద్ధిబలం తక్కువ. రానివ్వండి, ముందితన్ని, ఆ తరువాత అర్జునుని సంగతి చూద్దాం అన్నాడు. బాణప్రయోగం మొదలుపెట్టాడు. భీముని చీకాకు పరుస్తున్నాడు. కవచం ఛేదించిన కర్ణునిపై, భీముడు అలిగి, వజ్రాయుధం వంటి అస్త్రం వేసాడు.

ఆ దెబ్బకు కర్ణుడు కుప్పకూలినట్లయ్యాడు. తన రధాన్ని అతని రధం దగ్గరకు చేర్చి నాలుక కోస్తానన్నాడు. అది నీ పని కాదన్నాడు శల్యుడు. దీనిని రారాజు గమనించాడు. కర్ణ రక్షణకు కొందరు వీరులను పంపాడు.

కర్ణుడు స్పృహతప్పడంతో, భీముడు వుత్తేజితుడయ్యాడు. మొండిబలంతో కనుపించిన వాడినల్లా, గుద్దుతూ, మొత్తుతూ, తన్నుతూ.. పోతుంటే, అతని ప్రతాపానికి చాలమంది, చావుకు బలయినట్లో, దగ్గరైనట్లో తలచి - భయపడి పారిపోతున్నారు.

భీముని దెబ్బకు కుపితుడైన కర్ణుడు, తన ధనువునందుకుని, ఇరవై బాణాలను అతడిపైకి వదిలాడు. ధనువు, సారథిని కూల్చడంతో, గద తీసుకుని, భీముడు, రథం దిగాడు. వెంటనే ఏనుగుల గుంపు అతన్ని చుట్టుముట్టింది. అప్పుడు కొట్టిన భీమబలుని బండ కొట్టుడికి ఏనుగులే కాదు, ఎదురుపడి, ఆ గదాఘాతం తిన్నవారందరు చచ్చారు.

ఇటు సంశప్తకశక్తులు అర్జునుని దిగ్బంధం చేస్తే భుజంగాస్త్రంతో వారినందర్ని అర్జునుడు నాగపాశబద్ధుల్ని చేసాడు. ఇది ప్రాణాలొడ్డి చేసే యుద్ధం ఫలితం తక్షణమేర్పడడానికిది మాయాద్యూతం కాదు. అందుకే అటు ఇటు ప్రతి వ్యక్తి - తమను నమ్ముకున్న వారి, నియమించిన వారి పరువు ప్రతిష్ఠల కోసం, ఎంతటి పాపాత్ములమైనా మరణిస్తే - వీరస్వర్గమొస్తుందనే గొప్ప ఆశ , నమ్మకంతో, తాము విజృంభిస్తున్నారు. తమ ప్రతాపాన్ని ప్రకటించుకుంటున్నారు.

కర్ణుడు కూడా, అమ్మో! సామాన్యుడు కాడు. చెప్పుకోదగ్గ మహావీరుడు. భీష్మద్రోణుల సరివీరుడు" అని పలువురు చెప్పుకునేటట్లు - ఆ నిజమైన వీర శౌర్యమూర్తి - పరాక్రమిస్తున్నాడు. అసలే ఆ బ్రాహ్మణ - పరశురాముల శాపాలు కనుక లేకపోతే, ఆ ఇంద్రతనయునకు, ఈ సూర్యతనయుడు - ఏ మాత్రం తక్కువ కాదు.

ఒకచోట భీముడు కౌరవసేనలు; మరొకచోట అర్జునుడు - సంశప్తక శక్తులను పీచమణుస్తూంటే - తనకు సరైన వీరుడు తగలలేదని, అశ్వత్థామ "అర్జునా! నీవు నాతో....!" అన్నాడు. "గురుపుత్రా! తగదు. ఒకరికోసం మరొకరు వైరం పెంచుకోవడం, ప్రాణాలు తీసుకోవడం తగదు" అన్నాడు. "తప్పదు" అని బాణం తీసాడు. "సరే...!" కాచుకోమన్నాడు. అదే అదనుగా -

అశ్వత్థామ - శరప్రయోగం చేసి, అర్జునుని నిరాయుధుడిని చేసినంత పని చేస్తూంటే - కృష్ణుడు ఆగలేక - "బావా! అయిపోయిందా! ఇక అశ్వత్థామకు లొంగిపోవాలా... ?" ఆ మాటలకు కృద్ధుడయిన అర్జునుడు ఇంతవరకు

గురుపుత్రుడని, అభిమానించి, గౌరవించాను. చూడమన్నాడు. తన తీవ్ర బాణాలతో గురుపుత్రుని నొప్పించాడు. రథం కూల్చి, అశ్వాలను చంపి, చాపము విరిచి నిరాయుధుడిని చేయ - కృష్ణుడు

"బావా! రోగానికి తగిన మందునివ్వాలి. లేకపోతే రోగం ముదురుతుంది. అలాగే ఈ వీరత్వం ప్రకటిస్తే పొంగుతుంది. కాదని నీరసిస్తే ప్రాణాలు తీస్తుందన్నాడు. దాని ఆంతర్యం గ్రహించిన కుంతీపుత్రుడు రెచ్చిపోయి, తీవ్రమైన వ్యధకు గురి చేసాడు.

ఈ సమయంలోనే దండధరుడను రాజు, భగదత్తుని వంటివాడు, పాండవసేనను అల్లకల్లోలం చేస్తూంటే, ముందతని సంగతని, కృష్ణుడు రథమటు మళ్ళించాడు. తొలి ప్రయోగంలోనే అర్జునుడు వాడు రెండు చేతులను నరికేసాడు. మరో బాణంతో తల.... కృష్ణార్జునులను అట్టహాసంగా అడ్డుకోవలసిన వాడికి. అంతే సంగతులు అయ్యాయి.

ధర్మరాజును కూలిస్తే... ఆ దిశగా కర్ణుడు ఆలోచిస్తున్నాడు. శల్యుడు - ఈ ఆలోచన ప్రమాదకరం. అటు చూడు, అందరుకలిసి, రారాజును, వెంటబడి తరుముతున్నారు. ముందాతనిని రక్షించమని, రథాన్ని, శల్యుడు అటువైపు మళ్ళించాడు. దొరికిన అవకాశం జారిపోయిందనుకున్నాడు.

అశ్వత్థామ, అర్జునుల యుద్ధం ఆటవలె వుంది. ఫలితం తేలకపోయేసరికి, అర్జునునిలో అసహనం బయలుదేరింది. ఏమయితే అయిందని తీవ్రమైనా బాణాలను గురుపుత్రునిపై గుప్పించాడు. వుపేక్ష పనికిరాదన్న కృష్ణసూత్రం ప్రకారం, అశ్వత్థామ నిరాయుధుడయ్యాడు. గురుపుత్రుని బలహీనతకు దుర్యోధనుడు వికలుడయ్యాడు.

అప్పుడు - "కర్ణా!" అన్నాడు దుర్యోధనుడు. యజమాని మెప్పుకన్న - ప్రాణరక్షకుని ధర్మనిరతికి గౌరవసూచకంగా - భీమార్జునుల నుద్ధరిస్తానని, శరాలు పరంపరగా, తీవ్రంగా విడుస్తున్నాడు. ఆ అస్త్రధాటికి తమసేన పారిపోతుంటే, "వాసుదేవ" అన్నాడు అర్జునుడు.

ఇతన్ని సంశప్తక శక్తులు నిరోధిస్తుంటే, భీమ పరాక్రమం చూస్తున్న అర్జునుడు "బావా! పెద్దన్న" అని భీమునే అడిగాడు. ఇక్కడెక్కడో నకుల

సహదేవులు రక్షణలో వుంటాడన్నాడు. అందుకు వాసుదేవుడు సరే నీవు వీరి సంగతి చూడు. మిగిలిన విషయాలను మేము చూసుకుంటామన్నాడు.

వెంటనే కృష్ణార్జునులు ధర్మరాజు శిబిరానికి వెళ్ళారు. ఆయనక్కడ విశ్రాంతి తీసుకుంటున్నాడు.

కర్ణుని మాటలు యుధిష్టరుని బాగా నొప్పించాయి. ఆతనిని చంపి, ఆ వార్తతో, తనను వుపశమింప చెయ్యడానికి వీళ్ళు వచ్చారనుకున్నాడు. అదే పైకి అనేసాడు. అర్జునుడు కొద్దిగా వెనక్కి తగ్గినట్లు, చాలా మెల్లిగా అతనిని చంపలేదన్నది - చావు కబురును చేసాడు. తమ్ముడతనిని చంపక, తనను చూడటానికొచ్చాడని తెలిసి, బాధపడ్డ రాజు - నేను, నకుల - సహదేవులు, ఆతని వల్ల పరాభవం పాలయ్యాము. నీ తిరిగి రాక దానితోనే సమానం. ఇంకెందుకు మనకు యుద్ధం ?! అనేసాడు యుధిష్ఠరుడు.

ఇంక అనవసరం... ఇంక - ఈ మాట "యుద్ధం" విడిచిపెట్టి, ఆ కురునాథునికి సేవలు చేద్దాం. చెడి అత్తవారిళ్ళకు వెళ్ళరాదు కాబట్టి, అడవులకు పోయి అజ్ఞాతవాసం గడుపుదాం. నీ దివ్యాస్త్రాలు, వాసుదేవుడు, పరమేశ్వరుని పాశుపతం... మన పాలిటి నిరర్థకాలు. అప్పుడైతే బాగుండేది. ఏ గొడవ వుండేది కాదు. ఇప్పుడు మన పితృపితామహుల పరువు శాశ్వత కీర్తి ప్రతిష్టలకు మాయని మచ్చ తెచ్చాయి.

ఇంక.... ఆక్రోసిస్తూ - ఆవేశంతో మాట్లాడలేకపోయాడు.

కృష్ణుడు - అన్నదమ్ములను ప్రతిజ్ఞలకు పోకుండా వారించాడు. ఇరువురిని శాంతింపచేసాడు. "రాధేయుడు. చస్తాడు'' వినుమని తాను ప్రతిజ్ఞ చేసాడు. ఇరువురు ధర్మరాజుకు నమస్కారం చేసి తిరిగి రణభూమిని చేరారు. ఇదంతా సంజయుడు చెబుతున్నాడు. గ్రుడ్డికళ్ళను అటు ఇటు తిప్పుకుంటూ ధృతరాష్ట్రుడు వింటున్నాడు.

"సంజయా! అయితే వాళ్ళిద్దరు ఇవ్వాళ కర్ణుని చంపేస్తే, మన గతేమిటి? ఈ పిల్లవాడు ఏమైపోతాడు!'' గుండె బాదుకుంటున్నట్లు మాట్లాడుతున్నాడు.

"మహారాజా! జరిగింది వినడం, జరగబోయేది తెలుసుకుని, ఏది సంప్రాప్తిస్తే సంతోషమో, దుఃఖమో... అనుభవించడం... ఏం చేస్తాం... అంతా విధివ్రాతగా, సంజయుడు తీర్మానించి చెప్పాడు. "కర్ణుని చంపడమే లక్ష్యంగా'' అర్జునుడు అరివీర భయంకరుడయ్యాడు. తన అస్త్రాలతో అడ్డువచ్చిన వారినందరిని చీకాకు

పరుస్తున్నాడు. ఇక్కడ భీముడు, శరవేగంతో అర్జునుడు. ఒకరిమీద మరొకరు పోటీ పడుతున్నారు. ముందు భీముని చంపేయండి. గట్టిగా అరిచాడు రారాజు.

నీ తమ్ముని నెత్తురు త్రాగడం, నీ తొడలు విరగ్గొట్టడం చెయ్యకుండా, నేను చావడమా ? అది జరిగేపనికాదని, ఆ భీమబలుడు, అటు - ఇటు ఎటు చూడకుండా, దొరికిన వారిని దొరికినట్లు వధిస్తున్నాడు.

దుర్యోధనుడు బెంబేలెత్తుతున్నాడు. అటువంటి తరుణంలో - "మన రథం.. అంటున్నాడు"అర్జునుడు. "ఏం జరుగుతుందో..!" అన్నాడు దేవకీసుతుడు. "కర్ణా!, కర్ణా! అడుగో వస్తున్నాడు. చూడు. ఇదే మంచి సమయము. అడ్డు వచ్చినవారిని, అడ్డం లేకుండా చేసుకుంటే, ఇటే వస్తున్నాడు. కానీయ్-!" అన్నాడు శల్యుడు.

"మద్రేశ్వరా! చాలా మంచి ధైర్యమిచ్చారు. చాలా సంతోషం. అతను పరమేశ్వర వరప్రసాదితుడు. మహావీరుడు. ఈ రోజు నన్ను చంపుతానని ప్రతిజ్ఞ చేసాడుట. వెనుకడుగు దేనికి ? ముందుకు వెడదాం, పదండి!" అన్నాడు.

రథం ముందుకు కదులుతుంది. అర్జునుడు, భీమసేనుని మెప్పించి, అడ్డం వచ్చిన వారిని అధిగమిస్తూ, పురోగమిస్తుంటే, దుర్యోధనుని ఆదేశంతో అనుక్షణం కర్ణుని రక్షణ యందే దృష్టి వుంచిన కురు కుమారులు పదిమంది, అర్జునునికి ఎదురు వచ్చారు. ఒకే ఒక్క బాణంతో వాళ్ళందర్నీ ప్రక్కకు తప్పించేసరికి పదమూడువందల గజదళం అర్జునుని ఢీకొంది.

అదిచూసి భీముడు తన గదను గిరగిర త్రిప్పుతూ ఏనుగులను పీనుగులను చేస్తుంటే, ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోతున్నారు. మరొక రకంగా పోరుకు సిద్ధపడు తున్నారు.

ఈ చావులు, అరుపులతో ఆ యుద్ధరంగం రణగొణధ్వనిలా వుంది - అటువంటి సమయంలో "ఏం వీరుడా! యుద్ధమా!" అన్నాడు దుశ్శాసనుడు. "రా! తమ్ముడు! ఈ నాటితో నా పగ, ప్రతీకారం తీర్చుకునే సావకాశమిచ్చార"ని పిలిచాడు.

"రా అంటే రా!" అని - ఇద్దరు కలబడ్డారు. పాపం. భీముని ఆవేశం ముందు, దుశ్శాసనుడు వెనకడుగు వేస్తున్నాడు. ఎదిరించలేకపోతున్నాడు. నిలువ లేకపోతున్నాడు, కూడా! అతన్ని అన్నిరకాల దెబ్బతీసి, చివరకు తన గదతో

దుశ్శాసనుని, గుండెపై ఒక్కమోదు మోదాడు. ఆ దెబ్బకు నోరు తెరుచుకుని, భళ్ళున రక్తం కక్కాడు. అలాగే వెల్లకింతలా పడిపోయాడు.

అతన్ని పడగొట్టి - కనుగుడ్లు పైకి వచ్చేలాగ, అతన్ని పిడిగుద్దులతో, నెత్తురు చిమ్మింత చేసాడు. అన్న ప్రతిజ్ఞ ప్రకారం, మహాభీకర లీలగా, వాడి వేడి రక్తాన్ని త్రాగి "భలే! భలే రుచిగా వుంది. నా ప్రతిజ్ఞ నిలబడిందని, వికటాట్ట హాసం చేసాడు. ఆ భయంకర భీభత్సకాండను చూసిన వారందరు అదిరిపడ్డారు. కొందరికైతే, ఆ దృశ్యం కడుపులో ప్రేవుల్ని గిరగిర త్రిప్పుతుంటే, ఇంకొందరు వాంతులు కూడా చేసుకున్నారు.

దుశ్శాసనుడు చావడంతో, తన ప్రతిజ్ఞ నెగ్గిన భీముడు, ప్రళయ భయంకరుడై చేసే ఆ అరుపు, రూపము, ఆతని నడక - ప్రవర్తన దడ పుట్టిస్తూంటే - దుర్యోధనుడు అవాక్కయ్యాడు. అయినా ఆతని వర్గం కోపం తెచ్చుకోవల్సిన అవసరం లేకుండా, కట్టను త్రెంచుకున్నట్లు మూకుమ్మడిగా, భీమునిపై పడటం గమనించి, అర్జునుడు అన్నకు బాసటగా నిలిచాడు. వీళ్ళ దెబ్బకు కౌరవసేన కకావికలయింది.

ఇదంతా వింటున్న ధృతరాష్ట్రుడు "సంజయా! నాకు చావురాదేమో! ఇవన్ని వింటూ..!" కుమిలిపోతున్నాడు. ఇక్కడ - భీముని చేష్టలకు నిరుత్తరుడైన దుర్యోధనుడు అయితే వీడు, యుద్ధ నియమాలకు విరుద్ధంగా నా తొడలు విరగ్గొట్టి చంపుతాడా!" ఈ భయము పట్టుకుని బెదురుతుంటే, శల్యుడు -

"కర్ణా! ఇంకా ఉపేక్షిస్తావేమిటి ? నిన్నే నమ్ముకుని నీపై ఆశలు పెట్టుకున్న రారాజు పరువు నిలబెట్టు. యుద్ధమని, ఏదో చేస్తానని పొంగిపోవడం కాదు. ఇప్పుడే మన సత్తా చూపవలసింది హెచ్చరిస్తున్నాడు.

వెంటనే "అర్జునా!" నిలుమంటూ, కర్ణుడు ఢీకొన్నాడు. వీరావేశంతో, పసివాడిని చూడకుండా తన కుమారుని చంపిన అర్జునుని "చంపుతా" అని అరుస్తూ శరసంధానం చేసాడు. అప్పుడు అశ్వత్థామ దుర్యోధనుని "రారాజా! ఇక ఈ యుద్ధమాపుము. ఈ కర్ణుడు ఆ అర్జునుని గెలవడం దుస్సాధ్యం గెలుస్తాననుకోవడం దుస్సాహసం. జరిగింది మరచిపో. అన్నగారు యుధిష్టరుని చేరి, దీనినాపడానికి ప్రయత్నించు. ఈ విషయంలో కృష్ణుడు తప్పక నీకు సాయపడతాడు.

వున్న పుత్రులు చనిపోవడమొక బాధ. లేకపోవడం మరియొక బాధ. వుండి ఈ రకంగా మృత్యువాత పడటం మాయని బాధ. ఇప్పటికైనా శాంతించు. నీ తల్లిదండ్రులకు పుత్రశోకం - గర్భశోకం కల్గించకు. నీకు మిత్రునిగా, శ్రేయోభిలాషిగా చెబుతున్నానంటాడు.

ఈ ప్రక్కన, కర్ణార్జునులు రెచ్చిపోతున్నారు. ఒకరి అస్త్రాలను మరొకరు నిర్వీర్యం చేసుకుంటున్నారు. పగ ప్రతీకారాలు యుద్ధం చేస్తున్నాయి. రాజ్యం వీరభోజ్యం. అది ఎవరికి స్వంతమో, ఆ భగవంతునికే తెలియాలి. అంతా వింటున్న ధృతరాష్ట్రుడు కుళ్ళి కుళ్ళి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు, మరొకసారి నిందించుకుంటున్నాడు. సంజయుడు, ఆయన పరిస్థితిని గమనించి - "మహారాజా! అశ్వత్థామ, చిలకకు చెప్పినట్లు చెప్పాడు. నీకుమార మూర్ఖరత్నాలలో, ఉలుకు-పలుకు లేదు. ఇది భూలోక కథనం. స్వర్గంలో -

కర్ణార్జునుల పోరాటం, దేవలోక అప్సరసలకు ప్రాణాంతకమై కూర్చుంది. ఈ యుద్ధం పేరు చెప్పి లక్షలలో వచ్చిన వారిని ఆటపాటలలో ముంచడం ఆనంద లోకాల తేలియాడించడం కుదరడం లేదు. ఈ యుద్ధమాగిపోవడమో వున్నపాటున పూర్తవడమో జరగాలి. లేకపోతే ఆ వచ్చేవారికి స్వర్గనరకాలలో చోటు లేదు. అప్సరకాంతలకు వీలులేదు.

వాళ్ళ అస్త్ర ప్రయోగ ఉపసంహారాలను చూసి భీముడు "ఏమర్జునా ? యుద్ధం చేయడం మరచిపోయావా ? లేక ఆ సూతపుత్రునిపై జాలిపడుతున్నావా ? పరిహసించాడు.

"అన్నా! అన్నాడు. దివ్యాస్త్ర ప్రయోగం చేసాడు. ఎన్ని అస్త్రములు ప్రయోగించినా అన్ని నిరుపయోగమౌతున్నాయి. అది చూసిన కృష్ణుడు "పోనీ ఓ పని చెయ్యి, అర్జునా ? నా సుదర్శనమిస్తాను. అతనిపై ప్రయోగించు. ఆట కట్టవుతుంది అన్నాడు.

అర్జునుడు నొచ్చుకున్నాడు. ఎన్ని రకాల అస్త్రాలు ప్రయోగించినా, ఎంత ప్రయత్నించినా అతడు అవధ్యుడయ్యేసరికి పార్థుడు బిత్తరపోయాడు. "బావా!" వాళ్ళ మాటలన్నీ ప్రక్కనబెట్టి, ఆశ్చర్యంగా పిలిచాడు.

"అవును, అర్జునా ! అతడెంతటివాడైనా అతడు మహాదానశీలి. అందుకే-అతన్ని ఎవరు కాదనినా ధర్మదేవత మాత్రం విడువడం లేదు. ఆ తల్లి ఆతన్నాశ్రయించి వుండగా - ఆతడు అవధ్యుడు. అజేయుడే! పరమరహస్యాన్ని చెప్పాడు.

కానీ అధర్మాన్ని ఆ తల్లి సహించదు. అందుకామె అతనికి సహకరించదు. అంటూండగానే ఓ దివ్యాస్త్రాన్ని అర్జునిపైకి, కర్ణుడు వేసాడు. ఆది శక్తిగా గమనించిన కృష్ణుడు, రథాన్ని కృంగదీసాడు. ఆ అస్త్రం, అర్జునుని కంఠం బదులు, కిరీటాన్ని పడగొట్టింది.

అయ్యో! అని బాధపడిన కర్ణుడు - అర్జునా! అదృష్టవంతుడివిరా! అప్రయత్నంగా అనేసాడు. అర్జునుడు సర్వముఖాస్త్రం ప్రయోగించాడు. కర్ణుని ముందర, అదీ వ్యర్థమయింది. శరీరానికి గాయాలు కలిగి, రక్తం చిమ్ముతుంది. ఆ మహాస్త్రాల శక్తి అంతా ఇంతా కాదు. ఒకే ఒక ధర్మమాతనిని, ఎవరు కాదన్న తను వీడకుండా రక్షిస్తూంది.

పరశురాముని మోసగించుట, బ్రాహ్మణ శాపం, అభిమన్యుని నిరాయుధుని చేసి చంపడం... ఏ ఖాతాకు, ఆ ఖాతాయేనన్నట్లుంది కర్ణుని పరిస్థితి. సూర్యకుమారుడు కదా, రక్తంతో తడిసిన ఆ కర్ణుడు, ఆ సాయంత్రపు నీరెండలో, సంధ్యా సూర్యుని వలె ప్రకాశిస్తున్నాడు.

ఈ సమయంలో బ్రాహ్మణుని శాపం. ఆపత్సమయంలో రక్తపుటేరులైన ఆ ప్రాంతంలో, కర్ణుని రథం దిగబడింది. భార్గవాస్త్రముంది. మంత్రం జ్ఞాపకానికి రావటం లేదు. నేను తెలిసి, ధర్మవర్తనుడినే తప్ప అర్థిని అనాదరించలేదు. యాచకులని హీనంగా చూడలేదు. అయినా అసందర్భ ప్రేలాపాలు, తండ్రి మాట వినకపోవడం, వీరుడనని పొంగి, లోకం సూతపుత్రుడన్నా - ఎవర్ని లెక్కించక, పెద్దలను సైతం దుర్భాష లాడటం, వారి విషయంలో ఎటులైనా, ఎటులున్నా కర్ణునికి అకాల శాపాలయ్యాయి.

తన స్వార్థం కోసం, దుర్యోధనుని "ప్రాణ"మిత్రత్వం కోసం, తనెంత వరకు... దిగజారాడో... తెలుసును. అయినా ధర్మం...!" రక్షిస్తుందనుకున్నాడు. పాపఫలం పాపానిదే. పుణ్యంఫలం పుణ్యానిదే! ఇలాగ ఆలోచిస్తున్న కర్ణుడు కృష్ణార్జునులను గాయపరచ వేసిన బాణాలు వ్యర్థమయ్యాయి. అర్జునుడు వేసిన

ఆరు బాణాలు కర్ణుని శరీరాన్ని మోదుగపువ్వు చేసాయి. ఎర్రగా, రక్తంతో తడిసిన శరీరంతో, ఆ.... తరుణంలో కర్ణుడు, భయపడలేదు. ఏ మాత్రం సంకోచించకుండా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

దానికి బదులుగా "ఇంద్రాస్త్రం" అర్జునుడు వేసాడు. కానీ, అది నిష్ఫల మవడంతో, తానూ బ్రహ్మాస్త్రాన్నే ప్రయోగించాడు. కర్ణుని కదలకుండా చేసాడు. తనవద్దగల దివ్యాస్త్రాలనెన్నింటినో ప్రయోగింప చూసాడు కాని, దురదృష్టమాతనిని వెన్నంటి, అపూర్వాస్త్రాలకు సంబంధించిన మంత్రాలు జ్ఞప్తికి రావడం లేదు.

చేతిలో వున్న అస్త్రాలన్నీ.... అక్కరకు రాని చుట్టాలు. ఆపదలు బాపని బంధువులయ్యాయి. ఇటు రథచక్రం భూమిలో దిగిపోయింది. అస్త్ర రహస్యాలు తెలిసినా మంత్రాలు గుర్తుకు రావడం లేదు. తన ప్రయత్నాలన్నీ విఫలమవడంతో, దిగాలుపడి క్రిందకు జారిపోతున్నాడు.

ఆ తరుణంలో... "అర్జునా!" అన్నాడు కృష్ణుడు. "శరసంధానం చెయ్యి ?" కర్ణుడు కోరుతున్నాడు. "రథం బయటకు రానివ్వు" అది కర్ణుడి అభ్యర్థన.

"ఆలోచించకు!" కృష్ణుని ప్రేరణ. "ఆ... అలాగా...! పిల్లవాడైన అభిమన్యుని, ఒక మహావీరుని, ఒంటరివాడిని చేసి అతిరథ, మహారథులందరు కలిసి, ఒక్కుమ్మడిగా చిత్రహింస చేసి చంపినప్పుడు... ఈ నీతులు, ధర్మాలు.... ఏమి.... గుర్తుకు రాలేదా ?...!

"కృష్ణా.... నువ్వు కూడానా ?" నువ్వు నన్ను అడిగినట్లే, అభిమన్యుడు కూడా నిన్ను సాటివీరునిగా గౌరవించి "కర్ణా! నీవు కూడానా ?" అంటే ఏం చేసావు... ఊ... అదే రాజకీయమా ? ఇది ప్రాణాంతక సమయమా ? వాడిని మీరు భక్షించారు. వాడిబాణాలను మాపై వేసిన మేము నిన్ను రక్షించినట్లు తగు సావకాశమిచ్చి, నీ అస్త్ర మంత్ర రహస్యాలన్నీ గుర్తు చేసి మా ప్రాణాలను మేము తీసుకోవాలా... చెప్పు.

అధర్మమని, తెలిసి... ఆ రారాజు పంచనజేరి, అతను నీకిచ్చిన రాజ్యం కోసం, పరమపవిత్రయైన పాంచాలిని, అయిదుగురు భర్తలుండి దాసి అయిన , ఆమెను ఏకవస్త్రనన్నా" ఆలోచించకుండా "వివస్త్రయైన తప్పులేదన్నది ధర్మమూ, రాజకీయంలో భాగమైతే... ఇది అందులోనిదే అనుభవించు"మన్నాడు.

"అర్జునా! ఆతనిపై బాణం సంధించు. ప్రాణాలు గాలిలో కలుపు" ఆదేశించాడు. ఇక్కడ కృష్ణునిది - "భగవంతుడు" పాత్ర, భక్తునికి ఆదేశం, ధర్మమార్గమే ఆదేశం. అధర్మం - అనుచితాలకు తావులేదు !

ధర్మ సంస్థాపనార్థం వెలసిన ఆ మహానుభావుడు, "దాహం-దాహం" అనే ధర్మదేవతకు శాంతి కల్గించాలనీ, అధర్మాలతో, ఈ ధరణీదేవిని కలుషితం చేస్తూ "అపవిత్రః పవిత్రోవా...!" అపవిత్రః అపవిత్రా..!" అంటూ, తాము చేసే పాపాలను, అంతమొందించవలసిన అవతారమూర్తి ఆదేశాన్ని, నారాయణుడు నిర్దేశిస్తే... నరుడు అనుసరించాడు. ఒక మహాశకం ముగిసింది.

"అనుక్షణం.... నేను, నా శక్తి.... అదే ప్రచడండాగ్ని వలె, తేజరిల్లే, ఆరని అగ్నిజ్వాల.... అనుకున్న యజ్ఞపు "పూర్ణాహుతి" కార్యక్రమం పూర్తిగాకుండగానే అర్థాంతరంగా ఆగిపోయింది. యజ్ఞఫలం లభించలేదు కానీ, ఆ పవిత్ర సంగమం వలన దోషపూరితమై కాలసర్పంగా మారింది. సంకల్పించిన వారి ప్రాణాలను "జ్వాలా"లక్ష్యంగా అది, తన సహజ ప్రకృతిలాగ, సహస్ర జిహ్వాలతో రక్తతర్పణ మొందింది. శల్యుడితోపాటు పాండవులు కూడా బాధగా కళ్ళు మూసుకున్నారు.

దుర్యోధనుడు.... తన ప్రాణాలకిక రక్షణ లేదని, భీముని చేతిలో చావు తప్పదని బావురుమన్నాడు.

ఈ జరిగేది వింటున్న ధృతరాష్ట్ర మహారాజు "దీనిని స్వయంకృతాపరాధంగా భావించడం లేదు. ఎందరో కలిసి పన్నిన కుట్రలా భావిస్తాడు. నన్ను, నా కుమారులు, నాకోడండ్రను... అంటూంటే, సంజయుడు "మహారాజా!" అన్నాడు. అప్పుడు "అవును" అన్నవాడు. ఆ వెంటనే అంతెందుకు నా వాళ్ళనందర్ని వుసురుపెట్టినవారు తప్పక నాశనమౌతారన్నాడు. "తథాస్తు. ఇది సత్య"మన్నాడు సంజయుడు.

పాపం ఇక్కడ - ధృతరాష్ట్రుని ఓదార్చడం, సంజయ-విదురుల తరం కావడం లేదు. అక్కడ - దుర్యోధనుని ఓదార్చడం కురువీరుల తరము కావడం లేదు.

పాండవ శిబిరంలో, పట్టరాని మహానందం. తమను అన్ని విధాల ఆరడి చేసిన ఆ కర్ణుడు హతమార్చబడ్డాడు. ఇక దుర్యోధనుడి పని... పూర్తికాబోతుంది. తనకోసం ఎంతమందిని చంపాడీ పాపాత్ముడు ?! దుర్యోధనుడిని, ఉభయ పక్షాలలోని వారు తిట్టుకుంటున్నారు.

విషయం విన్న ధర్మరాజు, పౌరుషం నిల్చిందని పొంగిపోయాడు. అధర్మానికి, అన్యాయాలకు, ఈ యుద్ధాలకు వెనుకంజవేసే యుధిష్టరుడు, ఈ యుద్ధం ప్రారంభించిన మరుక్షణం నుండి... జరిగే ప్రతిఘటనకు ఆ సంఘటన మిగిల్చే బాధలకు కృంగిపోయాడు. చివరకు తాను ఆవేశపడ్డాడు.

దాని ఫలితం.... ఈ కర్ణ వధ. ఎందుకో ధర్మరాజు... కృష్ణా... ఒక్కసారి...! అనగానే - "తప్పక...!" అన్నాడు. చేతిదీపపు, కాగడాల కాంతిలో, యుద్ధరంగానికి వచ్చాడు. కర్ణుని చూసాడు. గుండె ద్రవించి, కంటివెంట అప్రయత్నంగా... కన్నీటి బిందువులు చేరాయి. "నిజమైన మహావీరుడ"ని రెండు చేతులెత్తి నమస్కరించాడు.

ఎందరు... ఎన్ని రకాల శపించినా, నిరసించినా, ధిక్కరించినా, నమ్ముకున్న విశ్వాసంతో, కురు రారాజును తన దైవంగా తలంచి, ధర్మాన్ని నిలబెట్టిన మహావీరుడని, మరొక్కసారి ప్రశంసించి, అతన్ని అతని కుమారులను చూసి, కన్నీళ్ళు తుడుచుకుంటూ, ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టాడు.

# నిజంగా దుర్దినం

ఉన్నవారితో తన శిబిరంలో రారాజు సమావేశమయ్యాడు.

ఈ రోజు చాలా దుర్దినం. తన ప్రతిజ్ఞ ప్రకారం భీముడు, దుశ్శాసనుని క్రింద పడేసి, గుండెలు చీల్చి రక్తం త్రాగాడు. అతన్ని మానవుడనాలా ? లేక దానవుడనాలా ? దానవుడు కాబట్టే హిడింబను పెండ్లి చేసుకున్నాడు. ఓ పిల్ల పిడుగును కన్నాడు. ఆమెను వాడికప్పగించి... వీడు... వీడు... ఈనాడు మహాభయంకరంగా, అది తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. గుండెలు చీల్చి మరీ రక్తం త్రాగాడంటే...

ఒక ప్రక్క వికారం, మరొకప్రక్క భయము, జుగుప్స...! ఆదిమానవుని కంటే... హీనంగా... ఆ తర్వాత - మహారథుడు, దివ్యాస్త్ర సంపన్నుడు. తేజస్వియైన కర్ణుడు, దుర్విధిగా - మరణించడం... రారాజును కలచి వైచింది. ఆ తరుణంలో, కృపాచార్యులవారు, రారాజును చూసి "నాయనా!" అన్నారు.

"చెప్పండి గురుదేవా!" అన్నాడు. "నీకోమాట చెప్పాలని వుంది. వినడం నీ ధర్మం. ఆచరించడం, ఆచరించక పోవడమన్నది తదుపరి విషయం. కనీసం... మీరైనా చెప్పారు కాదు" అను మాటరానివ్వకుండా, చెబుతున్నాను! అనగా

దుర్యోధనుడు "చెప్పండన్నాడు!" . "చూడు. జరిగిందేదో జరిగిపోయిందని, పాండవుల కాళ్ళమీద పడమని చెప్పను." ఇక్కడ మనం - మనం యుద్ధం ప్రారంభించిన నాటి పరిస్థితిని, నేటి పరిస్థితిని ముందు సమీక్షించుకోవాలి. ఆలోచిస్తే.... ఆనాటి కురువీరులెవ్వరు, లేరు. ఇప్పుడు - ఉన్నది - నేను, అశ్వత్థామ, శల్యుడు, కృతవర్మ మిగిలాము.

చాలామంది మనవారు, మనకోసం వచ్చినవారు ఈ మహాయజ్ఞంలో సమిధలయ్యారు. ఈ సమయంలో మడమ త్రిప్పవద్దు. పరిస్థితిని సమీక్షించు. ఎంతయినా నీ అన్న ధర్మరాజు దాయాది ద్వేషమెరుగని ధర్మాత్ముడు. అనవసర పంతాలు, పట్టింపులకు పోక మీ రాజ్యాలను మీరు ఏలుకోండి. పోయినవాళ్ళు పోగా, మిగిలినవాళ్ళైనా, మీ తల్లిదండ్రులకు - ఆనందోత్సాహాలను ప్రసాదించండి. ఇవి యుద్ధానికి భయపడి చెప్పే మాటలు కావు. వంశానికి విలువ పెంచాలని కన్నవారికి కడుపుకోత తప్పించాలని, చేసే సూచన.

పాండవులు... అదృష్టవంతులు. ఆ భగవంతుని సహాయము, సహచర్యము పొందుతున్నవారలు. కృష్ణార్జునులు - "నర-నారాయణు"లని, ఆ వ్యాస భగవానుడు కూడా తెలిపాడు. వారికోసమే మాటి మాటికి వ్యాస, నారద, పరాశర... అంటూ, సప్తర్షి సంఘాలు దివ్యులు, దేవతలు, పుణ్యులు, మన వద్దకు వచ్చి మనకు బోధ చేస్తున్నారు.

సద్బుద్ధిని పొందాలని వారు చేసే సూచనలిప్పుడు తిరస్కరించవద్దు! నా మాట విను. చిన్ననాటి నుండి ఎత్తుకుని పెంచకపోయినా, ఎంతో మమకారం పెంచుకుని, మా పిల్లల్లో, పిల్లలవలె తలచి, ఈనాడు ఈ దుష్కర్మలో భాగంగా, అనవసర పోరాటం చెయ్యాల్సి వచ్చింది.

బంధునష్టం, జననష్టం... ఆఖరికి మన ప్రియతమ... ప్రాణం... ఎటువంటి వీరుడు - ఆ - గంగానందనుడు, కోల్పోయాం. అయినా వాళ్ళు అవధ్యులు, అజేయులు... నేను అసమర్థుడనని వాపోయారు. సంధి చేసుకోమని సూచించారు.

మా బావగారు,... అంతేకదా! అరివీర భయంకరుడే. అయినా కాలగతిగా వధింపబడ్డాడు. ఇది దైవనిర్ణయం. దీనికి ఎవరినో... అంటే నిన్నో, పాండవులనో బాధ్యులను చెయ్యడం తగదు. ఇదిలాగ జరుగవలసి వుంటే... మనం ఎవర్ని నిందిస్తాము, చెప్పు.

ఇక - కర్ణుడు - వీరుడే. మహావీరుడే కానీ, దురదృష్టహీనుడు. ఎంతటి వారలకైనా మరణం శరణం. ఆ "శ్రీ"చరణాలను పట్టాల్సిందే. తప్పదు. అదే అయింది - కర్ణుని విషయంలో కూడా! కాబట్టి... ఇంకా విషయాన్ని పొడిగించక, అలాగ - ఆపితే బాగుంటుందని తలిచారు. సత్యం చెప్పారు.

అంతా విన్న దుర్యోధనుడు, కళ్ళనీళ్ళు తుడుచుకుని, గద్గద స్వరంతో -

"గురుదేవా! మీరు చెప్పినదంతా నిజమే. కానీ ఇప్పుడు వెళ్ళి, అన్నా... అంటే... అది అపధ్ధర్మమవదు. ఆత్మవంచన అవుతుంది. ప్రాణభయంతో మా పాదాలు పట్టారనుకుంటాడు. అది - ఈ మానధనుడు, సుయోధనుడు ఒప్పడు. ఇంతవరకు వచ్చి... ఇక ఆగేదేమొంది ? చరిత్రకన్నీ తెలుసు. రేపు అందరికి, అన్నీ చెబుతుంది. ఎప్పటికైనా... రారాజు, రారాజు... గానే... బ్రతకడమో, చావడమో...చెయ్యాలి తప్ప..

ఈనాడు ఒకరి పాదాలు పట్టడం... దయాభిక్షనర్థించడం... అసంభవం. అయినా - గురుదేవా...! చేసినవన్ని చేసేసి "ఇప్పుడు, "అన్నా!" అంటే వాళ్ళు వెర్రివాళ్ళు కారు. వివేకహీనులసలు కారు. వారికి పోయిందేమీలేదు. అదేమైనా వుంటే... అది మనకు. కనుక...

కలిసిరండి. కలిసి సాగుదాం. ముందుకు వెడదాం. ఏది సంప్రాప్తిస్తే - అది అనుభవిద్దాం. ఇప్పుడు అసంబద్ధ ప్రసంగాలు, జీవన విధానం గురించి ఆలోచించకూడదు. ఇది నా అభిప్రాయం.

మీ మాట వినలేదని కోప్పడకండి. ఇంతమందిని పోగొట్టుకుని, ఈ పదిమంది కోసం ఈ ప్రాణాలు పదిలపరచుకోవాలనే తపనతో... ఆ పాండవులు, చేసిన అవమానాలు వాళ్ళు మరచినా మరువని, మరువలేని నా మనస్సుతో...

ముందుకు వెళ్ళడం ఇటు సభ్యత కాదు, అటు సంస్కారం కాదు'' అన్నాడు చేతులు జోడించి, నుదుటకు తగులునట్లు నమస్కారం పెట్టి - ప్రార్థించాడు.

అందరు కలిసి ప్రయాణిద్దామని "యుద్ధం'' పూర్తి చేద్దామన్నాడు.

★ ★ ★ ★

అందరితో రారాజు సమావేశమయ్యాడు.

ప్రస్తుతం సర్వసైన్యాధ్యక్షుడు కావాలి కదా! ఎవరిని ఎన్నుకుందామని అడిగాడు.

అశ్వత్థామ - ఇందుల ఆలోచించడానికేమీ లేదు. ప్రస్తుతం వున్నవారిలో పెద్దవాడు, సర్వసమర్థుడు, రుద్రభూపతి. వారిని అభిషిక్తుని చేద్దామన్నాడు. అందరు అంగీకరించారు. రారాజు శల్యుని దగ్గరకు వెళ్ళి విషయం చెప్పి ప్రార్థించాడు. వెంటనే, మద్రేశ్వరుడు "రారాజా! దీనికింత అభ్యర్థనమా. వద్దు. తప్పక, నా శాయశక్తులా కృషి చేసి నీకు విజయం ప్రసాదిస్తాను'' అన్నాడు.

ఇది అక్కడ జరుగుతున్న తంతు, కనుక, ధర్మరాజా! నీవే అస్త్రమై అతన్ని కూల్చాలి. "ఇది కృష్ణుని మాట''. అందరు తలదాల్చారు. అలాగేనని వారి వారి శిబిరాలకు వెళ్ళిపోయారు. తెల్లవారింది. యధావిధి యుద్ధం ప్రారంభమయింది.

సర్వతోభద్ర వ్యూహంతో శల్యుడు, రణరంగ ప్రవేశం చేసాడు. కౌరవ సైన్యాన్ని ఆ విధంగా నడిపిస్తున్నాడు. భీమార్జునులు, శల్యుని సాహసాన్ని, కురుసేనల విక్రమానికి పరీక్షగా నిలిచారు. శల్యుడు, యుధిష్టరుని రథం చూడటంతో, "ఆ... అదిగో... ధర్మరాజు. ఇవ్వాళ అతనిని.. అందరిలాగానే మొదలుపెట్టాడు. అయినా ఆశించినదానికన్నా- తన పరాక్రమాన్ని ప్రకటిస్తూ - సాగుతుంటే కౌరవసేనలు, సంతోషంతో వరుసగా ముందడుగు వేస్తున్నాయి.

తండ్రిని వధించిన పాండవులపై కోపంతో, కర్ణసుతులు ముగ్గురు యుద్ధరంగంలో విజృంభించి, ముందుగా నకులుని ఢీకొన్నారు. నకులుడు, అతి లాఘవంగా వారి ముగ్గుర్ని హతమార్చాడు. ఇక్కడ యుధిష్ఠరుని పైకి శల్యుడు, దండెత్తి రాగా భీమ, సాత్యకి, దృష్టద్యుమ్నులు, ఆయనకు చక్ర రక్షకులయ్యారు. శల్యుని, బెంబేలెత్తిస్తున్నారు.

అశ్వత్థామ ఒక ప్రక్క, ఇతర కురువీరులు ఇంకొక ప్రక్క, వారి వారి స్థాయిలో, రారాజుకేదో విధంగా విజయాన్ని ప్రసాదించి పెట్టాలని విఫల ప్రయత్నం చేస్తున్నారు. శల్యుడు సరేసరి. వీరి ప్రయత్నాలనన్నింటిని సంఖ్యాబలంగా, కురుసేనలో సగమే యున్నా అరివీర భయంకరులైన పాండుకుమారులు వారి అభిమానులు, మీదుమిక్కిలి శ్రీకృష్ణ అభిమాన సహకారాలు పాండవులను విజయపథంలో నడిపిస్తున్నాయి. ఇది అందరికి తెలుసు. అయినా... గెలవాలనే, ఆత్రం, తాపత్రయం!! ఈ రణరంగంలో, అందరితో కల్సి, వీరవిక్రమం చేస్తున్న మద్రపతి కుమారుడు సహదేవుని చేతిలో విగతజీవుడయ్యాడు. దాంతో శల్యుడు కృంగిపోయాడు. ముద్గరము చేపట్టాడు.

భీముడు ఆయనకు అడ్డు వెళ్ళాడు. ఇద్దరిమధ్యా భీకరపోరు. ఒకేసారి ఇద్దరు మూర్ఛపోయారు. ఎవరి సైన్యాలు వాళ్ళ వాళ్ళను కాపాడుకున్నారు. కాస్త తేరుకున్నాక - శల్యుడు - "నా వంతు" అని ధర్మరాజుని ఎదుర్కున్నాడు.

"అవును, నా వంతు" అని యుధిష్టరుడు రౌద్రుడౌతున్నాడు.

వారిరువురి సంగ్రామంలో - ఇంత రౌద్రం వుంటుందని ఎవరు అనుకోలేదు. ముఖ్యంగా - శాంతమూర్తిగా పేరు పొందిన, ధర్మజ్ఞుడైన యుధిష్టరుని వీరత్వం, ఆతని చేతులలో హతమైన సేనను చూసి ప్రతి ఒక్కరు ఒక ప్రక్క ఆశ్చర్యపోవడం, మరొకప్రక్క ద్రోణులు నేర్పిన, అపూర్వ శిక్షణకు, అంజలి ఘటించకుండా వుండలేకపోయారు.

అంతా, భీభత్సంగా, భయానకంగా వుందా యుద్ధం, ఆ వాతావరణం!

ఈ పరిస్థితులలో విజయం తనకు, అలభ్యమేమో అన్న ఆలోచనమునకు, యుధిష్టరుడు వచ్చేసాడు. అయినా శ్రీకృష్ణుని మాట తప్పదు కాబట్టి, తనకే విజయమనుకుంటున్న తరుణంలో, భీముడు వచ్చి శల్యుని ధనువు, సూతుడు, రథాశ్వములను కూల్చగా...

గద పట్టుకుని ఏదో రకంగా ధర్మజుని చంపాలని, శల్యుడు బయలు దేరాడు. ఆ వచ్చే శల్యుని వధించు శక్తినిమ్మని, వాసుదేవుని ప్రార్థించి తను అనునిత్యము పూజించే అస్త్రాన్ని శల్యుని పైకి సంధించాడు. అది చిత్రంగా దూసుకువెళ్ళి శల్యుని గుండె నుండి వీపుగా చీల్చేసింది.

"ధర్మో రక్షిత... రక్షతి!" అని గట్టిగా అరచి రుద్రభూపతి ప్రాణాలు విడిచాడు. కౌరవసేవ గగ్గోలు మొదలుపెట్టింది. రారాజు మళ్ళీ కృంగిపోయాడు. సైన్యాధ్యక్షులు ఒకరివెంబడి, మరొకరు చచ్చిపోతున్నారే తప్ప... విజయం గగన మంత దూరంలో వున్నట్లుంది.

ఇప్పుడు, దుర్యోధనుడు, ధైర్యం కూడగట్టుకుని ధర్మరాజాదులతో పోరు ప్రారంభించాడు. ఆ వచ్చే ప్రతి వ్యక్తి, ధర్మానికి శిరసువంచి వందనం చేస్తున్నట్లు, విరథుడవడమో లేక వీరమరణం పొందడమో జరుగుతుంది తప్ప - ఏ ఒక్కరు "శతమానం భవతి" అని పెద్దల ఆశీస్సులు పొందలేక పోతున్నారు.

ఇక్కడ - సంజయుడు - కృపాచార్యులు సూక్తులు చెప్పడం, క్షమించ మనడం, శల్యుని, పట్టాభిషిక్తుని చేయడం, ఎవరిని చంపుతానని బయలుదేరాడో, ఆ ధర్మరాజు చేతిలో చావడం, అది విన్న దుర్యోధనునికన్న - ఆ మాట విన్న మహారాజు ధృతరాష్ట్రుడు "ఏమిటయ్యా! ఇన్నాళ్ళు మనవద్ద వుండి, మన తిండి తింటూ "చెప్పుకోగల మగాడే, మనసేనలో, లేరా ? ఇది నా కుమారుడు గ్రహించలేకపోయాడు.

ఉన్నవాళ్ళందరు మహావీరులమని జబ్బలు చరుచుకున్న, ప్రతి వ్యక్తి - పాండవసేన ముందు మోకరిల్లడం చెయ్యాలా ? లేక - ప్రాణాలరచేత పట్టుకుని పలాయనం చిత్తగించాలా ? అలాగ పారిపోయినవాళ్ళు బ్రతికి బట్ట గడతారా ? ఎందుకయ్యా ~~ఈ~~ యుద్ధాలు, అందర్ని ఆదరించి మేపడాలు! వీడికెవడికి డాలు, కత్తి పట్టుకోవడం చాతకాకపోతే, వీళ్ళేం వీరులు ?" తలచుకుని, తలచుకుని ధృతరాష్ట్రుడు కృంగిపోతున్నాడు. ఇక తన పిల్లలకు జీవితం లేదనే నిరాశకు వచ్చేసాడు - ఇక్కడ - ఇప్పుడు -

దుర్యోధనుడే నాయకత్వం వహిస్తు తనవారిని "విజయమో - వీరస్వర్గమో...! తేల్చుకోండి. రండి" అని ప్రోత్సహిస్తున్నాడు. పోరాటం ఎవరితోనైనా చెయ్యవచ్చును కానీ, ఎవరిచేలో చావడానికి, ఎవరు ఇష్టపడరు.

సంఖ్యాబలంగా ఎక్కువ సైన్యమున్నా, గెలిచే అవకాశాలు, రానురాను క్షీణిస్తున్నా, దుర్యోధనునిలో ఆశ చావడం లేదు. పోరాడాలనే బుద్ధి ఆగిపోవడం లేదు. ఎంతకయినా సరే, ఏమయినా సరే ?! - ఇది దుర్యోధనుడి - ప్రస్తుత - ఆలోచన.

ఇప్పుడు -సాల్వుడు గూడా పురోగమిస్తున్నాడు. ఎదురువచ్చిన దృష్టద్యుమ్నుని ఏనుగుచేత తొక్కించాలనే, ఆతని ఆశను, తన బాణ సంపదతో, ఆ ఏనుగు కుంభస్థలము కొట్టగా, అది పిచ్చిపట్టినట్లు పరుగెడుతుంటే, అత్యంత శ్రమతో దానిని కట్టడి చేసుకున్నాడు.

అప్పటికింకా, బాణం దెబ్బ నుండి తేరుకోని ఏనుగు, ప్రక్కకు తిరిగి, పాంచాల వీరుడి రథాన్ని గుర్రంతో సహా ఎత్తి నేలకేసి కొట్టింది, ఇది చూసిన సాత్యకి, శిఖండులు - సాల్వుని చుట్టుముట్టారు. దృష్టద్యుమ్నుడు ఏనుగు కుంభస్థలాన్ని బ్రద్దలు కొట్టి నేలకూలుస్తే, సాత్యకి, సాల్వుని శిరస్సు త్రుంచాడు. ఇది కౌరవసేవ పలాయనమంత్రం పఠించడానికి మార్గమయింది.

శకుని బాగానే యుద్ధం చేస్తున్నాడు. కానీ, ఎదురు తిరిగితే వెన్ను చూపడం తప్పనిసరి అవుతుంది. సహదేవుడు చావకొట్టేసరికి, కాస్త వూపిరి పీల్చుకుని దుర్యోధనుని చేరాడు. ఇరువురు కలిసి విక్రమిస్తున్నారు. అప్పుడు - దుర్యోధన, శకునిలు చేసే యుద్ధాన్ని చూస్తున్న గాండివి, కృష్ణుని వారి పైకి రథం నడుపమన్నాడు. అప్పుడే శాంతనవుని మాటవిని వుంటే, ఇంత బాధ వుండేది కాదు, ఏం చేస్తాం! వీళ్ళకు ఇప్పటికి బుద్ధి రాలేదనుకుంటున్నారు, అర్జున - శ్రీకృష్ణులు.

వీరొకప్రక్కన, భీమ-సాత్యకులు, ఇంకొక ప్రక్కన, పాంచాలి కుమారులు మరొక ప్రక్క, మొత్తానికి మొదటిరోజు మహాసేనగా కనుపించిన కురుసేన, నేడు, మహాపీనుగుల గుట్టగా కనుపిస్తూంది.

ఎక్కడ - దుర్యోధనుడు ? అతన్ని వెదుక్కుంటూ సహదేవ - భీములు వెళ్ళారు. దుర్యోధనునికి ఎదురు నిల్చారు.

తన్నెదిరించిన సంశప్తక - శక్తులనన్నింటిని, అర్జునుడు పూర్తిగా నిర్మూలించాడు. ఎటు చూసినా జయాపజయాలు, అవధ్యులనుకునేవారు వధింపబడటంతో దుర్యోధనుడు ధైర్యం కోల్పోయాడు. సహనం చచ్చిపోయింది. ఇక ఈ పీనుగుల పెంట తనను రక్షించలేదు, వున్నవాళ్ళు సామాన్యులు. పారిపోవడమే మంచిదనుకున్నాడు. ఆ ఆలోచన రాగానే, గుర్రాన్ని విడిచి గద పట్టుకుని పరుగు మొదలు పెట్టాడు.

యుద్ధం - యుద్ధమన్నసేపు పట్టలేదు. అది మొదలయింది, పూర్తయింది. ప్రారంభానికి ముందు ఆశ - అయిపోగానే నిరాశ! ఆశ - దురాశగా మారి చేసిన యుద్ధం చివరకు బ్రతుకులనే మార్చి వేసింది. బ్రతకాలనే ఆశను చంపివేసింది.

★ ★ ★ ★

పద్దెనిమిది రోజుల క్రితం - యుద్ధం ప్రారంభిస్తూంటే, మీసం దువ్వి -

రోషంతో - అందర్ని అదిలించిన రారాజు చింత చచ్చినా - పులుపు చావదన్నట్లు - ఆశడుగంటి - కొనప్రాణంతో వుండీ కూడా! ఏదోరకంగా ప్రాణాలు రక్షించుకుని, అదనుచూసి, ఆ పాండవులనంతం చెయ్యాలనే కోరిక చావక, జలస్తంభన విద్యలో ప్రతిభావంతుడైన దుర్యోధనుడు - రణరంగానికి ఉత్తరదిశలోనున్న "ద్వైపాయన మడుగులో దిగి, విదురాది పెద్దలు, తాత, గురువుల సూక్తులు పెడచెవిన పెట్టిన ఫలితమిదియని గతాన్ని తలచుకుని విపరీతంగా బాధపడుతున్నాడు.

ఇటువంటి సమయంలో "కౌరవా" అన్నమాట వినబడకూడదని, పాండవసేనలు, దొరికినవారిని దొరికినట్లు చంపుతూంటే --- వార్తా సేకరణ కోసం వచ్చిన సంజయుడు, వీళ్ళ బారిన పడ్డాడు. అతన్ని కూడా చంపేస్తానని, సాత్యకి కత్తి తీసాడు.

అప్పుడు - వేదవ్యాసులవారు, వారికి కనుపించి, "చూడండి. ఇతడు అమాయకుడు. నేనిచ్చిన శక్తితో ఇక్కడి విషయాలనెప్పటికప్పుడు సేకరించి ధృతరాష్ట్రుని కందిస్తాడు. కనుక, ఇతడు ప్రమాదకారి కాని, "మన మనిషి" శాంతించండంటారు.

అతను విడిచిపెట్టబడ్డాడు. ఈ సంజయుని దృష్టి ప్రస్తుతం, దుర్యోధనునిపై వుంది. అతని గురించి కలయతిరుగుతూ, వ్యాసభగవానుడు ప్రసాదించిన దివ్యదృష్టితో "ద్వైపాయన మడుగులో వున్నట్లు గ్రహించి, పిలిస్తే పలకడు.

"రారాజా! నేను సంజయుడ"ననగానే బదులు ఇస్తాడు. "వెళ్ళు ప్రస్తుతం నా ఉనికి, మహారాజుకు తప్ప మరెవ్వరికి చెప్పకు. వీలు చూసుకుని ఇక్కడ నుండి తప్పించుకుంటాను. నా మిత్రులను కొందర్ని కలుపుకుని ఏదో రకంగా నా కసి, పగలను తీర్చుకుంటాను. వెళ్లు వెళ్ళమని కోరాడు.

అటునుండి సంజయుడు, కృపాచార్యులు, అశ్వత్థామ, కృతవర్మలను చూసాడు. వారెంతో దీనపరిస్థితిలో వున్నారు. వారికి, రారాజు జాడ తెలియక బాధపడుతూంటే, దుర్యోధనుని జాడ వారికి తెల్పాడు. రారాజు మడుగులో వున్నాడనేసరికి అశ్వత్థామ చాలా బాధపడ్డాడు. కృపాచార్యులు అంతే.

ఇంకెవరున్నారు ? కృపాచార్య - అశ్వత్థామ - కృతవర్మలు! వీరుకాక - చావని ఆ దుర్యోధనుడు. ముందా దుర్యోధనుడెక్కడున్నాడో తెలుసుకోవాలని పాండవుల ఆశ. అంతా వెదికారు. వారి ప్రయత్నం ఫలించలేదు. తిరిగి వెళ్ళిపోయారు.

అప్పుడు - ఆ త్రిమూర్తులు - కృపాచార్య, అశ్వత్థామ, కృతవర్మలు - సంజయుడు చెప్పినట్లు మడుగును చేరి దుర్యోధనుని పిలిచారు. వాళ్ళెవరో తెలుసుకుని అప్పుడు సమాధానమిచ్చాడు. అశ్వత్థామ, రారాజును బయటికి రమ్మని కోరాడు.

"రాను. ఆ మాయావి, ఆ గొల్లవాడు నన్ను బ్రతుకనియ్యడు. అతను ద్వారకకు వెడితే, అప్పుడు ఆ పాండవులనేమైనా చెయ్యగలమేమోనని ఆలోచించ వచ్చును. ప్రస్తుతము మీరు వెళ్ళండి" ప్రార్థిస్తున్నాడు.

"రారాజా! వెళ్ళడం కాదు. ఈ రాత్రి అపాండవం చెయ్యాలి. అది అశ్వత్థామ ఆ శ్రీకృష్ణుడు బ్రతికుండగా.... అది అసంభవం." "పిచ్చిరాజా! అతనితో కల్పి సర్వనాశనం చేసే అస్త్రం, నా వద్ద వుంది అది ప్రయోగించి అంతం చేస్తాను. "మరి ఇన్నాళ్ళు ఎందుకు చెయ్యలేదూ ?" రారాజు కృద్ధుడౌతూ అడిగాడు.

"మిత్రమా! ప్రతిదానికి కొన్ని పరిధిలు వుంటాయి. ఆ ప్రకారం వాటిని వుపయోగించాలి. ఇక ఇప్పుడు తప్పదు. అందుకే..." అంటున్నాడు. ఈ విషయాన్ని కొందరు వేటగాళ్ళు విన్నారు. దీనిని వాళ్ళు గబగబ వెళ్ళి భీమసేనుని కందించారు. భీముడు అన్నకు, అటునుండి వాసుదేవునికి తెలిపాడు.

అందరు కలిసి మడుగు దగ్గరకు వచ్చారు. దీనిని సంజయుడు చూసి, అశ్వత్థామకు చెబితే, అశ్వత్థామ రాత్రి కలుద్దామని, అక్కడ నుండి తప్పించు కున్నాడు. ఆ మడుగు, వాతావరణం చూసి "వాడు ఇందులోనే వున్నాడు. ఎన్నాళ్ళుంటాడో చూద్దామన్నాడు ధర్మరాజు." అదికాదు, ఆ రారాజు అభిమానధనుడు. సూటిపోటీ మాటలకు బయటకు వస్తాడు. అప్పుడు వాడి పని మన భీముడు చూస్తాడు. ప్రతిజ్ఞ చెల్లించుకుంటా డన్నాడు" కృష్ణుడు. అంతే...!

ధర్మరాజు "రారాజా!" అంటూ మొదలుపెట్టాడు. "వీరుడవా! శూరుడవా... కాదు... అందర్నీ చంపిన అధముడవు. తల్లీదండ్రీ గౌరవం లేదు. తాత అన్నా భయం లేదు. గురువులపై వినయ విధేయతలు లేవు. నక్కజిత్తులవాడివి, ఆ శకుని చెప్పినట్లు ఆడావు. వాళ్ళందర్నీ చంపావు.

ఇంక... కర్ణుడు... మహావీరుడన్నావు. నిజంగా మహావీరుడే కానీ నీ పాలబడి భీరుడు, హీనుడయ్యాడు. నీ పేరున ఆశను దురాశను చేసుకుని, కురువృద్ధుని, గురువృద్ధులను కూల్చావు గదరా! నీ పేరు చెప్పి ఎందరు విధవలయ్యారు. ఎందరికి కడుపుకోతలు కల్గాయి. అదృష్టం బాగుండి, ఆ యుయుత్సుడు మా చెంత వున్నాడు కనుక బ్రతికి బట్ట కట్టాడు. వాడు లేకపోతే, కురువంశం నాశనమయ్యేది. ఆ కొడుకు కూడా లేకపోతే ఇన్ని తులసి నీళ్ళు పోసేవారు కరువయ్యేవారు."

"నువ్వు మానధనుడవా ? మానధనులు మడుగులలో, బురద గుంటలలో దాగుతారా ? ఎందర్నో చంపావు. నీ ప్రాణాలంత విలువైనవి, దానికున్న తీపి, వాళ్ళకుండదా! రెచ్చగొట్టి మరీ చంపావు కదరా, మానధనుడవనే, రండా పుత్రుడా!

"రండ పుత్రా!" ఇది ధర్మరాజు మాట కాదు ప్రక్కనున్న భీముడిదై వుండాలను కున్నాడు. మడుగులోంచి బయటికి వచ్చాడు. రండి, ఒకరి తదుపరి, మరొకరు అప్పుడు.... నేనేమిటో తెలుస్తుంది.

అలాగే - అందరు వద్దులే. వున్నాడు కదా, ఈ భీముడు. వాడు, నువ్వు చూసుకోండి. విజయమో, వీరస్వర్గమో అన్నాడు ధర్మరాజు.

"సై" అన్నాడు దుర్యోధనుడు. ఉత్సాహంతో భీమ, దుర్యోధనులు - యుద్ధానికి సిద్ధమయ్యారు. అప్పుడు పిలిచినట్లు బలరాముడు వచ్చాడు. ఆ వచ్చిన బలభద్రుని అందరు స్వాగతించారు. "పెద్దన్నా!" అని కృష్ణుడు నమస్కరించాడు. అప్పుడు - బలరాముడు - "సోదరా! యుద్ధవార్తలన్ని విన్నాను. జరిగినదానికి బాధపడ్డాను. ఇప్పుడు -

భీమ - దుర్యోధనాదులు గదాయుద్ధం చెయ్యబోతున్నారని, అది చూడాలని ఉత్సాహంగా వచ్చాను. అందుకు సమాధానంగా కృష్ణుడు "అన్నా! ఇదివారి స్వంత విషయం. ఇందులో కేవలం మనం సాక్షీభూతులము తప్ప - దానిపై అధికార నిర్ణయం కాని, అదేమిటి అనే హక్కులు గాని మనకు లేవు!" అంటాడు.

బలరాముడు, కళ్ళు చిట్లించి చూసాడు. దుర్యోధనునిలో కొండంత సంతోషం. అధర్మానికి తావుండదనే ఆశ. అందరు రణరంగం చేరుకుంటారు. భీముడు, ధర్మరాజుకు నమస్కారం చేసి నా ప్రతిజ్ఞను గెలవాలని ఆశీర్వదించ మంటాడు. "శుభమస్తు" అంటాడు ధర్మరాజు. పెద్దల అనుమతితో ఇద్దరూ గదాయుద్ధం ప్రారంభించారు. ఇద్దరు బాగానే యుద్ధం చేస్తున్నారు. ఒకరిలో బలం, మరొకరిలో కౌశల్యం. చూడముచ్చటగా వుంది.

ఇది - కృష్ణునితో కల్సి చూస్తున్న అర్జునుడు "బావా! ఈ యుద్ధం...!" అంటాడు ఏదో అనుమానంగా..."ఇలాగ చేస్తే మన భీమన్న గెలిచేది సున్న" అంటాడు.

కృష్ణుడు "వాడు జిత్తులమారి మాయావి. అటువంటి వాళ్ళముందు మంచికి విలువలేదు. ఇంత జరిగినా వాడిలో చింత చావలేదు సరికదా! ఏదో రకంగా మిమ్మల్నందర్ని చంపాలన్నది వాడి వ్యూహం, వూహ. ఇక్కడే వాడి కుత్సితబుద్ధి బయటపడుతుంది.

ఇదంతా నావల్లనే కదా, ఇంకెందుకు ఈ అనవసర యుద్ధమనే ఆలోచన వుందా ? వీడికి గదా యుద్ధంలో గెలవాలన్నది ఆశ. అయితే ఆ మిగిలిన ముగ్గురు త్రిమూర్తులలో ఆద్యుడైన అశ్వత్థామ - దివ్యాస్త్రంతో, నాతో సహా అందర్నీ - అపాండవం" చెయ్యాలని చూస్తున్నాడు. ఈ ఆశకు అంతులేదు. కుత్సితాలకు బుద్ధి లేదు, రాదు! బలరాముని ముఖంలో కొంత సంతోషం. అదే దుర్యోధనునికి ధైర్యం.

ఆ సమయంలో చిత్రంగా, ఎందుకో భీముడు కృష్ణార్జునులను చూసాడు. అప్పుడతని ప్రతిజ్ఞను గుర్తు చేసాడు. అది బుర్రకెక్కింది. తనను చంపాలని తీవ్ర గదాఘాతం చెయ్యబోయిన దుర్యోధనుడు. ఒక్క గంతు గెంతాడు. ఎగిరి భీముని బుర్ర పగులగొట్టాలన్నదాతని వుద్దేశం. అది - వీలుచూసుకుని, వాలుగా తన గదతో, దుర్యోధనునికి ఊరు భంగం చేసాడు.

అంతవరకు ప్రశాంతంగా, వున్న బలరాముడు, భీముని అనైతిక గదా యుద్ధంతో "భీమా!" గట్టిగా అరిచాడు. తన హలాయుధంతో భీమునిపైకి వెళ్ళబోతూంటే - కృష్ణుడు అన్నతో, భీముడు చేసిన పనిని సర్దిచెప్పి - ఆత్మరక్షణార్థం, గాలిలో ఎగిరిన, వానిని కొట్టడం, ఆత్మరక్షణమే కాని, తప్పుకాదు

కాబట్టి ఆ కొట్టినదెబ్బ ఆతని దురదృష్టం కొద్దీ తొడలకు తగిలింది. విరిగి క్రిందపడ్డాడు'' - అని

రకరకాల ధర్మసూక్ష్మాలతో, బలరాముని ఒప్పించాడు. అంటే, అతను ఒప్పుకోలేదు. కేవలం తలవూపి, ఇక చూసేదేమీ లేదని వెళ్ళిపోయాడు. ధర్మజుడు కొంత బాధపడ్డాడు. అన్నింటికి కారణము తానే అయినా, తాను రాజునని, కృష్ణుడు వెర్రి యాదవుడనీ - "ఏయ్! గొల్లవాడా!" అని కృష్ణుని సంబోధం చేస్తాడు నీ జీవితంలో, నువ్వు చేసిన మంచేమిటో చెప్పు. ఎక్కడికక్కడ, మాయా మర్మాలు, నాటకాలు! అదిలించే వాడు, ఎదిరించేవాడు లేడని బరితెగించావు. బలరామ ప్రభువు చెప్పింది నిజం.

ఊరుభంగం చెయ్యరాదు. అతనికన్న ముందు నువ్వు నాపై పగ బట్టినట్లు చేయించావు. కోపంతో వూగిపోతున్నాడు. ఇది ధర్మయుద్ధమా ? అనుక్షణం మోసాలు, మాయలతో నీవు కుట్రలు కుతంత్రాలు కలిసాయి. మొత్తం "ధర్మక్షేత్రే కురుక్షేత్రే.... అన్నది... ధర్మము చేసిన క్షేత్రముగా కాక, అధర్మమొనరించిన క్షేత్రంగా - ఇది భాసిల్లింది. ఇప్పుడు - భవిష్యత్తుకు సూచికగా - దుర్యోధనునికి సమాధానం చెప్పాలి. మీరందరు ఒకేచోట వున్నారు. మీకందరికి సేవచేసి, చేసి, దుర్విధివశాత్తూ పాండురాజు శాపగ్రస్తు డయ్యాడు. అది భరింపరానిదై అడవుల పట్టాడు. సంతానం లేక కుమిలిపోయే పాండురాజు, మీ తండ్రిని, మీ నాయనమ్మకన్నట్లు కుంతీదేవి తను చిన్నతనంలో దుర్వాసమహర్షి ద్వారా పొందిన మంత్ర ప్రభావంతో ముగ్గురు పిల్లల్ని, మీ పినతల్లి - మరో ఇద్దర్ని పిల్లల్నికంది-ధర్మరాజు పుట్టేసరికి మీ అమ్మ కడుపు మండి, పండే కడుపును విచ్ఛిన్నం చేసుకుంటే, ఆ అండాన్ని వేదవిభజనం చేసిన వ్యాసుడు నూటొక్క పిండాల్ని చేసి నేతి కుండలలో వుంచమని, భద్రం చేసి ఆ మహానుభావుడు వెళ్ళిపోయాడు.

ఆ రకంగా, అవతలివార్ని వెక్కిరించే నీవు నేతికుండలో, దౌర్భాగ్యంగా పుట్టావు. పాండవులు వచ్చేసరికి అక్కసుతో - ఎన్ని దారుణాలు చేసావు ? నిన్నటికి నిన్న ఇంద్రప్రస్థ వైభవాన్ని చూడలేక సల్పిన దారుణం - సర్వలోకాలకు తెలిసినదే. ఇక మాట్లాడకు. ఇక ఉత్తమ లోకాలంటావా ? ధర్మరాజు స్వర్గంలో

అడుగుపెట్టే వరకే నీకు స్వర్గ సామ్రాజ్యం. ఆపైన శాశ్వత నరకం వెళ్ళిరా ?" అన్నాడు. ఆ తర్వాత అందరు శిబిరాలకు వెళ్ళిపోయారు.

వున్నట్టుండి శ్రీకృష్ణుడు "అర్జునా! ఆ గాండీవం, అక్షయతూణీరాలను క్రింద పడవెయ్యి. నువ్వు రథం తొందరగా దిగు. నేను దిగాలి" అంటాడు. అర్జునుడు కృష్ణుడు చెప్పినట్లు చేస్తాడు. రథపగ్గాలు విడిచి, కృష్ణుడు క్రిందకు దిగాడో... లేదో... ఆ దివ్యరథం. భగ్గుమని మండిపోయింది.

అందరు ఆశ్చర్యపోయారు.

కృష్ణునికి నమస్కరించి, గాండీవి విషయమడిగాడు. ఇంతవరకు, కర్ణుడు మహామహులు వేసిన అస్త్రాలను ఈ దివ్యరథం ఉగ్గడించినట్లు పట్టుకుంది. ఇక వాటిని విడవాలి. ఆలస్యంచేస్తే - ఈ రథం వలెనే మనము మండిపోతాము. ఆ విషయం తెలిసినవాడిని కనుక, నిన్ను హెచ్చరించాను. మనం దిగిన మరుక్షణం. ఆ రథం- ఆ తెల్లని గుర్రాలతో మాడిమసయిపోయింది. ఆలస్యం చేస్తే, మన పరిస్థితి అంతే అయేదన్నాడు.

ఇక - ఇక్కడ వుండి - ఈ కళేబరాలను చూస్తూ బ్రతుకలేమని అందరం కలిసి ఓఘవతి తీరానికి వెళ్ళారు. ఇక్కడే ధర్మరాజు "బావా!" అని హస్తినాపురి విషయ మెత్తేసరికి - "తప్పక" అంటాడు. వీళ్ళందర్ని జాగ్రత్తని హెచ్చరించి హస్తినకు వెడతాడు.

అక్కడ అందరు వాడిపోయిన మొహాలతో, వేదనారూపులుగా నిలిచారు. సరాసరి కృష్ణుడు ధృతరాష్ట్రుని సమీపించి "మామా!" అంటూ ఆతని వేదన తీర్చాడు. "అత్తా!" గాంధారీ!" అంటు ఆమెననుయించాడు. నా మాట సరేసరి. నేను స్వార్థపరుడిని. పాండవ పక్షపాతిని. వ్యాసులట్టా కాదే ?! ఆయనను గూడ లక్ష్యం చేయక, కాలం తోసుకు వచ్చినట్లు, పరిస్థితులన్ని కల్పి - ఎందరో కలసి "ఒక మహాయజ్ఞం"గా దీనిని రూపొందించారు. జరిగింది మరచి పోదామని పాండవులు అనుకున్నా....

చివరకు - భీష్ముల మాటగానీ, ద్రోణులు, అశ్వత్థామ, ఆఖరికి కృపాచార్యులవారు కూడా, కర్ణునితో కలిపి, సమయోచితంగా ప్రవర్తించమన్నారు. ఇదంతా సంజయుడు, వ్యాసుడిచ్చిన దివ్యశక్తితో వర్ణించి చెప్పాడు. అవునా ?...

"అవును....!" తలూపాడు ధృతరాష్ట్రుడు. "నువ్వు చెప్పలేదు. సరికదా, నీ మూర్ఖత్వంతో అత్తకు కూడా కొన్ని విషయాలు తెలుపక, తెలియనీక ఈ కురువంశాన్ని పౌరుషమనే ఆజ్యంతో, సమిధులుగా చేసి పాపాగ్నిలో భస్మం చేసావు కదయ్యా!" అన్నాడు.

వింటున్న గాంధారీదేవి ఆశ్చర్యపడేటట్లు ధృతరాష్ట్రుడు నిజమన్నాడు. ఇప్పుడు ఏం జరిగింది చూడు. నువ్వు చెప్పలేకపోయావు. చెప్పే తల్లికి విషయాలు తెలియక దాచిపెట్టావు. ఈ మొత్తానికి అసలు కారకుడివి నీవంటే... ఆ గుడ్డిరాజు తలవంచుకున్నాడు. మా కర్మమని గాంధారీ బాధ పడింది. మొత్తానికి వాళ్ళను వూరడించి, వాళ్ళలోని కోపాన్ని మరపింప చేసి -

"అత్తా! అందర్ని పోగొట్టుకున్నాం. అయినా ఎందుకో అశ్వత్థామ శాంతబడటం లేదు. కృపాచార్య, కృపవర్మలు అన్నీ తెలిసిన మహనీయులై వుండి, పరిస్థితిని సమీక్షించి దైవనిర్ణయమంటే - "నా ప్రతాపం చూపాలి" అని కోపంతో వూగిపోతున్నాడు. మహాగ్ని గుండమై మండిపోతున్నాడు.

"అత్తా! మళ్ళీ కలుస్తాను. అనవసర కోపం మనల్నే కాదు. మనవంశాలను గూడా నాశనం చేస్తుందని తెలిసి కూడా సామాన్య మానవులకన్న హీనంగా, ముందు మహాత్ములనేవారు ప్రవర్తిస్తున్నారు. అసలు గొడవలన్నీ ఆ పెద్దలతోనే... అని - అందర్ని ఓదార్చి - అశ్వత్థామ నుండి వాళ్ళను రక్షించాలని ధర్మరాజాదుల వద్దకు బయలుదేరాడు!

★★★★

**తొ**డలు విరిగి రణరంగంలో, దిక్కులేకుండా పడివున్న దుర్యోధన దుస్థితి, దారుణం మహాదారుణం. దిక్కుమాలిన చావుకై ఎదురుచూసే, రారాజు....ఎంతటి దయనీయ స్థితిలో వున్నాడో... అది తలుచుకునేసరికి సంజయుడు నీరుకారి పోయాడు. ఎటువంటి రారాజు ? ఎటువంటి దుస్థితి. అటువంటి దుస్థితిలో సంజయుని చూసిన కురురాజు అలాగే నీరుకారి పోయాడు.

"సంజయా! చూస్తున్నావా ? నేను దుర్యోధనుడిని. చివరికిలాగ.... "మాటలు రావడంలేదు. నేను ఎలాగ మరణించానో లోకానికి తెలియాలి. భీముడు

యుద్ధమర్మములన్ని విడిచి, నా తొడలు పగులగొట్టాడు. ఈ దీనస్థితికి తెచ్చాడు. నేనేకాదు - ఈ యుద్ధంలో కౌరవుల తరపున పాల్గొన్న ప్రతివాళ్ళు ఇలాగే, ఏదోరకంగా అన్యాయంగా మరణానికి ఆహుతయ్యారు. ఇదంతా లోకానికి తెలియాలి. దుర్యోధనుడు చెడ్డవాడు - అని లోకమంటుందే తప్ప -

పాండవులు ధర్మ పక్షపాతులు, ధర్మమూర్తులని పొగిడేవాళ్ళందరికి, వాళ్ళెంతటి అధర్మమూర్తులో చేసిన అకృత్యాలు, ఉల్లంఘించిన యుద్ధ నీతులు. నిబంధనలు.... అన్నీ... అన్నీ... నీవే చెప్పాలి.

నేను చెప్పితే - అసూయతో చెబుతున్నాననుకుంటారు. నీవు చెబితే నిజమని నమ్ముతారు. అన్నీ తెలిసిన నీవు, వ్యాసకృపతో ఈ సర్వాన్ని లోకానికి తెలియ బరచావు తప్పో... ఒప్పో... కానీ, జరిగింది జరిగినట్లు తెలియబర్చమని... దీనాతి దీనంగా చెప్పుకుని ఏడ్చాడు.

రారాజు దుస్థితి, చావుకెదురు చూడటం, అశ్వత్థామాదులకు గూడా తెలిసింది. వచ్చి, ఆ ఘోరాన్ని చూసి, గుండెలవిసేలాగ ఏడ్చారు. అప్పుడు - అశ్వత్థామ ప్రతిజ్ఞ చేసాడు. పాండవులనందర్ని చంపిగాని... తన మనస్సు శాంతింపదన్నాడు. ఈ నల్గురికి కాదు, పాండవనిశ్శేష కార్యక్రమానికి, అశ్వత్థామ సర్వాధికారి. కృతవర్మ, కృపాచార్యులు విశ్రాంతి తీసుకుంటున్నారు.

అశ్వత్థామలో... అణువణువునా, పగ.... చేసిన వాగ్దానం నిలబెట్టుకోవాలి. ఎలాగా ? ఇటువంటి సమయంలో కాకులు అరుస్తున్నాయి. ఇప్పుడెందు కరుస్తున్నాయని చూస్తే, ఒక గుడ్లగూబ ఆ గూటిలోచేరి - కాకుల్ని చంపుతుంది. ఆ రీతిగా తను పాండవుల్ని చంపాలనుకున్నాడు. కృతవర్మ - కృపాచార్యులను లేపి, విషయం చెప్పాడు. అది తగదన్నారు. అశ్వత్థామ వినలేదు. బయలుదేరాడు.

ఆ ప్రాంతమంతా ఏదో భూతశక్తి రక్షిస్తుంది. దానిపై బాణ ప్రయోగం చేసాడు. ఫలితం లేకపోయింది. అప్పుడు ఈశ్వరధ్యానం చేసాడు. "భూతము" భూతపతిగా అక్కడ నిలిచి, శ్రీకృష్ణ శక్తిని సదా రక్షించువానిగా వున్నాడు, ఈ అశ్వత్థామ ప్రార్థనమునకు పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. అపూర్వ ఖడ్గ మిచ్చి "విజయోస్తు" అన్నాడు. ఆతడు పరమేశ్వరుడు. ఆయనకన్నీ తెలుసు. ఈయన

భక్తుడు. ఇతనికి కొన్నే.... అంటే... కావల్సిందే తెలుసు. తప్పు..... కాలము, అందలి మహాత్మ్యము, ధర్మము తెలియదు.

కృపాచార్య, కృతవర్మలను శిబిరం ముందు నిలబెట్టి, పరమేశ్వరుడిచ్చిన ఖడ్గంతో పాండవం నాశనం చెయ్యాలని తలచాడు. లోపలికి వెళ్ళాడు. ఆవహించిన భూతపతిగా, ధ్రుష్టద్యుమ్న, శిఖండిలతోపాటు, దొరికిన వారినందర్నీ దొరికినట్లు చంపాడు. ఉపపాండవులను కూడా చంపాడు. కానీ, కృష్ణ - సాత్యకీ, పాండుకుమారులు మాత్రం, ఆతని కంటబడలేదు. కృపాచార్య, కృతవర్మలకు జరిగింది చెప్పాడు.

అప్పుడే - రారాజును కూడా చూడ వెళ్ళాడు. క్షణాలు లెక్కపెట్టుకుంటున్నా డతను. రాజా! శత్రుశిబిరం మొత్తం నాశనమైపోయింది. ఎటొచ్చి దొరకనిదల్లా- కృష్ణ, సాత్యకిలు, ఆ పాండు కుమారులు. ఈ మాట విన్న దుర్యోధనుడు ప్రాణాలను విడిచాడు.

ఓఘవతి నుండి, తమ శిబిరాలకు తిరిగి వచ్చిన పాండవులు, జరిగిన ఘోరానికి తల్లడిల్లిపోయారు.

జరిగిన దానికి కృష్ణుడు కూడా బాధపడ్డాడు.

ఇది జరుగుతుందనే, ఇక్కడ నుండి మన మకాం, రాత్రికి, అక్కడ వుండునట్లు చేసింది. లేకపోతే - ఈ పాండవం, అపాండవం. భరతవంశం నిర్వంశమయ్యేది. కోరినవాళ్ళు, కోరుకున్నవాళ్ళు కాక, వూపిరివున్నవాళ్ళు, ఇతరులు, వారి అదృష్టం కొద్దీ ఈ భూఖండాన్నేలేరన్నాడు. ఇది పూర్తయ్యేసరికి ద్రౌపది వచ్చేసింది. జరిగినదానికి ఘొల్లు ఘొల్లుమని ఏడుస్తుంది. ద్రౌపది కోరికపై, ధర్మరాజు అంగీకారంతో భీముడు, అశ్వత్థామకై బయలుదేరాడు. కృష్ణుడు - అతనివద్ద - దివ్యాస్త్రముందని అది ప్రయోగిస్తే - ఈ భూతలమే బుగ్గి అయిపోతుందని, అది భీమునిపై ప్రయోగించకుండా చూడాలని చెప్పి, తాము, అస్త్రాలను తీసుకుని బయలుదేరారు. కృష్ణార్జునులు, భీమ, నకులులు వచ్చారు.

అశ్వత్థామ, భీమ-నకులలకన్న, కృష్ణార్జునులను చూసి వీరు దివ్యాస్త్ర సంభూతులు, దివ్యశక్తి సమన్వితులు వీరిని మామూలుగా జయించడం కుదరదు. కనుక అని - కృష్ణుడు ఆలోచించినట్లే, భరతవంశ నిర్మూలానికన్నట్లు బ్రహ్మశిరో

నామకాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని పని సర్వనాశనం చెయ్యడమే. అది గ్రహించిన కృష్ణుడు, అర్జునా! నీవు కూడా ఇదే అస్త్రాన్ని ప్రయోగించు - తర్వాత... మిగిలిన గతి, మతుల గూర్చి ఆలోచనమన్నాడు.

అర్జునుడు వాసుదేవాదేశాన్ని శిరసావహించాడు. అస్త్రం విడిచాడు.

దానిమూలాన జరిగే ప్రమాదాన్ని తెలిసిన వేదవ్యాస, నారద మహర్షులు ప్రత్యక్షమయ్యారు.

ఇది దివ్యాస్త్రం. ఇంతవరకు దీనిని మానవులే కాదు, మానవలోకంపై ప్రయోగించినవారు లేరనగా వారికి నమస్కరించిన అర్జునుడు, మీకు తెలియనిదేమీ లేదు. మా నాశనం కోరీ అశ్వత్థామ, ఆ అస్త్రాన్ని ప్రయోగించాడు. మరి....!'' అని సందిగ్ధపడినవాడు, తమరు ఆదేశిస్తే, అస్త్రాన్ని ఉపసంహరిస్తా నన్నాడు. వాళ్ళు అంగీకరించారు. అర్జునుడు తన ప్రయోగించిన అస్త్రాన్ని వుపసంహరించాడు. అశ్వత్థామ... తన అస్త్రాన్ని వుపసంహరించలేదు.

అప్పుడు - వేదవ్యాసులు, అశ్వత్థామను వూరడింప ప్రయత్నించారు. నువ్వు ఎవరి సర్వనాశనం కోరావో, వాళ్ళు నీకు అపకారం జరగకూడదని, నీవు ప్రయోగించిన అస్త్రం శాంతించాలనే విడిచారు. మరి నువ్వు... ఎందరి నాశనం కోరుతావు ?

ఇది బ్రాహ్మణ ధర్మమా ? మనం చెయ్యవలసిన పనా ? ఆలోచించు. నీ తండ్రి ఇరువురికి ఒకే శక్తిని ప్రసాదించాడు. అర్జునుడు తన గురుభక్తిని ప్రకటించుకున్నాడు. మరి నువ్వు... ఆ గురుతత్వాన్ని జీర్ణం చేసుకున్నావా ? ఆ ప్రశ్నకు సమాధానం దొరకలేదు. కానీ, పాండవులను చంపను. వాళ్ళ వాళ్ళ భార్యల గర్భాలను నాశనం చేస్తానంటాడు. అప్పుడు - కృష్ణుడు -

"అశ్వత్థామా! చేసిన నష్టం, తలకెత్తుకున్న పాపం చాలు. అస్త్రాన్ని ఉపసంహరిస్తే చాలా మంచిది. కాదంటే, నీ అస్త్రం నుండి, ఉత్తర గర్భస్థ శిశువును ఎలాగా కాపాడుకోవాలో నాకు తెలియని విద్య, నాకసాధ్యమైన శక్తికాదని, గ్రహిస్తే చాలా మంచిదంటాడు.

"అబ్బ! అస్త్రశక్తికన్న నువ్వంతటి గొప్పవాడివా ?! అది చూద్దామంటాడు.

"అశ్వత్థామా! బ్రాహ్మణోమమదేవతా... అంటాను. అందుకే నీవు రక్షితుడి వయ్యావు. బ్రాహ్మణ్యం విడిచి క్షాత్రానికే ప్రాధాన్యమిస్తే, నిన్ను... ఒక్క క్షణం చాలు! ఒక్క విషయం గుర్తుంచుకో. నీ సహజ ధర్మాన్ని వీడి, క్షాత్రమాశ్రయించావు. ఇది నాశన హేతువు. నిరర్థక - వ్యర్థ - దుర్గంధపూరిత జీవితాన్ని మూడువేల సం॥లు అనుభవిస్తు బ్రతుకుతావు - ఇది మొదటిది.

నాచేత పరిరక్షితుడై ఉత్తర గర్భస్థ శిశువు పరీక్షితునిగా, ఈ కృపాచార్యుల వద్దే సర్వ శస్త్రాస్త్ర విద్యలనొంది, దీర్ఘకాలం, ఈ భారతాన్ని పాలిస్తాడు. ఈతని కుమారుడు - జనమేజయుడని, ధర్మరాజు ముని మనుమనిగా - అఖండకీర్తి ప్రతిష్ఠలు పొందుతాడు - ఇది రెండవది.

నీవు చేసిన పాపకృత్యాలకు, ఇవన్నీ చూస్తూ దిక్కుమాలిన చావు చస్తావు. తప్పదు. స్వయంకృతాపరాధం... అన్నాడు. తథాస్తు అని మహర్షి ఆశీర్వదించారు. మరో విషయం. వీళ్ళందరు నిన్ను చంపాలని వచ్చారు. ఈ వాసుదేవుని శాపాలతో నువ్వు చచ్చినట్లే. నీ తలపై గల శిరోమణిని వారికిచ్చి, ప్రత్యక్షవమానభారం నుండి బయటపడు"మన్నారు.

సరాసరి ఆ మణిని పాండవులకివ్వలేక వ్యాసులకు సమర్పించాడు. ఆయన పాండవుల కొసగాడు. దానిని తీసుకువెళ్ళి "ఇదిగో ద్రౌపదీ!" అని ఆమె కోర్కెను తీర్చినట్లు ఆమె కొసగారు. జరిగిపోయినదానికి ధృతరాష్ట్రుడు బాధపడుతున్నాడు. ఇటువంటి దుస్థితి వస్తుందని, తాను ఇతరుల పంచనాశ్రయించవలసి వస్తుందని, ఏనాడూ వూహించలేదు.

ఎంతసేపు వాని కుమారులు, వారి కోర్కెలు... వాటి గురించే ఆలోచించాడు. విదురుడెన్నోసార్లు హెచ్చరించాడు. మమతానురాగాలు వుండవలసింది పుత్రుల పైన కానీ, వారు చేసిన పాపపు పనులపైన కాదు. ఇలాగైతే భవిష్యత్తులో బాధపడాల్సి వస్తుందని గతంలోనే తెలిపాడు.

అయినా - ఎవరి మాటల్ని వినకుండా తెచ్చుకున్న ప్రమాదమిది. ఎప్పుడు చెప్పినా, విసుక్కోవడమో, నగర బహిష్కరణము లేదా రాజ్యబహిష్కరణ చేయడమో ఒక లక్ష్యంగా పెట్టుకుని, చేసిన ఏ సూచనను స్వీకరించకపోవడమింత ప్రమాదం తెచ్చింది.

ఇటు కురుకుల మహాశయుడు భీష్ములను కానీ, వంశకర్త అయిన వేదవ్యాసులవారిని, ధర్మమూర్తి విదురుడు, ద్రోణ, కృపాచార్యులాది ప్రముఖుల సందేశాలు, నారదాది మహాఋషుల పరిష్కారాలను పొందక ప్రాణంమీదకు నువ్వు తెచ్చుకుని, మా అందరికి తీరని దుఃఖాన్ని మిగిల్చావు. ఇప్పుడేడ్చి లాభం లేదు. మమ్మల్నందర్ని ఏడిపించి, నీకేదో... ఒక్కడికే ఏదో ఉపద్రవం వచ్చిందని బాధపడటమెంత అనాలోచితమో, ఆలోచించు!

ఇటువంటి తరుణంలో, అక్కడికి వేదవ్యాసులు వచ్చారు. వారిని చూస్తూనే విదరుడు, సంజయులు ఎదురేగి ఆహ్వానించి, సుఖాసీనులను చేసారు. మహారాజును ఓదార్చి మహర్షి రాకను తెలియచేసారు.

ధృతరాష్ట్రుడు లేచి, గొంతు సవరించుకుని - "అన్ని ఆశలు వమ్మయి పోయాయి. ఏడవడానికి కన్నీళ్ళు తప్ప - మరేమీ లేవు. దౌర్భాగ్యుడను, తగు ఫలితమనుభవిస్తున్నాను. ఇంక ఎవరికోసం బ్రతకాలి. అందరు పోయాక, పొందే ఆనందం, సుఖాలు ఏముంటాయి.

"కుమారా! ఇప్పుడు ఏడ్చి లాభమేముంది ? ఎన్నిసార్లు చెప్పినా, పుత్రప్రేమను విడిచావు కాదు. ప్రేమ వుండటం తప్పుకాదు. అది వుండవలసిన విధానమే తప్పయి సమూలవంశ నాశనం చేసింది. ఇది అనివార్యమైనది. కర్మ, విధి, దైవ నిర్ణయాలు. వీటి నెదుర్కొని, ధీరోదాత్తులవగల్గడం చాలా గొప్పది. కాని దురదృష్టవశాత్తు దీనిని విని, నిన్ను, నీ పిల్లల్ని నిగ్రహించుకోలేకపోవడమింత దారుణానికి కారణమయింది.

ఎంతసేపు నా పుత్రులు, పాండుపుత్రులు అన్నావు. వాళ్ళెవరు నీ తమ్ముడు పుత్రులే కదా! ఆ మాట నీ మనస్సులో ఎప్పుడైనా వచ్చిందా ? మొత్తం - నీది, నీతోపాటు, మాది దౌర్భాగ్యం కూడా! ఇది రాకూడనిది అయినా భగవంతుడు, మన కర్మల వలన తప్పించలేకపోయాడు. "కుమారా! ఇకపైన నా పిల్లలు, పాండుకుమారులనకు. వారూ నీ పిల్లలే. నీ తమ్ముని పుత్రులు. నీ చేతులలో పెరిగినవారు. ఆ ప్రేమను పంచు. నీకు దుర్విధి దాపురించదు. మనం చేసుకున్న కర్మలే, మనకు ఫలితాలను ప్రసాదిస్తాయి.

ప్రశాంతతను పొందు. ధైర్యంగా వుండు. ప్రేమను పంచి ఇవ్వు. అప్పుడే ప్రపంచం - సర్వదా, సర్వత్రా ఆనందదాయకం. అన్నీ తెలిసిన నీవు, జరిగిన అనర్థాలను మరచిపోయి, సర్వార్థ సాధకంగా నీ పిల్లలతో కలిసిపో. నీకు మేలు జరుగుతుంది.

వాళ్ళు నీ కన్నపిల్లలకన్న గొప్పగా నిన్ను ప్రేమిస్తారు. గౌరవిస్తారు. ఇంకా మూర్ఖత్వం, మూర్తీభవించినట్లు అనుచితంగా ప్రవర్తిస్తే, నీ మనసు శంకించినట్లు నీవు దారుణ దుఃఖాన్ని పొందవలసి వస్తుంద''ని, ధృతరాష్ట్రుని ఓదార్చుతారు. జాగ్రత్త!'' అని వెళ్ళిపోతారు.

ఇప్పుడే తీరని దుఃఖం కొంతలో కొంత ఉపశమనమయినట్లుంది. తేరుకుని, తన వాళ్ళకు తర్పణాలివ్వడానికి, కురుక్షేత్రానికి బయలుదేరాడు. ఆతని వెంట, కుంతీ, గాంధారీ, ఇతర ధార్తరాష్ట్ర కోడండ్రు, మిగిలినవారెందరో అనుసరించారు.

అక్కడికి వచ్చిన మహారాణి గాంధారీతో కృపాచార్యులు మాట్లాడారు. జరిగింది చెప్పారు. చివరిలో తాము చేసిన పాపాన్ని కూడా విప్పి చెప్పారు. ఎందుకైనా మంచిది. మేము మా దారిన పోతాము. అని ఎంతో దుఃఖంతో ఆమెతో మాట్లాడారు.

పెదనాన్న, పెదతల్లి, తల్లి వచ్చారని ధర్మరాజు, ద్రౌపది, తన సోదరులతో వారికెదురేగి వెళ్ళి వారి పాదాలకు నమస్కరించాడు. ధర్మరాజును చూస్తూనే, కౌరవవంశీయుల కులకాంతలు ఘొల్లుమన్నారు. ఆనాడు తమవాళ్ళు చేసిన పాపాల్ని ఆపలేకపోయారు కాని, యుద్ధం పేరిట ఇంత దారుణానికి ఒడిగట్టిన దుర్యోధనుని విడిచి, ధర్మరాజును దూషించారు.

తమకు గుండెశోకం, గర్భశోకం కల్గింది. అయినా ఈ పరిస్థితులలో తాము ఎదురు మాట్లాడకూడదని తాత్కాలికంగా మౌనం వహించారు. మర్యాదగా, ధర్మరాజును అభిమానించినట్లు, దగ్గరకు తీసుకున్న ధృతరాష్ట్రుడు "అవును. భీమార్జున నకుల సహదేవులేరి ?'' వారి యోగక్షేమడిగినట్లు అడిగాడు. కానీ "భీమ'' అన్నప్పుడు కురురాజు ముఖంలోని కళవళికలను, జాగ్రత్తగా గమనించిన కృష్ణుడు, జాగ్రత్తపడాలని తలిచాడు.

వయసు మళ్ళి, పెద్దలు చెప్పిన మాటలన్నీ విని కూడా, ఈ పెద్దమనిషిలో ద్రోహచింతన పోలేదనుకుని "రా! నాయనా! భీమా, వాయునందనా! మహా

ప్రతాపా!'' అని పిలుస్తూంటే, బుర్రలేని భీముడు, ముందుకు వెళ్ళపోతే, ఆగమని, దుర్యోధనుడు గదాయుద్ధ సాధనకై రూపొందించుకున్నాతని లోహ విగ్రహాన్ని "ఇటు మావా?'' ఇటు...!'' అంటూ, దాని దగ్గరకీయనను చేర్చాడు.

"నాయనా! నువ్వు మంచి బలవంతుడివి, అనుకున్నది సాధించగల ధీరోదాత్తుడివి, మొత్తానికి.... అంటూ ఆ లోహ భీముడిని గట్టిగా కౌగిలించు కున్నాడు, ఈ మహారాజు అంగసంధులు కొన్ని చిట్లి రక్తం కారుతూంటే, "అయ్యో పాపం! ఏమిటి నా కౌగలింతకు, భీముని శరీరం నుండి కారే రక్తానికి సంబంధ మేముంది ?'' తన పగ నావిధంగా చెల్లించుకున్నాడు.

భీమునికేదో అయిపోయిందని, ధృతరాష్ట్రుడు బాధపడటం.... కృష్ణునికి నవ్వు, కోపం తెప్పించాయి. అందరు ఆశ్చర్యంగా పగ-ద్వేషాలకు పుట్టినిల్లు ధృతరాష్ట్రుడనీ, అది దుర్యోధను స్వంతం చేసుకున్నాడని, అక్కడున్న వాళ్ళందరికి, పూర్తిగా అర్థమయింది.

"మామా! నీవు వజ్ర శరీరుడవు, మహా బలుడివి. "గొప్పవారి గోత్రాలు అందరికి ఎరుక'' అన్నట్లు నీ సంగతి నాకు తెలుసుండి, పొంగిపోయే నీ ప్రేమ పర్యవసానం తెలుసున్నవాడినై, ఓ లోహ విగ్రహాన్ని భీమునిగా నీకందించాను.

దానిని నిజమైన భీమునిగా తలచి, పాపం... ఓ నొక్కు నొక్కావు... ఆ లోహ విగ్రహం ముక్కలు ముక్కలుగా పొడి అయిపోయింది. ఆ విగ్రహం ముక్కలు గుచ్చుకుని రక్తం నీ శరీరం నుండే కారుతుంది. అది భీమునిది కాదు. నాకు ముందుచూపే కనుక లేకపోతే, నీ క్రూర దౌష్ట్యానికి, భీముడీపాటికి పరలోకగతు డయ్యేవాడు. పగ, అసూయా ద్వేషాలు, లుబ్ధత్వము నీ నుండే పుట్టాయి. ఏదో విధిలేక, రాజ్యం నీ చేతిలో వుంది కాబట్టి, పాండురాజును సహాయకునిగా వుండనిచ్చావు. లేదన్నా, కాదన్నా... నీ మూర్ఖత్వంతో అతన్ని బలి తీసుకునేవాడివి.

అటువంటి తమ్ముని బిడ్డలను "నా బిడ్డల''ని ఎప్పుడైనా అన్నావా ? "తప్పు నాయనా!'' అని కుమారుని మందలించావా ? మాటిమాటికి వాడు నా మాట వినడం లేదనడం నీకలవాటు. ఎందరు చెప్పినా నీ వంకర బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు - ఇప్పుడు నువ్వు చేసిన పని పర్యవసానం ఆలోచించావా ?

ప్రేమించే తమ్ముని పిల్లలలో.... ప్రేమించు పాండునందనులలో, విష బీజాలు నాటడం కదూ! దీనికి పరిహారం లేదు. అనుభవించమన్నాడు. "తప్పు చేసానని, ఆ గుడ్డి మహారాజు ఒప్పుకున్నాడు. ఒక్కొక్కరినే పిలచి ప్రేమపూర్వకంగా దగ్గరకు తీసుకున్నాడు.

అయితే భీముని పేరిట జరిగిన సంఘటనకు బెదరిపోయిన పాండు కుమారులు, పెదతండ్రి వద్దకు రమ్మంటే, వెళ్ళడానికి భయపడుతూంటే కృష్ణుడు వాళ్ళకు ఏ భయము లేదని అభయమిచ్చాడు.

"కృష్ణా.... ఇక, ఈ పాండునందనులు.... క్షమించి అలవాటులో పొరపాటు. ఈ - నా తమ్ముని పిల్లలే నాకు దిశా - దశా మార్గం చేసేవారని, విధిలేక కాదు, మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నానన్నాడు.

అప్పుడు మామా "ఇదుగో, నీ వంశాకురము యుయుత్సుడు, నీ కుమారుడని, అతని వద్దకు చేర్చాడు. అతన్ని దగ్గరకు తీసుకుని కౌగలించుకున్న మహారాజు, కొంతలో కొంత శాంతినొందుతూ - "నాయనా! ఒక్కసారి, ఏమను కోకుండా, మీ పెదతల్లిని కూడా కలవండి" అన్నాడు.

తప్పకుండా. మీ ఆదేశం మాకు శిరోధార్యమని ధర్మరాజు చెప్పాడు. అతను.... ఇప్పుడు - సార్వభౌముడు. ఆ సార్వభౌముని అందరు అనుసరించారు. అప్పుడు కృష్ణుడు "బావా!" అంటూ పెద్దబావకు పరమ రహస్యాన్ని చెప్పాడు - అది..... !

"బావా! యుధిష్టరా! ఇంతవరకు జరిగినదొక ఎత్తు. ఇక జరుగబోయేది మరొక ఎత్తు. జాగ్రత్త తొందరపడకండి!" భవిష్యత్తును చెప్పకుండా కేవలం "జాగ్రత్త" అని హెచ్చరించాడా, యదు నందనుడు.

"అమ్మా! నేను మిమ్మల్నందర్ని తీరని దుఃఖానికి కాలవశాత్తు - గురిచేసిన ధర్మరాజును. ఇదిగో తమ్ముళ్ళు అన్నాడు.... అందరు కలిసి, ఆ తల్లికి నమస్కరించారు. ఆ మాట వింటూనే, గాంధారి కడుపు మండిపోయింది.

వందమంది కుమారులను, అల్లుడిని.... అది యుద్ధరంగమైనా, అవతలి వాళ్ళు తప్పు చేసినా, ఈ కృష్ణుడిని అడ్డం పెట్టుకుని జరిపిన దారుణ, మారణకాండకు ఆమె హృదయం రగిలిపోతుంది.

వచ్చినవారిని ఆశీర్వదించక ముఖ్యంగా ధర్మరాజును... శపించాలనే స్థితిలో వుంది. ఆ పరిస్థితి తన దివ్యదృష్టితో గమనించిన వ్యాసులు అక్కడకు పిలిచినట్లు వచ్చి "గాంధారీ తొందరపడకు. ధర్మరాజును శపించకుము. అతడు నిజంగానే ధర్మమూర్తి. నా మాట విను.....!" ఆమెకడ్డం వచ్చి -

నీ కొడుకు, నీ దగ్గరకు వచ్చి "అమ్మా! ఆశీర్వదించమంటే.. ఏమన్నావు ? ఒక్కసారి ఆలోచించు. విజయోస్తు అన్నావా లేక... యతో ధర్మః తతో జయః" అన్నావా ? పిచ్చిదానా! నీ పిల్లల ప్రవర్తన నీకు తెలుసు. తల్లిగా, మహారాణిగా అందర్నీ గౌరవించావు.

జరిగేది నీకు తెలుసు. అందుకే నీ మనసుతో పాటు, భగవంతుడు కూడా, ధర్మపక్షంగా నీచేత వాడికి ఆశీస్సులందింప చేసాడు. అర్థం చేసుకో...!" అనేసరికి వ్యాసులవార్ని క్షమించమంది.

"మామా! తొందరపడ్డాను. కుపితనయ్యాను. వీళ్ళు కుంతికే కాదు, నాకు పిల్లలే. కాకపోతే... ఆమె కోపాన్ని చూసి, భీముడు భయపడ్డాడు. నాభికి దిగువున భీముడు కొట్టాడు. వాడు పాపాత్ముడే. తప్పులు చేసాడు. కాదనను. కాని ధర్మవిరుద్ధ పనులను కౌరవులు చేస్తారని నా పిల్లలు పేరుబడ్డారు. దానిని త్రోసి రాజన్నట్లు ఈ ధర్మరాజు సోదరుల అధర్మప్రవర్తనమే నన్ను బాధించింది. కృంగదీసిందంది.

అప్పుడు "అమ్మా! తప్పో, ఒప్పో తెలియదు. అతడు గాలిలోకి ఎగిరి నా తలను పగులగొట్టాలని తలచాడు. అప్పుడు నా యుద్ధ ధర్మంగా, ఆపద్ధర్మంగా నన్ను కొట్టదలిచిన వానిపై గదా ఘాతం చేసాను. ముందు నా ప్రాణరక్షణ చేసుకుంటే... ఆ తదుపరి కోపతాపాలు, పగ పట్టుదలలు - ఆ ప్రయత్నంలో వాడు తొడలు విరిగి...!

ఆపకుండా మొదట్నుంచి జరిగినదంతా వివరించి చెప్పాడు. ఇప్పుడు నీ ఇష్టం... నువ్వేం చేసినా ఈ ధర్మరాజు తమ్ముడు, పాండునందనుడు - శిరసావహిస్తాడని.. తలవంచాడు. అప్పుడా తల్లి కొద్దిగా శాంతపడి, మరి దుశ్శాసనుని అంది.

"అమ్మా! లోకభీకరలీలన్.... అన్నాను కాబట్టి ఆ రకంగా ప్రవర్తించాను. రక్తం త్రాగినట్లు నటించానే తప్ప ఈ భరతవంశీయుడు, అంత కిరాతకుడు, కాడమ్మా... అన్నాడు.

"సరే... వెళ్ళండి... కుంతిని కూడా చూడండి!' అందరు తల్లి దగ్గరకు వెళ్ళారు. నమస్కరించారు. బ్రతికి బట్టకట్టినందులకు, ముందు సర్వరక్షకుడైన చక్రికి, ఆ తదుపరి భగవంతునికి నమస్కరించి తన పిల్లలను చూసి, వళ్ళంతా తడిమి ఆశీర్వదిస్తూంటే....

"అత్తా!" ఘొల్లుమంది, ద్రౌపది. ఆమెను దగ్గరకు తీసుకుని, తానూ బావురుమంది. "నీ మనుమలందరు, ఈ దారుణ యుద్ధంలో మరణించారత్తా! అంటూంటే... "అవునవునని.... తానూ విలవిలలాడింది. ఇద్దరు కలిసి గాంధారిని దర్శించారు. ఆమె వీరి నడకను ఏడ్పును - గమనిస్తూ "వూరుకో అమ్మా! వూరుకో. ఈ భరతవంశానికి పెద్దకోడలివి. నీకు జరిగిన అన్యాయం శాపమయింది. నీకు, మీ అత్తకు, నాకు... గర్భశోకాన్ని మిగిల్చింది.

"శాంతించు, తల్లీ! శాంతించు. నీవంటివారు ఆగ్రహిస్తే, జరిగే పరిణామా-లిలాగే వుంటాయంది. ఒకరినొకరు ఓదార్చుకున్నారు. ఆ తర్వాత...

అందరు కలిసి రణరంగానికి వెళ్ళారు. ఎవళ్ళ వాళ్ళని వాళ్ళు వెదుక్కుంటూ చూసుకుంటున్నారు. ముందు అనాధ ప్రేతసంస్కారం జరిపించమన్నారు. ఒక్కొక్కరినే చూస్తూ గాంధారీ గుండె బాదుకుంది. వీళ్ళెంత పాపాత్ములైనా, దయామయుడనే ఆ భగవంతుడు, తనపై ఇంత నిర్దయ ఎలాగ చూపాడో...నని, బాధపడింది.

తదుపరి -గాంధారి, వేదవ్యాసులు ప్రసాదించిన దివ్యదృష్టిని ఉపసంహరింప చేసుకుంది. అప్పుడు కృష్ణుని సమీపించింది. "కృష్ణా...!" అంది, ధీరగంభీర స్వరంతో..

ఎంతో వినయంతో, "అత్తా!" అన్నాడు, ఆ వాసుదేవుడు. ఆపగలిగీ, ఆపావా ?....... ఈ దారుణ మారణకాండ ? ఎందుకయ్యా ఈ క్రోధం......... జన నాశనం. వంశ నాశనం. ఒక్క కొడుకును మిగల్చకుండా, చేసావు కదా!

"అత్తా! కలి వచ్చేస్తుంది. ఇంకా దారుణాలు జరుగుతాయి, ఈ పాప మహాభారాన్ని, భూదేవి మొయ్యలేదు. అందుకు, ముందీ మారణకాండ పూర్తయితే ఆ తర్వాత వచ్చే వారి సంగతి ఆలోచించవచ్చును.

సరే. ఇక ఒక్క కొడుకును... అంటావు ? ఏ ఒక్క కొడుకునైనా నిగ్రహించ గలిగావా ? చెప్పమ్మా. చెప్పు. ఒక్క కొడుకును విడిచి పెట్టండి. ఈ వంశం బాగుపడుతుందంటే విన్నారా ? ఎందుకమ్మా అనవసర కోపాలు, వ్యర్థ ప్రసంగాలు.

పైగా ఎవరో చేసారని నిందిస్తావు ? ఎవరు ఎవర్ని చంపమన్నారు ? చంపమంటాం.

వయసు వచ్చేకొద్దీ, పెంచుకునే అసూయా ద్వేషాలను త్రుంచగలిగారా ? అరే. తమ్ముడు కొడుకులే. ఆ తమ్ముడు నా కోసం తనను త్యాగం చేసుకున్నాడే... నని, ఏనాడైనా మహారాజు కానీ, నీవు కాని తలచారా ? చాతనయ్యి చేతులు కట్టుకుని నిలబడినందులకు, ఆతని కోడల్ని నిండుసభలో, ఏకవస్త్ర వివస్త్రయినా ఫర్వాలేదని అవమానిస్తారా ? ఇందాకట్నుంచి చూస్తున్నాను. తప్పంతా పాండవుల దేనా ? ఎవరు విన్నారమ్మా నేను చెప్పిన మంచిమాటలు ? మీకు చెప్పడం రాదు. అదేమంటే... వినడంటారు. ఇది సబబా ?

దాయాదుల మధ్య పోరు... ఒక్క సూది మొన కూడా ఇవ్వనంటాడే, ఇది వాడి తండ్రి సొమ్మా.... తాతల నుండి తరతరాలుగా వస్తున్న సామ్రాజ్యంపై అతనికెంత హక్కుందో... వీళ్ళకీ... అంతేకదా! ఆ ఇంగితజ్ఞానం పెద్దవాళ్ళు మీకుందా ? విదురుడు నోరు నెత్తి మొత్తుకుని చెబుతుంటే, నువ్వెప్పుడు పాండవ పక్షపాతివే, నా పిల్లల ఎదుగుదల చూడలేవని... తాను నిరశించాడు.

ఎన్నిసార్లు... ఎన్నిసార్లు... ఈ విదురుడు, ధర్మమూర్తి, మీకు మంచిమాట చెప్పగల్గిన సంబంధీకుడు..... చెప్పాడు. ఆయన మాటను విన్నారా ? పోనీ వినగల్గేరా.....? ఇప్పుడు పాండవులు, వాళ్ళతో నేను తప్పుచేసి, నీ పిల్లలకు ముప్పు తెచ్చినట్లు మాట్లాడతావు. రాయబారిగా వస్తే, కనీస మర్యాద తెలియని వాడు, నన్ను బంధింప చూస్తుంటే, “తప్పు, తగదని” మీ ఇద్దరిలో ఎవరైనా చెప్పగలిగారా ?

ఇక నీ తమ్ముడు... ఎన్నడైనా..... తన అల్లుళ్ళు బాగుపడాలని తలిచాడా ?

అదృష్టవశాత్తు.... రాజ్యం భాగించి ఇమ్మంటే, ఘనంగా ఒక అడవిని ఇస్తే- దైవకృపతో పాండవులు అద్భుత నగరాన్ని నిర్మిస్తే - దానిని చూసి సహించలేక, అసూయ భరించలేక, జూదమాడించి, ధర్మం మీరని ఆ ధర్మాత్మునికి చేసిన అన్యాయం... అంతా... ఇంతానా ? ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు, అతడు - తన దుష్ట చతుష్టయం, తమ్ములతో కల్సి చేసిన అరాచకాలు నీకు తెలియకపోయినా... మహారాణీ! మీ మహారాజుకు తెలుసు.

ఆఖరికి వ్యాసమహిమతో, యుద్ధరంగంలో జరిగే విశేషాలను, సంజయుడు

చెబుతూంటే, ఓర్వలేకపోయాడు కదమ్మా, ఈ గుడ్డి మహారాజు. ఎప్పుడు చూసినా- నా పిల్లలు, పాండవుల పిల్లలు అని... ఈసడించే మహారాజుకు, ఇప్పుడు బుద్ధి వచ్చిందా ? లేదే...

భీముని పిలిచి, తన వజ్ర బల శరీరంతో, కౌగలింత పేరున, మరణ శాసనం రాయబోతే, తప్పించిన, శ్రమ - నాది కాదా... అమ్మా! అన్నీ వింది. తలదించుకుంది. క్షణమాగింది. "ఎందులకయ్యా! ఇరువురు బంధువులమే అయినా, మమ్ముకాదని పాండవులపై నీకంత ప్రేమ! అందామె. "మహారాణీ వారు ధర్మమూర్తులు. నేను ధర్మావతారుడను. ఈ ధర్మం కోసమే లభించిన రాజ్యాన్ని పోగొట్టుకున్నాను. ఈ ధర్మం కోసమే తప్పు చేసిన మేనమామను చంపాను. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం - అసాధ్యమైనా - గురు పుత్రుని తెచ్చి వారికందచేసాను.

మీలో ధర్మముంటే.... నేనెల్లప్పుడు మీకు తోడుగా వుండేవాడిని. అయినా ఒక సంగతి మరిచావు. నీ కోడలు భానుమతి యువరాణిని, నా చిట్టిచెల్లెలుగా తలచి అభిమానించలేదా ? ఏమ్మా... ఇందులో కూడా దోషమెత్తుతావా ?

పైగా నీ కోడళ్ళు.... ఆ రోజు తమ భర్తలు, ఈ ఇంటి పెద్దకోడలిని వివస్త్రను చేస్తుంటే, మాట్లాడలేకపోయినవారు, ఇపుడు... ధర్మరాజట. ధర్మరాజు. పేరుకే పెద్ద... పేరు గొప్ప తప్ప... అన్నారే. అది అనవలసిన మాటా ? కట్టుకున్న వాడిని, కట్టడి చెయ్యలేక, పురుషాధిక్యానికి తలవొగ్గి, బందీలుగా బ్రతికే ఈ బానిస భార్యలకు-బాధ్యత, బాంధవ్యాల గురించి తెలుసా... ? చెప్పమ్మా! చెప్పు.

దీనికి.... నీవు... జ్ఞాతులెలాగ, జ్ఞానవిహీనులై మరణించారో.... అలాగే మీ యాదవులు కూడా.... దాయాది పోరుతో సమూలంగా నాశనమౌతున్నా రన్నావు. నీ కోపానికి, పాతివ్రత్యానికి చాలా సంతోషం.

మహర్షి ఒకరు - ఈ శాపాన్నెప్పుడో... ఇచ్చారు. లేకపోతే నేనుండగా, మహామహులైన, యదువీరులను అజేయులైన వారినెవరు చంపలేరు. వారు మరణించక తప్పదు. అదివారిలో వారి అంతఃకలహాలవల్ల రావాల్సిందే, తప్ప ఇతరత్రా కాదు. కాకపోతే, నీ పాతివ్రత్యాన్ని అడ్డం పెట్టుకుని, ఆ తపోశక్తితో

పాండవుల కపకారం కలుగుతుందేమోనని, నీ మనస్సు నీ విధంగా మళ్ళించాను.

"పిచ్చి అత్తా! అనంతుడినైన నన్ను, ధిక్కరించడం, నిరోధించడం, నిర్జించడం, నాకు తప్ప.... మరొకరికి సాధ్యం కాదు. ఆ అసాధ్యాన్ని నేనే సాధ్యం చేసుకుకోవాలి. ఇది నా లీలా విలాసంలో ఒక భాగం. మరో విశేషం. నీకు... నిన్నటివి.... ఇవ్వాల్టిదే తెలుసు. మరి నాకో... మత్స్యావతారం నుండి ఇప్పటివరకు, రేపు రాబోయే కల్క్యావతారం, ఆ తదుపరి - ఈ జగత్తు జనజీవన విధానాలు తెలుసు.

"చాలా సంతోషం. ఇక నీకు ఎవరు భయపడరు. జాగ్రత్తగా గడపండి. చివరి రోజులు దారుణం కారాదు." ఆ తర్వాత... ఓ ప్రక్క గాంధారీ, ధృతరాష్ట్రులు, మరొకప్రక్కన - ధర్మరాజాదులు గంగాస్నానం చేసారు. తిలోదక పిండప్రదానాలకు సిద్ధమవుతుంటే -

అంతవరకు మనసులోనే కుళ్ళి - కుళ్ళి - మగ్గి - మగ్గి ఏడుస్తున్న కుంతి- "ధర్మజా! నా మాట వినరా!" అని గట్టిగా అరిచేసరికి, అందరు ఆమెవైపు తలలు త్రిప్పారు అప్పుడామె - గద్గద స్వరంతో -

"నాయనలారా! కర్ణుడు సూతపుత్రుడు కాదు, సూర్యపుత్రుడు. రాధేయుడు కాదు. కౌంతేయుడు. నా పెద్దకొడుకు. మీ అందరికీ అన్న... చేతిలోని తిలాక్షతలతో తీసుకున్న నీరు అలాగే తెలియకుండా, ధర్మజుడు, విడిచేసాడు. అవును నే చెప్పేది నిజం. ఈ సంగతి నాకు, మామ, పరమపవిత్రులు - గంగా పుత్రులకు, వేదవ్యాసులకు, మీ బావ కృష్ణునికి తెలుసు. మీ అన్న కర్ణునికి తెలుసు... అని ముందాతనికి తిలతర్పణాలిమ్మని కోరింది.

"అమ్మా!" ధర్మరాజు దీనుడయ్యాడు. ఆతని తమ్ములు - బిగ్గరగా, రోదించారు. ఇన్ని నాళ్ళుగా ఎలాగ ఓర్చుకున్నావమ్మా. ఈ పరమ రహస్యాన్నెలాగ దాచుకోగలిగావమ్మా!" అని ధర్మరాజే కాదు, మిగిలిన సోదరులు కూడా విలపించారు. అర్జునుడైతే, చేజేతులా అన్నను చంపుకున్నామని రోదించాడు.

# ధర్మసూక్ష్మం

ఈ సమయంలో యుధిష్టరునికి కర్తవ్యబోధను చెయ్యడానికి - వ్యాస, నారద, కణ్వ మహర్షాది ప్రముఖులు వచ్చారు. ఇదంతా - ఆ దేవదేవుడైన శ్రీ కృష్ణుని చిద్విలాసమని, ఈ జగత్క్రీడ, ఆ పరంధాముని లీలావిశేషమని తెలియ బరిచారు. ఇప్పుడు కావల్సింది విచారం కాదని, వివేకమని -

ఇంత జరిగిన తర్వాత... ఇప్పుడు వేదాంతం వల్లిస్తూ, నీ ధర్మము నీవు మరువరానిదని, అన్నీ తెలిసినవాడివి, ఆత్మజ్ఞాన మెరిగినవాడవు కనుక సత్యం గ్రహించి, ధర్మమార్గమున నడువమని తెలిపారు. ఇదే నీ కర్తవ్యమని సూటిగా తెలిపారు.

అలాగే ధర్మరాజుకు, సోదరులందరు తలో విధంగా తెలిపారు. ఏమైనా ఆనాడు యుద్ధానికి సిద్ధమవడంలోను, ఈనాడు రాజ్యభారం వహించడంలోను, ఒక ఆశయం నిర్దుష్ట పద్ధతిలేనట్లు ప్రవర్తించే ధర్మరాజును, ఆనాడు ద్రౌపది ఆవేశం, ఈనాడు సోదరుల బోధలతోపాటు అప్పుడు, అక్కడే వున్న దేవస్థాణుడనే మహర్షి - ధర్మరాజుకిలా చెబుతున్నారు.

“యుధిష్ఠరా! చిన్నవాడైనా అర్జునుడు, శ్రీకృష్ణుని - సహచర్యం వలన ఉత్తమ పురుషునిగా రూపొందాడు. సత్యాన్నే ప్రకటించాడు. కోరికలు, ధర్మాన్ని విడిచేవాడు ధర్మబుద్ధి, సుఖ పురుషుడు. అదే బ్రహ్మానందమూర్తి కాలేడు. అలాగే డబ్బుకోసం అడ్డమైన గడ్డితినేవాడు సుఖమూర్తి కాలేడు. కనుక, ఎవరి ధర్మమును వారు నిర్వర్తించి నప్పుడు మాత్రమే అది నిలబడుతుందన్నాడు. ఇది సత్యము. సర్వత్రా హర్షణీయ శ్రేష్ఠ ధర్మం. బ్రహ్మపథము పొందదలచినవానికి, నిష్కామము సత్ఫలం. ఇందులో ధనం కూడకల్గి వుంటుంది. ఇది ధర్మపధానికి నిరోధకం కాదు. సుఖాల కోసం ధనముపయోగించడమో, దుర్వినియోగపరచడమో తప్పు. కానీ,

యజ్ఞయాగాదులు, అతిథి అభ్యాగతులు, దేవ, పితృ, యజ్ఞాలను, ప్రజా సంక్షేమానికి వెచ్చించే ధనం శ్రేష్టమైనదే తప్ప, నీవన్నట్లు నెత్తురుకూడు కాదు. మానవుడు తనకు తెలిసి చేసినా, తెలియక చేసినా, సర్వపాప ప్రాయశ్చిత్తార్థం - పుణ్యకర్మలలో భాగంగా యజ్ఞం చేయాలి. దానివలన సుఖము, చిత్తశాంతి, సర్వులకు సర్వతో భద్ర జీవనం లభిస్తుంది.

క్షత్రియులు చెయ్యవలసిన ధర్మాలను విసర్జించి బ్రాహ్మణ, వైశ్య, శూద్రుల వృత్తులయందు చిత్తము నిలుపడం మహానేరం. నీకు ఆనందమైనా, నీ పితృ పితరులు, కర్మగతులను తప్పి - దుర్భర - శాశ్వత నరకవాస మొందుతారు. చివరకు వ్యాసులవారు కూడ తమ అనుభవము, ధర్మతత్వ - శాస్త్ర జ్ఞానము, ఇతర ఉపనిషత్తు విజ్ఞానములన్ని సంకలనము చేసినట్లు, ధర్మరాజును సంస్కరించారు.

ఎవరి ధర్మములు వారు నిర్వర్తించాలే తప్ప, ఇతర ధర్మములు, ఇతరుల ధర్మములనాశ్రయించరాదు. చెప్పాను కదా! ఇది నీ కోసమైతే ఫర్వాలేదు. నీకింకా తరాలు, తరతరాలు, పూర్వీకులు వున్నారు. నీవలన వారు భ్రష్టులవకూడదు. భ్రష్ట జీవన మొందరాదు.

భిక్షాన్నం తినమన్నారు... ఎవర్ని సన్యాసులను, అవధ్యులను, ఆశ్రయం లేనివారిని మాత్రమే. అన్నీ వుండి మనం భిక్షకు బయలుదేరితే లోకమేమంటుందో తెలుసా ? చూడటానికి దున్నవలె వున్నావు. కష్టపడి పనిచేసుకుని తినకుండా ఇదేం "మాయరోగ" మంటారు ? ఈ తిట్టు మనకే కాదు - మన పూర్వీకులు కూడా తినాల్సి వస్తుంది. మన తరువాతి తరం వారికైతే "ఇతనెవరో తెలుసా ? దున్నలాగ వుండి అడుక్కు తినేవాడు చూడు. వాడి కొడుకనో, మనుమడినో.... వెక్కిరిస్తారు.

ఇది మంచిదా.... ఆలోచించు! కొన్ని కొన్ని ధర్మాలున్నాయి. అవి చెబుతాను ముందు విను. ఆ తరువాత అవి ఎవరు ఆచరించారో..... ఆలోచించాలో తెలుస్తుంది. నువ్వు ధర్మ"రాజు"వైనా, ఇవి తప్పక తెలుసుకోవాలి. జాగ్రత్తగా విను.

1. వేద ప్రసాదిత కర్మలు చేయకుండా, ఇతరములేవి చేసినా, అది పాపమే.
2. ఉదయాస్తమయాలలో నిద్రించుట, గౌరవించవలసిన వారిని గౌరవించక పోవడం, ఇతరుల భార్యలపై ఆశ, "గురువా" అని ధిక్కరించుట, సమాజ నాశనం, జీవహింస, బ్రాహ్మణుల ధనమపహరించుట, శరణార్థుల రక్షించపోవడం చెప్పుకోవలసిన పాపాలు.
3. యుద్ధమని కత్తి పట్టాక, ధర్మ మీమాంస పనికిరాదు. ఉపేక్షిస్తే అవతలివారు మనల్ని చంపుతాడు కాబట్టి, ఆత్మరక్షణ, ధర్మసంరక్షణ పాపము కాదు.
4. బ్రాహ్మణ ధనమపహరించినవార్ని తప్పక దండించాలి. ఇది దోషం కాదు.

5. ప్రాణాపాయ సమయంలో, ఏ యితర ఆహారము లభించనప్పుడు, అది కల్లు అయినా, తెలియక త్రాగినప్పుడు, పాపమంటదు.
6. ధన, మాన, ప్రాణం పోవు సమయాలలో చెప్పే అబద్ధం - చెప్పాల్సిన పరిస్థితిని బట్టి తప్పు కాదు. ఇది శుక్రనీతి. ఆచరించతగ్గది.
7. కలలో స్ఖలనం జరుగుతుంది. దానివలన బ్రహ్మచర్యం పోదు. అగ్నిలో నేతిని హోమం చేస్తే ఆ పాపం పోతుంది.
8. అన్న అసమర్థుడైతే, తమ్ముడు ముందు వివాహం చేసుకోవడంలో తప్పు లేదు.
9. యజ్ఞయాగాదులు, ఇతర శుభకార్యాల నిమిత్తం అడవుల కాల్చుట, యజ్ఞంలో పశువుల వధించుట, అపాత్రుడని తెలియక దానము నొసగుట, అర్హత లేనివారిని ఆదరించకపోవడం తప్పు కాదు.

తపో దాన, పుణ్యకర్మల వలన కొంత పాపపరిహారం జరుగుతుంది. ఆ ప్రాయశ్చిత్తాలు చెబుతాను, విను.

1. కపాలంతో భిక్షచేసి, ఆ అన్నాన్ని పన్నెండేండ్లు తింటూ, బ్రహ్మచర్యంతో, కటిక నేలమీద పడుకుంటే, బ్రహ్మ హత్యా దోషం పోతుంది.
2. అశ్వమేధ, అవబృధ జలములతో, పవిత్ర మొనరింపబడినవారి సర్వ పాపములు తొలగిపోతాయంటే, ధర్మజా! ఆ యజ్ఞములు చేసినవారి అదృష్టమే, అదృష్టం.
3. లక్ష గోవులను కాని, నూరు గుర్రాలను కాని దానమిచ్చినా బ్రహ్మహత్యా దోషం పోతుంది.
4. కల్లును, నిప్పులు కురిపించే ఎండలో కాచి, దానిని కనుక త్రాగినట్లయితే, కల్లు త్రాగిన పాపం పోతుంది.
5. గురు భార్యతో కొందరు కావాలనో, కర్మకొద్దో కొందరు వ్యభిచరించాల్సి వస్తుంది. అటువంటి దోషాలకు - ఇవి పరిహారాలు.
   i) అగ్నిలో దూకి ప్రాణాలు తీసుకోవాలి.
   ii) బృహస్పతి సవమనే క్రతువైనా చేయవచ్చును.

iii) విశిష్ట భూదానం చేసినా

i□) ఎర్రగా కాలిన స్త్రీ విగ్రహాన్ని కౌగలించుకున్నా

□) యుద్ధంలో - గురువు నిమిత్తం ప్రాణాలర్పించినా

□i) తన సర్వస్వము - దానమిచ్చేసినా

□ii) పై పాపాలు, పోవాలనే వుద్దేశంతో కాక, పోగొట్టుకోవాలనే తపనతో చేస్తే పాపపరిహారమౌతుంది.

6. బ్రాహ్మణుని ధనమపహరించిన పాపం, అంతటి బంగారమిస్తే పోతుంది.

7. ఇతనికి అపకారం చేసినవాడికే, తిరిగి ఇతడు ఉపకారం చేస్తే అసత్యదోషం పోతుంది.

8. గురు ధిక్కారం పోవాలంటే, గురువును సంతోషబరిస్తే తప్పక తన పాపం పరిహరింపబడుతుంది.

9. ఒక సం॥ కాలం బ్రహ్మనిష్ఠతో గడిపితే - ఇతరుల భార్యను సంగమించిన దోషం పోతుంది.

10. ఆడదైతే చాలని, ముందు వెనుక చూడకుండా తన వాళ్ళతో చేసే సంగమ దోషం, ఆరునెలలు తడిబట్ట కట్టుకుని బూడిదరాశిలో పడుకుంటే పోతుంది.

11. మితాహారం తీసుకుంటూ, "పగలు - రాత్రి" అను భేదం లేకుండా, గాయత్రీ జపం చేస్తే సర్వపాపాలు నశిస్తాయి.

ఇక అనవసరాలోచనలు చెయ్యకు. వాసుదేవుడు, నడిపిన రీతిలో నడుపు. "శుభం" కల్గుతుందని ఆశీర్వదించిన వేదవ్యాసులు -

"నాయనా! గంగానందనుడు, ఇంద్రాదులకే పూజనీయుడు. ఆ మహనీయుడు శరీరత్యాగం చేసే సమయం దగ్గరపడుతుంది. వారిని దర్శించి సేవిస్తే - సద్ధర్మములు, సకల ధర్మములు విశేషంగా లభిస్తాయి. ఇక అన్యచింతనలను విడిచి, ఆ మహామహుని దర్శించు"మన్నాడు.

ఆ తర్వాత - వాసుదేవుడు కల్పించుకుని మళ్ళీ కర్తవ్య బోధను చేసాడు. సార్వభౌమునిగా చేయవలసినవి, ముందాలోచించమన్నాడు.

సర్వులను సమదృష్టితో చూచేవాడే సార్వభౌముడు, ఆతడు యుధిష్టరుడని లోకం ప్రశంసించాలి.

"ధర్మజా! యుద్ధంలో కొందరు ప్రాణభీతితో పారిపోయారు. ఇంకొందరు వీలు చిక్కక యుద్ధంలో పాల్గొనలేదు. ఇప్పుడు వాళ్ళందరు నిన్ను చూడవచ్చారు. సార్వభౌమునిగా నీ దర్శనం ప్రసాదించు. వారి అభీష్టం తెలుసుకో. ధర్మం తెలియబరచు. సన్మార్గగాముల్ని చెయ్యి. కర్తవ్యబోధతో కనికరించమన్నాడు.

# పట్టాభిషేకం

**మ**హర్షి వేదవ్యాసులవారి దీవెనలతో, ఆదేశంతో ఆనాటి కార్యక్రమం ప్రారంభమయింది.

సద్బ్రాహ్మణులు -వేద పఠనం చేస్తుంటే, ధౌమ్యులవారు ముందు నడువగా, యుధిష్ఠరుడు, ద్రౌపదీ సమేతుడై - సింహాసన వేదికపైకి వచ్చాడు. పురోహితులుగా, ధౌమ్యులవారు ఆశీర్వదించారు. శుభాశీస్సులు, స్వస్తివాచక, మంగళాశీస్సులతో, భరతవంశ ఖ్యాతిని దశదిశలకు వెదజల్ల చేసిన ఆ పూర్వీకుల మహాప్రసాదమైన - దివ్య సింహాసనాన్ని యుధిష్టరుడధిరోహించాడు.

ద్రౌపదీ దేవివి సార్వభౌమునికి ఎడమప్రక్క గల దివ్య సింహాసనా నధిష్టింప చేసారు.

అగ్ని కార్యము జరిపి, హోమతంత్రము నడిపి, "శుభగ్ం, శుభ"మంటూ, వంశకర్తగా వ్యాసులవారు, జగత్సాక్షిగా వాసుదేవుడు పాంచజన్య దివ్య ఘోషతో మహదానందకర ధ్వని చేసాడు. వ్యాసమహర్షి మనుమని పట్టాభిషిక్తుని చేసాడు.

ధృతరాష్ట్రుడు సంయమనస్థితితో, శుభ్రమానసంతో, వంశజేష్ఠుని, కోడలిని పవిత్ర స్వర్ణ కలశ జలంతో అభిషిక్తులను చేసాడు. అందరికి కృతజ్ఞతలు తెలిపి, భూసుర, కళాకార, అనేకానేక ఇతరులను తగు విధాన సన్మానించాడు. దానధర్మములతో సామ్రాజ్య పట్టాభిషిక్తుడై - సార్వభౌమపథమందుకున్నాడు.

మరుక్షణం, ధర్మరాజు "తండ్రీ! గతంలో వలెనే తమరు, తమ రాజ్యమును పాలించుకోండి. మీ పిల్లలుగా మేము, మీకు, మీరు కోరిన క్షణాల మా సేవల నందిస్తామన్నాడు. అదే బహిరంగంగా ప్రకటించాడు. అందరు ధర్మజుని సత్శీలాన్ని బహువిధాల కొనియాడారు.

భీముడు యువరాజు.

విదుర మహాశయులు. సంధి, విగ్రహాదులే కాదు. సర్వధర్మ - శాస్త్ర - న్యాయవిదులు, మహామంత్రులు.

నకులుడు - సైన్య రక్షణ - శిక్షణ... సర్వధర్మములు నిర్వహిస్తాడు.

సహదేవుడు - సార్వభౌమునకు - ఆంతరంగిక కార్యదర్శి.

ప్రజారక్షణ - దుష్టశిక్షణ - అర్జునుని బాధ్యత.

శ్రౌత - స్మార్త - ధర్మకర్మ - కార్యనిర్వహణా బాధ్యత ధౌమ్యులవారిది.

యుయుత్సుడు - ప్రభుత్వ కార్యనిర్వహణ, వివిధ శాఖల సమన్వయ - సర్వాధికారిగా వుంటాడు.

యుయుత్స, విదుర, సంజయులు - మహారాజుకు ప్రతినిత్యం జరిగే ప్రతి విషయం - వివరిస్తుంటారు. ధర్మబద్ధ ప్రణాళికను రచిస్తుంటారు.

రాజమాతను, మహారాణిని - తమ అంతఃపురములకు పంపిన ధర్మజుడు- వాసుదేవుని మిగుల వాత్సల్యముతో చూసాడు.

సరాసరి గోవిందుని దర్శించి, "సర్వేశ్వరుడవు, సర్వాంతర్యామివి, సర్వాంతరాత్మవు! ~~ఈ~~ అదృష్టమంతా నీవు ప్రసాదించిన పుణ్యాలబ్ధము, లభ్యము. భక్త వాత్సల్యత, బంధుప్రీతితో అనుక్షణం మమ్మలరించే నిన్ను - నీ దివ్యతత్వాన్ని - సామాన్యులము - అర్థము చేసుకొన తరముకాదు. బంధుప్రీతుడవైన నీవు - భక్తవాత్సల్యముతో - మమ్ము సదా కనికరించి, కరుణించి, కాపాడు"మన్నాడు.

సద్ధర్మ మార్గమున నడిపింపుము. శాశ్వతకీర్తి ప్రతిష్ఠలనార్జింప చేయుము.

అనుక్షణము తోడునీడవై - కర్తవ్యమూర్తులమై చరించినట్లు, నడిపింపుము.

"సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అన్నది - నిత్యము - సత్యమై, సదాభద్రము, సర్వతోభద్రము - శుభప్రదమై - వర్థిల్లు గాక!

మమ్ము సంస్కరించి, నడిపించుగాక!

"శ్రీ"కరుణ - సర్వదా లభించుగాక, అని భక్తిపురస్కరంగా, యుధిష్ఠరుడు ప్రార్థించాడు.

★ ★ ★ ★

ఆ రాత్రి గడిచింది.

తెల్లవారి లేస్తూనే - యుధిష్టరుడు - వాసుదేవ ప్రభు దర్శనానికి వెళ్ళాడు. సుప్రభాత సేవ వలె ఆయనను పలుకరించాడు.

ఆదరము, దరహాసము లేక - నిశ్చల సమాధిస్థితుడై వున్నట్లు - ఆ భగవంతుడు దర్శనమిచ్చాడు. యుధిష్టరుడు ఆశ్చర్యపోయాడు. చేతులు కట్టుకుని అలాగే నిలిచాడు.

కొన్ని క్షణాల పిదప మందహాసం చేసి - "ధర్మజా! మహామహుడు, పరమ పవిత్రుడా గంగానందుడు - వశిష్ట శిష్యుడు. పరశురామునికి అభిమాన అస్త్ర విద్యా శిష్యుడు. ఉత్తరాయణ కాలము రాబోతుంది. అతి త్వరలో - ఈ భువి వీడబోతున్నాడు.

**"పరమపురుషా, ప్రసన్నా! పరంధామా, ఆశ్రిత వత్సలా, ఆదిదేవా! ధర్మరక్షకా, కర్మనాశనా, కృష్ణా! వరదా, వాసుదేవా, జనార్ధనా, అభయప్రదాతా! శరణాగతవత్సలా, శౌరీ! గోవర్ధన గిరిధారీ, మురారీ...." అని - ఒంటరిగా - అన్నీ మరచి, ఆత్మలో నిక్షిప్త మొనరించుకున్న నన్ను, "అనంతుడినని, ఆదిదేవుడునని- అవ్యజానంద ప్రదాతనని - ఆ బ్రహ్మానందమూర్తి పుణ్యధాముడు, పుణ్యశ్లోకుడు...**

నాకై పరితపిస్తూంటే... ఆ పిలుపు విని ఆనందం ప్రసాదించ, ఆత్మానందమూర్తి నయ్యాను. అవధ్యుని - ఆయన అనుమతితో వధించి, స్వచ్ఛంద మరణవర ప్రభావమూర్తిని, శరతల్ప మెక్కించడంతో - ఆ మహనీయుడు తన ధర్మం తెలుసుకున్నాడు. దారి చూసుకున్నాడు.

దారి చేసుకున్నాడు. గమ్యస్తుడయ్యాడు. ఆ ఆనందంతో - సరి.... సరి... చెప్పు"మన్నవాడు. క్షణమాగి" ధర్మనందన. వెళ్ళు. ఆ మహనీయుడు, ఈ భువిని విడిస్తే, ధరాదేవి అన్యాయమౌతుంది. ధర్మ - జ్ఞాన విజ్ఞానాలు చెప్పేవారు కరువవుతారు. ఆలసించకంటాడు. నీవు రావలెనని, సందేహాలు తీర్చవలెనంటాడు ధర్మజ్ఞుడు.

# భీష్ముని ధర్మబోధ

"సాత్యకీ! దారుకుని రథం సిద్ధం చెయ్యమను. అలాగే భీమార్జున, నకుల, సహదేవ, కృప, యుయుత్సు, విదుర, సంజయులను కూడా రమ్మనుము.

కురుక్షేత్రంలో అంపశయ్యపై వున్న గాంగేయుని దర్శించడానికి - నారద, వేదవ్యాస, దేవల, దేవస్థాణు, దేవతారాది మహర్షులు వచ్చి వున్నారని, మనమందరము కూడా తొందరగా అక్కడికి వెళ్ళాలని తెలియచెయ్యి" అన్నాడు.

ఉన్నట్టుండి తన అభయహస్తాన్ని గుండెలపై వుంచుకుని, ధ్యాననిమీలితు డైనట్లు కృష్ణుడు కళ్ళు మూసుకున్నాడు. ఈ సమయంలో - అక్కడ -

కురుక్షేత్రంలో-అంపశయ్యపై వున్న గంగాసుతుడు-రెండుచేతులు జోడించి "కృష్ణా, అభయహస్తా, వరదా! గోవిందా, గోపీజనరక్షకా, భక్తనిలయా, హృదయా!" కనుల ఆనందబాష్పాలు రాలుస్తూ-వాసుదేవునికై ఎదురు చూస్తున్నాడు.

సర్వలోకాంతరస్థుడై, యోగ నిద్రామూర్తిగా ప్రళయకాలమందు మఱ్ఱి యాకుపై పడుకుని క్రీడించు మహనీయా, బాలకృష్ణా... శరణు, శరణు!

శిరోజములు మేఘములుగా, నదులు - అవయవ సంధులుగా, ఉదరము- సముద్రముగా, సర్వలోకములు హృదయముగా - నిలచి వెలిగే ఓ యశోదా నందనా, నందనందనా, దేవకీసుతా, వాసుదేవా వందనం. అభివందనం.

బ్రాహ్మణులను ముఖముగా, క్షత్రియులను బాహువులుగా, వైశ్యులను తొడలనుచు శూద్రులను పరమ పవిత్ర పాదములుగా నిలచి వెలుగు నీరజాక్షా సహస్ర శీర్షః, సహస్ర పురుషః, సహస్రాక్షః, సహస్ర పాత్ " అను ఓ పరమపురుషా.... ప్రణతులు స్వీకరించు. వినతులనందుకో!

ఆది మధ్యాంత రహితా, అనంతా, అచ్యుతా, ఆది పురుషా.... పాహి, పాహి.

సర్వాంతర్యామి, సర్వావస్థా, సర్వ హృదయవాసా, సర్వేశ్వరా, సదాశివా... యదునందన, భక్తరక్షక, భవభయహర, దీనజన శరణ్యా, కరుణ కావుము. శరణు నీయుము!

అవతార పురుషా.... అనంతా!''

అని పరిపరి విధముల, అంతకుమించి మరో మహత్తర అదృష్టం లభించని, ఆ మహావిష్ణుభక్తుడు, పరమ భాగవతోత్తముడు సలిపే ప్రార్థనములకు పరవశించి మురిసిపోతూ - కైవల్యపద ప్రసాదితుడైన ఆ కరుణాంతరంగుడు... అని విష్ణువుని-

**నమః కృష్ణాయ, వృష్ణివంశాయ, వాసుదేవాయ, సారంగాయ, దేవకీ సుతాయ, నందనందనాయ, యశోద తనయాయా.... హరే మంగళాయ, మధుసూదనా, మదనాంతకాయ, మహాదేవాయ, మహాపురుషాయ నమః" అని అదేపనిగా ప్రార్థన చేస్తున్నాడు. ఇక్కడా - భక్తవరదుడైన కృష్ణుడు వున్నాడు.**

అక్కడా - ధర్మరాజు వద్ద నుండి బయల్దేరమని హెచ్చరిస్తున్నాడు.

అందరు కలిసి - కురుక్షేత్రాన్ని దర్శించారు.

అక్కడే వున్న కృష్ణుని, ఇక్కడే వున్న వారందరు, భక్తితో నమస్కరించి ప్రస్తుతించారు.

ధర్మరాజుతో "యుధిష్టరా! అని "ఇది శ్యమంత పంచకం'' - దీనిని స్మరించిన'' జీవుడు - సర్వ పాపవిముక్తుడౌతున్నాడు'' అందరితో కలిసి -

"యత్రయత్ర రఘునాధ కీర్తనం, తత్రకృత మస్తకాంజలి, బాష్పవారి పరిపూర్ణ లోచనం, మారుతిం నమతరాక్షసాంతకం -'' అన్నట్లు

ఈ బ్రహ్మమూర్తి - అణువణువున, నరనరాల్లో శ్రీకృష్ణమూర్తిని నింపుకుని, ఆనందప్రదుడై చరిస్తున్న తరుణంలో -

"పరమ పవిత్ర గంగాసుతా! సతత పరమేశ్వర - దర్శన - ప్రసాద సిద్ధిరస్తూ!

మనోవాంఛా ఫలసిద్ధిరస్తు - శాశ్వత దివ్యలోక ప్రాప్తిరస్తు -"అని అభినందించి-

యత్ర యోగీశ్వరః కృష్ణో ... అనే ఆ పరమ పుణ్యుడు - "పరమపూజ్యా! సమాహిత చిత్తముతో సర్వేశ్వర ధ్యానంతో సదానంద, చిదానంద, బ్రహ్మానంద, నిత్యానందప్రదుడివై - దివ్యానందమూర్తివై వర్థిల్ల గోరుతూ ఆనందా- మృతపానా! అద్భుత చారిత్రా! అభీష్టం తెలియబర్చు - తక్షణ మొసగి - సత్సంప్రదాయ బద్ధుడినై నేను తత్ఫలము, సత్వర మొసగెదనంటాడు.

శ్రీకృష్ణుని చూసిన భీష్మునితో "నారదాది మహర్షులు, మునులు, దివ్యులు అందరు వచ్చి యున్నారు. నీ నుండి, నా నుండి, మన నుండి - దివ్య జ్ఞానామృతపానం చెయ్యాలని తహతహలాడుతున్నారు.

ముందు చెప్పే మహనీయుడు కావాలి. తదుపరి - వినగల ధన్యచరిత్రుడు కావాలి. విన - వీలైన - సర్వార్హతలు కల ధర్మజునికి ధర్మోపదేశం చెయ్యమన్నాడు.

అంతవరకు - భయభక్తులతో సదా మెలిగే యుధిష్ఠరుడు తాతగారి ముందుకు వచ్చాడు.

"నాయనా, యుధిష్ఠరా! అఖండ యశో కీర్తి విరాజితుడవు కమ్మని ఆశీర్వదించి "ఓ నందనందనా! ఆ "నంద"వదనా, చెప్పగల్గినవాడివి నీవు. వినదగిన వారలము, మేము. కరుణించి, కటాక్షించుము" అన

అనుభవముతో - ధర్మాధర్మములు తెలిసిననీవు - అనగా -

ఈ స్థితిలో చెప్పు ఓపిక, శక్తి, తేజము లేదు - నీవే - చేతులు జోడించాడు.

"గంగానందనా! నీకు మూడు వరాలనిస్తున్నాను. మొదటిది - శరీర బాధ కలుగదు. మూర్ఛనొందవు. ఆకలి దప్పికలు, వుండవు. సాధారణ శారీరివై - తేజో ఓజస్సులు కల్గి - నీ ధర్మపథమును, ఈ మానవాళికందించుము. సాక్షియై ఈ వాసుదేవుడు

**"వాసనాద్వాసుదేవస్య వాసితంతే జగత్త్రయం**
**సర్వభూత నివాసోపి వాసుదేవ నమోస్తుతే!**

అంటారు కదా! ఆ విధంగా సాక్షిభతుడనై ప్రవర్తిస్తాను. నీవు ప్రసాదించిన సిద్ధాంతాన్ని ఆమోదిస్తానంటాడు.

అది మహాద్భుత సందర్భము. మరుపురాని సంఘటన.

ఆ సమయంలో దేవదుందుభులు మ్రోగాయి. పూలవర్షం కురిసింది. పుడమి ధన్యత చెందింది.

అందరి హృదయములు ఆనంద చంద్రికల ప్రకాశించాయి. ఆ రాత్రికి అందరు భీష్ములవద్ద వీడ్కోలు తీసుకుని, తెల్లవారి, ఎటువంటి అట్టహాసము

లేకుండా, శాంతనవుని చేరారు. ప్రశాంత మనస్సుతో, వాసుదేవుడొసగిన శక్తితో "ధర్మజా!" అన్నారు.

ధర్మజుడు తలవంచి నమస్కరించాడు.

బిడియపడకు. రాజధర్మము నీవు నిర్వహించావు. క్షత్రియ ధర్మము వీరత్వము. దానికి మూలం శౌర్యము. దానికి ధర్మం ఆధారం. అది రక్షణ సమన్వయం. నిజమైన క్షత్రియుడు, ఆత్మరక్షణ లేక - సకల జీవ సంరక్షణ, ధర్మ సంరక్షణా జరిపే ఏ కార్యక్రమమైనా బ్రహ్మవేత్తలు చేసే యజ్ఞయాగాదుల వంటివి.

వీటివలన ఎవరికి ఏ పాపము రాదు.

వాళ్ళు అత్యంత శక్తివంతులు, దృఢవ్రతులు, సత్యధర్మస్వరూపులై విరాజిల్లుతారు. నా వలన ఇంత నష్టం జరిగింది, ఇంత పాపం జరిగిందని బాధపడరు. ఒళ్ళు కొవ్వెక్కి అధర్మమార్గాన ప్రవర్తించి, నాడు దుర్యోధనుడు చెప్పినా వినని అజ్ఞాని.

వచ్చిన ఆపదను, సకల మానవాళి సంక్షేమ కర్తవ్యంగా తీసుకుని, కొందరికే ఆనందప్రదుడైన వ్యక్తిని అందరికి ఆనందమూర్తిగా - శ్రేయోగామిగా చేసావు. చాలా సంతోషం. బాధపడకమని - ఓదార్చారు.

ధర్మరాజా! ముందు అజ్ఞానం "శతృవు". జ్ఞానం మిత్రుడు. ఎంతసేపు అజ్ఞానంతో మనం, మన బుద్ధితోనే ఆలోచిస్తాము. తప్ప, జ్ఞానమొంది ఉపనిషత్తు ధర్మ-శాస్త్ర ప్రకారం నడువ ప్రయత్నించము. అది తెలుసుకోవాలనే ఆలోచన చేయము.

పొరపాటున ఎవరైనా చెప్ప సిద్ధబడితే, "అడగకుండా తలిచిన అదృష్టమని సంతోషించకుండా" కర్మ. మొదలెట్టాడురా, సోది...!" అంటు విసుక్కుంటూ మనకు అవసరం వచ్చినప్పుడు ఎవరి దగ్గరకైనా వెళ్ళి అడిగితే -

వాడు మనలాంటివాడే కాబట్టి - కొందరు తెలివిగా ఏదో చెప్పి పంపేస్తారు. కొందరు మధ్యస్తంగా మాట్లాడి పంపుతారు. ఇంకొందరు "ఇదంత అవసరమా, ఇది కడుపు నింపుతుందా... ఎందుకీ అనవసర...!" అని సిద్ధాంతాన్ని రాద్ధాంతంగా మారుస్తారు.

మరి కొందరు చెప్పటానికే పరిమితమౌతారు. వారికి శాస్త్రజ్ఞానం శూన్యం.

ఇంకొందరు - అవి, ఇవి చూసి... తెలుసుకుని గ్రంథరచనకు ప్రారంభిస్తారు.

ఇదీ... అంతే! విషయ పరిజ్ఞానం లేకుండా, శాస్త్రాభ్యుదయం తెలియకుండా, వూరిలోని కచేరిలు, చావిడుల వద్ద - వుబుసుపోని కబుర్లు చెబుతారే... అలాగ వుంటాయి, ఈ రాతలు, చర్యలు, మాటలు!

వింటున్న ధర్మరాజు, పితామహా "ఈ సంసారాన్ని తరింపచేయు, దివ్య జీవన మార్గముగా - ఏదైనా.... అనగా తప్పక చెబుతానని, మందహాసంచేసి-

"నా అదృష్టం. ఈ కథ ఇందలి భావము, త్యాగము, ధర్మము, సందర్భము, సర్వము ఆ వాసుదేవుడే. వాని సమక్షంలో దీనిని వివరించగల్గడం నా అదృష్టమన్నాడు.

పూర్వమొకసారి - ఈ రుక్మిణీ ప్రియవల్లభుడు, తన దేవేరి రుక్మిణితో కలిసి, ఉత్తమ కుమారుని పొందవలెననెడు తపనతో, ఈశ్వరుని గూర్చి తపస్సు చేయ, హిమవత్పర్వత ప్రాంతాలకు వెళ్ళాడు. తపస్సు ప్రారంభించాడు.

శ్రీకృష్ణుడు భార్యాసహితుడై చేసే తపస్సు అనేసరికి అందరిలో ఆశ్చర్యం ఆనందం కల్గాయి. ఆయనే దేవదేవుడు, అవతార పురుషుడు, ధర్మమూర్తి. ఇక రుక్మిణీ మాత... ఆ... ఆదిలక్ష్మి.

అటువంటి వీళ్ళు... ఆశ్చర్యం పోతూనే... తమ ఆశ్చర్య దివ్య రహస్యాన్ని తెలుసుకోవడానికి  నారదాది దివ్యర్షులందరు ముక్కుమూసుకుని తపము చేసే ముకుందుని సమీపించారు.

"కృష్ణా, యదునందనా, వాసుదేవా, గోవిందా! వుంది కదా! ఆయన బిరుదావళి స్తోత్రం ప్రారంభించారు.

వచ్చినవారిని అర్ఘ్యపాద్యాదుల పూజించి, తగురీతి ఆ దంపతులు సత్కరించి - ఇష్టాగోష్టి జరుపుతున్నారు.

ఆ సమయంలో అందర్ని ఆశ్చర్యబరుస్తూ, వామదేవుని ముఖము నుండి- ఓ కాంతికిరణం బయటికి వచ్చింది. తేజోరాశియైంది. చూస్తూండగా మహాగ్ని జ్వాలగా మారి, ఆ పరిసర ప్రాంత వనాలను దహించసాగింది. ఇదో క్షణం.

మరుక్షణం - కృష్ణుడు - యధావిధి మందహాస వదనుడయ్యాడు. చిరునవ్వుల అందర్ని చూసాడు. చూస్తుండగా కాలిపోయిన, ఆ వనాలు మళ్ళీ ఫలపుష్ప శోభితములయ్యాయి.

"గోవిందా!" అన్నారు. అలాగ చూస్తున్న వారందరు సంభ్రమాశ్చర్యాల మున్గి తేలుతూ, భయార్తులుగా కనుపిస్తున్నారు.

తాను శాంతించి, వాళ్ళను శాంతపరపింపచేసి "మునులారా! భయపడకండి. ఇదొక లీలా విలాసం. ఒక రాక్షసుడు, లోకాల నాశనం చేయ తలబెట్టేడు. అతన్ని నాశనం చెయ్యాలి. అనుకోని ఉపేక్ష. దాంతోవాడు తనకు ఎదురులేదనుకున్నాడు.

వాడిని సంహరించాలి. నేను కాదు - నా తేజోశక్తి సమన్వితుడైన కుమారుడు. ఆ సంకల్పం - ఆత్మ ముఖముగా అగ్నియై బ్రహ్మను సమీపించింది. చతుర్ముఖుడు నా సందేశమందుకుని, మన్మధుని నాకు "పుత్రునిగా ప్రసాదించాడు. బ్రహ్మను చేరడానికి వెళ్ళే తేజోశక్తి, ఈ వనాలను దహించింది.

తిరిగి ప్రశాంతరూపిగా నన్ను చేరుతూ, దహించివేసిన వనాలను ఫలపుష్ప శోభితం చేసింది. ఇదంతా కాలచక్రమహిమ, దేవరహస్యం. "అవును, మహానుభావులారా! త్రికాల వేదులు. నేను చేయవలసిన కర్తవ్యమును చెప్పి నన్ను కృతార్థుడిని చేయ ప్రార్థనమంటాడు, కృష్ణుడు.

"నటన సూత్రధారి" అనుకుంటాడు, నారదుడు.

అందరు కలిసి - నారదుని - "అయ్యా తమరు సర్వ సమర్థులు, భగవత్కృపామూర్తులు... కనుక...ఈ ఆలోచన రావడానికి తగిన వివరమందివ్వ మనగా - నారదుడు, భక్తజన హృదయాంతర్వర్తి! జగన్నాటక సూత్రధారియైన - కృష్ణునికి నమస్కరించి -

ఇక్కడ కూర్చుంటే... ఇది మహిమాన్వితమైన ప్రదేశము కావున, నాకో కథ జ్ఞప్తికి వస్తుంది.

పూర్వమొకసారి - ఈ ప్రాంతానికి వచ్చాను. ఒక రమణీయ ప్రదేశంలో- సిద్ధసాధ్యాది, సర్వదేవతాగణములు, యక్ష రాక్షసులు... సర్వులు భక్తి వినయముల నిల్చి వుండగా పరమేశ్వరుడు, మహాదేవుడై కూర్చున్నాడు. ఆ సమయంలోనే, పార్వతీమాత, వెనుక నుండి వచ్చి పతి ప్రేమతో, సతీమూర్తిగా, సరదాకని, ఆయన కన్నులు మూసింది.

దివారాత్ర రూపమైన వారి నేత్రాలు క్షణకాలం చీకట్లు ప్రసరింపచేయ, విధిలేక ఈశ్వరుడు మూడవకన్ను తెరిచాడు. దాని ప్రభావానికి, మంచు పర్వతం ముద్దయి కూర్చుంది. జరిగిన దానికి చింతిస్తూ "అయ్యో!" అందా తల్లి.

"చూడు దేవీ. నీవు సరదాకని నా కళ్ళు మూసావు. నాకు చీకటి కలిగింది. లోకాలు చీకటిలో మునిగాయి. వాటికి, నాకు - వెలుగురేఖలు కావాలి కాబట్టి మూడో కన్ను తెరిచాను. ఇది కాస్త ప్రభావమంతమైనది. కాబట్టి కొంత ఇబ్బంది కల్గిందంతేనని" ఆమెను అనునయించాడు.

క్షణమాగి - "పరమేశ్వరా! అందరికి ఒకే ముఖమంటే, మీకు నాల్గు ముఖములున్నాయి. దాని విశేషం తెలుపుతారా ?" అని అడిగింది పార్వతి.

"తప్పక...!" అంటూ, ఒక కథ ప్రారంభించాడు.

"దేవీ! పూర్వము సుందోపసుందులనే రాక్షసులుండేవారు. వాళ్ళు అవధ్యులు, అజేయులు వాళ్ళలో వాళ్ళు కలహించుకుని చావవలసిందే తప్ప, ఇతరులెవ్వరు, వారెవరైనా సరే చంపలేరు. దాంతో వాళ్ళ అవక్ర పరాక్రమాన్ని వక్రం చెయ్యాలని చతుర్భుజ బ్రహ్మ దేవతల ప్రార్థన ప్రకారం మయుని పిలిపించాడు. విషయం చెప్పాడు.

బ్రహ్మ ఆదేశాన్ని శిరసావహించిన మయుడు తన నైపుణ్యాన్నంతా ప్రయోగించి, ఒక అందాలసుందరిని సృష్టించాడు. నిజంగా ఆమె అపురూపమైనది. ఆమెను నా వద్దకు తీసుకు వచ్చాడు. పరమభక్తితో ఆమె నా చుట్టు ప్రదక్షిణం చేస్తుంటే, ఈమె తప్పక దైవ కార్యాన్ని సమర్థవంతముగా నిర్వహించగలదని, తలచి -

ఆమె ప్రదక్షిణం చేసినంతసేపూ నల్దిక్కుల చూసాను. ఆమె పుణ్యమా ? అని నాలుగు దిక్కులకు చూసేసరికి, నాలుగు తలకాయలు మొలిచాయి. ఇదీ కథ.... అని.... తన తలకాయల కథను పరమశివుడు, వివరించి చెప్పాడు.

"మరి.... ఆ కంఠము - నల్లగా వుండటానికి కారణము ? ఆదిశక్తివైనా ఆడది... అనిపించుకున్నావని అనుకుని, అదో పెద్దకథ" అంటూ-

ఒకసారి దానవులు, దేవతలు కలిసి, అమృతం కోసం క్షీరసాగర మథనం చేసారు. ఆ సందర్భంలో కాలకూట విషం పుట్టింది. అది లోకాల్ని దహించి వేస్తుందని భయపడి అందరు నన్ను ప్రార్థించారు.

నా శక్తి నాకు తెలుసును కాబట్టి, వాళ్ళందరి కోర్కెను మన్నించి, నేరేడు పండు వలె ఆ విషాన్ని త్రాగాను. కంఠంలో బంధించాను. దాంతో కంఠం నల్లగా తయారయింది. ఆ క్షణం నుండి, అందరు నన్ను నీలకంఠుడని పిలువడం ప్రారంభించారని చెప్పి, అయిందా ? ఇంకా కథలు వున్నాయా ? అన్నట్లు ఆగాడు.

అంతా విన్న ఆ పర్వత రాజపుత్రి "అవును. ఈ పినాకం కథేమిటో.... అంది. దానికి శివుడు ఏమీ తెలియకుండా నన్ను కట్టుకున్నావా ?" అని అడుగుదా మనుకుని, కొద్దిగా తగ్గాడు. అది - అంటూ - పినాకం కథను మొదలుపెట్టాడు.

"పూర్వం...!" అంటే... అనాది రోజులలో కణ్వుడనే మహర్షి అసాధారణ తపస్సు చేసాడు. దాని ఫలితంగా ఆయన శరీరం మీద పుట్ట పుట్టింది. పెరిగింది. అందులోనుండి వెదురు మొలిచింది. అందులో మహర్షి వున్నారని చెబితే తప్ప, తెలియని పరిస్థితి ఏర్పడింది.

ఆ తరువాత బ్రహ్మదేవుడు ప్రత్యక్షమవడం, వరాలనివ్వడం జరిగి పోయింది. అదొక కథ. సరే.

అందులో నుండి మొలిచిన వెదుళ్ళతో మూడు విల్లులు చేయబడ్డాయి. అందులో ఒకటి - నారాయణుని శారంగం. రెండవది ఈ పినాకం. మూడవది- నరుని - ఇప్పటి గాండీవం. కానీ, మొదట్లో దానిని బ్రహ్మ తీసుకుని వెళ్ళాడు.

మహర్షి.... తపో స్థలంలో జన్మించిన వెదురు నుండి మహాశక్తిగా రూపొందిన "ఈ పినాక"మంటే "నాకెంతో ప్రీతి. ఇదీ దాని కథ" అన్నాడు. శ్రద్ధగా విని, "ఆహా...!" అన్న పార్వతి -

మరి ఆ ఎద్దు - అదే వృషభవాహనమెలాగ వచ్చిందో.....!" సాలోచనగా అడిగింది. అర్థోక్తిలో... ఆగింది.

"అదా... అప్పుడు నేను హిమగిరిపై తపస్సు చేస్తున్నాను. అప్పుడు కొన్ని ఆవులు, మందలో నుండి తప్పిపోయి, నా చుట్టు తిరుగుతూ, చిత్రంగా అరుస్తు అల్లరి చేస్తున్నాయి. దాంతో నాకు కోపం వచ్చింది. నాకు తపోభంగం చేస్తున్నాయని, కోపంగా చూసాను. ఇంక వాటికి తిరుగుడు వగైరాల అల్లర్లు తప్పి - స్తబ్దుగా వుండిపోయాయి

అప్పుడు బ్రహ్మ వచ్చి కరుణాళువై వాటి సంతాపం తీర్చ నాకో వృషభాన్నిచ్చాడు. అప్పటినుంచి వృషభవాహనుడనయ్యాను. నాకు వృషభ ధ్వజం పతాక అయింది. ఈ వృషభం నా వాహనం పొందినప్పటి నుండి నేను పశుపతి నయ్యాను. మరి నాకూ పతే కదా! మరి - ఈ పశుపతి....! తనను పశువంటారేమీ నన్నట్లు చిత్రంగా చూస్తూ అడిగింది.

"పార్వతీ! పశువు అజ్ఞానికి నిదర్శనం. యజ్ఞానికి ఆహుతి. అంటే యజ్ఞ పురుషునికాహారం. అజ్ఞానాన్ని పోగొట్టే వాడినని, యజ్ఞముఖమున, ఆ మఖములో పడే పశువులను స్వీకరిస్తున్నానంటే, వాళ్ళ వాళ్ళ అజ్ఞానాలను తొలగించే, జ్ఞాన ప్రదాతనని అర్థం.

అంతేకాని, పశుపతి.... అంటే, వాటిని కాచుకునేవాడిని కాదు. నీవలె వాళ్ళకు భర్తను కాను. పశురూప, పాశవిక లక్షణ అజ్ఞాన తిమిరాన్ని నాశనం చేసి, సాత్విక, సత్వ-జ్ఞానమూర్తిని చేసే - సదా"శివు"డనని అర్థం. అర్థమయిందా ?" అనగా -

"చిత్త"మంది పార్వతి.

"ఏ.. చిత్తం ? నా చిత్తమా, నీ చిత్తమా ? ఎవరి చిత్తం. ఎటువంటిదా చిత్తం!" అనగా -

"అది సరే. ఈ భూతనాధుడేమిటి ? ఆ స్మశాన వాసమేమిటి ?" అమాయకంగా ముఖంపెట్టి అడుగుతూంటే, నారదుడు "ఈమె శివచరిత్ర మొత్తం చెప్పిస్తుంది తల్లి, ధన్యుడననుకున్నాడు. నా చరిత్ర నా చేత చెప్పించే, అసాధ్యురాలనుకున్నాడు - శివుడు!

"భూత పతి" అంటే.... ఏమిటని కదా, నీ సందేశం.

"సర్వ భూతాలకు నిలయుడ నైన నన్ను. అన్నీ నన్నే ఆవహించుకుని వుంటాయి. కొన్ని తమ తమ కర్మల వలన నాకు దూరమవుతాయి. కొన్ని దగ్గరయి నాతో, నాలో కలిసి వుంటాయి. తటస్థ విధానంతో ఇంకొన్ని బ్రతుకుతుంటాయి.

ఈ సకల భూతముల కర్మలు నాకెరుకే. భూతములంటే, కేవలం యక్ష రాక్షసులనుకోకు. జీవులు, కూడా కర్మానుగత భూతములే. ఈ భూతముల

అంతిమ ప్రయాణం, శ్మశానానికి. ఎన్ని ఎలాగ అనుభవించినా, చివరికి మిగిలేది, కలిగేది ఈ బూడిద మాత్రమేనని లయకర్తగా నా సందేశం.

అది తెలుపడానికే స్మశానవాసం. బూడిద ప్రసాదం. ఇది తెలుసుకుంటే, ప్రతి జీవితం ధన్యం.

మరి ఈ ఆభరణాలు. వీటిని పాములనాలో లేక నాగాభరణాలనలా ? దగ్గరకు వస్తే బుస్సుమంటాయనే భయంతో బ్రతకాలా ?

"చూడు పార్వతీ. శాంతము, వేడి అని రెండు విధములుగా ఈ లోకముంది. సత్యము, క్రోధము అనేవి మరో రెండు విధాలు. ఈ సత్యాన్ని - సౌమ్యమంటారు. అగ్నేయమంటే తెలిసిందే - అగ్ని స్వరూపం. సత్వ గుణానికి శ్రీహరి ప్రధానుడు. ఈ అగ్ని స్వరూపానికి అదే - లయకారకత్వానికి పరమశివుడు ప్రభువు. అందుకే - దుర్గుణ, దుర్మధాందులకు, ఈ విషసర్ప హారాలు, ప్రాణభయాలు.

"ఈ చంద్రుడెందుకు.... మధ్యలో మన మధ్య" అనగా

దక్ష యజ్ఞ సమయంలో, ఈ చంద్రుని అహంకారానికి, అతన్ని కాళ్ళతో తొక్కి దండిస్తూంటే అతడు శరణాగతుడయ్యాడు. అందితే జుత్తు లేకపోతే కాళ్ళంటారు కదా! ఆ కాళ్ళు పట్టుకున్నవాడిని కటాక్షించి నెత్తినెక్కించుకున్నాను.

మరి గంగ... అనబోతుంటే, ఆ పార్వతీపతి, "చాలు, చాలు" అన్నట్లు, ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. బుసకొట్టే పాములు ప్రక్కకు తొలగాయి. నెత్తిన వున్న చంద్రుడు, అలాగ పైకి, పైకి చూస్తూ తన ప్రియురాండ్రతో సయ్యాట మొదలుపెట్టాడు.

శివకేశవులు అభేద స్వరూపులు కాబట్టి, కృష్ణుడు హిమశైలంపై తపస్సు ప్రారంభించాడు. శివుడు ప్రసన్నుడయ్యాడు. శ్రీకృష్ణుని మనోవాంఛితం నెరవేర్చాడు. ఈ రుక్మిణీ - శ్రీకృష్ణుల కుమారుడే "మన్మధ" రూప ప్రద్యుమ్న కుమారుడు.

అయితే, ధర్మరాజు.... ఏదో అడగబోతున్నాడు.

ఉత్తరాయణం వచ్చేస్తుంది. ఇక కబుర్లతో కాలక్షేపం చెయ్యలేను. మీరంతా ప్రేమించి, గౌరవించే, ఆ శ్రీ మహావిష్ణువు. ఆయన నామం ఒక్కటి చాలు. సర్వపాపాలను పరిహరించి పరమపూజ్యుని చెయ్యడానికి. ఇందుకు విష్ణు సహస్రనామమే నిదర్శనం.

దానిని పఠించండి. పరమపూజ్యులు కండి. మిగిలిన అనుమానాలను, చెంతనే వున్న - ఈ దేవదేవుని నుండి పొందమని కోరాడు.

**"ఓం నమో భగవతే వాసుదేవాయ....!"**

ఇదొక్కటి చాలు, మానవులను తరింప చెయ్యడానికి. అయితే - ఇక్కడో విషయం తెలుసుకోవాలి.

సమర్థులు, వేదవిదులైన బ్రాహ్మణోత్తములు పై మంత్రమొకటి... అనుకుని వూరుకుంటే, ఏ ఫలితం రాదు. వారు, వారి నియమిత కర్మలతో ఆరాధిస్తేనే వారిధర్మం, లోకధర్మం నిలబడుతుంది. అలా కాకుండా అపభ్రంశ విధానాలతో సంచరిస్తూ - పై మంత్రం పఠిస్తే పుణ్యం దొరకదు. పుణ్యచరిత్రులు కాలేరు.

భగవత్కారుణను పొందలేరు.

"స్వధర్మే నిధనః శ్రేయః" అన్నట్లు, వారి వారి నియమిత ధర్మాలను నిర్వర్తిస్తూ, చేసే పై మంత్రపఠనం భుక్తిముక్తులను ప్రసాదిస్తుంది. కనుక - ధర్మరాజా!

సూక్ష్మంలో మోక్షమని అడ్డదారులు త్రొక్కితే దుర్యోధనుడు చేసిన అసందర్భ యుద్ధమే అవుతుంది. అప్రజాస్వామిక, అరాచక శక్తుల నిలయ మవుతుంది. కనుక -

ధర్మదీక్షుడు - దక్షుడైన - ఆ శ్రీహరి ఈ శ్రీకృష్ణుని రూపంలో ప్రభవించారు. ఆయనను సేవించుకోండి! అంటున్న సమయమునే తన చిత్తాన్ని ఆ శ్రీహరిపై వుంచి శ్వాసను బంధించాడా యోగమూర్తి. ఒక్కొక్క ప్రాణమే అనంత వాయువుల్లో కలసిపోతుంది. ఆ శరీరాన్ని ఇన్నాళ్ళు ఆవహించుకున్నట్లు, గుచ్చుకున్న బాణాలు ఒక్కొక్కటే క్రింద పడిపోతున్నాయి. బ్రహ్మాండమైన శబ్దంతో కపాల మోక్షమయింది. వసువులలో ఎనిమిదవవాడు ఆఖరివాడు అయిన "ద్యౌ" ఈ ఇహలోక జీవితానికి స్వస్తి పలికాడు.

ఈ సమయంలో.... సాధారణ స్త్రీలాగ గంగ వచ్చింది. కుమారుని చూసి బాధపడింది. అధర్మ యుద్ధం చేసి, నా కుమారునిలాగఅంపశయ్య నెక్కించిన ఆ దురాత్ముని తల.... అనతికాలంలో ఈ భూమిపై తెగిపడుగాక!" అని శపించింది.

"అమ్మా! నీవు "మానవీయు"రాలవయ్యావు. పుత్రప్రేమ మంచిదేకాని అది గుడ్డిప్రేమ కారాదు. తాత అనుమతితో మనవడు చేసినది అన్యాయం, అధర్మం కాదు. అయినా తొందరపడవద్దని, గంగను శాంతింపచేస్తాడు కృష్ణుడు.

గంగ మాట తప్పదు. అయితే పరమ కరుణామయుడైన ఆ భగవంతుడు గంగకు పూజనీయుడే! ఆ మహనీయుడు ఈ అధర్మము, క్రోధము శమింపచేయు గాక!" అని అర్థిస్తాడు.

ఇదొక శుభ సమయంగా వసువులు, తమ వాడినాహ్వానించారు. దేవతలు పుష్పవర్షం కురిపించారు. ఇక్కడ సంస్కార కార్యక్రమం ప్రారంభమయింది. నారదాదులే, ఈ అంతిమయాత్రలో పాల్గొన్నారంటే భీష్మడెంత గొప్పవాడో అర్థమవుతుంది.

పితామహుని పంచప్రాణాలు... ఒక్కొక్కటిగా అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆ మహనీయునికి జరుపవలసిన విధంగా, వేద ధర్మసమ్మతంగా అంత్యక్రియలు జరిగిపోయాయి.

గంగా స్నానం చేసి, శుచియై గట్టునెక్కుతు యుధిష్ఠరుడు, ఘొల్లుమన్నాడు.

అనాధలమైన తమను తెచ్చి, ఆధారంలేని తమ బ్రతుకులకు ఆధారం కల్పించి, పెంచి పెద్ద చేసిన ఆ మహనీయుని, చేజేతులా చంపుకున్నామని ఎంతో బాధపడ్డాడు.

దీనికి మళ్ళీ దుర్యోధనుని దుర్బుద్దే కారణమై ఇంతమంది దారుణానికి, మహనీయుల మరణానికి, కారణమయిందని వాపోయాడు. భీష్మ, ద్రోణ, కర్ణ.... దారుణ వధలు.... నన్ను నిలువనా కృంగదీస్తున్నాయి. అశక్తుడనని కుమిలిపోతున్నాడు.

వ్యాస భగవానులు ఆ పిల్లవాడిని ఓదార్చారు. "నాయనా! దుఃఖం తీరనిది. బాధ మరువరానిది. పాపం తరగనిది. పుణ్యం పెరగనిది.

ఇటువంటప్పుడే హృదయం చక్కబెట్టుకోవాలి. ఇక్కడ మానవధర్మం కన్నా, రాజధర్మమే ఎక్కువ ప్రాముఖ్యత - ప్రాధాన్యం వహించేది.

అధర్మవర్తునులనెంతమందిని చంపినా పాపం కాదు. కాకపోతే, వాళ్ళు మహనీయుల, పుణ్యమూర్తుల చేతులలో మరణిస్తే పుణ్యలోకాలనొందుతారు. అదే దిక్కుమాలిన చావు పొందారంటే శాశ్వత నరకవాసులౌతారు.

జీవుల ధర్మం .... జనన మరణాలు. అది నిరంతరం సాగే ఓ ప్రక్రియ.

ఇది నిర్విరామంగా - ఒక చక్రం వలె సాగాల్సిందే తప్ప, దీనికి ఎక్కడా ముగింపు వుండదు. ఈ సత్యమే కాదు, అన్నీ తెలిసి అనవసర శోక మొందడం, తద్వారా తీరని దుఃఖానికి దారి చేయడం తగదు. ఈ దుఃఖ పరిహారార్థం - అశ్వమేధం చేయి. నువ్వు ధన్యుడివవుతావు. నీ వాళ్ళందరు కూడా శాశ్వత పుణ్యలోకాలు పొందుతారు. నువ్వు భయపడి, బాధపడే పాపలోకం నుండి బయటపడతావు'' అని సూచించారు.

హస్తినాపుర ప్రభువుగా యుధిష్ఠరుడు రాజ్యమేలుతున్నాడు. ఇటువంటి తరుణంలో ఒకసారి, కృష్ణార్జునులు ఇంద్రప్రస్థానికి వెళ్ళారు. ఆ వాతావరణం చాలా బాగుంది. కానీ అర్జునునికే వేదన కల్గించింది.

హస్తిన నుండి ఇక్కడికి వచ్చింది, కొంతమార్పుకోసం. అది కొంత నెరవేరింది. కృష్ణుడు కూడా తన లక్ష్యం నెరవేరి ఒక ధర్మప్రభువు సామ్రాజ్యం స్వీకరించాడని సంతోషించాడు. అప్పుడే -

"అర్జునా! మీ అన్నదమ్ముల సమిష్టి కృషి - సమత్వ భావన, ఏకదృష్టి మీకిన్ని విజయాలను సమకూర్చి పెట్టాయి. ఈ యుగంలోనే కాదు, ఈ జగాలలో అన్నదమ్ములకు మారుపేరు "పంచపాండవులు'' అన్నది లోకప్రసిద్ధి గాంచిన, "సత్యం''గా సత్యవంతం చేసారు.

"చాలా రోజులయింది. ఎందుకో మనసు ఇంటివైపు మళ్ళింది. వెళ్ళాలి. వీలు చూసుకుని నా విషయం సామ్రాట్టుకు తెలియచెయ్యమనగా -

"కృష్ణా! నీకు మరొకరి అనుజ్ఞా. సర్వజీవులకు దిశా నిర్దేశం చెయ్యగల సర్వశక్తిమంతుడవు. సరే. అయినా నీ మాటను గౌరవించి, అన్నగారికి తెలియ బరుస్తాను.'' అంటాడు.

"బావా! నీకో విషయం చెప్పనా ? నీ సన్నిధానంలో అంతా జరిగిపోయింది, సంతోషంగా వున్నాము. ఇది నిజం. అయితే నీవు నీ ఇల్లు వాకిళ్ళు బాధ్యతలను మరచి ఎన్నాళ్ళని ఇక్కడ వుండగలవు ? ఎన్నాళ్ళని ఇక్కడ వుంచుకోగల్గుతాము.

మా బాధలు మావి. కర్మ గతానుసారం వచ్చే సర్వం ఆ జీవుడే అనుభవించాలి. తప్పక...!" అన్నాడు.

అప్పుడు కృష్ణుడు "బావా! ఎన్నో రహస్యాలు చెప్పాను. అన్నీ నాకు గుర్తున్నా లేకపోయినా నీతోపాటు వ్యాసులు, సంజయుడు, ఆతని ద్వారా మీ పెద్దనాన్న ధృతరాష్ట్రుడు విన్నారు. ఇవి నిత్యసత్యాలు.

మరొక్క విషయం. ఇది శాశ్వత సత్యం.

మీకు మీ బాధలొక్కటే అవి - బంధాలు, బరువులు - మరి, నాకో!

ఈ సర్వజీవుల బాధలు, బాధ్యతలు, బరువులు, బంధాలు - సమస్యలు, వాటి పరిష్కారాలు.... వీటిని పరిష్కరించాలి.

మీకొకే బాధ, అది తీరితే ఆనందం. నాకో -

ఇన్ని బాధలలో ఎన్ని తీరినా, ఇంకా... ఎక్కడో అక్కడ, ఎప్పుడో... ఒకప్పుడు... అన వీలులేకుండా, అనుక్షణం, అందరి సమస్యలు కృంగదీస్తూంటే, ఇన్ని సమస్యలకు సమాధానంగా నేను స్పందించాలి.

ఇంకో సత్యం నీకు తెలుసా ?

మీరు ఏడిస్తే ఏడవాలి. నవ్వితే, నవ్వాలి. ఇది - నా జీవితం.

ఇప్పుడు చెప్పు - ఎవరికెక్కువ బరువులు బాధలు - బాధ్యతలు - సమస్యలున్నాయో ఆలోచించు. కనుక... "నాకీ కష్టమొచ్చింది" అని బాధపడకండి. నా "కే" కష్టమొచ్చిందని ప్రశ్నించుకుంటే అంతా సుఖమే. కాదంటే అంతా విషాదమే!

ఇవన్నీ నీవు గుర్తుపెట్టుకుంటే, కృష్ణుడికున్న బాధలు నాకెన్ని వున్నాయని, బాధను మరచి, బాధ్యత ప్రకారం నడుచుకుంటావు. చిన్నప్పటి నుండి, నిన్నటి వరకు, నీకు తెలిసి నేనెన్ని బాధలు పడ్డానో.... తన శరీరం చూబుతూ, ఎన్ని గాయాలు పొందానో.... మాటలు పడ్డానో అలాగే, మీకోసం - "నేను" అన్న విషయం మరచి ఎన్ని శాపాలు పొందానో.... ఆలోచించుకో!

ఇప్పుడు నీకో - సంఘటన చెబుతాను. జాగ్రత్తగా, మనసుకు పట్టించుకో!

ఒకసారి నా వద్దకో బ్రాహ్మణుడు వచ్చాడు. ఆయనను తత్వజ్ఞాన రహస్యాలను, పద్ధతులను తెలియబరచమని కోరాను. అందుకాయన ఈ విధంగా తెలుపుతున్నారు.

నాకు తెలిసి, ఒకచోట ఒక సిద్ధుడున్నాడు. ఆయన అన్నిట సిద్ధుడే! ఆయన వద్దకు కశ్యపుడనే బ్రాహ్మణుడొకడు వచ్చాడు. ఎందరో మహనీయులతో సేవలు పొందే, సిద్ధుని శిష్యరికమపేక్షించాడు. ఆతని అదృష్టం కొద్దీ - ఒక మహనీయునకు శిష్యుడయ్యాడు.

గురుసేవలలో కశ్యపుడు చాలా మంచివాడనిపించుకున్నాడు. శ్రీ గురుసేవకు మించిన అదృష్టం మరొకటి లేదన్న సత్యం, సంపూర్ణంగా శ్రీ గురువుల ఎడ నిరూపించుకున్నాడు.

"చూడు నాయనా! ఈ దేహి - ఇవ్వాల్టికి పరిపూర్ణుడయ్యాడు. తెలియడం వేరు, తరించడం వేరు. తరించాలంటే విషయం తెలియాలి. దానికి వివేకం, అక్కడ నుండి సుజ్ఞానం, అక్కడనుండి విషయాసక్తి, అందుండి తెలుసుకోవడం...

ఇంతటితో జీవితమైపోలేదు.

ఇందులో - కేవలం మొదటిదశ పూర్తయింది.

సామాన్య చదువులలో అయితే దీనిని ప్రాథమిక "శిక్షణ" అని అంటారు. ఈ - తెలుసుకున్న దానిని - ఇప్పుడు - సాధనమ్మో, వైరాగ్యము ద్వారానో మనసుకు పట్టించాలి. బుద్ధిని వికసింప చెయ్యాలి. దానికి పదును పెట్టాలి. ప్రపంచంలో వుంటే దాని విపరీత పోకడలకు, అరిషడ్వర్గాలకు, ఇంద్రియ లోలత్వానికి లొంగకుండా, జితేంద్రియుడు కావాలి.

అప్పుడు - తెలుసుకున్న దానికి అర్థం దొరుకుతుంది. ఇది దొరికిన తర్వాత "హమ్మయ్య" అని చతికిలబడితే లాభం లేదు. ఆ కూర్చున్నవాడు, కూర్చున్నట్లే వుంటాడు. రాను రాను, తానెక్కడున్నా అందులో కూరుకుపోయి, బయటికి లాగేవాడు లేక - బయటికి రాలేక - పునరపి జననం - పునరపి మరణమౌతుంది. ఇక వాడు సాధించేదేముంది ? తెలుసుకున్న దానికి ఫలమేముంది ? ఫలితమేముంది ?

ముందు ఎవరినో ఉద్ధరించడానికి కాదు, నిన్ను నీవు సంస్కరించు కోవడానికి విషయ పరిజ్ఞానం కావాలి. "నాకు తెలుసు...!" అంటావు, అనుకుంటావు. ఏం తెలుసు ? అని ఎదుటివాడు ప్రశ్నిస్తాడు. నీకేం తెలుసు ? అంటే వికటో పర్యంతంలాగ వుంటుంది. దీనికీ ఓ కథ వుంది. చెబుతాను వినమంటాడు.

ఒకాయన, తన గ్రామం నుండి సాధారణ సంచారిగా బ్రతుకు తెరువు కోసం బయలుదేరాడు. ఎవరెవరినో కలుసుకుంటున్నాడు. ఎవరు నువ్వు... అంటే చెబుతున్నాడు. ఏం చదివావు. అంటే... వికటో పర్యంత.... మంటాడు. అక్కడే అవతలి వారికి అర్థం కాక, ఇక ఆతనితో వాదించడమిష్టం లేక, తమకు తోచినదేదో, అతనికి యిచ్చి గౌరవించి పంపుతారు. అప్పుడతను, వీడు నాకంటే మూర్ఖుడను కుంటాడు.

ఇలాగ కాలం గడుస్తూంది. ఒకనాడీ పెద్దమనిషి ఓ నగరంలో ప్రవేశించాడు. అక్కడా ఇదే తంతు!

రాను, రాను ఆ గ్రామస్థ పండితునికి, తెలుసుకోవాలనే జిజ్ఞాసకన్న - గౌరవ మర్యాదలు, సన్మానాలు పొందాలనే, కుతూహలం పెరిగింది. అమ్మో! ఆయనా... అంటూ, ఈయనకు గౌరవం పెరిగింది. ప్రజలలాగ పెంచేసారు. సన్మానాలు, గౌరవాలు..... భలే...... భలే...... ఎన్నో రకాల మర్యాదలు..... స్వాగత సత్కారాలు.

మొత్తానికీ - సామాన్య గ్రామస్థుడు ప్రజలచేత గుర్తింపబడ్డాడు. ఘనునిగా కీర్తింప బడుతున్నాడు. తన సంచారంలో ఈ ఘనకీర్తి వహించిన పెద్దాయన. ఒక నగరానికి వెళ్ళాడు. అక్కడ యధావిధి సాంప్రదాయ, సదాచార సభ జరుగుతుంది. ఫలానా వారు... అనేసరికి స్వాగత సత్కారాలతో లోపలికి తీసుకువెళ్ళారు. అంతవరకు బాగానే వుంది.

ఈయన గురించి విన్నవారు గుర్తించి, గౌరవించడం. చిన్నవాళ్ళు సరేసరి. పెద్దవాళ్ళల్లో కూడా అందరూ అభిమానించారు. కాకపోతే ఒకాయన కెందుకో సందేహం రాలేదు, కానీ.... ఎందుకైనా మంచిది ఓ పట్టుబడితే బాగుంటుందనుకుంటున్నాడు. పైగా ఇది విద్యజ్జన సభ.... ఇక్కడాతడు విజయుడైతే అది సరస్వతీదేవి కీర్తికిరీటంలో, కలికితురాయిగా వుంటుందని తలచాడు. అంతే...!

మెల్లిగా, ఈ పెద్దాయన వద్దకు చేరి, వినయ విధేయతలతో నమస్కరించాడు. తనను గురించి పరిచయం చేసుకున్నాడు. తదుపరి - తమరు.... నీళ్ళు నములుతూంటే, యధావిధి ఘనంగా, తన విషయాన్ని తెలియబరిచాడు.

"ఆహా!" అన్నాడు కానీ, ఇందులో ఏదో పితలాటకముందని గ్రహించి "అయ్యా, తమరు శుశ్రూష చేసిన గురుదేవుల నామధేయం... తమ గ్రామం, వగైరా వివరాలు అన్యధా భావించక, తెలియచేయ"మని ప్రార్థిస్తాడు.

ఆ కుర్రాయన ప్రవర్తన, ఈ పెద్దాయనకు శంక రేకెత్తించింది. దానిని కప్పి పుచ్చుకుంటూ "ఇంతకీ మీకు కావల్సింది...!" అంటాడు.

"అదే... అదేం లేదు మహాశయా! ఇది విద్వత్ జనసభ. ఇక్కడ విద్యకు నీరాజనం "జ్ఞానం". అటువంటి మహాశయులను అర్చించుకోవడం, సన్మానించు కోవడం మాకు సాంప్రదాయం. వారికి గర్వకారణమని... తెలియచేసాడు.

ఈ పెద్దాయన ఇరకాటంలో పడ్డాడు. కారణం...?!

ఈయన పెద్దగా చదువుకోలేదు. కాదు. అసలు చదువుకోలేదు. అతను చెప్పింది. అసలైన నిజం. అది అర్థం చేసుకోకపోవడం మన తెలివితక్కువతనం. ఏదో బ్రతుకుతెరువు దొరుకుంది కదా! అని తన సహజ లక్షణంతో ఆ బ్రాహ్మణుడు బయలుదేరాడు.

మీరేం చదువుకున్నారని... అంటే... "వికటో పర్యంత" మంటాడు. అదేం శాస్త్రమో, మనకు తెలియనివి చాలా వున్నాయంటూ, ఆతనిని పెద్దవాడిని చేసారు. చివరికిప్పుడు, అతన్ని నిలదీస్తే -

"అయ్యా! గణపతి శ్లోకమొకటుంది. మీకు తెలుసా ?" అంటాడు.

అదేం తిరకాసో... మళ్ళీ ఈయన చేతిలో అవమానం పొందాల్సి వస్తుందనో మొత్తానికీ చదువుకున్న వాళ్ళందరు వెనకడుగు వేసారు. చివరకు తేలిందే మిటయ్యా.... అంటే...

**"సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణికః**
**లంబోదరశ్చ వికటో....!"**

ఆ తర్వాత... అదేమిటో అతనికి తెలియదు. తెలుసుకోవాలని చాలాసార్లు ప్రయత్నించాడు. కాని ఫలితం కనబడలేదు.

మొత్తానికి - ఆ లంబోదరుని కరుణ, సంపూర్ణంగా కల, ఈ గ్రామస్థుడు- పూజ్యుడు, సద్వంశస్థుడు, ఘననీయుడు, గణనీయుడయ్యాడు.

అలాగ... ప్రతి వ్యక్తి జీవితాంతం తెలుసుకోవల్సింది ఎంతో వుంది. అలాగే సాధించుకోవాల్సింది, ఎంతో వుంటుంది. కనీసం వయస్సును బట్టి అయినా బుద్ధికి పదును పెడితే వాడు జ్ఞాని కాకపోయినా, అజ్ఞానిగా మాత్రం బ్రతుకడు... అని చెప్పి-

"చూడు! నాయనా! జీవి, కర్మ - గతి.... చేసుకున్న పుణ్య-పాపాలు.... ఇవన్నీ గ్రహించగల్గినవారు ధన్యులు. ఇప్పుడు నీకు కావాల్సింది చెప్పు. తప్పక నీ మనోభీష్టం తీర్చ ప్రయత్నిస్తానంటారు.

అప్పుడా శిష్యుడు -కాశ్యపుడు - "గురుదేవా! నాకు శివతత్వాన్ని గురించి తెలియచేయ ప్రార్థనమన్నాడు.

"పిచ్చివాడా! "నేను'' అని తెలుసుకుంటే, అది కానిదే పరము, తత్వము. అన్ని నీవయినప్పుడు, అంతా తానే తప్ప - పరము - పరాయి అనేది వుండదే! అప్పుడు - చెప్పవలసిందేమిటి ? ఏముంటుంది ? నిదానంగా ఆలోచించు.

బుద్ధికి - మాద్యం మెట్లాగో... శరీరానికి - శ్లేష్మము ఒక దోషము. అది పెరిగితే, శరీరావయవములన్ని ప్రకోపింప చేస్తుంది. స్తబ్దుగా పడుకోపెడుతుంది కూడా!

ఈ వాత, పిత్త - కఫాలు - త్రిగుణాల - త్రిదోషాలు. వీటి కోసం.... తగు ఉప సేవలు చేసుకోవాలి. అలాగే - కర్మలు. ఇవి అనంతాలు. అనవరతం అనుసరించాల్సినవే తప్ప -

"హమ్మయ్య!'' పూర్తయిందని. జీవుడు - దేవుడు ఇద్దరు అనుకోరు. కారణం- ఇద్దరు కర్మగతిననుసరించి సాగేవారే!

ఇది - ఎన్నిసార్లు చెప్పినా విషయమొక్కటే. చెప్పే విధానంలోనే తేడా వుంటుంది. వివేకాన్ని మేలుకొలుపుతుంది. కనుక - జ్ఞాన - విజ్ఞానమూర్తివై నాచే ప్రస్తావింపబడిన "భగవంతుని - గీత'' నందుకున్న నీవు సంశయరాహిత్య మొందుము.

సర్వభూత హితుడవై - సమాహిత చిత్తంతో - సర్వులను గౌరవిస్తూ పెద్దలను సేవిస్తూ - ధర్మగతిననుసరించి, నీ... నీ... ధర్మములను నిర్వర్తించు. అప్పుడు నిన్నే పాపము అంటదు. అసలక్కడ "పాప''మనే మాటకు కూడా తావుండదు.

అర్జునా! అరివీరభయంకరుడవు, నీవు. ఎప్పుడు ? అన్యాయం జరిగి నప్పుడు, దానినెదుర్కొవలసి వచ్చినప్పుడు.... అంతేకాని-

అరివీర భయంకరుడవని... అన్నారని, అనుక్షణం శరసంధాన చేసుకుని కూర్చుంటే వీరత్వం రాదు. శూరత్వం పెరగదు. ధర్మం నిలబడదు. చివరకు పాపం... అర్జునుడు... యుద్ధం చేసి, చేసి, పిచ్చివాడయ్యాడు'' అని ప్రతి ఒక్కరు నీ దగ్గరకు రారు కానీ - సానుభూతిని, ఒలకబోస్తుంటారు.

కనుక - ముందు విన్నావు కదా! ఇప్పుడు సాధనం చెయ్యి. తద్వారా... విముక్తి... ముక్తి...లేదా మోక్షం తప్పక సంభవమంటాడు. చెప్పవలసింది, చెబుతాడు. ఇద్దరు కలిసి హస్తినకు వస్తారు.

అన్నగారితో - కృష్ణవాసుదేవుడు, ద్వారకకు ప్రయాణమౌతున్నాడని, తమ అనుజ్ఞ కోసం ఆగాడని, అర్జునుడు చెబుతాడు.

"తప్పక, కానీ... అశ్వమేధయాగ కార్యక్రమ.. మని... ధర్మజుడు ఆగుతాడు.

"నీ యజ్ఞం పూర్తవుతుంది'' అంటాడు.

ద్రౌపది దగ్గరకు వెడితే అనుక్షణం నిన్ను చూడాలనే వుంటుంది. అతి త్వరలో.... అంటే - అభీష్ట సిద్ధిరస్తూ... అంటాడు కృష్ణుడు.

అందరి అనుమతితో, వీడ్కోలుతో- సుభద్రతో - శ్రీకృష్ణుడు - గీతను ప్రసాదించిన జగదాచార్యుడై - ద్వారకకు బయలుదేరాడు.

తాను నిమిత్తమాత్రుడే.... అయినా... అందరు - తననే - కర్త, కారకునిగా తలచి - ఈ జరిగేదానికి, తనను బాధ్యుడిని చేయడానికి నవ్వుకుంటూ...

**"యతో ధర్మః తతో జయః"**

అన్న సూక్తికి పర్యాయ పదమై -

ఆ, ఆది దేవుడు - ఆశ్రిత వత్సలుడు - భక్తపరాధీనుడు. ద్వారకావాసు లందర్నీ... ఆనంద ముద్రల తేలియాడించడానికి - మృదుమధుర మందహాసంతో, తేలిక మనసుతో బయలుదేరాడు.

# ఉదంక మహర్షి

**అ**భిమన్యుని మరణంతో అతి దీనయైన సుభద్రను తీసుకుని శ్రీకృష్ణుడు ద్వారకకు బయలుదేరాడు. దారి పొడుగునా కాలగతిని, కర్మగతిని చెబుతూ చెల్లెలిని ఓదారుస్తున్నాడు.

“చూడమ్మా! ఏడిస్తే ఎవరు రారు. కాకపోతే బాధ కొద్దిగా తగ్గుతుంది. ఇంకా ఆ పిల్లవాడిని తలచుకుని, ఏడుస్తూంటే, ఆ పిల్లవాడిని తెమ్మంటావా ? తీసుకురాలేవా ? అని అడుగుతావా ? పోనీ...నీ కోసం తెచ్చాననుకో. అతనీభూమిని ఎన్ని సం॥లు పట్టుకుని వుంటాడు. అతడు శాశ్వతుడౌతాడా ? కాడే!

నీవున్నన్నాళ్ళు నీ కళ్ళముందు వుంటాడు. ఆ తర్వాత, అతడు నీలాగే ఏడ్చి “మావయ్యా, అమ్మా! అంటే, నిన్ను తేవాలిగదా! ఇది తెలిసిందనుకో. మళ్ళీ కథ మొదటికే కదా! భీముడు ఘటోత్కచుడంటాడు. ద్రౌపది తన కుమారు లంటుంది. గాంధారీ, నా పుత్రులనివ్వు. మంచివాళ్ళను చెయ్యమంటుంది.

అంటే, మీ అందరి పేరున కాలగతిని మార్చడం సృష్టి ధర్మానికి విరుద్ధమమ్మా! కనుక ఇవ్వాళ్ళ వాడు. రేపు మనము. ఇలాగ జరిగిపోయే దానిని ఆపకుండా వుండలేము. చీకటికి భయపడేవాడు ఎప్పుడు పగలు కావాలంటాడు. అదే ఎండను చూసి భయపడేవాడు, చల్లని వెన్నెల వెలుగు కావాలంటాడు.

ఇది ఆలోచనా రాహిత్యంవలన జనించే ప్రశ్నలు. లాభించే సమాధానాలు మాత్రం రావు, కావు. ఇలాగ ఆమెను ఓదార్చి, ధైర్యాన్ని కల్పించిన వాసుదేవుడు మార్గమధ్యంలో కనుపించిన ఉదంక మహర్షి ఆశ్రమాన్ని చూస్తాడు. మహర్షిని దర్శించాలని రథం దిగుతాడు.

శ్రీకృష్ణుని రాకను తన శిష్యుల వలన తెలుసుకున్న ముని, ఎదురొచ్చి, ఆ భక్తవత్సలునికి స్వాగతము అర్ఘ్య పాద్యాదులను జరుపుతాడు. కృష్ణుడు గూడా మహర్షిని గౌరవించవలసిన తీరున, తాను సలుపవలసిన మర్యాదలను జరిపి, వారికో ప్రక్కన కూర్చున్నాడు.

కృష్ణా! ద్వారకపురవాసా! ధర్మమూర్తివి, అవతార పురుషుడవు. ఆశ్రిత వత్సలుడవు. నీ దర్శనంతో ధన్యత చెందానని ప్రముఖంగా పలికి, ఉభయ కుశలోపరి తదుపరి -

"అవును, వాసుదేవా! ఇద్దరూ నీకు బంధువులే కదా! కురు పాండవుల మధ్య వైరాన్ని ఆపి, సఖ్యతను నెలకొల్పావా ? అందరు కుశలమేనా ?'' అడుగు తున్నాడు.

అంతా విన్న శ్రీకృష్ణుడు "మహర్షీ! మీరు చమత్కారులు. మీకు తెలియనివి. మీ దృష్టికి రానిదీ ఈ సృష్టిలో ఏదీ వుండదు. అయినా నన్ను పరీక్షించాలని, అవునా ?'' క్షణమాగుతాడు.

"నిన్ను పరీక్షిస్తానా.... ?! ఏదో కుతూహలం కొద్దీ, నీనుండి విషయాలు తెలుసుకోవాలని..... ఆయన... ఉదంక మహర్షి గూడా తక్కువ తిననట్లే మాట్లాడుతున్నాడు. కృష్ణుడు ఆయన అంతరంగాన్ని చూస్తున్నాడు.

అప్పుడు, ధీరగంభీరుడైన గోవిందుడు - "మహర్షీ!'' అన్నాడు.

ఉదంకుడు, సావధానుడై వున్నాడు.

"వినండి. కురుపాండవులు, మీరు చెప్పినట్లు ఆశ్రితులే. అయితే పక్షపాత రహితుడను, ధర్మమూర్తిని. కనుక, పాండవుల రాయబారిగా హస్తినకు వెళ్ళాను. ఎవరికి చెప్పవలసినవి, వాళ్ళకు వివరంగా చెప్పాను. విషయం సేకరణం గూడా చేసాను.

నా ప్రయాణాన్ని, ప్రయత్నాన్ని - భీష్మాది పెద్దలు, ద్రోణ, కృపాచార్యులు, నారదాది మహర్షి సంఘాలు సర్వులు ప్రస్తుతించారు. నా మాట వినమన్నారు. మూర్ఖ దుర్యోధనుడు - తమ నలుగురిదే అఖండ శక్తిగా తలచి, ఆరని మంటలలో పగ, ద్వేషాల, సమిధల ఆజ్యం పోసాడు. అది "కురుపాండవ'' సమరం కాదు. మహాయజ్ఞమయింది.

ఆ యజ్ఞంలో అందరు - ఎందరో... అశువులు బాసారు. కురు వంశానికి, ధృతరాష్ట్ర కుమారుడు యుయుత్సుడు ఒక్కడే మిగిలాడు.

పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని యుద్ధాగ్నిలో దుర్యోధనుడు సమిధులు చేసాడు. తాను, తన సోదర బృందంతో - బంధు, మిత్ర - పుత్ర సహితంగా ఆహుతి అయ్యాడు. ఇదీ కథ.

దీనినాపడం ఎవరికి సాధ్యం కాలేదు. ఎందరో నెత్తి మొత్తుకున్నారు.

అందరు వద్దన్నారు. ఆఖరికి దుర్యోధనుని సైనికులే, ఆతనికి వినబడేటట్లు, అందరు వద్దన్నా సరే, తన మూర్ఖత్వంతో, ఈ దుర్యోధనుడు, మారణకాండకు, సిద్ధమయ్యాడని'' తిట్టుకున్నారు.

ఇదీ జరిగింది. మహర్షి! ఏం చెయ్యగలం ? అంతా కాలగతి, కర్మగతి ప్రకారం జరుగవలసినదేనన్న సత్యం తమకు తెలియనిది కాదు'' క్లుప్తంగా ముగించాడు. మహర్షిని పూర్తిగా గమనిస్తున్నాడు.

ఇప్పుడు - ఈ భరతవంశానికి సార్వభౌముడు యుధిష్టరుడు...

సంయమనం, సమాహిత చిత్తం కావాలనుకునే మహర్షే, ఇక వినలేక పోతున్నాడు. "నిన్ను... శపించడానికి, ఉదంకుడు సిద్ధపడుతూంటే -

"మహర్షి, తొందరపడకండి. నా మాటలు వినండి. ఆ తదుపరి.... మీ ఇష్టం ప్రకారం చేసుకుందిరిగాని. తపము.... అనితరమైన సాధనతో సంపాదించు కున్నది. ఒక కృష్ణుని కోసం దానిని వ్యర్థం చేసుకుని, ఆ పోయిన తపస్సును సంపాదించుకోవడానికి మరల తపస్సు చేయాలి. కాబట్టి...

"ఫర్వాలేదు. మళ్ళీ సంపాదించుకుంటాను. కానీ, నిన్ను విడువను. సరే, ఏదో చెబుతానన్నావు కదా, అదేమిటో చెప్పు...!'' ఆవేశం తగ్గలేదు. కొద్దిగా ఆలోచన వచ్చింది.

"తప్పు చేయడానికి ముందు.... మహర్షీ నేనెవరో తెలుసుకో. అప్పుడు నీ చర్య ఎంత తొందరైనదో నీవెంత సాహసం చేస్తున్నావో... తెలుస్తుంది'' ఊ... ఒక్క ఉరుము ఉరిమినట్లు ఉరిమాడు. మహర్షి అలాగ వుండిపోయాడు. కొంత సమయం గడిచింది. ఇప్పటికైనా నేనెవరో తెలిస్తే తొందరపడవు. పడిన తొందరపాటుకు చింతిస్తావన్నాడు. ఉదంకుడు తలదించుకున్నాడు.

"వాసుదేవా! నాకు తెలిసిందే, అయినా, కాలమహిమగా, నిన్ను గానక, ఏదో ఘోరం జరిగిపోయిందని, ఆపగలిగి నీవెందుకు ఆపలేదని తొందరపడ్డాను.

"ఓ దేవదేవా! అర్భుడను. భక్తుడను. సదా సంస్మరించువాడనైతే, ఒక్కసారి నీ దివ్యరూపమును దర్శింపగోరు నన్ను తరింపచెయ్యమని ప్రార్థించాడు.

భగవద్గీత చెబుతూ, అర్జునునకు ప్రసాదించిన దివ్యరూపాన్ని, ఉదంకునికి ప్రసాదించాడు.

ఆ అద్భుత దృశ్యాన్ని - ఆనందమయంగా దర్శిస్తు

**"సదానందా, చిదానందా, బ్రహ్మానందా, వాసుదేవ కరుణాంతరంగా,**
**కమనీయ రూపా, భక్తవత్సల - భవభయహరా...!"**

అని పలు విధముల ప్రార్థిస్తూ, ఉదంక మహర్షి తన్మయుడై పోయాడు.

పిలిచినట్లు వచ్చి, ప్రసాదించిన దివ్య విశ్వరూపానికి సాగిలపడ్డాడు. అతని ఆనందానికి, తాను పరవశుడౌతూ

"మహామునీ, ఈ శుభ సందర్భంలో, ఏదైనా వరం కోరుకో.... తప్పక ఇస్తానంటాడు.

అద్భుతమైన దివ్య దర్శనాన్ని పొందాను. ఈ జన్మకిది "చాలు" అని తృప్తిని ప్రకటిస్తాడు.

"లేదు. దేనికదే - భక్తికి తలవంచు, ఈ భక్తవత్సలుడు, భాగ్యప్రదాతగా ఏదైనా ఇవ్వాలి. అడుగ"మనగా -

"దేవదేవా! ఇక్కడ జలసన్నిధి చాలా తక్కువ. ఇవన్నీ మరుభూములు. కనుక అవసరమైన తరుణంలో, నిన్ను తలచుకొనగా, జలము లభించునట్లు వరమును గ్రహించమని ప్రార్థిస్తాడు.

"తధాస్తు...!" అని కృష్ణుడు, కోరి, మహర్షిని దర్శించి, కోరికనడిగి, వరము ప్రసాదించి, భక్తవత్సలుడను బిరుదమును శాశ్వతం చేసుకున్న భక్తవరదు డయ్యాడు ఆ గోవిందుడు. భక్తజనప్రియుని తాను శపించబోతే - తనకు వరమనుగ్రహించిన దేవదేవునికి ఉదంకుడు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

కాలగమనంలో భాగంగా - తీవ్ర కాటకం. అసలే మరుభూములు. జలసన్నిధి కరువై - ఘోర కరువు రక్కసి కోరలలో చిక్కుకున్న తరుణంలో-

ఉదంక మహర్షికి, శ్రీకృష్ణ భగవానుడు ప్రసాదించిన వరం విషయం జ్ఞప్తికి వచ్చింది.

"హే! కృష్ణా, వాసుదేవా! ఆశ్రిత వత్సలా అభయప్రదాతా,
ఆర్తత్రాణ పరాయణా, పాహిమాం, పాహి!
అని కళ్ళు మూసుకుని ప్రార్థించాడు.

తీరా కళ్ళు తెరిచేసరికి - ఎదురుగా ఓ ఛండాలుడు.

"స్వాములూ! ఏవిటో గొణుక్కుంటున్నారు. మంచినీళ్ళు కావాలా ?" అన్నాడు - "అవును. తమరు - ఉదంక... అవునా ?"

అయితే, ఈ మంచినీళ్ళు త్రాగండి. మిమ్మల్ని చూస్తే - ఈ ఎండలో - దాహం వేసి అల్లలాడుతున్నారనిపిస్తుంది. తప్పు లేదు. నీళ్ళకు అపవిత్రత... వుండదు. తనకు తెలిసిన ధర్మమాతడు, చెబుతున్నాడు.

"ఛీ.... నీవు నీళ్ళివ్వడం.... నేను త్రాగడం. ఇదా నాకు, కృష్ణుడిచ్చిన వరం...!" అసహ్యంచుకుంటున్నాడు.

అయినా, ఆ ఛండాలుడు, తోలుతిత్తితో, కుక్కలు చుట్టుముట్ట, విల్లంబులతో, చూడ చెమటలు పడుతూ, మహావికృతంగా కనుపిస్తూ -

"మహర్షులకు ఎంతో శాంతముంటుంది. మంచివాళ్ళు. "రాగద్వేషాలు, కోపతాపాలు మనకే కాని వారి"కుండవంటారు.

మరి... ఇదేమిటి, మహర్షి ? పోనీలే కదా, గొంతు తడారిపోతుందని నీళ్ళివ్వ పోతే ఎందుకలాగసురుకుంటావు. చచ్చాక నా సాయమే కదా, నీకు కావాల్సింది. నన్ను ఛీ! అంటే, ఆ దేవుడు కూడ నిన్ను ఛీ అంటాడు. తెలిసిందా ? ముందు తెలుసుకో...మని చెబుతూంటే, కోపంతో ఉద్రేకమొందుతూ

"కృష్ణా! నీవు నటన సూత్రధారివి. నయవంచకుడివి గూడా! ఇలాగే మాయ, మోసం చేసి, ఆ కౌరవులను చంపి, నీ పాండవులకు రాజ్యమిప్పించి వుంటావు!" అని వుడికిపోతున్నాడు. కోపంతో తిట్టుకుంటున్నాడు.

అప్పుడు -

అప్పుడాతని మనసును చదివినట్లు కృష్ణుడక్కడ ప్రత్యక్షమయ్యాడు. అతన్ని చూస్తూనే కోపంతో వూగిపోతూ -

"కృష్ణా! ఇదేనా నీ భక్తవత్సలత, కారుణ్యాభావము....!" వుద్రేకంతో వూగిపోతూంటే-

"మహర్షి! కాలం మారింది. యుగధర్మం మారుతుంది. అయినా అరిషడ్వర్గాలను, నీ ఇంద్రియాలను జయించలేకపోయావు. నిజంగా, నేను భక్తవత్సలుడను, ఆశ్రిత పక్షపాతిని కాబట్టే, అప్పుడు - ఇప్పుడు, ఎప్పుడు గూడా నిన్ను రక్షించడానికి సిద్ధపడ్డాను తప్ప - నిన్ను శిక్షించడానికి తొందరపడలేదు. అది నాకు మనసులోలేని, మనస్కరించని విషయం.

అవును. ఈ కోపంతో నీ తపస్సంతా వృథా అయింది. సంయమనం పాటించవు. సమతాదృష్టి లేదు. శ్రద్ధ, విశ్వాసాలు సున్న. భక్తి - వినయాలు... ఎన్నెన్ని వున్నా ఎటు కనబడటం లేదు.

"కృష్ణా! అన్నావు. నీళ్ళడిగావు అవునా ? దేవుడిలా ఆ దీనజనుడు వచ్చాడు. బాంధవునిగా గుర్తించవా ? ఎందుకయ్యా, నీవు, నీ తపస్సు ? సర్వభక్తజన హృదయాంతర్వర్తిని, సర్వాంతర్యామినని చెప్పుకుంటే సరిపోదు. చేతలలో చూపించ గలిగావా ? లేదే.... పైగా -

నాకు కారుణ్యా భావం కలదు. నీలాగ కోపం లేదు. తాపం లేదు. అప్పుడు శపిస్తానన్నా, ఇప్పుడు నిందిస్తున్నా.. ఒకే రీతిగా చూస్తూ, అప్పుడు, ఇప్పుడు గూడా అభయ ప్రదానం చేసాను. అది అపాత్రదానమని - ఇప్పుడు కదా, నాకర్థమయింది.

ముందు శాంతచిత్తుడవుకా, అప్పుడు నన్ను, నా ప్రయత్నాన్ని అర్థం చేసుకో. నా ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరు చేసిన, నీ దురహంకారాన్ని తగ్గించుకో.

"ఏమిటి నువ్వు చేసిన మహత్కార్యం. ఈ ఛండాలుని ద్వారా జలమివ్వడమేనా?

"ఉదంకా! ఊరుకున్న కొద్దీ - ఆత్మవిమర్శ చేసుకోకుండా, పరనిందకు ప్రయత్నిస్తున్నావు. తప్పు నాది కదూ! ముందు విను.

"ఇంద్రా, మహర్షి మంచినీళ్ళు అడిగాడు. అమృతమివ్వు. ఆయనకు దాహార్తి వుండదన్నాను. అప్పుడతను -

"దేవదేవా! నీవు నిజంగా భక్తవత్సులుడివి. అన్నానని అనుకోకండి. మీరు అమృతం తీసుకుని వెడితే "తత్వమసి"అని, ఆ తత్వమర్థం చేసుకోలేని మహర్షి మిమ్మల్ని గౌరవిస్తాడా. కనుక...!"

అయినా వాదించాను. అతన్ని వారించాను. కాదనలేక అమృతమిచ్చాడు. తెచ్చాను. నీ దౌర్భాగ్యం కొద్దీ దానిని పోగొట్టుకుని, నేనేదో తప్పు చేసినట్లు అరుస్తున్నావు. ఏమిటి నువ్వు తెలుసుకున్న సత్యం, నేర్చుకున్న తపోవిద్య... "జ్ఞాన ప్రకాశ"మని... గద్దిస్తాడు.

అప్పటికి, జ్ఞానోదయమయిందంటాడు, ఉదంక మహర్షి,

నీలోని సమతాభావాన్ని దర్శించడానికి, నా మాట మేరకు, ఇంద్రుడు - నువ్వు అసహ్యించుకున్న ఛండాల రూపంలో వచ్చి - ఈ మనుషులు జ్ఞానవంతులు కారు. భగవంతుడా! అని ప్రార్థిస్తారే తప్ప, నిజంగా ఆ భగవంతుడే వచ్చి, కరుణించి, కటాక్షిస్తే, దానిని అందుకోలేని, అదృష్టహీనులయ్యా!" అంటాడు. పైగా -

ఆయన మహర్షి కావచ్చును. ఆత్మజ్ఞానం పొంది వుండాలి. అనంత తత్వాన్ని అర్థం చేసుకోగలగాలి. అప్పుడే కదా - సమతావాదం, సమత్వబుద్ధి - కలిగేది.

ఇప్పుడు తన తప్పును తెలుసుకుని, "నీవు నిజంగా శాంతుడవు. పరమ కరుణామయుడవు. ఆశ్రిత వత్సలుడివి, భక్తభాగ్య ప్రదాతవు" అని ఉదంకుడు, శ్రీకృష్ణుని పరిపరి విధాల స్తుతిస్తాడు. ఆ పురుషోత్తముని చరణకమలాల నిలిచాడు.

""""""

# బాణుడు

**ద్వా**రకలో అడుగుపెట్టిన వాసుదేవుని, అంతకుముందే, లీలలు, భారత యుద్ధ వీరగాథలు, కథలు కథలుగా విన్న వారందరు, ఘనంగా స్వాగతించారు.

వెడుతూనే తల్లిదండ్రులను కలుసుకున్నాడు. సుభద్రను వారికప్పగించాడు. చెప్పవలసినవి చెప్పాడు. తండ్రి వసుదేవుడు కుమార కృష్ణుని ప్రక్కన కూర్చో బెట్టుకుని, ఆతని ముఖమున కొన్ని విషయాలు తెలుసుకున్నాడు.

దుఃఖమాపుకోలేని సుభద్ర "అన్నా!" ఈ మేనల్లుని దీనగాధను దారుణ వధతో కల్పి చెప్పమంది. అంతా వివరంగా చెప్పాడు.

అక్కడ నుండి - కృష్ణుడు - రుక్మిణీ అంతఃపురానికి వెళ్ళాడు.

అక్కడంతా యాంత్రిక జీవనంలాగ వ్యవహారం వుంది. కాని, ఏ ఒకరి ముఖాన నవ్వు, కళాకాంతులు కనబడటం లేదు.

ఏమయిందనుకుంటూ, ఈ ప్రభువు రుక్మిణీ అభ్యంతరానికి వెడితే, ఆమె రుక్మవతీ మందిరానికి వెళ్ళినట్లు తెలిసింది. అక్కడకు హడావుడిగా వాసుదేవుడు బయలుదేరాడు.

అందరు అదోలాగ వున్నారు.

ఎందుకలాగ వున్నారు ? ఏమిటి వారి బాధ...

అప్పుడు తండ్రి కృష్ణుని చూస్తూనే ప్రద్యుమ్నుడు "తండ్రీ! అనిరుద్ధుడు.... అంటాడు. భోరుమంటాడు. ఆ వాక్యం పూర్తి చేయడు.

"కనబడటం లేదు" అంటుంది రుక్మిణి.

ఆమె భుజంపై చెయ్యివేసి "అసలేం జరిగింది" అడుగుతాడు. అప్పుడు ప్రద్యుమ్నుని తమ్ముడు, రుక్మిణి ఇంకో కొడుకు చారుధేష్ణుడు "తండ్రీ!" అంటూ వందనం చేసి రాత్రి అందరం మేడమీద పడుకున్నాం. తెల్లవారి లేచి చూస్తే, అనిరుద్ధుడి మంచం ఖాళీగా వుంది. అతనేమయ్యాడో తెలియదంటాడు.

ఒకటికాదు, రెండుకాదు. ఆరుమాసాలయ్యాయి. మనవడి జాడ కనడటం లేదంది రుక్మిణి. "భయపడకండి!" అన్నాడు. రుక్మిణీ పిల్లలని ఓదార్చి. వాడే లోకంలో వున్నా తప్పక తీసుకు వస్తానన్నాడు. ధర్మరక్షకునికి, కార్యదక్షునికి క్షణం గూడా తీరిక వుండదంటే.... ఇదే!!

శ్రీకృష్ణుడు వచ్చాడనేసరికి యాదవ ప్రముఖులందరు వచ్చారు. అనిరుద్ధుని విషయంలో తమ ప్రయత్నాలన్నీ చెప్పారు. వస్తూనే - మనుమని అదృశ్యంతో, మిమ్మల్ని బాధపెట్టామని, వాళ్ళు చిన్నబుచ్చుకున్నారు.

అంతా వింటున్నాడు.

ఆలోచిస్తున్నాడు.

చాలా రోజులయింది. కృష్ణ దర్శనం చేసి.... అని, నారద మహర్షి వచ్చాడు. అర్ఘ్య పాద్యాదుల తదుపరి, అసలు విషయం చెప్పారు. అప్పుడు నారదుడు "అమ్మా! మీరిరువురు ఆది దంపతులు మీకు తెలియనిదంటూ ఏమీ లేదు.

ప్రస్తుతం మీ మనుమడు అనిరుద్ధుడు బాణాసురుని వద్ద వున్నాడు. వాని కూతురు, ఉష - ఈతనిని మోహించి, కృష్ణ పౌత్రుని మాయ చేసి తీసుకు వెళ్ళింది. అతి త్వరలో అతడు తండ్రి, ప్రద్యుమ్న కుమారుడు తాత కాబోతున్నాడన్నాడు.

వచ్చాడుగా, మహాదేవుడు. ఈ పుణ్యమూర్తి వల్ల కథ సుఖాంతమౌతుంది. అనిరుద్ధుడు తన భార్యా పుత్రులతో ఇక్కడికి వస్తాడంటాడు." అంటూ బాణుని వివరం ప్రారంభిస్తాడు.

ప్రహ్లాద సంతతికి చెందిన బలిచక్రవర్తి కుమారుడు, ఈ బాణుడు. ఇతడు అపర శివభక్తుడు. తపస్సు చేసి, దాని మహిమ వలన అతడు పార్వతీ పరమేశ్వరులను తన నగరి కాపలాగాను, తనను కార్తికేయుని వలె ప్రేమతోను చూడాలని కోరాడు.

భక్తవత్సలుడు, వశంకరుడైన "శంకరుడు" అన్నమాట ప్రకారం పార్వతీ సమేతుడై శోణాపురానికి కావలిగా వుంటున్నాడు. వెయ్యి బాహువుల బాణునికి, చేతికి తగ్గ పనిలేక, "పరమేశ్వరా! వీటికి సరయిన పనిలేక ఏమిటో చేతులు దురద పెడుతున్నాయి. ఏం చెయ్యమంటావు ?" అడుగుతాడు.

"తొందరపడకు. తొందరలో నీకోటపై గల జండా క్రిందపడుతుంది. అది పడిన కొన్నాళ్ళకు నావంటివాని చేతిలో తగు బహుమానమొంది, ఆ భుజముల తీట తీర్చుకుంటావు ? తప్పక తీట తీరుతుంది" అంటాడు.

అయినా ఊరుకోలేక, మనమిద్దరం యుద్ధం చేద్దామా ? అంటాడు. ఇందుకు పరమేశ్వరుడు ఇదివరకైతే తప్పక చేసేవాడిని, నేను రక్షకుడిగా వుండగా నిన్నోడించడానికెవరూ రారు. పోనీ నేనే యుద్ధం చేద్దామంటే... రెండు కోర్కెలు కోరావు.

మొదటిది - పుత్ర (సమాన) వీక్షణం.

రెండవది - నగర కావలి.

ఈ రెండు నిర్వహించే నేను, నీతో యుద్ధం చెయ్యను. తొందరపడకు!" నీ కోరిక నెరవేరుతుందన్నాడు.

ఇతనికో కూతురు వుంది.

ఆమె అందాల భామ, అన్నులమిన్న. ఆమెకామెయే సాటి.

ఆమె నిజానికి అప్సరకన్యల శిరోమణి - అందాలభామ - తిలోత్తమ.

దూర్వాసుని శాప ప్రభావం వలన, ఆమె బాణుని కుమార్తెగా జన్మించింది. పెరిగి, వయసు తెచ్చిన సొగసులతో మెరుస్తుంటే, కలలో ఎవరినో చూసింది. అతనెవరో తెలియదు కాని అందగాడు. దాంతో ఆమె చెలికత్తె వివిధ దేశాల రాజుల, అందగాళ్ళ, ప్రముఖుల చిత్రపటాలు తెచ్చింది. అందులో -

శ్రీకృష్ణ పౌత్రుడు అనిరుద్ధుని పటముంది. ఇతడే నా కలల రాజు. ప్రాణ ప్రియుడు అంది. అతను కృష్ణుని మనుమడని, రాత్రికి రాత్రి మాయచేసి తెచ్చింది.

ఇంతవరకు బాగానే వుంది.

ఇప్పుడే - ఇక్కడే అసలు కథ మొదలయింది.

అంతఃపురంలో జరిగేదేమీ బాణునకు తెలియదు.

ఆ సమయంలోనే పరమేశ్వరుడు చెప్పినట్లు ఆతని కోటబురుజుపైని పతాకం నేలకూలింది.

అంతఃపుర రక్షకులు ప్రాణభయంతో వచ్చి, అంతఃపురంలో మాకు తెలియకుండా, అమ్మాయిగారితో ఎవరో వుంటున్నారు. ఇదెలాగ జరిగిందో మాకు తెలియదని, తెలిస్తే మేమే చర్య తీసుకునేవాళ్ళమని, అసలు విషయం తెలియక, సర్వం తమకు తెలియబర్చాలని ఇట్లా, ఇటు - పరుగెత్తుకు వచ్చామన్నారన్నారు.

బాణుడు - అగ్గి - గుగ్గిలమయ్యాడు. అదెలాగ సాధ్యమని, అరచి గద్దించాడు.

"అంతేకాదు ప్రభూ! అమ్మాయిగారు గర్భవతి కూడా...!"

ఆ మాటతో మరింత కోపమొందాడు. వెంటనే మహామంత్రిని పిలిపించాడు. విషయం చెప్పాడు. ఆ ఆగంతకుడెవరో తెలుసుకుని బంధించి శీఘ్రమే తీసుకురా! అన్నాడు ఇంత దారుణమెలాగ జరిగిందో తెలియక తికమక చెందుతున్నాడు.

మహారాజుకు - అంతఃపుర రహస్యం తెలిసినట్లు గ్రహించిన చిత్రరేఖ, యువరాణి అభ్యంతర మందిరాన్ని ప్రవేశించి, జరిగింది చెప్పి - అనిరుద్ధులను.... అంటుంటే. "అవసరం లేదు. ఈ కృష్ణపౌత్రుడు కారణజన్ముడు. ఆ ధర్మమూర్తికి వారసుడు ? నన్ను రక్షించుకోవడం గొప్ప కాదు. మిమ్మల్ని గూడా రక్షిస్తాను. భయపడకండి" అంటున్నాడు... ఇంతలో -

కొంత రాక్షససేన వచ్చింది.

చేతిలో పరిఘాయుధంతో అనిరుద్ధ కుమారుడు వారినందర్ని ఎదిరించ, నిరోధించి, నిర్జించాడు కూడ. ఈ విషయం దానవేశ్వరునికి తెలిసింది. ససైన్యంతో వచ్చాడు.

వస్తూనే - తన సేనను, తన అహాన్ని దెబ్బతీసిన ఆ వీరవర్యుని చూసాడు. అతని అందచందాలకు అబ్బురపడ్డాడు. ఎవరు నీవు ? అని అడిగాడు.

ఒక నమస్కార బాణం వేసి "రాజేంద్రా! నీ అల్లుడను. ధర్మపురుషుడు, అవతార మూర్తియైన శ్రీకృష్ణుని పౌత్రుడను. ప్రద్యుమ్నుని కుమారుడను, అనిరుద్ధుడను. గాంధర్వ విధిన నీ కుమార్తెను వివాహం చేసుకున్నాను. ఇప్పుడామె గర్భవతి. అతి త్వరలో మిమ్ము తాతను, నన్ను తండ్రిని చెయ్యబోతుంది. మీ యువరాణీ, నా భార్య "ఉష" అన్నాడు.

కృష్ణపౌత్రుని అనకబోతే నెత్తిన పెట్టుకునేవాడే. రాక్షసాంతకుని మనుమడు- అనేసరికి - కొంత కంగారు పడ్డాడు. అమితమైన కోపము వచ్చింది.

వెంటనే ఒక బాణం వేసాడు.

శ్రీకృష్ణునివలె మందహాస వదనంతో, దానిని నిర్వీర్యం చేసాడు.

ఇద్దరిమధ్య భీకరమైన పోరు. రాక్షస సైన్యంలో - కలకలం.

ఆ పిల్లవాడి - అస్త్రశక్తికి - బాణుడు అభినందించకుండా వుండలేకపోయాడు.

అనిరుద్ధుడు ఒక దివ్యాస్త్రం వేసాడు. బాణుడు తూలిపడిపోతున్నాడు. ఆ సమయంలోనే బాణుడు ఒక దివ్యాస్త్రాన్ని అనిరుద్ధనిపైకి వేసాడు. తప్పదు.

ఆ అస్త్రశక్తికి అతడు చావడు కానీ, మూర్ఛిల్లుతాడు. పోనీలే... అని వూరుకుంటే, అనిరుద్ధ అస్త్రశక్తికి తాను అవమానాలపాలవుతున్నాడు.

కనుక అస్త్రాన్ని ప్రయోగించాడు. అనిరుద్ధుని మూర్ఛిల్ల చేసాడు.

అప్పుడు బంధించి, చెరసాలలో అతనిని వుంచాడు.

అంతఃపుర పరిచారికల ద్వారా విన్న విషయాలను బట్టి "చిత్రరేఖ, ఉషా కన్యను'' బంధించమని బాణుడు ఆదేశించాడు.

ఈ జరిగిందంతా విన్న బలరాముడు, శోణపుర వివరాలనడిగాడు.

అంతా.... అందరితోపాటు విన్న కృష్ణుడు శోణపురానికి - సముద్ర ప్రయాణం చేసి వెళ్ళేకన్న ఇంద్ర గరుత్మంతుల సాయంతో, ఆ నగరంలో ప్రవేశించి, చేయవలసిన కార్యక్రమాన్ని పూర్తి చెయ్యాలని, ఇంద్రుని తలచుకున్నాడు.

తక్షణం - ఆ దేవతా ప్రముఖుడు. శ్రీకృష్ణ దర్శనం చేసి, తన నుండి, కోరిన సహాయం పొందగలరన్నాడు. అంతే క్షణాలలో అందరు శోణపురంలో అడుగుపెట్టారు. యాదవ ప్రముఖల రాక, వారి శోణపుర ప్రవేశవార్త.... బాణుని ఆశ్చర్యంలో ముంచెత్తించింది.

పరాయివాళ్ళు అదే శత్రుసేనలు అడుగుపెట్టడానికి వీలులేని అగ్నిజ్వాలలు. కృష్ణుడు దివ్యాస్త్రంతో వాటిని ఆర్పాడు. అందరు నగరంలో ప్రవేశించారు. కృష్ణుడు పాంచజన్యాన్ని వూదాడు. ఎలాగ వచ్చారన్నది బాణుని ఆశ్చర్యము. ఈ వచ్చినవాడు సామాన్యుడు కాడని, అపూర్వశక్తులు గల మానవాతీతుడని గ్రహించాడు. అనిరుద్ధుని వలన కొంత దురద ఇప్పుడు తీరింది.

ఈ వచ్చిన దివ్యశక్తి, మొత్తం తన భుజబల దురద నరికడుతుందని సంతోషించాడే తప్ప ఎవరితో ఆ యుద్ధం, అది దారుణమని, ఎవరినీ నిందించలేదు.

ఉభయ సైన్యాలు యుద్ధానికి దిగాయి.

బలరామ, కృష్ణ, ప్రద్యుమ్న, ఉద్ధవ - సాత్యకిలు - అప్రతిహతంగా, రాక్షససేనను చీల్చి చెండాడుతున్నారు. తాను రక్షకుడిగా వున్న శోణపురం. రణరంగం స్థాయిలో - సైన్యాన్ని కోల్పోవడం. శివుడు భరించలేక, తన ప్రమధ గణాలను, తరలి వెళ్ళమని ఆదేశించాడు.

శివరక్షణ - భక్త సంరక్షణం - తెలిసిన కృష్ణుడు - శివుని, ప్రమధ గణాల అట్టహాసం చూసి నవ్వుకున్నాడు. వీళ్ళముందు ఆ గణాలు, గుణింతాలు నేర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

వెంటనే బలరాముని ఢీకొనడానికి శివజ్వరాన్ని పంపాడు. అది మూడు తలలతో భయంకరంగా, బలరాముని చేరుతుంటే, దాని విషయం తెలియని పెద్దన్న ఆపద పాలవుతాడని, తాను, శివజ్వరానికి ప్రతిగా వైష్ణవజ్వరాన్ని ప్రయోగించాడు.

అవి రెండు అతి ఘోరంగా ఢీకొంటున్నాయి.

అవి పగిలి ఛిన్నాభిన్నమయితే - భూగోళం బ్రద్దలవుతుంది. లోకాలు రోగమూర్తులౌతాయి. ఈ ఉపద్రవాన్ని గమనించి వాసుదేవుడు, శివజ్వరాన్ని అణగద్రొక్కించి, వైష్ణవాన్ని తనలో కలుపుకున్నాడు.

ఇక తాను రాక తప్పదని తలచిన శివుడు త్రిశూలధారుడై ఎదురుపడ్డాడు. శివునికి, కుమార, నందీశ్వరులు అంగరక్షకులుగా వచ్చారు. స్కందుడు, నంది- బలరామ, ప్రద్యుమ్నులను ఢీకొనగా - శివ, కేశవులు రంగ ప్రవేశం చేశారు.

ఈ దివ్యపోరాటాన్ని తిలకించడానికి ఆకాసంలో యక్ష రక్షస సిద్ధ సాధ్యాది దేవతా గణములు - మహర్షులు ఎందరెందరో నిలచి, ఆ వింతను, వింతగా గమనిస్తున్నారు. వారి యుద్దం - జగత్ప్రళయంగా మారింది.

వూహాతీత ప్రళయం, అనివార్యం - అగ్ని సదృశమయింది. దేవతానీకము, మహర్షి సంఘాలు “బాణా!” ఎంత పనిచేసావని నిరశించారు. ఇరువురు ఒకటే అయినా, వాళ్ళకు వాళ్ళే సాటి. ఆ జగన్మాత, సకల భువనైక - భువనేశ్వరీ అపార కరుణా కటాక్షములను కల్గి - ఆమె ప్రతినిధిగా వ్యవహరించే శ్రీమన్నారాయణుని, అపరావతారమైన - వాసుదేవాన్ని - ఏ శక్తి నిరోధించలేకపోవడం, అందర్ని ఆశ్చర్య పరచింది. ఈ సమయంలో కావలికాయవలసిన తను యుద్ధరంగమందు వుండకూడదని తలచి తన అస్త్రాలు, పరివారం, నందీశ్వర కుమారులను వుపసంహరించాడు, ఉమామహేశ్వరుడు.

ఇక - బాణాసురుడు, స్వయంగా రంగ ప్రవేశం చెయ్యక తప్పలేదు. వాసుదేవునితో యుద్ధానికి సన్నద్ధమయ్యాడు. ఇరువురికి పోరు ప్రారంభమయింది.

ఇక ఉపేక్షించక, యుద్ధాన్ని విరమింప చేయదలచి, చక్ర ప్రయోగంతో, ఆతని సహస్ర బాహువులను ఖండించాడు.

శిరచ్ఛేదం చేయబోయిన తరుణంలో, శివుడు

"కృష్ణా! ఇతడు నా భక్తుడు. వరసిద్ధుడు. కనుక ఆతనిని వధించవద్దు" అని కోరాడు.

ఇప్పుడు - చేతులు పోయాయి.

బాణుని తీట వదిలింది.

దాంతో - బాణుడు.

తను బంధించిన, అనిరుద్ధ - ఉషా కన్యలను సాలంకృతంగా తీసుకువచ్చి-

శ్రీకృష్ణభగవానునికి - సభక్తికరంగా సమర్పించుకున్నాడు.

గర్వాహంకారములు తొలగిన ఆతడు భక్తి వినమ్రమూర్తియై-

"వాసుదేవా! నీ సత్యదర్శనంతో, ధర్మమర్థయింది. శివకేశవులు అభేద స్వరూపులు. ఎవరిని పూజించినా, తప్పక మరొకరి అనుగ్రహం లభిస్తుంది. ధన్యుడనన్నాడు.

ఇదిగో - నా పుత్రిక, నీ మనుమడు.

వీరలను - నీకంటికి రెప్పలా కాచి, రక్షించమని ప్రార్థించాడు.

# పరీక్షిత్తు

నెలలు నిండాయి. అపాండవం చేయాలన్న అశ్వత్థామ ఆశ, అడియాసల్ని చేసి, ఉత్తర గర్భంలోని శిశువును పరిరక్షించాడు. కానీ - అందరిలో దైన్యం.

యుద్ధం చేసారు. సామ్రాజ్యం లభించింది.

సార్వభౌమత్వం పొందారు.

కానీ - ధర్మరాజు.... అదే పాండవులకు ద్రౌపది యందు జన్మించిన సంతానంతో పాటు, విధిగా అయిదుగురికీ వున్న ఇతర భార్యల వలన కలిగిన సంతానం మొత్తం.....

బంధుమిత్రులతో కలిసి, సబాంధవంగా దుంప నాశనమయింది. ఇప్పుడు ఈ తరుణంలో అపాండవం చెయ్యతలచిన, అశ్వత్థామ నుండి ఉత్తర గర్భజనితు డవబోయే పిల్లవాడిని పరిరక్షించడమే కాదు, ఈ పరిరక్షితుడైన -

పరీక్షిత్తుకు -

"జనమేజయుడు" జన్మించి, విశ్వ విఖ్యాతుడౌతాడని దీవించాడు. ఇప్పుడు ఆ పరీక్షిత్తే - ఉభయ - "కురు-పాండవు"ల కనికాదు -

"భరతవంశకులదీపుకు"డౌతాడని, కల్గిన దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఈ సంతాపం నుండి బయటపడాలంటే, వ్యాసమహర్షి-ప్రకటించినట్లు అశ్వమేధం జరగాలి.

ఇందుకు అపార ధనరాశులు కావాలి.

ఇవి -

"మరుత్తుడు" అనే మహారాజు చేసిన యజ్ఞం ప్రాంతంలో అపార ధనరాశు లున్నాయని, వాటిని సేకరించి, ఈ యజ్ఞాన్ని దిగ్విజయం చెయ్యాలని, ఈ అపార ధనరాశులు - హిమవత్పర్వత ప్రాంతంలో వున్నాయి. అవి తేవాలి.

ఇందుకు భీముని నియోగించారు.

అలాగే -

ఒక మహామహుని పిలిచి, తక్షణం ద్వారకకు వెళ్ళి - వాసుదేవుని - సంకల్పమైన అశ్వమేధానికి శ్రీకారం చుట్టమని, ప్రార్థిస్తున్నానని చెప్పండి. అక్కడున్న - ప్రభువుతో, మనవారినందర్నీ, యజ్ఞానికి తరలి రమ్మని, మా ప్రార్థనముగా విన్నవించమని కోరాడు.

ధౌమ్యులవారికి - యధావిధి వందనాలర్పించి, వ్యాస, శ్రీకృష్ణుల సంకల్పాన్ని మళ్ళీ ఒకసారి గుర్తుచేసినట్లు, తన విధానంగా, నిదానంగా విన్నవించాడు.

ఈ విషయాన్ని వ్యాసులవారికి తెలియపర్చగా -

వారు దిశా నిర్దేశం చేసి - ప్రయాణానికి అనుజ్ఞనిచ్చి -

"మీరు వెళ్ళండి. తప్పక నేను మిమ్ముల మరుత్తుని ఆశ్రమంలో కలుస్తానని" ఆశీర్వదించారు.

అప్పుడు - యుధిష్టరుడు -

గాంధారీ, ధృతరాష్ట్రుల వద్దకు వెళ్ళి వేదవ్యాసుల, శ్రీకృష్ణ సంకల్పాన్ని తెలియబరచి, "ఈ ధర్మరాజు, తమ ఆశీస్సుల నభ్యర్థిస్తున్నాడు. ఈ యాగం విజయవంతం కావాలని, ప్రోత్సాహ - ఉత్సాహాల నివ్వమని - అర్థిస్తున్నాడన్నాడు.

వీళ్ళు కాదన్నా వాళ్ళు వెడతారు. కనుక ఇచ్చిన పెద్దరికాన్ని నిలుపుకోవాలని, తమ కుమారుడు చెయ్యలేని సత్కర్మలను చేసే యుధిష్టరుని ఆశీర్వదించడమే, తమకు మర్యాద "అని తలచి, శుభం భూయాత్" అన్నారు. ఇది కేవలం ధర్మం. పెద్దరికానికి ఇచ్చిన గౌరవం మాత్రమే!

ఆ తర్వాత -

యుధిష్టరుడు - రాజమాతను కుంతిదేవిని కలుసుకుని, ఆశీస్సుల నభ్యర్థించాడు. తప్పక విజయుడవవుతావు. నీ ధర్మం - మీ బావ అనుగ్రహం సదా, మిమ్మల్ని కాపాడుతుందని, ఆ తల్లి - ఓ తల్లిగా ఆశీర్వదించింది.

"బావ ఆశీర్వచనం, అనుమతి తీసుకున్నారా ?" ఓ బాధ్యత గల తల్లిగా అడిగింది, కుంతి.

ఆయన ఆదేశం, తాత వ్యాసులవారి ప్రోత్సాహమేనమ్మా.... ఈ దివ్య కారణానికి మూలమంటాడు.

"సంతోష" మంటుందా తల్లి.

అక్కడనుండి యుధిష్టరుడు కొలువుకూటానికి సభాముఖంగా, తమ ప్రయాణాన్ని తెలియబరిచాడు. తమ్ములు, నల్గురు నాతో వస్తున్నారు. కనుక -

"తమ్ముడు! యుయుత్సా!" అని పిలిచాడు. అతడు పరుగు, పరుగున వచ్చినట్లు వచ్చి నిలిచాడు. "యాగనిర్వహణకు ధనం కావాలి. దాని నిమిత్తం మేము బయలు దేరాము. మేము తిరిగి వచ్చేవరకు రాజ్యసంరక్షణాభారం నీది. మహామంత్రి విదుర బాబు వున్నారు. కాదనకుండా ప్రతి విషయంలో వారి సలహా ప్రకారం సాగు.

రాజ్యాన్ని సక్రమంగా చూసుకోవడమొక ఎత్తు. అలాగే, మహా పితరులు, మహారాజు పెదతండ్రి, పెద్దమ్మలను జాగ్రత్తగా సేవించు. దేవ, బ్రాహ్మణ పూజలు,

అతిథి అభ్యాగతుల సత్కారములు, మరువకుండా తప్పక నిర్వహించాలి. జాగ్రత్త సుమా! అని హెచ్చరించి బాధ్యతలన్నీ - ఆ చిన్ని తమ్మునికిస్తాడు -

విదురబాబుకు నమస్కరించి “తండ్రీ! సర్వశ్రేష్ఠుడవు. జ్ఞానివైన నీ దీవెనలతో పాటు, ఈ రాజ్యభారము కూడా తమ్ముని ద్వారా, అన్నీ తెలిసిన మీరు, సర్వతో భద్రంగా నడుప ప్రార్థన”మని ఆశీస్సుల నభ్యర్థిస్తాడు. ఆ తదుపరి -

అయిదుగురు కొన్నిరోజులు ప్రయాణం చేసి హిమశైల ప్రాంతానికి చేరుకున్నారు. ఇక్కడినుండే కర్తవ్య బోధ జరగాలి” అనుకుంటూండగా వేద వ్యాసులవారు, వచ్చారు.

సమస్త నిధులకు నిలయము లక్ష్మి నారాయణలమంటాము. కానీ, లోకాలకు తెలియని పరమరహస్యము. శివుడే అష్టసిద్ధులు - నవనిధులకు నిలయుడు. ఆ విభూతి ప్రియుని ఆశీస్సులు లభిస్తే - అఖండ నిధులు అవే లభిస్తాయి.

కనుక, నేటి రాత్రికి దీక్ష తీసుకోండి.

శివానుగ్రహానికై శ్రమించండి.

మహర్షి ఆజ్ఞను శిరసావహించి, ఆ ప్రకారమే చేసారు.

తెల్లవారి మహర్షి మార్గము చూప, తమ ధౌమ్యాది పురోహిత వర్గముతో కలిసి, నిధి నిక్షేపాలకై బయలుదేరారు.

మహర్షి చూపిన స్థలంలో పూజలు సలిపారు. నివేదనలు సమర్పించారు. యధావిధి భూత తృప్తి గావించారు. జరుపవలసిన సమస్త పూజాదికములు, బలిక్రతువులు జరిపిన తర్వాత, మహర్షి చూపించిన ప్రదేశంలో, త్రవ్వకాదులు ప్రారంభించారు.

ఆ త్రవ్వకాలు ఒకటి, రెండు కాదు. ముందు మూడు రోజులు జరిగాయి. కానీ ఫలితం కనబడలేదు. మహర్షి దివ్యవాక్కుపై గల విశ్వాసంతో మరో రెండు రోజులు త్రవ్వకాలు జరిగాయి. అయిదవనాడు గునపం వేస్తే ఖణేల్‌మనే శబ్దం వినిపించింది.

దాంతో అందరు అమిత శ్రమించారు.

రాళ్ళురప్పలు ఇసుక తొలగించారు.

బంగారపు రాశులు కనుపించడంతో, ముందు మహర్షికి, ఆ తదుపరి తమ పురోహితులకు ఆ ధనలక్ష్మికి, శ్రద్ధాభక్తులతో నమస్కరించారు. వాటికి సలుపవలసిన వైదిక క్రియలన్నీ శ్రద్ధాభక్తులతో, వేదవ్యాసులవారు తెలిపిన ప్రకారం జరిపారు. మహర్షి ఆశీస్సులను పొందారు అప్పుడు -

ధర్మజా! జాగ్రత్తగా వీటిని నీ రాజధానికి పట్టించుకుని వెళ్ళు. అక్కడికి శ్రీకృష్ణుడు, నేను సకాలంలో వస్తాము. చేయవలసిన సూచనలు చేస్తాము. దగ్గరుండి కార్యక్రమము చేయిస్తామని అభయమొసగి అదృశ్యమయ్యారు.

మహారాజు ఆదేశంతో, ఆ బంగారురాసులను భద్రంగా బళ్ళకెక్కిస్తున్నారు.

ఇది ఇక్కడి సంగతి. ఇక - ద్వారకలో -

తమకందిన ఆహ్వానం ప్రకారం -

బలరామ, సాత్యకి, కృతవర్మ, ప్రద్యుమ్న - చారుదేష్ణులతో - ఉద్ధవ, సాత్యకిల - నేతృత్వంలో, అందరు హాయిగా ప్రయాణించి, హస్తినకు చేరుకున్నారు. యుయుత్సుడు విదుర మహాశయులు, ఈ మహనీయుల రాకను తెలుసుకుని, మహదానందభరితులైన - ధృతరాష్ట్ర ప్రభువుతో కల్సి, వారికి సలుపవలసిన సముచిత, స్వాగత సత్కారములనన్నింటిని నన్ను దగ్గరుండి జరిపించమని ఏ పొరపాటు లేకుండా, జాగ్రత్తగా పర్యవేక్షించాలని విదుర మహాశయులు ఆదేశించారన్నాడు.

వాసుదేవుడు కూడా తమ పరివారంతో, వారికి అభివందనములు తెలిపి, మహారాజు ధృతరాష్ట్రులను, గాంధారీ దేవిని దర్శించ వెళ్ళాడు. ఈ వచ్చిన భగవానుడు ముందు పలుకరింపు, ఇరువురు ఉభయకుశలోపరి తదుపరి -

అటునుండి, మేనత్త - రాజమాత కుంతీదేవిని దర్శించాడు. ఆమె సంతోషించింది. వీరుభయులు మిగిలిన విషయాలు మాట్లాడుకుంటున్న తరుణంలో-

అభిమన్యుడి మందిరం నుండి - ఏదో కలకలం. అరుపులు - ఏడుపులు ఏమిటోనని - తెలుసుకోవడానికి అందరు అక్కడికి వెళ్ళారు.

అందరి ముఖాలు వికసించాయి.

శుభవార్త వినిపించింది.

అభిమన్యుని భార్య ఉత్తర ప్రసవించింది. అర్జునుడు తాత, కుంతీదేవి తాతమ్మ అయింది. కాని పుట్టింది - మృతశిశువు. అది దుఃఖ కారణము. ఆర్తనాదాలకు మూలమయింది. భరతవంశం మొత్తం ఈ దుస్సంఘటనతో నిర్వీర్యమయింది.

ఈ పాండవులతో, మొత్తం - కురుపాండవ వంశాలు అంతిమ దశకు చేరాయి. అప్పుడు అందరు అక్కడే వున్న వాసుదేవుని "కృష్ణా!" అని గట్టిగా ప్రార్థించారు. రోదించారు. ఉత్తరకు పుట్టబోయే బిడ్డ కోసమే సుభద్ర, భర్త పోయినా పిల్లవానిని చూసుకోవచ్చని ఉత్తర వూరడిల్లుతుంటే, ఈ దారుణంతో అందరు నిరాశ నిస్పృహలకు గురయ్యారు. వంశ నాశనమైపోయిందని విలవిల లాడుతున్నారు.

వాసుదేవుడు ఆ దృశ్యం, వారి ప్రార్థనలిక భరించలేకపోయాడు.

"తప్పక, వాడు మృతశిశువు కాదు. చిరాయువు. తప్పక మీ వంశం విస్తరిల్లు తుందని అభయమొసగి, ఏడువవద్దని వూరడించాడు. అందరు కలిసి సూతికా గృహానికి వెళ్ళారు. అక్కడ, ఉత్తర - మృతశిశువును తన చేతులలోకి తీసుకుని దీనంగా రోదిస్తుంది.

"తండ్రీ! నీ తండ్రి మహావీరుడు. ఆ కౌరవ వంశనాశకులు, దుర్బుద్ధితో, కట్టకట్టుకుని వచ్చి మహావీరుడు, లోకోత్తర శ్రీకృష్ణ భగవానుని మేనల్లుడైన నీ తండ్రిని దారుణంగా వధించారు. నిన్ను చూసైనా, ప్రాణాలు నిలుపుకుందామను కుంటూన్న తరుణంలో -

ఆ గురుపుత్రుడు, ధర్మఘాతకి, అపాండవం చేస్తానంటు వేసిన దివ్యాస్త్రాన్ని, మీ తాత కృష్ణులవారు ఆపి నిన్ను రక్షిస్తానని, మమ్మ బ్రతికిస్తానని అన్నారు. అయినా నీవిలా చచ్చి పుట్టావు. మమ్మ చంపుతున్నావు.

ఇక మృత్యువు తప్ప మమ్మెవరు ఓదార్చలేరు.

నీ తాతలకేం చెప్పాలి ?

మేము ఎవర్ని చూసుకుని బ్రతకాలి.

"కుమారా! ఎంతటి దుస్థితి కల్పించావు. మేము కూడ యుద్ధరంగానికి పౌరుషంతో వెళ్ళి, ఆ కౌరవాధములను ముక్కలు చేసి - చంపడమో, చచ్చిపోవడమో చేసి వుంటే... ఈ బాధ వుండేది కాదు, కదయ్యా!

"కృష్ణా, జగత్ప్రభూ! లోకేశా!" అని ఆ పిల్ల దీనంగా, గుండెలు బాదుకుంటు ఏడుస్తున్న సందర్భంలో అక్కడ అడుగుపెట్టిన కృష్ణుని చూసి మరింత గట్టిగా విలపించింది. "కుమారా! మీ తండ్రికి, గురువు దైవమైన శ్రీకృష్ణ వాసుదేవుడు" వచ్చారు. చూసి నవ్వరా ? తల త్రిప్పరా ? ఆ నవ్వేవారికి స్వాగత... సత్కార్యాలు...!" అంటూంటే ఆ మాటలు వింటున్న ప్రతి ఒక్కరు చలించి పోయారు. కండ్ల జలజల రాలే కన్నీటి బిందువులను తుడుచుకోవడం సాధ్యంకాక... ఆ పిల్లను ఓదార్చలేక పోతుంటే అందర్ని చూసి -

"ఒరేయ్.. పెద్దలందరూ వచ్చారు రా. తాతమ్మ, నాయనమ్మ, పెద్దమ్మ... మహా సామ్రాజ్ఞి! పాపం నాలాగే పిల్లల్ని పోగొట్టుకుంది. నిన్ను చూసి మురిసి పోవాలని వచ్చింది. అందర్నీ చూడరా!"

ఆ మాటల్ని వినలేకపోతున్నారు.

కృష్ణుడు వెంటనే పాదప్రక్షాళనం చేసుకున్నాడు.

ఉత్తర చేతిలోని పిల్లవాడిని తీసుకుని, అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ఉపసంహారింప చేసిన మంచంపై పరుండబెట్టాడు. తన హృదయంపై చేతిని వుంచుకుని "ఆత్మ స్వరూపిడిని, ఆత్మానందుడను, ప్రసాదితుడను, ప్రభావితుడనైన - ధర్మమును సదా సంరక్షించు - సద్ధర్ముడునైన తప్పక ఈతడు, చైతన్యుడు, యశోకాముడై భరతవంశ కీర్తి ప్రతిష్ఠలను దశదిశల విస్తరిల్లు చేయుగాక! అని సంకల్పించాడు.

వాసుదేవుని సంకల్పం ఫలించింది.

పిల్లవానికి ఆశీర్వచనం లభించింది.

అందర్ని ఆశ్చర్యబరుస్తూ - అభిమన్యుసుతుడు, భరతవంశ (కుల)దీపకుడు "చైతన్యుడు" అయ్యాడు. "కేరు" మని గట్టిగా ఏడిచాడు.

జీవమొందిన బిడ్డను "ఉత్తర - శ్రీకృష్ణుని పదములపై వుంచి, "సదా నీ రక్షతో - వీడు భరతవంశ భూషణుడై వెలుగుగాక!" అని ఆకాంక్షిస్తుంది. మరల, మరల, వాసుదేవుని ఆశీస్సుల నభ్యర్థిస్తుంది.

వేదవ్యాసులవారు వచ్చారు. భగవంతునిచేత పరిరక్షింపబడిన ఈతడు "పరిక్షిత్తు"గా ప్రఖ్యాతి వహిస్తాడు. విష్ణు కరుణతో జీవమొందినవాడు కనుక "విష్ణురాయడు" అని కూడా కీర్తింపబడతారని ఆశీర్వదించారు.

ఈ శుభవార్త నగరానికి అందింది. పండుగ వాతావరణమేర్పడింది.

ఈ శుభ సమయంలోనే, విజయులై - అపార ధనసంపదలతో, యుధిష్ఠరాదులు నగర ప్రవేశం చేసారు. ఎటు చూసినా, అంతా ఆనందమే.

వేదవ్యాసులు - ఈ పిల్లవాడు ధన్యుడు - ధర్మ్ముడు - శుభప్రదుడు భద్రుడు - అవుతాడు. "భరతావని కీర్తికి - ఘనుడవుతాడు" అని ఆశీర్వదించారు. అందరు ఎంతో సంతోషించారు.

# అశ్వమేధం

**ఆ** తర్వాత వ్యాసులు, యాగ విషయాన్ని, వివరాలను, ప్రయత్నాన్ని అడిగారు. అన్నీ విన్న వ్యాసులవారు -

"ముందు ఉత్తమాశ్వాన్ని సంపాదించాలి. అది యవనాశ్వుడి వద్ద వుంది. దానిని సాధించడం "చాలా కష్ట"మంటారు.

"తాతా! తమరు ఆశీర్వదించండి.

తమ ఆశీస్సులు, కృష్ణదేవుని కరుణ, అసాధ్యాలను సుసాధ్యం చేస్తా యన్నాడు - ముందుకురుకుతూ భీముడు. అక్కడే వున్న కర్ణసుతుడు, చిన్నాన్న నేను వెడతానన్నాడు. ముందు యుధిష్టరుడు వద్దన్నాడు. మా దౌర్భాగ్యం కొద్దీ అందరితోపాటు అన్నను చంపుకున్నాను.

అతనికి వారసుడివి నీవొక్కడివి. "నిన్ను...." బాధపడుతూంటే -

"ఇందులో మీ తప్పు లేదు. అదంతా నా తండ్రి స్వయంకృతం. ఇప్పుడవన్నీ దేనికీ. నాకీ కార్యక్రమంలో భాగముంది. ఆ భాగ్యాన్ని కాలరాయకండి."

ఈ మాటలన్నీ వింటున్న ఘటోత్కచ సుతుడు మేఘపర్ణుడు -

"ఔరారా! నా తండ్రికి ధీటయినవాడిని నేనుండగా మీరందరు వెళ్ళడం ధర్మం లేదు. ఆ అవకాశం నాకివ్వండి. సమర్థవంతంగా నిర్వహించుకు వస్తాను. ఇందుకోసం తాతగారు, వృకోదరులవారు - బయలుదేరడ మనవసరం...

నవ్వుకున్నాడు, భీముడు.

ఎవరి పాత్రను వారన్నట్లు, వారి వారి ధర్మాలను వాళ్ళు చెప్పుకుంటుంటే-

పిల్లలముందు, పెద్దలెందుకు పనికిరారన్నట్లు కృష్ణుడు, వారి మాటలను విని, ముసిముసి నవ్వులతో నవ్వుకుంటున్నాడు.

ఇప్పుడెలాగైనా, భీమసేనుని, సర్వసన్నద్ధుడిని చేయాలని తలంచాడు. ఆ సమయంలో కృష్ణుని చూసిన భీముడు "ఏం బావా! ఏ మా చిద్విలాసం ? పరిహాసమా ? అది పరమానందమా ?" అడుగుతాడు.

"ఏం లేదు. మీ మీ వీరవిక్రమాలను విని మురిసిపోతున్నానంటాడు.

అర్థం కాలేదు. బుర్ర గోక్కుంటూ భీముడన్నాడు.

"అది వుంటే కదా, అర్థం కావడానికి ?"

"బావా!...."

"అవును భీమా! బలం వేరు, బుద్ధి వేరు, ఏనుగు ఆకారమే భీకరము. కానీ బుద్ధి లేక నల్ల మందు చెట్లుకై, గోతిలోపడి బందీ అయిపోతుంది.

"బావా! ఇవన్నీ ఎందుకు ? ఒక్కటివ్వు...!"

"నిన్నా! నన్ను...."

"నీ ఆశీర్వచనం బావా! అదివుంటే అండపిండ బ్రహ్మాండాలన్నీ -

ఈ భీముని బుద్ధిలో నిలుస్తాయి. జ్ఞానం కల్గుతుంది. పరాక్రమం పెరుగుతుంది. ఒంటరిగా వెళ్ళి సాధించుకొచ్చాననే... పరువు మిగులుతుంది!"

"ఏమిటీ, పై హడావుండి అంతా, ఈ నీ సరసంతో మున్గిపోయిందే!"

వీళ్ళ సరసం - చూసేవాళ్ళ కొందరికి చోద్యం. కొందరికి ఆనందం.

వెరసి, మొత్తం - ఆనందం, ప్రస్తుతానికక్కడ సాక్షాత్కరించింది.

★★★★

గోవిందుని ఆశీస్సులతో బయలుదేరుతున్న భీమసేనుడు, వ్యాసులవారికి, మాతృమూర్తికి సాష్టాంగ నమస్కారం చేసాడు. తదుపరి కృష్ణుని చూస్తూ నిలబడ్డాడు. అతని మనసు గ్రహించినట్లు, వాసుదేవుడు -

"ఆగిపోయావేం, రానా ? వస్తావా ?" అని అడుగుతాడు. ఆ చమత్కారం ఒక్కరికి అర్థం కాలేదు.

"నీవు అనుగ్రహిస్తే, నేనే వస్తాను."

"అనుగ్రహిస్తేనా ? అనుమతిస్తేనా... ?

"ఏదైనా ఫర్వాలేదు. నేనే వస్తున్నానంటాడు. భీముడు మళ్ళీ అతనే - ఏదో నాకంటే చిన్నవాడివనుకుంటే, లోకాలకే పెద్దదిక్కువయ్యావు. నా కళ్ళకు మాత్రం, నా చిన్న బావవే. అలాగని, నిన్ను అవమానించను. అభిమానిస్తాను. నీ అనుజ్ఞ - నీ ఆశీస్సులుంటే ఏదైనా సాధ్యమే ? అన్నవాడు "ఒక్కసారి...!" అంటాడు.

"అయ్యో! పెద్దవాడివి, ఒక్కసారేం కర్మ. రెండుసార్లు...!"

"వద్దు. బావా! వద్దు. నిన్ను ఆలింగనం చేసుకుంటాను. అనుమతించు. అప్పుడు నీలోని, నీ సర్వశక్తులు నన్ననుగ్రహిస్తాయి. వెళ్ళే కార్యక్రమం దిగ్విజయం చేసుకుని, వస్తానంటాడు.

శ్రీకృష్ణుని దరి చేరి, గాఢాలింగనం చేసుకుంటాడు.

"బావా! జాగ్రత్త...! అసలే...!" అంటూంటే, ఏదో అనిర్వచనీయమైన అపురూప ఆనందం పొందిన "భీముడు" చాలు, బావా! చాలు. ఈ అపురూప స్పర్శ - ఇందులోని అవ్యక్తానందములో, ఈ పధ్నాలుగు లోకాలను పొడి, పొడి చెయ్యగలనంటాడు.

"అంత కష్టపడవద్దు కాని, వెళ్ళి, యాగాశ్వం సులభంగా తీసుకుని, రా! విజయోస్తు" అంటాడు వాసుదేవుడు.

ఇందులో ఆనందం వుంది. సరసం వుంది. చమత్కారముంది.

అదే శ్రీకృష్ణలీల, ఆనందహేల, ఓం నమో భగవతే వాసుదేవాయ!

అందరికీ అన్ని చెప్పి - అన్న కర్ణుని కుమారుడు వృషకేతుని, మనుమడు మేఘపర్ణుని తీసుకుని భీముడు బయలుదేరాడు. తగు పరివారంతో, ప్రయాణం చేసి భద్రావతి నగర సరిహద్దులకు వచ్చి, అక్కడగల ఎత్తయిన కొండపై, నగరం మొత్తాన్ని చూడటానికి వీలుగా, ఎదుర్కోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను, ఆలోచించు కోవడానికి బస చేసాడు.

భద్రావతిపురం ఎంతో అందంగా వుంది.

ఆ నగరం చివర పెద్ద జలాశయం.

వూళ్ళోని జంతుజాలంతోపాటు రాజుగారి పశుసంపద కూడా ఇక్కడికి వస్తుందని తలచి, ఇక్కడ కనుక కాపువేస్తే, ఆ వచ్చే యజ్ఞాశ్వాన్ని సులభంగా పొందవచ్చనుకున్నాడు. ఈ ఆలోచనలలో - భీముడు అనుకున్నట్లే -

ఆ జలాశయం వద్దకు, ముందుగా ఏనుగులు వచ్చాయి. వాటిని చూసి సంతోషపడ్డా భీమాదులు, తప్పక అశ్వాలు కూడా వస్తాయని తలిచారు. ఈ ఏనుగులు వెళ్లిన కొంతసేపటికి, అశ్వసంపద వచ్చింది. ఘటోత్కచ కుమారుడు మేఘపర్ణుడు, గగనవీధి కెగిరాడు.

ప్రతి ఒక్క అశ్వాన్ని పట్టి పట్టి చూస్తున్నాడు. అన్ని చూసాడు. పెదవి విరిచాడు. మహర్షి ముత్తాత చెప్పిన వర్ణాల అశ్వం - ఆ సమూహంలో కనబడలేదు. "అయ్యో!" అనుకున్నాడు. ఆ వెంటనే బుద్ధి పని చేసింది. కృష్ణ భగవానుడు "విజయోస్తు" అన్నాడు. కాబట్టి, విజయమేననుకున్నాడు.

కొన్ని వెళ్ళిపోతున్నాయి.

ఇంకొన్ని అశ్వాలు వస్తున్నాయి.

మేఘపర్ణుడు, తాతకు శ్రమివ్వకుండా, వచ్చే అశ్వాలనన్నింటిని పట్టి, పట్టి-పరికించి చూస్తున్నాడు. అందులో ముందుగా సామ్రాట్టుగా, ఠీవిగా ఓ ఉత్తమాశ్వం నడుస్తూ వుంది. మహర్షి చెప్పిన రంగు, లక్షణాలన్నీ వున్నాయి. వాసుదేవుని ఆశీర్వచనం ప్రకారం, ఉత్తమాశ్వం కనుపించింది.

"తాతా! మేఘపర్ణుడు సంబరపడిపోతూ భీమసేనుని పిలిచాడు. మిగిలిన ఇద్దరు కూడా చూసారు. అందరు సంతోషించారు. వృషకేతువు "బాబాయి! నేను దానినిటు మళ్ళించుకు వస్తానన్నాడు."

ఆ వెంటనే - మేఘపర్ణుడు "తాతా! నేను మా నాన్నను మించిన మాయా విశారదుడను. కనుక, నేను నా మాయతో వాళ్ళందర్ని తరిమి, ఆ గుర్రాన్ని కుక్కపిల్లను పట్టుకొచ్చినట్లు పట్టుకు వస్తాను" అన్నాడు.

ఇది మంచిదే....!"ననుకుని, వృషకేతువు భుజంతట్టి, ముందు ఆ అశ్వం-మన దగ్గరకు వచ్చాక, మిగిలిన వీరంగం, వాడితో కలిసి మనం నడుపుదా మంటాడు. వృషకేతువు తలవూపుతాడు,

మేఘపర్ణుడు, మహదానంతో కొండదిగి, తన మాయాబలంతో, భీభత్సం సృష్టించి, ఆ ఉత్తమాశ్వం యొక్క నాలుగు కాళ్ళు కలిపి పట్టుకుని, గగన మండలానికి ఎగురుతాడు.

మొదట్లో కొంత - మేఘపర్ణుని భీభత్సానికి కంగారుపడినా, తదుపరి దాని రక్షకుడు. అశ్వాన్ని, అది సంగ్రహించిన వ్యక్తిని గమనించి అతనిపైకి బాణాలు ప్రయోగించే లోగా మేఘపర్ణుడు, ఆ అశ్వంతో సహా తాత సన్నిధిలో నిలిచాడు.

మనుమని, సాహసానికి భీముడు "భళా!" అని ప్రస్తుతించాడు.

"తాతగారు, మీరు బాబాయి, ఇక్కడే వుండండి. ఆ మీదికి వచ్చే సైనికులకు, నా తడాఖా చూపించుతానని, ఒక పెద్ద చెట్టును పెరికి, దానితో అడ్డమొచ్చిన వాడినలా, పిచ్చి బాదుడు. బాదుతుంటే, అశ్వ-సైనిక సంపదలు నాశనమయ్యాయి.

చావగా మిగిలినవారు, ప్రాణభయంతో, జరిగినదంతా వెళ్ళి మహారాజుతో చెప్పారు. ఎవరో, ఒకడు.... గబగబ పిడుగులు ఉరుములు - మెరుపులు సృష్టించాడు. ఉత్తమాశ్వాన్ని ఎత్తుకుపోయాడు. అతను, అరంగుళం కూడా, అటు

ఇటు కదలక, ఒక మహా వృక్షాన్ని పెకలించుకుని వచ్చాడు. దాంతోనే మనవాళ్ళను, అశ్వసంపదను చంపేసాడన్నారు.

యవనాశ్వునికి కోపం వచ్చింది.

సాయుధులై, చతురంగ బలాలతో, వాళ్ళనెదుర్కోండి. నేను, మీ వెంటే వుంటాను. వెంటనే బయలుదేరండి!'' అన్నాడు.

వచ్చే అపారసేనను చూసిన వృషకేతుడు, "బాబాయి ఆ వచ్చేవాళ్ళను నేను ఎదుర్కొంటాను. ఈ కుమారుడు మేఘపర్ణుడు అలసిపోయాడు. నన్ను అశీర్వదించండన్నాడు.

శుభమస్తు.... అన్నాడు చిరునవ్వులు చిందిస్తూ.. భీముడు.

అంతా శ్రీకృష్ణుని దయ. లేకపోతే-ఇది సాధ్యమా అనుకుంటున్నాడు భీమసేనుడు.

వాళ్ళను చూస్తూనే వృషకేతువు ధనుష్టంకారం చేసాడు. ఆ ధ్వనికే కొందరు కలవరపడిపోయారు. తేరుకునేలోగా - తీవ్రవేగంతో బాణాలు. ఎటునుంచి వస్తున్నాయో తెలియటం లేదు. ప్రాణరక్షణకు మార్గము కనబడటం లేదు.

అంత గందరగోళంగా వుంది.

యవనాశ్వుడు రంగంలోకి దిగాడు.

వస్తూనే వృషకేతువు ఆ పిల్లవాడిని చూస్తూ - సాహసాది, శరసంధాన ప్రయోగాన్ని చూసి "భళా!'' అని అనకుండా వుండలేకపోయాడు.

"నాయనా, నిన్ను చూస్తే నాకు చాలా ఆనందంగా వుంది. ప్రతాప వంతుడవని గ్రహించాను. నీవు... అనగా - తనది "కాశ్యప'' గోత్రమని, సూర్య భగవానుని మనుమడను, దానకర్ణుడైన యుధిష్ఠరాగ్రజుని పుత్రుడనన్నాడు.

మా పినతండ్రి - యుధిష్ఠర సార్వభౌములు, వేదవ్యాసులు, శ్రీకృష్ణ భగవానుల ఆశీస్సులతో, అశ్వమేధం తలపెట్టారు. యజ్ఞాశ్వం ఇక్కడ వుందని, మా ముత్తాత వ్యాసులవారు తెలిపారు. ఆ కారణంగా ఇక్కడికి వచ్చాము''ని తన వివరాలు, వచ్చిన కార్యం వివరించి చెప్పాడు.

"సంతోష"మని, రథమెక్కి యుద్ధం చేయమంటే, అవసరం లేదు. మా మామ కృష్ణ పరమాత్ముల వారి దయ పుష్కలంగా వుండ, ఎన్ని అక్షౌహిణుల సైన్యమైనా మాకు భయం లేదని ధనుష్టంకారం చేసి యవనాశ్వుని ప్రతాపానికి, వృషకేతువు అడ్డుకట్టగా నిలిచాడు.

ఇద్దరికి ఘోరాతిఘోరంగా యుద్ధం జరుగుతుంది. ఒకసారి యవనాశ్వుడు, ఇంకోసారి వృషకేతువు... ఈ రకంగా గాయాల పాలవుతున్నారు. మూర్ఛితులవుతున్నారు. పరిస్థితి విషమిస్తుంది. ఎప్పుడైతే వృషకేతువు మూర్ఛితుడైనాడో భీముడు, తన గదను తీసుకుని యవనాశ్వుని ఢీకొన్నాడు.

ఇప్పుడు - గదా యుద్ధ ప్రవీణుడైన సువేగుడు భీమునితో కలయబడ్డాడు. కొంత గదా యుద్ధం. ఆ తదుపరి మల్లయుద్ధం. ఈ ఇద్దరు కలియబడుతుంటే వారి వారి ముష్టి - పిడి ఘాతాలకు వాళ్ళు స్పృహ తప్పారు. ఈలోగా - యవనాశ్వుడు, తెలివొందిన వృషకేతువుపై శరసంధానం చేసాడు. ఆ బాణాల నన్నింటిని త్రిప్పికొట్టి వృషకేతువు వేసిన సర్పముఖ బాణాలకు, మహారాజు యవనాశ్వుడు, తూలి వాలిపోయాడు.

వృషకేతువు గబగబ రథం దిగి, యవనాశ్వుని చూసి "మహారాజా! నా మూలాన అశువులు బాసావా ?" అని బాధపడుతూ, కృష్ణ నామస్మరణం చేస్తూ అతని గాయాలను తుడిచి తన ఉత్తరీయంతో కట్టు కట్టాడు.

"దేవదేవా! ఈ దీనుడిని కరుణించి, మహారాజును బ్రతికించమని, మనస్ఫూర్తిగా ప్రార్థించాడు. యవనాశ్వుడు కళ్ళు తెరిచాడు. ఏదీ... అని లేవబోతూంటే, ఎవరినైతే తాను వధించాలని తలుస్తున్నాడో - ఆ వృషకేతువు, దానశీలి కర్ణుని కుమారుడు తనకు ఉపచారాలు చెయ్యడం, తన ఉత్తరీయం చింపి, తన గాయాలకు కట్టు కట్టడంతో చలించిపోయాడు.

"బిడ్డ! నిజంగా ధన్యుడివి. శత్రువునైనా క్షమించగల - నీ దివ్య హృదయం అనుపమానం... ఇప్పుడు నీ ధర్మనిరతికి, దీక్షగా ఉపకృతిగా, నాకు ప్రాణదానం చేసినందులకు - కృతజ్ఞతతో - నా రాజ్యం సర్వస్వం నీకర్పిస్తున్నాను.

స్వీకరించు. స్వీకరించి, సదా శ్రీకృష్ణ పదాంబుజములను దర్శిస్తూ, వారి నామంతో తరించేటట్లు, నన్నునుగ్రహించమంటాడు.

అందుకు వృషకేతువు, పెద్దవాడైన మహారాజుకు రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ "మహారాజా! ఇవ్వడం తప్ప, తీసుకోవడం తెలియని వంశంలో పుట్టిన వాడినని, ఇంతకుమునుపే చెప్పాను. రాజ్యం వీరభోజ్యమే కాదనను. నిజానికి, ఈ నగరంలో నిలచింది, గెల్చింది - ఆ కృష్ణ పరమాత్మ.

మనము నిమిత్తమాత్రులం. మీరు పెద్దవారు నన్ను ఆశీర్వదించాలి. మా పినతండ్రి యజ్ఞమునకు సహకరించండి. తమరు దగ్గర వుండి - ఆ యజ్ఞఫలాన్ని పొందండి అని అంటున్నాడు...!

ఈ సమయంలో, భీమసేన, సువేగులకు తెలివొచ్చింది.

"హస్తినాపుర యువరాజా! మహా భీమా! ఇక యుద్ధమనవసరం. ఈ వృషకేతువు నాకు ప్రాణదాత. ఇప్పుడు మనం మిత్రులం. అసలు శతృత్వం మనకెప్పుడూ లేదు.

ఇదిగో - ఈ యజ్ఞాశ్వాన్ని తీసుకువెళ్ళి, పెద్దలు తలపెట్టిన అశ్వమేధాన్ని పూర్తి చెయ్యండి అని సవినయంగా తెలిపాడు.

"తప్పక...!" అన్నాడు భీముడు.

"అయితే రండి. అలసిపోయిన మీరు విశ్రాంతి తీసుకోండి. యజ్ఞాశ్వంతో నేను వస్తాను. కృష్ణ భగవానుని దర్శనం చేసుకుంటాను. తరిస్తానంటాడు.

ఓ రెండురోజులు, అక్కడ వుండి... అందరు ఆనందంగా యజ్ఞాశ్వంతో హస్తినకు బయలుదేరారు. తమ రాకను ముందుగా సార్వభౌమునికి కబురు పంపించిన భీముడు, మహారాజా! ఇక్కడ విశ్రాంతి తీసుకోండి. నేను, సార్వభౌమునికి సర్వం తెలియబరుస్తాను. వారు తగు సముచిత మర్యాదలతో, నగరానికి ఆహ్వానిస్తారన్నాడు.

జరిగిందంతా విని ధర్మరాజు మహదానందభరితుడయ్యాడు.

నిండుసభలో వున్న యుధిష్టర సార్వభౌముడు, యువరాజు భీముని ద్వారా "భీమా! నువ్వే స్వయంగా వెళ్ళి మాతృశ్రీకి, ద్రౌపదీదేవికి తెలియబర్చమన్నాడు.

మరొకవైపు యవనాశ్వ మహారాజును నగరానికి ఆహ్వానించ తగు ఏర్పాట్లు చేయించాడు. ఆ మర్నాడు -

యుధిష్ఠర సార్వభౌముడు, సామ్రాజ్ఞి ద్రౌపది, కృష్ణ భగవానుడు, సోదరులు, ముఖ్యమైన ఇతరులతో కలిసి, యవనాశ్వ మహారాజును, మహారాణిని, వారి కుమారుడు - యువరాజు సువేగుని సాదరంగా ఆహ్వానించారు.

సకల విధ రాజమర్యాదలతో వారిని నగర ప్రవేశం చేయించారు.

ఇటు సార్వభౌముని, అటు శ్రీకృష్ణ భగవానుని దర్శించిన యవనాశ్వుని ఆనందానికి హద్దుల్లేవు.

శ్రీకృష్ణ భగవానునికి, శరణాగతుడను, దాసుడనని, తనను అర్పించుకున్న యవనాశ్వుడు, వాసుదేవునికి సాష్టాంగ నమస్కారం చేసాడు. తదుపరి యుధిష్ఠరుని చూసి -

"సార్వభౌమా! అనంతమైన తమ కృపారసమును పొందగలిగాను. అదృష్టవంతుడను. ఇది యాగానికై నేను సమకూర్చుకున్నది. ఇక్కడ లోకకల్యాణ కారకులైన శ్రీకృష్ణభగవానుడు, సకల ధర్మ నిగమాగమ స్వరూపులైన వేదవ్యాసుల వారు, సద్ధర్మమూర్తులైన తమరు - సలిపే -

ఈ అశ్వమేధం సమస్త లోక కల్యాణ కారకం.

కనుక నేను తరించినట్లే, దీనిని స్వీకరించి యజ్ఞ ప్రసాదాన్ని ప్రసాదించమని ప్రార్థించాడు. పాదాభివందనం చేసాడు.

ఇంతటి మహత్తరదృష్టం కల్పింప చేసిన -

వేదవ్యాసులకు -

విజయమన్న - గోవిందునికి

వెంటనుంటామన్న వృషకేతువుకు.

"నన్ను మరువకండి. సదా మీ వెంటేనన్న మేఘపర్ణునికి -

సదా కృతజ్ఞుడనని, యవనాశ్వుడు వేదోక్త వందనాలర్పించాడు.

# యజ్ఞ రక్షణ

**య**జ్ఞం ప్రారంభించడానికి కావలసిన సర్వ వనరులు శ్రీ వేదవ్యాస, కృష్ణదేవుల కృప వలన సిద్ధమయ్యాయి. ఇక యజ్ఞం ప్రారంభించాలి.

ఎప్పుడు - ఎక్కడ - ఎలాగ -

ఇది మనలోని మానవ ప్రశ్నలు.

వీటికి సమాధానంగా - ఒకనాడు.

వేదవ్యాసులవారు వచ్చారు. యుధిష్టరాదులను ఆశీర్వదించారు.

మీ ఆశీస్సులు - బావ, వాసుదేవుని అనుగ్రహమే ఈ యజ్ఞ సాఫల్యానికి-కారణమౌతుంది. ఎంత చేసినా, కాలాన్ని బట్టో, లేక స్థిర చిత్తము రాను రాను బలహీనపడో... ఇటువంటి అపురూప కార్యక్రమాలకు, దుష్టశక్తుల నుండి విఘ్నాలు కూడా కల్గుతాయంటారు. అదే నా భయమంటాడు.

"నువ్వు చెప్పింది, అక్షరాలా నిజం కాదనను."

మంచికి - ఎప్పుడు - చెడు - చెడే చేయ చూస్తుంది. మంచి మాత్రం - అందరికి మంచినే చెయ్యాలని చూస్తుంది. ఇవి సహజ లక్షణాలు. ఇంద్రుడున్నాడు. అతడు దేవతా ప్రముఖుడే అయినా తన స్వార్థంతో, తన కోసం - ఇతరులను వధించడానికైనా సిద్ధపడతాడు. దీనినేమనాలి!

దేవతా ప్రముఖుడిలాగ చేస్తాడా ? అని ఆశ్చర్యపోతావా ?

ఎందుకు చేస్తున్నాడని... బాధపడతావా ?

మన దుర్యోధనుడే... అయినా... నీకు దాయాదే.

ఒక - రాజ్యం - ఒకరిదే - ఆ రాజ్యం ఇద్దరిదయి, ఇన్ని ఘాతాలు జరిపి చివరకు చరిత్ర భ్రష్టుడయ్యాడు. అవునా ?

"నిజం. శ్రీకృష్ణ పరమాత్మ రక్షణ పొంది వున్నారము కాబట్టి, మేము పసితనంలో హస్తినలో అడుగుపెట్టినప్పటి నుండి, ఎన్నో ఆపదల నుండి బయట పడ్డాము.

ఇవ్వాళ - జరిగిందేదైనా, తప్పెవరిదైనా........ అందర్ని పోగొట్టుకుని ఒక మూల అలమటిస్తూ ఈ సర్వభోగాలను అనుభవిస్తున్నాము.

దీనికి మూలం కాదు, సర్వం ఆ వాసుదేవుడే! ఆయన కృపే మమ్మల్ని బ్రతికిస్తుందంటాడు యుధిష్టరుడు. వ్యాసులు-

"ధర్మరాజా! వచ్చేది చైత్రమాసం" అన్నారు.

యజ్ఞ నిర్వహణానికి తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

యాదవ ప్రముఖులందరు, శ్రీకృష్ణవాసుదేవుడు, ఆయన పత్నులు - పుత్ర - పౌత్ర - సహితం విచ్చేసి కాళిందీ తీర ప్రాంతంలో విడిది చేసారు. వారందర్ని యుధిష్టరుడు ఆహ్వానించి నగరానికి తీసుకువచ్చాడు.

ఒక ప్రక్కన యజ్ఞ ప్రయత్నాలు.

మరొక ప్రక్కన - విఘ్న - అవరోధాలు.

వాసుదేవుడు - సాల్వుని చంపినప్పటి నుండి అతని సోదరుడు. ఈ అశ్వమేథయాగ సమయంలో, ఏదో రకంగా కృష్ణుణి చంపాలనే మిషతో వున్నాడు. దాంతో పాండవ సైన్యంలో కలిసి, సమయానికి ఎదురుచూస్తున్నాడు.

అతనికి కాలం కలిసి వచ్చినట్లు, ధర్మ భీమార్జునులు, కాళిందీ తీరానికి వెళ్ళడంతో, అతని సేనాధిపతి తారకుడు ఆ యాగాశ్వాన్ని అపహరించి, గృధ్రవ్యూహంతో, మధ్యలో ఉత్తమాశ్వాన్ని వుంచి యుద్ధానికి సిద్ధమయ్యాడు.

అతనితో, అనుసాల్వుడు... "ఆదినుండి మాకు, యాదవులకు బద్ధవైరము." అంటూ విషయం తెలిసిన అతను వస్తాడు. మా అన్నను చంపిన, ఆతనిని చంపి పగతీర్చుకుందామంటాడు. తారకుడు, తల వూపుతాడు.

యాగాశ్వపహరణ విషయాన్ని, కృష్ణ సన్నిధిలోని యుధిష్టరునకు సైనికులు తెలుపుతారు. ఆయన కంగారుపడుతూ "బావా!" అంటాడు, భయంగా.

కంగారు పడవద్దు. ఇది అనుసాల్వుని పని. మీరందరు... అని.. అర్జునుని వైపు తిరిగి, వీళ్ళను జాగ్రత్తగా చూసుకో యుధిష్టరా! మీరు నగరానికి వెళ్ళి, నగర రక్షణం చూసుకోండి. నేను, మన యువరాజు, యువకులం బయలుదేరి వెళ్ళి మీ యజ్ఞాశ్వాన్ని తెస్తాము. ఆ తర్వాత మిగిలిన కథ.... అంటాడు.

వాసుదేవుడు చెప్పినట్లే వాళ్ళు, వాళ్ళ పనులయందు తమ దృష్టిని నిలిపారు. వాళ్ళందర్ని పంపిన కృష్ణుడు -

"ప్రద్యుమ్నా, నీవు వృషకేతు, అనుసాల్వుని సైన్యాలను ఎదుర్కోండి." అని - "నేను, రానా... ?" అంటాడు.

"అవసరం లేదు మామా! నేను, బావ వాళ్ళను మంచినీళ్ళు తాగించి, యవనాశ్వంతో తిరిగి వస్తామన్నాడు.

ప్రద్యుమ్న, వృషకేతువుల ప్రవేశంతో, అనుసాల్వుని గృధ్రవ్యూహం చెదరి పోయింది. అతని సైన్యం చెదరిపోయింది. ప్రద్యుమ్నుడు శరపరంపరతో అనుసాల్వుని కంగారు పెడుతుంటే, ఎదుర్కోవలసిందిపోయి, మాటలు మొదలుపెట్టాడు.

ప్రద్యుమ్నుని ధాటికి మొదట్లో తట్టుకోలేకపోయినా, ఒక మహాస్త్రంతో ప్రద్యుమ్నుని దెబ్బ తీసాడు. అది శ్రీకృష్ణునికి క్రోధ కారణమైంది. పాంచజన్యం పూరించాడు. సాల్వుని సేనల తలలు తిరిగాయి.

ఇటు భీమ విజృంభణం. అటు వృషకేతువు శర పరంపర. శ్రీకృష్ణుని చిద్విలాస రణ కౌశలం. అన్నీ అధిగమిస్తూ - భీముని తీవ్రమైన బాణంతో పడగొట్టి, వాసుదేవుని అనుసాల్వుడు ఢీకొంటున్నాడు. ఆ రోజు మా అన్నను చంపావు. "ఇవ్వాళ నిన్ను నేను మహా మాయగా చంపుతాను. కాచుకో" అన్నాడు. ఇరువురు బాణాలను తీవ్రంగానే విడుస్తున్నారు.

మధ్యలో వృషకేతువు కలుగచేసుకుని, అనుసాల్వుని సారథిని, అశ్వాలను కూల్చాడు. భయపడక అనుసాల్వుడు, వృషకేతుని రథమెక్కి అతని గుండెపై తన్నాడు. వృషకేతువు చలించలేదు సరికదా - అనుసాల్వుని రెండు కాళ్ళు పట్టుకుని గిరగిర త్రిప్పి నేలకేసి పడేసాడు.

అతని గుండెలపై కాళ్ళు వేసి తొక్కి, వింటినారితో కంఠం బిగించాడు. ఆ దెబ్బకు ముక్కు పగిలి రక్తం కారుతూ, మూర్ఛితుడయ్యాడు. వాడు కాళ్ళు పట్టుకుని ఈడ్చుకు వస్తూ "మామా! ఇదిగో గుర్రపు దొంగ! వీడిని....!" అంటూ కృష్ణుని పాదాలపై పడేసాడు.

వృషకేతువును కృష్ణుడు అభినందించాడు. మహావీరుడవని, జగతి మెచ్చుకుంటుందని, ఆశీర్వదించాడు. వర బల గర్వంతో మిడిసిపడే అనుసాల్వుని నీవు జయించగలిగావంటే, నిజంగా వీరుడవు ధీరుడవు అని అభినందించి ఆశీర్వదించాడు.

ఇప్పుడు మెల్లిగా కళ్ళు విప్పుతూ అనుసాల్వుడు పరిసరాలను పరికించాడు. ఎవరినైతే తను వధించాలనకున్నాడో ఆ వాసుదేవుని పాదాల వద్ద తానున్నా'డు. అప్పటికి తెలివి, బుద్ధి - జ్ఞానం అన్నీ వచ్చాయి.

"ప్రభో వాసుదేవా!" అన్నాడు. కరుణించమని ప్రార్థించాడు. శరణాగతుడనని వేడుకున్నాడు. కనికరించ మన్నాడు.

మహాభక్తులకు తప్ప ఇతర బంధములకు చిక్కని నిన్ను, బంధించాలను కోవడం, జయించాలనుకోవడం, నా మూర్ఖత్వం. మొత్తానికి ఏదో రకంగా నీ శ్రీ చరణాల నిలిచాను. నా అజ్ఞానం తొలగిపోయింది. నీ ఆజ్ఞాబద్ధుడనన్నాడు.

ఆ మరునాడు అందరు కలిసి యుధిష్టర సార్వభౌముని కలిసారు. అప్పుడు కృష్ణుడు, ఇప్పుడు - ఈతడు నీకు మిత్రుడు - సామంతుడు. ఈ యజ్ఞాశ్వంతో వెళ్ళి - నీకు విజయాన్ని చేకూర్పింప చేయడంలో, కేవలం... సహకరిస్తాడని పరిచయం చేస్తాడు ?

"చిత్త"మని, నిలుచోగా - సద్ధర్మమూర్తియైన ధర్మరాజు -

"రాజా! ఈ క్షణం నుండి, నీవు నా సోదరులలో ఒకడివని" అభిమానించాడు.

"వృషకేతూ! ధన్యుడవు. నీ చిన్నాన్న యజ్ఞ సంరక్షణమునకు, యజ్ఞాశ్వము తెచ్చి నన్ను కీర్తిమంతుని చేస్తున్నందులకు, నీకు అభినందనపూర్వక ఆశీస్సులని, మురిసిపోయాడు.

# యజ్ఞం

చైత్రపూర్ణిమ వచ్చింది.

ఒక పుణ్యదినాన, యుదిష్ఠర, ద్రౌపదిలు, ఉపవాస దీక్ష చేసారు. యజ్ఞదీక్ష నొందడానికి కావలసిన వైదిక క్రియలన్ని నిర్వర్తించారు. వంశకర్త వేదవ్యాసులకు, మాతృమూర్తి కుంతీదేవికి నమస్కరించారు. గాంధారీ, ధృతరాష్ట్రుల అనుజ్ఞ, ఇతర పెద్దల ఆశీస్సులు పొంది ద్రౌపది, యుధిష్ఠరులు యజ్ఞదీక్షను స్వీకరించారు.

యవనాశ్వాన్ని రప్పించి, సకలాలంకారములు చేసారు. పూజాదులు నిర్వహించారు. బంగారు రేకుపై "యాగ వివరాలను" లిఖించిన దాని ముఖముపై కట్టారు. ఆ అశ్వాన్ని విడిచారు.

చూడగానే వందనం చేసేటట్లు, మహా సుందరంగా పవిత్రంగా వుందా - యవనా (యజ్ఞా)శ్వం!

అభిజిత్తు లగ్నంలో -

మంగళవాయిద్యాల సుమధుర ఘోషల మధ్య యజ్ఞాశ్వాన్ని విడిచారు.

అర్జునుడు, దానికి రక్షకుడిగా - ధనుర్బాణాలను ధరించి బయలుదేరాడు.

కృష్ణునికి నమస్కరించి, ఆయన అనుగ్రహమర్థించాడు. వేదవ్యాసులవార్కి నమస్కరించి వారి దీవెనలను కోరాడు. ఆ తదుపరి - కృష్ణుడు -

అర్జునా! నీతోపాటు, ప్రద్యుమ్నుని, వృషకేతువును కూడా తీసుకుని వెళ్ళు. అలాగే యవనాశ్వుడు, అనుసాల్వుడు కూడా నిన్ననుసరిస్తారు. అవసరమొస్తే తలుచుకో. నీ ఆపద కాస్తానంటాడు.

అందరికి నమస్సులర్పించి, యాగాశ్వంతో వీర కుమారులై ప్రద్యుమ్న, వృషకేతువులు, యౌవనాశ్వ, అనుసాల్వులతో - అర్జునుడు బయలుదేరాడు.

యాగాశ్వము స్వేచ్ఛావిహారము ప్రారంభించింది.

అడ్డువచ్చిన త్రిగర్తవీరులను శిక్షించకుండా మందలించాడు. వచ్చే చైత్ర శు॥ పౌర్ణమికి హస్తినకు వచ్చి యాగములో పాల్గొనమని సూచించాడు. ఇదే విధముగ, తన తండ్రి ప్రాగ్జోతిషపురాధిపతి భగదత్తుని వధించిన... అర్జునుని యాగాశ్వముని బంధించిన ఆతని కుమారుడు వజ్రదత్తుడు నిలువరించి యుద్ధము చేయ, ఆతనిని శాంతింపచేసి, పై విధముగా చైత్ర శు॥ పౌర్ణమికి, హస్తినకు ఆహ్వానించాడు.

ఇలా యాగాశ్వం చేసే ప్రయాణంలో మహిష్మతీపురానికి రావడం, యువరాజు ప్రవీరుడు, దానిని చూసి భార్య కోరిక మేరకు బంధించడం జరిగింది. ఈ విషయాన్ని సైనికులు అర్జునునకు తెలిపారు. దీనికి "బాబాయి మీరెందుకు, ఈ వీరుని విషయం నాకు వదిలెయ్యండి'' అన్నాడు. అతనితోపాటు, అనుసాల్వుని కూడా అర్జునుడు వెళ్ళమన్నాడు.

వృషకేతువు, అనుసాల్వుడు వారి గురించి చెబితే, "చాలా సంతోష మన్నా''డా యువరాజు. తమ అర్జునులవార్ని దయ చేయమనండి. వారి

పరాక్రమాన్ని పరికించాలి అంటాడు. వృషకేతువు కవ్వించగా యువరాజుగారితో యుద్ధం చెయ్యడం, ఇరువురి అశ్వములు, సారథులు దెబ్బతినడం, చివరకు అనుసాల్వుని చేతిలో ప్రవీరుడు దెబ్బతినడం, పాండవ సైన్యం జయ జయ ధ్వనులు మహిష్మతీ పురాధిపతి కందాయి.

తన అల్లుడు అగ్నిదేవుని సేనా నాయకత్వంలో నీలిధ్వజుడు యుద్ధానికి వచ్చాడు. ఇప్పుడు అర్జునునికి మహిష్మతీశ్వరునికి మధ్య యుద్ధం. చివరకు నీలధ్వజుడికి రక్షకుడైన అల్లుడు, అగ్నిదేవుడు అస్త్రమై అర్జునుని, సేనపై పడుతుంటే, పాండవ మధ్యముడు వారుణాస్త్రం వేసాడు.

సహజ అగ్నిదేవ - దివ్యాస్త్రము ముందు వారుణాస్త్రం దెబ్బతినడం, కనుపించిన వారినెల్ల కాలుస్తుంటే, సర్వ సైన్యం నాశనమై ఒంటరిగా నిల్చాడు. పరిస్థితికి బాధపడుతున్నాడు. ఇదేనా నా ప్రతాపం ? కృష్ణుడు... అప్పుడర్థ మయింది. కృష్ణా! అని ప్రార్థించాడు. విలపించాడు.

ఖాండవదహనానికి తృప్తిపడిన అగ్నిదేవుడు, తానిచ్చిన అస్త్రశస్త్రాల శక్తిని, తానే నీరు గార్చాడా ? అని విలవిలలాడిపొయ్యాడు. అయినా ధైర్యంపూని శుచియై, పద్మాసనం వేసుకుని, అగ్నిని స్మరించాడు. అతని దర్శనం లేదు. ధారకత్వం లేదు. ఇక నా శక్తి సన్నగిల్లిందని, అర్థం చేసుకుని "బావా! నన్ను రమ్మంటావా... అన్న మాటలను అర్థం చేసుకుని వాసుదేవుని బిగ్గరగా పిలచినవాడు చివరిగా, నారాయణాస్త్రం తీస్తాడు. మంత్రోచ్ఛరణం చేస్తున్నాడు.

పర్వతాలు కదలుతున్నాయి. భూమి కంపిస్తుంది. ఇంద్రాది దేవతలు భయపడిపోతున్నారు - అప్పుడు - అగ్ని బ్రాహ్మణ రూపంతో వచ్చాడు. శరణాగతు డయ్యాడు. అస్త్రం ఉపసంహరించు. సర్వం సానుకూలమౌతుందని అభయ మివ్వడంతో అస్త్రాన్ని ఉపసంహరించుకున్నాడు.

మరుక్షణం మామగారి ముందు అగ్నిదేవుడు ప్రత్యక్షమవగా -

అల్లుడూ! సర్వ శత్రుసంహారం జరిగిందా'' అంటాడు. "రాజా! అతడు నారాయణ భక్తుడు, శిష్యుడైన అర్జునుడు. సదా శ్రీమన్నారాయణ పరిరక్షితుడు. అతనితో విరోధం మీకు, ఈ సకల లోకాలకు ప్రమాదం. నేను నిజానికి వారికి దాసుడను. అయినా గతాన్ని మరచి, మీ అల్లునిగా కాక, సేనా నాయకునిగా, నా సేనలతో విజృంభించాను. జరిగిన ప్రమాదానికి చింతిల్లి -

అతడు నారాయణాస్త్రం తీసాడు. ఇంకేముంది, గోవిందా!

అయితే లోకాలన్ని ఆ అస్త్రానికి శరణాగతినొందడమో లేక భస్మమవడానికి సిద్ధపడటమో చెయ్యాలి. ఇక - దాంతో శాంతుడనయ్యాను. ఆక్రోశం వలదని, శాంతియే సౌఖ్యమని తెలుపడానికి వచ్చాను'' అంటూ -

శ్వేతకి యజ్ఞం - యజ్ఞ "ఆజ్య"ధారల నొంది కృశించడం, ఖాండవ దహనానికి, కృష్ణార్జునులు సహకరించడం వగైరా చెప్పి "మామగానో, మహారాజుగానో... ముందు, వారి యజ్ఞాశ్వాన్ని వారికిచ్చి సంధి చేసుకోమంటాడు.

అన్నిమాటలు విన్న మహారాణి జహ్నుదేవి "రాజా! నీవు క్షత్రియుడు. రాజ్యపాలన, ధర్మసంరక్షణ, ప్రజారక్షణ నీ ధర్మం. శరణాగతి బ్రాహ్మణులకు, శూద్రులకు అలంకారము కావచ్చును కానీ, ఆర్యపుత్రులకు కాదు.

"శౌర్యము గలదేని... అన్నారు కాబట్టి ఆ శూరత్వమును ప్రకటించండి. నారాయణుడు అర్జునునికే కాదు, మనకు పూజనీయుడే. భక్తజన రక్షకుడే! కనుక... వీరనారిని, వీరపత్నిని, వీరమాతను కావాలి కానీ -

సంధిపత్నిని, సంధిమాతను, సంధి సంధినినీ అనుకోవడం తగదని హెచ్చరించింది. రణభేరులు మ్రోగాయి. నీలధ్వజుడు శూర ప్రకటనమునకు సిద్ధపడ్డాడు. ఇక - అర్జునుడు -

ఉభయులు యుద్ధం చేసారు. సైన్యం నాశనమయింది.

అర్జునుని చేతిలో మూర్ఛితుడయ్యాడు. సారధి తెలివిగా ప్రక్కకు తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్నాడు. మంత్రిమండలి సమావేశం పరిచాడు. తన నిర్ణయం చెప్పాడు. అగ్నిదేవునితో సహా, అందరు "సరే'' నన్నారు. కాని -

"మహిష్మతీపుర ప్రాభవ వైభవాలకు మచ్చ తెచ్చే సంధికి - తానంగీకరించనంది మహారాణి జహ్నుదేవి. మీరందరు తప్పుకోండి. మేము మా నగరాన్ని రక్షించుకుంటామనేసింది.

మహామంత్రి వారించాడు. "చూస్తా... చేస్తా... నంటూ సభ నుండి బయలుదేరింది. కుమారుడు ఎదురుపడ్డాడు. నడుం కట్టమంది.

ఆతడు "అర్జునుడు'' కావచ్చును. శ్రీకృష్ణ పరిరక్షితుడే కావచ్చును. నీవు శూరుడివి, ఆ నారాయణ సంరక్షకుడివి. లే, విజృంభించు. దారినపోయే వారితో

యుద్ధం చేస్తే పేరు రాదు. అర్జునునివంటి వారలను నిర్జిస్తేనే - ఖ్యాతి, విశేషఖ్యాతి యని - కాళికయై హెచ్చరించింది.

"నీ ఆజ్ఞ" అన్నాడు తల్లితో.

విషయం - అర్జునునికి తెలిపాడు. అర్జునుడు భవిష్యత్తు పాడుచేసుకోవద్దని తిరుగు సందేశం పంపాడు.

అయితే మాటల్ని కట్టిబెట్టి హస్తినకు వెళ్ళ వచ్చునంటాడు - ప్రవీరుడు.

రాత్రంతా - ఈ రకంగా రాయబారాలు నడిచాయి. ఫలితంగా - యుద్ధం మిగిలింది. తెల్లవారింది.

శ్రీకృష్ణప్రియ భక్తుడైన ప్రవీరుడు, శ్రీకృష్ణ స్మరణంతో బాణం తీసాడు. ప్రద్యుమ్నా! ఇతడు సామాన్యుడు, కాడు. జాగ్రత్త! అన్నాడు అర్జునుడు. ప్రద్యుమ్నుడు ఎదిరించ వచ్చాడు. శ్రీకృష్ణ నామమే తప్ప మరొకటి తెలియని ఆ భక్తుని ఎదుర్కోవడం, తనకు చాతకాక, దానినే అర్జునునికి తెలిపాడు.

అనుసాల్వుడు బయలుదేరాడు. అతను అంతే. శ్రీకృష్ణ నామానికి దాసుడయ్యాడు.

ఇప్పుడు - అర్జునుడు.

దివ్యాస్త్రాలుపయోగించాడు. అన్నీ శ్రీకృష్ణనామం ముందు వృధా అయిపోయాయి. రణరంగంలో తలవంచుకుని నిస్సహాయుడై, నిరాశా నిస్పృహలతో నిలబడ్డాడు. అప్పుడు - ప్రవీరుడు - అర్జునుని నవ్వుతూ చూస్తూ "మహావీరా! దీనికోసమేనా అశ్వం వెనుక వచ్చారు. ఇప్పుడర్థమయిందా - శ్రీకృష్ణ "నామ" ప్రభావం.

తొందరగా వారిని రప్పిస్తే పని సులువవుతుంది. లేదో.... ఇప్పుడు హస్తినకు వెళ్ళిపోండి. నేను వీలుచేసుకుని "అశ్వమేధ"మని కబురు పంపుతాను. అప్పుడు విలువైన బహుమతులు తీసుకుని, నన్ను కలుద్దురు గాని, వెళ్ళి రండి! అంటాడు. ఈ మాటలతో కృష్ణుని హెచ్చరిక నిజంగా గుర్తుకు వచ్చింది.

"కృష్ణా! వాసుదేవ, గోవిందా!" మనస్ఫూర్తిగా పిలిచాడు.

ఆర్తితో పిలిచిన ఆ పిలుపుకు, అక్కడే వున్నట్లు కృష్ణుడు దర్శనమిచ్చాడు. చెరో ప్రక్కన - అర్జున, ప్రవీరులు మహదానంద మొందారు.

ఇద్దరు సాష్టాంగ నమస్కారం చేసారు "బావా! క్షమించమన్నాడు పార్థుడు. ప్రభో! కరుణించమన్నాడు ప్రవీరుడు.

మధ్యలో నిలచి, మందహాసం చేస్తున్నాడు కృష్ణుడు!

అప్పుడు ప్రవీరుడు - ఈ రోజుకు యుద్ధమాపి, రేపు కలుసుకుందా మన్నాడు. శ్రీకష్ణుడు అర్జునుని గుడారానికి, ప్రవీరుడు తన మందిరానికి వెళ్ళాడు. నా భర్త విజయుడు కావాలి. ఆ లక్ష్యంతో ఆమె శ్రీకృష్ణ దర్శనానికి అర్థరాత్రి బయలుదేరింది.

భూతపతియైన పరమేశ్వరుడు, శ్రీకృష్ణ గుడారానికి కావలి వుండటంతో ఆమె కృష్ణ దర్శనం చేసుకోలేకపోయింది. "శంకరా! అభయంకరా! నువ్వు కాదంటే, శరీర త్యాగం చేస్తాననేసరికి ఆయన అదృశ్యమయ్యాడు. ప్రవీరుని భార్య మదనమంజరి శ్రీకృష్ణ దర్శనార్థం - ప్రభువు గుడారానికి వెళ్ళింది.

ఇక్కడా అడ్డంకి.

"ప్రభూ!" అని భరించలేక, సహనం నశించినట్లు "ఓయీ! శ్రీకృష్ణ దర్శనం చెయ్యని, ఈ కళ్ళు, నోరు మొత్తం శిరం, శరీరం వ్యర్థం. దీనినిప్పుడు నేను నరుకు కుంటాను. రేపుదయం, మా ప్రభువుకు సమర్పించమని కత్తి తీసింది. "వద్దని వారిస్తున్నాడా భటుడు.

తీరా చూస్తే మురళి మనోహరుడైన వాసుదేవుడు.

ఆమెను ఓదార్చాడు. అనునయించాడు.

చివరకు విధిలేక తన గద, సుదర్శనాలను ఆమెకు ఇచ్చాడు. అవి ఆతని వద్ద వున్నంత వరకు అవధ్యుడు. అజేయుడు. భక్తజన దాసానుదాసుడను, దాసపోషకుడను కాబట్టి - దాసుడనయ్యానంటాడు.

చివరకు తెల్లవారింది.

"వాసుదేవా!" అంటాడు, అర్జునుడు. "వాసుదేవుడు కాదు, నీలకంఠుని శరణు పొందుదా" మంటాడు, శ్రీకృష్ణుడు.

ఇద్దరు శంకరుని దర్శించారు. విషయం వివరించారు. సహాయమర్థించారు.

అంతా చెప్పి లాభం లేదు, నేనూ - నీలాగే అసమర్థుడనంటాడు.

కిం కర్తవ్యం...

క్షణమాలోచించి "రా!" అంటాడు ఇద్దరు కలిసి, జగన్మాతను పార్వతిని కలుస్తారు. ఆమెను ప్రణుతించి, విషయం వివరించి, నీ సహకారమవశ్యం...?" అంటాడు. విషయం చెబుతాడు. "తథాస్తు" అంటుందా తల్లి.

జగన్మాత అభయంతో, వీళ్ళు భూలోకానికి వస్తారు. యుద్ధ రంగాన్ని చేరుతారు. కొద్దిసేపట్లో యుద్ధం ప్రారంభమౌతుందనగా -

ఆకాశంలో తళుక్కుమని తార.

అదొక వెలుగై, అక్కడనుండి రూపుదిద్దుకుని మహాసుందరిగా నిలిచింది.

ఆమెను చూస్తూ ప్రవీరుడు, తనను తాను మరచిపోయాడు. తానున్న ప్రదేశము, తన లక్ష్యము ఆ అందాలసుందరి దర్శనంతో నిర్వీర్యమై పోయాయి. ఒళ్ళంతా మోహము. ఆమె అందం నిండిపోయి, ఆమెకోసం అర్రులు చాస్తుంటే-

"ఏవిటీ ? ఇది ప్రేమనా... ఆ చేతిలో ఆయుధాలుంటే, ఏ ఆడదైనా నిన్ను కామిస్తుందా ? కావాలని దగ్గరకు రమ్మంటుందా ? కవ్విస్తుందా ? ఆ మొహంలో ప్రేమ - కామం - కనుపిస్తూంటే -

ఆ మోహంలో - ప్రేమకు చిహ్నంగా - ఈ ప్రవీరుడు కృష్ణుడిచ్చిన గదా, చక్రాలను జారవిడిచేసాడు. అవి కృష్ణునికి చేరాయి. ఆ మహామాయ అదృశ్య మయింది. కామ జ్వరం తొలగిపోయింది. అప్పుడు తన తప్పు ప్రవీరునికి అర్థమయింది.

ఇరువురికి యుద్ధం. అది ఆగేటట్లు లేదు.

ఒకరు భక్తుడు. మరియొకరు ఆత్మ.

ఇరువురికి ఒకడే దేవుడు. ఒక్కడే దిక్కు.

అయినా ఆశ్రిత పక్షపాతంలేని ఆ పరమాత్మ భక్తులకు మోక్షదాయకుడు.

పక్షపాతివైన నిన్ను... అంటూ ప్రవీరుడు, ఆనాటి యశోదవలె చెట్టుకు కట్టేస్తే కట్టుబడి వున్నాడు. శంఖారావం చేస్తూ - మరల అర్జునుని రధసారథిగా కనుపించాడు.

ఇటు అర్జునుడు - వాసుదేవుడే. ఆయన సారధి - తన సారధి వాసుదేవుడు అంతా వాసుదేవమయం. "భగవాన్!" అంటూ కృష్ణలీలను తలుచుకుంటూ యోగ నిష్ఠుడయ్యాడు. అర్జునా! ఆలోచించకు! శరం సంధించు!

"ఇప్పుడా....!

"అవును. ఇప్పుడే. మాటిమాటికి నీకు అడ్డం రావడం, కాపు కాయడం కుదరదు. కానివ్వమంటాడు.'' ప్రవీరుని శిరం ఖండించబడుతుంది. కృష్ణుని శ్రీచరణాల పడుతుంది. మోక్షగామి అవుతుంటే... ఈతని భార్య కూడ, భర్తననుసరిస్తుంది.

నగరంలోకి వెళ్ళాడు. అందరిని ఓదార్చాడు. నీలధ్వజుడు - యజ్ఞాశ్వాన్ని అర్జునుని కొసగాడు. అర్జునుడు, మహిష్మతీరాజ దంపతులను చైత్ర పౌర్ణమికి, హస్తినకు రమ్మనమని ఆహ్వానించాడు.

తను ప్రార్థించినా రక్షించని గంగపై మహారాణి కోపించి, నిన్ను ముట్టుకున్న వారికి పాపం సంక్రమించుగాక'' అని శపించింది.

అప్పుడు గంగ - మహారాణీ! అర్జునుని తల నేలకూలక తప్పదు. నీవు నన్ను శపించావు. కానీ, సత్యధర్మమూర్తియైన నా ఎడ నీ శాపము నిష్ఫల మంటుంది.

మహిష్మతీపురం నుండి బయలుదేరిన యాగాశ్వం వింధ్యాచల పర్వత ప్రాంతం పట్టింది. అక్కడి అరణ్యాలలో ప్రవేశించిన దానికి, దురదవేసి, ఆ ప్రక్కనే గల పెద్ద బండరాతికి రుద్దుకుంది.

అదేం మహాత్మ్యమో, రుద్దుకోవడానికి దగ్గరకు వెళ్ళిన ఆ యాగాశ్వం ఆ రాతికి అతుక్కుపోయింది. దాంతో భయంకరమైన సకిలింతలు. దానికి పరుగెత్తుకు వచ్చిన సైనికులు, ఆ అశ్వాన్ని రాతి నుండి విడుదల చెయ్యలేక పోయారు. ఈ విషయం విని -

వృషకేతువు, ప్రద్యుమ్నులు వచ్చారు. వారి ప్రయత్నం ఫలించలేదు. అనుసాళ్వ, యవనాశ్వులు వచ్చారు. వాళ్ళు ఆ గుర్రాన్ని, ఆ బండరాతి నుండి విడుదల చెయ్యలేక పోయారు. అర్జునుడు వచ్చాడు. అతని ప్రయత్నం విఫలమయింది.

ఆ పరిసరాల్ని పరికించగా ఓ ఋష్యాశ్రమం కనబడింది. అక్కడికి వెళ్ళి, మహర్షికి తన కులగోత్రాల ప్రవర చెప్పుకుని నమస్కరించి, విషయం విన్నవించాడు. విన్న మహర్షి - "అర్జునా! ఇది ఉదంక మహర్షి శాప ఫలితంగా ఏర్పడిన విపత్తు. దీనిని నీవే నివారించాలి. అది రాయి కాదు. మహర్షి భార్య. కారణాంతరాలవలన ఆమె రాయిగా నిశ్చల సమాధిలో వుంది. నీ చేయి తాకిన మరుక్షణం ఆ తల్లి తన స్వస్వరూప మొందుతుంది.

అర్జునుడు మహర్షి చెప్పినట్లు చేసాడు.

స్వస్వరూపమొందిన ఆ తల్లి, కృతజ్ఞతగా అర్జునకు నమస్కరించి, తన దారిన తాను వెళ్ళింది. రాతి నుండి బయటపడ్డ అశ్వం తన ప్రయాణం కొనసాగింది. వింధ్యారణ్య ప్రాంతాలు దాటి, చంపకాపురంలో చేరింది. యధావిధి అర్జునాదులు, ఆ అశ్వాన్ని అనుసరిస్తున్నారు.

తమ నగర పొలిమేరలకు వచ్చిన అశ్వపు వివరాలు ఆ పురమహారాజుకు అందాయి. వెంటనే వెళ్ళి దానిని బంధించి తెచ్చాడు. ఈ వార్త అర్జునునికి తెలిసింది. దానిని విడువమని కబురు పంపితే, శత్రువులను జయించి అశ్వమేధం-తానే చేస్తానని కబురు పంపుతాడు.

ఈ మహారాజు అసాధ్యుడు. మహాపరాక్రమవంతుడు. డెబ్భైమంది సేనాపతులతో, అయిదుగురు కుమారులతో విశేష సైన్యంతో వెలిగే ఆ శూరుని ఓడించడం సామాన్య విషయం కాదు. ఈ విష్ణుభక్తులు, సత్య - ధర్మ - నిష్ఠా గరిష్టులు. అయినా, తన చతురంగ బలాలతో - మహారాజు యుద్ధానికి బయలుదేరాడు.

అందరు వచ్చి ఈ యుద్ధంలో పాల్గొనాలని మహారాజు ఆదేశించాడు. తన ఆజ్ఞకు విరుద్ధంగా యుద్ధానికి రాక, ఇంట్లో కూర్చున్న పురుషులను సలసల కాగే నూనెలో పడవెయ్యమని, ఆదేశాలిచ్చి, మరీ యుద్ధానికి బయలుదేరాడు.

అందరు యుద్ధానికి వెళ్ళారు.

హంసధ్వజుని మూడవ కుమారుడు సుధన్వుడు. యుద్ధరంగానికి బయలు దేరుతూ వచ్చి ముందుగా తల్లికి నమస్కరించాడు. ఆమె ఆశీస్సులు తీసుకున్నాడు. భార్య హారతి ఇచ్చింది. వీరతిలకం దిద్దింది.

"ఇలాగరండి" అంటూ సరాసరి శయనమందిరానికి తీసుకువెళ్ళింది.

"దేవీ!" ప్రస్తుత పరిస్థితి మహాభయంకరమైనది. మహారాజు ఆజ్ఞ కూడా దారుణమయింది.

"కావచ్చును. నేను ఋతుస్నానమై పదహారు దినాలయింది. ఇకపైన - ఆ దినాలు వుండకపోవచ్చును, కనుక - నన్ను కరుణించి, నా కోరిక తీర్చమంది. తప్ప లేదు. ఆమె కోర్కెను తీర్చి బయలుదేరుతున్నాడు. ఇంతవరకు తన కుమారుడు రాకపోయేసరికి, అతనినిపట్టి కాగుతున్న నూనెలో పడ వెయ్యమన్నాడు.

యుద్ధరంగానికి బయలుదేరిన సుధన్వుని రాజాజ్ఞ ప్రకారం, సైనికులు పట్టుకున్నారు. రాజగురువు ముందు నిలబెట్టారు.

రాజగురువుకు నమస్కరించాడు. మహారాజు శిక్షననుభవించ సిద్ధపడ్డాడు.

అలంకారాదులన్ని తీసి పక్కన బెట్టాడు. సామాన్య పౌరునివలె చేతులు కట్టుకుని నిలబడ్డాడు. తులసి తీర్థం సేవించి, శ్రీ కృష్ణనామం చేస్తూ, ఆయన పదాబ్జములపై తన దృష్టిని నిలిపి, ధ్యానస్థుడయ్యాడు.

అక్కడ నుండి - సలసల కాగే నూనె తొట్టి వద్దకు తీసుకువెళ్ళారు. శ్రీకృష్ణ నామం చేస్తూ ఆతడు, నూనె చేతితో అటు ఇటు కదిలించి, వేడిగా వుందో లేదో చూసి ఎవరి ప్రయత్నం లేకుండా తానే అందులో దిగాడు. ఆ "నూనె" కంఠం వరకు వచ్చింది. పన్నీటి జలాలలో కూర్చుని వున్నట్లుందే తప్ప, సలసల మరిగే నూనెలో పడినట్లు లేదు.

అందరు ఆశ్చర్యపోయారు.

మహాభక్తుడు. ప్రహ్లాదుని వంటి కృష్ణభక్తుడు. "శ్రీ"చరణరక్షితుడని, అక్కడున్న వారందరు ప్రశంసించారు. ఈ విషయం మహారాజుకు తెలిసింది. ఇటువంటి మహాభక్తుని ఎడ, తను అప్రసన్నంగా ప్రవర్తించానని బాధపడ్డాడు.

మళ్ళీ యధాప్రకారం తండ్రి ఆశీస్సులతో కవచం ధరించి యుద్ధరంగంలో నిలిచాడు. పద్మవ్యూహం రచించాడు. యాగాశ్వాన్ని మధ్యలో నిలిపాడు. అదిచూసి వృషకేతువు, సుధన్వునిపైకి విజృంభిస్తుంటే -

"ఓ వీరచంద్రమా! నీవెవ్వరివి ? నీ గురించి తెలియకుండా నీతో యుద్ధం చెయ్యడం తగదు!" అనగా -

"నేను సూర్యుని మనుమడిని. కర్ణుని కుమారుడను. నా పేరు వృషకేతువు. ఇక - నీవు - హంసధ్వజ మహారాజు కుమారుడివని, నీవు సుధన్వుడివని నాకు తెలుసు. ఆలస్యం తగదు." అంటూ అయిదు బాణాలు వేసాడు. దాంతో సుధన్వుని విల్లు విరిచాడు. పతాకం పడగొట్టాడు. గుర్రాలను కూల్చాడు. విరధుడైన సుధన్వుడు, రథం కూడా విరిగి నిరాయుధుడై క్రిందపడ్డాడు. ఆశ్చర్య పోయిన సుధన్వుడు మరో రథము ఎక్కాడు. వృషకేతువును, తనవలె నిరాయుధుని చేసాడు.

అది వీరుల మధ్య యుద్ధం.

వృషకేతువు మరో రధమెక్కి, ప్రద్యుమ్నునితో కలిసి ఎదిరించాడు. సుధన్వుని తీవ్ర బాణానికి వృషకేతువు మూర్ఛిల్లాడు. ఇప్పుడు ప్రద్యుమ్నుడు రంగంలోకి దిగాడు. సుధన్వుని సారథి, అశ్వాలను అయిదు బాణములు ప్రయోగించి కూల్చాడు.

"పరాక్రమవంతుడివే, శ్రీకృష్ణ కుమారిడివైనందులకు ధన్యుడవని ప్రశంసించాడు. వెంటనే పదహారు బాణాలతో ప్రద్యుమ్నుని నొప్పించాడు. అయినా ఇద్దరు హోరాహోరిగా పోరాడారు. తమ రధములపై మూర్ఛిల్లారు.

సుధన్వుడు తెలివి పొందేసరికి, ప్రద్యుమ్నుడు కళ్ళు తెరిచాడు. ఎదురుగా- కృతవర్మ కనుపించాడు. ఇరువురి మధ్య మహాపోరు. సుధన్వుని దెబ్బకు, కృతవర్మ పరుగు లంఘించాడు.

కృతవర్మ పారిపోవడంతో, అనుసాల్వుడు ముందుకు వచ్చాడు. సుధన్వుడు ప్రధమ ప్రయత్నానికే అతడు మూర్ఛిల్లాడు.

మహాభక్తుడైన సుధన్వుని ఎదిరించడానికి ఎవరు సాహసించడం లేదు. ఏ ఒక్కరు నిరోధించలేకపోతున్నారు. ఒకరి తర్వాత మరొకరు అన్నట్లు, ఇప్పుడు సాత్యకి రంగంలోకి వచ్చాడు.

ఏమిటీ పరిస్థితి ? అందరూ కృష్ణభక్తులే. ఏ ఒక్కరు మరొకర్ని నిరోధించలేక పోతున్నారు. ఒక ప్రక్కన ఆశ్చర్యం, మరొక ప్రక్కన భయం. ఆందోళనాపూరిత హృదయంతో విలవిలలాడుతున్నారు.

అయినా ధైర్యం తెచ్చుకుని అర్జునుడు సుధన్వుని ప్రశంసించాడు.

సుధన్వుడు కూడా "మహావీరా! నీతో పోరు మహాదానందదాయకం. గతంలో నీవు కృష్ణుడు రథసారధిగా వుండగా, విజయాలు పొందావు. ఇప్పుడు నీవు ఒంటరివి. నీ పరిస్థితి ఎలాగ వుంటుందో... ఆనాటి విజయాలు కథలు, ఈనాటి విజయం - కల్లలై, లోకాలను, లోకేశుల్ని ఆశ్చర్యపరుస్తుం దంటున్నాడు. అర్జునుడు, ఆవేశంగా వింటున్నాడు.

అర్జునునిలో కోపం పెరిగింది. శరసంధానం చేసాడు. ఒకటికాదు, రెండు కాదు. నూరు బాణములు గురిపెట్టి సుధన్వునిపై ప్రయోగించాడు. అర్జునుని

ప్రయత్నాన్ని గమనించిన సుధన్వుడు, తానూ, నూరు బాణాలను అర్జునునిపైకి వదిలాడు. ఇరువురి మధ్య సంభ్రమాశ్చర్యాలు.

ఒకరిది శరవర్షం. మరొకరిది - దశదిశల స్తంభనమన్నట్లు కురిసే బాణవర్షం.

సుధన్వుని పరాక్రమానికి అర్జునుడు, రధసారధి కూలి, ఎటు కదలలేక అశక్తుడయ్యాడు. ప్రభో, కృష్ణా! అని ఎలుగెత్తాడు.

ఆ పిలుపుతో అంతటా వున్న వాసుదేవుడు, అర్జునుని రధసారధిగా, పార్థుని రథంపై ప్రత్యక్షమయ్యాడు.

సుధన్వుడు భక్తితో చేతులు జోడించాడు. మందహాసవదనుడైన ఆ మురారి, అర్జునుని శరీరాన్ని తడిమాడు. అస్త్ర బాధలన్నీ నశించాయి. శ్రీకృష్ణుని చిరునవ్వులను పొందిన సుధన్వుడు.

"అర్జునా! అదృష్టవంతుడివి. శ్రీకృష్ణుడు పార్థసారధి అయ్యాడు. ఇక భయమెందులకు, విజృంభించు ?!

ఇద్దరిలో పట్టుదలలు. భీకర ప్రతిజ్ఞలు.

సుధన్వుని ఒక్కొక్క మాట, మహాస్త్రమై అర్జునుని బాధిస్తుంది. ఆ మాటలు ములుకులవలె పొడుచుకుంటున్నాయి. సుధన్వుడు నూరు బాణాలు ఏకబిగిన అర్జునుడిపై ప్రయోగించాడు. ఆ బాణాల గాలికి, శ్రీకృష్ణుడు పార్థసారధిగా గల ఆ రథం, నాలుగు వందల మూరలు వెనక్కి వెళ్ళింది. వాసుదేవుడు అతి బలవంతం మీద ఆ రథాన్ని ఆపాడు.

"అర్జునా! నన్ను చూసుకుని అనవసర ప్రతిజ్ఞ చేసావు. నిన్ను చూసి అతడు రెచ్చిపోయాడు. సుధన్వుడు మహాభక్తుడు, సలసల మరిగే నూనెలో దిగినా, అతనికేమీ కాలేదు. పన్నీటి జలాలలోవలె, అందులో జలకాలాడాడు. అంతటి మహాభక్తుని వధించడం...!" సగంలో ఆగాడు.

"కృష్ణా! నీ అభయం స్మరించుకుని తొందరపడ్డాను. నీ దయ వుంటే, అసాధ్యమేముంది ? అని తీవ్రమైన శరం వేసాడు. బరువు నెత్తిన పెట్టిన అర్జునుని మాట నిలబెట్టుట బాధ్యతగా, ఆ శరానికి, గోవర్ధనగిరి ఎత్తి పట్టి రక్షించిన అమాయకులనందరి, పుణ్యం ఫలం కలిపాడు. అయినా సుధన్వుడు చిత్తు చేసాడు.

మరో బాణం... దానికి - కశ్యపునకు భూమండలం యావత్తు ధారపోయగా, లభించిన పుణ్యాన్ని జోడించాడు. అదీ మహాభక్తుని శరాఘాతానికి తుస్సుమంది.

ఇక మూడవ - ఆఖరి బాణం. దీనికి రామావతారంలోని పితృవాక్య పరిపాలన - సేవలోని ఫలాన్ని అందించాడు. దీనిని సుధన్వుడు ఖండించినాడు. కాకపోతే ఖండితమైన ఆ బాణం యొక్క ములుకు సుధన్వుని శిరస్సు ఖండించింది. కృష్ణుని పాదాలపై పడేసింది.

ఇద్దరు భక్తుల ప్రతిజ్ఞలు నిలిచాయి. భగవంతుడు - సమాధానపడ్డాడు.

భక్తజన రక్షణా దీక్ష - దక్షత భగవంతునికెంత కష్టమయినదో, ఈ సంఘటన మనకు తెలియబరుస్తుంది.

తమ్ముని మరణంతో, అన్న సురధుడు, కాలభైరవుని వలె వస్తున్నాడు. అర్జునా! ఇతడు మహాభయంకరంగా వస్తున్నాడు. క్షణకాలమంటూ, రథం అలాగే వెనక్కి నడిపించాడు.

వస్తూనే సైన్యాన్ని కకావికలు చేసి, దొరికిన వారిని, దొరికినట్లు చంపాడు. కృష్ణార్జునులపైకి దూకినట్లు వచ్చి -

"కృష్ణా! ధర్మము ధర్మావతారమంటావు. ఇదేనా నీ ధర్మం. ఒక అర్జునుని కోసం, నీ పుణ్యాన్ని ధారపోసి మహాభక్తుడైన నా సోదరుని బలితీసుకున్నావా ? ఇది తగునా ? ఇదే ధర్మమా ? అని ప్రశ్నించాడు.

జరిగిందేదో జరిగింది. రండి. నన్ను నిగ్రహించండి" అని సురధుడు వారిని పిలిచాడు. ఇరువురు మహాభీకర పోరు నడిపారు. జయేచ్ఛ... ఎవరిదో తెలియడం లేదు. అయినా పరాక్రమిస్తున్నారు. వారి విక్రమంలో భాగంగా, అర్జునుడు వేసిన మహాస్త్రం సురధుని శిరము ఖండించింది. ఆ శిరము ఒక పెద్ద పిడుగులాగ అర్జునుని తలపై పడింది. ఆ దెబ్బకు, అర్జునుడు తూలి, స్పృహతప్పి నేలమీద పడ్డాడు. ఆ తరుణంలో హంసధ్వజుడు తన సైన్యాలతో వచ్చాడు. అతన్ని చూస్తూనే కృష్ణుడు రథం దిగి ముందుకు అడుగు వేసాడు.

కృష్ణుడు రథం దిగడం చూసిన రాజు, హంసధ్వనుడు తానూ, రథం దిగి, కృష్ణుని కెదురు వెళ్ళాడు. వాసుదేవుడు ఎంతో ప్రేమతో, హంసధ్వజుని ఆలింగనం చేసుకున్నాడు.

అప్పుడు - శ్రీకృష్ణుడు - విధిప్రేరితమైన యుద్ధానికి ముగింపు చేసి, యాగాశ్వాన్ని విడిచి, యుధిష్టర సామ్రాట్టును ధన్యుని చేయవలసిందిగా, మైత్రీ భావంతో మెలగవలసిందిగా కోరాడు.

ఆలోచించి, జరిగిన నష్టానికి విచారించి, వాసుదేవుని అభిప్రాయానికి, ఆదేశంగా శిరసు వంచాడు.

# జైత్రయాత్ర - ప్రమీల

శ్రీకృష్ణదయాలబ్ధుడైన అర్జునుడు తేరుకున్నాడు.

అశ్వం తన ప్రయాణం సాగిస్తూంది. చతురంగబలాలతో అర్జునుడు అశ్వాన్ని వెంబడిస్తున్నాడు.

సుదీర్ఘ ప్రయాణం, యాగాశ్వం - తన నడకలో ఒక రాజ్యం చేరింది. దాని వివరమడుగగా అది స్త్రీ రాజ్యమని, అక్కడ రాచకార్యలన్నింటిని స్త్రీలే నిర్వహిస్తారని, పురుషులకా రాజ్యంలో ప్రవేశం లేదని తెలిసింది.

అటువంటి రాజ్యంలో ఈ గుర్రం అడుగుపెట్టింది.

ఈ రాజ్యాధినేత ప్రమీల. మహా సౌందర్యవతి - అపురూప ధైర్య సాహసముల ఖని. తమ రాజ్యంలో ప్రవేశించిన యాగాశ్వాన్ని చూసారు. దాని ముఖంపై గల శాసనాన్ని చదివారు. అంతా చదివి, ఆ అర్జునుడు - ఎంతటి వీరుడైనా మా మహారాణి ముందొక ఆవగింజ అనుకున్నారు.

ఆ అశ్వంతో వచ్చిన సైనికులు, ఆ రాజ్యస్త్రీ రక్షకభటమణులకు, విషయం చెప్పి బెదిరించారు. ఆ బెదురుకు లొంగక తమ ప్రతాపంతో, వాళ్ళను బంధించి, "రండి. మీరు మగవాళ్ళు కదా! మీ మగతనం ప్రదర్శిద్దురుగా అని" తీసుకు వెళ్ళారు.

వాళ్ళను తలో ఇంటికి అర్పించి యవనాశ్వాన్ని ప్రమీలాదేవి ముందు నిలిపారు. ఆ ముఖాన గల శాసనాన్ని చదివి, అయితే మహావీరుడు అర్జునుడు వస్తున్నాడు. అతన్నో చూపు చూడాలని అనుకుంది. ఇదే సమయంలో అందులోంచి ఒకడు తెలివిగా తప్పించుకుని ఈ విషయాన్ని అర్జునులవారికి విన్నవించాడు.

"వుండండి. అంటూ యవనాశ్వుడు నారీ సైన్యాలను ఢీకొన వెళ్ళాడు. కాని వాళ్ళ శరసంధానం ముందు యవనాశ్వుడు తలవంచాల్సి వచ్చింది. ఈలోగా మరో నారీ శౌర్యమణి విడిచిన బాణానికి ఆయన మూర్ఛితుడయ్యాడు. సైన్యం వెనుదిరిగింది.

ఇప్పుడు వృషకేతువు రంగంలోకి దిగాడు. ఉభయుల మధ్య మహా యుద్ధమే జరిగింది. ఆ వీర నారీమణుల శౌర్యానికి ఆశ్చర్యపోయాడు. వృషకేతువు ముందు వారందరు డీలాపడిపోయారు. ఈ విషయం తెలుసుకొని మరికొంత సైన్యం వచ్చింది. ఆ పోరాటంలో వృషకేతుడు మూర్ఛిల్లాడు. సారధి చాకచక్యంగా అతన్ని దాటించాడు. సేనలు వెనుదిరిగాయి.

దొరికినంతమంది సైనికులను స్త్రీలు బంధించి తీసుకువెళ్ళి తమ తమ శయనాగారాలలో కట్టి పడేసుకున్నారు.

ఇద్దరు మహావీరులు మూర్ఛగతులవడంతో అర్జునుడే బయలుదేరాడు. అతని ధాటికి తన వారలు వెనుదిరిగి, చిక్కుల్లో పడుతున్నారన్న విన్న ప్రమీలా రాణి తానే స్వయంగా రంగంలోకి వచ్చింది.

మహావీరుడైన అర్జునుని చూసింది. అర్జునుడు - ఆమెను అలాగే చూసాడు. ఏదో తెలియని శక్తి, ఆసక్తి - ఇద్దరిలో కలిగింది. కానీ, ప్రస్తుతం వారిది యుద్ధం... చూపుల ధర్మం కాదు. అర్జునుడు - ఆమెను చూస్తూ మోహంలో మున్గిపోయి, శరసంధానం చెయ్యలేకపోతున్నాడు.

"ఓ సుకుమారీ, సుందరాంగీ. లోకంలోని అందాన్ని కలబోసి, ఆ బ్రహ్మ నిన్ను సృష్టించినాడు. నేను... ఆ యాగాశ్వ ముఖమున గల బంగారు శాసనాన్ని చూసే వుంటావు.

"ఆ.. చూసాను. ఓ! వీరా! నీ ధీరత్వమెవరికి తెలియదు. పరమేశ్వరుని మెప్పించి, పాశుపతం గెలిచావు. ఓ శిఖండిని ముందు పెట్టుకుని, చాటుమాటున పెంచి పెద్దచేసిన తాతనే చంపిన వీరుడవు. రథచక్రము కృంగి దానిని పైకి తీసుకునే సమయంలో, మహావీరుడు మహాదాత కర్ణుడిని వధించావు" అని పరిహసించింది.

"ఓ మహారాణీ! వయస్సులో వున్నదానికి, భవిష్యత్తు బాగా వున్నదానివి. ఈ మాటలు పద్ధతి కాదు."

"అందుకే. అలవికానిచోట అధికులమనరాదు. మా రాజ్యంలో అడుగు పెట్టిన వారు మాకు అతిధులు కారు. మాకు ఆనంద ప్రసాదులు. కనుక, ఆయుధమ్ములను మర్యాదగా విడిచి లొంగిపోతే మన్నిస్తాం. కాదంటే... శిక్షిస్తామంది.

ఆ మాటతో తీవ్రమైన శరాన్ని, శరీరంపైకి దాక్షిణ్యం లేకుండా విడిచిపెట్టి, ఈనాటితో ఈ రాజ్య సాంప్రదాయాలు - పూర్తి" అన్నాడు. "నీకది అసాధ్య"మంటూ ఆమె, ఇలాగ ఇరువురు - ఒకరికొకరు తీసిపోకుండా బాణాలు గుప్పిస్తున్నారు. తమ తమ పరాక్రమాలను ప్రకటించుకుంటున్నారు. అనకూడదు కానీ, ఆమె ముందు అంతటి మహావీరుడు అర్జునునికి తలకొట్టినట్లయింది.

"పార్థా" నువ్వు మహావీరుడవే కావచ్చును. మా ముందు మాత్రం మా కోర్కెలు తీర్చు ఒక కదిలే బొమ్మవు.

అనవసర ఆర్భాటములు, ఆయుధములు వీడి బుద్ధిగా మమ్ము వెంబడిస్తే సంతోషము. కాదంటే బంధించవలసి వస్తుంది. అప్పుడా సర్వశాసనకర్తయైన ఆ భగవంతుడు కూడా నిన్ను రక్షించలేడు.

ఎంతో ధైర్యంగా, నిబ్బరంగా, అంతా... తన చేతిలోనే వున్నట్లు - ప్రమీల చెబుతుంది. "నన్ను..... ! శరములు గుప్పించాడు. "నిన్ను... అని, నీ బాణాలు నా ముందు కుప్పిగంతులు వేస్తాయి. ఆ తర్వాత నీవు.... గలగల నవ్వుతూ అంది. మామూలు సమయాలలో ఆ నవ్వుకు పరవశించగల అర్జునుడు ఇప్పుడు పరువు దక్కించుకునే ప్రయత్నంలో వున్నాడు.

ప్రమీల విడిచిపెట్టిన ఒక దివ్యబాణం పార్థుని గుండెకు గుచ్చుకుంది. అర్జునుడు మూర్ఛపోయాడు. క్షణకాలం ఆమె మనసు చివుక్కుమని బాధపడి, అతన్ని తీసుకురమ్మని వెళ్ళిపోయింది.

తీరా కన్ను తెరచేసరికి, అంతటి మహావీరుడు ఒక హంసతూలికా తల్పంపై వున్నాడు. ఇంకా స్వస్థతకు రానట్టు "ఓ రాణీ, నిలు, నిలు" పలవరిస్తున్నట్లున్నాడు. ఆ కలవరింతలు, మాటల్ని విన్న పరిచారిక "మహావీరా! ఇప్పుడు రణరంగంలో లేరు. మా మహారాణి గారికి బందీలుగా వున్నారు. మా మహారాణి కరుణించేవరకు తమ పని ఇంతే! పాపం..!" అని వెళ్ళిపోయింది.

“ఇదెక్కడి గొడవరా, బాబూ! వచ్చి, వచ్చి, చివరకు ఓ ఆడదాని చేతిలో ఓడిపోయి ఆమెకు బందీనయ్యాను. అంటే.... గతంలో తాను చేసిన సాహసాలు, పొందిన విజయాలన్నీ... నావి కావా ? బావ సంప్రాప్తింప చేసినవా ?

ఇది ఇక్కడితో ఆగదు. చరిత్రలో చేరుతుంది. అందరు నవ్వుకుంటారు. ఎంతటి దురవస్థ ?! బావా... కృష్ణా, గోవిందా, వాసుదేవా, మురళీధరా! అనాధరక్షకా, ఆర్తత్రాణపరాయణా, పాహిమాం పాహి. రక్షమాం రక్ష, రక్ష” అని కళ్ళు మూసుకుని, చర్మచక్షువులన్ని ఒకచోట చేర్చి మరీ ప్రార్థిస్తున్నాడు. అలాగ ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు.

వున్నట్టుండి తలుపులు తెరచుకున్నాయి. ఎవరో లోపలికి వస్తున్నారు. ఆమె ప్రవర్తనను బట్టి, సైనికాధికారిణి అని విజయుడిగా, విఖ్యాతుడైన అర్జునుడు, అనుకున్నాడు. వీళ్ళు, వీళ్ళాచారాలు! నన్నేం చేస్తారు ? ఈ ఆలోచనలు సాగుతున్నాయి. ఆ అధికారిణి రావడం, ఈతనిని రమ్మని తీసుకువెళ్ళడం జరుగుతుంది. అప్పుడు మనస్ఫూర్తిగా “నీవు లేకుండా, “విజయుడు” లేడు. విజయము లేదు” ప్రార్థించుకున్నాడు. ఆ సైనికాధికారిణి, కోట లోపలికి తీసుకు వెళ్ళలేదు. నగరం బయటకు తీసుకువచ్చి విడిచిపెట్టింది. నీవు వెళ్ళి నీ సేనలను కలుసుకోమని ఆదేశించింది.

అప్పుడు అర్జునుడు “కృష్ణా! ఇది నీవే. నిన్ను మరచిన వాడికి, వద్దనవాడికి మనుగడే వుండదని, తెలియబరిచావు. ధన్యుడనని” కృష్ణుని చేతులు పట్టుకున్నాడు.

తన చెరలోని అర్జునుడు తప్పించుకున్నాడన్న విషయం ప్రమీలకు తెలిసింది. విచారించగా ఎవ్వరు సాహసించలేదట. అప్పుడా మహారాణి ఇదంతా ఆ జగన్నాటక సూత్రధారియైన శ్రీకృష్ణలీల అనుకుంది -

మరునాడుదయం యధావిధి రణభేరి మ్రోగింది. అర్జునుడు శంఖం పూరించాడు. అతనితో సమానంగా - మహారాణి ప్రమీల శంఖనాదం చేసింది.

ఇద్దరిలో సమానమైన “విజయోత్కంఠ ? వుంది. పైగా తననుండి తప్పించుకున్న ఆ అర్జునుని బంధించి తీరాలన్న పట్టుదల మహారాణి ప్రమీలలో బలీయమయింది. తనను, అల్లరిపాలు చేసి, ఆటపట్టించిన, అందాలరాణిని భార్యగా స్వంతం చేసుకోవాలనే పట్టుదల అర్జునునిలో బయలుదేరింది.

మాటలు మనసులో వున్నాయి. బాణాలు - చాపం నుండి బయటపడు తున్నాయి. ఇద్దరిలో ఏ ఒక్కరు, అవతలివారికి తీసిపోరు. అది నిన్ననే తేలిపోయినా, ఇవ్వాళ ఇద్దరిలో పట్టుదల. శ్రీకృష్ణుని కరుణతో బయటపడ్డ అర్జునునిలో మరింత ప్రబలంగా వుంది.

ఈ సమయంలో - శ్రీకృష్ణుడు అక్కడికి వచ్చాడు. అతన్ని చూస్తూనే ఇరువురి చేతుల్లోని ధనువులు జారిపోయాయి. రెండుచేతులు జోడించి, అప్రయత్నంగానే నమస్కరించారు. వారిద్దర్ని ప్రీతితో చూసి - ఆజ్ఞ.... అన్నట్లున్నాయి, వాళ్ళ చూపులు.

మీరిరువురు సమవుజ్జీలు - మహాపరాక్రమవంతులే. అనవసర యుద్ధంతో, ప్రళయం సృష్టించకండి. నా మాటవిని యుద్ధమాపేయండి!'' ఆదేశించినట్లు శ్రీకృష్ణుడు చెప్పాడు.

మీ మనసులు కలిసాయి. ఆ సంగతి నాకు తెలుసు. గాంధర్వ విధిన వివాహం చేసుకోండి. సంతోషంగా వుండండి. యాగాశ్వాన్ని కానుకలతో పంపు-

వాసుదేవుని ఆదేశాన్ని శిరసావహిస్తున్నట్లు మహారాణి ప్రమీల - "ప్రభూ! మీ ఆజ్ఞ శిరోధార్యమంది.''

తమరు కూడా, మా కోటలో మీ పవిత్ర శ్రీ చరణాల నుంచండి. మా ఆతిధ్యము స్వీకరించండి. మమ్మల్ని ఆశీర్వదించండ''ని ప్రార్థించింది.

కొన్నాళ్ళు అక్కడ వున్నారు. ప్రమీలార్జునులు సంతోషంగా గడిపారు. వెళ్ళవలసిన మహత్తర కార్యక్రమం ఎదురు చూస్తుంది.

వాళ్ళను ఆశీర్వదించిన శ్రీకృష్ణుడు "ప్రమీల ఇకపై స్త్రీ శాసనానికి సడలింపు లభిస్తుంది. స్త్రీలు తమకు నచ్చినవారిని వివాహం చేసుకుని, పురుష సంతానాన్ని పొందుతారు. అంతేకాదు - పుత్ర - పౌత్రాభివృద్ధి నొందుతారని కూడా శ్రీకృష్ణ భగవానుడు ఆశీర్వదించాడు.

బంధాలను విడిచివెడుతూ, మమ్మల్ని పెండ్లియాడామన్నారు. కొందరు వివాహం చేసుకుని అక్కడే వుండిపోయారు. మహారాణిగా అశ్వాన్ని విడిచిపెట్టింది. కానుకలు సమర్పించుకుంది. సగౌరవంగా, ఒక మహావీరునకు తన భర్తకు వీడ్కోలు చెప్పింది.

యధాప్రకారం - యాగాశ్వం తన ప్రయాణం ప్రారంభించింది.

★ ★ ★ ★

అలాగ ప్రయాణించి, ప్రయాణించి, యాగాశ్వం - మణిపురం ప్రాంతాలకు చేరింది. తమ పొలిమేరలలో తిరుగుతున్న అశ్వాన్ని ఆసక్తిగా చూసిన సేనాని దాని ముఖముపై గల శాసనాన్ని చూసి "చాలా మంచిదని" దానిని పట్టుకున్నాడు.

అప్పుడు సంధ్యా సమయం.

దానిని భద్రంగా తీసుకువెళ్ళి రాజుగారి కోట ముందు బంధించి, వుంచాడు.

మణిపురాధీశుడు - భభ్రువాహనుడు. ఈతడు చిత్రాంగద - అర్జునులకు కల్గిన వీరఫలం. వారికి వంశాకురం లేకపోవడంతో, మణిపుర ప్రభువుల మనోభీష్టం మేరకు, అర్జునుడు - తన కుమారుని - భార్యను, అక్కడే వుంచేసాడు.

ఇప్పుడు మహారాజు నిండుకొలువులో వున్నాడు. సేనాని మహారాజుకు నమస్కరించి, యాగాశ్వం విషయం తెలిపాడు. దానిని మనకోట ముందు బంధించి వుంచానని కూడా చెప్పాడు. అది అపురూపమైనదని, మన దగ్గర వుండదగ్గదని చెప్పడంతో -

మహారాజు, తన పరివారంతో వచ్చి ఆ అశ్వాన్ని చూసాడు, అది యాగాశ్వమని, దాని ముఖముపై గల బంగారు శాసనాన్ని చదివి - ఆనంద భరితుడయ్యాడు. "శహభాష్" మంచిపని చేసావు.

ఇది యాగాశ్వం. మనదే. దీనిని విజయయాత్రకై విడిచిపెట్టిన వారు మా పెదతండ్రి, యుధిష్ఠర సార్వభౌములవారు. దీనికి రక్షణగా వచ్చిన మహావీరులు మా పితృపాదులు - అర్జునులవారు. ఇది మనదే. దీని సంరక్షణ బాధ్యత మనకే వుంది.

దీనిని తెచ్చి చాలామంచి పనిచేసావని పొంగిపోయాడు. ఆ ఆనందంలో-

"మహామంత్రీ! సకల విధ రాజలాంఛనాలతో మా తండ్రిగారికి స్వాగత మివ్వాలి. వారి స్థాయికి తగ్గట్లు కానుకలు సమర్పించాలి. ఎప్పుడో నా చిన్నప్పుడు పొత్తిళ్ళలో నన్ను చూసిన మా పితృదేవులు వస్తున్నారు.

నగరాన్ని శోభాయమానంగా అలంకరింపచేయండి. మన గొప్పతనం కాదు కానీ, మన మంచితనం, లోకానికి మా తండ్రిగారికి కూడా తెలియాలి, అన్నాడు. నగరంలోకి అడుగుపెడుతూ, ఆ రాజ్యాన్ని చిత్రంగా చూస్తున్నాడు. ఆ రోజుల్లో తను చూసిన రాజ్యానికి, ఇప్పటి రాజ్యానికి చాలా తేడా వుందనుకున్నాడు.

"హంసధ్వజా!" అన్నాడు. "మహావీరా! ప్రస్తుత - మీ రాజ్యాధిపతి తమ కుమారుడు భభ్రువాహనుడు. మీవలె మహావీరుడు. ఎందరో సామంతులతో సర్వప్రజా క్షేమంకరుడై వున్నాడు. ఇది - మీ అశ్వమని తెలిసి, ఆ చిరంజీవి భక్తిపురస్కారంగా సమర్పిస్తే - సంతోషించాలి. కాదంటే అనివార్యమైన యుద్ధం కొనసాగించాలి.

తెల్లవారింది. భభ్రువాహనుడు, రాజ్యాధినేతగా, ఆ వచ్చిన మహావీరునికి, సర్వవిధ రాజ లాంఛనాలతో ఎదురేగి స్వాగత సత్కారములు జరిపాడు. కనుల ఆనంద బాష్పాలు రాలుస్తూ, ఆయన పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసాడు. ఒకరాజుగా కాక, ఒక మహావీరునికి సామంతునిగ -

ఓ తండ్రికి బిడ్డగా వినయవిధేయతలు పుణికి పుచ్చుకున్న - పాండవ కులరత్నంగా - విరాజిల్లాడు.

"తండ్రీ! అశ్వము ఎవరిదోనను కుని, మా సైన్యాధ్యక్షుడు దానిని బంధించాడు. అపురూప కార్యక్రమానికి బయలుదేరిన యాగాశ్వానికి, తమకు మా స్వాగతాంజలి" అని తగు కానుకలను అర్పించగా -

శిరసువంచి నిల్చున్న కుమారుని కిరిటాన్ని అర్జునుడు ఒక్క తన్ను తన్నాడు. ఈతడు మహావీరుడే కావచ్చును. తన్నినది ఒక మహారాజును దానికి భభ్రువాహన పరివారమంతా కలకలం రేపింది. గుసగుసలు ప్రారంభమయ్యాయి.

తన తప్పేమిటో అర్థం కాని, ఆ తనయుడు -

"తండ్రీ!" అన్నాడు. చూడక, చూడక, చూసిన తండ్రి ప్రవర్తనకు బాధపడుతూ!

అప్పుడు - నీవు వీరుడనుకున్నాను! అన్నాడు.

అది - భభ్రువాహనునికి కోపం తెప్పించింది. నా ప్రవర్తనను శంకించిన మీ తీరు గర్హనీయం. ఎదుటివారిని గౌరవించాలనే సంస్కారంలేని మీరు, భరతవంశంలో ఎలాగ పుట్టారు ? యుధిష్ఠర సార్వభౌమునికి ఎలా సోదరు లయ్యారో... ఆ వివరాలు మీ ప్రతిభా - ప్రతాపాలను - నా వీర - శూరత్వాన్ని యుద్ధంలో రుచి చూద్దురుగాని అన్నాడు.

విసురుగా బయటికి వచ్చాడు. వస్తూనే - రణభేరి మ్రోగింది. అర్జునుడు తప్ప- అక్కడున్న హంసధ్వజ, యవనాశ్వ మహారాజులు, వృషకేతు, ప్రద్యుమ్న, అనుసాల్వులు... ఈ పాండవ మధ్యమునికి ఏం వచ్చిందో అర్థంకాక దిగ్భ్రమ చెందారు.

ఇప్పుడు యుద్ధం. తప్పదని - ఆ యుద్ధంలో - ఎలాగ పోరాడాలి.

ఓ సంస్కారవంతునితో, కుసంస్కారికి తోడుగా వచ్చినట్లు మణిపుర మహారాజు భావించే.... ఆ వీర రత్నంతో... ఎలాగ పోరాడాలి ? అందరిలో ఇదొక ప్రశ్నయి కూర్చుంది. ఇటువంటి సమయంలో -

అర్జునుని పత్ని చిత్రాంగద - తన భర్త, తమ రాజ్యానికి రావడమొక వరంగా తలచింది. పతిదేవుడు వచ్చాడనే వార్తను నాగకాంత ఉలూచికి కూడా తెలిపింది. కుమారుడు, ఒక మహారాజుగాను బుద్ధిమంతునిగాను తన తండ్రిని, ఒక మహావీరుని చూడవెళ్ళినందులకు స్వాగతించి తెచ్చే ప్రయత్నానికి సంబరపడి పోయింది.

భర్త ఆగమనం కోసం ఎదురుచూసే తల్లికి తండ్రి ప్రవర్తనను తెలిపాడు. ప్రస్తుత కర్తవ్యాన్ని కూడా తెలిపాడు. తల్లిని, పెదతల్లి ఉలూచీ మాతను, చేయబోయే యుద్ధానికి ఆశీర్వదించమని ప్రార్థించాడు. విన్న ఆ భార్యలు -

భర్త అనుచిత ప్రవర్తనకు, కుమారుని సమాధానానికి క్షణకాలం తత్తరపడ్డారు. వీరత్వమా... అనేసరికి తమ కుమారుడు శూరుడే కాని, మరొకడు కాడని నిరూపించ, ఆ తల్లులు ఆశీర్వదించారు.

ఉభయ సైన్యాలు మోహరించాయి. శంఖనాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి. భభ్రువాహనుడు, తిన్నగా తండ్రిని ఢీకొన్నాడు. యుద్ధ మర్యాదగా - ఆర్యా! నేను తమ కుమారుడను. ధర్మమతిక్రమించని విధముగా నా వందన శతాలు. కారణమేదైనా, తమ అనుచిత ప్రవర్తనం - నా శీలానికి, మాతృశ్రీ జీవితానికి కళంకమై కూర్చున్న క్షేత్రంలో ఓ వీరపుత్రునిగా - నా తల్లి కమర్యాద కలుగకుండా చూడవలసిన బాధ్యత నాది.

నా శౌర్య పరాక్రమాలను చూడాలనే అనుకున్నారో... లేక... ఈ ప్రయాణాలతో విసిగి, అలసి - విచిత్ర మనస్తత్వమొంది, ఆ రకంగా ప్రవర్తించారో... దేవునికి తెలియాలి.

మహాపరాక్రమవంతులని కదా, లోకం మెచ్చుకునేది. మీ యజ్ఞాశ్వాన్ని పట్టినందులకు కోపం మీకు వుండాలి. విజృంభించండి. కాదంటే... చిత్తగించండి!" అని చాలా సూటిగా, నిక్కచ్చిగా మణిపుర ప్రభువు మాట్లాడాడు.

ఆ మాటలు అందరికీ ఆశ్చర్యదాయకమే. అయినా - అనుసాల్వుడు - వీరిద్దరి మధ్యకు నిలిచాడు. “మహారాజా! వారు మహావీరులు. మేము వారికి తోడు వచ్చిన వారలము. వారిని సరాసరి ఎదుర్కొనుట తగదు. అది యుద్ధనీతి కాదు, కనుక... మమ్ము ఎదుర్కోండి” అని బాణం వేసాడు.

భభ్రువాహనుడు, తన బాణంతో సమాధానమిచ్చాడు. ఇరువు - ఇరువురే- మహా ప్రతాపవంతులే.... అన్నట్లు యుద్ధం మొదలయింది. ఎవరు తక్కువ తినడం లేదు. శర పరంపర కొనసాగుతుంది. ఒకసారి ఒకరిది పైచేయి. మరొకసారి ఇంకొకరిది.

భభ్రువాహనుడు ప్రయోగించిన దివ్యాస్త్రానికి అనుసాల్వుడు మూర్ఛితుడయ్యాడు. ప్రద్యుమ్నుడు - తీవ్ర కోపంతో, మణిపురాధీశుని ఎదుర్కున్నాడు. ప్రద్యుమ్నుని బాణ ప్రయోగానికి భభ్రువాహనుడు మురిసిపోయాడు. అతని విధానం తెలిసింది కాబట్టి, తనదైన పద్ధతిలో దివ్యాస్త్రాలు - “శర పరంపర”- అన్నట్లు విడిచిపెడుతున్నాడు.

ప్రద్యుమ్నుని అవక్ర పరాక్రమానికి, బావ, మామను మించిన వాడనుకున్నాడు. తన బాణాలతో అతనికి భభ్రువాహనుడు అయోమయాన్ని సృష్టించాడు.మొత్తానికి ఇరువురు, కేవలం బాణాలతోనే కాదు - కత్తి, గద, పరశువు, ముసలం, ముద్గర... ఇలాగ అన్నింటితో పోరాడారు. ఆ పోరు ఫలితంగా ఇద్దరు మూర్ఛితులయ్యారు. ప్రద్యుమ్నుడు సొమ్మసిల్లడం అర్జునునికి కష్టమనిపించింది. ధనుష్టంకారం చేసాడు. ఆ శబ్దానికి భభ్రువాహనుడు తెలివొంది, ధనువునందుకున్నాడు.

“చాలా సంతోషం, తమరే వచ్చారా. నా వీరత్వ వైనం తెలుసుకుందురు గాని, సిద్ధపడండి... అన్నాడు. వారిరువురు యుద్ధానికి సిద్ధపడుతుంటే, హంసధ్వజుడు అడ్డువచ్చి భభ్రువాహనుని అయిదు అక్షౌహిణుల సైన్యంతో పాటు, అతని రథం కూడా కూల్చేసాడు.

దానికి కృద్ధుడయిన భభ్రువాహనుడు, వేయి నిశిత శరములు వేసి, హంసధ్వజుని రథము, అశ్వములు, చివరకు ఆ మహారాజును కూడా నేలపడ చేసాడు. దానికి కోపించిన -

యువనాశ్వుని కుమారుడు సువేగుడు. తన దివ్య బాణములతో, భయంకరపోరు సలిపే భభ్రువాహనుని, స్పృహ తప్పించాడు. కొద్ది నిముషాలకు తేరుకున్న మణిపుర మహారాజు, శతృసేనలను చీల్చి చెండాడాడు. సువేగుని కూల్చి సింహనాదం చేసాడు.

తను మాట ఇచ్చిన ప్రకారం ఉలూచి రణరంగానికి వచ్చింది. శతృపక్షం చేతులలో దెబ్బతిన్న, తమ వారందర్నీ తన విశల్యకరణితో - బ్రతికించింది. గాయాలను మాన్పించింది. ఆరోగ్యవంతులను చేసింది.

అర్జునుడు జరిగే బీభత్సానికి, తన సైన్యం తన ననుసరించిన మహావీరులు, పరాభవాలపాలవడం అతన్ని కలచి వైచింది. పినతండ్రి పరిస్థితిని గమనించిన వృషకేతువు, ఆయనను సమీపించాడు. కోరి తెచ్చుకున్న దౌర్భాగ్యంగా తలిచాడు.

తన తొందరపాటు, ఎందరికి ఇబ్బంది కల్గించిందోనని బాధపడుతున్నాడు. గంగాదేవి శాపం, నన్ను వెన్నాడుతుంది. నా నీడకు తల కనబడటం లేదు. అంటే అపమృత్యువు పొందుతానన్నమాట. ఇది నా కుమారుని రూపంలో నాకు వస్తూంది. కానీ, నా పేరు చెప్పి -

మీ అందర్ని ఇబ్బందుల పాల్జేసాను, చూడు అదే నన్ను బాధిస్తుందని, అర్జునుడు - ఎంతో బాధపడుతుంటే - “బాబాయి! ఏమిటీ నిర్వేదం ? నీవంటి వీరునకు, శ్రీకృష్ణ శిష్యునికి.... సమాధానపరుస్తున్నాడు. నేనుండగా... మీకు ఏ ప్రమాదం రాదన్నాడు. విజృంభించాడు.

భభ్రువాహనుడు, ఆతని శౌర్యానికి మెచ్చుకుని “వృషకేతూ! మనమిద్దరము సోదరులము. అయినా ఇక్కడ వైరి వర్గాల మయ్యాము. నీవు తప్ప, నాతో ఇంతసేపు, ఇంత దీటుగా, ధాటిగా పోరాడిన వారెవరు లేరు. చాలా సంతోషం. అయినా - ప్రస్తుత పరిస్థితిలో - అంటూ - ఒక దివ్యాస్త్రాన్ని విడిచాడు. అది తీవ్రవేగంతో వచ్చి వృషకేతువు శిరస్సును ఖండించి, ఆ శిరస్సును అర్జునుని పాదాల వద్ద పడేసింది.

ఆ దెబ్బకు అర్జునుడు “కుమారా! మా మూర్ఖత్వానికి నీవు బలయి పోయావా ? అన్న కర్ణుని పోగొట్టుకున్న మాకు నీవు మిగిలావంటే... నిన్ను నా

మూర్ఖత్వంతో పొట్టనబెట్టుకున్నాను. ఎంతటి దౌర్భాగ్యుడను. నా తొందరపాటే, మీ అందరి ప్రాణాలకు మృత్యువయింది'' కన్నీరు-మున్నీరు చేసుకుని ఏడిచాడు. ఆ బాధలో మూర్ఛపోయాడు.

కళ్ళు తెరిచేసరికి ఎదురుగా భభ్రువాహనుడు.

"మీరు మహావీరులు. నీది క్షత్రియ బీజమా ? వైశ్య బీజమా ?'' అన్నారు. అందుకు ఈ మహావీరుని శిరమును అనర్ఘరత్నంగా అర్పిస్తున్నాను. వెళ్ళండి. వెళ్ళి, దీనిని శివునికి అర్పించి, జరిగింది చెప్పి, ఏడ్చి పాశుపతాన్ని అర్థించి, తెచ్చుకోండి.

కుమారుని వెక్కిరింపు అర్జునుని హృదయంలో అగ్నిజ్వాలల్ని రేకెత్తించింది.

వెంటనే ధనువందుకున్నాడు. శరపరంపర కురిపిస్తున్నాడు. అతన్ని నిరోధించాలంటే - ఆనాడు కర్ణునికి పరశురామ శాపం వలన, మంత్రాలు మరచినట్లు, తన నిర్దాక్షిణ్యంగా చంపినందులకు కోపించిన గంగామాత శాప ప్రభావంతో, ప్రయోగించవలసిన మంత్రాలన్ని మరచిపోయాడు. తడబడుతున్నాడు.

అతని పరిస్థితికి నవ్వుతూ - "ఏం మహావీరా! మంత్రాలు మరిచావా, ప్రాణాలు అర్పించదలిచావా ? ఎందుకైనా సర్వదా రక్షించే ఆ కృష్ణ భగవానుని దలచుకో. మనశ్శాంతిని, పుణ్యలోకాలను ప్రసాదిస్తాడు!'' ఆ ఎత్తిపొడుపులకు అర్జునుడు అసహాయుడయ్యాడు. తన దుస్థితికి కుమిలిపోతున్నాడు. పుట్టే బాధను లోలోపలే అణచుకుంటున్నాడు.

భభ్రువాహనుడు "జాల'' అనే దివ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. అది తీవ్ర వేగంతో నిప్పులు కురిపిస్తు వచ్చి అర్జునుని శిరము ఖండించింది. శిరసు నేలకూలింది. పినతండ్రి, అన్నకుమారుడు వృషకేతుని శిరములు ఒకచోటికి చేరాయి.

తన సేనలు - జయ జయ ధ్వానాలు చేస్తూంటే మంగళహారతులతో నగరం ప్రవేశం చేస్తుంటే, రాజమాత చిత్రాంగద, తన భర్త వస్తున్నాడని పొంగిపోయింది. కాని కుమారుడు తండ్రిని చంపి, విజయుడై వస్తున్నాడని విని కృంగిపోయింది. ఆమె దుఃఖముతో క్రిందపడిపోయింది. అంతఃపురంలో చీకట్లు చిమ్ముకున్నాయి. తల్లి సంతోషిస్తూందని విజయవార్తతో వచ్చిన కుమారుడు నీరుగారిపోయాడు.

తల్లులిద్దరు - తండ్రిపై యుద్ధం చేసి విజయం సాధించమన్నారు కానీ, తండ్రిని చంపిన పితృహంతకుడై తమవద్దకు రమ్మని కోరలేదు. చిత్రాంగదలో కోపం పొంగింది. ఉలూచీ బాధ వర్ణించలేము. ఏడ్చి ఏడ్చి కొంత ఉపశమనం పొందారు.

"నాయనా! మమ్మి నీ తండ్రి శవము దగ్గరకు తీసుకువెళ్ళు. చితి పేర్పించు. నా భర్తతో సహగమనం చేస్తానంది చిత్రాంగద.

"అమ్మా!" ఇప్పుడు నేనేం చెయ్యను. నీవు క్షత్రియుడవా, వైశ్య కుల సంజాతుడివా.... అన్న మాటకు నా పౌరుషం ప్రదర్శించాలనే యుద్ధం చేసాను తప్ప, తండ్రిని చంపాలని, మిమ్మి - ఈ రకంగా - ఇబ్బంది పెట్టాలని నాకు ఏ కోశాన లేదు" అని బాధపడుతుంటే -

"నాయనా! తొందరపడకు. ఈ విషాదానికి మార్గము వుంది. నా తండ్రి వద్ద మృతసంజీవని వుంది. ఆ మణిని అనవరతము నాగరాజులు కంటికి రెప్పలా కాపాడుతూ వుంటారు. బలాత్కారంగా తేలేము. మంచితనంతో నా తండ్రిని అర్థించి తేవాలి. మా ప్రధాని పుండరీక మహాశయులు తమ ప్రయత్నంతో - ఆ మణిని తీసుకురాగల సమర్థులు.

ఆ తదుపరి దైవేచ్ఛ. అంది. తన మంగళసూత్రాలు, చెవికమ్మలు, ఆధారాలుగా తీసుకువెళ్ళి నా తండ్రికి చూపండి. పరిస్థితి చెప్పండి. మా ప్రాణాలు రక్షించ ప్రార్థించానని చెప్పండి అంది. అలాగే చేసాడు.

ఆశ్చర్యంగా వుందన్నాడు - ఆదిశేషువు. ఆ హరిభక్తపరాయణునకు ..... ఆపదా! అనగా -

ఇదంతా పవిత్ర గంగామ తల్లి శాపఫలమని మొత్తం కథనాన్ని వివరించాడు. అది విన్న శేషుడు - మృతసంజీవని, అమృతకలశమిద్దామనగా, మంత్రిమండలి కాదంది. పైగా - వాసుదేవ పరిరక్షితుడైన అర్జునుని మనం రక్షించగలమా ? ఆ గోవిందుడు తల్చుకుంటే - గడ్డిపరక గూడా మహాస్త్రమవుతుంది. మృత సంజీవనిగా రూపుదిద్దుకుని, వాని ప్రాణాలను రక్షించను వచ్చును - కనుక.

ఆ విధంగా వారు తమ "మృతసంజీవని"నివ్వ నిరాకరించారని నా కుమార్తెలకు చెప్పుమన్న నీ తండ్రిమాటతో తిరిగి వచ్చానని, పుండరీకుడు - ఉలూచికి, అక్కడ జరిగినదంతా వివరించి చెప్పాడు.

నిజం. ఆ గోవిందుడే, ఈ గండం తప్పించగలడన్నారు. కానీ, ఆ మాటలు-భభ్రువాహనునికి నచ్చలేదు.

ఓ మహావీరా! పుండరీకా నాగలోకానికి దారి చూపండి. నా బల పరాక్రమాలతో, వాళ్ళను నిరోధించి, ఆ మృతసంజీవనిని తెచ్చి, నా చేతులారా పోరుకు పిలచి, చంపుకున్న నా తండ్రిని బ్రతికించుకుంటానని, పుండరీకుని సాయంతో నాగలోకానికి బయలుదేరాడు.

భభ్రువాహనుని చూసి, నాగలోకం బుసలుకొట్టేసరికి వరుసగా -

మయురాస్త్రాన్ని, మర్మబాణాన్ని, పిపీలికాస్త్రాన్ని ప్రయోగించాడు. నాగలోకం మొత్తం తుడిచి పెట్టుకు పోయింది. మణిపురాధీశుని, బల పరాక్రమాలకు బాధపడిన శేషువు, మిగిలిన నాగప్రముఖులు, విధిలేక భూలోకానికి వెళ్ళి అర్జునుని, వృషకేతువును బ్రతికించ సిద్ధపడ్డారు.

కాని నాగులమంత్రి ధృతరాష్ట్రునికి, అర్జునుని బ్రతికించడమిష్టం లేదు. దాంతో అదృశ్యమార్గాన వెళ్ళి అర్జునుని శిరస్సు మాయం చేసాడు. అర్జునుని బ్రతికించుకుందామని వచ్చిన ఉలూచీ, చిత్రాంగదలు, అర్జున-వృషకేతువుల శరీరములను భద్రపరచిన పెట్టెలను చూడగా, అందులో అర్జునుని శిరము కనబడలేదు.

చిత్రాంగ, ఉలూచీలు ఇక సహగమనం తప్పదనుకున్నారు - ఇదంతా చూస్తున్న భభ్రువాహనుని, శ్రీకృష్ణుని కాదని, తన బలపరాక్రమములు ప్రదర్శించి నందులకిదొక హెచ్చరిక!" అని తప్పు తెలుసుకున్నాడు.

"హే కృష్ణా! గోవిందా! గిరిధారీ! అనాథ రక్షకా! ఆశ్రిత జనవత్సలా...!" అని గర్వము మొత్తం తొలగించుకుని, సర్వస్వ శరణాగతియని, వాసుదేవుని శరణు పొందాడు.

ప్రతి ఒక్కరి గళం - శ్రీకృష్ణ నామంతో - ఆ ప్రాంతమంతా మార్మోగింప చేస్తూంటే-

భక్తవత్సలుడైన - ఆ భక్తవరదుడు. శ్రీకృష్ణుడు అభయప్రదాతగా - అక్కడ వారికి దర్శనమిచ్చాడు. ఉలూచీ - చిత్రాంగద - భభ్రువాహనుడు శరణాగతులయ్యారు. ఆ శ్రీ చరణాలకు శరణమొందారు.

అప్పుడిది నాగుల పనిగా తలంచిన కృష్ణుడు - నా అవతారము - సత్య, ధర్మాలకు నిలయమైతే, అర్జునుని శిరము - ఇప్పుడే - ఇక్కడే ప్రత్యక్షమగుగాక!" అన్నాడు. అర్జునుని శిరము, బిరబిరా, తిరుగుతూ అక్కడికి వచ్చి ఆగింది.

ఆదిశేషువు - అర్జునుని, వృషకేతువుల శిరములు కలిపి, సంజీవనీ రత్నమును, ఆ శరీరములపై వుంచగా అవి జీవములు పోసుకున్నాయి.

నిద్రలేచినట్లు లేచారు వాళ్ళు. ఎదురుగా భభ్రువాహనుడు. అతనిని చూసి కర్ణసుతుడు, హుంకరిస్తూంటే! ఆ ప్రక్కనే వున్న వాసుదేవుడు "అల్లుడూ!" అంటూ అతని భుజంపై చెయ్యి వేసాడు.

అన్నదమ్ములిరువురు - ఏదో దురదృష్టంగా పోరాడుకున్నారు. ఇప్పుడు కలిసారు. శాశ్వతమైత్రి దివ్యానురాగాలతో, సుఖమూర్తులై చరించండని వారిని ఆశీర్వదించాడు.

వారిద్దరు ప్రేమగా కౌగలించుకున్నారు. వాళ్ళ ప్రేమకు అర్జునుడు మురుస్తున్నాడు.

"బావా! నన్ను రావద్దన్నావు. ఎక్కడికక్కడ చిక్కుల్లో పడుతున్నావు. చివరకు ప్రేమతో వచ్చిన కుమారుని దురాగ్రహంతో, యుద్ధానికి తెచ్చి, ప్రాణాలు తీసుకున్నావు. పితృహంతకుడిని చేసావని - "భభ్రువాహనా, బాధపడకు. ఇది ధర్మయుద్ధం. ఇందులో పాల్గొన్నవారికి ఏ దోషములు వుండవని" ఓదార్చి - "బావా! ఇప్పటికైనా, నీ పిల్లవాడిని అనుగ్రహించమన్నాడు.

"కుమారా!" అని గుండెలకు హత్తుకున్నాడు. ఆతడు పరవశించి, తండ్రి పాదాలపై వ్రాలాడు. ఇందుకు ఎంతో పరవశించిన అర్జున పత్నులు -

"స్వామీ!" అంటూ, ఆ శత్రుంజయుని పాదాలపై వ్రాలారు. వారిని చెంతకు తీసుకున్నాడు. అందరు ఒక్కటయ్యారు.

**"హే కృష్ణా! వాసుదేవా! గోవిందా!**
**భక్తజన రక్షకా! ఆశ్రిత వత్సలా, అనాధ బంధూ!"**

ముక్తకంఠంతో - శ్రీకృష్ణుని పరవశించి, భజించారు.

**"కృష్ణం వన్దే జగద్గురుం"** - అని సర్వులు శ్రీ స్వామి చరణాలకు, శరణాగతులయ్యారు. ఇదే "శ్రీకృష్ణ భాగవతం."

''''''''''''

# భభ్రువాహనుడు

**యు**ద్ధం చేసి, చేసి అలసిపోయిన, అర్జున బృందం యాగాశ్వంతోపాటు కొన్నాళ్ళు, మణిపుర రాజ్యంలో వున్నారు. జరిగిందానికి బాధపడిన తండ్రి, కుమారులు ఆ తదుపరి తమ ప్రవర్తనకు, జరిగిన ఘాతుకానికి చాలా బాధపడ్డారు.

తనకు తెలిసిన వైశ్యకరణితో, ఉలూచి ఉభయసైన్యాలు తమవే కాబట్టి, ఇటు భర్తకు - అటు కుమారునికి సహకరించింది. యుద్ధంలో గాయపడినవారు, వారు మరణించినవారు స్వస్థులయ్యారు.

రాక, రాక వచ్చిన తండ్రికి, మేనమామకు, సోదరునకు, ఇతర రాజన్యులకు, భభ్రువాహనుడు చక్కని ఆతిధ్యమిచ్చాడు. శరీర బడలికలు తీరాయి. ఇంకా ఎక్కువరోజులు అక్కడ వుంటే, సోమరిపోతుదనం, అంటుకుంటుందేమో...నన్న స్థితిలో... అందరికి వీడ్కోలు చెప్పి, తమ తమ కృతజ్ఞతలను తెలుపుకున్నారు.

యాగాశ్వాన్ని బయలుదేర తీసారు. ఈ మహావీరులందరు దానిని, యధాప్రకారం అనుసరించారు.

యాగాశ్వం తన ప్రయాణంలో రత్నపురాన్ని చేరింది. దానిని మయూర ధ్వజుడు పరిపాలిస్తున్నాడు. ఆతడు కూడా విష్ణుభక్తుడే. రాజునుబట్టే ప్రజలని, ఆయన రాజ్యమే మహావిష్ణుమయం. "కృష్ణ నామస్మరణకు సమయమేమిటని ? సర్వ కాల సర్వావస్థలలో, ఆ నామం ఆ రాజ్యంలో మార్మోగుతుంది.

మయూరధ్వజుడు గతంలో ఏడు అశ్వమేధాలను చేసాడు. ఇప్పుడు ఎనిమిదవది చెయ్యాలని, తన అశ్వాన్ని విడిచిపెట్టాడు. దానికెదురు వచ్చింది. యుధిష్ఠరుల వారి యాగాశ్వం. మహారాజు కుమారుడు తామ్రధ్వజుడు అశ్వరక్షకుడిగా బయలుదేరాడు.

ఈ రెండు యాగాశ్వాలు - రత్నపురి పొలిమేరలలో కలుసుకున్నాయి. ఎవరో చెప్పినట్లు - ఆ రెండు - సకిలింపులు, ఎగురుళ్ళు... కవ్వించుకుని మరీ యుద్ధం మొదలుపెట్టాయి. ఈ యుద్ధంలో యుధిష్టర సామ్రాట్టు వారి యాగాశ్వం ముందు, మయూరధ్వజుని అశ్వం ఓడిపోయి తలదించుకుంది.

తమ యాగాశ్వం ఓడిపోవడంతో - యువరాజు - సేనానిని పిలిచి, ఆ అశ్వ వివరాలు తెలుసుకున్నాడు. అయితే, ముందా అశ్వాన్ని పట్టండన్నాడు. దీనితో మన మహారాజు మరో అశ్వమేధ యాగం చేస్తారు. శ్రీకృష్ణ పరిరక్షితులమైన మనల్ని ఎదిరించి, నిలుచుట ఎవరికీ సాధ్యం కాదన్నాడు.

ఆ అశ్వాన్ని పట్టికట్టారు. ఆ వచ్చే సేనను ఎదిరించడానికి వీలుగా యుద్ధానికి సన్నద్ధమయ్యారు.

ఇది ప్రమాదమేమో! కృష్ణ పరమాత్మతో వచ్చే అర్జునుని, ఎంతటి కృష్ణ భక్తులమైనా... సేనాని సందేహం.

"ఫర్వాలేదు. ప్రమోదమే. ఆ వచ్చేది భగవానుడైన కృష్ణుడు. అంతా ఆనందాయకమేనన్నాడు. ఈ వార్త మొత్తం కృష్ణునికి, అర్జునుని అందింది.

"ఇదేమిటి బావా! నీవు - నీ భక్తులు. నీవు మాకు రక్ష. నీ భక్తులతో మాకు శిక్ష. పైగా వాళ్ళను ఓడించడం నీవే కష్టమంటే... ఏం చేద్దాం...! నీవే రక్షకుడైన వానికి, నీ భక్తులతో వచ్చిన కష్టము బాపలేవా!" అంటాడు.

"అర్జునా! ఏమిటీ అమాయకత్వం" ప్రమీల చెఱలో వుండి, "కృష్ణా! అంటే నిన్ను కటాక్షించినట్లే వారిని కటాక్షించాలి. తప్పదు. నీవెంట రావడం, యాగాన్ని రక్షించడం కర్తవ్యం... అంటే విద్యుక్త ధర్మం. "కృష్ణా... అనగానే రక్షించడం బాధ్యత. భక్తుడు తన ఆశలన్నీ - "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" - సర్వకాల సర్వావస్థల యందున నన్నే - స్మరిస్తూ, నాకై తపిస్తూ, నేను లేనిదే.... వారి జీవితం లేదనుకునేవారి సంపూర్ణ రక్షణ - నా బాధ్యత.

అందులోని భాగమే కదా - "కృష్ణా...!" అని సోదరి మొరలిడితే, ఎక్కడనున్నా సరే... ఆ చేసే పనిలో భాగంగా, ఈ ధర్మాన్ని నిర్వర్తించడం.... కనుక - నీ వెంట రావడమొక కర్తవ్యమైతే - పిపిలికాది బ్రహ్మ పర్యంతము తానైయున్న ఆ భగవంతుడు సర్వజీవుల సంరక్షకుడు, ఆపద్బంధువు.

అందుకనే - అనన్యశ్చింతయంతోమాం...! అని చెప్పేది. నా బాధ్యతను నిర్వర్తించేది. కనుక - నా వెనుక వస్తూ వాళ్ళను రక్షించడం.... అనకు. తప్పదు.

శ్రీకృష్ణుని తత్వంలోని ఒక్కమాట అర్జునునికి అర్థం కాలేదు.

భక్తపరాధీనత, భక్తరక్షణ, భక్తవత్సలత... అన్ని నావే... కానీ.... మీరు భిన్నమూర్తులైనా, అధర్ముడివైనా - నేను, ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించాలి. మీకు దర్శింప చెయ్యాలి'' అన్నాడు. మన సేనలను "గృధ్ర'' వ్యూహంలో నిలుపమన్నాడు.

అనుసాల్వుడు - కంఠమయాడు. హంసధ్వజుడు వక్షస్థలమయ్యాడు. ప్రద్యుమ్న, అనిరుద్ధులు - పిక్కలుగాను, భభ్రువాహన, చిత్రభాను, చారుదత్తులు ముఖముగాను, గాండీవీ - ఉదరముగాను, వృషకేతు, యవనాశ్వమేఘపర్ణులు- రక్షకులయ్యారు.

ఇప్పుడు కృష్ణభగవానుడు పాంచజన్యము పూరించాడు. కృష్ణభగవానుని, వారి పరివారాన్ని దర్శించిన తామ్రధ్వజుడు - అణుమాత్రం జంకలేదు. "ప్రభో కృష్ణా....!'' అని కృష్ణ నామం గుండెనిండుగా పిల్చుకున్నాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసల స్వరూపమే కృష్ణనామం. అయినా ఆ నామాన్ని - స్వీకరించి -

అర్థ చంద్రాకృతి బాణాలను అందరిపై దిగ్విజయంగా ప్రయోగించాడు. సింహనాదం చేసాడు. తాము, తమ గురువు ద్రోణాచార్యులవారే ఈ ధనుర్విద్యలో మహామహులనుకున్న అర్జునునకు, కళ్ళు బైర్లు కమ్మాయి. లోకంలో ఎంతటి మహావీరులున్నారు. మట్టిలో మాణిక్యాలుగా వున్నారని, నిండు మనసుతో ఒక వీరునిగా ప్రశంసించకుండా వుండలేకపోయాడు.

అనిరుద్ధుడు - మహా ప్రతాపంతో చెలరేగిపోతున్నాడు. ఏమిటి యాగాశ్వాన్నిస్తావా ? లేక ప్రాణాలు బలిపెడతావా ? అని సవాలు విసిరిన అనిరుద్ధునికి బదులుగా - "ఏమిటి మహావీరుని వలె మాట్లాడుతున్నావు ? తండ్రి, తాతలు కలిసి నిన్ను రక్షించుకున్నారు. కాబట్టి మహాభక్తుడైన బాణాసురుడు, తన భక్తితో, కానుకగా సమర్పించాడు. తప్ప, నీ వీరత్వం అక్కడ శోభించలేదన్నాడు. కాచుకోమన్నాడు. ఈ మాటలు - అస్త్రాలయ్యాయి. ఇరువురి మధ్య భయంకర సంగ్రామమే మొదలయింది.

కృష్ణపౌత్రుడు, కృష్ణభక్తుడి మధ్య పోరు తీవ్రంగానే వుంది. బాణాలు అయిపోయినట్లు, కత్తియుద్ధం ప్రారంభించారు. ఆ పోరాటంలో అనిరుద్ధుడు

అలిసిపోయాడు. అనవరత కృష్ణనామామృతపానుని దెబ్బకు, కృష్ణ మనుమడు మూర్ఛపోయాడు. ఆ వెంటనే తామ్రధ్వజుడు -

వృషకేతు, ప్రద్యుమ్నులపైకి లంఘించాడు. కుమారుని, మూర్ఛకు కోపమొందిన ప్రద్యుమ్నుడు, తీవ్ర శరాలను, తామ్రధ్వజునిపై ప్రయోగించి, ఉక్కిరిబిక్కిరి చేసాడు. వృషకేతువు - పనిలో పనిగా, తామ్రధ్వజుని రథాశ్వములను సారథిని చంపగా, మరో రథమెక్కాడు. అతనెక్కిన ప్రతి రథాన్ని వృషకేతువు ధ్వంసం చేసాడు.

క్షణక్షణానికి తామ్రధ్వజునిలో...కృష్ణనామ శక్తిన పట్టుదల పెరుగుతుందే తప్ప నీరసము - నిస్పృహలు కనబడటం లేదు. కృష్ణనామ బలంతో, వృషకేతువును ప్రతిఘటించడం కాదు, మూర్ఛిల్ల చేసాడు. దాంతో అనుసాల్వుడు- ఆతన్నెదిరించాడు.

తామ్రధ్వజుని - నామశక్తిముందా - అనుసాల్వుడు, యవనాశ్వుడు, కృతవర్మలు తడబడ్డారు. గాయాల పాలయ్యారు. సాత్యకి మూర్ఛపోయాడు. భభ్రువాహనుడు, తామ్రధ్వజునితో కలబడ్డాడు. ఇరువురి మధ్య జరిగిన యుద్ధంలో చాలా భాగం సేన నశించింది. మిగిలినవారు పలాయన మంత్రం పఠిస్తున్నారు.

మొత్తం పరిస్థితి దారుణంగా వుంది. ఒక్కడే... ఒక్కడు... శ్రీకృష్ణనామం చేస్తు ఇందర్ని తరిమి తరిమి కొట్టాడంటే, కృష్ణునికన్నా - కృష్ణనామమే గొప్పదని తేలిపోయింది. భగవంతునికన్న, భక్తుడే ఘనుడని - నిర్వచించబడింది. వాసుదేవుడు తన చెంత వున్నా...

"యత్ర యోగీశ్వరః కృష్ణో....!" అన్నమాట, అక్కడ, అప్పుడు... సత్యము, ఇప్పుడు - ఇక్కడ అసత్యమై కూర్చుంది. దాంతో అందరి కృష్ణభక్తులవలె, అనంతుడు, అవ్యక్తుడు, సదానందుడు, చిదానందుడు, భక్తవత్సలుడైన, ఆ భాగవత ప్రియున్ని నామాన్ని అందుకున్నాడు. అమితోత్సాహంతో, సర్వత్ర కృష్ణుని దర్శిస్తూ- నామజపం చేస్తున్నారు.

దీంతో అర్జునునికి జ్ఞానోదయమైందనుకున్నాడు.

భక్తుడే - "భగవంతుడ"న్న సత్యం - కనీసం ఇప్పటికైనా అర్థమయిందని ఆ శ్యామసుందరుడు సంతోషించాడు.

ఇప్పుడు - భక్తవత్సులుడైన భగవానుడు, తన భక్తుని కరుణించాలి. అంటే... అతనిలో ప్రవేశించి, ఇరువురు ఒక్కటై నిలవాలి. నిరంతర నామ జపం ధ్యేయంగా అర్జునుడు, వున్న సైన్యాన్ని సమీకరించుకున్నాడు. సమరోత్సాహంతో, తామ్రధ్వజునిపైకి వెళ్ళాడు. అతనివలెనే ~~ఈ~~తని కృష్ణనామ భక్తి, అహంకారం బదులు - అస్త్రమయింది. తామ్రధ్వజుని నిరాయుధిని చేసింది.

మరో రథమందుకున్నాడు. చెలరేగిపోతున్నాడు. అది వూహాతీతమైన అపూర్వ యుద్ధం. ఇరువురి ప్రతాపం వాళ్ళనే ఉక్కిరిబిక్కిరి చేస్తూంది. సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది.

తామ్రధ్వజుని ఒక బాణవేగానికి, అర్జునుడు గాలిలోకి ఎగిసి, ప్రాణాలతో క్రింద పడబోతుంటే, వాసుదేవుడు పట్టుకున్నాడు. అది తగదన్నాడు తామ్రధ్వజుడు. అర్జున - తామ్రధ్వజుల సంగ్రామము. "భక్తుడు - భగవంతుని" ఉనికినే ప్రశ్నిస్తున్నట్లు తయారయింది. భక్తుడు రెచ్చిపోతున్నాడు. భగవంతుడు ఓడిపోతున్నాడు. ఎందరినో అదిలించి బెదరించి, నిప్పులు గ్రక్కుతూ, ప్రాణాలు తీసే సుదర్శనం - తామ్రధ్వజుని భక్తిముందర - దీపావళి టపాసువలె తుస్సుమంది.

మొత్తానికి తామ్రధ్వజుడు, నిజభక్తునిగా కృష్ణార్జునులను, మూర్ఛిల్ల చేసాడు. రెండు యాగాశ్వాలతో నగరంలో ప్రవేశించి, జరిగిన మొత్తం - తండ్రికి వివరించి చెప్పాడు.

మొత్తానికి సంతోషించిన మహారాజు, కృష్ణుడు లేని యాగాశ్వాలెందుకు ? దండుగ ? అనేసరికి కృద్ధుడయ్యాడు. అప్పటికి స్పృహలోకి వచ్చిన కృష్ణార్జునులు పరిస్థితిని సమీక్షించుకుని, భక్తపరాధీనుడనైన నేను అశక్తుడను. అతని గెలవడం కష్టమని - ఒక ఉపాయం చేద్దామన్నాడు.

ఇద్దరు వైష్ణవ గురుశిష్యుల రూపం ధరించారు. నగరంలో ప్రవేశించారు.

మహారాజు మయూరధ్వజుని యజ్ఞవాటికను ప్రవేశించారు. అక్కడ సాంగో పాంగంగా జరిగే యజ్ఞ వైదిక తంతును గమనిస్తుంటే - వీరలను గమనించిన మహారాజు భక్తివినమ్రుడై - "బ్రహ్మణోత్తమా!" అని నమస్కరించ బోగా, "శుభం

భూయాత్" అని కపట బ్రాహ్మణరూప, శ్రీకృష్ణుడు ఆశీర్వదించడంతో, మహారాజు మనసు కలతచెందింది. "భూసురోత్తమా.... ఏవిటీ అమంగళం" అన్నాడు.

"మేము కార్యార్థులము. అందుకే మీ నమస్సులను ఆశించకుండా, మా మనస్సును దీవెన రూపంలో తెలిపాము" అన్నాడు.

"అయితే, మీకేం కావాలి ?" మహారాజు అడిగాడు.

"రాజా! నా పేరు కష్ణశర్మ. ఇతను విజయశర్మ. నేను ఇతడు, నా కుమారునితో, కన్యార్థమై - మీ పురోహితుడగు సుశీలశర్మ వద్ద కన్యకై వస్తున్నాము. దారిలో నా కుమారుని ఓ సింహం నోట చిక్కించుకుంది. దానిని నిలువరించడం నాకు సాధ్యం కాలేదు. నా తపస్సు, మంత్రశక్తి ఫలించలేదు. చివరకా సింహం -

"చెప్పండి. సంకోచించకండి." "అప్పుడా సింహము, మయూరధ్వజుడనే మా మహారాజు వద్దకు వెళ్ళండి..!"

"ఫర్వాలేదు. భయంలేదు. చెప్పండి!" అడుగుతున్నాడు. మీ శరీరంలోని- సగ శరీర మాంసం, దానికి ఆహారం ఇస్తే... తప్పక.... అది నా కుమారుని విడిచి పెడుతుందిట!" భయం భయంగా చెప్పి, మహారాజును చూస్తూ - కృష్ణశర్మ ఆగాడు.

"తప్పక. మీ కార్యం సఫలత మొందుతుందని, నా అర్థశరీర మాంసంతో, మీ పుత్రుని బ్రతికించుకోండని, మంత్రిమండలి సమాయత్త పరిచాడు. తన నిర్ణయాన్ని ప్రకటించాడు. కుమారునికి పట్టాభిషేక ఏర్పాట్లు చేయమన్నాడు.

కుమారునికి పట్టాభిషేకం. ఆ సమయంలో దానాదులు జరిగాయి. అప్పుడే తన శరీరంలోని అర్థభాగాన్ని కృష్ణశర్మకు దానమిచ్చాడు. అప్పుడు మహారాణి కుముద్వతి భర్తలో భార్య సగం కాబట్టి, నన్ను తీసుకువెళ్ళమని కృష్ణశర్మను అర్థించింది.

"మహారాణీ, మీరు చెప్పింది నిజం. కాని ఆ సింహం కోరింది కుడిభాగ మన్నాడు." "అయితే, ఆత్మావైపుత్రనామాసి" అన్నారు కాబట్టి, నన్ను తీసుకు వెళ్ళండి. ఒక మహాధర్మప్రభువు ఈ రాజ్యానికి దక్కుతాడన్నాడు, పుత్రుడు!

"నాయనా! మీరంతా త్యాగమూర్తులే. కాదనను. మీరిద్దరు కలిసి, కుడి భాగాన్ని కోసి ఇవ్వాలి. అప్పుడు..." సరేనని రాజు పద్మాసనం వేసుకున్నాడు. భార్యా కుమారుడు

మహారాజు కుడి భాగాన్ని కోస్తున్నారు. అప్రయత్నంగా, మహారాజు ఎడమకంటి నుండి కన్నీరు వుబికింది. అది చూసిన వైష్ణవుడు "ఆపండి. ఈ ఏడుస్తూ ఇచ్చే దానం నా కనవసర" మంటాడు. అందుకు సమాధానంగా మహారాజు!

"వైష్ణవోత్తమా! సత్యం ప్రకటిస్తున్నాను. నేను విష్ణుభక్తుడిని. నాకు శరీర భ్రాంతి లేదు. ఈ శరీరమే కాదు, ఇందలి సర్వము ఆ పరమేశ్వరునిదే. కాకపోతే కుడిభాగానికి లభించిన అదృష్టము ఈ ఎడమభాగానికి లభించలేదేనని... మొత్తం శరీరానికి లభిస్తే - నేనెంత అదృష్టవంతురాలినని" ఆ భాగమనుకుంటుంది.

అంతే తప్ప. ఇందులో మరో వుద్దేశం, దురుద్దేశం లేవు. ఇది సత్యమన్నాడు. అన్యథా భావించక మీ శరీర భాగాన్ని మీరు తీసుకువెళ్ళండని, కృష్ణ భక్తులకు, అసత్యదోషం అంటకుండా, స్వార్థబుద్ధి లేకుండా చెయ్యమని అంజలి ఘటించి, తలవంచుకుని ప్రార్థిస్తున్నాడు.

అప్పుడు - భక్తవత్సలుడైన కృష్ణ పరమాత్మ ప్రత్యక్షమయ్యాడు.

"మయూరధ్వజా! నీ అకలంకమైన భక్తి, భగవన్నామశక్తికి పరవశుడ నయ్యాను. భగవంతునికన్న నామమే గొప్పదని తలచి, నిరూపించిన మీ అందరికి నా మంగళాశీస్సులు.

అదృష్టవంతుడివి. ఈ రెండు అశ్వాలతో యజ్ఞం చేసి తరించు. విజయుడికే, విజయుడవయ్యావు. నన్ను భక్త సులభుడిని చేసి, నీవాడిగా నిరూపించుకున్నావు. నీకు శుభమస్తు - అంటే -

"కృష్ణా! నందనందనా! ఏదైతే అసాధ్యమో, అది లభించింది. ఏది లభించదనుకున్నామో, దానిని పొందాము. నా కుమారుని తొందరపాటును మన్నించి, భక్తవత్సలా! మా నగరానికి వచ్చి మా ఆతిథ్యం స్వీకరించు.

యజ్ఞాశ్వాన్ని మీరే తీసుకువెళ్ళండి. యజ్ఞేశ్వరుడు నావాడయ్యాక - ఈ ఈ లౌకిక యజ్ఞాలవనవసరం. "రండి.... నగరానికి ఆహ్వానించాడు. మహారాజు భక్తిశ్రద్ధలకు అందరు మురిసారు. కొన్నాళ్ళు అక్కడ గడిపారు.

వారిచ్చిన కానుకులనందుకుని, మహారాజు మయూరధ్వజునితో - యాగాశ్వంతో - తమ సంచారం ప్రారంభించారు - అందరు యాగాశ్వాలతో

బయలుదేరారు. జైత్రయాత్ర సాగుతుంది. తన యాత్రలో భాగంగా - యాగాశ్వం సారస్వతపురం చేరింది. దానిని "వీరవర్మ" అనే వీరవర్యుడు పరిపాలిస్తున్నాడు.

రెండు యాగాశ్వాలు, తమ రాజ్యంలో ప్రవేశించాయని విన్న మహారాజు ఆశ్చర్యపోయాడు. తమ సేనానాయకుని రప్పించి, వాటిని పట్టి తీసుకురమ్మని ఆదేశించాడు.

వాటిని పట్టి తెచ్చి, కోటలో బంధించారు. అర్జున పుత్రుడు భభ్రువాహుని నాయకత్వంలోని సైన్యం, తమ యాగాశ్వా లను విడుదల చెయ్యమని కోరారు. ఆ వార్త విన్న మహారాజు తన ముగ్గురు కుమారులు - సుతలుడు, కువలుడు, సుబలుడు లను పిలిపించాడు.

"వెళ్ళండి. ఆ భభ్రువాహనుని సైన్యాన్ని ఓడించి విజయవార్తతో తిరిగి రమ్మని ఆదేశించాడు. పదివేలమంది సైన్యంతో, అతిరథ-మహారథులతో కలిసి, వీరవర్మ కుమారులు, భభ్రువాహునుని పైకి దండెత్తారు. ఉభయుల మధ్యా పోరు తీవ్రంగా జరిగింది.

అర్జునుని కుమారుని ముందు వీరవర్మ కుమారులు నిలువలేకపోయారు. సేనలు పరాజయమొందిన విషయం విన్న వీరవర్మనితో అతని అల్లుడు - "యమరాజు", "మామా! భభ్రువాహనుడు సామాన్యుడు కాడు. మహావీరుడు. అర్జునుని కుమారుడు. అతనిని ఓడించడమంటే... అసాధ్యమనే చెప్పుకోవాలి.

అప్పుడు వీరవర్మ అల్లుడిని వుద్దేశించి "యమరాజా! విజయం ఎవరిదని కాదు ఇక్కడ ముఖ్యం లేదా ప్రశ్న. మన వీరత్వం శోభిల్లిందా" శూరత్వం పరువు నిలబెట్టుకుందా" అన్నదే సమాధానం. వెళ్ళండి. వారిని నిరోధించండి. ఆ తర్వాత దైవేచ్ఛ అన్నాడు. అలాగేనని యమరాజు, మామగారు వీరవర్మ పక్షాన తన పరాక్రమాన్ని చూపించాడు. ఆ అసంఖ్యాక బాణ పరంపరకు పాండవ పక్ష మహావీరులందరూ, స్పృహ తప్పారు.

"బావా! ఈ అశ్వమేధం కాదు కానీ అనుక్షణం నన్ను పరిక్షిస్తుందని, వీరుడిగా ఏడవలేక, విచారవదనుడయ్యాడు. ఏమిటీ పరిస్థితి, ఏం చెయ్యాలి.

గతంలో ప్రతిఘటించనివారందరు, ఇప్పుడు ప్రతిఘటిస్తున్నారు. కారణం ?'' అంటూ అర్జునుడు కారణాలు వెదుక్కోవడం ప్రారంభించాడు.

అర్జునా! అప్పుడు - ఆ దిగ్విజయంలో వీళ్ళు పిల్లలో, విదేశీ వ్యవహారాలు మనకెందుకనో, వూరుకుని వుండాలి. ఇప్పుడు తమ ప్రతాపాలు ప్రదర్శించే సమయం వచ్చిందని, విజృంభిస్తు వుండాలి. ఇందులో కారణాలేముంటాయి. వున్నదంతా ఎదుటి కార్యక్రమమే. అది వార్ని కవ్వించుతుంది.'' అంటూంటే-

"అవును. నువ్వు, ద్వారకాపురి వాసుడవు. నీ భక్తులు దేశదేశాలలో ప్రకటిత మౌతున్నారు. నీతో లేని ప్రమాదము - వీరితో అధికమయి, ప్రాణాలు తోడేస్తున్నారు. ఎక్కడో వున్నవారికి, ఇక్కడున్నవానికి సంబంధం...!'' అన్నాడు.

"అర్జునా!'' ఒక్కసారి గీతను గుర్తుచేసుకో.

అది మొదట్లో మొట్టమొదటిసారిగా సూర్యునికి చెప్పబడింది. ఆ తరువాత మనువు, ఇక్ష్వాకుడు... ఇలాగ లోకానికి వచ్చింది. అవునా ?''

"అదే. నీకు చెప్పింది.''

"అప్పుడు నీవేమన్నావు. బావా! నీవు ఇప్పటివాడివి. ఆ సూర్యుడేమో ఎప్పటివాడో. నీవు ఆతనికెప్పుడు, ఎలాగ చెప్పావంటే... ఇచ్చిన సమాధానమే దీనికి వర్తిస్తుంది. భక్తుడు చిత్తశుద్ధితో ప్రార్థిస్తే - ఆ భక్తుడు సప్తసాగరాల వెనుకవున్నా, అక్కడికి వెడతాడు. అతన్ని రక్షిస్తాడు. తన భక్తపరాధీనతను ప్రకటించుకుంటాడు. అలాగే - ఇది అంతే!'' నంటాడు.

ఇప్పుడు మన పరిస్థితి... ఆ స్థితినే... ఆలోచిస్తున్నాను. ఇప్పుడు మనతో యుద్ధం చేసేది, యమధర్మరాజు. "ఆయనెందుకు వచ్చాడు. మనతో ఆయనకు పనేమిటి ? "పిచ్చిబావా! మనతో ఆయనకు పనిలేదు. కానీ, తన మామగారి పక్షాన పోరాడటానికి వచ్చాడు. అంతే!'' అన్నాడు. "భలే చిత్రంగా వుందే. అక్కడ అగ్ని అల్లుడు. ఇక్కడ యమధర్మరాజు అల్లుడు. భలే బాగుంది. ఈ పొంతనలు.... అంటూంటే -

"నీవు నాగసుందరిని వివాహం చేసుకున్నావు. ఈ పొంతన... అసాధ్యమా? సమాధానం చెప్పు. అలాగే నేను సూర్యపుత్రికను, కాళిందిని వివాహం చేసుకున్నాను. ఆమె నా కోసం తపస్సు చేసి, చేసి మరీ వివాహం చేసుకుంది. ఇంకా చెప్పాలంటే-

మీ తాత భీష్ములవారు దివిజగంగ కుమారుడు. ఆమె శంతనునికి భార్య అయింది. కర్ణుడు - కుంతికి, సూర్యునికి పుట్టినవాడు. ఈ బాంధవ్యాలు నిలబడ్డాయా, నిలబడలేదా ? సవ్యాలా, అపసవ్యాలా ? సమాధానం చెప్పు. ఇప్పుడు అసలు కథలోకి వద్దాం.

ఈ వీరవర్మ మహారాజుకో కుమార్తె వుంది. ఆమె పేరు సుమాలిని. అతిలోక సౌందర్యవతి. ఆమెకు యుక్త వయస్సు వచ్చిందని, వివాహ ప్రసక్తి తెస్తే - నేను యమధర్మరాజును వివాహం చేసుకుంటానంది. తండ్రి కూతుళ్ళు తపస్సు ప్రారంభించారు.

విషయం గ్రహించిన నారదమహర్షి - ఈ పరిణయ వార్తను, వారి తపస్సు గూర్చి యమధర్మరాజుతో చెప్పాడు. ఆయన ఒప్పుకున్నాడు. వైశాఖ పౌర్ణిమకు వస్తున్నానని తెలిపాడు. వీరవర్మకు వర్తమాన మందింది. తగు ఏర్పాట్లు ప్రారంభించాడు. వివాహమయింది.

తనను ఆనందపరచిన మామగార్ని వరం కోరుకోమన్నాడు. తప్పక మీ కోరిక తీరుస్తానన్నాడు.

"యమరాజా! నాకు వాసుదేవ దర్శనానంద కాంక్ష చాలా బలంగా వుంది. కనీసం మరణించేలోగా వారి దర్శనం పొందే అదృష్టాన్ని ప్రసాదించు. ఈ జన్మకది చాలన్నాడు. అప్పటినుండి యమరాజు, మామగార్కి తోడు - నీడగా వున్నాడు. నీవు విజృంభించు. నేను యధాప్రకారం రథసారథి నవుతానంటాడు.

యుద్ధం ప్రారంభమయింది. అసాధారణ ప్రతిజ్ఞ కనబరిచే వీరవర్మను పట్టడమెలాగా ? అని ఆలోచించే వాసుదేవుడు, ఆంజనేయుని స్మరించాడు. మరుక్షణం "స్వామీ!" అన్నాడు. వాసుదేవుడు విషయం చెప్పాడు. కాని, కృష్ణభక్తి ముందు, రామభక్తుని కుప్పిగంతులు ఫలించలేదు.

"ఆగు"మని కృష్ణార్జునులను తన చంకలో ఇరికించుకుని, మారుతితో యుద్ధం మొదలుపెట్టాడు. వీరవర్మ ఆంజనేయుని ఒక్క గుద్దు గుద్దాడు. ఆ దెబ్బకు "రామా" అంటూ క్రిందపడిపోయాడు.

ఇక్కడ మిత్రత్వం తప్ప వీరత్వం పనికిరాదని, కృష్ణుడు ఆతని చంకలో నుండి తప్పించుకుని, ఎగిరి నెత్తిమీద ఒకే తన్ను తన్నాడు. ఆ దెబ్బకు వీరవర్మ క్రిందపడటం, కృష్ణార్జునులు విడుదలవడం జరిగింది. శ్రీకృష్ణుని పదతాకిడికి, వీరవర్మలో... జ్ఞానోదయం మొదలయింది. ఆ యుద్ధం వలదని, నీ చరణాలే శరణమని స్తుతి మొదలుపెట్టాడు.

యాగాశ్వం తీసుకోమని, తనను కరుణించి తరింపచెయ్యమని తన దగ్గరికి వచ్చి, తన సేవలు పొందమని పరిపరి విధాల ప్రార్థించాడు. భక్తజనబాంధవుడు దాసానుదాసుడైన శ్రీకృష్ణుడు, అతని కోరికను మన్నించాడు. చివరకు - అతిథి సేవలు జరిపించి, కథ సుఖాంతం చేయించాడు, వాసుదేవుడు.

ధన్యుడనన్నాడు - ఇటు ధనంజయుడు, అటు వీరవర్మ కూడా!

# మగధ

**ఆ**తిథ్యమందుకున్నారు. ఆనందముద్రల తేలియాడారు. యాగాశ్వంతో జైత్రయాత్ర ప్రారంభించారు. ప్రయాణం - దానిష్టం. అది తన ప్రయాణంలో మగధ సామ్రాజ్య రాజధాని గిరివ్రజపురాన్ని చేరింది. ఇప్పుడా మగధ సామ్రాజ్యాన్ని జరాసంధుని మనుమడు, మేఘసంధి రాజ్యం చేస్తున్నాడు. యాగాశ్వం గురించి విని, ఆనాటి మహానుభావులెవరూ లేరు, కాబట్టి, తమ పగ - పట్టుదలలకు, ప్రతీకారంగా యాగాశ్వాన్ని బంధించమన్నాడు. శ్రీకృష్ణుడు కనుక యాగాశ్వం వెంట కనుక లేకపోతే విజయం తనదేనన్నదాతని భావన.

అదే కనుక, వాసుదేవుడు వీళ్ళతో వుంటే, తన ఆటలు సాగవని తెలిసిన మేఘసంధి, అర్జునుని శిబిరంలో ఎవరెవరు వున్నారో తెలుసుకోమన్నాడు. ముఖ్యంగా అతనికి కావలసింది, కృష్ణుడు, వున్నాడా ? లేదా ? అన్నది. చారులు కృష్ణుడు, యాగాశ్వ సైన్యంలో లేరని తెలియబరిచారు.

అదే పెద్ద విజయంగా భావించిన మేఘసంధి, తన సేనావాహినితో, అర్జునునితో "సై" అన్నాడు. అతనిని చూసి అర్జునుడు జాలిపడ్డాడు.

"మేఘసంధీ! నీది దుస్సాహసమౌతుంది. నీ పెద్దలందరికి పరాక్రమం విలువ బాగా తెలుసును. తొందరపడిన ఫలితాన్ని మీ తాతగారు జరాసంధుల వారు చాలాసార్లు రుచి చూసారు.

చివరకు కాలయవనుని మరణంతో, కయ్యానికి కాలుదువ్వకూడదని నిర్ణయించుకున్నారు అప్పుడు నీవు చాలా చిన్నవాడివి. ఆ పెద్దల అనుభవం లేదు. మీ తాతగారి సాహసం లేదు. చాకచక్యమసలే లేదు. కనుక తొందరపడి, ప్రాణాలమీదకు తెచ్చుకోకు.

ఈ అశ్వం పేరిట అందరం మిత్రులుగా వుండాలనే సంకల్పమే తప్ప, చిన్నా పెద్దా తేడా లేకుండా, కనిపించిన వారితో యుద్ధం చెయ్యడం, విజేతననడం సార్వభౌముల ఉద్దేశం కాదు. కనుక - అర్జునుని మాటలు మేఘసంధికి రుచించలేదు.

దీటుగా - సూటిగా - పోటుగా మా తాతను ఎదుర్కొనలేక, కపట బ్రాహ్మణులై వచ్చి, మల్ల-గదా యుద్ధాలంటూ, మాయ మాటలు, కుయ్యుక్తులతో మా తాతగార్ని వధించారు కానీ, ఎదుటపడి మగాడివలె - ఎవరు ప్రవర్తించలేదు!" తనలోని కసినంతా, అర్జునునికి సమాధానంగా చెప్పాడు.

అప్పుడు కృష్ణుడు - మాయా యుద్ధ విశారదుడు. ఇప్పుడిక్కడ - ఆ మాయదారి కృష్ణుడు లేడు. యుద్ధానికి సిద్ధమవమని, బాణం ప్రయోగించాడు.

దానిని భగ్నం చేసాడే తప్ప, అర్జునుడు ఆతన్ని ఎదుర్కొన తలచలేదు. అది అలుసుగా తలచి మేఘసంధి బాణాలు విపరీతంగా ప్రయోగిస్తున్నాడు. పార్థుడు మౌనం వహించాడే కానీ, ఆ పిల్లవాడిపై - శరసంధానం చెయ్యదలుచుకోలేదు.

మంచిని గ్రహించలేని, ఆ జరాసంధ పౌత్రుడు రెచ్చిపోయి, అర్జునుని నొప్పించడంతో, రథం ధ్వంసం చేసాడు. అశ్వమును చంపాడు. ధనుర్భంగం చేసాడు. అప్పుడు అవతలివారి శక్తి కొద్దిగా అర్థమయింది. అయినా వీరునిగా గద పట్టుకుని, గిరిగిర త్రిప్పుతూ, అర్జునుని మీదకు వస్తూంటే -

ఒకే ఒక్క బాణంతో, ఆ గదను ఎగిరి అవతల పడేసాడు. దాంతో మేఘసంధికి కొంత జ్ఞానోదయం కల్గడం ప్రారంభించింది.

సార్వభౌములు చిన్నపిల్లలను, స్త్రీలను హింసించ వద్దన్నారు. అతి సాహసం వలదన్నారు. అందుకే ఈ ఉపేక్ష, చిన్నవాడివని నీపై అపేక్ష. కాదంటే, ఈ పాటికి భూలోకానికి నీళ్ళు వదులుకునే వాడివన్నాడు.

అర్జునుని మాటలు, ఆయన సహనశీలాన్ని మెచ్చుకోకుండా వుండలేక పోయాడు. ఆ మహావీరునికి మేఘసంధి - స్వాగతమొసగి, వారియందు తన భక్తి ప్రపత్తులను చాటుకున్నాడు. చైత్ర శు॥ పౌర్ణమి అశ్వమేధం. ఆ యాగానికి బంధుమిత్ర సమేతంగా విచ్చేయమని చెప్పగా, తమ తాహతుకు తగ్గ కానుకలనొసగి, పాండవుల హస్తినాపురంతో సంధి చేసుకున్నాడు.

★★★★

అక్కడనుండి తిరిగి యాగాశ్వం తన జైత్రయాత్ర ప్రారంభించింది. అదొక మజిలీగా - యాగాశ్వం చేది రాజ్యంలో అడుగుపెట్టింది. ప్రస్తుతమా రాజ్యాధిపతి శరభునికి యాగాశ్వం వచ్చినట్లు తెలిసింది. పాండవ - యాదవులపై కోపమతనికి. దాంతో ఆ అశ్వాన్ని బంధించమని తన సేనలకు తెలియబరిచాడు.

అర్జునుని ఎదుర్కొనడానికి సిద్ధమౌతున్నాడు. ఛేది దేశం తమదే, అంటే... చేది దేశాధీశుడు దమఘోషుని భార్య తమకు పినతల్లి. అనవసరంగా శిశుపాలుడు యాదవ పాండవులతో విరోధించుకున్నాడు. ఆ కారణంగా అకారణవైరం, తెలియకుండానే ఆ కుటుంబంలో పెరిగిపెద్దదవుతూ వచ్చింది.

దమఘోషుని కుమారుడు శిశుపాలుడు. ఆతని కొడుకు ధృష్టకేతువు. ఇతడు పాండవులపై సోదరభావంతో, కౌరవ - పాండవుల యుద్ధంలో పాండవుల పక్షాన పోరాడాడు. మళ్ళీ ఆతని సోదరుడైన శరభుడు, శిశుపాలునివలె, అకారణ వైరానికి - తెర తీసాడు. అతన్ని, ఆతని ప్రయత్నాన్ని చూస్తే అభిమానం పొంగి వస్తూన్న అర్జునుడు -

"చిరంజీవీ! జరిగిన ఘోరయుద్ధం, దారుణాలు మనసును దాటలేదు. మా మాతృవంశానికి చెందిన నీపై కత్తి దూయలేను. సార్వభౌములు కూడా, స్త్రీ, బాల - వృద్ధులపై కత్తి కట్టరాదని, ఎత్తరాదని ఆదేశించారు. ఆ పూజ్యుల ఆజ్ఞ మాకు శిరోధార్యం.

అనవసర యుద్ధానికి కత్తి ఎత్తకు. ఈ యుద్ధరంగమెంత భయంకరమైనదో, మాకు కుమారుని వంటివాడవు. వృధా వైరము తగదు. వచ్చే చైత్ర శు॥ పౌర్ణమి పెదతండ్రి హస్తినాపుర సార్వభౌములు చేసే యాగానికి బంధుమిత్ర సపరివారముగా విచ్చేయి. అందరం ఆనందంగా కలిసి వుందా''మన్నాడు.

అర్జునుని ప్రశాంత - శాంతి - ప్రేమపూర్వక వచనాలు శరభుని మూర్ఖత్వం పోగట్టి, అనవసర యుద్ధం, వైరి వాతావరణంతో సాధించగలదేమీ లేదని గ్రహించాడు. దాంతో నగరానికి స్వాగతించి, ఆ మహావీరులను సత్కరించు విధంగా గౌరవించి, భూరి కానుకలనిచ్చి వీడ్కోలు నొసగాడు.

అక్కడ నుండి తన జైత్రయాత్ర ప్రారంభించిన యాగాశ్వం.... తన పర్యటనలో భాగంగా నిషాద రాజ్యంలో ప్రవేశించింది. దాని ప్రభువు మహావీరుడైన ఏకలవ్యుడి కుమారుడు. కురు-పాండవులంటే తమ ప్రభువులుగా గౌరవమే. కాని, కేవలం అర్జునుని మూలంగా మహావీరుడైన తన తండ్రి - తన వీరత్వాన్ని దాచుకోవలసి వచ్చిందన్న కోపం మాత్రం మనసులో చోటు చేసుకుంది.

ఆ కోపంతో, అర్జునుని ఎదిరించాలనే కోరిక ఎప్పటి నుండో వుంది. ఇప్పుడు దానికి అవకాశం లభించిందని మురిసిపోయి, అర్జునుని ఎదుర్కున్నాడు. ఆతడు ఏకలవ్యుని కుమారుడని తెలిసి, అనవసర కోపతాపాలను పెంచరాదని తలచి -

"ఓ, చిరంజీవి! అనవసర యుద్ధము వలదు. అకారణ వైరాలు, ప్రజా జీవితాన్ని భగ్నం చేస్తాయి. మన మనసుల్ని కృంగదీస్తాయి. ఒక మహావీరుని కుమారునివే కావచ్చును. ఇంకా కుర్రవాడివి. భవిష్యత్తు వున్నవాడివి'' అని అనునయిస్తున్నాడు.

కానీ, ఆ నిషాద ప్రభువు - ఆ మాటలేమీ వినలేదు. తన వాళ్ళను కూడ బెట్టుకుని అర్జునుని ఎదిరించాడు. అర్జునుని శరసంధాన శక్తి ముందు ఆ నిషాద ప్రభువు - ఓడిపోయాడు.

"కుమారా! నీపై నాకు కోపం లేదు. వచ్చే చైత్ర శు॥ పౌర్ణమినాడు, సార్వభౌములు చేసే యజ్ఞానికి, వచ్చి, చూసి, అందులో పాల్గొన్న ఆనందం పొందమని కోరాడు.

పెద్దాయనగా, అర్జునుని మాటలను గౌరవించి, తగు కానుకలను యొసగి, సార్వభౌములపై గల - గౌరవాదరాలను ప్రకటించుకున్నాడు. అక్కడ నుండి

మళ్ళీ ప్రయాణం. ఆ యాగాశ్వం తన జైత్రయాత్రలలో భాగంగా - జయద్రధుని రాజ్యం సింధు దేశం చేరింది.

ఆ వచ్చింది - పాండవుల యాగాశ్వమని తెలిసి అందరు క్రోధమూర్తులయ్యారు. దొరికిన ఆయుధం తీసుకుని అర్జునునిపై విరుచుకు పడుతూంటే, వాళ్ళను నిగ్రహించే విషయంలో జరిగిన యుద్ధంలో ముందు అర్జునుడు మూర్ఛితుడయ్యాడు. మహావీరుడనే శత్రుంజయుడు పార్థుని మట్టి గరపామని విర్రవీగుతున్న తరుణంలో స్పృహ పొందిన అర్జునుడు -

యుద్ధం వలదని, జరిగిన దారుణం చాలని, తాను యుద్ధం చేసి - నా అన్న వాళ్ళనందర్ని చంపుకోవడానికి రాలేదని ఎన్నో విధాల చెప్పాడు. వారి సైన్యం వినక అర్జునుని పైపైకి వచ్చేసరికి, కాస్త సమాధానం చెప్పాల్సి వచ్చింది. చాలామంది గాయపడ్డారు. ఆ సమయంలో - "అన్నా!" అంటూ కురుపాండవుల ఏకైక సోదరి, దుశ్శల, తన మనుమనితో వచ్చింది. అన్న పాదాలకు నమస్కారం చేసింది. మనుమని చూపింది.

"అన్నా! వీడు నీ అల్లుని కుమారుడు, నీకూ మనుమడే. వాడిని కరుణించి, కాపాడు. వీడిని... !" ఆ తర్వాత ఇటు కన్నీళ్ళు ధారాపాతమయ్యాయి. గొంతు మాట్లాడలేకపోతుంది. చెల్లెలి మాటలకు అర్జునుడు కృంగిపోయాడు. "అమ్మా! జరిగినది - ఆవేశంలోని అనర్థం. అది నిజమైన పొరపాటు. ఇప్పుడు దానిని గుర్తు తెచ్చుకోవద్దు. అది ఇద్దరికి బాధాకరమే. జరిగిందేదో జరిగింది. ఇప్పుడు నేను యుద్ధం చెయ్యడానికి, అందర్ని చంపుకుని ఆ రక్తపుకూటిని తినడానికి రాలేదు.

పెద్దన్న - సార్వభౌములుగా అశ్వమేధం చేస్తున్నారు. ఆ జైత్రయాత్రలో మన అశ్వం ఇటు వచ్చింది. నిన్ను చూడగలిగాను. ఇంతకీ అల్లుడు... అంతవరకు కొంత సావధానచిత్తురాలైన ఆమె అల్లుడని, కుమారుని పేరు ఎత్తేసరికి "అన్నా! వాడు మీ పేరు ఎవరైనా అనుకుంటే విని, భయపడిపోతున్నాడని" బావురుమంది.

భయపడకు. అతనికి నా వలన ఏ ఆపద రాదని చెప్పు. అందరు రేపు చైత్ర శు॥ పూర్ణిమకు హస్తినకు రండి. సపరివారంగా యజ్ఞంలో పాల్గొనండి. అందరం అక్కడ ఈ మనుమని చూస్తా"మని ఆడబడుచుకు తగు కానుకలిచ్చి, అందరికి తన ఆశీస్సులనిచ్చి ముందుకుసాగాడు.

యాగాశ్వం - మెల్లగా - గాంధార దేశంలో ప్రవేశించింది. గాంధారం, కౌరవులకు మాతామహుల దేశం. గాంధారీదేవి పుట్టినిల్లు. ఆ రోజుల్లో గాంధార దేశాధిపతి సుబలుడు. ఆయన కుమార్తె గాంధారి. కుమారుడు శకుని. మొన్నటి కురుక్షేత్రంతో వాళ్ళందరు మరణించారు. ప్రస్తుతం - ఈ రాజ్యానికి అధిపతి- శకుని కుమారుడు.

యాగాశ్వం, అందువెంట... వివరాలు విన్న శకుని కుమారుడు, ప్రస్తుత రాజ్యాధిపతి, అనవసరంగా పాత వైరాలను మనసులోకి తెచ్చుకుని, "అర్జునుడు, యాగాశ్వ"మనేసరికి యుద్ధానికి "సై" అన్నాడు. రణభేరి మ్రోగించాడు. అది తగదని, అనవసర వైరాలతో మా దాయాదులం, ఎంత నష్టపోయామో, ముఖ్యంగా మీ తండ్రి అనవసరంగా - ఎత్తులు - కుయ్యుక్తులని ఏ రకంగా నశించాడో, కౌరవుల నాశనానికి ఎగబడ్డాడో - జాగ్రత్తగా ఆలోచించుకుని ఈ వైరి వాతావరణాన్ని ముగించమన్నాడు.

"చిరంజీవి, చంపడం - చావడం కాదు ముఖ్యం. మానవత్వం - మమతాను రాగాలు - ఇవి లోపించే మహాభారత యుద్ధం జరిగింది. వీటిని నీవు విడువకు. నిజానికి నీతో యుద్ధానికి రాలేదు. ఎంతో మెల్లిగా అనునయిస్తూ చెప్పాడు. వినలేదు సరికదా! తానేదో ఘనకార్యం చేస్తున్నట్లు అర్జునునిపైకి బాణాలు ప్రయోగించాడు.

అసూయాద్వేషాలెంత ప్రమాదకరమైనవో, ఈ శకుని కుమారుని చూస్తే అర్థమవుతుంది. అర్జునుని శాంతప్రియ వచనాలను అర్థం చేసుకోలేకపోతున్నాడు. చివరికి ప్రజలు ధైర్యం చేసి రాజకుమారుని వెనక్కి తీసుకును వెళ్ళే ప్రయత్నం చేసారు. మూర్ఖత్వం మూర్తీభవించినట్లు, అతడు అనవసరంగా శరసంపదను ప్రయోగిస్తున్నాడు. అప్పుడు శకుని భార్య తన మంత్రులతో కలిసి, వచ్చింది. అర్జునుని తనకు పుత్రభిక్ష పెట్టమని వేడింది.

"అమ్మా! జరిగింది. దారుణ ఘోరం. మళ్ళీ అటువంటి స్థితి రాకుడదన్నది మా అభిప్రాయం. వాడు చిన్నపిల్లవాడు. మాకు బావ. వాడినేమీ చెయ్యను. నిన్ను, నీతోపాటు పెదనాన్న, పెదతల్లులకు.... ఇంకా... బాధలను కల్గించను.

"అత్తా! మమ్ము... మన్నించు. సార్వభౌమునిగా మా అన్న చైత్రశుద్ధ పౌర్ణమి నాడు, అశ్వమేధం చేస్తున్నాడు. బావతో, బంధుమిత్రులతో తరలిరా, అందరం ఆనందమూర్తులవుదా"మంటాడు.

అర్జునుని, ప్రియ శాంతవచనాలకు మురిసిన శకుని భార్య - నిజమైన మూర్ఖత్వంతో, జీవితాలు నాశనం చేసుకున్నామని బాధపడింది.

కుమారుని ఓదార్చింది. జరిగిన సత్యం తెలుసుకోమంది. ఇక ఎటువంటి అనర్థాలకు తావివ్వకుండా అందరం కలిసిమెలిసి వుండే విధంగా మన ప్రయత్నాలు ప్రారంభించాలని రాజమాతగా, ఆకాంక్షించింది.

అదే కుమారునికి చెప్పి - సర్వమంగళములు పొందమని ఆశీర్వదించింది. అక్కడ నుండి, యాగాశ్వం హస్తినకు బయలుదేరింది.

★★★★

ఇక్కడ ఆనాడు మాఘశుద్ధ పౌర్ణిమ.

యుధిష్ఠరుడు - అందరితో సమాలోచనలు చేస్తూన్న తరుణంలో - అక్కడున్నవారు అనుకుంటున్నారు.

హస్తినలో, యాగాశ్వం సంచారం, ఎదురౌతున్న ప్రతిఘటనలు, యుద్ధాలు, జయాపజయాలు, సమయానుకూలంగా శ్రీకృష్ణదేవుని అభయప్రదానం అన్నీ తెలుస్తున్నాయి. కానీ - ధర్మరాజుకు అర్థం కానిది ఒక్కటే.

పరమశివుడు వంటి వానిని నిగ్రహించిన అర్జునుడు, రాజసూయా యాగాన్ని నిర్విఘ్నంగా జరిపింప చేసిన ఘనుడు - ఈ చిన్న చిన్న రాజ్యాలతో, ఇటువంటి ప్రతిఘటనలతో ప్రతిక్షణం అపజయాలు, అవమానాలు పొందడం... అంతా అయోమయంగా - అగమ్య గోచరంగా కనుపించింది.

యాగాశ్వం గాంధారం వైపు వెళ్ళినట్లు తెలిసింది.

ఇక అర్జునుడు - యాగాశ్వంతో తిరుగు ప్రయాణం పట్టి వుంటాడనుకున్న సమయంలో ప్రతిహారి వచ్చి - గాంధారం నుండి - యాగాశ్వంతో, విజయ మూర్తిగా-అర్జునులవారు అతి త్వరలో నగర ప్రవేశం చెయ్యబోతున్నారని చెప్పాడు.

శుభవర్తమానం చెప్పినందులకు అతన్ని సత్కరించి పంపిన యుధిష్ఠరుడు. తమ్ముడు భీముని చూస్తూ - "తమ్ముడూ! చైత్రశుద్ధ పౌర్ణిమ వస్తుంది. దిగ్విజయ యాత్ర చేసి యాగాశ్వముతో అర్జునుడు వస్తున్నాడు" అనగానే -

"అన్నా! ఇక్కడ కూడా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వసతి, భోజనాదులకు, ఎందరు వచ్చినా, ఎవరు వచ్చినా... వారి వారి స్థాయికి తగ్గట్లు ఏర్పాట్లు ఏ లోటు లేకుండా జరుపబడుతున్నాయి. "మీరు ప్రశాంతంగా వుండండి" అని, సర్వ విషయాలను, వివరంగా వివరించి చెప్పాడు. అప్పుడే -

కృష్ణభగవానుడు రాలేదు. వ్యాసభగవానులు రావాలి. ఎందరికో ఆహ్వానాలు, సకాలంలో అందేటట్లు పంపాలి. వూరికే, ధర్మరాజు కంగారు పడుతున్నాడు. రాజలోకానికి అందటికి ఆహ్వానాలు పంపండి. వేదవిదులకు, ఆశ్రమాలకు, మహర్షులకు మరచిపోకుండా ఆహ్వానాలు అందించండి అన్నాడు -

"సహదేవా! నువ్వు ద్వారకకు వెళ్ళి వాసుదేవుని, పెద్దన్న బలరాముని, మిగిలిన ప్రముఖులను స్వయంగా ఆహ్వానించి, దగ్గరుండి తీసుకురా!" అని చెబుతున్నాడు.

"అక్కర్లేదు. అందరు బంధుమిత్ర పరివార సమేతంగా వస్తున్నామని వార్త వచ్చింది. హమ్మయ్య - తృప్తిగా యుధిష్ఠరుడు వూపిరి పీల్చుకున్నాడు. యజ్ఞం పూర్తయినట్లేనని ద్రౌపది సంబరపడింది.

ద్వారక నుండి బంధుమిత్ర సపరివారంగా వాసుదేవుడు వచ్చాడు. ఆ మహనీయునకు సలుపవలసిన విధంగా స్వాగత సత్కార్యాలు జరిపించి, వారు విశ్రాంతి తీసుకున్న తదుపరి యుధిష్ఠరుడు శ్రీకృష్ణుని దర్శించాడు. ఉభయకుశలోపరి తదుపరి, జరుగుతున్నదంత ధర్మరాజు వివరించాడు.

అంతావిన్న కృష్ణుడు, సింధు గాంధారాది దేశాలను చూసుకున్న తదుపరి నీ యాగాశ్వం మా ద్వారకకు వచ్చింది. ఈ జైత్రయాత్రలో పాల్గొన్న రాజులందరు కూడా తమ పరివారంతో, అశ్వమేధానికి వస్తున్నారని, ముందుగా వెళ్ళే నీవు, ఈ శుభవార్త అన్నగారికి తెలియచేయమన్నాడు.

అర్జునుని కుమారుడు మణిపురాధీశుడు భభ్రువాహనుడు, తమ తల్లులతో వస్తున్నాడుట. అంతేకాదు. ఇంత హడావుడిలోను, నీ తమ్ముడు ప్రమీల మహారాణిని చూసి, ఆమెపై మనసు పడవేసుకుని, ఆమెకు బందీయై, తదుపరి విడుదలయ్యాడు. వివాహం చేసుకున్నాడు. సంసారము చేసాడు. ఆ మరదలు మహారాణీ కూడా -

మీ యజ్ఞానికి తమ తమ పరివారాలతో వస్తుందిట.

నీ తమ్ముడు గూడా అతి త్వరలో వస్తాడని చెప్పాడు. విజయుని విజయ యాత్రలనలేము కాని, దుర్భర దిగ్విజయంతోపాటు, అర్జునుని మరణం, భభ్రువాహనుని వీరోచిత పరాక్రమం, నాగలోకం వెళ్ళి - వాళ్ళందర్ని హడలగొట్టి, ఆదిశేషువును, అమృతకలశ - సంజీవనీమణులను తేవడం, కుమార భభ్రువాహనుడు తన తండ్రిని బ్రతికించుకోవడం అన్ని వివరంగా విన్న యుధిష్ఠరుడు తమ్ముని కోసం ఎదురు చూస్తున్నాడు.

ఒకనాడు యుధిష్ఠర - శ్రీకృష్ణులు, యజ్ఞము దాని నిర్వహణ, అతిధుల రాక గూర్చి ఇష్టాగోష్టి జరుగుతుండగా, ప్రతిహారి వచ్చి అర్జునులవారు, తెల్లవారేసరికల్లా హస్తినలో వుంటారని తెలియబరిచాడు.

జైత్రయాత్ర ముగించుకుని వచ్చే విజయునకు, స్వాగత సత్కారాలు ఘనంగా ఏర్పాటు చేయబడ్డాయి. అర్జునునికి ఘనస్వాగతం లభించింది. సామ్రాట్టు యుధిష్ఠరునకు వందనం సమర్పించాడు.

అఖిలలోకారాధ్యుడు, ఆది మధ్యాంత రహితుడైన కృష్ణునికి - సాష్టాంగ వందన మర్పించాడు. పెద్దలకు నమస్కారాలు, సమవయస్కులకు ఆలింగనాలు, చిన్నలకు ఆశీస్సులు, మందహాసం. పేరుకు విజయుడై వచ్చాడు కానీ, ఆతడు పడ్డ కష్టాలు వర్ణనాతీతం. ఘోరాతిఘోరం.

"అర్జునా!" అని దగ్గరకు తీసుకున్న అన్న ధర్మరాజు - ఆనందంగా -

బంధువులందరు వస్తున్నారు. సకల రాజలోకం చాలావరకు వచ్చింది. ఇంకా వస్తున్నామని వర్తమానాలు వస్తున్నాయి. విజయుడవై నీవు నచ్చావు. చాలా, చాలా సంతోషమన్నాడు, దగ్గరకు తీసుకున్నాడు.

"భభ్రువాహనుడు వచ్చాడా ?" అడిగాడు. ఇంకా రాలేదు. మాతా సహితంగా రేపు వస్తున్నాడని వర్తమాన మందింది. నాగకాంత, మా మరదలు ఊలూచి కూడా, కుమార భభ్రువాహనునితో వస్తుందట. మా మరదలు, ప్రమీలా మహారాణి కూడా విచ్చేస్తుందట. ఆ మాటలన్నీ శుభ వర్తమానాలే. అతనికి ఆనందదాయకాలే.

అభ్యంతరం మందిరంలోకి వెళ్ళాడు. మాతృశ్రీకి నమస్కరించాడు. ద్రౌపది, సుభద్ర, ఇతర పాండవ రాణీవాసకాంతలు, ఆ వీరవిక్రముని ప్రేమాదరాల గౌరవభావంతో కళ్ళతోనే పలుకరించారు.

అనుకున్నట్లే కుమార భభ్రువాహనుడు, పత్నులు, చిత్రాంగద, ఉలూచీలు ఒక వర్గంగాను - మహారాణి, విజయుని "విజయ" పత్ని ప్రమీల తన స్థాయితో అశ్వమేధానికి వచ్చింది. వాళ్ళందర్ని ద్రౌపది సుభద్రలు, అరమరిక లేకుండా, ఆహ్వానించారు. ఆదరించారు. ఎంతో ప్రేమను కురిపించారు.

అందరు రావడం, చాలారోజుల తర్వాత ఆనందం - అక్కడ తాండవించడం- అందరికి ఆనందదాయకమయింది. నిర్ణయించిన శుభముహూర్తంలో, యుధిష్ఠరుని "నాయనా! తరుణ మాసన్నమయింది. సామ్రాజ్ఞి సహితుడవై అనగా "అవశ్యం" అన్నాడు, యుధిష్ఠరుడు దీక్షా కంకణధారుడౌతూ. ముందుగా వాసుదేవుని -

ఆ తదుపరి - పెదతండ్రి - పెద్దతల్లిని, మాతృమూర్తి - ఆశీస్సుల నపేక్షించాడు.

వ్యాసులవారి సారధ్యంలో - అశ్వమేధం ప్రారంభమయింది. సర్వసమర్థుల శాసన - ఆశ్వాసన - శాసన - అనుశాసన - వైదిక కర్మల క్రియలకు, శక్తులకు - సర్వదేవతానీకం సాక్షాత్కరించింది.

యజ్ఞాశ్వం వధింపబడింది. వివిధ శరీర భాగాలను, ఆయా దేవతల ప్రీత్యర్థం - ద్రౌపదిచేత హోమం చేయించారు. ఆ తదుపరి -

వపాహోమం కూడా జరిగింది.

హోమధూమాన్ని - పాండుకుమారులందరు ఆఘ్రాణించారు. యజ్ఞాశ్వం- మిగిలిన భాగాలు కూడా ఆహుతి చెయ్యబడ్డాయి.

యజ్ఞం పరిసమాప్తమయింది. సురలు, భూసురులు కూడ తృప్తి చెందారు.

తదుపరి - ఇంతటి దివ్యయజ్ఞం నిర్వహింపచేసిన వ్యాస భగవానుల వారికి యజ్ఞ దక్షిణగా, తన అధీనంలోని, సర్వ సామ్రాజ్యాన్ని ధారపోసాడు.

యుధిష్టరుని మానసాన్ని - సోదరులు, భార్య ద్రౌపది శ్లాఘించారు.

రాజ్యం వీరభోజ్యం కానీ, బ్రాహ్మణ భోజ్యం కాదు. ~~ఈ~~ రాజ్యాన్ని నేనేం చేసుకుంటాను. దీనిని అమ్మేస్తాను. కొనుక్కోమంటాడు. శ్రీకృష్ణుని సలహా ప్రకారం దానిని కొనుక్కుంటాడు.

తనకు లభించిన ధనాన్ని వ్యాసులవారు అందరికి పంచిపెట్టారు. అయినా చాల వుంది. అప్పుడు కోడలు కుంతిని పిలిచి -

"తల్లీ! నీవు మహామాత సత్యదేవి వలె మహావైభవంతో - శాశ్వతకీర్తిని పొందమని, మామగారిగా - ఇచ్చే - ఈ ధనం స్వీకరించమన్నాడు.

ఆ తర్వాత - యుధిష్టర సామ్రాట్టు సర్వులను తగు విధంగా - గౌరవించి సత్కారాలు జరిపాడు. చేతికి ఎముక లేదన్నట్లు - సంపదను సర్వులకు పంచి పెట్టారు. అందరు అయ్యాక -

"నాయనా! భభ్రువాహనా! అని దగ్గరకు తీసుకుని నుదుట ముద్దుపెట్టుకుని నీవు వెళ్ళవలనా ? అంటే - "రాజరికము, పెదనాన్నా!" మీకు తెలియని దేముందంటాడా - తనయుడు.

అమ్మలను వుంచమన్నాడు. కుమారుడు వెళ్ళడానికి అనుమతి యొసగాడు.

దుశ్శల వచ్చింది. ఆ పిల్లను చూడగానే సంతోషించిన ధర్మరాజు - ఇదంతా మా వల్లనే జరిగిందని కాస్సేపు బాధపడ్డాడు.

"ఇప్పుడితడు సింధు దేశాధిపతి. ఇతనికి మేము రక్షకుల"మని తమ అభయ ప్రదానాన్ని తెలియబరిచాడు.

ప్రమీలా మహారాణి, భర్త వద్ద - బావగారులు, సపత్నుల వద్ద శలవు తీసుకుని తన రాజ్యానికి సంతోషంగా తరలి వెళ్ళింది. వీలైనంత తొందరలో భర్తను రమ్మని కళ్ళతో ఆహ్వానించింది.

దేవకీ వసుదేవులు; రోహిణీ బలరాములను - అక్రూర, సాత్యకి, కృతవర్మ-ఉద్ధవులను - ప్రద్యుమ్న - అనిరుద్ధులను - చక్కగా బహూకరించారు. అమూల్య సేవలనందించి పెద్దలనుండి ఆశీస్సులను పొందారు.

అందరితో కలిసి, వచ్చినవారు వచ్చినట్లు ద్వారకకు బయలుదేరారు.

శ్రీకృష్ణుని కృప - వ్యాసులవారి ఆశీస్సులతో అశ్వమేధం పూర్తయింది. భరతవంశ కీర్తిప్రతిష్ఠలు దశదిశలా విస్తరిల్లాయి. సర్వులు - యుధిష్ఠరుని అదృష్టాన్ని బహుముఖాల ప్రస్తుతించారు. ఇంతటి ఆనందాన్ని, అదృష్టాన్ని కల్గించిన శ్రీకృష్ణునికి పాండవ సోదరులు, వారి పత్నులు, కుంతిమాత - ప్రతి ఒక్కరు "కృష్ణం వన్దే జగద్గురుం" అని - ఆ దేవదేవునికి శరణాగతులయ్యారు.

# శ్రీకృష్ణం శరణం మమ

ద్వారకానగరం - నిత్య కల్యాణ - పచ్చతోరణాలతో సర్వదా - శోభా-యమానంగా విలసిల్లుతుంది.

మంగళాశాసనములు సలుప ఆచార్య పూర్వాచార్యులతో - జగద్రక్షకుడైన జగన్నాథుడు శ్రీకృష్ణుడు పరమాత్ముడై - అక్కడ నిలిచి వుండటమే - ఈ -

నిత్యకళ్యాణ - పచ్చతోరణానికి మూలం - కారణం! ఇప్పుడు, ద్వారక - భారతంలోనే సమగ్రాభివృద్ధినొందిన సంపన్న దేశం.

దీని మహారాజు ఉగ్రసేనులే - అయినా పరాత్పరుడు - శ్రీకృష్ణుని - పర్యవేక్షణ, సమయస్ఫూర్తులే - యాదవ విజయానికి కారణమయింది. ఇక - వసుదేవునికి, మనకు తెలిసిన "రోహిణీ - దేవకి"లు తో మొత్తం పదమూడుమంది భార్యలు. అందరు సంతానవంతులే. ఈ పదముగ్గురు భార్యలలో రోహిణీ - దేవకిల - బిడ్డలే జగత్ప్రసిద్ధులయ్యారు.

ఇక వాసుదేవునికి - పదహారువేల నూట ఎనిమిదిమంది భార్యలు. వీరందరికి - కృష్ణుడు - అనురాగమూర్తి అపురూప భర్త. ఏ ఒక్కరిని నిరశించని, నిరాదరించని వ్యక్తిత్వం - ఆ శ్రీకృష్ణునిది.

ఒక్కొక్క భార్య యందు పదేసిమంది పుత్రులను పొందాడు. వారలకు సంతానం. అందరికి భోగభాగ్యాలు - సుఖసంతోషాలు లభించాయి. ప్రతి ఒక్కరు ఆనందమూర్తులే. వీరందరికి ఇళ్ళు వాకిళ్ళు - ఆస్తులు - అంతస్తులు సమకూర్చాడు. నిత్యం - వీరిళ్ళలో - ఏదో శుభకార్యం జరుగుతూనే వుంటుంది.

అక్రూర - సాత్యకి - ఉద్ధవ - కృతవర్మ - అందరు సంతానవంతులు. బహు కుటుంబీకులు.

అందరికి ఆరాధ్యుడు - కృష్ణుడు. ఆయన చరిత్ర యాదవులకు నిత్యపారాయణం. ఆయన నామం నిత్య సంస్మరణీయం. "కృష్ణం వన్దే జగద్గురు"

అని అందరు అంటుంటే, మా కృష్ణుడు, మా యదునందనుడు, యదువంశమౌళి అని ఆ ద్వారకావాసులందరు - అనుక్షణం శ్రీకృష్ణ "భాగవత" లీలల్ని తలుచుకుని మురిసిపోతుంటారు.

★★★★

రుక్మిణికి పదిమంది కుమారులు, ఒక కుమార్తె. కుమార్తె పేరు చారుమతి. ఆమె కృతవర్మ కుమారుని వివాహం చేసుకుంది. ఇదంతా పెద్దల అనుమతితోనే జరిగింది. ఈ వివాహానికి అందరితోపాటు రుక్మిణిదేవి అన్న రుక్మి, వదిన సువ్రతలు కూడా వచ్చారు.

కృష్ణుని కన్న వయస్సులో పెద్దవాడైన రుక్మికి ఎందుకో కృష్ణుడంటే కోపం. అది జరాసంధుని సాంగత్యం వలన వచ్చిందో, లేక శిశుపాలుని స్నేహం వలన వచ్చిందో మొత్తానికి - వాసుదేవుడంటే, రుక్మికి, తగని కోపం. అసలు రుక్మిణిని శిశుపాలునకిచ్చి వివాహం చెయ్యాలన్నది రుక్మి ఆలోచన. రుక్మిణికి మాత్రం మధురలో తాను చూసి, తెలియకుండా ప్రేమించిన దేవకీ సుతుడంటే మక్కువ. ఇందుకు కొంత వదిన సువ్రత కూడా సహకరించింది.

విదర్భ రాజకుమారి వీరనారిగా, శ్రీకృష్ణుని ప్రేమించి వరించింది. పిలిపించుకుని, పుట్టింట్లోగాక, మెట్టినింట్లో, మరీ తాళి కట్టించుకుంది. ఆమె బాటనే నడిచి రుక్మి కుమార్తె రుక్మవతి, ప్రద్యుమ్నును పిలిపించుకుని వరించింది.

రుక్మిణీ కల్యాణం పేరున అవమానమొందిన రుక్మి విదర్భలో అడుగు పెట్టలేదు. తండ్రి - తాత మరణించాక, రాజ్యమొందిన రుక్మి, తన రాజధానిని కుండినపురం నుండి తానుగా నిర్మించుకున్న బీజకటకానికి మార్చుకుని, రాజ్యపాలనం చేస్తున్నాడు.

కాలంలో మార్పువలె, ఇప్పుడు అనుకోకుండా ద్వారకకు రావల్సి వచ్చింది. ఈ ద్వారకలో ఒక వీధికి వున్న విలువ కూడా తన రాజధాని బీజకటకానికి లేదు. ఏదో సామాన్యంగా బ్రతుకుతుందనుకునే రుక్మిణిని అందరు ఆదిలక్ష్మి అవతారంగా భావిస్తారు. అర్చిస్తారని విని ఆశ్చర్యపోయాడు. ఆమె అనుమతి లేనిదే, ద్వారకలో ఏ శుభకార్యం జరుగదు. అన్నిటా ఆ జగన్మాత వుండవలసిందే.

రుక్మిణి సిరులకు, అనంత వైభవాలకు, రుక్మి భార్య... అదే రుక్మిణి వదినకు, కళ్ళు తిరిగి క్రిందపడినంత అయింది. ఆమె తన కూతురు రుక్మవతితో అవునే, ఈ భోగభాగ్యాలన్ని ఎక్కడ నుండి వచ్చాయంటావు ? ఈమెవేనా లేక యాదవ ప్రముఖులు ప్రేమతో ఇచ్చినవా ?'' అసూయ పట్టలేక అడుగుతుంది.

ఆ తల్లి మాటలకు, రుక్మవతి నవ్వుతూ - "చూడమ్మా! మీరు ఆనాడు నా మేనత్తకు ఇవ్వలేదు. ఈనాడు నాకివ్వలేదు. అయినా నీ తెలివితక్కువ కాని - మా అత్తగారు - సాక్షాత్తు ఆ ఆదిలక్ష్మి అనీ, మా మామగారు, శ్రీమన్నారాయణుడని, ఇక్కడి వారందరి విశ్వాసం. వాళ్ళకు అసాధ్యము లేదు. ఇవ్వాల్టి ఈ భోగభాగ్యములన్నీ మా అత్తగారు ఆ ఆదిలక్ష్మీదేవి చలువేనని - ప్రతి ఒక్కరి విశ్వాసం. ఆ మాట, ఆ సంపదలు ఇల్లు వాకిళ్ళు - భాగ్యాలు, భార్యాభర్తలిరువురిని అబ్బురపరిచాయి.

ఏదో సామాన్యంగా బ్రతికే ఆమెకు, సర్వసిరిసంపదలు, పదహారువేల నూట ఎనిమిది మందిలో - ఈమె ఒకటనేకంటే, ఈమె అందరిలోకి ఆధిక్యురాలని సువ్రత విని ఆశ్చర్యపోయింది.

"ఒకసారి...!" అంది సువ్రత.

"అలాగేనమ్మా, రేపుదయమే వెళ్ళి, దేవకీ వసుదేవులు - ఈ పురికే జననీ జనకులు - వారిని, పెద్దమామగారు - అత్తగారిని, ఇతర అత్తగార్లను చూద్దువు గాని'' అంది. "అవునమ్మాయి... ప్రొద్దున్నుంచి మీ మామగారు ఇక్కడే వున్నారు. అక్కడ మిగిలిన భార్యలతో ఇంతేనా... !'' అంటూంది నీరసంగా, ఆ సందేహాల పుట్టయిన సువ్రత! "ఆయన ఆదిదేవుడమ్మా! అందుకే ఆయనను వాసుదేవుడు'' అంటారు. ఆయన వశించని ప్రదేశం, ఈ లోకంలో ఎక్కడా వుండదు.

"మరీ విడ్డూరంగా వుంది. నువ్వు చెప్పేదందని'' రుక్మవతి తల్లి సువ్రత. నవ్వుకుంది రుక్మవతి.

మీ మిగిలిన అత్తగార్లనంటుంది సువ్రత. తప్పక అత్తగారి అనుమతి తీసుకుని, దేవకీ వసుదేవులు, అక్కడ నుండి...!'' వాళ్ళకు వీడ్కోలు చెప్పి "వెళ్ళిరా, వదినా! ఇక్కడ....! ఆమె ఏదో చెప్పబోతుంది.

పాయసం గరిటెతో ప్రేమ సామ్రాజ్యమేలే మహాతల్లివేనే... అని మరదల్ని చూసి ఆశ్చర్య పోయింది. చిరునవ్వులు చిందిస్తూ తర్వాత మాట్లాడుకుందామని,

అమ్మాయి మనవాళ్ళందర్ని... అని, లోపల మా ఆయనతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలని చెప్పి పంపింది.

ముందుగా, సువ్రత - రుక్మవతులు, దేవకీ వసుదేవుల కోటకు వెళ్ళారు. అక్కడ అత్తగారి సేవచేస్తూ - రుక్మిణి, తండ్రితో మాట్లాడే కృష్ణుడు కూడా అక్కడ కనుపించారు. అప్పుడే ఇక్కడికి వచ్చారా ? ఆశ్చర్యపోయింది సువ్రత.

"లేదమ్మా! వారు అక్కడా, ఇక్కడా వున్నారు, వుంటారు. అదేనమ్మా - ఆదిదేవుడు, వాసుదేవుడైన - మా మామగారు, జగన్మాత అయిన మా అత్తగారి ఘనత. పొరపాటున నీ దగ్గిర మా మేనత్తగా ఆమెను తలువకు. అది జగన్మాత మాయ ప్రాథమిక మాయ. ఇది విశ్వజననిగా - విశ్వమాయ'' అంది.

"అవును అమ్మాయి. మీ మావగారు, ఇక్కడకు రాకముందే "రాధ'' అనే ఆమెను వివాహం చేసుకున్నారుట, నీకు తెలుసా ? అడిగింది. "అమ్మా! ఆయన లీలామానుష విగ్రహుడు. ఆ రాధమ్మ ప్రేమమూర్తి - అయినా విశ్వజనని. ఇంకా చెప్పాలంటే మా అత్తగారి ఆత్మ స్వరూపం..'' ఆ.. ఆశ్చర్యంగా నోరు తెరచింది. తన పిల్ల - ఇంతలేసి పెద్దమాటలు, పరమ రహస్యాలు - రుక్మవతీ...!! మాటలు రాని, అడగలేని చెప్పలేని - ఆశ్చర్యానికి గురవుతుంది, సువ్రత గుటకలు మ్రింగింది.

"పిచ్చిదని'' ప్రజలు అనుకుంటారు'' ఒక మూల పిల్లని చూస్తూ, ఆశ్చర్య పోతూనే అడుగుతుంది. "నీవు పిచ్చిపిల్లవే" అంటూ పిచ్చిప్రశ్నలు.'' ఆ... అనేసింది సువ్రత. "అవునమ్మాయి. రతీదేవి... నీకు సవతి కదా! ఆమె నీ జీవితంలో...!''

మేనత్త సహచర్యంతో, అత్తగారయిన గడుసుతనంతోనో గడుసుపిల్లయిన- రుక్మవతీ - రతీ మన్మధులు శృంగారానికి మూలపురుషులు. అంతమాత్రం చేత కామంతో కొవ్వెక్కి కొంపలు తీయరు. మా ఆయనది మన్మథుని అవతారం. ఆమె రతీదేవే. శివుని కంటబడి నుసి అయిన మన్మథుడు, అప్పుడు శ్రీమన్నారాయణు కుమారుడు, ఇప్పుడు శ్రీకృష్ణమూర్తి కుమారుడు.. శివ వరం వల్ల రతీదేవి పుణ్యమాని, ఈ రకంగా జన్మమెత్తారు. ఆయనను ఆమెయే దక్కించుకుంది. ఆది దేవతా దివ్యజీవనా స్వరూపం, ఇప్పుడు ప్రద్యుమ్నులు అయినా, తన భర్త ఆనందప్రదుడు. ఆయన "నంద''నందనుడు, గోవిందునికి కుమారుడయ్యాడు. భౌతిక వాసనల -

గౌరవంగా - మేనమామ కుమార్తెను పరిణయమాడాడు. ఆ దివ్యజీవనులుగా జీవితానికి దివ్యసుఖాలు ప్రసాదిస్తున్నారు. అసలు రతీ మన్మథుల సంపర్గమే లేకపోతే ఈ సృష్టిలో ఏ జీవరాశి ఆనందమొందదు.

ఆ పేరులోని వుంది సకలసృష్టి - ఆ సంపర్కము సంయోగ రహస్యము. ఆ దివ్యమూర్తితో కల్గిన బాంధవ్యము, నిజంగా నా అదృష్టమంటుంది. బహు బాగుందమ్మా'' అని ఒక ముక్క చెప్పకుండా. కథ బాగానే చెప్పింది. ఫర్వాలేదు'' అని - అందరికన్న తానే అమాయకురాలిననుకుంది.

సువ్రత దేవకీదేవి పాదాలకు నమస్కరించగా - "అత్తగారూ! ఈమె మా వదిన. మీ దర్శనం చేసుకుందామని....!'' రుక్మిణి చెబుతుంటే, అప్పుడు రుక్మిణీ. విషయాన్ని ప్రక్కనపెట్టి -

"అమ్మా! మీకో విషయం చెప్పాలని, ఇక్కడికి వచ్చిన తర్వాత, వీళ్ళను చూసాక నాకో కోరిక కల్గిందనగా "చెప్పు'' ఆ తల్లి ఎంతో ప్రేమగా అడిగింది. నా మనుమరాలు రుక్మలోచనను, మన అనిరుద్ధని కిచ్చి - మీతో, మరల సంబంధము కలుపుకోవాలని.. నా ఆశ..! అంది. "తప్పకుండా, మా వాసుదేవునితో చెబుతాం. అదిగో, అబ్బాయీ, మనుమడు ప్రద్యుమ్నుడు ఉదయాన్నుండే -

''ఉదయాన్నుండే''లోపల అనుకుంది. పైకి అనేసింది. ''అవునమ్మా! ప్రొద్దున్నుండి ఇక్కడే వున్నారు. రుక్మి, మా బలరాముని ఇంట వున్నాడు. వాళ్లను రమ్మను. ఇప్పుడే "వూ'' అందామంది. బలరాముడు రుక్మి వచ్చారు. సువ్రత ఆలోచనను మెచ్చుకున్నారు. అనిరుద్ధుని అడిగారు. అందరు హర్షధ్వానాల మధ్య తథాస్తు అన్నారు.

రాజపురోహితుడు రావడం, ముహూర్త నిర్ణయం చెయ్యడం జరిగింది. అప్పుడు రుక్మి - మీరందరు బీజకటకానికి వచ్చి - మా మనుమరాలు, అనిరుద్ధుల వివాహం, ఆనందదాయకంగా జరిపించండని కోరాడు.

తథాస్తు - పెండ్లి పెద్దగా బలరాముడు. ఆ మరునాడు - తెల్లవారే - తల్లి కూతుళ్ళిద్దరూ, జాంబవతితో ప్రారంభించి, ఒక్కొక్క దేవేరి ఇంటినే దర్శిస్తున్నారు. ప్రతిచోట పరమాత్మగా కృష్ణుడు, ఆ వచ్చిన సువ్రతకు ఆనందం, ఆశ్చర్యం కల్గిస్తున్నాడు. అన్ని ఇళ్ళలో - ప్రతి ఇంట్లోను ఆ భార్యతో సరససల్లాపాలాడే -

శ్రీకృష్ణుని స్వయంగా చూసి సువ్రత ''దేవుడ''నే కీర్తించింది. తాను అదృష్టవంతురాలినని పొంగిపోయింది.

"అమ్మా! ఇక నీచింతను విడిచిపెట్టి, మా అత్తగారివంటి దివ్య - పరమ - భాగవతోత్తమురాలు, మా మామగారి వంటి జగద్వంద్యులను బంధువులుగా పొందగల్గడం, వారి అడుగుజాడలలో నడువగల్గడం ఎంతటి అదృష్టమో ఆలోచించు.

ఈ అఖిల లోకారాధ్యులు కేవలం, భక్తికే ప్రసన్నులు. ఇక్కడ మా అత్తగారు సత్యభామతో చదరంగమాడుతూనే"కృష్ణా" అని ఆర్తితో అరచిన పెద్దమ్మ ద్రౌపదీ మాతను, నిండుసభలో పరువు దక్కించి, అఖండ వస్త్రాల నొసగిన అద్భుతశక్తి సంపన్నుడమ్మా మా మావగారు!

అదే సమయంలో - తన చిన్ననాటి మిత్రులతో ఆనందం పొందుతున్న... దేవదేవుడమ్మా ఈ దేవకీసుతుడు. నిండు మనసుతో - ఆయనను తలచుకుంటే ఎటువంటివారినైనా కరుణించి, కనికరించి కాపాడగలరమ్మా - దివ్యులమ్మా - నా అదృష్టంకొద్దీ, నేను ఎన్ని జన్మలలో చేసుకున్న పుణ్యమో ఆ పరాత్పరునికి కోడలినయ్యాను. నాకు మామగారవడంతో మేమదృష్టవంతులమయ్యామమ్మా!"

శ్రీకృష్ణలీలలు విన్నవి చెబుతూ, రుక్మవతి ఆనందపరవశురాలవుతుంటే, ఆ మహాభాగ్యము మేము, దక్కించుకోలేకపోయామని సువ్రత నిరాశకు గురయింది. తమ దురదృష్టంగా బాధపడింది.

నిజంగా నువ్వు ధన్యురాలవు. నిన్ను గని మేము ధన్యులమైనామని, ఆ పిచ్చితల్లి - పొంగిపోయింది.

మొత్తానికి ద్వారకకు రావడం తన అదృష్టంగా సువ్రత తలచింది. వారం రోజులు భార్యాభర్తలిరువురు ద్వారకలో వున్నారు. బ్రహ్మానందం పొందారు. తమ రాజధాని బీజకటానికి వెళ్ళిపోయారు.

ఇక - వారి రాజ్యానికి, రుక్మిణీ కృష్ణులు, బలరామాది ప్రముఖులు, దేవకీ వసుదేవులందరు....ఎందరో.... రావాలి. ఆ శుభముహూర్తానికై ఎదురుచూస్తున్నారు.

# అనిరుద్ధుడు

**శు**భముహూర్తంలో -

అనుకున్న ప్రకారం, ద్వారక నుండి బలరామ-కృష్ణులు, ప్రద్యుమ్నాదులు, రుక్మిణీ, రుక్మవతీలు, అనిరుద్ధునితో, బీజకటకానికి బయలుదేరి వెళ్ళారు.

సాదరాహ్వానం లభించింది.

వివాహం ఘనంగా జరిగింది.

ఎవరి ఘనతను వాళ్ళు ప్రకటించుకున్నారు. ఈ వివాహానికి అందరిలా రుక్మికి, ఆంతరంగీకుడైన కళింగ భూపతి వచ్చాడు. కురుక్షేత్ర యుద్ధంలో అతను పరాభవం పాలయ్యాడు. దాంతో అతనికి కృష్ణుడంటే మంట. ఏదో రకంగా దెబ్బ తియ్యాలన్నదాతని ఆలోచన. రుక్మి అసాధ్యమంటాడు. కాకపోతే పాచికలంటే బలరాముడికి ప్రీతి. అంటాడు. ఇంకేం మాయాపాచికలు తయారు చేయించి, ఆట ప్రారంభిస్తారు.

ప్రతి ఆట రుక్మిదే.

లక్ష బంగారు నాణాలు పోయేసరికి, అనుమానం కల్గి రుక్మిని నిలదీస్తే "అబ్బే!" అంటాడు. కానీ ఆకాశవాణి - "అవి మాయాపాచికల"ని, నిర్ధారిస్తుంది. అంతకుముందే గొల్లలంటు నోరు పారేసుకుంటాడు.

ఆ కోపంతో నెత్తిమీద ఒక్కటిస్తాడు. రుక్మి పరలోకగతుడౌతాడు.

మాటిమాటికి వికటాట్టహాసం చేసి రుక్మిని బలపర్చిన, కళింగ భూపతి మూతిమీద ఒక్కటిచ్చేసరికి, పళ్ళు రాలి, రక్తం కక్కి మరీ చచ్చిపోతాడు. ఆ రకంగా - వినోదం - విషాదానికి దారి తీసింది.

వీళ్ళ బుద్ధులు.... అదే రుక్మివి .... మారవంటూ క్రొత్తదంపతులతో.... స్వయంకృతాపరాధానికి అక్కడ వుండలేక...ద్వారకకు తిరుగు ప్రయాణం చేసారు.

మహాభారత యుద్ధం జరిగి - ముప్ఫయి ఆరు సం॥ల యింది.

యుధిష్టరుడు ప్రజారంజకంగా భరతవంశాన్ని, భరతఖండాన్ని పరిపాలిస్తున్నాడు. ఇక -

ద్వారకలో - శ్రీకృష్ణుని కరుణా కటాక్షాలతో అతి సామాన్యులైన యాదవులు.. అన్నిట ప్రముఖులయ్యారు. రాజాధి రాజులుగా, అమిత సంపన్నులుగా - సర్వవిధాల సుసంపన్నులయ్యారు.

శ్రీకృష్ణుని పుణ్యమా..అని...విలాసజీవితానికి, యాదవులు అలవాటయ్యారు. ఇది వద్దంటే - ఒప్పుకోరు. వీరికి తగు విధంగా గుణపాఠం చెప్పాలని వాసుదేవుడు తలిచాడు. వీళ్లను హెచ్చరించకపోతే, తన అవతార లక్ష్యం బెడిసికొడుతుందని, ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఈ యాదవులందరూ మహాపురుషులు, మహామహులు వారినెవ్వరు సంహరించలేరు. వారిలో వారు అంతఃకలహాలతో మరణించాల్సిందే!

అందుకు... తానే శ్రీకారం చుట్టి, శుభముహూర్తం నిర్ణయించాలి.

శ్రీకృష్ణుని సంకల్ప స్వరూపంగా -

అత్రి, వసిష్ట, విశ్వామిత్ర, అసిత, కణ్వ, దుర్వాస, భృగు, కాశ్యప, ఆంగీరస, వాలఖిల్యాది మహామునులెందరో వచ్చారు.

ఆ వచ్చిన వారినందరిని, రుక్మిణి సహితుడై, కృష్ణుడు అర్ఘ్యపాద్యాల అర్చించాడు. అందరు కాలగతిని చర్చించారు. సర్వమునీవే - అయిన స్వామీ ద్వాపరాంతాన్ని కలి ప్రారంభాన్ని తలచి - నిర్ణయం తీసుకోమంటారు. అందరు శ్రీకృష్ణదర్శనానికి పరవశించారు.

ఈ సమయంలోనే నారదుడు, దేవకీవసుదేవులకు దర్శనమొసగాడు.

"మహర్షి రాకకు సంతోషించిన దేవకీ వసుదేవులు తగు విధాన స్వాగత సత్కారాలు నడిపారు. "ఓ దేవఋషి! దయ వుంచి... తరించు మార్గము చెప్పమని కోరారు." అప్పుడు నారదుడు నవ్వుతూ -

"పూజ్యులారా! పరమ కరుణామయుడైన ఆ భగవంతుని కరుణ కలిగింది కాబట్టే తరించే జన్మగా మీరు దేవకీ వసుదేవులయ్యారు. ఆ దేవదేవుని బిడ్డగా

పొందారు. అనుక్షణం ఆ మహనీయుని దివ్యస్మరణ శ్రవణ మననాదులతో తరిస్తున్నారు. ఇదే ఈ యుగాంతానికి, కలియుగానికి కూడా తారకమంత్రమని చెప్పాడు.

ఆ వచ్చిన వసిష్ఠ విశ్వామిత్రాదులు, శ్రీకృష్ణుని వద్ద శెలవు తీసుకుని వెడుతుంటే, ఒళ్ళు కొవ్వెక్కి కండకావరంతో పేట్రేగుతున్న యాదవులు, తమ దౌర్భాగ్యం కొద్దో లేక శ్రీకృష్ణలీలా విలాసం కొద్దో - మతిమాలి - జాంబవతీ సుతుడు, సాంబునికి గర్భిణీ స్త్రీ వేషం వేసారు. అమాయకులుగా, ఆ మునుల ముందరి నిల్చి "మహర్షులారా! మన్నించండి. అన్నీ తెలిసిన మీరు, మా ఈ పిల్లకు ఎవరు జన్మిస్తారు. ఆడా ? మగా ? ప్రసవ మెప్పుడు ?" అనేసరికి

మహర్షుల కళ్లు చిట్లించారు. అవసాన కాలం దాపురించిందనుకున్నారు. శ్రీకృష్ణమాయ ఆవహించిందని తలిచారు.

ఆ వాసుదేవుని కరుణ తొలగినందులకే ఈ చిత్తభ్రమలని, వాళ్ళను సునిశితంగా గమనించారు.

వారు మహర్షులకు, భలే పరీక్ష పెట్టామని లోలోపల మురిసిపోతున్నారు.

కోపాన్ని తమాయించుకుని, అందర్ని ఒకసారి చూసిన ఆ మహర్షులు-

"నాయనలారా! ఈమె ప్రసవిస్తుంది. అది సుఖప్రసవమే కానీ - ఆ పుట్టేది, ఆడాకాదు... మగాకాదు... యాదవ కుల ముసలం. అది మిమ్మల్ని సర్వనాశనం చేస్తుంది. మీ కర్మమని" అక్కడనుండి, కోపంతో వెళ్ళిపోయారు.

అతి భారంగా ఆ రాత్రి గడిపినవాళ్ళు, సాంబుని చీర విప్పి చూస్తే, అందులో మహర్షులు చెప్పినట్లు ముసలముంది. దానికి విపరీతంగా భయపడిన సాంబుడు, ముందుగా తల్లివద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పాడు. దానిని శ్రీకృష్ణుని పాదాల ముందు వుంచాడు. కృష్ణుడు మందహాసం చేసాడు. చూసావా, జాంబవతీ, యాదవ కుల ముసలం పుట్టింది. మిగిలింది నాశనం తప్పదు.

మహర్షుల కోపాలు, పతివ్రతల శాపాలు అవశ్యం అనుభవించాలన్నాడు.

నిత్యం దరహాస మందహాసాలతో చిరునవ్వుల చిందించు, ఆ దివ్య మోహన మూర్తి వదనం భయంకరంగా తయారయింది. అది దర్శించలేనిదయింది. ఈ తరహా..... ముఖమెప్పుడు చూడని జాంబవతి కలవరపాటుకు గురయింది.

"స్వామీ....!" అంది.

"తప్పదు దేవీ. ఈ ముసలం ఎక్కడినుండో కాదు. నా ఇంటే ప్రభవించింది. ఇక్కడినుండే యాదవ కుల నాశనానికి దారి చూపుతుంది.

ఆ మాటలు, ఆ మూర్తీ... చూడలేక ఒకప్రక్క రుక్మిణికి, మరొకప్రక్క సత్యభామకు కబురు పంపింది. రుక్మిణీ అక్రూరాది ప్రముఖులతో సత్యభామ, సపత్నులతో - జాంబవతీ మందిరానికి వచ్చింది.

జగత్ప్రభువు.... జగత్ప్రళయమూర్తిగా కనబడుతున్నాడు.

"వాసుదేవా!" అన్నాడు అక్రూరుడు.

"మహాభక్తా! అన్ని ఇక్కడ నుండే ప్రారంభమౌతాయి. అంతటా వున్న అన్నిటిని ఆవహించి, వశించి, నా ధర్మం నేను నిర్వర్తిస్తాను.

ఎంతటి దేవుడైనా భక్తజన పారిజాతము. వారిదాసానుదాసుడు. మహామహులు, తపోమూర్తులలో తమంతవారము లేమని, అన్నీ ఇచ్చిన నన్నే ధిక్కరించి చేసిన అపచారానికి ప్రతిఫలం - ఈ యాదవకుల నాశనం.

తప్పదు... ఇచ్చిన సుఖాలవలె, ఈ నాశన దౌర్భాగ్యాన్ని కూడా పుచ్చుకుని అనుభవించండి.

శ్రీకృష్ణుడు రక్షకుడే. శిష్టజన రక్షకుడు. దుష్ట జన శిక్షకుడు. వారలెవరైనా సరే... అవశ్యం అనుభవోక్తం. గేలిచేసింది మహా మహులను, తపోమూర్తులను తప్పించుకోలేరు. తర తమ భేదాలు మరచారు. తత్వం విడిచారు.

శ్రీకృష్ణుని కాదనుకున్నారు. ఫలితం... అనుభవిస్తారు, తప్పదు! ఆ మూర్తిని అలా చూడలేక శ్రీకృష్ణ దేవేరీలే, భయపడిపోతున్నారు. అది యుగాంత రహస్యానికి సంకేతమయింది.

# యాదవ కులం

**"కృ**ష్ణా! అయితే యాదవ కుల నాశనం తప్పదా!'' బలరాము డడుగుతున్నాడు.

"అన్నా! తప్పదు. అనివార్యమైన దానిని నివారించబూనడం సృష్టి విరుద్ధం. సృష్టికి విఘాతం కూడా!

"అదికాదు, కృష్ణా.... ఈ ముసలాన్ని...!''

"అన్నా, అన్నీ తెలిసి, సామాన్యునివలె ఆలోచిస్తావేమిటి ? ప్రకృతి విరుద్ధంగా ఎవరూ ప్రవర్తించలేరు. ఆ భగవంతుడు కూడా కర్మగతుడే.

అనుభవించవలసినవి, అనుభవించవలసినదే తప్ప, నేనెంతో గొప్పవాడి ననుకునే ముందు అవును. నేనెంత గొప్పవాడినని, ప్రశ్నించుకోవాలి తప్ప. మరో మార్గం లేదు. మార్గాంతరం దొరకదు. ఎంతో గంభీరంగా చెబుతున్నాడు.

★★★★

చివరికి - ఎన్ని ప్రయత్నాలు చేసినా యాదవకులంలో ముసలం భీతి బయలుదేరింది. శ్రీకృష్ణుడు రక్షించలేడనేసరికి, ముసలాన్ని అరగదీసి, అరగదీసి చివరకు విసుగెత్తినట్లు మిగిలిన చిన్న ముక్కను సముద్రంలోకి విసిరేశారు. ఈ ముసలం నుండి, ఎలాగ బయటపడగల్గుతామనే భయం ప్రతి ఒక్కరిలో పెరిగిపోతుంది.

ఇలాగుండగా ఒకనాడు చతుర్ముఖుడు - జగన్నివాసుడు, వేదవేద్యుడు, దేవదేవుడైన శ్రీకృష్ణ దర్శనార్థం వచ్చాడు. ఆ వచ్చిన ప్రజాపతికి, మానవలోక ధర్మం ప్రకారం, అర్ఘ్య పాద్యాదుల నొసగి గౌరవించాడు.

"తండ్రీ! సామాన్య మానవుని వలె - ఈ లౌకిక లంపటాలు, భౌతిక వాసనలు నీకవసరమా ? నీ అవతార కార్యక్రమం పూర్తయింది. ఇక యాదవకుల నాశనం కూడా పూర్తిచేసి, నీ నిజధామానికి తరలి రమ్మనమని, ప్రార్థించడానికి వచ్చానన్నాడు.

చాలా సంతోషం పరమేష్ఠి! ప్రజాహితం నెరవేరింది. లోకహితం, ధర్మకారణం పూర్తయింది. అవతారం ముగించాలి. ఈ యాదవకుల...'' అన్నీ జరుగుతాయి.

"స్వాభిమానమా ?'' వినయంగానే అంటాడు చతుర్ముఖ ప్రజాపతి.

కొన్ని సం॥లు తపస్సు చేసే భక్తులకు దాసానుదానుడైన భగవంతుడు, అన్నివిధాల శారీరక బంధాలు, మమతానురాగాల మున్గితేలే మానవుడై... బంధకుడు, సహజబద్ధుడు... అవుతున్నాడు. ఇది సర్వసహజం. నిత్యం, సత్యం.

అయినా సంతోషం. ఈ బంధాలన్నీ త్రెంచుకుని వస్తాను. నాకంటె ముందు అనంతుడు వస్తాడు. ఆ తదుపరి ఇక్కడి శేష కార్యక్రమాన్ని పూర్తిచేసి, నేను లక్ష్మి సమేతుడినై - వైకుంఠానికి వస్తాను. వచ్చిన వారందరికి చెప్పవలసినది చెప్పి పంపాడు.

తెల్లవారి బలరాముని వద్దకు వెళ్ళాడు.

ఆ పెద్దన్న - ఇంకా నిద్రపోతున్నాడు.

నిద్రలేపి, "అన్నా! ఓ ముఖ్య విషయమంటాడు.

"అంత ముఖ్య విషయమా ? బద్ధకంగా లేచి కూర్చుని అడుగుతాడు. మళ్ళీ, బలరాముడే - నువ్వు వచ్చావంటే, అది నిజంగా ముఖ్యమైనదవుతుంది'' అంటాడు.

ఇక దానిని పొడిగించడమిష్టం లేక - "నిన్న బ్రహ్మాది దేవతలు వచ్చారని, వారు వచ్చిన కార్యాన్ని వివరించి చెప్పాడు.

మనకు తెలిసిన విషయాన్నే వాళ్ళు. మనకు మరల హెచ్చరించి చెప్పారా ? చాలా సంతోషం. నా అవతారం తెలియబరిచారు. నీ...

"నా అవతారతత్వం, నేనవరో అన్నది... ధ్యానస్థుడినైనప్పుడల్లా, నాకు గోచరమవుతుంది!''

"సరే. నేను రావడానికి కనీసం, ఇంకో వారం రోజులు కావాలి.

అయితే నేను ముందు వెడతానంటాడు. గబగబ లేచి స్నానసంధ్యాదికములు పూర్తి చేసుకుని కండువా భుజాన వేసుకుని బయలుదేరాడు. ఎక్కడో, ఎవరికి చెప్పలేదు. అలాగ నడుస్తున్నాడు. ఇక్కడ -

రుక్మిణీ మందిరంలోనున్న కృష్ణుడు ఆమె రాగానే "నిన్న బ్రహ్మాదులు వచ్చిన వైనం, వారు చెప్పిన విధానం విన్నావు కదా!

"విన్నాను. ప్రభూ!'' అంది.

"ముందు, అన్న - ఆ తదుపరి నేను, ఆ తర్వాత మీరందరూ... సముద్రం వుప్పొంగుతుంది. ద్వారకను ముంచెత్తుతుంది. ఇవన్నీ మనకోసం వచ్చినవి. మనతోనే మాయమవుతాయి.

అవతారం కాలం పూర్తవుతుందని తెలిసిన నీవు, ఆ విధంగా - నీ చెల్లెళ్ళందర్ని సిద్ధం చెయ్యి. ఇది విధి విలాసం. కాలగతికి మనమందరము బాధ్యులమే''నన్నాడు.

"ఆ తర్వాత ఉద్ధవుడు వచ్చాడు. ప్రభూ! నిన్నటి దినం, బ్రహ్మాది దేవతలు వచ్చారుట.

"అవును'' అని క్షణకాలమాగి "ఎందుకో తెలుసా ?'' అంటాడు కృష్ణుడు.

గంధపుచెట్టు ప్రక్కనున్న చెట్టుబెరడుకు గంధపువాసన అంటుకుని, తానే గంధపుచెట్టుగా భావిస్తుందిట. అలాగే - నీ సహచర్యంలో సమాధాన చిత్తుడనయ్యాను. కనుక - నేనూ వస్తానంటాడు.

"ఉద్ధవా! ఎవరి ధర్మం వారిది. సూర్యచంద్రులిద్దరూ లోకాలకు ఆధారు లేనని, ఒకరి ధర్మం మరొకరు స్వీకరిస్తే, ఏం జరుగుతుందో... అదే జరుగుతుంది... నాతో... నీ రాక! కనుక అజ్ఞానాన్ని విడిచిపెట్టి, జ్ఞానివై నన్ను దర్శించు.

ధర్మం తెలుస్తుంది. ధన్యత చెందుతావు. అంతేగాని....!''

"అంతేనా వాసుదేవా!''

"అంతే... నని వూరడిస్తాడు. ధర్మం తెలియబరుస్తాడు.''

ఈ ద్వారక నీట మున్గుతుంది. యాదవులు నశిస్తారు. అధర్మం చోటుచేసుకుంటుంది.

కలి ప్రభావాన, చేసుకున్న పాపాన్ని చేజేతులా అనుభవించాలి......'' కృష్ణుడు చెబుతున్నాడు.

"ప్రభూ...!''

"అవును. ఉద్ధవా! ఆత్మను కట్టడి చెయ్యి. అదే అసలైన గురువు. ఇంద్రియాలను నిగ్రహించు సర్వ కోర్కెలు దూరమౌతాయి. భోగాలు బంధనాలు కావు. బంధుత్వాలు కనబడవు. నిరాకార, నిర్వికార నిరంజనుడైన ఆత్మ -

బ్రహ్మానంద స్థితినొంది, అనంతాత్ముడై ప్రకాశిస్తాడు. ఇదే - ఇప్పుడు మానవాళికి కావల్సింది. దీన్ని తెలియబరచడానికి యాదవవంశ నాశనమైనా, నీవు వుంటావు. ఈ సద్ధర్మాన్ని వున్నవారికి తెలియబరుస్తావు. ఆచరింప చేస్తావు!

ఇదొక తత్వం. దీనిని అర్థం చేసుకోవడమసాధ్యం. అయినా నిన్ను ధర్మబద్ధుని, కర్మ-తత్వ బద్ధుని చేస్తాను.

జన్మించినప్పటి నుండి, జీవించినన్నాళ్ళు, ఈ సృష్టిలోని ప్రతి అణువణువున ఆ దృష్టితో ఆలోచించేవారికి జ్ఞానోపదేశం చేస్తుంది.

నువ్వీ విషయం వినే వుంటావు. ధర్మరాజును చూడు “నాయనా, నీ రాజ్యంలో చెడ్డవాళ్ళెందరో లెక్క పెట్టి చెప్పమంటే, నగరమంతా తిరిగి ఒక్కరు” కూడా లేడంటాడు. ఇదే ప్రశ్న దుర్యోధనునికి వేస్తే, ఒక్క మంచివాడు లేడంటాడు.

ఇద్దరు ఒకే రాజ్యంలో పర్యటించారు. అదే మనుష్యులను పరిశీలించారు. కానీ, భిన్న మనస్తత్వాల భిన్న ధోరణిలోని వారి మనోగుణం ఆ ఫలితాన్నిచ్చింది. ఇందులో తప్పుపట్టడానికేం లేదు. అందుకే యద్భావం తద్భవతనేది.

★★★★

కురుక్షేత్రం యుద్ధం - ఒక మహాప్రళయం వంటిది. దీని తర్వాత మిగిలిన లోకాన్ని నాశనం చేసి, మరో యుగానికి అంకురార్పణం చెయ్యాలి. దానికీ అంతం వుంటుంది. అప్పుడు మళ్ళీ అవతారం. అందుకునే - ఒకసారి.

తన గురించి - అర్జుననకు విశదబరుస్తూ - నువ్వు చూసే యదుకులమౌళి కృష్ణుడు - నీ బావనుకునే దేవకీ-వసుదేవుల కుమారుడు వ్రేపల్లె వరకే! ఆ తదుపరి ధర్మరక్షకుడు - అవతారపురుషుడయ్యాడు.

అందులోని భాగమే. ఈ అంతర్యుద్ధం. దీనివలన జన నాశనం జరగాలి. ధర్మాన్ని గాడిలో పెట్టాలి.

“యదాయదాహి ధర్మస్య, గ్లానిర్భవతి, భారతా!” అని హెచ్చరించింది.

ఇందులో భాగమే ఈ అవతరణలు, అవతారాలు. ఆ పేరిట అష్టకష్టాలు. అర్థం చేసుకో...! అది “ముగింపు”.

# అవతార పరిసమాప్తి

**మొ**త్తానికి లోకరక్షకుడనుకునే -

శ్రీకృష్ణుని ఇంటిలోనే ముసలం పుట్టింది. అదీ - ఆయన కుమారుని వల్లనే. అదేమిటి.... అంటే... కర్మా... కారణం. కలిప్రభావం!

దీని ప్రభావంతో తనకు తానుగా సర్వతో భద్రంగా నిర్మించుకున్న ద్వారకా నగరానికి చెడ్డరోజులు ప్రారంభమయ్యాయి.

అపశకునాలు. ఒక్కొక్కటి ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి. వీటినుండి బయటపడటానికి దుర్వ్యసనాలు, త్రాగుడుతో ప్రారంభమయ్యాయి. ద్వారకా నగరంలోనే కాదు, యాదవులెవ్వరు మద్యం ముట్టరాదనే నిషేధాన్ని శ్రీకృష్ణుడు శాసనంగా ప్రకటించాడు.

విధి విలాసమనడానికి, అధిగమించలేని దైవ నిర్ణయానికి వీలుగా, ఉద్ధవుడు ధర్మబద్ధుడు, తత్వమూర్తిగా మారిపోతే - సాత్యకి, కృతవర్మ వంటి పెద్దలు, ద్వారకను విడిచి, ప్రభాసానికి వెళ్ళారు. దుర్వ్యసనాలకు గురయ్యారు.

ఇదివరకు ఎంతో అభిమానించిన ఉద్ధవుని పరిహాసం, గేలి చేయడం మొదలుపెట్టారు. అప్పుడు ఉద్ధవునికి, శ్రీకృష్ణ - సత్యసూక్తులు - జ్ఞప్తికి వచ్చాయి.

సర్వసంగ పరిత్యాగియై - శ్రీకృష్ణ ధర్మ ప్రభోదంతో బయలుదేరిన ఉద్ధవునికి - యదుకులంలోని పెద్దలు, చిన్నలు - ఆఖరికి వాసుదేవుని పుత్రులైన ప్రద్యుమ్నాదులు కూడా బరితెగించి, నిందించారు. పెద్దవాడని కూడా చూడకుండా ఉద్ధవుని గేలిచేయడంతో -

మనస్సు కష్టపెట్టుకోదల్చుకోలేదు. ఇది కాలమహిమ. ఇందులో - ఎందరో బుద్ధిమంతులు, మహావీరులను కన్న - శ్రీకృష్ణ సుతులతోపాటు, తన పిల్లలు వున్నారు. మొహం తాను చాటు చేసుకుని అడుగువేస్తున్నాడు.

ఎదురుగ్గా - లీలా మానుష విగ్రహుడైన శ్రీకృష్ణ పరమాత్మ "ఉద్ధవా...!" అన్నాడా భగవానుడు.

"ప్రభూ, నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. వారికి పెద్దా - చిన్నా, ఉచ్ఛ-నీచాలు - తెలియడం లేదు. నేను బదరీకి వెళ్ళిపోతాను. "బాధపడకు. నడు. నేను వస్తున్నాను." అని కృష్ణుని ఓదార్పు.

"నువ్వా స్వామి!

అవును. నా భక్తుల తోడిదే నాకు లోకము. వారు ఎక్కడ వుంటే అదే నా స్థానము. స్థలము." అన్నాడు. గోవిందునిది ముందడుగు.

ఉద్ధవునిది - అనుసరణ - అడుగులో అడుగు.

కనబడని కృష్ణునితో, తత్వమూర్తియై సాగే ఉద్ధవుని - ఓ పిచ్చివానిగా, త్రాగిన మత్తులో - చేతులు వూపుతూ, పగలబడి నవ్వుకుంటూ, పరిహసిస్తున్నారు. త్రాగుతున్నారు, మత్తు పెరుగుతుంది.

ఎక్కడిదో, ఎప్పటివో తలచుకుని మాటలు. దాంట్లోంచి కోపాలు. తామెవరో మరచిపోతున్నారు. తమ వ్యక్తిత్వం చంపుకుని, ఏం చేస్తున్నారో తెలియని విధంగా తిట్టుకుంటున్నారు. ఆ తిట్లతో రెచ్చిపోయి, ఎక్కడ ఏది దొరికితే దానినొక ఆయుధంగా చేసుకుని అంతఃకలహాలు పెంచుకుని, అన్నీ మరచి కొట్టుకుంటున్నారు.

ఇది ఉదయం ప్రారంభమయింది.

సాయంత్రమయ్యేసరికి ఈ ఉన్మాదకాండ చివరికి భీభత్స హత్యాకాండగా మారింది. ఆ ప్రభాస తీర్థం - పీనుగుల కుప్పయి కూర్చుంది.

ప్రతి ఒక్కరు, ఒకరినొకరు కొట్టుకుని - ఆ జన్మశత్రువుల వలె చచ్చిపోయారు.

అంతా చూసిన కృష్ణుడు, "దారుకుని పిలచి, గాంధారీ శాప ప్రభావంతో, యాదవ కుల నాశనమయింది. బలరాములు కూడ యోగనిష్ఠలో వున్నారు. ఒకసారి ఆయనను చూద్దాం, రా!" అంటూ రథంలోబయలుదేరాడు. దారిలో -

దీనిని నివారించవలసిందని - దారుకుడు ప్రార్థించాడు.

"సావకాశముంటే ఆపనా ? యుగధర్మం అనుభవించాలి. జరిగి తీరవలసిందే! అన్నాడు. బలరాముడు యోగనిష్ఠను పొందిన ప్రదేశానికి వచ్చి ఆతనిని చూసాడు.

వచ్చిన కృష్ణుని చూస్తూనే, తన దృష్టిని ఆ ప్రభువుపై పెట్టి - బ్రహ్మరంధ్రం ఛేదించుకున్నాడు. కపాల మోక్షం జరిగింది. అందులోని జీవుడు - శేషుడు, అనంతుడై అదృశ్యమయ్యాడు.

"ప్రభూ!" అన్నాడు, దారకుడు ఆశ్చర్యంగా!


"కాలగతి" అన్న కృష్ణుడు, రథాన్ని దేవకి వసుదేవుల మందిరానికి తీసుకు వెళ్ళమన్నాడు. తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పాడు. మీరు వెంటనే అర్జునునికి కబురు పంపండి. నేను వచ్చిన కార్యము పూర్తయింది. మా తదనంతర-పాలనాది విషయాలను అర్జునుడు చూసుకుంటాడన్నాడు.

కాదంటే, అతనిని - ప్రస్తుతం వున్న స్త్రీ, బాల వృద్ధులను - ఇంద్రప్రస్థానికి, తీసుకు వెళ్ళమనండి. మీరు జాగ్రత్తగా వుండండి. ఏడ్చి ఎవరు ఏమీ చెయ్యలేరు. ఏదీ సాధించలేర"న్నాడు. జాగ్రత్త" అని బయలుదేరాడు.

దారుకుడు చూస్తూండగానే శ్రీకృష్ణ ప్రభువు దివ్యాశ్వములు, రథం అదృశ్యమై పోయాయి. ఒక మూల ఆశ్చర్యపోతూనే, ఉత్తమాశ్వాలు పూన్చిన రథంపై హస్తినకు బయలుదేరాడు.

ఇక - బయటికి వచ్చి కృష్ణుడు, రుక్మిణీ మందిరానికి వెళ్ళాడు. ఆమెను ఓదార్చాడు. తనతో వచ్చేవార్ని అనుసరించమన్నాడు. కాదనుకునేవారికి, అర్జునుడు వచ్చి అండగా నిలుస్తారన్నాడు. చెప్పవలసిన నాలుగు మాటలు తన బాధ్యతగా చెప్పి ఏకాంత ప్రదేశానికి బయలుదేరాడు.

అన్నీ తెలిసిన ఆ పరంధాముడు, ఎదలో ఏ బంధము లేనట్లు, నిర్వికార, నిరంజనుడై ముందుకు సాగుతున్నాడు.



# కృష్ణ నిర్యాణం

ఆ వేటకానికి ఆనాడు వేట దొరకలేదు.

ఆకలితో నకనకలాడుతున్నాడు.

కాళ్ళీడ్చుకుంటూ వస్తున్నాడు.

వాడి చెవికి ఏదో శబ్దం. సంబరపడ్డాడు. ఏదో మృగము దాపుల్లో వుందనుకున్నాడు. ఆ ప్రాంతమంతా చప్పుడు చెయ్యకుండా, ప్రశాంతంగా పరికించాడు.

పొదల మధ్యనున్న సందులో నుండి తల అటు ఇటు ఆడిస్తున్న దృశ్యం.

"అమ్మా. దొరికింది. నా అదృష్టం బాగుందని" ఆత్రంగా బాణం వేసాడు. అది ఈ పాటికి చచ్చే, చావబోతూనో వుంటుందని, బాణంవైపు నడిచాడు. చూసాడు.

అక్కడ ఏ జంతువు లేదు.

బాణము వుంది. ఆడించే పాదముంది. నిశ్చలంగా వున్న దానిని చూసాడు. బావురుమన్నాడు. గుభేలుమంది గుండె. అలాగే క్రిందకు కూలిపోయాడు. చిన్మయుడైన శ్రీకృష్ణ ప్రభువు, యధావిధి తన మధుర మందహాసం ప్రదర్శిస్తున్నాడు.

ఆయన కదిపే పాదం, తనకో మృగమనిపించి, తనకు దొరికిన ఒక ములుకును బాణం చేసుకున్నాడు. దానిని ప్రయోగించాడు. అది యాదవకుల ముసలంలోని ఒక భాగం.

ఆ సంగతి కృష్ణునికి తెలుసు. ఆ వేటగానికి తెలియదు.

"ఇది విధి నిర్ణయమని అతనిని వాసుదేవుడు వూరడించాడు. అయినా ఆ బోయడు నిలువరించుకోలేకపోయాడు. ఆపుకోలేక దుఃఖంతో, కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

"కృష్ణప్రభో! క్షమించు. తెలియక చేసిన అపరాధమిది. "నా తండ్రీ! నా దైవమా! నన్ను కరుణించు, కటాక్షించు. పాపిష్టివాడిని. పరమ పురుషుని చంపుకున్నాను. అంతులేని దుఃఖంతో వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

కటిక బండరాయి మీద చిద్విలాసంగా పడుకుని - కాలిమీద కాలు వేసుకుని - లీలగా పాదాన్ని ఆడిస్తుంటే - అది - ఈ బోయనికి - ఏ లేడి తలో అనిపించింది. హమ్మయ్య! నా అదృష్టం బాగుందనుకున్నాడు. కానీ - ఈ రకంగా కృష్ణుని బాణ ప్రయోగం చేసి ఆయనను -


ఆపుకోలేకపోతున్నాడు.

అతనికి అభయమిచ్చి - ఇది నా నిర్ణయమేనని, నీకే దోషం అంటదని ఓదార్చాడు. కళ్ళు మూసుకున్నాడు. నవనాడులు బిగించాడు. అప్పటికే - ఆ ప్రభువు ఈ భౌతిక నాశనభూతశరీరాన్ని విడిచిపెట్టేసాడు.

దివ్య దేహంతో - తన యధారూపంతో, బ్రహ్మచతుర్ముఖాలతో - వేదగానం చేస్తూంటే, అంతకుముందే, యోగనిష్ఠురాలై పాలకడలి చేరిన ఆదిలక్ష్మి-సాదర స్వాగతంతో అనంతశయనుడైనాడు -

ఆ ఆదిదేవుడు - లక్ష్మి వల్లభుడు - భూలోక రుక్మిణీ వల్లభుడైన వాసుదేవుడు. తన నిజధామానికి చేరి ప్రకాశిస్తున్నాడు. యధాప్రకారం, వేదాలు సాకారమై ఆ వేదవేద్యుని ప్రస్తుతిస్తున్నాయి.

**హరిః ఓం తత్ సత్!**



# ఉపసంహారం

**హ**స్తినాపురంలో కూడా దుర్నిమిత్తాలు గోచరిస్తున్నాయి. ఏమిటీ అపశకునాలు ? ఏం జరుగబోతుంది. యుధిష్ఠరునితో సహా సర్వులకు ఆందోళనగా వుంది.

ఒకనాడు నిండుసభలో యుధిష్ఠరుడు వున్న సమయంలో, ద్వారకనుంచి, శ్రీకృష్ణ రథసారథి సభా ప్రవేశానికి అనుమతి వేడాడు. మహారాజు ఆ కృష్ణ రథసారథిని సాదరంగా తీసుకురమ్మన్నాడు.

అతని మొహంలో నిరాశా - నిస్పృహలు తప్ప ఎక్కడ కళాకాంతులు కనబడటం లేదు. ఆ వచ్చిన దారుకుడు మహారాజుకు జయము పల్కి, తలవంచుకుని నిల్చున్నాడు. ఏదో జరిగి వుంటుందని వూహించిన ధర్మరాజు, ధైర్యం చిక్కబరుచుకుని -

"చెప్పు నాయనా!" అన్నాడు.

"మునిశాపం వలన.... యాదవ కులంలో ముసలం పుట్టింది. దాని ప్రభావం, యదువంశంపై పడింది. శ్రీకృష్ణసుతులు, సాత్యకి, కృతవర్మాదులు తమలో తాము కొట్టుకుని మరణించారు.

బలరాములు యోగనిష్టులై - ఆ అనంతుడిని చేరారు. శ్రీకృష్ణ ప్రభువులు కూడా అవతార విసర్జనకు సిద్ధమయ్యారు. నన్ను హస్తినకు వెళ్ళి అర్జునులవార్ని తీసుకువచ్చి, ~~ఈ~~ రాజ్యాన్ని నడపుకోమన్నారు. స్త్రీ, బాల, వృద్ధులందర్నీ జాగ్రత్తగా హస్తినకో, ఇంద్రప్రస్థానికి చేర్చామన్నారని.... తన రాకలోని ఆంతర్యాన్ని, వివరంగా వినమ్రుడై చెప్పాడు.

"దారుకా! ఇదంతా నిజమా... ?!" అన్నారు.

పాండవుల మనసును గ్రహించిన దారుకుడు "సార్వభౌమా! నా మాటలు అసత్యాలయితే బాగుండును. కానీ కావు. అవి పచ్చి నిజం.... బ్రహ్మాది రాకలతో ప్రారంభించి శ్రీకృష్ణులవారు అవతార పరిసమాప్తికి బయలుదేరిన కథనం యావత్తు.... పూస గుచ్చినట్లు చెప్పాడు.

శ్రీకృష్ణుని కోరిక మేరకు దారుకునితో అర్జునుడు బయలుదేరాడు. ఎవరు లేకపోయినా ఫర్వాలేదు. మా కృష్ణుడుంటే చాలు'' అనే ద్వారక నిద్రావస్థలో వున్నట్లుంది. చైతన్య రహితమైన - ద్వారకలో ముందుగా రుక్మిణీ మందిరానికి వెళ్ళాడు. అక్కడ శ్రీకృష్ణుని భార్యలున్నారు.

"తమ్ముడూ! వెళ్ళు. ఆ జగత్ప్రభువు భౌతిక దేహాన్ని తీసుకుని, రా! దాంతో ఇందరి బ్రతుకులు ఆధారపడి వున్నాయి. ఆ దేహంతో ఈ కట్టెలు కలిసి పోతాయి. ఆత్మలు ఆ పరమాత్మలో లీనమవుతాయి.'' రుక్మిణి - అందరిలోకి పెద్ద దిక్కు కాబట్టి శాంత, గంభీర వచనాలుతో చెప్పింది.

అది విన్న అర్జునుడు, దేవకీ వసుదేవులను కలుసుకున్నాడు. తప్పక నా బావ కోసం నన్ను నేను సమర్పించుకుంటానన్నాడు. అటునుండి సభా భవనంలో నగర ప్రముఖులను సిద్ధపరిచాడు!

"ఆర్యులారా! ఈ ద్వారక అతి త్వరలో మునిగిపోతుందిట. మాకు ఇంద్రప్రస్థమనే నగరముంది. అక్కడే రాజసూయం చేసాము. అది మా బావల ప్రేరణతో కలిసి నిర్మింప చేసింది. దానికి అనిరుద్ధ కుమారుని పుత్రుడు వ్రజకుమారుని రాజుగా పట్టాభిషేకం చేద్దాము. ఇప్పటికి ఏడవనాడు ద్వారక సముద్రంలో కలిసి పోతుందని తెలిసింది. కాబట్టి - మీరు సిద్ధంగా వుండండి. అతి త్వరలో దీనిని ఖాళీ చేసి, మనమా నగరానికి వెడదాం'' అని హెచ్చరించాడు.

దారుకునితో కలిసి, శ్రీకృష్ణుని వెదుక బయలుదేరాడు. విషాదం పూర్తిగా నింపుకున్న అర్జునునికి దారి తెలియడం లేదు. మార్గదర్శకులు అయోమయంలో పడి, సరిగ్గా దారే చూపలేకపోతున్నారు.

ఒక ప్రక్క బలరాముడు, తన శరీరాన్ని విడిచి అనంతుడయ్యాడుట. శ్రీకృష్ణుడు ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. యాదవ ప్రముఖులందరు, బలరామునికి ముందే, తమలో తాము అనవసర అంతఃకలహాలతో కొట్టుకుని చచ్చిపోయారు.

ఈ పరిస్థితులన్నీ చూసి బాధపడలేక వసుదేవులవారు కూడా కీర్తిశేషులయ్యారు. వారితో వున్న పదముగ్గురిలో కేవలం నల్గురు - దేవకి, రోహిణి, భద్ర, మదిరలు వసుదేవుని కళేబరంతో, సహగమనానికి శ్మశానానికి వెళ్ళారు. ప్రజల కళ్ళముందు - కాలి బుగ్గి అయిపోయారు.

ఈ పరిస్థితులలో - అడవి దారి పట్టినవాళ్ళు దారి తప్పి, రెండురోజుల ప్రయాణం తర్వాత, అయోమయంగా వెళ్ళేవారిని ఒక బోయ చూసి ఎక్కడికి వెడుతున్నారని అడుగుతాడు. కృష్ణ ప్రభువు కోసమంటాడు, అర్జునుడు. "రండి" దారి చూపిస్తానంటూ, తానొక చెట్టు క్రింద స్వామి వుండటం చూసాను" అంటూ తీసుకు వెడతాడు.

"అదిగో! అదే చెట్టు అంటాడు. అక్కడ అస్పష్టంగా కనుపించే వానికోసం పరుగెత్తుకు వెడతారు. అక్కడ వున్నది కృష్ణప్రభువే. కాని నిర్జీవుడు. కృష్ణుని పాదంలో ఒక బాణం, ఆయన పాదాల క్రింద - ఒక వేటగాడు.

ఆ దృశ్యం చూసిన అర్జునుడు దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. అతని అనుసరించిన వాళ్ళు సరేసరి. ఎప్పుడు ఆ చిరునవ్వులు చూసే వారందరు, మేని చందాన పూజలతో, పరిమళ హారాలతో, చెరగని చిరునవ్వుతో, నెమలి పింఛము, బంగారు సుందర కిరీటం -

ఆ దేవదేవుడు - సకల లోకారాధ్యుడు ఇంద్రాది దేవతలకు పూజనీయుడు. బ్రహ్మాది దేవతలకు వందనీయుడు. భక్తపరాధీనుడు, ఆశ్రిత వత్సలుడు, అనాథనాథుడు, ఆ గోవిందులు,... రాతి బండమీద....

హంసతూలికాతల్ప మనుకున్నాడో, లేక - దానితో పనిలేదనుకున్నాడో.... ఆ చైతన్యాన్ని కళేబరం చేస్తే - మహాదృష్టవంతునిగా - ఆ బోయడు, ఆ భక్తజన వత్సలుని - "శ్రీ" చరణాల శాశ్వతుడయ్యాడు.

అర్జునుడు, ఏడ్చి, ఏడ్చి, సొమ్మసిల్లి ... ఆ దేవేదేవునికి, అలాగే - ఆ ప్రాంతమంతా వెదకి బలరామదేవులను - కల్సి - దహన సంస్కారం గావించాడు. నగరంలోకి వచ్చాడు. ఈ విషయం ఎవరికి చెప్పకుండా, ఆలస్యం చెయ్యకుండా బయలుదేరుదాం. లేకపోతే సముద్రానికి ఆహుతి అవాల్సి వస్తుందని, ఎంతవరకు వీలయితే అంతమేర అంతఃపుర స్త్రీలను, పురప్రజలను, ధన కనక వస్తు వాహనాదులను తరలించారు.

తెల్లవారింది.

పెద్ద ఘోషతో, ఆకాశమంత ఎత్తున ఎగిరే కెరటాలతోసముద్రమొక ఒక మహాప్రళయం వలె పొంగింది. ఆ కెరటాల శక్తికి, మహాద్భుత భువన భవనాలు, పేకమేడల వలె కూలిపోతుంటే, కృష్ణుడు ప్రసాదించిన, రక్షణ, సిరిసంపదలు.... ఆతను తమపై నిర్దయుడవడంతో, సముద్రమట్టమైపోయాయని చిత్రంగా చూస్తు బాధపడుతున్నారు.

ఇంచుమించు అందర్ని, తెచ్చుకోగల సంపదలతో అర్జునుడు, శ్రీకృష్ణుని ఆదేశం ప్రకారం, ఆయన తలచినట్లు - రక్షించాడు. దీర్ఘకాల ప్రయాణం జరుగుతుంది.

అడవిమార్గంలో, వీళ్ళందరు తమ అశేష ధనరాసులతో స్త్రీ - బాల - వృద్ధులు, బండ్లపై, గుర్రాలపై ప్రయాణం సాగిస్తున్నారు. అడవి మధ్యలోకి వచ్చేసరికి, వీళ్ళ వద్ద ధన కనక వస్తువులున్నట్లు గ్రహించి, బోయలు, వీళ్ళపైబడి, అందినంత అందుకుని, ఇవ్వని వారిని చంపి, కొన్ని బండ్లు తరలించుకుని దయాదాక్షిణ్యాలు లేకుండా నానా భీభత్సం... చేసారు.

ఆ విషయం అర్జునునికి తెలిసింది. విక్రమించాడు.

అప్పుడు - అర్జునుని - పరాక్రమము, వీరవిక్రమము, గాండీవ "టం"కారము.... నిరుపయోగము లైనాయి.

రాళ్ళు రువ్వుతూ, బండగా వాళ్ళు ప్రవర్తిస్తుంటే ఒక్క మంత్రము గుర్తు రావటం లేదు. ఒక్క ఆ దివ్యశక్తి గూడా అంతటి మహావీరుడు ప్రయోగించలేకపోయాడు.

నిరర్థక జీవిగా అర్జునుడు, వ్యర్థ పదార్థాలుగా ఆతని అస్త్రములు, తన పేరు అర్జునుడు. ఇది గాండీవమంటే.... పరిహసించేలా వుందా పరిస్థితి. ఆ మజిలీలో భాగంగా అర్జునుడు కురుక్షేత్రానికి వచ్చాడు. అచ్చటి వారందరు అర్జునుని గౌరవించి స్వాగతించారు. తదుపరి -

మహావీరుడు, శ్రీకృష్ణుడికి మిత్రుడయిన కృతవర్మ మనుమని పిలచి- "నాయనా! మీ వాళ్ళందరుతో కలిసి, ఇందులోని మూడవవంతు సైన్య సంపదతో మృత్తికాపురంలో వుండండి. దానికి నీవు అధినేతగా ఇప్పుడే అభిషిక్తుని చేస్తున్నా"నన్నాడు.

సాత్యకి పౌత్రుని - సరస్వతీ నగరానికి రాజును చేసాడు. కృష్ణ పౌత్రుడు, అనిరుద్ధుని కుమారుడు వజ్రుని - ఇంద్రప్రస్థానికి రాజుగా అభిషిక్తుని చేసాడు.

ఇప్పటికా కథ పూర్తయింది.

ఇంతవరకు తమ ప్రాణప్రదాత, మిత్ర సచివుడు, హితుడు, శ్రేయోభిలాషి శ్రీకృష్ణుడు తన దివ్యధామానికి వెళ్ళడాన్ని కాని, బలరాముడు యోగంతో శరీరాన్ని విడువడం కాని, శ్రీకృష్ణ పత్నులకు తెలుపలేదు.

అంతా సద్దుమణిగింది. ఇప్పుడు.... జరిగినదంతా.... మెల్లిగా వారి ముందు వుంచాడు. విషయం తెలుసుకున్న శ్రీకృష్ణ పత్నులు కొందరు అర్జునుని మొదట్లో నిందించినా తదుపరి సహగమనానికి ఏర్పాట్లు చేయమన్నారు.

రుక్మిణి, జాంబవతి, కాళింది, మిత్రవిందలు - శ్వాసలు బంధించి, ఎప్పుడో యోగమూర్తులై ఈ శరీరాలను విడిచారు. సత్యభామ వగైరా మరి కొందరు, భార్యలు తమకింకా - స్వామిని అనుసరించే యోగస్థితి కలుగలేదని - తపోమూర్తులై, అడవులకు వెళ్ళిపోయారు.

మెల్లిగా వ్యాసభగవానుల వారి ఆశ్రమాన్ని దర్శించాడు. అర్జునుని చూడగానే ఏమిటి నాయనా! ఏదో... పరామర్శించినట్లు పలకరించారు.

జరిగిందంతా చెప్పాడు.

వ్యాసమహర్షి కూడా కొంత బాధపడ్డారు.

ఈ లోకంలో పుట్టాక -

భగవంతుడు కూడా, మానవుడై పోతాడు.

మానవుని వలెనే ప్రవర్తిస్తాడు.

ఆ దివ్యాత్ముని, జగత్ప్రభువు అవతార కార్యక్రమం పరిసమాప్తి అయింది. "విధి" నిర్వహణను పూర్తి చేసుకున్నాడు. విశ్వంభరుడై పోయాడు!" అని అర్జునుని అనునయించారు.

ఆ వాక్యాలు వినబడుతున్నాయి.

వాసుదేవుని దివ్యరూపము, ఆ దేవదేవుడు చూపిన మహాద్భుత లీలలు-

అనన్య పరాక్రమము!

అశేష అభిమానము!

విశేష సలహా!

అర్జునుడిని, నిరుత్తరుడిని చేసింది.

శ్రీకృష్ణుడు ప్రసాదింపచేసిన గాండీవం వ్యర్థమయింది, కాబట్టి **"కృష్ణం వన్దే జగద్గురుం"** అని ఈ వ్యర్థగాండీవి, శ్రద్ధాభక్తుల, వినయ విధేయతలతో, ఆ నారాయణునికి - ఈ నరుడు, శరణాగతుడు కావాలని, నిర్ణయించుకున్నాడు.

"కనులు మూసినా, తెరచినా కనుపించే ఆ మూర్తిని మరువలేక కృష్ణా! ముకుందా! మురారీ!" అని అంజలి ఘటించి, ఇక స్వస్థానానికి తరలాలని తలచాడు.

ఇది శ్రీకృష్ణ భాగవతము. ఆ భగవంతుని లీలా సముద్రము. ప్రసాదించిన ఆనందామృతము. అందుకునేవారు అదృష్టవంతులు. అందుకోగల్గినవారు కారణజన్ములు.

**ఈ అనంత లీలా శ్రీకృష్ణ చరిత్ర - "శ్రీకృష్ణ భాగవత"మై సర్వులను అలరించుగాక. ధన్యులనొనరించుగాక!**

**- శుభం భూయాత్ -**



## చివరగా....

"శ్రీ కృష్ణా! యదుభూషణా" అన్నా, శ్రీకృష్ణం శరణం మమ'' అన్నా లేక "కృష్ణం వన్దే జగద్గురుం'' అన్నా. పిలుపు ఏ విధంగా పిలిచినా చివరకు చెందేది "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి, శ్రీ కేశవం ప్రతిగచ్ఛతి'' అను ఆ పరమాత్మకే. ఈ సత్యం తెలిసిన సర్వులు ధన్యులు.

అటువంటి దివ్యచరిత్రను ఎందరో వ్రాసారు. వ్యాసభారతంలోను, శ్రీమద్భాగవతంలోను "శ్రీకృష్ణ'' పాత్ర ఎంతో ప్రముఖంగా కనబడుతుంది. ఊరుపేరు లేని యదువంశానికి ఉనికి, ఊపిరి ప్రసాదించాడా ప్రభువు. రాముని వలన రఘువంశము, అదే... సూర్యవంశము పరమ ప్రసిద్ధమైనట్లు, కృష్ణుని వలన "యదువంశము'' విశ్వవిఖ్యాతమయింది. అంతకుముందు, వెనుక వున్న పాత్రలన్నీ "పాత్రలే'' తప్ప, నాయకులు, కథానాయకులు కాదు. వారికి చెప్పుకోదగ్గచరిత్ర లేదు.

ఇటువంటి "కృష్ణచరిత్ర''ను మూడుభాగాలుగా తీసుకువద్దామంటే, చేసిన ఈ ప్రయత్నం సర్వపాఠక భక్త జనామోదం పొందుతుందనే దృఢ విశ్వాసంతో, "కృష్ణం వన్దే జగద్గురుం'' అను ఆ జగదాచార్యుని కరుణతో నా కోరిక సఫలీకృతమౌతుందని చేసిన ఈ సాహస ప్రయత్నాన్ని, ఆ కృష్ణ ప్రభువు నాకిచ్చిన ఆదేశ, ఆవేశాలతో - శ్రీకృష్ణచరిత్రలో నిక్షిప్తమైన సత్య, ధర్మ, శాంతి స్వరూపాన్ని,

భక్తి, జ్ఞాన - ముక్తి (వైరాగ్య) కాండలుగా విభజించి ఆనందంగా అందిస్తున్నాను. అవతరించినప్పటి నుండి ఆలమందల్ని, ప్రకృతిని కూడా పరవశింప చేసిన, ఆ చిన్న, లీలా, బాలకృష్ణుని ఆటపాటలు, ఎందరినో ఆనంద పరవశులను చేయించాయి. ఆఖరికి తల్లి యశోధ, పిల్ల కృష్ణుడు మన్ను తిన్నాడంటే, చెవి నులిమి "ఏరా కన్నా!'' అంటే లేదమ్మా, మన్ను తినలేదంటే'' కాదని, మొండికెత్తి నోరు చూపమంటే "వద్దమ్మా! భయపడతావు'' అంటాడు.

"అబ్బ! అంత గొప్పవాడవా ?'' అనుకుంటుందా తల్లి ఎంతో అమాయకంగా. అయినా చూపమంటుంది. కృష్ణుడు చూపుతాడు. ఆ దృశ్యాన్నెంత పరవశించి, తేటతెలుగులో (ఆనాటి) పోతనగారు "భక్తి''తో పరకాయ ప్రవేశంచేసి రాసారో, ఆ పరమాత్మ లీలకే చెల్లు. మహాశయుడు పోతన మహాభక్తికే చెల్లు, చదువుకునే వారికన్న, ఆ పరమభక్తిలో పొంగిపొరలి, మురిసే వారికి నిజంగా "స్వామి'' సాక్షాత్కారం, శాశ్వత బ్రహ్మానందం తప్పక లభిస్తాయి.

దాంతో "అమ్మ" "అమ్మో" అంటుంది. నా పిల్లవాడని అనుక్షణం తలిచే ఆ తల్లి కృష్ణ మాయకు అప్రతిభురాలౌతుంది. ఇందులో "భక్తి", తాదాత్మ్యము, పారవశ్యము, మాటలలో పులకింత,... ఇవన్నీ చేర్చి కలిసి, ఆ భక్తుని అనంతానంద తృప్తికి, సమాధిస్థితికి కూడా చేర్చి ఆ శాశ్వతానందంలో, ఈ ప్రకృతిని మరచేటట్లు చేస్తాయి. అదే అయింది, మాత యశోదకు.

గోకులందాటి బృందావనంచేరి, బృందగానాలతో ఆ బాలగోపాలాన్ని పరవశింప చేసిన కృష్ణ భాగవతంలో ప్రేమ, అనురాగం, మమత, మార్దవం... అన్నీ కలిసి ఓ "భక్తి" వృక్షమై, అది ప్రతియింట వెలిసి, మహా వృక్షమై ప్రతి ఒక్కర్ని ఆ వృక్షఛాయన శాశ్వతా వాసము పొందునట్లు చేసింది. అది సామాన్య భక్తి కాదు, పరాభక్తి. అది ప్రసాదించి, అందర్ని ధన్యులను గావించిన దేవుడు శ్రీకృష్ణుడు. దేవురించే వారికందరికి, దీనవత్సలుడు.

ఇక ఇక్కడనుండి "జ్ఞాన" (కాండకు) మార్గదర్శకత్వం చెయ్యాలని తలచిన ఆ కృష్ణుడు, పిల్లాటలు మాని చూడటానికి పిల్లవాడైనా పెద్దవాడిగా, మథురలో, కోరికోరి, తన ప్రాణం తీసుకోదలచిన కంస మామకు కైవల్యం, యదు ప్రముఖులకు మార్గదర్శకత్వం వహించదలచినట్లు -

వారిలో జ్ఞానబీజాలు నాటి కర్తవ్య పరాయణులను చేయదలిచినట్లు, బృందావనం వీడి మథుర ప్రవేశించాడు. అడుగు పెట్టిన క్షణం నుండి అడుగడుగునా, ఆత్మజ్ఞాన ప్రదాతగా, ఇటు ఆనందాశ్చర్యాలు, అటు జ్ఞానమార్గాన్ని ప్రతి ఒక్కరికి, అవతారం దాల్చిన పూర్ణ మానవునిగా, ఉద్ధరణ కార్యక్రమంలో భాగంగా, ధర్మమూర్తిగా, అందరిని కరుణించాడు. వున్న జ్ఞానంతో, తానెవరినో తెలుసుకోమని, తన చేష్టలతో సూచించాడు.

ఈ కార్యక్రమంలో కేవలం "కంస" మామే కాదు, వాడి మామ, మిత్ర హిత బంధువులకందరికి కూడా బుద్ధి, జ్ఞానాలను యుక్తియుక్తంగా ప్రసాదిస్తాడు. ప్రదర్శిస్తాడు. ఎందరు తెలుసుకున్నారు. ఎందరు తరించారు, ఎందరు తరింప బడ్డారంటే, అది వారి, వారి, ప్రాప్తా ప్రాప్తాలపై ఆధారపడి వుంది, వుంటుంది. ఈ తత్వం గ్రహించగల్గడమొక అదృష్టం. చదువుకున్నవారు, చదువుకుంటున్న వారు, చదువుకొంటున్నవారు, ముందు ముందు అందరు ఎలాగ ప్రఖ్యాతి వహించలేరో, అలాగే ఈ జన్మ - కర్మ - ధర్మ విలాసం, విలాపం!

ఈ రకంగా గోకుల బృందావనాలకే ఒకనాడు పరిమితమైన "కృష్ణుడు" ఇప్పుడు ఆర్యావర్తానికి, అధిక మొత్తం రాజ్యాలకు, అధినాయకులకు ఆరాధ్యు డయ్యాడు. ఇది కొందరు కాదన్నా, అందరు ఒప్పుకొనవలసిన విషయం. ఒప్పుకొనక తప్పని

విషయం. "చక్రవర్తి" కావాలనే జరాసంధుని అత్యాశ వమ్ము చేసాడు. అన్న చేతిలో చావబోయేవాడిని "ఇప్పుడు కాదన్నా" అంటూ ప్రాణరక్షణం చేసాడు.

రాజును కాను, స్వయంవరానికి వెళ్ళ తగదు" అంటూనే విదర్భ రాకుమారి పిలుపుమేరకు వెళ్లి, ఆమెను తనింటికి తెచ్చుకుని తనింట్లో వివాహం చేసుకున్న ఘనుడు. కంటిలో నలుసై జరాసందుని కన్నీటి పర్యంతం చేసి కృంగదీసిన కృష్ణుడు జరాసంధ మిత్ర సామంతవర్గానికి "గుండె గుబులు" అయ్యాడు.

అక్కడనుండి ఎన్ని అసాధ్యాలు చేసాడు ? ఎందరికి ఆరాధ్యుడయ్యాడు... అంటే, వ్యాసులవారు, గంగాసుతుడు, అక్రూరాది యాదవ ప్రముఖులెందరో... ఒకనాడు కాదన్న వారితో కలిసి అందరు దగ్గరకు చేరారు. "ధర్మ స్వరూపుడు శ్రీకృష్ణుడు" అని, ముక్తి మార్గ ప్రదాతగా ఎందరితోనో కొనియాడబడ్డాడు.

మహాప్రళయం వంటి సమరం రావాలని, అది కలికి భయ - విభ్రాంతులను కలిగించాలని తలచి, ద్వాపరాంతానికి మార్గంగా ఇటు కురుక్షేత్ర యుద్ధం. అటు "ముక్తిమార్గ" ధన్యతా రూపమైన యుద్ధోపదేశం చేసి, ఆ తదుపరి దానిని "భగవద్గీత"గా లోకానికి జగదాచార్యుడై అందించడమే కాదు, అష్ట భార్యల వివాహ సమయంలో, "హస్తి" వంటి, సప్త వృషభాల నిలువరించడంలోను, నరకాసురుని చెర నుండి బయటపడి, తననే కోరిన, పదహారువేల వంద మంది భార్యల విషయాలలో మోహం, వ్యామోహం లేని సంసారినని తన సర్వాంతర్యామి తత్త్వాన్ని తెలియబరిచాడు.

అందరి ఇంట తానుండి, అందనంత ఎత్తులో నారదుని ఆలోచనా సాలోచనకు, సరియైన తత్వజ్ఞానమొసంగి ముక్తిమార్గ లేదా "వైరాగ్య" మూర్తిగా భక్తజనులను తరింపచేసిన, ముఖ్యంగా - నారదుని సర్వసందేహాలను తీర్చిన ఘనుడు.

తనకై జన్మించిన యదుప్రముఖులైన దేవతలను తాను తప్ప ఇతరులు నిర్జించలేరంటూ, యాదవ కులంలో "ముసలం" పుట్టించి, దాంతో వారిలో వారు కలహించి, కడతేర్చుకునేటట్లు చేసి, భూభారం తగ్గించిన పరంధాముడు, రామావతారంలో వాలిని చెట్టు చాటు నుండి చంపిన పాపానికి ప్రాయశ్చిత్తంగా, ఆ వాలిని బోయడిని చేసి, తన యాదవకుల "ముసల" ములుకుతో చెట్టు చాటు నుండి ప్రాణాలు తీయించుకుని, ధర్మమతిక్రమింపరానిదని, పాపము - శాపములనుభవించ వలసినవేనని, మనకెరుకబరచిన ధర్మమూర్తి - శ్రీకృష్ణుడు.

ఈ మొత్తం తలుచుకుంటే త్రికాండయుత "భక్తి, జ్ఞాన, వైరాగ్య" స్వరూప "శ్రీకృష్ణ భాగవతం". సర్వభక్త, ఆస్తిక మహాశయులకు, ధర్మమూర్తులకు ఈనాటి విద్యార్థినీ విద్యార్థులకు, తెలుగు సరిగ్గా మాట్లాడేవాళ్ళకు కల్పతరువు. పఠించండి.

"అవతార వరిష్ఠాయ "రామ-కృష్ణాయ"తే నమః" అన్న ఆ దేవదేవుడు, ఇటు మానవతావాదిగాను, అటు ధర్మపరిరక్షణామూర్తిగాను చరిత్ర సృష్టించిన "చరిత్రకారు" డయ్యాడు. "ఇది నిజమా ?" అని సందేహిస్తు కూర్చుంటే మన వునికే మనకు సందేహా స్పదమౌతుంది. కనుక సర్వ సంశయాలను ప్రక్కనపెట్టి సదాచార సంపత్తి, సంస్కృతీ సాంప్రదాయాలను అర్థం చేసుకునే ప్రయత్నం కాదు, అర్థం చేసుకుంటే, "ఆర్ష ధర్మం" నిలబడుతుంది. ఎత్తిన జన్మ సార్థకమౌతుంది. బ్రతుకు, బ్రతుకవుతుంది.

ఆ ఆశయంలో విభాగమే ఈ చిరు ప్రయత్నం. నిజానికిది "భారత, భాగవతాదులలోని - శ్రీకృష్ణ చరిత్రకు, సాకార సాక్షాత్కార స్వరూపం.

భారతంలో కొంత "కృష్ణచరిత్ర" మనకు లభిస్తుంది. భాగవతంలో, తొమ్మిది స్కంధాలు పూర్తయి, దశమస్కంద (పూర్వ - ఉత్తర భాగాల)లో శ్రీకృష్ణ చరిత్ర దర్శనమిస్తుంది. శ్రీకృష్ణ భగవత్ తత్వాన్ని మనకందిస్తుంది.

అందుకుని, సంక్షిప్తంగా వాటిని, విన్నవి, ఇతరత్రా చదివినవి కలిపి, భారతీయ విద్యాభవన్ శ్రీ కె.యం. మున్షీగారి, "శ్రీ కృష్ణావతారం"లోని అతి ముఖ్యమైన విషయాలను, పోతనగారి భక్తి మకరందాన్ని ఆస్వాదించి, సర్వ భక్త - ఆస్తిక - సామాన్య పాఠకజనులు, ఈ లీలా భాగవతంలో మున్గి తరించేటట్లు "శ్రీకృష్ణ భాగవతం"గా, నా అదృష్టంగా అందించాను.

ఇది ఆత్మానందమొందడానికి, బ్రహ్మానందం పొందడానికి, శ్రీకృష్ణ కరుణామృత మాస్వాదించడానికి ఎంతో దోహదపడుతుందని, ఆ జగదాచార్యుని సాక్షిగా, అభిలషిస్తూ -

అందరికి శ్రేయోభివృద్ధిని కల్గింప, ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తూ -

**- స్వస్తి -**

మీ
**- వొరుగంటి రామకృష్ణ ప్రసాద్.**
పారంపర్య పీఠాధ్యక్షులు,
విశ్వమానవతా గురుపీఠం

శ్రీ సాయి సువర్చలా సదన్
రామలింగేశ్వర పేట,
కుడిచేతి 6వ లైను
విజయవాడ - 520 003.
ఫోన్ : **0866-2532139**
**9393007648.**

**web site : www. vorugantiramakrishnaprasad.com**
**e-mail : vorugantiramakrishnaprasad@gmail.com**